# තිලංගේ කවුළු

SHOUT
SHARE
IT

# తెలంగాణ కథలు

♦ తొమ్మిది దశాబ్దాల సాంస్కృతిక సామాజిక పోరాట రూపురేఖలు ♦


సంపాదకులు :

కాలువ మల్లయ్య

సదానంద్ శారద

చంద్ర



విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజ్ఞాన భవన్, 4-1-435, అబిడ్స్,

హైదరాబాద్.

**TELANGANA KATHALU**
Editors : Kaluva Mallaiah, Sadanand Sarada, Chandra.

---

ప్రచురణ నెం : 2350/58

ప్రతులు : 1000

వి.పి.హెచ్. ప్రథమ ముద్రణ : జూలై, 2005

© టైటిలు, ముందుమాట, లేఔట్, డిజైన్ మొదలగునవి
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

టైటిల్ డిజైన్ : చంద్ర

C 22971

72056

**వెల: రూ. 300-00**

**విదేశాల్లో వెల : $ 30**

ప్రతులకు : **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
4-1-435, విజ్ఞాన భవన్, బ్యాంక్‌స్ట్రీట్,
హైదరాబాదు - 500 001.
E-mail : visalaandhra@yahoo.com

**విశాలాంధ్ర బుక్ హౌస్**
(అబిడ్స్, సుల్తాన్ బజార్) హైదరాబాద్,
విజయవాడ, అనంతపురం, విశాఖపట్నం,
హన్మకొండ, గుంటూరు, తిరుపతి, కాకినాడ.

అక్షరాలంకరణ : కాంపాక్ట్ గ్రాఫిక్స్, హైదరాబాద్.

ముద్రణ : శ్రీ కళాంజలి గ్రాఫిక్స్, హైదరాబాద్. ఫోన్ : 23224831

# ప్రాంతీయతా ఆర్ద్రతా పోరాటాల గుండెచప్పళ్ళ స్టెతస్కోప్

తొమ్మిది దశాబ్దాల సామాజిక చరిత్రకు సజీవ సంతకం తెలంగాణ కథ. తెలుగు అస్తిత్వం కోసం పడ్డ తపనా, పరాయి పాలకుల మత విద్వేషాల పద ఘట్టనల కిందపడి నలిగిన జనఘోషా, తెలుగుభాషా సాహితీ సంస్కృతులపై జరిగే దురాక్రమణలనెదుర్కొన్న తెగువా, స్వాతంత్ర్య భానూదయం కాకుండా తన పుర్రచెయ్యి అడుపెట్టబోయిన పాలకుల పట్ల కసీ, వారి తాబేదార్లైన దేశముఖ్, జమీందార్లు వెట్టి రూపేణ సాగించిన అణచి వేతలపైనా, దుష్ట గడీ సాంప్రదాయాల పట్ల వ్యతిరేకతతో ఉప్పొంగిన ఆవేశమూ - ఇవీ 1948కి పూర్వం తెలంగాణ జనంనాడి. దీని గుండె చప్పుళ్ళే తొలితరం కథల ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. ఇవో తొమ్మిదొందలుండవచ్చు. ఇటీవల సంగిశెట్టి శ్రీనివాస్‌గారు బాగా పరిశ్రమించి కవిలె ప్రచురణగా 'దస్తమ్' అన్న తెలంగాణా తొలితరం కథల సూచిని - 1956కు పూర్వం వాటి జాబితా - ప్రకటించారు. తెలంగాణాలో కథలేవీ? అన్న వాళ్ళకొక సమాధానం. కథా సాహిత్య పరిశోధకులకదొక దారిదీపం.

విజ్ఞప్తుల పర్వంనుండి విప్లవాల యుగం దాకా కథాగమనం సాగింది. మట్టిమనిషి నడుంకట్టి కృద్ధుడయ్యాడు. అణగారిన దశాబ్దాల ఆవేశం కట్టలు తెంచుకుంది. భుక్తి కోసం, భూమికోసం, స్వేచ్ఛా వాయువులు పీల్చడంకోసం సాయుధుడైనాడు. అరివీర భయంకరుడైనాడు. ఆ దశలో ఉప్పొంగిన ఉద్రేకం జనంనోట పాటగా మారి ఉరక లెత్తిందే కానీ, కథారూపం తీసుకున్న దాఖలాలు కొద్ది. రైతాంగ సాయుధపోరాటాన్ని వినీ, చదివీ, పర్యటించీ ఉద్రేకితులైన తెలంగాణేతరుల కలాలే ఎక్కువగా కథలనల్లటం సాహిత్యకారులకు తెలిసిందే! పోరాటం ఊసులల్లినవి మొత్తం మీద ఓ ఎనభై. అందులో తెలంగాణా కథకులు పదుల సంఖ్యలో ఉంటే రచనలూ ఆ మేరకే వచ్చాయి. ఆవేశం నెమ్మళించి ఆలోచనలు కొనసాగినప్పుడే కథాప్రక్రియ రూపుదిద్దుకుంటుంది.

ఆ తర్వాత కాలంలో తెలంగాణ వేదిక మీద రంగం మారింది. అణచివేత, దోపిడీలు మారిన రూపాలలో స్వాతంత్ర్యం పల్చని ముసుగు కింద కొనసాగింది. పట్టణ సంస్కృతి విస్తృతమౌతూ గ్రామీణ సంస్కృతులను అల్లకల్లం చేయడం ఆరంభమైంది. గ్రామీణ వలసలు అధికమయ్యాయి. అవినీతి, లంచగొండితనం, ఆశ్రితపక్షపాతాలు రాజకీయ దుస్తులు వేసుకున్నాయి. చదువరుల శాతం అరకొర సామాజిక, సంక్షేమ పథకాల వల్లనైనా పెరిగింది. ప్రభుత్వ ప్రణాళికల అమలులో

చిత్తశుద్ధిలేని కారణంగా పారిశ్రామికీకరణ కుంటుపడడం. సంపన్నవర్గాల గుత్తాధిపత్యం అన్నిటా ప్రభావం చూపటంతో చదువుకున్న నిరుద్యోగ యువత ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. నిరాశ నిస్పృహలతో ఉన్నవారు ఎవరే నినాదం ఇచ్చినా నిరాలోచనగా అందుకున్నారు. గ్రామీణ, పట్టణ సంస్కృతులు రెంటికీ చెడ్డ రేవడి చందమయ్యారు. ఈ సామాజిక, ఆర్థిక పరిస్థితులు వస్తువుగా స్వీకరిస్తూ కథారంగం ఉన్నతశిఖరాలు అందుకోవటమే కాదు - విస్తృతీ పెరిగింది. ఈ కాలంలో ఉవికి వచ్చిన దళితవాద స్త్రీ వాదాలు సామాజిక పునాదులుండటం వలన సాహిత్యరంగాన్ని ప్రభావితం చేశాయి. పట్టణ సంస్కృతి బాగా ఎదగని కారణాన తెలంగాణలో దళితవాదం అందుకున్నంత ఊపు స్త్రీవాదం అందుకోలేదు. ప్రపంచంలో ఎక్కడ పరిశీలించినా గ్రామీణ మహిళా సమాజాన్ని స్త్రీవాదం చాలా తక్కువగా ప్రభావితం చేసినట్టు అనిపిస్తుంది. ఈ స్థితి తెలంగాణలో మరీ ఎక్కువనే అనాలి. దళిత, మైనారిటీ వాదాలకు దొరికినంత ఊతం తెలంగాణలో మరేవాదానికీ లభించలేదు. కారణం - రెండూ సమాజంలో పైపైన ఆవిర్భవించినవి కావు. గ్రామీణ మూలాల నుండి వచ్చినవి. సామాజిక, రాజకీయ రంగం అంతా వర్గ, కులాల చైతన్యంతో నిండింది. నిజాయితీ కొరవడిన పాలకవర్గ రాజకీయ నాయకుల అసమర్థత వల్ల ప్రాంతీయ అసమానతల ఊబిలో తెలంగాణా చిక్కుకుంది. ఈ పరిస్థితులనూ కథ అందిపుచ్చుకుంది. భాషా స్పృహ కథకులను చైతన్యవంతం చేసింది. దాంతో తొలి తరంలో ఏ ఒకరిద్దరో తెలంగాణ భాషను పాత్రోచితంగా ప్రతిబింబిస్తే, క్రమంగా ఎనిమిదవ దశకానికి వచ్చేటప్పటికి కథ యావత్తూ ప్రాంతీయ భాషా పరిమళాలు వెదజల్లడం ఆరంభించింది.

తెలంగాణ కథల ఎంపిక సందర్భంలో ఓ విషయం గమనార్హం. ఇక్కడ జన్మించిన తొలితరం కథారచయితల్లో ఎక్కువ మంది ఉన్నత వర్ణాలకు చెందిన అప్పుడప్పుడే రూపుదిద్దుకుంటున్న మధ్యతరగతివారు. వారి భాషా, శైలీ, చాలావరకూ వస్తుస్వీకరణా - తెలంగాణేతరుల్లాగానే ఉండడం చూడవచ్చు. అలాగే తొలితరంలోని పలువురు కథకులు అనేకానేక కారణాలవల్ల ఈ ప్రాంతానికొచ్చి స్థిరపడి, దశాబ్దాలుగా సాహితీ సృజన సాగిస్తూ తెలంగాణా కథకులుగా పరిగణనలో కొచ్చినవారు. వీరి రచనల్లో తెలంగాణాతనం కనిపించదు. ఏదిఏమైనా గత శతాబ్దం మధ్యవరకూ తెలంగాణా కథకులను నిర్ధారించడం కష్టంతో కూడుకున్న పని. దస్త్రం సంకలన కర్తలకూ ఈ చిక్కు ఎదురయ్యే ఉంటుంది. కాగా ఆరో దశకంనుండీ కథారచయితల్లో దాదాపు అందరూ మధ్యమ, దిగువ మధ్యమ వర్గానికి చెందిన అట్టడుగు వర్ణాలవారు. ఈ స్థితిని చూస్తే కథ తెలంగాణాతనంతో గ్రామీణ మూలాలను స్పృశించడం ఆరంభించిందని స్పష్టమౌతుంది.

ఇలా రచయితలకు సామాజిక సమస్యలు - జనపోరాటాలూ కథావస్తువు లవుతున్న తరుణంలో - సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావం తెలంగాణా ఆర్థిక, సామాజిక రంగాన్ని కుదిపివేయడం వారి చూపునుండి తప్పించుకోలేకపోయింది. కరువుకాటకాలు, తాగునీటి సమస్యలు, కల్తీ విత్తనాలు, పురుగు మందులతో అస్తుబిస్తు అవుతున్న రైతాంగం - రియల్ ఎస్టేట్‌దార్ల కబంధ హస్తాల్లో చిక్కి పంటపొలాలు ఇళ్ళ స్థలాలుగా మారుతున్న ప్రక్రియలో - ఛిన్నాభిన్నమయింది.

లాభంలేని, తప్పనిసరి వలసలు ఆత్మహత్యలకు దారితీశాయి. చివరకు హత్యా రాజకీయాలూ తెరమీదికొస్తున్నాయి.

ఇదీ ప్రస్తుతపు సామాజిక, రాజకీయ, ఆర్థిక తెలంగాణా దర్పణం. రానున్న క్షణం తమది కాదేమోనన్న అనుమానం. క్షణక్షణం బతుకుభయం. ఇదీ నేటి పల్లె బతుకుల సౌభాగ్యం. చూడగలిగిన కళ్ళు వుండాలేగాని కథకు పనికిరాని వస్తువంటూ లేదు. సవాలక్ష వైరుధ్యాల మధ్య జీవనపోరాటమే వారికి కన్ననందించింది. ఇందుకే ఈ ప్రాంతంలో పలువురు కథకులు గ్రామీణానుభవంతో పండినవారే. దీనికి తోడు కొందరు వ్యక్తులూ, సంస్థలూ జిల్లాల వారీగా కథా సంకలనాలనూ, కథకుల కథల సంకలనాలనూ - సంవత్సరాల వారీగా సంకలనాలనూ ప్రచురిస్తూ ఎనలేని తోడ్పాటు నందిస్తున్నారు. మిత్రులు బి.యస్. రాములుగారు చేస్తున్న కృషి ప్రశంసనీయం. దీన్ని ఓ ఉద్యమంగా నెత్తికెత్తుకున్నారు.

ఒకప్పుడు తెలుగు కథకు పెద్ద దిక్కు తూర్పుగా భావించారు. మధ్యలో రాయల సీమకు మళ్లింది. ఈనాడు రాశిలోను, వాశిలోను సాహితీపరులందరూ తెలంగాణ దిక్కు చూడాల్సిందే. నేలవిడిచి సాముచేయని తెలంగాణ కథ బహుముఖీన వికాసం చెందుతోంది. ఇంతటి సామాజిక చరిత్రను క్లుప్తంగానైనా చెప్పగల కథలను వివిధ కాలాల, దశలకు ప్రాతినిధ్యం వహించగల వాటిని సంపాదకులు ఈ సంకలనానికి ఎంపిక చేశారు. తొలితరాల కృషిని నేటి తరాలకు అందివ్వడం సముచితం అన్న భావనతో కథకుల ప్రాతినిధ్య ఉద్దేశంతో కాస్త ఎక్కువగా 1912 నుండి 1956 వరకు వచ్చిన కథలను ఎన్నుకున్నారు. తరువాత ఉద్యమ ప్రభావ కథలకు ప్రాధాన్యాన్నిచ్చారు. 1970 నుండీ వస్తు ప్రాధాన్యాన్ని గమనంలోకి తీసుకున్నారు. గత అయిదారేళ్ల నుంచీ కథకులు బహుముఖీనంగా రచనలు సాగిస్తున్నారు. వీరికీ తగిన ప్రాధాన్యాన్నిస్తూనే పాతతరాల వారిని విస్మరించడం భావ్యం కాదన్న స్పృహ సంపాదకులకుండడం ఈ సంకలనంలో గమనించగలం.

ఈ సంకలనాన్ని చదివితే -
తెలంగాణ ఇంటి పేరు పోరాటం,
తెలంగాణ మాటతీరు ధిక్కారం,
తెలంగాణ వంటి సౌరు ఆత్మీయం,
తెలంగాణ కంటిచూపు ఆప్యాయం,
తెలంగాణ బిడ్డచాలు వీరంగం -

అని అనిపించకమానదు. అంతేకాదు ఈ కథల్లో మనం ఆశానిరాశలను, ఆవేశకావేశాలనూ, ఆరాటపోరాటాలనూ మొత్తంగా 9 దశాబ్దాల సజీవ తెలంగాణా చైతన్యాన్ని దర్శించగలం. అనుభవించగలం. ప్రాంతీయ భాషా నిసర్గ పరిమళాల నాఘ్రాణించగలం. జమీందార్లు, నిరంకుశ నిజాం పాలకులూ, వారి తాబేదార్లూ కాలానికి కట్టిన కత్తులవంతెనను తెలంగాణా ప్రజ దృఢసంకల్పంతో దాటిన వైనం అవగాహన చేసుకోగలం. ఏది ఏమైనా ప్రాంతీయ సామాజిక వర్ణ, వర్గ మూలాలను

అర్థం చేసుకున్నప్పుడే సమగ్రమైన తెలంగాణాతనం చూడగలం. అస్తిత్వ పోరాట పార్శ్వం చూడగలం. అందుకే సంకలనం ఉపకరిస్తుంది.

ఇక ప్రాంతీయ కథా సంకలనాల చరిత్రకొస్తే చా.సో. కళింగాంధ్ర కథలకు స్వయాన శ్రీకారం చుట్టారు. సీమ కథలను ప్రచురించి మా ప్రచురణాలయం చెన్ను చరిచింది. ఇప్పుడు సర్వశ్రీ కాలువ మల్లయ్య, సదానంద్ శారద, చంద్రలతో సంపాదక వర్గాన్ని ఏర్పరచి వీరి నిరంతర కృషి ద్వారా ఈ బృహత్ సంకలనాన్ని మీకందించే కార్యక్రమం చేపట్టింది. పలు కథాసంకలనాలనుండీ, కథకుల వ్యక్తిగత సంకలనాల నుండీ, పత్రికలనుండీ కథలను సేకరించడం జరిగింది. చాలామంది తమ అనుమతినిచ్చి తోడ్పడ్డారు. కొందరు చాచా అంగీకరించారు. కొందరు బహుశా తీరికలేక తమ అంగీకారాన్ని అందించలేదనుకుంటున్నాం. సంకలన ప్రాధాన్యం దృష్ట్యా అలాంటివారి కథలనూ చేర్చాము. ఏ కొందరినైనా ఈ సంకలనంలో చేర్చలేకపోయామంటే వారిని తక్కువ చేయడంగా భావించవద్దని మనవి. లభించకా, సమయం చాలకా ప్రధానంగా గ్రంథ విస్తృతి భయంవల్లా నని మనవి. అందరికీ కృతజ్ఞతలు. పలువురి సలహా సంప్రదింపులు, సూచనలు, సహాయాలు స్వీకరిస్తూ ఈ రూపంలో మీకీగ్రంథాన్ని అందిస్తున్నాం. సలహాదారులకూ, తమ అంగీకారం తెలిపిన రచయితలకూ, సంపాదకులకూ కృతజ్ఞతలు. భావస్ఫోరకమైన, ప్రతీకాత్మకమైన ముఖచిత్రాన్ని రూపొందించిన ప్రముఖ చిత్రకారుడు చంద్రకు కృతజ్ఞతలు. వ్యాపారదృష్టితోకాక ఓ బాధ్యతగా ఈ గ్రంథం ప్రచురిస్తున్నాము. ఇది సమగ్రం అని చెప్పలేము గాని, నిజాయితీతో కూడిన ఓ ప్రయత్నం అని చెప్పగలం. సోదర ప్రచురణకర్తలు కూడా ఇలాటి అనేక కథాసంకలనాలు తెచ్చి కథాసాహితిని పదిలపరచగలరని ఆశ. నిర్మాణాత్మక సూచనలను ఆహ్వానిస్తున్నాం. పాఠకుల ఆదరాభిమానాలనూ, అర్థిస్తున్నాం.

అభివందనాలతో,

**ఏటుకూరి ప్రసాద్**

సంపాదకుడు, విశాలాంధ్ర ప్రచురణాలయము.

# గిది కథల సోలుపు


| | కథ - రచయిత | సంవత్సరం | పేజి |
|---|---|---|---|
| 1. | ఎవరికి? - మాడపాటి హనుమంతరావు | 1912 | 1 |
| 2. | గ్యారా కద్దూ బారా కోత్వాల్ - సురవరం ప్రతాపరెడ్డి | 1930 | 12 |
| 3. | పటేలుగారి ప్రతాపము - నందగిరి వెంకట్రావు | 1930 | 16 |
| 4. | వెట్టిమాదిగ - అజ్ఞాతవాసి భాగ్యరెడ్డివర్మ | 1932 | 22 |
| 5. | పందెం - నందగిరి ఇందిరాదేవి | 1941 | 24 |
| 6. | నా స్నేహం - పెండ్యాల శేషగిరి రావు | 1943 | 28 |
| 7. | మనమే నయం - కాళోజీ నారాయణరావు | 1943 | 32 |
| 8. | విశ్వప్రేమ - సర్వదేవభట్ల నరసింహమూర్తి (కవిరాజమూర్తి) | 1945 | 35 |
| 9. | అన్నా - చెల్లెలు - అడ్లూరి అయోధ్య రామ కవి | 1945 | 37 |
| 10. | చెరువొడ్డున - కాంచనపల్లి చిన వెంకట రామారావు | 1945 | 40 |
| 11. | బ్రహ్మపత్ర భక్తసమాజము - జి. రాములు | 1946 | 46 |
| 12. | ఊరేగింపులు - ఆవుల పిచ్చయ్య | 1946 | 49 |
| 13. | యుగాంతం - నెల్లూరి కేశవస్వామి | 1948 | 52 |
| 14. | గొల్ల రామవ్వ - పి.వి. నరసింహారావు (విజయ) | 1949 | 66 |
| 15. | మేం నలుగురం - ఎం. హీరాలాల్ రాయ్ | 1950 | 78 |
| 16. | ఆరూఢం - కందుకూరి లింగరాజు | 1950 | 84 |
| 17. | గాలిపటం - వట్టికోట ఆళ్వారుస్వామి | 1952 | 93 |
| 18. | ఊరు - అడవి - పొట్లపల్లి రామారావు | 1953 | 103 |
| 19. | ముక్కోటి బలగమోయి - జి. సురమౌళి | 1956 | 105 |
| 20. | లచ్చి - గూడూరి సీతారాం | 1957 | 111 |
| 21. | వెన్నెలవాడ - చక్రవర్తి రంగస్వామి | 1957 | 119 |
| 22. | అడవి మల్లెలు - జనపరెడ్డి సత్యనారాయణ (సత్యశ్రీ) | 1961 | 131 |
| 23. | గమ్యస్థానం - డి. రామలింగం | 1964 | 152 |
| 24. | చెప్పులు - కవుటూరు వెంకట నారాయణరావు | 1967 | 161 |
| 25. | ఆశాభంగం - ఊటుకూరు రంగారావు | 1967 | 170 |
| 26. | అయ్యో డబ్బు - ఇటికాల నీలకంఠరావు | 1967 | 177 |
| 27. | ఇజ్జత్ - భాస్కరభట్ల కృష్ణారావు | 1967 | 180 |
| 28. | తల ఎత్తని కస్తూరి - ఇల్లిందల సరస్వతీదేవి | 1968 | 189 |
| 29. | సంసార సాగరం - కొండపల్లి వెంకట శేషగిరిరావు | 1968 | 204 |

| | | | |
|---|---|---|---|
| 30. | మానవ కంఠధ్వని - పబ్బరాజు గోపాలరావు | 1968 | 208 |
| 31. | నిశ్చితార్థం - పి. యశోదారెడ్డి | 1969 | 211 |
| 32. | తామరపూలు - దాశరథి రంగాచార్య | 1969 | 220 |
| 33. | ఎర్రబుట్ట - తాడిగిరి పోతరాజు | 1970 | 228 |
| 34. | గడ్డం మనిషి - నిఖిలేశ్వర్ | 1970 | 237 |
| 35. | చిరంజీవి - చెరబండరాజు | 1971 | 242 |
| 36. | హక్కు - మాదిరెడ్డి సులోచన | 1972 | 249 |
| 37. | గడీ - చావా శివకోటి | 1973 | 256 |
| 38. | యెలుగు మింగిన శీకటి - దేవరాజు మహారాజు | 1974 | 268 |
| 39. | తలుపులు - చంద్ర | 1976 | 276 |
| 40. | చీకటి మంట - పడాల రాములు | 1978 | 286 |
| 41. | భూమి - అల్లం రాజయ్య | 1978 | 293 |
| 42. | చిత్రకన్ను - నందిని సిద్ధారెడ్డి | 1979 | 302 |
| 43. | పాఠశాల - రామా చంద్రమౌళి | 1980 | 310 |
| 44. | బోనస్ - పులుగు శ్రీనివాస్ | 1981 | 315 |
| 45. | దొరగారి కుక్క - నందిగం కృష్ణారావు | 1982 | 325 |
| 46. | ఇత్తనపు కోడె - వుప్పల నరసింహం | 1983 | 328 |
| 47. | గొల్లకథ - కె. రాంమోహన్ రాజు | 1984 | 346 |
| 48. | మానవత - పోల్కంపల్లి శాంతాదేవి | 1985 | 356 |
| 49. | వీకర్ సెక్షన్లు - సదానంద్ శారద | 1987 | 368 |
| 50. | చెర - నవీన్ | 1987 | 388 |
| 51. | గంగజిమ్మ - సాహు | 1988 | 401 |
| 52. | బొమ్మలు - బోయ జంగయ్య | 1988 | 413 |
| 53. | గిర్నిబాయి - పసుపులేటి మల్లికార్జునరావు | 1989 | 422 |
| 54. | ఇల్లు - తుమ్మేటి రఘోత్తమరెడ్డి | 1991 | 433 |
| 55. | జంగుబాయి - గోపి భాగ్యలక్ష్మి | 1992 | 442 |
| 56. | ధోకా - దిలావర్ | 1993 | 459 |
| 57. | ముసల్దాని ముల్లె - ఆడెపు లక్ష్మీపతి | 1993 | 464 |
| 58. | అల్లాదీన్ అద్భుతదీపం - జ్వాలాముఖి | 1994 | 490 |
| 59. | కళేబరం - జూకంటి జగన్నాథం | 1995 | 504 |
| 60. | సర్వేజనా సుఖినోభవంతు - జింబో | 1995 | 512 |
| 61. | బొడ్రాయి - భూపాల్ | 1996 | 522 |

| | | | |
|---|---|---|---|
| 62. | చిరుమ్మడి బతుకు - కాలువ మల్లయ్య | 1996 | 542 |
| 63. | తిత్తి - దొడ్డి రామ్మూర్తి | 1997 | 554 |
| 64. | లగ్గం సంబురం - అంబల్ల జనార్దన్ | 1998 | 561 |
| 65. | విద్యుల్లత - ఎన్.కె. రామారావు | 1998 | 570 |
| 66. | వరుసలు - బి.ఎస్. రాములు | 1999 | 579 |
| 67. | సిల్‌సిలా - షాజహానా | 1999 | 590 |
| 68. | తెగిన బంధాలు - పెద్దింటి అశోక్‌కుమార్ | 2000 | 599 |
| 69. | గుంగీ ధడ్‌కన్ - గౌస్ మొహియుద్దీన్ | 2000 | 614 |
| 70. | కలికి గాంధారి - ఐతా చంద్రయ్య | 2000 | 622 |
| 71. | మరో సిద్ధార్థుడి కథ - పి. లోకేశ్వర్ | 2000 | 630 |
| 72. | గుడిసెలు! గుడిసెలు! - ముదిగంటి సుజాతారెడ్డి | 2000 | 637 |
| 73. | భూ నిర్వాసితులు - పి. చంద్ | 2000 | 647 |
| 74. | గోరిమా - అఫ్సర్ | 2001 | 670 |
| 75. | కిర్రు చెప్పులు - దార్ల రామచంద్ర | 2001 | 685 |
| 76. | దొర మళ్లా వచ్చిండు - కె.వి. నరేందర్ | 2001 | 691 |
| 77. | గౌరడు - గూడ అంజయ్య | 2001 | 696 |
| 78. | ఆఫ్టర్ ట్వంటీ ఇయర్స్ అను మంచి మిత్రుల కథ - కాసుల ప్రతాపరెడ్డి | 2001 | 703 |
| 79. | మావూరి ముచ్చట్లు - నల్లాల లక్ష్మీరాజం | 2002 | 707 |
| 80. | బోరు పొక్కలు - బోధనం నర్సిరెడ్డి | 2003 | 715 |
| 81. | అంతర్ముఖం - జాతశ్రీ | 2003 | 724 |
| 82. | బెలాద్ - గీతాంజలి | 2003 | 733 |
| 83. | ఎర్రదీపం - ముక్తవరం పార్థసారథి | 2003 | 739 |
| 84. | మట్టి మనుషులు - పంజాల జగన్నాథం | 2003 | 746 |
| 85. | మన్నుబువ్వ - జాజుల గౌరి | 2003 | 756 |
| 86. | నెలపొడుపు - బి.వి.ఎన్. స్వామి | 2004 | 759 |
| 87. | లాకప్ డెత్ - కర్ర ఎల్లారెడ్డి | 2004 | 770 |
| 88. | ఐటి కప్ప - పులిపాటి గురుస్వామి | 2004 | 774 |
| 89. | చర్చల కథలు - సి.హెచ్. మధు | 2004 | 781 |
| 90. | నిత్యగాయాల నది - బెజ్జారపు రవీందర్ | 2004 | 787 |
| ★ | **కథకుల జీవన రేఖలు** | | 795 |

# బరువు బతుకుల కథా ప్రస్థానం

తెలంగాణా జనజీవన పరిణామ చిత్రాలు "తెలంగాణ కథలు". నైజాం ఉక్కుపాదం కింద నలిగిపోయిన తెలంగాణా గడ్డమీద 1912లోనే ఆధునిక కథ పుట్టింది. 1910లో గురజాడ 'దిద్దుబాటు' కథ ప్రచురింపబడిన ఆంధ్రభారతిలోనే మాడపాటి హనుమంతరావు రాసిన 'హృదయ శల్యం' కథ 1912లో అచ్చయింది. గురజాడ కథకు పూర్వమే బండారు అచ్చమాంబ 1902లో కథ వచ్చిందన్న వాదనున్నా కథానికా లక్షణాలు, వివిధ ఇతర కారణాలవల్ల దిద్దుబాటు కథే మొట్టమొదటి తెలుగుకథగా ప్రాచుర్యం పొందింది. తెలంగాణ నుంచి మాడపాటి హనుమంతరావు తొలికథకుడుగా, హృదయ శల్యం మొదటి కథగా తెలంగాణా ఆధునిక కథా ప్రస్థానం మొదలైంది. ఆ కథ ఇదివరకే కొన్ని సంకలనాల్లో ప్రచురితమైనందున తెలంగాణా మొదటి కథతో కాకుండా తెలంగాణా మొదటి కథకుడు మాడపాటి హనుమంతరావు - 'ఎవరికి?' అనే కథతో ఈ సంకలనం ప్రారంభమవుతుంది.

'తెలంగాణ కథలు' ప్రచురణకు ఆదిలోనే కొన్ని సందేహాలు వచ్చాయి. తెలంగాణా రచయితల కథలు తెలంగాణా కథలా లేక తెలంగాణా జీవితాన్ని ప్రతిబింబించే కథలా...? ఈ రెండూ దృష్టిలో పెట్టుకొని కథల ఎంపిక చేయడం జరిగింది. ఇందులో కొందరు తెలంగాణాలో పుట్టినవారు కాకున్నా చాలా కాలం క్రితం తెలంగాణాలో స్థిరపడి తెలంగాణా జనజీవన సంస్కృతితో మమేకమై రాసినవాళ్ళ కథలూ ఉన్నాయి. కొన్ని కథల విషయంలో భాష, ప్రాంతీయతా ముద్ర విషయంలో రాజీపడాల్సి రావడానికి కారణం ఆ తరం వాళ్ళనుంచి ఈ విషయాలకు సంబంధించి ఇతర కథలు లభించక పోవడం.. రెండువందల యాభైమందికిపైగా కథకులుగా పేరు తెచ్చుకున్న వాళ్ళున్నా అందరి కథలతో సంకలనం తేవడం కష్టంతో కూడుకున్న పని కాబట్టి వీలైనంత ఎక్కువమంది కథలతో తొంభై ఏళ్ళకు పైబడుతున్న తెలంగాణా కథా వయసును దృష్టిలో పెట్టుకొని తొంభై కథలతో ఈ సంకలనం తీసుకొస్తున్నాం.

1956వరకు కలంపట్టిన వారిని తొలితరం కథకులుగా, ఆ తరువాతికాలం నుండి 70, 75వరకు కలంపట్టిన వారిని మలితరం కథకులుగా, అప్పటినుంచి 90వరకు కలంపట్టిన వారిని మూడవతరం, తొంభైల తర్వాత కలంపట్టి ప్రసిద్ధులైన వారిని ఈ తరం కథకులు అన్న అవగాహనతో అన్ని తరాలవారికి, అన్ని జిల్లాల

రచయితలకు ప్రాధాన్యత నిచ్చి కథలు ఎంపిక చేయడం జరిగింది. చారిత్రక ప్రాధాన్యత దృష్ట్యా తొలితరం కథలను ఎక్కువ వచ్చే ప్రయత్నం చేశాము. కథలు ఎంపిక కోసం అనేక ముందిని సంప్రదించాం. చాలామంది రచయితలకు ఉత్తరాలు రాశాం. కలిసి చెప్పాం. ఫలానా కథ ఎన్నిక చేసుకున్నాం - అనుమతిపత్రాల్ని పంపమంటే కొందరు పంపారు. కొందరు పంపలేదు. పంపనివారికి సంకలనంలో కథ చేర్చుకోవడంలో అభ్యంతరముంటే తెలియజేయమనీ రాశాం. అలా అభ్యంతరం తెలిపినవారి కథలను ఈ సంకలనంలో చేర్చుకోలేకపోయాం. ఇలా అనేక వ్యయప్రయాసలకోర్చి సంవత్సరన్నర పైగా కృషిచేసి తీసుకొస్తున్న తొమ్మిది పదుల తెలంగాణ కథల బృహత్సంకలనమిది.

ఆంగ్లభాషా సంస్కృతుల ప్రభావంతో, మధ్యతరగతి ఉనికితో కోస్తాలో ఆధునిక సాహిత్య ప్రక్రియయైన కథానిక కొంత ముందుగా ప్రవేశించింది. స్వాతంత్ర్యానికి పూర్వం కథలను ప్రచురించే అవకాశాలుగాని, లిఖిత కథలను చదివే మధ్యతరగతి గాని తెలంగాణాలో లేవు. తెలంగాణాలో అప్పుడున్నది భూస్వాములు, దొరలు - వాళ్ళ భూముల్లో పనిచేసే అట్టడుగు వర్గాలవారు. ఎన్ని అననుకూల పరిస్థితులున్నా తెలంగాణా నుంచి ఆధునిక కథ దాదాపు తెలుగు కథ వచ్చిన కాలంలోనే అట్టడుగువర్గ దృష్టి కోణంలోంచి మొదలు కావడం విశేషం. తొలి మలితరాల్లో తెలంగాణానుంచి గణనీయమైన సంఖ్యలోనే కథలు వచ్చినా మూడవతరంలో తెలంగాణా కథ అన్ని వర్గాలనుంచి ఉప్పెనలా విజృంభించింది. కథకు వస్తువును సమకాలీన సమాజంనుండి తీసుకోవాలన్న దృష్టితో తెలంగాణానుండి అన్నితరాల్లోనూ సమకాలీన అట్టడుగు జీవితాలే కథా వస్తువులయ్యాయి. నిజానికిది వస్తు సేకరణలో ఒకడుగు ముందున్నట్టే. వస్తువుతోపాటుభాషా శిల్పాల్లోనూ - సాంప్రదాయిక రీతికి కొంత భిన్నంగా మాండలికం, ఆశుకథా రీతులను ఉపయోగించడం మొదటితరం నుంచే ఉంది. తెలంగాణాలోని మౌఖిక సంస్కృతి, శిల్పక్లిష్టతలేని ఆశు కథన పద్ధతులు లిఖిత కథల్లోనూ ఉపయోగించడం గమనించవచ్చు. అందుకేనేమో మధ్యతరగతి వస్తుశిల్ప దృష్టికోణాలతో కోస్తా ప్రాంతంలో కథావిర్భావ వికాసాలు జరిగిన చాలాకాలం వరకు కూడా తెలంగాణానుంచి కథలు వచ్చినట్టుగా గుర్తించిన వాళ్ళు తక్కువ. ఇప్పటివరకు వచ్చిన తెలుగు కథా సంకలనాల్లోని ఆ పొరపాటు పునరావృతం కాకుండా, 'విశాలాంధ్ర తెలుగుకథ' సంకలనం చాలావరకు జాగ్రత్త తీసుకుంది.

తెలుగు కథ దశను దిశను మార్చేంత గొప్పగా తెలంగాణా నుంచి కథలు వచ్చిన కాలంలోనూ తెలంగాణా రచయితలు వస్తువు కిచ్చిన ప్రాధాన్యత శిల్పానికివ్వరన్న విమర్శలు వచ్చాయి. స్వాతంత్ర్యానంతరం పుట్టిపెరిగి చదువులతో జీవితాలను గెలుచుకొని రచయితలైనవారు లిఖిత కథను ఆశు సాంప్రదాయరీతిలో రాస్తూనే - మధ్యతరగతి వస్తు శిల్పాలనెన్నుకొని రాయడం ప్రారంభించిన తర్వాత తెలంగాణ నుంచి గొప్ప కథలు వస్తున్నాయన్నారు. నిజానికి తీసుకున్న వస్తువుకు తగ్గ భాషా శిల్ప సమన్వయంతో తెలంగాణాలో మొదట్నుంచీ మంచి, గొప్ప కథలు వస్తున్నాయి. విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రచురిస్తున్న ఈ తొమ్మిది పదుల కథలు అందులోని కొన్నిమాత్రమే. ఇవి తెలంగాణా జనజీవన సంఘర్షణను వివిధ కోణాల్లోంచి చిత్రించిన

కథలే తప్ప మొత్తం తెలంగాణా కథలంటే ఇవి మాత్రమే కావు. తెలంగాణా జనజీవన సంఘర్షణ చిత్రణే ఈ కథల ఎంపికకు ప్రధాన ప్రాతిపదిక.

మొదటితరంలో తెలంగాణానుంచి కథలు రాసినవాళ్ళు కేవలం రాసి ఊర్కున్న వాళ్లు కారు. తెలంగాణా వికాసంకోసం శాయశక్తులా కృషి చేసినవాళ్ళే. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, వి.వి. నరసింహారావు, కాళోజీ నారాయణరావు, దాశరథి రంగాచార్యులాంటివాళ్ళకు జీవితం సాహిత్యం వేరు కావు. కోస్తా ప్రాంతంలో నయినా తెలంగాణాలో నయినా మొదటితరం రచయితలంతా తమ సాహిత్యాన్ని సంస్కరణ నేపథ్యంతోనో, స్వాతంత్ర్య కాంక్షతోనో, సామాజిక మార్పు కోసమో ఉపయోగించారు.

అదే పరంపరను తెలంగాణా రచయితలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అన్ని తరాల్లోనూ తెలంగాణా కథ ప్రజాపక్షమే వహించింది. ఏ వ్యాపార మసాలాల జోలికీ పోలేదు. ఏ ప్రలోభాలకూ లొంగలేదు. డిటెక్టివ్, అవాస్తవిక ప్రేమ కథనం, భూతప్రేత పిశాచగణాల ప్రభావం తెలంగాణా కథమీద పడలేదు. ఆ సమయాల్లోనూ, తెలంగాణా నుంచి మంచికథలే వచ్చాయి. తెలంగాణా రచయితలెవరూ నేలవిడిచి సాము చేయలేదు. తెలంగాణా కథ అన్ని ఉద్యమాలనూ తనలో సంలీనం చేసుకుంది. నిజాం నిరంకుశ పాలనలోని దుర్మార్గాన్ని వేలెత్తి చూపింది. రజాకారు వ్యతిరేక పోరాటాలకు అద్దంపడుతూ తెలంగాణా భాషా, సాహిత్య, సంస్కృతుల రక్షణకు నడుంకట్టింది. ఫ్యూడల్ వ్యవస్థను ఎండగట్టింది. భూస్వామ్య వ్యవస్థ పతనానికి స్వాగతం పలికింది. మధ్యతరగతి బతుకు వెతలను తనది చేసుకుంది. గత శతాబ్ది డెబ్భై దశకంలో ప్రారంభమై ఉవ్వెత్తున లేచిన భూపోరాటాలకు దర్పణమైంది. తెలుగు కథకు విప్లవ పంథాను చూపింది. సమీక్షక వాస్తవికతా దృష్టి నుంచి సోషలిస్టు వాస్తవికత వైపు పయనించింది. కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి వర్గాలను అక్కున చేర్చుకుంది... గిరిజన పోరాటాలను అక్షరబద్ధం చేసింది. దళిత కథకు పట్టం కట్టింది. బహుజన జీవితాలకు భాష్యం పలికింది. మైనారిటీలను ఎదకు అదుముకుంది. వివక్షను ఎత్తిచూపింది... ప్రపంచీకరణ భాగోతాన్ని బట్టబయలు చేసింది. శ్రమ సంస్కృతిని ఉన్నతీకరించుకోవడం, దేశీయతను రక్షించుకోవడమే పరిష్కారమార్గమని ధిక్కారస్వరంతో చాటింది. నూరుతున్న విలువలను, పతనమవుతున్న వృత్తులను, ప్రత్యామ్నాయం లేని బతుకులను, మృగ్యమవుతున్న మానవ సంబంధాలను అక్షరీకరించింది. ఉత్తమ సమాజం కోసం తనవంతు కృషిని చేసింది. అస్తిత్వ దిశగా పిడికిలెత్తింది. ఈ తొంభై రెండేళ్ళ కాలంలో తెలంగాణా కథ అనేక పార్శ్వాలను స్పృశించడాన్ని ఈ సంకలనంలో పొందుపరిచే ప్రయత్నం చేశాం.

మొదటితరంలో జరిగిన తెలంగాణా పోరాటాలగూర్చి నవలలు వచ్చినా చెప్పుకోదగ్గ కథలు లభ్యం కాలేదు. స్థల కాలాల చైతన్యంతో తెలుగు కథను విప్లవకథగా తీర్చిదిద్దుతూ వచ్చిన మూడవతరంలో లభ్యమైన కథలు భూపోరాటాల గూర్చిన ఉద్యమ నేపథ్యంలో వచ్చినవి. ఫ్యూడల్ వ్యవస్థ అమలులో ఉన్న కాలంలో పుట్టిపెరిగి, ఫ్యూడల్ వేదన ననుభవించి, అతికష్టంగా చదువుకొని అందులోంచి రచయితలైనవాళ్ళు రెండవసారి ఉవ్వెత్తున లేచిన పోరాటాలకు భాష్యాలనదగిన కథలు రాసినట్టు గమనించాం. తెలంగాణా గ్రామీణ సంఘర్షణను, భూస్వామ్య వ్యవస్థ పతనం దిక్కు పయనిస్తున్న వైనాన్ని, దున్నేవాడికే భూమి చెందాలన్న భావాన్ని

రైతు దృష్టి కోణంలోంచి చూసే కథలుగా భూమి, ఎర్రబుట్ట, ఇత్తనపు కోడె, చిరంజీవి లాంటి కథల్ని ఎన్నుకున్నాం. బలహీనవర్గాల్ని అడ్డం పెట్టుకొని తెలంగాణాలో నడిపిన దగాకోరు రాజకీయాలకు అద్దం పట్టే కథగా 'వీకర్ సెక్షన్లు'ను ఎంపికచేశాం. అట్లాగే గిరిజన భాషా సంస్కృతులకు అద్దంపట్టే కథలను, దిగంబర సాహిత్యోద్యమ కారులైన రచయితలు తెలంగాణా జీవితాల్ని స్పృశించిన కథల్ని ఎన్నుకున్నాం. మార్క్సిజంతోపాటు అంబేద్కరిజంతో ప్రభావితులై తెలంగాణా రచయితలు దళిత కథలను విరివిగా రాశారు. బొమ్మలు, ఎట్టి, కళేబరం, గౌరడు, మా ఊరి ముచ్చట్లు ఇందుకు కొన్ని మచ్చుతునకలు. తెలంగాణా కథకు మరోముఖ్యమైన పార్శ్వం బహుజనకథ.. వివిధవృత్తుల గూర్చి పుంఖాను పుంఖాలుగా కథలు వచ్చాయి. అందులోంచి ఎన్నుకున్న బలమైన కథలకు ఊరుమ్మడి బతుకు, వరుసలు, బోరు పొక్కలు, తెగిన బంధాలు, మట్టిమనుషులు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ కథలన్నిటి ఎన్నిక కోసం అనేక వడపోతలు తప్పలేదు.

పారిశ్రామిక కార్మికవర్గం తెలంగాణాలో స్వాతంత్ర్యానంతరం క్రమక్రమంగా పెరగసాగింది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో గోదావరి నదీతీరం వెంట బొగ్గుగనులు పడ్డ తర్వాత బొగ్గు ఆధారిత పరిశ్రమలు పెరిగాయి. దాంతో కార్మిక వర్గం మరింత పెరిగింది. అయితే కార్మికుల గురించి కథలు చెప్పుకోదగ్గ సంఖ్యలో రావడానికి చాలాకాలమే పట్టింది. భూపోరాటాలు ఉధృతమైన తర్వాత సింగరేణి కార్మికుల గూర్చి ఆ ప్రాంతంలో పనిచేస్తున్న రచయితలు కథలు రాయడం ప్రారంభించిన తర్వాతే కార్మిక కథలెక్కువయ్యాయి. కార్మికవర్గ సంక్షోభంవల్ల అనివార్యంగా పోరుబాట తొక్కాల్సి రావడం ఆ కథల సారాంశం. ఇల్లు, భూ నిర్వాసితులు, బోనస్‌లాంటి కథలిందు కుదాహరణలు. పట్టణ ప్రాంత సంఘర్షణను, కార్మికజీవితాలను చిత్రించే కథలుగా గుడిసెలు! గుడిసెలు!, మంచి మిత్రుల కథలను ఎంపిక చేశాం. ముస్లిం జనజీవన సంస్కృతిని చిత్రించే కథల్లోంచి గుంగీ ధడ్‌కన్, జౌలాద్, గోరీమా, సిల్‌సిలా లాంటి కథలెన్నికయ్యాయి. నైజాం పాలనా కాలంలోని తెలంగాణా బతుకు వెతలను, సంస్కృతీ సాంప్రదాయాలను, భాషా సొగసులను చిత్రించే ముప్పయి కథల్లో గ్యారా కద్దూ బారా కోత్వాల్, చెరువొడ్డున, ఇజ్జత్, ముక్కోటి బలగమోయి, లచ్చి, గొల్ల రామవ్వ కొన్ని మాత్రమే. అన్ని కథలను అంశాల ప్రాతిపదికన కాకుండా ఆయా కథల ప్రచురణ తేదీల కాలక్రమంలో పొందుపరిచాం. కొన్ని కథలకు సరైన ప్రచురణ సంవత్సరాలు లభించని కారణంగా ఉజ్జాయింపుగా కాలాలు నిర్ణయించడం జరిగింది. అవీ కుదరని సందర్భాల్లో రచయితల వయస్సును పరిగణనలోకి తీసుకొని క్రమంలో వుంచాం.

ప్రాంతీయతా ముద్రతో, తెలంగాణాతనంతో, తెలంగాణా జీవద్భాషా పరిమళంతో, స్థలకాలాల చైతన్యమున్న కథలతో ఈ సంకలనం ద్వారా తెలంగాణా ముఖచిత్రాల్ని పాఠకుల ముందుంచే ప్రయత్నం చేశాం. పోరాటాలు తెలంగాణా ప్రాంతంలో తెచ్చిన మార్పులను, అగ్నిగుండాలుగా మారిన గ్రామాలను, తుపాకీ మోతలను, దళితుల, కార్మికుల, వృత్తిపనివారల బతుకువెతలను, తెలంగాణ మోటబావులు, చెర్లు, కుంటలను, నీళ్ళులేని బోరు పొక్కలను, విరిగిన నాగళ్ళను, మూలకుపడ్డ తొండాలను, చీకుపట్టిన పల్లకీలను, విరిగిన మగ్గాలను, ఇంకిపోయిన చెలిమలను,

బొంబై, దుబాయ్‌లకు బతుక పోతున్న వలసజీవులను కళ్ళెదుట పెట్టే కథలకోసం ప్రయత్నించి తెలంగాణ సాంఘిక చరిత్ర రాయడానికి ఉపయోగపడే జీవితాన్ని, సంస్కృతిని, అతారెలను సమకూర్చే గ్రంథంగా ఈ సంకలనాన్ని తీర్చిదిద్దాం. నైజాం పాలనా కాలంనుండి నల్లదొరల పాలనా కాలం వరకు తొమ్మిది పదుల కాలంలోని 'బతుకమ్మ' బరువు బతుకు గాథను - ఈ సంకలనం - కథలు కథలుగా చెప్పాలని మా ఆకాంక్ష.

తొలితరం తెలంగాణా కథలు, తెలంగాణ కథ 2003, తెలంగాణ కథ 2004, ఆధునిక కథాసరిత్సాగరం కరీంనగర్ కథలులాంటి అతి కొద్ది కథా సంకలనాలు తెలంగాణనుంచి రావడం ఇటీవలి కాలంలోనే ప్రారంభమైనా, తొంభై కథలతో అన్ని పార్శ్వాలను స్పృశిస్తూ వస్తున్న అతిపెద్ద తెలంగాణ కథల మాలిక ఈ పుస్తకం. విభిన్న పుష్పాలతో ఏకమాలగా సంకలనాన్ని కూర్చే ఈ పథకానికి ఎందరో సాహితీమిత్రులు తమ అమూల్య సలహాలు, సూచనలనిచ్చారు. తమ దగ్గరున్న అరుదైన కథలప్రతులను అందించారు. సర్వశ్రీ కేతు విశ్వనాథరెడ్డి, ముదిగంటి సుజాతారెడ్డి, బి.యస్.రాములు, కాళీపట్నం రామారావు, డా॥ ఎస్వీ సత్యనారాయణ, దేవరాజు మహారాజు, కాసుల ప్రతాపరెడ్డి, ఎన్.వేణుగోపాల్, సంగిశెట్టి శ్రీనివాస్ తదితర సాహితీ బంధువులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. అలాగే తెలుగు విశ్వవిద్యాలయ గ్రంథాలయం, నగర కేంద్ర గ్రంథాలయం, కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయం, శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయంలాంటి గ్రంథాలయాలు మాకెంతో తోడ్పడ్డాయి. వాటి నిర్వాహకులకు మా కృతజ్ఞతలు.

లాభనష్టాలు బేరీజు వేయకుండా ఈ బృహత్ గ్రంథ ప్రచురణకు నడుంకట్టిన విశాలాంధ్ర ప్రచురణాలయం వారికి, తమ కథలను చేర్చడానికి అంగీకరించి సహకరించిన తెలంగాణ కథకులందరికీ మరీమరీ ధన్యవాదాలు.

హైదరాబాద్
మార్చి, 2005

**కాలువ మల్లయ్య,**
**సదానంద్ శారద,**
**చంద్ర.**

# 1. ఎవరికి?

♦ మాడపాటి హనుమంతరావు ♦

"మీ యోగత్యకు తగిన ఉద్యోగము మా వద్ద ప్రస్తుతము ఖాళీలేదు. మిమ్మును మా దగ్గర ఉంచుకోవలెనని ఉన్నది. కానీ ఏమి లాభము?" అని జమీందార్ ప్రతాపవర్మగారు తమ రాజఠీవిని ప్రకటించుచు మోహనరావుతో బలికిరి.

మోహనరావు కాలేజి వదిలిన తరువాత ఏదైన తగిన జీవనోపాధి సంపాదించు కొనుటకై యాలోచించవలసిన వాడయ్యెను. నీతివర్తనమునకు అడ్డములాని ఏదేని వృత్తి నవలంబించ వలయుననియు, భుక్తి, ముక్తి రెండును కలిసివచ్చునట్లు తన కుటుంబ పోషణ చేసుకొనుచు తోడిమానవుల యోగక్షేమములను కనుగొను నవకాశమును సంపాదించ వలయుననియు అతని మనోరథము. ఏదైన ప్రభుత్వ కార్యాలయములో లేఖకునిగా ప్రవేశింతునా, జనసామాన్యముతో సంబంధముండదు కనుక అది వలదను కొనెను. "న్యాయవాది వృత్తికై యత్నింతునా? దానియందు రెండు కోరికలును నెరవేరును. కాని భగీరథ ప్రయత్నము చేసినను నా నడవడిని నిష్కళంకముగ నుంచు కొనుట అసాధ్యము కనుక అది పనికిరాదనుకొనెను. "పోలీసు ఉద్యోగమున బీదసాదల యెడ దయచూప వీలుకలదు. కాని అచ్చటి వాతావరణము సద్వర్తనమునకును, న్యాయ స్వభావమునకు వీలు కలిగించదు. కనుక అది అసలే తలంపకూడనిది" అని నిశ్చయించెను. ఈ విధముగా ఎన్నియో తెన్నుల విచారించి ఆలోచించి, చివరకు జమీందారుని వద్ద యుద్యోగము సర్వవిధముల మంచిదనుకొనెను. "ఏ జమీందారు కడకైనను ముఖ్యోద్యోగిగ ప్రవేశించితినేని... జీతము తక్కువ దొరికిన మానె పేదసాదలగు రైతులతో రాత్రిందినములు కలిసిమెలిసి యుండగలను. వారి క్షేమమునకై ఉపకరించగలను. డంబములేని సాధుజీవనమును గడుపగలను... ఇదియే మంచి మార్గము" అని నిశ్చయించుకొని, విఖ్యాతుడగు జమీందారు ప్రతాపవర్మగారి దర్శనము చేసి, "నన్ను దేవరవారి సేవకాబృందమున చేర్చుకొన ప్రార్థించుచున్నా" నని సవినయముగా మనవి చేసుకొనగా జమీందారు గారు, ప్రత్యుత్తరము పైన ఉల్లేఖింపబడిన విధమున అనుగ్రహించిరి.

"నా కొరకు ప్రత్యేకమగు ఉద్యోగము అవసరములేదు." మోహనరావు సవినయ ముగ పలికెను. "నేను పని ఎట్టిదైనను సంసిద్ధుడనైయున్నాను. జీతము యిష్టాను సారము దయచేయవచ్చును. జమీందారు వద్ద తప్ప వేరేయుద్యోగము చేయవలదని నేను నిశ్చయించుకొన్నాను."

"జమీందారు వద్ద నౌకరీకాదు; దొరతనమనుకొనండి" ప్రతాపవర్మగారు సగర్వముగా నాజ్ఞాపించిరి. "చూడండి నేను చప్రాసీకి (బంట్రోతుకు) నెలకు నాలుగు రూపాయలు యిస్తాను. వాడు పట్టుకోట్లు తొడుగుకొనుచున్నాడు. వాని చాకిట్లో గుర్రములున్నవి. నా గుమస్తాలకు జీతము ఎనిమిది రూపాయలు కదా. వారు వకీళ్ళతో సంబంధము చేయుచున్నారు!! వారి సంపాదనలో ఎట్టి మహాత్మ్యము ఉన్నదో తోచదు. ఏండ్లు గడిచినను జీతము లెక్క చూచుకొనరు! ఎందరో ఇప్పుడు జీతము లేకుండ చప్రాసి పని, గుమస్తా పని యిప్పించవలసినదని ప్రార్థించుచున్నారు! కాని మా సంప్రదాయము అట్టిది కాదు. మా ముఖ్యారు అనగా ఏమనుకున్నారు? అది రెండవ జమీందారీ పదవియే! అదే రీవి, అదే వైభవము, అదే గాంభీర్యము! ఈ ఉద్యోగపు రుచి తగిలినవాడు తహశీలుదారు నౌకరీని తృణీకరించుతాడు!!"

"చిత్తము" అని శిరఃకంపము చేయవలసియుండెను. కాని మోహనరావు అట్లు చేయలేదు. ప్రపంచ ధర్మములు యింకను ఎరుగనివాడు కనుక అనెను: "నేనిదివరకు ఏ జమీందారీలోను నవుకిరీ చేయలేదు. ఇటీవలనే కాలేజి విడిచినాను. తమరు సెలవిచ్చిన కారణములనుబట్టి నేను ఉద్యోగము కోరుటలేదు. కాని ఒక సంగతి. ఇంత కొద్ది జీతము చాలదు. తమ నౌకరులు పేద రైతులను పీడించి సంపాదించు చుండవచ్చును. కాని నావల్ల అటువంటి పని కాజాలదు. ప్రమాణ బుద్ధిగల నౌకరులకు ప్రోత్సాహము దొరుకుట సాధ్యమే అయిన పక్షమున, నేను త్వరలో తమ అనుగ్రహమునకు పాత్రుడనగుదునని నమ్ముచున్నాను."

ప్రతా: "నిజమే కాని, ఎక్కువ జీతము యియ్యవీలు పడదు!"

మోహ:- "అట్లయిన పక్షమున నన్ను క్షమింపగోరుచున్నాను. ప్రమాణ బుద్ధిగల ఉద్యోగి ఇంత చౌకగా దొరకడేమో!"

జమీందారుగారు ఆలోచింపసాగిరి. కోర్టులలో ఎల్లప్పుడు కాగితములు దాఖలు చేయవలసియుండును. ఇంగ్లీషులో తర్జుమా చేయించుటకు బోలెడు ఖర్చుపెట్టుట తప్పదాయెను. ఇతడు అమాయకుడుగా నున్నాడు. ఇంగ్లీష్ వచ్చినవాడు కూడను. కొంచెము ఎక్కువ జీతము యిచ్చినా బాధలేదు. అయినను ప్రస్తుతము జవాబు ఏదైనా చెప్పవలెను. కనుక జమీందారు గారు యిట్లనిరి:

"పంతులుగారూ! ప్రమాణ బుద్ధికలవాడు ఎంత తక్కువ జీతము యిచ్చినను తన మార్గమును వదలడు. అదే విధముగా దుర్వర్తనము కలవాడు ఎక్కువ జీతము తీసుకున్నంత మాత్రాన ప్రమాణ బుద్ధి కలవాడు కాజాలడు. నీతికి ద్రవ్యమునకు ఎట్టి సంబంధము లేదు. నేను నా మట్టుకు ఎందరో నీతిగల చప్రాసీలను చూచినాను. లంచగొండులగు హైకోర్టు జడ్జీలను చూచినాను! సరే పోనియ్యండి, మిమ్ములను నా ఊళ్ళలో కొన్నిటికి ముఖ్యారుగా ఏర్పరచగలను. మీ పని చూచిన తరువాత జీతము వృద్ధి కూడా కాగలదు."

మోహనరావు యిరువది రూపాయల జీతం ఒప్పుకొనెను. తిమ్మాజిపేట పట్టీకి అతడు జమీన్‌దారు తరపున ముఖ్యారుగా నియోగించబడెను.

## 2

మోహనరావుకు ఈ ఉద్యోగము, జమీందారు గారు సెలవిచ్చినట్లు "దొరతనము" వలెనె యుండెను. అందమైన బంగాళా, కుర్చీలు, బల్లలు, మంచములు మొదలైన పరికరములు సమృద్ధి. ఎందరో చప్రాసీలు, ప్రయాణమునకు మంచి గుర్రపు బండి చేయేల సుఖమునకు కావలసిన సామాగ్రియంతయు నుండెను. కాని ఈ ఆడంబరములు మోహనరావును సంతోషపరచలేదు. తన చుట్టుప్రక్కల లెక్కలేని బీదసాదల గుడిసెలుండగా అతనికి బంగాళా నివాసము సుఖప్రదముగా తోచలేదు. గుడిసెలోని మనుష్యులు మట్టి ముంతలు వాడుకొనుట చూడ అతనికి బంగాళాలోని మంచి పాత్రలు యింపుగా కానరాలేదు. నలుదెసల నివసించుచున్న కుటుంబములకు కుక్కి మంచము లైనను గతిలేకయుండ, బంగాళాలోని పట్టె మంచములు అతనికి ఆసక్తి గొలుపలేదు. రైతులు ప్రతిస్వల్ప విషయమునకు భయభ్రాంతులై వడవడ వడకుచుండ, గంభీరధ్వనులుచేయు పరిజనులయొక్క సేవ అతనికి సంతోషప్రదముగ నుండలేదు. చుట్టును కనుమేరదూరము వ్యాపించియున్న దారిద్ర్యమునకు నడుమగల ఐశ్వర్యధామము అతని మనస్సునకు బాధాకరముగ కన్పట్టసాగెను!

మోహనరావు ఉద్యోగమున ప్రవేశించి బంగళాలో దిగిన నాడే, రైతులందరు కానుకలు తీసుకొని వచ్చిరి. కాని అతడు కాసైనను ముట్టడయ్యె. ఇది వారికి ఆశ్చర్యము కలిగించెను. వారు సంతోషించిరి. కాని చప్రాసీలకు మాత్రము ఈ వర్తనము వెగటుగా దోచెను! ఊరి మంగలివాడు కాళ్ళు పిసుకుటకై వచ్చెను. అక్కరలేదని పంపివేయబడెను. గొల్లవాండ్ర యింటినుండి బుడ్డెడు మంచి పాలు వచ్చెను. అవసరము లేదని త్రిప్పివేయబడెను. తోటవాడు తమలపాకులు కట్ట తెచ్చి సమర్పింపజూసెను. "నాకు అలవాటు లే"దని పంపివేయబడెను!

రైతులు తమలో తాము 'ఈయన ధర్మరాజువలె ఉన్నాడు సుమా' యని గుసగుస లాడుకొనిరి. ఎవరేమైన అనుకొనెదరుగాక! ఎవరైన సంతోషించిన సంతోషించెదరు కాక! చప్రాసీలు ఇట్టి వర్తనమును సహింపగలరా? వారు ధైర్యముతో మోహనరావుకు విన్నవించిరి. "మీరు ఈ కానుకలను తీసుకొనకపోయిన మానె. కాని ఆచారము పోగొట్టుట బాగుండదు. ముందు కొత్త ఉద్యోగి వచ్చినప్పుడు ఈ ఆచారమును పునస్థాపితము చేయవలసి వచ్చును. అది చాలా కష్టమైన పని!"

మోహనరావు దీనికొకటే జవాబు చెప్పెను. "ఎవడి తిప్పలు వాడు పడగలడు. నే నిప్పటినుంచే ముందు వచ్చేవారి విషయమున కష్టపడవలసిన పని ఏమి?"

ఒక చప్రాసి ధైర్యముచేసి యనెను. "అయ్యా! ఈ రైతులు తమరు అనుకొను చున్నంత బీదవారు కారు. వీరిట్టి వేషములు వేయుచున్నారు. అంతే! ఉత్త నటన!! చూచుటకు వీరొక్కరు కొమ్ములులేని అవులుగా నున్నారు. కాని ఒక్కొక్కడు ఒక్కొక్క హైకోర్ట్ వకీలు అనుకొనండీ!..."

అయినను చప్రాసీల ఈ వాదము మోహనరావు హృదయమును మార్చలేక పోయెను. అతడు ప్రతి రైతుతోను నెమ్మదిగ మాట్లాడసాగెను. వారి విషయమున మహా దయతో ప్రవర్తించుచుండెను. ఉదయము ఏడుగంటల నుండి తొమ్మిదిగంటల

వరకు ఉచితముగా ఔషధము లిచ్చుచుండెను. తరువాత తన లెక్కపుస్తకములను వ్రాసుకొను చుండువాడు.

ఈ విధముగా నతని వర్తనము రైతుల మనస్సుల వశము చేసుకొనెను. పూర్వము ప్రతి సంవత్సరము పన్నులు వసూలుకాక ఆస్తుల జప్తు చేసుకొనవలసి వచ్చెడిది. ఈ సంవత్సరము ద్రవ్యము అవలీలగా వసూలు ఆయెను. బీదసాదలందరు వేళయనక పాళయనక తమ కష్టనిష్ఠూరముల చెప్పుకొనుచుండిరి.

## 3

మన ప్రతాపవర్మగారు రైతుల మీద అభిమానము కలవాడే. వారికి విత్తనములకు గింజలు యిచ్చును. కూళ్ళకు, ఎద్దులకు డబ్బు యిప్పించుచుండును. పంటకళ్ళముల మీద ఒకటికి ఒకటిన్నర లెక్క చొప్పున తిరిగి పుచ్చుకొనును! అంతే.

ఈ పద్ధతిపైననే తిమ్మాజీపేట పట్టీ రైతులు జమీందారుగారికి అప్పుపడి యుండిరి. ఇంకను కొంత ధాన్యము కళ్ళములలో నుండెను. కొంత రైతుల యిండ్లు చేరెను. దొరవారు రైతులను పిలిపించి డబ్బుకు తొందర పెట్టిరి.

"దొరగారూ! రకం అంతా యిప్పుడు పెకలదు. కొంత యిప్పుడు తీసుకోండి; కొంత తరువాత ముట్టచెప్పుకుంటాము. మా ప్రాణాలు దొరవారి చేతులలోనే యున్నవి కదా!" అని రైతులు చెప్పుకొనిరి.

ప్రతా:- "అట్లా పనికిరాదు. దమ్మిడీకి దమ్మిడి బేబాకు చేసి అవతలపొండి. అంతవరకు అడుగు అవల పెట్టనియ్యను. మీ చేష్టలు ఎప్పుడూ ఇట్లాగే వుంటవి!"

ముసలి పాపిరెడ్డి అనెను :- "అయ్యా, కానిండి ఏమి చేస్తాము. మాకేంగావాలి! దొరగారిది గంజి; మావి కడుపులు. ఇంత పిండం వెయ్యండి. తింటూ పడి వుంటాము. అసలు అంతా దొరగారిదేకదా. అయ్యా, మేమింత చాకిరి చేసి పొట్ట గంజితో నింపుకొనేవాండ్లము!"

శ్రీశ్రీ ప్రతాపవర్మగారికి ఆ ముసలివాని పొగరుబోతుతనము చూచి ఆగ్రహము వచ్చెను. ఆయన రాజుగారు కదా, అడ్డము ఎవరు? పండ్లు పటపటకొరికి కండ్లెర్రచేసి పల్కెను. "చూస్తారేమిరా! ఆ ముసలివాడికి కొంచెము ముల్లు పెరిగినట్లున్నది. పిండు, వాడి చెవులుపిండు!"

దొరవారు ఈ మాటలు ఊరికే బెదిరింపుకు అనిరేమో, కాని చప్రాసీలు ఊరకుందురా? ఇంతకు ముందే తిమ్మాజీపేట పట్టీ రైతులపైన వారికి కన్నెర్రగా నుండెను! అబ్దుల్లా చప్రాసీ వెంటనే ముందుకు దుమికి ముసలి పాపిరెడ్డిని మెడపట్టి తోసెను! పాపము, ముసలి రెడ్డి నేలమీద బోరగిల పడిపోయెను. అది వరకు సహించి శాంతముతో నిలబడి యుండిన పదుచువాండ్రు పాపిరెడ్డి కొడుకులు ఇద్దరు. కస్సుమని ముందడుగువేసి అబ్దుల్లా పైనబడిరి. సాహెబు కూడ్తా చినిగెను! దభీలున క్రిందపడెను. కాని వాక్శూరత్వము రవంతయైనను తగ్గలేదు!

అనుభవశాలియైన పాపిరెడ్డి పరిస్థితులను నిమిషములో గ్రహించెను. లేచి నిలుచుండి అబ్దుల్లాను విడిపించెను. కొడుకులను తిట్టనారంభించెను. కుమాళ్ళు తండ్రిని

ఘురకాయించిరి. అంతలో రెడ్డిపోయి వర్మగారి కాళ్ళమీద పడెను. కాని, లాభమేమి? పాకము ముదిరినది. పాపిరెడ్డి యొక్క సమయోచిత ప్రజ్ఞ నిరర్థకమైనది. ప్రతాపవర్మగారి కన్నుల నుండి నిప్పులు గురియుచుండెను. ఆగ్రహపరవశుడై పాపిరెడ్డిననెను.

"చండాలుడా! వెళ్ళిపో, నా యెదుట నిలువకు, నిలిస్తివా నీ నెత్తురు తాగినానసుకో!"

ముసలివాని శరీరములో దొరవారు త్రాగుటకు రక్తము అసలే లేదు. కాని ఉష్ణము మాత్రముండెను. న్యాయము జరుగునేమోయని అతడు ఆశించియుండెను. ఈ కఠోర వాక్యములు విని అనెను. "అయ్యా! ముసలితనములో దొరగారి గడీ ముందర నా మానము మంటిలో గలిసెను. పైగా నన్ను తిట్టుతుంటిరి!"

ప్రతా:- "ఇప్పుడే మానము ఏమి పోయిందోయ్. ముసళ్ళ పండుగ ముందున్నది! చూతువుగానిలే."

పాపిరెడ్డి కొడుకులు కొంచెము ముందునకు వచ్చి గట్టిగా ననిరి. "దొరగారూ, తమరు రూపాయలు తీసుకుంటారా, మానము తీసుకుంటారా?"

ప్రతా:- "చూతాము లెండోయ్. మీ రూపాయలు తరువాత తీసుకొంటాలే. మీ మానము ఏపాటిదో కొంచెము పరీక్షింతాము."

## 4

తిమ్మాజీపేట రైతులు స్వగ్రామము పోయి జరిగిన వృత్తాంతము మోహనరావుతో చెప్పుచుండగానే, ప్రతాపవర్మగారి నౌకరులు వచ్చి మోహనరావుతో ననిరి. "దొరవారు మిమ్ములను రమ్మన్నారు."

మోహనరావు రైతులకు సమాధానము చెప్పి, వెంటనే గుర్రమెక్కి దివాణములోనికి వచ్చెను.

ప్రతాపవర్మ దీవాన్‌ఖానాలో కూర్చుండియుండెను. అతని చూపులు అగ్నిజ్వాలల వెదజల్లుచుండెను. గుమస్తాలు, చప్రాసీలు చుట్టూ మూగి ఆ జ్వాలలపైన తైలము చల్లుచుండిరి! మోహనరావును చూడగానే ప్రతాపవర్మ తీక్ష్ణదృష్టులతనిపై బరపి, "తిమ్మాపేట రైతుల చేష్టలు చూచినారా?" అని ప్రశ్నించెను.

మోహ:- (తల వంచి) "అయ్యా! విన్నాను. చాలా విచారపడితిని. వాండ్లు అంత పొగరుపోతులు కాకుండిరి!"

ప్రతా:- "అయ్యా! నిజమే కాకుండిరి. కాని, యిది అంతా తమ సహవాస ఫలితము. మీరింకా బడి పిల్లవాండ్రు. ప్రపంచములో ఎట్లా నడుచుకోవలెనో మీకు ఏమి తెలియును? రైతుల విషయమున మీ ప్రవర్తన ఈ ప్రకారమే సాగుతూ వున్నట్టయితే, నా జమీందారీ బాగా తగలబడ్డట్టే! ఇదంతా మీ ప్రభావము. ఈ నా గడీ దర్వాజా ముందర - ఈ వాకిట్లో నేను మా, - ఆసామీలను తాళ్ళతో తలకిందుగా వేళ్ళాడ గట్టించి ఉంచాను! తెలుసునా? ఒక్కడన్నా కుంయ్య మన్నాడా? ఇప్పుడు చూచినారా, నా యెదుటనే నా నవుకరు మీద కలియబడిరి!"

మోహ:- (వినయముతో) "అయ్యా! ఈ విషయమున నా దోషమేమి? ఈ సంగతి విన్నప్పటి నుండి నేను చాలా దుఃఖించుచున్నాను."

ప్రతా:- "మీది కాకపోతే ఎవరిదీ తప్పు? మీరే కదా వీరిని తలపై కెక్కించుకుంటిరి. వెట్టిపని తీసివేస్తిరి. వీండ్లతో అస్పృశ్యులచలె మెదల మొదలు పెట్టితిరి. వారితో ఎకసక్కెములాడుచుంటిరి. ఈ హల్యాండ్లు మీ ప్రవర్తనమును గ్రహించగలరా? విన్నారా? పుస్తకములలో, పాఠశాలలో, కాలేజీలలో చదువుకొన్న నీతులు బళ్ళల్లో పనికివచ్చేవే సుమండీ. అంటే ప్రపంచములో నడచుకొనవలసిన నీతి పద్ధతి వేరే. సరే! జరిగినదేదో జరిగినది పోనియ్యండి. ఈ రైతు ముండాకొడుకులు చేసిన బద్మాషీకి గాను వారికి కొంచెము రుచి చూపించవలెనని ఉన్నది! ఏమంటారు? ఆసామీలు చెల్లించిన మాల్గుజారి పైకమునకు మీరు రసీదులు యింకా యియ్యలేదు కదా?"

మోహనరావు భయపడుచు అనెను:- "లేదండీ. రసీదులు తయారైనవి. తమ దస్కతుకొరకు మాత్రము ఆగియున్నవి."

ప్రతాపవర్మ ముఖమున సంతృప్తి ప్రకటితమయ్యెను. ఇట్లనెను :- "ఇది మంచిపనియే. శుభసూచనయే. ఆ రసీదులను పరశురాము ప్రీతి చెయ్యండి. తెలిసిందా? వీండ్ల మీద మాల్గుజారీ పైకము బాకీ వున్నదని దావాలు చేతాము. వీండ్ల పంటలను జప్తు చేయించి హర్రాజు చేయింతాము. అప్పుడు గాని వీరికి గింజల ధర తెలిసిరాదు! ఇప్పటివరకు వసూలైన పైకమును విత్తనములు, ఎద్దు వీటి బాకీలకింద జమ కట్టుకొనండి. మీరు మాత్రము సాక్ష్యములో, 'వాండ్లిచ్చిన పైకము మాల్గుజారి కింద యియ్యలేదు; పాత బాకీల కింద చెల్లించినా' రని చెప్పవలసి యుంటుంది. అంతకంటే మించి యేమీ లేదు."

మోహనరావు ఆలోచనలో మునిగెను. "ఏ బాధలు పలదని, మారుమూలలో శాంత జీవనమునకు నేను ప్రాముఖ్యతనిచ్చియుంటినో, ఆ బాధలే, ఆ తికమకలే నన్ను లోబరుచుకొనునా? తెలిసియుండి ఈ పేద రైతుల గొంతులపైన కత్తి వేటు ఎట్లు వేయించగలను? ఈ విధముగా నాకు జీవనోపాధి లభించవలసినది? ఇట్టి కార్యము నా వలన కాజాలదు!" అనుకొని మెల్లగా నడిగెను.

"అయ్యా! నా సాక్ష్యము లేకుండ పని వెళ్ళజాలదా?"

ప్రతా:- (మందధ్వనితో) "ఇంతమాత్రము అనగూడదా? మీకేమైనా ఆక్షేపణయా?

మోహ:- (మందధ్వనితో) "నేను తమ పోషణలోనున్నవాడను, ప్రతిజ్ఞను చెల్లించుటకు సంసిద్ధుడను. కాని నేనెపుడును సాక్ష్యమిచ్చిన వాడనుగాను. నా వలన ఈ పని కాజాలదేమో? నన్ను క్షమింపుడు."

ప్రతా:- (ఖండితముగా) "ఈ పని మీరు చేయక తప్పదు. దీనిలో వెనుక ముందాడవద్దు. మీరు పెట్టిన మంటను మీరు కాక మరెవ్వరు చల్లార్పగలరు?"

మోహ:- "అయ్యా! అబద్ధములు చెప్పు అలవాటు నాకు లేదు. ఇట్టి సాక్ష్యము నే నియ్యజాలను."

ప్రతాపవర్మ కొంత తిరస్కారభావము, కొంత ముజ్జగింపు కలసియుండు వైఖరి సంభాషించి ఇట్లు బోధించెను:- "మిత్రవర్యా, ఇది అసత్యము చెప్పుట కాదు. నేను అబద్ధపు వ్యాపారము చేయను. 'రూపాయలు ముట్టనేలేదని చెప్పండి' అని నేను మిమ్ములను అడుగుట లేదు. రైతులు నాకు బాకీదారులు కనుక వారు చెల్లించిన పైకమును నా పాత బాకీల కిందనైనా జమకట్టుకొనవచ్చును. అట్టి అధికారము నాకున్నది. ఇంత మాత్రపు మాట మీకు అసత్య ప్రలాపముగా తోచినట్లయితే మీదే అన్యాయము! మీరింకా ప్రపంచమును చూడలేదు. మీరు తలంచిన సత్యవర్తనమునకు ఈ ప్రపంచములో ఎక్కడా తావులేదని తెలుసుకోండి. మీరు నా నౌకరులు. నా ఉప్పు తినినందుకు మీపైన కర్తవ్యభారమేమైన ఉన్నదంటారా?లేదంటారా? మీరు విద్యాధికులు. వృద్ధికి రాదగినవారు. ఇంకా మీరు ప్రపంచంలో చాలా దినములు వుండవలసిన వారు. చాలా పనులు చేయవలసినవారు. ఇప్పుడే యిటువంటి నడవడి మొదలు పెట్టినట్లయితే జీవితములో మీకు నిరాశ, దుఃఖము ఇవి తప్ప గత్యంతరము లేదు. ప్రామాణిక బుద్ధి నిజముగా చాలమంచిదే, కాని మితమును దృష్టిలో నుంచవలెను. అతి సర్వత్ర వర్జయేత్! ఎక్కుచ ఆలోచన వద్దు, ఈ సమయమే అట్టిది."

ప్రతాపుడు జగమంతటిని గాలించిన ముసలి అనుభవ శాలి. అట్టివాని యెదుట పొట్టిగాడైన మోహనరావు నిరుత్తరుడయ్యెను. "ఇటా", "అటా" అని విచార సాగరమున బడి మునుకలు వేయుచుండెను. అట్టి ఆందోళనము ఉత్తమ సంకల్పమునకు విషప్రాయము గదా?

## 5

పది పదునేను దినములలో తిమ్మాజీపేట పట్టి రైతుల మీద మున్సిఫ్ కోర్టులో దావాలు దాఖలు అగుటయు, ప్రతివాదులకు సమనులు వచ్చుటయు జరుగనే జరిగెను. ఇంటింట రోదనములు ఆరంభమయ్యెను. స్త్రీలు దొరవారిని దీవించసాగిరి. పురుషులు దోషములను తమ అదృష్టములపై బడవేసిరి. పేషీ తారీఖున రైతులందరు కూడగట్టుకుని న్యాయస్థానమునకు ప్రయాణమైరి. స్త్రీలు వారి వెనువెంట పిల్లల నెత్తుకొని ఎంతో అపాయము వాటిల్లినట్లు బయలుదేరిరి! మరల భర్తల ముఖములను చూడమనుకొనిరా?

మోహనరావు మానసికావస్థ యెట్లుండెనో ఊహింపుడు. అటుపక్క జమీందారుగారి బుజ్జగింపు, ఇటుపక్క బీదరైతుల హాహాకారములు. రెండు మూడుదినములు ఆందోళనములో చిక్కుకొని యుండి తుదకు నిశ్చయించుకొనెను. "ఇది మొదటి పరీక్ష. దీనిలో పడిపోయితినా జీవితమున ఎదుర్కొను పరీక్షలలో నిలుచుట అసంభవము! నా లాభము కొరకు నోరు లేని వారిని కష్టముల పాలుచేయజాలను! చేయజాలను!!"

మొత్తము మీద న్యాయస్థానములో విచారణ జరిగెను. మోహనరావు ముఖ్య సాక్షి. ఇతనిని బోనులో నెక్కించి వాజ్మూలములు బుచ్చుకొనిరి. అతని

దండము పెట్టెను. దొరవారికిది స్వప్నావస్థగా తోచెను. పుల్లారెడ్డి ప్రభువుగారితో కేలుమోడ్చి యనెను.

"దొరగారూ! మా తప్పు మన్నించవలెను. మేము దేవరవారి సేవకులము. దొరవారే మమ్ములను బ్రతికించుచున్నారు. ముందు కూడా మా మీద అనుగ్రహం వుంచవలెను."

"మోహనరావు వెళ్ళిపోయినాడు కనుక వీండ్ల మదమడిగినది. ఇక ఎవరి ఆసరా వున్నది? ఆ దుర్మార్గుడే కదా వీరందరిని రెచ్చగొట్టినాడు." అనుకొను జమీందారు గర్జించుచు పలికెను.

"ఏడీ మీ దొర, మీ పోషణకర్త మోహనరావుగారు? ఆయన ఎదుటికి వస్తే కొంచెము వారి యోగక్షేమము తెలిసికొందునే!"

పుల్లారెడ్డి కన్నులలో నీరునిండెను. అతడు పలికెను.

"దొరగారూ! ఆయనను మీరు ఏమీ అనకూడదు. అతడు మనుష్యుడు కాడు; దేవత. అతడు మాకు ఏ దుర్బోధన చేయలేదు. మీ పాదముల తోడు. అతడు మాకు మాటిమాటికి 'యజమానునితో పోరాటము వలదు జాగ్రత్త' అని హెచ్చరించుచుండువాడు. మా దగ్గిర పంచపాత్రెడు మంచినీళ్లయినను త్రాగిన పాపమున పోలేదు! పోవునపుడు మాతో గట్టిగా, యజమానునికి మీరు యెంతెంత బాకీయున్నారో అది పైసా పైసా లెక్కచేసి పంపించండి! అని చెప్పిపోయెను. తమరు మాకు అన్నముపెట్టే దొరలు. మేము మీ నీడలో వున్నాము. ఈ శరీరములు మీరు పెట్టిన ఆహారమువలన పెరిగినవి. కనుక మా మనవి యేమనగా, మా లెక్కపత్రము జూచుకొని మేము ఎంత బాకీ యున్నామో చెప్పండి. సొంతము చెల్లించిగాని మంచినీళ్ళు తాగము."

గుమాస్తాగారు పుస్తకములు తెరచిరి; రైతులు సంచుల తెరచిరి. ఆరువేల రూపాయలు కుప్పలు కుప్పలుగా యెదుట నిలచెను. ఒక దమ్మిడియైన బాకీ లేదు. ఇది న్యాయవర్తనము యొక్క ఫలితము! జులుముచేతను, బలాత్కారముచేతను ఏ పని జరుగలేదో, మంచితనముతో ఆ పని జరిగినది.

రైతులు న్యాయస్థానము నుండి తిరిగివచ్చిన వెంటనే బాకీ చెల్లించవలెనని వారికి తోచెను. మోహనరావును వారు ఈశ్వరావతారముగా భావించుచుండిరి. అట్టివాడు పైకము చెల్లించుమని ఆజ్ఞాపించిన తరువాత వారిక వెనుకముందు జూతురా? కొందరు గుమ్ములలోని ధాన్యము అమ్మిరి. కొందరు నగలు తాకట్టు పెట్టిరి. కొందరు పశువులను విక్రయించిరి. ఎట్టి శ్రమకైనను ఓర్చిరి కాని, మోహనరావుయొక్క ఆజ్ఞను ఉల్లంఘించ దలచరైరి.

ప్రతాపవర్మ ఇప్పుడు కన్నులు తెరచెను. మోహనరావు వద్ద ప్రసంగావధానము, సమయోచితబుద్ధి లేకపోయిన లేకపోవచ్చును. కాని అతడు యదార్థవాది. ధర్మాత్ముడు అని నిశ్చయించుకొనెను.

తిమ్మాజీపేట పట్టీ రైతుల నుండి తరువాత అతనికెట్టి శ్రమయు గలుగలేదు. బాకీ అనునది లేకుండపోయినది.

ప్రతాపవర్మ జీవితము ఐశ్వర్యముతో గడచెను. అయిదుగురు కుమార్తెల వివాహములు వైభవముతో జరిగినవి. తిమ్మాజీపేట పట్టణము తక్కిన ప్రాంతముల రైతులలో జరుగవలసిన లాంఛనములు జరుగుచునే యుండెడిది. పూర్వము వలెనే అల్లరులు, ప్రతిదినము న్యాయస్థానములో పనులు చుండుచునే వచ్చెను. ఫౌజ్దారి క్రిమినల్స్ కోర్టులలో కూడ పని చేరిందఁ డయుండనే యుండెను. దెబ్బలింపులు, చీవాట్లు, ఎండలో కూర్చుండబెట్టుట, చెవుల మీండింపు ఇవన్నియు యథావిధిగా నుండెను. ఈ మాత్రము లేకపోతే ఇక దొరతనమేమి?

జమీందారుగారికి క్రమముగా ముసలితనము వచ్చెను. పూర్వపు ఝుంకారములు, హడావిడులు తగ్గెను. శారీరకశక్తులు సన్నగిల్లెను. కోర్టువ్యవహారముల తర్క వితర్కములు తగ్గి, భగవద్గీతాపారాయణము, సాధువుల సేవ కొంతకొంత యిష్టము కాసాగెను. అట్టి వార్ధక్యదశలో వర్మగారికి పుత్రోద్భవమైనది.

వ్యాధులు క్రమముగా దేహము నాచరించెను. వైద్యుల రాకపోకలు హెచ్చెను. ఔషధములు గుణములిచ్చుట మానెను. ఈవిధముగా రెండున్నర సంవత్సరములు గడచినవి. శారీరక మానసిక శక్తులన్నియు తిరుగబడెను. జీవితపు ఆశ పలుచబడి "దినములు దగ్గరికి వచ్చినవిరా" అనిపించెను.

"ఇంత పెద్ద ఆస్తిని ఎవరిపైన వదలిపెట్టుదును? కోరికలన్నియు వృథయయ్యెను. పిల్లవానిని యొక యింటివానిగ చేయనైన చేయజాలకపోయితిని. ఈ పసిపాపను ఎవరికప్పగింతును? ఈ మొక్కను పెంచి పెద్దచేయువారెవరు? పిల్లవాని తల్లియా - యీడుది, ఏమియు ఎరుగదు. వ్యవహార భారము దుర్భరము, ఆడది ఎట్లు సంబాళించు కొనగలదు? గుమస్తాలు, సౌకరులు ఎందరో - కరువుకు చచ్చినంత మంది - పున్నారు. కాని ఏమి భాగ్యము? అందరూ మోసకారులు, లుచ్చాలు, స్వార్థపరులు, ఒక్కడైన నమ్మకమైనవాడు కాడు. కోర్టు ఆఫ్ వార్డ్సు వారికి అప్పచెప్పుదామా అంటే, అందులో మాత్రము చిక్కులు తక్కువగా పున్నవా? వీడు బెదిరించుటయు జరుగును. అంతేకదా!

"నాకొక రత్నము దొరికియుండెను. కాని నేను దానిని పెంటమీద కందిగింజ యనుకొని అవతల పారవైచితిని. దాని యోగ్యతను గ్రహింపనైతిని. ఆ రత్నము మరల ఎచ్చటినుండియైన దొరికిన పక్షమున యెంత బాగుండును? నా పనులన్నియు నెరవేరును. నా చిక్కులన్నియు వీడిపోవును. దురదృష్టవంతుడగు ఈ శిశువును నేను అతని కాళ్ళపైన బడవేసి, అతనిని బ్రతిమాలుకొని, 'నా తప్పు సైరింపు'మని, 'నా బాలుని కాపాడుమని' ఈ శిశువును నేను అతనికి అప్పగించియుందును. నా ఆస్తియంతయు అతని వశము చేసియుందును. అతని హృదయమున దాక్షిణ్య మున్నది. నెనరు కలదు. తండ్రిలేని బాలునిపైన నతడు తప్పక జాలిపడును. అక్కటా! అట్టి ఉత్తముడు నాకు దర్శనము మరల యిచ్చునా? నేనాతని పాదముల కడిగి తలపైన చల్లుకొందును. నా కన్నీటితో అతని చరణముల తడుపుదును. అతనిని కొంగు చాచి అభయ ప్రదానము వేడియుందును. అతడు వచ్చెనా, మునిగిపోవుచున్న నా నావ ఒడ్డుకు తగుల గలదు. నాకంతటి ప్రాప్తము కలదా!" అని ప్రతాపవర్మ వగవసాగెను.

అవసాన కాలము రానేవచ్చెను. పసి బాలుని మొగము చూచినపుడెల్ల అతని గుండెలు పగులుచుండెను. "ఆ దేవత ఎక్కడయున్నదో కదా!" అని అతడు మాటిమాటికి గొణుగుకొనుచుండెను. కాని మోహనరావు జాడ తెలియలేదు.

"మోహనరావూ! నేనెంతటి బుద్ధిహీనుడను? నీవంటి యమూల్య వస్తువును కోలుపోయితిని. నేను కంప్లుండియు గ్రుడ్డినైతిని. దుఃఖసాగరమున మునుగుచున్న నన్ను పైకి లేవనెత్తి కాపాడుము! ఈ శిశువును, ఈ కాబోవు వితంతువును రక్షింపుము, నా తప్పు మన్నింపుము" అని లోలోన వగచుచుండెను.

బంధువులందరు చుట్టు మూగియుండిరి. ప్రతాపవర్మ తన దృష్టులను వారందరి మోములపైన బరపి చూచెను. కాని ఒకరి ముఖముననైనను నిజమగు దయాలక్షణము కనపడదయ్యె. తెరచిన కన్ను మరల మూసికొనెను.

జమీందారుగారి భార్య కన్నీరు గార్చుచు ఎదుట నిలువబడెను. భావముల యుద్రేకమును, దుఃఖతరంగముల యుద్వేగమును ఎంత ఆపుకొనినను ఆగలేదు. తుదకు ధైర్యము చిక్కబట్టి, "ఈ బాలకుని, నన్ను ఎవరికప్పజెప్పి పోవుచున్నారు?" అని మంద స్వరమున బలికి ఏడ్వసాగెను.

జమీన్‌దారు:- "ఎ-వ-రి-కా? ఆ - ఆ - ఆ - మో-హ-న-రా-వు-కు" అని మూసికొనిన కన్నులు మరల తెరువలేదు.

● 1912 ●

# 2. గ్యారా కద్దూ బారా కోత్వాల్

♦ సురవరం ప్రతాపరెడ్డి ♦

(గ్యారా అనగా పదకొండు. కద్దూ అనగా సొరకాయ లేక ఆనగపుకాయ. బారా కోత్వాల్ అనగా గ్రామాలలోని పన్నిద్దరు(12) ఆయగాండ్లు. మొగలాయి జమానాలో కర్ర యెవనిదో బర్రె వానిది అనే బాబతుగా పనులన్నీ సాగుతూ వుండెను. ఒక అమాయకుడైన కాపు తుదకు లక్షాధిపతి ఎట్లైనాడో యీ కథ నిరూపించుతుంది.)

ఒకనాడు ఒక పల్లెకాపు 11 సొరకాయలను కంబట్లో వేసుకొని ఒక గ్రామానికి అమ్ముకొనేదానికి వెళ్ళినాడు. గ్రామంలో అమ్మలక్కలు పదిమంది మూగి బేరంచేస్తూ వున్నారు. అంతలో మాలీపటేల్ చేంచేసినాడు. "ఒరేయ్! ఈడ కూర్చోమని నీకెవరు సెలవిచ్చినారు? మంచి మాటతో ఒక కాయ ఇచ్చిపో" అంటూ తానే ఒక పెద్ద కాయను లాగుకొని పోయినాడు. కాపువాడు గొణుకుంటూ ఉన్నాడు. అంతలోనే గోరుచుట్టుమీద రోకటి పోటన్నట్లుగా పోలీసు పటేలు హాజరైనాడు. "పట్టుకొని రారా వాన్ని. ముసాఫిర్ల లెక్కలో వానిపేరు రాయాల్సింది వుంది" అని గర్జించినాడు. తలారివచ్చి తనపాలి పకకాయ, పటేల పాలిటి పక కాయ లాగుకొని పోయినాడు. కొంతసేపటికి పెద్ద తలారి వచ్చినాడు. "ఏయ్, మొన్న నీవంటివాడే వచ్చిండెను. పొద్దు మునిగినప్పుడు కూరగాయ లమ్మినట్లు అమ్మి రాత్రి కోమటోళ్ళ యింట్లో కన్నం వేసిండు. పద! చావిట్లో నిన్ను కట్టేస్తాన్" అంటూ తానున్నూ ఒక కాయ చేతబట్టుకున్నాడు. "అయ్యా! మారాజా! నేను దొంగను కాను. దొరను కాను. పొరుగూరు వాన్ని, ఎల్లప్పటికిన్ని వచ్చిపొయ్యేవాన్ని. ఇప్పటికే మూడు కాయలు ఎగిరిపోయినవి. మళ్ళీ నీవెక్కడనుండి ఊడి పడితివి?" అని కాపువాడు మొరపెట్టుకున్నాడు. అదే కాయతో వాని నెత్తిని పొడిచి కాయతో చక్కా పోయినాడు పెద్ద తలారి. ఈ విధంగా పూజారి, పురోహితుడు, కమ్మరి, వడ్ల మొదలైన 11 మంది ఆయగాండ్లు ఒకరి వెనుక వకరువచ్చి కాయలన్నీ లాగుకొని పోయినారు. కాపు వాడు ఏడ్చుకుంటూ గొంగడి దులుపుకొని లేస్తున్నాడు. చీకట్లోనే చేనికి పోయినట్టి కర్ణమయ్య అప్పుడేవానికి ప్రత్యక్షమైనాడు. "ఏమిరా ఏడుస్తున్నావు? నిన్నెవరేమన్నారు నాకు చెప్పు. నేనీవూరి కర్ణున్ని. తప్పు చేసినోనికి శిక్ష యిప్పిస్తాను" అని అన్నాడు. న్యాయం విచారించే ప్రభువు ఒక్కడైనా ఈ వూరిలో ఉన్నాడురా నారాయణా అని అనుకొని కాపువాడు తన 11 సొరకాయలు మాయమైన విధమంతా వినిపించి "అయ్యా కరణమయ్యా, నీవే నారాయణమూర్తివి.

నన్నెట్లన్నా గద్దె కేయండి" అని గొంగడి ఆయన కాళ్ళమీదవేసి కాళ్ళు పట్టుకొన్నాడు. కర్ణం ఒక్క తన్ను ఝాడించి తన్ని కంబడి లాగి చంకబెట్టుకొని ఇట్లన్నాడు. "అరే లుచ్చా! అందరికీ వంతు సొరకాయ యిచ్చి నావంతు తప్పించి నావా? నేను తలారి వాని కంటే పనికిరాని వాన్నా? వడ్లోని కంటే వ్యర్థుడనా? ఆ ఓనమాలురాని మాలీపటేలు నీకు ఎక్కువైనవాడా? తే! నా వంతు సొరకాయ. అదిచ్చి యీ గొంగడి తీసుకుపో" అని గ్రుడ్లెర్ర చేసుకొని కంబళి తన చంకపెట్టుకొని తన యింటికి పోయినాడు.

కాపువాడు ఎగాదిగా చూచినాడు. "నీవూ ఇంతేనా? ఈ వూరంతా ఇంతే? ఏందేశం యిది పాడుదేశం. ఇంక నా వంటి దిక్కులేనివారు బదికే దెట్లా?" అని గొణుగుతూ పట్వారివెంట కొంతదూరం దీనంగా ప్రాధేయ పడుతూ వెళ్ళినాడు. "ఒరేయి! ఒక్క అడుగు ముందుకువెస్తే నీ తలకాయ పగులతంతా (జాగ్రత్త) ఖబర్దార్?'. అన్నాడు పట్వారి కాపువాడు దిక్కుతోచకుండా నిలిచిపోయినాడు. చిన్న పిల్లవానివలె కొంతసేపు ఏడ్చినాడు. ఒకరిద్దరు ఆడవారు వాన్ని చూచి "పో నాయనా! పో! పొద్దున్నే ఎవరి ముఖం చూచినావో ఏమో! యీ వూళ్ళో అందరూ ఇట్లాంటి మారాజులే. ఇంకోమారు రావద్దు" అని బుద్ధిచెప్పినారు. కాపువాడు దీర్ఘాలోచన చేస్తూ ఇంటిబాట పట్టినాడు. "థూ. పుట్టితే పటేలు పట్వారి అయి పుట్టాలె. లేకుంటే తలారిగా అయినా పుట్టాలే. ఈ బదుకు బతికినా వకటే చచ్చినా వకటే.... కాయలుపోతే పోయెకాని గొంగడి కూడా పోయింది. అందరికంటే ఆకర్ణమోడు మరీ చెడ్డవాడు. అందుకోసరమే కాటికిపోయినా కర్ణంపీడ తప్పదన్నారు పెద్దలు... దీనికి బదలా తీయకుంటే నేను మనిషినా? అయితే బీదోన్ని ఏమి చేయగలను? ఆ తలారికి చేరెడు చేనన్నాలేదు. నాకు చేనుంది. పెండ్లాము పైన వంకి వుంది ఒకెద్దుంది. తలారి కంటే తక్కువనా నేను?.... దేవునికైనా దెబ్బే గురువు. నేనున్నూ ఏదో మొండి తొండిచేస్తా...." ఇట్లా ఆలోచనా పరంపరలో మునిగి నడుస్తున్నాడు. తన మోటబావిని సమీపించినాడు. బావిగడ్డపై కూర్చున్నాడు. ఇంకా దీర్ఘాలోచనలోనే ఉన్నాడు. తటాలున మెరుపుమెరిసినట్లూ వాని తలలో వక ఆలోచన తళుక్కుమంటూ ప్రవేశించింది. చటుక్కున లేచినాడు. ఊళ్ళోకి పోయినాడు. చక్కగా పెండ్లాం వద్దకు వెళ్ళి "ఒసేయి! నీ వంకి ఇట్లాతే. ఇయ్యమంటే! నీకేం పర్వాలేదు తే. మళ్ళీ వుగాదినాటికి ఒకటికి నూరువంకీలు చేయిస్తే నా పేరు వెంకయ్య! అనూ" అని వంకీని లాగుకున్నాడు. పటేలుకు దాన్ని 200 రూపాయలకు అమ్మినాడు. పైకం తీసుకొని 10మైళ్ళ దూరంలో ఉండే పట్నం చేరుకున్నాడు. షేర్వానీలు, లాగులు, మోజాలు, పగిడీ, నడుముపట్టి, బిల్లలు మొదలైన పరికరాలు సిద్ధము చేసుకొన్నాడు. నలుగురు అరబ్బు జవానులు జతచేసుకున్నాడు. వారికి బిల్లలును తగిలించాడు. తానున్నూ బాగా వేషం వేసుకొన్నాడు. ఒక బగ్గీని కిరాయకు మాట్లాడుకొన్నారు.

రెండామడల దూరంలో ఒక పెద్ద బస్తీ ఉండింది. అది నాలుగు బాటలు కలిసే స్థలం. గొప్ప వ్యాపారి పేట. అధికారులు, మంత్రి, నవాబుకూడా ఆ మార్గంగా షికారుకు పొయ్యే స్థలం. ఆ గ్రామంలో మన కాపు దిగినాడు. ఊరబావిగట్టున ఒక పెద్ద మర్రి మానుండింది. దానికింద మేజు కుర్చీలు వేయించినాడు. జవానులను బావిపై పహిరా ఎక్కించినాడు. ప్రొద్దున్నే ఊరులోని ఆడవారు నీటికి వస్తే ఆ

జవానులు "ఖబర్దార్ కదవకొక పైసాయిచ్చి నీళ్ళు తీసుకోండి" అని చెదరించినారు. పటేలు పట్వారీలు వచ్చినారు. "ఒరేయ్! మాకు సర్కారు హుకుం అయింది. ఇదిగో ఫర్మాన్" అని ఉర్దూ ముద్రలతోనుండే ఫర్మాను చూపించినాడు కాపు. ఉండవచ్చునని గ్రామాధికారు లూరకైనారు.

దినమున్నూ పైకం బాగా వసూలు కాబట్టింది. మొదట మొదట దినం 20 రూపాయిల వరకు వసూలైంది. క్రమేణ ఆదాయం ఎక్కువైంది. "మర్రిమాన్ పరగణా సుంకం" చుట్టూ రెండామడపరకు ప్రసిద్ధి అయిపోయింది. ఇట్లా వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచినవి. ఒక నాడు సుబేదారు దౌరావచ్చి గుడారాలు వేయించినాడు. అతని నౌకరు నీటికి పోతే "పైసా లావ్" అన్నారు జవానులు. వారు ఉత్తరకదపలతో వాపసుపోయి "సర్కార్! నల్గురు అరబ్బీ జవానులు పైసా యియ్యంది నీళ్ళు తీసుకోనివ్వరు. అరే సుబేదార్ సర్కారు వారికిరా! అంటే జంబీయాలతో పొడిచేదానికే పైబడవస్తారు సర్కార్!" అని విన్నివించుకొన్నారు. అక్కడనే సేపలో ఉన్నట్టి పటేలు పట్వారీ లిట్లన్నారు, "హుజూర్! పదేండ్లనుండి యీ మర్రిమాన్ పరగణా సుంకం సక్రమంగా వసూలౌతుంది. అందుకు సర్కారు ఫర్మాను వుంది.", "ఉంటే ఉండవచ్చును" అనుకొని సుబేదారు కూడా పైసలిచ్చి నీరు తెప్పించుకొన్నాడు.

ఒకనాడు దీవాన్ బహద్దర్‌గారు అక్కడ ధేరావేయించినాడు. అతనికిన్నీ ఇదేగతి పట్టింది. అరబ్బులు కదవకు పైసా పెట్టంది ఒక మెట్టుకూడా దిగనియ్యరు. దీవానుగారు అంతా వినుకొని ఇట్లనుకొన్నారు. "మాహూజూర్‌గారు ఫర్మానిచ్చి నారేమో లేకుంటే నా వద్దకూడా వసూలుచేసే గుండె వుందావీనికి?" దీవాను గూడా సుంకం చెల్లించు కొన్నాడు. ఒక కాపువాన్ని పట్టేపగ్గాలు లేవు. సుబేదారేమిటీ దీవాను బహద్దరు కూడా కిక్కురుమనుండా సుంకం చెల్లించుకొని పోయివుంటే అబ్బా ఏం దబ్బా బారా వీనిది అని జనులు చాటున అనుకునేవారు. ఇట్లా వుండంగా నవాబుగారు షికారుకు పోతూ పోతూ పొద్దుపోయిందని రాత్రికి ఆవూరులోనే ఠికానా వేసినారు. నవాబో గివాబో ఇప్పటికి కాపువానికెవ్వరున్నూ కంటికాగేటట్లు కనబడలేదు. పైసా ఆడపెట్టి బావిలోకి దిగూ అన్నాడు నవాబు నౌకరును. నవాబుకు షికాయతు అయింది. నవాబు గారిట్లా తమలోనే అనుకున్నారు. "మా దివాన్జీ మాఖజానా భర్తీ చేసే దానికి ఈ హుకుం ఇచ్చినాడేమో పట్నం పోయిన తర్వాత విచారించుతాను. ఇప్పుడుమాత్రం నేనున్నూ ఖానూనుకు బద్ధున్నై ఉండాల్సిందే" అని ఆలోచించుకొని తానున్నూ నీటిసుంకం చెల్లించుకొన్నాడు.

ఈ పాటికి మర్రిమాన్ పరిగణాలో రెండంతస్తుల బంగ్లా పెరిగింది. గ్రామంలో సగం భూములు కాపువానివే. 100 ఎద్దుల సేద్యం సాగించినాడు. చుట్టూ 5 ఆమడ దూరం అప్పులిచ్చినాడు. నవాబుగారు తమ నగరానికి వేంచేసిన తర్వాత దివాన్జీని పిలిచి "దివాన్‌సాబ్, మీరెందుకు నీటికి సుంకం ఏర్పాటుచేసినారు? ఇది అన్యాయము కాదా?" అని విచారించినాడు. అందుకు దీవానుగారిట్లు మనవి చేసుకొన్నారు, "బందగానె ఆలీ, హుజూర్! నేనున్నూ మీతో అలాగే గుంజారిష్ (మనవి) చేసుకోవాలె అని వుంటిని. నేను కూడా సుంకం చెల్లించుకున్నాను. హుజూర్‌గారు ఫర్మానె ముబారక్ జారీ చేసి వుంటారని నేనున్నూ అనుకున్నాను." "అరే నీవూ హుకుం ఇయ్యలేదు. నేనూ హుకుం ఇయ్యలేదు. మరి ఈ 15

ఎంతమంది వాడు ఎట్లా మనూలు చేసినాడు? వాన్ని గిరప్తారీ (అరెస్టు) చేయించి తక్షణం మట్లే తెప్పించు" అని నవాబుగారు ఉరిమినారు.

కాపువాడు ఇట్టి ఫర్మానుకొరకై 10ఏండ్లనుండి నిరీక్షించుతూనే వున్నాడు. 1000 అష్రఫీలు బంగారు తట్టలో పోసుకొని జర్రీపనిచేసిన ముఖ్మల్‌బట్ట పైన మూసుకొని కాపువాడు హుజూరువానికి నజరానా సమర్పించుకొన్నాడు. నజరానా చూచేవరకు నవాబుగారు చల్లబడ్డారు. "క్యారే నీకీయెవ్వర్ నీటి సుంకం హుకుం ఇచ్చినార్?" అన్నారు నవాబ్‌గారు. "హుజూర్! గ్యారా కద్దూ బారా కొత్వాల్ హుకుం ఎట్లా ఏర్పడిందో మర్రి మాన్ పరిగణా సుంకం కూడా అట్లే ఏర్పాటైంది" అన్నాడు కాపు. "ఏమంటున్నావురా? నీవనేదేమిన్నీ అర్థం కాలేదు. సరిగా చెప్పు".

"నా తప్పులంతా మాఫ్ చేస్తామని సెలవిస్తే అన్నీ మనవి చేసుకుంటాను."
"సరేలే! చెప్పు చూస్తాం."

కాపువాడు తనకథంతా వర్ణించి వర్ణించి చెప్పుకొన్నాడు. హుజూరు వారు అదేపనిగా నవ్వుతూ సాంతం విని "అరే! నీవు చాలా హుష్యారు మనిషివి. నీ తప్పంతా మాఫ్ ఇకముందు నీవు మాదేవిడీ వద్ద రాత్రి గంటలు కొట్టూ వుండుము. అదే నీకు శిక్ష" అని సెలవిచ్చినారు. కాపువానికి కొన్నాళ్ళ వరకు తిక్కలేచినట్లుండింది. ఏమిన్నీ ఆదాయం లేదు. అధికారంలేదు. అడిగేవారు లేరు. రాత్రులంతా నిద్రకాయవలెను. ఒక నాడు నిద్రమబ్బులో రాత్రి 11గంటలు కొట్టేది మరిచిపోయినాడు. 12 గంటలకు లేచి కొట్టినాడు. ఈ చిన్న పొరపాటుకు దేవిడీ అంతా తలక్రిందులయ్యింది.

హుజూరు వారు 8 గంటల నుండి గంటకొక బేగంగారి గదికి పొయ్యేవారు. 11 గంటలు కొట్టలేదు. 11 గంటల బేగం వద్దకి హుజూరు పోలేదు. మర్నాడు 11 గంటల బేగంగారు గంటల కాపును పిలిపించి "అరేయ్! నా గంట మరిచిపోకుండా కొట్టూ వుండుము. నెలకు 50 రూపాయిలిస్తాను" అని అన్నది. "చిత్తం చిత్తం హుజూర్!" అని కాపువాడు తత్తరపాటుతో అన్నాడు. "ఈ గంటలలో ఏమో రహస్యం ఉందిరా" అని కాపువానికి స్ఫురించింది. ఒకనాడు 9 తప్పించినాడు. ఒకనాడు 10 తప్పించినాడు. ఒకనాడు 12 తప్పించినాడు. ఏ గంట తప్పితే మరునాడే ఆ గంట బేగంగారు కాపువానికి జీతం ఏర్పాటు చేసుకొన్నది. ఈ విధంగా నెలకు 400 రూపాయిల జీతం ఏర్పాటైంది కాపువానికి. కొన్ని యేండ్ల తర్వాత నవాబుగారికీ సంగతి కూడా తెలిసింది. వీడు చాలాకీవాడు అని మెచ్చుకొని వాడు సుంకం వసూలు చేసిన గ్రామమే వానికినాముగా ఇచ్చి పంపివేసినాడు. చూచినారా సొరాకయ మహిమ! సొరకాయ నరుకుట అంటే ఇట్లాంటి కథలు చెప్పేదానికే అంటారు.

● 1930 ●

# 3. పటేలుగారి ప్రతాపము

♦ నందగిరి వెంకట్రావు ♦

గుఱ్ఱమును కల్లెముతో పట్టుకొని ఆంజనేయ దేవాలయము ఎదుటనుండి పోవు చున్నాడు రామయ్య. పటేలు గారు ఆంజనేయ దేవాలయపు అరుగుమీద కూర్చొని యుండునని రామయ్యకు ముందుగనే తెలియును. అందుకనియే గుఱ్ఱమును దిగి నడిచి పోవుచున్నాడు. పటేలు అరుగుమీద కూర్చొనియున్నాడు. నరసాగౌడు అరుగుక్రింద దుప్పటి కుప్పపై దొగ్గాళపైన కూర్చొని యున్నాడు. మరికొంత దూరాన తలారి లచ్చిగాడు గోడ నానుకొని తన చేతికట్టెపై తలనానించి నిలిచియున్నాడు.

రామయ్య మూల మలుపు తిరిగి పటేలుకు కనబడగనే "దండం పటేలా"అని కొంచెము పెట్టెను. పటేలు నోటి నుండి చుట్టను తీసి "ఓహో యాడికో పొయ్యింది" సవారి?

రామయ్య : నా బిడ్డకు నాసనకు బంపించొస్తున్న పటేలా!

"ఏం మునిగిపోతుండెరా ఈ యాల్లటి కుంచి రేపు తోలించింటె."

"నా అల్లుడు నిష్కారంగ చెప్పంపిండు పటేలా!ఈ యాల్ల తోలించక పోతె మల్ల గలమల కాలు బెట్టనియ్యనని. మరి అప్పటికి గూడా హత్ భడివీకె! వాని పెండ్లాన్ని వాడు తోలించమన్నప్పుడెందుకు తోలించలేదు. కావరమా అని మీరే తిడ్తరు యెన్న శిక్కి.

"చాలు పోవోయి నీ సాకులు అయిపోయేనా ఈయాల్లటికి! నువ్వు బోతవా నేను బోతనా వూరిడిచిపెట్టి చూసుకుందాం పో.

"రేపు తీస్కపో పటేలా గుఱ్ఱాన్ని వద్దన్ననా! పని జూసి అడుగుతె ఎం జెయ్యాలా! ఆనాడు యెడ్లడిగితివి అప్పుడు గూడా పనిజూసే అడిగితివి. ఆయాల్లెడ్లిస్తె చేను యెండి పోకపోవునా పటేలా?

అవునోయి నువ్వంటే నాకు పగ. పగనోయి. సరే పో. పోరాదు మరి ఇప్పుడేం. చూసుకుందాం పో"

"అయిపాయెతియ్యి ఆనాటి సంది పగబట్టి కూటికి లేకుండజేస్తివి. ఇంకేం జేస్తవు? వూళ్ల వుండనిస్తే వుంటం లేకపోతే పోతం. పుట్టించిన దేవుడు కూడుబెట్టడా"

"...నోరెత్తుతౌమల్ల. చూసుకుంట నిలపడ్డావురా లచ్చిగా ఒకటెయ్యి. కండ్లు గనబడనీ గాడ్డి కొడుక్కు."

లచ్చిగాడు రామయ్య దగ్గరకు వచ్చి "పోరాదయ్య అట్ల యెనుకబడి మాట్లాడ్తరా దొరల ముంగల."

ఇంతలో పటేలు రామయ్యపైబడి కొట్టబోవుచుండ నరసాగౌడు మధ్యనొచ్చి వారించెను. అయినను పటేలు వినక రామయ్యను చెప్పుతో కొట్టబోగా ప్రక్కనున్న గుఱ్ఱము పటేల్ను ఎనక్కనదన్నేను. మోకాటికి గాయము తగిలినట్టయినది. పటేలుగారి కోపము. మంటలో నెయ్యి బోసినట్టులయినది. రామయ్యను చెప్పుతో అనేక దెబ్బలు అనేక తావులలో కొట్టి అలసిపోయి పండ్లు పటపటగొరుకుచు ఆవేదనతో "అరే లచ్చిగా. తీస్కపో తీస్కపొయ్యి దొడ్లెగట్టెయ్యా గుఱ్ఱాన్ని. చూస్కుంటాం. ఇప్పుడే తహసీలుకు బంపుతాయిణ్ణి. యాణికిగన్కన బేడీలు బెట్టిచ్చి కైదుకు బంపకపోతినే నేను నరసయ్య కొడుకునే గాననో. నా యీ పటేల్తనం యాణికి యీ రామయ్య దొరగారికే కద్ద."

లచ్చిగాడు రామయ్యను తరిమేసెను. రామయ్య వెళ్ళిన పిమ్మట ఒక రెండు నిముసములు ఎవరూ మాటాడలేదు. పటేలు తిరిగీ అరుగుమీద కూచుంటూ, కాదోయి గౌడా, మరీ యీ కొంపంత అజాదు కొంప యాళ్ళేదు, దినదినం దినదినం మరీ యెక్కువై పోతున్నదీ ఊళ్లోల్లకు అందరూ ఖానూనుబాజులే. అందరికీ కానూనులు గుర్తె (నోటిపై చేయిబెట్టుక) అవ్వ, ఇంతిదినం యెన్నడు జూడ్లే, పాడుకాలం వస్తున్నదీన్నా. ఆ! అందుకనే ఇసుంటి నడుమంత్రపోల్లు పుడుతున్నరు. వీళ్ళకు పెద్దగనబడ్తెనా చిన్నగనబడ్తెనా! అప్పటి సంది సూస్తున్నవు గదా యిట్లనే వుండెనా దినం."

"ఆకాలమాడా యీ కాలమాడ! పటేలు గర్నాలంటే నిద్రల కూడ వుచ్చపోస్కుటుండ్రి. అసుంటి కాలమది. పటేలు అడంగ బోతున్నడంటె ఆడుదానిగ్గాని మొగోనిగాని పాణాల్ల పాణాలుంటుండెవా! అద్దుమ్మ నాత్రయనా తలుసుకున్నరంటే వూరికూరు మీ మగన ముంగట్నె."

"సూడు వీనికండ్లకు గనబడని శాతలు. నేను లేక లేక ఒక్కనాడు యెడ్లడుగుతే లేదంటాడీడు! పోనీ ఆడికీ ఓర్సుకున్న ఏమౌగదా పాపమని, ఈయాల్ల గుఱ్ఱపుతట్టు నడిగిన్నోయి యిస్తడా యివ్వడా సూద్దామని.

'ఏం బోతుండె ఒక్కనాడెడ్లనిస్తె. నా నాయన నరసయ్య పటేలుండంగ యాల్ల యీ ఆటలు సాగినాయి. ఇప్పుడాయన వుండనుండగని మరి వీల్ల ఆటలు తెలుస్తుండె వానకాల మొచ్చిందంటు ఒక్క నాగలిగట్ట నాడాయిన పునాస పొలాలన్ని రయితు వచ్చి దున్నిస్తుండ్రి జక్కుమరాయించుకుంట ఒక్కలయినా కుయిక్కుమన్నారు.

ఇట్లు మాటలాడుచువారు పటేలుగారి యిల్లు చేరిరి. పటేలు లోపలికి బోవుచు నరసాగౌడుతో లెక్క యాడికి బోతది చూస్కుందాం గానీ ఈ యాల్లయితే బంపుపో. బ్యాగరి బాలిగాణ్ణి తోలిస్త."

"ఇదివరకే ఫదిరూపాయలయినై పటేలా."

'ఈనెల కిస్తుల ముజురా తీస్తుందుగాని పోవోయి పంపించు. ఎతుక్కున్న ట్టుంటదోయి లేకపోతె."

## 2

తెల్లవారు సమయమున రామయ్య లేచి పశువులను మేతకు తీసుకొని పోవలయునని కొట్టము కడకు బోయెను తడక దీసి చూసెను. పశువులు లేవు. వానిని గట్టిన త్రాళ్ళు అచ్చటనే పడియున్నవి. ఎవరో వానిని వదిలిపెట్టిరి కాని అవి త్రెంచుకు పోలేదని స్పష్టమయ్యెను. ఏమి చేయవలయును. బంజేరిదొడ్డి (సర్కారుదొడ్డి) యందు జూడవలయునని తోచినది. ఆచటికి వెళ్ళెను. పశువులందున్నవి. తమ పశువులను బలవంతమున విడిచి తెచ్చి ఈ దొడ్డియందు తోలుచారెవరో రామయ్యకు తెలియును. పటేలుగారు తప్ప అట్టి పనిని మరెవరును యొనర్చరు. పటేలుగారట్లొనర్చుటకు ఇది మొదటి తడవు కాదు. ఈ తడవు పశువులను విడిపించుకొనుటకు ధనము కావలయును. కాని ఆ ధనము నెక్కడనుండి తేవలయును? ఇట్లు ఆలోచించుచుండగనే తట్ట తీసుకొని పేడను గూర్చుటకై వీరమ్మ వచ్చెను. తన అన్న నుండి వీరమ్మ సంగతులన్నియు తెలిసికొని తమ పశువులను దొడ్డియందు గొట్టినవానిని తిట్టసాగెను. వారిరువురు గలిసి పటేలు యింటికడకేగిరి.

గ్రామములోని వారందరును లేచి పశువులను పొలములకు తోలుకొని పోవు చుండిరి. పటేలు దుప్పటి ముసుగుబెట్టి నోటియందు పలుగఱుంచుకొని ఇంటి ముంద లరుగుపై కూర్చొనియుండెను. మరెవ్వరును అచట లేరు. వీరమ్మ గోడచాటున పటేలునకు సగము గనబడనట్టు నిలుచుండెను. రామయ్య పటేలు ముందునకొచ్చి ఆయన కాళ్ళపై బడి "నువ్వే మా తల్లితండ్రివి పటేలా. మా తప్పులు కడుపుల బెట్టుకొని రచ్చించాలె. జంజెప్త పటేలా అవి తెంపుక పోలే. పగశాత ఎవరో అవిట్ని దొడ్లెకెల్లి యిడ్సుక పొయ్యి బంజరు దొడ్లె కొట్టిరు కాని అవి "ఏస్లబళ్ళె గీండ్ల బళ్లె."

"యెంత వగలోడవోయి! అమాయకుడవు అవ్విట్ని కంచకు తీస్కపోయ్యిండీ నీవొంతె. మేపిందీ నీవొంతె. కంచోడు చూచి దొడ్లెగొడ్లె ఆడిముండల్యాక ఏడ్చేదీ నీ వొంతె. ఎంత సుద్దపూసవోయి. ఎవలి పెండ్లికి, మూడు ముబ్బాడలు రూపాయి బ్యాడిచ్చి యిడిపిచ్చుక పో."

"సత్యం పటేలా, బువ్వతోడు, ఎవలో యిడుచుకపొయ్యిరు పటేలా నాకేం దెలువదు."

"అయ్యో నువెప్పుడూ సత్యమే సెబ్తవు. సత్యవంతుడవు. అరిచ్చంద్రుడవు, నీ పగోల్లెవరో వాట్ని దొడ్లె కొట్టిరు. నీసీమంతం మీద ఓర్వలేక, లేదోయి నేనే కొట్టిన. నేనే కొట్టిన్నోయి"

"మారె! అంతమాట ఏనాలికతోటనాలె పటేలా. కాల్లుమొక్త యిడ్చిపెట్టు పటేలా. ఒకనాడు మోటల్లేకపోతే యాడాదిగోలె చేసినకష్టం యేట్లె గలుస్తది."

"ఛీ, ఛీ, ఛీ. పటేలుకు ఒక గంటకోసం యెడ్లిస్తె పంటపాడైతది. చస్తరు ఇప్పుడే మైతది. ఏం కాదు ఎవలి పెండ్లికోసం పోపో. రూపాయ బ్యాడ తీస్కరా యిడిపిచ్చుకపో. లేకపోతె వుండనీ."

"యాడికెల్లి దేవాలె పటేలా! మొన్ననే రొండు దూలాలమ్మి కాలబెడ్తిమి ఈయాల్లాడికెల్లి తేవాలే." అని నీరమ్మ గోడచాటునుండి పలికినది.

"అయ్యో! గోడసాటునుండి గులుకుతున్నావు. యాడికెల్లన్న దెచ్చియ్యాలె ఎవలి పెండ్లికి. ఇంకేమన్నుంటె అమ్మాలె తేవాలె."

"ఇంకేమున్నది పటేలా! కొంపగూడా కోమటోడు గుంజుకునెనాయె. ఇగ మా పాణాలు దప్ప ఏమున్నయె!" అన్నది వీరమ్మ.

"ఏట్లకు బొండి వాగులకు బొండి, సర్కారుకేం. అమ్ముడుబొండి. నీతులు బల్కుతౌ. నువ్వమ్ముడు బోరాదు సక్కందానవు."

వీరమ్మ గోడచాటునుండి బైటికొచ్చినది. రుద్రాకారిణియై పండ్లు పటపట గొరుకుచు, "నా అసుంటోండ్లు నీకు లేరా? నీ బిడ్డెల్లెరా? సెల్లెండ్రులేరా? వాండ్ల నమ్ముకో. కరక తురకకమ్ముకో. ఆ పైసబెట్టి మిద్దెలు గట్టు మేడలు గట్టు! నన్ను కండ్లల్ల బెట్టుకుంటున్న వేమయ్య నేనీ వూరికొచ్చింసంది!" అని పారాయణము మొదలు పెట్టినది! దారిని బోవు వారదిద్దరొచ్చి రామయ్యను వీరమ్మను బుజ్జగించి వారింటివైపు బంపించిరి. ఇంటిలో నుండి పటేలు తల్లి రామయ్య వచ్చి "ఏమ్రో యింత చాతగాక పొయినాది. ఆద్నా ఆడిముండొచ్చి నీ యింటిముంగట్నే నిన్ను నోటికొచ్చినట్టు తిడ్తె నోరుమూసుకోని కూసుంటివాయె. దవడలు వాయించొద్దు. రుయ్యాల్ల తిట్టింది రేపు మీదబడి కొడ్తది. ఆసుంటి మీయయ్య కడుపున ఎసుంటోడవు బుట్తివిరా! నరసయ్య పటేలంటే చుట్టూ ఫదామెద వణికేది. బజారుపొంటి బోతుంటె ఒక్క ఆడది గనబడ్డాది! కనబడ్డ ఆడిది వూరికె బతికిపొయ్యింది గనుకనా! ఆడోల్లు యిడిచిపెట్టు మొగోల్లు సైతం! ఒక్కల్లయినా యెదురు మాట్లాణ్ణారు. చింతచెట్టుకు మామిడికాయలు కాసినయంటే అవును చూసిన మన్నారు. గాని కాదంటే బతికింరా! పటేల్నుగాదని వూల్ల ఒక కూరసైతం వండుకొని బతికింరా! యెందరు వూరిడిచి పెట్టిపోలే! మనయింటి సుట్టు యిట్ల పాడెందుకు బడ్డది మరి! ఆయిన భయానికంతా దెంకపోయ్యింరు. అసుంటి జరబు ఆయనంటె. అట్ల లేకపోతె ఈ సంసారం యింత పెద్దదాకెట్లయ్యింరు. హదాట్న వాల్ల కడుపుల గాల పగబట్టి చంపిరి గాని లేకపోతే ఇంకెంత పెద్దగ జేస్తుండెనో సంసారం. నువ్వు పుడ్తివి సుపుత్రుడవు! ఎందుకురా ఆ ముండు ముందర నీ నోరు కట్టుబడిపోతది? తండ్రిపేరు చెడ్ప బుట్టినవు గాడ్డి కొడ్కా! థూ!" అనుచు లోనికి వెడలిపోయినది.

## 3

పదిహేను రూపాయిలకు గుఱ్ఱము నమ్మి రూపాయి బ్యాడ యిచ్చి పశువులను విడిపించుకొనినాడు రామయ్య. అక్కడక్కడ చేసిన అప్పులను దీర్చెను. సాహుకారి యింటినుండి వెడలి పొమ్మనుటవలన పొలమువద్దనే నివాసమేర్పరుచుకొనినాడు. రామయ్య స్వభావము నెరుగనివారు అరుదు. చాలా మంచివాడు. ఇతరుల జోలికి బోనివాడు. ఆయనకొకతే బిడ్డ. వివాహమైనది. ఆయన భార్య చనిపోయినది. వీరమ్మ కిప్పుడు యిరవై యేండ్లు. ఆమె ఫదేండ్ల దున్నప్పుడే వితంతువైనది. ఇంతకాలము ముత్తవ తల్లియొక్క మరొక గ్రామమునందుండెను. కాని ఆమె అచ్చట పెద్ద బెరిగిన కొలది ఆమెను గాపాడుట ఆ ముత్తవ తల్లికి దుస్తరమగు చుండెను. ఆ గ్రామము వారందరికి వీరమ్మ పైననే కన్ను. వీరమ్మ స్వభావము సామాన్యమై యుండినచో

అందరిలో కలిసిపోవు చుండెడిది. కాని అట్లుగాకుండుటవల్ల రామయ్యయొప్పు బంపబడినది.

సాయంత్రము సూర్యుడు అప్పుడే అస్తమించినాడు. రామయ్య ఏటోపనిపై గ్రామము లోనికి వెళ్లియుండెను. వీరమ్మ పగలంత పనిజేయుటచే అప్పుడే స్నానము జేసి తమ గుడిసె ముందు నిలుచోని వెంట్రుకలు ఝాడించుకొనుచుండెను. ఒకపెద్ద చిరిగిన గుడ్డచే శరీరము తుడిచికొని దానినే చుట్టుకొని యుండెను. యవ్వనము చేతను, బాగుగా కష్టమొనర్చుట చేతను ఆమె శరీరము కండలు దీరి రక్తముతో నిండియున్నది.

గుడిసె వెనుకనించి పటేలు వచ్చెను. వీరమ్మ ఆ దిక్కునకు చూడనేలేదు. పటేలు అట్లె ఆగి ఆమెను ఎగాదిగా చూచుచున్నాడు. ఆయనకప్పుడు కలిగిన ఉద్రేకము అవర్ణనీయము. ఆయనొకవేళ ఆమెను నగ్నముగ జూచియుండిన గూడా అంత ఉద్రేకము కలిగి యుండెడిది గాదు. ఆమె ఆ చింపుగుడ్డలోంచి శరీరప్రభాగము లక్కడక్కడ గనబడు చుండెను. కొన్ని తావులయందు శరీరపు ఎత్తులు బట్టను చించుకొని బయటకు వచ్చుచున్నదా అన్నట్టు ఆ చినుగులో నుంచి ఈవలకు తొంగి చూచుచుండెను. ఆమె తలక్రిందికివంచి వెంట్రుకలపై దెబ్బగొట్టినప్పుడు ఆమె శరరమంతా కదిలేది. ఆమె శరీరపు బలువైన మాంసపు కండలు మెరుపు వలె మెరిసి కదులుచుండెను. ఆ స్థితిని చూసి పటేలు ఓర్చుకొనలేకపోయెను. ఉద్రేకము తలకెక్కినది. ఆయన ఆమెవైపు చూడ నటుల నడిచి "ఎవరది!" అనెను.

వీరమ్మ తిరిగి చూచి గుడ్డను చక్కబెట్టుకొనుచు గుడిసెలోనికి బోవుచు ఏమయ్యా అది అయిష్టము తెలిసెటట్టు పలికెను. పటేలు గుడిసె ముందాగి వీరమ్మవా అని ఆదరించెవానివలె విచారించెను. వీరమ్మ లోపలి నుండేమియు జవాబు చెప్పలేదు. పటేలు కొంత దవ్వారికుండి "వున్నదా రామయ్య" అనుచు గుడిసెలోపలి కేగెను. పటేలులోనికి వచ్చుట జూడ వీరమ్మ కోపముతో ఉప్పొంగి పోయినది. గుడిసె మధ్య నిలచి "లేడు బైట గూకో వస్తడు."

పటేలు మరీ ఈమెను సమీపించుచు మారాజోలె సుఖంగుండక యిదేం ఖర్మ నీకు! రామయ్య తనంత తానే చెడిపోతున్నడు నువ్వన్నా జెప్పవు? వీరమ్మ దూరముగా జరిగినా కొద్ది మరీ సమీపించుచున్నాడు పటేలు. వీరమ్మ "ఆయనొచ్చిం తరువాత చెప్పరాదయ్య నాతోటెందుకిదంతా?"

"ఆయాల్ల కల్లనాటి రాత్రి ఎట్టగాలవ కింద నిన్ను యెంతగసం బతిమాల్నా విన్నావు? ఏం నేనే బాగలేనా! ఇంక నీ అదృష్టమనుకో. నీకేం తక్కువ! ఆడుదాన వొప్పుకుంటె మీరామయ్య కిదంత్పందుకొస్తుండె. ఇప్పటికన్న యేం మునిగిందని! ఆయాళ్ళ నువ్వొద్దంటుంటె బాగనిపించి నేనాడ కొరుకుతే ఏడ్వలే. ఎంతగట్టిగుండె! అబ్బ! నొప్పి శాస బెట్టిందా?" అంటూ వీరమ్మ ఒకచేతిని తన ఒకచేత్తో పట్టుకొని మరొకచేతిని ఎచ్చటికో పోనివ్వవలయునని ప్రయత్నించుచున్నాడు. వీరమ్మ పదిలించుకోలేక ఆయన ప్రయత్నమును వారించుటకు తనవంటి చేతితో ప్రయత్నించుచున్నది.

నీ మీద దయ చేతను కోలేకపోతెనా! నేను రమ్మంటె రాని ఆడిదెవతి సూపించు. పాపం నీ వయసు నువ్వు దింటున్నవు గదా అని అన్యం పున్యం యెరుగదా ముంద

కొడుకు. బాగా బతికినన్నాల్లు యిట్లివే కష్టపడాల్న? దేవుడు నీకిచ్చిన అందం వయిసు అనుభవించాలె కాని పాడుచేసుకుంటారు. ఉఁ! తప్పించుకుంటావు? నన్ను? నన్నా?" అంటూ పటేలు వీరమ్మను బలవంతాన గట్టిగా కౌగలించుకొని తన యిష్టము వచ్చిన తావుల యందంతా యెత్తుయెత్తు గట్టిగట్టి ప్రదేశాలందంతా కొరుకుతున్నాడు. వీరమ్మ కేకల పెట్టుచు పుల్లిచేత పట్టుబడ్డ కోడివలె కొట్టుకొను చున్నది. తన చేతులతో సీసమువలెనున్న పటేలు ఎదపై గ్రుద్దుచున్నది. పటేలామె శరీరమునంతా ఆక్రమించుకొనుచున్నాడు.

ఎవరో ముగ్గురు పోట్లాడుచు గుడిసెయందు జొరబడిరి. అందులో ఒకడు గొడ్డలితో గుడిసెయందు జొరబడెను. అందులో ఒకడు గొడ్డలితో గుడిసెలో ప్రవేశించ ప్రయత్నించుచున్నాడు. తక్కిన యిరువురాతనిని వారించుచున్నారు. ఆ గొడ్డలి చేతనున్నవాడు తనగొడ్డలిచే ఎవరెవరినో మూడు నాలుగు దెబ్బలు కొట్టి చివరదెబ్బ తన తలపైననే కొట్టుకొనెను.

తెల్లవారి నలువురి హత్యల గురించి పోలీసు రిపోర్టు బంపబడెను. చచ్చిన వారిలో ఒకడు పటేలు, రెండవాడు కావలి, మూడవది వీరమ్మ, నాల్గవాడు రామయ్య.

● గోల్కొండ పత్రిక -1930 ●



# 4. వెట్టిమాదిగ

♦ అజ్ఞాతవాసి భాగ్యరెడ్డివర్మ ♦

పోలీసు పటేలగు రామిరెడ్డి గ్రామచావడిపై కూర్చొని యుండెను. అతడేదో తొందర పనిచే మనోవైకల్యము గలవానివలె గన్పట్టుచుండెను. రామిరెడ్డి గ్రామము నందు పలుకుబడిగల రెడ్డి కుటుంబమున జన్మించెను. ఈతనికి సుమారు రెండువందల ఎకరముల భూమిగలదు. దీని వలన సంవత్సరమునకు ఇంచుమించు యైదారు వందల యాదాయము వచ్చును. మన రెడ్డిగారికి తెనుగు నందును, ఉరుదూ భాషయందును కొంత జ్ఞానము కలదు. ఐనను వాక్పటిమలో నీతని సరిపోలు పోలీసు పటేండ్లు అరుదుగా నుందురు. గ్రామములో ఒకనితో నింకొకనికి కలహములు కలిగించుట యందీతనికి పెట్టినది పేరు. గ్రామములో రెడ్డిగారిని మనసార దూషించనివారులేరని చెప్పిన తప్పు కాదు. ఐనను వీరికి జంకియో లేక వారితో నేదేని పని గలుగుననియో అందరును వీరిని గౌరవ భక్తులతో జూతురు. రెడ్డిగారితో కించిద్విరోధ మెవరికైన గలిగెనా నాతడు అచటినుండి వేరొక గ్రామమునకు లేచిపోవలసినదే. లేనిచో నాతడు కష్టనష్టములకు పాలగుటయేగాక కొద్దిదినములలోనే యేదేని నేరము క్రింద న్యాయస్థానమున కీడ్చబడి నేరారోపితుడై శిక్షకు పాత్రుడైన కావలయును. లేదా దండుగలపాలై "అన్నమో రామచంద్రా" యను సప్తాక్షరి మంత్రోపాసననైనను చేయ వలయును. ఈ కారణము వలననే చండశాసనుడగు రామిరెడ్డిగారని గ్రామ ప్రజలకు భయము.

రామిరెడ్డిగారి కత్యవసరమైన కార్యముపై మూడామడ దూరముపైనున్న యతని బంధువుని యింటికి యుత్తరము పంపవలసియుండెను. తలారిని యూరిచంతు మాదిగను పిలుచుకొని వచ్చుటకై పంపెను. కాని తలారి రిక్త హస్తములతో వచ్చి వంతు మాదిగవాని కీరోజు ఆవశ్యక కార్యము కలుగుటచే రాజాలననెనని రెడ్డిగారితో నుడివెను. ఇది వినగానే రెడ్డిగారు తోకద్రొక్కిన కాలభుజంగములవలె క్రుద్ధుడై ఏమి! వంతు మాదిగను ఆవశ్యకమైన పనిగలదా! నా పని ఎవ్వరు చేయుదురు. నీ తాతనా లేక నీ ముత్తాతనా? నీకు బుద్ధి లేదు. తుచ్ఛుడగు మాదిగవానిని పిలుచుకొని రాక యింకను సిగ్గులేక నాతో చెప్పుచున్నావా? నీ కింతయైనను సత్తువా లేదా యనుచు పాదమున నున్న చెప్పునూడదీసి తలారిని కోపమడుగువరకు మోది, ఐదు నిమిషములలో మాదిగ వాడు. రాకున్న నీప్రాణముల తీసెదనని బెదిరించెను. తలారియు పటేలుగారి ప్రతాప మెరుగవాడగుటచే కిక్కురుమనక మాదిగవాడ దారిబట్టెను. పటేలుగారికి క్రోధముడుగక యిట్లు తిట్టనారంభించెను. ఏమి, మాదిగవాని కావశ్యక కార్యమా! ఇక్కడ

సర్కారు పని నెవ్వరు చేతురని తలచెనో, నేడు రేపటి కాలమే మారినది. మాదిగలకు గూడ కన్నులు నెత్తికెక్కి క్రిందుమీదు కానరాకుండ నైనవి. రేపే వీరి పని పట్టించెదను. ఈసారి వీరి మాన్యమును జప్తు చేయించకున్న నేను రామిరెడ్డినే కాను. ఇప్పుడదేమి విచిత్ర కాలమో కాని సర్కారనిన అందరికి నిర్లక్ష్యమే కలిగినది. పాపము వారినెందుకు కష్టపెట్టపలెనని దయదలచిన వారు నెత్తికెక్కి పోవుచున్నారు. .అందుకనే పెద్దలు చెప్పుతో నలుగ రాచపలయునని చెప్పిరి. వెట్టంటే వీరికి కష్టమట. వీరిని ఊళ్ళో ఉండనిచ్చిన దెందుకో - వీరికి రైతులతో బిచ్చము బలిపెట్టించే దెందుకో - ఇంట్లో కూర్చొని దొరంవలె తినుటకు కాదోలు. ఇక నా ప్రతాపమును చూపింతును. వీరల కొంపలు నాశనము చేతును - ఎవ్వరడ్డము వచ్చెదరో చూచెదను కాక.

కార్తీక మాసము ఆరునెలలు కష్టపడి గింజలు పండించుకొని నాలుగు అయిదు నెలల వరకు కలియో గంజియో త్రాగుదుమని యువ్విళ్ళూరుచు పండించి ధాన్యపు కుప్పలను కొట్టుకొను సమయము. బొక్కెనలకు తొండములిచ్చి, వ్యవసాయమునకు కావలసిన యితర పరికరముల నొసగి మీదు మిక్కిలి భూఖామందుతో కలిసి రాత్రింబగళ్ళు పనిచేసిన వెట్టి ఫలితమిపుడే తేలగలదు - ఆ దినమున మాదిగ మల్లడు వంతు పోవలసి యుండెను. కాని నాడే అతడు వెట్టిచేసిన భూఖామందు కుప్పలు కొట్టుచుండెను- అందుచే మల్లడు సంకటమున చిక్కెను. ఒకవేళ వెట్టిపనికి పోయినచో గవ్వ లాభముండక పోవుటయేగాక రావలసిన బిచ్చములో తచ్చగును - వెట్టి మానినచో పాషాణ హృదయుడగు పటేలుగారి క్రోధాగ్నికింధనము నగుదునను జంకు - ఇట్లు చింతించుచు పటేలు గారిని బ్రతిమాలుకొని నేటికింకొకరిని తోలుట కొప్పించుటకై పటేలుగారి సన్నిధానమునకు పోవుటకై ప్రయాణమయ్యెను. ఇంతలోనే తలారి కోపఘూర్ణిత నయనములతో వచ్చి మల్లనిని తిట్టుచు కొట్టుచు పటేలుగారి కడ కీడ్చుకొని పోజొచ్చెను. అధైర్యుడును, న్యాయశాస్త్రమున నేమొనెరుగనట్టియు మనమల్లడు యెవరి ధైర్యము చూచుకొని తలారి నెదిరింపగలడు? పటేలుగారు యితనిని చూచుటయే తడవుగ చేతిలోని కఱ్ఱను సవరించుకొని మల్లనిపై బడెను. మల్లడేమైన మరల కొట్టగలడాయను ధైర్యముతో. నతడు చేతులు నెప్పి యెత్తువరకు సమర్ధించెను. ఎంత కొట్టినను పాపము మల్లడు నోరైన యెత్తలేదు. తుదకు మల్లడు దెబ్బలకాగలేక స్పృహతప్పి పడిపోయెను. నెత్తిపైన బలమగు గాయము తగిలెను. నెత్తురు వరదలై ప్రవహింప దొడగెను. నెత్తురును కనులచూచినతోడనే పటేలుగారి కోపము శాంతించెను. అంత నాతడు తలారితో తన భృత్యులనిద్దరిని బిలిపించి మల్లనిని యింటివద్ద విడిచి రమ్మనెను. వారును శవాకారముగా నున్న నాతనిని యింటికి కొని పోయిరి. సుమారైదారు నెలల వరకును మల్లడు వ్యాధిపీడుతుడై కూర్చున్న చోటునుండి లేవలేనివాడై పడియుండెను. ఇన్ని దినములును తినతిండిలేక, కట్టబట్టలేక ఆలుబిడ్డలు కృశించి యుండిరి. ఇది యంతయు కనులార జూచుచుండెడి పటేలుగారొక కాని సహాయమైనను చేయలేదు. రామిరెడ్డి ఎంత కఠినాత్ముడో పాఠకులే గ్రహించవలెను - ఇట్టి పటేండ్లు దేశమునందింకెంతమంది గలరో యూహించుకొనుడు.

● భాగ్యనగర పత్రిక - ఆగష్టు, 1932 ●

# 5. పందెం

♦ నందగిరి ఇందిరాదేవి ♦

ఆనాటి సాయంకాలం స్నేహితులంతా సేటు రాజారాం ఇంట్లో విందారగించి కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. వివిధ విషయాలను చర్చిస్తున్నారు. ఉత్సాహంగా సేటు రాజారాం తెల్లటి పర్పుమీద ఉన్న పట్టుదిండ్లకొరిగి హుక్కా పీలుస్తున్నాడు అవసరమని అనుకున్నచోట్ల తానుకూడా పాల్గొంటూ. దగ్గర నిలువబడి యున్న నౌఖరు లక్ష్మన్ కాళీయైన గాజు గ్లాసుల్లో వైను నింపుతున్నాడు. స్నేహితులు సేటు బలంవంతం చేయాలని బెట్టుసరిగానే కాళీచేస్తున్నారు పాత్రలు. సేటు "లక్ష్మన్! మొన్న ప్రత్యేకంగా ఆర్డరిచ్చి తెప్పించిన సీసా తీసుకురా" అన్నాడు. లక్ష్మన్ తెచ్చి మళ్ళీ గ్లాసుల్లో నింపాడు. స్నేహితులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. 'సేట్! వేపారం బాగా సాగుతున్నట్లుందే!' అన్నాడొక స్నేహితుడు. 'అవును మరి లేకపోతే ఇంత ఖరీదు గల వైను తెప్పించటం సామన్యమా' అన్నాడు మరొకడు. లక్ష్మన్ అందిచ్చిన గ్లాసు తీసుకుంటూ సేటు కూడా గ్లాసులోనిది కొద్దిగా చప్పరించి స్నేహితులవంక చూచి మందహాసం చేశాడు

గ్లాసులు కాళీకావటంతో ఉత్సాహం ఇనుమడించింది అందరికీ. అంతకు ముందు దాకా చర్చిస్తున్న విషయం మళ్ళీ ఎత్తుకున్నారు.

'మీరు ఏమన్నా అనండి! యావజ్జీవం ఖైదుశిక్ష అనుభవించటం చాలా ఘోరం. అంతకంటే రెండు నిమిషాల్లో ప్రాణం పొయ్యేటట్లు ఉరితీయటం మంచిది' అన్నాడు రాంలాల్ పట్టుదలగా.

'బతికితే బలుసాకయినా తినొచ్చు. అసలే లేకుండా అంతమొందటంకంటె ఎట్లాగో ప్రపంచం మీద ఉండటం నయం' అన్నాడు నరోత్తందాసు. 'ఏమీ స్వేచ్ఛ లేక జీవితాంతం వరకు ఆశలన్నీ చంపుకొని బతికి బాధపడటం కంటె ఉరిశిక్ష అనుభవించటం చులకన గాదూ" అని తాను కూడా ఒక సమిధ వేశాడు సేటు.

'ఈ రెండు శిక్షలూ నాగరికత గల దేశాల్లో గర్హ్యమయినవి. నెమ్మదిగానో తొందరగానో వ్యక్తుల ప్రాణాలు తీయటమే ఈ రెంటి ఉద్దేశం. కాని తప్పుచేసిన వాళ్ళను మంచి మార్గంలో ప్రవేశపెట్టటానికి బదులు సంఘంలోనుండి వాళ్ళను పూర్తిగా అంత మొందించటం దెబ్బ తగిలిన వేలును పూర్తిగా కోసివేయటం వంటిది' అన్నాడు లలితా ప్రసాదు చేతిలోని సిగరెట్టు బూడిద దులుపుతూ. 'నిజమే! ఈ రెంటిలో నాకయితే యావజ్జీవ శిక్షే నయమనిపిస్తుంది' అన్నాడు నరోత్తందాసు.

సేటువంక చూస్తే సేటు తన మాటను పడగొట్టాలని అన్నట్లుగా అనుకొని 'యావజ్జీవం ఏమిటోయి? ఒక ఐదేండ్లు ఉండలేవు! ఏకాంతంగా యావజ్జీవం గడపాలంటే మాటలా?' అన్నాడు సేటు పూర్తిగా వాదనలోకి జొరబడి. ఇద్దరికీ తమ మాట నెగ్గాలన్న పంతం ఎక్కువయి వాదన ముదురుతోంది. స్నేహితులు వాళ్ళకు పొగవేస్తున్నారు తాము తమాషా చూస్తో.

'ఐదేళ్ళు కాదు పదేళ్లుంటాను నువ్వు ఎట్లా చెప్పితే అట్లా' అన్నాడు నరోత్తందాసు.

'ఆ! పందెం! రెండు లక్షలు!' అన్నాడు సేటు ఉద్రేకం పట్టలేక.

'ఓ సిద్ధం! నువ్వు రెండు లక్షలు గుమ్మరించాలి మరి?' అన్నాడు నరోత్తందాసు.

'తప్పకుండా?' అన్నాడు సేటు.

ఇంకేముంది? వ్యవహారం ముదిరింది. సేటు రాజారాంతోటలో పదేళ్ళపాటు ఏకాంతవాసం నరోత్తందాసు అనుభవించేటట్లు తదుపరి నరోత్తందాసుకు సేటు రెండు లక్షలు ఇచ్చేటట్లు ఒప్పందం చేయించారు స్నేహితులు.

సేటు అంతా అయిపోయ్యాక కళ్ళు తెరిచాడు. "ఎంతపని జరిగింది. ఎందుకు వచ్చినట్లు ఈ రెండు లక్షల దండుగ!" అన్నాడు స్నేహితులతో. స్నేహితులందరూ రెండు లక్షల కొరకు వెనుకకు పొయ్యే పీనాసి అని బనాయించేరు. సేటు సిగ్గుతో మారు మాట్లాడక ఒప్పందం అంగీకరించాడు.

తోటలో ఒక గది ప్రత్యేకించారు నరోత్తందాసుకొరకు. సరిగ్గా పదేళ్ళకు ఏ రెండు నిమిషాలు తక్కువయినా కూడా రెండు లక్షలు చెల్లించే బాధ్యత సేటుకు ఉండదు. ఖైదీకి కావలసిన వస్తువులు ఆర్డరు వ్రాసి తెప్పించుకోవచ్చు. పుస్తకాలు, బట్టలు, భోజనం వగైరాలు. అతనికి బాహ్యప్రపంచంతో ఏమాత్రం సంబంధం ఉండకుండా ఈ వస్తువులన్నీ కిటికీద్వారానే వెళ్ళవలసి ఉండేవి. ఖైదీ కావాలంటే ఉత్తరాలు వ్రాసుకోవచ్చు.

మొదటి సం।।రమంతా చాలా విసుగుగా, విచారంగా గడిపాడు ఖైదీ. ఎన్నోసార్లు ఏడవటం కూడా వినబడేది అక్కడి వౌకీదారుకి. రెండు మూడేళ్ళు గడిచాక ఈ ఒంటరి జీవితానికి అలవాటు పడ్డాడు. రాత్రింబగళ్ళు చదవటమే చదవటం. ఖైదీ కావాలెనని వ్రాసి పంపిన పుస్తకాలు తెప్పించలేక అవస్థపడేవాడు సేటు. తన స్థితిని గురించి విచారపడటానికి సమయమే చిక్కక పోయేది ఖైదీకి.

ఒకనాడు సేటుకు ఖైదీ పరిభాషలో ఒక ఉత్తరం వ్రాశాడు. ఆ ఉత్తరం ఆయా భాషలు వచ్చిన వాళ్ళకు చూపెట్టుమని తప్పులు లేకుండా సరిగా ఉన్నట్లయితే తోటలో శంఖు ఊదమని వ్రాశాడు. అట్లాగే శంఖం ఊదారు.

సేటు రాజారాంకు ఇదంతా చూస్తే చాలా ఆశ్చర్యమైనది. ఈ ఏకాంతవాసం పదేళ్ళపాటు అనుభవించపోతాడా? నేను రెండు లక్షలియ్యబోతానా అనుకున్నాడు సేటు. మొదటి సం।।రంలోనే భరించలేక ఆత్మహత్య చేసుకుంటాడని ఆశించిన సేటు చూస్తుండగానే నాలుగేళ్ళు గడిచిపోవటం, అందులో ఖైదీ ఏమాత్రం ఒంటరితనం 'బాధ' అనుభవించటం లేదని తెలుసుకొని కిటకిట పడ్డాడు.

రేపు ఉదయం వరకు పదేళ్ళు నిండుతాయి. మా ఒప్పందం ప్రకారం ఆతనికి రేపు నేను రెండు లక్షలు గుమ్మరించాలి' అనుకున్నాడు సేటు. కాలం అంతా ఒక్కతీరుగా ఉండదు. పదేళ్ళక్రితం రోజుకు ఐదువందలు సంపాదించే సేటుకు ఇవ్వాళ యాభై రూపాయలు రావటం కష్టంగా ఉన్నది. వ్యాపారం నష్టం వచ్చి సన్నగిల్లటం మూలానా రెండు రూపాయలు రెండు లక్షల సమానంగా భర్తుపెట్టుతున్నాడు. 'రేపు ఎట్లాగూ ఇయ్యటం తప్పదు. ఇస్తే ఇంక నేను బిచ్చమెత్తుకోవాల్సిందే?' అంటూ ఎటూ తోచక పచార్లు చేస్తున్నాడు తనగదిలో. 'నేననుకున్నట్లు వీడు చచ్చిపోతే ఎంత బాగుండేది' ఏ దిగులు లేకుండా!' అని గొణిగాడు మళ్ళీ!' ఇంతలో గడియారం రెండు కొట్టింది. కిటికీలోనుండి బయటికి చూచాడు. దట్టంగా చీకటి ఉన్నది. సన్నగా తుంపరపడుతోంది. చప్పున పెట్టెదగ్గరకు వెళ్ళి ఎర్రటి ముఖములు ఒరలో మెరిసిపోతున్న చిన్న కరవాలం మొలలో దోపుకొని తాళపు చెవుల గుత్తి పట్టుకొని బయలుదేరాడు. తోటలోకి వెళ్ళి చేతిలోని టార్చి వెలిగించి చౌకీదారును పిలిచాడు. వాడు పలకలేదు అంతరాత్రి. 'మొదలు అనుమానం చౌకీదారు మీద పడుతుంది. తరువాత ఎట్లాగయినా తప్పించు కోవచ్చు' అని మొలలో ఉన్న కత్తిని చూచుకున్నాడు. మెల్లిగా గది దగ్గరకు వచ్చాడు. బల్లమీద లాంతరు వెలుగు కిటికీలో నుంచి కనబడుతున్నది. టేబిలు దగ్గర కుర్చీలో ఖైదీ కూర్చున్నాడు కిటికీ చేపు చెన్నుచేసి, ఐదునిమిషాలు గడిచాయి. ఖైదీ కదలనేలేదు. 'పదేళ్ళనుండి ఇట్లా కదలక కూర్చోటం అలవాటయింది కాబోలు' ననుకున్నాడు సేటు. కిటికీ తలుపు చప్పుడు చేశాడు. అయినా కదల్లేదు. సేటు తలుపుతాళం తీశాడు. పదేళ్ళ కింద వేసిన తాళం, తీస్తుంటే కిర్రుకిర్రుమన్నది. తానుతాళం తీస్తే ఎంత ఆశ్చర్యంగా చూస్తాడో లేక ఏమున్నా అంటాడేమోననుకున్నాడు. కాని అతడు కదలనన్నా కదలలేదు. గడ్డం జుట్టు బాగా పెరిగింది. చిక్కి శల్యమయి ఉన్నది అతని శరీరం. సూర్యరశ్మి లేక ఒళ్ళంతా పండుబారింది. టేబిలుమీద అన్నీ తెరిచిన పుస్తకాలు కుప్పలుగా పడి ఉన్నవి. అతని ఒళ్ళోకూడా ఒక పుస్తకం ఉన్నది. చదువుతూ చదువుతూ నిద్ర పోయినట్లున్నది అనుకున్నాడు సేటు. 'ఇప్పుడు పొడిచి వేయటం చాలా చులకనయిన పని' అని టేబిలు వంక చూడగానే ఒక కాగితము మీద ఏదో వ్రాసి ఉన్నది.

అది తీసి దీపం వెలుతురులో చదవటం మొదలుపెట్టాడు.

'నేను రేపు ఉదయం బంధవిముక్తుణ్ణి అవుతాను. నాకు స్వేచ్ఛ వస్తుంది. కాని నేను ఈ గది వదిలి వెళ్ళడానికి ముందు కొన్ని విషయాలు నీకు విశదీకరించటం అవసరం.

ప్రపంచం అంతా పెద్దవాళ్ళన్నట్లు మిథ్య. ఈ స్వేచ్ఛ, ఈ జీవితం బుద్బుద ప్రాయాలు. ప్రపంచం పై పై మెరుగులతో నిండి ఉన్నది. ఇట్లాంటి బూటకపు ప్రపంచంలో జీవించటం నాకిష్టంలేదు.

ఈ పదేళ్ళబట్టి నేను ఐహిక సుఖాలన్నిటినీ పుస్తకాలద్వారా అనుభవించాను. తోటల్లో విహరించాను. ఆరామాల్లో విశ్రాంతి తీసుకున్నాను. స్త్రీలను ప్రేమించాను. యాత్రలు సేవించాను. చూడదగినవి చూశాను. వినదగినవి విన్నాను. అంతా అనుభవమయినది నాకు.

నీ పుస్తకాల వల్ల జ్ఞానం సంపాదించాను. నేను మీ అందరికంటె తెలివిగలవాడ నయ్యానన్న నమ్మకం బాగా కుదిరింది.

కాని పుస్తకాలు ఈ జ్ఞానం అంతా వ్యర్థం. ఎంతటి వాడికయినా చావు తప్పదు. అందం, చందం, ధనం, ధాన్యం, తెలివి, గొప్పతనం అంతా చెల్లు దీనితో.

ప్రపంచం అబద్ధాన్ని నిజం అంటుంది. పై మెరుగులన్నీ నిజమయిన అందం అని నమ్ముతుంది. ఇట్లాంటి లోకమే స్వర్గమని ఆనందిస్తుంది.

నాకు ప్రపంచం మీద విసుగు పుట్టింది. ఇవేవి నన్నాకర్షించవు. కొన్నాళ్ళ క్రింద రెండు లక్షల ఆస్తికోసం ఎన్నో కలలు కన్నాను. అనుభవించినట్లే ఆనందించాను. కాని నేడు నాకవి అనవసరం. కనుక నేను నిర్ణీత సమయంకంటే ముందుగా వెళ్ళిపోయి మన ఒప్పందం విచ్ఛేదం చేస్తున్నాను.

సేటు ఇదంతా చదివి కాగితం అక్కడపడవేసి 'నూరేళ్ళు జీవించు నాయనా' అని నెమ్మదిగా వెళ్లిపోయినాడు. తెల్లవారి చౌకీదారు ఖైదీ పరారయ్యాడని బిక్కమొహం వేసుకొని చెప్పాడు.

రాజారాంసేటు బల్లమీద ఉన్న రెండు లక్షల ఒప్పందం వ్రాసిన పత్రం వంక ఒకమాటు చూచి డ్రాయరులో పడేశాడు.

● గృహలక్ష్మి - జనవరి, 1941 ●

# 6. 'నా స్నేహం'

♦ పెండ్యాల శేషగిరిరావు ♦

మా కిద్దరికీ తొలిపరిచయం మా అన్నగారి ధర్మానగల్గింది. ఆ పరిచయం ఏ ముహూర్తాన అబ్బిందోకాని మాయిద్దరికీ, గాఢంగా స్నేహం కుదిరింది. నాకు కొద్దో, గొప్పో సాహిత్యం అంటే ఆపేక్ష. యెప్పటికి యేదో తెల్గు పుస్తకం జేస్తుండేవాణ్ణి. దీన్నిబట్టి నాకు సాహిత్యం విషయంలో తీరని దాహముందని మీరు గ్రహించుకోవచ్చు. అందుకనే నా మిత్రులంతా యేదైనా పుస్తకము నాచేత చదివి వినటానికి సరదాపడతారు. నాకంటె పెద్దవాడనే గౌరవంకొద్దీ, ఆయన రాశిన కొన్ని కథలు నాకు నచ్చటమువల్ల ముఖ్యంగా "విప్రణాం జ్ఞానతోజ్యేష్ఠ" అను లోకోక్తి బట్టి బ్రాహ్మణుడుకావటంవల్ల నేను – 'రఘు' అంటే అపరిమితమైన ప్రేమ గనపరుస్తాను.

మా రఘుకు సంగీతం బాగావచ్చు. హాస్యప్రియుడు గూడాను. సినీమాలంటే మహాచెడ్డ ప్రీతి. ఉభయభాషల్లో మంచి విజ్ఞానం సంపాదించాడు. శాస్త్రాలు, శ్లోకాలు అవలీలగా వల్లించుతున్నప్పుడు మా అందరికీ తన్మయత్వం కల్గుతుంది. ఈ మహాశక్తులన్నీ మా రఘు బుర్రలో మూర్తీభవించాయి కసకనే నేనతనితో నేస్తంకట్టాను. యిట్లా కొన్ని వసంతాలు అతిమనోహరంగా దొర్లిపోతున్నాయి. యింతవరకుగూడ మాయిద్దరి మధ్య యెవ్విధమైన భేదభావాలు రాపద్దని ప్రార్థిస్తుంటాను.

'రఘు'కి కాఫీ హోటల్‌కి అవినాభావ సంబంధం. మా రఘు ఇన్నిగుణాలకు అగ్రస్థానం వహించినా నేనుమాత్రం బహువచన ప్రయోగము చేయక 'రా' 'రారా' అని పిలుస్తుంటాను. మారఘు వున్నంతసేపు నేను బడికి 'సటక్ సీతారాం' జెప్పి వానితోపాటు కాఫీహోటళ్ళు, సినిమాలు, పోతూ మహా సరదాగా కాలంవెళ్ళబుచ్చుతూ వుండేవాళ్ళం. మా రఘు ఎప్పుడన్నా తన స్వగ్రామం వెళ్ళితే నాకు కాలం వెళ్ళబుచ్చటం దుర్లభ మనిపించేది. కలలో మళ్ళీ, మళ్ళీ కాఫీ త్రాగినట్లు ఇడ్లీలు తిన్నట్లు సినిమాలకు పోయినట్టు కనిపించి పిచ్చి యెత్తేది.

మేం పట్టణంలో వున్నంతసేపు రోజు, సాయంత్రం, ప్రొద్దున హోటల్ తిర్గి సాయంత్రం బాగే ఆమావైపుకో లేక చమన్‌కో పోతూ, దారిలో భావకవిత్వ సంభాషణలు మాట్లాడుచు ప్రకృతి చిత్రాలను వర్ణిస్తూ తిర్గి గూటికి జేరుకోవడం మామూలు. మా ప్రతిపనుల్లో డ్యూటీలు, హాస్యపు గొడవలూను.మా రఘుతత్వం ఒకటి నాకు ఆశ్చర్య మేస్తుంది. వాడన్నది ఒప్పుకోవాలి. తను ఏది చేసినా మంచే.

తనపట్టు తనదే. యితరుల మాట కాతరా చేసుట రఘుకు సుతరాం గిట్టదు. అశ్రద్ధ జాస్తి. తలుస్తే బాగానే చేస్తాడులెండి. యిది కనిపెట్టే నేను ప్రవర్తిస్తూంటాను.

ఓ రోజు వాడు రాశిన కథలు, భావగీతాలు చదివి వినిపిస్తున్నాడు. నిజంగా వాడు రాశిన భావగీతాలంటే నాకు చాలా గౌరవం.చదువుటం అయ్యాక ఖర్మం జాలక "కథలు- రచయితలు" అనే విషయము పైనా అభిప్రాయ మడిగినాడు. కథలు బాగా రాశే మహానుభావలెవరు అని? నేను, అందరు మంచికథకులే అన్నాను. అల్లా అంటే కాదు. యెవరైనా నీ దృష్టిలో మంచిగా కథ సృష్టించేవారిని పేర్కోమన్నాడు. నేను ఇగ ఎత్తుకున్నాను. "అమరేంద్ర" "విశ్వం", "జగం" "చలం" "ఇంద్రకంటి, మొక్కపాటి. చింతా "ముద్దా", "ధనికొండ "తాతా" మొదలుగువారని. యిందులో నా కథలు యెవరి కథలను పోలి వుంటాయి? అన్నాడు. నేను ఆలోచించి "ధనికొండ" వ్రాశిన కథలు జ్ఞప్తికి వస్తావిరా! నీ కథలు వింటున్నప్పుడూ అన్నాను. అదిగాకను తుదివరకు మంచి రసవంతంగా వుంటాయి అన్నాను. వెంటనే మా రఘు నన్ను కాఫీహోటల్‌కు తీసుకపోయి 'కాఫీ' పోయించాడు. ఐతే! నాకు కాఫీ పోయించే వారంతా బాగా కథలు రాశేవారు కావచ్చు అన్న సందేహం బయలు దేరింది.

ఆ రోజుల్లో ప్రతిస్నేహితుడు నన్ను చూడ్డంతోడనే ఓ! నమస్తే! అంటూండేవాళ్ళు. యిది నాకు వింతగా దోచేది. యిందులకు కారణం గ్రహించక మారఘు నా విషయమై ఏమైనా ప్రచారము చేశాడా! అని తలపోస్తుండేవాణ్ణి. ఓనాడు 'ప్రసాద్' 'ప్యాలెస్' టాకీస్ వద్ద కలిసి అంతా కులాసా! అని మమ్ముల కుశల ప్రశ్నవేశి మా రఘుని జూచి ఏమోయ్! నీవు కథలు భావగీతాలు బాగారాస్తావుట కదూ! యేదైనా పత్రికకు ఇయ్యక పొయ్యావా! అన్నాడు. 'ప్రసాద్'కు యేదో సమాధానం జెప్పి మేము కాఫీ సేవించి యిల్లు చేరుకున్నాం.

ఇంటికి వచ్చాక యేమి పాలుపోలేదు. కొంతసేపు మా రఘు సిగరేట్ సేవించి రెండు పాటలు పాడి నాహృదయాన్ని సంతోషపఱచినాడు. తదుపరి నేను బడికి పోవుటకు సంసిద్ధున్నయ్యాను. ఇంతలో రఘు నన్ను స్కూల్‌కుపోకుండా ఆపుచేశి మూడురోజులు శెలవు బెట్టుమన్నాడు. యీ మాట వినగనే నా బుర్రలో రైళ్ళు పరుగెత్తినట్టెయింది. ఇదివరలోగానే సక్రమంగా స్కూల్‌కు పోనందుకు మా టీచర్ నన్ను బాగా చీవాట్లేశాడు. ఇప్పుడు మూడురోజులు శెలవులు అవైనా ఓ గొప్ప పని వున్నట్లు మా అంటే స్నేహితులతో బాతాఖానీ, టిఫిన్ మెక్కుతూ, టీపార్టీలు జర్పుతూ, సినిమాల కెళ్ళుతూ, వృధాగా టైమ్‌ను వ్యయపఱచుటకు. కాని రఘు నన్ను వదలలేదు. తను రాశిన కథలు 'ఫేర్' చేయాలనే అభిలాషతో, చేసిన పిదప అచ్చు వేయించుటకు ప్రయత్నములకై వుండమన్నాడు. తుదకు ఎలాగైనా స్నేహితుని కొఱకు 'త్యాగం' జెయ్యాలి అన్నాడు యీ మాటలకు నా మనస్సు పరిపరివిధాల పరుగెత్తింది. యీ మూడు రోజులు బడికి పోనందుకు పేరు స్ట్రైక్ ఆఫ్ అవుటం తప్పదు. పైగా చదువుకు స్వస్తిచెప్పిన సంగతి మా యింటివారలకు తెలుస్తే నన్ను యింటికి గూడా రానీయరు. పోనీ వెధవ స్నేహం యేం జేస్తాడులే అని వెళుదామంటే రఘు వదలిపెట్టే యోగం కాన్పించదు. యీ సమస్యను 'సాల్వు' జేసుకుంటాను. యీలోగా నాకు తెలియకుండానే 'రఘు' ఒక 'లీవ్‌లెటర్' రాసి మా క్లాస్‌మెంట్' కు యిచ్చి పంపాడు. నేను భయపడుతూ ముందు జరుగబోయే ఘట్టాలను నెమరు

వేసుకుంటున్నాను. నా భయ నివారణకై రఘుయేదేమో మాటలు నా 'మైండ్' లో కెక్కించి నీకేం భయం లేదు. నా భారం. బెంగపెట్టుకోకు? అని ధైర్యాన్ని యిచ్చినాడు.

'చేసుకున్న కర్మ అనుభవించాలి' అన్నట్లు నాక్రియలకు దగ్గట్టు హాస్టల్లోనుండి పేరు తీసివేయబడ్డది. తదుపరి నా పశ్చాత్తాపమునకు మేరలేదు. ఐనా ధైర్యం వహించి స్నేహితుల సలహాలను గైకొంటూ ముందు కార్యక్రమానికై నడుం కట్టాను.

తదుపరి మా విజ్ఞానాన్ని సద్వినియోగం చేయాలనే ఉద్దేశ్యంతో కథలు, భావగీతాలు వ్రాయటం మొదలెట్టాం. తిర్గి వాటిని అచ్చు వేయించాలనే అభిలాషతో. దానికి ప్రారంభములో ఎవరైన గొప్పవారితో సంస్కరించిన బాగుందునని తలచి 'బందర్' పోవుటకు 'ప్లాన్' వేసుకున్నాం.

అదే ప్రకారం రైలులో ప్రయాణమై వెళుతున్నాం. దారిలో ఆ నల్లని మేఘాలు పరిగిడుతున్నట్లు మా భావాలు పరుగిడుతున్నాయి. అప్పుడే తూర్పున కుంకుమ చల్లినట్లు సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఆ పచ్చపచ్చని పొలాలు మా హృదయానికి ఎంతో హాయి గూర్చాయి. కొందరు రైతులు ఆ బురదలో నిర్విచారముగా పనిచేస్తున్నారు. మరికొన్ని దృశ్యాలు నామనస్సులో పురాణ వైరాగ్యం కల్పించాయి. అట్టి సమయములో నా మనస్సంతా ఇంటిలోనే వుంది. మాయింటిలో నా విషయమై ఏమి అపోహపడు తున్నారో! ఎంత నిందిస్తున్నారో! నిజమే! మన తలిదండ్రుల హక్కులను పాటించాలి! వాళ్లు చెప్పే నీతులను నియమబద్ధంగా ఆచరిస్తూ అభివృద్ధికై పాటుపడాలి! ప్రస్తుతం నేను మావాళ్ళను మెప్పించే ఉపాయము వెదకాలి.

ఇంతలో బందరు చేరుకున్నాం. అక్కడ మాకు పరిచయ మున్నవారు యెవరు లేకున్నా కృష్ణాపత్రిక సంపాదకులు "మౌన ముద్రాలంకారః" ముట్నూరి కృష్ణారావు గారి బసను కనుగొని వారి యింటికి జేరుకున్నాం. వారు మమ్ముల యెంతో ఆదరించి తగిన అతిథి సత్కారాలు జర్పి, మేము వచ్చినపని యేమో తెలియ కుతూహలమొందారు.

ఇంతలో నేను మెల్లిగా సంశయమును వెలిబుచ్చినాను. అయ్యా! నిరాఘాటంగా, అతి గంభీరంగా వ్యాసము రాయాలంటే ఏమి చేయాలి! ఎట్లా అబ్బుతుంది? అన్నాను. దీన్ని బట్టి వారు గ్రహించి వుండవచ్చు.' నేను వారి సంపాదకీయమును, మెచ్చుకొని యిటుల అడుగుచున్నానని. ముసి ముసి నవ్వులే అబ్బాయీ! ముఖ్యంగా మనం విజ్ఞానం బాగా సంపాదించాలి. తదుపరి ఆ విజ్ఞానాన్ని స్వతంత్రముగా ప్రజానీకంలో గౌరవ స్థానం అలంకరించుటకు తగిన కృషి నిర్భయంగా చేయాలి. వారు చెప్పిన యీ రెండు వాక్యాలు నాకు వరహాలు.

తదుపరి మా రఘు తాను వ్రాశిన కథలు వారికి జూపించుటకు జంకుతుండగా వారు అబ్బాయి! నీ సంశయమేమిటో నిర్భయంగా వెలిబుచ్చు అన్నాడు. అప్పుడు మేము వారి ప్రకృతి గ్రహించినవారమై, అతనికి మాపై వున్న చనువు, ప్రేమకు ఆశ్చర్యం జెంది నిరాటంకముగా మా పద్యాలు, కథలు వారిముందు పెట్టాం- వాటిని వారు జూచి సంస్కరించి మావిమాకు యిచ్చేశి బాగున్నాయి! 'మీరు యింకా కుర్రాళ్ళు, ప్రయత్నం జెయ్యండి. మీ పరిశ్రమ యెన్నటికి వృధాగాదు. యీ పట్టుదలను వదలక సాధ్యమైనంతవరకు రాస్తు వుండండి. ఒకప్పుడు గాకున్నా యింకొకప్పుడు

మీ రచనలు అభివృద్ధికి రాగలవు' అని కొన్ని సూక్తులు మాకు బోధించి సాగనంపాడు. మేము ఆ మహానుభావుని విషయమై చర్చించుకొనుచూ యిల్లు చేరుకున్నాం.

యిల్లు చేరిన తర్వాత బడలిక చేతనో, మరెందు చేతనో నాకు బాగా ఆకలి వేసింది. అప్పుడుమాత్రం, మా రఘు, నేను "భార్య చేత పంచభక్ష పరమాన్నాలు తిన్నదానికన్న, తల్లిచేత తవిటన్నం తిన్నదిమేల"ని భావించి ఆ హోటల్ మెతుకులు దీసక యింటిలోనే వంట జేసుకొని దివ్యంగా భోజనం చేశాం.

తదుపరి మా మిత్రులంతా మేమేదో 'ఇన్‌వైట్' జేశినట్లు జేరుకున్నారు. కొంతసేపు బాతాఖానీ' వేసి తదుపరి మేం బందరు పోయివచ్చిన వృత్తాంతము అంతా మా స్నేహితుల ముందు నివేదించుకున్నాం. చాలా సంతోషపడ్డారు. ఇగ మా బంధువులను సంతోషపెట్టి వారికి లోగావున్న సంతాపము బాపుట నా విధి. కావున మేము వచ్చే ముందు సరస్వతీ ముద్రాలయా – బెజవాడలో అచ్చు వేయించిన కథలు మా బంధువులను ఉల్లాసపఱచగలవని నమ్మి యీ విషయం మా యింటికి తెల్పి ఇగముందు నా ఉద్యోగం యిదేయని, భవిష్యత్ గూడ యిదే వృత్తిచే కాలం వెళ్ళబుచ్చుటకు సమకట్టాను. దీనికి మా బంధువులు, యింటివారలు అంతా గతించిన విషయం తలపోయక, నిరుద్యోగంగా వుండక యేదో ఒక గౌరవమైనపని జేస్తున్నందుకు సంతోషపడ్డారు. నేను గూడ నా విజ్ఞానాభివృద్ధికి తగిన మార్గం లభించింది గదా! యని సంతృప్తి పడ్డాను. ప్రస్తుతం మా వాళ్ళు నాపై వున్న పూర్వ వైరాన్ని చంపేసుకొని ప్రేమభావంగా చూస్తున్నారు. ఇప్పుడు నేను వివిధ భాషల్లో అభివృద్ధి చేయాలని, ప్రతి పుస్తకం వల్లిస్తూ, కథలు రాస్తూ, సాహిత్యం పెంపుజేసు కొనుటకు తగిన సాహసం యివ్వాలని దేవుని ప్రార్థిస్తున్నాను.

**● 1943 ●**

# 7. మనమే నయం

♦ కాళోజీ నారాయణరావు ♦

'ఇవ్వాళ్ళ ఎల్లయ్య మనమెడల పైకాణికి బదులు, బుక్కా గులాలు, బ్యారేడు జోడులకు బదులు పూలదండలు, నొదుట కుంకుమ పెట్టి కొరడా చురుకులకు బదులు వెన్నుపై దయతో చేయి తిప్పుతున్నాడేమి?' అని నల్ల ఎద్దు తెల్ల ఎద్దును ఎల్లయ్యకు తెలియకుండానే ప్రశ్నించెను. అంత తెల్ల ఎద్దు

'ఓపిక పట్టు. అంతా జరిగినట్టు జూడు. అదే తెలుస్తుంది. నాకుమాత్రం ఏమి తెలుస్తుంది' అనెను.

ఆరోజు ఎస్‌పిసిఎ (జంతువుల యెడ జరుగు అన్యాయ నిరోధక సంఘము) స్థానికశాఖ కార్యకర్తలు తమ సంస్థయొక్క వార్షికోత్సవము జరుపదలచిరి. వారు నాడు పుర ప్రముఖులతో బాటు పురములోని కొన్ని ఆపులను, గుర్రాలను, ఎడ్లను, బాగా బలసిన వానిని వెతికి వెతికి ఊరేగింపు జరుపుటకు ఏర్పాటు జేసిరి. నుల్లన్న సేటుగారి భర్తి బండిని లాగే పై రెండు ఎడ్లు కూడా నాటి ఊరేగింపులో పాల్గొన వలసియుండెను. అందుకనే వాటి కాపరి ఎల్లయ్య వాటికి బండికి కట్టక అందంగా అలంకరించుచుండెను.

పగలు మూడుగంటలకు బాజా బజంత్రీలతో, వాలంటీర్ల 'గార్డ్ ఆఫ్ ఆనర్లతో' చెప్రాసి మొదలు సుబేదారువరకు గల ప్రభుత్వోద్యోగులు, లక్షాధికారులు, బిచ్చగాండ్లు, విద్యావంతులు, అవిద్యావంతులు, డాక్టర్లు, వకీళ్ళు వారు వీరు అననేల అన్ని కులాల, సంఘాల, మతాల, ప్రతినిధులు ముందునడువ ఎడ్లు, గుర్రాలు, ఆవులు మహావైభవంగా ఊరేగెను. గుంపులోనున్న చాలామంది పెద్దలకు (వారికి గల ధనసంపదలచే పెద్దలు) నాటి యా హడావుడి విషయము కథా ప్రారంభమున నున్న ప్రాణులకి తెలిసినంతే తెలియును. పాపమా నల్లెద్దుకు ఎల్లయ్య బలవంతముచే నాటి యా వుత్సవములో పాల్గొనవలసి వచ్చెను. గుంపులోని చాలా మంది పెద్దలు ప్రభుత్వము వారి ఉన్నత ఉద్యోగుల యాజ్ఞాబద్ధులై నడుచుచుండిరి. ఇంతే తేడా.

పెద్ద హడావుడితో ద్విపద, చతుష్పాదముల అపూర్వమైన గుంపు పుర మందిరము జేరెను. అక్కడ అదివరకే సభకు తగిన ఏర్పాట్లు చేయబడియుండెను. ప్రభుత్వము వారి ఒక గొప్ప ఉద్యోగి(అధికారి) అధ్యక్షత వహించెను. సంఘ కార్యదర్శి వార్షిక నివేదిక చదివి వినిపించెను. దానిలో యెన్ని వందల ముల్లుకట్టెలు విరగగొట్టినది, యెంతమంది బండ్లవాండ్లను జట్కా వాండ్లను బక్కవాటిని, గాయపడినవాటిని, ఎడ్లను, గుర్రాలను, బండ్లకు కట్టినందుకుగాను కోర్టుకెక్కించి

జరిమానాలు జేయించినది (దానిచే ఆ బక్క వాటికి గడ్డికొనుటకు చిల్లిగవ్వలేక ఎన్నింటినో చంపుకొన్న సంగతి దానిలో లేదు) వివరంగా వుండెను. తర్వాత నలుగురైదుగురు పెద్దలు, జంతువులకు గల కష్టాలు, ఇబ్బందులు, వానిని మాన్పుటకు ఉపాయములను గూర్చి ఘనంగా ఉపన్యసించిరి. (యింతకు వారిలో ఎవరికి ఏ జంతవునకేమి కష్టమో ఏమి సుఖమో తెలియదు.) సభానంతరము పెద్దలందరు తమతో చేరేగిన జంతువులను జూచిరి. వారంతా మోటార్లలో తిరుగుతూ భవనాలలో జీవనం గడిపేవారు. కావున ఆ జంతువుల జూడ వారికెంతో సరదాగా వుండెను. వారిలో కొందరికి గుర్రాలననేవో, యెడ్లననేవో కూడా తెలియదు. ఇట్లు ఈ తమాషా జరిగిన తరువాత పెద్దలందరు తమ తమ బంగాళాలకు, పశువులు తమ తమ దొడ్లకు వెడలిపోయెను. మన నల్ల, తెల్ల యెద్దులు గూడా నాడు తమ జీవితములో మొదటిసారి బండి లాగని దినము (విశ్రాంతి) జరిపి యెల్లయ్య సహాయంతో తమ దొడ్డిని జేరుకొనెను. పాపం నల్లది ఉదయం తానడిగిన ప్రశ్నకు సంతృప్తికరమైన ప్రత్యుత్తరము గానక చింతతో నుండెను. అంత తెల్లది దానితో నిట్లనెను.

"నేటి 'ఫార్సు (బూటకము) నీకు బోధపడలేదేం? చెపుతాను విను. ఈ మనుష్యులలో కొందరు, అందులో ముఖ్యంగా పనిపాటలు లేకనే వందలు వేలు గడించేవారు మన క్షేమం కోసమని ఓ సంస్థ స్థాపించారు. ప్రత్యక్షంగా నిత్యజీవితంలో వారికీ మనకూ ఏమీ సంబంధంలేదు. మనతో నేరుగా సంబంధం ఉన్నవారు, మనవలన జీవనోపాధియే గాక వేలపుట్ల ధాన్యము పండించుకునేవారు, మనపై, మనము ఈడ్చె బండ్లపై స్వారీ జేయువారు మనలకు తిండి సరిగా పెట్టక కష్టపెట్టెదరనియు, మనకు రోగం వచ్చిన, గాయాలు తగిలిన, చికిత్స జేయించకనే మనతో పని చేయించుకుంటారనియు, అందువలన మనమందరము చాలా ఇబ్బందుల పాలగుచున్నామనియు వీరి అభిప్రాయము. అందుకనే ఈ సంఘం వారుయెంతో ప్రయాసపడి మన కాపరులగు నరులనుండి వేలకు వేలు ముల్లు కట్టెలను లాగికొనుచున్నారట. బక్కబడినవాటితో, రోగాలవాటితో, గాయపడిన వాటితో పనితీసుకొను నరులను కోర్టుల కెక్కించి శిక్షలిప్పించుచున్నారట. కాని వీరికి కలుకలు నరకబడే జంతువులపై ఏ మాత్రము దయలేదు. ఒకేసారి చంపుట యన్న జీవిత కష్టముల నుండి ముక్తి యిప్పించుటయని వీరి యభిప్రాయము కాబోలు! తమ ఆహారమునకు ప్రతిరోజు తెల్లవారు సరికి, లక్షల కోళ్ళు, గొఱ్ఱెలు, ఆవులు, యెడ్లు క్రమముగా నరకబడుచున్నను వీరికేమాత్రము ఆక్షేపణ లేదు. అట్లు జంపుటకు కావలసిన జంతువులు ఆరోగ్యము కలవి, బాగా బలిసినవి, ముసలివి కానివి, బలము గలవిగా వుండవలెను. ఇది ఏమి భూతదయయో! ఇది ఏమి దౌర్జన్య నిరోధమో!! వారికే తెలియవలెను. ఇంతకూ ఈ సంఘం వారు మనపై జేసిన ఉపకారమేమి? తల్లిపాలు మరచి ఏ నాలుగుపోచలో నమల నారంభించిన నాటినుంచే మనకు ఈ నిర్బంధ జీవితము ప్రారంభము. రోజు ఒకటే కార్యక్రమం. స్వేచ్ఛయననేమో మనమెరుగము గదా. ఏ వాంఛను కూడా దీర్చుకోనివ్వక ఈ నరుడు మన జీవనమును దుఃఖమయం జేయుచున్నాడు గదా. వాడు కట్టిన గుంజవద్ద పడి

యుండి, వేసిన నాలుగు గడ్డిపోచలు, నమిలి, బండికి కట్టితే బండిని, నాగలికి కట్టితే నాగలిని, మోటకు కట్టితే మోటను, అది ఇది అనలేల, చేయించిన పనిని తలవాల్చి జేయవలసినదే కదా! లేకపోతే యెముకలు విరిగెటట్లు బాదుతాడు దుడ్డుకర్ర పుచ్చుకొని. పనిచేస్తాం. చేస్తూ వచ్చాం. చేస్తూ వున్నాము. చచ్చేవరకు చేస్తాం. మనకున్న అన్ని కష్టాలకు మూల కారణం ఈ నిర్బంధజీవనము. దానికి కారణం ఈ నరుడు. వీడేమి! మననుద్ధరించుట ఏమి!! తన జీవనాన్ని సుఖంగా గడుపుటయే పరమధర్మమని తలపెట్టి అందుకని మనలను అన్ని నిర్బంధాల పాలుజేసే నరుడా మనపై దౌర్జన్యముల నిరోధించునది. ఛీ ఛీ అంతా బూటకం. మోసం. ఏమంటావు, అంతేనా?"

ఇంతవరకూ తెల్లఎద్దు ఇచ్చె ఉపన్యాసం శాంతంగా వింటున్న నల్ల ఎద్దు ఇట్లనెను:

"అంతా నిజమే చెప్పావు కాని మనలను ఇంత కష్టపెట్టే ఆ నరుల జీవితం మాత్రం ఏమంత బాగా ఏడ్చింది. వారిలో చాలామంది బ్రతుకు మనకన్నా అన్యాయం. అత్యల్ప సంఖ్యాకులైన భాగ్యవంతులు (అందరి కష్టాలకు మూల కారకులు) తప్ప మిగతా కోట్లకొద్ది ప్రజల జీవితం మనకన్న ఎన్నియో రెట్లు అసహ్యకరంగా వుంది. జంతువులలో స్వేచ్ఛగా వున్నవి సుఖంగానే వున్నవి కదా. పోగా మిగిలిన మనవంటివి. మనవంటి వాటికి గూడా అతి దేహకష్టము జేసిన తర్వాతనైతేనేమి తినుటకు గడ్డి, చొప్ప, తెలకపిండి, త్రాగుటకు నీరు, వుండుటకు కప్పుగల దొడ్లు గలవు. కాని మనుష్యులలో కోట్ల కొలది జనులకు ఎముకలు విరుగునట్లు కష్టపడినను వుండుటకు గుడిసె లేక, వారి ఆచారాను సారము దేహము దాచుకొనుటకు గుడ్డలేక, తుదకు త్రాగుటకు జలమైన లేక మలమల మాడుచు అసహ్యకరమైన రోతపుట్టునట్టి జీవనము (కేవలము ధనాఢ్యుల దాస్యము కొరకేయన్నట్లు) గడుపుచున్నారు. వారికి మనకున్నట్లు దౌర్జన్య నిరోధక సంఘమొకటి (ఎన్‌పిసిఎ) లేదు. కనీసం తలనరికి ఒకేసారి కష్టముల నుండి ముక్తి యిప్పించు నటువంటి కసాయి భానాలు గూడా లేవు మనకున్నట్టు. ఇంతకూ మనమే నయము!!" ఇది విని తెల్ల ఎద్దు తెలతెల బోయెను.

● కాళోజి కథలు, అణాగ్రంథమాల ప్రచురణము - 24 ఏప్రిల్, 1943 ●

# 8. విశ్వప్రేమ

♦ సర్వదేవభట్ల నరసింహమూర్తి (కవిరాజమూర్తి) ♦

రాధ చేశిన కార్యం పాపభూయిష్ఠం. ప్రస్తుతమామె కులట, కళంకిని, రాధ శరీరం పరస్వాధీనమైన కళేబరం, ఆత్మమాత్రం అగ్నిసాక్షిగా పరిణయమాడి, శిరస్సుపై దిక్పాలకుల సాక్షిగా, మహత్తరమైన వైదిక మంత్రములతో పసుపు బియ్యము చల్లినవాని బానిస.

అతడు ముదుసలి. కామక్రోధంలో భాలణగిపోయినవాడు కావుననే ఆ పుత్రుడు తనవాడు కాడని గుర్తించినాడు. కొందరు మేనమామపోలికని మరికొందరు అక్క కొడుకు పోలికని అన్నారు. ప్రపంచమునకు మాత్రం రాధ కళంకని అని తెలియదు. కావుననే సాహసించి నిర్ధారణ చేయలేకపోయింది. "గుమ్మడికాయల దొంగ" అంటె బుజాలు తడుముకున్నాడు ముదుసలి. తన పరిస్థితిని బాగా గుర్తెరిగి అనుమాన నిర్ధారణకై ప్రబల ప్రయత్నం చేయసాగాడు.

స్నేహబంధము మాంగల్య బలంకంటె, మాతాపితృ వాత్సల్యం కంటె మహత్తర మైనది. ఆ స్నేహిత సంబంధము యొక్క పరిపక్వ దశయే స్త్రీ పురుషుల లౌకిక సంబంధమునకు నాంది. భగ్న ప్రేమికులిరువురు ఒకనాటి రేయి కలుసుకున్నారు. ఒకదానిపై నొకటి స్వారీ చేయుచున్న మబ్బు తునకల మింట జూచి నవ్వుకున్నారు.

కార్య దీక్షతత్పరుడైన ముదుసలి తన ప్రయత్నంలో విజయలక్ష్మిచే వరింప బడ్డాడు. "నీవు నాకవసరం లేదన్నాడు నిష్కర్షగా. పావనమైన హిందూమత సిద్ధాంతములు అన్యాక్రాంతమైన వస్తువును ముఖ్యముగా స్త్రీని దగ్గరికి తీయుటకై సమ్మతింపవు" అన్నాడు. రాధ పొరపాటయిందని బ్రతిమాలింది కాని ఆ ముదుసలి పాపమొనరించి, పశ్చాత్తాప పడుట మరో పాపమన్నాడు. ఒక ఒరలో రెండు కత్తులిముడవన్నాడు.

★ ★ ★

ఆకాశం శూన్యంగా ఉంది. నల్లటి కారుమబ్బులు ఒకదానిపె ఒకటి, కేళీ విలాసాలు జర్పుచు సాగుచున్నవి. ఆ నల్లటి మబ్బుల్లో ఒక మెఱుపు తళుక్కుమంది. రాధ తన పాపను తీసుకుని బయల్దేరింది. కష్ట పరంపరలోనే భక్తి రెట్టింపని శాస్త్ర ప్రమాణము. రాధ తిన్నగా నడుస్తూ శూన్య ప్రపంచాన్ని చూచి చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వు ఎండిపోయిన పెదవుల మీద అంకురించి క్షణంలో మాయమైంది. రాత్రంతా ప్రయాణం సాగించింది.

దివాకరుడు తన ప్రయాణాన్ని సాగించినాడు. పాపాయి కెప్పుడున్నది .ఆ శబ్దం రాధ చెవిగుండా పోయి హృదయానికి బాణమువలె తగిలింది. రాధ త్రుళ్ళిపడ్డది. పట్టణంలో వ్యక్తులంతా తమ తమ పనులకు పోవుచున్నారు.

"అమ్మా! పాపాయికి ఒక ముద్ద అన్నం?" అంది రాధ.

"మేము బ్రాహ్మణులం, ఇప్పుడే వీలుకాదు" అంది ఆవిడ.

"అమ్మా! ఈచిన్నపాపకు కబళం" అంది రాధ.

"మేము విద్యార్థులము, ఆడవాండ్లు లేరు అన్నాడా తను."

బైటకు వస్తున్న తనతల్లిని లోనికి వెళ్ళమని సైగ చేస్తూ "తల్లీ! ఊప్సు" అంది మరో యింటిముందు. తెల్లని రవి బింబము ఎర్రబారింది.

యువకులు తమ గృహిణులను దర్శించుటకై కాబోలు ఆత్రంగా ఇండ్లకు వస్తున్నారు పొలములనుండి. కొందరు యువతలు శృంగారించుకొని తమ భర్తల నాహ్వానిస్తున్నారు. అందు కొందరు వీధివెంట నడిచే యువకులను చూస్తూ తమ విధిని తిట్టిపోసు కుంటున్నారు.

సమయము చాలా ప్రశాంతంగా వుంది. కబళము తీసికొని సమీపము నున్న తటాకము వద్దకు వెళ్ళింది. రాధ పాపమా పాపకు అన్నంపెట్టి తను దోసెడు నీళ్ళు మాత్రం తాగుదామని. తటాకము యోగసమాధియందున్న బుద్ధదేవునివలె ప్రశాంతంగా వుంది. తటాకము నుండి చిన్న చిన్న అలలు ఉత్పత్తి అయి క్రమేణా క్షీణిస్తూ ఒడ్డుకు జేరుచున్నవి ముసలమ్మవలె.

"అమ్మా! లే, ఇదిగో అన్నం తిందువులే" అంది రాధ లేని బలం తెచ్చుకొని.

కాని పాప సమాధానమిచ్చలేదు.

"అమ్మా! అమ్మా!" అని మరల అంది. ఆ ధ్వని విచారపూరితమై విషాదంగా ప్రతిధ్వనించింది. ఆ ధ్వని ప్రథమ శ్రుతిలో రాగోత్పత్తి అయినట్లు బొంగురుగా వెడలింది. అప్రయత్నంగా రాధ కండ్ల నుండి రెండు అశ్రుబిందువులు నేలపై రాలాయి. పిల్లను కదల్చి చూచింది. కాని పాపమా పసిబిడ్డ పరమపదించిందని తెలిసికొని భోరున ఏడ్వసాగింది. రాధ చేతులు వణికినవి. ఆమె చేతుల్లో నుండి పిల్ల జారి క్రిందబడ్డది.

తనకీ విస్తీర్ణమైన ప్రపంచంలో ఏమీలేదని ఇప్పుడు గుర్తించింది రాధ. ఆమె రోదన పర్వతాలను సైతము కరిగించింది కాని భగవంతుని లీలలను సంఘ శాసనాలను మాత్రం కరగించలే.

నన్ను నీలో ఇముడ్చుకో తల్లీ! అంది రాధ.

"గుభిల్లు" మనే శబ్దం ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఆ నిశీధిలో పర్యవసించింది. ఆ శబ్దంతోపాటు తటాకంలోని కొన్ని బిందువులు పైకిలేచి ఒడ్డుపైవున్న బండమీదపడి జారిపోయినవి. మరికొన్ని గరికపై, కొన్ని మరల తటాకములోనే కలసిపోయినవి.

కొన్ని మాత్రం తామర పత్రం మీద పడి ధగధగ మెరసినవి.

● పార్థివ ఉగాది - 1945 ●

# 9. అన్నా - చెల్లెలు

♦ అడ్లూరి అయోధ్య రామ కవి ♦

"అరవిందా! అన్ని యెరిగిననీవు, మూడు సంవత్సరాల నుంచి కాపురం చేస్తూ నా హృదయాన్నెరిగిన, నీవే ఇలా శంకిస్తూ మాట్లాడితే ఇకనే నేమనగలను? ఎన్నడైనా నీ రామం పరిస్త్రీతో మాటైనా మాటాడినట్టు చూచావా".

"మరైతే ఈ ఫోటో యేమిటి? మన ఇంట్లో, ఊళ్ళో అంతా ఏమంటున్నారు?"

"అబ్బ! నేను నీకెలా బోధించగల్ను? నా మాట నమ్ము లోకులు, బంధువులూ ఆడిపోసుకున్నంత మాత్రాన నీ నిర్మలమైన వాత్సల్యాన్ని మంటగలుపుకొని యావజ్జీవితం సుఖించబోయే నాధుణ్ణి వీడగలవా?"

"---"

"అబ్బ! ఆకంటినీటిని నే చూడలేను. నిష్కారణంగా ఈ నింద నాపై పెట్టకు. ఆమె నా సోదరి. ఆ భావం ఈ ఫోటోలో నీకు కన్పిస్తులేదా? స్త్రీకి సహజమైన ఈర్ష్య, తన భర్త పరస్త్రీ లోలుడైతే. కాబట్టి నీవు శంకించటానికి తావులేదనను. కాని విశాల హృదయంతో యోచించు."

"క్రిందటి తడవనే మీరు పట్నం వెళ్ళి నాలుగు నెలల వరకురాని కారణం కూడా ఇదే ఐయుంటుంది. నేను మొదట కూడా అనుమానించలేదు. కాని యీఫోటో యేమిటి? ఒక ధర్మపత్ని తన నాధుని పాదాభిషేకం చేస్తున్నట్లు ఇంకా నమ్మకపోవచమేమిటి?"

"ఐతే జరిగిన సంఘటనంతా చెప్పుతాను తరువాత నీవే నిర్ణయించు. ఇకనేనేమీ అనను" అని రామం ఇలా చెప్పసాగాడు.

"ఆ రోజుల్లో ఇంటి బాధలు పడలేక, పట్నం ఉద్యోగాన్నన్వేషింపబోయిన రోజులు. నెలపదిహేను రోజులు కాళ్లు కాయలు కాచేట్టు తిరిగినా ఉద్యోగం దొరుక లేదు. కాని ఆ ఆంధ్రపితామహుని దయ వల్ల తన పత్రికలో కొన్ని కథలు మాత్రం వేసుకుని తృణమో పణమో ముట్టచెప్తుంతుంటే, దానితోనే సవరించుకుంటుండేవాణ్ణి. ఇలా ఉండగా ఓ రోజు పెద్ద బజారులో ఏదో కాన్ఫరెన్సు జరుగుతూంటే వెళ్దామను కున్నాను. ఐదు దాటింది ఇంకో పదినిముషాల్లో సభ ఆరంభం అవుతుంది. కాబట్టి మెయిన్ రోడ్డు గుండా వెడితే ఆలస్యమౌతుందని ఆ---వాళ్ళ సందులోనుంచి (crosscut) గా వెళ్ళిపోతున్నాను. ఏ మాత్రం చెప్పటానికి అలవిగాని ఆ సందు చూచేవరకు నా కంటినీళ్ళు ఆగలేదు. ఏమిట రవిందా!! వాళ్ళ జీవితం. అందుండి

నడుస్తున్నంతసేపూ, పెళ్ళీళ్లు అందులోని భోగం మేళాలు, జారులు, వాళ్ళ విపరీతపు చర్యలు, భార్యలున్నా వీడి ఒకవిధమైన ముద్దు తకాశాన్నా పరించిసట్లు వారు చేసే కృత్యాలు మొదలైనవి నా కళ్ళల్లో మెరిసాయి. ఈ వీధి అనేదొకటి సృష్టించింది వారే కదా అనుకున్నాను. అలా పోతుండగా అకస్మాత్తుగా ఒక విగ్రహం ఏర్పడ్డది. నేనాశ్చర్యపోయాను. వెంటనే నా కాలేజీ జీవితం, నా ఇంటిపక్కన ఉన్నవారి జీవితం స్ఫురణ కొచ్చాయి. ఆమె నన్ను హస్త సంజ్ఞతో పిలిచింది. పోకుండా ఉండలేక పోయాను. లోపలికి వెళ్లింతరువాత ఓ కుర్చీలో కూలబడ్డాను.

"ఏం జానకీ - నీ జీవితం! -"

"జాను, ప్రభాకరం ఆ నెలరోజులు నా వద్ద ఉండిపోయాడా? ఆ రోజునుంచి నేనతన్నే పెళ్ళాడతాను కాని యీ వృత్తి వద్దని నేను మా అమ్మతో పంతంపట్టింది. దాని గురించి రోజు జరిగే సంఘటనలు తెల్సుగా?"

"ఆ!, తరువాత?"

"ఏమున్నది - కన్నతల్లి గంగపాలు కావటం జరిగింది. ఆమె చెప్పిన మాటలన్నీ ఇప్పుడనుభవంలోకి వస్తున్నాయి. ఆ రోజు ఏకాకినైపోయినాను. ఉన్న ఆస్తి ఆరునెల్లు గడిచింది. తరువాత డబ్బేలేదు. కృషిపై ఆధారపడుదామనుకున్నాను. ఒక మిల్లులో పనిజేయటానికై వెళుతుండేదాన్ని. మానేజర్ ఒకరోజు బలవంతం చేయబోయాడు. ఆ పని చాలించుకున్నాను. నా ప్రభాకరం కలవడు పెళ్ళికాదు. ఇదే రాత్రింబగళ్ళు ధ్యాస నిరీక్షణ. ఒక ఇంట్లో దాసీగా పనిచేశాను కొన్నిరోజులు, కాని దురదృష్టం వల్ల అతని భార్య నాకంటె కురూపి కావడం మానేజరు తోప ననుసరించబోయాడు. అక్కడికా పనికి స్వస్తి! ఇలా అడుగడుక్కు ఎన్నో దాటుకుంటూ ఆ ప్రభాకరం కొరకు నిరీక్షిస్తుండే దాన్ని. "నన్ను ప్రధమం స్వీరించినవాడతను అతనే నా భర్త" ఈ ఆలోచనలతో రెండేళ్ళు నిరీక్షించాను. కాని సర్వజగత్తుకే నాపై కామముద్భవించినట్లు తెలిసికొన్నాను. అంతా నన్ను నిర్బంధించినట్లు తోచింది. నా మతి తిరిగింది. ఎక్కడలేని కోపమొచ్చింది. వెంటనే అనగా పదిహేనురోజులనుండి ఇక్కడుంటున్నాను. ఇప్పుడు బహిరంగంగా నేను వేశ్యను. డబ్బుకై శరీరమమ్ముకునే కులటనుకాని ఆ రోజుల్లో నన్ను బలవంతపెట్టే వాళ్లెవరూ నా దగ్గరకూ రాలేదు. ఇక్కడ చూస్తును కదా అందరు రంగ్‌రంగేలాగా ఉంటారు. వచ్చినవారంతా వాళ్ళ ఇండ్లకే పోతారు. మరి నావద్ద ఆ బహిస్సౌందర్యం లేదు. దానికి తగ్గ ఉపకరణాలు లేవు. నాపై కన్నెత్తి చూడరు. ఈ రోజుకు బియ్యం లేవు. ఒకానొక రోజు అన్నా అని పిలిచిన చెల్లె నేడు 'నాధా' అని పిల్చి మీ కామతృప్తి నడచటానికి నిలబడి ఉంది. కాని నా హృదయం అప్పటి 'అన్నయ్య' నే జ్ఞాపకం చేస్తూంది. అంటూ నునుపారిన చెక్కిళ్ళపై నుంచి ఆశ్రు స్రవంతి వస్తుంటే నా హృదయం నీరైంది".

"ఇక ఏం చేయాల్సుండెనో చెప్పు అరవిందా! చెల్లీ" అన్నాను. ఆమె తల పైకెత్తింది. 'జాను' అన్నట్లు తలవూపి నీకే భయంలేదు నీ ప్రభాకరం వచ్చేవరకు నిన్ను సాకే భారం నాది. ఇందుకు లోకమేమన్నా అన నీ లక్ష్యం లేదు అని ఏబై రూపాయలిచ్చాను.

సంవత్సరం గడిచింది ప్రభాకరం రాలేదు. నేను నెలకు పాతిక పంపేవాణ్ణి. ఒక్క నెల ఆలస్యమైంది. ఓ రోజు నాకో కార్డు వచ్చింది" అని చెప్పి ఏం జ్ఞాపక

మొచ్చిందోకాని తన డ్రాయరులో ఓచోట గుప్తపరచిన కార్డు దీసి చూపించాడు. అరవింద విస్తుపోయింది. "అరవిందా!" వద్దన్నా మొన్ననే వెళ్ళినప్పుడు అన్న! నాకనీసపు కోర్కె తీర్చండి అంటే కాదనలేక ఆ ఫోటో తీయించుకున్నాము. నా చెల్లి ఫోటో నా వద్ద కూడా ఉండాలని ఉంచిందేకాని వేరుకాదు. ఇప్పుడైనా శంక తీరిందా?" అని చెప్పిన రామం వాక్కులకు ఆమె ఏమనుకుందో కాని రామం వక్షస్థలంపై శిరముంచి కన్నీటితో అతని అంగీని తడిపింది. రామం సంతోషించాడు.

ఆంధ్రదేశంలో పేరెన్నిక గన్నకవి, కవికోకిల బిరుదునందిన ప్రభాకరశాస్త్రిగారి కావ్యగాన మనివిని అరవింద యుక్తంగా పట్నం వచ్చాడు రామం. అదివరక రవింద పట్నమే చూడలేదు. ఆ పని కూడా నెరువేరుతుందని.

అతను పద్యాలు చదువుతన్నంత సేపూ రామం అదోవిధంగా చూట్టం మొదలు పెట్టాడు. అధ్యక్షుడాతని కవితా వాహినికి సంతసించాడు కాని ఆ కవిత్వం పూర్తి అనుభవజ్ఞం ఎడబాటు ఫలం పశ్చాత్తాపం అని మాత్ర మూహించగల్గింది రామం ఒక్కడే.

జానకి ఇంటికి ప్రభాకరశాస్త్రి, అరవిందా, రామాలు, వెళ్ళేసరికి రాట్నం వడుకుతున్నదల్లా లేచి, "అన్నా!" అని దణ్ణం పెట్టింది. మళ్ళీ పక్కలకు చూచి నిర్ఘాంత పోయింది. రెండో పక్కకు చూచి ఇంకా నిర్ఘాంత పోయింది. అప్పటి ఆమె స్థితి వర్ణించడానికంటే ఊహిస్తేనే మేలు.

● పార్థివ ఉగాది - 1945 ●

# 10. చెరువొడ్డున

♦ కాంచనపల్లి చిన వెంకట రామారావు ♦

ఈ యేడు చెర్లోకి నీళ్ళు ఐదడుగులే వచ్చినై. ఉన్న భూములు యే విధంగా సాగుకావాలన్న ఆలోచన ప్రతి రైతు యెదట్లో మెసుల్తున్నది. ఈ యేడు పంటలు పండకుంటె ముందుకు కరువు సిద్ధం. లెవీ ఖుష్ ఖరీదు గల్లాలు పోగా యెవనింట్లో గూడా కారుకు సరిపోయే గింజలు కూడా మిగలవు. యెటుబోయి అందర్ని దేడ్‌నాగిచ్చి పోషించవలసిన భారం రాంరావు దొరవారిదే.

"ఉన్న ఐదు ఎకరాల పారకంలో రాంరావు దొరవారి మూడు యెకరాల కెట్లయినా నీళ్ళు బెట్టవల్సిందే. అది మాత్రం తప్పదు" అన్నాడు లతీఫ్ నెత్తి గోక్కుంటూ.

"యేటా పదడుగుల నీళ్ళు వస్తుండబట్టి వారి భూములకు అవి యెక్కడున్నా నీళ్ళు బెట్టితే యెవరి కేమనిపించలేదు. కాని యీ యేడు నీళ్ళు ఐదడుగులే వున్నై." అన్నాడు పెద్ద రైతు వెంకయ్య.

"దొరవారి సగం భూములు సేద్యమయితే తక్కిన పొలాలకు నీళ్ళు దొరుకుత వన్నాడు?" రెండెకరాల యిసాంలో పదో పాలు చాకలి రాముడు.

"పిల్లి మెళ్ళో గంట యెవరు గట్టాలే దొరవారిని సగం భూములే సేద్యం చేసి మన సగం భూములకైనా నీళ్ళు చాలేటట్లు చెయ్యమని యెవరడుగాలే?" అన్నాడు పెద్ద మాదిగ ముత్తయ్య.

ఈ సంగతె తేలాలన్నారు చెరువొడ్డున గూర్చున్న రైతులంతా.

'దాత సంవత్సరం మానేటి కరువులో ఉన్న కాస్త నీళ్లు దొరవారి పొలాలకే పెట్టినాం. వెనుకటినుంచి వారిపొలాలు పారినాక తక్కినవారి పొలాలు పారటం రివాజు. కరువు కైనా, కాలానికైనా ఆదుకుంటున్నాడు ధర్మప్రభువు. దాత కరువులో తిండి గింజలిచ్చి బ్రతికించిం దా మారాజే' అన్నాడు వీరుడి కోటయ్య.

'పోయిన మన పెండ్లాల పుస్తెలు ఇచ్చిన రూపాయికి సేరు బియ్యం మరిపించ లేవన్నాడు.' ఒక మూల నున్న ముసలి రైతు.

'ఇంక సాగు చేసే కాలమే రాలేదు. ఇప్పుడేం తొందర' అన్నారు అందరిని సర్దుక పోవటంలో ఆరితేరిన సర్వయ్య వగైరాలు. వీళ్ళిటు రైతులకు, అటు గ్రామాధికార్లకు మంచిగా వుంటూ ఏ యెండకా గొడుగు పట్టటంలో ఘనులు.

ఈ సంగతి చిన్నగా గడిలోకి పాకింది. దొరవారి సేరిదారు వెంకయ్య లతీఫ్ వగైరాలను సంప్రదించడానికి వచ్చాడు. 'ఈ యేడు దొరవారి పొలాల విషయం

తాతల నాటి నుండి వచ్చే రివాజుకు వ్యతిరిక్తం జరుపదలిచినట్లు దెలుస్తున్నది యేం సంగతి' అన్నాడు.

ఉన్న రివాజు నుల్లంఘిస్తే ఏం చిక్కో గ్రామ దేవతలకు కోపం వస్తుందేమో. దాని వల్ల గత్తర అమ్మతల్లి రావచ్చునన్న అనుమానాలు బుట్టినై. ఆ యనుమానాలను వృద్ధులు బలపరిచారు. పెండ్లి చేసినాడు దొరవారి మామూలు (కట్నం) ఐదు రూపాయలు పంపించకపోయేసరికి పోల్లోనే ముండమోసిన వెంకయ్య బిడ్డ సంగతులు యింకా యిటువంటివెన్నో విషయాలు ముందరబడ్డయి. కాని రైతులంతా ఏమైనా కానీ యీ యేడు న్యాయం ప్రకారం తమ పొలాలు పారకంలో చేరాల్సిందే అని నిశ్చయించు కున్నారు. ముఖ్యంగా తమ అందరితో లేవీ ఖుష్ ఖరీదు పడేక గల్లాలు పోయించి తనొక్క గింజకూడా పోయకపోవడం. వచ్చిన లేవీ వగైరా డబ్బును సేల్సు సొసైటీ షేర్సు కింద ముజరా పెట్టించి షేర్లు తన పేర కొనుక్కోవటం, షేర్ల కింద పోగా మిగిలిన డబ్బును మింగి కూర్చోవటం, అడిగినా ఇవ్వకపోతే ఈ సంగతులు దెల్పుతూ ఇచ్చిన దరఖాస్తుల కింతవరకూ అతీగతి లేకపోవడం కండ్ల ముందాడినై. తిండి గింజలెవ్వరి దగ్గరా లేనిది చూచి రూపాయికి నాల్గు సేర్ల ప్రకారం ధాన్యమమ్మిన దొరవారి దయ యింకా బాగా హెచ్చరించింది. తమ పొలాలు సేద్యం కాకపోతే పచ్చికరువు తాండవ మాడ్తుందన్న భయం రివాజును సేరిదారు మాటలను లక్ష్యపెట్టనివ్వలేదు. వీళ్ళంతా కట్టగట్టి ఒకటైనారు. సరె మంచిది చూచు కుందాంలే అని మీసం మెలేసినారు దొరవారు.

## 2

ఉపాయాల మీద ఉపాయాలు ఊహించాడు. ఊరుకుంటాడా, లేకుంటే? ఈ యేడు తాననుకున్న ప్రకారం చెర్వు నీళ్ళు పారకపోతే కొన్ని వేల రూపాయల నష్టం వస్తుంది. రైతు ముందాకొడుకులు బలిసిపోతారు. ఆలోచించి, ఆలోచించి లతీఫ్‌సా అన్న కొడుకు హసనల్లీమీదికి దృష్టిపోయింది. హసనల్లీ చిన్నగా అటిటుబడి చదువు కొని మజ్లిస్ సంస్థ తరఫున ప్రచారకుడుగా పనిచేస్తున్నాడు. మజ్లిస్ అధ్యక్షుడు ఖాజీ షర్ఫుద్దీన్ సాహెబు. ఈయన పెద్ద జాగీర్దారు కూడా.

హసనల్లీ ఊళ్ళో మాల మాదిగలను మతం మార్పించినాడు. దొరవారి వెట్టి వగైరా బంద్ చేయించి తానే దొర ఐనాడు. ఇందువల్ల ఎంతోనష్టపడ్డ దొరవారు రైతులతో కట్టు గట్టించి మతం మార్చుకున్న వాళ్ళతో పని తీసుకోకుండా చేసినాడు. మతం తిండి బెట్టటం మానుకొని ఉన్న కూట్లో మన్ను బడే స్థితి వచ్చింది. హసనల్లీ మాట ఎవరూ వినలేదు. పాపం హసనల్లీకి ఊరువిడిచి వెళ్ళిపోయేదాకా పరిస్థితులు విషమించినై. ఈ మామ్లాలో ఖాజీసాకు రాంరావుగార్కి కత్తులు దిగేటంత పనైంది. చివరకు రాజీ ఐంది. ఖాజీసా హసనల్లీని వాపసు పిలిపించుకునేటట్లు, రాంరావుగారు ఖాజీసా జాగీరు రైతులను వెంటేసుకొని బందోబస్తుకై సర్వేచేసిన పైరవీ వదులు కునేటట్టు ఒడంబడికలు చేసుకున్నారు. ఒకళ్ళ రైతుల కొకళ్ళు ఉసికొల్పకుండా ప్రశాంతంగా తమ హుకూమతు సాగించుకునేటట్లు, ఆపత్కాలంలో పరస్పరం సాయం జేసుకునేటట్లు గూడా షర్తులు జరిగినై. ఈ విధంగా ఒకానొకనాడు వెనుకటికి కొండంత కథ ముగిసింది. కాని యివాళ హసనల్లీ అవసరం పడ్డది పిలిపించుకున్నారు

దొరవారు. హసనల్లీ రావడమే ఆలస్యం ఒకడొకడుగా తనవాళ్ళను చీలదీసేడు. ఇదంతా మీకెందుకు మీ భూములకు నీరొచ్చే ఏర్పాటు నేను చేస్తాను. తక్కిన రైతుల సంగతి మనకవసరం లేదు. మనతో మాత్రం దొరవారు విరోధం పెట్టుకోరు. ఎందుకంటే కింది నించి మీది దాకా అంతా మనవాళ్ళే అధికార్లు. మా ముజ్లీస్ సదరు అధ్యక్షుడు సా॥మంత్రి పేషి ముస్లీకి పి.ఎ.దగ్గరి చుట్టం. ఖాజీసాతో సిఫారసు చేయించితే దొరకు తగిన శిక్ష అవుతుంది. అన్ని కచేరీల్లో పలుకుబడి గల మన ముజ్లీస్ వకీళ్ళున్నారు. ముజ్లీస్ ద్వారానే మన బ్రతుకువాళ్ళ బ్రతుకు కూడా. మనం యేలికలం గులాముతో కలుసుంటే గులాములమే ఐపోతాం. ముందు శాసనసభకు మీ దొర మా ఖాజీ సా॥ రైతుల ప్రతినిధులుగా ఎన్నికైపోతారు. ఎన్నిక కాకపోతే ఇంకెట్లనన్నా వాళ్ళు అక్కడికి పోతారు. అప్పుడు మీ కోసమని ప్రత్యేకంగా ఖానూన్‌లు తయారు జేయించుతా. ఎక్కడికి పోయినా మన వాళ్ళడగినంత ముందున్నరు. అని తలా తోకాలేని సంగతులు దొరవారి దగ్గర తిన్న డబ్బు హలాల్ గావటానికి బోధించాడు. కండ్లకు ప్రత్యక్షంగాని డొంకతిరుగుడు సిద్ధాంతాలు ఇవేమి తెలిసినా తెలియకున్నా చడీ చప్పుడు లేకుండా తమ పొలాలకు నీళ్ళు దొరుకుతాయన్న విశ్వాసం వారి నోరు పడేసింది. అనవసరంగా ఊరి పంచాయితీ తమకెందుకు యెవని చెయ్యి వాడు కదుక్కుంటే చాలుననుకున్నాడు. హసనలీ గొప్పదేవుడైపోయాడు. అటు దొరవారికీ ఇటు వీళ్ళకూ, ఎన్నడూ లేనిది బక్రీద్ పండుగకు వెట్టి బక్రాలు (మేకలు) వసూలైనై. దొరవారనుగ్రహం పల్ల ఎన్నడూ లేనిదిఒక దినం సొంతం దొరవారింట్లోనే విడిసివిందులు గడిచినై. పీర్లు సవారీలు అసోయి దూలా అని ఆడవచ్చిన రైతులను, జీతగాళ్ళను తరిమివేశారు. వాళ్ళస్థానంలో ఖాజీసా బృందం తయారయింది. ఊళ్ళో ముస్లిములు 'ఇదేమన్యాయం మా వూళ్ళో మేమంతా కలిసి పీర్లపండుగ జేసుకుంటాము. వాళ్ళ పండుగలు కూడా మేమంతా కలిసి చేసుకుంటాం' అని యెదిరించినా హసనల్లీ ఖాజీ సా॥ బృందం కుల తప్పు బెడ్తామని దబాయించి నోరు మూయించారు.

## 3

రైతులంతా అనుకున్న ప్రచారం చెరువు తూములు దియ్యడానికి పోతున్నారు. లతీఫ్ వగైరాలను రమ్మన్నారు. హసనలీ చేసిన తెరచాటు రాజీ వున్నది. కనుక దొరవారికి వెనకటినుంచి వస్తున్న హక్కులో దఖలియ్యటం మంచిదికాదు. ఊరుకట్టు తప్పి పోతుంది ఇవాళ. ఒకనాటి మాట గాదు. ఈ రివాజును తప్పించిన మనం, ఇంకో రివాజును తన్ని పారెయ్యటానికి తయారైత భూమి పుట్టినప్పట్నుంచి, రాజ్యం పుట్టినప్పట్నుంచి వున్న రివాజులు దేవుడేర్పాటు చేసిన ధర్మాలతో సమానం. అవి యెప్పటోలిగే సాగవలసిందే అని వాదించి హసనల్లీ చెప్పిన పాఠం సరిగ్గా అప్పగించారు. వీళ్ళు రంగు దిప్పటంతో తక్కిన వాళ్ళకు మాత్రం ఆశ్చర్యం కాలేదు. ఏమైనా కాని మేం మాత్రం పోయి నీళ్ళు బెట్టుకుంటాం మమ్ముల తిండికి మాడ్చి చంపే రివాజును మేమెందుకు మన్నించాలె? ఇది మా చావు బ్రతుకుల సంగతి. ఈ రివాజు ఈనాటితో పూర్తిగా హతం కావలసిందేనన్నారు తక్కిన రైతులు. ఈ సంగతి గడిలోకి పాకింది. హసనల్లీకి తెలిపారు. దొరవారు పొలిమేర మీద వున్నం

భాజీ సా॥కు కబురు పోయింది. వెళ్ళిన హసనల్లా లతీష్ వగైరాలను కూడగొట్టి మనం జేసుకున్న రాజీ ప్రకారం మన దోస్తుకు సాయం చెయ్యాలన్నాడు. ఏం సాయమన్నారు విస్మవాండ్లంతా. "నీళ్ళు బెట్టుకునే వాండ్లను రొకాయించాలె, దొర మనుషులతో పాటు మనం గూడా గుతుప లేసుకొని పోవాలె. వాండ్లు నీళ్ళు బెట్టుకోకుండా ఆపితే, దొరకూ ఆయనతోబాటు మీకు నీళ్లు దొరుకుతాయి. పెరుగన్నంబట్టి ప్రమాణంచేసిన దొర మాటలు నమ్మి ఆయనకు సాయం చెయ్యాలె" అన్నాడు హసనల్లి. వెంకయ్య వగైరాలంతా వినేటట్లు లేదు. ఈయేడు భూములు సేద్యం కాకపోతే పచ్చికరువొస్తుంది. కిందటేడు రసల్ గిర్దావరు (ఫుడ్ ఇన్‌స్పెక్టర్) దాచ్యామా అందరిండ్లలో ధాన్యం ఊడ్పించి తనింట్లో మిగుల్చుకున్న ధాన్యం రూపాయికి నాల్గు సేర్లమ్మితే కొనలేక కష్టాలు పడ్డాము. వాండ్లు మోరుదోపితనానికి దిగితే కొట్లాటవుతుంది. ఏం చెయ్యాలన్నారు లతీఫ్.

'ఒక్కొక్కణ్ణి పట్టి నరకాలే' అన్నాడు హసనలీ. ఒక చంకనున్న కూరాను, ఒరలో ఉన్న కత్తీ ఊగిపోయాయి. ఇంట్లో గూచొని మన తలకాయలు గోయించి తన పొలాలకు నీళ్ళు బెట్టుకుంటాడు దొర" అన్నాడు గఫూర్, 'అవును' అన్నాడు లతీఫ్.

అవును మేమందరం బ్రతికి వస్తేగదా మాపొలాలకు నీళ్ళేసేది' అన్నారంతా.

హసనలీ గప్పిన మైకం విడిపోతుండేసరికి మధ్యన అందుకున్నాడు. మనం సిపాయిలం. మనను చూస్తేనే భయపడిపోతారు. కొట్టుకునేటంత పనిగాదని యుద్ధ రంగంలో అర్జునునికోసం కృష్ణుడు పడ్డంత కష్టపడ్డాడు. చివరకు అంతపని గానివ్వనని చంకలో పుస్తకం ముట్టి ప్రమాణం చేశాక గాని నమ్మకం కుదరలేదు.

## 4

పొరుగూరి భాజిసా॥ కబురందటమే ఆలస్యం వేంచేశారు. గలా మిలాయించు కున్నారు దోస్తులిద్దరూ. కచేరి వ్యవహారాలు వదులుకున్నప్పటి నుండీ కలిసింది ఈనాడే.

"మీ కాపద వచ్చిందంటే వుండలేకపోయినా" నన్నాడు భాజీసా॥

"లంజకొడుకులకు గట్టిపాఠం చెప్పాలె. ఇవాళ మా దగ్గరి రివాజు పోతే మీ జాగీరీ కూడా రివాజులన్నీ బందైపోతై" అన్నాడు రాంరావుగారు.

"పోలీసుల సాయమెందుకు పిల్పించలేదు"

ఈ మామ్లాలో పోలీసులకు జోక్యం కల్గించుకొనే వీల్లేదు. ఖానూనులున్నాయి అని గడగడా తన ఖానూన్‌లా పాండిత్యమంతా గష్తీలు మురాసి లాల యుక్తం గుమ్మరించారు రాంరావుగారు.

పదేండ్లనుంచి పైరవీకారీ చేస్తుంటే ఇంతమాత్రమైనా పట్టుబడకపోతే యేమన్నమాట.

'అజీ మారాజ్ డబ్బు బారేస్తే అంతా ఖానూనే. కొండమీది కోతి దిగివస్తుంది. రెండువేల రూపాయలట్టా బారెయ్యండి నేను బోయి రిజర్వు పోలీసులనే బట్టుకొస్తా. పోలీసుల్లో పెద్ద అధికారి మాషడ్డకుని బావమరిది దగ్గర చుట్టం.

'సిఫారసులు దేవటంలో మీ ప్రజ్ఞ నాకెరికే కాని యిప్పుడంత అవసరమేం లేదు. మన చేతగాకపోతే కదా పోలీసుదాకా పోవటం' అని సర్దినాడు రాంరావ్‌గారు

బిర్యానీ తయ్యారయిందన్న వార్త వచ్చింది లోపల్నుంచి రైతులు తూములు దీస్తున్నారన్న వార్త వచ్చింది బయటి నుండి. హసనలీకి సైగ అయ్యింది భాజీసా బలగం లతీఫ్ వగైరాలతోపాటు తయారైయ్యాడు హసనల్లీ మూడు జాడీల దేశీ సారా, ఆరుమేకలు అంతకుముందే హతమైనై. భాజీసా దొరవారి కోసం వెలగల విదేశీ సారాలు లోపల యెదురు చూస్తున్నాయి. వాళ్ళటూ, వీళ్ళటూ ఎవళ్ళ డ్యూటీకి వాళ్ళు పోయారు

## 5

శత్రుపక్షంలో వున్న లతీఫ్ వగైరాలను చూచారు రైతులు ఎంగిలి మెతుకుల మహత్యమన్నారు కొందరుండలేక. హసనలీ అన్నాడు తూములు దియ్యపద్దు దగ్గరికి బోతె కొబ్బరికాయలు పగిల్నట్టు తలకాయలు పగుల్తుయని, గోగ్గూరకాడలు కోసినట్లు తలకాయలు గోస్తనని కత్తి జూయించారు. ఇన్నాళ్ళకి రైతులు కారుకష్టాలనుభవించీ అనుభవించీ సంప్రదాయాల కుళ్ళు మడుగులో ముక్కులు దిబ్బిళ్లుపడి ఉక్కిరి బిక్కిరై బాధపడలేక సంకెళ్ళను దెంచుకోడానికి సిద్ధమైనారు. పచ్చి కరువు వస్తుందన్న భయం, యిదివరకు దొర గల్పించిన కటిక చీకట్లు మరిచిపోలేదు. ఈ రివాజులు హతమైతే మానవుల వలె బతుకుతాం లేకుంటే అట్రైనా చావే ఇట్రైనా చావే యేదో ఒకటి తేల్చు కుందామనుకున్న రైతులు ఉత్త కత్తి జూపుల్లకే భయపడే కాలం పోయింది.

'భాజీసా కుక్క మొరుగుతున్నదిరా' అన్నాడెవరో ఒకమూలనుంచి ఈ కుక్కను చెరువు తూములు గాయటానికి కిరాయకి దెచ్చుకున్నాడురా మన దొర అన్నాడింకెవరో.

"రెండు తంతేసరి కుయ్యం కుయ్యమని తోక ఝాడిస్తుంది' ఇంకెవరో అన్నారు.

తూములు దియ్యనే తీశారు. నీళ్ళు రంయిమని కట్టలు దెంచుకొని పారుతున్నాయి. హసనల్లీ వీరావేశముతో కత్తి దిప్పుకుంటూ వెంకయ్యను నరకటాని కురుకుతున్నాడు. రైతుల్లో నుండొకడు కర్ర గురి చూసి కొట్టాడు. హసనలీ మణికట్టుకు బలమైన దెబ్బ తగిలింది. చేతి కత్తి వూడి గఫూరుకు తగిలింది. ఎగిరి గంతెయ్య బట్టిగాని లేకుంటే కాళ్ళు రెండూ తెగి పొయ్యేవే. ఉభయపక్షాలు యుద్ధానికి దిగినై. కొట్టుకోటంలో ఊరి రైతు లతీఫ్ తల బగిలింది. ఇటునెత్తురు బారుతున్నది. అటు నీళ్ళు బారుతున్నాయి. గఫూర్ చేతిలో కర్ర పారేసి లతీఫ్ తల బట్టుకున్నాడు ఇదే అదునని ఇంకో కర్ర గఫూరు మీదికి లేచింది ఆగండి, ఆగండి అని అరుస్తున్నాడు గఫూరురు, 'ఆపండి పాడు కొట్లాట' అంటూ వెంకయ్య గఫూరు మీద పడబోయే కర్రకు అడ్డంబెట్టి తప్పించాడు లతీఫ్ దగ్గరికి పోయిన వెంకయ్య తననెత్తి రుమాలు తీసి కట్టుగట్టాడు. నెత్తురు దర్శనంతో అందరికి దిమ్మదిరిగి దిగాలుపడి చూస్తున్నారు. గఫూరు కంట నీరుబెడుతూ 'ఎవరి కోసమని మన లతీఫ్ తల బగిలినట్లు' అన్నాడు. 'మనకు కరువుదెచ్చిపెట్ట చూచిన దొరకోసం' అన్నాడు

[redacted]అవునన్నారు. ఇంకామైకం వదలని ముస్లిం రైతులు ఏమనేకుండా [redacted]

గఫూరందుకున్నాడు, 'మొన్నటి[redacted] కాజీసా రాంరావు లొకటైనారు. నిన్నటిదాకా కలిసివున్న మనం పగోండ్లమైనాం మాయ. మాట్లాడరేం గాద్దులు' అన్నాడు వెంకయ్య. "ఖాజీ సా॥ దొరలిద్దరు ఒకటైనారు. వాళ్ళకు మతం అద్దు రాలేదు. బతుకు దెరువాలోచించుకుంటే మతం మనలో చీలికలు దేవడానికని వచ్చింది" అన్నాడు గఫూరు.

మూల్గుతూ లతీఫందుకున్నాడు. 'దొరది, హసనల్లీగానిది, కాజీసా॥ వీళ్లందరిదీ ఒక మతం. నాదీ, వెంకయ్యదీ మన అందరిదీ ఒక మతం. వాళ్ళది దోపిడీ మతం, మనది బతుకుదెరువు మతం'. 'తన్నండి హసనల్లీగాణ్ణి' తన్నండి అంటే తన్నండి అన్నారు. ఊరు గుతపలన్నీ ఒకటై దొరల బలగంమీదికి లేచినై. ఈ సంగతి మొదటే ఊహించుకున్న హసనల్లీ మొదటి దెబ్బకే దేవేంద్రలోకం బోయినంత పనై, చెట్ల చాటుకు నక్కి పరారైనాడు. ఈ సంగతంతా చూస్తున్న ఎదురు బలం గుతపలు పారేసి దండాలు పెట్టి బతిమిలాడుకున్నది. రైతులందరి మళ్ళకు నీళ్ళు బారినై. అందరికీ బాగా పంటలు పండినై. ఈయేడు కరువు వాసన గూడా రాలేదు. అందరికీ బాధ గల్పించిన రివాజు హతమై రూపుమాసింది 'చెరువొడ్డున'.

● మన వూళ్ళో కూడానా..?! కథల సంపుటి నుంచి - 1945 ●

# 11. బ్రహ్మోపత్ర భక్తసమాజము

♦ జి. రాములు ♦

ప్రచారార్థమై వెడలిన శాస్త్రిగారు ఆ దినము కార్మికపేటలో బసజేయునెంచిరి. ఈ పేటలో నూటికి (90) పాళ్ళు చేనేత పారిశ్రామికులుంటారు. పేటమధ్య భాగమున మార్కండేయ దేవాలయము, అందులో ఒక పాఠశాల మరియు సత్రము గలవు. ఆ సత్రములో దిగనెంచి శాస్త్రిగారు పోవుచు దానిలో నుంచి పొగ పైకి లేచుట చూచి ఎవరో యిదివరకే విడిదిచేసి యున్నారని అనుమానించుచు లోనికి ప్రవేశించగా ఒక విచిత్ర దృశ్యము కాన్పించెను. బడిపిల్లలు బీడీలు సిగరెట్లు కాల్చుచు, నేను ముక్కులో నుంచి పొగ దీస్తాను చూడు అని ఒకడు, నేనెట్లు బుగ్గలు లేపుతాను చూడండి అని మరియొకడు కేకలు వేస్తూ ఆడుచున్నారు. ప్రతిదినము బడిపిల్లలు ఇంటినుండి డబ్బు దొంగిలించి బీడీలు సిగరేట్లుకొని బడివేళకు కొంతముందుగా ఆ సత్రములో సమావేశమయి గమ్మత్తుగా పొగ పీల్చుట అలవాటై పోయియుండెను. ఒకనాడు బడికి తప్పిపోయిన సరే ఆ సమాజములోకి హాజరి మాత్రము తప్పేది కాదు. శాస్త్రిగారిని చూచేసరికి కొందరు నిర్ఘాంతపోయారు. కొందరు సిగరెట్లు దాచుకున్నారు. మరికొందరు 'ఏహే! ఇతనిది మన ఊరుకాదురా' అంటూ మళ్ళీ సిగరెట్లు కాల్చ నారంభించిరి. కాస్త పెద్దవాడు మరియు ఆ విద్యార్థులందరికి లీడరుగా నున్న రామయ్య సిగరెటు నోట బెట్టుకొని శాస్త్రిగారి చెంతకువచ్చి "ఏమయ్యా ముక్కుకు గుడ్డపెట్టుకున్నావు. బీడీ త్రాగవా ఏమి?" అని ప్రశ్నించెను.

శాస్త్రి: "లేదు నేను బీడీలు త్రాగను. పొగ బీల్చుట మంచిదికాదు. దీనివల్ల ఎన్నియో నష్టములున్నవి. మీరందరు నిశ్శబ్దముగా కూర్చున్న ఆ పాడు చుట్ట బీడీల వలన మనకేమి నష్టమో నేను చెప్పగలను."

రామయ్య: "మీ దేవూరోకాని ఎప్పుడైన చర్చిల్ ప్రధాని ఫోటో చూచియుండిన ఇట్లన సాహసించక పోదురు, ఆతడింత తెల్యనివాడు కాబోలు."

శాస్త్రి: "ఇది మనదేశపు బానిసత్వమునకు కారణము. విదేశీయులేది చేసిన దాని నకలు చేయుట మనకు మోజు అయిపోయినది. కోటు, సూటు వేసుకొని నీటుగా ఉన్న ఒకాయన తాను యైరోపానుండి దిగుమతి అయాననుకుంటాడు. అప్టు డేట్ ఫ్యాషన్‌గల ఒకావిడ తాను కేవలము ఫ్రాంసునుంచి అవతరించినట్లు నటిస్తాది. చర్చిల్ ఏ దేశస్థుడు! ఎట్లుంటాడు! మనవలెనే పప్పుదిని బక్కగుంటాడా! విచారించాలి. చర్చిల్ ఎట్లున్న మనకేమి? మనదేశమునకే కాదు, ఈ ప్రపంచమునకు

బుద్ధిచెప్పగల నాయకులను భగవంతుడు మన దేశమునకును గ్రహించినాడు. వారే మన కాదర్శ పురుషులు మనదేశపు ముఖ్య నాయకులు ఎవరైన చుట్ట బీడీలు త్రాగుతారనంగ విన్నారా? పైస కొఱకై పనిజేయుచున్న డాక్టర్లను బడిపంతుళ్ళను జూచి మోసపోకండి? సిక్కులు పొగాకునంటరు. స్వామి దయానంద సరస్వతిగారు దీనిని నిషేధించినారు."

కృష్ణయ్య: "అందరు వద్దన్నారు మీరు వద్దంటున్నారు గాని దానివల్ల నష్టమేమండి. మా నాన్నగారు తాను త్రాగేచుట్ట నాకిస్తుంటాడు. దానివల్ల ఎన్నో లాభాలున్నాయన్నాడు. చలిలో పనిచేస్తూ చుట్టగాల్చిన శరీరమునకు వేడి లభించును. అలసిపోయినప్పుడు విశ్రాంతి గల్గును. ప్రవర్తి సాపుగానుండును. దగ్గు ఉబ్బస వ్యాధులకైతె ఇది రామబాణము వంటిదట."

శాస్త్రి: తా చెడ్డ కోతి వనమెల్ల జెఱచునట్లు పొగబీల్చువారు తమతోబాటు ఇతరులను గూడ చెడగొట్టుటకై పన్నిన ఎత్తులివి. లేకున్న చుట్ట త్రాగనివారికి ప్రవర్తి బందు ఉంటుందా? అది మనకు వేడినిస్తుందట ? ఆ వేడిపొగయే లోనికి ప్రవేశించి ఊపిరితిత్తుల కంటియిండవలసిన నీటిపదును నుండనీయక దగ్గులేపి క్షయ రోగమునకు మూలకారణమగును. పొగబీల్చువాని తొమ్ము ఎముకలు వంట ఇంటి వాసములవలె పొగబట్టి పోవును. చిన్నప్పటి నుండియే నేయుటవల్ల తొమ్ము (వక్షస్థలము) ఎండిపోయిన చేనేత పారిశ్రామికులు ఈ కల్లు, సారాయి, చుట్ట, బీడి మున్నగు దురభ్యాసముల వల్ల దుర్బలులై చిక్కిపోయి ధనస్సాకారముగ వంగిపోయి అడుగకముందే తెలుసుకోగలుగు నట్లుందురు.

పనికిమాలిన వారై క్షయమున్నగు వ్యాధులకు గురియై తొందరగనే మృత్యువాతం బడుదురు. కావున చేనేత పారిశ్రామికులకైతె పొగపీల్చుట పెట్టని విషము. ఇంతేగాక దీనిలో ఒక చెడ్డగుణము కలదు. ఇది ధర్మవిరుద్ధముగా మనచే భిక్షమెత్తించును. మీకు సంధ్య వచ్చునో లేదో 'ఓం కరతలకరపుష్టె' యను మంత్రమునకు ఓ భగవంతుడా! నా చేయి ఒకరి కిచ్చునట్లుండవలెగాని ఒకరిని యాచించగూడదని భావము. ఇందుకు విరుద్ధముగా చుట్ట బీడీలు ఎంత ధనికులనైన బిచ్చమెత్తజేయును. ఇక మీరే చెప్పండి మంచిదో చెడ్డదో?"

రామయ్య: "మీరు చెప్పినదంతయు నిజము. దీనివల్ల లాభము సున్న. పైగా పైసా నష్టము ప్రాణనష్టము."

శాస్త్రి: "ఇంకొక మాట జెప్పమరచితిని. మీవలె భార్యలు చుట్ట బీడీలు గాల్చుటకు మీరొప్పుకొందురా?"

విద్యార్థులు: " లేదు. స్త్రీలు చుట్ట గాలుస్తారా?"

శాస్త్రి: స్త్రీలు చుట్టగాల్వరు కనుక అది వారికి అసహ్యముగా నుండును. పురుషుల నోటినుండి వచ్చు దుర్వాసన వారికి బాధాకరంగా నుండును. విధిలేక మాట్లాడుచున్నను నోటివాసనకు తాళలేక దూరముండజూతురు. ఇక మీలో ఎవ్వరెవ్వరు సిగరెట్టు, బీడీ విడుతురో చేతులు పైకెత్తండి."

శాస్త్రిగారి వాక్యములు పిల్లల మనసున కెక్కినవి. మొగనికాళ్ళు చల్లగానుంటె విడాకులందుకొంటున్న పాశ్చాత్యుల కథలు వింటున్నారు. పూర్వులకెట్లో జరిగి

పోయింది. ఇకవారికి చదువుకొన్న భార్యలు వస్తారు. వారీ దురభ్యాసమున కేవగించుకోగలరేమో అని అందరు చేతులు పైకెత్తి ఇక చుట్టబీడీలు త్రాగమని ఒప్పుకొనిరి. నాటినుండి ఆ బడి పిల్లల సమాజము బండు పడిపోయెను.

శాస్త్రిగారు మరుసటి దినమునలేచి ఈక్రింది పద్యమొక చీటిపై వ్రాసి గోడకంటించి వెడలిపోయెను.

సీ॥ సారాయికంటెను ఘోరంబిదని గురు । నానకు పొగయాకు నంటకనియె
వేదవిరుద్ధంబు వినుడని ఋషి దయా । నందుడు పొగయాకు నంటకనియె
నేటికి సుగుణాల పేటియౌ విప్రుండు । పొగకోపిచెంతకే పొడువినుడి
వింతయౌనిది జూడ నెంతధనికుండైన । బిచ్చమెత్తును చుట్టబీడికొరకు॥

గీ॥ పైస నష్టంబు మఱియును ప్రాణనష్ట । మగునుగోరంత దుర్వాసనగునువినుడి
ఎట్టి లాభంబు రుచిలేని చుట్టబీడి । విడువగా దీక్ష బట్టుడీ విమలులార!

● పద్మశాలి, మాసపత్రిక, షోలాపూర్ - ఆగస్టు, 1946 ●

# 12. ఊరేగింపులు

♦ ఆవుల పిచ్చయ్య ♦

జై జై జై అనే శబ్దం గ్రామం వెలుపల తోట బావిమీద కూర్చుని మొఖం కడుగుచుండగా వినవచ్చినది. ఇంతలో గ్రామాలనుండి కొందరు ప్రజలు ఎర్రజెండాలు తీసుకొని గ్రామంలో వెళ్ళుచుండగా చూచాను. నా హృదయం అతివేగంగా కలవరపడింది. ఒక క్షణమయిన ఆగలేకపోయాను. నోటిలోవున్న పండ్లపుల్లను తీసి నేలకు కొట్టి గ్రామంలోకి పరుగెత్తాను. కాని ఎవరో సాధ్యమయినంత తొందరలో తెలుసుకోవాలని ప్రయత్నించాను. గ్రామం చివర్లో వున్న గొల్ల యువకుడయిన గంగయ్య ఇంటికి వెళ్ళి చూచేసరికి ఎవ్వరు లేరు. తొంబయి సంవత్సరముల వృద్ధురాలు మాత్రం ఉంది. చేతిలో కట్టె తీసుకొని బయటికి రావటానికి ప్రయత్నించుచున్నది. "ఏమవ్వా గ్రామంలో ఏం జరుగుతుందని" అడిగాడు. "ఇవ్వాళ మా అమరజీవి కొమరయ్య వీరమరణానికి ఊరేగింపు జరుగుతుంది. నేను అక్కడికే వెళ్లుచున్నాను. నీవు కూడా రావయ్యా" అని ఆ చెప్పింది వృద్ధురాలు. ఇంతలో నా పొలంలో నాటు పెడుతున్న 20, 30 మంది స్త్రీలు నాట్లు పెట్టుట వదిలి గ్రామంలోకి వచ్చారు. వారు అంతా గందరగోళంగా వున్నదని నా జీతగాడొచ్చి చెప్పగా వెంటనే పొలం దగ్గరకు వెళ్ళాను. పొలంలో ఎవరూ లేరు. నీటిలో ఒరిగిన నారు దృశ్యం చూసేసరికి ఏదో విచారం వెళ్ళబుచ్చుచున్నట్లుగా కనిపించింది. ఈ పాడిపంటలు చల్లగా ఉండాలని ప్రాణత్యాగం చేసిన కొమరయ్య గురించి ఈ పొలం విచారపడుచున్నదని గ్రహించాను. ఇంతలో నా ప్రక్కనున్న పట్వారి పొలంలో నుంచి పెద్దకేకల ధ్వని వినబడుట వలన అక్కడికి వెళ్ళి చూశాను. జీతగాండ్రు ఒకరికొకరు తొందర తొందరగా పిలుచుకొనుచున్నారు. వ్యవసాయ కూలీల కొరకు కొమరయ్య ప్రాణాలర్పించినందున ఈ వ్యవసాయ కూలీలు ఊరేగింపులో పాల్గొనటానికి తొందరపడుచున్నట్లు తెల్సుకున్నాను.

అడవి పొలాలలో బావుల దగ్గిర ఎక్కడ గూడా ఒక మానవుడు లేడు. అంతా గ్రామంలోకి చేరుకున్నారు. నాకాళ్లు ఏమాత్రం నిలబడటం లేదు. నేను ఎటు అడుగు వేస్తామన్న అడుగు లేవటం లేదు. గ్రామంవైపు మాత్రం అడుగుపడుతుంది.దారిలో వస్తూ వుండగా గొర్రెలన్నీ గుంపులు గుంపులుగావుండి ఇతర చెలకలవైపు వెళ్ళకుండా క్రిందికి తలలు వేసి నిశ్శబ్దంగా నిలబడ్డవి. గొల్లవాండ్లు మాత్రం కావలి లేరు. వారుకూడా కొమరయ్యగారి ఊరేగింపులో పాల్గొనటానికి వెళ్ళినట్లు బోధపడింది. ముందు వెళ్ళి కాలువలో మొఖం కడుక్కొని వెళ్ళుదామనుకొన్నాను.

కాలువ దగ్గరకు వెళ్ళేవరకు నీళ్ళు లేవు. చాపి దగ్గరకుపోయాను. చాపమీద దొక్కలు గుంజుకపోయి ముందు గడ్డి వున్న మేత మేయకుండా వున్న ఎడ్లను చూసి నాకు చాలా చిత్రమయినది. ఆలోచించాను. వేళగాని వేళ ఎన్నడు లేని వేళ అకస్మాత్తుగా మోటలు మీదనే విడిచి రైతు గ్రామంలోకి పోయాడని ఎడ్ల విచారంతో నిలబడ్డాయని తెలుసుకున్నాను.

అంబాయని ధ్వనులు ప్రక్క వైపునుండి ఒకేసారి వినబడ్డాయి. అటు చూచేవరకు శరీరమంతా బురద జల్లుకొని నాగళ్ళు మెడపై వేసుకొని మోకాటి లోతున బురద పొలాలలో నిలబడ్డ ఎడ్లను చూశాను. ఏమాత్రం కదలకుండా విశ్రాంతి తీసుకొని నిలబడ్డట్టు కనిపించాయి. పిట్టల కీచుకీచుమనే శబ్దం వినిబడటం లేదు. సన్నని మంచు కురుస్తుంది. ప్రపంచమంతా ఇద్దాళ్ళ విచారం వెలిబుచ్చుతున్నట్లుగా కనిపించింది. కారుమబ్బులు పట్టాయి, మబ్బుల్లో తలదాచుకున్న సూర్యుడు కనిపించటంలేదు. నా శరీరమంతా ఒకేసారి జలదరించింది. ఇక నిలబడలేక పోయాను. గ్రామంలోంచి నినాదాల ధ్వనులు వినిపిస్తున్నవి. యీ అడవిలోని దృశ్యాలు నాహృదయాన్ని కలవరపెట్టుచున్నాయి. ముందునడవటం ప్రారంభించాను. మెల్ల మెల్లగా అడుగులు వేస్తుంటే నినాదాల ధ్వనులు ఎక్కువగా వినిపించు తుంటే అంతవేగంగా నా అడుగులు పడు తున్నాయి. నేను ఎంత వేగంగా నడుచుచున్నానో నాకే తెలియదు, గ్రామంలోకి వెళ్ళాను. ప్రజలందరు ఆంధ్రమహాసభ ఆఫీసుకి వెళ్ళినట్లు తెలిసింది. అయినను యింటివద్ద ఆడువాండ్లు ఉంటారనుకున్నాను. ఇంటికి వెళ్ళేవరకు ఎవ్వరు కనబడలేదు. అతివేగంగా పొంగుచు పొయ్యిలోని నిప్పులను చల్లార్చుచున్న పాలు చూచాను. ఒకవైపు అన్నం పళ్ళెంలో సగం మాత్రం కూరలతో కలిసియున్నది. కొమరయ్యగారి నినాదాలు వినబడగానే అన్నం తినుకుంటూ సగం అన్నం విడిచి పోయారని తెలుసుకున్నాను. ఇంతలో ప్రక్క ఇంట్లో నుంచి ఏమో మాడుతున్నట్లు వాసన వచ్చింది. ప్రక్క ఇంటిలోకి వెళ్ళగానే పొయ్యిమీద అన్నంపెట్టి ఊరేగింపులో పాల్గొనటానికి స్త్రీలు వెళ్ళినట్లు బోధపడింది. ఆ పొయ్యిమీద మాడుచున్న జొన్న అన్నం క్రిందికి దించాను. ఇక నా ఉత్సాహం అన్నది ఆగలేక పోయింది. పొలం దగ్గర ఎవ్వరులేరు, జీతగాండ్లను పొలం దగ్గరకు పంపి ఊరేగింపులో పాల్గొనాలనుకొన్నాను. జీతగాండ్ల కొరకు హరిజన వాడవెళ్ళాను. ఈ వాడకు చివరవున్న చెప్పులుకుట్టే ముత్తిగాడింటి ముందుకు వెళ్ళి జీతగాండ్ల కొరకు కేకలు వేశాను. కానీ జవాబు రాలేదు. ముత్తిగాడింటిముందు చెప్పులు కుట్టే సామాను, చర్మాలు అన్ని చిందరవందరగా పడి వున్నాయి. చెప్పులు కుట్టుకుంటూ విడిచి ఊరేగింపులో పాల్గొన్నట్టు తెలుసుకొని జీతగాండ్లు కూడా వూరేగింపులో పాల్గొన్నారేమో నా పొలం ఏమవుతుందో నని భయం వేసి వాడలో ప్రతి ఇంటిలో చూచాను. ఎవ్వరూ లేరు. చిప్పలు, కుండలు మొదలగునవి మాత్రమే ఉన్నవి. రోటిలో సజ్జలు పోసి దంచుతూ రోకలి పడవేసి వెళ్ళిపోయినారు. ఇంతలో కొమరయ్య పేరుమీద పాటలు పాడుతు నినాదాలు ఇచ్చుట వినపడింది. ఇక ఆగలేక పోయాను. ఆంధ్రమహాసభ ఆఫీసుకి వస్తూ ఉండగా గ్రామాధికారి ఎదురయ్యాడు. గ్రామ ప్రజలు మొత్తం అక్కడ వుంటె మీరు ఎక్కడికో వెళ్ళిపోతున్నారేమిటి అని అడిగాను.

"నేను అక్కడ ఉంటానికి వీలులేదు."

"ఏం ఎందుకు నేనయినా పోవచ్చునా?"

"నిస్సందేహంగా వెళ్ళవచ్చును"

"మీరెందుకు రాకూడదు? ఏం కారణం చెప్పకూడదా?"

"చెప్పేదేముంది. నేను ప్రభుత్వ బానిసను. ఆ ఊరేగింపు రాజకీయ ఊరేగింపు అక్కడ వుంటే రిపోర్టు వ్రాయవలసి వస్తుంది. కొమరయ్య ప్రాణత్యాగాన్ని గుర్తించారు. రిపోర్టు చెయ్యటానికి చెయ్యి పణుకుతున్నది. నాకలం ఆడదు. ఊరేగింపులో వుంటే తప్పక రిపోర్టు వ్రాయాలి. లేకుంటే పై అధికారులతో బూతులు పడాలి. వీటన్నిటి కంటె ఇవాళ గ్రామంలో నుంచి వేరే గ్రామం వెళ్ళటం ఉత్తమమని నిశ్చయించుకొని వెళ్ళి పోవుచున్నాను" అని వెళ్ళిపోయాడు.

నేను వెంటనే ఆంధ్రమహాసభ ఆఫీసుకు వెళ్ళి ఊరేగింపులో పాల్గొన్నాను. ఆంధ్ర మహాసభ ఏమిటి? కమ్యూనిస్టుపార్టీ జెండాలు పట్టుకున్నారు. ఏమి సంగతి? ఆంధ్ర మహాసభ జండా ఇంతవరకు నియమించలేదు? ఆంధ్రమహాసభ నాయకత్వాన, కమ్యూనిస్టు పార్టీ ఈ ఊరేగింపు జరుగుతున్నదని తెలుసుకున్నాను. ఇంతలో వీరుడైన కొమరయ్యగారికి జై! అని నినాదాలిచ్చారు. మొత్తం ప్రజలను చూడాలనుకున్నాను గాని చూపు అందటంలేదు, దగ్గరలోవున్న చెట్టుఎక్కి పైన నిలబడ్డాను. నెత్తిమీద ఏదో రెపరెపమని చప్పుడయింది. పైకి చూసేసరికి చెట్టుపైన కమ్యూనిస్టు పార్టీ జెండా రెపరెప లాడుతుంది. కమ్యూనిస్టు పార్టీకి జై అని నినాదాలిచ్చుకుంటూ మీజాన్ పత్రికలో వ్రాసిన కొమరయ్యపాట పాడుకొంటూ వూరేగింపు బయలుదేరింది.

బురదకాళ్ళతో వుండి వంటిమీద చొక్కా లేకుండా అతి ఉత్సాహంతో ఎర్రజెండాలు పట్టుకొని నినాదాలు ఇచ్చుచున్న రైతులు కనబడినారు. తలలు వూపుకుంటూ మంచులో వణుక్కుంటూ వూరేగింపులో పాల్గొన్న తొంబయి ఏండ్ల వృద్ధ స్త్రీలు కూడా కనిపించారు. హరిజనులు, చాకలి, మంగలి, వడ్ల, కమ్మరి, కాపు, రెడ్డి, మహమ్మదీయులు మొదలగు వూరేగింపులో పాల్గొనిన వారందరిని చెట్టెక్కి చూడగలిగాను. ఇక చెట్టుమీద వుండలేక పోయాను. వెంటనే వచ్చి ఊరేగింపులో పాల్గొన్నాను. కొమరయ్య పాట చదువుచుండగా నీరైనట్టు అయింది. ప్రజలందరికీ కండ్లల్లో నీళ్ళు కమ్మిన యీ పాట ముగియగానే ప్రజలందరు రౌద్రులయ్యి కొమరయ్యకు జై! ప్రజారాజ్యం కావాలి! పోలీసుల దౌర్జన్యాలు నశించాలి! స్వతంత్ర భారత్ కీజై! కమ్యూనిస్టు పార్టీకి జై అని వూరేగింపు ముగించి ఎవ్వరి ఇండ్లకు వారు కొమరయ్య సంగతి మాట్లాడుకుంటూ వెళ్ళి ఇండ్లపై ఎర్రజెండాలు స్థాపించు కున్నారు. ఒక కొమరయ్య పోగానే ఇంతమంది కొమరయ్యలు సిద్ధమయ్యారు అని, తప్పక మనకోర్కెలు నెరవేరుతవని నాకు దృఢమైనది, నేను నా యింటిపై ఎర్రజెండాను స్థాపించాను. ఆ ఎర్రకాంతి మొత్తం మా బజారులో వెలిగింది. అందరు గూడి కొమరయ్య ఏ ఆశయం కొరకు ప్రాణత్యాగం చేశాడో ఆ ఆశయం కోసం కంకణం కట్టుకొని ప్రతిజ్ఞ చేశారు.

● **1946, ఆగస్టు (11-8-48 మీజాన్ నుండి)** ●

72056

# 13. యుగాంతం

♦ నెల్లూరి కేశవస్వామి ♦

పదిహేను సెప్టెంబర్, పందొమ్మిది వందల నలభై ఎనిమిది....'పోలీస్ యాక్షన్' మొదలై ఆనాటికి మూడో రోజు.

మేము హైద్రాబాద్ నగరంలో చాటుమాటుగా, వాల్యూం బాగా తగ్గించి "ఆల్ ఇండియా రేడియో" వింటున్నాం. భారత సైన్యాలు నలువేపులనుండి హైద్రాబాద్ రాష్ట్రంలోకి జొచ్చుకు వస్తూన్నాయి. ముఖ్యంగా తూర్పు దిశకు విజయవాడ నుంచి, పడమరలో షోలాపూర్ నించీ బయలుదేరిన సైన్యదళాలు హైద్రాబాద్ నగరానికి దాదాపు యాభైమైళ్ళ దగ్గరగా వచ్చేశాయి. రేపో మాపో నగర ప్రవేశం చెయ్యొచ్చు. తక్కిన వైపుల నుండి వచ్చే దళాలు అట్టే చురుకు చూపడంలేదు. కారణం అనూహ్యం.

హైద్రాబాద్ ప్రత్యేక ప్రసార కేంద్రం "దఖన్ రేడియో' లోంచి, రాత్రింబవళ్ళు, ఎడతెరిపి లేకుండా ప్రసారాలు పస్తూన్నాయి. వీటి ప్రకారం హైద్రాబాద్ సైన్యాలూ, ఇత్తెహాదుల్ ముసీల్మీన్ రజాకార్ (స్వచ్ఛంద) దళాలూ కలిసి, భారత సైన్యాల్ని తరిమి కొట్టేస్తున్నాయి. వాళ్ళ ధైర్యసాహసాల్ని పొగడ్తూ, భారత ప్రభుత్వాన్ని అనేక రకాలుగా తిట్టిపోస్తూ, పాటలూ, పద్యాలూ, ఉపన్యాసాలతోనూ 'ఖాసింరజ్వీ జిందాబాద్!', 'ఆజాద్ హైద్రాబాద్ జిందాబాద్!' అన్న నినాదాలతోనూ, హోరెత్తించేస్తోంది రేడియో.

కాని హైద్రాబాద్ నగరం మాత్రం ప్రశాంతంగానే ఉంది. ఆఫీసులూ, స్కూళ్ళూ, కాలేజీలూ, దుకాణాలూ తెరిచే వున్నాయి. ప్రజల దినచర్యల్లో చెప్పుకోదగ్గ మార్పేమీ రాలేదు. హిందువులు భయం భయంగా బిక్కుబిక్కుమంటూ, వంచిన తలలు ఎత్తకుండా, మౌనంగా తమతమ పనులు చేసుకుంటూనే వున్నారు. సాయంత్రం కాగానే మాత్రం దుకాణాలన్నీ, ముఖ్యంగా హిందువులవి, మూతపడిపోయేవి. రోడ్లంబటి ఒక్క హిందువూ కనిపించేవాడు కాదు. ముస్లింలు మాత్రం బాహాటంగా తిరుగుతూ వుండేవారు.

ఈ విపరీత వాతావరణం ఈ మూడు రోజులే కాదు, దాదాపు సంవత్సరం నుంచి అంటే భారతదేశానికి స్వాతంత్ర్యం లభించాక, నిజాం నవాబు హైద్రాబాద్‌ను స్వతంత్ర రాష్ట్రంగా ప్రకటించినప్పటి నించీ, ఇలాగే వుంటోంది. జిల్లాల్లో అక్కడక్కడ, అప్పుడప్పుడు రజాకార్లూ పోలీసులూ కలిసి, బలవంతానైనా హిందువులను స్వతంత్ర రాష్ట్రానికి అనుకూలంగా మార్చాలన్న ఉద్దేశంతో, పల్లెలపై కాకి దాడిచేసి, హత్యలూ, దోపిడీలూ,

స్త్రీల మానభంగాలూ లాంటి దారుణ హింసాకాండలు జరుపుతున్నారని వింటూనే వున్నాం. కాని నగరంలో మాత్రం గంభీర వాతావరణం, చెదురుమదురు సంఘనటలు తప్ప హింసాకాండలు జరిగేవికావు. ప్రజానాయకుల్లోనూ, ధనవంతుల్లోనూ, చాలా మట్టుకు పారిపోయి రాష్ట్రేతర ప్రదేశాల్లో సురక్షితంగానే వుండిపోయారు. కొందరు, ఆడవాళ్ళను మాత్రం నగలతో సహా బయటికి, బంధువుల ఇళ్ళల్లోకి చేర్చేశారు. మాలాంటి సాధారణ ప్రజానీకం ఎటూపోలేక, వూపిరి బిగబట్టి, ఇక్కడే వుండిపోయారు.

మా ఇంట్లో నేనూ, అమ్మ మాత్రమే వుండేవాళ్ళం. హిందూవాడలోనే ఉంది ఇల్లు. కాని కొద్ది దూరంలో ఒక మస్జిద్ కూడా ఉంది. దాని చుట్టూ కొన్ని ముస్లింల ఇళ్ళు వున్నాయి. అప్పటిలో అవి పాముపుట్టల్లా కనిపించేవి మా కళ్ళకి.

ఆఫీసులో మాది ఇంజనీరింగుశాఖ. ఎక్కువ హిందువులే వుండేవాళ్ళు. అయినా, ఆఫీసరూ, క్లర్కులూ, చప్రాసీలూ (బంట్రోతులు) అంతా ముస్లింలే. దాంతో ఆఫీసులో రాజకీయాలు చర్చించుకునే ధైర్యం మాకుండేది కాదు. ముస్లిం క్లర్కులు, ఉర్దూ పత్రికల్లో భారత ప్రభుత్వాన్ని, ముఖ్యంగా సర్దార్ పటేల్ని తెగతిడుతూ రాసిన రాతలన్నీ గట్టిగా చదువుతోంటే, విని విననట్లు మా పనేదో మేము చేసుకుంటూ కూచునేవాళ్ళం.

నా తోటి ఇంజనీర్లలో ఇద్దరు ముస్లింలు కూడా వుండేవాళ్ళు. ఒకడు, లోలోపల పక్కా రజాకార్ అని తెలుసు. వాడికి దూరంగానే వుండేవాణ్ణి. రెండోవాడు నా సహపాఠి కూడాను. కొంచెం కమ్యూనిజం భావాలు గలవాడు. నిజాంనూ, అతని యాజమాన్యంలో సాగుతోన్న జమీందారీ నిరంకుశ వ్యవస్థనూ విమర్శిస్తూండేవాడు. అతని ఎదుట మాత్రం అప్పుడప్పుడు నా మనస్సులోని మాట వెళ్ళ గ్రక్కుతూ కాస్త తేలిక పడేవాణ్ణి.

'పోలీస్ యాక్షన్' మొదలైందని తెలియగానే రొమ్ములమీది పెద్దబరువు తీసేసి నట్టనిపించింది. ఇక కొద్దిరోజుల్లోనే బంధవిముక్తులమవుతామన్న సంతోషంతో ఉప్పొంగిపోయాం. కాని, వెంటనే మరోభయం ఆవరించింది. ఇంతవరకు శాంతంగానే వున్న ముస్లింలు అటు భారత సేనలు దెబ్బమీద దెబ్బ తీస్తోంటే, తట్టుకోలేక, గదిలో బంధించిన పిల్లిలా, మాపైన ఎక్కడ విరుచుకుపడతారోనని భయంగా వుంది. వాళ్ళ దగ్గిర ఆయుధాలున్నాయి. పోలీసు బలగం వెనుకవుంది. మేము నిరాయుధులం. దినమొక గండంగా, రాత్రిళ్ళు మహాగండంగా గడుస్తున్నాయి.

ఆ రోజు మూడో రోజు కూడా ఆఫీసు కెళ్ళొచ్చాను. రాగానే తలుపులు బిగించేసి, కిటికీలన్నీ మూసేసి రేడియో దగ్గిర చెవి పెట్టి కూచున్నాను. అమ్మకూడా కూచుంది దిగాలుగా. నేను వింటున్న వార్తల సారాంశాన్ని చెబుతూ, నా భయాన్ని నాలోనే దాచుకుని, అమ్మకు ధైర్యం చెబుతున్నాను.

నాకు ఆకలిగా లేకున్నా, అమ్మ బలవంతంమీద పెందరాళె భోంచేశాం. అమ్మ పడుకుంది. పూర్వమైతే నిద్రవచ్చేదాకా ఏవేవో కీర్తనలను పాడుకుంటూ వుండేది. ఇప్పుడవన్నీ మానుకుంది. మనసులోనే ప్రార్థించుకుంటుందేమో కొద్దిసేపట్లోనే నిద్ర పోయింది.

నాకు నిద్ర రావటం లేదు రేపేమవుతుందో తెలీక. ఒకవైపు సంతోషమూ, మరోవైపు దిగులుతో కొట్టు మిట్టాడుతున్నాను. లేచొచ్చి రేడియో దగ్గిర కూచున్నాను. వార్తల్లోనూ, సంగీతంలోనూ నా భయాల్ని పారతోలటానికి ప్రయత్నం చేస్తూ....

రాత్రి పదిగంటలప్పుడు ఎవరో పిలుస్తున్నట్లనిపించింది. చప్పున రేడియో ఆపేశాను.

"స్వామీ!...." అన్న పిలుపు వినిపించింది.

ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. భయంతో వొళ్ళంతా రోమాంచితమై పోయింది. గుండె దడ హెచ్చింది.

ఎవరు?... ఎవరై వుంటారు?... హిందువులెవ్వరూ ఇళ్ళు వదిలిరావటం లేదు. ముస్లిం స్నేహితులెవరొస్తారూ? అదీ ఇంతరాత్రి?

"స్వామి సాబ్!..." మళ్ళీ పిలుపు. పరిచిత కంఠంలాగే వుంది. కాని ఎవరో పోల్చుకోలేక పోతున్నాను.

"ఎవరు?" అంటూ హాల్లోకి వెళ్ళాను. ఎదురుగా అమ్మ. ఇంకా నిద్రపోలేదేమో, గాబరాగా "ఎవర్రా అదీ?" అంటూ దగ్గరకొచ్చింది.

"ఎవరో నన్ను పిలుస్తున్నారమ్మా, తెలిసిన వాడిలాగే వుంది."

"వొద్దు, తలుపు తీయకు. రోజులు మంచివి కావు."

"తియ్యను, కాని ఎవరో ముందు కనుక్కుంటాను" అంటూ తలుపు దగ్గరికెళ్ళి, కొంచెం ధైర్యంగానే "ఎవరదీ?" అన్నాను.

"నేను...నేను స్వామీ! దిలావర్‌ని..దిలావర్‌హూసేన్.'

దిలావర్? నాపాత మిత్రుడు దిల్లూ...? అవును, అతని కంఠమే అది.

"అమ్మా! దిలావర్!" దిల్లూ... నా స్నేహితుడు నీకు తెలుసుగా."....

"అయినా తలుపు తీయకు, ఎవర్నీ నమ్మటానికి లేదు."

"లేదమ్మా, వాడే అయితే, ఏ భయమూ లేదు...వుండు వొక్కడే వచ్చాడో, వెంట ఎవరైనా వున్నారో చూస్తాను అంటూ, హాల్లో లైటార్పి మెల్లిగా కిటికీ గడియ తీసి ఒక రెక్క కొద్దిగా తెరిచి, పొంచి చూశాను. బైట స్ట్రీటు లైట్లు దేదీప్యమానంగా వెలుగు తున్నాయి. ఇంటి ముందు ఒకే ఒక్క ఆకారం నిలుచుని ఉంది. శేర్వానీ పైజామా తో వున్నాడు. తలకు టోపీలేదు. మొహం స్పష్టంగా కనిపిస్తోంది. దిలావరే. నాకు బాగా ధైర్యమొచ్చేసింది.

"దిలావర్ ! నువ్వా?...ఇప్పుడు?... ఇంతరాత్రి?...."

"అవును, నేనే తలుపు తెరువు."

"ఎక్కడి నుండి వస్తున్నావు?"

"చెబుతా, ముందు తలుపు తీయ్"

కిటికీ తలుపు మూసేసాను. హాల్లో లైటు వేశాను.

"అమ్మా! మరేం భయంలేదు. దిలావరే.....వంటరిగానే వచ్చాడు. చేతిలో కర్రగానీ, కత్తిగానీ లేదు...తలుపు తెరుస్తాను..నువ్వెళ్ళి పడుకో" అంటూ తలుపు దగ్గరికి నడిచాను. అమ్మ వెళ్ళలేదు. అక్కడే నిలుచుంది, బిక్కచచ్చి చూస్తూ.

తలుపు తెరిచాను. దిలావర్ లోపలికి అడుగుపెట్టగానే అమాంతంగా నన్ను కావలించుకుని వెక్కి వెక్కి ఏడ్వటం మొదలుపెట్టాడు. నేను ఉక్కిరిబిక్కిరి అయ్యాను. అమ్మ తలుపువేసి, గడియ పెట్టేసింది.

"దిల్లూ! ఏంవిటిది? ఎందుకేడుస్తున్నావ్" వీపు మీద మెల్లిగా తడుతూ అడిగాను.

"నాశనం... సర్వనాశనమై పోయింది."

"ఏమిటి?"

"మన రాష్ట్రం మట్టి పాలైపోయింది. యూనియన్ వాళ్ళు వచ్చేస్తున్నారు. రేపటి వరకు ఇక్కడికి క్కూడా వచ్చేస్తారు..నిజాంగాడు లొంగిపోయాడు.

ఆ చివరి మాట వినగానే నా హృదయం ఆనందంతో పరవశించిపోయింది. "రా...రా, ఇలా వచ్చి కూచో" అంటూ డ్రాయింగు రూం కేసి నడిపించాను.

దిలావర్ దృష్టి అమ్మమీద పడగానే, "అమ్మా! నేను...దిల్లూను...నాక ఆకలిగా వుందమ్మా" అన్నాడు దీనంగా.

అమ్మ కళ్ళు మెరిశాయి. కరుణతో నిండిపోయాయి. "ఇప్పుడే తెస్తాను, నువ్వు చేతులు కడుక్కో అంటూ లోపలికెళ్ళింది.

అప్పుడు గమనించాను. వాడు వేసుకున్న గుడ్డలు మట్టి గొట్టుకుపోయాయని, కాళ్ళకు చెప్పులు కూడా లేవని, జుత్తంతా రేగి వుందని. వెంటనే వెళ్ళి నావి చలవ చేసిన కుర్తా, పైజామా తెచ్చి ఇచ్చాను. దిలావర్ మొహం కాళ్లూ చేతులూ కడుక్కుని, బట్టలు మార్చుకున్నాడు. వచ్చి సోఫాలో కూచున్నాడు. నేనూ ప్రక్కనే కూచున్నాను.

అమ్మ ఒకపళ్ళెంలో అన్నం కూరలూ, నీళ్ళగ్లాసూ తెచ్చి పెట్టింది. అది చూడగానే ప్రాణం లేచి వచ్చినట్టు గబా గబా తినటం మొదలుపెట్టాడు. నేనూ, అమ్మా మౌనంగా అతన్నే చూస్తూన్నాం. అన్నం అయిపోయాక గటగటా నీళ్ళు తాగాడు.

అమ్మ అడిగింది. "ఆకలి తీరిందా?...ఇంకా కావాలంటే వంట చేస్తాను."

"వొద్దు వొద్దు, చాలు ఆఁమరో గ్లాసు నీళ్ళు."

అమ్మ తెచ్చింది తాగేశాడు. అమ్మ పళ్ళెమూ, గ్లాసూ తీసుకెళ్తూంటే నేను అన్నాను. "అమ్మా! దిలావర్‌కు నా గదిలోనే పక్క వెయ్యి...నువ్వు వెళ్లి పడుకో"

అమ్మ వెళ్లిపోయింది.

అప్పుడు అడిగాను. "ఊఁ చెప్పు ఏంవిటీ హడావిడి? ఎక్కడ్నించి వస్తున్నావు."

"నేనెక్కడుంటున్నానో నీకు తెలీదా?"

"...మనం కలుసుకుని ఆర్నెల్లయింది. అప్పుడు నువ్వు నల్లగొండలో టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్‌లో వుండేవాడివి."

"ఇప్పుడూ అక్కడే వున్నాను. కాదు. వుండేవాణ్ణి ఇవాళ్ళ ప్రొద్దుటి వరకూ."

"మరేమైంది?"

"నిన్నరాత్రి, అర్ధరాత్రి యూనియన్ సైన్యం నల్లగొండలోకి వచ్చేసింది....ఇహ గత్యంతరం లేక నేను వున్న పళంగా ఇల్లువదిలేసి, పారిపోయి వచ్చాను. అయిదారు

మైళ్ళు పరుగెత్తాను. ఒకలారీ కనిపిస్తే బ్రతిమాలి ఎక్కాను. ఓ ఇరవై మైళ్ళు పచ్చేసరికి లారీ ఫేలయింది. మళ్ళీ పరుగు. ఇంకో లారీ కనిపించింది. వాడికో పది రూపాయలిచ్చి ఎక్కాను. వాడుపట్నం పొలిమేర్లలో దించేశాడు. అక్కడ్నించి నడిచి నీ దగ్గరి కొచ్చాను.

"మరి నీ భార్యో?"

వాడి మొహంలో ఒక్కసారి మార్పు వచ్చేసింది. కాసేపు మాట్లాడలేదు. తర్వాత, "భార్య...?...భార్య సంగతి అడక్కు తర్వాత చెబుతాలే" అన్నాడు.

"అది సరే, మరి నువ్వెందుకు పారిపోయి రావటం?"

"ఎందుకేవిటి, యూనియన్ సైన్యం వచ్చేసిందని చెప్పాగా?"

"వస్తే?....నిన్నే మంటారు?"

"వాళ్ళుకాదు వాళ్ళ అంద చూసుకుని అక్కడి హిందువులు నా మీద పడ్తారు. చీల్చి చెండాడ్తారు."

"ఎందుకూ?...నువ్వేం చేశావనీ?"

"అయితే నాగురించి నీకేం తెలీదన్నమాట. నేను..నేను రజాకార్‌ని."

నేను చకితుణ్ణయాను. "నువ్వు రజాకార్‌వా... నేను నమ్మలేను... ప్రభుత్వోద్యోగివా...?

"ప్రభుత్వోద్యోగులకీ రజాకార్‌లకీ తేడా ఏంవిటి? ఇక్బాల్ సంగతి వినలేదూ?"

"ఏ ఇక్బాల్? మన హాకీ ప్లేర్ ఇక్బాల్ అహమద్... బీబీ నగర్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా వున్నాడు. అతనేనా..ఆఁ విన్నాను."

"అతనే మా ప్రాంతానికంతా నాయకుడు, ఉపనాయకులం మేము, సల్లగొండ చుట్టు ప్రక్కల జరిగే దాడులన్నీ నా ఆధ్వర్యంలో జరిగేవి..."

నా వళ్ళు జలదరించింది. నా ఎదుట కూచున్నది మనిషి కాదేమో క్రూరమృగమేమో ననిపించింది. హీనస్వరంలో అడిగాను, "ఎందుకు ఎందుకలా చేశావు?"

"ఎందుకేవిటి, ఆ దుర్మార్గుడి కోసం, అంతా వాడికోసమే"

"వాడెవడు?"

"అదే, నిజాం...మమ్మల్ని నట్టేటముంచి ఇప్పుడు నాకేమి తెలీదు, అంతా ఖాసిం రజ్వీ చేయించాడు, అని బొంకుతూ యూనియన్ వాళ్ళ కాళ్లు పట్టుకుంటున్నాడు వెధవ!"

నేను జంకుతూనే అడిగాను, "అది అబద్ధమా?"

"పచ్చి అబద్ధం! రేపు నిజంగానే హైద్రాబాద్ రాష్ట్రానికి స్వతంత్రం వచ్చి వుంటే ఒరిగేదెవరికి? వాడుగద్దె దిగిపోయేవాడా. ఖాసిం రజ్వీకి పట్టం కట్టేవాడా?"

ఇహ వీడిని ఏదడిగినా ఇంకా రెచ్చిపోతాడేమోనని గ్రహించి, నెమ్మదిగా, "లే దిల్లూ! నువ్వు బాగా అలసిపోయి వుంటావు. మనం మళ్ళీ మట్లాడుకోవచ్చు. పద, పడుకుందాం" అన్నాను.

సరే అంటూ లేచి దిలావర్ తిన్నగా కొలిక్కి తగిలించిన తన శేర్వానీ దగ్గరికెళ్లాడు. జేబులు తడిమి, కర్చీఫ్‌లో కట్టిన ఒక మూటతీసి నాకివ్వబోయాడు. ఏంపిటస్నట్టు చూశాను.

"ఇందులో కొంత దబ్బూ, నగలూ వున్నాయి", అని తగ్గు స్వరంలో అన్నాడు.

నాకు భయం వేసింది."నాకెందుకూ?"

"దాడు రేపు ఎటుపోయి ఎటొస్తుందో తెలీదు. నన్ను ఏ క్షణాన్నైనా పోలీసులు పట్టుకోవచ్చు. అప్పుడది నీ దగ్గర సురక్షితంగా వుందన్న తృప్తి నాకుంటుంది.

"కానీ...కానీ..."

"భయపడకు.. నీ మీదికేమీ రాదు. నిన్నడిగితే 'నాకేమీ తెలీదు. నాకేమీ ఇవ్వలేదని చెప్పు."

నేనింకా సంకోచిస్తూనే వున్నాను. తీసుకోలేదు ఆఖరికి, "ఉహూఁ క్షమించు దిల్లూ, నేనలాంటి అబద్ధాలు ఆడలేను" అన్నాను.

కొద్ది క్షణాలు నాకేసే చూసి అన్నాడు, "సరే, ఆడకు, నీ ఇష్టం వచ్చినట్టు చెప్పు. ప్రస్తుతానికైతే దాచు."

తీసుకుని ముడి విప్పబోయాను. వారించాడు. "వొద్దొద్దూ, విప్పకు, నీ మీద నాకు పూర్తి నమ్మకముంది. అందుకే ఇక్కడికొచ్చాను."

మారు మాటాడకుండా తీసికెళ్ళి అల్మరా సొరుగులో దాచి, తాళం వేశాను.

పడుకున్న మరుక్షణం దిలావర్ నిద్రలోకి జారుకున్నాడు. నాకు చాలా సేపటి వరకు నిద్రపట్టలేదు. ఒకటే ఆలోచన్లు..

దిలావర్ నాకు చిన్ననాటి స్నేహితుడు. నా సహపాఠి కాకపోయినా, ఒకే బస్తీలో వుండేవాళ్ళం. ఆటల్లో పరిచయమై, మంచి స్నేహంగా మారింది. అది మేము యూనివర్శిటీలో చేరాక ఒకే హాస్టల్లో ప్రక్కప్రక్క గదుల్లో వుండటం మూలాన మరీ పెరిగింది. నేను అతని ఇంటికి వెళ్ళటమే, అతను మా ఇంటికి రావటమూ జరుగుతూండేది. అప్పుడే అమ్మతో కూడా పరిచయం అయింది. మా ఇంటిలో బాగా చనువు ఏర్పడింది. దిలావర్ తల్లిదండ్రుల్ని చిన్నప్పుడే కోల్పోయాడు. మేనమామల ఇంటిలో పెరిగాడు.

యూనివర్శిటీలో ఇక్బాల్ అహమద్ పరిచయమైంది. హాకీలో మేటి ఆటగాడు. అంతకంటే ఎక్కువ మాటకారి. దాంతో ఒక చిన్న ఆటగాళ్ళ బృందానికి లీడరయ్యాడు. ఆ భజన బృందంలో ఎక్కువమంది ముస్లింలూ, కొద్దిమంది హిందువులూ వుండేవాళ్ళు. ఆ బృందంలో నేను చేరలేదు. దూరందూరంగానే వుండేవాణ్ణి. అందుకేనేమో నన్ను కొంచెం గౌరవంగానే చూశేడు ఇక్బాల్.

యూనివర్శిటీ చదువు అయిపోయాక ఇక్బాల్ హైద్రాబాద్ సివిల్ సర్వీస్‌లో సెలెక్ట్ అయి రెవెన్యూ డిపార్టుమెంటులో చేరాడు. క్రిందటి సంవత్సరం నుంచీ బీబీనగర్‌లో డెప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే అతను జరిపించిన క్రూరత్వాల గాథలు అనేకం వినిపించాయి. రజాకార్లనీ, పోలీసుల్నీ వెంటేసుకుని తన హయాంలో వున్న గ్రామాల మీదికి దాడిచేసి, కొల్లగొట్టించేవాట్ట. ఒకసారి

ఇరవై ఇద్దరు యువకుల్ని చేతులు విరిచి వెనక్కు కట్టింది. పరుగుగా నిలబెట్టి, తానే స్వయంగా కాల్చి చంపాట్ట. ఆ వార్త రాష్ట్రేతర పత్రికలలో చదివినప్పుడు నా కళ్లని నేనే నమ్మలేకపోయాను. నాకు తెలిసిన ఇక్బాల్‌నేనా? మిస్టరీ పోయాను.

దిలావర్ ఓ.ఏ. అయిపోగానే, మొదట రేషనింగ్ డిపార్ట్‌మెంట్‌లోనూ, ఆ తర్వాత టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్‌లోనూ చేరాడు. క్రిందటి సంవత్సరం సర్దార్‌మండలో పోస్టింగ్ అయిందని చెప్పాడు. అక్కడే ఇక్బాల్ పరిధిలోకి వచ్చినట్టున్నాడు. కాని అతని లాగా ఇతనూ దౌర్జన్య కార్యక్రమాలలో పాల్గొన్నాడంటే ఇప్పటికీ నమ్మలేకుండా వున్నాను. తన నోటే చెబుతున్నాడు. కాబట్టి నమ్మక తప్పదు. దుతోన్నాడంలో చెడ్డవాళ్ళతోబాటు మంచివాళ్లు కూడా కొట్టుకుపోయారన్నడూట.

దిలావర్‌కు యూనివర్సిటీలో వుండగానే పెళ్ళయిపోయింది. మా ఫిజికల్ డైరెక్టర్ బంధువుల ఇంట్లో ట్యూషన్ చెప్పటానికి వెళ్ళేవాడు. అక్కడే ఓ అమ్మాయితో ప్రేమ కలాపం జరిపించాడు. అది పెళ్లిదాకా దారితీసింది. ఆ పెళ్ళి దిలావర్ మావయ్యలకు ఎంతమాత్రం ఇష్టం లేదు. ఇంటిలోనుంచి తరిమేశారు. నానా అవస్తలూ పడ్డాడు. నేను అప్పుడప్పుడు వెళ్లి వస్తూ వుండేవాన్ని. అతని భార్య నా ముందరికెప్పుడూ రాలేదు. కాని లోపల్నించి టీలూ, కిళ్ళీలూ పంపిస్తూండేది. ఒకసారి అమ్మను తీసికెళ్ళాను. చాలా అందంగా వుంటుందని చెప్పింది అమ్మ...మరి ఇప్పుడెక్కడుందో? ఆమాట ఎత్తితేనే వాడి ముఖం కవళికలు మారాయి. ఏమైందో ఏమో...

నాకు నిద్ర ఎప్పుడు పట్టిందో తెలీనేలేదు. ప్రొద్దున లేచేసరికి దిలావర్ ప్రక్కమీద కూచుని వున్నాడు. ముందర టీ కప్పు పెట్టి వుంది. అంటే అప్పటికే అమ్మ లేచి టీ చేసిచ్చిందన్నమాట. నేనూ లేచి కాలకృత్యాలు తీర్చుకుని, టీ తాగి ఆత్రంగా వెళ్ళి రేడియో ఆన్ చేశాను.

దఖన్ రేడియోలో ఒక పెద్ద మార్పు కనిపించింది. నిన్నటి వరకూ జరుగుతూన్న ఉద్రేకపూరితమైన ప్రసారాలేవీ లేవు. విషాద సంగీతం వినిపిస్తోంది. మధ్య మధ్య వార్తలూ, ప్రకటనలూ, హెచ్చరికలూ వినిపిస్తున్నాయి. నిజాం ఓటమి ఒప్పేసుకున్నట్ట. ఇవ్వాళ మధ్యాహ్నానికే భారత సైన్యాలు నగర ప్రవేశం చేస్తాయట. ప్రజలంతా ప్రశాంతంగా వుండాలి. అల్లర్లు రేపిన వారికి కఠినశిక్ష విధిస్తామని పదే పదే హెచ్చరిస్తున్నారు. ఇవ్వాళ రాత్రికి మేజర్ జనరల్ చౌదరి, నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ రేడియోలో ప్రసంగిస్తారని కూడా చెప్పారు.

అంతసేపూ నేను దిలావర్‌నే గమనిస్తున్నాను. తల దించుకొని మౌనంగా వింటున్నాడు. అతని కళ్ళింట బొటబొటా కన్నీళ్లు కారటం చూసి, చలించిపోయాను. జాలి వేసింది. వెంటనే రేడియో ఆపేశాను. అతన్ని లేపి, "పద నాష్తా చేద్దాం" అంటూ తీసికెళ్ళాను.

ఆ రోజు శుక్రవారం శలవుదినం. మంచిదే అయింది. ఆఫీసుకు వెళ్ళాల్సిన పనిలేదు. ఇంట్లోనే వుండొచ్చు. కాని నా దగ్గరికే హిందూ స్నేహితులు ఎవరైనా రావచ్చు. అందుకని, నాష్తా చేసిన తర్వాత, దిలావర్‌ని తిన్నగా బెడ్‌రూం లోకి తీసికెళ్ళాను.

"ఊఁ, ఇప్పుడు చెప్పు ఏమైంది?"

"ఏవిటో?"

"అదే, నీ భార్య...ఎక్కడుంది?"

"...అక్కడే వుండి వుంటుంది...ఆజంపురాలో."

"మరి నువ్వు అక్కడికెందుకు వెళ్ళలేదు."

"హు! అంత తెలివితక్కువవాణ్ణనుకున్నావా? ఈపాటికి నాకోసం గాలిస్తూ వుంటారు. అక్కడికీ, మా మాఁవయ్య ఇంటికీ వెళ్ళే వుంటారు. ఈ మధ్య ఈ ఇంటికెప్పుడూ రాలేదు నేను. కాబట్టి ఇక్కడికెవరు రారని నా నమ్మకం....అయినా ఇక్కడ కూడా అట్టే వుండనులే, భయపడకు."

"ఎక్కడి కెళ్తావు?"

"ఏమో, చెప్పలేను, ఇంక ఆలోచించలేను. కాని ఒక్కటిమాత్రం నిశ్చయించుకున్నాను. వీళ్ళ చేతుల్లో చిక్కకూడదు."

నేనేమీమాట్లాడ లేదు.

"ఆఁ స్వామీ! ఒక పనిచేసి పెట్టాలి. నాకోప్యాంటూ, షర్టూ తెచ్చి పెట్టాలి. ఇక పైజామా శేర్వానీ వేసుకోలేను.

"ఎక్కడికైనా వెళ్ళాలా?"

"ఇవ్వాళ కాదులే."

"ఇవ్వాళ్టసలు షాపులు తెరుస్తారో లేదో తెలీదు... కావాలంటే నాప్యాంటూ షర్టూ ఇస్తాను.

ఇంతలో నన్నెవరో బైట్నించి పిలిచారు. నేను చప్పున లేచి, బెడ్ రూం తలుపులు బైటినించి గడియ వేసి, వీధి గుమ్మం తలుపు తెరిచాను. ఇద్దరు బస్తీ పెద్ద మనుషులు నిలుచుని వున్నారు. సరాసరి డ్రాయింగ్ రూమ్‌లోకొచ్చి కూచుని ముస్లింలనీ, రజాకార్లనీ, ఖాసిం రజ్వీని చెడామడా తిట్టటం మొదలెట్టారు. నాకు చాలా ఇబ్బందిగా వుంది. దిలావర్ ఎక్కడ వినిపోతాడోనని.

"అంత తొందరపడకండి. ఇంకా రాజ్యం మన చేతుల్లోకి రాలేదు" అన్నాను మెల్లిగా.

"ఇంకా భయపడ్తారేఁవిటండీ? చచ్చిన పేన్లయ్యారు వెధవలూ."

"అదే అంటున్నాను. చచ్చిన పామును ఇంకా ఎందుకు చావగొడ్తారని."

"అమ్మా, వీళ్ళను నమ్మొద్దు. ఈ పాములకు నిలువెల్లా విషం."

"పోన్లెండి, వాళ్ళ పాపాన వాళ్లే పోతారు."

"ఏవిఁటో, ఇవ్వాళ్ళ మీరేదో అదోలా వున్నారు ఉత్సాహంగా లేరు...వస్తాం" అంటూ లేచి చక్కా వెళ్లిపోయారు.

ఆరోజు దక్షిణ భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాల్లో లిఖించదగ్గ దినం! మూడు వందల యాభై సంవత్సరాల క్రితం మొఘల్ సామ్రాజ్యం క్షీణదశలో అవతరించిన ఆసఫియా రాజ్యం అంతరించిన దినం. వందలాది సంవత్సరాలుగా పదిశాతం

ముస్లింలు తొంభై శాతం ముస్లిమేతరులపై చలాయిస్తున్న అధికారం అంతమొందిన దినం!

సరిగ్గా మధ్యాహ్నం మూడు ఝాములకు హైద్రాబాద్ నగరంలో అడుగుపెట్టింది భారతసైన్యం. మిలటరీ ట్రక్కులూ, టాంకులూ కంటపడగానే, ఇళ్లలో దాక్కుని వున్న ప్రజలు తండోపతండాలుగా వీధుల్లో కొచ్చి, ఝుండాలతో సుస్వాగతం చెప్పారు. ఇన్నాళ్ళూ మాటవోయిన గొంతులు ఎలుగెత్తి నినాదాలు చేశాయి. భారత్ మాతాకీ జై! సర్దార్ పటేల్‌కీ జై! జవహర్‌లాల్ నెహ్రూకి జై! స్వతంత్ర భారత్ జిందాబాద్! అన్న నినాదాలు మిన్నుముట్టాయి. నేనూ ఉత్సాహంగా వెళ్ళి వేడుక తిలకిస్తూ నిలుచున్నాను. అంతమందిలోనూ ఒక ముస్లిమూ కనిపించలేదు.

ఆ రాత్రి ఏడింటినుంచి కర్ఫ్యూ విధించారు. వీధులన్నీ నిర్మానుష్యమైపోయాయి. సాయుధ పోలీసులూ, సైనిక దళాలు మాత్రం గస్తీ తిరుగుతున్నాయి. నేను ఇంట్లోనే డ్రాయింగ్ రూంలో రేడియో దగ్గర కూచున్నాను. ప్రక్కనే దిలాపర్ వున్నాడు. అతని మొహం చాలా గంభీరంగా వుంది. విషాదఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రేడియోలో మొదట మేజర్ జనరల్ చౌదరి ముక్తసరిగా మూడు నిమిషాలపాటు మాట్లాడాడు. అందులో ఎక్కువ భాగం హెచ్చరికలే వున్నాయి. ఆ తర్వాత మరో మూడు నిమిషాలు నిజాం మాట్లాడాడు. అందులో కొంత భాగం భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలపటమూ, మరికొంత భాగం 'తన' ప్రజల్ని శాంతంగా వుండమని కోరటంతో సరిపోయింది. నిజాం మాట్లాడుతూన్నప్పుడు దిలాపర్ మొహం విపరీతంగా మారింది. పళ్ళుకొరుకుతూ, పిడికిళ్ళు బిగిస్తూ కూచున్నాడు. ఆ కోపంలో లేచి నా రేడియో ఎక్కడ బ్రద్దలు కొడతాడోన్నంత భయం వేసింది. ప్రసంగం ముగిశాక చాలా సేపటికి గాని మామూలు మనిషి కాలేదు.

ఇద్దరం లేచి మౌనంగానే భోంచేశాం. పడుకున్నాం.

రెండో రోజు నాష్తా చేసేప్పుడు అడిగాడు. "నువ్వివాళ్ళ ఆఫీసుకెళ్తున్నావా."

"వెళ్తాను."

"వెళ్ళకు"

"ఏం?"

"నువ్వు నాకు రెండు మూడు పన్లు చేసిపెట్టాలి."

"ఏంవిటి?"

"చెబుతా, మొన్న నీకిచ్చిన డబ్బు మూట ఇలా తే."

తెచ్చాను.

"ముడివిప్పు"

విప్పాను. అందులో నోట్ల కట్టలూ,విడిగా మరో నగల మూట వున్నాయి.

"రూపాయిలు లెక్కపెట్టు."

పెట్టాను. మూడువేల పై చిల్లర హాలీ(నిజాం) కరెన్సీలో వున్నాయి. నగల మూట విప్పొద్దన్నాడు. విప్పలేదు.

"అందులోంచి కావలసినంత డబ్బు లీసుకుని, నాకు ఓ వెయ్యి రూపాయల కల్దార్ (భారత) కరెన్సీనోట్లు తెచ్చి పెట్టాలి నాకో ప్యాంటూ, షర్టూ, ఖద్దర్ ధోతీ, లాల్చీ, గాంధీ టోపీ కొనుక్కు రావాలి. ఆఁ మరో ముఖ్యమైన పని కూడా వుంది. ఆంజపురాలో నా భార్య వుండే ఇంటికీ, గౌలిగూడాలో మా మాఁవయ్య ఇంటికి వెళ్ళి నాకోసం పోలీసు లెవరైనా వచ్చారేమో జాగ్రత్తగా తెలుసుకు రావాలి. ఏఁ?"

సరేనని లెఖ్ఖపెట్టి పన్నెండొందలు జేబులో పెట్టుకుని, తక్కింది మళ్ళీ మూట కట్టి అల్మారాలో భద్రపరిచాను

ముందు బ్యాంకుకెళ్ళి డబ్బుమార్చాను. ఆ తర్వాత ఆజంపురాకెళ్ళాను. అక్కడ ముస్లింలే ఎక్కువుండేవారు దివాళా తీసినట్టు బోసిగా వుంది. రోడ్లంబటి మనుషులు, అదీ మగవాళ్ళే. బహు కొద్దిమంది కనిపించారు ఇళ్ళ తలుపులన్నీ మూసి వున్నాయి. దిలావర్ ఇంటి తలుపులు కూడా మూసి వున్నాయి.

తిన్నగా వెళ్ళి తలుపు దగ్గిర నిలుచుని, ఇక్కడి ఆచారం, ప్రకారం చప్పట్లు చరిచాను. కొద్దిసేపటికి లోపల్నించి "ఎవరదీ?" అన్న మగ గొంతు వినిపించింది.

"నాపేరు స్వామీ. దిలావర్ హుసేన్‌గారి స్నేహితుణ్ణి" అన్నాను. మరికొంత సేపటికి తలుపులు తెరుచుకున్నాయి. అడ్డంగా ఒక గోనె సంచి పరదావేసి వుంది. ఒక రెక్క మూసేసి, గుమ్మంలో నిలుచుని నన్నే అనుమానంగా చూస్తున్నాడు ఒకతను. ఆజాను బాహువు, కోలమొహం, చామనఛాయ, ప్రాయం పాతిక ముప్పై మధ్య వుంటాడేమో గళ్ళలుంగీ కుర్తా వేసుకున్నాడు

"దిలావర్‌గారు ఉన్నారా" అన్నాను.

"లేరు...నల్లగొండలో వున్నారు."

"తెలుసు, కాని వచ్చారేమోననీ...వారి జాడేమైనా తెలిసిందా?"

"...ఉహుఁ, తెలీలేదు "

"మీరూ...?"

"దిలావర్‌గారి భార్య నాకు చెల్లెలి వరుస."

"ఓహో..... ఈ రెండు రోజుల్నించి మీరిక్కడే వుంటున్నారా?"

"అంటే?"

"ఏఁ లేదు, దిలావర్‌గారి కోసం ఎవరైనా వచ్చారేమోననీ."

"ఎవ్వరూ రాలేదు, మీరే మొదటివారు."

"అలాగా...సరే, దిలావర్ వస్తే నేనొచ్చి వెళ్ళానని చెప్పండి వస్తా" అంటూ వచ్చేశాను.

గౌలిగూడాలో దిలావర్ చినమాఁవయ్య నన్ను చూడగానే ఆప్యాయంగా కౌగలించుకుని తీసికెళ్ళి డ్రాయింగ్ రూంలో కూచో బెట్టాడు. టీ తెప్పించాడు. నాకంటే ముందు ఆయనే అడిగేశాడు. "దిలావర్ కనిపించాడా?" అని.

"లేదే. ఇక్కడికి రాలేదా."

"ఇక్కడికా? ఇక్కడి కెప్పుడూ రాడు "

"ఆజంపురా కెళ్ళొచ్చాను. అక్కడికీ రాలేదుట."

"ఆ పాడుముండ మాట ఎత్తకండి. దాని మూలానే మూడాడు చెడిపోయాడు." అన్నాడు కోపంగా.

నేను కాసేపు మాట్లాడలేదు.

"అయితే, నల్లగొండలోనే వుండి వుంటాడు" అన్నాను.

ఉహుఁ, అక్కడా లేడు"

"మీకెలా తెలుసు?"

"అక్కడ నా స్నేహితులు కొందరున్నారు. వాళ్ళ ద్వారా వాకబు చేశాను. యూనియన్ సైనిక దళాలు నల్లగొండ చేరిన రెండో రోజే వాడి ఇంటిమీద పడ్డారట. కొల్లగొట్టారట. కాని వాడు మాత్రం చిక్కలేదట. అంతకు క్రితమే పారిపోయేడేమో."

"మరింకేఁ ఎక్కడో అక్కడ సురక్షితంగానే వుండి వుంటాడు."

"ఉహుఁ..నాకు నమ్మకంలేదు. ఎక్కడికని పారిపోతాడు? పట్టుపడే వుంటాడు. ఏం చేశారో ఏమో..." కంఠం రుద్ధపోయింది. "వాడిని మాచేతులు మీదుగా పెంచాం. ఈ రెండురోజులూ వాడి గురించే కుమిలి కుమిలి పోతూన్నాం."

ఆయన దుఃఖం చూసి, నిజంచెప్పేద్దామని నోటి దాకా వచ్చింది. కాని దిలావర్ చేసిన హెచ్చరిక జ్ఞాపకం వచ్చి మానుకున్నాను. "విచారించకండి, పట్టుబడ్డాడని నిర్ధారణగా తెలియనప్పుడు సురక్షితంగానే వున్నాడనుకోవాలి. సరే, వస్తా" అంటూ లేచాను.

"మీరు వారి జాడ తెలిస్తే నాకు వెంటనే తెలియజేస్తారు కదూ?"

"తప్పకుండా" అంటూ వచ్చేశాను.

ఇంటికొచ్చి, సంగతంతా చెప్పి, కల్దార్ నోట్లు దిలావర్ చేతిలో పెట్టాను. "వెయ్యి రూపాయలు లెఖ్ఖపెట్టుకో."

"అఖ్ఖర్లేదు" అంటూ తన జేబులో కుక్కున్నాడు.

"ఇదిగోఁ పన్నెండువందల్లో ఈముప్పై మూడు రూపాయలు మిగిలాయి."

"ఏంఁ? నేను చెప్పిన గుడ్డలు కొనలేదా?"

"లేదు... కావాలంటే నా ప్యాంటూ, షర్టూ ఇస్తానన్నానుగా... ఎన్నడూ తొడగని ఖద్దరు ధోతీ, లాల్చీ చెయ్యడం మంచిదికాదు. అలాంటి వేషాల్లో పారిపోజూసిన వాళ్ళను రైళ్ళలోంచి దించి ధోతులు ఊడబెరికి, ముస్లింలేనని తేలితే, నానా హింసలు పెడుతున్నారని విన్నాను. నువ్వలాంటి పిచ్చి ప్రయత్నం చెయ్యటం ప్రమాదకరం."

దిలావర్ మారు మాట్లాడకుండా తలవంచుకుని సుదీర్ఘంగా ఆలోచిస్తూ కూచున్నాడు. కాసేపటికి పక్కమీదికి వొరిగిపోతూ, "కనీసం బనియన్లూ, అండర్‌వేర్లూ, కాళ్ళకు చెప్పులైనా తీసుకు రాకపోయావా?" అన్నాడు. సరేనని మళ్ళీ బజారుకెళ్ళి అవన్నీ తెచ్చాను.

ఆ రోజు సాయంత్రం దిలావర్ బాగా మాసిపోయిన గడ్డం గీక్కున్నాడు. దాంతోబాటు గుబురుగా వున్న మీసాలు కూడా తీసేశాడు. ఎందుకలా చేశావని

నేనడగ లేదు. నా ప్యాంటూ షర్టూ అడిగి వేసుకుని కాస్త చీకటి పడ్డాక ఒక గంటలో వస్తానని ఎటో వెళ్ళిపోయాడు.

గంటకాదు, నాలుగ్గంటల తర్వాత వచ్చాడు. భోంచేసే వచ్చానని చెప్పి వెంటనే పడుకున్నాడు. మేమేమీ మాట్లాడుకోలేదు.

మరుసటిరోజు నేను ఆఫీసుకెళ్ళాను. దిలావర్ ఇంటిలోనే వున్నాడు. సాయంత్రం నేనొచ్చాక, తయారై బయలుదేరాడు. ఎక్కడికని అడిగితే, ఇప్పుడిప్పుడే చెప్పనన్నాడు.

ఆ రాత్రికి అసలు రాలేదు. తెల్లవారాక వచ్చి నాష్తా చేసి, పడకవేశాడు. నేను ఆఫీసుకెళ్ళిపోయాను. మళ్ళీ శుక్రవారం వచ్చేదాకా అలాగే జరిగింది.

ఆ రోజు నాకు శలవు. ఇంటిలోనే వున్నాను. దిలావర్ స్నానం చేసి తానే కొనుక్కుని తెచ్చుకున్న కొత్త ప్యాంటూ, షర్టూ వేసుకుని. పదకొండుగంటలకల్లా బయలుదేరాడు. నాకు ఆశ్చర్యం వేసింది. "దిల్లూ! ఇప్పుడు...ఈవేళప్పుడు బయటికెళ్తున్నావా?" అన్నాను.

అవును మక్కా మస్జిద్‌కు నమాజ్ చదవటానికి వెళ్తున్నాను. బహుశ నేను ఆ మస్జిద్‌లో నమాజ్ చదవటం ఇదే ఆఖరిసారేమో" అంటూ, నారెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుని ఒక్క క్షణం నా కళ్ళల్లోకి నిశితంగా చూసి, మరో ప్రశ్నకు తావివ్వకుండా వెళ్ళిపోయాడు. నేను చూస్తూ వుండిపోయాను.

ఆ వెళ్ళటం వెళ్ళటం దిలావర్ మళ్ళీ రాలేదు. అతను విడిచి వెళ్ళిన దబ్బా, నగలూ అలాగే వున్నాయి. ఏంచెయ్యాలో తోచలేదు. పదిరోజుల తర్వాత ఒక ఉత్తరం వచ్చింది.

"డియర్ స్వామీ!

నేనలా చెప్పా చెయ్యకుండా వచ్చేసి నందుకు క్షమించు. చివరిసారిగా నిన్ను కావలించుకోలేక పోయాననీ, అమ్మకు నమస్కారమైనా చెయ్యలేకపోయాననీ బాధగా వుంది. కాని ఏం చెయ్యను, అక.స్మాత్తుగా కొన్ని పరిస్థితులు అనుకూలించటంతో, ఏకాయకీని వచ్చేయాల్సి వచ్చింది. ఆవారంరోజులూ నువ్వూ, అమ్మా నన్ను కడుపులో పెట్టుకుని కాపాడారు. ఆ రుణం నేనీ జన్మలో తీర్చుకోలేను. అమ్మ చేసే కమ్మని వంటకాలు మళ్ళీ తినే అదృష్టం నాకుందో లేదో.

నేనిప్పుడు బొంబాయిలో వున్నాను, కాని నీకీ ఉత్తరం చేరేసరికి వుండను. కరాచీలో ఎక్కడో వుంటాను. పాకిస్తాన్‌లో కొత్తజీవితం ప్రారంభించటానికి పోతూన్నాను. తలచుకుంటేనే భయంగా వుంది. యూనివర్శిటీ నించి బయటపడ్డాక, జీవితంలో స్థిరపడడానికి నేనెన్ని కష్టాలు పడ్డానో నీకు తెలుసు. మళ్ళీ కథ మొదలు పెట్టాలి. ఇప్పుడు నా దగ్గిర బి.ఏ. డిగ్రీపత్రం కూడా లేదు. కేవలం అనామకుడిగానే అగాధంలోకి వెళుతున్నాను. నెగ్గుకొస్తానో లేదో చెప్పలేను. కాని వెళ్ళాలి. తప్పదు. బ్రతికి బట్టకట్టాలంటే వెళ్ళక తప్పదు. అక్కడే వుంటే నా రక్తం కళ్ళ చూసిందాకా వదలరు. అందుకే, నీలాంటి ప్రాణ స్నేహితుల్ని కూడా వదిలేసి, ఇలా తెగించి పారిపోతూన్నాను.

ఆఁ నేను నీ దగ్గిర వదిలి వచ్చిన డబ్బూ, నగలూ నావి కావు. నా కష్టార్జితం కాదు. నేను నడిపించిన దాదుల్లో కొల్లగొట్టిన సొమ్మే. కొంత నల్లగొండ ఇంట్లో కూడా వుండిపోయింది. ఈ పాటికి దోచేసి వుంటారు.

మరి, దీన్నేం చేస్తావు? నాకోసం అట్టిపెట్టటం అవివేకం. మళ్ళీ మనం కలుసుకుంటామన్న నమ్మకం లేదు నాకు. కలుసుకున్నా, నాది కానిది నాకెందుకు? నా మాట వింటావా? నా పాత స్నేహితుడిగా, ప్రాణ స్నేహితుడిగా నేనిచ్చే చివరి కానుకగా స్వీకరించావంటే నేనెంతో సంతోషిస్తాను. కాని, నీ సంగతి నాకు తెలుసు. నువ్వలా స్వీకరించవేమోనని నా అనుమానం. మరేం చేస్తావ్. మా వాళ్ళకు ఇవ్వటానికి మాత్రం ప్రయత్నం చెయ్యకు. మా పెదమామయ్య చండశాసనుడు. ఆ పాపిష్టి సొమ్ము ముట్టుకోడు కూడాను. చెత్తకుండీలో పారేయిస్తాడు. ఐపోతే నా భార్య వుంది...ఒరే స్వామీ! ఇన్నాళ్ళూ నీతో దాచిన నిజం చెబుతున్నాను. అది నా భార్యకాదు. ఉత్త రంకు ముండ. సువ్వానాడు చూసినవాడు దాని అన్నకాడు. రంకుమొగుడు. నేను పెళ్లి చేసుకున్నప్పుడు దానికీ అన్నలూ తమ్ములూ ఎవ్వరూ లేరు. వీడు ఎక్కడ్నుంచి దాపురించాడో, వాణ్ణి మరిగింతర్వాతే నాతో కాపరం చేయటం మానేసింది. ఆ దెబ్బకు తట్టుకోలేకనేమో, మనశ్శాంతి కోల్పోయి, దోపిడీ దహనకాండల్లో కూరుకుపోయాను. విడాకులు ఇచ్చేసి, మా వాళ్ళ దగ్గరికి తిరిగి వెళ్ళి వాళ్ళు చేసే మరో పెళ్ళి చేసుకుందా మనుకున్నాను. కాని ఇంతలో ఈ పోలీస్ యాక్షన్‌తో అంతా తలక్రిందులైంది. ఇంతకూ నేను చెప్పొచ్చేదేంవిటంటే ఆ ముండకు ఒక పైసా చెందకూడదు. తెలిసిందా? ఇహ మిగిలిన వారసుడివి నువ్వొక్కడివే. అందుకే నువ్వే తీసుకొమ్మంటున్నాను. ఆఁ పిచ్చి, పిచ్చిగా ఆలోచించి, వాటిని అసలుదారులకు అందజెయ్యాలని నల్లగొండకు వెళ్ళకు సుమా. అనవసరమైన చిక్కుల్లో పడతావు. జాగ్రత్త. అవి ఎవరిదో నాకే తెలీదు. వాళ్ళు బ్రతికున్నారో లేదో అంతకన్నా తెలీదు.

నా ఉనికి మరెవ్వరికీ తెలీనివ్వకు. మాఁవయ్య కనిపిస్తే మాత్రం చెప్పు. వాళ్ళకు కొంత ఊరట కలుగుతుంది.

బ్రతికుంటే మళ్ళీ కలుసుకుంటామేమో. అంతవరకు శలవు. ఉంటాను.

నీ ప్రియ స్నేహితుడు

**దిల్లు.**

ఆ ఉత్తరం చదవగానే నామనసు కుదుట పడ్డది. నా స్నేహితుడు సురక్షితంగా తనదారి తాను చూసుకున్నాడని సంతోషం కలిగింది. కాని నన్నే ఓ పెద్ద సందిగ్ధావస్థలో ముంచిపోయాడు. తాను వదిలి వెళ్ళిన ధనాన్ని వదిలించుకునే దారులన్నీ మూసేసి నేనే దానికి వారసుణ్ణని తేల్చాడు. కాని అది అసంభవం. అందులోంచి ఒక చిల్లి గవ్వ కూడా నేను తీసుకోలేను.

ఏముందో చూద్దామని మూట తీసి చూశాను. రెండువేలదాకా నగదూ, చిన్నచిన్న బంగారు నగలూ వున్నాయి. ముక్కుపుడకలూ, కమ్మలూ, చెంపసరాలూ, నాగరాలు, జడ కుప్పెలూ, మెడగుండ్లూ, గొలుసులూఁ ఉంగరాలూ ఇంకా నాకు పేర్లు తెలియనివి అనేకం వున్నాయి. బహుశా నలభై, యాభై తులాలదాకా వుండొచ్చు

బంగారం. దిలావర్ రాసినట్లు అన్నీ పల్లెటూరు వాళ్ళవే. వాళ్ళే వీటికి అసలు వారసులు. వాళ్ళకే తిరిగి ముట్టాలి. కాని ఎట్లా? అదే తోచలేదు. ఎంత ఆలోచించినా పరిష్కారమార్గం కనిపించ లేదు.

ఇంతలో నాకో వార్త తెలిసింది. మా బంధువుల్లో ఒకాయన యూనియన్ మిలటరీతోపాటు వచ్చిన సివిల్ టీంలో నల్లగొండకు తహసీల్దారుగా వచ్చాడని ఆయనే ఏదో దారి చూపిస్తాడన్న నమ్మకంతో, ఆ మూట తీసుకుని బయలుదేరాను.

ఆయనకు కథంతా చెప్పాను. ఉత్తరం మూటా ఆయన చేతి కందించాను. ఉత్తరం ఆసాంతం చదివి, మూట విప్పాడు. అందులోని డబ్బూ, బంగారం చూడగానే ఆయన కళ్ళు జిగేలున మెరిశాయి. తిరిగి మూట ముడివేసి ఉత్తరం చేత తీసుకుని, "ఈ ఉత్తరం ఎంత ప్రమాదకరమైందో నీకు తెలుసా?" అన్నాడు.

"నేనే పాపమూ ఎరుగను" అన్నాను.

"అని మీరనుకుంటున్నారు. ఒక నేరస్తుడికి వారం రోజులపాటు ఆశ్రయ మిచ్చారు. దేశం నించి పారిపోవటానికి దోహదమిచ్చారు."

"కాదు, అది నిజంకాదు. అతను పారిపోతాడని నాకు తెలీనే తెలీదు.

"కావచ్చు, కాని మీరు రుజువు చెయ్యలేరు. దీన్ని నాకు చూపించారు కాబట్టి సరిపోయింది. మరొహరి చేతిలో పడితే ఏమయ్యేదో..." అంటూ ఆగిపోయాడు.

నేనాయసకేసి భయంగా చూస్తూ, "అందుకే మీ దగ్గరికి వచ్చాను" అన్నాను.

"మంచిపనిచేశారు. మీరు మాకు బంధువులు. మీకు హాని కలుగకుండా చూడటం నా ధర్మం. నామాట విని ఈ ఉత్తరాన్ని వెంటనే కాల్చేయండి. మీ దగ్గిరవుండటం మంచిది కాదు."

"అలాగే కాని ఈ డబ్బు, నగలూ..."

"వీటి సంగతి నాకువదిలేయండి. ఇలాంటివి మనకు చాలా చేరుతున్నాయి. అసలు వారసులొచ్చి రుజువు చూపించి తీసుకెళ్ళుతున్నారు. వాటిలో వీటిని కూడా కలిపేస్తాను మీ పేరు పొక్కనివ్వను. మీరు "నిశ్చింతగా వుండండి" అంటూ చిన్నగా నవ్వాడు.

ఆయనకు నా కృతజ్ఞతాభివందనాలు అర్పించి సంతృప్తిగా ఇంటికి తిరిగి వచ్చేశాను.

ఆ తర్వాతర్వాత తెలిసింది. సివిల్‌టీంలో వచ్చిన మహాశయులంతా రామాయణంలో కిష్కింధాపుర నివాసుల వారసులనీ, రావణుడి మరణానంతరం లంకను కొల్లగొట్టినట్టే ఇక్కడి ప్రాంతాన్నంతా దోచుకున్నారనీ, తమ చేతి కందినదల్లా వీలైనంత మట్టుకు తామే స్వాహా చేశారనీ, అప్పటినుంచి ఇక్కడ ఇచ్చిపుచ్చుకునే ఆచారం ప్రబలంగా ప్రాకిందనీ...

● 1948 ●

# 14. గొల్ల రామవ్వ

♦ పి.వి. నరసింహారావు (విజయ) ♦

ధాం...ధాం...ధాం!.. బాంబుల ప్రేలుడుతో అర్ధరాత్రి ప్రశాంత వాతావరణం చిన్నాభిన్నమైంది. సర్వత్ర నిండుకున్న నిస్తబ్ధతను ఆ ధ్వనితరంగాలు ఒక విచిత్ర సంచలనం కలుగజేసి శూన్యంలో విలీనమైనవి. గాఢనిద్రలో నిమగ్నమైయున్న గ్రామ మంతా ఒక్కపెట్టున దద్దరిల్లిపోయింది. ఆబాలగోపాలం గొల్లుమన్నారు... నిద్ర మబ్బులో ఏమి జరిగిందో ఎవరికీ బోధపడలేదు...ఏదో ఆవేదన. ఏదో చికాకు. ఏదో బెగడు. కాని అంతా అగమ్యగోచరమే! ఊరివారందరికి ఒకే సమయాన ఏదో మహా భయంకర మైన పీడకల వచ్చి హఠాత్తుగా నిద్రనుండి త్రుళ్ళిపడి లేచారా అన్నంత అలజడి చెలరేగిందా రెండు నిమిషాల్లో.....

ఇంత అలజడి చెలరేగినా బజార్లు మాత్రం నిర్మానుష్యంగానే ఉన్నవి. లోపలినుండి వేసుకున్న తలుపుల గొళ్ళాలు తీసి బయటికి తొంగి చూతామనుకున్న వారి చేతులు కూడా గొళ్ళాల మీదికి పోగానే ఎక్కడిచక్కడ జలదరించి నిలిచిపోయినవి. చికాకువల్ల కీచు కీచుమని అరుస్తూ తత్తరపాటుతో అటూఇటూ లేచిపోయే పక్షుల రవం, వాటి తెక్కల తటతట, ఊరిచుట్టు పెరండ్లలో నుండి కుక్కల అఱుపు, దొడ్లలో నిశ్చింతగా నెమరువేస్తున్న పశువుల గిజగిజ, అక్కడక్కడ దొడ్ల కంపను విరుగద్రొక్కి ఊళ్ళో తోచిన దిక్కుల్లా పరుగెత్తే దున్నపోతుల గిట్టల ఱాపిడి - ఇది మాత్రమే ఆ తదుపరి వినిపించినవి. అంతేకాని ఒక్కసారి గొల్లుమన్న గ్రామస్తులు మాత్రం అదేదో దివ్యజ్ఞాన బోధ కలిగిందా అన్నట్లు మళ్ళీ కిమ్మనలేదు...కిమ్మనలేదు నిజమే కాని బొడ్డూడిన కూనపర్యంతం ఎవ్వరు నిద్ర కూడా పోలేదు...ఏవో గుసగుసలు... ఏవో సైగలు... ఏవో అసహాయ దృక్కులు... ఏవో వినపడని మ్రొక్కులు....తల్లులు పిల్లలకు శ్రీరామరక్ష తీశారు. పిల్లల దడుపు పోవడానికి ఎడమ అరికాలు దుమ్ముతో నొసట బొట్లు పెట్టారు. వీపు చరిచారు. కాని పిల్లల దడుపుకుపాయాలు యోచించే తల్లులకు తమ దడుపుకే ఉపాయం దొరకలేదు. బొట్లు పెట్టుతున్న చేతుల గాజులు గలగలమంటూనే వున్నవి. ఉన్న చోటనే ఉన్న కాళ్ళ పాజేబులుకూడా కించిత్తు ఝంకరిస్తునే వున్నవి.

అదొక విచిత్ర ప్రళయం...అదొక క్షణిక మృత్యు తాండవం.

అదొక అస్థిరోత్పాతం.

ఒక గంట గడిచింది. ఎప్పటివలెనే నలువైపుల అంధకారం అలముకొన్నది. చిమ్మట్లు ఏకశ్రుతితో అరుస్తున్నవి. అంతా మామూలే! కాని నిద్రమాత్రం ఊరి పరిజేర లేదు.

గొల్ల రామమ్మ తన గుడిశెలో చీకటిలోనే కూర్చుని వుంది. ఆమె కాళ్ళు చేతులు కూడా వణుకుతున్నవి. కొంత వృద్ధాప్యం వల్ల కొంత భయం వల్ల. ఆమె ఒడిలో ఒక పదిహేనేండ్ల బాలిక తలదాచుకొని ఉంది...

"అవ్వా! గిప్పుడిదేం చప్పుడే?" అని మెల్లగా ప్రశ్నించిందా బాలిక.

"నీకెందుకే మొద్దుముండా. గదేంది, గిదేంది - ఎప్పటికి అదుగుడే! ఏదో మునిగిపోయినట్లు! అన్ని నీకే కావాలె!....."

బాలిక మళ్ళీ మాట్లాడ సాహసించలేదు. కొన్ని కొన్ని నిముషాలకు ముసలవ్వ తనంత తనే మెల్లగా గొణగడం మొదలుపెట్టింది. 'ఏమనుకున్నావే తల్లీ మాపాడు కాలమొచ్చిందే! మీరెట్ల బతుకుతారో ఏమో బిడ్డ! ఈ తురుకోల్లతోటి చావొచ్చింది... మొన్ననే నలుగుర్ని తుపాకినేసి చంపింన్రు. ఇప్పుడు కూడా ఏదో గసొంటి అగాయిత్తమే చేసిన్రేమో!...ఏం పొగాలమే వీల్లకు!....'

మళ్ళీ నిశ్శబ్దం.... రామమ్మ మల్లమ్మ ఇద్దరు తమ తమ యోచనల్లో పడిపోయారు. నిద్రకు మాత్రం సంపూర్ణ బహిష్కారమే! డెబ్భైయేండ్లు దాటిన రామమ్మకు జాగరణే, క్రొత్తగా వయసువచ్చిన మల్లమ్మకు జాగరణే...

హఠాత్తున కిటికీ నెవరో తట్టారు...కిటికీ అంటే చాని ప్రాణమెంత? - మంటిగోడలో వెల్తురుకొరకని ఉంచబడ్డ ఒక రంధ్రం. దానికి చెదలు పట్టిన ఏదో చెక్కతో చేయబడ్డ రెండుచిన్న తలుపులు. ఇదే ఆ గుడిసెకు కిటికీ...

ఆ చప్పుడుకు లోపలి వారిద్దరు ఉలిక్కిపడ్డారు. కూర్చున్న చోటినుండి కదలక శ్వాసోచ్ఛ్వాసాలు బిగబట్టి జాగ్రత్తగా వినసాగారు. కిటికీ తలుపులు గాలికి కొట్టుకున్నవో లేక పిల్లి వచ్చి కదిల్చిందో అని..!

మళ్ళీ అదే చప్పుడు... ఈసారి అనుమానం లేదు. ఎవరో కిటికీ తలుపులు తట్టుతున్న మాట నిజం. గాలికాదు. పిల్లి అసలే కాదు.

ఏంచేయాలి? ఎటూ తోచలేదు...

మళ్ళీ చప్పుడు. ఈసారి పెద్దగా వినబడింది. ఏదో స్థిరసంకల్పంతోనే తట్టినట్లు..

ఇక లాభం లేదు. ముసలవ్వ మెల్లగా లేవసాగింది. మల్లమ్మ గుండె దడదడ మాత్రం మితిమీరింది. అవ్వను గట్టిగా పట్టుకొని కంపించే గుసగుసలో "నాకు బయమైతాందే అవ్వా!" అనగలిగింది.

"అట్లుండు! ఏందో చూత్తాం," అని ముసలవ్వ దృఢ నిశ్చయంతో లేచింది. అలవాటు చొప్పున చీకటిలోనే కిటికీ వద్దకు చేరుకుంది. లోపల గొళ్ళెం తీస్తూ తీస్తూ "ఎవర్రా?" అంది.

ఆ ప్రశ్న పూర్తిగా ఉచ్చరించబడిందో లేదో ముసలవ్వ నోరు గట్టిగా మూయబడింది. వెంటనే ఒక వ్యక్తి అతికష్టంమీద ఆ ఇరుకు కిటికీ గుండా లోపలకి చొరబడ్డాడు. అతని పాదాలు లోపలి నేలకు ఆనినవో లేదో అతడే కిటికీ తలుపులు

బిగించాడు. ముసలవ్వ బీరిపోయి నిలుచుంది...ఇంకో మూలన మల్లమ్మ గట్టిగా కండ్లు మూసుకొని కత్తిపోటుకై ఎదిరి చూస్తున్నట్లు పడి ఉంది. చిమ్మని చీకట్లో ఏదీ కనబడడం లేదు. ముసలవ్వకు మాత్రం సందేహం లేదు. గతానుభవమే అంతా సూచించినది. పోలీసో, రజాకారు తురకవాడో ఇంట్లో దూరాడు. ఇంకేముంది. తనకు చావు తప్పదు. తానల్లారుముద్దుగా పెంచి పెండ్లి చేసిన తన ముసుమురాలికి మానభంగం తప్పదు. ఎవరెదిస్తారీ రాక్షసుల్ని.. తాను గోల పెట్టితే మాత్రం పక్క ఇంటివారైనా వినిపించుకుంటారా? ఉహుఁ! కలలోని మాట!... వాళ్ళది మాత్రం ప్రాణాలు కావా? వాళ్ళ యింట్లో మాత్రం పదుచుపిల్లలు లేరా? ఆనాడు అంత పెద్ద కరణంగారి కూతుర్ని బలాత్కారం చేసి ఎత్తుకుపోయినప్పుడు దెబరేం చేయగలిగారు? ఎవరడ్డం వచ్చారు?... ఇప్పుడు తనకు మాత్రం దిక్కెవ్వరౌతారు?...

ఒక్క నిమిషంలోపల ముసలవ్వ ఇదంతా యోచించింది. ఇక జరుగబోయేది ఆమెకు స్పష్టంగా అద్దంలోలాగ కనిపించసాగింది.

తాను చచ్చినా సరే తల్లిదండ్రులు లేని మల్లికైనా మానభంగం తప్పితే...తానా పిల్లను సాది సంబాళించింది తుదకీ రాక్షసునికి ఒప్పగించడానికేనా... ముసలవ్వ కన్నీరు నింపుతూ కొయ్యవలె నిలిచిపోయింది. వృద్ధాప్యపు కంపనం కూడా ఎందుకో తనంత తానే స్తంభించిపోయింది.

ముసలవ్వకు, ఆ వ్యక్తికి మధ్య దాదాపు రెండు గజాల దూరముంది. యోచనా మధ్యంలోనే వ్యక్తి ఆమెవైపు రెండడుగులు వేశాడు. చీకటిలో కూడ గూటిగా సమీపిస్తున్నాడు...

ఆమెకు మిన్ను విరిగి మీదపడ్డట్లయింది. ఇంకొక్క అడుగులో తన బ్రతుకు కొనముట్టుతుంది....ఆ తరువాత పాపం మల్లి...!

అతికష్టం మీద ముసలవ్వ "అయ్యా!" అని ఏదో అనబోయింది.

కానీ మళ్ళీ ఈమె మూతి మూయబడింది. ఆమె ఆ క్షణంలో తనకు తెలిసిన దేవుళ్ళందరిని స్మరించింది... మల్లమ్మ కోసం...

ఇంతలో ఆ వ్యక్తి గుసగుస వినబడింది.

ముసలవ్వ చెవిలో..."చప్పుడు చేయకు నేను దొంగను కాను, రజాకార్నుకాను, పోలీసును కాను, మిమ్మల్నేమీ అనను. లొల్లి మాత్రం చేయకండి.."

అబ్బా! ఏమి టక్కరి! నమ్మించి గొంతు కోయడానికి చూస్తున్నట్టున్నాడు! తీయని మాటలతోనే సంతోషపెట్టి పాపం మల్లిని..!

అబ్బ! ఎంతకైనా తగుతారీ రాక్షసులు! ఔను! ముందుగా తీయని మాటలు– అవి సాగకపోతే అన్యోపాయాలు. అదేకదా క్రమం...

ఎందుకైనా మంచిదని ముసలవ్వ వెంటనే ఆ వ్యక్తి రెండు కాళ్ళు దొరికించుకుంది... ఎంతో దీనంగా వేడుకుంది. "నీ బాంచెను! చెప్పులు మోత్తా, నా తలకాయైనా తీసుకో. పోర్ని మాత్తరం ముట్టకు. అది నీ చెల్లెలనుకో...నీ కాల్లు మొక్కుత!"

"లేదవ్వా! నమ్మవేం చెప్పుతుంటే? నేను దుష్టుణ్ణి కాదు. నేనూ మీ అందరి వంటి తెలుగోణ్ణే!"

శుద్ధ తెలుగులో మాట్లాడుతున్నాడు. ముసలవ్వ ఇదివరలో ఏ తురకవాణ్ణి ఇంత చక్కగా మాట్లాడగా వినలేదు. తొశ్శ తొశ్శగా మాట్లాడే నైజాం తురకలనే చూచిందామె కాబట్టి ఈ వ్యక్తి తురక కాడేమోనని తర్కించుకుంది.

కొన్ని నిమిషాలపాటైనా చావు, మానభంగం తప్పినవి! ముసలవ్వకదే ఇంద్రజాల మనిపించింది! మానవ హృదయంలో నిహితమైయుండే అజేయ ఆశావాదశక్తి ఆమెకు చేయూతనిచ్చింది వచ్చిన వ్యక్తి ఎంత అపరిచితుడైనా, అతడు వచ్చిన పరిస్థితులెంత అనుమానాస్పదమైనవైనా ముసలవ్వకు మాత్రం అతణ్ణి విశ్వసించాలని పించింది. అది విశ్వాసం కాదు, విశ్వాస్యేచ్ఛ. విపద్దశలో గోచరించిన ఏకైక తరణాధారం దాన్నెలా జార విడుస్తుంది?

వచ్చిన వ్యక్తి కాళ్ళు పట్టుకొన్న ముసలవ్వ మెల్లమెల్లగా లేస్తూ అతని మోకాళ్ళు నడుము, వక్షస్థలం, వీపు, ముఖం తల తడుమ సాగింది. ఒకే ఒక చడ్డీ ఉంది. చొక్కాలేదు. దేహమంతటా పల్లేరుకాయలు. చిగురంత, జిట్టరేగు ముండ్లు అంటుకొని ఎండిపోయిన రేగటిమన్ను. ఆ మంటిలో చిక్కుకొని యున్న తుంగపోచలు, గడ్డిపోచలు, చెంపలాకులు, తాటిపీచు వగైరా - ఇవన్నీ ముసలవ్వ చేతులకు కండ్లున్నవా అన్నట్లు గోచరించినవి. ఆపాదమస్తకం ఎన్నోచోట్ల శరీరం కొట్టుకుపోయినట్లు చర్మమే చెబుతున్నది. కొన్నిచోట్ల గాయాలనుండి స్రవిస్తున్న రక్తపుతడి ముసలవ్వ చేతికంటింది మరికొన్నిచోట్ల గాయాల నుండి ఎప్పుడో స్రవించి ఎండిపోయి అట్టుకట్టిన రక్తపు ఆనవాళ్ళు తగులుతున్నవి. శరీరమంతా జ్వరంతో రొట్టెపెంకెలా మసలిపోతున్నది. ముఖంమీద ముచ్చెమటలు క్రమ్మినవి. శ్వాస అతికష్టంమీద నడుస్తున్నట్లున్నది. మధ్య మధ్య ఆపినా ఆగని మూల్గులు బయటపడుతున్నవి. గుండె వేగం విపరీతమై పోతున్నది.

స్పర్శతోనే ఈ స్థితినంతా గమనించింది ముసలవ్వ. ఆవ్యక్తి నిస్సహాయుడు. అపాయస్థితిలో హఠాత్తుగా తటస్థించిన శరణాగతుడు.

ఇంత తెలుసుకోగానే ముసలవ్వ మనస్థితిలో కాయాకల్పమైంది. అనిర్వచనీయమైన భావ పరివర్తనం కలిగింది. ఐదు నిమిషాలకు పూర్వం మనుమరాలి శీలరక్షణకోసం ఆగంతకుని కాళ్ళు పట్టుకుని "బాంచెను, కాళ్లు మొక్కుత" అని వేడుకున్న ముసలవ్వ ఇప్పుడు ఆశ్చర్యసహానుభూతుల సమ్మిశ్రిత స్వరంతో "ఇదేం గతిరా నీకు? గిట్లెందు కైనవు కొడుకా?" అని ప్రశ్నించింది.

"ఏదో అవ్వా! అదొక కథ.. కొంతసేపు నన్నిక్కడ దాచు. తరువాత నా దారిన నేను పోతాలే. ." అని అతికష్టం మీద అన్నడాగంతకుడు.

"ఆ! మాపోతె మాపోతె...ఒక్కటే పోకడ! చక్కంగ స్వర్గమే పోతె.. మంచి బుద్ధిమంతుడె పా! .హు! పోతడంట యాడికో!"

ఆగంతకుడు మాటాడలేదు. ముసలవ్వ వెంటనే మనుమరాల్ని పిలిచింది. "మల్లీ! ఓ మల్లి ముండా! దీపంముట్టియ్యవే జెప్పన.. నిదురొచ్చినాదే పోరీ..."

దీపం మాట వినగానే ఆగంతకుడు ఉలికిపడి అన్నాడు. "అబ్బో! వద్దవ్వా వద్దు... దీపం వెలిగించకు నీపుణ్యం.. పోలీసులు నా వెంట పడ్డారు. పట్టుకుంటారు.... "

"ఇగచాల్లే మాట్లాడకు! పోలీసులకన్న ముందల సావు దేవతే పట్టుకునేటట్లున్నది నిన్ను! అని ముసలవ్వ గద్దించింది.

మల్లమ్మ దీపం వెలిగించింది. ముసలవ్వ ఒక మూలకొక గొంగడి పఱచింది. దీపపు వెలుతురులో ఆగంతకుణ్ణి కొంత తడవు పరీక్షించింది. బక్కపలుచని యువకుడు. పదునెనిమిదేండ్లకు మించని వయసు. సూసూగు మీసాలు - గంభీరతను సూచించే కండ్లు. సుకుమారమైనప్పటికీ చాపతీగ వెత్తం వలె పంగగల దేహం. సౌమ్య సౌజన్యాలలీనే ముఖముండలం..

ఆ యువకుణ్ణి చూచిందో లేదో ముసలవ్వ ఆశ్చర్యం మేరమీరింది.

"రాజోలిగె ఉన్నపు కొడకా! నీకెందు కొచ్చేరా ఈ కట్టం?.. పందు పందు.. ఆ గొంగట్ల పందు. బీరిపోతావేందిరా? పందు. ఆఁ! గట్లఁ మల్లిపోరీ! కుంపటి మీద కదుముంతెడు నీళ్ళెక్కియ్యే... అబ్బ మంజగరున్నోలిగె కదుల్తది మబ్బు ముంద! ఈడ పోరని పానం పోతాందంటే దీనికి నిర్దమజ్జే పదల్లేదు.. ఁఁ! కానీ జెప్పన. ఎక్కిచ్చినవా కదుముంత? ఆఁ! ఇగరా..దీపం పోరని దగ్గరకు తే....దీపానికి ఇంటి తలుపుకు నడుమ నా గడంచె నిలబెట్టు. దానికి నా గొంగడి ముసుగెయ్యి.... ఏసినవా? ఆఁ! గట్ల. గిప్పుడు కొద్దిగ వుశారయింది పొల్ల! మొగుడు నాలుగు మల్కల పెయ్యి మెదుగ బెడితే ఇంకా కుదుర్తది చురుకు!.. కొద్దిగ సందుంచి ఓ కంచుడు బోర్లియి దీపంతె మీద. ఆ పోరని మీద ఎలుగు పడాలె. కదుమ దిక్కుల్ల చీకటె ఁండాలె. గట్ల కావాలె ఉపాయం.. ఆఁ! గంతే! ఉన్నదే ఒనరు నీ దగ్గెర! మా చేత్తవులే సంసారం!...ఇక కూకో వాని పక్కన. ముండ్లు తీసెయి ఁల్లుల్లుగ.. అయె! సిగ్గయితాందా వాన్ని ముట్టుకుంటే? ఏం మానాపతివి గదనే! నీ సిగ్గు అగ్గిలబడ! వాని పానం దీత్తవా యేం సిగ్గు సిగ్గనుకుంట? ఁఁ! చెయ్యిచెప్పిన పని! పాపం పీసుగోలె పడున్నడు గాదె! వాన్ని జూత్తె జాలి పుడుతలేదె నీకు దొమ్మరముండా?...ఆ! గట్ల! నొప్పిచ్చకు పాపం!...."

మహాప్రవాహం వలె సాగిపోతున్నది ముసలవ్వ గొణుగు ధోరణి. అందులోనే చీవాట్లు, అందులోనే వినోదం, అందులోనే ఆజ్ఞలు - ముసలవ్వ ఆజ్ఞలన్ని చకచకా అమలౌతున్నవి. యువకుడు నిజంగా అర్ధశుద్ధావస్థలో పడియున్నాడు. మల్లమ్మ జిట్టరేగ ముండ్లు ఒక్కొక్కటి తీస్తున్నది. యువకునికేదో క్రొత్తలోకం వచ్చిపడ్డట్లుంది.

ముసలవ్వ మళ్ళీ ప్రారంభించింది.

"వచ్చినాయె ముండ్లన్ని? - మా కట్ట పడుతాన్నవే పొల్లా! పున్నెముంటుంది నీకు. మల్ల పెతరమాసకు తుంటకొక్కంత బుడ్డోన్ని కంటవులే! సరె. ఇగబటు.. నీల్లెచ్చ బడ్డయి... ఈ పేగు నీల్లల్ల ముంచి వాని గాయాలన్ని కాపు. ఆ రౌతం మరకలు, మంటి ముద్దలు తుడిచి పోరెయ్యి, తానెం జేసినట్టు కావాలె - పాపం! ఎంత సుకాశి పెయ్యే పొల్లంది! ముట్టుకుంటే దూదోలిగే తలుగుతాంది! ఎసోంటోని కెసోంటి గతొచ్చిందే!"

చూస్తూ చూస్తూ మల్లమ్మ పరిచర్యవల్ల యువకుని గాయాల బాధ తక్కువయింది. దేహమంతా శుభ్రమైంది. మెల్ల మెల్లగా తేరుకున్నాడు.

ఇంతలో ముసలవ్వ తలెలో ఏదో తెచ్చింది. యువకుని తలాపున కూర్చొని అతని తల నిమురుతూ గొణగసాగింది.

"ఇగ లే కొడుకా కొద్దిగ గింత గటుక చిక్కటి సల్లల పీసుక్కచ్చిన.. గింత కడుపుల పడేసుకో. ఎన్నడన్న తాగినావు తాతా గట్క? వరిబువ్వ తినెటోనికి నీకేమెరుక? గొల్లరామి గట్కంటే ఏమనుకున్నో? పొయ్యే పానం మర్సతది! చూడు మరి - కులం జెడిపోతదని భయపడుతున్నవా? నువ్వు బామనోడవైనా, జంగమోడవైనా, యేకుల మోడవైనా సరే - మొదలు పానం దక్కిచ్చుకో. అంతకైతె నాలికెమీద, బంగారి పుల్లతోటి సురుకుపెడితే పోయిన కులం మల్లత్తదట కాదు?- ఆఁ! ఇగ తాగిపారెయ్యి గటగట!-"

యువకుడు లేచి కూర్చున్నాడు. ముసలవ్వ మాటలకు కొద్దిగా నవ్వు వచ్చిందతనికి. చిరునవ్వు ముఖంతో ముసలవ్వను చూస్తూ తలె అందుకున్నాడు. అందులోది నవజీవన సర్వస్వసారమన్నట్టు ప్రీతితో గటగట త్రాగాడు. - ముసలవ్వ మాట అక్షరాలా సత్యమైంది. సగంపోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి. యువకుని ముఖం మెల్లమెల్లగా వికసించింది. కండ్లలో జీవనజ్యోతి వెలుగజొచ్చింది.

ముసలవ్వకు పూర్ణ సమాధానమైంది. యువకుని వైపు చూస్తూ, ముడుతలు పడ్డ ముఖంతో నవ్వుతుంటే ముడుతలన్ని అంతర్ధానమైనవా అనిపించింది. కొన్ని నిముషాల పాటలాగే ఉండిపోయారు ముగ్గురు...

యువకుని దేహాన్ని ప్రేమతో నిమురుతున్న ముసలవ్వ చేయి హఠాత్తుగా అతనిచడ్డీ జేబు వద్ద ఆగిపోయింది. వెంటనే "గిదేందిరో?" అంటూ ముసలవ్వ ఆ జేబులో చేయి వేసి ఒక ఉక్కు వస్తువ తీసింది.

"అది రివాల్వరవ్వా!" తోటాల తుపాకి..."అన్నాడు యువకుడు.

"ఎందుక్కొడుకో తుపాకి? మమ్ముల గిట్ల చంపుదామనుకున్నావా, యేంది?" అన్నది ముసలవ్వ.

"లేదవ్వా! మిమ్మల్ని చంపేవాళ్ళను చంపే అందుకది..ఈరాత్రి ఇద్దరు పోలీసులను హతమార్చాను. మొన్న మీ గ్రామంలోని నలుగరు నిర్దోషుల్ని కాల్చిచంపిన పోలీసులే!"

ముసలవ్వ ముఖ లక్షణాలు వర్ణనాతీతంగా మార్పు చెందినవి. మొదట కొద్దిగా భయం, ఆ తదుపరి తెగువ, ఆతరువాత ఉత్సాహం, ఆ వెనుక విజయోల్లాసం క్రమశః గోచరించినవి.

యువకుడు ముసలవ్వ ముఖాన్ని సూక్ష్మంగా పరీక్షిస్తున్నాడు. భావ పరివర్తన చూచినకొద్దీ అతని మానసం పరిపరివిధాల తర్కించుకుంటున్నది. ఆ విషయం ఎందుకు చెప్పానా అన్న పశ్చాత్తాప రేఖ కూడా అతని మనస్సును ఒకసారి స్పృశించి పోయింది. ఏమంటుందో ఈ వృద్ధురాలు? శతాబ్దాల దాస్యమనుభవించి దలితమైన ఈ అమాయక గ్రామీణ సమాజంలో తేజమెక్కడ శేషించింది. ఎలాగైనా ఆ గుడిశె ఆశ్రమం నుండి తనకుద్వాసన జరిగితీరుతుందని అతనికి తోచింది. ఇద్దరు పోలీసులను చంపిన హంతకుణ్ణి ఎవరుండనిస్తారు? ఎంతమంది తన తోటి కార్యకర్తలు ఈ గ్రామస్థుల పిరికితనం వల్ల పట్టుపడలేదు? యువకుని మనస్సు ఎన్నెన్నో వితర్కాలకు లోనౌతున్నది.

కొంతసేపు యోచించి యువకుని హృదయం ధడుక్కుమన్నది.

"ఇద్దర్నా?... కాని ఇంకిద్దరు మిగిలిన్రు కొడుకా! నువ్వు పనే చేసుడు ...!"

యువకుడు చకితుడైనాడు. అతని సుసంస్కృత మానసం గర్వోన్నతమై కల్పనాకాశంలో భ్రమణం సాగించింది. అతని తారుణ్యానురూపభావుకత్వం అతణ్ణి మైమరపించింది. శ్రీరామ స్మరణవల్ల ఉప్పొంగే హనుమంతుని దేహం వలె తనదేహం కూడా ఉప్పొంగినట్లనిపించింది. రివాల్వరు కొరకై చేయిచాస్తూ, "తక్కినవాళ్ళను కూడా చూచుకొస్తా తే అవ్వా!" అనేశాడు.

ముసలవ్వ రివాల్వరు లాక్కొని ప్రారంభించింది.

"చాల్లే చేశినకాడికి! బాద్దురుగాదవు పా! బాగ తిని టుండబుద్ధిగాక పోలీస్ తోటే వైరం పెట్టుకుంటడట ఉచ్చిలిపోరడు! ఎందుకురా నీకు పోలీసోల్ల తోటి కైలాట్నం?"

యువకుడన్నాడు "నేను స్టేట్ కాంగ్రెస్ వాలంటియర్ను. నైజం రాజు తోటి కాంగ్రెస్ పోరాడుతున్నది. ప్రజలు పోరాడుతున్నారు."

యువకుడేదో రాజకీయ సిద్ధాంత బోధ ప్రారంభిస్తాడా అనిపించింది. కాని మధ్యలోనే ముసలవ్వ అందుకున్నది. "యాడున్నదిరా నీ కొట్లాట? ఈడనైతే పెద్ద పెద్దోల్లంత ఆ తురుక పోలీసోల్లనే ఇండ్లల్ల పండబెట్టుకుంటాన్రు గాదు? ప్యాదోల్లు కొట్లాడితే ఏమైద్దిరా?"

"పేదవాళ్ళతోనే నడుస్తున్నదవ్వా కాంగ్రెస్ పోరాటం..." అన్నాడు యువకుడు.

"మరైతే నీది కాంగిరిజో గీంగిరిజో అండ్ల ఈడుపడ్తోల్లు లేరార? గద్దాలు, మీసాలు నరిశినోల్లంతయాడ విరగడైపోయింన్రు?"

"వాళ్లందరు పట్నంలో ఉంటారు. రాజుతో మాట్లాడుతారు. ప్రజల తరపున వాదిస్తారు. అధికారాలు ఇప్పిస్తారు. నాయకత్వం చేస్తారు."

ముసలవ్వ విసుగుతో అందుకుంది. "ఏహే! గదంత నాకు మసుసున పట్టది. పెద్ద పెద్దోల్లేమొ ముచ్చట్లు పెట్టుకుంట కూకుంట రట! పసి పోరగాల్లనేమొ పోలీసోల్ల మీదికి పొమ్మంటరట! ఇగ యీ పొల్లగాల్లేమొ చేసుకున్న పొల్లల ముండమోపటానికి తుపాకులు భుజానేసుకుని బైలెల్లుతురట! ఎంత పాడుదిసమొచ్చింది. అన్యాలం పాడుబడ!"

అలాగే కొంతసేపు గొణిగి ముసలవ్వ ఆజ్ఞాపించింది. "అరేయ్! ఇగ కొద్దిగ కన్ను మలుపుకో. జాము నాత్తిరున్నదింక. ఇంత నిర్దపట్టితే బతుకుతవు. వశేయ్ మల్లిపోరీ! మనిద్దరం తెల్లారేదాక కావాలుండాలే. నువ్వాకొనకు. నేనీకొనకు. కూర్పాట్లు పడ్డవంటే యాదుంచుకో - ఒక్క చరుపుకు దయ్యం వదిలపోవాలె మరీ-ఆఁ"

పాలు పిండేవేళ అతిక్రమించిపోతున్నది. ఇండ్ల వెలుపల కట్టివేసియున్న గేదెలు లోపలి దుడ్డెల కొరకు అరుస్తున్నవి. లోపలినుండి దుడ్డెలు విలపిస్తున్నవి. పాల చేపుల ఆతురత ఒకవైపు. ఆకలి బాధ రెండవవైపు. కాని పాలు పిండబడడం లేదు. రోజు ఈ పాటికి ఎటువిన్నా జుంయిజుంయిమనే పయస్సంగీతం నేడు సంపూర్ణంగా నిలచి పోయింది. భయంవల్ల గ్రామంలోని జీవనలక్షణాలన్ని ఒక్కుమ్మడి లుప్తప్రాయమై పోయినవి. మృత్యుసమయపు అంతిమ సంచలమైనా లేదు.

స్మశానవాటికలోని కాటి చిటచిటలైనా లేవు. ఆ గ్రామంలో అనాది కాలం నుండి అంతా నిశ్శబ్దమే అన్నట్లనిపించింది.

రామమ్మ, మల్లమ్మ ఇద్దరు కావలికాస్తున్నారు. యువకుడు సుఖనిద్రపోతున్నాడు. చీమ చిటుక్కుమన్నా అదరిపడే అంత నిదానంగా ఉన్నారు గ్రామ ప్రజలు. కాని చీమ కూడా చిటుక్కుమనడం లేదు. గతరాత్రి భయంకర సంఘటనకు కారకుడైన ఆ యువకుడొక్కడే నిద్రిస్తున్నాడు. తక్కిన గ్రామమంతా శ్వాస బిగబట్టి నిరీక్షిస్తున్నది.

దేనికో? ఎవరికొరకో? ఎందుకో? అదంతా... అందరికీ తెలుసు. పాత కథే! ...

రామమ్మ యోచిస్తున్నది. ఎవరో కాంగ్రెస్ వారు ఊరికి వచ్చారన్న నేరంపైన ఇదివఱకే నలుగురు నిర్దోషులు కాల్చివేయబడ్డారు. ఇక ఈసారో, ప్రత్యక్షంగా ఇద్దరు పోలీసులు చంపబడ్డారు. థానా భగ్నం చేయబడింది. ఊరినంతా దగ్ధం చేసి ఊరివారినందరిని కాల్చివేసినా ఆశ్చర్యంలేదు. అదొక పండుగే! ఏ ఒక్క ఇంట్లోనో పోలీసులు చొచ్చి హత్యలు, మానభంగాలు సాగించటం, ప్రక్క ఇంటివారు కిమ్మనలేకపోవడం, ఈవిధంగా ఒకొక్క యింటి లెక్కన తుదకందరి కదేగతి పట్టడం ఇంతకన్న ఊరివారందరు ఒకేసారి చంపివేయబడడం మేలు కాదా? పదిమందితో చచ్చినా మంచిదే బ్రతికినా మంచిదే కుక్కచావు కన్న!

నిద్రిస్తున్న యువకునికి తల నిమురుతూ రామమ్మ, గొణిగింది. "అబ్బ! ఏం పోరడు! ఇసోంటోల్లెంత మంది చావాల్నో ఇంక!"

అకస్మాత్తుగా బజారులో మోటార్ ట్రక్కు చప్పుడైంది. ఎటు విన్నా బూటు కాళ్ళ తటతటలే వినరాసాగినవి. ఏవో అరుపులు, తురకభాషలో తిట్లు - దుర్భాషలు ప్రగల్భాలు. ఛటేల్ ఛటేల్‌మని మధ్య మధ్య కొరడా దెబ్బలు.

"చస్తి! చస్తి! నీ బాంచెను ... నాకెరుకలేదు. అయ్యో! వావ్వో! వాయ్యో!!" అన్న అరుపులు.

మిన్నుముట్టే ఆక్రోశాలు. అంతకుమించిన క్రూర నినాదాలు. ఒండొంటితొ పోటీ చేస్తున్నవి. మనుష్యులు ఉన్నవారున్నట్లు బజార్లలో ఈడ్వబడుతున్నారు. రెండు గడియల క్రితం స్మశానవాటికను మరపించిన గ్రామం ఒప్పుడు యమపురిని తలదన్నుతున్నది...

మల్లమ్మ గడగడలాడసాగింది. యువకుడు దిగ్గున లేచి కూర్చున్నాడు. ఆ గాఢ నిద్ర క్షణంలో మటుమాయమైపోయింది. రివాల్వరు ముసలవ్వ చేతినుండి తీసుకొని తోటాలెక్కించాడు. బయట జరుగుతున్న అలజడి రెండు నిముషాల వరకు విన్నాడో లేదో - అతన్నో మహావేశం ఆవరించింది.

ముసలవ్వ స్థితి మాత్రం చెప్పేట్టులేదు. అది భయం కాదు. వ్యాకులత కాదు. దుఃఖము అసలే కాదు. అపూర్వమైన నిశ్చలత్వం, గాంభీర్యం ఆమెలో ప్రవేశించినవి. బయటి హాహాకారం చెవిసోకిన కొద్ది ఆమెలో కూడా అదొక రకపు ఉద్వేగం బయలుదేరసాగింది.

రివాల్వరులో తోటాలు నింపుకొని యువకుడు దిగ్గున లేచాడు. తలుపువద్దకి చకచకా నడిచాడు. గొళ్ళెంమీద చేయి పెట్టాడు. తీయబోయాడు కాని ... కాని

వెంటనే అతని చేయి మీద మరొక చేయి పచ్చబడింది. అది ఒక్క చేయి కాదుగదా అన్నంత దృఢతరంగా తగిలిందతని చేతికి. అతడు ముహూర్తంలో వెనకకు తిరిగి చూచాడు. ఆఁ." అన్నాడు.

ముసలవ్వదే ఆ ఉక్కుచేయి!

"యాడికి?" అని ప్రశ్నించింది ముసలవ్వ. యువకుని మాట తడబడింది. తుపాకి గుండ్ల మధ్య విహరించే ఆ వీర యువకుడు, రాక్షసులనైనా నిర్భయుడై ఎదిరించే ఆ శూరశిరోమణి, దేశ కళ్యాణానికై ప్రళయాన్నైన ధిక్కరించే తరుణ సింహం, నేడొక్క డెబ్భైయేండ్ల ముసలవ్వ ప్రశ్నకు జంకాడు. అతని గుండె జల్లుమన్నది. కాని వెంటనే గొంతు సవరించుకొని అన్నాడు. "ఎక్కడికేమిటవ్వా? అటో ఇటో తేలిపోవాలి. హింస జరుగుతుంటే చేసినవాణ్ణి నేను దాగుకోవాలా? దాగడం మాత్రమెంతసేపు? ఈ యిల్లు సోదా తప్పుతుందా? పైగా నావల్ల మీకు అపాయం కలుగుతుంది - నన్ను పోనీ అవ్వా!"

ముసలవ్వ మాట్లాడలేదు - యువకుని చేయిపట్టి వెనకకు లాగింది. మంత్రముగ్ధునివలె అతడామెను అనుసరించాడు.

బయట అలజడి అధికమైంది. బూటుకాళ్ళ చప్పుడు గుడిసెను సమీపిస్తున్నది. ముగ్గురు నలుగురు వ్యక్తులు గుడిసె ముందు నుండి పక్క యింటి ముందటికి వెళ్ళారు. ఆ వెనుక

"రామ్‌ధన్ గడ్‌రీకీ గుడ్సీ యహీ హై" అన్నమాటలు వినిపించినవి.

మళ్ళీ ఒకసారి యువకుడు బయటితలుపువైపు పోబోయాడు. కాని ముసలవ్వ అతన్ని వెనక్కి నెట్టింది. రివాల్వరు అతని చేతి నుండి లాగుకుంది. మినుకు మినుకు మంటున్న దీపాన్ని పూర్తిగా ఆర్పింది. ముల్లమ్మను పిలిచిచెప్పింది.

"పొల్లా! నిన్న మర్రి కొందడు కట్టుటానికియ్యలే? ఆ దుప్పటీన్ను కందువ తీస్కరా! యాడబెట్టినవో తే ఎల్లెంతెచ్చినవా? ఆఁ! పిల్లగా! ఆ దుప్పటి కట్టుకో కందువ నెత్తికి చుట్టుకో ఊఁ యేమాయే గింతసేపా? మల్లీ! నీ రెండు చేతుల దండకడ్యాలు వాని కియ్యి... బక్కపల్చటోడు మాపట్టుతై." "ఆఁ పట్టినయా? గంతే! ఒక్క కుర్మదారమంటే బాగుండు. ఇప్పుడేడదొరుకుద్ది? ఊఁ లేకుంటే లేకపాయె. ఈ పోరని చడ్డి కూరాటి కుండ కింద దాచిపెట్టె పొల్లా! ఆఁగొల్లేశ మేసినవా కొడుకా? అచ్చం ఎర్రగొల్లేనోలిగేనే ఉంటవు! ఎవడన్నమాట్లాడితే గొల్లోనోలె మంచిగ మాట్లాడాలె ..."

"ఆఁ" అన్నాడు యువకుడు.

దాగి తిరిగే కార్యకర్తలకు గొల్లవేషాలు మామూలే కనుక యువకుడు సంసిద్ధుడైనాడు వేషం తయారయింది. ఇక ఏ త్రోవనో బయటపడడం మాత్రమే శేషించింది. ముసలవ్వ ఆజ్ఞకై నిరీక్షిస్తున్నాడు.

అకస్మాత్తుగా తలుపుమీద నాలుగైదుసార్లు దిబదిబమనని దెబ్బలు పడ్డవి. "రామా ఓ రామీ! ఓ గొల్లరామీ! తల్వాకీఖోల్" అనే కర్కశ స్వరాలు వినిపించినవి. కొందరు బూట్లవాళ్ళు ఇంటి చుట్టు దగ్గరదగ్గరగా నిలుచుంటున్న అలికిడి

వినవచ్చింది. ఇంకేముంది? తప్పించుకునే వీలులేదు. ఈ గొల్లవేషమంత వ్యర్థమైనట్లే. యువకుని చేయి రివాల్వరుకై వెదకసాగింది. కాని ముసలవ్వను అడిగే ధైర్యం రాలేదు.

ముసలవ్వ గుసగుస ప్రారంభించింది? "మల్లీ! ఆ మూలకు మంచం వాల్చి గొంగడెయ్యి. పిల్లగా! అండ్ల పండుకో. ఊఁ పండుకో."

యువకునికెటూ తోచలేదు. ఇంతకూ తుదకు పట్టుపడడమే నాసట వ్రాసి యున్నట్లుంది. అలా మంచంలో పడుకోవడం వల్ల లాభమేమో అతనికి బోధ పడలేదు. విధి లేక పడుకున్నాడు.

మళ్ళీ తలుపుమీద దిబదిబ!

"ఓ రామీ! తల్పూ తీస్తాలేదూ. తూ భిన్న హరాంజాదీ! మాట్లాడా! నీకీ తోడ్కుల్ తీస్తం బైర్! ఫౌరన్ తీ తల్పు లేకుంటే తోడాయిస్తం సూడు."

ముసలవ్వ ఇప్పుడిప్పుడే నిద్ర లేచిన దానివలె ఆవిలిస్తూ ఒళ్ళు విరిచిన చప్పుడు చేస్తూ అర్ధస్పష్టంగా ప్రారంభించింది.

"ఎవ్వర్రా పెద్ద దొంగనాత్తిరచ్చి తలుపు కొడ్తాన్రు? దొంగముండ కొడుకు లున్నట్లున్నరు! మీ ఇల్లు పాడుబడ. పోలీసోల్లు రాత్రి గత్తుకత్తె మీయిాపులు పెట్న బలుగుతయ్."

బయటివాళ్ళు మేం పోలీసోళ్ళం. అని ఇంకా ఏమేమో చెప్పబోయారు. కాని ముసలవ్వ ఒక్క అక్షరం కూడా వినిపించుకోలేదు. బిగ్గరబిగ్గరగా అఱుపులు, మధ్య మధ్యన రెండుమాటల గుసగుస.

"కాలం పాడుగాను! ఎవ్వలకొంపలవాళ్లను పడుండనీయరు. నాత్తరనక పగలనక చంపుతాంటరు."

పాల్లా! పోరని మంచానికి నా గడంచె అడ్డంపెట్టు.

నన్నేం దొసుకుంటర్రా? ముసలిముండని దగ్గరేమున్నది? దొంగలైతే ఉన్నోన్ని దోచుకోండి లేవలేందాన్నెందుకు చంపుకతింటరు. అబ్బబ్బ తలుపు పలగ్గొట్టేటట్టే ఉన్నది. ఆగరాదుండి? కట్టెత్తె తప్పా గుఱ్ఱాన్ని? లేవలేని ముండను. చెంగుచెంగున గంతు లెయ్యాల్నా మీ తొందరకు?" మల్లీ! మట్లాడక ఆ పోరని పక్కల పండు ఊఁ! నడూ!..

ఇగ పగుల గొట్టండ్రి! లేచి తలుపుతీసేదాకా గూడా ఓపిక లేకపోతే పగుల గొట్టండ్రి. ఇంట్లజొచ్చి నా దగ్గరున్న రావన వరాలు తలిన్ని దోసుకోన్రి... దీపమన్న ముట్టిత్తామంటె కుంపట్ల అగ్గిలేదు. ఈ మల్లి ముండకు ఎన్ని సార్లుచెప్పిన మాపటాల్ల కుంపటి కప్పదు. ముదనట్టం ముండ! ఇగ నిన్నమొగడచ్చిండేమొ దానికి పట్టపగ్గా ల్లేకుంటున్నది. ఏ పనిచెప్పినా యినుపించుకోదు. నడుమనే ఆగమైతాంది మొగన్ని చూచి మురిసిపోతాంది. వగలముండ!

చెయ్యేసి పండుకో పోరడా దానిమీద! చూసెటోని కనుమానం రావద్దు.

'ఇగ నా చాతాగాదురా తండ్రీ ఈ మల్లి ముండ లేవలేదు. ఓ మల్లీ! ఓరి మల్లిగా! ఉహూఁ వీల్లు లేవరు. నీకు దీపప్పంతె దొరకదు చీకట్ల! వీల్ల వైస్సు వక్కలుగాను,

బజార్ల గంత లొల్లయితాంటే మా రాజుగ గుట్టుకొచ్చుతాన్రు ఈ లంగడప్పోరి నేంజేతు? .నా ముంగట్నే కొడుకు కోడలు రుచ్చాలోకి పడిపోయిన్రు ఈ పోర్ని నా నెత్తిన పడేశిన్రు. దెబ్బకొడ్తెనేమో రడ్డి. కొట్టకుంటే బుద్దిరాదు ఎన్ని మీద తెచ్చి పెడితివిరా నాపానానికి యాడున్నవురో కొడుకా! నా కొడుకా! ముసరిముండకు చెరబట్టి పోయినావు కొడకా! నా కొడుకా! నేనేం జేతురో కొడకో నాకొడుకా!"

ముసలవ్వ మహోర్ప్వాటంతో రాగం పెట్టి ఏడుపు సాగించి బయట వాళ్ళు నానావిధాల మాట్లాడుతున్నారు. పాపం పోనీ అని ఒకరు అబ్బే ఈ ముసలిది చాలా బద్మాష్ అని మరొకరు. మొత్తానికి సోదా జరిగి లీడాలసి అందరు నిశ్చయించారు.

లోపలినుండి గొణుగుసాగుతూనే వుండి. "అప్పల్ల! అయ్యల్ల! ఆగుర్రి తలుపు తీశేదాక -అవ్వల్ల! అయ్యల్ల!"

"తోడ్దేవోరే దర్వాజా" అని బయట ఆజ్ఞ ఇవ్వబడుతుండగానే ముసలవ్వ తలుపు గొళ్ళెం తీసింది. ఇద్దరు పోలీసులు ఒక్కుమ్మడి తలుపునెట్టి తలుపు తెరువ బడడంతోనే అమాంతం ఒకరిమీద ఒకరుపడ్డారు.

వాళ్ళు పడడంతోనే ముసలమ్మ పెద్దకేక వేసింది వాళ్ళులేవడంతోనే వాళ్ళ క్రింద పడ్డట్టుపడి ఏడవసాగింది

"చంపతిర్రా! నీ దొడలబడ - ముసల్దాని పానం తీత్తిర్రా! ఇగ చూసుకోండి. ఆ పడుచు పోరగాండ్లాడ మంచంల పడున్నరు. ఈడ నేనున్న కుండలటున్నయి. గురుగులున్నయి. తలెముంతలున్నయి పోరి మెడల గంటెపుత్తెలున్నయి. పోరగానికి రెండు దండకడియాలున్నయి ఇగేం కావాల్నో తీసుకోండి చంపాల్సంటే చంపండి. నన్ను చంపుండి. పోరని చంపండి పొల్ల ముండమొయ్యకముండు దాన్ని గూడ తుపాకి నెయ్యండి ఇద్దర్నొక్కసారే చంపండి అప్పట్నుంచి నన్ను చంపుకలింటాన్రు. ఇక జుర్రుకోండి. ఏం జుర్రుకుంటరో!" .

మల్లమ్మ మెల్లగా కండ్లు నులుముకుంటు మంచి దిగి వ్యాకులదృష్టితో అటూ ఇటూ చూడసాగింది. యువకుడు కూడా ఆవలిస్తూ లేచి మంచం మీదనే కూర్చున్నాడు.

పోలీసువారందరు ఒకరి ముఖం ఒకరు చూచుకోసాగారు. ముసలవ్వ ధోరణి నడుస్తేనే ఉంది.

"ఇంకేంచేత్తరో చెయ్యరాదుండి... తుపాకులన్నెగద... చంపరాదుండి నన్ను. ఇగ బతికినన్నొద్దులు బతుకుతనా? .."

యువకుని వైపు చూపిస్తూ పోలీసు జమాదారు ప్రశ్నించాడు "వాడు యెవడున్నడ్ చెప్పు! కాంగ్రెసోడాయేం?..."

ముసలవ్వ నెత్తిన నోరు పెట్టకుని అరవసాగింది.

"వాడెవ్వడా? ఎవ్వడుపడితే వాడు మా పక్కల్ల పండుటానికి మేమేం బోగమోల్ల నుకున్నావా? నిన్నెవడన్న గట్టనే అడుగుతె ఎట్టుంటది? ఆ మాటల్తోటి మానం దీసుడెందుకు? పానం తియ్యరాదుండి? నా బుద్ధిరిగిన కాన్నుంచి నేనైతే గింత బేఇజ్జతి

మాట యెప్పట్లనోట్నుంచి యినలే. ముసల్తనానికి ఇయ్యాల మానం పోయింది. ఇగ చూస్కున్న ఉరిపెట్టుకొని చస్తేంది. ఇలాంటి బతుకు బతికిందానికన్న?...వాడు మా మల్లమైతడా కాదా ఊరోల్లందర్ని తెలుసుకోని. వెలగచ్చినంక బాగ పరిచ్చవట్టి చూస్కోండి. గాని గిసొంటి జే కంగాలు కూతలెందుకు. మేమసంటోల్లం కాదు బాంచెను! ఏదో మీ పాదాలకింద బతుకుతున్నాం బైటోడు గొల్లరామి గుడిశెలకొచ్చి తప్పిచ్చుకుంటాడు? పానం పట్టుకచ్చి అప్పచెప్పనయ్య?గొల్లరామెసొంటిదో ఊరోల్ల నడుగుండి!"

అప్పటి తీవ్రతకు, ఇప్పటి విధేయతకు పోలీసులు చకితులైనారు. ఏమనుకోవాలో, ఏం చేయాలో వారికి తోచలేదు.

"పోని బాంచెను! ఈడేం లేదు. నామాట అబద్ధమైతే కోశిత్త నేనేడికి ఉరికిపోను. ఈడ్నే ఉంట. నా మాట డాకలచూడుండి. ఇగ తిప్పల బెట్టకుండి!"

పోలీసు జమాదారు కొంతసేపు యోచించి లేస్తూ అన్నాడు. "అచ్చా! నేన్ పంచనామా చేస్కోని వస్తా. నీ బయాన్కి తీస్కుంటా. వీన్కి హాజరుచెయ్యాలె. లేకుంటే నీకే షూట్ చేస్తా తెల్సిందీ."

జమాదారు బయలుదేరాడు. ముసలవ్వ మంచం మీద కూర్చుంది. ఒకవైపు యువకుడు మరోవైపు మల్లమ్మ అదొక అపూర్వ సమ్మేళనమనిపించింది యువకునికి.

"అవ్వా నీవు సామాన్యురాలవు కావు సాక్షాత్ భారతమాతవే" అన్నాడు యువకుడు భావలీనతలో కండ్లు మూసి.

దోడ్డ్! కొంటెపోరడా! నాకే పేర్ల బెడుతున్నావు?...నా పేరు గొల్లరామి! గంతే... ఇగ నువ్వెల్లు...మల్లిని అత్తోరింటికి తోలుకపోత పొద్దెక్కుతాంది..ఊఁ..యెల్లు....."

ముసలవ్వ ఆజ్ఞ అనుల్లంఘ్యమైందని యువకుడదివఱకే తెలుసుకున్నాడు.

● కాకతీయ పత్రిక - 15 ఆగస్టు, 1949 ●

# 15. మేం నలుగురం

♦ ఎం. హీరాలాల్ రాయ్ ♦

ప్రజ్వలించిపోయే సూర్యకిరణాల ధాటికి జడిసి, పొద్దస్తమానం ఎటూ వెళ్ళడానికి వీల్లేకుండా పోయింది. కాని చూస్తుండగానే సూర్యుడు ముసలాడై పోయినాడు. దానంతటనే రానే వచ్చింది రాత్రి. ఏనాడూ తొమ్మిది గంటలకి నేను నిద్రపోయిన పాపాన పోలేదు. నిద్రపట్టి చస్తేగా? మా అమ్మ ఎప్పుడూ గోలపెడుతూనే ఉంటుంది "జబ్బు చేస్తుందని." కాని నేను రాత్రిపూటనే తప్ప పగలు తిరిగే అవకాశం కనపడదు. జర్జరీ భూతమై పోతూన్న యీ మనుష్యుకి కొంత సంతృప్తీ, శాంతీ లభించాలంటే మిత్రబృందాన్ని కలుసుకోవడం తప్ప గత్యంతరం లేదు.

అమ్మకి కనపడకుండా చిన్నగా బజార్లో అడుగెట్టాను. ఆవిడకి రోజూ అలా గోలచేయడం, నాకిలా బయల్దేరి రావటం అలవాటైన విషయంలే. ఐనా ఆవిడముందు ప్రత్యక్షంగా నేను బజారుకి బయల్దేరడానికి జంకేవాణ్ణి. ఇవాళా అంతే.

బజార్లో రెండుపక్కలా చూస్తూ వెడుతున్నాను. మిత్రులెవరన్నా కలుస్తారేమోనని. మా మిత్రులంతా నిశాచరులే కావడంతో నేను రాత్రిపూటే నా సంచార కార్యక్రమం ఏర్పరచుకోక తప్పనిసరి అవుతోంది. అంతా ఉదయం పదినుండి సాయంత్రం నాలుగింటివరకు గాడిద చాకిరీ చేసి అలిసిసోయి వచ్చేవాళ్ళే. ఇంటికొచ్చి ఓ చక్కని కునుకుతీసి, ఆరున్నరకి లేచి శుభ్రంగా బజారుకొచ్చేస్తారు వాళ్ళు.

ఎదురుగా లంచ్‌హోమ్‌లోంచి 'లతామంగేశ్‌కర్' గానం మధు నదంలా పాయలు పాయలై ప్రవహిస్తూ బయల్పడుతోంది. 'లతా' పాటలు నాగుండెల్లో చెవుల్లో వేదనాగ్ని రేపుతాయెందుకో. లత తీయని కంఠం నన్ను స్మృతి లేనివాడుగా తయారుచేస్తుంది. ఆ పాటలన్నా అంత మధురాతి మధురత్వమన్నా నేను భరించలేను. ఆ పాటలకి జాగ్రత్తపడి నేనెంత దూరం వున్నా నా కవి వినిపిస్తూనే వుంటాయి. అబ్బబ్బ! బజార్లో నడుస్తున్నా, మూతపడ్డ పాడుకొంపల మూలల్లోంచీ, అందమైన అమ్మాయిల నోళ్ళలోంచీ, గొప్ప గొప్ప సౌధాల్లోంచీ, నిశాగర్భం చీల్చుకుంటూ ఆ పాటలు పుంఖానుపుంఖాలుగా అక్షయతూణీరంలోంచి వచ్చే బాణాల్లా నా చెవుల్లోంచి గుండెల్ని దూసుకుంటున్నాయి. పాటల్లో అతి తీయదనం గుండెని కబళిస్తుంది. మనిషి నీలోకం లోంచి తప్పిస్తుంది.

"లతాదేవీ! నీకో నమస్కారం దైవసాక్షిగా చెబుతున్నాం. నీవిక పాడడం మానివేయి. మేమంత తీయదనాన్ని భరించలేం. మా మనస్సులు చిల్లులు పడుతున్నై. మా నిద్ర పాడైపోతోంది. మా బుద్ధి నశిస్తోంది క్రమంగా. మేం గాలిలో తేలిపోతున్నాం. గానం నీకు అమరత్వాన్ని ప్రసాదించిందిలే. ఇక పాడకు. అంతగా నీకు కళాభిరుచి ఉంటే చక్కగా ముస్తాబై నృత్యం చేయడం నేర్చుకో. నీకు మా హృదయపూర్వక స్వాగతం " పై విధంగా ఓ అప్లికేషన్ వ్రాసి నాలాంటి ఇంకా కొన్ని లక్షలమంది సంతకాలు తీసుకుని లతామంగేశ్‌కర్‌కి సమర్పించాలని వుంది నాకు.

"కాదు .. లతా .. లత... లత... పాడాల్సిందే... ఇంకా, అంతా వినాలి. గుండెల్లో వేదనాగ్నులు ప్రజ్వలించాలి. మేమంతా ఉన్మత్తులం కావాలి. వేణునాదం విన్న కోడెతాచుల్లా మరచి లతపాటకి అనుగుణ్యంగా శిరస్సు లాడించేంత భయం ఉన్మాదం ఆవేశించాలి మాకు. అప్పుడే మా కథలో చివరి అధ్యాయం. అక్కడితో అంతం "

మళ్ళీ ఇలా అలోచిస్తు లంచ్‌హోమ్ ప్రొప్రైటర్‌ను చూస్తూ లత పాటలు ఆ హోటలుముందు నిలబడే వినొద్దనుకుంటూనే వింటూన్నాం. ఇంతలో ఎక్కణ్ణించో బిలా బిలా ప్రవేశించారు మిత్రులు సుబ్రహ్మణ్యం. రంగారావూ, రామకృష్ణ - ముగ్గురూ ఒకే తల్లి పిల్లల్లా. వాళ్ళు ముగ్గురూ నాతో కలీగానే నాకెందుకో, సంతోషంతో ఎగిరి గంతేయాలనిపించింది. "పదండిరా! ఓ మాంచి ఘాటైన బ్రూక్ బాండ్ టీ తలో ఒకటీ తీసుకుని మరీ కూర్చుందాం."అని అంతా ఒకేసారి అనడంతో ఒకేసారి నవ్వుకుంటూ హోటల్లో జొరబడ్డాం. 'బృందావన్'లో సుబ్రహ్మణ్యం ఎక్కౌంట్ ఉండనే ఉంది, ఇక విచారం ఎవడికి?

మందమైన చుక్కలకాంతిలో మెరుస్తూ వెలిగే చంద్రుడి వెన్నెల్లా రాళ్ళమీంచి ప్రవహించే మునేటి గలగల చప్పుడుతో, స్వచ్ఛంగా సుబ్రహ్మణ్యం నవ్వు ప్రతిక్షణం వినబడుతోనే వుంటుంది. ఆ నవ్వుకు అంతం లేదా అనే సంశయము నాకోసారి కలుగుతూంటుంది. సుబ్రహ్మణ్యం డి.పి.బి.క్లర్కు, చచ్చేంత చాకిరీ, వాడిజీతం అంతా ఇలా హోటళ్ళ పాలే. వాడింకా బ్రహ్మచారిగా వుండడంవల్ల బతికిపోయాడనిపిస్తుంది.

ఇవాళ సుబ్రహ్మణ్యం నవ్వు రామక్రిష్ణ కెందుకో చిరాకు కలిగిస్తూన్నదల్లే వుంది. "ఒరేయ్! ప్రతిక్షణం అర్థం లేకుండా ఏమిట్రా ఆ వెధవనవ్వూ నువ్వూను?" అన్నాడు. రామక్రిష్ణకి పోస్టాఫీసులో ఉద్యోగం. ఉదయం ఏడుగంటలకి వెళ్ళితే రాత్రి ఏడుగంటలకే మళ్ళీ కొంపకి చేరుకోడం. చావడానికైనా తీరదు వాడికి. అయినా రోజూ వాడు మాతో కలియందే తృప్తి పడేవాడు కాదు. ఇవాళ రామక్రిష్ణ చికాగ్గా వున్నాడు. అందుకే ఇలా అన్నాడు.

సుబ్రహ్మణ్యం తన నవ్వు నాపకుండానే "రామక్రిష్ణా! చచ్చేంతవరకూ ఇలానే నవ్వు తుంటాను రా నేను. ఈ నవ్వుకోసం నేను రోజూ ఎన్ని వేల కన్నీటిబొట్లో ధారపోస్తాను! నా యీ నవ్వుతో యీ చరాచర ప్రపంచం ప్రతిధ్వనించిపోవాలి. ఇంతకంటే నాకింకేమీ లేదు" అన్నాడు. అదోరకం బాధతో మళ్ళా బాధ కనిపించ నీయనంత మామూలు ధోరణిలో

"బావుంది చాలా బావుంది. నవ్వుకోసరం యాచపడడం, ఏడుస్తూ నవ్వడం, నవ్వుతూనే చస్తాననడం ఏమిట్రా నీ వెధవ ఫిలాసఫీ అంతాను? మా ప్రాణం తోడేస్తున్నావ్" అంటూ రామక్రిష్ణ ఇంకేదో అనబోతున్నాడు. సుబ్రహ్మణ్యం మధ్యలోనే అడ్డుకుని -

"మీకేం తెలుసురా బతుకుని గురించీ? ఏమీ తెలీకపోయినా అన్నిటినీ గురించి రచనలు ఎలా సాగిస్తారో నాకర్థం కాదు. నా జీవితానికి రెండే రెండు ధర్మాలు తప్ప మరేమీ లేవని లక్షసార్లు చెప్పాను. నవ్వులో ఏడుపు. ఏడుపులో నవ్వు...ఈ రెండు రసాత్మక క్రియలూ తోడుతోడుగా వర్ధిల్లాలంటే వీటికి ఘాటైన టీ, సిగరెట్ల సహకారం అత్యవసరం. ఒరేయ్! రామక్రిష్ణా! ఇంకోమాట: నామీద నాకే విశ్వాసం లేదు...నాకు నేనే ఓసారి సమస్యగా, ఇంకోసారి పరిష్కారంగా, ఇంకోసారి ఫ్రాక్షన్‌లో పడ్డ లెక్కలా తయారవుతాను. ఉద్యోగం చేస్తూ కూడా ఇవాళిటిపరకూ ప్రైసా ఇంటికి పంపలేదు. పంపలేను కూడాను. పోతే నా టీ, సిగరెట్లకే సంపాదన సమీతం...ఇంకో సంగతి చెప్పు ల్లేకుండా వుత్తపాదాల్తో నడవాల్సిన స్థితి వస్తుంది. కాని, అలా నడిస్తే అంతా వెక్కిరిస్తారనే భయంతో ఉపవాసం వుండైనా చెప్పులు కొనుక్కుని తీరాలి. ఎన్నిరోజులు నేను కూడు లేకుండా గడుపుతానో ఎవడికి తెలుసు? అసలెవరికి చెప్పను? ఇలా చెబితే మీరు పరిహసిస్తారు. గుండెల్ని పిండిచేసే మీ పరిహాసాలు భరిస్తూ బ్రతుకుతుంటాను నేను. మానవుడికీ, విజ్ఞానానికీ, జీతాలిచ్చే చదువుకీ, చదువుకీ సంస్కారానికీ, మంచికీ కీడుకీని అంతరాంతర సంబంధాలెలా వుంటాయో ఆలోచించబుద్ధవుతుంది. నేను ఆలోచిస్తాను. ఇంతకంటే మహోన్నత విషయాల్ని గురించి కూడా ఆలోచిస్తూ నిద్రపోతాను. నిద్రలో నవ్వుతాను. మేలుకుని ఏడుస్తాను. ఆకాశంతో మాట్లాడతాను. నీలాంటి మిత్రులు కలిస్తే వికృతంగా నవ్వుతాను. నవ్వడం ఏడవడం నాలో జీర్ణించుకు పోయాయిరా! అవి నన్ను వదలవు" అంటూ చిట్టచివరికి ఓ తాచుపాము బుసలాంటి నిట్టూర్పు విడిచాడు సుబ్రహ్మణ్యం.

"ఒరేయ్! నీకో వెయ్యి నమస్కారాలు. కాస్త నీ యేడుపుల భాగోతం ఆపు. తాగిన టీనీళ్ళ మైకం వదిలిపోతోంది. నేనో చిన్న కథ రాశాను. ఐదునిమిషాలు పడుతుంది. వినిపిస్తా ఉండు" అంటూ రామక్రిష్ణ జేబులో చెయ్యిపెట్టాడు.

సుబ్రహ్మణ్యం ఈ మారు హోటల్ హాలంతా అదిరేంత వికృతంగా నవ్వాడు.

"నీవే ఓ గొప్ప కథవైనప్పుడు ఇంకా నీవేం కథలు రాస్తావురా? నేనేం వింటాను? జీవితానికి అవతలొడ్డునున్న నాలుగు భయంకర సన్ని వేశాలూ, రెండు ప్రణయఘట్టాలూ, ఇరికిస్తే ఓ కథ అయిపోతుందా?... అలాంటి కథలు నాకు అవసరంలేదు.. అసలెందుకూ అంట నీ పిచ్చి కథలు? కథలురాస్తే కడుపు నిండుతోందిరా? మానవుడి రోదనధ్వని మాటు మణిగిపోతుందా? ఫ్చ్...వట్టిది... అంతా బూటకం. బంగాళా దుంపలు పాతిపెట్టి, వరిపంట పండుతోందంటూ రాసే కథలు బతుక్కు పనికిరావురా! కథా ప్రపంచంలో పడి నీబతుకు మరిచిపోతున్నావ్... పైగా నేనెప్పుడూ ఏడుస్తూంటానని దబాయిస్తావ్?..." సుబ్రహ్మణ్యం ఈ మారు చాలా ఉద్రేకంలో పడిపోయాడు. ఒకసారి నావేపు చూసి మళ్ళీ లంకించుకున్నాడిలాగ.

"ఒరేయ్! రామక్రిష్ణా! ఇటుచూడు ఇవాళ నీ గదిలో డ్రాయరు మీదున్న ఉత్తరం ఎక్కణ్నించి వచ్చిందిరా? అది చదివావా? చెప్పు. చదివావా అని..? మీ అమ్మగారు గదుట్రా రాసింది? ఏముందందులో? యీ నెల యింటద్దే. స్కూల్ ఫీజూ ఈ నెలైనా చెల్లించకపోతే పరిస్థితి బాగుండదని కదూ రాసింది? నేను చూశానని కోప్పడకు. ఇవన్నీ వదిలి...మనలోమాట... నేనో గొప్ప కథకుణ్ణని మందిని గురించి కథలు రాయ బోతావేం? అవి నాకు వినిపిస్తానంటావ్ మళ్ళీ.. నీవు కథరాస్తే ఈ నెల యింటద్దె బాకీగానీ మీ వాడి ఫీజుగానీ చెల్లిపోతాయట్రా? చెప్పవేం? ఎందుకా మౌనం? కథ వినిపిస్తావూ? నీకథ వింటూంటే ఇంటద్దె కోసం యజమాని మీ అమ్మని కేకలేయడం వినొస్తుంది నాకు... వద్దులే...నీ కథకన్నా "లతామంగేశ్‌కర్' పాట వేయిరెట్లు మెరుగు..ఏదో కొంత బాధ అనుభవిస్తూనైనా వినొచ్చు...నీ కథ విప్పకు. గుండెపగిలి చస్తాను. నేనింక మాట్లాడన్లే" అంటూ సుబ్రహ్మణ్యం గప్పున నోరు మూసుకున్నాడు. రామక్రిష్ణ నిజంగానే బేజారెత్తి ఏమిటో ఆలోచిస్తున్నాడు.

నాలో వున్న మనిషెవడో మాట్లాడుతున్నట్టుంది... "నిజం. సుబ్రహ్మణ్యం మాటలు నూటికి నూరుపాళ్ళు నిజం. కథరాస్తే ఇంటద్దె తీరుతుందా, బడి ఫీజు రద్దవుతుందా? ఇంకా యీ రాసిన కథలు ప్రకటించుకునే పత్రికలూ ఈ రాసేవాళ్ళలానే వుంటాయి... లోపల ప్రచండమైన బాధతో వీళ్ళు కథలు రాసి పైకెంతో శాంతంగా కనిపిస్తారు... ఇక పత్రికలో..పై అట్టమీద చక్కని ముస్తాబూ, లోపల పొట్టలోకి తిండి లేదని గోల... ఇంతేగా?" అని.

మేమంతా ఇలా సతమతమవుతోంటే రంగారావు, ఇందాకటినించీ గొప్ప వేదాంతిలా మామాటలన్నీ మౌనంగా వింటూ మా ముగ్గురి ముఖాలూ తదేకంగా పరిశీలిస్తున్నాడు. ఇండియా పాకిస్తాన్ పంచాయితీల పరిష్కారం గురించో, కొరియాయుద్ధం ముగింపు తెచ్చే విషయాన్ని గురించో, లేక ఆంధ్రరాష్ట్ర సుస్థిరత్వాన్ని గురించో ఆలోచిస్తూన్నంత దీర్ఘమైన స్థితిలో వాడు మమ్మల్ని చూస్తున్నాడు. చేతిలో సిగరెట్టు వాడి నోట్లోంచి పొగకక్కిస్తోంది. ఇంతవరకూ వాడు ససేమిరా నోరు విప్పనేలేదు. వాడిచాత మాట్లాడించటం ఎలానా అని నేననుకుంటున్నాను.

రంగారావు ఓ లైబ్రరీయన్‌గా జీవితం గడుపుతున్నాడు. అస్తమానం వాడు పుస్తకాల మధ్య ఇరుక్కుని నలిగి, అంతో యింతో అంటించుకుని బయట పడుతాడు... చక్కగా కవిత్వం, కథలూ రాస్తాడు... ఈ మధ్య చాలామంది పత్రికల వాళ్ళు వాడి రచనలకోసం వుత్తరాలు రాసేవాళ్ళు. కాని వాడిష్టమైతే తప్ప చస్తే పంపకపోయేవాడు. . అప్పుడప్పుడు వాడు నాతో అంటూండేవాడు... "భాయీ! నాపద్యం వినాలని అంత కుతూహల పడతావు గాని, నేనివాళ భోంచేశానో లేదో తెలుసుకోవేం?" అని. వాడిష్టమైతే కోరని పత్రికకైనా రచనలు పోస్టు చేస్తాడు. అవి తిరిగొచ్చినా సరే. అడిగేవాడికి పంపడు... పంపని కారణం నాకు తప్ప చస్తే మరొకడికి చెప్పడు. సంస్కారంలేని మొరటుమనిషిలా ప్రతిమాటా గభాల్ని అనేస్తాడు.. అన్నందుకు వీసమెత్తు పశ్చాత్తాపంపడంగా వాణ్ణి మామిత్ర బృందంలో ఎవడూ చూల్లేదు. వాడి జీవితం చార్లెస్ డికెన్స్ పాత్ర, 'సిడ్నీకార్టన్ జీవితం లాంటిది,

కార్టన్‌కి సారాయి దుకాణం. వీడికి కాఫీ హోటల్. నేను పెద్దగా వాడి చెవికింద నోరుబెట్టి "అరే! కవిమార్జాలం! మేమంతా కొట్టుకు చస్తుంటే పిల్లిలా అలా కూర్చుంటావేంరా? తగిలించు నీవీ రెండుముక్కలు. కథగానీ. కవిత్వంగానీ. ఏదైనా సరే" అన్నాను నేను పెద్దగా.

వాడోసారి చిన్నగా నవ్వాడు. ఇతర్లకి ఆ నవ్వు అమాయకమైన పసిబిడ్డ నవ్వులానో, లేక వెకిలిగానో కనిపిస్తుంది కాని, నాకు మాత్రం వాడి నవ్వు అతిభయంకరంగా, దెబ్బతిన్న కుక్కపిల్ల అరుపులా, అగాధంగా వుంటుంది. ఏదో బాధని చీల్చుకు వస్తూన్నట్టు వినిపిస్తుంది. చివరికి వాడూ నోరు విప్పాడు.

"ఒరే నాన్నలూ! ఇదిగో ఇటు వినండి! కొన్ని హఠాత్సంఘటనలు ఎంత భయంకరంగా వుంటాయో, మన జీవితాలూ అలాంటివే. ఇదే జీవితానికి రూపం అంటే నమ్మండి. ఇదిగో! ఈ బతుకులున్నాయే వీటిని గురించి మనం ఆలోచించ కూడదురా! మన పరిసర వాతావరణాన్ని గురించి కానీ, ఏ మాత్రం ఎన్నడూ ఆలోచించకండి. ఆలోచించడం పిచ్చితనంరా! ఊరకే వున్నా లేకున్నా అలా నిరంతరం విశ్రాంతి లేకుండా ముందుకు నడవడమే మన పని. ముందుకు నడవాలి. కాని 'ఆలోచిస్తూ కూర్చోగూడదు. ఆలోచించామా? మన కళ్ళముందు నరకం ప్రత్యక్షమై కూచుంటుంది. ఆత్మవిశ్వాసం నాశనమవుతుంది. మన బుర్రలమీది జుట్టు రాలిపోయి, చివరికి లోపలేమీ మిగలకపోగా జవాబు కూడా దొరకదు మన బతుక్కి ఆలోచించామంటే మనం ముందుకడుగెయ్యలేం. పిరికితనం వస్తుంది. ఆలోచన మనల్ని మృత్యువు సన్నిధికి లాక్కునిపోయి నిలబెడుతుంది. మన బాధలూ, గాధలూ, కథలూ, కల్పనలూ అన్నీ వెంటదీసుకుని ముందుకే మనం నడవాలిరా! వద్దురా నాన్నలూ! ఎందుకలా ఆలోచిస్తారు మీరు? పదండి. అలానైతే మనం ఎవరెస్టుని నిమిషంలో జయిస్తాం. ఎర్రకోట చరిత్రని మారుస్తాం. తాజమహల్ తలదన్నే సౌందర్యాన్ని నిర్మిస్తాం. అజంతా ఎల్లోరా గుహల్ని నవీన సాంస్కృతిక సంప్రదాయంలో పునఃచిత్రిస్తాం. ముందుకే నడుద్దాం. వెనక్కిపోయి చూసుకోకండి. దోవలో ఎదురయ్యే అభిజాత్య సంపన్నుణ్ణీ, అతిదూష్యవర్తనుణ్ణీ ఇద్దర్నీ ఒకేరకంగా పలకరించండి. ఏడ్చేవాణ్ణి చూసి నవ్వండి. నవ్వేవాణ్ణి చూసి వాడికంటే వికృతంగా నవ్వండి. కాని వెనక్కి తిరిగి వాళ్ళతో మాట్లాడకండి. తిండిలేక చచ్చిన ముసలాళ్ళ అస్థిపంజరాలు కాళ్ళకి తగిలినా ఆగకండి ఈ అస్థిపంజరాల్లో కూడా ఓరోజున యౌవనం పెల్లుబికేదనీ, వీళ్ళకి పిల్లాజెల్లా వుండేవుంటారనీ, వీళ్ళూ మనుషులేననీ, వీళ్ళూ ఒకనాడు కడుపునిండా తిని గౌరవంగా కాలక్షేపం చేసినవాళ్ళే కావచ్చుననీ వాళ్ళ జీవితాల్లో చొరబడి చూడకండి. అలా వెళ్ళారో అంతా అగాధం. ఇంకా కూరుకుపోతాం దానిలో."

వీడిమాటలు విన్నాక ఇంత క్రితం మేం పుచ్చుకున్న టీ సిగరెట్ల స్టిమ్యులేషన్ యావత్తూ కరిగిపోయింది. వాడిచూపుల్లో ఇందాకటిలా లోతులేదు. నిప్పురవ్వలు కనిపిస్తున్నై. సుబ్రహ్మణ్యం నవ్వుతోనే వున్నాడు. కాని ఆ నవ్వులో ఓ రకమైన స్పర్ధ... రామకృష్ణ మౌనంలో భరించరాని వికటధ్వని. హోటల్ రేడియోలోంచి వచ్చే

లతామంగేశ్‌కర్ గానంలోంచి గుండెల్ని చీల్చే వేదన ప్రస్ఫుటమవుతున్నై. నే నెక్కడున్నానో నాకే అర్థంకాలేదు.

హోటల్ మూసేస్తున్నారల్లే వుంది. "లేవండి బాబూ! ఇక! రాత్రి పదిన్నర కావస్తోంది" అంటూ రేడియో స్విచ్ ఆఫ్ చేసి మమ్మల్ని గొళ్ళెల్ని అదిలించేటట్టు ప్రొప్రైటర్ అదిలించడంతో ప్రపంచంలో పడ్డాను.....

నలుగురం బలవంతాన బైటికొచ్చాం మోయలేనంత మౌనభావంతో... ఒకళ్ళ నొకళ్ళం మాట్లాడించుకోవడం కూడా చేతకాని నరాల బలహీనతతో నలుగురం నాలుగు దిక్కులకీ వ్యాపించాం.

"ఆలోచించకండిరా! చస్తారు" అనే ధ్వని నన్ను వెంటబడి తరుముతూంటే పాతబైక్‌మీద పడి కొంపకి చేరుకుని అమ్మకి కనపడకుండా గదిలోకెళ్ళి పడుకున్నాను. నిద్రపట్టి చావదు.

● 1950 ●

# 16. ఆరూఢం

♦ కందుకూరి లింగరాజు ♦

గదిలో కూర్చుంటే చుట్టూరా వున్న అనేక రకాల పత్రికలు తనకి కోపం తెప్పించేయి. వాటిని విసిరెయ్యాలని, చింపి పారెయ్యాలన్నంత కోపం వస్తోంది. కిటికీలో నుంచి వచ్చే చిన్న గాలి పేజీల్ని తిప్పుతోంది. అందులో అనేక రచయితలు పుట్టి, పెరిగి, జరిగిపోతున్నారు. వాళ్ళ పేర్లు తనకి నిత్యతలంపుల్లోని అంశాలుగానే వున్నాయి. తనకి ద్వేషం కల్గిస్తున్నారు. దేశాన్ని ఉద్ధరిద్దామని, వెర్రి మొర్రి కథలు వ్రాస్తూ, పేరుపడి నందుకు సంతోషించేవారిలాగే కన్పడ్డారు. వాళ్ళు, వాళ్ళ కథలన్నా సుందరికి ఉగ్గుపాలతో వెళ్ళుకురావటం ప్రారంభించింది.

తన అత్తగార్ని చూసింది. ఆ ఏభైయ్యోపడి దాటి, నడుం వంగీ వంగని స్థితిలో వున్న ఆవిడ, ఇంకా ఆ పత్రికలన్నీ సరదాగానే చదువుతుంది. తన రాజా వ్రాసినవన్నీ ఇంకో రెండుమూడుసార్లు చదివి మురిసిపోతుంది. అందులోనే అతని జీవమున్నట్లు, భావి ఆధారపడ్డట్టూను. ఆవిడ భర్త కూడా ఓ పెద్ద పత్రికాఫీసులోనే పనిచేసి చచ్చిపోయేడు. ఆ చాలీచాలని జీతంతో సంసారం నెగ్గుకురాలేక పడ్డ కష్టాలు, ఒక్క పేట పలకసర్లు తప్ప ఇంకోటి చేయించలేని బీదతనం, పడ్డ శ్రమ, ఇవన్నీ ఆవిడకు గుర్తువున్నా, ఎందుకు తన కొడుకుని కూడా, తండ్రి అడుగుజాడల్లో నడవమని ప్రోత్సహిస్తూందో తెలియటంలేదు. కడుపు మాడ్చుకుని, పోషించుకోలేక, దయా ధర్మ నిచ్చం కింద వాళ్ళు యిచ్చే స్వల్ప ప్రతిఫలాల్లోనూ జీవించడం ఎందుకో అర్థంకాలేదు. ఎన్నోసార్లు ముఖాముఖీగా అడుగుదామనుకునేది. కాని ధైర్యం చాలేదికాదు.

రాజాని చూచినప్పుడల్లా, ఆకళ్ళల్లోని ఆశ, పట్టుదల అతనికే ఓ చిన్న ప్రెస్సు వుంటే, యావదాంధ్ర దేశాన్ని ఉర్రూతలూగించే పత్రికాసంస్థగా చేసివుండేవాడన్నట్టే తట్టేది. దానికి డబ్బే! అదే లేదు. తన సంసాదనలో అతను ఎప్పుడు ఈ ఆశను సఫలీకృతం చేసుకోలేదు. ఆ ఆశలు నిరాశగా తయారవ్వడం తప్ప. ఆ పట్టుదల కోసం, తన్ని ఈ చిన్న అద్దె ఇంట్లో, ద్వేషించే పరిసరాల్లో వదలి వారాలు, నెలలు కూడా, ఉండిపోయి విధి నుండి తను సఫలీకృతుడు అవుతాడన్నంతగా త్యాగం చేస్తాడన్న భయం పీకేది. అతని తండ్రివలె ఈతడు కూడా, విధిని జయించలేక దానికి బలి అయిపోతాడేమో అన్న భయం శాంతినిచ్చేది కాదు సుందరికి.

ఆరోజు అతను దగ్గరగా వచ్చేడు. దగ్గరగా తీసుకునే "సుందరీ! నా కథలన్నిటికీ జీవంపోసిన దేవకన్యవా నువ్వు" అన్నాడు. అన్నాళ్ళలో ... చూచింది. ప్రతి కథలోనూ

తనపేరు, తన రూపం నిరూపించేవాడు. తన్ని గురించే ఓ అమరభావనల్లో విహరించే వాడు.

"ఆ దేవకన్యత్వం నాకొద్దు. నన్ను ఇల్లా ఈ సంసారంలోనే వుండనియ్యండి. ఈ ప్రతీవాడూ చదివేట్లు, చూడాలన్నట్టు, నాకక్కరలేదు.

"ఏం రాణీ! ఆ పోకడలన్నీ విషలిప్తమా?"

"ఔను..."

"అది కాదు సుందరీ! జీవితంలో ఆ మార్గం కూడా అలవర్చుకోవడంలో తప్పేముంది. నేను ఆరాధించేమార్గం అది."

సుందరికి ఆ మాట భయం కల్పించింది. తను వూహించుకున్న నిర్ణయ మార్గాల్లోకి తన రాజా రాడు. "నేను ఆరాధించే మార్గం అది" ఆ వాక్యం ఎన్నోసార్లు జ్ఞాపకం వచ్చింది. తనకంటే ఆ కవితాదేవినే ఆరాధిస్తున్నాడు. అతన్ని మార్చడం ఎల్లాగా!

'సుందరీ! ఆ మార్గంలో ఏం తప్పుంది. స్వతంత్రంగా జీవించలేమా అందులో! నా భావాలు, ఆశలు, అన్నీ, నావే అయినప్పుడు, అంతకంటే స్వతంత్ర జీవనం ఏముంది. దానివల్ల మన సంసారసుఖం ఏ విధంగా అడ్డుతుంది?"

అదీ ఓ జీవనమేనా?

"ఏం? ఎందుకు కాదు. జీవించడానికి డబ్బు కావాలి. దానిని సంపాదించుటకు ఆ మార్గంలో అడ్డేముంది? దానితోనే సంపాదిస్తా!"

"కాని ఆ కంపెనీలో మీకు ఇంతకంటే ఎక్కువ జీతం ఇస్తామన్నారుగా. అదెందుకు ఒప్పుకోకూడదు?"

"అదా? నాకు ప్రెస్సు ఒకటి కొనుక్కోవాలని వుంది. అదే వుంటేనా!"

"అప్పుడు నాకు మరింతదూరం అయిపోడానికా?"

"అయితే మాత్రం రాణీ, నువ్వు నాకు మరింత దగ్గరగా వుంటావుకా" అతను వెళ్ళిపోయేడు.

ఇందులోని వేదాంతం అర్థం కాలేదు. తనకంటే రాజాకి అతని పత్రికా జగత్తే ఎక్కువని దుఃఖం వచ్చింది. ఈ ఆరాటనను ఒకళ్ళకు చెప్పుకునైనా అనునయం పొందుదామన్నా తన అత్తగారు తనవైపు మాట్లాడదు. ఆ వయస్సులో మూగగా పుస్తకాల్లో కాలం గడుపుకోవడం తప్ప ఇంకేమీ లేనేలేదు. ఆ మూగతనం తనకి మర్మభేద్యం కాని సమస్యగానే వుంది.

ఆ రాత్రి విపరీతమైన బాధపడింది. ఆ ఇంట్లో తల్లీకొడుకు ఒకటిగాను, తనోవిధంగాను ఉన్నట్లే తట్టింది. ఓ ఉద్యోగం చేస్తూ, బంట్రోతులు, హోదా ఉన్నంత గొప్పగా ఈ పత్రికా ప్రపంచంలో ఎక్కడ వుంటుంది? అది ఆశించడం కూడా పిచ్చిగానే వుంది. భావి?

★ ★ ★

ఆ మర్నాడు రాజా వస్తూనే "ఇవ్వాళ నా స్నేహితుడు వస్తున్నాడు అతడూ కవే. అతని పేరు వినేవుంటావ్" అన్నాడు అందులో అతని కళ్ళు, శరీరం పొంగిపోయింది ఆనందంలో ఊగులాడుతున్నట్టే చెప్పేడు

"అతనూ కవే!" అన్న వాక్యం మాత్రం ముళ్ళతో గుచ్చినట్టే అయ్యింది. తను ఎంత గృహిణీత్వం వహిద్దామన్నా, ఆ శబ్దం అంటేనే మనస్సు, శరీరం కూడా ద్వేషించేట్లు చేస్తోంది. ఈనాడు అతని మర్యాద అంతకూడా చెయ్యలేదేమో అని తట్టింది. ఈ జోగీగాళ్ళకు తనెందుకు చాకిరీ చెయ్యాలి?

"అతను స్వతంత్రంగా పత్రిక పెడుతాడట. నన్ను కూడా రమ్మంటున్నాడు."

"పత్రికా! దానికి సంపాదకుడుగానా!"

"ఔను."

"మరి మీ స్వతంత్రం అన్నారే! ఇదీ ఊడిగం అవటం లేదూ' తను ఎంత ద్వేషంలో అనాలో అంతగానూ అంది. ఎల్లాగైనా ఆ పందాలోకి రాజాని దిగనివ్వకూడదన్న భావమే మెట్లు ఎక్కుతోంది.

నవ్వేడు. "ఊడిగమా! వ్యక్తిగత స్వాతంత్ర్యం ఉన్నంతవరకూ ఊడిగం అవదేమో!" మళ్ళీ ఆ వేదాంతమే!

రా రాత్రి వాళ్ళిద్దరూ ఘంటల తరబడి మాట్లాడేరు. తను విందీ అన్ని ఘంటల్లోనూ, రచనలు, టెక్నిక్, సర్రియలిజం, క్లైమాక్సు, బేలన్సు, కేరక్టరు, వగైరాలను గురించే మాట్లాడేరు. అవి వింటున్నంతసేపూ తనకి క్వినైస్ మాత్రలు మింగినట్టే వుంది. భరించలేని కోపం వచ్చింది ఎంతగా, స్త్రీ అయి పుట్టినందుకు, తను, బానిస అయ్యిందో, అన్న ద్వేషం కల్గింది.

ఆ మర్నాడు అతడు వెళ్ళిపోయేడు "సుందరీ! ఓనాడు పత్రికా ప్రపంచంలో ఉన్నత స్థానం ఆక్రమించేవాడిలో అతను ఒకడు. అతను విషాదాంతాలు మనస్సు...." ఆయన చెప్పేడు.

"నేను వినదలుచుకోలేదండి" విసురుగానే వెళ్ళిపోయింది.

అతని నవ్వు వెనక వినపడుతోంది. అది తన్ని బంకులులో పెట్టినట్టే వుంది.

అతను తనవెనుకే వచ్చేడు. దగ్గరగా తీసుకుంటూనే – "నన్ను అర్థం చేసుకోలేక పోతున్నావ్."

"అర్థం చేసుకోకేం మీకు నేనంటే ప్రేమేలేదు. మీకు మీ ఆ సారస్వత ప్రపంచం తప్ప మరోటి లేదు. అందులో నేను లేను. దాన్నిగురించి ఆలోచిస్తూ సంసారాన్ని ఇల్లా చెయ్యడం బాగులేదు. పైగా మీ ఆశలు సఫలం అవుటకు మన దగ్గర డబ్బులేదు .. " ఉద్వేగంలోనే అంది.

"అవును. నాకు డబ్బు లేదు" నెమ్మదిగానే చేతులు విడిపించుకున్నాడు. అందులో నిరాశ, ఆశల, మధ్య నలుగుతున్న భావన తట్టింది. హృదయాంతరాల్లో విధితో పోరాడి ఓటమిపుచ్చుకున్నట్లు మొఖం బాధపడింది అతన్ని ఆ స్థితిలో చూడలేకపోయింది. తన రాజా, తను ద్వేషంలో, ఈర్ష్యలో, అన్న ముక్కలతో బాధపడ్డం. తను చూడలేదు. అతను తను ఆరాధించే వ్యక్తే. దుఃఖం వచ్చింది.

"రాజా!"

కళ్లు బాదతో చూచేయి...

"రాజా!" అతని ఒడిలో వాలిపోయింది మాటల్తో చెప్పలేని అనునయం, హృదయస్పందనతోనే చెప్పింది కాని అతని కౌగిలింతలో తన పూర్వపు మధురస్మృతి కన్పించలేదు నెమ్మదిగా దూరం అవుతున్న అతన్ని చూస్తుంటే ఏడ్పు వచ్చింది. కళ్ళమ్మట నీళ్ళు చిమ్మేయి.

క్రిందకు దిగింది. అత్తగారు సావిట్లో కూర్చుని రాట్నం తీస్తోంది. ఆవిడని చూస్తుంటే "అత్తగారూ! మామగారు ఈ జీవనంకు జీవితాన్నే ధారపోసి, బాధలో, బీదనతంలోనే చచ్చిపోయేరు. ఈనాడు రాజాకు కూడా ఆ మార్గమే ఉత్తమమైనదని ఎందుకు ప్రోత్సహిస్తారు. అతని జీవితానికి ఉరితాడు తగిలిస్తున్నారని మీకు తెలియటంలేదా? మీ హృదయంలో ప్రేమ, వాత్సల్యం చచ్చిపోయేయా!" అని అడగాలన్నంత ఉద్వేగం కల్గింది.

నెమ్మదిగానే దగ్గరగా వస్తూనే "అత్తగారూ! వారు ప్రెస్ కొందామనుకుంటు న్నారు మీకు ఇష్టమేనా?" అంది.

"ఔనమ్మా!"

"మామగారు అంతగా... ఇప్పుడు కూడా?" ఆవిడ తలెత్తి చూచింది. ఆ చూపులో మార్పే లేదు. కొంచెమైనా భావం స్ఫురించని చూపే ఉండిపోయింది.

"ఆయన కొన్నివత్సరాలు వసంతకాలాన్నే చూచేరు" అంది.

అంతకంటే ఏమీ మాట్లాడనేలేదు. ఆవిడ తను నూలు తియ్యడంలో మునిగి పోయింది. ఎదురుగా అలమారుల్లో ఉన్న పుస్తకాలు, గూళ్లల్లో ఉన్న పుస్తకాలు, ఎదురుగా నవ్వుతున్నట్లే వున్నాయి. తను నుంచోలేదు. ఈ గృహంలోనే స్థలంలేనట్టు వుంది. తల్లీ, కొడుకూ, ఇద్దరూ కూడా అర్థంకాని వ్యక్తులైపోతున్నారు.

తన గదిలోకి వెళ్ళింది. మనసారగా ఈ ఆరాటన ఉపశమించడానికే ఏడ్చింది. తనకే నమ్మకం కల్గటంలేదు. రోజూ పూజలు, ఉపోషాలు, నైవేద్యాలు పుచ్చుకుంటున్న దేవుడు వున్నాడా అని.

★ ★ ★

ఎంతసేపు నిద్రపోయిందో సుందరికే తెలియలేదు. క్రింద అత్తగారి, రాజా మాటలు వినపడుతుంటే ఖంగారుగానే లేచింది. ఆ నిద్రలో "ఇంతకీ రాజాకి డబ్బు లేదు. తనే ఉర్దినే ఊహలు కల్పించుకుని బాధపడుతోంది" అనుకుంది తను ఎంత మూర్ఖురాలిగా ప్రవర్తిస్తోందో తట్టింది. క్రిందరకు దిగింది. తల్లీకొడుకు లిరువురూ కూడా సంతోషంలోనే మునిగిలేచినట్టే స్ఫురిస్తే తనే తెల్లబోయింది అంత ఆనందంగా వుండుటకు కలిగిన పరిస్థితులు తను ఆలోచిద్దామన్నా దొరకటంలేదు.

"సుందరీ! ఎన్నాళ్ళు ఇల్లా వుంటాను. నా ఆశలు సఫలం అవ్వాలి. ఈనాడు అప్పు అడుగుదామన్నా నా స్థితి చూసి ఇచ్చేవారు లేరు అమ్ముదామన్నా నాకు ఆస్తిలేదు. ఒక్కటే తట్టుతోంది. ఉమాపతి మామయ్య ఉన్నాడు ఆయనకు సారస్వతం

అంటే ఇష్టం. ఆయన నాకేమైనా చేబదులుగా ఇస్తాడేమో? దాంతో నేను నా పత్రిక నా స్వంతప్రెస్‌లో ప్రారంభించగలుగుతాను"

"ఉమాపతి మామయ్య?" అతనెవరో తెలిసింది కాదు.

"ఉమాపతి నా తమ్ముడు. పక్షవాతం వచ్చింది. ఇప్పుడు రేపల్లెలో ఉన్నాడు" అంది అత్తగారు.

పక్షవాతం వచ్చిందా! ఈ తిండీ, నిద్ర మర్చిపోయి. ఆలోచనల్లో, ఆరోగ్యం చెడగొట్టుకుని సారస్వతం కొరకు పక్షవాతం తెచ్చుకున్నాడా? తనకి భయం కల్గింది. అడుగుదామనుకుంది.

"అదొక్కటే మార్గం. నా ప్రయత్నాల్లో ఆఖరుది కూడాను. మామయ్య సహాయం చెయ్యకపోతే..." నుదురు తుడుచుకుంటూనే, "చెయ్యడు అని అనుకోలేను. తప్పక చేస్తాడు" అన్నాడు.

"ఆయన చేస్తారా?"

చేస్తాడు. అతనంతా ఓ చిత్రమైన మనిషి. నేవ్రాసే ఉత్తరం మంచి మూడ్సులో ఉన్నప్పుడు అందితే..."

కాఫీ తాగినతర్వాతనే రాజా ఉత్తరం వ్రాసేడు. ఆ వ్రాస్తున్నంతకాలం, రాజాలో ఉన్న ఆతృత, ఆశ, స్వయంసిద్ధీ, అన్నీ కూడా ఉలకేయి. ఆనందం, సంతోషం కళ్ళల్లో మెరిసేయి. ఆ సాయంకాలమే టపాలో వేసివచ్చేడు.

సుందరిని మాత్రం ఈ చర్య స్తబ్దత పరచింది. హృదయంలో క్షోభ, ఆందోళన, భయం కమ్ముకున్నాయి. రాజామొగంలోకి ధైర్యంగా చూచేశక్తి కూడా పోతోంది.

చిలక్కొయ్యను ఖండువా వేస్తూనే "పిచ్చి వూహలు పెట్టుకుని ఎందుకు బాధపడతావ్. వాట్లని తరిమెయ్యాలి. జీవితాన్ని ఈ పరిస్థితుల్లో అల్లా మలుచుకోవడంలో ఉంది గొప్పతనం" అన్నాడు.

జీవితాలు, పరిస్థితులు, మలుచుకోవడం, ఏమిటి ఈ ముక్కలు, అర్థం కాకుండా మాట్లాడటమే జబ్బు అనుకుంది. తన తలంపులన్నీ కూడా మూర్ఖమైనవి, ఆధారంలేనివి, భయంతో వున్నవి, అని రాజా ఎందుకు అంటాడో, తెలిసింది కాదు.

ఆ జరిగిన రోజుల్లో పోస్టు బంట్రోతు ఉత్తరం తెస్తాడేమో అన్న ఆందోళన, ఆశతోనే రాజా గడిపేడు. అలసివచ్చిన సాయంకాలంలో "ఇవ్వాళ ఉత్తరం వచ్చిందా?" అని అడిగేవాడు. "రేపు వస్తుందేమో" అనేది అత్తగారు.

నాలుగురోజులు గడిచేయి. అన్ని రోజుల్లో ఆ మధ్యాహ్నం ఉత్తరాలు అందుకునేందుకు సుందరే వెళ్లింది. ఆరోజుల్లో "ఇవ్వాళేమీ లేవండి" అంటంతో ఓ విధమైన భారం తగ్గినట్లే వుండేది.

ఐదోరోజు, యధాలాపంగానే ఆ రెండు గంటలకు వెళ్ళింది. "అమ్మా, టపా" అంటూనే ఉత్తరం చేతిలో పెట్టేడు. తన చెయ్యి వణికింది. అందుపైనున్న ముద్ర చూచింది. 'రేపల్లె'. ఉమాపతిగారు వ్రాసిందే. పిరికితనంలో ఇంట్లోకి చూచింది, ఎవ్వరూ కన్పించనేలేదు. ఓవిధమైన ధైర్యం వచ్చింది. ఉత్తరం రాజాపేరుతో వున్నా చింపింది. మడతలు విప్పుతుంటేనే గుండెలు కొట్టుకున్నాయ్.

"రాజా! నా ఆరోగ్యం సరిగ్గా వుండటంలేదు. నువ్వు అడిగిన డబ్బు యివ్వడానికి అభ్యంతరం లేదు. మీ తండ్రి పోకడలే నీలో వున్నందుకు చాలా సంతోషిస్తున్నా. ఒక్కసారి నా దగ్గరికి రా!" అని వుంది. ఈ ప్రపంచం తన కళ్లల్లో, ఆశల్లో తలక్రిందులే అయ్యింది. తను భరించుకోలేని కోపం వచ్చింది. ఈ పక్షవాతం మామయ్య ఎవడు, తన్ని తన రాజా నుండి దూరం చెయ్యడానికి, అన్న కోపంలోనే, ఉత్తరాన్ని చించింది. ప్రతి చిన్న ముక్కనీ నలిపేసింది. దూరంగా దూరంగానే గోడపతల పారేసి ఇంట్లోకి వచ్చింది. అందులో శాంతి వచ్చినట్లే తట్టింది. తన రాజా పునఃమామయ్యకు ఉత్తరం, స్వాభిమానంలో వ్రాయడని తెలుసు. ఇప్పుడు తను భద్రతగానే ఉండినట్టు తట్టింది. ప్రక్క గదిలోనుండి అత్తగారు వచ్చి "ఉత్తరాలేమైనా వచ్చేయా?" అడిగింది.

"లేవు". ఆ సమాధానం ఇచ్చేటప్పుడు సుందరికి మాటలు ఒణికేయి. గబగబా అడుగులు వేస్తూనే మెట్లు ఎక్కింది. సాయంకాలం రాజా వస్తాడు. ఆ కళ్ళల్లోంచే అడుగుతాడు. ఇన్నాళ్ళు ఓ భయంతో వేగిపోయింది. ఇప్పుడు దానికి తను ఎందుకు తలొగ్గాలో కూడా తట్టలేదు.

అనుకున్నట్టే రాజా అడిగేడు. 'రాలేదు' అనే తలూపింది. ఒక్కసారిగా అతను కృంగిపోయేడు. తన అబద్ధం కృతఘ్నత ఏవిధంగా కన్పడిపోతుందోనన్న భయాందోళన లోనే సుందరి నిరుకుగా చూడలేకపోయింది.

ఆ సాయంకాలమే వరండాలో కూర్చొని "సుందరీ! ఉత్తరం ఎందుకు రాలేదు! ఇప్పుడు రాదు అన్నట్టే అయితే భావి ఎల్లాగా అన్నదే సమస్యగా వుంది" అని కిటికీ వూచలవైపు చూస్తూనే అన్నాడు.

దగ్గరసానే వెళ్ళింది. అందులో అతని అశాంతి, తన్నినుంచోడానికి కూడా హక్కు లేనట్టే చేసింది. అని భార్యే తను. అతని ప్రేయసే, ఆరాధింపబడే దేవకన్యే - కాని ఇప్పుడో ఓ కృతఘ్నురాలు, దగాకోరు, అబద్ధాల పుట్ట అన్న భావన హృదయాన్ని పిండింది. కాని తనేం చెయ్యాలో తెలియలేదు. తన ఆత్మకి అతను జీవితంలో అర్ధాకలితో, బీదతనంలో ప్రపంచకంలో వేగిపోతూ, అంశాతుణ్ణిగా చెయ్యడం, తప్పించేనుకదా తృప్తిపడూ, అని చెపుదామన్నా, అది ఆగటంలేదు.

ఆరోజుల్లో చూచింది. రాజా అన్నమే తినడంమానేసేడు. సమస్యల్తో వేగిపోయి ఎముకల ప్రోగే అయ్యేడు. అత్తగారూ ఆ ముభావంలోనే క్రుంగిపోయింది. అందులో ఇద్దరి ఆశల్లోని కలలు, నెమ్మది నెమ్మదిగా రక్తం చిదిమి మంగళహారతు లిస్తున్నట్టే తట్టింది. తను చూడలేకపోతూనే వుంది. తనకేచోటు లేనట్టే వుంది. ఆ రోజులు చూడలేకనే తమ్ముడికి ఉత్తరం రాసింది. "తన్నొకసారి పుట్టింటికి తీసుకువెళ్ళమని".

ఆ ఆదివారం తమ్ముడు వచ్చేడు. కొన్నాళ్లైనా దూరంగా వుంటే తన ఆరాటన శాంతి కల్గుతుందనుకునే బండి ఎక్కింది. ఆ శబ్దాల్లో తన రాజాహృదయం గగ్గోలుపెట్టినట్టే తట్టింది. తనెవరు? ఏం చేసింది? ఏం పొందగల్గింది? ఇదేనా గృహిణికి అర్ధం? ఎన్నో ప్రశ్నలు వచ్చేయి. భరించుకోనేట్లే...

"తమ్ముడూ! రేపల్లె వెళదాం పద" అంది. అందులో అందులో ఉమాపతి మామయ్యను ఓసారి చూస్తే, అతనితో తన హృదయం పెప్పుకోగలనేమో అనిపించింది. తను పుట్టింటికి వెళ్ళి రాజాకి తను చేసిన అపచారం అంతా వ్రాద్దామనుకున్న భావన నిలవటంలేదు. అది చెయ్యలేదు కూడాను.

రేపల్లెలో ఉమాపతిగారి ఇల్లు తెలుసుకోవడంలో ఏం అంత కష్టపడలేదు. తమ్ముడికి అంతా ఆశ్చర్యంగానే వుంది. అక్క ప్రవర్తన అసలు అర్థం కానే కావటంలేదు. పతేమైనా కాస్త చెడిందేమో అనుకున్నాడు.

లోపల్కి వెళ్ళింది. సావిట్లో మూలగా ఆయన మంచం కన్పించింది. దిండ్లు ఎత్తుగా పెట్టబడి ఆయన కూర్చున్నాడు. 'ఎవరో' అన్నట్టు చూపులు ఉండిపోయేయి.

సుందరి అడుగులు వేస్తూనే "నేను మీ మేనల్లుడి ... "

"రాజా పెళ్ళానివా! ఎందుకు వచ్చేవు? వాడు పంపేడా? వాడి జీవితానికి ఓ ఆధరవు ఏర్పరచి వెళ్దాం అనుకునే ప్రెస్‌కు డబ్బు యిస్తానన్నా. కనీసం కృతజ్ఞతలో నైనా ఉత్తరం రాయలేకపోయాడు. ఇన్నాళ్ళ నుండి ఆశపెట్టుకునీ ఉన్నాడే, కాస్త వుత్తరం వ్రాయకూడదూ. పోనీ తన ఉద్దేశ్యం మార్చుకున్నానైనా తెలియ పరచక్కర్లేదూ?" ఆయన కోపంలోనే అన్నాడు.

"లేదండీ! మీరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు."

"తప్పు అర్థాలా! నీకేమైనా... వెళ్ళు... ఇక్కడకు ఎందుకు వచ్చేవు?"

"వినండి... కోపపడ్డా, దానికి నేనే బాధ్యురాల్ని ఆ వుత్తరం నేనే చింపేశేను. రాజా కాని, అత్తగారు కాని చూడలేదు."

"ఏమిటి?"

"నిజమేనండి. నేనే చింపేసేను. అది నా స్వార్థమే కావచ్చు. అతను సారస్వత ప్రపంచంలోకి వెళ్ళడం నాకిష్టంలేదు. అందులో కొట్టుకుంటూ, తిండీ, బట్టా కూడా కరువై ఈగల్లా మాడిపోవడం నాకు యిష్టంలేదు." సుందరికి ఏడ్పే వచ్చింది. ఆయన కళ్ళల్లోకి చూస్తూనే ఇదేనా నీ త్యాగం. నీ భర్తను ప్రేమిస్తున్నానంటావా? ఇదే నీ ప్రేమ అన్నమాట."

'కాదా' అందామనుకుంది. కాని అది గొంతులోనే కొట్లాడింది.

"నీలాంటి పెళ్ళాలుంటే మనుష్యులు...." ఆయన పూర్తిచేయకుండానే "అందుకే, నేను నా పుట్టింటికి వెళ్లిపోతున్నా, అతన్ని చూడలేకనే."

"వెళ్ళి ఏం చెయ్యగలవ్! ఎంత తప్పు పనిచేసేవో అర్థం అయ్యిందా."

సుందరి మాట్లాడలేకనే మూగపోయింది. తన స్థితి, న్యూనత, ఆందోళన అన్నీ కూడా ఎదురుగా ఆయన మాటల్తో చస్తున్నాయ్.

"రాజా రక్తంలో అతని తండ్రి ఉన్నాడని మర్చిపోయేవా! మా బావ ఆ రోజుల్లో ఎంతగా ప్రతీ ఇంట్లో చెప్పుకునేవాడయ్యేడో నీకేం తెలుసు. అతను బీదరికంలో బ్రతికేడని, కష్టాలు పడలేక సంసారాన్ని కాల్చేడని, అస్తీపాస్తీ తగలబెట్టేడని ఎవరు చెప్పేరు. ఈ ఊహలన్నీ నీ కుంచిత భావాల ఫలితంకాని ఇంకేమిటి?"

తను వ్రాసుకున్న రామాయణంకు టీక చెప్పినట్టే వుంది.

"రాజా ఆ ఆశలోనే, గొప్పవాడు ఎందుకు కాలేడో నువ్వు చెప్పగలవా? వెళ్ళు, రాజాని రమ్మని చెప్పు."

"ఈ స్థితిలో వెళ్ళితే, నన్ను ...."

"పిచ్చిపిల్లా! ఆదరించుతాడా అంటావా? ఆ ప్రేమ వుంటుందా అనుకుంటావా? కవిహృదయంలో ప్రేయసీకి వున్న స్థానం ఇంకెవరికీ కూడా వుండదు. ఆ స్థితి పొందుటకు నువ్వు ఎంత పుణ్యం చేసుకున్నావో."

సుందరి ఆ పూటకూడా అక్కడ వుండకుండానే తమ్ముడితో బయల్దేరింది. ఈ అర్థం కాని సంగతుల్లో తమ్ముడు ఏమైనా ఓ నిర్ణయం చేసుకోగలనేమో అని ఆలోచించేదు. అది దొరకటంలేదు. స్టేషన్కు వచ్చినపుడే "అక్కాయ్ మనవూరికే టికెట్టు కొననా?" అడిగేడు.

"వద్దు, నా ఇంటికి వెళ్ళిపోతా. మరోసారి వస్తా" అంది. తమ్ముడికి అమ్మ అడిగితే ఈ సంచారాల్కి ఏమి అర్థం చెప్పాలో తెలియక తికమకపడ్డాడు.

తనింటికి వచ్చేటప్పుడే ఆ ఇల్లు చూస్తుంటే - తను జీవితంలో ప్రేమ, ఆరాధన ఆ ఇంట్లోనే నేర్చుకుంది. సంసారంలోని సుఖం, మాధుర్యం రుచి చూసింది. ఇప్పుడో అవన్నీ స్వార్థంలోనే మర్చిపోయి వదిలిపెట్టింది. తన హృదయమే తిరగపడింది. తన శరీరం ఇప్పుడు ప్రతీ కణం, ప్రతీ భాగం ఎలుగెత్తి తన భరోసాతనాన్ని తిడుతోంది. ఎత్తి చూపిస్తోంది. ఏమవుతుంది? ఎల్లా పరిణామాల్లో తను కట్టబడుతుంది?

తలుపు తోసింది. అత్తగారు పత్రికలోనుండే తలెత్తింది. అందులో ఆశ్చర్యం కొంచెం పొడచూపింది.

"ఆయన ఏరీ!"

"రాజానా! తిరుగుతున్నాడు. దుఃఖం భరించుకోలేకనే ఇల్లు మర్చిబోయేడు" అంది.

తనేం చెయ్యాలి. సుందరికి శరీరంలో నవనాడులు క్రుంగిపోయేయి.

"అప్పుడే వచ్చేసే వేం?"

"ఆయన్ని క్షమాపణ అడగడానికి ఉమాపతి బాబుగారింటికి వెళ్ళే. ఆయన ఈ రోజుకే ఎదురుచూస్తూనే వున్నారు, రాజా వస్తాడని" - ఇక మాట్లాడలేకనే కుర్చీలో కూలబడింది.

ఆవిడ దగ్గరగానే వచ్చింది. భుజంమీద చెయ్యివేస్తూనే "నాకు తెలుసు. నేను ఆరోజు కిటికిలోనుండే చూచే. నువ్వు ఉత్తరం చింపేవు. ఆ గోడవరకూ కూడా వెళ్లేవు. చింపిన ముక్కలు పారెయ్యడానికి...

ఉలిక్కిపడే భయంలో తలెత్తి "రాజాతో మీరు చెప్పేరా?" అడిగింది సుందరి.

నవ్వింది. "పిచ్చిపిల్లా. భార్యాభర్తలు వారి సమస్యల్ని వారే చర్చించుకోవాలి. నిర్ణయానికి రావాలి. ఒకళ్ళు పెద్దనమ్మా అంటూ కలగచేసుకోవడమంత తెలివితక్కువ లేదు. నువ్వు ఓ రోజు కాకపోతే ఇంకోరోజైనా రాజాతో నిజం చెపుతావనుకున్నాను.

ఇన్నాళ్ళూ వాడికి ఎంత క్షోభ కలుగజేశావో నువ్వు చూడలేకపోయేవు. పైగా నేను భార్యమీద నేరాలు చెప్పి విడతీసేంత మూర్ఖురాల్ని కాను" అంది.

సుందరికి అత్తగారంటే కొంచెం అర్థమైయ్యిందేమో! చెయ్యెత్తి నమస్కరించింది.

"రాజాకి వాళ్ల తండ్రి పోలికలూ, పట్టుదలా వుంది. వాడి భావిలో వాడి ఆదర్శం పొందగలదన్న ధైర్యం వుంది. ఓనాటికైనా మీరిద్దరూ కలుస్తారని, జంటగానే మీ సమస్యల్ని పరిష్కరించుకుంటారన్న ధైర్యం వుంది."

కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి. అత్తగారు అనుభవం అంతా మూర్తీభవించే చెప్పింది. తన్నో, ఈ స్థితిలో రాజా నమ్ముతాడా? తను పతనం చెందింది. ఇందులో నరకం అనుభవించి, ఆ స్వర్గానికి ఎగస్తోంది. అది అందుతుందా?

"అత్తగారూ! మీ విశాల హృదయం నాకు లేక పోయింది. కాని ఇప్పుడు రాజా నన్ను నమ్ముతాడా?"

"సుందరీ! వెళ్ళు. వాడితో మాట్లాడు. వాడింకా నువ్వంటే ఆరాధిస్తున్నాడు"

గుమ్మంమీద చెప్పుల చప్పుళ్ళు వినపడ్డాయి. ఆ అడుగులు రాజావే! సుందరికి భయం వేసింది. ధైర్యం చాలటంలేదు. "అత్తగారూ! మీరుండండి" ఆవిడ చెయ్యి పట్టుకుంది.

నవ్వుతూనే "భార్యాభర్తల తగువు అది. నే నెందుకూ" అంటూనే వెళ్లింది. రాజాతో చెప్పింది. అతని ఆశ్చర్యపు శబ్దం తను విందీ. "స్త్రీకి జాలీ అనునయం కావాలి. ఆమె ఏది చేసినా నీయెడ వుండే ప్రేమచేతనే" అని అతనితో అన్న ముక్కలు కూడా వినపడ్డాయి.

రాజాని చూసింది. ధైర్యం చాలటంలేదు. ఆ రెండు దినాల్లోపలా ఎంతగా మారి పోయేడో అని ఆవేదన పడింది. కళ్ళనీళ్ళు కమ్మేయి. మాట్లాడలేకపోయింది. అతనే దగ్గరగా వచ్చి చేతుల్లోకి తీసుకున్నాడు. బావురుమని పోయింది.

"నిజంగానే రాజా! నిన్ను నేను పిరికితనంలో స్వార్థంలో, కుత్సితంలోనే ప్రేమించాను. కాని ఈనాడు నేను దాన్ని జయించగల్గేనేమో! నా స్వార్థాన్ని పిరికితనాన్ని..."

"రాణీ! అవన్నీ మర్చిపో! నువ్వు వచ్చేవు. అంతే చాలు." హృదయాన్ని హత్తుకున్నాడు. కరిగిపోయే అతనికి చెప్పింది.

"రేపే వెళదాం రాజా!"

"పిచ్చీ!" అతను నవ్వేడు. అందులో తను నాగకన్య అయ్యిందేమో! అమరత్వం చూచిందేమో! కరిగే పోయింది సుందరి. ఈ ప్రపంచకమే లేదు.

● భారతి - 1950 ●

# 17. గాలిపటం

♦ వట్టికోట ఆళ్వారుస్వామి ♦

నాలుగు నెలలు మందు ఇచ్చి ఇంటికి పొమ్మన్నాడు నా వైద్యుడు. "నీకిక పరవాలేదు. వజ్రకాయుడివి" అని ఆశీర్వదించాడు. నా శరీరములోని బలహీనతలు, బలహీనతలకు కారణమైన వ్యాధులు మొదలంటా రూపుమాసిపోయినంత ధైర్యము పొందాను. ఏ అమృతమో నేను తెలుసుకోలేని ఇంక ఏదేని గొప్పవస్తువో వైద్యుడు నాకు వాడి వుంటాడని ఉల్లాసపడ్డాను. వికసించిన ముఖంతో ఇంటికి బయలు దేరాను.

ప్రతి నిత్యం ఆహార విహార విషయంలో తీసికోవలసిన జాగ్రత్తలన్నీ వైద్యుడు ఏకరువు పెట్టాడు. ఆయన విధించిన షరతులన్నింటిలో ప్రతినిత్యము పరగడుపున పావుసేరు ఆవుపాలు తాగటం చాలా ముఖ్యమైనది.

ఇంటికి వచ్చిన తర్వాత పదిహేనురోజుల వరకు ఆవుపాలకోసం ఎంతో అవస్థ పడ్డాను. నమ్మకంగా కల్తీలేకుండా ఆవుపాలు దొర్కడం ఈ రోజుల్లో కష్టమని నా ప్రయత్న ఫలితం తేల్చివేసింది. "మనుషుల్నే కల్తీచేస్తున్న ఈరోజుల్లో స్వచ్ఛమైన ఆవుపాలు ఎట్లా దొరుక్తాయి?" నా మిత్రుడు సీతయ్య అన్నాడు. అప్పుడే అతడు వోట్ల పోలింగు బూత్‌నుండి నిరుత్సాహంతో ఇంటికి వెళ్తున్నాడు. పోలింగులో తన ఆప్తమిత్రులే, తనకు బాగా పరిచయం వున్నవాళ్ళే మారుపేర్లతో మభ్యపెట్టే మాటలతో చేస్తున్న చేష్టపై అసహ్యత కల్గిందేమో! వారి ఆటలను కట్టివేయడం నిజాన్ని బట్టబయలు చేయడం శక్తికి మించిన పనైందేమో! తుదకు సీతయ్యకు నిరాశ నిస్పృహ కల్గి నిర్వీర్యుడైన దేబె ముఖంతో ఇంటిదోవ పట్టడమే అతని మనసులో చెలరేగుతున్న తుఫాన్ను అడ్డుకొనుటకు మార్గమనుకున్నాడేమో!

అతని ఆ మాటలు నా అమాయకత్వాన్ని అద్దంలో చూపించినట్ట నిపించింది. అయినా ఆవుపాలు దొరకని పరితాపము నన్ను వేధిస్తూనే వుంది. ముఖ్యమైన పెద్ద పెద్ద పాల దుకాణాలన్నీ తిరిగాను. వేల రూపాయిల బేరంచేసే పాలవాండ్లను అడిగాను. తుదకు విసిగిపోయాను. కాని ఒక విషయంలో మాత్రం నాకు చాల తృప్తికలిగింది. పాలబేరం చేసే ప్రతివాడు కల్తీలేని ఆవుపాలు దొరకవని చెప్పే స్థాయికొచ్చాడు. అటువంటి నగ్నసత్యాన్ని అరమర లేకుండా బయటపెడ్తున్నారు. కల్తీపాలు కల్తీ కానివని చెప్పి అమ్మచూచే చైతన్యం మనోనిబ్బరం దెబ్బతిన్నందుకు సంతోషించాను.

నేను ప్రతిరోజు ఆఫీసునుండి ఇంటికిపోయే సందులో పాలు పెరుగు అమ్మే ఒక చిన్న దుకాణం వుంది. అంత చిన్న దుకాణంలో ఆవుపాలు దొరకడమే ఎక్కువకంతో ఎన్నడూ అడ్డనేలేదు. కాని అనుకోకుండానే ఒకరోజు ఆ దుకాణంలో కూర్చున్న ముసలివాన్ని అడిగాను. "కల్తీలేని పాలు దొరకడం కష్టం మనం గట్టిగా ముందులకు కావాలని పాలు తెచ్చేవాండ్లకు చెప్తే సరేనంటరు కాని నమ్మటం కష్టం" ఒక్కొక్క మాటను తూచినట్లు గొణ్ణుతూ అన్నాడు. ఇంతలో ఒక అమ్మాయి పక్కగదిలోంచి తొంగి చూచింది. "ఎందుకు దొర్కవు మామ మన పెంటయ్య రాసు మూడు ఆవులున్నయట, పాలు సుతం ఇస్తున్నయట, మనకుపోసే పాలల్లో ఆవుపాలు కల్పుకొనే తెస్తుండు" అంటూ ఆ అమ్మాయి నా కెదురుగా వచ్చి నిల్చుంది. ఆ అమ్మాయి కండ్లు వింతగా తెర్చి పరీక్షగా చనువుగా నన్నే చూడసాగింది

"ఏమో మరి అడిగిసూడాలె" ఆ ముసలివాడు పాలకుండ పొయిలో బొగ్గులు సవరిస్తూ అన్నాడు.

"రోజు ఎన్నిపాలు కావాలె నీకు" మందహాసం తొణికిస్తు ఆ అమ్మాయి నన్ను ప్రశ్నించింది.

ఇన్నాళ్ళనుండి పాలు దొరక్క విసిగివేసారి వున్న నాకు ఆమె మాటలతో ఎంతో ఆశకల్గింది. పైగా ఆమె నావైపు చూస్తున్న వైనం, మాట్టాడే పద్ధతి ఎటువంటి వాన్నైనా ఆకర్షిస్తుంది.

ఆ అమ్మాయి చాలా అందంగానే వుంటుంది. పచ్చని శరీరము, వెడల్పాటి కండ్లు, నిటారైన ముక్కు, పల్చని చెంపలు, దానిమ్మ గింజల్లాంటి పండ్లు, ఎత్తుకు తగిన స్థూలము, బిగువైన రవికె, అద్దకపు తెల్లచీరెతో సొమ్ములులేని లోపాన్ని కప్పివేస్తూ మెరుస్తున్నది. పాలసంగతి మరచిపోయాను. మనస్సు చెలించింది. నేనూ కండ్లన్ని ఆమె కప్పగించి తనివితీర చూచాను ముసలివాడు తల నేలకు వేసి పక్కచూపులతో ఇదంతా గమనిస్తూనే పాలను కల్పుతున్నాడు. కొంటెగా తనకు తనే నవ్వుకొనుచున్నాడు. నా చిత్త వికారానికి కాకలుతీరిన ఆ వృద్ధుడు తన మధుర స్మృతుల్లో విహరించాడేమో.

అన్ని బలహీనతల నుండి కోలుకొని "వజ్రకాయుడు" గా వైద్యునితో వరము పొందాను కదు. అయితే అప్పటి నాస్థితి బలహీనమునకు చిహ్నమా, పుష్టికి పునాదా. తికమకపడ్డాను. తిరిగి తలెత్తి ఆ అమ్మాయిని చూడటానికే సాహసం కల్గలేదు.

"ఊఁ" అన్నది ఆ అమ్మాయి.

తలెత్తి చూశాను. నా ప్రత్యుత్తరానికై ఆ అమ్మాయి తన కండ్లపాపలను, కనుబొమ్మలను ఆడిస్తూ ప్రశ్నించింది. నా మనస్సును స్థిమితపర్చుకొని "రోజు అద్దసేరు చాలు" అన్నాను.

"రూపాయి..కొక..." అంటు ఆ అమ్మాయి కొంటెగా చూపుడువేలు చూపింది.

"ఆఁ" అన్నాను.

"ఒకసారేందే పిచ్చిముండ" ముసలివాడు నవ్వాడు.

"ఒకసారన్నానామామ, ఒకసేరంటి" అని పైట సవరించుకుంటున్నట్టు నటించింది. "మరి ఏమంటావు ఇష్టమేనా?" అంటూ ద్వార బంధాన్ని కౌగలించుకొన్నట్టు ఆసుకున్నది. ఆమె శృతిమించుతున్నది. ఆరునెల్ల ఆవుషధసేవతో పొందాననుకొన్న శక్తి, దారుధ్యమూ నీరై పోయాయి.

తత్తరపడుతూ వణుకుతున్న నాలుకను స్వాధీనపర్చుకుని "ప్రతిరోజు పైసలిచ్చి పిల్లవాన్ని పంపుతుంటాను. కాగినవే పోస్తుండు తాత" తలవంచుకొని అన్నాను. ఆమెను చూడటానికే భయం వేస్తున్నది.

"తాతకే చెప్పుకుంటున్నవు? తాత ఎప్పుడు కూచోపోయినాడు? నేనే అమెశ దుక్నంలో వుంట. మరి ఏడి ఏడియి ఇక్కడ్నె తాగిపోరాదు?" ఆ అమ్మాయి పాత బంధువంత చనువుగా అడిగింది.

ఆ మాటలతో నేను గుటకలు మింగటం ఎక్కువైంది. సమాధానం యిచ్చే యోగ్యత లేకపోయింది. అవుతల పడాలని ఆలోచిస్తున్నాను. నాకు ఆవుపాలు ముఖ్యం. పాలమ్మాయి దూరపు కొండవలె నన్ను ఆకర్షిస్తున్నది. కాని దెగ్గర్కి పోతే?

"ఏమిటీ పిరికివేషం? ముగ్గురు పిల్లల తండ్రివి అంత అసమర్ధత ఎందుకు? నీవూ ఒక మగవాడివని అందులో అందమైన వాడివని ఆ అమ్మాయి మోహించింది. నీవు పక్కకు తొలిగినంత మాత్రాన చేస్తున్న ఉద్దారకమేమిలేదు" హృదయములో తుపాను రేగింది. జ్వరలక్షణాలు ఏర్పడినై, చెవుల్లో గుయ్యుమని ధ్వని పుట్టింది. నా మిత్రుడు వెంకట్రావు ఒకసారి వీపు తట్టి ఎన్నడో చేసిన హితవు జ్ఞాపకానికొచ్చింది. "ఎవరో ఏమేమొ తప్పులు చేస్తుంటారని, అవినీతిగా మెల్గుతుంటారని మనం అనుకుంటాం. కాని అటువంటి వాతావరణం పరిస్థితి ఒత్తిడి మనకు కల్గినపుడు మనము ఏ మౌతామొ అప్పుడుగాని తేలదు." వెంకట్రావు నిజంగా అక్కడ వుంటే నా కన్నీటితో అతని కాళ్ళు కడిగి నెత్తిన చల్లుకుందామన్నంత ఆవేశం పొందాను. మొఖమంతా మాడ్చుకుని ఆ అమ్మాయిని అసహ్యంగా చూస్తు "పిల్లవాడికి పైసలిచ్చి పంపుత. పాలు మాత్రం కల్తీలేకుండా వుండాలె" అని తల నేలకు వేసుకొని గంభీరంగా ఇంటికి బయలుదేరాను.

నాలుగు గజాలు ముందుకెళ్ళి అనుకోకుండానే వెనక్కు తిరిగి దుకాణం వైపు చూశాను. ఆ అమ్మాయి దుకాణం ముందట నిల్చుండి నావైపే చూస్తున్నది.

"మహామహులను మంటకలిపాం. భస్మాసురున్ని బుగ్గిపాలుచేశాం. రుక్మాంగదుని రూపే మార్పించాం. దేవేంద్రున్ని దేబెగా తేల్చివేశాం. శివుడిని చిందులు తొక్కించాం. విప్రనారాయణున్ని వీధికుక్కను చేశాం. మా విసురుకు తూలిపోనివాడు ఎవడూ లేడు. అంతెందుకు బ్రహ్మకైనా పుట్టు రిమ్మతెగులు" అన్నంత ప్రతీకారం ఆమె చూపుల్లో తాండవమాడ్తున్నది.

పాలమ్మాయి వలెనే ఆనందాన్ని ప్రదర్శిస్తు ఆహ్వానించిన నా భార్యను చూడగానే వాడిపోయిన నా మొఖంలో తిరిగి ఆనందం కళకళలాడింది. ఎండలో అలసిసొలసి వచ్చిన నాకు దట్టమైన నీడ దొర్కినంత హాయి కల్గింది.

నా భార్య అందించిన కాఫీని తాగుతు నాకు నేనే ముసిముసిగా నవ్వు కుంటున్నాను. వక్కలు తీస్కొచ్చి పక్కకు కూర్చొని "ఏమిటండి! మీకు మీరే నవ్వుకుంటున్నారు?" అంటూ నా అంగీ గుండీలు సడిరింది.

పాలదుకాణం సంగతంతా చెప్పాను. "పాలకోసం పోతే ఆవేదొర్కింది. ఇంకేం? అదృష్టవంతులు" అల్మారాలోనుంచి అంగీని తెచ్చి అందిస్తూ కొంటెగా అన్నది నా భార్య.

"ఆ ఆవుపాలు నాకెందుకు?" నిర్లక్ష్యంగా అన్నాను.

"మీరు వైద్యుడిని అడిగి చూడండి. అసలు దొరకాలెగాని మనిషిపాలు చాలా మంచివి అని" కాఫీ కప్పు అందుకొని వెళ్ళిపోయింది.

"చాలా బింకంగా మాట్లాడుతున్నావు. కాని నేను ఆ అమ్మాయి పలలో పడ్తే నీవాలకం ఇట్లా వుంటుందా?" పత్రికను చూస్తూనే అన్నాను.

గ్లాసులో కాఫీ తెచ్చుకొని, ఒక గుటకవేసి, మందహాసం కురిపిస్తూ కూర్చొని "అది మీకు ఉండాలెగాని మేము పడ్తే ఎన్నాళ్ళు పట్టి ఉంచగలం?" అన్నది నా భార్య.

కాలుతున్న గ్లాసును పైటకొంగుతో పట్టుకొని, ఒక్కొక్క గుటక వేస్తూ, ఎవరెవరి భార్యలు ఏవిధంగా ప్రవర్తిస్తున్నది, ఎవరెవరి భర్తలు ఎన్ని పిచ్చి చేష్టలు చేస్తున్నది ఏకరువు పెట్టింది.

"మరి మన గురించి కూడా మనల్ని ఎందరనుకుంటున్నారో?" పత్రికను చూస్తూనే ప్రశ్నించాను.

"ఎవరేమనుకొంటే మనకేమండీ! మన సంగతి మనకు తెలియకుండా ఉందా? ఎవరి నీతి వారినే కాపాడుతుంది...ఇంతకూ ఆ అమ్మాయి విధవా, ముత్తైదా?" కాఫీగ్లాసును పక్కకు గోడవెంట పెట్టి సోది సాగిద్దామన్నట్టు కూర్చున్నది.

"ఏమో! అవన్ని ఎప్పుడు పరీక్షిస్తిని, ఆమె చూపులు విన్యాసాలతోనే హడలిపోతిని" అని పత్రికను మడిచి కిటికీలోంచి బజారువైపు చూశాను.

నా భార్య పైటకొంగు ముడివిప్పి, వక్కలు నోట్లోవేసుకుని "మగవాడికో ఆడది, ఆడదానికో మగవాడు - ఇద్దరూ లేందే ఈ కుళ్ళు బయలుదేరదు గద, దీంట్లో ఎవరిది తప్పంటాం" నిస్పృహతో అన్నది.

మెల్లగా వచ్చి నా పక్కకు నిలుచుండి, కిటికీలోంచి బజారువైపు చూస్తూ, "ముఖ్యంగా మీకు ఆవుపాలు దొరికాయి. కండ్లకింపైన అమ్మాయి కనపడింది. కంటికింపైతే కడుపుక్కూడ ఇంపుగా వుంటాయి. తాగిన పాలు బాగా వంటపడ్తాయి" అని కొంటెగా నన్ను చూచింది.

నా భార్య గొప్పతనానికి, మనోనిబ్బరానికి నేను ఉబ్బిపోయాను. అటువంటి భార్యను కలిగి ఉన్నందుకు చెప్పరాని ఆనందం కలిగింది.

ప్రతిరోజు పాలు తెప్పించుకొంటూనే వున్నాను. ప్రతిరోజు ఆ బాటన ఆఫీసుకు వెళ్తూ, వస్తూనే ఉన్నాను. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు సుమారు వందగజాల దూరంనించి

నన్ను కనిపెడ్తూ చూస్తూ ఉండేది ఆ అమ్మాయి. యీలోగా లక్షసార్లేనా ఆ బాటన నేను పోతుండగ చూచి ఉంటుంది. కాని నేను మాత్రం ఆ విషయం కనిపెట్టలేదు.

పాలం బేరం కుదరిం తర్వాత ప్రతిరోజు ఆమెకండ్లు, నా కండ్లు కలుసుకోవడం, అప్పుడు నా మిత్రుడు వెంకట్రావు కండ్లలో ప్రత్యక్షమవడం జరుగుతుండేది.

ఓసారి సినిమాకుపోతూ, ఆ అమ్మాయిని నా భార్యకు చూపించాను. 'పాపం! ఏదో మంచి ఇంటి అమ్మాయి వోల్నే ఉంది. ఎట్లా ఈ కుళ్ళులో ప్రవేశించిందో 'నా భార్య తనకు తానే మధనపడ్డది. 'అవకాశాలు తక్కువ వున్నాయి గనకనా ?' తిరిగి అన్నది.

సుమారు మూడునెల్లు గడిచాక ఒకనాడు సాయంత్రం ఆ బాటన వెళ్తున్నాను. మసక, మసక చీకటి ఉంది. నేను ఆ దుకాణం దాటి రెండు గజాలు ముందుకు వెళ్ళానో లేదో "లెక్క చూసుకోకపోతివి" ఆ అమ్మాయి పెద్దగా అన్నది. నేను వెనుకకు తిరిగి చూచాను. "నిన్నే రమ్మన్నది" చేతులాడించుకుంటు అన్నది.

నాకు పరీక్షా సమయ మాసన్నమైందనుకున్నాను. వెనుకకు తిరిగి దుకాణం వద్దకు వెళ్ళాను. "ఏం లెక్క? ఎప్పటికప్పుడు డబ్బు ఇస్తూనే వున్నానుగా" అంటూ కండ్లల్లో కండ్లు నిలిపి ప్రశ్నించాను.

ఆ అమ్మాయి ఆలోచిస్తున్నట్టు తలదించుకొని "మేమే మీకు పైసలివ్వాలె" అన్నది. ఆమె శరీరం పులకరించింది. అలసినట్టు ఒక దీర్ఘ నిశ్వాసాన్ని వదిలింది.

ఒక స్త్రీని వలలో వేసుకోడానికి, ఆమెలో దుర్బుద్ధి రేకెత్తించడానికి నూటికి నూటా యాభై వంతు పురుషుని దుష్ట చింతన, ప్రేరేపణ ఉంటుందని నా విశ్వాసం. కాని ఆ అమ్మాయి చొరవ, నిర్భీతి నా విశ్వాసాన్ని తప్పని తేల్చివేశాయి.

ఆ బాటన పొయ్యేవాండ్లు మమ్ములను వింతగా చూసి, తిరిగి తిరిగి వెనుకకు మళ్ళీ చూస్తూ పోసాగారు.

"ముసలాయన లేడూ? ఎక్కడపోయాడు?" లోపలికి చూస్తూ అడిగాను.

"అవు! లేడు. ఉరికిపోయిండు. రేపో, ఎల్లుండో వస్తడు" అని దీనంగా నావేపు చూచింది. ఆ దీనతలో "ఈ అవకాశాన్ని వృధాపోనీయవద్దు" అని ఆమె కండ్లు అంటున్నాయి.

ఒయ్యారంగా తల ఎత్తి 'నీకోసం మీగడ దాచి ఉంచిన తినరాదూ!' అన్నది.

"నిక్కము ఎపనేల ధరణీసురనందనయింకనీపయున్

జిక్కె మనంబునాకు ననుజిత్తజు బారికిన ప్పగించెదో

చొక్కి మరంద మద్యముల చూఱల బాటలువాడుతేండ్ల పొం

పెక్కిన యిట్టి పూవు బొదిరిండ్లను గౌగిటగారవించెదో.' అన్నట్టు ఆమె ఒయ్యారం ప్రదర్శించింది. దాంతో నాకు కలిగిన ఉద్రేకాన్ని చంపుకొని, 'మీగడ వద్దులే. కాని పాలుకల్తీ లేకుండా పోస్తున్నవా?" విషయం మార్చాను.

"కల్తీ ఎందుకు లేదు. కాని..." తలెత్తి కొంటిగా నన్ను చూచింది. ఆ కల్తీ నీకు నుక్సాన్ చెయ్యదులే, మరింత బలంవస్తది, అని ఫక్కున నవ్వింది.

"అంటే?" బొమలు ముడిపెట్టి ఆశ్చర్యంగా అడిగాను.

"మనిషిపాలు.. యిష్టమేనా?" వంకరగా మెడలు తిప్పి ప్రశ్నించింది. నేనేమీ సమాధానమివ్వకముందే "నా పాలే కలుపుతున్న" అని పెండ్లి పిల్లవలె తల నేలకు వేసి "రాత్రి ఎనిమిదిగంటలకు వస్తే...." సమాధానానికై నిరీక్షిస్తున్నట్లు అట్లాగే తల నేలకువేసి ఉంచింది.

స్త్రీ నోట ఆ విధంగా వినడం నాకే సిగ్గుగా తోచింది. ఆమె పరిసరాలు ఆమెలోని స్త్రీత్వమును, లజ్జను మొదలంట రూపుమాపాయని అదిరిపోయాను. నా ఒళ్ళంతా చెమటలు పట్టింది. నా భార్య మాటలు జ్ఞాపకానికొచ్చాయి. మిత్రుడు వెంకట్రావు కండ్లల్లో ప్రత్యక్షమయ్యాడు.

వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాను. ఆ అమ్మాయిలో అప్పుడు సిగ్గు ఆవరించింది. నన్ను భూమిని మెల్లగా చూడసాగింది.

ఇంతలో నా మిత్రుడు మల్లేశం ఆ బాటనపోతు, నన్ను చూచి ఆగిపోయాడు. "ఇక్కడ నిల్చున్నావెందుకో?" అని భుజాన చేయివేసి, క్రీగంట అమ్మాయిని చూచాడు. నేను ఏమీ సమాధాన మివ్వకనే పరీక్షగా మల్లేశాన్ని చూచాను.

"అవును, పని ఉండే వచ్చాను. నేనిక్కడ ఆవుపాలు కొంటున్నాను. వెళ్దాం పద" అని బయలుదేరి రెండడుగులు తిరిగి వెనుకకు వేసి, "చూడు అమ్మాయి ఇప్పుడే వస్తాను" అని తోవ బట్టాను. ఆమె మల్లేశాన్ని క్రోధంగా చూడసాగింది. "సమయానికి వీడెవడో తారసిల్లిండు" అని ఆమె బొమలు ప్రకటిస్తున్నాయి.

ఆ అమ్మాయి విషయం, ఇదివరకే మల్లేశానికి చాలా వివరాలు తెలుసు. వివరంగా ఆ విషయాలన్ని నాతో చెప్పాడు. నాకు కలిగిన అనుభవాన్ని వివరించాను. ఆ అమ్మాయిని ఆవిధంగా గాలిపటం వలె ఉండనివ్వొద్దనుకున్నాను. నా నిశ్చయానికి మల్లేశం చేయూతనిస్తానన్నాడు.

మల్లేశం, నేను నేరుగా మాయింటికి వెళ్ళి నాటి సంఘటన వివరాలన్నీ నా భార్యకు చెప్పాం. మా నిర్ణయాన్ని తెలిపాం.

"మీ కెప్పుడూ ఏదో ఇటువంటివే వెంటపడ్తుంటాయి. సరే, కానియ్యండి, చలికాలం. చాలారాత్రివరకూ పోకండి" అని నా భార్య ఆమోదముద్ర వేసి అనుమతి పత్రం ప్రసాదించింది.

ఆ అమ్మాయి కంటపడకుండా మల్లేశాన్ని మమ్ముల అనుసరించమని చెప్పి, నేను రాత్రి ఎనిమిది గంటలకల్లా పాల దుకాణం చేరుకున్నాను. అమ్మాయి సింగారించుకొని, ఉల్లాసంగా ఉంది.

"మా మామ ఇప్పుడే ఊర్నించి వచ్చిండు. బయట పనుండిపోతనని సెప్పిన. నీవేడికి రమ్మంటే ఆడికొస్త" చనువు ధోరణిలో అంది.

"సరే అయితే, బయలుదేరు"

"నువ్వు ముందుగా నడువు. నేను ఎనకాల ఒస్త."

నేను ముందట, కొంచెం దూరంగా ఆమె, ఆమెకుచాలా దూరంగా మల్లేశం పబ్లిక్‌గార్డెన్స్‌కు చేరుకున్నాం. మల్లేశం మాకు కనుపించేటట్టే దూరంగా కూర్చున్నాడు. యదార్థములో నాకు తోడుగా వుండాలనే మల్లేశాన్ని రమ్మన్నది.

పబ్లిక్‌గార్డెన్స్‌లో లైటుకు దూరంగా ఒకచెట్టుకింద, ఆమె నేను ఎదురుబడి కూర్చున్నాం. ఆమె మాట్లాడాలని ప్రయత్నిస్తున్నది. కాని మాట ఉబికి రావడం లేదు. ఉత్తమ ఇల్లాలువలె బిడియంతో కూర్చుంది.

"నీకు పెండ్లి అయిందా?" గంభీరంగా అడిగాను.

"ఆ! మూడు సార్లు"

నిర్విణ్ణుడయ్యాను. ఆమె కండ్లల్లో నీళ్ళు తిరిగాయి.

"ఆ ముసలాయన నీకు మామెట్లా?"

"ఏదో ఒక వరుస వుండాలని 'మామ' అని పిలుస్తున్నా" గద్గదస్వరంతో అంది.

"అతనికి నీకు సంబంధం?"

"నీళ్ళతో మెరుస్తున్న కండ్లను నా కండ్లమీద నిలిపి, "నాకు ఆయనకేం సంబంధం?" తిరుగు ప్రశ్న వేసింది.

"అదికాదు సంగతి. నీకు ఆయనకు ఎట్లా పరిచయం కలిగింది. నిన్నెక్కడ్నించి ఏమని ఇక్కడికి తెచ్చిండు అని అడుగుతున్న."

"పెండ్లి చేస్తానని తీస్కొచ్చిండు."

"ఊఁ నాలుగో పెండ్లా?"

"పెండ్లి లేదు, పెడాకులు లేదు. అందరు పెండ్లి చేస్తనని యీడికి తెచ్చిన్రు –" కన్నీరు తుడుచుకుంటు అన్నది!

నాతల దిమ్మెక్కింది.

"ఎందుకు ఏడుస్తున్నావు?"

వెంటనే ఆమె సమాధానమివ్వలేదు.

"ఇల్లూ, పిల్లలతో సంసారం చేద్దామని నా గన్పిచ్చదా. మా మామ మందికి భయపడి లేకలేక పుట్టిన పసిగుడ్డును మాయం చేసిండు." చిన్నపిల్లలాగ ఏడ్పు నాపుకుంటూ మెల్లగా చెప్పింది.

నా కండ్లలో నీళ్ళు గిర్రున తిరిగాయి. "చావసిద్ధమైన ముసలివాడికి ఎంత సాహసం" నాలో నేననుకున్నాను.

హిరోషిమాలో ఆటంబాంబుకు గురి అయిన పిల్లలు, పిల్లల తల్లులు, కరువుల్లో సంతానాన్ని, శీలాన్ని అమ్ముకున్న పిల్లలు, పిల్లల తల్లులు, తుఫాన్లకు, భూకంపాలకు నామరూపాలు లేకుండా వేలాది కుటుంబాలు నాశనం కావటానికి ఆ ముసలివాడే కారకుడన్నంత బాధతో ఆ ముసలివాణ్ణి గురించి ఆలోచించాను.

"పెండ్లి చేసుకొని ఓ చోట హాయిగా పడి ఉండరాదు?" మనసులోని స్వాదీనం చేసుకొని అన్నాను.

"నీకు పెండ్లి అయిందిగదా?"

"అవును, మరి నన్నెందుకు రాత్రి ఎన్మిది గంటలకు రమ్మన్నావు?"

"మీ మొగోండ్లకు పెండ్లయితేం" ఇంకా ఏదో అనబోయి, గంభీరించి ఊరుకుంది. వింతగా నన్ను చూచింది.

"చూడు! నీ ఊరేదో చెప్పితే నిన్ను తీసుకెళ్ళి నీకే చిక్కు లేకుండా ఏర్పాటు చేస్త.!"

"మళ్ళీ ఏమొఖం పెట్టుకొని మా ఊరుకుపోతా?"

మరి అయితే ఇక్కడెవరినన్నా పెండ్లి చేసుకుంటావా?"

"మా మామ ఇప్పుడు పెండ్లి కొప్పుకోవడంలే "

"అవును, ఎందుకు ఒప్పుకుంటాడు? వ్యాపారం దెబ్బతినదు?"

ఆ అమ్మాయి బెదిరినట్టు చూచి, "నా సంగతి అంతా నువ్వు బాగనే తెల్సుకున్నవు!" అన్నది.

"తెలిసికోబట్టే నీ విషయంలో పట్టుదల కలిగింది. నిన్నీవిధంగా ఊరికి బలిచేయ తలచుకోలేదు. నేను నీ కొడుకుగా చెప్తున్న. నీ పాలు తాగుతున్న గదా, నీవు నాకు తల్లితో సమానం. నీకు పెండ్లి చేసుకోవాల్నని ఉంటే నీ మామ, గీమ ఎవరూ అడ్డం రానివ్వం. నీకేం భయంలేదు ఇప్పుడే నా వెంటవస్తే ఓచోట నిన్ను పదిలంగా కాపాడుతాం. మంచి పిల్లవాడ్నిచ్చి పెండ్లి చేస్తాం. ఏమంటావు?"

"ముంగట పెండ్లి చేయించినోళ్ళు, చేసుకున్నోళ్ళు గిట్టనే మాట్లాడిన్రు."

మా విషయంలో ఏ విధంగా నమ్మకం కలిగించాలో నాకు అర్థం కాలేదు! కొంతసేపు నిశ్శబ్దంగా గడిచింది.

"నాకు పాలు తాపడంలో నీ అభిప్రాయం?" ప్రశ్నించాను.

"రోజు పిండిపారపోసేకంటే అదే మంచిదనుకున్నా... నా పాలు ఒట్టిగ పార పోయటానికి మన్సొప్పలే" గుడ్లలో నీళ్ళు తీసుకొని అన్నది.

"నీ పాలుతాగే నామీద కన్నెయ్యడం మంచిది కాదనుకోలే?"

నేననుకున్నట్టు ఏది అయుతున్నది. గిట్ట బతకటం నాకిష్టముందను కుంటున్నావా?" గంభీరంగా ఎదురు ప్రశ్న వేసింది.

నా విషయంలో నమ్మకం కలిగించటానికి ఏం చేయాలనో నాకే తోచటంలేదు. కాసేపు తత్తరపడ్డాను. నిశ్శబ్దంగా కూర్చున్నాను.

"ఇంకెంతసేపు ఇట్ట కూసుందాం" తల నేలకు వేసి అన్నది.

"ఏం జేయమంటావు? నా వెంట వస్తావా?"

"ఎక్కడికి, నీ యింటికా?" భయంతో అడిగింది.

అవును నా ఇంటికే. నీకు నామీద విశ్వాసము లేకపోతే నా భార్యకు నా మీద విశ్వాసముంది."

ఆ అమ్మాయి అసమ్మతిగా తల నేలకు వేసింది. రాత్రి మించిపోతున్నది. పరిష్కారమార్గమేమి తోచలేదు. ఎటూ పాలుపోక లేచి నిల్చున్నాను. ఒక నిట్టూర్పు విడిచి ఆ అమ్మాయి కూడ లేచి నిల్చున్నది. నేను ముందుకు సాగుతుంటే మల్లేశం ఎదురైనాడు ఆ అమ్మాయి అతన్ని చూసి బెదిరిపోయింది.

"భయపడకు నా స్నేహితుడే" అన్నాను.

ఆమె ఇంకా బెదిరినట్టు చూడసాగింది.

"ఏమంటది?" మల్లేశం ప్రశ్నించాడు.

"పాపం, నేటివరకు ఆమెకు కల్గిన అనుభవాలవల్ల మనలను నమ్మటం లేదు" అన్నాను.

అయితే మరి ఆమెను తిరిగి ఆ ముసలోనికి ఒప్పచెప్తే ఏమి లాభం. మనం అనుకున్నదంతా మంట్లో కలిసినట్టే" మల్లేశం అన్నాడు.

"ఇప్పటికైనా ఆలోచించుకో. నీ మంచికే చెప్పుతున్న. మమ్ములను నమ్ముకో నీకు చెడుపే చేయదల్చుకుంటే మేమీవిధంగా ప్రవర్తిస్తామా?" దీనంగా అడిగాను.

"ఇంతకన్న ఎక్కువ మంచిగ మాట్లాడినోళ్ళను సూసిన."

ఒక్కొక్క అడుగు వేస్తు ముందుకు సాగాం. ఆలోచిస్తు ఆ అమ్మాయి కూడా మమ్ముల అనుసరించింది. ఊళ్ళో ప్రవేశించాం. సద్దు మణిగింది. మా ఇల్లు సమీపించింది. కిటికీలో నుంచి నా భార్య నాకోసం ఎదురు చూస్తూంది.

"అదిగో, అది నాయిల్లు, ఆ కిటికీలో నుంచి చూస్తున్నదే, ఆమే నా భార్య. కావాలంటే ఆమెతో కూడా మాట్లాడు" అన్నాను.

"ఈ సంగతంతా మీ ఆమె కెరికేనా?" భయంతో అడిగింది.

"అవును, ఇందులో రహస్యమేముంది. ఆడవాండ్ల సంగతులు ఆడవాండ్లకు రహస్యమా?" అంటూ ఇంటి తోవతీశాను. ఆమె మమ్మనుసరించి ఇంటిలోకి వచ్చింది.

'మొత్తానికి మెప్పించి వెంట తీసుకొచ్చినట్టున్నారు. పాపం! ఏదో మంచి పనే అయింది. రా! అమ్మా! రా అట్లా కూర్చో" నా భార్య ఆహ్వానించింది.

ఆమె తలవొంచుకుని కండ్ల నీళ్ళు తుడ్చుకుంటూ ఒక కుర్చీమీద కూర్చున్నది.

"పాపం. ఆమెను దగ్గరతీసిన వాండ్లందరు మోసంజేస్తూ వచ్చారట. అందువల్ల మమ్ములను నమ్మటం లేదు. నీవు కూడ చెప్పి చూడు" నా భార్యతో అన్నాను.

"అవును మీ మొగవాండ్లు సామాన్యులా? ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో తెల్సికోటం కష్టం" అంటూ నా భార్య ఆమె పక్కకుర్చీలో కూర్చున్నది. "మావారు నమ్మకస్తులని మాత్రం నేను చెప్పగలను" అని అమ్మాయి వీపుపై చేయి నిమిరింది.



"నా సంగతి మీకు బాగా తెల్సిందే కదా! నా మీద మీకు అనుమానం లేదనుకుంట" మల్లేశం మందహాసంతో అన్నాడు.

"నీకేం గురువుకు మించిన శిష్యుడివి" నా భార్య అన్నది.

"ఇతడేనా?" అన్నట్టు అమ్మాయి మల్లేశాన్ని ఓరకంట చూసింది.

అంతా సహపంక్తి భోజనం చేసి లేచాం.

'ఏం మల్లేశం గారు మాటకు వెనుకకు పోవద్దు. చూడు మూడారికి మాట దక్కటమే కాదు. ఆమె జీవితం కూడా బాగుపడ్తుంది. పాపం ఎన్ని కష్టాలు అనుభవించిందో, ఇప్పటికైన గట్టెక్కితే మంచిది" నా భార్య అన్నది.

"మొదలే అన్ని ఆలోచించుకోవాలెగాని మాట అన్నాక తిరుగు వుంటుందా." ఆ అమ్మాయిని చూస్తూ నా భార్యకు సమాధానంగా అన్నాడు.

"అయితే మీ వివాహం నిశ్చయం" నా భార్య అన్నది.

ఆ అమ్మాయి అమాంతంగా వచ్చి నన్ను కౌగిలించుకున్నది. చేపిన ఆమె పాల రొమ్ములు నా చొక్కాను తడిపాయి.

"పాపం" అంటూ నా భార్య కన్నీరు పెట్టింది.

● 1952 ●

# 18. ఊరు - అడవి

♦ పొట్లపల్లి రామారావు ♦

బ్రహ్మాండంగా మండుతోంది ఎండ. గడ్డిపోచ లేకుండా మాడి రుద్ర భూమివోలె కనిపిస్తున్నది నేల. నిప్పులా మండుతున్న ఎండలో నుంచి నడిచిపోతున్నాను. నా శరీరంలో సర్వశక్తులను ఎండ ఓడ్చివేసింది. దాహ బాధకు శరీరమంతా నీరసంగా ఉంది. ఎక్కడా నీరు జాడ కనిపించలేదు. దప్పి తప్ప నాకు.

"ఎంత కోపముంది".

వేరే సంగతి స్మృతిలో లేదు. దూరాన పచ్చ చెట్ల కింద ఓ ఊరు కనిపించింది. పచ్చని చెట్లను, మనుష్యుల ఇళ్ళను చూడటంతోనె నీరు త్రాగినట్టె కొత్త ప్రాణం వచ్చింది నాకు. ఊళ్ళోకి పోయి ఒక ఇంటి ముందు ఆగి 'దాహం' అని అరిచాను.

"ఏ ఊరు మీది?"

మొదలు అడిగాడు ఆయన! దాహముకన్నా అది ముఖ్యావసరమైనట్టు - దాహ బాధతో ఊరు, పేరు చెప్ప బుద్ధి పుట్టలేదు నాకు. నేను మాట్లాడలేదు.

ఆయన అట్లాగే నిలబడ్డాడు, పేరు చెప్పంది నీళ్ళు పోయనన్నట్లు. ఆయన అట్లా నిలబడడం నాకు బాగుండలేదు. కొంచెం సేపు నిలబడి ఇంకొక ఇంటికి పోయాను.

"ఎవరు మీరు?"

మళ్ళీ అదే ప్రశ్న.

మళ్ళీ అదే ప్రశ్న వినడం నాకు బాగుండలేదు. కొంచెం కోపం వచ్చింది.

"నాకు దాహం వేస్తోంది" అన్నాను.

"ఎవరంటే మాట్లాడవెందుకు?"

"ఎవరైతే ఏమిటయ్యా ... నీళ్ళు ఇయ్యటానికి?"

"ఎవరైంది చెప్పకూడదా?"

"దాహానికి ఎవరైతే ఏమిటి?"

"ఎవరని అడిగితే ఇంత బాధ ఏమిటయ్యా?"

అక్కణ్ణించి ఇంకో ఇంటికి పోయాను.

"నీ పేరేమిటి?"

మళ్ళీ అదే ప్రశ్న. నాకు మరీ కోపం వచ్చింది.

"ఎవరైతే ఏముంది?"

"కాదు, ఏం పేరు?"

"ఏదో ఒక పేరు."

"ఏమిటయ్యా... చెబుదూ?"

"అబ్బా! పేరు! పేరు! ఏ పేరైతే ఏముంది?"

"అంత విసుగు ఎందుకయ్యా?"

"నీరు నీరు అని ప్రాణాలు వదులుతున్నవాడ్ని పేరు - పేరు! అని ఏడ్పిస్తారేమిటి?"

కోపంతో ఊరు దాటిపోయాను. ఊరు దాటిన వెనుక. నా తెలివి తక్కువ తనము, తొందరపాటు మీద నాకు కోపము వచ్చింది. ఎందుకంటే ఊరు పోయి అడవి వచ్చింది. అడవిలో నీళ్ళు ఎక్కడ దొరుకుతాయి? ఊరు పేరు అక్కర లేకున్న పొదలు తీగెలు నీళ్ళు యిచ్చేవి కావు. ఏమి చేయాలో నాకేమీ తోచలేదు. పిచ్చివాడి మోస్తరు అట్టాగే పోతున్నాను. నా శరీరం నా వశం తప్పదొడిగింది. నా కాళ్ళు తడబడదొడగాయి. మృత్యువు ముంచుకొస్తున్నట్లు కళ్ళు చీకట్లు క్రమ్మదొడ సాగాయి. దాహముతో అడవి మధ్య చచ్చిపోతానేమోనని భయం వేయదొడగింది. ఇంతలో హఠాత్తుగా ఓ చిన్న వాగు ఎదురైంది. నా విగతజీవాలు వాగు రూపంలో ప్రత్యక్షమైనట్టు పొంగిపోయాను.

వాగులో బాటసారులు ఓ చెలమ తోడి ఉంచారు. చెలమలోకి తలవంచి అమృతము త్రాగినట్టు ఆ నీరంతా త్రాగేశాను. దాహానికి నీరు దొరికినందుకు నాకు ఎంతో ఆనందమైంది. నీరు తాగుతూ తాగుతూ నాకు ప్రాణదానం చేసిన ఆ మూగతల్లికి కోటి నమస్కారాలు చేశాను.

కాని అన్నిటికన్నా నాకు మహా ఆనందం కలిగించిన విషయమేమిటంటే, ఆ చెలమ నా ఊరు, పేరు గూర్చి ప్రశ్నలు వేయలేదని. ఇది ఏదో అసాధారణ విషయమని నాలో నేను అలౌకికానందంతో పొంగిపోయాను.

● సెప్టెంబర్, 1953 ●

# 19. ముక్కోటి బలగమోయి

♦ జి. సురమౌళి ♦

కోటాయి ఓ కంబళీ, తుండుగుడ్డా బ్యాగులో సర్దుకుని హైదరాబాదు వెళ్ళే బండిలో ఎక్కాడు. పెట్టెనిండా జనం కిక్కిరిసి వుండారు. భారతదేశంలో రైలుబండ్లు బోల్తా కొడతానే వుండయి. వందలకు వందలు జనం చస్తానే వుండారు. కాని ప్రజలు రైలు ప్రయాణాలు మాన్తారా? జనాన్ని అటీటు తోసుకుని, బ్యాగు సంకన గట్టిగా పట్టుకుని పెట్టెలో ఓ మూలన నిలుచున్నాడు కోటాయి.

కోటాయి సెక్రటేరియట్ ప్యూను. కర్నూలునించి హైదరాబాదుకు తరలిస్తున్న ఆఫీసుల్లో తనదొకటి సూపరింటు సుందర్రామయ్యా, యూడీసీ వెంకటప్పయ్యా వారం రోజుల ముందే ఆఫీసు సామాన్లు ఓ వాగెనులో నింపుకుని హైదరాబాదుకు చేరుకున్నారు. కోటాయి తనూరికి పోయి, విశాలాంధ్ర వచ్చిన సంగతీ, తాను హైదరాబాదు కెళుతున్న సంగతీ భార్యబిడ్డలకు చెప్పి ఆలస్యంగా బయల్దేరాడు. ఎట్టాగయినా ఫస్టు నవంబరు నాడు పదిగంటలకి ఆఫీసుకు జేరుకోవాలి. తెల్లారేసరికి హైదరాబాదుకు చేరుతుందన్నారు బండి. అందులోనే ఎక్కాలి.

ఉండి ఉండి కోటాయి కళ్ళమీదికి నిద్రకప్పుకొస్తోంది. ఉలిక్కిపడి కళ్ళు నలుచుకొని మళ్ళీ సరిగ్గా నిలుచుంటున్నాడు. ఇలా లాభం లేదని, జేబులో ఉన్న మాంచి ఘాటైన లంకపొగాకు సుట్టోటి దీసి అంటించాడు. సుట్ట కాలుస్తున్నా కొద్ది, ఒక్కొక్క దమ్మే ఆ పొగ పీల్చి వదుల్తా వుంటే కోటాయి మెదడులో ఏవేవో ఆలోచనలు రాసాగినయి.

తెలంగాణా వోళ్ళు తన్ను ఎన్ని అగచాట్లు పెడతారోననే భయం గబుక్కున కోటాయికి దట్టింది. తానా మధ్యన పేపర్లో చదివిన సంగతులు జ్ఞాపకానికి రాసాగినై. "ముల్కీ నాన్ముల్కీ" అని ఏదో అల్లరిజేసి, పొట్టకూటికి తమ పుట్టినూరినీ, ఇంటినీ వదిలి ఆంధ్రదేశంనుంచి వచ్చి హైదరాబాదులో కాపురంపెట్టుకున్న తన బోటివాళ్ళని ఎక్కడ బడితే అక్కడ దొరికించుకుని తన్నారట. వాళ్ళకు ఆలోచనే లేదట. ఇక తన్నటం మొదలు పెడితే పెద్దా చిన్నా చూడకుండా - బొక్కలిరిగేట్టు తన్నడవేనట. అక్కడి తెలుగువారు కూడా తురకం మాట్లాడుతారుట!" అంటూ తన వాళ్ళు, పత్రికలు, అప్పుడప్పుడూ కొన్ని సంవత్సరాలనుంచీ, తెలంగాణా ప్రజలను గురించి తనకు కలిగించిన, తన మనస్సులో బాగా నాటుకుపోయిన తెలంగాణాలోని తెలుగువారిని గురించిన తప్పుడు అభిప్రాయాలతో తాను వెళ్ళబోతున్నదేదో

నరకమన్నట్టు అక్కడి వాళ్ళంతా యమదూత లన్నట్టూ భావించుకుంటూ, ఒరుగులికి పడుతున్నాడు కోటాయి. బండి మహబూబునగరం స్టేషను దాటింతరువాత కొంత స్థలం దొరికింది కోటాయికి కూర్చోడానికి. బ్యాగును మోకాళ్ళ మీదేబుకుని తలకాయ దానిమీద పెట్టి నిద్రపోయాడు.

ఏదో ఒక స్టేషనులో ఎవరో లేపారు కోటాయిని. 'లేవండి, తెల్లారింది' అని కోటాయి గబుక్కున లేచి బ్యాగు చూసుకొని, కళ్ళు నలుచుకుని చక్కగా కూచున్నాడు. ఆ లేపినాయన కోటాయిని, పేరూ, ఎక్కడినుంచి ఎక్కడికి ఎందుకు వెళ్ళుతున్నదీ వివరాలడిగాడు. చుట్టదీసి కోటాయి కొకటిచ్చి, తానొకటి నోట్లో పెట్టుకుని కాల్చాడు. "మీపేరేటండీ?" అడిగాడు కోటాయి. "రామప్పంటారు. హైదరాబాదే. ఇది నా అడ్రసు. దగ్గర బెట్టుకో. ఎప్పుడన్న ఏమన్న గావలసివస్తే రా. అని విజిటింగ్ కార్డు ఇచ్చాడు. ఆ విజిటింగ్ కార్డు మీద "డా.రామప్ప. ఎమ్.బి.బి.ఎస్., బషీర్‌బాగ్, హైదరాబాద్-1" అని చదివి కోటాయి ఆశ్చర్యపోయాడు. "అసలు మీది ఈ వూరేనా?" లేక మన ప్రాంతంనుండి ఇక్కడకొచ్చి స్థిరపడ్డారా?" అని అడిగాడు కోటాయి. ఈ ప్రశ్న వెనుక కోటాయిలో ఎన్ని సందేహాలు నాట్యం చేస్తున్నాయో డాక్టర్ రామప్ప గమనించకపోలేదు. "ఇవన్నీ మన ప్రాంతాలే. ఇన్నాండ్లు మీ మనస్సులో ఉన్న మీ తప్పుడు అభిప్రాయాలను మార్చుకోవాలె. నాది ఖాస్ హైదరాబాదే" నన్నాడు. ఇంతలో స్టేషన్లో బండాగింది. 'హైదరాబాదు, కాచీగూడ' అని అరుస్తున్నారు. రామప్ప కోటాయి దిగారు. రామప్ప కోటాయిని తనవెంట రమ్మని తనతోపాటు కోటాయిని కోఠీదాకా నడిపించుకొచ్చి, సెక్రటేరియటు కెళ్ళాలని కోటాయంటే అక్కడే ఎనిమిదో నెంబరు బస్సు కోటాయి నెక్కించి, తాను ఏడవ నంబరు బస్సు ఎక్కి ఇంటికి చేరుకున్నారు.

బస్సు రెండో అంతస్థులో కూర్చుని చూస్తున్న కోటాయికి హైదరాబాదు నగరం గమ్మత్తుగా కనపడుతోంది. కండక్టరుకు డబ్బులిచ్చి టిక్కెట్టు కొన్నాడు. సెక్రటేరియటుకని. ఆబిడ్స్, నాంపల్లి, లకడీకాపూల్, బస్సు పోతూంది. బస్సాగినప్పుడల్లా, కోటాయి కండక్టరు నడుగుతూనే ఉన్నాడు. సెక్రటేరియటుకెక్కడ దిగాలని. సెక్రటేరియట్ రాగానే కండక్టరే 'ఇదే సెక్రటేరియట్' అని చెప్పి దించాడు. కోటాయి బస్సు దిగాడు. అటూ యిటూ పరికించాడు. ఎక్కడా 'సెక్రటేరియటు' అనే బోర్డు చిన్నది గాని, పెద్దదిగాని కనిపించలా. అట్లా బేలిపోయి చూస్తుంటే "ఏం రోయి కోటాయి, ఈ బండికేనా వచ్చింది?" అనే కేకవిని, అటీటు చూశాడు. ఎక్కడ చూసినా తన ప్రాంతంనుండి వచ్చినవాళ్ళు గుంపులు గుంపులుగా చేరి ఉండడం చూసి కోటాయెందుకో ఉబ్బిపోయాడు. 'ఇక్కడా ఇక్కడా' అని మళ్ళీ కేక వినిపించేసరికి ఆ వైపు చూశాడు తన ఆఫీసు ప్యూను బలరామయ్య. గబుక్కున పరిగెత్తాడా వైపుకు మధ్య కారొస్తున్నది కూడా గమనించకుండా. కొద్దిలో తప్పించుకున్నాడు గాని లేకపోతే యాక్సిడెంటే. బలరామయ్యది కర్నూలే. మెడ్రాసునుండి తనాఫీసు కర్నూలుకు తరలించ బడ్డాక ఉద్యోగంలో చేరాడు ప్యూనుగానే. నిన్నగాక మొన్న ఇద్దరూ కర్నూలు వీధుల్లో తిరిగారు. మళ్ళీ ఇవాళ, ఎంతోకాలం విడిపోయిన ఆప్తులవలె ఆప్యాయంగా కలుసుకొని, ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకున్నారు. వారు మాట్లాడుకున్న విషయాల్లో ముఖ్యమంత్రి ఎన్నిక దగ్గర్నుంచి హోటల్‌లో కాఫీకి ఉన్న

ఎక్కువ ధరదాకా ఉన్నాయి. బలరామయ్య కోటాయిని తీసుకెళ్ళి తమకోసం కేటాయించిన ఆఫీసు గదులెక్కడున్నదీ చూపించాడు. సెక్రటేరియటు భవనంచూస్తూ, కోటాయి ఉప్పొంగి పోతున్నాడు. 'మెడ్రా సిడిచినా, దానబ్బలాంటి పట్నం సంపాదించు కున్నాంలే' అన్నాడు. ఇంకా ఆఫీసు గదులకి తాళాలు తియ్యలేదు. "మనకి సన్నతునగరుట. ఆడ ఏర్పాటు చేసినారు ఆస్టలు" అని సనత్ నగర్‌కు ఎట్లా వెళ్ళాల్సిందీ వివరించి చెప్పాడు బలరామయ్య. 'ఔనుగానీ ఈ ఊరోళ్ళు మంచివాళ్ళేనా?" అనడిగాడు కోటాయి బలరామయ్యను. తాను రైల్లో ఎక్కుతుండగా కలిగిన సందేహానికి సుస్పష్టమైన సమాధానం పొందాలన్న ఆశతో. 'ఎహె మంచేటి? మంచి ఆడుండాదిలే. నైజాం కాలేజి. ఆ కాలేజీ కుర్రోళ్ళు నిన్నకార్లని ఆపి టపాకాయలు పేల్చినారంట. కారుమీద నంబరు సూడ్డంవట. అది మన ప్రాంతంకాదు అని తెలిసిపోంగనే ఆటిని ఆపటవట, అద్దాలు పగలు గొట్టటం, గాలి తీసీయటం, టపాకాయలు కొట్టటం, శానా బాధ పెట్టి నారంటలే- " అని చెప్పుకుపోయాడు బలరామయ్య. "అయితే ఈళ్ళు తోటి జాగ్రత్తగానే వుండాలే?" అంటూ "ఆస్టలేపు వెళ్ళొస్తా. సుందర్రామయ్యగారికీ, ఎంకటప్పయ్యగారికి చెప్పు..." అని బయల్దేరినాడు. సనత్‌నగర్‌కు వెళ్ళే విధానం బలరామయ్య వివరంగా చెప్పాడు గనుక, కోటాయి కాట్టే కష్టం కలుగలేదు. బస్సులో కోటాయికి ఎన్నో ఆలోచనలు వచ్చాయి. రామప్పగారు అంత మంచిగా ప్రవర్తించారే, మరి ఇక్కడివాళ్ళు మంచివాళ్ళు కాదంటేమిటి బలరామయ్య? - బలరామయ్య అబద్ధమెందుకు చెబుతాడు? మరి రామప్పగారు మంచిగా ప్రవర్తించిన సంగతి తనకే అనుభవ మాయె. ఇంతకూ ఇక్కడివాళ్ళు మంచివాళ్ళా? కాదా? అనేసంగతి కోటాయి ఇదమిద్ధంగా తేల్చుకోలేక పోయాడు. సనత్‌నగర్‌కి వెళ్ళి తనకోసం ఏర్పాటు చేయబడ్డ చోటును చూసుకుని, మళ్ళీ పదకొండు గంటలకల్లా తిరిగి ఆఫీసుకు చేరుకున్నాడు. ఆఫీసుకెళ్ళగానే సుందర్రామయ్య, వెంకటప్పయ్యలు కోటాయి నాహ్వానించారు. రిజిస్ట్రారుగారి రూము చూపించి అక్కడ తన పేర్రాయించుకుని సంతకంపెట్టి రమ్మన్నారు. అక్కడ ఆ ఫార్మాలిటీస్ అన్నీ ముగించుకున్నాక, సుందర్రామయ్య కోటాయిని చూసి, ఓ కవరు చేతికిచ్చి దాన్ని చీఫ్ సెక్రెటరీగారికిచ్చి రమ్మన్నాడు. 'వచ్చాడో లేదో అప్పుడే పనిజెపుతాడేటి సుందర్రామయ్య?' లని కోటాయి కడుపులో మండింది. కానేం జేస్తాడు? ప్రభుత్వోద్యోగమాయె తప్పుతుందా మరి? "ఎట్టా ఎల్లాలీ? దారి తెలీదుగా?" అన్నాడు కోటాయి నసుగుతూ. "అడుగుతే ఎవరన్నా చెపుతారు - బేగంపేట వెళ్ళే బస్సెక్కి వెళితే అదే వస్తుంది పో" మ్మన్నాడు సుందర్రామయ్య. కోటాయి మాట్లాడకుండా బయలుదేరాడు సుందర్రామయ్యను మనసులో తిట్టుకుంటూ. 'యదవ అంబోతు మొగం ఈడూనూ. ఎప్పుడొచ్చావన్నా అడగడేం? తిన్నావా? ఆస్టలు దొరికిందా? ఏదీ అడగడేం? మనిషి కనపడితే ఇగ పని జెప్పటవేనా?" అనుకుంటూ తన నడక సాగించాడు. దారిలో మళ్ళీ రామప్పగారు కనిపిస్తే దారడిగాడు. రామప్పగారు బేగంపేటకుపోయే బస్సు ఆగేచోటు చూపించి, 'అక్కడ నిలబడు. చిన్న సింగల్ డెక్కర్ బస్సు వస్తే ఎక్కి కండక్టరు నడిగి చీఫ్ సెక్రెటరీగారింటికి పోవడానికి ఎక్కడ దిగమంటే అక్కడ దిగు. మంచిగా వినయంగా అడుగుతే ఈవూరి వాండ్లు చెప్పుతరు. గర్వంతోటి మాట్లాడితివా - సహించరు' అని రామప్పగారు వెళ్ళిపోయారు. రామప్పగారు చెప్పిన ప్రకారమే బస్సు

ఎక్కి చీఫ్ సెక్రెటరీ గారికా ఉత్తరం అందించి, తిరిగి ఆఫీసుకు చేరుకున్నాడు కోటాయి.

ఆఫీసుకు చేరుకున్నాక, కోటాయి బలరామయ్యను పిలుచుకుని అడిగాడు. తన్ను బస్సులో బాధించిన సందేహానికి సమాధానం. "అసలీ పూరు వాళ్ళు మంచివాళ్ళేగా?" అని. "అప్పుడే చెప్తిని గదా" అన్నాడు బలరామయ్య. తాను ఇక్కడి వాళ్ళను చెడ్డవాళ్లేనని నిర్ణయించుకున్న నిర్ణయం అబద్ధం కాదనే మాటను పునరుద్ఘాటించుకుంటూ. కోటాయి రామప్పగారి సంగతి చెప్పాడు. బలరామయ్యకు నమ్మకం కుదరలే. బలరామయ్యకూడా ఆలోచించాడు. ఆలోచించి వెంటనే ఒక నిర్ణయాని కొచ్చాడు. గవర్నమెంటుతో అపసరమున్నవారు, గుమస్తాలూ, ఉద్యోగులు, బాగా చదువుకున్నవారూ, నాయకత్వం కోసం పాటుపడేవారు మాత్రమే తమతో మంచిగా ప్రవర్తిస్తున్నారని, ఆ మంచితనం స్వార్థంతో కూడుకున్న దనీను. కోటాయి కీవాదంలో సబబు కనిపించినా వెంటనే విశ్వాసం కలగలా. "రామప్పగారు డాక్టరు. ఆయనకేం స్వార్థం ఉంటుంది?" అనడిగాడు. "డాక్టరేనేమొ? కాని బహుశా నాయకత్వం కోసం పాటుపడే వాడయ్యుంటాడు. భద్దరు కట్టాడా?" కోటాయి జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. రామప్పగారి రూపం. అవును భద్దరే కట్టినట్టున్నాడు. బలరామయ్య మాటల్లో విశ్వాసం కుదిరింది కోటాయికి. తమంటే ఇక్కడివాళ్ళు భయపడాలను కున్నాడు కోటాయి. రామప్పగారిమీద కోటాయికి కలిగిన గౌరవమంతా పటాపంచలై పోయింది. "నెహ్రూగారి మీటింగెక్కడా?" అనడిగాడు కోటాయి మాటమారుస్తూ. "ఫతేమైదానంలో – అటేపు కెళితే వస్తుంది." అప్పటికే మూడయింది. కోటాయి సుందర్రామయ్యకు చెప్పి, ఈ పూటకు తన్నిడిసి పెట్టమని సెలవు తీసుకుని ఫతేమైదానం వైపు నడిచాడు.

కర్నూల్లో కోటాయి బండెక్కినప్పుడు, హైదరాబాదువారంటే క్రూరులని భయపడ్డాడు. తన్నేం చేస్తారో ఎన్ని తిప్పలు పెడతారోనని ఆరాటపడ్డాడు. బండిలో కూడా అవే ఆలోచనల్తో సతమతంపడ్డాడు. రామప్పగారిని చూసింతర్వాత కోటాయికా భయం విచ్చుకుపోయింది. హైదరాబాదు వాళ్ళు చాలా మంచివాళ్ళనే అభిప్రాయం కలిగింది. సుందర్రామయ్యగారి ప్రవర్తనను చూసింతర్వాత కోటాయికి కలిగిన ఈ అభిప్రాయం మరీ గట్టిపడింది. సుందర్రామయ్య తన్ను విచారించనే లేదు. మరి రామప్పగారెంత మంచిగా ఆదరించారు? సుందర్రామయ్య కంటే రామప్పగారే వెయ్యిరెట్లు నయమనే అభిప్రాయం కలిగింది. తెలుగువాళ్ళందరిదీ ఒక్క కుటుంబం అనే మాట నిజమే ననుకున్నాడు. కాని బలరామయ్య మళ్ళీ కోటాయి ఆలోచనల్ని మార్చాడు. దానికేదో కారణముందని ఊహించి కోటాయిని కూడా తనలాగే ఊహించేటట్టు చేశాడు. కోటాయిలో ఇప్పుడు ఎన్నడు లేని గర్వం ప్రవేశించింది. ఆ గర్వంతో ఆనందం కలిగింది. ఆంధ్రప్రదేశ్ అవతరిస్తుందని విన్నప్పుడు కొందరికి ఈలాంటి ఆనందమే కలిగి ఉంటుంది. ఇక్కడివాళ్ళందరినీ తానే ఏలుతున్నానను కున్నాడు. సుందర్రామయ్య లాంటి అధికార్లు తన్ని పెట్టే కష్టాలు మరిచిపోయి, తానూ, సుందర్రామయ్య, బలరామయ్యలూ కలిసి హైదరాబాదు వాళ్ళమీద రాజ్యం చేస్తున్నట్టు భ్రమపడ్డాడు. నైజాంను గద్దెదించింది తానే ననుకున్నాడు. ఆ గద్దె తన కోసమే ఖాళీ అయిందనుకున్నాడు. ఇట్లా అనేక విధాలుగా అనుకుంటూ ఫతేమైదానం

చేరుకున్నాడు కోటాయి. అన్నీ గళ్ళు గళ్ళుగా కట్టారు. పోలీసులెక్కడి వారినక్కడ కూచోపెడుతున్నారు. దారులు చూపిస్తున్నారు దూరంగా ఓ వింగులో ఓ మూల కూచొని, జేబులో మిగిలిపోయిన మరో లంక పొగాకు చుట్ట అంటించు కున్నాడు. మూడున్నరయిందప్పటికి, ఇంకా మూడు గంటలు గడవాలి. అప్పటిదాకా ఓ నిద్రతీద్దామనుకుని, అక్కడే వాలాడు కోటాయి. బ్యాగులో కంబళిని పరుచుకుని, తుండు గుడ్డనెత్తికి చుట్టుకుని, బ్యాగును తలకింద పెట్టుకొని, బాగా అలసిపోయాడేమో వెంటనే నిద్రపట్టింది.

"ఏమండీ, లెవ్వండి, లెవ్వండి, కూర్చోండి" అని ఎవరో లేపేసరికి ఐదున్నరయింది. జనం నిండుతున్నారు. తన చుట్టూ చాలామంది ఈ వూరి వాళ్ళే చేరారు. తన ఊరు వివరాలడిగారు, తను చెప్పిందంతా విసుగులేకుండా విన్నారు. తాను తనకు లేనిపోని కొన్ని గొప్పతనాల్ని చెప్పుకుపోతుంటే – అవన్నీ విని నిజమేననుకుని నమ్మి 'ఓహో' అన్నారు. పక్కనుండి ఒక ఆసామి కోటాయికి ఓ చుట్ట ఇచ్చి చుట్ట కాల్చండి అన్నాడు. కోటాయి ఓ చుట్ట తీసుకుని నోట్లో పెట్టుకుని, తన జేబులోంచే అగ్గిపెట్టె తీసి గీసి, తన చుట్టతో బాటు ఆ ఆసామీ చుట్ట గూడా వెలిగించాడు. కోటా యడిగాడు "మీ పేరేంటి?" అని ఆ ఆసామిని. 'కోటయ్య' అని చెప్పాడా ఆసామి. తమ ఇద్దరిపేర్లూ ఒక్కటి కావడంతో ఆ యిద్దరికి కలిగిన సంతోషానికి మేరలేదు. ఇద్దరినీ తనువులు వేరైనా ఇద్దరూ ఒకటే ననుకున్నారు. ఇంతలో ఎవరో వస్తే కోటయ్య కొంచెం పక్కకు తొలిగాడు.

నెహ్రూగారు వచ్చారు. సూర్యకుమారి పాటపాడింది. ముందరున్న పిల్లలు కొంతమంది మోకాలి మీది దాకా లేచి నిక్కి చూస్తున్నారు. 'ఏయ్, కూచోండి, కూచోండి' వాళ్ళు కూచున్నారు. నైజాం వాళ్ళంతా దద్దమ్మలనీ, తానేం చెపితే అదినమ్ముతారనీ, తనకిందాకా కలిగిన అభిప్రాయం – వాళ్ళు తన ఆజ్ఞను కూడా పాలించటంతో ధ్రువపడ్డది. తమను చూసి నైజాం వాళ్ళు భయపడుతున్నారనీ అందుకని వాళ్ళే తమకు లొంగి ఉంటారనే నిర్ణయానిక్కూడా వచ్చాడు కొటయెప్పుడో.

నెహ్రూగారు ఉపన్యాసం ప్రారంభించారు. ముందున్న పిల్లలు మళ్ళీ తలలు నిక్కించారు. కోటాయి మళ్ళీకుకేశాడు. కూచోండమ్మాయిలూ కూచోండని వాళ్ళు మళ్ళీ కూచున్నారు. ఈ తతంగం ఇట్లా నాలుగైదు సార్లు సాగేసరికి ప్రక్కనే ఉన్న ఒక ఆసామికి కోపంవచ్చింది. ఉపన్యాసం స్పష్టంగా వినపడుతూనే ఉంది. నెహ్రూగారెట్లాగూ కనపడ్డం లేదు. ఈనిట్లా అరవటం ఆ ఆసామికి నచ్చలేదు. "ఉపన్యాసం ఇనకుండ ఏందా అరుపులు" అని కోటాయిని మందలించాడు. కోటాయిక్కోపం వచ్చింది. ఇందాకా అనుకున్నాడుగా, తమంటే వీళ్ళు భయపడాలనీ, లొంగి ఉండాలనీ "ఏంటయ్యా నువ్వనేదీ, అందర్నీ నుంచోమంటావేటీ?" అన్నాడు. ఆ ఆసామిని దబాయిస్తూ, ఇప్పుడింత మందిలో ఇదో అల్లరెందుకని ఆ ఆసామి తప్పించుకున్నాడు. 'నన్నుగాదు లేమ' ని "ఏదీ, ఏదో వాగుతున్నావేటీ?' ఎదుటివాడు తనకు భయపడి లొంగిపోతున్నట్టు గ్రహించి 'ఏయ్ జాగర్త ఏమనుకున్నావో ఎక్కువ తక్కువొదిరితివా బొక్కలిరుగుతయి మల్ల – ఏంవొ, పోనీ లెమ్మని ఊకున్నా కొద్ది నీలుగుడు శానయిందే."

ఈ వాదం విని ప్రక్కనుంచి ఓరూమీ టోపి, 'మ్మారోస్సలేకూ' అంటూ మాయమైంది. కోటాయి లేచి "కొడతావేటీ?" అంటూ ఆ ఆసామిపై కురికాడు. "అంతకాడికి దెస్తె ఆపని గూడ అయిద్ది మల్ల" అంటూ ఇతనూ లేచాడు. చుట్టూ జనం లేచారు. కోటాయి చెంప చెళ్లు మన్నది. అటీటు చూస్తూ వుండగానే మరోచెంప చెళ్లుమన్నది. తలమీద బలమైన దెబ్బ తగిలింది. పోలీసులు వెంటనే వచ్చి కోటాయి నొకవైపూ ఆ ఆసామీనొకవైపు తీసుకువెళ్ళి ఫతేమైదానం ఆవరణ బైట విడిచారు.

రెండు చెంపలూ చుర్రుమంటూ జవజవలాడుతున్నాయి. నెత్తికి కొద్దిగా గాయం తగిలి రక్తం కారుతోంది. ఎటు పోవాలో తోచలేదు కోటాయికి. మనసులో ఏదో తిట్టుకుంటూ ముందుకడుగేయబోయాడు. పొద్దట్నుంచీ తినలేదేమో ఆయాసమైంది. కళ్ళు బైర్లు క్రమ్ముకున్నాయి. ఫుట్‌పాత్‌మీదే కంబళీ పరుచుకుని, తుండుగుడ్డ తలకు చుట్టుకుని అక్కడే వాలాడు కోటాయి.

కోటాయి లేచేసరికి మంచంలో వున్నాడు. ప్రక్కన కోటయ్య కూచుని వున్నాడు. కోటాయి ఆశ్చర్యపోయాడు. ఈ ఆశ్చర్యాన్ని గమనించి కోటయ్య చెప్పాడు. అది డాక్టర్ రామప్పగారి ఇల్లనీ, తానే ఇక్కడికి కోటాయిని చేర్చాననీ, చాలామంది బీదవాళ్ళకు రామప్పగారు ఉచితంగా వైద్యం చేస్తారనీను. ఇంతలో రామప్పగారు కూడా వచ్చారు లోపల్నించి. "గాయం ఏమంత పెద్దది కాదులే. ఈ కట్టు మూడురోజుల్దాకా విప్పకు- అన్నం తినలేదుగా వడ్డనయింది, తిందుగాని పా, కోటయ్యా నువ్వు కూడా లేచికాళ్ళు కదుక్కో" మన్నారు రామప్పగారు. ముగ్గురూ ఒకే పంక్తిలో కూచుని భోజనాలు చేశారు.

భోజనాలయింతర్వాత డాక్టరు గారింట్లో రేడియోలో-

"ముక్కోటి బలగమోయి ఒక్కటై మనముంటె

ఇరుగు పొరుగూలోన ఊరు పేరుంటాది

తల్లి ఒక్కటె నీకు తెలుగోడా..

సవతి బిడ్డల పోరు మనకేలా?..."

అనే పాట వినిపించింది.

ఆ పాటనే మనస్సులో ఆలపించుకుంటూ కోటయ్యా, కోటాయిలు డాక్టరు గారినుండి సెలవుపుచ్చుకున్నారు.

● తెలుగుస్వతంత్ర వారపత్రిక - 14 డిసెంబర్, 1956 ●

# 20. లచ్చి

♦ గూడూరి సీతారాం ♦

తండ్రి, పెద్దకొడుకు కలిసి వాళ్ళయింటి ప్రక్కనే చిన్నగుడిసెను వేస్తున్నారు. నడిపికొడుకు రంగడు. దీర్ఘాలోచనల్లో మునిగిపోయి పాత గుడిసెముందు కూర్చున్నాడు. అప్పుడే ఊళ్ళోనుండి వొస్తున్న భార్య కనిపించగానే పాలిపోయిన రంగని ముఖంలో అప్రయత్నంగా చిరునవ్వు తొణికింది. "మా అందట్లో లచ్చే నయం. అది చేసినంతపని మేమెవ్వరం సెయ్యలేం. అందానికి అందం ఉంది, తెలివికి తెలివి ఉంది." కొంచెం దూరాన తల్లి పొరుగింటావిడతో మాట్లాడుతుంటే విని మరీ సంతోష పడ్డాడు రంగడు. ఇందరు అన్ని మాటలు అంటున్నా, అందరు అన్ని పనులు చేసిపెడుతున్నా రంగని కెందుకో ఏమో బాధగానే ఉంది. ఉండదు మరీ! యిరవై ఏండ్లు ఆ యింట్లో పెరిగినాడు. వాళ్ళతో కలిసి తిరిగినాడు. ఈ రోజు వేరైపోతున్నాడు.

బిచ్చగాళ్ళల్లో ఈ ఆచారం ఉంది. కోడలు కాపరానికి రాగానే కొడుకు వేరే ఇంట్లో ఉండి వాళ్ళ సంపాదన మీద వాళ్ళే బ్రతకాలి. అందుకే వాళ్ళల్లో పిల్లలను చిన్ననాటినుండే వెంట తీసుకపోయి బిచ్చమెత్తడం నేర్పుతారు. పిల్ల వాళ్ళనే పంపి బిచ్చమెత్తక రమ్మంటారు కూడా!

రంగడు కొత్తకాపరం పెట్టినాడు. లచ్చికి కాపురాన్ని గుట్టుగా నడిపించాలన్న సంగతి బాగా తెల్సు. వాళ్ళకు ఆస్తి అంటూ ఏమీ లేదు. ఒక ఊరంటూ ఉంటేనా భూమి బుట్రా, యిల్లూ గిల్లూ ఉండేది. ఎక్కడ పొట్టబోసుకోవడానికి అనువుగా వుంటే అక్కడికే వెళ్ళిపోతారు. రంగని పాలుకువచ్చినవి రెండు పాతకుండలు, ఒక కమ్మకోతకత్తి, రెండు అంబలి పోసుకునే బుర్రలు, రెండు బిచ్చమెత్తుకునే కమ్మజోలెలు. ఈ ఆస్తితోనే రంగడు కాపురాన్ని మొదలుపెట్టినాడు. వాడు ప్రొద్దంతా ఒక్క బిచ్చమెత్తడానికే పోడు, ప్రొద్దునే లేచి ఈదుల వైపు వెళ్ళి కమ్మగోసి తెస్తాడు. భోజనపు సమయానికి వాడి పూర్తి కూడును అడుక్కొచ్చుకుంటాడు. సాయంకాలానికి ఎండ్రకాయలో, చేపలో పట్టడానికి వెళ్లుతాడు. వాటిని ఊళ్ళో అమ్ముతాడు కూడా! అప్పుడప్పుడు మందుచెట్లను త్రవ్వుకొచ్చి నాలుగు పైసలు సంపాదించి తాళ్ళల్లకు వెళ్ళి కల్లుత్రాగి వొస్తాడు. పెండ్లానికి కూడా బుద్ధిపుట్టినప్పుడు ఓ బుంగండంత కల్లు తీసుకొస్తాడు. లచ్చి కూడా ఒకనిమిషం వృధా చేయకుండా పనిచేస్తుంది. మొగడు

తెచ్చిన కమ్మతో చాపలు అల్లుతుంది. రోజుకు ఒకటి రెండు అల్లినవి అల్లినట్టు అమ్మివేస్తుంది. వేళకు వెళ్ళి తనకూ, తన మగనికీ సరిపోయేంత గంజిని, గడుకను అడుక్కొస్తుంది. వాళ్ళిద్దరికి సరిపోగా మిగిలిన గంజిని, గడుకను అత్తమగానీ, మరెవ్వరికిగానీ లేకపోతే కుక్కలకు గానీ వేస్తుంది.

వాళ్ళ కాపురం చిలకా గోరెంకల్లా సాగిపోతుంది. లచ్చిచాగా పనిచేసే దమ్ములను కూడబెట్టాలంటుంది. రంగడు ఎప్పుడయినా దుబారా ఖర్చు చెడితే కోప్పడుతుంది. అతడు ఆమెకు భయపడకున్నా తన సంపాదనతో వొచ్చిన పైసలన్నిటినీ భార్యవద్దే ఉంచుతాడు. ఆ గూడెంలో రంగని సంసారాన్ని చూచి అందరూ సంతోషపడుతారు

వానాకాలం దగ్గరపడజొచ్చింది ఆ గూడెంలోనివారు ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు ఎవరి అదను వారు చూసుకొని. రంగని అన్న వెళ్ళి పోయినాడు. ఇక మిగిలినవారు నలుగురయిదుగురు మాత్రమే ఉన్నారు. రంగడుకూడా ఎక్కడికయినా వెళ్ళిపోదా మనుకున్నాడు. కానీ ఆ వూరు విడిచిపెట్టిపోవడం యిష్టంలేదు ఆ ఊళ్ళోనే ఎక్కడయినా ఒక కాపు నాశ్రయించి కొట్టమును చూచుకోవాలనుకున్నాడు. వాని తండ్రికూడా పోవడానికి తయారయినప్పుడు రంగని మనసంతా కలికలి అయి పోయింది. ఈ జీవితములో మళ్ళీ కలుసుకుంటామో లేదో అని బాధపడ్డాడు. ఆ బాధనోర్వలేక తండ్రితో పోవటానికే రంగడు ముల్లె మూటకట్టినాడు. కానీ ఆశించిన ఆశ్రయం ఆ ఊళ్లోనే లభించింది. ఇక రంగడు అక్కడే స్థిరపడిపోయినాడు గుండెను రాయిచేసుకొని.

ఇప్పుడు నా అన్నవాళ్ళు లేరు. ఆ ఊళ్ళో అక్కడక్కడ వున్న కొట్టాలలో ఎక్కడెక్కడి నుండో క్రొత్తవాళ్ళు వచ్చివున్నారు. రంగడు తన పనేమిటో అది చూసుకుంటున్నాడు. సంపాదనేమీ లేదు. సంపాదించిన డబ్బుల్లోనుండి చిల్లిదమ్మిడీ కూడా లీయడం లేదు. రోజూ అడుక్కొస్తున్న గంజి, అంబలితోనే కాలం గడుపు తున్నారు.

వాడు పెళ్ళాన్ని ఒక్కనాడు కూడా తప్ప త్రాగి వచ్చి కొట్టలేదు. చాలా అన్యోన్యంగా నాల్గు చేతులు కలిపి సంసారం చేస్తున్నారు. ఇట్లా వాళ్ళు కాపురం చేస్తుండగా ఒకరోజు పోలీసులు వచ్చి రంగన్ని పట్టుకపోయినారు. లచ్చికి కొండ నెత్తిమీద పడ్డట్టయింది. భ్రాన్పడిపోయి గుడిసెముందు ఆ రాత్రికి రాత్రంతా కూర్చుండిపోయింది. అక్కడ తనకు తెలిసిన తనకులంవాళ్ళెవ్వరూ లేరు ఇక ఏం చేయాలో తెల్వలేదు. తన మొగన్ని వాళ్ళెందుకు పట్టుకుపోయారో ఎంత ఊహించినా ఆమె ఊహకు తట్టలేక పోయింది.

మామవద్దకు పోదామన్నా లచ్చికి వాళ్ళెక్కడుంటున్నారో తెల్వదు. లచ్చి పుట్టిన్నాటినుండి కూడా తనవాళ్ళ నెవరినీ పోలీసులు పట్టుకపోవడం ఎరగదు. ఊళ్ళోకి వెళ్ళి అడిగినా ఎవరికీ ఈ సంగతి తెల్వదన్నారు. ఎక్కడైనా దొంగతనం చేసినాడో ఏమో అన్నారోమాట. ఈ వార్తవిన్న తరువాత సగం చచ్చిపోయిన లచ్చి ప్రాణం పైపైనే ఎగిరిపోయింది. ఇక తన మొగుడు కనిపించడేమోనని గజగజ వణికి పోయింది. తను ఒంటరిగా ఎట్లా బ్రతకాలో ఊహించుకుని కడుపంతా చెరువు చేసుకొని ఏడ్చింది.

మూడురోజులు గడిచిపోయినవి. లచ్చి కూడు కుమ్ములేక ఏడ్చింది ఏడ్చినట్లుగానే ఏడుస్తోంది. తన తల్లిగారింటికి పోదామన్నా వాళ్ళిక్కడుంటున్నారో తెల్వదు. పోలీసులకు నా మొగనిమీదే అనుమానం రావాలా? ఇంకెవ్వరూ దొరకలేదా? పచ్చని కాపురంలో చిచ్చుపెట్టినారే? నేనేం కావాలి? నేనెట్లా బ్రతకాలి? లచ్చి అనేక విధాల ఊహించుకుంటూ కుమిలిపోయింది. లచ్చికి రంగన్ని ఎక్కడికి పట్టుకుపోయినారో కూడా తెల్వదు. ఎక్కడికైనా వెళ్లి కనుక్కుందామన్నా ఆడది. ఏం చేయగలుగుతుంది? మొగదిక్కులేని వారి గతి ఇంతేనా? అని తన్ను తను నిందించుకుంది.

నాలుగో రాత్రి ఇంటికొచ్చినాడు రంగడు. లచ్చికి పోయిన ప్రాణం లేచివచ్చింది. మూడు రోజులనుండి కూడులేక శోషవచ్చినట్లున్నా మొగన్ని చూడగానే లేడిపిల్లలాగా గంతులేసింది లచ్చి. ఎన్నడో వడ్లు దంచబోతే వచ్చిన నూకలతో జావచేసి ముందు పెట్టింది. రంగని తలమీద తల ఆనించి కడుపు నిండారా ఏడ్చింది. వాడు ఇంకేం ఫర్వాలేదని సముదాయించినాడు లచ్చిని.

రంగడు ఇక ఆ ఊళ్ళో ఉండలేకపోయినాడు. దొంగతనం చేయకున్నా ఊళ్ళో అందరూ 'దొంగ' అన్నారు. లేకపోతే పోలీసులు ఊర్కనే పట్టుకపోతారా? అన్నారు. పాపం, అతన్ని పోలీసులు అనుమానంతో పట్టుకపోయి ఒళ్ళంతా సున్నం సున్నం చేసినారు. లచ్చి రాత్రంతా ఉడుకునీళ్ళతో కాపింది. వారంరోజుల్లోనే రంగ డాఊరు విడిచి పట్టణం వెళ్ళిపోయినాడు తనకాశ్రయ మిచ్చిన కాపు కరకుమాటలను ఓర్చుకోలేక.

వొచ్చిన క్రొత్తలో ఏమీ బాగనిపించలేదు. ఇన్నాళ్ళూ కష్టపడి సంపాదించిన డబ్బులను వాడవలసి వచ్చింది. లచ్చి బాగా బాధపడ్డది. మునుపటి ఊళ్ళో దొరికినంత బిచ్చం దొంకడం లేదిక్కడ. తన గూడెంనుండి బిచ్చమెత్తడానికి నాలుగైదు మైళ్ళు నడిచిపోవాలి. అంతదూరం నడిచిరావడం – పోవడంలోనే సంపాదించిన బిక్షం సాహ్వా అయిపోతుంది.

పట్టణమంతా క్రొత్తగా ఉంది వాళ్ళకు. పైసలు సంపాదించడమే వొస్తుంది వాళ్ళకు. కాని ఖర్చుపెట్టడం మాత్రం రాదు. పుట్టినప్పటినుంచీ కూడా పైసలు పెట్టి వడ్లూ మొదలైనవి కొనుక్కుని బ్రతుకవలసి వొస్తుందనుకోలేదు లచ్చి. ఈ పాడుపట్నం వొచ్చిన్నుండి అవీ – యివీ తినాలనే బుద్ధి కూడా పుడుతుంది. ఆ పల్లెటూళ్ళలో ఉండగా కల్లో, గంజో దొరికేది కాని పైసలు మందులు వేస్తామన్నా దొరక్కపోయేవి. కానీ ఇక్కడ ఎవరింటికి వెళ్లినా ఓ పైసో – అణానో వేస్తారేకాని ఇంత వండుకుంది మాత్రం పడేయరు. అందుకే లచ్చి ఫుట్‌పాత్‌మీద కూర్చొని అమ్మే ముసలమ్మ వద్ద బుడ్డాలో బజ్జీలో కొనుక్కుని కడుపు నింపుకుంటుంది. మొగుడిక్కూడా తెస్తుంది.

రంగడు అంతే!

రోజులు గడిచిన కొలది రంగనికి బిచ్చమెత్తడం బాగనిపించలేదు. వచ్చే రైలుకు పోయే రైలుకు తీరికలేదు. రంగనికి పైసలు రాకకేం తక్కువలేదు. ప్రతి డబ్బాకు వెళ్ళి యాచిస్తాడు. క్రొత్తలో పాటలు పాడకపోయేవాడు కాని ఇప్పుడిప్పుడే పల్లెపాటలు

చదువుకుంటూ బిక్షమెత్తుతున్నాడు. ప్రొద్దంతా యాచిస్తే ఒకటో రెండో రూపాయలు దొరుకుతాయి. అన్నం తినాలంటే రూపాయి కావాలి. సంపాదించినదంతా ఖర్చుపెడితే పెళ్ళాం కోప్పడుతుంది. రంగడుకూడా చిరుతింపుకు అలవాటుపడ్డాడు. ఉడుకుడుకు చాయిలు త్రాగి పూటలకు పూటలు గడపడం నేర్చుకున్నారు.

వాళ్ళిద్దరి జీవితాల్లో క్రమక్రమంగా మార్పులొచ్చినవి. ఇద్దరూ సాయంకాలానికి ఇల్లు చేరుకుంటారు. రంగనికన్నా కొంచెం ముందే లచ్చిచచ్చి వంట పండుతుంది. ఇద్దరూ తింటారు. వర్షం పడ్డనాడు రాత్రంతా జాగారం చేయాలి. అట్లాంటి కొంపలు కూడా లేకుండా బజార్ల వెంట కూడా కొంతమంది బ్రతుకులారు.

ఆనాడు పెందరాలే తిరిగి వొచ్చినారు. ఇద్దరి ఆదాయం లెక్కపెడితే ఆరురూపాయల వరకు పోగయింది. చాలా ఆశ్చర్యం కలిగింది. తమయందు లక్ష్మి ప్రసన్నమయిందని సంతోషపడ్డారు. తెల్లవారి దీక్షమెత్తడానికి వెళ్ళితే హోలి పైసలు చెల్లవన్నారు ఒక వేళ ఎవరయినా దానంచేస్తే తీసుకోకూడదని తెలిసింది భార్యాభర్తలకు. పాపం రాత్రి దబ్బు జ్ఞాపకానికి రాగానే ముఖంలో నెత్తురుచుక్క లేకుండాపోయింది. లోలోనే ఏడ్చుకున్నారు. రంగడు వెంటనే ఇంటికి పరుగెత్తుకు వచ్చి పెండ్లాం దాచిన దబ్బునంతా వెదకినాడు. రంగడు వెదుకుతుండగానే ఆదర బాదర లచ్చివొచ్చింది. ఇద్దరు కలసి ఇన్నాళ్ళు సంపాదించిన దబ్బునంతా నూటికి ముప్పయి రూపాయిల నష్టంతో కల్దార్లను తెచ్చుకున్నారు.

ఆ రాత్రంతా రంగనికి నిద్రపట్టలేదు. బిచ్చమెత్తుతుండగా అప్పుడప్పుడు యువకులన్న మాటలు చెవుల్లో గింగర్లెత్తి పోయినవి. ఆ రాత్రంతా యోచనా నిమగ్నుడయినాడు. తెల్లవారి లేస్తుండగానే ఏదో నిశ్చయానికి కొచ్చినట్టు కనిపించి నాడు. "ఏమేవ్! ఈ పైసలతో ఒక రిక్షా కొంటాను. యెధవ బిచ్చ మెవడెత్తుతడే! రాజోలే రోజుకు అయిదారు రూపాయలు సంపాదించవచ్చు. ఏమంటవే" రంగడు తన అభిప్రాయాన్ని పెండ్లాంకు చెప్పినాడు.

లచ్చికిదేం బాగనిపించలేదు. చేతిలోనున్న పైసలను నాశనం చేసుకోవడం తప్ప మరేం లేదనిపించింది. రిక్షాలు నడిపిస్తూ శరీరం కూడా తొందరగా పాడయ పోతుందని కూడా వింది. ఇంకెట్లా ఒప్పుకుంటుంది. ససేమిరా వొద్దంది లచ్చి. రంగడుమాత్రం వినలేదు. కొంటానంటే కొంటానన్నాడు. ఈ రూపాయలననగా ఒకనెలలో సంపాదించి పెడుతానన్నట్లు మాట్లాడినాడు.

రంగడు రిక్షాను కొన్నాడు. కొన్ని రూపాయలు తక్కువబడితే రిక్షా కొనాలనే సలహానిచ్చిన మిత్రుడే అప్పును కూడా ఇప్పించినాడు.

నెత్తురున్న మనిషి కాబట్టే రాత్రనక, పగలనక, ఇక్కడి కనక, అక్కడి కనక తిరుగుతున్నాడు రిక్షాతో రంగడు. పగలు తిండికి తప్పితే మరెప్పుడూ ఇంటికి రాడు. రాత్రి ఎప్పుడో అందరూ పడుకొన్న తరువాత వొస్తాడు. మళ్ళీ మబ్బు ఉండగానే వెళ్లిపోతాడు. లచ్చి ఎప్పటివలెనే బిచ్చమెత్తుతోంది. రంగడు సంపాదించిన దాంట్లో చిల్లర కర్చులకు పోగా రెండో మూడో రూపాయలను లచ్చివద్దే ఉంచుతున్నాడు.

నెల అయిపోగానే అప్పు తీర్చాలనుకున్నాడు రంగడు. మొత్తం ఇవ్వకున్నా, సగమో, పావో, పరకో ఇవ్వాలనే నిశ్చయించుకున్నాడు. కాని తానొకటి తలిస్తే

ప్రక్కతొకటి చేసినట్లు నెలాఖరు తేదీన రంగని రిక్షాను పోలీసులు పట్టుకొన్నారు. రూలు విరుద్ధంగా దీపం లేకుండా నడిపిస్తున్నాడని, ఏదో రెండు మూడు రూపాయలిస్తే అయిపోతుందనుకున్నాడు. కానీ అంతటితో ఆపీడ వదిలిపోలేదు. ఈ కేసు పోలీసుల చేతుల్లో నుండి ఇనస్పెక్టర్ల చేతుల్లోకి పోయింది. పదైదులనుండి పాతిక యాభై దాకా వెళ్ళిపోయింది లంచం. నెత్తురు వడిపి నిద్రనక, అలసటనక సంపాదించిన అంతడబ్బును ఒక్క నిముషంలో నీళ్ళల్లో పోసినట్లు పోసినారు. లచ్చి కలకలమంది. చెప్పితే ఏంటేనా అని తిట్టింది. ఏడ్చింది.

రోజులు గడుస్తున్నా కొలది రంగనికి రిక్షామిత్రులు పెరిగిపోతున్నారు. సంపాదించిన దాంట్లో తరుగు బాగానే అవుతుంది. మిత్రులవల్ల సిగరెట్లు, పానలు, చాయెలు అలవాటైనవి. అప్పుడప్పుడు అందరూ కలిసి సినిమాలకు కూడా వెళ్ళేవారు. లచ్చి రంగన్ని ఒకకంట కనిపెడుతూనే ఉంది. ఆ రిక్షా వొచ్చిన్నాడే అది అనుకొంది. లేని అలవాట్లనన్నింటినీ రిక్షా తెచ్చిపెడుతుందని. అక్కడికి ఎన్నోసార్లు చెప్పి చూచింది. చెప్పినప్పుడు రంగడు ఔనౌనని తలూపేవాడు. కాని ఇంట్లోనుండి కాలు బైటపెడితేనే అన్నీ మరచిపోయేవాడు. ఈ లోకమే వేరుగా ఉండేది వాడికి.

ఇప్పుడు రంగడు పాతచోటలేడు. పట్టణానికి ఓ కోనలో మురికిపేటలో ఉన్నాడు. అక్కడంతా రిక్షావాళ్ళే. అందరూ అద్దె ఇళ్ళల్లోనే ఉన్నారు. లచ్చి బిచ్చమెత్తడం మానేసింది. బోళ్ళు తోమడానికి ఓ చోట కుదిరింది. ఉదయ సాయంకాలాలూ అట్లా నాలుగిండ్లలో పనిచేస్తుంది.

సంపాదన ఎంత ఉంటే ఏముంది? ఎంతచెట్టుకు అంత గాలియట. ప్రతి వస్తువు కొనడమేనాయే. లచ్చి తన జన్మలోనేకాక తన అమ్మమ్మ జన్మలో కూడా కట్టెలుకొని ఎరగదు. కాని లచ్చి కొంటుంది. ఎక్కడైనా ఏరుకొద్దామన్నా వీల్లేదు. లచ్చికంతా సంకటంలో పడ్డట్టు అనిపించింది. ఇదేం బ్రతుకురా బాబు అని బాధపడ్డది. రంగడు మాత్రం పట్టణపు భ్రాంతిలో పడిపోయినాడు. ఇక జీవితమంతా ఇక్కడే గడపాలనే నిశ్చయంతోనే రిక్షాను కొన్నాడు.

లచ్చికి చాలారాత్రి తెలివైంది. ఇంకా మొగడు ఇంటికి రాలేదు. రోజూ ఈపాటికి వచ్చేవాడే కాని ఈ రోజెందుకు రాలేదని ఆలోచిస్తుంది. దీపం వెలిగించింది. చాలాసేపు రంగని కొరకు ఎదిరిచూచింది. తను తిని భర్తకోసం ఉంచిన అన్నంను చూసింది. ఎప్పుడో కుక్కలు తిని పోయినవి. గుండె గుభిల్లుమంది. మొగడెంత ఆకలితో వొస్తాడోనని బెదిరిపోయింది. లచ్చి అట్లా చూస్తుండగానే రంగడు గడపలో కాలుబెట్టినాడు. కాలుబెడుతూనే తూలికూలిపోయినాడు. అమాంతంగా లచ్చి రంగనిమీద పడ్డది. ఒళ్ళంతా పుణికి చూసింది. మెల్లిగా లేబట్టి పడక బట్టలో పడుకోబెట్టింది. రంగడిట్లా ఎందుకైనాడో లచ్చికి అర్థంకాలేదు. కొంతసేపైన తరువాత వాంతులు చేసుకొన్నాడు. లచ్చికప్పుడు పూసగుచ్చిన ట్లర్థమైంది. త్రాగినదంతా వాంతి చేసుకొన్నాడు. లచ్చి ఆ దుర్వాసనను భరించలేక పోయింది. తన మొగుడు ఎంత కల్లు త్రాగినా కక్కుకోడు. వాసన కూడా వేరేవిధంగా

ఉంది. ఇదేదో క్రొత్తదనుకొంది. పెద్దలను చంపుకున్నంత దుఃఖం పొర్లింది లచ్చికి. రంగడు రోజురోజుకిట్లా చెడిపోతాడని ఆమె కలలో కూడా అనుకోలేదు. కాళ్ళకు, చేతులకు గాయాలు తగిలినవి. నెత్తురునంతా తుడిచి తడిసున్నం పెట్టింది లచ్చి. ఏ తెల్లవారక ముందో కాని నిద్రపోలేదు.

లచ్చి తెల్లవారి చెప్పితేనే కాని ఇదంతా తెల్వదు రంగడికి. రాత్రి జరిగినదంతా భార్య చెపుతుంటే చేటంత ముఖం మొంటంత అయింది. ఛీ..చీ... అలాంటిపని కలలోకూడా చేయకూడదనుకుని చెంపలు వాయించుకొన్నాడు రంగడు.

అప్పులవాడు వచ్చి డబ్బో... డబ్బని పీక్కు తింటున్నాడు. అనరాని మాటలన్నీ అంటున్నాడు. రంగనికేం వానికెన్నడూ అప్పిచ్చిన సేటు కనిపించలేదు. వచ్చిన కష్టమంతా లచ్చికే. దాన్ని ఏమేమో అంటాడు. మానముంటే వారం తిరక్కముందు నా డబ్బు నాకు పడెయ్యండని గొంతు మీద కూర్చుంటాడు. లచ్చి ఎన్నిసార్లని బొంకుతుంది. తన బ్రతుకులో అప్పులవాళ్ళ గురించియే తెల్వదాయె. రంగడురాగానే నెత్తిన నోరెట్టుకొని చెపుతుంది లచ్చి. కాని రంగడేమి లక్ష్యపెట్టకుండానే, సరే చూద్దాం అని వెళ్ళిపోతాడు. మధ్యన వచ్చింది లచ్చికి మాత్రమే. రోజూ సంపాదిస్తున్న రూపాయలనేం చేస్తున్నాడో లచ్చికి మాత్రం తెల్వదు. ఇప్పుడు రంగడు సంపాదించిన డబ్బులను తనదగ్గరే ఉంచుకొంటున్నాడు. అవసరముంటే నాలుగో అయిదో ఇచ్చి లెక్కడుగుతున్నాడు. లచ్చి ఎంత గుట్టుగా కాపురం నడపాలనుకున్నా రద్దిపాలైపోతూనే ఉంది. ఆనాడు సేటు వొస్తే 'ఆయన్నే అడుగు' మని కచ్చితంగా చెప్పి వేసింది. ఇంటి కిరాయదారుక్కూడా అలాగే చెప్పింది.

చాలా రాత్రివరకు సేటు రంగని ఇంటిముందే కూర్చున్నాడు. పద కొండుగంటలైనా రంగడు రాలేదు. ఇంట్లోకి కేకవేసి 'మర్యాదగా చెప్పుతున్నానమ్మా రేపు పైకం కట్టకపోతే దావావేయక మానను' అని బెదిరించి వెళ్లిపోయినాడు. సేటు అట్లా వెళ్ళగానే రంగడు వొచ్చినాడు. ఇంట్లో కాలు బెడుతూనే అగ్గిబుక్కినాడు. 'రండా' అంటూ సిగవెంట్రుకలు పట్టినాడు. త్రాగిన వాసన గప్పుగప్పున కొడుతుంది. లచ్చి విడిపించుకోడానికి ప్రయత్నం చేసింది. రంగనికి మన్ను మిన్ను కనిపించడం లేదు. గజగజ వణుకుతూనే 'అన్నం తింటావా?' అన్న లచ్చిమాట పూర్తిగాకముందే రంగడు దబాదబా నాలుగు తన్ని 'వెంటనే ఇంట్లోనుండి పొమ్మని' గర్జించినాడు. లచ్చిఎత్తేసుకొస్తున్న దుఃఖాన్ని కడుపులోనే అదిమి పట్టుకుంది. కుక్కిన పేనులాగా ఓమూలకు కూర్చుంది లచ్చి. రంగని కండ్లు జోతుల్లాగా వెలుగుతున్నాయి. ముఖమంతా నెత్తురితో చిందులు త్రొక్కుతూంది.

ఇప్పుడు రంగడు ఒక్కొక్కసారి వారం రోజులవరకు కూడా ఇంటికి రావడం లేదు. లచ్చికి బ్రతకడమే బరువైంది. తనేం తప్పు చేసిందని అట్లా బాధ పెడుతున్నాడు. వేళకు కూటి కింట్లో గింజలు లేకున్నా పోరు పెట్టడం లేదు. నీవెందుకిలా త్రాగుతున్నావని అడగలేదు. ఎందుకిలా బాధిస్తున్నాడు వాడు. లచ్చి కేమీ అర్థం గాలేదు. ఊరుగాని ఊరికి వొచ్చింది. ఊ అంటే తన్ని అవతలికి నూకి పారేసేట్లున్నాడు రంగడు.

లచ్చికి బలే కష్టమొచ్చింది. ప్రొద్దంతానేమో అప్పులవాళ్ళ బాధ, రాత్రంతానేమో మగనితో బాధ. పాపం ఎలక్ట్రిక్ తీగెకు అంటుకున్న పక్షిలా విలవిల కొట్టుకొంటోంది లచ్చి ఆమె బ్రతుకలా తెల్లవార వలసి వచ్చింది. మగనితో దెబ్బలుతిని తిని మోటుబారిపోయింది శరీరం. రాసి రంపాన పెడుతున్నాడు. యమలోకమంటే ఇదేనేమోనని అనుకొంటుంది పాపం అమాయకజీవి లచ్చి.

ఆనాడు రంగడు పెందలకడనే ఇంటికి వచ్చినాడు. రంగడు మూల మలుపు తిరుగుతుండగనే ఎవడో మగవాడు తన ఇంట్లోనుండి బయటికి రావడం కళ్ళారా చూచినాడు. ఒక్కసారే కాళ్ళక్రింద భూమి బ్రద్దలై పోయినట్లు తోచిందతనికి. కండ్లల్లో నిప్పులు చెరిగినవి. ఒళ్ళంతా కోపంతో కంపరమెత్తింది. గడపలో కాలు బెట్టగానే అద్దం ముందు కూచొని బొట్టుబెట్టుకుంటున్న లచ్చి కనిపించింది అగ్నికి వాయువు తోడైనట్లు తన అనుమానానికి ఈ అలంకరణ సరిపోయింది. రంగడు మన మనిషి గాకుండా అయిపోయినాడు. లచ్చిని అలసిపోయేదాకా కొట్టినా రంగనికి కసి తీరలేదు అది ఎంత మొత్తుకున్నా, కాళ్ళమీదపడి ఎంత ప్రాధేయపడినా విడువలేదు రంగడు నానా బూతులు తిట్టినాడు. నమ్మినందుకు మోసం చేసినావని నిందించినాడు. అతని నిషా అంతా క్షణంలో కర్పూరంలా హరించుకపోయింది. ఇంట్లో ఒక్కక్షణం కూడా ఉండలేకపోయినాడు. వెంటనే బయటికి వచ్చి రిక్షా తీసుకొని వెళ్ళిపోయినాడు రంగడు.

తన భార్య ఇంతపని చేస్తుందని కలలో కూడా ఊహించుకోలేదు రంగడు. తన ప్రాణమే నేనని భావించిన లచ్చి ఇట్లా చేస్తుందా? అబ్బ పట్నం ఎట్లాంటి వాళ్ళని ఎట్లా మార్చివేస్తుంది." రంగడు యోచిస్తూ పోతున్నాడు పిచ్చివానిలాగా. ఇంతట్లో కారుహారను వినిపించింది. మరో క్షణంలో ఏమైపోయిందో రంగనికి తెల్యదు. కాని ఆ రాత్రి ఆస్పత్రిలో తెలిసింది కారు తన రిక్షాకు టక్కరయిందని.

తెల్లవారి భార్య వచ్చింది. కాని రంగడు లచ్చికి ముఖం చూపించలేదు. ఆమె ఎవతో అన్నట్లుగానే మెలగినాడు. ఆమె తన భార్య అన్న మాటనే మరచిపోయినట్లున్నాడు. నిజంగా లచ్చికి అప్పుడు కండ్లలో ఎన్ని సురగంగలు ఉప్పొంగినాయో తెలియదు. ఎన్ని అగ్నిపర్వతాలు హృదయంలో భగ్గుమన్నాయో తెలియదు. ముఖంమీద, చేతులమీద, కాళ్ళమీద పూయబడిన సున్నపు మరకలతో వచ్చి రంగని కాళ్ళమీద పడ్డది లచ్చి. తన తప్పేమీ లేదని, తన్నెందుకిట్లా శిక్షిస్తున్నావని ఏడుస్తూ అడిగింది. కాని రంగడేమి మాట్లాడలేదు. నీరసంగా వైరాగ్యంతో కూడిన ఒక చిన్ననవ్వును నవ్వినాడు అంతే!

లచ్చి గుండె బేజారెత్తిపోయింది. ఈయన అసలు ఇన్నాళ్ళు తనతో కాపురం చేసిన రంగడేనా అనే అనుమానం కలిగింది ఇంతగా ఒక్కసారే ఎట్లా మారిపోయినాడో అంతుచిక్కలేదామెకు.

రంగనికి తెలివొచ్చింది. సాయంత్రానికల్లా కళ్ళు నులుముకున్నాడు. తనముందు నిల్చున్నది తన భార్యేనా? తను నిన్న చీల్చిచెండాడిన లచ్చియేనా? ఎందుకంత అనుమానం కలిగింది? వాడు రోజూ పైసల కొరకు వొస్తున్నాడని చెపితే నేను వినిపించుకున్నానా? లచ్చికి తను ఇష్టం లేకపోతే చావుముఖంలో

ఉన్న నాదగ్గరికి ఆ దెబ్బలతోనే ఎందుకొస్తుంది? యోచనా తరంగాల్లో తరలి పోయినాడు రంగడు. వాడి కళ్ళముందు తళుక్కున ఏదో మెరసిపోయింది, అప్రయత్నంగా కళ్ళల్లో కన్నీరు దుమికింది.

కాళ్ళతో తన్నివేసిన లచ్చిని దగ్గరకు రమ్మని కళ్ళతో సైగ చేసినాడు రంగడు. కాటికిపోనున్న లచ్చి ప్రాణం లేచివచ్చింది.

"లచ్చీ! నన్ను క్షమించు."

లచ్చి మనసులో నవ్వుదొరలింది. కళ్ళపాపలను ఆనందబాష్పాలతో గిలిపింది.

రంగడు ఇంకేమో అనబోతుంటే నోటికడ్డంగా చేతినిబెట్టింది లచ్చి.

కళ్ళల్లోనుండి ముత్యాల్లాగా జాలువారుతున్న కన్నీరును కొంగుతో తుడుచుకుంది. రంగని ముఖమంతా ఆకొంగుతోనే అద్దింది.

"పచ్చని కాపురంలో చిచ్చుపెట్టిన రిక్షా నాశనమయిందిలే! ఇక ఎప్పటిలాగా పాతజీవితాన్నే ఆరంభిద్దాం" అన్నాడు రంగడు.

లచ్చి పొరలిపోతున్న ఆనందబాష్పాల నాపలేకపోయింది.

● జనవరి, 1957 ●

# 21. వెన్నెలవాడ

♦ చక్రవర్తి రంగస్వామి ♦

తియ్యని సన్నాయి సంగీతం భూమినీ, ఆకాశాన్నీ గిలిగింతలు పెడుతూ హృదయాలను మధు నాదమయంచేసి ఆనందపులకితం చేస్తోంది.

వసుంధరా సుధాకరులకు శుభపాణిగ్రహణ మహోత్సవం ఆయలంలో శ్రీస్వామి వారి సమ్ముఖాన జరుగుతోంది.

ఆ వివాహం అన్ని వివాహాల్లా రెండుకుటుంబాలను కలుపుతూ కొత్తగా ఏర్పడిన వంతెన వంటిది మాత్రమే కాదు -

జాతికీ, దేశానికీ, స్ఫూర్తినీ, పటిష్ఠతనూ కూర్చేది.

సమాజానికి వున్న మచ్చను తుడిచి శృంగారించేది.

మానవత్వాన్ని ఉత్తేజపరిచి వైషమ్యాన్ని రూపుమాపి, అన్యోన్యతను పెంచి, నవజీవనోత్సాహాన్ని ప్రసాదించే ప్రేమలను పెంచేది.

అందువల్లే ఆవూరు నవయౌవనంతో తొణికిసలాడుతూ ఆరోజు 'వెన్నెలవాడ' అయింది.

వెన్నెల రోజులకు పూర్వం ఆ వూరూ అన్ని వూళ్ళలాగే చీకటిలో పడి వుండేది.

అప్పటిలో ఒకరోజు-

రామయ్య చాలా కోపంగా కనిపించాడు.

తుఫానుకు ముందువుండే నిశ్చలత ఆ గృహ వాతావరణంలో ద్యోతకం అవుతోంది.

"లక్ష్మణా" అని పిలిచాడు.

"వస్తున్నా, అన్నా" అంటూనే వచ్చాడు లక్ష్మయ్య.

"అలా కూర్చో" అని కుర్చీ చూపించి "వసూ విషయాలేమిటి?" అని అడిగాడు.

"సుధాకర్‌ను చేసుకుంటానంటోంది" అన్నాడు లక్ష్మయ్య సంతోషంగా.

రామయ్య ముఖం కోపంతో యెర్రగా కందింది.

"నేను బతికుండగానే?" కోపంతో రామయ్య గొంతుక వణికిపోయింది.

లక్ష్మయ్య ఆలోచనలో పడ్డాడు.

"అందుకే, ఆనాడు ఆడపిల్లకు అంత చదువెందుకన్నాను. నా మాటను నువ్వు లక్ష్యపెట్టలేదు?.. ఈనాడు రామయ్య కూతురు తక్కువజాతి చేసుకుందంటారు. నీకేం నీ పేరు ఎవరెత్తుతారు?"

లక్ష్మయ్య కళ్ళుచెమ్మగిల్లాయి.

"అన్నా, యిలా అంటావని నేను కలలో కూడా అనుకోలేదు. నీ ప్రతిష్ఠకు భంగం కలిగితే, అది నాకుమాత్రం కాదా?... ఆడపిల్లకు చదువు చెప్పించటం తప్పా?"

రామయ్య కోపం ఆకాశాన్ని అంటింది.

"నీ కన్నబిడ్డే యీ పనిచేస్తే నీకు తెలిసి వచ్చేది."

లక్ష్మయ్య నిశ్చలంగా అన్నాడు. "నా కన్నబిడ్డ యీ పని చేసివుంటే నేనెంతో సంతోష పడేవాడ్ని. వసు నా బిడ్డ కంటే యెక్కువ. అందుకే నేను గర్వపడుతున్నాను. ఇంతకీ వసు చేసిన తప్పేమిటి?... మన కులంలో సుధాకరరావువంటి బుద్ధిమంతుణ్ణి చూపగలవా? అలాంటి భర్తను కోరుకోవటం తప్పా? అన్నా కన్నబిడ్డకంటే తక్కువగా చూసుకుంటున్నానా నేను వసును?" అతనిమాట కంపించిపోయింది.

తమ్ముడి మనస్సు కష్టపడ్డట్టు రామయ్య గ్రహించాడు. కాని, తన మనస్సు కష్టపడ్డట్టు తమ్ముడు గ్రహించలేదని అతనికి కోపం యెక్కువయింది. చేతికర్ర తీసుకొని చరచరా పొలానికి బయలుదేరాడు కోపం కనపడేలా.

పోతున్న అన్నను చూస్తూ లక్ష్మయ్య అలాగే నిలబడిపోయాడు విచారంగా.

రామయ్యకు యెప్పుడు యే విషయాన్ని గురించీ తీవ్రంగా ఆలోచించే అలవాటు లేదు. ఇంటిపనులన్నీ భార్య చూసుకుంటుంది. పిల్లల చదువులు, యితర వ్యవహారాలు తమ్ముడు చూస్తుంటాడు. పొలం పనులేమో, అతనేమో. అవసరమైనప్పుడు నౌకర్లను మందలించడం, మళ్ళీ జాలిపడటం అతని అలవాటు. అంతేకాని, బుర్రలు బద్దలు కొట్టుకునేంత ఆలోచనలుంటాయని అతనికి తెలియదు.

వసు సుధాకర్‌ని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకోటం అతని పాలిటొక గడ్డు సమస్య అయి కూర్చుంది. సుధాకర్ తల్లిదండ్రులు అతనికి తెలుసు. అలాంటప్పుడు సుధాకర్‌ను అంత చదువుకున్నదై యుండి తన కూతురు వివాహం చేసుకోటానికి నిశ్చయించుకోవటమా? – అని అతని బాధ.

అన్న తనను అర్థం చేసుకోలేదన్న బాధ లక్ష్మయ్యది. అన్న బిడ్డలను తను అత్యంత గాఢంగా ప్రేమిస్తున్నాడు. విద్యాగంధం యెరుగని ఆ ఇంట్లో చదువుల సరస్వతిని నెలకొల్పాడు. మూఢవిశ్వాసాలతోటీ, అజ్ఞానంతోటీ చీకటి కమ్మిన ఆయింట్లోకి మంచి వెలుతురును, గాలిని తీసుకు వచ్చాడు. తను పెళ్ళి చేసుకోలేదు. స్వార్థాన్ని చూచుకోవటం లేదు. తన వంతు ఆస్థిపాస్తులు రేపు అన్న బిడ్డలకే. ఇదంతా తెలిసుండి అన్న తనను అలా అన్నాడే! "అందుకే మొదటే ఆడపిల్లకు అంత చదువెందు" కన్నాట్ట. లక్ష్మయ్యకు జాలి వేసింది. లక్ష్మీనారాయణగారు తన జీవితాన్నంతా యిలాంటివాళ్ళకు విద్యనూ, విజ్ఞానాన్ని పంచిపెట్టడానికే ధారపోశారు. అయినా కొందరు దూరంగా వుండి యిలా మిగిలిపోయారు.

అదృష్టవశాత్తు అన్నపిల్లలను విద్యావంతులను చేశాడు కనుక యిది యెదుర్కో లేనంత పెద్ద కెరటమేమీ కాదు. ఈ ఊపున గ్రామంలో కులభేదాలను పునాదులతో సహా పెకలించాలి. ఈ పని లక్ష్మీనారాయణగారు బ్రతికుండగా అయితేనే సులభ సాధ్యం అవుతుంది. ఒక గ్రామం ఒక పనిని చేయగలిగినప్పుడే దేశం చేయగలుగుతుంది. గ్రామం చేయలేని పనిని దేశం యెలా చేయగలుగుతుంది అనుకొని లక్ష్మయ్య కొత్త ఉత్సాహాన్ని తెచ్చుకున్నాడు.

వసుని పిలిచి తనకూ అన్నకూ జరిగిన సంభాషణ వినిపించాడు.

వసు చిరునవ్వు నవ్వింది.

ఆ చిరునవ్వులో ఒక విషాదరేఖ ప్రస్ఫుటంగా కనిపించింది. దాని అర్థం లక్ష్మయ్యకు స్ఫురించినట్లయి పైన కండువా వేసుకొని బయలుదేరాడు. దారి పొడుగునా లక్ష్మయ్యకు ఆలోచనలే. లక్ష్మీనారాయణగారు యింత విజ్ఞాన భిక్ష పెట్టారు గనక యింతమాత్రం జ్ఞానం కలిగింది. అంటరానితనం యెంత కూడనిదో తానైనా అన్నకు వివరించి చెప్పి వుండవలసింది. అలా చేయకపోవడమే తను చేసిన పెద్దతప్పు. దాని దుష్ఫలితం కనిపించింది. సుధాకర్ యెంత ఉత్తముడో, అన్నకు యెలా తెలుస్తుంది? వసులోని హృదయౌన్నత్యం, సంస్కారదృష్టి, వైదుష్యం సుధాకర్‌ని భర్తగా యెన్నుకోటానికి కారణాలని అన్న యెలా అర్థం చేసుకోగలడు? – అందువల్లే వసు చిరునవ్వులో విషాదరేఖ కనిపించింది.

అన్నను దారికి తీసుకురావటమే తను తక్షణం చేయవలసిన పని. అందుకే బయలుదేరి వెళ్ళుతున్నాడు.

రామయ్య తమ్ముణ్ణి చూసి "ఎందుకు వచ్చావ్!" అని అడిగాడు.

"వసు విషయం మాట్లాడుకుందామని" చెప్పాడు.

"మాట్లాడాల్సిందేముంది? నేను ఒప్పుకోవడమేనా కావలసింది?"

"నిజానికి అంతే, కాని బలవంతపెట్టి కాదు."

"అయితే మీ అభిప్రాయాలకు అనుకూలంగా నన్ను మార్చటానికి వచ్చావన్నమాట. తమ్ముడూ, యింతకాలం యేదో కలిసివున్నాం. ఇక నీ నీ అభిప్రాయాల ప్రకారం స్వేచ్ఛగా నీ దారిన నీవు వుండు. పిల్లలు కలవాణ్ణి, నా బతుకేదో నన్ను గుట్టుగా బతకనివ్వు."

"ఏమిటి అన్నా , నీవనేది?"

"మా బతుకేదో మమ్మల్ని బ్రతకనివ్వమని అంటున్నాను – అర్థం కాలేదా?"

"కలిసి వుంటున్నందువల్ల నేను కష్టం కలిగిస్తున్నానా?"

"కష్టం మాట అటుంచు, యెంతోమందిని చూస్తున్నాం. ఎవరికైనా తమ బిడ్డపెండ్లి యింత గడ్డు సమస్య అయి కూర్చుందా చెప్పు?"

"నీవు ఆలోచిస్తున్న విధం తప్పు అన్నా."

"నీవు ఆలోచిస్తున్న విధం ఒప్పు అని తేలినప్పుడు నీ మాట వింటానులే తమ్ముడూ" అని వెటకారంగా అన్నాడు.

"ఇంతేనా?"

"ఇప్పటికి యింతే."

లక్ష్మయ్యకు చాలా దుఃఖం కలిగింది."సరే వెడతాను" అని బయలుదేరాడు. కొంతసేపటికి సూర్యుడు అస్తమించాడు. మరికొంతసేపటికి చాలా చీకటిపడింది.

రామయ్యకు యేదో జంకుగా వుంది. చుట్ట ముట్టించి యింటికి బయలుదేరాడు. కిర్రు చెప్పులు, చేతికర్ర నీరసంగా చప్పుడు చేస్తుండగా యింటికి చేరుకున్నాడు.

ఇల్లు నిశ్శబ్దంగా వుంది కాళ్ళు కడుక్కొని మంచంమీద చాలా కొంతసేపు విశ్రాంతి తీసుకున్నాడు. వేణ్ణీళ్ళు కాగాయని పిలిచారు వెళ్ళి స్నానం చేశాడు. భార్య వడ్డించి భోజనానికి రమ్మంది.

రామయ్య భోజనానికి కూర్చొని మామూలుగా పక్కకు చూశాడు లక్ష్మయ్య భోజనానికి కూర్చునేచోటు ఖాళీగా వుంది. యీ రెండేండ్లకు పైబడ్డ తన జీవితంలో లక్ష్మయ్య పక్కన కూర్చోని రోజు యిదే భోజనం సయించలేదు. మొక్కుబడి తీర్చుకొని వెళ్ళి పడుకున్నాడు.

ఎల్లాగో తెల్లవారింది. ఎండెక్కింది. ఎవరి పనులు వాళ్ళు చూచుకుంటున్నారు. కాని, ఆ యింటిని ఆవరించిన భయంకర నిశ్శబ్దం, వాతావరణంలో విషాదం అలాగే వున్నాయి.

రోజువెంట రోజు కాలప్రవాహంలో కొట్టుకపోతున్నాయి

వసు వైద్యం ప్రారంభించింది. వైద్యంతోపాటు మంచి పేరు కూడ వృద్ధి పొందు తోంది.

పెండ్లి మాట మాత్రం ఎక్కడా వినిపించటం లేదు.

వసు పెండ్లి విషయంలో అన్నదమ్ముల మధ్య మనస్పర్ధలు కలిగాయని ఊరు వుడికి పోతోంది.

రామయ్య, లక్ష్మయ్య అన్నదమ్ములు. వ్యవసాయం చేసుకుంటూ కొద్దిపాటి భూస్వాములనిపించుకొని మర్యాదగా జీవిస్తున్నారు

★ ★ ★

రామయ్యకు ఒక కొడుకూ, ఒక కూతురూ - వసుంధర, మధు

లక్ష్మయ్య పెళ్లి చేసుకోలేదు. మొదట మొదట "యిప్పుడేం పెళ్ళిలే" అని నెట్టుకుంటూ వెళ్ళాడు. అన్న పెళ్ళిచేసుకోమని బలవంతపెట్టేసరికి చివరకు "జంజాటం పెట్టుకోవటం యిష్టం లేదన్నా, నీ పిల్లలే నా పిల్లలు. నన్నూ వాళ్ళే చూస్తారు. బలవంతపెట్టవద్ద" ని బ్రతిమలాడి తప్పించుకున్నాడు ఇక చెప్పీ లాభం లేదని రామయ్య వూరుకున్నాడు.

లక్ష్మయ్య అన్నతోపాటు వ్యవసాయం చేస్తున్నా, అతని దృష్టి విద్య వైపు మరలింది. కష్టపడి కొంత విద్యను ఆర్జించాడు. పొలం పనులు లేనప్పుడు లక్ష్మీ నారాయణగారి ఇంటికో, గ్రంధాలయానికో వెళ్ళి అనేక పుస్తకాలు చదువుతూండే వాడు. చదువు

సముద్రంలాంటిదని అతని భావన. చదివింది పూర్తిగా అర్థంకాక పోయినా, లీలగా అంతుపట్టేది. చదివిన పుస్తకాలలోని ఎన్నో విషయాలు కొంత కొంత అర్థమై అతని విజ్ఞాన తృష్ణను పెంచాయి. క్రమంగా దుర్వ్యసనాలు, దురాచారాల మీద ఏవగింపు పుట్టింది. విషయాన్ని పరిశీలనగా చూడటం, తెలిసినవాళ్లు ప్రసంగించుకునేటప్పుడు వినటం, సానుభూతితో ఆలోచించటం అలవాటయింది.

లక్ష్మయ్యకు అన్న అంటే అమిత గౌరవం. అన్న పిల్లలంటే ఎంతో ప్రేమ. వాళ్ళకు వసుంధర అనీ, మధు అనీ చక్కని పేర్లను ఎన్నిక చేసిందీ అతనే. తండ్రి దగ్గరకంటె పినతండ్రి దగ్గరే పిల్లలకు చనువు ఎక్కువ. వాళ్ళకు ఏది కావలసినా పినతండ్రినే అడుగుతారు. అతని దగ్గరే మారాం చేస్తారు. అతని మీదపడి ఎక్కి తొక్కి అల్లరిచేసి ఆడుకుంటారు. లక్ష్మయ్య ఎక్కడకు వెళ్ళినా పిల్లలకని ఏదో ఒకటి తీసుకువస్తేనేగాని అతని మనస్సుకు తృప్తి ఉండేది కాదు. బాబాయి తమకు ఏదో ఒకటి తినటానికి తెస్తాడని ఎదురు చూట్టం వాళ్ళకు అలవాటయిపోయింది.

వసు మరీ చిత్రమైన పిల్ల. పినతండ్రిని చూచి పుస్తకాలను ముందువేసుకొని కూచొని ఏదో చదువుతున్నట్లు 'లొడ లొడ' లాడేది. పినతండ్రిని చూచి నేర్చిందని అంతా నవ్వేవాళ్ళు.

ప్రాథమిక పాఠశాల చదువు కాగానే రామయ్య వసు చదువు మాన్పించాలని చూశాడు. కాని అన్నతో వాదించి వసును హైస్కూల్లో చేర్పించాడు లక్ష్మయ్య. వసు చదువు విషయంలో శ్రద్ధంతా లక్ష్మయ్యదే.

వసు చదువులో బాగా రాణిస్తోంది. హైస్కూలు చదువు అయింది. రామయ్య మళ్లీ ఒకసారి కూతురి చదువు మాన్పించటానికి ప్రయత్నించాడు. చదువుమీద ఆసక్తిగల వసుంధరవేపు పినతండ్రి మేరు పర్వతంలా నిల్చాడు. దానితో రామయ్య "సరే, పినతండ్రి యిష్టం, కూతురి యిష్టం" అని చురచుర చూచి పొలం వెళ్ళిపోయాడు.

వసు చదువు నిర్విఘ్నంగా సాగి వైద్య కళాశాలలో చేరి కోర్సు పూర్తి చేసుకొని అప్పుడే యింటికి చేరింది.

ఇంతలో ఒకరోజు "లక్ష్మీనారాయణగారు నోట మాటలేకుండా పడిపోయా" రని పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు నారాయణ.

"ఏమిటీ, ఎప్పుడూ?" అంటూ పైన కండువా వేసుకొని హడావుడిగా వెళ్ళాడు లక్ష్మయ్య - లక్ష్మీనారాయణ గారి యింటికి.

ఆయనస్థితి చూస్తూనే డాక్టరుకోసం మనిషిని పంపి "వసును తొందరగా పిలుచుక రా, బాబూ" అని నారాయణను పంపాడు. డాక్టరు వచ్చాడు. ఇంజక్షన్ యిచ్చి మందులు, ఉపచర్యలు గూర్చి చెప్తున్నాడు. ఇంతలో వసు వచ్చింది.

"మా అమ్మాయి వసుంధర, ఎం.బి.బి.యస్.కోర్సు మొన్ననే పూర్తి చేసింది. మందులివ్వటం, పథ్యం పానాలు ఆమె చూస్తుంది. మీరు శ్రద్ధగా వస్తూ వైద్యం చేయాలి. ఎంతకర్చయినా పరవాలేదు. ఆయన దక్కితే చాలు" అని లక్ష్మయ్య డాక్టరుతో అన్నాడు.

డాక్టరు వసుతో జబ్బును గూర్చి, ఔషధాలను గూర్చి చెప్పి మళ్ళీ సాయంత్రం వస్తానని వెళ్ళాడు.

లక్ష్మయ్య చదువు నేర్చుకోవడంలో సహాయపడ్డ వ్యక్తి లక్ష్మీనారాయణగారే. ఆయన తరచు మాట్లాడే విషయాల వల్లనే లక్ష్మయ్యకు యెంతో జ్ఞానం కలిగింది. దేశానికి సంబంధించిన అనేక విషయాలను గురించి ఆయన మాట్లాడేవారు. కులమతద్వేషాలు, దుర్వ్యసనాలు, దురాచారాలు దేశాన్ని యెంత బలహీనపరిచాయో, యెంతకూడనిదో వివరించేవారు

సుధాకర్‌ని అందరూ లక్ష్మీనారాయణగారి కుమారుడేనని అనుకునేవారు.

లక్ష్మీనారాయణగారు ఆవూరికి ఉపాధ్యాయుడుగా వచ్చిన కొత్తలో ఒకనాటి సంఘటన.

ఆయనకు ప్రతిరోజు సాయంత్రం విహారానికి పోయే అలవాటు ఆ రోజు చీకటి పడుతుండగా విహారంనుండి తిరిగి యింటికి వెళ్ళుతున్నారు. హరిజనవాడలో గుంపుగా జనం చేరి వుండటం చూచి అక్కడికి వెళ్ళారు.

అది చిన్న పూరిల్లు చిన్న దీపపు బుడ్డి కునుకుపాట్లు పడుతోంది. కాగుతోన్న వొంటితో పసికూన మంచంలో కుక్కి మంచంలోని మురికి గుడ్డలలో మూలుగుతున్నాడు.

హరిజనవాడను ముంచి వేసిన 'విషజ్వరం' ఆ బిడ్డ తండ్రిని క్రిందటి నెలలో మింగింది. అంతటితో ఆగక నిన్నటిరోజున తల్లిని మింగింది. విషజ్వరాలకు ఆరోజుల్లో మాలపల్లిలో బీదకుటుంబానికి ఏమి వైద్యం జరుగుతుంది?

అక్కడ పోగైన జనం ఆ బిడ్డ విషయంలో కూడ పెదవి విరిచి శ్రద్ధ చూపడం మానేశారు. "ఈ బిడ్డ దక్కితే నాది" అంటూ చేతుల్లోకి తీసికొని యింటివేపు నడిచారు లక్ష్మీనారాయణగారు.

అందరూ ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు.

దక్కిన ఆబిడ్డే - సుధాకర్.

సుధాకర్‌ను పెంచడం వల్ల బంధుమిత్రులు ఆయనకు దూరమైనారు ఎన్నో కష్టాలు వచ్చాయి. అన్నిటినీ ఎదుర్కొన్నారు. పెండ్లిలేదు ఏకాకిగా బ్రతికారు అయినా ఏ మాత్రం చలించలేదు.

ఆయనే తల్లీ, తండ్రీ అయి సుధాకర్‌ను పెంచి పెద్దజేసి విద్యాబుద్ధులు చెప్పించారు. అతని విద్యాబుద్ధులు, వినయ విధేయతలు, శుచి శుభ్రతలు వెళ్ళిన చోట్లల్లా అందరికీ ప్రేమపాత్రుణ్ణి చేశాయి

సుధాకర్ యిప్పుడు నాగార్జున సాగర్ వద్ద అసిస్టెంట్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు.

లక్ష్మీనారాయణగారికి జబ్బు చేసిందని సుధాకర్‌కు టెలిగ్రాం యిచ్చారు.

సుధాకర్‌కు టెలిగ్రాం అంది, సెలవుదొరికి వచ్చేటప్పటికి నాలుగు రోజులైంది.

ఈ నాలుగురోజుల్లో లక్ష్మీనారాయణగారికి ప్రాణాపాయ స్థితి తప్పింది. కాని మాట రాలేదు ఎడమ పార్శ్వం పూర్తిగా స్వాధీనం లేకుండా పోయింది.

సుధాకర్ వస్తూనే లక్ష్మీనారాయణగారి స్థితిని చూసి పసిపిల్లవాడిలా ఏడ్చాడు.

లక్ష్మీనారాయణగారి కళ్ళవెంట కన్నీరు దొర్ల ప్రారంభించాయి. వసు తుడిచింది. మళ్ళీ దొర్లాయి మళ్ళీ తుడిచింది. ఈ సారి సుధాకర్‌ను చాటుకు పిలిచి ధైర్యంగా వుండవలసిన అవసరాన్ని హెచ్చరించింది.

రోజులు గడుస్తున్నాయి. లక్ష్మీనారాయణగారి స్థితి కొంత బాగుపడుతున్నా మాట రావటానికి. పక్షవాతం పొందిన పార్శ్వం స్వాధీనంలోకి రావటానికి, చాలాకాలం తీసుకుంటుందని తేలిపోయింది.

సుధాకర్‌కు సెలవు అయిపోయింది. ఇంకా వారం సెలవు పొడిగించుకొని తన కర్తవ్యాన్ని గురించి లక్ష్మయ్యను సలహా అడిగాడు. లక్ష్మీనారాయణగారి భారం తాను తీసుకుంటానన్నాడు లక్ష్మయ్య. నిశ్చింతగా సుధాకర్‌ను పనిలోకి వెళ్ళమన్నాడు.

సుధాకర్‌కు లక్ష్మీనారాయణగారిని విడిచి వెళ్ళటం యిష్టం లేదు.

"నేను కూడా యిక్కడే వుంటాను. కాబట్టి లక్ష్మీనారాయణగారి విషయం మేము చూసుకుంటాం. ఆయన దిగులు పెట్టుకోకుండా మీ ఉద్యోగ విధులు మీరు చూసుకోండి" అని వసు కూడ అన్నది.

ఆ అనటంలోని నిజాయితీ అతని హృదయాన్ని తాకింది.

వసులోని సేవాభావం, వినయం అతణ్ణి ముగ్ధుణ్ణి చేశాయి.

లక్ష్మయ్యకు లక్ష్మీనారాయణగారి యందుండే గౌరవం ఆమె తెలుసుకుంది. కనుకను ఆమెకు కూడ ఆయన యందు గౌరవ భావం యేర్పడి వుంటుందను కున్నాడు.

ఆయనకు సేవ చెయ్యటానికి అందరూ ముందుకు వస్తున్నారు. తన రుణం తీర్చుకోటానికి వీలు దొరకటం లేదు అనేదే అతని విచారం.

అతని ఆలోచనలు యింకా యిలా పరుగెత్తాయి.

కీడులోజరిగిన మేలు కాబోలు తనకు లక్ష్మయ్యతో, వసుతో ఆత్మీయత పెరగటం.

కులానికీ కులానికీ మధ్య పెరిగి పోయిన అడ్డుగోడలను విడగొట్టి తమ హృదయ వైశాల్యతను పెంచుకోగలగటానికి యెంత సంస్కారం వుండాలి! అంత సంస్కారం వసుకు యెలా అబ్బిందో అని ఆశ్చర్యపోయాడు.

అనేకసార్లు ఉబుసుపోక యెన్నో విషయాల గురించి చర్చించాడు సుధాకర్. కులమత భేదాలు, దురాచారాలు, సంస్కరణలు, సాహిత్యం, కళలు – జాతీయ అంతర్జాతీయ విషయాలు యెన్నో.

ప్రతిచర్చలోను ఆమె విషయ పరిజ్ఞానం, ఆలోచనా శక్తి ఆధునిక యువతిగా ఆమె వ్యక్తిత్వం కనిపించేవి. సానుభూతి, దయాదృష్టి మొదలైన సద్గుణాలు అడుగడుగునా స్పష్టంగా వుండి అతనిని ఆకర్షించాయి.

ఇంతకూ అతను ఎల్లుండే పనిలో చేరాలి. వెళ్ళి లక్ష్మీనారాయణ గారిదగ్గర కూర్చున్నాడు. లక్ష్మయ్య, వసు అక్కడే వున్నారు. లక్ష్మయ్య వేపు, వసు వేపు చూసి, "వారు నావిషయంలో శ్రద్ధ తీసుకుంటారు. నీవు వెళ్ళి పనిలో చేరవలసిందని" లక్ష్మీనారాయణగారు తెలిసేట్టు సంజ్ఞ చేశారు.

సుధాకర్ ధైర్యం తెచ్చుకొని వూరికి వెళ్ళాడు.

నెలవెంట నెల కాలచక్రంలోని ఆకుల్లా జరిగిపోతున్నాయి.

లక్ష్మీనారాయణగారి ఆరోగ్యం - కర్ర సాయంతో కొద్దిగా నడవటం, సంగి సంగిగా మాట్లాడటం వరకు అభివృద్ధి పొందింది. నారాయణ ఎప్పుడూ ఆయనను కనిపెట్టుకొనే వుండేవాడు. లక్ష్మయ్య రోజుకు ఒకటి రెండుసార్లు వచ్చి విచారించి వెళ్ళుతుండేవాడు. వసు తరచు చూసి వెళ్లుతూ వుండేది. డాక్టరు శ్రద్ధగా వైద్యం చేస్తున్నాడు.

సుధాకర్ నెలకు ఒకసారైనా వచ్చి లక్ష్మీనారాయణగారిని చూచి వెళ్ళుతూ వుండేవాడు.

సుధాకర్‌తో పరిచయం వసులో ఒక క్రొత్త మార్పును తెచ్చింది. అతని పుట్టుక, పెరిగిన విధం, తెలుసుకున్న ఆమెకు అతని యందు ఎంతో సానుభూతి ఏర్పడింది. అతని విద్యా వినయసంపత్తి, సౌశీల్యం ఆమెను ఎంతో ఆకర్షించాయి. సంస్కార బుద్ధి, విశాల దృష్టిగల ఆమెకు అస్పృశ్యతా భావం ఏకోశానా లేకపోవటంతో అతని యందు ప్రేమ అంకురించింది. తన వివాహ ప్రసక్తి వచ్చినప్పుడు పినతండ్రితో సుధాకర్ పేరును ఆమె సూచించింది.

దానితో రామయ్యకు ఆగ్రహావేశంవచ్చి లక్ష్మయ్య మీద విరుచుకుపడటం జరిగింది.

ఆనాడు హృదయభారంతో అన్న యింటిని వదిలిపెట్టిన లక్ష్మయ్య పూర్తిగా హరిజన సేవలో మునిగిపోయాడు. గ్రామంలోని విద్యావంతులసందరిని చేర్చి వుత్తేజపరిచాడు. దానితో కులానికీ, కులానికీ మధ్య వున్న అడ్డుగోడలను పూర్తిగా పడగొట్టాలని అందరూ నడుములు బిగించారు. హరిజనవాడలో అడుగడుగునా వయోజన విద్యాబోధ ప్రారంభించాడు. ఇంటింటివద్ద పారిశుద్ధ్య ప్రబోధం మొదలు పెట్టారు. వారం వారం విద్యావంతుల చక్కని ఉపన్యాస కార్యక్రమాల నిర్వహణ ప్రారంభమైంది. అస్పృశ్యతను పాటించకూడదని అందరూ ప్రమాణం చేసుకున్నారు. ఒకరి కష్టానికి ఒకరు ఆదుకుంటున్నారు. ఒకరి ఆనందాన్ని ఒకరు పంచుకుంటున్నారు. హరిజనవాడలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, శుచిగా కనబడుతున్నారు. త్రాగుడు మొదలైన దుర్వ్యసనాలను విడిచిపెట్టారు. ప్రతి ఒక్కరిలో విద్యాభిరుచి, విజ్ఞాన తృష్ణ పెరిగాయి.

రామయ్య తన భావాలతో తాను ఏకాకి ఐపోయినట్లు భావించటం మొదలు పెట్టాడు. ఒక్కొక్కసారి తన భావాలు అనాగరికమైనవని కూడా తోచేది. ఎంతో ప్రపంచజ్ఞానం సంపాదించుకున్న తమ్ముడు, విద్యావంతురాలైన కూతురు, గ్రామాని కంతా మణిపూసలాంటి లక్ష్మీనారాయణగారు. వాళ్ళ భావాలకూ, తన భావాలకూ ఎంత వ్యత్యాసం. తప్పకుండా తనది మూర్ఖపు పట్టుదలే అయ్యుంటుంది. మరి కూడని పనే అయితే సుధాకర్‌ను లక్ష్మీనారాయణగారు ఎలా పెంచారు?

లక్ష్మీనారాయణగారికున్న జ్ఞానంలో తన జ్ఞానం ఎన్నోవంతు? తనలాగ అజ్ఞానులైన కొందరు ఆయనను ఎంత కష్టపెట్టారు? ఈ కులాల ఎక్కువ తక్కువలు ఎందుకో! అందరమూ మనుష్యులమే అయినప్పుడు అంటరానితనంలో న్యాయం ఏముంది? వీటివల్ల కక్షలు సాధించు కోవటాలు తప్ప ఏమి లాభం ?

గ్రామంమొత్తం పొందగలిగిన సంస్కారం తను ఎందువల్ల పొందలేక పోయాడో! అంటరానితనం ఎలా వచ్చిందీ? పాటించ తగినదేనా? తగనిదా? అని లక్ష్మయ్యను తను అడిగి వున్నట్లయితే ఎంత బాగుండేది? వసుపెండ్లి ఒక సమస్య కాకుండానే వుండేదేమో!

వయస్సులో పెద్దవాడై కూడ, ఇంత చిన్న విషయాన్ని గ్రహించటంలో అందరికన్నా వెనుకపడ్డట్టు అనుభూతి పొంది సిగ్గుపడ్డాడు.

సుధాకర్‌తో వసు వివాహానికి సంతోషపూర్వకంగా తాను అంగీకరించే వరకు వసు పెండ్లి మాట ఎత్తదు, తను రమ్మని పిలిచే వరకు తమ్ముడు యింట్లో అడుగుపెట్టడు. విచిత్రమైన సత్యాగ్రహం! అస్పృశ్యత పాటించరాదని తనకు తెలిసి వచ్చింది. తనలో వచ్చిన మార్పును వాళ్ళకు ఎలా తెలపడం? ఈ ఎడతెగని ఆలోచనలు అతనిలో పశ్చాత్తాపాన్ని కలిగించాయి.

ఒక సంవత్సరం గడిచింది.

లక్ష్మీనారాయణగారు మాట్లాడ గలుగుతున్నారు చేతికర్ర వూతతో కొంత దూరం నడవ గలుగుతున్నారు. జబ్బు చాలా వరకు తగ్గింది. చిన్న చిన్న పనులన్నింటికీ యితరులమీద ఆధారపడకుండా ఆయనే చూసుకుంటున్నారు.

వర్ణవైషమ్యం పూర్తిగా నశించిన ఆగ్రామస్థులకు ఒక సందేహం కలిగింది. "ఊరికి మాలపల్లి ఎందుకుండాలి" అని.

ఒకరోజు గ్రామస్థులందరూ వెళ్ళి లక్ష్మీనారాయణగారివద్ద తమ సందేహాన్ని బయటపెట్టారు.

"ఉండకూడ" దన్నారు ఆయన.

గ్రామస్థులంతా లక్ష్మయ్యతో హరిజనవాడకు వెళ్ళారు. గ్రామస్థులు తరపున వాళ్ళనందరిని గ్రామంలోకి ప్రేమ పూర్వకంగా ఆహ్వానించాడు లక్ష్మయ్య. గ్రామస్థులు చందాలు వేసుకొని తమ తమ యిండ్ల మధ్య స్థలాలను సంతోష పూర్వకంగా యిచ్చారు. ఇంజనీరైన సుధాకర్ ఆరోగ్య సూత్రాల ననుసరించి యిండ్ల నిర్మాణానికి చక్కని సలహా యిచ్చాడు.

ఇండ్లు కట్టడం పూర్తి అయింది. మహోత్సాహంతో గృహప్రవేశాలు జరిగాయి.

ఇక ఆ వూరికి మాలపల్లి లేదు. ఆ స్థలంలో సహకార పద్ధతుల మీద పెద్ద "ఆయిల్ మిల్స్" స్థాపించారు. దానితో అందరికీ రకరకాల పనులు దొరికాయి.

అందువల్ల గ్రామ ఆర్థిక వ్యవస్థ ఎన్నో విధాల బాగుపడ్డది.

దానితో గ్రామానికి నవచైతన్యం వచ్చింది.

అన్ని సదుపాయాలతో చక్కని డిస్పెన్సరీ ప్రారంభమైంది దాంలో వసుంధర డాక్టరుగా నియమించబడింది.

రోగులపట్ల ఆమె చూపే శ్రద్ధ, వైద్యంలో ఆమెకు గల నైపుణ్యం చుట్టుపక్కల గ్రామాలను కూడా ఆకర్షించాయి. డాక్టరుగా ప్రజోద్ధరాలు కావటం అలా వుంచి, సంఘసేవ వల్ల కూడా ఆమె యెంతో మంచిపేరును సంపాదించుకుంది.

డాక్టరు వసుంధరా దేవి తండ్రిగా రామయ్య గౌరవం యెంతో పెరిగింది. దానితో కూతురు ఆశయాలపట్ల సానుభూతి కలిగి, అతనిలో పరివర్తన కలిగింది.

లక్ష్మీనారాయణ గారిని చూడటానికి వచ్చి, సుధాకర్, వసు కొద్ది కాలంలోనే ఆర్జించుకోగలిగిన గొప్ప పేరును చూసి ఆశ్చర్యపోయాడు ఆమె మధురప్రకృతి, నిరాడంబరత, సేవాదృష్టి అతనిలో ఆమె యెడల ప్రేమ, గౌరవాలను రేకెత్తించాయి.

ఒకరోజు లక్ష్మయ్యతో "నిన్ను నీ అన్నదగ్గరకు చేర్చటం, వసు వివాహం, మళ్లీ మీ యింట్లో శాంతీ సంతోషాలను నెలకొల్పటం - యివీ యిక మనం పరిష్కరించ వలసినవి" అన్నారు లక్ష్మీనారాయణగారు.

లక్ష్మయ్య మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు.

లక్ష్మీనారాయణగారు నారాయణను పిలిచి "రామయ్యను ఒకసారి వచ్చి మాట్లాడి పొమ్మని చెప్పిరా బాబూ. అశక్తతవల్ల రాలేక మిమ్మల్ని రమ్మనవలసి వచ్చిందని అన్నానని కూడా చెప్పు" అన్నారు.

నారాయణ రామయ్యను పిలవడానికి వెళ్ళాడు.

"ఇప్పుడు అన్న పొలం వెళ్లివుంటాడు. రాత్రికి వచ్చి మాట్లాడుతాడనుకుంటాను." అన్నాడు లక్ష్మయ్య.

"అతని వీలునుబట్టి యెప్పుడన్నా రానీ, ఎక్కడికీ వెళ్ళేవాడ్ణి కాదుకదా."

"నాకు కష్టం కలిగించింది 'నీ కన్నబిడ్డే యీ పనిచేస్తే నీకు తెలిసి వచ్చేది' అని అన్న అనటం, నాకు కన్నబిడ్డవున్నా ఇంతకంటె యెక్కువగా ప్రేమించటం ఎలాగో నాకు తెలియదు. నా వల్ల తనకు అప్రతిష్ఠ కలుగుతుందనీ, ప్రతిచిన్న విషయం ఒకపెద్ద సమస్య అయి కూర్చుంటున్నదని కూడా అన్నాడు .. చివరకు వేరే పొమ్మనీ అన్నాడు."

లక్ష్మయ్యకు దుఃఖం ముంచుకురావటం లక్ష్మీనారాయణగారు కనిపెట్టారు. అన్న పట్ల లక్ష్మయ్యకున్న ప్రేమకు లక్ష్మీనారాయణగారు ముగ్ధులైనారు.

"కొందరికి ఏ సమస్యతోనూ సంబంధం ఉండదు. వాళ్ళను మనం కదిపి కుదిపితే గానీ కన్ను తెరువరు. ప్రతి విషయాన్ని ఆనవాయితీ అనుకొని తల వంచుకొని చేస్తూ పోతూ వుంటారు. తన ప్రేమపాత్రులెవరైనా ఆ ఆనవాయితీనుంచి తప్పి నడిస్తే కష్ట పడతారని వాళ్ళమీద పట్టరాని కోపం వస్తుంది అందుకే అలాంటివాళ్ళను జాగ్రదావస్థలోకి మొదట తేవడానికి ప్రయత్నించాలి వాళ్ళు దారికిరావటం - చాలా సులభం కూడ"

"నా దృష్టిలో రామయ్య అమాయకుడు, వెళ్ళిపొమ్మన్నది కోపంతో వచ్చిన మాటేననుకుంటా. తరువాత విచారపడి కూడా వుంటాడు. అస్పృశ్యతను గురించి

నీవు మొదటనే కొంత వెలుగును యిచ్చివున్నట్లయితే యింతవరకూ వచ్చేదికాదు. సరే, నీవు వెళ్ళి నీ పని చూచుకో" అన్నారు లక్ష్మీనారాయణగారు.

అనుకున్నట్లుగా రామయ్య చీకటిపడ్డాక వచ్చాడు. నమస్కారం చేసి కూర్చుని "పొలం నుంచి రాగానే తమరు కబురు చేసినట్లు ఇంట్లో చెప్పారు. ఇలా వచ్చేశాను... తమ ఆరోగ్యం కొంత మేలుగా వుందా బాబూ?"

"ఆ. కొంత మేలుగానే వుంది."

"మేమందరం చాలా అదృష్టవంతులం."

"చాలా ముఖ్యమైన సంగతి మాట్లాడ్డానికి పిలిపించాను రామయ్యా, మీకుటుంబ వ్యవహారాల్లో నేను కల్పించుకున్నానని అనుకోవుగదా."

"తమరు కల్పించుకోకపోతే మాకుటుంబంలో వచ్చిన చిక్కులు యెలా చక్క బడతాయో చెప్పండి??.. అసలు నేనే రావాలనుకుంటున్నాను."

'లక్ష్మయ్యను గురించి నీ మనస్సులో యే ముందో నాకు చెప్పాలి. లక్ష్మయ్య నిన్ను నీ బిడ్డలనూ యెంతగా ప్రేమిస్తున్నాడో నాకు తెలుసు. పుట్టినప్పటినుంచి ఒకర్నొకర్ని వదిలిపెట్టకుండా అన్యోన్యంగా వుంటూ, రామలక్ష్మణులన్న పేర్లను సార్థకం చేసుకున్నారు. లక్ష్మయ్య తన జీవితాన్ని నీకు అంకితం చేశాడు. ఇంతవరకు నీవు కూడ కాదనవనుకుంటాను" అని ఆగి రామయ్య వేపు చూశారు లక్ష్మీనారాయాణగారు.

రుద్ధకంఠంతో "తమరు సెలవిస్తున్నదంతా సత్యమే బాబూ" అని కండువాతో కళ్ళను తుడుచుకున్నాడు.

అమాయకుడైన రైతు నిజమైన పశ్చాత్తాపాన్ని పొందటం రామయ్యలో చూచి లక్ష్మీనారాయణ గారి హృదయం కరిగిపోయింది.

"అతను నీ తమ్ముడు. ఏదైనా తప్పు చేసి వుంటే నీవు కోప్పడవచ్చు. సరిదిద్దవచ్చు కాని, యిక్కడ అతని తప్పు ఏమీలేదే."

"వసు, సుధాకర్‌ను పెండ్లి చేసుకుంటాననటంతో మాయిద్దరి మధ్య అభిప్రాయ భేదం ఏర్పడింది. సుధాకర్ తల్లి దండ్రులెవరో నాకు తెలుసు -

"అంటరానితనం ఎంతకూడనిదో అప్పటికి నాకు తెలియదు. అందువల్ల కులం పట్టింపు నాకు ఉండేది. దానితో వొళ్ళు తెలియని కోపంతో విరుచకపడ్డాను."

"అప్పటికీ, ఇప్పటికీ వూరే మారిపోయింది..." అంటూ వుండగా లక్ష్మయ్య వచ్చాడు.

"అలా అన్న పక్కన కూర్చో లక్ష్మయ్యా" అన్నాడు లక్ష్మీనారాయణగారు.

లక్ష్మయ్య అన్ని పక్కన కూర్చొని వింటూ వున్నాడు.

"మా తమ్ముడు ఒక తప్పు చేశాడు, బాబూ" అన్నాడు రామయ్య.

"ఏమిటది?"

"ఏమీ తెలియనివాణ్ణి కదా, అంటరానితనాన్ని గురించి నాకు కొంతవివరంగా చెప్పి వుండవలసింది."

"అవును అన్నా, నాది తప్పే. ఆ రోజు ఆవిషయం చెప్పబోతే పొలానికి వచ్చాను. నీవు గట్టిగా మాట్లాడటంతో నాకు కోపం వచ్చి అంతటితో చెప్పకుండా, చెప్పి దలచుకున్న విషయం చెప్పి వుండవలసింది. అలా చేయకపోవటం నా తప్పే" కళ్ళల్లో ఆనందాశ్రువులు మెరుస్తూండగా అన్నాడు లక్ష్మయ్య

"నీ తమ్ముడు ఒక తప్పుచేస్తే, నీవు నాలుగు తప్పులు చేశావు రాయుయ్యా" అని నవ్వుతూ అన్నారు లక్ష్మీనారాయణగారు.

"ఏమిటో సెలవివ్వండి" అన్నాడు రామయ్య

"అంటరానితనాన్ని పాటించటం, లక్ష్మణుడివంటి తమ్ముడ్ని యింటినుండి గెంటటం, గొప్ప మనస్సు గల బిడ్డను గుర్తించకపోవటం, వరుని గుణగుణాలు, విద్యాబుద్ధుల విషయంలో ఆసక్తి చూపకపోవడం" ఒక్కొక్క వేలును ముడుస్తూ లెక్క పూర్తి చేశారు నవ్వుతూ.

"అందుకే అన్ని తప్పులనూ సరిదిద్దుకోడానికి తమరి దగ్గరికి వచ్చాను బాబూ" అన్నాడు రామయ్య.

లక్ష్మయ్య అన్నవేపు ఆశ్చర్యంతో చూశాడు.

"తమ్ముడూ, మన ఇంటికి పోదాం రా. వసూ, మధూ, మీ వదినా నీకోసం బెంగ పెట్టుకున్నారు. తెలిసీ తెలియని అన్న దురాగ్రహాన్ని క్షమించవూ?" అని మాట మాటకూ కన్నీటి బిందువులు రాలుతూండగా చేతులు చాచాడు.

మరుక్షణంలో యిద్దరు అన్నదమ్ములు ఆలింగనంలో వున్నారు ఇద్దరి కళ్ళవెంట కన్నీరు ప్రవహించటం చూచి లక్ష్మీనారాయణగారు ఆనందపులకితులైనారు.

"పెండ్లికిగాను పదిరోజులు సెలవుపెట్టి వెంటనే రమ్మని" టెలిగ్రాం యివ్వటానికి నారాయణ తపాలా ఆఫీసుకు వెళ్ళాడు.

● 1957 ●

# 22. అడవి మల్లెలు

♦ జనపరెడ్డి సత్యనారాయణ (సత్యశ్రీ) ♦

గుబురుగా పెరిగిన జొన్న చేలోనుంచి చలిగాలి ఈడ్చి కొడుతున్నది. జొన్న కర్రలు గాలికి వంగినప్పుడల్లా ఆకులు రాసుకుని చప్పుడు చేస్తున్నాయి.

మంచె క్రింద, నగిడి ఆరిపోతే నోటితో వూది మంటచేశాడు రాజాలు. నిద్రకి ఆగలేక ఒకజోగుజోగి నగిడిలో పడేవాడల్లా ఉలిక్కిపడి మేలకొన్నాడు లక్ష్ముడు.

"అదిగో - నగిడిలో పడుదువా? అప్పుడే ఏం నిద్ర? అట్లాగెల్లి నాలుగు కిసుకులు ఏరుకురా. పెద్ద మంటేద్దాం" లక్ష్ముడి భుజం చరిచి లేపాడు అప్పిరెడ్డి. లక్ష్ముడు వళ్ళు విరుచుకుంటూ బద్ధకంగా లేచి బయటకు వెళ్ళి నాలుగు వెదురుబద్దలు, చిన్న చిన్న చెక్కపేళ్ళు ఏరుకొచ్చి నగిడి దగ్గర పడేసి, కొంకర్లు తిరగే వేళ్లను కాపుకున్నాడు.

"ఇంతమాత్రం చలికే వణికిపోతే యిక నువ్వేం పనికొస్తావు - చచ్చు దద్దమ్మవు!" మృదువుగా లక్ష్ముడి మెడమీద చిన్న దెబ్బకొట్టాడు అప్పిరెడ్డి.

"లేదు సావీడ! ఈయాల మాలావు చలేస్తుంది దొర! అసలు ఈ నగిడి లేకపోతే చానా కట్టం అనుకొండి ఈ దేశాన!" బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు లక్ష్ముడు.

"హోరీ నీ!" అంటూ నవ్వుకున్నాడు అప్పిరెడ్డి. నగిడిలో పేళ్ళు, వెదురు బద్దలు వేసి మంట పెద్దదిచేశాడు. ఆ నగిడి వెలుగు చుట్టుపక్కల చాలావరకు అలుముకుపోయింది.

చుట్టూ అడవి కీరుమంటూంది. ఏభై అరవై గజాల దూరంలో పొలం చుట్టూవున్న 'తోగు' లో నుంచి నీరు పారుతూ చప్పుడు చేస్తూంది తోగు(వాగు) డొంకల్లోనుంచి రకరకాల అడవి పూలవాసన జిమ్ముతున్నది. వాగు పొడుగునా వున్న కన్నాల్లోనుంచి బయటకు లాగి, కడుపునిండా తిన్న ఎండ్రపీతలు అరక్కోమో, నక్కలు ఊరికే అరుస్తున్నాయి.

ఆ తోగు పొడుగూతా సుమారు పాతికెకరాల పొలం సంపాదించాడు అప్పిరెడ్డి. "ఇంత చేస్తే ఆ పాడు అడవిలో ఎందుకొచ్చింది! ఏం పూసుకు తిందామని" అన్నారు అప్పిరెడ్డి బంధువర్గం మొదట్లో

"మీకేం తెలుసు! తలుచుకుంటే బంగారం పండిస్తాను!" అనుకున్నాడు అప్పిరెడ్డి. అనుకున్నట్టే చేశాడు చివరకు.

మొదట్లో అక్కడున్న పొదలు, గడ్డిదుబ్బులు వాట్ని లీయించి మొదలుపెట్టాడు వ్యవసాయం. అయిదారు ఏళ్ళకి, అడవికోళ్ళు, దుప్పులు, ఎలుగుబంట్లు తిరిగే ఆ ప్రదేశాన్ని మిరపతోట, పొగతోట యిత్యాదులు వేసి కొత్తజీవం పోశాడు. అప్పిరెడ్డికి అంత యిదిగా కలసి రావడానికి, ఆ పొలంలో బంగారం పండటానికి ముఖ్యంగా పొలం ప్రక్కనుంచే పారే ఆ వాగే కారణం అంటూంటారు. ఎందుకంటే ఎండాకాలం కూడా ఆ తోగు ఎండిపోదు. అన్ని కాలాల్లోనూ కావలసినంత నీరు యిస్తూంటుంది. తను పైకి రావడానికి కారణం మరొకటికూడా ఉందని నమ్ముతూంటాడు అప్పిరెడ్డి. ఏవిఁటంటే, ఆ పొలంలో ఏరువాకసాగే మొదటిరోజున నాగలి కర్రుకి ఏదో రాయిలాంటిది తగిలి, కర్రుకి మొక్కపోయింది ఏదో రాయి అనుకుని గునపాలు తెచ్చి త్రవ్వేసరికి ఏవో రెండు మూడు విగ్రహాలు బయటపడ్డాయి.

"పొలంలో ఏవో దేవతలు వెలిశారు. వస్తే పైకొస్తాడు.. లేకపోతే నాశనమన్నా అవుతాడు!" అనుకున్నారు ఊరంతా. అయితే అప్పిరెడ్డి పైకేవచ్చాడు. ఆ విగ్రహాల్ని పొలానికి సమీపంలోనే ఒక చెట్టుక్రింద ప్రతిష్ఠించి చిన్న గుడి కట్టించి ఏటా పెద్ద ఎత్తున సంబరాలు చేయిస్తూంటాడు.

నగిడి మంట మరీ పెద్దది కావడంవల్ల కాస్త వెనక్కి జరిగి కూర్చున్నారు ముగ్గురూ.

"నెల పొడుస్తూన్నట్టుంది దొరా..! గుట్టపై ఆకాశంలో అంతా ఎలుగు నిండి పోయింది" అంటూ అటువైపుకి చెయ్యిపెట్టి చూపించాడు రాజాలు. అప్పిరెడ్డి, లక్ష్ముడు యిద్దరూ కొన్ని క్షణాలవరకు అటువైపు చూచారు.

"పూర్తిగా పొడవనీయ్...! ఆ మోదుగచెట్టు పైకెక్కిగాని, మనకి గుట్టప్రక్కన వెన్నెల పడదు.. అయినా యిప్పుడింటికెళ్ళి చేసే పనేముంది. పోయి పడుకోవటమేగా.!" అంటూ జేబులో నుంచి రెండు పుగాకు పాయలు తీసి పెద్ద చుట్టచుట్టి నగిడిలో నుంచి చిన్న కొరకంచు తీసి నోటి దగ్గరగా పెట్టి ముట్టించాడు అప్పిరెడ్డి.

"ఏదీ..! యివ్వాళ మాటుకడతామన్నారు. పోలేదేం రా. !" అన్నాడు రాజాలు నుద్దేశించి. ఈ లోపులో చెయ్యి చాపిన లక్ష్ముడి వళ్ళోకి రెండు పుగాకు పాయలు విసిరాడు.

"లే ద్దొరా! పెద్ద తూటాల కోసం సింహాద్రిగారు సుబ్బరాజుగార్ని పంపారు కదండీ.. యింకా రాలే.. మన దగ్గరున్నయి పిట్టల్ని కొట్టేవి. పులికి కొడతానికి పనికి రావంట.." అన్నాడు రాజాలు వేటంటే తనకున్న ఉత్సాహాన్నంతనీ ముఖంలో వ్యక్తం చేస్తూ.

"ఏదెలాగున్నా చాలా జాగ్రత్తగా వుండాలి! మనిషి నెత్తురు మరిగిన పుల్ని కొట్టటమంటే మాటలు కాదు. మొన్న ఎవతెనో, అడవిలోకి పుల్లలేరుకుంటానికి వెళితే మీదపడి లాక్కుపోయిందటగా...!" అన్నాడు అప్పిరెడ్డి.

"అవునండి . పాపం మన శాయన్నగాడి తల్లండి. శానా ముసిల్ది.. !"

"పాపం.. ." అన్నాడు అప్పిరెడ్డి చుట్ట పొగను గుప్పుగుప్పున వదులుతూ. ఆ మైకంలో ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు.

"యింకెంతండి - సుబ్బరాజుగారు రేపు తూటాలు తెస్తే దాని రోజు మూడిందన్న మాట... మన సింహాద్రిగారు తలుచుకుంటే ఎంతసేపు... దీని తల తన్నిన పులుల్ని కొట్టలేదా..?" అన్నాడు లక్ష్ముడు.

అప్పటికి నెల కొండదాటి బయటికొచ్చింది. నిటారుగా ఆకాశంలోకి చొచ్చుకు పోయిన టేకుచెట్ల ఆకుల సందులోనుంచి చంద్రుడు మెరుస్తున్నాడు. మసక మసగ్గా వెన్నెల పడుతోంది.

అప్పిరెడ్డి యింటికి పోయే ఉద్దేశంతో లేచి నిలబడ్డాడు.

"యింటికా దొరా?" అన్నాడు లక్ష్ముడు.

"ఆఁ.. పోతా! నెల చాలా దూరం ఎక్కినట్లుంది. యింకెందుకు? మీరు మాత్రం పొలం దగ్గర జాగ్రత్త. తోట మంచి కాపులో ఉంది. పందులు గిందులు వస్తయ్ చూస్తుండండి" అన్నాడు అప్పిరెడ్డి చెప్పుల్లో కాళ్ళు పెడుతూ. రాజాలు మంచెయెక్కి అక్కడ పెట్టిన శాలువా తెచ్చి అప్పిరెడ్డి కిచ్చాడు. అప్పిరెడ్డి శాలువా వంటినిండా కప్పుకుని, మఫ్లర్ చెవులకి బిగుతుగా చుట్టాడు.

"మరింక నే పోతున్నా జాగ్రత్త!" అంటూ మంచె గుంజకు జేరవేసిన చేతి కర్ర తీసుకొని బయలు దేరాడు.

"చానా పొద్దయినట్టుంది! నేను కూడా రానా దొర అక్కడనాక! ఆ గుట్టకాడ చిరుతపులోటి తిరుగుతుందంట!" అన్నాడు లక్ష్ముడు తను కూడా బయలు దేరటానికి సిద్ధమవుతూ.

అప్పిరెడ్డి నవ్వాడు. "హారి నీ - పాతికేళ్ళనుంచి నలుగుతుందీ దారి. చిడతపులి గిడతపులి అది నన్నేంచేస్తదిరా!" అంటూ ముందుకు సాగాడు అప్పిరెడ్డి. కంకివేసి అప్పు డప్పుడే పాలుపోసుకుంటూన్న జొన్న చేలు, పంటకొచ్చిన మిరపతోట దాటి అడవిదారిలో పడ్డాడు.

బాగా నలిగిన బండిబాట అవడం వల్ల దారి చాలా వెడల్పుగా వుంది. అటూ యిటూ పొదలు. దూరదూరంగా ఆకాశన్నందుకుంటూన్న టేకు చెట్లతో అడవి కేరు మంటూంది. దారి పొడుగునా చెట్లు అడ్డు రావడం వల్ల వెన్నెల జాడజాడలుగా పడుతోంది. పొదల్లోనుంచి ఏవో కీటకాలు, పిట్టలు వూరికే ధ్వని చేస్తున్నాయి.

పైనుంచి మంచుకురుస్తున్నా వంటినిండా శాలువా వుండడం వల్ల ఏమీ అనిపించడం లేదు. కాళ్ళకు చెప్పులున్నా, బండిబాట బాగా నలిగి దుమ్ముతేలి, మంచుకి తడిసి చల్లబడిన దుమ్ము చెప్పుల్లో దూరి కాళ్లను మొద్దుబారిస్తున్నది. అయితే ఆ దుమ్ము పాతికేళ్ళనుంచి అప్పిరెడ్డి కాళ్ళక్రింద నలుగుతూనే ఉంది అలానే

చుట్టూ కమ్ముకున్న కొండలు, కేరుమనే అడవుల మధ్య తెల్లబట్టల్ని చూస్తే బెదిరి ఆమడదూరం పారిపోయి తేరిపార చూచే అమాయకులైన మనుష్యుల మధ్య "సుట్టు గుడిశ" ల మధ్య వెలసిన తనపెంకుటింట్లో కిటికీకి ఎదురుగా, దుప్పితోలు కప్పిన తన పడకకుర్చీలో నడుం వాల్చి, ఎదురుగా కనిపించే కొండల్ని, నిటారుగా

పెరిగిన టేకు చెట్లను చూస్తూ అప్పుడప్పుడు అనుకుంటుంటాడు అప్పిరెడ్డి - "ఎక్కడి నెల్లూరు? ఎక్కడి వ్యవహారం?" అని.

మొదట కిరాణా వ్యాపారిగా ఈ ప్రాంతం వలస వచ్చి, రెండు చేతులా సంపాదించాడు. రాను రాను భూమికొని పెద్ద ఎత్తున వ్యవసాయం చేసి మోతుబరి రైతుగా చలామణి అవుతూన్నాడు అప్పిరెడ్డి.

ఎందుకిదంతా? ఎందుకు సంపాదించాడు! ఎవరికోసం? తన స్వంతం అని చెప్పుకుందుకు ఎవరున్నారు? బంధువర్గమ్మీద ఎక్కువ నమ్మకం లేనివాడు అప్పిరెడ్డి. భార్య చనిపోయి పాతికేళ్ళు దాటిపోయింది రొట్టం. ఆస్తి చూచి పిల్లనివ్వడానికి చాలామంది వచ్చినా, ఎంచేతనో మళ్ళీ పెళ్లి చేసుకోలేదు.

"నీతరం తరువాత యిదంతా ఏం చేస్తావయ్యా" ఓద్దా పాపా కూడా లేదుకదా?" అని అంటే, "నేను ఎక్కడయితే పైకి వచ్చానో, ఎవరిపల్ల వచ్చానో అక్కడే, వాళ్ల కోసమే ఖర్చవ్వాలి తన సంపాదనంతా ...బయటికి పోడానికి వీలే లే..." అంటూంటాడు అప్పిరెడ్డి. నిజంగా అప్పిరెడ్డి చేసే పనికూడా అదే

బస్తీలంటే ముఖం మొత్తింది అప్పిరెడ్డికి. ఎప్పుడైనా తన స్వస్థలం వెళ్ళినా రెండు మూడు రోజుల కంటే ఎక్కువ వుండేవాడు కాడు. మళ్ళీ నీలికొండలు, పచ్చటి అడవులు, రకరకాల జంతువుల, పిట్టల కూతలు, కొండలోయల్లో నుంచి పారే చల్లటి తోగు నీరు - యివి లేకపోతే ఏమిటో వెలితిగా వుండేది ఇక్కడి మనుష్యులు, ఇక్కడి వాతావరణంతోటి బాగా కలిసిపోయాడు అప్పిరెడ్డి.

పరధ్యానంగా ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నాడు అప్పిరెడ్డి..

మధ్యదారిలో, బండిబాటకు ప్రక్కనుంచే రెండు ఫర్లాంగులకు పైగా వ్యాపించిన చిన్నగుట్టను చుట్టి మలుపు తిరగాల్సి వుంటుంది. అక్కడకు రాగానే ఎవరైనా కాస్త జంకుతారు. గుట్ట అంతా దట్టంగా చెట్లు, పొదలు, గడ్డిదుబ్బులు, రాళ్ళకుప్పలతో నిండి వుంటుంది. రాత్రులు చూట్టానికి చాలా గంభీరంగా వుంటుందా గుట్ట. గుట్టనీడ అడ్డురావడంవల్ల, దారంతా మసక మసగ్గా వుంది. సహజంగా అంత ప్రొద్దు పోయి ఆ గుట్ట పక్కనుండి రావడానికి ఎవరూ సాహసించరు. అప్పిరెడ్డి నడకలో వేగం హెచ్చించాడు ఇంతలోనే పక్కపొదలో నుంచి ఏదో 'చంగ్' మని దూకిన చప్పుడై, ఏదో ఆకారం దారికడ్డంగా, సుమారు ఏభై, అరవై గజాల దూరంలో నిలబడ్డది! అప్పిరెడ్డి ఉలిక్కిపడి రక్కున ఆగిపోయాడు. శరీరంలోసుంచి వెచ్చటి పొగలు బయలుదేరి నట్టయింది అక్కడే నిలబడి దానికేసి తేరిపార చూచాడు. అనుమానం పోయిన మీదట ఒక బెద్దముక్క ఏరి దానిముందుకు విసిరాడు. అది బెదరి మళ్ళా పొదలోకి పారి పోయింది. "ఓస్ నక్క పోతు! దొంగముండ నన్నే భయపెట్టిందే!" అనుకొని తనలో తానే నవ్వుకున్నాడు అప్పిరెడ్డి.

ఎందుకయినా మంచిదని నడకవేగం మరికాస్త హెచ్చించాడు. ఆ గుట్టదాటి మలుపు తిరిగితే యిక అంతా బయలుగానే వుంటుంది. పెద్ద అడవి ఏమీ వుండదు. చిన్న చిన్న తుప్పలు తప్ప

గుట్టదాటి, మలుపు తిరగ్గానే దారంతా వెన్నెల పరచినట్టు కనిపిస్తుంది. దారిపొడుగుతా వున్న అడవి మల్లె పొదలు యింకా ఏవో రకరకాల అడవిపూల

చాసన ఘుప్పున కొడుతున్నది. ఎండిపోయిన వెలగచెట్టు కొమ్మలోనుంచి చంద్రుడు పై కెక్కుతున్నాడు. దారంతా బయలు బయలుగా వుంది.

తనకు కొద్దిదూరంలో ఎవరో వస్తూన్నట్టు చప్పుడైతే, తలెత్తి చూచాడు అప్పిరెడ్డి. వంటినిండా తెల్లటి దుప్పటి కాబోలు కప్పుకుని వుంది. నడుస్తూంటే కాలి అందెలమోత ఆ నిశ్శబ్దమైన రాత్రిలో స్పష్టంగా వినిపిస్తూంది. ఆశ్చర్యపోయాడు అప్పిరెడ్డి. "ఇంత రాత్రిలో వంటరిగా ఈ దారిన వచ్చే ఆడవారు ఎవరైవుంటారు?" అనుకున్నాడు గాని ఊహించలేకపోయాడు.

ఆ వచ్చే వ్యక్తి ఎదురుగా వచ్చే అప్పిరెడ్డిని గమనించలేదేమో తలవంచుకుని అలానే వస్తూంది. దగ్గరకు రాగానే చెప్పుల చప్పుడు వినిపించిదేమో, తలెత్తి చూచి యిక ఎటూ కదల్లేక అలాగే నిలబడి పోయింది. అప్పిరెడ్డి దగ్గిరకెళ్ళి చూచి నిర్ఘాంతపోయాడు.

"ఎవరది....? నాగులు...!"

కొంచెం తొట్రుబాటు కలిగి తడబడ్డది.

"ఆఁ..! నే నే బాబాయి..!"

"ఓసి నీ... అసాధ్యం.....! యిదేంటి యింత రాత్రిలో ఎక్కడికి అడవిలో బడి పోతున్నావు...?"

"లేదు బాబాయ్...! యివ్వాళ మన ఆవుదూడ యింటికి రాలేదు. చూద్దామని!"

"ఆవుదూడ యింటికి రాలే! తెల్లారి వెతుక్కోవచ్చుగా. యిప్పుడేం తొందర? నడూ యింటికి పోదాం. ఇంత అడవిలో...ఇంత రాత్రిలో..!"

అంతకన్న యింకా ఏమీ అనలేకపోయాడు అప్పిరెడ్డి. ఇక ఏమీ మాట్లాడలేక వెనక్కు తిరిగింది నాగులు.

"చిన్న దూడకదూ బాబాయి! అడవిలోగాని చిక్కుపడ్డదంటే దుసపోతు (తోడేలు) గాని ఎత్తుకు పోద్దేమోనని.. అయినా ఎన్నెలేగా... ఏం భయం.. రోజూ తిరిగే దారేగా?'

అప్పిరెడ్డి కొన్ని క్షణాలవరకూ ఏమీ మాట్లాడలేదు.

"పోతే పోనీయ్.. బ్రతికుంటే అదే రేపు తల్లితో కలిసొస్తుంది. ఇంత రాత్రిలో యింత అడవిలో ఎక్కడెదుకుదామని..అయినా నీకు భయ మెయ్యదే నాగీ..? రేపు రాజాలు వెతుక్కొస్తాడుగా...! నువ్వెందుకు?"

రాజాలు మాటెత్తగానే ఏదో రహస్యం బయటపడి పోయినట్టయి సిగ్గుపడి పోయింది నాగులు. పట్టుపడ్డ దొంగలా మళ్ళీ ఏమీ మాట్లాడలేక పోయింది. "బాబాయికి అనుమానం కలిగిందేమో అప్పుడే యింటికి వొచ్చేశాడు" అనుకుంది నాగులు.

నాగులు ముందు నడుస్తూంటే, వెనుక అప్పిరెడ్డి నడుస్తున్నాడు. నడుస్తూనే ఏదో ఆలోచిస్తున్నాడు అప్పిరెడ్డి. "ఎంత సాహసం.? రోజూ యింతే గామాలు! యింత

రాత్రిలో!" ఇది తలుచుకుని ఆశ్చర్యపోయాడు అప్పిరెడ్డి నాగులు ఎక్కడమ చయలు దేరిందో అప్పిరెడ్డి గ్రహించాడు.

"దూడ కనిపించలేదు వెతకడానికి కొచ్చాను!" యిదే మాటలు చాలాసార్లు అప్పిరెడ్డి మస్తిష్కంలో వూరికే తిరగ నారంభించాయి ఏదో గతస్మృతులు స్మృతిపథంలో మెరుపులా మెరసి అలానే నిలిచిపోయి వేధిస్తోంటే అప్పిరెడ్డికి కళ్ళు చెమ్మగిల్లాయి.

వాళ్ళు నడిచే బండిబాటకు ప్రక్కగా, అదవిలో చిన్న గుట్టమీద ఫర్లాంగు దూరంలో ఫారెస్టు రెస్టుహౌస్ బంగాళా వోటుంది. ఎవరో ఆఫీసర్లు కేంప్రకొచ్చారేమో లోపల లైటు మినుకు మినుకుమని కనిపిస్తూంది నిశీధిలో. నిండు చెన్నెల్లో మునిగి, విసర్జన ప్రదేశంలో అతి గంభీరంగా కనిపిస్తుందా బంగళా

ఆ ప్రాంతంలోకి రాగానే, ఆ బంగాళా కంటపడి ఏదో గతస్మృతుల్ని జ్ఞప్తికి తీసుకువచ్చింది. అప్పిరెడ్డి మస్తిష్కం యిరవై సంవత్సరాలు వెనక్కు పరుగెత్తింది ఏవో దృశ్యాలు తెరలుతెరలుగా కళ్ళముందు తిరగ నారంభించాయి.

అప్పుడూ ఇదేదారిన...యిదే సమయంలో పాలంనుంచి యింటి కొస్తున్నాడు. కటిక చీకటి రాత్రి. వర్షాకాలం. దారంతా బురదగా వుంది దారిపక్కన గడ్డిదుబ్బులు, పొదలు ఏపుగా పెరిగి బాగా దట్టంగా వున్నాయి వర్షం వచ్చేలాగుంది. దూరంగా ఉరుముతున్నది. మెరిసినప్పుడల్లా ఆకాశంనిండా నల్లటి మబ్బులు, ఏనుగుల మందలు చెల్లా చెదురై పరుగెత్తుతూన్నట్లు కనిపిస్తూన్నాయి అలివేగంగా యింటికి చేరుకోవాలని నడుస్తూన్నాడు. వర్షంకంటే వేగంగా యింటికి చేరుకోవాలని నడుస్తూన్నాడు. తనకంటే వేగంగా వర్షం తరుముకొస్తూంది ఆకాశం చీటలు వారేలా ఉరుములు నెత్తిమీదుగా పరుగెత్తుతూన్నాయి కళ్ళలోనే మెరుస్తూన్నట్టు వుంది. ఈశాన్య దిక్కునుండి హోరుమనే గాలి. వర్షం తరుముకు రానే వచ్చింది.

ఎంత నిలద్రొక్కుకున్నా గాలి ముందుకు పడదోస్తూంది. పొదల్లో దాక్కున్న కుందేళ్లు, నక్కలు చెల్లాచెదురై పరుగెత్తుతున్నాయి. చెపులు చిల్లులు పడేలా ఒక్కటే ధ్వని. ఆ పరిస్థితిలో ఏం చెయ్యాలో ఎవరికీ అర్థంకాదు

ఎలాగో నిలద్రొక్కుకుని ఈ బంగాళాలోకి వచ్చి పడ్డాడు. నిజంగా ఈ బంగాళాయే లేకపోతే తను ఆ సమయంలో బ్రతికి బయటపడేవాడేకాడు అనుకున్నాడు అప్పిరెడ్డి. బంగాళా వరండాలోకి చేరుకోగానే ప్రాణాలు కుదుట పడ్డట్టయింది. బయట కుండపోతగా వర్షం. మెరిసినప్పుడల్లా, ఎత్తయిన బంగాళాలో నుంచి అడవంతా అతి భయంకరంగా కనిపిస్తూంది గుండెల్లోనే ఉరుముతూన్నట్టు ఉంది.

మెరిసినప్పుడు తప్పితే వరండా అంతా చీకటిగా ఉంది. చుట్టూ వున్న పరదాలు దించి వున్నాయి. లోపల ఎవరూ ఉన్నట్టు లేదు. ఎప్పుడో నెలకో రెండునెల్లకో ఎవరన్నా ఆఫీసర్లు కేంపుకి వస్తే తప్ప మిగతా రోజుల్లో గదులన్నీ తాళాలు వేసి వుంచుతారు. పగలు, ఎవరూ కేంపుకి రానప్పుడు మాత్రం గొడ్ల కాపరులు వరండాలో తలగుడ్డలు తీసి పరుచుకుని కాసేపు పడుకుని పోతూంటారు.

అప్పిరెడ్డి జేబు తడిమి అగ్గిపెట్టె తీసి గీశాడు గాని బాగా తడిసిపోయి వుండటంవల్ల వెలగలేదు. నీళ్లు కారే చొక్కాను విప్పి, నీళ్ళన్నీ పిండి మళ్ళీ వేసుకున్నాడు. కాని ఈదురుగాలి వణికిస్తున్నది.

బంగాళాకి వెనుకవైపు వరండాలో గోడ అడ్డువుండటంవల్ల అటువైపుకి జల్లుకొట్టడం లేదు. పరదాలు వేసి వున్నాయి. ఆ మూల వెచ్చగా వుండవచ్చుననుకుని అటువైపుకి నడిచాడు.

అటు, ఆ మూలనుండి గాజుల చప్పుడు వినిపించేసరికి ఆశ్చర్యపోయి నిలబడి తేరిపార చూచాడు అటు వైపుకి. ఎవరో మూలగా ఒదిగి నిలబడి ఉంది. వంటినిండా పవిట చెంగు కప్పుకుని వుంది.

"ఎవరో పాపం! తనలానే వర్షం దెబ్బతిని వుంటారు!" అనుకున్నాడు. చీకటిగా వుండటంవల్ల ఎవరయిందీ గుర్తు తెలియడం లేదు.

"ఎవరది?" అన్నాడు.

వర్షపు హోరువల్ల వినిపించలేదేమో ఆమె పలుకలేదు. వెనుకవైపుకి చూస్తుండటం వల్ల తన్ను గమనించలేదు కూడా. రెండడుగులు ముందుకు వేసి గట్టిగా పిలిచాడు. ఆమె ఉలిక్కిపడి యిటువైపుకి తిరిగింది.

"ఎవరంటే మాట్లాడవేఁ?"

అంతలోనే బయట మెరసిన పెద్ద మెరుపు పరదాల్ని చీల్చుకు లోపలకు రావడం వల్ల ఆకారం స్పష్టంగా కనిపించి గుర్తుపట్టాడు.

"ఓస్ నువ్వా! 'ముచ్చాలు' పెళ్ళానివి కదూ? మరి మాట్లాడవేఁ?" ఆమె అప్పిరెడ్డిని గుర్తుపట్టింది.

"నేనే బాబుగారు, మాణిక్యాన్ని! పాడువాన అనుకోకుండా ముంచుకొచ్చింది. అసలే నాకు మెరుపులు, ఉరుములంటే భయం.. మెరిస్తే కాళ్ళు ముందుకు సాగవు. కళ్ళు చీకట్లు కమ్ముతాయి. సమయానికి ఈ బంగళా దగ్గరకొచ్చాను. లేకపోతే దారిలోనే చద్దును.." అంటూ కొద్దిగా ముందుకొచ్చింది.

అప్పిరెడ్డి నవ్వాడు.

నిజమే! తనుమాత్రం ఏమయ్యేవాడు అప్పుడు. ఎన్నాళ్ళనుంచో చూస్తుండేవాడు మాణిక్యాన్ని జొన్న చొప్పనెత్తి నెత్తుకుని, కాలిమట్టెలు ఘల్లుమనేలా చెలకదారిన వస్తూంటే. ఆ మోత తనగుండెల్లో మ్రోగేది. నిగ్గుతేలి బుసలుకొట్టే యౌవ్వనం. బిర్రబిగిన కలువమొగ్గలా, నీటిచుక్కపడితే జారిపోయేటంత నున్నగా మెరిసేముఖం చూస్తూన్నప్పుడు ఏవో ఆశలు పుట్టుకొచ్చేవి; గెచ్చ పొదమీద పూలతీగ అల్లుకున్నట్టు చిక్కగా హృదయం చుట్టూ అల్లుకునేవి "ఛీ! తప్పు- తన కిటువంటి బుద్ధులు పుడుతున్నాయె..." అనుకునేవాడు ఆ భావం స్ఫురించినప్పుడల్లా.

వర్షం యింకా కురుస్తూనే ఉంది. బంగళా కప్పుమీద పెద్దపెద్ద బండలు దొర్లుతూన్నట్ల ఉరుముతోంది. గోడ అడ్డువుండటం వల్ల అక్కడ జల్లు అంతగా రావడం లేదు.

"ఇంత ప్రొద్దుపోయిందే ? ఎక్కడ సుంచొస్తున్నావూ? మీ అమ్మగారి వూరు వెళ్ళావా?" అన్నాడు.

"లేదండీ! మా ఆవుదూడ యింటికి రాలేదు పొద్దుండగానే వెతకటానికొచ్చా. పొద్దుపోయింది వెదికేసరికి .. ఆఖరికి దొరకనే లేదు ఈపర్షంలో ఎక్కుదుదో ఏవిఁటో...?"

ఆమె చేతిలో దూడపలువు పట్టుకొని ఉండి తను బయటపడే వర్షాన్ని చూస్తూన్నాడు పరధ్యానంగా. ఆమె స్తంభానికి జేరబడి ఁండి

అంతలోనే కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మెరిసి అదవంతా తృటికాలంపాటు తెల్లగా వెలిగి చీకటైపోయింది. ఆకాశం పగిలి ముక్కలైపట్లు ఁరిమింది. బంగళా ఆవరణలో అతి సమీపంలోనే టేకుచెట్టు కొమ్మమీద పిడుగుపడి పెళపెళమని కొమ్మ విరిగి నేల కొరిగింది....! ఆమె, హడలిపోయిన లేడిపిల్లలా ఎగిరిపడి తన మెడచుట్టూ చేతులువేసి తన కౌగిల్లో యిరికి సొమ్మసిల్లిపోయింది.

ఈ సంఘటన గుర్తుకురాగానే అప్పిరెడ్డి మెన్నుమీద ఎవరో చరిచినట్టయి ఉలిక్కిపడి, నడిచేవాడల్లా క్షణంసేపు నిలబడిపోయి, మళ్ళీ నెమ్మదిగా నడక ప్రారంభించాడు..

అప్పుడేం జరిగింది..? తను అమానుషంగా ప్రవర్తించాడా.. ? తన మానసిక ప్రవృత్తిని, తనలో రేగిన సంచలనాన్ని అదుపులో పెట్టుకోలేకపోయాడు . ఆ కౌగిల్లో.. ఆమెలోవుండే వెచ్చదనం తన నరనరాల్లోకి ప్రాకిపోయింది. శరీరంలోని ప్రతీ అణువు ఉద్రేకపడింది.. ఆ ఉద్రేకం తన్ను పశువును చేసింది. .!

చాలాసేపటికిగాని ఆమెకు స్పృహరాలేదు రాగానే తనున్న స్థితి గమనించి, వెంటనే కౌగిలి విడిచి దూరంగా నిలబడిపోయింది తప్పు చేసిన వాడిలా భయం, సిగ్గు ఆవరించి, తనూ ఏమీ మాట్లాడలేక అలానే నిలబడిపోయాడు తలవంచుకుని. ముందు ఏం జరుగుతుందో ఊహించలేక పోతూన్నాడు.

ఆమె ఆపాదమస్తకం వణికిపోతూంది. తెల్లబోయి పిచ్చిపిచ్చిగా చూట్టం మొదలు పెట్టింది.

"ఏం? యింకా భయం పోలేదూ? ఏం ఫరవాలేదు...వర్షం తగ్గిపోతూంది..."

ఆమె చేతులతో ముఖం కప్పుకుని, ముఖం అటు త్రిప్పి వెక్కి వెక్కి ఏడుస్తోంది. అదంతా కలలో జరిగినట్టుంది.

"ఛీ... వూరుకో - వర్షం తగ్గగానే ఇంటికెళ్ళి పోవచ్చు... నీకేం భయంలేదు!" దగ్గరగా వెళ్ళి ముఖానికి అడ్డుపెట్టుకున్న చేతుల్ని తీసి ఊరడించాడు.

ఆమె, ఏమీ మాట్లాడలేదు..!

చేతులు తీసేటప్పుడు వారించనూ లేదు....!

వర్షం వెలవగానే బయటికి వచ్చి యింటిదారి పట్టారు. మధ్య దారిలో యిద్దరూ మాట్లాడలేదు. దారిలో వాగు పొంగి, మొలలోతు నీళ్ళు ప్రవహిస్తోంటే, ఆమె నడుం చుట్టూ చేతులువేసి, వాగు దాటించాడు. దానికీ ఆమె అభ్యంతరం తెలుపలేదు.

పొలిమేర చేరుకున్న తరువాత, ఆమె యిల్లు సమీపించగానే, యింటిలోకి పోయేముందు ఆగి, కనుకొలకుల్లో నిండి చెంపమీదకు కారే నీళ్ళతో తనకేసి చూచిన చూపుల్ని తన జీవితంలో ఎన్నడూ మర్చిపోలేదు. వాటిని తన హృదయంలో ఒకప్రక్క గుప్తంగా దాచుకున్నాడు.

తను పుంతదార్లో నడూస్తూంటే ఎన్నోసార్లు, దారిపక్కన ఉన్న మోదుగుచెట్టు మీద నుంచి పువ్వులు రాలి మీదపడేవి. మీదపడిన పూలను దులుపుకుని చెప్పు కాళ్ళతో పిప్పిచేసి పోవడం తనకు గిట్టదు. వీటిమీద ప్రత్యేకమైన అభిమానం. మమకారంతో ఏరుతాడు. మాణిక్యం విషయంలో కూడా అలాగే జరుగుతుందను కున్నాడు

పది కాలలాలపాటు ఆ స్నేహం అలాగే సాగింది. మొదట్లో ఎడమెడంగా వున్నా తనంటే పడిచచ్చేది రానురాను. తనెంతో సహాయం చేసేవాడు. ఆర్థికంగా, మరోవిధంగా కూడా సహాయపడేవాడు. ఇంతచేస్తున్నా, పక్షవాతంతో కాళ్ళు, చేతులుపడి మంచంలో మ్రగ్గిపోయే 'ముచ్చాలు' గాడితో నానా బాధలు పడుతోంటే, వాణ్ణి వదిలేసి శాశ్వతంగా తనతో వుండి పొమ్మంటే ఏమంది మాణిక్యం...? రానన్నప్పుడు తను ఏమాత్రం బాధపడలేదు. మాణిక్యం నిండుతనాన్ని తనెంతగానో మెచ్చుకున్నాడు! ఇప్పుడూ మెచ్చుకుంటున్నాడు.

తనతో స్నేహమైన రెండోయేట ఎప్పుడూ కాన్పులేని మాణిక్యానికి కాన్పు వచ్చింది...! ఒకనాటి రాత్రి, తూర్పుదిక్కున, నిండుచంద్రుడు పొడుస్తూండగా ఒక ఆడపిల్లను కన్నది మాణిక్యం...! దానికంత అందం, సౌకుమార్యం, నిమ్మపండువంటి ఛాయ ఎలా వచ్చాయి? దానిలో తన పోలికలు కనిపించేసరికి ఊరంతా అదోరకంగా చెప్పుకున్నారు...! అది లోలోనే అణగిపోయింది.

అందరు అనుకునేలా, 'నాగులు' తన రక్తం పంచుకుపుట్టిందని తను విశ్వసించగలడా...? తనకు పూర్తి నమ్మకం వుందా...? ఎందుకుండదు...?

మాణిక్యం అప్పుడప్పుడూ అనే మాటలు తను మర్చిపోలేదు.

"యిది నీ కూతురే..! 'ముచ్చాలు' కి అనుమానమే.., అందుకనే దీన్నంటే దగ్గిరకు రానియ్యడు... ముట్టుకోడు...!

ఆ మాణిక్యం ఎక్కడుందిప్పుడు...? తను ఒకప్పుడు మాణిక్యం ద్వారా గొప్ప అనుభూతులు పొందాడు. అది వుండేటప్పుడు, దాని ముఖం కనిపించేటప్పుడు ఎంతో తృప్తిగా వుండేది. ఎంతోమంది ఆప్తమిత్రుల్ని చూస్తున్నట్లుండేది... మానసికంగా తను ఎంతో హాయిని అనుభవించేవాడు.

అయితే ఆ మాణిక్యం ఎక్కడుంది...? అంతరిక్షంలో అనంతకోటి నక్షత్రాలలో ఒకటై మినుకు మినుకుమనే కాంతుల్ని తన హృదయం మీదకు ప్రసరిస్తూంటుంది... ఆ కాంతి రేఖల్లో ఏదో ఒక హెచ్చరిక, ఒక బాధ్యత గుర్తుకు తెస్తుంటుంది...

ఏవిఁటది...?

"ముమ్మాటికీ నాగులు తన కూతురే...! తన రక్తం పంచుకు పుట్టిందే. తను విశ్వసించగలదు... తను బ్రతికుండగా దీనికి ఏ లోటూ రాకూడదు...తన నీడ ఎప్పుడూ దీనితోటే వుంటుంది... దీనిమీదే పడుతూంటుంది."

నడుస్తూ యోచించే అప్పిరెడ్డి హృదయంలో సంక్షోభం, గత చరిత్రలు కళ్ళముందు తిరగడంవల్ల కలిగిన ఉద్రేకం తట్టుకోలేక, బయటకు ఏవో అస్పష్టంగా గొణుగుతూ, తన ప్రక్కనే నడిచే నాగులు తలను ఆప్యాయంగా నిమిరాడు...!

అప్రయత్నంగా జరిగిన దానికి నాగులు తెల్లపోయింది.

"తనంటే 'బాబాయి'కి ఎందుకింత ప్రేమ...?" అనుకుంది.

"ఏమో...? ఎందుకో తనకర్థంకాదు... కన్న కూతురులాగే చూచుకుంటాడు...!"

ఇద్దరూ నడిచి ఊరు పొలిమేర దగ్గిరకు చేరుకున్నారు. ఊరు చివరనే వున్న నాగులు యిల్లు రాగానే యిద్దరూ నిలబడ్డారు.

"ఇంక నే నెలతాను బాబాయి...!" అంది తలవంచుకునే.

అప్పిరెడ్డి క్షణం ఆలోచించి, రెండడుగులు ముందుకు వేశాడు.

"యిదిగో... చూడు నాగులు...!" ఏదో చెప్పాలని ప్రయత్నించి ఆగిపోయాడు.

"మళ్ళీ అక్కడకుగాని వెళతావా యిప్పుడు...?" అన్నాడు కొన్ని క్షణాలు యోచించిన మీదట.

నాగులు తెల్లపోయింది. పట్టుపడ్డ దొంగలా.

"ఛీ! మళ్ళీ ఎందుకెళతాను బాబాయి యింత రాత్రిలో...! రేపు అదే వస్తుంది యింటికి...!"

అప్పిరెడ్డి వాత్సల్యపూరితంగా నవ్వాడు.

"నాకంతా తెలుసు నాగీ - నువ్వెక్కడకు బయలుదేరావో నాకు తెలుసు...!"

నాగులు వాడిపోయిన పువ్వులా సిగ్గుతో ముడుచుకుపోయింది. ఏమీ సమాధానం లేకుండా తల వంచుకు నిలబడ్డది. అప్పిరెడ్డి నాగులు దగ్గరగా వచ్చి నిలబడ్డాడు.

"ఇంతరాత్రిలో అడవిలో ఒక్కదానివి బయలుదేరావు కదా... ఎంత ప్రమాదం...? ఏ జంతువన్నా కరిస్తే ఏంచేస్తావు...? యింకెప్పుడూ అలా వెళ్ళకు" అని, కొన్ని క్షణాలు ఆగి, "చూడు నాగీ! ఈ ఎండకాలం మీ యిద్దరికీ పెళ్ళి చేద్దామనుకుంటున్నాను...! మీ అయ్యకి నేను నచ్చచెబుతాను... అప్పుడు యిక యిలా వంటరిగా అడవిలో పడిపోవాల్సిన అవసరం వుండదు - నీ బాగుకోరి చెబుతున్నా, మళ్ళీ ఎప్పుడూ యిలా రాత్రులు అడవిలోపడి వెళ్ళకు - ఏఁ..?"

నాగులు నిర్ఘాంతపోయింది. హృదయంలో ఏదో ఆవేశం పొంగింది. సిగ్గు, భయం తన్మయత్వంతో ఉక్కిరిబిక్కిరై అప్పిరెడ్డి కళ్ళలోకి వెర్రిగా చూసింది నాగులు. ఆ వెన్నెల్లో, మిలమిల మెరిసే ముత్యాల్లా చెంపమీదకు జారిన కన్నీళ్లను తన పైపంచెతో అద్దాడు అప్పిరెడ్డి.

"ఛీ . ! ఊరుకో..! పిచ్చిపిల్లలా కన్నీళ్ళెందుకు...! నువ్వేమీ తప్పు చేస్తున్నావని నేను అనుకోవడం లేదు...! అయితే అడవిలో పడి రాత్రులు వెళితే ప్రమాదం. అందుకనే చెబుతున్నా.. యింత ప్రొద్దుపోయి యింకెప్పుడూ వెళ్ళకే..?" వాత్సల్యంగా తల నిమిరాడు అప్పిరెడ్డి.

నాగులు పులకించింది. 'బాబాయి దేవుడు...! తనంటే ఎందుకంత ప్రేమ...! తన తండ్రి కూడా యింత ప్రేమగా మాట్లాడ్డు.. ఎప్పుడూ చీదరించుకుంటాడు.. తనంటే యిందుకింత ప్రేమ . ? అనుకుంది నాగులు.

"సరే.. యిక పోయి పడుకో...ప్రొద్దుపోయింది....!" అంటూ, నాగులు యింటిలోకి వెళ్ళేవరకూ అక్కడేనిలబడి చూచి, బరువుగా నిట్టూర్చి యింటిముఖం పట్టాడు అప్పిరెడ్డి.

చింతచెట్టు గుబురులో చంద్రుడు మెరుస్తూన్నాడు. ఆకాశంలోనుంచి అడవి కొంగల బార్లు అరుస్తూ ఎగిరిపోతున్నాయి.

"పిచ్చిపిల్ల..! అదంటే తన కెందుకంత ప్రేమ అర్థంకాదు...నిజంగా, అది తనరక్తం పంచుకు పుట్టిందని తెలిస్తే తనమీద గౌరవం తగ్గిపోతుందా...? ఏమో! అందుకే తనా విషయం చెప్పలేక పోతూన్నాడు....!చెప్పడు కూడా...!"

అప్పిరెడ్డి యోచిస్తూ యింటిదారి పట్టాడు.

పలుచని నీలితెరలా వూరుచుట్టూ క్రమ్ముకున్న పొగమంచును సూర్యకిరణాలు చీల్చుకు రాగానే, భూదేవి ఒడిలో నిద్రపోతూన్న ప్రకృతంతా మేల్కొంది. చెరువుగట్టుమీది తుమ్మచెట్లు రంగు దిద్దుకున్నాయి. తంగేడు పొదలచుట్టూ రాలిన తంగేడు పూలు ఎండకు వజ్రపు ణనకల్లా మెరుస్తూన్నాయి. ముద్దుకొన్న లేతకిరణాల తాకిడికి తామర మొగ్గలు మేల్కొని అరవిచ్చుకున్నాయి.

బారెడు ప్రొద్దెక్కగానే ఎడ్లను కడగటానికి అప్పిరెడ్డి యింటికి వచ్చాడు రాజాలు. గుమ్మం ఎక్కగానే, వాలుకుర్చీలో కూర్చుని తుపాకీని తుడుస్తూన్నాడు సింహాద్రి. తూటాలు లెక్కపెడుతూ సుబ్బరాజు ప్రక్కనే కూర్చున్నాడు.

"తూటాలు వచ్చినియ్యిరా...! ఈ రాత్రికే 'మాటు'లోకి వెళ్ళటం...తయారుగా వుండు" అన్నాడు సింహాద్రి.

తూటాలను చూడగానే ఎక్కడలేని ఉత్సాహము వచ్చిపడ్డది. దగ్గరలోనే అరుగుమీద పేము కుర్చీలో పడుకుని చుట్టకాలుస్తూ మైకంలో మునిగి ఏదో ఆలోచనలో వున్న అప్పిరెడ్డిని కూడా గమనించకుండా. అక్కడికి వెళ్ళి కూర్చుండిపోయాడు రాజాలు దాన్ని తుడుస్తూన్నంతసేపూ దృష్టంతా దాని మీదే ఉంది. అప్పుడప్పుడూ చెరువులో పిట్టల్ని కొట్టుకురమ్మని తనచేతికి తుపాకిస్తే, ఆ రోజు తను అన్నం తింటం కూడా మర్చి పోయేవాడు.

తనకీ ఒక తుపాకీ వుంటే ! అమ్మో! అంత అదృష్టం తనకుండొద్దూ! మూడు నాలుగు సంవత్సరాల జీతం కూడబెడితేగాని రాదు.. నిజంగా తనకే వుంటే పులిని కొడితే భూవిఁ కరుచుకుని కింద పడిపోదూ...? ఆకాశంలో ఎగిరేపిట్టలు తన్నుకుంటూవచ్చి తనకాళ్ళముందు రాలిపడవూ..?" ఇంకా ఏదో ఊహిస్తూన్న రాజాలును సింహాద్రి ప్రశ్న యిటు త్రిప్పింది

"ఈవాళ తప్పకుండా పులి పడతదంటావా రాజాలు' అంటా నీచలుప నువ్వు వెంటుంటే షికారు కాకుండా తిరిగి వచ్చిన రోజంటూ ఏమీ లేదు" అన్నాడు నవ్వుతూ. రాజాలు మనస్సు వికసించేలా నవ్వుకున్నాడు ఆ పొగడ్తలో ఎంత ఆనందం వుందో వాడికే తెలియాలి

"ఎందుకవద్దొర? మీరు తుపాకి పట్టుకుంటే ఎనుగైనా భూమికొరుగుద్ది!"

సింహాద్రి నవ్వాడు. అర్ధనిమీలిత నేత్రాలతో రాజాలు కేసి చూసి నవ్వాడు. ఆ నవ్వు వేరు. ఆ నవ్వేతీరు వేరు. దానిలో అతిక్రౌర్యం, కరుకుదనం, గంభీరత మిళితమై వుంటాయి. ఎరపెట్టి తింటూంటేను. అటూ యిటూ అడవిలో పరుగులు పెట్టి గొంతెండుకపోయి రాత్రులు ఏ తోగు దగ్గరకో చల్లని నీళ్ళు త్రాగుదామని ఆశతో వచ్చే దుప్పుల్ని ఏ పొదచాటునో నక్కి నిర్దాక్షిణ్యంగా ఒక్క దెబ్బతో పడగొట్టే నేర్పు వుండటం వల్లేమో. ఆ పేరుకున్న పాపం అంతా సింహాద్రి కళ్ళల్లో కనిపిస్తూంటుంది. సన్నటి మెలితిరిగిన కోర మీసాల మీద తాండవం చేస్తూంటుంది. 'ప్రాణాలు తియ్యడం ఏమంత కష్టమైన పనుల్లో లెక్కకాదు.' అనుకునే తరహా మనిషి సింహాద్రి.

చెల్లెలు కొడుకని, వ్యవసాయంలో సహాయం కోసమని సింహాద్రిని యింటిమీద పెట్టుకున్నాడు అప్పిరెడ్డి. తనతోపాటుగా నమ్మకమైన మిత్రుడు సుబ్బరాజును తోడు తెచ్చుకున్నాడు. వాళ్ళ జీవితంలో ఎక్కువభాగం భవంతుల మధ్య రంగురంగుల మనుష్యుల మధ్య, రైలు కూతలు, కారుహారన్లు రొదలో గడపడం వల్ల యింకా యిక్కడి వాతావరణానికి సరిగా అలవాటుపడలేదు. అక్కడ వుండే మనుష్యులు - జంతువులు ఒక్కటే అనుకుంటాడు సింహాద్రి.

తుపాకి గొట్టం శుభ్రపరిచిన తరువాత 'మాను'కి తగిలించి, కవరు తొడిగి. సుబ్బరాజుకిస్తే గదిలో పెట్టి వచ్చాడు.

రాజాలు లేచి, ఎడ్లను విప్పుకు రావటానికి దొడ్లోకి బయలుదేరాడు

"అంతంత ప్రొద్దుకి బండీ తయారుగా వుంచు.. ప్రొద్దుకూకక ముందే బయలు దేరాలి..!' అన్నాడు సింహాద్రి. "సరే" అంటూ దొడ్లోకి వెళ్ళి ఎడ్లను విప్పుకు, చెరువుకి బయలుదేరాడు రాజాలు.

ప్రొద్దు, 'రెండు బారలు' పైగా ఎక్కినా యింకా చలిగాలి కొడుతూనే ఉంది. దూరంగా కొండలను అంటిపెట్టుకుని వున్న నీలి పొగమంచు యింకా సరీగా చెదిరి పోలేదు. దారి పొడుగూతా చెట్ల ఆకుల సందులకి పెట్టిన సాలెగూళ్ళమీద వున్న మంచుబిందువులు ముత్యాల సరాల్లా మెరుస్తున్నాయి ఎండలో.

ఎడ్లను రేవుకి దూరంగా తీసుకుపోయి కడిగి, తను స్నానం చేసి యింటికి తోలుకొస్తూంటే రేవులో నాగులు, కడవతో నీళ్ళు ముంచుతోంది పరధ్యానంగా. ఎద్దుల్ని అక్కడ గట్టుమీద వదిలి రేవులోకి వెళ్ళాడు రాజాలు.

"నీడ చూసుకోని మురిసిపోతున్నావా?"

నాగులు ఉలిక్కిపడి, రాజాలను చూచి కొలుకుంది.

"మరె"! ముక్తసరిగా అని, నవ్వింది నాగులు. కడవతో నీళ్ళు ముంచి నెత్తికెత్తుకుంది. నీళ్లు తొణికి, ముఖంమ్మీదకు కారుతోంటే, ముఖం చిట్లించింది. నీరెండలో ఆ ముఖం చిట్లింపులో వుండే సోయగాన్ని కన్నార్పకుండా వెర్రిగా చూస్తూండి పోయాడు రాజాలు ముక్కుపుడకలోని తెల్లరాయి 'తళక్' మంది.

"ఓస్..దీనందం! యింతందంగా వుందే యిది...!" అనుకున్నాడు రాజాలు.

"అట్లా చూస్తావెందుకు ?" నాగులు సిగ్గుపడిపోయింది. కళ్ళలోకి సూటిగా చూడలేక పోయింది.

"రాత్రి అక్కడకే రాలేదనేమో" అనుకుంది నాగులు.

"రాత్రి అక్కడకురాలేదెందుకో!" అనుకున్నాడు రాజాలు.

'రాత్రంతా నువ్వే కలలోవున్నావు" నావ్వాడు రాజాలు.

నాగులు నవ్వింది. చెక్కిలి కందిపోయేలా నవ్వుకుంది. ఏమీ మాట్లాడలేదు. కుండ అంచుమీద చెయ్యివేసి వయ్యారంగా నడుస్తోంటే, వెనుకే రాజాలు ఎద్దుల్ని తోలుకుని వస్తూన్నాడు.

"ఇవ్వాళ అంతబాగా మాట్లాడటం లేదు?" అనుకున్నాడు.

"వాగుదగ్గర తెల్లవార ఝాముదాకా కూర్చున్నాను. నువ్వు రాలేదే?"

నాగులు రెండుమూడు అడుగులువేసి అంది, యిటు చూడకుండానే!

"ఇకనుండి అట్లా రావడానికి వీలుండదు!"

రాజాలు ఉలిక్కిపడ్డాడు.

"ఏఁ..?"

'బాబాయికి తెలిసిపోయింది మనసంగతి. రాత్రి వస్తుంటే దారిలో కలిసి ఇంటికి తీసుకొచ్చేశాడు.

రాజాలు గతుక్కుమన్నాడు. 'దొర' ఏవంటాడో.. అనుకున్నాడు.

"ఏమన్నా తిట్టాడా దొర?"

'ఆఁ...! నీ పెళ్ళి చేస్తాడంట..." గిరుక్కున ముందుకు తిరిగి, రాజాలు కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అని, నవ్వి మళ్ళీ వెనక్కి తిరిగి, చరచరా నడిచి వెళ్ళిపోయింది నాగులు, ఎదురుగా వస్తున్న వ్యక్తిని గమనించి. రాజాలుకి సరిగా అర్థంకాలేదు. పరాగ్గా నడుస్తూ ముళ్ళపొదమీద కాలువేసి అక్కడే చతికిలపడి ముళ్ళు తీసుకుని ఎడ్లను తోలుకుని ఇంటికి బయలుదేరాడు.

పశ్చిమాంగన నొసట రక్తచందనం దిద్దుకుంది. చెరువుగట్టు ఎర్రబారింది. తూర్పుకొండమీద రంగు బట్టలు ఆరవేసినట్టుంది.

వేటకి అవసరమైన సరంజామా అంతా బండిలో ఎక్కించారు బండి చుట్టూ పిల్లలు, పెద్దలు పోగయి ఉత్సాహంగా చూస్తున్నారు. సింహాద్రి వేటకెళితే తప్పకుండా ఏదో ఒకటి పడుతుందని వాళ్ళ నమ్మకం. అందులో పులి వేటంటే మరీ వెర్రిగా వుంటారు

అప్పిరెడ్డికూడా బండితోపాటుగా కొంతదూరం వరకూ వచ్చి, వాళ్ళకు జాగ్రత్తంటూ హెచ్చరించి యింటికి తిరిగి వెళ్ళిపోయాడు అప్పిరెడ్డికి వేటంటే అంత యిష్టముండదు. తన జీవితంలో ఎప్పుడూ ఏ ప్రాణిని 'హింస' పెట్టకూడదను కుంటాడు. తన హృదయం ఎప్పుడు అతి సున్నితంగా, పూరేకుల్లా స్వచ్ఛంగా వుంచుకుంటానికి ప్రయత్నిస్తాడు. అది తన మతం.

ఇంతకీ వేటకెళ్ళేదల్లా ముగ్గురే. సింహాద్రి, సుబ్బరాజు బండిలో పరుపు వేయించుకొని సుఖంగా ఆసీనులయ్యారు. ముందు తొట్టిలో కూర్చుని బండి తోలుతూన్నాడు రాజాలు. తిరునాళ్ళలో కొన్న ఎర్రపంచె, గీతల చొక్కా వేశాడు. పాతదయిందని పెద్దదొర యిచ్చిన సిల్కు కండువా తలకు చుట్టాడు తీర్థానికి పోతున్నవాడిలా మరీ ఉత్సాహంగా వున్నాడా రోజు

ఊరి పొలిమేర దాటగానే, జొన్నచొప్ప ఎత్తుకుని ఎదురుగా నాగులు వస్తూంటే బండివేగం కాస్త తగ్గించాడు. చెమటపట్టి వాడిపోయిన ముఖం నలిగిపోయిన మోదుగు పువ్వులా వుంది. తలలో వాడిపోయి జారిపోతూన్న నీలిగోరింత చెండు భుజమ్మీద పడుతున్నది. నాగులు బండి దగ్గరకురాగానే, రాజాలు బండాపి మాట్లాడాలనుకున్నాడు. కాని బండిలో చిన్నదొరవాళ్ళు ఉండడం వల్ల అది సాధ్యమయిందికాదు. కళ్ళతోటే మాట్లాడి నవ్వాడు రాజాలు. బండి దూసుకొని పోతూంటే తెల్లపోతూ అక్కడే నిలబడి బండికేసి చూస్తూండిపోయింది నాగులు. బండిలో సింహాద్రి నవ్వుకున్నాడు. నాగులు కళ్ళల్లో కళ్ళు పెట్టి చూచాడు. నిర్లక్ష్యంగా చూచింది నాగులు. ఆ చూపులతోటే అందాన్నంతా త్రాగివేస్తూన్నట్టు చూచాడు... అదేమీ సింహాద్రికి కొత్తకాదు... చిటారు కొమ్మల్లో పెట్టిన తేనెపట్టును చూస్తూ చెట్టుకింద కూర్చుని నీళ్ళు కార్చడం కొత్తేమీ కాదు సింహాద్రికి.

"కొమ్మలొచ్చిన పెద్దపులులే నేలకరుచుకొని నా కళ్ళముందు పడతాయి. నీ లెఖ్ఖంత?" అన్నట్టు చూచి, మెలితిరిగిన సన్నటి మీసంమీద చెయ్యివేసి కన్ను గిలిపి నవ్వాడు సింహాద్రి. నాగులు వళ్ళు ఝుల్లుమంది. .చెడ్డ అసహ్యం పుట్టుకొచ్చింది. "యింకా సిగ్గు రాలేదేఁ... ఛీ..!" అనుకుని వెంటనే గిరుక్కున వెనక్కితిరిగి, యింటిదారి పట్టింది నాగులు.

సుబ్బరాజుకి సైగచేస్తూ అట్టహాసంగా నవ్వాడు సింహాద్రి. ఇదేమీ పట్టించుకో కుండా బండి తోలుకుపోతున్నాడు రాజాలు

రాత్రి పన్నెండు దాటింది.

నిశీథంలో అడవంతా కీరుమనే ధ్వనిలో మునిగి అతి గంభీరంగా వుంది. అప్పుడప్పుడే చెట్ల సందుల్లోంచి చంద్రుడు పొడుచుకువస్తున్నాడు. చెట్టు ఆకు సందుల్లోంచి "మాటు" లోకి వెన్నెల జాడజాడలుగా పడుతోంది.

మాటులోంచి మూడు జతల కళ్ళు అతి చురుకుగా సమయం కోసం ఎదురు చూస్తున్నాయి. మాటుకి సమీపంలో, 'ఎర'గా రాటకు కట్టిన మేకపిల్ల నిర్విచారంగా ముందు వేసిన గడ్డి మేస్తూంది.

సింహాద్రి తలకు తగిలించిన 'హెడ్‌లైటు' తీసి పక్కన పెట్టాడు బరువుగా వుందంటూ. డబుల్ బారల్ తుపాకి లోడ్ చేసి వుంది. సుబ్బరాజు అప్పుడు

కునికిపాట్లు మొదలు పెట్టాడు. ఏ పొద కదిలినా రాజాలు కళ్ళుమాత్రం అతిచురుగ్గా అటు తిరుగుతున్నాయి.

సింహాద్రి దృష్టిమాత్రం మరోదిక్కు వెతుక్కుంటూ పోతోంది. కళ్లముందు ఏవోవో దృశ్యాలు సుడితిరిగి పొగమంచు తెరల్లా, క్రమ్ముకునే కారుమేఘాలలా కనిపించి మాయ మవుతున్నాయి. నిగ్గుదేరిన యౌవ్వనం, పసిడి పువ్వుల సోయగం తన దృష్టిముందు.. తను సృష్టించిన జ్వాలల్లోపడి దగ్ధమైపోతూన్నట్టు వుంది. ఎన్నో అందమైన లేళ్ళు, జింకలు చెంగుచంగున దుముకుతూ ఆ విషజ్వాలల్లోపడి, మంటలో కురికిన మిడతల దండులా మాడి, ఆహుతి అవుతున్నట్లు కనిపిస్తూంది.

"అందులోదే.. ఆమందలోదే ఒక లేడిపిల్ల.. చెంగు చెంగున వయ్యారంగా, అతి స్వేచ్ఛగా పరుగులుపెట్టే అందమైన లేడిపిల్ల.. అదే తనకు కావాలి.. అదే తను పన్నిన ఉచ్చులో పడాలి. ఎన్నోసార్లు పట్టుకుంటానికి దగ్గరగా వెళ్ళేవాడు. రకరకాల విషజ్వాలల్ని పుట్టించి మీదకు వదిలేవాడు. ఏం జరిగేది? వెనుక కాళ్ళతో ఎదురు రొమ్ము పగిలేలా తన్ని పారిపోయేది..! ఎక్కడికి – ఎక్కడికి పోయేది...? నవనవలాడే గడ్డి మైదానాల్లోకి, ఘుమఘుమలాడే పూలవనాల్లోకి, చల్లచల్లని సెలయేళ్ళ చెంతకు. ఏపుంతలోనో, తన 'ప్రియుడి' తో స్వేచ్ఛా విహారం చేస్తూ హాయిగా వుండేది...!' అది చూస్తున్నంతసేపు తన హృదయం వేయికళ్ళు చేసుకు చూచేది. ఆ చూపులోనుంచి ఏదో బడబాగ్నిలాంటిది పుట్టేది. ఆ జ్వాలల్లో పడి తన హృదయం ఎప్పుడూ కాలిపోతూంటుంది...ఎప్పుడూ ఉడికి పోతూంటుంది... ఎట్లా చల్లారుతుంది? తను నిజంగా తలుచుకుంటే ఎంత..? ఆ లేడి పిల్ల ఎంత? ఒక్క దెబ్బకు తన ఒడిలో వచ్చిపడదూ!"

సింహాద్రి ఊహలు కట్టలు, గట్లు తెంచుకుని ఎక్కడెక్కడికో పోతూ వున్నాయి. పులి జాడమాత్రం యింకా లేదు. సింహాద్రీ వాచీచూసుకున్నాడు. రెండు గంటలు దాటింది. సుబ్బరాజు నిద్రకాగలేక, మాటులోనే తలక్రింద దిండు పెట్టుకుని నడుం వాల్చాడు. పొదల్లోనుంచి కీచురాళ్ళధ్వని తప్ప అడవంతా నిశ్శబ్దంగా వుంది. చలిమాత్రం ఎముకలు కొరికి వేస్తూంది. చెట్ల నీడల్లోనుంచి మిణుగురు పురుగులు మెరుస్తూ ఆశాజ్యోతిల్లా పోతూన్నాయి. మాటు క్రింద కట్టిన మేకపిల్ల కడుపులో తల యిరికించుకుని స్వేచ్ఛగా నిద్రపోతోంది.

సింహాద్రి మళ్ళీ దీర్ఘాలోచనలో పడ్డాడు. రాజాలు కళ్ళుమాత్రం చురుగ్గా పొదల్ని గాలిస్తున్నాయి. ఉన్నట్టుండి మాటులోనుంచి ఏదో జారి క్రిందపడ్డట్టు శబ్దమయింది. రాజాలు ఉలికిపడ్డాడు. సింహాద్రి ఉలిక్కి పడ్డట్టే పడ్డాడు.

"లైటుపడ్డట్టుంది దొరా క్రింద....! మీ చెయ్యి తగిలిందా!"

"ఉఁ! ఎట్లా యిప్పుడు" అన్నాడు సింహాద్రి క్రిందపడ్డ లైటు కేసే చూస్తూ.

"దిగి తేనా?" అన్నాడు. రాజాలు చెట్టుదిగటానికి సర్దుకుంటూ. ఈ మాట అనగానే సింహాద్రి ఎందుకో ఒళ్ళు ఝుల్లుమంది. గుండె వేగంగా కొట్టుకుంది.

"పులొస్తే?"

"యింతలోనే ఎక్కడొస్తుంది దొరా.. అంత సేపటించుంచి రెండు - పచ్చినా తుపాకి బారు చేసి వుందిగా..ఏం...భయం?" అంటూనే నెమ్మదిగా చెట్టుదిగాడు రాజాలు. ఈ గొడవేమీ తెలియకుండానే మత్తుగా నిద్రపోతూన్నాడు సుబ్బరాజు.

రాజాలు చెట్టుదిగి, క్రిందపడ్డ లైటును సమీపించి వంగి, నేలమీద లైటును తియ్య బోయాడు అంతలోనే, మాటులోనుంచి నిశ్శబ్దాన్ని చీలుస్తూ, అదవంతా మారుమ్రోగేలా 'ధన్...ధన్' మని రెండుసార్లు తుపాకీ ప్రేలింది! మాటులో నిద్రపోయే సుబ్బరాజు త్రుళ్ళిపడి లేచాడు. మాటుక్రింద మేకపిల్లకు కంగారుపుట్టి రాదుచెంచుకు ఎటో పారిపోయింది.

మాటు క్రింద రాజాలు గుండె చేత్తో పట్టుకుని, ముద్దలా చుట్టుకుని అక్కడే నేలకొరిగిపోయాడు..!! మైమరచి నిద్రించే భూదేవి చెన్ను 'కళుక్కు' మంది... పీడకలలో, అక్కడ నాగులు గుండెల్లో ఎవరో బలంగా కత్తి గుచ్చినట్టై, ఉలిక్కిపడి లేచి కూర్చుండిపోయింది.

అతి భయంకరమైన వాతావరణం తృటికాలం మెరపులా మెరిసి, మళ్ళీ అడవిలో నిశ్శబ్దం ఆవరించుకుపోయింది. త్రుళ్ళిపడి లేచి సుబ్బరాజు, భుజానికి ఆన్చిన తుపాకిని దించే సింహాద్రిని చూచి తెల్లబోయాడు.

"ఏం జరిగింది సింహాద్రి! పులిగాని వచ్చిందా.?"

సింహాద్రి మాట్లాడలేదు. అతని ముఖమ్మీద తాండవంచేసే అమానుషత్వం, అతిక్రౌర్యం మాటులో, చెట్ల గుబురుల్లో, అలుముకుపోయిన ఆ మసక చీకట్లో అతి స్పష్టంగా, భయంకరంగా కనిపిస్తూంది.

సుబ్బరాజు కొన్ని క్షణాలకు అక్కడ జరిగిన అమానుషాన్ని గ్రహించాడు. మాటుక్రింద భూదేవి ఒడిలో శాశ్వతంగా కన్నుమూసి ప్రక్కకు ఒరిగి పడివున్న రాజాలును చూచి స్తబ్ధుడయ్యాడు. ఆ దృశ్యం చూడగానే ఆపాదమస్తకం వణికిపోయాడు సుబ్బరాజు.

'ఏవిటిది...? యిది ఎలా జరిగింది సింహాద్రీ.?"

సింహాద్రి కొన్ని క్షణాలవరకు మాట్లాడలేదు. దొంగతనం చేసి పట్టుబడ్డవాడిలా గుండెలు అతి వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టాయి. హృదయంలో ఒకప్రక్కనుంచి చెప్పరాని భయం బల్లెంతో పొడుస్తూన్నట్టు బాధ పడుతున్నాడు. అయినా నెత్తిమీదినుంచి ఏదో పెద్ద బరువు దించినట్లు తేలిగ్గా నిట్టూర్పు వదిలాడు.

"ఏమీ లేదు. లైటుజారి క్రిందపడితే, తేవడానికని చెట్టు దిగాడు. అంతలోనే తుపాకీ దానంతటే పేలిపోయింది.....!"

సుబ్బరాజు నమ్మలేకపోయాడు. ఏదో అనుమానం కలిగింది ఇటువంటి అఘాయిత్యం ఎందుకు జరిగిందో ఊహించలేకపోయాడు. సింహాద్రిలో యిటువంటి అమానుషం, క్రౌర్యం వున్నాయని ఎప్పుడూ అనుకోలేదు. ఒక వ్యక్తిని నిలువునా కాల్చే సాహసంవుందని ఏనాడూ ఊహించలేదు సుబ్బరాజుకి కర్తవ్యం ఏవిటో బోధపడలేదు. ఎదురు ప్రశ్న వెయ్యబుద్ధి కాలేదు.

"మరి యిప్పుడెట్లా? వూర్లో తెలిస్తే..!యింటి దగ్గర ఏమని చెప్పడం?" అన్నాడు సుబ్బరాజు.

"తెలియదం..!" గంభీరంగా నవ్వాడు సింహాద్రి. "యిక్కడ నువ్వు నేనూ శప్ప యితర ప్రాణిలేదు. నామీద నీకు విశ్వాసం వున్నంతకాలం తెలియడమనేది అసంభవం..!"

సుబ్బరాజు కళ్ళల్లోకి సూటిగా చూచి నవ్వాడు సింహాద్రి. ఆ చూపుల్లోని భావం ఆ మసకచీకట్లో అంత స్పష్టం కాలేదు సుబ్బరాజుకి.

సుబ్బరాజు ఏమీ మాట్లాడలేదు. హృదయంలో చెప్పరాని క్షోభ బయలుదేరింది. మౌనంగా తలవంచుకుని, మోకాళ్ళమీద అన్చి, రెండు కన్నీటి బిందువులు రాల్చాడు సుబ్బరాజు. అవి సింహాద్రిలాంటి పాపపు కంటికి కనిపించవు. కనీసం అవి ఆ తావుల్లోకి రావడానికి సిగ్గుపడతాయి.

అప్పటికి తెల్లవారుఝాము కావస్తుంది. దూరంగా అడవికోళ్ళు కూస్తున్నాయి. ఎక్కడో దూరంగా నక్కలు మోరచాచుకుని అరుస్తూన్నాయి. తెల్లగా ప్రకాశించే చంద్రుడు చెట్లగుబురుల్లోంచి, నేలమీద పడివున్న రాజాలు శవంమీద చల్లటి వెన్నెల కురిపిస్తున్నాడు. ఆకాశంలో నుంచి తీతువుపిట్ట అర్చుకుంటూ తూర్పుదిక్కుగా ప్రయాణమై ఎగిరిపోతోంది.

సింహాద్రి తుపాకి భుజానికి తగిలించుకుని మాటు దిగాడు. సుబ్బరాజు అతన్ని అనుసరించాడు. ఇక సుబ్బరాజు కర్తవ్యమల్లా సింహాద్రి చెప్పినట్టల్లా నడుచుకోవడమే....!

★ ★ ★

తెల్లవారింది. గూడెం అంతా పొగమంచులో మునిగి మత్తుగా మేల్కొంది. రాత్రి మాటులో రాజాల్ను పులి మీదపడి లాక్కుపోయిందనే వార్త గూడెం అంతా మ్రోగిపోతున్న....!

ఊరు వూరు వచ్చి అప్పిరెడ్డి యింటిముందు మూగారు. నాగులు ఈ వార్తవిని యింట్లోనుంచి బయటకు వస్తూ విరుచుకుపడి మూర్ఛపోయింది. ఆ మూర్ఛల్లా ఎంతో సేపటికిగాని తేరి, మాటా మంతీ లేకుండా వెర్రిచూపులో పడిపోయింది.

"దీనికి ఆ వార్త వినగానే మతి దెబ్బతిని వుంటుంది..!" అన్నారు.

అప్పిరెడ్డి పైపంచతో కళ్ళద్దుకుంటూ గోడకు జేరబడి దీర్ఘాలోచనలో మునిగి వున్నాడు. సింహాద్రి మాత్రం ఏదో కట్టుకథను గ్రామస్థుల దగ్గర చెప్పుకుపోతుంటే అంతా వింటున్నారు కళ్ళప్పగించుకుని... చిట్టచివరకు గ్రామస్థులు, అప్పిరెడ్డి వగైరాలంతా ఒక నిర్ణయానికి వచ్చిరాజాలు శవం అన్నా దొరుకుతుందేమోనని ఆశతో అడవంతా గాలించడానికి బయలుదేరారు మిట్ట మధ్యాహ్నానికి.

'ఇదిగో...!యిక్కడే లైటు క్రిందపడ్డది....దిగొద్దంటుండగా చెట్టుదిగాడు దాన్ని తేవడానికి.. అంతలోనే పులి వచ్చింది పొదలోనుంచి.. లైటు అందుకుని మళ్ళీ గబగబా మళ్ళీ చెట్టెక్కుతుండగా మీదబడి క్రిందపడగొట్టి లాక్కుపోయింది..! నేను రెండు దెబ్బలు కూడా వేశాను.. ఆయువుపట్టున తగల్లేదు..ఆ కంగారులో.. మొత్తంమీద పులికి దెబ్బ తగిలే వుంటుంది..!"

చెప్పుకుపోతున్నాడు సింహాద్రి. అంతా నిట్టూరుస్తుంటే సుబ్బరాజు మాత్రం మౌనం దాల్చాడు. లోలోన ఏదో బాధ గుండెను పెనవేస్తుంటే పైకి కనబడనీయకుండా దాచుకుంటున్నాడు.

ప్రొద్దువాలే వరకూ వెదికారు. రాజాలు శవం ఎక్కడా కనిపించలేదు. అంతా నిరాశతో గూడానికి తిరిగి వచ్చేశారు. "ఇంతపనీ జరిగిన తరువాత ఆ పులిని ప్రాణాలతో వదలగూడ" దన్నారు గ్రామస్తులు. విధిలేక మళ్లీ ఆ రాత్రే మాటుకట్టాల్సి వచ్చింది సింహాద్రికి.

మళ్ళీ అదేమాటు.. అదే ప్రదేశం. నిర్దాక్షిణ్యంగా అతి క్రూరంగా బలి అయిన ఒక అమాయకుడి వేడిరక్తంతో తడిసిన ఆ మట్టిమీద.. అదే చెట్టుమీద మాటు...మాటులో సింహాద్రి, సుబ్బరాజు కూర్చుని వున్నారు. క్రితం రాత్రి జరిగిన సంఘటనలు పదేపదే సింహాద్రి కళ్ళముందు తిరుగుతున్నాయి... ఎందుకో ఈ రోజు మాట్లోవుంటే గుండెల్లో భయం భయంగా వుంది సింహాద్రికి. ఎదో దృశ్యాలు కళ్ళముందు ఆడుతున్నాయి.

అడవంతా అంధకారంలో మునిగివుంది. ఇంకా అప్పటికి వెన్నెల రాలేదు. 'కేరు' మని ధ్వనించే ఆ అరణ్యంలో భయంకరమైన కటిక చీకటిలో ఏవో భయానక దృశ్యాలు కనిపిస్తున్నాయి. అడవి దయ్యాలు తలలు విరబోసుకుని కోలాహలంగా సవ్వడి చేస్తూ ఘల్లుఘల్లుమని మాటు చుట్టూ నృత్యం చేస్తున్నట్లు కనిపిస్తున్నది సింహాద్రి కళ్ళముందు.

మళ్ళీ మాటులోకి ఎందుకువచ్చాడు తను..? తను చేసుకున్న పథకం గత రాత్రితో తీరిపోయింది..గ్రామస్థుల నమ్మకంకోసం వచ్చాడు. నిజంగా పులి వచ్చినా రాకపోయినా తనకేమి అభ్యంతరంలేదు. ఎన్నడూ లేంది ఈనాడెందుకో గుండెల్లో భయంభయంగా వుంది. పీడకలలా వికృత దృశ్యాలు కనిపిస్తూ తన్ను భయపెడుతున్నాయి. తను గతరాత్రి పాపకార్యం చేశాడు. దానికి పరిహారంగా ఏ నాగుబామో చెట్టు ఎక్కి తన్ను కాటు వేస్తే...? రాజాలు దయ్యమయి తన పీకనులిమి చంపేస్తే...

సింహాద్రి ఊహలు మళ్ళీ కట్టలు త్రెంచుకుని ఎటో పోతున్నాయి. అర్థం లేకుండా సన్నగిల్లిపోతున్న ధైర్యాన్ని కూడగట్టుకుని నిలుపుకుంటున్నాడు. సుబ్బరాజు మాత్రం విధిలేక కునికిపాట్లు పడుతూ మోకాళ్ళలో తలదూర్చి పడుకుని వున్నాడు.

ఒంటరిగా అడవిలో నిశాచరుడిలా నిద్రరాక ఏవో గతస్మృతులు బాధిస్తోంటే అట్లాగే మేల్కొని యోచనలో పడిపోయాడు సింహాద్రి.

క్రితంరాత్రి ఒక వ్యక్తిని నిలువునా ప్రాణాలు తీశాడు... ప్రాణాలు తియ్యడం తనకు కొత్తకాదు... ఏమంత కష్టమైందీ కాదు... తుపాకి 'కమాన్' నొక్కితే చాలు.. తను అమితంగా వాంఛించే దానికోసం తను ఏపని అయినా చెయ్యడానికి వెనుదియ్యడు. ముఖ్యంగా ఒకనాడు తనలో రేగిన ప్రతీకారం, కక్ష ఇప్పటికి తీరాయి. నాగులు..., నాగులు తనకు దక్కకపోయినా వాడికోసం తపించి తపించి చావాలి..! అప్పుడు తన హృదయం తేలికవ్వాలి..! అదే తను వాంఛించేది.

అప్పటికి అర్ధరాత్రయింది. గుట్టచాటును తప్పించుకుని వచ్చి, ఎండిపోయిన మోదుగచెట్టు గుబురులోంచి కనిపించే చంద్రుడు మొరికి మొరికిగా, కాంతివిహీనంగా వెలుగుతున్నాడు. ఆ గ్రుడ్డి వెలుగులో సమీపంలో వున్న గుట్ట, పెద్దరాక్షసుడు అడ్డంగా పడుకుని నిద్రపోతూన్నట్టు కనిపిస్తూంది. గుబురుగా ఉన్న చెట్లు తలలు విరబోసుకున్న అడవి దయ్యాల్లా కనిపిస్తూన్నాయి. అంతలోనే దూరంగా యెక్కడ నుంచో "రాజాలూ...!" అన్న కేక వినిపించింది. ఆ కేకతో అడవంతా మారు మ్రోగింది. అదే పిలుపు ఎన్నోసార్లు దిక్కు దిక్కులుగా ప్రతిధ్వనించింది.

మాటులో కూర్చుని ఆలోచించే సింహాద్రి త్రుళ్ళిపడ్డాడు. ఒక్కసారిగా గుండెలు ఝల్లుమన్నాయి. శరీరం అతా పొగగ్రమ్మింది.

"...సుబ్బరాజు!"

నిద్రపోయే సుబ్బరాజును తట్టిలేపాడు సింహాద్రి. సుబ్బరాజు ఉలిక్కిపడి లేచాడు.

"చూడు..అటువిను. ఆ కేక ఏమిటంటావు?"

ఆ కేక మళ్ళీ వినిపించింది. అది దగ్గరగా వస్తున్నట్టుంది!"

సుబ్బరాజు గ్రహించాడు.

"పాపం...! నాగులు అనుకుంటా..! దానికి మతి చలించింది...వాడు పోవడంతోటే! మనస్సు వుండబట్టలేక ఇటు వచ్చి వుంటుంది.!"

నిట్టూర్పు వదిలాడు సుబ్బరాజు.

"మధ్యాహ్నం చెరువులో పడబోతే తీసుకొచ్చారు కదూ?"

సింహాద్రి ప్రశ్నకు సుబ్బరాజు ఏమీ సమాధానం ఇవ్వలేదు. కనుకొలుకుల్లోకి వచ్చిన నీళ్ళను అద్దుకున్నాడు.

ఆ పిలుపు మరీ దగ్గరకు వస్తున్నట్టు వుంది. పరుగెత్తుతూన్నప్పుడు కాలి అందెల సవ్వడి స్పష్టంగా వినిపిస్తూంది. సింహాద్రి క్షణం యోచించాడు. అతనిలో ఏమూలో అణిగి మణిగి వున్న వాంఛలేవో ఒక్కసారిగా విజృంభించాయి.

"దిగి చూచి వస్తా....!" అన్నాడు సింహాద్రి.

సుబ్బరాజు తెల్లబోయాడు.

"ఎందుకూ..?"

"ఏమీలేదు. ఇంత అడవిలో ఒంటరిగా వచ్చింది పాపం....ఏమన్నా అయితే! సుబ్బరాజు వెంటనే సింహాద్రి ఉద్దేశాన్ని కనిపెట్టి అసహ్యించుకున్నాడు.

"దిగితే ప్రమాదం! ఒకవేళ పులి వస్తే..?"

సింహాద్రి నవ్వాడు.

"పులి! తుపాకీ వుందిగా...తీస్కెళతాను..!"

సుబ్బరాజు వారిస్తున్నా వినక, తుపాకీ భుజాన పెట్టుకుని చెట్టు దిగాడు సింహాద్రి.

మాటులో సుబ్బరాజు స్తబ్ధుడై వుండిపోయాడు తను మళ్ళీ తిరిగి వచ్చేవరకు మాటులోనే కూర్చోమని చెప్పి పిలుపు వినవచ్చేవైపుకు నడిచాడు సింహాద్రి. ఆ పిలుపుతో నిశ్శబ్దంగా వున్న అడవంతా ప్రోగుతోంది అటు యిటు పరుగెత్తినప్పుడు కాలి అందెల మోతతోపాటు, కాలిక్రింద నలిగే ఎండుటాకులు గలగలా చప్పుడు చేస్తూన్నాయి. ఆ పిలుపు వచ్చే దిక్కుగా వెళ్ళాడు సింహాద్రి అనతిదూరంలో ఒక ఆకారం తల విరబోసుకుని, 'రాజాలూ.. ' అని కేకవేసుకుంటూ పిచ్చిగా అటువైపుకి పరుగెత్తుతున్నట్టు కనిపించింది. సింహాద్రి అటువైపుకి వెళ్ళి గట్టిగా పిలిచాడు. "నాగులూ..!"

పరుగెత్తే నాగులు ఈ కేక వినిపించగానే త్రుళ్ళిపడ్డట్టు ఆగిపోయింది

"ఆగు.. ! ఎక్కడికి....? యింత అడవిలో ఎందుకొచ్చావ్ ?"

సింహాద్రి పరుగెత్తుకుంటూ వెళ్ళి అక్కడ ఆగాడు

ఆ మసక వెన్నెల్లో, తల విరబోసుకని శోకించే వసుదేవతలా నిలుచుండి వుంది. మిసమిసలాడే పాలపొంగులాంటి యౌవ్వనం పైకి చిమ్ముతోంది ఇక్కడ ఈ సమయంలో ఒంటరిగా తనకి చిక్కడం అదృష్టమనుకున్నాడు చాటుచెంట పోతుంటే అనుకోకుండా తన మీద పూలవాన కురిసినట్టైంది సింహాద్రికి.

నాగులు సింహాద్రి కళ్ళల్లోకి పరికించి చూచి, పులిని చూచిన లేడిపిల్లలా చెంగున దూకి తప్పుకు పారిపోబోయింది. సింహాద్రి వెంటపడి నాగులు చెయ్యి బలంగా పట్టుకున్నాడు. బలంగా కొరికి పరుగుపెట్టింది నాగులు. సింహాద్రి తరుముతూ వెంటపడ్డాడు.

పొదల్లో, చెట్లనీడల్లో నుంచి ఎండుటాకులు మీదనుంచి, ఎటో ఎటో పరుగెత్తుతూంది నాగులు... సింహాద్రి తరుముకు పోతూన్నాడు వగురుస్తూ .

అనతిదూరంలో మసక మసకగా పెద్దవాగు కనిపిస్తూంది. . ఎదురుగా నాగులు ఆ వైపుకే పరుగెత్తుతోంది. అది సుమారు ఇరవై గజాలు లోతువున్న పెద్ద అఖాతం.. కారు చీకట్లు క్రమ్మిన పెద్దలోయ... కాలువేస్తే జారిపోయే గరిగోడ. నాగులు అటువైపుకే పరుగెత్తుకు పోతుంటే సింహాద్రికి ఆతురత ఎక్కువైంది.. అక్కడే... ఆ లోయలోనే రాత్రి, రాజాలు శవాన్ని పూడ్చి పెట్టారు. నాగులు యింకా పరుగెత్తుతూనే వుంది. ఎదురుగా అఖాతం వుందని తెలీకా? తెలిసే పోతుందా? అనిపించింది సింహాద్రికి. సింహాద్రి తొందరగా పరుగెత్తాడు.

"నాగులు! ఆగు. నీకేం భయం లేదు....!" దగ్గరగా పరుగెత్తి పట్టుకోబోయాడు. అయితే క్షణంలో నాగులు అదృశ్యమైంది...! భూమిని బ్రద్దలుకొట్టుకుని పాతాళంలోకి పోయే వనదేవతలా నాగులు ఆ లోయలోపడి అదృశ్యమైపోయింది.

క్షణంసేపు అడవంతా నిశ్శబ్దం అయింది.. ! రెక్కలు దులుపుతూ గుడ్లగూబ కూసుకుంటూ మరో దిక్కుగా ఎగిరిపోయింది.

సింహాద్రి ఆయాసపడుతూ, ఆ వాగు గట్టుమీద నిలబడి లోపలికి, లోయలోకి తొంగి చూచాడు స్తబ్ధుడై.

ఏముంది. ..?

అంధకారం. లోయంతా అంధకారం. రాళ్ళమీదనుంచి పారే నీరు గలగలా చప్పుడు చేస్తూంది... లోయనుంచి అడవిపూల వాసన ఘుప్పున కొట్టింది! నిస్పృహతో వెనక్కు తిరిగాడు. అంతే... స్తబ్ధుడై నిలబడిపోయాడు మళ్ళీ...!

గలగల కదిలే పొదలో మిలమిల మెరిసే రెండు ఎర్రటి జ్యోతులు కనిపించాయి! ఎండుటాకుల మీద. బలమైన అడుగుల సవ్వడి వినిపించింది గచ్చపొదలో నుంచి పులి దూసుకొచ్చి సింహాద్రి ఎదురుగా నిలబడింది...!! సింహాద్రి కళ్ళు చీకట్లు క్రమ్మాయి.. ! ఎక్కడేముందో కనిపించడంలేదు. నాలుక ఎండుకు పోతున్నట్లువుంది. భుజంమ్మీద వున్న తుపాకిని మెల్లగా చేతిలో పట్టుకుని లేపాడు

'మృత్యువు' తోకను భూమికి తాటించి కొడుతూ ఒళ్ళు జలిపించి 'గుర్రు' మంటూ సింహాద్రి మీదకు దూకింది. కాళ్ళ తాకిడికి రేగిన ఎండుటాకులు చెల్లా చెదురుగా ఎగిరిపోయాయి.

క్షణంలో సింహాద్రి వెర్రికేకపెట్టి నేలకొరిగిపోయాడు...! చేతిలోని తుపాకి మిట్టిపడి అనతిదూరంలో పడ్డది. బలమైన పంజాదెబ్బతో ఎదుర్రొమ్ము పగిలి వేడిరక్తం బయటకు చిమ్మింది.

త్రుటికాలంలో అడవిలో మళ్ళీ నిశ్శబ్దత ఆవరించింది. అడవంతా శోకించే వనదేవత కౌగిట్లో యిరికి ఆ మసక వెన్నెల్లో మత్తుగా నిద్రపోతూంది. పొదల్లో, ఎండుటాకుల మీద మాత్రం ఏదో ఈడ్చుకుపోతున్నట్టు 'బరబర' మని శబ్దమవుతూంది.

అక్కడ, గూడెంలో తన యింట్లో కిటికీకి ఎదురుగా, కలత నిదురపోతున్న అప్పిరెడ్డికి, పీడకలలో పేగు పెనవేసుకుని త్రుళ్ళిపడి లేచాడు. భూదేవి కౌగిలివీడి, ఏవో రెండు దివ్యజ్యోతులు ఆకాశంలోకి ఎక్కుతూన్నట్టు కిటికీలోంచి కనిపించింది అప్పిరెడ్డికి!

● భారతి - ఫిబ్రవరి, 1961 ●

# 23. గమ్యస్థానం

♦ డి. రామలింగం ♦

సంధ్యాసమయం. ఇప్పుడో ఇంకా కొంచెంసేపటికో చీకటి పడుతుందన్నట్లుగా ఉంది. అప్పుడే దూరం నుంచి చీకటి నీడలు నాలుగు దిక్కులా కమ్ముకొని వస్తున్నవి ప్రసాద్ ప్రయాణం చేస్తున్న బస్సు ఊరి చివర ఆగింది కండక్టరు అతనివైపు చూచి, ఫేషన్‌గా చేతి బొటనవ్రేలితో వూరివంక చూపిస్తూ 'మీరిక్కడే దిగాలి సార్!" అన్నాడు.

కండక్టరు అన్నమాట విని ప్రక్కన కూర్చున్న ప్రయాణీకులు అతనివైపు అదో మాదిరిగా చూసారు. బహుశా అత నా ప్రాంతానికి కొత్తగా వస్తున్నట్లు కండక్టరు మాటవల్ల వాళ్ళు తెలుసుకొని ఉంటారు అతను చప్పున లెదర్ సూట్‌కేస్ తీసుకొని చురుకుగా అడుగులు వేస్తూ బస్సుదిగాడు. వెంటనే బస్సు కదిలి వెళ్ళిపోయింది.

బస్సుదిగి ఒక పర్యాయం వూరువేపు చూసాడు ఒకమాదిరిగా పెద్దవూరే. బహుశా తాలూకా కేంద్రం కూడానేమో! మరొకసారి రోడ్డుకు అటూ ఇటూ పారచూచి ఇందిర చెప్పిన గుర్తులకోసం వెదికాడు.

సమీపంలోనే పంటకాలవ కనిపిస్తూ వుంది ఆ కాలవ గట్టునే పడి ఫర్లాంగు దూరం నడిచి, ఆ తరువాత అక్కడ పాత వంతెన దాటి అవతలివేపు వెళ్ళితే రెండు ఫ్యాక్టరీలు వుంటాయి. ఆ ఫ్యాక్టరీల ప్రక్కనే కొత్తగా కట్టించిన రెండంతస్తుల మేడ వుంటుంది. అదే వాళ్ళ ఇల్లని ఇందిర చెప్పింది

అలాగే కాలవగట్టున పడి చకచకా నడిచాడు. గట్టున పెరిగివున్న సరుగుడు చెట్లు. తోపును చూస్తే ఎందుకో కొంచెం భయంవేసిందతనికి చిన్నతనంనుంచీ పట్టణంలో పెరిగినవాడు, కనుక ఈ తోపులూ, వనాలూ ఎరుగడు. అందులోనూ ప్రొద్దుగుంకుతున్న సమయంలో ఆ చెట్ల గుంపు పక్కగా నడవటం కొత్తవాళ్ళ కెవరికైనా భయంవేస్తుంది.

ప్రసాద్ చకచకా నడుస్తూ తన ఈ ప్రయాణం విషయమై ఆలోచించాడు. బాగా ఆలోచిస్తే ఎందుకొచ్చినట్లో అతనికే తెలియడంలేదు ఎందుకొచ్చినట్లు తాను? ఈ ప్రశ్న తనకు తానే వేసుకుంటే తనపై తనకే నవ్వొచ్చింది. చుట్టాలు రమ్మన్నా పోనివాడు ఈనాడిలా అకస్మాత్తుగా గ్రామసీమకు రావటం, అందులోనూ చీకటి పడుతూన్న సమయంలో ఒకళ్ళ యింటిని వెదుక్కుంటూ పోవటం వెర్రికాకపోతే ఏమిటనుకున్నాడు.

అయినా ఎందుకోగాని ఈ ప్రయాణం తాను అవశ్యం చేయవలసిందేనని అంతరాత్మ చెబుతూ ఉంది ప్రయాణం చేస్తూవుంటే హృదయమెంతో తేలికగా, ఆహ్లాదంగావుంది. కాని ఎందుకీ ప్రయాణం అని ఎవరైనా నిలదీసి అడిగితే మాత్రం సమాధానం చెప్పే స్థితిలో లేదు.

వేసవి సెలవులు ఇంకా వారంరోజు లున్నాయనగా కాలేజీ డే జరిగింది. అక్కడ మిత్రులంతా కలుసుకొని బాగా మెక్కి కులాసాగా గడిపారు. ఇందిర అతన్ని కలుసుకొని మాట్లాడింది ఆరోజు ఎన్నడూలేనంత స్వేచ్ఛగా మాట్లాడింది. వాళ్ళ ఊరికోమారు సెలవుల్లో రమ్మన్నది ఎలా ప్రయాణం చేయాలీ, ఊళ్ళో వాళ్ళ యిల్లు ఎక్కడ, ఎలా వుంటుందీ గుర్తులన్నీ బాగా వివరంగా చెప్పింది. అతనూ అలాగే వస్తానన్నాడు. "వస్తానంటే కాదు తప్పక వచ్చి తీరాలి" అన్నదామె. ఓ తప్పకుండా వస్తానన్నాడు అతను.

ఆమె ఎందుకోసం రమ్మన్నదీ, తాను ఎందుకోసం వస్తానన్నది అప్పుడుకాదు సరిగదా ఇప్పుడీ ప్రయాణానికి బయలుదేరేముందు కూడా అతను ఆలోచించలేదు. నిజం చెప్పాలంటే ఇందిరకూ, అతనికీ అంతగా సాన్నిహిత్యం కూడా లేదు. అతన్ని ఆకర్షించే అందంకూడా ఆమెలో లేదేమో మనిషి చామనఛాయలో పలచగా వుంటుంది మొహం మాత్రం కోలగా ముచ్చటగా వుంటుంది. ఆ కళ్ళు చురుగ్గా ఎదుటిమనిషి లోతుల్ని పరిశీలిస్తున్నట్లుగా వుంటాయి. ఆమె జడ, చీరె ముస్తాబు పరవాలేదనిపిస్తాయి. ఇంతకుమించి ఆమెలో చెప్పుకోదగిన సౌందర్యం, ఆకర్షణా ఏమీలేదు. ఆవిడకంటే అందమైన అమ్మాయిలు కాలేజీలో వున్నారు. వాళ్ళలో ఒకరిద్దర్ని తాను పరిశీనలగా చూచినట్లుగా కూడా అతనికి గుర్తుంది. అయితే, అతనిదృష్టి వాళ్ళపై ఎప్పుడు పడేదో అప్పుడే వాళ్ళ భేషజాలూ, రీవీ, అహంభావం ప్రదర్శితం కావటంతో వాటిని సహించలేని అతని ప్రవృత్తి వాళ్ళపై అతనికిగల కుతూహలాన్ని తగ్గించివేసేది.

ఇందిరమాత్రం స్వీట్ మేనర్స్ గల అమ్మాయి, అని అతనికొక అభిప్రాయం ఏర్పడింది. ఆమెలో అహంభావం కించిన్మాత్రంకూడా లేదు. ఎంతో వినమ్రంగా వుంటుంది. ప్రసన్నంగా వుంటుంది అంతవరకేగాని ఆమె వ్యక్తితం అతన్నెప్పుడూ ఆకర్షించలేదు. ఆమెను గూర్చి అతను తలపోసిన మధుర క్షణం ఒక్కటీ లేదు. ఆ సంగతి ప్రసాద్‌కు బాగా తెలుసు. అయినా, ఆమె ఎందుకు తనను రమ్మన్నదో ఏమో! పోనీ ఆమె అయినా అతన్ని అదో మాదిరిగా కాంక్ష బారగా చూసిందా అంటే అటువంటి సన్నివేశం ఒక్కటికూడా జరిగినట్లు లేదు. జరిగినట్లేమిటి, అసలు జరగలేదు. కాలేజీలో చాలా ముభావంగా మెలిగేది ఇంటర్ నుంచి చూస్తున్నాడతను. ఎం.ఏ. ఫైనల్ వరకు కూడా ఆమె వైఖరి అలాగేవుంది. మగపిల్లలతో ఆమె మాట్లాడటమే బహు తక్కువ. ప్రసాద్‌తో కూడా ఎక్కువగా మాట్లాడలేదు. మరి అతన్ని ఇలా ఆహ్వానించడంలో ఆమెకు లోపల ఏమైనా ఉద్దేశాలున్నాయేమో అతనికి తెలియదు. మనిషి అంత చొరవ, ధైర్యం కలది కాదని కూడా అతని అభిప్రాయం. అయినా ఇవన్నీ తన బుర్రలో పుట్టిన భావాలు. కాని విషయం బహుసాధారణ మైనది ఏమీలేదు, ఆమె ఒక మారు సెలవుల్లో వాళ్ళ ఊరు రమ్మన్నది. అతను

కేవలం వాళ్ళ ఊరు, వాళ్ళ యిల్లు చూడ్డానికి మాత్రమే వెళ్ళుతున్నాడు. ఇంతకు తప్ప మరేమీలేదు. ప్రయాణంకూడా చాలా సరదాగా వుంది.

ఈ ఆలోచనల్లోపడి కాలవ వంతెన దాటడం మరచి నాలుగు అడుగులు ముందుకు వెళ్ళాడు. మళ్ళీ వెనక్కివచ్చి గబాగబా వంతెన దాటుతూ వున్నాడు. ఆ పాతవంతెన దాటుతూ వుంటే అతని భయం మరికొంచెం ఎక్కువైంది. ఎప్పుడు కట్టిందో ఆ వంతెన, శిథిలావస్థలో వుంది. సమీపంలో ఒక్క మనిషికూడా కన్పించడం లేదు. పైగా చీకట్లు బాగా కమ్ముకొస్తున్నాయి. పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వంతెన దాటి ఫ్యాక్టరీ వైపు చూశాడు. బహుశా రైస్‌మిల్లులు కావాలి, వాటికి ఒక పక్కగా కొత్తగా కట్టిన ఇల్లు కన్పిస్తూ వుంది. ఆ ఇంటిపై గదుల్లో ఎలక్ట్రిక్ దీపాలు వెలుగుతున్నాయి. తప్పకుండా అదే ఇందిర ఇల్లు అయి వుంటుందని అనుకుంటూ అటువైపు పరుగుతీశాడు. ఎవరైనా చూస్తే భయపడి పరుగెత్తుతున్నాడని అనుకుంటారేమోనని దిక్కులు చూస్తూ, మధ్య మధ్య నెమ్మదిగా నడుస్తూ, ఎవరూ రావడంలేదని నిర్ధారణ చేసుకోగానే పరుగుతీస్తూ బాగా చీకటిపడేసరికి ఆ ఇంటి గేటుదగ్గరకి చేరుకున్నాడు. అక్కడికి కొంత దూరంలో కూలివాళ్ళ గుడిసెలు, వాళ్ళు అన్నం వండుకుంటున్న పొయ్యి మంటలూ కన్పిస్తున్నాయి. ఈ మేడ చుట్టూ మాత్రం ఇండ్లులేవు. ఫ్యాక్టరీలు సాయంత్రమయేసరికి మూతపడి నట్లున్నాయి. ఇంటిగేటువేసి వుంది.

గేటుపై రెండుసార్లు కొట్టి "ఎవరండీ ఇంట్లో" అని కేకవేశాడు ప్రసాద్. బాగా రెండు మూడుసార్లు అలా పిల్చిన మీదట ఓ ముసలి మనిషి వచ్చి గేటు తీసింది. బహుశా ఆ ఇంట్లో పనిమనిషేమో, గేటుతీసి "ఎవరు కావాలి?" అని అడిగింది.

అతను చప్పున సమాధానం చెప్పలేకపోయాడు. "ఇది ఎవరిల్లు?" అని ఎదురు ప్రశ్న వేశాడు. "ఇంజనీరు గారిల్లు" అన్నదా మనిషి. "ఇందిర ఇల్లు ఇదేనా?" అని అతను అడిగాడు.

ఈ ప్రశ్నకు ఆ మనిషి లోపలికెళ్ళింది. ఇంతసేపటినుంచీ బైటనిల్చునే వాకబు చేస్తున్నాడతను. చుట్టూ అంతా చీకటిగా వుంది. ఆ మనిషి గేటుదాటి లోపలికైనా రమ్మనమని అన్నదికాదు. ఆ, చీకటిలో దిక్కులు పరకాయించి చూస్తున్నాడు. ఈ పర్యాయం ఆ మనిషితోపాటు ఎవరో ఒకావిడ వస్తున్నట్లుంది. ఆమె వస్తూనే స్విచ్ వేసి లైటు వెలిగించింది. అతను ఆ వెల్తురులోకి చూస్తే ఇందిరే. అతన్ని చూచి "ఓ! ప్రసాద్! నువ్వేనా? లోపలికి రా ప్రసాద్!" అంటూ సాదరంగా ఆహ్వానించింది. అమ్మయ్య! ఇప్పుడు అతని మనస్సు కొంచెం స్థిమితపడింది. ఎలాగైతేనేం ఇందిర చెప్పిన గుర్తుల్ని బట్టి వాళ్ళ యిల్లు చేరుకోగలిగాను.

"ఎప్పుడు బయల్దేరావు, బస్సులో వచ్చావా, రైల్లో వచ్చావా? దారిలో భయం వేసిందా?" ఇత్యాది ప్రశ్నలన్నీ ఇందిర అడుగుతూంది. ప్రసాద్ వాటికి సమాధానం చెప్దామని ప్రయత్నిస్తున్నాడు. కాని ఇందిర అతని సమాధానాలు వినకుండానే లోపలికెళ్ళి ఒక ముసలాయన్ని వెంటబెట్టుకొచ్చి ఆయనకు పరిచయం చేస్తూ, "నాన్నా! వీరు ప్రసాద్, కాలేజీలో నా క్లాస్‌మేట్. సెలవుల్లో మావూరి కో పర్యాయం రమ్మని నేనే ఆహ్వానించా. తప్పకుండా వస్తామన్నారు. చూచావా మాటతప్పకుండా వచ్చారు" అన్నది నవ్వుతూ.

ముసలాయనకు దాదాపు అరవై ఏళ్ళుంటాయి. దృష్టిమాంద్యంకూడా ఏర్పడిందేమో! ప్రసాద్‌కు బాగా దగ్గరికొచ్చి అతని మొహాన్ని పరిశీలనగా చూస్తూ భుజంపై చెయ్యి వేసి ముందుగదిలోకి తీసుకెళ్ళాడు. అతనికో కుర్చీ చూపిస్తూ "కూర్చోబాబూ!" అంటూ ఆయన మరో కుర్చీలో కూర్చున్నాడు. ప్రసాద్‌ను మళ్ళీ పరిశీలనగా చూస్తూ ఏమో అడగబొయ్యాడు. అతనూ ఆయనవేపు సగౌరవంగా చూస్తూ ఆయన అడిగే ప్రశ్నకు ఎలా సమాధానం చెప్పాలో ఆలోచిస్తున్నాడు.

వాళ్ళిద్దర్నీ చూచి ఇందిర లోపలికెళ్ళి పనిమనిషి కేమిటో పురమాయిస్తూ వుంది. ముసలాయన ప్రసాద్ వూరు, అతని తల్లిదండ్రుల వివరాలూ, బంధువుల సమాచారాలు అడిగాడు. ఆయన అడిగినవాటి కన్నిటికీ అతను ఓపికగా సమాధానం చెబుతున్నాడు. తమ కుటుంబం విషయాలు కూడా ముసలాయన చెప్పాడు.

ఆయన దక్షిణదేశంలో చాలాకాలం రైల్వే ఇంజనీరుగా ఉద్యోగంచేసి రిటైరయ్యాడు. మూడు పెళ్ళిళ్ళు చేసుకున్నాడు. ముగ్గురు భార్యలూ చనిపోయారు. మూడో భార్యకు ముగ్గురు పిల్లలు పుట్టారు. అంతా ఆడపిల్లలే. పెద్దది ఇందిర. రెండో అమ్మాయి జానకి. జానకి వాళ్ళ పెద్దమ్మగారి ఇంటికి వెళ్ళింది. మూడో అమ్మాయి రాధ కనిపిస్తూనే వుంది. చిన్నపిల్లలిద్దరూ ఆ వూళ్ళో హైస్కూలులో చదువుకుంటున్నారట. మూడో భార్యకూడా పోవడంతో ముసలాయన చాలా క్రుంగిపోయినట్లు కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆడపిల్లలకు తల్లిలేకుండా పోవడం తలచుకొని ఆయన ఎప్పుడూ బాధ పడేట్టున్నాడు. క్రొత్తగా యీ ప్రాంతంలో యిల్లు కట్టించుకున్నాడు. ఇక్కడే స్థిరపడిపోవడానికి నిశ్చయించుకున్నాడు.

ఇలా వాళ్ళు మాట్లాడుకొంటూ వుంటే ఇందిర వచ్చింది. ఆమె వెంట పనిమనిషి కూడా వుంది. "వెళ్ళిస్నానం చేసి " రా, నాయనా" అని ముసలాయన అన్నాడు. ప్రసాద్‌కు ముసలాయన సంగతి విన్న తరువాత ఆయనపై జాలి, అమితమైన గౌరవం ఏర్పడ్డాయి.

★ ★ ★

అతను స్నానంచేసి ముగించుకొని వచ్చిన తరువాత భోజనానికి కూర్చున్నాడు. పనిమనిషి వడ్డించింది. వాళ్ళ వంటకాలెంతో రుచిగావున్నాయి అతనికి. అందులో ఆకలికూడా బాగా వేస్తుందేమో ఇంకా రుచిగా అనిపించాయి. ఇందిర అతనికేం కావాలో కనుక్కుంటూ పనిమనిషిచేత వడ్డన చేయిస్తూ వుంది. ముసలాయన కూడా అతని భోజనం విషయంలో శ్రద్ధ వహించాడు. మూడో అమ్మాయి రాధ మాత్రం ఏమీ మాట్లాడకుండా ప్రసాద్ వేపు కొత్తగా చూస్తూ భోజనం చేస్తూంది.

భోజనాలైన తరువాత వరండాలోకి వచ్చాడు. సోఫాలలో కూర్చొని అంతా పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. ముసలాయన పొగచుట్ట కాల్చుకుంటూ ఆ ఊరి విశేషాలు తన సర్వీసు అనుభవాలు, తాను సంపాదించిన ఆస్తి వివరాలు చెబుతున్నాడు. రాత్రి పదిగంటలు కావస్తూ వుంది. ఆయనకు ఒకటి రెండు ఆవలింతలు వచ్చాయి. ప్రసాద్‌కు కూడా బడలికగానే వుంది. అతను ముసలాయనతో నమ్రతగా "తెల్లవారు జాము బండికి వెళ్తానండి" అన్నాడు. "ఆయన రేపు వుండిపోరాదు బాబూ!" అన్నాడు. "లేదండి. ఇంట్లోవాళ్ళతో

రేపొస్తానని చెప్పాను. ఎదురుచూస్తూ వుంటారు" అన్నాడతను. అలాగే తెల్లవారు జామున అయిదుగంటల బండి వుంది బండిదేళకు లేపమని పనిమనిషితో చెప్పమ్మాయి అంటూ ఇందిరకు చెప్పి ముఖాయుని లోపలకు వెళ్ళాడు.

ఇందిర, ప్రసాద్ చాలాసేపు కూర్చుని అవాకులూ చెవాకులూ మాట్లాడుకున్నారు. ఇందిర చెల్లెలు రాధ వాళ్ళ దగ్గరే కూర్చుని కళ్ళు తెరుస్తూ మూస్తూ వాళ్ళ మాటలు వింటోంది చివరకు నిద్ర పట్టించేమో ఆ అమ్మాయి కూడా వెళ్ళిపోయింది.

వీళ్ళకూ నిద్ర వస్తున్నట్లుగా వుంది. ఇందిర మెట్లపైకి దారితీస్తూ "పైకి వెళ్దాం రా ప్రసాద్!" అంది. ఆమెను అనుసరించి అతను నడుస్తున్నాడు "ఎలా వుంది యిల్లు?" అంది ఆమె.

"ఇల్లు బాగానే ఉంది. కాని యింటి కొచ్చేటప్పుడే ఎవరైనా గాభరాపడరారు" అన్నాడతను.

ఆమె పెద్దగా నవ్వింది. అతనూ కొంచెంగా నవ్వాడు.

"ఏం సరుగుడు చెట్లుచూచి భయపడ్డావా?" అని అడిగింది ఇందిర

"అలాగే అనిపించింది" అన్నాడతను. మళ్ళీ ఇద్దరూ నవ్వుకున్నారు.

ఇద్దరూ పైకి చేరుకున్నారు. పైన రెండు గదులు ఎదురుబొదురుగా వున్నవి. మధ్య వరండా వుంది. గదులకు వెనుక బాల్కనీలున్నాయి. ఒక గది తలుపుతీసి స్విచ్ వేసింది ఇందిర. గదిలో ఒకటే మంచం, ఒకటే కుర్చీ ఒక మేజాబల్లా వున్నాయి. బహుశా అది ఇందిర గది అని అతననుకున్నాడు

అతను లోపలికెళ్ళి గది అంతా కలియజూచిన తరువాత "ఇక్కడ నీకేం భయం లేదు. నిశ్చలంగా నిద్రపో. తెల్లవారుజాము బండివేళకు నిద్రలేపుతా" అంటూ యిందిర మెట్లవేపు వెళ్ళబోయింది. ప్రసాద్ ఆమెను పిలిచి "ఇక్కడ మంచినీళ్ళున్నాయా?" అని అడిగాడు. క్రిందికి వెళ్ళి పంపిస్తానని ఆమె వెళ్ళిపోయింది. కొంతసేపటికి పనిమనిషి కుండతో నీళ్ళు తెచ్చిపెట్టి పోయింది. అతను తాపీగా సిగరెట్టు వెలిగించి పక్కమీద నడుంవాల్చాడు.

పడుకున్నాడేగాని కొత్తప్రదేశం అవడంచేత అతనికి నిద్ర పట్టడంలేదు ఒకదాని తరువాత ఒకటి సిగరెట్లు కాలుస్తున్నాడు. దూరంలో పోలీస్ స్టేషనులో పన్నెండు గంటలు కొట్టినట్లు అనిపించింది. దూరంనుంచి వినవస్తున్న కీచురాళ్ళ ధ్వని తప్ప ప్రకృతి అంతా నిశ్శబ్దంగా వుంది. అతను లేచి లైటు ఆర్పి నిద్రపోవడానికి ప్రయత్నించాడు.

లాభంలేదు. నిద్ర బొత్తిగా పట్టడంలేదు దుప్పటి కప్పుకొని వత్తిగిల్లి ఒక ప్రక్కకు పడుకున్నాడు. నిద్రపోవడానికి గట్టిగా ప్రయత్నించాడు. మనస్సులో ఆలోచనలన్నిటిని పారద్రోలి నిశ్చింతగా కళ్ళు మూసుకున్నాడు. అయినా నిద్ర వస్తున్నట్లే లేదు. పైగా ఊహలు పరిపరివిధాల పరుగులు తీస్తున్నవి. అలాగే ఆలోచిస్తూ, ఊహిస్తూ కొంతసేపు గడిపాడు. ఒంటిగంట కొట్టినట్లు వినిపించింది.

ఇక నిద్ర రాదని నిశ్చయించుకున్నాడు. లేచి లైటు వేసి సిగరెట్టు పొగలను చుట్టలుగా పాయలుగా వదులుతూ కిటికీలోంచి బైటికి చూస్తున్నాడు. అంతా చీకటిగా వుంది ఏమీ కన్పించడం లేదు. చుక్కలు మాత్రం స్ఫుటంగా ప్రకాశిస్తూ నల్లచీరెపై తెల్లమచ్చలలాగా కనిపిస్తున్నవి సిగరెట్టు చివరంటా కాలుకొచ్చింది దాన్ని కిటికీ లోంచి బైటికి విసిరివేసి లైటువైపు చూస్తూ ఊహలకు కళ్ళెంబిగించి మనస్సును నిరామయం చేసుకున్నాడు.

అలా పడుకుని వుంటే ఎప్పుడు పుట్టిందో సన్నని కునుకు పట్టింది. ఆ కునుకు ఎంతో హాయిగా అనిపిస్తూంది కొంతసేపు సగం మెలకువలో ఉండి నెమ్మదిగా గాఢనిద్రలో పడబోతున్నాడు. ఇంతలోనే తాను పడుకున్న గది తలుపు ముందుగా ఎవరో నడిచినట్లనిపించింది. బాగా గుర్తుపట్టడానికి అలికిడి స్పష్టంగా లేదు. అడుగుల చప్పుడు సరిగా వినపడడం లేదు. కళ్ళు తెరచి చూశాడు. ఎవరూ నడుస్తున్నట్టు లేదు. కేవలం తన భ్రమేనేమో! మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. ఈ పర్యాయం తనగది తలుపు దగ్గరగా ఎవరోవచ్చి నిల్చున్నట్లనిపించింది. అతను మంచంపైకి లేచికూర్చున్నాడు. అసలే మనిషి పట్నవాసంవాడు. రాకరాక గ్రామసీమ కొచ్చాడు కొత్త ప్రదేశం. కొత్త యిల్లు. పైగా పై అంతస్తులో ఒక్కడే ఒక గదిలో పడుకొని వున్నాడు. అందులో మళ్ళీ ఈ బెడద. ఏమై వుంటుంది చెప్మా! అని దీర్ఘంగా ఆలోచించాడు. కొత్తగా కట్టిన యింట్లో దయ్యాలూ, భూతాలూ వుంటాయా! పైగా యిది మనుషులున్న ఇల్లాయె. పాడుపడిన యిల్లు కాదుగా. క్రింద మనుషులు పడుకుని వున్నారాయె. అయినా అతనికి యిటువంటి మూఢనమ్మకాలు లేవు. మనుషుల మూఢ నమ్మకాలను గూర్చి అతను కాలేజీ డిబేట్సులో మాట్లాడుతూంటే లెక్చరర్స్ దంగైపొయ్యేవాళ్ళు. అతని వాదధోరణి నెదుర్కొవడానికైనా మూఢనమ్మకాలను సమర్థిస్తూ మాట్లాడిన ప్రబుద్ధులు కూడా లేకపోలేదు మరి అటువంటివాడు తాను యిప్పుడు వాటిని ఒప్పుకొని కంగారుపడతాడా? ఇలా ఆలోచిస్తూంటే రెండుగంటలు వినొచ్చాయి. అతను తలుపు వైపు చూస్తూ చెవులు రిక్కించి ఏవైనా శబ్దాలు వినపడతాయేమోనని అతిశ్రద్ధగా కాచుకొని వున్నాడు. ఈ పర్యాయం ఏదో బైట వెల్తురు పడ్డట్టనిపించింది. అతని కుతూహలం మరీ ఎక్కువైంది. ఏమిటిదీ అని విసుక్కున్నాడు. తన ధీరీకే యీ సంఘటన సవాలుగా వుంది. కాబట్టి అతని కిందులో కొంచెం ఆసక్తి కూడా కలిగింది. కాని నిద్రే చెడిపోతూ వుంది. మూడుగంటలుకూడా కావస్తూ వుంది. తాను యిందాకటి నుంచీ తనవాచీ చూసుకొనటమే మరిచాడు. అసలు తనకు వాచీ ఒకటి వుందనే జ్ఞాపకం కూడా అతనికి రాలేదు. దూరంనుంచి వినపడుతున్న గంటలే లెక్కపెడుతన్నాడు. అత్యధికమైన ఆసక్తి కలిగించే ఏదో నిగూఢమైన విషయంలో పడ్డప్పుడు మానవుడు స్వవిషయం పూర్తిగా మరిచిపోతాడేమో!

గది బైట పడ్డ వెలుతుర్లు అలాగే వున్నాయి. చిన్న నీడ వాటిమీదుగా కదిలిపోయింది. మళ్ళీ యధాప్రకారం కాంతి, ఈ పర్యాయం బైట గదిలోంచి ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లుగా వినిపించింది. అయితే ఏడుపు పెద్దగా లేదు. ఎక్కువగా వెక్కుతూన్న శబ్దమే. తప్పకుండా ఎవరో స్త్రీ అయి వుంటుంది. ఇకగదిలో కూర్చుని లాభం లేదను కున్నాడు నెమ్మదిగా తలుపు తీసిచూస్తే ఎదుటి గది తలుపుతెరచి వుంది. అందులో లైటు వెలుగుతూంది. ఎవరో మనిషి కూడా గదిలో వున్నట్లుంది.

తన గది తలుపు బారగా తీసి ఆ గదిద్వారం దగ్గరకెళ్ళి చూశాడు. ఎవరోకాదు - ఇందిర. టేబులు అద్దానికి ఎదురుగా కూర్చుని తల చేతుల్లో పెట్టుకుని ఏడుస్తున్నట్లుగా వుంది. తాను ఇందాకటి నుంచి వట్టిగనే కంగారుపడ్డాడు. ఇందిర అన్న సంగతి తెలిస్తే ఎప్పుడో తలుపు తీసి బైటకొచ్చేవాడు. పై గదిలోకి ఎందుకొచ్చిందీ? ఇలాంటి ప్రశ్నలన్నీ అతనికి కలిగాయి. "అబ్బ, ఎంత కంగారు పెట్టిందీ" అనుకున్నాడు తనలో.

ఆమె అలాగే చేతుల్లో మొహం పెట్టుకొని ఏదో అవేదన పడుతున్నట్లుగా వుంది. మనిషి చక్కగా కుందనపు బొమ్మలాగా మలుపు తిరిగి కూర్చొనివుంది. ఆ మలుపులో ఆమె సన్నని నడుం కొలతకు అందుబాటులో వుంది. సన్నని గులాబీరంగు వాయిల్ చీరె వంగపందురంగు బ్లౌజులో ఎంతో అందంగా కనిపిస్తూ వుంది. జడ పదులుగా విడివడినట్లుగా వుంది. జడ చివర ఆకుపచ్చ రంగు రిబ్బను కట్టుకుంది. అతను ఎన్నో మార్లు ఆమెను చూచాడు. కాని తనను ఇంతగా ఆమె ఎన్నడూ ఆకర్షించ లేదు. స్త్రీలు గంభీరంగా, ఠీవిగా బైట విహరిస్తూ మగాళ్ళతోపాటు చదువుకుంటూ, ఉద్యోగాలు చేసుకుంటూ వున్నప్పటికంటె ఇలా ఏకాంతంగా గదుల్లో ఆమెలాగా సక్రమంగా స్త్రీ సహజమైన స్వభావాన్ని వ్యక్తం చేసేటప్పుడే అందంగా వుంటారని అతనికి ఆ క్షణంలో ఒక అభిప్రాయం ఏర్పడింది. ఇక ఏడుస్తున్న యువతి వెయ్యిరెట్లు పురుషుణ్ణి ఆకర్షిస్తుందనుకున్నాడు. అతను నెమ్మదిగా ఆమెను సమీపించాడు. ఆమె అలాగే తలవంచుకుని వుంది. అతను దగ్గరకొచ్చినట్లు మాత్రం గుర్తించిందేమో, అతను ఆమె వీపు మీద చెయ్యి వేయబోతూ మళ్ళీ స్పృహలోకి వచ్చి చేతిని వెనక్కు లాక్కుని అనునయంగా "ఇందిరా, ఇందిరా!" అని ఆతురతగా పిలిచాడు. ఆమె మొహం పైకి యెత్తలేదు. అతను మళ్ళీ "ఇందిరా, ఇటు చూడు!" అన్నాడు కొంచెం బిగ్గరగా. ఆమె తలపైకెత్తి అతని మొహంలోకి ఒక క్షణం చూచి చప్పున మళ్ళీ తలచేతుల్లో పట్టుకుని విపరీతంగా వెక్కి వెక్కి ఏడుస్తూ వుంది. అతని గాభరా మరీ ఎక్కువైంది.

అతను ఈ పర్యాయం ఆమె భుజంమీద చెయ్యి వేసి, "ఇందిరా! ఇలా ఏడవ కూడదు. సంగతేమిటో నాకు చెప్పకూడదూ" అన్నాడు.

"ఆమె అలాగే తల వంచుకొని ఏమీలేదు ప్రసాద్!" అంది.

"మరి ఎందుకేడుస్తున్నావ్?"

ఆమె జవాబు చెప్పలేదు.

"ఇందిరా! క్రింద పడుకున్నారు గదూ మీరంతా. ఈ గదిలోకి ఎప్పుడొచ్చావ్?' అతను ప్రశ్నించాడు.

"ఇప్పుడే" అందామె.

"ఎందుకూ?"

ఆమె సమాధానం చెప్పలేదు.

"ఇందిరా! నువ్వెందు కేడుస్తున్నావో నాతో చెప్పకూడదా?" అతను అడిగాడు.

"నీతో చెప్పకూడంది ఏముంది ప్రసాద్ మాకు. ఏవో జ్ఞాపకాలొచ్చాయి."

"ఏమిటవీ."

"మా అమ్మ..." అంటూ ఆమె ఏమో చెప్పబోయి ఆగింది.

"ఓస్ అమ్మ జ్ఞాపకం వస్తేనే ఇంతగా ఏడ్వాలా?" అతను తేలిగ్గా అన్నాడు.

ఇందిర అతని కళ్ళల్లోకి పరిశీలనగా చూసింది. అతను సానుభూతి పూర్వకంగా ఆమె ఏమంటుందోనని ఎదురు చూస్తున్నాడు. ఆమె లేచి అవతలి కిటికీ వద్దకుపోయి బైటికి దూరంగా చూస్తూ "మాకెవరున్నారు ప్రసాద్! చూశావు కదా మా నాన్న ఎంత ముసలివాడయ్యాడో! అమ్మకూడా పోవడం ఎంత దురదృష్టకరం!" అందామె.

"అయితే, మీకిక బంధువులు కూడా లేరా?"

"ఎందుకు లేరు. కాని వాళ్ళు వుండి కూడా లేనట్లు అనుకోవచ్చు."

అయినా ఆత్మీయులు లేనంతమాత్రాన మనుషులు ఇలా దీనంగా నిస్సహాయంగా వుంటారా - వీళ్ళకేం కొరత? ముసలాయన బాగా ఆస్తికూడా సంపాదించాడయ్యే. అనుకున్నాతను.

ప్రసాద్‌కేమీ అర్థం కాలేదు. ఇందిర తాను చెప్పిన దానికంటె మరేదో విషయం గూర్చి కలత చెందుతున్నట్లుగావుంది. ఆమె అంతరార్థం కనుక్కుందామని దగ్గరగా వెళ్ళి "అయితే ఎవరూ లేనంతమాత్రం చేత ఇలా ఇదవుతారా?" అన్నాడతను.

ఆమె అతన్ని పక్కగా చూసి " నీకర్థంగాదు ప్రసాద్ మా పరిస్థితి" అంది.

"నాకు చెప్పకూడదూ?" అన్నాడతను.

"ఎందుకు చెప్పకూడదు, కాని చెబితేనే అర్థం కాదు."

"ప్రయత్నిస్తాను అర్థం చేసుకోడానికి..." అతను మనఃపూర్వకంగానే అన్నాడు.

ఇందిర వెంటనే సమాధానం చెప్పలేకపోయింది. అతనితో ఏమని చెప్పాలో ఆమెకు మాటలు పెకిలి రాలేదు. పోనీ ఏదైనా చెబుదామని తీవ్రంగా ఆలోచిస్తే ససేమిరా తోచలేదు. కళ్ళు సన్నగా చేసి ఓరచూపులతో అతని ముఖ కవళికల్ని పరిశీలిస్తూ క్రింది నేలమీదికి చూస్తూ వుంది. అతను సానుభూతి పూర్ణమైన దృక్కులతో ఆమె విషయమే ఆలోచిస్తున్నాడు. అతను ఆ ఇంట్లోకి ప్రవేశించిన కొంచెంసేపట్లోనే ఆ కుటుంబం ఏకాకిగా వుంటున్నట్లు అనుభూతి చెందాడు. అది నిజమని ఇప్పుడనిపిస్తూ వుంది.

చివరకు ఆమె అన్నది. "నువ్వొక్కడవైనా మా కుటుంబానికి ఆత్మీయుడవు కావడం ఎంతో మేలు జరిగినట్లుగా అనిపిస్తూంది"

"ఇందిరా!" అతను ఆవేశంగా పిలిచాడు. ఆ ఆవేశంలో అతనామెకు తేజోవంతంగా కన్పించాడు.

"ఏమిటి ప్రసాద్?"

"కేవలం ఆత్మీయుడనే కాదు. ఈ రోజునుంచి మీ కుటుంబంలో ఒకడనైపోతే బాగుండు ననిపిస్తుంది."

"అది మా అదృష్టం ప్రసాద్!"

"మీ అదృష్టం కాదు. నాకు ఆత్మసంతుష్టిగా వుంటుంది. కబుర్లు, కబుర్లు, మొహమాటాలూ, పట్టింపులు వుండే కృత్రిమ బాంధవ్యాలకంటే స్పష్టమైన, నిర్మలమైన హృదయ పూర్వకమైనట్టి సాంగత్యం మానవులకు మానసికంగా, నైతికంగా ఆరోగ్యవంతుల్ని చేస్తుంది. ప్రతి మానవుడికీ హృదయార్ద్రతతో పెనవేసుకొనే ఆత్మీయు డొక్కవ్యక్తి వుంటేచాలు. జీవితంలో ఎన్ని కష్టాలు ఆపదలు వచ్చినా అతను ఆశాపూరితుడై ముందుకు పోతాడు. సిరిసంపదలు, సౌందర్యం కంటె హృదయ సమ్మేళనమే ఆనంద దాయకమైనది."

అతను యిలా చెబుతూ వుంటే ఆమె విప్పారిన మొహంతో ప్రకాశవంతమైన దృక్కులతో అతని వైపు చూస్తూ వుంది. అతను అన్ని విధాలా తనకు తగినవాడని అంతరాంతరాలలోనుంచి ఏదో వాణి చెబుతూ వుంది. కాని తమ కలయిక అంత సులభ సాధ్యమా అని కూడా ఆమెకు సందేహం రాకపోలేదు అయితే ఆ సందేహం క్షణికం మాత్రమే. అతనిపై ఆమెకు స్థిరపడిన విశ్వాసం ముందు మరే ఆలోచనలు నిలువలేక పోతున్నవి.

ఇద్దరి మధ్య గంభీరమైన నిశ్శబ్దం. ఇద్దరి హృదయాలు మాత్రం నిశ్చలమై ప్రశాంత మయ్యాయి. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ నాలుగుగంటలు వినపడ్డాయి ఆమె తేరుకొని "ప్రసాద్ రైలు వేళయింది. ప్రయాణానికి సిద్ధంకావూ?" అంది.

అతను ఆమె కళ్ళల్లోకి చూశాడు. సిగ్గుతో ఆమె చెంపలు జాలువారాయి ఆమె మందస్మిత వదనం సమ్మోహనంగా వుంది. ఈ పర్యాయం ఆమెలోని అందాలనే అతను పరిశీలనగా చూశాడు. సిగ్గుతో ఆమె ముఖం ప్రక్కకు తిప్పుకొని మళ్ళీ అతన్ని ఓరగా చూసింది.

అతను చిరునవ్వుతో "ఈ పూట ప్రయాణం మానుకుంటున్నా ఇందిరా!" అన్నాడు.

"మరి రాత్రి ఇవాళే వెళ్ళాలన్నావు కదూ?" కుతూహలంగా అడిగిందామె.

"అవును వెళ్ళాలనుకున్నాను. కాని పడలేదు. నిద్రాభంగమే కలిగింది. ఇక ప్రయాణం భంగపడదా? ఉదయం మీ నాన్నగారితో మాట్లాడి ఏ విషయమూ ఖాయ పరచుకొని మరీ వెళతాను" అన్నాడు అతను ధైర్యంగా.

ఇందిర సన్నని చిరునవ్వుతో అతన్ని చూసింది. అతనామెకు దగ్గరగా వచ్చాడు. గది తలుపుతీసి ఇద్దరూ బైటికొచ్చి మెట్లవైపుకు దారితీస్తూ వుంటే ఉదయ రేఖలు అప్పుడే నలుదిక్కులా ప్రసరిస్తున్నాయి. ఇద్దరూ చెట్టాపట్టాలు పట్టుకొని ఆ కొత్త వెలుగులోకి అడుగుపెట్టారు.

● ప్రచురణ, 1964 ●

# 24. చెప్పులు

♦ కవుటూరు వెంకట నారాయణరావు ♦

రెండు పాత చెప్పులు గిరవాటుగా కిందపడ్డాయి రపీమని శబ్దం చేస్తూ.

చెప్పులు కుడుతూన్న రంగయ్య తల ఎత్తి చూశాడు. అతని కాలిబొటన వేలికింద ఓ చెప్పు అదిమిపెట్టి ఉంది. చెప్పులోకి సగం సూది దిగి ఉంది. వేలితో లాగుతున్న దారం, దారపు ఉండ మెల్లిగా కదులుతున్నాయి. సాగుతూన్న పని ఆగిపోయింది. ఆ సంవత్సరమే బళ్ళో చేరిన ఎనిమిదేళ్ళ కొడుకు రమణ అగుపించాడు.

యాడివిరా యియి రవణా ముఖం చిట్లించి చూస్తూ అడిగాడు రంగయ్య.

భుజానికి తగిలించుకుని వున్న పుస్తకాల సంచీ చేతికీ తీసుకున్నాడు రమణ. సంచిలో పలకా బలపం, ఒకటో తరగతి తెలుగు పుస్తకం, ఎక్కాల పుస్తకం వున్నాయి. అన్నీ వాడికి ఎవరో ఒకరు దానం చేసినవే.

నేలమీద కాలిబొటన వేలితో గుండ్రాలు గీస్తూ మా అయ్యోరియి.. పంతులు గారియి.. బాగసేసి వెంటనే తెమ్మన్నాడు అన్నాడు రవణ.

రంగయ్య ముఖం విప్పారింది. ముసలితనానికి చిహ్నంగా వున్న అందులోని ముడతలు విచ్చుకున్నాయి. 'పంతులుగారియా? మరిసెప్పవేంరా? అని చెప్పులను చేతికి తీసుకుని చూచి మీ అయ్యోరికి ఇట్లాంటి సెప్పులేడయిరా? తాత ముత్తాతల్నాటియి లాగన్నాయే' అన్నాడు.

ఏవో నాకు తెలవదు! అన్నాడు రవణ. వాడికి అక్కడ ఉండను బుద్ధిపుట్టలేదు.

ఆ చెప్పులు బాగు చెయ్యను వీలులేనంతగా పాలిపోయి వున్నాయి. తోలు పూర్తిగా అరిగిపోయి ఉంది. లోపలి అట్టలు బయటపడి వున్న ఎముకలతో పోటీచేస్తూ కుట్లు పూర్తిగా తెగి వున్నాయి.

పక్కన్నే ఉన్న డబ్బాలోని నీళ్ళతో చెప్పుల్ని తడిపి ఈ సెప్పుల్ని బాగు సేసేదానికన్నా కొత్త సెప్పుల్ని కుట్టడం సులభం రమణా అన్నాడు రంగయ్య.

"అయ్యోరొద్దన్నాడు నాయనా. ఈట్నే బాగాసేసి తెమ్మన్నాడు. యిప్పుడే గావలంట" అన్నాడు రవణ.

వాడి దృష్టి దుమ్ములేపుకుంటూ వెళ్ళిన నల్లటికారుమీద పడ్డది. రంగయ్య మాత్రం చెప్పులను పరిశీలనగా చూస్తూ కూర్చున్నాడు. అతనికి తలవంచుకుని చెప్పులు కుట్టడం తప్ప మరొక ప్రపంచం తెలీదు. అదే చోటున కూర్చుని యాభై

సంవత్సరాలకు పైనే గడిపాడు. లోకంలో ఎన్నో మార్పులు జరిగాయి కానీ అతని జీవితంలో మటుకు ఏ మార్పూ రాలేదు.

"యీలుగాదురా. సందేలకైతే ఊరు సరేలే నేనేదో ఒకటి సేత్తా బడిగొల్డి వొచ్చా సెప్పుమంటా?" అని కొడుకువైపు అనుమానంగా చూశాడు రంగయ్య.

ఉహూ ఒంటేలు గంట కొడితే వచ్చా

సరేలే ఎల్లు!

రవణ కదల్లేదు. నాన్నా..నాయన్నా.. నాన్నా! అని నసిగాడు.

"ఏరా."

నాయనో! మరలా నసిగాడు రవణ.

"ఏరా ఏం గావాల?" విసుక్కుని కొడుకుని చూశాడు రంగయ్య.

కొడుకు వాలకం అర్థమయింది రంగయ్యకు నవ్వుకున్నాడు ఈ కాలం డబ్బుతో అవసరం లేనిదెవరి కనుకుంటూ.

అయిదుగురిని పోగొట్టుకున్న తరువాత కలిగినవాడు రమణ వాడు పుట్టి పుట్టడం తోటే వాడి తల్లిపోయింది. అప్పటినుంచి గారాబంగా సాకుతున్నాడువాణ్ణి రంగయ్య. వాణ్ణి ఏమనాలన్నా మనసురాదు.

డబ్బులు గావాలంట్రా?

ఆశగా తలాడించాడు రవణ అవునన్నట్లు

జేబులోంచి చిల్లర తీసి అందులోంచి అయిదు పైసల బిళ్ళ అందుకుని తిరిగి చిల్లర జేబులో పోసుకున్నాడు రంగయ్య.

రవణ దృష్టి ఆ అయిదుపైసల బిళ్ళ మీద నిలిచిపోయింది ఆత్రంగా చూడ సాగాడు. ప్రపంచమంతా వాడి కదిగానే అగుపించసాగింది. ఉండబట్టలేక చివాలున ఆ అయిదు పైసల బిళ్ళ తండ్రిచేతిలోనుంచి లాక్కుని పరిగెత్తాడు వస్తా నాన్నా అంటూ.

రవణా..రేయ్ కేకేశాడు రంగయ్య వాడు వినిపించుకోలేదు. వాడి ఆనందం వాడిది. పిల్లవాడి చేతిలో పైసా పెడితే ఆ తల్లి ఒడికంటే ఎక్కువ ఆనందాన్ని ఇస్తుందేమో.

కొడుకు వెళ్ళినవైపు చూస్తూ స్తంభించిన రంగయ్య కాసేపటికి తేరుకుని నవ్వుకున్నాడు. నాకు కూడా ఒక కొడుకున్నాడని అందరి పిల్లల్లాగా కాకుండా చదువు కుంటున్నాడనీ గర్వంతో అదోలా చూచాడు. ఆ గర్వం అతని మనసుని కరిగించి వేసింది. కరిగిన మనసు ఆనంద బాష్పాలుగా బుగ్గలమీదినుండి జారిపోయింది. ఆశలన్నీ రవణమీదే పెట్టుకున్న రంగయ్యకు. వాడు బాగా చదువుకోవాలని, గొప్పవాడు కావాలని తప్ప మరొకటి లేదు. వాడు సాటికులంలోని ఇతర పిల్లల్లా దేనికీ కాకుండా పోగూడదు.

అదృష్టంకొద్దీ రవణకి తన ఇంట్లోనే అన్నం పెట్టి చదివిస్తున్నాడు పంతులుగారు. ఆయన ఋణం తీర్చుకుంటే తీరేది కాదు

రంగయ్య హృదయం కృతజ్ఞతలతో నిండిపోయింది. వీధి బడి నడుపుతున్న పంతులుగారు కళ్ళ ముందు మెదిలాడు. ఆయన, ఆయన తెల్లటిదేహం, నడి నెత్తిన పండిన పిలక ముఖాన విభూతిరేఖలు, చందనపు బొట్టు, గోచిపోసి కట్టిన నీరుకాని పంచ పైన ఖద్దరు శాలువ

ఓ సారి వెళ్ళి ఆయన కాళ్లమీద పడి మొక్కిరావాలనిపించింది రంగయ్యకు. అంతేకాదు రవణ బళ్ళో చేరినప్పటినుంచి వాడెలా చదువుకుంటున్నాడో చూడాలనే ఆశా ఉంది. ఒక్కసారి ఆ వైపు వెళ్ళితే ఆ రెండు కోరికలూ తీరతాయి.

పక్కన్నే ఉన్న టీ బంకు నుంచి సిలోన్ పాటలు వినవస్తున్నాయి. అటువైపు చూశాడు రంగయ్య. కళాత్మకంగా టీ కలుపుతున్నాడు. పులిచారల బనీను తొడిగి వున్న ఓ యువకుడు. అతన్ని చూసి సింగిలు టీ, అన్నాడు రంగయ్య.

టీ వచ్చేలోపల ఓ రూపాయల డబ్బుల బేరాలు వచ్చాయి. బూట్లు పాలిష్ చెయ్యాలి. సైకిల్ టైరు కుట్టాలి. చెప్పులు బాగు చెయ్యాలి. లాడాలు కొట్టాలి!

ఓ అయిదునిమిషాలు తీరిగ్గా కూర్చుని టీని ఆర్చుకుంటూ తాగి, ఆ గ్లాసులో ఏడు పైసలు వేశాడు రంగయ్య. ఓ కుర్రవాడు వచ్చి గ్లాసు తీసుకుని టీ బంకులోకి వెళ్లాడు

వచ్చినవారి పనులన్నీ చెయ్యను అరగంటపైనే పట్టింది రంగయ్యకు. ఆ తరువాత ఒక పక్కన పెట్టి ఉన్న పంతులుగారి చెప్పులను అందుకున్నాడు. అవి సాధారణమైన చెప్పులే అయినా పంతులుగారివి కావడం వల్ల మహిమాన్వితంగా అగుపించాయి. వాటిని కళ్ళకద్దుకుని యీట్ని బాగు సేత్తాను. కొత్త సెప్పులు కుట్టిత్తాను!!' అనుకున్నాడు రంగయ్య.

వెంటనే బడి దగ్గరికి బయలుదేరాడు, ఆ చెప్పులను ఇతర సరంజామాను సంచిలో దాచి ఒక పక్కన పెట్టి.

మెల్లిగా కూచున్న చోటినుంచి లేచిన రంగయ్య చేతికి బనీను జేబులోని చిల్లర తగిలింది. వెంటనే ఆ చిల్లర అంతా బయటికి తీసి జాగ్రత్తగా లెక్కపెట్టుకున్నాడు. మొత్తం ఆరు రూపాయలా ఇరవై పైసలు. అతని పెదవుల సందున ఆనందం తాండవించింది. అది నిన్నటి కష్టార్జితం.

కాస్త వంగిన నడుము పట్టుకుని ఉత్సాహంగా ముందుకు సాగాడు రంగయ్య. పక్క వీధిలో వున్న బడిదగ్గరగాని ఆగలేదు.

అదొక చిన్న పెంకుటిల్లు. ముందు ఇరువైపులా అరుగులున్నాయి. అరుగుల మీద కూడా బడి సాగుతూంది. ఇద్దరు ఉపాధ్యాయులు చెరొక అరుగు మీద కూర్చుని పాఠాలు చెబుతున్నారు.

పంతులుగారు ఎక్కడున్నారోననే అనుమానం వేసింది రంగయ్యకు నేరుగా లోపలికి వెళ్ళి చూడను ధైర్యం చాలలేదు. అక్కడే నిలబడిపోయాడు

ఒక ఉపాధ్యాయుడు పిల్లలచేత ఏదో వల్లె వేయిస్తున్నాడు. అతనొక మారు చెబితే పిల్లలంతా కలిసి మళ్ళీ చెబుతున్నారు. ఆ ముక్త కంఠంలోంచి వెలువడుతున్న ధ్వని సంగీత సౌందర్యాన్ని వెదజల్లుతూ, రంగయ్యకు గంభీరంగానూ, మధురంగానూ వినిపించింది. కాస్సేపు తన్మయత్వం చెందాడు.

రెండు మూడు నిమిషాలు గడిచాయి. కాలం క్షణక్షణం సాగుతుంటే తన కొడుకెలా చదువుకుంటున్నాడో చూడాలనే ఆశ, ఆశతోపాటు ఆత్రం ఒకదాన్ని ఒకటి తరుముకు పోసాగాయి. లోపలికి వెళ్ళి చూచే ధైర్యం లేకపోయినా తెగించి అరుగుల నడుమ ఉన్న మెట్లెక్కుతూ ఆగిపోయాడు రంగయ్య.

"ఎవరండి మీరు? ఎవరు కావాలి? ఒక ఉపాధ్యాయుని కంఠం వినిపించింది.

రంగయ్య వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. చెయ్యగూడని పనిచేస్తున్నా నేమోననే భయం గూడా కలిగింది.

మా నేను అదే మా రవణ్ణి చూడాలని నా కొడుకు తడబడ్డాడు రంగయ్య.

మీ అబ్బాయిని చూడాలా.

ఆఁ.

ఏ తరగతి?

ఒకటి! వేలెత్తి చూపాడు రంగయ్య.

అయితే నేరుగా సందులోకి వెళ్లండి. వసారాలో ఉందా తరగలి' అన్నాడు ఉపాధ్యాయుడు.

ఏదో గండం గడిచినట్లు భావించాడు రంగయ్య. నేరుగా సందులోకి వెళ్లగానే తలెత్తి చూడలేదు. ఎదురుగా వున్న వసారాలో అందరి పిల్లలతోపాటు కూర్చుని గుణింతం చెబుతున్న రవణ అగుపించాడు. పలకా బలపం పట్టుకుని అక్షరం ముక్క నేర్చుకునే అదృష్టం తనకు లేకపోయినా, తన కొడుకు చదువుకుంటున్నాడు.

రంగయ్య ఆనందం పట్టపగ్గాలే లేకుండాపోయింది.

పంతులుగారు ఓ స్టూలుమీద కూర్చుని పిల్లల చేత మాటలు పలికిస్తున్నారు ఆయన చేతిలో పెద్దబాల శిక్ష ఉంది.

మ. న కు..మ ఒత్తిస్తే న్మధుడు మన్మధుడు.

పలుకుతూన్న రవణ తలతిప్పి చూశాడు. తండ్రి అగుపించాడు. వెంటనే నాయనో నాన్నో అన్నాడు.

పంతులుగారు అటువైపు చూశారు. రంగయ్య చేతులు కట్టుకుని అణిగి మణిగి నిలబడి వున్నాడు. ఆయన లేచివచ్చి "రంగయ్యా బాగున్నావా? ఎంతసేపయింది వచ్చి? అని అడిగాడు.

ఇప్పుడే ఒచ్చానయ్యగారూ. మా రవణ్ణి సూడాలనిపించింది ఒచ్చా! అన్నాడు రంగయ్య.

"దానికేం అడుగో రవణ, రారా"

ఒద్దులెండి అయ్యగారో సదువుకోనియ్యండి.

ఊఁ మా బడి అంతా చూపుతారా.

ఎందుకు లెండయ్యగారో! మాఓడు బాగా సదువుకుంటున్నాడా

"దర్జాగా ఏవో< అనుకున్నానుగానీ అసాధ్యుడే. అప్పుడే పెద్ద బాలశిక్ష చదివేస్తున్నాడు" అని తనచేతిలోని పుస్తకం చూపాడు పంతులు.

నిజంగానా అయ్యగారో ఇంత పెద్ద పుస్తకవే ననుకొలేది ఇదే. నా సెర్మం ఒలిసి మీకు సెప్పులు కుట్టిచ్చినా మీ ఋణం తీరదు అని చివాలున వంగి ఆయన పాదాలు పట్టుకుని ఓణ్ణి బాగా సదవెయ్యండయ్యగారో! అన్నాడు రంగయ్య.

రంగయ్య అలా కాళ్ళమీద పడతాడని పంతులు గారనుకోలేదు. పిల్లలు, రవణ అదంతా ఏమిటో వింతగా చూస్తుంటే అబ్బే! ఇదేంటి రంగయ్యా! ఎవరన్నా చూస్తే బాగుండదు. రవణకేం బాగా చదువుకుని రేపీపాటికి గొప్పవాడవుతాడు. నిన్ను కారులో కూర్చోబెట్టి తిప్పగలడు!! అన్నారు పంతులుగారు.

అంత అదుట్టం గూడానా! అని ముకుళిత హస్తాలతో లేచి "మీ సెప్పుల్ని సందేళకు బాగా సేసి పంపిత్తా" అన్నాడు రంగయ్య

అలాగేలే కాని సాయంత్రం నేనుండను. రేపు ఉదయాన్నే పంపు.

నేనే కొత్త కొత్తానయ్యాగారో

మంచిది. ఇకనువ్వు వెళ్ళు రవణ నీ కొడుకు గాదు, నా కొడుకనుకో! వాడి దిగులు నీకక్కర్లేదు.

ఆ మాటలు అమృతతుల్యంగా తోచాయి రంగయ్యకు. జేబులోనుంచి నాలుగు రూపాయాలు తీసి పంతులుగారి చేతిలో ఉంచాడు. ఆయన వాటిని చూస్తూ మొన్నటికి సరిగ్గా రెండు వందల రూపాయలు. దీంతో రెండు వందలా నాలుగు. ఇలా కూడబెట్టి ఏం చెయ్యాలని అన్నాడు.

మీ ఇట్టం వచ్చినట్టు సెయ్యండి. వత్తా.

ఇంకొక్క క్షణం అక్కడాగలేదు రంగయ్య. సంతోషం దోవ చూపుతుంటే వత్తారా రవణా అని కొడుక్కి చెప్పి చరచరా వీధిలోకి వచ్చి నిలబడి, మరో మారు ఆ బడివైపు చూచాడు. అదొక స్వర్గధామంలా అగుపించింది. తనకంటే తన కొడుకు అదృష్టవంతుడనుకున్నాడు.

అనుకున్న ఆశ తీరడంతో తృప్తి పడ్డ రంగయ్య ముందుకు సాగిపోతూ ఆగి అరుగుమీద వున్న ఉపాధ్యాయుని దగ్గరికి వెళ్ళాడు.

అతన్ని చూచి ఆ ఉపాధ్యాయుడు ఏమండీ మీ అబ్బాయిని చూచారా అని అడిగాడు.

"ఆ నాదో సిన్ని సందేగం" వినయంగా అడిగాడు రంగయ్య.

చెప్పండి.

నేను సదువుకోవచ్చా?

ఎందుకు చదువుకోకూడదు అన్నాడు. అంత వయసులో ఉన్న అతనికి ఆ ఆశ కలిగినందుకు ఆశ్చర్యపడుతూ ఉపాధ్యాయుడు.

మరి రేపటి నుంచి నేనూ ఇక్కడ కాసేపు కూకుని పోతా. పలకా బలపం కొనుక్కు రమ్మంటారా? అక్కడ కూకుంటే మా రవణ నను సూసి బెదిరిపోతాడు అన్నాడు రంగయ్య.

అతని అమాయకత్వానికి ఉపాధ్యాయుడు నవ్వి మీకు చదువు చెప్పను వయోజన పాఠశాలలున్నాయి. అంటే రాత్రి బళ్ళన్నమాట. అందులో వెళ్ళి చేరండి అన్నాడు.

అయ్యేంటో నాకు తెలవదే.

మరేం పరవాలేదు. రేపు సాయంత్రం ఇక్కడకు రండి. నేనే ఆ బడిలో మిమ్మల్ని చేర్పిస్తాను.

తప్పకుండా ఒత్తా నయ్యగారో! మీరు నాకా సగాయం సేశారా మీకు సెప్పులు కుట్టిత్తా దణ్ణాలు ఒత్తా!

ఆఁ.

రంగయ్య సంబరపడిపోయాడు. తనూ వ్రాయనూ చదవనూ నేర్చుకున్నాడంటే తన కులంలోని వాళ్ళందరూ ఆశ్చర్యపడిపోతారు. ఆఁ అయినా తనకు చదువెందుకు? ...ఛీ..ఛీ.. అదేంటి అందరూ చదువుకోవలసిందే చదువుకు వయస్సు భేదం లేదు.. రవణలాగా తనూ!

ఎన్నో ఆలోచనలు! నడుం వంచి నడుస్తున్న రంగయ్యకు తనకంటే తన కొడుకు భవిష్యత్తు ఆనందదాయకంగా తోచింది. వాడు ముసుముందు పొందబోయే గౌరవాన్ని తలుచుకుని ఉబ్బిబ్బయ్యాడు. వచ్చే సంవత్సరం రెండు.. ఆ పైన మూడు.. నాలుగు.. అయిదు!

అలా అలా పెద్ద చదువు చదివేస్తాడు.

నిజమే! పంతులుగారన్నట్టు రేపీ పాటికి రవణ గొప్పవాడైపోతాడు.

టీ బంకు చేరుకోవడంతోటే తన సంచి తీసుకుని ఇంటికి బయలుదేరాడు రంగయ్య. ప్లాట్‌ఫారం మీద నడస్తూ మురికి కాలవ వంతెన దాటి, సినిమాహాలు ముందున్న గుడిసెలు చేరుకున్నాడు.

ఎటువైపు చూచినా టైర్లు, తోళ్ళు, చెప్పులు. వాటిలాగే అక్కడి మనుషులూను. ప్రతి వ్యక్తికీ తాగడంలో ఉన్న నేర్పు మరి దేనిలోనూ అగుపించదు. వాళ్ళల్లో రంగయ్యేగానీ, రంగయ్య వాళ్లల్లోవాడు గాడు.

మలుపు కాలవగట్టునే ఉంది రంగయ్య ఇల్లు. మూడు దూలాల పూరిపాక, ఆ గుడిసెల కది భవంతి. అతని ఆస్తి అంతా అదే!

అక్కడ ముగ్గులు పెట్టి ఉన్న అరుగుమీద కూర్చున్నాడు రంగయ్య ఉసూరుమంటూ. అతని భుజం నుండి సంచి దానంతటదే జారిపడ్డది. వయస్సు మళ్లేకొద్దీ రంగయ్యలో జవసత్వాలుడిగిపోతూన్నాయి. కొడుకును పైకి తీసుకురావాలనే ఆశ తప్ప మరేదీ అతన్ని నడిపించడం లేదు.

ఆ కాస్తదూరం ఎండలో నడిచేసరికి తల దిమ్మెక్కిపోయింది. కాసేపు సేద తీర్చుకుని తల పైకెత్తి చూచి కాలాన్ని కొలుచుకున్నాడు. పన్నెండు గటంలు కావస్తూంది. మెల్లిగా లేచి లోపలికి వెళ్లి కుండలో ఉన్న మంచినీళ్ళు ముంతతో తీసుకుని తాగి బయటికి రాబోతూ ఆగిపోయాడు.

ఎదురుగా గోడకు వెంకటేశ్వరస్వామి పటం వేలాడదీసి ఉంది. దాన్ని చూస్తూనే చేతులెత్తి నమస్కరించి, సావే నాకొడుకుని బాగా సదియించు. ఓణ్ణి నీ కొండెక్కించి ఎంటికిలిప్పిస్తా. నే ఇత్తా అని మొక్కుకున్నాడు.

దేవుడంటే రంగయ్యకున్నంత నమ్మకం మరెవ్వరికీ ఉండదేమో!

బయటికి వచ్చి తిరిగి అరుగుమీద కూర్చున్నాడు. కొందరు పిల్లలు సర్వ దుర్గంధానికి అలవాలంగా వున్న కాలవ నీటిలో మునుగుతున్నారు. ఆడవాళ్ళు కొందరు గుడ్డలు ఉతుక్కుంటున్నారు.

రంగయ్య మనసు పంతులుగారి చెప్పుల మీద పడ్డది. వెంటనే సంచిలోనుంచి పంతులుగారి పాత చెప్పులను బయటికి తీశాడు. వాటిని కొత్త చెప్పుల్లా తయారు చెయ్యాలి. తనే స్వయంగా ఆయన కాళ్ళకు తొడగాలి. అంతకంటే గొప్ప పని మరి తను చెయ్యలేదు.

"మావోఁ" ఎవరిదో పిలుపు వినిపించింది.

తలెత్తిచూచాడు రంగయ్య. పదేళ్ళ పిల్ల కుళ్లిపోయిన మామిడి పండు తింటూ అగుపించింది.

ఏఁయేఁపోలే

మా యమ్మకు ఒళ్లు బాగా లేదంట. ఇయ్యాల కూడు నిన్నే ఒండుకోమంది!

రంగయ్య నిట్టూర్చాడు. సరేలేయే. అవునుగానీ మీ యమ్మ కేయే!

ఏవో నాకు తెలవదు మావా తలనొప్పంట.

అవున్లేయే. కడుపుతో ఉండ్లా. జాగర్తగా ఉండమను. పో!

ఆ పిల్ల వెళ్ళిపోయింది.

రంగయ్య సంచిలోని సామానులు ముందువేసుకుని పంతులుగారి చెప్పులు బాగు చెయ్యను పూనుకున్నాడు. ఓపిగ్గా వాటిని కుట్టి, మళ్ళీ కొత్త చెప్పుల్లా చెయ్యను గంటసేపు పట్టింది మెల్లిగా చేసేసరికి. పాలిష్ చేసి ఒక పక్కన పెట్టి వాటి అందాన్ని కొలుచుకున్నాడు. బాగా అగుపించాయి. అవును మరి! చెప్పులు కుట్టడంలోగాని, బాగు చెయ్యడంలో గానీ ఆ ఊళ్ళో రంగయ్యను కొట్టే చెయ్యలేదు.

బాగు చేసిన చెప్పుల్ని లోపలికి తీసుకువెళ్ళి అటకమీద ఉంచాడు. ఉన్నట్లుండి ఆకలి అతన్ని దహించి వేసింది. తలుపుదగ్గరికి లాగి, నేరుగా రోడ్డుమీదికి వచ్చాడు.

కొళాయి పక్కనే ప్లాట్‌ఫారం హోటలుంది.

ఓ ఆడమనిషి పెద్ద బుట్టనిండా అన్నం, కుండలో పులుసు, టిఫిన్ బాక్స్‌లో మజ్జిగ పెట్టుకుని ఉంది. నలుగురు రిక్షావాళ్ళు ఆమె చుట్టూరా కూర్చుని అన్నం తింటున్నారు.

రంగయ్య కొళాయి దగ్గరికి వెళ్ళి కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కున్నాడు. బనీను కొసలతో తుడుచుకుంటూ వెళ్ళి ఏయే గంగా ఇయ్యాల కూట్లోకేంచేశావ్ అని అడుగుతూ ఆమె పక్కన కూర్చున్నాడు.

మునక్కాయ పులుసూ, గోగాకుపచ్చడీ...కూకో! అంది గంగ.

సాల్లేయే.. ఓ ఇస్తరాకిట్టా పడేయ్!

కూకో మావాఁ నే పెడతాను! అని గంగ పక్కన్నే ఉన్న విస్తరాకు అందుకుంది.

రంగయ్య ఓపికగా కూర్చున్నాడు. గంగ బుట్టమీద వున్న గుడ్డ తొలగించి అందు సగం వరకూ ఉన్న అన్నాన్ని టెంకాయ చిప్పతో మూడు మూర్లు కొలిచి పెట్టి రంగయ్యముందు ఉంచి పచ్చడా? పులుసా? అంది.

"పచ్చడెయ్యే."

గంగ అటకలో ఉన్నపచ్చడి తీసి అన్నంమీద పెట్టింది.

రంగయ్య ఆ అన్నానికి నమస్కరించి తిననారంభించాడు. గంగతో మాట్లాడుతూ ఏయేఁ గంగా యాపారమెట్టాగుందే?

ఊఁ మంచి బియ్యం ధర రూపాయైపోయింది మావాఁ. గిట్టుబాటు గాడంలేదు. రేపట్నుంచీ పైన ముప్పయిదు పైసలు వెయ్యాలనుకుంటుందా!

సేసెయ్యే సేసెయ్. సెయ్. నీదేంపోయింది. ఊఁ పులుసెయ్!

గంగ రెండు గరిటెలు పులుసు పోసింది. అన్నం అంతా దాంతోటే తిని మజ్జిగ తాగి ఒక చిన్న త్రేపు తేపాడు. వేళ్ళను చీకుతూ కొళాయి దగ్గరికి వెళ్ళి చేతులు కడుక్కుని పక్కన్నే ఉన్న గంగరావి చెట్టుకింద సేదదీర్చుకోను కూర్చున్నాడు. అలాగే కునుకు పట్టింది. మగతగా నేలమీద వాలి నిద్రపోయాడు.

ఏంతసేపు నిద్రపోయాడో రంగయ్యకే తెలియదు. ఎవరో తట్టి లేపితే ఉలిక్కిపడి లేచి "ఏరా నారిగా, ఏంటి? అన్నాడు.

గుడిసెలు అంటుకున్నాయి తాతా! లేచిరా! అని నారిగాడు పరిగెత్తాడు.

రంగయ్య గుండెలు? ఝల్లుమన్నాయి. సినిమాహాలు వైపున పొగ ఆకాశన్నంటు తూంది. చివాలున లేచి పరుగెత్తినట్టు నడవసాగాడు.

అప్పటికి నాలుగు గంటలవుతుంది. ఎక్కడ నిప్పుపడ్డదో ఎవ్వరికీ తెలియదు. మొత్తంమీద గుడిసెలన్నీ అంటుకుని మండుతున్నాయి. మంటలు ఆకాశాన్ని చుంబిస్తున్నాయి. ఏడ్పులూ పెడబొబ్బలూ తప్ప మరేమీ వినపించడం లేదు. ఎవ్వరూ ఏదీ రక్షించుకోలేకపోతున్నారు. టైర్లు అంటుకుని పొగంతా టైర్ల వాసన కొట్టసాగింది. ధైర్యం వున్నవాళ్ళు మంటల్లో మండుతున్న టైర్లను కాలవలోకి దొర్లిస్తున్నారు. మంటలకు తోడు గాలి రివ్వున వీస్తూంది. ఎవ్వరూ సాహసించి ముందు అడుగు వెయ్యడం లేదు.

రంగయ్య రొప్పుతూ రోజుతూ వచ్చిన తన ఇంటివైపు చూచాడు. కప్పు పూర్తిగా అంటుకుంది. మంటల సెగ ముఖానికి కొడుతూంది.

పంతులుగారి చెప్పులు లోపలున్నాయి. రంగయ్య మనసు వాటికోసం తపించ సాగింది పక్కనే ఉన్న యువకుణ్ణి చూచి అబ్బయ్యా లోపలికెళ్ళి అటకమీద సెప్పులున్నాయి మా పంతులుగారియి లాక్కొస్తా నీకెంత డబ్బులుగావాలంటే అంతా ఇత్తా! అన్నాడు

నీ కేవన్నా పిచ్చిపట్టిందా తాతా. సెప్పులకేంగాని ముందు నీసామాన్లు బయటేయించు అన్నాడతను.

రంగయ్యకు మనస్సుండబట్టలేదు. ఆ ఇంట్లో ఉన్న అమూల్యమైన వస్తువల్లా పంతులుగారి చెప్పులే. అవి కాలేదాని కన్నా తను కాలడం మంచిది.

ఏదో ఆవేశం రంగయ్యను లోగొంది. చెప్పులేగదా. అంతకంటే మంచివి కుట్టివ్వవచ్చు లెమ్మనుకోలేదు. ఆ ఆలోచన రాలేదు రంగయ్యకు. ఒక్కసారి బలాన్నంతా కేంద్రీకరింపచేసి చరచరా కాలుతున్న ఇంట్లోకి అడుగుపెట్టాడు తలుపు ఎగిసి తన్నుతూ.

అప్పుడే ఫైర్ ఇంజన్ గంట వినిపించింది. ఎంతకూ రంగయ్య మటుకు బయటికి రాలేదు ఫైర్ ఇంజన్ సిద్ధమైన నీళ్ళు కొట్టను మొదలుపెట్టింది. ముందుగా రంగయ్య ఇంటినే ఆర్పింది. నలుగురు లోపల అడుగుపెట్టారు. అక్కడ అగుపించిన దృశ్యం వాళ్ళను భయకంపితులను చేసింది. రంగయ్య బోర్లా పడి ఉన్నాడు. పై భాగం అంతా పూర్తిగా కాలిపోయి ఉంది. చర్మం కుతకుతలాడుతుంది. రంగయ్య కాలిపోయాడు. అందరికీ ఆ విషయం తెలిసింది. పరిగెత్తివచ్చి మొండిగోడల ముందు చేరిపోయారు. నలుగురు దగ్గరికి వెళ్ళి మెల్లగా రంగయ్యను లేవదీశారు.

పంతులుగారి చెప్పులు రెండు చెక్కుచెదరకుండా రంగయ్య పొట్టలో దాగి వున్నాయి. రంగయ్యలోని ప్రాణాలు పైకి లేచిపోవడం ఆ చెప్పులు తప్ప మరెవ్వరూ చూచి ఉండలేరేమో!

● ఆంధ్రప్రభ వీక్లీ - 13 ఆగస్టు, 1967 ●

# 25. ఆశాభంగం

♦ ఓటుకూరు రంగారావు ♦

ఉదయం మంచి ఘాటైన గరంగరం టీని ఇడ్లీ అనే ఘన పదార్థంతో సహా కడుపులోకి పంపించాను. ఒళ్ళూ మనస్సూ అంతా బలే ఉత్సాహంగా ఉండి ఏం చేయాలా అనిపించింది. ఏమీ పని తోచనప్పుడల్లా ఆలోచించడం, రాయడమే నాకు పని. ఊహలమీద ఊహలు, ఆలోచనలు దండలు దండలుగా, తెరలు తెరలుగా, వస్తూంటే మనస్సు మత్తెక్కి పోతోంటే, అనిర్వచనీయమైన ఆనందం అనుభవిస్తూ, ఎక్కడకో తేలిపోవడం అందరికీ సాధ్యంకాదు.

అన్నయ్యకి నిన్న అమాంతం పెరాలిసిస్ వచ్చేసిందనీ దాంతో పాటు స్మృతిలేకుండా పడిపోయాడనీ, డాక్టర్లు పెదవి విరిచారనీ వున్న పళంగా బయలుదేరి రమ్మనీ వరంగల్ నుంచి "సుజాత" యిచ్చిన టెలిగ్రాం అది..

వెంకోబారావుని నేచూడక దాదాపు ఏడెనిమిది నెలలు కావస్తోంది. ఇంతలోనే వాడికిలా ప్రమాదంగా జబ్బు ముంచుకొచ్చిందని తెలియడంతోటే నాకెందుకో ఓసారి కళ్లు చెమ్మగిల్లాయి. తల్లీ దండ్రీ నశించి, స్వయంశక్తిమీద ఉద్యోగం సంపాదించుకుని ఎక్కడో జీవితం సాఫీగా వెళ్ళదీస్తూ చెల్లెలికి చదువు చెప్పించుకుంటూ తృప్తిపడే వాడిమీద యీ పిట్ట పిడుగేమిటి? పాపం, సుజాత ఎలావుందో, ఎంత బేజారవు తుందో.. వాడికి నేనొక్కణ్ణే తప్ప చిన్నప్పటినుంచి తెలిసిన ఆప్తమిత్రు డింకెవ్వడూ లేడు.

వెంకోబారావుకీ నాకూ చిన్నతనం నుంచీ స్నేహితం. వాళ్ళనాన్న సంపాదించి పోయిందేమీ లేదు - దరిద్రం తప్ప. ఎలాగో పెరిగి పెద్దవాడై ఇవాళ ఉద్యోగం చేసుకుంటున్నాడు. అది వరకు వాళ్లింటికి నేనూ మా యింటికి వాడు వస్తూ పోతుండే వాళ్లం. వాడు అప్పుడప్పుడు చేసే చిలిపిచేష్టలకీ అబద్ధాల ప్రచారానికీ కోపం వచ్చి వాడికి నేను "కోతి" అనే బిరుదిచ్చాను. పెద్దయిందాకా చాలామంది మిత్రులు వాణ్ణదే పేరుతో పిలిచి ఏడిపించుకు తినేవాళ్ళు. సుజాత మాంచి అందమైన చలాకీ పిల్ల... బహుశా ఇప్పుడు స్కూల్ ఫైనల్ చదువుతుంటుంది.. దాన్ని చిన్నప్పుడు నానారకాలుగా ఆడించి కోపం తెప్పించేవాణ్ణి.. సుజాతంటే నా కెందుకో మంచి అభిమానం వుందీ నాటికీని.

వెంకోబారావుకి పట్టిన దురవస్థకి దురపిల్లి పోయానంటే నమ్మండి. ఏం చేయాలి అనే నిర్ణయం కోసం తటపటాయింపు వదిలి, ఇంకో అర్ధగంటలో బయల్దేరబోయే బండికి తయారయాను.

ఆఫీసుకు సెలవు చీటీ రాసి ఓ కుర్రాడిచేత పంపించి తిన్నగా రైలుస్టేషనుకు చేరుకున్నాను. సమయానికి ఏవన్నా అవసరాలుంటాయని ఓ మిత్రుడి దగ్గర కొంతడబ్బు చేబదులు తీసుకుని మరీ బయలుదేరాను.

బస్తీలో ఉండడం చిన్నప్పటినుంచీ మరిగి ఉద్యోగం అవసరం లేకున్నా ఉద్యోగం సాకుతో ఇలా డబ్బు తగలేస్తూంటాననీ, నేను పూర్తిగా చెడిపోతున్నాననీ మా ఇంటి దగ్గర వాళ్ళ అభిప్రాయం. అలాగని నాకు వాళ్ళు కావాలన్నప్పుడు డబ్బు పంపకుండా వుంటారా అంటే అదీ లేదు. పంపుతూనే వుంటారు. అంటూనేవుంటారు. నా ఉద్యోగంతో నేను సంపాదించే డబ్బు ఖచ్చితంగా చెప్పాలంటే నెల మొత్తం మీద హోటల్‌కీ, సిగరెట్లకీ హతం అవుతుంది. అయినా ఎలానో బతగ్గలుగుతూనే వున్నాను. నేను మిత్రులదగ్గర అప్పుగా పుచ్చుకున్న బాకీలు తీరిస్తే చాలుగాని దాదాపు ఇప్పటికి కొన్ని వేలసంఖ్యలో వుంటాయి. కాని వాళ్లు నన్నడగనూ అడగరు. నేను యిచ్చిన పాపానపోను. ఇలా అప్పు పేరుతో తెచ్చుకోకుండా నాకు గడవనూ గడవదు. ఇలా ఎంత కాలం గడుస్తుందని ప్రశ్నిస్తే అది వేరు విషయం.

"వీడికి త్వరగాపెళ్ళి చేసేస్తేగాని దోవకిరాడు అంటుంది నేనింటికి వెళ్ళినప్పుడల్లా మా అమ్మ. "అసలు వాడిప్పుడు పెళ్లి చేసుకునే దశలో వున్నాడనీ, మనమాట వింటూ కూర్చుంటాడనీ ఇంకా నీపిచ్చి అభిప్రాయం... వాడెక్కడ.. వాడికి మాట్లాడానికే తీరదు" అని వెటకారంగా మా అన్నాయ్ పంచకావ్యాలు చదివేస్తాడు మా అమ్మ ముందు. అమ్మకి నేను కనపడ్డంతసేపు నాపెళ్లి గొడవే.

"పెళ్ళి చేసుకోవడానికి నీకేమభ్యంతరం?" అని అమ్మ నన్ను బలవంతంచేస్తే నేనేం చెప్పను? ఒకవేళ ఏదన్నా చెప్పినా వాళ్ళు సంతృప్తి పడొద్దా? అంతేకాదు. నేను పెళ్లి చేసుకోకపోవడం మాయింట్లో వాళ్ళకే కాక ఇరుగుపొరుగు వాళ్ళకు కూడా ఇదో సమస్యగా మారింది. పెళ్ళి అయితే అనుభవించే, కష్టాలూ నష్టాలూ, ఆనందాను రాగాలూ నావో వాళ్ళవో నాకర్థంకాదు విసుగుపుడుతుంది. వీళ్ల మాటలు వినని నేను బస్తీలో ఏవో దురలవాట్లకి లోనయ్యాననీ, లేకుంటే పెళ్లి చేసుకోకపోవడమేమిటనీ ఊహించుకుని సంతృప్తిపడతారు. నిజానిజాలు వాళ్లకెందుకు? ఏదో తమ అనుమానాన్ని బలపరచే రెండు మూడు కారణాలు వెదికి పట్టుకుని అవి నిజమేనని తృప్తిపడటం తప్ప.

నేను పెళ్లిచేసుకోకపోవడానికి సవాలక్ష కారణాలున్నాయి. అవన్నీ చెబితే ఎవళ్లన్నా నమ్ముతారా? చెప్పి నేను వెక్కిరింతలపాలు గావలసిందే. ఇది నా యిష్టానికీ నా అభిరుచులకీ సంబంధించిన సమస్య. ఇందులో ఎవరికీ అధికారములేదు.

నాకు మొదటినుంచీ సహజంగా అమ్మాయిలతో మాట్లాడ్డమన్నా, అమ్మాయిలన్నా అంతగా సదభిప్రాయము లేదు. ఎందుకంటే, వాళ్ళు వాళ్ళకి అనుకూలంగా ఉన్నంత సేపూ చనువుగా వుంటారు. యిష్టంలేని మరుక్షణంలో మగాళ్ళని బుద్ధిలేనివాళ్ళుగా ప్రచారం చేస్తారు. కాకుంటే స్నోలూ, పౌడర్లూ మోయిస్తో గాడిద చాకిరీ చేయించు కుంటారు. వాళ్లకి యిష్టంలేక పోవడమనే ఈ విషయం ఏకొద్ది కారణం మీదనైనా సృష్టి అవుతుంది.

అందరమ్మాయిలకంటే సుజాతలో మాత్రం నాకొకవిధమైన ప్రత్యేకత కనిపిస్తుంది. సుజాతని చూస్తుంటే అయిష్టం కలక్కపోగా మాట్లాడాలనిపిస్తుంది. మాట్లాడినంతసేపూ

అదోరకం తీయగా ఏదో మధురలోకంలో విహరిస్తున్నట్టుం టుంది ఇంతెందుకూ? సుజాతలో నన్ను ఆకర్షించే లక్షణం ఒక్కటి కాదు, బోలెడు కనిపిస్తాయి నాకు. మా మూర్తి రిమార్కు ప్రకారం సుజాతముందు నాలో వైచ్చాను సంధానం ప్రజ్వరిల్లదు. ఆవిడలో అహంభావం అంకురించదు. ఇద్దరం ఒకళ్ళకొకళ్ళు అవగాహన చేసుకున్నందు వల్లే ఇలా వుంటుందిగాని ఏదో గుణాలు రామ్మూర్తి అన్న ప్రకారం వుండడం అసంభవం. వాడెక్కడో నాలుగైదు ఇంగ్లీషు వాక్యాలు రట్టుకొట్టి, ఉపయోగించే పరిస్థితులు తెలీక అన్నదానికల్లా ఉపయోగిస్తుంటాడు తప్ప అర్థంలేదు. అయినా వాడి రిమార్కుల్ని నే నెప్పుడూ అంతగా ఖాతరు చేయను. వాడేదో అంటున్నాడని, ఒకవేళ నేను అమ్మాయిలకోసం పడిచచ్చేంత ప్రయత్నం చేసినా, మనకోసం బలికావడానికీ కనీసం ప్రేమలేఖ రాయడానికైనా ఏ అమ్మాయి ఇవాళ తయారుగావుంది?

'సుజాత'ని నేను పెళ్లి చేసుకుంటే బావుంటుందనీ, ఇద్దరం ఒకళ్ళనొకళ్ళం బాగా ఎరిగిన వాళ్ళమని వెంకోబారావు అప్పుడప్పుడు ధ్వనిస్తుండేవాడిదివరకు. ఈ మాటలు ఊహించుకుంటే నాకోవిధమైన అభిప్రాయం కలిగేది. సుజాతని నేను పెళ్లి చేసు కోవడమేం కర్మ...మాంచి అందగత్తె...చక్కగా చదువుకుంటున్నది. నిజం చెప్పాలంటే, సుజాతకి నేను తగినవాణ్ణి ఎన్నడూకాను. నాకంత అందంగానీ, అంత సౌకుమార్యంగానీ, అంతటి అమృత హృదయంగానీ లేవు.. నిజంగా నేను సుజాతను పెళ్లి చేసుకోవడమన్నా, సుజాత నన్ను చేసుకోవడానికి అభ్యంతరం చెప్పకున్నా అది నా అదృష్టంయొక్క విపరీతపు పంటేననాలి. కాని, నా హృదయం పూర్తిగా ఒప్పుకోదు. సుజాత సౌందర్యం ఎంతో రసహృదయంతో ఆరాధించదగింది కాని, నాలాంటి రాక్షస హస్తాలకి అంకితం కాదగింది కాదు. చక్కని లేత గులాబీని ఎండలో తెంపివేయడం ఎలాంటిదో సుజాతని నేను పెళ్లాడ్డం అలాంటిది.

ఇంత ఆలోచనల భారంతో స్టేషనుకి ప్రవేశించాను. తీరా వాకబు చేస్తే నే వెళ్ళాల్సిన రైలు లేటుగా వచ్చేస్తుందని తెలిసింది. ఇంకా బుకింగ్ లేదు. తిన్నగా మా మిత్రుడు ఎ.ఎస్.ఎం. దగ్గరకెళ్ళాను ఎంత లేటో కనుక్కుందామని .. నైట్‌డ్యూటీ చేసి, ఈలవేస్తూ తీరిగ్గా కూచుని విశ్రాంతి ననుభవిస్తూన్న మిత్రుడు నన్ను చూసి చిరునవ్వు నవ్వి "ఎటోయ్ ప్రయాణం?" అన్నాడు.

"ఇటే, పడమరవైపు...ఈ రైలు యెంత లేటేమిటి? అవతల మా మిత్రుడొకడు డెత్ బెడ్ మీదున్నాడు త్వరగా వెళ్ళాలి" అన్నాను

"ఫరవాలేదు. మిత్రుడికి కర్మకాండల కందుకోగలవులే" అంటూ వ్యంగ్యంగా మాట్లాడి వెళ్లిపోయాడు.

ఈ లేటుకావటంకూడా సరిగ్గానే తోడయ్యాయని ఉసూరుమంటూ ఓ చోట కూలబడి ఆలోచిస్తున్నాను. ఆలోచించాలిగాని, ఆలోచనకందినంత వరకు చూసినా బ్రతుకులో అన్నీ లేటేననిపిస్తుంది. ఈమధ్య నెక్కడో "నిజాల్లో నిజాలు" అని రాస్తూ ఎవరో మిత్రుడు "డిలేయిజం"ని కూడా పేర్కొన్నాడు. ఈ "డిలేయిజం" నిజంగా మనిషిలోంచి దానంతటదే పుట్టుకొస్తూంటుందనీ, దీని కెవళ్ళోకాదు. ప్రకృతీ, మనుషుల మనస్సులే కారణమూ, బాధ్యత వహించాలనీ అనిపిస్తుంటుంది. కాకుంటే, వెంకోబారావు పెళ్ళీ, వాడి చెల్లెలి పెళ్లీ, నాపెళ్ళి నాలాంటి యింకా కొంతమంది

పెళ్ళీ. యింత లేటుగావడం దేన్ని గురించంటారు? మినిష్టర్ల పదవీ కాలాలే లేటయి సంవత్సరాలు సాగుతుంటే దిక్కులేదు కాని, ఇక నా పెళ్ళీ ఈ రైలూ లేటయితే మాత్రం విమర్శలు తప్పనిసరిగా దూకుతాయి. విచిత్రం.

జపం చేస్తూచేస్తూ విసిగిపోతున్న తరుణంలో నే వెళ్ళే రైలు రానేవచ్చింది, గంటన్నర లేటుని మూటగట్టుకుని.. నాకేముంది.. బెడ్డింగా... పెట్టా.. బెగ్గర్ ఫెలోలా అమాంతం రైలులో దూరేశాను. ఎదురు చూచి చూసి అలసిపోయినందు కోఅనువైన సీటు దొరికింది కూడాను

రైలు కిటికీలోంచి చూస్తుంటే, చెట్లు నడుస్తున్నాయా రైలు పరిగెడుతుందా అన్న సంశయం కలిగింది."చెట్లు నడిస్తే ఎంత భయంకరమో" నని ఎప్పుడో ఎక్కడో ఒకనాటి కవిరాజు గారన్నట్టు గుర్తు. ఆ చరణాన్ని ఊహిస్తుంటే మాత్రం మా కవిరాజు ఎప్పుడో ఓ పర్యాయం రైలుబండిలో పోతూ పోతూ ఈ గీతం చరణం వ్రాశాడని నా కనిపిస్తుంది.

దూర భూరేఖమీదగల చెట్లు, అమాంతం ప్రస్తుతంలోకి వచ్చి, క్షణకాలంలో రివ్వుమంటూ గతంలోకి అదృశ్యమైపోయాయి. ఈ సమయంలో నిజంగా మా 'సత్యానందస్వామి' నాపక్కన వున్నాడంటే దీన్నంతటినీ వేదాంతపరంగా మార్చిపారేసి ఉపన్యసిస్తాడు.

మానవ జీవితాలైనా ఇంతేననీ, ఏదో క్షణకాలం, బుద్బుధప్రాయమైన ఈ పృధివిమీద మెఱవడానికి, ఎంతో దూరంనుంచి ఎన్నో శ్రమల కోర్చుకుని, గర్భ నరకాన్ని కూడా అనుభవించి మరీ బయటపడతాడని, మళ్ళీ గతంలో కలిసిపోతాననే విజ్ఞానం వీసమెత్తైనా లేక ఏదేదో చేసేస్తుంటాడని చెప్పిచెప్పి ఒక్క వేడినిట్టూర్పు విడుస్తాడు. క్షణంలో ఆయన భంగిమ మారిపోతుంది. ఇంతా అనీ అనీ చిట్టచివరికి ఆయన నాకిచ్చే సూచనేమిటంటే "ఈ క్షణకాలం పాటైనా పెళ్ళిచేసుకుని బతుకుని ఆనందంగా నెట్టెయ్యి నాయనా!" అని. సత్యానందస్వామి నాక్కలిసినప్పుడల్లా ఇలానే వేదాంతం బోధించి చివరికి ఆ ముక్క తగిలించి పోవడం ఆయన కలవాటు. నాకు చిర్రెత్తుకొస్తుంది. ఐనా పైకి కనబడనీయకుండా "స్వామీ మీరు సన్యాసాశ్రమం స్వీకరించారు కదా, మళ్ళీ నాకేమో ఈ సంసార నరకంలో పడమని బోధిస్తున్నారు" అని వినయంగా అడిగితే, "ఈ సన్యాసాశ్రమం మాబోటి ప్రజలకే బాబూ! అందరూ దీన్ని ఆచరించలేరు. గృహస్థాశ్రమంలో వుండి కూడా మోక్షాన్ని సంపాదించవచ్చని శ్రుతిస్మృతులు ఘోషిస్తున్నాయి. తప్పులేదు" అంటాడు స్వామీజీ.

"సంసారంలో గలది మధుర దశో, నికృష్ట దశో అనుభవించని మీకు మాత్రం ఏం తెలుసు స్వామీ!" అంటే, "ఎదురు ప్రశ్నించడం, తాత్విక విషయాలు చర్చించడం తగవు, అన్నది నమ్మితీరాలి" అని చప్పున జారుకుంటారు మా సత్యానందస్వామి గారు.

ఇంతకీ, ఎక్కడో ఎర్రని కాషాయవస్త్రాలు ధరించి, హాయిగా ముక్కుమూసుకోక ఈయనకీ నా పెళ్లి గొడవెందుకు చెప్పండీ! ప్రపంచంలో కొన్ని కోట్లమంది పెళ్లికాని వాళ్లున్నారు వాళ్లందర్నీ వదిలి, నా ఒక్కడిమీదే వీళ్లంతా విరుచకపడతా రేంకర్మో తెలియక చావొస్తోంది నాకు.

నా ఆలోచనలు ఒకదాన్ని గురించి ఆరంభమైతే ఇంకోదాంట్లోకి కప్పలా గంతులు వేస్తూ వేస్తూ చివరికి మాత్రకనే మరిచిపోతాయి. ఒక్క పాయింటు మీద నిలబడి, దాన్ని గురించే ఆలోచించేంత చిత్త సంస్కారం లేకపోవడంతో, నాపని మరీ ఇబ్బంది పాలవుతుంది. నేనాలోచిస్తూ వుండగానే మా బండి వరంగల్ ప్లాట్‌ఫారం మీద ఆగిపోయింది. నా గొలుసు విషయాలు తెగిపోయాయి. శరీరం సగం హూనమై, రెండుచోట్ల తలబొప్పికట్టిన తదుపరి రైలునుంచి ప్లాట్‌ఫారం మీద అడుగువేయగలిగాను. ఈరోజుల్లో రైళ్ళు దిగడం, ఎక్కడం మొదలైన సర్కస్ ఫీట్సులాంటి కష్టాలకన్నా, పెళ్ళి చేసుకోవడమే సులభంగా కనిపిస్తుంది.

ప్లాట్‌ఫారం దాటిన దగ్గర్నుంచీ మళ్ళీ వెంకోబారావు స్థితిని గురించిన ఆదుర్దా చీకటి తుఫానులా నన్ను ముంచెత్తింది. వాడింటికి ఒక్కో అడుగు దగ్గరపడుతున్న కొద్దీ భయం భయంగా, కడుపులో దేవినట్టుంది. ఏ కబురు వినాల్సి వస్తుందో, స్టాలిన్‌లా ఆమాంతం వాడి బ్రెయిన్ బద్దలైందో, పొద్దుటి నుంచీ ఏ పరిస్థితులు జరిగాయో చిట్టచివరికి వాడి సంకీర్ణ మానవారణ్యంలో దిక్కులేనివాడిగా వెళ్ళిపోయాడేమోనని గుండె బేజారై కాళ్ళు తడబడుతుంటే, తిన్నగా వాడింటి ముందుకొచ్చేశాను. గుండెలు గంటకు నూరువందలసార్లు కొట్టుకున్నంత అలజడి. కంపంతో ఆగిపోయాను. వాకిటి తలుపు లోపల గడియవేసి ఉంది. లోపల నుండి ఎలాంటి ధ్వనీ వినపడ్డంలేదు. ఉండబట్టలేక రెండు మూడుసార్లు తలుపును చప్పుడు చేశాను. ఎవరో తలుపు తీస్తున్నట్టు ధ్వని విని మనస్సును అదిమి పట్టుకున్నాను. పచ్చగా విరబూసిన తంగేడు చెట్టులా సుజాత నా కళ్లముందు ప్రత్యక్షమైంది. ఆవిడ ముఖంలో దుఃఖంగానీ, కనీసం ఆ సూచనలుగానీ లేవు కదా, అప్సరసలా తయారై నిలబడింది.

"అప్పుడే రానే వచ్చేశావే, సుస్వాగతం, అన్నాయ్ చెప్పే వెళ్ళాడు నీవొస్తావని. రా. అలా నిలబడ్డావేం?" అంది సుజాత.

నే నెలావున్నానో నాకే తెలీక ఓసారి బుర్రగోక్కుని, "అయితే వాడికెలా వుంది ప్పుడు?" అన్నాను. "ఎవరికీ?" సుజాత ప్రశ్న నన్ను కలవరపెట్టింది. "మీ అన్నాయ్‌కి" అన్నాను.

"ఏం మా అన్నాయ్ కేం? చక్కగా ఆఫీసునుండి ఇప్పుడే వచ్చాడు....బజారు కెళ్ళాడు కొద్ది పనుండి. ఇప్పుడే వస్తూనే వుండాలి.."

నాకు పిచ్చెత్తినట్టయింది. అయితే ఈ టెలిగ్రామునెవరిచ్చారు నాకు? అర్థంకాక సజాత ముఖంలోకి చూడటమే శరణ్యమైంది.

"ఏం కొత్తవాడిలా అలా చూస్తావేం?" అంటూ కిలకిలా నవ్వింది. "లోపలికొచ్చి ముఖం అవీ కడుక్కుని కూర్చో, మాంచి వేడి వేడి పూరీలు నాలుగు తెస్తాను. ఇప్పుడే తయారయ్యాయి."

మనస్సులోని మధన భరించలేక "అయితే దీనికర్థం యేవిటో చూడు?" అని జేబులోంచి కాగితంతీసి సుజాత కందించాను పరధ్యానంగా. సుజాత ఆదుర్దాతో ఆ కాగితాన్ని విప్పింది. చదివింది...ఆవిడ బుగ్గలు ఒక్కసారిగా ఎర్రబడిపోయాయి.

చిలిపిగా నావైపుచూస్తూ "ఇదెవరికన్నా రాసిన ప్రేమలేఖా? లేక, భగ్నప్రేమికుడి కవిత్వమా? నాకర్థం కావడంలేదు" అంది.

అదిరిపోయి చూశాను... అరే...అది టెలిగ్రాం కాగితం కాదు. రాత్రి గంటన్నర సేపు కూర్చుని వ్రాసిన పొయిట్రీ.. "ప్రేమించడం ఆత్మవంచన" అన్న ధోరణిలో వ్రాసేశాను. మరి టెలిగ్రాం ఏమయిందీ?..ఓ..... డిసాప్పాయింట్‌మెంట్..

నాకు విచిత్రం, విచిత్రాన్ని మించిన నిరుత్సాహం కలిగింది. టెలిగ్రామ్ ఫారం తొందర్లో ఇంట్లోనే మరచిపోయానల్లే వుంది? ఓ.. వెధవ మైందు...నట్టూడిపోయిన యంత్రం.

"అఘోరించావులే గాని ముందు లోపలికి నడు. తరువాత మాట్లాడుదాం" అంటూ నా భుజంమీద చెయ్యేసి నెట్టారెవరో వెంకోబారావు. ఓరి వీడి తస్సాదియ్యా మొద్దులా... దుక్కదున్నలా.. వున్నాడు. గాలిగంగలా వూరంతా తిరిగొస్తున్నాడల్లే వుంది. వీడికి పక్షవాతం ఎక్కడుంది?

మనస్సులో కొంత బరువు దిగినా, అసలు సంగతి అర్థంకాక బుర్రఖరాబై నాపని కంపలోబడ్డ కాకిలా అయింది. కాదు మరి?

ఏదేమైనా, ఆరోజు సుజాత చేతి వేడిపూరీలూ, రాయల్ గెస్ట్‌హౌస్‌లో దొరికేలాంటి భోజనం లభించాయి. కాని అనుమానం నివృత్తి కాలేదు.

భోజనాలయ్యాక తీరిగ్గా కూర్చున్నాం. సుజాత యిల్లు సర్దుకుంటూంది. వెంకోబారావుగాడు అసలు విషయం బయటవేశాడు. నాకు ఆశ్చర్యం, రోషం, క్రోధం ఒకేసారి వచ్చి వాణ్ణి లాగి తన్నాలంత కసిపుట్టిందంటే నమ్మండి.

సారాంశమేమిటంటే, వాడికి ఈ వూరునుంచి ట్రాన్స్‌ఫర్ అయిందట. పదిహేనో తేదీన అక్కడికి వెళ్ళి జాయినయి తీరాలట. సరే జాయినైతాడనుకోండి. అక్కడ సుజాత చదువు మిగిలిన నాలుగునెలలూ పూర్తి అయ్యే ఏర్పాట్లు లేవు. డిస్కంటిన్యూ చేయించడం వాడికి ససేమిరా యిష్టం లేదట. వాడికిదో పెద్ద సమస్యగా అయింది. మళ్లా ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయించుకోడానికి ఏమాత్రం అవకాశంలేదట. అదో మలేరియా ప్రాంతమట.

"మరీ టెలిగ్రాం సంగతేవిట"న్నాను నాకు విసుగెత్తి.

ఈ పదిరోజుల్లోనే తప్పక రావాలని వుత్తరం రాస్తే జాప్యం, సోమరితనం వల్ల రానని వాడికి బాగా నమ్మకమట. నేను వాణ్ణి నిర్లక్ష్యిస్తాననే భావంతో, సుజాతకి తెలీకుండానే అవిడ పేరుతో తనే టెలిగ్రాం యిచ్చాడట. చూడండి వాడి వరుస ఎలా వుందో. వళ్లు మండింది నాకు. నన్నింత గాభరా పెట్టినందుకు మండదూ?

అంతటితో వూరుకోలేదు వాడు. చల్లగా బయట వేశాడు కబురు.

ఎంతోకాలంనుంచీ సుజాతని నాకిచ్చి పెళ్ళి చెయ్యాలని వాడికుందట. సుజాత అభిప్రాయం తెలుసుకుంటే తనకంటే ముందే ఆవిడకా అభిప్రాయం వుందని తెలిసిందట. కాబట్టి దాని చదువు చెడిపోకుండా వుండాలంటే నేను దాన్ని పెళ్లి చేసుకొని ఇటొచ్చేయాలట. పెళ్లి ప్రస్తుతం చేసుకోకున్నా తీసుకొని వచ్చి ఈ నాలుగు నెల్లూ చదివించాలట. లేదూ, ఇంకో వారంలో క్షుప్తంగా పెళ్లికూడా జరిపిస్తాడట

నే నొప్పుకుంటే. అన్నివిధాలా యీ విషయంలో వాడిని నేను మిన్చించి స్నేహానికి విలువను చూపాలట. ఇదీ వాడి ధోరణి.

ఇది మళ్ళీ వాడి చెల్లెలి భవిష్యజ్జీవితానికి సంబంధించిన అత్యవసర సమస్య కాబట్టే ఇలా పిలిపించాననీ క్షమించమనీ చివరికి కూశాడనుకోండి.

నా గుండెల్లో జలపాతం దూకినంత ఆవేదనేకాక, వాణ్ణి నిలువునా బుర్ర బద్దలు చేయాలనిపించింది. ఊరికే ఉత్తరం రాయకూడదూ, ఇష్టంవుంటే వచ్చేవాణ్ణి లేకుంటే లేదు. నన్ను నానా హైరానాల పాలుజేసి చివరికి నాకు పెళ్లి చేయడానికా వీడు పిలిపించింది.

మర్నాడింకా సరిగ్గా తెల్లవారకముందేలేచాను. వెంకోబారావు నిద్రలోంచి లేవనే లేదింకా. సుజాత సందున చెంబూ తపాలాను బయటవేస్తోంది అంట్లుతోమే మనిషికి. నేను పరిశీలించాను ఆవిడనోసారి మనస్సులోనే.. "అమాయకత్వం నిండుకున్న అందాల బాల".... కాఫీనీళ్ళకి పొయ్యి వెలిగించడానికి యత్నిస్తోంది. తిన్నగా వాకిట్లోంచి బయటపడ్డాను. నా కాళ్లు నన్ను స్టేషన్‌కు లాక్కొచ్చి పడేశాయి. బతుకు జీవుడా అంటూ ఆరున్నరకి వచ్చే పార్సెల్ ట్రెయిన్‌కి టికెట్టు కొనుక్కుని పదిగంటలకల్లా కొంపకి చేరుకున్నాను. ఇక వాళ్ళేమన్నా భావించనీండి. నాకేం భయంలేదు.

ఇంట్లో అడుగుబెట్టి తలుపుతీయగానే మళ్ళీ ఏదో ఉత్తరం ప్రత్యక్షం. నా బతుకిలా వుత్తరాల్తో వెళ్లమారాల్సిందే ననుకుంటూ తీసి చూశాను. మా అన్నాయ్ రాశాడు. ఆరోతేదీ మధ్యాహ్నం వరకల్లా ఇంటికి రావాలనీ, పిల్లనివ్వడానికెవళ్లో వస్తారనీ ఈమారు డిసప్పాయింట్ చేసే మాటుంటే నేనుతిరిగి తనని చూసే యోగ్యత వుండదనీ.

ఆలోచిద్దామన్నా మెదడు బండలా మారిపోయింది. మనస్సు ప్రజ్వరిల్లిపోతూంటే కలం పట్టి ఉత్తరం రాశాను మావాడికి. వీలుగా వుంటే తప్పక వచ్చి తీరతాననీ, లేకుంటే ముహూర్తం కూడా పెట్టించవచ్చనీ, పిల్లని నేనిక చూడాల్సిన అవసరం కూడా లేదనీ, ఇది పరిహాసం కాదని అమ్మకి తెలియజేయమనీ వ్రాసేశాను...

● 1967 ●

# 26. అయ్యో డబ్బు

♦ ఇటికాల నీలకంఠరావు ♦

"మీ డబ్బు ఎక్కడికీ పోదు.." అన్నాడు జానయ్య. అవును డబ్బెక్కడికీ పోదు. ఎక్కడో అక్కడ ఉండనే ఉంటుంది యిస్తే శోభనాద్రి దగ్గర ఉంటుంది. యివ్వకపోతే జానయ్య దగ్గరే ఉంటుంది. ఎక్కడికీపోదు డబ్బు! కానీ, డబ్బు చంచలమైంది. అది ఒక చోట నిలకడగా వుండదు. శోభనాద్రికి యివ్వకుండా, జానయ్య డబ్బు తన దగ్గరే వుంచు కుంటాడనుకుందాం! ఉంటుందా అతని దగ్గర? ఉండదు. లేక జానయ్య శోభనాద్రికి యివ్వవలసింది యిచ్చేశాడనుకుందాం! ఉంటుందా శోభనాద్రి దగ్గర? ఉండదు. అది పోతుంది. ఎటో పోతుంది. దేని కిందో పోతుంది. శోభనాద్రికి డబ్బివ్వలసిన జానయ్య యివ్వలేదనే బాధేకాని, డబ్బెక్కడికీపోదు. ఎక్కడోక్కడ ఏదో రూపంలో ఉండనే ఉంటుంది. చదువు లేకపోయినా, జానయ్య పదార్ధ విజ్ఞానాన్ని చాలా బాగా చెప్పాడు. చదువేవుంటే అతను మేటి వైజ్ఞానికుల తలతన్నేవాడు. ఏమైనా జానయ్య "మీ డబ్బెక్కడికీపోదు" అన్నాడు. జానయ్య మాటలు శాస్త్ర సమ్మతంగా ఉన్నాయని కొందరప్పుడే మెచ్చుకున్నారు. అవును పదార్థానికి చావులేకపోవడం వైజ్ఞానిక సత్యమే కదూ!

డబ్బెక్కడికీ పోదనటంలో జానయ్య ఉద్దేశం, డబ్బు శోభనాద్రికి యివ్వబడకుండా ఎక్కడికీ పోదనీ, తప్పకుండా యివ్వబడుతుందనీ అయి వుండాలి. లేకపోతే ఆమాటలకు ఏమిటీ అర్థం? బాకీ వుండి అడుగుతే డబ్బెక్కడికీ పోదనడమేమిటి? యిస్తేనే కదా బాకీ తీరేది! శోభనాద్రి కోరేది బాకీ తీరుమానం అంతేకాని పదార్థవిజ్ఞాన శాస్త్రపాఠాలు కాదు. ఇప్పుడు మనుష్యుల్లో రెండురకాల ఆలోచనలు పనిచేస్తున్నాయని స్పష్టంగా చెప్పొచ్చు. తన అవసరమప్పుడు ఒక ఆలోచన! తన అవసరం తీరింతరువాత మరొక ఆలోచన! పుచ్చుకునేటప్పుడు చెప్పే మాటలు వేరు! యివ్వవలసి వచ్చేటప్పుడు చెప్పే మాటలు వేరు. ఆలోచన నిర్మాణయుతంగానూ చేయవచ్చు. వినాశాత్మకంగానూ చేయవచ్చు. నిర్మాణానికి ఉపయోగించుకునే శాస్త్రాలనే నిర్మూలనానికీ ఉపయోగించుకోవచ్చు! ఉపయోగించుకునే వాని చిత్తశుద్ధిని బట్టి అవి ఉపయోగపడతాయి. జానయ్య యిచ్చే సమాధానం ఎలా అర్థం చేసుకోవాలో తెలియటంలేదు. తన సమాధానాన్ని అతను ఎలా ఉపయోగించుకో దలచాడో అతనికే తెలియాలి మనస్సులో చొరబడి యిదమిద్ధమని మనమేమీ చెప్పలేం అతను ఎలాగైనా ఉపయోగించుకోవచ్చు. సమాధానం ద్వంద్వంగా ఉంది.

శోభనాద్రి కోరేది ద్వంద్వ సమాధానం కాదు. యివ్వడమో, యివ్వకపోవడమో అతనికి కావాలి. అందుకని శోభనాద్రి ఖండితంగా అడిగాడు. "దబ్బిచ్చేదా, యివ్వందా" తెలియజెప్పమని. కాని జానయ్య "మీ డబ్బు! ఎక్కడికీ పోదు.." అన్నాడు మళ్ళీ.

జానయ్య యిప్పటికి ఎన్నిసార్లు అన్నాడో, "మీ డబ్బు ఎక్కడికీ పోదు" అని. శోభనాద్రి యిదంతా లెక్కవేసే ఉంచాడు. యిన్నిసార్లన్నాడని లెక్కపేసి, సాక్ష్యంతో సహా ఉంచాడని జానయ్యకు మంట. మాటలకు లెక్కేమిటి వీశాదీ ఏమిటని అతనంట! ఎప్పటికప్పుడు అదే తొలిసారి అన్నట్టు జానయ్య సమాధానం చెబుతూ ఉంటాడు. అతను మరి మరిచేపోతాడో లేక మరిచిపోయినట్టు నటిస్తాడో తెలియదు. అంగీరించడం యిష్టం లేదేమో, అంతకన్నా తెలియదు. ఈ లెక్క విషయంలో శోభనాద్రి చెప్పే మాటల్నే మనం ప్రామాణికంగా తీసుకోవాలి. ఎందుకంటే డబ్బిచ్చినవాడు అడుగుతూనే ఉంటాడు. ఒకసారి అడుగుతే ఒకసారి అడిగినట్టే లెక్క. డబ్బు పుచ్చుకున్నవాడు మరిచిపోతూనే ఉంటాడు. ఒకసారి మరచిపోతే ఆసారి లెక్క మటుమాయం కాదు. డబ్బు పుచ్చుకున్న వారిలో నీతీనిజాయితీ కల వ్యక్తులు ఎందరుంటారో ఊహాతీతమైన విషయమేమీ కాదు. ఈ జానయ్య శోభనాద్రుల వ్యవహారంలో నేనసలే తలదూర్చ తలచలేదు. కారణం, వీరిద్దరూ నాకు పరిచితులే. సాధారణంగా సత్యం అప్రియంగానూ, అసత్యం ప్రియం గానూ ఉండడం ముమ్మాటికీ నిజం! డబ్బు యివ్వవలసిందే అంటే జానయ్యకు కోపం! యివ్వనక్కర లేదంటే శోభనాద్రికి తాపం? ఈ పరిస్థితుల్లో నాకు ఒక సంగతి మటుకు బాగా తెలుసు. డబ్బివ్వనక్కరలేదంటే జానయ్య బాగా సంతోషిస్తాడు. నా అంత పెద్ద మనిషి మరి లేడని బ్రహ్మరథం పడ్తాడు. కాని ఈ సలహా యిచ్చేవాళ్లు జానయ్యకు చాలా మంది దొరుకుతారు. ఒంటరిగాడి సలహా ఎక్కడా నొక్కుడు పడదు. యిప్పటికే అతనికి డబ్బివ్వనక్కరలేదనే వారి సలహాలు చాలా లభించి వుండొచ్చు. అందుకే అనుకుంటా. "మీ డబ్బు ఎక్కడికీపోదు.." అన్నాడు జానయ్య తిరిగి.

ఎన్ని సార్లంటాడో "మీ డబ్బు ఎక్కడికీ పోదు" అని. ఎక్కడికీ పోదు నిజమే. కాని తేల్చి చెప్పేసెయ్యాలి కదా, యిస్తాను, యివ్వను అని. యిస్తే ఫలానా అప్పుడు యిస్తాను అనాలి. యివ్వవూ, ఉట్టికున్న చేర్లన్నీ తెగిపోయాయనాలి. అంతేకాని ఏమిటీ సమాధానం. ఎన్నిసార్లని యీ సమాధానం. యిలాటి సమాధానం యిచ్చేవాడికైనా ఉండాలి, వినేవాడికైనా ఉండాలి. సమాధానాలు యిచ్చేవారికి మనం ఉండాలని కోరేది ఉంటే సమస్యలు యింతదూరం రావు. ఏ విషవాతావరణ ప్రభావమోకాని, మనుష్యులకు ఉండవలసినవి లేకుండాపోతున్నాయి.

జానయ్య ఎన్నిసార్లని 'మీ డబ్బు ఎక్కడికీపోదు" అని చెబుతూ పోతాడు. యిలాంటి సమాధానాలకు కొన్నిసార్లవరకే విలువ వుంటుంది. తరువాత విలువ నశిస్తుంది. పాడిందే పాట అయ్యేసరికి ఆపాటకు విలువ నశిస్తుందని అందరూ ఎరుగుదురు. జానయ్య తను యిస్తున్న సమాధానానికి విలువ నశించిందని గ్రహించే ఉంటాడు. విలువ నశించినా తాను దానికి విలువయిస్తూ, తానివ్వవలసిన సమాధానం అదేనని అత ననుకుంటూ ఉండొచ్చు. అతనికి యీ సమాధానం యివ్వటమే ఉభయతారకం కావచ్చు. శోభనాద్రిని యీ సమాధానంతో బాగా

పిచ్చివాడ్ని చేయవచ్చని అతను ఊహించి ఉండొచ్చు. యీ సమాధానాలతో లోకం ఆటకూడా కట్టించొచ్చని అతననుకొని ఉండొచ్చు. పైగా యిలా సమాధానం యిస్తూ తనను తాను ఒక గొప్ప లౌకికుడుగా భావించవచ్చు. కాని శోభనాద్రి కూడా యిదే లౌకికుల మధ్య యిదే ప్రపంచములో సహజీవనం చేస్తున్నాడు ఈ డొక్కు సమాధానాలు అతను ఎరుగనివి కావనుకుంటాను. ఈ లౌకికుల మధ్య యిప్పటికే అతని తల బొప్పులు కట్టి, అతను యీ సమాధానాల అర్థాలను విలువలను గ్రహించే ఉంటాడు. మనుష్యులే మనుష్యుల దగ్గర నేర్చుకొని మనుష్యులకు నేర్పుతారు. శోభనాద్రికి వళ్లు మండింది. తన అవసరానికి రాని డబ్బు తనకు దేనికి? చచ్చిందాకా ఉంటే యిస్తాననే సమాధానాలతో ప్రయోజనమేమిటి తను యివ్వవలసిన వాళ్ళతో తన పరువు పోయింతరువాత యీ డబ్బెందుకు? "నాకు తెలియదు, డబ్బిస్తావా యివ్వవా?" అని గట్టిగా అడిగాడు. జానయ్య 'మీ డబ్బు ఎక్కడికీ పోదు" అని ముఖం తిప్పాడు. "అయితే సరి నా డబ్బెక్కడికీ పోదు కదూ, పద" అన్నాడు శోభనాద్రి. "మీ డబ్బెక్కడికీపోదు. మీడబ్బెక్కడికీపోదు.. మీ డబ్బెక్కడికీపోదు.." అంటూనే వెంట వెళ్ళాడు జానయ్య.

● 1967 ●

# 27. ఇజ్జత్

♦ భాస్కరభట్ల కృష్ణారావు ♦

రంగారావు ఓ నిశ్చయానికి వచ్చాడు. పెందలాడే లేచి గబగబా రెండు షర్ట్‌లు, ఒకధోవతి, ఒక బనియన్, ఒక టవల్ వేసుకున్నాడు. చెప్పులు తొడుక్కుంటుండగా, తల్లి విధవావిడ, ఎదురుపడి "ఎక్కడికి వెడుతున్నావురా?" అని అడిగింది. "అడిగావూ?" అని విసుక్కున్నాడు రంగారావు. తల్లి వీడ్కోలు మాటలకుండా లోపలికి వెళ్ళిపోయింది. అప్పటికే రెండు అపశకునాలు ఎదురయ్యాయి. చెయ్యబోయే పని అవుతుందో, లేదో అనే సందేహం కలిగింది. తీరా బయల్దేరుతూ అపశకునాలను గూర్చి ఆలోచించడం మంచిది కాదనుకున్నాడు రంగారావు. చప్పున యింట్లోంచి బయల్దేరాడు. వాకిలి గుమ్మం దాటాడో, లేదో ఎక్కడినుంచో ఒక తుమ్ము వినపడింది. తిరిగి యింట్లోకి వెడదామా అని ఒక నిమిషం ఆలోచించాడు. కాని తిరిగి వెళ్ళడానికి మనస్సు ఒప్పలేదు. నిలుచున్న చోటునుంచి కదిలాడు. సికింద్రాబాద్ స్టేషన్ దారిపట్టాడు. స్టేషన్ చేరుకునేసరికి, ఇంకా రైలు రాలేదు. టిక్కట్టు కొని ప్లాటుఫారం మీదికి వెళ్ళాడు. ట్రైను అరగంట లేటని తెలిసింది.

నిప్పుకుమల్లే మెదడు రాజుకుంటున్నది; పొగలకు మల్లే ఏవో ఆలోచనలు. తన పెద్ద చెల్లెలు ఛాయ పెళ్ళికి, రెండు నెల్లు కూడా వ్యవధి లేదు. పెళ్ళిఖర్చులుకాక, వెయ్యిన్నూట పదహార్లు కట్నం. ముహూర్తంకూడా నిశ్చయమైంది. బహుశా వివాహానికి మూడు వేలదాకా ఖర్చు కావచ్చు. సంబంధం చాలా మంచిది. పెళ్ళికొడుకు బుద్ధిమంతుడు, బి.ఎ. ప్యాసైనాడు. తనకు మల్లే సెక్రటేరియట్‌లో గుమస్తా ఉద్యోగం చేస్తున్నాడు. నెలకి వందరూపాయలదాకా ఆదాయం వుంటుంది. ఏ బాదరబందీ లేదు. ఆ ఆదాయంతో భార్యాభర్తలు సుఖంగా కాలం గడపవచ్చు. తనదగ్గర డబ్బులేదు. తనకి వచ్చే ఆదాయంతో భుక్తి గడపటమే కష్టసాధ్యంగా వుంది.

ఇట్టి పరిస్థితులలో మూడు వేలు తనెక్కడ తేగలడని? ఇది కాసికాలం, అప్పు ఎక్కడ పుడుతుందని? పుట్టినా, తనకు తీర్చే తాహతులేదు. ఇచ్చేవాడుకూడా ఏమి చూసి ఇస్తాడని? రఘునాథపల్లెలో తమకు ఒక బావి, పది ఎకరాల ఖుష్కీ వుంది. బావి క్రింద ఎకరం, ఎకరంన్నర తరీ వుండవచ్చు. బావి తాకట్టు పెట్టి అయిదారు వందల రూపాయలు తీసుకురావచ్చు. అయిదారువందలు ఏ మూలకి వస్తాయని? అమ్మజూపితే మూడు నాలుగువేలదాకా రావచ్చు. కాని ఖిభూమి కొనడానికి ఎవరైనా ముందుకు వస్తారో, లేదో - ఒక కాలంలో అది ఈనాంభూమి, తన తండ్రి పోయిన తరువాత, తనపేరన పట్టా అయింది. ఎందుకో ఈమధ్య ఈనాం భూములన్నీ

పడ్తాలు అవుతున్నాయట. మల్లయ్య కుటుంబం, తండ్రి తాతల కాలం నించీ, ఆభూమి సేద్యం చేస్తున్నది. "ఈ భూమిలో పుట్టి, ఈ భూమిలో పెరిగాం" అంటాడు మల్లయ్య. మనిషి దైవభక్తి కలవాడూ, నెమ్మదైన వాడునూ, అతని కెన్నడూ తమ కౌతుపత్రం ప్రాణియ్య లేదు. పట్టుపట్టి అతనూ వ్రాయించుకోలేదు. కౌలుగింజల విషయంలో ఏదో ముఖాముఖీ మాట్లాడుకోవడం, ఇంత అని ఒక నిర్ణయానికి రావడం, అతను సరే ననడం. ఇది చాల కలంనించి వస్తున్న పద్ధతి. వంశపారంపర్యంగా వస్తున్న ఆ పద్ధతికి తను ఎన్నడూ విరుద్ధంగా వెళ్ళలేదు. విరుద్ధంగా నడుచుకోవాల్సిన అవసరం కూడా కలుగలేదు. మల్లయ్య భూమిపన్ను తనే కట్టుకుంటున్నాడు. పన్ను పోనూ సంవత్సరానికి పుట్టెడు గింజలు యిస్తున్నాడు. శివుడుమీది పూలు తప్పినా, అతను కౌలుగింజ లివ్వడం ఎన్నడూ తప్పలేదు. కాని గడచిన రెండు సంవత్సరాలనించీ, తనకు మల్లయ్య దగ్గరినుంచి ధాన్యం ఏమీ రావడంలేదు. ఈ మధ్యనే అతను కూతురు పెళ్ళిచేశాడు. ఖర్చులో పడ్డాడు. కాగా గోరుచుట్టుపై రోకలిపోటు అన్నట్లు పక్కనున్న కుంట గండిపడి, ఆ భూమిలో ఒక సంవత్సరంనించీ ఏమీ పండడం లేదు. కుంట గండిపూడ్చడానికి తనకుగానీ, మల్లయ్యకు గానీ తాహతులేదు. కనీసం అయిదు వందల రూపాయిలయినా కావాలి. కుంట పెద్దది అయితే ప్రభుత్వం సహాయమైనా పొందవచ్చు. తాలూకా కచేరీలో ధరఖాస్తు యిచ్చి కూడా చూచాడు మల్లయ్య. రెవెన్యూ అధికారి వచ్చి చోటు తనిఖీ కూడా చేశాడు. అది కుంట కానిదే! అతను మాత్రం ఏమి సిఫారసు చేస్తాడని? ఏదో పెద్ద బొంద.

అక్కడ వానాకాలంలో నీళ్ళు ఆగుతాయి. ఆనీళ్ళన్నీ వరిచేనులోకి కొట్టుకొస్తాయి. ఎండా కాలంలో బావిలోని నీళ్ళు వరి పొలానికి చాలవు. ఫలితం, ఏ కారులోనూ, ఆ పొలం పండడం లేదు. మల్లయ్య తనకు కొలవ వలసిన ధాన్యం కొలవడం లేదు. పాపం అతను మాత్రం ఎల్లా కొలుస్తాడని- భూమిలో ఏమీ పండనప్పుడు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న భూసంస్కరణల ఫలితంగా, అతనికి టెనెన్సీ ఫారం దొరికింది. అతనికి కూడా ఆ భూమిలో కొంత హక్కు సంక్రమించినది. ఆ భూమినుంచి అతన్ని తొలిగించడానికి వీలు లేదు. భూమిని అమ్మదలచినా మొదట అతనికి అమ్మజూపాలి. అతను ఒకేసారి ధనం కక్కాల్సిన అవసరంలేదు. చిన్నచిన్న మొత్తాల్లో కొన్ని సంవత్సరాల వరకూ చెల్లిస్తూ వుండవచ్చు. అతని పరిస్థితి ఏ మాత్రం బాగులేదు. కనుక అతను ఆ భూమిని కొనుక్కోకపోవచ్చు. పైగా అతనికి కూటికీ, గుడ్డకీ జరగడం లేదని వినికిడి.

ఐనా భూమిపై తనకుగల హక్కుని వదులుకుంటాడా? భూమి వదులుకొని రాజీనామా యిస్తాడా? అసాధ్యం-భూమీ వదులుకోడు- రాజీనామా యివ్వడు. కాగా కౌలుగింజలు కొలువడు. ఈ రైతులకి భూమి అంటే అంత మమకారం ఎందుకో?

మొదట కౌలుగింజల విషయంలో వత్తిడి కలుగజేయాలి. అతను ఎల్లాగూ యివ్వలేడు. ఆ తరువాత గొడ్డో, గోదో వేలం వేయడానికి ప్రయత్నించాలి. అప్పుల వాళ్ళ బాధ పడలేక, ఇటీవలనే అతను రెండు కోడెలు అమ్ముకున్నాడట. ఇక మిగిలితే ఒకటీ అర గొడ్డు మిగిలి వుండవచ్చు. ఉన్న ఒక్క గొడ్డు వేలం వేయడానికి పూనుకుంటే అతను బెంబేలు పడిపోతాడు. కాళ్ళ బేరానికి వస్తాడు. అప్పుడు

నెమ్మదిగా భూమికి రాజీనామా యిప్పమని నచ్చజెప్పి ఒప్పించాలి. మొదట ఒప్పుకోడు. ఎకరమో, అరో ఖష్కి దానమిస్తానంటే ఒప్పుకోవచ్చు. అప్పుడు భూమి అమ్మకానికి చూపితే నాలుగు రాళ్ళు వొస్తాయి. తన గండం గట్టెక్కుతుంది. ఈ వ్యవహారమంతా ఎంతో చాకచక్యంతో నడపాలి. దీనికి కరణం రామచంద్రయ్య సహాయం తనకు ఎంతైనా అవసరం. రఘునాథపల్లెకు వెళ్ళగానే అతన్ని ముందు పట్టుకోవాలి. ఇల్లాంటి దగుల్బాజీ వ్యవహారాల్లో అతను దక్షుడు. అతనికి ఏదో ఆశపెట్టి వ్యవహారం సానుకూలం చేయించుకోవాలి. గుట్టుగా గ్రామంనుంచి బయటపడాలి. దానితో ఆ గ్రామానికీ, తమకూ మధ్యగల సంబంధ బాంధవ్యాలు తెగతెంపు లవుతాయి.

రఘునాథపల్లె, తెలంగాణాలో ఒక మారుమూల లోని కుగ్రామం. ఆ గ్రామం ఇంకా సభ్యతకు కన్ను విప్పలేదు. భూసంస్కరణలకు సంబంధించిన వార్తలు ఇంతవరకు అక్కడికి ప్రాకలేదు. ఇంకా రోజులు జరిగితే పరిస్థితులు ఈ విధంగా వుండవు. విషమ పరిస్థితులు ఏర్పడక ముందే, వున్న ఆ కాస్త భూమి అమ్ముకోవడం శ్రేయోదాయకం. ఇంకా రోజులు గడిస్తే భూముల ధరలు మరీ పడిపోతాయి. దున్నేవాడికే భూమి అనే నినాదం అక్కడక్కూడా ప్రాకుతుంది. అప్పుడు భూములు కొనడానికి రైతులెవ్వరూ ముందుకురారు. భూమి అమ్మివేయడం ఇప్పటికే ఆలస్యమైంది. ఇంకా జాప్యంచేస్తే అసలుకే మోసం వస్తుంది. ఛాయ పెళ్ళి నిశ్చయించుకోవడం మంచికే వచ్చింది. లేకపోతే భూమి అమ్మవలసిన అవసరం అసలు ఏర్పడేదికాదు.

రంగారావు మానసికంగా ఒక గడ్డు సమస్యను పరిష్కారం చేసి, స్టేషన్ గడియారం కేసి చూచాడు. పదిగంటల అయిదు నిమిషాలు అయింది. పదిగంటలకి తను ప్లాటుఫారం మీదికి వచ్చాడు. ఒక అయిదు నిమిషాల్లో రఘునాథపల్లె చుట్టివచ్చాడు. ఎందుకో, రంగారావుకు మానసిక కాలానికి, భౌతిక కాలానికీ ఎంతో తేడా కనపడింది. మానసిక కాలం ఇట్టే వాయువేగంగా పరుగెడుతుంది. భౌతికకాలం వున్న చోటునే వుండిపోతుంది. ఒకవేళ నడిచినా మందకొడిగా నడుస్తుంది. ఈ భేదం ఎందుకుంటుందో అతని కేమీ అర్థం కాలేదు.

రైలు... బస్సు... కాని నడకను ప్రయాణంచేసి రంగారావు సాయంత్రానికల్లా రఘునాథపల్లె చేరుకున్నాడు. తెచ్చిన చేతిసంచి తమ షావుకారు ఇంట్లో పడేసి, కాళ్ళూ చేతులూ కడుక్కొని తిన్నగా కరణం రామచంద్రయ్య ఇంటికి బయల్దేరాడు. రామచంద్రయ్య ఇంటి వాకిలి గుమ్మానికి రెండువేపులా రెండుపెద్ద అరుగులున్నాయి. రామచంద్రయ్య ఒక అరుగుమీద కూర్చొని ఒక రైతుతో ఏదో వ్యవహారాన్ని గూర్చి మాట్లాడుతున్నాడు. తనను చూడడంతోనే చేతులు జోడించి "రండి, పంతులుగారు, ఇదేనా రాకడ?" అని పరామర్శించాడు. రంగారావు "దీర్ఘాయుష్మమస్తూ" అని, ఏవో కుశల ప్రశ్నల్లోకి దిగాడు. రామచంద్రయ్య ఇంగితం గ్రహించి ఏవో నాలుగు మాటలు చెప్పి, తనతో కూర్చున్న రైతును పంపించివేశాడు. ఆ వెంటనే రంగారావు వేపు తిరిగి, "ఇక చెప్పండి" అన్నట్లు చూశాడు.

తను ఏ పనిమీద ఆ గ్రామానికి వచ్చిందీ రంగారావు సవివరంగా చెప్పాడు. "మీ సహాయం లేకపోతే, ఈ పని ఏ మాత్రం సానుకూలం కా"దని కూడా హెచ్చరిక చేశాడు అతను.

"దానికేమి లెండి. ఉదయమే మల్లయ్యని పట్టి తెప్పిద్దాం" అన్నాడు రామచంద్రయ్య జవాబుగా.

"అలా అంటే కుదరదు - ఇది మీరు స్వంతపనిగా భావించాలి. మల్లయ్యతో రాజీనామా ఇప్పించి మంచి ధరకు ఆ భూమిని కాస్తా అమ్మించి పెట్టాలి" అని రామచంద్రయ్య చేయవలసిన పనిని, విస్పష్టపరిచాడు రంగారావు.

"ముందు మల్లయ్య దగ్గరినుంచి రాజీనామా రాబట్టుకోవడం, మనకు చాలా ముఖ్యం - ఆ తరువాత భూమి అమ్మకం అంటారా? అది అవలీలగా నిమిషాల్లో జరిగి పోతూంది. ఈ వూరి రైతుల దగ్గర మంచిధర పలకకపోతే, పొరుగూళ్ళనుంచి రైతుల్ని పిలిపిద్దాం" అన్నాడు రామచంద్రయ్య రాజీనామాకి సంబంధించిన వ్యవహారానికి ఎక్కువ ప్రాముఖ్యత యిస్తూ.

"ఈ వ్యవహారంలోంచి నన్ను ఎలాగైనా గట్టెక్కించండి. మీచేతులతోనే ఛాయ పెళ్ళి చేసినవారవుతారు. కాగా మీ కష్టం నేనేమీ ఉంచుకోను. అణాపైసలతో సహా చెల్లించు కుంటాను" అన్నాడు రంగారావు, చల్లకొచ్చి ముంత దాచుకోవడం దేనికనే ధోరణిలో.

తను రెండువందల రూపాయలు రామచంద్రయ్యకు యిచ్చేటట్టూ, అతను మల్లయ్య దగ్గర రాజీనామా యిప్పించి, ఆ పొలం, మూడు వేలూ, నాలుగువేలకి మధ్య అమ్మించి పెట్టేటట్టూ, అన్ని విషయాలు ముఖాముఖిగా మాట్లాడుకొని, రామచంద్రయ్యతో రంగారావు ఒక ఒప్పందానికి వచ్చాడు.

"ఈ రాత్రికి మీరు నిశ్చింతగా వుండండి. రేపీపాటికి మీ వ్యవహారం ఫైనల్ కాకపోతే, నన్ను మారుపేరుపెట్టి పిలవండి" అన్నాడు రామచంద్రయ్య చివరిమాటగా.

"అయితే, నాకింక సెలవిప్పించండి" అని లేచాడు రంగారావు.

"సెలవు, నమస్కారాలు" అంటూ రామచంద్రయ్య కూడా లేచాడు అరుగుమీది నుంచి.

"దీర్ఘాయుష్యమస్తు" అని కదిలాడు రంగారావు అక్కడనుంచి. మరునాడు ఉదయం ఎనిమిది గంటలకల్లా, రంగారావు కాలకృత్యాలు తీర్చుకొని, టీ తాగి, కరణం రామచంద్రయ్య ఇంటికేసి వెళ్ళాడు. రామచంద్రయ్య తన ఇంటిముందు అరుగుమీద కూర్చొనివున్నాడు. అప్పటికే కావలివాడిని పంపి, మల్లయ్యని పట్టి తెప్పించాడు. ఎందుకో రంగారావుకు ఎడమకన్ను అదిరింది. నిర్లక్ష్యంగా ముందుకు నడిచి, వెళ్ళి అరుగుమీద కూర్చున్నాడు. రామచంద్రయ్య నమస్కారాలకి "దీర్ఘాయుష్యమస్తు" అని ఆశీర్వదించాడు.

రంగారావుని చూసీ చూడడంతోనే "దండాలు పంతులుగారూ" అన్నాడు. మల్లయ్య - ఎందుకో రంగారావు జవాబుగా 'దీర్ఘాయుష్యమస్తు' అని అనలేకపోయాడు.

"రెండు సంవత్సరాలనుంచి కౌలుగింజలు కౌలవడం లేదు-మంచిగ బాకి గల్లా (ధాన్యం) కోసం వచ్చాడు పట్నంనుంచి. వెంటనే గల్లాయిచ్చి పంపటంకోసం ఫైనల్ చేసుకో" అన్నాడు రామచంద్రయ్య నాందీప్రస్తావనగా మల్ల [illegible].

"ఇప్పుడు గల్లా యాడికెల్లి ఎల్లుతది దొరా నాదగ్గర - నాలుగురోజు లాగితే మొత్తం గల్లా గొలుస్త" అన్నాడు మల్లయ్య దీనంగా.

"రేపు రేపు అంటూ రెండు సంవత్సరాలు దాటేశావు. ఇంకా మిగ్గిన్న వ్రూమ్మాలకి ఎగనామం పెడతావు?" అని అడిగాడు రామచంద్రయ్య నిక్కచ్చిగా.

"కుంట గండిబడ్డది-పొలంలో చారెడీత్తులు (గింజలు) పండుతులేవు. బాయి బెట్టెబడి పోతున్నది. ఇంక యాడికెల్లి గొలుస్తు దొర గల్లా?" అని మల్లయ్య సంగతి సందర్భాలు వివరించాడు.

"బొత్తిగా లాభం లేకపోతే బావి వదిలేసెయ్యి-ఎంకెవరికైనా కౌలుకిచ్చుకుంటాడు పంతులు" అని సూచించాడు రామచంద్రయ్య.

"ఆ బాయికాడ బుట్టి, ఆ బాయికాడ పెరిగిన-సస్తే ఆ బాయి గడ్డమీదే సావాలె. గిప్పుడు (ఇప్పుడు) యేమి మొకం బెట్టుకొని వదిలెయ్యమంటవు దొరా?" అని అడిగాడు మల్లయ్య సూటిగా.

ఆ ప్రశ్నకి రంగారావు మనస్సు కలుక్కుమంది. కాని అతను ఏమీ కల్పించుకోలేదు మధ్యలో.

"నీ వెధవ వేషాలు నాదగ్గర సాగవు. కొలిస్తే బాకీ గింజలు వెంటనే కొలువు. లేకపోతే వెంటనే భూమికి రాజీనామా ఇవ్వు" అని నిష్కర్షగా చెప్పాడు రామచంద్రయ్య.

"మా తాతలకాడినుంచి ఆ బాయిజేస్తున్నం. గిప్పుడు బాయి యిడిసిపెట్టి యాడికి పోను దొరా?" అని అడిగాడు మల్లయ్య, తన కేదైనా ప్రత్యుకుతెరువు చూపించ మన్నట్లు జాలిగా. ఆ వాక్యానికి రంగారావు హృదయం అమాంతంగా కరిగింది. "వీడిని పీడించడ మెందుకు. వదిలివేతాగూ" అనుకున్నాడు మనస్సులో-కాని ఛాయ పెళ్ళి, ఒక పెద్ద సమస్యగా మారి అతని కళ్ళముందు ఆకాశం ఎత్తున లేచింది. దానితో రంగారావు హృదయం చప్పున గడ్డకట్టింది.

"పోనీ, సొమ్మూ సంబంధం, గొడ్డూ గోదా ఏమైనా వుంటే వెంటనే అమ్మి బాకీ చెల్లించు" అన్నాడు రామచంద్రయ్య మల్లయ్యని.

"నా తాన (దగ్గర) సొమ్ము, గిమ్ము యాడుంది దొరా - పొల్ల (అమ్మాయి) పెండ్లికి వలిశంత అప్పుజేసిన-అప్పులోళ్ళువచ్చి రెండుకోడెలు గొటుక పోయిన్రు. ఒక యెద్దు నాం దిని సచ్చింది. గిప్పుడు ఒక బక్క దున్నపోతున్నది నాతాన" అన్నాడు మల్లయ్య జవాబుగా.

"వీడు మంచి మాటలతో ఏమాత్రం వినేట్టులేదు. ఇంక చూస్తారెందుకు? వంగబెట్టి వీపుమీద బండ పెట్టండి" అని రామచంద్రయ్య ఆగ్రహావేశంలో కావలి వాళ్ళని ఉద్దేశించి అన్నాడు.

"నీ కాలు మొక్కుత (కాళ్ళకు మ్రొక్కుతూ) నా ఇజ్జత్ (పరువు) తీయకు దొరా, నా ఇజ్జత్ తీయకు దొరా" అని కంట నీరు పెట్టాడు మల్లయ్య. ఇద్దరు కావలివాళ్ళు మల్లయ్యని పట్టుకొని, అతన్ని వంగబెట్టి, వీపుమీద ఒక బండ పెట్టారు. మల్లయ్య వాళ్ళని ఏమీ ఎదిరించలేదు. యజమానికి మచ్చికపడ్డ గొడ్డుకుమల్లే లొంగిపోయాడు ఆ యిద్దరికీ - ఆ తరువాత మల్లయ్య అవమానంతో ఇటూ, అటూ ఎవ్వరినీ చూడలేదు. నేలకేసి చూస్తున్న అతని మొహం నేలకేసి చూస్తూనే వుండి పోయింది. భూమిపైన ఏకధారగా అశ్రువులు రాలడం మొదలెట్టాయి.

రామచంద్రయ్య ఆ వ్యవహారాన్ని అంతటితో తాత్కాలికంగా ఆపి, ఇంకొక వ్యవహారంలోకి దిగాడు యాంత్రికంగా.

రంగారావు మొహంలో కత్తి వేసినా నెత్తురు చుక్క లేదు. కూర్చున్నవాడు కూర్చునే వుండిపోయాడు.

కొంతసేపటికి కడవలతో నీళ్ళుపోసినట్టు మల్లయ్యకి చెమటలు కారడం మొదలెట్టాయి. అవమానభారంతో కరిగి నీరౌతున్నాడా అనిపించింది రంగారావుకు. అతను మల్లయ్య కేసి చూడడం మాని ఇంకొకవేపు చూడడం ఆరంభించాడు.

మల్లయ్యకి మరీ నీరసం ఎక్కువైంది. దానితో తల తిరగడం ఆరంభించింది. కళ్లు చీకట్లు కమ్మాయి. వెంటనే స్పృహతప్పి కుప్పగా కూలాడు మల్లయ్య బండతోసహా.

మల్లయ్య పడిపోవడంతోనే, అక్కడున్న ప్రజ, మల్లయ్య చుట్టూ మూగింది. కొందరు అతన్ని ఎండలోంచి నీడకి తీసుకువెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు. మరి కొందరు "వద్దు, వద్దు" అని వారిస్తున్నారు.

మల్లయ్య పడిపోవడంతోనే, రంగారావు రామచంద్రయ్యలు, అమాంతంగా అరుగు మీదనించి క్రిందికి దూకి, అతను పడిపోయిన చోటుకి పరుగెత్తారు. ఊపిరి సలుపదేమోనని భయపడి, జనాన్ని కొంచెం దూరంగా జరిపారు. ఒకరిని నీళ్ళకోసం పరుగెత్తించారు. ఇంకొకరిని అతని భార్యదగ్గరికి తరిమారు.

మొహంమీద నీళ్ళు చల్లిన కాసేపటికి కొద్దిగా స్పృహ వచ్చింది మల్లయ్యకు.

"ఇజ్జత్ పోయింది. ఇంక బతికేమి లాభం?" అంటూ గొణుక్కున్నాడు మల్లయ్య ఆ మైకంలోనే.

రంగారావుకి ఆ గొణుగుడికి కళ్ళ నీళ్ళ పర్యంతమైంది.

"పాపం-పట్టుమని పది మెతుకులు తిని ఎన్నిరోజులైందో!" అంటున్నారు ఎవ్వరో ఆ గుంపులో.

ఆ వాక్యం రంగారావు చెవిని పడింది. మల్లయ్య అంత బీదరికం అనుభవిస్తున్నాడని అతనికి తెలియదు.

ఇంతలోకే మల్లయ్య భార్య మల్లి - "ఏమైంది మామా?" అని గొల్లున ఏడుస్తూ అక్కడికి పరుగెత్తుకొచ్చింది. మల్లిని చూడడంతోనే చుట్టూ మూగిన జనం ఆమెకి దారి యిచ్చారు.

మల్లి, మల్లయ్యని సమీపించి చెంబులోని నీళ్ళు చేతితో మొహంమీద వత్తుగా చల్లింది. కొంగుతో మల్లయ్య మొహం తుడ్చింది.

"ఇజ్జత్ పోయింది పిల్లా" అంటున్నాడు మల్లయ్య ఇంతలోకే ఎవరో చేడి పాలు తీసుకువచ్చి, మల్లికి అందించారు. మల్లి పాలగ్లాసు మల్లయ్య నోటి దగ్గరికి తీసుకు వెడితే, అతను వద్దన్నట్లు మొహం తిప్పుకున్నాడు.

"మల్లయ్య! కొంచెం పాలుతాగు" అని అన్నాడు రంగారావు. గుంపులో ఒకరిద్దరు కూడా అదేమాట అన్నారు. కాని మల్లయ్య చాళ్ళ మాటలు వినిపించుకోలేదు. పాలు తాగనూ లేదు.

"లే మామా మనింటికి పోదాం లే" అని మల్లి తన మెడచుట్టూ అతని చెయ్యి వేసుకొని, మల్లయ్యని నెమ్మదిగా లేపింది. మల్లయ్యని లేపడంలో మల్లికి యిద్దరు ముగ్గురు మనుషులు సహాయం చేశారు

"పొదాం పాపిల్లా" అంటూ నెమ్మదిగా కదిలాడు మల్లయ్య.

నెమ్మదిగా నడిపించుకుంటూ, మల్లి, మల్లయ్యని యింటికి తీసుకెళ్ళింది. రంగారావు కూడా మల్లయ్య యింటిదాకా వెళ్ళివచ్చాడు.

"జర్రంత గట్కు తాగుతావు మామా" అని అడిగింది మల్లి. ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్ళిపోగానే.

"గింజలు యాడికెల్లి దీసుకొచ్చినవు?" అని అడిగాడు మల్లయ్య మల్లిని ఆతురతగా.

"యెల్లవ్వ జర్రన్ని సజ్జగింజలు పెట్టింది." అన్నది మల్లి సమాధానంగా.

"నా కొద్దు పిల్లా - నా మనస్సు బాగలేదు. నువ్వు జర్రంత దాగి, బుడ్డోడికి పెట్టు" అన్నాడు మల్లయ్య.

"నిన్న పొద్దుగల్లి దాగిన గట్క - జర్రంత దాగుమామా!" అని మల్లి ప్రాధేయపడ్డది.

మల్లి మాటని తోసెయ్యలేకపోయాడు మల్లయ్య. ఏదో ఎంగిలిపడ్డాడు, ఆ పక్కమీదే మల్లిని సంతృప్తిపరిచే ఉద్దేశంతో.....

తండ్రిని, ముగ్గురు నలుగురు మనుషులు పట్టుకు రావడం చూచి, ఏదో జరిగిందని ఊహించి, క్షణం యింట్లో వుండని మూడేళ్ళ కుర్రవాడు రామయ్య. ఆనాడు తండ్రి పక్కదగ్గరినించి కదలలేదు.

"నేను పెద్దల ఇజ్జత్ పోడగొట్టిన, బుడ్డోడా నువ్వన్న నిలబెట్టాలే" అన్నాడు మల్లయ్య బుడ్డోడిని దగ్గరికి తీసుకుంటూ.

"ఏంది మామా ఆ మాటలు?" అంది మల్లి కళ్ళల్లో నీళ్ళు నింపుకుంటూ.

మల్లయ్య కాసేపు మధ్యాహ్నం పడుకోవడానికి ప్రయత్నించాడు. కాని అతనికి ఏమాత్రం నిద్రపట్టలేదు. ఉండి ఉండి, ఉదయం జరిగిన సంగతులే మాటిమాటికీ జ్ఞాపకం రావడం మొదలెట్టాయి అతనికి. పక్కమీద ఇటూ, అటూ పొర్లుతూ కాలం గడిపాడు.

సాయంత్రం చీకటి పడుతుండగా పక్కమీదినుంచి లేచాడు మల్లయ్య.

"యాడికి మామా?" అని మల్లి అడుగుతూనే వుంది. కాని మల్లయ్య మల్లిమాట వినిపించుకోలేదు ఒక ఇత్తడి చెంబు చంకలో పెట్టుకొని, భుజాలమీది నుంచి చెంబు కనపడకుండా ఒక దుప్పటి కప్పుకొని, నీరసంగా యింట్లోంచి బయల్దేరాడు మల్లయ్య. అతను ఎక్కడికి వెడుతున్నదీ మల్లి ఇట్టే గ్రహించింది. "మనస్సు బాగలేదు. పోనియి" అనుకొని మౌనం వహించింది మల్లి.

రాత్రి ఎనిమిది దాటిన తరువాత మల్లయ్య యింటికి తిరిగివచ్చాడు. చెంబు తిరిగి రాని సంగతి మల్లి ఇట్టే పసికట్టింది. చెంబు కుదువబెట్టి భర్త తాగివచ్చాడన్న సంగతి అపలీలగా తెలుసుకుంది.

"పిల్లా, బుడ్డోడు పండుకున్నాడా?" అని అడిగాడు మల్లయ్య వచ్చీ రావడంతోనే.

"ఆఁ" అంది మల్లి జవాబుగా.

"నువ్వు బుక్కెడు గట్కు తాగినావా?" అని అడిగాడు మల్లయ్య ఆతురతతో.

"ఇంక గట్కు యాడిది మామా? యెల్లవ్వ తాన దెచ్చిన గింజలు పొద్దునట్టె అయిపోయినయి" అంది మల్లి అనునయంగా.

"పోనీలే ఈ పూటకు మనకు పాప్తం (ప్రాప్తం) లేదు" అన్నాడు మల్లయ్య వేదాంతి ధోరణిలో.

"పిల్లా!"

"ఊఁ"

"ఒకమాట జెపుత యింటావు?"

"యేంది మామా?"

"పొల్ల పెండ్లికి దుచ్చిన చీర (చీర) గట్టుకొని, జెర్ర ఆ అద్దాల రయికెను దొడుక్కో" అన్నాడు మల్లయ్య ప్రేమ ఉట్టిపడుతున్న కంఠంతో.

"ఊర పొద్దుగూకలేదు ఏంది మామ ఈ సరసాలు" అని ప్రణయకోపాన్ని నటించింది మల్లి.

"కట్టుకోకపోతే బుడ్డోడి మీద ఒట్టే" అని బలవంతపెట్టాడు మల్లయ్య.

విధిలేక మల్లి అమ్మాయి పెళ్ళినాడు తనకు భర్త తెచ్చిన ఆకుపచ్చ చీర కట్టుకొని, అద్దాల రవిక తొడుక్కుంది. ఒయ్యారంగా వచ్చి పక్కలో వాలింది.

"వనలచ్చిమి వోలున్నవు" అన్నాడు మల్లయ్య, మల్లిని గట్టిగా ముద్దు పెట్టుకొంటూ.

"బుడ్డోడు పండుకున్నడో, లేదో జర్రసూడు" అని హెచ్చరిక చేశాడు మల్లయ్య కొద్దిసేపటికి.

"మెసుల్తున్నడు మామా!" అని అంది మల్లి కొంటిగా.

మల్లయ్య ఒక నిమిషంపాటు కుర్రవాడిని పరీక్షించి చూచాడు. కుర్రవాడు ఒళ్ళు తెలియకుండా నిద్రపోతూ ఉండడం గమనించి, అతని మనస్సు కుదుటబడింది.

"అబద్దాలాడుతున్నావ్ పిల్లా."

"లేదు మామా, పండుకో లేదనుకున్నా."

"పిల్లా! నీ యన్ని దొంగ ఎత్తులే"

ఆ వాక్యానికి మల్లి ఆకాశం ఎత్తున ఉప్పొంగిపోయింది .

రాత్రి రెండు జాముల తరువాత మల్లయ్య చడీచప్పుడూ లేకుండా పక్కమీద నుంచి లేచాడు. మల్లి పక్కలో మైమరచి నిద్రపోతున్నది. చీకూ చింతా లేకుండా కుర్రవాడు నిద్రపోతున్నాడు. మల్లయ్య తిన్నగా కుర్రవాడి మీదికి వాలి అతన్ని తేలికగా ముద్దుపెట్టుకున్నాడు. మల్లి లేస్తుందేమోననే భయం కొద్దీ ఆమె దగ్గరికి వెళ్ళలేదు. దూరంగావుండి తదేక దీక్షగా ఆమె మొహంలోకి ఒక నిమిషంపాటు పరికించి చూశాడు. ఆ తరువాత ఒక తాడుతో సహా నెమ్మదిగా పక్కగదిలోకి వెళ్ళాడు. గది తలుపులు బంధించి వేశాడు. ఇంక ఆ గదిలోంచి చెలుపలికి రాలేదు

మల్లి తెల్లవారుజామున మగత నిద్రలో అలవాటు ప్రకారం పక్క తడిమి చూసుకుంది. పక్క ఖాళీగా వుండడం గమనించి, దిగ్గునలేచి కూర్చుంది. అవతలి కెళ్ళాడో, ఏమోనని కాసేపు భర్త కోసం నిరీక్షించింది. ఎంతకూ రాకపోవడంతో లేచి యిల్లంతా వెతికింది. పడమటి గదిలోపల గడియవేసి వుండడం గమనించి, ఒక్కసారే గొల్లుమంది. ఆ ఏడ్పులకి పొరుగున వున్న నాలుగు యిళ్ళవాళ్లూ మల్లి యింట్లో పోగైనారు. పడమటి గది తలుపులు బద్దలుకొట్టారు. మల్లయ్య లోపల దూలానికి వ్రేలాడుతూ వున్నాడు.

"ఇజ్జత్ పోయింది. పాపం మల్లయ్య ఆత్మహత్య చేసుకున్నాడు" అన్నారు అందరూనూ. మల్లి ఏడ్పులు ఊరంతా ప్రతిధ్వనించాయి.

రెండురోజుల వరకూ, రఘునాధపల్లె పోలీసు అధికారుల రాకపోకలతో హడావుడిగా వున్నది.

ఎవ్వరి ప్రేరేపణతో కూడా ఆ ఆత్మహత్య జరుగలేదని నిరూపించడానికి, రామచంద్రయ్య తలప్రాణం తోకకు వచ్చింది. రంగారావు, రామచంద్రయ్యలు చెరి రెండు వందలు తడిపి ఎక్కడి వ్యవహారం లక్కడే సర్దేశారని ఆ డబ్బో గిట్టనివాళ్ళు చెప్పుకుంటారు.

బ్రతుకు జీవుడా అని నాలుగు రోజుల తరువాత రంగారావు తిరిగి పట్నం చేరుకున్నాడు. "ఊరికి వెళ్ళావేమో, ఏమైందిరా?" అని తల్లి అడిగితే, "ఛాయకి పెళ్ళి అయ్యేయోగం లే" దని నిక్కచ్చిగా చెప్పాడు. మీ సంబంధం మాకు నచ్చలేదని తెలుపుతూ పెళ్ళి కొడుకు వాళ్ళకి ఉత్తరం వ్రాసిపడేశాడు రంగారావు.

ఇప్పటివరకూ ఆ పొలం అమ్ముడు పోనూలేదు ఛాయ పెళ్ళి ఇంతవరకూ జరగనూ జరగలేదు.

# 28. తల ఎత్తని కస్తూరి

♦ ఇల్లిందల సరస్వతీదేవి ♦

"ఆటో - బాదుగకు వస్తావా?"

సన్నగా తుప్పర పడుతున్నది. తలమీద చేతులు పెట్టుకుని రెండుసార్లు అడిగాడు పుందరి.

"ఎక్కడికి?" చదువుతున్న పుస్తకం మూసి తలెత్తాడు డ్రైవరు.

"రామకృష్ణాపురం బస్టాండు దగ్గరికి."

"చాలాదూరం. వచ్చేటప్పుడు ఊరికేరావాలి. మీటర్‌మీద రెండు రూపాయ లివ్వండి" డ్రైవరు మళ్ళీ పుస్తకం తెరిచాడు.

"అటువైపు ఆటోలున్నాయి రండి" తల తడవకుండా కొంగు కప్పుకుంటూ నసుగుతూ కస్తూరి రోడ్డు దాటింది.

తుప్పర పర్వంలోకి దిగింది. వెంకటరమణ థియేటరు ముందర వచ్చేజనం, పోయేజనం. రద్దీ ఎక్కువవుతున్నది. చీరెలు తడిసిపోతున్నాయని థియేటరు వరండాలోకి పరుగులు తీస్తున్నారు స్త్రీలు. థియేటరులోనుంచి బైటికి వచ్చినవాళ్ళు రిక్షాలకోసం, ఆటోలకోసం ఉరుకులు పెడుతున్నారు.

దారిసపొయ్యే జనమ్మీద బురదచిమ్ముకుంటూ కార్లు దూసుకుపోతున్నాయి.

పుందరి మళ్ళీ మొదటి ఆటో దగ్గరికి వచ్చాడు.

"మీరు ఇంతకుముందు ఒకసారి అడిగారు. నేనడగింది మీటరుమీద రెండు రూపాయలు. అదికూడా చాలా తక్కువ. చదువుతున్న పుస్తకాన్ని సొరుగులోకి నెట్టాడు డ్రైవరు.

పుందరి చేతిసైగ చెయ్యగానే ఆటో ఎక్కింది కస్తూరి. పుందరి అమ్మయ్య అనుకున్నాడు.

పెద్ద చప్పుడుతో వాహనాల మధ్య చోటుచేసుకుంటూ, మాట్లాడుకుంటూ రోడ్డుకు మధ్యగా నడిచే జనాన్ని తప్పించుకుంటూ సాగిపోతున్నది ఆటో.

బస్సులు కంటికి కనపడినప్పుడల్లా పుందరి మనసు ఉసూరుమంటున్నది. ఎంతసేపు నిలబడినా రామకృష్ణాపురం వైపు వెళ్ళే బస్సు రాలేదు. ఇంకా కొంచెంసేపు నిలబడితే అందేదేమోనన్న ఆశ అతడి మనసులోనుంచి పోలేదు. సినిమా టికెట్లకంటే

రాకపోకల ఖర్చు మించిపోయిందన్న బాధవల్ల ఆ చిత్రం చూసిన ఉత్సాహం నీరుకారి నట్లవుతోంది.

కస్తూరిని 'ఆమె కన్నీరు' చిత్రంలో కథానాయిక పడ్డ బాధలు మనసును కలిచి వేస్తున్నాయి. 'ఆమె కన్నీరు' జీవితమంతా కారుతూనే వుంది. ఆమె జీవితమంతా కార్చిన కన్నీరు కస్తూరి మూడుగంటలసేపు చూడలేకపోయింది. ఆమె కన్నీటిని తుడిచే వారెవరూ లేరు. 'అయ్యోపాపం' అనేవారేకాని ఆమె కన్నీటిని తుడిచే సాహసం ఎవరికీ లేదా? సంస్కర్తలూ - అభ్యుదయవాదులూ - సామాజిక స్పృహగలవారూ - పురోగాములూ ఎవరూ లేరా? ఉంటే ముందుకు రారేం? అయితే ఈ సమస్యకు పరిష్కారమార్గమే లేదా?

కస్తూరి మనసు సుళ్ళు తిరుగుతున్నది. పరిష్కారమార్గం చూపలేనివాళ్ళు ప్రజానీకానికి అటువంటి సమస్యను కళ్ళకు కట్టినట్టు ఎత్తిచూపించి ఏం ప్రయోజనం?

సమస్య అర్థమవుతోంది. కాని పరిష్కారం లభించదు. ప్రేక్షకులకు కప్పదాటు స్వభావం కలగటానికి కారణమవుతోంది.

సృష్టిలోని స్త్రీలందరిమీదా ఒకవిధమైన జాలీ - ఏవగింపూ కలుగుతున్నాయి. అటువంటి పరిస్థితులు ఎదురయిన వాళ్ళ జీవితాలు ఇంతేనా అనిపిస్తోంది. తప్పెవరిది? ఎవరు బాధ్యులు? ఈ ప్రశ్నలకు సమాధానాలుండవా?

తన తల్లి స్త్రీ. తను స్త్రీ. తనబిడ్డ స్త్రీ. సృష్టికి మూలం స్త్రీ.

కస్తూరి మనసు బాధతో బరువెక్కుతోంది.

తడిసి కుచ్చులు కుచ్చులుగా ముఖమ్మీద పడుతున్న తలవెంట్రుకలను పైకి తోసుకుంటూ రేపటి సంగతిని గురించి ఆలోచిస్తున్నాడు పుండరి. వెధవ జీవితాలు. నెలకొక సినిమా చూస్తేనే బడ్జెటు తలక్రిందులవుతుంది. ఇవాళ పదిహేనో తారీఖు. ఈ నెలయ్యే లోపల మరేదయినా ఖర్చు వస్తే పరిస్థితి చెయ్యిజారిపోతుంది.

'కస్తూరీ, కస్తూరీ' నిద్రమత్తులో ఉన్నట్టుందని ఆమెను కుదిపాడు.

'నిద్రపోవటం లేదు' ఆమెకెందుకో విసుగ్గా వుంది.

"సినిమా చూడాలనుకుంటున్నావేమోనని తీసుకెళ్ళాను. వచ్చేటప్పుడున్న ఉత్సాహం ఇప్పుడు కనబడటం లేదు."

ఏముంటుంది అటువంటి సినిమా చూస్తే?"

"సినిమా చూచి, ఏడవటం, విచారపడటం నీవంటి ప్రేక్షకుల వంతు. కన్నీళ్ళతో కొంగులు తడిసిపోతాయి. మహిళా ప్రేక్షకుల మన్ననలందుకొన్న చిత్రమని నిర్మాతలు బాగా డబ్బు సంపాదిస్తారు. మీరెంత బాగా ఏడిస్తే వాళ్ళకంత డబ్బు అధికంగా వస్తుంది" సర్దుకుని కూర్చున్నాడు పుండరి.

ఆటోలోనుంచి సన్నని కూనిరాగం "దొరకునా ఇటువంటి సేవ.."

కస్తూరి మనసులో సుడిగుండాలు తిరుగుతున్నా ఆమె చెవిలో ఆ ఇంపైన కూనిరాగం బిత్తరపోయేటట్టు చేసింది. ఇదెక్కడినుంచి? 'దొరకునా ఇటువంటి సేవ' ఆ రాగచ్ఛాయలో కూనిరాగం? ఉలిక్కిపడ్డది.

పుందరి ఆటో రొదలో కూడా వినబడే ఈ కూనిరాగం ఎక్కడిదా అన్నట్టు తల బయటపెట్టి చూస్తున్నాడు.

ఒళ్లు జలదరించినట్టుగా నిటారుగా కూర్చుంది కస్తూరి.

ఆటో దిల్‌షుక్‌నగర్ దాటుతోంది.

గొంతు సవరించుకున్న చప్పుడు. మళ్ళీ ఇంకోపాట అందుకున్నట్టు రాగం మారింది.

"శంకరాభరణంలోది కదూ ఈ పాట?" బైటికి అనేశాడు పుందరి.

అప్పుడే నిద్రలోంచి లేచినట్టుగా ఆఁ ఆఁ అంటోంది కస్తూరి. భయమావహించినట్టుగా ముడుచుకుపోయింది.

రామకృష్ణాపురం బస్టాండు దగ్గర ఆటో టక్కున ఆగింది.

దానితోపాటు పాట కూడా ఆగింది. పుందరి దిగిన తరువాత కస్తూరి దిగింది.వర్షం వెలిసి గాలి వీస్తోంది మందంగా.

పుందరి మీటరు చూడటానికి డ్రైవరు చిన్న టార్చిని వెలిగించి చూపించాడు. డ్రైవరు డబ్బు తీసుకుంటుండగా కస్తూరి డ్రైవర్ని మరొకసారి పరీక్షగా చూసింది. ఆ కంఠధ్వని ఎక్కడో ఎప్పుడో విన్నట్టుగా వుంది ఆమెకు. పుందరి కాళ్ళు కదుక్కుని వచ్చేంతలోపు కస్తూరి పక్కలు సరిచేసి తన పక్కమీదపడుకుంది.

"భోజనం చేద్దాం రా" పిలిచాడు.

పీటవేసి అన్నీ పళ్ళెందగ్గర పెట్టాను. మీరు భోజనం చేయండి.

"మరి నీవు?"

"నాకు తినాలని లేదు. వికారంగా వుంది" పక్కకు తిరిగి పడుకుంది.

"నీవు కొంతకాలం సినిమాలు చూడటం మానెయ్యి. సినిమా చూస్తేనే మనసు పాడుచేసుకునేవాళ్ళను నేనెక్కడా చూడలేదు. అయినా దీనికీ భోజనానికీ సంబంధం ఏమిటి? లేచికాస్త మజ్జిగన్నమయినా తిను" అతడింకా మంచందగ్గరే నిలబడ్డాడు.

"నేను తినలేనండీ" తలెత్తి చూసి మళ్ళీ పడుకుంది. ఆమె చూపులు వేటగాడి దెబ్బతిన్న పక్షిలా వున్నాయి.

"నీవు తినలేవు. సరే బాగానే ఉంది. మరి - నాకు పెట్టటానికేం? లేచి పెట్టు. నీవు పెట్టకపోతే నేను తినను."

"అబ్బా ఏమిటీ పట్టుదలా?" కనుబొమ్మలు ముడిచి మెల్లగా లేచింది. అంతలో అతడు పళ్ళేలు పెట్టి మంచినీళ్లు పెట్టాడు.

"ఇదేమిటి? రెండెందుకు?"

"ఒకటినాకు - ఒకటి నీకు."

"అయ్యో నేను తినలేను."

"ఒంటరిగా నేనూ తినలేను" చెయ్యి పైకి పెట్టుకుని పీటమీద అలాగే కూర్చున్నాడు.

చిన్నబుచ్చుకున్న ముఖంతో ఆమె రెండు పళ్ళేలల్లో పట్టించింది

ఇద్దరూ భోజనాలయ్యాయనిపించుకున్నారు.

ఆమె ఆ సన్నటి వెలుతురులో కళ్ళు చికిలించి చేపకూర చప్పరించడం చూడ నారంభించింది.

పుందరి పక్క దులుపుకుని పడుకున్నాడు. అతడి కళ్ళకి మాత్రం నిద్రపట్టలేదు కస్తూరిని గురించి ఆలోచిస్తున్నాడు.

అంతలో కస్తూరి కెవ్వున కేకవేసింది

ఒక్క ఉదుటున లేచి 'కస్తూరీ ఏమయింది?' అంటూ పక్కి తనే మంచంమీద కూర్చుని "ఎందుకో భయపడుతున్నావు బాధపడుతున్నావు నీకొక్కదే కూర్చుంటాను నీవు నిద్రపో" తల నిమురుతూ కూర్చున్నాడు

కస్తూరికి కొంత ధైర్యం వచ్చినట్లయింది. కళ్ళు మూసుకుంది గాని మనసు గతంలోకి అడుగులు వేస్తూపోయింది.

"మణీ, నీ తల్లో పూలు మంచి వాసన వేస్తున్నాయి ఎక్కడివి?" రెండు చేతులతో మణి తల పట్టుకుని వాసన చూసింది కస్తూరి.

"మాయింట్లో పూసినవే. అమ్మ దండ కట్టింది."

"నా కిటువంటి పూలంటే ఎంత యిష్టమో చెప్పలేను"

"అయితే మీ అమ్మను కూడా మల్లెచెట్టొకటి వేసి పెంచమను"

"సర్లే, మాకే వుంటానికి చోటులేదు గాని - పూలచెట్టు పెంచటం కూడానా? మీకంటె అంత పెద్దపెరడుంది కనుక ఎన్ని చెట్లయినా పెంచవచ్చు?"

"పోనీలే, రేపటినుంచీ నాదండలో కొంతభాగం నీకిస్తాను. పూలకోసం అంత బాధపడతావేం?" భుజమ్మీద చెయ్యేసింది మణి స్నేహంతో.

"ఈ పరీక్షలయితే నీవెక్కడుంటావో నేనెక్కడుంటానో? మీ నాన్నకు ట్రాన్స్ఫరు అవుతుందన్నావు?"

"ఏమో మరి. అయితే కావచ్చు ఇక్కడున్నంతపరకూ మన స్నేహానికి ప్రమాదం రాదు. మనం విడిపోము. సరేనా?"

కస్తూరి నవ్వులో మణి నవ్వు కూడా కలిసేటప్పటికి గొల్లున నవ్వినట్లయింది.

ఆ మరునాడు కాలేజీకి వచ్చిన మణి అటూ ఇటూ చూసింది కస్తూరికోసం. కొంచెం ముందరగా వెళ్ళిననాడు కాలేజి కాంపౌండులో ఎడమపక్కగా ఉన్న చెట్టుకింద కూర్చుంటుంది పుస్తకం పట్టుకుని కూనిరాగాలు తీస్తూ కస్తూరి.

"కస్తూరీ! ఇక్కడున్నావా? ఇదిగో నీకోసం పూలదండ తెచ్చాను" వాసన చూపిస్తూ కస్తూరి చేతికిచ్చింది.

కస్తూరి దేహచ్ఛాయ నలుపే. కాని చూపులకు అందంగా కనబడుతుంది కళ్ళు అంత విశాలమైనవి కావుగాని - ఆ కళ్ళల్లో ఒక చింతకాంతి తళుక్ తళుక్ మంటుంది. ఎదుటివారికి చూడగానే ఆకర్షించేవి ఆ కళ్ళే ఆమె నాసిక కూడా

ఎటుంది చూపుకూ దీనికి ఎక్కడా పోలికలేదుగాని - నిండైన ఆ చెంపల మధ్య ఒదిగి కొనతేలి వుంటుంది. గడ్డానికి ఎడమవైపుగా ఉన్న పుట్టుమచ్చ చామనఛాయతో వర్ణగురాడే ఆ ముఖానికి అందాన్ని తెచ్చిపెట్టింది

"కస్తూరీ! అందాలభామా?" అమె చారెడు జడను చేతిలోకి తీసుకుని మెలికలు తిప్పుతారు స్నేహితులు

'సల్లటి దాన్ని తక్షేపణ చేస్తున్నారు కదూ? నేనేం చెయ్యను? బ్లీచ్ చేయించుకోనా?' ఏడుపు మొఖం పెడుతుంది కస్తూరి

"ఎప్పుడు మరీ అందంగా వున్నావు. ఆఁ.. అలాగే వుండు. కదలకు ఆఁ...కొంచెం ముఖం పైకెత్తమ్మా" అంటుంది మరొక సహాధ్యాయిని పరుగెత్తుకుంటూ వచ్చి.

"ఎందుకు? పోటో తీస్తావా? అందమైన మా కస్తూరికి దిష్టి తగులుతుంది. మరొక తోటి విద్యార్థిని కస్తూరిని చెయ్యిపట్టుకుని లాగుతుంది.

గంట మోగుతుంది అంతలో. మగపిల్లలు ఒకవైపూ - ఆడపిల్లలు ఒకవైపు గుంపులుగా గుంపులుగా లోపలికి నడుస్తారు.

ఇవాళ కనకాంబరాలూ మరువం కలిపి కట్టిన దండ తెచ్చావు. ఇది నాకెంతో ఇష్టమని నీకెట్లా తెలుసు మణీ?" ఆమె చేతిని గట్టిగా పట్టుకు నడుస్తోంది కస్తూరి.

కాలేజినుంచి ఇంటికి రాగానే మణికి బజారుకు వెళ్ళాల్సినపని తగిలింది. అర్జెంటుగా బట్టల దుకాణానికి వెళ్ళి రెండు రెవిక బట్టలు తీసుకురమ్మంది తల్లి. మణి బయలుదేరుతుంటే తోడుగా కస్తూరి కూడా వెళ్ళింది.

ఐదారు దుకాణాలు తిరిగారు. మణికి కావలసిన రంగుల్లో జాకెట్ బట్టలు దొరకలేదు ఒంకా ఇంకా ముందుకు పోతున్నారు. నేల ఈనినట్టు జనం. ఆ జనంలో ఇద్దరు కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

'ఎనిమిది కావస్తోంది మణీ. ఎన్ని దుకాణాలు తిరిగినా నీవు మెచ్చిన బట్టలు దొరకలేదు చీరెలయినా కాదు ఇంకా తిరగటానికి" కస్తూరి మందలించినట్టుగా అంది.

"పోనీలే కస్తూరీ! అమ్మ అసలు బైటికి పోనివ్వదు. ఈ పేరుమీద పంపించింది కాసేపు సరదాగా తిరుగుదాము. ఇలాంటి రద్దీ రోడ్లమీద కబుర్లు చెప్పుకుంటూ నడవడమంటే నాకెంతో సరదా ఈ శ్రీనివాసులు దుకాణంలో జాకెట్ పీసులు కొనేద్దాం ఆ బండిమీద మిరపకాయ బజ్జీలు కొని తింటూ ఇంటికిపోదాం " మణికి ఇంకా తిరగాలని సరదాగా వుంది.

మరో పావుగంటకు ఇద్దరూ తిరుగుముఖం పట్టేరు.

కస్తూరి చేతివాచీ చూసుకుంది. "అబ్బో తొమ్మిదయింది. మా అమ్మచేత ఇవాళ చీవాట్లు తప్పవు."

"నేనదే ఆలోచిస్తున్నా ఇంత ఆలస్యమైంది. కనుక కూరగాయలు కొనుక్కుని ఇంటికి తీసుకుపోతే అమ్మ కోపమంతా క్షణంలో మాయమవుతుంది "

"పద ఈ సందులోనుంచి వెళితే కాస్త చీకటిగా వున్నా తొందరగా వెళ్ళిపోతాం."

మసక వెలుతురులో సైకిళ్ళూ, రిక్షాలూ ఆ సందులో నడుస్తూనే వున్నాయి. ఒకటీ, రెండు ఆటోలు పరుగులు తీస్తున్నాయి.

మణీ, కస్తూరీ చేతులు పట్టుకుని నడుస్తున్నారు. ఇద్దరి చేతుల్లో సంచులు ఉన్నాయి. మాట్లాడకుండా నడుస్తున్నారు.

ఒక ఆటో ఆ సందు మొదట్ల ఆగి వుంది. ముగ్గురు నలుగురు తమ వెనుక నడుస్తున్నట్టుగా అనిపించి గబగబా అడుగులు వేయటం మొదలుపెట్టారు ఇద్దరూ.

ఇద్దరో ముగ్గురో తెలియదు. గభాలున ఆ అమ్మాయిలిద్దరినీ విడదీసి గుంజుకుంటూ తీసుకుపోయారు.

"వదలండి -వదలండి" భయంతో అరుస్తున్నారు. అమ్మాయిలు. అరిచి అరిచి కీచు గొంతులు పడ్డాయి. వాళ్ళను లాక్కుపోయి ఆటోలో పడేసి చెరొక పక్కా ఇద్దరు పట్టుకొని కూర్చున్నారు.

ఆడపిల్లలు అరిస్తే పదిమందీ పోగవుతారన్న అభిమానం- రౌడీల చేతుల్లో పడ్డామన్న భయం - ఏంచేస్తారోనన్న భీతావహం - ఆ యిద్దరి గుండెలూ గబగబా కొట్టు కుంటున్నాయి.

గట్టిగా కళ్ళు మూసుకున్నారు.

ఒకదాని వెంట ఒకటి ఆటోలు చప్పుడు చేసుకుంటూ పరుగులు తీశాయి.

మసక వెలుతురు ప్రసరిస్తున్న చిన్నసందులోకి నడిచాయి ఆటోలు. మణినీ, కస్తూరినీ వాళ్ళ ప్రమేయం లేకుండా ఎవరో దింపారు. వాళ్ళను పూరిపాక లాంటి ఇంట్లోకి తీసుకు వెళ్ళారు. ఆటోలు తిరిగి వెళ్ళాయి.

ఎవరెవరో లోపలికి వెళ్తున్నారు - వస్తున్నారు.

శవాలమాదిరిగా పడున్నారు ఆడపిల్లలిద్దరూ.

కాకుల అరుపులతో ఇటునుంచి అటు కదిలింది మణి. అప్పటికే కస్తూరి లేచి కూర్చుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది.

ఒకరినొకరు పలకరించుకోకుండా పెరటివైపు నడిచారు. కుండలో నీళ్ళు తీసుకుని ముఖాలు కడుక్కున్నారు. నలిగిన బట్టలను సరిచేసుకున్నారు. తల వెంట్రుకలను చేత్తో సవరించుకున్నారు. ఇద్దరూ వాకిట్లోకి వచ్చారు.

ఇది ఏ ప్రాంతం? ఇక్కడినుండి ఇల్లుచేరుకోవటమెట్లా?

ఆ యిద్దరి మనసుల్లో బయలుదేరింది ఇదే ప్రశ్న.

గడిచిన రోజున ఉన్నట్లే ఇద్దరి చేతుల్లో సంచులున్నాయి. జాకెట్ పీసుల పొట్లం మణి సంచిలో ఉంది. ఇద్దరికీ అడుగులు తడబడుతున్నాయి. ఒళ్ళు నలగ్గొట్టినట్లుగా వుంది. కాళ్ళు తేలిపోతున్నాయి.

వాళ్ళు పదిబారల దూరం నడిచేసరికి అక్కడొక ఆటో కనబడ్డది.

"ఆటో కావాలా?" అడిగాడు తల పైకిపెట్టి. కస్తూరి చూస్తూ నిలబడిపోయింది. మణి ఆలోచిస్తోంది. తమ ఇళ్ళకు దారెటో తెలియదు. ఆటోలో పోతే నయమనుకుంది. ఆటోలో పోదాం రా" చెయ్యి పట్టుకుని ఆపింది.

ఆటో డ్రైవరుపంకే నిశితంగా చూస్తోంది కస్తూరి. ఆ కంఠధ్వని ఎక్కడో విన్నట్టుంది. అతడినికూడా ఎక్కడో చూసినట్టనిపిస్తోంది.

"మణీ, మనం ఇంకాస్తదూరం నడిచివెళ్దాం పద. ఎక్కడ నడవలేకపోతే అక్కడే ఓ రిక్షా మాట్లాడుకోవచ్చు."

మణి చేతిని విడిపించుకుని కస్తూరి ముందడుగు వేసింది.

జడ విసురుకుంటూ మణికూడా ఆమె వెంట నడిచింది. నడి బజార్లోకి వచ్చేవరకూ ఇద్దరూ పరుగెత్తినట్టుగా నడిచారు. అక్కడినుంచి రిక్షా తీసుకుని ముందు మణి యింటికి వెళ్ళారు.

"నిన్న సాయంకాలమనగా ఇల్లు వదిలి బయలుదేరిన దానవు - ఇప్పుడా ఇంటికి రావటం? ఎక్కడికి వెళ్ళావు? రాత్రంతా ఎక్కడున్నావు? నీకోసం రాత్రి నాన్న తిరిగి తిరిగి పదుకొండుగంటలకు ఇంటికి వచ్చారు తెలుసా?" మణి తల్లి సుందరమ్మ కళ్ళెర్ర జేసుకుంటూ ముందుకు వచ్చింది.

"అమ్మా! మార్కెట్లోకి వెళ్ళగానే మా స్నేహితురాలు సరోజకు చాలా జ్వరంగా వుందని వాళ్ళ తమ్ముడు కలిసి చెప్పాడు. నేనూ, కస్తూరీ చూడటానికి వెళ్ళామమ్మా. సరోజ స్పృహలో లేదు. మంచుగడ్డలు బట్టలోవేసి తలమీద పెడుతున్నారట. తలంతా తడిసిపోతుంటే ఐస్ బ్యాగ్‌కోసం అతడు బజారుకొచ్చాడట. ఇక మేము వెళతామని బయలుదేరగానే వాళ్ళ నాన్నగారు చిన్నపిల్లలు ఇంత రాత్రివేళ వెళ్ళద్దని ఆపేశారు. సరోజ తమ్ముడిని మనింటికి పంపుతామన్నారు. రాలేదా అమ్మా?" భయపడుతూ చేతులు నలుపుకుంటూ అన్నది మణి.

"అతడొచ్చి చెబితే నాన్న ఆ బజార్లన్నీ ఎందుకు తిరుగుతారు? ఈ కూరగాయల బుట్టతోటే వాళ్ళ యింటికి వెళ్ళావా?" బుట్టచేతిలోకి తీసుకుని కూరగాయలు పట్టి చూస్తూ లోపలికి తీసుకెళ్లింది.

"అమ్మా! నాన్నక్కూడా ఈ సంగతి చెప్పు. నాకు భయంగా ఉంది" అతికినట్టు అబద్ధం చెప్పిన మణి తల్లిని చూసి మణి ఒణకటం మొదలుపెట్టింది.

"చెబుతాలే. ఆయన మీనాన్న స్నేహితుడేగా?"

ఈలోగా నాలుగిళ్ళ అవతల ఉన్న తన యింటికి చేరుకుంది కస్తూరి.

కస్తూరికి తల్లిదండ్రులూ, తమ్ముడూ వున్నారు. తమ్ముడు పదవక్లాసు చదువు తున్నాడు. అతడింకా పక్కమీద మసులుతూనే వున్నాడు. తల్లి అన్నం వండి వంకాయలు తరిగి పొయ్యిమీదికి ఎక్కించింది.

"నీ స్నేహితురాలు రానిచ్చిందా తల్లీ?"

కస్తూరికి నోటమాట రాలేదు.

"ఈ భయం నీకు నిన్న ఉండాల్సింది. ఇంటికి వచ్చిన తరువాత నా ముందర ఎందుకే భయం? పద. స్నానం చెయ్యి. నీళ్ళు కాగే వున్నాయి" అంటోంది తల్లి.

గబగబా గదిలోకి వెళ్ళి బట్టలు తీసుకుని స్నానాలగదిలోకి వెళ్ళింది.

'జరిగిన ఘోరాలు ఈ అమ్మలకు తెలియవు. తెలిస్తే గుండెలు బాదుకుంటారు. ఎంత అమాయకులు? వీళ్ళకు కొంచెమయినా అనుమానం కలగనట్టులేదు లోకంలో జరుగుతున్న దుర్మార్గాలను ఊహించనైనా ఊహించరే?'

కస్తూరి ఆలోచనలకు అంతులేకుండా ఉంది కన్నీళ్ళు కారిపోతున్నాయి

"కస్తూరీ, ఇంతసేపు స్నానం చేస్తున్నావేమిటి? తమ్ముడు స్నానం చేసి భోజనం చెయ్యాలి. స్కూలుకు వేళవుతోంది" తలుపు తట్టింది తల్లి

"అదేమిటీ కళ్ళు అంత ఎర్రగా ఉన్నాయి?" కస్తూరి బైటికి రాగానే తల్లి ఆమె ముఖంలోకి చూసింది.

"సబ్బు కళ్ళల్లోకి పోయిందమ్మా" కళ్ళు ఒత్తుకుంటూ గదిలోకి నడిచింది

రాత్రి భోజనం లేదు. కడుపులో ఆకలి బాధ. శరీరమంతా సలగొట్టినట్టు నొప్పి - మనసునిండా భయం - ఆందోళన. ఏదో ప్రాణ సమానమైనది పోగట్టుకున్న బాధ - దుఃఖంతో గిలగిల్లాడిపోతున్నది కస్తూరి.

"ఈ విషయం ఎవరి చెవికైనా పడితే? ఏవయినా పదంతులు ప్రబలితే? కన్య బ్రతుకు ఎట్లా తెల్లవారుతుంది?"

"కస్తూరీ. భోజనానికి లేమ్మా. ఇవాళ కాలేజీకి వెళ్ళవా?"

'ఆలోచిస్తానమ్మా. రాత్రి వాళ్ళయింట్లో భోజనం, నిద్రా సరిగా లేవు" భోజనం చేసి మంచమ్మీద ఒరిగిపోయింది.

ఆమె కళ్ళు తెరిచేసరికి చీకటి చీకటిగా అనిపించింది

"అమ్మా గంటెంత?"

"ఆరు కావచ్చింది."

"ఇంకా తెల్లవారినట్టులేదు. ఇంకో గంట పడుకోనీ అప్పటికీ లేవకపోతే లేపు" అంటున్నాడు తండ్రి.

కస్తూరి పక్కకు తిరిగింది.

తల్లి బిగ్గరగా నవ్వినట్టు వినిసించింది.

"రాత్రి కావచ్చింది. నీకింకా నిద్ర సరిపోలేదా? లేచి చన్నీళ్ళతో ముఖం కడుక్కో. నాన్న ఆఫీసునుంచి వచ్చి ఇంకా పడుకోవటమేమిటి లేపమంటున్నారు. ఇప్పుడైనా లే" మందలించింది తల్లి.

దిగ్గున లేచి ముఖం కడుక్కుని తల్లి యిచ్చిన కాఫీగ్లాసందుకుంది కస్తూరి. పక్కకు తిరగ్గానే ఎదురుగా తండ్రి.

తండ్రిని చూడగానే కస్తూరిలో ఒణుకు మొదలైంది.

"ఎక్కడికి వెళ్ళావు రాత్రి?"

కస్తూరి చేతిలో గ్లాసు కిందపడిపోయింది.

"నన్ను చూస్తేనేనా అంత భయం? రాత్రిళ్ళు బజార్లు తిరగటానికి భయం లేదూ?" ఆయన అక్కడే నిలబడి ఆమెను నిశితంగా పరిశీలన చేయటం మొదలుపెట్టాడు.

తల్లికి చెప్పిన కథంతా తండ్రికి చెప్పింది.

"చీకటి పడగానే ఇంటికి రావలసిన పిల్లలు చీకట్లో బజార్లు తిరగటమేమిటి? అమ్మకు చెప్పే వెళ్ళావా?" నిలదీశాడు.

"మణి ఇంటికేగదా అని నేనే వెళ్ళమన్నాను. ఇద్దరూ ఎటో వెళతారని నాకేం తెలుసు?"

"చిన్నపిల్లలను చీకటి పడేవేళ ఇల్లు కదలనిచ్చిన నిన్ను అనాలి. అనాలోచితమైన పనులు చేయటం - తరువాత ఏడవటం" గిరుక్కున వెనక్కు తిరిగాడు.

కస్తూరి గుండె గుభేలుమన్నది. అంతా తెలిసినట్టూ - చూసినట్టూ మాట్లాడుతున్నాడే? చూచాయగా తెలిసిందా? లేక ఊహించాడా? ఇవాళ కాకపోతే రేపైనా పసిగట్ట గలిగినవాడే నాన్న!

కస్తూరి మనసులో ఆలోచనలు వలయాలుగా తిరుగుతున్నాయి.

నాలుగునెలల క్రిందట జరిగిన పెళ్ళిచూపులలో మూడువంతులు నిశ్చయమైనట్లే నమ్ముకున్నారు. ఈ సంగతి వింటే వెనక్కుపోతారేమో? ఆ పెళ్ళికొడుకు ముందుగానే 'మగపిల్లల కాలేజీలో ఎందుకు చదివిస్తున్నార' ని అడిగాడట. ఈ రోజుల్లో మగపిల్లలకు అనుమానాలెక్కువ.

తెల్లవారి చెప్తే కాలేజీకి వెళ్ళాలా వద్దా అన్న సమస్య ఎదురవుతుంది.

కస్తూరి గుండెల్లో రాయిపడినట్లయింది.

తనవల్ల ఈ తప్పు జరిగినట్టుగా కుంచించుకుపోతోంది. మనసులో మధన పడుతోంది.

పగలు నిద్రపోయిన తరువాత - రాత్రి సరిగా నిద్రపట్టలేదు. కళ్ళు తెరుచుకునే ఉంది. చీకట్లో చూస్తే ఏముంటుంది? జరిగిన విషయాలే కళ్ళకు కనబడటం తప్ప? ఉన్నట్టుండి ఉలికిపాటు. కళ్ళు మూస్తే కలతనిద్ర. అబ్బా. ఈ యమయాతనకు అంతమెప్పుడు.

తెల్లవారి తల్లి అడగనే అడిగింది. "అమ్మాయీ కాలేజికి వెళ్ళవా? ఇంకా అట్లా కూర్చున్నావు?"

"అక్కడ క్లాసులు కావటం లేదమ్మా. పరీక్షలు దగ్గరికొచ్చాయి. కాలేజీకి ఎవరూ సరిగా రావటం లేదు."

సాయంత్రపువేళ మెల్లగా నడిచి మణి ఇంటికి వెళ్ళింది.

"మణి లేదమ్మా. వాళ్ళనాన్నగారితో ఊరికి వెళ్ళింది" మణితల్లి తల ఎత్తకుండా జవాబిచ్చింది.

"పరీక్షలముందర ఊరికెళ్ళిందా?"

"మావాళ్ళింట్లో పెళ్ళి, నేనూ రేపు వెళ్తున్నాను."

"నాతో ఒక్కమాటయినా చెప్పలేదు."

"వ్యవధి లేదమ్మా చెప్పటానికి" ముఖం తిప్పుకుంది.

ఆరోజు ఆమె మాటలు కస్తూరిదే అంతా తప్పన్నట్టుగా ఉన్నాయి కస్తూరికి చికాకూ దుఃఖమూ ముంచుకొచ్చాయి. ఈమెకంతా తెలిసిందా? అందులో తన తప్పేముంది?

కస్తూరి గిరుక్కున వెనక్కు తిరిగింది.

ఆమె ఇంట్లోనే చదివి పరీక్ష రాయాలనుకుంది. కాని తల్లి తమ్ముడికి చదువు చెప్పమనీ, ఇంట్లో పనులు చేయమనీ పుస్తకం పట్టనీయలేదు తండ్రి బలవంతమ్మీద పరీక్ష రాసింది. ఫలితాలు తెలిసినాడు ఆమెకు ప్రాణం ఉసూరుమంది.

"పోనీ సెప్టెంబరుకయినా రాయగలదా?"

పదిరోజుల తరువాత కస్తూరికొక ఉత్తరం వచ్చింది. తనకు ఒక ఇంజనీయరుతో పెద్దకట్నమిచ్చి తండ్రి తిరుపతి కొండమీద పెళ్ళిచేసి రూర్కెలా పంపించేశాట్ట. కస్తూరిని కూడా పెళ్ళి చేస్కోమని సలహా ఇచ్చింది మణి.

రోజులు గడుస్తున్నాయి. సెప్టెంబరులో కస్తూరి పరీక్షరాసి నెగ్గింది. మళ్ళీ చదువు సాగుతుందో లేదోనన్న బెంగ.

ఆ రాత్రి గదిలో తల్లీదండ్రీ ఘర్షణపడుతున్నారు.

"ఏదో ఒక సంబంధం సెటిల్ చెయ్యండి. కాలం గడిపేస్తున్నారు" తాత్సారం చేయకుండా వెంటనే పెళ్ళి ప్రయత్నాలు చేయండి.

"ఎట్లా వస్తాయే సంబంధాలు? కాలేజీ గోడలమీద ఏం రాసి వుందో చూశావా ఎప్పుడయినా? ఆ రాతలు అందరు చదివే వుంటారు. ఆ కాలేజీలో చదివింది అమ్మాయి అనగానే సంబంధాలు వెనక్కుపోతున్నాయి ఈ మాట నీతో చెప్పలేక తప్పించుకు తిరుగుతున్నాను.

తల్లి "అయ్యో, ఇంకెలా? పెళ్ళెట్లా అవుతుంది నా కూతురికి?" అని ఏడవటం మొదలుపెట్టింది.

తల్లి అట్లా మానసికంగా అలసిపోతే ఫిట్సు వస్తాయి. "నా మూలంగా తల్లికి ఫిట్సు వస్తాయేమో? ఈ దెబ్బనుండి తేరుకోవటం కష్టమే" కస్తూరి కుప్పలా కూలిపోయింది.

రోజులు నెలలుగా, సంవత్సరాలుగా మారిపోతున్నాయి. కస్తూరి తమ్ముడు వెటర్నరీ డాక్టరయ్యాడు. ఉద్యోగం వచ్చింది. అప్పుడు తల్లిదండ్రులిద్దరూ మళ్ళీ ఘర్షణపడటం మొదలుపెట్టారు.

"వాడికి పెళ్ళిచేసి ఉద్యోగానికి పంపాలి గాని పెళ్ళిచెయ్యకుండా పంపటం నాకిష్టం లేదు" తల్లి పట్టుపట్టింది.

"దానికి చెయ్యకుండా వాడికి ఎట్లా చేస్తాం? నీవూ ఆలోచించు"

ఆమె పోరుపడలేక తన మిత్రుడిని సలహా అడిగాడు కస్తూరి తండ్రి.

"చూస్తాను. నీవు ఇవ్వగలిగిన కట్నానికి వచ్చేవాడున్నాడేమో చూస్తాను"

మిత్రుడు వెతికి వెతికి ఒక సంబంధం తీసుకొచ్చాడు.

కస్తూరి తనను చూడటానికి వచ్చిన పెళ్ళికొడుకును కళ్ళెత్తి చూసింది కడుపులో తిప్పినట్లయింది చటుక్కున చూపులు తిప్పేసుకుంది.

పెళ్ళిచూపులకు వరుడితో వచ్చినవాళ్ళు మాటల్లోపడ్డారు. పెళ్ళికొడుకు చాలా గంభీరంగా వున్నాడు.

కస్తూరి తల్లిదండ్రులు అనాసక్తంగా వున్నారు. ఈ తతంగము ఎప్పుడు పూర్తవుతుందా అని చూస్తున్నారు. పెళ్ళి కొడుకుతో వచ్చినవాళ్లు కట్న కానుల ప్రసక్తి తీసుకువచ్చారు.

"మా అమ్మాయికూడా చదువుకుంది. ఉద్యోగంచేసి డబ్బు సంపాదిస్తుంది. అన్నిటికంటె మీరు గ్రహించాల్సింది మా అమ్మాయి అందగత్తె. నేను ఐదువేలకంటే ఒక్క రూపాయి కూడా ఇవ్వను."

"సరే, మీరంత ధీమాగా మాట్లాడితే మేమేనా తక్కువతిన్నది? మాకు దొరకవా సంబంధాలు" వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి తల్లీదండ్రీ మళ్ళీ ఘర్షణ. "దీనికి పెళ్ళెట్లా" అంటూ బాగా ఘర్షణపడ్డారు. ఒక నిర్ణయానికి రాకుండానే నిద్రపోయారు.

కస్తూరికి బాగా అర్థమైపోయింది తను నాన్నకూ, అమ్మకూ కూడా చాలా భారంగా ఉన్నట్లు స్పష్టమైంది. తను వాళ్ళ గుండెలమీద కుంపటి. వయసు మళ్ళిన కన్నవారికి ఇదో పెద్ద సమస్య. ఛీ, ఆడబ్రతుకు!

ఈ సమస్యను ఒకవిధంగా తను పరిష్కరించగలదు. ఈ చదువుతోటే తనేదయినా ఉద్యోగం సంపాదించుకోగలదు. తన కాళ్ళమీద తాను నిలబడగలదు. ఏ ఊరయినా వెళ్ళి చదువుకుంటూ ఉద్యోగం చేయగలదు. కాని తను దురదృష్టవంతురాలు. ఒకసారి దౌర్జన్యానికి బలి అయిన తరువాత తన జీవితమంతా ఆ మచ్చ వెన్నాడక మానదు. జీవితం కుక్కలు చింపిన విస్తరవుతుంది.

అందుకని జీవితంతో రాజీపడాలా అతడిని పెళ్ళిచేసుకుని?

రెండు రాత్రులు నిద్రాహారాలు లేకుండా ఒకటే ఆలోచన. చివరకు ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. ఎం ఏ. పరీక్షకు కావలిసిన పుస్తకాలు తెప్పించుకుని ఇంట్లోనే చదివింది. పరీక్ష ఆ ఊళ్ళో రాయలేదు. తండ్రి వెంబడి పెట్టుకుని వెళ్ళి మరొకచోట రాయించాడు. రెండేళ్ళు కష్టపడి చదివినందుకు క్లాసు తెచ్చుకుంది.

"నాన్నా, మనింటిదగ్గరే ఒక స్కూలుంది. నేను టీచరుగా చేరనా?"

అతడి కనుబొమ్మలు ఆత్మీయంగా కలుసుకున్నాయి.

"చూడు కస్తూరీ. అమ్మకు ఆరోగ్యం బొత్తిగా చెడిపోయింది. తమ్ముడికి పెళ్ళి చెయ్యమని ఒత్తిడి చేస్తోంది ఆ బాధ పడలేక ఒక సంబంధం సెటిల్ చేశాను. శ్రావణంలో పెళ్ళి అమ్మకు నిన్ను గురించే బెంగ. నీకు ఉద్యోగం కంటె పెళ్ళి ముఖ్యమని అంటుంది.

"అదా నాన్నా అమ్మ బెంగ? నేను ఏం చేస్తే ఆ బెంగ తగ్గుతుందో చెప్పు. చేస్తాను. నిప్పుల్లో దూకమంటుందా? దూకుతాను ఆమె తృప్తిపడుతుందంటే"

అతడు వంచిన తల ఎత్తలేదు.

తెల్లవారి లేస్తూనే కస్తూరి తల్లిదగ్గరకెళ్ళి అమ్మా అని పిలిచింది.

"ఏం తల్లీ. రాత్రి నిద్రపోయినట్టు లేదు. నీముఖం మీకుపోయింది. ఏద్నాచా?" కళ్ళు తెరిచి తలనిమిరింది.

"నా ఏడ్పుకేమిటి? నీ సంగతి చెప్పు? నేను పెళ్ళి చేసుకుంటే నీకు చెంగ తగ్గుతుందని నాన్న అంటున్నాడు. అదే నిజమయితే ఎవడిసయినా తీసుకు వచ్చి మూడు ముళ్ళు వేయించు - అదీ తమ్ముడి పెళ్ళికాకముందే.. త్వరగా ప్రయత్నాలు చేయండి."

తండ్రి తిరిగి తిరిగి కస్తూరికి వికారపెట్టిన సంబంధమే మళ్ళీ చూశాడు. ఈసారి మర్యాదగా మాట్లాడాడు. కస్తూరి పట్టుదలమీద గుడిలో పెళ్ళి జరిగిపోయింది పదిరోజుల లోపల.

పెళ్ళికాగానే కస్తూరి భర్తతో చెప్పింది తల ఎత్తకుండా.

"మీరు ఈ ఊరినుంచి బదిలీ చేయించుకోండి."

ఆ ఊరికి రావాలని ఎందరో ప్రయత్నాలు చేస్తున్నారు. అందుచేత బదిలీ సులభంగా అయింది.

కస్తూరి తలవంచుకునే ఇంటిపనులు చేస్తోంది. పుండరికి పంటచేసి పెడుతోంది. కాని తల ఎత్తి అతడి ముఖంలోకి చూడలేదు.

ఆ ఊరు కొత్త. కస్తూరి చదువుకుందని తెలియగానే విద్యార్థులు ట్యూషన్ చెప్పమని వచ్చారు. బి.ఏ. చదివేవాళ్ళూ, ఇంటర్ చదివేవాళ్ళూ, పదోక్లాసు పిల్లలూ స్ట్రైకులవల్ల పోర్షను కాలేదని, పరీక్షలు దగ్గరికి వచ్చాయని బ్రతిమిలాడడం మొదలుపెట్టారు.

"విద్యను దాచుకోకూడదు. దానం చెయ్యాలి. వాళ్ళకు సహాయం చెయ్యి" పుండరి నోటి మీదుగా వచ్చిందీ మాట. ముఖం పక్కకు తిప్పుకుని తనకు కొంత కాలక్షేపం అవుతుందని కస్తూరి అంగీకరించింది. ఇంటిపనులు తొందరగా ముగించుకొని ఉదయం రెండు బ్యాచెస్ సాయంత్రం రెండు బ్యాచెస్ విడదీసి చెప్పేది. ఆ సంవత్సరం పరీక్షకు వెళ్లిన వారందరూ నెగ్గారు. మరుసటి సంవత్సరం కూడా చాలామంది వచ్చారు ట్యూషన్‌కి.

వయసు మళ్ళిన ఆడనౌకరును పెట్టుకుని కస్తూరి ఇంటి పనులూ, ట్యూషన్లు చెప్పటమూ కాలక్షేపంగా జీవితాన్ని గడుపుతోంది.

ఆమెకు జీవితంలో ఆశలు లేవు. ఆశయాలు అంతకంటె లేవు. ఉత్సాహం చచ్చి పోయింది. తల్లీ, దండ్రి తమ్ముడూ ఇప్పుడామె మనసులోనుంచి మరుగైపోయారు. తల్లి ఆరోగ్యమెట్లా ఉంధో? తండ్రి రిటైరయ్యాడో? ఆ జీవితానికి తెరపడిపోయింది.

వాళ్ళు రాసిన జాబులు వాళ్ళకే తిరిగి వెళ్తున్నాయి.

విద్యార్థులతోడిదే లోకమనుకున్న కస్తూరి జీవితంలో హఠాత్తుగా ఒక సంఘటన జరిగింది. భోజనానికి అంతా సిద్ధంచేసుకుని పుండరికోసం ఎదురు చూస్తున్న

కస్తూరికి అతడు రాత్రి పదిగంటలయినా యింటికి రాకపోయేసరికి తలమీద పిడుగు పడినట్లయింది తెల్లవారేవరకూ కూర్చున్నది కూర్చున్నట్టుగానే ఉంది. ఆఫీసుకు ఒక విద్యార్థిని పంపింది ఆ క్రిందటిరోజు కూడా అతడు ఆఫీసుకు రాలేదని తెలిసింది

కస్తూరి హృదయం సముద్రమంత గంభీరమైంది. పైకి నిబ్బరంగా పిల్లలకు పాఠాలు చెప్తున్నది ఇరుగుపొరుగు స్త్రీలతో తొణకకుండా మాట్లాడుతున్నది. అడిగినవాళ్ళకు పుందరి తన తల్లిని చూడటానికి వెళ్ళాడని చెప్తోంది.

పగలు పైకి కనబడుతున్న గాంభీర్యం రాత్రిళ్ళు సడలిపోతున్నది. ఎంత ఆలోచించినా ఒక తీరానికి చేరుకోలేకపోతున్నదామె మనసు. తన జీవితంలో ఎన్ని మలుపులు?

ప్రతి ఉదయం సూర్యుడు ఉదయిస్తూనే ఉన్నాడు. సాయంత్రం అస్తమిస్తూనే ఉన్నాడు ఋతువులు వాటి దర్మాలను నెరవేర్చుకుంటూ పునరావృత మవుతున్నాయి.

పుందరిని గురించి ఆమె హృదయం లోలోపల ఘోషిస్తున్నది. తనవల్లనే పుందరి ఇంట్లోనుంచి వెళ్ళిపోయాడు. ఎంతకాలమని తలెత్తి చూడని భార్యతో జీవితం గడుపుతాడు? ఆదరించని భార్య తనకెందుకనుకున్నాడు? అందుకనే చెప్పకుండా వెళ్ళిపోయాడా? అంతే అంతే.

పెరట్లో చాపమీద కూర్చుని తనవెంట తెచ్చుకున్న నవల ఒకటి చదువుతోంది కస్తూరి సాయంత్రపు నీరెండ ఆమె ముఖమ్మీద పడుతోంది. నౌకరు గడపముందర కూర్చుని కునికిపాట్లు పడుతోంది.

ఆమె చదువుతున్న నవలకస్తూరి జీవితానికి దగ్గరగా ఉంది. ఎంతో సారూప్యముంది. ఆమెకు తెలియకుండానే కన్నీళ్ళు కారిపోతున్నాయి.

తలుపు తెరిచిన నౌకరు గడపలో నిలబడిన వ్యక్తిని చూసి "మీ పేరు చెప్పండి. అమ్మగారికి చెప్తాను" అంటోంది. అతడు వినిపించుకునే స్థితిలోలేడు. ఆమెను తోసుకుంటూ పెరట్లోకి వచ్చి కస్తూరి ముందర నిబడ్డాడు.

గ్రేకలర్ సూటు – నిగనిగలాడే బూట్లు – కళ్ళకు మిలమిల మెరిసిపోయే కళ్ళ జోడు అతడిని చూసి బిత్తరపోయి దిగ్గునలేచి నిలబడ్డది కస్తూరి. ఆమెకు నోట మాటలేదు దిగ్భ్రాంతిగా ఉంది.

"కస్తూరీ, ఒక ఏడాదికే మనిషిని మర్చిపోతావా? లేక నీకు చెప్పకుండా వెళ్ళానని మూగనోము పట్టావా? ఇంతకాలం నిన్ను క్షోభపెట్టి నేను నరకం అనుభవించాను. ఒక డాక్టరు సలహాతో నీకు చెప్పకుండా వెళ్ళాను. తిరిగి వచ్చి నిన్ను సంభ్రమపరుద్దామనుకున్నాను. ఇప్పుడైనా నా ముఖం చూస్తావా?" ఆమెను కూర్చోబెట్టి తనూ ఆ చాపమీదనే కూర్చున్నాడు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

అతడికీ కొత్తగా ఉంది తను తీసుకుంటున్న చొరవకు.

తను చేసిన పనికి కస్తూరి కుమిలిపోయింది. చీలిన అతడి పెదవినీ - ఆ నోటినీ చూడలేక తను తల ఎత్తకుండా అతడితో ఒక్కమాటయినా మాట్లాడకుండా గడిపింది. ఇంతకాలమూ తనవంటిదానికి అంతటి సహృదయుడు లభించటం ఎంత అదృష్టం?

"కస్తూరీ, గతంలోకి వెళ్ళకు. నీ చేతివంట రుచిచూసి ఎంతకాలమైందో ననిపిస్తోంది. ఆకలి మండిపోతోంది. భోజనంచేద్దాంలే. అన్నట్టు అసలు వంట చేశావా?"

ఎన్ని మాటలు? ఎంత ఆప్యాయత? అసహ్యించుకున్న భార్యమీద ఎంత మమత? కస్తూరి కరిగిపోతున్నది.

అతని చేతిని ఆసరా చేసుకుని లేచిన కస్తూరి తడబడేకాళ్ళతో వంటింట్లోకి వెళ్ళి ఇద్దరికీ పళ్ళేలలో వడ్డించింది. ఊరగాయ కొసరి కొసరి పడ్డించింది.

ప్లాస్టిక్ సర్జరీవల్ల అతడి ముఖానికి ఎంత అందం వచ్చింది? కళ్ళార్పకుండా అతడి ముఖాన్ని చూస్తూ ఆకలి మరిచిపోయింది కస్తూరి.

అతడు విరగబడి నవ్వుతున్నాడు.

ముందు భోజనం కానీ. నీకు చెప్పాల్సింది చాలా ఉంది. తెల్లవారితే నాకాఫీసు - నీకు ట్యూషను."

"నేను గ్రహించుకున్నాను" అన్నది కాని ఆమె ముఖం వెలవెలబోయింది. ప్లాస్టిక్ సర్జరీ పేరున ఊరికివెళ్ళి కాలేజి గోడవ్రాతలు చదివి వచ్చాడా? ఇప్పుడు తనేం చెయ్యాలి?

రాత్రంతా అతడో కుర్చీలో కూర్చుని ఏవేవో కబుర్లు చెబుతున్నాడు.

కస్తూరి తన ఆలోచనలో తానుంది.

అతడు తన మంచమ్మీద నిద్రకొరగగానే ఆమెలేచి గబగబా బట్టలు సూట్ కేస్‌లో సర్దుకుని తెలతెల వారుతుండగానే స్టేషన్‌కి చేరుకుంది.

ఎక్కడికి తన పయనం?

తల్లిదండ్రుల దగ్గరకా?

కాదు. ఆ ఊళ్ళో తిరిగి తాను అడుగుపెట్టదు.

మరెక్కడికి? ఎక్కడికి?

ఎవరికీ తెలియని దూరతీరాలకు - తన ముఖం తెలియనిచోటికి. అక్కడే ఏదో పనిచేసుకుని జీవిస్తూ రాలిపోవాలి.

ఢిల్లీకి టికెట్ కొనుక్కుంటే? అదే నయం. ఇంకా ఇంకా పైకి ఉత్తర భారతం - హిమవత్పర్వత శిఖరాలు - గౌరీశంకరులు నాట్యంచేసిన చోటికి వెళ్ళి శివాలాస్యము - శివతాండవం చూడవచ్చు. ఆ మంచులో గడ్డకట్టి కరిగిపోవచ్చు.

ఇంకా టికెట్లు ఇచ్చే వేళ కాలేదు. ప్రయాణీకులు ఇటూ అటూ తిరుగుతున్నారు.

కస్తూరి పెట్టెమీద చెక్కిట చేయిచేర్చుకుని కూర్చుంది ఆలోచిస్తూ.

స్పీడుమీద చెమటలు కారుతూ వచ్చాడు పుండరి. కళ్ళతో వెతుకుతూ పెట్టెమీద కూర్చున్న కస్తూరి దగ్గరికి వచ్చాడు.

ఆమె భుజం పట్టుకుని "ఏమిటిదీ? ఎక్కడికీ ప్రయాణం? పెట్టె తీసుకుని నన్నొదిలిపెట్టి వెళ్ళిపోతావా? నీకోసం - నీ నోటిమాటకోసం- నీ కంటిచూపుకోసం నేనీ ఆపరేషన్ చేయించుకుని వస్తే నీవు వెళ్ళిపోతున్నావా? ఒక్క మాటయినా మాట్లాడకుండా" ఒంగి అడుగుతున్నాడు.

కస్తూరి లేచి నిలబడ్డది. అతడిని కళ్ళనిండా చూసింది. ధారాపాతంగా కారుతున్న కన్నీటిని కొంగుతో అద్దుకుంటూ.

"రా పోదాం. మనకో కుటీరం ఉంది. చిలకా గోరింకల్లా కబుర్లు - ఇన్నాళ్ళ కబుర్లు చెప్పుకోవచ్చు" పెట్టె తీసుకున్నాడు చేతిలోకి.

అతడికంతా తెలుసా? తెలిసే ఆహ్వానిస్తున్నాడా?

కస్తూరికి అగమ్యగోచరంగా ఉంది.

"రా పోదాం. జీవితంలో ప్రతి నిమిషమూ అమూల్యమైంది" లాక్కుని పోతున్నాడు.

● 1968 ●

# 29. సంసార సాగరం

♦ కొండపల్లి వెంకట శేషగిరిరావు ♦

"అబ్బబ్బ! ఏమిటో! యీ సంసారం నాకర్థం కావడంలేదు. చంటిదానికి పాలు త్రాగించడానికి పాలపొడి కూడా లేదాయె, గంటన్నర నుంచి అది ఒకటే పనిగా యేడుస్తూంటే దాన్ని అదుపులో పెట్టలేక నేనూ యేడ్వాల్సి వస్తూండె - ఇక యీ సంసారం చెయ్యడం నా వల్లగాదు - ఉద్యోగం చేస్తున్నరన్న పేరు - ఏంటద్యోగం? నెలజీతం పదిరోజుల ఖర్చుకైనా చాలదు - పదకొండవ రోజునుంచే ప్రారంభం - బదుళ్ళూ, అప్పులూ ఇవి తీర్చే వరకే చాలదు జీతం - ఇక మిగతా రోజులెలా గడవాల? పోనీ మనిషికైనా సుఖముందా అంటే అదీ మృగ్యం. ఊపిరి సలపకుండా పని. చేయలేక ఎంత బాధపడినా చేయక తప్పదుగా? ఇంట్లో సామానయిపోయిందని చెప్పి వారం రోజులయింది. ఇంతవరకూ తేలేకపోయారు. తేలేదేమండీ అంటే విసుక్కుంటారు - అనకుంటే వెళ్ళదు - "ఇలాంటి దినగండం నూరేళ్ళాయుష్షు' ఈ సంసారం గడపడం కంటే చావడం మేలు - దిక్కుమాలిన చావు - అది రాకుండా వుంది" - అంటూ తన కష్టాలు యేకరువు పెడుతూ నూతి వద్దకు వెళుతూ వున్న సుశీలను జూచి అప్పుడే గుమ్మంలో అడుగుమోపుతున్న రామారావు హడలిపోయాడు - మాటలు కూడా కొన్ని వినబడినవేమో? ఆమె నిజంగా యేదో అఘాయిత్యం చేస్తుందేమోననుకున్నాడు. అతని చెవిలో దూరిన ఆమె ఆఖరు మాటలు, మళ్ళీ మళ్ళీ మార్మ్రోగుతున్నాయి - ఎట్లాగో నూతి దగ్గరకుపోయి - భార్య తోడి యిచ్చిన నీటితో పాద ప్రక్షాళన పూర్తిచేసి, మెల్లాలో గల కుక్కి మంచంలో మేను వాల్చాడు.

ఉదయం 9 గం॥ లకు చేసిన భోజనం మధ్య యిన్ని కాఫీ నీళ్ళయినా త్రాగాడు కాదు - పనితో అలసి, సొలసి సాయంత్రం 8 గం॥లకు యింటికి చేరిన రామారావును భార్య పరిస్థితి మరీ ఆందోళనపరిచింది. అలసట వలన కళ్ళు మూసుకున్నాడు. మనస్సుకు శాంతిలేదు. ఆలోచనా పరంపరలు ఆయన మనస్సు నాందోళన పరుస్తున్నాయి. అశ్రుధారలు అనంతంగా ప్రవహిస్తున్నాయి. అంతా అగమ్యగోచరంగా కన్పిస్తుంది. బావి తలంపురాగానే భయంతో కంపించి పోతున్నాడు. హృదయవేగము యినుమడించింది. "ఏమండీ! కాఫీ తెచ్చాను" - అని అంటూన్న భార్య మాట చెవినపడగానే - ఆత్మీయుల మాటవిన్న కారాగార బంధితుని వలె కండ్లు తెరిచాడు. కాఫీ అందుకుంటూనే సుశీల వాలకాన్నీ నఖశిఖపర్యంతం పరికించాడు. ఎంత ప్రయత్నించినా దాచుకోలేని ఆమె మనోవేదనను గ్రహించ గలిగాడు. చినిగిపోయిన ఆమె చీరె, మాసిన తల దైన్యంతోగూడిన ఆమె ముఖ

వర్ణస్సు, సహజ సుందరియైన సుశీల సౌందర్యానికి మసిపూశాయి – ఆమె యాకారం, అతని హృదయాన్ని దహింపజేసింది. చంటిపిల్లవానిలా ఆమెను కౌగిలించుకొని విలపించాలనుకున్నాడు. అదింకా ఆమెను అధైర్యపరచడమే అవుతుందని కాబోలు అతి ప్రయత్నం మీద కట్ట తెగిన యేరులా ప్రవహింపనుంకిస్తూ వున్న దుఃఖాన్ని దాచగలిగాడు. అందుకున్న కాఫీని త్రాగాలని ప్రయత్నించాడు. చంటిదాని పాలమాట జ్ఞాపకమువచ్చింది. కాఫీ మింగుడు పడేలా లేదు. బజారుకెళ్ళి ప్రయత్నం చేసి తెద్దామనుకున్నాడు – ఒక గుటికెడు కాఫీ త్రాగాడు. అదినోట్లో నుండి గొంతులోకి జారకముందే, యడపిల్ల యేడ్పువిన్పించింది. వెంటనే సుశీల అరుపులు వినిపించాయి. "అమ్మా! కాఫీ పోయవే? అంటూంది మూడేండ్ల కుఱ్ఱ సన్యాసివి" "నోర్ముయ్! అలా అడగొచ్చా? పోస్తే త్రాగాలి. లేకుంటే మానాలి" అని గంభీరంగా అంటూందేగాని సుశీల హృదయం తరుక్కుపోయింది. "నోరు తెరచి అడిగిన బిడ్డకు గుటికెడు కాఫీయైనా పోయలేని జన్మయెందుకు?" అనుకుంటూ బిడ్డను దగ్గరగా తీసుకుంది – "అమ్మా! రేప్రొద్దున్నే పోస్తానులే – ఏడవకూడదు – నా తల్లివి కదూ!" అంటూ పొరలి పొరలి వస్తూన్న దుఃఖాన్ని బహుప్రయాసతో ఆపుకుంటూ ఓదారుస్తూంది కూతుర్ని.

ఇదంతా వింటూవున్న రామారావు చేతిలోని కాఫీగ్లాసు కాస్తా క్రింద పడిపోయింది. సగానికి పైగా వున్న కాఫీ నేలపాలయింది. గభాలున మంచంమీంచి లేచి, వీధిలోకి పరుగెత్తాడు రామారావు – సుశీల యీ విషయాన్ని గ్రహించింది. కన్పిస్తేగా? ఎక్కడకు వెళ్లారో? యేమో? చాలా రాత్రయింది? అనుకుంటూ బయటవీధిలో రామారావు కన్పించనందున కంపిస్తూ వున్న శరీరంతో యింట్లోకి పోయింది సుశీల.

బిడ్డలు నిద్రకేడుస్తున్నారు. ఏదో ఒక చాప చింపురుమీద పడుకోబెట్టింది సుశీల – "నిద్ర సుఖమెరగదు – ఆకలి రుచియెరగదన్నట్లు" ఆకలి బాధతో యేడ్చి యేడ్చి అలసిపోయిన జీవులు నిద్రించాయి. సుశీల మాత్రం పిల్లల ప్రక్కనే పడుకొని దీర్ఘాలోచనల్లో మునిగిపోయింది. "ప్రొద్దస్తమానం ఆఫీసు పనిలో మునిగి, అలసి సొలసి యింటికి వస్తే యిల్లు కాస్తా నరకంలాగా కన్పించే –" యిక వెళ్లక యేంచేస్తారు? నా బ్రతుకు పాడుగాను – ఆయన యింటికి వచ్చేసరికి యే అల్లరి లేకుండా ఆయన మనస్సుకు ఆనందం కలిగించాలని యెంత ప్రయత్నం చేసినా, ఒక్క నిమిషం కూడా అలా చెయ్యలేక పోయాను. రాత్రి పదకొండు కావస్తూంది గదా? ఇప్పుడెక్కడికి వెళ్ళుంటారు? అని యేమేమో ఆలోచిస్తూ వున్న సుశీలకు యెందుకో భయమేసింది. తప్పంతా తనదేనని తీర్మానించుకుంది. ఉన్నదేదో వుంది– లేనిదేదో లేదు – పదిసార్లు లేదు లేదనుకుంటే వస్తుందా? వారు నా మాటలు వినటాన్నే కదా యిల్లు వదిలిపోయింది – పట్టుమని పదిమెతుకులయినా తిననిచ్చాను కాదు. దుర్మార్గురాల్ని అని తనను తానే నిందించుకుంటూ పడుకుంది. – నిద్ర రాదు – ఆకలి లేదు – మనశ్శాంతి మాయమైంది.

ఉదయం తొమ్మిది గంటలకు తిన్న అన్నం – మధ్య కాఫీయైనాలేదు – రాత్రి భోజనం లేదు. అస్తమానం అదే పనిగా కూర్చొని వ్రాసినా తరగని ఆఫీసు పనితో అలసిపోయిన శరీరం, అశాంతితో చిరాకుపడి చెదిరిపోయిన మనస్సు, వీధిలోపడి

పోతున్నాడేగానీ, యెటుపోతున్నది, యెందుకు పోతున్నదీ తనకే తెలియదు - బజార్లన్నీ ప్రశాంతంగా వున్నవి. అందరూ తమ తమ యిండ్లలో గాఢంగా నిద్రించి వుంటారేమో? ఆకస్మికంగా క్రమ్ముకున్న మేఘాలు దారి కన్పించకుండా చేశాయి - ఆకాశం బ్రద్దలవుతుందేమోననిపించే ఉరుములు - జిగేల్ జిగేల్ మని మెరిసే మెరుపుల కాంతిలో దారి చూచుకుంటూ నడుస్తున్నాడు రామారావు. ఎంతదూరం వెళ్ళాడో ఏమో అతనికే తెలియదు.

కొండకు చిల్లిపడినట్లు కుంభవృష్టి ప్రారంభమయింది - నిలువ నీడ కనిపించ లేదు. చెట్టు చాటు చేసుకొని కూర్చున్నాడు - క్షుద్బాధ - మానసికాందోళన - నిర్విరామ కృషిచే కలిగిన అలసట, ఇంటిలోని అశాంతి, అన్నీ ఒకేసారి దాడిచేసి, ఈ వర్ష సాయంతో అతడ్ని నిస్పృహునిగా చేశాయి.

తరువాత యేం జరిగిందో యేమో అతనికి తెలియదు - స్పృహ వచ్చి చూచేసరికి తాను, తన యింట్లో, అదే తన కుక్కి మంచంలో వున్నాడు. తన పక్కనే కుమిలి కుమిలి యేడుస్తూన్న తన భార్య కూర్చుని వుంది - "అమ్మా ఆకలే" అంటూంది కుఱ్ఱది. మాటలు రాకపోవడంవలన తన బాధను వివరించలేక యిల్లెగిరి పోయేలా యేడుస్తూంది చంటిది - ఈ అల్లరంతా చూసిన రామారావు తనకు స్పృహ రాకుండా వుంటేనే బాగుండుననిపించింది - తన భార్యా పిల్లల్ని పోషించుకోలేని వెధవ బ్రతుక్కంటే మృత్యుదేవత హస్తాల్లో చల్లగా, సుఖంగా దీర్ఘనిద్రల్లో పోవడం మేలనిపించింది - విచారం ఎక్కువయింది - హృదయ వేగం అతిశయించింది. మళ్ళీ స్పృహ తప్పిపోయింది.

డాక్టరుగారు వచ్చారు - "స్పృహ వచ్చిందాండి?" అన్నారు. 'కండ్లు తెరిచి మళ్ళీ మూసుకున్నారండి" సుశీల రోదిస్తూనే - డాక్టరుగారు రోగిని పరీక్షించారు - తన భర్తకు త్వరలోనే ఆరోగ్యం చేకూర్తుందని చెప్పారు - తన వద్దనున్న యింజక్ష నొకటిచ్చారు - యింకా కొన్ని మందులు వ్రాసి, సుశీలచేతికిస్తూ సాయంత్రం వరకు తెప్పించండని చెప్పి వెళ్ళిపోయారు.

తన భర్త ఆరోగ్యవంతుడౌతాడన్న డాక్టరుగారి మాటలు సుశీలకానందాన్ని కలిగించాయి- కాని మందులు తెప్పించాలన్న విషయం ఆమెను నిశ్చేష్టురాలిగా చేసింది - చేత చిల్లిగవ్వయినా లేని తను మందులు కొనేదెలా? కడుపున పుట్టిన బిడ్డకు గంజి అయినా పోయలేని తాను, మందులు కొనేదెలా? విలపించడం తప్ప మార్గాంతరం తోచడం లేదు - పిచ్చిదానివలె కంటికి మింటికి యేకధారగా కారుస్తూంది అశ్రువులు. - అమ్మా! అన్నం పెట్టవూ?" అంటూ వచ్చిన కుఱ్ఱదాని చేతి మురుగులు ఆమె కండ్ల ముందు మెరిసేయి - ఆమె యెంతో ఆలోచించింది. ఆ యింటికంతకూ మిగిలిన ఆస్తి ఆ మురుగులే.

ఇంతలో రామారావు నిస్పృహునిగా యింటికి చేరవేసిన సుందర్రావు వచ్చాడు. అతడంత వృద్ధుడుకాదు - లేయువకుడూ కాదు - నడికారువాడు. వస్తూనే 'అమ్మాయీ! రామారావుకెలా వుంది?" అని అడిగాడు.

కన్నీరు పమిట చెంగుతో తుడుచుకుంటూ, "రాండి అన్నగారూ!" అంటూనే డాక్టరు చెప్పిన మాటలన్నీ వివరంగా చెప్పింది - కంఠం గాద్గదికమవుతూంది -

శరీరమంతా కంపించి పోతూంది – వణుకుతూ వున్న పెదిమల మధ్యనుండి ఒక్క మాటకూడా వెళ్ళలేకపోయింది. సుందర్రావు పాదాలపై కుప్పకూలిపోయింది. కుబ్జదాని చేతి మురుగులతో పాటు డాక్టరుగారు వ్రాసి యిచ్చిన మందుచిట్టీ కలిపి సుందర్రావు చేతికందిస్తూ, "అన్నగారూ! నాకున్న సర్వస్వం యిదే! నా పసుపు కుంకుమలు నిలిపే భారంమీది" అంటూ హృదయం నీరయ్యేలా విలపించింది.

సుశీలను ఓదారుస్తూ, సుందర్రావు ఆ మురుగులను తిరిగి ఆమెకిచ్చి చిట్టీ మాత్రమే తాను తీసుకొని, "చెల్లీ! నీవే మాత్రం బెంగపడనవసరం లేదు – రామారావు తిరిగి యథాప్రకారం ఆరోగ్యాన్ని పొందే వరకు యీ సంసారం బాధ్యతంతా నాది – నీవు వేరే విధంగా అనుకోవద్దు" అంటూ వెళ్ళిపోయాడు.

సుందర్రావు వెళ్ళిన కొన్నిగంటల్లోనే మందులతోపాటు ఒకనెల రోజులకు సరిపోయే ఆహార పదార్థాలు కూడా వచ్చాయి. సుందర్రావు చూపిన సానుభూతికి సుశీల చాలా సంతోషించింది.

సుందర్రావు అష్టదరిద్రుడుగా ఆ వూరిలో ప్రవేశించి, అదృష్టం కలిసి రావడాన ఆగర్భ శ్రీమంతుడైనాడు. "మధ్యన వచ్చిన సిరి" అందరి వలె అతన్నికూడా ఆడించక, అతనిలోని సహజ సద్గుణ సంపత్తిని యినుమడింప జేసింది – కష్టాలెన్నో భరించిన వాడు కాబట్టి, ఆ బాధ అతనికి తెలుసు. కనుకనే తాను రామారావుతో యెప్పుడో కొద్ది సహాయాన్ని పొందాననే అభిమానంతో, అతని కుటుంబానికి గొప్ప సానుభూతి ప్రదర్శించాడు.

వ్యాపార రీత్యా గ్రామాంతరం వెళ్ళి వస్తూ రాత్రి పదకొండు గంటల సమయంలో దారిలో చెట్టు వద్దపడియున్న రామారావును మెరుపు కాంతిలో చూచి గుర్తించి, ఇంటికి చేర్చడమే అతనిలోని మానవత్వాన్ని, సద్గుణ సౌశీల్యాలను ప్రదర్శిస్తూంది. రామారావు తిరిగి కోలుకొనే వరకు ఆ కుటుంబ భారాన్ని వహించి నిర్వహించి, బ్రతుకే భారంగా ఎంచే రామారావుకు తన వ్యాపారంలో భాగమిచ్చి, తన త్యాగబుద్ధిని ప్రదర్శించాడు.

ఇటు సుశీల, అటు రామారావు యిరువురూ సుందర్రావుకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

● 1968 ●

# 30. మానవ కంఠధ్వని

♦ పబ్బరాజు గోపాలరావు ♦

రామయ్య తాత చేను ప్రత్యేకత చెప్పమంటున్నావా బాబూ? ఈ ప్రశ్న నీవేకాదూ, ఈ దారిగుండా వెళ్ళే ప్రతి ప్రయాణీకుడూ వేసే ప్రశ్నే ఇది. అయినా ప్రతివారికి చెప్పడం నా విద్యుక్తధర్మం అంటూ ఆ అరవైసంవత్సరాల ముసలితాత కథ చెప్పడం ప్రారంభించాడు. యువక బాటసారి ఊఁ కొడుతూ వింటున్నాడు.

సుమారు పది సంవత్సరముల క్రితం సంగతి బాబూ. నాడు సంస్థానములోన గ్రామ జీవితం దుర్భరమైపోయింది. జాగిర్దారీ జమీందారీ వ్యవస్థ కొన్ని వందల సంవత్సరాలుగా వ్రేళ్ళు పాతుకొని సంస్థానాధీశుని అండ చూసుకొని నిరంకుశత్వం చలాయిస్తున్న రోజులవి. వర్షాలు కురిసినా, కురవకపోయినా, పంటలు పండినా, పండక పోయినా, జమీందారులకు రైతులు కట్టవలసిన కొళ్ళ డబ్బు కట్టవలసిందే. డబ్బు కట్టడంలో ఏమాత్రం విలంబనమైనా జప్తులు, వారంట్లు ముమ్మరంగా జరుగుతున్న రోజులవి.

రామయ్య తాతకు స్వంత పొలమంటూ లేని కారణంగా జమీందారుగారి నలభై యెకరాల భూమిని కౌలుకు చేస్తున్నాడు. నలభై సంవత్సరాలుగా జమీందారుగారి భూమిని కౌలుకు చేస్తున్నా భూమిమీద రామయ్య తాతకు ఈషణ్మాత్రం హక్కు లేకపోగా, ఎన్నడూ రెండుపూటలా తిండి తినిఎరుగడు. వంటినిండాబట్ట కట్టి ఎరుగడు... రామయ్య తాతకు ఒక్కతే ఒక్క కూతురు. మొగ సంతానానికి రామయ్యతాత నోచుకోలేదు. రామయ్య తాత భార్య అయిన లక్ష్మమ్మ ఒక్కగానొక్క బిడ్డను ఈ ప్రపంచంలో పడవైచి తనువు చాలించింది. ఇటు చేనుపనులలో, అటు గృహకృత్యాలలో ఆడ - మొగ అనే భేదం లేకుండా కష్టించి తోటి వారలకు సహజీవన లక్ష్యాన్ని చూపెడుతున్న లక్ష్మమ్మ మరణం రామయ్య తాతకు తీరని ఆవేదనను కలిగించినా, జనన మరణాలు సృష్టి రహస్యాలు అనే విషయం తెలిసిన రామయ్యతాత కూతురు మంగమ్మను కంటిలోపాప మాదిరి సాకుతూ రోజులు వెళ్ళదీస్తున్నాడు..

అప్పటికే దేశమంతటా సంస్థానాల ఏకీకరణ జరిగి, ప్రజాప్రభుత్వాల్ని స్థాపించు కొన్న రోజులవి. ఒక్క ఈ సంస్థానాధీశుడే ఏకీకరణకు వొప్పుకోక, స్వతంత్రంగా వుండ నిశ్చయించుకున్నాడు. అప్పటికే కొన్నివందల సంవత్సరాలనుండి బానిసత్వాన్ని అనుభవిస్తూ నలిగి నశిస్తున్న సంస్థాన ప్రజలు మేల్కొని స్వాతంత్ర్యం మా జన్మహక్కు

ప్రజాస్వామ్యం మా జీవిత లక్ష్యం. సంస్థాన ఏకీకరణ తక్షణం జరగాలి, ప్రజాప్రభుత్వం ఏర్పడాలి అంటూ బాపూజీ ప్రసాదించిన శాంతి, అహింస అనే పరమ పవిత్ర మైసటువంటి ఆయుధంతో సత్యాగ్రహాల, ఊరేగింపులు, బహిరంగ సభలు, అత్యధిక సంఖ్యలో జరుపుకొంటున్న రోజులవి...

సంస్థానంలో ఒక్కుమ్మడిగా ఉప్పెనలా ప్రజలు కాంక్షిస్తున్న ప్రజాస్వామ్య నినాదం సంస్థానాధీశునికీ, జాగీర్దారులకూ, జమీందారులకూ పక్కలో బల్లెంలా గుచ్చుకొంది. దౌర్జన్యపూరితంగా ప్రజలకంఠాలను నిలుప దల్చుకున్నారు. ప్రజా వెల్లువను అణచడానికై అదనపు దళాలను ఏర్పరచుకొన్నారు. స్వాతంత్ర్యం మా జన్మహక్కనే ప్రతి వ్యక్తిని చిత్రహింసలకు గురి చేశారు. ఊళ్ళకు ఊళ్ళను పరశురామ ప్రీతి చేశారు.

రైతులు సంవత్సరం పొడుగునా ఎండనకా, వాననకా కష్టించి చెమటోడ్చి పండించి కోసి కుప్పలుగా వేసిన ఆహారధాన్యాలను సహితం పరశురాముని ప్రీతియైన జ్వాలామ తల్లికి ఆహుతి చేశారు. నాడు పల్లెజీవితమే దినగండం నూరేళ్ళ ఆయుష్యంగా మారింది. నిద్రాహారాలకు సహితం గ్రామీణులు నోచుకోలేదు. ఏ నిమిషాన ఎటువంటి మారణ హోమం జరుగుతుందో తెలియక, భయకంపితులై గజగజలాడిపోతున్న రోజులవి. నానాటికీ మారణహోమాలు, హత్యలు, గృహ దహనాలు, లూటీలు, మానభంగాలు అధికం కాసాగినై. ఎంత పెద్దపెట్టున హింసాత్మకంగా ప్రజావాణిని అణచజూచారో అంతకంటే పదిరెట్లు ప్రజలు సంఘటిత పడి, మా బొందిలో ప్రాణముండగా స్వాతంత్ర్య పిపాసను విడువబోమని ముక్తకంఠంతో ప్రజావాణి చాటుతున్న రోజులవి.

నాడు సంస్థానంలో జరుగుతున్న అరాచక చర్యలను, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని గమనించి, అఖండ భారత అధినేతలు సంస్థానాధీశునికి దౌర్జన్య పూరిత హింసాకాండను విడనాడమని, సంస్థాన ఏకీకరణకు సమ్మతించుటయే శ్రేయస్కరమని నయాన భయాన చెప్పి చూశారు. ఫలితం మాత్రం చెవిటివాని ముందు శంఖం పూరించినట్లే అయింది.

సంక్రాంతి పండుగ సమీపిస్తున్న రోజులవి, జొన్న ఎక్కువ ఎత్తుపెరుగుట మూలంగా తలమీద వున్న కంకి బరువు ఫలితంగా గాలికి ఉఱ్ఱూత లూగుచున్నవి. జొన్నచేలకు పిట్ట కావళ్ళు కాస్తున్న రోజులవి. రామయ్య తాత చేను ఊరి వెంబడే ఉన్నకారణంగా పిట్టల తాకిడి ఎక్కువగా ఉండేది. తూరుపురేఖలు ప్రసరించక ముందే నడి చేలో వున్న మంచె ఎక్కి వడిశలతో రాళ్ళిసురుతూ, హే హే అంటూ పిట్టకావలి కాస్తూ చేనుకు తూర్పుదిశన పిట్టలు వాలినట్లు కనుగొని వడిశాలలో రాయిపెట్టి బరబరా తిప్పితూరుపు ముకంగా వడిశాల విసురుతున్న రామయ్య తాత కూతురు మంగమ్మకు నెత్తిన ఇనుపటోపీలు పెట్టుకొని తుపాకుల సహితంగా ఊరును చుట్టుముట్టడానికి పొంచి వున్న కిరాతకులు కనిపించారు. పిట్టలను వెళ్ళగొట్టేందుకు తూరుపు ముఖంగా, మంగమ్మ వడిశాలతో విసిరిన రాయి మోత పెడుతూ ఓ కిరాతకుడిని ఢీకొన్న సంఘటనను కళ్ళార చూసిన మంగమ్మ గజగజలాడుతూ నివ్వెరపోయి ఖిన్నురాలై మంచెమీద అలానే నిలుచున్నది. సంస్థానాధీశుని పక్షాన

కిరాతకులు కోపోద్రిక్తులై జొన్నచేనుకు అడ్డంగా పడి వస్తూ, మంగమ్మ ఉన్న మంచెను చుట్టుముట్టడానికి ప్రయత్నించారు.

మంగమ్మ కిరాతకుల బారినుండి తప్పించుకొనే అవకాశం లేకపోయింది. ప్రాణముండగా కిరాతకుల వశం కాకూడదనే నిశ్చయానికొచ్చింది. వడిశాలను బరబరా తిప్పుతూ కిరాతకులను ఎదుర్కొంది. కిరాతకులు ఎంత ప్రయత్నించినా మంగమ్మ ఉన్న మంచెను సమీపించలేకపోయారు. మంచెమీద తూరుపు ముఖంగా నిలబడి కిరాతకులను ఎదుర్కొంటున్న మంగమ్మకు పశ్చిమ దిశగుండా వచ్చిన తుపాకి గుండు వెన్ననపడి వక్షస్థలంగుండా దూసుకపోయింది. పాపానికి పరిపక్వ దశ వచ్చింది. అఖండ భారత అధినేతలు సంస్థాన ప్రజల సమస్యను పరిష్కరించారు. స్వాతంత్ర్య భిక్షను ప్రసాదించారు.

సంక్రాంతి పండుగ సమీపిస్తున్న రోజులవి. జొన్న చేలలో పిట్టకావళ్ళు కాసే తరుణం, రైతులందరూ తమ తమ చేలలో మంచెలు వేసుకొని పిట్టకావళ్ళు కాస్తున్న రోజులవి. రామయ్య తాతకూడా తనచేలో మంచె వేశాడు. పిట్టకావలికొరకు చేను కెళ్ళాడు. చేలో ఎక్కడా ఏ మూలనా పిట్టలు వాలినట్లు కనిపించకపోగా హే, హే!! అంటూ పిట్టలను మానవ కంఠధ్వని, బరబరా అంటూ వడిశాల తిరుగుతున్న ధ్వని రామయ్య తాతకు తను కూర్చున్న మంచె సమీపం నుంచే వినపబడింది. గడిచిన సంఘటన గుర్తుకు వచ్చి ఆవేదనను పట్టలేక వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

చేలో ఎవరూ పిట్టకావలి కొరకు లేకున్నా, హే, హే! అనే మానవ కంఠధ్వని, బరబరా తిరుగుతున్న వడిశాల ధ్వని ఎట్లా వినిపించి వుంటుందని ఆలోచిస్తున్నావా బాబూ? అదే రామయ్య తాత చేను ప్రత్యేకత, ఇదే చేలో, ఇదే పిట్టకావలి తరుణంలో కిరాతకులను ఎదుర్కొని మంగమ్మ వీరస్వర్గం అలంకరించిన విషయం మర్చిపోయావా బాబూ? అదే నాయనా ఈ మానవ కంఠధ్వని. కథకు సంబంధించిన ఘట్టమంతా సుమారు పది సంవత్సరాల క్రితం సంగతి బాబూ! ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సమీపిస్తున్న రోజుల్లో రామయ్య తాత జొన్నచేలో హే, హే!! అనే మానవ కంఠధ్వని వినబడుతూనే వుంటుందంటూ ఆ అరవైసంవత్సరాల ముసలి తాత కథ చెప్పుతుండగానే శ్రద్ధాభక్తితో కథ వింటున్న యువకుని కండ్లు అశ్రుపూరితాలైనవి.

● 1946 నాటి తెలంగాణాను దృష్టియందుంచుకొని - 1968 ●

# 31. నిశ్చితార్థం

♦ పి. యశోదారెడ్డి ♦

అయ్యయ్యో! ఇదేం పాపం; తల్లీ! ఇనీ కనని, యిచిత్రాలు వూయవెట్టి అచ్చం నాట్కం తీర్గనె నడిసె. ఇన్నాళ్ళగోలె దొంతు లోలె పేర్సుకున్న ఆశెలన్ని పిడ్కల కుచ్చెన గూలినట్ల గూలిపాయె. ఆశెలుగీశెలు, అట్లవెట్టు, ఆయింటి పేరుదల్చుకుంటెనె యాదో చెప్ప తరంగాని ఎత ముంచుకొస్తది. సూడ్రాదు,

నిన్నటిదాంక ముద్దుగ కళకళలాడుకుంట కండ్ల పండుగోలె కానొచ్చె ఇల్లు ఇయ్యాళ్ల అఖండ దీపాలు ఎల్గుతున్నా సమరు జాలక, కొడిగట్టిన గుడ్డి దీపమోలె, మస్కవట్టి మబ్బుగ కండ్ల వడ్తుండది. ఊకెనే అన్నారు? అంగిసుకమే అంగాల సుకవంట. దుడ్డిచ్చి దుక్కాన్ని కొనుక్కున్నట్లు మావోళ్ళు, ఈ పిల్ల మాటిని, బెల్లం బువ్వ పిస్కితే దక్కదంట, ఆ దిక్కుమాలిన సవందం జేతమంట సేయి జూపిరి. అదెమొ? కొర్వితోటి నెత్తిగోక్కున్న కాడికొచ్చె. యామాట కామాటేగని సవందాని కేమైంది? నూట్లకు కోట్లకో పిలగాడు, గని వాళ్ళ గుణాలెచ్చు, లొచ్చో? ఎచ్చో? తిప్పలు వడేది మనం" అంట వోకాడ నిల్వకుండ కాలు గాలిన పిల్లి తీర్గ ఆడికీడ్కి ఆసువోసుకుంట తామసం తోటి తనండ్ల తానే మాట్లాడుకుంట తిర్గవట్టింది యశోదమ్మ.

శనాసేపటినుంచి సెల్లెలి వాల్కం గనిపెడ్తున్న అక్క గోయిందమ్మ యింగ వుండవట్ట లేక సెల్లెల్ని జూసుకుంట "అదేందే? యశోద! వొచ్చిరాని బాపనయ్య మంత్రం జదివినట్టు నీయంతల నీవే మాట్లాడుకుంటుండవ్? ఏందో కత?" అంట అడ్డం దగిలి జవాబు కోసం జూసింది.

ఆ మాటల్యావి బట్టిచ్చుకోకుండ యశోదమ్మ ఇంగింత ఊపుతోటి అయ్యో! 'నాజూకు బీబినౌరోటికాయి' అంట ఆ తల్లికి నాగరీకమంట, కుటీలపు గుణాలు, కువ్వారపు నడ్తలు! పిడుగసొంటి వాళ్ళ మాటలిని, అంబ్యాదరాలు పాపం జానకమ్మ భూమి బట్టి కంటికి పుట్టె డేడుస్తుండది. అంతెత్తు అన్నయ్య గోపాలన్న మొకాన కత్తేటుకు నెత్తుటి సుక్కలేదంటె నమ్ము, ఇంగ చిత్రం ఏందంటె, పిల్లది మట్టుకు దైర్నంగనె తిర్గుతుండది. మరి దాని గుండె దిటువేందో? అంట కోపాన, యాసోయీ లేకుండ మాట్లాడ్కపోతున్న యశోదమ్మను నిలవెట్టి అక్క గోయిందమ్మ.

'అదేందే? ఎచ్చలు! ఏందో? గాలివూనినట్ల వూగుడేనా? ఇంతమింగుడు వడనంత ఇసం ఏం బుట్టె? యామర్మం దెల్వక నేను మిడ్కిసస్తుండ, ఇంతగానం అడ్గుతుంటె

నీవు సెవు మీద పేనువారనట్ల పల్కక. పుల్కక పుండుజేంది? ఇంతమంయటి వెట్టిందెవరు? ఏంది కత?, అంట అడ్గింది.

కోటగట్టంత ఎత్తు అన్నయ్య గోపాలన్న పునాదుల్తోటి ఒక్కసారి పెరిగిపోయిండు. ఇంగ సెప్పుకో దగ్గ సిత్రం ఏందంటె. పిల్లది మట్టుకు యూడసెమర్సకుంట రాయోలె గట్టి గుండది; మరిదాని గుండె దిటువుకె మొక్కాలె అంట. ఆగకుంట సెప్పకపోతుంటె అక్క వుండవట్టలేక.

"యెవ్వారం ఏందో? ఏకోలెగాదు. కొరుకుడుపడని మేకోల్నె తయారై నట్లుందది. లేకుంటే, సెల్లె లింత కసి బీసి పద్దాది?" అంట గొంతులాణిగ జేసి, నిలువరిచ్చుకుంట.....

'ఏందిర? ఎచ్చెలు? ఎంతతామసం వున్నగని ఎదుటోళ్ళ మాటగుడ ఇనిపిచ్చు కోకుండ, గాలిగీలి సోకినట్ల శిగం వూగుడేన? కొర్కుపడనంత కొర్రి ఏం బుట్టె? ఎట్ల పుట్టె? నిన్నంత గదిలిచ్చి చిట్లిస్తున్న ఎత ఏందొ? సెప్పు నా బంగారు గద! అంట బుజ్గరిచ్చింది.

అక్కమాటలిన్న యశోదమ్మ నిప్పుకల మీద నీళ్ళు జల్లినట్ల గాంగ. గడె మంచం మీద గూసుండి "అవునక్క! నీవన్నట్ల నిన్నటి నుంచి నా మనసు. కనితోటి అవుమానం తోటి, తినస్కారం తోటి కుమ్ములెట్టిన మూడికాయె తీర్గవుడ్కుతుండది. నీకు దెల్వదు, అక్క! ఆడివిల్ల పుట్టుక, తరాలు గడ్సినగని, యుగాల సుట్లు జుట్టిన గని మాసిపోని పాతకత, దిన దినం కోడిగండమోలె కొత్తకత. ఎస్క జూస్తె బాయి, ముంగల జూస్తె సెర్వు, ఇక్కడ జూస్తె కనిపెంచినోళ్ళు, అక్కడ జూస్తె కలిసి కాపిరంజేసె మొగనోళ్లు, నడుంగల పిల్ల నజ్జిగిజ్జి.

అక్కా! సామెతలంటె వూకెవుట్టవు. అనుభవాన్ని రంగరిచ్చుకోని తాగినంక జీర్ణమైన సారం తోటి పొట్మరిల్లుతయి. అందికె 'కులానికి కులమే సీడపురుగన్నరు' అంటె? మన ఆడి కులాన్ని వోర్వంది ఆడికులమే! మొన్నటి మనపిల్ల సంగతె సూడరాదు, ఇన్నాళ్ళవట్టి ఒగరు ప్రాణం. ఒగరు శరీరం అంట మొసిల్న సంగతి దెల్సిగుడక పిల్లగాణి తల్లి యాదొ? వొంక జూపి మొకం దిప్పింది. ఇదేం అన్యాలం? పిల్లకు కొదువ యాండది? మనకు ఎల్తి యాండది? పిల్ల రూపుజూస్తె సాలు ఆకలి దూపలు వాస్తవి.

జమిడిరెప్పల తోటి కవుచిప్పలోలె కాట్కెకండ్లు, అద్దాలోలె ముద్దులు గురిసె చెంపలు, సింగిణీలోలె బొమ్మలు, పల్కుల సిల్కోలె మాటలు, పొన్నకాయెతీర్గ పొంకమైన పెయ్యి, మొగమారాజుల తోటి సరి బరి సదువు. అన్ని అమిరిన సదువుల తల్లీ అసొంటి కుందనపు బొమ్మను, వొల్లుమన్నంత పని జేసిన్రు ఏటవుతలి తెగ నీల్గుళ్ళు, ఖదరుదెల్వని గుణాలు, అంట జెప్పుతుంటె జరజర పోవడి పసిగట్టిన గోయిందమ్మ నడుంగల అడ్డమొచ్చి –

"ఎశోద! నీవు జెప్పవట్టిన జోలి మన పెదనాయిన మనుమరాలు ప్రభమ్మ ముచ్చెట గినగాదుగద? అదిచిల్క తల్లి, సింగారాల దొంతి, దానికి వొంకలు దిద్దెటోండ్లెవరు? గని" ఇది మళ్ళ యాదన్న కొత్త సంవందం గిట్టన ఏంది?

ఆ పిల్ల ఇంతకు ముందె మన పురాణాలల్ల పతివర్తలోలె మెచ్చి మనసిచ్చినోణ్ణి కాదని హరిబ్రహ్మదులొచ్చిన గని వొల్లనంట గూసున్నట్లు పుకారుండది. వుత్తపుకారు కాదు ఖుద్దు మీ బావనె జెప్పిండు ఇనుకత అంట మొదలు వెట్టింది.

"నేను ఈడ్కి రాక తొలిగ అంటే వో వారం పది దినాల కింద రామాపురం నుండి వొ అయ్యగారొచ్చి మీబావనుగల్సి ఆ ముచ్చెటేముచ్చెట అల్లం బెల్లం మాట్లాడి నంక వుపాయంగ దొరవారూ! శుభకార్యం మీద బయిలెల్లి శుభ వర్తమానం దెచ్చిన. అన్నిట్లు... సంబంధం, ఆర్సమైన కుటుంబం, మీ కన్న వో బెత్తెడు పొడుగరి పిల్లవాడు, విలాయత్ సదువు అంటే అమెరికా పలట్, వీండ్లకు కోడలు చదువుకున్న సక్కని చుక్క కావాల్నంట. ఆంత సదువూ సింగారం కలెబోసిన సొగసుకత్తె దొరసాని వారి బంధువర్గంల ఉందని తెలిసి, నన్ను అప్పుడు గాదిప్పుడంట తుర్తుల పంపిన్రు. తమరు పట్టిచ్చుకోవాలె' అన్నడంట. ఆ మాటలిని, అన్ని దెల్సిన మీ బావ భవంతి బంకులు దద్దరిల్లె టట్లనగుకుంట బంకుల్లకు నన్ను విలిపిచ్చి నా కండ్లల్ల కండ్లు గలిపి!

"ఇగో! ఇంటుండవా? వో శుభకార్యంల నీ సాయం గావల్నంట, అంటె రామాపురంల పేరువోయిన ఇంటికి మీ ప్రభను అదుగొచ్చిండు అయ్యగారు, ఏవంటవ్? నీకు దెల్సొ తెల్వదొ గని, ఆదొర్సాని పెద్దాసిన్న అనకుండ ఎన్నటికి దమయంతమ్మ నలమారాజును వరిచ్చి ఇంద్రాది దేవుతలను గాదన్న కతోల్నె తాసుగుడ ప్రసాదు అనెటి జతగాణ్ణి కోరుకున్నదట, యాపుట్టల యాపాముండదొ? ఆడోళ్ళేం సిన్నసన్నోండ్లు గన్నన? నీళ్ళలోతు ఆడిదాని ఎదలోతు ఎవ్వరికి దెల్వదన్నరు పెద్దలు. అయితె మాయె; వోత్యాప మీ తల్లిగారి రాజ్యెం పయినం గట్టి, మతులబు దెల్సుకోనిరారాదు" అంట సూటిగ నాకు గురివెట్టిండు.

ఈ మాటలిన్న నాకు బయమైంది, సిగ్గైంది. గని, అయ్యగారి ముంగల అలుసు జూపకుండ పెద్దీర్కమంత మొకం నిండ పుల్ముకోని అయ్యగార్ని జూసి, అయ్యగారు! మీరు దెచ్చిన, సంవందం అన్నివిదాల మెప్పితమైందె, గని ఇందాకె మీరింటిరి గద, దొర జెప్పిన ముచ్చెట. రెక్కలొచ్చిన రుచులు ఈడొచ్చిన పిల్లలు, ఎన్కటి తీర్గ తల్లిదండ్రి మాటిచ్చి నోణికి నెత్తొంచి అచ్చెన గిల్లలాడెనాడె! పీటలమీద గూసుండి పుస్తెగట్టిచ్చు కునెటండుకు ఇప్పటోళ్ళేం కసురుగాయలు, పసరు విందెలుగారు. ఈడేర్ని వయిసు, మంచిచెడ్డలు ఏర్పాటు జేసె తెలివిడి గొల్పె సదువు, ఇట్ల, లగూ, బిగు, దక్కినంక మనసు వడ్డోణ్ణి మరిపిచ్చుడు అల్కనగాదు మంచిది గుడ గాదు.

మీకు దెల్వంది యాండది నొష్టన ఎంతుంటె అంత! బ్రాహ్మరాత, తూడ్సుడు ఎవరితరం? మీరు మరో తీరున అనుకోకుండి ఎట్ల రానేవొస్తిరి, సాయిత్యం దీస్కపోండి, అంట సంభావనిచ్చి సాగనంపిన.

అయ్యగారట్ల కద్ప దాటిండొ లేదో, మీ బావ మళ్ళా నన్ను విల్సుకోని ఉయ్యాల మంచం మీద గూసుండి ఎక్కడ లేని వుల్లాసం తోటి కోడెపాయం నాటి కొంటె సూపు జూసి ముసిముసి నగులొలుకంగ మన ప్రభ - ప్రసాదుల ముచ్చెటంత పూస గుచ్చిండు. నన్ను ప్రాణవార్తికంగ దగ్గిరికి దీస్కోని సూడు! మీ ప్రభ ఎంపిక జేసుకున్న పిల్లగాడేం ఏరిపారేసె నాసిరకపోడు గాడు, అందరోలె ఉత్తసూపుడు గుర్రం తీరు గాదు, మంచి గోర్జెం వున్న పుట్టుకె, సదువులల్ల అవ్వల్ నెంబరంట, పిల్లగాణ్కి

నిల్వెత్తు గుమ్మరిస్తమంట ఆడిపిల్లలు గల్లోళ్ళు బార్లు దీర్చి గసి పొల్లనంటె పొల్లనని. ప్రభనె జేస్కుంట నన్నడంట, ఈ మొండిని ఆగలేక తలిదండ్రి గుడ జెరమెత్తవడి మంచిదినం జూసి నిశ్చితార్థం చేస్తం అన్నరంట. ఈ కతంత జెప్పిశనాపెద్ద మనుస్సుతోటి మీ బావ, "నిశ్చితార్థం జరిగె ట్యాళ్ళకు నీవ్వగుడ తడుంచుడు మంచిది గద! అంట తుర్తుల నన్ను దోల్తె వొచ్చిన, "ఇదినాకు దెల్సినకత! నీ కతేందొ సెప్పరాదు? నిప్పులు సెరుగకుండ" అని అంటున్న అక్క మాటల తోటి వో సింతాకంత వోప్కె దెచ్చుకోని తనకు తామసం ముంచుకొచ్చిన కతంత 'కాశిపట్నం' జూపినట్ల జెప్పవట్టింది యశోదమ్మ.

అక్కా! పిలగాణోళ్ళు పిల్లం జూడవస్తుండరని నాల్గు దినాలకు ముందె కారటందింది. అయ్యో! ఇంట్ల సంబురం పొంగి కొండదాకెంది. ఆ నాల్గుదినాలు ఇల్లంత కుచ్చుల కోలాట మేసినట్లె; అల్కులు, పూతలు, కడ్డుడు, గాలిచ్చుడు, పలారాలు, ఎచ్చాలు, పూలు తబుకులు, ఆకులు, పోకలు, చుడుబత్తీలు, కుడుకలు, పస్పు కుంకుమలు, గందాలు, అత్తర్లు, పన్నీర్లు, అన్నిలాంచనం దప్పకుండ అమిరిచ్చి, తబుకుల మీద జాలి దీర్చి పూసలు గూర్చిన దస్తీలు గప్పి పెట్టిర్రు.

ఈతదంగం అంత జూస్తె నిశ్చితార్థం జెయ్యెనిచ్చినోళ్ళ తీర్గగాకుండ యాదో? పెద్ద గురువులయ్య శిష్యవొర్గం తోటి సమసీర్నం జేయదొస్తే బయభక్తులతోటి చేస్తున్న సర్పరాయి తీర్గనె కండ్ల వడ్డది.

ఇంటి పెద్ద నాయినమ్మ శేషమ్మ కండ్లకు సురచ్చినాలు వెట్టుకోని ప్రభను విల్చి గదువ పట్టుకోని 'సూడుబిడ్డ! మా ఇంట్ల నీవు ఎత్తెత్తు మాణిక్కెం తీర్గ వెర్గినవ్, రేపు మీ అత్తోళ్ళాచ్చెట్యాళ్ళకు ఎంటికెలు సెంచితోలె ఇరవోసుకోకు. ముద్దుగ నేను మెరుగు వెడ్త, అటెంక బిగ్గజడేసుకో. నడిస్తే ఎదలిర్సి పక్కడు పక్కడు మంట పాపోసులు సప్పుడు చేసుకుంట సోజరోడు నడ్సినట్ల సడ్సకు, ఓ గడిసేప్ప వాళ్ళ ముంగల నెత్తొంచు కోని కూసుండు, ఏందన్న అడ్గితె సేరుకు సవసేరంట జవాబియ్యకు, జర సిగ్గువడుకుంట పెండ్లి కొడుకు దిక్కు వోరగండ్ల జూసి అప్పుడే నెత్తివొంచుకోని వీణెమీటి నట్ల సన్న కుత్తికె తోటి ముక్తసరిగ మాట్లాడు' అంటచెప్పి 'నాచంద్ర దీపం'అంట మెట్కెలు ఇర్సి ముద్దిచ్చు కుంటుంటె పిల్ల కిచ్కు కిచ్కు మంట నగవట్టింది. అది జూసి మేమేగాదు, అదిక్కు కెళ్లివోతున్న అన్నయ్య గుడవొచ్చె నగును రెప్పల్ల ఆగవట్టుకుంట ముందలికి నడ్సిండు. ఆడివిల్ల ద్రౌపదమ్మ సనువుగ వొచ్చి 'అమ్మా! మాందాతల నాటి ముచ్చెట్లు, ఎన్నెల తార్లసొంటి ఈ కాలపు మనుమరాళ్ళకు జెప్తె ఎట్లనె? రేపు నీ మనువడొస్తె సూస్కుమ్మర్వు" అంట జెప్పి మంచి గంధాన్ని పరిమళిచ్చింది.

ఇంతట్లకె వొచ్చిరొచ్చిరంట కడ్పులల్ల కావలున్న పోరగాండ్లు ఉరుక్కొచ్చిర్రు. నోట్లెమాట నోట్లో వుండంగనె పోవల్సినోళ్ళ బుజాన సెల్లలు సవరిచ్చుకోని పెద్దర్వాజ కాడ నిలవడ్డరు. వొచ్చినోళ్ళు మొత్తం తొమ్మిదిమంది, ముగ్గురాడోళ్ళు, ముగ్గురు మొగోళ్ళు, వోసన్న విల్ల, వో దుడ్డెగాడు, వో పనిపిల్ల, పెండ్లికొడ్కు ప్రసాదు రాలేదు ఏందో? పనుండిందంట.

బంకులు దాటంగనె ఆడోళ్ళంత బుజ బుజమంటవోయి, ఇట్లకెళ్ళి రాండమ్మ! బాయి మీద గచ్చులల్ల మొకాలుగిన కదుక్కుందురుగని అంట తోల్కపోయి

నీళ్ళందిచ్చి, తుడ్సుకోను బట్ట తువాలందిస్తె వొచ్చినోండ్లు ఒగరి మొగాలొగరు అదోతీరు జూసుకున్రి, ఇంతట్లకె, పనిపోరి మాచిన్నమ్మగోరు 'టెర్కిటేవల్' వాడ్తారంటి అంట, అన్నది గని మేం ఇనిపిచ్చుకోకుండ ఇంట్లకు నడ్సినం.

అందరొచ్చి మనుసాల్ల పెద్దబెల్లె పీట మీద గూసుండిరి. దాని ఎదూర్గవున్న అరాం కుర్సీలల్ల పిల్లగాణి తండ్రి, పిల్లతండ్రి గూసుంటె, సిన్నపోరలంత ఇంగో బల్లెపీటమీద గూసున్నరు. ఒగళ్ళు అందియ్యంగ ఇంగోళ్ళు వొంటింట్లకెళ్ళి పలారాలు వట్టుకొస్తుంటె, పెద్ద తరహా గా పిల్లమ్యానత్తొచ్చి కలెగల్పుగ నగు మొకం బెట్టి ' ఏఁమ్మ! పయినం బాగసాగింది గద? ఎండపొద్దులు, తిప్పలు వెట్టలేదుగద! అంట మర్యాద నడిపింది.

ఆ మాటకు పిల్లగాణి తల్లి 'ఆఁ సాగింది లెండి ప్యాన్లు తిరక్క ఉక్కపోసి ప్రాణాలు తోడేశాయి అని అంటుంటే బిడ్డ బీబి పాత్మమ్మ శముత్కారంగ వన్నెలు వడుకుంట 'మమ్మీ! వాడి తస్సాదియ్య వాడేంటి? వద్దు మొర్రో అన్నా వినకుండా చాయ్, చాయ్ అంటూ అస్తమానం కేకేసి చంపేశాడు బేవారిస్‌గాడు అన్నది. ఇద్దరొంతాయె, ఇంగ తను మాట్లాడకుంటె బాగుందనుకున్నదో? ఏందో మూడోతల్లి, కండ్లన్నీ దిప్పుకుంట, అక్కగారూ ట్రైనంత ఎంత రద్దీగ ఉందో, ఈస్ట్ గోదావరినించి హైదరాబాద్ వెళ్ళడవంటె ఎంత దూరం? ట్రైన్‌లో హాయిగ, షికారెళ్ళినట్లు ఎళ్ళిరావచ్చనుకుంటె ఎదుట బెర్తువాళ్ళు తెలుగును కూనిచేస్తూ మాట్లాడ్తూ నానా కంగాళీ చేశారు. ఆ తుర్క తెలుగు వినలేకపోయాం. వాళ్ళతో కలిసి పెట్టెలో కూర్సోవటమే నామర్దగ అనిపించింది. ఏదో ఇలా అవస్థల్తోటి బయటపడి చివరికి మీ వూరొచ్చాం అన్నది.

ఇట్ల నర్కుతున్న గొప్పలు, గప్పాలు సాలవన్నట్లు మళ్ళ ఆ పిల్ల అందుకోని 'మమ్మీ! శాటర్ డే ప్రయాణంలో రష్ ఎక్కువ, 'మండే' అయితే ఈజీగా, బేజారీ లేకుండా కులాసాగా వెళ్ళొచ్చు అంటే నా మాటను డాడికేర్ చేస్తేగా? అంటూ అంటుండంగనె.

గల్లుగల్లున పాంజేవులు మోగంగ పూసిన తంగేడోలె పస్పు సీరగట్టి, మెరుపు తీగోలె ముత్తెద ఎంటరాంగ పలారపు కిస్తివట్టుకోని వొయ్యారంగ నడ్సుకుంట సత్తెభామ తీర్గ వొచ్చింది ప్రభ. అపిల్లను జూసి వొరెప్పపాటు అందరికండ్లు ఇప్పారంగ జూసి బీరువోయి నట్లైండ్రు. పిలగాణి తండ్రి మట్కు మనుసార మెచ్చుకున్నడు.

ప్రభను జూసిన కాణ్ణుండి ఓర్వలేని కువ్వారపు ఆడివిల్ల మసి మసి వడ్తుండది. ఈ సంవందం గినగట్టిగైతే కొర్రమట్టోలె నీల్గె తనునీల్గుడు సాదగనుకున్నదో ఏందొ? పోకడ పెద్దమ్మ, ముక్కిర్పులు, మూతిర్పులు మొదలైనవి.

ఇంతట్లకె నాయనమ్మ "ఏందుర్గ అట్లనిలవడి సూస్తుండరు? గోడకు కొట్టిన ఎన్నముద్దలోలె? సుట్టాలకు యాళ్ళపాళ్ళనర? ముత్తెదలకు కుంకుమ పస్పు లొంచుండి" అనంగనె అందురం మంగళద్రవ్యాలు అమరిచ్చిన కిస్తీలు వట్టుకోని కొంగులు బుజాలిడు వకుండ జెక్కి, వొంగి వొంగి, నగుమోకాల్తోటి, వర్సలు గల్పుకుంట

కుడికాలు జాపమ్మ పస్పులు పెట్టుకుందువుగని అంటె 'పమ్మరెత్తు' అంట పుల్ల ఇర్సినట్ల జేసిన్రు. ఇంగ కుంకుమగుడ తామె నేతికి దీస్కొని అంటె అంటనట్ల వెట్టుకున్నట్టు జేసి సోకు సెడ్డదని దస్తీలకు రాసుకున్నరు. ఎదంత జూసి నా పెయ్యంత సుర్రున మండింది. మే జూడిన మున్నసంత తకటాల్రి మూస్రకు మజ్లెదనపు మోటు వాసన గొట్టిందట, వీళ్లషాన్ మిడ్డ గని. ఏంజూస్న ఏలరిపిల్లరా?

ఆ పెండ్లిగాని ఆడివిల్ల పట్నంల పుట్నం గింజోలెపుండి గదురు బెదురు లేకుండ నడ్సిన గని తాకుడు వడని పిల్లంట వోప్మెపట్టొచ్చు గని. ఇదేం పాశం? తమ్మాన గోడలమ్మ? యాబాస సక్కగరాదు. మాట్లాడ్తున్న బొట్లేరు కూతల్న్ల అంగ్రీజ్ అనుకుంటుందది, మా అమ్మలకు వొచ్చినంత గుడరాముగని. ఏందో హిమూకత్!

యాదో! ఆచారాలు, ఇష్టంగాలేదు వొద్దన్నరు. ఇంతకు మునుసెందుకు సిన్నవుచ్చు కోవాల్నంట మట్లసంగనెపుంటి మూయె. ఇంతట్లనె ఆ పిల్లడి ప్రభను జూస్కుంట, 'ప్రభా! మీ ఇంట్లో అన్ని బార్ బరస్ కంట్రీ హాబిట్స్: ఫోక్‌టేల్స్‌లో లా, పోలేరమ్మల్లా పస్పులు పట్టించుకోవటాలు, కుంకుమలు దాంచుకోవటాలు, గందాలు రుద్దుకోవటాలేంటి? ఇంత చదువుకున్న నీవు మాడరన్ సొసైటీ, హైక్లాస్ బిహేవియర్ తెలియనిదానిలా వుండడం బాగోదు ఏవంటావ్? అదే మా ఆంటీని చూడు ఎంతఫాస్ట్ యాండ్ ఫార్‌వర్డు థింకింగొ? అంట దాని కతంత గుమ్మరిచ్చుకున్నది.

ఆ మాటలిన్న ప్రభమ్మకు రౌద్రం ముంచుకొచ్చిందిగని, ఆనువుగాని సోటు తన ప్రసాదు లేదు, అందికె కోపం నోటెంట బయలుపర్చుకుంద చెంపలకు కెంపులద్దింది. చముత్కారంగ ఎడ్డినగు రూపుకంల అంత దిగమింగిది. ఇది జూసి ఫార్‌వోర్డు ఆంటమ్మ వుల్లాసం వుండవట్టలేక - వాళ్ళ అడివిల్లకు జెప్పిట్ల జేసుకుంట -

"బేబి! మనం రాత్రంత ట్రైన్‌లో స్లీపింగ్ లేకుండా సిట్టింగ్‌లోనే వుంటూ ట్రావెలింగ్ చేసి, ఆ బ్యాడ్ ల్యాంగిచేజి విన్నందుకే ట్రబుల్ ఫీలింగ్ అయ్యాం కదా, తీరా వియ్యమంటూ వొచ్చిన ఈ ప్లేస్‌లో, ఈ ఇంట్లో అంతా యూస్, మరీ పాతకాలం మోటు, మన కల్చెర్ వీరికి ఎప్పుడొస్తుంది? ఎలా వొస్తుంది. ఏదైనా ఈ సంబంధం నామూషీగానే ఉంటుంది." అంట తెగిచ్చి కూసింది.

ఆమాటవిన్న ప్రభమ్మ చెవుల వెట్టినకెంపులలో లాకులు కండ్లల్ల ప్రతి ఫలిచ్చుంగ గిరుక్కున దిర్గి ఇంట్లకు నడ్సింది. అందాక ఎవ్వరికి ఏం జరిగింది దెల్వలేదు, పిలగాణి తల్లికి గుడ ప్రాణం చింతకాయ గొర్కినట్లైంది. ఆదోండ్లల్ల యింత కుంపటి రాజు కుంటున్న సంగతి దెల్వక, అవుతల దివాన్ కాండ్లకు శేషమ్మ వోయి కొడ్కునువిల్సి ఏం నాయిన! అందరికి అన్ని పసందయిసట్లెగద? అంతమెప్పితమైనంక అల్సెంజేసు దెందుకు? ఎల్లుండి నిశ్చితార్థానికి తయారు జేస్త అన్నది.

ఆ మాటిని పిలగాణి తండ్రి కడ్పులేం కుటిలం లేకుండ, 'రేపు ఎలాను అబ్బాయి వచ్చేస్తాడు. మా వైపునుండి ఏ ఆటంకం వుండదు. అయితే రెండు రోజులు మమ్మల్ని ఇక్కడే మకాం చేయమంటారు? ఆఁ అంటూనే పెండ్లాన్ని విల్సుకున్నడు. ఆ దొరుసాని, బిడ్డ ఆడింది ఆట పాడింది పాటోలె నెత్తి పూపుకుంట అంజనేలకు బదులు కోతిని జేసింది ఆ పిల్లసు, అందుకే బిడ్డ మనసు పోంటి పోదల్చి మొగణ్ణి జూసి, "అదేంటండి అంత తొందర? అబ్బాయి వచ్చాక మనం కలిసి సంప్రదించు

కోనక్కర్లా. ఆ మీదే ఏ నిర్ణయైనాను. వూరెళ్ళాక మళ్లా తెలుపుదామని చెప్పండి" అంట పుల్ల ఇర్సింది.

గోపాలయ్య సంగతి జెప్తనంట లోపటికి పోయ్యేటాళ్ళకు ప్రభ మొకవంత జేప్ప రిచ్చుకోని బాపూ! ఈ సంవందం నాకొద్దన్నది. ఆ మాటెన్న గోపాలయ్య నిల్చురాయి పడ్డడు. అందరి మొకాలు కత్తేటుకు నెత్తుటి సుక్కరాలనంత తెల్లవడ్డది. ఎప్పరికి నోటెంట మాటపెకుల లేదు.

అయినగని అందరు గంభీరంగ మర్యాదలకు యాడ ఎలితి రాకుండ వడ్డున జేసి భోజనాలకు లేపిన్రు. వాళ్లుగుడ వాళ్ల నడవడికను సరిదిద్దుకున్నట్ల సంబాళిచ్చుకోని భోజనాలమీద గూసుండి వంటకాలు శనాకమ్మగ కుదర్నివంట పొగిడిన్రు. తొల్త ఏందొ దూదిపింజలు ఊదితె గాలిలలేస్తయి. ఆడిచ్చి సూతమంట. రుచాబు జూపిన్రు, గని. వాళ్ళనుకున్నట్ల తాలు యిత్తులు గాకుండ గట్టి గింజలంట తేలంగనె. వుబ్బుడంత వోయి సాపుగైన్రు. ఏం లాబం? ఇనుమా? కట్టెన? ఇర్గితె అత్కెటందుకు? మనుసాయె; అందికె అన్నరు పెద్దలు దేన్నైన తెగ గుంజకు మంట.

ఎట్లైతేంది 'వెళ్ళొస్తం అంట చెప్పిన్రు' ప్రభ కాన్రాలేదు. పెదవుల బిగికి ఇంటోళ్లంత మళ్ళ దరువాజదాంక వోయి 'పోయిరాండి' అంట సాగనంపిన్రు. పిల్ల తల్లి పని పిల్ల సేతుల వో అయిదు రూపాలనోటు వెట్టింది. అదేమొ మొకంశాటంత గాంగ "అమ్మగోరు మీరు మా మంచోరండి, ప్రభ గారు సినిమా యాక్టర్లా వున్నారండి" అంటవలికి పైసక రామత్ సూపింది.

వాళ్ళు వోయినంక, అది సుకమో, దుక్కమె? రొండెర్గని తీర్గ మాట పల్కులే కుండ బీడువడి కూసున్నోళ్ళను జూసి శేషమ్మ సంగతి దెల్వక "అదేంది? పిల్లలు? బెల్లం గొట్టిన రాళ్ళోలె మెస్లకుండ గూసున్నరు? ఏంది అంటుంటె, ప్రభ తల్లి పెద్దమనిషికి చెప్పొద్దంట సైగజేసి, "ఆఁ ఏం లేదు ఉద్కుల వుద్కు అంట ఇప్పుడేగాక, మళ్ళావో వారం పది దినాలకు ఇంత రాజానకం నడ్వాల్నంటె? ఎట్లని ఆలోచన్ల వడ్డరు. అంట సర్దిచెప్పింది. అటెంక పెద్ద మనిషి నాకాడి కొచ్చి 'పిల్లా ! ఏశోద, పెండ్లోండ్లు మాట్లాడిన మాట మన తెలుగేనా? అదోతీరు యాసతోటి బాసోలె గండ్లవడ్తది? వాళ్ళను పయినం ఎట్లైందమ్మ" అంట అడ్గితె ఏందొ.

'రద్ది, బేవారీస్‌గాడు, కంగాళి అంటరేందె? రైలు డబ్బుల రద్దినిండిందంటనా? పాపం వీండ్లు మర్సిపోయి మాల్ గాడిల గిట్ట ఎక్కినో? ఏందో? లేకపోతె మన రైళ్ళనె సామాన్ల డబ్బుల గిన ఎక్కిండొచ్చు. శుబ్రంగ లేక సెత్తచెదారం, కసువు, కర్ర, పనికిరాని రద్ది అంత నిండిన్నదేమొనె? అందికె పాపం తిప్పలువడ్డరు. ఈ త్యాప బాగ చూస్కాని ఎక్కమనాలె.

ఇంగోటి, ఎవడొ రైళ్ళ బేవారస్‌గాడు నిద్రవొనియ్యకుండ, చా, చా అంట వొర్లిండని సీదరిచ్చుకున్నోడు వాళ్ళ ఊరోడొ ఏందొ? బేవారిస్ గన్న దిక్క లేక రైళ్ళ నా అమ్మిక బతుక్కుంట వీళ్ళను జూసి ప్రాణం లేసి రాంగ వద్దన్న ఇనకుండ, చా, శాయ్, అంట ఆర్శిండొచ్చు ప్రాణావార్తికంగ తను వూరోళ్ళంట.

అవును ఏశోద! రైళ్ళల్ల అవుసురానికి ఈవలీవల్కి పోను ప్రతేకం వో అరవుంటది గద, మళ్ళ వీండ్ల ఎదరు మంచెమీద వున్నోళ్ళు కంగాళి అదే 'కంగాల్' ఎట్ల జేసిరో? ఏం కతలమ్మ, ఇనసిత్రాలు!

అవును పిల్లా, షికారు అంటె యాట మూర్కం గదా? దొలలు, బల్సాలు, ఈటెలు, సువ్వలు, తుపాకులు, దీస్కోని అడువులకు పోతరు గని రైళ్ళ షికారేం జేస్తరు? షికారు చేస్త జీవరాసి యాందది? రైళ్ళ, కొట్టేది సల్లనా? బల్లినా?

ఈ త్యాప వొస్తె వాళ్ళ మ్యాసగోడలకి చెప్పాలె అనుకుంటుండ. పోయమ్మో! తనకు నా మర్దగి అంట? ఇదేం అన్యాలం? ఆడిపుట్టక పుట్టి, 'నా మర్దగి' అంటె మొగతనానికి లోటు, అంత పొడుగు, ఇంత పొడుగంట పెద్దోర్లం బల్సి ఆర్తంలేని పొల్లు మాటేంది? మన మొగోళ్ళ సెవులల్ల యాడవడ్తదా? అంట ముగుర్లైండ్. ఆ తల్లి తప్పుదు తుర్కమె గాదు, ఇంగిలీసు గుడ ఇష్టమొచ్చినట్ల సుండ బండాచావదీసి పోకళ్ళు సూపుతుండది. ఏటిపతలోళ్ళు మందిని తుర్కం, గిర్కం అంట పిక్కిపిస్తరుగని, వాళ్ళు నోరు దెరిస్తె మాట్లాడేది ఆ బాసే. అడన్ల తెల్సి తెల్వని బాస. బాస బీస తిప్పుతునంటె కుదుర్తాది. నాల్గు బాసలు దెల్సినోళ్ళు నిండు కుండదోలె పుంటరు, ఎగిసిపడరు, తప్పులు అంత దైర్నంగ వల్కుతుంటె ఏందెల్వని గుడ్లిముగిలమ్మను, నాకె సెవులు తూట్లువడ్డట్టనిపిచ్చింది.

యాదా? సుట్టీర్కం గలిసినంక కడ్పుల వెట్టుకోని పోవాలెగద. ఈ త్యాపదొచ్చినప్పుడు, వాలాయించి ఇవి జెప్పు బిడ్డ, మనోళ్ళు నలుగుట్ల నగుచాట్ల పాలు గాగూడదన్నది.

శేషమ్మ పెద్దమ్మ మాటలిని అంత నొప్పిల గుడ నవ్వు ఆగలేదు. మబ్బులిడ్సిన మొగులోలె అందరి మొకాలు జళజళైనయి. పెద్దామె బుడ్డికి మొక్కాలనిపిచ్చింది. సేదుమందు తేనెతోటి తాగిచ్చి పత్తెం గుర్తు దెల్వకుండ వెట్టింది.

ముసలమ్మ గుండె బలం దెల్సుకున్నంక ఉన్న వాస్తవం జెప్పుదమని, మెల్లగ "అమ్మా! ఇగ జూడు, ఏటవతలోళ్ళకు మనం మోటోళ్ళమైసం. మన మాట యాస, మన రీతి రివాజులు, కట్టుబొట్టు, నడువడికం అంత యాసంట, మనం కాలంపోటి నడ్వకుండ బాయిల వడ్డకప్పలోలె, తండ్లాడుకుంట 'యాండడె గొంగడి అంటె ఏసినకాణ్ణె' అన్నట్లు ఉండమంట, వాళ్ళ తీర్గ బూమికి మొగులకు అంటకుండ యాళ్లాడ్తమంట, వాళ్ళ తీర్గ నజూకులు, నాజాకతులు దెల్వని మనసొంటి అనాగరికపోళ్ళ సంవందం వద్దన్నట్లే మాట్లాడిస్రె. ఆశలు ఇడ్సుకో" అంట జెప్పి నేను ఇంటి కొచ్చిన.

అక్కా! ఇప్పుడు జెప్పు నేను పెంకె మీది ప్యాలెంగింజోలె ఎగురకుంటె ఏంజేతు? నేనుగాదు నీవేం జేస్తవోచెప్పు? అన్నది.

ఆమాటలిన్న గోయిందమ్మ, సీర, బొట్టు సవరిచ్చుకోని 'చెల్లమ్మ పద పోదాం మనోండ్ల ఇంటిదాంక" అంటె ఇద్దరుగల్సిపోయిన్రు.

అట్ల వోయినోళ్ళు ఆ మాట ఈమాట మాట్లాడకుంటుండంగనే మోటరు సైకిలెక్కి జెయ్యిమంట ప్రసాదు, ప్రభ ఇద్దరొచ్చిన్రు. వాళ్లను జూడంగనె ఇదేం మైస్కరం? ఇదేం ఇంద్రజాలం? మేం జూస్తున్నది నిజంగనేన, ఏదన్న కనికట్టు విద్దెనా? అంట జూస్తుంటె సిన్న పిల్లలు, నాయినమ్మ, నాయిన ఇంగ రాండి సూతురంట కూతలు వెట్టిన్రు. ఇంట్లకెళ్ళివొచ్చిన తల్లికొడుకులిద్దరు ఎదురుంగ పూలదండ లేస్కోని పార్వతీ పరమేశ్వరు లోలె, నిలవడ్డ ప్రభప్రసాదులను జూసి

తలుపులు దెరువంగనె ఎంకటేశ్వరస్వామి దర్శనం తోటి కండ్లు చెక్కున మెరువంగ పైయంత పులుకలు పుట్టంగ ఏ భావమో తెల్వకుండ కండ్లనీళ్ళు గారంగ ఇదేం చిత్రం తల్లీ! అంటుండంగనె ఇద్దరొచ్చి గోపాలమ్మ జానకమ్మలకు దండం బెట్టిన్రు, ప్రభ దబ్మున వోయి నాయనమ్మ సంకన సంటి విల్లోలె జొర్రింది. శేషమ్మ పిల్లనెత్తి లేవట్టి ముద్దిచ్చుకుంట, అమ్మో! ఎంతదానవెంవైతివె? పోయి పోయి ఆర్సమైన ఏన్గెనె ఎంటవెట్టుకొస్తివి అంట దబ్మున్ ఇంట్లకు వోయి మూడుముద్దల అన్నం నల్పు, పస్పు, ఎర్పులు అద్ది తెచ్చి దిష్టిలేకుండ ఘుత్తిదీసింది.

తల్లి జానకమ్మ 'ఏంనాయిన పెండ్లికి మేం మోటనుకున్నారా? అంట, గొంతు గద్గద మనంగ కండ్లొత్తుకున్నది.

ఆమాట తోటి దెబ్బదిన్నట్లైన అల్లుడు లేదమ్మ! మా చెల్లెలు తెల్వంది, పాపం మా అమ్మకేం దెల్వదు, ఏదో జరిగివుంటది, అందికే మీ రెండు కుటుంబాల అంటుపొంటు లేకుండ, ఎవ్వరి మనుసులు నొవ్వకుండ పెండ్లి జేసుకున్నం, ఇప్పుడు మీరెంత పండుగన్న జేసుకోండి.

అవ్వా! మేం గుమ్మడి పండ్లను గని మీ చేతుల వెడ్తం, తెలంగాణపు పల్కుబడి తీపినంత చేదుకొచ్చి నీవొళ్ళ వోసి తరతరాలకు ఈ తీపి చెవులూరించాలని దీవిచ్చు, అన్నడు, అందరి ఎదలు ఘల్లగ గాండ ఇండ్లకు నడ్సిన్రు.

● 1969 ●

# 32. తామరపూలు

♦ దాశరథి రంగాచార్య ♦

**బా**ల్యం... ఆ పదం గారడి చేస్తుంది. ఆ పదం వినగానే మబ్బుల మీద స్వారీ చేస్తున్నట్లూ - నక్షత్రాలతో ఆడుకుంటున్నట్లూ అనిపిస్తుంది. అలా విహరిస్తూపోతే చందమామ ఎదురవుతాడు. ఆ చంద్రునిలో ఒక పొన్న చెట్టు ఉంటుంది. ఆ చెట్టు క్రింద ఒక ముసలవ్వ కూర్చుని ఉంటుంది. ఆమె రాట్నం మీద దారం తీస్తుంటుంది. అలా అలా విహరించి దిగి వస్తే మా ఇంటి ముందరి రెండు చింతచెట్లు గుర్తుకువస్తాయి.

ఆ రెండు చింతలు - వాటి సాంద్రచ్ఛాయలో బంగారు బాల్యం కరిగిపోయింది. అందకుండా పోయింది. దొరక్కుండా పోయింది.

నా బాల్యం వెళ్ళిపోయింది.

తిరిగి చూడకుండా పోయింది.

కనిపించకుండా పోయింది.

మా యింటి ముందరి రెండు చింతలు, చలికాలంలో వెచ్చని నీడ! ఎండ కాలంలో చల్లని నీడ? ఒక్క చింతకింద నర్సిగాని గుడిశ.

నర్సయ్య నా బాల్యమిత్రుడు. అతనితో - ఆ చింతల నీడన ఎన్ని ఆటలు ఆడామో! గోలీలు ఆడాం. చిర్రగోనె ఆడాం. బిళ్ళంగోడు ఆడాం. మొగల్ పఠాన్ ఆడాం. దాగుడు మూతలు ఆడాం. ఉప్పు చెర ఆడాం.

ఆటలు! ఆటలు! అటువంటిదే బాల్యం!

ఉంటుందా వెర్రి బాగులుది! వెళ్ళిపోయింది!!

దీపావళి వచ్చిందంటే పండుగలకు పండుగ! టపాకులు - మతాబులు లేవు. కోలలు చేసుకునేవాళ్ళం. వాటిని పోటీపడి గిరగిరా తిప్పేవాళ్ళం. ఒక జ్వాలా వలయం! ఒకటి కాదు - రెండు కాదు - అనేక జ్వాలా వలయాలు!! ఇంద్రధనుస్సులు గిరగిరా తిరుగు తున్నట్లుండేవి.

అప్పుడప్పుడూ మా ఇంటి పక్క సీత వచ్చేది. చింతల నీడకు రవంత దూరంలో బొడ్డుమల్లె పున్నాగ - చెట్టు వుండేది. సీత ఆ పూలు ఏరుకోవడానికి వచ్చేది. తెల్లవారేవరకు బొడ్డు మల్లెలు - నేల కానరాకుండా రాలేవి. సీత పూలు ఏరడం బాగనిపించేది. ఆమెకు వడి నిండా పూలు ఏరిపెట్టడం సరదా! నర్సయ్య చెట్టును ఊపుతాడు. పూలు - వానలా రాల్తాయి. ఆ రాలడం సీతా, నేనూ సంబరంగా చూచేవాళ్లం.

సీత వడి నిండితే గంతు లేసుకుంటూ పరిగెత్తేది. మేమిద్దరం చూస్తూ ఉండేవాళ్ళం! ఆమె లేడిలా గంతులు వేస్తూ పరిగెత్తేది.

బొడ్డు మల్లెపూవు కాడ తుంపి నోట్లో పెట్టుకుని ఊదేవాళ్ళం. సీత కూడా ఉన్నప్పుడు ఆ ధ్వని విని ఆమె కిలా కిలా నవ్వేది! ఆమె కళ్ళు పెద్దవి. అలా నవ్వినప్పుడు చిన్నవి అయ్యేవి. మేమూ అమెతో కలిసి నవ్వుతాం.

కాని సీత నవ్వే వేరు!

ముత్యాలు రాల్తాయి.

ఒక్కోసారి సీత - వడి నిండా పూలతో - కూలి పడిన గుడి స్తంభం మీద కూర్చునేది. పూలుతీసి తన వ్రేళ్ళతో సుతారంగా మాల అల్లేది. అలా బారెడు మాల అల్లుతుంటే ఆశ్చర్యంగా చూస్తూ ఆమె పాదాల చెంత కూర్చునేవాణ్ణి!

అది ఒక ఆనందం!

అది ఒక అంబరం అందటం!!

సీత బారెడు మాల అందుకొని నిర్దయగా వెళ్లిపోయేది! ఆమె నడకను చూస్తూ ఉండిపోయేవాణ్ణి!!

వర్షాకాలం హర్షకాలం! అది వచ్చిందంటే మా ఆనందానికి అవధుల్లేవు. జోరున వానలో ఎగిరే వాళ్ళం. గంతులేసే వాళ్ళం. వర్షంలో నుంచొని - నెత్తి మీదనుండి పడే వాననీరు - ముక్కు మీదినుంచి జారుతుంటే - నాలుకతో చప్పరించడం!

అదొక మహత్తర అనుభూతి!

అదిచెప్పడానికి భాషలేదు! పదాలు చాలవు!!

మా ఇంటిపక్క నుంచి పంటకాలువ పారుతుంది. ఉదయం నర్సయ్యా, నేనూ బయలుదేర్తాం. ఇసుకలో కాళ్ళు ఈడేస్తూ కాలువలో నడుస్తాం. మధ్య మధ్యన ఎగురుతాం. గంతులేస్తాం. నీళ్ళు చల్లుకుంటాం. అలా చెరువు తూముదాకా నవ్వుతూ త్రుళ్ళుతూ సాగిపోతాం.

అక్కడ కాలువ నుంచి బయటపడతాం. చెరువు కట్టలు ఎక్కుతాం.

అది మా ఊరి చెరువు. దాని పేరు ముత్యాలమ్మ కుంట. చెరువు. పక్కన పెద్ద రాతి పరుపు. దాని మధ్యన ఒక ముద్దు వచ్చే మర్రి గున్న. దానికి ఆవల ముత్యాలమ్మ గుడి. చెరువు కట్ట దిగువన గుబురు నాగ జముండ్లు! వాటిని ఆనుకొని పచ్చని పొలాలు! చెరువు కట్టమీద అక్కడక్కడా మోదుగు చెట్లు.

మేము చెరువు కట్ట ఎక్కి చూస్తే చెరువులో నీళ్ళు కనిపించేవికావు. చెరువు నిండా పరుచుకున్న పచ్చని తామర ఆకులు. వాటిమీద ముత్యాల్లా మెరిసి ఆటలాడే నీటి బిందువులు - రెండాకులకు ఒక పూవు చొప్పున విచ్చుకున్న తామరలు. వాటిమీద ఎగిరే నల్లని తుమ్మెదలు. అబ్బో! అదొక మహాద్భుత దృశ్యం!

లోకంలోని తామరలన్నీ అక్కడే చేరినట్లు!

లోకంలోని అందాలన్నీ అక్కడే రాశి పోసినట్లు!

అది మాటలకు అందని అందం. ఆ అందం వదలడం ఇష్టం కాదు. అక్కణ్ణుంచి కదలను.

ఎండ ఎక్కుతుంది. అవి మరింత అందం సంతరించుకుంటాయి.

ఎండ చురుక్కు మంటుంది. అయినా కదలను. ఆ అందం వదలరానిది. వదలను! నర్సయ్య జ్ఞాపకం చేస్తాడు – ఇంట్లో కొడ్తారని! అతడు నన్ను లాక్కుపోతాడు. దూరంగా అమ్మ కనిపిస్తుంది. అన్నానికి పిలవడానికి వస్తుంది. ఇహ తప్పదు. వెళ్ళిపోతాను! అయినా తామరల చెరువు నన్ను విడువదు! వెంటనే వస్తుంది!

ఒకనాడు చెరువును అలా చూస్తున్నాను. తామరలు పరుచుకొని పడుకోవాలని పించింది.

"నర్సయ్యా! పూలు తెస్తవా? వాటిమీద పడుకోవాలె సనిపిస్తున్నది" అన్నాను.

"అట్లనురి, ఇగో దిగితి. బండెడు కోస్తి" అన్నాడు నర్సయ్య.

అయితే, అన్ని పూలు తెంపడం మనసొప్పలేదు. రెండు తామరలు కోయించాను. రెండు చేతుల్లో పట్టుకున్నాను. తామరతూళ్ళు మంచు తీపల్లా చల్లగా హాయిగా ఉండేవి. వాటి చివరన వికసించిన పద్మాలు!!

అలా వెళ్తున్నప్పుడు సీత కనిపించింది. రెండు తామరపూలు సీతకు అందించాను. సీత అవి అందుకున్నది. ఎగిరింది. గంతేసింది. చెంగు చెంగున ఎగురుతూ మాయం అయింది. బహుశా ఒక రాజ్యం చేతికందినా అంతకుమించి ఆనందించదు!

నేను చింతల నీడలో – గుడి స్తంభం మీద కూలబడ్తాను. చెరువు పక్కనున్న పరపు బండ మధ్య మర్రిగున్న కింద సీత కూర్చుంటుంది. నేను గంపలతో తామరలు తెస్తాను ఆమె ముందు పోస్తాను. సీత బొడ్డుమల్లెలతో వలె తామరపూలతో మూల అల్లుతుంటుంది. నేను ఆమె పాదాల చెంత చతికిలపడి సీతవ్రేళ్ళ కదలికలు చూస్తూ ఉండిపోతాను!

అదీ దృశ్యం! అలా జరగాలని ఊహ!!

ఒకనాడు సీత చేయి పట్టుకొని చెరువుకు రావలసిందని ప్రాధేయపడ్డాను.

"ఛీ! ఆడపిల్లలు చెరువు కొస్తరా? మా అమ్మ చంపుతది" అని నన్ను విడిచి రాతి బొమ్మలా సాగిపోయింది.

నేను కుప్ప కూలిపోయాను. సీత తామరలు కద్తుండగా చూడలేను!

సాయంత్రం మళ్ళీ చెరువుకు వెళ్ళే వాళ్ళం. అంత అందం కనిపించేది కాదు. అందం సొంతం ఎవడో దోచుకుపోయాడు అనిపించేది. అయినా ఉదయం విచ్చుకున్న పూలనూ – సాయంత్రం ముడుచుకున్న పూలనూ చూడకుండా ఉండలేకపోయేవాణ్ణి.

ఒకరోజు నాయనమ్మను అడిగాను "ఎండకేమో!" అన్నది.

తామరలను కాపాడాలి. వాటికి ఎండ తగలరాదు. ఇంట్లోంచి చింత గింజలు తీసుకెళ్లాను. చెరువు కట్టమీద నర్సయ్య గుంతలు తీశాడు. నేను గింజలు వేశాను. పూడ్చాను. చింతలు పెరుగుతాయి. వాటి చిక్కని నీడలో తామరలు వాడవు! అలా అనుకొని రోజూ చెంబులతో వాటికి నీళ్ళుపోశాం. కొన్ని రోజుల తరువాత మొక్కలు మొలిచాయి! పచ్చని రెండు గింజలను చీల్చుకొని –చిగురు తరువాత కిరీటంగా వచ్చిన మొక్కల బారులు మురిపించాయి. వాటిని వదలబుద్ధికాదు!

ఒకనాడు చెరువు కట్టకు వెళ్లాం. అక్కడ మొక్కల్ను పశువులు తొక్కేశాయి. మేకలు మేసిపోయాయి. మొక్కలు ఉన్న జాడ కూడా మిగల్లేదు. నాకు ఏడుపు వచ్చింది. పెద్దగా

ఏడ్చాను. ఎక్కెక్కి ఏడిచాను. మంచినీళ్ళకు వచ్చిన ఆడవాళ్ళు చూశారు. కారణం తెలుసు కున్నారు. నవ్వారు. కొంగుతో కన్నీళ్ళు తుడిచారు. నన్ను ఇంటికి తీసికెళ్ళారు. మా నాయనకు అప్పగించారు. మా ఇంట్లో అంతా నన్నుచూశారు. విరగబడి నవ్వారు.

"వెర్రి వెధవా! తామరలు ఎండకు వాడవు, విచ్చుకుంటవి. సూర్యుడు క్రుంగుతె ముడుచు కుంటవి" అన్నారు నాయన.

అయితే, ఇదంతా సూర్యుని పని. వాణ్ణి క్రుంగకుండా చేయాలి! ఏం చేయాలి? గొడుగు పట్టుకుంటే సరి. ఒక్క గొడుగు చాలదు. ఇంట్లో ఒక్కటే గొడుగు ఉంది!

తాటిచెట్టు ఎక్కి సూర్యుణ్ణి పట్టవచ్చు. కాని, దానికి ఇంకా పెద్దవాణ్ణి కావాలి! మునివేళ్ళమీద లేచినా గూడు అందలేదు.

ఆకాశం వంగే చోటికి వెళ్ళాలి! అదిగో, అక్కడ సూర్యుణ్ణి పట్టాలి! నర్సయ్యను వెంట పెట్టుకొని బయలుదేరాను. ఎంత దూరం వెళ్ళినా ఆకాశం వంగిన చోటు రాలేదు. సాయంత్రానికి ఇల్లు చేరుకున్నాం. అంతా నాకోసం పరేషానుగా ఉన్నారు.

మా నాయన గద్దించారు. "ఆకాశం వంగిన చోటికి" అన్నాను.

"మామ్మే! మా నాయనే!" అని మా అమ్మ గట్టిగా కౌగలించుకొని ముద్దులాడింది. ఆకాశం వంగే చోటు ఉండదని చెప్పింది.

ఆనాటి అమ్మ ముద్దుల ఆనందం మరలి వచ్చేనా!!!

వర్షాకాలం దాటిపోయింది. ఎండకాలం వచ్చింది. చెరువు సాంతం ఎండి పోయింది. ఆ తామరలు – ఆ అందం అంతా అంతరించింది. పందులు తామర దుంపలు తవ్వుకొని తింటున్నాయి.

నా మనసు నెర్రెలు వారింది!

చెరువు కట్టన ఉన్న మోదుగులు విరగపూశాయి. ఒక్క ఆకులేదు. చెట్లు సాంతంనిప్పు కణికలతో కణకణ లాడుతున్నాయి. పూసిన మోదుగుల అందం చూచి తీరాలి. అయినా, తామరల్లా అనిపించేవి కావు. నాలో తామరలు తాపం చల్లారలేదు.

బొడ్డు మల్లెలు లేవు. సీత మల్లెలు ముందు పోసుకొని మాల అల్లుతుండేది. ఒకనాడు వడి నిండా మోదుగ పూలు తెచ్చి ఆమె ముందు పోశాం. "మోదుగ పూల మాల కడ్తరా?" అని చివాలున లేచి వెళ్ళిపోయింది.

చెరువు కట్టకు వెళ్లినప్పుడల్లా బీటలు వారిన చెరువును చూస్తే ఏడుపు వచ్చేది. "వానాకాలం వస్తది. చెరువు నిండుతది. తామరలు పూస్తయి" అనేవాడు నర్సయ్య.

వానాకాలం కోసం ఎదిరిచూపులు! ఎదిరిచూపులు!! ఎదిరిచూపులు!!!

మృగశిర ప్రవేశిస్తే వర్షం వస్తుందన్నారు మా నాయన! మృగశిర రానేవచ్చింది. బెల్లంలో ఇంగువ పెట్టి మిగించింది నాయనమ్మ.

వాన పడుతుంది! చెరువు నిండుతుంది. తామరలు తంపరలుగా పూస్తాయని ఆశ!!! రోజంతా ఎదిరి చూశాను. రాత్రి సాంతం మేలుకొన్నాను. ఆకాశం మీదనే దృష్టిని నిలిపాను. మబ్బులు రాలేదు. వాన కురవలేదు. నా ఆశ ఫలించలేదు.

చెరువును చూచి ఏడుపు వచ్చింది. మోదుగు పూలు కూడా లేవు. ఎడారి వలె ఉంది. బీడుగా వుంది. దాడి జరిగినట్లుంది.

రోజులు గడుస్తున్నాయి. చినుకు రాలడం లేదు

"వాన రావటానికి ఏం చేస్తరు?" నర్సయ్యను అడిగాను.

"ఆంజనేయస్వామికి నీళ్లు పొయ్యాలె" అన్నాడు.

ఆనాడు తలమీంచి స్నానం చేశాను. తడి తలతో, తడి బట్టలతో, వెల్తిన తప్పేలడు నీళ్ళతో ఆంజనేయస్వామి గుడికి వెళ్ళాను. స్వామి పాదాల మీద నీళ్ళు గుమ్మరించాను. కళ్ళు మూసుకొని ప్రార్థించాను.

"స్వామీ! వాన పడెయ్యి. చెరువు నింపు. తామరలు పూయించు "

రోజులు గడుస్తున్నాయి. వాన రాలేదు చెరువునిండలేదు. తామరలు పూయలేదు.

ఆనాడు తడిసిన తలలతో, తడిసిన బట్టలతో మా ఇంటికి కొందరు పిల్లలు వచ్చారు. వారిలో ఇద్దరు రోకలిని చెరొక వైపు భుజాలమీద పెట్టుకున్నారు. రోకలి మధ్యన గుడ్డలో కప్పను కట్టి తెచ్చారు.

"కప్పా తల్లి నీళ్లాడె - కడవా నిండా వానా కురిసె

దోమా తల్లి నీళ్లాడె - దొడ్లా నిండా వానా కురిసె

ఈగా తల్లి నీళ్లాడె - ఇంటినిండా వానా కురిసె

పామూ తల్లి నీళ్లాడె - పటువా నిండా వానా కురిసె."

వారు అలా ఎందుకువచ్చారని అడిగాను. "కప్పతల్లికి నీళ్ళు పోస్తె వాన కురుస్తది" అన్నారు.

"వాన కురుస్తదా! చెరువు నిండుతదా!! తామరలు పూస్తయా!!! అడిగాను.

"ఓ! కురుస్తది" అన్నారు.

బావి దగ్గరకు ఉరికా. నీళ్ళు తోడా. తప్పేల నింపా. తప్పేలతో తెచ్చి కప్ప తల్లి మీద నీళ్ళు గుమ్మరించా.

"కప్పతల్లీ! వాన పడెయ్యి. చెరువు నింపు. తామరలు పూయించు" అని తల్లి మీద మొక్కాను.

రోజులు గడుస్తున్నాయి. వాన రాలేదు చెరువు నిండలేదు తామరలు పూయలేదు.

చెరువు దగ్గరికి వెళ్ళాను. ఏడిచాను. చింతల కిందకి చేరాను ఆటలు ఆడలేదు. గుడిస్తంభంమీద కూలబడ్డాను. ఊరు బోసిగా ఉంది వెలితిగా ఉంది వెళ్లి పోయినట్లుంది.

"వానపడదా! చెరువు నిండదా!! తామరలు పూయవా!!!" నర్సయ్యను అడిగాను.

"వాన కురుస్తది. ఇయ్యాళ బోనాలు పడ్తున్నారు" అన్నాడు.

ఆ సాయంత్రం మంచి బట్టలు వేసుకొని బయలుదేరాను. ముందు డప్పులవాళ్ళు - కొమ్ములవాళ్ళు సాగుతున్నారు. వారు కొమ్ములు ఊదినప్పుడు నాకు వింత అనుభూతి కలిగేది. గుండెలో ఉరుము ఉరిమి క్రమంగా జారిపోతున్నట్లనిపించేది డప్పుల చప్పుళ్ళకు ఎగరాలనిపించేది. ఎగిరేవాణ్ణి.

వారి వెనుక ఆడవారు కడవల దొంతరలు - బిందెల దొంతరలు పెట్టుకున్నారు. దొంతరలకు వేప మండలు కట్టారు. వేపాకు మండలు పట్టుకొని మగవారూ, పిల్లలూ సాగుతున్నారు.

"వాన కురుస్తదా! చెరువు నిండుతదా! తామరలు పూస్తయా!!" అక్కడ ఒకర్ని అడిగాను

"ఓ! కురుస్తది" అన్నాడు

తప్పేలలో నీళ్ళు నెత్తిన పెట్టుకొని నేను నడిచాను.

"ఆడపిల్లలు పెట్టుకుంటరు. మగపిల్లలు పెట్టుకోరు" నర్సయ్య అన్నాడు. నేను వినలేదు. తల మీద తప్పేలతో నడిచాను.

ఊరేగింపు చెరువు కట్టకు చేరింది. ముత్తాలమ్మ గుడి ముందు నీళ్ళు గుమ్మరించారు. నేనూ గుమ్మరించాను.

"ముత్యాలమ్మ తల్లీ ! వాన పడెయ్యి. చెరువునింపు. తామరలు పూయించు" అని మొక్కుకున్నాను.

ఆ రాత్రి వాన కోసం ఎదిరి చూచాను. ఆకాశం మీదనే దృష్టి ఉంచాను. నల్లని ఆకాశంలో తెల్లని చుక్కలు మిలమిలా మెరుస్తున్నాయి. ఆశ మోసుకొని ఒక మబ్బు ముక్క వచ్చింది ఆశలు వమ్ము చేసింది. చిటపట చినుకులు రాల్చింది తేలిపోయింది

రోజులు గడుస్తున్నాయి వాన రాలేదు. చెరువునిండలేదు. తామరలు పూయలేదు.

"వాన పడదా? చెరువునిండదా? తామరలు పూయవా?" నర్సయ్యను అడిగాను.

"ఇయ్యాళ సాయెబులు చెరువులో నవాజు చేస్తరట" నర్సయ్య చెప్పాడు.

ఆ సాయంకాలం చెరువు దగ్గరికి వెళ్లాను. సాయెబులు తళతళ మెరిసే షేర్వానీలు వేసుకొని కూడారు. కొంతమందికి గడ్డాలున్నాయి.

"నవాజు చేస్తే వాన కురుస్తదా! చెరువు నిండుతదా!! తామరలు పూస్తాయా!" ఒకరిని అడిగాను. "ఓ కురుస్తది" అన్నాడు

సాయెబులంతా చెరువులోకి దిగారు. వరుసలుగా నుంచున్నారు.

నేనూ వారి వెంట సాగాను. నర్సయ్య వెనక్కు లాగాడు. సాయెబులు వరుసలుగా వంగారు. కూర్చున్నారు ఏదో చదివారు. లేచారు. వెళ్ళిపోయారు.

ఆ రాత్రి వాన కోసం ఎదిరి చూశాను ఆకాశం మీదనే దృష్టి ఉంచాను. నల్లని ఆకాశంలో తెల్లని చుక్కలు మిలమిలా మెరుస్తున్నాయి. ఆశ మోసుకొని ఒక మబ్బు ముక్క వచ్చింది. ఆశలు వమ్ము చేసింది. చిటపట చినుకులు రాల్చింది. తేలిపోయింది.

రోజులు గడుస్తున్నాయి. వానరాలేదు. చెరువు నిండలేదు. తామరలు పూయలేదు

చింతల కిందికి వెళ్ళడం మానేశాను. నర్సయ్య మా ఇంటికి వస్తున్నాడు వానను గురించే ఆలోచన! ఏం చేయాలో తోచదు ఉన్నట్లుండి ఆకాశమంత పెరగాలనిపించేది. అప్పుడు మబ్బుల్ను లాక్కొచ్చి కురిపించవచ్చు. మునికాళ్ళ మీదగా చూస్తే గూడు అందలేదు

దేవుడు వాన పడెయ్యడం లేదు దేవుడు చెడ్డవాడా? దేవుని పటం చూచాను దేవుడి చేతిలో తామరపూవు ఉంది. తామరలంటే దేవుడికీ ఇష్టమే! దేవుడికి తన

తామరయే ఇష్టం లాగుంది. చెరువు నిండా తామరలు చూడలేదేమో! దేవుని చేతిలోని తామర లాక్కుంటే సరి! చెరువులో తామరలు హాయిస్తాడు! దేవునికి కావాలిగా ఒకటి! పీట వేసుకున్నా పటం అందలేదు.

ఒకనాడు నర్సయ్య ఉరికి వచ్చి చెప్పాడు సీత వచ్చిందని. వెళ్ళి చూశాను. సీత స్తంభం మీద మౌనంగా కూర్చుంది. అశోకవనంలో సీతలా ఉంది. ఆమెముందు పూలు లేవు. ఆమె మాల అల్లడం లేదు. ఆమెలో విషాదచ్ఛాయలు కనిపించాయి.

నేను ఆమె పాదాల చెంత కూర్చున్నాను. ఆమె నన్ను చూసింది. మాట్లాడలేదు. నాకు దుఃఖం వచ్చింది.

"సీతా! వాన పడదా! చెరువు నిండదా? తామరలు హాయవా?" నా మాటలు కన్నీటి తడిశాయి.

సీత నన్ను ఒక రకంగా చూసింది. ఆ చూపులో ఆర్ద్రత ఉంది. తడి ఉంది, ఆప్యాయత వుంది.

"రేపు చెరువులో విరాటపర్వం పురాణం చెప్తుతరట. వానవస్తది. చెరువు నిండుతది. తామరలు పూస్తయి" అన్నది. ఆమె మాటల్లో అంతులేని విశ్వాసం దర్శనం ఇచ్చింది.

"సీతా! నువొస్తవా చెరువుకు?"

"వస్త కద" అన్నది. ఆమె కళ్ళు తామర రేకులంత అయినాయి.

సీతా, నేనూ జంటగా ఇళ్ళకు చేరుకున్నాం.

రేపురానే వచ్చింది. గ్రామం సాంతం చెరువు దగ్గరే చేరింది. నడి చెరువులో పందిరి వేశారు. బారుగడ్డం - తేజోవంతము లయిన నేత్రముల స్వామి తివాచి మీద కూర్చున్నారు. వారి ముందు వ్యాస పీఠం. వ్యాస పీఠంలో భారతం. వారి ప్రార్థన మేఘ గంభీరంగా ఉంది. వారి గొంతు కంచు గంట.

విరాటపర్వం ప్రారంభం అయింది.

సీత మర్రి నీడలో కూర్చున్నది. మాల అల్లుతున్నది. నేను ఆమె పాదాల చెంత కూర్చున్నాను. ఆమె వ్రేళ్ళ కదలిక - మాల అల్లిక చూస్తున్నాను.

"సీతా!"

సీత చూసింది.

"చెరువు చూసినవా! బీటలు వారింది."

సీత తొలిసారిగా బీటలువారిన చెరువును చూసింది. చూస్తూనే ఉంది.

సీత కళ్ళను చూచాను.

అమె కనులు ఎండిపోయాయి. ఆమె కనుపాపల్లో బీటలువారిన చెరువు దర్శనం ఇచ్చింది.

సీత గంభీరంగా ఉంది.

"సీతా!"

"సీతా!" పలుకలేదు.

"వాన వస్తుందా?"

"వాన కురుస్తుంది, చెరువు నిండుతుంది. తామరలు పూస్తయి" ఆమె ధ్వనిలో శాసనం ఉంది.

సీత కళ్ళను చూశాను.

సీత కళ్ళలో నీరు నిండింది.

ఆమె కనులు నిండిన చెరువుల్లా ఉన్నాయి.

సీత ఆకాశంలోకి చూచింది.

నేనూ ఆకాశంలోకి చూచాను.

మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఏనుగులు గుంపులా సాగి వస్తున్నాయి. చల్లని గాలి వీస్తున్నది.

క్షణాల్లో ఆకాశం మేఘచ్ఛన్నం అయింది.

ఇద్దరమూ ఆకాశాన్నే చూస్తూన్నాం.

ఫెళ ఫెళార్భటులతో ఉరుములు వినిపించాయి.

శిశిర వృక్షాల్లా మెరుపులు మెరిశాయి.

చినుకులు! చినుకులు! చినుకులు -

జల్లు ! జల్లు! జల్లు!

జోరున వాన - విస్సురు గాలి.

సీతా - నేనూ చెట్టాపట్టాలు పట్టుకొని ఎగిరాం.

వాన నీరు ముక్కు మీదినుంచి కారుతుంటే చప్పరించాం.

వాన దంచుతున్నది.

మేము ఎగురుతున్నాం.

ఆడుతున్నాం.

మంట మనసు చలించాలి.

అంతే.

ప్రకృతి పులకిస్తుంది.

● 1969 ●

72056

# 33. ఎర్రబుట్ట

♦ తొడిగిరి పోతరాజు ♦

జీపులు, లారీలు రఁయ్‌రఁయ్‌మంటూ వచ్చి ఆగాయి. తహశీల్ ఆఫీసు చుట్టూ చీమల్లా జీపులు, లారీలు మొదలైన వాహనాలు. వాహనాల చుట్టూ జనం 'టకటక' మని శబ్దంచేస్తూ వాటిల్లో కూలబడి పోతున్నారు.

జీపుల్లో ఆఫీసర్లు రివిన్యూ హెడ్లు... పోలీస్ చీఫ్‌లు కూర్చున్నారు.

లారీలలో నిలబడిన వాళ్ళు...పోలీసులు.

కొందరు నెత్తిపై మామూలు ఎర్రటోపీలు పెట్టుకొన్న నాటు పోలీసులు. కొందరు నెత్తిపై ఉక్కు శిరస్త్రాణాలు (చిప్ప టోపీలు) పెట్టుకొన్న రిజర్వు పోలీసు. ఈ మరమనుషులందరికీ కాకీ యూనిఫారమ్.

ఈ కాకీ యూనిఫారమ్స్ మధ్య మామూలు తెల్లగుడ్డలవాళ్లు. సివిలియన్లబడే సాదా మనుషులు. వాళ్ళ చేతుల్లో గోనె సంచులు. సంచుల నిండా బ్యాలెట్ బాక్సులు - ప్రజాస్వామ్యపు ఎన్నికలలో పౌరులకివ్వవలసిన ఓట్లు- ఓట్లపై ముద్రగుద్దే 'యక్స్‌మార్కు' సాధనాలు - ఓటర్ల జాబితా - చచ్చినవాళ్ళ లిస్టు బ్రతికినవాళ్ళ లిస్టు - సభ్యులకిచ్చిన గుర్తులు - గడియారం, కప్‌సాసరు, గంట మొదలైన ట్రేడ్ మార్కు బొమ్మలు - ఎన్నికలకు ఉపయోగించే లక్క మైనపు వత్తులు తదితర సామాగ్రి.. ఉంది ఆ సంచిలో ఎవరి సంచి రక్షణకు వారు బాధ్యులు.

ఈ సంచి మార్కు వ్యక్తి హోదా ఎలక్షన్ ఆఫీసర్.

తెలుగు అనువాదం... ఎన్నికల నిర్వహణోద్యోగి.

ఈ వేల్టి ఎలక్షన్ ఆఫీసర్ నిన్నటి వరకూ ఉపాధ్యాయుడు. ఎన్నికకు ఒక రోజుముందు, ఎన్నిక రోజూ కలిపితే రెండు రోజులు ఈ ఆఫీసర్ హోదా. ఆ తరువాత మళ్ళీ ఉపాధ్యాయుడే... "ఏక్‌దిన్ కా సుల్తాన్."

వీరికి సహాయకులుగా పోలింగ్ ఆఫీసర్లు...వీళ్ళు చిన్న చిన్న ఉపాధ్యాయులు. పాపం ఉపాధ్యాయులు ఊడగొట్టిన మేకులు. జనాభా లెక్కలకు, ఎన్నికలకు మరో మరో అమాంబాపతు 'సమాచార సేకరణంతటికీ వీళ్ళే. గడప గడపకు తిరిగి, 'అమ్మా - బాబూ' అని పేర్లు వ్రాసుకొచ్చే స్వీకింగ్ కంప్యూటర్స్ వీళ్ళు... పోలీసులు పంతుళ్ళూ అందరూ ముఖాలు చెమట కార్చుకుంటూ లారీలల్లో నిలబడ్డారు.

వాహనాలు బయలుదేరటానికి సిద్ధంగా ఉన్నాయి, వరసగా.

కలెక్టరుగారి ఉపగ్రహాలు. ఆర్.డి.వోలు, తహశీల్‌దార్లు - డిప్యూటీ తహశీల్‌దార్లు అందరూ వాహనాల చుట్టూ పహరా తిరుగుతున్నారు. నానా కంగారుగా అటూ ఇటూ పరుగులు - లారీ నంబరువంక ఒకసారి యెక్కిన మనుష్యుల వంక మరొకసారి. చేతిలో ఉన్న కాగితంవైపు ఇంకొకసారి, చూసుకొంటూ లోలోన తిట్టుకొన్నట్టు గొణుక్కుంటూ వెనక్కీ ముందుకూ రైలు బళ్ళలా షంటింగ్ చేస్తున్నారు... చేసే పని తక్కువ పరుగెత్తటం ఎక్కువ. ఒక్క చిన్న ఫైలు ట్యాగ్ కావల్సివస్తే తాహశీల్ చప్రాసీలందరూ బిలబిలమంటూ పరుగెత్తటం, వాళ్ళ వెనక పరుగెత్తినట్టు నటించే ఎల్.డి.సి.లు వాళ్లందర్నీ బాధ్యతా యుతంగా పర్యవేక్షిస్తున్నట్లు ఫోజులో చేతులు దులుపుకొనే యు.డి.సీలతో సర్కారు సంత చాలా వింతగా ఉంది.

'మైక్' కీచుమని గొంతు సరిదిద్దుకొని బుఁయ్ అని శబ్దం చెయ్యసాగింది.

"లారీ నెంబరు పది దెబ్బయి" బిగ్గరగా పిలిచాడు మైకులో రివున్యూ హెడ్డు 'మైక్' పక్కగా వచ్చి ఆగింది లారీ.

"చింతకానీ - చెల్వూర్ - ఘనపూర్ - మడిపల్లిగూడెం... ఎలక్షన్ ఆఫీసర్స్ ఎక్కారా"...? వాళ్ళకేసి చూస్తూ మైక్‌లో అడిగాడు.

వాళ్ళు అవుననన్నట్టు తలలు ఊపి చేతులెత్తారు.

"మీ పోలింగ్ ఆఫీసర్స్... మీ పోలీసు సిబ్బంది.. యస్.యస్.. ఆల్ రైట్...గో..."

వరసగ్గా ఊళ్ళ పేర్లు చదవటం 'గో' అనటంతో లారీలన్నిటికీ తహశీల్ ఆఫీసు ఆవరణ నుండి విముక్తి లభించింది.

చివర లారీ వచ్చింది.

మహదేవ్‌పూర్... ఫల్గుల... కాళేశ్వరం... ఎలక్షన్ ఆఫీసర్సు... పోలింగ్ ఆఫీసర్స్... పోలీస్... గో" మైక్ దగ్గరుండి కూడ ఎవరినో అవతల చేను గట్టువాడ్ని పిలిచినట్టు పిలిచిన రివిన్యూ అధికారి గొంతు సర్దుకొని జీపువైపు నడిచాడు.

జీపులు... లారీలు రఁయ్‌రఁయ్ మంటూ దూసుకుపోగాయి.

వెనక లారీలో... మహదేవ్‌పూర్ ఎలక్షన్ ఆఫీసరు ఆయన సిబ్బంది. సదరు ఎలక్షన్ ఆఫీసరు లారీలో కూర్చుని కూడ గట్టిగా గోనెసంచి పట్టుకున్నాడు. ఆయన అతిజాగ్రత్తను గ్రహించిన పోలీసులు కనుసైగలు చేసికొని భావగర్భితంగా చేతులు ఎల్లుకున్నారు. పదిహేను నిమిషాలయింది. ఆయన సంచి విడిచిపెట్టలేదు. ఆసుపత్రి వరండాలో రోగిష్టి కుమార్తెను యెదురుగా కూర్చోబెట్టుకున్న తల్లిలా బిక్కుబిక్కు మంటూ హర్చున్నాడు ఎలక్షను ఆఫీసరు. శ్మశానవాటికకు మోసికెళ్లి దూరంగా తలలు ంచుకొని కూర్చున్న బంధువుల్లా మిగతా పోలింగు ఆఫీసర్లు మౌనంగా కూర్చున్నారు.

"సాబ్ గాసంచి యెవల్లు తీసుకుపోతారని గట్ట కూసున్నారు సార్. లారీ గిందాక యితే ఎవల్లూ ముట్టుకోరుగదా?...ఇడిసిపెట్టనిసార్..మే మున్నాం గదా?" లబడిన ఒక పోలీసు జాలిగా అన్నాడు.

"ఉన్నారు లేగానీ.. ఇందులో బ్యాలెట్ పేపర్లున్నాయి. ప్రాణం ఒక యెత్తుగా హసుకోవాలి. దబ్బున అవి పోయినాయంటే నేను జైలుకు వెళ్ళాలి. మీరందరూ

మంచిగానే ఉంటారు... ఎరికేనా..? అందుట్లో మనం పొయ్యేది సుహాదేవ్‌పూర్. నక్సలైట్సుంటారట ఎలక్షన్స్‌లో పాల్గొనకూడదని ఊరంతా తిరిగి చెప్పి పొయ్యారట. అసలు ఈ ఎలక్షన్ డ్యూటీ నాకు వద్దు కాన్సిల్ చెయ్యిమని ఆర్.డి.వో. దగ్గరకు పోతే వినిపించు కోలేదు. నాఖర్మ... ఏం...చేద్దాం?....మళ్ళీ ప్రాణాలతో భార్యాపిల్లలను చూస్తానో చూడనో అనే అనుమానం కళ్ళలో పొడసూపింది. భయం భయంగా చూశాడు. ప్రభుత్వం యెన్నికల రక్షణార్థం ఏర్పరచిన రక్షకభటులవైపు.

"నక్సలైట్లంటే మీరు ఏమనుకుంటున్నారు సార్.. యూనిఫారాలేసుకొని మాకులాగ మీ దగ్గరకొస్తారనుకొన్నారా సార్".. బ్లేడు మొనల్లా గంజి పెట్టిన కాకినిక్కరు ఒర ఒర లాడించుకొంటూ వంగి క్రింద కూర్చున్నవాళ్ళ దగ్గర నుండి బీడి అందుకున్నాడు.

బీడి వెలిగించి ఒకదమ్ములాగి పైకిచూశాడు.

నెత్తిపైన చిత్త అగ్గి కాస్తోంది. టాపులేని లారీ మెత్తటీ ఎర్ర దుమ్ము తలలపై చిమ్ముకు పోతున్నాయి.

ఎలక్షన్ ఆఫీసర్‌గారు ఒక్కింత యోచించి మొదలుపెట్టాడు.

"యూనిఫారాలేసుకొనీ ఏసుకోక పోనివ్వు మన ఎలక్షన్ అయినన్నాళ్ళు మన జోలికి రాకపోతే సరె - తరువాత వాల్లు ఎవరినైనా సంపుకోనియ్యి. కాల్చుకోనియ్యి. ఏదో నా బాధ్యత తీరిపోతే ఈ గోనెసంచి, బ్యాలెట్ పేపర్లు అన్నీ ఆ బి.డి.వో గాడి ముఖాన ఇసిరికొట్టి మన దారి మనం చూసికొంటాం.... ఎలక్షన్ పాడుగాను.. ఎలక్షన్ డబ్బా ముయ్యిటానికొక రూలు - పగలగొట్టటాని కొకరూలు... ఓట్లు తియ్యడానికికొక రూలు... ఈ రూల్సన్నీ రట్టుగొట్టి చచ్చిపోయినన్నుకో. ఈ పదిహేను రోజులూ. నేను బి.ఎ. పరీక్షకు వెళ్ళినపుడు కూడ ఇంత కష్టపడి చదవలేదు...." అంటూ "గ్రామ పంచాయితీ ఎలక్షన్స్" అనే పుస్తకాన్ని పేజీలు తిరగ వేయసాగాడు.

దాదాపు పేజీలలో సగానికిపైగా వాక్యాలు ఎర్రసిరాతో అండర్‌లైను చెయ్య బడ్డాయి. కొన్ని నల్లసిరాతో అండర్ లైను చెయ్యబడ్డాయి. ఆ విధంగా పేజీలు తిప్పుతూ "బ్రతికి వుండి చనిపోయిన వారి లిస్టులో పేరుంటే ఓటు ఇవ్వటమా వద్దా" అనే అధ్యాయం తీసి చదవటానికి ప్రయత్నించ సాగాడు.

లారీ కదుల్తుండటం వలన అక్షరాలు కదిలిపొయ్యాయి.

విసుగ్గా తల పైకెత్తాడు.

లారీ చెక్కను ఒకచేత్తో పట్టుకొని నిర్లక్ష్యంగా బీడి కాలుస్తూన్న పోలీసు కానిస్టేబుల్ తనను నఖశిఖ పర్యంతం పరిశీలిస్తున్నట్లు గ్రహించాడు. కుతూహలంగా చూస్తున్న అతని కళ్ళల్లోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

"మీకు ఇంపార్టెంటు కాందేంది సార్ అందులో..." పోలీసు అడిగాడు.

"అదేం?..."

"అదికాదుసార్.. మీరు పుస్తకం అంతా అండర్‌లైను సేత్తిరి. అంతకు బదులు చెయ్యకపోతే ఏమయిందని అడుగుతున్నా."... ముసిముసి నవ్వులు దాచుకున్నాడు.

"బాధ్యతకదా .. మన డ్యూటీ మనం సక్రమంగా చెయ్యాలికదాని ఒక్కొక్కటి చదివితే అన్నీ అండర్‌లైను చెయ్యాల్సి వచ్చింది. ఇది తెలివితక్కువె." ప్రశాంతంగా ఒప్పుకున్నాడు.

అతను అలా అంగీకరించడంవలన ప్రశ్నించిన వ్యక్తిలో కొంతమార్పు కనిపించింది. తను ఎలా సమర్థించుకొంటాడో చూద్దామని. ఏదో గొప్ప విట్టు వేశానని లోలోన సంతోషిస్తున్న తనకు అతని మాటలు కొంత బాధ కల్గించాయి.

"మీరు తెలివి తక్కువ వాళ్ళని నేనన్నానా సార్...ఈ గుచ్ఛంగుంట్ల ఎలక్షన్స్‌కి ఇంత వెట్టిచాకిరి మీ రెందుకు చేస్తున్నారని అడిగినసార్....ఈ ఎలక్షన్స్ ఈ మంత్రులు అంతా బోగస్ సాబ్... అన్నీ దందాలు . మంచివాణ్ని, నీతి నిజాయితీ వున్న గరీబ్‌గాన్ని ఎక్కడైన ఎన్నుకొన్నారా సార్.. మళ్ళీగా వాళ్ళెదొరలు జమిందార్లు. ఈ పేర్లు పెట్టుకొని రంగంలోకి వస్తారు. ఇది వరకు ఒక్కడే రాజు...ఇప్పుడు అందరూ చిల్లర రాజులే... సర్పంచ్ గ్రామానికి రాజయితే ముఖ్యమంత్రి రాష్ట్రానికి రాజు. మామూలు మంత్రులు సామంత రాజులు... చేసు మార్చిన మాత్రాన వాళ్ళు ప్రజాప్రతినిధులనుకోవటం చాలా బేవకూఫ్‌తనం ఇవి ఎలక్షన్స్ కావుసార్. మనదేశంలో ప్రతి మూడు సంవత్సరాలకు జరిగే జాతర్లు. మామూలుగా పోచమ్మ జాతర్లకు మేకలు, గొర్రెపోతులు బలయితే ఈ జాతర్లకు మనుషుల పుర్రెలు బలిగొంటాయి. ఓటర్లందరినీ సారాలో ముంచిపారేసి ఓటు గుద్దించి పారేస్తారు. నల్లది కావాలంటే నల్లది తెల్లది కావాలంటే తెల్లది. గట్ట ఉన్నది సార్ యవ్వారం. ఇక నెంబర్లు గెలిసినంక నెంబర్లను యెత్తుకపోవటం.. కొనటం 'తిరుపతి' కి వీసుకోని పోయి వెంకటేశ్వరస్వామి ముందు ఒట్టువేసుకొని వాడిని 'వెయ్యి' లేకపోతే ఎందుకివ్వ అనుకున్నకాడికి పైసలిచ్చి నెంబర్ని కొనటం.. సమితి పెసిడెంటు కావటం చెయిర్మన్ కావటం.. వీటిని గూర్చి నీ పుస్తకంలో రాసిన్రా. అంతా లంగలు గందుకనే నేను ఏం చెప్తున్నానంటే, గింతఘనం మీరు ఈ పుస్తకం ఎందుకు సదివిన్రని... బీడి నోటిలో పెట్టాడు. పొగ రాలేదు.

మ టల ధోరణిలో బీడీ దమ్ములాగటం మరచిపొయ్యాడు. అది ఆరిపోయింది. అగ్గిపెట్టకోసం క్రిందవున్న పోలీసుకేసి చెయ్యి చాపాడు.

"నాయనా.. నీపేరేంది?"... అప్యాయంగా అడిగాడు ఎలక్షన్ ఆఫీసర్.

"సత్యనారాయణ.. కానీ అందరూ సత్తయ్యాని పిలుస్తారు."

"సత్తయ్యా.. నీవు చెప్పింది సత్యమే. నేను కాదనను - కానీ మనం ప్రభుత్వ సేవకులం...మనం గీరకంగా విమర్శించకూడదు. మనకు ఈ దేశంలో వాక్ స్వాతంత్ర్యం లేదు..మరీ ముఖ్యంగాను పోలీసులకు.

"అంటే.. మనం మనుషులం కాదా?..

.... ... ..... .....

"సార్....అంతా అన్యాయం, మీకు తెలియనిది కాదు... మీకంటే మేము ఈ అన్యాయాలను రోజూ సూత్తాం కాబట్టి చెబుతున్నా మీ సంగతె ఆలోచించండి. ఎలక్షన్ అంతా మీరు సెయ్యాలి. గదులు కట్టించుకొని, డబ్బాలు మూసికొని వాటికి

బొమ్మ లంటించుకొని, ఓట్లు ఇవ్వనివని, ఇచ్చినవా మొత్తం ఒక్కొక్క నెంబరుకు ఇన్ని ఓట్లు వచ్చినయని...అంతా లెక్కలే. ఇస్సాబ్ అంతా సూసుకొనే సరికి 'ధిమాక్ ఖరాబ్' అయితది.. ఇంత సేత్తే మాకువాల్లిచ్చే బేటా ఆరుసూపాయలు.. ఈ ఆఫీసర్‌గాళ్లు యెంపని సేతారని రోజుకు పన్నెండు రూపాయలు కలెక్టరు, డిప్టికలెక్టర్లు ఇంకా డిస్ట్రిక్టు ఆఫీసర్లున్నారు సూడండి ఉత్తదండుగ గాడిద కొడుకులు. ఆ పుస్తకంలో ఒక్కచుర ముక్కయినా చదవరు. ఒట్టి గొడ్డుకు అరుపు లెక్కువని 'ఇది నాన్సెన్సు.. అది నాన్సెన్సు..నొ...నొ... యస్.యస్..' అని చొర్లటం మినహా..ఏదైనా కొంప ముంచుకొత్తే పంతుళ్ళు "అమ్మా, బాబూ" అని సందురుక పోతారని మీకు ఏశారు ఈ డూటీ..."

"అగ్గో... చూడు నేనిందాక చెప్పానా లేదా? వానవత్తదని ఇయ్యాల సూడు మబ్బులెట్లాపడతన్నయ్యో.. ఏమి యెండ.. నీయవ్వ . తల పగిలిపోయింది"... క్రింద కూర్చున్న ఒకపోలీస్ అన్నాడు.

'గటుమబ్బు లెందుకు సూత్తాన్రు. ఇగ్గొ సినుకు... నాచేతిమీద నీయవ్వ.. ఎలక్షన్ డూటీ ఏమోకానీ.. సలికీ.. వానకూ . వొణికి సచ్చేలాగున్నాం ' మరో కానిస్టేబిల్ అన్నాడు.

చల్లగా గాలి వీచసాగింది.

నిండు కుండల్లా మేఘాలు కదిలాయి.

'టప టప' మని ఇంతింత లావు చినుకులు ప్రారంభమై ఒక్క క్షణములోకుండపోత వర్షంకురవటం మొదలెట్టింది. తడవటం మినహా వేరే గత్యంతరం లేదు. వాన వస్తున్నదని లారీలు ఆగలేదు. ఒక వేళ ఆగినా తడవటం తప్పదు.

బట్టలన్నీ నీళ్ళు వొడుస్తున్నాయి.

తలలు నీరు కారుతున్నాయి - వాళ్ల శరీరాలనిండా నీరు - లారీ అంతా నీళ్ళే.

"ఈ ఆఫీసర్ గాళ్ళను కాల్చిపారేసినా బాధలేదు. మనమంటే ఏ మనుకొన్నారో లంగగాడిదలు. లారీలలో తీసుకొని పోటానికి మనమేమన్నా ప్రాణం లేని చెక్కపెట్టెలు, బొగ్గు బస్తాలనుకున్నారేమో.వాళ్ళుమట్టుకు వాళ్ళు జీపులల్లో కూసొని చినుకు తగులకుండ పోంగనే సరికాదు... బద్మాష్ ఎదవలు ఎక్కడికైనా 'దొరా' పోవటమంటే సరి ఉరికి వత్తారు. మందిని బెదిరించి కోళ్ళూ, కుక్కలూ కోయించుకొని తిని సర్కారిచ్చే బేటాలు జేబులో ఏసికొంటారు..జుమేదారితో కూడిన పనంటే యెవడి నెత్తినో రుద్దటానికి కోసీష్ చేస్తారు సార్... ఆ గోనెసంచి అయినా కనీసం వాళ్ళు పట్టుకెళ్ళకూడదా సార్. దాన్ని తీసి వానలో ఇసిరి పారెయ్యండి సార్ వాల్లు చేసే తలకిందులేందో సూద్దాం.. వానకూ చలికి వణికి పోతున్న పోలీసు సత్తయ్య కోపంతో వాగటం మొదలెట్టాడు.

వాన కురుస్తూనే ఉంది.

లారీలు పోతూనే ఉన్నాయి.

వాళ్ళు వణుకుతూ మాట్లాడుకుంటున్నారు.

"తప్పు భాయి సాబ్.. ఇది చాలా నేరం  మనంగిట్టా 'పీ'లు కాకూడదు.. ఇది నేషనల్ డ్యూటీ యెరికయిందా?. ఆఫీసర్లు మనకు లారీ ఇచ్చి వాళ్ళు జీపుల్లో పోతే వాళ్ళపాపాన వాళ్ళు పోతారు .." తాపీగా సమాధానమిచ్చాడు.

వాన సన్నని జల్లుగా మిగిలిపోయింది. లారీలు 'పరకాల' తాలూకా  కేంద్రాన్ని సమీపించ సాగాయి.

"యెవరి పాపాన వాళ్ళే పోతారనుకొనే పిచ్చిజనం ఉండబట్టే మన భారతదేశం ఇట్టె ఏడుత్తుంది సార్.. చదువుకున్నవాల్లు మీరుకూడ గట్టానే మాట్టాడితే ఇంకెట్టా సార్.. యెవడికాడు. మన 'ఖర్మ'ని సర్దుకుపోబట్టే ఈ ఖద్దరు బురఖాగాళ్ళు దేశాన్ని చెదలు తిన్నట్టు తింటాన్రు.... సరేలే! ఇవన్నీ నాకెందుకు? పోలీసుకానిస్టేబిల్ని... మీరు మా ఆఫీసరు కదా? ఈ మూడు రోజులూ మా బాగోగులూ మీరు సూడాలి... ప్రస్తుతానికి 'ఛా' తాగిపించండి .. సాలు... సలికి పానం వొలిగొనిపోతంది.

జీపులు - లారీలు ఊరి చౌరస్తాలో  ఒక్కొక్కటే ఆగసాగాయి.

"మంచిది . మొత్తం పోలీసులు - పోలింగు ఆఫీసర్లు ఎంతమంది..? పదకొండు మందిగా?.. రండి ఛా తాగిపిస్తా.. మరి టిఫిన్లంటే నేనివ్వలేను.. ఏదో ఆఫీసరు ముళ్ళకిరీటం పెట్టుకొన్నందుకు ఇజ్జత్ కోసమని 'ఛా' తాగిస్తా దిగిరండి"... అతను పిలిచాడు.

వాన వెలిసింది. అతను ముందు దిగాడు.

అతని వెనక పోలీసులు, పోలింగ్ ఆఫీసర్లు మొదలైన సిబ్బంది, అందరూ తడిసి ముద్దయి పొయ్యారు. నీళ్ళు కారుతూన్న వెంట్రుకలు ముఖంపై చెవులపై బడి, తడిసిన కోడిపెట్టల్లా మెడలు చాచుకొన్నారు. పోలీసుల కాకీ యూనిఫారాలపై తళతళ మెరిసిన గంజినీరు కారి వాళ్ళ శరీరాలపై పేరుకుపోసాగింది.

ఎలక్షన్ ఆఫీసరుగారు అందరికీ ఛా ఆర్డరిచ్చి లారీలో గోనెసంచి ఉన్న స్థలానికి తొంభయి డిగ్రీల కోణంలో యెదురుగ్గా కూర్చున్నాడు. ఛా తాగుతున్నంత సేపు ఆయన కళ్ళు లారీలో గోనెసంచివైపే చూస్తున్నాయి. మూర్తీభవించిన 'నేషనల్ డ్యూటీ' లా ఉన్నాడాయన.

'ఛాయి' తాగిన ఆయన సిబ్బంది ఎవరి సిగరెట్టు, బీడీలు వాళ్లు కాల్చుకుని శరీరాన్ని వేడిచేశారు. వాటికి కూడా వాళ్ళు తననెత్తిన చెయ్యిపెట్టనందుకు సంతోషించాడు ఆయన.

లారీ స్టార్టయింది.

మహదేవ్‌పూర్‌లో రోడ్డుపైకి వచ్చింది.

దాదాపు ముప్ఫయి మైళ్ళు సరళరేఖ గీచినట్లు రోడ్డు.

రోడ్డు పోను పోను అత్యంత సన్నని గీతలా తోక చుక్క వెలుగులా ఆకాశపుటంచు ల్లోకి చొచ్చుకు పోయింది. ఎక్కడా మలుపుకానీ వంకరగానీ లేవు. ఇంజనీయరింగు కళకు నిదర్శనగా శోభగా ప్రకాశిస్తోంది. ముందు వెల్తూన్న జీపులు చీమల్లా కనిపిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా టేకుమానులు. మదించిన ఏనుగు

చెవుల్లా వాటికి వెడల్పయిన ఆకులు. వాటిపై అల్లుకొన్న రంగురంగుల పూల తీగలు. స్వచ్ఛమైన గాలి వెలుతురుతో పచ్చని చెట్లతో అడవి కళకళలాడుతోంది

మహదేవ్‌పూర్...

అడవుల మధ్య వెనిసింది.

చిన్న పారశాల భవనం ముందు ఆగాయి లారీలు

ఊరికి ఆవలగా ఊరుచుట్టూ అర్ధవృత్తాకారంగా పడుకొన్నది గోదావరి సంధ్య కాంతిలో మిలమిలా మెరుస్తున్నాయి నీళ్ళు. తెలుపు గోధుమరంగు కాంతిలో నీటి పాయలకు ఇరువైపులా ఇసకమేటలు. నదికి సమానాంతరంగా అటూ ఇటూ రెల్లు దిబ్బలు. రెల్లు పూలు మెల్లగా తలలూస్తున్నాయి. చుట్టూ పచ్చిక బయళ్ళు దూరాన లోయ ప్రాంతంలో నల్లని గొర్రెలు మేస్తున్నాయి. డెల్టా ప్రాంతాలలో నల్లని రేగళ్లను పగలదున్ని విడిచిపెట్టారు.. అంతా ప్రశాంత ప్రకృతి .. ఉన్నతమైన స్థలాలలో ప్రభుత్వ బంగళాలు. బంగాళాల చుట్టూ వెదురు చెట్లు - టేకు చెట్లు. వాటికి దూరంగా చెదురు మదురుగా ఉన్నపెంకుటిల్లు.

నిర్మలమైన, స్వచ్ఛమైన గాలిని కలుషితం చేసే పెట్రోలు, బొగ్గులేపు చెవులను గింగుర్లు ఎత్తించే ఫ్యాక్టరీ సైరన్లు లేవు. బస్సుల రొదలేదు. అంతా ప్రశాంతత. పవిత్రత. నైర్మల్యం..

గోనెసంచి రోడ్డుపై పెట్టుకొని తాపీగా చూడసాగాడు పరిశీలించి.

"సార్ మనల్నందర్నీ ఈ మిడిల్ స్కూల్లో ఉండమన్నారు" పోలీసు వచ్చి అన్నాడు.

"ఈ స్కూల్లోనా?.. బావిలేదుగదా."

"బావి ఎందుకు సార్.. ఇంత పెద్ద గోదావరుంటే.. అన్నిటికీ ఆ మహాతల్లేదిక్కు.. పల్లికిలించాడు.

"అన్నిటికీ అంటే.. భోజనం కూడ గోదావరి తల్లేగా?...లేకపోతే ఏమైనా ఇంత జాములు"..

"ఇంతజాముల సంగతి మమ్ములు నడిగితే ఎట్టా సార్, మీరు మా ఆఫీసరు కాబట్టి మీకే తెలియాలి... మెట్టుకయితే ఈ ఊళ్ళో హోటళ్ళు కూడ లేవు. ఈ మూడు రోజులూ మీరు మమ్ములను ఎట్లా బతికిస్తారో ఏమో?" హెడ్ కానిస్టేబుల్ దీనంగా అన్నాడు.

"దేఖో.. బాబూ.. నేను ఆఫీసర్నని పేరుకు మాత్రమే.. కానీ నేను మాత్రం ఏం చేస్తాను... అందరం కలిసి ఏదైనా ప్రయత్నం చేద్దాం. ఆలోచించండి.. ఈలోగా నేను గోదావరికెళ్లి స్నానం చేసివస్తాను...ఈ సంచి జాగ్రత్త".. అంటూ నిష్క్రమించాడు.

ఆయన స్నానం ముగించుకొని వస్తూ వస్తూనే గోనెసంచి కోసమయి ఆయనకళ్ళు వెదకసాగాయి. గోనె సంచి సురక్షితంగా ఉంది గది మధ్యలో. దానిచుట్టు గుండ్రంగా దేవుడిచుట్టు కూర్చునే భక్తబృందంగా పోలీసులు పోలింగ్ ఆఫీసర్లు కూర్చున్నారు. వానకు తడిసిన బట్టలను ఎండలో విసిరేసి, బన్నీ చెడ్డీలపై కూర్చున్నారు. వాళ్ళ చేతుల్లో పేకముక్కలున్నాయి. అప్పటికే 'రమీ' మహాయజ్ఞం

మొదలై జోరుగా సాగిపోతోంది. పోలీసుల యెర్ర బుట్టలు, పాదరక్షలు, సంచులు వగైరా వగైరా ఓ మూలకు విసిరి పారేశారు.

"సత్తయ్యా".. పిలిచాడు అతను.

"సత్తయ్యా లేడు సార్.. ఊళ్ళోకి పొయ్యాడు సార్ మన భోజనాల విషమయి మాట్లాడానికీ..పైసలిత్తామన్నా పెట్టేదిక్కు లేదంట ఈడ" సమాధానమిచ్చాడు నిర్లక్ష్యంగా రమీ ఆడుతున్న ఒకపోలీసు.

ఎలక్షన్ ఆఫీసర్ ఇస్త్రీబట్టలు వేసికొని అద్దంలోకి చూసుకొని ముఖంలోకి ఆఫీసర్ కళ తెచ్చిపెట్టుకోవడం కోసమై కనుబొమ్మలు పైకెత్తి పెదవులు లోపలికి వత్తుకొని ముఖం భంగిమను మార్చి మార్చి చూసికొన్నాడు. కానీ సంతృప్తికరమైన ముఖ భంగిమ కుదరలేదు. అంతలోనే నైరాశ్యం ముంచుకొచ్చింది. ఒక్కనాటి భాగోతానికి మూతి మీసాలు గొరుక్కున్నట్లు ఈ వేషాలెందుకు? ఉన్న రెండు ప్రాణాలు కాపాడుకొని కొంప చేరేదానికి అనుకున్నాడు.

అంతలోనే మరో భయం పట్టుకుంది.

తన ఒక్కడి ప్రాణాలయితే ఎలానో దక్కించుకోగలడు? ఏ పటేల్ పట్వారీనో బతిమాలి పిడికెడన్నం పెట్టించుకోగలడు. కానీ వీళ్ళందరి సంగతి ఎలా? ఆఫీసర్నని ములగచెట్టు ఎక్కించేరు కాబట్టి పరువుకోసమై పస్తుండాలి. లేకపోతే అందరికీ తిండి, తిప్పలు అమర్చిపెట్టాలి..పాడు ఎలక్షన్ చావుకొచ్చింది.. ఆఫీసర్లు రెవిన్యూ హెడ్లున్నారంటే పంతుళ్ళను, పోలీసులను గొర్రె మందలను ఎక్కించినట్లు లారీలలో ఎక్కించి ఈడ దించిపొయ్యారు. తిండితిప్పలు చూడకుండ... వాళ్ళమట్టుకొ వాళ్ళు ఎవడో ఫారెస్టు కాంట్రాక్టరునో రేంజరునో పట్టి కోళ్ళూ మేకలూ కోయించుకొని జల్సా చేస్తున్నారు.. అగ్గో టి.బి. వంట గదినిండా పొగలు బ్రహాండంగా వెల్తున్నాయి. ఇంక చూడు.. చప్రాసీ గాడిద కొడుకులు ఉరికి ఉరికి పనిసేత్తన్నారు...ఎంత జెడ్డా జి.వో. జి.వో.నే. యన్.జి.ఒ.యన్. జి.ఒ.నే..జీ.వో... అంటేనే ఆల్సేషన్ కుక్కలాటి గొప్పతనం హుందా.. వాళ్లంటే అందరూ పిలిసి పిలిసి భోజనం పెడతారు. మనల్ని పిలిచేదెవడు?.. దిక్కా మొక్కా? ఏం చెయ్యాలి? పొద్దున ఎప్పుడో తిన్న తిండి.. అనుకొంటూ ఓ బెంచి లాక్కుని వెల్లికిలా పడుకున్నాడు చేతిని తలగడలా పెట్టుకొని.. అంతలో కలకెలం వినిపించి ప్రక్కకు చూశాడు.

సత్తయ్య కానిస్టేబిల్ వచ్చాడు. ముఖం కందకడ్డలా చేసికొని వాళ్ళతో మాట్లాడాడు. రమ్మి ఆడుతూన్న పోలీసులు పేకముక్కలు విసిరిపారేసి 'ఛలో నడువ్' అన్నారు బిగ్గరగా.

"మనం గిట్టా పోతే ఏం 'ఖదర్' ఉంటుంది. ఈనీఫారాలేసుకుని పోవాలి" సత్తయ్యన్నాడు. యూనిఫారాలేసుకుని, బూట్లు తగిలించి యెర్రటోపీలు సరిదిద్దుకొంటూ చేతులలో లాటీలు ఊపుకొంటూ సీరియస్‌గా ఊళ్ళోకెళ్లి ఒక అర్ధగంటలో నవ్వుకొంటూ తిరిగి వచ్చారు. వచ్చీ రావటంతోనే యెర్రబుట్టల పరాటోపం పీకిపారేసుకోనీ 'రమ్మీ' మొదలు పెట్టారు.

"సార్.. భోజనాల సంగతి 'ఫికరు' పెట్టుకోకండి.. అన్ని ఇంతజాములు చేసి వచ్చా".. సత్తయ్య నవ్వుతూ అన్నాడు.

ఎలక్షన్ ఆఫీసరుగారుయెట్లు? అన్నట్టు చెయ్యి సైగ చేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఏమయిందో చూశిన్రా సార్.. ముందు నేనుపోయి ఊళ్లోపెద్ద మనుషులనుకునే వాళ్లందర్నీ బతిమాలినా సార్. ఇంటికి ఒకరిద్దరి చంతున భోజనం ఏర్పాటు చెయ్యండని కనీసం పైసలు తీసుకోనైనా తిండి పెట్టమని చెప్పినా ఇనలేదు.. నాకు చాలా తిక్క పుట్టింది సార్.. వచ్చి అందర్నీ తోలకపోయినా అప్పుడు దారికొచ్చిన్రు. అసలు సంగతేందో యెరికయిందా సార్. ఈ పెద్ద మనుషులందరూ లైసెన్సు లేకుండ గుండుంబ కాసి అమ్ముకుంటారు. ఇంటికొక బట్టీ. ఈనిఫారాలేసుకొని యెర్రబుట్టలు పెట్టుకొని అందరం పొయ్యేసరికి గుడెంబ కాసే దేకిసాలు, బెల్లం, కుంకుడు పులుసు, తుమ్మచెక్క, విప్పపువ్వు, అంతా ఎక్కడిదక్కడ పడవేసి కొందరు పరుగెత్తుడు 'షురూ' చేసిన్రు. చిక్కిన వాళ్లను టేషన్‌కు నడవమంటే కాళ్ళు పట్టుకోవటం, గదవ పట్టుకోవటం షురూ చేసిన్రు. గప్పుడు వాల్లకూ మాకూ రాజీకుదిరింది. గుడుంబ కాసే వాళ్ళందరూ తలకొక పదిరూపాయల చొప్పున ఏసుకొని ఈ మూడు రోజులూ మనకు జోర్‌దార్ వంటలు చేసిపెట్టాల.. కోళు పట్టుకురావటానికి మనుషుల్లు అప్పుడే పోయిన్రు. బిర్యానీ వండిస్తాన్నం.. ఇక 'గుడంబ' అంటానా? మీరు తాగి ఈతకొట్టవచ్చు. మల్లీ ఇప్పుడే వత్తా.." అన్నాడు సత్తయ్య అవధానం చలించినట్లు.

అప్పటివరకూ అర్ధనిమీలిత నేత్రాలతో తన్మయత్వంతో వింటూన్న ఎలక్షన్ ఆఫీసరు గార్కి కనురెప్పలు టపటప కొట్టుకున్నాడు...సత్తయ్యా నాకీ పేరు ఎలక్షన్ ఆఫీసరని దండుగ. నిన్నే నియమించాల్సింది ఎలక్షన్ ఆఫీసరుగా. నీవే లేకపోతే ఈ అడవిలో అందరమూ ఉపవాసం పడిఉండాల్సి వచ్చేది సత్తయ్య సాబ్. 'బహుత్ షుక్రియా' అన్నాడు చేతితో చేయికలుపుతూ.

సత్తయ్య ముఖం గంభీరంగా మారిపోయింది.

"నాదికాదు సార్. ఈ గొప్పతనం.. ఇదిగో ఈ యెర్రబుట్టది... ఈ యెర్రబుట్ట లేకపోతే నామాట వినేవాడే లేడు... ఈ యెర్రబుట్ట లేకపోతే ఎలక్షనే లేదు. ఢిల్లీలో... ఇందరమ్మనీ, హైద్రాబాద్‌లో మంత్రులుకాని అందరూ ఈ యెర్రబుట్ట చూపెట్టి జనాన్ని భయపెడుతున్నారు.... కాబట్టి మీరు నాకుకాదు దన్నం పెట్టాల్సింది దీనికి'.. అంటూ యెర్రబుట్టతీసి టేబిల్‌పై పెట్టాడు.

దేవుని సమక్షంలో చెంపలు వేసికొని దన్నం పెట్టినట్లు చెంపలు వేసుకొని రెండు చేతులెత్తి యెర్రబుట్టకు నమస్కరించాడు ఆ ఎలక్షన్ ఆఫీసర్.

● 1970 ●

# 34. గడ్డం మనిషి

♦ నిఖిలేశ్వర్ ♦

ఉక్కపోస్తున్న ఈ ఇరుకుగది చుట్టూ ఈదర గాలి. కట కటాల్లోంచి గాలి జుయ్యిన లోనికి కొడుతూ - కొడుతూ ఆగిపోతుంది. గాలి జుయ్యి మనగానే ప్రాణాలు లేచొస్తున్నాయి - శరీరం మాత్రం చెమటతో తల్లడిల్లుతోంది. అబ్బ! ఎంతకీ ఈ వెధవగాలి ఒక్కసారి తాకిపోదేం?

తాడు మంచంపై ఈ శరీరంలోని ఎముకలు వొత్తుకపోతున్నాయి. కొబ్బరి నారతాడు వెంట్రుకలు గుచ్చుకపోతున్నాయి.

వుఫ్! బయట ఎంతగాలి! చెట్లు ఏం ఇదిగా వూగిపోతున్నాయ్!

చటుక్కున నిలబడి చూశాను. కటకటాల్లోంచి ఆకాశంలో సగం చంద్రుడు సగం వంగిన చాకులా నిలబడ్డాడు.

లేనిపోని దాహం తీర్చుకోడానికి గొంతులో కాసిన్ని నీళ్ళు పోశాను. ఈ ఇరుకు గది గోడకున్న కిటికీ ఆవల మరోగది. మిణుకు మిణుకు దీపం. భార్యభర్తలు పడుకున్నారు కామోసు!

ఆరాటంతో ఏమీ తోచని మనస్సు. బయట దారి వెంబడి రేగుతున్న దుమ్ము, గాంధి విగ్రహం తలపై సగం చిరిగిన ఝండా, పైన వేపచెట్టు - అదే పనిగా ఊగిపోతోంది.

ఈ ఎడారిలోకి ఎందుకు వచ్చాను?

ఎవడ్ని నమ్మాలో అర్థం కాదు!

అట్లా బస్సు వెళ్ళిపోతుంటే నోరుమూసుకొని గమ్మున ఆ వెధవ కూర్చోవలసిందేనా? వాడికేం - ఆయాచితంగా చేతికి పక్కనే దొరికిన బ్యాగు. పుస్తకాలు, రూపాయలు - బట్టలు - పెన్ను.. అన్నీ - చివరికి నా డైరీ కూడా ఆ వెధవ - చేతిలో భరించలేను!

ఈ రాత్రి - ఈ ఈదరగాలి - ఈ మనస్సు ఇలా యమయాతన పెట్టకముందు ఈ రోజు సాయంత్రమే జనగామలో దిగాను. సాయంత్రం 6గంటలకు ప్లాట్‌ఫార్మకు పై నా కాళ్ళు చేతిలో బ్యాగు, మనస్సు సాయంత్రం వీస్తున్న చల్లగాలిలో ఉల్లాసంగా ..

బస్సు వెళ్ళిపోయే ముందు కాఫీతాగేసి - వెచ్చని కడుపుతో బస్సు ఎక్కి ప్రయాణం చేసి - వాడి దగ్గరికి, నా భూస్వామి స్నేహితుడి దగ్గరికి, వాడి స్నేహాన్ని - వాడిచ్చే

పళ్ళు తిని హాయిగా పొలాల వెంబడి తిరిగా రావాలి మంచి ఈతకల్లు కూడా దొరుకుతుంది!

సూర్యాపేట వెళ్ళే బస్సులోకి ఎక్కి, సీటు చూసుకొని బ్యాగు పెట్టేశాను. కండక్టర్ వెంటనే టికెట్టు కత్తిరించి చేతుల్లోపెట్టి డబ్బులు లాక్కున్నాడు ఇంకో పదినిమిషాల్లో బస్సు బయలుదేరుతుందని కూడా నేను అడిగాక చెప్పాడు.

కాఫీ తాగొస్తాను. కాస్త చూచండి నా సీటు. – నా సీటుపై బ్యాగు అని పక్క సీటు ఆసామికి చెప్పాను. మనిషి ఏదో ఊరి నాటువైద్యుడిలా వున్నాడు – సరే అనక ఏమి చేస్తాడు?

గబగబా వెళ్ళి బస్సువెళ్ళే దారిపక్క హోటల్లో కూచొని కాఫీ సగం తాగానో లేదో – హోటలు ముందునుంచి బస్సు చప్పుడు

బయటికి పరిగెత్తాను.

అదే బస్సు – అరె! వెళ్ళిపోతుందే ఇంత త్వరగా! వెనకాలే కేకలు వేస్తూ పెద్ద పెద్ద అంగలతో పరిగెత్తాను. రెండు పక్కల జనం – దుకాణాలు – బేరం చేస్తున్న వర్తకులు – ఎవడు చూడడూ!

బస్సు కనబడుతూనే ఉంది. ఆశతో కేకలు వేశాను. అరిచాను గొంతు చించుకొని. బస్సు ఆగినట్టు అనిపించింది. ఇంకా ముందుకు దుమ్మురేగింది. వెనకే పరుగెత్తాను.

రెండు మలుపులు తిరిగి తిన్నగా వెళ్ళిపోయే రోడ్డుపైకి తిరిగాను...బస్సు ఆగలేదు. నేను మాత్రం దుమ్ములో మిగిలిపోయాను.

పక్కనే చుట్టూ గోడ పెట్టుకున్న గాంధీజీ విగ్రహం.. సగం చిరిగిన కాంగ్రెస్ ఝండా.. పైన వేపచెట్టు కొమ్మలు – నా ముఖంపై ఊగుతున్నాయి. మెడపై కణతల చుట్టూ చెమట చెరువు. గుండెదడ నాకే జోరుగా వినిపిస్తోంది.

రోడ్డు పక్కనే పెద్ద మురికి కాలువ. దానిపై ఇళ్ళవరుస. ఆగి నేను నిస్పృహతో అటు ఇటూ చూస్తుండగా ఒక మనిషి పిలిచాడు. అడిగాడు చెప్పాను.

"భయపడకు, స్టేషన్ దగ్గరే బస్సు కంట్రోలర్ వుంటాడు. నేను చెప్తాలే" అని హామీ ఇచ్చాడు.

గుండె దడ తగ్గింది. మనిషిని చూశాను అనుకోకుండానే ఎగాదిగా. గడ్డం వెనుక చిన్న – చిన్న కళ్ళు. పెద్ద వయస్సు ఏమీ మించిపోలేదు. లుంగీ చుట్టుకొని వున్నాడు. నాకంటే పొడుగేం కాదు! అంత లావూ కాదు!

పక్క సందులోంచి వచ్చిన ఎవరో రైతుతో నా గురించి సానుభూతితో చెప్పాడు. నేను అవుననన్నట్లు చూశాను.

ఆ మనిషి నాతోబాటే స్టేషన్ దాకా వచ్చాడు. అతను నా విషయం బస్సు కంట్రోలర్‌తో చెప్పగానే – "అరే రెడ్డీసాబ్! నేను ఇతని సంగతి చూస్తాను. ఏది చాటు – నీ టికెట్టు ఏదీ?" అని అడిగి టికెట్ నంబర్ నోట్ చేసుకున్నాడు – రేపు ఉదయమే మొదటి బస్సు 8 గంటలకు వస్తుంది. అప్పుడు కలువు" అన్నాడు కంట్రోలర్ లావుగా – నల్లగా వున్న పెదవులతో

ఈ మనిషి - రెడ్డీ సాబ్ అనేగడ్డం మనిషి - "ఇంకేం, చెప్పేసిన గదా! నువ్వు హోటల్లో తిను - ఆ తర్వాత వచ్చి నిన్ను కలుస్త!" అని వెళ్ళిపోయాడు.

డెబ్భై అయిదు పైసలిచ్చి భోజనం టికెట్టు కొన్నా, ఏదో తిన్నాను కూడా. గుండె అంతా ఖాళీ. హోటల్‌కు వచ్చి ఏదో తింటున్న మనుషుల ముఖాలన్నీ ఖాళీ. రేపు నా బ్యాగు దొరక్కపోతే - అనే బెంగ లోపల లోపల నమలి మింగివేస్తోది.

జేబులో ముప్పై పైసలు మాత్రం మిగిలిపోయాయి. రేపు పొద్దున భోజనానికి? ఎవర్ని అడగాలి? అనే ప్రశ్నలు ఎదుట కత్తుల్లా దూసుకవస్తున్నా ఏడవకుండా కూర్చున్నాను మరి!

"ఎంతమంచి వాడవురా - పొరపాటు గ్రహించితివిరా!" రేడియోలో సినిమా పాట. సినిమాపేరు జ్ఞాపకం వచ్చింది. ఈ సినిమాలు, సినీ నటులు ఎందుకు ఇంత జ్ఞాపకం ఉండిపోతారో అప్పుడు తట్టలేదు. పాటతోపాటు కోరస్ రాగాన్ని లాగుతూ నాకోసం పాడుతున్న విషాదగీతం - సినిమా సీక్వెన్స్ జ్ఞాపకం వచ్చింది. ఇప్పటికీ ఉండి ఉండి ఆ కోరస్ ఆ రాగం చెవుల్లో తిరుగుతోంది. ఉండి ఉండి ఇప్పటికీ నా గుండెలో ఏసుప్రభు తలపై ముళ్ళ కిరీటంతో రక్తం కారుస్తున్నాడు.

హోటల్ కౌంటర్ దగ్గర యజమాని అరవవాడు. తెలుగువాళ్ళతో అందులో జనగామ ఊరివాళ్ళతో కలసిపోయాడు - ఆశ్చర్యం వేసింది. ఆశ్చర్యం ఏముంది, వీళ్ళు తప్ప తెలుగువాళ్ళు ఇక్కడ హోటళ్ళు నిరవాకం చేయలేరుగా!

ఎదురుగా కిళ్ళీ కొట్టులో ఒక ఆడమనిషి కూర్చున్నది. అంత ఎర్రగా అంత అందంగా అంత మంచి చీరకట్టుకొని ఆకులు కట్టి ఇస్తున్నది.

హోటళ్ళోకి ప్రయాణికులు - అప్పుడే రైలుదిగి వచ్చినవాళ్ళు రోడ్డుపై దుమ్ము కొట్టుకుని వచ్చిన ఊరివాళ్ళు. సగం సగం పట్నం వాసన, సగం సగం ఊరి వాసనతో హోటళ్ళో చాయ్ గ్లాసుల ముందు... కొందరు అన్నం విస్తళ్ళ ముందు.

నాముందు టేబిల్‌పై ఖాళీ కాఫీ గ్లాసు. మిగిలిన డికాక్షన్ పిప్పి, ఎండిపోయిన తియ్యని చుక్కలపై ఈగలు. జుయ్యిన లేచి మళ్ళీ మనస్సులా ఎగిరి ఎగిరి తియ్యని చుక్కలపై వాలుతున్న ఈగలు.

ఆ గడ్డం మనిషి ఇంకా రాలేదు. కాస్సేపు బయటికి నడిచాను. పక్క మలుపులో వరుసగా హోటళ్ళు. మోగుతున్న రేడియోలు, ఈగలు కొడుతున్న యజమానులు. ఎంతైనా తెలుగు యజమానుల హోటళ్లు.

లైట్లు మాత్రం బాగానే వెలుగుతున్నాయి. లేనిపోని దర్పంలా. చీకటిని దాచి పెట్టుకొన్న మనిషి కళ్ళల్లా లైట్లన్నీ బాగానే కాలుతున్నాయి.

మళ్ళీ వెనక్కి పాత హోటలుకేసి తిరిగి వచ్చి బయటే నిలబడ్డాను.

గడ్డం మనిషి వచ్చి రమ్మన్నాడు. వెనుకే నడిచాను. "తిన్నావా! ఏం ఫికరు చెయ్యకు! రేపు నీ బ్యాగ్ దొరికిపోతది" అంటూ గడ్డం రెడ్డీ సాబ్ తనలో తానే మాట్లాడుతున్నట్టు ముందుకు నడుస్తున్నాడు.

దారిలో "నమస్తే రెడ్డీ సాబ్! ఎక్కడికో పోతుండ్రు!" అని ఒకడి వాకబు. రెడ్డిసాబ్ ఆగిపోయి కాసేపు ఎదుటి మనిషితో బాతఖాని. మళ్ళీదారిలో ఇంకో ఇద్దరు-ముగ్గురు నమస్తేలు అందించారు.

ఒక మలుపు తిరిగి సందులోకి దారి తీశాడు గడ్డం మనిషి. కొంచెం దూరం వెళ్ళాక గుంపు కనబడింది. గుంపు మధ్య ఒకటే అరుస్తున్న పొడుగాటి మనిషి పక్కనే ఇంకెవడో అదే మోతాదులో 'నాపైసలు పెట్టుకొని నేను తాగితే - ఇడెవ్వడురా నాకు చెప్పొచ్చేటోడు!" అని అరుస్తున్నాడు.

గుంపు దగ్గరికి వెళ్ళగానే గడ్డం మనిషి గుంపులో కలిసిపోయాడు. పొడగాటి మనిషి - "ఒరేయ్! నువ్వు కూడా వొచ్చినావురా రెడ్డిగా!" అని వీపుమీద చరిచాడు. గడ్డం మనిషి - 'ఒకోరా! లంజకొడకా!' అని పక్కనేవున్న వందవాట్ల బల్బు వెలుగులో కాలుతున్న గదిలోకి దూసుకపోయాడు.

చుట్టూ కల్లు వాసన. మాంసం ముక్కలు కాలుతున్న కమురు వాసన. గుట్టగా పేర్చుకొన్న బూడారు - బజ్జీల్లు. కటికవాళ్ళు అమ్ముతున్న చాకస - (మాంసంతో వండినది) డొప్పల్లో నాకేస్తున్న మనుష్యులు. వీపుచెనకే నాలుకలు వేలాడేసుకున్న కుక్కలు. లాలాజలం చక్కలు స్రవించి మట్టిలో ఇంకిపోతున్న కోరికలు.

వొడ్డరివాడు ముంతతో బాతాఖానీ. చీరకొంగు కప్పుకొని వాడి పెళ్ళాం - తట్టలకు రాళ్లు ఎత్తి -గుత్తదార్ల జేబులు నింపి - చివరికి నడుము వంగిపోయిన వాడిపెళ్ళాం.

గడ్డం మనిషి వచ్చి నన్ను కలుసుకున్నాడు - 'నడూ తమ్ముడూ' అని పురమాయించాడు. నోట్లోంచి గుడుంబా వాసన గుప్పుమని నా నవనాడుల్ని ఊపివేసింది - మత్తువాసన - నరాలను పిండి వాంతిచేసే వాసన.

వెనకాలే నడుస్తున్నాను.

"ఆఁ! అయితే ఎవరన్నావు సూర్యాపేటలో వున్నారని?". నేను చెప్పాను. మా భూస్వామి స్నేహితుడి పేరు. 'అరే! ఆయనా? - నాకు తెలుసులే! ఆయన అన్న జనసంఘం లీడరు కదా! ఆయనకేమబ్బా - ఎంతో భూమివుంది. మొన్న కారు కూడా కొన్నాడు గదా!" గడ్డం మనిషి మాట్లాడేస్తున్నాడు. నేను అవునంటున్నాను.

ఇంకో మలుపు తిరిగాము. సన్నని సందులోంచి రోడ్డుపైకి వచ్చాము. సినిమాహాలు ఎవరిదో ఆసామి భవంతిలా వుంది. గడ్డం మనిషి లోపలికి నడిచాడు. గేటు కీపర్స్ - "నమస్తే రెడ్డిసాబ్!" అని లోపలికి దారిచ్చారు. నేను వెనకాలే నడిచాను.

తెరపై బొమ్మలు. సజీవంగా కళ్ళముందు ఆడుతూ - పాడుతూ కౌగలించుకోబోయి మానేస్తున్న నటీనటుల నీడలు. మనుష్యుల మనస్సులో నుండి వెలికి వచ్చిన బొమ్మలు.

గడ్డం మనిషి నా పక్కనే కూచోని కాళ్ళు ఎదుటి సీట్లోకి పారజాపాడు. ఎదుటి సీట్లో కూచున్న వాడి నడుముకు పోయి ఆ కాలు తాకిందేమో - 'ఎవడ్రా ఆడు' అని ఎదుటి మనిషి చర్రునలేచాడు. గడ్డం మనిషి 'నువ్వెవ్వడ్రా' అని వెంటనే లేచి వాడి కాలర్ దొరక బుచ్చుకొని "నడు బే! బయటికీ" అని ఆ మనిషిని గడ్డం మనిషి బయటికి లాక్కొచ్చాడు.

గేట్‌కీపర్‌లు - 'పోనీ రెడ్డిసాబ్ -పోనీ! పోనీ! ఎందుకు లొల్లి' అంటూ విడిపించారు. గడ్డం మనిషి - "కాలు తాకితే చెప్పొద్దోయి చక్కగా! ఎవడ్రా

అంటావా సాలే! ప్రాణాలు తీసేస్తా! ఎవడనుకున్నావురా . జాగ్రత్త బిడ్డా!" ఆ మనిషి నీళ్లు నములుతూ ఏమో చెప్పబోతుండగా గేట్ కీపర్‌లు అతన్ని బలవంతంగా లోపలికి త్రోసుకెళ్ళారు.

"నడూ బాబు" అని గడ్డం మనిషి మళ్ళీ పురమాయించాడు. ప్రేక్షకుడిలా వెనకాలే నడిచాను.

"నీకు తెలవదు బాబు! ఈ ముండాకొడుకుల్ని ఇట్లా బెదిరిస్తేగాని బతక నియ్యరు" అని చెబుతున్నాడు. రోడ్డుపై దుమ్ము సుడిగాలిలా జుయ్యిన లేచి చుట్టుకుంటోంది. తలపై సగం చంద్రుడు సగం వంగిన బాకులా-

"మొన్నపోయిన ఏడాది మున్సిపల్ ఎలక్షన్‌లో గిట్లనే ఒకడు తిరుగబడిండు. మోక చూసుకొని ఒకసారి ఆ గల్లీలో పట్టుకొని బొక్క బొక్కకు నీళ్ళు పోసిన్ననుకో. బేహోష్ అయిపోందాకా కొట్టినాము. లేకపోతే నాకే పోటీ నిలబడుతాడా? మళ్ళా ఈ లోకంలో కనబడలేదు వాడు." గడ్డం మనిషి కళ్ళు తళుక్కున మెరిసాయి సగం చంద్రుడి సగం చమక్కులో, కళ్ళలో వంగిన బాకులు -

"తెల్లారి పోలీసోళ్ళు పంచనామా చేసిండ్రు. నన్ను నా గ్రూప్ వాళ్ళను తీసుకెళ్ళి చాలా అడిగిండ్రు బస్! ఎవరైని నిజం చెబితే గదా మనం దొరికేది? అప్పటినుండి ఈ గడ్డం పెంచుతున్నాను. ఈ ఎండాకాలంలోనే తిరుపతికి వెళ్దామని అనుకుంటున్నం" అని గడ్డం మనిషి మాట్లాడ్డం మానేశాడు. ఇంట్లోకి అడుగుపెట్టాడు. నాకు ఎదుటి ఇరుకు గదిలో మంచం చూపాడు. చెంబులో నీళ్ళు తెచ్చిపెట్టి లోపలికి వెళ్ళి గొళ్ళెం పెట్టుకున్నాడు.

....ఇంకా నిద్ర రావడం లేదు.

అబ్బ! శరీరమంతా చెమట. కొలిమిపైన నిప్పుసెగలా గది అంతా ఇరుకు. గాలి - బయట ఈదురు గాలి. కటకటాలను తాకి తాకనట్టు జుయ్యిమని లేచి దుమ్మును లేపుకు పోతుంది.

నీళ్ళుపోసి, - ఈ రాత్రికి మంచం ఇచ్చి ఆసరా ఇచ్చిన గడ్డం మనిషి లోపలే వున్నాడు. మంచంపై నేను దొర్లుతూ - దొర్లుతూ కళ్ళు మూసుకొని గడ్డం మనిషి గురించి రేపటి కోసం నా బ్యాగు దొరుకుతుందేమోననే ఆశతో అట్లాగే నిద్రపోయాను.. కట్టెలతో. కత్తులతో.. తుపాకులతో మనుష్యులు భల్లూకాలు - ఊరబెబ్బులులు - హఠాత్తుగా ఈ ఇంటిపై విరుచుకపడ్డారు. నన్ను చూడకుండానే తలుపు విరగొట్టి లోపలికి వెళ్ళి గడ్డం మనిషి తలపగుల గొట్టి బయటికి ఈడ్చుకొచ్చారు. శవం.. రక్తం.. గడ్డం వెంట్రుకలోనుండి మెరుస్తున్న చిన్నచిన్నకళ్ళు.

కళ్ళు తెరచి చూశాను. నిలబడ్డాను. బట్టలు దులుపుకొని నీళ్ళు ముఖాన చల్లుకొని బయటికి గబగబా భారంతో, ఖాళీ మెదడుతో కుంగిన మనస్సుతో ఎడారిలాంటి రోడ్డుపైనుండి నడుచుకుంటూ వెళ్ళాను.

● 'పాలికేక' సచిత్రవారపత్రిక - 6 మే, 1970 ●

# 35. చిరంజీవి

♦ చెరబండరాజు ♦

స్టీరింగు ముందు తనకు తెలియకుండానే వణికిపోతున్న చేతులతో ఖాసిం, ఆ ప్రాంతాలకు ఎన్నిసార్లు వచ్చినా కొత్తగానే ఉంటుంది. మట్టిరోడ్డంతా గతుకులు గతుకులు. ఒక్కొక్కసారి స్టీరింగు జారిపోయేంతగా ఎగిరిపడుతోంది జీవు. దట్టమైన మంచులా ఎర్రని దుమ్ము ఆకాశానికెగురుతోంది. అప్పటికి అయిదారు సార్లు అయినా తుడిచి వుంటాడు, అద్దం మీది దుమ్మును. చలికూడా బాగానే వేస్తోంది. ఏదో భయం నరాల్ని క్రుంగదీస్తోంది. డోక్కునేట్లు పెట్రోలు వాసన కడుపులో తిప్పుతోంది. చలి, ఆకలి. ఏది కనిపించినా దండన తప్పదు. జాగ్రత్తగా నడుపుతున్నాడు జీపును.

ప్రక్కనే డి.యస్.పి. రెడ్డి గబ్బిలాల్లా మీసాల్తో ముక్కుపుటాల్ని పగలగొట్టే చుట్టకంపుతో ఓ చేయి పిస్తోలుమీద వేసి విగ్రహంలా కూర్చున్నాడు. దుమ్మును చీల్చుకుని చూస్తున్నాడు ముందుకు.

అతని ప్రక్కనే కుర్రవాడు పద్నాలుగేళ్ళుంటాయి. నిక్కరు, బుష్షర్టు వేసుకున్నాడు. చెరగని చిరునవ్వులో, సన్నని పెదాలు ఏవో పాటల్ని నెమరువేసుకుంటున్నాయి. అతనికి రెండో వైపు మెషిన్‌గన్‌తో మరో ఇన్‌స్పెక్టర్.

రెండు బండరాళ్ళ మధ్య విసిరిన గడ్డి పువ్వులా నిబ్బరంగా కూర్చున్నాడు రాంబాబు.

మెషిన్‌గన్ బయటికిపెట్టి అదేపనిగా చూస్తూ కూర్చున్న ఇన్‌స్పెక్టర్ని చూసి నవ్వుకున్నాడు రాంబాబు.

"సార్! ఇది మైదాన ప్రాంతం. అంత భయం అక్కర్లేదు" అన్నాడు.

"నోర్ముయ్యరా వెధవా" గర్జించాడు మెషిన్‌గన్ శివలింగం.

లోడ్ చేసిన తుపాకులతో ఆర్గురు పోలీసులు ప్రాణాలు బిగబట్టుకొని లోపల ఎవరి భయంతో వాళ్ళు, ఎవరి ఆరాటంతో వాళ్ళు, చలికో భయానికో ఒకరినొకరు వొదిగొదిగి కూర్చుంటున్నారు

మైలుకో రెండు మైళ్ళ కో గూడెం. పొలాల్లో పని చేసుకుంటున్న రైతులు. జీపు చప్పుడు. తలెత్తగానే పోలీసుల వేళ్ళు ట్రిగ్గర్ల మీదికి వెళ్తున్నాయి.

కర్రతో పసులకాపరి కనిపించినా, చిన్న పిల్లలు ఆటగాళ్ళతో ఎదురుపడ్డా, కొడవళ్ళతో కూలీలు తారసపడ్డా, జీపులో కలకలం బయలుదేరుతుంది.

ఎదురుగా వస్తోన్న వో బాటసారి సూర్యుడి కడ్డంగా అరచేయి ఎత్తి జీపుని చూసి ఆగిపోయాడు

ఫర్లాంగు దూరంలో వుంది జీపు.

బాటసారి ఒక్కక్షణం ఆగి, వెనక్కిచూసి మళ్ళీ నడక ప్రారంభించాడు.

"పోనీ, జీపు"

హుకుం జారీ చేశాడు డి.యస్.పి రెడ్డి

'ఖాసిం' సర్ అంటూ వేగం పెంచాడు.

ఉక్కిరి బిక్కిరి అయి దుమ్ముతో బాటసారి.

మళ్ళీ కళ్ళు తెరిచేలోగా కనిపించకుండా జీపు.

అదేదో కొంచెం పెద్దపల్లే. రెండో మూడో పెంకుటిండ్లు. మిగిలినవన్నీ పూరిండ్లే. మధ్యాహ్నం మనుషులెవరూ లేరు. దుమ్ములేపుకుంటూ వెళ్తోంది జీపు. సందుల్లో స్టీరింగు తిప్పి తిప్పి చలిలోనూ చెమటలు పట్టాయి ఖాసింకు. ఎంత ప్రయత్నించినా స్పీడు తగ్గుతూనే వుంది. వేగం తగ్గగానే గుడ్లురిమి చూస్తున్నాడు డి.యస్.పి.

మూల మలుపులో "అదిగో అదిగో రాంబాబు" అంటూ ఒక్కసారిగా కేకలు వినిపించాయి.

చెడుగుడు ఆడుకుంటున్న పిల్లలు చెల్లాచెదురు అయిపోయారు. రాంబాబు నవ్వుతూ సంకెళ్ళ చేతులెత్తాడు.

ఆ పిల్లలు చేతులెత్తి సైగ చేశారు.

జీపుకూ గూడానికీ మధ్య దట్టంగా దుమ్ము.

ముందున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఇంగ్లీషులో మాట్లాడుకొని రాంబాబుని జీపులోపలికి పంపించారు.

"ఎందుకు సార్ అంత భయపడతారు?" అంటూ రాంబాబు లోపలికెళ్ళాడు.

"కుర్రాడి చూపులు బాణాల్లా ఉన్నాయిరా."

"కళ్ళు నక్షత్రాల్లా అందంగా వున్నాయి."

"ఏమిటి, ఆ కనుబొమలు అంత నల్లగా సిరా వొలికినట్టే వున్నాయి"

"పాపం! మీసకట్టు ఇప్పుడిప్పుడే వస్తోందిరా!"

"అచ్చం మాబాబులాగే నవ్వుతున్నాడు."

"వేలెడంత లేడు వీడూ వున్నాడు దళంలో!"

"మనల్ని చంపేవాడు ఎంతవాడైతేనేం? శత్రువు శత్రువేరా నాన్న."

"మావాడు ఇలాంటి దేశసేవలోనన్నా పాల్గొన్నాడు కాదు."

ఎవరికి తోచినట్టు వాళ్ళు అనుకోసాగారు పోలీసులు. ఆ వుద్యోగంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వీలులేదని అందరికీ తెలుసు. పైవాడి మాటలకే చెల్లుబడి. నోరెత్తితే పనిష్‌మెంట్ మాటకోసం నిలబడితే డిస్‌మిస్.

రాంబాబు ఒకర్నొకర్నే చూస్తున్నాడు.

ఏ ఒక్క పోలీసు వంటిమీద కిలో మాంసమున్నట్లు లేదు కంటినిండా నిద్ర లేక ఎన్నాళ్ళయిందో, లోతుకు పీక్కుపోయినాయి కళ్ళు చెరుకుగడల్లాంటి చేతులు తుపాకుల్ని ఎలా మోస్తున్నాయో! స్పష్టంగా నరాలుపైకి తేలి దారపుపోగుల్లా వున్నాయి. ఎవరి ముఖంలోనూ కళాకాంతులు లేవు. చూసి రాంబాబు కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"పోలీసులూ మీరందరూ పేదలే", అన్నాడు ఆవేశంగా తలపంకించి రాంబాబు.

పోలీసులందర్నీ ఏదో వెలుగు చుట్టుముట్టినట్లు, ఆకలి తీరబోనున్నట్లు ఆశ్చర్యంగా చూశారు.

వెయ్యి కంఠాలు ఒక్కసారి ఆమాటే అన్నట్లు వినిపించింది కానిస్టేబుల్ రామ్మూర్తికి.

"బాబూ!"

కన్నకొడుకు తప్పుచేస్తే వారించినట్లుంది రామ్మూర్తి పిలుపు.

"టూ నాట్ వన్, ఏం చేస్తున్నావ్?" ముందునుంచి గద్దింపు.

"ఆవాజ్ బంద్ కరో", కళ్ళెర్ర చేశాడు హెడ్డు.

"మీరొట్టి అంకెలుకారు, మీకూ పేర్లున్నాయండీ."

ఓ చేయి చినబాబు నోరు నొక్కి వెనక్కి నెట్టేసింది. కాని వెంటనే అతని ఉంగరాల జుట్టుమీద ఆప్యాయంగా నిమిరింది, ఎందుకో.

రాంబాబు మాటలు వినాలని అందరికీ కుతూహలంగా వున్నట్టుంది.

వారి చూపుల్లో కరుణ, జాలి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రామ్మూర్తికి రాంబాబు కంఠం, నటన, తెలివి, ఎటువంటివో తెలుసు. అతనింత వరకు అలాంటి పిల్లవాడ్ని చూడలేదు. వినలేదు కూడాను. సాహిత్యం తెలుసు. సంగీతం తెలుసు. రాజకీయ సిద్ధాంతాలు తెలుసు. వాటితోడు అపారమైన లోక జ్ఞానం. రాంబాబును ఒక్కసారి చూస్తేచాలు. మరిచిపోవడమంటూ జన్మలో జరగదు. మూడేళ్ళ క్రితం విజయవాడ గవర్నరుపేట సెంటరులో డ్యూటీమీద వెళ్ళి రాంబాబు చెప్పే బుర్రకథ విన్నాడు. ఆనాటినుండీ అతనిదదే అభిప్రాయం.

రామ్మూర్తి చెవుల్లో ఇప్పటికీ ఆ కధే మార్మోగుతుంది. లేడిపిల్లలా ఎగురుతూ, నాట్యం చేస్తూ తంబురా మీటుతూ కథ చెప్పే రాంబాబు రూపం, ఆ వెలుగు ప్రవాహం. పాదరసంలాంటి ఆ చురుకుదనం, ఆ నవ్వులు, పరిహాసాలు అతని కళ్ళలో బొమ్మ కట్టాయి.

"ఒక్కపాట పాడించుకుంటే బావుణ్ణు" రామ్మూర్తి మనసు ఆరాటపడుతోంది.

ఇంటిదగ్గర అల్లరి చిల్లరగా తిరిగే తన కొడుకు ఎందుకూ పనికిరాడు, బడికెళ్ళడు. తల్లి పోయిన్నాటినుంచి వూరిమీద పడ్డాడు. తాను మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. చాలీచాలని జీతం. రాత్రులకు రాత్రులు డ్యూటీమీద వెళ్ళి తన భార్యను సుఖపెట్టలేకపోయాడు. మందులిప్పించడానికి డబ్బులుండేవి కావు. ఉద్యోగంలో సెలవు దొరికేది కాదు.

తీసుకుని తీసుకుని కన్నుమూసింది భార్య చచ్చి తాను సుఖపడిపోయింది. బతికిన కుర్రవాడు బతికే మార్గంలేక, బాగుపడే వీలులేక చస్తున్నాడు. తనకింకా పెళ్ళెందుకు? తనకు తానే సమాధానం చెప్పుకున్నాడు రామ్మూర్తి.

భార్యవున్నప్పుడు చాలా పోరు పెట్టేది. రాక్షసుల్ని తయారుచేసే పోలీసు ఉద్యోగమనీ, మానెయ్యమనీ. ఉద్యోగం వదిలేస్తే రిక్షా తొక్కుకోవాలి. వయసా, మీదపడింది. తన వల్ల ఆ పని అయ్యేది కాదు. సగం మనసుతో స్ట్రయికుల్లో లాఠీచార్జీ చేసేవాడు. గ్లాసు బుడ్లు విసిరాడు. విద్యార్థుల మీదికి తుపాకులు పేల్చాడు. మనసు రాయే అయ్యింది. ఎంతోమంది పోలీసుల్లాగా తానూ యంత్రంలా పనిచేశాడు. ఎద్దులా బతికాడు. కూటికోసం తప్పిస్తే, ప్రభుత్వానికి కీలుబొమ్మలా ఉపయోగపడడం తప్పిస్తే, దేశాన్ని కాపాడేది పోలీసులేనని అనుకోలేకపోయాడు. ఆ మాటకొస్తే మొట్టమొదటి దేశభక్తుడు పోలీసే కావాలి. మంచీ మర్యాద లేనిదే పోలీసు ఉద్యోగం, డి.యస్.పి. రెడ్డిని చూశాక, అక్రమంగా ఆర్జించడానికి పెద్దిళ్ళ విద్యావంతులు ఈ డిపార్టుమెంటులోకి వచ్చి ఎంత కర్కశంగా ప్రవర్తిస్తారో, కానిస్టేబుళ్లను ఎంతగా హింసిస్తారో, రామ్మూర్తి కళ్ళారా చూశాడు.

ఒక్కొక్కసారి చేతిలోని తుపాకితో కాల్చుకుని చావాలనిపించేది. బందిపోటు దొంగలా మారిపోవాలనిపించేది.

ఎప్పటికప్పుడు ఏవో సమస్యలు. విరామంలేని పరుగులు. శ్రీకాకుళం వచ్చాక జీవితమంటే పోరాటమనే అభిప్రాయం బలంగా కుదురుకుంది. ఆత్మరక్షణ పేరుతో పోలీసులు చేసే అన్యాయాలకు లెక్కా, పత్రం వుండదు. ఇన్‌స్పెక్టర్ల దృష్టిలో పోలీసులు మనుషులు కారు. గానుగెద్దులు. రాళ్ళు, ఆత్మవంచనతో కూడిన నీ ఉద్యోగాన్నుంచి, నటన విముక్తి ఎన్నాళ్లకో? ఇలా నిట్టూర్పులతోనే పదేళ్ళు సర్వీసు చేశాడు రామ్మూర్తి.

రాంబాబును చూశాక అతనిలో ఏవేవో భావాలు ప్రాణం పోసుకున్నాయి. శవప్రాయం లాంటి జీవితం చిగిర్చినట్టుగా వుంది. "తన కొడుకు చినబాబే" అనే ఆలోచన అతనికెంతో ఉత్సాహాన్ని, బలాన్నిచ్చి నిలబెట్టింది.

"అవును బాబూ, పోలీసులు నిరుపేదలే. తుపాకి ఎత్తితే పశువులం. లేకపోతే ఎందుకూ కొరగాం" నోటి వరకు వచ్చిన మాటల్ని ఆపుకున్నాడు రామ్మూర్తి.

రాంబాబును ఓదార్చాలని, ధైర్యం చెప్పాలని మనసులో రకరకాల ఆలోచనలు.

అడవిలో కొంతదూరం వెళ్ళి టక్కున జీపు ఆగిపోయింది.

అందరూ తుపాకులతో సిద్ధంగా నిల్చున్నారు.

"పదండి, నడవాలి. ఆ కుర్రకుంక జాగ్రత్త."

డి.యస్.పి., ఎస్.ఐ. శివలింగం దిగారు. ఖాసిం కూడా తుపాకితో సిద్ధమయ్యాడు.

వాళ్ళ మామూలు పద్ధతి ప్రకారం రాంబాబును మధ్యలో నడిపిస్తున్నారు. ముందు యస్.ఐ. వెనక డి.యస్.పి. రెడ్డి.

రాంబాబు చేతి సంకెళ్ళు గణగణమంటున్నాయి. వొరుసుకుపోయి ముంజేతులు నొప్పిపెట్టాయి. అడవి దద్దినట్టుగా బూట్ల చప్పుడు.

దట్టమైన అడవిగుండా ప్రయాణం.

దారిపొడుగునా రాంబాబు మాట్లాడుతూనే వున్నాడు. మాసపుడు. నిజమైన స్వేచ్ఛ, ఈనాటి దేశ పరిస్థితులు, రాజకీయ సిద్ధాంతాలు, రాజీమార్గాలు, ప్రపంచంనిండా రగులుతున్న విప్లవజ్వాలలు, పోరాటాలు, దోపిడీ పర్వాలు, కోర్టులు చేస్తున్న మోసాలు, వర్గాలుగా చీలిపోతున్న భారతీయులు, వాటి ఆవశ్యకత, ఒకటేమిటి ఎన్నో తెలిసిన వాడిలా అంత చిన్న వయసులో అనర్గళంగా మాట్లాడుతూ, మధ్య మధ్య శ్లోక్తులతో, నవ్వులతో పోలీసులు చెంట నడుస్తూ వున్నాడు రాంబాబు.

రాంబాబు వీపుమీద తుపాకీ గురిపెట్టి వుంది అయినా అతనిలో ఇసుమంతైనా భయంలేదు.

"నేను దేశద్రోహిని. పద్నాలుగేళ్ళ పసివాడు దేశద్రోహి. నేను పీల్చేగాలి దేశ ద్రోహులకు సాయం చేసేది. నేను పుట్టి పెరిగిన భూమి వాది కాదు నాపాటలు, నా కథలు, వేలాది లక్షలాదిమంది విన్నారు. విన్పిస్తూనే వినిపిస్తారు. నాగీతాల్లోని సాహిత్యాన్ని, సత్యాన్ని ప్రచారం చేస్తారు. నన్ను మాయం చేయగలరు కానీ నా గీతాన్ని ఏం చేయగలరు? మీరు ప్రభుత్వం యంత్రాంగంలో కీలకమైన స్థానాల్లో వున్నారు. మాది ప్రజల పక్షం. మేము గెలిచేదీ లేనిదీ చరిత్ర తప్పకుండా రుజువు చేస్తుంది. కాని, ఇష్టంలేని, ఆత్మ అంగీకరించని. శత్రుపక్షంలో నిల్చొని ఏం సాధిస్తారు? ఏ వ్యవస్థను నిలబెట్టదలుచుకున్నారో అదే పరోక్షంగా మిమ్మల్ని ఖూనీ చేస్తుంది, ఆలోచించండి?" మధ్య మధ్య ఆగుతూ సాగుతూ రాంబాబు చెపుతున్న మాటల్లోని సారాంశాన్ని అందరూ మౌనంగా వింటున్నారు.

గమ్యం చేరుకున్నారు కాబోలు, ఇన్‌స్పెక్టర్లు ఆగిపోయారు.

వ్యూహం ప్రకారం పోలీసులు నిలుచున్నారు.

యస్.ఐ.శివలింగం తెచ్చిపెట్టుకున్న ప్రేమతో, "ఒరేయ్ బాబు నువ్వింకా కుర్రోడివిరా, తెలిసీ తెలియకుండా, చాలా చాలా మాట్లాడుతున్నావు. నువ్వెంత నీ వయసెంతరా?" అన్నాడు.

పార్టీ పరిజ్ఞానానికి వయసక్కరలేదు సార్. ఆడా మగా, చిన్నా పెద్దా తేడా కూడా వుండదు. మా చదువులు, మీ న్యాయాలకు పరిమితాలు కావు. అవి విశ్వవ్యాప్తమైనవి. నేర్చుకోవలసింది, తెలుసుకోవలసింది, మీరు మాదగ్గర కాని, మేము మీ దగ్గరకాదు, సార్."

"చూడు రాంబాబూ, ఇంటికెడతానంటే పువ్వుల్లో పెట్టి మీ వూళ్ళో దిగబెడతాం. పైసా ఖర్చులేకుండా ప్రభుత్వం స్కాలర్‌షిప్పు ఇచ్చి చదివిస్తుంది. తల్లిదండ్రి కడుపు కాల్చకు. నిన్ను చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతోందిరా" అన్నాడు.

రాంబాబు కిలకిలా నవ్వి, "సార్ మీసానుభూతికి థ్యాంక్స్, నా మాటేంటో, దారేంటో చెప్పాను. అదే నా నిర్ణయం. మీరే ఆలోచించుకోండి" అన్నాడు.

డి.యస్.పి "అంతేనంటావా?"

"అక్షరాలా "

"అయితే, మీ నాయకుల స్థావరాలు ఎక్కడో చెప్పు".

రాంబాబు నవ్వి. "స్థావరాలా, సార్? మీకేం గుండెలున్నాయి. అక్కడికెళ్ళడానికి? ఒకనాడుండేవి. ఇవాళ లేవు. ప్రతిమనిషీ. ప్రతి అడుగూ, అడుగులోని ప్రతిమట్టీ, అటువంటి స్థావరంగానే తయారయ్యింది. చాతనైతే తేల్చుకోండి. నేను చెప్పేది అదీ," అన్నాడు.

"అధిక ప్రసంగం చేస్తున్నావు".

"మాకు హద్దంటూ వుంటేగదా అధిక ప్రసంగం చేయడానికి? సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరి ప్రాణాలకు తెగించి పోరాడే ప్రతీవ్యక్తి నాలాగే మాట్లాడుతాడు.

ప్రపంచంలో ఏ పుట తిరగేసినా ఇదే సత్యం కనబడుతుంది. మీరు ప్రభుత్వం కాదు. ఈ తుపాకులు తయారు చేసేవాళ్ళు ప్రభుత్వం. మీ శరీరం ప్రభుత్వానిది కాదు. ఈ కాకీ నిక్కర్లు తొడిగించిన వాళ్ళు ప్రభుత్వం. మీరు కాల్చే ధైర్యం ప్రభుత్వం కాదు. డ్యూటీ పేరు మీద మిమ్మల్ని భయపెట్టి కాల్పండి, లేదా చావండి అంటూ వెన్నంటి తరిమే యంత్రాంగం ప్రభుత్వం. మీరుండే ఇళ్ళూ, కాలనీలు ప్రభుత్వంకాదు. దేశంలో వేలాది ఎకరాల్ని పెట్టుబడుల్ని గుప్పిట్లో పెట్టుకొని పెద్ద మనుషులుగా చలామణి అయ్యేవాళ్ళు ప్రభుత్వం."

"అన్నలారా ఆలోచించండి. ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమో, దోపిడీ ప్రభుత్వమో తర్కించుకొని శాస్త్రీయమైన మా పోరాటంలో చేరండి. తుపాకులు అప్పగించి దేశంకోసం వీరుల్లా పోరాడండి."

"యూ షటప్ బ్లడీ."

గాండ్రిస్తూ రెచ్చిపోయాడు డి.యస్.పి. రెడ్డి.

"టూట్వెంటీ షూట్ హిమ్."

రాంబాబు మళ్ళీ నవ్వి, "సార్, నన్ను చంపగలరు కాని న్యాయాన్ని చంపలేరు. నా సిద్ధాంతాల్ని చంపలేరు. ఊc కానీయండి మీ పని," అని కళ్ళుమూసుకు నించున్నాడు.

రామ్మూర్తి "నో సర్!" అని తుపాకీ దించాడు.

"వన్ నైంటీ నైన్!"

"నో సర్!"

"టూ హండ్రెడ్!"

"నో సర్!"

ఒకరొకరే పోలీసులందరూ తుపాకులు దించారు.

ఇన్స్పెక్టర్లు ఒకర్నొకరు ఆశ్చర్యంగా చూసుకున్నారు.

కాసేపట్లో డి.యస్.పి. పిస్తోలు ధామ్మని మోగింది.

రాంబాబు నేలకొరిగాడు.

నేలంతా భరించలేనట్లు రక్తాన్ని చిమ్మింది.

ఆకాశం అరుణారుణమై ప్రకాశిస్తోంది.

పని పూర్తిచేసుకొని జీపు వెనక్కి బయలుదేరింది. అడవి దాటకుండానే నీళ్ళు అయిపోయి ఆగింది జీపు.

ఈ అడవిలో నీళ్ళు ఎట్లా అంటే ఎట్లా అని తర్కించుకోసాగారు అంతా.

చివరికి రామ్మూర్తి "ఇప్పుడు వెళ్తుంటే చూశాను సార్, ఆ డొంకలోనే సెలయే రున్నట్లుంది" అన్నాడు భయం భయంగా డి.యస్.పి.తో.

"అయితే, ఏయ్, వన్ నైంటీ నైన్, నువ్వు రామ్మూర్తికి తోడుగా వెళ్ళు" అన్నాడు యస్.ఐ శివలింగం.

"నే వెళ్ళను సార్, భయంగా వుంది."

ఒక్క రామ్మూర్తి తప్ప అందరూ భయాన్నే వ్యక్తం చేశారు

"మీ పని స్టేషను కెళ్ళాక చూడాల్సిందే" అంటూ రామ్మూర్తితో పాటు డి.యస్.పి.రెడ్డి మీసాలు దువ్వుకుంటూ బయలుదేరాడు.

పొదలూ, గుంటలూ దాటారు ఇద్దరు.

రామ్మూర్తి మనసులో తుఫాను బయల్దేరింది. అడివంతా రాంబాబు మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. అడుగు అడుగులో రాంబాబు నవ్వే ప్రతిపలిస్తోంది.

'భయమేస్తుందా రామ్మూర్తీ?" అన్నాడు డి.యస్.పి.

"లేదు సార్."

నడక సాగుతూనే వుంది.

రామ్మూర్తి మనసు గట్లు వొరుసుకొని తిరగబడ్డ నదిలా వుంది. ఏ క్షణానికాక్షణం రాంబాబు కళ్ళముందు నించుని కిలకిలా నవ్వుతున్నాడు. రక్తం మడుగులో పొర్లాడుతున్న రాంబాబు దేహం చేతులందిస్తున్నట్టుగా వుంది.

ధైర్యం తెచ్చుకున్నాడు. తుపాకి ఎత్తి క్షణంలో డి.యస్.పి రెడ్డిని కాల్చి అతని పిస్తోలు లాగేసుకుని రాంబాబు మృత కళేబరంవైపు పరుగు లంకించుకున్నాడు రామ్మూర్తి.

రెండురోజుల తర్వాత "పోరాటంలో ఇద్దరు నక్సలైట్లు వధ అందులో ఒకడు పధ్నాలుగేళ్ళ కుర్రవాడని అధికారయుతంగా తెలుస్తోంది. ఒక తుపాకి, రెండు చేతి బాంబులూ మావో సాహిత్యం లభ్యం. పోలీసులెవరికీ గాయాలు తగలలేదు" అని మాత్రం వచ్చింది.

● "ఇప్పుడు వీస్తున్నగాలి" (సంకలనం) 1971 ●

# 36. హక్కు

♦ మాదిరెడ్డి సులోచన ♦

"అన్నయ్యా! మీరు కూడానా!"

దేవయాని ఆశ్చర్యంగా చూచింది. ఆ ఆవేదనలో "యూటూ బ్రూటస్' అంటూ ఆశ్చర్యంగా చూసిన అలనాటి రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్ బాధ కనిపించింది. "అవునమ్మా! నీకు హక్కులేని విషయాలలో తలదూర్చటం అనవసరం" అన్నాడు రాము.

"అది కాదన్నయ్యా!..." ఏదో చెప్పబోయింది.

"నాకు వివరాలు, వివరణలు వినటం ఇష్టంలేదు" అన్నాడు. అంతవరకు అక్కడ పేపరు ముఖానికి అడ్డం పెట్టుకుని కూర్చున్న దేవయాని భర్త పరశురామ్ విసురుగా లేచాడు.

"అయిందా, ఇంకా ఏమయినా అవమానం మిగిలిందా?" అన్నాడు కోపంగా.

దేవయాని వాళ్ళముందు కళ్ళనీళ్ళు బయటపడరాదని శతవిధాలుగా ప్రయత్నించింది. ఆమెకు దక్షయజ్ఞంలో పార్వతి గుర్తుకు వచ్చింది. 'అడపిల్లలు పుట్టిన ప్రతివారికి సతీదేవి అనవాయితీ తప్పదేమో'

దేవయాని మెల్లగా లేచి బయటికి వస్తుంటే వదినగారు చిన్నగా నవ్వింది.

"ఈ అనుకోవటాలూ, అనునయింపులు యెప్పటికీ ఉండేవేలే. కాఫీ తీసుకుని వెళ్ళండి" అన్నది. ఆమె స్థితి చూస్తే పిర్రగిల్లి జోలపాడినట్టుంది.

"ఇప్పుడు కడుపులో అర అంగుళం కూడా స్థానంలేదు. మళ్ళీ వస్తాము వదినా!" అని వచ్చి పరశురామ్ స్కూటర్ వెనుక ఎక్కేసింది దేవయాని. పరశురామ్ కూడా తన కోపం అంతా స్కూటర్ పైన చూపాడు. ఇద్దరూ ఇల్లు చేరారు. యెన్నడూ లేనిది పరశురామ్ సార్థకనామధేయుడు అనిపించాడు. దేవయానిని రెక్కపట్టి పడకగదిలోకి ఈడ్చివేశాడు.

"మనిషి అన్నాక సిగ్గు, లజ్జ ఉండాలి. పుట్టింటివారంటే పడి చస్తూంది. మానాన్న ఒంటరివాడు, మానాన్న కష్టజీవి అంటూ పట్టుకు తిరిగింది? ఏం కోడండ్లు చేయ కూడదా! మా అమ్మ, నాన్నలకు మనము చేస్తూన్నాము. మా అప్పచెల్లెండ్లు వచ్చి వెళ్ళిపోతున్నారు. స్టుపిడ్! సేవచేయటమే హక్కు అన్నట్టు అరవచాకిరీ చేసింది. నీ కసలు ఉద్యోగం చేసి సంపాదిస్తున్నానని గర్వం..." అని ఆవేశంగా బయటికి వెళ్ళిపోయాడు. దేవయానికి ఏడ్పు కూడా రాలేదు. అందరూ అవమానించినప్పుడు,

పరశురామ్ అనునయింపు మాటలకు కరిగి కన్నీరు ఒలికించేది ఈరోజు ఎవరి ముందు ఒలికిస్తుంది!

శ్రీపతిరావుకు ముగ్గురు కొడుకుల తర్వాత పుట్టినది దేవయాని. ఆయనకు, ఆయన భార్యకు ఆడపిల్లలు అంటే అంతా దోచుకుపోయేవారని, మగపిల్లలంటే వంశాన్ని ఉద్ధరించేవారని ఒక అభిప్రాయం. ముగ్గురు మగపిల్లల తరువాత పుట్టిన దేవయానికి మరో ఇంట్లో అయితే అపురూపంగా జరిగేది. ఈ ఇంట్లో ఆమెను ఒక భారంగా భావించారు.

"లక్ష్మీ! మనకు ఈ అమ్మాయి, అబ్బాయి అయితే శ్మశానానికి మోయటానికి మరో మనిషి అవసరం ఉండేది కాదు" అంటూ వుండేవాడు దేవయాని పెరిగినకొద్దీ కొన్ని విషయాలు అర్థంచేసుకుంది. జన్మనిచ్చిన తల్లిదండ్రులు ఇంత వ్యత్యాసం చూపటమా!

హరికృష్ణ, మురళీకృష్ణ, రామకృష్ణ ఏదడిగినా నిమిషాలమీద వచ్చేవి. దేవయాని ఏదయినా అడిగితే తండ్రి ఖర్చుల లిస్ట్, తల్లి 'మగబిడ్డలతో వంతేమిటే' అని చదివేది.

మళ్ళీ ఏనాడూ తన కోరికను బయటపెట్టలేదు. పదవతరగతి ఫస్ట్‌క్లాస్‌లో పాసయింది దేవయాని.

ట్యూషన్లు పెట్టి రాత్రింబవళ్ళు కష్టపడి చదివించిన అన్నలు హైయ్యరు సెకండ్ క్లాసు, సెకండ్‌క్లాసు తెచ్చుకున్నారు. తను ఫస్ట్‌క్లాసు తెచ్చుకుంటే ఎంత అభినందిస్తారో అనుకుంది.

పనిలేక ఆడపిల్లలు ఫస్ట్‌క్లాసులే తెచ్చుకుంటారు. ఇంకా చదినించటం అనవసరం. సత్యవతి కొడుక్కి చేసుకుంటానంటుంది. ఆ కుర్రాడికి కట్నం వద్దనే పిచ్చి ఉంది" అని మాట్లాడుకుంటున్న తల్లిదండ్రులను చూసి దేవయాని ఒక్కసారి నిలబడిపోయింది.

సత్యవతమ్మ, శ్రీపతిరావుకు చిన్నమ్మ కూతురు. అతనికి ఆమె అంటే ఇష్టం. ఆమె కొడుకే పరశురామ్ ఎల్.ఎమ్.ఇ. చేసి భారత్ హెవీ ఎలక్ట్రికల్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతని ఆశయాలను అందరూ పిచ్చి అంటారు.

కానీ కట్నం లేకుండా దేవయాని వివాహం అతనితో జరిగిపోయింది. అతనిలోని పిచ్చే దేవయానిని ఎం.ఏ వరకు చదివించింది. ఆమె జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తోంది. ఇద్దరు పిల్లలు తను ఏ వ్యత్యాసానికి భయపడి బాధపడిందో, అది తన బిడ్డల మధ్య తలయెత్తరాదని జాగ్రత్తపడింది. హరి, మురళి, రాము ముగ్గురూ దూరంగా వున్నారు. హరి ఢిల్లీలో, మురళి యిరాన్‌లో, రాము అమెరికాలో ఉండిపోయారు. దేవయాని పెళ్ళికాగానే లక్ష్మీదేవి చనిపోయింది. భార్యను కోల్పోయిన తండ్రి అంటే విపరీతమైన అభిమానం దేవయానికి.

అతనికి మాత్రం కొడుకులను పొగడటం, వారి గొప్పలు చెప్పటం పూర్తిగా సంతృప్తి నిస్తాయి.

"నీ గురించి రవంత అభిమానంలేని మనిషికి సేవచేస్తావెందుకు!" అంటాడు పరశురామ్.

'అభిమానానికి రూపంలేదు. అది కొలవలేము" అని అతని మాటలు తీసివేసేది!

వెళ్ళి అతని కే అవసరం వచ్చినా తనే ఆదుకునేది. ఓ రోజు వెళ్ళేసరికి శ్రీపతిరావు కోపంగా ఉన్నాడు.

"చూడమ్మా, ఈ నలభై గజాల స్థలం ఆ ప్రక్కవారిదట పాత ఆస్తులు కొనటమంత బుద్ధితక్కువ లేదు" అన్నాడు.

"అక్కడ మనం గదులువేసాం కదానాన్నా."

"అదేనమ్మా, ఆ మాటంటే ఆ స్థలానికి ధరకట్టారు. గజానికి వంద రూపాయలు. నేనెక్కడ తేను..." అన్నారు బాధగా.

ఏం చేయాలో తోచలేదు. నాలుగు వేల రూపాయలు. సాయంత్రం కాలేజికి ఫోన్ వచ్చింది, ఫ్యామిలీ డాక్టరు చేశాడు.

"దేవీ! ఈ బాదరబందీ ఏది వద్దంటే వినరేం? ఆ పెద్దమనిషికి పిచ్చి పెరిగింది. పోతే పోనియ్యండి, మీ ఆరోగ్యం కంటే యెక్కువా అన్నావినడు.." అన్నాడు కోపంగా.

"ఏం చేయమంటారు. డాక్టరుగారూ!"

"ఏదో ఒకటి చెయ్యి మీ అన్నల దగ్గర నుండి డబ్బు వస్తుందని నమ్మకంగా చెప్పు మీరు నల్గురూ సెటిల్ అయ్యారు. హాయిగా ఉండకూడదూ.." ఆయన విసుక్కుని ఫోన్ పెట్టేశాడు.

కాలేజీ నుండి సరాసరి తండ్రి దగ్గరకు వెళ్ళింది. ప్రక్కవారు వచ్చికూర్చున్నారు.

'చూడండి రావుగారూ! మీ అబ్బాయిలు రావాలంటే నెలలు పడుతుంది. డబ్బివ్వండి లేకపోతే..." వారి మాటలు పూర్తికాకముందే దేవయాని కల్పించుకున్నది.

"అంతంత మాటలెందుకు! ఇదిగో చెక్కు" నాలుగువేలకు వ్రాసి యిచ్చింది. వాళ్ళు రసీదు వ్రాసిచ్చి వెళ్ళిపోయారు.

"మీ పరువు కంటే ఆ డబ్బు ముఖ్యం కాదునాన్నా! వజ్రాల దిద్దులు కొనాలని చీటీ కట్టాను. ఆ చీటీడబ్బే. ఆరు నెలలు ఆలస్యంగా కొంటాను" అన్నది ఓదార్పుగా.

మర్నాడు తండ్రి స్థితి బావుందని డాక్టరు చెప్పినప్పుడు ఆమె చాలా సంతోషించింది. తను ఒక ఉపయోగమయిన పని చేసింది. అన్నలు తప్పక అభినందిస్తారనుకుంది.

హరి ఈ విషయం విని తండ్రిని నాలుగు దులిపాడు.

"ప్రక్కింటివాడే మగాడా నాన్నా! ఇంకే పదేళ్లయినా హాయిగా కోర్టు చుట్టూ తిరిగేవారం" అన్నాడు. ఆ తరువాత డబ్బు విషయం యెత్తనేలేదు. అతను వెళ్ళిపోయాక తండ్రి విసుక్కున్నాడు. "కోర్టుకెళ్ళటం అంటే సినిమా అనుకుంటున్నాడు. మురళితో ఇప్పించేస్తాను. తొందరపడ్డావేమో."

"అదేం మాట నాన్నా! మీకు రోజూ తలనొప్పి ఉండేదిగా" అన్నది. రెండు నెలలకు యిరాన్ నుండి మురళి వచ్చాడు. ఒక రోజు తండ్రి విషయం చెప్పాడు.

"నాన్నా! ఇంటికి ఖర్చుపెట్టావు. ఆ వచ్చే అద్దెతో అప్పు తీర్చండి. నాకు అనవసర విషయాలు చెప్పొద్దు" అని లేచి వెళ్ళాడు.

"గొప్పకోసం కాకపోతే ఆమెనెవరు ఇష్టమన్నారు' మురళి భార్య కోమల అనటం దేవయాని చెవుల్లోపడ్డది.

మనుషులకు తార్కికజ్ఞానం నశించిందా! ఏమో... అలా మరో ఆరు నెలలు గడిచాయి. శ్రీపతిరావుకు రెండుసార్లు జబ్బు చేసింది రెండుసార్లు సెలవలు పెట్టి తండ్రి దగ్గర ఉండిపోయింది దేవయాని.

ఆయనకు తృప్తి లేదు. అనుక్షణం కొడుకులుంటే ఇంకా పెద్దడాక్టరుకు చూపించే వారని అనుకుంటుంటాడు. అది విన్నప్పుడల్లా పరశురామ్ దేవయాని పంక కొరకొర చూస్తాడు. అతను వద్దని వారించలేదు. కొందరు తమచాళ్లను రానిచ్చి సేవచేసి, అత్తగారి వైపు బంధువులను వద్దంటారు. దేవయాని ఈ రోజు తండ్రికి చేసినట్టే మామగార్కి చేస్తుంది.

తండ్రిని చూడాలని రాము వచ్చాడు. అతనికి నాలుగువేలు గొప్పకాదు కాని అది వదులుకునే గొప్ప హృదయం ఉండాలి.

అతను దేవయాని ఇంటికి భోజనానికి వచ్చాడు. వెళ్తూ, తను తెచ్చిన వాచీ ఆమెకిచ్చాడు.

"చూడు దేవీ! నువ్వు నాలుగు వేలిచ్చావని నాన్న చెప్పాడు. కాని ఐడోంట్ అప్రిషియేట్. కేసు కొట్లాడాల్సింది."

"ఆ ఓపిక నాన్నకెక్కడిదన్నయ్యా! నాన్న పరిస్థితి డాక్టరును అడుగు."

"లెటిట్ గో.. ఒక్కసారిస్తే నాన్న చేసే అవకతవక ఖర్చులకు నువ్విస్తావు. నేను ఇవ్వను."

"దట్స్ ఆల్‌రైట్ అన్నయ్యా."

అతను వెళ్ళిపోయాడు. శ్రీపతిరావు ఒక్కసారి బాధపడ్డాడు. "పోన్లే నాన్నా! నేను నీ కూతుర్నే కదా! ఇప్పుడేమయింది. నీ ఆరోగ్యానికన్నా, నీ అనుభూతి ముఖ్యం కాదు" అన్నది.

ఆ తరువాత ఆ విషయమే మరిచిపోయింది. అప్పుడప్పుడు పరశురామ్ హేళన చేసేవాడు.

"ఏమిటో వెర్రి అభిమానం. మా పెద్దవాడు నాకిష్టమని యెవరు వచ్చినా కలకత్తా స్వీట్స్ పంపుతాడు."

"ఇదిగో ఈ నేల్ కట్టర్ మా రాము పంపాడు. నాకెందుకురా అంటే ఈ స్వీటులిచ్చి పోయాడు."

"మా మురళి పైకి చూస్తే యెంతో పొదుపరిలా కనిపిస్తాడు పిచ్చిసన్యాసి. ఉన్నన్ని రోజులు రోజుకు పదిరూపాయలు పెట్టి పళ్ళు కొంటాడు" అని తండ్రి అరిగిపోయిన రికార్డులా అందరి దగ్గర చెప్పేవాడు.

"మరిచిపోయి కూడా 'మా అమ్మాయి' అన్నమాట మీనాన్న నోటరాదు. అలాంటి నాన్నను పట్టుకుని ప్రాకులాడతావేం?"

"ఆయన అనాలని చెయ్యటం లేదు. యెవరి ఆనందం వారిది. మీ అమ్మ మీ చిన్నతమ్ముడి గుణగణాలే రామాయణ కీర్తనలా పాడుతుంది.."

"అబ్బబ్బ చాల్లే" అనేవాడు పరశురామ్.

వాదనకోసం భర్తను అలా అన్నా ఆమె మనసు పీకుతూ వుండేది. అది మనిషికి ఉండే బలహీనత. వీటన్నిటికీ అతీతంగా యెదిగిపోవాలని ఆమె తపన పడేది.

అదే సమయాన ఒక డాక్టరుగారు వంధ్యచికిత్స చేస్తానని కేరళనుండి దిగాడు. అతను దేవయాని కొలీగ్ అన్న.

"దేవీ! మీ ఇల్లు పెద్దహాలుతో ఉంది.అక్కడయితే ఓ పదిరోజులు అన్న హాయిగా ఉండొచ్చు" అని అడిగింది.

"మా ఇల్లా! అంత చిన్న వరండాలో పేషంట్లు పట్టరు."

"మీ ఇల్లు అంటే మీ నాన్నగారిదోయ్" అన్నది.

"ఆయన ఒక్కరే కదా, అడుగుతాను" అన్నది దేవయాని. మళ్ళీ ఆమె రెట్టించటంతో తండ్రి దగ్గరకు వచ్చింది.

"నాన్నా! నా స్నేహితురాలు కన్నమ్మపోతన్ అని ఉంది. వాళ్ళన్న పిల్లలు కాని వారికి మందులు ఇస్తుంటాడు. వారానికి అయిదురోజులు బయట బస చేస్తారు. ఈసారి హైదరాబాద్ వచ్చారు. మన ఇల్లయితే కాస్త హాలు పెద్దగా ఉంటుందని..." చెప్ప బోయింది. "దాందేముందమ్మా, అలాగే కానియ్యి. ఇల్లంతా పడి దొర్లుతానా!" అన్నాడు నవ్వుతూ.

కన్నమ్మతో చెప్పింది దేవయాని. కన్నమ్మపోతన్ చాలా సంతోషించింది. అంతవరకు అలా ఊరూరా తిరిగే డాక్టర్లు అంటే వారు ఒక్కరే వస్తారు అనుకుంది దేవయాని.

డాక్టరు మందీమార్బలం పది పన్నెండు మందితో వచ్చాడు. వెంట సామాన్లు కూడా వేసుకు వచ్చారు. గర్భకోశ దోషాలకు చిన్నచిన్న ఆపరేషన్లు అవీ చేస్తారట.

అనుకోకుండా ఢిల్లీ నుండి హరికృష్ణ వచ్చాడు. తండ్రిని నానామాటలన్నాడు.

"ఇల్లు ధర్మసత్రమా!"

"ఓహో! పెరిగిన కొడుకులు అంటే గౌరవం లేదా!" అంటూ

శ్రీపతిరావుకు మురళి దగ్గరున్న చనువు హరిదగ్గర లేదు. "అబ్బే నాకేం తెలియదురా. అంతా అమ్మాయే చూసుకుంది. నన్ను అడగలేదు" అన్నాడు శ్రీపతిరావు.

హరికృష్ణ వచ్చి దేవయానిని నిలదీస్తే అదేమిటని ఆశ్చర్యపోయింది. ఛ...నాన్న అంగీకరిస్తేనే డాక్టరును ఉంచానన్నయ్యా."

"ఇప్పుడు నాకిష్టం లేదు. వెంటనే ఖాళీ చేయించు. యిదేం బజారు కొంపా!" అన్నాడు

దేవయాని సాయంత్రం వెళ్ళి శ్రీపతిరావుని అడిగింది.

"అదేమిటి నాన్నా! అన్నయ్యతో అలా చెప్పావు? నిన్ను అడగలేదా?"

"అడిగావు కాని, వాడు నిలదీస్తే నా కాళ్ళూ, చేతులు వణికాయి తల్లీ. నాకు చావెందుకు రాదో.."

తండ్రి అసహాయస్థితిలో అనేమాట అది. దేవయానికి ఏం పాలుపోలేదు.

"నాన్నా వాళ్లను వెళ్ళమంటే సభ్యతగా వుంటుందా ఆరురోజులు గడిచాయి. మరో నాలుగు రోజులు ఓపికపడితే.."

"ఒర్ధి మళయాళ మేళమే తల్లీ అంటే నీకు కోపం వస్తుంది. వాళ్ళగోల, రోగుల సందడి చూస్తుంటే ఛీ....ఛీ..."

"పిల్లలు కలుగకపోతే వస్తున్నారు. వారేం రోగులు కాదు. అంటువ్యాధులు కావు" దేవయాని నచ్చజెప్పింది.

ఆమెకు తనపై తనకే కోపం వచ్చింది. వెళ్ళి కన్నమ్మతో ఖచ్చితంగా చెప్పింది.

"ప్రజల కోరిక మీద రెండు రోజులు యెక్కువ వుంటారు. ఉన్నపాటున పొమ్మంటే యెలా?"

"కన్నమ్మా నాకు తెలుసు. కాని, నేనూహించింది మీ అన్నగారు ఒక్కరే వస్తారని. మందీమార్బలంతో వస్తారని ఊహించలేదు" అన్నది.

"నాకూ అనుభవం లేదు దేవయాని..."

దేవయాని ఆ వారం రోజులు నరక యాతన అనుభవించింది. "డాక్టరుగారిని ఖాళీ చెయ్యమను" అని తండ్రి ఫోన్.

"మీ నాన్న నానా మాటలంటున్నారు. పెద్దవారని సహించి ఊరుకుంటున్నాము" అని వాళ్ళ ఫోను.

తిని కూర్చుని ఏం తద్దినం తెచ్చిపెట్టుకున్నారా బాబూ అనుకుని దేవయాని బాధపడని క్షణంలేదు.

డాక్టరుగారు ఖాళీ చేశారని వార్త వచ్చింది. దేవయాని వెళ్ళింది. "గోడలకు నీళ్ళు కొట్టారు, గచ్చుడిపోయింది. అబ్బబ్బ జనం పెరడు పాడుచేశారు." అంటూ శ్రీపతిరావు చెప్పాడు.

వీలయినంతవరకు బాగు చేయించింది. మర్నాడు కాలేజికి వెళ్తే గంపెడు చేపలు తిన్న గండుపిల్లిలా ముఖం పెట్టింది కన్నమ్మపోతన్.

"మనుష్యుల్ని చూసి మోసపోతాం. మాట్లాడుతుంటే తీయగా వుంటాయి. చదువు కున్నా సంస్కారం వుండదు. సహకరిస్తే, ఒకరింట్లో ఉండి డబ్బు సంపాదించాం అని అద్దె ఇచ్చేవారం. మాటలు పడి అద్దె యెందుకివ్వాలి!" అన్నది.

దేవయాని తలనుండి పెద్దభారం దిగినట్లు నిట్టూర్చింది. మళ్ళీ ఇలాంటి వాటిల్లో ఇరుక్కోవద్దని లెంపలు గట్టిగా వాయించుకుంది.

ఆరోజు సాయంత్రం తండ్రికి పళ్ళు తీసుకుని వెళ్ళింది.

"అందరూ నన్ను ఏమడుగుతున్నారో విన్నావుటే అమ్మాయ్! ఈ డాక్టరు రోజు రెండు వందల అద్దె ఇచ్చాడంటున్నారు."

"యెవరికిచ్చారట.." తీక్షణంగా చూసింది. ఆ క్షణంలో ముఖం దాచుకోవటానికి యెక్కడా స్థలం లేదనిపించింది. కన్నతండ్రి, డబ్బంటే తనెంత దూరంగా ఉంటుందో, లెక్కలంటే ఎంత ఖచ్చితంగా వుంటుందో తెలిసిన తండ్రి, ఆ మాట అనగలిగాడంటే ఆ అద్దె తను తీసుకున్నట్టే అనుమానించాడేమో? దేవయానికి ప్రపంచంలో యెవరూ తనవారు కారనిపించింది. ఈ విషయం భర్తతో చెబితే ఇంకా ఏమయినా వున్నదా!

మూడు నెలలు తిరక్కుండానే శ్రీపతిరావు కొడుకులను పిలిచి ఉన్న కొద్దిపాటి ఆస్తి పంచి ఇచ్చాడు.

"నీకు కట్న కానుక లిచ్చారా! ఏమీ ఇవ్వరా! మీ అమ్మ నగలయినా ఇవ్వరా!" అని ఆడబడుచు అత్తగారు గుర్తుచేశారు.

"అభిమానం కరువయ్యాక, డబ్బు, నగలు ఎందుకు?" అనుకుంది విరక్తిగా. వాళ్ళు వచ్చినందుకు పలుకరించాలని, వెళ్ళి పలుకరించి, తన ఇంటికి ఆహ్వానించింది.

ముగ్గురూ ఏకమయి నిలదీశారు.

"ఇల్లు ఆస్పత్రికి ఇవ్వడానికి నీకేం హక్కు వుంది" అన్నారు.

"అన్నయ్యా!" అన్నది అవేదనగా. వాళ్ళలా నోరు జారాలంటే తనూ జారగలదు! నాన్నను ఒంటరిగా వదిలిపోతే చూసే హక్కు ఉన్నట్టే, నాన్న కష్టాలలో ఆదుకునే హక్కు ఉన్నట్టే, ఈ హక్కు ఉంది అనగలదు.

కాని అసలయిన వ్యక్తే పక్షపాతం వహించాడు. వాళ్ళీ విషయాలను రెట్టించినప్పుడు తండ్రి కలగుజేసుకుంటే బావుండేది.

"ఏరా! ఇల్లు బావురుమంటుంటే, నాల్గురోజులు ఇచ్చిందేమో. మీలా అదీ పుట్ట లేదా!" అంటే వాళ్ళ దగ్గర జవాబు లేదు. వాళ్ళు అలా అడగటానికి ఆస్కారం ఇచ్చింది కూడా తండ్రే. తల్లిదండ్రులు చిన్న చూపుచూసిన పిల్లలు సమాజంలోను, బంధువుల లోను చిన్న చూపు చూడబడతారు. ఆ నిజం తనకు బాగా తెలుసు.

దేవయానికి దుఃఖం తన్నుకు వస్తుంది. తన కన్నీటికి కరిగేవారు యెవరూ లేరు. తన అన్నల సంగతి బాగా తెలుసు. తమకు చీమకుట్టినా అది బాధే. ఇతరులకు తేలు కుట్టినా పరిహాసమే. "చాలయిందిలేమ్మా ఏడ్చావ్ గానీ" అంటారు.

ఏ చిన్న విషయానికి వాళ్ళలో వాళ్ళకు తగాదా వస్తే గంటల తరబడి చెబుతారు. కొంపలంటుకుపోయినట్లు బాధపడతారు.

"చాలయింది లేవయ్యా!" అనాలనిపిస్తుంది. కాని తనొక బాధ్యత కల్గిన అధ్యాపకురాలు. అంత స్వార్థానికి దిగజారలేదు. నిజమే, వారడిగింది నిజమే. టిట్ ఫర్ ట్యాట్ అని వుండాలి. ద్వేషించేవారిని, హేళన చేసేవారిని, నిర్లక్ష్యం చేసేవారిని, ప్రేమించటం తనదే బుద్ధితక్కువ. తన హక్కుకోసం తను పోరాడకపోవడం తెలివిమాలిన పని.

చాలాసేపు అలాగే కూర్చుంది దేవయాని. ఈ చిన్న సంఘటన తనకు మనస్తాపం కలిగిస్తే కల్గించింది కాని, 'హక్కు' అని ఆధిక్యత చూపుకుని, తండ్రి బాధ్యతనుండి విముక్తిరాలిని చేశారు.

"భగవాన్ నాకు పూజచేసే అలవాటు లేదు. నువ్వంటూ ఉంటే, అనుబంధాల నుండి ప్రేమనుండి కూడా విముక్తురాలిని చెయ్యి" అంటూ నమస్కరించింది.

● 1972 ●

# 37. గడీ

♦ చావా శివకోటి ♦

'బే'గినడు' అన్నడు సరవయ్య - చాచి నడుస్తూ.

పది, పన్నేండేళ్ళ బుడతడు - జారిపోతున్న పొట్టిలాగుతో - తండ్రెంట పరుగులాంటి నడకతో లగెత్తుతనే వున్నడు, పొద్దుట నిద్రలేపి, 'చిన్నడూ బేగి నీళ్ళోసుకుని, ఇంత సద్ది తిను' అన్నప్పుడు కూడా 'ఏడికి పోవాల్నే', అని అడగలేదు. పైగ, చాకిరేవు నుంచి వచ్చిన తెల్లబట్ట లేసుకొని రడీ అయి కూర్చుండు. సరవయ్య వచ్చి 'ఇక పద' అని గడప దాటుతుంటే - అడుగులో అడుగు కలిపి వెంట నడిచిండు.

ఆ నడక - రెండు బారల పొద్దెక్కిన ఆగలేదు బాట తరగనూ లేదు. మధ్యన ఓ మోట బావి కనిపిస్తే 'నీళ్ళు తాగుతవా?' అని మాత్రం అడిగిండు 'ఊఁ!' అని మోటదారికాడ నాల్గు గుక్కలు నీళ్ళు తాగి, కలవ ఉరికిండు. పొద్దు నెత్తికెక్కుతుంటే - ఓ ఊరి పొలిమేర కనిపించింది. మేత కొదిలిన గొడ్లు డొంకెంట చింగిరి బింగిరిగ కనిపించినయి.

గొడ్ల కాచే పోరళ్ళు - కావిలి కట్టకు సద్దులు గట్టుకొని - ఎనకెక్కడో కనిపించినారు. ఇంతలో జీవాల మంద ఎదురుపడింది.

వాటెంట ఉన్న 'ఎల్లమంద' సరవయ్యను జూసి - 'గడీకా' అనడిగిండు.

'ఆ'! అని దొర ఉన్నడా' అన్నడు.

'ఉన్నడు - కచ్చడపు గిత్తకు' 'గుఱక' రోగం తగిలింది గది నయమయిందనక ఏడికీ కదలడు.

'అట్టనా' అని తోవన పడ్డడు - సరవయ్య.

పచ్చిగడ్డి మోపులెత్తుకొని ఊళ్ళో కెళ్తున్నారు ఆడాళ్ళు.

వరుసగా వాళ్ళు వెళ్తుంటే -అట్టాగే చూడబుద్ధేసింది రాముడికి.

కానీ - అయ్య సానా దూరమవులు దన, కేకలేస్తడనీ, గుబులయి, లగెత్తాడు, ఊళ్ళో కొచ్చేసరికి, రాముడికి చొక్కా, లాగూ, చెమటతో తడిసి ముద్దయింది. ముత్యాలమ్మ గుడి పక్కనున్న రాగిచెట్టు కడన, కూసేపు ఆగి - సేద తీర్చుకున్నారిద్దరూ.

తిరిగి బయలుదేరాడు సరవయ్య.

సీదా- ఆ నడక గడీముందు కాపలా ఉన్న 'ఎట్టోడి' తాన ఆగింది.

వెంటనే - అడిగిండు - 'దొరుండడా?' అని

'ఆఁ!'

'నన్ను లోనకిడస్తవా? లేక సరవడొచ్చిందని దొరకి చెప్తవా?' అన్నాడు.

"అంత రద్దిగ లేదులే - పో" అన్నాడు.

"దొరా" అని రాముడికి సైగ చేసి గడీ గేటు లోనకడుగు పెట్టిండు సవరయ్య. గడీ - చానా ఎత్తున వుంది. ముందు చప్టా వుంది. దాని ముందుమంటపం లాగా విశాలంగా ఒకటుంది. దొర ఉండే 'లోగిలి' లోగిలి మొత్తం పెద్దగా చీకటిగా కనిపించింది. ఈ రెంటికీ మధ్యన ఆ చానా ఖాళీ స్థలం కనిపించింది. అక్కడ నుంచి ఓ ఇరవై మెట్లు ఎక్కితే గాని 'లోగిలి' లోపలి భాగం కనిపించదు. ఆ మెట్లపైన ఉన్న చప్టామీద వాలు కుర్చీలో కనిపించిండు దొర. ఆయన్నెత్తిన నీడ కోసం తాటాకు కప్పు ఉంది. దొర యెనక ఓ ఎట్టోడు విసనకర్రతో విసురుతూ కనిపించిండు. ఎదురుంగ మాత్రం ఎవ్వరూ లేరు. కాకపోతే నాలుగు మెట్లకింద ఎడమవైపున ఉన్న 'చప్టా' పైన ఐదారుగురు మనుషులు మెల్లిగా మాటాడుకుంటూ కనిపించారు.

సరవయ్య తలనున్న కండువాను చేతులలోకి తీసుకోని "దొరా! కాల్మొక్కుత. నీ బాంచను దొరా!" అని మొక్కేస్తూ - ఎదురుగా చేరాడు.

వెంటనడిచిన రాముడికేం చెయ్యాలో తోచక - ఆగిపోయి భయంతో బిక్క మొఖం వేసిండు.

సరవయ్య మాటకు, ఇటుగా చూసిన దొర - సరవడిని గుర్తుపట్టి, - 'ఆ! ఏందిరా! ఇప్పుడే వస్తివా?' అన్నాడు.

'ఔ దొరా నీ కాల్మొక్కుత! తమరు వంటకాడికి బుడతడు కావాలంటిరి గదా! పట్టుకచ్చిన!' అన్నాడు తిరిగి మొక్కేస్తూ.

'వాడేనా?' అన్నాడు దొర - నిల్చుని ఉన్న పోరణ్ణి జూసి.

'అవుదొరా! ఈడే ! నా పొరడే!'

'అట్టనా! అన్నట్టుగ తల విదిలించి, "ఇగో మల్లన్నా! వంటకాడున్న 'వరదణ్ణి పిలు" అని పురమాయించిండు.

'దొరా!' అంటూ గడీలోకి పోయిండు మల్లన్న అనెటోడు.

కూసేపాగాక - ఓ 'రివట' లాంటి వాడొకడు 'గడీ' నుంచి బయటకొచ్చి దొరకి ఎదురుంగ పోయి "దొరా! పిలిచిన్రట" అన్నాడు వంగి మొక్కేస్తూ.

"ఇగో! వరదా! ఈ పోరణ్ణి - వంట కాడ చేతికింద ఉంచుకో. పని నేర్పు" అని - "ఆ! గడీల ఎట్టుండెడిది కూడ- తెలవజెప్పు" అన్నాడు.

"అట్టనే దొర" -

'ఇయ్యాల నుంచి ఈడు గడీల మనతాననే ఉంటడు. ఏం?" అన్నాడు తిరిగి.

దండమెడుతూ తలూపిండు వరదడు.

దూరంగవున్న పోరడ్డి పిలిచి "నీపేరేందిరా?' అనడిగిండు.

'రాముడంటరు'.

'ఇగో! రాముడూ! ఈడెమ్మటుండీ వంటతో పాటు ఈడ ఉండే 'తరీఖ' కూడా నేర్చుకో. ఫో' అన్నడు.

రాముడు వాని 'అయ్య' వైపు ఒక తూరి చూసి వరదడెంట గడీ లోపలకు నడిచిండు.

'సరవా! ఇంక నువ్వు ఫో' అన్నడు దొర సరవడివైపు చూసి.

'అట్టనే దొర నీ కాల్మొక్త' అని దండాలు పెడుతూ పది అడుగులు వెనక్కి నడిచి అక్కడ నుంచి గడీ గేటు వైపు తిరిగి బయటకు నడిచాడు సరవడు

దోవన రాముడు గుర్తుకొచ్చి కళ్ళల్ల నీరు నిండింది ఓసారాగి పైకండవాతో కళ్ళొత్తుకుని 'ఈడైనా బాగుపడతడు' అనుకుంటూ ముత్యాలమ్మ గుడి - రావిచెట్టు దాటి డొంకలోకొచ్చాడు.

* * *

'ఇదిగో! పెద్దొరసాని గదిలో - భోజనం పెట్టిరా!" అన్నాడొకనాడు వరదడు.

'అమ్మగారి కమరలకు పోవాలంటే నాకు జర్ర గుబులయితదే!' అన్నడు రాముడు.

'అదేం లేదుర బిడ్డా! గడీలో ఉండెటోడికి ఫికరెందుకు? కొత్త మొఖమయితెనే తంట వస్తది. ఇగో! నువ్వు అక్కడ చేసెడిదేం లేదు! వీటిని గొంచకపోయి పెట్టిరా! మన నాంచారమ్మ ఈ 'పొంటి' పనిలోకి రాక పాయెగద! దాని మిలట్రి మొగుడు ఈ పొద్దే ఊళ్ళోకొచ్చిండట. న్యాయంగ చూస్తే, ఈ రాత్రే దానికి మనుగడుపు - అదెట్ట? అనకు- పాపం అది పెద్దది గాకమునుపే ఆడు మిలట్రిల జేరిండు. ఈడ మన దొర ఊర్కో లేదనుకో' అని ఆగి - 'అరే రాముడూ! నాకూ వంట్లో సైసుగ లేదుగనీ - కూస్త చెప్పినట్టు చెయ్యి' అన్నాడు విసుగ్గా-

ఇక మాటాడగూడ దనుకొని - భోజనం తట్ట నెత్తికెత్తుకొని - పెద్ద దొరసాని కమర దగ్గరికి చేరిండు.

'ఎవర్ని తోలాల్నా అనుకుంటుండం - నువ్వే తెచ్చినవుగద!' అని గంప అందుకొని- 'ఇగపో!' అందక్కడున్న ఓ ఆడపాప.

తల ఊపి - వంట గదికి చేరిండు రాముడు.

ఇట్టనే - ఒకనాడు వరదడికి జొరం తగిలితే - పెద్ద దొరకి భోజనం పట్టుకుని పైకి నడిచిండు రాముడు. దొరకనపడంగనే గంప దింపి మొక్కేసిండు. అయితే దొర వళ్ళో ఓ ఆడపాప కూకొని ఉండది. అది రాముణ్ణి చూసి సిగ్గుతో చితికిపోయింది పాపం. దొరమాత్రం దాన్ని చేతులతో నలిపేస్తూ - అక్కడక్కడ ముద్దాడుతూనే ఉన్నాడు. అప్పుడప్పుడు మాత్రం - ఆగి - పక్కనున్న 'సార'నూ, కోడి కూరనూ, చేప ముక్కలనూ నంజుకొని మరీ తింటున్నడు. నాల్గు అడుగులు - పడ్డయ్యో లేదో - 'రాముడూ!' అని పిలిచిండు దొర.

ఆగిందు రాముడు - ఎనక్కి తిరగకుండ. 'దొరా!' అని మాత్రం పెద్దంగ అన్నడు.

'ఇట్రారా!' అన్నడు.

పోక తప్పదు గద! దగ్గరికొచ్చిండు - తల వంచుకొని 'వస్తిదొర' అన్నడు. 'సేసల ఉన్న మందు గళాసులో నింపిపో' -అన్నడు - వళ్ళో ఉన్నదాని చెవి తమ్మెను చప్పరిస్తూ - గళాసునిండా సారా వంచి - చేతి కందించి - ఇంకేం చెపుతడేమోనని అక్కడే వంగి నిల్చుండు. దొరేమో గటా గటా అరగళాసు పైన తాగి - ఒళ్ళో ఉన్న ఆడపాప బుగ్గను కందేలా కొరికి - అదేదో ఘనకార్యం చేసినట్టు రాముడేపు చూసి - 'బాగుందిర పోరి! పచ్చికొబ్బరనుకో!" అని గఱ గఱ నవ్విండు.

రాముడు తలెత్తలేదు - తలపోయినా ఎత్తాలనిపించనూ లేదు.

'ఓసినీ! ఈడికింక మీసమే సరింగ రాలేదు. మజా ఎట్ట తెలిసి చస్తది 'అనుకొని' పోరిని దగ్గరికి జరుపుకొని - చెవిలో 'ఈ పోరణ్ణి పనిలో పడెయ్యరాదు' అని ఎలుగొడ్డులా నవ్విండు.

అది నవ్వులా అనిపించలేదు. ఎలుగుబంటి - చెద పురుగుల్ని పీల్చినటువంటి శబ్దం వినిపించింది. ఆడపాప మాత్రం సిగ్గుతో చచ్చిపోతూ కనిపించింది. ఆ చితికిన సిగ్గులో - కళ్ళెంట చెమ్మా - కనుపాపల్లో సూర్యోదయపు ఎఱుపూ కనిపించింది రాముడికి.

'అరె!' ఇంక ఇక్కడేం జేస్తున్నవు? తమాషగున్నాదిర బే! పో!' అని కసిరిండు. రెండు అంగల్లో - వంటింటికి చేరిపోయిండు.

'గడీ' లోని - అందరి తంతూ 'పూరా' అర్థమయ్యేసరికి - ఇంకో నాలుగేళ్ళు పట్టింది రాముడికి. ఇంతలో నూగు మీసమూ మొలిచింది. ఇట్టా మరో రెండేళ్ళు గడిచినయి - 'వరదడి' వయసయిపోవడంతో రాముడే - పని కొంగాడు. వంటలోని మెళకువనూ అర్థం చేసుకుండు. ఒకనాడు మామూలుగనే - వంటపని పూర్తయ్యాక- అందరికి పంపి, వెనక్కి తిరిగిండు. వరదడి దగ్గరికొచ్చి - పడుకుండు. నడిఝాము దాటుతుంటే మెళుకువ వచ్చింది. లేచి - బయటికొచ్చి, కాలుముడుచుకొని వస్తుంటే- చంచయ్యగారి కొత్తకోడలు పిల్ల పెద్దదొర గదివైపుగా వెళ్తూ కనిపించింది. ఊళ్ళోకే కొత్తపిల్ల కాపురానికి వచ్చినా - మొదటి రోజు - గడీలోనే నిద్రచేయాలి గదా! అయితే - ఇది మొదట చాలా రోజులు అంతుపట్టలేదు. అలాంటి రోజులలో వరదడు ఓ రాత్రి రాముడ్ని లేపి, 'జర ఊళ్ళోకి పోయొద్దాం పద' అన్నాడు. 'ఈడు' తలూపగానే బయలు దేరారు. 'నాసరయ్య' అనే అతని ఇంటి దగ్గరకురాగానే - ఆగమన్నాడు. ఆ ఇంట్లోకి పోయిండు. అతని కూతురును వెంట పెట్టుకొని బయటకొచ్చిండు. ముక్కు పచ్చలారని పోరి. పెద్దదయి కూడ నెలకాలేదు. బంగారు తీగలెళ్ళనుంది. రాముడుకిది సమజ్ గాలేదు. బీడులోని మోదు పువ్వూ - అడవి మల్లే గుర్తుకొచ్చినయి రాముడికి

"ఏందిది?" అడిగిండు.

ఇంతలో నాసరయ్య ఆడి పెళ్ళాం కంళ్ళు తుడుచుకుంటు, గడపలోకొచ్చిన్రు.

'పద' అన్నడు వరదడు నడుస్తూ.

గడీలోకి వచ్చిందాకా - ఆపోరీ కళ్ళు తుడుచుకుంటనే ఉన్నది.

"నువ్వు ఆగు" అన్నడు.

ఆ 'పోరి' ని దొర పడకగదిదాకా కొంచకపోయి, దాంట్లకు తోలి - వచ్చిండు వరదడు.

"ఏందిది?" అడిగిండు రాముడు ఆగబట్టలేక.

'ఏముందిరా! ఈడ ఎవతి పెద్దదయినా - కాపురానికొచ్చినా - మొదటిరాత్రి గడీలో నిద్ర చేయాల్సిందేరా!' అన్నడు.

అదేదో కొద్దిగ సమజయినట్టుగ అనిపించింది రాముడికి.

అయితే 'ఈ గడి' లో ఇంకా చానా తెలవాలన్న మాట' అనుకున్నడు.

ఇట్టనే రాముడి వంటికి సరింగ ఇరవై ఏళ్లువచ్చినయి.

అప్పుడప్పుడు గడీల ఆడపాపలు, సరసమాడతంటే వాంళ్ళను తాకాలని, వయసు వగరు చూడాలనీ - అనిపించసాగింది.

రాత్రిపూట గాజుల చప్పుడు ఇనపడితే ఆ పొద్దు నిద్రపట్టేది కాదు.

రోజులిట్ట గడుస్తుండగ, ఒకనాడు ఓ కొత్త 'పోరి'ని పెద్దదయిందని 'గడీ'లోకి పట్టుకొచ్చినారు. కొబ్బరి లవుజు లెక్కన అనిపించింది చూసెటందుకు.

ఇట్టవచ్చినోళ్ళను తెల్లారకముందే ఇంళ్ళకు పంపుతరుగద. అప్పటిదాకా నిద్ర పట్టలేదు రాముడికి.

అది బయటకొచ్చినంక కిందికి రాంగనే వాటేసుకుండు రాముడు.

అది అరవబోయింది. కాని -

రాముడి వయసూ - వగరూ చూసి ఆగింది.

తెల్లారుతుండగా - ఎల్లిపోయింది.

ఈ సంగతి వరదడికెట్ట తెలిసిందోగనీ - రాముణ్ణి మందలించిండు.

'అనే! పోరడా! ఈ గడీలోనే నిన్ను మతలబు లేకుండ పాతిపెడతరు. పిచ్చిశకలు చెయ్యకు. నిఖార్సుగ ఉండు. ఊఁ!' అని.

అది మొదలు జాగ్రత్తపడ్డాడు రాముడు.

ఆ రాత్రి వరదడు పడుకున్నప్పుడు 'ఇగో! రాముడూ! ఎన్ని చిల్లర తిళ్ళు తిన్నా ఇంటి భోజనం మీదికి రాదురా! అందుచేత ఈ తిప్పలు పడక, ఓ మంచి పోరిని జూసి లగ్గమాడు' అన్నడు.

'ఇది బాగానే ఉండది' అనిపించింది రాముడికి పైగా - చక్కలిగిలిలా అనిపించి వల్లు వేడెక్కింది. ఇదిట్ట ఉండంగనే పెద్దొర మనస్సులోకొచ్చి - గుండె అబుక్కుమన్నది. 'ఈడ ఎవడు మనువాడినా - వచ్చిన పోరిని - మొదటినాడే - గడీలోకి పంపాలిగదా! అమ్మో! పెళ్ళొద్దు పెటాకులొద్దు' అనుకుని గట్టిగ కంళ్ళు మూసుకున్నడు.

నిద్రపట్టింది. మళ్లీ వరదడు లేపిందాకా సోయేలేదు.

ఒకనాడు పెద్దదొర వళ్ళు పడతాంటే - 'రాముడూ! బెండముదిరినా - వయస్సు ముదిరినా - నాభం లేదంటారు గనీ - మీ అయ్యతో జెప్పి - మంచిపోరిని జూడమను. ఈ ఎండల్ల లగ్గం జేసుకుందువు' అన్నాడు.

తలూపిండు రాముడు.

ఊపుతూనే - ఓరగా దొరముఖంవైపు చూసిండు.

తోడేలులా అనిపించిండు.

అయినోళ్ళ మామూలుగా ఆరగించడం తోడేలుకు అలవాటు.

కూసింత భయం అనిపించింది కూడ.

గబగబ, వంట ఇంటివైపుగా నడిచిండు.

వరదడు కనపడతాడేమోనని చూసిండు లేదు.

ఇంతలో, 'దొరసాని రమ్మన్నది' అని ఓ ఆడపాప వచ్చింది.

పైకి పోయిండు.

దొరసాని ఒక్కతే వుంది.

'ఇట్రా!' అంది.

దాపుకొచ్చిండు.

'ఒళ్ళు బాగ పడతవట' అంది - ఆబగా చూస్తూ.

తలూపిండు రాముడు.

'ఆడాళ్ళకు కూడా పడతావా?' అంది నవ్వుతూ.

వంచిన తల ఎత్తలేదు రాముడు.

'ఆదివారం తలంట్లున్నాయి. తెల్లారగట్ల వచ్చేయ్ పో" అంది. తల ఊపి -వెనక్కి తిరిగిండు. గుండెమాత్రం గుబగుబ మంది.

* * *

మళ్ళీ ఆదివారం భగవంతుడి దయవల్ల దొరసాని 'వారగ' ఉండటాన రాముడికి పిలుపు రాలేదు.

ఎప్పుడేందోనని రాముడికి ఆ దినమల్ల చానా గుబులయింది.

పొద్దెట్ట గూకిందో - ఎట్ట పొడిసిందో గూడ అంతుపట్టలేదు.

'అరే! రాముడూ! మీ అయ్య వచ్చిండు' అన్నాడు వరదడు.

'ఏడి?' అన్నడు ఆత్రంగ -

'లోన గూకున్నడు పో' -అని బర్ల దొడ్డేపు జూపిండు.

అటు పరుగెత్తిండు రాముడు. అయ్య కనపడంగనే ఎందుకోగాని - ఏడుపొచ్చింది. దాపుకి చేరి 'అయ్యా! అంత బాగున్నరావె! అమ్మ సైసుగుంది గద!" అంటూ అయ్య వళ్ళంత తడిమిండు.

'నువ్వెట్ట ఉండవు బిడ్డా! కొలువు బాగుందా?' అన్నడు అయ్య. కండ్లతో కళ్ళు వత్తుకుంటూ... కూసేపాగి - 'అరె అయ్యా! మీ అమ్మ నిన్ను కలవరిస్తన్నదిరా! దొరనడిగి ఓ సారి రారా!" అన్నడు.

'వస్తనే ! ఎందుకు రాను. నాకూ కళ్ళబడతంది.'

'ఇదిగో రాముడూ! ఇట్టగూకో!' అని - 'అయ్యా! నీకు లగ్గం జేసుకునే వయసొచ్చిందిరా! మీ అమ్మేమో - వాంళ్ళ అన్న బిడ్డ రత్తాలును కోడలుగ జేసుకుంటే బాగనుకుంటండిది '- అన్నడు.

'అయితే ఈకొలువు మానుకుంటనయ్యా!' అన్నడు రాముడు.

వాడి మొఖంల దిగులు కనపడ్డది - భయం బయటకొచ్చింది.

'అదేందిర బిడ్డా! కొలువు మానుకుంటనంటవేంది?' అన్నడు - పోరడి వాలకం అర్థం కాక.

'అది అంతేనే! నీకు తెలీదు' అన్నాడు రాముడు.

'బంగారంలాంటి కొలువురా ఇది - బయట బతుకుతేరువేడ వుంది. చలకల్ల ఆముదాలేస్తిమా? అవి దుప్పట్లకి వచ్చేటట్టు లెవ్వు. పండితే ఇంటివాడకానికే సరిపోతయి. పనిచేద్దమంటే - అదీ లేదు - అసలే రెండేళ్ళలో - పరదగూడేసిన జాడలేదు. తాగిటందుకు కూడ నీళ్ళు లెవ్వు' అన్నడు.

'అయ్యా! నేను దొరనడిగి ఇంటికొస్తలే. అప్పుడు జెప్త. ఈడెందుకు? అని పనిలో కెళ్ళిండు రాముడు.

ఆ పొద్దుండి - దొర కనపడినంక ఓమొక్కేసి - ఎల్లిపోయిండు సరవడు.

మనువాడాలనే, కోరిక, కొరివిదయ్యంలా పెరుగుతోంది రాముడిలో - అయితే - మనువాడిన 'పోరి' ని గడీలోకి పంపాలిగదా! ఇదెట్టా? అనేది తేలక సతమతమై పోయిండు. ఒక్కోనాడు రేత్రి కన్ను మలగడం గగనమైపోయింది. కూర్చోవయిలు గాదు - పండుకోలేడు.

మరీ అయాళ్ళ నిద్ర - మాయమైంది. టండ్ టండ్ పళ్ళుతీపులని పిచ్చి - బయటకొచ్చి కూకుండు. కునుకు ఎప్పుడొస్తే - అప్పుడుపోయి కునకొచ్చని వాడి ఆశ. అక్కడా కూకోబుద్ధికాక - కరివేపాకు చెట్టుకెల్లిపోయి చతికిల పడ్డడు. కూసేపాగినంక ఎనక అడుగుల సప్పిడయింది. ఉలిక్కిపడి చూసిండు. రాచమ్మ కనపడ్డది. ఇది చిన్నదొర సానితాన ఉండే ఆడపాప.

రాచమ్మ నడికారు మనిషి. కాకపోతే నడిపట్టున - చిన్న దొరసానింట ఉంటది గనుక నాజూకుగ ఉన్నట్లనిపిస్తది. గట్టి వరసమనిషి. పిడిరాయి లెక్కన తిరుగాడు తుంటది. మొఖంలో కవ్వింపు ఉంటది. మాటతీరులో - లాలింపు కనిపిస్తది. వంట్లో కోరికల బుస వినిపిస్తది. వయస్సునొదిలేసి - దగ్గరకు నడవ బుద్ధవుతది. దాని పెదవులపైన అరకొరగా ఉండే చిరునవ్వు ముద్ర మాత్రం - లోకం తల్లకిందులయినా చెరగదు.

'చిన్నమ్మగారు పిలుస్తన్నరు' అంది దాపుకొచ్చి. ఉలిక్కిపడి - 'ఏటట?' అన్నడు రాముడు.

నవ్వింది రాచమ్మ.

"ఏందా నవ్వు?'

'నువ్వనేది ఇన్నంక నవ్వాలో ఏడవాలో తెల్సిచావక నవ్వినట్లున్నాను' అని ఓసారి చేరిపార జూసి 'ఈ గడీలో – పెద్దోళ్ళు పిల్సినంక – 'ఏంటి?' అని అడగకూడదు. వినాల్సిందే! గదికూడా తెలీకపోయినే అని నవ్విన' అన్నది.

'ఏడ ఉంది?'

'ఏడ ఉంటది? ఆ యమ్మ కమరలోనే ఉన్నది.'

'నేను బయట రికాగా ఉండడం చూసిందా ఏం?' అనడిగిండు రాచమ్మను.

'తెలీదు.'

'అయితే – అంగి తగిలించుకొని వస్త– పద' అని లోనకెళ్ళి – చిలక్కొయ్యన ఉన్న చొక్కా తగిలించుకొని – సీదా చిన్నమ్మ కమర దగ్గరకెళ్లిండు.

తలుపులు బార్లగ తీసే ఉన్నయి.

అక్కడనే ఆగి – లోనకు తొంగి చూసిండు.

మనుషులున్న అలికిడి – అంతగా కనిపించలేదు.

గడప బయటనుంచే తల వంచుకొని 'నేను రాముణ్ణి దొరసానీ! తమరు కబురెట్టిరట' అన్నడు.

'రా!' అంది చిన్నమ్మ.

గడపదాటి లోనకు అడుగేసిండు.

అక్కడదాకా వెంటవచ్చిన రాచమ్మ చుట్టూరా గమనించినా కనిపించలేదు. బెదురుగా మాటవినిపించిన వైపు అడుగులేసాడు. మబ్బుల్లో మెరుపులా ఎదురొస్తూ కనిపించింది చిన్నమ్మ.

రవిక దండెం మీద వేసి వస్తున్నట్టుంది. – చీర చెరగు జారి చేతిపైనవుంది. వయసు వగరూ, కంళ్ళకైపూ, పచ్చటి పసుపుచాయ వళ్ళూ,– ఆవిడ పైనుంచి చూపులను మరల్చుకోవాలన్నా – పినక మొరాయించినయి. దగ్గరవుతున్న కొద్దీ – తల దించుకొన్నాడు కష్టంగా – తల పోతుందనే భయంతో – 'ఇటూ –ఇట్రా!' అంది. ఆవిడ కంఠంలో మాలావు నాజూకుతనం వినిపించింది. ఇంకా దగ్గిరగా నడిచాడు. ఇప్పుడు రాముడు తల పూర్తిగా దించుకున్నా – చిన్నమ్మ బంగారురంగు పాదాలు కనిపిస్తూనే ఉన్నాయి. పాదాలకున్న నగిషీ పట్టాలూ, వంకి మెట్టెలూ, ఇంకా దగ్గరకు రమ్మంటున్నాయి. ఈలోపు చిన్నమ్మ చీరను కూడా, దండెంపైకి విసరి – రాముడి దిశగా జరిగి – అమాంతం వాటేసుకుంది – బిత్తరపోయాడు రాముడు.

చిన్నమ్మనుంచి విడిపోవాలని ప్రయత్నించాడు. కానీ ఆ ప్రయత్నం ఫలించక ముందే ముఖం ముద్దులతో నిండి తడిసిపోయింది. పైగా ఆవిడ మెత్తదనాలు – ఎటూ అంతగా చొరవ చూపనివ్వలేదు. ఈ లోపు తీగలా అల్లుకొని – కదలనివ్వలేదు ఓ క్షణం. రాముడికి లోలోన ఎంత చావు భయం ఉన్నా – బయటపడి పారిపోవాలనే ప్రయత్నం ఉన్నా – శరీరం మాత్రం – మాట వినలేదు. ఆవిడ పలికించిన

పలుకుబడిలోనే జారిపోయింది. మెల్లిగా మంచం దాకా లాక్కెళ్లి – మీదకు జరుపుకుంటూ వాలిపోయింది. పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటంలా ఉన్నా – చిన్నమ్మ పట్టుకు, గోరెంకలా పక్కలోకి జారి ఒదిగిపోయాడు. తెల్లారు ఝామునెప్పుడోగాని వదల్లేదు. లేచి, చిన్నమ్మకు రోజుటిలా మొక్కేసాడు 'ఇకపోతా' నన్నట్టు.

'ఒక్కసారి ఇటురా రాముడూ' అని ఒళ్లు విరుచుకుంటూ పిలిచి మీదపడి వాటేసుకుని – గట్టిగా ముద్దెట్టి – 'ఇకపో' అంది.

శరీరం వద్దనుకుంటూనే బోలెడు సుఖాన్ని అనుభవించింది గనుక – రాముడికి మాలావు అలుపు కల్గింది – చిన్నమ్మ పొందులోని సుతి మెత్తదనాలూ – కదలికల లోని కవ్వింపూ – అంత తొందరగా మనస్సుని వదలలేదు. ఈ ఆలోచనల హోరు తెగకముందే – తెల్లగా తెల్లారిపోయింది. ఎప్పుడెట్టా చచ్చినా – ఎట్టా పుట్టినా – ఈ తెల్లారడం మాత్రం ఆగదు. మన బాధలతో, మన వ్యధలతో – ముంచి చెదులతో మాత్రం దానికి సంబంధం లేదు. క్రమం తప్పక తిరగడం మాత్రమే తెల్సు –

ఈ వరవడి, ఎటు దారితీస్తదోనని పిరికిబారి పోయాడు రాముడు.

అయితే –

అకస్మాత్తుగా నాల్గోనాడు చిన్నమ్మ తాళిగట్టిన మగడు వచ్చాడు.

ఒకటి రెండు రోజులుండి ఇక్కడ గడీల ఉన్న ఆడపాపలతో కుషీచేసి పెంళ్ళాన్నెంట పెట్టుకుని వెళ్ళిపోయాడు. రాముడి మనస్సు తేలిక పడింది.

ఇట్ట కాలం గడుస్తుండగనే – రాజులోరి కోడలు బావిలపడి ప్రాణం తీసుకుంది. 'ఏందిది?' అని అడిగినోడు లేడు. పోలీసు పటేలు అసలేమి ఎరగనట్టే ఉన్నాడు. సాయంత్రానికి పీనుగను గొంచకపోయి – పూడ్చి పారేశారు. – పాపం ఆ 'పోరి' ఎందుకు పోయిందో కళ్ళారా జూసిన రాముడికి గుండె ఆగలేదు.

ఇంతలో ఎండలొచ్చినయి.

ఇంటికి పోయొత్తానని పెద్దొరకు జెప్పిండు రాముడు.

'రేపు పోదువులే' అన్నడుదొర.

తలూపి వంట కమరేపు నడచిండు.

ఆ రాత్రి సోరిదయ్య ఈడేరిన 'పోరి' నెంటబెట్టుకుని అపరాత్రి గడీల కొచ్చిండు.

'ఓరదీ?' అని అడిగిండు వరదడు జొరంల ఉండి.

"నేను వరదా! సోరిదయ్యని' అన్నాడు.

'ఎవరా పోరి? నిన్ను పట్రమ్మనాడా దొర?' అనడిగిండు.

'నా బిడ్డేరా! పెద్దదయింది గద! గడీలోకి పంపాలగద' అన్నాడు.

అవాక్కయిపోయిండు వరదడు – రాముడికి మతిపోయింది.

'పెద్దొర గది దనక నేతోలలేనురా వరదా! అల్లుడుతో పంపాల్సిన కన్న పేగును – కటికోడికి పెట్టయ్యంటావా? ఈ చేతులెందుకిరిగి పోలేదంటవు?' అని కళ్ళు వత్తుకొని ఎల్లిపోయిండు.

దొర గది దనక - పోరిని తీస్కపోయిండు రాముడు.

దొర ఆడపాప సుక్కీతో సొక్కిపోతండు - ఆరు బయట.

'దొరా! సోరిదయ్య పోరి వచ్చింది' అన్నాడు రాముడు తలవంచుకొని.

'అట్టనా?' అని సుక్కి మీంచి లేచి - దీని తానకొచ్చి - సంతల పశువును జూసినట్టు జూసి - 'బొమ్మలెక్కున్నావు - దా' అని లోనకు ఈడ్చుకపోయిండు.

సుక్కేమో ఊడబెరికిన బట్ట గుడ్డల్ని ఏరుకొని - వంటికి చుట్టుకొని - కిందికి నడిచింది.

ఊరికి చేరేసరికి - రాముడికి లగ్గం కుదిర్చి పెట్టింది వాళ్ళ అమ్మ.

పోరిని జూసిండు. ముద్దబంతి పూవు లెఖ్ఖన కనపడ్డది. అడవిలోని మోదుగు పువ్వోలె - కొట్టొచ్చినట్టు గనిపించింది. అందుకే - గుడికాడ మనువాడిండు.

మూడు దినాల పెంళ్ళి సందడి కాంగానే - కొలువుకు బయలదేరిండు.

గడీ కెళ్ళినంక ఆ రాత్రి వరదడితో చెప్పిండు రాముడు.

'ఎవడికీ చెప్పకుండా లగ్గం జేసుకున్న వేందిరా! పిచ్చివెధవా!' అన్నాడు వరద - ఆడి కళ్ళల్లో సంతోసం కనిపించింది.

పెద్దొర అడిగిండొకనాడు.

తలూపిండు రాముడు తలదించుకునే.

'కాపరాని కీడకెప్పుడొస్తదేంటి?' అన్నాడు దొర.

మాటాడలేదు రాముడు. కానీ - దొర మాటలలోని అర్థం, భయమనిపించి, ఎట్టాగో అయిపోయి ఉడికిపోయిండు.

ఒక్కటే ఏటుకు ముత్యాలమ్మ దగ్గర దున్నను నరికినట్టు - దొర తలను నరికితే బాగు అనిపించింది.

తలెత్తి పెద్దొర మొఖంలోకి చూడాలనిపించింది.

ఎందుకోగాని తమాయించకొన్నాడు - పై కెగసిన కోపాన్ని.

'ఇకపో' అన్నదాకా అక్కడే ఉండి. వరదడి దగ్గరకెళ్ళాడు.

అది మొదలు -

రాముడికి కన్ను మలగలేదు.

మనసాగనూ లేదు.

తిండి సయించలేదు.

కుదురుగ కూర్చోలేకపోయిండు.

ఒక్కటే ఆలోచన -

పిచ్చి లేస్తదేమోనని భయం, గుబులూ కల్గినయి.

మనుగుడుపు కాంగానే - పోరి కాపరాని కొస్తది గదా! అంటే?

ఈడికొచ్చిన రాత్రి - గడీలో కంపాలి గదా!

మరి అట్లాంటి బతుకు బతక్కపోతే ఏం?

మరెట్ట???

తోచలేదు -

కానీ -

తల పగిలేలా - ఆలోచనల సుళ్ళు - వదలకుండా తిరిగాడుతూనే ఉండయి.

ఇయ్యట్ట ఉండంగనే - మనుగుడుపు అయింది

'పోరిని ఎంట బెట్టుకొని వచ్చి ఏం చెయ్యాల? అనుకుంటుండగ - బయటుండే రోజులు దగ్గరున్నాయని - ఆనక పంపుతామని అనడంతో ఒక్కడే - గడీకి చేరిపోవాల్సి వచ్చింది.

ఈలోపున ఒక పొద్దు - పెద్దొర 'పసిడి ముద్ద లెఖ్ఖన ఉంటదట గదరా నువ్వు కట్టుకున్నది' అని అడిగిండు గరగర నవ్వుతూ.

ఇది ఇన్నాక - రాముడి ప్రాణం ఎటో లేచిపోయింది.

ఎంత తమాయించుకుందామన్నా - గుండె ఆపలేదు.

ఇక రేపే - అది వచ్చేడిది.

'ఎట్ట?'

'ఏందిమార్గం?'

'ఈడికి పోరి చేరినంక ఇంక చేసేడిదేముంటది?'

తల పోటెత్తి పోయింది.

పిచ్చోడి లెఖ్ఖనయిండు.

అయితే దొర కోసం గొంళ్ళ బుచ్చన తాటికల్లు, సందున పెట్టి పోవడం కళ్ళబడ్డది. రక్కున మెదడు పనిజేసింది - చచ్చేంత ఫికరూ వచ్చింది.

'అమ్మో' అనుకున్నాడు కానీ - తెల్లారితే పోరి వస్తది గద? అప్పుడెట్ట?

అంతే!

ధైర్యం చేసిండు - గుండో బండ చేసుకొని.

మాపటేళ్ళ - కల్లు ముంతను పైకి లేపిండు దొర -మసాల చేప ముక్కలు నంజుకున్నడు. పూర తాగి గడీలోకి నడిచిండు. మధ్యన తూలిండు. పక్కనున్న పోచమ్మ అడ్డుపడింది - దాని మోపున్నే మంచం చేరిండు.

పెద్దొర పక్కలోకి గినక పిలుస్తడేమోనని కాసేపు ఆగింది పోచమ్మ.

ఉలుకు పలుకూ కనపడలే దొరలో.

'అక్కరుంటే చూద్దంలే' అనుకొని బయటకొచ్చింది.

మరీ ఎట్టంగ పొద్దు పొడించిందావేళ్ళ. పొద్దుతో పాటు గడీ అంతా ఘొల్లు మంటూ కనపడ్డది - ఏందని వాకబు చేస్తే పెద్దొర పోయిండన్నారు. వరదడీమాట విని లగెత్తిండు పడుతూ లేస్తూ.

నిజంగా పెద్దొర చచ్చినందుకు రాముడికి బోలెడు సంతోషమయింది. అయినా నల్గురుతోపాటు దొర పాడితాన కెల్లి - జనంలో కల్సి కాసేపు ఏడిసిండు - ఆ రాత్రి వరకు దొరక గొంచకపోయి తగలేసారు.

రాముడు - ఆలి. అదే పూట కొత్త బట్టలతో గడీలోకొచ్చింది

అదే గడీలో - ఓ పక్కన ఏడుపు మొత్తుకోళ్ళతో ఉంటే - మరో పక్కన తాళికట్టిన పోరితో బేఫికరుగ గడిపిండు రాముడు.

ఇక గడీనుండి ఏ పోరికీ పిలుపు రాదు.

ఊరి పొర్ల పాలిట శని - నడిచిపోయింది.

ఆ మర్నాడు - తెల్లారినంక - ఇంత తిని - సీద పోలీసు రాణాకు పోయిండు రాముడు.

యస్.ఐ. ఎదురుంగ నిల్చున్నడు - 'దొరా!' అంటూ.

'ఏంది రాముడూ! ఇట్ట వస్తివి?' అడిగిండు యస్.ఐ.

'మాపెద్దొరని చంపింది నేనే దొరా! కల్లు ముంతల విషం కలపిన' అన్నాడు.

ఉలిక్కిపడి లేచి పరేషాన్‌గ కుర్చీ దిగి - 'నీకేమైన తిక్కగుందర బే' అని గదిమిండు.

లేదన్నట్టు తల ఊపిండు - రాముడు.

'మరి ఎందుకు చంపినవుర బిడ్డా! గదయిన జెప్పు?' అన్నాడు నెమ్మదిగా.

'దొరా! ఊళ్ళ కే పెంళ్ళి పిల్లొచ్చినా - ఊళ్ళో పెద్దదయినా - ఆ పొద్దున్నే గడీకి రావాల్సిందే - మొదటి నిద్రగడీలోనే. ఇది ఆ గడీల ఉన్న ఆనవాయితీ. నిన్న నా పెళ్ళి పిల్ల కాపురానికొచ్చెడి దినం - అంటే దాన్నీ గడీకి పంపాల గదా! అందుకే తెగబడి గుండె బండ జేసుకొని - ఇట్ట జేసిన' అన్నాడు.

రాముడి నిజాయితీకి ముచ్చటేసింది. ఆడు పడ్డ క్షోభ సమజయింది.

రాముడిపట్ల సానుభూతి, జాలీకల్గింది.

'నోర్ముసుకొని ఎనక్కిపో! ఈ మాట ఏడ్నన్న అంటివో చంపుత' అని గదిమిండు. రాముడు బిత్తరపోయిండు. అర్థంకానట్టు చూసిండు.

నవ్వు రాకున్నా నవ్విండు. ఎనక్కి మళ్ళిండు. ఎలుతురు కళ్ళబడింది. గా వెలుగున టేషను మెట్లు దిగిండు.

● 1973 ●

# 38. యెలుగు మింగిన శీకటి

♦ దేవరాజు మహారాజు ♦

సరింగ రొండు జాములకు అయిలయ్య, ఆనిపెండ్లం సత్తెమ్మ, పెద్ద కొడుకు పోశాలు కలిసి పెరట్ల గోడ గడ్తాండ్రు. గా ఒక్క గోడ గడితె ఆల్లకది యింకో అర్రయితది. గింత గింజ గిరువు వోసుకుంటందుకు, ఎవుసం సామాన్లు బెట్టుకుంటందుకు అయిద్దని నాలుగైదు రోజుల సంది కట్టుకం మొదల్జేశిండ్రు. అయిలయ్య గోడ సొకంజూసుకుంట కూని రాగం దీస్తాండు. "ఏటికి యాతం బెట్టి ఎయ్యిపుట్లు పండిస్తే ఎన్నడొక మెతుకెరుగం నన్నా, గంజిలొక మెతుకెరుగననా, నా యాతెమెప్పుడు దీరునన్నా..."

"ఆc సాల్ సాల్ పనిగానియ్ మోగిప్పుడే పదాలు సురూజేస్తివి పొందుగ గూసోని? నా కీడ నిలవడి నిలవడి ఒల్లు దిర్గుతాంది. పానం కులాసలేక..." యాష్ట కొచ్చింది సత్తెమ్మ.

సత్తెమ్మ కోపానికొత్తె, అయిలయ్య మన్సుల నగిండు. ఇంతక జెర్ర దిల్లగి జేద్దామనుకున్నడు.

అచ్చం ఆడిబట్లోనో నోరు దిప్పుకుంట "ఏందేయ్ ఒల్లుబాగ లేకుంటే మందు దింటనే ఉంటివి. కల్లుగిన దాగినవేమో ఒల్లు దిర్గుతాంది –

మందు దింటున్నాను మొగడో మంది దింటున్న.

మందు పత్తెం దీరెదాక మందలియ్యాకు

మడత రొట్టెలు పొంగె కల్లు

వూరిమీది కోడిపిల్లలు మందుదింటున్న.

అరుశేర్ల అరిసెంత పప్పు

నానబోసి గారెల్జేసి మందుదింటున్న..."

అయిలయ్య పాటకు సత్తెమ్మ మొకమంత, మాడు శెక్కోలే జేసుకున్నది పోశాలుకు అయ్యపాట ఇశిత్రమనిస్తాంది. అయిలయ్య కుశయిండు. ఊటగా పదం మల్లందు కున్నడు.

"నాసబోసి గారెల్జేశి

మందుదింటున్నాను మొగడో మందు దింటున్న.

పోరి కొక్కాటియ్యలేదు పొరనీకి ఇయ్యలేదు,
కక్కుకుంటా ఒక్కదాన్నే మెక్కి తింటీని
గొర్రె కూర వొండుకొని మర్రికింద కూసోని,
మంచి కుండకల్లుతోని మందు దింటున్నా.."

అయిలయ్య పదం పురాగ్గాక ముందె సత్తెమ్మ తిట్టుడు సురూజేసింది.

"ఛ. పరాశ్కపోనోలె ఎంత చక్కని పదం బాడవడ్తివి? సొక్కనయ్య. ఎన్కటి ముందట్కి ఎన్నడో గొర్రెకూర కల్లుకుండ దెచ్చిపెట్టినట్టు పాడ్తానవ్. ఏమన్న శరమున్నాది? నీయవ్వ పంచిచ్చిందా? నీ యన్న పంచిచ్చిండా? పెయి మీది కట్టు బట్టతో నెల్లగొడ్తె కష్టం జేస్కోని, శెమటబోసి యింతయిల్లు - వాకిలి జేసుకున్న ముందట్నించి గట్టదినే దాన్నయితే నువ్వు ఇయ్యాల్లటికి బుడ్డగోశి బెట్కోని యాడవోదువో సన్నాసులల్ల..." సత్తెమ్మ అయిలయ్య మీదికి ఎగవడ్డది. మొన్నటి దాక పండి పండి జెరంతోని, లేశి పన్జేత్తున్నా యింత యిదిలేదు. ఎక్కడ దిక్కుమాలినోనివో నాగండానికి దొర్కినవ్-" ఎగవడుడంత ఏడ్పయిపోయింది.. సత్తెమ్మ యేడ్పు సూశి అయిలయ్య మన్సు నీల్లయ్యింది.

"ఎహె ఏడ్వకు. నీయవ్వ. నేనేదో గమ్మత్కంటి - నివొద్గినె ఏడుస్త దేందిరా నీయవ్వ?-" పోశాల్ను సూసుకుంట అన్నడు అయిలయ్య. సత్తెమ్మను ఇగ ఏమనొద్దు. అంటనుకున్నాడు. సత్తెమ్మ లోపల్లోపట గునుస్తనే ఉంది. 'నడీడు రాబట్టి పదాలు మానడాయె, సరసం మానడాయె - అన్కోని పదం యాజ్జేసుకుని 'నీ పదంకునా బారేద్దు. యా ట్టేర్శిండో కన్నిద్దెల మారోడు' అనుకుంది.

ఎండేమో మా వూటగ గొడ్తాంది. కండల్గరిగి శెయటయేటట్టు. ఇగ సత్తెమ్మ పెయ్యి బాగలేదు. గా మొన్న పేటకుబోయి డాక్సరు తాన సూదుల్దీస్కో నొచ్చింది. జెర్ర నయమైంది నిన్నియ్యాల్ల.

పోశాలేమో మన్ను కశ్శె పిశ్శె తొక్కి వొంగి పారతోని మన్ను గుంజి యిస్తాండు. శేత గాకున్న. శేశెటోల్లెవ్వల్లేరని - మన్నందు కోని ముద్దల్జేసి గోడమీద మొగన్ని యిశిరేస్తాంది సత్తెమ్మ. అయిలయ్య మన్ను తోడెం తోడెం దీసుకుంట, సర్సు కుంట గోడ పొందు వెడ్తాండు "బుచ్చాలాడ వోయింది? జెర బిలువ్. పసుల నిద్వాల్నాయె. పొద్దొంగ బట్టె, ఈడనేమె పని గాక పోతుండె" అంటన్నడు అయిలయ్య.

'ముదనష్టప్పోరి ఏడవోయిందో ఏమోc నోరంత బోంగ బిల్సినారాదు." అని అన్కుంటనే బిల్సింది సత్తెమ్మ. "బుచ్చాలూ... ఓ బుచ్చాలూ... ఏడ సచ్చినవే నీ మీద మన్ను వడ! ఎదిగిన బిడ్డవున్నట్టేగని గీడున్న పుల్లగాడవెడ్త దంటని ఆశ లేకపాయె- అన్కుంట తిడ్తనే వుంది.

బుచ్చాలు యాణ్ణించో ఉర్కొచ్చింది. బుచ్చాలుకు బుగులయింది. అయ్యేతే గోడ దిగి రాడుగని, అవ్వగిన కొడతదేమోనని...గింతసేపు ఓనమోల్లింట్ల ఓన గుంట లాడొచ్చినందుకు.

సత్తెమ్మ పని మీదుండె గాబట్టె జంగలి మాటలు దిట్టి ఊరుకుంది. కని, కొట్టలే - గంతే సాలనుకుంది బుచ్చి.

"గా దొడ్లకు బోయి గొడ్ల నిడ్వు పో. జెర మేత మేస్తయ్ " కోపం దీరినంక అన్నది సత్తెమ్మ.

దొడ్డి యాణ్ణో లేదు. యింటి కాడ్డించి పదడుగులేస్తే గదే - దొడ్డైశాన పసురం వుంది గని ఆయన్ని వీండ్లయి గావు. పైళ్ళీర సామియి, జట్ట లచ్మిగాసియి, గుండె బోయిన మైసయ్యయి, నామాల యాది రెడ్డియి, కుకునూరి అనుచాండ్లయి అందరియి గల్సున్నయ్.

సుక్కలావు, పిల్లి కండ్ల బత్తె, పల్ల దుడ్డె, ఒంకర కొమ్మల దుస్స - గీ నాలుగే అయిలయ్యయి.

బుచ్చాలు మల్ల మాట్టాడకుండ గమ్మున ఎక్కకు దిరిగిండి అవ్వ జెప్పిన పని జేద్దామని- కని మల్ల ఒనమోలింటికే వొయి ఓన గుంట లాడ్తామని పిచ్చింది. ఆల్లింట్ల శిన్న బిడ్డ పేరు శెంద్రి. ఎన్నాట లాడ్తది? ఎన్ని పదాలు పాడ్తది? పోయి నేర్వమంటే సాలు యాష్ట లేకుండ శెప్తంది. ఇయ్యాల్ల ఆంబటాల్లప్పుడు పసందైన పదం బాడింది.

నాగ సరం బాడుకుంట

నడి బాటల కెల్లి రాంగ

నాగసరం నాదులకయ్యా నారామయ్య

నడుములో జల్‌జల్ మనెనయ్య

వద్ద నాపు - అడవిలోనె,

నీ అడుగు గురుతు బట్టి,

మొగిలి పువ్వు అనుకోనయ్య నా రామయ్య

మొక్కి వొల్లె దాసుకుంటయ్య" పదం యాదికి రాంగనె మన్సంత సల్లగయింది. రోజు వొయ్యి రోజు కో పదం నేర్వాలె - అనుకుంది బుచ్చాలు.

"ఓ పొల్లా... బుచ్చాలు..."

యింతలకే తల్లి మల్ల బిల్శినట్టుందని ఆగింది.

ఇగో మల్లగిట్ట ఎవ్వలిండ్ల పొంటన్న దిరిగేవు. జెర శెప్పినపని జెయి. మేవీడ ఎండల పన్జేస్తాంటే నీకు ఊరి మీద బడి ఎట్ల దిరుగాలనిపిస్తాందే యిన్నవా ఆ - కూతేసి నట్టు శెప్పింది సత్తెమ్మ.

"ఆఁ యిన్న యిన్న. దొడ్లకే బోతాన-" అంటని అడుగులేసింది. తల్లి మల్ల బిల్శిమాట పాబందుగ శెప్పె తలకు ఇగ ఎటూ పోబుద్ధికాలె - బుచ్చాలుకు.

నివొద్దెనె అయ్య. అవ్వ, పోశన్న ఎండల కట్ట బడ్తాండ్రు. తానేమో ఆటకు బోయింది. ముంద్గాల్నే కాలమయిత లేదు. శేశిన కట్టం గంగ పాలన్నట్టు ఏం జేశినా కడ్పు నిండ్తలేదు. ఇంట్ల ఒక్క గింజదాప్కం లేదు. ఇంక తన లగ్గం జేశెటందుకు యింట్లందరు ఎంత తిప్పలు పడ్తాండ్రో -

యింట్లెవ్వరు మంచిబట్ట గట్టరు.

"పండ్లకో అంగి పట్టిచ్చో రాదుర" అంట అయ్యంటె -"నీ యవ్వ నాకెందుకే వొల్లంత శిట శిట బుచ్చాలుకు లంగదేంద్రి-" అంటన్నడు పోశన్న. ఇగ అవ్వ పయ్యిమీద దారానికి రెండు నల్లపూసలు, పుస్తె, పోతె ఇగేమి లేదు. గ్గా మొన్న పొలం నాటు వెడ్తాంటె మట్టెలు గూడ బురదలో వొయినయి. గా శెంద్రయ్య పటేల్ పెండ్లాంకైతె గంటీలు, కత్తెర బోనీలు, దుద్దులు, కాకర్లు, తుత్తె, నాగసరం, కమ్మలు, గుండ్లు, వొడ్డాలం, పట్టగొల్సులు, కడాలు.. ఇంక శాన శాన ఉన్నయ్ గని - ఆల్లది ఉన్నోల్ల ముచ్చట, తింతాన్కి కుండల కూడే వుండదాయె. గయ్యేడొస్తయ్? గిట్ల గిట్లనే పికరు జేసుకుంట గాన్నించి బుచ్చాలు పదడుగులేశే తలికి, శెంద్రయ్య పటేల్ బాటవొంట వొయ్యేటోడు దెబ్బకు ఆగిపొయ్యిండు - బుచ్చాలు గనిపిచ్చింది! "ఓఫో పొల్ల పెద్దదయింది ఆఁ..." అని శెంద్రయ్య వూటగనే అన్నడు.

బుచ్చాలు దబ్బున మీదికి సూశింది. "అమ్మో గివీడా?" - అనుకుంది. గుండెల బుగులయింది. శక్కరొచ్చినట్టయి, పక్కకు జరిగి గోడ పొంట బాటెమ్మటి బర్రబర్ర ఉరికింది.

శెంద్రయ్యను సూశి బయపడెటందుకు, హిరన్నకశిపుని తీర్గ ఏముండడు. గని నల్లగ బక్కగ పొడుగుండడు. సీన్మల ఆడోల్ల నెత్కపొయ్యేటోనికుండే బుర్ర మీసాలు గూడలేవు. గని కండ్లెర్ర గుంటయి, గొంతుబొంగు.

బుచ్చాలు నడిశి పోతాంటె గమ్మత్తు గనిపిస్తాంది - శెంద్రయ్యకు. దాని ఒయసును దాశిపెట్ట శాతగాక నోర్లు తెర్సుకున్న సిరుగులు - గ్గా మొన్ననాత్రి పేటల దొరికిన కొత్త సరుకు బాపతుది కావాల్నలి వాలాయించి... యొల్ల వెట్టిన సంగతి యాది కొచ్చి కుశయిండు. యెంబడే నగిండు.

సప్పుడిని, అయిలయ్య ఎన్కకు సూశిండు. ఊరి సర్పంచు శెంద్రయ్య పటేలు తన దిక్కే ఒస్తాండు.

సూడంగనె సూదుల్తోటి గుండెకాయ గుచ్చినట్టయింది. గని, మల్లమీది కన్నడు "దండమయా.. ఈ యాల్లప్పుడెటో ఎల్లిండ్రు?"

'లేలే! ఎట్లేగని, ఏమాయె యింక గోడగానే లేదులే."

"యాడాయె పటేలా మొన్న సురువు జేశి కచ్చులేపంగనె ఆన పెండ్లాం ముండ వొయ్య, ఆనొచ్చి గోడంత తెర్లాయె, ఇగ ఆరాలని నిన్నూ కోని ఇయ్యాల వెడ్తాన" గోడ వెట్టుంటనే శెప్పిండు అయిలయ్య.

"సరెగని - బాయికి మోటరు పెట్టించుకుంటరా లేదా? నువ్వు మీతోటోండ్లు కూడుకోని, ఏ సంగతైంది శెప్పుండ్రి - ఇంతజాం జేస్త! మొన్నగా మన్నెం బాయికాడ మోదుగు మారిగానికి, గంద్కం గంగన్కి మంజూరు జేపిచ్చిన. లేదా నలుగుర్నడుగు. గా ఏనుగు అనుమయ్యకు పూడ్కె బావుల అప్పు ఇప్పిచ్చిన నాకేమన్న ఒస్తున్నదా? ఊల్లె సర్పంచుగిరి ఉన్న కాడ్కి అందరికి మంచిజెయ్యాలని నా ఖాయిషు. మోటరు వెట్టించు కోండ్రి జల్దిన. ఇగ పొంటె గొట్టంగ లేశి, మోటలు గొట్టుడుండదు" అన్కుంట సర్‌సర్ర ఎల్లిపోయిండు సర్పంచు.

అయిలయ్య ఆయన్దిక్కే సూశిండు సానసేపు. "పైసగల్లోన్ది రాజ్జెం.. లాబమొకని దైతె కట్టమొకడు శెయ్యాలె–" అంట గుల్గిండు అయిలయ్య.

గోడ ఇవుతల్నించి పటేల్ మాటలన్ని ఇని "ఊఁ ఎల్ల చెట్టిండు తీయ్– " సత్తెమ్మ యిసుక్కుని యిసిరేష్టం యేస్తె, మల్లపోయి అయిలయ్య ఈపుల పడ్డది. మన్ను ముద్ద.

అదిరిపడ్డడు అయిలయ్య– ఎన్కకు సూస్కోని.

ఏందేయ్ నంజమీద కోపం గుంజమీద్దీశినట్టు, నామీదేత్తివి' ముసల్తనానికి సర్ సమాద్తాన్నావ్.." గట్లనే ఏమేమో గులుక్కున్నడు అయిలయ్య. ఈపుల మన్ను దీసుకున్నడు.

పోశాలుగాడు శిన్నగ నగిండు. సత్తెమ్మ కిసుక్కుమన్నది.

గోడ వెట్కం జోరు జోరుగ అయితనే వున్నది. ఆకలి గూడ అంత జోరు అయితాంది. వాండ్లకు అంబటాల్లప్పుడు తాగిన గెంజి నాలుగు మెత్కులు అరిగి శాన సేపయింది. ఇగ సత్తెమ్మ ఈన్నించి వోతె, గట్కొండితె పొద్దీకి తినుడయితది. గని ఈపని యేడిదాడపెట్టి బొయ్యేటట్టు లేదు.

తల్లి, కొడ్కు – ఇప్పుడెండల లేరు. మెల్ల మెల్లంగ నీడ ఆల్ల మీదికి పాకొచ్చింది. గిప్పుడు సాంతం – గోడ నీడలున్నరు.

ఉన్నట్టుండి ఒకసారి ఊల్లె ఊరోల్ల లొల్లి ఎక్వయింది. గదేం లొల్లో ఏందో అయిలయ్యకు తెల్వాలె.

'వయ్యో! మంటలే. గుడిసెల్వాయెనే – అంట ఆడోల్లు, పిల్లగాల్లు మొత్తుకుంటున్న సప్పుడు యినవడి, గోడమీద కూకున్నోడల్ల దెబ్బకు నిలవడి సూశిండు. ఊరి గుడిశెలన్ని కనిపిస్తనే వున్నయ్. ఊరి నడ్మ లచ్చిగాని గుడిశె అంటుకున్నది.. ఏం ఆలోచన శెయ్యకుండ ఆత్రంగ గోడ దుంకి "ఇండ్లు గాల్తానయ్ రాండ్రి" అనుకుంట అయిలయ్య ఉరికిండు. ఉరుకంగ ఉరుకంగ తొవ్వకెదురుంగ, దమ్మిగ బోసుకుంట బిడ్డరాబట్టె – ఏంద్బిడ్డ ఏమాయెనె'

బిడ్డకు ఏద్పే గాని మాట లొస్తలేవ్–'

'పస్లనిడుద్దామనుకునే తలికి, కొట్టమంటుకున్నదే, కాల్తాంది.'

గా మాట యినంగనె అయిలయ్యకు తన బత్కు కాలినట్టనిపిచ్చింది – గుండె కాలింది. ఉరికిండు ఊల్లె మందిని పిల్సుకుంట. గుంపులు గుంపులుగ వొయింద్రు.

మొగోల్లు వూల్లె తక్వమందున్రు. పొద్దుగాల శెల్కల పొంటి పొయినోల్లు యింక రాలె! ఉన్నోలయితె కుండలు బిందెలు దెచ్చిన్రు బాయికాడ్కి.

పూరి గుడిసెలు గాబట్టి మంటలు బాగా లేశినయ్. అటు యిటు అన్ని గుడిసెలకు అంటుకున్నయి – మంటలు మొగుల్ను తాకెటట్టు. ఆడోల్లు నీల్ శేదుతాండ్రు. మొగోల్లు సల్తనే వుండ్రు.

శెంద్రయ్య పటేలురు కొచ్చిండు. పటేలుది మిద్దె. దాని సుట్టు ఇంకో ఇర్వయిండ్లోల్లయి గూనయి. గవన్నిగటు గడ్డకు అలగున్నయ్, అయ్యి వోంగ గీ గుడిశెలన్ని గాలెటట్టున్నయ్.

"పొయింద్రి. . పొయింద్రి.. ఓరి కొరిమిగా నువ్వందోన్ని దబ దబ శేదరాదుర.. బుగులు వడకుండ్రి నేనున్న గద. ఊరుమంచి కోసానికి ఏమైన జేస్త. గిప్పుడే యాదగిర్ని సైకిల్ మీద పేటకు దోల్న. పైరింజనొస్తాండొచ్చు. ఆ నీల్ల కారోల్లు ఒచ్చేదాక కష్టపడి బడాయించుకుంటుండాలె! పోయింద్రి – శాన్తాల్లు దెచ్చి పక్కపొన చేదుర్రి. గిర్క మీంచె అంటె ఎన్నడు గావలె? శేదిపొయింద్రి... పొయ్యింద్రి..." గట్టిగ అరుస్తాండు.

సూస్త సూస్తనే అందరొచ్చిండ్రు. సల్లార్పు తాండ్రు. గని ఎంతకేమయతది? గటు గెడ్డాములాయె, సొప్పాములాయె. నీల్లు దెచ్చి సల్లెదాకుంటాయి? బస్సున కాలిపోతానయి. గిటు గుడిసెలక్కప్పింది గూడ తాటాకులాయె.

ముసలోల్లను శిన్న పిల్లల్ను ఎత్కవోయి దూరం ఏశి ఒస్తాండ్రు ఒయిసోల్లు. గా గొల్ల మల్లేశంవోల్ల పోరడు!! సామిగాని పెండ్లాంమీద కాలెడ్డి మొద్దు వడ్డదంట జబ్బమీద.. వాత ఆటంగ వడ్డది. ఇగ గాసాలె బాలిగానింట్ల గట్లనే అయ్యింది.. బంటు జమాల్ గానియిల్లంత యేడికాడికి కాలి కూలింది. ఏదో కొద్దిల సావులు తప్పినయి. వాండ్ల వాండ్లు ఎవలూ సావలె.

గూడ ఎవ్వలు గూడ, గదెవ్వనిల్లు అని సోంచాయిస్తలేరు. ఇంత వరకు వాల్ల వాల్ల నడ్మ శిన్న శిన్న జగడాలు అయినా గని –అన్ని మర్శి ఆపతి కాలంల గిప్పుడయితే కల్శి నీల్లు వోస్తాండ్రు

అయిలయ్యుండె గుడిశె గూడ మంటల్తోటి నగుతాంది. అది సూశిన అయిలయ్య, సత్తెమ్మల పానాలు మసైనయ్. అయిలయ్య, పోశాలు.. ఇల్లు వాండ్లందరు, ఊల్లె వాండ్లు కొందరు నీల్లు వోస్తనే వున్నరు. అందకుంట మంటలురుకుతనే ఉన్నయి – ఊరు ఊరంత లొల్లి... దేసంల అన్ని జాగలల్ల ఉన్నట్టు – పేద పేదోల్ల యిండ్లనిండ మంటలే!

శెంద్రయ్య పటేల సంటోల్లు ధైర్నం శెప్తనే ఉన్నరు – పెద్దలు జనానికి ఏదో ఓటి శెప్తనే ఉంటరు. జనం చెప్పేదియినరు – మల్ల మాట్లాడ్తె అసలే సెప్పనియ్యరు.

"నీయవ్వ గిది గాశెంద్రిగాని పనే! ఎవన్మీద కోపమొచ్చిందో, గుడిసెలంట వెట్టించ్చిండు – దొంగ బేకూబ్‌గాడు – లఫంగి సన్నాసి... బాగర్ల కొడ్కు.." యిండ్లు గాలినోల్ల దాంట్ల ఎవలెవలో సెర్‌పంచును తిడ్తాండ్రు.

అయిలయ్య సుట్టున్న అయిదారిండ్లు అంటుకున్నయ్. సగాన్కెక్కువ గూడెం బూడ్డయ్యె తల్కి గన గన మన్కుంట పైరింజను ఉర్కొచ్చింది. దాని మీద ఒచ్చిన మన్సులు సటుక్కున దిగి, పైపులు బయటికి దీశి బాయిలేశిండ్రు. ఇగచాల్ జేసి – జెర్ర సేపట్ల అగ్గి మంటలార్పిండ్రు. బూడ్డి మిగిలిచ్చిన్రు. గని వాండ్ల యేడ్పు లార్పలె. వాండ్ల బత్కులు కాల్నయ్, కాలినట్టే ఉన్నయ్. సల్లార్పినా సల్లారినట్టు అనిపిస్తలేదు. సమదాన మయిత లేదు.

అవ్, మల్ల – ఎట్లైతది గన్క – దొడ్లె జీవాల్కొన్ని సచ్చె, మిగిల్నయ్ సుర్ర సుర్ర గాలంగ బెదిరిపాయె. ఇండ్లల్ల వున్న గింజ గిరువు బట్ట గుడ్డలు ఎవుసం సామాన్లు అన్నీటితోటి గుడిసెల్ గుడిసెలే ఉంతానికి యీలుకాకుండ ఊడ్చుకపాయె! ఎవ్వన్కుండదు బాద?

"పటేల్ సాబ్ మీవోని తోటి మత్లబు అందంగనె లెత్కొచ్చినం. జోరమంటల్ భి సల్లార్పినం సూస్కో! జెర్రనువ్ మమ్ములగూడ సూస్కొవాలె. చూక్కుడ కష్టంటది" అంటన్నడు. సల్లార్పేటందుకు వొచ్చినోలల్ల పెబ్బ.

"హహ్హహ్హ. అయ్యఁయ్య సూస్కుంట" - పెశిడెంటు నగిండు. సచ్చెట్లొంచ్చిందో, యాణ్ణించొచ్చిందో తెల్సుకోటం కష్టం.

"నా శేత్లేమున్నది? ఎవలెవలిండ్లార్పించ్రో, వాండ్లే మిమ్ముల ఆర్సుకుంటరు... దార్రి గట్టమా యింటి అరుగు మీద కూకుందురు. కల్దెప్పిచ్చిన..పురాగ ఆనక్కుందే.. "పా-పా పటేల సాలొద్దు లాయె తాగక నద్వు" - అనుకుంట ఒక్కొక్కలు పైరింజనోల్లు సర్పంచు అడుగుల అడుగులేసుకుంట వొయింద్రు. ఈడ మల్లేశం కొడుకు సచ్చిండని, బంటురాజయ్య తల్లి నడుము యిరిగిందని, బత్కెటట్టు లేదని శేతులు కాల్లు గాలినోల్లు.. వాండ్ల యింటివాండ్లు సోకాలు బెడ్తాండ్రు.

గుడిసెల మీదినుండిమంటలు బోయి, పొగలొస్తానయ్. ఊరోల్లు గూడ, బగబగ మండిన బాదలను ఇప్పటిదాక కన్నీల్ల తోటి ఆర్పింద్రు. గిప్పుడు కుములుకుంట, మూలుక్కుంట కూకున్నరు. పొగ అసోంటి దేదో గుండె లోపట్నించి బయలెల్తాంది. వీల్లు బిబ్బలెక్కి ఆరుస్తాంటె వాండ్లు తాగుకుంట పండ్ల తోటి బొక్కలిరుస్తాండ్రు.

ఇగ జెర్ర గాంగనె, శెంద్రయ్య పటేలు పైరింజనోల్ల పెబ్బ ఇద్దరు ఊల్లె దిర్గుతాండ్రు. సర్పంచు శెప్తాండు. "గంతదూరం నుంచి వొచ్చిండ్రీల్లు . ఈల్లకేమన్న ఒప్పజెప్పాలె.. రూపాయల్దీసి పెట్టుండ్రి. సచ్చినోల్లను, దెబ్బల్దాకినోల్లను, కాలినోల్లనేం జూస్తరు? ఆల్లకు గట్ల గీతరాసుంది...ఈల్లను తొందర సాగనంపాలె!' సెప్పుకుంట బాటపొంటి దొరలెక్క నడుత్తాండు శెంద్రయ్య.

మాట్లాడేటంద్కే సాతనయిత లేదు. ఇగ మర్లవడ్తారు? సర్పంచు శెంద్రయ్య సర్పమసోంటోడు. పోంగ ఎవ్వలేడ్పులాల్లకున్నయ్.

ఒక్క రాజయ్యడిగిండు. దైర్నంజేసి, "ఇగ మా తానేమున్నయ్ పటేల మా పానాల్దప్ప?" ఏడ్సుకుంట.

"గయ్యే ఇయ్యి, మల్ల - పెండ్లాం లేదుర దాన్నమ్మి పైసదే" ఇంక బగ్గ శెడ్డ మాటలు తిట్టిండు.

సచ్చిన పీన్గును గాల వెట్టేటంద్కు, వొల్లుగాలినోల్ల బాగ జేయించె టంద్కు కొత్త ల్లేవు. ఇగ గీల్లకిచ్చె టంద్కేన్నించొస్తయ్ వాండ్లకు.

గట్ల అరుసుకుంటనే అయిలయ్య తానికొచ్చిండు. "సూడు అయిలయ్య మంటల్గిట్ట ఆపు జేశినసాబ్ లొచ్చిన్రు. ఆల్లు సల్లార్పకుంటె ఈ ఆపతిల ఆదుకోకుంటె మన మంత యాడుందుం? ఆల్లకు మనంరునపడి ఉన్నం. ఎంతనన్న ముట్టజెప్పుకోవాలె. తయారు జెయ్."

"తయారు జేశెటంద్కేమున్నది. నీ కాల్లు మొక్కుత. పెండ్లాంపుస్తెమిగిలిచ్చి..."

"గదైతే గదే సఁయ్. ఇయ్యాలె! మల్ల వీండ్లు ఉత్తగ వోతారు? గిది ఎవ్వల్కి తప్పదు. ఉన్నోన్ని లేనోన్ని సమానంగ జూస్త. అందరి తాన ఒసూలు జేస్తానం. ఎల్లకుంటె ఇగో వీండ్ల వాల్లొచ్చి ఏద్దారికితె గదే తీస్కపోతరు" - కదిలిండు పటేలు.

పైరింజనాయిన శిన్నగ నగిండు - ఊక్కుంట పటేలెనక్కపోతాండు.

"నీ యవ్వ దునియ! పుస్తెలయిన సరే ఇయ్యమనే అరిచ్చంద్రులున్న రియాల్రేపు ధూ!"

- అనుకున్నడు అయిలయ్య.

సత్తెమ్మ పోశాలు కొట్టం కాడున్నరు. కాలినింట్ల ఏమే మున్నయో దేవులాడ్తాంది బిడ్డ బుచ్చాలు.

పక్క గుడిశె కాడ గిట్లనే బెదిరిత్తాండ్రు - ఈన్నించి వొయినోల్లు!

కడ్పుల పేగులేదుస్తున్న సప్పుడయతాంది.

"గిదొక్కటే ఉన్నదే నాయిన" ఏడ్పు గొంతుతోటి అనుకుంట, లంగ మీదికి చెక్కు కోని, కాలిన కట్టెలూ, బూడిద, శెత్త, దాటుకుంట కాలినింట్ల నుంచి బయటికొస్తాంది బుచ్చాలు.

అవుతల వాండ్లు, పీన్గల సుట్టు నక్కల్దిరిగినట్టు, గుడిసెలన్ని తిరుగుతనే వున్రు.

గుడిసెలు కాలినోల్ల బత్కులు గిట్లయినయని, కండ్ల వడెటట్టు గట్క కుండది పల్గిన బోకె బుచ్చాలు శేతుల ఉన్నది.

● 1974 ●

# 39. తలుపులు

♦ చంద్ర ♦

ఎండ పెళ్ళుమని నిప్పులా కాల్తోంది.

వీస్తున్న గాలి వేడిగా వుంది.

ఉక్కగావున్న షెడ్‌లోంచి నాగరాజు బయటికొచ్చాడు.

చెవుల్ని బద్దలు చేస్తున్న ఇంజను శబ్దాల్నుంచీ, మరల శబ్దాల్నుంచీ దూరంరాగానే ఎదారి నిశ్శబ్దంలోకి వచ్చినట్టుంది.

నడుంకి చుట్టుకున్న తుండుగుడ్డని తీసుకున్నాడు. ఒళ్ళంతా తుడుచుకుని తరువాత మొహం తుడుచుకోబోయాడు. వొచ్చిన వాసన భరించలేక నోటిలోకొచ్చిన దాన్నంతా కాండ్రించి బయటకు ఉమ్మేసాడు. ఉమ్మేస్తూనే నెమ్మదిగా వెళ్ళి షెడ్ నానుకున్న మామిడిచెట్టు కిందున్నబావి దగ్గరికెళ్ళాడు. ఉక్కలోంచీ, ఎండలోంచీ చెట్టునీడకి రాంగానే చల్లగా వుండి స్వర్గంలోకి వొచ్చినంత హాయిని అనుభవించాడు.

బొక్కెనతో నీళ్ళు తోడుకుని హుషారుగా ఒళ్ళంతా తడుపుకున్నాడు. తరువాత తుండు గుడ్డని రెండుసార్లు నీళ్ళతో తడిపి, పిండేసి దాంతో ఒళ్ళు తుడుచుకున్నాడు. రివ్వున దూసుకొస్తున్న వేడిగాలి ఒంటిని తగలగానే చల్లబడుతోంది.

తుండుని అక్కడ - నీడలో గుట్టలా వున్న ఊకమీద పరిచి నడుం వాల్చాడు.

★ ★ ★

'చౌటుప్పల్' ని ఊరు అనాలో, అరవై డెబ్భయి యిళ్ళూ మరిన్ని గుడిసెలూ వున్న పల్లె అనాలో తెలీని చోటు. అది హైదరాబాదు నించి బెజవాడకు వెళ్ళే ట్రంకురోడ్డులో, కొండెక్కాక దిగువలో వుంది. చౌటుప్పల్‌కి ఎటూ ఏడెనిమిది మైళ్ళదాకా పేరున్న మరో ఊరులేదు.

సిటీ దాటిన ప్రతి లారీ అక్కడ ఆగుతుంది. అక్కడ లారీ డ్రైవర్లకి తినటానికి కోడికూరా, రొట్టెలూ, బన్‌లూ, టీలూ, నిలవుంచిన మడుగు బూలూ దొరుకుతాయి. అక్కడ రోడ్డుకి ఒకవైపునే వరసగా హోటల్లాంటివి మాసిపోయిన చూరుల్తో, గోడల్తో-అప్పుడో, యిప్పుడో పడిపోయే అస్థిపంజరాల్లాగుంటాయి. ఆ హోటల్లలో సప్లయిచేసే మనుషులు శవాల్లాగుంటారు. కనుచూపుమేరలో ఏ ఊరూలేని ఆ చౌటుప్పల్ - వొంటరిగా, ఏకాకిగా, తప్పిపోయినట్టుగా వుంటుంది.

అక్కడ - ఒకే ఒక రైసు మిల్లుంది.

దాని ఓనరు వెంకటరెడ్డి.

ఆయనకి చౌటుప్పల్ ప్రాంతాల్లోనే చాలా ఎకరాల భూములున్నాయి. ఎందుచేతనో ఆయన తనకి మిగిలిన ఒకే ఒక్క వారసునికి, బసవరెడ్డికి లక్షల ఆస్థినీ, చనిపోయే ముందర అక్కడ కట్టించిన రైసుమిల్లునీ యిచ్చిపోయాడు. బసవరెడ్డికి తనకొచ్చిన లక్షల ఆస్థి బాగానే వుందిగానీ, ఎటూకానిచోట వున్న ఈ రైసుమిల్లు మటుకు నచ్చలేదు. అందుకనే బసవరెడ్డి ఒకటి రెండుసార్లు దాన్ని ఎంతకో అంతకు వదిలించుకుందామనుకున్నాడు. కాలం, ఖర్మం కలిసిరాక ఎవరూ దాన్ని కొనడానికి ముందుకు రాలేదు. 'పోన్లే - ముసలాడు ఎందుకు కట్టించాడో గానీ, దీన్ని అమ్మేసినా ఎంతొస్తదిలే, వుంటే మనకి ఖర్చేముంది గనక?' అని మొదట్లో అనుకున్నా తనకీ ముగ్గురు నలుగురు నలుసులు పుట్టేక, రైసుమిల్లు ఎలాగూ వుంది దీని మీదకూడా ఎందుకు సంపాదించొద్దూ అనుకుని, అనుకున్న ఏటినుంచే చుట్టుపక్కల ఊళ్ళనుంచి ధాన్యం కొని సిటీకి రైసుని రవాణా చెయ్యడం మొదలు పెట్టాడు.

ఎంతలేదనుకున్నా ఇప్పటికి బసవరెడ్డి రైసుమిల్లుమీద ఒకలక్షయినా సంపాదించే వుంటాడని అక్కడి జనం అనుకుంటారు.

ఉంటానికి బసవరెడ్డి సిటీలోనే వుంటున్నాడు. అప్పుడప్పుడూ - నెలకు ఒకటి రెండుసార్లు వచ్చి వెళ్తున్నాడంతే. రైసుమిల్లుని బసవరెడ్డి దూరపు బంధువొకాయన చూస్తున్నాడు. ఆయనపేరు కొండారెడ్డి.

చౌటుప్పల్‌కి చెప్పుకోదగ్గ అలంకరణ ఆ రైసుమిల్లు ఒక్కటే!

★ ★ ★

చౌటుప్పల్‌కి పదిహేను మైళ్ళదూరంలో ముంగనపల్లి వుంది. చిన్నాపెద్దాయిళ్ళు, యిళ్ళలాంటివీ, గుడిసెలూ అన్నీ కలిపి రెండొందల గడపకన్నా వుండదు. ఆ వూళ్ళో గార్ల నరసయ్యకి పెళ్ళయ్యాక పన్నెండేళ్ళకి ఓ కొడుకు పుట్టాడు. పుట్టాడన్న సంతోషమేగాని, వాడికో కాలు వంకర, తల వంకర.

పురుడుబోసిన మంగమ్మ "పిలగానికి దోషమొచ్చింది. గా నాగన్నకు మొక్కు బెట్టుకుంటె మంచిద" న్నది.

'దేవుడా నాగన్నా! కలగక కలగక నా యింట్ల బిడ్డ పుట్టిండు. వీణ్ణి నువ్వె బతికించాలె. సాకాలె! బతికుండి బాగుంటె నీకు ఎండిగ్రం బెట్టిస్త' అని నరసయ్య నాగదేవునికి మొక్కుబెట్టుకున్నడు.

వంకర్లు పోకపోయినా, పుట్టిన ఏడాదిలోనే నాలుగయిదు సార్లు చావునుంచి తప్పించుకున్నాడు గనకనే నరసయ్య ఇంక ఆలస్యం చెయ్యకుండానే తన కొడుక్కి నాగరాజు అని పేరు పెట్టుకున్నాడు.

పిట్టలాగ ఊతగా వున్న కొడుకుని చంకనేసుకుని నాగన్న కొండకి వెళ్ళి కొబ్బరికాయ కొట్టి పప్పూ బెల్లం పంచి వచ్చాడు.

నరసయ్య, నాగరాజుకి పదేళ్ళు రాగానే తనతోపాటే పటేల్‌గారింటికి తీసుకెళ్లాడు. దొరగారితో మాట్లాడి జీతంలోకి కుదిర్చాడు.

మొదటిసారి, పటేలు పదేళ్ళ నాగరాజుని చూడంగానే - "అరే నర్సిగా... ఇదేందిర నీ కొడుకు ఇట్లగున్నడు? శిన్న గాలొస్తెకొట్టుకపోద్రా? కోడి కూస్తే జడుసుకునె టట్టున్నడు. ఈడు నా తాన ఏం పన్జేస్తడ్రా?" అని అన్నాడు. కొండెత్తు రాక్షసుడు పిల్లకోడిని చూసి దీంతోని నా ఆకలి ఏం తీరుద్దిరా అన్న సందేహంలో పడినట్టుగా వుంది దొరగారి మాట.

ఆయన మాటతో గుండె గుటుక్కుమన్నది నరసయ్యకు. క్షణంసేపు అటూ యిటూ ఊగిస లాడింది. కాని వెంటనే నీరసపడిపోకుండా "గదేందొరా! పనికీ మనిషికీ జతేంది. మా అయ్య మొట్ట మొదట్ల నన్ను మీ తానికి జీతానికి తోలుకొచ్చినప్పుడు నేను గూడ గిట్లనే వుంటి గదా! ఏనాడన్నా మీరు జెప్పిన పని తప్పిన్నా? మానిన్నా? పొద్దనక రాత్రనక మీ తానున్న. ఇప్పుడు మా ముగ్గురికి కడుపు నిండతలేద్దొరా. ఈడు గూడ మీతాన పన్జేస్తె కొద్దిగన్న సయం గదాని ఈన్ని తోలుకొచ్చిన. ఎంత పనున్న జేసెటోళ్లం మేమెగద. ఏదో మీ కాళ్ళ నీడల బతికెటోళ్ళం. ఇయ్యాల గాకపోయిన రేపన్న ఈడు మీ తాన్నె జీతం జెయ్యాలె గద. మీ కాడ గాక ఇంకోరితాన ఎట్ల కుదురుతడు? ఇశారించండి నీ బాంచెను!" అని అన్నాడు. చేతులు కట్టుకునీ, తల వొంచీ వొంచక భక్తితో, కళ్ళలో ఆశని నింపుకుని దొరగారికి తన విన్నపాన్ని విన్నవించాడు నరసయ్య.

నాగరాజుకి - తన తండ్రి పటేలు ముందు అట్లా భయంతో వొంగిపోవటం ఎందుచేతో నచ్చనేదు.

పటేలు తీరిగ్గా పొగాకుకాడ తుంచి అతి జాగ్రత్తగా సాపుచేసి చుట్ట కట్టి నాలిక తడితో ఓచుట్టు చుట్టాడు. తర్వాత దాన్ని అగ్గిపుల్లతో వెలిగించుకుని, పొగవదిలి నరసయ్య కేసి ఓరగానూ, నాగరాజుకేసి తీక్షణంగా, పరీక్షగానూ చూశాడు. లూజు చొక్కావేసుకుని, మూతిమీద కోరమీసంతో వున్న పటేల్ని నాగరాజు చూడలేక పోయాడు. తలెత్తి నెమ్మదిగా తండ్రి దగ్గరికి జరిగాడు.

పటేలు చుట్టని ఇంకోసారి పీల్చి పొగని బయటకు ఊదాడు. నాగరాజు మళ్ళీ తండ్రి కేసి చూసాడు.

తన తండ్రి ఇంకా అలాగే వొంగినట్టుగానే నుంచునున్నాడు.

"సర్లేరా - సూస్తున్నవుగద నా పరిస్థితి గూడ. పంటల్లేవు పాడులేవాయే. వాని కింద నీ కింకొక్క బస్తిస్త. సరెనా?" అన్నాడు పటేలు.

నరసయ్య మొహం చాటంతయ్యింది.

"దండం దొర నీ బాంచెను" అన్నాడు నరసయ్య మరింత కిందికొంగి దణ్ణం పెడుతూ. పటేలు తోలుచెప్పుల్ని కిర్రుకిర్రు మనిపిస్తూ వీధిలోకి వెళ్ళి పోయాడు.

"రారా - దొరసానికి నిన్ను చూపిస్త. రా" అంటూ నాగరాజు చేయి పుచ్చుకొని సావిట్లోంచి పెరటిగుమ్మం దగ్గరికి తీసికెళ్ళాడు. అక్కడి గుమ్మం మనిషికి రెండింత లుంది. నాగరాజు దానివంక ఆశ్చర్యంగా చూసాడు. వెంటనే వాడికి తమ గుడిసె తలుపు గుర్తుకొచ్చింది.

"ఔ మల్ల. గంత శిన్న తలుపుల కెల్లి నడిశి నడిశి నడుం వంగదా ఏంది. గందికే నాయనకు నడుం వంగి పోయింది" అనుకున్నాడు.

"ఏందిరా గట్ల నిలబడ్డవ్? మల్ల బేగి యింటికి పోదాం" అంటూ దొడ్లో గాదెల మధ్యనుంచి యింటి వెనక తలుపు దగ్గర నిలబడి "అమ్మా! దొర్సానమ్మా!" అంటూ దేవకమ్మ గారిని పిలిచాడు.

పది నిమిషాల తర్వాత గానీ దేవకమ్మ ప్రత్యక్షమవలేదు.

ఆమెని చూడంగానే నాగరాజుకి పంతులు గారింట్లో వీధరుగుమీద గుమ్మానికి పైన వేళ్ళాడే లక్ష్మీదేవి బొమ్మ గుర్తుకొచ్చింది.

నల్లగా, బక్కపలచగా ఎముకలు బయటకు తన్నుకొచ్చినట్టుండి, తల ఓ పక్కకి వొంగి పోయి, ఎడంకాలు మరింత ఎడమకి మోకాలు దగ్గర తిరిగి పోయినట్లున్న నాగరాజుని చూడంగానే దేవకమ్మ "ఏందిరా నరిసిగా - ఈడేనా నీకొడుకు" అని అడిగింది.

"అవమ్మ - ఈడే. గిప్పుడే దొరతోని మాట్లాడిన. రేపటికాడ్నిండి ఈడు మీతాన జీతానికుంటుండు." అన్నాడు.

ఇప్పుడు గూడ తన తండ్రి అమె ముందు వంకీలు తిరిగిపోతూ వంగి వంగి నిలబడడం గమనించాడు నాగరాజు.

తండ్రి అలా భయంగా వొంగి వొంగి మాట్లాడడం నాగరాజుకి ఎందుకనో భయం కలిగించింది. వెన్నుపూసలోకి వొణుకొచ్చినట్టు నిలుచుండి పోయాడు.

"మరి నేనొస్తనమ్మ" అని నరసయ్య కొడుకుని తీసుకుని వెనక్కి తిరిగిపోయాడు.

దేవకమ్మ ఒక్కక్షణం వెళ్తూన్న నాగరాజుని చూసింది.

నడుస్తున్నప్పుడు వాడి ఎడంకాలు మరింత ఎడమకు పడుతుంటే తల కుడికీ ఎడమకీ కదలటం చూసి "పోరగాని నడక పాములెక్కున్నదే!" అనుకుని యింట్లోకి వెళ్ళిపోయింది.

★ ★ ★

పదేళ్ళు గడిచాయి.

నాగరాజు యిప్పుడు పెద్దవాడయ్యాడు.

తల్లి చచ్చిపోయింది

తండ్రీపోయాడు.

ఇన్నేళ్ళు తన పన్లో ఎప్పుడూ దొరతో ఏ ఒక్కనాడూ ఒక్కమాటా పడకుండానే గడుపుకొచ్చాడు.

"పోరగాడు పాములెక్కనే శరశర పని జేసుకుంటున్నడే" అని మొగుడితో చాలాసార్లు నాగరాజు గురించి అన్నది దేవకమ్మ.

"ఆ చేస్తున్నడు చేస్తున్నడు. ఎందుకు చెయ్యడు? వానొంతూ వానయ్య వొంతూ వాడే తింటున్నడు గద" అని విసుక్కున్నాడు పటేలు.

"గదేందయ్య? గట్ల మాట్లాడుతుంటివీ? మరి పని మటుకు?... వాడి పనీ వానయ్య పనీ ఒక్కడే చేస్తలేడా ఏంది?" అని నాగరాజుని వెనకేసుకొచ్చేది దేవకమ్మ.

పటేలు మరింకేం మాట్లాడకుండా ఊరుకుండి పోయేవాడు

నాగరాజుకిప్పుడు ఇరవైయ్యేళ్లొచ్చాయి.

ఊళ్లోకూడా మార్పులొచ్చినయి. ఇళ్ళు పెరిగినయి. జనం పెరిగారు. స్కూలు వచ్చింది. వూళ్ళో జనంతో పాటే నాగరికతా, రాజకీయాలతో పాటు కక్షలూ, కావేశాలూ కూడా పెరిగినయి. చుట్టుపక్కల ఊళ్ళకి కూడా కలిపి ఇక్కడికి ఓ పోలీసు స్టేషనుకూడా వొచ్చింది.

ఈ మధ్య నాగరాజుకి రాత్రిళ్ళు నిద్ర సరిగా పట్టడంలేదు.

తనుండటంవల్ల పటేలుకి ఏ బాధా లేకుండా వుంది. పదేళ్ళుగా ఆయన పొలం పనులన్నీ చూస్తున్నాడు. ఆయనకీ వూళ్ళో తనకన్నా నమ్మకంగా పన్జేసేవాడు ఇంకెవడూ దొరకడు.

పటేలికి ఏళ్ళొచ్చిన కొద్దీ డబ్బుమీద మోజు పెరిగింది. పిసినారయ్యాడు. ఫలితం లేకుండా ఏ పనీ చెయ్యటంలేదు. ఇప్పుడు ఊళ్ళో దాదాపు ప్రతి కుటుంబం ఎంతో కొంత ఆయనకి బాకీ పడ్డారు. కొందరైతే - అప్పులకింద పొలాన్నీ, పుట్టల్నీ వొదులుకుని ఊరొదిలి వెళ్ళిపోయారు.

దేవకమ్మ యిప్పుడు దుమ్ము తుడిచిన 'లక్ష్మీదేవి పటం'లా వుంది

'వాళ్ళే పెరిగారు. కాని తను పెరగలేదు.

తన ఇన్నేళ్ళ కష్టానికి ఏమీ మిగలలేదు.

ఎంతకాలమిట్లా? తనిప్పుడు ఒళ్ళు చేసాడు. ఒంటితోపాటు కోరికలూ పెరిగాయి. వయసూ పెరిగింది. వయసుతో పాటు యవ్వనం పెరిగింది.

వెనకాముందూ ఎవరూ మిగిలారు కాదు.

ఇంకెంతకాలం చెయ్యి కాల్చుకోవటం? ఎవరో ఒకరు తనకి తోడు కావాలి!

తనూ అందరిలా బతకాలి.

తండ్రిలాగ తను ఎవరి ముందూ నడుం వంచొద్దు. ఈ గుడిసెలో వుండి తను వెన్నుపూసకి వంకర తేవొద్దు' అనే రకరకాల కలల్తో సతమతమయి పోతున్నాడు నాగరాజు.

ఓ రోజు -

తండ్రి పోయినప్పుడో, మరెప్పుడో వచ్చిన రంగమ్మత్త అధాట్టుగా వచ్చింది.

వచ్చీ రాంగానే - "ఏందిరా నాగన్నా - ఎంతకని గిట్ల ఒక్కనివి పడుంటవు? పెండ్లి గిండ్లి ఏమన్న చేసుకునేదుందా లేదా?" అని అడిగింది.

నాగరాజు సిగ్గుపడలేదు.

"చేసుకోవాలనే వున్నదత్తా - గని నన్ను జూస్తె పిల్లనెవరిస్తరంటవు?" అని ఎదురడిగాడు నాగరాజు.

రంగమ్మ ముందు తికమకపడింది గాని వెంటనే "ఓలవ్వ! నువు మొగోనివి కాదా ఏంది? నీకేందిరా - మానిక్కానివి! సుక్కలాంటి పిల్ల దొరుకుద్దని మాటియ్యగని

సూడు... వొచ్చే సంకునాత్రికి నీకు పెండ్లి చెయ్యకపోతె నాపేరు రంగమ్మకాదు" అని శపథం చేసి ఆనాటికి వుండి మర్నాడు ప్రయాణం కట్టింది.

రోజులు గడిచాయి.

సంక్రాంతి వొచ్చిందీ, వెళ్ళిపోయిందీ!

నాగరాజు సంక్రాంతి వరకూ రంగమ్మత్త కోసం ఎదురు చూసాడు. తరువాత అంత ఉత్సాహంగా లేకపోయాడు.

ఇప్పుడు నాగరాజులో రోజురోజుకీ పెరిగిన ఒంటరితనం - ఆ ఊరిమీదా తన దొరమీదా కసీ, కోపం పెంచుతోంది.

ఇక్కడిలాగే వుండిపోతే తను యింక నిటారుగా నడవలేడు. తనూ తన తండ్రిలాగే వొంగిపోవటం ఖాయం - అని భయమేస్తోంది.

స్వర్గ ద్వారంలోకి పిలిచినా - తలెత్తితే ఎక్కడ గుమ్మం తగులుతుందో అని వొంగి నడిచే తండ్రి కళ్ళక్కనిపించినప్పుడల్లా పటేలు ఇల్లు కళ్ళల్లో కదలాడుతోంది. వెంటనే - ఇనప సందూకుల్లో డబ్బు నింపుతూన్న దొరా, లక్ష్మీదేవిలా రోజురోజుకీ వెలిగిపోతున్న దేవకమ్మా నాగరాజు కళ్ళలోకి నిద్ర రాకుండా చేస్తున్నారు.

తాతా, తండ్రీ, తనూ - మట్టిని దున్ని మానిక్యాల్ని పండించి, బస్తాల్లోకి నింపి ప్రతి యేడూ పటేలు గాదెల్లో నింపారు. అలా నింపీ నింపీ తన చేతుల్లోకి నిస్పత్తువ చేరుతోంది. గుండెలోకి గునపాలు దిగుతున్నట్టు విలవిలలాడుతున్నాడు. సముద్రం లాంటి చీకటి రాత్రిళ్ళలో ఒంటరిగా వున్న తనకూ ఓ తోడుంటే బావుండునని పిస్తోంది నాగరాజుకి.

ఉండుండి ఓ రోజు రంగమ్మత్త ఊరునుండి ఊడిపడింది.

మళ్ళీ - వోచ్చీ రాంగానే "ఏమిరా నాగన్న ఈ రంగమ్మత్తంటే ఏందనుకున్నవురా? నీ పెండ్లికి నాకేం పెడుతవో ముందు శెప్పు" అనంది.

నాగరాజు గుండె ఆనందంతో పొంగింది. పొంగిన కెరటం పైక్కదిలి కళ్ళల్లోకి విరుచుక పడింది.

"గదేందిరో పెండ్లికొడుక గట్లేడుస్తున్నవు" అంది తనూకళ్లలోకి నీళ్ళు తెచ్చుకుంటూ.

నాగరాజు వెంటనే ఏమీ మాట్లాడలేదు. తరువాత నెమ్మదిగా "ఏంలేదత్తా! నాగ్గూడ పెండ్లయితదని అనుకోలేదు. నువ్వేమొ పోయిందె పోకడాయె. సంకురాత్రి కొస్తనన్న దానవు రాకనేపోతివి. నాకెవరున్నరు శెప్పు" అని అన్నాడు.

"నేనున్నను గాదుర నాయన. నేనున్నను గద" అంటూ ముక్కు చీదుకున్నది రంగమ్మత్త.

అమావాసపోయి పున్నమొచ్చేసరికి నాగరాజు గుడిసెలోకి కొత్తకుండలూ, కొత్త బట్టలూ, కొత్త చాపలూ, బొంతలూ, కొత్త దీపమూ వొచ్చాయి.

రంగమ్మత్త వెళ్లిపోయిన రాత్రి "ఉడుకపోస్తంది. బైట పండుకుందమా?" అంది నాగమణి.

"వొద్దులె సగం రాత్రయినంక సలేస్తది. ఈన్నె లోపల్నే పందాం" అన్నాడు నాగరాజు.

నాగమణి గుడిసె వెనక్కెళ్ళి కాళ్లు కడుక్కుని వొచ్చి మొగుడి పక్కనే కూచుంది. నాగరాజు లేచి గొళ్ళెం వేసొచ్చి దీపం బుడ్డిని చాపదగ్గరగా జరిపి నాగమణి కళ్ళలోకి చూసాడు.

నాగమణి సిగ్గుతో తల దించుకోలేదు. "ఏందంతగసం సూస్తున్నవ్? నీ పెండ్లాన్నె కాదేంది?" అంది చిన్నగా నవ్వి.

నాగరాజు వెంటనే ఏమీ మాట్లాడలేదు. మోకాళ్ళమీద కూచుని కొద్దిగా ముందుకి వొంగి నాగమణి తలమీద చేయి వేసాడు. నాగమణి తల కిందకు దించుకున్నది. మళ్ళీ తలెత్తి చూసేటప్పటికి నాగరాజు కళ్ళలో నీళ్ళున్నాయి.

నాగమణి మొగుడి కళ్ళలో తడిని చూసి తల్లడిల్లింది. "ఏందయ్యో - ఆడదాని లెక్కేడుస్తున్నవేంది? ఎందుకూ? ఎక్కడన్న మొగుడు పెండ్లాలు పందుకునేటప్పుడు గిట్లనే వుంటారా ఏంది?" అంది బాధగా.

"ఛీ పాడు.....నేనాడిదాన్నా ఏంది? గట్లగాదు. నన్ను చూసినంక మీ అయ్య అమ్మ, సుక్కలాంటిదానివి, నాకెట్లిచ్చినారాని? నువు నా పెండ్లానివయితే నాకదురుష్టం కాదా ఏంది?" అని అడిగాడు అమాయకంగా.

నాగరాజుని ఇంకేమీ అననీయకుండా నాగమణి గబుక్కున మొగుడ్ని కౌగలించుకుంది.

ఏడాది తిరిగింది.

అవసరాలు పెరిగి, ఎదుగుబాటు కోసం ఆలోచనలు పెరిగే తోడు దొరికిందన్న కొండంత ధైర్యంతో తను పుట్టిన గుడిసెనీ, ఊరునీ, తెలిసిన మనుషుల్నీ వొదిలేసి మంచి బ్రతుకుని వెదుక్కుంటూ బయలు దేరిన నాగరాజు - ఇక్కడ, ఈ రైసుమిల్లు దగ్గరాగిపోయాడు.

★ ★ ★

బ్రహ్మాండం బద్దలయినంత శబ్దంతో వచ్చిన లారీ చప్పుడుతో నాగరాజు చటుక్కున కళ్ళు తెరిచి చూసాడు. గేటులోపలవేపు ఏడెనిమిది లారీలాగి వున్నయి.

"ఓర్నియ్యవ్వ. పొద్దుగాల పోయిన బండ్లప్పుడే తిరిగొచ్చినయ్యేంది?" అనుకుంటూ గబగబా లేచి షెడ్‌లోకి వెళ్ళాడు నాగరాజు. ఎండ వెలుతుర్లోంచి లోపలికొచ్చిన నాగరాజుకి వెంటనే షెడ్లో ఏమీ కనిపించలేదు. కాస్సేపటిగ్గాని మరలూ, బియ్యం కుప్పలూ, వరి బస్తాలూ కనిపించలేదు. కళ్ళకు కనిపించని శబ్దం మటుకు చెవుల్ని బద్దలు చేస్తోంది. ఎడంవేపు తలుపులోంచి కొండారెడ్డి గదిలోకి వెళ్ళి, "గట్లపోయి చా తాగొస్త దొర" అనడిగాడు.

"ఇంకా పనికెక్కనేలేదాన్ర? నీ యవ్వ - బాగనే. పో - పో - ఇంకా నిలబడ్తవు? పొయి చాయి తాగొచ్చి రా పో. తొందరగా బండ్లకు బస్తాలు ఎక్కించాలె" అని గదిమాడు కొండారెడ్డి.

నాగరాజు షెడ్‌కు ముందున్న తలుపులోంచి గబగబా బయటికి వెడుతూ ఓ క్షణం ఆగి వెనక్కి తిరిగి చూసాడు. షెడ్ తలుపు పటేలు యింటి తలుపుకన్నా పెద్దది.

అక్కడే - ఆ ఎండలోనే నిలబడిపోయాడు.

తనిప్పుడు ఎంతో పైకెదిగినట్టుగా వుంది నాగరాజుకి.

వున్నట్టుండి నాగరాజు మనసులోకి ఆనందపు కెరటాలు లేచినయి. వాడి కళ్ళలోకి కొద్దిగా నీళ్ళొచ్చి తన బ్రతుకిప్పుడు చల్లగా వున్నట్టు అనిపించింది.

వెంటనే - పరిగెత్తినంత వేగంగా గేటు దాటి, కాలవ దాటి రోడ్డు దగ్గరికి వచ్చాడు. ఎండకి రోడ్డు మీది తారు కొంచెం కొంచెం కరిగి దూరంగా చూస్తే నక్షత్రాలు రాలి ఆ తారుకి అతుక్కుపోయినట్టు కనిపిస్తోంది. నీళ్ళతో తడిసినట్టు మెరుస్తోంది.

ఎదురుగావున్న హోటల్లోకి వెళ్ళి తాటాకుల పందిరికింది బెంచీమీద కూచున్నాడు. "రే కిష్టయ్యా - ఓ చా తీస్కరా!" అనడిగాడు.

కిష్టయ్య తెచ్చిచ్చిన చా తాగుతుంటే ఎదురుగా అప్పుడే ఓ లారీ ఆగింది. అందులోంచి డ్రైవరూ క్లీనరూ దిగి తిన్నగా నాగరాజు కూచున్న బెంచీ దగ్గరకే వచ్చారు.

"బాగున్నావురా నాగన్నా" అని పలుకరించాడు డ్రైవరు.

"అరె నువ్వా ఎంకటన్నా....రా రా కూకో! నేను బాగానే వున్న. నువు బాగున్నవాన్నా" అని పలకరించాడు నాగరాజు.

బాగున్నట్టు తలాడించి ఎంకటన్న హోటల్లోకి చూసి "నాలుగు రొట్టెలు, కూరా పంపియ్యవయ్యా" అని పక్కనున్న బకిట్లోంచి నీళ్ళు తీసుకుని మొహం, చేతులూ కడుక్కుంటూ అవున్రా - "నాగారాజూ....నీ పెండ్లాం ఇంకా మిల్లుల్నే పనిచేస్తున్నదా?" అనడిగాడు.

టీ తాగటం పూర్తి చేసిన నాగరాజు "లేదన్నా గీ రెన్నెల్లూ రాదు. నెలలు నిండినయి గద. రెడ్డయ్యే వొద్దన్నడు" - అని లేచి హోటల్లోకి వెళ్ళి, "నా కాతల ఒక చాయి రాస్కో," అని చెప్పి ఎంకటన్నతో, "అన్నా- నేను బోతున్న చానా బస్తలు నింపాలె. వస్తా." అంటూ నాగరాజు వొచ్చినంత వేగంగా రైసుమిల్లు కేసి నడిచాడు.

షెడ్‌లో ఇంజను శబ్దం స్పీడెక్కి పని మహజోరుగా సాగుతోంది. నీళ్ళు పడుతున్నంత ధారగా మరలోంచి బియ్యం పడుతున్నాయి. అటూయిటూ చూస్తే బియ్యం కుప్పలు కుప్పలుగా గుట్టల్లాగ వుంది.

కూలీలు గబగబా ఆ బియ్యాన్ని బస్తాల్లోకి ఎత్తి తూకం చూసి కుట్టేస్తున్నారు. కుట్టిన బస్తాల్ని ఒకటొకటీ తీసి కెళ్ళి లారీల్లోకి నింపుతున్నారు.

నాగరాజు చురుగ్గా పని చేస్తున్నాడు.

అతని మెదడ్లో ఆలోచనలు రేపో మాపో నాగమణి కనబోయేబిడ్డ చుట్టూ తిరుగుతున్నాయి. వాడిది తన తాతలాగ, తండ్రిలాగ, తనలాగ గానుగెద్దు జీవితం కాదు. తండ్రి తరువాత తన బ్రతుకు ఇలా కొంచెం మెరుగ్గా వుంది. తన తరువాత తన బిడ్డ బ్రతుకు ఇంకా బాగుండాలి. తను చిన్న గుడిసె తలుపులోంచి పటేలు గారింటి తలుపులోకి, పటేలు తలుపులోంచి షెడ్ తలుపులోకి వొచ్చాడు. తన కొడుకు ఇంకా పెద్ద తలుపుల్లోకి...

నాగరాజు చేతులు మహా చురుగ్గా పని చేస్తున్నాయి. మెదడు ఆలోచిస్తున్నది. ఆలోచనల్లో వెలుగులూ, కలలూ ఎక్కువయిపోయి చెవులకి ఏ శబ్దమూ వినిపించడం మానేసింది.

చుట్టూతా పెట్రోమాక్స్ లైట్లు పెట్టినట్టు పండువెన్నెల వెలుగు వొచ్చింది.

షెడ్డంతా ఖాళీ అయిపోయినట్టుగా వుంది.

ఒంటరిగా, విశాలంగా ఆ షెడ్ ఓ భవంతిలా వుంది నాగరాజుకి. అయితే అంత పెద్ద భవంతికి ఎక్కడా ఒక్క తలుపైనాలేదు.

కళ్ళకి అన్నీ వెలుగులే! తను కంటున్న కలలే!!

*'రేపు నా బిడ్డ బ్రతుకు నా బ్రతుకులా వుండదు. వుండదు గాక వుండదు. వాడెక్కడో పెద్ద పట్నంలో చదువుకుని ఇంకా పెద్ద పెద్ద దేశాలకెల్తాడు. వాడి బ్రతుకు మహరాజు బ్రతుకే! వాడింట్లో గుమ్మాలుండవు... తలుపులుండవు... అవును వుండవు గాక వుండవు.'*

"ఓర్నాగన్నా! గదేందిరా గట్ల నిలబడ్డవు?" అన్న లచ్చుమయ్య మాటకి నాగరాజు కలలు కరిగి వాస్తవంలోకి వచ్చాడు.

నిజంగానే ఇంజను ఎప్పుడో ఆగిపోయింది.

షెడ్లో లైట్లు వెలుగుతున్నాయి.

ఇందాకంతా గుట్టలు గుట్టలుగా వున్న బియ్యం ఇప్పుడు అక్కడక్కడా గుప్పెడు గింజలుగా కనిపిస్తోంది. ఆడకూలీలు చీపుళ్ళతో ఆకాస్త గింజల్ని దగ్గరిగా ఊడుస్తున్నారు.

నెమ్మదిగా తుండుగుడ్డతో మొహానికి పట్టిన చెమటని తుడుచుకున్నాడు. నాగరాజు షెడ్‌లో తనూ, లచ్చుమయ్యే మిగిలారు

ఇద్దరూ కలిసి షడ్‌లోంచి బయటకు వొచ్చారు. అక్కడ చిరుచీకట్లో ఇంకా ఓ లారీ వుంది. లోడ్ చేయాల్సిన బస్తాలు ఓ పక్క వున్నాయి.

కొండారెడ్డి లారీ పక్కన నిలబడి సిగరెట్ వెలిగించుకుని, "తొందరగా పొయి రాండ్రా! టైమయిపాయె. ఇగో ఈ పైసలు తీసుకపోయి తొందరగ ఏమన్న తిని రాండ్రి" అంటూ జేబులోంచి ఓ రూపాయి కాగితం అందించాడు.

ఇద్దరూ కలిసి రోడ్డుకేసి కదిలారు.

ఉన్నట్టుండి "నీ యవ్వ! ఇదేందిర - ఇక్కడసలే వానల్లేక పంటల్లేకపాయె. జనమేమొ తిండిలేక సస్తాండ్రు. ఈళ్ళేమొ గిట్ల బస్తాలకు బస్తాల బియ్యం పట్నాలకు పంపుతాండ్రు. కష్టపడి పండించినోళ్ళ నోట్లె మట్టేనార?" అన్నాడు నాగరాజు.

తనకు తానే మాట్లాడు కుంటున్నాడో, తననే అడిగాడో లచ్చుమయ్యకు అర్థంకాలేదు. అయినా, "పైసరా పైస. ఎవన్తాన పైసుంటే రాజ్జమాందేగదర. ధర తక్కువున్నప్పుడు కొని పెట్టుకుంటరు. కరువొచ్చెతాల్కె గిట్ల పెట్టిందానికి రెండింతలు జేసి అమ్ముకుంటాన్రు. కష్టపడేదేంది? ఈ పెద్ద కుటుంబాల తలకాయలే గింత" అని జవాబిచ్చాడు.

మాట్లాడుకుంటూనే వాళ్ళిద్దరూ ఆ చీకట్లో రోడ్డు దాటి కిష్టయ్య హోటల్‌కెళ్ళారు. ఆ హోటల్ ముందు నాలుగయిదు లారీలాగి వున్నయి. బెజవాడ వేపు రవాణా అవుతున్నాయి. ఆ లారీల తాలూకు డ్రైవర్లు బెంచీలమీద కూచుని మాట్లాడు కుంటున్నారు.

నాగరాజు అక్కడున్న బకెట్లోంచి నీళ్ళతో మొహం కడుక్కని అరుగెక్కి లోపలికెళ్ళి కూచున్నాడు. లచ్చుమయ్యకోసం చూస్తే ఆ లారీ డ్రైవర్లదగ్గర మాట్లాడుతున్నాడు.

లచ్చుమయ్య వచ్చేసరికి నాగరాజు ఓ బన్నుతిని టీ తాగాడు. గ్లాసు కింద పెడుతుంటే లచ్చుమయ్య వొచ్చి, "ఇదిన్నావుర నాగన్న? నిన్న రాత్రి ఆ కనకదుర్గ లారోడు గిట్లనే బియ్యం బస్తాలు ఏసుకు పోతుంటే సూర్యాపేట దగ్గర పొన్నూరు లేదూ, ఆడ చీకట్లకెల్లి జనం మందలు మందలుగా వచ్చి రోడ్డుకడ్డం పడ్డరంట. ఈడు లారాపి ఏందన్నడంట. జనం గంతమందున్నగుడ ఒక్కడు గుడ మాట్లాడ లేదంట. సడిసప్పుడు లేకుండ బస్తలు కిందికి దింపుకున్నరంట. డ్రైవర్‌కు ఏం జెయ్యాల్నొ తెలవలేదంట. చూడబోతె ఆళ్ళేమొ నూరుమందాక వున్నరంట. ఈడేమొ ఒక్కడాయె. కిక్కురమన లేదంట. సూస్త సూస్త ఆళ్ళు బస్తాలు కొనబోయిండ్రంట" అని చెప్పాడు.

నాగరాజు క్షణంసేపు ఆలోచనలో పడిపోయాడు.

ఇందాక షెడ్‌లోంచి ఇక్కడికొస్తూన్నప్పుడు తను లచ్చుమయ్యతో అన్న మాటలు గుర్తుకొచ్చినయి.

తరువాత బన్నుతింటున్న లచ్చుమయ్యతో "బొన్ర లచ్మయ్య! ఏంకరువుర ఇది? ఎంత వానల్లేక పోతే మటుకు ప్రతేడూ పండించిందంతా ఏమయి పోతాందిర? దొరలు గిట్ల దాచిపెడ్తే ఎట్ల? ఒకటికి రెండింతలు జేసి అమ్ముకుంటాంటే ఎట్లయితది? పండించె టోడు యాడికెల్లి తినాలె?.....బాగయింది లేరా! మంచి పనే జేసిండ్రు. కష్టపడ్డోడె తీసుకున్నడు. అంతే గద!" అన్నాడు నాగరాజు.

ఇప్పుడు నాగరాజు మనసు తేలిగ్గా వుంది. ఆనందంగా వుంది. వాడి కలలకి ఏనుగంత బలం వచ్చింది.

నెమ్మదిగా లేచి రోడ్డు మీదకు వొచ్చాడు.

ఇందాక మధ్నాహ్నపుటెండలో ఎడారిలా వున్న ప్రాంతం ఇప్పుడు చల్లగా, నల్లగా సముద్రంలా వుంది.

చీకట్లో -

ఆ రైసుమిల్లు ఒంటరిగా చిక్కుకుపోయినట్లు అనిపించింది.

తను కన్న రేపటికలల వెలుగుకోసం రైసుమిల్లుకేసి నడక సాగించాడు నాగరాజు.

● ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక - 6 ఆగస్టు, 1976 ●

# 40. చీకటి మంట

♦ పడాల రాములు ♦

నా శరీరం తీవ్రమైన కామ జ్వరంతో కాలిపోతూ ఉంది!

బంగళాలోని భయంకరమైన నిశ్శబ్దం... ఏకాంతం నా మనస్సుని చిత్రవధకి గురి చేస్తున్నాయి.

'అబ్బబ్బా.! ఏడీ? ఆ వెధవ ఇంకా రాడేం?"

కాలం అతిభారంగా... నిండుగర్భిణీ స్త్రీలా నత్తనడక నడుస్తోంది.

వాచీలోకి చూశాను.

రాత్రి పదయింది!

నా మెడలో తాళికట్టిన మా దొరవారికి డబ్బు సంపాదనపైన, అక్రమ సంపాదనపైన ఉన్న శ్రద్ధలో కనీసం ఒక వంతయినా.. కట్టుకున్న నామీద ఉండి ఉంటే.. నాకీ తిప్పలుండేవి కావు. నేను సాంప్రదాయికమైన కుటుంబంలోంచి వచ్చిందాన్ని గనక, యుక్తాయుక్త విచక్షణాజ్ఞానాన్ని కలిగిందాన్ని గనక.. ఇలా ఇంట్లో పడి ఉంటున్నాను. నేను గాక మరో ఆడది ఎవర్తయినా.. ఈ పాటికి ఎప్పుడో ఎవడితోనో తప్పకుండా ఉడాయించేది!

తలుపు దగ్గర అలికిడయి తలెత్తి చూశాను.

రత్తి!

"ఇంత సేపు యేంచేశావే యేడుపుగొట్టు మొహందానా!" అని బిగ్గరగా అరిచాను.

రత్తి చిన్నగా నవ్వుతూ "నారిగాడ్ని ఎంట బెట్టుకొచ్చానుండి దొర్సానమ్మగోరూ!" లేచి వెళ్ళి పర్సులోంచి ఓ పదిరూపాయల నోటు తీసి.... దాని చేతిలో పెట్టాను.

రత్తి కళ్ళు తళుక్కున మెరిశాయి!

"ఇహ నువ్వింటికెళ్ళిపో... వాణ్ణి లోపలికి పంపించు!" అన్నాను తిరిగి మంచంమీద కూర్చుంటూ.

ఓ నిమిషం గడిచింది. కాదు - నడిచింది.

నేను కన్నార్పకుండా గుమ్మంవైపే చూస్తున్నాను.

గది అవతల - అడుగుల సవ్వడి. నాలో యేదో ఆత్రుత.. యేదో అలజడి...

గుమ్మంలో నారిగాడు ప్రత్యక్షమయ్యాడు!

మనిషి నల్లగా, ఎత్తుగా, లావుగా వున్నాడు. వాడికి పాతికేళ్ళుండొచ్చు...కండలు తిరిగిన శరీరం... సన్నటి మీసకట్టు... తిరగలిరాయిలాంటి ఛాతీ... ఆడాళ్ళని మురిపించి - మైమరపించి - కోరికల్ని రెచ్చగొట్టే విగ్రహం వాడిది.

వాణ్ణి చూడగానే మత్తుగుండెని మల్లెచెండుతో కొట్టినట్టయింది.

"ఒరే నారిగా!" అని పిలిచాను మృదువుగా. నారిగాడు తలెత్తాడు.

"యేంది దొర్సానీ?" వినయంగా చేతులు కట్టుకుని అడిగాడు.

"నీతో ఓ ముఖ్యమైన పనుందిరా! ఇలా గదిలోకి రా చెప్తా" అన్నాను సాధ్యమైనంత ఆప్యాయంగా.

నారిగాడు బిత్తరపోయాడు. క్షణం తరువాత తేరుకుని "గదేంది - దొర్సానీ, నన్ను కమ్రలకు (గదిలోకి) రమ్మంటాండ్రు? నేను మాదిగోణ్ణని మర్సిపోయిండ్రా యేంది?" అన్నాడు.

"తెలుసులేరా! నేను రమ్మంటున్నాను. నువ్వు రావాలి. అంతే!" శాసిస్తున్న ధోరణిలో చెప్పాను.

నారిగాడు కదల్లేదు. శిలలా అలాగే నిలుచుండిపోయాడు, యేదో ఆలోచిస్తూ.

ఆకలైన నోటికి ఆహారం ఆమడ దూరం ఉంటే ఎలా?...

"యేమయిందిరా నీకు? తుమ్మమొద్దులాగా అల్లాగే నిలబడిపోయావేమిటి? నే నెప్పింది వినిపించలేదా?" అన్నాను గద్దిస్తున్నట్టుగా.

వాడు బెరుకుగా చూశాడు. తరువాత గదిలోపలికి అడుగుపెట్టాడు, తటపటాయిస్తూనే.

"తలుపులు మూసేసెయ్" ఆజ్ఞాపించాను.

తలుపులు మూసేశాడు.

"గడియకూడా పెట్టు" అన్నాను.

గడియ పెట్టాడు.

"నా దగ్గరికి రా!" అన్నాను. వచ్చాడు.

"ఇలా మంచం మీద కూర్చో" అన్నాను. వాడు కూర్చోలేదు.

నేను వాడి చెయ్యిపట్టి బలంగా లాగి మంచంపైన కూర్చోపెట్టాను.

గబగబా నా ఒంటిపైని చీర, జాకెట్, బ్రాసరీ పెటీకోట్ విప్పేసి...నారిగాడికేసి వాడి శరీరాన్ని నలిపేసినట్టు చూశాను. దాంతో వాడు అమాంతం నాపైన పడిపోతాడని ఆశించాను.

ఉహు! అదేం జరగలా.

వాడి కళ్ళలో భయం చోటు చేసుకుంది. వాడి కాళ్ళూ చేతుల్లో వణుకు.

"భయపడ్తున్నావుట్రా పిచ్చివాడా! మరేం ఫర్వాలేదు. రా! నా మీది కొచ్చేసెయ్" అన్నాను వెల్లకిలా పడుకుంటూ.

వాడి ఒళ్లంతటా చెమటలు పట్టేశాయి. హిస్టీరియా పేషెంట్‌లా కంపించిపోతూ "వొద్దు దొర్సానీ! గిది తప్పు. నువ్వు గీ తిర్రిపని సెయ్యొద్దు" అన్నాడు.

"ఒరే వెర్రి వెధవా! ఈ కార్యానికి అంటూ ముట్టూ వుండవురా! నీ పిరికితనంతో, పాడు నమ్మకాల్తో నన్ను చంపేస్తున్నావు గదరా...! ఇంక మాటల్సాలు గానీ త్వరగా రారా!" అన్నాను వాడి మెడచుట్టూ చేతులేస్తూ.

"అమ్మో! వొద్దు దొర్సానీ, నన్ను కరాబు జెయ్యమాకు."

నీకు సేతులెత్తి దండం బెడ్తాన. దొరగ్గిన గీ మతలాబు ఎర్కయితే (తెలిస్తే) నన్ను పానాల్తోటి ఉంచుతాడు?" చటుక్కున లేచి నిలబడ్తూ అన్నాడు వాడు.

నాకు చివ్వున కోపం పొంగుకు వచ్చింది. అయినా అతి బలవంతంగా నిగ్రహించుకుని "దొరకి తెలిస్తే నిన్ను చంపేస్తాడు. నిజమే. కానీ ఎట్లా తెలుస్తుందిరా? నేను చెప్తేగదా తెలిసేది? ఆ దేముడిమీద ఒట్టువేసి చెప్తున్నాను. ఈ విషయం నేనెవ్వరికీ చెప్పను. తెలియనివ్వను. సరేనా? ప్రస్తుతం ఇంట్లో నువ్వూ నేనూ తప్ప మరో పురుగు కూడా లేదు. మరింక బెట్టు చెయ్యకుండా రారా! నా శరీరపుతాపం తీర్చు. రా!!" అన్నాను చేతులు చాచి ఆహ్వానిస్తూ నరాల గోల భరించలేక.

"గీ పాపం నేన్జెయ్యలేను దొర్సానీ!... నాకు కూడుపెట్టే దొరకు దోఖా (ద్రోహం) సెయ్యనీకి నా మనసొప్తలేదు. నీ కాల్మొక్తత. నన్ను బల్మి(బలవంతం) సెయ్యవాకు బాంచెన్" అన్నాడు.

"ఎంత మొండి ముండా కొడుకు వీడు!" అనుకుని కసిగా పళ్ళు కొరుక్కున్నాను. రోషం, అసహనం, తహతహ, ఆర్తి అంతకంతకూ పెరిగిపోతూన్నాయి నాలో.

"ఆఖరి సారిగా అడుగుతున్నాను. వస్తవా? రావా?" వాణ్ణి తినేసేలా చూస్తూ బెదిరిస్తున్నట్టుగా అడిగాను.

"రాను దొర్సానీ! నేను రాను. నన్ను కనికెరించి సెమించుండ్రి బాంచెన్" అని ఖచ్చితంగా చెప్పేసి - ఒక్కంగలో వెళ్ళి గడియ తీసి - తలుపులు తెర్చుకుని వడివడిగా బయటికి వెళ్ళిపోయాడు.

నా బుర్ర గిర్రున తిరిగిపోయింది. నా గుండెని దబ్బనంతో గుచ్చినట్టుగా ఫీలయ్యాను. అవమానభారంతో నారక్తం మరీ వేడెక్కి వెర్రిగా మరిగిపోయింది. ఓ హరిజన పాలేరుని అడిగి భంగపడ్డానన్న నామీద నాకు జనించిన అసహ్యం నన్ను నిలువెల్లా దహించి వేసింది.

గభాలున లేచి వెళ్ళి బాత్‌రూమ్‌లోకి వెళ్ళాను.

అకస్మాత్తుగా దుఃఖం గత్తరలా ముంచుకు వచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తూ ఉండిపోయాను. ఎంతోసేపటిగ్గానీ నా దుఃఖం ఉపశమించింది కాదు.

"ఆ పాలేరు వెధవ...ఆ అంటరాని గాడిద.. నేను కోరగానే నా కోరిక తీర్చేస్తాడన్న పిచ్చినమ్మకంతో. ఎంత గ్రుడ్డిగా ఆలోచించాను!.. ఎంత వెర్రిగా వాడికి కబురుపెట్టాను. వాడు నన్ను ఎంత మూర్ఖురాల్ని చేసేసి వెళ్ళిపోయాడు.. ఏం చెయ్యాలి?.. ఇప్పుడేం చెయ్యాలి ?... ఏదో చెయ్యాలి!!

ఆలోచనలు.... ఆలోచనలు.. సొర చేపలా తినేశాయి నా మెదడుని.

పది నిమిషాల్లో ఓ నిర్ణయానికి వచ్చేశాను.

చల్లటి షవర్ నీరు నాపై చల్లగా పడుతోంది.

★ ★ ★

తెల్లవారుతూనే రత్తిని పిలిపించాను.

ఏం చెయ్యాలో.. ఎలా చెయ్యాలో....దానికి వివరంగా ఒకటికి పదిసార్లు బోధించాను. అది ముందర సంకోచించింది. భయపడింది. కానీ - నేను ఓ పచ్చనోటు అందించేసరికి.. ఒప్పేసుకుంది.

★ ★ ★

ఆ మధ్యాహ్నం..

ఎండ లోకాన్నంతటినీ తినేస్తున్న వేళ!

నేను మా డాబా మీద నిలబడి కుతూహలంగా చూడసాగాను.

మా బంగళా కవతల... పశువుల కొఠానికి ఎదురుగా... వేప చెట్టు!

ఆ వేప చెట్టుకీ జనపనార తాళ్ళతో గట్టిగా కట్టేయబడివున్నాడు నారిగాడు.!

వాడికి కుడివైపున బితుకు బితుకుమంటూ నిలుచున్న పాలేర్లు.. ..ఎడమ వైపున పులుకు పులుకున చూస్తూ రత్తి...

వాడికెదురుగా చేతిలో నల్లత్రాచులాంటి కొరడా పట్టుకుని మా దొరవారు!

ఆయన పట్టులాల్చీ, టెరికాట్ ధోవతీ ధరించారు. మెళ్ళో పులిగోరు గొలుసు వ్రేలాడుతోంది. కుడిచేతి వ్రేళ్ళకి నాలుగు, ఎడమచేతి వేళ్ళకి నాలుగు, బంగారు ఉంగరాలు జిగ జిగ మెరుస్తున్నాయి. ఆయన ఎర్రటి కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"సెప్పరా లంజాకొడకా! బటువు (ఉంగరం) దొంగిలిచ్చినవా లేదా" అని పెద్దగా అరిచారు దొరవారు.

"లేదు దొరా..! నాకు తెల్వది. నేనసలు బటువునే సూడలేదు" భయంగా చూస్తూ చెప్పాడు నారిగాడు.

దొంగతనం జేసిన మొగ లంబ్డీకొడుకు... లంజెతనం చేసిన ఆడముండ నువ్వద్దె (నిజం) జెప్తారా వుట్టిగనే అడిగితే? సెప్పరు. పెయ్యల (శరీరంలో) పులుసు జారగొడ్తే గానీ సుద్ది (విషయ) బయటికి రాదు నోట్లెకెల్లి. నీ ఈపు సాపు జేత్తేగానీ నువ్వు తొవ్వకు (దారికి) రావు. నిజం సెప్పవు. అంటూ కొరడా ఝుళిపించాడు దొరవారు.

"అమ్మ!"

ఛెళ్...ఛెళ్...ఛెళ్...కొరడా వీరంగం చేస్తోంది నారిగాడి ఒంటిమీద.

నారిగాడు "అమ్మో. అబ్బో... వామ్మో.....వామ్మో.." అంటూ అరుస్తున్నాడు. ఆక్రోశిస్తున్నాడు. హాహా కారాలు చేస్తున్నాడు. హృదయ విదారకంగా రోదిస్తున్నాడు.

వాడి శరీరమంతటా వాతలు తేల్తున్నాయి. కదుములు కడ్తున్నాయి. చెమటలు జారిపోతున్నాయి. సన్నగా రక్తపు ధారలు కారిపోతున్నాయి.

ఆ సన్నివేశం నా హృదయానికి ఎంతో హాయిని కల్గిస్తోంది.

"దొరా! నీ కాల్మొక్త దొరా! నీ బాంచెన్ దొరా! నీ గులాబోణ్ణి! దొరా! నన్ను అన్యాలంగ కొట్టుకుని దొరా! నేను సచ్చిపోత దొరా! నన్ను కొట్టకుండ్రి" భరించలేని బాధతో గోలుగోలున ఏడుస్తూనే ప్రాధేయపడ్తున్నాడు నారిగాడు.

"ఐతే సెప్పుమల్ల.. బటువు దొంగిలిచ్చి ఎవల్ల కమ్ముకున్నడో సెప్పు" కొట్టడం ఆపకుండానే అడిగాడు దొరవారు.

"సెప్త దొరా! సెప్త.. అసలేమయిందో. .బాజాప్త... సెప్త... జరూరుగ సెప్త" అన్నాడు నారిగాడు ప్రాణభీతితో. కొరడా చప్పున ఆగింది.

అంతే హఠాత్తుగా అంతా నిశ్శబ్దం అలుముకుందక్కడ.

నేను చెవులు రిక్కించాను. ఊపిరి బిగబట్టాను. అందరిలోనూ నారిగాడు ఏం చెబుతాడో నన్న ఉత్కంఠ!

నారిగాడు వెక్కి వెక్కి ఏడుస్తూనే – హీనస్వరంతో "దొరా! గిదంతా దొర్సాని.. ఎయ్యాలని నా మీదేసిన నింద.. సెయ్యాల్నని సేసిన పాత్కం.." అంటూ ప్రారంభించి గతరాత్రి జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పేశాడు.

దొరవారు పిండిబొమ్మలా అయ్యారు. పట్టువిడిన చెయ్యి కొరడా వదిలింది.

పాలేర్లు నోళ్ళు వెళ్ళబెట్టారు. రత్తి బిత్తరపోయింది. నా గుండె కడుపులోకి జారింది.

నా మెదడులో జ్వరం వచ్చినట్టయింది.

కథ ఇట్లా అడ్డం తిరుగుతుందనుకోలేదు నేను.

కొంతసేపు చీమ చిటుక్కుమన్నా వినిపిస్తోంది.

"ఈడు ఒట్టి ఝూటాకోర్... పచ్చి పుండాకోర్ దొరా! అన్నీ అబద్దాలే సెప్పిండు దొరా! సీతమ్మ తల్లంటి దొర్సాని మీద నీలాపనింద మోపుతాండు. మీ సేత తన్నులు తప్పించుకోనీకె గట్ల కట్టుకత లల్లుతుండు. నేను సాయంగా నా కండ్లతోని అంత్రాలు సూడకుంటె ఈడు ఇంకెన్ని పితూరీలు సెప్పేటోడో! దొర్సానిని ఇంకెంత బద్నామ్ జేసేటోడో!" రత్తి కంఠం ఖంగున మ్రోగింది.

నా ఒళ్ళు జలదరించింది. నా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. దొరవారిలో మెల్లిగా చలనం కలిగింది. రత్తి వంక తిరిగి అడిగిరాయన నీరసంగా "ఇగ నువ్వు సెప్పే...అసలేం జరిగిందో ఇవురంగ జెప్పు"

"నిన్న న్యాత్రి (రాత్రి) బోతాన. నారిగాడు దొర్సాని కమ్రలకు పిల్లిలెక్క జొర్రిండు. గూట్లెకెల్లి బటువు దొంగిలిచ్చి బనీను జేబులేస్కున్నడు. నేను సాటుకేలి గిదంత జూత్తనే నిలవడ్డ. ఈడు దబదబ ఇవుతలికొచ్చి సట్న బంగ్లాతల్కి పారి ఉరికిండు. పాపం! గప్పుడేమొ దొర్సాని బంగ్లామీద అర్రల నిద్రవోతాంది. నేనే వోయి ఆమెను లేపి గీ మతులాబు సెప్పాస్తిని. గివ్పుడేమో గీడు గిట్ల అవద్దం జెప్పవట్టె. దొర్సాని మానానికే మచ్చతేవట్టె... హు! గీ అల్కా జాతి ముండకొడుకు ఉత్తగ సత్తాడు?

ఆ!..." అంటూ రెండు క్షణాలాగి - "దొరా! అని కీసల (జేబులో) ఎతికియ్యండ్రి' ఆని దొంగతనం గిప్పుడే బయటవడ్తది. అని బద్మాష్‌గిరీ తెలుత్తది" చెప్పింది

నేను తేలికగా నిశ్వాసం వదిలాను. మనసులోనే రత్తికి జోహార్లర్పించాను. చక్కటి సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తున్నందుకు!!!

దొరవారి కనుసైగతో ఓ పాలేరు నారిగాడి దగ్గరికి నడిచాడు. వాడి బనియన్ జేబులో చెయ్యిపెట్టాడు.

అందరం కన్నార్పకుండా చూస్తున్నాం.

పాలేరు చేయి నారిగాడి జేబులోంచి వెలుపలికి వచ్చింది. ఆ చేతిలో ఎర్రరాయి పొదిగిన ఓ బంగారు ఉంగరం ఎండలో తళుక్కున మెరిసింది!

అందరూ మరోసారి విస్తుపోయారు దొరతో సహా!

నారిగాడు తలపైన పిడుగుపడ్డట్టుగా అదిరిపోయాడు. కాళ్ళక్రింద భూమి కదిలినట్టుగా అనుభూతించాడు. కళ్ళు విస్ఫారితం చేసి చూస్తూ - "దొరా! గిదంతను మాయ మంత్రం తీర్గున్నది. దొర్సాని, రత్తీ కల్సి నన్ను దొంగతనంల ఇరికియ్యాలంట గీ నాటక మాడింర్రు. దేవుని మీద పమానం జేసి సెప్తాన దొరా! మా అమ్మతోడు. నేను గీ బటువు దొంగతనం జెయ్యలే" అన్నాడు గద్గద స్వరంతో.

అయినా వాడిమొర ఆలకించలేదు దొరవారు. ఆయన కళ్ళు అగ్ని గోళాలయినాయి. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. పళ్ళు పటపట లాడినాయి. ఒళ్ళు వరద నదిలా ఎదురు దూకింది.

"రేయ్ దొంగ లంబ్డీ కొడకా! నా ఉప్పు దినుకుంట నాకే ద్రోహం జేస్తవులే? అన్నం బెట్టిన దొర్సాని శీలానికే కళంకం దెస్తవులే? బే నియ్యత్ లంజాకొడకా! దానికి బద్‌లా (ప్రతీకారం) ఎట్ల తీస్కోవాల్నో నాకెరికే!" ఆగ్రహావేశాల్తో ఉగ్ర నరసింహుడిలా ఊగిపోతూ గర్జించారాయన. తరువాత చివ్వున తలతిప్పి పాలేర్లవంక తిరిగిచూస్తూ - "ఈ కుక్కల కొడుకు నోట్లె బట్ట పేల్కలు గుక్కుండ్రిరా... ఆయి పెయ్యినిండా గడ్డి సుట్టుండ్రిరా. ఒసె! రత్తీలంజా! లోపట్నేలి గ్యాసు నూనె (కిరసనాయిల్) డబ్బా పట్కరా పో!" అని ఆజ్ఞాపించినారు.

నా తలని ఏదో అదృశ్యహస్తం హాయిగా నిమిరినట్టయింది.

నారిగాడి కళ్ళల్లో విపరీతమైన భయం...

ఇద్దరు పాలేర్లు నారిగాడి నోట్ల గుడ్డలు కుక్కారు. మరో నలుగురు వాడి ఒంటి నిండా.. ఎండిన వరిగడ్డి ఎత్తుగా చుట్టబెట్టారు. సన్నటి ఈతనార తాళ్ళతో గట్టిగా కట్టుకట్టారు.

నారిగాడ్ను అచ్చం చేనులో నిలబెట్టిన దిష్టిబొమ్మలా అగుపిస్తున్నాడు.

రత్తి పరుగున కిరసనాయిల్ డబ్బా తెచ్చి....దొరవారి ముందర పెట్టింది.

పాలేళ్ళందరూ ఊపిరి బిగపట్టారు.

నా కళ్ళు రెప్పవాల్చడం విస్మరించాయి.

"రేయ్! ఈ గ్యాసు నూనె ఆడిమీద కుమ్మరియ్యుండ్రిరా!" దొరవారు మరో హుకుం జారిచేశారు, లాల్చీ జేబులోంచి అగ్గిపెట్టె తీస్తూ.

ఒక పాలేరు గజగజలాడుతూనే దొరవారి ఆజ్ఞను అమలు పరిచాడు.

"ఇగ మీరందరూ మీ ఇండ్లల్ల కెళ్ళిపోండ్రిరా! గీడ జరిగింది. గీడ జూసింది మీరందరూ యాది మర్సిపోవాలె గీడనే. ఏ మాత్తరం గిది బయటకు పొక్కినా మీ పానాల్దక్కయి. మీ పెండ్లాం పిల్లలు సుత గీ భూతల్లి మీద బత్కరు అని హెచ్చరించారు దొరవారు చేత్తో పాతక్ వైపు చూపిస్తూ.

వెంటనే రత్తితో సహా అందరూ కిమ్మనకుండా నిష్క్రమించారు అక్కణ్ణుంచి.

దొరవారు పులిలా చూస్తూ.. ఓ అడుగుముందు కేసి.. గడ్డికి నిప్పంటించారు.

భగ్గున మంటలేచింది.

క్షణంలో గడ్డి అంతా అంటుకుంది.

సరసరమని కాలిపోసాగింది.

కాస్సేపట్లో మొత్తం కాలి.... మసి అయిపోయింది. వాసన..కంపువాసన... కమురు వాసన... ఆ ప్రదేశమంతటా! దట్టమైన పొగలేచి..వేపచెట్టు ఆకుల్ని నల్ల బరుస్తోంది.

ఇంతలో దభ్ మన్న శబ్దం!

నారిగాడు నేలమీద కూలిపోయాడు, నరికిన చెట్టులా.

దొరవారు... నారిగాడి శరీరాన్ని చేత్తో తాకి చూసి అలవోకగా నవ్వాడు.

నారిగాడు ప్రాణాలు అనంతవాయువుల్లో లీనమైపోయాయన్న మాట! "ఓహ్!..."

ఆనందం ఏక్‌దమ్ ఉప్పెనలా ముంచేసింది నన్ను!!

● 1978 ●

# 41. భూమి

♦ అల్లం రాజయ్య ♦

డిశంబరు నెల మొదటివారం. మొక్కజొన్న పెరడు జల్లుకొచ్చింది... తడిగట్ట కుంటె కర్రల పీసులు ఇరుకబడతాయి. ఒకవేపు వరి కోతల సీజను. మిరుపతోట ముడుత పడుతున్నది. మందుకొట్టకుంటె నోట్లే మన్నే.. ఎటుచూసినా ఊపిరి సలపనంత పని సరిగ్గా ఇలాంటి క్లిష్ట సమయంలోనే పిడుగులాంటి వార్త తెలిసింది. మా బావమరిదిని పోలీసులు అరెస్టు చేశారట.

కారణాలు ఏవైనా కనీసం చూసన్నారావాలి. గౌరమ్మ దాదాపు పిచ్చిదైపోయింది. నాకంటేముందే తయారయ్యింది. ఇద్దరం పోతే కోతలు మిగతా పనులన్ని ఎలా వెల్లుతాయి? తరువాత ఇద్దరం నెత్తినోరూ కొట్టుకున్నా లాభం లేదు. గౌరమ్మను బతిమిలాడి నచ్చచెప్పి నేను బయల్దేరాను.

మా అత్తగారి ఊరు మా ఊరికి ముప్పయి మైళ్ళు. ఇదివరకైతే మా నాన్న కాలి నడకన పోయేవాడు. మా స్థితి కొంచెం మెరుగైన తరువాత ఎడ్లబండి మీద కొన్నాళ్ళు వెళ్ళాము. ఎడ్లబండిలో కడుపుల పేగులు నోట్లెకు రావడమటుంచి ఒక్కరోజల్లా నడుకే అయ్యేది. ఈ మధ్య బస్సు వచ్చింది. ఎడ్లబండి అవస్థ తప్పిందనుకుంటే బస్సు ప్రయాణంలో ఉన్నాయి కష్టాలు....మొదట అయిదు మైళ్ళు నడిచి బస్సు స్టేజీ చేరుకోవాలి. ఆ తరువాత బస్సు ఎప్పుడు వస్తుందో భగవంతుడికే తెలియాలి. ఎదురుచూడగా వచ్చిన బస్సు రావడమే ఫికఫికలాడుతూ వస్తుంది. జొన్నచొప్ప ఒండిలో మెలిగినట్టున్న బస్సులో ఎక్కడం బహుకష్టం. తొక్కిసలాటలో బస్సు ఎక్కామంటే ఒక గండం గడిచినట్టే - ఆ తరువాత బస్సు దిగిన తరువాత మళ్ళీ నడవాలి.

ఇలా ఆలోచించుకుంటూ, ఏ వేళకు చేరుకుంటానోనని రంధిపడుతూ మా ఊరి కాలిబాటలో నడుస్తున్నాను. గాలి ఉండీ ఉండి తెరలు తెరలుగా వీస్తున్నది... గాలి ఊపుకు బాటకు రెండు పక్కలనున్న పొలాల్లోని వరి గొలుసులు రాసుకొని చాలా గమ్మత్తు సప్పుడు వినిపిస్తోంది... దూరంగా దొరగారి అందురు(పల్లపు) పొలంలో కూలోల్లు మోతలు మోస్తున్నారు... కోతలయిపోయిన దొయ్యల్లో కొన్ని పశువులు 'బరుకూ బరుకున' కొయ్యకాల్లు పీక్క తింటున్నాయి... వాటిని కాసే బింగిచెవుల పోరడు ఏదో పాట పాడుతున్నాడు.. నా నెత్తిమీద తీతువపిట్ట "కిక్కిరీకీ" అనుకుంట పల్టీలు కొడుతున్నది. షావుకారు కల్లంకాడ "తాంద్రపాపారాయుని" కథ చెబుతున్నట్టున్నది. వాని గర్జన ఉండీ ఉండీ వినిపిస్తోంది...వాని పక్క వాని భార్యలు కావచ్చు

ఇద్దరు "తపుకూ తపుకు" న బుర్రలు కొడుతున్నారు...దూరంగా దొరగారి చరిమడ్లల్లో పుల్లకోడె పుట్టజిమ్మ రంకెలు వేస్తోంది.

బాట పక్క పొలంలో బుడ్డగోచి పెట్టుకున్నోడు ఎలుక పొక్కలు తువ్వుతూ కూనిరాగం దీస్తున్నాడు.

"పొరుక పోడుగొట్టి
మరి రాళ్ళు రప్పలేరి
బంజేరు దున్నిదోకి
తెల్లజొన్న వేసుకుంటె
ఎవ్వడు వాడెవ్వడు నాది అనేటోడు?
ఎవ్వడు వాడెవ్వడు నా భూమి అనేటోడు?

నా మనసు చివుక్కుమన్నది.. ఈపాటలే జనాన్ని చెడగొడుతున్నాయి...కాకపోతే చూస్తూ చూస్తూ ఊబిల దిగడమెందుకు? దిగి నిండా కూరుకుపోయిన తరువాత పెద్దల తలవడమెందుకు? గాలికంటే వేగంగా ఇప్పుడు ఈపాటలు చుట్టుక పోతున్నాయి... తలవంచుక పన్జేసుక బతికే కూలీనాలోడు తలలు రిక్కిస్తుండు. సంఘాలు గింగాలు ఊరూరా మొలుచు కస్తున్నాయ్... వెనుకటినుండి వొచ్చే వ్యవహారాన్ని ఒక్క దెబ్బతో మారుస్తాననడం ఎవనబ్బతరం... "ఒరే ఎడ్డిముండా కొడుకుల్లాగా గాందీసొంటేడే గంగల కలిసిపోయిండంటే?" నన్ను ఎగాదిగా సూసి "గాంధో, నైరో మాకేమెరుక సదూకున్నోనివి బుద్ధిగానెం గలోనివనుకుంటే బాంచెగాన్ని బాంచెగాన్ని తీర్గనే కాళ్ళకాడ బడుండ మంటవ్... సాలు సాలు..." అని మా వూరి మాదుగ లంటారు. "తాగినోడు తాళ్ళ పన్ను కట్టుకుంటడు. కడుపునొచ్చినోడు ఓమ బుక్కుతడు. మధ్యన నాకేంది? అనుకొని నాపని నేను చూసుకుంటున్నాను. అయినా అంతరాలు ఉండొద్దంటరు. జీతాలు పెరుగా లంటరు... వీళ్ళడిగిన వన్ని పెట్టుకుంటూ పోతే దొరలకు మిగిలేది చిప్పే.... పెట్టకుంటే మొత్తం పనులు బంద్. కాదు పోదంటే పీకులాటే. దొరింటిమీదికి దండయాత్రలు, అక్కడ నరంలేని నాలుక నానా విధాలన్నట్టు - "తీసుకున్న దండుగుల కాన్నుండి, వసూలు చేసిన వంతు గొర్రెపిల్లలు" పంచుమని లొల్లి అయిన డబ్బూ, దస్కం, హోదా, అధికారం అన్నీ గల్గిన దొరలు వీళ్ళ కోర్కెలు తీర్చేందుకు వాళ్ళేమన్న పిచ్చివాళ్ళా?

మా బావమరిది గాడెందుకు సంఘంలో కలువాలె? కలుస్తే దొరలు చేతులు ముంగ బెట్టుకొని చూసుకుంటూ కూర్చుంటారా? వాళ్ళు చేసేది వాళ్ళు చేశారు. అధాలతంటే మాటలా? అధాలత్ అంటేనే అధాహాలత్ ఖతమన్నమాట. కోర్టుల్లో కేసునామనేశుని కాదు... కేసు తెగది ఇల్లు మిగలదు.. నేను మా గొరితో గిదే మాటంటే గిదే నిలవెడెత్తు లేసింది. దానికేం తెలుసు వ్యవహారమంటే "తొక్కు" నూరడమను కుంటున్నదేమొ?

క్రిందటి నెల తల్లిగారింటికి పోయి వచ్చినకాన్నుండి దానితోని మాట్లాడ వశమైత లేదు- మాటకు కారణాలు తీస్తున్నది.... అది సన్నగా అప్పుడే పాటలు పాడుతున్నది. ఇంకా నయం ఇంకో నెల అక్కడే వుంటే అన్నతో కలిసి పోయేదే?

తాచెడ్డకోతి వనమెల్ల చెరిచిందని ఊరికెనే అన్నారా? "మా బామ్మర్దిగాడు తన పరిధిలో తనుంటే గిన్ని చిక్కులు వచ్చునా?" అన్నాను ఉండబట్టలేక.

గౌరి ఆ మాట మీద అంతెత్తు ఎగిరిపడి..."ఓయబ్బో! మాదండి గ్యానవంతునివి తేలిన వయ్యో! నీ కేగ రెండాకురాల పొలం మూడెకురాల పెరడు లేకుంటే ఎరికయ్యేది. భూమున్నోనికి భూమిలేనోన్ని తిప్పలు నెత్తికెక్కాయి. కడుపు కాలినోలి కెరుక ఆకలి మంట...సదూకున్నవేమొ శాత్రపురండాలు జెప్పుతున్నవ్. నేను చెప్పుకత్త శాత్రపురండాల కేంది?'

నాకు భూముండడం నా తప్పా! ఎవరదన్నా గుంజుకున్ననా? కొంచెం మంచి భాషలో మాట్లాడితేచాలు ముసి ముసి నవ్వి మూతులు పొడుస్తుంది... గొల్లోనికే మెరుక మొగిలి పువ్వు వాసన.. ఈసారి అది నవ్వుకుంట.. నా వేపు చూస్తున్నది...

"ఎవనిభూమి కట్టకరాలే.. మా అయ్య రెక్కల కట్టం ఎరికేనా" నేను...

"మాలావు కట్టపడ్డవయ్యో! మీ అయ్య మా వోల్లు ఆడికి కూసుండి తింటండ్లా! అయ్యో గీ మురిపెం ఎన్నొద్దులు...మనకొత్తయి తిప్పలు..."

చేతులు తిప్పుతూ వెళ్లిపోయింది. ఇక దానితోని వాదించి లాభం లేదు. నేను ఏది అందామని నోరు తెరచినా అది గడగడ ఉపన్యాసం చెప్పుతుంది...

"ఏవూరు మంది పటేలా?" నా ఆలోచనలో నేను నడుస్తుండగా ఈ మాట వినబడి ఉలిక్కిపడి చుట్టూ చూశాను."

నా పక్కకు బాగా వంగిపోయిన ముసలోడు చేతిలో ఈతపగ్గం. ఆ పగ్గం ఒక కొస దున్నపోతు ముగుదాడుకున్నది. ముసలోడు బాగా వంగిపోయి వున్నాడు.. అతని చర్ముము ముడుతలు పడిపోయి ఊగుతున్నది. బుగ్గమీసాలు, నెత్తికి పాత గుడ్డపేగు చుట్టుకున్నాడు. చేతులు నరాలు తేలి పుల్లల తీరుగ వున్నాయి. ముడ్డికి బాగా మాసిపోయిన గుడ్డపేగు అక్కడక్కడ చిరిగి ఉన్నది. అదైనా బాగా పైకి ఎగగట్టి కుడివేపు చెక్కుకున్నాడు...ఆ గుడ్డపేగులో కాళ్ళు బొక్కలు తేలి పిక్కలదగ్గర వంగి పోయున్నయి. వంగిపోయిన ఎన్నుకు ఏదో కట్టుకున్నాడు. బహుష రొట్టెల మూట కాబోలు, బొక్కినోరు, నోట్లో పాచిపట్టిన రెండో మూడో పండ్లు - మనిషి ఎప్పటినుండో దరిద్రం, రోగంతోని బాధపడుతున్నట్లుగా అతని వాలకమే చెప్పుతోంది... కాని గుంటల్లాంటి కండ్లల్లో ఎక్కడో కొండంత ఆశ కనపడుతోంది... అతని పాదాలు చూశాను...డొక్కు తోలు చెప్పులకు గుడ్డపేగులు చుట్టబడి ఉన్నాయి. అరిచేతి మందాన కాళ్ళమీద దుమ్ము పేరుక పోయున్నది. అంటే దూరం నుండే వస్తునాదన్న మాట.

ఇద్దరం పక్కపక్కగా నడుస్తున్నాం... నెత్తిమీద ఎండ చురుక్కుమనిపిస్తోంది.. గాలి చాలా పలుచగా వీస్తున్నది. ముసలయ్య గెంటుతూ ఎడంకాలు దుమ్ములో ఈడుస్తూ నడుస్తున్నాడు... నాతో సమానంగా నడువలేకపోతున్నాడు. ఒక్కన్ని నడిచే బదులు తోడుంటడు కదా! అని నేను కొంచెం నడక తగ్గించాను.

"ఏవూరు మంది పటేలా" మళ్ళీ అదేమాట. ముసలయ్య నా తెల్లబట్టలు నెత్తికి నూనె దువ్వుకోవడం చూసి అలా అన్నాడు...నిజానికి నేను పటేలును కాను. పట్వారిని కాను మామూలు రైతును.

ముసలయ్య మళ్ళీ ఊరు పేరడిగిండు... నేను చెప్పాను.

"తమరి పేరేంది" ముసలయ్య.

"ఆశన్న."

ఆశన్నూశన్న అన్నదమ్ములాలా.

ఆశన్నా ఊశన్నలాలా...

దంచబోయి మిము సాత్తి కొడుకో

ఆశన్నా ఊశన్నలాలా...

ముసలయ్య బొంగురు గొంతుతో పాటెత్తుకున్నాడు. "ఈ మనిషి ఇంకా పాటలెలా పాడగలుగుతున్నాడబ్బా!" అనుకున్నాను. ముసలోడు మొత్తానికి కలుపు గోలు మనిషిలాగే కన్పిస్తున్నాడు.

"మనదేవూరు తాత?" నేనడిగాను ఎటూ తోచక.

ముసలయ్య పాటాపి నన్ను ఎగాదిగా చూసిండు. చూసి ఊరు చెప్పిండు.

నేను కొంచెం ఉలిక్కిపడ్డాను. మా బావమరిది సంగతటుంచుతే ఆ ఊరిలో ఇటీవల జరిగిన సంఘటనలు తెలిసినవాళ్ళు ఉలిక్కి పడకుండా ఉండలేరు.

"నీ పేరేంది?" నేను.

"గంగన్న -"

మేమిద్దరం మరికొంచెం దూరం నడిచాము. దున్నపోతు ఎండకు అఖర్ కొడుతున్నది. దాని నోటినుండి చొంగ కారుతున్నది. మొత్తం దున్నపోతంతా ఊగుతూ నడుస్తున్నది. ఈ మధ్యకాలంలో మా ఇద్దరికి మరికొన్ని పొడిమాటలు నడిచాయి. నన్ను గంగన్న "తమరు - పటేలా" అనడం మానుకున్నాడు. నేను అతననుకున్న "పటేలు"ను కాదని గంగన్నకు తెలిసిపోయింది.

"గంగన్న తాత గట్ల దొరింటి మీనికి కట్టుగట్టుకొని పోవడం తప్పుకాదా? పాపం, పున్నెం ఇసారం జేయద్దా? ఎనుకటినుంచి సంఘాలు లేకుంటె మనం బతుకలేదా?"

గంగన్న తాత ముఖంలో నెత్తురు చిమ్ముకొచ్చింది. పెదిమలు కొద్దిగా వణుకు తున్నాయి. ఆ ఉద్రేకంలో అతనేం మాట్లాడలేకపోయాడు.

"వాని దగ్గెర తుపాకున్నది. దొరలు తుపాకుల నెందుకు కొనుక్కుంటారు? గిసొంటి యేల్లలత్తయనే కదా! నాకెరుకలే కడుగుతున్న! అగ్గని తెలిసినప్పుడు దాన్ని ముట్టుకోవడ మెందుకు? ముట్టుకుంటె కాలదా?"

"నోరెత్తకు.." గంగన్న అరిచిండు. ఆ అరుపుకు దున్నపోతు బెదిరింది.

"ఔనయ్యా! కిందబడ్డా మీదబడ్డా! గరీబోనిదే తప్పు ఊకె సప్పుడు జెయ్యకుంట మా పల్లెలకు అగ్గిబెడితే ఒడిసిపాయె - గరిబోల్లమంత మారుత్తర మియ్యకుంట సత్తం.... పీడబాత్తది.. గరీబోడు బతికుంటే ఆనికి కడుపుంటది. కడుపుంటే ఆకలుంటంది. ఆకలయితే ఆడు తెగబడుతడు...మేం ఏ జేసినం?ఎవని కొంపల్ల చొచ్చినం? తాలూకాల మా గరీబోల్లు సభబెడితే సభకు బోయినం. ఆడకట్ట సుఖమో

నాలుగు ముచ్చెట్లిన్నంక మాకూ సంఘం బెట్టుకోవాల్ననిపిచ్చింది. సంఘం బెట్టుకున్నం. ఆ మాటకత్తె దొరలకు సంఘాలు లెవ్వా? నే జెప్పత లెక్కబెట్టు - ఆప్‌కారోల్ల సంగం - గుత్తెదార్ల సంగం, గూనకంపినీల సంగం, అడ్లగిన్నుల సంగం, మోటార్ల సంగం, అతన్‌దార్ల సంగం, సర్పంచిల సంగం, ఇంకా పట్నంలేందో సిమ్మం మూతి సంగమట - మేం గట్లనే గరీబోల్ల సంగం రైతుకూలీ సంగం బెట్టుకున్నం... ఇగ ఊరినక్కలకు కుక్కలకు మొలదారాలు దెగిపోయేటట్టు కడుపు లుబ్ధినయ్ దొరోల్లంత కుప్పగూడి, గుజులు గట్టిండ్లు - అయ్యో ఏం చెప్పాలే - మా ఊళ్ళె ఇల్లిల్లు దిర్గి పిల్లామేకా - ముసలి ముడిగే, ఆడది గీడదని సూడకుంట ఎర్రిలేసిన కుక్కలోలె కనిపిచ్చినోన్నల్ల ముల్లుగుచ్చ సందులేకుంట గొట్టిండ్లు. మా తనువులు పచ్చిపుండ్లయినయి. మా దాండ్ల నలుగురిని గడికెపట్టుక పోయిండ్లు - గడిల మట్లు బాతి కట్టేసిండ్లు - మల్ల అక్కడ దొరగొట్ట వట్టె - మేం జేసిన తప్పేందో ఇక నువ్వు చెప్పు?"

"అక్‌బార్లల్ల(పేపర్ల) గట్లరాయలేదే?" నేను..

"ఏం రాసిండ్లు! రాసినోల్లెవలు?"...

అక్‌బార్ల రాసిందేమిటో నేను చెప్పుకొచ్చాను...

ముసలోడు పండ్లు పటపట గొరికిండు....

"ఆ లంజకొడుకుల ఎవలు రాయమన్నరు గట్ల?"

"ఆళ్ళు ఒకలు రాయమంటె రాత్తరా?"

"అయితే పీక్కపోయిందేంది? అక్‌బ్యారోల్లు దొరల మనసులే అయ్యుంటరు. మీ వోల్లను దొర గడిల కట్టేసిండంటవు.... ఆ టెనుక ఏమయ్యింది?"

"ఏమయితదో అదయ్యింది? గీ దున్నపోతే ఉన్నది. గీ దీన్ని బంజేరుదొడ్లె కట్టేత్తే నేను ఎనుకులాడబోను? ఇక మనుషులే బోయినంక ఊళ్ళోందరం గిదేం అన్నాయెం దొరా అని అడుగబోయినం. దొంగకు దొంగ యావ.. దొరకు దొర యావం - ఆడనుకున్నడు ఈళ్ళంత నా గడిమీనికి ఇజ్జానికే అత్తండ్లనుకున్నడు. గట్ల మేం తలుసుకుంటె ఆడుంటదా! అహ నా కెరుకలేకడుగుత. ఉండడు. పాపం బరుపూర నిండుకుంటెనే కదా నర్సిమ్మసామి కంభాలనుంచి సెర సెర పలుగ్గొట్టుకోనచ్చి ఇరన్న కసిపుని పేగులు పీకి మెడకేసుకున్నడు. మేం గట్ల గడిదనుక పోయినమో లేదో అని తుపాకి మొరిగింది. ఏం జెప్పాలె కొడుకా సిలసిల నెత్తుర్లు గారంగ పచ్చులోలె అటిటు ఉరికినం - నీ బాంచెన్ తుపాకి దెబ్బ కాసుకోను మా వొంటిమీన బట్టపేలుక సుత లేకపాయె - బంగళా మీన్నుంచి ఒక్క తుపాకిగాదు బాంచెన్ ఆశన్నా రెండు జోడు తుపాకులు ఎటూ తోసకుంటయిపోయింది....నెత్తురుగారే తనువులు కోటుకోల్లు మొత్తుకోల్లు - నెత్తురు జూసిన కండ్లల్ల నెత్తుర్లు పొంగినయ్...గంతట్లనే పోలీసోల్ల మోటర్లచ్చినయ్.."

"లేకపోతే ఎంతమంది సచ్చెటోల్లో..."

"మేమంతా గట్లనే అనుకున్నం. ఆళ్ళచ్చి సేసిన పనేంది. పోలీసోల్లు నాయం సేయరా? కండ్ల ముంగటగింత అన్నేయం జర్గుతుంటె ఆళ్ళ సేతుల్ల తుపాకులు

ఎదరు జబాబు సెప్పయా? అనుకున్నం.. కని ఏపేరందస్తడ్ ఆశన్నగాదు, ఆశన్నా! కొడుకా! తుపాకుల కుల మొక్కటే - జాతొక్కటే - నాకనిపిత్తది తుపాకి పుట్టుడే మనసొంటోల్ల కోసం పుట్టిందేమోనని? ఏం జెప్పాలె - కారుడున్నపోతసొంటోడు గింత జరుగుతుంటె మోటర్ల కడుపుల సల్ల కదలకుంట కూకుండి పోనుగిలాసల మొత్తుకోబట్టిండు.

"పెజలాలా! పర్‌శాంతంగ ఉండాల్నె"ని -

"ఓరినీ..."

"వాని తాడు దొంగ. ఇగట్లచ్చింది కోపం జనానికి. అరికాలు మంట నెత్తికెక్కింది. ఆడికీ ఆశసావక మాదిగోల్ల సమ్మక్క అని మోటరకెదురురికింది.

"ఓ దొరా! నీ బాంచెన్ దొరా! గ బంగుల దోరే గరీబోల్లను తుపాకి వేసి సంపుతండు దొరా! మేం సప్పుడుజేయకుంటనే ఉన్నం. గబంగుల మీని దొరకు జెప్పుండ్లి దొరా!" ఓ దిక్కు తుపాకి మొరుగుతంటే - ఇంకో దిక్కు ఈడుతగదే మొత్తుకునుడు మొత్తుకో వట్టిండు సెవులు గోసిన కుక్కోలె - సమ్మవ్వ అని పక్కకురికచ్చి "ఏమోయెనయ్య తుపాకులు సేతుల బట్టుకొని.." దొర తుపాకి కాలుత్తనే వున్నడు. నీ బాంచెన్ ఆశన్నా దానికి ఇగట్లచ్చింది పూనుకం కనుగుడ్లు పెకిలించింది - ఎంటిక లిరబోసుకున్నది.... పటపట పండ్లు గొరికింది.

"ఆడిదాన్ని నాకేం కండ్లకు నెత్తురత్తంది.. తూ! మొగపుటుకబుట్టినవ్.. నీ సాతగాకుంటె గ తుపాకి నా సేతికియ్యి. నేను జూత్త ఆని సంగతి...."

"ఆడెందుకిత్తడు, ఆడెవలబంటు - ఆడే ఇచ్చెటోడయితే దొరోడు ఇంకా కాలుపు లెందుకు సాగిత్తడు.."

నా మనసు మొద్దుబారిపోయింది..

"అయ్యా! అదంటే గట్లయిందనుకున్నం... అటెన్క తెల్లబట్టలోల్లు మోటర్ల మీనచ్చిండ్లు మూతినాకుడు మాటలు మాట్లాడిండు.. "చ్చొ - చ్చొ" అన్నరు.... "అయ్యో పాపం" అన్నరు. కలం పుల్లలతోని తెల్లకాయితాల మీన ఏందేందో రాసుకున్నరు.. మాగ్గావలసింది గీ మాటలు గావే.. ఊళ్ళే ఎవ్వనికి ఏర్గవోను జాగా లేకుంట మొత్తం భూమంత దొరముడ్డికిందేసుకొని మమ్ముల కూల్లో జేసి మా నెత్తురు పిండుకుంటండు. ఆడు గంతగనం సెల్లిచ్చుకుంటండంటే ఆనికున్నది మాకు లేందేంది? ఎరికయ్యిందా భూమి..అచ్చినోల్లెవలు భూమి మాటెత్తలే...ఇచ్చుకాయ కచ్చకాయ మాటలకేం దనుకుంటే - మూడోనాడు మల్ల పోలీసోల్లచ్చిండ్లు - ఎందుకనుకున్నవ్ ఆశన్నా! మేం ఆని బంగుల మీనికి ఆన్ని సంపెటందుకు పోయినమంట - ఆడు నిచ్చంగా మా వోల్లను సంపిన మాట గంగల కల్సిపోయింది...మల్ల తన్నుకుంట గుద్దుకుంట ఎంటబెట్టుక పోయిండ్లు. మల్ల ఊరు మొకం సూడకుంట జేల్లెల్ల బెట్టిండ్లు... వానవ్వల ఓట్లప్పుడు పుచ్చిన కుక్కల తీర్గ తిర్గి ఓట్లేయించుకుని ఏకు మేకయిపోయింది. మా ఓటే గిప్పుడు బాకయింది. కచ్చీర్లు గిచ్చీర్లు అన్నీ ఆళ్ళయేనాయే." గంగన్న తాత సన్నగా వనుకుతున్నాడు - ఎండిపోయిన ఎదురు రొముల్లో అతని నెత్తురు మరుగుతోంది.

"అన్నాయేమే?"

"అన్నాయెమని అందరంటరు కొడుకా! మా బాదలు గీ మాటలకు తీరయి... ఆ యింక ఏమయిందంటే ఊరు పాడుబడిపోయింది. కాష్టాల గడ్డ తీర్గ ఎవలూ మాట్లాడరు.. ఎవడు నవ్వెరగదు. ముసలి ముతక ఆడోళ్ళు ఏం పనులు జేత్తం? ఉన్న కోండ్రల్ల ఫసల్లు నాశినమయిపోయినయ్ - మాకు సేతనయితది గనుకనా! ఆనికి కూలి జేసెటందుకు - సావనన్న సత్తంగని అని పనికి బోమనుకున్నం. అని పసురాల కాడపెండ దీసినోడు లేదు - అని ఫసల్లు కోతలు గోసినోడు లేడు...అయ్యా! ఆ కాష్టాల గడ్డల ఇంకా ఏమున్నదనో సర్కారు పోలీసోల్ల దోలిచ్చింది...ఊళ్ళే..."డేరా" లేసుకున్నరు. దొర కొట్టాలల్ల మకాములు బెట్టిండ్లు. ఇక ఆళ్ళ దుట్టుతనం నేనేం జెప్పాలె..."

గంగన్న ముఖంలో బాధను నేను చెప్పజాలను...

"అయితే గంగన్నతాత? మీవోళ్లెవలనన్నా పట్టుకపోయిండ్లా...?'

"మెల్లె గడుగుతవేంది? నా కొడుకుని..అల్లున్ని పట్టుకపోయిండ్లు..."

"నీకెందరు కొడుకులు?"

"ఎందరేడిది? ఒక్కడే కొడుకు. ఒక్కతే బిడ్డ - బిడ్డను ఉన్న ఊళ్ళనే ఇచ్చిన.."

ఇంకా మైలు దూరం నడిస్తే నేను బస్సు ఎక్కే స్టేజీ వస్తుంది. గంగన్న చెప్పిన మాటల్లో నాకెక్కడా తప్పు కనిపించలేదు... కాని ఎందుకో జనాన్ని సమర్థించలేక పోతున్నాను.

గంగన్నకు జేల్లో ఉన్న కొడుకూ, అల్లుడూ మనసులో మెదిలి వుండాలి. అతనేం మాట్లాడకుంట నడుస్తున్నాడు... అడుగులు కోపంగా పడుతున్నాయి.

కాసేపు ఇద్దరం మౌనంగా నడిచాము...దున్నపోతు ఎండకు చాలా ఆయాస పడుతోంది. ఓ పది నిమాషాలన్నా నీల్ల మడుగులో పండుకోనిది. అది నడిచే స్థితిలో లేదనిపించింది. దాని నోటినిండా నురుగు వస్తోంది.

"తాతా... దానికి నీళ్ళన్నా పెట్టరాదు... పాపం ఎండకు ఆఖరు కొడుతుంది."

"నాలుగామెడ బోవాలె. ఇది మడుగు జూసిందంటె మడుగులకు బోతది... ఇగ దాన్ని లేపవశమా."

"నాలుగామెడంటే దాదాపు ముప్పయి మైళ్ళన్నమాట... ముసలయ్య ముప్పయి మైళ్ళు నడవాలి... గడుసు పిండమే.

ఇద్దరం కలిసి కాలిబాట ప్రక్కనున్న మడుగులో దున్నపోతుకు నీళ్ళు పట్టాము. గంగన్న నీల్లల్ల దిగి దాని ఒంటిమీద నీల్లు జల్లిండు...

మళ్ళీ నడక సాగించాడు.

"గంగన్నతాత... ఊళ్ళె పోలీసోల్లున్నరంటవు - పంటలు నాశినమైపోయిన యంటవు. పనులు బందయిపోయినవంటవు... మల్ల గీ దున్నపోతునేం జేత్తవే?"

"గిట్లనే ఎల్లకాల ముంటదంటవా?"

"ఆళ్ళు తలుసుకుంటె ఉంటది..."

"మరి మేం తలుసుకోము గదా! మేం బతుకాలంటె బువ్వ గావాలె - బువ్వ గావాలంటే దున్నకుంటెట్లయిద్ది?"

"ఎవల భూమిదున్నుతరు?"

"భూమి ఎవలదేంది? గీల్లదని రాసున్నదా? అన్ని భూములు తొలిసినుకు బడ్డంక దున్నుతం..."

అమ్మో ముసలోడు చిన్నోడు గాడు .. ఇంత జరిగినంక కూడా మళ్ళీ భూములే దున్నుతనంటున్నాడు. నాకు కొంచెం గంగన్న పట్టుదల మీద ఈర్ష్య కలిగింది.

"నువ్వు మా దుంతవ్? నిన్ను దున్ననిచ్చెటోడెవడు!"

"ఏం జేత్తరు?"

గంగన్న ముఖంలో తిక్క - మాటల్లో కరుకుదనం

"ఏం జేస్తరో నేను చెప్పాల్నా? మీ వోల్లనేంజేసిండ్లు?"

జేల్లకు పట్టుకపోతరంటవు - అంతేనా?

గంగన్న ఆలోచనలో పడ్డాడు - నెత్తిరుమాలు ఊడబీకి భుజం మీదేసుకున్నడు - నెత్తి బరబర గీక్కున్నడు - అబ్బ ఇప్పటికి ముసలోని తల తిరుగుడుకు అడ్డుకట్ట వేశాననుకున్నాను..

"ఔ ఆశన్నా మనుసులకు జేల్లుంటయి నిజమే - పసురాల కేడన్న జేల్లున్నాయా?"

నాకు తెలిసినంతవరకు అలాటి యేమి లేవనుకున్నాను.. టక్కున బందెలదొడ్డి గుర్తు కొచ్చింది.

"బందెల దొడ్లుంటయిగదా!"

"ద్ధుత్తెరి..." భుజం మీది రుమాలు ఝాడిచ్చిండు

"పసురాలకున్నయన్నపు బందెలదొడ్లు - మరి నాగండ్లకేనన్న జేల్లుంటయా?"

గంగన్న వాలకం నాకు అంతుబట్టడం లేదు...

"అదిగాదు గంగన్నతాతా! నువ్వు! దున్నపోతును కొనుక్కపోతన్నవ్ నిజమే - నాగలి గడ్తవ్ నిజమే - ఏం భాగ్గెం . ఇంత కట్టపడి నువ్వు నాగలి గడ్తె నిన్ను గొంటబోయి జేల్లదోలుతరు. "

నా కంఠం నాకే వ్యంగ్యంగా వినిపించింది.

"నన్ను బట్టుకపోతే నా బిడ్డా, కోడలు దుంతరు?" ముసలి ముండాకొడుకు అసాధ్యుడే ..

"నీ కోడలును బిడ్డను జేల్లకు పట్టుకపోతరు. ."

"అయితే మా ముసల్ది నాగలిబడుతది.."

"మీ ముసలిదాన్ని పట్టుకపోతరు..."

"నా మనుమలు దున్నుతరు?"

నీ మనుమల పట్టుకపోతరు "

"దున్నపోతులే నాగలి దున్నుతయి "

"దున్నపోతుల బండెల దొడ్లె బెడుతరు..."

"నాగలి దానికదే దున్నతది..."

"నాగలికి కొత్తజేల్లు కట్టిత్తరు...."

"అప్పుడు భూమి సెరసెర సెక్కలయిద్ది... 'ఇంటన్నవా? అంతవరదనుక మేం సేతులు ముంగట బెట్టుకొని కూసుంటమా?"

నేను ముసలయ్య ముఖం చూశాను... కనుగుడ్లు పొడుచుకొచ్చినయ్- నుదురు మీద నరాలుబ్బినయ్... కండ్లల్లో మంట...ముసలి గంగయ్యనూ స్థితిలో ఎవడూ గెలవడం అసాధ్యమనిపించింది.

నేను బస్సు ఎక్కాల్సిన స్టేజీ వచ్చింది. నేను ఆగిపోయాను.

"గంగన్న తాత నిన్ను గెలవడం ఎవరికి తరంగాదు.." అన్నమాట నా అంతరంగంలో మారు మ్రోగుతోంది.

గంగన్న వెళ్ళిపోతున్నాడు. అతనెంట దున్నపోతు నడుస్తున్నది... నూర్ల యుద్ధాలు చేసిన పురాణ పురుషులు గంగన్న కాలిగోరుకు సాటిరారని నేననుకున్నాను.

నాలాంటివాళ్ళు రావాల్సిన బస్సుకోసం చాలామంది అక్కడ ఎదురు చూస్తున్నారు... గంగన్న దేనికోసం ఎదిరిచూడడు.. మేమంతా గంగన్న మార్గంలో నడిస్తే..???

● ప్రజాసాహితి మాసపత్రిక - 1978 ●

# 42. చిత్రకన్ను

♦ నందిని సిద్ధారెడ్డి ♦

పిడకల మధ్యనుంచి సన్నగా పొగలేస్తుంది.

నర్సయ్య వొడ్డె ముత్తడితో కలిసి బస్తీకెళ్ళి పందుల అమ్మకానికి గాను సొహన్‌లాల్ సేఠ్‌జీతో బేరమాడుతున్నాడు.

పరుశరాములు, అమ్మగా అమ్మగా మిగిలిన అర ఎకరం నేలా అమ్ముకొని తాగటానికి ఆకుమడచుకుని తాటిచెట్టెక్కిన ఎల్లగౌడు వంక చూస్తున్నాడు - నాగరాజం, పిల్లల్ని ఇళ్ళలోకి పంపించేసి స్కూల్లోనే టీచర్లంతా కలిసి వేసుకున్న సిండికేట్‌లో సిగరెట్ తాగుతూ కమ్మలు వేస్తున్నాడు -

సరిగ్గా అదే సమయాన -

ఆ ముగ్గురినీ కన్నతల్లి బాలవ్వ ఆయాసపడటం మానేసింది.

అదేం చిత్రమోకాని - లచ్చవ్వ పోసిన తులసి పసరు నోట్లో పడటంతోటే బాలవ్వ ఆయాసం చల్లారింది. లచ్చవ్వ పెద్దనోరు చేసుకుని ఏడవటం చుట్టు ప్రక్కల వాళ్ళకి ఆశ్చర్యంగా అనిపించి గునగునా పరిగెత్తుకొచ్చారు.

బాలవ్వ మాత్రం యెండుగడ్లో నిర్జీవంగా పడివుంది. ఈదురుగాలికి యెండుగడ్డి కిలకిల లాడ్తుంది. కానీ ణాలవ్వ మాత్రం కట్టెలా వుండిపోయింది.

★ ★ ★

ఏడు గంటలయి చీకటి పడ్డప్పుడు ఓ నిర్ణయానికొచ్చాడు నర్సయ్య. తన అవ్వ యెన్నోసార్లు తనకి బతిమాలి చెప్పేది. "నేను సచ్చిపోయినంక నన్ను పాతిపెట్టకుండ్రి. కాలెయ్యిండ్రిరా. ఆఖరుకు నా దగ్గరి బంగారం పెట్టైనా సరే" అని చేతిలో చేయికూడా వేయించుకుంది.

కట్టె కొట్టటానికి, డప్పు కొట్టడానికి మాదిగల్ని పిలిపించుక రమ్మని వొడ్డె ముత్తడ్ని పంపాడు నర్సయ్య.

అప్పుడే నలుగరు పెద్దమనుషులు శవం దగ్గరికి చేరారు. ఇద్దరు మాదిగ పెద్దలు వచ్చారు. గోచీ, రుమాళ్ళు తప్ప అంగీల్లేవా యిద్దరికీ. "ఎంత తీస్కుంటర్రా" అడక్కూడదనీ, కొంచెం ఎక్కువే ఇవ్వాలనీ తెలిసినా నర్సయ్య పీసుగా అడిగాడు.

"గదే రెండుపన్లకి ఎనుభై రూపాయలియ్యిండ్రి " అన్నాడు మీసాలతను పరుశరాములు గోడకు చేరగిలబడి నిల్చున్నాడు తప్ప ఏమీ మాట్లాడ్డంలేదు. "ఇరవై రూపాయలిత్త' అని ఓ నిమిషం గడవకముందే "ఏమంటర్రా అన్నాడు నరసయ్య

"మేం జెయ్యం, మావోడింక తక్కువడిగిండు. ఎనుభైకేం తక్కువవున్నా, ఉహు, మేం జెయ్యం." అన్నాడు ఎర్ర రుమాలతను

"ఎందుకు జేత్తర్రా?" కనరెక్కిందిరా మాదుగులకు. ఇర్వయిత్తనంటె గూడ ఒల్లనని నీల్గుతాండ్రు. నీయవ్వ..." నర్సయ్య మాట్లాడ్తొంటే ఆ నోట్లోంచి తుంపర పడుతోంది పెద్ద మనుషుల్లో వున్న పోలీస్ పటేల్ కూడా ఏమనలేదు.

"ఇర్వయా? త్చూ .. తెనుగోడిచ్చిండు యాభయి అంతకంటె అద్వానమా ధూ . నీ వొంశమే గంత" మీసాలతను కోపం పెట్రేగిపోతున్నట్లన్నాడు.

"ఉంచుతావురా నేనింత అగ్గువైనానురా పోని - అయితే అయితిగని ముప్పయికి జెయ్యిండ్రి?"

మాదిగల్ని నర్సయ్య చావుకాడ బేరమాడుతున్నందుకు చుట్టూ గుమి గూడుతున్న వాళ్ళు ఆయన పిసినారితనాన్ని తిట్టుకొంటున్నారు.

నలుగురు పెద్దల్లో పోలీస్‌పటేల్ వుండబట్టలేక సారా తెప్పించుకు తాగు తున్నాడు. పక్కన్నే మస్కూరీ నిలబడి గ్లాసులో వంచిస్తున్నాడు. ఇద్ద రేమన్లేదు.

మిగిలిన పెద్దే సర్పంచు

ఆయన మాదిగలని సముదాయించబోయి "యాభై"కి వొప్పుకో మన్నాడు.

ఎర్ర రుమాలతను సర్పంచువంక తిరిగి విషయమంతా ఏకరువు పెట్టసాగాడు.

"కాదు పటేలా ఈయినకేమయిందని ముప్పయిత్తడు. యాభయిత్తడు. కులం తక్కువోడా? లేనోడా? ఇంటినిండ పైసలెట్కోని. .పోనీ మీ అసోంటోళ్ళకు మొఖం జూసన్న యాభయికో అరవైకో జేత్తం. ఎందుకని? అందినంత మీ దగ్గరతింటనే వున్నం. ఈ పీసోని దగ్గర తుసురంతన్న దిన్నమా మమ్మల్ని దోస్కోకపోతెజాలు. ఇన్ని లగ్గాలు జేసుకున్నరు. ఒక్క లగ్గానికన్న పిలిసింత పెట్టిండ్రా. ఇన్ని పంటలు ఓసుకున్నరు. ఇన్ని కల్లాలయినయి. కల్లం కాడికి పోతే ఒక్కసారన్న ఒక్కిత్తన్న పెట్టిండా మాతోని పని జేయించుకుంటె బిచ్చం పెట్టవడ్తదని చెప్పులు గూడ వాళ్ళే ముడుసుకునిరి పగ్గాలు పేనుకునిరి మాకేం లాభపడ్డరు? తెనుగోళ్ళక్కర కొస్తరు కుమ్మరోళ్ళ క్కరకొస్తరు ..యీనె దేనికక్కరకొస్తడు??? నాల్గు బర్రెలు పాలిత్తన్నయని సల్లకు వోతె పైసలిత్తెనే పొత్తనన్నదట ఈనె పెండ్లాం. పోని, పైసలు దీస్కోనన్న సల్ల పోసిందా వుత్తనీళ్ళు పోసింది. తల్సుకుంటె కండ్లకు నెత్తురొస్తది. మాదే ఆండ్లనో. ఇండ్లనో...దోసుకున్నడు. ఖర్సయిద్దనేగాదు పటేలా యిన్ని సావులయితే బొంద పెట్టిండ్రుగని, ఒక్కటన్న కాష్ఠం పెట్టిండ్రా కనీస్రం. ఇసోంటోళ్ళూరిల వుండెందుకు? వుండి దండుగ మన్సులు .."

వాడి నోట్లోంచి దూకుతున్న మాటలకి ఆనకట్ట లేకుండా పోయింది. నర్సయ్య కెన్నడూ రానంత కోపం వచ్చింది రబ్బరు బుగ్గలో గాలిలానిండి వుబ్బిపోయాడు నర్సయ్య ధన్‌మని పగిలినట్లు విరుచకపడ్డాడు మాదిగలమీద

"లంజకొడ్కులు ఏంద్రా. ఏమంటాండ్రూ... తన్నుండ్రి. ఎట్లంటండ్రో సిగ్గులేదు. తన్నుండ్రి. నీ యవ్వ నేనెందుకు పెడ్త. నాగ్గిట్ట పుట్టిన్రా కొడుకులు!"

పెద్దల సమాధాన పరిచే మాటలు ఎవరూ చెవిస బెట్టదలచుకోలేదు.

మీసాలతను, ఎర్రరుమాలతను విడివిడిగా నర్సయ్యను తిడుతున్నారు.

పరుశరాములు మాత్రం పాతగోడకొరిగి కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. "నీకు పుట్టాలంటవ్ లే మల్లగినంటే తంతం ఎక్కువోనివై తెనుక సీరికొడుకా.. పైసుంటె నెత్తిల వెట్టుకోని ఊరేగుగని గంతమాట ఎట్లొచ్చింది నీ నోటికి - మాకస్టం దిన్నవ్. మమ్ముల దోసుకతిన్నవ్ మిత్తీలకిచ్చి. నాగులకిచ్చి, ముమ్ముల ముంచి నువ్వు లేసినవ్. మాగ్గిట్ట పుట్టినవనుకో వన్నార నిన్ను."

లచ్చవ్వ బయటకొచ్చింది శవం దగ్గర్నుంచి లేచి.

నలుగుట్లో పడి నాలుగు మాటలనాలని నోరిడిసి పెట్టింది.

లచ్చవ్వ, నర్సయ్య ఒక పక్షం-

ఎర్రరుమాలతను, మీసాలతను ఒకపక్షం-

బూతులు తిట్టుకుంటున్నారు. మధ్యస్థులు నోరుమూసుకుని చూస్తున్నారు.

నర్సయ్య తన్నటానికన్నట్లు వాళ్ళ మీదికి ఉరకబోయాడు. పెద్దమనుషులు నర్సయ్యను ఆపి లాక్కొస్తున్నారు. పెద్ద మనుషులు దెబ్బలు పడకముందే అలా ఆగబడతారని తెలిసుండబట్టే నర్సయ్య మాటిమాటికీ ముందుకు ఉరుకుతున్నాడు.

అక్కడ అల్లరిజోరైంది.

పొయిలో పడ్డ ఉప్పురాళ్ళలా చిటపట లాడ్తున్నాయి మాటలు.

అప్పుడు నాగరాజం దిగాడు.

అక్కడ వాతావరణం బాగాలేదనీ, కలిగించుకుంటే డబ్బు మీద ఒరుగుతుందేమో నని అర్థం చేసుకుని "ఓ అవ్వా, నా అవ్వా నువ్వెట్లపోతివే ఓ అవ్వా" అని పెద్దగా ఏడుస్తూ (గాడిద ఓండ్ర పెడుతున్నట్టుంది కొందరికి) శవం దగ్గరికి పరిగెత్తాడు.

శవం దగ్గరి జనమంతా గొడవ దగ్గరికి చేరారు.

పెద్ద మనుషులన్న యాభైకి పైసెక్కు వియ్యననే నర్సయ్యా, ఎనుభైకి వొక్కపైస తక్కువైనా కూడ పనిజెయ్యమన్న మాదిగలూ, అసలు విషయం గంగ మధ్యలో వొదిలేసి తిట్లు చల్లుకుంటున్నారు.

కూర్చున్న వాళ్ళంతా యెంత జోక్యం చేసుకున్నా యెవరూ తిట్లు మానలేదు.

విచిత్రమైన కేసే అది.

ఆ కేసు నెలా పరిష్కారం చెయ్యాలో, ఆ నలుగురు పెద్దలకీ అర్థంకాలేదు. నలుగుర్లో సర్పంచు, పోలీసు పటేలుకూడా వున్నారు. వాళ్ళు సీసాలోని సారా గ్లాసులో వంచుకుని అంతమంది ముందు సిగ్గుపడకుండా తాగేస్తున్నారు.

పెద్దల కర్థంకానిది లచ్చవ్వ కర్థమైంది.

తన పరిష్కారం అందరికీ వినబడేటట్లు నర్సయ్యతో చెప్పేసింది.

"వాళ్ళతోనేంది? వాళ్ళ సావు వాళ్ళు పడతరు మనకు సింతలున్నయి - దేవుడిచ్చిన సేతులున్నయి - మనమే కట్టెలు గొట్టుకోని మనమే కాష్ఠం పేర్చుకుంటె పోదా?? పా ఎనుబై ఇచ్చి గాళ్ళతోటేంది? మనం జేసుకుంటె జెర సేపట్లయితది. పోదాం పా" నర్సయ్యకు లచ్చవ్వ చెప్పింది బాగా నచ్చింది అంత గొప్ప ఆలోచన తనకు రానందుకు బాధపడ్డాడు

"ఆc కాపు బిడ్డ జెప్తంది గద - గట్ల జేసుకోండ్రి. శినకదరుంటది. పైసకు పది ముళ్ళేసేటోళ్ళు మీకెందుకి సోంటియి?" అనుకుంటూ మాదిగలిద్దరూ వెళ్ళి పోయారు.

నలుగురు పెద్దలూ, కూడిన ఆ మందీ ఆ నిర్ణయానికి చెవులు మూసుకొని వెళ్ళిపోక తప్పలేదు.

మంది మాత్రం లచ్చవ్వ పనికి తలా ఓ రకంగా తిట్టుకున్నారు.

"ఎంత పైసుంటే ఏం పలం? బుద్ధులుండాలెగని", 'ఇంతకన్న పీనుగుల్నయం".

జనం శూన్యమైంది.

శవం మాత్రం మిగిలింది.

శవంమీద పడి ఏడ్చే నాగరాజం.

గోడ కారిగి నిద్రపోతున్న పరుశరాములూ.

తల్లి పక్కన అదే పనిగ ఏడ్చే బిడ్డా, మిగిలారు.

మధ్యరాత్రి కాలేదింకా.

గొడ్డళ్ళు పట్టుకుని నర్సయ్య, లచ్చవ్వ, కొడుకు శంకర్రెడ్డి, వొడ్డె ముత్తడూ కలిసి వెళ్ళారు.

విసుగ్గా వచ్చే మాదిగ పెద్దల వంక మిగతా మాదిగలు ఎదురొచ్చేరు.

జరిగింది విని ఆలోచిస్తూ గుడిసెలవైపు నడుస్తున్నారు

"గిదే జరిగితే ఒకల్ని జూసొగలు, ఒగల్ని జూసొకలు, అందరూ వాళ్ళకు వాళ్ళే చావు జరుపుకుంటరు. " అన్నాడొకతను. అందరి జీవితాలకూ హెచ్చరికలా వుండా మాట

"జరిగితే - అటెనుక మనకు దొప్పకూడా దొరకది ఇప్పటికే తిండికిట్ల జస్తంటే ఇంక ఈ యింత అసరా పోతే ఏం దొరుకుతది?" మీసాలతను నిర్ణయం చెప్పేశాడు.

గాలి వీచినపుడు కదలిపోయిన ఆకుల్లా కదిలి కదిలి వాళ్ళంతా ఎందుకో ఒకరి ముఖాలొకరు చూసుకొన్నారు.

తెల్లారే వేళకి నర్సయ్య వాళ్ళు కాష్ఠం పేర్చి ఇంటికొచ్చారు. పాడె కట్టి తమ్మలిడప్పని పిలిచారు.

నలుగురు పెద్దలు రాలేదు. జనమెవరికీ రా బుద్ధేయలేదు.

పరుశరాములు, తలకొరివి పెట్టడానికి ఏదో కుండ ఒకచేత్తో, పొగనికక్కే కొఱ్ఱాయిని ఒక చేత్తో పట్టుకుని నించున్నాడు.

సూర్యుడు మెల్లిగా తొంగి చూస్తున్నాడు.

పాడెకు మూడో పక్క శంకర్రెడ్డి, మరి నాలుగో పక్క?'?

ఆడవాళ్లు పట్టకూడదు. "ఎలా?" నర్సయ్య చుట్టూ చూశాడు. కనుచూపు మేరలో ఎవరూ లేరు. ఒక్క వొడ్డె ముత్తడు తప్ప-

నాలుగో పక్క వొడ్డె ముత్తడి చేత పట్టించక తప్పలేదు!!

తమ్మలి డప్పు మోగుతోంది.

తల దగ్గర పిడకల్లోంచి పొగ వస్తోంది.

పాడె లేచింది.

సొన్నాయిల్లేని లోటు బిడ్డ సాగించే ఏడుపు తీరుస్తుంది.

పాడెలో బాలవ్వ శవం మీదుగా తెల్లటి మబ్బులు తేలిపోతున్నాయి.

బాలవ్వ తన జీవితంలో అందరిలా కాకుండా చాలా ప్రత్యేకమైన కలలు కన్నది. వింతకోరికలే కోరుకుంది. అవన్నీ కేవలం తన చావుగురించే -

"నలుగురు కొడుకుల్ని కనాలనుకుంది కనీసం. తన పాడె నాలుగుదిక్కులూ కొడుకులే మోయాలని!" ముందు ఆడపిల్ల పుడితే ఎంతో బాధపడిపోయింది.

తర్వాతర్వాత "తను చచ్చిపోతే ఏడవటానికి ఆ ఒక్కత్తే పనికొస్తుందిలే" అని సరిపెట్టుకుంది.

బిడ్డ తర్వాత వరుసగా ముగ్గురూ కొడుకులే పుడితే కొండను తవ్వేశానన్నంత సంతోషపడింది.

అంతలోకే పెద్ద ఘోరం జరిగిపోయింది.

మొగుడు చనిపోయాడు.

నాలుగో కొడుకు నివ్వకుండానే చనిపోయినందుకు ఆ మొగుడ్ని తను చనిపోయేవరకు రోజూ తిట్టుకుంది

నిశ్శబ్దంగా వెళుతోంది శవం.

వీధుల్లోకి వచ్చి కట్టలు కట్టలుగా గుమికూడి చూస్తున్నారు జనం.

అంతేకానీ - వెనక ఎవరూ వెళ్ళటం లేదు.

శవంమీద చల్లిన పేలాలు బాలవ్వమీద పడకుండానే గాలిలోకి తేలిపోతున్నాయి. కిందపడ్డ పేలాల మీంచి కొడుకులు నడిచి వెళ్తున్నారు.

"బాలవ్వకి బంగారంమీద, డబ్బుమీద పెద్ద మోజుండేది. భూమ్మీది డబ్బూ, బంగారమంతా తన ఇంట్లో చేరితే బాగుండేదన్నంత పిచ్చిగా ఉండేది. తను చస్తే ఏడుపైనా ఏడుస్తుందని బిడ్డనీ తల్లికి తలకొరివి పెట్టడానికి పనికొస్తాడని చిన్న కొడుకునీ తప్ప - మిగతా ఏ కొడుకునీ అంత ప్రేమగా చూల్లేదు. నిజానికి ప్రేమ వొలకబోస్తూ కూర్చుంటే డబ్బెలా కూడుతుంది. డబ్బు కూడందే తన "చావు" బాగా ఎలా జరుగుతుంది?? ఆ ఉద్దేశ్యంతోనే మొగుడ్ని కూడా ఒక్క నిమిషం కొడుకుల్ని ముద్దాడనివ్వలేదు.

బాలవ్వ కాపురానికొచ్చేనాటికి తన మొగుడు నాగమల్లయ్యకి ఎకరం నేలా. చిన్న మిద్దే వుండేది?

(కాన్సరొచ్చి) చావు పుండు కార్నెల్లు నిండి తన నాగమల్లయ్య చనిపోయేనాటికి బాలవ్వ చేతులో ఇరవయి తులాల బంగారము, ఎనభై ఎకరాల నేల, రెండు కూరగాయ తోటలు, ఊరి అప్పు ఖాతాల కాగితాలు దక్కాయి.

అనవసర ఖర్చని తన మొగుడి శవాన్ని కాలేయలేదు. కొడుకుల్తో ఎత్తించి బొంద పెట్టింది కానీ-? తను మాత్రం తన శవం మాత్రం తప్పక కాలేయించుకోవాలనుకుంది కాష్ఠంలోనే తను

"అందుకే బంగారం. .డబ్బు ..

బిగదీసి కట్టిన నారపోచల మధ్యనుంచి తెల్లగుడ్డ గాలికి రెపరెపలాడుతోంది. బాలవ్వ చనిపోయిన కలలాగే -

అతి నిశ్శబ్దంగా నడుస్తోంది శవం.

ఊరు దాటిన అయిదో గజానికే బిడ్డ ఏడవటం మానేసినట్టుంది. కాష్ఠానికి కాస్త దూరంగా పాడె దించారు

దింపుడు గల్లం చేశారు తమ్మలివాడే పూజ చేసి నీళ్లు చల్లేడు.

బాలవ్వ పెయిమీద గంటీలు తీయాలన్నారు.

బలిమిగా లాగాడు నర్సయ్య. చెవి రంధ్రాలు నిశ్శబ్దంగానే తెగిపోయాయి.

"గంటీలు నాకే రావాలె" అన్నది బిడ్డ.

"ఖర్చు మేం పెడతన్నం. మాకే చెందుతయి" అన్నాది లచ్చవ్వ.

ఇద్దరి మధ్యా తిట్లూ, వాదాలూ జరిగాయి.

పరుశరాములు, నాగరాజం అక్కవైపే వాదించడంతో నర్సయ్య చేతిలోంచి గంటీలు స్థలమార్పు జరిగి ఆడబిడ్డ చేతిలోకి చేరక తప్పలేదు.

పాడె మళ్ళీ లేచింది.

తమ్మలి డప్పు మళ్ళీ మ్రోగింది. శవం ముందుకుసాగింది.

అడుగులు తడబడుతున్నాయి. ఆగిపోయాయి

పరుశరాములు ఆశ్చర్యపోయాడు. తమ్మలి ఆశ్చర్యపోయాడు.

పాడె మోస్తున్న నలుగురూ వెనకాతల వచ్చిన ఆడవాళ్లిద్దరూ... ఆ కళ్ళన్నీ ఆశ్చర్యపోయాయి

శవాన్ని మోస్తున్న నర్సయ్య తనే శవమైపోయినట్టున్నాడు.

ఆ కాష్ఠం -

కష్టపడిన పేర్చిన కాష్ఠం-

రాత్రి నిద్ర లేకుండా పేర్చిన కాష్ఠం-

ఏమైందోగాని అక్కడంతా బూడిద మాత్రం ఉంది

శవంకోసం పేర్చిన కాష్ఠం శవం రాకముందే కాలిపోయినట్లు ఆ బూడిద సాక్ష్యం చెబుతోంది.

నర్సయ్యకు ఏడుపొచ్చింది లచ్చవ్వకు మల్లే -

పొడె దిగింది.

నర్సయ్యకు కోపమొచ్చింది సూర్యుడికి మల్లే.

మంటల్లాంటి గీతలు కళ్ళల్లో ఏర్పడ్డంతోటే చెట్లు విరిచేస్తున్నట్లు పళ్ళు ఫెళ ఫెళ మన్నాయి.

"లంజ కొడుకుల సంగతి.. చెప్త" మనసు ఏమంటుందో కాని నర్సయ్య కాళ్ళు మాత్రం భయంకరంగా వెనుదిరిగాయి.

మాదిగిండ్ల వైపు భూకంపంలా వెళుతున్నాడు నర్సయ్య.

చింతచెట్టు కింద నిలబడి చుట్టూ చూసేడు. నిశ్శబ్దంగా వుంది. దూరంగా ఓ గుడిసె దగ్గర నలుగురయిదుగురు కూచుని వున్నారు. పేలుతున్న ఫిరంగుల్లా అడుగులేస్తూ వాళ్లవైపుకు నడిచాడు.

"రాజాలూ" కాసేపాగి "మీరన్నంత యిత్తగని జెర జల్ది రాండ్రి" చింతచెట్టు నీడకు చల్లబడ్డట్టు చాలా చల్లగా మాట్లాడేడు.

వాళ్లు మరో మాటనలేదు. అందర్నీ పిలుచుకుని లేచారు గొడ్డళ్ళతో సహా - నర్సయ్య లొంగిపోవడం మాదిగలకు సంతోషంగా ఉంది.

చింతల్లో కట్టె కొట్టేస్తున్నారు.

చాలా హుషారుగా గాలికి ఊగే కొమ్మల్లా ఊగుతూ టకటకా పనిచేస్తున్నారు. పెరిగిన కొండను ఎక్కేసినంత సంతోషం వాళ్ళని హుషారుగా పనిచేయిస్తోంది.

ఆడాళ్ళు పొడె చుట్టూ కూర్చున్నారు.

ఆడది కాకపోయినా ఆడాళ్ళ మధ్య శవం దగ్గరే కూర్చున్నాడు నాగరాజం.

పరుశరాములు దూరంగా వెళ్ళి తాటి చెట్టుకింద కూచుని ఎటో చూస్తున్నాడు.

నర్సయ్యా, ముత్తడు మంగపొద దగ్గర మాట్లాడుకుంటున్నారు.

చూస్తున్నంత సేపట్లోనే కాష్ఠం పేర్చటం పూర్తయిపోయింది.

అందరూ కాష్ఠం వద్దకి చేరారు.

ముత్తడు మాత్రం రాలేదు. ఎటో వెళ్ళినట్టున్నాడు.

మగవాళ్ళంతా అక్కడే ఉన్నట్టుగా చాలామందున్నారు మాదిగలు.

పొడె లేచింది.

పొడెలోన బాలవ్వ లేచింది. కాట్లో పడుకోబెట్టబడింది.

బాలవ్వ మీద కట్టెలు పేర్చుతున్నారు అందరూ కలిసి.

పెద్ద పెద్ద మొద్దులు తెచ్చి బాలవ్వ మీద పెడుతుంటే చాన్నాళ్ళ కసినంతా తీర్చుకుంటున్నట్లు హుషారుగా అన్పించింది మాదిగవాళ్ళకు!!

పరుశరాములు చిల్లుల కుండలో కాష్ఠం చుట్టూ తిరిగి ఎడంచెత్తో కొరివిపెట్టెడు. సాగబారుతున్న కష్ఠంమీద మీసాలతను కిరోసిన్ వెదజల్లుతుంటే "మంట" సప్పన లేస్తోంది.

ఎందుకో మాదిగలు చాలా సంతోషంగా కనిపిస్తున్నారు.

బాలవ్వ చాలావరకు కాలిపోయింది.

నర్సయ్య వాళ్ళు అందరూ స్నానాలు చేయడానికి బావివైపు వెళ్ళారు.

బీడీ కాల్చుతూ వచ్చిన వొడ్డె ముత్తడు నర్సయ్య కోసం వాళ్ళనడిగి బావివైపు వెళ్ళిపోయాడు.

తృప్తిని చప్పరిస్తూ, హుషారును మింగుతూ మాదిగలు ఊరి మొఖాన నడిచారు.

వాళ్ళ పోరలు కొందరు ఏడుస్తూ, రొప్పుకుంటూ పరిగెత్తుతూ ఎదురొస్తున్నారు.

"ఏమైందిరా.." అన్నాడు ఎర్ర రుమాలతను, అతనితోపాటు మరో ఇద్దరూ అదే అడిగారు.

"మంట...." అని అస్పష్టంగా వెక్కిళ్ళు పడుతూ ఏడుస్తూ అంటున్నారా పోరలు. అంతకంటె ఏమీ చెప్పటంలేదు.

కాదు జరిగింది చెప్పటానికి ఆ అమాయకత్వానికి నోరు రావటం లేదు.

మీసాలతను మరికొందరు గాభరా పడుతూ పరిగెత్తారు.

ముసలాళ్ళు పరుగుతో ఊహలుపోతూ నడిచారు.

పరిగెత్తుతున్న ఆ కళ్ళు ఆత్రంగా ఉన్నాయ్.

తీరా వచ్చి గుడిసెల్ని చూసిన ఆ కళ్లు అట్టే ఆగిపోయాయి.

కళ్ళు కొయ్యబారి చూస్తున్నాయి.

వాళ్ల ఒక్కొక్కరికీ ఒక్కొక్క కాష్ఠం ఎదురుగా రగులుతూ కన్పించింది.

● ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక - 3 ఆగస్టు, 1979 ●

# 43. పాఠశాల

♦ రామాచంద్రమౌళి ♦

ఆ రోజు కూడా ఆఫీసునుంచి యింటికి రాగానే అదే దృశ్యం కనిపించింది మళ్ళీ.

పిల్లలు గుంపుగా ఆ మూలకు చేరి తదేకంగా కళ్ళనిండా ఉత్సుకతను నింపుకుని చూస్తున్నారు. పిచ్చుకలు ఎగురుతూ కొత్తగా కట్టుకుంటున్న గూటిలో ఓ క్షణం సేపు కూర్చుంటూ....మళ్ళీ ఎగురుతూ కిచకిచ చప్పుళ్ళతో కితకితలు పెడుతున్నాయి. పిల్లలకు వాటిని చూస్తూ ఆనందపడడం వ్యాపకమైపోతోంది.

ప్రక్కనే ఖాళీ కుర్చీలలో బోర్లించిన పుస్తకాలున్నాయి.

నాల్గయిదు రోజులనుంచి వరుసగా చూస్తున్నాను నేను ఈ తతంగాన్ని.

ఇదివరకు నేను ఆఫీసునుంచి యింటి కొచ్చేవరకు ముగ్గురు పిల్లలూ బడినుంచి వచ్చేసి చక్కగా కాళ్ళూ చేతులూ కడుక్కుని బుద్ధిగా చదువుకుంటూ కనిపించేవాళ్ళు. చదువుపైన వాళ్ళు కనబరుస్తున్న శ్రద్ధను చూచి ఆనందించాను.

కాని...దాదాపు ఓ వారం క్రితం...ఎక్కడినుంచి వచ్చాయో రెండు పిచ్చుకలు... ముందు గదిలో ఓ మూలనున్న వెంటిలేటర్ గూట్లో చేరి ముక్కులతో గడ్డిపోచలను చేరవేయడం ప్రారంభించేయి. మొదటిరోజు ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు నేను. మరునాడు పిల్లలు బడినుంచి రాగానే పుస్తకాలనక్కడ పారేసి పిచ్చుకల వెంట పడ్డారు అవి ఎగరడం....వీళ్ళు కేరింతలు కొట్టడం...ఇంటినిండా ఎండు గడ్డి పరకలు పడి....మా ఆవిడ వూడ్వలేక విసుక్కోవడం - ఈ గోల మొదలైంది. సాయంకాలం పిల్లలు చదువుకోవడం పూర్తిగా బందైపోయింది. నేను కాస్త గదమాయిస్తే ఏదో పుస్తకాలను ముందేసు క్కూర్చుంటున్నారు. కాని చూపులూ, మనసు మాత్రం పిచ్చుకల గూడు మీదే. పిల్లల హృదయంనిండా పిచ్చుకల ప్రపంచం వ్యాపించింది.

ఒకటి..రెండు..మూడు - యిలా వారంరోజులు గడిచేసరికి...

పిచ్చుకలు తమ గూటిని శాశ్వత ప్రాతిపదికపైన పూర్తి చేసుకున్నాయి. పిల్లలు పిచ్చుకాభిమానులై చదువును అశ్రద్ధ చేస్తున్నారు -

ఇప్పుడు....ఇవాళ కూడా ఆఫీస్‌నుంచి రాగానే.

ఇదిగో మళ్ళీ యిదే కథ.

"ఒరే వెధవలూ...ఎప్పుడూ ఏమిట్రా ఆ పిచ్చుకలతో... వెళ్లి చదువుకోండి.. పోండి..." అని అరిచి సైకిల్‌ను లోపలపెడ్తూ -

శ్రీమతి చేతిలో చీపురుతో వస్తోంది వస్తూ గుమ్మంలో నన్ను చూచి "అబ్బబ్బ - ఈ పిట్టలనూ, ఈ పిల్లలనూ నే భరించలేనండి. ఇంటి నిండా వీటితో చెత్త - వీళ్ళతో అల్లరి - కిష్కింధలో ఉన్నట్టుంది వీళ్ళతో" - అని అంటూ... నేలపై పడ్డ గడ్డిపోచలను ఊడుస్తూంది.

పిల్లల వంక చూశాను కోపంగా.

ముగ్గురూ మౌనంగా తలలు వంచుకుని పుస్తకాల్లోకి చూస్తూ చదువు నటిస్తున్నారు.

తలెత్తి వెంటిలేటర్‌లోకి చూస్తే-

పిచ్చుకలు కిచకిచా స్వచ్ఛంగా...అమాయకంగా... నిర్మలంగా... అరుస్తున్నాయి.

లోపలికి వెళ్ళి కూర్చుని కాఫీ త్రాగుతూ...

"వీళ్ళు అసలే చదువుకోవడం లేదండీ... మీరటు వెళ్ళగానే ఆ పిచ్చుకల లోకంలోకే వెళ్తారు. ఇలా వీళ్ళిక నెలరోజులుంటే యిక పరీక్షలు రాసినట్టే..." అని మా ఆవిడ గొణుగుతూ -

"మరి ఆ పిచ్చుకల గూడును పీకేస్తే -

"ఊ...అలాంటిదే ఏదో చేయాలి. లేకుంటే పిల్లలు పాడైపోయేట్టున్నారు" అంటూ వెళ్ళిపోయింది లోపలికి -

మరునాడు-

ఆఫీసుకు వెళ్లొచ్చి యింకా ఆశ్చర్యపోయాను నేను ఎదురుగా జరుగుతున్నదాన్ని చూచి.

వెంటిలేటర్‌లోకి నిచ్చెనను వేసుకుని నా శ్రీమతి పై మెట్టుదాకా ఎక్కి గూట్లోకి తొంగిచూస్తూ... పసిదానిలా కేరింతలు కొడ్తూ "గట్టిగా పట్టుకోండర్రా నిచ్చెనను ఊం.. ఒకటీ...రెండూ...మూడూ...ఊం...అంతే యిక...మొత్తం మూడు గుడ్లు వున్నాయర్రా. వీటిని పిల్లులు తినకుండా మనం కాపలా కాయాలి. అప్పుడు యివి పిల్లలలౌతాయి.. అప్పుడు యివి మూడు అవి రెండూ. మొత్తం ఐదు పిచ్చుకలౌ తాయన్న మాట... అంటోంది మహానందంతో.

"అమ్మా అమ్మా,, నేను చూస్తానే గుడ్లను. అమ్మా అమ్మా!" అని రెండవ వాడు మారాం చేస్తున్నాడు. నిచ్చెనను పట్టుకుని.

ఇంతలో "ఏం చేస్తున్నారూ?" అని నేనన్నమాటకు ఉలిక్కిపడి...పిల్లలు బిలబిలా ఉరికి... ఆమె దిగుతూ-

"అసలు నేనా గూడునే తీద్దామనుకుంటూంటే నువ్వు కూడా పిల్లల జట్టు చేరి ఏమిటి చేస్తున్నావ్- అన్నాను ఆమెను.

"పాపమలా చేయకండీ...నోరులేని పక్షులు, ఎక్కడుంటాయి పాపం..." అంది దీనంగా. అప్పుడామె ముఖం భగవంతుడిని వరం కోసం ప్రార్థిస్తున్న భక్తురాలి

ముఖంలా శూన్యంగా, అర్ధింపుగా ఉంది

పిచ్చుకల అభిమానుల సంఖ్య పెరిగిందన్నమాట - నిన్నటిదాకా పిల్లలు... ఇవ్వాళ తల్లి కూడా ఆ పార్టీలోకే చేరింది.

.. నిట్టూర్చి -

రాత్రి భోజనాల దగ్గర పిల్లలతో ఎంతసేపు పిచ్చుకలతో గడపవలసిందీ - ఎంతసేపు చదువుకోవాల్సిందీ మొదలైన విషయాలమీద నిబంధనలను తయారుచేసి చెప్పాను. తద్వారా పిచ్చుకలు మా ఇంటిలో ఓ భాగమైపోయాయి. ఆ రోజు రాత్రి పడుకునేప్పుడు పిల్లలు పిచ్చుకలు ఎలా గుడ్లు పెడ్తాయి - అవి ఎలా పిల్లలను చేస్తాయి లాంటి ఎన్నో ప్రశ్నలు వేశారు

ఆ తర్వాత అనుకోకుండా అవసరమేర్పడి సకుటుంబంగా మా కుగ్రామం రాములవారిపల్లెకు వెళ్ళవలసి వచ్చింది అదెక్కడో అడవిలో ఉంది అక్కడికి వెళ్ళి ఓ వారం రోజులుండి వచ్చేప్పుడు కచ్చరంలో చూస్తును గదా - పిల్లలు మోట బావులపై చెట్ల కొమ్మలకు పిచ్చుకలు కట్టే గమ్మత్తయిన సోలల్లాంటి పీచు గూళ్ళను మా పాలేళ్ళతో నాకు తెలియకుండా తెప్పించి ఓ మూట కట్టుకుని వెంట పట్టుకొస్తున్నారు.

పిల్లల మెదళ్ళనిండా పిచ్చుకలు వాటి సదుపాయాలు అవి చేయబోయే పిల్లలు.. యివే ఆలోచనలు నిండిపోయేయి.

నిజం చెప్పాలంటే "తినగ తినగ వేము " వలె యింట్లో పిచ్చుకల కిచకిచలు విని నేను కూడా నాకు తెలియకుండానే వాటిని యిష్టపడుతున్నట్టనిపిస్తోంది.

ప్రయాణం చేస్తున్నంతసేపూ పిల్లలు వాళ్ళు తెస్తున్న గూళ్ళలో పిచ్చుకలు ఎలా పడుకుంటాయి. తాము చేస్తున్న ఈ ఏర్పాటుకు అవి ఎలా ఆసందిస్తాయి... యివే మాట్లాడుకుంటున్నారు.

మేము యింటికి చేరుకోగానే - నా శ్రీమతి చేసిన మొట్టమొదటి పనేమిటంటే యింట్లోనుంచి నిచ్చెన తెచ్చుకుని ఎక్కి -

అప్పుడు చూశాన్నేను. ఆమె మేము బయలుదేరే ముందు ఎన్ని ఏర్పాట్లు చేసిందో! పిల్లి రాకుండా ఏదో ఇనుప జాలీ అడ్డుపెట్టింది ప్రక్కన ఓ గిన్నెలో నీళ్ళు పెట్టింది అక్కడే నూకలను పోసింది పిచ్చుకల కోసం.

"ఒరే. ఒరే మూడు పిల్లలైనాయిరా" ఒకటే కేరింతలు.. పసిదానిలా.

పిల్లలా విషయం విని ఛెంగున గంతులేస్తూ - ఒకటే ఆనందం.. ఒకటే గెంతడం...

మొత్తంమీద ఇంటినిండా సంతోషం వెల్లివిరిసింది. పిచ్చుకల జననంతో-

తర్వాత-

తల్లి పిచ్చుక ఎక్కడి నుంచో ఆహారం తెచ్చి పిల్లలకు ముక్కుతో అందివ్వడం.. పిల్లలు "అదేమిటి నాన్నా. " అని నన్నడగడం. నేను చెప్పడం .."మరి పిల్లలకు రెక్కలు లేవేమిటి నాన్నా" అని యింకో ప్రశ్నను వెంటనే అడగడం. నేను చెప్పడం .. మళ్ళీ మరో ప్రశ్న- చివరికి నేను విసుక్కోవడం యిదీ జరుగుతోంది రోజూ.

పిచ్చుక పిల్లలు దినదిన ప్రవర్ధమానమై...రెక్కలు సగం మాత్రమే పెరిగి - నేలపై పరుగెత్తుతూ సందడి చేయనారంభించాయి.

ఆ రోజు సాయంకాలం-

ముగ్గురు పిల్లలూ బడి నుంచి ప్రోగ్రెస్ రిపోర్టు పట్టుకొచ్చారు. ఇదివరకూ ముగ్గురూ తమ తమ క్లాసులో మొదటి ర్యాంక్‌లో వచ్చేవాళ్ళు యీసారి ముగ్గురూ రెండు, మూడు ర్యాంక్‌లలోకి జారిపోయారు. ఆ నెలంతా పిచ్చుకల సహవాసంతో గడిపి - అవే లోకంగా ఆనందించి చివరికి దిగజారి... కోపమొచ్చింది బాగా తిట్టాను...ఈ పిచ్చుకలూ...పీతలూ అన్నీ ఈ పిచ్చుకలాట మీకు కూడు పెట్టదు. చక్కగా చదువుకుని బాగుపడి బ్రతకటం నేర్చుకోండి. పోండి గాడిదల్లారా..." అని ఎన్నో వినిపించి.. తరిమి -

పిల్లలు ముఖాలు మాడ్చుకుని ఏడుస్తూ వెళ్ళిపోయారు.

ఇంటి నిండా నిశ్శబ్దం నిండి..

నడుమ పిల్లపిచ్చుకల కిచకిచ చప్పుళ్ళు.

వాటిని వింటూంటే అదో గమ్మత్తయిన స్పందన..

మర్నాడు ఉదయమే-

సూర్యోదయం దిక్కు చూస్తూ కూర్చున్నాను కిటికీలోనుంచి.

పిల్లలు లేచి పుస్తకాలు ముందేసుకున్నారు.

సరిగ్గా అప్పుడే పిచ్చుకపిల్లలు గూట్లో నుంచి నడిచి మా దగ్గరికి వచ్చేది రోజూ.

ఆరోజు యింకా రాలేదు.

పిల్లలు చూస్తున్నారు. దొంగతనంగా అప్పుడప్పుడు గూటిదిక్కు

నేను కూడా చూస్తున్నాను. అటు దిక్కే పిల్లలకు తెలియకుండా.

ఈలోగా రెండు పెద్ద పిచ్చుకలు రివ్వున ఎగిరిపోయేయి కిటికీలోంచి. వాటి వెంటనే వరుసగా... ఒకదాని వెంట ఒకటీ రెక్కలొచ్చిన పిల్లపిచ్చుకలు కూడా ఆకాశంలోకి ఎగిరిపోతూ -

"నాన్నా...పిల్లపిచ్చుక లెగిరిపోతున్నాయి" అన్నారు పిల్లలందరూ మూకుమ్మడిగా ... ఎంతో నిరాశతో...

"రెక్క లొచ్చాక ఎగిరిపోతాయి గదరా" అన్నాను.

"ఎక్కడికి వెళ్లాయి నాన్నా అని" రెండోవాడు.

"అవా...అవీ, అవీ...ఏమని చెప్పను?"

"ఆకాశంలో వాటికి బడి వుంటుందిరా...అక్కడికి వెళ్తాయి..." అన్నాను చటుక్కున.

"అక్కడేం చేస్తాయి అవి."

"అక్కడా...అక్కడ వాటికి పాఠాలు చెప్తారు...మీరు కూడా వాటిలాగానే చక్కగా బడికి వెళ్ళి శ్రద్ధగా చదువుకుని పైకి రావాలి."

"వాటికి ఏం పారాలు చెప్తారు నాన్నా అక్కడ?"

"వాటికి.. వాటికేఁ.. ' ఏం చెప్పాలి...?

"వాటికే ఎలా ఎగరాలి...ఎలా బతకాలీ. . ఎలా ఆహారం సంపాదించుకోవాలీ.. యివి చెప్తారా..."

"మరి మా స్కూలులో ఎలా బతకాలి. . ఎలా ఆహారం సంపాదించుకోవాలీ యివి చెప్పరు గదా నాన్నా.. మేమూ బడికిపోం ఆకాశంలోని బళ్ళోకే పోతాం..." చిన్నాడంటున్నాడు.

'మరి మాస్కూలులో ఎలా బ్రతకాలి..

ఎలా ఆహారం సంపాదించుకోవాలీ - యివి చెప్పరు గదా నాన్నా.

మేమూ బడికిపోం.. "

పిల్లల మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

జవాబు ఏది ...?

లేదు.

ఆకాశంలోకి... శూన్యంలోకి చూస్తున్నాను - శూన్యంగా. .

● ఆంధ్రజ్యోతి - 4 మే ఆదివారం, 1980 ●

# 44. బోనస్

♦ పులుగు శ్రీనివాస్ ♦

ఆ రాత్రి.. గాఢమైన చీకటి రాత్రి..

దట్టమైన నల్లని పొగమంచు..ఆకాశన్నంతా కప్పుకుపోయిన రాత్రి...

ఎక్కడో దూరాన ఓ కుక్క 'బోరు' న ఏడుస్తోంది ఫ్యాక్టరీ ధ్వనుల్ని చీలుస్తూ. చుక్కలు - చెమర్చిన కన్నీటి చుక్కల్లా మెరుస్తూ మిణుకు మిణుకు మంటున్నాయి. అక్కడక్కడ గుడ్డిగా వెలుగుతున్నయి లైట్లు దీనంగా.

ఆకాశంనించి - ఏ ఆశా పొందలేని దిక్కులు, చీకట్లతో బావురు మంటున్నాయి.

భూమి - తన ప్రకృతి ధర్మాన్ని నిర్దేశిస్తోంది. మనుషుల్లో - క్రూరత్వాన్నీ తారతమ్యాన్నీ, మోసాల్నీ, అన్యాయాల్నీ కసిగా ఉసిగొల్పుతోంది.

భయంకరమైన చీకటి సత్యాల్ని నిర్దయగా కాలరాస్తోంది.

వొణికిస్తున్న ఆ చల్లని గాలిలో.. ఎవరూ లేని ఆ రోడ్డు మీద!...శారీరక బలాన్నీ, మానసిక స్థిమితాన్నీ కోల్పోయి, గుక్క తిప్పుకోలేని వెక్కిళ్ళతో - చంకలో పాపతో, పిల్లలతో- చొక్కిపోతూ, సోలిపోతూ, ఊగిపోతూ, పిచ్చిగా పిచ్చి పిచ్చిగా.. పరుగులు తీస్తున్న స్త్రీ అడుగులు.

'దబ్..దబ్..దన్..దన్..' ఫ్యాక్టరీల మోత.

నల్లతాచు లాంటి గొట్టాల్లోంచి వెలువడే పొగ - నాలుకలు చాచి విషం కక్కుతూ చీకట్లో కలిసిపోతోంది.

ట్యూబులైట్ల వెల్తుర్లో మిలమిల మెరుస్తున్న 'విజయా కేబుల్స్(ప్రయివేట్) లిమిటెడ్' బోర్డుముందు - ఒక్కసారి.. అణుచుకున్న వుద్వేగమంతా పేలిపోయినట్లు, గేటు చువ్వల్లోంచి ఏడుస్తూ, వూపుతోంది స్త్రీ.

చంకలోంచి పాప ఎలా జారిపోయిందో - కిందబడి ఏమైందో తెలీనట్లూ.. మిగిలిన పిల్లలు తన్ను చూసి ఎలా భయపడి భయంకరంగా అరుస్తున్నారో పట్టనట్లు.. ప్రతిసారీ.. వొంగి వొంగి...వూడ్చి వూడ్చి దుమ్మెత్తిపోస్తోంది అర్థంకాని ఆవేశంతో. తన్నింతవరకూ పట్టించుకోని మనుషుల్ని అసహ్యించుకుంటోంది బూతులు తిడుతోంది నిస్సహాయంగా.

"మీ మీద మన్నుబొయ్యరో.."

"మీ దినాలు, వారాలు గానురో...."

"మిమ్ముల్నెత్తుక, కట్టుక బోనురో. "

"ఓర్ లంజకొడుకుల్లారో! ..తలుపుల్దియ్యుర్రో . . '

ఒకటే అరుపులు.

## 2

"చంద్రంసాబ్!.. " అన్నాడు అటెండర్. 'చంద్రంగారూ! మిమ్మల్ని మేనేజర్‌గారు పిలుస్తున్నారు' అన్నట్లు.

"నన్నా" అన్నాడు చెంద్రయ్య ఆశ్చర్యంగా.

అతని అసలు పేరు చెంద్రయ్యే .

కానీ, ఈ కోస్తా వాళ్ళతన్ని 'చంద్రం' గా మార్చేశారు.

"ఔ" నంటూ వెళ్ళిపోయాడు అటెండర్

"ఆశ్చర్యంనించి తేరుకుని, ఆలోచన్లో పడ్డాడు చంద్రం

"మల్లేమైనా తప్పుడు సాక్ష్యమిప్పించి, ఎవర్నైనా పన్లోంచి తీసెయ్యడు గదా! ఏ చిక్కుల్లోకి తోయడుగదా!!

"పాపం! కరీంకెంత అన్యాయం జరిగిందని! ఆ రోజు.. గుండెలవిసేలా బాధపడ్డాడు. "తనకేం తెలీదని, తన్ను తీసెయ్యకండనీ" మేనేజర్ కాళ్ళపైబడి గొంతు పగిలేట్టు ప్రాధేయపడ్డాడు

"అతన్ని ఊస్ట్ చేసిన రోజున. తనావిషయం పూర్తిగా తెలుసుకోకముందే, మేనేజ్ మెంట్ తొందరపెట్టడం వల్లా, ఆ ఇద్దరి నాయకులపై నమ్మకం వల్లా, ఏం చేయలేక తలూపాల్సొచ్చింది.

"వరుసగా నాలుగు మిషన్స్‌లో పి వి.సి. ముక్కలతో కలిపి మేకులు వేశాడనీ, అవెందుకు కొరగాకుండా పోయాయనీ, అంత నష్టాన్ని తెచ్చిన మోసగాడ్ని - మరీ పన్లోకెక్కించుకుని, వ్యాపారాన్ని చెడగొట్టుకోకుండా వెంటనే తీసేస్తున్నానీ".. గొంతు చీలేలా, ఆగకుండా, అరగంటసేపు అరుస్తూ ఎగిరెగిరి పడ్డాడు మేనేజర్.

"కానీ - నిజం ఆలస్యంగా తెలిసింది. కరీం చెల్లి - ఫోర్‌మెన్ డబ్బుకి లొంగలేదని . అతని పశుత్వంపైకి చెప్పు విసిరిందనీ . ఆరోజునుంచి అసలు విషయం ఎవరికీ చెప్పకుండా పని మానేసింది ఫోర్‌మనే మనుష్యులతో చిన్నమేకులు వేయించి, రెండ్రోజులు మిషన్స్ ఆపుచేయించీ, పెద్దగా గొడవలేపాడు. 'బెంగుళూరునించి స్పెషల్ మెకానిక్‌లను పిలిపించాననీ, అన్ని కొత్తపార్ట్స్ వేయించాననీ, అందుకు చాలా డబ్బు ఖర్చయిందనీ' నానా అబద్ధాలాడాడు.

'దీని వెనుక మేనేజర్ హస్తం వుండకుండా వుండదని అన్పించింది. తన భార్య కమలకీ విషయం చెప్పినప్పుడు, ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. జరిగిన ఈ అన్యాయానికి ఎంతగా అంగలార్చిందనీ, "తమ బతుకులు కూడా ఎప్పుడో ఒకప్పుడు అలాంటి అన్యాయానికి గురై చితికిపోవాల్సిందే కదా?" అని ఎంతగా కుమిలి పోయిందని .!'

ఒక్కసారి భారంగా నిట్టూర్చాడు చంద్రయ్య

అయ్యో వెళ్ళాలి కదా?' అనుకుని, తన మిషన్నొక్కమారు చూసుకున్నాడు - బాగానే నడుస్తుంది. ఇప్పుడే తీగేం ఐపోదు.

అరే రంగా. మాల్ (పి వి సి. ముక్కలు) ఐపోంగనే మళ్ళనింపు. జాగర్తగా సూత్తుండు . జెప్పున మల్లొత్తగనీ.. ఆఁ .." అంటూ తన హెల్పర్‌కి చెప్పి వెళ్ళిపోయాడు చంద్రం.

మేనేజర్ గది ముందుకెళ్ళి తలుపు అద్దంలోంచి చూశాడు లోపలికి. "నీకోసమే చూస్తున్న!' అన్నట్లు తలనొకమారు ముందుకు కదిలించాడు మేనేజర్.

స్ప్రింగ్ డోర్‌ని నెమ్మదిగా నెట్టుకుని లోపలికెళ్ళి - వినయంగా నమస్కరించి నించున్నాడు చంద్రం.

మేనేజర్ - చూడ్డానికి సన్నగా, పొడుగ్గా.అందంగా వుంటాడు. కళ్ళల్లోంచి వచ్చే చూపుల్ని తీక్షణంగా ఒకే దగ్గర ప్రసరిస్తే - యెదుట నించున్న మనిషికి తేళ్ళూ, జెర్రులూ పాకినట్లుంటుంది.

అతడి నోటినుంచి వచ్చే ప్రతీమాటా దాదాపు 420 కిలో వాట్స్ శక్తితో - 360 క్వింటాల్స్ బరువుతో మీద బడినట్లుంటుంది.

కానీ - అతడి అవసరాన్ని బట్టీ, ఎదుటి మనిషి భీరుత్వాన్ని బట్టీ వాటి నుపయోగిస్తూ వుంటాడు.

చిన్నగా నవ్వుతూ - "ఏం లేదురా చంద్రం! ఈ సంవత్సరం బోనస్ విషయం మాట్లాడుదామని పిలిపించాను. ఈ షిఫ్ట్ లీడర్‌వి. నీతో చెప్పాలి కదా!...ఇంతకు ముందే మన సేట్ ఫోన్ చేశాడు. 'బోనస్ 10 శాతం ఇవ్వమని' లాస్టియర్ చెప్పాం కదూ? 'ఈ ఏడు యివ్వలేకపోతున్నా మళ్లీ వచ్చే ఏడు తప్పకుండా 20 శాతం ఇస్తామని" కాని ఇవ్వలేకపోతున్నందుకు విచారిస్తున్నారా! ఎంత ప్రయత్నించినా కుదర్లా. అంతగా లాభాలు రాలా నష్టాల్లోనే నడుస్తుంది ఫ్యాక్టరీ. అలాంటప్పుడు మేఁవేఁ చేయగలం చెప్పు? . మీరు బాగా కష్టపడి పనిచేస్తే వచ్చే సంవత్సరం తప్పకుండా యిస్తాం. ఈ విషయం అందరికీ చెప్పి, మళ్లీ సాయంత్రం కన్పించు..." అంటూ మేనేజర్ తన ఫైళ్ళ అడవిలోకి దూరిపోయాడు పులిలా. ఏం తోచని చంద్రం - మళ్ళీ తిరిగి రావాల్సిన ఆవులా వెళ్ళి పోయాడు.

తన మిషన్ దగ్గరకెళ్ళి తడిమి చూసుకున్నాడు చంద్రం సాలోచనగా బాగుంది . ఒక్కవైర్ కట్టవుతే, తన చేతి నరం తెగినంత బాధపడతాడు. ఏ పనైనా మనస్ఫూర్తిగా చేస్తాడు. "మనం చేసే ప్రతీపనికి న్యాయం చేకూర్చాలం" టాడు అమాయకంగా.

చంద్రం ఆలోచనలు - తన పెద్దకూతురువైపు మళ్ళాయి

"పెద్దదయి నాలుగేళ్ళయింది ఆడపిల్లల్ని ఎక్కువ కాలం ఇంట్లో ఉంచుకోవడం అంత మంచిది కాదంటారు. దాన్ని పెళ్ళిచేసి పంపిస్తే తన నెత్తిమీద బరువు సగం దిగిపోయినట్టవుతుంది. చివరిదాని పెళ్ళి కిప్పుడేం తొందరలేదు చాలా చిన్నపిల్ల. మిగిలిన ఇద్దరూ మగపిల్లలే వాళ్ళెలాగో బతగ్గలరు, ఏ కూలో నాలో చేసుకుని "ఇప్పుడు దొరక్క దొరక్క మంచి సంబంధం దొరికింది. అది తప్పిపోకుండా ఈ

శ్రావణమాసంలోనే పెళ్ళి చేయాలని నిశ్చయించుకున్నాడు కూడా." ఐతే... తన ఊహలు నిలువనా కూలిపోయాయి.

## 3

గిర్..... ర్?.....' న బెల్ మోగింది.

లంచ్ టైమ్.

అందరూ - పంపు దగ్గర చేతులు కడుక్కుంటున్నారు.

చంద్రయ్య కొంచెం ఆలస్యంగా బయటికొచ్చాడు.

మొహం విచారంగా వుంది.

"యేం భాయ్! అట్లున్నవ్? మేనేజర్ పిల్సినట్టుంది. యేం జెప్పిండేంది?" అంటూ అందరూ చుట్టుముట్టారు.

ఉలిక్కిపడిన చంద్రం తేరుకుని, "యేం లేదు భాయ్ మనందరం ఆశపడ్డదంతా వొట్టిదే ఐంది. "సరింగ లాభాలు రాలేదనీ, ఈ యేడుగూడా 10శాతం బోనస్ యిత్తననీ - యింగేం మాట్లాడకుంట దీసుకుని, ఇగనుంచైనా కష్టపడి పంజేత్తే - మల్లచ్చే యేడు ఎక్కువిత్తననీ".. సెప్పిండు. అంతే..." అన్నాడు, ఓ విధమైన చిరాకుతో.

"ఇగనుంచైనా కష్టపడాల్నంటే.. మనఁ వీ సమచ్చరం కస్టపల్లేదనా వీనర్థం? యేఁవైనా యీ తాప వీనంతు సూడాలింక" అన్నాడు జాన్ కోపంగా.

"పెతీయేడు యేవో తొంపులు జెప్పి తప్పించుకుంటండు. నేనిన్నేండ్లాయె గాని పంజేయబట్టి ఒక్క తాపగూడ పిడికెడు పైసల్దీసుకోలే వీంతాన. ఈతాప మాత్తరం వూకునేది లేదు..." అన్నాడు మల్లయ్య బొంగురు బోతున్న కంఠంతో.

"యేంది! వీనింట్ల కెల్లిత్తాండట్నా? యేడుపు గొట్టు లంజకొడుకు. సమచ్చరమంతా కష్టపడి లచ్చల రూపాయల్లాభం దెత్తే - వీడిచ్చేది 10శాతం బోనసట్నా? సీ...సిగ్గులేదు పుండకోరు ముండకొడుక్కు. అరే వీని కూకుంటాంటె బాగ లాగఁవైతాందిరో!..." అన్నాడు రాజన్న. ఆవేశాన్నింకా ముందుకు తీసికెళ్ళి మండిపడ్తూ.

"ఇగో సెంద్రన్నా! నువు గనక దానికొప్పుకుంటే - మమ్ముల్నందర్నీ అన్నాయం జేసినోనివైతవ్. మనం నిజంగా రాత్రనకా పగలనకా కష్టపడతలేఁవా? మీ ముగ్గురు లీడర్లు గట్టిగ నిలబడుండ్లి! ఎనుక మేఁవుంటంగని. అక్కెరైతే స్ట్రైకు జేసి పని మానేద్దాం గని - మీరు పట్టు సడలీండ్రో - మేఁవంతా వుత్తోల్లవైతం. "మేవంతా వొప్పుకుంట లేఁవనీ తప్పకుండా 20 శాతం బోనసియ్యవలసిందేననీ, ముందటేడోలె యీ యేడేం జాగదనీ... గట్టిగ జెప్పుబోయి..." అని తుది నిర్ణయమిచ్చాడు జోగులు, పక్క కంపెనీలో మొదలైన స్ట్రైకును గుర్తుచేసుకుంటూ.

ఇలా తలా వొక మాటతో - తమ తమ కోపాల్నీ, అవసరాల్నీ, దీనత్వాల్నీ, బాధల్నీ, తెలియజేశారు.

చంద్రయ్య సాంతంగా విన్నాడు విని అర్థం చేసుకున్నాడు. తన బతుక్కంటే వాళ్లవేం మెరుగ్గా లేవన్న సంగతి అతనికి తెలుసు. పట్టుదలగా పిడికిళ్ళు బిగించి, యేదో స్థిరంగా నిర్ణయించుకున్న వాడిలా ఒక్కడుగు ముందుకేసి "నేను గట్నే అనుకున్న ఈ యేడు వీంతో తాడో పేడో తేల్చుకోంది యిడిసిపెట్టేది లేదు. నేనిప్పుడే సెప్పొత్త మీరు తిని మీ పండ్లాకి మీరు బోండ్లి. వాడినకుంటే యెనుకసీరి సూద్దంగని.." అంటూ చెంద్రం గబగబా వెళ్ళాడు మేనేజరు గదివేపు.

## 4

"ఈ రోజు సాయంత్రం 5 గంటల 30 ని లకు ఆఫీసు గదుల వెనుకున్న పార్కులో మీటింగుంటుంది. మేనేజరుగారు మాట్లాడుతారు. .. మీరంతా హాజరు కావాలి!" అని ప్రకటించారు. ప్రతీ సెక్షన్‌లోని సూపర్‌వేజర్లు.

బోనస్ గురించే మాట్లాడుతారన్న విషయాన్ని అందరూ ఊహించగలిగారు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగిపోయి, వారి వారి పనుల్లో నిమగ్నులయ్యారు.

చంద్రం ఆలోచనలు తీవ్రరూపం దాల్చాయి. అతడి కళ్ళు ఏకదీక్షగా తన మిషన్ని పరిశీలిస్తున్నాయి.

తీగ - ఒకగిట్ట (తీగ చుట్టబడిన పరికరం) నించి వెలువడుతూ, ఎర్రగా కాలే మిషన్‌లో చిక్కని ద్రవంగా వున్న ప్లాస్టిక్ పూసుకుని, చల్లని వాటర్‌ట్యాంకులో గట్టిపడి, రెండో గిట్టకి చుట్టుకుంటోంది ఇన్స్యూలేషన్ వైర్‌గా.

పక్క మిషన్ - ప్లాస్టిక్ పొడరుని పి.వి.సి. ముక్కలుగా తయారుచేసి, దీనికి సరఫరా చేస్తోంది. ముందు సెక్షన్‌లో పూర్తిగా తయారైన వైర్‌ని అడవాళ్లు ప్యాకింగ్ చేసి లారీవాళ్ళు కందిస్తున్నారు.

వెనక సెక్షన్స్‌లో - తీగను శుభ్రం చేయడం, ట్విస్టింగ్ చేయడం, గిట్టలకి చుట్టడం జరుగుతోంది

కరెంటు ఆధారంతో నడిచే మిషన్లు - మీటల కలవాటుపడ్డ చేతులూ, బరువుల కలవాటుపడ్డ తలలూ, మాటల కలవాటుపడ్డ మనసులూ, అనుకోకుండానే ఆలోచన లేకుండానే పనులని నిర్వర్తిస్తున్నాయి. ఉత్పత్తులు పెంచేస్తున్నాయి.

అక్కడ - మిషన్లకీ, మనుష్యులకీ తేడా కన్పించదు.

వాళ్ళు మరమనుష్యులు, వాళ్ళవి యాంత్రిక జీవితాలు.

## 5

సాయంత్రం -

కార్మికులందరూ పార్కులో గుమిగూడారు. కాసేపు మిషన్స్ ఆపుచేసి, పార్కుని దూరం నించి చూడ్డమే తప్ప వాళ్ళు సామాన్యంగా అందులో కెళ్ళరు వెళ్ళాలని కోరికున్నా తీరికుండదు. తీరికున్నా అర్హతుండదొక్కోసారి. దాన్నీ మధ్యనే అభివృద్ధి చేశారు చుట్టూ ముళ్ళకంచె.. ఒక క్రమంలో క్రోటన్స్ మొక్కలూ, మధ్యలో గరికా, చెట్లూ - అందంగా వుంది

కార్మికులంతా గరికపై కూర్చున్నారు మేనేజర్ - బాడంచెట్టు కానుకుని నించున్నాడు. ఒక్కమారు కళ్ళజోడు సర్దుకుని, చేతులు కట్టుకున్నాడు యెంతో సంస్కారంగా.

వాతావరణం - తుపాను ముందున్న ప్రశాంతంలా మారింది

"కార్మికులారా! మిమ్మల్నందర్నీ సమావేశపర్చిందేమంటే - ప్రధానంగా . ఈ సంవత్సరం వచ్చిన లాభనష్టాల గురించి చెప్పి, మీ బోనస్‌ని డిక్లేర్ చేయడమే. నేను చెప్పబోయే విషయాలన్నీ మీకు తెలిసినవే ఐనా నా బాధ్యతగా ముక్తీ చెబుతున్నా.. ప్రతి సంవత్సరం లాగే యీ సంవత్సరం కూడా మీ పనుల్లో ఏమీ అభివృద్ధి లేకపోగా...కొందరి కక్ష్యామోసాలతోనూ, అసమర్ధతతోనూ నాలుగు మిషన్స్ పాడయ్యాయి. దీనికి ఉదాహరణగా మీ సోదరుడు కరీం - రన్నింగులో ఉన్న మిషన్స్‌లో దొంగచాటుగా మేకులు వేసి, బోల్డంత నష్టాన్ని తెచ్చి. ఈ మధ్యనే ఊస్ట్ ఐన సంగతి మీకందరికీ తెలిసిందే..

"అంతేగాకుండా యీ యేడు లాభాల కంటే, నష్టాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. మన సేటుగారి కుటుంబం విదేశ యాత్రలు బోవడం, వారి పెద్ద కూతురి వివాహం జరగడం యీ యేడు ఖర్చే. ఈ పార్కు వేయించడం, మీకు షెడ్ వేయించడం, ఆఫీసు గదుల్ని ఎయిర్ కండీషన్డ్‌గా మార్చడం, మూడు కొత్త మిషన్స్ తెప్పించడం కూడా ఈయేడు ఖర్చే.

"ఇలా ఏదోరకంగా మీకూ, ఫ్యాక్టరీకే వుపయోగిస్తున్నాం వచ్చే ఆదాయాన్నంతా, బోనస్ ముందటేడు మీకు 20శాతం ఇస్తామన్నా - యీ యేడు ఎంత ప్రయత్నించినా 10 శాతం కంటే ఎక్కువియ్య లేకపోతున్నాం. కాబట్టి . మీరు మా ఇబ్బందుల్నీ కష్టాల్నీ అర్థం చేసుకుని, మాతో సహకరించి, ఈ బోనస్‌తోనే సంతృప్తి చెందుతారనీ, ఎంత చెట్టు కంత గాలి వుంటుందన్న విషయాన్ని గుర్తిస్తారనీ ఆశిస్తున్నా.

"పక్క కంపెనీలో కార్మికులూ, దుందుడుకు వాదులూ - ఎవరైనా మన సామరస్యాన్ని చెరపాలని ప్రయత్నిస్తే - మీరు వాళ్ళకి వ్యతిరేకంగా వుంటూ - మీ పనులు మీరలాగే కొనసాగించి ముందుకెళ్ళాలనీ, వచ్చే యేడు తప్పకుండా 20 శాతం బోనసిప్పిస్తామని నమ్ముతున్న

"ఈ వారం రోజుల్లో మీ జీతాలతోపాటు బోనస్‌కూడా యివ్వడం జరుగుతుంది. ఇక మీ రేరకమైన గొడవలు చేయకుండా నిశ్చింతగా -మీమీ పనుల్లోకి వెళ్లొచ్చు..." అంటూ వలని గుప్పున పైన విసిరిన వేటగాడిలా, స్పీడుగా నిట్టూర్చాడు మేనేజర్.

కార్మికుల్లో కలకలం బయలుదేరింది

"మేం కష్టపడి పంజేయకుంటె యీయనేంవన్నా జేత్తాండా?" అన్నారొకరు.

"పెతి సమచ్చరమున్న బారతంవే గదాయిది? యీ యేడేం కొత్తా? ఈ తాపేం వూకునేది లేదని, సెప్పుండహం. ." అన్నారు మరొకరు

"ఇప్పుడు మా అందరి తర్పు నుంచి సెంద్రన్న మాట్లాడాలే . " అంటూ అందరూ కేకేశారు. వాళ్ళ క్రోధ్భలం, అవసరం, ఆతృతా - తన బాధ్యతా ముందుకు నెట్టాయతన్ని.

చంద్రయ్య లేచి నించున్నాడు. అతడిలో శాంతీ, ఓపికా పూజ్యమై - ఆవేశం అసహనం ప్రత్యక్షమయ్యాయి.

"అయ్యా! తఁవరు పెతి సమ్మచ్చరం ఇట్నే అంటాండ్రు గానీ.. మాకొక్కసారి గూడా 20 శాతం బోనసియ్యలే.. నస్టం..నస్టం.. అంటనే...కొత్త మిసన్లు, తోటలూ, పెండ్లిండ్లూ, తీర్థాలూ, బంగ్లాలూ...లచ్చల రూపాయల కర్చుతో శేత్తాంట్రి. మరవన్నీ మా కస్టంతో వొచ్చిన రూపాయలూ.. లాబాలూ.. గాకుంటే యెక్కడియంటరు? మాట వరసకంటా.. సేటు బిడ్డ పెండ్లికి బెట్టిన రొండు లచ్చల రూపాయలుగూడా మా కస్టమ్మీన్నే యేత్తే.. మేం బతకాల్నా? సావాల్నా? ఆఁ.....

"కరీం - అన్యాయం జేసిండనీ, మోసం జేసిండనీ... మిసిన్ల మోలలేసిండనీ.. సెప్పిండ్రు. మరి కరీం సెల్లెందుకు పన్లె కొత్తలేదో సెప్పుండ్లి జరా? మీకు దయిర్నం ఉంటే.. పోరుమన్ను బిలిచి... యేదీ మా ముంగట గట్టిగడుగుండ్లి? నిజం గక్కుతడు.. మీరు మాకండ్ల నెన్నిదినాలో ముయ్యలేరు సారూ! ఈ యేడు బోనస్‌తో తాడోపేడో తేల్చుకుంటం. రేపటిదాకా జూసి, మీరిట్నే అంటే.. అందరం పనూకొని, స్ట్రయికు మొదలు పెడతం. ఈ తాప మాతరం భయపడి, మీ మాటలు నమ్మి... ఇంగ ఊకో దల్సుకోలే.." అంటూ కచ్చితంగా చెప్పేశాడు చంద్రం ఆవేశంగా.

అందరూ చప్పట్లు కొడుతూ, చంద్రాన్ని కొనియాడుతూ, నవ్వుతూ కేకలేస్తూ - వెళ్లిపోయారు వారి వారి పనుల్లోకి.

మేనేజర్ - ఎంతో అవమానంగా ఫీలై బుసలుకొడ్తూ వెళ్ళిపోయాడు.

## 6

రాత్రి పదిగంటలు.

చంద్రానికి పిలుపొచ్చింది మేనేజర్ నించి.

ఈసారి మేనేజర్ దగ్గర కెళ్ళడానికి కాస్త జంకాడు చంద్రం. సాయంత్రం తను ఆవేశంగా మాట్లాడిన మాటలు గుర్తొచ్చి. ఐనా పూర్తిగా తేల్చుకునేవరకతనికి శాంతి లేదు.

మేనేజరు గదిలో - రమేశ్, నజీర్ నిలబడివున్నారు. వాళ్ళిద్దరూ మిగతా షిఫ్ట్ నాయకులు. వాళ్ళనెంతసేపాయనో అక్కడికి పిలిపించి, లావాదేవీలన్నీ పూర్తియి నట్లున్నాయి. ప్రస్తుతం ఎంతో సిన్సియర్‌గా నించున్నారు. రాబోయే మనిషికి కించిత్తు గూడా అనుమానం రాకుండా.

చంద్రయ్య వెళ్ళి వాళ్ళ పక్కనే నించున్నాడు.

మేనేజర్ తలెత్తి తీక్షణంగా చూస్తున్నాడు. ఆ చూపుల్ని తట్టుకోలేక తలదించు కున్నాడు చంద్రం. కాస్త చిరాక్కూడా వేస్తోంది.

"యేరా చంద్రం! ఉపన్యాసం భలేగా దంచేశావే... నీ సోదరులు బాగా మెచ్చు కున్నారనుకుంటాను!..." వ్యంగ్యంగా అనీ, 'మాకో పెద్ద తలనొప్పివయ్యావన్నమాట!' అన్నాడు తలూపుతూ చిన్నగా.

తొందరగా మేల్కొన్నట్లు "ఆఁ.. అదిసరే! మీ ముగ్గుర్ని పిలిపించింది వొక అతి ముఖ్యమైన పనికి. లాభాలగురించి నన్నేం అడగొద్దు... 'ఎక్కువ బోనస' ని వూసే

ఎత్తొద్దు . వర్కర్స్‌నించి నాకెలాంటి గొడవలూ రావొద్దు మీరు ముగ్గురూ వొప్పుకుంటే. . ఆ వెధవలేం చేయలేరు. దానికిగానూ. మీ ముగ్గురికి తలా రెండువేల రూపాయలిస్తా ఇవి తీసుకుని యింతటితో యీ గొడవకు నొక్కెయ్యండి.." అంటూ సొరుగులోంచి కరెన్సీ నోట్ల కట్టలు తీసి టేబిల్ పైనేశాడు మేనేజరు.

అందరి కళ్ళు 'జిగేల్' మన్నాయి ఆ వెల్తుర్లో

ఆశల నెమళ్ళు పురివిప్పి నాట్యమాడాయి

వాళ్ళిద్దరూ వెంటనే ఆ రూపాయల్ని తీసుకున్నారు ఆత్రంగా

చంద్రానికి తన బిడ్డ పెళ్ళిప్పుడే జరిగిపోతున్నట్లు తనవసరాలట్లే తీరిపోతున్నట్లూ, కష్టాలన్నీ కడతేరుతున్నట్లు .. కన్పించాయి కానీ ఆ వెంటనే . ఆ నోట్లకట్టలే తోటి కార్మికుల్ని నాగుపాములై కాటువేసినట్లు బాధపడ్డాడు

"రెండు సంవవత్సరాలనించి అల్సర్ వ్యాధొచ్చి బాధపడుతున్న తన భార్యని - ఈ సంవత్సరమైనా బాగుచేయించి, ఆమె ప్రాణాన్ని కాపాడుకోవాలని. "చూసే జాన్ కళ్ళల్లోని 'ఆతృత' గుర్తొచ్చింది.

"పెళ్లైనప్పట్నించీ - ఇప్పటివరకూ తీరని కోరికగా మిగిలిన - భార్యకి చీరా, పిల్లలకి గౌన్లు కుట్టించి, దూరంగా ఉన్న తన భార్య పుట్టింటికి పంపించాలనీ.." కాంక్షగా చూసే గంపెడు పిల్లల రాజన్న దీనత్వం' గుర్తొచ్చింది.

"ఇక నీవే నాకు శరణ్యం! అప్పిచ్చినోడు రెండ్రోజుల్లో నా గుడిసెను తెల్ల పందుల దొడ్డిగా మార్చుకోబోతున్నాడని .." చేతులెత్తి వున్న జోగులు 'నిస్సహాయత' గుర్తొచ్చింది.

మానవత్వం వున్న చంద్రం మనసు చలించిపోయింది

బాధలూ, కష్టాలూ, తనొక్కడికే కాదు ప్రతీ కార్మిక సోదరుడికీ వున్నాయన్న సంగతి అతన్ని హెచ్చరించింది.

చంద్రయ్య కళ్ళకి - మల్లెచెండులో బాంబుని కప్పిస్తున్నట్లూ, వెండి చెంబులో విషాన్ని దాచిస్తున్నట్లూ.. కన్పించాడు మేనేజర్ క్రూరంగా.

ఒక్కసారి తలపైకెత్తి - "సార్ పైసలతో నా నోరు మూయించి నా తమ్ముళ్ళ కడుపులు గొట్టాల్నని సూత్తానవ్, గానీ జాగర్త సార్! పచ్చిగడ్డితినే పసుని గాదు...." అంటూ గిర్రున వెనక్కి తిరిగి విసురుగా వెళ్లిపోయాడు చంద్రం.

నిశ్చేష్టులయ్యారు మిగిలిన ముగ్గురు

## 7

చంద్రం - నిలకడలేకుండా అటూ యిటూ తిరుగుతున్నాడు తన మిషన్‌దగ్గర. తలంతా బద్దలయ్యేలా సమ్మెట్లతో కొడుతున్నట్లూ, మండుతున్న పెనంపైవేసి దిక్కు తోచనీయకుండా దొర్లిస్తున్నట్లూ బాధపడుతున్నాడు

గిట్ట ఐపోవస్తోంది. మళ్ళీ గిట్ట దొరకాలంటే పూర్తి ఇంటరెస్ట్ ఆపరేటర్‌దే ఔతుంది. తీగ స్టాక్‌లో లేదు. ఓల్డ్ స్టాక్‌లో వెతకాలి ఆ తుప్పు పట్టిన తీగనంతా యాసిడ్‌లో శుభ్రం చేసి గిట్టకు చుట్టించాలి. అప్పుడది తనకవసరం

హెల్పర్ - రంగడికోసం చూశాడు చంద్రయ్య.

రంగడు - ట్యాంకులో వున్న వెచ్చని నీటిని మోకాలానిస్తూ బాధ నుపశమనం చేసుకుంటున్నాడు. నిన్న - 15 కిలోల రాగి బెండల్ (తీగచుట్ట)ని యెత్తుకుని, హీటర్ బావిలోంచి పైకొస్తుంటే. మెట్లుజారి కిందబడ్డాడు. అదృష్టవశాత్తూ ఆ ప్రమాదం తప్పిపోయింది ఆ బెండల్ మోకాలుపై బడి లావుగా వాచి, నడవడానికి ఇబ్బందిగా వుంది డ్యూటీకి రాకుండా పస్తులైనా పడుకుందామంటే. కొత్తగా పనికెక్కిన తన్ను నిర్దాక్షిణ్యంగా తీసేస్తాడనే భయంతో వచ్చాడు

అతడి అసహాయతని చూస్తే జాలేసింది చంద్రానికి - ఈ పరిస్థితిలో అతడు 10 కిలోల రాగితీగను లేపడమసాధ్యమన్న విషయాన్ని గ్రహించాడు.

మిషనాగిపోకుండా చూడమని చెప్పి, తనే బయలుదేరాడు చంద్రం. లోపలి రూంలోకెళ్ళి ఓ తుప్పుపట్టిన రాగి బెండల్‌ని భుజానికెత్తుకున్నాడు. మెట్లని బలవంతంగా ఎక్కి - 'అపాయం' అని ఎర్రగా రాసున్న రూం తలుపునెట్టుకుని లోపలికెళ్ళాడు

అందులో ఎవరూ లేరు - భుజమ్మీది బెండల్‌ని కిందేశాడు. రూం మధ్యలో, భూమి లోపలిగా అరేంజ్ చేసిన ట్యాంక్‌లో యాసిడ్ బుస బుస పొంగుతోంది.

ఇనుపకడ్డీ కొక్కానికి బెండల్‌ని తగిలించి, ట్యాంక్‌పై అటోకాలు ఇటోకాలు వేసి. బెండల్‌ని జాగ్రత్తగా యాసిడ్‌లోకి దించాడు 'బుస్సు'న పొంగుతూ రాగి తీగకున్న మురికినంతా తినేస్తోంది.

మెల్లగా డోర్ తెరుచుకున్న చప్పుడైంది

కాళ్ళ మధ్యనించి చూసిన చంద్రయ్య ఆశ్చర్యపోయాడు

మేనేజర్.!

'యే హెల్పరేమయ్యాడు?" చిన్నగా నవ్వుతూ అడిగాడు మేనేజర్ ముందుకొస్తూ

'వానికి నొప్పిలేచింది" ఆశ్చర్యం నించి తేరుకుని అన్నాడు చంద్రం. కొంచెం నిర్లక్ష్యంగా తన పని చేసుకుంటూనే

"అఁహా! అలాగా?.. " అంటూ ఏం తోచక అంతటితో ముగించి, 'పరధ్యానం' గా ముందుకెళ్ళి కరెంట్ ఫ్యూజుల డబ్బాని తెరిచి, యేదో సర్దినట్లుగా చేసి, మళ్ళీ మూసేశాడు.

వెనుదిరిగి - "తెల్లగా కడుగు. లేకుంటే ప్లాస్టర్ తొందరగా వూడిపోతుంది..." అంటూ చంద్రం వెనక్కొచ్చాడు

చంద్రాని కీసారి అసలు జవాబే యివ్వాలన్పించలేదు.

కాసేపు తటపటాయించాడు మేనేజర్.

చంద్రం - అలాగే వొంగి బెండల్‌ని జాగ్రత్తగా యాసిడ్‌లో దొర్లిస్తున్నాడు రాగితీగ బంగారంలా మెరుస్తోంది

మేనేజర్ - ఒక్క వుదుటున ముందుకొచ్చి, బూటుకాలితో గట్టిగా తన్నాడు చంద్రయ్య ముందు పాదాన్ని

## 8

ఆరుబయట - పోలుకింద....

తడితడిగా చీము నెత్తుర్లతో తడిసి, భయంకరంగా పోల్చలేకుండా చంద్రయ్య శవం...శవం చుట్టూ జనం, అంతులేని ఆవేదనా ఆర్ద్రంకాని ఆలోచనా.

చాలాసేపైంది. ఒకరితో ఒకరు మాట్లాడ్డం లేదు

ఎవరికి వారు - కంటతడితో రక్తం చుక్కలులేని మొహంతో . కట్టెలా నిలబడి వుండిపోయారు కొందరు కూర్చుండిపోయారు దిక్కు తోచక

ఎక్కిళ్ళ చప్పుళ్ళు. దూరాన మెల్లని ఫ్యాక్టరీల ద్వనులు తప్ప - భయంకర నిశ్శబ్దం

ఎందుకో - 'కెవ్వున' ఫ్యాక్టరీ అదిరేలా కేకపేసి. పిచ్చిగా కుంటుకుంటూనే పరుగు తీసిన రంగడు తప్ప - అందరూ రాత్రి 11 గంటలుదాటి 12 దొతున్నా అలాగే వుండిపోయారు

మేనేజర్ - శవాన్నొక మారు పరీక్షగా చూసి. కొంచెం ఎడంగా వెళ్ళి నించున్నాడు. విచారంగా, చివరి గేటుముందున్న స్ట్రీ ఆర్తనాదం - అతన్నప్పుడు చుట్టుముట్టింది. అప్పుడే వచ్చిన రంగడు బయట్నించి గేటెక్కడానికి ప్రయత్నిస్తున్నాడు.

"అయ్యో!. చంద్రం భార్య. గేటు తియ్! అన్నాడు మేనేజర్ ఆత్రంగా.

డ్యూటీనే మర్చిపోయి - ఎంతో దీనంగా, బాధగా అక్కడే కొయ్యబారి చూస్తూ వుండిపోయిన వాచ్‌మెన్ - ఒక్కసారిగా పరుగు తీశాడు గేటువైపు కంగారుగా.

ఆలోచనల్నించీ, దుఃఖాల్నించీ, తేరుకున్న తలలు లన్నీ ఒకేమారు గేటువైపు తిరిగాయి

సిగ వూడిపోయిన వెంట్రుకలూ, ఎర్రగా కందిపోయిన ముఖమూ, గేటు నూపుతున్న చేతులూ . మట్టిలో దొర్లుతూ ఏడుస్తున్న పిల్లలూ. పిచ్చిగా కేకలు, వెర్రిగా అరుపులూ, నిస్సహాయమైన బూతులు.

అవి అందరి గుండెల్లో సూటిగా తాకాయి ఒక్కొక్కరి కళ్ళల్లోంచి రక్తం ద్రవంగా ప్రవహిస్తోంది

పక్కనున్న వెల్తుర్లో - ఆవిడ గేట్లోంచి విసురుతున్న మట్టిలోంచి పొగలు లేస్తున్నాయి.

మండినట్లు మెరుస్తున్న ఆ మట్టిలోంచి ఎర్రని పొగలు, గాలికి చువ్వలు దాటి ఫ్యాక్టరీలోకి వీస్తున్నాయి.

● 'సృజన' మాసపత్రిక - జనవరి, 1981 ●

# 45. దొరగారి కుక్క

♦ నందిగం కృష్ణారావు ♦

దొరగారు పడక్కుర్చిలో కూర్చుని పెంపుడు కుక్కని సవరదీస్తూ దాన్ని గూర్చి ఆలోచిస్తున్నారు. ఆయన ఆ కుక్కని పెంచడం మొదలు పెట్టిన్నాటినించి అది ఎప్పుడూ మొరగ్గా ఆయన చూడలేదు. కనీసం యితర్లకేసి గుర్రుగా చూసిన పాపానైనా పోలేదు అసలు ఆ కుక్క పౌరుషం వున్న కుక్కేనా కాదా? అని ఆయనకి యీ మధ్యనే ఒక డౌట్ వచ్చింది. ఆ మాటే ఆయన – చుట్టుపట్ల ఊళ్ళల్లో నక్సలైట్ చర్యలు విజృంభించి పోతున్నాయి కనక తనకి రక్షణ కావాలని అడిగినప్పుడే 'కుక్కని పెంచండని సలహా యిచ్చిన ఇన్‌స్పెక్టర్ గారితో అన్నాడు

అబ్బెబ్బె కుక్కలన్నిటికీ పౌరుషం వుంటుందండీ కాని సమయం వచ్చినప్పుడు కాని బయటపడదు అని సమాధానం చెప్పారు ఇన్‌స్పెక్టర్‌గారు ఇన్‌స్పెక్టర్‌గారి సమాధానం ఆయన్ని కొంతవరకు సమాధానపరిచినా, ఆయనలోని అనుమానాన్ని పూర్తిగా తొలగించ లేకపోయింది. ఒకవేళ తన అనుమానమే నిజమైతే తను ఆ కుక్కని మేపడానికి పెడుతున్న ఖర్చు వృధా పోయినట్టేననే బాధా, అలా గనుక అయితే తనకి రక్షణ లేదు కదాననే భయమూ ఆయన్ని వేధిస్తున్నాయి

"దండాలు దొరా" అన్న లచ్చిగాడి పిలుపు వినటంతోటి దొరగారు ఉలిక్కి పడ్డారు. ఆ తరువాత వాడికేసి ఎగాదిగా చూసి సర్దుకు కూర్చుంటూ "మీ అయ్య బాగానే వున్నడట కదా? పనికెందుకు రాలె..? అని అడిగారు "మా అయ్యకి పానాలు బాగయ్యేటాలికి యింట్ల నూకలు లేకుండా పోయినయి దొరా పస్తులుండటం తోటి నీరసంగుండి రాలేకపొతున్నాడు" అని వినయంగా చేతులు కట్టుకుని సమాధానం చెప్పాడు పదహారేళ్ళ లచ్చిగాడు

'రేపు పొద్దుగాల్నే రమ్మను. లేకుంటే అసలు పనిలోకే రావద్దని చెప్పిన అని చెప్పు యింక ఎవరినైనా చూసి పెట్టుకుంట" అని కొంచెం కరినంగా అన్నారు దొరగారు

వెళ్ళిపోయాడు లచ్చిగాడు వాడి మొఖం పాలిపోయింది అసలుకే మోసం వచ్చేట్టుగా వుంది కదాననుకొని భయపడిపోయి నిలువునా వణికిపోయాడు. వెంటనే దొరగారి కాళ్ళదగ్గరికి వంగి నీ భాంచను దొరా! కాళ్ళు మొక్త రెండు పొద్దులకెల్లి యింట్ల ఎవరికి తిండిలేదు ఉన్నన్ని నూకలు కొల్పించని దొరా పొద్దుగాల్నే మా అయ్యని తప్పకుండ తొల్తనంటూ ప్రాణాచారం పడ్డాడు

యాడాదిలో సగం కాలేదు, యిప్పటికే మీ అయ్య మూడు బస్తాల వడ్లు పట్టక పోయిండు, యిప్పుడు నువ్వేమో నూకలు కొల్పిచ్చమంటన్నవ్, రేపటికెల్లి మీరు పని ఎగగొట్టితే బాకీ వసూలు చేసుకోడానికి మీ సుట్టారంగ మేం తిరగాల్నారా అన్నారు దొరగారు.

పెద్దోళ్ళు మీరే అట్లంటే యెట్లదొర మీ అసంటోళ్ళు దయ దలిస్తేనేకదా మా అసంటోళ్ళు మీ కాళ్ళకాడ బతికేది. దయ సూపండి దొరా లేకుంటే ఆకలితో సచ్చిపోతాం దొర! అంటూ దొరగారి కాళ్ళు పట్టుకొన్నాడు లచ్చిగాడు

"సరే చూద్దాం యింట్ల నీళ్ళు లెవ్వంట పోయి కొన్ని నీళ్ళు తోడి పోసిరా పో" అంటూ లచ్చిగాణ్ణి లోపలికి పంపించేరు దొరగారు

తిండి లేకపోవడంవల్ల లచ్చిగాడి వంట్లో ఏమాత్రం ఓపికలేదు. కాసేపట్లో నూకలు దొరుకుతాయి కదాననే ఆశ వాడికి కొత్త బలాన్నిచ్చింది పళ్ళ బిగువున దొరగారి ఇంట్లోకి సరిపడ నీళ్ళు తోడిపోసాడు. నీళ్ళు తోడిపోసి తిరిగి వస్తుండగా దొరసాని ఎదురుపడి, వాకిళ్ళు ఊడ్చి బోళ్ళు తోమిపెట్టి వెళ్ళమంది. తప్పదు కనుక ఆ రెండు పనులు కూడా చేశాడు అసలే ఆకలితో వుండటంవల్లా పనులు చేసిన కారణంగా నీరసం ఆవరించింది అతన్ని. నిదానంగా నడిచి వచ్చి దొరగారికెదురుగా చేతులు కట్టుక నిలబడి "సెలవిప్పించండి దొరా" అన్నాడు

"చీకటి పడ్తాంది కదా పాలు పిండి పోరా" అన్నాడు దొరగారు. నీరు గారిపోయాడు లచ్చిగాడు. చేసేదిలేక "చిత్తం దొరా" అంటూ కదిలాడు పాలు పిండేసరికి అతని వేళ్ళు నొప్పి పెట్టసాగాయి. పూర్తిగా చీకటి పడిపోయింది. తిరిగి నీరసంగా దొరగారి దగ్గరకి వచ్చి "సెలవిప్పించండి దొరా" అన్నాడు

పొద్దుగాల్నే మీ అయ్యని తోలు అంటూ లేచారు దొరగారు. నూకలు కొలిపించండి దొరా! భయం భయంగా గొణిగినట్లుగా అన్నాడు లచ్చిగాడు.

చీకటి పడినంక నూకలు గీకలు కొలవరని ఎరుకలేదారా! రేపు కొలిపిస్తా అని కసురుతూ లోపలికి వెళ్ళిపోయాడు దొరగారు

విస్తుపోయి ఏం చేయాలో పాలుపోక నిలబడిపోయాడు లచ్చిగాడు. ఒాడికి దుఃఖం వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి మరోసారి దొరగార్ని అడగటానికి ధైర్యం చాలలేదు. ఇంతలో లోపల్నించి మాంసంకూరతో కుక్కకి అన్నం తీసికొచ్చి పెట్టారు. కుక్క ఆవురావురుమంటూ దాని మీదకి ఎగబడింది. అది చూడగానే లచ్చిగాడి కడుపులో ఆకలి బుసలు కొట్టింది ఎలాగయినా తను యిప్పుడు ఆకలి తీర్చుకోవాలి. అన్నం కావాలి లేకపోతే తను బతకలేడు అనుకొని మరేమి ఆలోచించకుండా పరుగున వెళ్ళి కుక్క ముందర్నుంచి గిన్నె అందుకొని బయటకు పరుగెత్తాడు. అరుస్తూ వెంటపడి పట్టుకొని వాణ్ణి దుస్తులన్నీ చింపేసింది కుక్క

ఎప్పుడూ తమ కుక్క అరవగా వినని దొరగారు కుక్క అరవడం విని ఆనందంగా బయటికి పరుగెత్తుకొచ్చి, బయట కన్పించిన దృశ్యం చూసి కోపం తెచ్చుకొని దొంగలం..కొడుకా ఎంతపని చేసినవురా ఇంట్లతిని ఇంటివాసాలు లెక్కపెడుతావురా అంటూ గట్టిగా లచ్చిగాణ్ణి రెండు గుద్దులు గుద్దాడు.

నీ భాంచనుదొరా! ఇంక ఎప్పుడు చెయ్యదొరా నన్నిడ్చిపెట్టు దొరా అంటూ దొరగారి కాళ్ళమీద పడ్డాడు

ఛీ యింక ఇడ్చిపెడతారా లం.. కొడుకా అంటూ గట్టిగా వాడి డొక్కలో ఒక్కతన్ను తన్నారు దొరగారు.

అమ్మా అంటూ కుప్పలా కూలిపోయాడు వాడు

ఈ గలాభా విని అప్పటికే అక్కడికి వచ్చిన మిగతా నౌకర్లని వీణ్ణి తీసుకుపోయి అర్రలేసి తాళం పెట్టుండ్రి అని ఆజ్ఞాపించాడు దొరగారు.

ఆ తరువాత దొరవారు పోలీస్ స్టేషన్‌కి ఫోన్‌చేసి మాకుక్క దొంగని పట్టిందని ఇన్‌స్పెక్టర్‌గారికి సంతోషంగా చెప్పారు. కొద్దిసేపటి తరువాత పోలీసులు లచ్చిగాణ్ణి తీసుకవెళ్ళారు.

ఆనాటి నుండి దొరగారి కుక్క దొరల పంచన చేరిన పోలీసుల్లా గుర్రుగా చూడ్డం మొదలెట్టింది. సంతృప్తిపడ్డాడు దొరగారు.

● 1982 ●

# 46. ఇత్తనపు కోడె

♦ వుప్పల నరసింహం ♦

పిల్ల తల్లులు పనులనుంచి చంటిపాపలకు పాలిచ్చేందుకు వచ్చేవేళ అంటే నీడలు దిగిన పొద్దు

కుక్కలు దొక్క లెగరేసుకుంటూ, నాలికలు బయటకు చాచి చల్లటి నీడలకు పడుకున్నాయి

ఊరిలో వారందరిని ఎక్కడకో లాక్కెళ్ళినట్టు ఊరంత నిశ్శబ్దంగా వుంది. దాదాపు అన్ని గుడిశెల, ఇళ్ల తలుపులు మూసి ఉన్నాయి. వీధులు నిర్మానుష్యంగా ఉన్నాయి.

అక్కడో చూరుక్రింద, ఇక్కడో చూరుక్రింద మాత్రం ముసలివాళ్ళు చిన్న పిల్లల్ని వొడిలో వేసికొని బుజ్జగిస్తూ ఆడిస్తున్నారు రాజుల కదలు రాక్షసుల కథలు చెపుతున్నారు మరీ చూపు ఆనక, కదిలే సత్తువలేక వున్నవారు గంటల తరబడి కూర్చున్న వద్దనే కూర్చుని తమ నికృష్టపు బతుకును తిట్టిపోసుకుంటున్నారు

పాడుపడిన గోడలల్లో ఇద్దరు ముగ్గురు పిల్లలు దొంగతనంగా 'కట్టెబీడీలు' తాగుతున్నారు.

బాలమ్మ, పెంటమ్మ, నర్సమ్మ ముగ్గురూ పరుగుపరుగున నడుస్తూ, తమ పిల్లలకు పాలివ్వడానికి వరికలుపునుంచి ఊళ్ళోకి వస్తున్నారు

నడుములకు కట్టుకున్న కొంగులు: అలాగే వున్నాయి, మోకాళ్ళ పైవరకు కట్టిన చీరల అంచులకు అంటిన బురద, మట్టి అలాగే వుంది. చేతులకు కాళ్ళకు బురద తడారి పోయింది.

వారి పాలిండ్లు బరువెక్కుతున్నాయి. నడక వేగానికి అదిరిపడుతున్నాయి. "పిల్లలు పాలకు ఎంత ఏడుస్తున్నరో? అంబటాళ్ళ (మధ్యాహ్నం) అనంగ బుక్కెడన్ని ఇచ్చిన పాలు. ఎప్పుడు అరిగిపోయినయో? ..కుతికెల తడారిపాయుండొచ్చు...." అని స్వగతంలో అనుకుంటూ నడుస్తున్నారు.

నిదానంగా నడిచి, నిదానంగా పిల్లలకు పాలిచ్చి, తిరిగి పనికి పోకపోతే పటేలుతో, పటేలమ్మతో తిట్లు, ఆ భయం, కంగారు మొఖంలో స్పష్టంగా కనిపిస్తూవుంది. అంతేగాకుండా తమ వంతు పని తిరిగి తామే చేయాలి కాబట్టి వెంటనే తిరిగి వెళ్ళాలన్న ఆలోచనవారిని వేగంగా నడిపిస్తున్నది బండపై ఊసి, ఉమ్మి ఆరకముందే తిరిగి రావాలన్న పటేలమ్మ హుకుం వారి నడక వేగాన్ని మరింత పెంచింది

ఊర్లోకి రాగానే ముగ్గురూ మూడుదారుల్లోకి విడిపోయి ఎవరింటికి వాళ్ళు బయలుదేరారు.

బాలమ్మ వాకిట్లోకి అడుగు పెట్టగానే, తొమ్మిది సంవత్సరాల కూతురు ఈశ్వరమ్మ ఒడిలో ఏడుస్తున్న ఏడాది చంటివాడు తల్లిని గుర్తు పట్టి పాలకోసం ఆరాటపడ్డాడు.

ఆ ఆరాటానికి తల్లిగుండె చెరువయింది. దాంతో

"నా అయ్య... వస్తున్న బిడ్డ, వస్తున్న - ఆకలయితుందా నా కొడుకా? నా కొడుకు గుండెలు ఎండుకపోవచ్చు నమ్మా...." అని నొచ్చుకుంటూ బాలమ్మ గోళెం (నీళ్ళు పోసుకునే తొట్టి) వద్ద కాళ్ళు చేతులు కడుక్కుంది. కొన్ని నీళ్ళను మొఖంపై చల్లుకొని, నడుము నుంచి కొంగువిప్పి ముఖం తుడుచుకొని, పెద్దబిడ్డ ఒడిలో నుంచి చంటివాణ్ణి తీసుకొని గట్టిగా నాలుగైదుసార్లు ముద్దాడింది ప్రేమతో.

ఆ వాత్సల్యం, ప్రేమ, పేగుతీపి ఆ చంటివాడికి ఎలా తెలుసో కాని అంత ఏడుపులోనూ ఓ చిరునవ్వు పువ్వులా ముఖంపై విరబూసింది. రొమ్ముకోసం తడుము లాడాడు.

ఈశ్వరమ్మ బిక్కుబిక్కుమంటూ తల్లిని చూస్తూ నిల్చుంది.

బాలమ్మ రవికె ముడివిప్పి కుడిరొమ్ము తీసి, తడిచేతితో తుడిచి, రెండు పాలధారలు కిందపిండి, చంటివాడి నోటికందించింది.

చంటివాడు ఆకలిగా రొమ్మునందుకున్నాడు.

బాలమ్మ కొడుకు తల వెంట్రుకలను సర్దుతూ, నిమురుతూనే -

"అయ్యేడికి పోయిండే..." అని కూతుర్ని అడిగింది.

"జల్లెండ్లు, చాట్లు తీసుకొని పటేలు ఇంటికి పోయొస్తనని పోయిండు" అని నిరుత్సాహంగా అంది.

మిగతా పిల్లలకోసం చూసింది బాలమ్మ. ఎవరూ లేరు. ఆడుకోడానికి వెళ్ళారేమోనని పాలివ్వసాగింది.

తనూ కొద్దిసేపు ఆడుకోడానికిగాను ఈశ్వరమ్మ పరుగు తీసింది.

కుడి రొమ్మును తీసి చంటివాడి నోటికి ఎడమరొమ్మును అందిస్తూ ఎదురుగా వున్న కొట్టంలో ఈనడానికి సిద్ధంగా వున్న ఆవును చూసింది. తెల్లగా, బలిష్టంగా చురుకైన చూపులతో నిండు చూలాలతో ఆవు...

"ఆవు తన బిడ్డకు కూడా ఇంత మురిపెంతోటి పాలిస్తుండొచ్చు" అనుకుంది ఓ క్షణం తర్వాత-

'చిన్న లేగ పిల్లను ఎంత కష్టపడి సాకితే ఇంత పెద్దగయ్యింది సూడు?" అని ఆలోచించగానే బాలమ్మ స్మృతిపథంలో ఆవుకోసం పడ్డ కష్టమంతా మెదిలింది...

ఆవుకు తొలిసూరు కాన్పు. ఆ విషయం తలచుకోగానే బాలమ్మ మనసు బాధగా క్షణం మూలిగింది. ఆమె హృదయం ఆవుపట్ల ప్రేమతో ఆపేక్షగా కొట్టుకుంది.

పాలు తాగుతూ, తాగుతూనే చంటివాడు నిద్రపోయాడు.

వాకిట్లో చూరుకింద నీడకు గోనె తట్టులో చంటిబాబ్ని పడుకోపెట్టి రవికె ముడి వేసుకుంది బాలమ్మ. చిందర వందరగా పడేసి వున్న బొంగులను, చీర బరిగెలను, బొంగు బద్దలను సర్దింది.

గుడిశెలోకెళ్లి పొయ్యివద్ద పిల్లలు చిందరవందరగా చేసిన వాటినన్నింటిని సర్ది చెత్తనంతా పొయ్యివద్దకు ఊడ్చి కంచు గిన్నెలో పిల్లలు విడిచిపెట్టిన అన్నంలో పచ్చిపుల్లు వంపుకుని గుడిశె బయటికొచ్చి తిని, గిన్నె కడిగి ఇంట్లోపెట్టి తలుపులు దగ్గరకేసి "ఓ పోరీ.." అని కేకేసింది.

రెండు క్షణాలవరకు సమాధానం లేదు. తర్వాత నవ్వుతూ, తుళ్ళుతూ ఈశ్వరమ్మ పరిగెత్తుకొచ్చింది

"తమ్ముడు పన్నెండు సూడు ఎక్కడపోకు, ఇక్కడ్నే ఆడుకో. అయ్యొస్తడు. యెంకటేశన్న వొస్తడు - ఆకలయితే వుట్టిమీద బువ్వుంది లిసు. పిల్లలను కొట్టకు ఏమంటున్న?.. నేను పోతున్న...." అని గబగబ అన్ని పనులు పురమాయించి బాలమ్మ కదిలింది.

ఈశ్వరమ్మ "ఆఁ..." అని తలూపింది. తల్లిపోగానే తోటి పిల్లలను వేపచెట్టుకిందకు పిలిచి ఆటకు ఉపక్రమించింది. అది బోకె పించలాట.

బాలమ్మ వీధిలోకి నడవగానే మదమెక్కి బుసలు కొడుతూ వస్తున్న కోడెగిత్త ఎదురయింది.

కంది కొమ్మ నములుతూ వస్తూంది

"ఎవరి చేను దుంబాల చేసిందో దినింట్ల పీనుగెల్ల .ఊర్లె అడ్డమైనది దాపురించింది మంది చేన్లు సత్తెనాసు చేయడానికి తల్గింది. ఇది ఎన్నడు సస్తదో? ఎన్నడో పీడ పోతదో?". .

అని తిడుతూ బాలమ్మ పక్కనుంచి భయం భయంగా నడుస్తూ వుంది

కోడె గిత్త గడివైపు నడుస్తూ ఉంది.

ఆ కోడె వంద రెండు వందల పశువుల్లో వున్న అతి సులభంగా గుర్తుపట్టొచ్చు. అది మనిషెత్తుకోడె - పుష్టిగా, బలిష్టంగా వున్నకోడె తీక్షణమైన చూపు. పెద్దదైన నుదురు- నుదుట అరచేయంత గోధుమరంగులో మచ్చ.. మూరెడంత మూపురం. ఇద్దరు కూర్చునేంత వీపు, ఇనుము కరగబోసినట్టుగా పిక్కలు, పొడవైన తోక, తోక చివరన పొడవాటి నల్లటి వెంట్రుకలు, కాళ్ళకు నల్లటి గిట్టెలు, పరుగు అందుకుందంటే క్షణంలో కనుమరుగైపోతుంది. ఈగనుకాని దోమనుకాని వాలనీయకుండా అప్రమత్తతో వుంటుంది

ఆ కోడె గిత్తను ఊరిలో చాలామంది 'ఇత్తనపు కోడె' అంటారు.

వాళ్ళ ఉద్దేశంలో ఈ కోడె గిత్తకు పుట్టిన సంతానం శ్రేష్ఠమైనవని, ఎక్కువ పనిచేస్తాయని, అవులయితే ఎక్కువ పాలిస్తాయని, చూడ్డానికి గూడ బాగుంటాయని.

ఆ గిత్త పగలంతా బలాదూర్‌గా తిరుగుతూ, అవులను పరికిస్తూ, కంటికింపైన చేను మేస్తూ, నాలికను ముక్కు రంధ్రాల్లోకి పోనిస్తూ హాయిగా నెమరేస్తూ వుంటుంది. ఏదైనా తనకు నచ్చిన అవు కనిపిస్తే రంకె వేసిందంటే ఆ చప్పుడు సగం ఊరుకు స్పష్టంగా వినిపిస్తుంది

ఆ కోడెను చూసి ఇతర కోడెలు, ఆవులు నక్కి నక్కి తిరుగుతాయి. మేతగూడా భయం భయంగానే మేస్తాయి. దాని పక్కనుంచి సడవడానికి మనుషులు కూడా భయపడతారు.

ఆ కోడె గిత్తను చూసి కొంతమంది గ్రామస్తులు "బంగారం, బంగారమసుంటి కోడె అది, దాని పుట్టుకేందోగాని ఇసుంటి కోడె బంగారం పెట్టినా దొరకది. పైసల్ పెట్టినా దొరకది. దానికి ఇంతవరకు పేరు పెట్టినోడే లేడు" అని అంటూ వుంటారు.

ఏనాడూ కూడా ఆ కోడెగిత్త నాగలి దున్నలేదు. బండి లాగలేదు. బరువు మోయడం ఎలాంటిదో దానికి తెలియదు. ముల్లుకర్ర ఎలాంటిదో ఎరగదు. బాగా తినడం ..నీడకు పడుకోవడం.. ఊరంతా బలాదూర్‌గా తిరగడం దాని పని.

ఆ కోడెగిత్త యజమాని ఆ కోడెను చూసి గర్వపడతాడు. మితిమీరిన గర్వంతో మీసాలు మెలేస్తాడు. తనకు అచ్చొచ్చిన కోడె అని ఊరూరుకు చెప్పుకుంటాడు. దాన్ని జాగ్రత్తగా చూస్తున్నాడు.

ఇంతకూ ఆ కోడె ఎవరిది?

ఎవరిదంటే...ఒకప్పటి దేశ్‌ముఖ్, ప్రజలను గడ గడలాండించిన వ్యక్తి. ఇప్పుడు సర్పంచ్. సర్వాధికారి - ఆయన పేరు ప్రతాపరెడ్డి దొర ఆయనదే ఆ కోడెగిత్త.

ప్రతాపరెడ్డి దొరది పెద్దపులి ఆకారం. చెయ్యెత్తు మనిషి. ఆ భారీ శరీరానికి పిడికెడు, పిడికెడు మీసాలు మరింత గాంభీర్యాన్ని తెచ్చిపెట్టాయి. ఎర్రటి కళ్ళు చింత నిప్పులు (అతిశయోక్తి కాదు) ఒత్తుగా ఉన్న కనుబొమ్మలు, పెద్దపెద్ద డొప్ప చెవులు, చెవులనిండా గుబురుగా వికృతంగా వెంట్రుకలు.. వొంటినిండా రోమాలే.

మాదిగ బాలయ్య వెట్టికి చేసిన కిర్రు కిర్రు మనే చెప్పులు వేసుకుని చేతికి నాలుగు బంగారు ఉంగరాలు పెట్టుకుని ఓ ప్రక్క కావలి ముత్యాలు, మరో ప్రక్క మహమ్మద్‌పాషా వస్తాద్ నడువగా దొరవారు ఊరంతా రోజుకు ఓసారి తిరిగి వస్తాడు.

అలా దొరవారు షైర్ కెళ్ళినపుడు వీధుల్లోని ఆడవాళ్లు ఇళ్ళల్లోకి దూరిపోతారు. పిల్లలు జడుసుకొని ఒక్కోసారి మూత్రం చేసుకుంటారు. ఎదురైన ముసలివాళ్ళు వంగి వంగి రెండు చేతులు జోడించి 'దండం' బెడతారు. పక్కకు తప్పుకుంటారు. సైకిల్‌పై ఎవరైనా ఎదురైతే దిగి మరో దారెంట పోవల్సిందే... దొరవారు వస్తున్నప్పుడు దారికడ్డంగా ఆయనకు ఎదురుగా ఎడ్లుగాని, బండిగాని తోలరాదు. వాకిళ్ళల్లో మక్కలుగాని, ధాన్యంగాని పోయొద్దు. పిల్లలు దొడ్డికి కూర్చోవద్దు ఇలా రకరకాల నిర్బంధాలు... కట్టుదిట్టాలు..

ప్రతాపరెడ్డి తాత ముత్యంరెడ్డి హయాంలో కట్టిన 'గడి' ఇంకా ఉంది, ఆ కాలంలో దేశ్‌ముఖ్ ముత్యంరెడ్డి ఆ ప్రాంతంలో ఎక్కడా లేనటువంటి గడి కట్టించాడు. ఎన్నో వందలమంది జీవితాలకు సమాధికట్టె ఆ సమాధుల మీదనే ఆ గడి లేచిందని, ఆ గడిలో జరగని అన్యాయం అంటూ లేదని, అది దొరలపాలిట స్వర్గం అని, పేదల పాలిట నరకం అని, రైతుల రక్తాన్ని ప్రతిరోజు చవిచూసేదని ఆ ప్రాంతంలో చాలామందికి తెలుసు. ఇప్పుడు ప్రతాపరెడ్డి అందులోనే వుంటున్నాడు.

ఇప్పటికి ఆ సాంప్రదాయమే కొంచెం అటు, ఇటుగా కొనసాగుతూ వుంది. ఇప్పుడు గడి దక్షిణంవైపు బురుజు కొంత కూలిపోయింది ప్రధాన ద్వారం వద్ద కూడా గోడ కొంత కూలిపోయింది. బురుజు కొమ్ములు కూలిపోయాయి. చెట్లు, చేమలు ఎండిపోయాయి నీటికొలను ఎండిపోయింది

గడి లోపల సున్నంతో కట్టిన 'మిద్దిల్లు' బాగానే ఉంది. అక్కడక్కడ పెచ్చులూడినా, వర్షాలకు, తేమకు నాచుపట్టినా, గత వైభవఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ కచ్చీరు కుర్చీలు బల్లలు అలంకారాలు, అరుగులు చెక్కు చెదరకుండానే వున్నాయి.

ప్రతాపరెడ్డి దొరకు రెండువందల పశువులకు పైగా వున్నాయి. మరికొన్ని పశువులు అత్తగారి ఊరు మైలారం వద్ద ఉన్నాయి. గడీలో విశాలమైన నాలుగు పెద్ద పశువుల శాలలు పశువులకు సరిపోవడం లేదు

భూపరిమితి చట్టం గత కొద్ది సంవత్సరాలుగా అమలు జరుగుతున్నా ఆయనకు ఐదువందల ఎకరాలకు పైగా భూమి ఉంది ఊరిచుట్టు వున్న మంచి మంచి వ్యవసాయపు బావులన్నీ ఆయనవే. చెరువు కింద పొలాలు వున్నాయి. తన పొలాలను అనుకుని వున్న ఇతరుల పొలాలను కలుపుకున్నవి, అక్రమంగా ఆక్రమించుకున్నవి ఎన్నో వున్నాయి. సారవంతమైన భూమి గ్రామ శివార్లలో ఎక్కడున్నా అది ప్రతాపరెడ్డిదే ..

ప్రభుత్వం వెట్టిచాకిరి నిషేధించినా ఆయనవద్ద పదుల సంఖ్యలో వెట్టిచాకిరీ చేసేవారు ప్రతికులానికీ చెందిన వాళ్ళున్నారు

లైసెన్సు లేకుండా వడ్డీవ్యాపారం చేయడం చట్ట విరుద్ధమని ప్రభుత్వం నెత్తిమీద నోరు పెట్టుకొని ప్రకటనలు చేసినప్పటికీ, ఆయన లైసెన్సు లేకుండానే దశాబ్దాలనుంచీ వడ్డీ వ్యాపారం చేస్తూ వున్నాడు. లెక్కకుమించి ఆస్థి సంపాదించాడు.

ఆదాయపు పన్ను, ఆస్థిపన్ను అనేవి ఈ దేశంలో వున్నాయంటే అతను విరగబడి నవ్వుతాడు.

గ్రామంలో న్యాయం, చట్టం, అన్నీ ఆయన చేతిలోనే. పై అధికారులను తన ఆధీనంలో వుంచుకునేందుకుగాను తహసిల్‌దారుకు వెట్టి వాళ్ళతో నేతికుండలు, మసూరి బియ్యం పంపుతాడు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, ఎస్.పి.కి కోళ్ళు, గొర్లు, యిప్పపువ్వు సార దొంగతనంగా కాయించి పంపిస్తాడు గ్రామానికి వచ్చిన ఇతర అధికారులకు 'అంద చందాలతో' విందు చేయిస్తాడు.

ప్రతాపరెడ్డికి పరాయి స్త్రీలందరూ తన వుంపుడుకత్తెలతో సమానం. ఊర్లో ఎవరు పుష్టిగా, అందంగా కనిపిస్తే వాళ్ళు దొర కాళ్ళమీద పడాల్సిందే. ఆ తరువాత పడక గదిలో నలగాల్సిందే. .

ఎవరైనా ఇది అన్యాయం, న్యాయం అని అరిస్తే, గిరిస్తే లైసెన్సులేని టువల్ బోర్‌గన్ గుండెలమీద గర్జిస్తుంది. ఆ తరువాత కేసులేదు, కేసుపెట్టే నాధుడేలేడు... పెడితే పెట్టినవాడి నామరూపాలు అపురూపమవుతాయి.

అలా రాముని రాజ్యం భరతుని పట్టాభిషేకంలా కొనసాగుతున్న అతనికి ఎదురేమున్నది? ఏమీలేదు?

దొరవారి ఇత్తనపు కోడెకు కూడా ఎదురేముంది? ఏమీలేదు?

ప్రతాపరెడ్డిని చూసి ఎంత భయపడుతారో ఆయన కోడెను చూసి ప్రజలు అంతే భయపడరారు ఆ కోడె ఉనికి ఆ విధంగా పెరిగింది ఆ గ్రామంలో ఏ రాత్రో, ఏ పగలో చేలు మేసినా ఏమనడానికి వీల్లేదు గడ్డివాములు గుల్లచేసినా, ఏమనడానికి వీల్లేదు ఎనుగు(కంచె)లను తుక్కు తుక్కు చేసినా ఏమనడానికి వీల్లేదు గెట్టువెంట దాచుకున్న గడ్డి మేసినా ఏమనడానికి వీల్లేదు

ఎవరైనా అటకాయించి, కర్రతో కొట్టడానికివస్తే కాలి గిట్టలను నేలకేసి రాసి కొమ్ములతో కుమ్మడానికొస్తుంది. లేవనెత్తి ఎత్తేసినా ఎత్తేయగలదు. అందుకే ఆ కోడె జోలికి ఎవరూ పోరు

అలా బలాదూర్‌గా తిరిగి అందరికి సింహస్వప్నంలా తయారైన కోడెగిత్త గడీలోకి అడుగు పెట్టింది అడుగు పెట్టకముందు అరచిన అరుపుకు ఇద్దరు జీతగాళ్ళు పరుగెత్తు కొచ్చారు ఎదురుగా. .

మ్యాదరి పోశయ్య మిగిలిన చాటలు, జల్లెండ్లు చేతిలో పట్టుకొని గడిలోనుంచి బయటకొస్తున్నాడు ఇత్తనపు కోడె ఎదురయింది - దాన్ని చూసి పక్కకు తప్పుకొని అది తనను దాటిన తర్వాత ఇంటిదారి పట్టాడు.

పోశయ్య ఇంటికొచ్చి, ఆవుకింత మేతవేసి, పొడిమట్టిని కింద రొచ్చయిన ప్రదేశంలో పోసి, కాళ్లుచేతులు కడుక్కుని, సగం బొంగు చీరే వరకు పొద్దుపోయింది.

రైతులు, కూలీలు తలలమీద బరువులతో ఇళ్లకు చేరుతున్నారు. చేద బావుల వద్ద గిలకల చప్పుడు, కొట్టాల వద్ద పశువుల చప్పుడు, కూతలు, కేకలు, అంతా సందడి, కల్లు దుకాణం వద్ద మరీ సందడి.

బాలమ్మ కూలిపని నుంచి ఇంట్లోకి రాగానే పోశయ్య కల్లు దుకాణం వైపు కదిలాడు

ఈశ్వరమ్మ కుండలు తోముతోంది ఈశ్వరమ్మ కన్న చిన్నోడు మల్లేశ తమ్ముడిని ఆడిస్తున్నాడు. చిరాకు పడుతూ -పెద్దోడు వెంకటేశు ఇంట్లో లేడు- బాలమ్మ రాగానే కాళ్లుచేతులు కడుక్కొని, చంటివాణ్ణి ఒడిలో వేసుకొని పాలివ్వసాగింది. తాను కొంతసేపు అలాగే కూర్చుని విశ్రాంతి తీసుకుంది.

ఆ తర్వాత వాకిలి, గుడిశెలోపల ఊడ్చి దీపాలు ముట్టించి, వంట ప్రయత్నంలో మునిగిపోయింది బాలమ్మ ఈశ్వరమ్మ తల్లికి సాయపడుతూ వుంది.

చంటివాడు పాలు తాగాక మల్లేశతో ఆడుకోసాగాడు

★ ★ ★

సరిగ్గా వారం రోజుల తరువాత

మ్యాదరి పోశయ్య ఆవు ఈనింది. ఇంటిల్లిపాదికి పట్టరాని సంతోషం గండం గడిచినందుకు బాలమ్మ మనసు ఉప్పొంగిపోయింది. ఇక పిల్లల సంగతి వేరే చెప్పనక్కరలేదు

పుట్టిన మొగల్యాగ (దూడ) చూడ్డానికి చాలా అందంగా ఉంది గిట్టల వద్ద, మెకాళ్ల దగ్గర నల్లటిమచ్చలు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. నుదుట గోధుమ రంగులో మచ్చ, మెత్తటి శరీరం .చురుకైన కళ్ళు

పోశయ్య రుమాలు తీసేసి, ధోవతిపైకి ఎగకట్టి, వేడి నీళ్ళతో ఆవును. ల్యాగను కడిగి శుభ్రం చేశాడు. ఆవుకు చేయవలసిన సపర్యలు చేశాడు ఈనిన కొన్ని గంటలకు తినిపించాల్సిన ఆకులు, మందు తినిపించాడు

ఇంటిల్లిపాది ఆవును చూస్తూనే కూర్చున్నారు. పిల్లలు ఆ ల్యాగకు ఏ పేరు పెట్టాలో ఆలోచిస్తున్నారు. వెంకటేశు ల్యాగచుట్టు తిరుగుతూ దాని మెత్తటి శరీరాన్ని తాకి ఆనందిస్తున్నాడు. చెప్పరానంత ఆనందం ఆ కుర్రాడి కళ్ళల్లో కనిపిస్తున్నది.

ల్యాగ పుట్టినాక కొన్ని గంటలకే వాకిలంతా పరుగు తీయడం ప్రారంభించింది. ల్యాగ కాళ్ళు నొప్పి పెడతాయని పోశయ్య పరుగెత్తనీయకుండా పట్టుకోసాగాడు. అయినా అది విడిపించుకొని పరుగు తీయసాగింది అది పరుగు తీసినప్పుడల్లా పిల్లలు కేరింతలు కొడుతూ చప్పట్లు చరుస్తూ ఆనందిస్తున్నారు. పిల్లలు అలా చేస్తున్నందుకే ల్యాగ రెచ్చిపోయి, పరుగెడుతుందన్న అభిప్రాయానికి వచ్చి పోశయ్య పిల్లల్ని వారించాడు. పిల్లలు కొద్దిసేపు మౌనంగా వుండి తిరిగి యధాప్రకారమే ల్యాగతో ఆడుకోసాగారు.

ఆవు తన బిడ్డ చలాకితనాన్ని గర్వంగా చూస్తూ ఉన్నది ల్యాగ ఎటువెలితే అవు చూపులు అక్కడ చిక్కుకుంటున్నాయి. ప్రతి కదలికను అది గమనిస్తూ ఉంది.

ల్యాగ క్షణంలో అటూ ఇటూ పరుగెత్తి తిరిగి తల్లిదగ్గరికి వచ్చి తల్లి నాలిక తడి అంటగానే తిరిగి పరుగు. .ఇలా సైయ్యాట లాడుతూ వుంది.

'తొలిసూరుగ మొగల్యాగ పుట్టింది, ఇంట్ల అంత మంచే జరుగుతది. ' అని బాలమ్మ మనసు సంతోషపడింది. పనిచేస్తూ వున్నా మనసు అంతా ఆవుమీద, దానిబిడ్డ మీదనే వుంది బాలమ్మకు

పిల్లలు జున్ను పాలు తాగొచ్చునని తెగ సంబరపడిపోతున్నారు "జున్నుపాలు నాకే ఎక్కువ అంటే నాకే ఎక్కువ" అని అప్పుడే కీచులాడుకుంటున్నారు

ప్రతిరోజు కొన్ని పాలు అమ్ముకుంటే వచ్చిన పైసలు దేనికైనా అవసరానికి వస్తాయని పోశయ్య మనసులో ఆనందపడిపోతున్నాడు. ఆ గర్వం, ఉత్సాహం, ధైర్యం మొఖంమీద కనిపిస్తూ వుంది.

'ఇంటిముందు గొడ్డు, గోదవుంటేనే మంచిది. అన్నిటికి ఆదుకుంటయి అని' మనసులో అనుకున్నాడు పోశయ్య.

'చేటలు, జల్లెండ్లు, జల్లి గంపలు, తడికెలు అల్లి అమ్ముకుంటే పొట్టకు గడవకుంట అయింది. రోజు రోజుకు సంసారమేమో పెరగవట్టె, ఆమ్దానేమో తగ్గవట్టె. ఇంక ఏదైన ఆమ్దాని వుంటె బాగుండెడిది' అని అనుకుంటున్న రోజుల్లోనే ఆవు కట్టడం ఆ తర్వాత ఈనడం కొంత ఊరటనిచ్చింది పోశయ్యకు

పోశయ్య ఆవు ఈనిన విషయం ఊరంతటికి తెలిసిపోయింది. కొంతమంది వచ్చి చూసిపోయారు మరికొంతమంది చూడ్డానికి వస్తున్నారు, పోతున్నారు.

చాలామంది పోశయ్య అదృష్టానికి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కొంతమంది కొన్ని సలహాలు ఇచ్చారు. మరికొంతమంది కొన్ని సూచనలు చేశారు.

పోశయ్య అందరి మాటలు విని, చేయవలసిన పనులు అన్నీ చేశాడు.

పోశయ్య ఆవు ఈనిన విషయం తన మనుషులద్వారా దొరగారికి తెలిసింది. ఆ వార్త విని ప్రతాపరెడ్డి చిన్నగా నవ్వుకున్నాడు.

బాలమ్మ, పోశయ్య, పిల్లలు అందరూ ఆనందంతో రాత్రి చాలా పొద్దుపోయేంత వరకు ఆవు వద్దనే మంట వెలిగించుకొని, మంటవెలుతురులో ఆవును, ల్యాగను చూస్తూ వాటి ప్రేమను, ఆప్యాయతను గమనిస్తూ, ముసిముసిగా నవ్వుకుంటూ కూర్చుని తరువాత గుడిశెలో కెళ్లి పడుకున్నారు.

వరుసగా మూడు రోజులపాటు పిల్లలు జున్ను పాలు కొట్లాడుకుంటూ తిన్నారు. బాలమ్మ ఆ వాడలోవున్న వారందరికీ జున్ను పాలు పోసింది. పొరుగూరిలో వున్న తమ బంధువులకు కూడా పంపింది.

ప్రతిరోజు పిల్లలు పోటీపడి, ల్యాగకు, ఆవుకు మేతవేయడం సపర్యలు చేయడం ప్రారంభించారు. ల్యాగతో చాలసేపు ఆడుకునేవారు.

ఆవు ఈనిన తరువాత ఇంట్లో వారందరికీ పని అధికమయింది. సందడి ఎక్కువ యింది. పోశయ్య వారంరోజులపాటు పూటకు రెండున్నర కిలోల పాలు గొల్ల మల్లయ్యకు పోశాడు. ఇంట్లోకి కొన్ని వుంచుకునేవాడు. కాలం బాగానే జరుగుతూ వుంది. మల్లయ్య వద్ద కొన్ని డబ్బులు తీసుకొని వాడుకున్నాడు. మొత్తంమీద ఏదో తృప్తి మనసునిండా.

వారం రోజుల తరువాత ఓనాడు ఉదయం...

గళ్ళ గళ్ళలుంగీ కట్టుకొని, లాల్చీ వేసుకొని, కళ్ళకు సుర్మా పెట్టుకొని, రెట్టకు, మెడలో తాయెత్తులు కట్టుకుని, చిన్న బాకు పొత్తి కడుపులో దోపుకొని పోశయ్య గుడిశె ముందు నిల్చున్నాడు. దొరగారి మనిషి వస్తాద్ మహమ్మద్‌పాషా.

చేటలకోసం వచ్చాడేమోననుకొని పోశయ్య గుడిసెలోకి రమ్మన్నాడు పాషాను. రెండు మూడుసార్లు పిలిచినా రాకపోయేసరికి పోశయ్యనే గుడిశె బయటకు వచ్చి,

"ఏం సంగతి పాషాభాయి?" అని అడిగాడు.

రెండు క్షణాలు పోశయ్యను తదేకంగా చూసి,

"దొర నీ ల్యాగను కొట్కరమ్మన్నడు..." అని కుండబద్దలు కొట్టినట్టు సూటిగా చెప్పాడు పాషా.

పోశయ్యకు ఏమీ అర్థంకాక ఆశ్చర్యంగా

"ఎందుకూ?..." అని అడిగాడు.

బాలమ్మ పనులు వదులుకొని వాకిట్లోకి వచ్చి ఇద్దరి సంభాషణ వింటూ ఉంది. పిల్లలు ఎండకు వేపచెట్టువద్ద కూర్చున్నారు.

కోడి తన పిల్లలతో "క్కొక్కొక్కొ..." అంటూ పెంటవైపు బయలుదేరింది.

"కొట్టుక రమ్మన్నడు అంతే! ఎందుకు అంటే ఏం జెప్పాలే?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"ఎందుకు కొట్టుక రమ్మన్నడో తెలవాలెగదా పాషాభాయి?" పోశయ్య నిదానంగా అడగ్గా.

"గడికి వచ్చినంక తెలస్తుది ఫా.." అన్నాడు పాషా.

"గడికి వచ్చేది ఎందుకు? ఏం తప్పు చేసినమో చెప్తేగదా... చెప్పి కొట్టుకపోతే కొట్టుకపోదువుగాని చెప్పు" విషయం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలంతో అడిగాడు పోశయ్య.

పాషా రెండు క్షణాలు తటపటాయించి,

"దొరవారి ఇత్తనపు కోడె నీ ఆవుమీద పారిందట. ఇత్తనపు కోడెకు పుట్టిన ల్యాగదూడ నీ దగ్గర వుండొద్దట. అది దొరదేనట. అందుకే దొర కొట్టుక రమ్మన్నడు..." సూటిగా చెప్పాడు.

ఆ మాటలు వినగానే పోశయ్యకు గుండెల్లో రాయి పడింది. మొఖం వివర్ణ మయింది. ఎన్నో భావాలు, ఆ మొఖంలో తొంగిచూశాయి. క్షణంలో మొఖం కళావిహీనం అయింది.

బాలమ్మ ఏమి వింటోందో? తనకే తెలియకుండా వుంది.

పిల్లలకు ఇదేమి అర్థం కాలేదు.

దొర కన్ను తన ఆవుమీద పడిందంటే, ల్యాగను కొట్టుకరమ్మన్నడంటే ముందు ఏమి జరగనున్నదో కూడ పోశయ్యకు లీలగా తెలియ సాగింది.

అంతే! గుండె ఆగినంత పనయింది. రక్తనాళాల్లో రక్తం ఓ క్షణంపాటు యిగిరి పోయినట్టనిపించింది. కళ్ళముందు వెలుగును ఎవరో ఆర్పేసినట్టు తోచింది. పంచేంద్రియాలు పనిచేయటం మానేశాయేమో ననిపించింది. తాను ఏమి ఆలోచిస్తున్నది తనకే తెలియకుండా ఉంది. మెదడునిండా ఏదో బరువు, అంతా శూన్యం... చీకటి, నోరువెళ్లపెట్టి అలాగే పాషాను రెప్పవేయకుండా చూస్తూ వున్నాడు. రెండు క్షణాలు గడిచాక మనసు నెమ్మదించింది. ఈ ప్రపంచములోనికి రాగలిగాడు. అయితే ముందు జరుగబోయే ప్రమాదకర సన్నివేశాలన్నీ పాషా కళ్ళల్లో కనిపిస్తున్నాయి. మనసులోని తీవ్రత, ఆందోళన, భయం, తిరిగి స్థాయినందు కున్నాయి. ఆ ప్రమాదాన్ని నివారించేందుకుగాను వెంటనే పోశయ్య పాషా కాళ్లమీద పడ్డాడు. పడి,

"పాషాభాయి నీ కాల్మొక్త! గులాపోణ్ణి అయిత. గాపని మాత్రం చేయకు. ఈపుల కొట్టుగాని కడుపుమీద కొట్టకు. పొట్టకు ఎల్లక, సంసారం గడవక, ఉపాసం ఉండి, ఉప్పిడి ఉండి ఆ ఆవును నడుపుకున్నం - దాన్ని పువ్వును కాపాడుకున్నట్టు కాపాడు కున్నం. ఇప్పుడు నువ్ తీసుకపోతాంటే ఎట్ల?.. జెర నువ్వే జెప్పు?

జెర మా మీద... కన్నెయ్య కుంద్రి మీ కాల్మొక్త.." అని ఏడ్చాడు.

పాషా మనసు కరుగలేదు - సరికదా ఈసడింపు, కోపం పెరిగింది.

ప్రతాపరెడ్డి దొర చెయ్యమన్న పని చేస్తే ఏదైనా 'ఇనాం' దొరకగలదన్న ఆశ మనసు మారుమూలల్లో లేకపోలేదు. ఆయనను సంతోషపరచడమే తన విధి. ఆయన ఎలా చెయ్యమంటె అలా చెయ్యడమే తనపని. అని మనసులో అనుకున్నాడు పాషా. రోజు రోజుకు ప్రతాపరెడ్డి మన్ననలను పొందాలన్న కుతూహలం, తపన, ఆరాటం పాషా మనసులో పెరగసాగింది. దాంతో తనకు ఏదో మేలు జరుగగలదన్న భ్రమ కూడా లేకపోలేదు. ఆ ఉత్సుకతే ఇతరుల పట్ల చిరాకు కోపం కలుగచేస్తున్నది.

మ్యాదరి పోశయ్యను ఓ క్షణం చూశాడు సూటిగా... ఆ వెంటనే దొరవారు పురమాయించిన పని. ఆజ్ఞ, దొరవారి ఆకారం మనసులో మెదిలింది. దాంతో మనసులో పేరుకుంటున్న పొర పటాపంచలైంది. దొరగారి పలుకుబడిద్వారా తాను తాగుతున్న కల్లు, విప్పపూల సారా....కోడి, మేకమాంసం మనసులో మెదిలింది. 'కల్లు, సారా మాంసం' జ్ఞాపకం రాగానే ఒంట్లో ఉత్సాహం పెరిగింది. స్వామి భక్తి పెల్లుబికింది. కర్తవ్యం తనను ముందుకు తోసింది. కళ్ళల్లోకి కారిన్యం పాకింది.

మ్యాదరి పోశయ్య గుడ్లళ్ళోకి నీళ్ళు తీసుకొని, దుఃఖంతో బొంగురు బోయిన గొంతుతో.

"పాషాభాయి.. దాని జోలికి పోకుండ్రి మీ కాల్మొక్త , మీకు పుణ్యమైతది.."

అని మనసులోని బాధనంతా మాటల్లో వెల్లడిస్తూ వున్నాడు.

పాషాకు అవేమీ వినిపించడంలేదు. పాషాకు ఒళ్ళుమండుతూ వుంది. పోశిగాడు తనను ఆజ్ఞాపించేంత మొనగాడా?అని చిర్రెత్తుకొచ్చింది. కోపం రాసాగింది. వీడెంత, వీడి తాహతెంత అన్నట్టుగా చూస్తూ నాసలు చిట్లించాడు.

తెగిన చెరువులాగా బాలమ్మకు లోపలనుంచి ఏడ్పు తన్నుకొస్తూ వుంది. కనుకొలనుల్లో నీరు ఊరింది...ముక్కు బరువెక్కింది.

పిల్లలకు ఇదేమీ అర్థం కాలేదు. వెంకటేశ మాత్రం, తండ్రి దగ్గరకు వచ్చి నిల్చున్నాడు. మిగతా పిల్లలు కూర్చున్న వద్దనుంచి లేవకుండానే అలాగే చూస్తూ వున్నారు

పాషా ఇదేమి పట్టించుకోకుండా, పోశయ్య ఏడ్పు, బాలమ్మ బాధ, పిల్లల అవస్థ, చూడనట్టుగానే కాళ్ళమీద పడ్డ పోశయ్యను వదిలించుకోడానికి ప్రయత్నం చేస్తూ,

"అదంతా నాకు తెలవది...దొర కొట్టుకరమ్మన్నడు... నేను కొట్టుకపోతను. ఏమన్న వుంటే దొర దగ్గరకొచ్చి మాట్లాడుకో...యిగ అప్పుడు దొర ఇష్టమో, నీ ఇష్టమో దొర చెప్పిన మాట యినకుంటె నాకు దొబ్బులొస్తయ్...? అన్నాడు నిదానంగానే.

ఆ మాటలన్న తరువాత పోశయ్య, పాషా కాళ్లను మరింత గట్టిగా పట్టుకొన్నాడు. కాళ్ళు వదిలితే ల్యాగను కొట్టుకపోతడన్న భయం ఆవరించింది.

బాలమ్మ చేతిలోని చేటను గుడిశెలో పెట్టి భర్త దగ్గరకొచ్చి నిల్చుంది. పిల్లలు కూడా తండ్రి దగ్గరకొచ్చి నిల్చున్నారు.

పరిస్థితి ఇలా మారేసరికి పాషాకు అరికాలిమంట నెత్తికెక్కినట్టయింది.

"చెప్పుతుంటె నీకు కాదు భే... ఇడువ్...." అని పోశయ్యను ఓ తోపు తోశాడు –

పోశయ్య కొంత దూరంలో పడ్డాడు ఆ తోపుకు.

పాషా ఆవు వద్దకు అడుగు వేశాడు.

బాలమ్మ, పిల్లలు, పోశయ్యను పట్టుకున్నారు. ఆ దశలో కూడ పోశయ్య తన చుట్టూ మూగిన పిల్లలను, భార్యను తీసుకొని పాషా దగ్గరికి పరుగెత్తినంత పనిచేశాడు.

కొత్తమనిషి దరికి రావటం చూసి ఆవు ఏదో అపాయమని గ్రహించి కుమ్మడానికి ప్రయత్నించింది. కాని కట్టేసి వుండటము వలన ఆవు పాషా దగ్గరికి రాలేకపోయింది. మెడకువున్న త్రాడు ఆపేసింది. అయినా కుమ్మడానికి గింజుకున్నది. కాని వీలు లేక పోయింది.

పోశయ్య తిరిగి పాషాను పట్టుకుని,

"జెర నామాట యిను పాషాభాయి – సచ్చి నీ కడుపుల పుడత. ." అని ఏదేదో అంటూ వున్నాడు. అవన్ని పాషా చెవికి ఎక్కడం లేదు

ల్యాగ బెదురుతు – తోక పైకెత్తి పాషా వైపు చూస్తూ వుంది. పాషా కదిలితె అది పరుగు అందుకునేట్టుగా వుంది. అంత హుషారు చురుకుదనం దాని కళ్ళల్లో కనిపిస్తూ వుంది.

బాలమ్మ వెళ్ళి పాషాకు అడ్డంగా ల్యాగను పట్టుకోకుండా నిలుచుంది పాషాకు భరించరానంత కోపంవచ్చి, బాలమ్మను అవతలకు తోసి, ల్యాగ మెడనుంచి వ్రేలాడుతున్న త్రాడు అందుకున్నాడు. ఇదంతా క్షణంలో జరిగిపోయింది.

ల్యాగ పరుగెత్తబోయింది. కాని మెడత్రాడు పాషా చేతిలో ఉండటం వల్ల ఎక్కువ ముందుకు పోలేకపోయింది. అయినా గింజుకోసాగింది. ఆవు అక్కడ ఉండీ కుమ్మడానికి ప్రయత్నిస్తూ వుంది. తన బిడ్డను ఆపదనుంచి కాపాడాలని ఆరాటపడుతూ వుంది.

బాలమ్మ పాషా చేతిలోని తాడును లాక్కోడానికి ఏడుస్తూనే తీవ్ర ప్రయత్నం చేస్తూ వుంది. అక్కడనుంచి కదలకుండ పోశయ్య పాషా కాళ్ళను గట్టిగా పట్టుకున్నాడు. వెంకటేశు తప్ప అందరు పిల్లలు ఏడుస్తూ వున్నారు. ఆ చప్పుడుకు, ఏడ్పుకు చుట్టు ప్రక్కలవాళ్లు గుమికూడారు. దొర మనిషి పాషా వుండటంతో ఎవ్వరూ ముందుకు రాలేకపోయారు. అందరూ ప్రేక్షకుల్లా చూస్తూ నిల్చున్నారు. పాషా చేతులతో బాలమ్మను, కాళ్ళతో పోశయ్యను దూరంగా నెట్టేస్తూ ల్యాగను అక్కడనుంచి తీసుకెళ్ళడానికి శతవిధాలా ప్రయత్నిస్తూ ఉన్నాడు.

ఇదంతా గమనిస్తూవున్న వెంకటేశు బుర్ర తిరిగిపోయింది. మనసులో ఏదో తళుక్కున మెరిసింది. కళ్ళల్లో కోపం, కసి సన్నగా పాకింది. అంతే దగ్గరలోని ఓ రాయిని తీసుకొని బలంగా పాషా మీదికి విసిరాడు. ఆ రాయి వెంట్రుకవాసిలో తప్పి దూరంగా పడింది. వెంకటేశు మరో రాయి విసరడానికి ఉద్యుక్తుడవుతుండగా...

"అరేయ్...." అంటూ వెంకటేశు వైపు పరుగెత్తబోయాడు పాషా.

పాషాకు పట్టుబడి పోతానేమోననే భయంతో వెంకటేశు చేతిలోని రాళ్ళను క్రిందపడేసి పరుగు లంఘించుకున్నాడు.

ఆ చర్యతో పాషాలో మరింత పట్టుదల పెరిగింది. కోపం తారాస్థాయి నందుకుంది. బాలమ్మను, పోశయ్యను చేతులతో కాళ్ళతో తోసేస్తూ బూతులు తిడుతూ ల్యాగను గుంజుకపోవడానికి ప్రయత్నిస్తూ వున్నాడు. పాషా చేతిలోనుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్న ల్యాగ "అంబా.. " అంటూ కాళ్లు భూమికేసి అదిమిపట్టి ముందుకు పోవడానికి నిరాకరిస్తూ వుంది.

బాలమ్మ, పోశయ్య తమ ప్రయత్నాల్లో తామున్నారు.

ఈ పరిస్థితినంతా చూస్తూ ఆవు తన మెడకు వున్న త్రాడును తెంపుకోవడానికి ప్రయత్నిస్తూ వుంది. బుసలు కొడుతూ, గిట్టలతో నేలను బలంగా రాస్తూ పాషాను కుమ్మడానికి వస్తూవుంది... తన బిడ్డను కాపాడుకునేందుకు శక్తినంతా కూడగట్టు కుంటూ వుంది.

ఇలా పరిస్థితి ఉద్రిక్తతగా వుంది ఎవరి పెనుగులాటలో వారున్నారు.

ఇటు పిల్లల ఏడ్పు, అటు ఆవు బుసలు, ల్యాగ అరుపులు, బాలమ్మ, పోశయ్యల మాటలు, పాషా బూతు మాటల నేపధ్యంలో కాకుల అరుపులు, ప్రేక్షకుల్లా వున్న జనం నిట్టూర్పులు..

ఆ సమయంలోనే ఇలాంటిదేదో జరుగగలదన్న అనుమానంతోనే ప్రతాపరెడ్డి దొర కావలి ముత్యాలు, మరో ఇద్దరు ముగ్గురు తన మనుషులు తోడు రాగా, లైసెన్సులేని టువల్ బోర్‌గన్ బుజానికి వేసుకుని మ్యాదరి పోశయ్య గుడిశెవద్ద కొచ్చాడు.

దొరను చూడగానే పాషాకు ఏనుగంత బలమొచ్చింది. తనేమిటో, తన ప్రతాపమేమిటో, చూపించే మరో అవకాశం చిక్కిందనిపించింది. తన రౌద్రరూపాన్ని మరింత భయంకరంగా ప్రదర్శించాలని బాలమ్మను, పోశయ్యను విసిరి విసిరి గెంటేస్తూ వున్నాడు.

ప్రతాపరెడ్డిని చూడగానే పోశయ్య పరుగెత్తి కాళ్లమీదపడి ఘొల్లుమని ఏడిచాడు. బాలమ్మ పాషా చేతులను విడవకుండా గట్టిగా అలాగే పట్టుకొని పెనుగులాడుతూ వుంది. త్రాడును ఒడిసి పట్టుకోవడంలో తాడు ఒరుసుకపోయి చేతులు ఎరుపెక్కాయి. చర్మం గీరుక పోయి సన్నగా రక్తం పైకొస్తుంది. పాషా గెంటేస్తున్న ప్పుడల్లా గోడకు తగిలి బుజం వద్ద చర్మం ఊడి ఎర్రగయింది....

పిల్లలు తల్లిచెంగు, కొంగు పట్టుకొని గుండెలు పగిలేట్టుగా "అద్దద్దా" అని ఏడుస్తూ వున్నారు. ఆ ఏడ్పు బాలమ్మకేమి వినిపించడంలేదు. పాషా ఆ పిల్లలను పట్టించుకోవడము లేదు తన ధ్యాస తనకే ఉంది....

గొడ గొడ ఏడుస్తున్నా పోశయ్యను ప్రతాపరెడ్డిదొరగారు తన చేతిలోని టువల్ బోర్‌గన్ గొట్టంతో కాళ్ళమీదినించి దూరం జరిపి..

"ఏంది! ఏం సంగతిరా?.." అని నిదానంగానే అడిగాడు

పోశయ్య గుండెలు గుద్దుకుంటూ, ఏడ్పుగొంతుతో కళ్ళెంట నీళ్ళు కారుతుండగా..."

"నా ల్యాగను కొట్టకపోకుండ్రి దొరా మీ కాల్మొక్త. మీ బాంచెనైత. ల్యాగను కొట్టుకపోతే ఆవు గుండె పల్గి సచ్చిపోతది దొరా.. ఆవు మాకు గాకుంట చెయ్యకండ్రి. కడుపు మీద కొట్టకుండ్రి దొరా.. మీ గులాపొణ్ణి.. మీ గంజి గట్క తిన్నోన్ని.. నన్ను అన్యాలం (అన్యాయం) చేయకండి.." అని చిన్నపిల్లవానిలా ఏడుస్తూ మోకాళ్ళ మీద నిలబడి రెండు చేతులు జోడించి ప్రతాపరెడ్డికి దండంపెట్టాడు.

పోశయ్య గోడు అనవసరమైన గోడులావుంది దొరవారికి.. కాళ్ళమీద పడటం దండం పెట్టడం చిరాకనిపించింది. పోశయ్య ఓ పురుగులా కనిపించాడు.

అసహ్యమేసింది. అవన్ని విషయాలను నుదురే తెలియజేస్తున్నది. అయినప్పటికి నిదానంగానే,

"ఆ ల్యాగ నా ఇత్తనం కోడెకు పుట్టిందా? లేదారా?" అని అడిగాడు.

పోశయ్యకు ఏమి చెప్పాలో ఓ క్షణం తోచలేదు. తరువాత

"ఏమో దొరా నీ కాల్మొక్త...పశువులల్ల కొడితే యెదకొచ్చినప్పుడు యే కోడె "పారిందో" తెల్వది... మీ గులాపోణ్ణి మా మీద దయ సూడండ్రి....." అని ఇంకేదో చెప్పబోయాడు.

కాని దొరవారికి కోపం చురుక్కున వచ్చింది చేతిలో వున్న గన్ మరో చేతికి మార్చుకొని,

"ఏందిరా మ్యాదిరి లంజకొడుకా నా మాటనే జూట అంటావ్? నీయమ్మ..." అని ప్రతాపరెడ్డి బూతులు తిడుతూ పోశయ్య డొక్కలో తన్నాడు.

పోశయ్య "అమ్మా" అంటూ క్రింద తూలిపడిపోయాడు. బాలమ్మ కొట్టుకుంటూ, గుద్దుకుంటూ పాషా చేతులను, త్రాడును వదిలి భర్త దగ్గరికి పరుగెత్తికొచ్చి డొక్కలో అరచేయితో ఏడుస్తూనే రాయసాగింది.

పిల్లలు బిల బిల మంటూ తండ్రి చుట్టూ చేరారు.

పాషా త్రాడుతో ల్యాగను ముందుకు లాక్కుపోతున్నాడు.

పోశయ్య ఆ అశక్తతలో కూడా బలాన్నంత కూడదీసుకొని, భార్యను పిల్లలను తోసేసుకుంటూ పాషాకు అడ్డంగా వెళ్ళాడు.

ఆవు ఇంకా గింజుకుంటూను వుంది. క్రిందభూమి గిట్టెల తొక్కిడికి నలిగిపోతూ వున్నది.

పోశయ్య పాషా కాళ్ళను చుట్టేసుకున్నాడు. బాలమ్మ తల బాదుకుంటూ శోకం పెట్టి ఏడుస్తూ వుంది. పిల్లలు వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. వీధిలో కొంతమంది ప్రేక్షకుల్లా చూస్తూ నిలుచున్నారు. ప్రతాపరెడ్డిరాగానే చాలామంది అక్కడినుంచి కదలిపోయారు. ముసలివాళ్లు తప్ప స్త్రీలందరూ ఎవరి ఇళ్ళల్లోకి వాళ్ళు దూరారు.

ల్యాగ "అంబా.." అంటూ గిట్టెలతో భూమిని తొక్కిపడుతూ ముందుకు కదలడానికి నిరాకరిస్తూ వుంది. పాషా పట్టు కొంత సడలినా అది వెనక్కు అడుగేస్తూ ఉంది.

ప్రతాపరెడ్డికి పిచ్చెక్కినట్టు వుంది. రెండు అడుగులు వేసి

"ఏందిరా ఏమనిపిస్తొంది.." అని తుపాకి గొట్టంతో పోశయ్యను పాషా కాళ్ళ మీదినించి కదిపాడు.

"ఏంలేదు దొరా ల్యాగను కొట్టుక పోకుండ్రి మీకాల్మొక్త.." పోశయ్య.

"చెప్తిని గదరా అది నా ఇత్తెనపు కోడెకు పుట్టిందని అగో నొసట మచ్చగూడా అట్లనే వుంది సూడు. నా ఇత్తనం కోడెపారినంక పుట్టిన ల్యాగను ఇంతవరకు ఎవడన్న ఇయ్యనన్నడా? ఇయ్యనన్నొడు బతికిండా?...యిప్పుడు ఇయ్యనని కాళ్ళమీద పడతావు? నీ తల్లి.." అని బూతులు తిట్టాడు దొర.

"అరే పోశిగా దొరతోటి ఎందుకురా తకురార్? ఊర్లె ఊర్లె ఉండబుద్ధి అయితలేదా? ఏం సంగతి? నీ అవు మీద ఇత్తనంకోడె పారంగ నేను జూసినరా నా కండ్లతోటి నేనే సూశిన. . ఆళ్లు ఈళ్లు చెప్పంగయిని అంటలేను తెల్సా.." అన్నాడు దొరవెంట వచ్చిన మాదిగ మైసయ్య-

"అదైతే సత్యమే .. దొరా ఇత్తనపు కోడె పారితేనె ఇత్తనం కోడె అసుంటి ల్యాగ బుట్టింది. కనిపిస్తలేదురా. . దానిరూపు.... దాని అవతారం..." అని బ్యాగరి నర్సయ్య వంతు పలికాడు.

"ఇప్పుడన్న యిన్నావురా పోశిగా.." దొరవారు గర్వంగా మీసం మెలేశాడు.

"పారితే పారిండొచ్చు దొరా...యెనకముందు లేనోళ్ళముగా ఒక్క ల్యాగను కొట్టుక పోకుండ్రి....మీ ఉచ్చ తాగుమంటే తాగుత.."

కడుపులో అట్టడుగు ప్రేగు వణుకుతుండగా అన్నాడు పోశయ్య.

"ఊకున్నకొది నీల్గుడు ఎక్కువైతుంది. ఏమి సంగతిరా మ్యాదిరి లంజాకొడకా..." ముందుకు జరిగాడు దొరవారు.

పోశయ్య ఆ అవతారాన్ని చూసి భయపడి వణికాడు రెండు చేతులు జోడించి సబ్బతి పట్టినట్టు పట్టి దండంపెట్టాడు "ఏమనొద్దు దొరా" అన్నట్టుగా.

ల్యాగను లాక్కెళ్ళడానికి ప్రయత్నిస్తూ వున్న పాషానుద్దేశించి.

"ఏయ్, దాన్ని మన దొడ్డికి కొట్టుక ఫో..నడు..." అని ఆజ్ఞ జారీ చేశాడు.

"ఇయ్యాల నీ ల్యాగ దూడను ఇడిసి పెడితే రేపు ఇంకోడు అట్లనే అంటాడు. వాన్ది గూడ ఇడిశి పెడితే ఇంకోడు యిడువ్ మంటడు. అదంత కానిపని. నా ఇత్తనపు కోడెకు పుట్టిన ల్యాగలు ఇంకోని దగ్గర ఉండేతందుకు యిల్లేదు "

తన కోడెకు పుట్టింది కాబట్టి ఆ ల్యాగ తనదేనన్న భావం ఆ మాటలో వుంది. అంతేగాకుండా తాను తీసుకపోవడం అన్యాయం కాదన్న భావం ఆ మాటల్లో మరీ బలంగా వుంది.

పాషా ల్యాగ దూడను రెండు చేతుల్లోకి తీసుకొని అక్కడినుంచి కదిలాడు.

ప్రతాపరెడ్డి కూడా తన మనుషులతో అక్కడినుంచి కదిలాడు.

బాలమ్మ, పోశయ్య అసహాయులుగా రోదిస్తూ వున్నారు.

పిల్లలు బోరుమని ఏడుస్తూ వున్నారు.

ఆవు మెడలో వున్న తాడు తెంపుకోవడానికి శక్తినంతా కూడగట్టుకుంటూ వుంది.

ఆవు ఆరాటాన్ని, పెనుగులాటను ఎవరూ పట్టించుకోవడం లేదు. నిర్లిప్తంగా తమ దురదృష్టాన్ని తిట్టుకుంటూ శోకాలు పెడుతున్నారు.

ల్యాగ దూరమవుతున్నకొద్ది ఆవు శక్తి మరింత పెరగసాగింది. ముక్కునుంచి బుసలు వినిపిస్తున్నాయి. కళ్ళల్లో తీక్షణత పెరగసాగింది. అప్పటికే మెడలోని తాడు ఒకటి, రెండు పొరలు తెగిపోయాయి.

బాలమ్మ, పోశయ్యను పట్టుకొని ఏడుస్తూ వుంది. పోశయ్య దొక్కను పట్టుకుని కళ్ళలోకి నీళ్లు తెచ్చుకుని కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు పేగులను ఎవరో

తెంపేస్తున్నట్టుగా బాధ కాసాగింది. ఆ బాధకు మెలికలు తిరిగిపోతూవుంటే బాలమ్మ గుండె తరుక్కుపోతూ వుంది. ఆ అసహాయస్థితిలో ఏమి చేయాలో తోయక తల్లడిల్లుతూ అల్లల్లాడిపోతూ వుంది.

పాషాచేతిలోని ల్యాగ దూడను కింద దింపి నడిపించుకుంటు పోతున్నాడు. అది మొరాయిస్తూ వుంది. "అంబా" అంటూ వెనక్కి తిరిగి చూస్తూ వుంది. పాషా బలవంతంగా తాడుపట్టి గొర గొర లాక్కెలుతున్నాడు.

ల్యాగ వెనకాల ప్రతాపరెడ్డిదొర తుపాకి చేత్తో పట్టుకుని నడుస్తూ వున్నాడు. దొర వెనక బరిసెకర్ర పట్టుకొని కావలి ముత్యాలు. మరి కొంతమంది నడుస్తూ వున్నారు.

కడుపులోనుంచి పేగులను పీకి లాగుతున్నట్టుగా, సాగదీస్తున్నట్టుగా వుంది పోశయ్య గుడిశె వద్ద పరిస్థితి..."అంబా" అంటూ అరుస్తున్న ల్యాగపిల్ల అరుపు దూరమవుతున్న కొద్ది అందరి హృదయాల్లోనూ నెత్తురు గడ్డకట్టుకపోతూ వుంది.

దొరవారు వెళ్ళిపోయాక ఒకరిద్దరు పోశయ్య వద్దకు చేరుకున్నారు.

ఆవు ఇక భరించలేక, శక్తినంతా కూడగట్టుకొని ముందటి కాళ్ళతో భూమిని నొక్కిపట్టి మెడను ముందుకు సారించింది. అప్పటికే పొరలు పొరలుగా వీడుతున్న తాడు మధ్యకు "పట్" మని తెగిపోయింది. సగం తాడు గుంజకు, సగం తాడు మెడకు వుండి పోయింది.

తాడు తెగిన వెంటనే ఆవు హూంకరిస్తూ, బుసలు కొడుతూ ఆవేశంతో భారమైన శరీరాన్ని మరచిపోయి తన బిడ్డకోసం పరుగుతీసింది.

అక్కడవున్నవారు ఎవ్వరూ దాన్ని అడ్డుకోలేకపోయారు.

సందు మలుపు తిరుగుతున్న ప్రతాపరెడ్డి బుసలు కొడుతూ, ఆవేశంతో కుమ్మేయడానికి పరుగెత్తుకొస్తున్న ఆవును గమనించి, వెంటనే,

"అరే పాషా ల్యాగను ముందుగాల ఆ ఇంట్లకు కొట్టుకపో యెనక ఆవు ఉరుకొస్తుంది... నడూ..." అని ఆజ్ఞాపించి గన్‌లోడ్ చేశాడు.

ఆవు రౌద్రాకారంతో పరుగెత్తుకొస్తూ వుంది. కింద మట్టి రేగుతూ వుంది. ఆవు డొక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి. చూపులు బిడ్డకోసం వెతుకుతున్నాయ్...

ఆవు దగ్గరకొస్తె ప్రమాదమని ప్రతాపరెడ్డి లోడ్‌చేసిన తుపాకిని ఆవు కాలికి గురి చూసి పేల్చాడు. గురి తప్పలేదు....పెద్ద శబ్దము ఊరంతకు వినిపించింది.

పిచికారి చిమ్మినట్టు ఆవుకాలునుంచి రక్తం చిమ్మింది. తూట లోపలికి దిగింది. అయినప్పటికి లెక్కచేయకుండా ఆవు రంకెవేస్తూ శక్తిలా విజృంభిస్తూ ముందుకు కదిలింది. ప్రతాపరెడ్డి తనను కుమ్మేయడానికి వస్తుందనుకొని గన్‌ను మరోసారి లోడ్ చేశాడు. కాని ఆవు దగ్గరకు వచ్చేసింది. గురి చూసి కాల్చడానికి వ్యవధి లేదు... వెంటనే ప్రతాపరెడ్డి మిగతా మనుషులు అందరూ కనిపించిన ఇళ్ళల్లోకి దూరి తలుపు లేసుకున్నారు.

అంతకుముందే పాషా ల్యాగను చేతుల్లోకి తీసుకొని ఓ ఇంట్లోకి దూరిపోయాడు.

ఆవు సందు మలుపు తిరిగినా తన బిడ్డ కనిపించలేదు. మనుషులు కనిపించలేదు. దాంతో ఆవు ఉన్మాదంగా, పిచ్చిగా రంకెలు వేస్తూ, గిట్టెలతో భూమినంత పెల్లకిస్తూ,

కొమ్ములతో గోడను, కనిపించిన వస్తువులను కుమ్ముతూ అటు, ఇటూ పరుగెత్తుతూ వుంది కాలుసుంచి రక్తం కారుతూవుంది కాలు సలుపుతూ వుంది

ఆవేశంగా, అటూ ఇటూ పరుగెత్తినాక, రంకెలేసినాక, గాయం వల్ల క్రమంగా శరీరంలో శక్తి నశించిపోతూ వుంది. ఏమీ చేయలేని అసహాయ స్థితి మరింత కృంగ దీసింది. ఆ అశక్తితోనే, ముందుకు అడుగేయలేని స్థితిలోనే, గట్టిగా బిడ్డకోసం రంకెవేసి కళ్ళల్లోకి నీరు తీసుకొని, బాధగా, మూల్గుతూ, ఇంకొద్దిసేపు ఆగిన తర్వాతైనా తనబిడ్డ కనబడగలదేమో, నన్న ఆశతో వీధిలోకి చూస్తూ కూలబడిపోయింది ఆవు.

పోశయ్య, బాలమ్మ, పిల్లలు కంటికి పుట్టెడు ఏడ్చుకుంటూ ఆవు వద్దకు వచ్చి ఆవు మీదపడి ఏడ్వసాగారు. ఆవుకు తగిలిన గాయాన్ని చూశారు. గుండె తరుక్కు పోయింది ల్యాగనే పోయిందనుకుంటే ఆవుకు కూడా గాయం. భరింపరాని బాధ, తగిలిన చోటనే తిరిగి దెబ్బతగిలినంతటి దుఃఖం కలిగింది. ఆవు కంటనీరుతో తన యజమానిని, యజమానురాలు వైపు నిస్సహాయంగా చూసింది. ఆ చూపులకు తట్టుకోలేక పోశయ్య బోరుమని ఏడ్చేశాడు.

పోశయ్య ఏడుపుని చూసి బాలమ్మ శోకం పెట్టింది. ఇద్దరిని చూసి పిల్లలు ఘొల్లుమన్నారు. వీరినందరిని చూసి ఆవు మరింత కంటనీరు పెట్టుకుంది.

కొంతమంది ముసలివాళ్ళు అక్కడ పోగయ్యారు. పోశయ్యకు ఊరట కలిగించే టట్టుగా గతంలో జరిగిన సంఘటనలు చెప్పి, వాటితో ఈ సంఘటన పోల్చి నచ్చ చెపుతున్నారు. అలా ఊరటిస్తున్నకొద్ది పోశయ్య మనసు మరింతగా కరిగి నీరైపోతున్నది. బాధ అధికం కాసాగింది.

ఆవు తనబిడ్డ కనిపిస్తదేమోనని అప్పుడప్పుడు ఆశగా వీధిలోకి చూస్తూ వుంది. దీనంగా కళ్ళనీళ్ళతో దిక్కులను పరికిస్తూ వుంది.

కాలు సలుపుతూ వుంది. రక్తం కారుతూనే వుంది. పోశయ్య గాయాన్ని మరోసారి ధోవతితో రక్తాన్ని తుడిచి, ధోవతి అంచు చింపి రక్తం ఎక్కువగా పోకుండా కట్టుకట్టాడు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూనే.

ఆవు కళ్ళనీళ్ళను బాలమ్మ తనకొంగుతో తుడుస్తూ వుంది.

పిల్లలు ఆవు వీపు నిమురుతూ కూర్చున్నారు.

అక్కడ చేరిన వారు పోశయ్యను, బాలమ్మను లేవమంటున్నారు. కాని వాళ్ల మనసు అంగీకరించడం లేదు. అక్కడే అందరూ చనిపోతే బాగుండుననిపిస్తూ వుంది పోశయ్యకు.

ఆవు పగిలిన గుండెతో తన యజమాని కుటుంబాన్ని చూస్తూ వుంది. తిరిగి ఆశగా వీధిలోకి చూస్తూ వుంది. ఆవును లేపి ఇంటికి తీసుకపోవడానికి పోశయ్య, అతని తోటివాళ్ళు ప్రయత్నించినా ఆవు లేవలేదు. అందరూ అలాగే కూర్చుండి పోయారు. గతంలో జరిగిన అన్యాయాలను నెమరువేసుకుంటూ ఉన్నారు.

పాషా దూరిన ఇంటి దొడ్డి గుమ్మం నుంచి దొర 'గడి' కి చేరాడు. గడిలోవున్న పశువులశాలలో దొర ఇత్తనపు కోడెతో ఊర్లోని ఆవులకు పుట్టిన ల్యాగలను, కోల్యాగలను కట్టేసిన వద్దనే పోశయ్య ల్యాగను కట్టేశాడు.

కట్టేసినాక పాషా గట్టిగా ఓ నిట్టూర్పు విడిచి, చేతులు దులుపుకొని గర్వంగా ఓసారి ల్యాగదూడను చూసి, కర్ర తీసుకొని కచ్చీరువైపు నడిచాడు

కట్టేసిన ల్యాగదూడ గింజుకుంటూ, తాడును తెంపుకోపడానికి ప్రయత్నిస్తూ వుంది. తాడును తెంచడానికి తన శక్తి చాలడం లేదు. తిరిగి ప్రయత్నించింది. అయినా లాభం లేదు. చుట్టూ ఒకసారి కలియ చూసింది. వందకు పైగా ఆవులు, కోడెగిత్తలు తనలాంటి ల్యాగదూడలు తననే చూస్తూవున్నాయ్. అవన్నీ కలిసి నన్నెందుకు విడిపించడం లేదు- అని అనుకుంటూనే ల్యాగ గింజుకుంటూ వుంది.

ఇక్కడ ఆవు కంటనీరు ధారగా కారుతుండగా ఏడుస్తూ వుంది కాలు సలుపు ఎక్కువయింది. కాలు జడత్వస్థితికి చేరుకుంటుంది. రిల్లెలు పట్టినట్టుగా వుంది. ఇంటికి రమ్మని పోశయ్య ఎంత బ్రతిమాలినా ఆవు కదలడం లేదు. దీనంగా చూస్తుందే తప్ప ఉలుకు లేదు... బాలమ్మ సముదాయించినా ఆవు అక్కడనుంచి కదలలేదు. దీనంగా వీధిలోకేసి తన బిడ్డకోసం చూస్తూ వుంది.

దొడ్డి గుమ్మాల ద్వారా దొరవారు, దొరవారి మనుషులు గడికి చేరారు. పశువుల శాలలో కట్టేసివున్న ల్యాగ గింజుకోవడాన్నిచూసి ప్రతాపరెడ్డి గర్వంగా మీసాలు మెలేసి నవ్వుకున్నాడు

"పెద్దగయినంక ఈ కోడెగూడ మంది ఆవులమీద పారి ఇంకెన్ని పశువులను గడికి తీసుకొస్తదో. " అని మనసులో అనుకున్నాడు దొరవారు. అలా ఊహించడంలో ఎంతో తృప్తి అనిపించింది. అక్కడినుంచి కచ్చీరుకు దారి తీసాడు. పాషా ఇతర మనుషులకు ఓ కుండ కల్లు తాగమని వీరయ్య గౌడ్‌కు చీటి రాసి ఇచ్చాడు.

వీరయ్యగౌడ్ ఆ చీటీ చూసి "పొద్దుగాల పొద్దుగాల ఇదెక్కడి బ్యారం..." అని విసుక్కుంటూ 'దొరకు యీ మామూళ్ళు యిగ తప్పయ్' అని బాధపడుతూనే ఓ కుండ కల్లు దొర మనుషులకు అప్పగించాడు.

చీకటయింది..

ఆవు పడివున్న దగ్గరనుంచి లేవలేదు. వీధి వాళ్ళు. జీతగాళ్ళు ఎవరువచ్చి లేపినా లేవలేదు. నిర్ర నీల్గినట్టు పడుకుంది. తోకపట్టి మెలేసినా కదలి అలాగే కూర్చుండి పోయింది. కంటినుంచి ధార అలాగే వుంది. పోశయ్య కుటుంబమంతా ఆవు వద్దనే వుంది వెంకటేశం తప్ప.

భయం తగ్గిపోయి, చీకటి పడిందని, ఇంకెవరు ఏమి చేయలేరు అన్న భరోసా కలిగాక వెంకటేశు గుట్టలల్లోనుంచి గుడిశెకొచ్చాడు. ఇంట్లో ఎవరూ లేకపోయేసరికి అనుమానం కలిగింది. పక్కన కనుక్కుంటే విషయం తెలిసింది.

అంతే బాణం పుల్లలా ఆవు వద్దకు చేరాడు. ఆవు పరిస్థితి చూడగానే వెంకటేశం బోరున ఏడ్చాడు. ఆ ఏడ్పును చూసి ఆవు కూడ కుమిలి కుమిలి ఏడ్చింది. పోశయ్య, బాలమ్మ కొడుకుని పట్టుకుని ఏడ్వసాగారు.

ఆవుకు పాలశేపులు వచ్చి పొదుగువద్ద బాధగా వుంది. మరోవైపు గాయం సలుపుతూ వుంది. యజమాని కుటుంబాన్ని చూస్తే బాధ, ల్యాగ సైయ్యాటలు .... జ్ఞాపకాని కొచ్చాయి. కంటనీరు అధికమయింది. ల్యాగ గెంతులాట ఊహించుకుంది. "తన పొదుగును కుమ్మి తన బిడ్డ యిక పాలు తాగదేమో" అన్న విషయం మనసులో

మెదలగానే మనసు విచ్చుకపోయి, తూట్లుపడి డొక్కలు ఎగిరెగిరి పడుతుండగా ఏడ్వసాగింది.

వెంకటేశు కొద్దిసేపు ఏడ్చి ఆవుకు తగిలిన గాయాల్ని చూసి ఆవు వీపు నిమిరి, నుదుట ముద్దాడి, గంగడోలుకు తనమొఖం అదిమిపెట్టి రుద్ది ముద్దాడి, ఆవు కళ్ళనీళ్ళు తుడిచి, చెవుల్లోని పిడుదులను తీసేసి ఆవును శాంతింప జేశాడు. గుడిశెకు రమ్మని ఎన్నో విధాల బ్రతిమాలాడు. మామూలు మనిషితో మాట్లాడినట్టుగానే వెంకటేశు ఆవుతో మాట్లాడాడు. ఆవు అన్నీ అర్థం చేసుకుంటున్నట్టుగానే కనిపిస్తూ వుంది. అన్నీ విన్న తరువాత ఇక తన బిడ్డరాదని నిర్ణయించుకుని, బాధగా మూల్గుతూ మెల్లిగా లేవబోయింది.

ఆ ప్రయత్నాన్ని చూసి పోశయ్య, బాలమ్మ, వెంకటేశు, అక్కడ గుమిగూడిన మరికొంతమంది ఆవును లేపట్టి నిలబెట్టారు. నిల్చున్న తరువాత వెంకటేశు ఆవు కాళ్ళను కొద్దిసేపు నిమిరాడు. రిల్లేలు కొంత తగ్గాయనిపించాక ఆవు మెల్లమెల్లగా కుంటుకుంటూ పోశయ్య గుడిశెకు నడిచింది. ఆవు వెంట పోశయ్య కుటుంబం, మరి కొంతమంది నడిచారు.

తెల్లారి...

కమ్మరి రాజయ్య వచ్చి ఆవు కాలులో దిగిన తుపాకి చెర్రాలు తీసి, కొన్ని ఆకులను దంచి పసరు గాయానికి కట్టాడు. నాటు వైద్యం చేశాడు.

ఆవు మేత మేయడం మానేసింది. పాలు ఇవ్వడం లేదు. శేపులు వచ్చి బాధగా వున్నప్పుడే కొన్ని ఇచ్చి ఊరుకుంటూంది. రెండు రోజుల్లోనే ఆవు సగం అయింది. వెంకటేశు ఆవును బుజ్జగిస్తూ వున్నాడు. అయినా లాభం లేదు.

పదిరోజుల తరువాత నవిసి నవిసి ఆవు కన్ను మూసింది.

పోశయ్య ఇంటిల్లిపాది అల్లల్లాడిపోయారు.

గడిలో ల్యాగదూడ రోజు గింజుకుంటూనే వుంది. ఎప్పుడు తన మెడకు వున్న తాడు తెంపుకోవాలన్న ఆరాటమే.

ఆవు మరణించిన మరుసటి రోజే వెంకటేశు ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు. ఎక్కడికెళ్లాడో ఎవరికి తెలియదు.

బాలమ్మ, పోశయ్యల గుండెలు చెరువులయ్యాయి. కళ్లల్లో నీళ్ళు ఇంకిపోయాయి. అవి అగ్ని గోళాలు అయ్యాయి. వాటిని ఆర్పేందుకు ఎవరితరం కాదేమో..

● 'ప్రజాసాహితి' - మార్చి, 1983 ●

# 47. గొల్లకథ

♦ కె. రాంమోహన్ రాజు ♦

అయ్యా, గొల్లోనుండ్రి బాంచెను. నాపేరు బుచ్చయ్యగని నన్నంత బుచ్చిగాడంట రుండ్రి. నేను గిప్పుడు కజ్జెపుతనయ్య.

పోయిన వైశాక మాసంకెల్లే నాయాల్దానికి పెయిబాగులేకుంట ఉండుకచ్చింది.

జెష్టమాసంవరకు దానికి రోగం పెర్గిపోయింది. ఇగ మా ఊర్లె రంగాశార్ల దగ్గెర వైద్గం జేయించిన. ఓ, ఒగకత గాదయ్య కడుపుల నొప్పని సుడిబెట్టుక బోయేది. గప్పుడు రంగాశార్లు రసాలు పోశిండు. ఆకుల్నూరి పట్టీలేశిండు. ఉప్పు బుక్కిచ్చిండు. గిట్నే రొన్నెల్లు వైద్గం జేశిండు. ఈసమెత్తు రోగం గూడ బోలె.

గప్పుడు నేను పెద్దేవరకు కొలువు జేయిచ్చిన. నా దగ్గెరున్న దాంట్లకెల్లి పెద్ద పొడేల్ను బలిచ్చిన. ఉఁ...ఉఁ...రోగం దిర్గలే. గాపొడేల్ను కటికోడు మున్నూరు కడుగుతె గూడ ఇయ్యలే. గిప్పుడు నాపెండ్లం ఎమానం మీదికచ్చిందని బలిచ్చిన. దాని పానం పోయిందిగని దీని పానం బాగ్గాలే. పెద్దేవర పొడేల్ను మింగి నిమ్మలంగ కూసున్నది. గదాని మాంసం మా సుట్టాలంతా లొట్టలు గొట్టుంట తిన్నరు. కుత్కెలదాకా కల్దాగి ఎగిరింద్రు. "నీయక్క బుచ్చన్నో జోర్దార్ గున్నదే శియ్యకూర" అన్నరు.

నేను నాయల్దీ మాత్రం గట్నే ఇశారంగ కూసున్నం - రొండ్రోజులుండి సుట్టపక్కాలంత పోయినంక కోమటోడు "దుకాండ్ల పద్దు ఎక్కువైందిరో వారో"! అనుకుంట బాకి కిందకి గొర్రెపిల్లను దోల్కపోయిండు. సొమ్ముబాయె శనిజుట్టునె అన్నట్టయింది నా పని.

గిన్ని జేశినాగూడ నా పెండ్లం మాత్రం నొప్పితోటి బాధపడుతనే ఉన్నది. "వాయ్యో వామ్మో ఇగ నేంజత్త" అని ఒర్రుతనే ఉన్నది. నాకు ఎటు సమజ్‌గాలే. దాని బాద జూత్తాంటె నాకు తిక్కతిక్కగున్నది - "నీయక్క పెండ్లాం పానం నయం జేయించని గొల్లడెందుకుర ఉండి?" ఎడమ శెయ్యెత్తి బుర్రమీసాలు బిరబిరవడి బెట్టిన. గంటల్నే మల్ల కాల్జచ్చినట్టయి కూసున్న.

దాన్ని దావుకానకు తీస్కపోవాల్నంటె ఎన్ని పైసలు గావాల్నో దెల్వలే. ఎన్నైతేంది గని కావాలె గద. మరెక్కన్నుంచత్తయి? నాగ్గిన్నన్ని గొర్లున్నయిగద. గవన్ని అమ్ముకోనైనా సరే పోదమనుకున్న. మరి గాయింత అమ్ముకదొబ్బుతె తర్వాత బతుకుడెట్ల?

ఇగ గదంత తర్వాత, ఆపతికాలం ఆలోచన శేస్కుంట కూసుంటె అంత అయిపోద్ది. నేనుగిట్ల ఆలోశిచ్చుకుంటాంటె రంగాశార్లచ్చిండు.

"అయ్యావారూ, రోగం తీరు రోగం దేనాయె మీ మందు తొవ్వ మందు దేనాయె ఏమన్న పాయిదా వున్నదా చెప్పుండ్లి" అన్న.

గప్పుడా అయ్యోరోడు నక్కోలె ఇగిలిచ్చిండు. "అరే ఓర్వారీ! రోగం గాని ఏది గాని ఎప్పుడు తగ్గాల్నో అప్పుడు పోద్ది గని నేను పొమ్మంటె పోద్దారా?" అన్నడు.

గిదెక్కడికతరో "మరింగ నీమందులెందుకు బాంచెను" అన్న నేను.

"మానవ ప్రయత్నంరా పిచ్చిముండకొడుక! మన పని మనం జేస్తాంటె దాని కాలాని కదిబోద్ది" అన్నడు.

నాకు శిరెత్తింది – నీయక్క సకలావస్తలు జుట్టుకోని నేను బాదలు పడ్తాంటె బాపనోడు ధర్మశాత్రాలు జెప్పుకుంట జేరిండు అనుకున్న.

"అయ్య, మరి పెద్దావుకానకు తీస్కపోనా?" అనడిగిన.

"ఆఁ" అని ఇచ్చెంత్రపడి మొకం శిటశిట లాడిచ్చిండు రంగశార్లు. "అరేయ్ ఎర్రిగోల్లోడా! నాకు ఆంజనేయస్వామి సిద్ధిఉన్నదని తెల్వదార నీకు! రోగం నిముశంల బోడగొడ్డుగని ఇది నిక్కంగ రోగం కాదురా కొంత పాపఫలం ఉన్నది. అది అనుబవించనిదే శమనం గాదురా" అన్నాడు.

నొప్పచ్చి మిడుకుతాంటె పాపం అంటడేందిరో వీడో! నీయక్క విన్తోటేంది గాని "దావుకానకు తీస్కపోతనుండ్లి" అన్న గట్టిగనే.

రంగశార్లు ఒగమానంగ నా మొకం జూశి "సరె బిడ్డ, గన్ని పైసలు నీకాడ వున్నప్పుడు నేనేమంట కొత్తలు ములముల బెడ్తానయి నీకు" అన్నడు.

"అగ్గొ గా పైసలే లెవ్వుండ్లి! పైసలుండి కాదు, పాపంకోసం ఇశారం" అన్న నేను.

"ఏందిరో పిచ్చిగిట్ల లేశినాదిర! కొత్త కానిగూడ లేదంటవు. దావుకాన కేస్క పోతనంటవు ఏందిర నీకత?" అని మల్ల అన్నడు "ఏమన్న అమ్ముతావుర పైస కోసం?"

"తప్పుతాది బాంచెను. మీ అసొంటి పెద్దల దయుంటె" అన్నా నేను.

గీ మాటల ఏమున్నదో నాకర్ధంగాలేగని అయ్యోరోనికి కోపమచ్చింది అరుగు మీంచిలేశి ముడ్డి దులపుకుంట సక్కగ బోయిండు.

నేను గక్కన్నే పోటుగర్రకు ఆనుకోని కూసున్న. "ఎట్లనన్నా! ఏదన్న అమ్ముదామంటే ఎండి బంగారాలు అయిపాయె. ఇన్నాల్లు పానమోలె సాదిన గొర్రె జీవాల్దప్ప ఇంకేం లెవ్వు. ఇప్పుడు పుసుక్కున అమ్ముదామంటే పానం దరిత్తలేదు. అవుసరాని కమ్ముతె అడ్డికి పావు శేరు అడుగతరు. గా తర్వాత అడుక్కు తినాలె. ఇంగెట్ల జేద్దురా నారాయినా బగవంతుడా" అని ఇశారం జేస్తుండంగ నాపెండ్లం నొప్పెక్కువైపోయి గొంగట్ల బొర్లుకుంట కొండకీకెలు బెడ్తాంది.

నేను అబరత్తంగా దాన్దగ్గరికిపోయి "ఏందె, ఏందె" అనుకుంట దాన్ని గట్టిగ పట్టుకున్న. గది ఎసుమంటి మనిశి? ఈ మూన్నెల్లల్ల ఎండిపోయి పరుగోలె అయ్యింది. దాన్ని జూత్తె నాదుక్కం ఆగలే.

నన్ను అనుకోని కూసోని "ఇగ నా వశంకాదు. నేను బత్క" అని నా మొక మంత ఎండిపోయిన శేతులతోటి పునుకుతాంది. గింతల గాలొల్లికి పక్కింటి రాజవ్వచ్చింది. "ఊకోవె మల్లక్కా! శిన్న పిల్లోలె ఏందెగది?" అనుకుంట.

నా పెండ్లాన్ని సముదాయించి నేను ఇగలేశిన "రాజవ్వ! గిదీన్ని సూస్కుంట ఉండే - నేను గిప్పుడే ఈడిదాక బొయత్త!" అని లేశి తలుపు శెక్కమీది గొంగడిదీశి భుజాన ఏసుకున్న. "జెప్పనరా" అని రాజవ్వ అంటుండగనే బయటికచ్చిన.

దబ దబ నడుసుకుంట కొమటి సత్తెయ్య ఇంటిదాక బోయిన. పొయ్యేటాల్లకు కొమటోడు మాదిగ ముత్తితోని పరాశ్కాలాడుతాండు. గదేమో వీన్ని జూత్తనేలేదు. నేం బోంగనె ఇగిలిచ్చుడు బందుజేశిండు. జెప జెప పొట్లంగట్టి మాదిగ ముత్తిని ఎల్లగొట్టిండు.

"దండాలు బాంచెను" అని గొంగడి కిందేస్కోని కూకున్న.

"ఆc...ఆc ఏందిర బుచ్చిగా ఎటోవస్తివి?" అన్నడు కొమటోడు.

"ఇంకాడికి?సుకమచ్చినా దుక్కమచ్చినా మీ అసొంటి పెద్దిండ్లకే నాయె" అన్న.

"మరిప్పుడు సుకంతోని వస్తివా? దుక్కంతోని వస్తివా?" అని కొమటోడు ఎక ఎక నవ్విండు.

నేంగూడ ఎర్రినవ్వు నవ్విన. వాడు చింతపండు బస్తోలిగున్నడు బొర్రమీనికెల్లి మాశిపోయిన జంజిరం నల్లగ ఏలాడుతాంది. గిట్ల సంగతని అంతజెప్పి "పైసలు గావాలె బాంచెను. ఎట్లన్న జెయింద్రి ఒక్క ఇన్నూరు జాలు" అన్న.

గంతలకె వాడు గల్లడబ్బ లటుక్కున బందుజేశి "అబ్బో, పైసలాడ ఉన్నయిరా" అన్నడు.

నాకు గాయింత దెల్వదా? ముంద్గాల గట్నే అంటడుగని ఆకరుకు వాడు జెప్పిన మిత్తికి ఒప్పిచ్చుకోని మాగ పైసలిస్తడు - గందుకే వదులకుంట "మీరు గాకుంటె ఇగెట్ల" అన్న బతిమాల్నట్టు.

బతిలాడిచ్చుకోని, బతిలాడిచ్చుకోని ఆకరుకు వాడొక్క ఉపాయం జెప్పిండు. నా గొర్రెజీవాలన్నిదెచ్చి వానికి తాకట బెడ్తె ఇన్నూరు ఇత్తనన్నడు. నాకు పదిగొర్లున్నయి. గయిదెచ్చి వీనికిచ్చి నేనాడబోవాలె? గీ ఉపాయం నాకెరికే. ఏ....ఏ! ..ఇచ్చి రొండ్రోజులు కాంగనే "ఇగదే నా పైసలు" అంటడు. ఎల్లకపోతే మిత్తి పెంచుతడు. గామిత్తి బరాబరైంది అంటడు. గా మాటే వాన్తోటి అన్న.

"గట్లయితే మరిపైసలద్దా?" అన్నడు కొమటోడు.

"అట్లయిందానికి మంచిగ పోతరించిన జీవాన్నమ్ముత ఇన్నూరియ్యిండ్లి" అన్ననేను.

"గొర్రెపిల్లను నేనేం జేస్కోవాల్రో నువ్వు నేం జెప్పింది మల్లోసారి ఇశారించుకోని రాపో!" అని లేశి ఇంట్లకు బోయిండు నేను అడివిల తొవ్వదప్పిన మ్యాకపిల్లోలె తల్కాయె ఏలాడేసుకోని పచ్చిన.

వచ్చేటాల్లకు నాగుడిశెకాడ ఇరుగుపొరుగంత జమయిండ్లు "మల్లేమయిందిరో" అనుకుంట లోపలికచ్చిన.

గాడ సాపల నాపెండ్లం పండ్కోని ఉన్నది. దాని డొక్కలు ఎగుర్తానయి. ఊపిరి బీల్పుడు కట్టమైతాంది."బుచ్చన్నా ఇగనన్న పెద్దవుకానకు తీస్కపోకపోతె మల్లవ్వ మనకు దక్కదే" అన్నది రాజవ్వ నాకు గంతలకే కండ్లనీళ్ళు బొటబొటకారినయి. "యాన్నన్న పైసలకు జూడకపోయినావుర!" ఎంకటిగాడు నా బుజంమీద శెయ్యేసి అన్నడు. నాకు మండుకచ్చింది.

బోడవరాశ్కమాడ్తానావుర! పైసలాడదొర్కుతయి? తెల్వనట్టే జేత్తానవు!" అన్న అయింత ఎంకటిగాడు మొకం శిన్నబుచ్చుకున్నడు.

నాకు పెయ్యంత శిటశిటలాడింది. నీయక్క గీడ కూసుంటె పనిగాదు మల్ల మంది మాటలంటారు అని మల్ల బయల్దేరిన.

"యాడికి బోతానవురో నేనత్తాగు" అని ఎంకటిగాడు రాబోయిండు. "లే - లే - నువ్వీన్నే కూసో" అని కుమ్మరి గోవిందు ఇంటిమొకాన బోయిన.

పట్నం దీస్కపోవాల్నంటె బస్సుమీద పోవాలె. బస్సు తొవ్వకు మావూరు ఎనిమిది మైల్లు దూరానున్నది. గీ ఆమెడ దూరం ఎట్లా బోవాల్నంటె నడిశిపోవుడే. గిప్పుడు నా పెండ్లాం నడిశెటట్టు లేదు. బండి గావాలె. గీవూల్లె బండ్లెవనికి లేవు నల్గురికి తప్ప. రెడ్డోడు అసలు ఇయ్యనే ఇయ్యడు. గవాన్దాక పోవుడుకంటె పాంపుట్టల చెయినూకుడు మంచిది. కొమటి సత్తిగానికున్నది. అప్పే ఇయ్యకపాయె బండేడిత్తడు? ఇగవున్నోడు కుమ్మరి గోవిందు. దానిమీద కుండలేస్కోని ఊరూరా దిరుగ్గుంట అమ్ముతడు గాబట్టి అయింత వానికొక్కనికున్నది. ఇగెవ్వరికి లేదు. ఇప్పుడు బండిత్తె గవాడొక్కడే ఇయ్యాలె. దబదబ నడ్సుకుంట పోయెటాల్లకు నుల్కతాడు పేనుకుంట కూసున్నడు గోవిందు.

"ఏందే బుచ్చన్నా మల్లవ్వ బాగాలేదట గదనే!" అని పల్కరిచ్చిండు.

"ఔనే! గిట్ల సంగతున్నది. జరంత నీ బండిగావాలె" అన్న.

"గదాన్దేం బాగ్గెం? నువ్వు మల్లరా పో. గొడ్లు కుంటుకొమ్మున మేయబోయినయి ఆటిన్నేను తోలుకత్తగని నువ్వు తయారుగుండు" అన్నడు. అమ్మ నాయినా! నా పానాలు నిమ్మలమైనాయి. గుండెదిట్టం జేస్కోని ఎన్కకు దిర్గిన.

గిదంత నాకు నాకే ఇశారంగ, ఇచ్చంత్రంగ ఉన్నది. పట్నం బోయినంక రొండు గొర్లు అమ్మయినా గూడ నాపెండ్లం పానం నయం జేయిచ్చాలని అనుకున్న. గీడ కోమటోనికి అమ్ముడుకంటె గక్కడమ్ముడే మంచిది. ఆకరుకు కన్నకొడుకులు, సుట్టాలు, పక్కాలు ఎవలు అక్కెరాకుంటయిరి గద. మొదట్నుంచి గొర్రెజీవాల నమ్ముకోని బతుకు తుంటి. ఆకరుకు ఇయ్యాలగూడ అవ్వే దిక్కయినయి.

మా అయ్య సచ్చినప్పుడు, అవ్వ సచ్చినప్పుడు, నాపెండ్లప్పుడు, కొడుకులు, బిడ్డలు పుట్టినప్పుడు, వాల్ల పెండ్లిండ్లకు, వాల కొడుకులు బుట్టినప్పుడు, ఎప్పుడు జూశినా సావుల, బతుకుల, సుకంల, దుక్కంల అన్నిటికి గొర్రెజీవాలే దిక్కయినయి గని, గీ మనుషులు ఎప్పుడన్న ఆదుకున్నారు?

ఊల్లె ఒక్కొక్కని దగ్గర గింతపైకమున్నది ఎవడన్న అక్కరకు దగ్గెరికచ్చిండా? నన్ను సూడ్రాదుండ్రి ఎసువంటి సంసారం ఎట్లయిపాయె. నా దొడ్డినిండ ఎప్పుడు సూశినా గొర్రెలు, మ్యాకలు మెకమెక లాడుకుంట ఉండేది. ఇన్నూరుగొర్లు, యాభై మ్యాకలు గవన్నిగిప్పుడెవ్వి?

రెడ్డోని దొడ్లో కొన్నున్నయి. కటికోని శేతుల కొన్నిబడ్డయి. గదే మరి గమ్మత్తు! నాకు పండ్లకు, పబ్బానికి అవుసరమైతేనో, బియ్యపు గింజల్లేకుంటేనో ఉన్న గొర్రెలు మ్యాకలు అమ్ముక దొబ్బిన. గదే పట్వారోనింట్ల బిడ్డపెండ్లయితె నేను పున్యానికి గొర్రె పిల్లనిచ్చిన.

కాపోల్ల సమ్మయ్య తోట్ల పండిన కూరగాయల్దెచ్చి ఇచ్చిండు. కోమటోడు అయిదు వీశెల నెయ్యి పోశిండు. రైతులంతగల్సి పందుంపడ్లు జమజేశిచ్చిండ్లు. ఎట్టి శాకిరికి సాకలి ఇస్తారిగాడు, మంగలి సోముడు, ఎలోడు ఉండనే ఉండిరి. వాని కార్యమేమొ గట్టెల్లిపోద్ది. నా అసుమంటోనికేమొ గీ తిప్పలు. నీయక్క దేశం....

గిట్ల ఇశారం జేస్కుంట మల్ల గుడిశెదాకపోయిన. గాడ ఒగ లొల్లిగాదు. మా రాజవ్వ, చినమల్లి, బుచ్చిరామి, కొమిరి నాపెండ్లం దగ్గర కూకోని తీకనాలు తీత్తార్రు. నాకు కిందికెల్లి మండుకచ్చింది.

"గిదెక్కడ కతరో! ఉన్నది పైసంతయితె పదిరూపాలు జేత్తార్రుమంది" అనుకున్న.

"దూశ్... లేర్రి! ఆగమాగం జేత్తార్రు అంత. ఏమైందిపుడు? బండి మాట్లాడు కచ్చిన. ఇగ పుటం తీస్కపోత. ఆడధన్వంతరసొంటి వైదుగులున్నరు. ఇంజేషనిచ్చి ర్రాంటె మల్ల ఎమదర్మరాజుసొంటోడు తీస్కపోయ్యే పానాలు ఇడిసిపెట్టె పోవాలె" అని నవ్వుకుంట సెమత్కారంగ అన్నట్టు అన్న.

అన్నగని గామటల్ల ధైర్నం లేదు. ఏ – ఏం లేదుర్ర అని పిచ్చాల్నని వట్టిగనే అన్న. కని అన్ని గాలిమాటలొలిగున్నయి. మా బుచ్చిరామికి గా మాటలకు కోపమచ్చి నట్టున్నది నన్ను కోశిపారేశెటట్లు సూశింది.

"తూ....నీయవ్వ మొండి గుండెల ముండకొడుక! మనిషి సావుబాదల పడ్తాంటె ఇగిలిచ్చుకుంట మాట్లాడెటానికి శిగ్గులేదు. మల్లబండి మాట్లాడుకచ్చినంటాండు. ఈ దేశముకు కోసం ఎవలో ఇత్తరట బండి. సోయి వున్నోడు గిట్లనే ఉంటాడు?" అన్నది.

నాకు మా శికాకయిపోయింది. "నీయక్క లొల్లి..." అనుకున్న గింతలకె గోలెం ఈరిగాడచ్చిండు వాడు దానిమొగడె. "నీ తల్లి... నోర్ముయ్యె నువ్వు! బండనంగనె దొర్కు తదనుకుంటానవ? ఈ వూల్లె బండున్నోడు ఎవడే! ఎవన్నో ఆముదం బెట్టి గీకాలె. గప్పుడు అది రావాలె. పుణ్యానికి అత్తాదిబండి? బండి దెచ్చుడంటె పెరట్ల శిక్కుడు గాయలు దెంపుడనుకుంటానని?" అన్నడు.

గంతట్లనె అది నోరుమూసుకున్నది. నేను గక్కన్నే అరుగుమీన కూసుండి సుట్టముట్టిచ్చుకున్న.

గుప్ప గుప్పపొగూత్తాంటె గాపొక సాయలకెల్లి నాయిల్లు, నా పెండ్లం, మంది అందరూ మస్కమస్కోలె కన్పిత్తారు.

నాశిన్నప్పుడు, దేశసంచారం జేస్కుంట బాపనాయివె ఒగాయినె వచ్చిండు – గాయినె "బిడ్డా! గీలోకమంత వట్టి మాయలోకంరా – నీగ్గనపడేదంత నిజంకాదు. నిజమనేది ఒక సత్తెపదార్తం. దానినీడలు ఈ లోకంల మనకు కండ్లకెదురుంగ కనిపిస్తయి. అసలు సత్తెం వేరే వుంటది. గది మనగ్గనపడది – గదాన్ని జూడాల్నంటె మోచ్చం పొందాలె మోచ్చం పొందుడంటె ఏం దనుకుంటానవు పరాశ్కం గాదు" అన్నడు.

నాగ్గీసంగతి అంతు తేల్చుకోవాలనిపిచ్చింది "మరి నాకు మోచ్చమార్గం జెప్పుండ్రి బాంచెను" అన్న.

గప్పుడాయెనె ఒక మంత్రం జెప్పిండు. గదేందో గమ్మతుగున్నది. నాకు నోరె తిర్గలె. "సామీ! గిట్ల నాతోనిగాదు – ఏదన్న సులువు మార్గం జెప్పుండ్రి" అన్న. గప్పుడాయినె ఇగ ఆలోశిచ్చిండు. ఆలోశిచ్చి ఆలోశిచ్చి ఆకగుకు 'బిడ్డా! నీకు సంస్కృత మంత్రాలు రావురా! నీకు అలుకగ ఉండేది ఒగటి జెప్త ఇను" అని గిట్ల జెప్పిండు.

"బొల్లిగద్ద నాసామి! కాపాడ రావయ్య".

బొల్లిగద్ద అంటె గరుత్మంతుడు. గదాని మీనెక్కెటోడు నారాయిన మూర్తి. గాయినెను తల్సుకునుడన్నమాట.

"నీక్కష్టకాలమచ్చినప్పుడుగీ మంత్రం సదువుకోర!" అన్నడు.

ఇరుసవడ్లు, ముంతడు నెయ్యి గీ రొండు మాటలు జెప్పినందుకే దొబ్బి పోయిండు. "కార్తీక మాసంల సలిబెడ్తది ఒక గొంగడియ్యిరా" అని అదొకటి ఏస్కోని పోయిండు.

ఇగ గా తర్వాత నాకెన్నెన్నో కష్టాలచ్చినయి. గప్పుడు గా మంత్రం ఒక సదువుడు సదువులే ఇగ – కష్టందీరుడు అటుబోయి ఉన్న జాయిజాతు అంత పోతెగని కష్టాలు దీరలే. "నీ తల్లి...." అనుకోని ఆ మంత్రం, దేవతలు వదిలి పెట్టిన – ఆపదలచ్చి మీన గూకుంటె మంత్రం జదువుతె పోద్దా? గప్పట్నుంచి గీమంత్రం అందర్ని అదిలిపెట్టి కూకున్న.

మొన్న పెద్దేవర కొలుపెందుకు జేశిన అంటె గింతంత ఆశ ఎన్నో సుక్కోలె నాలోపల ఎలుగుతాండె. నీయక్క గొర్రెపోతు పాయెగని పెండ్లం కంటెక్కువా? అనుకున్న అదిగూడ తీరిపోయింది. దేవతలేమన్న వైద్గులా రోగం నయం జేశేటానికి? అన్నందింటె ఆకలిపోద్ది. మందేత్తె రోగం పోద్ది. గంతె ముచ్చట. ఆండ్ల ఇశారం జేశాటినికేమున్నది?

గిట్ల ఆలోశన జేస్కుంట కూకుండెటాల్లకు సుట్ట అయిపోయింది అదటుదిక్కు పార్నాకి "ఊళ్ళో" అనుకుంట లేశినిలబడ్డ సుట్టూతజూశిన మంది అంత తలోమాట వాల్లల్లవాల్లే మాట్లాడుకుంట నాదిక్కు జూత్తాండ్రు.

గోలెం ఈరిగాడు నా దగ్గరికచ్చి 'పో-పోరాదే జెప్పనబోయి ఎవస్నడ్గినవో బండి దేరాదు!" అన్నడు.

"అవుర! కుమ్మరి గోవిందు ఇంటిదాక వొయ్యుత్తరా! బండిత్తనన్నడు పట్టుకత్త" అని బైల్దేరిన.

"ఆఁ ఆఁ జెల్దిబొయిరా. ఆలిసెం జేత్త అపాయమైతది" అన్నడు వాడు. నేను నా పెండ్లాన్ని జూశిన. మైకం గమ్మిన దానోల్గినే పండ్కోని ఉన్నదది. "గిదేందిరో! ఉన్నదా ఊశిందా?" అనుకుంట దానిపెయి ముట్టుకున్న. రాజవ్వ కసిరిచ్చి కొట్టింది. "గిట్లనే నువ్వు సూస్కుంట జేరుతె అది నిజంగానె సచ్చిపోద్ది" అన్నది.

నేను లేశి దబదబ బయటికచ్చిన. బువ్వల్దినేయాల్ల దాటింది. ఊల్లె అంత సప్పుడు లేకుంటనే ఉన్నది. ఐనా గీయాల్లకెవడుంటడు? మల్ల శీకబడెటప్పుడు గని రారు. బజారు పొంట శెట్ల నీడున్నకాడ పొల్లగాండ్లు బొంగురాలాటలు, బచ్చాలాటలు ఆడుతాండ్లు. కొందరు పోరగాండ్లు ఊశికేల గుడ్డేలుగులు పడుతాండ్లు. కాపోల్ల కిష్టయ్య పెరట్ల కొందరు పొల్లగాండ్లు శింతకాయలు కొట్టుక తింటాండ్లు.

గపోరగాల్లను సూశెటాల్లకు నాకు నా శిన్నతనం యాదికచ్చింది. ఎంత ముద్దు గుండేటియి గారోజులు గిట్లనే ఆటలాడేది. ఈతలు గొట్టేది. గసుమంటి రోజులన్ని పోయినయి. నేను సంసారంలబడి గిన్ని తిప్పట్లు పడబడ్డిని.

గింతట్లెనె కొమటోని దుకానమచ్చింది. గొండ్ల యాదమ్మతోని పరాశ్కమాడు కుంట కోమటోడు నాదిక్కుసూశి "యాడికి బోతానవురో!" అన్నడు.

"గీడికే" అన్న నేను ఆగకుంటనే - "మంచిది మంచిది పోయిరా!" అన్నడు వాడు ఎటకారంగ నవ్వుకుంట.

నేనాడికిబోతె గీవీనికెందుకు అనుకున్న "నీయక్క.. గొల్లోని బతుకెంత... అద్మాన్నమై పోయిందిరో" అని రుమాల దీసి మొఁగ దుడ్సుకున్న

ఎండ శిటమటలాడ్తాంది. నాకు గుండెలు గుబగుబలాడ్తానయి. నా పెండ్లం నలభై సంవత్సరాలకెల్లి నాతోటి కట్టసుకాలల్ల పాలు బంచుకుంటాంది. నేనేడిత్తె దాని కండ్లలగూడ నీల్లు గిర్రగిర్రతిర్గుతయి. నేన్నవ్వుతె దానిమొకం గూడ పెద్దగొంగడంత యిప్పుకుంటది. గసుమంటి దానికి పానాంతుకమైతే ఏం జెయ్యలేకపోతిని. శీ - నీ యక్క

గిట్ల ఆలోశనజేస్కుంట పోయెటాల్లకు కుమ్మరి గోవిందు సావట్ల గూసోని శిన్న కొడ్కును ఓల్లెగూకోబెట్కోని "గింతంత తాగురబిడ్డ! ఒక్క బుక్క పీలువు. ఏం గాదురా మంచిగుంటది" అని సుట్ట అందిత్తాండు.

గా శిన్నపోరడు "ఊఁ ఏవఁద్దే" అని మొకందిప్పుకుంటాండు. నన్ను జూడంగనె పిలగాన్ని ఓల్లెకెల్లిదించి "రాయె, కూసో!" అని అరుగు సూపెట్టిండు.

"అబ్బో! కూకునేటట్టు యాడున్నది. జెప్పన బండి దోల్కపోవాలె" అన్న.

"పోదువుగని కూసో" అన్నడు గోవిందు

"లే.లే, పోవాలె. దానికి పరీశాన్ గున్నది" అని అట్లనే నిలబడి అటిటు చూశిన. గొడ్లు యాడ గనబడలే - బండి మాత్రం ఆన్నే ఉన్నది "ఎడ్లేవ్వి? తోలుకరాలే!" అన్న

గోవిందు నాదిక్కు శిగ్గుపడుకుంట సూశిండు. "ఆఁ పోయిన గని ఎడ్లు లెవ్వు ఆద" అన్నడు.

'అరె?" అన్న ఏందో వున్నదిర కతో అనుకుంటనే.

"ఇగో బుచ్చన్నా! పెద్దోల్లతోటి యవ్వారం! మనం మనం సదురుకుంటంగని వానితోని పెట్టుకోజాలుతమా!" అన్నడు గోవిందు.

"ఎవన్తోటిరో?"

"గదే కోమటోనితోటి! వానిగ్గిప్పుడే పట్నంబొయ్యే పనున్నదట. వాని వడ్ల బత్తాలు మార్కెటు కేస్కుబోవాల్నట. బండెడ్లడిగిండు" అన్నడు గోవిందు తలకాయె వంచికోని.

"వాని బండి బోంగ ఇదిగూడ గావాల్నటనా?"

'అవునట!"

వానిగొంతు వనికింది.

నాకు కాల్లకింది భూమి కదిలినట్టనిపిచ్చింది. "అంటె గిప్పుడెట్ల బండిలేకుంటె మరి? నాకిస్తనంటివి గద!" అన్న నీర్సంగ.

నేనేం జయ్యాలెచెప్పు! 'కోమటోనికి కొత్తలు బాకివుంటి. ఎడ్లు బండియ్యకుంటె అవిదెమ్మని కూసుంటడు. పైసలియ్యాల్నంటె ఏదన్న తెగనమ్మాలె. పోని అని ఆన్తోటి పంచాతి పెట్టుకుంటె రేపేయాల్ల ఎట్లుంటదో. గివన్ని అయ్యేపనులేనాజెప్పు?" గోవిందు ఎటో సూస్కుంట అన్నడు.

నాకు కోపమచ్చింది. ఇశారమైంది. ఉద్దిరేకం పెరిగిపోయింది. ఐనగూడ అనుసుకోని అన్న.

"మరిగ ఎట్ల? బండికావలె గదనాకు! దొరుకదంటవా!"

"ఏం జెయ్యమంటవు కతగిట్లున్నది. నీకేమో ఇయ్యబుద్దయితాంది.

కోమటోన్తోని పంచాయితైద్దని బయమైతాంది" అన్నడు గోవిందు.

నాకిగ కోపమాగలే బుస్సున తాసుబామోల్లె లేశిన. "అవున్రా! మీరంత వానిశేతికింద బతుకుతార్రు. వాడు సోలెడుపప్పు, మానెడు బియ్యం ఇత్తె బతికేటోల్లు గాదుర మీరు! వానిమాటినక నా కట్టసుకాలు సూత్తార్రా! నా అవుసరానికాదు కుంటార్రా నేను కూడ మీవోల్లెనే బతికెటోన్నిరా! మీతోటోన్నిరా! నా పెండ్లం సావుబతుకుల్లున్నది. గ దానికేమొ బండియ్య శాతగాదు వాని అడ్లు మార్కెటుకేస్క పోయటాన్కి ఇత్తర్రా. గావడ్లన్ని యాడియి రావానికి? గది ఆలోశించినార్ర. వాడు జెప్పినట్టినకపోతె రెడ్డోన్తోని, పట్వారోన్తోని జెప్పి మీ బతుకుల అగ్గిరేపుతడువాడు. కని గిదెంతదూరం పోద్దో ఎర్కెనార? గిసుమంటికాలం నీకు గూడ అత్తదిరా! గప్పుడు

నీమీద ప్రేమజూపెట్టే కోమటోడు ఏంజెయ్యుడురా గప్పుడు గీ గొల్లబుచ్చిగాని మాటలు నీకు యాదికత్తయిరా! సూస్కో ఇదేనా మాట శిలాచ్చరం- శిలాచ్చరంరా అరేయ్" అని శాపనార్దాలు పెట్టిన.

గివన్ని నేను కడుపుబ్బరంతోటి అన్నయిగాదు నిజంగ నా కడుపుల కెల్లి అగ్గి నిప్పులోలె దున్కినయి. మనుసుల జెకముకి గొట్టినట్టయితాంది. ఇంగ ఏం మాట్లాడ కుండ ఎన్కకుదిర్గి బిర బిర నడ్సుకుంట నా ఇంటిమొకం బట్టిన.

కోమటోని దుకానం ముందటికెల్లి బోతాంటె ఆడు పండ్లిగిలిచ్చుకుంట "ఏమిర బుచ్చిగా! ఆగమాగం బోతానవు?" అన్నడు.

నాకు పెయిమీద దెల్వలే. "ధూ! అరేయి నామాలకోమటోడ! నామొకం ముందట ఏదన్న జేసేధైర్యం ఉన్నాదిర నీకు? నీకు గొర్రెపిల్లలమ్మలేదని గింత కైలాటుకంజేత్తావుర? గిదీంతోటి ఏమైద్దిరా? నాకు తిక్కేరేగిందంటే గొర్రె తిత్తి దీసినట్టు దీత్త బిడ్డ...." ఇంకేమంధునో గని గంతట్లకే గోవిందు ఉర్కచ్చిండు.

"బుచ్చన్నా ఆగాగు గట్ల మాట్లాడ్తె ఎట్లనే? జర ఎన్కముందు జూస్కోవాలె" అన్నడు.

"యెన్ననేవత్తానావుర. పిరికిగాడ్డికొడ్క! నీ అసుమంటోల్లు ఉండెపట్కెనేరా గివీల్లు లతెగాంచేది. శ్శీ! నియ్యత్ లేని బతుకుల్రామీయి. ఎవడు నాకు సాకారం జెయ్యకపోతే సత్తననుకున్నార్రా!" మందుకుంట అన్న.

గోవిందు మొకం మాడ్సుకున్నడు. "సరె బిడ్డ! వస్త" అని నా యింటి దిక్కుపోయిన.

నా గుడిశెకాడికి పోంగనే అందరు గిరుక్కున తిరిగి సూశిండ్రు. నాకు కండ్లల్ల నీల్లు దిర్గుడుబందయి నిప్పులు దున్కుతానయి. అందర్ని ఇగ గురుకాయించి సూశిన. నా పెండ్లం గట్లనే బొంతలపండి మూలుగుతాంది. అందరు మంది సుట్టుజేరి ఉన్నరు.

"ఏందుర్రా! ఆర్మెటోడుగాదు తీర్మెటోడుగాదు గని పొద్దుకు పదిసార్లడిగెటోడని మీ సంగతేంది? పెండ్లం గిట్లుంటె గివీడు గింతతీర్బాటంగ తిర్గుతాండని సూత్తానా?

నేను పేదోన్నిరా. నాకెవడు సాయంజేత్తర్రా? నేంజత్తాంటె సూశి సంబుర పడె టోల్లున్నర్రా! నా రగుతం నీరైపోతాంటె దాంట్ల పంటలు పండిచ్చుకునెటోల్లున్నర్రా. నా అక్కెర పానంమీది కచ్చినంక ఉన్న జాయిజాతంత పున్యానికి దొబ్బెటానికి సూశె టోల్లున్నర్రా! అరేయి గోలెం ఈరిగా, నా పెండ్లాం ఎసుమంటిదిరా! గోవు మాలచ్చిమికంటే దాని మనసు సుతారంరా! అది ఎందరి బిడ్డలను కన్నబిడ్డలోలిగె సూస్కున్నదిరా! ఊల్లె ఎవల పిల్లలకేమచ్చినా ఇదక్కడికి తయారై ఎట్లసూస్కున్నదిరా! ఎన్ని వైద్గాలు జేశిందిరా. ఎందరి ఇండ్లల్ల పెండ్లింల్లయితాంటె ఎన్నిశావలు చేశిందిరా. గసుమంటిది గియాల గిట్లున్నదంటె ఎవడన్న ఒక్కడు సాయం జేత్తాండా? ఆకరుకు బండిత్తనన్నోడు గూడ కోమటోనికి బయపడి తెడ్డుజూపెట్టిండు. వానింట్ల - గదే గా కోమటోనింట్ల గిదెన్ని పనులు. జేశిందిరా! అదివాడు ఇయ్యాల

మర్శిపోవచ్చు గని వారీ! నేన్దాని మొగన్నిరా! కట్టుకున్నోన్నిరా! దాని బాగోగులు సూశేదర్మం నామీదున్నదిరా.

అరేయ్ - గిదంత సూత్తాంటె నాకు ఈరబద్రుడు పూన్తాండు - శివాలెత్తు తానయి- ఎల్లెల్లెల్లె - లరేయి ఎవ్వడు వాని సుకమే సూస్కోనీరా? కనివారీ మీరంత నావోల్లే గదేనాకు బలంరా! అరేయి నన్ను ఏందో జేయాల్నని పెద్దింటోడు నాకు బండియ్యి నీయకుండ జేశిండు గదేంజేత్తదిరా నన్ను? నాకింక నా బుజాలల్ల సత్తవబోలే. బండి లేకుంటేందిరా ఆమెడదూరం దాన్ని బుజాలమీద మోస్కపోత. రొండు గొర్లమ్మి వైద్గం జేయిత్త. అరేయి నాకష్టకాలంల మీరన్న కంటతడి బెట్టిండ్రు. సాల్రాబిడ్డా గయింతసాలు, గదేరా నాబలం - గదేరా నాసత్తవ. అని పెయిమీద దెల్వకుంట పోయి రొండు గొర్లు ఇప్పి తాడు గట్టి చేతుల బట్టుకున్న.

నాపెండ్లాం దగ్గరికచ్చి దాన్ని ఓసారి నిండార సూసుకున్న.

"లేర్రి - దూరం జరుగుర్రి" అని అందర్ని దూరం జరిపి బొంత తోటిపాటు గదాన్ని ఎత్తి బుజం మీనేస్కున్న.

గప్పుడు నాకు ఏం ఈరావేశం పూనిందోగని ఇంతింత బలం రాలేనాకు. నా పెండ్లాన్ని బుజాలమీన ఎస్కోని మావోల్లంత ఎంబడి రాంగ బిరబిర నడ్సిన.

ఊరుదాటినంక మావోల్లంత పొలాలల్ల ఆగిపోయిండ్రు.

నేమాత్రం గదేనడుకతోటి ముంగలికి నడ్సుకుంట పోయిన. ఈపుమీన నా పెండ్లం కండ్లల్లనీరు సుక్కలు సుక్కలు పడ్తాంది.

● 1984 ●

# 48. మానవత

♦ పోల్కంపల్లి శాంతాదేవి ♦

రత్న చంకలో బిందెతో పరిగెత్తుకు వచ్చినట్టుగా ఇంట్లో పచ్చిపడింది.

కూతురు పరిగెత్తుకు రావడం, వగర్చడం చూసి "ఏమిటే, అలా పరిగెత్తుకు వచ్చావు?" అనడిగింది తల్లి దేవకి.

"రంగరాజు కొడుకు, రెడ్డిగారి కొడుకు వెంటబడ్డారమ్మా! చాలా అసభ్యంగా మాట్లాడుతున్నారు. ఆ మాటలు నా నోటితో చెప్పడానికే సిగ్గేస్తోంది!" రత్నకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"కాస్త వయసున్న ఆడపిల్ల కనిపిస్తే చాలు ఆంబోతుల్లా వెంటపడడమేనా ఈ కొడుకులకు: పని దూ! వీళ్ళకి చెల్లెళ్ళూ, తల్లులూ లేరేమో అడుగుతాను! నడిబజారులో వాళ్ళ సిగ్గు తీయకపోతే నా పేరు దేవకి కాదు!" దేవకి భగ భగ మండుతూ వెళ్ళబోయింది.

"వద్దమ్మా! వాళ్ళజోలికి వెడితే ఇంకా రెచ్చిపోతారు. పగబట్టినట్టుగా అవుతారు! వాళ్ళు ఏం దుర్మార్గం తలపెట్టినా ఇద్దరం ఆడవాళ్ళం! ఏం చేస్తాం చెప్పు?" అంటూ తల్లి రెక్కపుచ్చుకు ఆపింది రత్న.

"మరీ నోరుచచ్చి కూర్చుంటే వాళ్ళ ఆగడాలకు అంతుంటుందా?"

"వాళ్ళు ముందే దుష్టులు! వాళ్ల జోలికి వెడితే ఏమైనా వుంటుందా? బలహీనులం బలవంతులను ఎదుర్కొంటే ఏం జరుగుతుందో తెలియదా?"

ఏం జరుగుతుందో తెలుసు కాబట్టి దేవకి నిస్సహాయంగా కూలబడింది. "ఎంత దయలేనివాడు దేవుడు? ఇరవయ్యేళ్ళకే నొసటి కుంకుమ చెరపటానికి ఆయనకి చేతులెట్లా వచ్చాయో? వయస్సంతా ముందే ఉందికదా! ఎలా బ్రతుకుతావో అసలు నిన్ను మర్యాదగా బ్రతకనిస్తుందా లోకం? పుల్లాకుమీద విరుచుకపడే కుక్కలా తయారయ్యారే ఈ వూళ్ళో మగవెధవలు నేనా కాటికి దగ్గర పడ్డాను. నిన్ను కాపాడుకొనే శక్తి నాకు లేదు, నిన్ను నీవు ఎలా కాపాడుకొంటావో!"

తల్లి మాటల్లోని యధార్థం రత్నని క్రుంగదీయసాగింది.

రత్న తండ్రి ఆ పిల్ల పదో ఏటికేపోయాడు. తల్లే తల్లీదండ్రై పెంచి పెద్దజేసి ఆ పిల్ల పద్దెనిమిదవో ఏట పెళ్ళిచేసి అత్తవారింటికి పంపించేసింది. రత్న భర్త సైకిల్‌షాపు సిటీలో పెట్టుకొని రెండేళ్ళు కాపురం చేశారో లేదో, అతడు

యాక్సిడెంట్‌లో పోయాడు. అత్తవారింట ఎవరూ ఆదరించేవాళ్ళు లేక పుట్టిల్లు చేరుకొంది రత్న.

మగతోడు లేదు. ఎవరు ఏం అఘాయిత్యం తలపెట్టినా ఇదేమిటని అడిగే నాధుడు లేడు. ఇరవయ్యేళ్ళ పడుచు వయసు, దానికి తోడు సౌందర్య రాశి.

తలమీద నీడ చెడి పుట్టింటికి చేరిన మరునాటి నుండే ఊళ్ళో కుర్రకారు ఆకలి చూపులు వెంటాడ సాగాయి రత్నను. కుర్రకారే కాదు వయసు మళ్ళుతున్న మగవాళ్ళు కూడాను కనుబొమ్మలు ఎగరేసి విలాసవంతమైన చూపు విసురు తున్నారు.

పుట్టిల్లు చేరిన ఈ ఏడాదిలో రత్నని పొందాలని పొంచి కూర్చోన్న నక్కలు ఓ పాతికమందైనా ఉంటారు! రంగ రాజుకొడుకు ముకుందం, రెడ్డిగారి కొడుకు రంగారెడ్డి, మరీ బరితెగించి మీద పడడానికి సిద్ధమౌతున్నారు.

"రేపో, ఎల్లుండో దొరగారు వస్తారని విన్నాను! నా బిడ్డకు ఏదైనా దారి చూపమని ఆయన కాళ్ళమీద పడతాను! అంది దేవకి.

"ఆయనేం చేస్తారమ్మా?" చిరాకుగా అడిగింది రత్న.

"దొరగారు తలుచుకొంటే చేయలేనిదేమిటే? ఒక అనాధకు ఆశ్రయం చూపడం ఆయనకొక లెఖ్ఖా?'

ఆ ఊరి దొరగారి పేరు కృష్ణనాయుడు. పిల్లల చదువుల గురించి, ఇతర వ్యాపారాల గురించి ఆయన కాపురం పట్నంలోనే! రెణ్ణెల్లకీ, మూణ్ణెల్లకీ ఇక్కడ పొలాల్ని చూచుకోడానికి వస్తుంటారు. రెండుమూడు రోజులుండి వెళ్ళిపోతారు.

దేవకి ఆయన దేవిడీలోనే పనిచేస్తూంది. దొరగారు ఉన్నా లేకపోయినా బంగళా అంతా శుభ్రంగా ఊడ్చి పెడుతుంది.

★ ★ ★

అన్ని పనులకీ తల్లే వెడుతుంది గాని, నీళ్ళు తోడడం ఆమెకు చేతకాదని నీళ్ళకోసం ఊరబావి దగ్గరికి రత్న వెడుతుంది. మనస్సేం బాగుండక కాస్త ప్రశాంతతైనా చిక్కుతుందని సాయంత్రం ఊరవతల ఉండే శివాలయానికి వెడుతుంది. చదువు సంధ్య లబ్ధక జులాయిగా తిరిగే ముకుందం, రంగారెడ్డి రత్న ఎక్కడుండేది అంజనంలో చూసినట్టుగా ప్రత్యక్షమౌతారు. వెకిలి మాటలతో వేధించడం మొదలు పెడతారు.

ఆరోజూ అలాగే వేధిస్తుంటే, జయదేవ్ చూశాడు. ఇదివరలో కూడా ఒకటి రెండుసార్లు చూశాడు వాళ్ల వేధింపు. అతడు ఆ ఊరి ప్రాదమిక పాఠశాలకు హెడ్మాస్టరు. ఇంకా పెళ్ళవలేదు. ప్రక్క ఊరే అతడిది.

రత్న గర్భగుడి చుట్టు ప్రదక్షిణం చేస్తూంటే ముకుందం, రంగారెడ్డి వెంట వెంటే నడుస్తున్నారు. ఆగి నమస్కారం పెడుతూంటే వాళ్ళూ ఆగి పెడుతున్నారు. కూర్చుంటే కూర్చుంటున్నారు. అక్కడితో ఆగితే సరిపోయేది.

"చేతులు జోడించి నువ్వేం కోరుకొన్నావురా దేవుడిని?"

"చేతులు జోడించి కళ్లుమూసుకోగానే నా కళ్ళముందు ఏం కనిపించిందో తెలుసా?"

"ఏం కనిపించింది?" చెప్పలేనంత కుతూహలం వ్యక్తం చేశాడు రెడ్డి.

"ఖరీదైన సినిమాల్లో చూస్తామే, హీరో హీరోయిన్ పెళ్లికాగానే, బ్రహ్మాండమైన శోభనం గది సీను! అది!"

"పడకమీద నువ్వు హీరో! మరి హీరోయినో?"

"అల్చిప్పలంత కళ్ళు; అందమైన నాశిక; దొండపండులాంటి పెదవులు; జలపాతంలాంటి జుట్టు; చిత్రకారుడు దిద్దినట్టుగా వంపులు, సొంపులు!" రత్నను క్రీగంట చూస్తూ కవిత్వం చదువుతున్నట్టుగా అన్నాడు ముకుందం

"తెలిసింది తెలిసింది ఆ సుందరి ఎవరో?" రత్నకేసి కన్నుకొట్టాడు రెడ్డి.

అక్కడే స్తంభానికి ఆనుకొని పుస్తకం చదువుకొంటున్న జయదేవ్ ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు.

"ఆ అమ్మాయిని అల్లరిపెట్టడంలో మీ ఉద్దేశ్యం ఏమిటి? మీ ఊరి ఆడకూతురు మీకు చెల్లెలు వరుస అవుతుందన్న జ్ఞానం కూడా లేదా మీకు?" జయదేవ్ పుస్తకం మూసి తీవ్రస్వరంతో అడిగాడు.

"మాకు చెల్లెలి వరుస అయితే పొరుగూరి అబ్బాయివి – నీకు మరదలు వరుస అవుతుంది కాబోలు! అందుకేనా నాయనా ఇంత ఉక్రోషం?" వెటకారంగా అన్నాడు ముకుందం.

ఊహించని ఈ విసురుకు రత్న ముఖమే కాదు, జయదేవ్ ముఖం కూడా కందిపోయినట్టుగా అయింది.

"భర్తపోయి పుట్టెడు దుఃఖంలో వున్న ఆ ఆడకూతురిపట్ల సానుభూతికి బదులు ఆలాంటి క్షుద్రమైన ఆలోచనలు వచ్చాయంటే వాడు పశువుతో సమానం అనాలి!" జయదేవ్ గంభీరంగా మారిపోయి, కటుస్వరంతో అన్నాడు.

"ఆ భర్త పోస్ట్ భర్తీ చేద్దామనే!" రొమ్ము విరుచుకొంటూ అన్నాడు రెడ్డి.

"ఇద్దరూనా?"

"మహాపతివ్రత ద్రౌపదికి అయిదుమంది ఉండగా, అయిదుమంది చాలక, కర్ణుడితో మానసిక వ్యభిచారం చేయలా!"

"మీ పురాణ పరిజ్ఞానం తగలడ", మంటగా అనుకొన్నాడు జయదేవ్. బురదలో రాయి వేసి చిట్లించుకొన్నట్టుగా అయింది. ఇంకా మాట్లాడితే ఇంకా చిట్లుతుందని టక్కున నోరు మూసుకొని పుస్తకం తెరిచాడు.

"తోక ముడిచాడు పంతులు!" కోరస్‌గా ఎగతాళి చేశారు ముకుందం, రెడ్డి.

"భగవంతుడా! నీ దగ్గరికి వచ్చినా, ఇక్కడ కూడ కాస్త మనశ్శాంతి చిక్కడంలేదు కదా! కన్నీరు ఒత్తుకుంటూ నిష్క్రమించింది రత్న.

★ ★ ★

ఊరంచున శివాలయం. శివాలయం ప్రక్కనుండి దొరగారు కృష్ణనాయుడి గారి పొలాలు ప్రారంభమౌతాయి ఆ పొలాలు చెరువునీటితో సాగుబడి అయినా, చెరువులో నీళ్ళు లేకపోయినా సాగుబడి అయ్యేట్టుగా పెద్ద బావి కూడా ఉంది.

ఈ బావికే రోజూ బట్టలుతుక్కోవడానికి వస్తుంది దేవకి. రోజూ ఆవిడే వచ్చేది. కానీ ఆవిడకి జ్వరం వచ్చి పడక వేయడం వల్ల మూడు రోజులు బట్టలు పేరుకుపోగా, కట్టుకోవడానికి చీరలుండవని, ఆరోజు బట్టలమూట చంకనుంచుకొని రత్న వచ్చింది.

పైరు మీద జీతగాడు క్రిమిసంహారక మందు చల్లుతూంటే ఒడ్డున నిలబడి చూస్తున్నారు దొరగారు.

అదే ఒడ్డుమీదనుండి వెళ్ళాలి రత్న. దొరగారిని చూసి అల్లంత దూరంలో ఆగి పోయినా, అంతదూరం వచ్చి బట్టలుతుక్కోకుండా వెళ్ళిపోయి ఏం చేయాలని, మళ్ళీ ముందుకే సాగింది. ఇద్దరు పట్టేంత ఆ వడ్డుమీద దొరగారికి తగలకుండా ఒదిగి ఒదిగి ముందుకు అడుగువేసింది.

రత్న తనని దాటి అంతదూరం వెళ్లిపోయాక "ఎవర్రా ఆవిడ?" అనడిగారు దొరగారు జీతగాడిని.

దొరగారి కంఠంలో వినిపించిన ఆసక్తికి ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు జీతగాడు ఎందుకంటే దొరగారికి పరస్త్రీని కన్నెత్తి చూడనివాడన్న సత్కీర్తి వుంది. సాధారణంగా డబ్బుండే వాళ్ళలో కనిపించే విచ్చలవిడితనం ఆయనలో కనిపించదు; రేసులు, త్రాగుడు, ముండలపట్ల అభిరుచి - ఇవేవీ సోకని మచ్చలేని వ్యక్తిత్వంగా చెప్పుకొంటారు. తాతగారు చనిపోతూ మనుమడి పెళ్ళి చూచిపోవాలన్న కోరిక గాఢంగా వెలిబుచ్చడంతో ఆయనకి పంధొమ్మిదో యేటనే వివాహం జరిగింది. ఇరవయ్యేళ్ళకే బిడ్డ తండ్రి అయ్యాడు. నలభయ్యో పడి వచ్చీరాకముందే తాతయ్యకూడా అయ్యాడు. ఇప్పుడాయన వయస్సు నలభయ్ అయిదేళ్ళు. ఇద్దరు అల్లుళ్ళు. ఇద్దరు కోడళ్ళూ వచ్చేశారు రేపో మాపో పెద్ద కొడుకు కూడా తాతయ్యని చేయబోతున్నాడు.

కాని, అంతవయసు కనిపించదు! వ్యసనాలేమీ లేకపోవడంవల్ల ఆయన శరీర దారుఢ్యం ఏమాత్రం సడలలేదు! మంచి ఆరోగ్యవంతమైన తిండివల్ల పాతికేళ్ళనాటి ఆ ఎరుపు, మెరుపు ఆ ముఖంలో ఇప్పటికీ చెక్కుచెదరలేదు! నిగ నిగలాడే ఉంగరాల జుట్టుతో, ముప్పయేళ్ళ యువకుడిలా కనిపిస్తాడు.

"మన దేవిడీలో పనిచేసే దేవకి బిడ్డేనండీ! రత్నమాల సిన్నప్పుడు తల్లి ఎంట మన దేవిడీకి వస్తుండేది కదా?" అన్నాడు జీతగాడు.

"ఓ, ఆ పిల్లా! మోకాళ్ళదగ్గరికి లంగా కట్టుకొని, ఎలుకతోకంత జడవేసుకొని, తల్లి కుచ్చిళ్ళలో దూరిపోయి కన్నంలో ఎలుక పిల్లలా తొంగితొంగి చూసేది! ఎంత మారి పోయింది గుర్తేపట్టలేదసలు!" అన్నారు దొరగారు విస్మయంగా.

"ఆ పిల్లకు అంత చక్కదనమూ ఇచ్చి అడవిని గాసిన ఎన్నెల సేసిండు దేవుడు! పెళ్లి సేసిన రెండేల్లకే మొగుడు పట్నంలో లారీకిందపడి సచ్చిండు. నుదుట కుంకమ సెదిరి వచ్చి తల్లి పంచన పడ్డది!"

"అయ్యో! పాపం, అలాగా!"

"సక్కనిది, వయసున్నది! మగతోడులేంది! ఊళ్ళో వయసు పోరలంతా జింక పిల్లెంటపడ్డ తోడేళ్ళలా అయినరు దొరా!"

"అలాగా? దేవకి నాతో ఒక మాటా చెప్పలేదేం అంతకష్టం వస్తే?"

"దొరగారు అడగందే ఎవరేం చెప్పగలరు, దొరా?"

అరగంట తరువాత మళ్ళీ అదే దారంట వచ్చిన రత్నను మరింత ఆసక్తిగా చూశారు దొరగారు.

ఇంతవరకు దొరగారి నిలువెత్తు విగ్రహంచూసి ఆడవాళ్ళెందరో గుండె లయ తప్పితే, ఇప్పుడు జీవితంలో మొదటిసారి దొరగారి గుండె లయ తప్పింది, రత్న సౌందర్యం చూసి!

మరునాడు దేవకి దేవిడీ ఊడ్చడానికి రాగానే దొరగారు అడిగారు! "నీ కూతురు ఎంత పెద్దదైపోయింది, నిన్న చూసి నేనసలు గుర్తుపట్టలేదు" అంటూ నిన్న పొలంలో రత్నను చూసిన సంగతి చెప్పారు దొరగారు.

"రోజూ మీ కాళ్ళమీదపడి మా గోడు చెప్పుకొందామనే! కాని, దొరగారు ఏమను కొంటారోనని భయపడి ఊరుకొనేదాన్ని మీ నోటంటే వచ్చింది కాబట్టి నాకెంతో ధైర్యం వచ్చింది! దొరా, నాకూ, నా బిడ్డకూ ఇంక మీరే దిక్కు! ఇరవయ్యేళ్ళు నిండీ నిండ కుండానే నా బిడ్డ జీవితం బుగ్గి అయిపోయింది! ఈ ఊళ్ళో మగవెధవలు దాన్ని గౌరవంగా బ్రతకనిచ్చేట్టు లేరు! నేను బ్రతికినన్నాళ్ళు బ్రతకబోనుకదా దాన్ని కాపాడు కోవడానికి! దాన్ని మీ బిడ్డలా మీ చేతుల్లో పెడుతున్నాను! ఏమైనా చేయండి, దొరా!" దేవకి దొరగారి పాదాలమీద వేడుకొంది

దొరగారు కాళ్ళు వెనక్కు లాక్కుంటూ అన్నారు! "కాళ్ళమీద ఎందుకు పడతావులే ఏదో ఒకటి ఆలోచిద్దాం! అధైర్యపడకు!" అని హామీ ఇచ్చారు. "ఒకసారి నీ కూతుర్ని తీసుకురా! తన ఆలోచన లేమిటో వింటాను! నాతో పట్నం తీసుకువెడితే చదువుకొంటా నంటుందా? ఏదైనా కుట్లూ అవీ నేర్చుకొని, తన బ్రతుకు తను బ్రతుకుతా నంటుందా?.. "

దొరగారు ఇంత శ్రద్ధగా తన కూతురి భవితవ్యం గురించి మాట్లాడడం చూసి ఉబ్బి తబ్బిబ్బు అయిపోయింది దేవకి. "ఇప్పుడేం చదువుకొంటుంది, దొరగారూ! మిషనో ఏదో నేర్పించే ఏర్పాటు చేశారంటే తన పొట్ట తను పోసుకొంటుంది! పట్నంలో ఒకరి ఊసు ఒకరికి పట్టదుకదా, దీని జోలికివచ్చి అరడిపెట్టేవాళ్ళుండరు. పగలూ రాత్రీ నాకు రత్న చింతే అయిపోయింది దొరగారూ!"

"సరేసరే! ఏదో ఒకటి ఆలోచిద్దాం! రేపు నీ కూతుర్ని తీసుకురా!"

దేవకి ఇంటికి వచ్చి ఆ సంగతి చెప్పేసరికి రత్న గుండెల మీద భయంగా చెయ్యుంచుకొంది. "అమ్మో! దొరగారి ఎదుటికే! ఆయన్ని చూస్తేనే నాకు భయం! ఇహ ఆయనముందుకు వచ్చి ఏం మాట్లాడుతాను?"

"దొరగారు తలుచుకోవాలేగాని, నీ జాతకమే మార్చివేయగలరే?"

'జాతకమే మారుస్తారంటే?"

"మంచి వరుడిని చూసి పెళ్ళిచేసినా చేయగలరు! వారు తలుచుకోవాలే గాని ఏం చేయలేరు!"

రత్నముఖం పాలిపోయింది. "ఏం మాటలమ్మా అవి? నాకు మళ్ళీ పెళ్ళా?"

"జీవితమంతా ముందరే ఉందికదా? పొట్టపోసుకోవడం ఒక్కటేనా ప్రధాన సమస్య? నీ జీవితంలో మళ్ళీ వెన్నెల రావాలని ఈ తల్లి కోరుకోవడంలో తప్పేమీ లేదు."

మరునాడు రత్నను బలవంతంగానే తీసికెళ్ళింది దేవకి.

రత్న వెళ్ళిందేగాని తల్లి వెనుక వెనుకే నిలబడసాగింది.

"నా వెనుక వెనుకే నక్కుతావేమే, దురదృష్టపుదానా! ఇలా ముందుకు వచ్చి దొరగారికి నమస్కారం చెయ్యి!"

"చిన్నప్పుడూ, ఇప్పుడూ - ఒక్కటే భయం అన్నమాట నన్ను చూస్తే?" దొరగారు చిన్నగా నవ్వారు. "పులిని కాదు! మనిషినే! కొంచెం కళ్ళెత్తి చూడు తెలుస్తుంది!"

దొరగారు అంత చనువిచ్చి మాట్లాడుతున్నా, దించిన తల ఎత్తని కూతుర్ని చూస్తే ఒళ్ళు మండినట్టుగా అయింది దేవకికి. ఆ పిల్ల రెక్కపట్టి లాక్కుపోయి దొరగారి పాదాల మీదకి పడదోసింది. "దొరగారి పాదాలు పట్టుకో! వారే నీకొక దారి చూపగల దేవుడు!"

"ఛ ఛ ఏమిటిది దేవకీ? అమ్మాయిని అలా త్రోశావేం?... లే లే!' దొరగారు రత్న భుజాలు పట్టుకు లేవదీశారు. ఒక పెద్దమనిషి వాత్సల్యంతో లేవదీసినట్టుగా లేదు! ఆ చేతులపట్టు... దాంపత్య జీవితంతో సుపరిచితమైన రత్న గుండెలెందుకో జల్లుమన్నట్టుగా అయ్యాయి.

రత్న జంకుగా రెండడుగులు వెనక్కివేసి నిలబడింది.

"ఊఁ ఇక చెప్పు! నిన్ను మీ అమ్మ నా చేతుల్లో పెట్టేసింది! నీకో దారి ఏర్పరచమంది మీ అమ్మ! నువ్వు కోరుకునే దారి ఏమిటి?"

"...."

"మాట్లాడవే మొద్దూ!" తల్లి రత్న నెత్తిమీద మొట్టి మరీ అంది.

"నాకేం తెలియదు మీరేం చెబితే అది చేస్తాను!" దించిన తల ఎత్తకుండానే అంది రత్న. సన్నని స్వరంతో.

"ఏం చెబితే అది చేస్తావు కదూ? మాట తప్పకూడదు మరి!" దొరగారి పెదవులు మందహాసాలు వెదజల్లాయి.

"దేవకీ! ఈ క్షణంనుండి రత్న నీ కూతురు కాదు! నా మనిషి. ఇక నిశ్చింతగా వుండు నే నిక్కడున్నన్నాళ్ళు ఇక్కడే ఉంచు. నన్ను చూస్తే ఈ భయం పోగొట్టుకోనీ!"

దొరగారి మాటను ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు దేవకికి! పిల్లను ఇక్కడెందుకుంచమంటున్నారు? వయసు పిల్ల! ఛఛ! దొరగారి గురించి తను తప్పుగా ఆలోచిస్తుందేమిటి? ఆడవాళ్ళ విషయంలో ఆయన నిప్పులాంటివారని పేరుపొందిన మనిషి!

దొరగారి మాటకు వివరం అడగడానికి జంకిన దేపకి. "అలాగే దొరగారూ!" అని ఇవతలికి వచ్చింది.

"ఇక్కడ నాకేంపని నేనుండను!" అనేసింది రత్న తల్లితో.

"ఉండనంటే ఎలా? దొరగారు మాట జవదాటి బ్రతకగలమా? ఆయన ఉప్పు తిని బ్రతుకుతున్నవాళ్ళం! ఆయన సాయం కోరినవాళ్ళం.

ఉండక తప్పలేదు రత్నకు. దొరగారి మాటను కాదని వెళ్ళిపోతే తల్లికి ఉన్న ఉద్యోగం కూడా ఊడిపోతే తమకిక జీవనాధారమేదీ? అమ్మా, తనూ పూర్తిగా వీధినిబడి పోవాల్సిందే కదా! దొరగారిని సాయం అడిగి లేనిపోని సమస్య తెచ్చిపెట్టిందే అమ్మ!

★ ★ ★

ఆ రాత్రి వంటతడు పాలగ్లాసు రత్న చేతికందించి "దొరగారి కిచ్చిరా!" అని చెప్పాడు.

"ఈ రాత్రివేళ దొరగారి గదిలోకి వెళ్ళనా? నువ్వే లీసికెళ్ళి ఇవ్వు!" అంది రత్న.

"రత్నచేత పాలు పంపించు అన్నారు దొరగారు! మరి నీ యిష్టం!"

ఎన్నాళ్ళీ ప్రాణసంకటం? అదేదో ఈ రాత్రే తెగిపోనీ అనుకొని, మొండి ధైర్యంతో పాలగ్లాసు పుచ్చుకొని మేడమీద కెళ్ళింది రత్న.

గుమ్మం దగ్గర శోభనపు పెళ్ళికూతురిలా నిలబడిన రత్నను, చిలిపిగా అడిగారు దొరగారు "అక్కడే నిలబడితే నాకు పాలెలా వస్తాయి?"

రత్న రెండడుగులు లోపలికి వేసింది "తండ్రిలాంటివారని.. నన్ను మీ కప్పగించింది మా అమ్మ. కంచే చేనుని మేసినట్టుగా..." రత్న కంఠం దుఃఖంతో వణికింది.

"కంచె చేనుని మేసినట్టుగా...తోడేళ్ళ బారినుంచి తప్పించుకోడానికి వచ్చి పులివాత పడ్డట్టుగా...అనిపిస్తూందా?" దొరగారు కులాసాగా నవ్వారు. "నా జీవితంలో నా భార్యను తప్ప ఇంకే ఆడదాన్ని ముట్టలేదు తెలుసా?"

"నాకెలా తెలుసు?"

"ఊళ్ళో చెప్పుకోగా వినలేదా?"

".... ..."

"ఇప్పుడు... ఈ వయసులో... నీ మీద మనసు కలిగిందంటే - నువ్వెంత అందమైన దానివో ఊహించు! ఈ అందం నా సొత్తు కావాలి! ఇంకెవరి సొత్తూ కాకూడ దనిపించింది. నా సొత్తును నేనెంత అపురూపంగానైనా చూచుకొంటాను! అందలం ఎక్కిస్తాను! ఈ ఊళ్ళో కన్నెత్తి చూసే మగవాడుంటాడా ఇక? నువ్వు నా దానివి అయితే.. ఏలోటూ వుండదు! ఆలోచించుకో, నా దానివి అవుతావో, ఈ ఊరి తోడేళ్ళ వాత బడతావో! నీ ఇష్టంలేకుండా నిన్ను తాకే మొరటుమనిషిని కాదు!"

"దొరగారూ!" ఆ క్షణంలో రత్న మనసులో చెలరేగిన అలజడంతా స్వరంలో ప్రతిధ్వనించింది. "మీరు నాకు అండగా నిలబడితే, నేను మీ మనిషినని ప్రపంచానికి చెప్పుకోగలిగితే నన్ను మీకు అర్పించుకొంటాను! నాకు కావలసింది ఇప్పుడు ఒక బలమైన రక్షణ!"

"నా మనిషివి అయినాక నిన్ను అన్యాయం చేస్తానా?" దొరగారు లేచి వచ్చి మోహవివశంగా రత్నని చేతుల్లోకి తీసుకొన్నారు!

★ ★ ★

వారంరోజుల తరువాత దొరగారు పట్నం బయలుదేరుతూ, 'వారం పదిరోజుల్లో తిరిగివస్తాను. తరువాత కార్యక్రమం నిర్ణయిస్తాను.. మన మధ్య సంగతి ఇప్పుడే బయట పెట్టొద్దు! గౌరవ కుటుంబానికి చెందిన వాడిని! భార్యా పిల్లలున్నవాడిని! చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన విషయమిది!" అన్నారు రత్న చుబుకం పట్టి పైకెత్తుతూ.

"నన్ను అన్యాయం చేయరు కదా?" రత్న కళ్ళల్లో నీళ్ళు చిందాయి.

"ఛ ఛ, ఎంత మాటన్నావు!"

దొరగారు పదిరోజుల తరువాత మళ్ళీ వచ్చారు. వారంరోజులు గడిపారు.

రత్న ఆ బంగళాలో తిరగడం ఎవరికీ ఏం అనుమానం కలుగలేదు! ఎందుకంటే, ఆమె తల్లి ఆ బంగళాలో పనిపాటలు చేసే దాసి ! తల్లికి సాయంగా కూతురువచ్చి చేస్తూంది అనుకొన్నారు.

ఇలాగే ఓ ఆరు నెలలు గడిచాయి.

"పట్నం తీసికెళ్ళడానికి పరిస్థితుల్ని సానుకూలం చేస్తున్నాను!" అంటూ చెబుతున్నారు దొరగారు. తన భార్యకి హఠాత్తుగా సుస్తీ చేసిందని, డాక్టర్లు హార్ట్‌స్ట్రోక్ అన్నారని, ఇలాంటి సమయంలో అలజడి కలిగించే ఎలాంటివార్తా ఆవిడ చెవిలో పడకూడదని చెప్పారని ఇలాగే ఏదో ఒకటి చెప్పుకొస్తూండగా రత్నకి నెల తప్పింది!

ఈ వార్త ఒక విధంగా దొరగారికి పిడుగుపాటే అయింది. ఆయన కళ్ళని ఆవరించిన మోహపు తెరలు విడిపోయినట్టుగా అయ్యాయి! ఈ సంగతి తన కుటుంబం దాకా, మిత్రులు, పరిచితులదాకా వెడితే ఏమైనా ఉందా? తను వాళ్ళ ముందు ముఖమెత్తుకు తిరగగలచా? తన ఇన్నేళ్ళ జీవితంలో తెచ్చుకొన్న మంచి పేరంతా ఉఫ్‌న గాలిలో కలిసిపోదూ?

ఆయన తన గురించీ, తన పరువు ప్రతిష్టల గురించీ, ఆలోచించుకొన్నారే గాని, రత్న గురించి కాస్త కూడా ఆలోచించలేదు. సామాన్యంగా డబ్బుండేవాళ్ళకి ఆ సమయంలో వచ్చే ఆలోచనే ఆయనకీ వచ్చింది. ఓ అయిదువేల రూపాయలున్న నోట్ల కట్ట రత్న ముందుపెట్టి, "దీనితో మన సంబంధానికి గుర్తుని తుడిచి వెయ్యి!" అని, ముఖం మరో ప్రక్కకు త్రిప్పుకొని నిలబడ్డారు.

రత్న హృదయం తుఫాను వచ్చిన కడలిలా అయింది. "దొరగారూ!' అని పిలిచింది వణికిపోతూ "నన్ను మీ మనిషినని చెప్పుకొంటే చాలు! నాకు తాళి అక్కరలేదు! డబ్బు అసలే అక్కరలేదు!"

"అది చెప్పుకొంటే ఇహ అన్నీ వచ్చేసినట్టు కదా నీకు!"

డబ్బుతో ఈ లంపటం వదిలేట్టుగా కనిపించలేదు దొరగారికి! ఈ సంబంధం సంగతి దేవకి దాకా వెళ్ళి ఆవిడ గొడవ పెట్టే సూచన కనిపించగానే కారెక్కాడు. గుమస్తా రంగరాజుని పిలిచి, నోట్ల కట్ట చేతిలో పెట్టి చెప్పారు. "తల్లీ కూతుళ్ళ నోరు ఎలా మూయిస్తావో నీ ఇష్టం! నా పేరు ఎంతమాత్రం బయటికి రాకూడదు!"

★ ★ ★

రంగరాజు దేవకి ఇంటికి వచ్చాడు.

"మర్యాదగానే నోరుమూస్తే సరేసరి. లేకపోతే మీ తల్లీకూతుళ్ళ నోరు ఎలా మూయించాలో నాకు తెలుసు!" అన్నాడు. రంగరాజు ఆకారం, ప్రవర్తనా రౌడీలకు రౌడీలా వుంటాడు. అతడిని చూస్తే ఊరంతా హడల్.

దేవకి మాత్రం అగ్నిపర్వతం బ్రద్దలైనట్టుగా అరిచింది. "గొప్పవాళ్ళు ఏంచేసినా చెల్లుతుందను కొన్నారేమో! దొరగారి బ్రతుకును బజారు కీడుస్తాను నా కూతురికి జరిగిన అన్యాయం నలుగురికీ తెలిసేట్టు చెబుతాను. దప్పు వాయించి మరీ చెబుతాను."

"నీ కూతురు ఎవరిచేతో చేయించుకొన్న కడుపుని దొరగారికి అంటగడతావా? వారేనాడైనా పరాయి ఆడదాన్ని కన్నెత్తి చూశారా! నువ్వు వేసే నిందలకి జడిసి దొరగారు నీ కూతురు మెడలో పుస్తె కట్టేస్తారని ప్లాన్ వేశావు ముసలినక్కా! అరిస్తే బజారున పడేది మీ బ్రతుకులే! దొరగారు మచ్చలేని మహారాజు!"

"ఆ మచ్చలేని మహారాజే నాకొంప ముంచాడయ్యో! దొరగారు గొప్ప మనసుతో నా బిడ్డకు ఆశ్రయమిస్తాడని ఆయన చేతిలో పెడితే దాని జీవితం నాశనం చేశాడయ్యో!" శోకాలు పెట్టింది దేవకి.

రంగరాజు శక్తివంచన లేకుండా చేయాల్సిన ప్రచారం చేయసాగాడు కూతురు చెడి ఎవరితోనో కడుపు తెచ్చుకొంటే అది చాలా తెలివిగా దొరగారికి అంటగట్టి డబ్బు గుంజాలనో, చిన దొరసానిని చేయాలనో చూసిందని, ఆ ప్లాన్‌తోనే రత్నను దొరగారు వచ్చినప్పుడు పనివంకతో బంగళాకు పంపించేదనీ..

ఊరివాళ్ళు ఎటూ తేల్చుకోలేనట్టున్నారు! ఎవరి మాట నమ్మాలో తెలియడంలేదు! దొరగారు మచ్చలేని మహారాజే! రత్న కూడా చిన్న బుద్ధి పిల్లకాదు! పరాయి మగాడికేసి కన్నెత్తి చూసేదికాదు ఆ పిల్ల రూపం, ఆ పిల్ల బుద్ధిచూసి ఒక మామూలు దాసి ఇంట్లో పుట్టాల్సింది కాదు అనుకొంటారు.

మరి ఇంత ఘోరం ఎలా జరిగింది?

ఊరంతా ఇదే చర్చ! ఎవరిద్దరు కలిసినా ఇదే గుసగుస!

★ ★ ★

రాత్రి పదిగంటలవుతూంది.

జయదేవ్ అంతవరకు చదువుకొంటున్నవాడు, దీపం ఆర్పేసి పడుకోబోతున్నాడు. తలుపులు మూస్తుంటే ఎవరో కుర్రవాడు పరిగెత్తుకు వచ్చాడు.

"దేవకి మిమ్మల్ని ఓసారి అర్జంటుగా రమ్మందండీ! వాళ్ళేదో ఆపదలో వున్నారట! అర్జంటుగా జయదేవ్ పంతులుగారిని తీసుకు రారా అని నన్ను పంపింది!" పరిగెత్తుకు వచ్చినట్టుగా వగరుస్తున్నాడు.

జయదేవ్ ఆందోళనగా, "ఆపదా? ఏమైందిరా?" అనడిగాడు.

"ఏమోనండి. నాకు తెలియదు!" వాడు వచ్చినంత స్పీడ్‌గా పరిగెత్తాడు.

జయదేవ్‌కి ఒక్క నిమిషం ఎటూ పాలుపోలేదు. ఎన్నడూ దేవకి ఇంటికి వెళ్ళలేదు! పైగా రత్న సంగతి ఊరంతా పొగలా వ్యాపించింది. ఇంత రాత్రివేళ ఆడవాళ్ళుండే ఇంటికి వెళ్ళడం ఎంతవరకు సమంజసం? ఉదయం వెళ్ళి ఏ సంగతీ తెలుసుకొంటే సరిపోదూ?

నిజంగా ఆపదలో ఉన్నారేమో! తీరికగా ఉదయం వెడితే జరగాల్సిన అనర్థం జరిగిపోతే?

మొన్న శివాలయంలో కనిపించి, తన గోడంతా చెప్పుకొని, 'నాకు చావొక్కటే మార్గం కనిపిస్తూంది పంతులుగారూ! అంటూ విలపించింది రత్న.

పాపం! ఇద్దరూ ఆడవాళ్ళు! ఏం ఆపదలో చిక్కుకున్నారో?

మగవాడు తను! ఏ రాత్రి ఎక్కడికి వెడితే తనకొచ్చే నష్టం ఏమిటి?

టార్చీ తీసుకొని తలుపుకు తాళం పెట్టి బయల్దేరాడు జయదేవ్.

ఊరంతా అప్పుడే నిద్రలోకి వరిగిపోతూంది! దారి పొడువునా ఇళ్ళ తలుపులన్నీ మూసి వున్నాయి. దేవకి మాత్రం ఇంటిముందు అరుగుమీద కూర్చొని వుంది.

జయదేవ్ అంతదూరంలో ఉండగానే గుర్తుపట్టి, "కొంచెం ఇలా రండి, పంతులూ! దానికి కొంచెం బుద్ధిచెప్పి పొండి, కంట్లో వత్తులు వేసుకొని కాపలా కూర్చొన్నాను!" అని పిలిచింది.

"ఏం జరిగింది" అంటూ దేవకితో లోపలికి అడుగుపెట్టాడు జయదేవ్.

"నూతిలో పడతానంటూ తయారైంది. సాయంత్రం నుండి కాపలా ఉన్నాను!"

"ఎందుకని?"

"మీకు తెలియకుండా ఉంటుందనుకోను? దొరగారు నా బిడ్డ జీవితంతో ఆడుకొన్నారు బాబూ! ఇప్పుడు తనకేం సంబంధం లేదని వెళ్ళిపోయాడు! అది ఇప్పుడు వట్టి మనిషి కూడా కాదు. ఈ అవమానం భరించేకంటే ఈ లోకం నుండి తప్పుకోవడం హాయి అంటుంది. ఈరోజు ప్రొద్దుటినుండి అదే ప్రయత్నంలో ఉంది! అదిపోయాక నాకీ ప్రపంచంలో ఏముంది బాబూ?" అని ఏడవసాగింది దేవకి.

"చచ్చి సాధించేదేమిటట?"

"అదే మాట ఆ మూర్ఖురాలికి కొంచెం చెప్పిపొండి!"

"ఎక్కడుంది రత్న?"

"ఆ గదిలో ఉంది. పిలుస్తానుండండి!"

అంతలో తలవాకిలి ఎవరో మూసేసారు అవతలినుండి.

"ఎవర్రా, బయటినుండి తలుపులు మూసేది? " దేవకి బిగ్గరగా అరిచింది.

జయదేవ్‌కి అంతా అయోమయం అయిపోయింది.

"రండి! ఊరంతా లేచిరండి! ఈ తల్లికూతుళ్ళ నాటకాలు ప్రత్యక్షంగా చూద్దురు రండి. దీని బిడ్డకు కడుపు దొరగారు చేశారో, ఎవరు చేశారో ఇప్పుడు చూస్తే మీకే తెలుస్తుంది!" తన పెద్దగొంతుకతో అరిచి జనాన్ని ప్రోగు చేయసాగాడు రంగరాజు. చుట్టుప్రక్కల ఇళ్ళ తలుపులన్నీ తెరుచుకొన్నాయి.

నిశ్చేష్టుడైపోయాడు జయదేవ్. "నా దగ్గరికి పిల్లవాడిని పంపించింది నువ్వేనా?" దేవకిని అడిగాడు.

"పిల్లవాడినా! నే నెప్పుడు పంపించాను బాబుగారూ! మీరే వస్తే దేవుడు పంపించినట్టుగా వచ్చారని సంతోషపడ్డాను! ఇంట్లోకి పిలిచాను!"

జరిగిన మోసం తెలిసిపోయింది జయదేవ్‌కి. తెలిసేసరికి జరగాల్సిన అనర్థం జరిగిపోయింది.

జనం బాగా పోగయ్యాక తలుపులు తెరిచాడు రంగరాజు.

ఇంత అవమానం భరించలేనట్టుగా రత్న గదిలోకి పరిగెత్తి భళ్ళున తలుపులు మూసుకొంది.

"లోపల ఏం అఘాయిత్యం తలపెడుతుందో ఔ నా కూతురు!" శోకాలు పెట్టసాగింది దేవకి.

"రత్నా! తలుపు తియ్! ఈ అపవాదు ఏదో నేను తేల్చేస్తాను. అనవసరంగా నువ్వేం అఘాయిత్యం చేయబోకు!"

జయదేవ్ ఎంత పిలిచినా తలుపు తీయలేదు రత్న.

దేవకి కూడా ఎంతో బ్రతిమాలి పిలిచింది.

ఇదంతా ఏదో నాటకాన్ని చూస్తున్నట్టుగా వినోదంగా చూస్తున్నారు జనం.

జయదేవ్ ఇహ లాభం లేదని తలుపు బ్రద్దలుకొట్టడం ప్రారంభించాడు.

రత్న లోపల నిజంగానే ఆత్మహత్యా ప్రయత్నంలో ఉంది!

చీర ఉయ్యాల కొక్కాలకు వేసే సరికి ఆమెకు ముఖమంతా చెమటలు పోశాయి. ఉయ్యాల కాళ్ళకు చీరగట్టి ముడివేసి తన మెడకు ఉరి తయారుచేసుకొంది. ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా ఉరి మెడకు తగిలించుకొని, చప్పున కాళ్ళకింది ఆధారాన్ని తన్నేసింది.

కాని, ఆమె అనుక్నొట్టుగా ఉరికి వ్రేలాడిపోలేదు. గొంతు బిగుసుకుపోలేదు.

ఆమె నడుం జయదేవ్ చేతుల్లో వాలి ఉంది.

ఎవరో గబగబా స్టూలు ఎక్కి రత్న మెడకున్న చీరముడిని విప్పేశారు.

"నన్నెందుకు బ్రతికిస్తారు? నన్ను చచ్చిపోనివ్వండి. బ్రతికివుండి నేనీ నరకం పడలేను!" జయదేవ్ చేతుల్లో రత్న పెనుగులాడసాగింది.

"బొందెపోయినా నింద పోదుకదా! చచ్చి సాధించేదేమిటి?"

"ఈ నిందతో ఈ బొందెను భరించడం సాధ్యంకాదు, పంతులుగారూ?"

"నువ్వు వెళ్ళిపోతావు! మరి నా సంగతి? ఈ నింద నాకు శాశ్వతమౌతుంది కదా?"

రత్న నిస్సహాయంగా చూసింది! "మీ మీదపడ్డ నిందను తొలగించడానికి నేనేం చేయగలను?"

"నిందను నిజం చేసేద్దాం! సరేనా?" ఇంతవరకు సీరియస్‌గా వున్న జయదేవ్ ముఖంలో నవ్వు ఉదయించింది. బయటికి వచ్చి నిలబడి అందరికీ చేతులు జోడించాడు. "ఇంత రాత్రి వేళ చాలా శ్రమపడి వచ్చారు. ఇక వెళ్ళండి. అయితే వెళ్ళేముందు ఒక శుభవార్త వినిపోండి! రత్నను నేను త్వరలోనే వివాహం చేసుకోబోతున్నాను!"

తెల్లబోవడం రంగరాజు వంతు అయింది! చూడవచ్చిన ప్రజలకు అయోమయం అయింది!

"రత్న భర్తను పోగొట్టుకున్న అభాగిని! ఈ ఊళ్ళో చాలామంది మగవాళ్ళు ఆమెను పొందాలని చూసినవాళ్ళే. తన బ్రతుకు కుక్కలు చింపిన విస్తరి అవుతుందేమోనని భయపడి ఆమె దొరగారిని ఆశ్రయించింది. అర్పించుకొంది. కాని, దగా చేశారు ఆయన! దొరగారు దొంగలా పారిపోయారు?

"మనముందే అన్యాయమైన అభాగిని రత్న. ఆమెకు న్యాయం జరగవద్దా? దొరగారిని తీసుకువచ్చి తప్పు ఒప్పించడం వల్ల జరుగదు న్యాయం! ఏ అండ కోరుకొని ఆమె దగాపడిందో, ఆ అండ ఆమెకివ్వడం వల్లే ఆమెకు న్యాయం జరుగుతుంది. ఆ అండ నేనివ్వాలనుకుంటున్నాను! ఆమెను వివాహం చేసుకోవాలను కొంటున్నాను కేవలం మానవతా దృక్పథంతో తీసుకొన్న నిర్ణయమిది!"

"ఎవరో ఒడిగట్టిన పాపాన్ని మీరెందుకు మోస్తారు, బాబూ?" ఎవరో అన్నారు.

"భగవంతుడి సృష్టి! అప్పుడే దానికి పాపం పుణ్యం అంటడం ఏమిటి? పాప పుణ్యాలకు, రాగద్వేషాలకు అతీతమైన మనసుతో తీసుకొన్న నిర్ణయమిది? ఇదే మనసుతో ఆమెతో జీవితం పంచుకోగలను?" మృదు గంభీరమైన స్వరంతో ముగించి లోపలికి వచ్చాడు జయదేవ్?

● దీపావళి సంచిక - యువ 1985 ●

# 49. వీకర్ సెక్షన్లు

♦ సదానంద్ శారద ♦

ఈరడి చేతిలో గొడుగు వుంది.

ఆ గొడుగు కింద ఈరడి తల లేదు.

చిన్నయ్య దొర తలవుంది...

బావి గట్టుమీద నిల్చొని పొలాలు చూసుకుంటున్నాడు చిన్నయ్య దొర.

ఆ బావిలో నీళ్ళున్నాయి -

చిన్నయ్య దొర పొలాలు పచ్చగా నవ్వుతున్నాయి.

"దొరా... నాకొక్కటి సమజ్ గాలె...జెర తవరె సెప్పాలె.." అని అడిగాడు ఈరడు.

"ఏందిరా అది?"

"ఈకర్ సెచ్చన్లు అంటె ఏంది దొరా? మాటకు ముందు నాయకులంత గా మాటె అనబట్టిరి...అంటురోగం లెక్క అది నాయకులందరి నాల్కలకు అంటు కుంటాడె.. జెర ఎందో సెప్పకపోతిరి..."

"అందరెందుకు అంటర్రా.. ఆ పదం మాది.. మా సొంతం... మా ఇలాఖా.."

"అవుమల్ల... నేను గట్లనే అనుకున్న... ఊర్లె సగం గొడ్డు గోదా మా దొరగోరిది. గట్టనే గిదేందో కాని మా దొరగోరిదే అనుకున్న.. ఈకర్ సెచ్చన్లు అంటె ఏంటియి దొరా కందులా? బాగ పిరమయినై గదా...

"కందులెందుకైతయిరా గాడ్డి కొడుకా...ఈకర్ సెక్షన్లంటే తెల్వదా ఈకర్ సెక్షన్లు?"

"గొర్రెలా బాంచెను..."

"ఉహు..."

"ఆ..నాకెర్కె.. నాకెర్కె సమజ్ అయింది..." ఈకర్ సెచ్చన్లంటె కోళ్ళు...

"నీ అక్క నోర్ముయ్.. ఈకర్ సెక్షన్లంటే కోళ్ళా! ఎవలన్న వింటె నవ్వుతరు.."

"తెల్వక అడుగుతాన జెర సెప్పరాదుండ్లి....."

"ఈకర్ సెక్షన్లంటె.. బలీన వర్గాల్రా."

"అంటే ఏంది దొరా?"

"బలీనవర్గాలంటె తెల్వదార? బలీనవర్గాలు-"

"ఉహు....తెల్వది దొరా గులాపోన్ని కోప్పడకుండ్లి-"

"బలీన వర్గాలంటే బలం లేనోళ్ళురా.."

"అంటె ఆళ్లు మడుసులేనా దొరా!"

"మనుస్సులేరా... ఓట్లేసే మన్సులు..."

"దొరా నీ బాంచెను కాల్మొక్త...నాగ్గిప్పుడు సమజ్‌ల బట్టింది.. ఈకర్ సెచ్చన్లంటె మడుసులేనా!.. ఆళ్ళు మనూళ్ళె వున్నరా దొరా?"

"ఎందుకులేర్రా... అట్ల దూరంగా గట్టు మీద పోయెటోడు ఎవడు?"

అటువేపు చూశాడు ఈరడు - గడ్డిమోపు మోసుకపోతున్న ఓదెలు కనిపించాడు.

"ఓదెలుగాడు బాంచెను."

"వాడు ఈకర్ సెక్షనే.."

"గదా తిర్కాసు...వంగి దండం పెట్టెటోడా ఈకర్ సెచ్చనంటె... అట్లనా... గట్లయితే నేను గూడ ఈకర్ సెచ్చనే గదా దొరా..."

"ఆ ...నువ్వు కూడ.."

"దొరా... నేను ఈకర్ సెచ్చనయితే అయిత గావచ్చుగాని ...గా ఓదెలు గాడు ఈకర్ సెచ్చను ఎట్లయితడు?"

ఎందుక్కాడురా...వాడు ఈకర్ సెక్షన్ గాడ్డి కొడుకేనాయె..."

"ఈకర్ సెచ్చన్లంటే బలీనులంటిరి... ఆడు సూసిండ్లా ఎట్ల బలంగ వున్నడో ఎద్దు లెక్క."

"బలమంటె గా బలం గాదురా..."

"మరేంది బాంచెను?..."

"నీకు తెల్వది కాని నోర్ముయిరా..."

"తవరి కాడ గిన్నియేండ్ల బట్టి నౌకరి సేత్తాన.. తవరు గింత సెప్తె నాకు గంపంత తెల్వాలె.. ఆడ్ని బలీనుడని ఎందుకనాల్నో నాకు సమజయింది దొరా.. "

"ఏందిరా నీకు సమజయింది ..."

"ఆడికెంత బలం వుంటె ఏంది...పది మంది బలీనుడివిరా అంటె ఆడు బలీనుడినె అనుకుంటడు.... ఎవల జోలికి పోడు.. వంగి దండం పెడ్తడు.....ఆడు ఎద్దు లెక్కుంటె ఏంది ఏనుగు లెక్కుంటె ఏంది...కుక్కిన పేనైపోతడు. ముసల్ది.. ఇద్దరు మన్వలు అని మా తాత కత సెప్పెటోడు దొరా.. ఆ మన్వలు రాజు ఏనుగుల్ని తోక బట్టి ఆడించిండ్లట.... గంత బలం వుండేదట ఆ పోరగాళ్ళకు.. అది చూసే ముసల్ది ఆళ్ళ బలం ఎట్ల వొంచాల్నని ఇశారించి రోజూ బువ్వపెట్టి బిడ్డలారా... మనం కట్టంల వున్నం రా... మనం ఆధారం లేని పచ్చులంరా.. ఇయ్యాల గీకూడు దొరికింది... రేపు దొరుకుద్దో లేదో...ఏం చేద్దును బిడ్డల్లారా... అని ఏడ్సేదంట...

గట్ల... ఆ పోరగాళ్ళ దైర్నం డీల అయిందట.. గప్పట్నించి గల్లిల రాజుగోరి ఏనుగు కనబడ్తె గజగజ వొనుక్కుంట దూరంగ నిలబడె వోళ్ళంట. గందుకె గీ ఓదెలు గానసంటోల్లను ఈకర్ సెచ్చన్ అనాలె... డీల అయిపోతరు.. "

ఈరడి మాటలు చిన్నయ్య దొరకు రుచించలేదు. కోపంతో ఏదో అన బోయేంతలో ఎల్. రావు అక్కడికొచ్చాడు. అతడు ఆ ప్రాంతంలోని ఏకైక కవి.

"దొరవారికి దండాలు..." అంటూ చేతులు జోడించాడు కవి

"ఓహ్‌హో ఎల్లారావా! బాగున్నావా?" అని అడిగాడు చిన్నయ్య దొర

"బాగానే వున్నాడు కవి. నాపేరు ఎల్లారావు కాదు ఎల్ రావని మనవి..."

"ఏదో రావు లేవయ్యా... ఏదన్నా కవిత్తం చెప్పు వినక చానరోజులయింది".

తనను పొగిడే కవిత్వమేదో కావాలనన్నట్టు మొహం పెట్టాడు చిన్నయ్య దొర.

"దొరగారు ఈకర్ సెచ్చన్ల నాయకులు గదా. గాదాని మీద సెప్పరాదుండ్లి.." అన్నాడు ఈరడు.

కవి ఆలోచించాడు. మినీ కవిత ఒకటి వినిపించాడు..

కొమ్మ మీద కాకి వుంది..

నీళ్ళ మీద పడవ వుంది..

వీకర్ సెక్షన్ల మీద దొరకు ప్రేమ వుంది..!

అదేవిటో అర్థంగాకున్నా తనను కవి పొగడుతున్నాడనుకొని మెచ్చుకోలుగా నవ్వేశాడు చిన్నయ్య దొర.

★ ★ ★

అది చిన్నయ్య దొర దేవిడి.

కుర్చీలో విలాసంగా కూర్చున్నాడు చిన్నయ్య.

ఈరడు అగ్గిపుల్ల వెలిగిస్తే సిగరెట్ ముట్టించుకున్నాడు. హాయిగా ఒక దమ్ము లాగాడు.

"దొరా.." మెల్లిగా అన్నాడు ఈరడు.

"ఊ.."

"ఊల్లె అనుకుంటాండ్లు దొరా..."

"ఏమన్రా.."

"తవరు చెంబు పార్టీ నుంచి తపేలా పార్టిల చేరిండ్లట కదా...."

"ఊ..."

"ధొర నాదో సిన్న అనుమానం.. చెంబుపార్టీల తవర్ని పెజాసేవ చేయనిత్తలేరా?.."

"నీ కెందుకుర లంబ్డి కొడుకా గియన్ని... అసలు చెంబు పార్టీ ఒక పార్టేనా.. తొత్తునా కొడుకులంత జేరి పార్టిని నాశనం చేసిరి.. తపేలా పార్టే ఇప్పుడు ఈకర్ సెక్షన్ల పార్టీ..."

"గట్టనా.. మొన్నటిదాంక తపేలా పార్టీ ఒట్టిది... మట్టిది అంటిరి..."

"అప్పుడు ఒట్టిదేరా .. ఇప్పుడు గట్టిదయింది. ఎలక్షన్లల్ల గెలుస్తది.. ఈకర్ సెక్షన్లను బాగచేస్తది

అంతలో సుందరం వచ్చాడు. అతడా ఊరి స్కూల్లో టీచర్..

"నమస్కారం సార్.." చిన్నయ్య దొరకు చేతులు జోడించాడు సుందరం.

చిన్నయ్య దొర తలెత్తి చూసి "నువ్వా పంతులు దాదా...అరేయ్ ఈరిగా పంతులుకు కుర్సి తీసుకు రారా .." అన్నాడు.

ఈరడు కుర్చీ తెచ్చివేశాడు.

సుందరం కూర్చున్నాడు.

"ఆ. ఏం పంతులు ఏమో మా ఇల్లు పావనం చేస్తిరి..." అని అడిగాడు చిన్నయ్య దొర.

"మీరు పెద్దలు.. అట్లనకండి దొరగారూ.. మీ దర్శనం లేక చాలా రోజులయింది.."

"దొరగోరికి తీర్కె లేదండి .. ఈకర్ సెచ్చన్న పార్టి కోసురం ఎతుకుతున్నరుండి.."

"గా సమస్యలు ఎప్పుడూ ఉన్నయే పంతులు. జెర పైకొచ్చి ఈకర్ సెక్షన్లను బాగ చేద్దామనుకుంటె దొంగనా కొడుకులు అణగదొక్కాల్నని చూస్తరు - గా రాజకీయాలన్ని మీకెందుగ్గాని మీరు శేమంగ వున్నరు గదా...పోరగాళ్ళు సరింగ బడికి వొత్తాండ్లా? రాత్రి పూటకూడ బడి నడ్పబడ్తివి.. ఎందుకు పంతులు గింత కష్టపడ్తవు!.. రోజు రోజుకు మీరు అమాయకులై పోతున్నరు..."

"పిల్లలకే కాదు... పెద్దలకూ చదువు అవసరం కదా సార్... గ్రామాలలోని నిరక్షరాస్యత నిర్మూలింప బడేదాక మనకు సామాజిక, ఆర్థిక ప్రగతి లేదండి... అదిగాక గ్రామ ప్రజలకు చదువు రాకపోతే తమరు చేస్తున్న మంచి పనులు వాళ్ళకెలా అర్థమవు తాయండీ? మొన్న మీరు పంచాయితీ సమితి ప్రెసిడెంట్‌ల మీటింగ్‌లో వీకర్ సెక్షన్లను బాగుచేయడం కోసం రక్తమైనా ధారపోస్తానని ఎంతో ఆవేశంగా మాట్లాడారు...ఆ వార్త పెద్దపెద్ద అక్షరాలతో పేపర్లలో వచ్చింది. జనానికి చదువు వస్తేనే కదండి అవన్నీ చదువుకునేది..."

"అయ్యగోరు ఖర్సుకు ఎనుకాడలేదుండి.. ఎంత డబ్బు కావాల్నంటె గంత ఇచ్చి ఎయించిండ్లు. ."

"అరేయ్ ఈరిగా నువ్వు నోర్ముసుకో..."

అన్నాడు కోపంగా చిన్నయ్య.

"అలా నాలుగు గ్రామాల జనం తమ ఉపన్యాసాలు చదివినప్పుడే కదా తమ మంచితనం వారికి తెలిసేది.. తమరే వారి నాయకులని గుర్తించేది..."

"నిజమే పంతులు.. ...బడితోని గిన్ని మంచి పనులున్నయని తెలిసే అనాడు మా ఫాదరు వొద్దన్నా మా ఊళ్ళె బడి పెట్టించిన...."

"అలాగే మీ చేతుల మీదుగా మరో మంచిపని చేయించాలని వచ్చాను. "

"ఏం పని? ఏమన్న పైసలు ఖర్సయ్యేది కాదుకదా!" కంగారుగా అడిగాడు చిన్నయ్య.....

"కాదు సార్...."

"అయితే చెప్పు..."

"రాత్రిపూట బడికి వచ్చేవాళ్ళంతా చందాలిచ్చి ఒక చిన్న లైబ్రరీకి సరిపోయే పుస్తకాలు తెప్పించుకున్నారు .....ఆ లైబ్రరీకి తమరు ప్రారంభోత్సవం చేయాలి...."

"అవల్ రైటుగా ...జనం బాగా వొస్తున్నరు గదా....

"వస్తారు సార్...."

"సరే పంతులు ....ప్రారంభోత్సవం లాంటి మంచిపనులు చేయాల్నంటె మాకు ఈ సిగరెట్ కంటె ఇష్టం.... పోదాం పాండి...." అంటూ లేచాడు చిన్నయ్య.....

"ఇప్పుడు కాదండీ...."

"దొరగోరికి పెజాసేవ చేయాల్నని మా చెడ్డ ఏగిరంగ వున్నదుండి...." ఎంతో ఆనందంగా చెప్పాడు ఈరడు.....

"ప్రారంభోత్సవం రేపు సాయంకాలం ఆరు గంటలకుంది. ముందుగా మీ అనుమతి తీసుకుందామని వచ్చానండీ...." అన్నాడు సుందరం

"రేపు సాయింత్రికా! రేపు సాయింత్రికి మాదిగోల్ల వాడల రాయి పాతుతం గాదు.." అన్నాడు చిన్నయ్య.

"అవునట సార్....గుడి కట్టిస్తున్నారట కదా..."

"అటెంక అంటె ఎలెచ్చన్లు అయినంక బాంచెను. ." ఈరడి నోరు వూర్కోదు..... ఎంత వద్దనుకున్నా ఏదో అనేస్తుంటాడు. దొరగారి చేత తిట్లు తింటుంటాడు. కాని ప్రస్తుతం దొరగారు ఎలక్షన్ల గూర్చి ఆలోచిస్తున్నారు కనక ఈరడి మాటల్ని పట్టించుకోలేదు. తానింకా ఏం చేయబోతున్నాడో సుందరంకు చెప్పారు.

"పన్లేపని రెండు కార్మానలకు....ఈకర్ సెక్షన్లకోసం ఇండ్ల కాల్నీకీ రాళ్ళు పాతుదాం అనుకుంటాన.....రాళ్ళు శాన్నే తెప్పించి పెట్టిన..."

"బండెడు బాంచెను...గిట్లసోంటి ఖర్చులేని పన్లు దబ దబ గావెలె....ఎలెచ్చన్లు దగ్గిర బడినయి గదా...దోరగోరు ఎమ్మెల్లేగా నిలబడ్తాండ్లు..."చిన్నయ్య దొర వంక చూస్తూ అన్నాడు ఈరడు....

"అవును సార్....తమరు వచ్చే ఎలక్షన్లలో ఎం.ఎల్.ఎ.గా పోటీ చేయబోతున్నారని ఉర్లో అనుకుంటున్నారు..."

"నిజమే పంతులు....ఈకర్ సెక్షన్లను చూస్తాంటే నా గుండె చెరువైతోంది.... కంటికి నిద్ర పట్టది....తింటె కూడు సయించది...ఆళ్ళను బాగచేయాల్నని ఒకటే ఇది.....తవరు ఎమ్మెల్లే అయి మంతిరైతెగాని ఆళ్లు బాగ్గారు. .వచ్చే ఎలక్షన్ల పోటీ చేయిండ్లి అని నా సపోర్టర్లంతా ఒకటే పోరుతున్నరు. ఆళ్ళ పోరు పడలేకనే నిలబడ్తాన.. మరి మీరంతా నన్ను గెలిపించి ఈకర్ సెక్షన్లకు సేవజేసే అదురుట్టం కలిగించాలి..." అంటూ చేతులు జోడించి ఎన్నికల నవ్వు నవ్వాడు చిన్నయ్య.

"తమరు గాక ఇంకెవరు గెలుస్తారు సార్.. వీకర్ సెక్షన్లకు తెలియదా తమరు వారి ప్రియతమ నాయకులని.. వారే తమరిని గెలిపించుకుంటారు.." అన్నాడు సుందరం.

"తవరి నోటి వాక్యాన మా దొరగారు గెల్వాలెగాని మిమ్మల్ని పెద్ద పంతుల్ని చేయరూ.." తమరి తరపున నేనే వాగ్దానం చేస్తున్నానన్నట్లు చిన్నయ్య దొర వంక చూశాడు ఈరడు.

చిన్నయ్య నవ్వి... అట్లనే.. అట్లనే పంతులు.. మిమ్మల్ని ఏదన్న పెద్ద బడికి హెడ్‌మాస్టర్ చేయిస్త...." అని హామీ ఇచ్చారు.

సుందరం మామూలుగా...మొహంలో ఏ భావానికి తావు ఇవ్వకుండా, "ఏదో నాకీ ఉద్యోగం చాలు సార్...హెడ్‌మాస్టర్స్ కావాలనే కోరిక నాకు లేదు. ఈ వూరు వొదిలి పట్టణానికి పోవాలనే ఆశలేదు. రేపు సాయంత్రం లైబ్రరీకి ప్రారంభోత్సవం చేశాక మీరు హరిజనవాడలో శంకుస్థాపన పోవచ్చుగా.." అని అడిగాడు.

"అట్లనా..." అని ఆలోచించాడు చిన్నయ్య"సరే... అట్లనే కానియ్యి. పంతులు.. ముందుగాల ప్రారంభోత్సవం చేసినంకనే రాయి పాతడానికి పోత.."

"ధన్యవాదాలు.. ఇక వెళ్ళొస్తానండి.." లేచి నిల్చొని రెండు చేతులు జోడించాడు సుందరం.

★ ★ ★

రోజులు దొర్లిపోతున్నాయి..

పంచాయితీ సమితి ప్రెసిడెంటు చిన్నయ్యదొర రాళ్ళను పాతి శంకుస్థాపనలు చేస్తూనే వున్నాడు.

రాబోయే అసెంబ్లీ ఎలక్షన్లలో అవి తన విజయానికి పునాది అనుకుంటున్నాడు -

ఒక రోజు....

చిన్నయ్య దొర ఒళ్ళు పడుతున్నాడు ఈరడు.

చిన్నయ్య మాత్రం కోపంతో మండిపడుతున్నాడు -

"అరె ఈరిగా.... మన ఊళ్లె జనానికి ఏం పుట్టిందిరా?" ఎరుపు కళ్ళతో భయంకరంగా కనిపిస్తున్న చిన్నయ్యదొర..

"అదె బాంచెను.. తవరి కాళ్ళకు మొక్కుతనే వున్నరు... తవరు ఎదురైతె పక్కకు తప్పుకుంటనే వున్నరు గాదు.."

"అది సరేరా... రాళ్లుపాతె మిటింగులల్ల అడ్డదిడ్డం ప్రశ్న లేస్తరేందిరా!"

"ఎవరేత్తరు బాంచెన్.. ఏసే మల్లన్ని కొట్టించినం గదా...."

"ఏందిరో ఎట్లున్నది ఒళ్ళు... అన్ని మనం కొట్టించినాంరా? ఆ..."

దొర ఉరిమి చూసేసరికి గజగజ వణికిపోయాడు ఈరడు.

"కాద్దొరా...మన్నించుండ్లి...అన్ని ఎవలో కొట్టి కాల్వల పడేసిండ్లు.."

"ఆ.."

సిగరెట్ వెలిగించుకున్నాడు చిన్నయ్య.

"దొరా.."

"ఊ..."

"ఇప్పుడేదన్నా మీటింగ్ వున్నదా.."

"ఔన్రా....చెంబు పార్టీ లీడర్ వస్తాండు.. పెద్ద మీటింగ్ పెట్టాలె....మన బలం చూపించాలె..."

"అదేంది దొరా... నిన్నటి దాంక తపరు తపేల పార్టిల వుంటిరి... తెల్లారేసరికి చెంబుల దూకినారు!"

"ఆ... తపాల పార్టీ ఒక పార్టార? తూర్పు పడమట తెల్వని తొత్తుగాళ్ళంతా చేరిండ్లు ఆ పార్టీల.."

"గసోంటి పార్టీల వుండి తవరు ఈకర్ సెచ్చన్న సేవ ఎట్ల సేత్తరు దొరా.. చెంబుల దూకి మంచిపని చేసిండ్లు.. ఇగ ఈకర్ సెచ్చన్న సేవ బగ్గ సేత్తరా?"

"ఆ..ఆ... మొదాలు మీటింగ్ పెట్టాలె కాదుర.. చెంబు పార్టీ బలమెంతో చూసి నాకు ఎతిరేకంగా పోటీచేసె ఒక్కొక్క బాసుటర్ కొడుకు గుండె పగిలిపోవాలె..."

"మీటింగు పెట్టుండ్లి దొరా.. బొడ్రాయి కాడ శానమంది జనమే పడ్తరు గదా...."

"మన ఊళ్ళెనా!... ఇయ్యాల రేపు మన ఊరి దొంగనాకొడుకులకు బలిసిందిరా... మీటింగ్‌లకు రారు...ఒక ప్రారంభోత్సవానికి రారు...ఈసారి శానా పెద్ద లీడర్ వస్తాండు. మీటింగ్‌కు శానామంది జనం కావాలె.."

"మంది కరువా దొరా మన దేశంల.. మన ఊరోళ్ళు కాకపోతే పక్క ఊరోళ్ళను తెద్దాం.." సలహా యిచ్చాడు ఈరడు.

"అట్లనా!".. చిన్నయ్య మొహం ఒంటరి ఆడపిల్లను చూసిన పోలీసు పటేలు మొహంలా వెలిగిపోయింది.

"మీరు ఊ అనుండ్లి దొరా.. లారీల కొద్ది తెత్త జనాన్ని.. అయితె దానిక్కొంత ఖర్చు అవుద్దుమరి.. మీకో ఖర్సు గాని రాళ్ళు పాతె పనులు గావాల్నాయే..."

"నీ అవ్వ ఖర్చుదేందిరా.. ఇయ్యాల పోతది.. రేపు వొత్తది.. గిటువంటి పనికాడ ఖర్సుకు భయపడ్తార.. మనకు మంది కావాలె.. మన మీటింగ్‌ల కూసోడానికి జాగలేక జనం ఒగరి మీద ఒగరు నిల్సోవాలె. గంతమంది జనం కావాలె.."

"గట్లయితే రొండు లారీలు ఇప్పించుండ్లి... ఊర్లెంబడ పడి మందిని తోలుకొత్త..."

తోలుకొస్తవు సరె గాని... జెరమంచోళ్ళను చూసి తోలుక రావాలె.."

"మంచి మంచోళ్ళంటె ఎట్లాంటోళ్ళను బాంచెను! నోరు లేనోళ్ళను చెవులు న్నోళ్ళను తెత్తెసరి గదా..."

"ఆ..జెర  చేతులున్నోళ్ళను గూడ సూడు.. చప్పట్లు కొట్లాలె..."

"అంగో... చప్పట్లంటె ఎక్కువ ఖర్సయిద్ది.. ఉత్త మీటింగు ఇనడానికి వొత్తె ఒగ రేటు.. చప్పట్లు కొట్టేదానికి ఇంకో రేటు వున్నది దొరా....

"సరే...చప్పట్లు కొట్టే రేటెంబడే తోలుకురా...గుమాస్తనడిగి పైసలు  కొంటబో.." అని చెప్పాడు చిన్నయ్య దొర..

"దొరగారికి ప్రణామాలు.."

తలెత్తి చూశాడు చిన్నయ్య దొర.

చేతులు జోడించి నిల్చున్న కవి ఎల్.రావు కనిపించాడు.

"తమరికో మినీ కవితను అంకితం చేద్దామని  ఈ కవి వచ్చాడు.. మీ ముందు నిలిచాడు.." అన్నాడు కవి.

"అదేందో చదువు కవీ విందాం..." కుతూహలంగా  చూశాడు చిన్నయ్య దొర.

కవి తన మిని కవిత వినిపించాడు.

బెల్లం ముక్క నోట్లో వేసుకుంటె మాట తీపిగా వుంటుందా....

అత్తరు పూసుక దిగితే ఫోటో గుబాళిస్తుందా....

వీకర్ సెక్షన్లు పదం వాడితే పార్టీ గెలుస్తుందా...

తపాలా వీకర్ సెక్షన్ల పార్టీ అనడంలో అనృతం వుందా...

ఆ కవిత విని చిన్నయ్య దొర మొహం కవి

ఆశించిన రీతిలో వెలగలేదు.

"చూడు...కవీ..నేనిప్పుడు తపాల పార్టిల లేను. చెంబుపార్టిల వున్న...నీ కవిత్తం బాగలేదు-"

"దొరా పొరపాటును మన్నించండి...తమరు పార్టీ మారిన మంచి విషయం నాకు తెలియదు...కవితను మళ్ళీ చదువుతాను దయచేసి వినండి...."

అని కవి ఇలా చదివాడు.

బెల్లం ముక్క నోట్లో వేసుకుంటే మాట తీయగా వుంటుందా....

అత్తరు పూసుకు దిగితే ఫోటో గుబాళిస్తుందా...

'వీకర్‌సెక్షన్లు' పదం వాడితే పార్టీ గెలుస్తుందా...

'చెంబు' వీకర్ సెక్షన్ల్ పార్టీ అనడంలో అనృతం వుందా!....

"సెబాష్ కవి.. మా గొప్ప కవిత్తం చెప్పినవు... ఎనకట రాజులు తమ ఒంటిమీది ముత్తాల హారాలు కవులకు ఇచ్చేవోరట.. నా దగ్గర గసోంటి హారాలు లేవు... పస్తుతానికి గీ సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె వుంది కొంటబోండి... నేను ఎలక్షన్ల గెలిచి మంత్రి నయినంక నిన్ను తప్పక ఆస్థాన కవిని చేస్తా.." అని హామీ ఇచ్చాడు చిన్నయ్య దొర.

"ధన్యోస్మి..." అంటూ సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె అందుకుని వెళ్లిపోయాడు కవి.

గుమస్తా శంకరయ్య వచ్చాడు - వెంట కండలు తిరిగిన ఓ వస్తాదు వున్నాడు.

ఎవడ్రా వీడు అన్నట్టు చూశాడు దొర -

"వీడు పద్నాలుగు రేప్‌లు, ఆరు హత్యలు చేసిన ఆరితేరిన గూండా సార్... పదిమంది గూండాలకు నాయకుడు - మనకు ఎలక్షన్ల ప్రచారంలో పనికొస్తాడని తీసుకొచ్చాను.." ఆ శాల్తీ గురించి వివరించాడు శంకరయ్య.

అప్పుడా శాల్తీ వినయంగా నమస్కరించింది.

చిన్నయ్య దొర సంతోషించి ఆశీర్వదించాడు -

"ఒరే గూండా నువ్వు నాకు అండా.. నేన్నీకు అండా.." అన్నాడు -

గూండా ఆనందం పట్టలేక ఐదునిమిషాల దాకా సాష్టాంగ నమస్కార వ్యాయామం చేశాడు.

"సార్?. వీడిదో చిన్న కోరిక ఉంది.... అది మీరు తప్పక నెరవేరుస్తారని హామీ ఇచ్చి తీసుకొచ్చాను..."

"ఏంటిదది?"

"ఏం లేదు సార్...చాలా చిన్నకోరిక...మీరు ఎలక్షన్లో గెలిచి మంత్రి అయాక వీడిని ఆస్థాన గూండాను చేయాలి... అంతే.."

"ఓస్ గదేనా.. అట్లనే చేస్తాం.. వీణ్ణి తప్పక ఆస్థాన గూండాను చేస్తాం.." అన్నాడు నవ్వుతూ చిన్నయ్యదొర.

"పేరు మార్చినా ఫరవాలేదు సార్...ఆ హోదా వుంటె చాలట.."

"అట్లనె...అట్లనె గాని వీడు మాట్లాడడేంది?"

"వీడు నోటితో ఎక్కువ మాట్లాడడు సార్... చేతులతోనే అంతా-"

"ఊహు....శానా పనెడో. వీణ్ణి తీసుకపోయి తర్ఫీదు బాగా చెయ్యి. రేపు మన చెంబు పార్టీ లీడర్ వొస్తాండు. మీటింగ్ ఉంటది... ఆ తరువాత మన అప్పొజిషన్ పార్టీల మీటింగ్‌లు వుంటయి... అర్థమయిందా!"

అర్థమయింది అన్నాడు శంకరయ్య.

కాబోయే ఆస్థాన గూండాను అడిగి చూశాడు. అతని పిడికిలి బిగుసుకపోవడం చూసి అర్థమయిందని గమనించాడు - ఆ తరువాత వాళ్ళిద్దరూ వెళ్లిపోయారు...

జరపబోయే మీటింగ్ చిన్నయ్య ఆలోచనలను ఆక్రమించుకుంది.

తన భవిష్యత్తు అంతా ఆ మీటింగ్ మీద వుందని అతని నమ్మకం-

ఆ రోజు గ్రామంలో చెంబు పార్టీ మీటింగ్ -

లారీలు అంకెలను దింపుతున్నాయి.

చిన్నయ్య దొర సంఖ్యను చూసి మురిసిపోతున్నాడు.

అందరూ చెంబు పార్టీ నాయకుని కోసం ఎదురు చూస్తున్నారు.

చూడగా చూడగా చూడగా చూస్తున్న కళ్ళల్లో దుమ్ము కొడుతూ గంట సేపటికి ఒక కారు వొచ్చి ఆగింది.

చిన్నయ్య దొర గబగబ ఎదురేగి ఆ కారు తలుపులు తాకి చెంబు పార్టీ నాయకునికి స్వాగతం పలికాడు.

"అంతా రెడియేనా?" అని అడిగాడు కారు దిగుతూ నాయకుడు.

"రెడీ...అండి" అన్నాడు చిన్నయ్య.

నాయకుడు చిన్నయ్య దొరను దగ్గరికి పిలిచి చెవిలో గుసగుసలు ఊదాడు.

"చప్పట్లు కొట్టే జనాన్ని తెప్పించినవా?"

"ఆ..."

"విలేకరులు చాలా మంది వచ్చారు.. జనం ఎంత బాగా చప్పట్లు కొడితే అంత బాగా పేపర్లలో రాస్తారు. దాని వల్లా నీకూ పేరొస్తుందోయ్..."

"ఆ....ఆ...తెప్పించిన్నండి.. జెర గట్టి గట్టోళ్ళను.. చేతులున్నోళ్ళను. తెప్పించిన. మనకు చప్పట్లకు ఢోకాలేదు -"

"అయితే.. పద.." అంకెల దిక్కు చూసి చేతులు జోడించి నడిచాడు నాయకుడు.

అతని కంటికి నల్ల కళ్లద్దాలున్నాయి.

అతని ఒంటికి తెల్ల ఖద్దరు బట్టలున్నాయి.. అతని ఇంటికి బంగారు ఇటుకలు వుండగలవు..

అంకెలు చప్పట్లు కొట్టాయి....

అతని నడకలో రాజఠీవి హెచ్చింది.. అతని మొహం మీదికి చిరునవ్వు వచ్చింది...

ఉచితాసనంపై ఆసీనుడు కాబోతూ మరోసారి చేతులు జోడించాడు.

మరోసారి అంకెలు చప్పట్లు కొట్టాయి.

అంకెల మధ్య ఈరడి పక్క కూర్చున్న ఓ అంకె ఆ చప్పట్ల సంఖ్యను లెక్కించుకుంటున్నది.

ఉపన్యాసాన్ని చిన్నయ్య దొర ముందుగా ఇలా ప్రారంభించాడు.

"మా జనులారా.. ఇయ్యాల మన ఊరికెంతో... మన ఊరికెంతో సుద్దినం... సుదినం... అంటే పండుగ దినం అన్నమాట. మన కట్టాల్ని దూరం జేసె ...మన ఈకర్ సెక్షన్ల ఏకై...ఏకైక పార్టీ అయిన చెంబు పార్టీ నాయకులు (అంకెలు చప్పట్ల వర్షం కురిపించాయి...) నాకు తెల్సు జనులారా.. మీకు మా... అదే మన పార్టీ అంటె ఎంత ఇదో... ఎంత ఇదో నాకు తెలుసు.... చెంబుపార్టీ ఈకర్ సెక్షన్లు ఒకటే మా జనులారా.. అట్టి పార్టీ నాయకుడు.. ఈకర్ సెక్షన్ల ఏకైక నాయకుడు మన తాయిలం రాయుడు గారు.. (అంకెలు కుండపోతగా చప్పట్లు కురిపించాయి...) అట్టి నాయకులైన తాయిలం రాయుడు గారు ఇయ్యాల మన ఊరికి రావడం నిజంగా మన ఎన్కటి జన్మల చేసుకున్న అది.. అదే జనులారా మీకు తెలుసు... అదేంటిదో మీకు తెల్సు జనులారా.. (ఆ పదం గుర్తుకు రాలేదు చిన్నయ్య దొరకు).. అంకెలు చప్పట్ల హోరును వినిపించాయి.)

చిన్నయ్య దొర ఎంతో సంతోషించి తాయిలం రాయుడి గారి వంక చూశాడు..

తాయిలం రాయుడు తృప్తిగా నవ్వాడు-

అంచేత రెట్టింపు ఉత్సాహంతో చిన్నయ్య దొర ఉపన్యాసాన్ని కొనసాగించాడు -

"మా జనులార.. తాయిలం రాయుడుగారు మన ఊరికి వచ్చిన ఆనందంలో నా నాల్కె తడబడుతాంది.. ఏం మాట్లాడ్దామన్నా మాట రాస్తలేదు.. అందువల్ల మా జనులారా నేను ఎక్కువ మాట్లాడ -నాకు తెలుసు మీరంతా తాయిలం గారి ఉపన్యాసం ఇనాలని మా ఇదిగ వున్నరని.. తాయిలం గారిలాంటి గొప్ప మన్సి మన ఊరు రావడం మనందరి అదురుట్టం.. (అంకెలు చప్పట్ల చినుకుల్ని రాల్చాయి).... మనకు ఊపిరి ఎంత ముఖ్కెమో చెంబుపార్టీ అంత ముఖ్కెం జనులారా.. నిజం చెప్పాలంటే మనం ఈనాడు ఊపిరి పీలుస్తున్నమంటె చెంబుపార్టీ వల్లనే.. తాయిలం రాయుడుగారే మనకు సక్కగా గాలి సరఫరా చేయిస్తున్నరు. . (అంకెలు చప్పట్ల గాలి వానను వినిపించాయి - ఈరడి పక్కన కూర్చున్న అంకె చప్పట్ల సంఖ్య లెక్కబెడుతున్నది...) తాయిలం రాయుడుగారు ఈకర్ సెక్షన్లకోసం పుట్టిండ్లు... చెంబుపార్టీ ఈకర్ సెక్షన్ల కోసం పుట్టింది...( తాయిలం. . రాయుడుగారు వాళ్ళను ఉత్తరించడాన్కి కంకణం కట్టుకున్నరు...(అంకెలు చప్పట్ల ముసురును వెదజల్లాయి.) ఎవరోవచ్చి దొర చెవిలో చెప్పారు 'అయ్యా ఉత్తరించడానిక్కాదు.. ఉద్ధరించడానికి..") ఆ.. ఆ... నాకు తెలుసు జనులారా... మీకు తెల్సు... నేను కూడ అందుకే...అంటె ఈకర్ సెక్షన్లను ఉత్తరించడానికి.. కాదు కాదు జనులారా నేను ముందగాల్నె మనవి చేసిన.. తాయిలం రాయుడు గారిని చూసిన సంబురంల నా నాల్కె తడబడుతాంది.. నేను గూడ అట్ల ఈకర్ సెక్షన్లను చేయడానికె.. ఈకర్ సెక్షన్ల కోసమే పుట్టిన జనులారా.. రాజకీయాలల్ల అడుగుపెట్టిన జనులారా.. (అంకెలు చప్పట్ల చిటపటల్ని వినిపించాయి. ఈరడి పక్కన అంకె అది ఎన్నవసారో లెక్క రాసుకున్నది) ....."

వరుసగా అలా తన మాటలకు అంకెలు చప్పట్లు కొట్టడం చూసి చిన్నయ్య దొర చాలా ఖుషీ అయ్యాడు -

"మా జనులారా.. ఇంగ నా ఉపన్యాసం ఆపేస్తాన.. నాకు తెలుసు జనులారా మీరంతా తాయిలం గారి ఉపన్యాసం ఇనడానికే వొచ్చిండ్లు....అందువల్ల మీ అందరి తరపున.. మరి నా తరపున ఇప్పుడు మన ఈకర్ సెక్షన్ల నాయకులైన తాయిలం గారిని తమ అందేశం.. అదే మా జనులారా సందేశం... ఇయ్యమని పోరుతున్నాను...." అని కుర్చీలో కూర్చున్నాడు. (అంకెలు అయిదు నిమిషాల దాకా చప్పట్ల వర్షపాతాన్ని రికార్డ్ చేశాయి)..

తాయిలం రాయుడు లేచి నిల్చున్నాడు- అంకెలు తిరిగి చప్పట్లను కురిపించాయి.

సంతోషంగా చేతులు జోడించి విలేకర్లు ఆ చప్పట్లు వింటున్నారో లేదో గమనించి తాయిలం రాయుడు తన ఉపన్యాసాన్ని ప్రారంభించాడు.

"ఈ ప్రాంతానికి మహానాయకులైన చిన్నయ్యగారూ...(అంకెల చప్పట్ల ప్రవాహాన్ని ఉధృతంగా వినిపించాయి) మమ్మల్ని ఎన్నుకొనే మాననీయులారా.... మహాజనులారా.. (అంకెలు చప్పట్లు ధారల్ని కురిపించాయి....) మీఅందరి దీవెనలతో మా పార్టీ... ఇంత పెరిగింది (అంటూ తన ఎత్తైన బొజ్జ నిమురుకున్నాడు - అది ఆయన

అలవాటు కాబోలు . ) (అంకెలు మరోసారి చప్పట్ల వెల్లువను వినిపించాయి...) ఈరడి పక్కన కూర్చున్న అంకె అది ఎన్నవసారో చప్పట్లు కొట్టడమో లెక్క రాసుకొని కాగితాన్ని మడచి జేబులో పెట్టుకున్నాడు) మీ అందరి సేవ చేయడానికి .. ముఖ్యంగా వీకర్ సెక్షన్ల సేవకు. . వారి అభివృద్ధికి(!) మా చెంబు పార్టీ పాటుపడుతుంది. (ఆగాడు - చప్పట్లకోసం - కాని ఎవరూ చప్పట్లు కొట్టలేదు) వీకర్ సెక్షన్ల సేవే మా చెంబుపార్టీ లక్ష్యం. (గొంతు చించుకుని అరిచాడు - ఉహు... చప్పట్లు లేవు) వీకర్ సెక్షన్లు స్ట్రాంగు సెక్షన్లను బాగుచేసే దాకా నిద్రపోం... నీళ్లు ముట్టం... గాలిపీల్చం... (ఈసారైనా చప్పట్లు కొడ్తారని ఆశించాడు... కాని చప్పట్లు లేవు. కోపంగా చిన్నయ్యను చూశాడు - చిన్నయ్య కోపంగా ఈరన్ని చూశాడు - ఈరడు పక్కనున్న అంకెను చూశాడు. చడీ చప్పుడు లేకుండా కూర్చుంది అంకె. అప్పటి దాకా ఆ అంకె చప్పట్లు కురిపించినపుడే.. . మిగతా అంకెలన్నీ కురిపించాయి... మీరు మాట్లాడుండ్లి నేను కొట్టిస్తా అన్నట్లు తాయిలం రాయుడికి సైగ జేశాడు చిన్నయ్య - తాయిలం తిరిగి ఉపన్యాసం ప్రారంభించాడు.

" ..గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్యం కోసం పుట్టాడు - మా చెంబు పార్టీ వీకర్ సెక్షన్ల కోసం పుట్టింది. పందొమ్మిది వందల...పందొమ్మిది వందల నలభైతొమ్మిది ఆగస్టు 15న మనకు... (సంవత్సరం సరిగా గుర్తు రాక తడబడి వాక్యం మార్చేశాడు.. ) పది సంవత్సరాల లోపల మా చెంబు పార్టీ వీకర్ సెక్షన్లకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సంపాదించి ఇస్తుంది. అడిగిన వారికి లేదనకుండా ఉద్యోగాలను పంచి పెడుతుంది. అసలు, దేశాన్నే మార్చేస్తుంది. రామ రాజ్యాన్ని స్థాపిస్తుంది...." (చిన్నయ్య ఈరనికి సైగ చేశాడు చప్పట్లు కొట్టించమని....ఈరడు పక్కనున్న అంకెతో ఆ మాట అన్నాడు...!) "మేమెందుకు కొడ్తమయ్యా....మా చేతులు ఎట్టి చేయడానికి వొచ్చినయ్యా మీరిచ్చిన పైసల కాడ్కి చప్పట్లు కొట్టినం.. ఇగ కొట్టం. " అని బిగ్గరగా అంది అంకె.

ఆ మాటలు విని అంకెలతో పాటుకూర్చున్న జనం గట్టిగా నవ్వారు.. గలాటా మొదలయింది. తాయిలం రాయుడు ఉపన్యాసం కొనసాగించాడు -

" ....మా పార్టీ మీటింగ్‌ను విఘ్నం చేయాలని ఒక పార్టీ సంకల్పించుకున్నది. ఇది ప్రజాస్వామ్య చర్యయేనా? అని నేను ఆ పార్టీకి సవాలు చేస్తున్నాను. మేం వీకర్ సెక్షన్లవైపు వున్నామని. వీకర్ సెక్షన్లు మావైపు ఉన్నాయని తెలిసి సోదరులారా కొన్ని పార్టీలు మాపై కక్ష గట్టినాయి. కాని మీరంతా మా పక్షమని మాకు తెలుసు.. మా చెంబుపార్టీ మీదని మీకు తెలుసు. కూర్చోండ్లి.. మహా జనులారా కూర్చోండ్లి.. మనలను వ్యతిరేకించేవారికి తగిన గుణపాఠం నేర్పాలని మిమ్మల్ని కోరుతూ...వచ్చే ఎన్నికల్లో మీరు వీకర్ సెక్షన్‌ల పార్టీయిన చెంబు పార్టీని గెలిపిస్తారని ఆశిస్తూ నాకీ మహదవకాశాన్నిచ్చిన మీ అందరికీ మరోసారి కృతజ్ఞాభి వందనములు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్.. గట్టిగా అనండి మహాజనులారా జైహింద్.. .. వీకర్ సెక్షన్ల పార్టీ చెంబు జిందాబాద్.. చెంబుపార్టీ... జిందాబాద్.."

అలా తాయిలం రాయుడిగారి ఉపన్యాసం ముగిసింది.

మీటింగ్ కూడా ముగిసింది.

★ ★ ★

మరునాడు మధ్యాహ్నం తన పార్టీ పెద్దలను పిలిచి దేవిడీలో పెద్ద పార్టీ ఇచ్చాడు చిన్నయ్యదొర. చికెన్ ముక్కలు కొరుకుతూ, గ్లాసులు ఖాళీ చేస్తూ వీకర్ సెక్షన్ల గూర్చి మాట్లాడసాగారు పెద్దలు. తమ పార్టీ వీకర్ సెక్షన్ల కోసమే వుందని పదేపదే ఒకరి కొకరు చెప్పుకున్నారు.

తాము ప్రభుత్వాన్ని చేపట్టకపోతే, మంత్రులం కాకపోతే వీకర్ సెక్షన్‌లకు భవిష్యత్తు లేదని గట్టిగా చెప్పుకున్నారు - అసలు దేశానికే భవిష్యత్తు లేదన్నారు-

అంతలో ఈరడు చిన్నయ్య దొర దగ్గరికి వచ్చి తపేలా పార్టీ రంగారావు హరిజనవాడలో కనిపించాడని చెప్పాడు. నోటినిండా చికెన్ కుక్కుకున్న ఒక సెక్షన్ నాయకుడు లేచి...త..పాలా... పార్టీ...ఈకర్ సెక్షన్లను కొట్టేస్తుంది. .అయ్యో, ఎట్లా? అని ఏడ్చి - కాబట్టి మనం...ఎంటనే...హరిజనవాడకు పోయి.. మన పార్టే ఈకర్ సెక్షన్ల పార్టీ కాని....తపాలా పార్టీ కాదని చెప్పాలి.." అని గట గట రెండు గ్లాసులు కొట్టేసి....ఓ త్రేన్పు తేన్చి...."ఈకర్ సెక్షన్ కోసం మన దగ్గరే...పణాళికలున్నయి... ఎవల దగ్గర లేవు... అని మనం హరిజనులకు చెప్పాలె..." అన్నాడు -

ఎలక్షన్‌లు దగ్గరి కొస్తున్నయి. ఈకర్ సెక్షన్ల ఎంట పడాలె ఇగ మనం...ఏదన్న ఎత్తుగడతోనె తపాల పార్టీ హరిజనవాడలో తిరుగుతోంది. ఆళ్లేం మాట్లాడ్తాండ్లో అంతకంటె మంచి మాటలు మనం చెప్పాలె. ఆళ్ళను మనదిక్కు తిప్పుకోవాల...ఈకర్ సెక్షన్లందర్ని మన దిక్కే తిప్పుకోవాలె...నూటికి ఎనభై శాతం ఓట్లన్ని ఆ కొడుకులయే నాయె.. అందుకే నేన్ చెప్పేందేదంటే మనం దేవుని భజన చేసినా చేయకున్నా ఈ నాల్గు రోజులు ఈకర్ సెక్షన్ల భజన చేయాలె..." అన్నాడు మరో నాయకుడు.

ఈరని వెంట కొందరు పని వాళ్ళను పంపించాడు చిన్నయ్య దొర. హరిజన వాడలో తపాలా పార్టీ రంగయ్య, అతని సహచరులు ఏం చేస్తున్నారో, ఏం మాట్లాడుతున్నారో తెలుసుకొని రమ్మన్నాడు.

అలా వెళ్ళిన ఈరడు, మిగతా పని వాళ్ళు గంటలో తిరిగొచ్చారు.

అప్పటికే 'ఈకర్ సెక్షన్ల' మహానాయకులు చాలామంది మందులో స్నానం చేసి మత్తుగా పరుపుల మీద దొర్లుతున్నారు.

చిన్నయ్య దొర మాత్రం కుర్చీలో విలాసంగా కూర్చొని మనుసులో రంగయ్యను చిత్రవధకు గురి చేస్తున్నాడు.

"దొరా...ఆ తపాలపార్టీ రంగయ్య పజా సేవ మొదలు పెట్టిండు. పజా సేవ తవరు గదా దొరా...ఆనికేం పజాసేవ చేయత్తది!...కత్తి పట్టరానోడు గడ్డం గీకుతె బొండిగ తెగదీ...పజాసేవ చెయ్యరానోడు చేత్తె పజలు ఇదైపోతరు...తవరు ఏగిరంగ పజల్ను రచ్చించాలె దొరా.." అన్నాడు ఈరడు చేతులు జోడిస్తూ..

"ఇంతకు ఆడ ఏమైందిరా? ఆ రంగయ్య గాడ్ది కొడుకు అరిజన వాడల మీటింగు గిట్ట పెట్టిండా?" ఆత్రుతగా అడిగాడు చిన్నయ్య దొర.

"లే...మీటింగు పెట్టలే దొరా.." ఈరని వెంట వెళ్లి వచ్చిన పనివాళ్ళు అన్నారు-

తేలిగ్గా ఊపిరి పీల్చాడు చిన్నయ్య.

"మరా తపాలా పార్టీ లంబ్డి కొడుకులు అరిజన వాడకు ఎందుకు బోయినట్టు. ."

"చెప్తినిగదా దొరా. ఆళ్ళు ఈకర్ సెక్షన్ల సేవ మొదలు పెట్టిండ్రు-" చేతులు కట్టుకొని అన్నాడు ఈరడు.

"ఆళ్ళెవండ్లురా కోన్ కిస్కా గాండ్లు ఈకర్ సెక్షన్ల సేవ జేయడాన్కి.. మేం రా ఈకర్ సెక్షన్ల సేవ చేసెటోల్లం. ."

"మరి ఆళ్ళు చెంద్రుగాని గుడిసెకు పోయిండ్లు దొరా.. చెంద్రుగానికి పానంల బాగలేకపాయె గదా. మంచం మీదికెల్లి లేత్తలేదు...తపాలపార్టీ రంగయ్య చెంద్రిగాని పక్కన కూసొని " నీకేం భయం లేదురా చెంద్రిగా...నేను డాక్టర్ను తీసుకచ్చి మందు లిప్పిత్త .." అన్నడటనుండి. ఆడు డాకుటర్ను తేవడానికి పోయిండట..." తాను విన్న సంగతులు వివరించాడు. ఈరడు.

"అట్లనా. అరిజనవాడను బుట్టలేసుకోవాల్నని చూస్తున్నాడు రంగడు. నాకు పోటీకి వస్తాండన్న మాట.. వాని బలుపు వంచుతాను..." మీసం మీద చేయి వేశాడు చిన్నయ్య.

"ఆడి ఎంట ఏనుగుల్లెక్క ఐదారు మంది వున్నరుండి .. రౌడీ నాకొడుకులు గావచ్చండి.."

"అరేయ్ గుమస్తాను ఇటు పిలువు" ఒక పనివాడికి చెప్పాడు చిన్నయ్య.

గుమస్తా శంకరయ్య వచ్చాడు.

"పిలిచిండ్లా సార్..."

"నూడు శంకరయ్య...నువ్వు గుండాగాణ్ని తెస్తివి గదా వాడేడి?" శంకరయ్యను చూసి అడిగాడు చిన్నయ్య.

"ఉన్నడు సార్. "

"వాణ్ని.... వాని ఎంట వున్న గుండాల్ని జెల్లి పిలిపించు అర్జంటు..."

"అట్లాగే సార్. " అని శంకరయ్య వెళ్ళిపోయాడు.

కాస్త స్పృహలో వున్న ఒక చెంబుపార్టీ నాయకుడు పరుపు మీదినుంచి లేచి చిన్నయ్య దగ్గరికి వచ్చి-

"ఆ తపాలా రాస్కెల్... కంటె. . ముందు మనమే ఒక డాక్టరును ఆ మాదిగోని దగ్గరికి తీసుకెళ్తె మంచిది.. " అని సలహా ఇచ్చాడు.

"లేకపోతే ఆ తపాలా పార్టీ రంగడే డాక్టర్ను తీసుకుపోయిండు అనుకోండ్లి.... అప్పుడు అరిజనవాడంత ఏమనుకుంటరు? ఈ దొర మాకోసం శాన కష్టపడ్తాండు. మా దాంట్ల ఒగనికి పానంల బాగలేకపోతే సాయంగ డాక్టర్ను తెచ్చిండు అనుకుంటరు. అప్పుడు అరిజనవాడంతా ఆ రంగడి వశమై పోతుంది రేపు ఎలక్షన్ల వాడికి ఓటేస్తరు. చిన్నయ్యగారికి ఏయరు కాబట్టి మనమే వాడికంటే ముందుగా ఓ డాక్టర్ను తీసుకొని అరిజనవాడకు ఎల్లాలి ఆ మాదిగోని చేత టాబ్లెట్ మింగించాలి. అప్పుడు ఆ మాదిగోనికి మనం చేస్తున్న సేవ మిగతా జనం చూస్తరు. మన వైపు వుంటరు. మన ఓట్లకు ఢోకా వుండదు-" అన్నాడు మరో నాయకుడు -

"నివ్వద్దే...కాని వున్న ఫలంగా మనకిప్పుడు డాక్టరెట్ల వస్తడు?" సందేహం వెలిబుచ్చాడు ఇంకొక నాయకుడు.

"ఈ ఊర్లె డాక్టర్లు లేరా?" మరో నాయకుడి ప్రశ్న.

"మా ఊళ్ళె కెవలన్న డాకుటరు వొత్తె రొండు దినాల్ల జబ్బునపడ్డ మడిసి లెక్క అయితడు. గందుకె డాకుటర్లు లేరు బాంచెను-" అన్నాడు ఈరడు.

"మరి, ఆ తపాలా పార్టీ రంగడికి ఎలా దొరుకుతున్నడయ్యా డాక్టరు?..."

"ఆళ్ల ఇంట్ల ఏదో కార్యంబడిందట. నిన్న చాస మంది సుట్టాలు వచ్చిండ్లు. దాంటె డాకుటర్లు వున్నరో ఏందో.." ఈరని పక్కన నిల్చున్న పనిమనిషి చెప్పాడు.

"ఆ....నాకొక ఉపాయం తోస్తాంది" అన్నాడు బొజ్జనిమురుకుంటూ ఓ నాయకుడు.

"ఏందో చెప్పుండ్రి...." కుతూహలంగా అడిగాడు చిన్నయ్య.

"ఆడు ఇప్పుడే డాక్టర్ను తెస్తం అని పోయిండేమో... మనం వాడికంటె ముందుగాల్నె డాక్టర్ను కొంటబోదాం.." అన్నాడు బొజ్జనాయకుడు.

"అదే ఎట్లననే కదా ఆలోచన చేసేది..."

"మన దాంట్ల ఎవలూ డాక్టరు లేరా?" అని అడిగాడు వీకర్ సెక్షన్ల పార్టీ అని చెప్పుకుంటున్న చెంబు పార్టీ నాయకుడు.

అందరిని ఒకసారి కలియజూసి - "లేరు" అని చెప్పాడు చిన్నయ్య.

"తలుచుకుంటె మనలో ప్రతి ఒక్కడూ డాక్టరేనయ్యా.."

"అది సరేనండీ.. ఇప్పుడీ గండం గెట్టెక్కేదెట్లా? ఆ రంగడు...ఆ తొత్తునా కొడుకు అరిజనుల ఓట్లన్ని కొట్టిస్తడండి. ఒకటా రొండా రొండు వందల ఓట్లు... ఈకర్ సెక్షన్లంతా గిట్లనే తపాలా పార్టీ రంగని పాలైతే నాగతేం కావాలె? మనపార్టీ పరువేం గావాలె? నిజానికి ఈకర్ సెక్షన్ల సేవ చేసెటోల్లం మనం కదా...మన పార్టే ఈకర్ సెక్షన్ల పార్టీ కదా...ఆ ఈకర్ సెక్షన్ మాదిగోడికి మందులు ఇప్పించె హక్కు ఆ రంగడికి ఎక్కడిది? అది మన హక్కు. మనం చేసే పని. మాదిగోళ్ళు, మన్నెపోల్లు, కమ్మరోల్లు, కుమ్మరోల్లు, బెస్తోల్లు, ఈ ఈకర్ సెక్షన్లంతా మనోల్లండి.. ఆడెందుకు పోతాండు వాళ్ల ఇండ్లల్లకు" అంటూ ఆవేదన వెలిబుచ్చాడు చిన్నయ్య దొర.

"నీకేం ఫరవాలేదయ్యా చిన్నయ్యా ..ఈకర్ సెక్షన్లను వాడి పరం కానిస్తామా.. ఇంత మంది నాయకులం వుండి!.. ఓ తెల్లకోటు వుందేమో చూడు.." అన్నాడు బొజ్జ నాయకుడు.

"తెల్లకోటా! ఎందుకు?"

"అబ్బ ముందు తేవయ్యా చెప్తా...."

ఈరన్ని పంపించి ఓ పాత తెల్లకోటు తెప్పించాడు చిన్నయ్య.

"అరె ఇట్రా" - అని ఈరన్ని దగ్గరికి పిలిచుకున్నాడు బొజ్జనాయకుడు -

"అవుతల కార్ల మా డ్రైవరు వుండడు చూడు.... వాడ్ని తీసుకురా పో... వాడైతే కొంచెం ఎర్రగ బుర్రగ వున్నడు.. ఈ కోటేసుకుంటె అచ్చం అప్పుడే ఆస్పిటల్ నుంచి

వచ్చిన డాక్టర్ లెక్క వుంటడు. మనం ఆ మాదిగోని గుడిసె ముందల నిలబడి... అరిజనవాడల అందరి ఆరోగ్యాన్ని పరీక్ష చేయడానికి పట్నంనుంచి డాక్టర్‌ను పిలిపించినం . . ఊళ్ళల్ల మలేరియా జొరాలు వచ్చి జనం పోతున్నరు కదా... అందరికి ఒట్టిగనే మందులు ఇప్పిస్తం. ఇయ్యాల ఈ ఈకర్ సెక్షన్ గాడ్ది చూసి మందిచ్చి పోతాడు డాక్టర్ రేపు నర్సులను, మందులను ఎంట బెట్టుకుని వస్తడు.. అని చెప్పాలె. చెప్పినంక అందరు చూస్తాంటె మన డాక్టరుచేత ఆ తపాలగాడి కంటె ముందుగాల్నె ఈకర్ సెక్షన్‌గాడికి మందులు ఇప్పించాలె.." అన్నాడు బొజ్జనాయకుడు ఈరన్ని పంపించాక చిన్నయ్యతో-

ఈరడు వెళ్ళి బొజ్జనాయకుడి కారు డ్రైవర్ని తీసుకొచ్చాడు.

"అరేయ్... ఈ కోటేసుకో..." కోటు చూపించాడు.

డ్రైవర్ తెల్లమొగం వేసి తెల్లకోటు వేసుకున్నాడు. ఆ నువ్విప్పుడు డాక్టరువి. దొర వెంటబోయి ఓ ఈకరుసెక్షను గాడికి మందిచ్చి రావాలె..." ఆజ్ఞాపించాడు నాయకుడు.

"నేనా సార్!. ." డ్రైవర్ ఇంకా తెల్లబోయాడు.

"దొరా మరి మందులో?" జ్ఞాపకం చేశాడు ఈరడు.

"మందులా! . మన దగ్గర మందులకేం కొదవరా... మన ఒళ్ళే ఓ మందుల పుట్టాయె.. .ఏది నా బ్రీఫ్ కేస్ ఇటుపట్రా..." అన్నాడు.

ఈరడు బ్రీఫ్‌కేస్ తెచ్చి ఇచ్చాడు. ఆ నాయకుడి విరోచనాలు కొంచెం ట్రబుల్. అందుకే పర్గోలాక్స్ ఎప్పుడూ దగ్గరుంచుకుంటాడు.

"చిన్నయ్య గారూ ఓ బ్యాగ్ ఇప్పించండి వీడికి-" అన్నాడు చిన్నయ్యతో.

చిన్నయ్య ఓ నల్ల బ్యాగు తెప్పించాడు. ఆ బ్యాగ్‌లో పర్గోలాక్స్ టాబ్‌లెట్స్ వేసి డ్రైవర్‌కు ఇచ్చాడు ఇంకేం.. తెల్లకోటు, నల్లబ్యాగు.. డాక్టర్ తయారయ్యాడు!!

"ఇగ డాక్టరును తీసుకపో చిన్నయ్యా ఈకర్ సెక్షన్ల వాడకు. ఇంతకుముందు చెప్పిందంతా చెప్పు. నేను రెస్ట్ తీసుకుంటా... రాత్రికి రాజధాని ప్రయాణం కదా.." అన్నాడు బొజ్జనాయకుడు.

చిన్నయ్య ఆ బొజ్జనాయకుడిగారి మెడ కౌగలించుకొని... ఆ తరువాత చేయి దొరికించుకొని ..

"మీ బుర్ర అమోఘం... మీలాంటి బుర్రలే మన చెంబు పార్టీకి సీరామరక్ష" అని పొగిడాడు చిన్నయ్య.

ఆ నాయకుడు బొజ్జ అదిరిపోతుండగా పెద్దగా నవ్వి "నాదేం బుర్రండి... నాకంటె గొప్ప బుర్రలున్నయండి మన పార్టీల.." అన్నాడు.

"తొందరగా డాక్టరును తీసుకపోండి. లేకపోతే హరిజనవాడలో శత్రువులు చొరబడతారు" అని హెచ్చరించాడు ఒక నాయకుడు.

బొజ్జనాయకుడు సృష్టించి ఇచ్చిన డాక్టరును వెంట బెట్టుకుని కొంతమంది పని వాళ్ళను కాబోయే ఆస్థాన గుండా పరివారాన్ని తీసుకొని హరిజన సేవకు... వీకర్ సేక్షన్ల సేవకు తరలి వెళ్ళాడు చిన్నయ్య దొర.

ఆలస్యమైతే శత్రుపక్షం ఎక్కడ ప్రజాసేవ చేస్తుందోనని భయపడి వురుకుల పరుగులతో హరిజనవాడ చేరుకున్నారు –

అంతలో ఓ విచిత్రం జరిగింది.

తపేలా పార్టీ రంగయ్య కూడా ఓ డాక్టరును వెంటబెట్టుకొని చంద్రయ్య గుడిసె చేరుకున్నాడు.

చిన్నయ్య దొరగారి గూండా గారు.. కాబోయే ఆస్థాన గుండాగారు తపాలా పార్టీ డాక్టరుకు అడ్డం నిల్చొని గుడిసె వైపు పోనివ్వలేదు.

"చెంద్రుగాడు... ఈకర్ సెక్షన్లంతా మనోళ్లు డాక్టరు మనోళ్ళను మనం చూసుకోవాలె గాని మంది చూస్తరా.. ఉర్లల్ల మలేరియా వుందంటిరి, రేపు నర్సులను, మందులను పట్టుకొని వస్తనంటిరి. ఇయ్యాల మా చెంద్రుగానికి జెర చూసి మందులిచ్చి పోండ్లి... వానికి జెప్పన రోగం తక్కువ కావాలె.. వాడు నాకు కుడిభుజం అసోంటోడు... పో డాక్టరు పోయి చూడు పో.." అని తాను తెచ్చిన డాక్టరును ముందుకు తీసుక పోబోయాడు చిన్నయ్య.

"ఆగవయ్యా.... చెంద్రుగాన్ని మా డాక్టరు చూస్తడు... వాడు మా మనిషి.. ఈ హరిజనవాడ.. ఈకర్ సెక్షన్లంతా మావాళ్ళు.. మా పార్టీ కొన్ని ఏండ్ల బట్టి ఈకర్ సెక్షన్ల సేవ చేస్తోంది. ఇప్పుడు కూడా మేమే చేస్తం...ఎవ్వలను చేయనివ్వం.. అంటూ చిన్నయ్య డాక్టరుకు అడ్డు నిలిచాడు తపేలా పార్టీ రంగయ్య.

"మేం మీ కంటె ముందు నుంచే ఈకర్ సెక్షన్ల సేవ చేస్తానం – అసలు మా పార్టే ఈకర్ సెక్షన్ల కోసమే పుట్టింది... జిందాబాద్ జిందాబాద్... తపేలా పార్టీ జిందాబాద్..." రంగయ్య వెంటనున్న తపేలా పార్టీ మనిషి అరిచాడు –

"నోర్ముయిరా కుర్ర నా ఎదవ – మీ పార్టీ ఈకర్ సెక్షన్ల పార్టా!... పోయిన ఎలక్షన్ల ఈకర్ సెక్షన్ల గుడిశెలన్నీ తగులపెట్టినప్పుడు ఏడబోయిందో ఈ తెలివి?..." చెంబు పార్టీ నుంచి అరుపులు–

"మేం గట్ల తగులబెట్టెటోల్లం కాదు మీరే తగులబెట్టి మా పేరు బదునాం చేసిండ్లు..."

"అవునవును అడ్డ బాస గుట్టకాడ వంతెన కట్టిస్తనని మా ఎమ్మెల్యేనే కదా జనం దగ్గర... సర్కారు దగ్గర డబ్బు దొబ్బి పత్తా లేకుండ ఉడాయించింది."

"అవుమల్ల – నువ్వు సొక్కం పార్టిల వున్నవనుకుంటాననా – ఈకర్ సెక్షన్లకు భూములిస్తున్నం, బర్రెల్నిస్తున్నం అని ఇచ్చినట్టె ఇచ్చి బామ్మరుదుల పేర, బావల పేర రాసుకునేది ఎవ్వరో ఈకర్ సెక్షన్లకు ఎరికే..!"

"అవునవును....ఎందుకెరుకలే... పోయినేడు ఈకర్ సెక్షన్ల సేవచేస్తానం అని అరిజన వాడలు ఊడ్సి పుల్లమ్మకు కడుపు చేసి దాని బావిల నూకింది ఎవరో అందరికి ఎరికే...."

"అవున్రా.. మా పార్టేకాదు.. ఈకర్ సెక్షన్ల పార్టీ అనుకుంటనే.. ఈకర్ సెక్షన్ల పొల్లలను తీసుకుపోయి హైద్రాబాద్‌ల అమ్మివొస్తాంది.. "

"నోర్ముయిరా.. ఇప్పసారా పోసి మేమేకాదు ఓట్లు కొంటానం.."

"అవున్రా చెంబుల కొద్ది గుడుంబా గుమ్మరించి మేమే కాదు ఓట్లు కొంటుంది..."

"ఈ దున్నపోతుల మాట ఇనుకుండ్లి జనులారా మాదే ఈకర్ సెక్షన్ల పార్టీ.."

"ఈ లంబ్డీ కొడుకుల మాట ఇనుకుండ్లి జనులారా మాదే ఈకర్ సెక్షన్ల పార్టీ ..."

అలా బూతు మాటల్లోకి దిగిపోయి ఒకరినొకరు నెట్టుకుంటూ హరిజన గుడిసెల్లోకి పోవడానికి పోట్లాటకు దిగాయి ఈ వీకర్ సెక్షన్ల పార్టీలు...

గుడిసెలో చెంద్రయ్య కొన ఊపిరితో కొట్టుకుంటున్నాడు - భార్య, పిల్లలు చుట్టూ కూర్చొని ఏడుస్తున్నారు.

భర్త పడుతున్న అవస్థను చూడలేక చంద్రయ్య భార్య నర్సమ్మ గుడిసె బయటికొచ్చి రెండు చేతులు జోడించి దీనంగా ప్రార్థించింది...

"అయ్యా... మీరు నా పిల్లల గోస సూడుండ్లి... మా మావ... ఎట్లనో సేత్తాండయ్యా... ఎవన్న ఒక డాకుటరును రానీయండ్లయ్యా.."

" మా డాక్టరే చెంద్రుగాన్ని చూడాలె-" అంటూ చిన్నయ్య ముందుకొచ్చాడు.

"అట్లెట్ల. . మా డాక్టరే... చెంద్రుగాన్ని చూడాలె.." అంటూ రంగయ్య ముందు కొచ్చాడు

"మా పార్టే.. మా చెంబు పార్టే ఈకర్ సెక్షన్ల పార్టీ... మా డాక్టరే చెంద్రుగాన్ని ముట్టుకోవాలె.."

"మా పార్టే... తపాలా పార్టే... ఈకర్ సెక్షన్ల పార్టీ... మా డాక్టరే చెంద్రుగాన్ని ముట్టుకోవాలె..."

"ఎవలన్న ఒగలు డాకుటరును రాని యిండ్లుల్లా... ఓయ్య మీ కాల్మొక్త.. మీ బాంచెను... మీకు దండం పెడ్తనయ్యా.. మా గోస సూడుండ్లయ్యా.." గోడు గోడున విలపించింది నర్సమ్మ.

తల్లి ఏడ్వడం చూసి పిల్లలు బిగ్గరగా ఏడుస్తున్నారు. భయం భయంగా అటు ఇటు చూడసాగారు...

చుట్టుపక్కల వాడల్నించి వచ్చిన జనం అక్కడ జరుగుతున్న వాదాన్ని.... దొమ్మిని చూస్తున్నారు.

"ఓయ్య...నీ కాల్మొక్త దొర నీ కాల్మొక్త..." ఇద్దరి కాళ్ళ ముందు పడిపోయి... "నా పసుపు కుంకుమ నిలుపుండ్లి దొరా... నా పిల్లల్ని పచ్చుల్ని సేయకుండ్లి.. డాకుటరును పోనీయిండ్లి దొరా.." రెండు చేతులు జోడించి వాళ్ళకాళ్ళకు మొక్కింది నర్సమ్మ -

"నర్సమ్మ నీకేం భయంలేదు లేవే - చెంద్రుగాన్ని మా డాక్టరు చూస్తడు..." చిన్నయ్య నర్సమ్మ రెక్క బట్టి లేవనెత్తాడు.

"నర్సమ్మ....మేం ఉన్నం చెంద్రుగాన్ని పానాన్ని కాపాడ్తం- మా డాకుటరు చూస్తడు" రంగయ్య మరో రెక్కపట్టుకొన్నాడు.

తల్లిని వాళ్ళేదో చేస్తున్నారని ఏడుస్తున్న పిల్లల్లో ఒక పెద్ద పిల్లవాడు దోసిలతో మట్టి తీసి వాళ్ళ కళ్ళల్లో చల్లాడు.. .

"ఆ పోరగాన్ని పట్టుకోరా.." అన్నాడు చిన్నయ్య.

కాబోయే ఆస్థానగుండా ఆ పిల్లాడ్ని పట్టుకొని తలమీద కొట్టాడు..

"అరేయ్ మా వీకర్ సెక్షన్ల పొలగాన్ని కొడ్తావ్.." చెంద్రయ్య గుడిసె బొంగులాగి కాబోయే ఆస్థాన గుండా మీదికి వచ్చాడు రంగయ్య పార్టీ మనిషి.

చెంబుపార్టీ మనిషి కూడా చెంద్రయ్య గుడిసె బొంగులు లాగి అతని మీద కలియ బడ్డాడు.

గుడిసె సగానికి పడిపోయింది.

"ఓవ్వో...ఓ నాయనో.. నా మావ సచ్చిండే." వాళ్ళను విడిపించుకొని సగం కూలిన గుడిసెలోకి పరుగెత్తింది నర్సమ్మ.

అప్పటికె చెంద్రయ్య కాళ్ళ మీద చిన్న దూలం వచ్చి పడింది.

గావుకేక పెట్టి చెంద్రయ్యను బయటికి లాగుతున్నది నర్సమ్మ-

సహాయంగా రంగయ్య వెళ్లబోయాడు - "నువ్వెట్ల పోతవ్...నేను వీకర్ సెక్షన్ల మనిషిని...." అంటూ రంగయ్యను నెట్టేసాడు చిన్నయ్య -

చిన్నయ్య కోపంతో గుడిసె సూరులోంచి ఓ కట్టేను లాగి రంగయ్యమీదికి వచ్చాడు.

గుడిసె కప్పుకూలి చెంద్రయ్యను బయటికి లాగుతున్న నర్సమ్మమీద పడింది. పిల్లలు గగ్గోలు పెడబొబ్బలు పెట్టారు -

"నీ యవ్వ ఈ దొంగ నాయాల్లను తరుముండ్లిరా" చూస్తున్న జనం నుంచి కుమ్మరి మల్లన్న ముందుకు దూసుకవచ్చాడు.

"మేం ఈకర్ సెక్షన్ల మన్సుల మంటె మేం ఈకర్ సెచ్చన్ల మనుసుల మని మా పాణాలు తీత్తారు. నడువుండ్లిరా...ఇక్కన్నుంచి ఎల్లిపొండ్లి.." ఆవేశంగా చిన్నయ్య, రంగయ్యల మీదికి వచ్చాడు.

అంతసేపు కేవలం ప్రేక్షకులుగా మిగిలిపోయిన జనానికి చెంద్రయ్య ప్రాణాల్ని కాపాడాలని ఉంది.. డాక్టర్లను ఆపుతున్న చిన్నయ్య, రంగయ్యలను వారి సహచరులను దూరంగా తరిమేయాలని ఉంది - కాని ఎవరికి ధైర్యం చాల్లేదు. కుమ్మరి మల్లన్నను చూడగానే అందరికి ధైర్యం వచ్చింది.

జనం బాణాల్లా దూసుక వచ్చారు.

ముందుగా కొంతమంది చెంద్రయ్యను, నర్సమ్మను, పిల్లలను ఒక చెట్టు కిందికి చేర్చారు.

డాక్టర్లను కొంతమంది పట్టుకున్నారు.

కొందరు చిన్నయ్యను, రంగయ్యను వారి బలాలను తరిమేశారు.

"నీ అవ్వ వీళ్లారా మనకు సేవ చేసేది - వీళ్ళారా మన బతుకుల్ని బాగు చేసేది? వీళ్లకు మనమీద జాలి వున్నాదిరా.. వీళ్ళకు మనమీద దయ వున్నాదిరా?.... వీళ్ళకు మన మీద ప్రేమ వున్నాదిరా? వుంటె గిట్ల ఒగ మనిషి చావు బతుకుల్ల

కొట్టుకుంటంటె మేం సేవ చేత్తమంటె మేం సేవచేత్తమని వాళ్ళదాంట్ల వాళ్ళె కొట్టుకొని వచ్చిన డాకుటర్లను సూడనీయకుండ ఆపుతర్రా!.. మనం ఎట్లబోతె వాళ్ళకేందిరా... మనం ఎట్లసత్తె వాళ్ళ కేందిరా.. వాళ్ళకు మనం ఓట్లంరా.. ఓట్లకోసం మన కాడికి వొత్తర్రా..."

కుమ్మరి మల్లన్న పిడికిలి బిగుసుకుంది -

డాక్టర్లు వణికిపోతున్నారు.

కుమ్మరి మల్లన్న, చాకలి ఎల్లయ్య, ఓదెలు వాళ్ళ చేతులు పట్టుకొని "జెర చెంద్రుగాన్ని సూడుండ్లి బాంచెను.. చెంద్రుగాని పాణాలు కాపాడుండ్లి బాంచెను..." అంటూ ప్రాధేయ పడ్డారు.

చిన్నయ్య తీసుకొచ్చిన డాక్టరు వణికిపోతూ తన అసలు రూపం ఏమిటో చెప్పాడు.. ఇందులో తన తప్పేంలేదని తనను వొదిలేయమని వేడుకున్నాడు-

అతన్ని వొదిలేసి.. "తూ....నీ అక్క లంబ్డికొడుకులు - వాడు చిన్నయ్య మీ ఈకర్ సెచ్చన్ల నాయకుల్ని అని ఎంత పనిచేసిండ్లో చూసిండ్లా..." అని ఉమ్మేశాడు మల్లన్న.

రంగయ్య తెచ్చిన డాక్టర్ను బ్రతిమిలాడాడు - అతడు నిలువునా వణికి పోతున్నాడు. మొహం నిండా చెమటలు పట్టేశాయి... అన్నా... నేను డాక్టర్ను కాను - రంగయ్య దొర స్నేహితుని ఇంట్ల పనిమనిషిని...నన్ను డాక్టరు అని చెప్పి తీసుకొచ్చిండ్లు..." అంటూ రెండు చేతులు జోడించాడు.

"చూసిండ్లారా ఎల్లన్న... ఒరేయ్ చాకలి పుల్లన్న...కమ్మరి నర్సన్న.. బెస్త గోపన్న ..మనం ఈకర్ సెచ్చన్లమని మనకు సేవచేత్తమని వచ్చే నాయకుల పగటి వేషాలు చూసిండ్లా...చూసి నావురా ముత్తిగ...అరిజనవాడని వాళ్ళకు పేమ గదరా.. ఓడు డైవర్ని డాకుటరని తీసుకొచ్చిండు...ఓడు పనిమనిషిని డాకుటరని తీసుకొచ్చిండు. మనిషి ఈడ చావు బతుకుల్ల వుంటె వాళ్ళు ఏస్తున్న ఏసాలు చూసిండ్లా మనం కలువంగెనే దొంగనాకొడుకులు పారిపోయిరి గదరా...మనం ఈకర్ సెచ్చన్లం మనకు సేవ చేత్తమని వచ్చిన దొంగ లంబ్డికొడుకులు పారిపోయిరి గదరా... అసలు ఈకర్ సెచ్చన్లు వాళ్లురా .. బలీనంవర్గం వాళ్ళదిరా... మనం కాదు బలీసులం. మనది కాదు బలీనవర్గం. మనం ఒక్కటైతే అసొంటి కుక్కలన్నీ మన ముందు తోకాడిస్తయిరా... అరేయ్ గోపన్న నువ్వు బండి కట్టు చెంద్రుగాన్ని పట్నం తీసుకపోదాం. ఎంకన్న .. పుల్లన్న...మీరు గుడిసె ఏయిండ్లి...ముత్తక్క, లస్వక్క నువ్వు నర్సమ్మను పిల్లల్ని సూడుండ్లి... మన బతుకుల్ని మనమే బాగుచేసుకోవాలె అన్నా... మనం కలిసి మన బతుకుల్ని బాగు చేసుకోవాలె అన్నల్లారా... అక్కల్లారా... ఈ దొంగలు మనల్ని బాగుచేయరు...మనల్నింక బలీనుల్ని చేత్తరు..." అందరి కళ్ళలోకి వెలుగుల్ని, గుండెల్లోకి కొత్త ఊపిరిని ఉదాడు మల్లన్న.

● ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక - 3 జూలై, 1987 ●

# 50. చెర

♦ నవీన్ ♦

నవంబర్ నెలలో ఒకరోజు....

ధర్మారం ఊళ్ళో వరిపొలాలన్నీ కోతకొచ్చాయి....

వ్యవసాయ కూలీలకు బోల్డు డిమాండ్ యేర్పడింది.

వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే రోజుల్లో ఆ ఊళ్ళో వ్యవసాయ కూలీలకు విపరీతమైన కొరత యేర్పడుతుంది.

కూలీలకు చెల్లించే కూలీరేటు కూడా పెరుగుతుంది.

రోజంతా వరిపొలం కోసినందుకు ప్రతిఫలంగా ఆ పొలం యజమానిచ్చిన కూలి గింజల్ని నెత్తిన పెట్టుకొని చుట్టూ చీకట్లు ముసురుకుంటుండగా ఊరివైపు బయల్దేరారు సమ్మయ్య, అతని భార్య రాజమ్మ, మరికొందరు కూలీలు.

వాళ్ళిద్దరూ ఇల్లు చేరుకోగానే కంచంముందు కూర్చుని ఆవురావురుమని అన్నం తింటున్నవాళ్ళ కొడుకు సాంబయ్య కనిపించాడు. కొడుకును చూడగానే సమ్మయ్య తన నెత్తిమీదున్న వడ్ల బస్తాను కోపంగా కిందపడేసి..

"పైస సంపాయించే తెలివిలేదుగని గిన్నెనిండ బువ్వమాత్రం గావాలె" అన్నాడు కాంద్రించి ఉమ్మేస్తూ.

"కొలువుకని పట్నంల తిరిగి తిరిగి గిప్పుడే వచ్చి గింత తింటాండేమో...వాన్ని ఇప్పుడేమనకు" అంది రాజమ్మ కొడుకు అన్నం తినకుండానే లేచిపోతాడేమోనని విలవిల్లాడిపోతూ.

"పట్నంల గివీనికి కొలువెవ్వడిత్తడే! పెద్ద పెద్ద చదువులు సదివినోళ్ళకే కొలువుల్లేక తిరిగి తిరిగి చస్తాంటే...గీడు పనికోసం పట్నం బోవాల్నా? ఊళ్ళో ఆసాములంతా కూలికొస్తవా...కూలికొస్తవా అని ఇల్లిల్లు తిరుగుత లేరు? వీని తోటోళ్ళంత కూలికిపోయి రో గుండెడడ్డెడు వడ్లు తెచ్చుకుంటలేరు?" అన్నాడు సమ్మయ్య

"అందరోలె వాడు కూలి చేసుకుంటే గింత లొల్లెందుకుంటది. చిన్ననాటినుంచే ఆడు కూలంటే తప్పించుకునేది...గిప్పుడు చేయమంటే చేస్తడా!" అంది రాజమ్మ.

"చెయ్యకుంటెట్లగావాలెమళ్ళ.... కడుపులకు బువ్వెట్ల దొరుకుతది" అన్నాడు సమ్మయ్య.

"గంతోగింత సదువుకున్నడు. యేదన్న కొలువు సంపాయించుకుంటడు" అంది రాజమ్మ

"సదువుకున్నడు. సదువుకున్నడంటవు. . యేం సదువుకున్నడే? ఓ పది సది విండేమో. ఇయ్యాళ్ళ రేపు కుక్కలు, నక్కలు కూడా సదువుతున్నాయా సదువు. గీనికన్నా చానా పెద్ద చదువుల సదివినోళ్ళకే కొలువుల్లేవు. గీనికి ఎవడిత్తడే. నువ్వూ, నేనూ తెచ్చిపెడ్తాంటే బాగా తిని వంటికి కావరమొచ్చి పట్నంల షికార్లు కొట్టొస్తాండు. ధూ! సిగ్గు, శరం లేదురా ఇన్నేళ్ళొచ్చినా.... అయ్యా, అవ్వ రెక్కల కష్టంతో బతకటానికి" అంటూ సమ్మయ్య మరోసారి కాండ్రించి ఉమ్మేశాడు.

అంతసేపూ నిశ్శబ్దంగా అన్నం తింటున్న సాంబయ్య కంచంమీంచి దిగ్గున లేచి బయటికెళ్ళి చెయ్యి మూతి కడుక్కున్నాడు.

"నీకోపం పాడైపోను. బువ్వ తినేటోన్ని తినకుండా జేస్తివి. కొడుకు ఎంత ఆకలితో వచ్చిండో...ఎంత కోపమొచ్చినా ఎవడన్నా కొడుకు కడుపుమీద కొడ్తడా అయ్యా! యేం మనిషివయ్యా...వానికి నీ కష్టమేం పెట్టొద్దు. నోటికొచ్చినట్టు తిట్టొద్దు. మళ్లెప్పుడన్నా వాన్ని నువ్విట్ల తిడ్తివో నేను, ఆడు నీ ఇంట్లనుంచి యెళ్ళిపోతం" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ రాజమ్మ అంటూండగానే సాంబయ్య ఇంటినుంచి బయటకొచ్చి బజార్లో పడ్డాడు.

అన్నంమీంచి లేచి విసురుగా బయటకొచ్చిన సాంబయ్యక్కూడా కన్నీళ్ళు ఆగడం లేదు.

విషం తాగో, వంటిమీద గ్యాసునూనె పోసుకునో తను వెంటనే చచ్చిపోతే బావుండు ననిపించిందతనికి.

అయ్యన్న మాట నిజమే. తను అయ్యవ్వల కష్టమే తింటున్నాడు. తను అందరోలే కూలి నాలి చేసుకుని బతకలేకపోతాండు. తనకు బుద్ధి తెలిసినప్పటినుంచి మంచిగా బతకాల్నని, మంచి బట్టలు కట్టుకోవాల్నని, మంచింట్లో వుండాలని కోరిక.

తను పదోతరగతి పాసయ్యిండు. అప్పట్నించే యేదన్న ఉద్యోగం దొరుకుతుందని ఆశ. యే ఆఫీసులోనన్న అటెండర్ పోస్టు సంపాయించుకోవాల్ననని ఆరాటం. అందుకే రోజూ ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్నానికి నడిచిపోయ్యేస్తున్నాడు. ఎంప్లాయిమెంట్ ఆఫీసు చుట్టూ తిరుగుతాండు.

పట్నంలో తనకు బాగా తెలిసిన ప్రకాశరావుగారున్నారు. ఆయన యూనివర్శిటీలో పెద్ద ప్రొఫెసర్. ప్రకాశరావుది ధర్మారమే. అప్పుడప్పుడు వచ్చి పోతుంటాడు. ఆయన ఇదివరకు తన ఊరివాళ్ళకో ఇద్దరి ముగ్గురికి ఉద్యోగాలిప్పించిండట. వాళ్ళళ్ళ ఒకడు బుచ్చయ్య, రెండు మూడు నెలల కిందటే బుచ్చయ్య తనకు దోస్తయిండు. ప్రకాశరావే తనకు యూనివర్శిటీల డైలీవేజేస్ కింద అటెండర్ పోస్ట్ ఇప్పించిండని చెప్పిండు.

ప్రకాశరావు ధర్మారం వచ్చినప్పుడల్లా తను వెళ్ళి కలుస్తాండు. పట్నంల కూడా అతను ప్రకాశరావుగారింటికి బోయి కలుస్తనే వున్నాడు

"పట్నంల నాకేదన్న ఉద్యోగం ఇప్పించుండ్రి దొరా" - తను

"యేం ఉద్యోగం జేస్తవురా" - ప్రకాశరావుగారు.

"యేదన్న ఇప్పించుండ్రి. మనూరి బుచ్చయ్యకు మీరే ఇప్పించిండ్రట. నాక్కూడా గట్టిదే ఏదన్నా ఇప్పించుండ్రి" - తను.

"వాడికేదో లక్కీగ దొరికిందిరా... దాంట్లో నేను జేసిందేం లేదు. అయినా చూద్దాంలే. నువ్వు టెన్త్ పాసయ్యినవుగదా. యేదన్నా ఛాన్స్ వస్తే బుచ్చయ్యలాగే నిన్నుకూడా యూనివర్శిటీలో పడేస్తా" - ప్రకాశరావు.

"మరచిపోకుండ్రి దొరా" - తాను.

★ ★ ★

ఇంట్లోంచి బయటికొచ్చిన సాంబయ్య బజార్లన్నీ తిరిగి ఊరి బయట పంచాయతీ బోర్డు దగ్గర కొచ్చేసరికి రేడియోలో తెలుగు వార్తలు ప్రసారమవుతుంటే వింటూ కూర్చున్నాడు.

సాంబయ్యకు ప్రకాశరావు మీద చాలా నమ్మకం కుదిరింది. అతనికి ప్రకాశరావు చాలా మంచివాడిలా, దేవుడిలా కనిపించసాగారు. ఒక్క సాంబయ్యే కాదు ఆ ఊళ్ళో అందరూ ప్రకాశరావును చాలా మంచివాడనే చెప్పుకుంటారు.

బాగా డబ్బు, హోదా, పలుకుబడి ఉన్నవాళ్ళలో కనిపించే గర్వంగానీ, దర్పంగానీ ప్రకాశరావులో బొత్తిగా కనిపించవు. పట్నంనుంచి ఊరికొచ్చినప్పుడల్లా ఆ ఊళ్ళో అందరితో ధనిక, పేద అన్న వ్యత్యాసం లేకుండా అందర్నీ చాలా ఆప్యాయంగా పలకరించేవాడు. అందరితోనూ చాలా కలపుగోలుగా ఉండేవాడు. అతనికి పేదవాళ్ళంటే ఒక ప్రత్యేకమైన అభిమానం ఉండేదని, ఏమాత్రం అవకాశం ఉన్నా వాళ్ళకు సహాయం చేస్తాడని సాంబయ్యకు బుచ్చయ్య ఎన్నోసార్లు చెప్పాడు.

సాధారణంగా ఉద్యోగాలిప్పించే వాళ్ళు ఎంతో డబ్బు తీసుకుని గాని ఉద్యోగా లిప్పించరు. అలాంటిది ప్రకాశరావు బుచ్చయ్యకు ఉద్యోగమిప్పించినందుకు ఒక్కపైసా కూడా తీసుకోలేదని తెలిసినప్పుడు ఆ వూళ్ళో అందరికీ ప్రకాశరావు మీదున్న గౌరవం ఇంకా ఎన్నో రెట్లు పెరిగింది.

సాంబయ్యకు చిన్నప్పట్నించి పల్లెటూరి జీవితం నచ్చేది కాదు. పొద్దుట్నుంచీ సాయంత్రం వరకూ పొలాల్లో రెక్కలు ముక్కలు చేసుకొని పనిచేసే వ్యవసాయ కూలీల జీవితం అంటే కూడా అతడు అసహ్యించుకునేవాడు. తన అమ్మా, నాన్నలాగా తను కూడా ఒక వ్యవసాయ కూలీగా మారకూడదని సాంబయ్య కొంచెం బుద్ధి తెలియగానే చాలా దృఢంగా నిర్ణయించుకున్నాడు.

సాంబయ్యకు యేడెనిమిదేళ్ళ వయస్సురాగానే వాళ్ళ తండ్రి అతన్నో పెద్ద రైతు దగ్గర పశువుల్ని కాయటానికి జీతం వుంచాడు. కాని సాంబయ్య ఆ పని రెండు మూడురోజుల కంటే ఎక్కువ రోజులు చెయ్యలేకపోయాడు. ఆ పన్లోంచి పారిపోయి స్కూల్లో చేరాడు. అతన్ని వాళ్ళ తండ్రి బారినుండి తల్లి రాజమ్మ రక్షించింది. ఆమె మొగుడితో పెద్ద గొడవపెట్టుకొని కొడుకుని స్కూల్లో వేసింది. ఆ స్కూల్లో పనిచేసే ఒక టీచరు సాండయ్య మీద జాలిపడి ఆ కుర్రాడ్ని తనింట్లోనే ఉంచుకుని చదివించాడు. ఆ టీచర్ బ్రహ్మచారి కావటంవల్ల ఇంటి పనులు చేసుకోవడంలో సాంబయ్య అతనికి తోడ్పడ్డాడు. మంచినీళ్ళ బావికెళ్లి మంచినీళ్ళు తెచ్చిపెట్టడం,

అంట్లు తోమటం, టీ చెయ్యటం, ఇల్లు ఊడ్వటం, వంట చెయ్యటం, బట్టలుతకటం మొదలైన పనులన్నీ చెయ్యటంవల్ల ఆ టీచర్ సాంబయ్యకు తిండి, బట్టలు, పుస్తకాలు మొదలైనవన్నీ సమకూర్చాడు.

సాంబయ్య యేడో తరగతి వరకు చదువుకున్నాక ఆ టీచర్‌కు ఆ ఊరినుండి ట్రాన్స్‌ఫర్ అయింది. కాని అతడు సాంబయ్యను వదిలెయ్యలేదు. సాంబయ్యను దగ్గర్లోనే వున్న సిటీకి తీసికెళ్లి ఎనిమిదవ తరగతిలో జాయిన్ చేయించటమే కాకుండా సోషల్ వెల్ఫేర్‌వాళ్ళ హాస్టల్లో కూడా అతనికి ఆశ్రయం కల్పించాడు.

సాంబయ్య అలా పదోతరగతి వరకు చదువుకున్నాడు. ఒకసారి ఫెయిలయినా, ఫెయిలయిన సబ్జెక్టులు రాసి రెండోసారి పాసయ్యాడు. సాంబయ్య ఆ తర్వాత కూడా చదవాలని ప్రయత్నించాడు. కాని అతనికి ఇంటర్మీడియెట్లో సీటు దొరకలేదు. ఈలోగా అతనికి బుచ్చయ్యతో పరిచయమైంది.

బుచ్చయ్య కూడా సాంబయ్యలాగే వ్యవసాయ కూలీల కుటుంబానికి చెందినవాడు. అతనిలాగే బుచ్చయ్యకూడా ఎన్నో అడ్డంకులు అధిగమించి పదో తరగతి పాసయ్యాడు. ప్రకాశరావును ఆశ్రయించి ఉద్యోగం సంపాదించాడు. దాంతో బుచ్చయ్య పరిస్థితి అద్భుతంగా మారిపోయింది. అతనికి కాస్త ఉన్నవాళ్ళే మంచి కట్నం ఇచ్చి కాస్త అందంగా ఉన్న అమ్మాయినే ఇచ్చిపెళ్ళి చేశారు. బుచ్చయ్య వెంటనే పట్నంలో కాపురం పెట్టేశాడు. చాలా మంచి బట్టలు వేసుకోవడం మొదలెట్టాడు. ఓ సైకిల్ కొనేశాడు. ఊళ్ళో అందరూ బుచ్చయ్యను ఎంతో గౌరవంగా చూడటం మొదలెట్టారు.

రెండుమూడు సార్లు సాంబయ్య సిటీలో బుచ్చయ్య అద్దెకుంటున్న ఇంటికివెళ్ళాడు. అతనికి ఆ ఇల్లు, ఆ వాతావరణం ఎంతో నచ్చింది. బుచ్చయ్య భార్య తనకు టీ తెచ్చిచ్చింది. అతని కళ్ళకు ఆ అమ్మాయి చాలా గొప్పింటి అమ్మాయిలా కనిపించింది. ఆ ఇంట్లో వున్న వస్తువుల్ని చూస్తే వాళ్ళు చాలా గొప్పవాళ్ళయి పోయారనిపించింది.

అకస్మాత్తుగా బుచ్చయ్య పరిస్థితి అంతగా మారిపోవటానికి కారణం అతనికి ఉద్యోగం దొరకటమేనని సాంబయ్యకు అర్థమైంది.

బుచ్చయ్యకు పెద్ద పనేం వుండదని కూడా సాంబయ్యకర్థమైంది. ఒకరి దగ్గరినుండి మరొకరి దగ్గరకు ఫైళ్ళు తీసుకుపోవడమే పని, నెలకు ఆరువందల రూపాయలు... ఆపైన కూడా కొన్ని దొరుకుతాయని బుచ్చయ్య సాంబయ్యకు చాలా గర్వంగా చెప్పాడు.

బుచ్చయ్యలాగే తనూ ఎన్నికష్టాలు పడైనా సరే ఉద్యోగం సంపాదించాలని సాంబయ్య దృఢంగా నిర్ణయించుకున్నాడు. తన చిన్నప్పటినుంచి తన అయ్యా అవ్వల్ని వాళ్ళతో పాటు పనిచేస్తున్న ఎంతోమంది వ్యవసాయ కూలీల్ని చూస్తున్నాడు. పది పదిహేనేళ్ళుగా వాళ్ళ పరిస్థితి ఏమీ మారలేదు. అవే గుడిసెల్లో ఉంటున్నారు. అవే బట్టలు కడుతున్నారు. అదే తిండి తింటున్నారు. అవే తిట్లు తింటున్నారు. తను కూడా వాళ్ళల్లో కలిసి పోకూడదు. తను ఆ పరిస్థితులనుంచి దూరంగా వెళ్ళిపోవాలి. మంచి ఇల్లు, బట్టలు, మంచి తిండి, అందమైన భార్య.... పదే పదే సాంబయ్య వీటిని గూర్చి కలలు గనటం మొదలెట్టాడు.

తన కలలు నిజంకావాలంటే తను ప్రకాశరావును మెప్పించాలి. అతని కరుణను సంపాదించాలి. అందుకే ఐదారునెలలుగా అతడు సాధ్యమైనన్నిసార్లు సిటీకెళ్ళి ప్రకాశరావును కలిసొస్తుండేవాడు. ఎప్పుడు వెళ్ళినా "చూద్దాం! ఇప్పుడైతే ఏం పోస్టుల్లేవు, వచ్చినప్పుడు చూద్దాం" అనేవాడు. అతను వెళ్ళినప్పుడల్లా ప్రకాశరావు భార్య చిల్లరమల్లర పనులు చాలా చెబుతుండేది. ఆమె చెప్పిన పనులన్నీ ఎంతో ఓపిగ్గా చేస్తుండేవాడు.

త్వరలోనే తన అదృష్టం ఫలిస్తుందని, సిటీకి రమ్మని ప్రకాశరావు పిలుపు త్వరలోనే వస్తుందని సాంబయ్య వెయ్యికళ్ళతో ఎదురు చూడసాగాడు.

ఈ మధ్య సాంబయ్యకు వాళ్ళ తండ్రి సమ్మయ్య పెద్ద సమస్యయిపోయాడు. మొదట్లో తన కొడుకు అంతో ఇంతో చదువుకున్నాడు. కాబట్టి ఏదన్నా ఉద్యోగం దొరుకుతుందేమో ననుకునేవాడు సమ్మయ్య. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ అతనిలో ఆ నమ్మకం సడలి పోసాగింది.

సాంబయ్య యే పనీచేయకుండా ఊరికినే కూర్చుని తినటాన్ని, ఇష్టమొచ్చినప్పుడల్లా సిటీకి వెళ్ళిరావటాన్ని సమ్మయ్య సహించలేకపోయాడు. అతనికి కోపమొచ్చినప్పుడు అతని నోటి వెంట బూతు మాటలు ప్రవాహంలా వెలువడేవి. తండ్రి తిట్టే ఆ తిట్లకు సాంబయ్య బాధతో విలవిల్లాడిపోయేవాడు. అతని రక్తం వేడెక్కి సలసలా మరిగిపోయేది. ఆవేశంతో ఉక్కిరిబిక్కిరై పోయాడు. ఒక్కొక్కసారి ఆ తండ్రికి ఎదురు తిరిగి చితక బాదాలనిపించేది. కాని తనను తాను కంట్రోల్ చేసుకొని వెంటనే ఇంట్లోంచి బయటకెళ్ళిపోయేవాడు. సాధ్యమైనంతవరకు తండ్రిని తప్పించుకొని తిరగటం అలవాటు చేసుకున్నాడు.

★ ★ ★

పంచాయతీ బోర్డు ఆఫీసు దగ్గర గుమిగూడిన ఆ ఊరి యువకులంతా ఒక్కొక్కరే వాళ్ళవాళ్ళ ఇళ్లవైపు వెళ్ళిపోసాగారు. సాంబయ్యక్కూడా ఇంటి కెళ్ళాలనిపించింది. రేడియోలో ఇంగ్లీషు వార్తలొస్తున్నాయి. తొమ్మిదిగంటలై పోయింది.

"అయ్య గిప్పటిదాకా మేల్కతోనుండడు. ఎప్పుడో నిద్రపోయుంటడు" అనుకొని సాంబయ్య లేచి ఇంటివైపు బయలుదేరాడు. వాళ్ళ గుడిసె ముందున్న తడకను తోసుకుని లోపలకెళ్ళగానే వాళ్ళమ్మ బయటకొచ్చి గుసగుసగా చెప్పింది.

"నిన్ను ప్రకాశరావు దొర రమ్మన్నడట్రా..."

ఆ మాట వినగానే సాంబయ్యకు ఎగిరి గంతెయ్యాలన్నంత ఉత్సాహం కల్గింది.

"ఎవరొచ్చి చెప్పిండ్రే?" అన్నాడు సాంబయ్య.

"వాళ్ళ జీతగాడు రాముడొచ్చి చెప్పిండు. నువ్వు గప్పుడే బయటికి పోతివి."

ప్రకాశరావు దగ్గర్నుంచి తనకు పిలుపొస్తున్నప్పుడే తను ఇంట్లో లేకపోయినందుకు సాంబయ్యకు తన మీద తనకు విపరీతమైన కోపమొచ్చింది. ఎంతకాలంగానో ఊపిరి బిగపట్టుకొని ఎదురుచూస్తున్న ఆ మహదవకాశం వచ్చినట్టే వచ్చి తనకందకుండా పోతుందేమోనని వణికిపోయాడతడు. వెంటనే ప్రకాశరావింటికి బయల్దేరాడు.

"గింత రాత్రిపూటేంబోతవురా. .సొద్దుగాల పోదువులే" అంటున్న వాళ్ళమ్మ మాట వినిపించుకోకుండానే అతడు బజార్లోకి వెళ్ళి పరుగెత్తుతున్నట్లుగా నడవ సాగాడు.

తనకు తెలుసు.... ప్రకాశరావుగారింట్ల పొద్దుగూకంగనే పండుకోరు. పదింటిదాకా వాళ్ళింట లైట్లు వెలుగుతూనే వుంటయి.

సాంబయ్య లోపల అడుగుపెట్టగానే బయట హాల్లో కూర్చుని తన బావలతోను, చెల్లెళ్ళతోను మాట్లాడుతున్న ప్రకాశరావు కనిపించాడు. చాలామంది బంధువులతో ఇల్లంతా చాలా సందడిగా వుంది.

సాంబయ్యను చూడగానే ప్రకాశరావు వాళ్ళ మధ్యలోంచి లేచి బయటకొచ్చాడు. సాంబయ్య వెంటనే అతనికి నమస్కారం చేశాడు.

"యేంరా సాంబా! బాగున్నావా?" అన్నాడు ప్రకాశరావు.

బాగానే వున్నట్టుగా తలూపాడు సాంబయ్య.

"చాలా సేపట్నుంచి నీకోసమే చూస్తున్న.. ఇంట్లో లేవటకదా.. ఎక్కడికెళ్ళావ్?"

'గప్ప "ఈ నాయటికి బోయిన దొరా....."

కాస్సేపు నిశ్శబ్దం. ప్రకాశరావు యేం చెబుతాడో విందామన్న ఆతురతతో అతని కళ్ళు అతి వేగంగా కొట్టుకోసాగాయి.

"నీ ఉద్యోగం గురించి చాలా ప్రయత్నం చేస్తున్నానురా! యూనివర్సిటీలో వీసీకి, రిజిస్ట్రారుకు చెప్పిపెట్టాను. ఈ మధ్యనే రెండుమూడు అటెండరు పోస్టులు వస్తున్నాయని చెప్పారు. అవి యే క్షణమైనా రావచ్చు. తీరా అవి వచ్చినప్పుడు నేను సిటీలో లేకపోవడం... నీకు కబురు చెయ్యకపోవటంలాంటి పరిస్థితి ఏర్పడటం జరిగితే నువ్వు చాలా బాధపడిపోతావ్ . అందుకని నువ్వొకపని చెయ్యి. రేపు నువ్వు కూడా మాతోబాటే సిటీ కొచ్చేసి మా ఇంట్లోనే ఉండు. ఎప్పుడు అవకాశమొస్తే అప్పుడు నిన్ను యూనివర్సిటీలో పెట్టిస్తా...." అన్నాడు ప్రకాశరావు.

సాంబయ్య తన చెవుల్ని తాను నమ్మలేకపోయాడు. తను యెదురుచూస్తున్న మహత్తర క్షణం ఇంత త్వరగా వస్తుందని అతడు ఊహించలేదు. తను జరుగుతుందని ఆ శిస్తున్న ఆ మహోద్భుతం ఇంత త్వరగా జరుగుతుందని అతడు అనుకోనూలేదు. వెర్రి ఆనందంతో పొంగిపోతున్న అతని నోటినుండి మాటలు రావటం లేదు.

"యేరా... మాట్లాడవు. రేపు మాతోపాటే సిటీకొస్తావా? లేదా? నీ ఇష్టం.. ఇందులో బలవంతం యేమీ లేదు..." అన్నారు ప్రకాశరావు.

"గట్లంటరేంది దొరా! గిన్ని రోజుల్నించి నేను మీ పిలుపుకోసమే ఎదురు చూస్తుంటిని. మీరు రమ్మనంక రాకపోవుడుంటదా? గిప్పుడు రమ్మంటే గిప్పుడే వస్త" అన్నాడు సాంబయ్య.

"ఇప్పుడెందుగ్గానీ.... రేపు పొద్దున్నే ఆరుగంటలవరకు తయారై రా పో.. నీకు ఉద్యోగం దొరికేంతవరకు మా ఇంట్లోనే ఉందువు గానీ, మాతో బాటే నువ్వూ ఇంత తిందువుగానీ... నీ ఒక్కడికి ఇంత తిండి పెట్టడం మాకేమంత సమస్యకాదులే...." అన్నాడు ప్రకాశరావు.

ఆ క్షణంలో ప్రకాశరావు సాంబయ్యకు సాక్షాత్ శ్రీకృష్ణ పరమాత్ముడిలా కనిపించాడు. అతని నీడలో చేరిన తనకిక ఎలాంటి కష్టమూ రాదనుకున్నాడు.

"కోడి కూయంగనే లేచొస్త దొరా" అంటూ సాంబయ్య వాళ్ళింటివైపు బయల్దేరాడు.

సాంబయ్య ఇంటికెళ్ళి పక్కమీద పడుకున్నాడే గానీ నిద్రపోలేకపోయాడు. అతని భావిజీవితం అతనికి సప్తవర్ణాలతో దేదీప్యమానంగా వెలిగిపోతూ కనిపించసాగింది. ఎన్నో కలలు అతని కళ్ళల్లో ప్రమిదల్లా వెలిగిపోసాగాయి. అర్ధరాత్రి దాటితేగాని అతనికి నిద్రపట్టలేదు.

★ ★ ★

కోడికూస్తుండగానే లేచాడు. వాళ్ళమ్మతో ప్రకాశరావు దొర తనను రమ్మన్నాడని, ఉద్యోగం ఇప్పిస్తానన్నాడని చెప్పేసి, ఓ చిన్న సంచీలో తన బట్టలు సర్దేసుకుని ప్రకాశరావింటికి పరుగెత్తాడు.

సాంబయ్య ప్రకాశరావింటికి చేరకునేప్పటికి వాళ్ళు గూడ్సుక్కర్రే లేచి ప్రయాణానికి సన్నద్ధులౌతూ కనిపించారు. సాంబయ్య కనిపించగానే ప్రకాశరావు చెల్లెళ్ళు చిన్న చిన్న పనులు చెప్పడం మొదలెట్టారు. సాంబయ్య చాలా ఉత్సాహంగా వాళ్ళు చెప్పిన పనుల్ని చెయ్యసాగాడు.

వాళ్ళందరి మాటలు వింటోంటే సాంబయ్యకు వాళ్ళంతా ఒకేసారి ఎందుకొచ్చారో, ఎందుకు పట్నం వెళుతున్నారో అర్థమైంది. ప్రకాశరావు తండ్రి గోవిందరావుకు జబ్బు చేసింది. అతన్ని వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్ళాలని నిర్ణయించారు.

గోవిందరావుకు ఎనభై ఎళ్ళయినా పుంటాయేమో. అంత వయసొచ్చినా మొన్నటి దాకా అతడెంతో ఆరోగ్యవంతుడిలా కనిపించేవాడు చక్కగా నడుస్తూ వాళ్ళ పొలాల దగ్గరకు వెళ్ళొస్తుండేవాడు. ఒకప్పుడు ఆ ఊరినంతా ఒక చక్రవర్తిలా పరిపాలించిన గోవిందరావునుచూస్తే ఆనాటివాళ్ళు ఈనాటిక్కూడా హడలిపోయేవాళ్ళు. అంతటి మనిషి ఈ రోజు యేదో తీవ్రమైన జబ్బు చేసి నిశ్చలంగా పక్కమీద పడిపోవటంతో ఆ ఊళ్ళో ముఖ్యమైన వాళ్ళంతా అతన్ని చూడటానికొచ్చారు.

ఏడుగంటలౌతుండగా ప్రకాశరావింటికి సిటీనుంచి ఒక వ్యాన్ వచ్చింది. దాంట్లోకి మొట్టమొదట గోవిందరావును ఎక్కించారు. ఆ తర్వాత ప్రకాశరావు వాళ్ళ బంధువులంతా ఒకరి తర్వాత ఒకరు ఎక్కి కూర్చున్న తర్వాత ప్రకాశరావు సాంబయ్యను చూసి నువ్వు కూడా వెనకాల ఎలాగో సర్దుకుని కూర్చోరా అన్నాడు. సాంబయ్య అతికష్టంగా ఆ వ్యాన్లో ఇరికాడు.

గోవిందరావు కూతుళ్లు కన్నీళ్ళు పెట్టుకోవడం చూస్తే ఆయన కొచ్చిన జబ్బు ప్రమాదకరమైందే ననిపించింది. ఆయన్ను హాస్పిటల్లో జాయిన్ చేస్తే వచ్చేపోయే బంధువులతో చాలా హడావిడిగా వుండే ప్రకాశరావుగారికి తనను గూర్చి ఆలోచించే టైమ్ దొరుకుతుందా. ఈ సందడిలో ఆయనకు తన ఉద్యోగం విషయం గుర్తుంటుందా" అన్న సందేహం కలిగింది సాంబయ్యకు.

అరగంటలో వ్యాన్ సిటీ చేరుకొని ప్రకాశరావు ఇంటిముందు ఆగింది. అందరూ కలిసి గోవిందరావును కిందకు దించి ఇంట్లోకి తీసుకెళ్ళి పక్కమీద పడుకోబెట్టారు.

డాక్టర్‌ని తీసుకొస్తానని ప్రకాశరావు అదే వ్యానెక్కి బయటకెళ్ళాడు.

మళ్ళీ ఇంట్లో అందరూ సాంబయ్యకు తలా ఒక పని చెప్పటం మొదలుపెట్టారు.

"అరే సాంబయ్యా! నా సూట్‌కేసెక్కడుందో చూడ్రా" అని ఒకరంటే, "నేను స్నానం చేయాలి బాత్‌రూమ్‌లో నీళ్ళు పెట్రా" అని మరొకరు.

సాంబయ్య అందరి పనులు చకచకా చేసెయ్య సాగాడు. ఇంతలో ప్రకాశరావు భార్య సాంబయ్యని పిలిచి "మొదలు వంటపని చూడాలిరా! నువ్వు వెంటనే మార్కెట్టుకు వెళ్ళి ఈ కూరగాయలు పట్టుకురావాలి!" అని అతని చేతిలో కొంతడబ్బు పోసి ఓ లిస్టు చేతికిచ్చింది.

కూరగాయలు తెచ్చివ్వగానే అందరికీ టిఫిన్లు, కాఫీలు అందించే పని తగిలింది.

ఈలోగా ప్రకాశరావు డాక్టర్ను తీసుకొచ్చాడు. డాక్టర్ చాలాసేపు గోవిందరావును పరీక్ష చేసి "ఈయనను వెంటనే హాస్పిటల్లో అడ్మిట్ చేయాలి" అని సలహా ఇచ్చాడు.

గోవిందరావును మళ్ళీ వ్యాన్ ఎక్కించారు. వ్యాన్ స్టార్టవుతోంటే "సాంబయ్యా! నువ్వుకూడా రా" అన్నాడు ప్రకాశరావు. సాంబయ్య వెంటనే వ్యానెక్కేశాడు.

అక్కడికి దగ్గరలోనే ఉన్న ఒక ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో గోవిందరావును చేర్పించారు.

గోవిందరావును బెడ్‌మీద పడుకోబెట్టాక ప్రకాశరావు సాంబయ్యను పక్కకు పిలిచి చెప్పాడు.

"ఒరేయ్ సాంబయ్యా! నీ ఉద్యోగం విషయం నేను చూస్తాను గానీ నువ్వు మాకో సహాయం చెయ్యాలి. నాన్నగారికి ఈ వయసులో పక్షవాతం వచ్చింది. ఆయన కదల్లేకుండా పడిపోయాడు. ఇరవై నాలుగు గంటలు కంటికి రెప్పలా ఆయన్ని నువ్వే కనిపెట్టుకు ఉండాలి."

సాంబయ్యకు ఆ హాస్పిటల్‌లోని వాతావరణాన్ని చూస్తే చాలా భయమేసింది. రకరకాల జబ్బులతో బాధపడుతున్న ఆ రోగుల్ని చూస్తే అతని తల తిరిగినట్టయింది. కానీ తను ప్రకాశరావు మాట కాదనటానికి వీల్లేదు. ఆయనిప్పుడు తనను నిప్పుల్లో దూకమన్నా కళ్ళు మూసుకొని నిస్సంకోచంగా దూకాల్సిందే.

"నేను రేపే మరోసారి మా వైస్ ఛాన్సలర్‌తో నీ విషయం మాట్లాడతాను. నీకు ఉద్యోగం తప్పకుండా దొరుకుతుంది...డోంట్ వర్రీ....." అన్నాడు ప్రకాశరావు.

"మీమేలు ఈ జన్మలో మరువ...." అంటూ చేతులు జోడించాడు సాంబయ్య.

ప్రకాశరావు వాళ్ళ నాన్న దగ్గరికెళ్ళి "మీ దగ్గర సాంబడుంటాడు. మీకేం అవసరమున్నా వాడికి చెప్పండి. మనవాళ్ళు కూడా ఎప్పుడూ ఎవరో ఒకరు మీ దగ్గరకు వస్తూనే వుంటారు" అన్నాడు.

"డాక్టర్ ఏమన్నాడు?" అన్నాడు గోవిందరావు.

"కొన్ని రోజులు మందులు వాడితే తగ్గిపోవచ్చు అన్నాడు. మీరు ధైర్యంగా ఉండండి" అంటూ ప్రకాశరావు వెళ్ళిపోయాడు.

ఆ క్షణంనుండి సాంబయ్యే ఆ వృద్ధుడికి సర్వస్వమైపోయాడు. అనుక్షణం చంటి పిల్లాణ్ణి చూసుకున్నట్టుగా సాంబయ్య ఆ వృద్ధున్ని చూసుకుంటూ అతని అవసరాల్ని తీర్చాడు.

పొద్దున్నే అతన్నిలేపి కూర్చోబెట్టి మొఖం కడిగించి పాలు తాగించి, మూతి కడిగి పడుకోబెట్టేవాడు. అతడు ఉమ్మేస్తానన్నపుడు ఉమ్మిపాత్ర అందించేవాడు. ఒక్కొక్క బుక్క అన్నం తినిపించేవాడు. నర్స్ చెప్పిన ప్రకారంగా మందులందించే వాడు. అతన్ని చూడటానికొచ్చే వాళ్ళందరి పనులు చేసిపెట్టేవాడు. గోవిందరావుకు తెచ్చే అన్నంతోబాటే సాంబయ్యక్కూడా అన్నం తెచ్చేవాళ్ళు. ఆ రోగుల మధ్య సాంబయ్యకు అన్నం రుచించేది కాదు. రోజూ అర్ధాకలితో ఆ వృద్ధుడి మంచం పక్కనే నేలమీద పడుకునేవాడు. కాని ఆ వృద్ధుడు అతన్ని ఎంతోసేపు పడుకోనిచ్చే వాడు కాదు.. "సాంబా! సాంబా!!" అంటూ పిలిచి ఏదో పని పురమాయించేవాడు. అతడు చెప్పే కొన్ని పనులు చేసేటప్పుడు సాంబయ్యకు తనమీద తనకు విపరీతమైన అసహ్యమేసేది.

గోవిందరావుకు మూత్రం వచ్చినప్పుడు మూత్రంపోసే క్యాన్ అందించమనే వాడు. మంచం కిందున్న ఆ క్యాన్ తీసి దాంట్లో అతడు మూత్రం పోసేటట్టుగా సాంబయ్యే పట్టుకోవాలి. గోవిందరావు మూత్రం పోశాక దాన్ని తీసికెళ్ళి బయట లెట్రిన్‌లో పారబోసి, శుభ్రం చేసుకొని తీసుకురావాలి.

మొదటిసారి ఈ పని చెయ్యాల్సివచ్చినపుడు అతడికి వెంటనే ఆ హాస్పిటల్లోంచి పారిపోవాలనిపించింది. ఉద్యోగం ఆశలోపడి తనను తాను ఇంతగా దిగజార్చి వేసు కుంటున్నందుకు అతడు తనను తాను క్షమించుకోలేకపోయాడు. కానీ అతడు తనను తాను సమాధానపరుచుకునేవాడు.

ఒక్క నాలుగు రోజులు కష్టపడితే తన జీవితం మారిపోతుంది. తను సుఖంగా బతుకుతాడు. తన కలలన్నీ నిజమౌతాయి. తను ఆవేశపడకూడదు. నోటిదాకా వచ్చిన అన్నం ముద్దను కాలదన్నుకోకూడదు..

కాని తను కోరుకుంటున్నది సాధించడానికి ఇంకా ఎంత భయంకరమైన పనులు చేయాల్సివస్తుందో అతడు ఊహించలేకపోయాడు.

గోవిందరావు హాస్పిటల్లో చేరిన రెండో రోజు అర్ధరాత్రి తన బెడ్‌పక్కనే నిద్రపోతున్న సాంబయ్యను...

"అరేయ్ సాంబా" అంటూ గావుకేక పెట్టి లేపాడు.

యేదో పెద్ద ప్రమాదం జరుగుంటుందని సాంబయ్య దిగ్గున లేచి "యేంది దొరా" అన్నాడు.

"నేను దొడ్డికి పోవాల్రా" అన్నాడు ముసలాయన.

కాళ్ళు చేతులు పడిపోయి కదల్లేకుండా వున్న ఆ భారీవిగ్రహం లేచి దొడ్డిదాకా ఎలా వెళ్తుందో సాంబయ్యకర్థం కాలేదు.

"కదల్లేరు గద.. దొడ్డికెట్ల బోతరు?" కళ్ళు నులుముకుంటూ అన్నాడు సాంబయ్య.

"గక్కడ నర్సుంటది. మా దొరకు దొడ్డికొస్తాంది. యేమన్న ఇస్తరా అని అడిగి తీసుకు రాపో. అన్ని తెచ్చిన్రు గని బెడ్‌పాన్ తేలే. నర్సును అడుగు పో.. ఇస్తది" అన్నాడు గోవిందరావు.

సాంబయ్యకు అతడు చెప్తున్నదేమిటో అర్థం కాలేదు. అందుకే కదలకుండా అలాగే కూర్చున్నాడు.

"ఇంక గట్లనే కూర్చున్నావేందిరా గాడిదకొడకా! దబ్బునపోయి బెడ్‌పాన్ అడుక్కరా పో" కసిరాడు ముసలాయన.

"ముసిలోడికి ఇంకా కోపం బాగనే ఉన్నది. చింత చచ్చినా పులుపు చావలే" అనుకుంటూ సాంబయ్య లేచి ఆ వార్డు చివర్లో టేబుల్‌మీద తలపెట్టుకుని నిద్రపోతున్న నర్స్ దగ్గరి కెళ్ళాడు.

"సిస్టర్...సిస్టర్"

ఆమె లేచి యేమిటన్నట్టు చూసింది.

"గా 14వ నెంబరు పేషెంటు. .దొడ్డికి బోతడట."

'దొడ్డికి పోతే తీసుకుపో.... నన్నేం చెయ్యమంటావు?' అందామె విసుక్కుంటూ.

"ఆయనకు కాళ్ళు చేతులు పడిపోయినయి.... లేవలేరు."

"అయితే బెడ్‌పాన్ పెట్టు."

"గది మీరియ్యుండ్రి"

"మేమియ్యం....దాన్ని మీరే తెచ్చుకోవాలి"

"రేపు మా దొరకు చెప్పి తెప్పిస్త... ఇప్పుడొకసారికి మీరియ్యుండ్రి"

"అర్ధరాత్రి భలే న్యూసెన్స్ తెచ్చిపెట్టావే... పెరాలసిస్ పేషెంటుకు బెడ్‌పాన్ అవసరముంటుందని మీ దొరకు తెలియదా? బుద్ధిలేదు" అందామె కోపంగా.

"అరె సాంబా! దబ్బున రా .రా" నిద్రపోతున్న పేషెంట్సందరూ లేచేంత బిగ్గరగా అరిచాడు గోవిందరావు.

"పెద్ద దొర పిలుస్తాండు.. కాస్త సూసియ్యండి సిస్టర్" అన్నాడు సాంబయ్య.

"న్యూసెన్స్.. అర్ధరాత్రి భలే న్యూసెన్స్... ఛీ ఛీ!" ఆమె చాలా విసుగ్గా లేచి బెడ్‌పాన్ తెచ్చి అతని చేతికిచ్చింది.

"దీన్ని మళ్ళీ శుభ్రంగా ఫినాయిల్ పోసి కడిగివ్వాలి. తెలిసిందా?"

"అలాగే" నన్నట్టు తలవూపి గోవిందరావు బెడ్ దగ్గరకు నడిచాడు. తెచ్చాడేగాని దాన్ని ఎలా ఉపయోగించాలో సాంబయ్యకు అర్థం కాలేదు.

"గట్ల చూస్తావేందిరా.. దాన్ని నా ముడ్డి కింద పెట్టు" అరిచాడు ముసలాయన.

అతని నడుంపట్టుకొని పైకి లేపి అతడు చెప్పినట్టుగా చేశాడు. సాంబయ్య ఆ దృశ్యాన్ని చూళ్ళేకపోయాడు. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

తన జీవితంలో తను ఇలాంటి పని చెయ్యాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు.

తనక్కన్నించి వెంటనే పరుగెత్తుకుని బయటకు వెళ్ళిపోవాలి. ఇంత నీచమైన పనిచేసే కంటే తను వెంటనే చచ్చిపోవడం మేలు.. కాని తను యేమీ చెయ్యలేదు. తనక్కూడా పక్షవాతం వచ్చింది. తన కాళ్ళూ చేతులు పడిపోయాయి. తన శరీరంలోని రక్తమాంసాలు గడ్డకట్టుకు పోయాయి. అసలు తనే చచ్చిపోయాడు. కేవలం తన శవంమాత్రం మిగిలి ఆ ముసలాయనికీ పనులన్నీ చేసి పెడ్తోంది...

"గట్ల గుడ్లు మిటకరించి చూస్తున్నవేందిరా నీళ్ళు తెచ్చి కడిగి దీన్ని తీసెయ్" అన్నాడు ముసలాయన.

మారు మాట్లాడకుండా పైప్ దగ్గరికెళ్ళి నీళ్ళు తెచ్చి అతని ముడ్డి కడిగాడు..

"గదేం కడుగుడ్రా.... మంచిక్కడుగు" కోపంగా అన్నాడు గోవిందరావు.

సాంబయ్య ముక్కు మూసుకుని ఆ బెడ్‌పాన్ పట్టుకెళ్ళి లెట్రిన్‌లో గుమ్మరించేసి దాన్ని పైప్ కింద పెట్టి శుభ్రం చేసి దాన్ని తెల్లావారాక ఆమె కిచ్చేద్దామని తెచ్చి బెడ్‌కింద పెట్టాడు.

ముసలాయన హాయిగా నిద్రపోతున్నాడు.

కాని సాంబయ్య నిద్రపోలేకపోతున్నాడు.

తననీ దవాఖానాలో ఎవరో బంధించారు. తనకాళ్ళూ చేతులు విరగ్గొట్టి తన రక్తమాంసాల్ని పిండేసి తననో కదుల్తున్న శవంగా మార్చేసి అక్కడుంచారు? ఈ చెరలోంచి తనకిక విముక్తి లేదు...ఈ ముసలాడితోటే తనూ చచ్చిపోతాడు. తప్పదు.

లేదు...లేదు... అలా జరగదు. ఇంకొక్క నాలుగు రోజులుంటే తనకీ చెర వదులుతుంది. తన కష్టాలన్నీ తీరిపోతాయి. తన జీవితం ఒక అద్భుతమైన మలుపు తిరుగుతుంది. తనకిప్పుడు కావాల్సింది ఓపిక. భూదేవికున్నంత ఓపిక కావాలి. తనిప్పుడు ఎంత చిన్న పొరపాటు చేసినా నోటిదాకా వచ్చిన అమృతం విషమైపోతుంది. తనను బాగా చూడటం లేదని ఈ ముసలాయన కొడుక్కు చెప్పాడంటే తన బతుకు బండలైపోతుంది. తను ఆ పరిస్థితి తెచ్చుకోకూడదు.

★ ★ ★

ఆ మర్నాడు ప్రకాశరావు రాగానే రాత్రి జరిగిన విషయం చెప్పాడు. ఆయన వెంటనే ఎవరినో పంపించి బెడ్‌పాన్ తెప్పించాడు.

"నీచేత ఇట్లాంటి పనులు చేయిస్తున్నందుకు చాలా విచారిస్తున్నారా సాంబయ్యా ఏమీ అనుకోకు. ఆయన నీక్కూడా తండ్రే అనుకో.. నీ కష్టం ఊరికే పోదు. ఒక్క నాల్గురోజులు ఓపిక పట్టు. నీకు తప్పకుండా ఉద్యోగం ఇప్పిస్తా" అన్నాడు ప్రకాశరావు.

"మంచిద్దొరా!" అన్నాడు సాంబయ్య.

★ ★ ★

ఆ నాల్గురోజులు ఎనిమిది రోజులయ్యాయి. నెలరోజులయ్యాయి. రెండు నెలలయ్యాయి. మూడు నెలలయ్యాయి. కాని సాంబయ్యకు విముక్తి దొరకలేదు.

ప్రకాశరావు, అతని చెల్లెళ్ళూ, అతని భార్య అందరూ హాస్పిటల్ కొచ్చిపోతూనే ఉన్నారు.

ఉద్యోగ విషయం అడిగినప్పుడల్లా 'నాలుగు రోజులు ఓపిక పట్టు... తప్పకుండా ఇప్పిస్తాన" ని ప్రకాశరావు అంటూనే వున్నాడు. ఒక్క నాలుగు రోజులు గడిస్తే తనకీ చెర వదులుతుందని సాంబయ్య తనను తాను సమాధాన పరుచుకుంటూనే వున్నాడు. గోవిందరావుకు అన్నీ తానే అయిపోయి తనీ పనులు చెయ్యగలనని కలలో కూడా ఊహించని పనులన్నీ అతనికి చేసిపెడ్తూనే ఉన్నాడు.

మూడు నెలల తర్వాత గోవిందరావు పరిస్థితి విషమించింది. ఓ రోజు ఉదయం ఆయనకున్న ముఖ్యమైన బంధువులందరి సమక్షంలోనే శాశ్వతంగా కన్ను మూశాడు.

అతని శవాన్ని వ్యాన్‌లో వేసుకుని వాళ్ళ ఊరు తీసుకెళ్ళారు.

అతని అంత్యక్రియలు చాలా బ్రహ్మాండంగా జరిగాయి. వచ్చేపోయే బంధువులతో ఆ ఊరంతా నిండిపోయింది.

11వ రోజు ఉదయం ఆయన కర్మకాండ జరుగుతున్నప్పుడు పట్నంనుంచి ప్రకాశరావు మిత్రులు చాలామందొచ్చారు. ఐదారు కార్లొచ్చాయి. జీపులొచ్చాయి. వ్యాన్‌లొచ్చాయి. పెద్ద పెద్ద పార్టీలు జరిగాయి.

అన్ని రోజులూ సాంబయ్యకు రోజూ రెండు మూడు గంటలు కూడా విశ్రాంతి దొరకలేదు. అంతటా తానే అయి అందరికీ అన్ని పనులూ చేసిపెట్టాడు.

గోవిందరావు చనిపోయి పన్నెండు రోజులు గడిచాక బంధువులంతా వాళ్ళవాళ్ళ ఊర్లకు బయల్దేరారు. ప్రకాశరావు కూడా సిటీకి బయలుదేరాడు.

సాంబయ్య తననుకూడా సిటీకి రమ్మంటాడనుకొని అన్నీ సర్దుకొని రెడీగా ఉన్నాడు.

వ్యాన్ యెక్కబోతున్న ప్రకాశరావు సాంబయ్యను చూసి ఆగిపోయాడు. "యేరా.. సాంబయ్యా... నువ్వు కూడా వస్తున్నావా?" అన్నాడు.

"శ్లాను దొరా! రావాలెగదా!!" అన్నాడు సాంబయ్య.

"ఆఫ్ కోర్స్! రావాలనుకో. కానీ ఇప్పుడవసరం లేదు. నాలుగు రోజులు పోయాక వద్దువుగానీ... నిన్న ఇక్కడకు వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్.... అందరూ వచ్చారు. నీ విషయం గుర్తు చేశాను. రెండు అటెండర్ పోస్టులు వెళ్ళాయట. కానీ యేం లాభం! అవి రెండూ షెడ్యూల్డు కాస్ట్ వాళ్ళకే కేటాయించారట! నువ్వు షెడ్యూల్డు కాస్ట్ కాదుగదా?" అన్నాడు ప్రకాశరావు.

తన నెత్తిమీద యేదో పెద్ద రాతి బండ పడ్డట్టు... మెత్తని కత్తితో ఎవరో తన తలను నరికేస్తున్నట్టు.. తనకాళ్ళూ చేతులూ కట్టేసి తన నెవరో బావిలో ముంచేస్తున్నట్టు తన కళ్ళల్లో ఎవరో కారం చల్లుతున్నట్టు.....

సాంబయ్య నోట్లోంచి మాట రావడం లేదు...యే క్షణంలోనైనా తన కాళ్ళు పట్టు దప్పిపోయి తను అక్కడికక్కడే భూస్థాపితం అయిపోవచ్చు ననిపించిందతనికి.

"పోనీయ్.. నువ్వు ఒక పని చెయ్యగలుగుతావా?" అన్నాడు ప్రకాశరావు.

యేమిటన్నట్టు చూశాయి సాంబయ్యకళ్ళు

"నువ్వో షెడ్యూల్డు కాస్ట్ సర్టిఫికెట్ సంపాదించగలవా?'

దింపుడు కళ్ళెం ఆశంటే ఇదేనేమో అనిపించింది సాంబయ్యకు

"దొంగ సర్టిఫికెట్ నాకెందుకు దొరా!" అన్నాడు కన్నీటితో కంఠం పూడుకు పోతోంటే..

"ఎందుకలా బాధపడిపోతున్నావురా! ధైర్యంగా ఉండు. ఒక్క నాలుగు రోజులు ఓపిక పట్టు. ఈసారి అటెండర్ పోస్టులు వెళ్ళినపుడు నీకు తప్పకుండా ఇప్పిస్తా. ఈలోగా ఊళ్ళో ఏదన్నా పనిచేసుకో! నీలాంటి ఏబుల్ బాడీడ్ యంగ్‌మ్యాన్‌కు పని దొరకక పోవటమేమిటి?" అన్నాడు ప్రకాశరావు వ్యానెక్కుతూ...

మరుక్షణంలో వ్యాన్ స్టార్టయి వెళ్ళిపోయింది.

ప్రకాశరావు మాటలు సాంబయ్య బుర్రలో మార్మోగుతుంటే అతని కళ్ళకు చీకట్లు కమ్ముతుంటే పొలాలవైపు కదిలిపోతున్న కూలీలు కనిపించారు.

వాళ్ళళ్ళో చేరిపోవటమో.. లేక పట్నం వెళ్ళి యే లారీకిందనైనా పడి శాశ్వతంగా ఈ భూలోకానికి గుడ్ బై చెప్పెయ్యటమో... వెంటనే తేల్చుకోలేకపోయాడు సాంబయ్య....

● ఆంధ్రజ్యోతి వారపత్రిక - 1987 ●

# 51. గంగజిమ్మ

♦ సాహు ♦

పచ్చగా ఒక గీత గీసినట్లు కన్పిస్తున్నది ఆవలివడ్డు – బీరమాయ గుట్ట కింది ప్రదేశం. గోదావరి నది ఇక్కడ ఆవలి వడ్డుకు ఈవలి వడ్డుకు నడుమ దాదాపు మైలున్నర దూరం వుంటుంది. బీరమాయ గుట్టకు కుడిచేతివైపు వరుసగా మద్దిగూడెం, గంగపల్లి, రాళ్ళపేట వూర్లు వున్నాయి. ఈవలి వడ్డుమీద నుండి చూస్తే ఆ గ్రామాలు బొమ్మరిళ్ళలాగా కనిపిస్తున్నాయి. గట్టుమీది నుండి పోయే తోవకటీటు (దారికి అటు ఇటు ప్రక్కన) పల్సగా వున్న చెట్లు – దిట్టంగా (దట్టంగా, ఒత్తుగా) పెరిగిన అడివి మధ్యన తోవ వున్నట్లు సాటి చెప్పుతున్నై.

ఇక్కడ గోదావరి పెద్ద మలుపు తిరిగింది. పడమటి నుండి వస్తున్న గోదావరి ఎగువన మూడు మైళ్ళు పైకి పోతే వూరెన్క గుట్ట, దుర్గం గుట్టలు రెండు దిక్కుల నుండి అడ్డం వచ్చినందుకు ఇరుకులో (సన్నము) పడి ఉత్తరం వైపు తిరిగి ఈ బీరమాయ గుట్టకు తాకి మళ్ళీ దక్షిణానికి మరలింది గోదావరి. వానాకాలంలో దుర్గం గుట్ట, ఊరెన్క గుట్టల నడుమ పెద్ద పెద్ద సుడులు తిరుగుతుంటై.

ఐతే ఈ సలికాలంలో గోదావరి నీరు తగ్గి సగమే పారుతుంది. దుర్గం గుట్టకు, బీరమాయ గుట్టకు నడుమ పెద్ద మడుగు (నీటిగుంట) ఇప్పుడే కాదు ఎండాకాలంలో కూడా అంతే లోతువుంటుంది. ఈ మాగిలో (చలికాలము) పొద్దుగాల బీరమాయ గుట్టమీంచి సూర్యుడు మీదికి ఏస్తుంటే ఆ వెలుగు గోదావరి నీళ్ళలో పడినప్పుడు ఆ నీళ్ళు అద్దంలాగా మెరుస్తుంటాయి.

గోదావరి బీరమాయకు తాకి దక్షణానికి తిరిగిన కాడ (వద్ద) ఈవలి వడ్డుకు అడివి నిటారుగా దిగిపోయిన వడ్డు కాడి నుండి దిగువకు పోయిన కొద్ది దూరం జరిగింది. అక్కడికి దగ్గర దగ్గర మైలున్నర దక్షిణానికి పోతే దంపాయ గ్రామం వుంటుంది. ఇది చాలా చిన్న వూరు, మొత్తం ఎనభై గుడిసెలుంటై. ఒడ్డుకు అడివికి చెరిసగాన (మధ్యలో) చాకలి వొర్రె పక్కకు ఎత్తు బోరు (మట్టిదిబ్బ) – మాదిగబోరు, ఏడెనిమిది గుడిసెలుంటై. దాని ఎడమ పక్కకు కుంట కాలువ ఒర్రెతో కలిసే కాడా బోరు మీద మూడు బజార్లకటూ యిటూ దాదాపు నలభై గుడిసెలు, ఉత్తరం బాజుకు (దిక్కుకు) పెద్దచింత కింది దాకనే ఎక్కువ వుంటై. గోదావరి వొడ్డుకు – అడివిలైను ఈవల రెండు చిన్న గుట్టల నడుమ కట్టిన చెరువుకుంటకు అడ్డంగా పదిగాల గుడిసెలుంటై. అక్కడికి ఫర్లాంగు దూరాన నిలువుగా దిగిపోయిన గోదావరి

వొడ్డెంబడి నిండుగా గోదావరి పారుతున్నప్పుడు వానాకాలంలో ఒడ్డుజారితే ఆ గుడిసెలు ఎట్లుంటయో? – అనిపించేటట్లు వొడ్డుకు ఆని పడిహోను గుడిసెలు వున్నై. ఇవన్ని దొరచట్టపోల్ల (కోయలలో ఒక తెగ) ఇండ్లే. చింతక్రింది కెల్లి బోరుమీదికి వస్తుంటే సర్కారు బాయి దాటినాక ఈమధ్య పెట్టిన ఆశ్రమ స్కూలు, మూడు బజార్లకాడ వుంది. దానికి అటు ఇటూ పంతుల్లు వుంటున్నరు

గోదారి వడ్డుకు అడివిలైనుకు సదుమ గోదావరి మలుపు కాడికెల్లి నిలబడి చూస్తే ఎంతదూరం చూసినా ఒకమైలు దాక పైలాయించిన (విస్తరించి) చేన్లే అగుపడ్తయి. ఒడ్డు పొడుగూత బైలే (మైదానం). లైను ఆవల చిన్న చిన్న గుట్టబోర్లు, బైలావల గోదావరి. దానవతల మల్లి కొంత దూరం బైలు మల్లి కొండలు – అడవి.

★ ★ ★

మాగిల ఒకరోజు బలువంభటేల (ఉదయం పది గంటల సమయం) కావచ్చు. పసులు అడివి జేరుకుంటన్నై. నిలివెడెత్తు పెరిగిన మింజొన్న (తెల్లజొన్న) కర్రలు కనబడే కాడికి గోదావరొడ్డెంబడి వున్నై. వూరు చుట్టూ పెరిగిన జొన్నచేండ్లు వూరు కానరాకుండా జేసినై. అక్కడక్కడ గుడిసెల నుండి పొగ ఎల్లుతుంటే వూరున్నట్లు తెలుస్తుంది. నీళ్ళింకిపోయిన కుంట కింద యాభై ఎకురాల వరిచేండ్లు బీటలువారి వున్న కాడా ఒకరిద్దరు తిరుగుతున్నరు. ఇది తప్ప పెద్ద అలికిడి (శబ్దం) లేదు.

దాదాపు పదహారు – పదిహేడేండ్ల పిల్లవాడొకడు కుంట దాటి అడివిలో కొచ్చిండు. కొండ గొర్రెలాగా బెదురు కండ్లతో అటు ఇటు చూస్తూ ఎడమ చేతి దిక్కు అగుపడుతున్న (కనిపిస్తున్న) కచ్చదాల బాటెంబడి (బండ్లబాట) వురుకుతున్నంత ఏగిరంగా (తొందరగా) నడుస్తున్నాడు. పెద్దరాళ్ళ గుట్ట కిందికొచ్చి ఒక్క నిముష మాగి అన్ని దిక్కుల ఒక్క తడువ (ఒకసారి) జూస్కున్నడు. అలికిడి లేదని చూసుకొని పిట్ట మాదిరిగా ఈల కొట్టిండు. కాసేపే అలికిడి లేదు. ఈసారి ఇంకా గట్టిగా ఈల వేసి ఆగిండు.

గుట్ట లొద్దులో (గుట్ట లోయల్లో) కెల్లి ఈసారి అటువంటి ఈలే యినొచ్చింది... కాదు, గుట్టలకు తాకి తిరిగొచ్చిన తన ఈలన కాదు – ఇది తన ఈలకు జవాబు గొచ్చిన సైగేనని తెలుసుకొన్నంక లొద్దిలోకి నడిచిండు.

ఏడెనిమిది మంది పరికి పండ్ల తీగెల పొదల్లో ముదురాకు పచ్చబట్టలు – 'డ్రెస్సులు' వేసుకొని కూర్చున్నరు. ఒకాయన రెండొందల గజాల దూరంల కాలిబాట పక్కకు చెట్లచాటున రైఫిలు బుజాన బెట్టి తనకెయ్యి (తనవైపు) చూస్తున్నడు. గుర్తు పట్టిండు – ఈరన్న. సెంట్రీగున్నడు. దళంలోని మిగతావాళ్ళు తను ఈరన్న పక్కపొంటి నడిసొస్తుంటే నవ్వి పలకరిస్తున్నరు. వాళ్ళు తెల్లందన్కా (తెల్లవార్లు) నడిచినట్టు వున్నరు. అందరి మొఖాలలో అలుసటగుపడుతుంది.

ఇది చిన్నన్న దళం. దగ్గర కొచ్చినాంక చిన్నన్న పరుపుబండ మీద కూకున్నోడు లేచి పావురంగా (ప్రేమగా) కావలించుకొన్నడు.

"ఏం కామ్రేడ్ పాపన్న! ఏం సంగతి?" పల్కరించిండు.

బాబన్న ఒక పక్కకు కూసోని రైఫిల్ తుడుచుకుంటూ వున్నడు. పాపన్న (వచ్చినతన్ని)ను చూసి నల్లగా మసి అంటిన కుడిచెయ్యి ఎత్తి పిడికిలి గట్టిగా బిగించి

"లాల్ సలాం" అన్నాడు. కడమోల్లు (మిగతావారు) కూడా 'లాల్‌సలామ్' చేసింగ్రు. దానికి జవాబుగా పాపన్న అందరికి లాల్‌సలామ్ చేసి చిన్నన్నను ఒక పక్కకు తీసుకొనిపోయి ఏదో చెప్పిండు. చిన్నన్న తిరిగి దళం దగ్గరకు వచ్చి; "కామ్రేడ్స్ మన పాపన్న చాలా అవసరముండి వచ్చిండు. నేను వెంటనే ఆయనతో వెళ్ళాలి. మన అంకమ్మ చెల్లెలు దాదాపు మూడు వారాలకుపైన జబ్బుతో మంచం పట్టిందంట. మనం వచ్చిసట్లు తెల్సి అవ్వ పాపన్నను నన్ను తోలుకరమ్మని పంపింది. ఇవ్వాల పొద్దటి నుంచి అంకులు అసలు కండ్లు తెరువనే లేదట! నేను మన చెల్లెను చూసి రావటం చాలా అవసరం. మీ రేమంటారు కామ్రేడ్స్?" అని అడిగిండు.

బాబన్నకు అంకులు చెల్లె ఆరోజు కట్టిచ్చిన సద్దిమూట యాదికి వచ్చింది. నడిజాముర్రాత్రి లేసి ఆ చెల్లి గట్కపిండి కల్పి రొట్టెలు చేసి, తననులేపి, మొఖము కడగనీకి నీళ్ళ చెంబందించి ఎంతో పావురంగా రాత్రి మిగిలిన సద్దిబువ్వ కారం తొక్కుతో బెట్టి తినమని - నీళ్ళు తాపి తన దళంలో మిగిలిన వారికని రొట్టెలు పాత పేల్కలో కట్టించింది. తల్లి లాంటి ఆ చెల్లెకు ఏ జబ్బు పట్టుకుందోనని చాలా బాధపడ్డడు. ఈరన్న, వహీదు, సోమన్న, భీమన్నలకు కూడా ఈ సంగతి విని గుండెలవిసినట్లయింది.

సిమాంట (మొట్టమొదటిసారి) ఈవూరు వచ్చినప్పుడు అంకులే కదా క్యాంపోల్లు అట్కాయించినా (ఆపినా, అడ్డగించినా) - వీల్లు తన పెద్దయ్య కొడుకులేనని చెప్పి - నమ్మించి ఊరు దాటించి చెరువవుతలి కందిచేను కాడికి తీసుకొచ్చి కూకోబెట్టి మల్లి కాసేపటికి బట్టలమూటలో బుర్ర (సొరకాయ ఎండిన తరువాత - దానిలోని గుజ్జు తీసివేసి పాత్రలా వాడుకుంటారు) దాచి పట్టుకొచ్చి కడుపునిండా అంబలి పోసి - బద్రంగా తోలింది. ఆ చెల్లి సుడిబడ్డదని (జబ్బుపడ్డది) తెలిసి చానా బాధనిపించింది. అందరూ చిన్నన్నవైపు చూసింద్రు.

భీమన్న 'ఐతే కామ్రేడ్ చిన్నన్న, ఈ నిర్బంధపు రోజుల్లో పట్టపగలు అదీ మనకు బాగా సంబంధమున్నదని శత్రువుకు తెల్సిన వూరికి వెళ్ళడం ప్రమాదకరమేమోనని నా కనిపిస్తుంది. అదయినా శత్రుక్యాంపు వున్నకాడికి అంత దగ్గరలో!' అనుమానంగా అన్నాడు.

ఒక్క క్షణం నిశబ్దంగా గడిచింది.

"ఆ మాట నిజమే! ఐనా కామ్రేడ్ భీమన్నె అన్నట్లు ఆ గ్రామంతో మనకు గట్టి సంబంధాలు వున్నై. పోతే పగలు వెళ్ళటంలో ప్రమాదమున్నందుకు నా అభిప్రాయంలో రాత్రిదాక ఆగి వెళ్ళటం మంచిది" సోమన్న తన సలహా చెప్పిండు. 'మీరేమంటారు కామ్రేడ్ పాపన్న?' పాపన్నవైపు చూస్తూ.

'జబ్బు నా చెల్లెకే అయినా కామ్రేడ్ చిన్నన్న లాంటోని మాటకొచ్చేసరికి అన్నిదిక్కుల నుండి కొట్టిచూసి అప్పుడు ఏదో ఒకటి చెయ్యాలి తొందరచేస్తే నష్టమైనా ఐతది' అని పాపన్న ఆగి ఆగి చెప్పిండు. కీడెంచి మేలెంచాలనే ధోరణిలో.

వీరన్న లేచి నిలబడి 'నిర్బంధముందని మన ప్రజలను వదిలిపెట్టలేము కదా!' మన అంకులు, కామ్రేడ్ పాపన్న చెల్లె మన వుద్యమంలో ఈ చిన్నప్పుడే ఎంతో ఉత్సాహంగా ముందుకొచ్చేది, మనం మర్చిపోలేము. అంతకైతే కామ్రేడ్ చిన్నన్నతో

కల్సి ఇంకొకరు పోవచ్చు. పోవాలి! నేనే వెళ్ళివస్తా చిన్నన్నకు తోడుగా' ఉత్తేజంగా చెప్పి టక్కున కూర్చున్నాడు. కిందపెట్టిన తన సంచి వీపుపై పెట్టుకుంటూ అప్పుడే బయలుదేరాలన్న తన అభిప్రాయానికి కార్యరూపం ఇవ్వబోతున్నట్టు

చిన్నన్న ఇంతవరకు ఏమీ మాట్లాడకుండా వున్నాడు. ప్రజలకోసమే పార్టీ - పార్టీదే దళం, ఆ దళం బాధ్యత తన మీద వుంచింది పార్టీ. దంపాయ గ్రామం పార్టీకి గత కొద్ది సంవత్సరాలుగా పెట్టని కోటగా వుంది ఈ ప్రాంతంలో పార్టీ విస్తరణకే కాదు మొత్తం ఉద్యమానికే కేంద్రంగా వుంటూ వచ్చింది అందులో పాపన్న కుటుంబం కృషి ఎంతో ఉంది. యువజనోద్యమంలో అలి చురుకైన వారు, ఆర్థిక రాజకీయ తదితర రంగాలతోపాటు వైద్య అవసరాలలో కూడా ప్రజల బాధ్యత పార్టీదే అవుతుంది. ప్రస్తుత పరిస్థితిలో ఎంత చిన్న స్థాయిలోనైనా ఆ రకమైన సహాయం అందించడం తన కర్తవ్యం, నిర్బంధం వుంది. శత్రుక్యాంపుకు అతి దగ్గరకు వెళ్ళాలి. పగటి సమయం! దాదాపు ముప్పావు మైలు మైదానం దాటి!!

ప్రజలే విప్లవకారులు, విప్లవకారుల పాలిటి శిక్షణ కవచం! ఈ విధంగా రెండు విరుద్ధమైన ఆలోచనల నుండి చిన్నన్న క్రమంగా తేరుకుంటూ ఒక నిర్ణయానికి వస్తున్న సమయానికి కామ్రేడ్ వహీద్ తన అభిప్రాయం చెప్పాడు.

'చిన్నన్న ఇప్పుడే కామ్రేడ్ ఈరన్న చెప్పినట్టు ఇద్దరు వెళ్ళాల్సిన అవసరం నాకు కనిపించటం లేదు. వైద్యునిగా మీరే వెళ్ళాలి. కాని ఎటువంటి నష్టం జరగకుండా తిరిగి రాగలరా అనేదే నా అనుమానం.'

"ఒకవేళ నష్టమే జరిగితే పార్టీకీ - మీరు సేవ చేయాలనుకున్న ప్రజలకు నష్టమే కదా! - కాబట్టి చాల తూచి అడుగు వేయాలి" ఆఖరిగా బాబన్న అన్నాడు.

అప్పుడు చిన్నన్న "ఔను కామ్రేడ్స్! మీ అభిప్రాయాల సాయంతో నాకు అనిపించిందేమిటంటే నేను వెళ్ళవలసిన బాధ్యత వుంది. ఒంటరిగానే వెళ్ళాలి. ఎందుకంటే పగలు పోవాలి? ఏదైనా సమస్య ఎదురైతే జరిగే నష్టాన్ని సాధ్యమైనంత తక్కువయ్యేటట్టు ప్రయత్నించాలి. అన్నివైపులనుండి ఆలోచించినాంక ప్రజల సేవ కోసం కొద్దిపాటి ప్రమాదాల నెదిరించక తప్పదు అనిపిస్తుంది. అందుకే నేనొక్కన్నే వెళ్ళాలి. గ్రామంలో మనకు పూర్తి సహకారం వుంది. శత్రువు ఎవ్వరూ లేరు. పైగా పై గ్రామంలో శత్రువు నా రాక తెల్సుకొని వచ్చేలోగా ప్రజలకున్న వేలాది కండ్లు - చెవులు మెలుకువ వహిస్తూ పసికట్టగలవు. నాకు రక్షణ ఇవ్వగలవు. విప్లవ చైతన్యమున్న ప్రజలు అన్ని సాంకేతిక - ఆధునిక సౌకర్యాలు కలిగిన అభివృద్ధి నిరోధక శత్రువుకన్నా చాలా బలవంతులు. నాకున్న ఇతర బాధ్యతలను మరవకుండానే ఈ విషయాలన్ని ఆలోచించి నేను కామ్రేడ్ పాపన్నతో ఒంటరిగానే వెళ్ళాలనుకుంటున్నాను. వీటిని దృష్టిలో వుంచుకొని మనమొక నిర్ణయానికి రావాలి" అని తన ఆలోచనలను అభిప్రాయాలను తనతోటి దళ సభ్యుల ముందు వుంచిండు.

కొద్దిసేపటిలోనే చిన్నన్న ఒక్కడే, అప్పుడే పాపన్నతో బయలుదేరాలనే నిర్ణయం తీసుకోబడింది. చిన్నన్న పోతూ "నేను వెళ్ళి సాయంత్రంకల్లా తిరిగివస్తాను. మీరు జాగ్రత్తగా వుండండి. కామ్రేడ్ బాబన్నా! దళం బాధ్యత ఇక మీదే. నేను తిరిగి రావటం, ఆలస్యమైతే కొంతదూరం వెళ్ళి నాకోసం ఆగండి. మన అంకమ్మ చెల్లి

కాస్త కోలుకోగానే ఈ సాయంత్రం వరకు అంతకైతే తెల్లవారే వరకు నేను వచ్చేస్తాను. ఇక వెలుతున్నాను. రెడ్ సల్యూట్స్!" అన్నాడు. తరువాత పాపన్నతో కల్సి "కిట్" (మందుల సంచి) దీసుకొని, రివాల్వర్ నడుముకు కట్టి పైనంగా (మీదుగా) అంగి (చొక్కా) జారిడిచి (తొడిగి) బయలుదేరిండు.

★ ★ ★

చెరువు కట్ట పక్కెంబడి నడుసుకుంటూ ఇప్పచెట్టు కిందికొచ్చి ఒకసారి ఆగి అన్ని దిక్కులు చూచి అంతా సరిగానే వుందని చూచుకొని పాపన్న ముంగట, చిన్నన్న వెంబడి నడువసాగాడు. వరిచేన్లు బీటలుబారి వున్నాయి. గట్టెంబడి ఇప్పచెట్లు ఎండకు బిక్కు బిక్కుమంటున్నట్లు అక్కడక్కడా నిలబడి వున్నయి.

ఊరు కడకు ఉత్తరం దిక్కు, మూడు నాలుగు గుడిసెలు – జొన్నచేండ్ల గట్టెంబడి అటోటిటోటి (అటు ఇటు) కర్ర మొలిసినట్లు, వూరెన్క గుట్టకు కొంతదూరాన తేరాసుబండ (ఊరుపక్కకు ఉన్న ఒక పెద్దరాయి పేరు) ఉన్నట్లు, గొడ్లమంద పక్కకు మొండెడ్లు అటీటు తిరుగుతున్నట్లు, దళపోల్లు జొన్నకాడికి కొంతదూరంగా సెంట్రీ నిలుచున్నట్లుగా – ఆ గుడిసెలు వూరు పక్కకు ఉన్నై. అవి దాటి వాళ్ళు చింతచెట్టు కిందికెళ్ళి సర్కారు బావిదాక ఉన్న సందుకు అటీటు వున్న గుడిసెల్లో కడదాంట్లో కెళ్ళిన్రు.

చిన్న నాలుగు దూలాల పందిరి చుట్టు వున్న ఎనుగుకు (కంచెకు) గుజ్జుకొయ్యలు (వాకిలి తలుపుకు బదులుగా వాడే ఒక పక్కకు జరుపుకునే కొయ్యలు) దీసి పాపన్న వాకిటిలోకి అడుగుబెట్టిండు. చిన్నన్న గదవల (కడప) కాడ ఆగి ఒకసారి అటూ ఇటూ చూసుకొన్నడు. లోపలికెళ్లి వాకిట్లో ఒక మూలకున్న నీళ్ళబడ్డి (నీళ్ళ కుండలు పెట్టెటందుకు చేసిన స్టాండు) కాడ పాపన్న కాళ్ళు కడుగుతున్నడు. చిన్నన్న కిట్ కిందబెట్టి అక్కడికిపోయి పాపన్న చేతి చెంబందుకుని తను కాళ్ళు కడిగిండు. కండువతో మొకం తుడుచుకుంటూ వచ్చి కిట్ అందుకొని పాపన్న తడక జరపగా లోపలికొచ్చిండు. పాపన్న కన్నా పెద్దవాడైన నర్సన్న తన భార్యాబిడ్డలతో కల్సి ఆ గుడిసెలోని మూడవ వంతు వరకు తడకలు కట్టి విడిగా వుంటున్నాడు. పాపన్నకు ఇంకా పెండ్లి కాలేదు. తల్లి, ఇద్దరు చెల్లెండు, తమ నాల్గవ వంతు ఐన తమ భాగంలో వుంటున్నారు. ఇంటెన్క నుండి తడకలు కట్టి ఆరేడు మూరల ఆ అర్రను (గది) అన్న ఉంటున్న భాగం నుండి వేరు జేసుకున్నరు.

లోన చీకటి. అందులోనే ఒక మూలకు చిన్న పొయ్యి వుంది. చిన్న నులక మంచం వేసి వుంది లోపలిగోడ కానించి. మంచం పట్టగా రెండు మూరల జాగే మిగిలింది. పాత నులకమంచంలో లొట్టబోయిన (లోతుకు పోయిన) కండ్లు మూతపడి చాలా బలహీనంగా తయారైన అంకమ్మ చినిగిన చెద్దరు కప్పుకొని పడి వుంది. చిన్నన్న జప్పున (తొందరగా) బ్యాగ్ తీసి ఆల (స్టెతస్కోపు) తీసిండు. నడుముకున్న వాచి తీసి చేతికి పెట్టుకుంటూ గబగబా పరీక్షించిండు. మట్ట (మణికట్టు దగ్గర) బట్టి నాడి పరీక్షించిండు. తరువాత ఆల మెడకు ఎల్లాడదీసి చేత్తో అంకులు చెల్లెలు డొక్కలో ఒత్తొత్తి జూసిండు. సంకలో మీటర్ (ధర్మామీటరు) బెట్టి కాసేపాగి దీసి చూసిండు. జాడిచ్చి మల్లా డబ్బుల బెట్టిండు. ఆ చెల్లెని ఎల్కల

(వెల్లకిల) పండుకోబెట్టి మోకాల్లకాడికి కాల్లుమడిచి పడుకోబెట్టి మల్లి డొక్కలో ఎడమబాజు, కుడిబాజుకు తన చేతి ఎల్లతోని పొడిచి పొడిచి చూసిండు. బోర్లపడుకోబెట్టి మల్లి ఆల చెవులకు బెట్టి ఏదో ఇనుకుంటూ జరుపుతూ, తీస్తూ వున్నడు. తన ఎడమచేతి ఏల్లను అంకమ్మ ఈపుపై పెట్టి తాపుకొకసారి ఎడమ బాజుకు ఒకసారి కుడి బాజుకు సంతలో కుండను కొట్టిచూసినట్లు కుడిచేతి చూపుడేల్లతో కొట్టి కొట్టి చూసిండు. కొట్టిచూడంగా ఏదో ఇన్నడు చెయ్యి చెద్దరు కిందికెల్లి తీసి గోర్లొత్తి చూసిండు. కంటిరెప్పల కిందివి కిందికి వొత్తి చూసిండు. సంచిల బ్యాట్రిలైట్ తీసి కండ్లల్ల గొట్టి అటిటు జరుపుకుంటు చూసిండు. అరిపాదాలు ముందుకు వత్తి చూసిండు. మల్లి ఆలబెట్టి గుండె చప్పుడు ఇన్నడు.

గిర్రున తిరిగి సంచిల చెయ్యిపెట్టి సూదుల పెట్టె తీసిండు. పాపన్నను పిలిచి ఒక తెల్లగంజు (అల్యూమినియం గిన్నె) లో మంచినీల్లు పట్కరమ్మన్నడు. పాపన్న ఉర్కి పోయి నీల్లు పట్టుకొచ్చిండు.

చిన్నన్న పెట్టెమూత తీసి సూదులు పిచకారి (సిరంజి) వేరువేరు చేసి గిన్నెనీల్లలో ముంచి గిన్నెకు మూతబెట్టి ఇగ పొయిమీద పెట్టమన్నట్లు సైగజేసిండు ముసలి తల్లి పొయ్యి ఊదరబెట్టింది.

చిన్నన్న సంచిలకెల్లి ఇంకేంటెంటియో సీసాలు, డబ్బాలు బయటకు తీసిండు. బాగా మసిలిన తరువాత సూదులు పటకారు (ఫోర్‌సెప్)తో బట్టి తీసిండు. ఏవో రెండు సీసాల మందులు అండ్ల గుంజిండు. సూది ఇచ్చిండు. ఇంతసేపు సై సప్పుడు చెయ్యని అంకులు ఏదో మూల్గినట్టు చేసింది.

బారెడు పొద్దుండంగ అంకులుకు చెమటలు పోసినయి. రెండు మూడు సూదులు ఏసినంక పెంకోలె కాల్తున్న పెయ్యి (శరీరం) చల్లబడ్డది. ఆలబట్టి చూస్తున్నడు చిన్నన్న.

మల్ల ఏదో సూదిచ్చిండు. అప్పుడు తేరిపారి జూస్తే గదవలకాడ శానమంది నిలుసున్నరు. అతనికి కూడా చెమట బట్టింది. కండువకు తుడ్సుకున్నడు గవల కాడ కూడిన జనం అతనటు వస్తుంటే అటీటు జరిగిండ్రు. కొద్దిగా గాలాడింది. అతడు లేచి బయటకొచ్చిండు.

"అసం చిన్నవ్వో.. ఓ యాలమ్మొదినో! మీరంత గదవల కాడికెల్లి జరుగుండ్లి" వస్తూ వస్తూనే అన్నడు నర్సిగాడు. చిన్నన్న "నిజమే మనోడు చెప్పేది అంకులుకు గాలి ఆడకుండా చెయ్యకండి" అని వచ్చి యింటి బయట అరుగుమీద అందరి మధ్యలో కూకున్నడు.

"నిజమే నాయన నీ కడుపు సల్లగుండ! మేమంత నీ కోసం రోజూ చూసుకుంటునే వున్నాం ఇగ వత్తావని. ఇన్నాల్ల కొత్తివి. ఇగ మాకేఫికరు (చింత/విచారం) లేదు. నీ చేతుల బడ్డది. ఇగ అంకులు సావదు" అనుకుంటు ఆసమోల్ల చిన్నవ్వ చిన్న చిన్న పిల్లగాండ్లను జరుపుకుంటూ చిన్నన్న పక్కకొచ్చి కూలబడ్డది.

ఇంతలో కేదో గ్యాపకం వచ్చినట్లు ఆలమోల్ల నర్సిగాడు ముందుకొచ్చి తన మెడ మీద బల్లుచ్ఛ (తామర) చూపెట్టి ఒత్తుడుకీస (మందు ట్యూబ్) మందు చిన్నన్న ఇస్తె ఆకు డొప్పలో బట్టుకున్నడు.

"మనకిదేం చచ్చెకాలమొచ్చింది చిన్న? నీ జాడ జెప్పమని మల్లారం క్యాంపోల్లు పొద్దుగూకులు ఊర్మీనబడి సంపక తింటుండ్రు. మొన్ననే బడె సత్తయ్యను బట్కపోయి నీ జాడ జెప్పమని ఆరం రోజులు కేంపులుంచి సత్తయ్య కొడుకు కర్రమీద దుబ్బగూడెం పోయి సంపాయిచ్చుకొచ్చిన ఇన్నూరిత్తె (రెండు వందలు) ఇడసబెట్టిండ్రు. సిమాంట దళమొచ్చినప్పుడు బువ్వ పెట్టినమని చెప్పి హరిగోస బెట్టిన సంగతి నీకెరుకేనాయె. గప్పుడు ఇంటికి ఐదు రూపాయలు వసూలు జేసిండ్రు. ఆరంరోజుల కింద కమ్మరి మల్లయ్య పెద్ద మేకపోతు మందితో తిరిగి రాలేదు. కేంపోల్లు కోసుకతిన్నరని తెల్సి అడగబోతే తన్ని ఎల్లగొట్టిండ్రు. తల్సుకుంటే కడుపు బగ్గుమంటది. మేమైతే చిన్నా, కోసినా నీ జాడ, దళం జాడ చెప్పలేమనుకో. మీరు శేబట్టి ముత్యం చుక్కయ్య చేండ్లల్లకెల్లి తిప్పనపల్లి బోయే కచ్చులాల బాట మనకు దక్కింది. వాని కంచె బీకి బండ్లు నడిపినప్పటి సంది పొగాకు తోటలల్ల పోయెటోల్లకు జీతాలు బెరిగె. మీరు లేకుంటే ఆ సైకోని (చౌకీదారు, ఫారెస్టు గార్డు) మాములు పుల్లెర, నాగటిపన్ను కట్టలేక సచ్చేది..." అంది యాలమ్మోదిన.

"అడివి నరికి మన బొక్కిదొర కుంటల ముప్పయి ఏండ్ల తర్వాత మనం దున్నుకో గలిగేదొదినా? మనూళ్ళె ఆ సైకోడు కసబిస (పటపట) పండ్లు కొరికిండు. కట్టెబండ్లు పట్టుకుంటా నన్నడు, రేంజర్ని తోల్కచ్చిండు - పోలీసుల దెచ్చిండు. ఎన్నో జేసిండు. కాని చిన్నన్న దళపోల్లొచ్చి వాడ్ని ఒకసారి పట్కపోయి పెయ్యికున్న కొవ్వు కరిగేదాన్క అడవిలో కట్టేసెసర్కి, మనమంత గల్సి పట్టిచీరిన మాభూమి ఒదలమని ప్లాంటేసను పీకి యాభై అరకలు ఏకం గట్టి నిలుసుండేసరికి వానికి బుద్ధొచ్చింది - కది చెప్పరాదొదిన" అని నర్సిగాడందుకుండు.

నర్సిగాడు చెప్పుతున్నప్పుడు బయట బజార్ల సైకిల్ గంటి మోతినచ్చింది. ఆ యింటి ముంగటికెల్లి సాలెసాంబయ్య ఝుఁయిమని సైకిలెక్కి ఎన్క బట్టలమూట బెట్టుకొని నింషంల దాటిపోయిండు.

చిన్నన్నలేచి ఇంట్లకుపోయి అంకులు కండ్లు తెరిసి మిటమిట జూస్తుంటే "ఇప్పుడెట్లున్నది చెల్లి!" అని పల్కరించిండు. పాలిపోయిన మొఖం మీద సన్నగా నవ్వు- దూరంగా బీరమాయ గుట్టమీద చెట్ల సందులకెల్లి అగుపడే కచ్చులాల బాట తీర్గ, నడిగోదాట్ల దూరంగా చిన్నగ కండ్లబడే సూరన్న నావలాగ, ఆకురాలంగ నిలుసున్న బరిబాత చెట్లల్ల అక్కడోటి అక్కడోటి మోదుగులకున్న ఎర్రటి మొగ్గల్లాగ, దుక్కిబట్టిన నడిపన్న నల్లటి పెయిమీద మెరిసే చెమట తీర్గ ఆ నవ్వు వెలిగింది. "మంచిగున్నన్న" సన్నగ పల్కింది అంకమ్మ.

చిన్నన్న అవ్వనుపిల్చి దగ్గరకూకోబెట్టి సంచిల డబ్బుల వెత్కి తగురాల మాతర్లు తెల్లటివి, నల్లటివి, ఎర్రటివి రంగురంగుల గోలీలు మూడు నాల్గురకాలై అవ్వచేతికిచ్చి "ఇదోటి ఇదోటి ఇదోటి ఇదోటి పొద్దటీలి - ఈ మూడు, పగటీలి - మూడు, మాపటీరి నిదురబోయె ముందు ఐద్దినాల దన్క వర్సతప్పకుండా ఇవ్వాలి. ఈ మాతర్లు ఈ రాత్రి కొద్దిగా బువ్వ తినిపించి అటెన్క ఇచ్చెయి. ఇవన్నీ అయిపోయినంక ఈ నల్లటి మందుగోలీలు పద్దినాల్ దన్క రోజుకు మూడు ఇవ్వాలి. ఇవ్విగాలి తగలకుండా చూసుకోవాలి. ఇదిగో ఈ సీసల బెట్టిచ్చిన గోలీ ఇచ్చినప్పుడు దీసి మల్ల గట్టిగా బెట్టుంచు."

అవ్వ మర్చిపోకుండా రెండు మూడు సార్లు జెప్పిండు

మంచం మీద పడుకున్న అంకమ్మ చెద్దరుమీదబడి ఇంకా పైకిపోతూ ఇక్కడ ఆగనంటున్నట్లు దగ్గరేసిన తడక సందుల్లకెల్లి సన్నగా ముగ్గెసినట్లు అవతలి గోడ మీద పడుతుంది - ఎర్రటి వెలుగు. చిన్నన్న బయటికి వచ్చి చూసిండు. పచ్చగా చెర్వుకటీటు చెర్వెనక ఎంత దూరం జూసినా కనిపించే అడివిలో తలెత్తి నిల్చున్న ఊరెన్క గుట్టసాటుకు సూర్యుడు పడమటికి జారిపోతున్నాడు.

★ ★ ★

చెర్వు కట్టకాడ దుమ్ము లేచింది. గొడ్లు మర్లినయా?

కాదు.

కాకి బట్టలు - చిన్న టోపీలు - పోలీసులు.

ఆ దుమ్ము భూమి డొక్కలో రాక్షసుల బూటు తన్నులతో లేచింది. ఎర్రని సూర్యుడు ఒంటరి వాడైనట్లు అడివి దిక్కు గుట్ట చాటుకు దాగాలని ప్రయత్నిస్తున్నట్లు వున్నడు. అటు మాదిగ గుడిసెల తోవ పొంటి ఇంకో గుంపు రెండు దిక్కుల కెల్లి ఊర్లె కొచ్చిన్రు. టకటక బూట్ల చప్పుడు. అంతెత్తు లేచే దుమ్ములో కూడా వాల్ల చేతుల్లోని తుపాకులకున్న బయనెట్లు తల్కున మెరుస్తున్నయి.

మూడు బజార్ల కాడ బడి దగ్గర రెండు గుంపులు కల్సినయి. మొత్తం ఇర్వయి మంది వుంటరు. మోడు పట్టీల మేజర్‌గాడు బాగా తాగివున్నట్లు వున్నడు. కండ్లు ఎర్రగున్నై, మాటలు ముద్దబడుతున్నై. బొర్రమీద బెల్టు నిగ్గి (గుంజి కట్టి/ గట్టిగా బిగించి) కట్టిండు. నోట్లె నురుగు పెదిమల కొసల కాడికి కారుతుంది.

ఆ వూరు దొర చట్లపోల్ల వూరు.

దొర చట్టపోల్లు

దొరలే రైతులు - రైతులే దొరలు. దొరలే పెద్దలు. చేతి బలం కొద్ది ఐదెకురాలో, పదెకురాలో అడివి కొట్టి బయలు జేస్కున్నరు. చేతైన కష్టం జేస్తారు. పండింది తింటరు. అయిపోతే అడివి పడ్తరు. ఇప్పపువ్వు, తునికి పండ్లు ఏర్క శింటరు. పై వూరి సావుకార్లు- ముత్యం చుక్కయ్య లాంటి భూస్వాముల, పెత్తందార్ల కాడికి కూలికెల్లినా ఇంతవరకు వారికి లొంగిపోలేదు. పెత్తందార్ల ప్రభావం నుండి ఆ అమాయకులు తప్పుకోవటమెలా? ఇప్పుడిప్పుడే తెల్సుకుంటున్నారు.

అదో చిన్న వూరు. పెత్తందార్లు లేనివూరు. అందుకే ఈ వూరంటే క్యాంపు కమాండర్ హవల్‌దార్ మేజర్‌కు ఒల్లు మంట. దిక్కులేని అడివి మనుషుల - 'మర్యాద' తెలియని జంగ్లి పసుల వూరని అతని అభిప్రాయం.

"ఖైన్‌కే-లొ ... గాల్లు! ఎటు బోయిన్రు రా అంతా? హరాంకొc బచ్చా" ఉరిమిండు మేజర్. పనులనుండి తిరిగొస్తున్న బుడ్డగోసీ గోండు జనం ఒక్కొక్కరే వచ్చి జేరుతున్రు మూడు బజార్లకాడ. పెద్ద మనుషులు వీల్లే - అడివి బిడ్డలు.

మాంజి (ఊరిపెద్ద/కులపెద్ద) చెప్తె ఉర్కిపోయి మంచందెచ్చి బజార్లో ఏసిండు బొక్కన్న. మేజరు కూకున్నడు - కూకున్నడో కూలబడ్డడో అందులో.

"నక్సలైట్లను దాస్తున్నార్రా? బడివె కోర్లు మీరు! కమ్యూనిస్టులకు మీరు బువ్వ బెడ్తర్రా?"

అదివరకే ఇర్వైమందిదాన్క జమ (పోగవ్వడం, కూడిర్రు) అయింద్రు జనం. ఎవరూ పల్కలే. పోలీసోల్లు మంచాని కటీటు నిలబడి మిట మిట చూస్తుర్రు. ఐదార్గురు మంచాని కెదురుగా కూకున్న మందిల వచ్చి నిలబడ్డరు.

"ఇన్నాల్లకు మీ పని ఐతదిరా! బాడ్కావ్‌లు, మీరు సర్కార్‌తో గెలుస్తార్ర? నక్సలైట్లను పిలిపిస్తార్ర వూల్లె, మాకే లొడె" - హవల్‌దార్ అన్నాడు.

కూటికే పస్తుంటిమి - మాకే దిక్కు లేదాయే ... నక్సలైట్ల సంగతి మాకేమెరుక..." మాంజి ఇంకేదో చెప్పబోయిందు.

చిన్న పంతులు (హోస్టల్ వార్డన్) అటే వస్తూ ఈ మాటలు విని "హవల్‌దారుగారు నక్సలైట్లు ఈ చిన్న వూర్లెందుకు వస్తారు? వచ్చినా పట్టుకోవల్సింది మీరు. వూరి వాల్లను ఇట్ల దబాయిస్తె ఏమన్నట్లు?" అని అడిగిండు.

కండ్లతోనే నమిలేసేటట్లు అటు జూసిండు హవ్వల్‌దార్ "ఓ పంతులు! నీ పని ఏదో నువ్వు జూస్కో. సర్కార్ జీతం తిని ఊరోల్ల దిక్కు పల్కుతవా? - మా పనికి డిస్టర్బ్ చేస్తే నువ్వే నక్సలైట్లకు సాయం జేస్తున్నావని రిపోర్టు రాస్తా! ఉద్యోగం పీకిస్తా! జాగ్రత్త! చల్లగుండదలుస్తే మా డ్యూటీలో, మారెడ్‌లో ముక్కు దూర్చకు... హాఁ!"

పంతులు అక్కడ వుండలేక ఆశ్రమ స్కూలు వైపు నడిచిండు.

"హాఁ! డాక్టరు రాలేదు బోసిడికే - మీ వూళ్ళె! సాలె సాంబయ్య వచ్చి గంటయినా కాలేదు. వాన్ని రెండేసి 'నక్సలైట్లకు క్యాంపు ఇన్‌ఫర్‌మేషన్ ఇస్తున్నావ'ని బెదిరిస్తే 'నాకేమీ తెలియదు సార్, బట్టలమ్మి వూరూరు దిరిగి బత్కెటోన్ని అని పదిరూపాయల మామూలిచ్చి' దంపాయ వూల్లె ఇప్పుడే డాక్టర్ను జూసిన సార్ - జమదార్ సాబ్, నన్నటకాయించకుర్రి' అని కాళ్ళమీద బడితే ఇద్సబెట్టిన. ఇంక ఆ లం... కొడుకు పోయి అర్ధగంట కాలేదు! వాడు వుత్త పిరికి ముండాకొడుకు - నిజమే చెప్పి వుంటడు. రాలేదురా డాక్టర్ మీ వూల్లే? ఎవలింట్ల దాచిర్రో చెప్పుర్రి బతకబుద్ధుంటే లాభంలేదు. వీల్లట్లజెప్పరు, సీధి పుంగీలీసే ఘీనహి నికల్తా, ఉంగ్లీ తేడా కర్‌నా పడేగా' (చక్కగా పెట్టిన వేళ్ళకు వెన్నంటదు - వేళ్ళు వంకర చేయాలి - అనే హిందీ సామెత) నాయక్! నీ సెక్షన్‌ని అటు చెరువు కట్ట దిక్కున గుడిసెలకు 'లీడ్' చేయి! ఒక్కొక్క ఇల్లు 'సర్చి' చేసుకుంటూ రావాలి. ఆ డాక్టర్‌గాడు వుంటే వుంటడు. ఇంత తొందర్లో పోలేడు - మనం టూవే - ఎన్ సర్కిల్ (రెండువైపుల నుంచి చుట్టివేత) జేసినం పోలేడు. చీకటి కాకముందే పట్టుకోవాలి. దొర్కుతే మనకు 'రివార్డు' వస్తది" సెక్షన్ వన్! మూవ్, సెక్షన్ టూ! నాతోపాటే వుండండి" అని ఆర్డరిచ్చిండు. మంచంకాడ నిలబడ్డ జవాన్లలో ఓ పది మందిని వెంటదీస్కొని నాయక్ చెర్వు కట్టదిక్కు పోయే తొవ్వలో ఎల్లి పోయిండు.

నడిసినందుకు అలిసిపోయిన జవాన్లలో కొందరు వూరోల్లతో కల్సి కూసున్నోల్లు మేజర్ వైపు విచిత్రంగా చూసిర్రు. వాళ్ళలో ఒకడు:

"మేం లేకుంటే - మా గార్డు లేకుండ దొడ్డికైనా పోడు! వీడు నక్సలైట్లను బడ్తడత!!" ఇంకొకడితో మెల్లంగన్నడు. పక్కనే కూకున్న నర్సిగాడిన్నడు... నవ్వాపుకున్నడు

సిగరేటు వెలిగించిండు, ఆ ప్రయత్నంలో ఐదారు అగ్గిపుల్లలు పాడు జేస్కున్నడు 'మేజర్' ఏదో వాగుతూనే వున్నడు తనకు తానే.

మాంజి కండ్లతోనే ఏదో సైగ జేసిండు నర్సిగానికి చుట్టూ వున్న పోలీసులకు అనుమానం రానీయకుండ. నర్సిగాడు మంచినీళ్ళ బావికాడికెల్లి ఇటే వస్తున్న పుల్లెద్దుకు అడ్డందిరిగి అటే, చింతచెట్టుకేయి గెదిమినట్టు తను అటే దానెంటే పోయిండు. అటు నీళ్ళ కావిడితో వస్తున్న పాపయ్య, ఇంటి గవలకాడ నిలుసున్న పెంటన్నలను నర్సిగాడు కండ్లతోటే ఏదో చెప్పిండు. పాపయ్య బాయికాడికి వచ్చి కుండలు దించి తాడు - బొక్కెన బాయిలేసిండు. పెంటయ్య ఇంట్లకు బోయి నారేపనార (అడవిలో వుండే పెద్దేపచెట్టు నార, తాడులాగ ఉపయోగపడ్తుంది) పట్టుకొచ్చి అటు నర్సిగాడిటు పాపయ్య కనబడేటట్టు ఇద్దరికి చెరిసగం దూరంలో కూసున్నడు. చేతుల్లో వున్న నారతో వెలుగు సవరించుకుంట కట్టుడు మొదలుబెట్టిండు.

సెక్షన్ వన్ కడ గుడిసె కాన్నించి ఒక్కొక్క గుడిసెలో దూరి వెతుక్కుంటూ మూడు బజార్లకాడికొచ్చింది. బడి అవుతల అబ్బన్న గుడిసెలోకి పోయి బయటకొచ్చేలోగా పాపన్న నీళ్ళకావడి బుజానికెత్తిండు. పెంటన్న లేచి చింతచెట్టు కేయి నడిచిండు. పాపన్నతో గుసగుస ఏదో చెప్పిండు. అతని సంచందుకొని బిరబిర నడిచి ఇంటెన్క ఎన్గు దునికి కండ్ల నీరు పెట్టుకున్న అవ్వతో, తెల్లగా జూస్తున్న అంకులుతో ఏదో చెప్పి కుడిచేతితో నడుముకొన్న రివాల్వర్‌ను తాకి చూసుకున్న చిన్నన్నను తనవెంట రమ్మన్నాడు.

పాపన్న ఇంట్లోకొచ్చి తల్లితో ఏదో చెప్పి మందు గోలీలన్ని తీసుకొని నీళ్ళ కావడి కుండలను బడ్డిమీద బెట్టి ఉత్తకుండలు పెట్టుకొని బయటికొచ్చిండు. అక్కడ వచ్చి నిలబడ్డ పెంటన్న చేతికి ఆ మాతర్లు ఇచ్చి ముందుకు సాగిపోయిండు. పోలీసోల్లు ఈ బజార్ల యాలమోల్ల ఇల్లు వెతికి ఇటే తన ఇంటివైపే వస్తూ ఎదురైండ్రు. పెంటన్న మల్లి ఎనుగ్గు నారకట్టు కడుతున్నడు. పాపన్న పక్కకు జరిగి నిలుసున్నడు.

సెక్షన్ ఇంచార్జి అతని వైపు పురుగును చూసినట్లు చూసి దాటిపోయిండు. పాపన్న సర్కారు బాయికాడికొచ్చి మల్లి నీల్లు చేదబట్టిండు. అతని ఇల్లు 'రేడ్' అవుతుంది.

మంచాల్ల పీనుగులాగా వున్న అంకమ్మను చూసి అసహ్యంతో మూతి మీద దస్తిగప్పి నాయక్ లోపలికి తొంగి జూసిండు. ముసలవ్వ కుండలకాడ బెదురు కండ్లతో కూకున్నది. "ఇద్దరాడోల్లే సార్" జవాన్ మాటవిని ఎన్కకి తిరిగి బయటకు వస్తూ నాయక్ నీట మునిగి తేలినోనోలే పెద్దగా ఊపిరి పీల్చుకున్నడు. ఇంకా ముందుకు సాగిండు ఈ బజార్ల మిగిలిన రెండు మూడు గుడిసెల వైపుకు - జవాన్లు వెంటరాగా.

చిన్నన్నను తనవెంట దీసుకుని నర్సిగాడు జొన్నచేండ్లల్లపడి ఇండ్ల వెనక నడుసు కుంటూ చెర్వుబాజు కడ యింటికి దభగట్లోల్లింటికి దబదబ పోయి సంచి నడింట్ల బెట్టి ఇంటాయనతో "సమ్మన్న! పోలీసోల్లు ఇటు చూసి పోయిండ్రు. ఇప్పుడు చింతకింది గుడెంలున్నరు. మా వొడ్డు గుడానికి యిగ పోతరు. చీకటైనంక చిన్నన్నను మాదడప చేను (ఒండ్రుమట్టి చేను) కాడ మంచెదాక నువ్వు పడగొట్టి రావాలి కాసేపాగి" అని చెప్పి చిన్నన్నవైపు ఒకసారిజూసి గబగబ వచ్చిన దిక్కేవెళ్ళిపోయిండు.

నర్సింగాడెల్లిన దిక్కు జూస్తూ నిలుచున్న చిన్నన్నకు చీకటి ముదిరిందని నర్సిగాడు చీకట్ల కల్సిపోతుంటే అర్థమైంది

నడింట్లో నెగడి వెలుగుతుంది. దొర చట్టపోల్లకదే దీపం. వాళ్ళు గట్టిగ నమ్మే వాటిల్లో అడివి వాళ్ళదెనన్నద దొకటి. అందుకే ప్రతి ఇంట్ల నెగడి వుంటుంది. దీపం వున్నా లేకున్నా కిర్సనాయిలు బుడ్డి, లాంతర్లకు నూనె పిరమే (అధిక దర కలది) గాని అడివిలో కట్టెలకు కరువులేదు. సైకోని బయానికి మొదట దడిసినా దళం వచ్చిన కాన్నించి అడివి వాళ్ళదే అయింది.

సమ్మన్న తన ఏడాది నిండని బిడ్డ పారుతుందని చెప్పిండు సన్నని గొంతుతో. సమ్మన్న భార్య ఇస్తారక్క బిడ్డను ఎత్తుకచ్చి చిన్నన్న ముంగట కూకున్నది. ఇస్తారక్క కండ్లల్ల ఈ చీకట్ల – నెగడి గుడ్డి వెలుగులో కూడా మెరుస్తున్న కన్నీల్లను చిన్నన్న చూడగల్గిండు. అందులో కదుల్తున్న రెండు మంటలు, మాటలు లేవు.

చిన్నన్న మెల్లగా మందు సీసా దీసి ఏదో మందుగోలి దంచి అందులో ఏసి సీసను బాగా ఊపి ఇస్తారక్క చేతికిచ్చిండు. "కాపిస్క (కొపిచుక)తో నాలుగు సుట్లు (సార్లు) గుడుపాలి (తాగించాలి) మందొడిసే (మందు అయిపోయెవరకు) దాక" ని చెప్పిండు. అప్పుడే కొద్దిగ తన చేతులతోనే తాగించిండు.

ఇంతలో గుడిసె బయట అడుగు చప్పుడైంది. సమ్మన్న సప్పున లేచి బయటికి పోతూ తడకబెట్టి వాకిట్లో నిలబడ్డడు. ఇస్తారక్క లేచి సంకల బిడ్డను గడంచల (ఒకరకం మంచం) పండుకోబెట్టి నెగడి కట్టెలు గుంజి మంట తగ్గించింది. గుడిసెంత ఇంకా చీకటైంది. సంచిని గుడిసె ఎనక దిక్కు తడక దగ్గర బెట్టి మొగరానికి (నిలువుగా పెట్టిన కర్రస్తంభం) కట్టిన నారకట్టు విప్పి తడక సందుజేసింది. చిన్నన్న యింటెన్కకు పెరట్లకు పోవటాన్కి దారిజేస్తూ. ఇదంతా జేయడానికి గడియ పట్టలేదు.

చిన్నన్నను అవసరమొస్తే తప్పించటాన్కి ఆమె చొరువ – ప్రయత్నం. చిన్నన్న మనుసు కృతజ్ఞతతో నిండిపోయింది. బిడ్డకన్నా ఉద్యమం ఉద్యమకారులంటే ఇస్తారక్కకు ఎక్కువ. సదువు సాత్రములేని దోపిడికి నల్గిపోయిన ఆ గిరిజన కుగ్రామంలో పుట్టి పెరిగిన ఈ కోయతల్లి... కాదు వచ్చింది పోలీసులు కాదు... సమ్మన్న తమ్ముడు బొక్కన్న. సమ్మన్న లోపలికొచ్చి చెప్పిండు. ఇస్తారక్క అంతా సదిరింది మల్లా. తడక కట్టు కట్టి నెగడి మంటజేసి బిడ్డ నెత్తుకుంది. చనుపాలు ఇవ్వసాగింది కూసోని. చీకటి బాగానే అయింది.

ఊరులోని అన్ని యిండ్లు వెతికి అలిసిపోయిన పోలీసుపార్టీ అక్కడే మకాం చేసింది ఆ రాత్రి ఆశ్రమ స్కూల్లో. చెంద్రన్న వచ్చి ఈ సంగతి జెప్పిండు 'డాక్టర్ దొరకలేదని, కలైనా కావాలని కెంపోల్లడిగిండ్రట' ని కూకొని సుట్ట కాల్చుకుంటూ నెగడికాడ. సమ్మన్న ఒకచేత సంచందుకొని ముందు నడువంగ చిన్నన్న ఎంబడొచ్చిండు. జొన్నచేండ్లల్ల సరసర సప్పుడు కాంగ నిలువెత్తు చేండ్లల్ల అగుపడకుండా నడుస్తూ ఉత్తరం దిక్కు అడివి గోదావరోడ్డు కలిసేకాడ ఒర్రెదాటి దడప చేసు మంచె కాడ ఆగిండ్రు. నర్సిగాడు మంచెదిగి వచ్చి సంచందుకున్నాడు.

'అంతా సరిగ్గానే వుంద' ని సమ్మన్న నిలుసుంటె "నీ బిడ్డ కక్కుడు, పారుడు

రెండొద్దుల్లో ఆగుతది. మందు సరిగా వాడాలి. నువ్వికపోయిరా సమ్మన్న" ని పిడికిలెత్తిండు చిన్నన్న. జవాబుగా సమ్మన్న కూడా లాల్‌సలామ్ చేసి వెనక్కి తిరిగిండు. చీకట్ల కల్సిపోతున్న వైపు చూస్తూ మంచెక్కసాగిండు చిన్నన్న, తెల్లటి గోచిగుడ్డ కట్టుకొని అది తప్ప ఆ సలికాలంల ఏ బట్టలు లేని సమ్మన్నను, వేగుసుక్కలాగ వెలుగుతున్నడు సమ్మన్న.

సరసర కర్రలు కదిలే సప్పుడు విని గోదావరిలో బొర్రె కలిసే దిక్కు చూసిండు చిన్నన్న. నెత్తిమీద సద్దిమూట బట్టుకొని చెంద్రయ్య మంచెకాడి కొస్తున్నడు. నర్సిగాడు "నీకు నాకు ఇక్కడే వచ్చింది చిన్నన్న సద్ది" అంటూ మంచెమీంచి మూటందుకొని నెగడి (మంచె మీద మట్టిపోసి తడిక కాలకుండా ఏర్పాటు చేసుకున్న నెగడు) కాడబెట్టి చెంబందుకొని ఒర్రెకాడికి పోయి 'చెలమ' నీళ్ళతో మొకం కడిగి చెంబులో పట్టుకొచ్చి కూకున్నరు ఇద్దరు; తెల్లందాక జీవరాసుల (అడివి జంతువులు) తరుముకుంటూ కూసున్నరు సద్ది తిన్నంక. పక్కచేన్ల ఎవరో పాడుతున్నరు చిరుతల దరువులో -

"పల్లెసీమల దొరలభూములు
భూమిలేని వారికిచ్చి
మిక్తి ప్రాంతం నిలుపుకుంటూ
పట్టణాలను చుట్టుముట్టి
అంతిమంగా గెలుచుకోరన్న...
అనుమాన పడక ప్రజల రాజ్యం నిలుపుకోరన్న!!
ముక్తి పోరుల ముందుకురకరన్న !!
శత్రుబలమూ క్షుద్రమేరా
చీలిపోయి వున్నారయ్యా
ఏకమయ్యి పేదలంత
కొడ్తె దెబ్బ కూల్తడయ్య
ఎర్రదండుతో కలిసికదలన్న
అనూమన పడక ముక్తిపోరుల !!
అటు దూరంగా - ఊరి దిక్కు నుండి
"గార్డ్ హోశియార్!
... థమ్ కౌన్ ఆతాహై...! వినబడ్తుంది పోలీసుల కేక.

మంచె దిగి అడివి దిక్కు నడువ సాగిండు చిన్నన్న. గోదావరిలో అప్పుడప్పుడు చావలెగరంగ 'బుడుక్' మని సప్పుడు వినబడ్తుంది.

వేగుచుక్క బారెడెక్కింది.

● 1988 ●

# 52. బొమ్మలు

♦ బోయ జంగయ్య ♦

"నా దేవున్ని నాకిప్పియ్యండి" అంటూ కలెక్టర్ కార్యాలయపు గేటులోకి ప్రవేశించాడు ఓ నడివయసు వ్యక్తి. వేసవి వేడిని తట్టుకొని ఉద్యోగులు కొందరు బయటకు వచ్చి అదే ఆవరణలో వున్న వేపచెట్టు కింద నిలుచున్నారు. అంతేకాదు, వాళ్ళు మధ్యంతర ఎన్నికల గురించి మాట్లాడుకుంటున్నారు. అయన మాటలు విని అతని వైపు మళ్ళారు.

"మీరన్నా చెప్పండి, అయ్యలారా, నా దేవున్ని నాకిప్పియ్యండి" అన్నాడు.

అక్కడ నిల్చున్న వాళ్ళవైపు, ఆ తరువాత కలెక్టర్‌గారి గదివైపు చూస్తూ అటూ ఇటూ తిరుగుతూ ఉన్నాడు.

"నా భూమిని గుంజుకున్నరు. నా రాళ్లను గుంజుకున్నరు. నా సుత్తెను గుంజు కున్నరు. నేను ఎవరినీ ఏమీ అనలేదు. అకర్కి నా దేవున్ని కూడా గుంజు కున్నరు. నేను అడుగుతున్న ఎందుకు గుంజుకోవల్సి వచ్చింది" అంటూ పిడికిలి బిగించి అడుగుతున్నాడు. ఎదనిండా బాధతో ఒగర్చుతున్నాడు.

చూస్తూ నిల్చున్నారే తప్ప ఎవరూ ఏమీ మాట్లాడడం లేదు. ఏం మాట్లాడతారు. ఓ సంవత్సరం నుండి జరుగుతున్నదే ఇది. వస్తాడు, అరుస్తాడు, ఎవరూ పట్టించుకోరు. తనంతట తానే తిరిగి వెడతాడు. అంతేకాదు, తిట్టుకుంటూ వెడతాడు. అప్పుడు రాళ్ళ వాన వెలిసినట్టు ఉంటుంది.

ఒకరోజు మధ్యాహ్నం భోజన సమయంలో కలెక్టర్‌గారు తన గదినుండి బయటకు వస్తున్నపుడు ఎదురెళ్ళి

"అయ్యా, నా దేవున్ని నాకిప్పియ్యండి. నీ కాళ్ళు పట్టుకుంట తండ్రి" అంటూ కాళ్ళ మీద వంగాడు.

"ఏయ్ వద్దు వద్దు" అంటూ వెనక్కి జరిగాడు కలెక్టర్. అతని వాలకం గ్రహించిన కలెక్టర్‌గారు సి.సి.ని పిలిచి -

"విషయం కనుక్కో" అన్నాడు.

"సరే సర్" అని తలవూపి అతని వైపు చూస్తూ పక్కకు జరగమని సైగ చేశాడు. అతను జరగకుండానే ధనస్సులా వంగి నిల్చుని -

"నా దేవుడు నాకు కావాలే" రొమ్ము బాదుకుంటూ అన్నాడు.

కలెక్టరు గారు ఆ మాటవిని నవ్వుతూ

"భూమి అడుగు, ఏదన్న లోను అడుగు కానీ నేను దేవున్ని ఎక్కడినుండి తేను" అనుకుంటూ నవ్వుకున్నాడు.

"ఏ ఊరు" అడిగాడు కలెక్టర్ అతని భుజం మీద చేయి ఉంచుతూ.

సంబంధిత ఎమ్మార్వోతో మాట్లాడి, నోట్ తీసుకొని

"పంతంగి" అన్నాడు చేతులు జోడిస్తూ.

"ఈయన నీపని చూస్తాడు అన్నాడు " అప్యాయతను కనబరుస్తూ.

"ఎవరూ చూడరు తండ్రి. ఆ ఎమ్మార్వో కూడ వాళ్ళవైపే ఉన్నడు. వాళ్లకెయ్యే మాట్లాడుతుండు. నాకు మీరే దిక్కు తండ్రి" అన్నాడు వినయంగా.

కలెక్టర్ అతని వైపు పరిశీలనగా చూశాడు సగం నెరిసిన తల, పెరిగిన గడ్డం, పాదాలకు చెప్పులు లేవు. దుమ్ముపట్టి ఉన్నాయి. కాషాయపు పంచె కట్టి అదే రంగు జుబ్బా వేసుకున్నాడు. కాయకష్టంలో పెరిగి తరిగిన శరీరం. అతను ఆవేశంగా మాట్లాడుతూ ఉంటే గొంతు నరాలు తేలి కదులుతూ ఉన్నాయి. మాటను పట్టి కదులుతున్న కనుగుడ్లు, నిక్కి, నీలుగుతూ కాలి బొటిమన వేలి మీద నిల్చుని ఆవేదనగా అరుస్తూ ఉన్నాడు. శరీరం అంతా చెమటతో తడిసిపోయింది.

కలెక్టర్ కారులో కూర్చోగానే కారు కదిలింది. అతను కారుకు అడ్డంగా తిరుగుతూ అదేమాట. నా దేవున్ని నాకిప్పియ్యండి అన్నాడు. అటెండర్ అతన్ని పక్కకు జరిపాడు. కారు వెళ్ళిపోయింది. అతను మరింత ఆవేశంతో అటెండర్ వైపు, అక్కడున్న వాళ్ళవైపు చూస్తూ, రెచ్చిపోయి –

"మీరంత దొంగలు, మంది నోళ్ళు కొడతరు. ఈ దేశంలోని చదువుకున్న వాళ్ళంతా మోసగాళ్ళు, వోటుకాడ మోసం, కట్టేకాడ మోసం, తొవ్వేకాడ మోసం, బడికాడ మోసం, గుడికాడ మోసం, మోసం, మోసం, ఇందరు ఉండి నా దేవున్ని నాకిప్పియ్యటం లేదు. అంటే మీరంతా మోసగాళ్ళే" అంటూ అందరివైపు చూపుడు వేలును చూపిస్తున్నాడు. మీరంతా మోసగాళ్ళే అనేసరికి విధిలేక చిరునవ్వును తెచ్చిపెట్టుకుంటూ ఒక్కొక్కరు అక్కడినుండి కదులుతూ ఉన్నారు.

కలెక్టర్ సి.సి. అతన్ని పిలిచి దరఖాస్తు రాసి అతని సంతకం తీసుకున్నాడు.

"నీ పేరు నాకు తెలుసు" అని వేలిముద్ర పక్కన ఎంకులు అని రాశాడు.

"ఎందుకు తెలియదు. ఎప్పటినుండో తిప్పుతనే వుంటిరి. నా దేవున్ని నాకిప్పియ్యక పోతే చూడు. అసెంబ్లీ ముందు ధర్నా చేస్తా, ఢిల్లీకి వెళ్ళి దేశ ప్రధానిని అడుగుత, ఈ ఎంకన్న అంటే ఏమనుకున్నరు" అంటూ ఓసారి గడ్డాన్ని చేత్తో దువ్వుకున్నాడు. అప్పుడు అతడు గాలిదుమారంలో ఊగుతున్న చెట్టులాగున్నాడు.

ఈ లోపు సి.సి. వైర్‌లెస్ సెట్ ఆన్‌చేసి–

"హలో హలో యం.ఆర్.ఓ. చౌటుప్పల్ రెస్పాండ్ టూ జిల్లా ఆఫీస్, సి.సి.ని మాట్లాడుతున్న ఓవర్."

"హలో మాట్లాడుతున్న సర్. ఓవర్."

"మీ పక్క ఊరి పూజారి పంచాయితీ ఏమైంది? దాని రిపోర్ట్ అర్జెంటుగ మెసెంజర్ ద్వారా పంపండి. ఓవర్."

"సరే సర్. అతడు అక్కడికొచ్చి గొడవ చేస్తున్నాడా. పంపిస్తాను సర్. ఓవర్."

అదే వూరికి చెందిన ఓ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు. పెద్దవాడు ఎంకులు, చిన్నవాడు ఎల్లయ్య, ఎల్లయ్య పాతికేండ్ల వయసు నుంచే ప్రతి శనివారం పూనకం వచ్చి కొలువు చెప్పటం మొదలుపెట్టాడు. మువ్వల నిక్కరు తొడుక్కొని, చేతిలో చెర్నకోల పట్టుకొని ఒంటికి పసుపు రాసుకుని, నడుంకు గవ్వల పట్టి పెట్టుకొని, సుద్దులు చెపుతాడు. చుట్టుపట్టు గ్రామాల వాళ్ళు తమ తమ సమస్యలతో వచ్చి బియ్యం, పైసలు ఇచ్చి తమ కష్టాలు తీర్చమని మొక్కుతుంటారు. దేవతలను తల్చుకోని వీభూతి పెడతాడు. తగ్గినోళ్ళకు తగ్గుతుంది. మరికొందరికి అక్కడికి వచ్చిన తృప్తితో తగ్గినట్లు అనిపిస్తుంది. అందువల్ల అప్పటినుండి ఈ తంతు నడుస్తూనే వుంది. అతనికి బట్ట పొట్ట గడుస్తూ ఉంది.

పెద్దవాడు ఎంకులు, ఆయన భార్య, మరికొన్ని జంటలు కలిసి, ఊరి పక్కమ్మటే వున్న శనిగల గుట్టకు రాళ్ళు, కంకర కొట్టుకొని అమ్ముకుంటూంటారు. ఎంకులు విశ్రాంతి దొరికినపుడు ఓ బండకు ఓ కోతి బొమ్మను చెక్కాడు. దానికి కుంకుమ రుద్ది హనుమంతుడు అని మొక్కుతూ అక్కడికొచ్చిన వాళ్ళతో మొక్కిస్తూండేవాడు. రాళ్ళు, కంకర తీసుకెళ్ళడానికి చుట్టుముట్టు ఊళ్ళ వాళ్ళేకాకుండా, హైదరాబాద్‌నుండి కూడా వచ్చే వాళ్ళు. అలా లారీ వాళ్ళు పూలు వుంచి, కొబ్బరికాయలు తెచ్చి కొట్టడం, దాని దగ్గర పడివున్న ఎంకులుకు ఒకటి రెండు రూపాయలు ఇవ్వడం జరుగుతూ వచ్చి. ఓ సంవత్సరం తిరిగేసరికి అక్కడ ఓ భక్తి వాతావరణం ఏర్పడి, అక్కడికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. కొన్నాళ్ళ తరువాత అదే గుట్టకు ఇరుకైన చరికలో నరసింహుడు వెలిసినట్లుగా ఎంకులు అందరికి చెప్పాడు. మొదట ఎవరూ నమ్మలేదు. తర్వాత తర్వాత సన్నటి చరికలో సింహం తల చెక్కడం మనిషి పని కానేకాదు అంటూ, అక్కడ దేవుడే వెలిశాడు అన్న నిర్ణయానికి వచ్చారు. ఆ తరువాత అక్కడికి వచ్చిన గ్రానైట్ పాలిష్ కంపెనీవాళ్ళు పరిక్షించి చూడగా ఆ చరికలో సింహం రూపం కనిపించింది. ఆ విషయం హైదరాబాద్ వాళ్ళకు తెలిసింది. అక్కడి వ్యాపారులు, ముఖ్యంగా పాల వ్యాపారస్థులు, కల్లు వ్యాపారస్థులు రావటం, కానుకలు సమర్పించి వెళ్ళటం జరుగుతూ వుంది. మొదట చూసి అందరికీ చెప్పిన ఎంకులే అక్కడ పూజలు చేస్తూ వచ్చాడు.

ఇక అంతే, ఎంకులు ఎంకన్న అయ్యాడు. అర్చన చేసుకుంటూ రాళ్ళు కొట్టడం మానేశాడు. ఎంకన్న వేషభాషలలో మార్పు వచ్చింది. పట్టణాల నుండి మార్వాడీ వాళ్ళు రావడం, స్వామి వారికి బట్టలు, నగలు తేవడం జరుగుతూ ఉంది. పెద్ద పెద్దవాళ్ళ రాకతో పెద్ద పెద్ద పందిళ్ళు వేయించి ఉత్సవాలు జరుపుతూ వచ్చారు. శనిగల గుట్టకు వెలిశాడు కాబట్టి, శనిగల నర్సింహస్వామి అని నామకరణం చేశారు. ముందు గ్రానైట్ కంపెనీవాళ్ళు గుడి కట్టించారు. ఆ తరువాత మార్వాడీలు

ధర్మసత్రాలు కట్టించారు. పూజారి ఉండడానికో చిన్న ఇల్లు కట్టించారు. ఆ ఇంట్లోనే ఎంకన్న ఉంటూ వచ్చాడు. సూర్యోదయంతో సుప్రభాత గీతాల పాటలు మైకు ద్వారా వినిపిస్తున్నారు. గుట్ట చుట్టున్న బావుల దగ్గరి దొడ్లలోని పశువులు సంగీతాన్ని వింటూ నెమరేస్తూ వుంటాయి. చుట్టూరా చెలుకల్లో, చెట్ల కింద ఎడ్లబండ్లు, జీపులు, కార్లు, ప్రతిరోజు ఆగేవి. మరీ శనివారం రోజుల్లో జనమే జనం. నిత్యం అక్కడ జాతరే జాతర. మెయిన్ రోడ్డునుండి గుట్టవరకు రోడ్డు వేశారు. గుట్ట దగ్గర బోరు వేశారు. ఎటు రెండు కిలోమీటర్ల దూరంలో వ్యవసాయ బావుల దగ్గర పంట పండించటం మానేసి ఆ బావుల్లోని నీటిని బిందెల లెక్కమ్మటి అమ్ముకోసాగారు. పొలాల్లో డేరాలు వేసి స్థలం రోజువారీగా అద్దెకిస్తున్నారు చెట్ల నీడలను కూడరోజు లెక్కన అద్దెకిస్తున్నారు. అక్కడ ప్రతీది వ్యాపారం అయింది వచ్చిన వాళ్ళకు వంట పనుల్లో సహాయం చేయడానికి ఊళ్ళో ఆడ, మగ వచ్చి రోజు కూలిగా పనిచేసేవారు. ప్రతివాడి చేతిలో పైసలు తిరగడం మొదలైంది. పట్టణపు అలవాట్లు, ఆకర్షణలు అన్నీ పల్లెకు చేరాయి. తాగుడు, జూదం, తందాన, ఒకటేమిటి అన్నీ అందుబాటులో కొచ్చాయి.

కట్టు, బొట్టు మారి వేషభాషల్లో ఎంతో మార్పొచ్చింది. ఒక్కసారె ఆ వూరు మారిపోయింది. ఎస్.టి.డి. ఫోన్ వచ్చింది. దూరదూరంనుండి వచ్చి ఓ రాత్రి నిద్ర చేసి వెడుతూ ఉన్నారు. రోజుకో కిరాణం సరుకుల లారీ వస్తుంది. గ్రామ పంచాయితీ ఆదాయం పెరిగింది. గ్రామ సేవకులను, ఊడ్చేవాళ్ళను పెట్టి, ఊరిని శుభ్రంగా ఉంచుతున్నారు. ఊళ్ళోకి గుర్రపు బండ్లు, ఆటోలు వస్తూపోతూ వున్నాయి. అక్కడ అన్నీ పాత నమ్మకాలు - కొత్త కోరికలు.

ఎంకన్నకు క్షణం తీరికలేదు. రాబడి పెరిగింది. పూజలు, అర్చనలు, అభిషేకం, లారీలకొద్దీ కొబ్బరికాయలు, అగరొత్తులు, హారతి కర్పూరపు బిళ్ళలు, కుంకుమ కుప్పలు, రోజూ అక్కడ తిరునాళ్ళ సందడి. ఊరి దశ తిరిగిపోయింది. దేవాదాయ శాఖవారు ఓ కమిటీని వేశారు. ఆ ఊరిపెద్దలను అందులో సభ్యులుగా వేశారు. మొత్తంమీద మూడు దీపాలు, ఆరు హారతికర్పూరపు వెలుగుల్లా వెలిగిపోతూ ఉంది ఆ దేవస్థానం.

ఒకరోజు ఉన్నట్టుండి గుడి దగ్గరి పూజారిని తొలగించారు. అతను ఉంటున్న ఇల్లును ఖాళీ చేయించి అందులో కొత్త పూజారిని ఉంచారు. అనుకోని సంఘటనకు ఎంకన్న ఖంగుతిన్నాడు.

ఎందుకు అని ప్రశ్నిస్తే ఎవరూ జవాబు చెప్పలేదు.

"నీకు చదువు రాదు. శ్లోకాలు చదవటం లేదు. భక్తుల గోత్రాలు అడిగి తెలుసుకొని వాళ్ళ పేరుమీద అర్చనలు చేయలేకపోతున్నావు. కాబట్టి ఇక్కడికొస్తున్న భక్తులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అందుకే తొలగించటం తప్పనిసరి అయింది." అన్నాడు ఆలయ కమిటీ పెద్ద.

"అసలు దేవున్ని నిలిపింది నేను. పూజలు మొదలుపెట్టింది నేను. ఊరూరా ప్రచారం చేసింది నేను. నేనెట్ల ఇక్కడినుండి పోతాను? పోను" అని గర్భగుడిలోనే కూర్చుండి, దేవుని బొమ్మవైపు తీక్షణంగా చూశాడు.

కొత్త పూజారి అర్చనలు సాగిస్తూనే ఉన్నాడు. ఎవరికి అర్థంకాని శ్లోకాలను వల్లిస్తూనే ఉన్నాడు. ఎంకులు మౌనంగా కూర్చున్నాడు. అది గమనించిన కమిటీ వాళ్ళు అతను అలా కూర్చోవటం కూడా నచ్చక ఆఖరి బాణం సంధించారు.

"నీవు దళితునివి. కనుక పూజారిగా ఉండకూడదు. గర్భగుడిలోనూ కూర్చోకూడదు" అన్నారు.

అది విన్న ఎంకులుకు మతిపోయినట్టయింది. ఎంకన్న ఒక్కసారే ఎంకులు అయిపోయాడు.

"అది సార్ కథ. ఇక అప్పటినుంచి నా దేవున్ని నాకివ్వండి అని ఆఫీసుల చుట్టూ తిరుగుతూ వుంటాడు. పెడితె తింటాడు. లేకుంటే లేదు. ఆయన భార్య ఎప్పటిలానే గుట్టకు కంకర కొట్టి పూట గడుపుకుంటుంది" అని ఉన్న యం.ఆర్.వో రిపోర్ట్‌ను కుదించి, నోటు రాసి కలెక్టర్‌కు సమర్పించాడు సి.సి.

★ ★ ★

తాటివనం మధ్యనుండి దండు బాట. దండుబాటనుండి ఊళ్ళోకి వెళుతూ వుంటే ఓ వాగు. వాగును దాటి రెండు ఫర్లాంగులు వెడితే గవర్నమెంటు వాళ్ళు కట్టించిన కాలనీ. దాన్ని దాటిపోతూ వుంటే ఊరి పక్కమ్మటె దళితుల ఇండ్లు. ఆ ఇండ్లలో ఓ పెంకుటిల్లు ఎంకులుది. ఇంటి ఎదురుగా ఓ వేపచెట్టు. ఇంకొంచెం దూరంలో చేదబావి. తవ్విన కొత్తలో మాత్రమే నీరు ఊరి ప్రస్తుతం ఎండిపోయింది. బోర్లు వేయడం వల్ల నీరు అడుగుకు పీక్కపోయి ఎండిపోయిందని కొందరు, వర్షాలే సరిగలేంది బావులల్లో నీళ్ళు ఎట్టాస్తయని మరికొందరు అన్నారు.

"ఎవరేమన్నా నీళ్ళూరని బావిని పూడపోయకతప్పదు" అన్నది ఎంకులు భార్య దుర్గమ్మ. జీవితం నేర్పిన పాఠాలమీద ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్న మనిషి ఆమె.

ఒకరోజు ఎక్కడికో పోయి తిరిగి వచ్చిన భర్తతో –

"ఎన్నాల్లిట్ల తిరుగుతవు. నేను ఒక్కదాన్ని పనిచేస్తే పూటకెల్తదా? అడవినుండి వచ్చిన దుర్గమ్మ జాలరిలో ఉన్న తొట్టెలోని నీళ్ళను ముఖంమీద చల్లుకుంటూ అంది. తిరిగొచ్చి కూర్చున్న ఎంకులు చప్పుడే చేయలేదు.

"నేను మాట్లాడుతుంటే సెవికెక్కటం లేదా ఏంది?" అంటూ వంగి తన పాదాలను కడుక్కుంటూ, వేళ్ళకు ఉన్న కంచు మట్టెలను అటూ ఇటూ తిప్పుకుంది. వేలాడబడ్డ నల్లపూసల పేరును రవికె ముడి కిందికి దోపుకుంది.

ఎంకులు, ఎల్లమ్మతల్లి అంటూ వేపచెట్టుకు చేతులెత్తి దండం పెట్టాడు.

"మొక్కు మొక్కు దాన్ని కొన్నోడు రేపు కొట్టుకపోతడు గాని" అంటూ చేతి గాజులను అటూ ఇటూ జరుపుకుంది. ఈ చెట్టును అమ్మితే వచ్చే డబ్బుతో వెండి కడియాలు చేయించుకోవాలని ఆమె కోరిక.

"దేవ దేవ అనుకుంటూనే తిరుగు. ఆ ఏశం, ఆ గడ్డం, ఈడెవడో పిచ్చోడు అని జనం రాళ్ళతో కొట్టెకాలం వచ్చింది" అంది మళ్ళీ తానే. అప్పుడు ఓ మాదిరి ఏవగింపు, కోపం రెండు ఒకేసారి కనిపించాయి ఆమె ముఖంలో. కొంగుతో

మోచేతులను తుడుచుకుంటూ వుంది. ఆమె అలికిడికి దడి చాటున పడుకున్న కోడి, కోడి పిల్లలు వచ్చి దుర్గమ్మ చుట్టూ చేరి అరుస్తున్నాయి అది చూసి ఆమె ఇంట్లోకి వెళ్ళి ఇన్ని నూకలు తెచ్చి వాటి ముందు చల్లింది. అవి వాటిని ఏరుక తింటూ ఉంటే, కడుపు నిండుతుంటే కలిగే తృప్తో, త్వరగా తినాలనే ఆతురతో కనిపించింది. అవి ఏదో మాదిరిగా శబ్దం చేస్తున్నాయి తాను అడవినుండి తెచ్చిన ఆకును మేక ముందేసింది. అది తోక ఆడిస్తూ మేస్తూ ఉంటే దాని పిల్ల పాలు చీకుతూ తోకాడిస్తుంది. వాటినే చూస్తున్న దుర్గమ్మకు మనసులోని ప్రేమ కళ్ళలోకి పాకి తడిగా మెరిసింది. అప్పుడామె ఎదలో ఏదో బాధ కదిలింది

దుర్గమ్మ ఇంట్లోకి వెళ్ళి చెంబులో నీళ్ళు తెచ్చి ఎంకులు కిస్తూ -

"ఇక ఆ దేవున్ని మరిచిపో మనకు కానిది మంది పాలైందాన్ని ఊర్కె ఆలోచిస్తే ఏమొస్తది. మనోవ్యధ మంచిది కాదంటరు పెద్దలు. నా ఇల్లు ముంచకు. పిల్లా జెల్లా లేనిదాన్ని" అంది మేకపిల్లవైపు చూస్తూ.

చెంబెడు నీళ్ళు తాగి ఖాళీ చెంబును భార్యకిస్తున్నప్పుడు భార్య ముఖంలోకి చూశాడు. ఏదో బాధ ఎదలోనుండి కళ్ళలోకి పాకుతున్నట్టు గ్రహించాడు.

"పిల్ల జెల్ల లేదంటె నేనేం చెయ్యను. నీవే కంటలేవైతివి" అన్నాడు కాస్త నవ్వును నటిస్తూ. ఆమెను నవ్వించుచున్న ఉద్దేశంలో.

ఆ మాట అనగానే ఆమెకు రోషమొచ్చి -

"ఇత్తనాన్ని భూమి ఎప్పుడూ దాచుకోదు. అంతేకాదు, అదును, పదును అవసరం దాన్ని గుర్తించి మసలు కోవాలె" కట్టె విరిచినట్టంది.

మరునాడు తెల్లవారు జామునలేచి తట్ట, పార అందుకొని బావిని పూడబోస్తూ ఉంది. మంచి పొడగరి. పొడవుకు తగ్గ లావు. కాయకష్టం చేసి రాతి శిల్పంలా ఉన్న దుర్గమ్మకు బావిని పూడ్చటం ఓ పనేమీకాదు. అంతకుముందు కూడా భార్యభర్తలు ఇద్దరె బావిని తవ్వారు. బండ కనిపించగానే లోతు తవ్వలేకపోయారు. ఎంకులు వచ్చి దుర్గమ్మ దగ్గర పారను తీసుకున్నాడు. దుర్గమ్మ గోచిని తీసి, నడికట్టును వదులు చేసికొని, నుదుటి చెమటను కొంగుకు అద్దుకుంది. తడిసిన ఒంటికి రవికె అంటుకుపోయింది. చెమట మట్టిని కదుక్కోవడానికి జాలారులోకి వెళ్ళింది. ఆమెది ఎండుకొబ్బరి లాంటి నల్లని శరీర ఛాయ.

"నీరూరని బావెందుకు?" అని తనలో తానె అనుకుంటూ తలమీద నీళ్ళచెంబును గుమ్మరించుకుంటున్న శబ్దం.

"నన్ను పిలిచితివా" అని అడిగాడు ఎంకులు జాలారు వైపు చూస్తూ.

"బాగుంది నేనేదో అనుకుంటే నిన్ను జాలాట్లోకి ఎందుకు రమ్మంట."

"ఒళ్ళు రుద్దడానికి గట్టా" అన్నాడు ఎంకులు ముసిముసిగ నవ్వుతూ.

"సక్కదనం సల్లంగుండా. అంతకు నోచుకున్నాం మనం. ఓ దిక్కు సన్నాసులమై తిరుగు తుంటిమి గాని, అదును పదును పట్టింపె లేదాయె" అనుకుంటూ చిరాకుతో మరో చెంబు గుమ్మరించుకున్న శబ్దం వచ్చింది.

"ఇక నుండి నీవు పొద్దంత పనికిపోయి, రాత్రీలు ఇంటి దగ్గర ఉండకపోతివి నీ సంగతి చెపుత" అంటూ దడిమీద చీరను అందుకుని ఒంటికి చుట్టుకుని ఇంట్లోకి నడిచింది.

ఎంకులుకు నోటి మాట రాలేదు.

★ ★ ★

పూజారి విషయం పునరాలోచించవలసిందిగా, అంతేకాకుండా మొదటినుండి పూజారిగా ఉన్న ఎంకులుకు అక్షరజ్ఞానం కల్పించి అర్చక వృత్తిలో శిక్షణ ఇప్పించి రాజ్యాంగపరమైన అతని ప్రాధమిక హక్కులను కాపాడవలసిందిగా ఆలయ కమిటీ వారికి జిల్లా కలెక్టర్ ఆదేశాలను జారీ చేశారు.

అది విన్న ఎంకులు ముఖం విప్పారింది. ఆ రోజురాత్రి పొద్దుపోయేవరకు గ్రామ పంచాయితీ ఆవరణలో గుట్ట పూజారిని గూర్చి తర్జభర్జనలు జరుగుతూ ఉన్నాయి. కలెక్టర్ ఆర్డర్ గూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

ఎంకులు తానే పూజలు నిర్వహిస్తానని పట్టుబట్టాడు. ఒకప్పుడు పట్టు పంచ, పట్టు ఉత్తరీయంతో ఉండే ఎంకులు ఇప్పుడు మామూలు గుడ్డలతో ఉన్నాడు. మునుపటి కళ అతనిలో లేదు. కలెక్టర్ ఆర్డరొచ్చి ముఖాన కొంతకళను తెచ్చిపెట్టింది.

ప్రభుత్వ ఆదేశాలు ఆచరణ సాధ్యమైనవి కావు అని పక్కకు నెట్టారు. అంతేకాదు, ఎంకులు గుడికంటె ముందు నీవు బడికి పో అని ఎద్దేవా చేశారు.

ఆలయ కమిటీ వారు తమ పూర్వపు నిర్ణయంలో మార్పులేదన్నారు. కావాలంటే ఎంకులు మొదటినుండి అక్కడనే పడివున్నమాట వాస్తవం. అతను చేయగల్గిన పారిశుధ్యపు పనుల్లో ఏదో ఒకటి ఆయనకు, ఆయన భార్యకోటిచ్చి వాళ్ళపూట గడిచేటట్లు చూడాలని ఈసారి చేసిన తీర్మానాన్ని మరోసారి చదివి వినిపించారు.

ఎంకులు ఎదలో బాధాపూరిత శ్వాస బయటకు తన్నుకొచ్చి కళ్ళలో నీరై నిలిచింది. అంతేకదా అని ఆ కులస్థులూ అన్నారు.

దళితవాడంతా ఎంకులుకు వ్యతిరేకంగా ధ్వజమెత్తారు. ఎవరైనా తీర్మానానికి ఒప్పుకోక తప్పదు. అయినా ఎంకులులో ఎంతో మార్పు వచ్చింది. అతను ఎవరినీ లెక్క చేయటం లేదు. అతనిలో ధనాశ పెరిగింది అని అతని కులస్థులే అన్నారు. కమిటీ తీర్మానానికి ఖంగుతిన్న ఎంకులును తన కులస్థుల మాటలు చాలా కుంగదీశాయి.

వీళ్ళు ఇట్లా అనడానికి కారణం కేవలం ఈర్ష్యయే తప్ప తాను చేసిన నేరం ఏమీ లేదని, ఈర్ష్య భారతంనాటి కాలంలోను ఉంది, ఇప్పుడూ ఉంది. నాడు లక్కమేడకు నిప్పు, నేడు నా బతుక్కె నిప్పు. అనుకుంటూ ఓసారి కళ్ళు మూసి తెరిచాడు

నేలమీద కూర్చుని తన రెండు మోకాళ్ళ మీద తల వంచుకుని చేత కట్టెపుల్లతో నేలమీద దేవుని బొమ్మ గీస్తూ గతంలోకి వెళ్ళిపోయాడు. కోస్తాలో తుపాన్ కారణంగా అంతటా వరుసగా ముసురు కురుస్తూ వుంది. ఏ పనులు సాగడం లేదు ఎంకులు

అతని భార్య దుర్గమ్మ గుట్ట మీదనే కమ్మల గుడిసెలో ఉండిపోయారు. గుట్టకున్న పెద్ద పెద్ద గుండ్లను తీసుకెళ్ళడానికి గ్రానైట్ కంపెనీ వాళ్ళ లారీలు, క్రేన్‌లు అక్కడికి వచ్చిపోతూ వున్నాయి.

ముసురు కారణంగా ఆ నాలుగు రోజులు వాటిని అక్కడే వుంచి డ్రైవర్లు, క్లీనర్లు కొంత దూరంలో ఉన్న బావి దగ్గరి కొట్టంలో ఉంటున్నారు. తన గుడిసె ముందు పక్క పక్కమ్మటె ఉన్న మూడు పెద్ద గుండ్లమీద ఎంకులు చూపు పడింది.

అక్కడ దేవాలయం వెలిసింది. తనను మాత్రం పాము మింగింది. మళ్ళీ తోక దగ్గరకు రావాల్సి వచ్చింది అనుకుంటూ ఓ బరువైన శ్వాస వదిలాడు.

అంతలోనే పెద్ద పేలుడు శబ్దం!

ఊరంత ఉలిక్కిపడింది!!

కమిటీ సభ్యులందరూ భయంతో వణుకుతూ లేచి నిల్చున్నారు.

కొంతసేపటికి ఆలయపు పనివాళ్ళు పరుగెత్తుకొచ్చి-

"గుడిని పేల్చేశారు" అని బిక్కుబిక్కుమంటూ నిలుచున్నారు. చావు తప్పి బయటపడ్డాం అన్నట్లు చూస్తున్నారు.

"ఎవరు?" ఆలయ కమిటీ పెద్ద అడిగాడు. ఆయన గొంతులోనూ కంపరముంది. "తెలియదు" అన్నారు. వాళ్ళలో ఇంకా భయం తగ్గలేదు.

"మీరంతా వుండి ఏంచేశారు?" అన్నాడు ఏదో చంపుకోలేని బింకంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు.

"మేము హనుమాన్ పందిరికింద హరికథ వింటూ కూర్చున్నాం" అన్నారు.

ఇంకా వాళ్ళకు వణుకు తగ్గలేదు. బిత్తరపాటు పోలేదు.

"ఎవరు చేశారీ పని?" అన్నప్పుడు పెదాలు వణుకుతున్నాయి.

అదే తెలియదు అన్నట్టు చూశారు.

అప్పుడు వాళ్ళ గుండె అదురుతున్నట్టు వాళ్ళ చూపులు చెపుతున్నాయి. అందరి చూపులు ఎంకులు మీద ఆగినాయి.

ఎంకులు చెంపలేసుకుంటూ, కంటనీరు పెడుతున్నాడు.

"పదండి చూద్దాం" ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్నారు.

"ఇంత రాత్రి వద్దు ఇంకేమి జరుగనున్నదో" అని సర్పంచ్ అనగానే అందరూ ఆగిపోయారు.

ఒక్క ఎంకులు మాత్రం నెత్తీ, నోరూ కొట్టుకుంటూ గుడివైపు పరుగెత్తాడు.

ఎప్పటిలాగానే ఆ రాత్రి తెల్లవారింది. ఊరు ఊరంతా గుట్ట దగ్గరికి చేరింది. అక్కడ రాళ్ళు రప్పల కుప్ప మిగిలింది.

జరిగిన విషయాన్ని గ్రామాధికారి పోలీసులకు తెలియపర్చగా, పోలిసులొచ్చి ఆరా తీస్తున్నారు.

ఎవరూ, ఎవరు పేల్చిందీ చెప్పలేకపోతున్నారు.

అది జరిగినప్పుడు ఎంకులు తమ ముందే ఉన్నాడని ఆలయ కమిటీ తమ ప్రాదమిక సాక్ష్యంలో తెలిపింది అయినా పోలీసులు ఎంకులుపై నిఘా ఉంచారు. ఊరంతా ఎవరికి తోచినట్లు వాళ్ళు అనుకున్నారు.

పోలీసులు ఏదీ తేల్చలేక "అన్నల పనే" అని కేసు నమోదు చేసుకున్నారు. అది విన్న "అన్నలు ఎవరి మత విశ్వాసాలను గాయపర్చటం మా విదానం కాదు" అని ప్రకటించారు.

"ఏపచెట్టు ఎల్లమ్మకాదు, బండరాయి భగవంతుడు కాదు. రెక్కాడితే డొక్కాడే మాకు నీవే దిక్కు" అనుకుంటూ సుత్తెనే చూస్తూ, రాయి చెక్కమీద దెబ్బమీద దెబ్బ వేస్తూ అంది దుర్గమ్మ.

ఆమె పక్కమ్మంటే ఎంకులు.

● 1988 ●

# 53. గిర్నిబాయి

♦ పసుపులేటి మల్లికార్జునరావు ♦

తెలుగువాడి రాజధాని 'హైద్రేబేడ్'లో మొన్నీ మధ్యనే ఎమ్మే పూర్తిచేసి, ఏదయినా ఒక థీసిస్ రాసి - డాక్టరేట్ పొందాలనే ఆలోచనగల - సగటు తెలుగు విద్యార్థి వొహడికి దారమ్మట నడిచి పోతుండగా కన్పించిందది.

'త్రిల్లింగ్ విశ్వవిద్యాలయమ్'

అన్న బోర్డు

అదిరిపోయాడు. ఆరు విశ్వవిద్యాలయాలున్నాయి. వ్యవసాయ, వైద్య, సార్వత్రిక వంటి విశ్వవిద్యాలయాల పేర్లు విన్నాడు. కాని - ఇదేమిటి? మనుషుల జీవితాలకు బోర్ కొట్టకుండా 'త్రిల్' కోసం వేరే ఒక విశ్వవిద్యాలయమా?

ఔరా! తెలుగువాడు! ఎంత తెగులు మీరిపోయేడు?

తెలుగువాడు కదా - ఎంత చెడ్డా! కుతూహలం చంపుకోలేక, తనకిక్కడ థీసిస్‌కి ఉపయోగపడే సబ్జక్టు ఏదయినా దొరుకుతుండ వచ్చుననుకొని లోనికి వెళ్ళాడు.

అక్కడ - మాతృభాష తాలూకు - పిసరంత వాసన కూడా లేదు. వైస్ ఛాన్సలర్ శ్రీ మురుగప్పన్ నంబియార్ నుండి డిస్పాచి క్లర్క్ వరకు - చటర్జీలు, జైన్‌లు, డగ్గల్‌లు, మీనన్‌లు, హెగ్గడేలు, మహంతోలు, చవాన్‌లు - నానాజాతివారు ఎవరి భాషలో వాళ్ళు ఆనందంగా మాట్లాడుకుంటున్నారు.

ఇది హైద్రేబేడ్ అవునో కాదోనని - బహు అనుమానాస్పదగ్రస్తుడై అటునిటు నడయాడుచుండెను. సరే, ఏ భాషయితేనేం, కావలసిన వివరాలైనా తెలుసుకో వచ్చునని - ఆఫీసువేపు వస్తుండగా -

తాళం వేసివున్న ఆ గది ముందు, రూళ్ళకర్రలా చుట్టిన ఇంగ్లీషు దినపత్రికను చేతిలో పట్టుకొని, ఎవరితోనో అనర్గళంగా ఇంగ్లీషు దంచేస్తున్న మనిషొకడు కనబడ్డాడు. ప్రాణం లేచివచ్చింది విద్యార్థికి. తెలుగుగడ్డ నడిబొడ్డుమీద అలా ఇంగ్లీషు మాట్లాడేవాడు - తెలుగువాడు గాక, ఇంకెవ్వడు?

అయనని పలకరించాడు.

"వాడ్యూయు వాంట్?" అన్నాడాయన.

ముందుగా తనకు వచ్చిన ధర్మసందేహం చెప్పాడు (సంభాషణ అంతా ఇంగ్లీషులోనే నడిచిందనేది విస్మరించరాని సత్యం)

ఖయ్‌మన్నాడాయన. "త్రిల్లింగ్ కాదు అది. త్రిలింగ! త్రిలింగ!! ఆమాత్రం గ్రహించే బుర్రలేదా నీకు, ఆయ్?"

"క్షమించాలి"

"ఎందుకుట? తెలుగు భాషలో అన్నిటికన్నా ఎక్కువ అక్షరాలు, వొత్తులు, కొమ్ములు, పొల్లులున్నాయనీ, అది హలంతభాష అని, ఆ సంగతి తెలియని ఏ అజంత భాషగాడో బోర్డు తప్పురాస్తే, నిన్నెందుకు క్షమించాలి?"

ఏకవచనం (సారీ, ఇంగ్లీషులో 'యు' అన్న పదం ఏక, బహువచనాలకు అన్వయిస్తుంది) పైగా దబాయింపు. ఆ మీద తెలుగుభాషకు గల ధర్మాల్లో ఒకటి చెప్పగలిగాడు. ఇంకేం? తప్పకుండా ఏ తెలుగు ప్రొఫెసరో అయ్యుండకపోడు. తనకేమైనా సహాయం చెయ్యవచ్చుననే భావంతో "నేను మొన్నీమధ్యనే ఎమ్మే పూర్తిచేశాను"

"ఉద్యోగాల్లేవ్! ఎంప్లాయ్‌మెంటు ఎక్సేంజికి పో"

"చ్చొచ్చొ!" నొచ్చుకున్నాడు విద్యార్థి. "అది కాదు సార్! ఏదయినా సబ్జక్టు దీసుకుని పరిశోధన చేసి, థీసిస్ సబ్మిట్ చేద్దామని"

కళ్ళు పెద్దవి చేశాడాయన. ముక్కుపుటాలుబ్బించాడు. అంతవరకూ తన ఉపన్యాసానికి వోపిగ్గా బలయిపోతున్న మానవుడిని "నువ్వు పో" అని ఛీదరించు కొన్నాడు.

ఏదో ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్ళిపోతున్నట్లు – "థీసిస్! పరిశోధన!! అంటే "అక్కురు ఆంధ్రుడా? షేక్స్‌పియరు సికింద్రాబాదువాడా?" కాకతీయులకు కాళ్ళ నొప్పులుండేవా?– అటువంటి సబ్జక్టులు అవునా?"

"అవును సార్!"

సిటీ బస్సు స్టార్టయిన చప్పుడొచ్చింది. విద్యార్థి అటు ఇటు చూసేడు కాని – అది ఆయన నవ్వు. "పిచ్చి మగాడా! థీసిస్ మిథ్య, పరిశోధన పరమ మిథ్య. నీకు డాక్టరాఫ్ డాక్టర్స్, సకల కళా సంపూర్ణ, అనంత కళా సంపూర్ణ – ఇవేగదా కావలసింది. దానికి నేనో చిట్కా చెప్తాను. వినుకో!" అన్నాడు.

"చిట్కాలా!"

"అహో! ఇంటింటికీ డిగ్రీ, ఊరూరుకీ బిరుదు పథకం కింద, ఇదిగో ఈ తాళం వేసిన గదినిండా అవే బిరుదు పథకాలు. పుచ్చుకునేవాడు లేక పుచ్చిపోతున్నాయి."

"అంటే ఆరుకోట్ల ఆంధ్రులకు ఇవ్వగా మిగిలిపోయాయా గురూజీ!"

"అజ్ఞానం శిష్యా. ఇవి పుచ్చుకుంటే – జనం అపోహపడ్తరని"

"ఎట్లా?"

"కింద ఒక్కటి కొడితే పైవి రెండు రాలుసు - లాంటి సినిమా ఆశువులు చెప్పాడని, సిర్రబాదుళ్లు అను హీరో హీరోయిన్న ఫిట్‌నెస్ వర్కుషాపులు పెట్టేవాడని, ఆడుబిడ్డా, మగబిడ్డాలాంటి దిక్కుమాలిన డైలాగుల్తో సినిమా కథలు రాసేవాడనీ..."

విద్యార్థి బుర్ర గోక్కున్నాడు. ఈయన ఎంతకీ అసలు విషయం తేల్చడం లేదు. అసలుకెవరీ పెద్దాయన? "అర్థమైంది సార్! ఇంతకీ తమరెవరో శలవిచ్చారు కాదు!"

"ఇ.వి.లుని" ఇ. అంటే ఏడుకొండలు - ఇంటిపేరు. వి. అంటే వెంకటేశ్వర్లు - సొంత పేరు"

"తమరింత విజ్ఞానం ఎక్కడ కొట్టుకొచ్చారు స్వామి?"

"తమరి బొంద భక్తా! నేనూ నీలాగే పేరు చూసి థ్రిల్ అయిపోయి కనుక్కుందామని వచ్చాను. నాకన్నా ముందే - నాలాగ వచ్చిన బి.ఆర్.రం అంటే భద్రాచలం రామావతారం ఇవ్వన్నీ చెప్పారు. ఇప్పుడా డ్యూటీ నీదే ఇక" అనేసి డింగున మాయమై పోయాడు.

విద్యార్థి కాళ్ళు చేతులూ చల్లబడ్డాయి. పంచతంత్రంలో - దురాశాపరుడైన బ్రాహ్మడి నెత్తిన బండిచక్రంలా తనకే డ్యూటీ పడుతుందని వణుకుపుట్టుకు వచ్చింది. బతికుంటే బార్లో బీరు సీసాలు మోసి అయినా పొట్టపోసుకోవచ్చని, ఎవ్వరూ రాకముందే కాలికి బుద్ధి చెప్పాడు. గేటు దగ్గరికి రాగానే - నడుస్తున్న సిటీబస్సులోంచి జనం ధనధనా దూకేయడం కనబడింది. ఆ వూపులోనే తనూ ప్రాణాలకు తెగించి - ఎగిరి అందులోకి దూకాడు. డోర్ అందలేదు కాని, దారిన పోయేవాళ్ళకి చేతులు దురద పుట్టి రాళ్లేసి పగలకొట్టిన అద్దంగల వెనక కిటికీలోంచి లోపలికి పడ్డాడు.

యధాప్రకారం ప్రజలు - 'సరిగా నిలబడవయ్యా' అని నిలబెట్టారు. ఊపిరి పీల్చుకుంటూ, తను పడ్డ కిటికీలోంచి వెనక్కి చూస్తే - దూరంగా వెళ్ళిపోతూ మళ్ళీ అదే బోర్డు 'త్రిలింగ్ విశ్వవిద్యాలయమ్' - అని.

అప్పుడొచ్చింది ఆ ఆలోచన.

ఇలాగే ప్రతి వూరికి ఒక పేరు వుంటుంది. ఆ వూరికి ఆ పేరు ఎలావచ్చిందో పరిశోధించి - తెలుగు వూళ్ళన్నిటిమీద - వో థీసిస్ రాస్తే?

అద్భుతం, గాక - మరేమిటి?

అకారాది సూచిక ప్రకారం అనంతపురం, ఆదిలాబాద్, కడప, కర్నూలు, క్రిష్ణ, ఖమ్మం, గోదావరులు - జిల్లాలైపోయాయి. నల్గొండ ముగిసి 'మ' దగ్గర - మహబూబ్‌నగర్ జిల్లా ప్రవేశించాడు విద్యార్థి.

ముందు జిల్లా కేంద్రం -

అపురూపమైన పేరు. ఒకప్పుడది పాలమూరు. పద్దెనిమిదో శతాబ్దాంతం వరకు 'లోకాయిపల్లి' జాగీరులో చిన్న వూరు. కిరాయి సైనికులకు, పనివాళ్ళకు ప్రసిద్ధి. నల్లమల కొండలకు ఆనుకొని వున్న నాగర్‌కర్నూలు జిల్లాలో వుండేది. అటు శ్రీశైలం నుంచీ, ఇటు కందెనవోలు (కర్నూలు) నుంచీ నైజాం సంస్థానానికి వచ్చే దారిలో

వుంది, మన్ననూర్ మీదుగా శ్రీశైలం వద్ద కృష్ణ దాటితే గుంటూరు, సర్కారు జిల్లాలకు దగ్గరే.

ఆరో నిజాం నవాబు మీర్ మహబూబ్ ఆలీఖాన్ బాద్షావారి పేరున ఇది మహబూబ్‌నగర్ అయింది. ఇరవయ్యో శతాబ్దపు ప్రథమ దశకపు మొదటి పాదంలో నాగర్‌కర్నూల్ నించి జిల్లా కేంద్రం – ఇక్కడికి మారింది. ఏదో నవాబ్ మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ రాజ్య రజతోత్సవాల కాలంలో కలెక్టరాఫీసు వంటి హంగులు ఏర్పడ్డాయి.

మెరక భూములు. వర్షాధారం, వర్షపాతం తక్కువ. అప్పుడు జాగీర్దార్లు, పెత్తందార్లు నమిలి మింగేయగా, ఇప్పటి అధికార అస్తవ్యస్థత మూలంగా మిగిలింది కావలసినంత దరిద్రం. నారాయణపేట, గద్వాల జలతారు చీరలూ, మఖ్తల్, నాగర్ కర్నూలు కంబళ్లు ఎంత ప్రసిద్ధి చెందినవో దరిద్రానికి అంత పేరు ప్రఖ్యాతులున్నాయి.

అందుకు వుదాహరణ – అచ్చవ్వ.

అచ్చవ్వది యెంగొండ. యెంగొండ అంటే, రంగురంగుల రకరకాల అందమైన చాపలకు పేరు. శివరాత్రికి ముందు వెనక వచ్చే మెన్నెంకొండ, సిరంగాపురం జాతర్లో ఈ చాపలు – ఆకర్షణ. శ్రీశైలానికి వచ్చే యాత్రికుల ద్వారా ఇవి బొంబాయి, బరోడా వంటి పట్నాలకు పోయేవని పెన్మిటి ద్వారా విన్నది అచ్చవ్వ.

కాని – అది ఎప్పటిమాట?

ఇప్పుడెవడు ఆ చాపలు వాడుతున్నారని? కుర్చీలు, సోఫాలు – అధవా వాడినా, ప్లాస్టిక్‌తో ఇంతకన్నా నదరైన రంగులతో, చవగ్గా వచ్చేవాటిని కాదని వీటినెవరు కొంటారు?

సర్కారు వారేదో – ఇటువంటి చిన్న పనివాళ్ళకి సాయంజేస్తరని, డిపోలు పెట్టి వీళ్ళకి లాభం కలిగేలా అమ్మిస్తరని విన్నది. తాము తయారుచేసినవి అమ్ముకోడానికి – నానా పైరవీలు. ఇంతా చేస్తే – అమ్మగా మిగిలింది – హళ్ళికి హళ్ళి సున్నకు సున్న.

ఆ మధ్య పంచెకట్టుకొని, కోటువేసుకున్న ఒకాయన వచ్చి అందరికి పైసలిప్పిస్తనని వేలిముద్రలు వేయించుకున్నాడు. పైసలూ రాలేదు. మనిషీ పత్తాలేడు.

పెన్మిటి పోయేడు. పిల్లలు లేరు. ఉన్న గుడిసె అప్పులిచ్చినవాళ్ళు దఖలు పరుచుకున్నరు. చేసేపని – అన్నం పెట్టదు. మరోపని చేతగాదు, చేద్దామన్నా లేదు.

పొట్టచేత్తో పట్టుకొని దేశం మీద పడ్డది. ఆ పొట్ట – పస్తులతో వీపుకు అంటుకు పోయింది. ఎముకలగూడు మీది చర్మం, కాయితం అంటించిట్లుంది. దవడ పైఎముకకి కనుబొమ్మలకి మధ్య ఎక్కడున్నవో తెలియని కళ్ళు, పీకి పారేసిన మొక్కజొన్న పీచులాంటి జుట్టు, ఉతుకుల్లేక, రంగుతెలియక చిరుగులు పట్టి మాసిన చీర – వయస్సు నలభైలోపే అయినా అరవయ్యేళ్ళ పైబడ్డట్టు వుంది.

కూలిపనికి కూడా ఎవ్వరూ దయతలచలేదు.

ఎవరింట్లోనయినా అంట్లు తోముదామంటే కొత్తమనిషిని నమ్మి పనెవరు ఇస్తారు పైగా పనిమనుషుల కట్టు – దరిచేరనియ్యలేదు.

అడుక్కు తినడానికి ప్రాణం వొప్పలేదు. అయినా – తప్పదు. ఆకలి ఎంత పనయినా చేయిస్తుంది. విశ్వామిత్రుడంతటివాడు – కుక్క మాంసం తిన్న దేశమిది. ఇహ మామూలు మనుషులకు వచ్చిందా?

మధ్యలో ఒకసారి ఎవరో ఇచ్చిన ఎండిపోయిన రొట్టెముక్కలు నాలుగు, ఎవరో పెళ్ళింటి ముందు ఎంగిలాకుల్లో – తనకన్నా బలవంతులైన వాళ్ళు లాక్కోగా మిగిలిన గుప్పెడు ఎంగిలి మెతుకులు, పళ్ళకొట్టుముందు, పారేసి వున్న ఐదారు, కుళ్ళిన అరటిపళ్ళు – ఇవి తప్ప అచ్చవ్వ తిండితిని ఏడురోజులైంది

మేనెల ఎండ. ఆకలికన్నా భయంకరంగా భగ్గుమంటోంది అచ్చవ్వ కాళ్ళలో నడిచే సత్తువ కూడా హరించిపోతోంది. ఎండిపోయిన వెదురుకర్ర ఆధారంగా గుడ్డల మూట చంకనేసుకొని, కాళ్ళీడ్చుకుంటూ నడుస్తుండంగా –

రోడ్డుపక్కన, మురుక్కాలవ అవతల రెండు వేపచెట్లూ, వాటి చల్లని నీడ కనబడ్డాయి. ఏదో పెన్నిధి దొరికినట్లు తోచింది. ఎట్లాగో కాలవ దాటుకుని చెట్ల క్రింద వున్న రాళ్ళమీద కూలబడింది.

అక్కడికెదురుగా వుంది – జంగారెడ్డి పిండిగిర్ని. ఆ పిండిగిర్నిలో పనిచేసే మహబూబ్‌గాడికి పదహారేళ్ళు వుంటాయి. సన్నగా రివటలా వుంటాడు. తరచుగా సినిమా పాటల ఈలవేసేవాడికి, నెత్తిమీద సాయంత్రం అయ్యేదాక దస్తీకట్టి వుంటుంది.

ఆ పిండిమరలో వాడే డ్రైవర్ కమ్ ఆపరేటరు. నెలకి వంద రూపాయల జీతం. రోజుకు రూపాయి చాయి ఖర్చు బత్తెం. ఇదికాక నాలుగైదు శేర్ల గింజలు తెచ్చిన వాళ్ళదగ్గర పిండి అడుగుతూ వుంటాడు. ఇవ్వని వాళ్ళు పోగా గిర్ని బందు చేసే వేళకు శేరు, శేరున్నరో పిండి పోగవుతుంది. అది – ఉలవల్నించి, గోధుమల వరకు కల్తీ! అయిన ముప్పావు డజను కాలేకడుపులున్న వాడి కుటుంబానికి ఆ తేడా తెలియదు.

కరెంటు లేదు. మహబూబ్‌కి పన్లేదు. అందాకా వచ్చిన చిల్లరని నోట్లని కిందిపోసి లెక్కపెడుతున్నాడు. ఎందుకంటే సేటు ఎప్పుడొచ్చి, మీటరు ఎంత తిరిగిందో చూసి, లెఖ్ఖలు కట్టి, డబ్బడుగుతాడు. పావలా తేడా వున్నా "నీయవ్వ! పైసలు గొట్టుడు సురుజేసినవురా బిడ్డ, బొక్కలేరిస్తను బేకూఫ్" అని బొగ్గు రైలింజనులా అరుస్తాడు.

అంతకు ముందే అర్ధో, ముప్పావలో మాయంచేసి లెక్కసరిచేసి వుంచితే, అరచినా పెద్దగా అనుమానం వుండదు.

లెఖ్ఖల్లో వుండగా ఎవరో వస్తున్నట్లు తోచింది కాని రాలేదు. తలతిప్పి చూసేడు. చెట్లకింద కూర్చున్న అచ్చవ్వ కనపడింది

"ఏందే ముసల్దానా? మక్కలు దెచ్చినవా?" అని అడిగాడు. అటువంటి వాళ్ళ మొక్కజొన్నలు తెచ్చి ముతకపిండి పట్టించుకుపోతూంటారు.

అచ్చవ్వ వెంటనే మాట్లాడలేదు. మహబూబ్ పక్కనే స్టూలు మీదవున్న నీళ్ళ కూజా మీద ఆమె దృష్టి వుంది. నెమ్మదిగా అంది. "కొడుకా! బుక్కెడు నీల్లు బొయ్యవా? దూపైతాంది."

"ధూత్! నీతాత జాగీర్ల జలవడ్డదా ఏంది? ఫోఫో" అని కసిరేడు.

"గట్లనకు బిడ్డా!"

"ఏఫో! గిసంటోల్లని నూర్ల లెక్క చూసిన, దొబ్బెయ్ దొబ్బెయ్."

అచ్చవ్వ నిరాశగా చూసింది. ఇంకేమీ అనలేదు. మహబూబ్ మళ్ళీ తన లెక్కల్లో పడ్డాడు. లెక్క అయ్యాక చూసినా అచ్చవ్వ అక్కడే వుంది. ఇటే చూస్తోంది.

"ముసల్దానా? గీడ బైటాయించినావు. ఏంది కత?"

సలాం చేస్తున్నట్లు అచ్చవ్వ చేయ్యెత్తింది. అప్పుడే కరెంటు వచ్చి ఇండ?కేటర్ వెలిగింది. ఎవరో ఇద్దరు ?ంబాడీ?ు గంపల్లో జొన్న?ు తెచ్చారు. తట్ట?ు దింపుకొని మూ?నున్న చాట?ు అందుకొని వాటిని బాగుచేయడం మొద?ుపెట్టారు. మహబూబ్ అచ్చవ్వని తాత్కాలికంగా వదిలేసి వాళ్ళతో మాటల్లో పడ్డాడు – "ఎన్ని సేర్లు దెచ్చినవే లస్మి?" అంటూ.

వాళ్ళ పనయ్యాక పిండి పడుతూండగా ఇంకెవరో వచ్చారు. అప్పటినుంచీ ఎండ కాల్చేస్తున్నా జనం వస్తూనే వున్నారు. కరెంటు దరిద్రం వుంది. కాబట్టి ఐదు కాగానే మిల్లు బందు చేయాలని ఉత్తర్వులు. అందుకే రాత్రికి, మర్నాటికి కావలసివారు ఐదు లోపే రావాలి.

పొద్దు వాటారిపోతోంది. ఐదింటికల్లా జంగారెడ్డిసేటు వచ్చేడు. మీటరు చూసి డబ్బు లెక్కబెట్టుకొని "ఉల్లుకే పట్టి! రూపాయి తక్వైంది గాదురా" అని తిట్టుడు లంకించుకున్నాడు. అది సగంలో వుండగానే ఎవరో మోటరు సైకిలు మీద వచ్చి "రెడ్డన్న! జర గిర్దావరు సాబ్ ఇంటి దన్క వస్తవా?" అనడిగాడు.

"వస్త!" అంటూ దానిమీద వెళ్ళిపోయాడు.

ఇప్పుడు మహబూబ్‌కి మిల్లు అంతా ఊడ్చి, మోటరుని దులిపి తాళం వేసిపోయే డ్యూటీ మిగిలింది. మూలనున్న చీపురులు, చేటలు తీసుకుని ముక్కుకు మరో గుడ్డ కట్టుకొని క్రింద పడ్డ పిండి, రాళ్ళు కలిసిన తాలుగింజలు చేటలోకి ఎత్తి కాలవలో పారబోద్దామని మెట్టు దిగుతున్నప్పుడు – మళ్ళీ అచ్చవ్వ కనపడింది.

"ధూత్! అప్పట్సంది గట్లనే కూకున్నవె ముసల్దానా?"

అచ్చవ్వ తలవూపింది

"నీ తల్లి! మా సేటు గిన జూడలేదు. కండ్లవడి ఉంటె గన్క కుక్కోలగె కర్సెటోడు. బ్రతికినవ్ ఫో" అన్నాడు.

అచ్చవ్వకు అతని మాటల మీద దృష్టిలేదు. చేత, అందులో వున్న తాలు గింజలు, పిండినే చూస్తోంది. "బాంచన కొడ్క! గాపిండి మోరిలో పారబోస్తవా ఏంది?" అన్నది.

"బరాబర్! నువ్వుగిన బుక్కుతవా ఏంకత?"

"ఆ"

నవ్వాడు "పచ్చి పిండి, రొతులు, తాలుగింజలు దింటావే"

"ఆకలయితంది కొడుకా"

ఈసారి మహబూబ్‌కి జాలివేసింది. ఆకలిమంట ఎటువంటిదో వాడికి తెలుసు. అయినా ఆ పిండి పారబోసి "నీకు జరంత మంచి పిండి బెడ్తలేగని గంత ఆకలయితందా?"

"అవు కొడుకా! ఎన్మిది పొద్దులయింది బువ్వదిని."

"ఆ!" అన్నాడు రొమ్ముమీద కొట్టుకొని.

"పని జేస్తనన్న కూడ ఎవలు ఇస్తలేరు. బువ్వ బుక్కెడు లేదు. అటెన్కల దూపయితంది. గుక్కెడు నీలు వోయ్యి కొడుకా! కాల్మొక్తదా" అంది.

మహబూబ్ నాలికి కొరుక్కున్నాడు. కూజాలో నీళ్ళు సగంవరకు వున్నాయి. మళ్ళీ రేపటి వరకూ వాటి అవసరం లేదు. రోజూ పొద్దున్న రాగానే పాత నీరు పారబోసి, ఎదురుగా వున్న నర్సింగ్ హోం బావిలో కూజాడు నీళ్ళు తెచ్చుకుంటాడు.

చేట, చీపురు లోపల పడేసి కూజా తెచ్చాడు. అది చూసి అచ్చవ్వ మూటలోంచి రేకు డబ్బా ఒకటి తీసింది. నీళ్ళన్నీ అందులోకి వొంపేడు. ఆ డబ్బా అట్లానే ఎత్తి గట గట నీళ్ళు తాగింది అచ్చవ్వ.

"కడుపుల సల్లవడ్దాది?"

చల్లబడటం ఏమోగాని పేగులు ఆకలిమీదున్న పెద్దపులిలా ఒకటే గుర్రు గుర్రు.

"ఏ వూరు?" అడిగేడు.

"యెంగొండ."

"కొడుకుల్, బిడ్డల్ లేరా"

నుదురు బాదుకుంది అచ్చవ్వ. "ఉంటే గిట్లెందుకైత".

"అవుగని. నేనొక్క పనిజెప్త ఇంటవా?"

"శాతనయితే సెయ్యనా?"

"ఏం లేదు. దినాం మూడునాల్సార్లు గిర్ని ఊకాలె. సురయి నిండ నీలు దేవాలె. గట్ల జేసినవంటె దినాం నీకు అద్దశేరు దాన్క పిండి ఇప్పిస్త. ఏందంటవు?' ఈ మధ్య వాడికి చీపురుపట్టి ఊడ్చి చేటలో ఎత్తి పారబోయ్యటం నామోషీగా వుంది. అది ఫక్తు ఆడవాళ్ళ పనని వాడి భావం.

సేటుతో "ఎవలనన్న పోర్ని దెచ్చి పెట్టరాదా సేటు" అంటే "నువ్వేం నవాబు కొడుకువా" అని తిడతాడని భయం.

ఇప్పుడిది ఎవ్వరికీ నష్టం లేని ఏర్పాటు.

అయితే వాడికిప్పుడు ఎక్కువ టైం లేదు. ఇవ్వాళనే చిరంజీవి సినిమా వచ్చింది. ఆలస్యమైతే టిక్కెట్లు అందవు. ఇంకా ఇంటికి పోయి పిండి సంచీ ఇవ్వాలి. గిర్నీ తాళం చెవి సేటు ఇంట్లో అప్పజెప్పాలి.

అచ్చవ్వ జవాబు పట్టించుకోకుండానే, "రేపు పుర్సత్‌ల మాట్లాడ్తలేగని, నువ్వు గీడనే వుండు. గీ పావల పైసల్తో చాయ్ దాగి, పిండి ఇస్తను రొట్టె జేస్కతిను" అని,

దోసెడు పిండి, అచ్చవ్వ సంచిన పరచిన పాత గుడ్డలో పోసేడు. పావలా బిళ్ల కూడా దానిమీదనే పడేసి హడావుడిగా వెళ్ళిపోయేడు.

"సల్లంగుండు కొడుకా" అచ్చవ్వ గొణిగింది.

పిండినీ, పావలానీ చూసి అచ్చవ్వ ప్రాణం లేచివచ్చింది.

క్రమంగా రోడ్లమీద సందడి ఎక్కువైంది. దుకాణాల్లో జిగేల్మనే లైట్లు వెలుగుతున్నాయి. జనం వచ్చి పడుతున్నారు. కార్లు, స్కూటర్లు, సైకిళ్ళు, మనుషులు, గేదెలు– రోడ్డు క్రిక్కిరిసిపోతోంది. బజారు చివర్న వున్న గుళ్ళోకి జనం పుణ్యం కొనుక్కునేందుకు ఆత్రంగా పోతున్నారు.

పిండి మూటకట్టి – పక్కన పెట్టింది. పావలా బిళ్ళ చేత్తో పట్టుకొని – శక్తి కూడదీసుకుంటూ లేచి నిలబడింది. బరువుకి ఎండిపోయిన వెదురు కర్ర పుటుక్కుమంది.

కాళ్ళు పట్లు పట్టినట్లు వున్నా కూడా కూడదీసుకుని నెమ్మదిగా కాలువ దాటింది. ఒళ్లు తూలినట్లు అనిపించినా చేతిలో వున్న పావలా ఎంతో బలాన్నిచ్చి నట్లుంది.

అల్లంత దూరాన ఉన్న చాయ్ దుకాణం చేరింది.

తీరా వాడు – సింగిల్ చాయ్ కాదు కదా – ముక్కిపోయిన డబల్ రొట్టె కూడా రాదుపొమ్మన్నాడు

అచ్చవ్వ ప్రాణం అరికాళ్లలోకి దిగింది.

మళ్ళీ ఈడ్చుకుంటూ చెట్టుకిందకి చేరింది. అప్పటికి చీకటి పడ్తోంది. చీకటికి తోడు కళ్ళకు చీకట్లు కమ్ముతున్నట్లుంది. ఇందాకటి పావలా బలం నీరసించిపోయింది. నిస్త్రాణగా చెట్టుకు ఆనుకొని "బగమంతుడా" అనుకొంది. గాని ఆ బగమంతుడు కానుకలు నైవేద్యాలు స్వీకరించే కార్యక్రమంలో యమ బిజీగా వుండి వినిపించుకోలేదు.

రాళ్ళతో బాటు కదలక మెదలక వున్న అచ్చవ్వను కాసేపు వాసన చూసి, లాభం లేదనుకొని వెళ్లిపోయిందొక కుక్క.

అదటుపోగానే – మోరికి అవతల సరిగ్గా అచ్చవ్వకెదురుగా శర్బత్తులు అమ్మే బండి ఆగింది, గంట మోగించుకుంటూ. ఇద్దరు పిల్లలు రోడ్డు దాటి ఉరుక్కుంటూ వచ్చి "ఎంత?" అన్నారు.

"నల్పయ్ పైసల్" అన్నాడు బండివాడు.

చెరి అర్ధా ఇచ్చారు. వాళ్లకి మిగిలిన పది పైసలిచ్చేసి సీసాల్లో వున్న రంగురంగుల నీళ్ళు కొంచెం కొంచెం రెండు గ్లాసుల్లో పోసేడు. బండి కింద చిక్కంలో వున్న ఊకలోంచి ఐసు తీసి, బండి మీదే వున్న కుండలో ముంచి తీసి చిత్రిక లాంటి దానిమీద కింద ఎడం చెయ్యి పెట్టి గీరేడు.

పొడిగా ఐసు పడింది. దాన్ని గ్లాసుల్లోవేసి, చెంచాతో లటలట కలిపి పిల్లలకు ఇచ్చాడు.

వాళ్ళది తాగి గ్లాసులిచ్చేసి వెళ్ళిపోయేరు.

పావలాకి సగం గ్లాసయినా ఇస్తాడన్న ఆశతో అచ్చవ్వ "తమ్మి! తమ్మి" అని పిల్చింది. కాని ఆ రొదలో అచ్చవ్వ హీన స్వరం బండివాడికి వినబడలేదు. వాడూ – "షర్బత్! షర్బత్" అని కేకేసుకుంటూ సాగిపోయేడు.

అచ్చవ్వ కడుపులో దేవుతోంది. ఏదయినా తినాలి. కాని ఏం వుందని, మళ్ళా డబ్బా ఎత్తి కాసిని నీళ్ళు తాగింది. తాగుతుంటే ఇందాక బండివాడు ఐసు కలిపిన గ్లాసు దృశ్యం కళ్ళలో మెదిలింది.

చప్పున డబ్బా కింద పెట్టింది. ఇందాక మహబూబ్ మియా పెట్టిన పిండిమూట విప్పింది. పిండి అంతా డబ్బాలో మిగిలిన నీళ్ళలో పోసింది. విరిగిపోయిన వెదుర కర్రముక్క అందుకొని కలిపింది.

జావలాగా అయింది.

అత్రంగా, ఆబగా గటగట తాగేసింది. చప్పగా ఉంది. ఏదో రుచి. అయినా ఆకలి.. వారం రోజుల ఆకలికి – మొద్దుబారిన నాలికకు అదేం తెలియదు. కడుపులో ఆకలి మంటలకు ఆవిర్లయిపోతున్న ఇందాకటి నీళ్ళకి తోడు – ఈ ద్రవం.

నిముషం పాటు హాయనిపించింది. మరో నిమిషానికి ఒంట్లో సత్తువ చేకూరినట్లు తోచింది. కానయితే – కడుపులో ఏవో సుడిగుండాలు తిరుగుతున్నాయి.

"కక్కొస్తదో ఏందో?" అనుకుంది అచ్చవ్వ. ఎందుకైనా మంచిదని కొద్దిగా కాలవ అంచుకు జరిగింది.

అప్పటికే కడుపులో ప్రళయం ముంచుకొస్తున్నట్లు ఏదో జరుగుతోంది. ఏం జరుగుతోందో అచ్చవ్వకి తెలిసే లోగా, అంతకుముందు తాగిన నీళ్ళతో సహా భళ్ళుమంటూ ఇవతలికి వచ్చేసింది.

"ఆరి బగమంతుడా" అనుకుంది మరోసారి. కాని ఆ బగమంతుడు కానుకలు స్వీకరించడం పూర్తి చేసి, మెక్కిన నైవేద్యాల భుక్తాయాసంతో – భక్తుల ఆసరాతో పవళింపు సేవకు సమాయత్తమవుతున్నాడు.

అచ్చవ్వ చెవులు దిబ్బళ్ళు పడ్డాయి. లైట్ల వెలుగు – కళ్ళముందు అతుక్కుపోయి ముద్దలు ముద్దలుగా కనపడుతున్నట్లుంది.

మళ్లీ పావుగంట తరువాత అచ్చవ్వ గొంతులోంచి చేదయిన ద్రవం పొంగుకొచ్చింది. అరుచి, కడుపులో ఎలుకలు పళ్ళతో కొరుకుతున్నట్లు. మరబరిసె గిరగిరా తిరుగు తున్నట్లు.

'బగమంతుడా!' అనుకునే శక్తికూడా ఆమెలో లేదిప్పుడు.

రోడ్డు అంచుకున్న కాలువకి ఇవతల చెట్లకింద పడివున్న అచ్చవ్వని ఎవరూ పట్టించుకోలేదు. క్రీనీడలో వున్న మానవాకారాన్ని పట్టించుకున్న కొందరు "ఆ!అడుక్క తినేది" అని చూసీ చూడనట్లు వెళ్ళిపోయారు. నలుగురైదుగురు ధర్మాత్ములు చిల్లర పైసలు కూడా విసిరేశారు.

కాని అచ్చవ్వ వాటిని ఏరుకునే స్థితిలో లేదు.

ఎవరూ చూడలేదుగాని – రాత్రల్లా గంటకీ అరగంటకీ నురగలా పచ్చని ద్రవం నోట్లోంచి వస్తూనే వుంది. ఎవరయినా చూసి వుంటే మాత్రం, పచ్చని పసర్లాంటి ద్రవమే కడుపులో జరరాగ్నిని రగిల్చి భగభగ మండిస్తుందనీ, ఏ పూటకాపూట ఆ దావాగ్నిని చల్లార్చడానికి ఆహారం అనబడే పదార్థం వేస్తుండాలనీ, లేకపోతే – మనిషినే నిలువునా దహించివేస్తుందనీ – తెలుసుకోవటం కష్టంకాదు.

పిండిగిర్నీపైనా – ఒంటిస్తంభంలాంటి మేడగదిలో – తాత్కాలికంగా ఒకటి రెండు నెలలకని అద్దెకు దిగిన విద్యార్థి, పొద్దున్నే వచ్చి ఏదో కలకలం విన్పిస్తే డాబా పిట్టగోడ వద్దకి వచ్చి తొంగి చూసేడు.

చెట్లకింద జనం గుమిగూడి వున్నారు. "ఎవలో దిక్కులేంది చచ్చింది" అనుకోవడం వినపడింది.

విద్యార్థి కిందకు వచ్చాడు.

"ఆడది పాపం. దిక్కులేని సావు జచ్చింది" మళ్లీ చెబుతున్నారెవరో.

ఆకారమే తప్ప, రూపు రేఖలు లేని మనిషి, కదలిక ల్లేకుండా పడివుంది. గుడ్లు తేలిపోయి ఉన్నాయి. చెంపలమీద, పక్కనా అసహ్యకరమైన నీచువాసనతో ఎండిపోయిన ద్రవం... ఈగలు.. కాలువ మురుగునీటిమీదే తిరిగే నల్లదోమలు.. ఆమె చెయ్యి పక్కన గుడ్డల మూట' దానికివతల వున్న డబ్బా మీద.

మహబూబ్ మియా ఎప్పుడొచ్చాడోగాని గిర్నీ అరుగుల మీద నిశ్చేష్టుడై కూర్చున్నాడు. వాడికళ్ళల్లో సేటు తిట్టే తిట్లకన్నా, ముసల్దాని జాలిగొలిపే ఆకారమే కదులాడుతోంది

విద్యార్థి నెమ్మదిగా పైకి వచ్చాడు. మరికాసేపటికి జంగారెడ్డి కేకలు. ఇంకాసేపటికి పోలీసులు వచ్చిన చప్పుడు. తర్వాత మున్సిపాలిటీ బండి..

ఆ రాత్రి పడుకోబోయే ముందు అతనిలా రాసుకున్నాడు.

మహబూబ్‌నగర్ – ప్రేమ లేక ప్రేమికుడి నగరం అని – అందమైన పేరు. కాని ఈ వూరికి ఆపేరు పరమ అసహ్యంగా ఉంది. దాని బదులు ఈ ఊరికొక మంచి పేరు స్ఫురిస్తోంది. అది "తెలుగు మనుష్యక్షుధార్తరావ నిక్షిప్త ప్రాంగణము" అని.

రాయనైతె రాసేడు గాని, మళ్ళీ పునరాలోచనలో పడ్డాడు. కేజిల్లెక్కన – సంకరజాతి కాన్వెంట్లలో ఇంగ్లీషు కొనుక్కుంటూ తెలుగు పాలు తాగి మమ్మీ డాడీ అంటూ భోజనం కూడా బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌లు చేస్తూ, ఒకానొక పుచ్చిపోయిన కొజ్జా సంస్కృతి ఊబిలో దొర్లుతున్న జనానికి ఈ భాష అర్థమయ్యేనా?

కాదుగాక, కాదు!

కాసేపు ఆలోచన, తర్వాత – ఖమ్మంజిల్లా భద్రాచలంలో తిరుగుతూ ఒక మిత్రుడి పెళ్లికి వరంగల్ బస్సులో వస్తుండగా – గిర్నిబాయి అనే వూరి పేరు వినబడింది.

ఆ వూరికి మందపల్లో, కొమ్మాలో - ఏదో స్టేజి పేరు వేరే! కాని అందరికీ వాడుక నామం మాత్రం గిర్నీబాయి.

కలం తీసుకుని మళ్లీ ఇలా వ్రాయసాగేడు.

మహబూబ్‌నగరం అన్న పేరు మార్చేసి ఈ ఊరికి 'గిర్నిబాయి' అని పెడితే బాగుంటుంది.

ఎంచేతనంటే

గిర్ని : అంటే మర. మనిషి కడుపు అనే బావిలో కరకరా తిరిగే మరలుంటాయి. తిండిరూపంలో ఏది వచ్చినా పిండి పిండి - కాదు కాదు అణువు కన్నా సూక్ష్మం చేసే మాయం చెయ్యగలదీ మర....అదే గిర్నీ.

బాయి : అంటే బావి. ఇందుల 'ఆకలి' ఎల్లప్పుడూ ఊరుతూ ఉంటుంది .దాన్ని చల్లార్చకపోతే పొంగిపోయి - మనిషినే ఈ లోకం నుంచి మాయం చెయ్యగల శక్తి వుంది.

కాబట్టి ఆలోచించండి!!!

● సాక్షి - ఆగష్టు, 1989 ●

# 54. ఇల్లు

♦ తుమ్మేటి రఘోత్తమరెడ్డి ♦

"పొద్దు పొడుపూ.. మెరుపు తీగా...

పొయ్యేటి మేనత్త కూతురా..."

దూరంగా ఉన్న బొగ్గుగని కార్మికుల గుడిశెల్లోంచి ఎవరో ఇంకా గ్రామ జీవితాన్ని మరువని కార్మికుడు కాబోలు! ఒక జానపద గీతం పాడుతున్నడు. ఆ రాత్రి గుడిశె ముందు మంచంలో వెల్లకిలా పండుకున్న నారాయణకు మనసంతా వికలమైంది

పెళ్ళి ఆర్నెల్లైనా కాపురానికి తీసుకురాని తన భార్య యాదికచ్చింది. ఈ విషయంలో పట్టీ పట్టనట్టుగ ప్రవర్తిస్తున్న తల్లీతండ్రిమీద చెప్పరాని కోపం వచ్చింది.

మంచంలోంచి విసురుగా లేచి వీధిలోకి నడిచాడు.

పాట విన్పిస్తూనే ఉంది. అవటానికి ఆ పాట బావామరదళ్ళ సరసగీతమే.

అయినా జీవితం తాలూకు విషాదమేదో ఆపాటగాని గొంతులో అంతర్లీనంగా ధ్వనిస్తోంది.

నారాయణ మంచంలోంచి కోపంగా లేచిపోయిన సంగతి అన్నం తింటున్న సూరమ్మ చూసింది. మొగనిమీద తగని కోపం వచ్చింది. కంచంలోని అన్నం ఆటుమూటుగా కలుపుతూ.

"అతారే లేని సుతారి ఏడూళ్ళిండ్లకు గోడలు పెడుతనన్నడట! గట్లనే వున్నది నీ శాత్రం" అన్నది సూరమ్మ అందాక భర్త చెప్పిన మాటలు విని కోపం తెచ్చుకొని.

వీరయ్య అన్నం తిని బ్రేవ్‌మని చెయ్యి కడుక్కుంటూ.

"నీయక్క నాలుగు రోజులాగరాదు! సూసుకుంటుండంగనే ఎసొంటిల్లుకదుతనో! అన్నడు. దానిమీద సూరమ్మ గయ్... మని లేచింది. 'మాట మాట్లాడితే నడుమ గదెందు కత్తది? నీయక్కట! అక్క.. నా పేరు బాతాల పోశెట్టి. మూడెద్లు... ముప్పయ్యారు దొడ్లు అన్నట్టు గదే పాటగని అది కట్టిందిలేదు పెయింది లేదాయె! నువ్వు కట్టేవరకు అసలాడ సింగరేణి కంపినే లేసిపోద్ది (బొగ్గు కంపెనీ)" అనుకుంట తిన్న కంచాలు తీసుకుని బయటకు వచ్చి గుడిశె వెనక దిక్కుపోయింది. అడవిదంతె పోరుక తడకల మీద నుంచి ఆవల దిక్కు నీళ్ళు పోసింది. తడికెల ఆవల చీకట్లోంచి ఒక మానవాకారం చేత్తో చెంబు పట్టుకుని సణుక్కుంట దూరంగా పోయింది.

సూరమ్మకు ఆ స్థితి చూడగానే నవ్వు వచ్చింది. మరోసారి అయితే ఎంత తిట్టిపోసేదో? కంచాలు అట్ల చేత్తోపట్టుకొని చప్పుడు కాకుంట నవ్వింది. నవ్వుతూ నవ్వుతూనే –

"దీనింట్ల పీనుగెల్ల! జాగేడదొరుక లేదో?" అని "బతుకులు పాడుగాను ఎంత అధ్వాన్నమయి పోయినయ్? అరిసెయ్యెట్ట జాగ లేకుంటాయె" అన్నది కంచాలు కడుక్కుంట. సూరమ్మ యింకా చాలా అనుకుంది. బాయి పనోళ్ళ బతుకులు గురించి రోజూ అనుకున్నట్టే అనుకొని నిట్టూర్చింది. తిరిగి యింట్లకు వస్తుంటే బజారు నుంచి కొడుకు నారాయణ తిరిగొచ్చి పందిరికింద మంచంల అటుమూటు'గ పండుకున్నడు. సూరమ్మ కొడుకు వాలకం చూసి మళ్ళ నిట్టూర్చింది. గుడిశెలోపల కిరోసిన్ దీపం గుడ్డిగా వెలుగుతోంది. పాతనులుక మంచంలో కూర్చుని మోదుగాకు చుట్టచుట్టు కుంటున్న భర్తను చూసి 'యింత కోపం తెచ్చుకున్నది. చేతిలో కంచాలు విసురుగ పెట్టేసి మంచం దగ్గరికి వచ్చి'.

"ఎన్నిసార్లు జెప్పినా దున్నపోతుమీద వాన గురిసినట్టేనాయె! గటుపోరని దిక్కు సూడు. నీకు తిండెట్ల పెయిన బడ్తాంది? అదెపాయె ఓనూరో యాబయో పోనీయ్ ఏన్నన్న యిల్లు కిరాయికి తీసుకొమ్మని చెప్పినా యినకపోతివి, లగ్గమంట చేసి అర్నెల్లాయె గని యిదువారకు తీసుకపెయింది లేదని" మీ యియ్యపురాలు ఆవాడ నుంచి యీ వాడకు యినచ్చేటట్టు అంటాంది. ఎరికెనా నీకు" అన్నది సూరమ్మ లోగొంతుకతో.

"నా తండ్లాటంత మిలమిల సూసుకుంట ఎట్లన బుద్ధయితదే నీకు?"

"మా తండ్లాడ్తనవ్!" మూతి తిప్పింది సూరమ్మ!

"నా తిప్పలు నీ కెమెరుకలే....మరి తీసుకచ్చు కొమ్మని చెప్పకపోయినవ్.... మనం గా పందిరి కింద పన్నా తెల్లారుద్ది" అన్నాడు చుట్ట కొరుకుతూ.

"శనివారం బాయిలు బందేనాయె. పొయ్యి కొడల్ను తీసుకు రారాదు. బిడ్డా అంటె సప్పుడు లేదు సడిలేదు అదేదో నువ్వే చెప్పు" అన్నది సూరమ్మ. వీరయ్యలేచి దర్వాజ లోంచి బయటకు సూసిండు. ఎదురు గుడిశెవాళ్ళు అంటించిన బొగ్గు పొయ్యి వెలుగు తడికె సందులోంచి మంచంల పడుకున్న నారాయణ ముఖంమీద ఎర్రగా పడుతోంది. చాలాసేపు కొడుకును సూసిండు. ఏదో ఆలోచనల్ల పడి నిలబడిపోయిండు.

తండ్రి కొడుకు లిద్దరు సెవెనింక్లెన్ (7వ నెంబరు బొగ్గుగని)లో పనిచేస్తున్నారు. తండ్రి కోల్‌ఫిల్లర్, కొడుకు బదిలి ఫిల్లర్ (టెంపరరీ కోల్‌ఫిల్లర్)గా పనిచేస్తున్నారు. తండ్రితో పనిచేసే జలాల్ తన పిల్లి గెడ్డాన్ని సవరించుకుంటూ అప్పుడప్పుడు ఆ విషయం గురించే చాలా చమత్కారంగా పులి కడుపున పులి, కోల్‌ఫిల్లర్ కడుపున బదిలీ ఫిల్లర్" అని నవ్వుతడు.

నారాయణ పదో తరగతి దాకా చదివిండు. 'గని' పనిలో చేరి కొంతకాలమే అయింది కాబట్టి ఆరోగ్యంగానే వున్నడు. పైగా యీడు మీదున్న మనిషి. వీరయ్య అట్ల నిలబడి కొడుకును చూస్తూ వుంటే నారాయణ మాత్రం పోయిన ఎండాకాలంలో పెండ్లి చేసుకున్న తన భార్య గురించి ఆలోచిస్తున్నాడు. భార్య అంటే సుజాత. సుజాతకూ తనకు పెండ్లయి ఆరునెలలు అయింది. అదే మురికిపేటలో

ఆ చివర రేకులషెడ్డు తన మామది. పెండ్లి అయినంక చాలాసార్లు అటుపోతూనో, ఇటు పోతూనో చూసుకొని ముసి ముసిగ నవ్వుకునేటోళ్ళు. వాళ్ళ సరసం ముసిముసి నవ్వులతోనే సరిపెట్టుకోవలసి వచ్చేది. లోపట లోపట నారాయణ బాగా బాధపడేవాడు. పెండ్లి అయి యింతకాలం అయినా భార్యను తీసుకురానందుకు అదో తరీఖమొఖం చిన్న బుచ్చుకొనేటోడు. తీసుకొస్తే మాత్రం ఏం లాభం? ఒకే ఒక్క గుడిశె పోని పక్కన రెండు సిమెంటు రేకులు కొని షెడ్డు తీరుగ వేద్దామంటె అరిచెయ్యి వెడల్పు జాగా కూడా లేదు. అవుతలికి, ఇవుతలికి పోవాలంటేనే ఎంతోదూరం బోవాలె. ఆ పాటికి ఆనికి గోచిలోనే పడుతుంది! అంతదూరం మరి!

నారాయణ మంచంలో అటూ యిటూ అసంతృప్తిగా కదిలిండు. ఆ కదలికలో సహజంగ ఆ వయస్సులో మరో మనిషి పొందుకోసం న్యాయమైన ఆరాటం వున్నది. అది నెరవేరడం లేదని అసంతృప్తి వున్నది.

చిన్న గుడిశె మీద, కన్నవాళ్ళమీద ఒక్కోసారి కోపం వస్తుంది. సరిగ్గా అదే కోపం ఇప్పుడు వచ్చింది. వీరయ్య ఆలోచనల్ని ఆపేసుకుని మంచం పక్కకు నడిచిండు మీద నీడపడటంతో కొద్దిగా తలతిప్పి చూసిండు. చూసి అలక్ష్యంగా అటు తిరిగి పడుకున్నడు నారాయణ. వీరయ్యకు ఎట్ల చెప్పడమో తోచలేదు.

పైన పందిరి కట్టెను ఆసరాగ పట్టుకొని నారాయణను వుద్దేశించి –

"అవ్వ పొద్దుట్నుంచే చెప్తాందట! పోయి పొల్లను తీసుకచ్చుకోరాదు బిడ్డా" అన్నడు నారాయణ మంచంల నుంచి చివ్వున లేచిండు. లేచి చెప్పులు తొడుక్కుచ్చుకోని బయట వీధిలోకి వచ్చిండు. వీధిసన్నగా వున్నది. చెత్తగా వున్నది. మురుగు కాల్వలతో బురదగా వున్నది అయినా దబదబ నడిచిపోతున్నడు. కొద్దిదూరంలోనే వున్న "కోల్‌స్క్రీనింగ్' ప్లాట్‌ఫారమ్‌లోంచి దడ దడ బొగ్గుపెళ్ళలు బంకర్లలో పడుతున్న చప్పుడు వినబడుతుంది. ఎదురుగా గోదావరి ఒడ్డుకు కొద్ది దూరం వున్న పవర్ హౌజ్ పొగ గొట్టాల్లోంచి నల్లని పొగ బుసబుస పైకి చిమ్ముతోంది. నారాయణ యిరుకు సందులోంచి చిన్న వీధిలోకి వచ్చిండు. వీధిలో జనసంచారం రోజులాగే జోరుగ వున్నది. వచ్చే పోయే వారితో సందడిగ వున్నది. పాలిపోయిన వెన్నెల వెలుగులో సన్నని దుమ్ము లేస్తున్నది. మామూలుగ అలవాటు తప్పని పందులు, కుక్కలు, గొడ్డులు, ఆ వీధుల్లో, వీధుల్లోని గుడిశెల చుట్టు తిరుగుతున్నాయి. నారాయణకు ఒకామె ఎదురైంది. ఆమె నెత్తిమీద గంపనిండ సామానున్నది. ఆమె ముఖం మాత్రం హుషారుగున్నది. "నీ తలపండు పలుగ, కనబడ్డనే లెవ్వు" అని మోటు పరాశికమాడింది నారాయణతో. నారాయణకు ఆమె వరుసకు వదిన అవుతుంది. మరోసారి అయితే "నీ అసంటోళ్ళను ఎంతమందిని యీసేతుల్తోని అవుతల పారేత్తనో వదినా" అనేవాడు. కాని సరసర పోనే పోయిండు. "పిలగానికి ఏమొ పుట్టింది" అనుకుని సందు తిరిగి పోయిందామె. నారాయణ కొద్ది దూరం నడిచి ఒక పాన్‌షాప్ ముందున్న చెక్క బెంచీపై కూర్చున్నడు. షాప్‌లో పెట్రోమాక్స్ లైటు వేడిగా వెలుగుతున్నది. షాపుల కూర్చున్న దొడ్డు మొఖపాయినె పత్రిక పట్టుకొని పరపర విసురుకుంటు –

"ఏం సంగతి తమ్ముడూ?" అని అడిగాడు.

"పాన్ కట్టు."

"ఎన్నడూ లేంది యిదేం బుద్దిరో? ఏం పాన్ గట్టాలే."

"ఏదో ఒకటి."

"అదేందిరో పోరి మీద అలిగినవా" పరాశికమాడిండు షాప్ అతను. నారాయణ తన వెనుక ఎవరో నిలబడ్డట్టు అయెసరికి వెనుకకు తిరిగి సూసిండు. చూసి ముఖం చిట్లించిండు.

"పొమ్మని అంటేనే గిట్ట వురికత్త వేంది బిడ్డా?" అన్నడు నిమ్మళంగ వీరయ్య.

"వురికి రాక ఏం జెయ్యాలె?" మాటలు తయారుచేసి పెట్టుకున్నట్టు అన్నాడు నారాయణ.

"అదిగాదు బిడ్డా రేపు పొద్దున పోతే సాయంత్రం తీసుకొని రావచ్చు గద" వీరయ్య మాట పూర్తిగాక ముందే లేచి నిలబడి –

"తీసుకచ్చుకొని ఎవల మంచం కింద పండవెట్టాలె" అన్నడు, అని పాన్ అందుకుని యింటి ముఖం పట్టిండు. వీరయ్య ప్రాణం వుస్సురన్నది. షాపువాలా తండ్రీ, కొడుకుల సంభాషణ విని "వీరన్నా! కొద్దిసేపు అట్ల బెంచిమీద కూసో, లక్ష్మిరాజం వస్తడు" అని చెప్పి ఎవరో వస్తే పత్రికలు అమ్ముకోవడంలో మునిగిండు.

వీరయ్యకు కొడుకు అన్న మాటలు యాదొచ్చినయి. వాడన్న మాటల్లో తప్పేం వున్నది అనుకున్నడు. ఆ వయస్సు అటువంటిది. ఆ వయసులో తాను సూరమ్మ కలిసి పల్లెటూర్లో గడిపిన వైనం యాదికొచ్చింది. "చీ చీ ఒక్క కొడుకు. పెండ్లంట చేస్తే ఓ గుడిశె కట్టియ్యక పోతి" అని విచారపడ్డడు. తన అశక్తత మీద అసహ్యం వేసింది. "నీ తల్లి! యిన్నేండ్లు బాయిపని చేసినా ఒక కోటరు (క్వార్టరు) కూడ యియ్యకపాయె కంపిని" అని బయటికే అనుకున్నడు ఎట్లన్నజేసి పోరనికి ఓ గుడిశెకట్టాలె. రేప్పొద్దున బాయికాడ చెప్పాలె వీలైతే లచ్చిరాజంకు కూడ చెప్పాలె. వాళ్ళు అయితేనే కస యాడనన్న జాగజూసి గుడిశె నిలబడెటట్టు చూస్తారు. నా వొక్కన్నుంచి ఆయెపనిగాను మారి, యింకా ఆగుతె పోరడు తెర్లయితడు" అనుకుంట కూర్చున్నడు.

"ఏం పెద్దయ్యా... తేరిపార కూసున్నవు?"

"తమ్ముడింట్లనే వున్నడా?" అని వీరయ్యను వుద్దేశించి ఎవరో అడిగిండ్రు. వీరయ్య తలెత్తి వచ్చిన మనిషి దిక్కు చూసిండు. బాగా పరిచయం వున్న మనిషి. అమ్మోరు మచ్చల మొఖం. బక్కమనిషి. అంతలోనే షాపతను కలుగచేసుకుంటూ నీ కోసమే కూసున్నడు" అని చెప్పిండు. 'అట్లనా' అని చేతిలో వున్న సరుకు సంచి బెంచిపై పెట్టి విషయం చెప్పమని ఆసక్తిగా అడిగిండు లక్ష్మిరాజం. వీరయ్య క్రితం దాకా జరిగిన తన యింటి సంగతి చెప్పిండు. అంతా విన్న తరువాత,

"పెద్దయ్యా ఇది గుడిశె గుడిశె భాగోతమే! నీ తీరుగనే శానమంది చెప్తాండ్రు. ఏదో ఒకటి చెయ్యాలె. రైలు కట్టావల కంపిని ఖాలిజాగ బోలెదున్నది. కొద్దిగ ధైర్యం జేస్తూ సూత్తి మనెటాళ్ళకు తలోగుడిశె ఏసుకోవచ్చు" అన్నాడు లక్ష్మిరాజం.

"మాయ్యగాదు బాంచెను. అదేదో జెరజెప్పన అయెటట్టు సూడు" అని లక్ష్మిరాజంను ప్రాధేయపూర్వకంగ చెయ్యి పట్టుకొన్నడు. చెయ్యి విడిపించుకొని రెప్పొద్దున బాయికాడ మనోళ్ళందరికి చెప్తాం. అందరికి ఇదే యిబ్బంది గద. అదిగాక ఈ గుడిశెల్ల ఒక్క బాయి కార్మికులు లేరు గద. ఏదో రోజు మనకు వీలు అయినప్పుడు గుడిశెల్ల అందర్నీ కలుసుకుందాం. అయితే ఈ విషయం బయటికి తెలుసుడు మంచిదిగాదు. రెండు మూడు రోజుల్ల ఏదో ఒకటి తెలుస్తదిగని నువ్వేం పికరు పెట్టుకోకు" అని సరుకు సంచి తీసుకొనిపోతుంటే వీరయ్య మళ్ళీ దీనంగ అన్నడు. "గా రంధి వాత్తె నాకు నిమ్మళం బిడ్డా!" అన్నడు. "నేను తమ్మునితో చెప్తలేవె. అలుగుతె అయితయా పనులు ముందుబడి చెయ్యాలెగని. నీకేం రంధి అక్కర్లేదు నారాయణను ఓసారి కలువుమను" అని మరెవరో కలిస్తే మాట్లాడుకుంట పోయిండు. వీరయ్య కొంచెం నిమ్మళంగ యింటిదారి పట్టిండు.

## 2

ఉదయం ఏడుగంటలకు పదినిమిషాలు ముందుగానే ఏడుగంటల సైరన్ ఏడ్చినట్లు కూసింది. చీమల్లాగున సరసరలాడుతూ, సైకిల్ గంటలు గణగణ లాడిస్తూ డ్యూటీలకు పోతున్నరు కార్మికులు. రోడ్డుమీద బొగ్గు ట్రాన్స్‌పోర్ట్ చేసే లారీలు చాలా వేగంగా బొగ్గు దుమ్ము లేపుకుంట పరుగెత్తుతున్నయి. సైకిల్ మోటార్లు యింకా పెద్ద అధికార్లు, అన్నీ కలిసి ఆ రోడ్డంత చాలా సందడిగ వురుకులు పరుగులమీద వున్నది. అటువంటి లారీ రోడ్డుకు, రైల్వే లైనుకు మధ్య అరకిలో మీటరు పొడుగునా నిన్నటిదాకా ఖాలీగ కన్పించిన జాగాలో యీరోజు కన్పిస్తున్న గుడిశెల్ని చూస్తూ ముగ్ధులై పోతున్నరు కార్మికులు. నుదుర్లు ముడిచి ముడిచి చూస్తూ పోతున్నరు అధికార్లు. ఎంతలేదన్నా అయిదువందల పైచిలుకు గుడిశెలు, అవన్నీ తాత్కాలికంగ వేసుకున్నవేనని చూసేవాళ్ళు చూడంగనే అనుకుంటున్నరు. వెదురు బొంగులతో, తడికలతో తెల్లారేసరికల్లా గుడిశెలు లేచి కూర్చున్నయి. తలుపులు, గోడలు పైకప్పులు అన్నీ కంక తడుకలే. కొంతమంది కార్మికులు మాత్రం "యిదంత ప్లాను ప్రకారమే జరిగుంటది" అని తీర్మానించుకున్నరు. యీ ఖాళీ జాగాలో గుడిశెలు వేసుకోవడం చూసిన కాలరీ కార్మికులు కొందరు మరునాడు తెల్లారెసరికల్లా ఖాళీగవున్న కంపిని భూముల్ని తలాయింత హద్దురాళ్ళు పాతి యిండ్లకోసం ఆపేసుకున్నరు.

నారాయణకు మూడో వరుసలో అయిదోయిల్లు వచ్చింది. సుజాతను తీసుక వచ్చిండు. ఒక్కొక్క గుడిశెలో ఒక్కొక్క చిన్న సంసారం అంతా దాదాపు పడుచువాళ్ళే! వాళ్ళలో ఒకటే సంతోషం. ఏదో సాధించామని తృప్తి ఆ కొత్త గుడిశెల ప్రాంతమంత వెదురు వాసన వేస్తూ అదోరకంగా బాగున్నది. అంతా ఆ గుడిశెకు యీ గుడిశెకు ఆసుగొయ్యల తీరుగ హడావుడి చేస్తున్నారు. ఓ వారంరోజులు గడిచినయి. నారాయణ ఇంటికి, అటు అత్తగారు యిటు అవ్వగారు వచ్చి మంచి చెడు కనుక్కు పోతున్నరు. యిద్దరు వియ్యపురాళ్ళు మధ్య నుంచి సఖ్యత కూడ కుదిరిందిప్పుడు. నారాయణ వారం రోజుల్లో నాలుగు రోజులు సెలవు పెట్టిండు. భార్యతో కలిసి మూడు సినిమాలు చూసిండు. యింట్లోకి కావాల్సిన సామాను కొనుక్కోమని తన జీతంలోంచి కూడ కొంత కొడుక్కే యిచ్చిండు వీరయ్య. రెండు వందల రూపాయలు

గుడిశెక్కావలసిన కంక బొంగులు, తడికెలు వగైరాకు ఖర్చు అయినవి. యింకా బాగానే మిగిలింది. యింట్లోకి కొంత సామాను కొనుక్కున్నడు. మిగిలిన డాంట్లోంచి పది రూపాయలు గుడిశెల కమిటీకి సంతోషంగ లెక్క ప్రకారం యిచ్చుకున్నడు. ఆ విధంగ సుజాతతో కలిసి మహదానందంగ గడుపుతున్నాడు నారాయణ. యిక కష్టం తీరిందని అనుకున్నరు. కొన్నాళ్లకి నాలుగు గోడలు లేపుకొనిపైన నాలుగు సిమెంటు రేకులు వేసుకుంటె చింత తీరుద్దని తల పోసిండ్రు. గుడిశె వెనుక నాటవలసిన బంతిచెట్ల గురించి సుజాత ఆలోచించింది. కాని కార్మికులు ఒకటి తలిస్తే మేనేజిమెంటు మరోటి తలిచె!"

## 3

వాళ్ళ ఆనందాన్ని నింపుక పోవుటానికి ఒకనాటి తెల్లవారుజామున పదిలారీలు, వందమంది సాయుధులైన పోలీసులు, రెండు వందల మంది కంపెనీ వాచ్‌మెన్లు, పోలీసు యిన్‌స్పెక్టర్లు వచ్చి దిగింద్రు. అమీన్ దిగుతూనే లారీకర్ర అటూయిటూ తిప్పుకుంట గుడిశెల ముందుకు వచ్చిండు. వూహించిన పరిణామం గనుక చాలామంది కార్మికులు బెదరలేదు. అప్పటికే గుడిశెల్లోని ఆడామగా వీధుల్లోకి వచ్చిండ్రు.

అమీన్ నారాయణ గుడిశెముందు కచ్చి ఆగిండు. తడుకమీద కర్రతో ఓ దెబ్బ వేసిండు. నారాయణ గుడిశె లోపల్నుంచి రయ్... మని బయటకు వచ్చిండు. సుజాత కూడ గలుమల నిలబడి చూస్తున్నది.

"ఏంరా? గుడిశెలు ఎవల్నడిగి వేసుకున్నర్రా?" పెద్ద జమీందారు తీరుగ అడిగిండు అమీన్.

"కంపెనీ జాగేనయె! కంపిన్ల పన్జేసెటోళ్ళమేనాయె ఎవళ్ళడుగుడేంది" నారాయణ జవాబుల వినయం లేదని కోపంగ చూసిండు అమీన్.

"కావల్నంటె మేం జి.యమ్.ను అడుగుతమ్ గని గుడిశెలు పీకుటానికి వీల్లేదు" జబర్ దస్తిగ పిల్లికండ్ల కార్మికుడొకడు ముందుకచ్చిండు. ఆ కండ్ల దిక్కు గుర్రుగ చూసిండు అమీన్. చూసి ఒకడుగు ముందుకు వేసి,

"అంతా మీయిష్టమైతే నడుమ మే మెందుకురా...." అన్నాడు.

"గుడిశెలు పీకుతరా! పీకించాలా" ఒక పోలీసు ముందు కచ్చిండు.

"నీకేమైతాందయ్యా... లావూ... ఏమో మీతాత పెరట్ల ఏసుకున్నట్లు మాట్లాడ్తానవ్?" గదమాయించినట్లు ఓదెమ్మ అన్నది.

"చూసి రమ్మంటె కాల్చుకచ్చినట్లు, వీళ్ళ జులుమేందండి" పోలీసు వెనక్కి తగ్గిండు. "తెచ్చిపెట్టుకున్న ధైర్యం జూడు" అని ఒకడన్నడు మరొకనితో మెల్లగ.

"పీకి పారేసుకోటానికి ఏసుకోలేదు" జారుతున్న పిల్లలను ఎగదోసుకుంట ఒకామె ముందుకచ్చింది.

"అసలు పోలీసులకు గిదీంతోని ఏమి సంబంధం?" పాయింటు లాగింది బెల్లంపల్లి లచ్చమ్మ.

"అసలా గుడిశెలు వేయించిదెవరు?"అన్నడు అమీన్ చిరాకుగ.

"ఎవరెందుకు వేయించుతరయ్యా? కడుపు నొచ్చెటోడు వోమ బుక్కుతడు గని" కొమురయ్య మందిల కెల్లి ముందుకచ్చి అన్నడు.

"బాగ తింటె కడుపునొస్తది బిడ్డా! గుడిశెలెవలు ఏయించిండ్రో, పేర్లు చెప్పు" అమీన్

"మళ్ళ గట్లనే అడ్గుతావేందయ? వుండటానికి జాగలేక మేం అందరం కలిసే ఏసుకున్నాం. దానిమీద తఖద్దమ్ చేస్తే ఎట్లనయ" అని గాజులు గల గల లాడుతుంటె పిల్లవాన్ని పొదివి పట్టుకొని ఒక లంబాడి స్త్రీ అన్నది.

ఆమె చంకల వున్న చిన్నిపిల్లవాడు అమీన్ ముఖం మీద గొర్రె కొమ్ముల తీరుగవున్న మీసాలు కదులుతుంటే చాలా తమాషగ చూస్తున్నాడు. అమీన్ కొమురయ్య దగ్గరికి వచ్చి భుజం మీద లారీ అనించి –

"లావు లావు మాట్లాడుతున్నవు లీడరువా బిడ్డ? గుడిశెలు ఏయించింది ఎవర్రా? చెప్పు బిడ్డ నీకేం భయం లేదు" అన్నడు చిన్నగ లారీతో కొడుతూ.

"ఏమో దొంగన్ జేసినట్టు జేస్తున్నావ్ ముందీ కట్టె తియ్..." అన్నాడు కొమురయ్య చీదరించుకున్నట్టుగ.

"యిట్లయితే ఏడ చెప్తర్ బేవకూఫ్స్! లోపలేసి తంతె చెప్తరు....' అనుకుంట వెనక్కు తిరిగి వీన్ని పట్టుకోండి అని చెప్పిండు. కొమురయ్య భార్య కొమురయ్యను వెనక్కు తోసి ఆమె ముందుకచ్చింది. కొమురయ్య తప్పించుకో చూస్తున్నాడని అనుమానించిన పోలీసు మందిలోంచి ముందుకు పోబోయిండు. ముసలోని చేతికట్టే కాళ్ళల్ల యిరికి పోలీసు బొక్క బోర్ల పడ్డడు. లోపలున్న పోలీసులు పడిపోయిన పోలీసు దగ్గరికి రాబోయిండ్రు, అంతే.... గడబిడ మొదలైంది. నేకేసుకునుడు, దొబ్బేసుకునుడు, తిట్టుకునుడు దాక వచ్చింది. లాఠీలు కార్మికులమీద యిష్టం వచ్చినట్టు పడ్డయి. పిల్లలు ఏడుస్తుంటె కొంతమంది స్త్రీల శాపనార్ధాలకు దిగిండ్రు. అపురూపంగ కట్టుకున్న పిట్టగూళ్ళవంటి గుడిశెల్ని వాచ్‌మెన్లు పీక్కొని లారీల్లో వేసుకుంటుంటె వాళ్ళ గుండెల్ని ఎవరో చేత్తో పెకిలించినట్టు అయింది వాళ్ళకు. వాళ్ళ నెత్తురు పొంగింది. పిడికిల్లు బిగుసుకుపోయినయి అటునుంచి తుపాకులు పేలినయి యిటునుంచి రాళ్ళు పడ్డాయి. వురుకులు, పరుగులు, పెడబొబ్బలు మొదలైనయి. నిమిషాల మీద కార్మిక జనం పుట్ట బెదిరినట్టు వురికిండ్రు. యిరువై మంది కార్మికుల్ని ఏడుగురు స్త్రీలను యిద్దరు పిల్లలతో సహా అరెస్టు చేశారు. అరగంటలో అయిదువందల గుడిశెల్ని పీకి పదిలారీలలో వేసుకొని కంపెని మెయిన్ స్టోర్‌కు పోయిండ్రు. మళ్ళ ఎప్పటి తీరుగనే ఆ ప్రదేశం వెలవెల బోయింది. దెబ్బలు తిన్న కార్మిక జనం పాత గుడిశెల దిక్కు వురికిండ్రు. చంద్రి ఏడ్చుకుంట అవ్వగారింటికి పోయింది. రోడ్డుపై లారీలు రైల్వే లైన్సుపై వ్యాగెన్లు బొగ్గు నింపుకొని ఏమీ ఎరగనట్టు పోతేనే వున్నాయి. ఆ రోజంత గుడిశెల్లో వుద్రిక్తత చోటు చేసుకున్నది.

## 4

డ్యూటీలకు పోతున్నపుడు, బొగ్గుబాయిలకు దిగి పనిచేస్తున్నపుడు, తిరిగి వస్తునపుడు ఒకరికొకరు గుసగుసలు మొదలు బెట్టిండ్రు. లక్ష్మిరాజం, బాలయ్య వంటి కార్మికులు మళ్ళ గుడిశె గుడిశెకు తిరుగుతున్నారు.

వేయివిధాల నచ్చ చెప్తున్నారు. సందుగొందుల్ల పోలీసుల జీబులు గూడ వురుకుతనే వున్నయి. కాళ్ళకు బలపాలు కుట్టుకున్నట్ల తిరిగి కార్మికుల్ని. మిగతా గుడిశెల కమిటీ మెంబర్లని కుప్పేసిండ్రు. దూరంగా వీధులన్ని కావలిగాండ్రతో వున్నయి. మసక వెన్నెట్ల మాటలు మొదలైనయి. లక్ష్మిరాజం పక్క గుడిశెల నుంచి కొంచెం బయటికి వచ్చిండు. కార్మికుల నుద్దేశించి "..మనం అనుకున్నట్టుగనే గుడిశెలు ఏసుకున్నం గని తొత్తు యూనియన్ల మద్దతుతో, పోలీసుల సాయంతో కంపెని మన గుడిశెలు పీకించింది. యిదంత మీకెరుకే. సమయం మంచిగ లేదు. తొందరగ మనం మాట్లాడుకోవాలె. అందుకని మల్ల మనం ఏం జేస్తే మంచిగుంటదో మీకు తోసింది మీరు చెప్పండి?"

"ఏం జేసుడేంది? నీయక్క బాయిలు బందువెడ్తె తెలుస్తది తడాఖ" గుంపుల్నించి రాయి విసిర్నట్టు ఒక కార్మికుడన్నడు. ఒకాయన కోపంగ లేసి పొగాకును తుపుక్కున వుమ్మి –

"అనుటానికేంది? ఎన్నైన అనవచ్చు. కని వూకె బాయిలు బందుపెడ్తె కలుత్తాది?" అన్నడు.

"మరేం జేసుడయ్యా?" సందు పండ్లల్ల పుల్చకుచ్చుకుంట ఒక కార్మికుడు "అరెస్ట్ చేసినోళ్ళను యిడిపియ్యాలె ముందు" వెనుకనుంచి ఎవరో! దానిమీద ఓ ముసలాయన కసురుకుని లేచి నిలబడి "ఏదో ఒకటి చెయ్యాలె, వాల్లను యిడిపిచ్చుడు మల్ల గుడిశెలు నిలబడెటట్టు చూసుడు రొండు ఒక్కపనితోనే కావాలె" అని కూసున్నడు.

"కలెక్టరుకు చెప్తె?" ఒకడు. "పాము పగైతే తోక సుట్టమా ఏంది?" మరో కార్మికుడు.

"మరి కోర్టుల కేసుబెడ్తె!" అనుమానంగనే ఇస్మాయిల్ సనిగిండు. అందరు గయ్‌మని లేచిండ్రు.

"ఏందని కోర్టు కెక్కుతవ్?"

"కోర్టంటె మాటలా?"

"వేయిలకు వెయిలు పైసలు గావాలె"

"ఆపతి పడంగ మంత్రసాని దగ్గరికి తోలిత్తె అంబాడంగ అచ్చినట్టు అయిద్ది."

"కోడి కోసం కోర్టుకు బోతె కొంప అమ్ముడు బోయిందట ఎనుకట."

"కోర్టులు గీర్టులు జాన్తానహీ!" దూదేకుల సాయెబు.

"సేత్తే మనమే ఏదో ఒకటి సెయ్యాలెగని ఒగని మీద ఆశపడద్దు" అని మరో మనిషి సలహా!

"అనుకునేదేదో జెప్పన అనుకోండ్రి, మళ్ళ పోలీసులత్తె కొట్టుకోలు మొత్తుకోల్లు" అన్నది ఒకామె.. పోలీసులంటె మీ ఆడోళ్ళకు లడలడంటది.

"జాపిలగా – మొన్న వురికినోళ్ళంత ఆడోళ్ళే" అన్నది అదే స్త్రీ. కొద్దిసేపు అటూ యిటూ చర్చించుకున్న మీదట అందరి అభిప్రాయాలు కనుక్కున్న మీదట లక్ష్మిరాజం తన అభిప్రాయం చెప్పిండు. చెప్పి అందరి దిక్కు పరిశీలనగ చూసిండు. అందరు

సంతృప్తి తల లాడించిండ్రు. అనుకున్నదాన్ని ఆచరణలో పెట్టడం ఆ రాత్రికి రాత్రే మొదలు పెట్టిండ్రు.

## 5

తెల్లవారింది. బొగ్గు బావులు యధాప్రకారం నడుస్తున్నయి. వాటి నడకల గురించి రాతకోతలు చూసే కంపిని జనరల్ మేనేజరు కార్యాలయం ముందు వుద్యోగులు మాత్రం చిన్నచిన్న వాహనాల్తో నిలిచిపోవాల్సి వచ్చింది! కంపిని గుమస్తాలందరు విచిత్రంగా చూస్తున్నరు. కార్యాలయం చుట్టువున్న విశాలమైన ఆవరణలోని వేపచెట్ల కింద, రేకుల షెడ్ల కింద కార్యాలయం వరండాలోపల ఒక చోటేమిటి? సందులేకుండ కార్మికులు సంసారాలతో దిగిండ్రు.

ఆడవాళ్ళు నిమ్మళంగ పొయ్యిలు అంటించుకుంట ముచ్చట్లు బెట్టుకుంటున్రు. గడెంచెల్లో కొందరు కార్మికులు నిర్రంధిగ నిద్రపోతున్నరు. పసిపాపలు ఏడుస్తుంటె ముసలివారు సముదాయిస్తున్నరు.

వెనకగా కంపెనీ జి.ఎం. కారు వచ్చి ఆగింది. వాచ్‌మెన్ బితుకు బితుకుమని చూస్తూ శాల్యూట్ కొట్టిండు. జి.ఎం. ముందుకు చూసి కనుబొమ్మలు ముడివేసిండు. ఆయనకు నాలుగు రోజుల క్రితం గుడిశెలు పీకేయించిన సంగతి జ్ఞాపకం వచ్చింది. అట్ల జ్ఞాపకం వచ్చేసరికి ఆయన ముఖం రకరకాల భావాలు రంగులు మారుతోన్నట్టు. ....

● భూమిక కథా సంకలనం 1991 ●

# 55. జంగుబాయి

♦ గోపి భాగ్యలక్ష్మి ♦

బండి గుట్ట మలుపు తిరిగింది.

అక్కడికి కొద్ది దూరంలో ఊరు - ఊళ్ళోని గుడిసెలు కన్పిస్తున్నాయి. ఊళ్ళోకి వచ్చి రావడంతోటే గుడ్డలు ఒంటినిండా లేని పిల్లలు బండి వెంటబడి నాకు అర్థంకాని భాషలో ఏదో అంటూ అరుస్తూ బండి వెంట పరుగెత్తారు.

మావారి స్కూల్ వాచ్‌మన్ ఎదురొచ్చి "రాంరాం సార్!" అన్నాడు.

నేను ప్రశ్నార్థకంగా ముఖం పెట్టేసరికి వాచ్‌మన్ అర్థం చేసుకొని "నమస్తే అమ్మా!" అన్నాడు.

నేను కలుపుగోలుగా నవ్వాను.

"ఇల్లు చూసి పెట్టినం సార్! బడికి దగ్గరే" వాచ్‌మన్ మాకు చెప్పుతూ- గోండు భాషలో బండి ఎక్కడికి పోవాలో సోముకు చెప్పాడు.

రాజు, మావారు బండి దిగారు.

బండి ఒక ఇంటి ముందాగింది.

ఆ ఇల్లు నాకు పర్ణశాలలాగా కన్పించింది. కంకు(వెదురు) పేళ్ళతో ఇంటి ముందు దడి కట్టారు. ఇంటి ముందు శుభ్రంగా అలికి ముగ్గు పెట్టి ఉన్నది. ఇంటి తలుపు కూడా వెదురు బద్దలతో అల్లినదే.

వాచ్‌మన్ తలుపు తీశాడు. "నాపేరు జంగు. ఏమన్నా కావాలంటే చెప్పండి" అన్నాడు.

హోస్టల్ వంట మనిషి సామాన్లు లోపలికి చేరవేస్తున్నాడు.

"నీ పేరేమిటి?" నేను.

"నామదేవ్" ముక్తసరిగా చెప్పాడు.

అతని వివరాలడిగాను. అతనికి ఇక్కడికి నాలుగు కోసుల దూరంలో గల ఊరట.

ఎలా తెలిసిందో గాని ఇంటి ముందు ఆడవాళ్ళు చాలా మంది వచ్చి చేరారు. వాళ్ళ కళ్ళల్లో ఏముందో నాకు అర్థం కాలేదు. వాళ్ళల్లో వాళ్ళే ఏదో మాట్లాడుకుంటూ బిడియ పడుతున్నారు. బహుశా నా కట్టుబొట్టు గురించేమో?వాళ్ళల్లో చాలా మందికి

పై ఆచ్ఛాదన ఏమీ లేదు. చీరకూడా చిత్రంగా కట్టుకున్నారు. ఒకరిద్దరు ఈ తరం పిల్లలు జాకెట్లు వేసుకున్నారు.

నేను బయటకు వచ్చి పలకరింపుగా నవ్వాను. వాళ్ళు నవ్వారు.

"అమ్మకు గోండి రాదు" నామదేవ్.

ఒక నడికారు స్త్రీ ముందుకు వచ్చి "అమ్మా మాకి తెలుంగు కొద్దిగ అస్తది. మేం ఈ ప్రక్క గుడిసెల ఉంటం. ఈ ఇల్లు కూడ మాదే" అన్నది.

ఇంటావిడకు తెలుగు తెలుస్తుంది బతికిపోయాను.

"ఎంతమంది పిల్లలు? మీ ఆయన ఏం చేస్తడు?" నేను మాటకలుపుతూ.

"నాకు ముగ్గురు బిడ్డలు, ఒక్క కొడుకు. మా ఇంటి మనిషి నేను చేనుపని చేసుకుంటం" ఆమె ఇంకా ఏమిచెప్పాలో తెలియక నిలుచున్నది.

నామ్‌దేవ్ బకెట్లతో నీళ్ళు తెచ్చి పెడుతూ "మీరంత పోండ్లి అమ్మ అలిసిపోయి ఉన్నరు" గోండు భాషలో చెప్పాడు.

"అమ్మా తానాల అర్ర గిక్కడ ఉన్నది" చూయించి వెళ్ళిపోయిండు.

ఇంటికి కొద్ది దూరంలో తడికలతో కట్టిన చిన్న గదిలాంటిది – స్నానం చేసి వచ్చాను. ఈలోగా రాజు, మా వారు ఓ రౌండు తిరిగి వచ్చారు.

అకలిగా వున్నది. తాగడానికి నీళు కావాలి. "ఇక్కడ మంచి నీటి బావి ఎక్కడున్నది?" నేను.

"ఇక్కడ బావులుండవు. అన్నింటికి పారే వాగు నీళ్ళే" మా వారు.

రాజు బెడ్డింగ్ పరుచుకొని వొరిగిపోయాడు.

"నీకు అలవాటయ్యేదాకా నా శిష్య పరమాణువులున్నారు. నామ్‌దేవ్. జంగు ఉండనే ఉన్నారు. ఇప్పటికి నామ్‌దేవ్ తెచ్చిన నీళ్ళతో సరిపెట్టుకోవాలి" మావారు.

కాస్త తిందామనుకొని ఆ మాటే మరిచి కాసేపు అలా ఒరిగాం. నిద్ర పట్టేసింది. మెలుకువ వచ్చేసరికి అంతా అయోమయంగా కన్పించింది. సాయంత్రం అయిదయ్యింది. మావారు ఎప్పుడో లేచి బయటకు పోయినట్లున్నారు. గోతాం సంచుల్లో కట్టిన వంట పాత్రలు తీశాను. మొదట మంచినీళ్ళు కావాలి.

"ఈ పూటకు నేను తెస్తాలే అక్కా" రాజు.

"నేను చూడాలి గదా!" బిందె తీసుకొని బయలుదేరాను.

తలుపు దగ్గర వేస్తుంటే ఇంటి వారమ్మాయి కాబోలు నా ముందు వచ్చి నిలుచున్నది. నల్లటి శరీరం నేరేడి రంగులో మెరుస్తోంది. కళ్ళు స్వచ్ఛంగా నిర్మలంగా మిలమిల లాడుతున్నాయి. పదహారుకన్నా ఎక్కువ వుండదు వయస్సు. చేతిలో బిందె తీసుకొని "నేను తెస్తా" నన్నది.

"వద్దు.. నేను కూడా మీ వూరు చూడాలి గదా!" నేను బయలుదేరాను.

తను కూడా కుండ తీసుకొని నా వెంట ప్రయాణమయ్యింది.

"నీ పేరేమిటి?" నేను.

"జంగుబాయి" తను.

జంగుబాయి నేను ఎప్పుడు వినని కంరస్వరంతో ఏదో చెప్పుతూనే వుంది. తన తండ్రి పేరు భీము అట, తల్లి పేరు లచ్చుంబాయి అట, తన అక్కకు పెళ్ళయ్యిందట- పక్క గూడెమే అత్తగారి ఊరట. చెల్లె పేరు రుక్మ అట....రుక్మ ఎవరు చెప్పారు వీళ్ళకీ పేరు?

జంగుబాయి అడవి పక్షిలాగా అడగనివి, అడిగినవి అన్ని చెప్పుతూనే ఉన్నది.

ఇంతలోనే వాగు వచ్చింది. వాగు గట్లు కోసి - నా చీరతో పాటు కిందికి దిగడం కష్టంగా తోచింది. ఏటవాలుగా ఉన్న ఒడ్డు మీద ఒక్క అడుగు వేస్తే నాలుగు అడుగులు అనుకోకుండా పడుతున్నాయి.

"అక్కా జాగ్రత్త" ముందు నడుస్తున్న రాజు కేకేశాడు.

జంగుబాయికి అలవాటు కాబట్టి చక చకా దిగిపోయింది. నేను జాగ్రత్తగా ఆమెను అనుసరించాను. నీటిపాయకు దగ్గరగా వచ్చాం.

ఆ ఒడ్డు ఈ ఒడ్డు మీద పెరిగిన వృక్షాలు. వృక్షాల మీద కేరింతలు కొట్టే పక్షులు. వాగునీటి గలగల. జంగుబాయి గొంతులాగా మోగే గాలి. ఇసుకలో కూలబడి పైకి చూశాను. వీటన్నిటిమీద నీలంగా బోర్లించిన ఆకాశం. నాకెంతో హాయిగా ఉన్నట్టని పించింది.

జంగుబాయి ఇసుకతో బిందె తోముతోంది....

"పదమ్మా" అంటూ కాస్త దూరం తీసుకు వెళ్ళి ఇసుకలో చెలిమ తీసి నీళ్ళు పేరుకోగానే ఇత్తడి గ్లాసుతో బిందె, కుండ నింపింది.

వాగు ఒడ్డు ఎక్కాలి. దిగడం కన్నా ఇది మరీ కష్టంగా తోచింది. పైగా నీళ్ళ బిందె. గట్టు ఎక్కేసరికి కళ్ళల్లో నీళ్ళూరాయి. జంగుబాయి చూడగలదేమోనని గబుక్కున తుడుచుకున్నాను. ఇంటికి చేరేసరికి కాళ్ళు పట్టేశాయి. దారి పొడుగునా పిల్లలు, ఆడవాళ్ళు నన్ను వింతగా చూడడం నేను గమనించాను.

రాజు ఇంటికి చేరగానే బకెట్టు పెట్టేసి కూలబడ్డాడు.

"అక్కా ఆ అమ్మాయి ముందు పరువుపోతుందని ఊర్కున్నాను గాని ఆ ఒడ్డు మీదనే కూలబడిపోదును" రాజు.

నేను నవ్వకుండా ఉండలేకపోయాను.

★ ★ ★

నాకు అడవి - అక్కడి మనుషులు కొత్తగా, వింతగానే వున్నాయి. ఆ అడవిలో సూర్యోదయాలు అందంగా, అలజడిగా ఉండేవి. పచ్చటి చెట్లమీద బంగారు వర్షం పులుముకొన్న గుట్టలు వింత శోభతో మెరిసేవి. అలాంటి సమయంలో చెప్పరాని ఉద్విగ్నత నాలో చోటు చేసుకునేది.

అలాంటి ఉదయాన్ని మా ఇంటికి కాస్త దూరంలో నిలబడి సూర్యోదయాన్ని చూస్తున్నాను. మా వారికి పొద్దున్నే లేచి ఊరు ఒక మారు తిరిగి రావడం అలవాటయ్యింది. మా వారితో పాటు రాజు వెళ్ళాడు.

నేను ఇంటి ముందు కూర్చున్నాను. పక్షులు గిరికీలు కొడుతూ అరుస్తున్నాయి.

"అక్కా ఈ కుందేలు ఎంత బావుందో చూడు?" రాజు మా వారి చేతుల్లో నుండి తెల్లగా మంచు ముద్దలాగా ఉన్న కుందేలును తీసుకొని ఎత్తి చూపుతూ.

"ఇది మీకెలా దొరికింది?" నేను.

"మీ తమ్ముడు తన జాతి వాడేనని కలుసుకోవడానికి వచ్చింది" మా వారు.

రాజు చిన్నప్పటినుండి పరుగెత్తడంలో ఫస్టు. అందరు వాన్ని "కుందేలు బచ్చా" అనేవాళ్ళు.

"ఇంతకీ అడవిలో తిరిగేదాన్ని ఎందుకు తెచ్చారూ?" నేను.

"ఇంకెందుకు వండుకు తినడానికి" మావారు.

"ఏమిటి? వెన్నెల ముద్దలాగా వున్న దీన్ని కోసి వండుక తినడమా? వొదిలేయండి. చూడండి దాన్ని కళ్ళెంత అమాయకంగా ఉన్నాయో?"

మా వారుదాన్ని వొదిలిపెట్టలేదు. నామ్‌దేవ్ సహాయంతో మా వారు అన్నంత పని చేశారు. ఆ రోజు నాకు అన్నం తినబుద్ధికాలేదు. ఎంత మరిచిపోదామనుకున్నా అమాయకత్వం, కించిత్తు భయం కలగల్సిన కుందేలు చూపులు నన్ను వారం రోజుల దాకా వెంటాడుతూనే ఉన్నాయి.

★ ★ ★

బంగాళాఖాతంలో వాయుగుండం లేచిందట - ఆకాశంలో చిక్కటి మబ్బులు కమ్ముకున్నాయి. భారీ వర్షం. దానికి తోడు చెట్లు గుయ్యిమంటుండగా ఈదురు గాలి - అసలే ఆ ప్రాంతం రేగడి నేల. నాలుగు చినుకులు పడితే బురద. అడవి కనుక చలికాలం చలి ఎక్కువ. దట్టమైన మంచుతెర కప్పుకొని కొండ కోనలు గజగజ లాడుతాయి. నాగరిక ప్రపంచం వెచ్చటి రగ్గుల్లో నులివెచ్చగా బతుకుతే ఇక్కడి చీకటి రాత్రులు ప్రకృతితో పోరాటం సాగించడమే. ఎముకలు కొరికే చలి. కలి మిగిల్చిన 'ఆకలిని' తట్టుకోవడానికి ఆదివాసులు రాజీ లేని పోరాటం సాగించవల్సిందే.

ఆదివాసులు నట్టింట్లో సంద్ర మొద్దులు పేర్చి అగ్గి రాజేసి ఆ నెగడి చుట్టూ కుటుంబ సభ్యులు మునగదీసుకుని కూర్చోవడం - ఆదివాసుల బతుకుల్లో చలికాలం రాత్రుల్లు భయంకరమైనవి.

ఇక ముసురు పట్టిన కాలంలో గుడిసెల్లో వీధిలో పెద్దగా తేడా కనబడదు. గుడిసె పైకప్పుల్లోంచి కారే వర్షపు ధారలతో ఆదివాసుల ఆవాసాలు నీటి చెలిమలౌతాయి. గుడిసె వాసాలు చీకి పోతుంటాయి. ఇంట్లో బురద, బయట వరదలతో అడవి తల్లి బిడ్డల కాళ్ళ వేళ్ళు పచ్చి పుళ్ళయి రసి కారుతుంటాయి. నిశిరాత్రుల్లో పాములు, కప్పలు ఇతర క్రిమికీటకాలు, తేళ్ళు వీటితో సహజీవనం. మంచినీళ్ళు దొరకడం కష్టమే. వరదనీరే తాగి కలరాలాంటి వ్యాధులు ప్రబలి, కనీస వైద్య సౌకర్యం కొరవడిన ఈ కొండ జాతి జీవనరాగం, మృత్యుదేవతకి తోడి రాగమౌతుంది

ఇక రోహిణికార్తె ఎండల్లో ఈ కోనల్లోని దీనావస్థ వర్ణనాతీతం. అది నాగరిక ప్రపంచపు ఊహకు సైతం అందనిది ఆధునిక మానవుడు ఏయిర్ కూలర్లు. ఫ్రిజ్

వాటర్ తాగుతూ కూడా అపసోపాలు పడుతూ వేసవిని తిట్టుకునే క్షణంలో - ఇక్కడి జీవన సరళి అందుకు భిన్నంగా కొండరాళ్ళతో, బండరాళ్ళతో సమానంగా నిప్పులు చెరిగే ఎండకు నెర్రెలు వారుతూ ఉంటుంది. కాళ్ళకు చెప్పులు ఆదివాసులు వాడరు.

ఇలాగ కష్టాల కడగళ్ళకు, ఎండ, వానలకు ఎదురు దెబ్బలకు, ఈదురు గాలికి ఎదురొడ్డి నిబ్బరంగా ప్రకృతితో రాజీలేని పోరాటం సాగిస్తున్న అడవి తల్లి బిడ్డల్ని చూస్తున్నప్పుడు నాలో వేనవేల భావతరంగాలు ఎగిసి పడేవి.

ఇలాంటి ఉద్విగ్నస్థితిలో నేను, రాజు వెళ్ళిపోయాడు. మా వారు అడవిలో తన స్కూలు గురించి తిప్పలు పడుతున్నారు. ఏదో తెలియని గుబులు, ఒంటరితనం నన్ను వెంటాడ సాగాయి. బయటి వాతావరణం కూడా అదే మోస్తరంగా ముసురుపట్టి, ఎడతెరిపి లేని వర్షంతో - నేను చూరునుండి ధారగా కురుస్తున్న నీటిని చూస్తూ కూర్చున్నాను. మా ఎదురింటి చూరుకింద జంగుబాయి నిలబడి ఉండటం కన్పించింది. చూరునుండి కారుతున్న నీళ్ళల్లో తడుస్తూ కూడా లోపలికి వెళ్ళడం లేదు. నిదానించి చూస్తే గజ గజ వణుకుతున్నట్టు తోచింది. ఈ పిల్లకేమన్నా పిచ్చి..

"ఏయ్ జంగుబాయి ఎందుకట్లా తడుస్తున్నావ్?" నేను కేకేశాను. జంగుబాయి నవ్వినట్టుగా తోచింది.

"పడిశం పట్టి జ్వరం వస్తుంది" నేను మళ్ళీ.

ఫర్వాలేదన్నట్లుగా సైగ చేసింది. ఈ సారి ఆ పిల్ల మూర్ఖత్వానికి .కోపం వచ్చింది.

"ఇలారా!" పిలిచాను.

రానన్నట్టుగా తల అడ్డంగా ఊపింది.

"వర్షం అంటే సర్దానా! సరేలే జ్వరం వస్తే తెలుస్తుంది" కాస్త కోపంగానే అనేసి లోపలికి వెళ్ళి నా పనిలో లీనమయ్యాను.

పొద్దుటి పప్పు చారు ఉంది. బెండకాయలు తరిగి వేపుడు చేశాను. మావారింకా రాలేదు. ఎన్నో చిత్ర విచిత్ర ఆలోచనలు. ఏదీ కొస మొదలుండదు. ఇది అని స్పష్టం గాదు. భావము ఎంత సేపో ఉండదు. ఎందుకో రాజు, అమ్మ వాళ్ళందరు జ్ఞాపకం వచ్చారు. వాళ్ళింత హైరానా పడుతున్నారో? వాళ్ళకు ఇక్కడి పరిస్థితులు అర్థం కావు. నాకు మాత్రం అర్థమౌతున్నదా? అర్థమైనా అర్థం కాకున్నా పేచీలేదు. అంటే అన్నిటినీ సర్దుకుపోవడమా? ఈ జీవితాన్ని ఇష్టపడుతున్నానా? లేదా విధిలేకనా? జంగుబాయి... ఆ పిల్ల గురించి ఏమనుకోవాలి.

జంగుబాయి జ్ఞాపకం వచ్చి చేతులు తుడుచుకుంటూ బయటకు వచ్చాను. వర్షం ఇంకా కురుస్తూనే ఉన్నది. మబ్బులు గుడగుడలాడుతూనే ఉన్నాయి. ఎదురుగా కన్పించిన దృశ్యం చూసి నా మనసు తడిసి ముద్దై పోయింది. జంగుబాయి గజగజ వణుకుతూ ఇంకా చూరునీళ్ళ కింద తడుస్తూనే ఉన్నది. ఆమె కాళ్ళమీద గొంతుక కూర్చున్నది. జంగుబాయి ముందు సత్తుగిన్నె - దానిలో జంగుబాయి తల్లి మొక్కజొన్న గడుక (సంకటి) పై నుండి ఎత్తి పడేసింది.

జంగుబాయి గిన్నె తీసుకొని తింటోంది. వర్షపునీళ్ళు గిన్నెలో కూడా పడుతున్నాయి. కంచం వోరగా పట్టుకొని తినేసి చూరునీళ్ళతో కంచం చెయ్యి కడిగేసు కున్నది. వాళ్ళమ్మ సత్తు చెంబుతో నీళ్ళు తెచ్చి కింద దూరంగా పెట్టింది. నీళ్ళు తాగి చెంబు, గిన్నె వారగా బోర్లించింది. నేను పరిస్థితిని అర్థం చేసుకొనే లోపల మావారు వచ్చారు.

'లక్ష్మీ తొందరగా వడ్డించు. ఆఫీసు జీపు వాగు అవతల ఉన్నది.

ఆఫీసులో పని ఉన్నది. ఆ జీపులో ఆదిలాబాదు వెళ్ళాలి. లేకపోతే కాలి నడకన వెళ్ళాల్సి వస్తుంది" మా వారు.

"అసలే వర్షం - పొంగే కొండవాగులు. నేనొక్కదాన్ని ఇక్కడుండాలా? చస్తే వుండను" నేను.

"ఎల్లుండి వచ్చేస్తాగా. మా ఆఫీసు వాళ్ళు వాగుదాటి వచ్చారు గదా! మా వెంట వాగుదాక నామ్‌దేవ్ వస్తాడులే. ఇంటి వాళ్ళ అమ్మాయిని ఒక రోజు తోడుండమను." మా వారు.

అయిష్టంగానే సణుగుతూ వడ్డించాను. మా వారు తనకు కావాల్సిన కాగితాలు తీసుకొని జాగ్రత్తలు చెప్పి గొడుగు వేసుకొని వెళ్ళిపోయారు. వాన కొంచెం తగ్గింది. కాని మబ్బులట్లాగే ఉన్నాయి.

మా వారిని సాగనంపుతూ ఎదురింటి వేపు చూశాను. జంగుబాయి ఇంకా అక్కడే ఉన్నది. కాస్త దగ్గరగా వెళ్ళి విషయం అడిగాను.

"బయటున్నాను. ఇంట్లకు పోవద్దు" జంగుబాయి లోగొంతుకతో చెప్పింది.

మాటలు వినపడ్డాయేమొ జంగుబాయి తల్లి బయటకు వచ్చింది. నన్ను చూసి "అమ్మా తడుస్తండ్లు - ఇంట్లకు రాండ్లి" అంది.

"మరి జంగు కూడా పొద్దటినుండి తడుస్తున్నది గదా!" నేను.

"అది ముట్టుకోదు. అయిదు దినాల దాకా ఇంట్లకు రావద్దు "

అయితే మాత్రం, వానలో చీకట్లో అట్లా రోజుల తరబడి తడువ వల్సిందేనా? వీళ్ళ మూర్ఖత్వానికి చిర్రెత్తుకొచ్చింది. "అట్లా కాదమ్మా రాత్రి పూట పురుగూ బూసి వుంటాయి. అదిగాక పొద్దటి నుంచి తడుస్తున్నది. రేపేదయినా కాకూడదని జరిగితే" నేను నచ్చ చెప్పే ధోరణిలో.

బహుశా ఇలాంటి మాటలు వాళ్ళు వినడం తొలిసారేమొ? జంగుబాయి ముఖంలో నీలినీడలు కమ్ముకున్నాయి. ఆమె తల్లి ఇలాంటి దుర్భర జీవితం అనుభవించిందే కదా! కాస్త చలించినట్టుగా "ఏం చేసుడు? ఆడ పుటుక పుట్టే బదులు అడవిల మానై పుట్టాలె - కాయిదా (ఆచారం) పాడుకాను" అన్నది.

"ఎవల ఇల్లయినా ఒకటే గదా!"

ఆమెకు ఏమి చెప్పాలో? ఎట్లా చెప్పాలో అర్థంగాలేదు.

"మా ఇంట్లోకి రాదుగాని వసారాలో పండుకుంటుంది" అని నచ్చ చెప్పి జంగుబాయిని తీసుకొని వచ్చేశాను.

జంగుబాయి తుపాను గాలిలో పూలతీగలాగ వణుకుతోంది. పాతచీర ఒకటి యిచ్చి తుడుచుకొమ్మన్నాను. తల బాగా తుడుచుకొని అదే చీర ఒంటికి చుట్టుకొని ఓ మూలకు ఒదిగి ఒదిగి కూర్చున్నది.

నాకు జాలేసింది. నాగరికత సంతరించుకున్న సమాజంలో స్త్రీ అనేక సమస్యలు ఎదురుకొంటోంది. ఇక్కడా అనాగరిక ప్రపంచంలో అంతే. ఎక్కడైనా స్త్రీ పరిస్థితి ఇట్లా ఎందుకుంటోంది? ఈ ప్రశ్న కొత్తగా వింతగా తోచింది.

వేడిగా కాస్త డికాషన్ చేసి యిచ్చాను. జంగుబాయి కళ్ళలో వింత మెరుపు. అదేమిటో నాకు స్పష్టంగా తెలియలేదు.

"ఎప్పుడు ఇంతేనా?"

'ఈ గూడాలల్లో గిట్లనే నడుస్తుంది."

నాగరిక ప్రపంచంలో సైతం మడి, "ఆచారం" అంటూ ఆ మూడు రోజులు దూరంగా ఉంచడం చూశాను గాని మరీ ఇంత ఘోరంగా వెలి వేసినట్టు చూడటం అన్యాయమనిపించింది. 'ఆడదానికే ఇలాంటిది ఎందుకుండాలి?' నేను కాస్త ఎంగిలి పడి మంచంపై నడుం వాల్చాను.

ఈ ప్రశ్న గింగురుమంటోంది. వర్షం తగ్గింది. కాని చలిరాత్రి పరుచుకున్నది. జంగుబాయి ఓ మూలకు కూర్చున్నది. దగ్గరికి వచ్చి కూర్చోమన్నాను. కాస్త దూరంగా నేల మీద కూర్చున్నది.

"ఇప్పటి తరపోల్లకు ఇంతేనా?"

"ఏం చేసుడమ్మా - పెద్దలు పెట్టిన కట్టడి. మా మేనత్త ఒకామె జ్వరంతో నున్నప్పుడే ముట్టయ్యింది. ఇంట్లకు రానియ్యలే - అప్పుడు సలికాలం. జెరం ఎక్కువై బయటనే నీల్గి నీల్గి పాణ మిడిసింది" జంగుబాయి కళ్ళల్లో నీటిపొర.

"వద్దు జంగుబాయి నువ్వు ఏడ్వద్దు' అనాలకున్న 'మరి కాన్పుల సమయంలో కూడా ఇదే కాయిదానా?" అడిగాను ఆమెకు గోనె పట్టాయిస్తూ.

"అది పంట ముట్టమ్మ గింత తప్పుండదు. దూరంగ దొడ్డిల (ఇంట్లనే) వుంటది బాలింత."

అలా మాట్లాడుతూ ఎప్పుడు నిద్రపోయానో తెలియదు.

బాగా తెల్లవారాక గాని మెలకువ కాలేదు. జంగుబాయి ఎప్పుడో లేచి వెళ్ళిపోయి నట్టున్నది.

బయట హడావిడిగా జనం గోండు భాషలో మాట్లాడుతున్నారు.

లేచి బయటకు వచ్చి అక్కడే నిలబడిన జంగుబాయి చెల్లెని పిలిచి "సంగతేమిటని" అడిగాను.

"నాత్రి చిరుతపులి ఊళ్ళెకు వచ్చి మేకను గొట్టింది" జంగుబాయి చెల్లె.

జంగుబాయి ముసలి నాన్నమ్మ నాకేసి చేతులారుస్తూ ఏదో గొణుగుతోంది.

"ఆమె ఏమంటోందని" ముద్దాయిలా నిలుచున్న జంగుబాయిని అడిగాను.

"రాత్రి పులి వచ్చింది గదా! కాయిదా తప్పుతేనె గూడెంలకు దేవుర పులిని తోలిందట - ముసల్ది ఒర్రుతుంది" జంగుబాయి.

అంటే రాత్రి జంగుబాయిని ఇంట్లోకి తీసుకపోవడం ఆ ముసల్ది గుడ్ల గూబలాగా చూసిందన్నమాట.

అక్కడ చేరిన వాళ్ళందరు ఆడవాళ్ళే కొంత నయం. ఎందుచేతనో వాళ్ళు నన్ను నిలదీసే లాగున లేరు. జంగుబాయిని వాళ్ళమ్మనే ఏదో అంటున్నారు. "ఆమె కాయిదా తెలువక రమ్మంటే నువ్వు పోవుడేనా?" అంటున్నారేమొ?

జంగుబాయి తల్లి ఏదో చెప్పుతోంది. కాసేపు కయ్యర బియ్యర మాట్లాడి వెళ్ళిపోయారు.

నోరు వాయి లేని జంతువులకు వీళ్ళ ఆటవిక కాయిదా తప్పినట్టు ఎట్లా తెలుసు నన్నుకున్నారో బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. వీళ్ళు ఇంత చిన్న విషయాన్ని ఆలోచించలేరా? మేకపిల్ల గురించి బాధపడుతున్నారు గాని జంగుబాయి అట్లా చూరు కిందనే ఉంటే మనిషిని ఎత్తుకపోతే. ఈ కాయిదా ఎవడు పెట్టాడో గాని.. ఇలాంటి ఆలోచనలు అనేకం చుట్టుముట్టాయి.

★ ★ ★

ఆ గూడెంలో మరొక వింత అలవాటు గమనించాను. తెల్లవారగానే ఆడవాళ్ళు ఓ వెదురు గంపలో ఎంగిలి కంచాలు, వంట పాత్రలతో పాటు నీళ్ళ కడవలు ఉతికిన బట్టలు పట్టుకొని వాగుకు వెళతారు. అక్కడ అవన్ని తోముకొని అక్కడే స్నానం చేసి, బట్టలు ఉతుక్కొని తీరిగ్గా ఊళ్ళోకి వస్తారు.

ఆ రోజు నీళ్ల బిందె తీసుకొని వాగుకు బయలుదేరాను. మాయింటికి నాలుగిళ్ల అవల గల కాంతాబాయి గట్టుమీద కలిసింది. ఆవిడను చూడగానే నాకు జుగుప్స లాంటిది కలిగింది. ఆమె కళ్ళల్లో ఒక రకం విలనీ ఉంది. ఎందుకో ఆ ఊళ్ళో చాలా మంది ఆమెతో ఎక్కువగా మాట్లాడరు. ఆమె అందరిని కసిరి కొడుతుంది. ఆమె ఈ ప్రపంచమంతటి మీద ద్వేషం పెంచుకున్న వింత మనిషిలా గోచరిస్తుంది.

నాతో మాట కలుపుతూ "నువ్వు వచ్చినవమ్మ."

"ఔ" నేను ముక్తసరిగా.

'మా దేశం మీ దేశంకు బుగ్గ (బాగా) ఫరకుంటది. సారు సంపాయిత్తండు మంచిగ."

నేను మౌనంగా ఉండిపోయాను.

దగ్గర దాకా వచ్చి అటిటు దొంగ చూపులు చూసింది. ఆముదపు కంపు నా ముక్కు పుటాలకు తాకింది. నాకేసి వొంగి "ఈడ మంత్రాలు చేస్తరు. జేగర్త గుండాల" గుసగుసగా కాంతాబాయి.

నేను అర్థం కానట్టు చూశాను.

"గోండి మంత్రం గట్టి మంత్రం" ఆమె.

నాకు ముచ్చెమటలు పోశాయి. గబ గబ బిందెలో నీళ్ళు నింపుకొని గట్టెక్కాను. ఆ పొద్దటి చిరుతపులి భయంకన్నా ఈ భయం నన్ను వణికించింది. ఇక్కడ మా వాళ్ళంటూ ఎవరు లేరు?

ఇంటికొచ్చాను. మా వారు నా ముఖం చూసి "ముఖం మీద రక్తం చుక్క లేనట్టు పాలిపోయావు" అన్నారు.

"మనం ఇక్కడి నుండి వెళ్ళిపోదామండీ! చుట్టూ గుట్టలు తప్ప ఏమీ కనబడని ఈ అడవిలో మనకేమైనా అడిగేవాళ్ళు లేరు. పులులు, పాములు, అంతకన్నా భయం గొలిపే ఈ మనుషులు" నాకు ఏడుపు వస్తోంది. నా కంఠం పూడుకపోయింది. కాసేపాగి కాంతాబాయి అన్న సంగతి చెప్పాను. మావారు "సరే, సరే" అన్నారు అనునయంగా.

ఆ మధ్యాహ్నం "లక్ష్మీ నువ్వు చదువుకున్న దానిని. నువ్వే ఇట్లా మంత్రాల గురించి భయపడితే - వీళ్ళు అనేక సంవత్సరాలనుండి విజ్ఞానానికి దూరంగా ఎడంగా బతుకు తున్నారు. వీళ్ళ బతుకులో మూఢ నమ్మకం ఒక భాగం. ఇలాంటి వాళ్ళను విజ్ఞాన వంతులను చేయాల్సిన పనిమీద - మన బతుకు తెరువు కోసం ఇక్కడికి వచ్చాం కాదా? మనం ఇక్కడి పరిస్థితులను, అజ్ఞానాన్ని తట్టుకోవాలి. నామ్‌దేవ్ జంగుబాయిని ఇంట్లోకి తెచ్చిన సంగతి చెప్పాడు. కాంతాబాయి ఇక్కడి స్త్రీల వెనుకబాటుతనానికి కొండ గుర్తు. ఆమె నిన్ను సైకలాజికల్‌గా బలహీన పర్చడానికి అట్లా చెప్పింది. ఏదైనా అనారోగ్య మొస్తే వీళ్ళు కాంతాబాయిని నమ్ముకుంటారు. అంటే కాంతాబాయి ఇక్కడ గణాచారి - ఆమె తనకు తెలిసిన పద్ధతిలో గోండులను హడలగొట్టి బతికేస్తున్నది. ఇక్కడ మనం బతకాలంటే వీళ్ళ ఆచారాలను నమ్మినట్టే కన్పించాలి. గోండువాళ్ళు చాలా ఆత్మాభిమానం గలవాళ్ళు. వీళ్ళను మనం వ్యతిరేకించినట్టు పసిగడితే వీళ్ళు మన దగ్గరికి రారు. రాజుల సంతతి అనుకుంటరు. అయినా సమస్యకే బెదిరిపోతే - పరిష్కారం ఎట్లా కనుక్కుంటావ్ రచయిత్రీ" అన్నారు ఆఖరి అస్త్రం వొదులుతూ.

★ ★ ★

చేసే పనేమిలేక మధ్యాహ్నం అట్లా పడుకున్నాను. ఏవో కేకలు అరుపులతో మెలుకువ వచ్చింది. బయటకు వచ్చాను....

నల్లగా లావుగా ఉన్న ఒకతను, అతని పక్క సన్నగా వున్న మరొకతను కలిసి మా ఇంటతను అదే జంగుబాయి తండ్రితో ఘర్షణ పడుతున్నారు.లావుగా ఉన్నతను చేతిలోని కాగితాలను చూపుతూ పెద్దగా అరుస్తున్నాడు.

జంగుబాయి తండ్రి తలవంచుకొని నిలుచున్నాడు. జంగుబాయి తల్లి మాత్రం బతిమిలాడుతోంది. వాళ్ళందరూ గోండులోనే మాట్లాడుతూ వుండటం వలన అసలు గొడవేమిటో అర్థంకాలేదు. మా వారు మధ్యాహ్నం భోజనానికి వచ్చారు. ఇంట్లోనే ఉన్నారు. సంగతేమిటో కనుక్కుందామని వాళ్ళ వాకిట్లోకి వెళ్ళారు. నేను లోపలికి వచ్చేశాను.

కాసేపటికి మా వారు బారెడు పొడుగు నిట్టూరుస్తూ వచ్చారు. నేను అడగకముందే "ఆఁ ఏముంది? గోండు వాని బతుకే అంత "

మన ఇంటతను పెద్దమ్మాయి పెళ్ళికి ఆ వచ్చిన షావుకారి వద్ద చేను తాకట్టుపెట్టి కొంత డబ్బు తీసుకున్నడట - గడువు తీరింది నాడబ్బు వడ్డీతో సహా కట్టు లేదా తాకట్టు

పెట్టిన చేను తనపరం చేయమంటున్నాడు. వీల్లేమంటారు? కాగితం చూస్తే వడ్డీ అసలు కలిసి తడిసి మోపెడయ్యింది. ఎంత తీసుకున్నాడో? ఈ వడ్డీ లెక్కలేమిటో అతగాడికి తెలియదు. సాక్షుల వేలిముద్రలు, భార్యభర్తల వేలిముద్రలు కాగితం మీద ఉన్నాయి. నాకు మనసంతా కలిసివేసినట్టయ్యింది. అసలు అంత వడ్డీ ఎక్కడైనా ఉందా అని? లక్ష్మీ వీళ్ళ అవసరం అలాంటిది – మనిషి అవసరాన్ని, బలహీనతని కనిపెట్టే గదా ఆవలివాడు దెబ్బతీసేది..." మావారు మరేమీ మాట్లాడకుండా వెళ్ళిపోయారు. నాకన్నా మావారే ఇక్కడి సమస్యలతో అతలాకుతలం ఔతున్నట్లనిపించింది... ఆ ఆదివాసి జీవితాలు పోనూ పోనూ కీకారారణ్యాల్లాగే తోస్తున్నాయి... ఆ విషయం కన్నా మరెన్ని విషయాల్లో ముందుకు వచ్చి మరిచిపోయాం.

నాలుగు రోజుల తరువాత జంగుబాయిని పిలవడానికి వాళ్ళింటికి వెళ్ళాను. ఆ ఆదివాసి దంపతులిద్దరు మొక్కజొన్న సంకటి కారం కలిపి తింటున్నారు.

"రండమ్మ గట్ల కటల్ (మంచం) మీద కూకోండ్లి" వాళ్ళు. "జంగుబాయి లేదా?" కాదనలేక కూర్చుంటూ –

"సంత (అంగడి)కి పోయింది" తల్లి.

అప్పుడే వాళ్ళ భూమి తగువు జ్ఞాపకం వచ్చింది. "మొన్నటి సంగతేమైంది?" నేను.

"ఏమైతదమ్మా! సేను సావుకారికిచ్చినట్టే" జంగుబాయి తండ్రి భీము.

నేను నివ్వెరపోయాను.

"మరి మీకు వేరే మార్గం లేకపోయిందా?"

"ఏం చేసుడమ్మా! గన్ని పైసలు ఎవరికున్నయ్."

"అసలు మీరెంత డబ్బు తీసుకున్నరు?"

"ఏడునూర్లు – పిల్ల ఎదిగిపాయె. చేతుల పైసలు లేకపాయె. మంచికి సెడ్డకు షావుకారే దిక్కాయె."

"ఏడువందలకు సేను గుంజుకుంటడా? ఒక సంవత్సరం పంట పాటి కాదు గదయ్య"

"శ్రీ! చేతికి పంట వచ్చే దనుక ఆగనంటడు. ఆగినా అసలుకు వడ్డికి ఆ పైకం సాలదు. మురిగిన కాలు కొట్టేసుకున్నదే నయం" భీము కళ్ళల్లో సన్నటి నీటిపొర.

అయినా భీము కలవరపడ్డట్టు కన్పించలేదు. "మా రెక్కలున్నయి గదా!"

భీము గుండె నిబ్బరం చూసి నాకు ఆశ్చర్యం కలిగింది. నాకు తెలిసిన నాగరిక ప్రపంచంలో నాలుగు రూపాయలు నష్టపోతేనే ఏడ్పులు, కొట్టుకోళ్ళతో వ్యవహారం ముగుస్తుంది. మరి ఈ ఆదివాసి తనకు, తన కుటుంబానికి ఆధారమైన చేను షావు కారికిచ్చేసి నిబ్బరంగా జొన్న సంకటి తింటున్నాడు. భీముకు ఏ కొండ స్ఫూర్తి నిచ్చిందో ఏ అడవి అండ నిల్చిందో? నీళ్ళ కాయిదాల్లాగే వీళ్ళ గుండె నిబ్బరం నాకు అర్థం కాలేదు.

★ ★ ★

జంగుబాయి సంబరంతో పరుగెత్తుకొచ్చింది. "అమ్మా మా అక్కకు కొడుకు పుట్టిండు" ఇంకా ఎగపోస్తూనే.

"ఎప్పుడు?" నేను.

"తెల్లారంగ."

"అట్లనా రేపు చూడడానికి వస్త" నేను. ఎట్లా వచ్చిన జంగుబాయి ,అట్లాగే వెళ్ళిపోయింది.

మరునాడు మావారు స్కూలుకు వెళ్ళిన తరువాత జంగుబాయి వాళ్ళింటికి వెళ్ళాను. వాళ్ళ ఇంట్లో కనిపించిన దృశ్యం.. ఇంకా కళ్ళు తెరువని పసిగుడ్డు తల వెంట్రుకలు తీస్తున్నారు.

"అయ్యో! ఇప్పుడేనా? అంత లేత చర్మం కోసుకపోతే ఎట్లా? తలకు ఏమన్న అయితే? నా ప్రాణం విలవిల్లాడింది.

అది మొండికత్తిలాగున్నది. పిల్లవాడు కాళ్ళు తన్నుకుంటూ కేర్‌కేర్ మంటున్నాడు.

"ఇది మా కాయిదా అమ్మా బిడ్డ పుట్టిన మూడోనాడే వెంట్రుకలు తీస్తం. పుట్టి వెంటుకలుండద్దు" ఏదో చెప్పుతోంది జంగుబాయి తల్లి.

"మీ ఆచారం బాగానే ఉన్నది. కాని ఆ పసిగుడ్డుకు ఏమన్నా అయితే" నేను విసుక్కున్నాను. వాళ్ళు వింటేనా?

వాళ్ళ నమ్మకాలను తిట్టుకుంటూ చేసేదేమి లేక బయటపడ్డాను.

తెల్లవారి ఆ పిల్లవాడికి జ్వరం పట్టుకున్నది. దగ్గర్లో ఆసుపత్రులు లేవు. ఉన్నా వీళ్ళు తీసుకువెళ్ళరు. కాలుగాలిన పిల్లిలా ఇంట్లకు బయటకు తిరిగాను. వెంట్రుకలు తీసేసిన ఆ పసిగుడ్డును చూడడానికి భయమేసింది. పగటివరకు ఆ బిడ్డ పొట్ట ఉబ్బిపోయింది వీళ్ళు చిట్కా వైద్యాలు మొదలుపెట్టారు.

తన తొలిసూలు బిడ్డ కోసం జంగుబాయి అక్క కుమిలి కుమిలి ఏడుస్తోంది. ఒకరోజు అలా గడిచింది. తెల్లవారింది. నా కంటి మీద కునుకు లేదు. బిడ్డ చనిపోయాడు. దగ్గర పెరట్లోనే పూడ్చిపెట్టారు.

ఆ బిడ్డ కీచు గొంతుతో నా మెదట్లో ఏడుస్తున్నట్టే ఉన్నది... ఆ తల్లి... అటువేపు చూడడానికే భయం వేసేది.

నున్నగా గీచిన తలతో ఆ బిడ్డ - గాట్లు పడిన తలతో ఆ బిడ్డ - ఆ బిడ్డ హృదయ విదారకమైన ఏడుపు నాకు నిదురలేకుండా చేశాయి.

★ ★ ★

నాకు మా వూరు పదే పదే జ్ఞాపకం వస్తోంది.

"నన్ను మంచిర్యాల వరకు వచ్చి బస్సెక్కించండి! అక్కడి నుండి వెళ్ళడం పెద్ద సమస్యేమీ కాదు గదా!" అన్నాను నేను మా వారితో.

"ఇంకా ఇరువై రోజులు గడిస్తే సెలవులే కదా! ఇద్దరం కలిసే వెళ్ళుదాం" అన్నారు.

ఆనాడు మరీ దిగులుగా ఉన్నది. మా వారు స్కూలుకు వెళ్ళిపోయాక ఏదో పుస్తకం చేతిలోకి తీసుకున్నాను. బయట వాకిట్లో జంగుబాయి గొంతు, మరొక అపరిచిత కంఠం వినిపించాయి.

"అమ్మా శానా మంచిది ఏమనదిరా!" జంగుబాయి గొంతు.

"ఏయ్ జంగుబాయి సారు లేడు లోపలికిరా!" నేను కేకేశాను.

జంగుబాయి, దాదాపు అంతే వయసుగల మరొక అమ్మాయితో లోపలికి వచ్చింది.

"దీని పేరు కమల. మేం చిన్నప్పటి నుంచి కలిసి పెరిగినం" పరిచయం చేసింది.

ఆ అమ్మాయి జంగుబాయికి పూర్తిగా విరుద్ధంగా ఉన్నది. జంగుబాయి నల్లగా పుష్టిగా ఉంటే కమల సన్నగా తెల్లగా ఉన్నది. చెంపమీద పచ్చబొట్టు. భాషలో కూడా వైవిధ్యం ఉన్నట్టుగా గమనించాను.

"మీరెక్కడ ఉంటరు?" నేను

"మేం ఇక్కడికి దగ్గరనే లంబడి తండలో ఉంటం" కమల.

"వీళ్ళు లంబడోల్లమ్మ. వీళ్ళకు గోదలు (పశువులు) బగ్గ ఉంటయమ్మా" జంగుబాయి. వీళ్ళకు పశుసంపద ఎక్కువని, పాలు, పెరుగు, తప్పనిసరిగా అమ్మవల్సి రావడం వలన నాగరిక ప్రపంచంతో గోండులకన్నా ఎక్కువ సంబంధాలు ఏర్పడ్డట్టు తెలుసుకున్నాను. తెల్లగా, బలిష్టంగా వుండే ఈ తెగవారు గోండుల కన్నా ఎక్కువగా వ్యవహారదక్షులు. వీళ్ళకు ప్రత్యేకమైన వేషధారణ ఉంటుంది. ఆడవాళ్ళు ముదురు రంగు ముతక నేత గుడ్డలపై అద్దాలు అందంగా కుట్టి తళుకులీనుతూ ఉంటాయి. వీళ్ళు వేసుకునే చోళీలు, లంగాలు, వల్లెవాటుగా వేసుకునే ముసుగులు కూడా కచ్‌వర్కు చేసి ఎంతో కళాత్మకంగా ఉంటాయి.

"నీ రవికెపై అద్దాలు బావున్నాయి" అన్నాను కమలతో.

కమల అందంగా కొద్దిగా వొయ్యారంగా నవ్వింది. జంగుబాయి నవ్వులో ఒయ్యారం కనిపించదు.

"నీది ఒక ఎర్ర రవికె ఉంటే ఇయ్యండమ్మా మంచిగ కుట్టిస్త" కమల.

నేను పెట్టెలో నుండి ఎరుపురంగు జాకెట్టు తీసి యిచ్చాను.

"మల్ల వారంల వచ్చినప్పుడు తెస్త" కమల.

"అద్దాలు పెద్దవి వద్దు - చిన్నవి చాలు" అన్నాను.

"నేను నీకు పచ్చీసు కుట్టిస్త" జంగుబాయి తను కమలకన్న ముందు ఏదో ఒకటి యివ్వాలనుకున్నదేమో?

'వద్దులే జంగుబాయి పచ్చీసు ఆడే ఓపిక, తీరుక రెండూ లేవు. నేను వెళ్ళేలోపున సోలెడు చారపప్పు తీసి ఉంచు ఎంత ధరైనా పర్వాలేదు" నేను.

"ఎంత మాటమ్మా తప్పక జాడదీస్త..." జంగుబాయి.

వాళ్ళు చాలాసేపు మాట్లాడి వెళ్ళారు. వాళ్ళకు నానుంచి ఏదో కావాలి? వస్తువులు కాదు... మాటలు... పైగా వాళ్లు నాకు తమ వద్ద నున్న చిన్న చిన్న కానుకలిచ్చి నా నుండి ఏమి కావాలనుకుంటున్నారు? నాకు ఎంతాలోచించినా అంతు పట్టలేదు.

★ ★ ★

మధ్యాహ్నం మూడవుతోంది. ఆనాడు శనివారం ఒక పూటే స్కూలు కనుక మా వారు నిద్రపోతున్నారు. నేను చాపకింద చాప పరుచుకొని పడుకున్నాను.

"సారూ!' ఎవరో బయటపిలుస్తున్నారు.

ఆ తరువాత నామ్‌దేవ్ లోపలికి వచ్చి "అమ్మా సార్ కోసం పటేల్ వచ్చిండు" అన్నాడు.

నేను మా వారిని లేపి చెప్పాను.

నామ్‌దేవ్‌తోపాటు మరో ఇద్దరు అపరిచిత వ్యక్తులు లోపలికి వచ్చారు.

"రండి రండి" మా వారు మర్యాద పూర్వకంగా ఆహ్వానించి మంచంలో కూర్చుండమన్నారు.

వారిలో ఒకతను ఎత్తుగా, లావుగా, తలకు పాగా చుట్టి, చేతిలో పొన్ను కర్రతో ఉన్నాడు. అతన్ని ఆ వూరి పటేల్ (గ్రామపెద్ద) గా పరిచయం చేశాడు నామ్‌దేవ్.

"కబురు పంపితే నేను వచ్చేవాన్ని గదా!" మావారు.

దానికాయన చిన్నగా నవ్వి "ఎవరొస్తే ఏంది సార్!" అమ్మని గూడ చూసినట్టుంటుదని వచ్చినం" అన్నాడు.

"మీరు వచ్చినంక పిలగాండ్లు మంచిగ, బుద్ధిగ బడికి వస్తండు సార్! కొంచెం తెలివికి దేవాల" పటేల్.

"మేం ఇక్కడికి వచ్చింది అందుకే గదా! అందుకు మీరు కూడా చేయూత నివ్వాలె" మా వారు.

"సారూ! అంత బాగనే ఉన్నదిగని ఆ మాల మాదిగోల్ల పోరగాండ్లను మా పిల్లలతో పెడుతండ్రుట. అల్లను దూరం కూసుండబెట్టి సదువు చెప్పాలె." రెండో పెద్ద మనిషి అన్నాడు. అతను కురుచగా ఉన్నాడు.

"ఓహో ఇక్కడ కూడా మాల మాదిగలున్నారా?" నేను తడుక కట్టిన వంటింట్లోంచి పోతూ అనుకున్నాను.

అక్కడినుండి చూస్తును గదా మావారి ముఖం ఎర్రగా జేవురించింది. అతికష్టం మీద తమాయించుకొని "చూడండి పారశాలకు వచ్చిన తరువాత అందరు పిల్లలు మాకు సమానమే. వారి వారి తెలివి తేటలను బట్టి, చదువుపై శ్రద్ధను బట్టి వాళ్ళలో ఎక్కువ తక్కువలుండవచ్చును. కాని కులాలను బట్టి బడిలో స్థానం యివ్వరు. దేవుడి గుడి లాంటిది పారశాల. దయచేసి ఆ కులం విషయం తేవద్దు" మా వారు.

"ఎట్లా సారూ! మైలపడుతం గదా!" పటేల్

మా వారు తన సహజ ధోరణిలో ఎట్లా అభివృద్ధిలోకి రావాలో బయటి ప్రపంచంలో ఎన్ని మార్పులు జరుగుతున్నాయో వివరించడానికి ప్రయత్నం చేశారు.

వాళ్ళిద్దరికి మా వారి ఒక్క మాట అర్థం కాలేదని వాళ్ళ ముఖాలే చెప్పుతున్నాయి. అట్లని ఈ చదువుకున్న తలతిక్క మనిషితో విరోధం తెచ్చుకునే వాళ్ళలాగా కనిపించలేదు.

"నిజమే సారూ! మా మనుషులున్నరు గదా! పాతవి ఇడిసిపెట్టరు. కాయిదా గదా! పోని తియ్యండ్రి బడికాడి నుంచి మా గోండియా పిల్లగాండ్లు వాగుకుపోయి మునిగస్తరు." అని "రాం రాం" చెప్పి వెళ్ళిపోయారు.

"వీళ్ళు మొండిఘటాలు - దేనికైనా సుళువైన దారి వెతుక్కుంటరు" మావారు.

నేనేమి చెప్పాలి?

★ ★ ★

మంత్రాల కాంతాబాయి మొగడు ఆమెకు సరిజోడు.

వాళ్ళిద్దరు కలిసి "బడిలో సారు అందరు పిల్లలను కలిపి కూచుండబెడు తున్నాడని" ఇల్లిల్లు దండోరా వేసి చెప్పారు. వాళ్ళు స్వయంగా తమ పిల్లలను బడి మాన్పించారు. బడిలో రోజు రోజుకు పిల్లల సంఖ్య తగ్గిపోసాగింది.

మావారు చాలా డల్‌గా కనిపించారు. హాస్టల్ సౌకర్యం ఉంది. కనుక భోజనాల సమయానికి కంచాలు పట్టుకొని పిల్లలంతా హాజరు అయ్యేవారు. పాఠశాల క్లాసులకు మాత్రం వచ్చేవాళ్ళు కాదు. వస్తే మాలపిల్లలతో పోట్లాడేవాళ్ళు.

మావారు ఇల్లిల్లు తిరిగి అందరికి నచ్చ చెప్పబోయారు.

ఆనాటి రాత్రి కాంతాబాయి మొగుడు బాగా తాగి మా ఇంటి ముందు తూలుతూ ఏదో పెద్ద గొంతుతో వాగసాగిండు.

నాకు చాలా భయమేసింది...

మా ఇంటాయినే కలుగజేసుకుని కాంతాబాయి మొగుడికి ఏదో చెప్పి తీసుక వెళ్ళాడు. అడవిలో తేనెపట్టుతోపాటు విషముష్టి కాయలున్నాయి గదా! అడవిలోకి కూడా కుట్రలు, కుతంత్రాలు ఎట్లా ప్రవేశించాయో? ఎవరు తెచ్చారో?

★ ★ ★

నాకు అక్కడున్న ఒకే ఒక నేస్తం జంగుబాయి. సాధ్యమైనంత వరకు ఇద్దరం కలిసే ఉండేవాళ్ళం. ఒకనాడు ఇద్దరం వాగుకు నీళ్ళకోసం బయలుదేరాం.

జంగుబాయి ముఖం మబ్బులు పట్టిన ఆకాశంలా వున్నది. అట్లా వుండడం నేనెప్పుడు చూళ్ళేదు.

"ఏంది జంగుబాయి ఎలాగో ఉన్నవ్" నేను.

జంగుబాయి భోరున ఏడ్చేలాగున ఉన్నది. గురగురలాడే గొంతుతో తనను తీసుక పోతామని అత్తగారు కబురు చేశారట. జంగుబాయికి చిన్నప్పుడే పెళ్ళయింది.

"మరి ఇన్నాళ్ళకు అత్తగారు తీసుకవెళ్ళుతానంటే బాధెందుకు?" నేను.

"నాకు యిష్టం లేదమ్మా. నాకన్న చిన్నగా అగుపడతడు" అన్నది జంగుబాయి.

ఈ బాల్య వివాహాల్లో చిక్కే యిది. ఇద్దరూ పెరిగిన తరువాత ఇద్దరిలో ఏ ఒక్కరికి నచ్చకపోయినా వచ్చే సమస్య ఇది.

"మరి ఆయనకు నువ్వంటే యిష్టమేనా?" నేను

"ఆయనకు నేనంటే ఇష్టం లేదమ్మా? కాని ముందుగా ఎవలు ఈ సంగతి ఎత్తితే వాళ్ళే కుల పంచాయితిల దండుగ కట్టాలె. మేం ముందు బయటపడితే మేమే."

పెళ్ళికి సంబంధించిన అనేక విషయాలు జ్ఞాపకం వచ్చాయి. ఇద్దరం మరేమి మాట్లాడుకోలేదు.

ఒకనాడు అనుకున్నంత అయింది తెల్లవారిందో లేదో జంగుబాయి గురించిన వార్త గూడెంలో గుప్పుమన్నది.

జంగుబాయి తనకునచ్చిన వేరొక యువకుని ఇంట్లో సొచ్చిందట. వాళ్ళిద్దరిని పట్టుకున్నరట - ఆ యువకునికి జంగుబాయి అంటే ఇష్టమేనట. మారు మనువు చేసుకున్నదట.

నాకేమి ఆశ్చర్యంగా లేదు. జంగుబాయి మంచి పనే చేసింది. ఇష్టంలేని, మనసులేని మగవానితో జీవితాంతం నరకం అనుభవించే బదులు తనకు నచ్చిన, తనను మెచ్చిన బతుకు పంచుకోవడం సబబు అనిపించింది.

నేను జంగుబాయి వాళ్ళ ఇంటికి వెళ్ళే సరికి ఆమె తల్లి ఏడుస్తోంది. కుటుంబానికి ఆధారమైన చేను షావుకారి పరమైనప్పుడు కూడా ఆమె ఏడ్వలేదు.

జంగుబాయి తండ్రి తలపట్టుకొని ఒక మూల కూర్చున్నాడు.

"ఎట్ల చెప్పేదమ్మా! ఇప్పుడు కులం పంచాయితీల కూకోవాల. మొన్ననే పెద్ద పోరి పెండ్లప్పు కింద షావుకారికి చేను ధారపోస్తిమి. ఇప్పుడు ఇది ఇంత చేసింది. కులం ఏదో వొకటి తేల్చకపోతే మాకు గూడెంలో నీళ్ళు, నిప్పు పుట్టయి. కులపోల్లకు కల్లు వోపియ్యాలె. తినుడుకు, తాగుడుకు తడిసి మోపెడయితది. ఏం చేసేది? ఇయ్యల్లనే దాని అత్తగారు అచ్చేదున్నది. నేనేం చెప్పేది" జంగుబాయి తల్లి ఏడుస్తూనే.

"జరిగింది జరిగిపోయింది. వాళ్ళకు కూడా మన పిల్ల యిష్టం లేనప్పుడు ఎప్పటికైనా - ఏదన్న సాయం కావాల్నంటే మా వారికి చెప్పుత" ఏదో చెప్పి బయటపడ్డాను.

తరువాత పంచాయితి తతంగం జరిగింది. జంగుబాయి కుటుంబం దండుగ కింద యి మూడు వందల రూపాయలు కట్టవల్సి వచ్చింది.

తరువాత అందరూ తాగారు. తిట్టుకున్నారు.

★ ★ ★

కమల అద్దాలు కుట్టి రవికె తెచ్చి యిచ్చింది. చేతుల మీద కచ్‌వర్కు చేసింది. వెన్ను భాగంలో నెమలి ఆకారంలో నీలం దారాలతో కుట్టి ఈకలకు చిన్న అద్దాలు కుట్టింది.

"ఎంత బాగా కుట్టినవే" కమలని నేను మెచ్చుకున్నాను.

కమల పొంగిపోయింది. పెట్లో నుండి పది రూపాయలు తీసి ఇవ్వబోయాను.

కమల "వద్దు" అంటూ నొచ్చుకున్నది మా ఇంట్లోనే భోజనం పెట్టాను. ఆమాట ఈ మాట చెప్పి జంగుబాయి విషయం వచ్చింది. కమల కప్పటికింకా పెళ్ళి కాలేదు.

"మరి మీ దోస్తు చేసుకున్నది గదా! నీకు ఎక్కడైనా?"నేను.

కమల సిగ్గుపడలేదు... వాళ్ళ గూడేనికి బట్టలు అమ్మడానికి ఎవరో వస్తారట – అతను మా సారు లాగే పైంటు తొడుక్కుంటాడట – అతనికి బోలెడు సంగతులు తెలుసట – ఇట్లా తన ప్రియుని గురించి చెప్పుకొచ్చింది. ఆ మాటల్లో జంగుబాయి కన్నా తనే ఎక్కువ తెలివిగల పనిచేసిన భావం కన్పించింది.

నాకెందుకో ఆ యువకుడు మంచివాడు కాదేమొననిపించింది. కాని అంత ఉత్సాహంగా చెప్పుకపోతున్న ఆ పిల్లకు ఆ మాట చెప్పబుద్ధి కాలేదు.

కమల వెళ్ళిపోయిన తరువాత ఆ యువకుడెలాంటివాడు? కమల అతనితో ఎంత దూరం వెళ్ళిందోనని ఆలోచించాను. నా భ్రమ కాని నా యిష్టాయిష్టాలతో వీళ్ళు పెళ్ళిళ్ళు చేసుకుంటారా?

★ ★ ★

సెలవులొచ్చాయి. మేం వూరికి ప్రయాణమయ్యాము. ఈసారి మా ఇంటాయనే బండి కట్టాడు. ఇంటామె బయటికి వచ్చి ఒకటే ఏడ్వడం. నాకెందుకో కళ్ళలో నీళ్ళు నిండాయి. మేమిద్దరం ఎక్కువసార్లు మాట్లాడుకోనే లేదు. అయినా ఒకరి గురించి ఒకరికి ఎంతో తెలిసినట్టే ఉన్నది. "నిజమేనమ్మా ముట్టయినప్పుడు నా బిడ్డను వానలో బయట ఉంచుడు తప్పే. నా పెద్ద బిడ్డ కొడుకును చంపింది నేనే" అన్నట్టున్నాయి చూపులు.

"నువ్వు మాత్రం ఏం చేస్తావు ఈ అడవిలో ఆడ పుట్టుక పుట్టి ఎన్ని భరించావో?" నా మనసులో ఈ రెండు సంగతులు ఇద్దరికి అర్థమౌతున్నట్టే వున్నాయి.

బండి కదిలింది. ఆడవాళ్ళంతా బయటికొచ్చి దాదాపు సజల నయనాలతో సాగనంపారు.

పెళ్లైన తరువాత జంగుబాయి ఇటుకేసి రానేలేదు. ఆమె భర్తను చూద్దామని ఎంతగానో ఉండేది.

మావారు స్కూలు దగ్గర సామానులు సదిరి వచ్చారు.

బండి ఊరు దాటింది. చాలామంది మాకు వీడ్కోలు చెప్పడానికి ఊరి బయటిదాకా వచ్చారు.

మేం వచ్చేటప్పుడు అనేక భయ సందేహాలతోనే వచ్చాం. అప్పుడు లేని ఆదరణ ఇప్పుడు. వాళ్ళల్లో జంగుబాయి ఆమె భర్త ఉన్నారేమోనని వెతికాను.

బండి ఊరుదాటి మూల మలుపు తిరిగింది.

'అమ్మా' ఎవరో గట్టిగా పిలుస్తూ పరుగెత్తుక రావడం కన్పించింది.

బండాపుమన్నాను. ఆ గొంతు గుర్తు పట్టినట్టే ఉన్నాడు జంగుబాయి తండ్రి - అయిష్టంగానే బండాపాడు.

జంగుబాయి ఆమె వెంట ఒక యువకుడు ఎగపోస్తూ పరుగెత్తుకొచ్చారు.

జంగుబాయి బండినొగల మీద తండ్రిని చూసి గతుక్కుమన్నది.

జంగుబాయి భర్త బలిష్టంగా వున్నాడు. కండలు తిరిగిన శరీరం. కొంచెం చప్పిడి ముక్కు, ఉంగరాల జుట్టు - జుట్టురంగు ఒంటిరంగు కల్సిపోయి ఉన్నాడు. అతని ముఖంలో కళ్ళు మాత్రం నిర్మలంగా ధైర్యంగా మెరుస్తున్నాయి.

"అమ్మా, ఇగో" జంగుబాయి ఏదో ముల్లె తీసి యిచ్చింది.

చారపప్పు. మా వారు జేబులో చెయ్యి పెట్టారు. వద్దన్నది.

వణుకుతూ నికనికలు పడి నా చేతిని తన చేతిలోకి తీసుకున్నది. ఆ స్పర్శ... అది నేను చెప్పజాలని స్పర్శ. ఒక గోండు యువతి స్పర్శ.

నా కళ్ళు నీళ్ళతో నిండాయి.

ఆ యువకుడు నాకేసి ఆత్మీయంగా చూసి చేతులు జోడించి మా వారికి దండం పెట్టాడు.

బండి కదిలింది.

"వద్దు - వద్దు - ఇకచాలు" అంటూనే ఉన్నాం.

వాళ్ళిద్దరూ మావెంట చాలా దూరం ఊరికనే నడిచి వచ్చారు.

వాగు దగ్గర వెనుతిరిగి బోతూ జంగుబాయి ఏదో జ్ఞాపకం వచ్చిన దానిలాగా ఆగింది.

"వీళ్ళు ఇరువై మైళ్ళయినా వెంట వచ్చేలాగున్నారే" మావారు జంగుబాయి ఆమె భర్త ఏదో గుసగుసలాడారు.

"ఏదో చెప్పాలనుకుంటున్నారు. లక్ష్మీ నువ్వు దిగి అయిదు నిమిషాలు మాట్లాడిరా" అన్నారు మా వారు.

నేను దిగి జంగుబాయి దగ్గరికి వచ్చాను.

"అమ్మ కమలకు నెల తప్పింది. వాడు పెండ్లి చేస్కుంటనని మోసం చేసిండు. రాత్రి ఉరిబోసుక సచ్చిపోయింది."

నేను షాక్ తిన్నాను. అందుకే వీళ్ళకు ఆలస్యమైందేమొ?

కలలో నడుస్తున్నట్టు నడిచి బండెక్కాను. నేను ఆ రోజు వేసుకున్న జాకెట్టు కమల పూలు కుట్టిందే.

బండి బయలుదేరింది.

● 1992 ●

# 56. ధోకా

♦ దిలావర్ ♦

'లిల్లాయెలో లల్లాయెలో
శివ తా లిల్లాయె లల్లాయెలో..
వొంకిడినా కత్తిరావాశూలంబు
కాదన్న వారి నోటికి గాలమదేలే
అట్లా బాగిన, దైబము లేదన్న వారంతా
ఆకురాలినట్లు రాల్దురటోయి
శివ తా లిల్లాయె లల్లాయెలో..
జజ్జనక జజ్జనక జనక జనక
జజ్జనక జజ్జనక జనక జనక....

రంగస్థలం మీద మెరుపువేగంతో నాట్యం చేస్తూ నాట్యకత్తెలా గురవడి చేతివేళ్ళు డప్పుమీద దరువేస్తున్నాయి. తరం నుండి తరానికి సంక్రమించిన వృత్తితోబాటు తమ బతుకుల్నిజాలిగా తడుపుతూ ప్రవహిస్తున్న పాట గురవడి నోటపరవళ్ళు తొక్కుతున్నది.

మిగిలిన వాళ్ళు గురవడ్ని అనుసరిస్తున్నారు.

గర్రున తేన్చుకుంటూ, ఓచేత్తో బొర్ర సవరించుకుంటూ మరో చేత్తో మీసాలు దువ్వుకుంటూ దర్పంగా బయటికొచ్చాడు ధర్మయ్య. దరహాసం చేసుకుంటూ కుర్చీలో కాలుమీద కాలువేసుకుని కూచున్నాడు.

పాట సాగుతూనే ఉన్నది. డప్పులు మోగుతూనే వున్నాయి.

'అంబా' అంటూ లేగదూడను చూసి పిల్లలు కోడి బెదిరి రెక్కల నిక్కబొడుచుకుని దూడమీదకి ఎగబడ్డది. పక్కనే ఉన్న కుక్క గుర్రుమంటూ కోడివైపు కోపంగా చూసింది.

'ఒరేయ! దూడనిగట్టేయిండ్రి' ధర్మయ్య గద్దించాడు.

తిక్కటి వొడుకుతున్న జీతగాడు జనపనార, తిక్కటి పక్కనబెట్టి దూడను తోలుకుపోయాడు.

'అరేయ్.. గట్లనె...గీల్లకు కుంచెడు వడ్లు కొల్వుండ్రి' పురమాయించాడు ధర్మయ్య.

పాటా, దరువూ ఆగాయి.

కుంచెడు ఏం సాలై కాల్మొక్త...కుండెడు గావాల్సాట కుండెడు...'

గొణిగాడు ధర్మయ్య.

'గట్లనకుండ్రి.. కాల్మొక్తం...' బతిమాలుకున్నాడు గురవడు

జిడ్డులా పట్టుకున్న గురవడు తనను విడిచిపెట్టడని గ్రహించాడు ధర్మయ్య.

'అరేయ్...కుండెడు కొల్వుండ్రి...' అయిష్టంగానే అన్నాడు

వడ్లు మూట గట్టుకొని గురవడూ అతని అనుచరులూ బయటపడ్డారు.

★ ★ ★

'అయ్‌మోమినో, సునో, ఏ కరామత్ నమాజ్‌కీ...

జన్నత్‌మె లేకే జాయెగీ ఆదత్ నమాజ్‌కీ...

అల్లాహ్ కా రసూల్ కా ఫరమాన్ అమ్ హై..

ఇస్ నామ్ మే నమాజ్ కా పహలా మకామ్.. హై....'

పాట ఆర్తిగా ఆధ్యాత్మికతను మోసుకపోతున్నది. ఆకలికి పొట్టలోని పేగులు నాట్యం చేసినట్టు దప్లీమీద పీరుసాబు చేతివేళ్లు యాంత్రికంగా కదులుతున్నాయి. గొంతునరాలు పొంగించి పెద్దగా పాడుతున్నాడు పీరుసాబు.

మీసాలు గొరిగిన పెదాలమీద నిటారుగా ముక్కు, గుబురుగా అల్లుకున్న గడ్డం. లోపలికి పీక్కుపోయిన సుర్మాకళ్ళు దట్టంగా పెరిగిన కనుబొమలు, నెత్తిమీద జాలీటోపీ, ఎగేసి కట్టిన మాసిన గళ్ళలుంగీ, చిరుగులు పట్టిన పాతచొక్కా వీపుమీంచి ముందుకు కట్టుకున్న ఎర్రంచు ఆకుపచ్చని జండాగుడ్డ. భుజానికి తగిలించుకున్న దప్లీతో దర్శన మిస్తాడు పీరుసాబు.

'అల్లాకె నామ్ పె ...ఖైరాత్ కరో బాబా...' పాట ఆపి ఓ బడ్డీ కొట్టు ఆసామిని అర్థించాడు పీర్‌సాబ్.

పావలాకాసు గిరాటు వేశాడు ఆసామి.

'చారానాకు ఇయ్యాల రేపు ఏం వస్తాది సేటూ...' అన్నాడు పీర్‌సాబ్.

"ఆc...వందలకు వందలు దానం చెయ్యమంటావా?' ఆసామి.

'గట్లంటె.. మేమెట్ల బతకాలె...సలాం జేస్త సేటూ...' ప్రాధేయపడుతూ అన్నాడు పీర్‌సాబు.

'అబ్బ... పెతోడు పీక్కు తినుడే...' విసుక్కుంటూ అర్ధరూపాయి బిళ్ళ వేశాడు బడ్డీ కొట్టు ఆసామి.

పీరుసాబు కదిలాడు.

టీకొట్టు, పాన్‌షాపు చిన్నచిన్న దుకాణాలు తిరుగుతూ, సాయంత్రం వరకూ ఇరవై రూపాయలు సంపాదించాడు పీరుసాబు.

ఇరవై రూపాయల్లో బియ్యమేం కొనాలో, నూనె, చింతపండు, ఉప్పు పప్పూ ఎలా కొనాలో. ఎటూ తోచడం లేదు పీరుసాబుకు.

ఆలోచిస్తూ నడుస్తూన్న పీరుసాబుకు గురవడూ అతని అనుచరులూ ఎదురయ్యారు. పంచుకోగా వచ్చిన తలాకాసిన్ని వడ్లతో ఏం చేయాలో వాళ్ళకు తోచడం లేదు.

పల్లేకాని, పూర్తిగా పట్నమూ కాని ఆ వూరిలో పీరుసాబూ, గురవడు లాంటి వాళ్ళ బతుకులు రోజుకో గండంలా సాగుతున్నాయి.

★ ★ ★

పీరుసాబు, గురవడూ రచ్చబండ కాడ కలుసుకున్నారు. కలసినప్పుడల్లా కష్టాలు, సుఖాలు కలబోసుకోవడం పరిపాటి.

'ఏం పీరుసాబూ! ఎట్ల వుంది కాలం...?' ప్రశ్నించాడు గురవడు.

'ఏంకాలం భయ్! మండిపోతంది... జర వూపిరి పీల్చుకునేటందుకు భీ మోఖా లేదు...' నిస్పృహగా అన్నాడు పీరుసాబు.

'రహీం.. పరీచ్చ లెట్లరాసిండట . ?' అడిగాడు గురవడు.

రహీం పీర్‌సాబ్ పెద్దకొడుకు...ఇంటర్ పరీక్షలు రాశాడు.

'ఏం పరీక్షలో భయ్... ప్యానం తీసిండు. టర్ము ఫీజులని. పరీక్ష ఫీజులని.. కట్టలేక బేజారయిన... తిననికే లేదంటె... వీడొకడు... సరేగని... నీ కొడుకు రాములు ఎట్ల రాసిండు. .' అడిగాడు పీరు సాము.

'నా పని సుత అంతంత మాత్రమే. యింక నయం. సర్కారు మాకు ఫీజు మాపి జేసింది. కాలరుషిప్పులో ఏందో వస్తయ్‌గద.. జర నయమనుకో... లేకుంటే యింకా దరిద్రం గుండెడ్డి...' అన్నాడు గురవడు.

పీరుసాబు ఆలోచనలో పడ్డాడు...!

'పీరుసాబూ....రాత్రికి పీర్లగుండం కాడికిరా....అలావా తొక్కుదాం... గీ పరేశాన్లు ఎప్పుడుండేటియే... రా మల్లా...' అంటూ వెళ్ళిపోయాడు గురవడు.

'ఆ..ఆ..ఆ..' ఆలోచనల్లో నుంచి తేరుకున్నాడు పీరుసాబు.

రాత్రి వూళ్ళోని అలగా జనమంతా పీర్లచావిడి దగ్గరికిచేరుకున్నారు.

చావిడలో పీర్లను అలంకరించి నుంచోబెట్టారు. చావిడి ముందు పీర్లగుండంలో నిప్పులు కణకణమండుతున్నాయి. గుండం చుట్టూ చేతులు చేతులు కలిపి కష్టజీవులంతా అలావా తొక్కుతున్నారు. కలిగినోళ్ళు దర్పంగా నిలబడి చోద్యం చూసినట్టు చూస్తున్నారు.

వూరిమాదిగోళ్ళు గుండంచుట్టూ తిరుగుతూ లయబద్ధంగా డప్పులు వాయిస్తున్నారు

పీరుసాబుగొంతు సవరించుకున్నాడు.

'అస్సోయ్.. దూలా.... హుస్సేన్ హుస్సేన్..'

'అస్సోయ్.. దూలా.... హుస్సేన్ హుస్సేన్.. ' కోరస్ అందుకున్నారు.

అమ్మా బీబీ ఫాతిమ లాల

మూడు పుట్ల ఊదుండెర కొడకా....

అమ్మా బీబీ ఫాతిమ లాల...' పీరు సాబ్ పాడుతుంటే మిగతావాళ్లు వంత పాడుతున్నారు.

డప్పులు జోరందుకున్నాయి. అలావా తొక్కేవాళ్ళ అడుగులు లయబద్ధంగా పడుతున్నాయి. పీరుసాబు పాటవెంట పాట అలుపెరగకుండా పాడుతున్నాడు. డప్పులు పీరుసాబు పాటతో పోటీ పడుతున్నాయి.

అలావా చుట్టూ ఉత్సాహం ఉప్పెనలా ఎగిసిపడుతున్నది. కొందరు విచిత్ర వేషాలు కట్టి జనాన్ని హుషారెక్కిస్తున్నారు. మంగలి వెంకటేశానికి ఉగ్రమొచ్చి నిప్పుల గుండంలోకి దూకాడు. జనమంతా హాహాకారాలు చేస్తూ గుండెలు బాదుకున్నారు.

గొడ్రాలు చాకలి సుబ్బి వచ్చి సంతు బట్టింది. పీరీని ఎత్తుకున్న చాంద్‌మియా సుబ్బి ఒడిలోకి పీరీని వంచి దులపరించాడు. పీరి మెడలోని సెహరాలోంచి పూలురాలి సుబ్బి ఒడిలో పడ్డాయి.

'ఎంత సెత్తం... ఎంత సత్తెం' అంటూ జనాలు ఆశ్చర్యపోయారు.

సుబ్బికి సంతానం కలిగినంత సంబరంతో ఉబ్బితబ్బిబ్బైంది.

ఆ సంబరం అలా కొనసాగుతూనే ఉన్నది..

★ ★ ★

నిలువునా కోసిన ఎద్దు దణ్ణెంలోంచి ఎర్రటి గుండెకాయ బయటపడినట్టు ఆకాశాన్ని చీల్చుకొని సూర్యుడు బయటపడ్డాడు.

గొడ్డును పడేస్తున్నారన్న వార్త క్షణంలో గూడెమంతా పాకింది.

మాదిగోళ్ళు, తురకోళ్ళు బెల్లం చుట్టూ ఈగల్లా గొడ్డు చుట్టూ మూగారు.

ఆవు ముంచరికాళ్ళకు, వెనక కాళ్ళకు బంధమేసి పడేశారు.

పీరు సాబు హలాల్‌నామా చదివి జుబా చేశాడు.

వాల్సేసి తునకలు దిన్నంత సంబురపడుతున్నారు పోరగాళ్ళు. దణ్ణెం చీల్చి పేగులూ, గలీజూ తీసేశారు. ముక్కలు నరికి పోగులు పెట్టారు.

హలాల్ చేసినందుకు పీరు సాబుకు గుండెకాయ ముట్టింది.

'గొడ్డుమాంసం తినే మాదిగ, తురకముండా కొడుకులకు పండగ యియ్యాల...' అనుకుంటూ వెళుతున్నారు ఆ దృశ్యం చూసిన అగ్రవర్ణాల వారు కొందరు.

"తున్కలు ఎండేస్కోవాల.. నాకు రెండు పోగులెత్తు గురువన్న..." అన్నాడు పీరు సాబు. చవగ్గా వచ్చే సరుకు. పిల్లలు కడుపునిండా తింటారని అతని ఆశ.

'గట్లనె..' అని రెండు పోగు లెత్తాడు గురవడు.

'అయ్యా'

అంతా అటువైపు చూశారు. గురవని కొడుకు రాములు.

"అయ్యా. . నాకు ఉద్యోగం వచ్చింది నేన్నెప్పలా....? బ్యాక్‌లాగ్ పోస్టులని.. మన కులపోల్లతో వాటిని భర్తీ చేస్తున్నారు. అందుల్లో నాక్కూడా ఉద్యోగం వచ్చింది. జాయిన్ కావడానికి వెళ్తున్నా..." చేతిలో సర్టిఫికెట్లు పట్టుకొని దర్జాగా దొరబాబులా తయారై వచ్చిన రాములు పట్టరాని సంతోషంతో చెప్తున్నాడు.

పీరు సాబు గుండె గొంతులో కొట్టుకుంటున్నది.

తను, గురవడూ, ఒక్కలాగే అడుక్కు తింటున్నాం. ఒక్కలాగే బతుకుతున్నాం... కష్టాలూ... కన్నీళ్ళూ, సంబరాలు, అలవాట్లూ అన్నీ... అన్నీ... ఒక్కలాగే ఉన్నాయి. కానీ తమకెక్కడో అన్యాయం జరిగిపోయింది.

తన ఒంట్లోని రక్తాన్నంతా ఎవరో తోడుతున్నట్టనిపించింది పీరు సాబుకు.

నిర్జీవంగా కదిలాడు పీరుసాబు.

'అయ్ మోమినో, సునో, ఏ కరామత్ నమాజ్‌కీ

జన్నత్‌మే లేకే జాయెగీ ఆదత్ నమాజ్‌కీ...

దూరం నుండి అలలు అలలుగా తేలి వస్తున్నది పాట.

తేరిపార అటువైపు చూశాడు పీరుసాబు.

డప్లీ భుజానికి తగిలించుకొని గొంతెత్తి పాడుతూ వస్తున్నాడు రహీం.

● 1993 ●

# 57. ముసల్దాని ముల్లె

♦ ఆడెపు లక్ష్మీపతి ♦

"వో నాయినా ... మన సందుగ, ముల్లెలు అన్నీ ఎక్కిచ్చినవా....?"

"ఆఁ...అన్నిచ్చినయ్... సందుగ అవ్వ దగ్గరుండాలె సూడు. . నువ్వున్న కాణ్ణె మీద పెట్టు."

"అయ్యా, జరంత పక్కకు జరుగు. నన్ను గట్ల పోనీయి - రాయే పోరీ దబ దబ..."

"ఏందవ్వా - గుమ్మటం తీర్గ తొవ్వల నిలబడ్డవ్. లోపట్కి పోయెటోళ్ళను పోనీయవూ?"

"ఇగో... మంచిగ మాట్లాడూ... ఇంకెటు బోవాలె? ఆడ మొగోళ్ళున్నరు కనబడ్తలేదా...?"

"వారీ... విశ్వనాతమూ... శెల్లె శెయ్యి పట్టుకో ... ఛత్రి బద్రం సుమా..."

"అయ్యయ్యో... ఏంకలీగం... మీ యిండ్లు పాడుగాను .. బుట్టసూసుకుంటనే తొక్కుకుంట నడుత్తాండ్రు ... పలారాలు, సద్దిబువ్వ మైలపడిపోవట్టె.. "

"గంత నీటుకమైతె ఎట్లనమ్మో ... బస్సు టాపుమీన ఎయ్యకపోయినవ్ ... లేకుంటే బతుకమ్మ శిబ్బినెత్తుకున్నట్టు నీ నెత్తిమీద పెట్టుకోసుంచుకో... ముట్టుడు కాకుంట ఉంటది నీ బోనం కుండ..."

"మారాజువు మంచిగనె మాట్లాడుతవ్... మీ సామాన్లన్నీ మీదనే యేశినవా...? జర సూసుకుంట నడువుండ్రంటె ఏందేందో మాట్లాడబడ్తివి..."

"ఈడ మనుషులు నిలబడేందుకె జాగలేదంటే నువ్వేందో బుట్ట అనొగ్రుతానవ్ గా పక్కకు సీటు కిందికి దొబ్బు నీ సద్దిమూటను."

"దొరా... మీ సీటు మీద గీ సంటోన్ని కూకుంట బెట్టుకుంటవా...?"

"ఎహెఁ... ఈడ మాకె ఇర్కుటంగున్నది. బస్సు కదిలినంక సూద్దామాగు..."

"ఏందయ్యా... నీ సుట్టకంపు రుమాలు ... నువ్వూ... వో పటేలా... నిన్నే.. గా కట్టె కింద పండబెట్టు... మాకండ్లు పోగొడ్తవా ఏంది..."

"అయ్యా బాంచను... కాళ్ళు జరంత గటు జరుపు. గొంగడి కిందేసుకుని కూకుంట."

"అరే.... హుస్సేన్. పీఛె కా సీట్ ఖాళీ హైక్యా ...?

"జీ నహీం.. మై ఖుద్ ఖడాహుం .."

"అగ్గొ.. మంచిగనె ఉన్నది యవ్వారం... ఈ సీటు నేనాపిన. సంచి పెట్టిన. లేలే .."

"టికెట్. . టికెట్... ఏ బీడీ తాగే సారూ... బీడి ముక్క అవతల పారేసి జల్దిన పైసల్దీయ్ ఏడికి బోవాలె...?"

"యేములాడకు... మూడు ఫుల్..."

"వంద రూపాయలనోటా...? శిన్ననోటే యిచ్చినవ్. అయిదువందల రూపాయల నోటు ఇయ్యక పోయినావ్... ఆం... ఎవ్వలెవ్వలు జెప్పు. ఈ పిలగాడు ఎవ్వల కొడుకు...?"

"మా సంటోడే... నా కొడుకు..."

"ఈ పిలగాన్కి గూడ టికెట్టు తగుల్తది. హాఫ్ టికెట్..."

"గింత శిన్న సంటోనికి టికెట్టేందయ్యా... నాలుగేండ్లు నిండలేదింకా..."

"సంకకెత్తుకొని పాల్జీకుతాండు అన్నా ఊకోను... ముంగట చెకింగయితది. నువ్వూ నేను ఇద్దరం లోపట్కి అయితం. ఇగ తీస్కో టికెట్లు... మూడు ఫుల్ ఒక హాఫ్. మిగిలిన పైసలు దిగేటప్పుడు తీస్కో.. ఆం...టికెట్లు ఇంకా..."

"నాంపెల్లికి రెండు .. "

"ఇగపట్టు... మంచిగ చేతులో పట్టుకో... గాలికెగిరిపోతయి... లోపట్కి పో... ఓం యెనుకున్న పెద్ద మనుసులూ... వో పచ్చంగి పిలగా... అన్నా... వో కద్దరు కమీజూ.. లోపలికి నడువుండ్రి... వో దుబాయి బనీనూ... నీకే... అర్రె లోపట్కి పోండ్రివయ్యా అంటే మీ క్కాదా... అటు దొబ్బుకపో... ఊం... గట్లు... ఆం... మీది సార్ ఏక్కడికి...?"

"... మక్కకంకులు... లేత మక్కకంకులు... లేత కంకులు... గరం గరం కంకి... రూపాయి కొక్కటి..."

"...వోం మనిషీ... ఇగగా సారాకొట్టులోనే కూకుంటవా... నీ బొందపెట్ట. నీ తాగుడు పాడుగానూ... వో గొండ్లోల్లన్నా ... ఇగ సాలు పొయ్యకు..."

"ఎహెం... ఆడిదానా... ఏం వదుర్తానవ్. ఇంక పొద్దుగూకలె... బస్సు కదుల్త లేదు.. "

"...బస్సులు నిండి పోయినై... ముంగటి బస్సు కదుల్తాంది... పోరగండ్లు సలికి వొనుకు తాండ్రు. ఇంక అక్కణ్నెసత్తవా...ఊళ్లళ్ల, వాడలల్ల కల్లు దుకాండ్లు, సారా కొట్టులు... మా సంపాదనంత మీరే జుర్రుకోబడితిరి. ఇక్కడ గీసలిల, వానల వాగొడ్డున గూడ మమ్ముల పీక్కుతినుడేనా... ఈడ సార దుకాండ్లు పెట్టకపోతేనేం... మీ ఇండ్లల్ల పీనుగులెల్ల..."

"...మేం బలిమీటికి పోత్తానమా... ఉద్దెర ఇత్తానమా... నీ బంగారం మంచిదిగాక మమ్ముల తిడతానవేందమ్మో... ఏయ్ ఇక పోవయ్యా.. నీ పెండ్లం వొర్రుతాంది..."

"...వో అన్నలారా... ఎక్కడున్నరో... మీరు మెరుపోలె రాబడితిరి, పోబడితిరి... మా గోసలు గిట్లనె ఉండె..."

"...సాబాసుపల్లి... సంకెపల్లి... నాంపల్లి... శాంతీనగర్... వేములవాడ... అగ్రహారం... సిరిసిల్ల... జప్పన ఎక్కుండ్రి - ఆల్మం జెయ్యక... ఇగ బస్సు కదుల్తది... వో అన్న ఏడికి...? ఎంతమంది?... సర్వీసు ఎక్కుండ్రి... ఊహూ... ఒక్క నిముషం గూడ ఆగుడులేదు. మీరు ఎక్కుడే ఆల్మం . సర్కారు బస్సుకన్న ముంగటపోతది... ఛార్జీ తక్కువ..."

"హలాల్ జేసిన కోడిపెట్టోలె వొర్రుతాండు ఆ కిలీండరుగాడు... ఇంక ఎంతమందిని ఎక్కిస్తడో అరగంటాయె... ఇక ఉర్కుతది అంటాడు కాని గట్లనే ఉంటాంది."

"మన బస్సుల మాత్రం తక్కువమందున్నారా... ఇంకా ఎక్కనెబట్టిరి... ఈ జనం... ఇంకో రొండు బస్సులచ్చినా సరిపోవు..."

"కండట్టరు సారూ... ఇగ రైట్ జెప్పరాదు... ఆవల మొగులు మూసుకత్తాంది మళ్ళా"

"హన్నా.. నువ్వెక్కి కూకోంగనే బయ్యిమని ఉర్కాల్నా...? ముంగట మందున్నరు. ఇకయిదు నిముసాలాగాలె..."

"గీ ముసురు కగ్గి తలుగ... ఎంత కట్టమచ్చె... కోత కచ్చిన పొలాలు, పొట్టమీదున్న నారు మునిగిపోయె... అంతటా బురద ఇసుక మేటయేసిపాయె... ఇగ ఈ యేడు ఏం తింటం? బువ్వ దొర్కుతదా...?"

"అగో... గా గుట్టకింది ఊళ్ళు సూడు. ఇండ్లు ఇండ్ల తీర్గలెవ్వు. సచ్చిన గొడ్లు వరదలల్ల కొట్టుకపోతానై. ఏటి వొడ్డున చేండ్లు, పొలాలు అగుపడ్తలేవు, అబ్బ... ఈదరగాలి పాడుగానూ, యమకొరుకుతాంది... తాడిచెట్లు యియ్యరమయ్యర ఊగుతానయ్. కరంటు తంబాలు నేలమీదికొరుగుతానయ్..."

"ఇగో నిన్నె...వాల్లేందో మంచి ముచ్చట మాట్లాడుతాంటె నువ్వేందో కునికిపాట్లు పడతవు... రాజవ్వ ఇల్లు చెర్వు కిందనె ఉన్నది ఎట్లున్నదో కూడూ, కొంపా.. ఈ ముసురు ఎన్నొద్దులుంటదోగా సదూకున్నసారు నడుగు...."

"వాయుగుండం తీరందాటి పోయి, బంగ్లాదేశ్‌వేపు మళ్లింది. క్రమంగా తెరిపి నిస్తుంది. ఈ రోజు చెదురుమదురుగా జల్లు లేదా ఓ మోస్తరు వర్షాలు కురవవచ్చు" అని వాతావరణ సూచన రేడియోలో...

"రైట్... రైట్... డోరేసుకొండయ్యా... గట్టిగ... తాకతులేనట్టు..."

"గేర్లపడింది... మళ్లాపిండు డ్రైవరు..."

"ఏమైంది... భాదర్ భయ్యా... రైట్..."

"ఎవతో ముసల్ది... పగ్గేబుడ్డి... అడ్డమచ్చింది... బస్సెక్కుతదట..."

"అయ్యా బాంచన్... పండు ముసల్దాన్ని... నన్ను జరంత ఎక్కనీయి. గీ మూటలు గటుతొయ్యి బిడ్డ..."

"ఇప్పటిదాంక ఏం జేశినవ్... బస్సు కదిలె మోపుకు ఉరికత్తానవ్... ముంగటి బస్సుల ఎక్కక పోయినవ్..."

ఆకలేందుకు వేయడుతుడు... బస్సు [illegible] అక్కణ్ణించి నిరిసిల్లకు మస్తు బస్సులుంటయిట... నాకు చెల్లాటట... నాని మొకం కగ్గి తలుగ... ముందుగాల నిరిసిల్ల దాంకపోతదని చెప్పిండు..."

"సరె... సరె... జల్దిన లోపల్కిపా... గా ముల్లెలు... ఎన్నో... తాను దూంసంత లేదు మెడకోడోలు అన్నట్టుంది... ముల్లెలు సీటు కిందికి దొబ్బి... ఎవ్వలో కాళ్లకాడనన్న కూకోపో..."

"ఆగోసూడు... ఇంకిద్దరు ఎక్కిండ్రు... కళ్లద్దాలసారు... వెనుక పెద్ద సూటుకేసాయన... ఆ సూటుకేసు ఏడబెడ్తడో... ఏడ నిల్సుంటడో..."

"సాయికుమార్ సార్... హల్లో... ఇట్ల రండి... ఇక్కడ కూర్చుందురుగానీ..."

"ఎవ్వరు... హోహ్... వేణుగోపాల్ నువ్వా... సంతోషం... ఎడారిలో ఒయాసిస్సు లాగా అబ్బ... ఏం ప్రయాణమో ఏమో... చాలా అవస్థలు పడ్డాను. మూడు గంటల నుండి కూర్చునే విరామం దొరకలేదంటె నమ్ము... జనం [illegible] కదుల్తోందా బస్సు ... సంతగోల... [illegible] పరిస్థితి... నేనిక్కడ కూర్చుంటాను... [illegible] అవుదాం... ఈయన సుందర్రాజుగారు... [illegible] పవర్ స్టేషనులో ఇంజనీరుట... సిరిసిల్లకు వస్తున్నారు.. [illegible]

"నేను ఇవతలి వొడ్డెక్కినంక చూసిన. మీరు [illegible] దాటించేవాడి సహాయంతో నడుచుకుంట వస్తున్నారు. సరిగ్గ [illegible] లేకుంటె మీరొచ్చెదాంక వొడ్డు మీద ఆగెటోడిని. ప్రసాద్... పోషను కాళ్ళమీదికి తీస్కొని... ఆ సార్‌ను కూర్చోనీయ్. స్మాల్ అడ్జస్టుమెంటు. ప్రసాద్ నా కొలీగ్. హార్డు వర్కర్... జీనియస్. గ్రూప్ వన్ మెయిన్ పేపరు పాసయ్యాడు. పింకి అపర్ణ కూతురు. కాలేజీలో ఆమె మా జూనియర్... అదుగో ఆమె ముందు వరునలో కూర్చున్నది..."

"...ఒకని గిరాకీ మరోడు గుంజుకోవద్దు. మనం మనం లొల్లి పెట్టుకోవద్దు. ఇగసాల. ఆకరి బస్సు ఇంకోటత్తదేమో... అదొక్కటె సూద్దాం పొదుగూకినంక ఏట్లెకు దిగద్దు..."

"ఊల్లె ఎండుపుల్ల దొర్కుతలేదు. ఇయ్యాల్టి కట్టానికి ఈ ముప్పయి రూపాల్ సాలు..."

"అగో ఆకరి బస్సు కొదురుపాక వొడ్డుకచ్చింది... నువ్వు జెప్పన అటుపో. మైసన్నకు జెప్పు. ఒకనిదొకడు గిరాకీ గుంజుకోవద్దని... ఇగ గట్టివాన కొట్టెట్టు లేదు. నీళ్ళు బాగ గుంజినయ్. మన వొడ్డు దాటిచ్చె కూలీ ఈ రోజుతో ఆకరు. రేపు జనం మన అవుసరం అడుగరు. వాళ్లే ఏరు దాటుతరు..."

"...రాయమల్లి బాలింత... వాడు సమ్మయ్య ఇంక ఈడనె ఉన్నాడా... ఎన్ని ట్రిప్పులు కొట్టిండో... వాని కాలుకు నెత్తురు కార్తాందా... నీర్నాగుంబాము గిట్ల కరిసిందా... ఆఁ... ఇంగిలీకం ముల్లు కుట్టిందా... ఏందీ... ఇప్పుడు మంచిగనె ఉన్నడు గద..."

"... మనిషికి మూడు రూపాలకంటె తక్కువ ఒప్పుకోవద్దని జెప్పిన. లగేజి వుంటె ఇంకో రొండు రూపాల్. కక్కుర్తి గాడిద కొడుకులు. వాడు యలమంద రూపాయికె ఉర్కిండు. వాగుల అటురికి ఇటురుకి నెరిపడ్డడు. అయితేంది యాభయి రూపాయల దాకా సంపాయించిండు..."

"...రోడ్డు డ్యాం మరమతు ఎల్లుండి మొదలయితదా... అయితె మానె... ఆ కూలీ మనకు కాకపోతె ఇంకెటు పోతది... ఎహె... ఊకె జగడం పెట్టుకోకుండ్రి... ఒకనికి అయిదెక్కువ మరోనికి అయిత్తక్కువ... ఏందీ... గడ్డీ సొప్పా... అని ఉన్న గొడ్ల గురించి సోచాయించకు. జప్పన షావుకారి దగ్గర్కి పా... ఎచ్చాలు కొనుక్కోవాలె..."

"ఈ కూలీలు వాగు... దాటించె తెనుగోళ్లపని బాగుంది. . ఈ వంతెన ప్రతియేడూ కూలిపోవాలనీ, తుఫాన్లు - వరదలు ముమ్మరంగా సంభవించాలనీ దేవుడ్ని వేడుకొంటారు కాబోలు... ఆహా... బస్సు కదిలినాక ప్రెష్ గాలి వీస్తోంది. ఏం రొచ్చు వాసన, ఏం నీచు కంపు... ఈ ప్రాంతంలో రోడ్ల స్థితిగతులు, బస్సుల పనితీరు ఇంత అధ్వాన్నంగా ఉందేమిటి? మామూలు సందర్భాల్లోనైనా బస్సులు సజావుగా ఉంటాయా... లేక క్రిక్కిరిసిన రద్దీతో చేపల మార్కెట్టులా ఇలాగే ఉంటాయా...?"

"కష్టజీవుల గురించి అంత సినికల్‌గా మాట్లాడకండి సార్... స్థిరమైన ఆదాయం లేని గ్రామీణ పేదవర్గాల బతుకులు ప్రకృతి వైపరీత్యాల మూలంగా చాలా అస్తవ్యస్త మవుతాయి. సీజనల్ వృత్తిగా దేన్నయినా వాళ్ళు చేపడతారు. పొట్ట పోసుకోవడానికి. ఏరు దాటడం మన అవసరం. దాటించినందుకు వాళ్ళు శ్రమకు మూల్యం అడగడంలో తప్పేమిటి? ఇక మీరన్న ప్రాంతాల అసమాభివృద్ధి. కొన్ని ప్రాంతాల కంటె మరికొన్ని ప్రాంతాలు, ఒక రాష్ట్రం కంటె మరో రాష్ట్రం బాగా వెనుకబడి వుండవచ్చు... అసలు మన దేశమే వెనుకబడ్డ అభివృద్ధి చెందుతున్న దేశం... అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటె మనం శాస్త్ర సాంకేతికంగా సాంస్కృతికంగా కనీసం యాభయి ఏళ్ళు వెనకబడిపోయాం. సో... ఇప్పుడు మీరు దేన్ని చూసి వాపోతున్నారో - ఆ స్థితి - జనరల్‌గా భారతదేశ ఆర్థిక, సామాజిక పరిస్థితి...?"

"మీ భాష బాగున్నది... సాయికుమార్ గారిది ఇంకా బాగుంది... ఈ ప్రాంతపు మాండలికం యాసలేకుండా స్పష్టంగా వుంది. మీలాంటి విద్యావంతుల, సాహితీవేత్తల, మేధావుల పరిచయం కల్గి కంపినీ దొరికినందుకు చాలా సంతోషం..."

"మా సాయికుమార్ మాస్టారు పేరున్న రచయిత... శుద్ధ గ్రాంథికం, వ్యావహారికం, అన్ని ప్రాంతాల మాండలికాలు అవలీలగా రాస్తారు.... అనర్గళంగా మాట్లాడతారు. సాహితీ సదస్సులోకి ప్రత్యేకించి మేస్టారి ఉపన్యాసాల కోసమే వెళ్ళేవాడిని... ఆయన రచనలు చదవండి... తెలుస్తుంది..."

'ఆఁ... ఆఁ... సార్ గురించి విన్నాను. పేపర్లలో చూశాను. కాని ఆయన రచనలు చదివే భాగ్యం కలగలేదు... మీ తెలంగాణా కథల్లో, రచనల్లో ఎక్కువ మాండలికం వాడతారు... ఎరికేనా, మాయిల్యమే, జెప్పన, యిగ్గుడు, గుంజుడు, నూకుడు, మందలిచ్చుడు - లాంటి పదాలు మాబోటి కోస్తాంధ్రా వాళ్ళకు అర్థమయి

చావవు. ఈ పదప్రయోగాలున్న రచనలు చదవాలంటే ఏదో పరభాషా పుస్తకం చదువుతున్నంత ఇబ్బంది ఫీలవుతాను. ఈ మధ్య సినిమాల్లో, టీవీ సీరియళ్లలో ఈ మాండలికాన్ని విరివిగా వాడుతున్నారు... గమ్మత్తయిన కొన్ని పదాల అర్థాలు నా భార్య నన్నడుగుతుంది... నాకే తెలీదు నేనేం జెప్పను.. "

"తెలుగు గడ్డమీది చాలామంది ప్రముఖ రచయితలు, సాహితీకారులు ఆయా ప్రాంతాలలోని మాండలికాలను తమ రచనల్లో విరివిగా వాడారు. గిడుగు, గురజాడ, రావిశాస్త్రి, ఇంకొందరు రాయలసీమ రచయితలు· ఒకానొక రకమైన ప్రిజుడిస్ మూలంగానో ఏమో - నేటి పండితులు కొందరు తెలంగాణా యాస వినడానికింపుగా ఉండదంటారు. ఈ ధోరణి కావాలని ఒక ప్రాంతీయ భాషా సంస్కృతిని కించపరచడ మన్నట్టె... కొందరి దృష్టిలో ఈ యాస కేవలం వినోదం కోసమే - విని, మాట్లాడుకుని అనుకరించి నవ్వుకోవడం కోసమే... ఈ మధ్య సినిమాల్లో టీవీల్లో - మీరన్నట్టు ఈ మాండలికాన్ని కృతకంగా వాడి మరీ వికృతం చేస్తున్నారు. మీరు ఓపెన్ మైండెడ్‌గా గమనిస్తే ఈ మాండలికంలోనూ, మిగతా మాండలికాల్లో లాగానే చక్కటి నుడికారం, జాతీయ పదబంధాలు, సజీవత కనుక్కోగలుగుతారు..."

మీరు బాగా చెప్పారు. నేను ఊరికెనే నా అభిప్రాయం వెలిబుచ్చాను. నాకేమీ ప్రెజుడీస్ లేదు సుమా... ఇకముందు· వీలు చూసుకుని మీ కథలు తప్పక చదువుతా."

"సాయికుమార్ సార్... ఏమిటి విశేషం...మీ టూర్లు ఎక్కువగా హైదరాబాదు, లేదా మద్రాసు వేపు ఉంటాయి కద! ఈ తుఫాను హోరులో ఇటువైపు... సిరిసిల్ల వేపు... బయలుదేరారేమిటి? అర్జంటుపని అయివుంటది..."

"ఔనోయి, వేణూ, ఇప్పుడు రిలీఫ్‌గా ఉందయ్యా... థ్యాంక్స్... అనుకోని ప్రయాణం అర్జంటుగా తగిలింది. సిరిసిల్లకు సాబాసుపల్లి మీది రోడ్డు డ్యాం రాత్రి వరదకు కొట్టుకు పోయిందని కరీంనగర్ బస్టాండులోనే తెల్సుకున్న. బోయినపల్లి మీదికెళ్లి వేములవాడ వైపుగా వద్దామనుకున్న కానీ, ఆ రోడ్డూ - ఏదో బురద కాలువలోనో పొలాల్లోనో కూరుకుపోయినందువల్ల ఆ రూట్ జామ్ అయిందట, బస్సులు నడుస్తలెవ్వట. ఇక ఏం చెయ్యాలో అర్థంకాలేదు. గంటాగినాక కంట్రోలర్ నడిగితే చెప్పాడు... వాగుమీద వరద తగ్గిందనీ, పడికట్టు రాళ్ళు తేలినాయనీ, నది దాటించే తెనుగోళ్ళ సాయంతో ప్రయాణీకులు ఆ వొడ్డుకూ, ఈ వొడ్డుకూ నడుస్తున్నారనీ... అలా మెరుగయిన పరిస్థితుల దృష్ట్యా తమ డిపో బస్సులను కొదురుపాక వొడ్డువరకు నడుస్తాయనీ, సాబాసుపల్లి వొడ్డు నుంచి సిరిసిల్ల లేదా కామారెడ్డి డిపో బస్సులు నడుస్తాయనీ డిపో మేనేజర్ చెప్పాడు. ఎటువంటి ఒడిదుడుకులయినా ఎదుర్కొని గమ్యం చేరుకోవడం ముఖ్యం అనుకొని రడీగా ఉన్న బస్సెక్కేశాను..."

"ఇలాంటి పరిస్థితి మీకెప్పుడూ ఎదురై వుండదు. పొంగి పొరలే వాగు దాటడం..."

"ఔను ఇదో విచిత్రమైన అనుభవం. నన్ను వాగు దాటించినవాడు నల్లగా, మొరటుగా హెర్క్యులస్‌లాగా వున్నాడు. నా బ్యాగు, బూట్లు వాడు నెత్తిమీద పెట్టుకొని

నిలువెత్తు కంటె పొడవున్న కర్రతో లోతు చూస్తూ నాకు మరో చెయ్యి ఊతంగా యిచ్చి సంకోచం లేకుండా తనను అనుసరించమన్నాడు. జలజలమంటూ సుళ్ళు తిరుగుతూ, నురగలు కక్కుతూ చల్లగా మురికిగా ప్రవహిస్తున్న వాగులోకి దిగి నడవాలంటే ముందు జంకిన మాట వాస్తవం. ఏటి మధ్యలోకి పచ్చినంక గజ్జలదాకా నీళ్ళు వచ్చినై. చల్లగా కొరుకుతూ వేగంగా పారె వరద... ఈదర గాలి... వళ్లు తూలిపోతున్నట్టుగా జలదరింపు... కాళ్లకింది మెత్తటి ఇసుక నున్నగా జారిపోతోంటే చక్కిలిగింత... గమ్మత్తయిన అనుభూతి.... 'స్వీట్ ఆర్ ది యూజెస్ ఆఫ్ అడ్వర్సిటీ' అనిపించింది. ది సీనరీ, ది అబ్‌స్ట్రాక్ట్ వ్యూ ఆఫ్ ద డిస్టెంట్ ఆబ్‌జెక్ట్స్ అగెనిస్టు ద బ్యాక్ డ్రాప్ ఆఫ్ ద మర్కీ స్కై... ఆర్ రియల్లీ ఇన్స్‌పైరెటివ్... సకాలంలో గమ్యం చేరుకుని, పని పూర్తి చేసుకున్నాక రాత్రికి మూడ్ బాగుంటె ఈ అనుభవం మీద పోయమ్ లేదా స్కెచ్ రాస్తాను. ది ట్రావెయిల్స్ ఆఫ్ ది పీపుల్, ఎస్పెషల్లీ అప్ ద పూర్ మాసెస్ హూస్ లైవ్‌లీ హుడ్ హాజ్‌బీన్ డ్రాస్టికల్లీ రెంచెడ్ బైది రాత్ ఆఫ్ ది స్టార్మీనైట్... మీద ఆనక కథ రాస్తాను..."

"నెలరోజుల క్రితం మీ ఫోటో దినపత్రికల్లో చూశాను సార్... కత్తిరించి పెట్టుకున్నాను... అదేదో సందర్భం గుర్తు రావడం లేదు..."

"యూనివర్శిటీ వారి ఆర్థిక సహకారంతో నా పుస్తకాలు రెండు అచ్చు వేయించాను. 'పుడమితల్లి' అనే కవితా సంకలనం, 'ఎత్తిన పిడికిలి' అనే కథానిక సంకలనం. పుస్తకాల ఆవిష్కరణ సభ రాజధానిలో పెద్ద ఎత్తున జరిగింది... ఆ సందర్భంలోనివే పత్రికల్లో ప్రచురితమైన ఫోటోలు..."

"ఓహోc... అదా సంగతి. కంగ్రాట్యులేషన్ సార్... వారం కిందట బుక్‌ట్రస్టులో 'కొత్త పుస్తకాల' వరుసలో వాటిని చూశాను. రెండు పుస్తకాలు కొన్నాను. మా లైబ్రరీలో వుంచేందుకు మా ప్రిన్సిపాల్‌గార్ని వప్పించాను. కథలు - సూపర్ అంతర్జాతీయంగా గుర్తింపు రావాల్సిన కథలవి. పొయిట్రీ గొప్పగా వుంది. కాని నాకు కొన్ని కవితలు అర్థంగాలేదు సార్..."

"మరోమారు చదువు... థ్రీవర్సే కదా..."

"ఊహూc... లాభం లేదు... బుర్రకెక్కలేదు. ఉండండి... ఒక కవితలో కొన్ని వాక్యాలు డైరీలో రాసుకున్నాను... చిరిగిన ప్రపంచపటం మూడో ముక్కలో బురద బాటల మీది స్త్రీలు కనుబొమలు దిద్దుకోరు. ఊరుమ్మడి నూతిగట్టు మీద ఖాళీ చెంబుల్లాగా కూర్చుంటారు వారు ఓపికతో - కృష్ణవేణి జడ పాయపాయలో ఆశను తురుముకుని - నీటి అద్దంలోకి లోతుగా చూస్తారు - తమ కళ్ళల్లోని తడికోసం... ఈ వాక్యాలు వివరించండి?"

"కథలోనైతే శైలి, శిల్పం, నిర్మాణం, ముగింపు ఉంటాయి. ఇవి పాఠకునికి సూటిగా అర్థమయేలా ఉంటాయి. వస్తువు, వర్ణన కాని కవిత్వంలో కొచ్చేసరికి కొంచం మేధోపరమైన కసరత్తు అవసరమవుతుంది. కవిత్వంలోని భాష సహజవాసనకు, అనుభూతికి, ఆలోచనకు తాకేలా వుండాలి. ఇది సాధించేందుకు కవి భావ చిత్రాలు, ప్రతీకలు, ఉపమానాలు విరివిగా వాడతాడు. భారత్ మూడో ప్రపంచ దేశం... ఇక్కడి స్త్రీలు పాశ్చాత్య వనితల్లాగా ఫ్యాషనబుల్‌గా ఉండరు.

హక్కుల కోసం పోరాడరు. వంటపాత్రలవలె ఓపికగా పడి వుంటారు ధరిత్రివలె. తరతరాల చరిత్రలో మార్పురాని భారత స్త్రీ స్థితిగతుల గూర్చిన భావన అది..."

"ధాంక్స్... అర్థమయింది. మీ దృష్టిలో రచయితల వర్గీకరణ...?"

"రచయితలైనా, కళాకారులైనా నా దృష్టిలో రెండు రకాలు. ఒక రకం ప్రభుత్వ పక్షం, మరోరకం ప్రజల పక్షం. ప్రజల పక్షాన ఉన్న కళాకారులే జీవిత వాస్తవికతను ప్రతిఫలిస్తారు.

"పాశ్చాత్య రచయితలకు, మన రచయితలకు పోలికలు - భేదాలు ఏమిటి..."

"నా అభిప్రాయం ప్రకారం - వెస్ట్‌లో రొమాంటిసిజం, అస్తిత్వవాదం అధివాస్తవికతా వాదం ప్రబల ధోరణులు. జాక్ లండన్, స్విఫ్ట్, ట్వెయిన్ లాంటి వాళ్లు తప్ప - అక్కడ ఎక్కువమంది ఎలైటిస్ట్ సాహిత్యమే సృష్టించారు. మన దగ్గర పీడిత ప్రజానీకానికి సంబంధించిన సామాజిక స్పృహ ఉన్న రచనలె ఉత్తమ తరగతికి చెందిన సాహిత్యంగా గుర్తించబడుతున్నాయి."

"సంకెపల్లి... సాబాసుపల్లె... దిగెటోళ్ళు జల్దిన రాండ్రి..."

"బస్సు పూరాగ ఆగనీయి... ట్రంకు పెట్టె ఇగో... వాన బాగనె పడుతంది..."

"ఇక ఎవలులేరా... రైట్... డోరు గట్టిగముయ్యి.... ఎట్లనయ్య... మాంసం కూర తింటలేవా... అద్దదీ... రైట్..."

"ఉత్తగనె బుర్రుబుర్రు మనిపిత్తాండు. కదిలిత్తలేదు బస్సు..."

"యాడిదాకా సిరిసిల్లకా... జల్దిన సైకిళ్ళు మీదేసి ఎక్కుండ్రి... ఏమేం సాపలు వున్నయ్..."

"గీ బుట్టలు, తోపెలలు పట్టుకో... కొమురా ఎక్కురా... నేను సైకిళ్ళు అందిస్త."

"జెల్లలు, కొర్రమట్టలు, పాపెర్లు..."

"ఎన్ని కిలోలయితయి... గంతనగమెక్కడర... ఇచ్చెరేటు జెప్పు... అన్నీ తీస్కుంటం..."

"మంచోడెవున్నడు డైవరు సాబు... బస్సు ఆపుకుని నిమ్మళంగ సాపల బేరం జేత్తాండు.

"వో ఖాదర్ భయ్యా... ఏమైంది ఏం జెత్తానవ్..."

"జనం యేగిర్తపడితే నీకేందయ్యా ఆంజనేలూ... పచ్చాపలు... మంచిగున్నాయ్ వాగుల పట్టిండ్రట బేస్తోళ్లు... సస్తల మాట్లాడిన... చెరో కిలో తీస్కుందాం..."

"సరే... మంచి పని జేసినవ్. నీ నీసు ముచ్చుబుద్ధి పోనిచ్చుకోలేదుగా తోపెలలు గూడ మీదనె ఎయ్యిమన్జెప్పు. ఈడ జాగలేదు, లొల్లి..."

"అబ్బ ఇంకెంతమందిని ఎక్కిస్తవయ్యా... ఇండ్ల వూపిరి తిరుగుతలేదు. అబ్బ కాలుష్యం... బురద... వాననీళ్ళు... ఇప్పుడు చాపల కంపు..."

"నల్గురు దిగిండ్రు... ముగ్గురం పట్టమా... ఏం జెయ్యాలె బాపనయ్య పంతులూ! ఎవ్వల పొట్ట తిప్పలు వాళ్ళయి. మీరు గుళ్లో పూజలు చేయించుకుంట, మంత్రాలు సదువుకుంట సంపాయిస్తరు. మాది గట్లకాదు కద... మా జీవనం గిట్ల... పోశెట్టి తోపెలలు ఎగిరిపోకుంట గట్టిగ కట్టినవా .. కండక్టర్ రైట్..."

"అంకుల్... కిటికీ తెరవా... బయట వడగళ్ళు పడతాను.. ఐస్... ప్లీజ్..."

"వద్దు... నీ గాయం తడి అవుతుంది. ఇన్‌ఫెక్షన్ అయే ప్రమాదముంది... ఐనా ఇప్పుడు వడగళ్ళు... నువ్వనె మంచుముక్కలు ఈ వర్షంలో రావు... అవి సమ్మర్‌లో వచ్చే వర్షంలో పడతాయి. అదెలా అని అడగకు. అదో దర్మో డైనమిక్ థియరీ. ముందు ముందు నీ హైయ్యర్ క్లాసుల్లో మీ సైన్స్ టీచరు నడిగి తెలుసుకో..."

"అమ్మాయి తలకు గాయమెలా అయింది...?"

"స్కూలు బిల్డింగు కూలింది. అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు."

"ఈ భారీవర్షం మూలంగా ఎంత ప్రమాదం జరిగింది. . అబ్బ..."

"తప్పు వర్షాలది కాదు. బిల్డింగు కట్టించిన కంట్రాక్టరుది నేరం. డబ్బు సంపాదించే ధ్యేయంతో గబగబ బిల్డింగు కట్టించి అదేదో విద్యానికేతన్ అనే బోర్డు పెట్టి స్కూలు వోపెన్ చేసిన యాజమాన్యానిది తప్పు .. నాసిరకపు కట్టడాలు... అవినీతి..."

"సరె... ఆ బిల్డింగు నాసిరకపు కట్టడం అందాము... మరి ఈ వాగు మీది వంతెన?"

"ఇదీ అదే సార్... ఇది కొట్టుకుపోవడం నా ఎరుకలో నాలుగోసారి. దీని ప్లాను స్ట్రక్చర్, మెటీరియల్‌లో ఎన్నో లోపాలుండాలి. లోపాలేమిటో ఇంజనీర్లకు తెల్సి వుండాలి. కాని... మళ్ళీ మళ్ళీ కట్టాలి... తమ జేబులు నింపుకోవాలి... వాళ్ళ ఆలోచన అది..."

"మీరనె నాసిరకపు కట్టడాలు లో స్టాండర్డు డిజైనులు ఇవి కంట్రాక్టర్ల ఉద్దేశపూర్వక తప్పిదాలు కావు సార్... అధికార్లు టెండర్లు జారీ చేస్తారు. లోయస్టు కొటేషన్‌కు కంట్రాక్టు అవార్డు చేయబడుతుంది. తక్కువ ఖర్చుతో పని నిర్వహణలో ఉన్నది లోపమంతా. ఉదాహరణకు నేను పనిచేస్తున్న ధర్మల్ స్టేషనులో వర్కులు చెపుతాను. మెకానికల్ రిపేరు వర్కులు, సివిల్ వర్కులు తక్కువ కొటేషన్‌కు ఇస్తారు సంబంధిత ఇంజనీర్లు. వ్యయం గురించి తప్పుడు అంచనా వేస్తారు నిపుణులు. ప్రభుత్వానికి, కంపెనీకి ఏదో ఉపకారం చేస్తున్న భ్రమలో ఉంటారు వీళ్ళు. ఫలితం - ఏడాది తిరగకుండానే మెషీన్లు, వాల్వులు మళ్ళా రిపేరుకు వస్తాయి..."

"యూ ఆర్ రైట్... తప్పు నిపుణులదయినా, అధికార్లదయినా, కంట్రాక్టర్లదయినా ఫలితం అదే... వీళ్లందరూ ఒకే హారంలోని పూసలు. అవినీతి, బంధుప్రీతి అన్ని రంగాల్లో వేళ్ళూనుకుని ఉన్నది. ఈ కరప్షన్ ప్రక్షాళన అయితేనే దేశం బాగుపడ్తుంది..."

"మీ వాదన చిత్రంగా ఉంది... దేశం బాగుపడ్డం లేదంటారా?"

"ఎందుకు లేదు... బోల్డంత అభివృద్ధి చెందుతోంది. వ్యవసాయోత్పత్తుల పెరుగుదల నాలుగు పాయింట్ అయిదు శాతం, దేశవాళీ పారిశ్రామికోత్పత్తుల పెరుగుదల ఎనిమిది పాయింట్ నాలుగు శాతం - గత సంవత్సరం కంటె ఈ సంవత్సరం ఎంతో మెరుగు అని ప్రభుత్వ ప్రకటన. కానీ అల్లుడి నోట్లో శని అన్నట్టు ఆరు పాయింటు ఆరు ఉండే ద్రవ్యోల్బణం ఇప్పుడు పదమూడు పాయింటు ఆరు శాతానికి పెరిగింది? జాతీయాదాయం మూడు లక్షల నలభై ఆరువేల తొమ్మిది

వందల తొంభై నాల్గు కోట్ల రూపాయలు. తలసరి ఆదాయం నాల్గువేల రెండువందల యాభై రెండు రూపాయలు జనసంఖ్య తెలుసా. ఎనభై నాల్గు కోట్లు, ఇక విదేశీ అప్పు - అరవై మూడు బిలియన్ డాలర్లు - మన రూపాయల లెక్కల్లోకి వస్తే రెండు లక్షల అయిదువేల కోట్ల రూపాయలు. మన స్థూల జాతీయోత్పత్తిలో యాభై ఏడు శాతం! మరో ప్రగతి... నిరుద్యోగుల సంఖ్య ఎంతో తెలుసా... రెండు కోట్ల ఎనభై లక్షలు. ఇవి మచ్చుకు కొన్ని గణాంక వివరాలు... ఇదీ మన ఆర్థిక పరిస్థితి..."

"ముసల్దాన. . పెద్ద పెద్ద ముల్లెలేసుకుని ఎటు బయలెల్లినవ్... ముసలోడు యెంబడి లేడేంది? .."

"ఇంకెక్కడి ముసలోడు బిడ్డ... పోయినేడు మట్టిల కల్సిపోయిండు. నన్నెప్పుడు తీస్కపోతాడో దేవుడు... ఏం పానమో... మొండి పానం... కాటికి కాళ్లు సాపుకున్నా రెక్కలకట్టం తప్పతలేదు... మళ్ళెప్పుడో... కొడుకును, బిడ్డను సూద్దామని సిరిసిల్ల పోతాన. మనుమలు, మనుమరాండ్లు కళ్ళల మెదుల్తాండ్రు..."

"నిజంగా మొండిపానమె ముసల్దానిది. అమ్మో దీని ధైర్యం పాడుగాను. గన్ని ముల్లెలు మోసుకుంట వాగులకెల్లి ఒక్కతే దాటివచ్చింది..."

"ఏంజెయ్యాలే బిడ్డ .. నా దగ్గర ఎక్కువ పైసల్ లెవ్వు. ఐనా ఓ పొలగాడు ఉత్తగ దాటిత్తనన్నడు. ఐతె గిరాకీ తగ్గేదాంక ఆగుమన్నాడు. పొద్దు మూసుకత్తాంది. ఆగెటట్టు లేదు. ఐనా నాకేం బయ్యంబిడ్డ! గిసోంటి వరదలు, వానలు ఎన్నో సూసిన. గీ వాగు ఎన్నో మాట్ల మా ముసలాయిన తోటి దాటిన. ఇయ్యాల ఎందుకో కండ్లు తిరిగినై... గట్టుమీన కాలు పెడ్తాంటె జారిపడ్డ... తెనుగోళ్ళ పొల్లగాని కడుపు సల్లగుండ... జబ్బపట్టి మీదికి గుంజిండు..."

"శివుని ఆజ్ఞలేనిదే చీమయినా కుట్టదు. ప్రాణం పొమ్మంటె పోదు, రమ్మంటే రాదు. నీ ఆయువు గట్టిది ముసల్దానా. జారిపడ్డా, వరదల్లో కొట్టుకుపోయినా మరెక్కడ్నో తేలి బొంతపురుగులా గడ్డ మీది కెక్కుదువు..."

"బాపనయ్య పంతులూ... ఏదన్నా యగ్నం, యాగం చేసేటందుకు బయలెల్లిండ్రా?"

"ఏం అట్ల అడుగుతున్నవ్?... ఎట్ల గుర్తుపట్టినవ్ జాలరీ...?"

ఏం లేదు పంతులూ... బాపనయ్య, మేకపిల్ల కత యాదికొచ్చింది. మీ చేతుల్లో గడ్డిమూట వుంది కదా... ఏదన్నా మేకపిల్లను గానీ గొర్రె పొట్టేలును గానీ పట్టుకపోతాండ్రా అని... నా చిన్నప్పుడు హన్మకొండల ఓ యాగం జూసిన... అబ్బ ఏం జనం... ఎగబడ్డరు యాట మాంసం ప్రసాదం కొరకు..."

"ఛ... ఛ... మూర్ఖ శిఖామణీ... నేను మేకపిల్లనో, కుందేలు పిల్లనో తీస్కపోవడం లేదు. నువ్వనుకున్నట్టుగా ఇది గడ్డిమూట కాదు. ఇవి దర్భలు. ఏటి వొడ్డున ఏపుగా పెరిగి వున్నాయ్. మా దగ్గర ఇవి లభ్యం కావు. కాపువాని చేత కోయించి చేతుల్లో మోసుకుపోయెటట్టుగ మూట కట్టించిన. యజ్ఞాలు, యాగాలు మా వృత్తి కదా... ఈ దర్భలను హోమగుండాల్లో, పిండప్రదానాల్లో, గ్రహశాంతుల వంటి వివిధ క్రతువుల్లో ఉపయోగిస్తాం."

"ఊకె మడుగులల్ల, చెర్లల్ల, నీసు కంపుల బోర్లెటోళ్లం. మాకేమెరుక! ఏమీ తప్పు పట్టుకోకు పంతులూ. పల్లెటూరోళ్లం. మావోనికి ఎట్ల మాట్లాడాల్నో దెల్వది... గీ ముసుర్ల యాడికి పోయస్తున్నరు...?"

"రాంనగర్ మందిర్ కమిటీ వాళ్ళు గణేశ విగ్రహ సంస్థాపన కొరకు పిలిచారు. ఆగమ శాస్త్రోక్తంగా మందిర నిర్మాణ, ధ్వజస్థంభ, విగ్రహ ప్రతిష్ఠాపనలు నిర్వహించి వస్తున్నాను. కారు పంపిస్తామన్నరు. నేనే వద్దన్నాను. ఎలగందుల, కొదురుపాకల్లో నాకు కొన్ని పనులు - వనమూలికల సేకరణ వుండింది.... ముగించుకుని వస్తున్నాను."

"పంతులుగారూ... శణార్తి... పంచాంగం ప్రకారం ఈ యేడు కాలం మంచి గుంటదని చెప్పబడె. మరి గీ వానలు, వరదలు ఏంది...? మా బేపారం మందమయింది. మావోళ్ళు సంగాలు, మగ్గాలు యిడిసిపెట్టి భీమండి, బొంబాయి, సోలాపూరు పోతాండ్రు."

"అప్పుడప్పుడు ఈ వైపరీత్యాలు తప్పవు. ఇవి తాత్కాలికములే. ముందు ముందు మెరుగయితది కాలం. కష్టాలు కలగకపోతే లోకంలో దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన ఎట్ల వస్తది...? దైవలీల... ఈశ్వరేచ్ఛ... మానవులకు ఎదురీత తప్పదు. 'యదృచ్ఛాలాభ సంతుష్టో ద్వంద్వాతీతో 'విమత్సర' సమ: సిద్ధావసిద్ధేచ కృత్వాపిన నబద్యతే' అన్న గీతకారుని వాక్యం మననం చేసుకోవాలి."

"అయ్యగారూ... దండాల్... మా వూరు శీర్లంచ తొవ్వ మర్సిపోయినట్టున్నారు! ఎన్నడో రతం పున్నమప్పుడు మావూరి కచ్చిండ్రు. శానా దినాల నుండి మా అత్త, మా బావ మిమ్ముల గలువాలనుకుంటున్నరు. నన్ను ఏర్పాటు జేసిండ్లా? బుచ్చయ్య కోడల్ను..."

"అహాఁ... ఏర్పాటు చేయకేంది... మీ మామకెట్లున్నది? వచ్చేనెల వస్తా శీర్లంచ సాంబిరెడ్డిగారింట్లో పూజ వున్నది జరూరు పనుంటె మీ మామను ఓసారి సిరిసిల్లకే రమ్మను."

"అయ్యో ఏం జెప్పేది... మా మామకు పచ్చవాతమచ్చి లేత్తలేదు. మా అత్త ఊకే శూలనొప్పి అంటాంది. పాడి బర్రె సచ్చిపోయింది. మా మనిషి రంధి తోటె పిచ్చోడయినట్టయిండు. ఊళ్లె అందరు అంటాండ్రు - ఇల్లు గట్టుడు సరిగ్గలేదని. మీ అసొంటోళ్ళకు ఇల్లు చూపెట్టి దర్వాజలు, నుయ్యి దిక్కులు మార్వాలంటాండ్రు..."

"పాత పెంకుటిల్లు తీసేసి బెంగుళూరు గూనతోటె ఇల్లు కడతనని మీ మామ ఏనాడో అంటూండె. అయితె ఇల్లు కట్టిండన్నమాట. ఎప్పుడు కట్టిండు. ముందు దర్వాజ ఎట్లున్నది?"

"దసరా పండుగా ఎల్లినంక వారం రోజులకే ముగ్గుపోశినం, మూన్నెళ్లల్ల అయిపోయింది ఇల్లు గట్టుడు. ముంగటి దర్వాజ పడమరకున్నది..."

"అదే తప్పు చేసిండ్రు మీరు, వాస్తుశాస్త్రం ప్రకారం - ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో దక్షిణం వైపుకూ, పడమరవైపుకూ, ముఖమున్న ఇండ్లు కట్టరాదు. ఇంటికి మూడు గుమ్మాలుండకూడదు. తూర్పున నుయ్యిగాని, పశువుల కొట్టంగానీ

ఉండరాదు. శాస్త్రం శాస్త్రమె. తప్పితే ఇసోంటి పీడలు దాపురిస్తాయి. వారం పదిరోజుల్లో నే వస్తనని మీ అత్తకు చెప్పు నీ పెనిమిటికి ధైర్యం జెప్పు. నేను స్వయంగ పరిశీలించి కట్టడంలో మార్పులు సూచిస్తాను."

"మంచిది అయ్యగారూ... దండాల్. ."

"బిడ్డా .. పచ్చవాతమంటానవ్... మీ మామ కల్లుసారాగానీ తాగుతాడా?"

"కాయకట్టం చేసుకునేటోళ్ళు తాగకుంట ఉంటరా... ముసల్దానా... నీ యెర్రిగానీ. ."

"వద్దు బిడ్డో .. సారా విషం... సారా తాగే మీ మామ గట్టయినట్టున్నడు నీ మొగునికి చెప్పు - పొరాటున కూడ కల్లు, సార జోలికి పోవద్దని, నా పెద్ద కొడుకు గీ సార తాగి తాగి... అయ్యో ఏం జెప్పాలె... కాలెయం చిల్లులు పడి, పసరు కక్కుకుంట సచ్చిపోయిండు. అయ్యో... నా లింగవ్వా... బంగారమసోంటి బిడ్డా... ఏ లోకానున్నవో..."

"పాపం ముసల్ది ఏడుత్తాంది - కొడుకుయాదికచ్చి... ఔరా కొమురా... మల్లేషు గాడు తాగి తాగి అడ్డం పడ్డడు మళ్ళా. లేవకుంట. ఇల్లు అమ్ముకున్నాడు... జాగలమ్ముకున్నాడు. చే దగ్గున్నట్టుంది... ఊకె దగ్గుతడు. సార అమ్మద్దని అన్నలు బెదిరిస్తనే ఉన్నరు తాగెటోళ్ళు తాగుతుండ్రు - అమ్మెటోళ్ళు అమ్ముతాండ్రు. ఎంతో లొల్లి అయితాంది. సర్కారు దిగచ్చి సార బందు పెడ్తానని వొప్పుకున్నది. నిజంగా సర్కారు మాట నిల్పుకుంటదంటావా...?"

"ఏమో. . సూడాలె... నిజంగ బందయితె ఎందరో గరీబోళ్ల బత్కులు బాగుపడ్తయి .."

"ముసలవ్వా... ఓ పెద్దవ్వా... జర గీ మొండిమనిషికి జెప్పు... ఊకే తాగద్దని జెప్పితే వినడు. బస్సు ఎక్కేకాడ నాల్గు పొట్లాలు కొట్టిండు, పని జెయ్యడు, వసపిట్టోలె ఒర్రుతడు. నన్ను రోజు కొట్టి సంపుతడు పైసలియ్యమని..."

"ఒద్దుబిడ్డ... సంసారం పాడుజేసుకోకు, పిల్లా జెల్లా ఉన్నారు. సారా నీ పానం తీత్తది. నేను ఎందరి బతుకులో జూసిన. తాగుడుకు అలవాటియినోడు ఎవ్వలూ బాగుపడలే..."

"ఎహెఁ.... మీ సోది పాడుగాను అదురుష్టం బాగుండాలె కాలం కల్సి రావాలె. తల్లిపాల బలముండాలె... మాకేమయింది సూడు. దిట్టంగ వున్న ఇగ పని అంటారా .. ఈడ ఎంత కట్టపడ్డా ఏం సంపాయించలేం ప్యాసుపోర్టు తియించిన. బేరన్‌కు లేదా మస్కట్టుకు పోత. సుతారి పనోళ్ళకు మస్తు జీతాలట అరబ్బు దేశాల్లో. ఏయ్... ఆడిదానా... నువ్వూకే.. వొర్రకే... నేనేదో పూటుగా తాగి బొర్లుతున్నట్టు కాకిగోల జెత్తానవ్..."

"అయ్యో కొడుక... నేను మళ్లా జెప్తాన యిను. నా చిన్న కొడుకు నీ తీర్గనే అనుకొని మస్కటు బోయిండు. రెండేళ్ళ తర్వాత ఉత్త చేతులతోటె తిరిగచ్చిండు. దలార్లను నమ్ముకొని మోసపోయిండు. ఆడ వాన్ని జైలుఖానల యేశిండ్రట. ఎండిపోయిన రొట్టె బిల్లలిచ్చిండ్రట. రగతం కారేటట్టు బారుగబ్బెల్తో కొట్టిండ్రట. ఏమయితేనేం... రాయేషుల సామి దయవల్ల మల్ల నా కళ్ల ముంగటికి తిరిగచ్చిండు.

బండి కొట్టుకుంటీడనె వుంటాడు బేరన్ మస్కట్టు అని కలలు గసకు. పెళ్ళాం పిల్లల్ని దిక్కులేనోళ్ళను జెయ్యకు..."

"ముసల్ది మంచిగనె జెబుతున్నది. గల్ఫు దేశాల మోజులో పడి ఎందరో మోసపోయింద్రు. కొందరు బొంబాయి దాకా పోయినట్టు మతులబచ్చింది. కానీ తర్వాత ఐపూ జాడ లేకుండ పోయింద్రు. ఇశ్రాయిలుగాని పెళ్ళాం.. చూసి చూసి ఎవనితోనో లేసిపోయింది - ఇద్దరు పిల్లల్ను అత్తమామల మీద యిడిసిపెట్టి."

"సంపాదన అంతా తాగుడుకు పోతుంటె దరిద్రం చుట్టుముడుతుంది. దాన్నుంచి బయటపడేందుకు వేరే తోవలు ఏమిటా అని చూస్తారు కూలిజనం. దళారీలు, బ్రోకర్లు ఈ బలహీనతను ఆసరా చేసుకొని అరబ్బు దేశాల్లో లేబరుకు మంచి గిరాకీ వుందని వీళ్ళను నమ్మించి డబ్బు గుంజుతారు. బొంబాయి దాటించేసి వాళ్ళ ఖర్మానికి వాళ్ళను వదిలేస్తారు... ఇదో దోపిడీ వలయం. ."

"సారా నిజంగానే విషంతో సమానం. ఇప్పుడు పొట్లాల్లో లభిస్తున్నది స్వచ్ఛమైన ఆల్కహాలు కాదు. కల్తీసరుకు, మిథేల్ కలుపుతారు. క్లోరల్ హైడ్రేటు, నవాసారం లాంటివి కూడా మిశ్రమం చేస్తారు. ఇది అలవాటయితే మాదక ద్రవ్యాలకు ఎలా బందీ అవుతాడో అలా బానిసయిపోతాడు. ఆరోగ్యం క్షీణిస్తుంది. నాడీ మండలం దెబ్బతింటుంది. చివరికి లివర్, మూత్రపిండాలు ఫెయిల్ అయి మనిషి నిర్జీవుడవుతాడు..."

"మరీ గివన్నీ తెల్సి కూడా సర్కారు సారా బందు పెట్టనని మొండికేసిందెందుకో?"

"మనుషుల ప్రాణాలు, సమాజం ఆరోగ్యం గూర్చి సర్కార్లకు పట్టింపు లేదు. కంట్రాక్టర్ల, దళారీల రాజ్యం యిది. యేటా ఎనిమిది వందల కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది ప్రభుత్వానికి - ఈ సారా అమ్మకాల ద్వారా."

"నాంపల్లి దిగెటోళ్ళు ముంగటికి రాండ్రి... డోరు దగ్గరికి..."

"అంకుల్... అమ్మ దగ్గరికి వెళతాను."

"పొగవాసన బాగనిపించడం లేదా?... సిగరెట్ అవతల పడేశానులే. కూర్చో."

"ఊహూc... ఆకలేస్తోంది. అమ్మ దగ్గరికెళతాను. బ్యాగులో ఆపిల్ పండ్లున్నాయి... అంకుల్, అంకుల్... ఫిషర్‌మెన్ తమ చేపల బుట్టలను మమ్మీ చేతిలోని బ్యాగుకు తాకిస్తున్నాడు. బేడ్ స్మెల్ ఆపిల్స్ కంటుకుంటున్నది. బుట్టలను దూరంగా ఉంచమని చెప్పండి ప్లీజ్..."

"ఆ బుట్టల్లో వున్నవి చేపలు... మంచినీటి తాజా చేపలు. మేరీన్ ఫుడ్ ఈజ్ గుడ్ ఫర్ హెల్త్, జాపనీస్, తదితర అభివృద్ధి చెందిన దేశాల ప్రజలు మెరీన్ ఫుడ్ విరివిగా తింటారు. మన దేశంలో బెంగాలీలు, కేరలైట్లూ చేపలంటె చెవి కోసుకుంటారు. ఫిష్ ఈజ్ వెరీ రిచ్ ఇన్ ప్రొటీన్స్ అండ్ మినరల్స్ అయోడిన్ పుష్కలంగా వుంటుంది. గుండె జబ్బున్న వాళ్ళకు చేపలు బాగా తినమని డాక్టర్లు ఈ మధ్య ప్రిస్క్రైబ్ చేస్తున్నారు. ఫిష్‌ని ఒకప్పుడు బ్రెయిన్ ఫుడ్ అనేవాళ్ళు. డోన్ట్ యూ ఈట్ ఫిష్...? బేబీ..."

"ఫిష్ స్మిమ్ ఫాస్ట్ అక్వేరియంలో రంగు రంగుల చేపలు ఎంత అందంగా వుంటాయో .. ఐ లైక్ దెమ్ వెరీమచ్. కానీ తినడం - రోత ... నాకు డోకు వస్తుంది. అంకుల్ మీరేమేమో చెప్తున్నారు. వేణు అంకుల్... మీరయినా చెప్పండి... చేపల బుట్టలను దూరంగా ఉంచమని..."

"కండక్టర్. . ఈ పొల్యూషన్ ఏమిటయ్యా... చేపల బుట్టలను బస్సు టాపు మీద వేయించాల్సింది. వాటిని డ్రైవరు దగ్గరనన్నా పెట్టుకోమని చెప్పు కనీసం..."

"అబ్బబ్బ .. ఇవ్వాళ డ్యూటీ నరకంగున్నది. మంది యమ తక్లీబిస్తాండ్లు... ఎక్కిస్తే ఓ బాద... ఎక్కనియ్యకపోతే మరో బాద.... బెస్తోళ్ళ తమ్మీ... గా సార్ చెప్పేది యిన్నవ్ కద... రెండు బుట్టలు క్యాబినులో ఇరికియ్యి. మరోటి ఏదన్నా సీటు కిందికి నూకు. భాదర్ భాయీ, నీ చేపలను జరంత నీ సీటెనుక పెట్టుకో..."

"రీక్ హై....తంబీ...ఇదర్ లావ్....."

"మరీ నత్తనడక బస్సుది. ఇంకా స్లో చేస్తాడేమిటి?"

"ముందు స్టేజి వున్నట్టున్నది...?"

"నాంపల్లిలో దిగేటోళ్ళు డోరు దగ్గరికి జల్దిన రాండ్రి..."

"అగో... డ్రైవరుసారు... ఇష్టేజి దాటింది... ఆపవేందయ్యా బస్సు... అయ్యో..."

"కండక్టర్... బస్సాపియ్యవయ్యా..."

"బలె... బలె... ఇలాగె నాన్-స్టాపింగ్‌గా వెళ్ళాలి... ఇంకా స్పీడు..."

"ఎందుకమ్మా... అంత తొందర...?"

"త్వరగా డాడీని కలవాలి... డాక్టరు బాబాయి దగ్గర బ్యాండేజి వేయించుకోవాలి... సో... ఫాస్ట్... శతాబ్ది ఎక్సుప్రెస్సులా..."

"శతాబ్ది ఎక్స్‌ప్రెస్సు స్పీడు ఎంత? వోన్లీ వన్ హండ్రెడ్ అండ్ ట్వంటీ కెఎమ్‌పిఎచ్. మనం అల్ప సంతోషులం. అదే గొప్ప స్పీడు అయిపోయింది. జర్మనీ వాళ్ళ అట్లాంటిక్ రైలు స్పీడు ఎంతో తెలుసా? మూడు వందల ఇరవై కెఎమ్‌పిఎచ్. జాపనీస్ ఇంకా ఎక్కువ స్పీడు అయిదువందల కెఎమ్‌పిఎచ్ కోసం ప్రయత్నిస్తున్నారు."

"నిజంగానా... థాంక్యూ అంకుల్... కొత్త జి.కె. విషయం తెలియజేశారు..."

"ముసల్దానా... పక్కకు జరుగు. సుట్ట తాగుతానవా... కంపు వాసన..."

"లేదు బిడ్డ... నా దగ్గరకాదు. ఎవ్వలో బీడీ, లేదా సిగరెట్టు తాగుతాండ్రు...?"

"మరి చేతిలోది ఏమిటి ..?"

"పుగాక్కాడ. పండ్లు గుంజుతానయ్. జరంత తుంపుకొని దౌడ కేత్త..."

"నాంపల్లి... దిగేటోళ్ళు దిగిండ్రా...?"

"ఇష్టేజి ఎక్కన్నో పోయింది గింత దూరాన ఆపుతవా...? ఏందయ్యా ఇది?"

"హక్కడ పబ్లిక్ మస్తుగున్నర్ ఇంక హెంతమందిని చడాయించుడు? లొందల దగ్గర టక్కుటక్కుమంటాది బండి. ఇస్పరింగులు ఇరుగుతాయ్. టైర్లు బరుస్టు అయితయ్. బస్సు సిరిసిల్ల దాంక పోతదని నాకు యకీన్ అయితలేదు .. డోరు దబాయించిండ్లా? .."

"గా సారు సికిలెట్టు గా అన్న బీడీ తాగబట్టిరి గీ అయ్యగారు తాపకోసారి నశం పీల్వబట్టె. కిటికీలన్ని బందు పెట్టిండ్లు. ఇగ వాసన ఎటువోవాలె?"

"అయ్యగార్కి చేపల వాసన పడ్తలేదు. గందుకేనేమో ఊకె నశ్యం గుంజుతాండు ముక్కు మూసుకుంటాండు. ముసలవ్వా గీ ఒక్క బుట్టనీ కాళ్ళకాడ పెట్టుకో అవ్వా..."

గీడ పెట్టు బిడ్డ. ఒద్దన్నానా? తినెటోళ్ళం మనకేం వాసన? మా ఊరి కొచ్చెర్వులో ఏం చేపలు! మత్తడి దుంకినప్పుడు... ముసుర్లల్ల కొంగు చాపితే తక్కెళ్ళ కొద్ది చేపలు..."

"సార్... మీ ముసల్ది – శ్రీశ్రీ గారి 'భిక్షువర్షీయసి' లాగా వున్నది కదా...?"

ఔను. వంగిన నడుము, చివికిన దేహం, ముగ్గు బుట్ట వంటి తల, గాజు కళ్ళు... ఆ రింకిల్స్ అవే ముఖంలోని ముడుతలు... కాలం చెక్కిన కత్తిగాట్ల తీరువున్నాయ్."

"కుమార్ సార్... మీ పొయిట్రీ చర్చకు అంతరాయం కల్గించినందుకు డోన్ట్ థింక్ అదర్‌వైజ్... నాదో చిన్న సందేహం తీరుస్తారని ఆశిస్తాను. నాన్-ఫిక్షన్ రచనల్లో అప్పుడప్పుడు కొన్ని లిటరరీ టరమ్స్ లాంటివి నాకు తారసపడతాయి. వాటి మీనింగ్స్ డిక్షనరీల్లో కూడా దొరకవు. ఉదాహరణకు – అహబ్స్ ఫాంటసీస్, క్విక్సోటిక్ ప్రాజెక్ట్స్, డాన్ జువాన్... లాంటివి..."

"ఇవి సాహిత్యానికి సంబంధించినవి కావు ప్రముఖ రచయితల నవలల ద్వారా కావ్యాల ద్వారా ప్రాచుర్యం పొంది మామూలు భాషలోకి ఫిగరేటివ్‌గా తీసుకోబడ్డ పద ప్రయోగాలు ఇవి. అహబ్ హెర్మన్ మిల్‌విల్లీ ప్రఖ్యాత నవల – 'మాబీడిక్' లో కథానాయకుడు. సమాజంతోటి తన సంబంధాలను తర్కించుకోకుండా, ఎవరి సలహాలనూ ఖాతరు చేయకుండా ఒంటరిగానే తన లక్ష్యం నెరవేర్చుకోవాలన్న అహంభావం, అతిశయం మూర్తీభవించిన వ్యక్తివాది ఈ అహబ్. సిబ్బందినీ, అనుచర వర్గాన్నీ సమకూర్చుకుని పెద్ద ఓడలో తిమింగలాల వేటకై అట్లాంటిక్ మహా సముద్రంలోకి బయలుదేరతాడు కెప్టెన్ అహబ్. తన జీవితాశయం – తన్ను కొన్నేళ్ళ క్రితం గాయపర్చి, కుంటివాణ్ణి చేసిన ఓ మహాజలచరం – తెల్లతిమింగలాన్ని మట్టుబెట్టాలన్న ప్రతీకారేచ్ఛతో ముందుకురికి ఓడలోని అందరితోసహా బలి అవుతాడు. అతణ్ణించి ఇలా... సామాజిక నాడి లేకుండా, మనస్తాత్వికంగా జంతు ప్రవృత్తినీ, ఆటవిక నైజాన్నీ ప్రదర్శిస్తూ తనకు తెలీకుండానే చుట్టూ వున్న మానవజాతికి హాని కల్గించే విపరీత వైఖరిని 'అహబ్స్ ఫాంటసీ' అంటారు. సర్వెంటిస్ నవలలో డాన్ క్విక్సోట్ ప్రధాన పాత్ర. అతన్నుండి డాన్ క్విక్సోటిక్ ఎపోర్ట్స్, క్విక్సోటిక్ ప్రాజెక్ట్ వచ్చాయి. ఇక డాన్‌జువాన్ అంటె – రొమాంటిక్ హీరోయిజానికి ప్రతీక. స్పానిష్ పురాణాల్లో స్వేచ్ఛాజీవి. మొజార్ట్ రూపకాల ద్వారా ఈ పేరు ప్రసిద్ధి పొందింది."

"సార్... మీరు ఇంగ్లీషులో రచనలు ఎందుకు చేయరు...? మీ పాండిత్యం అమోఘం. తెలుగు ఒక్క ప్రదేశానికే పరిమితం. ఇంగ్లీషులో రాస్తే జాతీయ, అంతర్జాతీయంగా గుర్తించబడే అవకాశముంది కదా!"

"నాకు మాతృభాష మీదనే మమకారం. ఇంగ్లీషులో మామూలుగా వ్యాసాలు విమర్శలు రాయగలనుకాని సృజనాత్మక సాహిత్యం రాయడానికి ఈ పాండిత్యం

సరిపోదు. ఇప్పుడు పాండిత్యం కోసం శ్రమిస్తే లక్ష్యం దెబ్బతింటుంది. అయినా భాషదేమున్నది - భావం ముఖ్యం కానీ... నోబెల్ వారియేట్లందరూ ఇంగ్లీషులో రాసిన వాళ్ళు కారు. తమ తమ దేశీయభాషల్లో రాశారు. ఇవి ఇంగ్లీషులోకి అనువాదం చేయబడి ప్రపంచ పాఠకలోకానికి అందించబడ్డాయి..."

"ఔనౌను. ఇటీవల ఒకానొక దినపత్రిక 'లిటరేచర్ కాలమ్'లో నోబెల్ ప్రైజ్ పొందిన రచయిత్రి నదీన్ గార్డిమన్ గురించి చదివాను. ఆమె రచనల్లో మాజికల్ రియలిజం ముఖ్య లక్షణమంటాడు సమీక్షకుడు. మిస్టికల్ రియలిజం కాస్త వివరిస్తారా...?"

"ఈ ధోరణి విదేశీ సాహిత్యకారుల్లో ప్రబలంగా ఉన్నా ఉరవడి ఇసాబెల్ అలెండీ, కార్లోపూయిస్, లూయిబ్రిట్టుగార్డియా మార్క్వెజ్ తదితర నోబెల్ బహుమతి గ్రహీతలు ఈ ధోరణి ఎక్కువగా అవలంబించారు. తెలుగులో చెప్పుకోవాలంటే దీన్ని మార్మిక వాస్తవికతా వాదం అనాలి. వాస్తవికతకు హత్తుకుపోయేలా చెప్పేందుకు అభూత ఘటనలు, అతీంద్రియ మెటఫర్‌లు రచయిత వాడతాడు. ఇదీ అల్లెగోరీకల్ టెక్నిక్ వంటిదే..."

"మీరు ఏ ధోరణిని ఎక్కువగా అభిమానిస్తారు..."

"ప్రత్యేకంగా ఒక ధోరణి పట్ల అభిమానమంటూ లేదు నాకు. థీమ్‌ను బట్టి టెక్నిక్ మారుతుంది. అయితే ఈ మధ్య నేను ఎక్స్‌పెరిమెంటల్ స్టోరీస్ ఎంచుకుంటున్నాను. వాటిని చైతన్య స్రవంతి పద్ధతిలో రాస్తున్నాను. ఈ టెక్నిక్‌కు ఆద్యులు జెమ్స్ జాయిస్, వర్జీనియా వుల్ఫ్‌లు..."

"దీని విశిష్టత ఏమిటి?"

"ఇందులో ముగింపుకు ప్రాధాన్యత ఉండదు. సమస్యాత్మక వర్ణన విశిష్టత?"

"మీరు రోజుకెన్ని రచనలు చేస్తారు? రోజుకో కథ, వారానికో నవల రాస్తారా?"

"నేను అంత సిద్ధహస్తుణ్ణి కాను. ఒక కథ రఫ్ స్కెచ్ రాస్తాను. దాన్ని మళ్ళీ సవరించి రాస్తాను. ఆ తర్వాత ఫెయిర్ చేస్తాను. ఇలా కథకు వారం పడుతుంది. ఇప్పటివరకూ అయిదు నవలలు మాత్రమే రాశాను. నవలకు దాదాపు మూడు నెలలు పడుతుంది."

"నో సార్. మీరు బాగా సృష్టించాలి. శరపరంపరగా రాయాలి. జాన్ ఓహరా తెలుసా? ఇర్విన్‌వాలెస్ ఓసారి అతని గురించి చెప్పాడు - అతడు రాత్రి పొద్దుపోయేదాకా పార్టీలో గడిపి, నాలుగైదు డ్రింకులు తీసుకుని, సుష్ఠుగా మెక్కి, ఇంటికి వెళ్ళి పక్కమీద వాలే ముందు ఒక కథ - మంచి కథను రాసి, ముగిస్తాడు. గ్రాహం గ్రీన్ బాగా తిరుగుతాడు. తిరుగుతూనే నెలకొక నవల పూర్తిచేస్తాడు. మీరు వాళ్ళను అనుసరించండి... బాగా రాయండి... నోబెల్ ప్రైజ్ కోసం పోటీ పడండి..."

"మీ సలహాకు కృతజ్ఞతలు... కృషి చేస్తాను."

"హన్నన్నా... పానమెల్లిపాయె, నడుమిరిగి పోయెటట్టు ఎత్తెతాంది బస్సు.

"దెబ్బ గిన తాకిందా... సుజావ్వా... అయ్యో పిల్ల మూతికి దెబ్బతాకి నెత్తురు గూడ కారవట్టె... జర మెల్లంగ పోనీ రాదయ్య డైవరుసాబూ..."

"ఇస్కీ మాకీ... సైడియ్యమని ఇషార ఇస్తనె వున్న. సువ్వరేగాడు సూడలేదు. ఇయ్యాల నశీబు మంచిగున్నది... జరయితే పల్టీగొట్టు బండి..."

"మళ్ళీ మిమ్ములను ఎప్పుడు కల్సుకోవచ్చు సార్.. "

"వారం పదిరోజులు జరూరు పని మీద తిరిగే పని వున్నది. ఆ తర్వాత ఇంటిపట్టునే వుంటాను. అప్పుడు రావోయి మా యింటికి..."

"నాడి" నిర్వహకుడు జగన్ మీ గురించి చాలాసార్లు జ్ఞాపకం చేశాడు. పత్రికకు మంచి రచనలు కరువైపోయినాయంటాడు. మీరు మొదట్లో రాసిన తరహా కథలు - అవె గని కార్మికుల జీవితాలు, క్వారీ కూలీల దయనీయ స్థితిగతులు, గ్రామీణ పేదల ఇక్కట్లు ప్రతిబింబించే రచనలు, కవితలు మీ నుండి రావడం లేదంటాడు..."

"ఆ పత్రిక ఆగిపోయిందనుకుంటాను!"

"ఆ పత్రికను పోషించుకోవాలని మీరు ఒకప్పుడు ఊరూ, వాడా తిరిగి చందా కట్టించే కార్యక్రమం చేపట్టారు. ఆ ఆదరణ ఇప్పుడు లేదు. మీరేమో దూరమైపోయారు ఇప్పుడు. దాదాపు మూతపడే దుస్థితి దాపురించింది పత్రికకు..."

"ఈ పోటీ ప్రపంచంలో చిన్న తరహా పత్రికలు నిలదొక్కుకోవడం కష్టమే మరి. జగన్‌ను కలువక చాలా కాలమయింది నిజమే. నాకీ మధ్య తీరిక దొరకడం లేదు. పిహెచ్.డి చేస్తున్నాను. విషయ సేకరణకు చాలా శ్రమించాల్సి వచ్చింది. ఏమయితేనేమి పూర్తయిపోయింది. మరోవిషయం - నా అభిప్రాయం స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఎప్పుడూ మాండలికంలో రాయడం, ఒక తరహా రచనలు చేయడం వల్ల రచయిత సృజనాత్మకత వికసించదు. కొత్తపుంతలు తొక్కడం నా ఆశయం. ప్రస్తుత సాహితీ లోకంలో ప్రబలంగా వున్న ధోరణికి మడి గట్టుకుని దూరంగా కూర్చోలేను..."

"మీరు పిహెచ్.డి చేస్తున్నందుకు సంతోషం - అభినందనలు. అంశం ఏమిటి?"

" 'తెలుగు నవల - కాల్పనికత; వాస్తవికత' అనే అంశం మీద."

"వచ్చే నెల మొదటివారంలో కలుస్తా సార్. జగన్ నేనూ, స్ఫూర్తి, ముగ్గురం కరీంనగర్‌కు మీ యింటికి వస్తాము. కాలరీ ఏరియాలో అంబేడ్కర్ హాలులో 'నాడి', 'స్ఫూర్తి' సంయుక్తంగా ఒక గోష్ఠి నిర్వహించబోతున్నారు. 'రాజ్యాంగం - ప్రజాస్వామ్య సమస్యలు' అనే అంశం మీద చర్చ. మిమ్మల్ని స్వయంగా ఆహ్వానించాలనుకుంటున్నాడు జగన్."

"రండి. కానీ నేను గోష్ఠికి రాలేకపోవచ్చు. థీసీస్ పేపరుకు తుది మెరుగులు దిద్దే పనిలో నిమగ్నమయి వుంటాను "

"లేదు - మీరు తప్పకుండా రావాలి. ఆ దినం కొత్తతరం కవుల పాటలు సంకలనం ఆవిష్కరించాల్సి వుంది. మీరు ఆ పత్రికల, సంస్థల సంస్థాపకుల్లో ముఖ్యులు. మీరు రాకపోతే ఎలా సార్..."

"చూడు వేణూ... నాకు కొన్ని లక్ష్యాలు వున్నాయి. అవి సాధించేంతవరకు నేను పక్క చూపులు చూడ దల్చుకోలేదు. ఆ గోష్ఠికి చాలామంది వస్తారు; మేధావులు,

రాజకీయ పార్టీల రచయితలు, పౌరహక్కుల సంఘం వాళ్ళు, ఈ రోజుల్లో నిఘా ఎక్కువుంటున్నది. ఎక్స్‌పోజ్ కావడం నాకిష్టంలేదు."

"ఆఁ... శాంతినగర్... దిగేటోళ్ళు లేవుండ్రి"

"ముసలవ్వా.. ముల్లె పక్కకు జరుపు. కాలు తాకితే నేనేమి జెయ్యాలె? పెట్టె అందుకోవే. . విశ్వనాతమూ... చిత్రి... శెల్లెను లేపు... పాముంగటికి... కండక్టర్ సార్ ఇగో టిక్కెట్టు నాకు ఇంక పైసల్ రావలె..."

"ఇగ్గో.. చిల్లరున్నదా... ఆఠాణా"

"రూపాయత్తది గద... గిదేంది?"

"బరాబర్ ఇచ్చిన. ఎప్పటియో జమానా కిందటి రేట్లనుకుంటున్నావేమో నువ్వు... పోయిన్నెల నుండి ఛార్జీలు పెరిగినయ్..."

"గింత మాయిల్యమె పెరిగినయా... గిట్లయితే ఎట్ల ఇగ?"

"గల్ఫు యుద్ధం పలితం ఇది. సర్ ఛార్జీ. మిగతా వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయ్. చమురు ధర బారెల్‌కు ఒక డాలరు పెరిగితే మనదేశం అదనంగా వందకోట్ల రూపాయలు చెల్లించుకోవాలి."

"గా తురక రాజ్యాల కొట్లాట ఎప్పుడో కలాసయిందంట గద?"

"యుద్ధం ముగిసినా మన దేశంలో ఒకసారి పెంచిన ధరలు మళ్ళా తగ్గడమంటూ ఉండదు. ప్రపంచం ఏదో మారుమూలలో మనకు ప్రత్యక్షంగా సంబంధంలేని ఏ యుద్ధం జరిగినా దాని ప్రభావం మనమీద వుంటుంది. ఇక మన రాజకీయ నాయకుల విషయానికి వస్తే - బడ్జటులో ధరలు పెంచము అని ఎన్ని హామీలు ఇచ్చినా - తర్వాత ఆర్డినెన్సుల రూపంలో కొత్త పన్నులు వేస్తారు. అన్ని పార్టీల వాళ్ళూ అంతే..."

"మళ్ళా ఇష్టేజి దాటిచ్చి పోతాండు డ్రైవరు!"

"పోనీ... ఇంకా ముంగటికి... శాంతినగర్ దవాకాన దగ్గర మంది వున్నారు..."

"డ్రైవరు సాబూ... ఆపుకో... దవాఖాన దగ్గర ముసలాయనా పాపం ఓ పిల్లతల్లి ఉస్సరు. వానల తడుత్తాండ్రు..."

"హన్నా బెస్తోళ్ళను ఎక్కిచ్చుడె తప్పయింది. ఏందయ్యా మాలావు ఆపు ఆపు అంటానవ్... ముంగట ఆపుతనని డ్రైవరు సైగ జేస్తాండు కదా..."

"దిగేటోళ్ళ కోసం బస్సు ఎక్కడన్నా ఆగుతది. మరి ఎక్కెటోళ్ళ సంగతి ఏంది? మనం ఎచ్చంగ బస్సుల కూకోంగనె అయిపోయిందా! మీలో ఎవలకన్నా గట్ల వానల తడుసుకుంట నిలబడె అవస్త వస్తె దారిన పొయ్యే ఏ బస్సు ఆపకపోతే ఎంత అన్యాయమనిపిస్తది...?"

"యెనకచ్చె బస్సు ఎక్కించుకుంటది లేవయ్యా... ఇండ్ల జాగెక్కడున్నది డ్రైవరు ఇట్టం... నువ్వాకో..."

"యెనక బస్సులో ఉనోళ్ళూ నీ అసొంటోళ్ళే అయితే? పాపం చెట్టుకింది నిల్సున్నోల్లు బస్సెన్నడు ఎక్కాలె... పోవాల్సిన జాగకు ఎప్పుడు బోవాలె. . కొంచెమన్నా జాలి... యింగిత ముండాలె... డ్రైవరు సాబు .. ఆపు బస్సు.. "

"ఫిషర్‌మాన్ లాజిక్ బాగున్నది. రియల్లీ ఎ గుడ్ సామారిటాన్. మొత్తానికి డ్రైవర్‌ను ఒప్పించాడు."

"ఆ....ఆగనియ్యి..ఇగో సందుగ.. చత్రి...దిగుండ్రి. .జర ఆగవమ్మా...వాళ్ళు దిగినంక ఇగ ఎక్కుతావా.....?

"నాయినా సంటిదాన్ని అందుకో .. ఆఁ... ఎక్కిన.. ఏం వాన... ఏమ్ముసురు!"

"తువ్వాల కప్పు సంటిదానికి..."

"గీ ఇగంల ఎటు బోతనవమ్మా?"

"ఏం జెప్పాలె పెద్దవ్వా.. దీనికి బైలు కక్కుడు. శాంతిసగర్ దవాకాండ్ల ఏదో మందులిచ్చిండ్రు. తగ్గలె. పిల్ల ఇంకింక బేవోషు అయితాంది. ఏములాడకన్నా జల్దిన తీస్కపొమ్మన్నాడు డాకుటరు. గంట సేపాయె గీ మర్రి కింద నిలబడి. వాన యిసిరిసిరి కొడుతాంది. రెండు బస్సులు పోయినై. ఆపలే ఏమన్నాయం! లోకం మీద మన్ను జల్ల... దయలేని లోకం..."

"తిట్టవమ్మా... తిట్టు... పెద్ద మనుషులంటరు..."

"ఊకోవయ్యా... పెద్ద పరోపకారివి దిగివచ్చినవ్... నీకేం పనిలేదు. గంత దయున్నోడివి... సాపలను మాత్రం ఎందుకు సంపుతానవ్?"

"దర్మవ్యాధుని కత సదువు ధనీ..."

"కండక్టర్ సాబ్... యె దేహాతీ లోగ్ ఆప్కో బడె పరేషాన్ కర్రహె హోంగె..."

"హాఁ... యారోఁ... బేకార్ డ్యూటి... దీని యమ్మ... అసలు బస్సు ఎయ్యద్దయా అంటె మా డిపో మేనేజరు యినిపిచ్చుకోలేదు. అబ్బ ఏం జనం... సమజ్జేసుకోరు... ఓ పద్ధతి లేకుంట ఎక్కుతరు. దిగేటప్పుడు నిమ్మలంగ సొంత బస్సయినట్టు దిగుతరు. చిల్లర యియ్యరు. చినిగిన లోట్లిస్తరు. నేను అదే నోటు ఇంకోనికిస్తే - చెల్తదో లేదో యేరే నోటియ్యమంటరు. నేను శిక్కా గొడ్తన అనుకుంటరో ఏమో... ఇంకొందరేమో... మీరు జూస్తాండ్లు కద... గింత ఛార్జీ అయితదా అనుగుతరు. నేను మింగుతాన్నా... గిట్ల పరేషాన్ ఛఛ..."

"మొదట్లో - నా చిన్నతనంలో, నా ఎరుకల సిరిసిల్ల నుంచి కన్నగురంకు రూపాయి పావలా ఛార్జీ వుండె. మరిప్పుడేమో... ఎనిమిది రూపాలాయె... గట్లనే ఉజ్జోగస్తుల జీతాలు పెరుగుతానయ్. కూలీల రేట్లు పెరిగినయ్. మార్కెట్టులో పంటల ధరలు - వడ్లు, మిర్చి, పొగాకు, పత్తి ఒక్కటేంది అన్నిటి ధరలూ పెరిగినయ్. ఏ కూరగాయ జూసినా సవశేరుకు రొండు రూపాలకు తక్కువలేదు"

"గదే సమజుగా కుంట ఉన్నది ధనీ! వడ్ల ధర, జొండ్ల ధర... సర్కారు అన్నీ పెంచుతాంది. కాని మాగతి. కర్సులన్నీ పోంగ మా చేతులల్ల ఏమ్మి గుల్తలేదు. మీకేంది - రంది లేని బతుకు! శేనేత సంగాలున్నయ్ - రిబేట్లు, లోన్లు గుంజుతనే ఉంటరు లచ్చలకు లచ్చలు..."

"అది ఒకప్పటి ముచ్చట. ఇప్పుడు కాలం గట్ల లేదు. కొత్త ఏడి వచ్చిండు. చెకింగు అంటాండు. ఏవో రూల్సు అంటాండు. మగ్గాలు మూతపడ్డాయి. పాత

బిల్లులు సాంక్షన్ అయితలేవు. గుట్టలకొద్దీ మాల్ పోగుపడ్డది. అవి మెల్లగ జారగొట్టె బతుకు దెరువు కోసం ఊరిడిసి పెట్టి ఎటన్న పోదామనుకుంటున్నాం..."

"ఇక్కడ కొన్ని కొత్త పదాలు వింటున్నాను. ధని అంటే ఏమిటి కుమార్‌గారు?"

"ధనీ అంటే మగ్గాల యజమాని అని అర్థం. ఆప్కోకూ, ఖాదీ భండార్‌లకూ చేనేత గుడ్డలు సప్లయి చేస్తారు. నేతగాళ్లకు ధోవతీ కింత, చీరకు ఇంత అని కూలీలిచ్చి మిగిలిన సొమ్ము సొంతం చేసుకుంటారు."

"ఈ ప్రాంతంలో టైల్సు ఫ్యాక్టరీలు, రైసుమిల్లులు, సైజింగు మిల్లులు ఉన్నాయంటె ఇక్కడి పారిశ్రామికవేత్తలు బాగానే వున్నారన్నమాట. రైతులు సాదాసీదాగా అగుపడ్తున్నా మోతుబరులే అనుకోవాల్సి వుంటుంది..."

"ఇక్కడ దేశాయిలు ఉన్నారు. ఆ సరసనే బక్క రైతులూ ఉన్నారు. చేనేత సంఘాల యజమానులు, సైజింగు మిల్లు వోనర్లున్నారు. ఆ పక్కనే బీడీ కార్మికులున్నారు. యజమానుల కాళ్ళకాడ పన్జేస్తూ గంజి తాగి కాలం వెళ్ళబుచ్చే నేత కార్మికులున్నారు. సుభిక్షంలో దుర్భిక్షం అంటే ఇదే. దిస్ ఈజ్ ఎ పార్ట్ అండ్ పార్శిల్ ఆఫ్ అవర్ ఎకానమిక్ సిస్టమ్. లెక్కల్లో తలసరి ఆదాయం పెరుగుతుంది. కాని దారిద్ర్యరేఖకు దిగువన వున్న నలభై శాతం ప్రజలకు అందే ఫలం స్వల్పం. పాయసం గిన్నె నిండా ఉంది. కాని వాళ్ళ స్పూన్లు చాలా చిన్నవి. దేశ జనాభాలో పదహారు శాతం ఉన్న సంపన్న వర్గాలు జాతీయ సంపత్తిలోంచి యాభయిశాతం అనుభవిస్తుండగా, నలభై శాతం ఉన్న బడుగు వర్గాలకు పదిహేను శాతం కూడా లభ్యం కావడం లేదు..."

"దారిద్ర్యరేఖ నిర్వచనం ఏమిటో ఈ పత్రికల వాళ్ళకే తెలుసు. వెనుకటి రోజుల్లో పారిశ్రామిక ప్రగతి లేనప్పుడు వేరే సంగతి. ఇప్పుడు అంతమంది దరిద్రులున్నారంటె నేనొప్పుకోను. కష్టపడేవాడు సంపాయించుకుంటూనే ఉంటాడు. రికామీగా తిరిగే సోమరిపోతుల సంగతి మనమేం చెప్పగలము. కొందరికి అడుక్కుతినడంలోనే ఆనందం వుంటుంది. మా రామగుండం ప్రాంతంలో చూడండి – దళితుల పార్టీ, పీడితవర్గ కార్మిక పార్టీ, అందులోంచి చీలిన మరో పార్టీ, ఇవన్నీ బొగ్గుగని కార్మికుల్ని రెచ్చగొట్టి అస్తమానమూ సమ్మెలు, ఆందోళనలు చేయిస్తాము. ఈ అరాచక ముఠాల పని ఎప్పుడు బందులు, అశాంతి సృష్టించడమే. బుద్ధిగా పన్జేసుకునే కార్మికులు ఫర్టిలైజరు కంపెనీలో, పవరు ప్లాంటులో, సిమెంటు కర్మాగారంలో మంచిగా బాగుపడుతున్నారు. పోయిన్నెల షేర్ల సీజనులో మా బ్యాంకుల్లో ఒక్కరోజులో పదికోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయి. వ్యవసాయం చేసుకునే పల్లెటూరి జనం కూడా లక్షల కొద్ది రూపాయలు మదింపు చేశారు. మీరనే దారిద్ర్యం ఉత్తమాట. పత్రికల వాళ్ళు పుస్తకాలు ఏవో రాస్తాయి."

"ఒక ప్రాంతంలో పరిస్థితి మెరుగ్గా ఉన్నంత మాత్రాన జనరలైజ్ చేయకండి సార్. పావర్టీలైను దిగువన వున్న జనాభా శాతం అంకెలు ప్రభుత్వం ఒప్పుకుంటున్నవే. ఇక నిర్వచనం అంటారా. ఆర్థిక శాస్త్ర నిపుణులు, ప్రభుత్వ తరపు మేధావులు విభిన్న అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. ప్రత్యక్షంగా కనబడుతున్న స్థితిగతులను బట్టి ఒకటి చెప్పవచ్చు. నలుగురు లేక అయిదుగురు మంది

సభ్యులున్న ఒక కుటుంబానికి సాలీనా రూ 6400 ఆదాయంగా వుంటె అది పేద కుటుంబం రూ. 3,500 ఉంటే అది నిరుపేద కుటుంబం. ఇలాంటివి కొన్ని లక్షల కుటుంబాలున్నాయి దేశంలో..."

"దేశ పరిస్థితి అంత అధ్వాన్నంగా లేదు. కాయకష్టం చేసుకునేటోడు, రిక్షా తొక్కేవాడు, హమాలీలు – వీళ్ళందరికీ గిట్టుబాటు కూలీలు దొరుకుతున్నాయి. బడుగు వర్గాలు, నిమ్న వర్గాలు దొరికిందేదో సుష్కగా తింటున్నాయి. గవర్నమెంటు కల్పించిన గృహాలు, విద్యా, వైద్య సదుపాయాలు, రిజర్వేషన్లు తదితర సౌకర్యాలు పొందుతున్నారు. మంచిబట్ట కడుతున్నారు. పిల్లలను స్కూళ్ళకు పంపిస్తున్నారు. మీరు పత్రికల్లో చదువుతున్నట్టుగా గ్రంధాల్లో రాసినట్టుగా దారిద్ర్యం. దోపిడీలు వాస్తవంగా లేవు. ఏమంటారు సాయికుమార్ సార్...?"

"అఫ్‌కోర్స్... గణాంక వివరాలు సరియైనవని చెప్పడానికి వీల్లేదు. కొలమాన పద్ధతులు అధునాతనంగా లేవు. మనం చదువుతున్నది అర్ధసత్యాలే. దేశంలో అభివృద్ధి రేటు గణనీయంగా వుందని ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలు కితాబు ఇచ్చాయి. అయితే పంపిణీ వ్యవస్థలో లోపాలున్నవి. అవి బాగుపడితే అసమానతలు చాలావరకు తొలిగిపోతాయ్ మీరన్నట్టుగా – ఒకప్పటి దళితులు, సోకాల్డ్ బడుగు వర్గాల పరిస్థితి ఎంతగానో మెరుగుపడింది. ఇప్పుడు, పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కొత్త పథకాలు యోజనలు ప్రవేశపెడుతున్నది..."

"ఓకే. మీ పాయింట్ అర్థమయింది. ప్రభుత్వం వివిధ పథకాలు చేపడుతున్నది. ఇందిరా ఆవాస్ యోజన, ఏఆర్‌డిపి, జవహర్ రోజ్‌గార్ యోజన, రాజీవ్ వికాస్ గ్రామ్, ట్రైసమ్ లాంటివి. కాని వాటి లక్ష్యాలు నెరవేరడంలేదు. అవి టార్గెట్ గ్రూపుకు పెద్దగా ఉపయోగపడడంలేదు. ఎలాగంటే... ఊఁ... ఒక గ్రామం నుండి శాంపిల్‌గా ఈ ముసలమ్మను తీసుకుందాం. ఆమె బతుకుదెరువులో ఏమన్నా మార్పు వచ్చిందేమో... పిచ్చాపాటీగా కబుర్లాడి కనుక్కుంటాను మీరు గమనించండి..."

"యెములాడ కమాను... ఎవ్వల్లేరు... ఖాదర్‌బాయ్ .. సక్కగ పోనీ..."

"ఏం... ముసలవ్వా... బాగున్నావా... ఈ తుఫాన్ల ఎటో ప్రయాణం చేస్తున్నావ్?"

"దొరా... బాంచన్... నన్నేనా... ఏం జెప్పాలె... ముసల్దాన్ని. నడుం లేవనిత్తనేదు. ఐనా రెక్కాడితేగాని డొక్కాడని బతుకు ఎప్పుడు తీస్కపోతడో యెములాడ రాజన్న. మాది కొండపురం బాంచను... కన్నగురం పోయొత్తాన..."

"ఏమమ్మమినవ్? వడ్లా, జొన్నలా? ఎన్నెకరాల పొలం వున్నది?"

"పొలం మాకెక్కడిది బాంచను. నాలుగెకురాల శెల్క వున్నది. శెల్కల ఓ యేడు పండుతది. మరోయేడు పండదు. జొండ్లు మాకు తింటానికేసాలయి. ఇగ అమ్మేదెక్కడ? అంగట్ల నాలుగు నులక సుట్టలు, అయిదు శాంతాళ్ళు అమ్ముకత్తాన..."

"ఒక్కదానివే పోయిస్తానవ్? కొడుకులు, బిడ్డలు ఎంతమంది...?"

"లేకేంది. ఉన్నరు. ముగ్గురు కొడుకులు, ఒక బిడ్డ. నడిపోడు తాగితాగి కాలం సేసిండు. ముసలయ్య ఆ రంధి తోటె కన్నుమూసిండు. ఏం జెప్పాలె బిడ్డ మాదోగోస..."

"కష్టాలు లేనోళ్ళు ఎవరు ఈ లోకంలో? చెప్పు..."

"పెద్ద కొడుకు బారెయిన్ పోయచ్చిండు. ఉన్నయి ఊడగొట్టుకచ్చిండు. ఇప్పుడు పెంట జారగొడ్తాండు. అనికి ఎగుసాయం పని తప్ప అల్లుడు పనిరాదు. కోడలు, మనుమరాలు ఆసరా అయితరు నేను తాళ్ళు పేన్త. శిన్న కొడుకుది సీతమ్మ శెర. ఎక్కన్నో బస్సు కాలబెట్టిండ్రని, కూనీ సేసిండ్రని పొరగాండ్ల కోసం పోలీసులు ఊరిమీద పడి ముగ్గురు పోరగాండ్లను పట్టుకుపోయిండ్రు. వాళ్ళ పత్తాలేదు. మావోని కోసం కూడా అత్తాండ్రని తేల్సి ఈడుంటె బత్కవు కొడుకో అని అల్లుని దగ్గరకు తోలిచ్చిన, అల్లుడు రైసుమిల్లు పన్జేత్తడు. ఈడు లారీల మీన గట్టాలెక్కిత్తాండంట..."

"సర్కారు వాండ్లు ఇండ్లు జాగాలిస్తాండ్రు. స్కీములు, కుటీర పరిశ్రమలకు లోన్లు ఇస్తున్నరు కద మరి అవి మీ కందుతలేవా?"

"ఇస్కీమ్లు మాకు దెల్వది. మా వూరికి మొన్నమొన్ననే కరంటచ్చింది. వానాకాలం గోస తొవ్వలు మోరీలు ఊకె తెగుతయ్. రెండేళ్ళ కిందట గరీబోళ్ళకు ఇండ్లు అని కట్టిచ్చిండ్రు. షావుకారు దగ్గర అప్పుజేసి పెట్టి ఇచ్చిందని సంబరపడ్డం. ఐతే ఏమయింది? ఒక్కవాన పెట్టుకే కూలిపోయింది. బేంకోళ్ళు దుడ్డెకొక్కులు ఇచ్చిండ్లు గని పోయినేడు కరువుల మేత సరిగ లేక సచ్చిపోయినయ్".

"మీకు చుట్టాలు, పక్కాలు ఉన్నారా ఊళ్ళో... వాళ్ళేం చేస్తరు?"

"మా కులపోళ్ళయి ముప్పయి యిండ్ల దాకా ఉంటయి ఊరవతల. ఏం జేత్తారంటే గదే పొలం పనులు, రైతుకూలీలు, చెర్వులకు సదుగులకు మట్టి మోసుడు, బాయిలకు పూడిక తీసుడు. యేసంగిల జరంత రికామ్ దొరికితే గిట్ల తాళ్ళు పేనుడు, ఇత్తార్లు కుట్టుడు... ఊళ్లె పోరగండ్లు శానమంది లేరిప్పుడు. పట్నాలకు పోయిండ్రు. కూలీ పనికోసం ..."

మైగ్రేషన్ ఆఫ్ ద రూరల్ పూర్ టు ద టవున్స్... ఏ డిస్టార్టెడ్ ఫ్యామిలీ సరె... సరే... నులక సుట్టలకు, తాళ్లకు ఎంత సంపాయిస్తవ్...?"

"ఎంత బాంచను? ఊకె అల్లుతనా? అవ్వి ఎంత కట్టం, ఎంత బండసాకిరీ? జంగళ్ళ ఈతవనంల తిరుగాలే... గొండ్లోళ్లను, కామందులను బతిమిలాడాలె. ఈత కమ్మ కోసుకోవాలె. అప్పుడప్పుడు కొనుక్కత్తం. కమ్మను ఎండబెట్టి, శీరాలే. పేనేటప్పుడు జబ్బలు పడిపోతాయి. తొడలు, అరిశేతులు మంట పుచ్చుకుంటయ్, ఎన్నో పనులు సూసుకుంట ఈటెనుక పడితే నాలుగైదు సుట్టలయిత్తై. శాంతాళ్లకు ఇంకెక్కువ కట్టం. కోడలు మోదుగాకు కోసుకొత్తది. రెండు మోపెళ్లు ఇత్తార్లు అయితే ఊళ్ళనే కోమటి కిత్తం. యాభై కట్టకు పది రూపాలిత్తడు. ఇగ తాళ్లంటవా... మా కట్టం ఎవలకెరుక... గిట్టించి .. గిట్టించి బేరమాడుతరు జనం. సుట్టకు ఐదు రూపాలత్తె గొప్ప, శాంతాదుకు పది రూపాల్. పలుపుకు ఐదు. నాగటి ఆండ్రెకు పదిహేను సొప్పున అమ్ముతం. ఇయ్యాల ఏం దినమో ముప్పయి ఐదు రూపాలె దొర్కినయ్...?"

"మరి పైసలు పట్టుకుని ఎటు బోతున్నావ్ .."

"సిరిసిల్లకు బాంచను. . కొడుకు, అల్లుని ఇండ్లు ఒక్క దగ్గరే ఉన్నయ్, చెర్వు కింద. మనుమలు, మనుమరాండ్లు కండ్లల మెదుల్తాండ్రు. గీ వానలకు వరదలచ్చి నయట. ఊళ్ళె పానం గుటగుటమంటాది. . ఎట్లున్నారో ఆళ్ళు.. "

"కుమార్ గారూ సిరిసిల్లలో వరద బీభత్సం. వార్త నిజమేనా? చెరువు అంత పెద్దదా...?"

"ఏమంత పెద్దది కాదు. కాని మెరుపు వరదల మూలంగా పట్టణంలో చాలా ప్రాంతం జలమయం కావడం అప్పుడప్పుడు జరుగుతుంటుంది ఏమిటి మీ భయం?"

"అబ్బ చీకటి పడుతోంది. పట్టణంలో బహుశా కరంటు ఉండదు. అది కల్లోల ప్రాంతమట కద. మావాడి అడ్రసు వెతుక్కోలేక చావాలి చీకట్లో. మావాడు ఎక్కడో శివానగర్‌లో ఉంటాడట. నాకు ఈ వూరు కొత్త. మా అబ్బాయి శ్రీను మొండి వెధవ. చక్కగా ఇంటర్‌లో జాయిన్ అవమంటే – నామాట, నా పెద్దబ్బాయి మాట వినకుండా స్నేహితులతో, వాళ్ళతో గంగలోనయితే దూకుతాడట. ఇక్కడి పాలిటెక్నిక్‌లో చేరాడు."

"మీరు గాభరా పడకండి... మీవాడు క్షేమంగా ఉంటాడు. అతని ఇల్లు కనుక్కునేందుకు నేను సహాయపడతాను..."

"పొద్దున్నే పేపరు చూపించి నా భార్య ఒకటే గగ్గోలు. సిరిసిల్లలో చెరువు తెగిందనీ, విపరీతమైన ఆస్తినష్టం... కొంచెం ప్రాణనష్టం కూడా జరిగిందని వార్త సారాంశం. అసలు శివానగర్ ఎక్కడ. మా శ్రీను, నల్గురైదుగురు స్నేహితులతో రూము అద్దెకు తీసుకుని ఉంటున్నాడు."

"శివానగర్ గడ్డమీదనే వుంది. అక్కడి ఇండ్లు పక్కా ఇండ్లు. మా ప్రసాద్ అటే వెంకంపేట వైపు వస్తాడు. వాడి మిత్రుడి ఇల్లు అటువేపే... కుమార్‌సార్ మీరు ఈ చీకట్లో ఎటుపోతారు. ఈ రాత్రి మా యింట్లో ఉండండి. లేదా అందరం కల్సి అడ్వకేటు గారింట్లో బసచేద్దాం."

"సారీ... నాకు అర్జంటు పని వుంది. పని ముగించుకుని రాత్రే హైదరాబాద్ వెళ్ళిపోవాలి."

"ఎలా వెళ్తారు? తంగళ్ళపల్లి రూటులోనూ బ్రిడ్జి నెర్రెలు బాసిందట రాకపోకలు బంద్."

"కుమార్‌గార్ని అదరగొట్టకురా నేను తీసికెళ్తాను. కామారెడ్డి మీదుగా వెళ్దాం సార్. నేనూ హైదరాబాదుకే వస్తున్నాను. నా స్నేహితుడు మహదేవ్ కూడా... ఇంటెన్సివ్ స్టడీ సర్కిల్‌లో రేపట్నుంచే క్లాసులు ప్రారంభమవుతున్నాయి..."

"ఓహో... అందరి ప్రోగ్రాములూ ఫిక్స్ అయినాయన్నమాట... కుమార్ సార్ మీ జరూరు పని ఏమిటో తెల్సికోవచ్చా...?"

"ఇటు... దగ్గరికి జరుగు... చెప్తా... నేను వెంటనే మండలాఫీసర్ని కలవాలి. అతడు నా కజిన్. మున్సిఫ్ జడ్జికి మంచి ఫ్రెండు. జడ్జిగారు క్లబ్బులకు వెళ్ళక ముందే కల్సుకోవాలి. ఆయనకు విసి దగ్గరి చుట్టం. యూనివర్శిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టు ఖాళీ అయింది. అది జారిపోకుండా..."

"అర్థమైంది. ఇది మీకు మంచి టర్నింగ్ పాయింటు. విష్ యూ ఆల్ సక్సెస్."

"యేములవాడ... దిగుండ్రి..."

"అరే జనమే లేరు. వాన బాగానే పడుతాంది. మెల్లంగ దిగుండ్రి జార్తది కరంటు లేదు. పొద్దు గూకకముందే చీకటి ముసురుకత్తాంది."

"అబ్బో .. వాగు ఏం పొంగుతాంది... రాజన్న మహిమ..."

"గుడికి పోవాలంటె ఎట్ల? గట్లనే... దిమ్మెలన్ని మునిగిపోయి వంతెన అదుర్తాంది... అగో... మొక్కులున్నోళ్ళు, శివసత్తులు... చీలమండలు నీళ్ళల్లో మునుగంగ గుడి దిక్కు పోతానే వున్నరు..."

"... కరెండు ఎప్పుడు పోయిందో... నిన్నట్నుంచి చిమ్మ చీకటి ఊరంతా... కనిపిస్తలేదా మేము పెట్రోమాక్సు లైట్లు పెట్టుకున్నం... పవర్ లైన్లు గ్రిడ్ దగ్గరే కూలిపోయినయంట. ఎప్పుడు బాగయితయో తెల్వది..."

"రైట్... రైట్... ముసల్దానా సీట్లు ఖాళీగున్నాయి. గా ముంగటి సీటు మీద కూకో... ముల్లెల్నూ సీటు మీన్నే పెట్టు..."

"ఇగ కూకుంట బాంచను. గీడ... అయ్యో దొర్సానీ... దూరమే కూకుంట అగ్గో... నా ముల్లేది... దేవుడో నా ముల్లె..."

"ఏమొర్రుతానవ్ పిచ్చి ముసల్దానా... ఏ సీటు కింద పెట్టినవో, ఎవ్వల కాళ్ళకాడ పెట్టినవో మంచిగ సూసుకో... జర లైటెయ్యి... డ్రైవరు సార్..."

"వోరి దేవుడో... రాజన్నో... కొడుకో... నా ముల్లె చిన్నమూట. ఎవరు మాయం జేసిండో... వాని దినాలుగాను.. వానికి గత్తర రాను. కాలు దియ్యి బిడ్డ... జర కిందంత సూడనీ... ఊహు... కనపడ్తలేదు... అయ్యయ్యో నా రెక్కల కట్టం... నా నెత్తురు కార్చి సంపాయించినయి..."

"అబ్బ... లొల్లి... ముసల్ది ఊరువాడ ఏకం జేత్తాంది. ఇంకేం ముల్లెలే... మూడున్నాయి గద సరిగ్గ సూసుకో..."

"మూడున్నయి బాంచను... ఇయిగాక ఇంకో శిన్నముల్లె... మాయమయింది. నా కష్టం... నా సొమ్ము..."

"ఇంకో శిన్న ముల్లేనా... మీదేసుకుని సత్తాననుకున్నావా...? పోతేపోనీ... గమ్మునూర్కో..."

"ఏం పోయింది పెద్దవ్వా... ఏమున్నది అండ్ల? ఎక్కడన్న ఎక్కంగ దిగంగ మారిపోయినావా...? యాదికి దెచ్చుకో..."

"నా మూట కొడుకో... కన్నగురలం నాల్గు ముల్లెలు. వాగు దాటినంక నాల్గు ముల్లెలు... మళ్లీ గా బస్సు దిగి... గీ బస్సక్కేటప్పుడు..."

"వాగొడ్డున మర్సిపోయినవా... లేక బస్సులో..."

"ఔను గావచ్చు బిడ్డ... వాగొడ్డున పచ్చబస్సు... గదే... సర్వీసు ఎక్కి అది సిరిసిల్లకు పోదనంగనే జప్పజప్ప దిగి గీ బస్సుల ఎక్కిన... అండ్లనే పోయినట్టుంది. ఎవడు పుణ్యం కట్టుకున్నడో... వాని కాల్జేతులు పడిపోను. ."

"పచ్చబస్సు... ఎర్రబస్సు... ముసల్ది గోల్‌మాల్‌గ మాట్లాడుతాంది. కుడ్ పరేషాన్ అయి, దునియాను పరేషాన్జేత్తుంది. అన్ని బస్సులెల్లిపోయినయ్... ఏ బెస్తోళ్ళ సారూ... నువ్వేదో జెప్పి ముసల్దానికి ఆశ జూపెట్టకు..."

"ఎవ్వల్దయినా సామానే... నీ సూటుకేసో, చేసంచో, జబ్బ సంచో పోతే మీరూరుకుంటరా? ఆ సర్వీసు ఈ బస్సెనుకనే వస్తుండె .. కమాన్ దాటి ఇటు రావాలె... అగో వస్తాంది... రెండు నిమిషాలాపుదాం..."

"ఈ ఫిషర్ మాన్ మనల్ని ఈ వేళ సిరిసిల్లకు పోనిచ్చేటట్టు లేదు. డ్రైవర్! ఆపకు!..."

"అబ్బబ్బ... పిశాచాల రొద... మాకు సంధ్యవార్చుకునే సమయం మించి పోతోంది. బస్సు పోనియ్యి నాయినా.. "

"పొద్దుట్నుంచి ప్రయాణించి వళ్ళు హూనమయింది. మీ డిపార్టుమెంటుది ఇదేం ప్రజాసేవ? ఇదేమన్నా సిటీ బస్సా?... డోన్ట్ స్టాప్ ద బస్...?"

"మన సమయం విలువైందని మనం వర్రీ అవుతూంటె ఈ బాలసంత ముసల్దాని గోల ఏమిటి? వోహ్ క్లబ్బుకు టయమయిందంటె ఒక్కరోజు వేస్టు నాకు..."

"బంగారు నగల మూట పోయిందా ఎవరిదన్నా? మరేందయా ఆపుడు? ఇస్పీడుగ పోనీ. ఆవల పొద్దూకుతాంది... ఊళ్ళో మాకెన్ని పనులు...?"

"ఎదురుంగ గొడ్లమంద రోడ్డు దాటుతాంది..."

"గొడ్లమందను సూసి ఆపుతాండే... గొడ్లకాసే ఎర్రటి పిల్లను సూడ్డానికి ఆపిండా..."

"ఒక్క నిమిషమాల్మమైతే ఏం మునుగుతది? మళ్ళా ఇస్పీడు పెంచుతే అయిపాయె. అయిదు నిముసాలల్ల బస్సు సిరిసిల్ల చేరుకుంటది... డ్రైవర్ సాబ్... ఎట్లనో అట్ల బస్సు స్లో అయింది కద... జరంత ఆపు. వచ్చే సర్వీసుని ఆపుమని ఇషార జెయ్యి. ఎవ్వల్దయినా బాధే అనుకోవాలె... ముల్లె దొర్కుతే ముసల్దాని అదురుట్టం... దానికి కొండంత సంతోసం... అగో గదే ఎదురుంగచ్చే బస్సు..."

"మీకు సాపలోడు మంచిగ దొరికిండు... మా గండానికే ఇండ్ల ఉన్నాడు..."

"ముసలవ్వా... ఇట్లరా... ఎసోంటి మూట - ఏ రంగు?"

"వంకాయ రంగు బట్ట... గుమ్మడికాయంత ఉంటది ముల్లె..."

"... వోయ్... జర రోకాయించు బండి. యెనుక సీటోళ్ళకు అడ్డు బుడ్డీ ముల్లె మర్శిపోయిందంట..."

"...ఇగో... గిదేనా... ఎవల్దీ ధనరాశి... మావోళ్లు మాదిగాదంటే మాది కాదంటాండ్లు గీ చిరుగ్గుడ్డల మూటను... గిదేనేమో అడుగు..."

"వో బుడ్డీ... గీ బైంగన్ రంగు ముల్లె... ఇగో.....ఇండ్ల వజ్రాలు, ముత్యాలు గిట్ల కట్టుంచినవా..."

"ఆఁ గదే బాంచన్... మీ కడుపు సల్లగుండ... ఇటియ్యి..."

"ఎంత పాయిరంగా అందుకుని అలుముకుంటాంది ముల్లెను. అండ్ల రూపాల్ గిట్ల ఉన్నాయేమో..."

'దాని కొడుకు గల్ఫుకు పొయ్యి వట్టిగెందుకు వచ్చిండు? ముసల్దానియి అన్ని అబద్దాలె... వాడు బంగారం బాగానే తెచ్చిండేమో... ఏర్పడకుండ పాతబట్టలల్ల కట్టి, బిడ్డ దగ్గర్కి తీసుకోపోతాంది..."

"అబ్బో. కొన్ని పల్లెటూరోల్లు, ఏర్పడరు గని. . పట్నపోళ్ళకంటె భాగ్యమంతులు."

"పెద్దవ్వా.. ముల్లె యిప్పి సూసుకో... అన్నీ ఉన్నయో లేదో..."

"పిసుక్కుంట సూత్తాంది. కాని యిప్పుతలేదు. సరుకు బాగానే వున్నదేమో..."

"బుడ్డీ.. దొంగలు వుషారుగుంటరు. లోపలి సరుకు మాయంజేసి ఠాళ్లు రప్పలు పెడ్తరు. ఓసారి మా సడ్డకుని సూటుకేసు పట్నంల ఎవడో చోరీ చేసిండు. అయితే మళ్లీ దొర్కింది. హిప్పి చూస్కుంటే లోపట ఏమీ లేదు. ఓ యిటిక మాత్రం ఉన్నది. గందుకనే చెప్తానా. సూసుకో... మళ్ళా అయ్యో అని లొల్లి పెడితే బస్సులకెళ్ళి అవతల్కి నూకేస్త..."

"డ్రైవర్ సాబ్ గమ్మత్తుగ మాట్లాడుతాండు..."

"అగో .. యిప్పుతాంది మూట... అపురూపంగ... పైలంగా..."

"ఏందే ముసల్దానా... ఏమున్నాయ్... ఏంటియయ్యి...?"

"అవ్వేందో నల్లగున్నాయ్..."

"ఆకారం బట్టి అవి అరటిపండ్లను కోవాలె బాగా మాగినాయ్..."

"అయ్యి... పేలాలు... బురద అంటిందా...కాదు బెల్లం కలిపిన పేలాల ముద్దలు- గవ్వి కారప్పూస... మురుకులు..."

"అయ్యో. . ముసల్దాన... గివ్వేనా? ఉండవల్సినయి?"

"గివ్వె బిడ్డ... ఇవ్వి లేకపోతే... పోంగనె సుట్టు అలుముకుని 'అమ్మా ఏం పట్టుకచ్చినవే మా కోసం' అనే మనుమలకు, మనుమరాండ్లకు ఎట్ల సూపెట్టాలే?"

"ధూ... ధ్... ముసలిముండ... ఇగిలిత్తాంది... బోసినోరు పెట్టుకోని... ఏదో ఖజానా పోయినట్టు గుండెలు బాదుకున్నది..."

"కుమార్ సార్... ముసల్దాని ముఖం చూడండి. వాట్ ఎ బ్రైట్‌నెస్..."

"డ్రైవర్ సాబ్! జర ఇస్పీడు పెంచు. జప్పన ఇంటికెల్లాలె. పొద్గూకక ముందే చీకట్లు ముసురుతానయి... నల్లగ..."

"మన ముకాల తీర్గ..."

"అర్రె... గీసాపలోడు బాగా మాట్లాడుతాండు ఏందో... మర్యాదగ మాట్లాడు లేకపోతే..."

● ఆహ్వానం - నవంబర్, 1993 ●

# 58. అల్లాదీన్ అద్భుతదీపం

♦ జ్వాలాముఖి ♦

"కూలే కలలు చేసే బోధలు
పోరే ఆశలు పలికే వీధులు
కలవని పేదలు - కలిపే యోధులు
కలియబడే గాధలు -హైదరాబాధలు"

అతడు కరీంనగర్ కమాలుద్దీన్ కాదు. ఝూమ్రీ తలయ్యా జుమ్మన్ చాచా అంతకన్నా కాడు. అంతటా కనిపించే హర్షన్ మౌలా కూడా కాదు. అతడు అంబర్‌పేట అల్లాదీన్! అందరి ఆకాశదీపం!

ఇంకా వేగుచుక్క మేలుకోలేదు. చీకటి పట్టు సడలలేదు. కష్టజీవి నుదిటి చెమట బిందువుల్లా చుక్కలు మెరుస్తున్నాయి.

అగాధమైన ఆకాశంలోకి సత్యనిష్ఠలా చొచ్చుకు పోయిన వెదురుగడ, దాని గిలక మీంచి సన్నగా జారింది ఆకాశదీపం. బాటసారులకు గమ్యస్థానం చూపిన ఆ దీపం ఇప్పుడు చేతి లాంతరుగా మారిపోయింది. ఇందాకటి వెలుతురు పిట్ట ఇప్పుడు కరదీపిక అయింది.

ఆ పొడవాటి మనిషి ఎడమ చేతిలో ఊత కర్ర - కుడిచేయి, ముందు నడిచే అమ్మాయి భుజంమీద, ఆ అమ్మాయి చేతిలో ఇందాకటి కందిల్ - ఉభయుల ప్రభాత ఫేరీ!....

"ఉఠో! సెహరీకావఖ్త్ హోగయా హై!" అని ఒక తలుపు తట్టారు - తెరిచిన తలుపుల్లోంచి... "ఆదాబ్!"

"జీతేరహో బేటి!" పెద్ద మనిషి దీవెనలు -

"ఆదాబ్! ఆజ్ జుమ్మెతుల్ విదాహై" అమ్మాయి హెచ్చరిక -

"మాలూమ్ హైమేరీ అమ్మా! పానీకీ పరేషానీ హై" ఇంటావిడ.

"ఖయామత్. హై ఖయామత్! గునాహ్ బడ్‌గయాహై."

"బాబా! పానీకబ్ ఆతా, కబ్ జాతా నహీన్ మాలూమ్ - ఆ తాకీ, నహీన్ ఆ తాకీ, నహీన్ మాలూమ్- బహుత్ పరేషానీహై - ఘర్ వాలేగయే హైస్... ఆజ్ కా హమ్మామ్?"

అంటూండగా సైకిల్ మీద ఇంటాయన డబ్బా నీరు తెచ్చి సైకిల్ దిగి బాబాకు ఆదాబ్ అన్నాడు – బాబా దీవిస్తూ కదిలాడు.

గుంతల్లోకి దిగి పంపుల్లోంచి నీరు తోడుతూన్న ఆడా మగా బాబాను చూడగానే నిల్చొని ఆ ప్రాతస్మరణీయునికి దండప్రణామాలు సమర్పించారు. బాబా దీవెనలు అంద జేశాడు. ఇలా తెలిసిన ఇళ్ళన్నీ తిరిగి మేల్కొల్పులు చదివాడు బాబా. ముందు మేల్కొన్న వాడుగా ఇంకా మేల్కొనని వారిని మేల్కొల్పుతూ రంజాన్ ఉపవాస దీక్ష ప్రారంభ విధులు గుర్తుచేస్తూ నడయాడే ఆకాశదీపంలా అన్ని వీధుల్ని చుట్టి తన గుడిశ చేరుకున్నాడు.

బావిమీద మోట చిమ్ముల దగ్గర బాబా గుడిశ. అదొక ఆశ్రమం. అక్కడికి చేరి బాబా ఇంజను నీటితో స్నానం చేశాడో లేదో, తెలిసిన వారు 'ఖిచిడీ' తెచ్చి ఇచ్చారు. దాన్ని సేవించి 'సెహరీ' వేకువ నమాజు కోసం ప్రార్ధన పిలుపు 'ఆజాన్' చేశాడు. ప్రార్ధనలోకి దిగాడు. నిశ్చల సమాధి. జీవుని నిర్వేదం.

అల్లాదీన్ ఆ గరీబ్ నగర్‌లో అందరికి అన్ని విధాల పెద్ద దిక్కు. ఆ గుడిశల వీధిని ఎన్నో రకాలుగా సంస్కరించాడు. అందరూ 'బాబా' అని పిలుస్తారు. నూరు రంజాన్లు చూడాలనుకునే బాబా ఇప్పటికి ఎనభై చూసి వుంటాడు. ఇది వరకు అక్కడ సేద్యగాడు. ఇప్పుడు శక్తిలేక ఆ పని వదిలేశాడు. ఇరుగు పొరుగు వారికి మతవిధుల్లో నిత్యావసరాల్లో సాయపడుతున్నాడు. నిజాయితీకి నిష్ఠకు అతడు పేరు పొందాడు. యూనానీ మందులు కూడా ఇస్తాడు.

ఆజానుబాహువు. బక్క ప్రాణం. స్ఫురద్రూపి. విశాల ఫాలం. దీర్ఘపు చూపులు. తెల్లని గడ్డం. తలపై జాలీ టోపీ. తెల్లని లాల్చీ పైజామా. అంగవస్త్రం. భుజాన జోలె సంచి. కాని ఫకీరు కాడు. ఊతకర్ర. పాపోసుల లయ. వేషం విశ్వాసానికి, భాష సంస్కారానికి, నడక నాగరికతకు, ఉనికి ఉదాత్తతకు చిహ్నాలుగా ఆ బాబాలో చోటు చేసుకున్నాయి. అడుగడుగునా వందనాలు పొందే బాబా అయిదో నియమం 'హజ్' (మక్కా యాత్ర) సాధ్యం కానందుకు చింతలో పడ్డాడు. మిగతా నాలుగు 'అజా' (ప్రార్ధనకు పిలుపు) 'నమాజు' (ప్రార్ధన – అయిదుసార్లు) 'రోజా' (ఉపవాస దీక్ష) 'జకత్' (దానం) సాధ్యం చేసుకున్నాడు.

అయిదో నియమం పూర్తి చేయడానికా అన్నట్లు బాబా రంజాన్ ఆ ఆఖరి శుక్రవారం మధ్యాహ్న నమాజు కోసం, చార్మినార్ దగ్గరి మక్కామసీదు సామూహిక ప్రార్ధనకు బయల్దేరాడు. ఎండకు తట్టుకునే అన్ని ఏర్పాట్లు చేసుకున్నా బక్క ప్రాణాలపై ఎండ ప్రతాపం చూపుతూనే వుంది. చిల్లుల గొడుగు, ఆపైన వడగాడ్పు.

తాతా, మనుమరాళ్ళు సుదీర్ఘ పాదయాత్ర అది. పైగంబరులా కనిపించే ఆ తాత, మిగిలిపోయిన మత ఔన్నత్యానికి ప్రతీక అవుతే మనుమరాలు ప్రాప్తకాలజ్ఞతకు దిక్సూచి. పాతకొత్తల మేలు కలయిక వారిది. మహా ప్రస్థానంలా సాగిపోతున్న బాబా పాదయాత్ర పలుకరింపుల మజిలీలను దాటి గమ్యస్థానం చేరేసరికి ఆకాస్తా పుణ్యకాలం మొన మీదకు వచ్చి నిలుచుంది.

చెమట చిత్తడిని తుడుచుకొని మనుమరాలందించిన సీసా నీటితో వజూ (ప్రక్షాళన) కార్యం పూర్తిచేసి, ఆమెను బస్సుస్టాండులో భద్రంగా వుండమని

నయాపూల్ గట్టుమీద ఆఖరి వరుసలో నమాజుకు నిలుచున్నాడు సైరన్ మోగింది. నమాజు సాగింది.

మక్కా మసీదు ఇంకా మైలుదూరం ఉందనగానే నయాపూలు మండుటెండలో నిలుచున్న ప్రార్థనా పరుల బారుల్లో ప్రతి ఏటా బాబాకు ప్రాప్తమయ్యే స్థలం నయాపూలే. మక్కా మసీదులో ప్రార్థన చేయాలన్న అతడి చిరకాలవాంఛ తీరనే లేదు. జబ్బబలం మీద అతడికి విశ్వాసం లేదు. అర్ధబలం అతడి దరిదాపుల్లోకి రాదు. అంగబలం వత్తిడికి లొంగదు. తృష్ణలేని తృప్తి అతడి ప్రాప్తి.

రంజాన్ ఆఖరి శుక్రవారం (జుమ్మెతుల్ విదా) మధ్యాహ్న సామూహిక ప్రార్థన ముస్లిములకు చాలా ముఖ్యం. ఆరోజు దూరతీరాల నుండి వస్తారు. వారు మసీదుకు నాలుగు వైపులా మైళ్ళ తరబడి నిలుచొని ప్రార్థనచేస్తారు మత విద్వేషాల వల్ల అది ఉద్రిక్తఘట్టంగా మారింది. గండం గడవడం ప్రార్థనలో భాగమైంది. తుపాకుల కాపలాలో దైవప్రార్థన.

నమాజు ముగిసింది. బాబా ఆత్మ మక్కా యాత్ర చేసి వచ్చినంత తృప్తిని పొందింది. తెలిసినవారు వంగి వంగి దండాలుపెట్టారు. అందర్నీ దీవిస్తూ బస్సుస్టాండు చేరాడు. అప్పటికే బారులు తీరిన చంటి పిల్లల (హిందూ) తల్లులు బాబా దీవెనల కోసం ఆత్రపడ్డారు. ప్రతి శిశువునూ వళ్ళోకి తీసుకొని ప్రార్థనలు చేసి ఆరోగ్యవచనాలు రోగిష్టి ప్రాణాలపై ఊదాడు. వళ్ళంతా నిమిరి దీర్ఘాయువు పోశాడు. ఎదురొచ్చిన ప్రతిఫలాన్ని మర్యాదగా తిరస్కరించాడు. తిరుగు ప్రయాణం కట్టాడు. ఆలస్యంగా వచ్చి దారిలో ఆపిన పిల్లల తల్లుల్నీ సంతృప్తిపరిచాడు. దీవించి అభయహస్తం అందించాడు. మనుమరాలు, చంటి పిల్లల రుగ్మతలు పసిగట్టి బాబా సలహా మేరకు యునానీ మందుల పొట్లాలు తల్లులకు ఇచ్చింది. దారి పొడుగునా మర్యాదల దీవెనలు మజిలీలు కొనసాగాయి.

ఎండ తీవ్రతను తట్టుకుంటూ పబ్లిక్ గార్డెన్ ప్రధాన ద్వారం దగ్గరి బస్సు స్టాండులో బాబా చతికిలపడ్డాడు. సాయంత్రం దాకా గార్డెన్ చెట్ల నీడల్లో విశ్రాంతి తీసుకొని సాయంత్రం అక్కడి మసీదులో రోజా విడిచి నమాజే చేసి చల్లపూట ఇల్లు చేరుదామని బాబా ఆలోచన–

ఎదురుగా ఎండకు కరుగుతున్న తారులో ఏదో మెరిసింది. మనుమరాలిని వారించి పరుగున పోయి పెకిలించి రొండికి చెక్కాడు. ఈలోగా దూసుకు వచ్చిన పోలీసు జీపులోంచి దూకిన అమీను, బాబా మెడపై చరచి పట్టి జీపు ఎక్కించాడు. ఎండవల్ల రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. అంతా చోద్యంగా సాగింది. కేకేసి వెంబడించి పరుగున మనుమరాలు కంట్రోలు రూము చేరింది. అప్పటికే బాబాలోనికి నెట్టబడ్డాడు. ఎంత రోదించినా అమీను వినలేదు. కసిరికొట్టాడు.

ఆ పగటి చీకటికి బయపడ్డ మనుమరాలు రోడ్డు మీదికి వచ్చి తెలిసిన ముఖాల కోసం దిక్కులు చూసింది. దూసుకుపోయే ఆటోను ఆపింది. అంబర్‌పేట చేరి తెలిసినవారి తలుపులు తట్టి మధ్యాహ్న మేలుకొలుపులు అరిచింది. హడలిపోయిన వారు విషయం తెలిసి మండిపోయారు.

దయగలవారు, ధైర్యం గలవారు కావడానికి వ్యవధికావాలి. దానికన్నా ముఖ్యం జనాన్ని కూడదీసే సంఘ నిర్మాణం కావాలి. ఆ పని మనుమరాలు చేసింది. ముందు

నిలిచాడు రామాయలం పూజారి. వెంట నడిచాడు ఖాద్రీబాగ్ ముర్షద్‌మియా. ఆ తర్వాత మనుమరాలి ఆర్తనాదం విని అందరూ నడిచారు. ఆటోలు, రిక్షాలు, సైకిళ్ళు, స్కూటర్లు, కూరగాయలవాళ్ళు, పళ్ళబళ్ళవారు, పాలడబ్బాలవారు, కష్టజీవులందరూ ఊరేగింపుగా కదిలి కంట్రోలు రూము చేరారు.

ఆఖిరీ జుమ్మా ఏ గొడవా జరగనందుకు కంట్రోలు రూము నిశ్చింతగా నిద్రపోయింది. చేరుతున్న జనం అలజడి అంతగా పట్టించుకోలేదు మొదట-.

రావాల్సిన వారందరూ వచ్చాక ఎంతకూ వినేనాథుడు కనిపించకపోవడం వల్ల తెగించారు పురజనులు.

"బాబా కో ఛోడ్‌దో!" నినాదాలు మిన్ను ముట్టాయి. హడలిపోయారు. వచ్చి చూశారు. జవాన్లు, పరుగున వెళ్ళి అమీన్‌సాబ్‌ను నిద్రలేపారు. నిద్రాభంగానికి విరుచుకపడుతూ లాఠీ దించి తగ్గాడు.

పూజారి సాహసించి కంట్రోలు రూము మెట్లెక్కి వసారాలో నిలుచున్న అమీన్ సాబును అనునయిస్తూ విన్నపాలు చేశాడు.

"మీరు పొరబడినట్లున్నారు! అల్లాదీన్ బాబా మర్యాదా పురుషోత్తముడు."

"యేంది? పొరబడ్డాం? పోలీసోళ్ళా? హౌలా గాళ్ళా?"

"ఎంతైనా మనుషులమే కదా! తాడును చూసి పాముగా అనుకోమా?"

"ఆ ఫరకు తెలియదా? బేవఖూఫ్ గాళ్ళమా?"

"రామ రామ? ఆ మాట నానోట రాలేదు?"

"అయితే ఏంది సోది?"

"బాబా నిరపరాధి! వదలండి! మా జమానతు తీసుకోండి!"

"అదిగో! ఆ బాగేయాం! మేను గేటు కాడ జుమ్మకుజుమ్మా కత్తిపోటు! ఇన్నాళ్ళకు ఒకడు దొరికిండు..."

"ఆ ఒకడు యీ అల్లాద్దీన్ కానే కాడు. పిర్ పైగంబర్ లాంటివాడు - జమానతు ఇస్తాం-"

'ఖూనీ కేసులో జమానతులుండవు"

"ఖూనీ కేసా?"

ఒక యువజవాను వచ్చి ఏదో చెప్పబోయాడు.

"యేంది? కోదండం! నీ గురించి శానశాన వింటున్న. కళ్ళతో చూస్తున్న. జవాన్లను జమ చేస్తున్నవట. పుస్తకాలిస్తున్నవట. యేంది నీ సంగతి? యింటికి పోవాలనుందా? ముందొచ్చిన చెవులకంటే వెనుకొచ్చిన కొమ్ములు తేజా? యేమి? యెమ్మే అని దిమాక్ చెడాయించిందా?"

"చెవులు వింటే కొమ్ములు పనిచేస్తయి."

"యేంది? ఎదరు జవాబులు ఇస్తావ్? నీ సంగతి చెప్తా!" అని గర్జిస్తుండగా హెడ్ కానిస్టేబుల్ వచ్చి కోదండాన్ని లోనికి తీసుకెళ్ళాడు.

అవకాశం చూసుకొని మళ్ళీ పూజారి అనునయించాడు.

"అమీన్‌గారూ! నమాజ్ రోజాలు పాటించే నిజమైన అల్లా భక్తుడు అల్లాదీన్."

"పంతులూ! అలాంటివారే ఖతర్‌నాక్‌గా వుంటారు. పెద్దపెద్ద గడ్డాలు నమాజు గుర్తులు పెట్టుకొని చాకూలు నడిపిస్తారు. ఏనుగుకు చూపించే దంతాలు సౌమ్యంగా వుంటాయి. నమిలి మింగే దంతాలు లోన క్రూరంగా వుంటాయి. మీకు తెలియదా?"

"మా బాబా అలాంటివాడు కాడు. మత సామరస్యానికి దీపస్తంభం- అన్ని మతాల వారు ఎందరొచ్చారో చూడండి మద్దతు ఈయడానికి."

"యేంది! జనాల్ని చూపించి భయపెడ్తున్నావ్! అవును యేంది నీ కథ? ఈ శంకరాచార్లకు ఆ పీర్ల పండుగకు ఏమిటీ సంబంధం?"

"కళ్ళకు, వెలుగుకూ వుండే సంబంధం, ఈ బాబా మా రామాలయం పక్కన ఉండే ఖాద్రీబాగ్ మసీదులో అజా నమాజులు చదువుతాడు. మా గుళ్ళో ఉత్సవాలప్పుడు పళ్ళు, పూలు, టెంకాయల దుకాణం పెడతాడు. రథోత్సవం నాడు మల్లెపూల దండలతో రథాన్ని నిలువెత్తు అలంకరిస్తాడు. రావణ కుంభకర్ణుల్ని చేసి లంకా దహనానానికి ఏర్పాట్లు చేస్తాడు... మసీదుకు మందిరానికి మానవతా వంతెన వేశాడు... మహనీయుడతడు.."

"అంతటి మహాపురుషుడి చేతిలో ఆయుధం ఎందుకు వున్నట్లు? చేతులకు చొక్కాకు రక్తపు మరకలు ఎక్కడి నుంచి వచ్చినట్లు?"

"అతణ్ణి చూపించండి. వాస్తవాలు తెలుస్తాయి. పాలు నీరు వేరవుతాయి"

"యేమీ? మీరు పరమహంసలా?"

"కాదు మేము కర్మయోగులం!"

ఇంతలో అధికార్లు ఒకరొకరూ దిగసాగారు.

ఎండలో మాడుతున్న జనం ఓపిక చస్తూ ఉంది. కమీష్నరు కూడా వచ్చాడు. జవాన్ల హడావిడి పెరిగింది. అమీను తొణకలేదు. రాజ్యబింకం!

"అయ్యా కమీష్నరు గారూ? మీరైనా కనికరించి పిచ్చుకమీద పడ్డ బ్రహ్మాస్త్రాన్ని తొలగించి పుణ్యం కట్టుకోండి"

"తొందరపడకుండి పూజారిగారూ" అంటూ కమీష్నరు బాబాను తీసుక రమ్మన్నాడు. కోదండం పరుగున పోయి బాబాను జాగ్రత్తగా నడిపించుకొని తెచ్చి మర్యాదగా నిలుచోబెట్టాడు వసారాలో. అందరూ చప్పట్లు చరిచారు.

"బాబా జిందాబాద్! బాబాకో ఛోడ్‌దో! హం జమానత్ దేంగే! హిందూ ముస్లిం భాయి భాయి...!"

అనే నినాదాలు పిక్కటిల్లాయి. పూజారి, మనుమరాలు నిదానింపజేశారు. అమీను అహాన్ని చంపుకోలేక కన్నెర్ర జేశాడు. కోదండాన్ని కొరకొర చూశాడు. పూజారి పరుగున వెళ్ళి బాబాను కౌగలించుకొని విషయం తెలుసుకున్నాడు.

"కమీష్నరుగారూ! ఈ ముసలి ప్రాణాన్ని చూడండి! తోస్తే తొంభై అడుగులు పడతాడు! ఇతడు హత్య చేయగలడా చెప్పండి? (కోదండం అందించిన ఆయుధం

అనే దాన్ని ఎత్తి చూపుతూ) ఇదేనండి! అమీనుగారు ఆరోపించిన ఆయుధం! (జనంలో నవ్వులు! అధికార్లు చోద్యంగా చూశారు! జవాన్లు నవ్వును ఆపుకున్నారు.)

ఈ మేకు బద్ద అతడి ఉపకరణం. జీవనాధారం. దారిన పోయేవారు ఏమరుపాటున విలువైన వాటిని జారవిడుచుకుంటారు. కొందరు కొన్ని పనికిరావని పారేస్తారు. అవన్నీ తారు రోడ్డుమీద పడి తారులో వాహనాల బరువుకు కూరుకపోతాయి. ఎండపూట తారు కరిగి అవి బయటపడ్తాయి. అలాంటి వాటిని ఈ మేకు బద్దతో పెకిలించి జోలె సంచిలో భద్రపరుచుకుంటాడు. (బాబా భుజాన వేలాడుతున్న జోలెసంచి తీసి గుమ్మరించాడు. మనుమరాలు కూడావచ్చి తన భుజాన వున్న జోలెసంచి తీసి గుమ్మరించింది. తన మేకు బద్దను ఎత్తి చూపింది) జానెడు కూడా లేని ఈ మేకు బద్ద ఆయుధం కాగలదా చెప్పండి!"

అలా పోగైన ఇనుప, ఇత్తడి, రాగి, సత్తుపిసర్లను కిలోలుగా జోకి బేగం బజారులో అమ్ముకొని దినవెచ్చాలు, యునానీ మందులు కొంటాడు బాబా. దేహీ! అని ఎవడినీ బిచ్చమెత్తడు. నెత్తురు చచ్చి, శక్తి ఉడిగాక అతడు చేపట్టిన కొత్తవృత్తి ఇది. ఈ లోహ సంచనయనంలో బాబాకు అదృష్టం కలిసి వస్తే ఒకోసారి వెండి, బంగారు నగలు ముక్కలు దొరకుతాయి. అలా దొరికిన ఒక చెవి రింగును తెచ్చి మనుమరాలి చెవికి ఎలా అలంకరించాడో చూడండి. మరొకటి దొరకక పోతుందా అని అతడి ఆశ! కాని మనుమరాలు ఇంతెత్తు పెరిగినా దొరకలేదు! నగలు వేసుకొని తిరిగే రోజులా ఇవి! ఉన్నవారు తాకట్టుపెట్టి బతకాల్సిన రోజులు?

ఈ మధ్యాహ్నం ఆ బస్‌స్టాపుకు ఎదురుగా ఎండకు కరుగుతున్న తారులో ఒక కాలి వెండి గొలుసు కనిపించిందట. వెళ్లి పెకిలించాడు. గోరూడింది. చొక్కా చేయి నెత్తురుతో తడిశాయి. అయినా తెలియకడుగుతాను! కత్తిపోటని హత్య అని అనుమానించి నిర్బంధించారే అమీనుగారు? హత్య అని అనుమానించిన చోట హతుడులేక గాయపడినవాడు ఉండాలి కదండి! ఆ దాఖలాలేనిదే ఇతడు హంతకుడని ఎలా నిర్ణయించారండి? అమాయకుడి మీద అఘాయిత్యం చేశారు?"

"విలువైన వస్తువుల్ని పట్టుకెళ్ళడం కూడా నేరమే! – అమీను.

"అయ్యా! అమీనుగారూ! తమరు సొంతదార్లను వెదకి తెచ్చి అందజేస్తామంటే చెవి రింగు ఈయడానికి మేమూ సిద్ధమే! అంతేకాదు. ఈ ఇనుప ముక్కలూ తీసుకోండి..."

అనడమే తడవుగా దూసుకు వచ్చిన మనుమరాలు తన చెవి రింగును తీసి అమీను చేతిలో పెట్టింది. తన రొండి నుండి తీసి కాలి వెండిగొలుసు అమీను చేతిలో వేశాడు బాబా –

"నో! నో! అవన్నీ ఇచ్చేయండి!" అని కమీష్నరు హుకుం జారీ చేశాడు. అమీను తన చేతిలోనివి కింద విసిరేశాడు. కోదండం పరుగున వచ్చి కిందపడిన గొలుసును రింగును అమ్మాయికి తిరిగి ఇచ్చివేశాడు. ఇనుప ముక్కల్ని సంచిలోకెత్తి బాబాకు అందజేశాడు. ఆ ఇనుపముక్కల రాశిలో విప్పి చూడగా కొన్ని యునానీ మందుల పొట్లాలని తేలాయి.

"పూజారిగారూ! ఇంతగా విషమించనీయక పట్టుబడగానే బాబా ఆ విషయం చెబితే పోయేది!"

"కమీష్నరుగారూ! నిందితుని నివేదన ఎప్పుడూ చెవికెక్కదు. రెండు గంటలుగా దాదాపు రెండువేల మందిమి ఎండలో మొత్తుకున్నా అమీనుగారికి దయ రాలేదే! ఆ అమ్మాయి చేసిన ఆర్తనాదం గెంటివేతకు గురైందే! ఉపవాసదీక్షాపరుడి నూతిలో గొంతుక లాంటి దీనాలాపన చెవికెక్కేదా? చెప్పండి? అనుమానం పెనుభూతం!

"అయోధ్య గొడవల కారణంగా తరచూ ఇక్కడ కత్తిపోట్లు జరుగుతున్నాయి. ఆ కారణంగా అలా అనుమానించడంలో పొరబాటు లేదు."

"బాధ్యతగల అధికార్లు మీరూ అమీను తప్పిదాన్ని సమర్థిస్తే ఎలాగండి? నీడను చూసి భయపడితే ఏమిటి లాభం? నేరస్థులు ఎక్కడున్నారో మీకు తెలియదా? 'రూల్ ఆఫ్ లా' ఎవరివల్ల విరుగుతూవుందో మీకు బోధపడనిదా? వంద నేరస్థులు తప్పించుకున్నా పర్వాలేదు. కాని ఒక్క అమాయకుడు శిక్షింప బడరాదంటారే? ఇంత సులభంగా, ఇంత నిర్లక్ష్యంగా, ఏ ఘరానా నేరస్థుడినైనా పట్టుకొని శిక్షించగలిగారా? ఈ రోజు మాత్రం ఒక మహాత్ముని ఆత్మను క్షోభపెట్టారు? అదీ ఆయన ఏ ఆదర్శాలకైతే తన జీవితంలో నిలిచారో? ఆ ఆదర్శాల ఖూనీకోరుగా అతణ్ణి దోషిని చేశారు? ఛ! ఛ! ఇదేమి రాజ్యం ?"

"పోలీసు రాజ్యం!" అని జనంలో ముందు వరుసలు అందుకోగానే వెనక వరుసలు రెట్టించాయి.

"పూజారిగారూ! మీరు చూడబోతే రాజకీయ బాధితుల్లాగ వున్నారే?"

"జనాబ్ ఆప్ క్యా సంఝే ఇన్కో! వీరు స్వాతంత్ర్య సమరయోధులు! పరోపకారి - మానవ సేవను మాధవ సేవను కలిపేసిన కర్మయోగి" అన్నాడు బాబా.

"రీక్ హై ఆప్ ఆరాం కరో!" కుర్చీ తెప్పించి వేయించాడు కమీష్నరు బాబాకు.

ఇంతలో డీజీపీ మరికొందరు కింది అధికార్లతో దిగాడు. అందరూ సాల్యూట్‌లు మోగించారు. అతడప్పటికే ఫోన్‌లో అన్నీ తెలుసుకున్నాడు. తాను వచ్చేదాకా ఆగమని చెప్పి ఇప్పుడు దయ చేశాడు -

"జరిగింది జరిగిపోయింది. బాబాను వదుల్తాము! కానీ! ఇక్కడకాదు! అతని బస ఎక్కడో! అక్కడ!" అన్నాడు డీజీపీ. వాహనాలు సిద్ధం అయ్యాయి. అధికార్లు కార్లలో, బాబా, అమీను, జవాన్లు, పోలీసు వ్యాన్‌లో బయల్దేరారు. నినాదాలు మిన్ను ముట్టాయి - 'కానీ' అనే డీజీపీ మాట అందరినీ వేధించినా మనుమరాలి బుద్ధికి మాత్రం పదును పెట్టింది.

పురజనులంతా పోలీసులకన్నా వేగంగా గరీబ్ నగర్ చేరే వేగంలోకి దూకారు. మనుమరాలు, పూజారీ ఆటోలో బస చేరుకున్నారు అడ్డదారుల్లో. పోలీసులు చేరేసరికి జనం విపరీతంగా పెరిగిపోయారు. అందరూ పేదలు, కష్టజీవులు, ఆత్మాభిమానం కలవారు. తోటి మానవుని పట్టించుకునే చైతన్యం కలవారు. చైతన్యానికి లింగ కుల మత వివక్ష రానీయకుండా తాత, మనుమరాలు, పూజారి అనేక సమావేశాల్లో తర్ఫీదు ఇచ్చారు. క్రమశిక్షణ పెంచారు. అవగాహన మలిచారు.

బాగంబర్‌పేట్ వెనకభాగం. మోటబావి. కాని ఇప్పుడు మోటలేదు. ఇంజనుతో పనిచేస్తూ వుంది. మోట చిమ్ములమీద ఒక ఆకర్షణీయమైన పర్ణశాల. చుట్టూ మొక్కలు, వేపచెట్టు దాని నీడలో మేక, మేక పిల్లలు. అక్కడే ఆశ్రమ దీపస్థంభంలా వెదురుగడ. ఆకాశదీపానికి ఆధారం. ఒక పక్క గుడిశలు, మరోపక్క రహదారిలో పెంకుటిళ్ళు, మోట కాలువలు. దూరాన పొట్టిచెట్ల మల్లెతోట. దాని పక్కన కూరగాయల పంట. బావిమోట చిమ్ముల ఎదుట ఆరుబయలు ఆ వెనక చింతచెట్లు, ఇమ్లీబన్‌గా పేర్కొనబడే ఆవాడ ఇప్పుడు గరీబ్‌నగర్‌గా చెలామణి అవుతూవుంది. బాబా ఆ నగరానికి రాజు కాదు ప్రవక్త. మనుమరాలు ఉపాధ్యాయురాలు. పూజారి సలహాదారుడు.

వచ్చీరాగానే మనుమరాలు పూజారీ కలిసి చేరిన జనాన్ని తొందరపడరాదని హెచ్చరించారు.

పోలీసు వాహనాలు దిగాయి. ఆదేశాలకనుగుణంగా జవాన్లు గుడిశలన్నీ గాలించ సాగారు. సోదాలు మొదలయ్యాయి. ముందే హెచ్చరికలు పొందిన ప్రజలు కాబట్టి చూస్తూ నిలుచుండిపోయారు. సహకరించలేదు. ప్రతిఘటించలేదు. కోదండం, తోటి జవాన్లతో వ్యవహారం జాగ్రత్తగా నడిపిస్తున్నాడు. తోక తొక్కిన పాములా ఉన్న అమీను జనాన్ని చూస్తున్నాడు. పెదవులు బిగిస్తున్నాడు. సొంత లాభం అంతమానుక నిలుచున్న జనానికి ఎలా బుద్ధి చెప్పాలో ఆలోచిస్తున్నాడు. అడ్డం తిరిగిన కథను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

వ్యాను దిగిన బాబాకు చప్పట్లతో జనం స్వాగతం చెప్పారు. పూజారి మనుమరాలు బాబాను కౌగలించుకొని గుడిశ ముందునిలిపారు. పొద్దు చూసి రోజా విడిచే ప్రయత్నంలోకి వెళ్ళాడు బాబా.

దూరాన మసీదు సైరన్ మోతవినబడింది.

మంచినీళ్ళతో రోజా విడవాలనుకున్న బాబా చేతిలో, పూజారి తన సంచిలోంచి తీసి పలుకుల పొట్లం పెట్టాడు. పొట్లం తెరిచి నాలుగు ఎండు ద్రాక్షపళ్ళను తీసి నోట్లో వేసుకొని మంచినీళ్ళు తాగాడు. రోజా విడిచి ఆకాశాన్ని చూశాడు. చేతులెత్తాడు. ఆ తర్వాత పూజారికి, పోగైన జనాలకు సలాము చేశాడు. మనుమరాలు కళ్ళనీళ్ళు తుడుచుకొని అందరికీ వందనాలు చెప్పింది. పూజారి ఆమెను అక్కున చేర్చుకున్నాడు. ఊపిరి పీల్చిన అల్లా దీనుని అలౌకికానందం ఆ సంధ్యా సమయం - అయినా సాగే శేషప్రశ్న!

నమాజు ప్రయత్నం. అక్కడే ఆరు బయటే 'అజా' కేక వేశాడు బాబా. తోటి జవాన్లతో కొందరు వచ్చి నిలిచారు. అది సామూహిక ప్రార్థనగా మారి ఒక సంఘీభావ ప్రదర్శనగా నిలిచింది. -

గుడిశల నుండి పోలీసులు సోదాలు చేస్తూ చేతులూపుకుంటూ వచ్చారు. అనుమానించిన అదృశ్య హస్తాలు కాని ఆయుధాలు కాని, సాహిత్యం కాని బాంబులు కాని, మందుగుండు సామగ్రి కాని, ఏ రహస్య కార్యకలాపాల ఆచూకి అక్కడ దొరకలేదు.

బాబా గుడిశ నుండి మోసుకొచ్చిన కుండల్లోంచి ఇత్తడి, ఇనుప, రాగి, సత్తుముక్కలు, స్క్రూలు, నట్లు, బోల్టులు, టూత్ పేస్ట్ ఖాళీ ట్యూబులు, పాల ప్యాకెట్లు,

కూల్ డ్రింకుల మూతలు వగైరా బయటపడి కుప్పలుగా చేరాయి. చెక్కపెట్టెలో మత గ్రంథాలు, స్కూలు పుస్తకాలు, పలకలు, సుద్దముక్కలు, యునానీ మందు సీసాలు, డబ్బాలు బయట పడ్డాయి. వేలాడే నల్లని గుడ్డబోర్డు, ప్రపంచపటం, భారతదేశపటం, విడిగా దొరికాయి. అలాగే పాత్ర సామగ్రి, వంట దినుసులు, గృహోపకరణాలు దొరికాయి. వాటిని లిస్టు రాసి యధాస్థానం చేర్చమన్నాడు డీజీపీ. గీత, బైబిల్, ఖురాన్, వాల్మీకి రామాయణం (సటీక) ఆజాద్ ఖురాన్ వ్యాఖ్యానం, గాంధీ జీవిత చరిత్ర, వినోబా గీతా ప్రవచనాలు వగైరా పుస్తకాల్ని తరచి తరచి చూశారు. గోర్కి 'అమ్మ' పుస్తకం ఆ అమ్మాయికి స్కూల్లో బహుమతిగా వచ్చినట్లు రాసి ఉంది. కోదండం వాటిని యధాస్థానం చేర్చే పనిలో నిమగ్నం అయ్యాడు.

హతాశుడయ్యాడు అమీను.

విలేకర్లు అన్నీ రాసుకున్నారు. పూజారిని దూరం తీసికెళ్ళి బాబా విశేషాలు రికార్డు చేయసాగారు. పూజారి మాటలు పోలీసు అధికార్లు వింటున్నా విననట్లు మెదిలారు.

"పోలీసులు నేరస్థుల్ని వదిలేస్తారు. అమాయకుల్ని వేధిస్తారు. బాబా ఈ గరీబు నగరానికి మానవతా ప్రవక్త. ఇక్కడ కల్లు సారా నిషేధం. అందరూ కష్టజీవులు. కొందరు ఈ పొలాల్లో పనిచేస్తారు. కొందరు బయట కూలీనాలీ చేస్తారు. పెంకుటిళ్ళవాళ్లు చిన్న చిన్న వ్యాపారస్థులు, ఉద్యోగస్తులు.

బాబా, వారి పిల్లలకోసం మనుమరాలిచేత వీధి బడి నడిపిస్తున్నాడు. అతి దీనుల పిల్లలంతా ఇక్కడే చదువుతున్నారు. మున్సిపాలిటీ లిస్టుకెక్కని ఈ వీధిని ప్రజలే శుభ్రంగా ఉంచుకుంటారు. వ్యసనాలు లేవు. సామరస్యం సంఘీభావం అద్వితీయం. వీధి దీపాలు లేని ఈ మారుమూల ప్రాంతానికి రాత్రిపూట రావాలంటే బాబా రోజూ వెలిగించే ఆ ఆకాశదీపమే కొండగుర్తు. దాని వెలుగులో రోజూ గుడిశవాసులకు ఏదో పురాణ కాలక్షేపంలాంటి హితబోధ జరుగుతుంది. నేను ఎన్నోసార్లు వచ్చి రామాయణ భారతాల కథలు చెప్పాను పిల్లలకు పంచతంత్ర కథలు చెప్పించాడు. బాబాకు రామాయణం ఇష్టం. ఆయన మనుమరాలికి భారతం ఇష్టం. ఇద్దరూ అనుకూల వ్యతిరేకులు.

బాబా బతికి చెడినవాడు. కరీంనగర్ దగ్గరి పల్లి అయన సొంత ఊరు. భార్యపోయినప్పటినుంచి విరాగి అయ్యాడు. పెరుగుతున్న కూతురు మీద ఉన్న పొలం మీద ఆ వూరి దొరలు కన్ను వేశారు. వేధించారు. రక్షణకు వచ్చిన ఆ ఊరి యువకుణ్ణి చెట్టుకు కట్టేసి కొట్టారు దొరలు. వాడినే వరించింది కూతురు. ఇద్దరూ పెళ్ళి చేసుకొని అడవులకు పోయారు. బాబా కాందిశీకుడయ్యాడు. పొలము కూతురూ పోయి పట్నవాసానికి వలసవచ్చాడు. ఆ పెళ్ళిని వ్యతిరేకించలేదు. ప్రమాదానికి భయపడ్డాడు.

వచ్చీరాగానే ఖాద్రీబాగ్ మసీదులో చేరాడు. పక్కనే ఉండే నాతో స్నేహం కట్టాడు. గుడి పనుల్లో సాయపడ్డాడు. నవాబును ఆశ్రయించి బీడుభూముల్లో కూరగాయల పంట తీసి నవాబు మెప్పులు పొందాడు. మళ్లె తోటలతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం చేశాడు. మానవతా పరిమళం విరజిమ్మాడు–

కొన్నాళ్ళకు నిండు చూలాలుగా అమ్మాయి వచ్చింది. అల్లుడూ వచ్చాడు. ఎవరికీ తెలియకుండా కాన్పు జరగాలని పట్టుబట్టారు. ఆ అమ్మాయి ఈ పిల్లను కని పురిట్లో సంధికొట్టిపోయింది అల్లుడు మళ్ళీ అడవులపాలు. మనుమరాలిని చూసి మళ్ళీ ప్రాణం పోసుకున్నాడు బాబా. హిందూ సాంప్రదాయం ప్రకారం పెంచాలని పట్టుబట్టాడు. తండ్రి హిందువు కాబట్టి కూతురూ హిందువవుతుందని వాదించాడు. తండ్రికి లేని పట్టుదల నీకెందుకన్నా వినిపించుకోలేదు. నా చేతే నామకరణం చేయించాడు. గాంధి మహాత్ముడు సరిహద్దు గాంధి అతనికి ఆదర్శపురుషులు.

చురుకైన బుద్ధికి, నిలకడగల నీతికి, క్రమం తప్పని ధర్మానికి, విశ్వాసంగల విధేయతకు, బాధ్యత గల విజ్ఞతకు సాటిలేని మేటి సీత అంటాడు బాబా.

'రామ్ విగ్రహవాన్ ధర్మః' అని నేనంటే "సీతా యాశ్చరితం మహత్" అంటాడు బాబా. ఆ విధంగా నేనూ వాదోపవాదాల తర్వాత బాబా ఆశయ చిహ్నంగా 'సీత' పేరు ఖాయమైంది మనుమరాలుకు. ఈ పొలాల నవాబు రెండు విధాలా దూరమయ్యాడు. ఒకటి పొలంమీద పట్టు పోతుందని, రెండోది సీత కొందరీ పరిణామాన్ని బాగా వ్యతిరేకించారు. కష్టజీవులు క్రమంగా బాబాను గుర్తించారు. అలా ఉభయమతాల వారికి మొదట దూరమైనా క్రమంగా తన ఔన్నత్యంవల్ల దగ్గరయ్యాడు.

'సాత్వికులు ధన్యులు భూమిని వారు స్వతంత్రించుకొందరు' అనే బైబిల్ వాక్యం అతడి జీవితవిధానం - అన్ని మతాలను గౌరవిస్తాడు. సూఫీగా మానవుడిని ముఖ్యంగా ప్రేమిస్తాడు. అందువల్లే మొదట వ్యతిరేకించిన వారు క్రమంగా దగ్గరయ్యారు. ఇప్పుడు బాబా తాత్వికంగా చాలా ఉన్నతంగా బతుకుతున్నాడు. సహనం, సంస్కారం, మానవత్వం, ప్రేమ, సరళమైన జీవన విధానం ఎలాగుంటాయి అంటే బాబాను చూపించవచ్చు. హిందీ, ఉర్దూ, తెలుగు, ఫార్సి, అరబ్బి భాషలు వచ్చు. సంస్కృతం, కష్టపడి నేర్చుకున్నాడు. ఇంగ్లీషు అక్కరలేదన్నాడు. అర్ధం చేసుకుంటాడు. ఖాదీ ధరిస్తాడు. యునానీ వైద్యంకూడా చేస్తాడు. పీర్ పైగంబర్ లాంటి అల్లాదీన్ బాబా ఇక్కడి వారికి ఆరాధ్య దైవం.

బాబా ఏ సముహూర్తాన మా రామాలయంలో షహనాయీతో మేలుకొలుపులు పాడాడో ఏమోగాని ఆనాటినుండి ఆ మోహన రాగం నన్ను ఇంకా పట్టి వుంచింది. జీవితకాలంలో ఒక గొప్ప సంస్కారితో స్నేహం చేసినందుకు చాలా తృప్తిగా వుంది. ఆ అమ్మాయి చింత, భారం నా మీద మోపాడు. గాంధీ తరం మనిషి.... అంతటి మహానుభావుణ్ణి ఈ దివాంధులు నిర్లజ్జగా నిర్బంధించారు. వినాశకాలే విపరీతబుద్ధి!"

"పూజారిగారూ! మరి మీ గురించి కూడా కొంతచెబితే మంచిది" అని ఒక విలేకరి బలవంతపెట్టాడు.

"నా సంగతెందుకండి? ఇంగువ కట్టిన గుడ్డను నేను. మానవాదర్శానికి బొమ్మ బొరుసులం మేము. మాకు మానవుడు ముఖ్యం. వాణ్ణి ఉన్నతుణ్ణి చేయాలని మా తపన. మతం సాధనమైతే మరీ మంచిది."

ఈ జన్మకిదే చాలన్నట్లుగా తృప్తిని ప్రకటిస్తుండగా సీత పరుగెత్తుకొచ్చి పూజారిని లాక్కెళ్లింది.

సామూహిక నమాజు ముగిసింది. జనం వరుసలు వీడారు. బాబా చుట్టూ మూగారు. చేరిన పూజారి నమాజులో మోకరిల్లిన బాబాను చూశాడు. పల్కరించి తట్టాడు. బాబా ఎడంవేపు వాలిపోయి కళ్లు తేలేశాడు. వైద్యం తెలిసిన పూజారి నాడి పరీక్ష చేసి..

"నారాయణ నారాయణ నారాయణ" అంటూ ఆకాశానికేసి చూసి మెరుస్తూన్న నక్షత్రాన్ని గుర్తించినట్లు చేతులెత్తి నమస్కరించాడు. ప్రాణం పోయిందని ప్రకటించాడు. ఒక్కసారిగా జనం 'బాబా' అంటూ రోదించసాగారు. సీత అవాక్కయిపోయింది.

విషయం తెలిసిన పోలీసులు హడలిపోయారు క్షణాలమీద పోలీసు వైద్యులు వచ్చారు. వారూ నాడి పరీక్ష చేసి గుండెపోటని నిర్ధారించారు. పరిష్కారమనుకున్నది సమస్యగా మారినందుకు బయటపడే మార్గానికి ఆత్రపడ్డారు అధికార్లు. అప్పటికే రోదిస్తున్న జనం నిగ్రహాన్ని కోల్పోసాగింది.

"పెద్దప్రాణం. ఉపవాసదీక్ష. ఎండ దెబ్బ తట్టుకోలేకపోయాడు. అల్లాను చేరాడు. సహజ మరణమే అయినా పోస్టుమార్టం మా విధి" అన్నాడు జీపు ఎక్కిన అమీను మైకులో.

"అంతా అబద్ధం పోలీసుల వేధింపుల వల్లే బాబా బలవన్మరణం పాలయ్యాడు. ఆ దేవుడి మరణానికి పోలీసులే బాధ్యులు. అది సహజ మరణం కానేకాదు" అరిచాడు పూజారి రోదిస్తూ. జనం కలకలం రెట్టింపయ్యింది.

"అందుకే శవాన్ని తీసుకపోనీయండి. పోస్టుమార్టం వల్ల నిజం మీకే తెలుస్తుంది" అన్నాడు కమీష్నరు.

దుఃఖాన్ని దిగమింగుకొని అలవాటు ప్రకారం ఆనాటి పవిత్రకార్యంగా ఆకాశదీపం వెలిగించి గదశిఖరాన తాడుతో చేర్చి నిలిపింది. ఆ తర్వాత సకల బాధ్యతలు స్వీకరించిన సీత కర్తవ్యోన్ముఖురాలైంది.

నినాదాల హోరు దిక్కులు పిక్కటిల్ల చేసింది. పోలీసు జీపులోకి ఎవరో ఎక్కుతున్నారు. ఎవరో దిగుతున్నారు. జనం గుంపులు గుంపులుగా కదులుతూంది. పూజారి గొంతు వినిపిస్తూవుంది. బలవంతాన పూజారిని జీపు ఎక్కించినట్లనిపించింది. ఏదో తప్పుమన్న చప్పుడు. ఎవరో కూలిన చప్పుడు. అతడు కిందికి దూకినట్ల నిపించింది. దట్టమవుతూన్న చీకట్లో ఏదీ స్పష్టంగా కానరావడం లేదు. పోలీసులు వాహనాల హెడ్‌లైట్లు వెలిగించలేదు. ఒకేసారి కేకలు, అరుపులు, లారీలు, పరుగులు, కాల్పులు, ఆర్తనాదాలు. వాటిని అధిగమించే నినాదాలు. "పోలీసు జులుం నశించాలి! బాబా అమర్‌హై'! టార్చిలైట్లు ఒక పద్ధతి ప్రకారం చప్పున వెలిగి ఆరిపోసాగాయి.

ఎంత కష్టపడ్డా బాబా శవం పోలీసుల వశం కాలేదు. అంతా అయోమయం. ఏం జరుగుతూ వుందో తెలియని పరిస్థితి. అదనపు బలగాలు. నిరవధిక కర్ఫ్యూ ప్రకటన. ఎక్కడా దీపం లేదు. ఆకాశదీపం అభయహస్తంలా వెలుగుతూనే వుంది. జనం చెల్లా చెదురైనా తిరిగి గుంపులుగా చేరుకోసాగారు. పిడికిలి మూయడం తెరవడం లాంటి సహజ పరిణామం. రాత్రి గడిచింది నరకంగా. నిరవధిక కర్ఫ్యూను

ధిక్కరించారు ప్రజలు. అద్భుతమైన పోరాటశక్తిగా మారిపోయారు. పోటెత్తిన సంఘీభావంలోంచి నినాదం. ఆ నినాదంలోంచి సంఘ నిర్మాణశక్తి క్రమంగా అభివృద్ధి చెందింది. అది బాబా శవాన్ని పోలీసుల వశం కానీయలేదు. బాగా గాయపడ్డ పూజారిని అక్కడినుండి తప్పించింది.

పూజారి కోరికపై పోరాట వీరులు పత్రికల వారిని రహస్య స్థలానికి పిలిపించి మరణ వాజ్మూలం రికార్డు చేయించారు.

ప్రభుత్వం పోలీసుల్ని రంగంలోంచి తప్పించింది. దూరాన రిజర్వు పోలీసు దళాలను నిలిపింది. కర్ఫ్యూను కొనసాగించింది పత్రికలు వాస్తవాన్ని బయటపెట్టాయి. పోలీసుల వేధింపు వల్లే బాబా మరణించినట్లు, బాబాను నిర్బంధించడమే అమానుషమని, అంతమంది అధికార్లు అంత తెలివితక్కువగా ప్రవర్తించడం అనూహ్యమని, బాబా శవం పోస్టుమార్టం కోసం పట్టుబట్టడం ఆ పరిస్థితుల్లో బాధ్యతారహితమని, ఆకారణంగానే నిగ్రహించి ఉన్న ప్రజల్ని రెచ్చగొట్టినట్లయిందని, పరమ సాత్వికుడు మరో గాంధీ అయిన బాబాను బలవన్మరణానికి గురిచేయడమే కాక, శవాన్ని అప్పగించడానికి నిరాకరించిన పూజారిని దగ్గరినుంచి రివాల్వరుతో కాల్చడం, పూజారి మరణ వాజ్మూలంలో రికార్డు అయిందని, దాన్ని చూసిన ప్రజలు అమీను అయుదాన్ని లాక్కొని అమీనును వెంబడించారని అతడు పరుగెత్తి చీకట్లో బావిలో పడిపోయి మరణించాడని పత్రికలు రాశాయి. బాబా పూజారుల జీవిత చరిత్రలు సంగ్రహంగా ప్రచురించాయి. పత్రికలు సంపాదకీయాలు రాస్తూ మొత్తం చర్యను ఖండించి బాబా పూజారులకు నివాళులర్పించాయి.

రెండు రోజుల తర్వాత ప్రజలు గుమిగూడి అన్ని ఆంక్షలను ధిక్కరించి పూజారి బాబాల శవాలను ఊరేగించి అదే చోట ఎవరి మతాల ప్రకారం వారి అంత్యక్రియలు జరిపారు. సంతాప సభలు జరిగాయి. సీత అన్నింటికీ మౌనంగా నిబ్బరంగా నాయకత్వం వహించింది. అక్కడే సమాధులు వెలిశాయి. "బాబా పూజారీ" పదాల మొదటి అక్షరాల్ని చేర్చి అక్కడి గుడిశవాసులు హక్కుల సంఘం, గరీబునగర్‌ను "బాపూనగర్" గా మార్చి బోర్డు తగిలించింది. అక్కడ ఉత్సవాలు, మేలాలు, సభలు సాగనారంభించాయి. పేద ప్రజలకు గుడిశవాసులకు అదొక తీర్థస్థలం అయింది.

ఓపిక పట్టిన ప్రభుత్వం ఒక విచారణ తతంగాన్ని నడిపించి ఒక రిపోర్టును ప్రచురించింది. దాని ప్రకారం చర్యలు కూడా తీసుకొంది.

బాబా నిర్బంధంలోను, విడుదలలోను మొదట అమీనును, ఆ తర్వాత అధికార్లను తప్పుదారి పట్టించిన కోదండాన్ని ఉద్యోగంలోంచి తొలగించింది. ఉత్తమ గాంధేయునిగా బాబాను పేర్కొంటూ, స్వాతంత్ర్య సమరయోధుడైన పూజారి, పరిస్థితిని రెచ్చగొట్టి అనర్థానికి దారి తీయించినట్లు ఆరోపించింది. అమీనుపై అఘాయిత్యం జరుగుతున్నందువల్లే కాల్పులు జరపాల్సివచ్చిందని సంజాయిషీ చెప్పింది. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించి అమీనుకు మాత్రం పరిహారం విశేషంగా ప్రకటించింది.

ప్రభుత్వం ప్రకటించిన తనకు సంబంధించిన భరణాల సహాయాన్ని సీత తిరస్కరించింది. అక్కడి సంఘ తీర్మానం మేరకు ఒక నిజనిర్ధారణ కమిటీని

నిపుణులతో ఏర్పాటు చేసింది. పాత్రికేయులు, లాయర్లు, డాక్టర్లు, ప్రొఫెసరుల, రచయితలు మున్నగు ప్రముఖులతో ఏర్పడ్డ ప్రజా విచారణ సంఘం అనేక విశేషాల్ని బయటపెట్టింది.

ఆదర్శమతవాది అయిన బాబాను అనుమానించి, వేధించి అతడి బలవన్మరణానికి బాధ్యుడైన అమీను మట్టారెడ్డి ఒక మంత్రి సహోదరుడని ఇదివరకు అనేక ఆరోపణల వల్ల రివర్టు అయినాడని, సర్కిల్‌గా వుండే వాడని, కొత్తగా వచ్చిన తెలివైనవారిని తనకింద సహించలేకపోయేవాడని, పోస్టు గ్రాడ్యుయేట్ అయిన కోదండం సమర్థుడైన యువకుడుని, అతడికి డబ్బు లేనందువల్లె పై ఉద్యోగం దొరకలేదని, అతడెంత చెప్పినా వినక అమీను యధేచ్ఛగా ప్రవర్తించి పై అధికార్లను తన రాజకీయబలంతో తన కనుకూలంగా మలుచుకున్నాడని, కారణంగానే ఆనాడందరూ తప్పుదోవ పట్టారని పూజారిపై కక్షకట్టి దగ్గరి నుండి రివాల్వరుతో కాల్చాడని ఈ యధార్థం పత్రికల్లో వచ్చిందని కోదండం ఇచ్చిన సాక్ష్యం పూజారి మరణ వాజ్మూలం నిజాలు చెబుతాయని భయంవల్ల పరుగెత్తిన అమీను బావిలో పడి చనిపోయాడని రివాల్వరు అతడి చేతిలో వున్నట్లు రుజువైందని కాల్పుల్లో ఇరవైమందికి గాయాలు తగిలాయని, నల్గురు గుడిశవాసులు, అయిదుగురు బయటివారు, ఇద్దరు స్త్రీలు, పదిమంది పిల్లలు చనిపోయారని ఆ రిపోర్టు తెలుపుతూ నిగ్రహించిన ప్రజల్ని రెచ్చగొట్టింది అమీనేనని తేల్చింది.

ఉద్రేకాలు చల్లారాయి. ఉర్సులు, సంస్మరణ ఉత్సవాలు, మేలాలు జరిగేచోట మనుగడ పోరాటం అనివార్యమయింది. సీలింగులో ఉన్న భూమి నవాబు ప్లాట్లు చేసి అమ్మాలని చూశాడు. కొందరు అధికార్లు శాసనసభ్యులు చేతులు కలిపారు. గుడిశల్ని సమాధుల్ని పీకించి ప్లాట్లు చేయించి అమ్మ చూపారు. ఏళ్ళ తరబడిగా వ్యవసాయం చేస్తున్న భూమి తమకే చెందాలని గుడిశవాసులు పోరాడారు. మున్సిపల్ పరిధుల్లో వ్యవసాయం నిషేధమని నవాబు మరోసారి ప్రభుత్వాన్ని ఆశ్రయించాడు. సీత స్థానికుల సహాయ సహకారాల్ని పొంది వారి చైతనాన్ని తీర్చిదిద్ది కోర్టుకెళ్లి స్టే తెచ్చింది.

పూజారి ఆజన్మ బ్రహ్మచారి. వారసులు లేరు. రామాలయం వంశ పారంపర్యపు ధర్మకర్తగా సీతను ప్రకటించాడు. మరణానికి ముందు సీతను దత్తు తీసుకున్నట్లుగా విల్లులో రాశాడు. అన్ని ధ్రువీకరణ పత్రాల ఆధారంతో తన స్థిరచరాస్తులకు సీతను వారసురాల్ని చేశాడు. యుక్తవయస్కురాలైన సీతకు ఆలయ బాధ్యతలు అదనంగా వచ్చాయి. అయితే దానికో కమిటీని నియమించింది. స్వాతంత్ర్య సమరయోధుల ఫించను కింద వచ్చిన సొమ్మంతా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిటు కింద జమ అయినందువల్ల పూజారి ఆ లక్ష రూపాయలు కూడా సీతకే చెందేట్లుగా వీలునామాలో రాశాడు.

ఆ డబ్బు సాయంతో కోర్టులకు వెళ్లి బాపూనగర్ విషయంలో స్టే తేవడమే కాక అక్కడ గృహ పరిశ్రమలు స్థాపించి గుడిశలవారిని ఒకతాటిపై నిలబెట్టింది. రాత్రి పాఠశాలలు, గ్రంథాలయం, సమావేశాలతో ఆ ప్రజల చైతన్యం పెంచసాగింది. ఆమెకు అన్ని విధాల తోడ్పడి అండగా నిలిచినవాడు కోదండం. ప్రజలు అపార్థం

చేసుకోకుండా అక్కడి ప్రజల ఆమోదంతో ఆకాశదీపం కింద దండల పెళ్లి చేసుకొంది.

అన్నీ గమనిస్తూ అప్పుడప్పుడూ ఆగంతకునిలా వచ్చిపోతున్న తండ్రి సీతను తనతోపాటు రమ్మని అనేకసార్లు బలవంతం చేశాడు. సీత తండ్రిని గౌరవించినా అతడితో ఏకీభవించలేదు. బాబాను ఆరాధించినా ఆ మార్గం స్వీకరించలేదు.

ప్రజల చైతన్య స్థాయిని బట్టి ఉద్యమాలు ఉండాలి కాని, ప్రజల్ని భాగస్వాములుగా చేయలేని ఉద్యమాలు తిరిగి పాలకవర్గాలకే ఉపయోగపడతాయని, చరిత్ర అనుభవాల్ని తండ్రితో చర్చించి సమీక్షించింది. కొందరు వీరుల సాహస చరిత్ర వల్ల సమాజం మారదని ప్రజల భాగస్వామ్యం వల్లే చరిత్ర గతి మారుతుందని ప్రజలు అన్నిస్థాయిల్లో చేసే జీవన సమరాన్ని సామాజిక విముక్తి సమరంగా మార్చే క్రమంలో వారి రాజకీయ చైతన్యాన్ని అభివృద్ధి చేయాలని ఈక్రమంలో గ్రామాల్లో భూమి సమస్య, నగరాల్లో భుక్తి సమస్య తోడ్పడతాయని తండ్రితో వాదించి తనమార్గంలోకి రప్పించింది. నాటి తెలంగాణా(46-51) నిజాం వ్యతిరేక రైతాంగ భూపోరాటమే ఆదర్శంకావాలని అందుకు ప్రజల్ని సమీకరించి వ్యవసాయ విప్లవం విజయవంతం చేయాలని సంకల్పించింది.

ఆ దిశలో బాపూనగర్‌ను బావుటా నగర్‌గా మార్చడానికి ప్రజల్ని సమీకరిస్తూ ప్రజా ఉద్యమాన్ని నిర్మించసాగింది. భూమి సీత. ఆదర్శాల ఆకాశదీపం ఇప్పుడు భూమి మీదికి వచ్చి కాగడాగా మారిపోయింది. తాత ఆదర్శానికి ప్రతీక ఆకాశదీపం. సీత యుగ ధర్మానికి ఆధారంగా కాగడా. ఇది క్రమ వికాసం.

కాగడాను ఆర్పేవారు పైకెత్తి పట్టేవారూ ప్రతియుగంలోనూ వుంటారు. కాని భూమి సీత చేతుల్లో కాగడా భద్రంగా వుండగలదనడానికి ఆధారం. గతాన్ని గుణపారంగా, ప్రస్తుతాన్ని ప్రాప్తకాలజ్ఞతగా స్వీకరించింది. భవిష్యవాణిగా ఆమె నేలను నమ్ముకుంది. ఆకాశాన్ని వదులుకుంది.

● మయూరి వీక్లీ - 15 జులై, 1994 ●

# 59. కళేబరం

♦ జూకంటి జగన్నాధం ♦

"పొద్దు రెండు శాంతాళ్ళ పెట్టు ఎక్కె. ఏమాయె పెద్ద మనిషి? ఇగ మొదలు పెడ్దామా?" మల్లయ్య

"కాలం గింత మారినా పెద్దమనిషి తనం ఇంకా సాగిచ్చుకోవాలని వుంది."

"మీకేంది ఊళ్ళె వుంటరు - తొందరగా పిలిపిచ్చిన పనికానియ్యిన్రి - ఎములాడ ఊరికి పనికి పోవాలె మేము."

"గీ పెద్ద మనుసులకు ఏం పనిలేదు - మనసును పట్టదీ - ఎప్పటికీ ఏదో ఒక పని వుందని ముందటేస్కొని పిలుత్తరు - వట్టిగుంటె ఏమన్నా కడుపుల కచ్చేది వుందా? వట్టిగ పొద్దు పోగొడుతున్రు - జెప్పన సెప్పక"

"జెర్ర తాతిపరం పట్టున్రి. నాకు ఎరికే మీపనులు పోతయని. బొడ్డు దుర్గయ్య వత్తె గొడ్సేపట్ల మొదలు పెట్టుడె" పెద్దమనిషి మైసయ్య.

"అగగో దుర్గయ్య కట్టె పట్టుకోని వత్తండు - అయిపాయె తియ్యిన్రి" మైసయ్య.

"టైమెంతయ్యిందోయ్?"

"దగ్గరదగ్గర ఏడు."

నాలుగు బజార్ల దగ్గర పొద్దటినుంచి అందరు జమ అవుతున్నారు - నవంబరు నెల, నిన్న ఇయ్యాళ్ళ సన్న సన్నగా చలి మొదలవుతుంది ఊరు ఇప్పుడిప్పుడే మెల్లగా ఆవులిస్తూ కళ్ళు తెరుస్తుంది. ఊరు ఇవతల వున్న మాదిగ ఇండ్లల్ల ఎప్పుడో లేచి ఎవరి పనుల్లోకి వాళ్ళు తయారవుతున్నారు. సమస్య వస్తే అందరిని పిలిచి అడిగి తెలుసుకొని పని అయ్యేలా చూడడం కుల పెద్దమనిషి చేస్తుంటాడు. ముందటి పెద్దమనిషితనంలో పది పైసల మందం అధికారం కూడా ఇప్పుడు లేదు - కాలం మారింది - కాలంతో పాటు పెద్దమనిషితనం - నిలుపుకునేతనంలోకి ఆ పాత్ర మారిపోయింది. అందుకే పెద్దమనిషి మైసయ్య ఎవరు ఎన్ని అన్నా కోపాన్ని దిగమింగుకుంటూ కూడా 'ఇగ అయిపాయె బిడ్డా!" అని బుదరగిచ్చినట్టు నునుగారంగా సమస్య తీరే వైపు ఓపిగ్గా సముదాయించుతున్నాడు - ఓ వందమంది వరకు కూర్చునే మర్రిచెట్టు నీడకు నలభై ఏభైమంది వరకు వచ్చి ఎవరికి వీలైన విధంగా వాళ్ళు కూర్చున్నారు. కొందరు వేప పుల్లలు ఏస్కొని పండ్లు తోముకుంటూ ఊంచుతూ అప్పుడప్పుడు పుల్లను 'కస్సర పిస్సర నమిలి మెత్తగచేసి మళ్ళీ

తోముకుంటున్నారు, కొందరేమె 'టూత్ బ్రష్' వేసుకొన్నారు. పని తొందర వున్నోళ్ళు అప్పుడే తయారయ్యారు.

దుర్గయ్య కట్టె పొడుసుకుంట మైసయ్య పక్కకు వచ్చి కూర్చున్నాడు.

"ఓ మైసు తాత! ఇగ సెప్పు" పడుచు పోరగాళ్ళ గుంపులోంచి ఎవరో అన్నారు.

"నిన్న పొద్దీకేజామ్లు పిల్దామనుకున్నాం కని - ఎములాడకు పనికిపోయి అందరు ఇండ్లకచ్చేటాల్లకు ఏ రాత్రయితదోనని ఊకున్నం - పొద్దంతా పోయచ్చి 'యాట్ట' మీదుంటరని పొద్దుగాల పెట్టినం - మీ పనితొందర నాకు తెలిసిందే. జెప్పన జెడగొట్టి మిమ్మల్ని ఎల్లగొడుతం - నిన్న 'ఎసర్ల యాల్లకు' గీ ముచ్చట దుర్గయ్య సెవుల యేసిన. ఆయన గీ రాత్రద్దు - రేపు పొద్దుగాల అన్నడు - సెప్పు దుర్గయ్య" మైసయ్య దుర్గయ్యను చెప్పుమన్నట్లు చూస్తూ అన్నాడు.

దుర్గయ్య అందరి దిక్కు చూసి సరాయించుకని "ఆ ఇదేదో పెద్ద పనిగాదు. పంచాయితీగాదు - గని ఎటూ ఒడువని లెక్క అయ్యింది. గందుకే అందరినీ కూడగొట్టు మన్నా నిన్న మబ్బుల అంటే మొన్నరాత్రి మొయినిరెడ్డి పటేల్ ఇంట్ల పాలిచ్చె మూడు నాల్గు వేయ్యిల సాదుకం బర్రె 'సలి దొమ్మ' చ్చి సచ్చి పోయిందట - తీసుకపొమ్మని సుంకరాయనను పొద్దూకేవరకు నాలుగుసార్లు మైసయ్య దగ్గరికి తోలిండు. మేము ముసలోల్లమైపోతిమి. మోసుకొచ్చి ఊరవతల 'నక్కల బండ' కాడ పారెత్తామంటే మాతో కాదు - జెర చాతనైనోళ్ళు మీకు సెప్పుదామంటే అందరు ఎవల పనులల్లకు ఆళ్లు పోతిరి - ఆ సచ్చిన బర్రె కుక్కను ఎట్లన్న అవతల పారెయ్యాలె" సమస్యను అందరి ముందు పెట్టాడు దుర్గయ్య.

మోహన్‌రెడ్డి ఇంట్ల బర్రె సచ్చిపోతే మనకేంది. మన పనులు మనకు లేవా? మీ కాలంల తీర్ధ కాపుదనం ఇండ్లు పంచుకొనుడువుందా? ఏమైనా 'సాతలు' వున్నయా? ఈయనేంది జెర పెద్ద పటేలునని తాప తాపకు సుంకరాయనను తోలుతుండా ఏంది? మాతోటైతే కాదు సచ్చిన బర్లను మోసుడు" ఏడో తరగతి వరకు చదువుకొని వేములవాడలో నిన్న యియ్యాల మేస్త్రీ పని నేర్చుకొని రెండు మూడేండ్ల నుండి ఇండ్లు కడుతున్న హన్మయ్య తన ఈడువాళ్ళవైపు చూస్తూ అభిప్రాయం చెప్పాడు.

మర్రిచెట్టు కింద కూచున్న నలుభై యాభై మందిలో కలకలం మొదలైంది. ముప్పై అయిదేళ్ళ వయసున్న వాళ్లందరు హనుమయ్య చెప్పిన దానితోని ఏకీభవిస్తూ 'గంతే గంతే' అంటున్నారు. నలుభై ఏడేళ్ళ వరకు ఈడున్నోళ్ళు ఎటూ పాలుపోక 'మల్లగుల్లాలు" పడుతున్నారు. మరికొందరేమో 'అరి' అంటే ఏందో 'శివ' అంటే ఏందోననీ, ఏమంటే ఏమొచ్చి మీద పడుతదోననీ అటూ ఇటూ మనసుల్లోనే పాతులాడుతున్నారు. కూర్చున్న మందికి 'పగ్గం' పెట్టు దూరంలనున్న బోరింగ్ దగ్గరికి ఆడోళ్ళు అటూ ఇటూ సూసుకుంటూ 'సర్ర సర్ర' వచ్చి పొద్దుపోతదని తొందర తొందరగా నీళ్లు కొట్టుకు పోతున్నారు... ఆయిల్ వేయక చాలా రోజులైనట్టు వుంది. బోరింగ్ కొడుతుంటే వచ్చే 'జుయ్యి జుయ్యి' మనే శబ్దం పెద్దగా వచ్చి ఆలోచించే వారి చెవుల్లో జోరిగ లెక్క సొదపెడుతుంది. ఎక్కడోల్లు అక్కడ ఎవరికి తోసిన తరీక వాళ్ళు గునాయించు కుంటున్నారు. పెద్దమనిషి మైసయ్య దుర్గయ్యతోని

ఇంకొందరు 'ఆరితీరి' అనుభవమున్నోళ్ళతోని 'ఎట్లంటె ఎట్ల' ని విచారం చేస్తున్నాడు – 'గదే గంతె తియ్యి' అంటూ మైసయ్య ఓ మాట చెప్పుదామని తలెత్తి అందరివైపు చూశాడు.

"జెర్ర ఆగుండ్రీ" గుంపుల నుంచి రాజయ్య అన్నాడు.

"నిజమే మన అనుమంతు చెప్పింది. నిజంగానే 'శాతలు' బందు అయినయ్ ఒప్పుకుందాం. గని మెయినిరెడ్డి పటేలు అందరసుంటి మనిషి కాదు – ఒగప్పుడు ఏపది పదిహేను ఎకరాల పొలం ఇరువై ఎకరాల 'కుష్కి' ఆరేడు నాగండ్ల ఎవసం వుండి 'ఎల్లి' బతికినాడు. గిప్పుడు అన్ని పోయి మిగిలిన ఓ కరెంటు పొలం, ఇల్లూ, ఓ పాలిచ్చే బర్రెతోని కాలం ఎల్లదీత్తుండు. మనల్ని ఎన్నడూ ఏనాడు 'వోరి తోరి' అననోడు – 'ఇమరస' వున్నోడు. పాపం ఈ 'పసలు' కాలం లేకబాయిల నీల్లు ఎల్లక ఎవసం బందయింది. నాలుగు షేర్లు పాలిచ్చే బర్రె ఆల్లను మొన్నటిదనుక కిందికో మీదికో ఆదుకునే. పటేలవ్వ పాపం సోకం పెట్టుక ఏడుస్తుందట. కాలం ఎప్పటికీ ఒక్క తీర్గ వుంటదా? బండ్లు ఓడలైతయ్ ఓడలు బండ్లయితయ్ – చెట్టంత 'ఆజమ్' వున్న మోయినిరెడ్డి మొదలు కొట్టేసినట్టయిండు. మీరంత లేనిది – నేను లేను. గని ఈసారి కొంచెం ఎనుక ముందు సూడుండ్రి. ముందటి తీర్గ కాదు. నేనేదో సెప్పుతే మీరు ఇనటానికి మీరు మాకన్నా సదువుకున్నోల్లు మంచి సెడూ తెల్సినోల్లు తెలివిగలోల్లు – గంతే మీరే చెప్పుండ్రి. బర్రెను తీసుకపోయే 'కషిపి' అయితే మనది' మైసయ్య కట్టె ఇరుగకుంట పాము సావకుంట మెల్ల మెల్లగా అందరిపై సమస్యను వదిలిపెట్టాడు.

కూసున్నోళ్ళు పెద్దమనిషి మాటలకు ఆలోచనలో పడ్డారు. ఎక్కడోళ్ళు అక్కడా ఎవరికి వారే విచారంలో పడిపోయారు. 'నువ్వు చెప్పు అంటే నువ్వే చెప్పు' మని అనుకుంటున్నారు. ఇండ్లల్ల ఆడోల్లు వంటసని మొదలుపెట్టారు. పొయ్యిలనుండి పొగ లేచి ఇంటి కప్పుల్లోంచి వస్తుంది. కొంచెం దూరంల తల్లి పిల్లగాన్ని పొద్దుపోయింది లెమ్మని పెద్దగా పిలుస్తూంది. అంతవరకూ భూమి గుండెల్లోంచి నీటి ప్రాణాలను తోడిన బోరింగ్ ఏమీ తెలియనట్టు నిమిత్తమాత్రురాలిలా కూర్చుంది. కొంచెందూరంల వున్న నాలుగు గిరుకల చలివేంద్రపు బాయి సిరిసిల్ల తహసీలు ముందు పురావస్తువులా పడివున్న ఫిరంగిలా వుంది. బాయి ఎప్పుడో ఎండిపోయి పాడుపడి పోయింది. ఇప్పుడు ఆ బాయిలో పగిలిన గాజుపెంకుల్ని అక్కరకురాని సామాన్లనూ పడేస్తున్నారు. ఒకప్పుడు నాలుగు వైపుల నాలుగు బొక్కెన్లతోని నాలుగు రెండ్లు ఎనిమిది చేతుల గాజుల చేదతో కళకళలాడిన బాయి ఇప్పుడు మోహన్‌రెడ్డి కుటుంబంలా వుంది. కాలం అక్కడ కూర్చున్న వారి ముఖాల్లో ప్రశ్నలై పరిపరి విధాల ఆలోచనల్లోకి నెట్టేస్తుంది.

అంతవరకూ వేపపుల్లను పట్టి గట్టిగా తోముతున్న కనుకయ్య లేచిపోయి పక్కకు ఊంచి వచ్చి సరాయించేసరికి అందరూ కనుకయ్య దిక్కు ఏమి చెప్పుతడోనని తిరిగారు. "మన పెద్దమనిషి మంచిగనే చెప్పుకచ్చిండు. గని గీకాలంల ఎవ్వరూ ఆపని సేత్తలేరు. సచ్చిన పసురాల తోల్లను నానబెట్టే 'లందలు' మన ఇండ్లల్ల నుండి ఎప్పుడో మాయమైపోయినయి. సెప్పులు, జోళ్లు, కుడుతున్నమా? పగ్గాలు శాంతాళ్ళు

పేనుతున్నమా? ఈత బరిగె తీసుకత్తునమా? వరి కోత్తుంటే పరిగె ఏరు కుంటున్నామా? వడ్లు తూర్పార పడుతుంటె గొంగడి 'కొప్పెర' కప్పుకొని 'పొల్లు' కొడుతున్నమా? పొల్లుతోపాటు వడ్లు కొడుతున్నమని ఎవసందారులతో తిట్లు తింటున్నమా? రైతులకు మాదుగులకు నడుమనున్న 'కట్టు' ఆల్లకూ తెలవకుంట మనకూ ఎరుకలేకుంట ఎప్పుడో తెగిపోయే. నైలాన్ తాల్లు అచ్చినయ్ – లబ్బరు సెప్పులచ్చినయ్. ఆల్లకు మన అవసరం లేకుంటయ్యింది. మనను అల్లు కుక్కలనూ మాదుగులనూ కూడ కడిగే తిట్ల బాధ తప్పింది. అరె... గింత ఎందుకు? మనం గిప్పుడు ఏమన్నా సచ్చిన 'పసురాల' మాంసంకు ఆసపడుతున్నమా? ఏందీ? మనం మన సిన్నతనంల తినొచ్చు కానీ గిప్పటి పోరగాండ్లు ఆ మాట అంటేనే 'ఒకారం' సేసుకుంటున్నరు. మన అదె, కమ్మకత్తి ఎప్పుడో సిలుంబట్టి పాయె. అస్సలు నేనడుగుతా మిమ్ముల్ని – సచ్చిన వాటిని మోసే కట్టెలు ఎవలిండ్లనన్నా గిప్పుడు వున్నయా సెప్పుండ్రి. సిన్న సిన్న లోకుల ఇండ్లల్ల సచ్చిన వాటిని వాళ్ళే ఊరవతల గుంజీ పారేసుకుంటున్నరు – ఊళ్ళె ఒకరిద్దరు ఇంకా సచ్చిన వాటిని అవతల పారేసుటానికి మాదుగులు కావల్నని కూసునుడేంది? మీరు ఆల్లకు తగ్గట్టు 'అయ్యో పాపం' అనుడేంది? మన తాతలు సేసిన పనులల్ల మనం 'సారాన' వంతు సెయ్య లేదు. మన పోరగాండ్లు అయింత 'కష్టి'ని నమ్ముకుంటే కడుపుల మన్నేనని 'కైకిలి' పనులకు పోవుడు మొదలు పెట్టిన్రు – మరి రైతులు కూడా గుంజుకున్నరు. ఆల్ల సెయ్యి ఆడితే మన సెయ్యి ఆడుతది. ఆల్ల సెయ్యి దినం దినం మూసుకుపోయింది. ఆల్ల సెయ్యిలు మన పనినుంచి దూరమై పోయినయ్. గంతే! 'ఇమరస' సెయ్యిన్రి మీరే" పూసగుచ్చినట్టు కనుకయ్య చెప్పి చేతులనున్న వేపపుల్లకు మళ్ళీ పని చెప్పాడు.

తనో దిక్కు గోడ కట్టుకత్తే పోరగాండ్లు ఓ దిక్కు మెల్లమెల్లగా కూలగొట్టేసరికి కులపెద్ద మైసయ్య మాటల కోసం తల్లడం మల్లడం అవుతున్నారు. బొడ్డు దుర్గయ్య 'ఇగ ఈ పని అయ్యేదికాదు' అని మనసులోనే అనుకున్నాడు. నలుగురైదుగురు పెద్దోల్లు తప్ప మిగతావాళ్ళు కనుకయ్యతో ఏకీభవిస్తూ – పోతున్న పొద్దు దిక్కు చూస్తూ 'సమస్య అయిపోయింది ఇగ మీ యిష్టం' అన్నట్లు పెద్దమనుషులవైపు చూస్తున్నారు.

"ఇక ఆఖరిసారి సెప్పుండ్రి – మోయినిరెడ్డి సచ్చిన బర్రె గతేంది? అది అక్కడనే వుండనీయమంటారా? తలో సెయ్యి ఏసి అవతల పారేద్దామంటారా సెప్పుండ్రి" మైసయ్య సూటిగా అడిగాడు.

"రామాయనం అంత ఇని సీత రామునికి ఏమైతదన్నట్లుంది, మైసు తాత నీ యవారం. యేమైతే అచ్చేది లేదు. ఇగ ఆ పనులు సేసేది లేదు. ఎనుకటోల్లు, మీ ఇట్టం ఏమన్నా సేసుకోండ్రి. కైకిలి పనికి పొద్దుపోద్ది ఇగ పోతం" హనుమంతు మైసయ్య ప్రశ్నకు ఖరాఖండిగా జవాబు ఇచ్చాడు.

కూచున్న వాళ్ళల్లో నలుగురైదుగురు పెద్ద మనుషులు మోహన్‌రెడ్డి వైపు అయితే మిగతా వాళ్ళు ఇది కలువని పని అని లేచి మైసయ్యకు చెప్పి ఎవరి ఇళ్ళలోకి వాళ్లు తొందర తొందరగా పెద్ద మనుషుల మీద గులుక్కుంటూ వెళ్ళిపోయారు.

మర్రిచెట్టు కింద మిగిలిన పెద్ద మనుషులు మళ్ళీ సచ్చిన బర్రెను ఎట్లా మోసుడు అనీ, మోహనరెడ్డి పటేలు నిన్నటినుంచీ ఎంత బాధపడుతుండోననీ, ఇయ్యాల్ల రేపటి పిల్లగాళ్ళ తోటి మాట్లాడవశం అయ్యేది లేదనీ - ఎవరి ఆలోచనల్లో వాళ్ళే మునిగి పోయారు.

ఇక ఎట్లా అని అనుకుంటుండగానే "మైసయ్యా! పటేలు పిలుసుక రమ్మన్నడని" సుంకరి పోచాలు వచ్చి పిలిచాడు.

పోచాలు పిలుపుకు మైసయ్యా మిగతావారు 'గటే అత్తన్న పా, నువ్ నడువ్" అని లేచారు.

బొడ్డు దుర్గయ్య ఏదో జ్ఞాపకం వచ్చి 'జెర్రసేపాగుండ్రి జెప్పన అత్త" నని ఇంటిదిక్కు పెద్ద అడుగులతో నడిచాడు.

మోహన్‌రెడ్డి మీద జాలితోనైతేనేమి, కుల 'కష్మి' మీది చుమకారంతో నైతేనేమి మైసయ్య బొడ్డు దుర్గయ్యతో పాటు ఇంకో ముగ్గురు పెద్ద మనుషులు కలిసి ఊరివైపు నడిచారు.

మొహన్‌రెడ్డి ఇంటి ముందర గద్దెమీద కూర్చున్నాడు. ఆయనకు చెరో పక్కన మరో ఇద్దరు రెడ్లు కూర్చొని చచ్చిన బర్రె మీది సానుభూతికన్నా బర్రెను నిన్నటినుండి తీసుకపోను రాని మాదుగుల మీద కోపాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇంట్లో మోహన్‌రెడ్డి భార్య బతుకు తెరువైన వున్న ఒక్కదిక్కూ పోయేసరికి ఇకముందు ఎట్లనని సన్నగా ఏడుస్తుంది. చచ్చిన బర్రె చిన్న 'దుడ్డె' ఇవేమీ పట్టనట్టు వీటన్నిటికీ అతీతంగా బజార్ల అటూ ఇటూ 'సెంగడ బింగడ' దుంకుకుంటూ ఉరుకుతుంది. మోహన్‌రెడ్డి విచారంగా మాదిగలు వచ్చే దిక్కు చూస్తున్నాడు.

కొంచెం దూరంల గదువకింద కట్టెను ఆనించి నిలుచున్న సుంకరి పోచాలు పటేల మాదిగ మైసయ్య అత్తుండు" అన్నాడు.

చిన్నబోయి కూర్చున్న మోహన్‌రెడ్డి ముఖంలో ఒక వెలుగురేఖ వెలిగింది. మిగతా రెడ్ల మనసులలో మాదిగలమీద కోపం కుతకుతలాడుతుంది.

కట్టెలు లేకుండా ఉత్తచేతులతోని వస్తున్న మైసయ్య తచితరులను చూసేసరికి మొహన్‌రెడ్డి ముఖం ముడుచుకుపోయింది. ఏమి వినాల్సి వస్తుందోనని 'అహం' కిందా మీదా బొర్రుతుంది.

మైసయ్య ముఖం మోహనరెడ్డి చూశాడు. మైసయ్య తప్పు చేసినట్టు దోషిలాకూడా వచ్చిన నలుగురితో పాటు తలలు కిందికి వేసి భూమిని చూస్తున్నారు.

"ఆ! మాదుగలు నిన్నటి నుంచి సెప్పంపంగ సెప్పంపంగ గిప్పుడా వచ్చేది? గదేనా 'మునాసం' అంటే?" మోహన్‌రెడ్డి పక్కనున్న రెడ్డి దీర్ఘాలు తీస్తూ కారెడ్డంగా అన్నాడు.

మోహన్‌రెడ్డి "అవన్నీ ఇప్పుడెందుకు పోనియ్" అని చెయ్యితోనే వారించాడు.

"అయ్యా! మోయినిరెడ్డి పటేలా! బాంచెన్! నిన్న తమరు సెప్పంపిన్నుంచీ తొక్కు లాడుతున్నం, బర్రెను దొడ్లెనుంచి ఊరవతల గుంజేయాలనని మిగతా వాళ్ళతోని

'ఇమరస' సేత్తునే వున్న. మేము మోసుకుపోదామంటే ముసలోల్లమైతిమి. సాతగాదని పదుసు పోరగాల్లతోని సెప్పి తీసుకువద్దామంటే - అందరూ ఎములాడ ఊళ్ళకు పనికి పోయి రాత్రనంగ ఇండ్లల్లకు అచ్చిన్రు. ఇయ్యాల పొద్దుగాల పిలిసి అడుగుతె..." ఇగ నువ్వు సెప్పు పొద్దుగల జరిగింది అని మైసయ్య దుర్గయ్య దిక్కు చెప్పమన్నట్లు చూశాడు.

మోహన్‌రెడ్డికి విషయం అర్థం అయ్యింది. వచ్చిన మాదిగలు బర్రెను మోసుకు పోవటానికి కాకుండా సంజాయిషీ చెప్పడానికి వచ్చారని తెలిసిపోయింది. పక్కనున్న రెడ్డీలు ఊ అంటే తోకతొక్కిన తాచుల్లా లేవడానికి ఉద్యుక్తులవుతున్నారు. మోహన్‌రెడ్డికి కోపం లేదని కాదు. పైకి కనపడనీయడు కానీ కండ్లతోని నవ్వుకుంటూ కడుపులో కత్తులు దించే తత్వం. అంత తొందరగా బయటపడడు. కాలంతోపాటు మారినట్టు కనబడే అవకాశం కోసం ఎదురుచూసే తేనె పూసినకత్తి.

"అయితే మైసయ్యా! ఇప్పుడు అవగల్ల ముచ్చటేంది? గదంతా తప్పీలు నాకు తెలువది" మోహన్‌రెడ్డి నునుగారంగా మెల్లగా అన్నాడు.

బొడ్డు దుర్గయ్య మైసయ్య వదిలిపెట్టిన విషయం గూర్చి "కాలం మారింది అయినా ఎందుకైనా మంచిదని మా పిల్లగాండ్లను అడిగినం. అల్లుసాతలు లేవు. వడ్ల 'ఎరాలు' బందు అయినయ్. మనకుల కష్టి ఎన్నడో పోయింది. మేము సచ్చిన పసురాలను మోయమని కట్టి ఇరిసినట్టు తెగేసి సెప్పిండ్రు బాంచెన్! సచ్చిన వాట్ని మోసే కట్టెలు మా ఇండ్లల్ల నుండి కనిపియ్యకుంట ఎటో పోయినయ్. ఏండ్ల కింద మా ఇండ్ల సూర్లకు సెక్కిన ఆరె కత్తులు 'సిలుం' పట్టి మొండిపోయినయ్. పటేల! మీరు అందరి తోటోల్లు కాదు అని మొత్తుకున్నాం. గీ ఒక్కసారి పటేలు పని ఒడ్డు ఎక్కియ్యాలని బతిమిలాడినం. గని మా పోరగాల్లు ఇనలేదు. ఆల్లకత ఆల్లు సెప్పిండ్రు. గదంత ఎందుకు గని పటేలా! ఎట్లనో మీరే సెప్పుండ్రి" అని మోహన్‌రెడ్డి మీద భారాన్ని ఎత్తాడు.

"మీరే సెప్పుండ్రి" చివరి మాటతో అక్కడున్న మిగతావారికి కత్తితో గాటు పెట్టి కారం పూసినట్టు అయ్యింది. బూతులు తిట్టి ఏ కీలుకు ఆ కీలు విరుగ కొడుదామా అన్నట్టు మోహన్‌రెడ్డి వైపు చూశారు.

ఆలస్యం చేస్తే వ్యవహారం చెడిపొయ్యేలా వుందని "మైసయ్యా! గిన్ని ఏండ్ల నుంచి లేంది గిప్పుడు నా ఇంట్ల పని పడితే గిట్ల అంటే ఏమన్నా మంచిదా చెప్పు. బాధకో బలిమిటికో ఎవల పని వాళ్లు చెయ్యాలె గాని ఒకల పని ఒకరు ఎట్లా చేత్తరు? 'సాతలు' పోయినయ్. 'ఎరాలు' బందైనయ్. నిజమే! కులాలు అయితే పోలేదు కదా! మా నాగండ్లకు నైలాన్ తాళ్లు రావచ్చు. మా ఎడ్లకు నూలు ముగుదాళ్ళు' రావచ్చు. కిర్రు చెప్పులు పోయి రబ్బరు చెప్పులు మా కాళ్ళకు రావచ్చు. కానీ మా ఇండ్లు మీయో, మీ ఇండ్లు మాయో కాలేదు కదా! మైసయ్యా! ఏమి చేస్తరో ఏమి చెయ్యరో నాకు తెలువదు. ఒకరియ్ ఒకరు తవ్వుకుంటే పెంకాసులు బయట పడుతయ్. నా పని గట్టెక్కియ్యిండ్రి గంతే!" మోహన్‌రెడ్డి బుజ్జగిస్తు అన్నాడు.

మైసయ్య దుర్గయ్యను - దుర్గయ్య మిగతవారిని కండ్లతోనే ప్రశ్నించాడు. మోహన్‌రెడ్డి చెప్పింది నిజమే కదా?ఎలా? అనే మీమాంసలో పడిపోయారు.

ఎండ చురుక్కుమని కొడుతుంది. మైసయ్య దుర్గయ్య మిగతావారి శరీరాలు 'చిమ 'చిమ' లాడుతున్నాయి. సమస్య మాదికాదు మీదేనని తెగేసి చెప్పిన మోహన్‌రెడ్డి మాటలకు దుర్గయ్య పెదవిని కొరికిపడుతూ కోపాన్ని దిగమింగుతున్నాడు. తమను చుట్టుముడుతున్న సమస్యను ఎలా బయటపడదామా అని మైసయ్య కాలివేలితో నేల మీద గీతలు గీస్తున్నాడు.

"పటేలా! గవన్ని ఇప్పుడెందుకుకాని.. మా పోరగాండ్లు జారిడిసిండ్రు. మాతోటి మోసుడు సాతకాదు. ఏదో మునుపటి మర్యాదకు సెప్పి పోదామని అచ్చినం. మీరే సెప్పుండ్రి" మైసయ్య మనుసుల విషయం చెప్పాడు.

మోహన్‌రెడ్డి మీరే చెప్పుండ్రి అంటే – మైసయ్య మోహన్‌రెడ్డిని మీరే చెప్పుండ్రి అని కొంచెం సేపు వరకూ తగాదాపడ్డారు. అయినా సమస్య ముదిరేలానే వుంది. కాని పరిష్కారమయ్యేలా కనిపించలేదు. నీవెంత అంటే నీవెంతా అనుకోవచ్చు కానీ ఇది అనుకొనటానికి వేళకాదు అని మోహన్‌రెడ్డికి తెలుసు. ఇంతకు ఎక్కువ మాట్లాడేది లేదని మైసయ్య వాళ్ళు మనసులలోనే తీర్మానించుకున్నారు.

"ఇగ అయిందేదో అయ్యింది. మోసుడు మాతోటి కాదు. సచ్చిన బర్రెను మీరు ఇంట్ల వుంచుకునుడు మీ వల్ల అయ్యేది కాదు. నేను ఒగ మాటంటే ఎవలకు కోపం కాదు గదా!" బొడ్డు దుర్గయ్య చివరికి అన్నాడు.

"దుర్గయ్యా! సెప్పు. కోపమత్తే ఆరేదా తీరేదా సెప్పు సరే" మోహన్‌రెడ్డి అన్నాడు.

"ఏమీ లేదు పటేలా! పెద్ద బండి ఎడ్లు వున్నయ్ కదా! బర్రెను మనిషికో సెయ్యేసి దాంట్ల ఏసుకపోయి నక్కల బండకాడ పారేత్తం" బొడ్డు దుర్గయ్య చెప్పాడు.

పైగా కాలం మంచిగలేదు. ఎటుపొయ్యి వస్తదో తెలువదు. ఈ పరిష్కారం మధ్యే మార్గంగా మోహన్‌రెడ్డికి అమోదమయ్యింది. మిగతా రెడ్లకు మోహన్‌రెడ్డి గతే ఇలా అయితే తమకు పని పడ్డప్పుడు ఎలా అని అసంతృప్తితో గుర్రుగా చూశారు.

"సరే అంటే సరే– అలాగే అంటే అలాగే ననుకొని మైసయ్య దుర్గయ్య మిగతావాళ్ళు పశువుల దొడ్లోకి నడిచారు. మోహన్‌రెడ్డి పాలేరు బండికట్టి ఇంటిముందు నిలబెట్టాడు.

కాళ్ళు బార్లా చాపి బర్రె పడిపోయి ఉంది. భూమి మీద కాళ్లు కొట్టుకున్న జాడలు కనిపిస్తున్నాయి. కండ్లు అలాగే తేలేసి వున్నాయి. పెండలనే పడి ప్రాణాలు విడిచింది. ఉచ్చ పెండతో కలిసి ఆ ప్రాంతమంతా 'గెదడు గెదడు' వాసనగా వుంది.

మైసయ్య తదితరులు బర్రె వెనుకవైపు పడితే మోహన్‌రెడ్డి మిగతా వాళ్లు కొమ్ములు, తలవైపు ఎసుంటి కాలమచ్చిందంటూ పట్టుకున్నారు. అతికష్టం మీద బర్రెను లేపట్టేసరికి ఒక్కసారి వాసన 'రప్పన' కొట్టింది. ఈగలు బయ్యన లేచాయి. మోహన్‌రెడ్డి వాళ్ళు, బర్రెను ఇడిసి ముక్కులు మూసుకున్నారు. మైసయ్య వాళ్ళు, 'ఉగ' తో పట్టుండ్రి బాంచెన్ ఇగ అయిపాయె'నని మిగతావారిని పనికోసం పురికొల్పు తున్నారు.

కిందా మీదా పడి బర్రెను బండిపైకి చేర్చారు. లోపలనుంచి సన్నగా ఏడుస్తున్న మోహన్‌రెడ్డి భార్య గొంతెత్తి దుఃఖిస్తుంది.

ఎండ నడినెత్తి మీదికి వచ్చింది. బర్రె చచ్చిన వాసన ఇప్పుడు మెల్ల మెల్లగా ఊరంతా వ్యాపిస్తుంది. నీడ పట్టన వుండే మంది పలుచ పలుచగా కనిపిస్తున్నారు. ఊరు ఎవరో చచ్చిపోతే ఇడిసిపెట్టినట్టు దిగులుగా వుంది. బర్రెను నక్కల బండవైపు మోసుకు పోతున్న బండి వెనుక మైసయ్య, దుర్గయ్య ఇతరులు నడుస్తున్నారు. బొడ్డు దుర్గయ్య ఇంటినుంచి ఎందుకైనా పనికొస్తదని తీసుకొచ్చి రొండికి చెక్కిన కత్తి పైకి లేచేసరికి ఆగి సర్దుకుని 'జనుము లేక 'కుయ్యి' మంటూ మొత్తుకుంటున్న బండి వెనుక అడుగులు వేస్తున్నాడు. ఊరి చుట్టూ పొలాలు చెరువుకు గండిపడి బీడు పడివున్నాయి. మైసయ్య వెనుకకు తిరిగి ఊరివైపు చూశాడు. శ్రమసందడి, నీటి గలగల, మనుషుల సంచారం లేక ఊరు ఇప్పుడు కళేబరంలా అనిపించి మైసయ్య గుండెల్లో దేవినట్లయ్యింది.

● ఆంధ్రజ్యోతి వీక్లీ - 1995 ●

# 60. సర్వేజనా సుఖినోభవంతు

♦ జింబో ♦

చైనా గోడలా కాంపౌండ్ వాల్. యుద్ధదేరాల ముందు పహరా కాస్తున్న సైనికునిలా సెంట్రీ. కన్ను తెరిచి ఆకాశాన్ని చూస్తున్న వైర్‌లెస్ సెట్టు. నోరు తెరిచిన తిమింగలంలా పోలీస్‌స్టేషన్. స్టేషన్ పక్కగా వేపచెట్టు కింద ఎస్ ఐ. దర్శనం కోసం ఆకుసాని మల్లయ్య చాతకానట్టుగా, చిక్కిపోయినట్టుగా ఉన్నాడు. అయినా కళ్ళు చురుగ్గున్నాయి. వయస్సు ముప్పై అయిదు దాటి వుండదు.

కాస్సేపటికి ఎస్ఐ నుంచి పిలుపొచ్చింది. స్టేషన్‌లోకి వెళ్ళాడు మల్లయ్య. గుడ్లగూబలా అరుస్తూంది వైర్‌లెస్ సెట్టు. కొత్త మనిషికి అక్కడికి వెళ్ళాలంటే గుండె లదురుతాయి. మల్లయ్య పాతకాపు కాబట్టి ధైర్యంగానే వెళ్ళాడు. సింహాసనం మీద కూచున్న రాజులా కుర్చీమీద కూర్చుని సిగరెట్టు కాలుస్తూ ఏవో కాగితాలు చూస్తున్నాడు ఎస్.ఐ. తను వచ్చిన గుర్తుగా చిన్నగా దగ్గాడు మల్లయ్య.

"ఏంరా మళ్లిగా ఎటో వచ్చినవు?" అన్నాడు ఎస్ ఐ. కాగితాలు చూస్తూనే.

"ఇక్కడికే వచ్చినయ్య. పానం కొంచెం బాగలేదు."

"ఏమైందిరా?" సమాధానం లేదు.

"మాట్లాడవేంది?" గట్టిగా ప్రశ్నించాడు ఎస్.ఐ.

"రోగం అంటుకుంది. మందులు కొనలేకపోతున్నాను" చెప్పాడు మల్లయ్య.

"సరే లేరా!ఈ వారం పదిరోజుల్లో ఏదైనా చూద్దాం.

వంగి దండంపెట్టి వెళ్ళిపోయాడు మల్లయ్య.

★ ★ ★

"దొంగా దొంగా!' అరుస్తూ బయటకు పరుగెత్తుకొచ్చాడు విశ్వనాథం. ఇంటిముందు పడుకొన్న నౌఖరు ఎల్లయ్య లేచి దొంగల వెంటపడ్డాడు. అప్పటికే ఇద్దరు దొంగలు గోడ దూకి పారిపొయ్యారు. మూడోవాడు గోడ దూకి పారిపొయ్యే ప్రయత్నం చేస్తున్నప్పుడు, వాడి కాలు లాగి గట్టిగా పట్టుకొన్నాడు ఎల్లయ్య. కొద్దిసేపటికి విశ్వనాథం, అతని భార్యా, కొడుకు అక్కడికి చేరుకున్నారు. ఆ దొంగని విశ్వనాథం, అతని కొడుకు రమేష్ గట్టిగా పట్టుకొంటూ -

"నువ్వు పోయి మిగతావాళ్ళను పట్టుకోరా" అన్నారు.

ఆ దొంగని వదిలి బయటకు పరుగెత్తాడు ఎల్లయ్య. కానీ అప్పటికే ఆ ఇద్దరు దొంగలూ మాయమైయ్యారు. రెండు మూడు సందులు చూసి పది నిమిషాల తరువాత తిరిగొచ్చాడు ఎల్లయ్య. దొరికిన దొంగని చేతులు, కాళ్ళు కట్టేసి కొడుతున్నారు విశ్వనాథం, అతని కొడుకు రమేశ్. ఆ దొంగ ముఖంలో పసితనం ఛాయలు పోయి యవ్వనం గుర్తులు కన్పిస్తున్నాయి. వయసు ఇరవై దాటి ఉండదు.

ఎల్లయ్యని చూస్తూనే "ఏమైందిరా?" అన్నారు.

"వాళ్ళెటో పారిపోయింద్రయ్యా" జవాబిచ్చాడు ఎల్లయ్య.

విశ్వనాథం వడ్డీ వ్యాపారి. నగలు కుదువబెట్టుకొని అరువులు ఇస్తూ ఉంటాడు. సాధారణంగా నగలు ఇనప్పెట్టెలో పెడుతుంటాడు కానీ ఆ రోజు బీరువాలో పెట్టాడు. దొంగలు బీరువా తాళం తీసి దొంగతనం చేశారు. ముప్పై తులాల నగలు, ఇరవై వేల రూపాయల నగదు దొంగతనం జరిగింది. ఒక నగ తప్ప అన్ని నగలూ పారిపోయిన దొంగలే తీసుకెళ్ళి పోయారు. రాత్రి మూడవుతోంది. ఏం చెయ్యాలని కొద్దిసేపు ఆలోచించారు. తండ్రీ కొడుకులు. నగల జాబితా ఫిర్యాదు తయారుచేశారు దొంగని తీసుకొని విశ్వనాథం, రమేశ్, ఎల్లయ్య బయల్దేరారు.

కాస్సేటికి స్టేషన్‌కి చేరుకొన్నారు.

సెంట్రీ తుపాకీతో కాపలా కాస్తున్నాడు. ఆ రాత్రి నలుగురు మనుషుల్ని చూసి అలర్టయ్యాడు.

"ఎవర్రా అది?" గట్టిగా ప్రశ్నించాడు.

"చింతకింది విశ్వనాధాన్ని. దొంగతనం చేస్తూ దొంగ దొరికాడు" సమాధానమిస్తూ స్టేషన్ కాంపౌండ్‌లోకి ప్రవేశించాడు విశ్వనాథం. అతన్ని అనుసరించారు రమేశ్, ఎల్లయ్య దొంగతోపాటు.

"నువ్వా! సేటూ" అన్నాడు సెంట్రీ.

సెంట్రీ దగ్గరకొచ్చి సంగతంతా వివరించాడు విశ్వనాథం. ఇప్పుడే ప్రయత్నం చేస్తే మిగతా ఇద్దరు దొంగలూ దొరుకుతారని, ఎస్ఐగారిని లేపమని అడిగాడు.

"ఈ రాత్రి లేపితే బండబూతులు తిడ్తాడు ఎస్.ఐ." అంటూ లోపలికి వెళ్ళి హెడ్ కానిస్టేబుల్ రషీద్‌ని లేపుకొచ్చాడు.

సంగతంతా వివరించాడు విశ్వనాథం. అర్ధరాత్రి నిద్ర పాడైపోయినందుకు కోపంగా ఉంది. 'అసలే అన్నల గొడవతో చచ్చిపోతుంటే ఇదేంటిరా?' అనుకొన్నాడు. లోపలికెళ్ళి కర్ర తీసుకొని వచ్చి దొంగని నాలుగు బాదాడు. అయినా కోపం పోలేదు.

"లంజాకొడుకా! మమ్మల్ని చావగొడ్తున్నారు గదరా!" అంటూ మళ్ళీ నాలుగు బాదాడు.

మిగతా ఇద్దరి సంగతి చూడమని, దరఖాస్తు తీసుకొమ్మని చెప్పాడు విశ్వనాథం.

"సేటూ! నువ్వు పొద్దున ఎనిమిదింటికి రా! అప్పుడు ఎస్.ఐ. గారుంటారు. గప్పుడు చెప్పు నీ కథంతా. ఆ దరఖాస్తు కూడా అప్పుడే ఇవ్వు ఈడు దొరికిండు గదా వాళ్ళెక్కడికి పోతారు? నువ్వు ఫికర్ చెయ్యకు, ఇగ పో" అన్నాడు ఆవులిస్తూ.

"లాకప్ తీసి వీన్ని దాంట్లో వెయ్యి" సెంట్రీకి చెప్పి లోపలికి వెళ్ళిపోయాడు.

ఏం చెయ్యాలో తోచలేదు విశ్వనాథానికి. ముప్పై తులాల నగలు కళ్ళముందు గిర్రున తిరుగుతున్నాయి. ఎస్.ఐ. క్వార్టర్ స్టేషన్ పక్కనే. కానీ అక్కడికి వెళ్ళాలంటే భయమేసింది. ఎక్కువ మాట్లాడితే ఒకటి పొయ్యి ఒకటై పోతుందని తండ్రీ కొడుకులు నౌఖరుతోపాటు ఇంటికి తిరుగుముఖం పట్టారు.

★ ★ ★

ఉదయం ఏడున్నరకి విశ్వనాధం, రమేశ్, ఎల్లయ్యతోబాటు పోలీస్‌స్టేషన్‌కి వచ్చాడు. వేపచెట్టుకింద నిల్చున్నారు. ఎస్‌ఐ ఇంకా రాలేదు. ఒకటికి రెండుసార్లు ఫిర్యాదు చదువుకొన్నాడు. దొంగ లాకప్పులో ఉన్నాడో, లేదో చూసుకొన్నాడు. మిగతా ఇద్దరు దొంగలు దొరుకుతారా, తన నగలు దొరుకుతాయా ఆలోచిస్తూ వేపచెట్టు క్రింద నిల్చున్నాడు విశ్వనాథం.

ఎనిమిదిన్నర ప్రాంతంలో ఎస్‌ఐ వచ్చాడు. హెడ్ కానిస్టేబుల్ రషీద్ రాత్రి సంఘటన గురించి వివరించాడు. కాస్సేపటికి విశ్వనాధాన్ని లోపలికి పిలిచాడు ఎస్‌ఐ. భయపడుతూ భయపడుతూ ఎస్‌ఐ ముందు నిల్చున్నాడు విశ్వనాథం.

"ఏమయ్యా సేటూ! ఎన్ని గంటలకి జరిగింది?"

"రాత్రి మూడుగంటల ప్రాంతంలో సార్."

"ఇంట్లో ఎవరూ లేరా?"

"మేమందరం ఉన్నాం సార్"

"గంత మొద్దు నిద్రపోతున్నారా?"

"....."

"సేఫ్‌లో పెట్టుకోకుండా బీరువాలో ఎందుకు పెట్టినావు?"

"....."

"వాళ్ళిద్దరినీ కూడా పట్టుకోక పోయిండ్రా, ముగ్గురున్నారు మొద్దులకి మొద్దులు."

"నగల సంగతేమోగానీ ఇదెక్కడి బాధరా?" అనుకొన్నాడు విశ్వనాథం.

"దరఖాస్తు తెచ్చినవా?"

"తెచ్చిన సార్!" వినయంగా తను తెచ్చిన ఫిర్యాదును ఎస్‌ఐకి అందజేశాడు విశ్వనాథం.

"అన్నీ వివరంగా రాసినవా?"

"రాసినా సారూ!"

ఈ రోజే గట్టిగా ప్రయత్నం చేస్తే మిగతా ఇద్దరు దొంగలు దొరుకుతారని చెబుదా మనుకొన్నాడు. కానీ ధైర్యం చాలలేదు.

"మళ్ళీ ఎప్పుడు కనిపించాలి సార్?"

"నేను చెప్పి పంపుతాను. లేకపోతే రేపోసారి వచ్చిపో."

నమస్కారం పెట్టి సెలవు తీసుకొన్నాడు విశ్వనాథం.

విశ్వనాథం వెళ్ళిపోయిన తరువాత కానిస్టేబుల్ని పిలిచి దొంగని తీసుకురమ్మని చెప్పాడు ఎస్.ఐ. లాకప్పు నుంచి దొంగని తెచ్చి ఎస్.ఐ ముందు నిల్చోబెట్టాడు. ఇంకా ఏం చూస్తున్నావన్నట్టుగా కానిస్టేబుల్ వైపు చూశాడు ఎస్.ఐ. ఆచూపుని అర్థం చేసుకొని లోపలికి వెళ్ళి లాఠీ తెచ్చి వీపు మీదా, చేతుల మీదా నాలుగు బాదాడు. 'అమ్మా, అయ్యా" అన్నాడు.

"ఏం పేరురా?"

"గంగాధర్."

"ఏ ఊరు?"

"ఈ ఊరే సార్."

"ఏం చేస్తున్నావు?"

"ఇంటర్మీడియెట్ ఫెయిలైనాను సార్."

"ఎన్ని దొంగతనాలు చేశావురా?"

"ఇదే మొదటిది సార్."

"మీ తండ్రి ఏం చేస్తాడురా?"

"ఇంజనీర్ సార్."

"అయితే ఇదేం బుద్ధిరా నీకు"

"....."

"ఎవరెవరు కలిసి చేసినార్రా?"

"....."

కానిస్టేబుల్ వైపు చూశాడు ఎస్.ఐ.

మళ్ళీ నాలుగు లారీ దెబ్బలు.

"చెప్పురా ఎవరెవరు చేశారు?"

"నేనూ, శ్రీనూ, క్రిష్ణా కలిసి చేశాం సార్!"

"వాళ్ళేం చేస్తుంటార్రా?"

"నాలాగే ఇంటర్మీడియెట్ ఫెయిలైనారు సార్."

వాళ్ళ వివరాలు చెప్పాడు.

"ఇంకా ఎన్ని దొంగతనాలు చేసినార్రా?"

"లేదు సార్? ఇదే మొదటిది."

"అంటే మళ్లీ చేస్తార్రా?"

"..... "

"లమ్డీ కొడుకులు! నిద్రపట్టకుండా చేస్తున్నారు. వీన్ని తోమండిరా" చెప్పాడు. ఆ కొడుకుల ఇండ్లకు పొయ్యి వాళ్లను, వాళ్ళు లేకపోతే వాళ్ళ అయ్యలను తీసుకు రాండ్రి" హెడ్ కానిస్టేబుల్‌కి హుకుం జారీ చేశాడు.

★ ★ ★

పన్నెండు కావస్తోంది గంటన్నర క్రితం వెళ్ళిన హెడ్‌కానిస్టేబుల్ రాక పోవడంతో అసహనంగా ఉంది ఎస్.ఐ.కి ఆకలిగావుంది. రెండు చాయ్‌లు తాగాడు. ఉదయం టిఫిన్ తినకుండా వచ్చాడు వైర్‌లెస్ సెట్టు అరుస్తూనే ఉంది. అప్పుడొచ్చాడు హెడ్‌కానిస్టేబుల్.

"ఆ పోరగాండ్లు ఇంట్లో లేరు సార్! వాళ్ళ తండ్రులని పట్టుకొచ్చినం" సాల్యూట్ చేస్తూ అన్నాడు.

"నఖరాలు చేస్తున్నరేమో?"

"లేద్సార్ నిన్నటినుంచి ఇంటికి రాలేదట. వాళ్ళకీ సంగతి ఇప్పుడే తెలిసింది. బయట ఉన్నారు సార్."

"ఏం చేస్తారు వాళ్ళు?"

"ఒకరేమో స్కూల్ టీచర్! ఇంకొకతను కిరాణా వ్యాపారం సార్! ఇంజనీర్ కూడా వచ్చిండు సార్!"

బెల్ కొట్టి అక్కడ నుంచి కుర్చీలను తీయించి వెనక గదిలో వేయించాడు. వాళ్ళని లోపలికి తీసుకురమ్మని చెప్పాడు. ముగ్గురూ అవమానంతో లోపలికొచ్చారు. టీచర్, వ్యాపారి చేతులు కట్టుకొని ముందు నిల్చున్నారు. వాళ్ళకి వెనుక ఇంజనీర్ నిల్చున్నాడు.

"మీ కొడుకులు చేసిన సంగతి తెల్సిందా?"

తెల్సిందన్నట్టుగా తలలు కిందికి వంచి నిల్చున్నారు.

"పోరగాండ్లను పెంచేదీ గిట్లనేనా? సార్ వేమో నువ్వు! ఏవయ్యా సేటూ? చెప్పు నీ సంగతేంది?"

సమాధానం లేదు. కొడుకులు చేసిన పనులకి తలవంపులుగా ఉంది. తల తీసినా బాగుండేదనిపించింది.

"వాళ్లను ఎక్కడ దాచిపెట్టిండ్రు? మంచిగ చెప్పుండ్రి."

"వాళ్కెక్కడున్నారో మాకు తెలియద్సార్" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"నా దగ్గర నఖరాలు చేస్తే నడవదు. సాయంత్రం వరకు వాళ్ళని తెచ్చి ఇక్కడ పడేస్తేనే మంచిది. లేకపోతే మీ చొక్కాలకు నీళ్ళు పోస్తా."

"మంచిది సార్" అన్నారు భయపడుతూ, అవమానపడుతూ

అక్కడినుంచి వెళ్ళాలా, ఉండాలా తెలియదు. కొద్దిసేపు అలాగే నిల్చున్నారు.

"పోండి, సాయంత్రం ఐదు గంటల వరకి ఆ పోరగాండ్లను, దొంగతనం చేసిన సొత్తుని తీసుకొని రండి" అన్నాడు ఎస్ ఐ.

"బతుకు జీవుడా"ని బయటపడ్డారు. వాళ్ళ వెంటే నడిచాడు ఇంజనీరు.

★ ★ ★

సాయంత్రం ఐదు కావస్తుంది. తన వికృతరూపాన్ని బహిర్గతం చేస్తోంది పోలీస్ స్టేషన్. శ్రీను, క్రిష్టని తీసుకొని వాళ్ళ తల్లిదండ్రులు వచ్చారు. వాళ్ళతో బాటు గంగాధర్ తండ్రికూడా వచ్చాడు. కరువుతో గత్యంతరం లేక పశువులని కబేళాలో అమ్ముతున్న రైతు మొఖంలా వాళ్ల ముఖాలు. ఆ ఇద్దరు కుర్రవాళ్ళూ భయంతో వణుకుతున్నారు. వాళ్ళ వయస్సు ఇరవైకి మించవు. నేరుగా ఎస్.ఐ.దగ్గరికి వెళ్ళటానికి ధైర్యం చాలక, స్టేషన్‌కి వెనుక వైపున్న హెడ్ కానిస్టేబుల్ రూం వద్దకి వెళ్ళారు. రషీద్ ఉన్నాడు. వీళ్ళతో మాట్లాడి ఎస్.ఐ.దగ్గరకు వెళ్లి చెప్పాడు. ఎస్.ఐ. వాళ్ళను తన రూంలోకి రమ్మన్నాడు. రషీద్‌తో పాటు వాళ్ళు ఎస్ఐ రూంలోకి వెళ్ళారు. వాళ్ళు పులి బోనులోకి తోసిన మేకపిల్లల్లా ఉన్నారు.

"సొత్తు తెచ్చినారా?" ప్రశ్నించాడు ఎస్.ఐ.

"తెచ్చాం సార్!" అంటూ ఎస్ఐ టేబిల్‌పైన పెట్టారు.

"అన్నీ తెచ్చారా! ఇంకా ఏమైనా ఉన్నాయా?" గద్దించాడు.

"అన్నీ తెచ్చినారు సార్!" చెప్పారు తల్లిదండ్రులు.

"సరే! మీరు పొండి" అన్నాడు ఎస్.ఐ. తండ్రులవైపు చూస్తూ.

వాళ్ళకి భయంగా ఉంది. సొమ్మంతా తెచ్చారు. కుర్రవాళ్ళని తెచ్చారు. సొమ్మంతా తెచ్చినప్పటికీ వాళ్ళను అక్కడే వదిలి వెళ్ళాలంటే భయంగా వుంది. ఎస్.ఐ.తో మాట్లాడాలంటే కష్టంగా ఉంది. అయినా గంగాధర్ తండ్రి ధైర్యం చేసి "వాళ్ళని ఏమీ అనకండి సార్! మొత్తం సొత్తు తెచ్చాం" అన్నాడు.

"ఈ మధ్య చాలా దొంగతనాలు జరిగాయి. వీళ్ళకి వాటితో సంబంధాలుండి ఉంటాయి. వీళ్ళను విచారించాల్సి ఉంటుంది. మీరు విసిగించక పోండి" గద మ యించాడు ఎస్.ఐ.

తల్లిదండ్రుల గుండెల్లో రాయి పడింది. ఏం చేయాలో తోచలేదు. అక్కడుండటానికి ధైర్యం చాలక బయటకొచ్చారు.

లోపల లారీలతో కొడ్తున్న శబ్దాలు. గుండెల్లోని దిగులు తండ్రుల కంటి నుండి నీరుగా కారుతోంది.

★ ★ ★

తెల్లవారింది. రాత్రి కురిసిన జడివానకి స్టేషన్ మూలుగుతోంది. రషీద్ డ్యూటీ రిజిష్టర్ రాస్తున్నాడు. అప్పుడొచ్చాడు శ్రీను తండ్రి మురళి, అతను వ్యాపారి, హెడ్ కానిస్టేబుల్ టేబుల్ దగ్గరగా వచ్చి నిల్చున్నాడు. 'ఏమిటీ' అన్నట్టు చూశాడు హెడ్ కానిస్టేబుల్. ఉదయం కాబట్టి ముఖం ప్రసన్నంగానే ఉంది.

"మోరీల్ సాబ్! పోరగాండ్లు ఏదో తప్పు చేసిండ్రు. ఇంకోసారి చేయకుండా చూసుకొంటాం. ఇంట్లో ఎవరికి నిన్నటి నుంచి పానం పానంల లేదు. గీ కేసు నుంచి పోరగాండ్లని తప్పించే ఉపాయం చూడుండ్రి. మీ కష్టముంచుకోం" భయం భయంగానే చెప్పిండు.

రషీద్ అక్కడ ఉన్న కానిస్టేబుల్ ముఖాలవైపు చూశాడు. వాళ్ళు అర్థం చేసుకొని బయటికి పోయారు. హెడ్ కానిస్టేబుల్ మురళివైపు చూశాడు.

ఎస్.ఐ. సాబ్‌శాన గరమ్ మీదున్నాడు. గీ పోరగాండ్లే ఈ మధ్య జరిగిన దొంగతనాలన్నీ చేసిండ్రని అంటున్నాడు" బెదరగొట్టేశాడు.

"లేదు మోరీల్ సాబ్! నిన్న గట్టిగా అడిగినం, ఇదే మొదటిదని చెప్పిండ్రు పిల్లలు. వాళ్ళు భవిష్యత్తు ఖరాబైపోతది. మీరే వాళ్ళను కాపాడాలే. ఇవి చేతులు కావు కాళ్ళు " అనుకొంటూ రషీద్ చేతులు పట్టుకొన్నాడు మురళి.

"సరే! కూచో"

కాస్త ధైర్యం వచ్చింది మురళికి.

"వాళ్ళిద్దరేమంటున్నారు?" గంగాధర్, క్రిష్ణ తల్లిదండ్రుల నుద్దేశించి అన్నాడు.

"వాళ్ళకు ముఖంలేకనే నేను వచ్చిన. మీరేది అంటే దానికి ఒప్పుకొంటాం.

"ఖతర్‌నాక్ కేసులో ఇరుక్కున్నరు. పోరగాళ్ళు రెడ్ హ్యాండెడ్‌గా ఒకడు దొరికిపోయె. వీళ్ళను ఈ కేసుల కెళ్ళి తీసుడు శానా కష్టం."

"మీరనుకుంటే గిది పెద్ద పని కాదు. మీరేదంటే గా మాటమీద నిల్చుంటం"

"సరే! నేను అమీన్ సాబ్‌తో మాట్లాడి వస్తాను. నువ్వు బయట నిల్చో. మళ్ళీ పిలుస్తా."

మురళి ముఖంలో ఆశలు చిగురించాయి. ఆ రూం నుంచి బయటకువచ్చి వేపచెట్టు క్రింద నిల్చున్నాడు.

తొమ్మిది గంటల ప్రాంతంలో ఎస్ఐ వచ్చాడు. రషీద్ వెళ్ళి ఎస్.ఐ.తో అన్ని విషయాలు చెప్పాడు. తన రూంలోకి వచ్చాడు రషీద్. మురళిని పిలిచాడు. మాట్లాడాడు. డీల్ కుదిరింది.

★ ★ ★

మూడు గంటల ప్రాంతంలో విశ్వనాథానికి కబురు పెట్టారు. విశ్వనాథం పరుగు పరుగున స్టేషన్‌కి వచ్చాడు. ఎస్.ఐ. ముందు నిల్చున్నాడు.

"కూర్చోవయ్యా విశ్వనాథం!"అన్నాడు ఎస్.ఐ.

ఎస్.ఐ. మర్యాదకి ఆనందపడాలో, దాన్లోని లాజిక్కుకి తలగొట్టుకోవాలో అర్థం కాలేదు విశ్వనాథానికి. అలాగే నిల్చున్నాడు. రషీద్ పెన్ను, ప్యాడూ తెచ్చి ఎస్ఐ టేబుల్‌పైన ఉంచాడు.

"కూర్చోవయ్యా సేటూ! కూర్చొని చదువుకొని సంతకం పెట్టు" అన్నాడు ఎస్.ఐ. కాగితాల ప్యాడు చేతికిస్తూ.

విశ్వనాదం ధైర్యం చేసి కూర్చున్నాడు. చదవడం ప్రారంభించాడు.

"గౌరవనీయులైన ఎస్.ఐ. గారికి

అయ్యా!

నా మనవి ఏమనగా నేను ఆల్లునూర్ నివాసిని. వ్యాపారం చేసుకొని జీవిస్తాను. నిన్న కరీంనగర్‌లో పనుండి మా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్ళాను. ఈ రోజు ఉదయం తిరిగొచ్చాం. వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగుల గొట్టబడి ఉంది. లోపల బీరువా తాళం కూడా పగుల కొట్టబడి ఉంది. బీరువాలో ఉంచినముప్పై తులాల నగల దొంగతనం జరిగింది. వాటి వివరాలు క్రింద పేర్కొన్నాను. ఎవరో గుర్తు తెలియని దొంగలు ఈ దొంగతనం చేసి ఉంటారు. దొంగలను పట్టి నా సొత్తును నాకు ఇప్పించాల్సిందిగా ప్రార్థిస్తున్నాను.

ఇట్లు

తమ విధేయుడు

(చింతకింది విశ్వనాధం)

విశ్వనాథం ఫిర్యాదు చదువుకొని ఆశ్చర్యపోయాడు. భయపడ్డాడు. కేసు ఒకలా ఉంటే, దరఖాస్తు మరోలా ఉంది. ఇదివరకే తను దరఖాస్తు ఇచ్చాడు.మళ్లీ ఇదెందుకు? తన నగదు ఇరవైవేల రూపాయల గురించి రాయలేదేమిటి? ఇంతకి తన సొత్తు దొరుకు తుందా? అన్నీ ప్రశ్నలే విశ్వనాథం మనసులో.

ఎస్.ఐ. వైపు భయంగా చూశాడు.

"ఆలోచిస్తున్నావేంది సేటూ? సంతకం పెట్టు?" అన్నాడు ఎస్.ఐ. మర్యాదగానే.

"అదికాదు సార్! జరిగింది ఒకటి. దీంట్లో రాసున్నది మరొకటి. నా పోయిన ఇరవైవేల సంగతి దీంట్లో లేదు" భయం భయంగా అన్నాడు.

"నీకు బంగారం దొరుకుతుందన్న ఆశ ఉందా? దొరికినా మొత్తం బంగారం దొరుకుతుందా? నీ చేతికి ఎప్పుడొస్తుందో తెలియదు. జరిగింది జరిగినట్టు రాస్తే కేసు హైకోర్టు దాకా పోతుంది. నువ్వు దీనిపై సంతకం చేస్తే కనీసం నీ ముప్పై తులాల బంగారమైనా దొరుకుతుంది. తొందరగా కోర్టు నుంచి నీ చేతికి వచ్చేట్టు చేస్తాను. ఆలోచించుకో. ఆలోచించుకొని సంతకం చేయి" అన్నాడు ఎస్.ఐ.

ఆలోచనలో పడిపోయాడు విశ్వనాధం.

"ఇట్లా చేస్తే కనీసం ముప్పై తులాల బంగారమన్నా దొరుకుతుందంటారా?" అడిగాడు విశ్వనాధం.

"దానికి నేను పూచీ ఇస్తాను. రెండు మూడు నెలల్లో నీ చేతికి వచ్చేట్టు కూడా చేస్తాను" భరోసా ఇచ్చాడు ఎస్ ఐ.

కాస్సేపు ఆలోచించుకొని సంతకం చేశాడు. "నీట ముంచినా, పాల ముంచినా మీదే భారం సార్" ఫిర్యాదు ఎస్.ఐ. చేతికిచ్చాడు

★ ★ ★

రెండు రోజులు గడిచిపోయాయి. సాయంత్రం నాలుగవుతోంది. పంచనామా, రిమాండ్ రిపోర్టు, ఛార్జిషీట్ అన్నీ సిద్ధం అయ్యాయి. వాటి మీద సంతకాలు చేస్తున్నాడు ఎస్.ఐ. జీప్ కూడా సిద్ధం అయింది. దొంగని తీసుకొని ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ కోర్టుకి బయలుదేరారు. కోర్టుని చేరుకొనేసరికి నాలుగన్నర దాటింది. ప్రాసిక్యూటర్ గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు ఎస్.ఐ కాగితాలు అన్నీ తీసుకొని వెళ్ళి బెంచి క్లర్క్‌కి అందజేశాడు హెడ్ కానిస్టేబుల్. కాస్సేపటికి కేసుని పిలిచారు.

ముద్దాయిని కోర్టులో ప్రవేశపెట్టాడు హెడ్ కానిస్టేబుల్ సాల్యూట్ చేస్తూ, కాగితాలని చదువుకొన్నాడు మేజిస్ట్రేట్.

"ఏంపేరు?" ముద్దాయిని అడిగాడు మేజిస్ట్రేట్.

"ఆకుసాని మల్లయ్య."

"తండ్రి పేరు?"

"రామయ్య"

"వయస్సు?"

"ముప్పై అయిదు."

"పోలీసులేమైనా కొట్టినారా?"

"లేదు సార్."

కేసు కాగితాలు ముద్దాయికి ఇవ్వమని చెప్పాడు మేజిస్ట్రేట్ బెంచి క్లర్క్‌తో. అతను కేసు కాగితాలు ముద్దాయికి ఇచ్చి సంతకాలు తీసుకొన్నాడు. పదిహేను రోజుల వరకి అతన్ని రిమాండ్ రాశాడు మేజిస్ట్రేట్. పోలీసులు అతన్ని తీసుకువెళ్ళారు.

పదిహేను రోజుల తరువాత రెండున్నర ప్రాంతంలో మల్లయ్యని కోర్టులో మళ్ళీ ప్రవేశపెట్టారు పోలీసులు.

"కేసుకి సంబంధించిన కాగితాలు అన్నీ ముట్టినవా?"

"ముట్టినవి సార్."

"ఫలానా తేదీనాడు విశ్వనాథం ఇంట్లో ముప్పై తులాల బంగారు నగలు దొంగతనం చేశావని, ఆ విషయాన్ని నువ్వు పోలీసుల ముందు ఒప్పుకొన్నానని, నువ్వు చెప్పిన ప్రకారం ఆ సొత్తుని నీ ఇంటినుంచి నీ సమక్షంలో బరామతు చేశారని పోలీసులు ఫిర్యాదులో ఆరోపించినారు. ఏమంటావు నువ్వు?" ప్రశ్నించాడు మేజిస్ట్రేట్.

"నిజమే సార్, చేశాను!"

"నేరాన్ని స్వచ్ఛందంగానే ఒప్పుకొంటున్నావా?"

"ఇష్టపూర్వకంగానే ఒప్పుకొంటున్నాను సార్!"

ముద్దాయి మల్లయ్య చెప్పిన సమాధానాలు రాసి క్లర్క్ కిచ్చాడు మేజిస్ట్రేట్. క్లర్క్ ముద్దాయి సంతకాలు తీసుకొన్నాడు.

మల్లయ్యకి పద్దెనిమిది నెలల కఠిన కారాగార శిక్ష, సొత్తుని ఫిర్యాదుదారైన విశ్వనాదానికి అప్పీలు కాలపరిమితి దాటిన తరువాత ఇచ్చెయ్యాలని మేజిస్ట్రేట్ తీర్పు రాశారు. ఆ సంగతి మల్లయ్యకి చదివి వినిపించారు. తుఫాను రాకని ముందే పసిగట్టిన జాలరిలా నిల్చున్నాడు మల్లయ్య. మల్లయ్యని పోలీసులు తీసుకొని వెళ్ళారు.

పోతేపోయినవి ఇరవై వేల రూపాయలు. ముప్పై తులాల బంగారం దొరికిందని సంతోషపడ్డాడు చింతకింది విశ్వనాథం. పోతేపోయాయి ముప్పై వేల రూపాయలు. కొడుకులు ఎలాంటి కేసూ లేకుండా బయటపడినారని సంతోషపడ్డారు గంగాధర్, శ్రీను, క్రిష్ణ తల్లిదండ్రులు. సెంట్రల్ జైల్లో మంచి మందులు దొరుకుతయని సంతోష పడ్డాడు ఆకుసాని మల్లయ్య, పదిహేను రోజుల్లో 'గ్రేవ్ కేసు' పరిష్కారమైందని సంతోషపడుతూ యాభైవేల రూపాయలని తనివితీరా తడిమాడు ఎస్.ఐ. నవ్వుతూ ఎస్ ఐ.పక్కన నిలుచున్నాడు హెడ్‌కానిస్టేబుల్ రషీద్.

సంతోషపడనిదల్లా మోసపోయిన న్యాయం.

● 'కథాప్రభ' ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక – జూలై, 1995 ●

# 61. బొడ్రాయి

♦ భూపాల్ ♦

**జూన్** నెల. మృగశిర కార్తె సగం పాదం దాటింది. వర్షాలు లేవు పట్టణాల్లో, పల్లెల్లో జనం నీళ్ళ కోసం అల్లాడుతున్నారు. ఎండలు 'మే' నెలను మరిపిస్తున్నాయి. ఐనా స్కూళ్ళు తెరిచారు. వేసవి సెలవులు ముగిశాయి – వేసవి వుంది. వేడీ వుంది. సాయంకాలం ఐదు గంటలు దాటినా అలాగే కూర్చొని వున్న సుజాత విపరీతమైన ఉక్క పోతకు తాళలేక తన కొంగుతో గాలి విసురుకుంటోంది. బడి ఆవరణ అంతా మైదానంలా ఉంది. ఉండి వుండి వీచే వడగాలి చెంపలు చరిచేస్తోంది. పొద్దు తిరిగి పోయినా కళ్ళు మిరిమిట్లు గొలిపే ఎండతో ఆమె విశాలమైన చక్కటి కళ్ళు, చిన్నబోయి వున్నాయి. వెలుగులు చిమ్మే ఆమె ముఖం కందిపోయినట్టున్నది. బడి గదిలో ఒక్కతే కూర్చొని వుంది. పిల్లలు ఇళ్ళకు వెళ్ళిపోయారు ఇక తనూ బయలుదేరే ప్రయత్నంలో వుంది. ఇంతలో ఎవరో అటుగా వస్తున్న చప్పుడు వినిపించింది. అటు దిక్కు చూసింది.

ఊరి కావలికాడు వెంకటయ్య అతన్ని అందరూ వెంకటీ అంటారు కాళ్ళకు చెప్పులు లేవు. పంచె పైకి ఎగకట్టాడు. బనియన్ తొడిగాడు. చేతిలో కర్రవుంది. భుజం మీద చిన్న తుండుగుడ్డ లాంటి టవల్, బట్టతల, అతను వస్తూనే.... నమస్కారం చేస్తూ

"పోతున్నావా అమ్మా?" అన్నాడు.

"అవును వెంకటయ్యా! ఈ ఎండకు తట్టుకోవడం కష్టం గుంది. ఊరి బయటగదా! వడగాలి. చెట్లు లేవాయె. సర్కారోళ్ళు బడి తెరువాలన్నారు. నీళ్ళు లేవు. కరెంటు లేదు. ఎండకు పిల్లలు మాడి చస్తరేమోనని నా భయం. వాళ్ళను తొందరగనే వదిలేసిన మూడు గంటలకే. ఇక నేను కూడా పోదామని లేస్తున్న" అని "చెప్పు ఏమో పనిమీదొచ్చినవు? ఎవరినన్న స్కూళ్ళ చేర్పిస్తవా?" అడిగింది సుజాత.

"నాకు అంత చిన్నపిల్లలెవరున్నరమ్మా? పెద్ద పటేలు పంపిస్తే వొచ్చిన" అన్నాడు వెంకటయ్య.

"ఎవరూ! కోదండరావు పటేలా?! నా దగ్గరికా? అంత పనేం పడ్డదమ్మా?! ఏందటా?"

"రాత్రికి ఊరి బొడ్రాయి కాడ కోమటోళ్ళ పంచాది వుంది. ఆడికి నిన్నూ, మీ మహిళా మండలికెళ్ళి ఇంకెవరినన్నా తోల్కొని రమ్మన్నడు కోదండం పటేలు!"

"పంచాదులుంటే డప్పు చాటిస్తరు గదా? ఇట్ల చెప్పుడేందీ?"

"అమ్మా! ఈ పంచాది పిల్లజెల్లలు ఇనేది కాదట. అందుకోసమే డప్పు చాటించలే! రాత్రిపూట పెట్టిందీ గందుకేనట."

"పెద్దలకు మాత్రమేనా? అంత రహస్యమేందీ? కోమటిండ్లు రెండే వున్నాయి గదా! ఎవరింటి కొట్లాట ఇదీ?"

"లోపటి సంగతేందో నాకూ దరి అనలేదమ్మా! ఇది ఆ రొండిండ్ల పంచాది లెక్కనే వుంది" అన్నాడు వెంకటయ్య.

అతన్ని ఇంకా వివరాలు అడిగి లాభం లేదనుకుంది సుజాత.

"సరే! ఎన్నిగంటలకూ?" అని అడిగి "మరి అంత బయటికి చెప్పుకోలేని పంచాదే ఐదే ఎవ్వరింటి దగ్గరన్నా పెట్టొచ్చుగదా! బొడ్రాయి కాడెకెందుకూ?" అంది.

"నైట్ ఆల్టు (హాల్ట్) ఆఖరు బస్సు పోయినంక, బువ్వలు దిన్నంక రమ్మన్నరు. బొడ్రాయి కాడనే అన్నరు. ఆడ యాపచెట్టుంది గదా! సుట్టూ అరుగు కట్టిండ్రు. కూసుంటందుకే... ఇప్పటిదా అమ్మా ఆ బొడ్రాయి. ఊరు పుట్టిన నాటిది. మా తాత ముత్తాతలూ పంచాదులు ఆడనే తెంపుకుండ్రట. అప్పుడు బొడ్రాయి నిజంగా ఊరి నడుమనే ఉండేదట. ఆడ తెగిన పంచాది డిల్లిల పెద్ద కోరట్ల (కోర్టులో) చేసిన తీర్మానం లెక్కనే వుండేదట. అప్పటి ధర్మం ఇప్పుడు కనవడుతలేదంటరు జనం. ఇగ బొడ్రాయా...?! ఊరు పది ఒంకలు తిరిగింది. ఎవ్వరికి తోచినట్టు ఆల్లు ఇండ్లు కట్టుకున్నరు జనం. నీళ్ల వొసతినీ, కులపోళ్ళను జూసి, ఇప్పుడు బొడ్రాయి ఓ మూలకు నక్కినట్టే అనిపిస్తది. ధర్మకాలం నక్కినట్టు."

పూర్వమెప్పుడో ధర్మకాలముండేదన్న నమ్మకమున్న వెంకటయ్య అలా ఆగకుండా చెప్పేసి... "అమ్మా ఇగ నేను వోత" అన్నాడు.

ఆమె "సరే" అంది.

అతడు ఇంత కథ చెప్పిన కారణం సుజాత టీచర్‌కి అర్థమైంది. పంచాదులు తీర్మానమైతే బొడ్రాయి దగ్గరే కావాలని అతను అనుకుంటాడు.

వెళ్ళిపోతున్న అతని పాదాలవైపు మరోసారి చూసింది సుజాత. నిప్పుల వర్షం లాంటి ఎండకు వేడెక్కిన నేల అతని పాదాలను ఏమీ చేయలేకుంది. అవి రాళ్ళలా గట్టిగా రాటుదేలి వున్నాయి. ముళ్ళు తొక్కినా పాదంలో దిగవేమో, విరిగిపోతాయేమొ అనుకుంది.

'ఎప్పుడూ ప్రత్యక్షంగా ఏ పంచాదికీ పిలవంది ఈసారి తనను ఎందుకు పిలుస్తున్నాడో కోదండం? ఇది ఆడవాళ్ళ కొట్లాటనా? అక్కడ జరిగే నిర్ణయాలకూ, తీర్పులకూ మా ప్రతిస్పందన చూడాలనుకున్నాడా? అతనికి నా మీదున్న కోపం, అసమ్మతీ ఈ రూపంలో అక్కడికి పిలిచి తీర్చుకుంటాడా? ఇలా ఆలోచిస్తూ స్కూలు గదికి తాళం వేసి సుజాత తన ఇంటివైపు వెళ్ళలేదు. నేరుగా గొల్ల కుర్మల వాడకట్టు చేరింది. ఆ ఇంటిముందు పులివాయిలి కర్రలతో తడకలు కట్టి వున్నాయి. మధ్యనుండి దారి ఒకవైపు తడకల మీద పారినకాకరపాదు. తీగ ఎప్పుడో ఎండి పోయింది. ఆ పాదుకాయలు ఎన్నోసార్లు తిన్నది తాను. తడికదాటి లోపలికి

అడుగుపెట్టగానే ఎదురుగా పెంకుటింటి ముందు వేసుకున్న పాక కింద, కుదురు మీద కూర్చొని వుంది. కురుమ చెంద్రమ్మ. రెండు తొడలమధ్యకీ చీర దోపుకుని, పక్కనే కుండలో భద్రం చేసివున్న గొర్రె బొచ్చు ఎడమచేత్తో తీసుకుంటున్నది. నేలమీద తిరుగుతున్న కదురు దారాన్ని చుట్టుకుంటూంటే, కదురుకీ ఎడమ చేతికీ మధ్య తొడమీద కుడిచెయ్యి రాసి పేనిన దారం సుళ్ళు తిరుగుతూ విచిత్రంగా కనిపిస్తోంది.

సుజాతను చూసిన చంద్రమ్మ చేస్తున్న పని ఆపి "రా! టీచరమ్మా" అంటూ నవ్వుతూ ఆహ్వానించింది. చెంద్రమ్మ సుజాతకి తల్లి వయసులో ఉంటుంది.

"నువ్వు పని ఆపకు" అంటూ వెళ్ళిపక్కనే అరుగులా వున్న గోడ మీద కూర్చుంది సుజాత. ఎర్రమట్టితో అలికిన ఆ గోడకి సున్నంబొట్లతో, గీతలతో చిత్రించిన బొమ్మలు ఎంతో ముచ్చటగా వున్నాయి.

గాలి ఆడడం లేదు. పాకనిండా గొర్ల గొతికెల వాసన. కొంచెం దూరంలో గెగ్గెతట్ట. తట్టలో మూడు మేకపిల్లలు పడుకొని వున్నాయి. టీచర్ దిక్కే చూస్తున్నాయి. ఎంతో అందంగా, సోయగం ఉట్టిపడుతున్న వాటిని చేతుల్లోకి తీసుకోవాలనిపిస్తుంది ఆమెకు.

"చంద్రమ్మా! మేక పిల్లలెంత బాగున్నాయో! ఎత్తుకోవాలనిపిస్తుంది" అంది.

చంద్రమ్మ నవ్వి, "మేకపాలున్నయ్, ఛాయ చెయ్యనా? తాగతవా టీచరమ్మా" అంది.

"టీ తాగాలనే ఉంది. కానీ మేకపాలు నాకు పడవు ఇంకా! కొంచెం వాసనగా వుంటాయి గదా. ఇప్పుడు ఆ ప్రయత్నం ఏమీ వద్దుగనీ, కావలి వెంకటయ్య నీ దగ్గిరికి వచ్చి ఏమన్నా చెప్పిండా?" అని అడిగింది.

"ఏది ఏం రాలేదు. బడికాడికొచ్చినాడు?"

"అవును, ఇంతకుముందే రాత్రికి ఏదో పంచాది చేస్తరట. ఆడికి మనల్ని రమ్మని కోదండం పటేలు కబురు జేసిండు. ఆ కొట్లాట సంగతి నీకేమన్నా తెలుసా?"

"నేననుకుంటనే వున్న. ఎంతకాలం మూసుకుంటరని. మూసిపెడితె పొసిపోత దంటరు" కొంచెం వెటకారంగనే అంది చంద్రమ్మ.

"ఏందీ అసలు సంగతి జెప్పు" అడిగింది సుజాత.

"ఈ ఊరికి తూర్పునుండే జానకమ్మ బిడ్డె పద్మ. ఆ పిల్లను వాడకట్టు దెగ్గెరున్న కోటిలింగం కొడుక్కు ఇచ్చి పెండ్లి జేసింద్రు. జానకమ్మ ముండమోసింది. కొడుకులు లేరు. ఒక్కతె బిడ్డ. అదే ఈ పద్మ. రేపు జానకమ్మ చస్తే దాని సంపాదనమంతా తనకే మిగుల్తదని కోటిలింగం ఉపాయంతోని కోడల్ని దెచ్చుకుండు. ఆ కోటిలింగం కొడుకు రామలింగం. ఆడు దుబాయి దేశం బొయ్యి మూడేండ్లు దాటింది. అప్పటికే యాడాది ముందల పెండ్లి జేసుకుండు. అట్ల వోయినాడు ఇయ్యాలటికి నాల్గు రోజులాయె ఊళ్లె కొచ్చి. ఒచ్చి సూస్తే ఏముంది ఆని పెండ్లాం పద్మ ఎనిమిది నెలల పొట్ట తోటుందట. అదమ్మా సంగతి" అని చెప్పింది చంద్రమ్మ.

ఇంకా కొన్ని వివరాలు అడిగి తెలుసుకుంది సుజాత. తర్వాత "చూడు చంద్రమ్మా! ఈ పంచాదికి మనల్ని పిలుస్తున్న పటేలు మనం ఏ చెపుతామో

చూద్దామనేగనీ, ఇంకెందుకూ గాదు. మహిళా మండలిని మనం స్థాపించడం, కొన్ని పనులు చేయడం, కొన్ని విషయాలల్ల నిలదీసి అడగడం ఆయనకు మంటలేస్తుంది. ఈ పద్మ తప్పు చేసిందనీ, ఆడజాతికి మచ్చ తెచ్చిందనీ, దాన్ని మహిళా మండలి ఎట్ల తీసుకుంటదో చూద్దామనే ఆయన ఆలోచన. ఐనా పద్మ ఎందుకు ఇట్ల చేసిందో మనం తెలుసుకోవాలె. ఏ దశలో చేసిందో గమనించాలె. నాల్గు నెలల కింద కడుపు తీయించుకుంటె ఈ సంగతి బయటపడేదా? పడకపోతుండె గదా! అట్ల జేసేటోళ్ళు ఎంతమంది లేరూ! వీళ్ళెందుకు చేయలేదంటే ఏదో వుంది. పోనీ తెలువని ఎడ్డి మనుషులా అంటే అదీ కాదుగా! రేపు పిల్లను కంటననీ పద్మకు తెలిసే వుంటది. లోకం కోడై కూస్తదనీ తెలిసే వుంటది. మరి ఎందుకు భయపడ లేదు! అంటే ఏదో తిరకాసు ఉంది. నిజమే నువ్వన్నట్టు మూసిపెట్టాలనే పెట్టిందా! ఇంకా దాచుకోవాలనే వుందా? మనం కనుక్కోవాలి. ఒకరి మీద నిందవేసే ముందు ఎందుకు అట్ల జరిగిందో చూడకపోతే మనం గూడ తప్పుగ లెక్కేసుకుంటం. నువ్వు చెప్పిన ముచ్చటబట్టి చూస్తే పద్మ అత్తగారివి కూడా చాలా తప్పులుండాలనే అనిపిస్తూంది" అంది. అప్పటికే చీకటి పడింది. మాట్లాడుతూనే తను చేసేపని ఆపి ఇల్లు ఊడ్చింది, కుండలు కడిగింది. దీపం పెట్టింది చంద్రమ్మ, కూర్చున్న చోటినుంచీ లేస్తూ "ఇగ పొయ్యిస్తె, ఒండుకోవాలె" అంది సుజాత. "గిప్పుడు వొయ్యి ఒంట జేసుకుని తిని ఎప్పుడొస్తవు టీచరమ్మా! ఈడనే తిను. ఇన్ని బియ్యం పొయ్యిమీద పెడ్త. సద్దలు గూడ దంచిపెట్న. గట్క వొండుమంటే వొంత, గోధుమ పిండి లేదుగానీ జొన్న పిండుంది. రొట్టె జెయ్యమన్న జేస్త" అంది చంద్రమ్మ.

సుజాత ఓ నిమిషం తటపటాయించి "సరే మీరు ఏది తింటే నాకూ అదే పెట్టుండ్రి నాకోసం వేరే ఏదీ చెయ్యొద్దు" అంటూ మళ్ళీ కూర్చుండిపోయింది.

తేలికగా ప్రజలతో, పల్లె వాసులతో కలిసిపోయే తత్వమున్న సుజాత టీచర్ అంటే ఆ ఊళ్ళో అందరికీ ఎంతో గౌరవముంది. జనం అభిమానిస్తారు. పట్నం నుంచి బడి పిల్లలకు చదువు చెప్పే పంతులమ్మగా రెండు సంవత్సరాల క్రితం ఈమె ఈ ఊరికొచ్చింది. ఆ వచ్చిన రోజున ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. అందమైన ఆమె ఆకారం చెదరలేదు. మాట తీరు మారలేదు. ఉత్సాహం తగ్గలేదు. మందహాసం మాయలేదు. సూటితనం తప్పలేదు

ఊరికొచ్చిన నాడే బడికి ఫర్లాంగు దూరమున్న తెనుగోళ్ళ ఇంట్లో ఓ గది అద్దెకిమ్మని అడిగింది. ఒద్దన్నా ఇప్పటికీ నెలకు యాభై రూపాయలు అద్దె చెల్లిస్తోంది. ఒక్కతే వండుకొని తింటుంది, స్కూలేగాక రాత్రుల్లు పెద్దవాళ్ళకూ చదువు చెబుతుంది. అందరి మంచీ చెడే ఆలోచిస్తూ, ఎవరికి ఏ ఆపద వచ్చినా వెళ్లి చూస్తుంది. ఆమె కాళ్ళకు మట్టెలున్నాయి. మెడలో మంగళసూత్రం, పసుపుతాడుకి ఉంటుంది. పిల్లాజెల్లా ఎవరూ వున్నట్టు లేరు. పది పదిహేను రోజులకొక మారో లేక నెలరోజుల కొకసారో ఒక యువకుడు వచ్చి రెండు రోజులుండి వెళ్ళిపోతాడు. అతను ఏదో ఆఫీసులో ఉద్యోగం చేస్తాడని చెపుతుంది సుజాత. అతను ఎవరితో ఎక్కువగా మాట్లాడడు. పలకరిస్తే నవ్వుతూ, ప్రేమగా మాట్లాడతాడు. లేదా ఎప్పుడూ ఏవో పుస్తకాలు చదువుతూ, రాసుకుంటూ కూర్చుంటాడు.

సుజాత టీచర్ తల్లి మూడు నెలలకన్నా ఎక్కువ రోజులు కూతుర్ని చూడక ఉండదు. ఆమె వస్తే పచ్చళ్ళూ, పసుపూ అనకుండ తోచినవల్లా తెచ్చి కూతురికిచ్చి రెండు రోజులే ఉండి, ఆ చుట్టుపక్కన ఉండేవాళ్ళందరితో నా పిల్ల బద్రం, మీ టీచర్ బద్రం అని చెప్పి చెల్లే, బిడ్డా, తమ్ముడూ అని నోటి నిండా పలకరించి వెళ్ళిపోతుంది.

వచ్చిన కొత్తలో కొన్ని రోజులవరకూ పల్లె ప్రజలు సుజాతని కూడా "అసలామ సంగతేంది?' అని గమనించారు. నమ్మకం కుదిరే వరకూ చదువుకు వెళ్ళలేదు. తర్వాత ఆమె ఎంత మంచి మనిషో అందరికీ తెలిసింది. ఊళ్ళో అన్ని కులాల వాళ్ళూ ఆమెకు అన్నదమ్ములు, పెద్దయ్య చిన్నయ్యలే.

ఐతే, కొందరికి ఈ పద్ధతి నచ్చలేదు. ఇప్పుడూ నచ్చకుంది. చదువు చెప్పడానికి వచ్చిన పంతులమ్మ ఊరి జనాల తలలో నాలుక కావడం, రాత్రుల్లు వయోజన విద్య చెప్పడం, బాలసంఘం, మహిళా సంఘమనే సంఘాలు ఏర్పాటు చేయడం వాళ్ళకు మంచి అనిపించలేదు. ఊళ్ళో ఏమైనా అవకతవక పనులు జరిగితే మహిళా మండలి సభ్యులు గట్టిగా వాదించి ఎదుర్కోవడం, ఉపాధిలేని వృద్ధ స్త్రీలకోసం జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రాలు పంపించడంతో కొందరు "ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి" అనుకున్నారు. అది నిజమేనని ఒప్పుకోరు.

మహిళా మండలి సాధించిన విజయాల్లో విజయదశమికి ముందు జరిగే బతుకమ్మ పండుగ కొట్లాటను ఉదాహరణగా చూపవచ్చు.

సుజాత వచ్చిన సంవత్సరం విజయదశమినాడు ఊళ్ళో జనం అంతా రెండు వర్గాలుగా చీలి కోదండరావు వర్గం, హనుమంతరావు వర్గంగా రూపొందారు. రక్తపాతంలో ముగియాల్సిన పండుగ కొద్దిలో తప్పింది. ఒచ్చే యేటికి వాయిదా పడింది. అప్పుడే అసలు మూలం ఎక్కడుందా అని యోచించింది సుజాత.

దసరా నవరాత్రుల్లో ఊరు జనం రెండు పక్షాలుగా విడిపోయి కోదండరావు ఇంటి ముందు ఒక పక్షం, అతని పెదనాన్న కొడుకు, తనకన్నా చిన్నవాడు హనుమంతరావు ఇంటి ముందు మరో పక్షంగా బతుకమ్మ ఆడేవారు. "నేను పెద్దవాన్ని, ఊరి సర్పంచ్‌ను నా ఇంటిముందే బతుకమ్మలాడాలి' అని కోదండరావు అంటే, "పూర్వం నుండీ మా రెండిండ్లలో మేమే పెద్దింటి వాళ్ళం. మా ఇంటిముందే ఆటలాడడం ఆచారం. నిన్న మొన్న అతను ఊరి పెద్దఅయ్యాడు గానీ, మా నాన్న వాళ్ళనాన్నకన్నా పెద్దవాడు కాదా?" అంటూ హనుమంతరావు. ఇలా ప్రారంభమైన కొట్లాట దసరా జెండాలు కట్టేవరకూ, జమ్మికి ఎవరు ముందు? ఎటువైపు అనే వరకూ వెళ్ళింది.

రెండు పక్షాలు ఆ రోజు ఒకరికొకరు ఎదురుపడితే చాలా ప్రమాదమే జరిగేది, అదెందుకో చిటికెలో తప్పింది. పండుగ జరిగిపోయింది. కానీ, పగలు, కోపతాపాలు ఏ కోశానా తగ్గలేదు. లోలోపల కుమిలి పోవడం మానలేదు.

ఆ మరుసటి సంవత్సరమే సుజాత పటేండ్ల భార్యలనూ, కూతుళ్ళనూ బంధువులనే కాకుండా ఎవరు నిజంగా పువ్వులు తెచ్చి ఇస్తారో, ఎవరు బతుకమ్మలు మోసుకెళతారో, ఎవరు పాటలు పాడి పాడి సంతోషం పంచుతున్నారో వాళ్ళను

కలిసింది బతుకమ్మలు పేర్చే ప్రతి ఇంటికీ వెళ్ళింది. ఊరి పరిస్థితి వివరించింది. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఊరి జనమంతా నలగడం భావ్యం కాదని చెప్పి... బతుకమ్మలు అన్నీ ఊరి బొడ్రాయి కాడికి చేరే ఏర్పాటు చేసింది. పేర్చిన బతుకమ్మల చుట్టూ ఎవరి ఇంటి ముందు వాళ్ళు కొద్దిసేపు ఆడి తర్వాత నేరుగా బొడ్రాయి దగ్గరకి తేవాలి. అక్కడ అందరూ కలిసి సంతోషంగా ఆడుకోవాలి. ఆ తర్వాతే ఊరి చెరువు వైపు బతుకమ్మలు విడిచేందుకు బయలుదేరాలి. ఇక జెండాల విషయానికొస్తే పార్టీలకూ, కులాలకూ అతీతంగా ఉండి పూర్వం నుండి కట్టెమైసమ్మ గుడి బురుజుపై నున్న వేపచెట్టుకు ఒకే ఒక జెండా కట్టాలి. ఈ నిర్ణయాలన్నీ స్త్రీలూ, పిల్లలు పట్టుదలతో, ఊరి ముప్పాతికమంది పురుషులు కలవడంతో సజావుగా నెరవేరాయి. ఇదంతా ఊరి జనాలకు తెలియని విషయం కాకున్నా, వాళ్ళను ఆ దారికి మళ్ళించే ప్రయత్నం ఎవరూ చేయలేదు. ఇప్పుడు సుజాత టీచర్, మహిళామండలి ఆధ్వర్యంలో అది నెరవేరింది. ఈ విజయం మహిళా మండలిదని సుజాత గర్వంగా చెపుతుంది.

ఇంతేకాదు, బాధపడుతన్న ఏ స్త్రీ తన కంటపడినా ఏదో సహాయం చేయాలన్న తపన సుజాతలో వుంటుంది. ఆమె హేతుబద్ధంగా ఆలోచిస్తుంది.

ఒకసారి ఆ ఊరి భార్యా భర్తలిద్దరూ కలసి పొలానికి బయలుదేరారు. స్కూలు పక్కనుండే పిల్ల బాటుంది. అలా నడుచుకుంటూ వెళుతున్న వాళ్ళలో భార్య చంకలో పసిపిల్ల, తలమీద గంప. ఆమె నడవడమే కష్టంగా ఉంది. భర్త ముందు నడుచుకుంటూ పైరగాలిని అనుభవిస్తూ వెడుతున్నాడు. అది చూసిన సుజాత ఇద్దరినీ కేకేసి ఆగుమని చెపుతూ దగ్గరకెళ్ళి పది నిమిషాలు ఆ పురుషునికి పాఠం చెప్పి, అంబలి గంప అతని తలకు ఎక్కించి, పంపించింది. ఆ తర్వాత ఎప్పుడు చూసినా భార్యతో పాటు వెళ్ళే అతను పాపనో, గంపనో ఎత్తుకునే వెళ్ళేవాడు.

ఇలా చెప్పాలంటే చీకటి పడితే చాలు తప్పతాగి పెళ్ళాలను తన్నే భర్తల ఇళ్ళకు మహిళా మండలి సభ్యులతో వెళ్ళి ఆ తాగుబోతులను గట్టిగా మందలించి మరోసారి ఆడకూతురు మీద చెయ్యి చేసుకుంటే ఇంట్లో వండడం, వార్చడం వుండదని చెప్పి వచ్చేది.

వయోజన విద్యాలయంలో పురుషులకన్నా స్త్రీల సంఖ్యే ఎక్కువ. అక్కడ చదువే కాదు ప్రపంచం నడత గూర్చి, సమాజం మనుగడగూర్చి అందరూ తెలుసుకుంటారు. పొలాల్లో పురుషులతో సమానంగా పనిచేసి ఇంటికొచ్చాక మళ్ళీ ఈ వంట పనులు, ఇంటి పనులు, పిల్లల్ని కడుపులో మోసి కనీ, పెంచి, పెద్ద చేసే అదనపు పనులూ ఇవన్నీ స్త్రీని ఎంత కృంగదీస్తున్నాయో అర్థం చేయిస్తుంది సుజాత.

"కష్టాలకంతా స్త్రీలు, సుఖాలకంతా పురుషులేనా ఈ సమాజంలో? అట్లాంటప్పుడు కొడితే, తిడితే ఎందుకు పడతావ్? ఇంకా తల్లిగారింటినుండి ఏదో రూపంలో డబ్బు తెమ్మంటే ఎందుకు తెస్తవ్? ఆలోచించు. అన్నీ నీకు తెలుసు. ఈ ఓపిక, సహనం, అమాయకత్వం, ఏదో పోనీలే అనే తత్వం మారేవరకూ మనం మనంగా మిగలం... అందుకే మనం మారాలి. మనంగూడా మనుషులం అనుకోవాలి... ఆలోచించాలి... " ఇలా సుజాత చెప్పే ప్రతిమాటలో ఏదో సందేశం, సూచన, జీవితం మీద ఆశ, ప్రేమ వాళ్ళకు కలుగుతుంది.

చంద్రమ్మ ఇంట్లో అన్నం తిన్నాక సుజాతా, చంద్రమ్మ కలిసి ముందు జానకమ్మ ఇంటికెళ్ళారు. జానకమ్మ కూర్చోనుంది. పద్మ మాత్రం వీళ్ళను చూసి చాలా ముభావంగా వుంది. ఈ పంచాదికి మూలం తెలుసుకోవాలనీ, గర్భం ఎలా వచ్చిందో పద్మనుండి కనుక్కోవాలనీ సుజాత ప్రయత్నించింది. పద్మ ఏమీ చెప్పలేదు. మాట్లాడలేదు. ఈ మహిళా సంఘానికి తెలియడం వల్ల జరిగేది కీడు కాదు, మేలే అని ఎన్నోవిధాల అర్థం చేయించింది సుజాత. ఐనా పద్మ ఏమీ చెప్పలేదు.

ఆ ఊరు దాటి నాలుగు ఊర్ల అవతల నైట్‌హాల్ట్ చేసే చివరి బస్ వచ్చి వెళ్ళి పోయింది. ఈ చివరి బస్ వచ్చిందంటే రాత్రి తొమ్మిదిన్నర ఐనట్టూ, గ్రామస్తులు బువ్వలు తిని పడుకోబోతున్నట్టూను.

ఇక జానకమ్మ ఇంటినుండి సుజాతా, చంద్రమ్మ బయలుదేరారు. మధ్యలో ఇంకా ఇద్దరు మహిళా సంఘ స్త్రీలు వాళ్ళతో కలిశారు వాళ్ళు బొడ్రాయి దగ్గరకొచ్చారు. గాలి అప్పుడప్పుడే చల్లగా వీచే ప్రయత్నం చేస్తోంది. విద్యుద్దీపాలు ఓ అరగంట వెలిగి మళ్ళీ చీకటిని ఊరినిండా గుప్పి ఆరిపోయాయి. బొడ్రాయి వద్ద శాఖోపశాఖలతో బాగా పరుచుకున్న వేపచెట్టు, చేయిపైకి చాస్తే అందేంత కిందకున్న కొమ్మలు. కదలీ కదలక అనుమానపడ్తున్న ఆకులూ, రెమ్మలూ దట్టమైన ఆ చెట్టుకింద చీకటి ఇంకా చిక్కగా ఉంది.

చెట్టుకు తూర్పు దిక్కు అర ఎకరం భూమి అవతల దక్షిణంవైపు ముఖం చేసి నిలుచున్న వీరాంజనేయుల గుడి. ఆ గుడిలో దీపం ఎప్పుడూ వెలగదు – దీపానికి దాపులేదు కనుక. పంచాదులున్న ప్రతీసారీ గుడి గూర్చి గుడిని బాగుచేసే కార్యక్రమం గూర్చి ప్రస్తావన వస్తుంది. బాగుచేయించే నిర్ణయాలు తీసుకుంటారు! అంతే! బరువు మోసే భక్తుడు ఉండాలి గదా!

ఆ గుడికి ఎదురుగా గజస్తంభం. గజస్తంభానికి పది అడుగుల దూరంలో మరో రాతి స్తంభం ఎత్తుగా దృఢంగా! పూర్వం ఎపుడో అది దీపస్తంభం. ఆ స్తంబం పైన నల్లరాతితో చక్కని గూడు చెక్కబడి ఉంది. ఆ గూటికి నలువైపులా చిన్న చిన్న ద్వార బంధాలు ముచ్చటగా శిల్పసౌందర్యంతో కనిపిస్తున్నాయి. ఆ దీపస్తంభం ఉపయోగం ఇప్పుడు లేదు. ఉన్నా, ఆ మాత్రం వెలుతురులో ఈ కాలం జనం సర్దుకుపోరు. అందుకే అక్కడ పంచాది దగ్గర సుమారు అరడజను లాంతర్లు పెట్టారు అక్కడక్కడా.

పంచాది కొచ్చిన వాళ్లు చెట్టు మొదలు చుట్టూ వున్న అరుగుమీద మాత్రమే కూర్చో లేదు. కొందరు పక్కనున్న ఇండ్ల అరుగులమీదా, కొందరు కిందా, కూర్చున్నారు. కొంతమంది నిలబడే ఉన్నారు.

చెట్టు అరుగుమీద కూర్చున్న 'అయ్యవారు' అని పిలవబడే కరణపాయన సుజాత రావడం గమనించి తన పక్కనే కూర్చున్న కోదండంతో "అయ్యా! ఆ పంతులమ్మా వస్తుంది. దాని నోటి వాటానికీ, అడిగే ప్రశ్నలకీ మనం ఇక మట్టి కరిచినట్టే" అన్నాడు చెవిలో.

"రానీయవయ్యా! నేనే రప్పించాను. ఈ పద్మకేసులో ఇరికించి దాని మెడకు మొద్దు వేస్తాను. ఉరుకలూ, పరుగులూ అప్పుడు తెలుస్తయి. ఐనా ఆడవాళ్ళ గాలి

అటుగా వుంది మనం తూర్పారబట్టక తప్పదు. నువ్వు చూస్తూండూ..." అన్నారు రహస్యంగానే కోదండం. అంతలోనే సుజాతను పలకరిస్తూ... "ఓహో పంతులమ్మగారా! రాండ్రి! రాండ్రి. ఈ ఊరు ఎంత పాడైపోతూందో చూడండ్రి. మీరు తప్పక వస్తారనే అనుకుంటున్న" అంటూ పక్కన చోటు చూపించాడు కూర్చోవడానికి

అక్కడ కోదండం అన్నదమ్ములు, అయ్యవారు, తెనుగు కులం పెద్ద, గొల్లకులం పెద్ద కోమట్ల రెండు కుటుంబాలు, ఇంకా కొందరు గ్రామంలోని వయసు మళ్ళిన వాళ్ళు ఉన్నారు.

దీపస్థంబం దగ్గరున్న పిట్టగోడ దగ్గర కూర్చుంది సుజాత. పక్కనే చంద్రమ్మ ఇంకా కొందరు ఆడవాళ్ళు కూచున్నారు.

ఎక్కడో చాలా దూరంలో నాలుగు వర్షం చినుకులు పడ్డట్టుగా వుంది. కొంచెం చల్లగాలీ, కమ్మని మట్టివాసన వస్తోంది. వేపచెట్టు కొమ్మలు మెల్లగా కదులుతున్నాయి. కుక్కలు విపరీతంగా మొరుగుతున్నాయి. రోడ్డుపై నుండి పెద్ద శబ్దం చేస్తూ బోర్ వెల్స్ వేసే మోటార్ వెళ్ళిపోతూంది. బొడ్రాయి దగ్గరున్న కాపోళ్ళ ఇంట్లో పసిపాప నిద్రలేచి ఏడుస్తోంది.

కోమట్ల రెండు కుటుంబాలు రెండు పక్కలా కింద నేలమీద కూర్చొని వున్నాయి. ఎడమ పక్కన పద్మ, ఆమె తల్లి జానకమ్మ, వాళ్ళకు ఎదురుగా రామలింగం, అతని తండ్రి కోటిలింగం, తల్లి యశోదమ్మ వున్నారు.

ఇక పంచాది ప్రారంభం కావలసి వుంది.

పట్నంలో పోలీసు వర్గంలో పెద్ద ఆఫీసరుగా పనిచేసి రిటైరై చాలాకాలంగా ఊళ్ళోనే వుంటున్న కోదండరావు, హనుమంతరావుల మేనమామ వృద్ధులు. అయన కోసం వెళ్ళిన వెంకటయ్య ఇంకా రాడేమని చూస్తున్నారు అక్కడ కూర్చున్న వాళ్ళంతా. ఇంతలో వెంకటయ్య రానే వచ్చాడు.

"ఏమైందిరా ఎంకటీ? ఏడీ 'మామా." అని అడిగాడు హనుమంతరావు పటేలు.

"అయ్యా పానం బాగలేదంట. పండుకున్నడు. ఒచ్చేటట్టు లేదు" అన్నాడు వెంకటయ్య.

"సరే" అన్నాడు కోదండం.

సభ తీర్చిన వారందరినీ మహారాజు వీక్షించినట్టు ఒక్కసారి అందరి దిక్కూ అర్ధవృత్తాకారంలో చూసి కోదండమే "రామలింగం! నీ సమస్య ఏందో ఇక్కడ పంచాది కొచ్చిన అందరి ముందట చెప్పు" అన్నాడు గంభీరంగా.

రామలింగం లేచి నిలబడ్డాడు.

సుజాత అతన్ని చూడటం ఇదే మొదటిసారి.

వయస్సు నలభై ఐదుకి తక్కువేం లేదు. తల సగభాగం నెరిసింది. పొట్టిగా నల్లగా దుంగలాగున్నాడు. పాదాలకి హాఫ్ షూ, రంగు రంగుల దుబాయ్ లుంగీ, పట్టులా మెరుస్తున్న షర్టూ, మెడలో బంగారు గొలుసు, అముదం బుడ్డిలా జిడ్డు

కారుతున్న ముఖం. అందులో తెల్లని కళ్ళు. వంకర టింకరపళ్ళూ పెదవుల మధ్యన కనిపిస్తూంటే అతను ఇలా చెప్పుకొచ్చాడు.

"అయ్యా! ఈ తల్లీ" జానకమ్మ దిక్కు చూపిస్తూ "ఈమె బిడ్డ నా పెండ్లాం ఇద్దరు కూడి నా వంశానికి, కులానికీ, గోత్రానికీ మచ్చ తెచ్చారు. మీ కందరికీ తెలుసు ఇదే ఊరిలో పెరిగిన పిల్ల ఈ పద్మను నేను నాలుగేండ్ల కింద పెండ్లి చేసుకున్న. ఒక్క యేడాది ఈమెతోటి సంసారం చేసినంక నేను బతుకుదెరువుకోసం ఊరి విడిచి, దేశం కాని దేశం బోయిన అక్కడ్ల మూడేండ్లు ఉండి నాలుగు రోజుల కిందనే వొచ్చిన. నేను రాంగానే తెలిసిందేమంటే పద్మ గర్భవతి అని. ఇప్పుడు ఈమెకు పొద్దులనీ, ఐతే కడుపెట్లా అయ్యిందో చెప్పమని నేను తిట్టి నిలదీసి అడిగితే నేనే కారణం అంటుంది. నీతోటే అంటుంది. నేను ఈ దేశంలనే లేను. నాతోటి ఈమెకు గర్భం ఎట్లొచ్చిందో మీరే అడుగుండ్రి. నన్ను ఏం జేయమంటారో మీరే చెప్పుండ్రి" జేతులు జోడించి చెప్పి ముగించాడు.

కోదండం అంతా విని, అందరి దిక్కూ "విన్నరా!" అన్నట్టు చూసి, పద్మ తల్లి జానకమ్మతో "ఏమమ్మా! నీ అల్లుడు నీ బిడ్డమీద నేరం మోపిండు. నీ బిడ్డె పాపం చేస్తే అందుట్ల నీకూ భాగముంటది. మీ అల్లునికి నువ్వేం సమాధానం చెప్తవ్?" అన్నాడు.

జానకమ్మ శరీరం తెల్ల గోధుమ వర్ణం. తల నెరిసినా నిండుదనం తగ్గలేదు. వృద్ధాప్యం ఛాయలు ఇప్పుడిప్పుడే చోటుచేసుకుంటున్నాయి. ఆమె లేచి నిలబడి "పటేలా! ఉన్న ఊర్లనే పిల్లనిచ్చినా, పెండ్లినాడు వాళ్ళు అడిగినన్ని పెట్టుపోతలు పెట్టినా, మూడేండ్ల నర్ధం నా పిల్ల ముఖం నన్ను చూడనియ్యలేదు దాని అత్తగారు. మొన్న నాల్గు నెలల క్రింద అత్తమామలు ఒద్దంటున్నా, కట్టేసి పెట్టినా కట్లు తెంపుకొని నా బిడ్డ నా ఇంటికొచ్చింది. అది అక్కడ బాధలు పడుతుంటె ఇని నేనూ కంటికి పుట్టెడు ఏడ్చిన, పెద్దలు చెప్పుకున్న. బాధలు మనుషులకు గాక మానుల కొస్తయా అన్నరు. అప్పటి సంది నేను తిన్నట్టే దానికీ కుండల కలిగిన ఇంత బువ్వ పెడుతున్న. అంతేగానీ నాకు ఇంకేసంగతి తెలవదు. ఇప్పుడు నా పిల్లకు పొద్దులే. ఐతే నాల్గునెల్లకే పొద్దులు రావు గదా. ఏమన్నా జరిగితే దాని అత్తమామలకు తెలిసే జరిగుండాలె. నాకైతే తెలవదు. మీరు ఆళ్ళనే అడుగుండ్రి. అది తప్పే చేస్తే చేసిందని తెలుస్తే ఇడిసిపెట్టు మనుండ్రి" అన్నది. "తప్పేచేస్తే ఎట్ల చేసిందో తెల్వాలె గదా! ఇది ఊరు. అడవిగాదు. ఇడిసిపెట్టేదీ లేదు దాని అత్తగారి మీదుంటది గానీ, ఒక ఇంటికిచ్చిన నీ మాట నెగ్గదు. ఆది వాళ్ళ ఇష్టం" అని.

"అబ్బా! నీ తెలివికి మెచ్చుకోవాలమ్మా! జాన చాలా హుశారు చూపించే ప్రయత్నం చెయ్యకు. నీ బిడ్డది తప్పే కాదు. దాని అత్తమామల్నే అడగమంటావ్! నీ ఇంట్లోనే ఇప్పుడుంది గదా! రోజూ దాని కడుపు నీకు కనిపిస్తూంటే పెనిమిటి లేందే ఇదెట్లా పెరుగుతోంది? ఏందీ కథ అని ఒక్కసారన్నా నీ బిడ్డను అడగలేదా?" అన్నాడు అయ్యవారు.

"అయ్యా! నా అల్లుడు బైటి దేశం బోయినట్టు నాకు తెలిస్తే గదా ఆయన లేడను కునేది? ఐతే నా బిడ్డ అత్తగారింట్ల ఎన్నికష్టాలు పడ్డదో ఆ కష్టాలల్ల నేను

భాగం పంచు కోలేదు నాలుగు నెల్ల కింద నా ఇంటికొచ్చిన నాటినుండి అది నెత్తి నొప్పి అన్నా కడుపు నొచ్చినా, కాలునొచ్చినా తల్లిగా అడిగి బాద తీర్చేదాన్ని. కానీ దానికి ఈడ ఏ బాధాలేదు. అసొంటప్పుడు అదేందీ? ఇదేందని నేనెందు కడుగాలె? దాని సుఖమే నా సుఖం. ఏడుపైతే అయిందేమో రేపు పిల్లను గని తల్లి లెక్క సుఖపడ్తది నన్ను మీరందరూ ఏమనుకున్నా సరే! ఇగ పరువూ మర్యాదా అంటారా! నాకు ఏం లేవు. బుక్కెడు బువ్వకోసం నా ఒక్కజీవి కోసం, ఏదో చిల్లర దుకాణం పెట్టుకుని బతుకున్న అది కూడా లేన్నాడు నాకు తిండి పెట్టి సాదే దాతలుంటే అప్పుడు పరువు, మర్యాదా కోసం చూస్త. ఐనా ఒకరి బతుక్కు నేను కర్తను గాను. అది చిన్న పిల్లగాదు. దాని ఇష్టం నేనైతే దాని కడుపులో కాసే కాయ దాని అత్తగారింటి చెట్టుదే అనుకుంటున్న మరి ఈ పంచాదెందుకు పెట్టినట్టూ అంటె నా సొత్తు అబ్బలేదని, నేను నాకున్నదంతా ఆళ్ళ ఆరిశడాన కొట్టక పోతిననీ".

"అబ్బా! అబ్బా!! ఇందిరాగాంధీని మించిన తెలివి నీకుంది జానకమ్మా! ఇప్పుడు నిన్ను ఏమడిగినా లాభం లేదు. ఐతే...." అని కోదండం అంటూండగానే మధ్యలో రామలింగం తండ్రి కోటిలింగం అందుకుని "పెద్ద పటేలా సూసిండ్రా దాని బజ్జాతి గుణం! దాని బిడ్డను నాల్గునెల్ల కిందనే ఇంట్ల కొటీళ్ళ ఏసి తగుల పెట్టేస్తే పీడ పొయ్యేది.

భూ ప్రపంచంల ఎక్కడనన్నా పెనిమిటి లేందే పిల్లలు పుడతారా? మావోడు కానని దేశాలుంటే దీనికి కడుపెట్లా ఆయె!ఈమె తల్లిగారిని' అడుగొద్దు. తల్లీ పిల్లా మా ముఖాలు నల్లగ జేసిండ్రు. మేం తలెత్తుకుని ఈ ఊర్ల ఎట్లా బతకాలె" అన్నాడు మనిషి నిలువునా వణికిపోతూ.

కోటిలింగం భార్య యశోదమ్మ "మేం దాన్ని బాధలు పెట్టినమట. దేశంల లేని బాధలు పెట్టినమా? ఎవరైనా బుద్దులు చెప్పుకోరా? ఇంట పనులెట్ల జెయ్యాల్నో చెప్పు కోరా? ఇదేమో బ్రహ్మ సోద్యమాయే" అని చేతులు వూపుతూ గట్టిగా అంది.

"ఓ ముసలమ్మా నువ్వుండు లొల్లి పెట్టకు. ఇక్కడ మేం ఉన్నం గదా! అన్నీ అడుగుతం" అన్నాడు హనుమంతు పటేలు.

అంతలో తెనుగు కులస్తుడు పెద్ద యాదయ్య కలుగజేసుకుని..."పాతవి తోడుకుంటే బోకులే బైటపడ్తయి. మనను మల్ల మాట్లాడనియ్యకుండ జవాబు చెప్పింది జానకమ్మ. ఇంగ ఇదంతా గాదు ఉన్న విషయం ఉన్నట్టు ఆ పిల్లదాన్నే అడుగుదాం. ఆమె ఏం చెప్తదో తెలుస్తది గదా" అన్నాడు దగ్గుతూ.

జనంలో గుసగుసలు మొదలయ్యాయి. అందరి చూపులు పద్మమీదే ఉన్నవి. సుజాత ఇదంతా జాగ్రత్తగా గమనిస్తోంది. ఇంతలో ఇంకా కొందరు స్త్రీ పురుషులు అక్కడి కొచ్చారు. ఇక అప్పుడు ఊర్లోని అన్ని కులాల జనం వచ్చినట్టే అయింది.

"ఏమమ్మా పద్మమ్మా నీ మొగుడు మమ్ములను పంచాది చెప్పమని ఎందుకు పిలిచిండో నీకు దెల్సు గదా! మరి నువ్వేం సమాధానం చెప్తవ్." అని అడిగాడు కోదండం

పద్మ అందరిలా లేచి నిలబడలేదు కూర్చునే వుంది. ఒకసారి తలెత్తి పెద్దలు కూర్చున్న అరుగు దిక్కుగా చూసింది. తర్వాత తల దించుకుంది.

పద్మ వయసు ఇరవై ఏండ్లకు మించి ఉండదు. గున్నమామిడి కొమ్మలా, గుమ్మడి పువ్వులా ఉంటుంది ముఖంనిండా మిసిమి, దీపాలకాంతిలో సైతం ముఖంలోని కళకొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

తీక్షణమైన ఆమె చూపులు చంచలత్వానికి లోనయ్యాయి భుజాల నిండా కొంగు సర్దుకుని, తల దించుకొని కూర్చుంది

"ఏందీ సప్పుడు జెయ్యవూ? మీ ఆయన చెప్పింది నిజమేనా? నువ్వు మీ ఆయనను చూసి ఎంతకాలమైందీ?" అని అడిగాడు హనుమంతు.

పద్మ మౌనంగానే ఉంది.

జనంలో మళ్ళీ కలకలం. ఆ జనంలో నుండే ఆడవాళ్ళు "చెప్పరాదే పిల్లా పీడ పాడుగానూ" అని ఒకరంటే, "సుద్ద పూసలెక్క కూసుంటే గాదు చెప్పు" అని ఒకరు, "అమ్మో, ఏమెరుగని మొల్లి నల్లి లెక్కనే కూసుంది" అంటూ మరొకరు అన్నారు. ఇలా చెప్పు... చెప్పు. అని పదిమందీ అనేసరికి –

"మా ఆయినే" అంది పద్మ.

"ఏందీ మీ ఆయనా? దుబాయ్‌కెళ్ళి ఎప్పుడొచ్చిండు?" అడిగాడు కోదండం.

"కలలొచ్చిండు. పక్కేసుకున్నం. నాకు గంతే తెలుసు" అంది పద్మ. ఈ మాట అందరికీ వినిపించింది. కొందరు నవ్వుతున్నారు.

మళ్ళీ కోదండమే "ఇన్నరా ఆడోళ్ళంతా! ఏమి సుజాత పంతులమ్మా ఇన్నరా? స్త్రీలోకం, మహిళాలోకం ,ఏ దేవుడు వరమిచ్చినా, పెనిమిటి లేంది పిల్లలు పుట్టరు గదా? మరి ఈమెకు మొగడు కలలొస్తే కడుపైందట. అదీ ఎప్పుడూ? ఈ పందొమ్మిది వందల తొంభై అయిదో సంవత్సరంలో.. ఈమె ఇంకా మనందరి చెవులల్ల పువ్వులు ఉన్నయను కుంటుంది కాకమ్మ కథల, పుక్కిటి పురాణాల కాలం చెల్లిందని తెలుసుకుంట లేదు. ఇక ఎవరన్నా మీరే ఇప్పుండ్రి ఈ చిక్కు" అన్నాడు.

మళ్ళీ గోల ప్రారంభమైంది. తలా ఓ తిట్టు పద్మకు అందుతూనే వుంది. ఇంకా ఊరుకోలేక సుజాత పద్మ దగ్గరకెళ్ళింది. ఐదు నిమిషాలు ఏదో మాట్లాడింది.ఐనా పద్మ మరోసారి నోరు విప్పలేదు. తన మనసునున్న మాట విప్పలేదు. కోటిలింగం, రామలింగం బండ బూతుల వర్షం కురిపిస్తున్నారు. యశోదమ్మ శాపనార్థాలు పెడుతోంది. ఐదునిమిషాలు గడిచాయి.

"ఇట్ల మర్యాదతోని అడిగితే ఇనెటట్టు లేదు. ఆ స్తంభానికి రెక్కలిరిసికట్టి నాలుగు అంటించాలె" అన్నాడు హనుమంతు.

అతని పక్కన కూర్చున్న పెద్దలు వంతపాడి "అవును! అవును" అన్నారు.

జానకమ్మ మనసంతా భయంతో నిండిపోయింది. ఎంత గుండె దిటవు చేసుకున్నా ఆ వాతావరణం కలచివేస్తోంది. పిల్లను ఏం చేస్తారు? కొట్టి చంపేస్తారా? ఇప్పుడేం చేయనూ? అని మధనపడుతూ బిత్తర· చూపులు చూస్తోందేగానీ, ఆ పెద్దల ముందుకెళ్ళి బతిమాల దలచుకోలేదు. కాళ్ళుమొక్కాలని అనుకోలేదు. తాళ్ళు చేతుల్లో ఉన్న వెంకటయ్య పద్మ దిక్కు నడుస్తున్నాడు.

ఇంతపరకూ ఓపిక పట్టిన సుజాతకి ఇంకా స్తబ్దత భరించాలని లేదు. "ఆగండి, ఇది మరీ అమానుషం, పశుత్వం, రాక్షసత్వం. ఆ పిల్ల నిండు చూలాలు. మీరు ఈ తీరుగ హింసపెట్టడం దారుణం" అంటూ పౌరుషంగా లేచి ముందుకు నడిచింది. "ఆమెను కొట్టి నిజం చెప్పించదల్చుకుంటే కట్టేసి కొట్టాలని ఏముంది? ఇంతమందిని కాదని కడుపుతో పాటు పారిపోతదా! ఐనా తప్పుచేసింది ఆమె ఒక్కతేనా? ఆ పురుషుడు ఈ ఊర్లో ఇక్కడే లేడా? వాడెందుకు రాడు ముందుకు? మనిషి కాడా, చీమూ నెత్తురు లేదా?" అంటూ సుజాత జనం మధ్యలోకొచ్చింది.

జనమంతా విన్నారు. గాలివీస్తున్న సన్నని చప్పుడు మినహా అక్కడ అలికిడే లేదు ఎవరూ ముందుకు రాలేదు.

కోదండం సైగ చేయగానే వెంకటయ్య తన చేతిలో ఉన్న తాళ్లు పక్కన పారేసి వావిలి బరిగెలతో పద్మ దగ్గరకెళ్ళాడు. నాలుగింటిలో మూడు పక్కనున్న వాడి చేతికిచ్చి, ఒక్క బరిగెతో ఆమె వీపున గట్టిగా రెండు దెబ్బలు వేశాడు.

పద్మ నోటమాటలేదు కానీ, ఆమె తల్లి భళ్ళున ఏడుస్తూ, "నా బిడ్డె చచ్చెరో, దేవుడో" అంటూ వెళ్ళి కూతుర్ని వాటేసుకుంది. ఆమెను పక్కకి లాగేశాడు వెంకటయ్య.

తాకిన దెబ్బలతో పద్మ ఒళ్ళంతా ఒక్కసారే జలదరించింది. ఎర్రగా వాతలొచ్చాయి. ఐనా పళ్ళు బిగపట్టి కట్టలు తెంచుకు ముంచుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ దెబ్బ తాకిడితో వంగిన శరీరాన్ని మళ్ళీ పైకి లేపింది. కళ్ళనుండి ఏకధారగా నీళ్ళు కారుతున్నాయి. ముఖం కందగడ్డలా మారింది. తలవెంట్రుకలు చెల్లాచెదురై ముందుకు వాలుతున్నాయి.

కోదండం దిక్కు చూసిన వెంకటయ్య పద్మ ఇంకా నోరు విప్పనందున సర్రున మరో దెబ్బ ఇంకా గట్టిగా వేశాడు. మళ్ళీ నాలుగో దెబ్బ వేసేందుకు బరిగె పైకెత్తాడు.

"ఎంకటయ్యా ఆగు... ఆమెను కొట్టొద్దు" అంటూ జనంలో నుండి అరుపు. అందరూ అటు దిక్కు చూశారు. అతను 'బాజారు' ఆశ్చర్యం ఊరి చాకలి. పెళ్లికాలేదు. ఇరవై ఐదేండ్ల యువకుడు. కులం తప్పి మర్యాదా మన్ననా మరిచి పెద్ద కులం దానితో సంబంధం! నిజమా! జనంలో ఆలోచనలు.

అమ్మలక్కలు ముక్కున వేలేసుకున్నారు. పురుషులు కొందరు గుడ్లురిమి చూస్తే, కొందరు బాజారును 'భలే పనిరా' అన్నారు వ్యంగ్యంగా.

బాజారును పంచాది పెద్దలు ఎన్నో ప్రశ్నలడిగారు. అన్నిటికీ అతను దాపరికం లేకుండా జవాబులు చెప్పాడు.

"వాన్ని చితకదన్నాలె కాలో చెయ్యో నరకాలె" అన్నారు ఎవరో.

బాజారును కొట్టలేదు. తిట్టారు. పెద్ద మనుషులనే పంచాయతీ సభ్యులతోపాటు కోటిలింగం, రామలింగం కూడా కూర్చొని చర్చించుకున్నారు. తర్వాత ఓ నిర్ణయానికొచ్చి తీర్పు చెప్పేందుకు సిద్ధమవుతుండగా సుజాత ముందుకొచ్చింది. వచ్చి.

"పెద్దలు మన్నించాలె. మీరు తీర్పు చెప్పేముందు ఒక్కసారి నా విన్నపం వినండి. ఈ ఇద్దరు నేరస్థులతోపాటు వీళ్ళకన్నా పెద్దనేరం చేసిన కుటుంబాన్ని

మీరు మర్చిపోవద్దు అది కోటిలింగం కుటుంబం వాళ్ళలో మొదటి ముద్దాయి ఇప్పుడు మీతో ఉన్న రామలింగం. రామలింగం తను బతకడానికి ఏం తక్కువుందని దుబాయ్ దేశం పొయ్యిండు? ప్రస్తుతం వున్న ఆస్తితో మూడుతరాలు బతకొచ్చు గదా! పోనీ దుబాయ్ ఎళ్ళ దలిచినోడు పెళ్లెందుకు చేసుకున్నడు? ఎక్కడుంచి ఎళ్ళిండు? ఎవరికోసం చేసుకున్నడు? ఐనా అతని వయస్సెంతా? ఆ అమ్మాయి వయస్సెంత? పెండ్లినాటికే నలభైఏండ్ల పైబడ్డ తాను ఇరవై ఏండ్లన్నా లేని పిల్లను ఎందుకు?, ఏ ఆశతో చేసుకున్నడు? ఆస్తి కోసమేగా? సరే! ఈనాడు అతని భార్య ఆ పడుచుపిల్ల తెలిసో, తెలియుకో, ఏ మానసిక స్థితిలోనో, కాదంటే మోసంతోనో నేరస్తురాలిగా ఇక్కడ నిలబడి ఉంది. ఆమెమీద మోపిన నేరం అక్రమ సంబంధం. అసొంటప్పుడు నలభై ఏండ్లప్రాయం మించిన ఆమె భర్త రామలింగం ఇంతవరకూ ఏ స్త్రీతోని అక్రమ సంబంధం లేకనే వున్నాడా? లేదని గుండెమీద చెయ్యేసుకుని చెప్పగలడా? అది పోనీ పురుషుడు అంటరేమో! మీరు స్త్రీలు కారు కనుక. పోనీయండి. రామలింగం తన జీవిత భాగస్వామిగా వుంటుండనుకున్న మనిషి అత్తగారింట్ల ఏ సుఖమూ లేక రోజూ ఎన్ని కష్టాలు పడుతూ కాలం వెళ్ళబుచ్చు తోందో ఒక్కసారన్నా ఆలోచించాడా? తనకు డబ్బు మినహా మరేం అవసరం? ఇవ్వన్నీ అడుగుండ్రి. అతన్నే కాదు, కోటిలింగంగారినీ, యశోదమ్మనూ ప్రశ్నించి ఆ తర్వాత పద్మకైనా, బాజారుకైనా శిక్ష వేయడం మంచిది. ఐతే ఒక్క సూచన లేదా మనవి. ఈ కేసులో నష్టపోయింది, అవమానపడింది, శారీరకంగా, మానసికంగా బాధకు గురయిందీ ఒక ఆడమనిషి అని మర్చిపోక తీర్పు చెప్పుండ్రి" అన్నది అందరికీ వినిపించేలా

ఆడవాళ్ళు సుజాత దిక్కు వింతగా చూశారు కొందరు 'అట్లా అడుగు' అన్నారు. ముసలమ్మలు మౌనంగా పటేళ్ల దిక్కు చూస్తున్నారు.

"ఇక ఈమె మాట్లాడితే ఊరికి అమాసే లేదంటది" అన్నాడు అయ్యవారు.

"పంతులమ్మా ఇది మా ఊరి వ్యవహారం. మిమ్ముల్ని పిలిచింది వినేటందుకే, మా మెదడ్లు తినేటందుకూ, సూచన లిచ్చేటందుకూ గాదు" అన్నాడు కోదండం.

"నువ్వు అన్ని తాకుడులు తిన్నదానివి కాదు. మేం నువ్వు పుట్టకముందు నుండే ఇక్కడ పంచాదులు తెలుపుతున్నంగావొచ్చు. ఏం జెప్పాల్నో మాకు తెలుసు 'నక్క పుట్టి నాలుగు వారాలు కాలేదట. ఇంత గాలీవానా ఎన్నడూ ఎరుగనన్నదట' అన్నాడు హనుమంతు.

"ఓ హనుమంతు పటేలా తోక ఉన్నట్టు సామెత బాగనే జెప్తివి కొసకు. టీచరమ్మను నక్కా కుక్కా అనకు మంచిగుండదు. గాల్దె దీసేసినట్టు తీసెయ్యకు. తెలివికి చిన్నా పెద్దా ఉండదని మీరే జెప్తరు గదా! మన ఊరేగాదు. ఏ ఊర్లనైనా న్యాయం ఒక్క తీర్గనే వుండాలె. దేశంలున్న ఊర్లన్ని ఆమేయే ఆమె చెప్పిన మాటల ఏమన్న మంచి వున్నదేమో సూడుండ్రి. గంతేగని, సల్ల తీగెను తీసేసినట్టు తీసేస్తే బాగుండదు" జనంలో నుండి ముందుకొచ్చి సూటిగా చూస్తూ అన్నది కురుమ చంద్రమ్మ.

చంద్రమ్మ దిక్కు కోపంతో చూశారు పెద్దలు.

హనుమంతు ఆవేశంతో ఏదో అనబోతుండగా... కోదండం ఆపి, ఓరగా చూసి తలఊపి "చంద్రమ్మా! పంతులమ్మగార్ని మేము తీసేస్తలేము. నువ్వెందుకు తొందరపడ్తవూ? చెప్పుమను ఇంకేమైనా ఆమె చెప్పాలనుకుంటే చెప్పుమనూ" అని "చెప్పవమ్మా ఓ సుజాతమ్మా" అన్నాడు మళ్ళీ.

"కోదండంగారూ! మీ తీర్పులకూ, నిర్ణయాలకూ సూచనలిచ్చే అధికారం నాకు లేదంటరేమో! కానీ, చంద్రమ్మ అన్నట్టు విజ్ఞానానికీ, సమస్యకీ, ప్రాంతీయతకీ మీరు లంకె వేయడం మంచిది కాదు ఇక మీరు అడగకున్నా, పాటించకున్నా ఇక్కడ నా అభిప్రాయం చెప్పక తప్పదు. పద్మను భర్త, అత్తమామలూ, ఈ సమాజం నిర్లక్ష్యం చేసింది. ఒక మనిషిలా ఆమెను చూడలేదు. తనను అభిమానించి, సానుభూతి చూపి, ప్రేమించే వ్యక్తి కోసం పరితపించింది. ఆ పని బాజారు చేశిండు. ఆమెకు కులంగొప్ప అనిపించలేదు. గుణమే గొప్పదని తెలిసి అతన్ని ఆమె ప్రేమించింది. వాళ్ళ ఇద్దరిలో మంచితనం వుంది. కనుక వాళ్ళకు వివాహం చేయడమే మంచిది. పద్మకు భర్తనంటున్న రామలింగం భార్యకు విడాకులివ్వడమే ఉచితం" అంది సుజాత.

జనంలో యువకుల చప్పట్లు. అంతలో ఏదో అల్లరి. మళ్ళీ నిశ్శబ్దం. తర్వాత కోదండం మెల్లగా "టీచరమ్మా! ఇది సట్నంగాదు. పల్లె. ఇక్కడ మాకు ఆచారాలూ, కట్టుబాట్లూ చాలా వుంటయి. ఈడికొచ్చి పోలీసులూ, కోర్టులూ ఏమీ చెయ్యవు. కులాల కట్టును ఏమీ తెంపలేవు. మనిషి జీవితం దాంట్లనే వుంది" అని "ఇప్పటికే శాస రాత్రయింది ఇంగ మీ తీర్మానం మేం జేస్తం ఇనుండ్రి" అన్నాడు.

హనుమంతు లేచి నిలబడి.....

"రామలింగం పొట్టతిప్పలకోసం దేశం బొయ్యిండు. అతను వచ్చేవరకు ఓపిక లేనట్టు కాలుజారే తెలువక పొరపాటు చేసింది అతని భార్య పద్మ. చిన్న పిల్ల తప్పే చేసిందని మేము అనుకుంటున్నాం. పద్మ చేసిన తప్పులో ముఖ్యంగా బాజారు నేరం క్షమించరానిది వీడు కులం మరిచి హెచ్చుతగ్గులు మరిచి వయసులో ఆమెకన్నా పెద్ద అయివుండి కూడా కావురం బట్టి బలిసి ఈ పనిచేసి వుంటడు. ఆ పిల్లకు లేని పోని మాయమాటలు చెప్పి ఒకటి రెండు సార్లు అక్రమ సంబందం పెట్టుకునే వుంటడు. ఇది ఆని మొదటి తప్పు కింద లెక్కేస్తున్నం. ఐనా తప్పు తప్పేకదా! అందుకే ఆనికి శిక్ష తప్పదు శిక్ష ఏమిటంటే మొదటిది ఈ పంచాది కానే ఇప్పుడే ఇక్కడే బుద్ధి వచ్చేటట్టు లెక్కపెట్టి వీపుమీద అరడజను దెబ్బలు కట్టెతోటి కొట్టాలె. రెండోది పదివేల రూపాయలు జుల్మానా ఏస్తున్నం. పదిహేను రోజుల్ల ఆ పదివేలు తప్పనిసరిగా కోటిలింగంకి ఇయ్యాలె. ఆ పిల్ల దిక్కు కన్నెత్తి కూడా చూడకూడదు. ఇక మూడోది ఊర్లకెల్లి ఎల్లిపోయి ఊరి కొసన మాదిగిండ్ల దగ్గర గుడిసె యేసుకొని వుండాలె" అంటూ తీర్పు వినిపించాడు.

బాజారు వీపుమీద ఆరు దెబ్బలు వేశాడు వెంకటయ్య. పద్మ తల్లడిల్లింది. ఏడ్చింది. అందరూ లేచారు. పద్మ తల్లితో వెళ్ళిపోయింది. సుజాతా కదలక తప్పలేదు.

మరునాడు రాత్రి ఎనిమిది గంటలు కావొస్తోంది. పొయ్యి దగ్గర కూర్చున్న సుజాత కట్టెలు, పిడకలు మండక యాతన పడుతూ వంట చేసుకుంటూంది. "కిరోసిన్ ఊళ్ళోకి రాక వారం దాటింది. దాని గూర్చి ప్రయత్నం చేసి సక్రమంగా

తెప్పించవచ్చు. తెచ్చే కోటాలో అవకతవకలు జరుగుతున్నాయి. కానీ, అది మరో పోరాటం. దానికి సమయం చిక్కాలిగా!" అలా అనుకుంటుండగానే తను వుండే గది తలుపు గొళ్ళెం ఎవరో కొడుతున్న శబ్దం వినిపించింది. వెళ్ళి చూస్తే ఆ వచ్చిన వ్యక్తి బాజారు.

బాజారును తను తరచూ చూస్తుంది. అతని తల నిండా ఉంగరాల జుట్టు వున్నా చాకిరేవులో సొడు నీళ్ళు పడి కాబోలు రాగి లేగెల్లా వుంటుంది. బట్టలుతికే బండ శరీరం బలిష్ఠంగా వుంది.

"టీచర్ నేను దిక్కూమొక్కూ లేనోన్ని ఒకటి రెండు ముచ్చట్లు అడిగి తెలుసు కుందామని, నా బాధ చెప్పుకుందామని ఒచ్చిన. ఇట్ల దర్వాజ పక్కకు కూసుండునా, కోపం జెయ్యొద్దు" అన్నాడు తలుపు తీయగానే.

"కూర్చో, బాజారూ! దానికేముందీ" గదిలోపలున్న స్టూలు చూపిస్తూ అంది.

సుజాత ఈ ఊరికొచ్చిన కొత్తలో ఊరి చాకలోని పేరు 'బాజారు' అని ఎవరో చెబితే 'అదేం పేర' ని అడిగింది. 'బాజారు' అంటే 'బజార్' 'వీధి' 'రోడ్డుసైడు' అంటూ వానితల్లి వాన్ని చాకిరేవులోనో, ఇంట్లోనో కనలేదు. వాడు కడుపులో వుండగా మైలబట్టల మూట మోసుకొని బజార్ గుండా వెళుతుంటే విపరీతమైన పురిటి పొప్పులు పడి వీధిలోనే ప్రసవించిందంట. ఆ విధంగా బజార్లో పుట్టినవాన్ని అందరూ 'బజారుగాడు' అంటూ పిలవగా పిలవగా 'బజారు' అనే పేరు స్థిరపడిపోయిందని చెప్పగా విన్నది.

పొయిమీది నుండి అన్నం గిన్నె దించింది సుజాత. బయట సన్నగా చినుకులు పడుతున్న చప్పుడు. చల్లగాలి వీస్తోంది. కరెంటు బల్బ్ వెలుగుతోంది. అది ఏ నిమిషంలో ఆరిపోతుందో ఎవరికీ తెలియదు - కనుక అగ్గిపెట్టె, దీపం బుడ్డీ దగ్గర పెట్టుకుని గదిలో మూలనున్న ఇనుప మడత కుర్చీ వాల్చుకుని కూర్చుంది సుజాత. అలా కూర్చుని అతని దిక్కుచూసి "ఇగచెప్పు ఏం ముచ్చట?" అంది.

"టీచరమ్మా! మేము సాటు మాటు పనులు జేసి లోకం కన్ను కప్పాలనుకుంటె పద్మ ఇప్పటి వరకు కడుపుతోటి వుండేది కాదు. కడుపు రాకుంటనే సూసుకుంటుండె. సత్యప్రమానంగా చెపుతున్న ఆమె నా నరనరాన కలిసి పానం తెక్క కదుల్తది. ఆమె మూడేండ్ల సంది పడుతున్న కష్టాలు చూడజాలక నా సొంతం జేసుకుందామనుకున్న. చేసుకున్న. నేనంటే తనకూ పంచపానాలే. ఐతే నస్నూ, ఆమెనూ ఆ కులపోళ్ళు, నా కులపోళ్ళు తిట్టిండ్రు. రాత్రి పంచాది కాడికొచ్చిన నా దెగ్గరోళ్ళూ, నన్ను తిట్టక ఇడిసి పెట్టలేదు. మా ఇద్దరికీ ఈ కష్టాలొస్తయని తెలుసు. అసలు సంగతి తెలిస్తే ఆమెను కులంల కెల్ల ఎలగొట్టి నా తోటి పంపిస్తరనుకున్నం. గని అట్ల జరగలేదు. టీచర్ నా భూమి నా తాతలకాలం నాటిది. నా అమ్మ నాకు ఇచ్చింది. ఇయ్యాల ఆ భూమి పోతుంది. పోనీ, పద్మకోసం ఇడిసిపెడ్త. నన్ను ఊరినుండి ఎల్లగొట్టి మాదిగిండ్ల అవతల వుండమన్నరు. వుంట. కనీ, పద్మ బాగుంటదంటరా? పద్మ సుఖపడ్తదని ఈ పెద్దమనుషులు రాసిస్తరా? నేనేమో ఐపోతే నాకు బాధలేదు. పద్మ సచ్చిపోతదేమోనన్న అనుమానముంది. ఎన్నోసార్లు పారిపోదాం, లేచిపోదాం పదూ" అని నన్ను ఎంతో బతిమిలాడింది. నేను పోలేదు. ఎందుకంటరేమో. నాకు ఈ జన్మనిచ్చిన అయ్య

నడుములు లేవని రోగస్తుడు. ఆయనను ఇడిసి పెట్టి మేము ఎల్లిపోతే నేను మనిషినే కాను" అన్నాడు అతని గొంతులో దుఃఖం పొంగు పొడసూపుతోంది.

బాజారు చెప్పిన మాటలన్నీ శ్రద్ధగా విన్న సుజాతకు ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరికాయి ఇక ఏమీ అడగాలనిపించలేదు. రెండు నిమిషాలు మౌనంగా కూర్చుంది. తర్వాత "సరే! ఇక నీవు వెళ్లు. భూమి అమ్ముతానని అప్పుడే ఎవ్వరి దగ్గరా డబ్బు తీసుకోకు. ఇంకా పద్నాలుగు రోజుల టైం వుంది గదా! పది రోజుల తర్వాత నాకు కనిపించు" అంది అతన్ని పంపిస్తూ.

సన్నని సాలెగూడు తీగెల్లాంటి వానచినుకుల్లో కలసి మెల్లమెల్లగా చీకట్లో కరుగుతూ వెళ్ళిపోయాడు బాజారు. ఆ రాత్రి చాలా పొద్దుపోయే వరకు నిద్ర రాలేదు సుజాతకు. ఆ తర్వాత ఐదు రోజులు గడిచాయి పద్మ తల్లి దగ్గరే వుందా! అత్తవారింటిలోనా? తెలుసుకొని ఆనాటి సాయంత్రం తల్లి దగ్గరేవున్న పద్మను కలిసేందుకు వెళ్ళింది సుజాత.

పద్మా, జానకమ్మా సుజాతని చూసి ఎంతో సంతోషపడ్డారు. పద్మ టిపిన్ చేసి పెట్టింది. 'టీ' కాచి ఇచ్చింది. జానకమ్మ తన కిరాణా కొట్టులో కూర్చుని వుంది. ఆనాటి జానకమ్మ మాటలు జ్ఞాపకమొచ్చి నవ్వుకుంది సుజాత. ఆమెదో ప్రత్యేకమైన పాత్ర ఇట్లాంటి వాళ్ళు తటస్థపడడం చాలా అరుదు. నిజంగా ఈమెను చూస్తే అంతసూటి మనిషిలా అగుపించదు. గట్టిపిండమే అనుకుంది.

రెండురోజుల క్రితం వీళ్ల ఇంటికి రామలింగం వచ్చి వెళ్లిన సంగతి నిన్ననే సుజాతకి తెలిసింది. ఇక పద్మ ద్వారా విషయాలు తెలుసుకోవాలి "పద్మా! బాజారు భూమి అమ్మేసి డబ్బు తయ్యారు జేస్తుండు. ఊరి బయట గుడిసె ఏసుకునే ప్రయత్నాలూ జరుగుతున్నయ్. నీ భర్త లేని నాటి మాట వేరు. ఏం జరిగిందో జరిగిపోయింది. ఇప్పుడు మరి పురుడు ఎక్కడ పోసుకుంటవ్? ఈడనేనా? మీ ఆయిన నిన్ను పట్నం తీస్కపోత నన్నడా?" అని అడిగింది సుజాత.

"మా ఆయన!! వాడో మొగోడా? పశువు, రాక్షసుడు. ఆనితోని ఒక్కయాడాది వున్న. ఆడు మనిషే కాదు. అయ్యకూ, అమ్మకూ, సుట్టాలకూ సేవలు జెయ్యాలని నా మెడకు తాడు గట్టిండు. అదెప్పుడో తెంపేసిన. నేను పెండ్లాన్నని ఈడ యములోళ్లకు నన్ను అప్పజెప్పి ఆడు దుబాయ్ దేశం బొయ్యిండు. ఆడనే సస్తే బాగుండె. మల్లెందు కొచ్చిండో..." కోపంతో అంటున్న పద్మమాటల మధ్యలోనే అందుకొని..."నిన్నింత బాధ పెట్టాడా పద్మా?" అంది సుజాత.

"ఎన్నని జెప్పాలె! ఆడున్నప్పుడు నా తప్పులేందే తిట్టేది. కొట్టేది. కాల్చేది. మీ అమ్మకున్న ఐదెకరాల భూమి అమ్మి పైసలు దెమ్మని బాధపెడ్తుండె. కిరాణా దుకాణంల లక్ష సంపాదించి అమ్మ దాచుకుందట అవ్వీ తెమ్మని కొడుతుండె. నన్ను ఆ ఆస్తికోసమే చేసుకున్నడంట. ఆడు దేశం బోతె పీడ పొయ్యిందనుకున్న ఐనా నన్ను ఒక్క రోజన్నా మా అమ్మ తానికి పంపలేదు. నా అత్త రాచ్చసి ముండ. రాత్రీ పగలూ ఒక్కదాన్నే అన్ని పనులు జెయ్యాలె. ఆమెనేమో మంచినీళ్ల గలాసముట్టుకుంటె కరిగిపోతననుకుంటది. తెల్లారితే పండ్లు తోముకునేటందుకు పండ్లపొడి కూడా అందియ్యాలె."

"బాజారు ఎట్లా దెగ్గరైండు?"

పద్మ నవ్వింది సంతోషంతో "చిన్నతనంనుండి చూస్తున్న బాజారును. బాజారు లెక్క లెక్క మనిషి నూటికొక్కరుండరు. నాకు బతుకు ఇచ్చింది బాజారే. లేకుంటే నేనెప్పుడో సచ్చిపోయెదాన్ని. బాజారు ఇంత మంచోడని రెల్తే అందర్నీ లాతుగొట్టి ముందే ఆయన్నే చేసుకునే దాన్ని. ఎక్కశిరి తెలిసింది. ఐనా కొంపమునగలే బాజారే నా మొగడు."

"మరి ఆరోజు అంత మందిల భర్త కలలొచ్చిందని ఎందుకన్నవ్?"

"మరేమనాలో తోచలేదు. అదంతా ఒట్టిమాట. లోకం ఏమంటదో చూద్దామనే అన్న. అంతేగాదు. అట్లనే దెబ్బలు తిని చస్తుంటిగాని, బాజారు పేరు బైటపెట్టక పోతుంటి. బాజారు అక్కడుంటే సన్ను తానే కాపాడుకుంటడు. లేకుంటే చచ్చిపోదమనే అనుకున్న."

మరో పదినిమిషాలు అలా మాట్లాడుతు కూర్చొని "బాగా చీకటిపడింది ఇక పోతా పద్మా" అంటూ లేచింది సుజాత.

అంతకుముందే జానకమ్మ కొట్టులో నుండి లేచి వీళ్లమాటలు ఏవీ పట్టించుకోక అలా వంటింట్లోకి వెళ్లి వంటపనుల్లో వుండిపోయింది. సుజాత లేచి నిలబడ్డది గమనించి వాళ్ల దగ్గరకొచ్చి "బువ్వ తినిపోతే బాగుంటుంది సుజాతమ్మా" అంది.

"అవును కలిసి తిందాం కూసో టీచర్" అంది పద్మ ఉత్సాహంగా.

"ఇవాళ కాదు నేను వండుకుంది వుంది. ఈసారి ఒచ్చినప్పుడు తప్పక తింటా" అంటూ బయలుదేరింది సుజాత.

★ ★ ★

కోదండం ఇంటి ముందు పడక కుర్చీలో కూర్చొని తన ట్రాక్టర్‌కి ఏదో రిపేర్ వస్తే చేయిస్తున్నాడు. బాజారును చూసి వేళగానివేళలో వస్తున్నాడని కాబోలు...."ఏం రా! బాజారూ నీ పనులెంతవరకొచ్చినయ్? పెద్ద మనుషులు చెప్పిన తీర్మానం సజావుగా సాగాలె. లేదంటే చిక్కుల్లల్ల పడతవ్. భూమి అమ్మినట్టు లేదు. రూపాయి లేదనన్న అడిగినవా? గుడిసెకు భూమి సూపుమనీ రాకపోతివి? ఏంది కథా? ఏం యోచన జేస్తున్నవ్‌రా?" అన్నాడు మాటలో దీర్ఘాలు తీస్తూ. .....

ఆయనకి నమస్కరించిన బాజారు. దగ్గరగా వచ్చి "అయ్యా రూపాయలు తయ్యారు జేసిన, నాకు ఇగ ఊర్లెనే ఉండబుద్దైత లేదు. ఇయ్యాల్లనో, రేపో రాత్రికే రూపాయలు అందరి ముందల ముట్టజెప్పి నేనేటన్నా యెళ్లిపోత" అన్నాడు.

"అందరితోటి పనేందిరా ఇంకా! ఇద్దరు పెద్దల్ని ఎంతవెట్కపొయ్యి కోటిలింగానికి రూపాయలు కట్టకపోయినావు? ఐనా నువ్వు ఊరు ఇడిసి పెట్టుడెందుకురా?"

"ఏందో పటేలా నా మనసు తావునుంటలేదు. ఆగమాగముంది. మెడనరికినట్టని పిస్తుంది.... ఇక పది మందిల రూపాయలు ముట్టజెప్పి చేసిన తప్పుకు చెంపలేసుకొని వెళ్లి పోదామనుకుంటున్న.....ఈ మాటే నా అయ్యకూ జప్పిన. జర నువెట్లైన రేపు రాత్రికి పెద్దలందర్నీ పిలువనంపు. దండం పెడ్త" అన్నాడు బాజారు.

"సరే పోరా! ఇక నీ ఇష్టం" అన్నాడు కోదండం.

★ ★ ★

మృగశిర వెళ్ళిపోయింది. ఆరుద్ర సగం నడిచింది. మూడు రోజుల క్రితం పడ్డ వర్షంతో ఊళ్లలో చల్లదనం చోటుచేసుకుంది. వేడి నుండి బయటపడ్డ జనం హాయిగా చల్లగాలి పీల్చుకుంటున్నారు. రైతులు విత్తనాలు వేసుకుంటున్నారు.

రాత్రయింది. బొడ్రాయి దగ్గరకి ఆనాటి జనం ఇంచుమించు అందరూ వచ్చారు పద్మనూ, పద్మ తల్లి జానకమ్మనూ పిలువలేదు. వాళ్ల అవసరం లేదని పెద్దలు నిర్ణయం తీసుకున్నారు.

ఆరుద్ర కార్తెలో ఆకు అల్లాడదనే సామెతగా అంతా నిశ్శబ్దంగా వుంది. అంతలో... ..

"ఆ! చెప్పరా బాజారూ! రూపాయలు తెచ్చినవా?"... అన్నాడు కోదండం పటేలు. బాజారు లేచి నిలబడ్డాడు. ఐదు అడుగులు ముందుకు నడిచాడు. "అయ్యా! ఇంగో ఈ సంచిల రూపాయలున్నాయి. ఇప్పుడే ఇచ్చేసి ఈ రాత్రికే నేను మల్ల మీకు కనబడకుంట యెళ్లిపోత. ఐతో నాకు పంచాయతి చెప్పిన పెద్దలు మీరు ఓ కాయితం రాసియ్యాలె. అదేదంటే నేనేసిన ఇత్తనం, నా బీజం, నా సంతానం పద్మ కడుపుల పెరుగుతుంది. ఆమె రేపో, మాపో కంటది. పుట్టిన బిడ్డ నా సంతానం. ఆ బిడ్డను నా కిచ్చేస్తమని కాయితం రాసిచ్చి ఈ రూపాయలు తీసుకొండ్రి" అన్నాడు గట్టిగా, చేతిలో వున్న సంచి చూపిస్తూ!

కోటిలింగం నాలుక కరుచుకున్నాడు.

రామలింగం కండ్లు తేలవేశాడు.

అందరూ విస్తుపోయి విన్నారు.

సుజాత తన స్నేహితులతో మౌనంగా కూర్చొని ఎవ్వరేమంటున్నారో వింటోంది. బాజారు చెప్పింది విని కొందరైతే పక్కున నవ్వారు. కోదండం ఒక్క నిమిషం సుజాత దిక్కు చూశాడు.

అట్లా అరుగుమీద కూర్చున్న పెద్దబుర్రలు పావుగంట తర్జనభర్జనలకు లోనయ్యాయి. వాళ్ళు పిలిస్తే కోటిలింగం, రామలింగం కూడా వెళ్ళి కలసి చర్చించు కుంటున్నారు. బయట అందరికీ వినిపించని మాటలు, గుసగులు, సైగలు అవుననీ, కాదనీ చేతులు ఆడించడం తప్ప వాళ్ళ చర్చ అక్కడున్న జనాలకు వినిపించకుంది. ఒక దశలో కోటిలింగం, కోదండం పటేలుకి నమస్కరించడం కూడా జనం గమనించారు. తర్వాత తండ్రి కొడుకుల్ని వేరుచేసి పెద్దలే మరో పావుగంట చర్చ సాగించారు. పెద్దల తీర్పు ఎదురు దెబ్బ తీసిందని అంతా అయోమయంగా అటు దిక్కు చూస్తున్నారు.

"అందరూ వినుండ్రి. అసలేమైందో ఇంకా మీకు అర్థం కాకుండొచ్చు. పద్మకూ, బాజారుకూ ఏ సంబంధమూ లేదు. పద్మ కడుపులో వున్న పాపకు తండ్రి రామలింగమే నట. బుద్ధి గడ్డి తిని, మనసు తావున లేక, డబ్బుకు కక్కుర్తిపడి తన భార్య మీద తప్పు, పంచాది పెట్టినందుకు ఊరి ముందు చెంపలేసుకుంట అంటున్నడు. ఎనిమిది నెలల కింద దుబాయ్ షేక్ పని మీద బొంబాయి వరకొచ్చి తిరిగి ఎల్లిన. రామలింగం అసమయంల పద్మను ఆడికి పిలిపించుకుండంట. పద్మ చిన్నత్త అంటే అత్త యశోదమ్మ చెల్లెలు బొంబాయిల వున్న సంగతి మన లోపట అందరికీ తెలుసు. అగో ఆ నాల్గు

రోజులు వీళ్ళు కలిసి వున్నందుకు పద్మకు గర్భం వొచ్చింది. ఇప్పుడు తనకు అంతా యాదికొచ్చి తన తప్పును ఒప్పుకున్నాడు. మనిషే మనిషి. మనిషన్నప్పుడు తప్పు ఒప్పులూ జరుగతనే వుంటయి. కనుక బాజారు మీద ఏ నేరమూ లేదు. ఇక ఎవ్వరి బతుకు ఆళ్ళు బతకొచ్చు. ఇట్ల మేమందరం మన ఊరి బొడ్రాయికాడ మొన్నటి తీర్పును సరిగ జేసి ఈ తీర్పు చెపుతున్నం" అన్నాడు హనుమంతు.

"అయ్య! మొన్న దెబ్బలన్నీ కొడితిరి. నోటికొచ్చిన తిట్టు తిడితిరి. ఇయ్యాల పద్మది తప్పే కాదంటున్నరు. ఇదే మీ న్యాయమా? ఈడ వున్నోళ్ళందరూ మీరు చెప్పిన తీర్మానం ఒప్పినోళ్లేనా?" కొంగు నడుముకు చుట్టి లేచి నిలబడి అడిగింది చంద్రమ్మ.

"మీ తీర్పును ధర్మంగా చెప్పండి హనుమంతుగారూ! అసలు సంగతి ఇక్కడున్న అందరికీ అంతో ఇంతో తెలుసు. ఈడ చంటి పిల్లలేం లేరు. బాజారును వదిలేస్తే రామలింగానికి మీరేం ఫైన్ వేస్తున్నారు" అన్న సుజాత "మీ తీర్మానం ప్రకారం ఏ మాత్రం ఇష్టం లేకున్నా పద్మ అతనితో సంసారం చేయవలసిందేనా? పెద్దలు మీరందరు కలసి ఇక్కడ పద్మకు న్యాయం చేశామనే అనుకుంటున్నారా?" అన్నది.

సభ మళ్ళీ నిశ్శబ్దంతో మునిగింది. పెద్దలు మరోసారి చర్చల్లోకి దిగారు.

ఇంతలో ఇంకా సహనం భరించలేక "అయ్యా! పెద్ద పటేలా! నేను వొయ్యి పద్మను తోల్కరానా? బొంబాయి పోయిందెప్పుడో తెలుస్తది! గంతేగాదు, రేపు ఈ రామలింగం తోటి సంసారం చేస్తవా అని అడగొచ్చు గూడా" అన్నాడు గట్టిగా వెంకటయ్య.

"అరే! ఎంకటీ నువ్వు నోరు మూసుకో! నీకు నేను చెప్పిన్నా తొల్కరమ్మనీ? గాడ్డి కొడకా! ఆ పిల్ల రామలింగమంటే ఇష్టం లేదని నీ తోటి చెప్పిందా? ఇంత మందిల చెప్పిందా? కట్టిన పుస్తెకూ, పెండ్లికీ విలువుందిరా! ఇంకా ఆ పిల్లను అవమానం జేస్తమా? ఇప్పటికే శానయింది. ఎక్కువ మాట్లాడకు నువ్వుండు" అన్నాడు కోదండం.

పది నిమిషాల తర్వాత... ...

ఈసారి కోదండం లేచి నిలబడ్డాడు. అందరి దిక్కూ ఒకసారి చూసి, "ఈ పంచాది అంతా ఒక్క రామలింగం బుద్ధిలేనితనం తోటే ఇంత దూరం వొచ్చింది. కోటిలింగం ఆశకు గట్టిగా గొళ్లెం పడ్డది. చాలా నీచంగా ఆళ్ల కొంచెపు గుణం బైట పెట్టుకున్నరు. మన ఊరిల కులమతాలకు గండిపడలేదు. ఎవ్వరి విలువలు వాళ్లకున్నాయి. బజారు గాడు తప్పును నెత్తిని మోద్దామనుకున్నడు. అమాయకుడు, మేమూ నిన్న పొరపాటుపడే నిజమే గావొచ్చు అనుకున్నం. ఐనా చంద్రమ్మా, టీచర్ సుజాతగారూ చెప్పినట్టు రామలింగానికే జుల్మానా వేయాలి. అది మాకు తోచనేలేదు. ఇప్పుడు చెప్పేదేమంటే బజారు ఇక్కడున్న పంచాదీల కెవ్వరు పిలువకున్నా నేరం నెత్తినేసుకొని దెబ్బలు తిన్నడు. జుల్మానా రామలింగానికి ఇస్తానన్నడు. ఇదంతా తప్పని తెలిసి గూడ రామలింగం పైస పదివేల కాశపడి వాన్ని బాధపెట్టిండు. కనుక ఆ బజారు తనకు ఇస్తాడనుకున్న పది వేలు రామలింగమే పంచాది ముందు కక్కాలి. ఐదువేలు ఇప్పుడే తెచ్చి బజారుకు ఇయ్యాలె. మిగతా ఐదు వేలు ఈడున్న వీరాంజనేయస్వామి గుడికి ఖర్చు పెట్టాలెనని మేం తీర్పు చెపుతున్నం.

ఇగ పద్మ సుజాత టీచరమ్మ తోటి ఏం జెప్పుకుందో మాకు సంబంధం లేదు. పెండ్లంటె నూరేండ్ల పంట. పద్మ కడుపుల పెరుగుతున్నది రామలింగం సంతానమేనని మేము నమ్ముతున్నం. ఇక ఎవరి మనసులో ఏమున్నా మర్చిపొయ్యి ఊరు శాంతంగా ఎప్పటిలెక్క వుండాలని కోరుతున్నం" అన్నాడు.

జనమంతా కాస్సేపు మౌనంగా వుండి ఇక వెళ్ళిపోదామని లేస్తున్నారు. అంతలో "అరే ఎంకటీ కోటిలింగం సేటు వెంట పోయి, ఆయన ఐదు వేలిస్తడు తీస్కరా పో" అని చెప్పాడు కోదండం.

"నేను పోను పటేలా!" వెంటనే జవాబు చెప్పాడు వెంకటయ్య.

కావలికాడు వెంకటయ్య నోటినుండి పటేలుకు బదులు పలికింది ఇదే మొదటిసారి. అందరూ ఆశ్చర్యంతో వెంకటయ్యనూ, కోదండంనూ చూశారు. కొదండం ఆ పని మరొకరికి చెప్పాడు. "వెంకటిగాడు ఈ రోజు ఇంత మందిలో తన తల తీసేశాడు" అనుకున్నాడు మనస్సులో....

ఐదువేలు వచ్చాయి. బాజారు చేతిలో పడ్డాయి. ఇక పంచాది ముగిసిందని పెద్దలు చెప్పారు. అందరూ ఎవరిల్లకు వాళ్ళు వెళుతన్నారు. చిటపట చినుకులు మొదలయ్యాయి.

వెంకటయ్య కదలలేదు ఉన్నచోటే వున్నాడు. అంతవరకూ దించుతున్న తల ఎత్తాడు...

"అయ్యా! పంచాది పెద్దలారా! జర్రాగుండ్రి. పంచాది కొచ్చినోళ్లూ జెర్ర నిలవడుండ్రి. ఇక నేను నా కావలితనం రేపటి సంది చేస్తలేను. అప్పటి వరకూ ఎన్నో ఐన పనులూ, కాని పనులూ చేసిన గుంజుమంటే గుంజిన, తన్నుమంటే తన్నిన. కొట్టమంటే కొట్టిన. ఇక నా తరంగాదు. ఏదన్నా కూలినాలి చేసుకొని బతుకుతగని, ఈడ కావలోనిగ బతుక. బొడ్రాయి తీర్మానం ధర్మం నాకు తోస్తలేదు. ఒంకర పోయింది. సూటితనం ఏందంటే ఆ రామలింగంతోటి పద్మను ఇడిపిచ్చి, బజారుగానికి ఇచ్చి పెండ్లి జెయ్యిండ్రి... నా మాట ఇనుండ్రి..." అంటూ చెప్పేదేదో అందరికీ వినిపించేలా అరుస్తూ చెప్పాడు.

ఒక్క నిమిషం ఆగిన పెద్దల్లో నుండి "ఇప్పటికే శానరాత్రయింది. అందరు ఇండ్లకు పొండ్రి. వెంకటిగానికి ఇయ్యాల పిచ్చి లేసినట్టుంది" అన్నాడు కోదండం.

అందరూ మెల్లమెల్లగా వెళ్ళిపోతున్నారు. బాజారు, సుజాత, చంద్రమ్మా ఇంకా కొందరు స్త్రీలు వెంకటయ్యను చూస్తూ నిల్చున్నారు. వర్షం మరికాస్తా ఎక్కువైంది. ఇకవాళ్ళూ అక్కడినుండి కదిలారు.

ఆ రాత్రి వర్షం భోరున కురిసింది. ఉరుములు, మెరుపులు, ఊళ్ళో కరెంటు లేదు. తెల్లవారింది. ఊరి బొడ్రాయి స్థానంలో రాయి లేదు. గుంట తీసుంది. ఆ గుంటలో బురదనీళ్ళు నిలిచున్నాయ్.

● ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక - జనవరి 5,1996 ●

# 62. ఊరుమ్మడి బతుకు

♦ కాలువ మల్లయ్య ♦

గోధూళివేళకు ఇంకొంత సమయమే వుంది. పొద్దంతా నిప్పులు చెరిగిన కర్మసాక్షి విశ్రాంతి తీసుకోవడానికి పడమటి కొండల్లో ముఖం దాచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. వ్యవసాయప్పనులతో అలిసిపోయిన సృష్టికర్తలు ఇంటిముఖం పట్టారు. శ్రామిక స్త్రీలు కొందరు సాయంత్రం వంటకోసం పొయ్యంటు బెట్టే ప్రయత్నంలో వున్నారు. మరి కొన్నిండ్లలోంచి పిడకలపొగ గుప్పు గుప్పున వొస్తుంది.

నర్సయ్యది ఆరుగజాల పొడవు, ఐదుగజాల వెడల్పున్న చిన పెంకుటిల్లు. దాని నానుకునే సాయమానుంది. నడింట్లో గోడకు గౌండ్ల కులదేవత రేణుక (ఎల్లమ్మ) పటముంది. ఆ పటం కింద ఇంట్లో దేవత కొలువున్నట్టుగా సున్నం, కుంకుమ, పసుపు గంధం చుక్కలున్నాయి ఇంట్లో ఓ మూలకు వాళ్ళ కులవృత్తి కుపయోగపడే మోకు, ముస్తాదు, గీసే కత్తులు. ముంజకొడవలి, గుదిలాంటి వస్తువులున్నాయి. చిలుక్కొయ్యలకు పాత కల్లులొట్లు వేలాడబడున్నాయి.

అరుగుమీద ఓ మూలకు వడ్లుపోసుకునే గుమ్ముంది. అరుగుమీదున్న కల్లులొట్ల లోంచి గుప్ గుప్‌మని కల్లువాసనొస్తుంది. కల్లు నురగ ఇంతెత్తు లేచింది. అరుగుముందు తాటికమ్మల పందిరుంది. పందిరి గుంజపక్కనే వున్న కుడితి తొట్టిలోంచి పులిసిన కల్లువాసనొస్తుంది. ఇంటికి ఈశాన్యమూలకున్న బావి దగ్గరున్న పురికికాలువలోంచి దుర్గంధమొస్తుంది. అటు కల్లువాసన, ఇటు పులిసిన కుడితి కల్లువాసన, జాలరి దుర్గంధంతో ఆ ప్రదేశమంతా అదో వాసన వేస్తుంది.

ఆ ఇల్లు ఏ యాభైఏండ్ల కింద కట్టిన ఇల్లే అయినా మొన్న మొన్ననే ప్రహరీగోడ, పెద్దరువాజ పెట్టించారు. పెద్దరువాజవతలున్న ఖాళీ ప్రదేశంలో ఐదారుగురు కూర్చోనున్నారు. ,వాళ్ళకు కొంచెం దూరంలోనే వున్న గుడిసెహోటల్లోంచి బజ్జీలు, మిరపకాయల వాసనొస్తుంది. కల్లు తాగడానికొచ్చిన ఆసాముల చేతుల్లో మోతు కాకులున్నాయి. ఇద్దరి పక్కన గాజు గ్లాసులున్నాయి. నర్సయ్య కోడలు వాళ్ళకు కల్లు వంచుతుంది. కొందరు బజ్జీలు, మిరపకాయలు తింటూ, ఇంకొందరు గుడాలు బుక్కుతూ కల్లు తాగుతున్నారు

ఉన్నట్టుండి బొంయ్‌మంటూ గాడ్పుదుమారం మొదలైంది. చూస్తుండగానే దుమ్మెత్తిపోయడం మొదలైంది. బయటున్న కల్లు పటువలను తీసుకొని లోపలికెళ్ళింది సరోజ. అరుగుమీద పెట్టింది. పందిరికింద నులకమంచంలో పడుకొనున్న నర్సయ్య

మంచం తీసుకెళ్ళి అరుగుమీద వాల్చుకున్నాడు. బయటున్న వాళ్ళంతా పెద్దరువాజ దాటి లోపలి కొచ్చారు. బజార్లోంచి పశువులు గెబ్బడగెబ్బడ పరుగులు తీస్తున్నాయి. కొమ్ములూపు కుంటూ బర్రె లోపలికొచ్చింది. నర్సయ్య అరుగుదిగొచ్చి కుడితి తొట్టిమీదున్న తట్టను తీశాడు. ఆ గేదె గబగబా కుడితంతా తాగేసింది. పులిసిన కల్లుపోసున్న ఆ కుడితి తాగిన గేదె హుషారుగా అటు ఇటూ కొమ్ములూపింది. దాన్ని పందిరి గుంజకు కట్టివేశాడు నర్సయ్య.

అంత ఉధృతంగా వచ్చిన గాడ్పు దుమారం అంతా దుబ్బమయం చేసి ఐదు నిమిషాల్లో మాయమైంది. వాతావరణమంతా ప్రశాంతంగా మారింది. ఒక్క కొమ్మ కూడా ఊగడం లేదు.

"నీ యవ్వ! ఏం గాడ్పు దుమారం... ఎట్లచ్చిందో అట్లనే పెయింది. ఆయుటి వూనేకాలంగద.. రాల్లవానత్తదనుకున్న... ఎంతెల్లమే ఎట్లయిందో సూడు... ఎప్పుడేమైతదో తెలువకుంటుంది. అంత చిత్రంగున్నది..." అన్నాడు నర్సయ్య.

"అవునిజమే.." అని అక్కన్నే వాకిట్లో కూర్చున్నారు కల్లుతాగడానికి వచ్చినవాళ్ళు.

మొగురానికానుకొని అరుగంచుకు కూర్చున్నాడు నర్సయ్య.

నర్సయ్య కుటుంబం తరతరాలుగా కల్లుగీత వృత్తితోనే బతుకుతున్నారు. పందలాది మందికి తన చేతుల్తోనే కల్లు వంచాడు నర్సయ్య. అయినా తాగేవాళ్ళంటే ఎందుకోగాని నర్సయ్యకు సదభిప్రాయం లేదు. కల్లుగీసేవాడు తాగకూడదన్న నియమాన్ని తుంగలో తొక్కి కొంతమంది గీతపనివాళ్ళు కల్లు తాగుతున్నా నర్సయ్య మాత్రం అసలే తాగడు తనకొడుకు తాగకుండా జాగ్రత్తపడ్డాడు. దొరయినా, దాతయినా, ఎంత వున్నవాడయినా, మంచివాడని పేరున్నవాడయినా తాగేవాడంటే ఏదో బలహీనతున్నవాడే ననుకుంటాడు నర్సయ్య.

సరోజ వాళ్ళకు కల్లువంచుతుంది. వంగినపుడు జారిపోతున్న కొంగును లాగి బొడ్లో చెక్కుకుంది. కట్టుకున్న వూలీవూలీ చీర సరిగ్గా ఆగడంలేదు. ఆమె దిక్కు, ఆమె ఛాతీ దిక్కు దొంగ చూపులు చూస్తున్నారు.

"కల్లు వంచెటోల్లుగూడ సిలుకు చీరెలు గట్టకుంటేంబాయె నూలుచీరెలు గట్టకపొయినావె పిల్ల" అన్నాడు ఆకు కిందబెట్టి ముకుందం.

అతన్దిక్కు గుర్రుగా చూసింది సరోజ.

కోడల్ను మనసులోనే మెచ్చుకున్నాడు నర్సయ్య.

"నా చీరె గురించి మీకెందుకు? మీరేం పనికచ్చిండ్రో ఆ పని జేసుకొని పోండ్రి..." కోపంగా అంది సరోజ.

ఏదో అనబోయిన ముకుందంతో మళ్ళీ అంది సరోజ.

"పనిచేసుక బతికెటోల్లు మంచి చీరెలు కట్టద్దా...?"

"అయ్యో! అట్ల పరాశికాన్నికన్నందుకు బాగ కోపానికి రావడ్తవేంది పిల్ల....? కల్లువోసె పిల్లతోని గాకుంటె ఎవ్వలతోని పరాశికమాడ్తరిగ...." అన్నాడు ముకుందం.

"గా పరాశికాలు నా దగ్గెర నడువయి. కుమ్మరోల్లు కుండలమ్ముకుంట బతుకు తండ్రు. కాపోల్లు పంటమ్ముకుంట బతుకుతండ్రు. సాలోల్లు బట్టలమ్ముకుంట బతుకు

తండ్రు. మేం కల్లమ్ముకుంట బతుకుతన్నం... కాని ఒళ్ళమ్ముకుంట బతుకుత లే..." అంది సరోజ.

కోడలు దిక్కు గర్వంగా చూశాడు నర్సయ్య. శ్రామిక కులంలోనే పుట్టినా ముకుందం తన కోడలునలా అనడం నర్సయ్యకు నచ్చలేదు. పైగా కుమ్మరి కొలిమి దగ్గర ముకుందం భార్యను దొరల కుటుంబాల వాళ్ళు ఇలాగే అవమానపరచడం నర్సయ్యకు తెలుసు.

"నర్సగౌడా! నీ కోడలు చదువుకున్నదార! తెలివికల్లదే వున్నట్టుంది. చీర గురించొక్క మాటన్నందుకే దులిపిడిసెడ్తంది. రోషం బాగానే వున్నట్టుంది గద" అన్నాడు కాపు మల్రెడ్డి.

"గివ్వి మాట్లాడుటానికి చదువే కావన్నా? దానభిమానం దానికుంది. కల్లమ్మి నంత మాత్రాన మీరేదంటె అదే పడన్నా?" అన్నాడు నర్సయ్య.

"నీ యవ్వ కాలమంతెట్లనో వున్నది. మునుపు కల్లున్నది పిల్లున్నదని పిలిచేవారు. ఇప్పుడు పరాశికమాడితేనే కోపానికత్తండ్రు"

ముకుందం మాటలు విన్న నర్సయ్య కళ్ళముందు ఒక్కక్షణంలో ఎన్నో దృశ్యాలు కదిలాయి.

ఆడవాళ్ళను కల్లు వంచే దగ్గరుంచడం చాలాకాలం నుంచే ఉంది. ఆడవాళ్ళు వంచుతుంటే తామెంత తాగుతున్నదీ గమనించేవారు కాదు. అలా కల్లు ఎక్కువగా అమ్ముడుపోయేది. అలా కల్లువంచే స్త్రీలతో చాలామంది ముఖ్యంగా వున్న కుటుంబాల పురుషులు పరాచికాలడేవారు. కొన్నిసార్లు కల్లువంచే స్త్రీ చేయి పట్టుకునే వారు. దొరలు, పటేండ్లు దేశ్‌ముఖ్‌ల లాంటి వాళ్ళ నెదిరించలేక కొన్నిసార్లు స్త్రీలు లొంగిపోవాల్సి వచ్చేది. ఇంటికి కల్లు తీసుకెళ్ళిన స్త్రీలను దొరలెన్నో సార్లు నుభవించేవారు. ఆ పరిస్థితుల్లో కొన్ని మార్పులొస్తున్నాయి. అయినా అ వాసనలింకా వున్నాయి.

లేచి నిల్చున్నాడు నర్సయ్య. కుంటుకుంటూ వాకిట్లోకొచ్చాడు. "పేదోనికి మంచి పెండ్లాముండద్దంటారా? మీ భార్యలతోని పరాశికాలాడుతె ఊకుంటారా?" అన్నాడు.

కొన్నేండ్ల క్రింది వరకైతే ఎవరెలా పరాచికాలాడినా పట్టించుకునేవారు కాదు. ఎవరైనా పట్టించుకున్నా కల్లమ్ముకునేవాళ్ళ కేం నీతని తేలికగా తీసుకునేవారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమాలు, వస్తున్న మార్పులు వాళ్ళలో చైతన్యాన్ని తీసుకొస్తున్నా యన్న విషయాన్ని గ్రహించారు వాళ్ళు.

ముకుందం లేచి నిల్చున్నాడు "గాలికి పొయ్యే కంపను తలుగ బెట్టుకున్నట్టుంది. ఏమనుకోకె కోడల. అట్ల మాటవరుసకన్న" అంటూ వెళ్ళిపోయాడు.

మరో ఇద్దరొచ్చి పందిరి గుంజకానుకొని కూర్చున్నారు.

సాధారణంగా అగ్రకులాలవారిండ్లకు సంపన్న కుటుంబాలవారిండ్లకు కల్లు వాడుక బింకుల్లో తీసుకపోయిస్తుంటారు. వ్యవసాయిక, శ్రామిక కులాలకు చెందినవాళ్ళు తాళ్ళళ్ళకుపోయిగాని, గొండ్లవాళ్ళిండ్లకొచ్చిగాని తాగుతుంటారు.

కొందరు చెట్టుమీది కల్లు విడిపించుకొని తాగడానికి తాళ్ళదగ్గరికెళ్తుంటారు. అయితే కొందరు దొరల కుటుంబాల వాళ్ళు కూడా మండువాల దగ్గరికొచ్చి తాగుతున్నారు చాలాకాలంగా. దొరలని చెప్పుకోబడే చాలా కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతినడం, ఊళ్ళలో ఎన్నో మార్పులు చోటు చేసుకోవడం, కొందరు దొరలు ఊళ్ళనే వదిలిపెట్టి వెళ్ళిపోవడం జరిగింది.

"పరుపు దాటి కల్లు మంచిది పొయ్యాలె పిల్ల. ఒక్క చెట్టుది పొయ్యాలె. నేనెటువంటిది తాగుతానో నీకు తెలుసుగద!" తనవెంట తెచ్చుకున్న బజ్జీల పొట్లాన్ని విప్పుతూ అన్నాడు రంగారెడ్డి

"ఏభై ఏళ్ళు వస్తున్నా రంగారెడ్డి పూలరంగడిలాగే వుంటాడు. ఇస్త్రీ మడతలు నలగని బట్టలేసుకుంటాడు. ఒకప్పుడు బాగా వున్న కుటుంబమే. చదువుకొమ్మని బడికి తోలితే పోకిరిగా తిరిగేవాడు. స్వాతంత్ర్యానంతర కాలంలో సంపన్న కుటుంబాలకు చెందిన రెడ్లు, వెలమల పిల్లలు తమకున్న ధనగర్వంతో చదువును నిర్లక్ష్యం చేశారు. శ్రామిక కుటుంబాలకు చెందిన చాలామంది వ్యవసాయాలు చేసుకుంటూనే చదువు కున్నారు. దొరల కుటుంబాలవాళ్ళు అటు కష్టపడి పనిచేయక, ఇటు చదువులకూ దూరమై చాలా భూములమ్ముకున్నారు. ఫ్యూడల్ భావాలు జీర్ణించుకొన్న చాలా కుటుంబాల కీ పరిస్థితి వచ్చింది. అయినా ఉద్యమాలు ఉధృతమయ్యేవరకూ వాళ్ళ గర్వమణగలేదు" రంగారెడ్డిని చూస్తూ తనలో తాననుకున్నాడు నర్సయ్య...

"మింగమెతుకులేకున్నా మీసాలకు సంపెంగనూనె అన్నట్టుంది వీని సంగతి. చింత చచ్చినా పులుసైతె చావలేదు. ఇంకెన్నడు బుద్ధత్తదో ఇటువంటివాళ్ళకు ...." గొణుక్కున్నాడు నర్సయ్య.

"మీకు తెలవదా దొర.. మా ఇంట్ల ఎటువంటి కల్లు దొరుకుతదో..." నికాలస్ కల్లు దొరుకుద్ది" అన్నాడు.

"ఎంతమందచ్చినా నికాలస్ కల్లేపోత్తరు మీరు. సారా, బీరు, బ్రాందిలు బందాయె. ఇప్పుడందరు తెల్లకల్లే తాగవట్రి. అయినా అందరికెట్ల సరిపోతంది? నికాలసే పోత్తండ్ర గద" బజ్జి నములూ అన్నాడు రంగారెడ్డి.

సరోజ మిగతావాళ్ళకు కల్లు వంచుతుంది.

"సార, బ్రాంది దొరుకతలేదని ఎవ్వలన్నరు" మనుసంటె మార్గముండదా అన్నట్టు కావల్సినోల్లు తెప్పిచ్చుకుంటనే వున్నరు. కాకపోతే డబుల్, తిబుల్ ధర పెట్టవల్సత్తంది" అన్నాడు రంగారెడ్డితో వచ్చిన ఉషాలు.

"ఎంతైన మునుపటంత అధ్వాన్నంగనైతె దొరుకదిగది. సార, బ్రాంది బందు జేసినంక కొన్ని సంసారాలన్న బాగుపడ్డయి" అన్నాడు నర్సయ్య.

"తాగెటోల్ల సంసారాలేమొకని మీరైతె బాగనే బాగుపడ్డరు. స్వతంత్రం వచ్చినంక బి.సి. ల్లల్ల పద్మశాలీలు సహకార సంఘాలని, అవని, ఇవని బాగుపడ్డారు. నిషేధమచ్చినంక మీరు ఇంకెంత బాగుపడ్డరు" నర్సయ్య నుద్దేశించి అన్నాడు శంకరాచారి.

వాళ్ళేవేవో మాట్లాడుకుంటూ తాగుతున్నారు. ఇంతలో తాళ్ళల్లో పని పూర్తిచేసుకొని మిగిలిన కల్లున్న కుండతో నర్సయ్య కొడుకు బాలాగౌడ్ ఇంటికొచ్చాడు.

చేతిలో వున్న కుండను వాకిట్లో పెట్టాడు. భుజాలకు వేలాడుతున్న మోకును, గుదిని అరుగుమీదేశాడు. నడుముకు కట్టున్న ముస్తాదును. కత్తులను మోకు ప్రక్క నుంచాడు.

నలభై ఏళ్ళు దాటుతున్న బాలాగౌడ్ వయసును మించినవాడిలా కనబడు తున్నాడు. అతని కండ్లు లోతుకుపోయున్నాయి. కాయకష్టం చేస్తూ బతుకుతున్న బతుక్కు సాక్షిగా అతని శరీరం సాగవారుంది. అతని వీపులో కాసున్న నల్లనికాయలు వికృతంగా వున్నాయి. రోజూ తాళ్ళెక్కడం వల్ల కాళ్ళకూ చేతులకూ గట్టి కాయలున్నాయి.

"మేం బాగ సంపాయించుతున్నమని ఏడుస్తండ్రు గదా. ఏడువుండేడువుండ్రి. సార, బ్రాంది బందుజేసినంక మాక్కొంత గిరాకీ పెరిగినమాట నిజమే. కాని అంతకంటెక్కువే ఎందరెందరి కెంతెంతిచ్చు కోవాలో మీకేం తెలుసు? ఎక్కువ వచ్చేదంత ఇచ్చుకుంటానికే పోతది మల్లకస్సూర్లల్లనైతె పొడులవీ కలిపి కల్తీ చేసి కల్లునెక్కువ జేత్తరు. ఇక్కడ చేస్తె మంచి కల్లు తాగుటానికలువాడపడ్డ ఊరి వాళ్ళు తాగుతారా? ఇసిరికొట్టి పోతారు. పట్టణాలల్ల కల్లు దుకాణాలున్నోల్లు బాగనే సంపాయించిండ్రు. కల్తీచేసి దొరికి శిక్షలూ అనుభవించిడ్రు. మేం పెద్దగ సంపాయించిందేంలేదు. మునుపు కొంత కల్లు మిగిలేదప్పుడప్పుడు. ఇప్పుడు మిగల్త లేదు. తేడా ఇంతే. మేం సంపాయించి నమట... సంపాయించి ఎన్ని బంగ్లాలు గడ్తమో చూడలేరు. నిషేధం తోటి లాభపడోల్లు వేరే వున్నారు." నిష్టూరంగా అన్నాడు బాలాగౌడ్.

భర్త రాగానే పని నతనికప్పగించింది సరోజ. ఇంటిపక్కకు పోయి పిడకల కుచ్చెలోంచి కొన్ని పిడకలను తట్టలో వేసుకొని వంటింట్లోకి పోబోతుంది.

"ఏం కూరండుతవ్? పడిశెం బట్టింది. కారం బెట్టి ఏదన్న మంచిగండు. పడిశెం దెంకపోవాలె?" అన్నాడు సరోజతో బాలాగౌడ్.

"మాంసమో, కోడో అయితే కారం బెట్టండుతె మంచి గుంటయి. గిప్పుడు గవ్వేడ దొరుకాలె? ఎండిపోయిన చాపలున్నయి. వండుత తియ్యి. అయినా ఎండిపెయిన చాపల్దింటె పడిశమేడ పోతది? ఎల్లిపాయేసి తొక్కునూరుత పట్టు" అని లోపలికెళ్ళింది సరోజ. సరోజ లోపలికెళ్ళడం గిరాకీలో ఒకరిద్దరికి నచ్చలేదు. వాళ్ళకు కల్లు వంచడానికి బుడ్డి చేతిలో పట్టుకొని దగ్గరికెళ్ళాడు బాలాగౌడ్. వాళ్లు ముఖం చిట్లించడం చూసి విషయ్యార్థం చేసుకున్నాడు "ఏదైన గాజుల చేతుల్తోనిస్తెనే మంచిగుంటది.." "అవు.. గాజుల చేతుల్తో నిస్తె విషమైన అమృతమైతది..."

వాళ్ళే ఉద్దేశ్యంతో ఆ మాటలంటున్నారో బాలాగౌడ్‌కు తెలుసు. ఇలాంటి మాటలు, చేష్టలు, చిన్నతనంనుంచీ తెలుసతనికి. బాలాగౌడ్ మరీ చిన్నగా వున్న ప్పుడు అతని తాతమ్మతో పరాచికాలాడేవారు. కొందరైతే మీద చేతులు కూడా

వేసేవారు. అతని తల్లికి కూడా కల్లువంచుతుంటే హృదయం తూట్లుపడే మాటలంటూ అవమానపరచడం చూశాడు. అతనికి ఒళ్లంతా కారప్పొడి చల్లినంత మంటగా వుండేది. ఒక్కొక్కని కత్తితో పొడిచేద్దామన్నంత కోపంగా ఉండేది.

"ఆడోల్లను కల్లువంచటానికి పెట్టుకుంటేంది?" అన్నాడు ఓ రోజు తండ్రితో పదిహేనేండ్ల వయసులో వున్న బాలాగౌడ్.

"నీకు తెలువది బిడ్డ. బట్టలుతికే చాకలోల్లతోని, వెట్టిచేసే హరిజన స్త్రీలతోని, కల్లమ్మే మన ఆడోల్లతోని ఇంకా కూలినాలి చేసుకునే ఆడోల్లతోని చాలామంది వెకిలితనంతో ప్రవర్తిస్తరు కొందరయితె మానాలు గూడబోతయి. మన ఆడోల్లను దొరల పెండ్లాల నుంచినట్టు లోపలుంచుతె మనకెళ్ళది. మనం అంటే మొగోల్లం కల్లు గీకుటానికి, ఎవ్వసప్పునులకు పోతమా? మరికల్లు మందువా దగ్గరికచ్చినోల్లకు కల్లెవ్వలు వంచాలె? మన ఆడోల్లకీ పని తప్పది. ఇందులో మన స్వార్థం గూడ కొంతుంది. స్త్రీని కల్లు వంచుడానికి పెడితే ఆమెను చూసుకుంట ఎక్కువ తాగుతరు. మనకు వ్యాపారం గూడ పెరుగుతది" తండ్రి మాటలు జ్ఞాపకం వచ్చాయి బాలాగౌడ్‌కు.

ఏం మాట్లాడకుండా కల్లు వంచుతున్న బాలాగౌడ్‌తో "ఏందెమొ మొకమంత ముడ్సుకున్నవు?" అన్నాడు మల్రెడ్డి.

"ఏం లేదు సరోజను పిల్సి కల్లు వంచమన్నా?" తమ దురుద్దేశాన్ని అర్థం చేసుకున్నాడనుకున్న వాళ్ల ముఖాలు నల్లబడ్డాయి. ఇదువరకైతే అలాగే చేయమనే వారు. కాని ఇప్పుడు ఎక్కువ మాట్లాడితే కర్రలు మల్లేస్తున్న విషయం వాళ్ళకు తెలుసు. పక్క ఊళ్ళో కల్లుపోసే ఓ స్త్రీమీద చెయ్యేసిన వ్యక్తి చేతిని నరికేసి కేసుల్లో తిరుగుతున్నవాళ్ళ సంగతి తెలుసు.

"ఏదో ఆట్ల వల్లగకారకన్నం. ఆడోల్లు పోత్తంటె తాగుతనే వుంటం. బుక్కు బుక్కు లెక్క బెతునన్నడట ఎనుకటికొగడు. తాగెటోడే కట్టె తాళ్ళపన్నని వర్ధిగనే పుట్టలే."

నర్సయ్య అరుగుమీదున్న నులకమంచంలో పడుకున్నాడు. 'తాగినాడు చచ్చినా గాని అవద్దమాడడు. నేను నిజం జెప్పుతున్న ఊరంత పాడైపోతుంది. ఎక్కడోడక్కన్నే తినుటానికెగ వడ్డరు' ఏదేదో వదురుకుంటూ బజారువెంట పోతున్నాడు శేఖరయ్య.

"ఎంత దాగుతే ఇరువై రూపాయలు గావాలె శంకరాచారి. ఇది సురాపానం తెలుసా? అంటే దేవతలు తాగేది?" అన్నాడు మల్రెడ్డి.

"మరి దేవతలసొంటోల్లే తాగినదాన్ని మనుషులెందకు బందు జెయ్యాలె?" లేచి నిల్చుంటూ అన్నాడు ఉషాలు.

"బందుజేత్తె బందు జేసిరికని ఇది గూడ బందుజేత్తె ఐపోవు వుంటెనేమొ పానం గొట్టుకునె పొద్దుగూకు తందంటె కాల్లటు దిక్కే గుంజు కచ్చె" లోపలికొచ్చి కూర్చుంటూ అన్నాడు చంద్రయ్య. ఉషాలు బయటికెళ్ళిపోయాడు.

"గివ్వన్ని ఓట్ల రాజకీయాలు? కల్లు బందుజేత్తె గవుల్ల ఓట్లు వోతయని భయం" మల్రెడ్డి అన్న మాటలు సూటిగా తగిలాయి బాలాగౌడ్‌కు.

"తెలిసి తెలువని సంగతులెందుకు మాట్లాడ్తరు పటేల'? గాసార. బ్రాంది బందు జేసుడున్ను దీన్ని బందుజేసుడు ఒక్కటే ఐతయా? సార, బ్రాందిలు తాగి వేల కుటుంబాలు నాశినమైనయి డబ్బూ, ఆరోగ్యం రొండూ పెయిసయి మల్లనల్ల కల్లు కంట్రాక్టర్లు, షాపుల కంట్రాక్టర్లం తెవ్వలు? బాగ డబ్బులున్నోల్లే. వీటికి కులవృత్తుల తోని సంబంధం లేదు తాగినోల్లెంతోమంది నాశినమవుతుంటె వాళ్ళు లక్షలు, కోట్లు సంపాయించిండ్రు. మరి కల్లు సంగతట్ల లేదు. ఇదో కులవృత్తోలుంది దీన్ని బందు జేత్తె వేలకొద్ది కుటుంబాలు బజార్న పడుతయి. మల్ల కల్లు కల్తీ కాకుంటె ఇదేం నష్టం చెయ్యదంటరు ఆర్థికంగా చూసుకున్నా పదిహేను, ఇరవై రూపాయలది తాగుతె పండి బొర్లుతరు. కల్లమ్ముకొని లక్షలు సంపాదించినవాన్ని చూపెట్టుండ్రి. ఏదో బట్ట పొట్టకు గడుత్తది ఇదో వృత్తిగ వుంది కాబట్టే బందు జేస్తలేరు."

"నువ్వన్నది నిజమే కాని బాలాగౌడ, ప్లాస్టికచ్చి కుమ్మరోల్ల వృత్తిపోతె వాళ్ళ నెవ్వలాదుకున్నరు? బస్సులచ్చి బండ్లు గట్టుకుంట బతికెటోల్లు బతుకులు నాశినమైతే ఎవ్వలకు చెప్పుకున్నరు? మరమగ్గాలచ్చి మా చేనేత పనోల్ల బతుకులు బజార్ల పడలేదా? సినుమాలచ్చి బాగోతులోల్లు, తోలుబొమ్మలాటటోల్లు పని లేకుంట గాలేదా? ట్రాక్టర్లచ్చి కొన్ని నాగండ్లు మూలకు పడుతున్నాయి గట్లనే గీ కల్లు గూడ కాదంటావా?" అన్నాడు మల్రెడ్డి పకోడి ముక్క నవల్తూ.

అతనికేం సమాధానం చెప్పాలో తోచలేదు బాలాగౌడ్‌కు కొద్ది క్షణాలేం మాట్లాడకుండా వున్నాడు.

"మేం గీ పని జేసుకుంటేం సుఖపడ్తలేం. బంగ్లాలు గడ్తలేం. గివ్వన్నెందుకు ఎవ్వలు తాగుంటె కల్లు గీసెటోల్లెవ్వలు? మాకేమన్న పనిజూపి గవర్నమెంటు గిదన్ని బందు జేసుకోనియ్యి కాదంటన్నమా?" అన్నాడు.

"ఆం... ఇగ గిదేం బందుజేత్తరు అయ్యి. బందుజేసినయే తెరుత్తయంటండ్రు. కల్లు బందు జేసుడొల్లక్కమే" అన్నాడు చంద్రయ్య.

అప్పుడే లోపలికొస్తున్న కాపు ముసలవ్వ "అయ్యో బిడ్డ సార దుకాండ్లు మల్ల వెడుతరా? ఇగ కొంపలు నాశినమైనట్టే. సార బందుజేసినంక మాముసలోని ఆరోగ్గం మంచిగైంది. నా కొడుకు గూడ ఇన్నన్ని పైసలు తెచ్చి పెండ్లాని కిత్తండు. మల్ల సారొత్తె ఎప్పటాటే" అని కండ్లనీల్లు తీసుకుంటూ సరోజ దగ్గరికెళ్ళింది.

"అగో చూసినవుగద మల్ల దుకాండ్లు వత్తె ఆడోల్లూకుంటారా?' లొల్లిలొల్లి జేత్తరు" అన్నాడు శంకరాచారి.

"ఊకుండకుంటె ఉరుకులాడ్తరా? ఎగిరెగిరి ఆల్లే నోల్లు మూసుకుంటరు. అయినా ఎవ్వలిష్టం వాళ్ళు గని బందుజేసుడేంది?" అన్నాడు రంగారెడ్డి. రంగారెడ్డికప్పటికే ఎక్కువైంది. అయినా తాగుతూనే వున్నాడు. "సార శరీరాన్ని నాశినం జేత్తది. బీరు బ్రాందిలతోని కొంపలమ్ముడు పోతయి సార దాగచ్చి చిన్న కుటుంబాలల్ల రోజు పెండ్లాలను చావగొట్టి వోల్లెంతమంది వున్నారు? మనూల్లెరెడ్డి వెలుమదోరలు ప్యాకాటలాడి ఇష్టమున్నట్టు తాగి భూములన్ని నాశినెం జేసుకుండ్రి. ఎంతైన కల్లుతోని గంత గనం నష్టంలేదు. మల్ల సార, బ్రాందిలత్తున్నయంటే కొందరాడోల్లు గొడగొడా ఏడుత్తండ్రు. వాళ్ళాకుండరు" అన్నాడు అరుగంచుకు కూర్చుంటూ నర్సయ్య.

"మొత్తుకొని మొత్తుకొని వాళ్లే యాష్టకచ్చి ఊకుంటారు. ఎంతైన బ్రాంది లేకుంటే మజే లేకుంటయి పెయింది. ఇంటికి చుట్టమత్తె ఓ సీస తెచ్చి కోన్ని గోసి ముక్క లద్దుకుంట తింటె అదో మజుంటది. కల్లున్నా గిది చిల్లరగాల్లు తాగేదాయె. గతిలేక తాగుడైతంది..." అన్నాడు రంగారెడ్డి లేచి నిల్చున్నాడు.

"ఏదో పటు మనకు తెల్సింది చాలా తక్కువ. ఎట్లగావన్నో గట్లనే ఐతది. మొత్తంమీద గీ సారా నిషేధం తోని గౌండ్లయితె బంద వస్తుగైనరంటంద్రు. బతుకు దెరువు కోసం భీవండి, బళ్ళారె, బొంబైకి పోయివోల్లు గూడ తిరిగచ్చి కలాలి మామూల పట్టింద్రంటంద్రు" అంటూ లేచి పోవడానికి సిద్ధంగా వున్నాడు మల్రెడ్డి.

ఆ మాటలు విని పకాపకా నవ్వాడు. బాలాగౌడ్.

మల్రెడ్డి పోబోతున్న వాళ్ళాగి లాగే నిల్చున్నారు.

"ఆరేడు నెల్లకింద కరీంనగరంల బి.సి.ల మీటింగు పెట్టింద్రు. ఆమీటింగుకు బి.సి ల కమీషనరచ్చిండు. అంతకుముందు పట్వారీలు, మాలిపటేలు గిరీలు చేసిన ఎల్లావు కుల పోల్లు గూడ గా మీటింగు కచ్చింద్రు. వాళ్ళు గూడ తమ కులాన్ని బి.సి.ల్ల కలుపుమని కాగిదమిచ్చిండు. గప్పుడో క్షవరం జేసేకులపయినె లేచి మస్తు మాట్లాడిండు...

"సారూ! మేం ఆ దొరల పల్లకీల మోసినం. బిజిలీలు మోసినం. లగ్గాలయితె పందిర్లేసినం. ఇంటికి మామిడాకులు గట్టినం. ఊరూరు, ఇల్లిల్లూ తిరిగి పత్రికలిచ్చి వచ్చినం. మేం ఆ దొరల గడ్డాలు గీకినం. ఎంటికలు కత్తిరిచ్చినం. ఆల్లకు పాలేర్లన్నం. గిన్ని పనులు జేసినం. గిప్పుడు వాళ్ళు మాతోని కలుస్తనంటూంటె సంబుర మనిపిత్తంది. మేం జేసిన పనులన్ని జేసి కలువనియ్యండ్రి' అన్నాడు.

అటెనుకో బట్టలుతికె కులపయినె లేచి మాట్లాడిండు....'సారూ! ఇయ్యాల్లగా రిజర్వేషన్ల తోని ముత్తెమంత లాబమైతందని పటేండ్ల సొంటీవోళ్ళు గూడ గిండ్ల కలుత్త నంటంద్రు. కలిస్తే కలువనియ్యిండ్రి. కాని మేం దొరల పీతిబట్టలుతికినం. మురికి బట్టలుతికినం. సవారుబండ్ల ముంగట ఎడ్లోలె ఉరికినం. వాళ్ళేపని చెప్పుతె ఆ పని జేసినం. వాళ్ళు గూడ కొన్నేండ్లు మా పనులన్ని చెయ్యినియ్యిండ్రి గప్పుడు కలుపుండ్రి' అన్నాడు.

గిట్ల ఎంతోమంది మాట్లాడింద్రు. వచ్చినోల్లు ధరఖాస్తు వాపసు తీసుకొని వెళ్ళి పోయింద్రు.

మేం గీ పనితోని సంపాదించుకుంటున్నమా? ఇండ్ల ఎంత కష్టముందో, ఎన్ని అవుమానాలున్నయో మీకెరుక? ఈ బతుకు ఎంత దినదినగండమో మీకు తెలువది – గిది సుఖమైతె మీరే చెయ్యలేరు అన్నాడు బాలాగౌడ్.

నర్సయ్య కుంటుతూ వచ్చి వాళ్ళ దగ్గర నిల్చున్నాడు. "మేం సుఖపడ్తన్న మంటంద్రా?" భలే పటేండ్లన్నరు. ఇగో మా వీపులు చూడుండ్రి. మా కాల్లు చూడుండ్రి. మా చేతులు చూడుండ్రి. ముస్తాదు, మోకు ఒరుసక పొయ్యి ఎట్ల నల్లబడ్డయో సూడుండ్రి. ఎట్ల కాయలు గాసినయె కనవడుతలేదా? మేం తాటిచెట్టెక్కుతున్న మంటె పానాలరచేతిల పెట్టుకునే ఎక్కాలె. కాల్జారితె పై పానాలు పైన్నె పోతయి. కిందికి దిగేదాక నమ్ముకమే ఉండది. పైకెక్కి కిందికి జూత్తె పెద్ద పెద్ద

జంతువులు గూడ చీమలవలె కనవడతయి కండ్లు తిరిగిసయంటే ఖతమే. అంత అగులు బుగులైతది. ఏ కొంత అజేగ్రత్తగున్నా బొక్కగూడ దొరుకది. అట్ల ఎంతమంది తాటిచెట్టుమీదినుంచి పడిపోయి చనిపోలేదు? గప్పు డెవ్వలాదుకున్నరు మమ్మల్ని? మేమట సుఖపడ్తన్నమట. సంపాయిత్తన్నమట...గీ పని మీరే చెయ్యలేరు. ...ఇగో జారిపడితే నా కాలిరిగింది" నిష్ఠూరంగా అన్నాడు నర్సయ్య.

"ఏదో అట్ల మాటవరుసకంటె తండ్రీ కొడుకులిద్దరు ఉరికి రావడ్తిరేంది? ఏ పనిలున్న కష్టాలు ఆ పని లున్నయి. ఎంతైన తాళ్ళతోని అన్నిరకాల లాభమే అన్ని కాలాలల్ల కల్లువారె పరువు తాల్లకు ముంజలు కూడచ్చె తాటిమట్టలకు గూడ పైసలచ్చె" అన్నాడు మల్రెడ్డి.

"ముంజలు మేమమ్ముకున్నదెప్పుడు? అవి పండ్లమ్ముకొని బతికే తెనుగోల్లు అమ్ముకుంటరు. తాటిమట్టలు, కమ్మలు ఊళ్ళె పైసలు పెట్టి కొనెటోల్లెవ్వలు? అందరట్టిగనే కొంచ వోయిరి ఇప్పుడిప్పుడు మేం గట్టిగ మాట్లాడుతాంటె వడుత్తంది దొరలకు, ఊరిపెత్తం దార్లకు ఇంతకుముందు కల్లు పుక్కానికే పోసుడాయె. పేదోని పెండ్లాం అందరికీ మరుదలన్నట్టే చేసిరి. కొందరికి మా ఆడోల్లు కల్లువంచకుంటె లోపలికే పోకపాయె. ఇన్నవమానాలు, కష్టాలు పడుకుంటు ఈ పని జేసుకుంట మేం సుఖపడ్తన్నమట. అనుటానికీ మీకు నోరెట్లత్తంది పటేల? మేమీ పనిచెయ్య కుంటేం జేత్తరు?" అన్నాడు బాలాగౌడ్.

"ఎవ్వలు చెయ్యమంటండ్రు మిమ్ములను చెయ్యకుండ్రి. మీబతుకు దెరువుకోసం మీరు సేత్తండ్రు" మాటలు తడబడుతుండగా అన్నాడు రంగారెడ్డి.

"మా పిల్లలు గిది చేసుటానికే మిష్టపడుతలేరు. కొందరు చదువుకుని నౌకర్లు చూసుకుంటున్నరు. ఇంకొందరు వేరేపనులు చూసుకుంటన్నరు. కొందరు రాజకీయాలల్ల తిరుగుతున్నరు. కొన్నేండ్లయితె చాలా వృత్తులు పోయినట్టు గిదిగూడ పోతదేమొ..."

బాలాగౌడ్ మాటలకు అదోలా నవ్వాడు చంద్రయ్య. "రాజుబోతె రాజరికం పడిపోదు. ఎవ్వరో ఒగరు మాసేత్తరు ఇప్పుడు ఎవ్వలు మాత్రం కులవృత్తితోని బతుకున్నని చూస్తున్నరు? చదువుకోవోల్లు లేకుంటె వేరే ఏం చెయ్యనోల్లు కులవృత్తితోని బతుకుతున్నరు. అన్ని కులాలనుంచి పట్నాలకు పొయ్యేటోల్లు రోజు రోజుకు పెరుగుతండ్రు. ఫ్యాక్టరీ పనులు, నౌకర్లు, వ్యాపారం చేసుకుంటాని కందరెగ వడ్తున్నరు. ఏదో అట్ల పొద్దువోక మాట్లాడుతె నువ్వు కోపానికి రావడ్తివి బాలాగౌడ" అన్నాడు.

చంద్రయ్య, మల్రెడ్డి, రంగారెడ్డి వెళ్ళిపోయారు.

చీకటిపడి అరగంట దాటింది. ఇండ్లల్లోంచి వస్తున్న పొయ్యంటుబట్టే పొగ అగిపోయింది. కొందరిండ్లల్లో అన్నాలు తింటున్నారు.

బాలాగౌడ్ ఇంటికొచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు.

ఆలస్యంగా ఎవరైనా వస్తారని ఓ బింకి కల్లుంచి అప్పుడే వచ్చిన మరొకతన్ని పంపించాడు బాలగౌడ్. అన్నీ సర్దిపెట్టాడు.

బావి దగ్గరికెళ్ళి కాల్లు, చేతులు ముఖం కడుక్కొవొచ్చాడు.

తండ్రి పక్కన మంచంలో కూర్చున్నాడు బాలాగౌడ్.

"చాకల్దానవ్వా" అని వాకిట్లో నిల్చుంది వీరమ్మ.

ఆ పిలుపు విన్న సరోజ ఇంట్లోంచి చేతిలో కంకెడంత అన్నం తీసుకొచ్చింది. వీరమ్మ బొడ్లో దోపుకున్న బుట్టలో వేసింది

వీరమ్మ మరో చేతిలో అల్యూమినియం డబ్బుంది. దాన్ని చూపుతూ "ఎమన్న కూరుంటె వెయ్యవ్వ" అంది.

"మా అసొంటోల్ల ఇండ్లల్ల ఏం కూరలుంటయే వీరమ్మ. ఏదుంటది వేసుక తినేదేనాయె. ఎండిపెయిన చాపల కూరింక ఉడుకలే. ఎక్కడ దొరుకకుంటె పొయెటప్పుడు రా. మా ఎత్త" అంది సరోజ.

"మా అత్తవ్వకని మునుపటి తీరుగ మనుషుల్లేరవ్వ ఎవ్వలనడిగినా కుండల గలదింత కూరపెట్టెడోల్లు. మేము అన్నంగాని, కూరగాని ఎప్పుడు వండుకోక పోదుము. ఇప్పుడు వండుకోంది నడుత్తలేదు. అందరు కాపాయని కచ్చింద్రు" అంది వీరమ్మ పోబోతూ.

"నిజమేనే ఈరమ్మ. తోట్లకు పోతె కూరగాయలు వట్టిగనె ఇచ్చెటోల్లు. కంకులు కాల్చిచ్చెటోల్లు. చారెడంత తవుడు కొంచమోతె పాలో, పెరుగో, చల్లనో పోసెటోల్లు గిప్పుడన్ని అమ్ముకుంటాని కెగవడ్డరు. అయినా ఎవ్వలనేమనె తట్టుంది. ఇంకొ న్నొద్దులయితే మీ పనికి బువ్వయ్యరు - కూలి గట్టిత్తరు" అన్నాడు నర్సయ్య.

"నువ్వన్నది నిజమే తాత" అంటూ వెళ్లిపోయిందామె.

చీకటి మరింత చిక్కబడతుంది. చెట్లకొమ్మలమీద పక్షులరుస్తున్నాయి.

ఉన్నొక్క బింకి అయ్యోరు స్వామచ్చి తాగిపోయాడు. తన ప్రక్కనున్న తండ్రి దిక్కు ప్రేమగా, అభిమానంతో చూశాడు బాలగౌడ్.

తన వృత్తంటే ఎంతో అభిమానంతో ఎవరికీ రాజీపడకుండా బతికిన నర్సయ్యపై ఎనలేని గౌరవముంది బాలగౌడ్‌కు. దొరలను, పెత్తందార్లను ఆ కాలంలోనే ఎదిరించిన తండ్రి ధైర్యం జ్ఞాపకం వచ్చి అతని మీద ప్రేమతో చెయ్యేసాడు.

"నాయిన్నా ఇప్పుడు గౌడ్స్ చట్టమని, ఇంకేమేమో వచ్చినయి. అయినా ఎక్సైజోల్లకు పోలీసోల్లకు, లీడర్లకు, ఇంకెందరికో పైసలిచ్చుకుంటునే పోతన్నం. ఇప్పుడు కొంత తెలివి వచ్చినా బెదిరిచ్చెటోల్లు బెదిరిత్తనే వున్నరు. ఇప్పుడే గిట్లుంటే మీ కాలంల నయితె, మనోల్ల మీన బాగ జబర్దస్తే జరిగేదమనుకుంట కదానె" అన్నాడు బాలగౌడ్.

"కూరుడికింది. బాగాకలైతదేమొ. బువ్వ తినుకుంట మాట్లాడు కుందరు రాండ్రి" అంది అరుగుమీది కొచ్చి సరోజ.

తండ్రికొడుకులిద్దరూ అంపుల కాడికి పోయి కాల్లు చేతులు కడుక్కొన్నారు. సాయమాన్లోకెల్లి పీటల మీద కూర్చున్నారు. స్టీలు కంచాల్లో ఇద్దరికీ అన్నం, కూర వడ్డించి వాళ్ళ ముందుంచింది సరోజ.

వాళ్ళిద్దరూ అన్నం కెలుకుతున్నారు. ఇద్దరి కళ్ల ముందూ ఆ వృత్తిలోని బాధలు చేదు అనుభవాలు కదుల్తున్నాయి.

బాలాగౌడ్ కంటె నర్సయ్య తరంవాళ్ళ అనుభవాలు, వాళ్ళపై జరిగిన పీడన మరింత వేదనాభరితంగా వుండటం ఇద్దరికీ తెలుసు.

"కొడుకా! ఇప్పుడు కొంత నయ్యం మనోల్లుగూడ బడితె మర్లేత్తండ్రు. మునుపు మనమీదెంత పీడనుందో నీకెరికేనా? అందరూ తాగెటోల్లేకని కల్లమ్ముకుంట బతికెటోల్లంటె అదో తీరుగ చూసెటోల్లు నంబర్ దారచ్చి నంబరేసేటోడు. నంబరు పడ్డదంటె అదిగ సరుకారుదైనట్టే. దాన్నెవ్వలు ముట్టుకున్నా తప్పే చెట్లు గీకినందుకు రకం గట్టాలె. రకం సమయానికి గట్టకుంటె ఎండలో నిల్చోబెట్టెటోల్లు. వంగబెట్టె టోల్లు. ఒక్కొక్కసారి కొట్టెటోల్లు గూడ నిజాం కాలంల నేను చిన్నపిల్లగాన్ని వాళ్ళ మనుషు లెవ్వలొచ్చినా కుండలకు కుండలు కల్లు కొంచవోయెటోల్లు దొరల, పటేండ్ల తోని కొద్ది కష్టాలు పడ్డమా బిడ్డ" చెప్పాడు నర్సయ్య.

ఇద్దరూ మాట్లాడుకుంటూ అన్నం తింటున్నారు "బిడ్డా మీ కాలం కొంచెం నయ్యమే. మా ఆడోల్లకు రక్షణ తక్కువే. అందరూ మొదల్ల సన్నని, ఇంకేందో సన్నని రకం గట్టేటోల్లం. పరాచికాలాడెటోల్లే. తాటిచెట్లకు దొరలు, పటేండ్లు, పట్వారులు, గవర్నమెంటధికార్లు మమ్ముల పీడించుకతినెటోల్లు" మళ్ళీ నర్సయ్యే అన్నాడు.

"నాయిన్నా ఓసారి మీటింగుల ఒకయివె చెప్పిన మాటలు నాకు బాగ యాదికున్నయి. గొల్ల, గౌండ్లలాంటి కులాలకు చెందిసవాళ్ళ చేతుల్ల కమ్మకత్తి, కత్తిలాంటి ఆయుధాలెప్పుడుంటయి. చేతుల్ల ఆయుధాలున్నప్పుడు ఆయుధాలే పని ముట్లయి నప్పుడు ధైర్యముండాలె. ఆత్మవిశ్వాసముండాలె అయితే శ్రామిక కులాలోల్లు తమ చేతుల్లున్న ఆయుధాల శక్తిని తెలుసుకోకపోయిండ్రు. గందుకే తమనుతాము చిన్నగా భావించిండ్రు. దొరలకు లోబడి పెయిండ్రు. బానిసలోలె బతుకుతండ్రు. ఇది మన దురదృష్టం అని చెప్పిండు గీ మాటలు నిజమేననిపిస్తుంది నాకు" అన్నాడు బాటగౌడ్.

"అయినన్న మాటల్ల నిజం లేదని కాదు. వాళ్ళంత బానిసలోలె బతుకుటానికి చాలా కారణాలున్నాయి. మనం బలం మనకు తెలువది. తెలియజెప్పినోల్లు లేరు. అయితె ఆయుధాలను పనిముట్లోలె వాడెటోల్లు మిగతావాళ్ళకంటె కొంత ధైర్యంగానే ఉన్నరనిపిత్తది నాకైతె. వాళ్ళమీదికి వచ్చుటానికి జంకుతరు. దెబ్బకుదెబ్బ కొడుతురని భయపడ్డరు. మిగతా కులాలోల్ల మీదికి లేసినంత ఎంత దొరలైన మన మీదికి లేవరు. గా ధైర్యంతోనే ననుకుంట మనోల్లు కొంత ఫకరుగుంటరు"

తండ్రి విశ్లేషణతను చిన్న బాలాగౌడ్‌కు ఆశ్చర్యం వేసింది. ఆమాటల్లో నగ్నసత్యాలు కనబడ్డాయతనికి.

అనుభవాలతో పండిన తండ్రిదిక్కు గర్వంగా చూశాడు బాలగౌడ్.

"నిన్ను చదివించనని అనుకున్న. కని ఎల్లక నాలుగో తరగతిల్నే బందుజేసిన. గీ పని తక్కోదే కాదు గని గీ కాలంల కులవృత్తులెవ్వలు చేసుకుంటండ్రు. అన్ని కులాల్లోల్లు అన్ని పనులు చేస్తండ్రు. నీ కొడుకును మంచిగ చదివియ్యి. ఇంట్లో చదువుకున్నోడుంటె ఇల్లు రూపమే మారుతది."

తండ్రి దూరదృష్టికి, పరిజ్ఞానానికి ఆశ్చర్యం కలిగింది బాలాగౌడ్‌కు. "ఉన్నొక్క బిడ్డకు పెండ్లిచేసి పంపిస్తి. ఇక మిగిలింది గా ఒక్కడే కాదె నాయిన్న. ఎంత

కష్టపడయినా వాన్ని బాగనే చదివిస్త. గందుకే సర్కారు బల్లె చదువు వానాకాలం చదువులొంటదని కరీంగనర్ ప్రైవేటు బళ్ళేస్తి. ఖర్చయిన మంచిదే కనాడు మంచిగ చదువుకుంటండు. ఇంటికచ్చినప్పుడల్ల ఈ పని మాను కొమ్మంటండు. గిది బందుజేసి ఏంజెయ్యాలె? వాని చదువు ప్తూరయి ఏదన్న నౌకరి దొరుకుతే గప్పుడు జూసేది". "గంతేపటు. కమ్మరికొలిమి, కల్లుమండువా ఊరుమ్మడి స్థలాలసొంటివి. ఊరోల్లందరికి పనికి వచ్చే మన బతుకులను ఊరుమ్మడి బతుకులు చెయ్యాలనె చూస్తరు పెద్దోల్లు మన ఆడోల్ల మానాలు కాపాడుటానికి మనవెంతో కష్టపడాలె. మన పిల్లలు చదువుకుంటండ్రు. ఆర్థికంగా ఓ తీరుగనే వున్నం. మనతోటె గిట్ల ప్రవర్తిస్తుండంటే ఇగ పూర్తిగ పేదోనితో వెట్లుంటరో ఆలోచించు. గిప్పుడే గిట్లుంటె యాభయేండ్లకింద ఎట్లుండెనో నీకెరుక. కూటికి లేకున్నా దొరతనం చెయ్యాలని చూస్తన్నరు కొందరు వాళ్ళు బాగా బతికి నప్పుడింకెట్ల వుండేవారో ఆలోచించు."

భోజనం ముగించి పల్లాలలో చేతులు కడుక్కొని లేచారిద్దరూ.

ఎవరి మంచంలో వాళ్ళు పడుకున్నారు.

తన తండ్రితరం, తనతరం బతుకుల గూర్చి, ఆలోచిస్తున్నాడు బాలాగౌడ్. తమ బతుకుల్లోని విషాదం అతని కళ్లముందు తిరుగుతుంది. అయితే బాలాగౌడ్‌కు తన కొడుకు తరంపై ఎంతో నమ్మకం కలుగుతుంది. కొడుకు గూర్చే ఆలోచిస్తూ నిద్రలో కొరిగాడు బాలాగౌడ్.

పరిస్థితుల గూర్చి బాగా ఆలోచిస్తున్న నర్సయ్యకు కూడా కొడుకు తరంపై కంటె మనవడి తరంపై నమ్మకం కలుగుతుంది.

● 1996 ●

# 63. తిత్తి

♦ దొడ్డి రామ్మూర్తి ♦

ఆకాసం నిప్పుల కుంపటి. కురుస్తున్న పొగల శెగల గాడ్పు. గాలి ఉస్సుమంట్లేదు. పచ్చులు సెట్ల కొమ్మల్మాట్న, ఆకుల మాట్న తల్లికోడి రెక్కల కింద దాస్కున్న పిల్లలోల్లె వున్నై. యెండ యేత్వకు దిక్కులు దిగులు మొకం పెట్టై. నేల దుమ్ముతోని దూలాడ్తుంది. సూపుల్తోని గాలిచ్చినా కాన్రాని పచ్చదనం. కాళ్ళు సుర్న అంట్కపోతున్నై. సెప్పుల్లేని అడ్గులకే యెర్కున్నబాద. గుడ్సె గూల్లు సూసి బవంతులు గుడ్లు తిప్పేదినం. గుడ్డ పేల్కెల అగుతారాన్ని రంగుల బట్టలు యెద్గనియ్యని యెల్తి. కాలం సేతిల ఇమ్మని గుత్పున్నోని బర్రె. సల్లగ సల్లజెమ్టలొచ్చి బిడ్డ గుడ్డల్దాడ్సి వెంతున్నై, తడుస్తున్నై. నడక నడ్సి-నడ్సి అల్సిపొయ్యి, బండ్ల బాటెమ్మటున్న పెద్ద ఊడల మర్రిక్రింద తలకు కట్కున్న రుమాలు పక్కకేస్కొని గుర్రుకొట్కుంట యెల్లెల్కల పన్నెడు 'రెట్ట కాల్లెంకడు.'

మిట్ట మద్దేనం యాల్ల బుడ్డపోరలు గుమ్మాయి-జక్కాయి గుంపుల్గూడి, మర్రిబాయిల ఈత గొడ్తండ్కు నెత్తి గుడ్డలేస్కొని, దొర్కిచ్చునే ఆటాడ్తున్నట్టు ఉర్కుతున్రు. ఊడల్వట్కోని ఉయ్యాల - జంపాలంటున్రు కొంతమంది మర్రాకుల్తోని పత్తాలాట ఆడ్తున్రు. కొందరు ముక్కుల్గిచ్చే ఆటలుంటె, తక్కిన ఆడిపోరలు డబ్బాలాటాడ్తున్రు.

సిక్కగ అల్లుకున్నట్టున్న ఆ సెట్టు మీన తీర్తీరు పచ్చులర్సే అర్పులు, బాగోతగాల్లు గొంతు కల్పి పాడ్తున్న పాటలోనివున్నై. కొన్ని పచ్చులు మర్రిపండ్లు కొర్కెతింటున్నై. ఆ పిల్లల - పిట్టల అర్పులు, కేకలకు రెట్ట కాల్లెంకడు దిగ్గున వుల్కిపడి లేసి, మిట్ట మిట్ట బిత్తర సూపుల్జూస్తుండు.

ఒనియ్యమ్మ నాకు బాగోతం సూస్తున్నట్టు అన్పించేంద్రో?....గాగిదంత కల గన్ననా గీ పచ్చగున్న సెట్టుమీద్కి పచ్చులొచ్చై. పోరలేమో ఆటకోగిలలయిన్రు. మరి గా యెండిపోయ్ని సెట్టునోడ్లెక్కజేత్తడు బట్ట-పొట్టకు సావకుంట పచ్చగున్నోని ఇంట్కే బాండ్లుతొత్తరు గని, గలిలేనోనింట్కి వోడెల్తడు?!...ఇగ నాజీవ్తింగూడ గంతేనని, ముస్లోని మన్సుల ఆలోశన్లు అలలు అలలోల్లె తల్కాయల మెదుల్తున్న తీరు కట్టెపుల్ల దీస్కొని నేల గీతలు గీస్కుంట గీస్కుంటుంటె గుడ్ల నిండ నిండి, అల్లెల్ని కన్నీల్లు బొలబొల కార్కుంట, సెంపల మీంచెల్లి కిందికి దున్కుతున్నై.

'ఓ ముస్లాయ్ని యే ఊర్నీది?! వొంటరి వొక్కన్వే యేడుస్తున్నవేందె' 'యేమని సెప్ప కొడ్క ఉన్న వొక్కగానొక్క పోరడు గార్వంగ సాద్కున్న. మొన్నీ మజ్జెల్నే

బీమారొచ్చి ఆల్లమ్మ కాలం జేసింది. ఆడీడ అప్పుసప్పుదెచ్చి పెట్నా దక్కదాయె. యేదన్నా కూల్నాలి జేద్దామంటె మడిమ సూలల్నొప్పాయె. యెట్ట జెయ్యాల అప్పిచ్చినోన్కి కట్టాలని పోరన్ని వొకయ్యతాన జీతముంచ్న. ఆడు మునాస్ట కాపోడు. యెప్పుడు ముక్కు మీన్నే కోపం. పోరడేమో గొడ్ల కాడుండె కడ్పుల ఆకలై కొడ్కు ముంజకాయల్దింటుండాట. ఆ గొడ్లు పాడై అటిటు కాల్లు రిల్లెల్వాయంగ తిర్గి సిర్నపాయ్ డొంకవతలి తోట్లపడి తొక్కి తొంబర్లాడ్నియని, పటేలుర్కొచ్చి పసిపోరడని సూడకుంట, ఆయిల్బర్గుల్తోని ఇయ్యరమరయ్య కొట్టిండు. ఇగ నేన్సచ్చినా జీతం జెయ్యననినాతెటీలి యేడుస్కుంట సెప్పిండు. దెబ్బల బాదల్దట్కోలేక అసల్నిదురవోత లేదు. సిన్నగ ఊర్కెట్కిపాయ్ గింత నల్లాలం తెంపొచ్చి, వో పెంకల పసర్పిండి నిప్పుశెగసూసి, నులెచ్చజేసి బొగ్గలాచ్నికాడ, దెబ్బల్దగిల్నికాడల్ల గుడ్డ పసర్లపుంపి అద్దిన. మరి పోరగాడేమన్కుండో యేమొ!... కోడికూసే జామున నేను సూత్తాలకె ఇంట్ల లేనెలేదు.

మాయ్యనన్నిట్ల కష్టపెడ్తుండు. మా అమ్మే వుంటె జీతాన్కి తోలిచ్చేదాని. యెంత సోకం పెట్కుంట యెల్లిపోయిండో కొడ్కు ఇటాంకల్ల నీగిట్ట కండ్లవడ్డదా కొడ్కా.

'గీ బాటెమ్మటి యెందరో వొస్తుంటరు పోతుంటరు. అల్ల మీవోడెవలని నేనెట్ట వశనత్ జేస్త తాత. ఇంతెండల కాల్కాల్గొట్కుంట పోతున్నవ్? నీ కొడ్కు యే ఊల్లె వుండనీ....యెక్కడని పోతవ్."

'గా బొకంతలపాడు పోయ్యొత్త.'

'ఆడ్కి పోయిండా మీవోడు.'

"మా అన్న బిడ్డను ఆ ఊర్కే యిచ్నిం. ఈ పోరడు ఆడ్కి పోయిండేమొ సూసొత్త."

"జెర యెండ సల్లవడ్డంక పో....కాళ్లకు సెప్పుల్దూడలెవ్. బొగ్గలొచ్చి నడ్వలేకుంటైతవ్."

'అయితేమాయె యెట్టన్న పోతగని, మాయ్యగని గిన్ని నీల్లుంటె పోయ్యయ్య. పానం వోసుల్వాట్లేదు. సరమంత యెండిపోయింది.'

'జరాగు తాత. అరే పుల్లిగ నీ తిత్తిల నీల్లుండెగార గా ముస్లోడు దూపగొని వొన్కుతుండు. జెర యిట్టియిరా తిత్తి ?....

"అమ్మో! యెంత బాగున్నవ్. నువ్వియ్యరాదె యేతులనన్నంటున్నవ్. నీది మంచిగుండాలె. నాదేమొ ఆడీడు ముట్కోవాల్నా. అబ్బో 'మంది సొమ్ముకు మారాజంటె నీయసొంటోడెహే"...

అరె నానీల్లు నానిగాడు తాగిండ్రా! అన్నయిపొయ్నియ్. నీ దగ్గెరున్నయ్ పొయ్యమంటె. మబ్బుకు మాస్కేస్తవేంద్రా. నస్కోని కండ్లల్ల ఏల్వెడ్తోడంటె నువ్వేర'.

'నీకు తెల్వేలేదు యెట్ట బత్కుతవుర సమ్మిగా. ఆడేంటోడో యెర్కలేకుంట నీల్లియ్యనంగనె యిస్తార?

'అంటే ఆడు మాలోడో మాదిగోడో, మాస్తోడో, డక్కలోడో ఆడోడోనని అంటున్నవా యేంది'.

'నువ్వు సెప్పోన్వా! కొల్పుగట్టి సెప్తుంటె తలుబ్బెట్టి అడ్డిసట్టు సేస్తవేంద్రా.'

'కాదుర మొన్న మీ పడ్వబడ్డ బాయి బొందల బండెడ్డు ఇర్గపడి సచ్చిందంటె, మీ ఇంట్లా జులువల పోస్తుంటె, ఆ మాద్గోల్లకు తెల్సి, గూడాన్కి గూడెం కదిలి, తాల్లు గట్టి ఎద్దును పైగ్గుంజి, ఆల్లు బండి మీదెస్కాని తీస్కపోయ్, తల్కాయ దప్పిచ్చి, సుర్కత్తిలోని తోలంత మటామట్లి తీసి, దాన్కియెంతో సాకీర్జేసి, యెండవెట్టి, యెన్నెంక నానవెట్టి ఆరెకత్తిలోని ఈనెలీనెలు సన సన్నగ తోల్దీసి ముద్దుగ తిత్తి కుట్టిండెవద్రా!?.....అది మర్చిపొయ్ తిత్తిల నీల్లు మాత్రం సల్లగున్నయని సంకల్గొట్కుంట తాగుతావ్? ఆడు పట్కొని ముట్కొని కాల్కిందవెట్టి కుడ్తె ఏంగాద్దనీ, నీ తిత్తిల నీల్లు తాగ్తె తప్పార.'

'సూడరేయ్ మన్సికి అనుమానమే పాతరోగంరా ఇయ్యాల్రేపు కులం - గిలం యాడుంద్రా'

'నువ్వేంద్ర సమ్మిగ నాక్జెప్పేది. నేనొట్టి దద్దమ్మనా. నాక్తెల్వదా'

'యేంది కొడ్క యేమొ అన్కుంటున్రు. నా గురాయించి మీ రెండ్కు కలెబడ్తరు. నీల్లేకుంటె లేకపాయె ఇప్పుడే సస్తనా? సస్తె బూమికి యెల్తయితనా. ఇంగ నేంబోత. తొవ్వల యాన్నన్న తాగ్తలే.'. .

'అరేయ్ రాత్ర గద్దగాల్లు మనంద్రం పోదం. ఈ సమ్మిగాన్తోని మనకెందుక్కు ఈడ్జెప్పినట్టు మనమింటందుక్కు ఈడేమన్న కొండమీంచెల్లి ఊడిపడ్డడా. ఎప్పుడనంగొచ్చి నోల్లం. ఈడ్జెయ్యవట్టే ఈతకు యంతాల్సెమాయె అయినా ఈడు ముచ్చెటంటె శవుల్గోస్కుంటదేంద్రా ముల్గోనిలెక్క.'

"అవున్ర పుల్లిగ అనియన్ని ముసల్సెకలే. వొంగొంగి నడుస్తడు. ఇంటికాడ కర్ర సేతుల్వట్కోని తిర్గుతడు. ఆనిదో సిత్రకథ. సినాలి కథ. రాత్ర పోదాం.!....

"ఆల్లు అవులగాల్లు గట్నే మొర్గుతరు. ఆల్ల మాట్లు కాయల్జెయ్యకు' నేనింటి కుర్కి గీ బుడ్డినిండ నీల్దీస్కొస్త యెల్లెమొస్తతాత.'

'ఓయ్య.... నా బాట్న నేన్వోత. . నీకెందుక్కొడ్కా.. నీ సోపద్గాల్లందర్వోతున్రు నువ్గూడ వో....'

'యెందొ నిన్నొదిలి పోవాలన్సిస్తలేదు తాత. మా తాతోల్లె ఎర్రగ, ముక్కు కొశ్మెగ రుమాల్గూడ నీవోల్లెనే కట్టేది.

'మన్సి తీర్గ మన్సి వుంటడు. మన్సులెందరున్నా మన్సున్నోన్ని శెరలుంటయ్.'

'నేన్పసిపోరన్ని నాకేమెర్క తాత. అయితేమాయెగని మరి మీవోడెట్టుంటడో సెప్పనైత్వి?'

'జెర జెర దోర నల్పుంటడు.. కోలమొకం, జుంపాల్జుంపాల్నెత్తి. తెల తెల్లగ సన్నని పండ్లోర్స. గవ్వలోల్లెకండ్లు. యెల్గొడ్డు పాదమోల్లె అరికాల్లు నడుస్తుంటె నేలకాన్తయ్. అడ్డం, నిల్వుల సార్కుల్, సార్కుల అంగి దండరెట్ట మీన సిన్గి వుంటది మోకాల్ల మీద్దాక పొట్టి - జిట్టలాగు కాకి రంగులుండి పిర్లకాడ రొండు పక్కల అర్శెయ్యి మందం మాశ్కె మర్వలేకుంటది. మన్సులకాయ్ బెదుర్బెదుర్గ సూస్కుంట

నడ్సేనడ్క కొప్మాస్తె యేసాయె కానకుంట దేన్తొన్వడ్తె దాన్తోనే కొడ్తడు. నచ్చినోన్తోని మంచ్గి సోపత్తేస్తడు. కొడ్కును తల్కుకుంటెనే గుండె సెర్వయితుందయ్యా!'.....

"నువ్ దిగుల్వెట్కోకు తాత. మీవోడేడ కండ్లపడ్డా, తీస్కొచ్చి నీకప్పజెప్త. 'దెబ్బతల్గి రగుతగోలైనా పుండు మాన్తది గాని, దాని ఒర్ర మాన్తదా? నాగోసట్టుంది. రోజంత సెప్పినా తీరేది కాదు కొడ్కా! ఇగ బోతున్న.....

"వోరి యన్కవడ్డ పోరలు యెన్క లొట్టలూడ్పడ్డయ్ వోనియ్‌రో!'

'లొట్టలేనా ఊడ్నియ్ ఇంకేమన్ననా. సూస్కోరో వోనియూడ్నియో.'

'మంతిగా నువ్వెంత సినాలోన్వేంద్ర. నోర్దెరిస్తే సాలు మాటల్మడ్తనవెట్టి జంప్తవ్.'

'మీరంత లోపట్లోపట సేసేది బాగుంది గాని, నేనంటెనే తప్పు పొడ్సుకొచ్చాది.'

'ముత్లింగా మేమేం జేస్నింరా'

"మీరేం జెయ్యరు. బుద్దిల బూములేల్తోల్లాయె, గేనంల మీయంత గొప్పోల్లు యవ్వలుండరు. మందికోల్ల గుడ్లను మాయం జేసేదె తెల్వదు. రేకల్రేకల్వారంగ తోట్ల జొరవడి కాయగూర్ల దొంగతనం కూడ తెల్వనోల్లు. గట్నే వుంటద్రా! వున్న దున్నట్టుంటె ఊర్నాకచ్చి రాదన్నట్టయింది'

"అరె ముత్లింగ మాయ్యగని వోన్కిజెప్పక్రో! ఇజ్జతి ఈదిల ముద్దైర్ది. మల్లీతేప నిన్నేమనం. మనం మనం దంటగాల్లం యెదన్నా జర్గినా మన మజ్జెల్నే వుండాలి : గాని ఊరంత బూర్బ్యాజ్యేస్తార్ర' అట్టసెయొద్రా....'

'మల్లీతేప నా జోలికి రార్గా! అరె మంతిగాని ముక్కేందో మోటదారైంది. సీముడంతకారి నోట్లకొస్తుంవటె పైకే యెగ పీల్చుకుంటుండు. నీక్సేతుల్ లెవ్రా. జెంగిమొకపోడ. వూకె గుర్కు - గుర్కు అంటున్నవ్. పిన్న బొప్పయ్యవా'.

'పడ్కెం పట్టిండ్రా' యెంతక్తగ్గుతలేదు.'

'అదెప్పుడు యెండిపోని సెర్వేలే....'

'మెల్లగ దన్కుర్ర. బాయంత అల్లడం తల్డమైయుంది. 'మంతి'గా గాపై గుండు మీన సూడుర్ర పెద్ద ఆల్మన్ని లెక్క తల్కాయమీన తెల్లగుడ్డేస్కాని కుసుండ్రా 'కోత్పిల్ల'....

'కోత్పిల్ల కాద్రా ముత్లింగ. ఆడు మన సమ్మిగాడు. కడెమ్మటి - కడెమ్మటి తిర్గుతడు. లోకం మీది ముచ్చట్లన్ని ఆనియే!....

'అవున్ర 'మంతా' ఆడంతేగని. మనమెప్పుడో శెర్తువట్కోవాలె.'

'సెర్తుల్తోని సేతులూప్తర్గనీ ... నాకు లొట్టల్గట్టేదుందా! లేదా?'

'నువ్వున్నావు 'బుడంకాయ' ఇట్రా... ఇట్రా... ఊపిరి పీల్వకు.'

'యిప్పుడు బిర్రుగుందా ఉల్లుల్లుగుందా'

'బిర్రుగనే వుందన్న'

'సిన్నగ-మెల్లగ నీల్లల్లక్డిగు.'

'అమ్మో! నీల్లు సూత్తాలకెనే బుగుల్బులైతుందే మంతన్న. అబ్బో లోతుందయ్య.'

'నువ్వేం మున్గిపోవ్గనీ. నీల్లల్ల సోపోల్గె రొండు సేతుల్తోని నీల్లు కడ్సుకిందికి దోప్కొర. నన్ను బిగ్గరల్లుకుంటవేంది. వొనియమ్మ గిదేం సక్కదనంరా. నువ్ జెర్సేపు వొడ్డుమీన కుసోపోర యెట్నో జేస్తున్నవ్.'

'ముత్లింగా'! నేనే మొనగాన్నంటున్నవ్గా. గది లెక్కగాదు. శెర్తు కట్టుకున్నట్టు వోడు ముంద్గాల నీల్లల్ల మున్గి అడ్డుమన్ను తీస్కొస్తడో! ఆడే మొనగాడు. 'నీ మాటేసైరా మంతా...

'వోడ్రో!... వోనీతల్లి గుండ్రాయోలె గుబిల్న మీదవడె యెన్నుపూస కలక్కుమనే.'

'నేనే గెల్సిన. అందర్కంటె నేనే ముంద్గాత అడ్డుమన్ను దెచ్చి.'

'ఆరి సమ్మిగా. కండ్లు ముస్కపోయినాయిర మన్నుల మీన అట్ట దుంకుతున్నవ్.'

'ఇంతల్లెమె ముస్లోని వొదిల్నవేంద్ర. ఆన్దగ్గిరేమన్న పశెల్గిశెలుంటె వోసూపు సూడపోయ్నొవ్.'

'నోరుంద్గదా...ని నోట్కొచ్చిందల్ల వొర్లకురా మంతిగా.'

'వొర్లుడు గిర్లుడంటున్నవ్ తిక్కతిక్కగుందా వొల్లు' నీ జోలికి మేమొచ్చిమా మేం - మేం శెర్తుల్గంట్కున్నం. మజ్జెల నీకెందోయ్. నేన్నెల్సిన - నేన్నెల్సిన్నని లావు పెగ్గిల్గొడ్తున్నవ్.'

'ఊకోర 'మంతి' ఆన్తోని మనకెందుకు.'

'కాదుర ముత్లింగ... యాకాలమాయె నేనొప్పెవట్టి. కోతి-కొండంగె యింక యేదేదొ... అన్కుంట తిడ్తుండు. వోల్వడ్తర్ర. అందరం కల్సి వొచ్చినోల్లం ఈతగొట్టి మల్ల మంచ్గిపోవాలె గనీ. తట్మారి సేతలొద్దు.'

'అన్కున్న- సేస్కున్నా మనం - మనం మొకటి సేతుల్ కల్సుకోర్ర. అలాయి బలాయిచ్చుకోండ్రి. పంచాదికునా పారెయ్య. పోత... పోత సీమ సింతకాయల్కోస్కొని తిన్కుంట పోదాం.'

'మా పెద్దక్క బిడ్డ నిన్న పట్నం నుంచొచ్చిందర్రా. ఆమకు సీమసింతకాయలంటె, యెంతో పావిర. ఆల్లకేమో గక్కడ యేం కొందాం-తిందామన్నా పిరమే. మన ఊర్లల్ల దొర్కినట్టుంటదా!?...'

'మీ కోడలు ముద్దుగుంటర్రా. సీల్మల బొమ్మొలె. సిల్కముక్కు, బుడ్డ-బుడ్డ కండ్లు. ముద్దబంతి పువ్వోలె మొకం. ఇంకా...'

'ఇంకా-కంకా యేంద్ర మంతిగా. నోర్ముయ్. మా కోడుల్గురించి మల్లొక్క మాటన్నా ఈపు ఇమానం మోత మోస్తది. ఆ...'

'మనిద్దరం అన్నదమ్ములం గదర. నీ కోడలు నాక్కోడల్గాదా? గంద్కే అంటున్న నువ్వేదేదో అన్కుంటెట్ట?

'ముచ్చెట మున్గుడు బాగుంద్కని నడ్వురెహె!... గా కమ్మ బొత్తలెమ్మటి యేరే వూర్పోరలొస్తున్రు సెట్టుకాడ్కి. సీమసింతకాయలైపోతయ్. ఇంగ మనంద్రం సీమల సూస్కుంట సింత జెయ్యాల్సిందే.

'అవున్రో! సమ్మయ్య మనం ముంద్గాలవొయ్ కోస్కుందాం పోదాం నడ్వర. ఉర్రటి వుర్గాలె పిట్టలుర్కినట్టు...'

'బత్కంత గియే తిప్పలాయె. 'బొకంతల్పాడు' పోవాల్నంటె ఇంకా ఐదామడ నడ్వాలె నడ్సి-నడ్సి కాల్లు జువ్వ జువ్వ గుంజవట్టె!... అర్కాలు బొగ్గలొచ్చి. పొద్దునించి పొద్దు దాన్క బత్కు బత్తలయ్యేగదరా. గదేందిగావొచ్చు బాటెమ్మటి దుమ్మంత రైకప్కాని అంతెత్తు గింగ్రీల్గొడ్తు గిరగిర సుడుల్దిరుక్కుంట నాకాయే వుర్కొస్తుందేంద్రో. వొనియమ్మ టక... టక... టక సప్పుడొస్తుంటె యేదోన్కుంటున్న గుర్రాల సప్పుడు. అంచగుర్రాలా?! నిల్వెత్తు - నిల్వెత్తు బర్తి లొట్లలోని తెల్లటి నుర్గులు పొంగుత్తన్న కల్లు. నరమెండి పిడ్కెగట్టి, నాంగొన్న పసురమో లయింది. గింత కల్లు బొట్టన్న తాగ్దామని. వొన్నాప్ని వొక్కడన్నా ఆప్తలేడేంద్రో! ఓయ్య. నువ్వన్న గుర్రం నిల్పరాదు. జెరాపు. కండ్లు తిర్గుతున్నె దూప... దూప... అమ్మా...'

'ఓ... ఓ .. జెరాగే.. మ్మనకు. ముందల్కెనక్కు కద్లకు ముస్లోడు కింద పడ్డడు సూస్పోదాం. యేవూరి ముస్లోడు కావొచ్చు? వోడైతేంది. కండ్లు తేలగిలేసి గడ గడ వొన్కుతుండు. యెండకు సొరగొన్నట్టుంది. నీల్లు లేవాయెట్ల? గింత కల్లు సుక్క సల్దాం ముంద్గాత మొకం మీన సల్ని కల్లుసుక్కలు కార్కుంటా, కార్కుంటొచ్చి నోట్లకు జారంగానే సప్పరిస్తుండ్గా. యెంత దూపగొన్నాడో యేమో. వో ముస్లాయన. తాత లే . లే... గింత కల్లు తాగ్దువ్.'

'కుసునే వోసులైతలేదు కొడ్కా. వొల్లంత యిసిరేస్నిట్టు అయిపోయింది. మాయ్యగని గింత పొయ్యయ్య.'

'కమ్మాక్తోని రేక కట్టాలంటె. సుట్టు పట్టు దగ్గెర్ల బొత్తలేడలెవ్. గాతంగ్టెట్లకాయ్ సిన్న మోద్దుకొమ్మ వుంది. జెప్న మోద్గాకు అందొస్త వుండు తాత.'

'అమ్మా .. అయ్య కని బూమ్మీదేసిపోతిరి. నా కస్టనిస్టూరం సూడకనే కండ్లు మూస్తిరేంరా!.. గా అంచె గుర్రం సుట్టు ఈగలు జొబ్బుమంటుంటె. తోకతోని అంటుకొట్కుంట, ముందల్కెన్కకు కదుల్తున్నట్టే. నా పోరని బాద నా తల్కాయల తేనెటీగలై తిర్గుతుండె. తుమ్ములు గుండెన్కెల్కుతున్నట్టు మనాది. కల్లు ముందర్నే వుంది యేమన్న గానియ్...

'వో నీతల్లి వేంద్ర ముస్లోడ ఆక్తెస్తనేవుంటి. ఈ లోపల్నే రొండు శేర్ల ముంత కాల్జేసి కండ్ల జూస్నివ్. ఆకల్మూప రుసెర్గదు నిదుర సుకమెర్గదని యెందుకంటరు గిదే తాగ్తె మాయెతియ్.'

'యేమన్కోకయ్య ముంతన్జూడంగనె పానం లేస్కూసుంది. అద్కెనే దమ్ము దీస్కోకుంట వొక్క వూటకే వొడ్సిచ్చి. కల్లు గట్టిగుందయ్య. ముకుల కెల్లి గాటొస్తుంది. మున్పోపాలి నా పైండ్లెన కొత్తల మావూల్లె తాగ్నికల్లు. ముల్లియ్యాల నీదగ్రె తాగ్తున్న. సచ్చి నీ కడ్పుల పుడ్త కొడ్కా! ఇయ్యాల నా పానం నిలవెట్నివ్. ఇంతమంది గుర్రాల్మీన రయ్య రయ్యిన వుర్కిన్ను గని వొక్కడన్న ఆగలేదయ్య. సొరగొని సరమెండి సప్పున గీ మట్టె కల్సిపోదు.

'నువ్ బత్కేదున్నంక యెట్ట సస్తవ్' తాత.

'అవునయ్య అయ్య! నా మన్సులోటి యల్దాకట్నించి మెరమెరంటుంది అద్దనా! యిన్ని గుర్రాల్మీన అంచెకల్లు తీస్కపోతున్రుగా! గా కల్లంత యేం జేత్తరు. యాడ పోత్తరు'

'ఈ కల్లు లారీలల్ల నింప్కొని పట్నం దీస్కపోతరు. అక్కడ పెద్ద-పెద్ద అంజులల్ల కల్లు పోసి, దాన్ని అటిటు లొపి, సెక్రిన్-గిక్రిన్ కల్పి, బస్తీలల్ల డిబ్బు కల్లని అమ్మతరు'

'మరి ఊల్లె తాగినోల్లు పశ్శెలియ్యరా! కల్లంత పట్నంకెందుకు పంపుతున్రు.'

'వున్నొల్లె పొయ్యకుంటె వూరుకోరు. వుద్దెర-సద్దెర పొయ్యాలె. లేకుంటె కంటు. వొక్కట్కి పదిసార్లు అప్పులోన్లెక్క ఇంటిసుట్టు తిర్గాలె. అంచెకల్లైతె నగదు సేతులవడ్తయ్.' ఇది సరెగనీ... ఇంతెండల యేవూర్వోతున్నవ్. యేం పని జెప్పవ్ తాత!'

'నాది మొండ్రాయికుంట మేం మాద్గోలమయ్య.'

'నిన్నది అడ్గినాన్రయ్య. వోటడ్గితె వోట్జైప్తవ్!'

'అడక్కున్నా! లోపట్లోపటుంటద్గా. యీడేందని. గందేకె జెప్తున్న. అసల్సంగను. మాన్న బిడ్డను బొకంతలపాడిచ్చినం. మా పొల్లగాడు...'

'సెప్కుంటనే యేడుస్తవేందె. యేమన్న జర్గదాన్ది జర్గిందా యేంది. ఊకో... ఊకో...

'యేంగాలేదయ్య. యేంలేదు. వుత్తుత్తగ్నే. యేదో మనాది.'

'వోరయ్య కడ్పుల బాదున్నప్పుడు డగ్గిరున్నోన్కి సెప్తె కొంత బర్వు దించినట్టైద్ది' లోపల్వెట్కొని కుమిల్కుమిలి సస్తావ్ర.'

'సచ్చెదుంటె సిన్నపోరగాన్ది వున్నప్పుడు బీమార్తో సద్దు... నేనిప్పుడేం సావగని? రుమాల్ కొంగున ముబ్బేదుంది. యిగవటయ్య నీ కల్లు పశ్శెలు' అనియ్యమ్మ గమ్మత్కునా పారెయ్య. నిన్నడ్గినావ్ పశెలియ్యమనీ... 'తాగినప్పుడియ్యకుంటె యెట్ట. నువ్ మార్చేరగాన్వి అయినా ఆపత్కి ఆదుకున్నోన్వి. నీ రుదాన పడ్పోను కొడ్క తీస్కోయ్య... తీస్కో!'

'పుట్టెడు దుక్కంలవున్నవ్ ముస్లోడ. నీ తాన తీస్కుంటాన్ పశెలు. పశెలొద్దు - గిశెలొద్దుపో? ఇయ్యిల్లాయె అంచెగుర్రాల్ని యెల్లిపాయె నేన్వాతున్న బద్రం ముస్లోడ...'

'కడ్పు సల్లంగుండ. యే తల్లి కన్న కొడ్కో పశ్శెకోసం కూసం కప్కునే గీ లోకాన ఇసొంటోల్లు ఆడ్ప-దడ్ప వుండవట్టే గీ దునియ గిట్టుండ్గని, లేకుంటె మన్సిని - మన్సి పీక్కతినేది రాకపోయినాది. పోరడెట్వాయెనోగా నాపానమంత ఆన్మీదనే. తల్లిలేని పోరన్ని మాద్గిముండాకొడ్కు గిట్టజేస్తాడని, లోకం కాకులై పొడ్సేయాల్లాయె...

నీల్లు పుట్టేది బూమిల్నే. కల్లు పుట్టేది బూమిల్నే. అయితేంది! గీ బూమిల నీల్లకు కులముండ్గని. కల్లుకు కులం లేదు.

● 1997 ●

# 64. లగ్గం సంబురం

♦ అంబల్ల జనార్దన్ ♦

"మన శేటు బిడ్డెకు కరయిందట"

"ఏ ఊరుకో"

"కోరుట్లకు"

"పిల్లగాడేం జేస్తడు?"

"ఇంకేం లేదట, గని బి.ఎ. నేర్సి టీచర్ ట్రేనింగ్ పాసయిండట. పని కొరకు అర్జిల పెట్టిండట."

"అంతాయే పనికేం, ఇయ్యల్ల గాకుంటే రేపు దొర్కుతది. నేర్చిన పిల్లగాడు గదా"

"ఏమైతేం, సదుకున్న పిల్లగాడు దొర్కిండు శేటుకు."

"పిల్ల ఏం తక్క జదివిందా? మేట్రిక్ పాసాయే."

ఇలా సాగుతోంది అమ్మలక్కల మధ్య సంభాషణ. వారంతా బీడీల లక్ష్మయ్య కమీషన్ ఏజెంట్ దగ్గర బీడీలు చేసేవారు.

బీడీల లక్ష్మయ్యకు ఆ ఊర్లోనే కాదు, చుట్టుపక్కల గ్రామాలలో కూడా చాలా పేరుంది. ఆ వైపు ఏ సాంఘిక కార్యక్రమానికైనా, పంచాయితీ జరిగినా బీడీల లక్ష్మయ్యకు కబురంపాల్సిందే!

తన కుల విద్య మగ్గం నేయడానికి స్వస్తి చెప్పి బీడీ కమీషను ఏజెంటుగా స్థిరపడి పోయాడు లక్ష్మయ్య. అతనే కాదు, అతని లాంటి ఎందరో పద్మశాలీయులకు ఇప్పుడు బీడీలు చేయడం, చేయించడం అంటే కమీషనుదారుగా వుండటం, మరో కులవిద్య అయింది. చేతిమీద నేసిన బట్టలు ఎవరు కడుతున్నారు కనుక! మిల్లు బట్ట మేలురకంగా ఉండటమే కాక చౌక కూడానూ!

పొలం పనులు లేనప్పుడే కాదు, మామూలుగా కూడా గ్రామాల్లో బీడీలు చేయడం కద్దు.

మొత్తంమీద వ్యవసాయం తర్వాత, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలలోని అధికశాతం ప్రజలకు జీవిక కల్పించే కుటీర పరిశ్రమ, బీడీల పరిశ్రమ. పదేళ్లు నిండిన చిన్నపిల్లల నుంచి, ఎనభైలలో పడిన వృద్ధుల దాకా రోజుకు అయిదు వందల నుండి రెండు వేల వరకూ బీడీలు చేస్తారు.

బీడీ కమీషన్ ఏజెంట్ అంటే బీడీలు చేయించేవారన్నమాట పెద్ద పెద్ద బీడీల కంపెనీల ఆఫీసులు జిల్లా కేంద్రాలలో ఉంటాయి. మండలానికి ఒకటి రెండు డిపోలు ఉంటాయి. అవి జిల్లా కేంద్రం ఆఫీసు ఆధీనంలో పని చేస్తాయి ఒక్కో డిపో కింద దాదాపు నలభై, యాభై మంది కమీషన్ ఏజెంట్లు ఉంటారు

వారు డిపో నుండి పొగాకు తునికాకు (బీడీలు చుట్టే ఆకు) తెచ్చి, బీడీలు చుట్టే కార్మికులకు ఇవ్వడం, వారు తయారు చేసిన బీడీలు పొడవు, నిడివి, బరువులో, కంపెనీ సూచించిన మేరకు ఉన్నాయో లేదో తనిఖీ చేసి, వాటిని డిపోకు పంపడం, బీడీ కమీషన్ ఏజెంటు బాధ్యత. దానికి వేయి బీడీలకింతని కమీషన్ ఉంటుంది. బీడీలు చేసే వారి క్కూడా వేయి బీడీలకు ఇరవై నుండి ముప్పై రూపాయల వరకు కూలీ ఇస్తారు.

ఇప్పుడు బీడీల లక్ష్మయ్యగా చెలామణి అయ్యే వంగ లక్ష్మయ్య దాదాపు ఇరవై సంవత్సరాలనుండీ బీడీ కమీషన్ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. తన ఊరైన 'తొర్రి' గ్రామంలోనే గాక పక్క ఊరైన 'యేర్గట్ల' లో కూడా అతనికి బ్రాంచి వుంది. అది లక్ష్మయ్య పెద్ద అబ్బాయి సురేష్ చూసుకుంటాడు. వారి డిపో కమ్మరిపల్లిలో ఉంది. కంపెనీ ఆఫీసు నిజామాబాదులో ఉంది.

లక్ష్మయ్య ఆధ్వర్యంలో రెండు బ్రాంచీలు కలిసి దాదాపు లక్షన్నర బీడీలు రోజూ తయారు చేస్తాయి. అతని ఏకైక కూతురు హైమవతి పెళ్ళి గురించే మాట్లాడు కుంటున్నారు ఆ 'కార్ఖానా' లోని బీడీ కార్మికులు

"లగ్గమెప్పుడు పెట్టుకుంటరో" అడిగింది సాయమ్మ.

"కార్తిక పున్నమైనంక మూర్తాలున్నాయట గదా" బదులు చెప్పింది పెళ్ళిమాటల్లో పాల్గొన్న నర్సవ్వ.

"అయితే నెల వందెవ్ సాల్ (నెల పదిహేను రోజులు) వున్నై. కట్నమెంతనో?"

"ఇరవై వేలు ఉండావను (వరకట్నం) గడేరం, పంక, తులముంగరం పిల్లగాడికి, అత్తులం కమ్మలు, మూడు తులాల శెవులారు పిల్లకు. దీలే (దీపావళి)కు లూనా కొనియ్యాలట."

"లగ్గం కర్సుతోని డెబ్భై వేలకు దాటుతది. పిల్లకు ఆల్లేం పెడుతన్నరో?"

"మూడు తులాల పుస్తెలతాడు, రెండున్నర తులాల పాట్నీలు (గాజులు)."

"ఒక్కతె బిడ్డ అని గర్వంగా పెంచిండు మేట్రిక్ దాకా సదు జెప్పించే. మిషను కుట్టుడు కూడా నేర్పించే. దేవుని పుణ్యాన పిల్లగాడికి సర్కారీ నౌకరీ దొరికేంటే ఇక అల్లరుండది."

"బిడ్డ మంచి ఇంట్లోపడితే తల్లిదండ్రులకు ఇంకేం గావాలె"

అవును. రాజయినా, పేదయినా తన కూతురు కొరకు కోరుకునేది మంచికాపురమే గదా!

పెళ్లి ముహూర్తం నిశ్చయమయింది. కన్యాదాత ఊర్లోనే పెళ్ళి. పెండ్లి పత్రికలు అచ్చయ్యాయి. ఊర్లోనే గాక, దూరపు ఊళ్ళలో ఉన్న బంధువులకు, స్నేహితులకు ఆహ్వానాలు వెళ్ళినాయి. ఇద్దరబ్బాయిల తర్వాత కలిగిన ఒక్కగానొక్క కూతురు.

పెళ్ళికాస్త మునంగానే చేయాలని లక్ష్మయ్య సంకల్పం. తాను కూడబెట్టిన సొమ్ముగాక, కొంత అప్పు కూడా చేయడానికి వెనుకాడలేదతను.

హైమ పెళ్ళి తన పరపతికి అనుగుణంగా నలుగురికి కొంత కాలంపాటు జ్ఞాపకం ఉండేలా చేయాలని అతని కోరిక. ఆ కోరికకు అనుగుణంగానే పెళ్ళి ఏర్పాట్లు మొదలు పెట్టాడు.

దగ్గర ఊర్లోని బ్యాండు మేళం, వీడియో, ఫోటోగ్రాఫరును ఏర్పాటు చేశాడు. పెళ్ళి పందిరి అలంకరణకు, కుర్చీలకు, షామియానాలకు, టెంటు హౌజు వారికి ఆర్డరిచ్చాడు. వంట బ్రాహ్మణులను కుదిర్చాడు. కోరుట్లకు పోవడానికి రెండు టూరిస్టు బస్సులకు అడ్వాన్సిచ్చాడు. అతనిద్దరబ్బాయిలే కాక వారి స్నేహితులు కూడా పెళ్ళి పనుల్లో మునిగి పోయారు. ఇంకేం, ఎదురు చూసిన రోజు రానే వచ్చింది.

మర్నాడు ఉదయం పదిగంటలకే పెళ్ళి. ఆనవాయితీ ప్రకారం వరుణ్ణి తీసుకు రావడానికి జీపు పంపాలి. సాయంత్రం ఆరుగంటలకు అయిదుగురు ఆడపెళ్ళివారు పెరుగన్నం, కూరగాయలు తీసికొని జీపులో కోరుట్లకు బయలుదేరారు. పెళ్ళి కుమారుడు ఆ రాత్రికి వస్తే, మిగతావారు మర్నాడు అంటే పెళ్ళిరోజునాడు పొద్దున ఏడు గంటల వరకు వస్తారు.

కోరుట్లకు వెళ్ళిన జీపు వరుణ్ణి తీసుకొని తిరిగి వచ్చేసరికి రాత్రి పదకొండున్నరయింది. వారిని మగ పెళ్ళివారికి కేటాయించిన "గంగ పుత్రుల సంఘం" లో ఉంచి, టీ, ఫలహారాలతో సత్కరించారు.

"ఏం సురేశూ, బాగా ఆలిసెం అయింది?" అడిగాడు నర్సయ్య.

"ఆలిసెం గాకుంటె ఏమైతది కాకా! మేం బోయేటప్పటికి ఇంకా ఏం తయారు కాలేదు. మేమత్తమని గుర్తే గదా! వంటన్నచేసిపెట్టద్దా! మేం జేరినంక వంటకు పెట్టిన్రు. ఆగమాగం అడ్డిచ్చిండ్రు. బువ్వకచ్చపక్క, పప్పు కారం, కూరల ఉప్పెక్క అదేందో నాకైతే ఆల్ల లక్షణం మంచిగనిపియ్యలే.

"సురేష్ ఆల్లకు తోయకుండవచ్చు ఆల్లింట్ల పైల(మొదటి) లగ్గం కదా!" నర్సయ్య.

ఇదంతా విన్న లక్ష్మయ్యకు మాత్రం ఎక్కడో అపశ్రుతిగా తోచింది. తాము వరుని ఇల్లు చూడడానికి పోయినప్పుడు మగపెళ్లివారి దర్పం కాస్త అతిగానే అనిపించింది. అయినా సర్దుకుపోయాడు. ఇప్పుడీ కధనం! ఎలాగో ఈ కాస్త తలపెట్టిన కార్యం నిర్విఘ్నంగా జరిగితే అదే పదివేలు" అని తన దైవాన్ని స్మరించాడు.

పెళ్లిరోజు.. ఉదయం ఎనిమిది గంటలు కావస్తుంది. ఏడు గంటలకు వస్తామన్న మగపెళ్ళి వారు ఇంకా రాలేదు.

లక్ష్మయ్య హడావుడిగా ఇంట్లోకి, బయటకు తిరుగుతున్నాడు.

'యేడేంగ అత్తమనిరి, ఎనిమిదాయే, ఇంకాపత్తకు లేరు. పదేగంగ లగ్గం. పైదు ముడపు జేయాల. పిల్లగాన్ని ఎదుర్కోవాల! పదికిమూర్తమాయె ఫోనుజేద్దమంటే అన్నలు ఎక్సేంజీ కాలపెట్టిరి. ఇగ ఎట్ల ! ఏం కత!" అడిగాడు లింగయ్య లక్ష్మయ్యను.

"దూరం మాటాయే. బస్సు కూశయిందో లేక ఆల్లకు పిల్లుడికే ఆలిసెం అయిందో, ఇంక తోడెం సేపు చూద్దాం" అన్నాడు లక్ష్మయ్య. కులం పెద్దమనిషి లింగయ్యతో.

"ఎనిమిదన్నర దాక జూసి, పిల్లగాన్ని హన్మాండ్ల కాడికితీస్కపోదాం. పిల్లగాడోల్లు రాంగనే పైదు ముడుపు జేశెయ్యచ్చు" అందుకున్నాడు గజం నర్సయ్య - వధువు మేనమామ.

ఎనిమిదిన్నర... పావుతక్కువ తొమ్మిది. మగపెళ్లివారి జాడలేదు.

పెళ్ళి పందిట్లో హడావుడి మొదలైంది. వరున్ని హనుమంతుని మందిరానికి తీసుకు పోవడానికి సన్నాహాలు చేయసాగారు

అయిదుగురు ముత్తైదువలు మంగళహారతులు పట్టుకుని రెడీగా వున్నారు. ఇద్దరు డప్పుల వాళ్ల కోరకు పోయారు. ఎంత బ్యాండుమేళం వున్నా, మాదిగ డప్పులు ఉండాల్సిందే!

"ముత్తెమ్మా, నువ్వు పిలగానికి బాశింగాలు కట్టు, కమలా, మీరు మంగళారతులు ముట్టిచ్చి తయారుగా ఉండుండ్రి. డప్పులోల్లు రాంగనే ఎల్లి ఐరేని (పెళ్ళికుండలు) ఎదుర్కద్దం" నర్సవ్వ చురుకుగా తిరుగుతూ సన్నాహాలు చేయసాగింది. ఐరేని కుండలు ఎదుర్కొని వరున్ని హనుమాన్ మందిరానికి తీసికెళ్ళే వరకు తొమ్మిది గంటల పది నిమిషాలయింది.

అపుడే! మగ పెళ్ళివారి బస్సులు వచ్చాయని కబురందింది.

వందా యాభై కంటె ఎక్కువ రామని చెప్పినవారు, మూడు బస్సుల్లో పిల్లా, జెల్లా కలిసి మూడు వందలమంది దాకా వచ్చారు. లక్ష్మయ్యకు, మిగతా అడపెళ్ళివారి కది నచ్చలేదు. కొందరు బాహాటంగానే మగపెళ్ళివారిని తప్పుబట్టారు. లక్ష్మయ్య వారిని శాంతింపజేసి, ఎక్కువగా వచ్చిన అతిథులకు సరిపడే వంటలు చేయటానికి, బ్రాహ్మలకు పురమాయించాడు. ఆ తర్వాత వచ్చిన అతిథులను వారి విడిదికి తీసుకెళ్ళారు. వరి పేలాలు, శనగలు, వేరుశనగలు కలిపి తాలింపు చేసిన ఫలహారం తయారుగా వుంది మగపెళ్ళివారికి. వారు రాగానే టీ, ఫలహారం ఇవ్వడం ఆనవాయితీ. పెళ్ళి మర్యాదలలో అది ఒక నిబంధన కూడా! ఎక్కువ వచ్చిన అతిథులకు సరిపడా, టీ, ఫలహారాలు చేయబడ్డాయి.

"కొందరు చాయి, ఫలారం కాడ వుండుండ్రి, మేం పోయి పైదు ముడుపు శేత్తం, మూర్తంకు పోని ముప్పావుగంట కూడాలేదు" అని లక్ష్మయ్య హడావుడిగా హనుమంతుని గుడి దగ్గరకు బయలు దేరాడు. అప్పటికే కులం పెద్దలు పైదు ముడుపు ఏర్పాటు చేశారు.

మగపెళ్ళివారు - ఆడపెళ్ళివారు చిన్న చిన్న గులకరాళ్ళతో కొట్టుకున్నారు. అబద్ధపు పోట్లాట నటించారు. ఆ తర్వాత ఒకరి నోట్లో ఇంకొకరు పంచదార, బిస్కట్లు పోసుకుని కలసిపోయారు. పైదు ముడుపు (ప్రధానం) తంతు ముగిసింది.

అపైన వరుణ్ణి జీవులో కూర్చుండబెట్టి బ్యాండు మేళంతో కళ్యాణవేదికకు తీసుకువచ్చారు. అన్నంతో దిష్టి తీసి పెళ్ళి పీటలపై కూర్చోబెట్టారు. పురోహితుడు

మంత్రాలు చదువుతూ సూచనలిస్తున్నాడు. ఇద్దరు వరునికి అడ్డంగా తెల్లదుప్పటి పట్టుకున్నారు ఆ తర్వాత పెళ్ళి కూతురుని తీసుకువచ్చి పెళ్ళి పీటలమీద కూర్చోబెట్టారు. లక్ష్మయ్య దంపతులు వరుని కాళ్ళు కడిగి కన్యాదానం చేశారు. వధువు కాళ్ళు కూడా కడిగారు.

హడావుడి నైతేనేం, పదిగంటల పది నిమిషాలకు అక్షింతలు పడ్డాయి. అలా అయిదు సార్లు జరిగాక, మంగళసూత్రధారణ, సప్తపది కూడా పూర్తయ్యాయి.

ఒక హోమహవనం మొదలయింది. నిజానికి పెళ్లికి ముందే హోమం చేయాలి. కాని మగపెళ్ళివారు రావడంలో ఆలస్యం చేయడంవల్ల, పెళ్ళి తర్వాత హోమం చేయాల్సి వచ్చింది. ఇలాంటివి పెళ్ళిళ్లల్లో మామూలే. వరునితో, వధువుతో ఎన్నో ప్రమాణాలు చేయిస్తున్నాడు పురోహితుడు. ఆయన చెప్పినట్టల్లా చేస్తున్నారు వారు. ఆ ప్రమాణాలు వారి తలకెక్కాయా? అవి వారు జీవితాంతం పాటిస్తారా? అంటే సందేహమే మరి!

ఏదో "విధి"గా ప్రమాణాలు చేయడమే కాని వాటిని అర్థంచేసుకునేదెంత మంది? అర్థం చేసుకుని ఆజన్మాంతం గుర్తు పెట్టుకుని ఆచరించేందెంత మంది? ఎలానైతేం, వరుడు సుభాష్ - వధువు హైమవతి భార్యభర్తలయ్యారు. ఇక పెళ్ళి ముచ్చట్లు ప్రారంభమయ్యాయి.

అటు పెళ్ళి భోజనాలు మొదలయ్యాయి. ఇటు వధూవరుల్ని కన్యాదాత ఇంటికి తీసుకెళ్ళారు. ఒకరి పేరు ఇంకొకరు - అదీ పొడుపు కథలో చెప్పందే లోనికి రానివ్వలేదు. వరుని ఉత్తరీయానికి, వధువు చీరచెంగుకు కట్టిన ముడి విప్పబడలేదు.

నవదంపతులు ఒకే కంచంలో ఒకరికొకరు తినిపిస్తూ భోంచేశారు. వరసైన వారు వేళాకోళం చేయడం, వధూవరులు బెట్టుచేయడం, ఇలా వేడుకగా మొత్తంమీద చాలా బాగా జరిగింది పెళ్ళి.

కాస్త భుక్తాయాసం తీరిన తర్వాత తన అత్తగారి ముంత తీసుకుని, అలిగి హనుమంతునిగుడి వద్దకు వెళ్ళాడు సుభాష్. అతనిపై దొంగతన నెపం వేశారు ఆడపెళ్ళి వారు. దానికి మగపెళ్ళివారు కయ్యానికి దిగారు.

ఇంటికి తిరిగి రమ్మని వరుణ్ణి బ్రతిమాలారు లక్ష్మయ్య దంపతులు. అదనంగా ఒక టేపు రికార్డరు కావాలని పేచీ పెట్టాడు సుభాష్. ఇక ఔననక తప్పలేదు వధువు తండ్రికి, ఇదంతా పెళ్ళిముచ్చట్లలోని భాగమనే. పెళ్ళిలో వరుడు 'అలిగి' కట్నం కోరడం, అది ఆడపెళ్ళివారు తీర్చడం అనవాయితీ. ఇక ఆడపెళ్ళివారి వంతు వచ్చింది. ఎప్పుడూ, అంటే పెళ్ళిరోజంతా వరుని దగ్గర ఉండాల్సిన కత్తెర ఎవరో దాచిపెట్టారు. బావమర్దుల కట్నం - కనీసం వేయి రూపాయలు జరిమానా ఇస్తేనే కత్తెర తిరిగిస్తామని షరతు. ఇరవై రూపాయల కత్తెర పోతే పోయింది. ఇంకోటి కొనుక్కుంటానని పెళ్ళికుమారుని ధీమా! తమ కట్నం ఇవ్వందే కదలనివ్వమని బావమర్దుల సవాల్!

నాదేంపోయింది, ఇక్కడే ఉంటానని వరుని జవాబు.

అలా కాస్త బెట్టు చేసిన తర్వాత, చివరకు రెండు వందల రూపాయలు ఇచ్చాడు సుభాష్. నగదు, వస్తు రూపంలో యాభైవేల వరకు దండుకున్న పెళ్ళి కొడుకు, ముష్టి రెండు వందలు ఇవ్వడమేమిటని, బావరుదులు కోప్పడ్డారు. అవి కూడా అతన్నే ఉంచుకోమని అన్నారు. పెద్దలు చెప్పిన తర్వాత ఊరుకున్నారు. ఈ విషయంలో సుభాష్ ప్రవర్తన వారికి నచ్చలేదు.

ఇక నాగవెల్లి కార్యక్రమం మొదలైంది. ఒకరింట్లో మగపెళ్ళివారు, తాము తెచ్చిన బియ్యం (దాదాపు 10 కిలోలు), అయిదు రవికె గుడ్డలు, అయిదు ఎండు కుడుకలు, ఒక పళ్ళెంలో పెడతారు. ఇంకో ఇంట్లో ఆడపెళ్ళివారు అలానే చేస్తారు.

వధూవరులు. నాగవెల్లి బట్టలు వేసుకుని ఒడి బియ్యం మలుస్తారు.

వరుడు తమ బియ్యం ఆడపెళ్లివారికి మలుస్తాడు. వధువు తమ బియ్యం మగపెళ్ళి వారికి మలుస్తుంది. అయిదు సార్లు ఒక ఇంటినుంచి ఇంకో ఇంటికి తిరిగి ఒడిబియ్యం మలచడం పూర్తిచేస్తారు. ఆఖరున మొత్తం బియ్యం కలిసిపోయి ఒకరి బియ్యం ఇంకొకరికి చెందుతాయి.

ఆ బియ్యం పెళ్ళి తర్వాత జరిగే వియ్యంపురాళ్ళ వాయినం – విందులో వండి భోజనం పెడతారు. ఈ తంతు ఒకరింట్లో, ఇంకొకరు కలిసిపోవడానికి సంకేతం.

నాగవెల్లి కాగానే కొందరు మగపెళ్ళివారు పగటి భోజనాలు కూడా కానిచ్చారు. లక్ష్మయ్య ముందు చూపుతో, సత్వరంగా చేయించిన ఏర్పాట్ల వల్ల వంటలు సరిపోయాయి. కాస్త మిగిలాయి కూడాను. గడుసుతనంతో, చెప్పిన దానికంటే ఎక్కువ సంఖ్యలోనే, మగపెళ్ళివారు వచ్చిపడినా, లక్ష్మయ్య నేర్పరితనంతో అతను పరువు దక్కింది.

ఇక మరుసటి రోజు వరుని ఇంట్లోని విందు సంగతి చర్చకు వచ్చింది. దాదాపు యాభైమంది వస్తామని హైమ తండ్రి అన్నాడు. మరునాడు పొద్దున పదకొండు గంటల వరకు భోజనాలయితే, తాము పగలు రెండు మూడు గంటల వరకు తిరిగి రావచ్చని అతని ఉద్దేశం. ఉదయం విందు కుదరదన్నారు మగపెళ్లివారు. రాత్రి, తమ ఊర్లోని స్నేహితులకు మాంసం భోజనాలు ఒప్పుకున్నామనీ, వారితో పాటే వీరికి భోజనాలు ఏర్పాటు చేస్తామని వారి వాదన.

ఆ రోజు తమ ఊరు చేరేసరికి రాత్రి పదిపదకొండవచ్చు. ఆ తర్వాత ఉదయం భోజనాలకు సన్నాహాలు చేయడం కుదరదు కనుక ప్రొద్దున భోజనాలు ససేమిరా పెట్టలేమని నొక్కి చెప్పారు. దీనిపై చాలా రాద్ధాంతం జరిగాక ప్రొద్దున శాఖాహార భోజనాలకు ఒప్పుకున్నారు.

ఇక్కడ లక్ష్మయ్య మనసు మళ్ళీ చివుక్కుమంది. ఉల్లాసంగా, సంబరంగా జరగాల్సిన పెళ్లి ముచ్చట్లు, తగువులతో ముగుస్తున్నాయి. మరుసటిరోజు ఎలా గడుస్తుందో!

ఇక అప్పగింతలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి.

వధూవరులను బ్యాండు మేళం ఊరేగింపుతో గుడికి బయలుదేరదీశారు. వెనక పెళ్ళి కానుకల ట్రాక్టర్ వుంది. హైమవతికి తల తల్లిదండ్రులు ఏమేమి కట్న – కానుకలు ఇచ్చారోనని కుతూహలంగా చూస్తున్నారు ఊళ్ళోని జనం.

డెకోలం మంచం, పరుపులు, స్టీలు బీరువా, పంఖా, గంగాళం, కొప్పెర, స్టీలు నీళ్ళ ట్యాంక్, కుక్కర్, మిక్సర్, ఎన్నో వంట పాత్రలు మొదలైనవి. అన్నీ ఒక ట్రాక్టర్లో పొందికగా పేర్చబడి వున్నాయి. గ్రామ ప్రజలు, తెలిసినవారు, తెలియనివారు, పిల్లలు, పెద్దలు ఊరేగింపుతో నడుస్తున్నారు. ఈ దృశ్యం కనులకింపుగా వుంది.

గుడిలో పూజ చేసిన తర్వాత, అప్పగింతల కార్యక్రమం మొదలయింది. సాధారణంగా ఇంటికి తిరిగి వచ్చి అప్పగింతలు చేయాలి. కానీ చీకటి పడుతున్నందున గుడి నుంచే అప్పగించాలని నిర్ణయించారు. అయిదు రోజుల వేడుకగా జరిగే పెళ్ళి ఒక్కరోజులోనే పూర్తి చేయాలి మరి!

లక్ష్మయ్య దంపతులు వధువు చేతిని వరుని తల్లిదండ్రుల చేతుల్లో పెట్టి కాళ్ళకు దండం పెట్టారు. ఆపైన వరుని చేతిలో, వారి దగ్గరి బంధువుల చేతుల్లో హైమవతి చేతిని పెట్టి వాళ్ళ కాళ్ళకు నమస్కారం పెట్టారు. ఆ తర్వాత పెళ్లి కూతురి అన్నలు, దగ్గరి బంధువులు వధువును మగపెళ్ళివారికి అప్పగించారు. తమ బంగారు కొండకు ఏమాత్రం కష్టం కలుగకుండా తల్లిగారిల్లు జ్ఞాపకం రాకుండా చూసుకోమని కోరుకున్నారు. అక్కడ అందరి కళ్ళు వర్షిస్తున్నాయి. తమ ప్రాణంలోని ప్రాణం పరాయిదయిందని దుఃఖంగా ఉన్నారు. పెళ్ళికూతురు కూడా ధారాపాతంగా ఏడుస్తూనే వుంది. ఆడపెళ్ళివారి ఇంటివారే కాక ఇరుగుపొరుగు వారు కొందరు ప్రేక్షకులు కూడా అశ్రువులను ఆపుకోలేకుండా ఉన్నారు. మగపెళ్ళివారు మాత్రం ఇదంతా తమకేమీ పట్టనట్టు నిర్వికారంగా వున్నారు. జాప్యం జరుగుతోందని ఒకింత అసహనంగా కూడా వున్నారు.

అదేమి చిత్రమో కాని ఆడకూతురన్న తర్వాత ఆమెకు పెళ్లి చేయడం తమ బాధ్యత అనీ, ఆ తర్వాత ఆమె పరాయి ఇంటకి పోతుందనీ తెలుసు. పెళ్ళి చేసేది కూడా అందుకే. కానీ ఆ ఘడియ వచ్చేసరికి దుఃఖం ఆగదు. తమ బిడ్డ, ఇంకా తమ ఇంట్లోనే వుంటే బాగుండును అనిపిస్తుంది.

దాదాపు ఏడు గంటల ప్రాంతంలో మగపెళ్ళివారు వధూవరుల సమేతం, తోడు వధువుతో, తమ బంధుమిత్రులతో కలసి మూడు టూరిస్టు బస్సులలో కోరుట్లకు బయలుదేరారు.

ఇక్కడ! ఆడపెళ్ళివారి ఇల్లు బోసిగా వుంది. ఎవరి మనసులో వారు దుఃఖ పడుతున్నారు. అది సహజమే కదా!

ఆ మర్నాడు దాదాపు వందాయాభైమంది ఆడపెళ్ళివారు, రెండు టూరిస్టు బస్సుల్లో కోరుట్ల బయలుదేరారు. వారు అక్కడికి చేరేసరికి దాదాపు పదిన్నరైంది. పిల్లలంతా ఆకలిగావున్నారు. ఎండకు నోళ్ళెండిపోయాయి.

బస్సు దిగిన పది నిమిషాల తర్వాత ఇద్దరు మగపెళ్ళివారు వచ్చివారిని విడిదికి తీసికెళ్ళారు. వరుని కుటుంబ సభ్యులెవరూ రాలేదు. అక్కడున్న నీళ్ళతో కాళ్ళు చేతులు కడుక్కుని మంచినీళ్ళు తాగి, తమ బడలిక తీర్చుకున్నారు.

అయినా వరుని కుటుంబ సభ్యులు పత్తాలేరు. ఇంకా వంటయినట్లు లేదు. టీ, ఫలహారాలు కూడా లేవు. ఏదో పిలవని పేరంటానికి వచ్చినట్టు అయింది.

దాదాపు అరగంట తర్వాత కొందరు కులపెద్దలు, వరుని తండ్రి దిగారు. అప్పటికే ఆకలితో కడుపు నకనకలాడిపోతున్న కొందరు యువకులు వారిని నిలదీశారు. మేము రాత్రి భోజనాలు పెడతామంటే మీరు వినలేదని మగపెళ్ళివారూ, ఆ తర్వాత ఒప్పుకుని కూడా మీరు భోజనాల ఏర్పాట్లెందుకు చేయలేదని ఆడపెళ్ళివారూ ఒకరినొకరు దూషించుకున్నారు.

మాటామాటా పెరిగింది. ఇలా అవమానపర్చడానికా మమ్మల్ని ఇక్కడకు తీసుకొచ్చావని కొందరు ఆడపెళ్ళివారు లక్ష్మయ్య మీద విరుచుకపడ్డారు.

టీ, ఫలహారాలు లేకపోతే మానె పన్నెండుగంటలవుతున్నా, పెడతామని ఒప్పుకున్న భోజనానికి ఏర్పాటు చేయకపోతే ఎలా? మా ఇంట్లో తిండికి లేక ఇక్కడకు వచ్చామా? అని వాపోతూ కొందరు తమ బంధువుల ఇండ్లకు వెళ్ళారు. కొందరు యువకులు హోటళ్ళ వైపుకు దారితీశారు. లక్ష్మయ్య కొడుకులైతే ఏదో హోటల్లో మనమే ఏర్పాటు చేద్దాం అన్నారు

వారిని శాంతింప చేసి, అలాచేస్తే తప్పుబడతారనీ ఆ తర్వాత హైమను దెప్పుతారనీ నచ్చచెప్పారు. ఒంటిగంట తర్వాత తీరా భోజనాలు అమరిస్తే, యాభై, అరవై మంది కూడా లేరు. వంటలు కూడా అంతంత మాత్రంగానే వున్నాయి. విరిగిన మనసులతో తిరిగి 'తొర్ది' వచ్చారు లక్ష్మయ్య బృందం.

చాలాకాలం తర్వాత ఆ రాత్రి మద్యం సేవించాడు లక్ష్మయ్య అతని మనసు వికలంగా ఉంది. కళ్ళు వర్షిస్తున్నాయి. తనలో తాను గొణుక్కుంటున్నాడు.

"ఒకే బిడ్డ అని గర్వంతోని పెంచితి, లెంకి లెంకి (వెదికి, వెదికి) సదూకున్న పిల్ల గాడు గదా ఎక్కొవుండావను అడిగినా ఒప్పుకుంటి. ఎంత సంబురంతోని లగ్గం జేత్తే, ఆల్లు గిట్ల జేసిరి. నేను కర్సు కెనకొచ్చిన్నా, ఏదన్న గమ్మతుకెనకొచ్చిన్నా? నూట యాభైమంది వత్తమని జెప్పి మున్నూరు మందిని దెచ్చినా, అందరికి ఫలహారాలు, భోజనాలు జేపిత్తి. ఇంక ఆల్ల ముఖంకు పగలు భోజనాలు గూడా పెడ్తి."

"అదే, మేం బోతే బిచ్చగాల్ల కంటే హీనంగా జూసిరి. గిసొంటోల్ల దగ్గర నా హైమ ఎట్ల నెగుల్తదో! నా తల్లిని ఎన్నికట్టాలు పెడతరో! పెద్ద మనసుల కంటే తెలకపాయె, ఆల్లు సదు నేర్వకపాయిరి. కాని పిల్లగాడు? సుభాష్? బి.ఎ నేర్సిండట. బి.ఎ? మంచి, మర్యాద లేకుంటే ఏంటికంట ఆ సదువు? ఆయనకు గూడా తెల్వదా, ఆల్ల మందికి సముదాయించ రాదా?"

"మన్ను దిన్న పామోలే మూలకు గూర్చిండి సోపతిగాల్లతోని ముచ్చట్లలో ఉండే. ఇగ నా హైమ బతుకెట్లనో ఏమో?అందరికి యాదుండేటట్టు లగ్గం చేయాలనుకుంటే, గిట్ట యాదుండి పాయె. లగ్గం తోల్కపోయి భోజనం పెట్టిపియ్యకపోయె, అని పేరొచ్చే."

అతని భార్య కూడా ఏడుస్తోంది. కాని తన భావాలకు మాటల రూపం ఇవ్వటం లేదు. కాసేపయిన తర్వాత భర్త దగ్గరికి వెళ్ళి తన చీరకొంగుతో కళ్ళనీళ్ళు తుడిచింది."ఏం జేద్దం. మన సేతులున్న కాడికి మనం జేసినం. ఇగ పరమాత్ముని దయ, హైమ నసీబు, దాని ఎంబడ (వెంట) పిల్లగాడు బుద్ధిమంతుడే అన్నరు. ఆ

టైముల ఆయనకు తోయకుండచ్చు. అంత మంచిగయితది. నువ్వేం ఫికరు సెయ్యకు. ఇంటికి పెద్ద నువ్వే ఇట్ల అయిటీల్తే, మా గతేం గావాల"

లక్ష్మయ్య శాంతించాడు. కాని అతని మనసు మధనపడుతూనే వుంది.

గారాబంగా పెంచిన తన కూతురు జీవితాంతం సుఖపడాలని, వెదికి వెదికి కుదిర్చిన ఈ సంబంధం, హైమపట్ల శాపంగా పరిణమించదు గదా! పెళ్ళిలోని అనుభవాలు ఒక పీడకలగా, మళ్ళీ జీవితంలో ఎప్పుడూ కలగకూడదనీ, తన గారాల పట్టి కలకాలం సుఖంగా ఉండాలనీ, ఆ భగవంతుని ప్రార్థించడం మినహా ఏమీచేయలేని అసహాయుడుగా మిగిలిపోయాడు లక్ష్మయ్య.

లక్ష్మయ్య లాంటివారు మన దేశంలో ఎందరో! ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, ఎంతో వేడుకగా సంబరంగా చేయాలనుకున్న పెళ్ళి సంరంభాలు వాదోపవాదాలతో, గొడవలతో ముగుస్తాయి. ఆ తర్వాత కక్షలకు దారి తీస్తాయి.

అనాదిగా వస్తున్న మగపెళ్ళివారి దర్పం, వారి అహంకారం, ఆడపెళ్ళివారిని కించ పరుస్తూనే వున్నాయి. ఎన్ని స్త్రీవాద సదస్సులు జరిగినా, స్త్రీలకు సమాన హక్కులు అంటూ ఎంత గొంతు చించుకున్నా, మనలో, మన వ్యవస్థలో మార్పు రానంతవరకు, ఆడపిల్లలను కన్న నేరానికి లక్ష్మయ్యలకు ఇలాంటి మనస్తాపం తప్పదు.

● రచన మాసపత్రిక - ఫిబ్రవరి, 1998 బొంబాయి కథలు ●

# 65. విద్యుల్లత

♦ ఎన్.కె. రామారావు ♦

రెండు గ్లాసుల్లోనూ షీవాస్ రీగల్ విస్కీ సగం వరకూ నింపి, ఫ్రిజ్‌లోంచి ట్రే తీసుకొని రెంటిలోనూ ఐస్‌క్యూబ్స్ వేశాను బయట డిశంబరు మాసం చలి తన తీవ్రతను క్షణక్షణానికీ పెంచుకుంటూ పోతున్నది. నా గదిలో వాతావరణం మటుకు చాలా వెచ్చగా వుంది. గది అత్యంతాధునికంగా అలంకరించబడింది. వాల్ టు వాల్ కార్పెట్లు, గోడలకు వాన్‌గో, పికాసో, వ.పాల పెయింటింగ్స్. కిటికీల వెనిషియన్ బ్లైండ్స్ కవతల గాజుసీసాల్లో పెరుగుతున్న మందపు ఆకుల తీవెలు గదిలో ముఖాల ప్రతిబింబాలు ప్రస్ఫుటంగా కనిపించే డెకొలామినేటెడ్ బల్ల. లేటెస్టు డిజైన్ కుర్చీలు.

"ఆన్ ది రాక్స్ లాగిద్దామా?" అన్నాడు జగన్నాథం అతను జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. వయస్సు దాదాపు యాభై అయిదు వుంటుంది రివెన్యూ శాఖలో అతి దీర్ఘకాలంగా పనిచేస్తూ, అంచెలంచెలుగా ప్రమోషన్లు అందుకుంటూ చివరకు జాయింటు కలెక్టరయ్యాడు. ప్రభుత్వం అతనికి ఐ.ఏ ఎస్. ప్రదానం చేసింది.

"అవును" అన్నాను గంభీరంగా. నా గొంతు నాకే విచిత్రంగా వినిపించింది. చెరో గుక్క మింగింతర్వాత గొంతు సవరించుకున్నాను.

"ఏదో సీరియస్ విషయం మాట్లాడాలన్నావ్?" అడిగాడు జగన్నాథం.

"య్యా, కమింగ్ టు ది పాయింట్" మరో గుక్క మింగి, సిగరెట్టు వెలిగించి ఒక్క సెకను ఆగి మొదలుపెట్టాను.

"జగన్నాథం, ఇవాళ, ఇపుడు చెబుతున్నది నా ఆత్మకథే అనుకో, స్వోత్కర్షే అనుకో లేకుంటే మామూలు భాషలో సొంత డబ్బా అనుకో. కాని చెప్పకుండా మటుకు నేనాగలేను" అన్నాను

జగన్నాథం విచిత్రంగా నా ముఖంలోకి చూసి "ఛ ఛ! అలాగెప్పుడూ అనుకోను! కానీయ్" అన్నాడు.

నేను మొదలు పెట్టాను "జగన్నాథం! నేను ఎలాంటి కుటుంబంలో పుట్టానో బహుశా నీకు పూర్తిగా తెలిసి వుండదు. మాది దేశ్‌ముఖ్‌ల కుటుంబం. మా తాత ముత్తాతలు నైజాం ప్రభుత్వంలో తాలూక్దార్లకు, జిల్లా కలెక్టర్లకు బ్రహ్మాండమయిన దావతులు ఇచ్చి మూడువేల ఎకరాల భూమి మా వూళ్ళోనూ, మా చుట్టుప్రక్కల వూళ్ళలోనూ కలిపి రికార్డుల్లో రాయించుకున్నారు. అలా ఏడు గ్రామాలకు దొరతనం వహిస్తూ, ఆ రోజుల్లో అక్షరమ్ముక్క నేర్వని అలగా జనాల చేత వెట్టిచాకిరీ చేయిస్తూ

కాలు మీద కాలు వేసుకుని కాలం వెళ్ళదీశారు. ఆ గ్రామాల్లో మాకు తప్ప వేరేవాడికి స్వంత భూమి లేదంటే నమ్ము. వ్యవసాయాన్ని నమ్ముకున్న కుటుంబాలు మా భూముల్నే కౌలుకు తీసుకోవాలి. కౌలు సరిగా కట్టాలి. ఏమైనా 'తభావతు' వచ్చిందా వాణ్ణి చెట్టుకు కట్టేసి కొరడాలతో కొట్టటమే".

జగన్నాధం ముందుకు వంగి సీసా తీసుకొని తన గ్లాసులోకి కొంచెం వంపు కున్నాడు. నేను మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాను. "1948లో పోలీస్ యాక్షన్ జరిగింది. మా భూముల్లో చాలా వాటిని కౌలుదార్లు ఆక్రమించుకున్నారు. వాళ్ళకు అండదండలు కమ్యూనిస్టులు అందజేస్తున్నారు. "దిస్ బ్లడీ కమ్మీస్" – నాకు తెలియకుండానే పళ్ళు కొరికాను. ఇంత జరిగినప్పటికీ మాకు ఇంకా ఎనిమిది వందల ఎకరాల స్వంత భూమి మిగిలింది. మా నాన్నగారు చాలా తెలివయినవారు. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం ఏర్పడుతుండగానే చాలా మటుకు భూములు అమ్మేసి, ఆ డబ్బుతో హైద్రాబాద్‌లో పాకిస్తాన్ వెళ్ళిపోతున్న ముస్లింల దగ్గర్నుండి కారుచౌకగా చాలా ఇళ్లు కొనేశారు. 'ఇవాక్యూ ప్రాపర్టీ' ఆక్యుపై చేశారు. ప్రభుత్వంలో వున్న పలుకుబడితో ఇలా ముందుచూపుతో గ్రామంలో నాలుగు వందల ఎకరాల భూమి వుంచారు."

"కౌలుదారీ చట్టం బూర్గుల రామకృష్ణారావు గట్టిగా అమలు చేస్తారని మీనాన్న నమ్మాడా?"

నేను మళ్ళీ కొంచెం తాగి మొదలుపెట్టాను. "మా నాన్నకు ప్రభుత్వంలో చాలా పెద్దవాళ్ళతో పరిచయాలుండేవి. రావ్‌సాబ్! రాబోయేరోజుల్లో ప్రభుత్వం తప్పనిసరిగా అట్టడుగు వర్గాల వాళ్ళకు సహాయం చేయాలి. ఉచిత విద్య, ఉచిత వైద్యం, అట్టడుగు వర్గాల కుర్రాళ్ళకు హాస్టళ్ళలో ఉచిత భోజనం. ఏది ఏమైనా వీళ్ళంతా విద్యావంతులు కాక తప్పదు. మీ మీ హోదాలను లెక్కచేయకుండా పోవటం తప్పదు. కాబట్టి సాధ్యమైనంత త్వరగా మీ ఆస్తుల్ని వేరే రూపాల్లోకి మార్చుకోవటం మంచిది అని వాళ్ళు సలహా ఇచ్చారట."

"మా నాన్న 1961లో సీలింగ్ యాక్టు రాకపూర్వమే మా మిగిలిన భూముల్ని మరికొన్నింటిని అమ్మేశారు. కొన్ని భూముల్ని మా పేర్లమీద మార్పించారు. ఇలా ఆయన ముందు చూపుతో చేసిన పనులవల్ల 1973లో వచ్చిన సీలింగ్ యాక్టు మా వెంట్రుక ముక్క పీకలేకపోయింది" అన్నాను.

"అసలు విషయం చెప్పు" అడిగాడు జగన్నాధం.

"ఇంకా కొంత చెప్పాలి. మా నాన్న, నన్నూ, మా తమ్ముడినీ హైద్రాబాద్‌లోనే కాన్వెంటులో వేశాడు. పెరిగి పెద్దయి కాలేజీ చదువులు పూర్తయింతర్వాత నన్ను ఆమెరికాలో యం.బి.ఎ. చేయించాడు. తిరిగి వచ్చింతర్వాత ఇదుగో – ఇలా ఈ 'సాల్వెంట్ ఆయిల్ ఫ్యాక్టరీ' స్థాపించాను. కారణమేమిటంటే మా భూములన్నీ నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు కిందికి వచ్చేశాయి. పుష్కలంగా వరిపంట, తవుడుకు కొరత లేదు. అంటే నా ఫ్యాక్టరీకి ముడిసరుకు కొరత లేదన్నమాట."

"మీ నాన్న లాగే నీకూ ముందు చూపుందోయ్" అభినందించాడు జగన్నాధం.

కిటికీ దగ్గరికి వెళ్ళి ఒక రెక్క తెరిచి చూశాను. చలిగాలి విసురుగా ముఖానికి

కొట్టింది. దూరాన్నుంచి రైలు వస్తున్న చప్పుడు. సిగ్నలు ఇవ్వసట్లుంది. రైలు వేగం తగ్గించుకొని పట్టాల మీద అత్యంత భారంగా ఆగుతున్న చప్పుడు. నా గుండెల్లోని బరువు అలా ఆ రైలు మోస్తున్నదా? అనే భావం నా మనసులోకి అనుకోకుండా చొరబడి మరుక్షణంలో మాయమయ్యింది. కిటికీ మూసి మళ్ళీ నా కుర్చీ దగ్గరకు వచ్చి సిగరెట్టు అంటించుకున్నాను.

"అసలు నువ్వు ఇవ్వాళ ఇంత సీరియస్‌గా ఈ కదంతా ఎందుకు చెపుతున్నావో నాకైతే అర్థం కావడంలేదు" అన్నాడు జగన్నాదం.

నేను ఒకరకమైన నవ్వు నవ్వాను. బహుశా జగన్నాధానికి ఆ నవ్వులో విషాదం కనిపించిందో, విరక్తి కనిపించిందో – అతను మాత్రం మళ్ళీ మాట్లాడకుండా కూర్చున్నాడు.

"నీకు తెలుసుగా! నాకు ఒకే ఒక్క అక్క. మా అక్కను మా సమాన ఫాయా కల కుటుంబంలో ఇచ్చారు. మా బావగార్కి ఖమ్మం జిల్లాలో చాలా భూములున్నాయి. వ్యాపారం వుంది. వాళ్ళు కూడా మాలాగే మాజీ దొరలు మా అక్కకు ఒక్కతె కూతురు. దాని పేరు విద్యుల్లత. పేరెంత అందంగా వుందో మనిషి కూడా అంతే అందంగా వుంటుంది. వరంగల్‌లో అదేదో కాలేజీలో బియ్యే పూర్తి చేసింది."

జగన్నాథం ఆసక్తిగా ముందుకు వంగాడు "కానీ, జగన్నాదం! నీకు మరో విషయం చెప్పాలి. నేను ఇంగ్లీష్ లిటరేచర్ ఎంత చదివానో నీకు తెలుసు. అలాగే తెలుగు లిటరేచర్ స్వంతంగా ఎంత చదివానో నీకు తెలుసు. శ్రీశ్రీని చదివాను. జాషువాను చదివాను. మార్క్సును చదివాను. అంబేద్కరునూ చదివాను. ఎక్కడ ఎవరు ఏ విషయం మీద మీటింగు పెట్టినా ఆ సందర్భానికి సరిపడా మాట్లాడే నాలెడ్జి సంపాయించాను. దళిత సాహిత్య సభ జరిగితే దళితుల పట్ల సానుభూతి కురిపిస్తూ, అంబేద్కర్, పూలేను కోట్ చేస్తూ నేను ఎంత బాగా మాట్లాడి వాళ్ల మెప్పు పొందానో నీకు తెలుసుగా? వాళ్లు ఇప్పటికీ నేను తమ వాణ్ణనుకుంటారు."

"అదేమిటి, దళిత సాహిత్యం... దళిత సమస్యలు...అలా అనర్గళంగా నువ్వే దళితుడి వైనంత సహానుభూతితో మాట్లాడ్తావు కదా? నిజంగా నీకు వాళ్ళమీద ఏ మాత్రం సానుభూతి లేదా?

"సానుభూతా, సాని బూతా!" పెద్దగా నవ్వాను.

ఎదురుగా వున్న అద్దంలో తన్నుక వచ్చిన రక్తంతో నా ముఖం ఎర్రగా నాకే విచిత్రంగా కనిపిస్తుంది. నాకు దళితులంటే అసహ్యం. కమ్యూనిస్టులంటే ద్వేషం. కాకపోతే మన ఛాందసభావాలతో వెనకపడిపోయినట్లు వాళ్ళు భావించకుండా అలా మాట్లాడతాను. అలాగని దళితులందరూ నన్ను నమ్ముతున్నారని నేను ఎప్పటికీ అనుకోను. కాకపోతే దళితనాయకులు, దళితుల్ని ఉద్ధరిస్తున్నామని ఫోజులు పెట్టే నాయక వర్గాన్ని నమ్మించగలిగాను అని స్పష్టంగా చెప్పగల్ను."

జగన్నాధం నాలో కొత్త వ్యక్తిని చూస్తున్నట్లు మొహంపెట్టాడు. "నువ్వంత ఆశ్చర్య పోనక్కరలేదు. నేను నా వర్గ స్వభావాన్ని బట్టి నడుచుకుంటున్నాను. ఆ విషయంపైకి కనబడకుండా చిరునవ్వు పులుముకుంటున్నాను. నాకున్న ఆర్థిక సంపదా, సాహిత్య సంపదా, సంఘంలో నాకున్న పలుకుబడిని పక్కకు పెట్టి దళితులతో స్నేహం

నటిస్తున్నాను. ఎందుకంటే ఏదో ఒకరోజు అధికారం వాళ్ళదే. ఈ సమాజంలో వాళ్ళేం పోగొట్టుకున్నారో అది వాళ్ళు సాధించి తీరుతారు. ఆ నమ్మకం నాకుంది. కాబట్టి వాళ్ళతో స్నేహం నటిస్తాను. చాటుగా వాళ్ళల్లోనే విభేదాలు సృష్టించే రాజకీయ నాయకులకు చందాలిస్తాను. పైకి వాళ్ల విభేదాల గురించి బాధపడుతున్నట్లు ఫోజుపెట్టి విషాదంగా మాట్లాడతాను. వాళ్ళ విజయం తథ్యం అని నాకు తెలుసు. కాని ఆ విజయాన్ని మరో యాభై యేళ్ళకు వాయిదా పడటానికి ప్రయత్నం చేసే ప్రతివాడితో చాటుగా చేతులు కలుపుతాను" ఉద్వేగంగా అన్నాను.

"శభాష్! నువ్వు చాలా గొప్పవాడివోయ్. నాకు కూడా దళితులన్నా, కమ్యూనిస్టులన్నా అసహ్యం, ద్వేషం. కానీ ఇన్నాళ్ళు నీ వాలకం చూసి వాళ్ళనేమైనా అంటే నువ్వు బాధపడతావని బయటికి పొక్కలేదు. పైగా నీ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్లుగా మాట్లాడుతున్నాను. ఈ రోజు నువ్వు బయటపడ్డావు. కాబట్టి నేనూ బయటపడ్డాను" అన్నాడు జగన్నాథం.

జగన్నాథం కేసి ఓ చూపు చూశాను. నాచూపులో ఆశ్చర్యం ఏ మాత్రం లేదు. జగన్నాధం వెనకబడిన తరగతికి చెందినా, అతను సంఘంలో డబ్బూ, పలుకుబడీ, హోదా కలిగిన వాళ్ళతో స్నేహం చేయటానికి వుబలాటపడతాడని అతను నాకు పరిచయం అయిన మరుక్షణంలోనే గ్రహించాను.

"జగన్నాధం ! నా మేనగోడలు చదువుకున్నది. ఆస్తిపాస్తులున్నది. కానీ దానికి కాలేజీ చదువు తప్ప ఈ సాహిత్యం, ఈ స్త్రీవాదాలు, ఈ దళితవాదాలు లాంటివి తెలియవోయ్. చాలా అమాయకురాలు. దాని మనసు స్ఫటికం లాంటిదనుకో!"

ఆగాను. లేదు, నా మాటలు వాటికవే ఆగాయి.

"ఆవిడకేమయింది?" జగన్నాథం ఆత్రుతగా అడిగాడు.

"అదీ....అదీ.." గొంతు పెగుల్చుకున్నాను. మా అందరి పరువూ గంగలో కలిపి దిక్కు దివాణం లేని ఓ మాదిగోణ్ణి మాకెవరికీ తెలియకుండా పెళ్ళి చేసుకుంది. ప్రేమ పెళ్ళట! రిజిష్టర్ మ్యారేజట!" పళ్ళు కొరుకుతూ అన్నాను.

"సారీనోయ్! నీ బాధ నాకర్థమయ్యింది. నీ అక్కా బావలు ఇంకా ఎంత బాధపడుతున్నారో వూహించగలను. ఇలాంటప్పుడే మనసు గట్టి చేసుకోవాలి. ఈపెళ్ళిని సమర్థిస్తున్నట్లుగా నటించాలి."

నేను ఏమీ మాట్లాడలేదు. నా గొంతు మూసుకపోయింది. మెదడుకు నిషా ఎక్కుతుంది పళ్లు కొరుకుతూ చెప్పాను. "లేదు ఆ బాస్టర్డ్‌ను నేనే కాలుస్తాను. నాకు రివాల్వరుంది" అన్నాను.

"ఆ పని మాత్రం చేయకు. ఏంచేయాలో తర్వాత ఆలోచిద్దాం!" వెళ్ళిపోయాడు జగన్నాథం.

★ ★ ★

తెల్లారి నా కారు మా అక్క వాళ్ళ వూరు పొలిమేర్లలోకి ప్రవేశించగానే బాటపక్క చేలల్లో పనిచేస్తున్న వాళ్ళంతా తలలు పైకెత్తి నా కారుకేసి చూస్తూ కనిపించారు. వాళ్ళ చూపులు నన్ను అవమానపరుస్తూ నా కారు బాడీలోంచి దూసుకొచ్చి నన్ను

గుచ్చు కుంటున్నట్లుగా ఫీలయ్యాను. యాక్సిలేటర్ ఇంకొంచెం అదిమి వేగంగా వూళ్లోకి ప్రవేశించాను. ఏం లాభం? వూరు ముందే వాళ్ళ వాడ. ఇళ్ళ ముందు నులక మంచాలు వేసుకొని కూర్చున్న వాళ్ళూ, ఇంకా మొహంపుల్లతో పళ్ళు తోముకుంటున్న వాళ్ళూ, అప్పటికే కంచాల్లో అన్నం పెట్టుకొని ఎర్రటి కారం కలుపుకొని నోరు మొత్తం తెరిచి అన్నం ముద్దలు గోళాకారంగా కలిపి నోట్లో పెట్టుకుంటున్నవాళ్లూ కనిపించారు. అవకాశం వస్తే భూగోళాన్నే మింగేవాళ్లుగా అగుపించారు. ఎవడో పిల్లవాడు అడ్డం వస్తే కారు అమాంతం స్లో చేశాను. "వీయనే వదినా గా పోరి మేనమామ" అంటున్నది ఒకామె ఇంకొకామెతో. నాకు గుండెల్లో శూలాలు గుచ్చినట్లయ్యింది."నా మేనకోడలు ఇలాంటి ఇళ్ళలో కాపురం చేయాలా? ఇలాంటి సొసైటీ స్త్రీలతో పొద్దుపుచ్చాలా?" ఇట్లాంటి ఆలోచనలు నా మెదడు నిండా గజిబిజిగా పర్చుకున్నాయి. ఎలా మా బావగారి ఇల్లు చేరానో తెలియదు. ఇల్లు బావురుమంటున్నది. మా అక్క ఒక గదిలో మంచంమీద పడి కుములుతున్నదల్లా అమాంతం నన్ను కావిలించుకొని భోరుమంది. సానునయంగా ఆమె భుజం తట్టి కాస్సేపు ఏడ్వనిచ్చాను. మా బావ ముఖంలో కళలేదు. దీర్ఘరోగంతో బాధపడుతున్న వాడిముఖంలా తయారయ్యింది. "ఎవడువాడు?" తర్వాత అడిగాను

"ఆ సోది సంగయ్య అని ఈ వూరువాడే. ఎం.ఏ పాసయ్యాట్ట" గొణిగాడు మా బావ.

"ఈ భాగోతం ఎన్నాళ్ళనుంచి సాగుతుందో పసిగట్టలేకపోయారా? మొదట్లోనే తుంచి పారేయ్యలేకపోయారా? వాడి కుటుంబాన్ని ఊరునుంచి వెళ్ళగొడతాం అని బెదిరించలేకపోయారా? కనీసం మొదట్లోనే నాకు కబురు పెట్టకపోయ్యారా?" మా బావను పట్టుకొని దులిపేశాను.

"ఏదీ ఒక వారం క్రితం ఒక పెళ్ళి సంబంధం గురించి చెబితే లత తను ఈ సంగయ్యను తప్ప ఎవర్నీ చేసుకోనని తెగేసి చెప్పేసింది. సర్లే, మెల్లగా మనసు మార్చలేక పోతామా అనుకున్నా, మొన్న డియస్పీ గారొచ్చినప్పుడు గుసగుసగా ఈ విషయం చెబితే, వాణ్ణి నక్సలైటు సానుభూతిపరుడంటూ అరెస్టు చేస్తానని, అవసరమయితే ఎన్‌కౌంటర్ చేస్తాననీ చాలా చాలా అన్నాడు. ఆ మాటలు ఏ మాత్రం విన్నదో ఏదో! అంతే మాకు తెలియకుండా ఇల్లువదిలి వాణ్ణి తీసుకొని వరంగల్ వెళ్ళి పెళ్ళి చేసుకుందట. చేసుకుందో లేదో తెలియదు. వాళ్ళూ వాళ్ళూ అంటుంటే నీకు అలా ఫోన్ చేశాం" అన్నాడు బావ.

"అచూకీ ఏమన్నా తెలుసా? ఎక్కడ వుంటారుట? ఏంచేసి బతుకుతారట?" అనడిగాడు.

"తెలీదు! ఖమ్మం, నల్లగొండ, వరంగల్లు, కరీంనగర్ అన్ని చోట్లా రహస్యంగా వాకబు చేయించాను. ఎక్కడ వున్నారో తెలియదు" అన్నాడు బావ.

"తెలిస్తే బాగుండునే."

"ఎందుకూ?"

"నా రివాల్వర్ కొన్నప్పట్నించీ వాడలేదు" కసిగా అన్నాను. అప్పుడో విచిత్రం జరిగింది. అకస్మాత్తుగా మా అక్క ఆవేశపడిపోతూ నా కాలర్ పట్టుకొని లాగింది.

"ఒరే! నీకు ఆడదాని మనసు తెలుసురా? అసలు మన నాన్నకు తెలుసా అమ్మ మనసు? మీ బావకు తెలుసా నా మనసు."

"మీరెంతసేపూ డబ్బు డబ్బు, డబ్బు, హోదా హోదా హోదా, తిండీ తాగుడూ. ఇలా బతుకుతున్నారు. అది నా బిడ్డ. ఆ సంగయ్య నా అల్లుడు, వాళ్ళిద్దరూ ఎక్కడైనా సుఖంగా బతకనీ. నువ్వూ వద్దు, నీ రివాల్వరూ వద్దు. నీ సహాయం అంతకన్నా వద్దు. నవ్వుకునే వాళ్ళంటావా, వాళ్ళెవరు? మనకులంలో మనకన్నా ఆర్థికంగా వెనుకపడ్డవాళ్ళు. మన ముందు మనల్ని పొగుడుతూ మన చాటున విమర్శించే వాళ్ళు. ఇంకా మన స్థితిగతుల్ని చూసి ఏడ్చేవాళ్ళు. నవ్వనీ వాళ్ళని ఇప్పుడు, ఇప్పుడైనా నవ్వనీ, దేశమంతా చాటి చెప్పుకోనీ. టీవీలో చెప్పించుకోనీ" గుక్క తిప్పుకోడానికన్నట్లు ఆగింది అక్క. నేను నివ్వెరపోయి చూస్తున్నాను. "ఒరే తమ్ముడూ! నాన్న నన్ను ఏడవ తరగతి దాటి చదివించలేదు. మీ బావ నన్ను ఈ గడప దాటి బయట తిరగనివ్వలేదు. చదువు కోకపోతే నేమిరా, నాకా మాత్రం జ్ఞానముంది. ఆడది తనకు నచ్చినవాణ్ణి పెళ్ళిచేసుకుంటే ఏమాత్రం తప్పులేదు. మాదిగవాడు మనిషికాడా? వాడు మనలాగా అన్నం తినడా? గడ్డి తింటాడా? వాడు మీకంటే డబ్బులో, చదువులో, అంతస్తులో తక్కువ కావచ్చురా. కానీ వాడూ మనిషే. వాడికీ మనసుంటుంది దయచేసి నా కూతురు విషయంలో కల్పించుకోకు" ఏడుస్తూ చేతులు జోడించింది మా అక్క.

నేను ఆశ్చర్యంగా చూశాను. మా అక్కకు నాకు తెలిసిన స్త్రీవాద, దళితవాద సాహిత్యాలు తెలియవు. పెద్దగా చదువుకోలేదు. అయితేనేం, నేను వంచనాశిల్పంతో వేదికలమీద మాట్లాడే మాటల సారాంశం గమనించినట్టే అన్నది. తన మనసు అట్టడుగు లోతుల్లోంచి, నిష్కల్మషంగా, నిజాయితీగా అంటున్నది. సమాజంలో ఏ స్థితిగతినయితే నేనూ, మా బావా తట్టుకోలేమని గింజుకుంటున్నామో ఆ పరిస్థితిని కొనగోటితో కొట్టి పడేసింది. ఏ సాహిత్యం తెలియకపోతేనేం – తల్లిప్రేమ అలా అనిపిస్తున్నదేమో అనుకొని వెనక్కి తిరిగి వచ్చేశాను.

★ ★ ★

నాలుగేళ్ళు గడిచిపోయాయి. దేశంలో చాలా మార్పులు వచ్చాయి. కేంద్రంలో ప్రధానమంత్రులు వంతులవారీగా మారినట్లు మారారు. రాష్ట్రంలో కూడా రాజకీయం మారింది. ఎవడు మారినా ఏమున్నది? నాయకుడైన ప్రతివాడూ, దళిత వెనుకబడిన తరగతుల గురించి మాట్లాడటమే.

చాటుగా కులానికో చీలిక తేవటం. డోలు దెబ్బ, దండోరా, ఇంకో 'దెబ్బ', ఇంకో 'రా'. ఎవరి దెబ్బ ఏ కులానిదో కూడా తెలియనంత అయోమయం! ఓట్ల కోసం కులాల్లో చీలికలు పెంచారు. టీవీల వల్లో, సినిమాలవల్లో సాహిత్యం చదివేవాళ్ళు తక్కువయ్యారు. చదివే అలవాటు చేసుకున్న వాళ్ళు ఆకస్మాత్తుగా బొందలో పడ్డట్టు వ్యాపార మత్తు సాహిత్యానికి అలవాటు పడిపోయారు. మధ్య తరగతి కుటుంబాల్లో పైతరగతుల నందుకోవాలన్న ఆశ. కోరికలు తీర్చుకోవడానికి లంచాల కలవాటయిన ఉద్యోగులు. ఏ ప్రయివేటు కాలేజీ ప్రకటన చూసినా వాళ్ళ కాలేజీలో ఫస్టుక్లాసులో తప్ప కింది క్లాసులో పాసయిన పిల్లలు కనపట్టంలేదు.

సమాజంలో అన్ని రంగాల్లో అవినీతి, విలువల పతనం దిగజారుడుతనం, కెరీరిజమ్- ఈ పరిస్థితులు నాకు చాలా తృప్తి కలిగిస్తున్నాయి దేశంలో విప్లవం రాదు. ఈ పరిస్థితుల్లో దళితులుపైకి రారు. ఇది నిర్ధారణ చేసుకున్న తర్వాత నా మనసు శాంతించింది. సాహిత్యం చదవడం మానుకొని భగవద్గీత చదువుకుంటున్నాను. వేదాంత సభలకువెళ్ళి ఉపన్యాసాలు వినటం, ఉపన్యాసాలు ఇవ్వటం కూడా చేస్తున్నాను. జగన్నాదం రిటైరై, ముసిలాడై వేదాంత సభల్లో తరచు కలుస్తున్నాడు.

★ ★ ★

అంతా నేననుకున్నట్లుగానే జరిగితే బాగుండును. మరో నాలుగేళ్ళ కాలం గడిచింది. నా కూతురికి ఇల్లు కట్టించే కార్యక్రమం మొదలుపెట్టాను. ఇల్లందు దగ్గరలో వున్న నా మిత్రుడొకడు టేకు కలప అతి చవకగా ఇప్పిస్తానని, రవాణా బాధ్యత తనే చూసుకుంటానని నన్ను తన దగ్గరకు రమ్మని బలవంతం చేశాడు. ఆ కారణంగా నేను ఇల్లందు వెళ్ళాను నేను వెళ్ళేటప్పటికి బాగా చీకటి పడింది. మా మిత్రుడి వూరుకు ఎలా వెళ్ళాలో తెలుసుకొని ఆ దారిలో బయల్దేరాను. నాతోపాటు కారులో జగన్నాధం కూడా ఉన్నాడు కారు నాటు రోడ్డుమీద ప్రయాణిస్తోంది. దట్టమయిన అడవి. లోకమంతా సిరా గుమ్మరించినట్లు చీకటి. ఆకాశంలో బీదవాడి ఆశాదీపాల్లో మిణుకు మిణుకు మంటున్న నక్షత్రాలు. ఎన్నో కోయగూడేలు దాటాం. టీవీలు కోయగూడాల్లోకి ప్రవేశించాయి. అంటే వ్యాపార సంస్కృతి కోయగూడాల్లోకి కూడా పాకుతోందన్న మాట. అమెరికాకు మనసులోనే జోహార్లు అర్పించాను.

రాత్రి పన్నెండుగంటలకు మా మిత్రుడి వూరు చేరాం. మర్నాడు వచ్చిన పని చూసుకున్నాం. అదేదో ప్రదేశానికి తీసుకెళ్ళి కొన్ని టేకు చెట్లను చూపించి వాటిని నా కోసం నరికిస్తానన్నాడు మిత్రుడు సైజు చేయించే బాధ్యతను ఒక వడ్రంగికి ఒప్ప చెప్పాడు.

ఆ సాయంకాలం మిత్రుడింట్లో మందుపార్టీ మొదలెట్టాం. డాబామీద కుర్చీలు, సాయంకాలపు చల్లనిగాలి వంటిమీంచి రాసుకుపోతుంటే తొలి యవ్వనంలో మా వూళ్ళోనే నేను చెడగొట్టిన దళిత కన్య స్పర్శ అనాలోచింతగా గుర్తుకు వచ్చి పెదాలమీదకు చిర్నవ్వు తోసుకు వచ్చింది.

"మీ కిక్కడ సమస్యలు - అంటే దళితుల వల్లగానీ, గిరిజనుల వల్లగానీ సమస్యలు లేవు కదా!" యధాలాపంగా అడిగాను గ్లాసును పెదాలకాన్చుకుని.

"మా వూళ్ళో గిరిజనులు లేరోయ్. మా వూరు కాస్త పెద్ద వూరే. చూశావుగా! మా వూళ్ళో మాలమాదిగల సంఖ్య కాస్త ఎక్కువే. ఇది వరకు మనచేలల్లో కూలిపన్లకు వాళ్లే వచ్చేవాళ్ళు. అంటే ఓ పది సంవత్సరాల క్రితం దాకా. మనం ఎంతిస్తే అంత పుచ్చుకునే వాళ్ళు. 'ఒరే! అన్నా పడేవాళ్ళు లం. కొడకా! అన్నా ఎదురు తిరిగేవాళ్ళు కారు" ఆగాడు.

"మరిప్పుడేమయింది?"

'ఇప్పుడా!" నిర్లిప్తంగా నవ్వాడు. "కూలిరేట్లు వాళ్ళు అడిగినంత ఇస్తేనే పన్లోకి వస్తారు నోరు జారి తిట్టామా! ఇక మన పని జైలే.. యస్.సి. యస్.టి. యాక్టు కింద కేసు. నేనైతే జాగ్రత్తగానే వుంటున్నాననుకో. కానీ వూళ్ళో కొంత మంది రెడ్లు ఈ బాధలను భరించలేరు."

"అలాగా?" అన్నాను కొంచెం నీరుగారిపోతూ.

"రచ్చబండ దగ్గర పంచాయితీ పెట్టి, వాళ్ళని దోషులుగా ఆ రోజుల్లో మనం పిలిపించే వాళ్ళమా! ఇప్పుడు వాళ్ళే మనల్ని రచ్చబండ దగ్గరికి పిలిపించి విచారణ జరిపి శిక్షలు వేస్తున్నారు" కొంచెం విచారంగా చెప్పాడు మిత్రుడు.

'ఈ మారుమూల, ఈ అడవి - ఈ పల్లె ప్రాంతంలో దళితులకు ఇంత చైతన్యమా?" నమ్మలేనట్లుగా అడిగాను.

"అవును. ఆ జంట ఈ వూరు రాకపోతే పరిస్థితి వేరేలా వుండేది" కరుగ్గా అన్నాడు.

"ఏ జంట?"

"సంగయ్య అని ఒక దళితుడు. లత అని మీ కులమేనట. ఒకమ్మాయిని లేవ దీసుకుని వచ్చాడు. పెళ్లి చేసుకున్నామని చెప్పుకుంటున్నాడు. ఎనిమిదేళ్ళ క్రితం ఈ వూరు వచ్చి మాదిగ్గూడెంలో మకాం పెట్టి వాళ్ళందరికి చదువు నేర్పటం మొదలు పెట్టాడు. వాళ్లకు వాళ్ళ పిల్లలకు చదువు నేర్పటం, వాళ్ళ హక్కుల్ని గురించి తెలియ చెప్పటం ఇలా చేస్తూ వచ్చాడు"

నా ఒళ్ళు ఝల్లుమంది. వెన్నెముకలో చలిపాకింది. నా బాహ్యేంద్రియాలు పనిచేయడం మానేశాయి. రెండు నిమిషాల పాటు నా మెదడు స్తబ్ధమై, జడమై, నిర్జీవ పదార్థమై తిరిగి పనిచేయటం మొదలు పెట్టింది.

మిత్రుడు చెప్పుకుపోతున్నాడు. "ఆ జంట ఈ వూళ్లో ఓ స్కూలు ప్రారంభించింది. ఇంగ్లీషు తెలుగు మీడియాల్లో చదువు చెపుతారు. ఈ వూళ్ళోని అన్ని కుటుంబాల పిల్లలు దాంట్లోనే చదువుకుంటున్నారు. వాళ్ళిద్దరితో పాటుగా మరో మూడు జంటలు. ఇలా పెళ్ళిళ్ళు చేసుకున్నవాళ్ళే వచ్చి చేరారు. వాళ్ళు టీచర్లుగా పనిచేస్తూ స్కూలును బ్రహ్మాండంగా నడుపుతున్నారు. ఒక వయస్సు వాళ్ళమయిన మనకే మాలా మాదిగా పట్టింపుగానీ, ఈ కొత్తతరం పిల్లల్లో లేదోయ్. వాళ్ళంతా కలిసి ఆడుకుంటారు. కలిసి మెలిసి వుంటారు."

"స్కూలు బాగా నడుస్తోందన్నమాట"

"అంతే కాదోయ్. ఈ చుట్టుపక్కల అన్ని వూళ్ళలో సంగయ్య పేరే. అధికారుల్లోనూ వాడికి మంచి పేరుంది. కులం ఏదైతేనేం గానీ మనిషి సంస్కారవంతుడోయ్" ఆగాడు నా మిత్రుడు.

"ఇంకా" అన్నాను

"ఏవుంది? ఇప్పుడు మేం కూడా దళితులతో పోట్లాటలు వేసుకోవడం లేదు. నాలాంటి వాళ్ళు భయం వల్లనయితే, ఇంకొంతమంది ప్రేమవల్ల, మానవత్వం వల్ల, అది వాళ్ళలో మేల్కొల్పిన సంగయ్య వల్ల, ఈ చుట్టుపక్కల గ్రామాలన్నింటిలో ఇదే వాతావరణం వుంది."

"ఆపు, నిద్రొస్తుంది" అన్నాను. భోంచేసి పడుకున్నాను నిద్రలో కల, సంగయ్య, విద్యుల్లతలు గ్రీకు పురాణాల్లోని దేవతల్లా కనిపిస్తూ. . గాలిలో ఎగురుతూ ప్రపంచమంతా చుట్టి వస్తున్నారు. దేవతల నివాసమైన ఒలింపస్ పర్వతంనుంచి సంగయ్య ప్రొమిధియస్ రూపంలో అగ్నిని సంగ్రహించి తెచ్చి, వాళ్ళందరికీ ఇస్తున్నాడు. అది అందుకున్న వాళ్ళంతా ఆనందంతో కేకలు వేస్తూ గంతులేస్తున్నారు. ఆ అగ్గితో నిప్పు రాజేస్తున్నారు. అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. తూర్పురేకలు విచ్చుకుంటున్నాయి. పక్షుల కిలకిలా రావాలతో లోకసంచారం మొదలుపెట్టాయి. మంచంలో బాసింపట్టు వేసుక్కూర్చుని నా కలని విశ్లేషించుకుంటున్నాను నాకున్న ఫ్రాయిడ్ పరిజ్ఞానంతో. సంగయ్య సంగ్రహించి తెచ్చి పంచిన అగ్ని - విద్య. ప్రొమిధియస్ తెచ్చి ఇచ్చినంత వరకూ అగ్గి అంటే ఏమిటో ఎరుగని ఆదిమ మానవులే రాత్రి నా కలలో సంగయ్య ఇచ్చిన అగ్గిని, అంటే విద్య నందుకున్న దళితులు.

ఇలా ఏదో ఏదో పిచ్చిగా ఆలోచిస్తూ స్నానం గట్రా పూర్తిచేసి, మా వూరు బయలు దేరబోతున్నాను. కారు దగ్గరికి రాగానే జగన్నాదం నా చెవిలో గుసగుసగా అడిగాడు. "నీ మేనకోడలును చూడవా?" అని నామనసు మారుమూల్నుంచి దాన్ని చూడాలనే కోరిక లావాలా తన్నుకొస్తున్నా బలవంతాన దిగమింగేసి "అబ్బర్లేదు" అన్నాను. కారు బయలుదేరింది. రోడ్డు చక్కగా మలుపుల్లేకుండా ఉంది. దారిపక్క చెట్లు వీడ్కోలు పలుకుతున్నట్లుగా తలలూపుతూ వంగాయి. ఒక పెద్దగాలి విసురు వీచింది. చెట్లన్నీ వంగాయి. వాటిని చూస్తుంటే విజయగర్వంతో రొమ్ము విరుచుకున్న మనుషులు గుర్తుకొస్తున్నారు. "జగన్నాథం! గెలుపు వాళ్ళదేనోయ్" అని మాత్రం అని వెనుకసీటుకి జేరగిలా బడి కళ్ళు మూసుకున్నాను.

● వార్త ఆదివారం అనుబంధం - 12 ఏప్రిల్, 1998 ●

# 66. వరుసలు

♦ బి.ఎస్. రాములు ♦

ఈమధ్య పెళ్ళి ముహూర్తాలన్నీ ఉదయమే పెడ్తున్నారు. దీనివల్ల ఎవరికే యిబ్బందీ లేదు. ఇంటి వద్దే స్నానాలవీ ముగించుకొని సమయానికి పెళ్ళి అవడంతోనే భోంచేసి ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్ళిపోవచ్చు. ఏంమాట్లాడుకున్నా భోజనాలయ్యే దాకానే. తర్వాత పెళ్ళి పందిరి ఖాళీ.

వరుసకు అన్న కూతురి పెళ్ళి. అందుకని చాలామంది పాతచుట్టాల్తో పరిచయాల్ని రెన్యువల్ చేసికోవాలని ఉదయమే లేచి స్నానాలవీ ముగించి గబగబా తయారై అందరం బస్సెక్కాం. తార్రోడ్డు మీద సాఫీగా వెళ్తోంది బస్సు. పూర్వం ఆ వూరికి ఏ వైపు నుంచీ తోవ సరిగ్గా వుండేది కాదు. అమ్మమ్మతో చిటికనవేలు పట్టుకొని గంటన్నర పరుగులాంటి నడకతో ఆ వూరు చేరేసరికి ఒక్క కాలివేలుకన్నా పసుపు అద్దాల్సివచ్చేది. చెప్పులు లేనికాళ్ళకు తోవలో అన్నీ గులకరాళ్ళు, దెబ్బలు.

ఆ వూరు మా అమ్మగారి పుట్టినిల్లు. నా పల్లెటూరి జ్ఞాపకాలన్నీ ఆ వూరితో ముడివేసుకున్నవే. అది జగిత్యాలకు నాలుగు కిలోమీటర్ల దూరంలోనే వుంటుంది. ఇపుడు చిల్వాకోడూరు, ధర్మారం మీదుగా పెద్దపెల్లి, గోదావరిఖని వెళ్ళే రూటులో రెండో స్టేజీయే ఆ వూరు.

బస్సు లక్ష్మిపురం పాత క్రాస్‌రోడ్ దాటుతుంటే గుర్తొచ్చింది. ఆ వూరి వాళ్ళూ మా పెరళ్ళు పోతాయి అని పెద్దపెల్లి వెళ్ళే రోడ్డు నిర్మాణానికి అడ్డం తిరగడంతో అది జాప్తాపురం మీదుగా పోయింది. అప్పట్నించి జాప్తాపురంకు సిరి వచ్చింది. ఇపుడు లక్ష్మిపురం ఒక మూలకైపోయింది. రోడ్డును రానీయకుండా చేసుకున్నందుకు ఇపుడు తమను తామే తిట్టుకుంటారు ఆ వూరివాళ్ళు.

నా విషయంలోనూ అలాగే జరిగింది. జాప్తాపురం మేన సంబంధాల వాళ్ళు నన్ను మాకు వద్దుపొమ్మన్నారు. ఇంటిముందు జాగలేదు. ఇంటెనక జాగలేదు. ఓ పొలం లేదు. పెరడు లేదు. ఏ పూటది ఆ పూట కొనుక్కొని తింటారు. వ్యవసాయం ఉన్న ఇంటికిస్తే ఏడాది గాసం ఇంటినిండా ఉంటుంది. ఏదీ కొనుక్కోనవసరం ఉండదు అని నన్ను అల్లుణ్ణి చేసుకోడానికి వరుస మేనమామలు నిరాకరించారు. నాకోసం పిల్లనిమ్మని అడిగి అమ్మ, అమ్మమ్మ అవమానంతో ఇంటికి తిరిగి వచ్చారు. గా సదువుకునే పోరనికి ఇస్తమా? ఏం పనిచేసుకొని బతుకుతడు. ఎదురు కట్నం ఇచ్చినా మీకివ్వను పో అన్నాడట ఓ మామ. ఇరవై అయిదేళ్ళ తర్వాత ఇప్పుడు

అయ్యో ఎందుకు ఇవ్వకపోతిమి అని తమను తామే తిట్టుకుంటారు ఆవరుసైన మేనమరదళ్ళు మరీ బాధపడ్తుంటారు ఈ చిన్నపాటి ఉద్యోగమూ. సౌఖ్యమూ చూసి.

ఆ మేనమరదళ్ళకున్న బాధ మా ఆవిడకు లేదు. అందుకు భిన్నంగా కూడా ప్రవర్తిస్తుంది.

"ఆ! నన్ను చేసుకోకముందు మీకు ఏం ఉండే. దిక్కుమాలిన ఇంటికి నన్నిచ్చారు. ఈ ఇంటికి సిరి నాతోనే వచ్చింది నా అదృష్టం మంచిది. అంతేగానీ నీమేనమరదండ్లను చేసికొని ఉంటే ఇపుడు వాళ్ళు బతుకుతున్నట్టే బతికేవాడివి. నాతో పెండ్లయినాకే నీకు ఉద్యోగం దొరికింది నేను కమ్మగ వండిపెట్టిన కొద్ది తినుకుంటూ నునుపుదేలినావు. పెండ్లి చూపులప్పుడు ఎట్లున్నావు కట్టెలా ఎండిన ఎముకల్లాగా. అప్పటి నీ హాల్‌టికెట్ మీది ఫోటో ఆల్బంలో ఉంది చూసుకో. అప్పుడెట్లున్నావో యాదికి వస్తుంది" అని మా ఆవిడ నన్ను దెప్పుతుంది.

పెళ్ళికాకముందు ఎవరికైనా ఏం ఉంటుంది ఇంతింత చదువూ, రేపటి గురించిన గంపెడు ఆశలూ, ఆశయాలూ తప్ప. పెళ్ళి కాకముందు మా ఆవిడ మాత్రం ఎలా ఉండేది. తినీతినక ఎముకలపై చర్మం అంటిచ్చినట్టు. నెలరోజులు మంచంపట్టి ఉపవాసాలుండి అపుడే కోలుకున్నట్టు. అబ్బే ఆ మాట ఒప్పుకోదిప్పుడు. నేను అందంగా లేకపోతే మరి ఎట్టా నన్ను మెచ్చి చేసుకున్నావని ఎదురు ప్రశ్నిస్తుంది. నా సొంతిల్లూ, చదువులు, పిల్లలు, ఎదుగుదల అంతా తన గొప్పేనట.

నా మేనమరదండ్లు ఎంత అందంగా వుంటారో అని ఎపుడో పోట్లాటలో అనేసి వుంటాను. "అట్లాగా అందరు కలుస్తారు గదా! ఏపాటి అందంగా ఉంటారో చూస్తాను" అని మా ఆవిడ ఈసారి బెట్టు చేయకుండా బయల్దేరింది.

ఉద్యోగరీత్యా నేను ఊళ్ళు తిరగడం వల్లనైతేనేమి, మా పాత చుట్టాలు పల్లెటూరి జీవితాలకో, భీవండి వలసలకో పరిమితమైపోవడం వల్లనైతేనేమి, మా ఆవిడ సహకరించక పోవడం వల్లనైతేనేమి పాత చుట్టరికాల మధ్య పరస్పరం రాకపోకలు తగ్గిపోయాయి. ఇపుడీ పెళ్ళికి వెళ్ళడానికి సమయం కల్సి వచ్చింది.

పెండ్లి కొడుకు భీవండి బట్టల మిల్లులో పనిచేస్తాడు. అమ్మాయి నాకు అన్న కూతురు. ఏదో తరగతిలో ఆపేసి బీడీ కార్మికురాలిగా స్థిరపడింది. మా అన్న కూడా బొంబాయి భీవండిల్లో యిరవై ఏళ్ళు బట్టల మిల్లుల్లో పనిచేసి తిరిగి వచ్చినవాడే. ఆ పరిచయాల్తోనే ఈ సంబంధం కుదిరింది. ప్రస్తుతం మా అన్న పాత పెరడు పొలం పని చూసుకుంటాడు.

మా అన్న వాళ్ళ నాన్న చనిపోయినపుడు పలకరించడానికి వెళ్ళలేకపోయాను. దాంతో యిక సంబంధాలు తెగిపోయినట్టే అనుకున్నాను. పెళ్ళికి రమ్మని పత్రిక యివ్వడం, రమ్మని మరీ మరీ కోరడంతో చుట్టరికాల్ని రెన్యువల్ చేసుకునే ఈ అవకాశాన్ని వదులు కోకూడదనుకున్నాను. అదే మాట మా ఆవిడకు చెప్పాను.

మా ఆవిడకు చెప్పని కారణం యింకొకటుంది. మీకు చుట్టాలే లేరు. మా చుట్టాల బలగం చూడు ఎంత పెద్దదో అని మా ఆవిడకు కాస్త గీర. నిజానికి మాకు చుట్టాలకేం తక్కువ లేరు. కానీ యింట్లో ఆడవాళ్ళు సహకరించకపోతే పాత చుట్టరికాలు విచ్చిన్నం కావడానికి ఎంతో కాలం పట్టదు.

మా చుట్టాలు దూరం కావడానికి నువ్వే కారణం అని అమ్మ మా ఆవిడతో పోట్లాడేది. ఆ మాట నిజమేననిపించేది. కాని మా అమ్మ మా ఆవిడకు అమ్మ కాదుగదా ఔననిపించడానికి. అమ్మే అత్త, అమ్మకాని వారు అత్త కాలేరు. కానీ అమ్మంటే ఆ వరుసతో కలిగే అనురాగం వేరు. అత్త అనగానే స్ఫురించే స్వభావం వేరు మా అమ్మలో మా ఆవిడ అత్తనే దర్శించుకుంది. మా అమ్మ సైతం కోడల్లో కూతుర్ని చూసుకోలేదు. కోడలుగానే చూసుకుంది. ఎక్కడ ఎప్పుడు ప్రారంభమైందో గాని అత్తాకోడళ్ళ వివాదం చివరకు ఒకరు ఔనంటే మరొకరు కాదనాలనేదే వారి తత్వంగా మారి కూర్చుంది.

అత్తకు మాటకు మాట జవాబిస్తూ నేనేమైనా మీ పాత చుట్టాలతో కొట్లాట పెట్టుకున్నానా! ఎందుకు నన్నాడిపోసుకుంటావు అనేది మా ఆవిడ. "చుట్టాల్ని దూరం చేసుకోవడానికి కొట్లాటే పెట్టుకోవాల్నా! వాళ్ళు పిలిసిన పండుగ పబ్బాలకు రెండుసార్లు పోకపోతే రాకపోకలు అవే తగ్గిపోతాయి. ఏడికి రమ్మన్నా కాలు నొస్తుంది, వేలు నొస్తుంది అనుకుంటూ యింట్లనే పంటివిగానీ రాకపోతివి. అన్నీ హాయిగానే ఉంటే నాకక్కడ తెల్సినోల్లెవరూ లేరంటివి. నాలుగు సార్లు పోతే తెలుస్తరు. నీకు మాత్రం నా కొడుకు నీ పెండ్లి ముందు తెలుసా! మరి ఎట్లా కల్సిపోయినవు. అట్లనే ఏ వరుసైనా కల్సిపోవచ్చు" అని అమ్మ వాదన.

"అంతా కొత్తోళ్ళు నేను రాను. తల్లీ కొడుకులు మీరే పోయి రాండ్రి" అనేది మా ఆవిడ. ఎవరం వెళ్ళినా భార్యా పిల్లలం కల్సి వెళ్ళినట్టుండదు గదా అంటే వినిపించుకోదు. అట్లా దూరం అయ్యాక ఇప్పుడు నాకు చుట్టాలు లేరని మా ఆవిడ నన్ను దెప్పడం నన్ను కత్తితో కోసినట్టుగా ఉంటుంది.

"మేం చిన్నపిల్లలుగా ఉన్నపుడు పెద్దనాన్న, పెద్దమ్మ అంటూ వెళ్ళినపుడల్లా ఎక్కువ రోజులు ఈ పెళ్ళికి వెళ్తున్న వాళ్ళ ఇంట్లోనే ఉండేవాళ్ళం" అని మా ఆవిడకేసి చూస్తూ అన్నాను.

బాల్యం గుర్తొచ్చి కళ్ళు మూసుకొని ఆ దృశ్యాలు చూస్తూ ఉండిపోయాను. చూస్తుండగానే ఆ పెద్దనాన్న పెద్దవాడై పోయాడు. మన కళ్ళముందు కళకళ లాడిన యిళ్ళు, సున్నం వేసేవారు లేక, ఉండేవారు లేక పాడుబడి గోడలమీద పాకురు పెరిగి, ఎండి, పెచ్చులూడి శిధిలమవుతున్నట్టుగా ఆ వూరి సంబంధాలన్నీ యిపుడిలా బీడుపడి పోయాయి. నేను ఒక్కడిని వెళ్ళినపుడు పాతచుట్టాల తాలూకు కొత్తకోడళ్ళు, కొత్త అల్లుండ్లు పరిచయాల్లేక ముడుచుకుపోయేవారు. అట్లా పాతచుట్టాల్లో సగంమంది కోడళ్ళుగా, అల్లుళ్ళుగా, వారి పిల్లలుగా నాకు కొత్తవారై పరిచయం తగ్గిపోతూ వచ్చింది. నాకే యిప్పుడా పాత వరుసలు, సరిగా గుర్తులేవు ఎవరు ఎవరింటి కోడలో తెలియదు. మా ఆవిడకు ఆ కాస్తా ఆసక్తి లేదు. మా పిల్లలకు ఈ బీరకాయపీచు బంధుత్వాల గురించి ఎన్నిసార్లు చెప్పినా తలకెక్కలేదు. ఆచరణలో లేని వరుసలు, వాళ్ళ అవసరాల్లో భాగంకాని చుట్టరికాల్ని పిల్లలు మరచిపోయారు. ఇలా మాతరంతోనే ఈ పల్లెటూరి చుట్టరికాలు వరుసలు అదృశ్యమైపోతున్నాయి అని నిట్టూర్చాను. ఇప్పుడు కొందరు నన్ను బావ, మామయ్యా, బాబాయి అనే బదులు గంపగుత్తగా "సారు" అనే వరుసతో పిలుస్తున్నారు. ఎందుకిలా జరుగుతోంది.

కూతురు పెళ్ళి చేస్తున్న ఈ అన్న నాకన్న వారం రోజులు ముందు పుట్టడం వల్ల అన్నయి పోయాడు. చిన్నప్పట్నించి అరేయి, ఒరేయి పిలుపులే. నేను పెద్దయ్యాక మానేసినా వాడు నన్ను అరేయి అని పిలుస్తూ తాను అన్నగా ఆధిక్యతను స్థిరపర్చు కున్నాడు. వాడు చిన్నప్పట్నించీ 'అరేయి నేన్నీకు అన్నను తెల్సా, నువ్వు నా మాట వినాలె. నీకు ఎక్కువ తెలవదు' అని నాపై పెద్దరికం చేసేవాడు.

నిజంగానే నాకు వ్యవసాయం గురించి పల్లెలు, పంటలు, పశువుల గురించి ఎక్కువ తెలియదు. అవన్నీ తెలియజెప్పింది వాడే. చిన్నప్పుడు, పెరండ్లు, వాగులు, తోటలు, తాటివనం కలియదిప్పింది వాడే. కాని వాడికి చదువు సరిగ్గా అబ్బలేదు. లేదా చెప్పాల్సిన వాళ్ళు వాడికి సరిగ్గా చదువు చెప్పలేదు. దాంతో చదువు చిన్నపుడే వదిలేసి కొంతకాలం వ్యవసాయం పనులు చేశాడు. పదిహేనో ఏట పెళ్ళి. పాత వరుస మేనమరదల్ని యివ్వాలని వాళ్ళు ఎంతో ప్రయత్నం చేశారు. మా అన్న అసలే వద్దన్నాడు. ఆ అమ్మాయి అలిగి వాడితో చాల్రోజులు మాట్లాడలేదు. వాడు వద్దన్న అమ్మాయిని అమ్మ నా కోసం అడిగితే వాళ్ళ నాన్న మాటలు పట్టుకొని నన్ను వద్దంటూ మూతి మూడు వంకర్లు తిప్పిందట మరదలు.

పెళ్ళయ్యాక ఆ అన్నకు యిరవై ఏళ్ళకే యిద్దరు పిల్లలయ్యారు. ఇపుడు చేస్తున్నది రెండో కూతురు పెళ్ళి. ఇరవై ఏళ్ళకే బరువు బాధ్యతలు పెరిగి వాడు తల్లికీ, భార్యకూ అంటే మా పెద్దమ్మకూ, వదినకూ వ్యవసాయ బాధ్యతలు అప్పగించి, భీవండి బట్టల మిల్లులో పని వెతుక్కుంటూ వెళ్ళాడు. దాంతో నేను విద్యార్థిగా ఉండగానే వాడు పిల్లల తండ్రయ్యాడు, సంపాదనాపరుడయ్యాడు.

పెళ్ళయి ఒక కూతురు పుట్టగానే మా అన్న ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. సంసారం అంటే నీకేం తెల్సురా అంటూ నన్ను మరీ చిన్నపిల్లాడిలా చూసేవాడు. భీవండి బతుకుల గురించి, జీవనతత్వం గురించి ఊరిస్తూ చెప్పి నీకేం తెల్సురా అని చిన్నబుచ్చే వాడు. అంత తెల్సిందనుకున్న మా అన్న పెద్ద కూతుర్ని అయిదో తరగతికే చదువు మాన్పించాడు. రెండో కూతుర్ని ఏడో తరగతికే చదివినకాడికి చాలన్నాడు. చివరికి భీవండి వెళ్ళి పదవ తరగతి చదివిన సంబంధాన్ని మించి చూడలేకపోయాడు.

నాకు ఉద్యోగం వచ్చి భార్యాపిల్లలతో కాస్త కుదురుకునేసరికి మా అన్న ఎదుగుదల ఆగిపోయింది. ఆశ్చర్యమనిపించింది. ముందు పొడిచిన పొద్దు ముందే గుంకుతుందా! అతనికి పిల్లల పెళ్ళి బాధ్యతలు మీదపడ్డం మొదలైంది. గానుగెద్దు జీవితం అయి పోయింది.

పూర్వం పెద్ద నాన్నలు, అయిదారుగురు నువ్వుల నూనె గానుగలు కట్టేవారు. అప్పుడే కొత్తగా ఆయిల్ మిల్లులు వచ్చాయి. నువ్వుల నూనె బదులు, పల్లి (వేరుశనగ) నూనె వాడకంలోకి వచ్చింది. కొత్తలో ఈ పల్లి నూనె వాడితే శరీరం అంతా దద్దుర్లు లేచేవి. పైత్యం చేసి తల తిప్పడం, పసరు వాంతులు జరిగేది. నువ్వులనూనె వాసన కమ్మగా, రుచి అద్భుతంగా ఉండేది. ఇపుడు అదిచేదుగా పల్లినూనె కమ్మగా అన్పిస్తోంది. రుచులూ, అభిరుచులూ ఎపుడూ ఒక్కతీరుగా ఉండవు. కాలం ఎన్నో మార్పులు తెస్తుంది.

మిల్లు నూనె ప్రవేశంతో గానుగ వ్యాపారంతో రాజాలా బతికిన కుటుంబాలు కొత్త వృత్తులు వెతుక్కోవాల్సివచ్చింది. వారికి బట్టలు నేయడం అనేది ఎపుడో మానేసిన కులవృత్తి. ఏ వ్యాపారమూ, వ్యవహారమూ తోచక, చెప్పేవారు లేక పదిమంది దాకా బొంబాయి బట్టల మిల్లుల్లో కార్మికులుగా చేరారు. ఆ కాలంలో టీచర్లకన్నా, ఎన్జీవోల కన్నా బట్టల మిల్లు కార్మికులకే గిట్టుబాటు ఎక్కువ.

కాని కాలం ఒక్కతీరుగా ఉండదు. బొంబాయి బట్టల మిల్లుల్లో రాజీనామా చేస్తే ప్రావిడెంటు ఫండు చేతికొస్తుందని, దాంతో పొలం కొనుక్కోవచ్చని పెద్దనాన్నలు రాజీనామా చేశారు. కాస్త పొలాలు కొన్నారు. ఇంటివద్ద ఏ గొడ్డూ గద్దీ గాదంలేని మా మామ ఒకాయన రాజీనామా చేస్తే వచ్చిన ప్రావిడెంటు ఫండూ, మిగుల్చుకున్న పైసలు కలిపి భీవండిలోనే రెండు పవర్ లూంలు పెట్టాడు. ఇపుడు యాభయి పవర్‌లూంల యజమాని అయ్యాడు. పెదనాన్నలకి దూరదృష్టిలేదు. ఎంతకూ వ్యవసాయం మీద ఆశ. ఉన్న ఊరుమీద మమకారం. ముఖ్యంగా మిల్లు కార్మికులుగా కోల్పోయిన స్వేచ్ఛ వ్యవసాయప్పనుల్లో అంతా తమ యిష్టం. పెదనాన్నలు యిలా ఆలోచించి ఇల్లు చేరినా ఆ తర్వాత ఇంట్లో వెళ్ళక నగదు చూసిన కన్ను భీవండి వెళ్ళక తప్పలేదు భీవండిలో ఏ కార్మికచట్టాలూ, రక్షణలూ ఉండవు కూలీ తప్ప.

మా అన్న విషయానికి వచ్చేసరికి ఆశ్చర్యంగా పెదనాన్నలకు భిన్నంగా భీవండినే యిష్టపడ్డాడు. అంత తెలివి ఏమైపోయిందో తెలియదు. గానుగెద్దులా అందులోనే యిరుక్కుపోయాడు ఒకరకమైన జీవితానికి అలవాటుపడ్డాక, ఆ గాడినుండి బయటపడ్డం కష్టమేమో! యవ్వనమంతా యిరవై ఏళ్ళు ఏకాంతంగా భీవండిలో గడిపి, వదిన ఇక్కడ పల్లెలో వ్యవసాయం చేసి వృద్ధాప్యం వచ్చేసరికి సంసారం పట్టుకొని వుండడంలోని సుఖమేమిటో ఆ అన్నకే తెలియాలి. ఇపుడు పరమ భక్తుడైపోయాడు. ఇంతింతబొట్టు, నామాలూ, జంధ్యాలూ, పూజలూ, ఏమైతేనేం గత కొన్నేళ్ళుగా నేను ఊళ్ళోనే ఉండడం వల్ల మా అన్న ఈ పెళ్ళి పత్రిక ఇవ్వగలిగాడు. చిన్ననాటి అభిమానంతో తప్పక రమ్మని కోరాడు!

చిన్నప్పుడు బావామరదళ్ళుగా పరాచికాలాడుకున్న మరదళ్ళు యిపుడెలా ఉన్నారో. సరస్వతి నాకన్నా ముందే కోతిలా పాకి చెట్లెక్కేది. రేన (రేగు) పండ్లు, మామిడికాయలు, చింతకాయ, ఒకటేమిటి ఎన్నో - రివ్వున బాణంలా పరిగెత్తేది. ఆమె, ఆమెతో పాటు మరో ముగ్గురు మరదళ్ళు, మాఅన్నలు మేం కల్సి వాగుల్లో, పెరళ్ళల్లో, మంచెమీద, మంచెకింద ఆడిన ఆటలు - తిరిగిన కాళ్ళు ఏడడుగులేనా కల్సి నడిచింది. ఎన్ని వేల అడుగులో కల్సి నడిచాం. నా ఎంగిలి, నీ ఎంగిలి, కాకి ఎంగిలి అంటూ ఎంగిలిని కొరక్కు తిన్నాము. పెండచేతులు, కొండి జడలు, జిడ్డు కారే ముఖాలు, ఒళ్ళె (చిన్న పిల్లల చీర) మోకాలి పైకి కట్టి కొంగునే ఎన్నో సంచుల్లా నింపే ఘటాలు. పరుల పెరళ్ళల్లో దొంగతనాలు. సరస్వతిని అమ్మమ్మ నా కోసం అడుగుతానన్నపుడు ఎంత సంతోషపడ్డానో అంత అవమానించారు.

బస్సు దిగి నడుచుకుంటూ చేరేసరికి ఎండ బాగా దంచుతోంది. ఎండకు, చెమటకు, తన మేకప్పు చెదిరిపోతున్నందుకు మా ఆవిడ లోలోపల ఏదో గొణుక్కుంటోంది. పెళ్ళి సన్నాయిలో, మైకు హోరులో ఏదీ విన్పించడం లేదు.

బస్సు దూరేంత వెడల్పయినా లేనివాకిట్లోనే పెళ్ళి. తాటాకుల కొత్త పందిరి, పాత యిల్లు మేరకే ఉంది. పెళ్ళి పందిరి చుట్టాలతో కళకళ లాడుతోంది. జనం ఎక్కువై తొక్కిసలాటగా వుంది. నాలుగు రెట్ల మంది పందిరి వెలుపలే నిలబడిపోవాల్సి వచ్చింది. మా ఆవిడ ఆడవాళ్ళున్న వైపు వెళ్ళింది. నేను అందర్తోపాటు ఎండలో నిలబడ్డాను. నేను గుర్తుపట్ట గలిగినవారిని పలకరిస్తున్నాను. నన్ను గుర్తుపట్ట గలిగినవాళ్ళు పలకరిస్తున్నారు. బావా అని, ఒకరూ అన్నా అని, ఒకరు తమ్మీ అని, ఒకరు పెదనాన్నా అని, ఒకరు చిన్నాన్నా అని, ఒకరు అల్లుడా అని, ఒకరు కొడుకా అని పలకరిస్తూ చిన్న నాటి విషయాలు గుర్తు చేస్తున్నారు. పిల్లలు వాళ్ళ సందడిలో వాళ్ళున్నారు.

"భోజనాలకాడ అంత పెద్ద టెంట్లు వేయించినోడు పెళ్ళిపందిరి కాడ రెండు టెంట్లు ఏపిస్తే ఏమైతుంది. ఇంత భర్చూ చేస్తూ ఇంత పిసినారితనం ఎందుకో. వచ్చి చూడొద్దా బావా నువ్వు" అంటూ పలకరించాడు లక్ష్మీరాజం.

"ఇంటి అల్లునివి. నువ్వు లేవా బావా చెప్పడానికి" అని నవ్వాను నేను.

"మామ పోయినంక అంతపోయే ఈ బావమరిది నా మాట దేకుతాడోయ్ మీ బావ. మీ అన్న గుణం మీకు తెలువదా. ఎవరి మాట వినడని" అన్నాడు లక్ష్మీరాజం మళ్ళీ.

"మా చెల్లెతోని చెప్పించనుంటివి" అన్నాను.

"ఆ అది చెప్తే ఇంటదా. ముగ్గురు పిల్లల తల్లిని పట్టుకొని నీకేం తెలువదే సెల్లె ఊకో. అన్ని సూసుకునుటానికి నేనున్న గదనే అన్నాడు" అంటూ లక్ష్మీరాజం బావ కారుతున్న చెమటల్ని తుడుచుకొని నెత్తిమీద కప్పుకున్నాడు.

ఈ ఎండకు, ఆకలికి తాళలేక తలువాలు (తలంబ్రాలు) ఎపుడు పడతాయా, భోజనాల టెంటులోకి ఎపుడు దూరుదామా అని చూస్తున్నారంతా. వాలంటీర్లు, 'బట్టవాల్' దడి కట్టకపోతే ఈ పాటికి సగంమంది అందులో దూరేవారే. ఇంటిపక్క పెరట్లోనే ఆ టెంటుంది. పెళ్ళి పందిట్లో ఏం జరగుతుందో ఏమీ కన్పించడంలేదు.

"కొన్ని కుర్చీలైనా వేసి వుండాల్సింది. అందరు నిలబడితే ఏం కనిపించడం లేదు" అన్నాను లక్ష్మీరాజం బావతో ఊసుపోక.

"టెంటే గతిలేదంటే కుర్చీలు తెప్పిస్తాడు" అంటూ నవ్వాడు లక్ష్మీరాజం బావ. ఎవరో అక్షింతల తాంబూలం పట్టుకుని తిరుగుతూ నమస్కారం సార్ అనేసరికి పిడికెడు తీసుకున్నాను. అతనెవరు అని లక్ష్మీరాజం బావనడిగాను. "మీ అన్న బావమరిది" అన్నాడు. అతన్ని పోల్చుకోలేకపోయాను.

ఏళ్ళు గడుస్తూ వయస్సు పెరుగుతుంటే చాలామందిని గుర్తుపట్టలేకపోయాను. పాత చుట్టాలనిపించిన వారికల్లా నన్ను నేను, అమ్మ - అమ్మమ్మ కొడుకుగా మనవడిగా పరిచయం చేసుకుంటూ నమస్కరిస్తున్నాను. వారిలో చాలామంది నాలాగే సందిగ్ధ స్థితిలోనే ఉన్నారు. కొడుకు పాతచుట్టమైతే కోడలు నాకు కొత్త. చెల్లెలు పాతచుట్టమైతే బావ నాకు కొత్త. ఇట్లా పాత చుట్టాల్లో సగంమందితో పరిచయం లేకుండా పోయింది. అదిగో జీలకర్ర బెల్లం పెట్టిన్రు అంటూ ఒకరిద్దరు ముందుకు

తోసుకుంటూ కదిలారు. ఆ తరువాత మరో పావుగంట గడిచాక తలువాలు వేయండి అంటూ మైకులో పిలుపు వినబడింది. తలవాలు వేస్తూ అటునుండే భోజనాల టెంటులోకి దారి తీశారు.

ఈ వీడియోలు వచ్చాక పెద్ద చిక్కొచ్చి పడింది. పూర్వం కట్నం రాయిస్తే చాలు. లేదా ఏదో ఒక వేళకు పెండ్లివాళ్ళను కలిస్తే చాలు, పెళ్ళికి వచ్చినట్టు హాజరు పడేది. వీడియో లొచ్చాక ఎప్పుడు వచ్చాడు, ఎక్కడ నిలబడ్డాడు వంటివన్నీ రికార్డు చేసి పట్టిస్తున్నాయి. అందుకని ఒక లైనులో వెళ్ళి అక్షింతలు వేసి వీడియోలో పడ్డాడననిపించుకొని ముందుకు నడిచాను. పెళ్ళికి వచ్చినందుకు అందరికీ ధాంక్సు చెప్తున్న అన్నకు నమస్కరించాను. అన్న బిగ్గరగా కౌగిలించుకున్నాడు. ఏనాటి పాతకాలం రక్త సంబంధమో, ఆప్యాయతతో అణువణువూ పులకరించింది. వదినకు నమస్కరించాను. మీ చెల్లెలు అంటూ మా ఆవిడను పిలిచి పరిచయం చేశాను. వెనకట చుట్టాల మధ్య నమస్కారాలుండేవి కాదు. నవ్వుతూ ఎప్పుడొచ్చినావు అనే పలకరింపులే ఉండేవి. ఇపుడు నమస్కరించి పలకరిస్తే తప్ప మనిషిని పలకరించుకున్నట్టు కాదు. వదిన మా ఆవిడ చేతిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంది. నేను భోజనాల టెంటువైపు నడిచాను.

భోజనాల టెంటులో బాగా రద్దీగా వుంది. అక్కడ కూడా పలకరింపులు, పరిచయాలు చేసుకుంటూ బోంచేసేసరికి మధ్యాహ్నం రెండైపోయింది. కట్నకానుకలు ఓనోటు బుక్కులో రాయిస్తూ పాత చుట్టాలు కొత్త చుట్టాలు చాలామంది వెళ్ళిపోయారు. పెండ్లి పిల్లవాడి తరపు వాళ్ళు ఏదో గొడవ పడుతున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు అదిగో అరుంధతీ నక్షత్రం అని అయ్యగారు చూపిస్తుంటే పక్కున నవ్వొచ్చింది. పందిరి గుంజ పక్కన పాతిన అందుగుకొమ్మ కూడా నవ్వుతూ ఊగింది.

"పత్తి గింజలు అలుకడం" అంత ఎండలోనే పూర్తి చేయించాడు అయ్యగారు. ఇంట్లో బట్టలనేత ఆగిపోయి మూడు తరాలైనా పెళ్ళిపందిరి పోలులో పాతకాలంనాటి నేస్తున్నకొద్దీ బట్ట చుట్టుకునే దోనుగు పసుపు కుంకుమలతో మెరుస్తోంది. మైలపోలు తీసేదాకా ఆ దోనుగే పెళ్లిపీట. ఆ సరికి పెండ్లి కూతురూ, అల్లుడూ కూడా భోజనం పూర్తి చేసినట్టున్నారు.

పల్లెల్లో కూడా పెళ్ళి వంటలు పట్నాల్లోలాగే చేయిస్తున్నారు. కాని మా అన్నకు కారంమీది మమకారం యింకా పోనట్టుంది. కూర ఆగి వస్తుందని కాస్త దట్టంగానే వేశారు. మటన్, బగారాలో మాటల్లో పడి కాస్త కచ్చు ఎక్కువే పడిందనుకుంటాను కారానికి, డాల్డాకు, ఆ ఎండకు ఒకటే నోరుమంట, దాహం. ఎన్ని నీళ్ళు తాగినా కడుపు ఉబ్బడమే గానీ దాహం, మంట చల్లారదు. భుక్తాయాసంతో కాస్త నిద్ర వస్తోంది

"అప్పగింతలదాకా ఉండురా..." అంటూ పెద్దమ్మ ఆప్యాయంగా పెయ్యంతా నిమిరింది. "రాత్రి తిన్నంక పోదువు. బస్సులు, ఆటోలు ఎంత రాత్రయినా దొరుకతయిరా" అంది మళ్ళీ చెవిలో గుసగుసగా" అయిదు మేక తలకాయలు, కాళ్ళున్నాయి. ఈత కల్లు రెండు కుండలు తెమ్మని చెప్పిండు! తప్పక ఉండురా" అంది పెద్దమ్మ

నాక్కూడా ఉండాలనే ఉంది. కాస్త పొద్దు వంగిన తర్వాత పాత చుట్టాల యిండ్లలో అందరినీ పలకరించవచ్చుననుకున్నాను. సాయంత్రానికి ఇంత రద్దీ ఉండదు.

"కాంచెంసేపు అట్ల ఒరుగు పోన్రి. సురేష్‌గాని యింటికి తీసుకుపోరా" అంటూ పెద్దమ్మ మనవడిని పురమాయించింది.

"దాయే పెదనాన్నా పెద్దమ్మా! పెద్దన్నయ్య ఏం చదువుతున్నడే! అంటూ పెద్దమ్మ చిన్న కొడుకు మాట కలిపాడు. మా ఆవిడ చెప్పింది. అట్లనా అని ఆనందంతో కండ్లు మెరిశాయి. "అయితే అన్నయ్య ఇంజనీరింగ్ చదువుతున్నాడన్నమాట. గిదే ఇల్లు" అని ఆ ఇంటిలోకి నడిచాడు.

వెళ్ళగానే ముంతతో కాళ్ళకు నీళ్ళిచ్చింది యింటావిడ. నేనూ మా ఆవిడా కాళ్ళు కడుక్కొని, చల్లని నీళ్ళు తాగి అలా మంచంలో కూర్చున్నాం. పిల్లలు అదీ ఇదీ చూస్తూ ఏదో అడుగుతున్నారు.

ఇంటావిడను నేను గుర్తుపట్టలేకపోయాను. నా పద్ధతి నాకుంది గదా. నన్ను నేను పరిచయం చేసుకొన్నాను. మా ఆవిడను పరిచయం చేశాను ఆమె కూడా పెళ్ళి భోజనం చేసి వచ్చినట్టే ఉంది. కారం మంటతో నోరు ఊదుతోంది. బీడీలు చేస్తూ ఆమె ఓసారి నన్నూ మా ఆవిడనూ ఎగాదిగా చూసింది. విరబూసిన పూవులా నవ్వుతూ అంది.

"నన్ను గుర్తు పట్టలేదా బావా!"

నేను నిజంగానే గుర్తుపట్టలేదు. కాని బావా అన్న పిలుపుతో ఒళ్ళు పులకరించింది. మా ఆవిడ నాకేసి విచిత్రంగా చూసింది. ఆ చూపులో ఎన్ని భావాలో.. అసూయ, అనుమానం.. ఈమెవరు చిన్నప్పటి లవ్ ఎఫేరా?

"నేను సరవ్వను. సరస్వతిని. నన్ను నీకు ఇమ్మని అత్త అడగవస్తే ఇయ్యపో అని మా నాయిన ఎల్లగొట్టిండు సూడు గా సరవ్వను."

కొద్దికొద్దిగా పోలికలు గుర్తు తెచ్చుకుంటూ పరిశీనలగా చూశాను. చిన్నప్పుడు చూసిన సరస్వతేనా ఈమె. ఇపుడు ఆమెలో చిన్ననాటి పెంకితనం లేదు. వయస్సును మించిన అనుభవంతో ఆమె శరీరం, వ్యక్తిత్వం నిండుకుండలా హుందాగా ఉంది. మాట తీరులో చాలా మార్పువచ్చింది.

"అబ్బ ఎన్నాళ్ళకు కలిశాం! అకస్మాత్తుగా" అన్నాను ఆశ్చర్యంగా.

"నేను నిన్ను పెండ్లికాడనే గుర్తుపట్టిన. రాములు బావనే కదా అని పెద్దత్తనడిగిన."

"ఇరవై ఏండ్లయి పోయింది గదా. యిన్నేండ్లు మన చుట్టాలల్లో ఏం ఫంక్షన్‌లో కనబడలేదేమిటి?" అని అడిగాను.

"కొంతకాలం భీవండీ, సూరత్‌లలో మీ తమ్మునితోని అక్కన్నే ఉన్న. అంతా మూడేండ్లయ్యింది మళ్ళీ ఇక్కడికి వచ్చి. పిల్లలను నీతీరు బాగా చదివించాలని మన దేశం వచ్చిన బావా" అంటూ కొంటెగా నవ్వింది. ఆమె నవ్వులో కొంటెతనంతోపాటు ఎన్నో ప్రాంతాలు తిరిగిన జీవితానుభవం ఉంది.

"నువ్వు చేసుకుంటానన్న మేనమరదలు ఈమెనేనా" అంటూ ఇంత అందంగా హుందాగా ఉందా అన్నట్టుగా ఆమెకేసి మా ఆవిడ ఎగాదిగా చూసింది. ఆమె తనకన్నా అందంగా, గంభీరంగా ఉండడం మా ఆవిడకు నచ్చినట్టుగా లేదు. తనకన్నా కాస్త నలుపుగా, దీనంగా ఉంటే సంతోషించేదేమో!

"అవునక్కా నన్నే చేసుకుంటానన్నాడు బావ" అంటూ సరస్వతి మా ఆవిడతో వరుస కలిపింది.

పిల్లల చదువులూ, బతుకు తీరుతెన్నులూ, గత స్మృతులూ ఎన్నో నెమరు వేసుకున్నాం. మా ఆవిడా, పిల్లలూ ఆసక్తిగా వింటున్నారు. సరస్వతి తన పిల్లలకు నన్ను పరిచయం చేసింది. కూతురు అప్పుడే పెళ్ళి కెదిగింది. అదే మాట అడిగాను.

"ఇపుడు పెండ్లయిన పిల్లగాని కోసం మా పిల్లను అడిగిన్రు. కాని భీవండి పోయే సంబంధం నాకు యిష్టంలేదు. భీవండి పోయి మేం ఏ పాటి బాగుపడ్డం? నీ కొడుకు తీరు ఈమెను యింజనీరింగో, టీచరు కోర్సో చదివిస్తాను" అంది సరస్వతి. "మీ పెద్దన్నయ్య ఇంజనీరింగ్ చదువుతున్నడే. నువ్వూ సీటు సంపాదించాలె" అంది మళ్ళీ తనే.

నిమ్మరసంతో షరబతు చేసి అందరికీ యిచ్చింది సరస్వతి.

"మా నాయన ముందుచూపు లేక నా బతుకు యిట్లా చేశాడు. నీతో పెళ్ళయి ఉంటే ఈ అక్క తీరు నేను సుఖంగా ఉండేదాన్ని కదా. చిన్నప్పుడే పెండ్లిల్లు చేయడంతో నా బతుకు గిట్లయిపాయె. కాస్తాజ్ఞానం ఎదిగింతర్వాత ఆడపిల్లకు యిరవై ఏండ్లయినా పడినంక పెండ్లి చేస్తే నేను తప్పకుండా నిన్నే చేసుకునేదాన్ని. పదిహేనేండ్లకే నన్ను మందికి అంటగట్టి చేతులు దులుపుకునే" విషాదంగా అంది సరస్వతి.

"ఇపుడు నీ బతుక్కేమైందక్కా" అంటూ మా ఆవిడ ఓదార్చింది. "అక్కా కష్టమైనా, సుఖమైనా కలిసి ఉన్నప్పుడే ఎంతో ఆనందం. ఎక్కడికో పోయి, ఏడాదికో పదిహేను రోజులుండిపోతే జీవితమంతా యిదే అయితే అదేం జీవితమక్కా? ఇలాంటి జీవితం పగవాళ్ళకు కూడావద్దు. ఎన్నో కోరికలుంటాయి. ఎన్నో కష్టాలుంటాయి చెప్పుకోవడాని కంటూ మనిషి లేకపాయె. ఊర్లో ఒంటరిగా ఉన్న ఆడదంటే అందరికళ్ళూ ఒకతీరే ఉంటాయా! అత్తగారింటి వద్ద ఉండలేక, ఇక్కడే తల్లిగారి ఊర్లో కిరాయికు తీసుకొని వుంటున్నాను" అంటూ నాకేసి తిరిగి అడిగింది సరస్వతి. సరస్వతి వ్యక్తిత్వం వన్నెకొచ్చినా మౌలిక స్వభావం మునుపటిదే. అదే చొరవ.

"నాయన పనికి రాడనుకున్న నువ్వు బాగుపడ్డానికి, బతుకు గెల్చుకున్నా మనుకున్న మేము వెనుకబడి పోవడానికి కారణం ఏంటిది బావా?"

"సరవ్వా! సమాజం సామాజిక అభివృద్ధి తీరు తెన్నులు... దీన్ని పసిగట్టి కొత్త అభివృద్ధిని అందుకున్నవాళ్ళు ఎదిగారు. మిగతావాళ్ళు వెనకబడిపోయారు" అన్నాను నేను

"సంపాయించిన పైసలతో అక్కడనే ఓ నాలుగు సాంచాలు (పవర్‌లూంలు) కొనడానికి పెట్టుబడి పెట్టకుండా, ఉన్న వూరు అని వ్యవసాయానికి పెట్టితే బతుకు ఇట్లా ఎటుగాకుండా ఆగిపోయింది" అంటూ నిట్టూర్చింది సరస్వతి.

"నిజానికి నేను కూడా అభివృద్ధిలో ఆగిపోయిన చాణ్లే సరస్వతీ! నాన్న చిన్నపుడే పోవడాన చదివించేవాళ్ళు లేక పైచదువులు చదుపలేక ఎన్టీచోనయ్యాను. క్లాసులో ఎంతో వెనుకబడ్డవాళ్ళు కంటిన్యూగా చదువుకుంటూపోయేసరికి ఇపుడు వాళ్ళు హైకోర్టు జడ్జీలుగా, యూనివర్శిటీ లెక్చరర్లుగా, మంత్రులుగా, ఆమెరికాలో డాక్టర్లుగా ఎదిగారు. మా అమ్మ చేతికష్టంతో అంత పెట్టుబడి పెట్టడం సాధ్యంకాక ఆగిపోయాను."

"అది సరే బావా! ఆధునిక అభివృద్ధి అందుకోవాలన్నావు. వ్యవసాయంలో ఎన్నో అధునిక పద్ధతులు వచ్చాయి. అనుసరిస్తూనే ఉన్నాము బట్టల మిల్లులు కూడా ఆధునిక అభివృద్ధే గదా! అయినా మేం ఎందుకు వెనకబడ్డట్టు?"

"ఏదైనా సరే కార్మికరంగంగానీ, ఉద్యోగరంగంగానీ, సంఘటితరంగంగా యాజమాన్యంతో బేరం చేయగలిగిన శక్తి, యాజమాన్యం తాలుకు అస్తిత్వంలో లాభాల్లో మనకు ఉండే కీలకస్థాయి ననుసరించి కూలీలు జీతాలు గిట్టుబాటవుతాయి. వెనకట వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అందుకని అది లేని నాకు నిన్ను యివ్వనన్నారు. ఇపుడది గిట్టుబాటు లేనిదైపోతున్నది. వెనకటి బట్టల మిల్లు కార్మికరంగం దాని స్థానం బలంగా ఉన్నంతకాలం కూలీ బాగా గిట్టుబాటై ఆ కార్మికుల్లోంచే చిన్న పెట్టుబడిదారులు పుట్టి యిపుడు షోలాపూర్, భీవండి బట్టల మిల్లుల యజమానులయ్యారు. ఇపుడా అవకాశం లేదు. కంప్యూటర్ ఎలక్ట్రానిక్ రంగాలిపుడీ దశలో ఉన్నాయి. అందులో నిన్నటి ఉద్యోగుల్లోంచి నేడు వేల కోట్ల అధిపతులయ్యారు."

"ఏమైనా బావా! నాయినా అవ్వా ఒక్కరేమిటి మా యీ పల్లెల్లో వ్యవసాయాన్ని నమ్ముకొని బతికినవాళ్ళున్నారు గాని బాగుపడ్డవారు లేరు వ్యవసాయాన్ని నమ్ముకుంటే తిండికి కొరతలేదు. కాని జంతువులు కూడా ఏదోతిని బతుకుతాయి. మామీద వేసే పన్నుల్తో అడ్డగోలు జీతాలు దొబ్బి మీరు సుఖాలనుభవిస్తున్నారు. మేమేమో వెనకబడి పోతున్నాం. ప్రభుత్వం మీ సౌఖ్యాల కోసమే పుట్టినట్టుంది. మా కోసమని పుట్టిన ప్రభుత్వం మీ సుఖాలు, సౌకర్యాలకి పరిమితమైపోయింది. అంగుకే నువ్విట్లా ఎర్రగా బుర్రగా నునుపు తేలినావు. నీ పిల్లలు బాగా చదువుకొని ఎదుగుతున్నారు." అంది నన్ను ఉద్దేశించిన మాటైనా మా అవిడ తననే అన్నట్టు ముఖం మాడ్చుకుంది

"ప్రజలందరూ నీలాగా నిలదీస్తే ప్రభుత్వం యిలా ఉండదు. ప్రభుత్వ ఉద్యోగులూ యిలా ఉండరు. వాళ్ళు ప్రజల గురించి నిజంగానే పట్టించుకుంటారు" అన్నాను.

అప్పగింతల కాడికి రమ్మన్నారంటూ తమ్ముడి కొడుకు రావడంతో అందరం ప్రెష్‌గా ముఖాలు కాళ్ళు చేతులు కడుక్కొని బయల్దేరాం. ఈ పెళ్ళిలో పెళ్లి ఖర్చుల్లో ఏ బాధ్యతనూ నిర్వర్తించని నన్నూ, మా ఆవిడనూ దీవించమని కోరుతూ అన్నకూతురు కాళ్ళపై బడి ఏడుస్తుంటే దుఃఖం వచ్చింది. వరుసలన్నీ మనిషికి తోటి మనిషిపైగల హక్కుల్తోపాటు వారిపట్ల నెరవేర్చాల్సిన బాధ్యతల్ని కూడా తెలుపుతాయి.

ఈ పాత చుట్టాల పట్ల, వీరి అభివృద్ధి పట్ల నేను నెరవేర్చినదేమిటి అనిమనస్సు బాధగా మూలిగింది.

రాత్రి భోంచేయమని ఎంత బతిమాలినా మా ఆవిడ "వద్దు ఇపుడే పోదాం" అన్నది. సరస్వతి అంత పేదరికంలోనూ తృప్తిగా, నిండు వ్యక్తిత్వంతో జీవించడం మా ఆవిడకు అసూయగా ఉందనుకున్నాను. "మనకన్నా వెనకబడిపోయిన వారిపట్ల సహృదయత, చేయూతనిచ్చే గుణం ఉండాలిగానీ అసూయ దేనికి" అని అనుకున్నాను. ఇంటికి చేరాక అదే అడిగాను.

"పెళ్ళి కాకముందు సరస్వతికీ నీకూ ఏదైనా సంబంధం ఉండేదా?" అంటూ నిలదీసింది మా ఆవిడ.

నాకు నవ్వు వచ్చింది. ఇన్నేళ్ళ సంసారం తర్వాత ఆ మాట అడగడం నన్ను బాధించింది. "నీక్కూడా నీ మేనబావల్తో అలాంటి సంబంధాలుండేవా! ఎందుకట్లా అనుమానపడ్తావు" అన్నాను. అంతే మా ఆవిడ వరసమారింది. మరుసటి రోజు ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోయింది.

● విపుల మాసపత్రిక - ఆగస్టు, 1999 ●

# 67. సిల్‌సిలా

♦ షాజహానా ♦

"సెల్లె, గరీబుదాన్నయితె అయినగని ఇంటికొచ్చిన సుట్టాన్ని, అప్పుదెచ్చయిన పానం తీర్గ జూసుకుంటగాదె, గీ ఎండాకాలం సెల్వలనన్న మున్నిని పంపరాదె, ఆడపొల్లలు లేకపోతిరి, నాల్గు దినాలుంచుకొని పువ్వో, పత్రో పెట్టి పంపిస్త...." అని 'అయిన నా "దినావతనం గనీ మా గరీబోళ్ళకు మీ దొరసాన్లసొంటి బిడ్డలొస్తరా.. ఐతెపాయెలె సెల్లె, మరి నేనొస్త. మల్ల ఎన్నాల్ల కీ కండ్ల జూసేది .." అని ఏడ్సుకుంట మా అమ్మీ యాకుబ్బీని కౌగిలించుకొని నెత్తిన బెట్టిన మందారపువ్వుని గట్టిగ లోపలికి దోపుకుని ముక్కుచీది చీరకొంగుతో తుడ్సుకుంట ఎనక్కెనక్కి సూసుకుంట ఎర్రబడ్డ కండ్లతోని ఎల్లిపోయింది కరీంబి బడెమ్మ.

డిగ్రీకొచ్చి ఇంతమటుకి ఎప్పుడు సెలవులిచ్చినా మా అబ్బవేపు వాళ్ళిళ్ళకే ఎల్లినగని అమ్మీవేపు వాళ్ళిళ్ళకు ఎల్లనేలేదు. ఎప్పుడో ఎల్లినగని గుర్తేలేదు. ఈ ఎండాకాలం సెలవులల్ల ఎట్లయిన కరీంబి బడెమ్మింటికి పోవాల్నని గట్టిగ అనుకున్న. ఈడొచ్చిన ఆడపొల్లను తోడులేకుంట ఏడికి పంపియ్యని వీళ్ళ భయానికి ఇరుగుడాలోచించి మా తమ్ముని గూడ తీసుకెళ్ళాల్ననుకున్న. ఆ మాటే అమ్మీతో అనంగనె ఆమె మొఖం పెరట్లో పూసిన ముద్దబంతి పువ్వులా కళకళలాడింది. మా అబ్బా ఏం మాట్లాడలె.

మా అమ్మీ ముకం ఎలగడానికో కారణముంది. మా బడెమ్మ జుట్టుకు సవరమేసి, కాయితప్పూలు బెట్టుకొని, మోటుగ మాట్లాడుకుంట మాసిన బట్టల్తోటి మద్దెమద్దెల శోకాలు పెట్టుకుంట ముక్కు చీది ఏడబడితె ఆడ రాసుకుంటుంటదని మా ఆపాగానీ, భాయిగానీ బడెమ్మొచ్చిందంటె కొద్దిగ కంపరం గుంటరు. పోయిందాన్క ఊపిరి తీసుడు కష్టంగ తీస్తరు. పోయినంక ఫ్రీగ మాట్లాడుకుంట ఆమె మాటల్ని ఇమిటేట్ చేస్కుంట, నవ్వుకుంట ఆమె పండుకున్న చద్దర్లని ఉతికిందాన్క నిద్రపోకుంట, గిట్ల ఉంటరు.

మా బడెమ్మొళ్ళు గీడ కొస్తేనే ఊపిరాడకుంటయితే ఈళ్ళు గిన ఆడికిబోతె పూరా పానం ఎగిరిపోద్ది. గందుకే నేను ఆల్లూరు పోతననంగనే మా అమ్మీ గంతగనం ఖుష్సయింది. మా ఆపా, భాయి నాకెల్లి వింతవస్తువుని జూసినట్లు చూసి మా కేందిలే అని గమ్ముగున్నరు. మా తమ్మునికి నేనంటే శానా ఇష్టం. నేనేం జెప్తె గదే ఇంటడు. వయసుల పెద్ద తేడా లేనందున ఇద్దరం అన్నీ కల్సేచేస్తం 'ఊరి కొస్తావురా' అనడగంగనె 'వస్తా నాపా' అన్నడు

సెలవులు రానె వచ్చినయి. బట్టలుగిట్ల అన్ని సర్దుకుని మేం బయల్దేరినం. మా అబ్బా చెప్తుండె. 'తుమ్హారా బడెబ్బ సేందీ మంగాయేంగే - మగర్ పియే బోల్కే మాలూమ్ హోనా. నూర్ దాలూంగా దోనోంకో'! అని. మెల్లంగ తలలూపి బయటపడ్డం. తెల్లవారు జాము మూడింటికి బస్టాండుకు బయల్దేరినం. ఆడ్నించి కొత్తగూడెంకు బస్సుంది. ఆ బస్సునిండా సింగరేణికి పొయ్యేటోల్లే ఉంటరు. నాలుగున్నరకల్లా రైల్వే స్టేషన్లుంటిమి. ఐదింటికి రైలొచ్చి ఆరింటికి బయల్దేరింది. తొమ్మిదింటికి కేసముద్రం స్టేషన్ల ఆగింది.

ఇద్దరం రైల్దిగి స్టేషన్లనుండి బయటికొచ్చినం. ఉప్పరపల్లి బస్సు గురించి ఎంక్వైరి చేస్తే పన్నెండు గంటలకు బస్సున్నదన్నరు. అప్పటిదాన్క ఎందుకుండాల్నని ఆటోల్లో నడ్డితే స్పెషల్గనయితే ముప్పయి రూపాలన్నడు. అందర్నెక్కిస్తే మూడురూపాలన్నడు. అందర్నంటె పదిహేన్గుర్నైన ఎక్కిస్తడని పక్కన పోతున్న ఆటోలని చూస్తే సమజయి మా తమ్ముడు "ఆపా! స్పెషల్గనే పోదా"మన్నడు.

ఇరవయ్యైదు రూపాలిచ్చి పావుగంటల ఊర్లోదిగినం. దిగనయితే దిగినం గని దారి తెల్వదాయె. మా తమ్ముడు దార్న పొయ్యేటి ఒకాయన్ని పిల్చి ,- "లతీఫ్గారిల్లెక్క డండీ?" అనడిగిండు. ఆయనకర్ధంగాలె "మల్ల చెప్పయ్య" అన్నడు. మల్ల మల్ల చెప్పినా సమజ్ గాలె. గప్పుడు అమ్మీ జెప్పిన మాటలు యాద్కొచ్చి-

"అదిగాదె తాత..దూదేకుల లత్తయ్య.. దూదేకుల కరీంబి వాల్లు లేరూ.. గదేనే సన్నాయి లత్తయ్య.. గాల్లిల్లు" అన్న.

"ఓర్నీ.. దూదేకుల లత్తయ్యింటికా.. రారీ... తొవ్వ సూపిత్త..' అని 'మీరేం గావాలే ఆల్లకు" అనడిగిండు తాత.

"కరీం చెల్లె బిడ్డని..ఈడు మా తమ్ముడు" అన్న.

"గిదే అనుకుంట మొదాలు రాక... కరీం ఎప్పుడు మీ గురించే చెప్తది, ఇసుగులేకుండ, ఇయాల్రేపు పండుగే కరీంబీకి, నాల్దినాలుంటారు బిడ్డా. అయినా గీ పల్లెటూల ఏం ఉంటర్లే తియ్... ఒక్కపూట, రెండు పూటలుండుడే గగనం" తనకి తనే చెప్పుకుంట నడుస్తుంటే మేం ఎనకనే సందులు గొందులు తిరుక్కుంట ఇల్లు జేరినం.

"కరీంబీ.....ఎవలొచ్చిన్లో సూడవూ..." పెద్దగా కేకబెట్టిండు తాత, ఇంట్లనుంచి బయటకొచ్చి కండ్లు పెద్దగజేసి దగ్గరకొచ్చి చేతులు ముఖం అంతా తడిమి ఒక్కసారి పెద్ద పెట్టున ఏడవబట్టింది మా బడెమ్మ.

"ఇన్నాల్లకు కాల్లొచ్చినయా బిడ్డా.. మీ బాపుకు గిప్పుడైన దయబుట్టె బిడ్డా.. ఆల్లకు రాబుద్ధయితలె బిడ్డా.. మేం ఉన్నోల్లమైతే వద్దురేమో బిడ్డా.. మా చెల్లెన్నదే బిడ్డా..." సాగుతనే ఉంది ఏడుపు. ఇంటిపక్క మాదిగోళ్ళు, ఇంటెనక గొండ్లోళ్ళు, పక్కనే పాలోళ్ళు అందరు గుమిగూడిర్రు వాకిట్ల.

"ఎవలె... ఎవలె?" ఎవరో అడుగుతుంటె మమ్ముల తీసుకొచ్చిన తాత, కరీంబి చెల్లె పాలెంచల ఉండదీ, గావెఁ బిడ్డ, కొడుకు' అని చెబుతుండు.

"కరీంబీ! ఇగ ఏడ్చింది సాల్లేగనీ ఆల్లనింట్లకు తీస్కపో! బిడ్డలు బిక్కమొగాలేసిన్రు. వస్తర్లే, రాకేడికి బోతరు నీచెల్లె. మరిది. నువ్వు బోతేంది. ఆల్లొస్తేందిగనీ.. ఆల్లకేమో గీపల్లెటూల్లకు రాబుద్ధయితలే. ఏం చేస్తవ్‌లే..కాల్లకు నీల్లు గిట్టియ్యి..." మాదిగోల్లవ్వ పెద్దగ మందలిచ్చినట్లనేసరికి గబగబా సూటికేసందుకుని ఇంట్లబెట్టి కాళ్ళకు నీళ్ళిచ్చి సందుగలనుంచి తువ్వాలుతీసి తుడుచు కుందికిచ్చింది బడెమ్మ. ఇద్దరం తుడ్చుకునేసరి కల్లా కాయితప్పుల చెట్టుకింద మంచమేసి బొంతేసి కూసొబెట్టింది. కింద చతికిలబడి –

'మా యాకూబ్నీ బాగున్నాదే.... తీస్కరానుంట్రి సెల్లెని... గింత కల్లు బొట్టన్నా తాగి పొయ్యేటిది. ఎన్ని దినాలాయె.. మాకేలి రాక' అన్నది దిగులుగా బడెమ్మ.

"ఇంటి గురించి తెల్సుగా బడెమ్మ, అందర్కీ రానీకి కుదర్దాయె' అని గునిగిన. బడెమ్మేం మాట్లాడలె. 'కూసునుంట్రి గిప్పుడే వొస్త బిడ్డా..." అని గబ్బగబ్బ ఇంట్లకు బొయ్యి బస్తాడొడ్లు నెత్తికేసుకుని బయటకు వొయ్యి పావుగంటైనంక చేతులిన్ని, టామాటాలు, కోడిగుడ్లతోని తిరిగొచ్చింది.

వడ్లమ్మి గయన్ని కొనుక్కొచ్చిందని సమ్జయి ఏమూలో కలుక్కుమనిపిచ్చి గామాటే బడెమ్మతోటి అంటే "ఇగసాలే బిడ్డా", రాకరాక పానమసొంటోల్లొచ్చిన్రు. గిదిగూడ లెక్కేనా... ఆగరాది. మీ బడెబాపు రాంగనే రేపు ఎల్లుండి మస్తుగ చేపల్దెప్పిస్త. గీడ సెర్వుల బాగ దొరుక్తయి. నాటుకోళ్ళు ఇంట్లనే ఉండె. గీ రాతిరి వస్తడేమో బడెబాపు" అన్నది బడెమ్మ.

వచ్చేటప్పుడు గొండ్లాయనకు చెప్పిందేమో మాకేలి చిత్రంగ చూసుకుంట రెండు లొట్లనిండ కల్లు తీస్కబోయి ఇంట్ల బెట్టిండు.

"ఎవలే కరీంవక్క" అన్నడు.

"మా పెద్ద సెల్లె బిడ్డ, కొడుకు..పాలెంచ" అని "ఓ తమ్మి, సెలవలనొచ్చిన్రు. ఉన్నన్ని దినాలు మంచికల్లు బొయ్యాలే అన్నది."

నాకు చచ్చే సిగ్గయింది. మేం కల్లు తాగుతమని అందరెక్కడ నుకుంటరో అని.

"ఇంతకీ పెంటుగోరిమియా లెక్కడున్నరు" అనడిగిన, ఇంతసేపటిదాన్క వాళ్ళ నడగనందుకు కొద్దిగ నొచ్చుకుంట.

"పెంటుగాడేమో సదూకోరా నీ బాంచెను, మేం అమ్ముడు బొయ్యినా సదిపిస్తంరా అంటే ఇనక కేసంద్రం టేషన్ల సీన్మలు మరిగి సదూ పాడూ జేసిండు. గిప్పుడు అయ్యెంబడి గజ్జెలు కొట్టబొయ్యి గట్లనే సన్నాయి వాయించుడు గూడ నేర్సిండు గాదూ! అన్నీ అయ్య బుద్దులె, తాగుట్ల గూడా! గోరేగాడేమో ఎనిమిదిల బడ్డడు. వస్తున్నాలె, పోరడు ఇస్కూలి కయితే మాగ బోతడు, గని వానికి రంగురంగుల అంగీలు గావాలే, బూట్లు గావాలే, గిప్పుడు సైకిలు గావాల్నని సతాయిస్తుండు.. ఏఁ వెచ్చుల పోరడు..." బడెమ్మ చెప్తుంటెనే గోరెమియా గబ్బగబ్బ వచ్చి మమ్మల్ని జూసి పళ్ళికిలించి 'ఓ ఆపో ఎప్పుడొస్తిరి?!" అని జవాబినకుండనే పుస్తకాల సంచి ధడేల్మనెత్తేసి గలాసల కల్లొంపుకుని గట్టగట్ట తాగబట్టిండు.

బడెమ్మ "గోరెగా, అది ఆపోల్లొచ్చిన్లని తెప్పిచ్చిన గాదు..ఏమో మొదలేసినవ్, మునుం బెట్టిన వంటే ఆగేదే లేదు. తియ్ గలాస్ తీసి కడిగి ఆపకింత, బాయికింత బొయ్యి మొదాలు" కోపం జేసింది.

"నువ్వేం జేస్తున్నవే, నే నాటకి బోవాలె. అవతల నా దోస్తులు నిలవడ్డరు, నాకు కోడిగుడ్డు ఉడకెయ్యకు, మాడ్సిపెట్టు' రోడ్డెమ్మటబడి ఉరికిండాడు. 'గిటున్న పుల్లగటు బెట్టరుగని రుచులు గావాలె పోరగాండ్లకు..." తిట్టుకుంట గ్లాసుల నిండ కల్లు తెచ్చింది బడెమ్మ. నేను తాగనన్న. అక్బరేమో నావేపు చూస్తుండు. అబ్బకు చెప్పకు అన్నట్లుందాని చూపు 'తాగు" అన్న. వాడు రెండు గ్లాసులు తాగిండు. కొద్ది సేపయినంక లేచి నడవ బోయిండు గని కాళ్ళు గాల్లో తేల్తున్నయేమో మళ్ళ మంచం మీదనే వాలిపొయ్యిండు.

అన్నం ఆరు బయట్నే తిని బయట్నే పండినం. మేమొచ్చిన సంతోషాన్కి కల్లుమత్తు తోడై బడెమ్మ ఏదేదో మాటలాడ్డం మొదలబెట్టింది. అక్బర్, గోరెమియాలిద్దరూ కల్లు మత్తులో నిద్రలో జోగుతున్రు. కొత్తకొత్తగా ఉండి నాకేమో నిద్ర రాల్లే.

బడెమ్మని గెలికిస్తే చాలా మాట్లాడేట్టు కనబడి చిన్నంగ అడిగిన – "బడెబాపుతో నీ నిఖా ఎట్లయిందే బడెమ్మా?" అని. కతం ఇగ మా బడెమ్మ చెప్పుడు షురు చేసింది.

'మా అయ్య రుస్తుం తెలుసుగ, అమ్మ అంకూసు, మే మొదాలు రాజోల్ల ఉండే టోల్లం. పూరింట్ల ఉండేటోల్లం. దూదేకి పరుపులు గుట్టేటోల్లం. మొదాలు బాగ అమ్ముడు బోయినయ్. అటెంక గిరాకి తగ్గింది. ఇస్పాంజి పరుపులొచ్చె. ఇగ మా అయ్య సారా అమ్మడం షురూ చేసిండు. రెండర్రలుండేటియి. ఎనక కొద్దిగా సోటుందన్నట్లు. ముందర్రల సారా అమ్మేటోల్లం. మా అమ్మీ సెక్రాలుజేసి సారాల నంజుకుందుకి అమ్మేటందుకు పెట్టేది. మేం నల్గురం అక్క జెల్లెల్లం. పెదక్క లాల్‌బీ, నేను, మీ అమ్మి యాకుబ్బీ, గాయెనక సలీంబీ. రోజు మైబ్బాదు బొయ్యి డిపో సార దెచ్చి రాజోల్ల అమ్మేటోడు మా అయ్య. గట్లగట్ల మా లాలక్కను రేల్వేల పంజేసేటాయనకు ఇచ్చిండు. గప్పుడు శానా పైసలు ఖర్చయినయి. ఇగ మల్లనే నెదిగే ఉంటి, మీ అమ్మ ఎదిగే ఉండె, సలీమ గూడ గంతే ఉండెజ ఒక్కో ఎమ తేడానే ఉండె మాకు.

అందర్ల యాకుబ్బీ తెల్లంగ సందమావోల్లె ఉండేది, సలీమ గూడ, నేను లాలక్క నల్లగున్న సక్కంగుండేటోల్లం. బారెడు బారెడు ఎంటికలతోని ఏడికన్న బైటకుపోయి యింట్లకు రాంగనె మా అమ్మ దిష్టి తీసేడిది" అని ఏదో గుర్తొచ్చినట్లు ఆగి "ఓ మాదిగోల్ల బుచ్చవ్వ! బువ్వగిట్ల తిన్నరానే, సప్పుడు జేస్త లేరెవ్వలు?" అనడిగింది.

"ఆ తింటిం బిడ్డా, మీ బుజ్జికి ఏం వండినవ్...కూర దెచ్చినవా?" అన్నదాఁవె.

'కోడిగుడ్ల పుడుం జేసినగాదు.. కూర దేలే... రేపుదెస్త...' అని ఇగామెతో మాటలాపి నావేపు తిరిగి "ఇంటన్నవా బిడ్డా .." అని మొదలు బెట్టింది మల్ల.

"గా సారా డిపో పెద్దాయన ఒకపాలి రాజోల్తొస్త నన్నడంట, కల్లు తాగి నాటుకోళ్ళు పట్కపోనీకి. గట్లని ఒచ్చి యాకుబ్బీని సలీమానీ జూసి, ఆల్ల అన్న కొడుకుల కియ్యాల ఎట్లన్నజేసి అని గా మాటే బాపుతోటి అన్నడట."

మా బాపు, మేమేఁవో, దూదేకులోల్లమైతిమి, మీరేమో సాయిబులైతిరి. ఎట్ల గుదుర్తదని బయపడ్డడు. గని పిల్లలు సందమామలెక్క గొడుతున్నరని వాళ్ళన్నిగూడ ఒప్పించిండు గా సాయిబాయిన. అంటే మీ సిన్నదాదా అన్నట్లు. మా బాపు గూడ ఒప్పుకున్నడు గనిమరి ఆల్లిద్దరి కంటెపెద్ద నేనుంటిగా.. అని ముందు నాకు పైగామ్ జూడపట్టిండు. గప్పుడు గీ సన్నాయి వాయించేటోడు కండ్లపడ్డడు మా బాపుకి. దూరం చుట్టరికం ఉండెనట.. ఇగ మీ పెదబాపు కూడ జూసి నన్నే చేస్కుంటనని పట్టుబట్టి నిఖా చేసుకున్నడు. గాల్లదేమో గీ ఉప్పరపల్లి.

ఇగ తర్వాత మీ అమ్మది, సలీమాది ఒక్కపాలే అయింది నిఖా. మీ బాపేమో సదు సెప్పెటాయనాయే, మీ పిన్నాయనేమో బేంకిల చేసేటాయనాయే. ఇగ మేమే తక్కువోల్లం అందర్లకన్నట్లు. ఇక కాన్సరొచ్చి లాలక్క సచ్చేపొయ్య. ఆల్లపిల్లలు పెండ్లిండ్లాయే.. మమ్ముల పురాగ మర్సేపోతిరి.

ఇంటన్నవా బిడ్డా.. రేపు నువ్వయిన గంతే. గిట్ల పెండ్లి కాంగనె, గట్ల మరుస్తరు" అని కాసేపాగి మల్ల మొదలు పెట్టింది.

"ఇగ జూడరాది నా కస్టాలు. మా అత్త బత్కే ఉండె. నా నిఖా అప్పటికి ఎన్ని ఇదాల బాదలు పెట్టాల్నో అన్నిదాల బెట్టింది నన్ను. జడ బారెడున్నదని నూనె శానా అయితదని జుట్టుని గుంజి గుంజి దువ్వి పట్ట పట్ట తెంపేటిది. గట్ల గట్ల మొత్తం ఊడి పొయ్యి ఇగో గీ బోడితల మిగిలింది. మా సెల్లెళ్ళముందు నేను తల్లోలె ఉన్నగని అక్కోలె ఏదున్న? పిల్లలు పుడ్తలేరని మీబడెబాపుకు మల్ల నిఖా చేస్తనని బెదరించేటిది. గప్పుడే పిల్ల బుట్టిందిగని ఐదేళ్ళొచ్చినంక రోగమొచ్చి సచ్చె. ఉంటే నాబిడ్డ అచ్చంగ మీ అక్కోలిగే ఉండేటిది. ఇగ శానారోజులు పిల్లలు పుట్టరని ఏడ్చిన. అటెంక శానాదినాలకు పెంటుగాడు కడుపుల బడ్డడు. గని బయమైతుండె ఏమయితదోనని. గప్పుడందరూ పుట్టంగనె పెంటకుప్పల పారెయ్యిరి, బత్కుతడు అని చెప్తె గట్టనే పారేస్తి...కతం! బతకిండు. మల్ల గోరెగాడు కడ్పుల బడ్డడు. వాన్ని గోరిమీన పారెయ్యిరి అన్నరు, గట్లనే గోరిమీన పారేసి గోరిమియా అని పేరు పెట్టినం. ఈడు గూడా బతికి బట్టకట్టిండు.

ఇంగ మీ బడెబాపు ఎంచాకాలంల వాయించబోతడు. కతం, బిడ్డా! గా వాయించ బోయినపుడు దెచ్చిన పైసలే పైసలు! ఇంగ పైసా సంపాయించడు. మీంచి దినాము తాగుడు గావాలె. గా మూన్నెల్ల సంపాదన ఎన్నాల్లొస్తది నువ్వే చెప్పు. నిఖా అయిన కాణ్ణుంచి ఇప్పటిదాంక సుఖమంటేందో ఎర్కలేకపాయె! నాట్లకు ,కలుపుకు, కోతకు బోవుడు... అయినంక పెసలేర, దూదేర, మిర్చేర బోవుడు. ఏపని దొర్కితే దానికి బొయ్యి పుట్టెడు పుట్టెడు గింజలు దెచ్చిఇంట్ల బోస్తుంటె సంసారం నడుస్తుండె. మిర్చేరబోతే మిర్చొస్తుండే. చింత తోపులల్ల కాయలేరి పొట్టుదీసి గింజదీస్తె చింతపండొచ్చె, పత్తేరినంక, మిర్చేరినంక ఆల్లీల్ల కాల్మొక్కి ఆ కట్టెనంత మోపులుగట్టి ఇంట్లేస్తుంటి, ఒక్కోపాలి ఆల్లుగూడ తిడుతుండ్రు. నీ మొగనికి తాగెటందుకు మస్తుగ పైసలొస్తయి... కట్టెపుల్లలకు లెవ్వా అని దెప్పి పొడుస్తుండె లోకం! ఏనాడన్న ఇంట్లెట్ల జర్గుతుంది, పెల్లాం పోరలు ఏ దింటుంన్రని పట్టించుకున్న పాపాన బోలె మీబడెబాపు... ఇంక నేన్దెచ్చిన గింజల్నమ్మి తాగొచ్చి ఒక్కటేలొల్లి చేసుడు! ఒక్కకాలం మమ్మేల సాదితే... రెండు కాలాలు నే సాదాలె అందర్ని.

ఉంటూంటే ఒంట్లోసత్తువ లేకుండ అయితాంది. కుండెడు కుండెడు నెత్తురువోద్ది. బయటున్ననంటే... లేసి కూసోనీకే సాతగాదు. గసొంటిది బిగబట్టి బువ్వాండి కూరొండి మల్ల నేకూలికి బోవాలె. ఔ బిడ్డా, ఇగ వొల్లు బాగా నొప్పి జేస్తది. గీ వయసుల సుత గింత కష్టం జేయాల్సొస్తుండే, గందుకే జరకల్లుబొట్టు తిగితే పానం లేసొస్తది. ఏం జెయ్య బిడ్డా, నా నసీబ్‌ల గిట్టున్నది...' అని - ఇంతల ఇంకేదో యాదొచ్చినట్లుంది బడెమ్మకి.

'ఓ మున్నీ...నీకు జెప్పుడు మర్సేపోయిన, జర అమ్మగ్గూడ మర్సిపోకుండ జెప్పు బిడ్డా... గీ మద్దెల పెంటుగానికి సంబంధం సూసినం. మాఊరి పక్క ఊరే... ఒక్కతె పోరి.. ఇద్దరు పోరగాండ్లు, పొల్లగాండ్లు చిన్నోల్లు. పోరిపెద్దది. గందుకే పోరి పెండ్లి జెయ్యాల్నని జూస్తున్రు. అల్లుల్లె వాయించ బోయిన్రు గదా. గప్పుడు పెంటుగాన్ని జూసినట్ర. ముద్దుగున్నడని కబురు జేసిన్రు. మంచిదని మేం సుత ఒప్పుకున్నం. పిల్లపేరు అలీవాఁ! నల్లగున్నా సక్కంగుంది. పనులు సిట్ట సిట్ట జేస్తది. గీ ఈడుల్నే అందర్ని మించి ముందు బోద్దంట నాట్లల్ల కోతలల్ల! మిగతా అన్ని పన్లు గూడా ఇవరంగ జేస్తదంట బిడ్డా. ఎండలల్ల సుత బీడీ ఆకులు సుడ్తదంట. ఇస్తర్లు గుట్టనీకీ దానిమీదికి ఎవలూ రారంట. గంత గుండ్రంగ గుడ్తదంట. పోరీ సూత్తే గింతలేదుగని మస్తుగ పన్లు జేస్తది. ఇగ అన్నీ జూసి లగ్గం రెండ్నెల్లకు బెట్టుకున్న బిడ్డా. పెంటుగాడు గూడా అయ్య తీర్గనే గిప్పుడే తాగుడు షురూ జేసిండుగాదు, గిసోంటోనికి గదోగిదో పన్జేసి నాల్గు పైసల్దెచ్చేటి దయితేనే ఇద్దరు ఉప్పసం పండకుంట బత్కుతరని జూసి సేత్తున్న బిడ్డా. అమ్మకు జెప్పు.. ఎట్లయిన సరె... పద్దినాలు ముందుగ రావాల్నని. ఇగ నువ్వు నెల దినాల ముందే రావాలె. మరదలికి బట్టలుగిట్ల నీకయితే మంచిగ తెలుస్తయి గాదు బిడ్డా....." అని ఆగి "బిడ్డా శానా మాట్లాడిన గాదూ! నీకు నిద్రొస్తున్నదో ఏమో... ఇగపండు..." అనుకుంట ఆవలించి నిద్రలోకి జారుకుంది బడెమ్మ.

బడెమ్మ గురించి ఇన్నంక చాలా బాధేసింది. మా ఇల్లు గుర్తొచ్చింది. మా ఇంట్ల అబ్బా నమాజు జేస్తడు. మా అమ్మీకి కూడా నేర్పిండు. మా అమ్మి నిఖాకు ముందు ఊర్ల పక్షోలె తిరగేడిదేమో! బయటికే రాదిప్పుడు. వచ్చినా బుర్ఖా వేసుకుని రావాల్సిందే. ఇంట్ల అందరం ఉర్దూనె మాట్లాడ్తం. నేనొక్కదాన్ని తెలుగు మీడియం చదవడం మూలాన తెలుగు బాగొచ్చు. మా అబ్బా ఇప్పుడు లెక్చరర్ అయ్యిండు. ఇంకకొన్ని రోజుల్ల ప్రిన్సిపాల్ గూడ అయితడు. వెనుకటి ఆస్థి బాగనె ఉండె. మల్ల ఈయన సంపాదన! ప్రతిరోజు మటనో, చికెనో లేంది ముద్దెత్తడు. రెండంతస్థుల బంగ్లా మాది. కింద మేముండి పైన కిరాయికిస్తం. అప్పుడప్పుడు అమ్మీమీద కోపమొచ్చినప్పుడు 'దూదే కుల్దానా' అని తిడతడు అమ్మీని. నామీద కోపమొస్తే 'అన్నీ అమ్మ పోలికలే దీనికి' అని నన్నూ తిడతడు. భాయిని, ఆపాని బాగా జూస్తడు. వాళ్ళకన్నీ నవాబు శెకలే... మామూలు బట్టలు వెయ్యినే వెయ్యరు. మా ఆపా ఐతే గంటసేపు తయారుగాంది బయటికే పోదు. నేనేమో బట్టలు నలిగినా సరే...ఎవరి ముందుకైనా ఉరికిపొయ్యి మాట్లాడ్త. ఆ తర్వాత అబ్బాతో 'లేకి బుద్దులని' తిట్లు పడత! అసలు లేకితనం ఎక్కణ్ణించొచ్చిందో... లేమితనం లోంచా...?!

బడెమ్మ నిద్రలో మూల్గుతున్నట్లుంది.. మళ్ళీ ఆలోచనలు ఇటు మళ్ళినయి. దిగులుగా ఆ రాత్రి తెల్లారింది.

తెల్లారి నే లేసేటప్పటికే బడెబాపు, పెంటుగాడు ఇద్దరూ పొయ్యి పక్కన కూసిండి చాయ్ తాగుతున్రు. పొయ్యికాణ్ణె సూరుకు రెండు ఎండుతున్కల డండ్యాలు వేలాడు తున్నయ్.

"పెదబాబూ! బాగున్నవానే' అన్న "

"బాగున్నం బిడ్డా! ఎన్నాల్లకొచ్చినవ్, మీబాపు, అమ్మగిట్ల రాకపోతిరి, ఆల్లు సుతొస్తే బాగుండు" అని చాయ్ గ్లాసు పక్కనబెట్టి 'గిప్పుడె జర చెర్వు కాడికి పోయొస్త" అనుకుంట బైటికెల్లిండు

"చాపలు తేనీకి బోతున్నడు, తేసయితే తెస్తడు గని పుల్లుగ పట్టించొస్తడు, ఇగసూడు ఒక లొల్లా ఒక ఆగమా. . మొత్తం ఈది ఈదంతా ఒక్క తాన దెస్తడు. ఇగ జూద్దూ ఆగు మీ బడెబాపూ ఈరంగం' అని నిట్టూర్చుకుంట గ్లాసులు కడిగి ఇంట్ల బెట్టింది బడెమ్మ.

మూడు గంటలయితుంటే చేపలొకచేత్తో ఇంకోచేతుల తువ్వాలు పట్టుకోని, ఊక్కుంట వచ్చిండు బడెబాపు

"కరీంబీ.. కరీంబీ...ఓర్నీయమ్మ పిల్తుంటే సెవ్వు లినబడ్తలేవా.. ఏం జేత్తున్నవే.. మా దేరీకి.. ఇగో సేపలు.. మంచిగ వండాల పులుసు నాల్క మీదెయ్యంగనే .సొర్గం ఔపడాలె. నేను గిక్కడ్నే గీడ్నె - పనుండిపోతున్న. వచ్చేటాలికే పుల్సు రెడీగా ఉండాలే.. నీయమ్మ...సెప్పింది సెవుల బెట్టవ్..." అనుకుంట మల్ల బజారుపొంటి పోబట్టిండు!

"ఓరి, నిన్ను మైసమ్మ దిన.. నీ కాలు చెయ్యి ఇర్గిపోను.. నిన్నెప్పుడు మోస్కబోతరో... మంచి మంచోల్ల కొత్తంది సావు .' అని మెల్లంగ అని "ఇప్పట్కే సోల్గుతుండవు... ఓరి లత్తయ్యా. సాలుగని రారో..." అని కేకబెట్టింది బడెమ్మ.

ఏం ఇనబడెటట్లు లేదు. గట్లనే నడ్సుకుంట సారా దుక్నం కాడికి మల్ల బొయ్యిండు బడెబాపు.

చాపల కూర మస్తుగ వండింది బడెమ్మ. వస్తె ఏం లొల్లిపెడతడోనని తొందర్గ అందర్కి అన్నం బెట్టి తాను గూడ రెండు బుక్కలు తిన్నది బడెమ్మ.

ఎనిమిదయితుండె ఇంకా బాగా సొలుక్కుంట కిందబడుకుంట, లేస్కుంటొచ్చిండు బడెబాపు. బట్టలెటు పోతున్నయో సోయే లేదు. వచ్చీరాంగనె...

'కరీంబీ... కరీం.. బువ్వ బెట్టు" అన్నడు. బడెమ్మ ప్లేట్ల అన్నం, మంచినీళ్ళు, పులుసు బెట్టి "రావు...గీడ బెట్టినా" అన్నది. గట్లనె సొలుక్కుంట వచ్చి పడేటోడె, బడెమ్మ పట్టుకొని సరిగ్గా కూసోబెట్టింది. అన్నం కలుపుడె వస్తలేదు. "కరీంవా... నువ్వే తినిపియ్యె...హె..." అన్నడు. బడెమ్మ నోట్లె నోట్లె తిట్టుకుంట ముద్దలు గలిపి పెట్టవట్టింది.

'ఏవోం .. తిట్టవట్టినవ్... సరిగ్గా జూసిపెట్టు.. కాంటలు వెట్టి సంపుద మనుకుంటన్నవ్... నాకు దెల్వదా.. నేన్ సావంగనె. తైయ్యిన ఎగుర్దమనా...? నీ ఆటలేం

సాగయి . హమ్మ, నువ్వు తక్వ దానివిగాదు. .నన్ను సంపిపారనూకుదానునే జూస్తున్నవ్ గని.. నీ మిండడి సొమ్మేవన్నా బెడ్తున్నవా. మీ అయ్యిచ్చిన సొమ్మేవన్న బెడ్తున్నవా.. నీయమ్మ... నన్ను సావనూకి తలకుబోసుకోవాల్ననే సూత్తన్నవ్ గని..." బడెబ్బ తిట్లు ఆగుతనే లేవు.

బడెమ్మ కోపం నసాళానికంటుకుంది. "ఏందో మా అయ్యెంట, అమ్మెంటబడ్డవ్, నీ సొమ్మే తింటున్నం లేరాదూ . నేదెస్తే ఏవన్న దింటున్నావ్ పిలగానివి! దినామూ తాగనీకి తిననీకి ఏణ్ణుంచొస్తున్నాయో. నీ అయ్య బెడుతుండా...! నువ్వు గినక సంపాయిస్తున్నవ్ గని దునియాల...ఎవలన్న సంపాయిస్తున్నారూ....! దూ... ఎదవ జల్మ. " బడెమ్మ పళ్ళెం తీసి గాబు దగ్గరకు బోయింది కడక్కరాను

"నీ లం..దానా.. నిన్ను గాడ్దలు.. ! మా అయ్యనంటవానే.. దేవుడసొంటోడు మా అయ్య! నాకు అమ్మురుతం రుచి సూయించిండే.. మా అయ్య...మా అయ్యంటే ఎవలను కుంటున్నవ్... దేవుడు.. " మాటలు తడబడుతున్నయ్ బడెబాపుకు.

"మాయదారి సారాని మీ అయ్య బోసిండు గాబట్కే ఇట్టుంది సంసారం! అయినగని తాగుబోతని జేసినోడు దేవుడెట్టా అయిండో...? ముదనష్టపు అయ్య.. ఆడికడుపుల బుట్టిన పెద్దముదనష్టపోడివి నువ్వు . " తిట్లకు లంకించుకుంది బడెమ్మ.

'నీయమ్మ.. నీకెన్ని సార్ల జెప్పాల్నె..? మా అయ్యని ముదనష్టపోడంటావా...?" లేచి ఊక్కుంటనే రోకలిబండ దీసి ఎన్కనించి దనాదన రెండు బాదిండు బడె బాపు!

"ఓర్నాయనో... సస్తినో. . నీ కడుపు మాడ... నిన్ను బొందబెట్టిరాను... నీ దినం జెయ్య.. నీ చేతుల జెట్టబుట్ట..." ఘొల్లున మొత్తుకుంట అటు ఇటు తప్పుకుంటున్నది బడెమ్మ ఇంక ఏడబడితె ఆడబాదుతనె ఉన్నడు సొలుక్కుంట, తిట్టుకుంట...నేను లేచి ఎంతడ్డం పోయినా ఆగబట్టలేక పోతుంటి. గోరెగాడు పెద్దగ ఏడ్వబట్టిండు. పెంటుగాడన్న ఇంట్ల లేడు. ఆ లొల్లికి, ఆల్లిద్దరి అర్సుల్లకు చుట్టుపక్కల ఇండ్లోళ్ళందరూ ఉరుక్కుంట వచ్చిన్రు. బడెబాపు రెక్కలు బట్టి బయటకీడ్చుక పోయిన్రు.

"...బాంచోత్....గిప్పుడంటే ఈలందరొచ్చిన్రు. ఎప్పటికైన నిన్ను పానాల్తో ఇడ్సి పెట్టనే. ఏమనుకుంటన్నవే నన్ను.. నీయమ్మ..." గట్టిగ అర్సుకుంట తన రెక్క పట్టుకున్న మాదిగోల్ల ఈరయ్యను విదిల్చుకొని తూలుకుంట ఎక్కడికి పోయిండో బడెబాపు..

ఆడోళ్ళందరూ కల్సిబడెమ్మని మంచంమీద పడుకోబెట్టిన్రు. చెయ్యికి బాగా తగిల్నట్టుంది. ఇంతెత్తున వాపొచ్చింది. మూల్గుతుంది బడెమ్మ. మూల్గులలోనే కలగలపి ఏడ్వబట్టింది. అందరూ బడెమ్మని ఊకోబెట్ట బట్టిన్రు. మెల్ల మెల్లంగ అందరు పొయినంక ఎప్పటికో నిద్రపట్టింది బడెమ్మకు. నాకు కళ్ళు మూసినా తెర్సినా బడెబాపు చేసిన వీరంగమే కనబడబట్టింది. మా తమ్ముడైతె భయంతోని మంచానికి కర్సుక పోయిండు.

తెల్లారే మేం ఎల్లేరోజు. బడెమ్మ కుడిచేయి బుజం రాత్రి కంటే గూడా ఎక్కువవాపు కొచ్చింది. నాకైతే ఇరిగిందనే అనుమానం. గామాటే వందమార్లు చెప్పిన బడెమ్మతో. దవాఖానలో చూయించుకొమ్మని.

"దీనికేమయిద్ది బిడ్డా.. ఇంతకంటె పెద్దదెబ్బలే. కొట్లగూడని సోట్ల కొట్టినా గూడా తిప్పుకొని మొండిబత్కు బతుకుతన్న గాదూ!మీ బడెబాపు సుత మంచిగనె ఉంటడు గని గా సారా తాగినప్పుడే సిందులేస్తడు" అనుకుంట లోపల్కిపోయి చేతుల మూడు వందనోట్లు పట్టుకొచ్చి నా కాల్లుమొక్కి... బిడ్డా... గరీంబోల్లం గాదు, నువ్వు గంత దూరం నుంచొత్తే ఏం కొనే ఈలే లేకపాయె! అయినా ఈడ ఏం మంచిగుంటయి గని... అడ్నేదేన్న కొనుక్కో బిడ్డా! గీలొల్లులు ఎప్పట్కీ నే సచ్చిందాంక ఉండేటియే గని నువ్వు మన్సులో ఉంచుకోకు బిడ్డా! ఏందో గరీబుదాన్ని గిది ఉందీ గిదే పెట్టినా.. మొదటి సారొత్తే గిదేనా సూసుడనుకోకు. పెంటుగాని నిఖాకి మంచి చీరదెస్త..." అని ఎంత వద్దన్నా ఇనకుండా చేతులపెట్టి ఎడంచేత్తో సూట్‌కేస్ పట్టుకుంది బడెమ్మ. నే పట్టుకుంటనని తీసుకున్నా గుంజుకుంది. ఆటో ఎక్కియ్యనీకి రోడ్డు దాన్క వచ్చింది.

మేం రోడ్డుకాడికి పొయ్యేసరికి ఆటో వచ్చింది. ఎక్కి కూసున్నం. "అమ్మకు, అబ్బకు, ఆపాకు, బాయికి గిట్ల సలాం చెప్పు మున్నీ! మర్సిపోకు, అందరు పెండ్లికి రావాల్నని చెప్పు. ఇగ నేనుంటున్న..." బడెమ్మ కళ్ళల్ల నీళ్ళు. ఆటో కనబడినంతసేపు బడెమ్మ చెయ్యూపుతనే ఉంది.. నా కళ్ళింట నీళ్ళు టపటప రాలబట్టినయ్..

● ఆదివారం ఆంధ్రజ్యోతి - 1999 ●

# 68. తెగిన బంధాలు

♦ పెద్దింటి అశోక్‌కుమార్ ♦

'బస్సు వచ్చే టైం అయింది. ఈ బాలయ్యమామ ఇంకారాకపాయె. నిన్న కలసినప్పుడు పదేపదే చెప్పిన. ఉడుము గుడ్లుపెట్టి మర్చిపోయినట్టు జేత్తడు. పొద్దుటి బస్సుకు పోవాలని అనుకుంటిమి' పొద్దుపొడుపుకు చేతిని అడ్డం పెట్టుకుని దారిపొడుగునా చూస్తూ విసుక్కున్నాడు లింగం. అతడి మాటల్లో విసుగుకంటే ఎక్కువగా బాధనే ధ్వనించింది. బస్సు ఎక్కడ వెళ్ళిపోతుందో అనే తొందర ఒకవైపు, బాలయ్య రాలేదనే బాధ మరోవైపు కలగలపి అతడిని ఉన్నచోట ఉండనీయడంలేదు. నిప్పును తొక్కిన కోతిలా తిరుగుతున్నాడు.

అతడి పక్కనే రాళ్ళతెట్టెమీద కూర్చుని నెమ్మదిగా బీడి తాగుతున్నాడు దేవయ్య. లింగం బుద్ధగోచిని సర్దుకుంటూ అటూ ఇటూ తిరగడం, వదరడం అతడికి తమాషాగా ఉంది. "ఖా... మంగలోల్ల మామా! నువ్వంటే గోర్లుతీసే గోరుగాలు, ఇత్తడిగిన్నే గోచీల పెట్టుకుని దబ్బదబ్బ ఉరికత్తివి. కుమ్మరోల్ల తాతకు నీలెక్క రావత్తదా? కూరాల్లు, ఐరేండ్లు, గరిగెబుడ్లు, కంచుళ్లు, మూట గట్టుకుని రావాలెనాయె. కొద్దిగ లేటయితది. నువ్వేదో కొంపలు మునిగిపోయినట్టు చేత్తున్నవు" బీడి దమ్ములాగి పొగను వదులుతూ వెక్కిరిస్తున్నట్టుగా అన్నాడు చేతులు తిప్పుతూ.

అతడి మాటలు చెవికెక్కనట్టు ముందుకు రెండు అడుగులు వేసినవాడల్లా చెవులు రిక్కించి వింటూ వెనక్కివచ్చి దేవయ్య భుజాన్నిపట్టి కుదుపుతూ అన్నాడు లింగం. "దొర్సాని వైనాల మనిషి. అన్నీ పద్ధతి ప్రకారం జరగాలంటది. కొద్దిగ లేటయిందనుకో... మనకు ఇచ్చే కట్నాలు ఇయ్యరు పెండ్లిల ముందుముందుగ కుమ్మరోల్లపనే మొదలాయె. గాడిపొయ్యిలు తీసి కూరాల్లు చేసి లెంక కంకణాలు కట్టినాకనే గదా... పెండ్లి పనులు మొదలయ్యేది. బాలయ్య లేటయితే మనం ఉత్తచేతులతో ఊపుకుంట కూసోవలసిందే! అయినా అల్లుడా! వాడిన్ని కుండలు దెత్తడు. నేను గిన్నె, గోరుగాలును దెత్త నువ్వయితే ఉత్త చేతులతోని రావడితివి. వచ్చేటప్పుడయితే తూమెడు బియ్యం, వెయ్యి రూపాయలు ముల్లె కట్టు కచ్చుకుంటవు" అన్నాడు ఎక్కసంగా.

దేవయ్యకు కోపం వచ్చింది. లేచి నిలబడి ప్యాంటును దులుపుకుంటూ విసురుగా అన్నాడు. "నువ్వు చేసే పనేముందట. పదినిమిషాలు మైలపోలు రాసి తూమెడు వడ్లు తెచ్చుకుంటవు. పోలుమీద పెండ్లిపిల్ల కట్టుకున్న బట్టలు నీకేనాయె. మీదికెళ్ళి నూట పదార్లు కట్నం మిత్తి తీసిన పైసలు. నేను పెండ్లిపత్రిక పెట్టుకుంది

మొదలు, పత్రికలు పంచుడు ఇక్కడున్న ఇంటికి సుర్మమెయిము ' దెపయ్య గొంతు ఆడపిల్ల గొంతులా సన్నగా ఉంటుంది. దానికితోడు చేతులూ కల ఆడిస్తాడు

అతడి మాటలు పూర్తికానేలేదు అందుకున్నాడు లింగం

"ఆ..చేసినవు తియ్యిరా! పటేలు సిరిసిల్లలో ఉన్నాడు కాబట్టి సరిపోయింది. లేకుంటే వచ్చిపోయే సుట్టాల బట్టలు ఉతుకలేక సచ్చిపోడువు అయినా చేసినందుకు ఏంచెడిపోతున్నవురా! కూరగాయలు కొండబోతే కట్నం పోలుబోత్తే కట్నం. గొర్లను గోత్తె కట్నం. బోళ్ళు తోమితే కట్నం పీలిరి కట్నం, పెంట్లి సామాన్లు ఎర్తుకపోతే కట్నం..."

బస్సు చప్పుడు వినిపించింది లింగం సోరు మూతపడింది. దేవయ్య కూడా మాట్లాడలేదు. ఆగమాగాన రోడ్డు మధ్యలోకి అటూ ఇటూ పారజూసి ఓ. .బాలయ్య తాతా...' అని కేకవేశాడు

లింగం ఆతృతగా రాళ్ళ తెట్టెను ఎక్కి నిలబడి రోడ్డుకు ఆవలివైపు పారజూపి అన్నాడు. "ఆ...వస్తుండు, వీపుకు ముల్లె వేసుకొని కోటగద్ద దిగుతుండు.." అని. "మామా... జెట్టనరా...బస్సు వత్తుంది' అని కేకవేసి తెట్టె అంచును పట్టుకొని కిందికి దుంకాడు.

"ఆ... ముసలాయన కోడె దూడయితున్నాడు. దుంకులాడుతున్నాడు" నవ్వుతూ అన్నాడు దేవయ్య నడుమును ఊపుతూ..

"ఇప్పుడేం జూసినవు రూడుకున్నప్పుడు కబడ్డి ఆడితే సలుగురిని ఎత్తు కత్తుంటిని. ఇప్పుడు నీతోని ఉడికిన పప్పు ఉడుకది" మీసాలను దిద్దుకుంటూ అన్నాడు. అప్పుడే దుమ్ము లేపుతూ బస్సు వచ్చింది దమ్ము ఎగపోస్తూ బాలయ్య కూడా వచ్చాడు. చేతిలో ఉన్న సంచిలో మూడుకుండలు, వాటిమీద కంచుల్లున్నాయి.

సంచివైపు తేరిపార జూసిన లింగం పెదవిని విరుస్తూ, "అదేంటిది మామా... మూడే ముంతలు తెత్తున్నవు" కూరాడు కుండలెవ్వి, పోలు ముంతలెవ్వి?" అన్నాడు ఆశ్చర్యంగా. అతడికేదో భయం మొదలైంది.

"ఈ మూడు ముంతలకే మూడిండ్లు దిరిగిన, వాటినెక్కడ తేవాలె అయినా ఇప్పుడు కూరాళ్ళు గాడిపొయ్యిలు ఎవలు దీత్తుండ్రురా అంతలావుంటె ఇత్తడి బిందెలు పెట్టుమంట అంతదూరం ఐదుపది కుండలు ఎట్ల తీసుకపోవాలె." నెమ్మదిగా అన్నాడు బాలయ్య గొంతు వణికింది. వయసుపైబడి ముడతలు పడ్డ చర్మం, వంగి నడుస్తున్నాడు.

"నీపని ఐనట్టే! దొర్సాని సంగతి కొత్తగ చూత్తున్నవా..? ఏది లేకున్నా ఊకుండది నిన్ను మల్లా ఇంటిదాకా ఉరికిత్తది" నవ్వుతూ అంటూ బస్సువైపు చూశాడు దేవయ్య.

బస్సుకు అదే చివరి స్టేజి. అక్కడిసుండే వెసక్కి తిరిగి సిరిసిల్ల వెళ్తుంది. రోడ్డు పక్కనే తవ్విన పునాది. అది నింపడానికి కుప్పలా పోసిన రాల్లు ఇసుక ఒకవైపు, కాంక్రీటు కుప్పలు ఒకవైపు. బస్సు మరలడానికి ఇబ్బందిగా ఉన్నది. డ్రైవర్ విసుక్కుంటున్నాడు.

"అరే...ఆడిగుట్లోడా... పక్కకు జరుగురా" వెనుకనుండి ఎవరో అన్నారు దేవయ్యను. కోపంగా తిరిగి చూశాడు. ఎవరూ కనిపించలేదు. తనలో తానే గొణుక్కుంటూ పక్కకు జరిగాడు. బస్సు మలుగుతుంది. ఇక్కడ ఏం కడుతున్నరు. బంగులానా? ఎవరో అన్నారు.

"కాదు బస్టాండు" మరెవరో.

"కాదు కాదు, మ్యారేజీ హాలు కొండల్‌రావు పటేలు కట్టిత్తుండు" ఎవరో అన్నారు. బస్సు బుర్రు బుర్రు మంటూ మలిగింది.

"ఆ....ఆగనీ.." చేతిలో ఉన్న పంచ్‌తో రాడ్‌పై టక్‌మని కొట్టి అన్నాడు కండక్టరు. అంతవరకూ ఎక్కడ కూర్చున్నారో కాని పదిమందివరకు జమయ్యారు.

అందరూ ఎక్కి కూర్చోగానే బస్సు ముందుకు కదిలింది. ఎత్తు వంపులతో కంకర దేలిన రోడ్డు "ఐరేండ్లు గరిగెబుడ్డిపైలం తాతా...ఏ ఒక్కటి భిన్నమైనా వట్టిదే ఇంటికి పోతే అమ్మ బువ్వ గూడా పెట్టది" హెచ్చరిస్తున్నట్లుగా అంటూ "లింగం మామా.. నీగోరు గాలు మెత్తగ నూరుకున్నావా లేదా? దాన్ని యాడపెట్టుకున్నవో.. గోచిలగిట్ల పెట్టేవు.. సక్కగ సామానుకు దిగుతది" అన్నాడు దేవయ్య నవ్వుతూ. బస్సు చప్పుడులో కీచు గొంతు ఎవరికీ వినిపించలేదు.

అప్పుడే పొద్దు కొద్దిగా పైకెక్కుతుంది. కొద్దికొద్దిగా చలిగా ఉంది. సన్నగా వణుకుతూ సీట్లో ఒదిగి కూర్చుని గురుగులకంటే పెద్ద సైజులో ఉన్న మూడు పటువలను భద్రంగా పట్టుకున్నాడు బాలయ్య. పైకి అలా అన్నాడు కాని కూరాడు కుండలు లేక పోవడం వెలితిగా భయంగా ఉన్నది. ఎలాగో కష్టపడి ఐదు కుండలు సంపాదించేవాడే! మధ్యలో పంచాయతీ మొదలై ఎటూ తేల్చుకోకుండా చేసింది. ఒకడు బతికి పోతున్నాడంటే ఓర్వరు. పాడుమంది అనుకున్నాడు.

"ఏంటిది మామా....నిన్న ఏదో పంచాది ఉందంటివి ఏం పంచాది.." పక్కనే కూర్చున్నాడు లింగం. కాల్లుజాపి సర్దుకుని కూర్చుంటు అడిగాడు బాలయ్యను.

"ఏం పంచాదిరా.. కండ్లచ్చినప్పుడు ఎవ్వడులేడుగనీ పండ్లచ్చినప్పుడు అందరు మొగోల్లమంటారు. ఇక్కడున్నప్పుడు కొడుకు పెండ్లి చేసిండు. అప్పుడు నేనే ఇచ్చిన. పండుగ పబ్బాలకు పటేలు ఈ వూరిలో ఉన్నంత మట్టుకు కుండా గురిగి నేనే ఇచ్చిన. పోయినేడు పెద్ద పటేలు సచ్చిపోతే కొత్తకుండ నాదే. ఇయ్యల్ల వీల్లు కొత్తగా కానూన్ తీత్తరు. నాకు చెప్పే మొనగాళ్లయింద్రు" గొంతు గరగరమంది. వయసు తెచ్చిన ఆయాసం, ఎగపోత పుట్టింది.

లింగం గొంతు అతని ఆకారంగా గంభీరంగా వుంటది. వయసు మీదవడి కొద్దిగా కుంగిపోయాడు. కాని చెయ్యెత్తు మనిషి. మనిషికి తగిన చెత్త. "మా కులపోల్లు అట్లనే గులుగుడు మొదలు వెట్టిండ్రు. నేను సందియ్యలేదు. ఎవ్వడు నోరు ఎత్తద్దని సెప్పిన. పెద్దమనిషి కాలం జేసినప్పుడు నేనే గుండుగొరిగితి. పటేలు వచ్చినప్పుడు నేనే గడ్డం మీసం గొరిగితిని. నాలుగు మాటలనంగనే ఎవ్వడు నోరెత్తలేదు..." అన్నాడు. "ఇయ్యాల్ల ఇన్ని కట్నాలు దొరుకుతయి గదా! ఎట్ల దొరుకవట్టె అనేమంట... అందరికి."

"అందరికంటే మా కులమే నయ్యం కష్టపడితేనే కట్నమత్తడి. చేసుకోరా అన్నరు. ముందుగల్ల ఊరెల్లిపోయిన మనిషి పొద్దులకే చత్తడని గులిగిరా శాతసాకలోనివి నీకే హక్కుంటది. నీతో కాదంటే సెప్పమన్నరు" వెనుకసీట్లో కూర్చున్న దేవయ్య ముందుకు వంగి అన్నాడు. వాళ్ళ మాటలు విన్నాక. "చెయ్యని కట్నమత్తదా...? మొయ్యని బాడిగత్తదా..."

"ఓ ముచ్చట.... మీ ముచ్చట మీదేనా? టికెట్లు తీసుకోండ్రీ. యాడికి పోవాలె...' కండక్టరు గద్దించాడు. ఇద్దరు డబ్బులు తీత్తుంటే తర్వాత లెక్క సూసుకుందామని ఆపి యాభై నోటు ఇస్తూ మూడు సిరుసుల్ల అన్నాడు దేవయ్య.

బస్సు వెళ్తోంది. బస్సుతోపాటు ఆలోచనలు కూడా. ముగ్గురిలో ఉత్సాహం, అంతకు మించి ఆనందం ఉంది. రెండేళ్ళకింద కొండల్‌రావు కొడుకు పెళ్ళి గుర్తుకొచ్చింది. గాడిపొయ్యిలు దీసి కూరాళ్ళకు లెంక కంకనాలు ఏసినందుకే నూటపదార్లు కట్న మిచ్చిండు. ఐరేండ్లు, గరిగెబుడ్డిని ఎదురుకోవడానికి చప్పుడుతో వచ్చినప్పుడు ఐదు తవ్వల ఓడిబియ్యం, కుడుకా, కనుము బట్టా, యాభై ఒక్క రూపాయి కట్నమిచ్చాడు బాలయ్యకు. పెండ్లి తర్వాత ఇంటికట్నం వేరే ఇచ్చిండు. అవన్నీ లెక్కగట్టుకుని ఇప్పుడు అంతకంటే ఎక్కువనే అత్తయి అనుకుంటున్నాడు బాలయ్య.

సాకలి దేవయ్యకయితే అప్పుడు నెలరోజులు పండుగనే. అక్కడేతిని అక్కడే ఉండుమన్నాడు పటేలు. దొరసాని మాట దురుసుగని ఎముకలేనిచెయ్యి. పెండ్లి పోలు పోసేటప్పుడు రెండు సంచుల బియ్యం పోసుకున్నా ఎవరూ ఏమనలేదు. ఐదుగొర్లను గోస్తే వాటి కాల్లు, తలకాయలు అర్రల బొత్తలు, దొబ్బలు మిగిలితే కులానికంతా పంచి పెట్టిండు. ఇంటికి సున్నంవేస్తే మనిషికి మానెడు బియ్యం, ఇరవై రూపాయలు, ఇంటి కట్నం అదసంగా ఇచ్చిండు. పత్రికలు పంచడానికి బస్సుకిరాయిలిచ్చి పెండ్లి ఐనంక ఇద్దరాలుమొగలకు పెయ్యినిండ బట్టలుపెట్టి ఇంటి కట్నం ఐదువందలిచ్చిండు. పటేలు ఇల్లు సల్లగుండ!

మంగలి లింగం మైలుపోలు రాసి తూమెడు వడ్లు పోలువోసుకున్నాడు. పోలుమీద పిల్లగాని పెయ్యిమీది కొత్త అంగి లుంగి ఇచ్చి నూటపదార్ల కట్న మిచ్చిండ్రు. రెండు మూడు రోజులు కడుపునిండా తిండి, చిల్లరపనులు చేసినందుకు వేరే కట్నం. దొర్సాని కడుపు సల్లగుండ! మిగిలిన అన్నం కూర పెట్టించ్చింది. మల్లమిత్తి తీసిన కట్నం వేరే!

సున్నం వెయ్యడంతో మొదలైన సందడి నల్లపూసలు అల్లడంతో ముగిసింది. అంతవరకు ఏదో పనితో ముగ్గురూ ఇంటిసుట్టే తిరిగేవారు. ఒక్కొక్కరికి ఆరు నెలల గాసం దొరికింది. బిచ్చగాల్లకు గరీబోల్లకు మూడుపూటల తిండి.

బస్సు ఒక్క కుదుపుతో ఆగింది. ముందుకు తూలిపడబోయి నిలదొక్కుకున్నారు. ముగ్గురు. బాలయ్యనైతే ముంతల్ని గట్టిగా పట్టుకున్నాడు. ఆలోచనల్లోంచి తేరుకుని అటూ ఇటూ చూసి "ఊరులేదు పల్లెలేదు ఇక్కడెందుకు ఆపినవు" అన్నాడు దేవయ్య. రెండు చేతులు ముందుకు చాపి మట్టలను తెంపుతూ డ్రైవర్ వైపు చూసి.

"ఆ కట్టమైసమ్మ బండిని కదలనియ్యదట. దిగి ఆసరపడుతవా?" అదే యాసతో అంటూ బస్సు దిగాడు డ్రైవర్. అందరూ నవ్వుకున్నారు.

"ఓసినీ బస్సుపాడుగాను ఇది ఇప్పుడే ఆగిపోవాల్నా. అగ్గోలె లగ్గమచ్చె అప్పుడే దొడ్డికచ్చె నన్నట్టు. ఇంకా మెట్టుగుట్టలన్న దాటలేదు. నడిచి పోదామన్నా లింగన్నపేట దగ్గర లేదు. ఇంకో బస్సిప్పుడు రాదు" లేచి నిలబడి చేతులు తింపుకుంటూ అన్నాడు దేవయ్య మల్లీ అలాగే.

"నీ ఆడిగుట్ల పీసునే గొడుదు ఒర్రకు" ఎవరో అన్నారు.

"లావురేషం రావట్టె నీకు, ఏం నొత్తుంది" బస్సుదిగాడు దేవయ్య గొణుక్కుంటూ.

అరగంటసేపు కుస్తీపట్టి బస్సు ఇక కదలదని చెప్పాడు డ్రైవరు. బస్సులో ఉన్న పదిమంది ప్యాసింజర్లు కండక్టర్‌తో వాదానికి దిగారు. టిక్కెట్టు చింపినాక డబ్బులు ఇయ్యమంటే ఎట్లా? రోడ్డు దాకా నడువుండ్రి అక్కడ వేరే బస్సెక్కిస్తా." అన్నాడు కండక్టరు చివరగా ఉసూరుమంటూ బస్సు దిగారు అందరు.

చుట్టూ గుట్టలు, వాటిని చీల్చుకుంటూ రాళ్ళుతేలని కంకరరోడ్డు. అక్కడక్కడ బీడువారి నోళ్ళు తెరిచిన పంటపొలాలు, వర్షాలు లేక గడ్డికూడా మొలువలేదు. గుట్టమీద చెట్లు వాడిపోయి నట్టున్నయి. మంచుకురిసే కాలమైనా ఏ ఆకుమీదా తేమలేదు.

డ్రైవర్ బస్సువద్దే ఉన్నాడు. రోడ్డును తిట్టుకుంటూ కండక్టర్ వడివడిగా నడుస్తున్నాడు. మిగిలిన వారంతా అతడివెంట ఎక్కడ తప్పించుకపోతాడో అన్నట్టుగా నడుస్తున్నారు.

బాలయ్య మాత్రం ముల్లెను నెత్తి కెత్తుకుని మెల్లమెల్లగా నడుస్తున్నాడు. అతడికంటె రెండడుగులు ముందుగా భారీ శరీరాన్ని కదుపలేక కదుపుతున్నట్టుగా నడుస్తున్నాడు లింగం. వడివడిగా వెళ్తున్నవాడల్లా వెనక్కి తిరిగి ప్యాంటును ఎగజెక్కుకుంటూ "ఏమాయె... రాండ్రి'... అంటూ ఆగి నడుస్తున్నాడు దేవయ్య.

"నేనయితే ముసలోన్నయితి. నీకేమయిందిరా...అడుగుల అడుగేత్తున్నవు. నడువు". సరాయిస్తూ అదిలించాడు బాలయ్య లింగంను. నాకింక వయసు ఉరుకులాడుతుందా మామ. యాభై దాటినయి మోకాళ్ళు కదులనిత్తలెవ్వు. అడుగులు వేగంగా వెయ్యడానికి ప్రయత్నిస్తూ అన్నాడు లింగం.

"ఆ....మీరు ఇట్లనడిస్తే పెండ్లికి కాదు మరు పెండ్లికి అందుతం ముడిబతుక పిల్ల ముద్దాడితె బతుకతదా అన్నట్లు చాతగానోల్లు ఇంటి దగ్గిరనే ఉండాలె. ఎందుకు ఆరాటపడాలె" విసుగ్గా అన్నాడు దేవయ్య-

"నువ్వురుకులాడకురా...ఒకసారి గిట్లనే! ఇదే కొండల్‌రావు పటేల్ లగ్గానికి మీ నాయిన ఉరుకులాడుకుంట సవారు కచ్చురమెక్కిండు. అప్పుడు గిట్ల బస్సులెక్కడియి. ఎంత దూరం పోవాలన్నా కచ్చురాలేనాయె. లగ్గానికి ఇరవై కచ్చురాలు బయిలెల్లినయి. ఒకలను వట్టక ఒకలు పై గొట్టుడు మొదలు వెట్టిండ్రు. మీనాయిన ఎక్కిన కచ్చురం ఎద్దు నడువలేదు. మెల్లమెల్లగ అదిలిచ్చుకపోతుంటే ఉన్న కచ్చురాలన్ని ఎల్లిపోయినవి. కొత్త తొవ్వ. జెంగల్‌లో కాటగలిసిండు. మేము

పొద్దుగూకుతుండగ పెండ్లిపిల్ల ఊరుకు చెరుకున్నం మీనాయిన ఎక్కిన బండి ఇగరాదు అగరాదు. కూరుకురాత్రి దాటింది. చిత్రమెంటిదంటే తలువాల బియ్యం, బాసింగాలు, గరిగెబుడ్డి, పెండ్లి బట్టలు ఆ బండిలనే ఉన్నయి. తెల్లవారే ముంగట పెండ్లి. పటేలు మనిషినొకదిక్కు గెదిమిండు. ఎక్కడివాల్ల మక్కడ కేకలేసుకుంట తిరిగినం. యాడ దొరుకడు ఎటు దిరిగిండో జరాగితే పెండ్లనంగ చేరుకున్నడు. అప్పటిగ్గాని పాణాలు సల్లచడలేదు" చెబుతూ నడుస్తున్నాడు బాలయ్య.

మొదటి గుంపు దూరమయింది అందుకోవాలని వేగం పెంచారు వాల్ల ముచ్చట్లు వింటూ మెల్లగా నడుస్తున్నాడు దేవయ్య

'అబ్బో... వీల్ల నాయిన సన్నపోడుగాదు " ముచ్చట అందుకున్నాడు లింగం... "చేసినంత సేపు పని మంచిగనే జేత్తుండె. కల్లుచాసన జూత్తే మాత్రం మన మనిషి కాకపోతుండే. ఇట్లనే ఇద్దరు తలువాల బియ్యం ఎత్తుకుని ముత్తిరెడ్డి కొడుకు పెండ్లికి పోయినం ఆ ఊర్లె బాగగాదుదులున్నాయ్. పెండ్లికి కొబ్బరాకుల ముత్యాల పందిరేసి గద్దెవేసి పూలదండలు చుట్టింద్రు ఇప్పుడు ఇట్లగని, అప్పుడు ఏ లగ్గమమైనా తెల్లారె ముందటనే అయితుండె. పొద్దందాక లగ్గాలే జరుగకపోతుండె

ఇగ పిల్లగాన్ని ఎదురుకచ్చెదానికి పోతూ . పందిరిదగ్గర మీ నాయినను కావలి వెట్టింద్రు. అప్పుడు ఎదురుకునేందుకు జేబులెక్కడియి ఉన్న మా రాజులైతే గుఱ్ఱం మీద ఎక్కిచ్చుకత్తురు ఏం లేనోల్లు నడిచివత్తురు. వాల్ల మామ ఎక్కడిదో డొక్కు సైకిలి పట్టుకచ్చి నాకిచ్చిండు. పిల్లగాన్ని దానిమీద కూసోబెట్టుకుని తీసుకురావాలె. చీకటి పూట ఎదురుకొనుడు. ఊరి మంగలోడు దీటి వట్టుకొని ముందట నడువాలె. అంతవరదాక నేను సైకిలు ముట్టనేలేదు భయం భయంగనే తోసుకత్తున్న. ముందట మాదిగ దప్పులు అక్కడో గురుజుంటది. దానికింద మోరి అయింత పైడి కాలుకు తట్టి ముందు సొలిగిన. చేతుల సైకిల్ పిసికిపోయింది సైకిలుమీదున్న పెండ్లి పిలగాడు మోర్లె గూలిండు. పెయ్యంత బట్టలంత బురుదనే!"

"మొద్దు పీసునె గొడుదు." పెద్దగా నవ్వుతూ అన్నాడు దేవయ్య.." పందికి పంది ఉన్నవు సైకిల్ నూకరాలేదా?"

బాలయ్య ఆయాసపడుతూ నడుస్తున్నాడు. అప్పుడప్పుడూ చేతిని అడ్డంపెట్టి తారు రోడు ఎక్కడుందో చూస్తున్నాడు

నవ్వుతూ అందుకున్నాడు లింగం "ఇంక మీ నాయినసంగతి చెప్పుత సూడు, తలువాల బియ్యం, కుడుకలు, పోకలు ముల్లె పక్కననెట్టుకుని పందిరి కావలున్నాడు. అప్పటికే రెండు మూడు సీసల కల్లు తాగిండట నడిజాము రాత్తిరాయె. నిద్ర ఆగక అట్లనే ఒరిగిండట. ఈంత గాడుదులు రాను ఒక్కపువ్వు లేకుండ గుంజినయి. గద్దెను తుక్కు తుక్క తొక్కినయి. పందిరిని కూలగొట్టినయి. తలవాల బియ్యం ఇత్తులేకుండ బుక్కినయి. దూరంగా సప్పుడినచ్చి లేచి చూసేవరకు ఏముంది! అంగడంగడయింది. ఇగ నన్ను ఉంచరురా అనుకున్నడు. ఇంటి తొవ్వ వట్టిండు. సైకిలు ఎత్తెయ్యంగనే నేనూ అదేపని జేసిన ఇద్దరం మేల్ల కుంట్ల కలుసుకున్నం కరకర పొద్దు పొడవంగ."

పడీపడీ నవ్వాడు దేవయ్య బాలయ్యగూడా నవ్వుతున్నాడు కండక్టర్ కేక వేయగానే నడకవేగాన్ని పెంచారు. దూరంగా తారురోడ్ కనిపిస్తుంది. అప్పుడప్పుడు

లారీలు జీపులు వెళ్తున్నాయి. బాలయ్య సత్తువనంతా కూడదీసుకుని నడుస్తున్నాడు. అతడి భుజం మీది మూటను దేవయ్య అందుకున్నాడు.

"ఇది ఆకిరి లగ్గం. ఈసారి బాగనే వత్తయి కట్నాలు" మూటను మార్చుకుంటూ అన్నాడు దేవయ్య. ఈ కట్నాలతో ఎక్కడెక్కడి బాకీలు తేరుపాలెనో ముందుగానే నిర్ణయించుకున్నాడు. లగ్గంలో బియ్యం దొరుకుతయని, బియ్యం సంచిగూడ కొనలేదు ఇంటికి. "లగ్గం ఊర్లె జేస్తే మనకు సతువుండు. ఎరుగని ఊర్లె మొరుగని కుక్క అన్నట్టు అక్కడెట్లుంటదో" నిరుత్సాహంగా అన్నాడు లింగం.

"ఎట్లుండుడేంది. పటేలు మనల్ని తప్పక రమ్మనిసెప్పె. నిన్నయితె మరీమరీ యాది జేసిండు." నడుస్తూ అన్నాడు దేవయ్య.. "మనం ఇప్పుడు ఇట్లగని.. ఎనుకట పెండ్లీలు మూడు రోజులు పోదురు. ఒక ఇంట్ల పెండ్లైందంటే అన్ని కులాలకు పని దొరుకుతుండె. ఇప్పుడు పెండ్లి పనులనుంచి ఒక్కొక్క కులం ఎడబాసిపోయె. మనం ముగ్గురమే మిగిలితిమి నిట్టూరుస్తూ అన్నాడు బాలయ్య.

మాటల మధ్యలోంచి తలెత్తిచూస్తె తారురోడ్డు వచ్చింది. రోడ్డు పక్కగానే ఎదురుగా ఒక బస్సువచ్చింది. అందరినీ బస్సులోనికి ఎక్కించాడు కండక్టరు. అందరూ ఆయాసంగా బస్సెక్కారు.

'బస్సు సల్లగుండ పెట్టే పైసలు తప్పకపాయె, నడుసుడు తప్పకపాయె!"చేతులు తిప్పుకుంటూ సీట్లో కూర్చున్నాడు దేవయ్య.

"ఆడిగుట్లొల్లు ఎక్కితే అట్లనే ఉంటదిమరి." వెనుకనుండి ఎవరో అన్నారు. గొల్లున నవ్వారు అందరు.

కోపంగా వెనక్కి తిరిగి చూస్తె ఎవరూ కన్పించలేదు. ఆ...కోపాన్నంతా లింగంమీద చూపిస్తూ.. "ఈ రుమాలెందుకు సుట్టుకత్తున్నవు ఇంటి దగ్గరపడేసి రాక" అన్నాడు దేవయ్య.

అతడి కోపానికి లోలోపల నవ్వుకుంటూ సరాయించి మీసాలు సవరించుకుంటూ 'నీకు తెల్వదోయ్. పైలపోలు రాయంగ నెత్తికి రుమాలుండాలె. లేకుంటె దొర్సాని మెడలువట్టి ఇవుతలికి నూకుతది. వాల్ల కొడుకు పెండ్లీల ఏమైందెరుకేనా? పెండ్లి పోలు పోసినంక పిల్లగాడు పోలులో అడుగుబెట్టే దాకా సాకలోడు బయటకు రావద్దట. ఆ విషయం అక్కడి సాకలోనికి తెలువదట. దబదబ పోలువోసి పోదామను కున్నడట. నాలుగుతిట్టి పిల్లగాడు పోలులోనికి అడుగువెట్టేదాకా ఇవుతలికి రావద్దని సెప్పిందట. అప్పటికింకా పెండ్లి పిలగాడు తయారు కానేలేదు. సాకలోనికి ఒత్తుగ దొడ్డికత్తుందట. ఇగ జెప్పు ఆ కథ ఎట్టున్నదో" అన్నాడు నవ్వుతూ.

కోపాన్ని మరిచి పక్కున నవ్వాడు దేవయ్య. చుట్టూ వున్నవారు వారివైపు విచిత్రంగా చూశారు. వీల్లు మాత్రం ఎవరినీ గమనించలేదు. ముగ్గురూ ఒకే సీట్లో కూర్చున్నారు. బస్సు దిగే వరకు పెండ్లి ముచ్చట్లే!

దిగినాక దేవయ్య ముందుగా నడుస్తుంటే ఇద్దరూ అతడి వెంట నడుస్తున్నారు. రోడ్డుకు రెండు దిక్కుల దుకాండ్లు. లైన్లు కట్టి పరుగు తీస్తున్న వాహనాలు.

"దేవిగాడు....జెరాగితే పిల్లగాన్ని తోలుకరాను పోతడేమో! కూరగాయల కట్నం బాగా అడుగురా.." వెనుక నడుస్తున్న బాలయ్య అన్నాడు. లింగం ఇంకేదో అన్నాడు. దేవయ్య మాట్లాడలేదు. ఇల్లు చేరుకునే వరకూ అందరూ మౌనంగానే ఉన్నారు.

అనుకున్నట్టుగా ఇంటి ముందు సందడి లేదు. టెంట్ మాత్రం వేసి ఉంది. పచ్చటి తోరణాలు గుచ్చారు. పిల్లను పెండ్లి కూతురుగా తయారుచేయడానికి బ్యూటీషియన్‌ను తెప్పించారని విని ఎందుకో తెలియక తికమకపడ్డారు ముగ్గురు. ఒకరిద్దరు ఆడా, మగా, అప్పుడప్పుడూ ఇంట్లోకి, బైటకు వెళ్తున్నారు. ఎవరికో పనిని పురమాయిస్తూ బయటకు వచ్చిన కొండల్‌రావు ముగ్గురినీ చూశాడు. దగ్గరగా వచ్చి "అరే... ఎప్పుడచ్చిండ్రురా... ఇక్కడ కూర్చున్నరేందిరా...? లోపలికి రండ్రి" అంటూ ఆదరంగా పలుకరించాడు. ఇంట్లోకి వెళ్ళగానే దొర్సాని, పిల్లలు, కోడండ్లు అందరూ సంతోషంగా పలుకరించారు. వారి పలుకరింపులు కొత్త ఉత్సాహాన్ని పుట్టించాయి.

ఐరేండల్ల కుండను అపురూపంగా అందిస్తూ భద్రపరుచమని చెప్పాడు బాలయ్య. తాను కూడా సిద్ధంగా వచ్చినట్టుగా బుట్టలో చుట్టిన గోరుగాలును, ఇత్తడి గిన్నెను అందిస్తూ 'దొర్సానీ ఇవ్విటిని గూడా దాసి పెట్టిండ్రి. యాల్లకు దొర్కయి మీరు ఇదిలేదు అదిలేదు అంటరు' అన్నాడు లింగం. దేవయ్యనైతే కలుపుగోలుగా అప్పటికే ఇంట్లోకి చొచ్చుకొని పోయాడు. ఇచ్చిన సామాన్లను కోడలికి అందించి బలవంతంగా వాళ్లకు భోజనాలు వడ్డించింది దొర్సాని.

"ఊరుమారినా ఆమె మనసు మారలేదు. సల్లనితల్లి! అనుకుంటూ భోజనం చేస్తున్నా మనసును తొలిచే అనుమానం మాత్రం జీర్ణం కావడంలేదు ముగ్గురికి. అడగాలని నోరు తెరిచినా అడగలేక అన్నం ముద్దను కుక్కుకుంటున్నారు. 'అలా ఎందుకైతదిలే' అని తమను తాము సరిపుచ్చుకుంటున్నారు. అయినా ఏదో! బెంగ! తొండను మింగిన అనుమానం.

మైలపోలు రాసేందుకు భోజల బండికాని ఏదిరా? అని అడుగుతదేమోనని లింగం భయపడ్డాడు. కూరాడుకుండలేవీ అని అడుగుతుందేమోనని బాలయ్య భయపడ్డాడు. ఇంత కాల్చిన సున్నం పట్టుకురావద్దురా? అని అంటుందేమోనని భయపడ్డాడు. దొర్సాని ఏవీ అడుగకుండా కొసరి కొసరి వడ్డించడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నా మనసులో ఏదో భయం మొదలైంది.

గుండె దడ దడలాడుతుండగానే భోజనం ముగించారు. బాలయ్య లింగంలు వచ్చి టెంటుకింద కూర్చున్నారు. దేవయ్య ఏదో పని చేస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాడు. అతడి మాటలు, చేతులు తిప్పుతూ యాక్షన్ చూశాక నవ్వుకుంటూ ఏదో ఒకపని చెబుతున్నారు. "మీకు నేను దొరికినానుండ్లా.. ఇసీ పాపం పాడుగాను ఏం పాపమిది" మూతులు, చేతులు, నడుము తిప్పుతూ మరింత ఉషారుగా పని చేస్తున్నాడు దేవయ్య.

పొద్దు గడుస్తుంది. ఇంట్లో వీడియో కెమెరా తిరుగుతుంది. అప్పుడప్పుడూ ఫోటో ఫ్లాష్‌లూ... అటూ ఇటూ పొక్కగాని పాములెక్క తిరిగి మళ్ళీ టెంట్ కిందికే వస్తున్నారు ముగ్గురు. తమలో తాము ఏదో గొనుక్కుంటున్నారు. గుసగుసలాడు

కుంటున్నారు. మాటల సరదా తీరాక ఎవరో కసురుకున్నట్టున్నారు. మొహం చిన్న బుచ్చుకుని టెంట్ కిందికి వచ్చాడు దేవయ్య.

"ఏమాయె.. అల్లుడా.. ఇంక పిల్లగాని తోలుకరాను ఎప్పుడు పోతవు. రేపే పెండ్లాయె" ఎత్తిపొడుస్తున్నట్టుగా అన్నాడు లింగం దేవయ్యను. "ఏదీ.. ఏం సప్పుడు లేదు గదా.. ఓ... కుమ్మరోల్లతాతా... లెవ్వు! లేచి గాడిపొయ్యిలు తవ్వుపో.. సాలిచ్చు కున్నవు" అన్నాడు దేవయ్య.

బాలయ్య మాట్లాడ్డంలేదు. అతడి ఆలోచనలు ఎక్కడో ముడిపడ్డాయి. ఏ జ్ఞాపకాలనో నెమరువేసుకుంటున్నాయి. అది ఎవరిపెండ్లి? ఎవరి పెండ్లి అయినా సరె! మూతులకు లెంక కంకనాలు పెట్టాల్సిందే. తన యింటికి చప్పుడుతో రావాల్సిందే! కూరాళ్ళయితే రెండు రోజులు ముందే తీసుకెళ్తారు. ఐరేండ్లప్పుడే తనింట్లో సందడి. కొత్తదోతి, అంగీ తొడుక్కొని తనుండాల్సిందే! కులవృత్తి ఏనాడో పోయింది. ఒక్కపెండ్లి తంతు తప్ప. అదికూడా ఈనాడు దూరమవుతుంది.

వదినమరుదులో, బావమరుదులో ఏదో ఒక వరుస ఉన్నవారే ఐరేండ్లు గరిగె బుడ్డిని ఎత్తుకోవాల్సిందే! తాంబూలంనిండా తనకు బియ్యం, ఐదు కుడుకలు, కనుమ, ఖర్జూరపు పండ్లు, చిల్లరకట్నం. ఇలాంటి పెండ్లీలు రోజూ జరగాలనే తన దీవెన! కనీసం పెండ్లీలకైనా తన సారె తిరగాలనే ఆశ!

మొగాళ్ళయితే భార్యల పేరడిగి, ఆడవాళ్ళయితే భర్తల పేరడిగి జాజుతో పలకలు అద్ది గీతలు గీచిన ఐరేండ్లు తన చేత్తోనే నెత్తిమీద పెట్టాల్సిందే!

పెద్దిండ్లలో పెండ్లి జరుగుతుందంటే నెళ్ళాల్ల ఖర్చులు దొరుకుతాయన్న ఆశ. బియ్యం దొరుకుతాయన్న సంబురం. ఇంటిల్లిపాదికి విందు భోజనం. వారం రోజులు చేతినిండా పని.

పెండ్లి సంబరాలనుంచి ఒక్కొక్క కులం దూరమయింది. పల్లకిమోసే బెస్త వాల్ల నుంచి తోరణాలకు నులుకతాడిచ్చి డప్పులు కొట్టే మాదిగల దాకా! సంబరంగా, అదొక వృత్తిలా చేసే పనుల్లోకి వ్యాపారం, పెట్టుబడి, సొచ్చుకచ్చింది. వేరుచేయ లేవన్న కుల వృత్తులు కూడా ఇప్పుడు... మిగిలిన ఆ ఒక్క జ్ఞాపకం తెగిపోయింది.

"మామా....ఓ బాలయ్యమామా... ఏందే మాట్లాడవు. ఏమైంది?" లింగం కుదుపుతో మామూలు మనిషయ్యాడు బాలయ్య.

అప్పటికే పొద్దువాలింది. కార్లమీద మోటారు సైకిళ్ళమీద ఎవరెవరో వస్తున్నారు. వచ్చినంత తొందరగానే వెళ్ళిపోతున్నారు. పటేలు స్కూటరుమీద ఎక్కడెక్కడో తిరిగి వస్తున్నాడు. మళ్ళీ వెళ్తున్నాడు. పొద్దుగూకుతుండగా తమ్మలి సొన్నాయి వాడొచ్చి పావుగంటసేపు పలికి వెళ్ళాడు. ముగ్గురు టెంటుచుట్టూ కాలుగాలిన పిల్లుల్లా తిరుగు తున్నారు. అప్పుడప్పుడు ఇంట్లోకి వెళ్ళి ఏదో సమాచారం తెస్తున్నాడు దేవయ్య.

రాత్రి భోజనాలకు మరోసారి పిలుపు. నిరుత్సాహంగా చేతులు కడుక్కున్నారు. ఎక్కువమంది చేరుకోవడంతో ముగ్గురిని టెంటులోనే కూర్చోబెట్టారు. పక్కనే కుర్చీ వేసుకుని కొండల్‌రావు కూర్చున్నాడు. మాట్లాడుతూ అమెరికా సంబంధమనీ, ఆస్తి ఉన్నవారని, ఏదేదో చెబుతున్నాడు. అతడి మాటల్లాగే ముద్దలు కూడా మింగుడు

పడడం లేదు ఎప్పటినుండో అడగాలని ఉన్నా అడగలేక తనకు తానే సిగ్గుపడి మానుకున్నాడు దేవయ్య.

భోజనాల తర్వాత లింగయ్యకు పిలుపు వచ్చింది పోయిన ప్రాణం లేచి వచ్చినట్టయింది గోచిని గట్టిగా చెక్కుకున్నాడు మొహాన్ని రుమాలుతో తుడుచుకున్నాడు. రుమాలును నెత్తికి చుట్టుకున్నాడు రాకరాక ఏదో గొప్ప అవకాశం వచ్చినట్టు హైరానా పడిపోయాడు మిగిలిన ఇద్దరు ఆతనికి గుసగుసగా సలహాలిస్తున్నారు. ఎక్కడినుండో కుంకుమ బొట్టును తెచ్చి నుదుట పెట్టాడు దేవయ్య. కొత్తకొత్తగా పెండ్లి కార్యంలోనికి అడుగు పెడుతున్నట్టు జేబులో మడిచిపెట్టుకున్న సంచిని బాలయ్యకు ఇచ్చి ఇంట్లోకి అడుగుపెట్టాడు లింగం. ముగ్గురి మొహాలు వికసించాయి.

ఐదునిమిషాలు గడువనేలేదు మళ్ళీ టెంట్‌లో వాడిపోయిన మొహంతో ప్రత్యక్షమయ్యాడు లింగం. అతడిని చూసి ఇద్దరూ ఎదురెళ్ళారు ఏం జరిగిందో అర్థం కాకపోయినా అతడు చేసే పని మాత్రం మొదలు కాలేదని అర్థమైంది. బాలయ్య మౌనంగా ఉన్నా దేవయ్యనే అడిగాడు ఏమైందని

"ఏంలేదురా... అటుకు మీద సూట్‌కేస్ అందలేదట నేను పొడవుగా ఉన్నానని నన్ను పిలిచారు" నీరసంగా కూర్చుంటూ అన్నాడు. ఎవరూ మాట్లాడలేదు. చలికి ఒదిగి కూర్చున్నారు. ఏదో బాధ గుండెను మెలి తిప్పింది

ఇంట్లోకి వెళ్ళేప్పుడున్న మధురానుభూతిలోంచి లింగం ఇంకా తేరుకోలేదు. అతని కళ్ళముందు నెత్తికి రుమాలు సుట్టుకొని నుదుట బొట్టుపెట్టుకుని పోలు రాసుడు, భోజల బండికాని కనిపిస్తుంది పిల్లయినా. పిల్లగాడైనా. ఎవరో ఒక తోడుతో భోజలకానిపై కూర్చోవలసిందే!

'దొర్సానీ.. వడ్లుతేండ్రి.. ఇవ్వే సాలుతయా . ? పెండ్లి రేపనగా మైలపోలు తీసుడు ఇత్తడి తట్టలోని వడ్లను దోసిడితో ముంచి పోలుస్తున్నాడు. బండికాని చుట్టూ నాలుగు గీతల చతురస్రం. దాని చుట్టూ మరొకటి. అంచులకు గుండాలు. అడ్డంగీతలు, పోలు ముంతల చుట్టూ దారం, మామిడాకుల కంకణాలు, ఐదుగురు వరుసగా పోలుపోసుడు.

ఇత్తడి తట్టతో ఐదుసార్లు తేవలసిందే ఇల్లు తీరు తట్ట పెద్దిండ్లలో పెద్ద తట్ట నెత్తికి నూనెపెట్టి పెయ్యంతా పసుపురాసి కాల్లవి వేల్లవి గోర్లు కత్తిరించడం. పెయ్యి మీదున్న బట్టలు తనకే! ఏం లేదన్నా తూమెడు పదికుంచాల వడ్లు. నూట పదార్లు కట్నం. మిత్తితీసిన పైసలు ఐదుగురు ముత్తయిదువులతో వడ్లమిత్తితీసుడు.

తాతల తండ్రులనాటి చరిత్ర, ఏండ్ల తరబడి పెండ్లితో మమేకమైన జీవితాలు. ఆధునికతకు అలవాటుపడ్డాక మారిన అలవాట్లు, అలవాట్లకు తగినట్టుగా మారిన కుల వృత్తులు, కత్తి కలుప పట్టుకొని ఇండ్లు దిరిగి గడ్డాలు గొరిగే స్థానంలోంచి ఎదిగిన పోరగండ్లు.. రోడ్డు మీది టేలా దబ్బాల్లోకి చేరడం, ఊర్లో జరిగే పెండ్లీలను నమ్ముకొని తను ఊరిలోనే ఉండడం .. అన్నీ గుర్తుకొస్తున్నాయి

కత్తి కట్నం అడిగేరోజుల్లోంచి కత్తికి పనిలేక కత్తెర పట్టుకొని రోడ్డునపడే రోజువరకు బేరీజు వేసుకున్నాక మిగిలిపోయిన పెండ్లి సంబరాల సంబంధాలు ఇప్పటితో

పుటుక్కుమని తెగిపోయినట్టయింది. తన భార్య మంత్రసానిగా చేసేది. బొడ్డుగోసి పురుల్లు చేసేది. పచ్చి బాలింతలకు తలస్నానాలు, పురుడు కట్నాలు, మక్కగుడాలు, కల్లుసీసలూ... మనిషి పుట్టుక, పెండ్లి, సావుదాక ఒకవృత్తితో మరొక వృత్తికి అల్లుకుపోయిన అవసరాలు ఎక్కడో తీరి పోతున్నాయి. డబ్బుతోనే డబ్బు పుడుతుంది. జీవితంలో ముడిపడిన అవసరాలు అవకాశంగా పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.

ఎవరో కుదుపగా లేచి నిలబడ్డాడు లింగం. చలాకిగా తిరిగే దేవయ్యలో కూడా ఉత్సాహం చచ్చిపోయింది. టెంటులోకి రెండు కార్పెట్లు వచ్చాయి. పటేలు ఇంట్లోకి వచ్చి పడుకొమ్మని బలవంతం చేశాడు. అక్కడే బాగుంటుందని టెంట్‌లోనే కార్పెట్లు పరుచుకున్నారు. ఒకటి కప్పుకున్నారు. వణుకుపుట్టించే చలి దానికంటే ఎక్కువగా వణికించే భయం. పెండ్లి పనుల్లోంచి తాము వేరు చేయబడ్డామని ఒకరు ఒకరితో మాట్లాడుకోవడం లేదుగాని, అగాధాల్లాంటి ఆలోనలతో కొట్టుకుపోతున్నారు.

"పిల్ల గానిది ఏ ఊరో! ఏ పల్లెనో! ఈ టైంకు ఊర్లె ఉందుంటి. కూరగాయల కట్నం కాడనైతే ఇంతవరకు పేచీ పెట్టుకోలేదు. ఎంత ఇస్తే అంతే తీసుకున్న" అనుకున్నాడు దేవయ్య. 'రకానికొక్కటి కూరగాయలను మూటగట్టుకుని పిల్లగాన్ని తోలుక రావడానికి పోదుంటిని. మా నాయినయితే అందరికంటే ముందుగనే నడిచిపోయి ఎంతమంది వస్తుండిరో చెప్పుతుండెనట. ఇప్పుడు అదిలేదు. ఇది లేదు. ఉన్నది ఊసిపాయె. దిడ్డి పాసిపాయె' దేవయ్యలో వణుకు.

ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదుగాని ఎవరు ఏం ఆలోచిస్తుండ్రో తెలిసి పోతుంది.

వారం రోజుల పెండ్లీలనుండి గంటల పెండ్లీలవరకు జరుగుతున్న మార్పులను, జరిగిన రోజులను గుర్తుకుతెచ్చుకున్న బాలయ్యకు ఎందుకోగాని మరీ వెలితిగా వుంది. మార్పు జరిగిన రోజుల్లోంచి మాత్రమే చూసి కారణాలు వెతుకుతున్న దేవయ్యకు ఇలా జరగడం కొంతవరకు మామూలుగానే అనిపిస్తుంది. ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉన్న లింగం జీర్ణమై, జీర్ణం కానట్టు తొక్కులాడుతున్నాడు.

ఏ రాత్రికో గానీ.... నిద్రపట్టలేదు. లేచి చూస్తే ఇంట్లో సందడి. దేవయ్యకు ఇంట్లో చిల్లర పని దొరికింది. బాలయ్య పైపును అందుకుని నీల్లునింపడం మొదలు పెట్టాడు. బట్టల సూట్‌కేస్‌లూ ఇంట్లకూ బయటకూ మోయడంలో మునిగిపోయాడు లింగం. బాధను మర్చిపోవడానికే ఏదోపని చేస్తున్నట్టున్నారు ముగ్గురు. బేలగా చూస్తున్నారు. అప్పుడే బీరిపోయినట్టు నిలబడుతున్నారు. అప్పుడే ఉలిక్కిపడి పనిలో మునిగి పోతున్నారు.

పొద్దుపైకెక్కుతున్న కొద్దీ హడావుడి పెరిగింది.అందరినీ ఎక్కడో కట్టగట్టి ఆపి ఒక్కసారి వదిలేసినట్టు గుంపులు గుంపులుగా జనం రావడం మొదలెట్టారు.

ముగ్గురికి టిఫిన్ తిన్న ప్లేట్లు కడిగే పని దొరికింది.దేవయ్య ప్లేట్లను తెచ్చి ఇద్దరి ముందు వేస్తున్నాడు. పెద్ద పెద్ద దేకీసాలు, బగోన్లు, అండలుకడుగుడు వాటికి మసి అంటకుండా బురుదను పెట్టించుడు, తోమినందుకు కట్నం అడుక్కునుడు అన్నీ గుర్తుకు వస్తున్నాయి. చేతులపని ఎవరో లాక్కున్నట్టనిపించింది.

"ఏది తప్పిపోయినా తిండిమాత్రం తప్పదుగదా! బోల్లు తోమేపని తప్పక ఉంట దనుకున్న ఆ పనిగూడా గోవిందా... హోటల్లోల్లకు ఆడరిచ్చిండ్రట" ప్లేట్లు కడుగుతూ అన్నాడు లింగం.

పేలవంగా నవ్వి పనిలో పడ్డాడు బాలయ్య. ఎక్కడినుండి చూశాడో కొండల్‌రావు పరుపరుగున వచ్చాడు. అతడి మొహం నిండా బాధ.

"అరేయ్... మీరెందుకు కడుగుతున్నార్రా...కడిగేందుకు మనుషుల్ని పెట్టిన... మీరు లేచి టిఫిన్ తినుండ్రి.. అంతే.....!" అంటూ ఎవరినో ఏదో పురమాయిస్తే ఇద్దరు ఆడమనుషులు వచ్చి చేతుల్లోని ప్లేట్లను లాక్కున్నారు.

ఆ పని చేయడం ఏ మాత్రం అవమానంగా లేదు ముగ్గురికి. పోగొట్టుకున్న పనేదో వెదుక్కున్నట్టుగా ఉంది. చేతుల్లోని పనిని ఎవరో లాక్కున్నట్టుగా ఉంది. ఇప్పుడు పాణం గిలగిల కొట్టుకుంటుంది. కలలో నడుస్తున్నట్టుగా ముందుకు కదిలారు ముగ్గురు.

టిఫిన్లు కాగానే పెండ్లికి ప్రయాణమయ్యారు. పొద్దున్నుంచి మేకప్‌కు కూర్చున్న పెండ్లికూతురు కారులో బయలుదేరింది. వెంట కెమెరాలు. మిగిలినవారు జీబుల్లో. జీబుల్లో సర్దాల్సిన సూట్‌కేస్‌లు సర్ది చివరి ట్రిప్పులో ముగ్గురు ఎక్కారు. ఎక్కడికి వెళ్తున్నారో తెల్సిపోయింది.

వెంకటేశ్వరా ఫంక్షన్ ప్యాలెస్ బోర్డు లేత ఎండకు మెరుస్తుంది. ముందు కార్లు జీపులు, సైకిల్ మోటార్లు, రకరకాల మనుషులు. పైన వేదిక చుట్టూ అల్లిన పువ్వులు. సన్నాయి చప్పుడు, స్పీకర్లో పంతులు చదివే పద్యాలు ఎక్కడ చూసినా ఖరీదైన వాతావరణం, మాటలు....నడక!

స్టేజీకి అటువైపు ఇటువైపు రెండుగదులు అటూ ఇటూ తిరుగుతున్న ఆడవారు. కింద వరుసగా కుర్చీలు.

ముగ్గురూ చివరగా వెళ్ళి నిలబడ్డారు. పెండ్లి కార్యక్రమం మొదలైంది. పటేలు, దొర్సాని, కొడుకు, కోడలూ.. ఎవరు తలెత్తిచూసినా తమకొరకే అన్నట్టుగా ముందుకు కదులుతున్నారు. ఏ పద్ధతిలో సాగుతుందో కాని కార్యక్రమం నడుస్తుంది. అంతవరకు గమనించలేదు గాని అక్కడున్న వారిని చూశాక సిగ్గుగా తమనితాము చూసుకున్నారు. అందులోనికి రావడానికిగూడా ఒక హోదా ఉండాలన్నట్టుగా అక్కడి మనుషులందరూ ఒకే రకమైన దర్పంతో దాబుతో కనబడుతున్నారు. అది గుర్తించాక ముళ్ళమీద నిలబడ్డట్టుగా ఉంది ముగ్గురికి.

రెండు వైపుల రెండు కెమెరాలు, రెండు మూడు ఫోటో కెమెరాలు, సెంటు స్ప్రే, హడావుడిగా తిరిగే మనుషులు. ఫంక్షన్ ప్యాలెస్‌లో పెళ్ళి అంటే విన్నారుగాని ఇలా ఉంటుందని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు.

"అరే దేవయ్యా! పటేలు ఎవలకొరకో చూస్తుండురా... నీకోసమే కావచ్చు. ఇప్పుడు పోలుపోత్తరు కావచ్చు. రుమాలు చుట్టుకొని పోరా...' మోచేత్తో ఉడికిస్తున్నట్టుగా అన్నాడు లింగం.

"ఈ.. సాలుతియ్యి.. నీ మురిపెమే జెప్పరాదు. పిల్ల, పిల్లగాడు ఎదురెదురుగా కూసున్నారు. ఇప్పుడు పోలు పోసుడేంది చిత్రంగ" అన్నాడు నీరసంగా దేవయ్య.

[illegible] మాయించటం. పూలు [illegible] కళ్ళముందు కదులుతున్నాయి దేవయ్యకు.

తన చిన్నప్పటినుండీ చూసిన పెళ్ళిళ్ళు, కొట్లాడి తెచ్చుకున్న కట్నాలు, 'సాకలోడి వంటే పెద్దకొడుకువు వీడ్రా! సావుకు తలారోడు, పెళ్ళికి సాకలోడు పెద్ద కొడుకులు. వీళ్లేగదా అన్ని పనులకు ముందు నడిచేది' అన్న మాటలు గుర్తుకొచ్చాయి. పెళ్ళిలో అల్లుకు పోయిన కథలు అనుభవాలు గుర్తుకొచ్చాయి తీపి తీపి జ్ఞాపకాల్లా!

"లింగమూ... ఇక్కడ మనముంటే అందరూ మననే చూస్తున్నారు. బైటకి పోదాం పదరా... ఇది మనసొంటోళ్ళుండే జాగకాదు "చోటెరుగని బొడ్డిమొగని పెండ్లికి పోయిందట' అన్నట్టుంది మనకథ. 'ఆసవడ్డనోట్లె పాసుపడ్డట్టయింది.' ఉన్నోళ్ళు ఉన్నోళ్ళ తోనే సోపతి జేత్తరు. పాము కుసుమిడిసినట్టు ఎప్పుడో ఒకయాల్లన తెల్వకుంటనే మనం దూరమైతున్నం" లింగం చెయ్యివట్టి లాగుతున్నాడు బాలయ్య.

చప్పుడు మోగుతుంది తలంబ్రాలు ఎత్తుతున్నారు. వీడియోలో రంగు రంగులుగా కనబడడానికి బియ్యంలో పేలాలు, రంగుల బంతులు కలుపుతున్నారు. ఇండియాలో పెండ్లి పద్ధతులంటే అమెరికావారికి చాలా ఇష్టమని సాంప్రదాయ పద్ధతిలో పెళ్ళి జరిపించాలని పట్టుబట్టారని అక్కడి వారు అనుకుంటే విని అర్థంకాని అయోమయంతో ముగ్గురూ బయటకు నడిచారు. చప్పుల్లను, సందడిని బట్టి లోపల ఏం జరుగుతుందో అంచనా వేసుకుంటున్నారు ముగ్గురు.

"ఇప్పుడు భోజనాలకు లేచినట్టున్నారు" దేవయ్య అన్నాడు కొంతసేపు ఆగినాక. గేటుముందు ఆటో ఒకటి ఆగింది. లోపలనుంచి కుర్చీలను మడతలుగా పెట్టి ఆటోలో వేస్తున్నారు. "అక్కడ పెళ్ళికి టైమైంది తొందరగా!" వెంట నున్న మనిషిని తొందర పెడుతున్నాడు టైం చూసుకుంటూ టెంట్ ఓనర్.

బ్రాహ్మణుడు బండిమీద పిట్టలా ఎగిరిపోయాడు. వెంట ఎవరో ఉన్నారు. ఒక్కొక్కరే వాహనాలను వెదుక్కుంటూ వెళ్తున్నారు ఆగమాగంగా.

హడావుడిగా ఎక్కడికో వెళ్ళబోతూ ముగ్గురుని చూసి పరుగు పరుగున దగ్గరికి వచ్చాడు కొండల్‌రావు. "అరే.. మీరు ఇక్కడున్నరేందిరా...? అన్నం తినుపోండ్రి. నిన్నటి నుండి చూస్తున్న మూలమూలలు ఈగినట్టున్నరేందిరా...?" అడిగాడు.

ఎవరూ నోరు తెరవలేదు. అడుగులో అడుగేసుకుంటూ లోపలికి నడిచారు. కుర్చీలు వేసిన స్థానమంతా ఖాళీగానే కనిపించింది. పెండ్లి పందిరి వద్ద కొద్దిగా సందడి. ఎవరూ కన్నెత్తి అటువైపు సూడలేదు. అన్నం తినే చోటికి నడిచారు.

అక్కడ మంది పలుచబడ్డారు. అడుగుతీసి అడుగు పెట్టరానట్టుగా బొక్కలు, అన్నం మెతుకులు, ఎంగిలి పల్లాల్లో కూడా...ఎవరో దులుపుతున్నారు. ఎవరో కడుగుతున్నారు. రకరకాల వంటలు, స్వీట్లు, ఐస్‌క్రీం. తిన్నదానికంటే ఎక్కువగా విడిచిపెట్టిందే!

"ఇస్తారువేసి కూసుండవెట్టి పెడితే కూరయినా అన్నమయినా బరుకతుంటది. తిన్నోల్లకు తుర్తిగుంటది. పెయిన పడుతది" ఆ బీభత్సాన్ని చూసి వికారంగా మొహం పెడతూ అన్నాడు బాలయ్య.

"ఇప్పుడు యాడజూసినా ఇట్లనే నడుత్తుంది" ప్లేటు అందుకుంటూ అన్నాడు లింగం.

"ఆ...ఇంత అద్వాన్నంగా మాత్రం కాదు" ముక్కురిల్చిస్తూ అన్నాడు దేవయ్య. ఎవరి పెండ్లో గుర్తుకు లేదుగాని, పందిట్లో మేకపిల్లను కొయ్యబోతూ విడిచిపెడితే మేక దొరుకక పొద్దంతా తిరిగాసని. ఒక పెండ్లిలో మేకనుకుని రాత్రి పూట దుడ్డెను కోసినమని తండ్రి నవ్వుతూ చెప్పిన మాటలు ఎందుకోగాని దేవయ్య బొచ్చెలో మెరిసినయి.

అక్కడి అంగడి చూశాక ఇంతకుముందు డాబుగా దర్జాగా కనిపించిన వారేనా ఇలా తిన్నది అనిపించింది. ఎవరికీ తినబుద్ధికాలేదు. నీల్లు మాత్రం తాగి బయటకు వచ్చారు ముగ్గురు.

వారికొరకే నిలిచినట్టు బయట జీబు. అందరితోపాటు ఎక్కి కూర్చున్నారు. ఐదు నిమిషాల్లో ఇంటి ముందున్నారు. ఇంతకుముందున్న టెంట్‌మాయం. అంతా ఖాళీ!

ఇంట్లో ఇంటి వాళ్ళదే సందడి. ఎక్కడెక్కడో తిరిగి సాయంత్రానికి ఇంటికి వచ్చారు ముగ్గురు. పెళ్ళికూతురు కొత్త పెళ్ళికళతో ఎదురైంది. అమెరికా పెళ్ళికొడుకు అక్కడలేడు. దొర్సాని హడావుడిగా తిరుగుతుంది. నాలుగైదు కొత్త మొహాలు. పటేలు మాత్రం తీరిగ్గా కూర్చున్నాడు. ముగ్గురిని చూడగానే దగ్గరికి పిలిచి సంతోషంగా అడిగాడు.

"పెళ్ళి ఎలా జరిగిందిరా.. బాలూ.. మంచి గనిపిచ్చిందా... మా చుట్టాలయితే గ్రాండుగ చేసిన వంటుండ్రు. చిన్న ఖర్చయినాదిరా..."

గంగిరెద్దులా ముగ్గురు తలూపారు.

"మల్లెపూల దండలకే ఐదు వేలయినయి. డెకరేషనుకు, పెండ్లి సెట్టుకు ఇరవై వేలు. సౌండ్స్‌కు.."

పటేలు చెబుతున్నవన్నీ వెయిలలెక్కలే! ఏవేవో ఎన్నడూ వినని మాటలు చెబుతున్నాడు పటేలు. పెయ్యంత జిలజిలమంది.

"పటేలా పోయస్తం. లేటయితే బస్సు దొరుకది" ముగ్గురు ఒకేసారి అన్నారు.

"అగో అంత తొందరేందిరా! రేపు పోండ్రి. ఇంటికాడ మావుల జేత్తరా." అదిలించాడు కొండల్‌రావు.

"వద్దు పటేలా వెళ్తం! ఇంటికాడ ఎదిరి సూత్తరు. దొర్సాని ఏదో పనిల ఉన్నట్టుంది. పోయినమని సెప్పుండ్రి" చెప్పినా వినకుండా ముందుకు కదిలారు. మొహాల్లో రక్తం చుక్కలేదు. ఏదో పోగొట్టుకున్నట్టు వెలితి బాధ.

వీధి మలుపు తిరగుతుంటే కేక వినిపించింది. ముగ్గురు వెనక్కి తిరిగి చూశారు. ఇంట్లోని పనిమనిషి పరుగెత్తుకు వస్తున్నాడు.

"ఇదిగో మీరు ఈ ముల్లెను మరిసి పోయిండ్రట" నెత్తిమీద ముల్లెను అందిస్తూ అన్నాడు. వెంటగోరుగాలు, గిన్నెకూడా!

వాళ్లు కనీసం విప్పి చూసినా, కులపోల్లతో కొట్లాడి రెండు రాత్రులు నిద్ర మాని జాజుపలుకను అందంగా గీచిన శ్రమను మర్చిపోయేవాడేమో బాలయ్య. ముల్లె ముల్లె

లాగనే ఉంది అందుకుని భుజాన వేసుకున్నాడు. ముందటికంటే బరువుగా అనిపించింది గోరుగాలు, గిన్నెను జేబులో వేసుకున్నాడు లింగం.

"మల్లెపూలకు ఐదువేలట. ఐదు వందలిస్తే మనం ఆరు నెలలు పేరు జెప్పుకొని తిందుంటిమి" బస్సెక్కుతూ గొణుక్కున్నాడు లింగయ్య.

"వాడంటే కార్లల్ల జీబులల్ల వచ్చె. మల్లెపువ్వులు అమ్ముడంటే మన తమ్మలి రాములు తీర్గ దండలు కట్టిచ్చినట్టనుకున్నవా...? అదో బిజినెస్.." వెనుకనుంచి అన్నాడు దేవయ్య.

ఊరిపొలిమేరల్లో దిగే సరికి చీకటయింది.

బస్సు మలిగే చోటనే కంకర, ఇసుక, పునాదులు, బేస్‌మీట్.. డ్రైవర్ విసుక్కున్నాడు.

ముగ్గురూ బస్సు దిగారు.

"చూసినవా మామా.. పెండ్లికి ఖర్చులేం తప్పలేదు. ఒకటికి రెండింతలయినయి. అచ్చిన చిక్కల్లా మనసొంటోడు బతికే ఖర్చుగాదు. మనకు పూట తిండి దొరికే పెండ్లి గాదు. ఇంతకుముందు మన ఊర్లె ఏ పెండ్లి జరిగినా మనకింత తిండి దొరికింది. ఖర్చుకు కట్నం దొరికింది. ఇప్పుడు జూసినవా...? ఆ పద్ధతి సాపకింది నీరు లెక్క ఇక్కడికస్తుంది" కట్టడాన్ని చూపిస్తూ అన్నాడు దేవయ్య.

లింగయ్యకూ, బాలయ్యకూ ఒళ్లు జలదరించింది. ఏదో రాక్షసగుహను చూసినట్టుగా భయమేసింది. ఆ పునాదుల్లో తమలాంటి వారినెందరినో పాతరేసి సమాధులు లేపినట్లుగా అని పిస్తుంది. ఇద్దరి కళ్ళల్లో సన్నటి నీటిపొర.

ఏదో గుర్తొచ్చినట్టు బాలయ్య పునాదులవద్దకు గబగబా నడిచాడు. భుజం మీదున్న కుండల మూటను అందులో వేసి పిచ్చిపట్టినట్టు మట్టిని కప్పి ఊరివైపు' వడివడిగా అడుగులేశాడు.

అప్రయత్నంగా లింగం చేతులు కదిలాయి. పునాదిలో గోరుగాలు, గిన్నె, ఐదు దోసిల్ల మన్నుపోసి, పొట్టను చేతపట్టుకుని బాలయ్య వెంట అడుగులేశాడు.

పునాదిరాళ్ళను, ఇసుక, కంకరను మార్చి మార్చి బాంబులు పేలుతాయా..? అన్నంత భయంగా చూస్తూ వారివెంట నడిచాడు దేవయ్య.

ఏడాది తిరక్కముందే.. భవనంపై 'వాసవీ మ్యారేజ్ హాల్' బోర్డు వెలిసింది.

కులవృత్తులు ఈనాడు కాదు ఏనాడో పోయినయి. కనీసం పెండ్లితో ముడివడ్డ ఒకటిరెండు పనులైనా పట్టణాల్లో ఎప్పుడో పోయినయి. అవి ఇప్పుడు పల్లెల్లో కూడా...

ముగ్గురూ దాని ముందు కూర్చుని పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటున్నారు.

● 2000 ●

# 69. గుంగీ ధడ్‌కన్

♦ గౌస్ మొహియుద్దీన్ ♦

గాజుల సప్పుడ్కి తలెత్తి సూశిన. బావ ఉన్న అర్ర తల్పులు బంద్ అయినయ్. కిట్కి మూసిన సప్పుడు వచ్చింది. లైటు కండ్లు మూసుకున్నట్లుంది చీకటి రాజ్యమేల్తుంది.

లోపల్నుంచి ఫ్యాన్ సప్పుడు. బావ ఎంట లోపల్కెల్లిన చెల్లె అప్పట్సుంది ఈణ్నే కూసొని మల్లెపూలల్లింది. ఆడిన్నీ ఆడిన్నీ పడున్న పూల వాసన గుప్పుమంటుంది. అర్ధ గంట సందిపానం దీస్తున్న ఆ వాసనకి తట్కో లేకపోతున్న.

బావ బియిడి జైన్ ఐన తొలి దినాల్ల రోజూ ఆల్ల ఊరికి పొయ్యేచ్చేటోడు. దినం మొత్తం కాలేజీకి బోయి మల్లీ ఊరికిక పోతానికి చేతైతలేదని మా ఇంట్లనే ఉండాలన్కుండు.

ఇంటల్లుడు అన్కున్నంక మేం ఏం చేయగల్గుతం. ఒంటర్ర ఉండలేడు కద! గందుకే... మా ఇంట్లనే అడ్డ ఏశిండ్రు. చెల్లెల్‌కి పెండ్లిచేస్తే చదువు ఒడ్సుద్దన్కుండు అబ్బ పెండ్లికి మునుపు బిడ్డ బరువన్పిస్తే పెండ్లయినంక అల్లుడు తలకు మించిన భారమైండు.

మేం ఇంట్ల అదో ఇదో తిని దినాలు నెట్టుకొచ్చేటోల్లం. ఆరు నెల్ల సంది ఇంట్ల అల్లుడూ బిడ్డ, గోగ్గూరా, గొడ్డు కూరా ఒండొద్దు. పొద్దుడాం దిల్ గుడ్డే మాపట్కి దేశంకోడి దస్తర్‌ఖాన్‌ల నడుమ అప్పులు పెర్గిపోతున్నయ్. ఏం చేయాలె? బియిడి చేస్తే బావకు కొలువైతదేమోనని ఆశపడిన. గిట్ట జర్గుతదన్కుంటే ఆ దలిందర్ ఐడియా ఇయ్యక పోదును. బావ నేను కల్సి అన్నం తిన్నంక ఇప్పట్టాక పక్కనే కూసుండె. ఆల్ల కాలేజి ముచ్చట్లు ఏవేవో చెప్పిండు. తలాడిస్తూ తప్పదన్నట్టుకూసున్న. నడుమ నవ్వినట్టు కూడా చేసిన. గంట దాక బోర్ చేసి తన అరల్లకెల్లిండు.

ఈ పాలి ఎట్లైన రాయాలన్కొని పెన్నూ పేపర్‌ని తీస్కొని కూసున్న. ఎన్నో దినాల సంది అన్కుంటున్న ప్రతిపాలీ వాయిదా పడుతూ ఒస్తుంది. ఈ పాలైనా వాయిదా వెయ్యొద్దు మతిల ఉన్నయన్నీ కాగితంల కెక్కించాలె. ఒక కహాని రాయాలె. కాని ఎట్లా మొదల్పెట్టాలె?

అసలు మొదల్పెట్టడమే చానా కష్టమనిపిస్తుంది. ఇంతకు మునుపు దోస్తు అన్నట్లు యాదికొస్తుంది. మంచి మొదలు దొర్కితే కహానీ సగమైనట్టేనని.

ఎంత నిజం చెప్తడు. తాగినంక పనికిరాని చెత్త వాగుడు వాగుతరని ఇన్న. కాని అందరూ అట్ల కాదేమో!

ఒక్కమారు కాదు ఒందలమార్లు చూశిన. తాగనప్పటి కన్న తాగినప్పుడే మస్తు నిజాలు మాట్లాడ్తడు. తాత్విక లోతుల్ని తడ్ముతా దిమాఖ్‌లలోకి చొచ్చుకపోతడు. ఈ నడుమ తాగుడు చానా ఎక్కువైనట్లుంది. ఇట్ల తాగితే ఆరోగ్యం ఏమైతది?

'చూడూ నూ తాగుడు తగ్గించు, ఆరోగ్యం ఖరాబైతది' ఎన్నో మార్లు చెప్పిన. పెద్దగ నవ్వుతడు తత్వవేత్త లెక్క.

ఐనా తాగాలన్పిస్తదేమో? తాగాలన్పించినంక ఆరోగ్యం, అనారోగ్యం అని కోర్కెను సంపుకోడం ఎందుకు ?

నాకిప్పుడనిపిస్తుంది, బతికినన్ని దినాలు ఇష్టమొచ్చినట్లు అడ్డగోలుగా బతకడమే కరక్టని కొన్ని బతుకులు ఎంత భద్రతను ప్రేమిస్తయ్!

సొంత కొంపా, పెండ్లాం పోరలూ బంగారు బాతు కొలువు. పొద్దు గూకంగనే పక్షులు గూల్లకి బొయినట్లే ఇంట్ల వాలడం. మల్లీ పొద్దున్నే చాయ్, పేపర్, ఇల్లూ, ఆఫీసు.... ఎంత రొటీన్.

ఈల్ల కండ్లకి మేము ఒట్టి బేకార్ గాల్ల లెక్క, పనీ పాటా లేని తాగుబోతుల్లెక్క ఔపడ్తం, చర్చలూ, రచనలూ అంటూ జీవితాల్ని బేకార్ చేస్కుంటోల్లం.

అసలు ఈల్ల అనుకోడాల్ని గిచ్చుకోడాల్నీ ఆల్లకే ఇడ్సిపెట్టి మంట పెట్టాలె. మన బతుకూ మనం బతకాలె. శ్రీశ్రీ, చలం ఎట్ల బతికిండ్రు.

'నూ తాగుడు బంద్ జేయాలె' అని నేన్చెప్పినప్పుడు ఎంత తాత్వికంగ నవ్వుతడు అది నీకు సమజ్ కాదిప్పుడు. ముందు ముందు తెల్సుకుంటవ్ అన్నట్లు రకరకాల అర్థాల్ని పలికిస్తడు తన నవ్వుతో.

నిజమే! ఏ విషయం నాకు తొందర్గ సమజ్తైందని?!

సమజ్ చేస్కున్నోన్నయితే నేను చేయకుండనే బియిడి చేయమని బావకు చెప్తనా?

ఆయనకేంది? హాయిగా ఈణ్నే ఉన్న మైనార్టీ కాలేజ్‌ల బియిడి చేస్తుండిప్పుడు. డిగ్రీ అయినంక ఒక ప్రవేటు కంపెనీల చిన్నపాటి కొలువు చేసెటోడు. ఒక్కగానొక్క చెల్లె. సర్కాకు కొలువు ఉన్నోన్కి ఇయ్యాలనే ఆశపడిన. గందుకే ఈ సంబంధం ఒద్దని ఇంట్ల లడాయి చేశిన. కాని నామాట ఓల్లింటరు?

సర్కారు కొలువోల్లు యాడున్నరు? అయిటంక వయసు మీద బడితే ఈపాటి సంబంధాలు కూడా రావని' కొంపలంటుకు బొయినట్లే పెండ్లి చేశిండు అబ్బ.

సరే! నేనన్కొన్నది ఎన్నడు జర్గింది? అని నేను సమ్జాయించుకున్న. 'షాది అయింది చాలు' అన్కొన్నట్లుంది చెల్లె కూడా నోరిప్పలేదు. అసలు దానికి ఎన్నడు నోరిప్ప నిచ్చినమని.

పెండ్లయినంక చేస్తున్న కొలువుకు కూడా దూరమైండు. ఆల్లింటికాడ ఒట్టిగానే ఉండెటోడు. గప్పుడే 'బియిడి చేస్తవా?' అనే ముదనష్టపు ముచ్చట జెప్పిన.

మంచిగన్పించినట్లుంది. తొందర్గనే ఒప్పుకుందు. దరఖాస్తు చేశిందు

'ఈ పాలైనా చెయ్యాలె' అన్కొని నేనూ కూడ దరఖాస్తు చేశిన. అప్పట్కే రెండు మార్లు చేశినోన్ని.

ముంగటిసారే మైనారిటీ కాలేజ్‌ల సీటొచ్చింది పోస్ట్‌మ్యాన్ లెటర్ తెచ్చిచ్చిండు. ఖుషీల మున్గిపోయిన. దోస్తులందర్కి చెప్పిన ఆల్లందరూ మస్తు ఖుషైండ్రు దావత్ అడిగిండ్రు. ఆ దినమంతా ఖుషీగ గడ్పినం.

మాపట్కి అబ్బ ఒచ్చిండు. 'మగ్రీబ్' నమాజ్ సదివి కుర్సిల కూసుండు. అబ్బకాడికెల్లి లెటర్ సూపెట్టిన. ఖుషయ్యే బదులు ఆలోచన్ల బడిండు.

ఔతల జీపు సప్పుడు పోలీసోల్లయుంటరు ఈగల్లీల పొంటి కూడా పెట్రోలింగా? పొద్దుగాలైన గొడవ ఇంకేమైన పెర్గిందా ఏంది?

ఇయ్యాల పదిగొట్టగ గణేష్ ఊరేగింపు మాన్యం చల్క మూలమడత దాటి మసీదు గల్లీల ఒచ్చినంక డప్పులు, కేకలు ఎక్కువైనయ్. ఒకల్లపై ఒకరు రంగులూ, కుంకుమా ఏసుకుంటునప్పు మసీదు గోడలమీద కుంకుమ పడిందని మసీదుల ఉన్న ఇద్దరు పోరలు చెప్పిండ్రంట.

గాదాన్నే సాకుగా దీస్కొని ఆడ కోలాటం ఆడుతున్న పోరలు చేతులల్ల ఉన్న దుడ్డు కర్రల్తో అల్లమీద బడిండ్రు. అంతట్తో ఆగక ఆడున్న పండ్ల బండ్లపై, పాన్ డబ్బాలపై బడి ఆగం ఆగం చేశిండ్రు

ఆడ పోలీసులున్నా ఏదో చోద్యం సూస్తున్నట్లు నిలబడిండ్రు. ఆ ఇద్దరు పోరలకి సీరియస్‌గా వున్నదంట! పండ్ల బండ్లని ఆగం ఆగంచేస్తుంటే అడ్డంబోయిన పాషామియా కూడా సీరియస్‌గా వున్నడంట.

ఆ దినం పండ్కునేటప్పు అమ్మితో బడేకు సీటొచ్చింది తీస్ హజార్ కట్టాలె. ఔతల 'మున్నీకి 'తిప్పర్తి' వాల్ల సంబంధం ఖరారయ్యేటట్లే ఉంది. 'షాదీ' చెయ్యాలె. పైసలు షాదీకే లేవు ఈడికి యాణ్ణుంచి తెచ్చి కట్టాలె? షాదీ ఎట్లచెయ్యాలె? సమజైతలేదు' అంటూ చెప్పుకుపోతుండు అబ్బ.

అమ్మి నూత్రం గప్‌చుప్‌గా ఇంటుంది. నా దిల్ చుక్నాచూర్ ఐంది. నా ఖుషీ రెక్కలు కత్తిరించబడి విలవిల్లాడింది. రాత్రంతా నిద్రపట్టలేదు.

మరు దినం 'లాస్ట్ డేట్ ఇంక ఏడు దినాలుంది కద సూద్దాం' అన్నడు అబ్బ.

ఒక్కొక్కదినం గడుస్తుంటే ఆశల హరివిల్లుల ఉన్న ఒక్కొక్క రంగూ దూరం ఐతుంది. ఆఖర్కి హరివిల్లు గైబైంది. లాస్ట్‌డేట్ దాటిపోయింది. తిప్పర్తి సంబంధం తిప్పర్తిలనే ఉండిపోయింది. ఆడికి మేమివ్వ గల్గింది చాన తక్కువన్పించిందంట. ఆడు మెట్టు దిగలేదు. మేమెక్కలేకపోయినం.

ఇట్ల మెట్లు దిగనోల్లతో సరితూగలేకనే ఎంతోమంది పోరీలు పుట్టింట్లనే మగ్గుతుండ్రు ఒకరోకు పెర్గుతున్న వయసు. ఇంకో రోకు చుట్టు పక్కనోల్ల సూటి పోటి హింసను భరిస్తుండ్రు

పోరగాల్ల విషయాన్కొస్తే వేలల్ల ఒకడు కొలువు చేస్తున్నోడు. అది కూడ అయ్య వాలంటరీ రిటైర్మెంట్ తీస్కొంటేనో, నడిమింట్లనే టపా కట్టేస్తేనో దొర్కినోడు. ఆడు

లక్షల్ల కూసుంటుండు.

ఇక ఈడ ఆవారాగ తిరిగి ఎట్లానో అట్ల కొన్ని పైసలు. జమజేస్కొని అరబ్ దేశాలకి పొయ్యొచ్చినోడు రెండో రకం. వచ్చీ రావడంతోనే పెండ్లి. ఆడికీ లక్షలు కావాలె.

ఆఖరి రకానికొస్తే మెకానిక్కులు, డ్రైవర్లు. పండ్ల, పూల వేపారులు. ఆల్లకూ వేలకు వేలు కావాలె.

ఈ వేలూ, లక్షలూ లేకుండా చేస్కొరనే అవ్వొచ్చు మొన్న ఒక పోరి దుర్గయ్యతో ఫరారైంది.

ఆకాశం పడిపోయినట్లు, సూర్యచంద్రులు ఢీకొన్నట్లు ఫీలయిండ్రు చానామంది. ఎంతో గడ్ బడ్ చేశిండ్రు. ఆ పోరిని, ఆ ఇంటిని ఆఖర్కి ఆ ఖాన్‌దాన్నే మస్తు తిట్లు తిట్టిండ్రు. ఆల్లిద్దర్నీ సంపుతమని చానా ఎతికిండ్రు. ఈ హక్కు ఈల్లకు యాడిది? అసలీల్లు కొండపైన కూసున్నందుకే కద! ఈల్లలో ఎవ్వడైనా నయాపైసా తీస్కోకుండా చేస్కో గల్గుతడా? అది మాత్రం చేతకాదు. ఆడు చేస్కోడానికి తయారైండు. ఆమె చేస్కోంది నడిమింట్ల ఈల్లకేందో గోకుడు.

ఆసలిట్లాంటి గోకుడు గాల్లుండబట్టే ఈ నడుమ ఎవ్వరితో కల్వాలన్పిస్తలేదు. తెచ్చి పెట్టుకున్న నవ్వుల్తో, జబర్ దస్తి షేక్ హ్యాండ్‌లతో పరేషాన్ అయితున్నం.

'కల్సేసరికి యాడున్నవ్? ఏం చేస్తున్నవిప్పుడు?' ఒక్కపూట అన్నం బెట్టినోడు కాడు కాని నేనేం చేస్తున్ననో కావాలె.

'ఏం చేస్త లేవా?! అరె ఎట్ల మరి!' రేపట్నుంచి ఈడి కొంప మీదపడి తింటున్న ఫీలింగ్....ఈల్ల ఈ ప్రశ్నలకి మదిల ఒకే ఒక్క జవాబు 'మా ఇంట్ల లేనప్పుడు నీ ఇంటికొస్తున్న.'

'అసలు నూ అప్పుడే చానా తప్పు చేసినవ్. బియిడి చేయాల్సుండె... పంతులు కొలువులు సూడు....'

ఈడికేం తెల్సు నా బాధ....గప్పుడేమైన సహాయం చేశిండా అంటే అదీలేదు. ఈ ఎధవలు ఎధవ సలహాలు ఇయ్యడం ఎప్పుడు బంద్ చేస్తరో?

'దావత్ ఎప్పుడిస్తున్నవ్?'

'దావతే కద! ఇప్పుడిస్తపట్టు'

'అట్లంటి దావత్ కాదు. పెండ్లి దావత్ కావాలె.'

'ఇస్త ఇస్త'.... నేను పెండ్లి చేస్కోకపోతే ఈడికొచ్చిన ప్రమాదమేందో?! ఈడి ఇంటోల్లకు ముంచుకొస్తున్న గండం ఏందో?

ఎందో ఓడితో కల్సినా రెండు నిమిషాలు మాట్లాడలేనితనం. అసలు ఈల్లకని ఏం లాభం. జీవితాల్ని ఫ్రేమ్‌ల లెక్క దిమాఖ్‌లల్ల బంధించుకున్న సుఖజీవులీల్లు.

ఇంక రెండో దఫా మల్లీ సీటొచ్చింది. ఈ దఫా నలభై వేలు కట్టాలె. కాలేజ్ నుంచి లెటరొచ్చింది. ఈణ్నేమో ముస్లీంకి సంబంధం కుదిరింది. అబ్బ పెండ్లి పనులల్ల మునిగిండు. నేనింక ఆ లెటర్‌ను ముంగటి లెటర్‌కు జతచేసి పెట్టిన.

నిరుడు డిసెంబర్ల గడ్‌బడ్ లైనప్పుడు తుర్కపోరలందర్నీ ఇండ్లపైబడి పట్కపోతుండ్రు. పట్నమంతా అట్టుడ్కిపోతుంది. ఇసోంటి గడ్‌బడ్‌లైనప్పుడు ఈ పోలీసోల్లు కండ్లకి మేమే ఔపడ్తమెందుకో?! ఏం చేయాలి? రెండుదినాల్దాకా టెన్షన్ భరించ లేకపోయిన. నానమ్మ ఊరికి పోదమన్నుంటే బస్సులు నడుస్తలేవు. బైటకి బోలేం? ఏం చేయాలె? ఎటూ సమజైతలేదు. టెన్షన్ పెర్గుతుంది. పోలీసోల్లు ఎప్పుడొస్తరో? ఎప్పుడు పట్కపోతరో? పట్కపోతే ఇజ్జత్ సమస్య. నాకన్నా ఎక్కువ నా అమ్మీ అబ్బాలకి. నా చుట్టాలకి. ఇంట్లనే ఉందామన్నొంటే నరాలు తెగిపోయె టెన్షన్.....

ఖిస్మతో, నసీబో కనీ ముంగిటింటి పోలీస్ మునీర్‌సాబ్ వాల్లకొడుకు 'రసం' అని స్పెషల్ పర్మిషన్‌తో చౌటుప్పల్ పోతుండ్రు. ఈ సంగతి తెల్సేసరికి రేపట్నుంది హైద్రాబాద్‌ల పరీక్షలున్నయ్. చౌటుప్పల్‌ల ఇడ్సిపెట్టమని' మునీర్ సాబ్‌కి అబ్బతో చెప్పించిన.

ఈడుండడానికి భయపడి ఫరార్ అయితుండని ఓల్లైన అన్కుంటరేమోనని అనుమాన పడిన. ఏ తప్పూ చేయకుండనే ఇసొంటి టెన్షన్‌తో ఫరార్ ఐననంటే ఎంత భయంగ బతుకుతున్నం.

ఇయ్యాల కూడ మసీద్‌ల ఉన్న పోరల్ని కొట్టినందుకు ఏమైన లొల్లి పెడ్తరేమోనని మాన్యం చల్క పొంటి ఉన్న తుర్క పోరగాల్లందర్నీ పట్కపోయిండ్రు పోలీసోల్లు. గడ్‌బడ్ ఎక్కువైతే మమ్ములగూడ పట్కపోలేరు. ఎందో? గొడవ చేసేదోకల్లు, పట్కపోయేదొకర్ని. అడిగేదోల్లు? అసలీడ న్యాయం ఎప్పుడూ ఉందదేమో?! చెప్తానికైతే ఈల్లకు అందరూ సమానమే. సమానమూ లేదూ సద్దిమూటలూ లేదు. సర్కారు ఆల్లది. పోలీసోల్లు ఆలోల్లే. గడ్‌బడ్ చేసేటోల్లు ఆల్లే.....హింసించేటోల్లు ఆల్లే, ఈడ మేమే పరాయోల్లం.

మొన్నటి దఫా మల్లీ హైద్రాబాద్‌ల. సీటొచ్చింది. ఈ దఫైనా తప్పకుండా చేపించా లంటూ పైసలు జమ చేసిపెట్టిండు అబ్బ. నేను బియిడి చేయడం ఖరారైంది. మూడో దఫాన కల ఫలించిందన్కున్న.

బావకు చానా 'పెద్ద' ర్యాంకు ఒచ్చింది. పైసలు ఎక్కువ అడిగిండ్రు. కాబోల్లు. 'అన్ని పైసలు' మేం కట్టలేం ఒక ముప్పైవేలు మీ అత్తోల్లనడుగు' అన్నరు ఆల్ల అమ్మా, అయ్య.

చెల్లె ఒచ్చి అమ్మికాడ ఏడ్చింది.

'ఏం చేస్తం? ఆడ పిల్లనిచ్చినోల్లం జరంత ఓపిక పట్టాలె.' అని పైసలు మొహంమీద కొట్టిండు అబ్బ.

ముంగటి రెండు లెటర్లకు మూడో లెటర్ తోడైంది.

డౌట్‌లేదు. ఈడ మేము పరాయోల్లమే. ఈడ మమ్ముల రక్షించేవాల్లే లేరు.

చేయి లౌకికత్వంని మంటగల్పిందని సైకిల్ నెక్కితే గదేమో కమలపు తోటల కెల్లింది. కాషాయ జెండేమో ఎర్రకోట నెక్కి, పాతబస్తేమో కరపత్రమై ఎక్కిరించినయ్.

అసలు శుక్రవారంనాడే మా వాడకట్టులల్ల కరంటు, నల్లాలు ఎందుకు బందైతయో సమజ్ చేస్కోలేని విషయం కాదు. ఎందో! ఈడ మాకు అన్నీ

వ్యతిరేకాలే. అసలీడ మాలో ఎవడూ దేశభక్తిని సూడడు. మేమందరం 'జిన్నా'లుగా జెపడ్తుంటం ఆల్లకు.

మేధోశక్తిని ధారబోసిన మౌలానా ఆజాద్ మా వోడు కాడా?! దేశాన్ని అగ్ర దేశాల పొంటినిలబెడ్తున్న అబ్దుల్ కలామ్ మావోడు కాడా?! ఈల్లల కూడా పరాయి భక్తిని సూపెట్టగల్గుతర ఆల్లు?

ఒక నెలదినాల్లో బావతో నారాజ్‌గ ఉండిన. నాతో పాటు చానా బాధపడిండు అబ్బ. పెనిమిటికి సీటొచ్చినందుకు చెల్లె ఐతే మస్తు ఖుషైంది. అదే దినం మాపడ్డాం బావ మిఠాయి దెచ్చిండు అందర్కీ పంచిండు. మనసుల ఏమున్నా 'ముబారక్' మాత్రం చెప్పిన బావ కూడ మిఠాయి దిన్నడు. నేను మాత్రం తినలేకపోయిన.

బావ మిఠాయి తింటుంటే నా జీవితంనే తింటున్న ఫీలింగ్....

నన్నే కొరుక్కు తింటున్న ఫీలింగ్.....

మెదడ్ల ఏవో పురుగులు తొలుస్తున్న బాధ.....

గుండెల్ని ముండ్ల కంపలై ఏసి నల్పుతున్నట్లు.....

తట్కోలేక అన్నుంచి లేశిన.....మనసు ఒంటరితనాన్ని దోలాడ్తుంది. కొంపల యాష్టైనా ఓల్లో ఒకరు ఏకాంతం కావాలె. గుండె బరువైతుంది. బాధ తట్కోలేకపోతున్న ఏకాంతం కావాలె.

కానీ సోటేది?

ఎటూ సమజ్ అవక పాయఖానల కెల్లి దర్వాజ బంద్ జేసుకున్న. బొటబొటా కల్లెంబడి నీల్లొస్తున్నయ్. ఎక్కి ఎక్కి ఏడ్చిన పది నిమిషాల్కి బైటికొచ్చి ముఖం కడుక్కున్న గుండెల్ల బాధ కన్నీల్లై పారబట్టి కాస్త రిలీఫ్ అన్పించింది.

ఆ! సూపెట్టగల్గుతరు. అబ్దుల్ కలామ్‌లోనూ, అజహరుద్దీన్‌లోనూ పరాయి భక్తి సూపెడ్తరు. ఆల్లు అన్కోవాలెగనీ ఎదైన చేయగల్గుతరు. ఎక్కాల్ 'సారేజహా సె అచ్ఛ'ల గూడ తిట్లనీ, పరాయిభక్తిని సూపెట్టగల్గుతరు. బెంగాలీ మాట్లాడేటోల్లందరూ బంగ్లా దేశీలని ఎల్లగొడ్తలేరా? బాంబు పేలుల్లు, తీవ్రవాదులంటూ పదిహనేండ్లు నిండని బుడ్డ తలకాయలకి లక్షలల్ల ఇనాంలు ప్రకటిస్తలేరా? ఆల్లకే మొట్టికాయ ఏశిన శ్రీకృష్ణ కమీషన్ గతేమైంది. అంతే! ఆల్లు అన్కోవాలెగని ఏమైన చేస్తరు.

కొంచెంసేపట్కి అబ్బ పిల్చి 'ఒచ్చే దఫా చేద్దూలే బేటా' అన్నడు. మల్లీ గుండె లోతుల్ల నుంచి పూడ్కెను తొవ్వితీశినట్లన్పించింది. బాధతోటి మెల్కలు తిర్గిపోయిన. కాని ఏం చేయగల్గుత. ఖామూష్‌గ ఉండిపోయిన. ఒచ్చే యేడు మల్లీ ఎంట్రన్స్ రాయాలె.

అసలీ మైనారటీ కాలేజ్‌లలో రూలు ప్రకారం నాల్గున్నర వేల ఫీజు తీస్కోవాలె. కాని ఈల్లు ముస్లింల సేవ చేస్తున్నమంటూనే వేలకు వేలు గుంజుతున్నరు. యాభై వేలు, అరవై వేలు ఓడియ్యగలుగుతడు. ఇయ్యగల్గినోడు యాన్నైన చేస్కుంటడు. మాలోంటోల్లకు కాస్తకూడ లాభం లేదు. గరీబ్ ముస్లింల సేవ అంటుంటనే పైసలు గల్గినోల్ల కొమ్ము కాస్తుండ్రు ఈల్లు.....

తలుపు సందుల నించి ఒస్తున్నట్లుంది... జెట్ వాసన... ఈడున్న మల్లె పూలకు

పోటీగా మత్తెక్కిస్తుంది... ముక్కు పుటాలు అదురుతున్నయ్... ఏవేవో ఊహలు దిమాఖ్‌ను చుట్టుముడ్తున్నయ్ .....

అప్పుడ్దాక నా పక్కనే కూసున్న బావ...

నాతో అవీ ఇవీ మాట్లాడిన బావ

కాలేజి ముచ్చట్లతో బోర్ చేశిన బావ

ఇప్పుడు....అబ్బా...

ఎంత ఖిస్మతున్నోడు.....

కండ్లు మంటల్ని విరజిమ్ముతున్నయ్...చుట్టూ కుంపట్లు అంటుకున్నట్లు సెగల్ని వెల్లగక్కుతున్న చెవులు.

గుండెల్ల బాధ. నిప్పులపై కూసున్నట్లు ఏడెక్తున్న శరీరం మూల స్తంబం గోల పెడ్తుంది...

తడారిపోయిన నాలుక. ఎండిపోయిన గొంతు. దూపైతుంది. నీల్లన్న తాగాలె. పేపరూ పెన్నూ పక్కన బెట్టి లేశిన.

నీల్లకుండ కాడికెల్లి ఒకటి...రెండు... మూడు....నాల్గు గ్లాసులు తాగిన కడుపు బరువెక్కిపోయింది. దూప మాత్రం తీరలేదు. నీల్లతో తీరేది కాదు.....!

ఇప్పుడ్దాకా నేనూ, బావ పక్క పక్కనే. .. ....

కాని ఇప్పుడు తలుపులకివతల నేను. తలుపులకు ఔతల బావ.....

అతను స్వర్గ సుఖాలల్ల.....నేను .....

తల పగిలిపోతంది. కనతలు ఎగిరెగిరి పడుతున్నయ్. ఒత్తిపట్టుకున్న పడిమింట్ల ఈ తలనెప్పి ఏందో ఉన్నయ్ తక్కువైనట్లు. చాయ్ తాగితే బాగుండె. కాని ఎట్ల? బైటికి పోలేము. ఇంట్లనే ఐతే.....పాలున్నయో లేవో? అమ్మినడుగుత. అయ్యో అమ్మి పండుకుంది.

పాపం! ఏ పొద్దుగాల్లో లేశిన అమ్మి. పొద్దుట్నుంది ఒంటింట్లోనే. ఇప్పుడిప్పుడే పండుకున్నట్లుంది. ఒద్దు. లేపొద్దు

పెరట్లకి బొయి అటూ ఇటూ తిర్గుతున్న. ఇనేండ్లొచ్చినా దూపతీర్చుకోలేను. చిఛీ.....

కొన్నేండ్ల కింద పక్కింటి పెద్ద కోడలు ఎట్లనో సూశేది. ఔపడిన ప్రతిమారూ కండ్లతో అంగీకారంని కుర్పించింది నేనే పిచ్చోన్ని. సమజ్ చేస్కోలేకపోయిన. సూశినప్పుడెల్లా మనుసు గడ్‌బడ్ చేశినా 'నీ తప్పు' అన్కొన్నా.

పరాయి కండ్లని తాకడం 'హరాం' అయితదని చిన్నప్పట్నుంది నూరిపోసిన హోరు చెవులల. ఔపోసన పట్టిన ఉర్దూ పుస్కాలు నాలోని ఉత్సాహంని అనగ దొక్కినయ్. నీతి బుర్దల చిక్కుకొని విలవిలలాడిన. తెల్వి తెచ్చుకొని దారికొచ్చుసరికి తను లాభం లేదన్కుని అమాయకున్నన్కుంది. మస్తు పవిత్రున్నన్కుంది దూరం ఐంది.

అబ్బా... ...!

ఇంక ఇంకో తోవలేదని మెదడు అల్బంని తిప్పుతున్న.

లిరిల్ పోరి గంతులేస్తుంది రంగీల హీరోయిన్‌కు పోటీగా.

దోస్తు దుకానంల సిగ్గుముద్దవుతూ మనసుల గడ్‌బడ్ చేస్తుంది.

కొలిమిల ఏసిన ఇనుప ముక్కలెక్క చేతులల బిర్రుగై ఏడెక్కుతుంది తాబేలు తల.....

భయం భయంగనే సెగలు చేస్తున్న పక్కింటి పెద్ద కోడలు హుషారు పెడ్తుంది 'జీన్స్' ఐశ్వర్యరాయ్ లెక్క.....

ఉచ్ఛ్వాస నిశ్వాసల హోరు....అంతెత్తుకు ఎగిరిపడ్తున్న అలలు.

శరీరం సముద్రంలో తుఫాను తీరాన్ని దాట్తుందన్కోంటున్న టైంల పెరట్ల లైటు ఎల్గింది. ఉలిక్కిపడి ఈ లోకంలకొచ్చిన.

కునుసుల తిర్గుతున్న అల్బం ఆగమాగమైంది. అందమైన గులాబి తోట కాలి బొగ్గైంది. అంచుల బైటికి చిమ్మాల్సిన ఆనందం ఆవిరైపోయింది.

ఛి...ఛీ.....గిట్ల గూడ జర్రంత మోకా ఇయ్యరు. ఇంత రాత్రి పూట గీడిక్కూడ తగ్లబడ్తుందోల్లో.

ఎన్క దర్వాజ సప్పుడయ్యే సర్కి గుమ్మంరోకు ఎల్లిన సర్దుకుంటూ.....

ఇంకా పండ్కో లేదానూ?! అంటూ బాత్రూమ్ రోకు ఎల్లిండు బావ.

గిట్లగూడ దూప తీరలేదు. ఈడా అడ్డమొచ్చిండీడు... ఛీ... అన్కుంటూ బలవంతంగా ఇంట్లకి బోయిన. ఇల్లంత తిర్గి మంచం కాడికొచ్చిన. దిండుకాడున్న పత్రిక ముఖచిత్రంపై నవ్వుతూ ఎక్కిరిస్తుంది. మనీషా కోయిరాల.

కసికొద్దీ ఆ పత్రికను తీస్కొని నేలకేసి కొట్టిన.

బాధతో మంచంపై కూలబడి కండ్లు మూస్కున్న. నిద్రైతే పడ్తలేదు. అటూ ఇటూ మస్సిన. మంచం కిర్రుకిర్రుమని ఏడస్తుంది నా మనసు లెక్క.....

● ఆంధ్రజ్యోతి, ఆదివారం - 19 మార్చి, 2000 ●

# 70. కలికి గాంధారి

♦ ఐతా చంద్రయ్య ♦

"గాంధారీ! నువ్వు విడుదలయ్యేది రేపే కదా!" నవ్వాలో, బాధపడాలో అర్థంగాక అప్పుడే నైట్ డ్యూటీకొచ్చిన నారాయణ గొంతువణికింది

"అవునన్నా! రేపే ఎల్లిపోతున్న" పడుకోవాలనుకున్న గాంధారి ఆ ప్రయత్నం మానుకుంది. నవ్వుతూ నారాయణవైపు దృష్టి మరల్చింది. గోడకొరిగి మోకాళ్ళ మీద తలానించి కూర్చుంది.

"బువ్వదిన్నవా మంచిగ!"

"తిన్న, మన జైల్ల. గూట్లే దీపం, నోట్లే బుక్కగదన్నా!"

రాత్రి భోజనాలైపోగానే ఖైదీలు తమ తమ గదుల్లో నత్తగుల్లల్లా ముడుచుకుంటున్నారు. చలిపులి ఎముకల్ని చప్పరిస్తూంటే కొందరు అన్నీ మరిచి నిద్రాదేవి కౌగిట్లో ఒరిగిపోతున్నారు. మరికొందరు ఏదీ మరువలేక గతం చేదు అనుభవాలను మనో యవనిక మీదికి చేదుకుంటున్నారు. వ్యాపకాలు, జ్ఞాపకాలు దాగుడు మూతలాడుతూ నిద్రకు దూరం చేస్తున్నాయి.

అది సెంట్రల్ జైలు. వందల కొద్దీ ఖైదీలున్నారందులో. తగిన సిబ్బంది కూడా ఉంది. అధికారుల నుండి అటెంటర్ల దాకా, జేబు దొంగలనుండి జీపు చొంగలదాకా గాంధారిని గుర్తుపట్టని వారులేరు. ఆమె ఒక ఖైదీ.

అందరిలాగా గాంధారి గూడా రోజూ రెక్కలు ముక్కలు చేసుకుంటుంది. సంవత్సరమంతా కష్టపడి సంపాదించిన డబ్బుతో రక్షాబంధన్ నాడు రాఖీలు కొనేస్తుంది. మగవాళ్ళందరికీ కట్టేస్తుంది. అందర్నీ ఆప్యాయంగా పలుకరిస్తుంది. ఆడ ఖైదీలనైతే ఆత్మీయతానురాగాల్లో ముంచెత్తి అక్కున చేర్చుకుంటుంది. వాళ్ళ కష్టాలు వింటుంది. భగభగ మండే గుండెలను తన చల్లని మాటల వెన్నతో చల్లబరుస్తుంది.

గింత మంచి గాంధారి గంత పెద్ద నేరమెందుకు జేసిందో అన్నది అందరినీ వేధిస్తుంది. అదే విషయమెవరన్నా అడిగితే, "అది నా కర్మ, దేవుడట్లా చేయించిండు. నేం జేసిన" అని యోగినిలా చెప్పేస్తుంది ఎన్నిసార్లు ఎవరడిగినా అదే జవాబు.

పట్టువదలని విక్రమార్కుడిలా నారాయణ మాత్రం ఆమె అంతరంగ తరంగ ధ్వనులను విని తీరాలనే నిర్ణయించుకున్నాడు ఈ రోజే, ఇప్పుడే తగిన సమయమనే పట్టుదలతో తయారయ్యాడు.

"గాంధారీ! నాకు తోడబుట్టిన అన్నదమ్ములు, అక్కచెల్లెల్లు లేరు. ఏటేటా రాకీ కడుతున్నవు కాబట్టి నువ్వే చెల్లవనుకుంటి."

"అవుననన్నా! నాకూ తోడబుట్టిన అన్నాదమ్ములు లేరు. నువ్వేమో సొంత అన్న లెక్క రోజూ మాట్లాడిస్తుంటివి. జొరమొస్తే గోలీలు తెచ్చిస్తివి. నువ్వే నా అన్న వనుకుంటున్నా" కపోలాల మీదాడుకుంటున్న ముంగురుల్ని మునివేళ్ళతో సవరించు కుంటూ అంది గాంధారి.

"అన్నచెల్లెండ్లు కష్టసుఖాలు చెప్పుకుంటరు గదా!"

"అవుననన్నా! నువ్వు గంత పెద్ద నేరమెందుకు జేసినవ్?చెప్పకపోతే నామీద ఒట్టే.. "

"అన్నా! రపీమని తలపైకి లేచింది. ఆ ముఖం కడిగిన ముత్యం లాగుంది. "గట్ల ఒట్టుపెడితే ఎట్లన్నా? నువ్వు నాలుగు కాలాలపాటు సల్లంగుండాలన్నా!" నరాల్లో ప్రకంపనలు.

"అయితే, నువ్విప్పుడే చెప్పి తీరాలె. ఆఁ....!"

"మరి నీ డ్యూటీ!" భృకుటి ముడివడింది.

"ఇంకా కొందరు గార్డులున్నారు గదా. వాళ్ళకు చెప్పి వచ్చిన."

గాంధారి చూపులు శూన్యంలోకి చొచ్చుకుపోయినై.

"చేసినపాపం చెప్తే పోతుందంటరు గదా. చెప్తా విను..." కొంగు భుజానిండా కప్పుకుంది.

"చెప్పమ్మా!" తుపాకీ పక్కనబెట్టి సర్దుక్కూర్చున్నాడు.

గుండెల్లోని చిచ్చును గప్‌చుప్‌గా దాచుకున్న ఖైదీ అటు,కంచాలు మోయలేక, లంచాలు మేపలేక కింది స్థాయిలోనే స్థిరపడిన గార్డు ఇటు. ఇద్దరి మధ్యన కఠిన సత్యాలు వింటున్న కటకటాలు.

'మెదక్ జిల్లాల మాదో పల్లెటూరన్నా. ఏ జన్మల ఏం పాపం జేసినమోగాని మా జాతోళ్ళకు తల్లిపేరే తెలుసుగాని, తండ్రి పేరు దెల్వదు. తెలిసినా చెప్పగూడదు. చెబితే బతుకు బండలపాలైపోతది."

"అరే.. గదేందీ. గమ్మత్తుగుంది" క్యాపుతీసి నెత్తి గోక్కున్నాడు నారాయణ.

"గదంతే నన్నా! మా అమ్మకు చిన్నప్పుడే దేవున్తోని పెండ్లి జేసిండ్రటా....."

"ఓర్నియవ్వ! దేవున్తోనా? గదేమన్నా బొమ్మల పెండ్లా?" క్యాపు తిరిగి నెత్తిమీది కొచ్చింది.

"అవును, మనుషులంతా దేవుని చేతుల బొమ్మలంటరు గాని, మేం మాత్రం మనుషుల చేతుల బొమ్మల. "పేరు పెరుమాండ్లది, అరగింపు అయ్యగారి" దంటరు గదా! మా అమ్మ పని గూడా గంతే అయిందట. గుడి సత్రముల ఓ అర్రనే మా ఇల్లు. పొద్దంతా గుడి ముంగిట జోలె పట్టి అడుక్కోవాలె. చీకటి పడ్డంక పులి నోట్లో తలకాయ పెట్టినట్లు బలమున్నోని చేతులల్ల నలిగిపోవాలె. మా ఊర్లె పెద్ద జమీందార్ రంగారావు దొర. ఆయన రోజూ మా ఇంటికొచ్చేటోడట. ఊరంతా

అతడంటే హడలట పగలు ఆ దొరకెదురుంగ నిల్చుండి మాట్లాడినోని పానం రాత్రికి రాత్రే ఎగిరిపోయేదట. నైజాం జమానల వాళ్ళ తండ్రికి సంస్థానముండేదట."

"అట్లనా... "

"ఆఁ...ఇంట్ల బంగారబ్బొమ్మోలె దొర్సాని ఉండంగ గూడ మా అమ్మకోసం వచ్చేటోడట. నన్ను పుట్టించిన గా దొరను నేను నాయిన అని పిలువొద్దన్నరు మీ అయ్య ఎవలని తోటి పిల్లలడిగితే కండ్లల్ల నీరు దిరిగేయి. అందరు పిల్లలోలె నేను గూడా బడికి పోయేదాన్ని ఓరోజు రంగారావుదొర జూసిండు. కండ్లబొమ్మ లెగిరేసి గుర్కాయించి చూసిండు జీతగాళ్ళకేం సైగ జేసిండో ఏమో గాని వాళ్ళు నా రెక్కలు పట్టుకుని మా ఇంటికి గుంజుకొచ్చిండ్రు. రంగారావు దొర మీసాలు దింపిండు. పండ్లు కొరుక్కుంట నా చెంపలు వాయించిండు

"బాంచత్! నీగ్గూడా సదువు గావాల్నే పోరీ' అనుకుంట మా అమ్మ సిగపట్టి గుంజి ఈపు మీద పెడాపెడా గుద్దిండు. మా అమ్మ నోరు దెరువలేదు. గుడ్లనీళ్ళు గుడ్లల్ల కుక్కుకుంది. ఊపిరి బిగపట్టి ఏడుపు ఆపుకుంది. నాకేమో దొరను కరకర నమిలి మింగాలనిపించింది. ఏడ్చుకుంట ఉరికి మా అమ్మమ్మ సంకలెక్కిన.

మా అమ్మమ్మ కేమనిపించిందో, నన్ను కిందికి దించి, 'దొరా! బుచ్చిపోరి సదూకుంట నంటున్నది. నాలుగచ్చరాలు రాంగనే బడికి బంద్ జేస్తం' అనుకుంట దండం బెట్టింది. కాళ్ళు పట్టుకుంది.

దొరక్కోపం మించుకపోయిందేమో అమ్మమ్మ సిగపట్టి లేపి పొత్తి కడుపుల ఒక్క గుద్దు గుద్దిండు.

'ముండా! నేను వద్దంటే నువ్వు సదివిస్తనంటవా?' అనుకుంట ఎక్కడపడితే అక్కడ పిడికిలితోని గుద్దుతున్నడు. అమ్మా, నేను మొత్తుకున్నం, నెత్తిగొట్టుకున్నం. అమ్మమ్మ కింద పడ్డది. దొర బూటుకాలు దాని పక్క బొక్కల మీద గంతులేసింది. అమ్మ దొరకాళ్ళు పట్టుకుని, 'గా ముసల్దాని కేమెరుక దొరా! ఏదో తెలువక అన్నది. మాఫ్‌జెయ్ దొరా' అంటూ బతిమాలింది.

'నీ బిడ్డ మొకం జూసి ఇడిచి పెడ్తున్నా' నని ఎల్లిపోయిండు.

అమ్మమ్మ మెడగోసిన మేకపిల్లోలె కొట్టుకుని, కొట్టుకుని చచ్చిపోయింది. అమ్మా, నేను దిక్కులేని పక్షులోలె నెత్తి గొట్టుకుంట, లబలబ మొత్తుకుంట ఏడ్చినం. వాడకట్టోల్లు వచ్చి పీన్గును జల్ది దీసెయ్యాలన్నరు. ఎట్టి బ్యాగరోల్లొచ్చి అమ్మమ్మను గుంజుక పోతుంటే మేము గుండెలమీద కొట్టుకున్నం. చూసినోళ్ళు కంటతడి పెట్టిండ్రు గాని నోర్లు దెరువ లేదు.

ల్యాత మేక మాంసం మరిగిన తోడెలోలె రంగరావు దొర మా ఇంటి కొచ్చిండన్నా! అమ్మ ఏడుస్తుంటే 'సచ్చినోల్లతోని మనం బోతామా?' అని రెక్కపట్టి అర్రలకు తోలుక పోయిండు

కొంటె పోరగాండ్లు 'దొరకు మరిగిన దొర్సాని' అనుకుంట మా అమ్మ మీది మీది కొచ్చేటోళ్లు

నాకు పధ్నాలుగేండ్లు వయసొచ్చింది. పొలంల పాము కాటేసి రంగారావు దొర సచ్చిపోయిండప్పటికి. ఒక రోజు ఊరి పెద్దలంతా మా ఇంటికొచ్చిండ్రు. దేవుని గుడిల పందిరేసిండ్రు. ఓ ముసలి ముత్తైద నన్ను పీటమీద కూచోబెట్టింది. బొట్టుపెట్టి కొత్త బట్టలు చేతికిచ్చింది. కట్టుకొమ్మంది. కొత్తబట్టలు చూడంగానే నాకు కోతిచేతికి కొబ్బెరి చిప్ప దొరికినంత ఇదైంది. సంతోషంగ కట్టుకున్న. నన్ను బాగా అలంకరించిండ్రు. ఆ ముత్తైద నన్ను కిందినుంచి మీద్దాకా చూచి "జాంపండోలున్నవు బిడ్డా! ఊరి పోరగాండ్లంతా ఊరకుక్కలోలె మీద పడ్తరేమో, జర జాగర్త" అన్నది.

సొన్నాయి సప్పుడుతోని గుల్లెకు తోలుక పోయిండ్రు. మంత్రాలు చదివిండ్రు. ఏందేందో చేసి 'నీకు దేవున్తోని లగ్గమైంది' అన్నారు. మా అమ్మతోని ఎవలెవలో ఏందేందో మాట్లాడిండ్రు. రాత్రికి నాకు సన్నబియ్యం బువ్వ పెట్టిండ్రు. కొత్త తెల్లచీరె గట్టిచ్చిండ్రు. జడల కనకాంబరాలు, కండ్లకు కాటికపెట్టిండ్రు. మల్లా పెండ్లి పిల్లోలె తయారు జేసిండ్రు. మా అమ్మ నుదుటిమీద ముద్దుపెట్టి, 'మన జోగినులకు గింతే బాకి గాంధారీ! దొర ఏంజేసినా నువ్వేమనద్దు' అని అర్రలకు తోలి తలుపేసింది.

అర్రల మల్లెపూలు జల్లిన పట్టెమంచముంది. దాని మీద ఎల్లారావు దొర నవ్వుతుండు.

అతడు రంగారావు దొర కొడుకు. అతని పెండ్లిల నేను డాన్సు జేసిన. మంచం పక్కన ప్లేట్లల్ల లడ్డూలు, బూంది కనిపించినై. దొర ఓ లడ్డూ నా నోట్లో పెట్టిండు.

'ఈ లడ్డూకంటే నువ్వే మంచిగున్నవు' అనుకుంట నన్ను తనమీదికి గుంజుకున్నడు. చెంపలమీద, పెదాలమీద ముద్దులు పెట్టిండు, సక్కిలిగులు జేసిండు. ఇంకేదేదో చేస్తుంటే నాకు భయమైంది.

'గిదేంది దొరా!' అనుకుంట మంచం దిగబోయిన.

'జర్రాగు, నీకే తెలుస్తది' అని పట్టుకున్నడు.

నేను పిట్టపిల్లోలె వణికిపోయిన.

ఎంత మొత్తుకున్నా విడిచిపెట్టలేదు. ఆరోజు నుంచి రోజూ నాకోసమొచ్చిండు.

నాకిష్టం లేకున్నా నాకో కూతురు పుట్టింది. దానికి మా అమ్మ మేనక అని పేరు పెట్టింది. అది పుట్టిననాడే ఎల్లారావుకు సర్కారు నౌకరు దొరికింది. ఆయన తన కొడుకును వాళ్ళమ్మ దగ్గరుంచి పెండ్లాంతోని పోయిండని తెలిసింది. అంతకుముందే మాకో గుడిసె కట్టించి ఇచ్చిండు. అప్పుడప్పుడు గాసం పంపించెటోడు.

మేము దిక్కులేనోళ్ళమైనం. జోలె పట్టుడు బంద్ జేసి కూలికి వోయినం. ఎవ్వలేమని లొల్లిపెట్టినా నోరు మూసుకున్నం. కానీ, లోకులు కాకులై కూస్తుంటే నాకు సచ్చి పోవాలనిపించేది. ఓసారి మనసంతా కలికలైంది.

"ఊర్లె అడపిల్లలంతా పెండ్లిల్లు జేస్కుని సుఖాంగుంటె మనం గిట్లెందు కుండాలమ్మా? మనపక్కల పడుకున్నోల్లే మనల్ని పురుగులోలె జూస్తున్నారు. ఎల్లారావు నాకు అన్న అవుతడు. అయినా గూడా పశువోలె వచ్చె. నన్ను తల్లిని జేసె. గిదేం న్యాయం?' అడిగిన అమ్మను.

'మనకు గిట్టే రాసిండా దేవుడు' అని ఎక్కెక్కి ఏడ్సింది అమ్మ. గప్పుడే నాపిల్లను బడికి దోలిచ్చినం. టీచర్లు దాన్ని హుషారు పిల్ల అనేటోల్లు.

మేనక పదవతరగతి ఫస్ట్ క్లాసుల పాసైంది. మాయదారి రోగమొచ్చి మా అమ్మ సచ్చిపోయింది.

గవర్నమెంటుకు మామీద దయగల్గింది. కలెక్టర్ మా ఇంటికొచ్చి ధైర్యం జెప్పిండు. మేనక రోజూ బస్సుల పట్నం బోయి బాగా సదువుకుంది. అయిదేండ్లల్ల నా మేనక అచ్చం స్వర్గలోకంలున్న మేనకోలె తయారైంది.

అది పట్నంల రఘురాం అనే టీచర్ను ప్రేమించిందంట. ఆ పిల్లగాడు మా ఇంటి కొచ్చిండోసారి. చానా మంచి గుణమట. బంగారమోలున్నడు. ఈడు జోడు మంచిగుంది. మంచిగ మాట్లాడిండు. మంచి మూర్తం జూసి మేనకను పెండ్లి జేసుకుంటనన్నడు..."

గాంధారి అంతరంగం అల్లకల్లోమైంది. గొంతు బొంగురుబోయింది. పెదాలు వణికినై. కళ్ళు చెమ్మగిల్లినై. చలికి తట్టుకునేందుకు నారాయణ బీడి అంటించి దమ్ము పీల్చాడు. గుండెలకు హాయిగుంది.

"మీదున్నోడు ఎట్లాడిస్తే మనం గట్లాడ్తం గాంధారీ!" నిట్టూర్చాడు.

"ఎప్పుడేం జరగాల్నో వాడే చూస్కుంటడు. రేపైతే మనకు కొత్త సూపర్నెంటు వస్తడు. అతడెసొంటోడో ఏమో! రేపీ టయానికి నువ్వు నీ బిడ్డ దగ్గరుంటవు. ఖైదీలకు జైలు శిక్ష గిన్నేండ్లని ఉంటది. మాకు మాత్రం సదా ఎల్లకాలం జైలు శిక్షే. గిప్పుడు మా సంగతి ఎందుగ్గానీ... నువ్వు అసలు సంగతి చెప్పెయ్ చెల్లే!"

"చెప్తానన్నా....." కపోలాల మీదికి జారి మెరుస్తున్న కన్నీటి బొట్లను కొంగుతో అద్దుకుంటూ గాంధారి మళ్ళీ చెప్పసాగింది.

"గాయాల్ల...చీకటి పడుతూంది. నేను కూలికి పొయ్యి వచ్చిన.. నా బిడ్డ ఆఖరి పరీక్ష రాసొచ్చింది. చెరో బుక్కెడంత దిని పడుకుంటున్నం. ఎవలో తలుపు గొట్టిండ్రు. మాకెప్పుడూ ధైర్యం జెప్పే గుడి పూజారనుకుని తలుపు దీసిన. వచ్చినోడు పూజారి కాడు. ఎల్లారావు దొరకొడుకు కమలాకర్రావు. హైదరాబాదుల ఏదో కోర్సుసదివి ఫెయిలై గప్పుడేవచ్చిండు. పైసలున్నోడు. కోరవయసులున్నడు. బ్రాందీ వాసన సొచ్చింది. కండ్లు ఎర్రపూవులోలున్నై.

"ఏంది చిన్న దొరా!" అడిగి అడ్డం నిల్చున్న.

"పనిమీద వచ్చిన" అనుకుంట నన్ను పక్కకు నూకేసిండు. ఒడిశెల గుండోలె ఉరికొచ్చిండు. గొర్రెమీద తోడెలోలె మేనక మీద పడ్డడు. నాకాళ్లు వొయ్యి కడుపుల జొచ్చినై. ఎంత సదివిందైనా అది ఆడపోరాయే. అయినా గూడా–

'ఎవర్రా నువ్వు' అని ఒకతన్ను దన్నింది. వాడు ఎల్కెలపడ్డడు. ఎంటనే లేచిండు.

రేపు దీనికి దేవున్తోని పెండ్లి జేయిస్త. గడ్బడొద్దు' అని యాభైరూపాయల నోట్ల కట్ట నా చేతిలో పెట్టిండు.

ఊరు మారిపోయిందనుకున్నం గానీ మల్లా గిదేందీ? జెర్రసేపు నోటి మాట రాలేదు. కోపమొచ్చింది. భయం గూడా పోలేదు. ఎంతైనా దొరల పిల్లగాడాయె.

కానీ, ధైర్యం జెయ్యకపోతే వీడు నా బిడ్డ బతుకుతోని బతుకమ్మాడ్డడు. దాని జిందగీ గూడా కుక్కలు చింపిన ఇస్తారైతది. ఎంటనే రూపాయల కట్ట అతని మొకమ్మీది కిసిరిన.

'వద్దు దొరా! నీకు చెల్లెలైతది. దానికి పెండ్లి కూడా ఖాయమైంది. ఇది ధర్మంగాదు. ఎల్లిపో' అని బతిలాడిన.

"నీయవ్వ! జోలె పట్టుకున్న జోగినోల్లగ్గూడా వరుసలా! మా నాయినకు నువ్వెట్లనో ఇది నాకట్ల. నువ్వటుపో' అని మల్లా బలవంతంగా ఆపి ఏమేమో చేస్తుండు. వాళ్ళిద్దరు కలవడ్డరు. గుంజులాడుకుంటున్నరు.

అరె, ఇంగ మా పని గింతేనా! వద్దు, నా అమ్మోలె, నా వోలె నా బిడ్డ బతుకు గలీజు కావద్దు. అది బురుదల దిగద్దు. అది పెండ్లి జేసుకొని సుఖం గుండాలె అని గట్టిగ అనుకున్నగ దానికోసమేంజేసినా సరేనని కూరగాయలు కోసుకునే బాకు అందుకున్న.

..... ..... .

"అరేయ్! నువ్వు దాన్నిడువకపోతే పొడిచి పారేస్తరా" గట్టిగ లొల్లివెట్టిన. వాడు పండ్లు గొరుక్కుంట నా దిక్కు మర్లిండు. నా మెడకాయందుకో వోయిండు. బస్... నా రక్తం సలసల కాగింది. నేనేం జేస్తున్ననో నాకే తెల్వలేదు. తెగింపు జేసిన. కత్తిలావట్టిన. వాని కడుపుల కసకస పొడిచి పారేసిన. రక్తం... ఇల్లంతా రక్తం.

మెడగోసిన మేకపిల్లోలె వాడు గిలగిల కొట్టుకుంటుండు. మేనక పరేశానైంది. పిచ్చి దానోలె చూస్తుంది. దాని ఈపు మీద చెయ్యేసి, 'భయపడకు బిడ్డా! నీకు మంచి తొవ్వ దొరకాలంటే ఇది తప్పలేదు' అని ధైర్యం జెప్పిన. 'ఆఖరు బస్సుంది. నువ్వు పట్నంబోయి రఘురాంను కలుసుకో. అతనితో పోలీస్‌స్టేషనుకు వొయ్యి ఇదంతా చెప్పు. పో. ఎంటనే పో. ఆలిశమైతే ఆగమై పోతవు. పో' అని గద్దించిన.

'మరి . . మరి నువ్వమ్మా' గొల్లుమంది.

'ఓ పిచ్చిదానా! నా సంగతి మర్చిపో, నీ సంగతి చూసుకో, నువ్వు బాగుంటే నాకేం ఫికర్ లేదు పో' అని తరిమేసిన.

sss

కొత్త సూపర్నెంటు పర్యవేక్షణలో గాంధారి విడుదలైంది. బయటి గేటు దాకా వచ్చింది. తోడబుట్టి కూడ పెరిగిన సొంత చెల్లిని అత్తారింటికి పంపిస్తున్నట్టు నారాయణ ఎదలో అష్టమ సముద్రం పొంగింది. ఆ పొంగు హంగుతో కళ్ళు మసకబారినా గాంధారి వెంటనే నడుస్తున్నాడు.

జైలు బయట రఘురాం, మేనక దంపతులు, వారి కలల పంట చిన్నారి గంధర్వ రాజు తనకు స్వాగతించేందుకు ఎదురుచూస్తున్నారని తెలిసిన గాంధారి తృప్తిగా గేటు దాటబోయింది.

"గాంధారక్కా!" వెనకనుంచి మరో సెంట్రీ పిలుపు.

"ఏంది తమ్మీ!" కాళ్ళకు బ్రేకులు పడినై.

"నిన్ను కొత్త సూపర్నెంటు రమ్మంటున్నారక్కా!'

"ఎందుకటా?"

"ఏమో, నాకేం దెల్సూ?"

గాంధారి చూపులు నారాయణవైపు మళ్ళినై

"విడుదలైన ఖైదీలతో కొత్త సూపర్నెంటుకేం పని? ఈయన కరక్టు మనిషో, కరప్ట్ మనిషో, కర్కోటకుడో తెల్వదాయె. ఎందుకైనా మంచిది నేను వెంట వుంటాను' నిర్ణయించుకున్నాడు నారాయణ. "నీకేం భయంలేదు. నేనున్నా పద" అన్నాడు సైగలతో.

"బాగున్నావా గాంధారీ?"

కొత్త సూపర్నెంటు పలుకరింపుసకు నివ్వెరపోయింది గాందారి. భయపడితే భంగపాటు తప్పదనుకుంది.

"గిట్లున్న ఎల్లారావు దొరా" అంది ధైర్యంగా.

"నువ్వ ఈ జైల్లనే ఉన్నవని నాకు దెల్సు."

"నీకు సర్కారు నౌకరని తెల్సుగానీ, గీ నౌకరని తెల్వదు" ఆమె మాటల్లో ఆత్మవిశ్వాసం, చూపుల్లో చురుకుదనం

"ఓహో! తొందరగానే గుర్తుపట్టావే కూచో!"

"మనిషి మనిషిని మరవొచ్చుగాని, పొత్తి కడుపుల కొమ్ముతోని పొడిచిన దున్నపోతును మనసు మరుస్తదా?"

బయట నుంచున్న నారాయణకంతా వినబడుతోంది, కనబడుతోంది గూడా.

"ఒక్కగానొక్క నా కొడుకు నీ చేతుల చచ్చిండు. ఆ వార్త విని నా భార్య గుండె ఆగి చచ్చిపోయింది" ఎల్లారావు గొంతు గురగురలాడింది.

నా... నా...

వంశం నిర్వంశమైపోయింది గాంధారీ!" తానో పెద్ద అదికారినన్న సంగతి మరిచాడు ఎల్లారావు

"కానీ, నా సంగతి గట్లలేదు నా కూతురు మేనక బాగా సదువుకుంది. దానికి రఘురాం అనే టీచర్తో పెండ్లయింది నాకో కొత్త వంశం శురువైంది ఎవ్వలు జేసిన పాపం వాళ్ళనే పామై కరుస్తుంది గద దొరా!" మాటలు ఈటెలై పోయినై.

"కానీ, నేను మారిపోయాను గాంధారీ! ఇప్పుడు నిన్ను నా భార్యగా..."

"దూ.. వద్దు..." గాంధారి అరిచింది

నాలుగు దిక్కులు దద్దరిల్లినై.

నారాయణ లోపలికొచ్చేశాడని గమనించి రెండడుగులు పక్కకు జరిగింది ఎంత వద్దనుకున్నా లోపలినుంచి ఎసరు ఎగదన్నుకొస్తోంది

"ఇయ్యాల భార్యనంటవు. రేపు జోలెవట్టుకునే జోగినివంటవు " తీక్షణంగా చూసింది.

"కాదు, కాదు గాంధారీ!"

"కాదూ..." అమెలో అసహ్యం అంగలేస్తుంది.

"ఇంకా మనం పశువులోలె ఉండొద్దు. చూడు దొరా! భారతంల గాంధారి కండ్లున్నా గుడ్డిదై కొడుకుల్ని చంపుకుంది. కాని... కాని నేను కలియుగము లుంటున్నా.. కలికి గాంధారిని... నీ కొడుకు చావంగనే నీ వంశం ఖతమైంది. కాని నా మనుమనితో నా వంశం శురువైంది. తెల్సుకో!"

"అంతేనా ... గాం... గాంధారీ?"

"అంతే ఇప్పుడు నీ తొవ్వ నీది, నా తొవ్వ నాది" ఖాండ్రించి ఉమ్మి గాంధారి గిరుక్కున వెనుదిరిగింది. క్షణాల్లో బయటికొచ్చి గేటు దాటింది.

● ఇండియా టుడే - 14 మార్చి, 2000 ●

# 71. మరో సిద్ధార్థుడి కథ

♦ పి. లోకేశ్వర్ ♦

"కొత్త బట్టలు వేసుకోరా నానీ" దీనంగా బతిమిలాడుతున్నట్లు మళ్ళీ మరోసారి అడిగింది అమ్మ.

"నేను వేసుకోనని ఎన్నిసార్లు చెప్పాలే" దాదాపు అరచినట్టుగా చికాగ్గా కొడుకు.

ఆ రోజున దసరా. తెలంగాణాలో దసరా చాలా ముఖ్యమైన పెద్ద పండుగ. ఆమె చాలా కష్టపడి అప్పు సప్పు చేసి కొడుకులకు కొత్తబట్టలు కుట్టించింది. చిన్నకొడుకు లిద్దరు సంతోషంతో వేసుకున్నారు. పెద్దకొడుకు మాత్రం కొత్తబట్టలు వేసుకోనని తల్లితో గొడవ పడుతున్నాడు.

"ఇటు నా ముఖం చూడరా. నా సంతోషం కోసమైనా వేసుకోవచ్చు కదా! ఎంతసేపు నీ మొండితనమేనా?" కన్నీళ్ళతో ఆమె. అమ్మ కన్నీళ్ళను చూసి కొద్దిగా చలించాడు. బలవంతాన సహనాన్ని గొంతులోకి తెచ్చుకొని "చూడమ్మా! పండుగరోజు కొత్తబట్టలు వేసుకోనని దాదాపు నెలక్రిందటే నీకు చెప్పాను కదా. మరి ఎందుకు కుట్టించావు? దేశంలో ఈ పండుగరోజు కొత్తబట్టలు కాదు సరికదా కనీసం తినడానికి తిండిలేని వాళ్ళు కొన్ని కోట్లమంది వున్నారు. అలాంటప్పుడు కొత్తబట్టలేసుకోవటం నాకు ఏమాత్రం యిష్టం వుండదు. నా గురించి తెలిసుండీ ఎందుకమ్మా నన్ను బలవంతం చేస్తావు? తమ్ముళ్ళిద్దరూ వేసుకున్నారు గదా! నేనొక్కణ్ణే వేసుకోకపోతే ఏం మునుగుతుంది?" అన్నాడు.

"దేశం ఏమైతే నాకేం రా!" నా కొడుకులు బాగుండాలని నేను కోరుకుంటాను. అదీ తప్పేనా?" ఆమేడుపు అందుకుంది.

"సరే ఈ రోజు కాదుగాని రేపు వేసుకుంటాను. సరేనా! ఇక నన్ను విసిగించకు" అంటూ మంచంలో అటువైపు తిరిగి గోడవైపు ముఖంపెట్టి మధ్యలో ఆపేసిన పుస్తకాన్ని తిరిగి చదవడం మొదలెట్టాడు.

పుస్తకం అట్టమీద ఎర్రరంగుల బొమ్మ చూడగానే కోపంతో ఆమె మనస్సు భగ్గున మండింది.

"ఈ ఎర్రఅట్టల పుస్తకాలే వీణ్ణి ఇలా చెడగొట్టాయి" అని లోలోపలే తిట్టుకుంటూ అక్కడి నుండి వంటింట్లోకి వెళ్ళింది.

పండుగ అనగానే అతనికి హఠాత్తుగా తన బాల్యంలోని సంఘటన జ్ఞాపకం వచ్చింది.

అప్పుడు తన వయస్సు పదారేళ్ళలోపే వుంటుందేమో! ఒకరోజు తమ ఇంట్లో పనిచేయడానికి ఒక కూలీ మనిషి వచ్చాడు. బాగా ముసలాడు. గడ్డాలు, మీసాలు పెరిగి బక్కచిక్కిన శరీరం. ఆ శరీరాన్ని పట్టుకుని వ్రేలాడుతున్న ఒక బుడ్డగోచీ. వాడి ఆకారం, వాడు చేస్తున్న మట్టిపని తనను బాగా ఆకర్షించాయి. వాడు పనిచేస్తున్నంత సేపు అతని చుట్టే తిరిగాడు. మాటలు కలిపాడు. తామిద్దరికీ దోస్తీ కుదిరింది. వాడిని ఏవేవో యక్షప్రశ్నలు అడిగాడు. వాడు పనిచేస్తూనే ప్రశ్నలన్నింటికీ ఓపికగా సమాధానాలిచ్చాడు. ఈలోగా మధ్యాహ్నమైంది. వాడు కాళ్లుచేతులు కడుక్కుని తినటానికి సద్దిమూట విప్పాడు. అందులో ఎండిపోయిన జొన్నరొట్టెలు, ఎండుకారం ముద్దలు ఉన్నాయి. తనకు ఆశ్చర్యం వేసింది. మళ్ళీ తిండికి సంబంధించిన ప్రశ్నలు వేయసాగాడు. ప్రతిరోజు తను ఇలాగే జొన్న రొట్టెలు, కారం ముద్దలు తింటానన్న అతడి సమాధానం విని, "మరి పండుగ నాడు ఏం తింటావు?" అని అడిగాడు. వాడు తన పళ్ళన్నీ కనబడేటట్టు ఇకిలించి నవ్వుతూ "పండుగనాడు అన్నం వండుకుని అందులో పాలు, చక్కెర కలుపుకుని తింటాను" అని సంబరపడ్డాడు. పండుగ రోజు తన ప్రత్యేక భోజనం అదేనని మళ్ళీ మళ్ళీ చెప్పాడు. వాడిని చూసి తనకు జాలి దయ కలిగింది. తనింట్లో పండుగ రోజు అమ్మచేసే గారెలు, పూరీలు, కోడికూరా, బిర్యానీ జ్ఞాపకం వచ్చి తమిద్దరి జీవితాల్లో కల వ్యత్యాసాన్ని గమనించాడు. తన జీవితంలో మొదటిసారి బీదలపట్ల కరుణ ఉద్భవించింది. ఇక అప్పట్నించీ పండగ అనగానే బుడ్డగోచీ పెట్టుకునే కూలీవాడే జ్ఞాపకం వస్తాడు."

★ ★ ★

తల్లి వంటింట్లోకి వెళ్ళి గారెల కోసం పప్పు రుబ్బసాగింది. ఆమె మనస్సంతా గజిబిజిగా వుంది. ఆలోచనలన్నీ పెద్దకొడుకు చుట్టే తిరుగుతున్నాయి. ఏదో దిగులు, భయం, బాధ, చిన్న కొడుకులిద్దరి గురించి ఆమెకు చింతలేదు. వాళ్లు ఎలాంటి గొడవలు లేకుండా బుద్ధిగా చదువుకుంటున్నారు. తనకు పెద్ద కొడుకే ఒక పెద్ద సమస్య. ఇంటరు వరకు మామూలుగానే ఉండేవాడు. డిగ్రీలో చేరినప్పట్నించే ఈ సమస్య మొదలైంది. ఎప్పుడూ ఏదో పరధ్యానం. ఏవో ఆలోచనలు. ఇంటినిండా ఎర్రట్టల పుస్తకాలు. కొత్త కొత్త స్నేహాలు. వయస్సులో వాడికంటే పెద్దవాళ్ళు కూడా వీడికోసం వచ్చేవారు. వాళ్ళంతా ఎవరో? వారివల్ల తన కొడుక్కు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయపడేది. తానేదైనా అడిగితే సమాధానం ఇచ్చేవాడుకాదు

తొలిరోజులలో నీకెందుకే అని కసురుకునేవాడు. ఆ తర్వాత రానురాను 'ఇవన్నీ నీ కర్థంకావులే అమ్మా' అని నెమ్మదిగా అనేవాడు. కాని తనకు ఏదో కొంత అర్థమవుతూనే వుండేది. రాత్రి పగలు, చిన్న పెద్ద అని తేడా లేకుండా ఎవరెవరో, ఎక్కడెక్కడ్నుంచో తమ ఇంటికి వచ్చేవారు. ఓ మూలగదిలో కూచుని గంటలు గంటలు రహస్యంగా, నెమ్మదిగా మాట్లాడుకునేవారు. అపుడపుడు గొంతులు పెంచి సీరియస్‌గా, కోపంతో, ఉద్రేకంతో ఏవేవో సంగతులు చర్చించుకునేవారు. వాదోపవాదాలు, విమర్శలు జరిగేవి. వర్గాలు, వర్గపోరాటాలు, బూర్జువాలు, సామ్రాజ్యవాదులు, సాయుధపోరాటాలు అంటూ ఆమెకు అర్థంకాని విషయాలేవో

మాట్లాడుకునేవారు. తుపాకులు, పోలీసులు అనే పదాలు మాత్రం తనను భయంతో వణికించేవి. తిండితిప్పలు, శుచిశుభ్రం లేకుండా ఒక దొక్కు సైకిలేసుకుని మాలమాదిగ గుడిసెలు, లంబాడీ తండాలు నిరంతరం తిరిగేవాడు. వీడొక్కడే గాక మరాఠోళ్ళ పిలగాడు శివాజీ, రెడ్డోళ్ల పిల్లగాడు బాలిరెడ్డి, బట్టల దుఖాణం సేఠ్ కొడుకు లక్ష్మీనారాయణలు కూడా తయారైనారు. ఇక అందరు కల్సి మీటింగులు, పాటలు, గోడలపై జాజు రంగుల రాతలు, బస్సులపై కాగితాలు అంటించడం చేసేవారు. చివరికి ఈ రోజు తన కొడుకు తనకు చిక్కకుండా, దూరమై పోతున్నాడన్న సంగతి ఆమెకు స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

పండుగరోజు ఇంట్లో ఉన్నాడన్న సంతోషం కాస్తా కొత్తబట్టలేసుకోసన్న కిరికిరితో ఆవిరయిపోయింది.

కోపంతో ఆమె రుబ్బురోలు గిరగిరా తిప్పుతోంది.

★ ★ ★

రుబ్బురోలు శబ్దంతో ఏకదీక్షగా పుస్తకం చదువుతున్న అతని ఏకాగ్రత చెదిరి పోయింది. చెమటలు కక్కుతూ తమ ఆనందం కోసం కష్టపడుతున్న అమ్మను చూసేసరికి అతడికి జాలికల్గింది. అందుకే కొత్తబట్టల గురించి జరిగిన వాదన గుర్తుకొచ్చింది. అమ్మకు సంబంధించిన చిన్ననాటి జ్ఞాపకాలు అతడిని ముసురుకున్నాయి.

"అమ్మా, తనకు నిద్రరాని రాత్రులలో 'అచ్చిపిట్టమ్మా' అంటూ కమ్మని గొంతుతో పాటల రాగాలను ఆలపించిన అమ్మ. జ్వరం వస్తే భుజంపై వేసుకుని కాలినడకన ఎంతో దూరం డాక్టరు దగ్గరకు పరిగెత్తిన అమ్మ. పైసలు లేకపోతే డాక్టరును బ్రతిమిలాడి వైద్యం చేయించిన అమ్మ. తను నెలల తరబడి మంచంలో వుంటే చివరికి ఒకరోజు తలారా స్నానం చేసి తడిబట్టలతోనే తన మంచం చుట్టూ ప్రదక్షిణలు చేసి 'నా కొడుకుకు బదులు నన్ను తీసుకపో స్వామీ' అని దేవుడికి దండంబెట్టిన అమ్మ."

ఉప్పెన. జ్ఞాపకాల ఉప్పెన.

వరద. కండ్లల్లో కన్నీటి వరద.

కింద టేదాది జరిగిన ఇంకో సంఘటన కూడా అతడికి జ్ఞాపకం వచ్చింది.

అది ఎండాకాలం. మందుటెండల్లో పార్టీ పనుల్లో తిరిగితే తనకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. నెలరోజులు మంచం దిగలేదు. చచ్చేవాడు కాస్తా బతికాడు. జ్వరం తర్వాత తను మంచంలోనే కోలుకుంటున్నాడు. ఆరోజు ఉదయం పూట పార్టీ మిత్రుడు "జ్ఞాని" తన మంచం ప్రక్కనే కూర్చుని కబుర్లు చెబుతున్నాడు. ఇంతలో అమ్మ గదిలోకి వచ్చింది. దేవుడి గదిలో నుండే వచ్చిందేమో చేతులలో హారతి పళ్ళెం - తీర్థం, ప్రసాదం వగైరాలున్నాయి.

"ఈ తీర్థం పుచ్చుకుని ప్రసాదం తీసుకో నానీ."

అనుకోని ఆ సంఘటనకు తను నివ్వెరపోయాడు.

"దేవుడికి దండంబెట్టి ఇవి తీసుకో నానీ" మళ్ళీ చెప్పింది. అసలే బలహీనంగా వున్నదేమో తన సహనం బద్దలయ్యింది.

"నేను దేవుడిని నమ్మననీ, దేవుడికి దండం బెట్టనని నీకు బాగా తెలుసు. మళ్లీ ఈ తీర్థప్రసాదాలేమిటీ? నేను తీసుకోను గాక తీసుకోను" గట్టిగా అరిచాడు.

"నేను దేవుడికి మొక్కుకున్నాను రా! నీ బాగుకోసమే" అని అమ్మ గొల్లుమంది. ఏడ్చీ ఏడ్చీ గదిలోనుండి బయటికి వెళ్లిపోయింది.

ఆ సంఘటనతో పక్కనున్న మిత్రుడు చాలా హర్ట్ అయ్యాడు. ఆమె తృప్తికోసం దండం పెడ్తే తప్పేంటీ? తీర్థం తీసుకుంటే ఏం కొంపమునుగుతుందీ? అమ్మను అంత బాధపెట్టడం సరైందేనా? అసలు నీకు అంత మొండితనం ఎందుకూ? అని వాదనలోకి దిగాడు.

"మన ఆలోచనకూ ఆచరణకూ మధ్య వైరుధ్యం వుండకూడదు. ప్రజలకోసం పనిచేసే మనల్ని ప్రజలు నిరంతరం గమనిస్తూ వుంటారు. మన సిద్ధాంతాలకు, ఆదర్శాలకు మనమే విరుద్ధంగా నడిస్తే ఎలా?" అని తనూ వాదనలోకి దిగాడు.

★ ★ ★

తల్లి ముగ్గురు కొడుకులను పీటలపై వరుసగా కూచుండబెట్టి పళ్ళేలలో భోజనాన్ని వడ్డిస్తుంది. ఆ ముగ్గుర్ని చూస్తుంటే ఆమె కళ్ళకు చాలా తృప్తిగా వుంది. చిన్నవాళ్లిద్దరూ ఇంటరు, టెన్త్‌లో ఉన్నారు. పెద్దోడి చదువువైపోగానే ఏదో ఉద్యోగం వస్తుందనీ, తమ్ముళ్ల బాధ్యత, ఇంటి బాధ్యత తీసుకుంటాడనీ, పెళ్లి చేసుకుంటాడనీ ఆమె కలల్లో తేలిపోతోంది. చిన్నవాళ్ళిద్దరూ గబగబా భోజనాలు ముగించినట్లుంది. పీటలపై నుండి ఎపుడు లేచారో ఆమె గమనించనేలేదు. పెద్దకొడుకు మాత్రం తలవంచుకొని పళ్లెంలో చూపుడు వేలితో ఏదో గీతలు గీస్తున్నాడు. వడ్డించిన పదార్థాలు పళ్ళెంలో సగానికి పైగా అలాగే వున్నాయి. వాడు గీస్తున్న గీతల్ని జాగ్రత్తగా గమనించిందామె. అవి పిచ్చిగీతలు కావు. సుత్తికొడవలి గుర్తులకు సంబంధించిన గీతలు. ఆమెకు ఒకవైపు నుండి రోషమూ, మరోవైపు నుంచి ప్రేమ, ఏక కాలంలో కలిగాయి. వీడికి ఇదే పిచ్చి. ప్రతి క్షణమూ అదే ధ్యాస. దేవుడు దయతలిస్తే త్వరలో పెళ్లి చేసెయ్యాలి. ఆ వచ్చే కోడలే వీడి పిచ్చి కుదురుస్తుంది. అసుకుంటూ తనేం గమనించనట్టే "అన్నం తిను నానీ" అని హెచ్చరించింది. దానికి వీడు ఉలికిపడి గబగబా తినసాగాడు. తల్లి వాడినే దీక్షగా చూస్తుంది.

"వీడికి ఎవరి సాలు వచ్చిందో తెల్వదు కానీ చిన్నప్పట్నించీ వీడిది ఇదే వరస ఊళ్ళోకి సురభి నాటకాల వాళ్ళు వస్తే వీడికి ఇంట్లో కాలు నిలిచేది కాదు. చదువు, స్కూలు ఎగ్గొట్టి వాళ్లతోనే వాల్ల గుడిసెల వెంబడే తిరిగేవాడు. ఆడమగ చిన్న పెద్దా అనే తేడా లేకుండా వాళ్ళు కూడా వీడంటే చాలా ఇష్టపడేవారు. వీడి నాటకాల పిచ్చినీ, తమ మీది అభియోగాన్ని చూసి మాతోపాటు రాకూడదు అని అడిగారట కూడా. ఆ సంగతి తెలిసి "ముఖాలకు రంగులు పూసుకుని తైతక్కలాడే ఆ నాటకాల వాళ్లతో అందులోనూ దేశదిమ్మరులతో స్నేహమేమిటీ" అంటూ వీడి బాపు చింత

బరిగెతో ఒళ్ళంతా వాతలు తేలేలా కొట్టినా వారి సావాసాన్ని మాత్రం వదలలేదు. ఇతర పిల్లలతో కలిసి వారికోసం చందాలు వసూలు చేసేవాడు.

వాళ్ల విషయంలోనే కాదు. ఇంటి ముందుకు ఎవరో బిచ్చగాళ్ళు వచ్చినా వారికి బిక్ష వేసేవరకు తనను సతాయించేవాడు. అలాగే కూలోనాలో పేద జనం ఎవరు కనబడినా వారిని ఇంటికి తీసుకొచ్చి తనతో అన్నం పెట్టించేవాడు. లేదా డబ్బులు ఇప్పించేవాడు. వాడి బాపుకు ఇవన్నీ సహించక ఎప్పుడూ తిడుతూ కొడుతూ వుండేవాడు. వీడు తిన్నన్ని దెబ్బలు ఈ ఇంట్లో ఎవరూ తినలేదు.

చివరికి ఇపుడూ ఇంతే. అపుడు వాళ్ళయితే ఇపుడు ఈ అన్నలు. "అమ్మా రాంరెడ్డి సారొచ్చిండే. ఊరవతల తోటలో వున్నాడు. పాపం బాగా ఆకలైతున్నట్లుంది" అంటూ రెండు రొట్టెలను పాంటు జేబులో కుక్కుకుని గ్లాసునిండా చాయ్ పోయించుకుని బాపుకు తెల్వకుండా పట్టుకెళ్ళేవాడు. తనకు తర్వాత తెల్సింది ఆ రాంరెడ్డి మహానుభావుడే తన కొడుకును రాజకీయాల్లోకి దించిండని. ఎవర్నని ఏం లాభం? వాడికి బుద్ధి వుండాలి గాని!

నిన్న గాక మొన్న రాత్రిపూట ఎవరో తలుపు కొట్టినట్లు చిన్నగా చప్పుడైంది. తనకు చటుక్కున మేల్కయ్యింది. వాళ్లొస్తారని వీడికి ముందే తెలుసేమో గబగబా వెళ్లి తలుపు తీశాడు. ఇద్దరు పెద్దమనుషులు లోపలికొచ్చారు. తలపై గొంగళ్లు కప్పుకున్నారు. ఆ ఇద్దరి వయస్సు నడి వయస్సు పైనే వుంటుంది. వాళ్ల వాలకం చూస్తే పల్లెటూరి మనుషుల్లాగా లేరు. బాగా చదువుకున్న పట్నం వాళ్లలాగా వున్నారు. పేర్లు ఏవో చెప్పారు భాస్కరావు, సత్యనారాయణ అని. వాళ్లేదో మర్యాద మనుష్యులనీ, తన బాధను అర్థం చేసుకుంటారనీ తన గోడును వాళ్లముందు వెళ్లబోసుకుంది. వాళ్లు తను చెప్పిందంతా ఓపికగా విని చివరికి "అమ్మా నీకు మరో ఇద్దరు కొడుకులున్నారు గదా! ఈ పెద్ద కొడుకును దేశంకోసం త్యాగం చెయ్యి. అట్లాంటి కొడుకును కన్నందుకు నీవు గర్వపడాలి" అన్నాడు.

ఆ మాటలు వినగానే తనకు రోషం, దుఃఖం ముంచుకొచ్చాయి. మరేం మాట్లాడలేదు.

★ ★ ★

"అవును. అమ్మనే గాక బాపును కూడా అనేకసార్లు బాధపెట్టాను" అతని ఆలోచనా స్రవంతి అలా తెగని జ్ఞాపకాల దారంలాగా కొనసాగుతూనే వుంది.

.... చివరికి బాపుకు క్యాన్సర్ అని తేలింది. అప్పటికే ఫైనల్ స్టేజ్. ఆ సంగతి ఆయనకు, అమ్మకు తెలిసింది. ఒకరోజు రాత్రి బాపు తనను తన మంచం దగ్గర కూచోబెట్టుకున్నాడు. అమ్మ పక్కనే వుంది. "నీ పెళ్లి చూడాలని వుందిరా" అని అతి కష్టంగా తన గొంతు పెగుల్చుకుని అన్నాడు. అది ఆయన చివరి కోరిక. ఒక కొడుకుగా అది నా చివరి బాధ్యత. చివరి కర్తవ్యం. మేనరికం ఉంది గదా ఇక ఆలస్యమెందుకు అని అమ్మ కూడా అందుకుంది. అలాంటి సందర్భం వస్తుందని తను ముందే ఊహించి మానసికంగా ప్రిపేర్ అయి వున్నాడు.

తను చాలా స్పష్టంగా చెప్పాడు. వ్యక్తిగత జీవితం కన్నా తనకు తన ఆదర్శాలు, తన రాజకీయ విలువలే ముఖ్యం అని. ఇద్దరూ కళ్లనీళ్ళు పెట్టుకున్నారు. అయినా తను కరగలేదు.

బాపు ఇంకా కొద్దిరోజులకు చనిపోతాడనగా ఓ రోజు రాత్రి తన యింట్లోనే ఒక ముఖ్యమైన సమావేశం జరిగింది. చర్చలు చాలా వాడిగా, వేడిగా జరిగాయి. గొంతులు పెంచి చాలా పెద్దగా ఉద్రేకంగా వాదించుకున్నారు. క్యాన్సర్ బాధతో నిద్రరాక పక్కగదిలోనే బాపు పడుకున్నాడు. ప్రతిమాటను ఆయన జాగ్రత్తగా విన్నాడో కాబోలు సైగచేసి పిలిచి "ఇదంతా ఏమిటీ? పోలీసులకు ఈ సంగతి తెలిస్తే ఎట్లా? ఇలా అయితే చివరికి వాడి భవిష్యత్తు ఏమౌతుందీ?" అని భయాన్నీ, బాధనూ తెలిపాడట. ఈ సంగతి అమ్మ ఆయన చనిపోయిన తరువాత ఒకరోజు ఏడుస్తూ చెప్పింది

అతనికి హఠాత్తుగా చలం కొటేషన్ గుర్తుకొచ్చింది. "స్వేచ్ఛ కలకత్తా కాళిక లాంటిది. అది నిరంతరం సుఖ నైవేద్యాన్నీ, అశ్రు అభిషేకాన్ని కోరుతుంది."

ఆలోచనతో అలిసిన అతనికి గాఢనిద్ర పట్టింది.

ఎంతోకాలం తర్వాత ఇంట్లో వుండి గాఢంగా నిద్రపోతున్న కొడుకును చూసి సంతోషంతో ఆమె కడుపు నిండిపోయింది.

★ ★ ★

వీడు ఇంటికి రాక వారం రోజులైతుంది. ఇట్లా ఎపుడూ జరగలేదు. ఆమె ఇటు అటు తిరుగుతూ. తత్తరపడుతోంది. తమ్ముళ్లిద్దరూ పరిగెత్తుకొచ్చి దాన్ని చదివారు.

అమ్మా!

నన్ను క్షమించు. కన్న కొడుకుగా నీకు, బాపుకు ఎప్పుడూ న్యాయం చేయలేదు.

ఈ దేశంలోని దరిద్రనారాయణులందరూ నాకు మీలాగే కనబడుతున్నారు.

నేను జనంలో జనం కోసం కల్సిపోతున్నాను.

ఇక నాకోసం ఎదిరిచూడొద్దు.

- నీ నాని

ఆమె కెవ్వున అరచి వెనక్కి విరుచుకుని పడిపోయింది.

★ ★ ★

పెద్దకొడుకు ఇంట్లో నుండి వెళ్లిపోయి అపుడే ఐదారేళ్లు అవుతుంది.

చిన్న కొడుకులిద్దరూ చేతికందారు. చదువులు, ఉద్యోగాలు అయి పెళ్లిళ్లు చేసుకుని జీవితాల్లో స్థిరపడ్డారు. కాని ఆమెకు సంతోషం లేదు. మనస్సంతా ప్రజలకోసం ప్రజల్లో కల్సిపోయిన పెద్దకొడుకు గురించే నిరంతరం ఆలోచిస్తుంది. వాణ్ణి తలచుకోని క్షణమూ లేదు - ఏడవని దినమూ లేదు. ఆమెకు అదో 'మనాది'

అయిపోయింది. కరెంటు "షాకు ట్రీట్‌మెంట్లూ మరిచిపోయే మందులూ" ఏవీ పనిచేయలేదు. రామనామ స్మరణలాగ నిరంతరం "నానీ-నానీ" అని తనలో తనే గొణుక్కుంటుంది. ఏడ్చి ఏడ్చి కండ్లల్లో నీళ్ళు ఎండిపోయాయి. ఎదురుచూసీ చూసీ కండ్లు కాయలైపోయాయి. కండ్ల డాక్టరుకు చూపిస్తే "మోతబిందెలు" ఆపరేషన్ చేయాలి అన్నాడు. ఏదో ఒక రోజు కొడుకు తప్పకుండా వస్తాడని ఆమె ఆశ. వాణ్ణి చూడటం కోసమే బ్రతకాలనీ, కండ్లు బాగుచేయించుకోవాలనీ ఆమె ఆలోచన. ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగిందని పేపర్లో వార్త వచ్చినా తన కొడుకు పేరు బొమ్మ అందులో వుంటుందేమోనని ఆమె పేపరంతా వెదికించి లేదని తెలిసేసరికి అందరి దేవుళ్ళకూ మొక్కుకునేది, దండాలు పెట్టేది. వాడు వెళ్లిపోయిన కొత్తలో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా పరిగెత్తుకుని అతికష్టంతో బస్సులలోనూ, రైళ్లలోనూ ప్రయాణం చేసి ఆ ఊళ్లకు చేరుకునేది. తన కొడుకు అందులో లేడని తెలిసి సంతోషంతో ఇంటికి తిరిగివచ్చేది.

ఆరోజు మళ్లీ మరో దసరా పండుగ.

ప్రతీ పండగలాగే ఆ రోజు కూడా కొడుకుకు కొత్తబట్టలు కుట్టించింది. ఈసారి ప్రత్యేకంగా ఎర్రషర్టు, తెల్లప్యాంటు కుట్టించింది. కొడుకు వాటిని చూసి తనను మెచ్చుకుంటాడని ఆమె ఆశ.

దూరంగా కనబడే కాలిబాటపై నుండి కొడుకు నడుచుకుంటూ, నవ్వుకుంటూ తన దగ్గరికి, తన యింటికీ తిరిగివస్తాడని కళ్లలో కొస ప్రాణాల్ని నిలుపుకుని ఎదిరిచూస్తూ ఇంటి అరుగులపై కూచుందా ముసలి తల్లి.

సాయం సంధ్య సంజకెంజాయి రంగుల చీరెను చుట్టుతుంది.

సాయంత్రం రాత్రిగా మారింది.

చూపులన్నీ, చుక్కలయినాయి.

శ్యామలాకాశంలో మిలమిలా మెరుస్తున్న లక్షల లక్షల నక్షత్రాలు.

తన కొడుకు చిన్నబాబుగా మారి తన ఒడిలో కూర్చున్నాడు. తన మెడచుట్టూ చేతులేసి చక్రాల్లాంటి కళ్లల్లో చుక్కల్ని ఇముడ్చుకుని చుక్కలకేసి చూస్తూ, అమ్మా అమ్మా అటు చూడవే! ఎన్ని చుక్కలో. మబ్బుల్లో అన్ని చుక్కలు ఎక్కడ్నించి వచ్చాయే? వాటిని అక్కడ ఎవరు పెట్టారే?" అని అడుగుతున్నాడు. మారాం చేస్తున్నాడు.

వెలుగునీడల మధ్యన ఆ భ్రాంతి అంతా నిజమే అనుకుని ఆమె జవాబు చెప్పబోయింది.

ఇంతలో మిలమిలా మెరుస్తున్న ఒక నక్షత్రం నెత్తురు కక్కుకుంటూ, నిప్పులు చిమ్ముకుంటూ నేలకు రాలిపోయింది.

తల్లిపేగు తెగిన చప్పుడు ఆ నిశ్శబ్దరాత్రి ఎవరికి వినబడుతుంది?

● సుప్రభాతం వీక్లీ - 12 ఫిబ్రవరి, 2000 ●

# 72. గుడిసెలు! గుడిసెలు!

♦ ముదిగంటి సుజాతారెడ్డి ♦

చీకటి పడింది. ఇంట్లో గ్యాసుతో వెలిగే బల్బులు వెలుగును విరజిమ్ముతున్నాయి.

నాగయ్య ముందటేడు కొడుకు పెండ్లికి ముందల్నే పెంకుటిల్లంతా సవరించాడు. గోడలకు రంగులు వేయించాడు. దూలాలకు, మొగరాలకు, కిటికీలకు, తలుపులకు వార్నిషు పూయించాడు. అప్పుడే గోబరు గ్యాసు పెట్టించాడు. ఆ గ్యాసుతో ఇంటినిండా బల్బులు వెలుగుతున్నాయి. వంటకు గ్యాసు అయింది. పిడకలతో, కట్టెలతో పొగ బాధతప్పింది కాంతమ్మకు.

గ్యాసు పొయ్యికి దగ్గరగా పీట మీద కూర్చొని కాంతమ్మ జొన్నరొట్టెలు చేస్తున్నది. ఆమె భర్త నాగయ్య ఆమె జొన్న రొట్టెలు చేస్తే ఇష్టపడతాడు.

కాంతమ్మ జొన్నరొట్టెలు గుడ్డ పేలికలంత పల్చగా చేస్తుంది. పొడి పిండి చల్లుతూ అరచేతితో చకచకా రొట్టెలు చరుస్తుంది కాంతమ్మ.

పొద్దంతా చెలకలో దుక్కులు దున్ని వచ్చిన నాగయ్య నీళ్ళ గోలెం దగ్గరకు పోయి ఒంటి మీద రెండు చెంబుల నీళ్ళు పోసుకుని, ధోవతి మార్చుకొని వచ్చి కాంతమ్మకు దగ్గరగా ఉన్న పీటలమీద కూర్చున్నాడు.

"వచ్చే ఏడు నాగలితో కాక ట్రాక్టరుతో దుక్కులు దున్నిద్దామె" అన్నాడు భార్యతో నాగయ్య.

"దానయ్య ట్రాక్టరు తెచ్చిండట గద! కిరాయిలకు తోలుతున్నడంట. చణంలో ఎకరం భూమిని దున్నతదట అని ఇన్న. ఇగ ఎద్లు, నాగలి మూలబడే రోజులొచ్చినయి" అంది తలెత్తకుండానే రొట్టెలు చరుస్తున్న కాంతమ్మ.

ఇంతలో కోడలు సరోజ మామ ముందు తలె తెచ్చిపెట్టింది. తలెలలో పప్పు వడ్డించింది. ఉల్లిగడ్డలు సన్నగా ముక్కలుగా కోసి తపుకులో తెచ్చి తలె పక్కన పెట్టింది. బర్రెపాలు పిండడానికి పెద్ద గుండు చెంబుతో పెరడులో ఉన్న గొడ్లపాక దిక్కు పోయింది.

"పిల్లా! కోల్లను సరిగ్గా కమ్మిన్నో లేదో జర సూడు" అంది కాంతమ్మ పెరట్లోకి పోతున్న కోడలుతో.

నాగయ్య ఉడుకు ఉడుకు జొన్నరొట్టెలు పప్పుతో తింటున్నాడు. మధ్య మధ్య ఉల్లిగడ్డలు నములుతున్నాడు.

"పొలంల బోరుకాడ ఉల్లిగడ్డలు నాటిన. బాగ ఉల్లిపొరక వొచ్చింది. ఒకరోజు తెచ్చివొండవే. ముదిరిపోతయి. జొన్నరొట్టెలలో గా కూర కమ్మగుంటదె" అన్నాడు నాగయ్య.

వేడి వేడి జొన్నరొట్టెలు ఎన్ని తిన్నాడో నాగయ్యకే లెక్కలేదు. చివరకు బేవు తీసి "ఇక సాలే" అని లేచాడు.

నాగయ్యకు ఇప్పుడు తరి పొలం వుంది. వడ్లు పండుతున్నాయి. రెండు పూటలా వరి అన్నం తినవచ్చు. కానీ, అతనికి రాత్రిపూటయినా జొన్నరొట్టెలు లేందే ఎట్లాగో ఉంటుంది. చిన్నప్పట్నుంచీ జొన్న గటుక, జొన్న రొట్టెలు తినడమే అలవాటు. పొలం కొన్నాక కాంతమ్మ పగటి పూట వరి అన్నం వండడం మొదలుపెట్టింది.

"ఏందే ఇది? జొన్నలుండగ గీ వరి అన్నం ఎందుకే?" అని అన్నాడు నాగయ్య మొదట్లో.

"అందరూ ఇప్పుడు రెండు పూటలు వరి అన్నమె తింటున్నరు వీల్లింక. జొన్నగటుక తింటున్నరంటె నీ కొడుక్కు ఎవరూ మంచి ఇంటి పిల్లనియ్యరు" నవ్వింది కాంతమ్మ.

వరి అన్నం తిన్న కొత్తలో నాగయ్యకు కాస్సేపటికి ఆకలేసేది. కానీ, ఇప్పుడు అలవాటు పడిపోయాడు. రాత్రిపూట మాత్రం ఆ ఇంట్లో జొన్నరొట్టెలు మాత్రం ఉండవలసిందే.

ఇంతలో పట్నం పోయిన శీతయ్య వచ్చాడు. పెరడులో ఉన్న బావి దగ్గర సరోజ నీళ్ళు చేది బొక్కెనతో పోస్తుంటే స్నానం చేశాడు. వచ్చి తండ్రి పక్కనే సరోజ వేసిన పీట మీద కూర్చున్నాడు. సరోజ భర్త ముందు తలె పెట్టి, పప్పు వడ్డించి ఉడుకు ఉడుకు జొన్నరొట్టెలు తెచ్చి తలలో పెట్టింది. ఉల్లిగడ్డ ముక్కలున్న తపుకు తలె పక్కన పెట్టింది.

కాంతమ్మ సరోజ వైపు తృప్తిగా చూసింది. "పిల్ల పనిమంతురాలు! ఇక ఇంటికి దరిద్రమనేది ఉండదు" అనుకుంది.

సరోజ పేదింటి పిల్లయినా, పనిమంతురాలు అనే ఇష్టపవడి కట్నం కానుకలను ఆశపడకుండా కాంతమ్మ కొడుక్కు చేసుకుంది.

'నాకు వాడు ఒక్కడే! ఒకరి ముందల చెయ్యి సాపకుంట, అప్పు లేకుంట బతుకుతున్నం. ఏడు కాన్పులు పోయినంక శీతయ్య పుట్టి బతికిండు. వాడు కడుపుల పడంగనే కులదేవత శీతలమ్మకు మొక్కుకున్న. ఆ తల్లి పేరు పెట్టుకుంట అని. వాడు బతికి బట్టకడ్తుండు. సరోజ తల్లిదండ్రులు కట్నమెక్కువ ఇయ్యరని తెలసి గూడ గీ పిల్లయితె బాగుంటదని చేస్కున్నందుకు పిల్ల బుద్ధిమంతురాలె తేలింది' రొట్టెలు చరుస్తూ కాంతమ్మ ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది.

"నువ్వు పట్నం పోయిన పని ఏమైందిర" అడిగాడు నాగయ్య కొడుకు వైపు చూస్తూ.

"బోరు ఏసెటోల్లు కలిసిండ్రు. వొచ్చి బోరు ఎప్పుడంటె గప్పుడేస్తమండ్రు. కానీ..." ఆగాడు శీతయ్య.

పదెకరాల చెలకలో ఇంతవరకు వర్షం మీద ఆధారపడే పంట పండుతోంది. ఇప్పుడు ఆ చెలకలో బోరు వేయించి పత్తి, మిర్చి పండించాలనుకున్నారు తండ్రీ కొడుకులు.

"కానీ... అంటున్నవ్ ఏమైందేంది? పైసలు బాగ అడుగుతుండ్రా?" అడిగాడు నాగయ్య. ఆయన పీట మీదినుంచి లేచి సరోజ అందించిన నీళ్ళ చెంబు అందుకుని చెయ్యి కడుక్కొని, నోట్లో పోసుకుని పుక్కిలించి ఊశాడు.

"కాదే నాయిన! తోవల దేవేందర్ కలిసిండు. మన ఊరి పక్కన విమానాలు ఆగేది గదే ఏరోడ్రోమ్ పెద్దది కడ్తరంట. మన ఊరోల్లయి భూములన్నీ సర్కారు తీస్కుంటదని సెప్పిండు. కలెక్టరు సాయాన గాయనకు సెప్పిండంటనే. మనం బోరేసి, దండుగయితమేమె"

"ఆ గట్ల ఎప్పట్నుంచో నీ పుట్టక కాడి నుంచి అంటున్నరు. గట్లని ఎవసాయం మానుకుంటమ!" నాగయ్య సరోజ అందించిన తువ్వాలకు చేతులు తుడుచుకున్నాడు.

నాగయ్యకు అరవై ఏళ్ళు దగ్గరపడుతున్నా ఒంట్లో సత్తువ ఏం కమ్మికాలేదు. అతని తండ్రి చచ్చిపోయినప్పుడు ఏమంత పెద్దోడు కాదు. ఒక్కడే వ్యవసాయంలోకి దిగి పనులు చేసుకున్నాడు. ఇప్పటికీ అదే సత్తువ అతనిలో చావకుండా వుంది. నాగయ్య తేనెటీగలాగా డబ్బు కూడబెట్టి కొడుకు వ్యవసాయానికి అందివచ్చేసరికి పదెకరాల చెలక జతకు అయిదెకరాల తరి పొలం కొన్నాడు. కొడుకు పెళ్ళయి ఏడాదయింది. మనుమడు పుట్టే తలకు ఇంకా అయిదెకరాల భూమయినా కొనాలని ఆశగా వుంది నాగయ్యకు.

"గట్ల గాదె నాయన! గీ సారి భూములు నిజంగనే పోతయంటున్నరే! భూములు కొలిసెటోల్లు తొందర్లనే వొస్తరనీ, గది ఖాయమనీ దేవేందర్ సెప్పిండే" అన్నాడు శీతయ్య.

"దేవేందర్ అంటె పట్నంల కలెక్టరు ఆఫీసుల పనిచేస్తడు గాయనేనా?" నాగయ్య అడిగాడు.

"అవునే గాయినే! భూములు తీస్కొని సర్కారు పైసలు కట్టిస్తరంటనే" శీతయ్య గొంతులో ఎందుకోగాని ఉత్సాహం ధ్వనించింది.

"ఎన్ని పైసలిస్తరు. బజారు ధర కట్టిస్తర ఏమన్ననా? అయినా గా పైసలేం చేస్కుంటం! బంగారం అసొంటి భూమి మల్లకొంటమ?" నాగయ్య గొణిగాడు. వెంటనే గొంతు పెద్దగాచేసి, "అయినా సర్కారోల్లు పైసలిచ్చిందాక మనమేం గావాలె" అన్నాడు నాగయ్య చూపులు శూన్యంగా కనిపించాయి.

నాగయ్య పోయి ఇంటికి ముందున్న అరుగు మీద కూర్చున్నాడు రోజులాగానే. చేతిలోని పొగాకు కాడను మరోచేతి వేళ్లతో ముడతలు లేకుండా చక్కంగ సాగదీసి, వాసన చూసి, ఆ వాసనకు తృప్తిపడ్డాడు. కాసేపు అతని మనసు ఏ చీకాకూ లేకుండా అయింది.

పెద్దిరెడ్డి ఇచ్చిన పది పొగాకు మొక్కలకు నాగయ్య నిరుడు చెలకలో ఓ మూల నాటాడు. ఎర్రభూమిలో పొగాకు ఎదగదని అన్నారందరూ. కానీ, అదేం మహిమోగాని ఆ పది పొగాకు మొక్కలు ఏపుగా పెరిగాయి. ఆ పొగాకు ఏడాది పొడుగునా తండ్రీ కొడుకులకు సరిపోతుందని కాంతమ్మ జాగ్రత్తగా దబ్బణంతో, సుత్లీదారానికి కుచ్చి మడచి బస్తాలో వేసి చుట్టి పెట్టింది. ఆ చుట్టలోంచే నాగయ్య తనకు సరిపోయే ఒక్క కాడ కాక కాంతమ్మ కంట్లో పడకుండా నాలుగు కాడలు తీసుకొని వచ్చి అరుగుల మీద కూర్చున్నాడు. ఎప్పటిలాగే రైతులు నలుగురు ఆ అరుగుల మీదికి చేరారు. నాగయ్య వాళ్ళకు పొగాకు ఇచ్చాడు. అందరూ ఆ పొగాకును నాగయ్య ఇచ్చిన మోదుగాకుల్లో వేసి చుట్టలు చుట్టి తాగుతూ మాటల్లోకి దిగారు. ఆ రోజు వాళ్ల మాటల్లోని విషయం రోజూలాగే పంటలు, ఎరువులు, చీడ పురుగుల గురించి కాదు. భూములను సర్కారోల్లు తీసుకొని ఏరోడ్రోమ్ కడుతున్నారన్నదే!

"దేవేందర్ గీ ముచ్చట మావోడికి పట్నంల కలిసి సెప్పిండట. కలెక్టరు సాయాన వానికి గీ సంగతి సెప్పిండట" అన్నాడు నాగయ్య. అతని గొంతు నీరసంగా ఉంది. వేళ్ళ మధ్య చుట్టను రోజులాగా ఆయన వేగంగా తిప్పుతూ పొగను పీల్చడం లేదు.

"దేవేందర్ ఎవడు? కలెక్టరాఫీసుల పన్జేస్తడు ఆడేనా! ఏతులమారి ఆడు. ఆడు చెప్పింది ఏదీ నమ్మకంగ ఉండదు" అన్నాడు రామలింగయ్య.

"అంతేనంటవ లింగయ్య బావా" అన్నాడు నాగయ్య. అతని గుండెలోంచి ఏదో బరువు దించినట్లయింది.

"సరేలే. సర్కారోల్లు భూములు తీస్కుంటె ఊకనే తీసుకోరు. పైసలు కట్టి ఇస్తరు. ఇస్తె మంచిదే! ఎంత కష్టం చేసుకున్నా మిగులని ఎదుగు బొదుగూ లేని గీ ఎవసాయాలు మానుకుని బిజినెస్సులోకి దిగుదాం. బిజినెస్సులో లాభాలే లాభాలు అనుకో!" పెద్దగా నవ్వాడు వెంకటరెడ్డి.

"ఏం బిజినెస్సో! తెల్వని దందల కెట్ల దిగుతం" అన్నాడు రామలింగయ్య అనుమానంగా.

"తెల్వదంటె నేర్సుకుంటం! మా మేనల్లుని పట్నంల చూసిన గద! బిజినెస్సంటె గదేమంత కష్టమైన పనిగాదు. ఆరామ్‌గా చల్లని అర్రల కూసోని – గీ ఎవసాయంల ఉండే మోటు కష్టముంటద ఏమన్నన" అన్నాడు వెంకటరెడ్డి చుట్టపొగను గాలిలోకి వదులుతూ.

"చాయ్ హోటల్ పెట్టుకున్న గీ ఎవసాయం కన్న నయమే గీ రోజుల్ల" అన్నాడు కిష్టయ్య.

ఎవరూ ఏం మాట్లాడలేదు. మళ్ళా అందుకున్నాడు.

"నేను పట్నంల కలెక్టరాఫీసు కాడ సూసిన గద! చెట్టు కింద చాయ్ అమ్మెటోడు మనకన్న ఎక్కువ సంపాయిస్తున్నడు" నవ్వాడు కిష్టయ్య.

"ఎట్లయిన తరతరాల నుంచి వొస్తున్న ఎవసాయం మనది. గదెట్ల మానుకుంటమే కిష్టయ్య" అన్నాడు నాగయ్య దిగులుగా.

"విమానాలు ఆగే దగ్గర భూములు పోయినోల్లకు నౌకరీలు యిస్తరంటనే నాయిన! దేవేందర్ సెప్పిండు" అన్నాడు శీతయ్య. తల్లీ, భార్య తీరికగా ముచ్చట్లు పెట్టుకుంటు తింటుంటే శీతయ్య పచ్చి అరుగుల మీదికి చేరాడు.

"ఇంకేంది. ఇంటికొక్కనికైన నౌకరీ పెట్టిచ్చాలె అని అందాం" అన్నాడు కిష్టయ్య గంభీరంగా.

"మనం ఎవసాయాలు చేస్కొని మారాజులెక్క బతికెటోల్లం. గిట్ల ఊడిగాలు సేయడం మనతోటి ఏమైతది" అన్నాడు నాగయ్య. అతని గొంతులో నిస్పృహ ధ్వనించింది.

"ఎప్పటికొక్క తీరుగుంటద నాగయ్య మామ" అన్నాడు వెంకటరెడ్డి.

శీతయ్యకు ఇక అక్కడ కూర్చోబుద్ధికాలేదు. సరోజ అర్రల తన కోసం ఎదురు చూస్తుంటది అని మనసులో మెదలంగనే శీతయ్య లేచి లోపలికి వెళ్ళిపోయాడు.

"పంట పండిచ్చిపోసుడు తప్ప మనకేం పనులొస్తయని నౌకరీలు చేస్తం" నిట్టూర్చాడు నాగయ్య.

"గదే మెల్లంగ అలవాటయితది" అన్నాడు వెంకటరెడ్డి.

"అంతేమరి! కాలంతోటి మనం" అన్నాడు కిష్టయ్య చుట్ట ఘాటును తుపుక్కున ఉమ్మేస్తూ.

"చూద్దాం ఏమైతదో" అన్నాడు నాగయ్య లేస్తూ. ఇంకా అతనికి భూములు సర్కారు తీసుకుంటదని నమ్మకం కలగడం లేదు.

"గిన్ని భూములు సర్కారు తీస్కొని ఏం చేసుకుంటది" అతనికి నమ్మశక్యం కాకుండా వుంది.

అందరూ లేచి ఇంటితోవ పట్టారు. కానీ, అందరి మనసుల్లో భూములేమైతదో అన్న సమస్యే మెదులుతున్నది.

శీతయ్యకు దేవేందర్ చెప్పిన కొన్నాళ్ళకే ఊరికి బుల్‌డోజర్లు వచ్చాయి. బుల్‌డోజర్లతో గవర్నమెంటు ఉద్యోగులు వచ్చారు. వాళ్ళవెంట పోలీసు బలగం లారీలతో దిగింది. ఇంజనీర్లు అంతకుముందే వచ్చి గుప్‌చుప్‌గా గట్లను పెట్టారు. రైతులకు ఉత్తరాలు వచ్చాయి. దాన్నుంచి వాళ్ళు తేరుకోకముందే బుల్‌డోజర్లు వచ్చాయి. ఇన్నాళ్ళు రైతు కుటుంబాలు ఆడమగా రెక్కలు ముక్కలయ్యేటట్లుగా పొతం జేసిన భూముల నన్నిటినీ చదును చేయడం మొదలుపెట్టాయి. చెలకలు, పొలాలు ఏకమయ్యాయి. బుల్‌డోజర్లు పెద్ద చప్పుడులు చేస్తూ రాక్షసుల్లా కదుల్తూ కాస్సేపట్లో గట్లను మాయం చేసి భూములను చదును చేస్తుంటే ఊర్లో వాళ్ళందరూ అక్కడ చేరారు. నోరు తెరుచుకుని బుల్‌డోజర్లను చూస్తుండిపోయారు. పిల్లలు వాటివెంట పరిగెత్తడం మొదలుపెట్టారు. కానీ ఒక్కొక్క చెలక, పొలం, చెట్లు, చేమలు చకచక చదునుకావడం చూసి మగాళ్ళు దిగాలు పడిపోయారు. దిక్కుతోచలేదు వాళ్ళకు. ఆడవాళ్ళు లబోదిబోమని ఏడ్వడం మొదలుపెట్టారు.

రెండోరోజు బుల్‌డోజర్లు ఊరిమీద కూడా పడ్డాయి. ఇళ్ళు కూడా నేలమట్టం అవుతాయని చూసి ఊరివాళ్ళందరూ పోయి బుల్‌డోజర్లకు అడ్డంగా నిల్చున్నారు.

"గా పైసలు ఎప్పుడిస్తరో మనం అడుగనే లేదు" అని రైతులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

వెంకటరెడ్డి కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"మనం గీ అన్యాయాన్ని ఎదిరించి కొట్లాడ్దాం" అన్నాడు కిష్టయ్య పిడికిలి పైకి లపె. అందరూ అతనివైపు ఆశగా చూశారు.

నాగయ్య మంచంలోంచి లేవలేక అక్కడికి రాలేదు. శీతయ్య వచ్చాడు. అతను ఏం మాట్లాడలేదు.

"నౌకరీలు ఇస్తమంట్రి గదాన్ని ఎవరు అడుగలేదు" అనుకున్నాడు శీతయ్య. పైకి ఏమీ అనలేదు.

రోజులు గడిచిపోతున్నాయి.

సర్కారు ఇచ్చే రేషన్ బందయింది. తమ పరిస్థితిని చెప్పుకుందామన్నా ఎవరూ సర్కారు ఉద్యోగులు ఆ ఛాయలకు రావడంలేదు. బుల్‌డోజర్లు ఇంకా తమ పనిని చేసుకుంటూ పోతున్నాయి.

ఒకప్పుడు పచ్చని చేనులు, పొలాలు, చెట్లు చేమలతో నిండిన భూములు ఇప్పుడు మిట్టపల్లాలు లేకుండా చదునై భూమి ఆకాశాన్నంటే దాకా ఎర్రగా, నల్లగా ఒక్క రాయీ రప్పా లేకుండా కనిపిస్తున్నాయి. ఎవరి చెలక ఏదో, ఎవరి పొలం ఏదో జాడల్లేకుండా పోయాయి.

ఒకరోజు గుడిసెల్లో ఉండే వాళ్లందరూ మీటింగు పెట్టుకున్నారు. ఆవేశంతో పోయి బుల్‌డోజర్లకు అడ్డుగా నిలబడ్డారు.

"మా భూముల పైసలు ఇయ్యందే ఈటిని నడువనియ్యం మాకు పక్కా ఇండ్లు కట్టిచ్చి ఇస్తమంటిరి ఏవి? మా సంగతేందో సూడకపోతే ఈటిని కదులనియ్యం" అన్నారు గట్టిగా.

ఇది విని కంట్రాక్టరు ఎయిర్ కండిషన్ కారులో కూర్చున్నవాడల్లా ఉరుక్కుంటూ అక్కడికి వచ్చాడు

"అయ్యబాబోయ్. మీ భూములకిచ్చే డబ్బు సంగతి నాకు తెలియదండి. అవన్నీ ఇచ్చేవాళ్ళు వేరే ఉన్నారండి. నేను కాంట్రాక్టరునండి. కావలిస్తే మీకు కూలిపని ఇస్తానండి. చేసుకోండి. అంతేగాని, నాకేం తెలియదు బాబోయ్" అని కాంట్రాక్టరు నివేదించుకున్నాడు.

జనంలో కొందరికి అతను చెప్పింది సమంజసమే అనిపించింది. తిండిలేక మలమల మాడేకన్నా ఏదో ఒక పని చేసుకున్నది మేలనుకున్నారు. కంట్రాక్టరు దగ్గర మట్టి మోసే కూలీలుగా చేరారు.

ఆ రాత్రి గుడిసెల మధ్య ఉన్న కాస్త ఖాళీ జాగాలో అందరూ పోగయ్యారు.

"సర్కారు మనకిస్తమన్న భూమి పైసలు ఇంతవరకియ్యలేదు. ఎవరూ గిక్కడికి వచ్చి మన గోస చూస్తలేరు. అందుకని రేపు మనమే పోయి కలెక్టర్ను ఇసయమేందో అడుగుదం" అన్నాడు కిష్టయ్య

అందరూ ఒప్పుకున్నారు.

మర్నాడు అందరూ కలెక్టరాఫీసు ముందు గుంపులుగా చేరారు. "కలెక్టర్ను కలవాలె" అన్నారు.

"కలెక్టరు లేడు" అని ప్యూను చెప్పాడు. అది వాళ్ళు నమ్మి, ఆఫీసు ముందు కలెక్టరు వచ్చిందాక ఉంటామని బైఠాయించారు. ఇంతలో లాఠీలతో పోలీసులు వచ్చారు వాళ్ళు చుట్టూ దడి కట్టి నిలబడ్డారు. పోలీసులను చూడగానే కొందరు జడుసుకున్నారు. మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు. కూలీ పనుల్లోకి వెళ్ళిపోయారు. మిగిలిన జనం కలెక్టరాఫీసు ముందు పొద్దుగూకె దాక నిశ్శబ్దంగా బైఠాయించారు అప్పటికీ కలెక్టరు రాలేదు.

జనం మర్నాడు వచ్చారు. కలెక్టరాఫీసు ముందు బైఠాయించారు. ఆరోజూ కలెక్టరు రాలేదు. అట్లా వారంరోజులు గడిచిపోయాయి. కలెక్టరు ఢిల్లీకి వెళ్ళాడని తెలిసింది. ఇన్ని రోజులు ఇట్లా కూర్చుంటే ఎట్లా అని చాలామంది దొరికిన కూలిపనుల్లోకి వెళ్ళిపోయారు. శీతయ్య, కిష్టయ్య, ఇంకా కొందరు మాత్రమే మిగిలారు.

ఆఖరికి ఒకరోజు కలెక్టరును వాళ్లు కలిశారు. వాళ్ళు చెప్పుకున్న గోడును విన్నాడు కలెక్టరు. ఒక ఉత్తరం రాసి ఇయ్యమన్నాడు. వాళ్లు అదేవిధంగా రాసి ఇచ్చారు.

"మీకు డబ్బు వెంటనే అందేట్టు చూస్తాను" అని హామీ యిచ్చాడు కలెక్టరు. అంతే వాళ్ళు మళ్ళా పోయినప్పుడు కలెక్టరు ఎప్పుడూ ఆఫీసులో దొరకలేదు. దాంతో జనంలో కొందరు విసిగిపోయారు.

"గా పైసలు వొచ్చేనాటికే ఒస్తాయి. గిట్ల ఆఫీసుల పొంటి తిర్గుతుంటె మనం, మన పోరలు బతికేదెట్ల" అని దొరికిన పనుల్లోకి దిగిపోయారు.

వెంకటరెడ్డి చిన్న హోటల్లో ఊడ్చే, తుడ్చే పనికి కుదిరాడు. జీతం పొంగ హోటల్లో గదుల్లో దిగినవాళ్ళ సామాన్లు మోసినందుకు కొంత మీది ఆదాయం ఉంది అతనికి

రామలింగయ్య పైపుల దుకాణంలో పైపులు చేరవేస్తూ రిక్షా నడపడం మొదలుపెట్టాడు. అట్లా తలా ఓ పని చూసుకుని చేరిపోయారు. కిష్టయ్య, శీతయ్యలు తప్ప అందరూ భూములకు వచ్చే డబ్బు గురించి ఆలోచించడం మానుకున్నారు. "వొచ్చెనాడు అయ్యే వొస్తయి" అని మనసును సమాధానపరుచుకున్నారు.

కాలం గడిచిపోతున్నది.

వానాకాలం రాగానే గుడిసెల తడికల కప్పుల మీద ప్లాస్టిక్ కాగితాలు చేరాయి. అవి గాలికి లేచిపోకుండా ఇటుక పెడ్డలు పెట్టారు. వానాకాలం పోయి చలికాలం రాగానే చుట్టూ వున్న తడికల గోడలకు గోనెసంచులు వేలాడదీశారు. గుడిసెల వాసులకు తెల్లరేషను కార్డులు వచ్చాయి. పొయ్యిలోకి కట్టెలు దొరకక గుడిసెల్లో గ్యాసు నూనె స్టౌలు వచ్చి చేరాయి.

"మాకు పైకం ముట్టేదాకా ఈటిని కదలనియ్యం! మా భూములను, పంటలను, చెట్లను, చేనుగట్లను నాశనం చేసిండ్రు ఆఖరికి మా ఇండ్లూ కూల్చేస్తున్నరు.

మేమెక్కడ ఉండాలె! మాకిచ్చే పైకం ఇయ్యలేదు. మేం గీ మెషీన్లను నడువనియ్యం" అన్నాడు కిష్టయ్య ఆవేశంతో ముందుకువచ్చి నిలబడి.

"గంతే గీ మెషీన్లను నడువనియ్యం" అన్నాడు వెంకటరెడ్డి పెద్దగా గొంతెత్తి.

కట్టలు కట్టలుగ కాగితాలున్న పైలు చేతిలో పట్టుకొని ఒక గవర్నమెంటు ఆఫీసరు పరిగెత్తుకుంటూ వచ్చాడు వాళ్ళముందుకు.

"మీరేం బాధపడకండి. గవర్నమెంటు మీకందరికీ పక్కా ఇళ్ళు కట్టించి ఇస్తుంది. మీకొచ్చే డబ్బు కూడా గవర్నమెంటు తొందర్లోనే ఇచ్చే ఏర్పాట్లు చేస్తుంది. వెంటనే మీకందరికీ తడికెలతో టెంపరరీగా అడిగో అక్కడ ఇళ్ళు కట్టిస్తున్నాం" అని దూరంగా ఖాళీజాగాను చూపించాడు ఆ ఆఫీసరు.

"మా భూములనూ పంటలను నాశనం చేసిండ్రు మా నోట్ల మన్ను పోసిండ్రు. గిప్పుడేం తింటం మేము" అని ఆవేశంగా అరిచాడు కిష్టయ్య

కిష్టయ్య నాలుగుసార్లు పట్నంపోయి వచ్చినవాడు దునియ చూసినవాడు. మాట్లాడగలిగే ధైర్యమున్నవాడు. ఆఫీసరు కిష్టయ్యవైపు చూశాడు

"మీ భూముల ధరలు తొందరగా ముట్టేట్లు నేను వెంటనే కలెక్టరుతో మాట్లాడ్తాను. రేపే మీకు తడికెల ఇళ్ళు కట్టిస్తాం. గవర్నమెంటు మీకు కావాల్సిన బియ్యం, పప్పు మొదలైన రేషను వెంటనే ఫ్రీగా ఇచ్చే ఏర్పాట్లు చూస్తానని మినిష్టరు హామీ యిచ్చారు. మీరేం దిగులుపడొద్దు. మీకేం నష్టం కాకుండా గవర్నమెంటు చూస్తుంది" అన్నాడు ఆఫీసరు ప్రశాంతంగా.

ఆ ఆఫీసరు మాటలకు జనం కాస్త చల్లబడ్డారు. భూముల పైసలు ఎక్కడికీ పోవని సమర్థుయింది వాళ్ళకు. ఊరటపడ్డారు

సూర్యోదయంతోనే తడికలు, వెదురు బొంగులతో నిండిన లారీలు వచ్చాయి. కాస్సేపట్లో ఖాళీ జాగాలో వందల కొద్దీ గుడిసెలు లేచాయి. ఆ ఊరి జనమే కాదు. భూములు, ఇండ్లూ పోయిన చుట్టుపక్కల నాలుగు ఊర్ల జనం ఆ తడికల గుడిసెల్లోకి చేరారు.

"కష్టపడి కట్టుకున్న ఇల్లు కండ్లముందే కూలిపాయె" అని వెక్కివెక్కి ఏడ్చాడు నాగయ్య.

ఆయనకు ఆ తడికెల గుడిసెలో ఏం బాగాలేదు ఒక్కటే అర్ర. అందులోనే వంట. అందులోనే అందరూ పడుకోవడం. గుడిసెనానుకొని గుడిసె. ఇక పక్కన ఖాళీ జాగానే లేదు. గుడిసె ఎదురుగా తోవ విడిచిపెట్టి వరుసగా గుడిసెలు! ఎటు చూసినా గుడిసెలు. ఎటూ మెసిలేందుకు జాగా లేదు.

నాగయ్యకు ఎవరో ఛాతీ మీద పెద్ద బరువు పెట్టి కూర్చున్నట్లుగా అయింది. పులకరం మొదలయింది రాత్రిళ్ళు ఒకటే కలవరింతలు

"నన్ను చెలకకాడికి పోనియ్యండ్రి! అయ్యో! పొలం ఎండిపోతున్నది. పోయి నీళ్ళు పెట్టాలె" అని మంచంలోంచి ఎగిరెగిరి లేస్తున్నాడు కాంతమ్మ, శీతయ్య రాత్రిళ్ళు అతని పక్కనే ఉంటున్నారు. పొద్దున డాక్టరు దగ్గరికి పోదామంటె నాకేమైందంటాడు. కదలడు. ఒంట్లో ఎంత బాగాలేకున్నా చెలక దగ్గరికి పోయే

నాగయ్య పులకరానికే మంచంలోంచి లేవకుండా అయ్యాడు. ఒంట్లో సత్తువ లేకుండా అయింది.

శేతయ్య ఒకరోజు గుడిసెకే ఒక డాక్టర్ని తీసుకొచ్చి తండ్రికి చూపించాడు.

డాక్టరు పరీక్షించి, "మీ నాయనకు జబ్బేం లేదయ్య. కాస్త షాకుతో అట్లా అయ్యాడు. అంతే! అదే సర్దుకుంటుంది" అని కొన్ని మందులు రాసిచ్చి వెళ్ళిపోయాడు.

గుడిసెలు లేచిన కొన్ని రోజులకు ఒకరోజు అక్కడికి జిల్లా కలెక్టరు వచ్చాడు. మూడు జీపుల్లో అతని వెంట సర్కారు ఉద్యోగులు దిగారు. వాళ్ళు దబదబా గుడిసెలకు దగ్గర్లోనే ఒక వేదిక తయారుచేశారు. ఒక కుర్చీ, ఒక మేజా తెచ్చి వేశారు. ఆ కుర్చీలో కలెక్టరు కూర్చున్నాడు. అతని ముందు పెద్ద కాగితాల కట్టలు పెట్టారు. కలెక్టరు స్వయంగా ఒక్కొక్క కాగితం తీసి ఒక్కొక్క పేరు పిల్చి వాళ్ళ భూముల వివరాలు వినిపించాడు. ఆయన వినిపించిన భూముల పట్టాలు గందరగోళంగా ఉన్నాయి. రైతులు దున్నుతున్న భూములు రైతుల పేర్ల లేవు. నాగయ్య కొత్తగా కొన్న పొలాన్ని కొడుకు పేర పట్టా చేయించాడు. కానీ ఆ పొలం అతని పేర లేదు.

కలెక్టరు చదివిన వివరాలు విని రైతులందరూ "గివన్ని అన్నాలంగ ఉన్నయి" అని మొత్తుకున్నారు. రైతుల్లో పెద్ద కలకలం లేచింది. రైతుల పేర కొన్నే భూములున్నట్లు తేలింది రికార్డు కాగితాల్లో.

"గిదంత అబద్ధం. మా తండ్రి, తాతల కాన్నుంచి దున్నుతున్న భూములు మాయి కావంటె ఎట్ల" అని అరిచారు.

"కాగితాల మీద రికార్డుల్లో లేకపోతే మేమేం చేయలేం! ఇప్పుడు నేను చదివి వినిపించిన భూములకే రైతులకు డబ్బు అందుతుంది అన్నాడు కలెక్టరు. ఒక్కొక్క రైతుకు ఎంతడబ్బు వస్తుందో కలెక్టరు లిస్టు చదివాడు.

అడ్డికి పావుసేరు లెక్కన తమ భూములు అమ్ముడుపోవడం చూసి రైతులు నిశ్చేష్టులయ్యారు. నోట మాట రాలేదు.

"ఇది బజారు ధరకన్న చాల తక్కువ. గిట్ల అన్నాలం చేయొద్దు మమ్ముల్ని. అడ్డగోలు ధరలు కడ్తున్నరు మీరు" అన్నాడు కిష్టయ్య చేచి నిలబడి.

"ఇందులో ఏం అన్యాయం లేదు. బజారు ధర ఏమిటో అదే మీకు ఇస్తున్నాం" అని కలెక్టరు అక్కడి నుండి కదిలాడు. వెళ్ళి జీపులో కూర్చున్నాడు.

జీవు కదిలింది. కాసేపట్లో వచ్చిన ఉద్యోగులందరూ జీపుల్లో వెళ్ళిపోయారు. జీపుల వేగానికి లేచిన దుమ్ములో రైతులు మిగిలిపోయారు.

మనుమనికి ఇరవై ఎకరాల భూమిని ఇచ్చి పోతాననుకున్న నాగయ్య ఆఖరికి ఆ మనాదితోనే చచ్చిపోయాడు. కాంతమ్మ పొద్దున్నే కట్టె సాయంతో పోయి మెయిన్ రోడ్డు మీదున్న మిరాయి షాపు బయట కూర్చుంటుంది.

మిరాయి షాపుకు వచ్చేపోయేవాళ్ళు దయతలచి ఆమె ముందున్న రాతెండి పళ్ళెంలో చిల్లర వేసిపోతారు. ఆ చిల్లరంతా పోగుచేసుకొని చీకటైనంక కాంతమ్మ గుడిసెకు చేరుకుంటుంది. కోడలు పెట్టిన అన్నం తిని గుడిసెలో ఓ మూల ముడుచుకొని పండు కొంటుంది.

సరోజ నాలుగిళ్ళల్లో పనిమనిషిగా పనిచేస్తున్నది. పొద్దున్నే పోతే మధ్యాహ్నానికి గుడిసెకు వస్తుంది. మళ్ళా సాయంత్రమూ ఇళ్ళల్లో పనికి పోతుంది. ఇద్దరు పిల్లలు స్కూలుకు పోతున్నారంటే సరోజ కష్టమే అని చెప్పాలి.

శీతయ్య ఏ పనికీ వంగడు. ఎప్పుడైనా కూలికి పోయి సంపాదిస్తే ఆ సంపాదనతో ఆ రాత్రి తాగి వస్తాడు. సరోజను కొడ్తాడు అడ్డం పస్తే పిల్లల్నీ బాదుతాడు.

సరోజా పిల్లల ఏడ్పులతో, కాంతమ్మ అరుపులతో గుడిసె దద్దరిల్లుతుంది. ఇరుగు పొరుగు ఎవరూ ఈ విషయంలో తలదూర్చరు.

గుడిసెల్లో జీవితం ఓ పద్ధతిలో సాగిపోతున్నది. గుడిసెల్లో, గుడిసెల చుట్టూ మురికి పేరుకుపోతున్నది.

"సర్కారోల్లు ఎప్పుడో అప్పుడు మా గోడు ఇంటరు. మా పైసలు మాకిస్తరు. పక్కా ఇండ్లు కట్టిచ్చి ఇస్తరు" అన్న ఆశమాత్రం ఆ గుడిసె వాసుల్లో చావకుండా ఉంది.

అట్లా చావకుండా కిష్టయ్య ఏవో వార్తలు మోసుకొస్తుంటాడు కూడా

అప్పుడప్పుడు మునిసిపల్, అసెంబ్లీ, పార్లమెంట్ ఎలక్షన్లు, బై ఎలక్షన్లు వచ్చిన ప్పుడల్లా వాళ్ళ ఆశలు మళ్లాచిగురుస్తుంటాయి. కిష్టయ్య ఏ పార్టీకి వేయమంటే ఆ పార్టీకే వోట్లు వేస్తారు గెలిపిస్తారు.

ఆ గుడిసెల మధ్య కిష్టయ్య గుడిసె చిన్న డాబాగా మారింది.

కానీ, మిగతావాళ్ళకు పక్కా ఇళ్ళు మాత్రం రాలేదు. రోజులు గడుస్తున్నాయి కానీ, పరిస్థితులు మాత్రం మారడంలేదు.

గుడిసెలకు పక్కన కొంచెం దూరంగా అందమైన ఇంటర్నేషనల్ ఏరోడ్రోమ్ వచ్చింది. జగజగమనే విద్యుత్‌కాంతులు, జెట్ విమానాల మోతలు ఆ గుడిసెల వాళ్ళకు మరో ప్రపంచం ఎంతో దూరం లేదనే ఆశలు కలిగిస్తుంటాయి.

విమానాల్లోంచి దిగి బయటకు రాగానే దేశ విదేశీయుల కండ్లు మొట్టమొదట ఎదురుగా ఉన్న వందలాది గుడిసెల మీదనే పడతాయి.

"హో! ఇండియా! డర్టీ" అంటారు విదేశాల నుంచి దిగిన విదేశీయులు

"పూర్ ఇండియా! వై సోమచ్ పావర్టీ" అంటూ ఆశ్చర్యపోతారు విదేశీయులు.

● ఇండియా టుడే - 20 జూన్, 2000 ●

# 73. భూ నిర్వాసితులు

♦ పి.చంద్ ♦

గోదావరిఖని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు-3 గని గోదావరిఖని పట్టణానికి ఆనుకొనే ఉంటుంది. ఇదివరలో అక్కడ జిడికె సెవన్ ఇంక్లయిన్ బావి ఉండేది. ఇప్పుడు ఆ బావిని మూసివేసిన తరువాత అత్యంత ఆధునికమైన యంత్రాలతో విదేశీ సాంకేతిక పరిజ్ఞానముతో నడిచే ఓసిపి ప్రాజెక్టు మొదలయిన తరువాత అక్కడ వాతావరణమే మారిపోయింది ఓవర్ బర్డెన్‌గా ఉన్న మట్టి డ్రాగ్‌లైన్ వంటి ఆధునిక యంత్రాలు భూమిని తొలచి పోసిన ఎత్తైన మట్టి కుప్పలు గుట్టలుగుట్టలుగా పేరుకుపోగా మరోవైపు లోతైన బొందలు. అక్కడ తేలిన బొగ్గును తరలించడానికి ఉపయోగించే బంపర్స్, షావర్స్, లోడర్స్ వంటి భారీ యంత్రాలు నిరంతరము తిరుగాడు తున్నాయి.

ఓపెన్ కాష్టు ఓసిపి-3 గని మీద తిరుగాడే డంపర్స్ పోయే రోడ్డుకు ఆనుకొని వాచ్‌మెన్ ఉండే షెల్టరు పక్కన తుమ్మచెట్టు నీడన ఒకచిన్న టీకొట్టు ఉంది. ఆ కొట్టు నడిపించే కుండ మల్లయ్య వయసు అరవై దాటింది. తలంత ముగ్గు బుట్టలాగా నెరిసిపోయి ఉంది. అడ్డదిడ్డంగా పెరిగిన తెల్లగడ్డం, అతని వొంటిమీద కట్టుకున్న పంచతప్ప మరే ఆచ్ఛాదన లేదు. అతని వెంట ఉండే పిల్లవాడు అతని మనువడు. పేరు రాజు, రాజు చాలా చురుకైనవాడు. వాస్తవానికి ఆ టీకొట్టు మల్లయ్యది అయినా పని అంతచేసేది రాజే. మల్లయ్యకు కండ్లు సరిగా కనిపించవు. ఏదో నామమాత్రంగా చూచాయగా కనిపిస్తాయి. కాని, అంత స్పష్టంగా చూడలేడు. వయసుతోపాటు పెరిగిన చత్వారము అతని చూపును మందగింప చేసింది.

పొద్దున చీకటితోనే తాత మనుమడు ఇద్దరు ఆ అడ్డమీదికి చేరుకుంటరు. పొద్దున్నే బొగ్గుపొయ్యి అంటేసి మొదటి షిఫ్టు కార్మికులు డ్యూటీకి పోయే సమయంలో కాసేపు అక్కడ విశ్రాంతి కోసం ఆగడం, అవసరమున్న వాళ్ళు చాయ్‌లు తాగుతూ కొంతసేపు పిచ్చాపాటి చేయడం జరుగుతుండేది. అలా మొదటి షిఫ్టు మొదలు కాకముందునుండి రాత్రి బదిలీ అయిపోయే వరకు ఆచిన్న హోటల్ కొనసాగుతూనే ఉంటుంది. ఏ అర్ధరాత్రో చాయ్ గిన్నెలు తోముకొని తాత మనుమలు ఇద్దరు ఇంటిదారి పట్టేవాళ్ళు. మధ్యాహ్నం తిండి తిప్పలు అంతా అక్కడే పది గంటల వేళనో మధ్యాహ్నం పూటనో అక్కడే బొగ్గుల కుంపటి మీదే ఇన్ని బియ్యం ఉడుకేసుకొని ఏదన్న కూరో పచ్చడో వేసుకొని భోజనాలు చేయడం మొదలుకొని

మధ్యాహ్నం పూట మల్లయ్య ఆ మురికి తుమ్మచెట్టు నీడలో కాసేపు విశ్రాంతి కోసం విశ్రమించడం వరకు అన్ని పనులు అక్కడే జరిగిపోతాయి మళ్ళీ మధ్యాహ్నం మూడు గంటలైతే రెండవ షిఫ్ట కార్మికులతో కొంత సందడి మొదలవుతుంది

ఆ రోజు మధ్యాహ్నం ఎప్పటిలాగే మల్లయ్య మురికి తుమ్మ కింద తన గోనె తట్టు పరిచి నడుం వాల్చుకొనే వేళ వాచ్‌మెన్ రంగయ్య కూడా అదే చెట్టు నీడకు చేరుకున్నాడు.

"ఏం తాతా అప్పుడే నిదురకు సిద్ధమైనవా" అంటూ పండ్లన్ని బయటపడేలా మొఖం పెట్టి అడిగి పరిచి వున్న గోనె తట్టు చివరన కూచున్నాడు.

మల్లయ్య, రంగయ్య మొఖంలోకి పరీక్షగా చూస్తు "ఏం నిదురబిడ్డా కంటి మీద కునుకు ఏడపడ్తది. ఏదో ప్రాణం నిలువది కాబట్టి కాసేపు ఇట్లా వొరుగుతా" మల్లయ్య బదులు పలికి బీడికోసం రంగయ్య కేసి చెయ్యి చాచిండు

రంగయ్య మల్లయ్యకు ఓ బీడి ఇచ్చి తనో బీడి తీసుకొని ముట్టించుకున్నడు. రోడ్డు వారగా దృష్టి సారించి రంగయ్య అంతా సవ్యంగా ఉందని భావించి మల్లయ్యతోని మాటల్లోకి దిగిండు.

మొన్న రాత్రి బదిలీల పన్నెండింటి దాక ఇక్కడే ఉండి అప్పుడే కడుపు గుడగుడ లాడుతుంటే గా పంపులో ఉన్న నీళ్ళ కాడికి పోయేసరికి జమేదారు ప్రాన్సిస్ వచ్చి చూసి డ్యూటీ నుండి అబ్‌స్కాండ్ అయిపోయి ఎక్కడ తిర్గుతున్నావని నానా హంగామా చేసిండు. చేసేటోడు రాత్రి పగలనకుండ చేస్తూనే ఉన్నాడు. చెయ్యనివాడు చేయకుండా గాలి పంకాలా తిర్గిపోతనే ఉన్నాడు. ఎవరిని ఏమి అనేట్టు లేదు. మనం కింది స్థాయిలో ఉన్నోళ్ళం పైన ఉన్నోళ్ళు ఏమన్నా పడాల్సిందే అంటూ తన బాధ చెప్పుకుంటున్నాడు

మల్లయ్య ఊ కొడుతూ "అంతా బాకి సంబంధం బిడ్డా! మనిషికి ఎట్లా రాసిపెట్టి ఉంటే అట్లా జరుగుద్ది ఆ బ్రహ్మరాత తప్పించడం ఎవరితరం అవుతుంది" అంటు విచారంగా నిట్టూర్చిండు

మల్లయ్యను కదిలిస్తే చాలు తన బతుకు బాధలు దొంతరలను విప్పి ముందు పెడుతడు నిరంతరము అతను చెప్పే విషయాలు ఒక్కటే అయినా అతను అదే విషయాన్ని మళ్ళీ మళ్ళీ చెపుతూనే ఉంటడు

అదిగో గుట్టోలె పోసిన ఆ మట్టి కుప్పకిందనే నాది రెండు ఎకరాల పొలం ఉండేది. గా మట్టికుప్పకు ఈవల ఉన్న నీటిగుంటే మారెడు పాక చెరువు. చెరువు నిండితే అలకగా రెండు పంటలు పండేది. ఇప్పుడా చెరువు లేదు. ఆ పొలం లేదు. నా పొలమే నాకుంటే గిట్లా గీ ఎంగిలి చిప్పలు కడిగి బతుకాల్సి వచ్చేదా? అంతా కర్మ అనుకోవాలి. ఎట్లా రాసిపెట్టి ఉంటే అట్లా జరుగుద్ది. మల్లయ్య మారేడు పాకకు పోయే మట్టి రోడ్డు కేసి దృష్టి సారించిండు పెద్ద పెద్ద మట్టి కుప్పల మధ్య అలుక్కపోయినట్టుగా మారేడు పాక పోయే మట్టి రోడ్డు లీలగా కనిపించింది. పెద్దగా చప్పుడు చేస్తూ డంపర్ బర్రెన ముందుకు దూసుకపోయింది. దాని ఎత్తైన టైర్లు మట్టి రోడ్డు మీద అచ్చులు పడంగా దుమ్ము రేపుకుంట ముందుకుపోయింది ఎర్రగా లేసిన ధూళికెరటం ఒక్కసారిగా పైకి ఎగజిమ్మి వీళ్ళు

కూచున్న వైపుగా వచ్చి మల్లయ్య కంట్లో దుమ్మురాల్చింది. కంట్లో దుమ్ము పడే సరికి మల్లయ్య కండ్లు నలుపుకుంటూ ఇగో గీ ప్రాజెక్టు వచ్చిన తరువాత మా బతుకులే దుమ్ము కొట్టుక పోయినయి. అంటు విచారంగా మళ్ళీ మొదలు పెట్టిండు.

రంగయ్య పోవడానికి లేచిండు. మల్లయ్య పదే పదే చెప్పే మాటలు పట్ల అతనికి పెద్దగా ఆసక్తి లేకున్నా కాసేపు కూచునే వాడేకాని, తనపై ఆఫీసర్లు రౌండుకు వచ్చేవేళ సమీపిస్తుండటముతో అతను అక్కడి నుండి కదిలిండు.

అదే సమయం రాజు "తాతా, తాతా" అంటూ కేకేసి మల్లయ్యను పిలిచిండు. "అన్నం అయింది. తిని పండుకుందువురా" అంటు మరోసారి అరిచిండు.

మల్లయ్య ఈసారి మనవనికేసి, దృష్టి సారించిండు. వాణ్ణి చూస్తుంటే మల్లయ్యకు మరోసారి గుండె తరుక్కుపోయింది. వానితోటి పిల్లలు రంగు రంగుల బట్టలు వేసుకొని బళ్ళల్లకు పోతుంటే వీడేమో పొద్దు మాపు చాకిరి చేసుకుంటు తన పొట్టనింపేందుకు తాపత్రయపడుతున్నాడు. అదే స్పృహ రాగానే మల్లయ్య పీక్కుపోయిన కండ్లలో నీళ్ళూరినాయి.

రాజు అప్పటికే తాతను పిలుచుకపోయేందుకు అతన్ని సమీపించిండు. రా తాతయ్య కండ్లలో నీళ్ళు చూసి "ఏం తాత మళ్లీ ఏడుస్తున్నవా" అంటూ విచారంగా అడిగిండు. తాత అలా చాలాసార్లు గుడ్లలో నీళ్ళు కుక్కుకోవడం రాజు చాలాసార్లు చూసిండు. ఒక్కొక్కసారి అర్ధరాత్రులు తాత మెలుకువతో ఉండిపోయి విచారంగా తనపక్కన కూచొని కండ్ల నీళ్ళు కార్చటం అతను ఎరిగి ఉన్న విషయమే. మళ్ళీ తాత కండ్లలో కన్నీళ్ళు చూసేసరికి రాజుకు ఒక్కసారిగా విచారం కమ్మింది.

"ఏం లేదురా ఇప్పుడే దంపరు అటు వెళ్ళింది కదా కంట్లో దుమ్ముపడి నీళ్ళూరినాయి. అంటు పంచె కొంగును తీసి కళ్ళకేసి అద్దుకున్నాడు.

"నాకు తెల్సు నీవు ఏడుస్తున్నావు. మల్లయ్య పక్కన మునివేళ్ళమీద కూర్చొని తన చిన్నారి చేతులతో తాత చెంపలను తుడిచాడు.

"అబ్బే నేనేం ఏడ్వటము లేదురా దుమ్ము పడి కండ్ల పొంటి నీళ్ళు కారినాయి అంతే. పద పద అన్నం తిందాంకాని ఇప్పటికే చాలా ఆలస్యము అయింది. పొద్దటి నుండి నువ్వేమి తినకపోతివి" మల్లయ్య దిగ్గున లేచి మనువణ్ణి తీసుకొని రోడ్డు వార బొగ్గుల కుంపటి కాడికి వచ్చిండు.

వేడివేడి అన్నాన్ని రాజు రెండు రాతెండి పళ్ళాల్లో పెట్టాడు. నిన్న సాయంత్రం నూరిన పచ్చిమిరపకాయలు వేసి నూరిన టమాట పచ్చడిని రెండు పళ్ళాల్లో వేసి తాతకు ఒక పళ్ళెం అందించి తనొకటి తీసుకున్నాడు.

మల్లయ్య మనసు విచారంతో మొద్దుబారిపోయి అన్నం మింగుడు పడటం లేదు. అయితే మనవణ్ణి కష్టపెట్టడం ఇష్టం లేక తాత్సారంగా ఒక్కొక్క ముద్ద నోట్లో వేసుకొని మింగసాగిండు.

మిట్ట మధ్యాహ్నం ఎండ వేడెక్కిపోతున్నది. కొద్దిగా వేడిగాలి మొదలయింది. చుట్టు చెట్టుచేమలేక కనుచూపు మేర బోసి పోయినట్టుగా ఉంది. మట్టి దిబ్బలు ఎండకు ప్రతిఫలిస్తున్నాయి. అన్నం తిని చేయికడుక్కునే వేళ కల్లు పోషవ్వ ఫలహారాల బుట్ట పట్టుకొని అక్కడికి వచ్చింది.

కల్లుపోషవ్వకు నలుభై ఏండ్ల వయసుంటుంది. అక్కడికి దగ్గరలో ఉండే కల్లుపాక కాడ ఫలహారాలు అమ్ముకుంటు జీవనం సాగిస్తుంది. మనిషి నల్లగా లావుగా ఉంటుంది. వెడల్పు ముఖం మీద ఎర్రబొట్టు. ఎప్పుడు జర్దాకిళ్ళి నమిలే అలవాటువల్ల ఆమె పండ్లన్ని ఎర్రబారి పోయి ఉంటాయి. మనిషి చాలా గడుసుది. ఆ గడుసుతనమే లేకుంటే తాగుబోతుల మధ్య కల్లుపాకలో ఫలహారాలు అమ్మేదే కాదు. అంతకు మించి ఆమెకు వేరే జీవనోపాధి ఏమీలేదు. బతకాలంటే ఏదో ఒకటి చేయాలి తప్పదు అనే తత్వము ఆమెది.

కల్లు పోషవ్వ ప్రతిరోజు మిట్ట మధ్యాహ్నం వేళ ఫలహారాల బుట్ట పట్టుకొని వస్తుంది. మొదటి షిప్టు కార్మికులు డ్యూటీ దిగిపోయే వేళకు కల్లు పాకలో గిరాకీ మొదలవుతుంది. అలా మొదలయిన గిరాకీ రాత్రి చిమ్మచీకట్లు పడే వేళకు సద్దుమణిగి పోతుంది. అంతవరదాక ఆమె ఆ కల్లుపాకలో ఫలహారాలు అమ్ముకొని తిరిగి ఇంటిదారి పడుతది. ప్రతిరోజు కల్లు పాకకు ఫలహారాలు తీసుకపోయే అలవాటు ప్రకారము కల్లు పోషి ఫలహారాల బుట్ట పట్టుకొని అక్కడికి వచ్చింది. ఆమె వచ్చేసరికి వాళ్ళు అప్పుడే భోజనాలు ముగించిండ్రు.

"ఏం బిడ్డా ఏంకూర వండినావు" అంటూ పరిచయ పూర్వకంగా మందలింపుగా రాజును అడిగింది. రాజు అంటే ఆమెకు తెలియని ప్రేమ, అనురాగం. ప్రేమ ఎందుకన్నది ఆమెకు ఇదమిద్ధంగా తెలియదు. తల్లిదండ్రులు లేని పిల్లవాడు అనా? లేదా ఇంత చిన్న వయసులో బ్రతుకు దెరువు కోసం రాజు పడే ఆరాటం రోజు చూడటం వలనా? లేక ఆమెకు పిల్లపాప లేకపోవడం వల్లనా? రాజును పుత్రవాత్సల్యంతో చూడటము వల్లనా? ఏ కారణం అయితేనేమి ఆమె విధిగా రోజు అక్కడికి రావడం కాసేపు అక్కడ గడిపి చాయ్ తాగిపోవడం ఆమె దినచర్యలో భాగం అయిపోయింది.

"ఇయ్యాల టమాట పచ్చడి చేసిన" అని రాజు ఆమె మాటకు బదులిచ్చిండు.

"నిన్న పచ్చడే. ఇవ్వాళ పచ్చడేనా? రోజు పచ్చడి మెతుకులు తింటే కడుపు కరాబు అయిపోతది." ఫలహారాల బుట్ట కుంపటికి కాస్త ఇవతల పెట్టి మల్లయ్యతోని మాటలకు దిగింది.

"పెద్దయ్య ప్రాణం ఎట్లుంటున్నదే" అంటు మొదలు పెట్టింది కల్లుపోషవ్వ.

"కొత్తేముంది బిడ్డా గిట్లనే ఉంటుంది. వంగిన పొద్దు ఇప్పుడో అప్పుడో గుటుక్కు మనక మానదు. నా బాధంతా వీని మీదనే. నేను లేకుంటే వీడు ఎట్లా బతుకుతాడా అని తలుచుకున్నప్పుడల్లా నా ప్రాణం విలవిల్లాడుతుంది." - మళ్ళీ అదే విచారం మల్లయ్యను కమ్ముకున్నది. నిజానికి మల్లయ్య మాట్లాడాలనే ప్రతిమాట పుట్టెడు దుఃఖముతో కూరుకుపోయిన మనిషి మాట్లాడే మాట తీరుంటుంది.

"నువ్వు గట్లా రంది పడితే లాభంలేదు. కానున్నది కాకమానదు. ఒక్కదాన్ని అయినా పొట్ట నింపుకోవడానికి ఏదో ఒకటి చేస్తలేనా" కల్లు పోషవ్వ మొఖంలో విచారం కమ్మింది. మళ్ళీ అంతలోనే తేరుకున్న దానిలా "రంది పడ్తె ఏమైతదే నీ మనుమణ్ణి పెద్దచేసి వాణ్ణి ఇంటివాణ్ణి చేయాలె అప్పుడిక నీవు కాలుమీద

కాలేసుకుని మునిమనుమల్లతోని ఆడుకోవాలె." ఏదో సుందర స్వప్నం దర్శిస్తున్నట్లు కల్లు పోషవ్వ కండ్లు మెరిసిపోయినవి.

మల్లయ్య గలగల నవ్విండు "అంత అదృష్టమా బిడ్డా".

"అదృష్టవంతుడివి కాకపోతే మరేంది! నీకు మనవడన్నా ఉన్నాడు." కల్లు పోషవ్వ కంఠంలో మళ్ళీ విషాదం.

రాజు చాయ్ తెచ్చి ఆమె చేతికిచ్చిండు. చాయ్ అందుకొని మెల్లగా సప్పరించడం మొదలుపెట్టింది. కల్లు పోషవ్వ ఉండేది మారేడుపాక గ్రామమే. మల్లయ్యకు చిన్నప్పటి నుండి తెలిసిందే. కల్లు పోషవ్వ భర్త పచ్చి తాగుబోతు. తాగి తాగి కార్జాలు తూట్లుపడి సచ్చిండు. భర్త బతికినన్ని రోజులు అరిగోసపడ్డది. కొన్ని రోజులు కూలి నాలి చేసి బతికింది. చివరికి కూలి దొరకడం కష్టమైపోయి ఈ వ్యాపారంలోకి దిగింది.

చాయ్ తాగిన గ్లాసు రాజు చేతికిచ్చింది. గ్లాసు తీసుకొని క్షణకాలం ఫలహారాల గంపకేసి ఆశగా చూసిండు. కల్లు పోషవ్వ అది కనిపెట్టకపోలేదు. రొంటికున్న చేతి సంచి తీసి రూపాయి బిళ్ళ యిచ్చింది. పోపు చేసిన శనిగ గుడాలను పిడికిట తీసి రాజు చేతిలో పోసింది. రాజు ప్రతిరోజు చాయ్ తాగినప్పుడు రాజుకు పిడికెడు గుడాలు పెట్టడం ఆమెకు ఆనవాయితీ. అందుకు ఆమె డబ్బులేమీ తీసుకోదు.

మనమడు సంతోషంగా గుడాలు చప్పరించడం చూసి "పోషవ్వ వానికి ఎందుకే అలా గారాబం చేస్తావు. పొద్దు నెత్తిమీదికి వచ్చిందంటే వాని చూపంత రోడ్డుమీద నీకోసమే" అంటూ బోసినవ్వుతో నవ్విండు మల్లయ్య.

"అందులో పొయ్యేది ఏం భాగ్యం! నాకు ఇటు రాకుండా పోతే ఏదో పోగొట్టుకున్నట్టుగా ఉంటుంది" అంది పోషవ్వ. అంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చినట్టుగా "అన్నట్టు పెద్దయ్య! రేపో మాపో మన ఊరికి కలెక్టర్ సాబు వస్తాడంట. భూములు పోయిన వాళ్ళ కేసులు పైసలా చేసేందుకు" అంది.

ఆ మాట వినేసరికి ఎక్కడలేని చిరాకు కల్గింది "ఎందుకంటా ఇంకా బతికి ఉన్నరో చచ్చి పోయిండ్లో చూసిపోవటానికా?"

పోషవ్వ అదేమీ పట్టించుకోలే. మళ్ళీ మాట్లాడసాగింది. "ఈసారి ఏదో ఒకటి పైసలా అయిపోద్దని ఊరు ఊరంతా అనుకుంటున్నది. పెద్ద వెంకటి, రాజలింగం సారు ఊళ్ళందరికి చెప్తున్రు. అందరు రావాలెనంట! ఈసారి పైసల కాకుంటే మళ్ళీ ఎన్ని దినాలకు అయిద్దో తెలియదట!"

పుండుమీద కారం చల్లినట్టుగా మల్లయ్యకు కోపం ఎక్కువైంది.

"ఏమైతదంట లొట్టపీసు. భూములు పోయి ఎనిమిదేండ్లయింది. సగం మంది ఊరు విడిచి పోయిండ్రు. మిగిలిన సగంమంది ఒంటి ఊపిరి ప్రాణాలతోని రోజులు వెల్లదీసు కొస్తుండ్రు. మొన్నటికి మొన్న స్పీకర్ వచ్చిండని ఊరు ఊరంతా ఆయన చుట్టుమూగి పూలదండలేసి డప్పులు మోగించుకుంటూ ఊరేగించి తీస్కపోతే, మీటింగుల ఏం చెప్పిండు. వారం పది రోజుల్లో ఏదో ఒకటి చేస్తమని అరచేతిలో బెల్లంపెట్టి సంక నాకిచ్చిపోయిండు. వారం కాదు ఆర్నెల్లు గడిచిపాయె. ఏమైంది

ఎంటిక మందం కదులలేదు. మా రాజేశం ఎప్పుడో చెప్పిందు. ఈ బాయిలు వచ్చి మన బతుకులు మంట్లె కలుస్తయని వాడు అస్సట్లే జరిగింది. మనం బతికుండగనే బొంద పెట్టిండ్లు. అగోగా మట్టికుప్పలు ఏంటివనుకుంటున్నావు అంటూ గుట్ట లాంటి మట్టికుప్పలకేసి చూయించి "మన బొందలు" మల్లయ్య కంరం దుఃఖంతో పూడుకుపోయింది. ఆయనకు కొడుకు మతికి వచ్చేసరికి దుఃఖంతో గుండె చెరువై పోయింది. మాట పెకలలేదు దుఃఖం పొంగుకొచ్చింది. అందుకే బిడ్డా మా రాజేశంను బతకనివ్వలేదు అందరు కల్సి వాన్ని చావగొట్టిండ్రు" మల్లయ్య ఎక్కి ఎక్కి పడ్తు ఏడ్వసాగిండు.

రాజేశం పేరు వినేసరికి కల్లు పోషవ్వ మనసు కూడా బరువెక్కింది మనిషంటే రాజేశమే అని ఆమె స్థిరమైన అభిప్రాయం. ఆమె దుఃఖాన్ని మనసులోనే దాచుకొని "రాజేషన్న అందరటువంటి వాడుకాదే. దేవునటువంటివాడు. అందుకే మంచి వాళ్ళను లోకం మీద ఎక్కువ రోజులు వుండనీయడంట" పోషవ్వ ఓదార్పుగా మల్లయ్యను ఊరడించింది.

నోట్లో గింజలు నోట్లోనే ఉండగా రాజు బీరిపోయిండు గద్గదమైన ఆ వాతావరణం అతని చిన్న మనసును బాధపెట్టింది తండ్రి పేరు వినేసరికి. తండ్రి బొత్త మీద పండుకున్న తనను రెండు చేతులతో పొదివి పట్టుకొని గుండెలకు హత్తుకుంటూ తండ్రి నిద్రబుచ్చే చిన్ననాటి జ్ఞాపకం లీలగా మనసులో మెదిలింది.

బీరిపోయిన పిల్లవాణ్ణి చూసి పోషవ్వ మనసు కలుక్కుమంది. "ఏంది బిడ్డా అట్ల బీరపోయినవు తిను" అంటూ అనునయంగా దగ్గరికి తీసుకొని రాజు తలను గుండెలకు హత్తుకున్నది. తల్లిలాంటి మెత్తటి స్పర్శతో రాజు మనసుకు కొంత ఊరట కల్గింది.

పోషవ్వ మెల్లగా లేచి తన ఫలహారాల బుట్టను చేతిలోకి తీసుకొని బయల్దేరటానికి సిద్ధమౌతూ "పెద్దయ్యా అయిందానికి కానిదానికీ ఊరికే తలుచుకొని బాధపడ్తె ఏం లాభం లేదు. మన నొసట ఎట్ల బతుకాలని రాసిపెట్టి వుంటే అట్లనే జరుగుద్ది. ముందు జరుగపోయేదాని గురించి గుండె దిటువు చేసుకోవాలె" అంటూ అక్కడినుంచి కల్లుపాక కేసి అడ్డదారి గుండా బయలుదేరిపోయింది

డంపర్ ఆపరేటర్ సాయబలీ చాయ్ తాగటానికి అక్కడికి వచ్చిండు. "అరె ఛోటే అబ్బా చాయ్ బనావోరే!" అంటు అక్కడున్న బండరాయి మీద కూసున్నడు. రాజు చాయ్ కాసే గిన్నెలో పాలుపోసి కుంపటి మీద పెట్టిండు. అందులో కాస్త చాయ్‌పత్తా చక్కర కలిపి చాయ్‌ను మరగపెట్టిండు.

బండరాయి మీద కూచున్న సాయబలీ కాళ్ళు బారజాపుకొని వొళ్ళు విరుచుకున్నాడు మల్లయ్య లేచిపోయి మళ్ళీ మురికి తుమ్మచెట్టు కాడికి నడిచిపోయి గోనె తట్టుమీద వొరిగిండు

రాజు చాయ్ తెచ్చి ఇస్తేదాన్ని తీసుకొంటు కొమురయ్య గిట్టకనిపించిండా!" అంటు రాజును అడిగిండు.

"ఏం కొమురయ్య సారు"

"వాడేరా వెంకట్రావ్‌పల్లి కాడ డీసిల్ అమ్ముతాడు చూడు."

"ఇయ్యాల కన్పించలేదు సారు."

"నీకు కన్పిస్తే నన్ను ఒకసారి కలువమని చెప్పు."

"సరె మంచిది."

సాయబలీ చాయ్ తాగుకుంటూ ఆలోచనల్లో పడ్డాడు. వారం రోజులుగా కొమురయ్య కనిపించక పోయేసరికి అతనికి కొంత దిగులుగా వుంది. వెంకట్రావ్‌పల్లి కాడ డీసిల్ అమ్మే కొమురయ్య డంపర్ డ్రయివర్‌కు మధ్య చిన్నపాటి లావాదేవీలున్నాయి. నైటు షిఫ్టులో దొంగచాటుగా డంపరు నుండి వంద రెండు వందల లీటర్ల డీసిల్ దొంగతనంగా తీసినా పెద్దగా లెక్కలోకి రాదు. అట్లా నాల్గు ఐదు వందలు జేబుల్లోకి చేరుకుంటాయి. అలా తీసుకపోయిన డీసిల్‌ను వెంకట్రావ్‌పల్లికాడ డబ్బాలో పెట్టి కొమురయ్య అమ్ముకుంటాడు. పోలీసుల మామూలు, సెక్యూర్టీ వారికిచ్చే మామూలు పోను ప్రతిసారి కొమురయ్యకు ఐదారువందలు మిగులుతాయి. ఓపెన్ కాస్టు బావులు మొదలయిన తరువాత పైస్థాయి వాళ్ళు వాళ్ళకు అందినకాడికి వాళ్ళు మింగుతున్నారు.

చాయ్ డబ్బులు ఇచ్చి సాయబలీ వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం రెండు గంటల వేళ డ్యూటీ నుండి ఇంటికిపోయే మొదటి షిఫ్టు కార్మికులతో, రెండవ షిఫ్టుకు డ్యూటీకి వచ్చే కార్మికులతో చాయ్ గిరాకీ ఎక్కువుంటది. రాజు పెద్ద గిన్నెలో చాయ్ మరగబెట్టిండు. ఓ కునుకు తీసి మల్లయ్య లేచి వచ్చి పనిలో మునిగిపోయిండు.

ఓపెన్ కాస్టులో ఎక్కడో పెద్ద బ్లాస్టింగ్ జరిగిన చప్పుడు. ఆ వెంటనే ఆకాశంలోకి ఎగజిమ్మిన ధూళి లేచింది. అలవాటుగా అందరు ఒక్కసారి రేగిన దుమ్ముకేసి చూసిన్రు. ఓపెన్‌కాస్టును ఆనుకొని ఉన్న ఫర్టిలైజర్ ఫ్యాక్టరీ గొట్టం నుండి నల్లటి పొగ ఎగజిమ్ముతున్నది.

అప్పుడే రాయమల్లు నల్గురు మనుషులను వెంట వేసుకొని అటుగా వచ్చిండు.

"ఏం తమ్మీ బాగేనా" అంటూ పలకరించి ఐదు చాయ్‌లకు ఆర్డరు యిచ్చిండు.

రాజుకు రాయమల్లును చూస్తే ఎంతో సంబంరం. అందరితో కలుపుగోలుగా మాట్లాడే రాయమల్లు అంటే తోటి పనివారికి కూడా యిష్టమే. ఏదన్నా విషయముంటే నిక్కచ్చిగా సూటిగా మాట్లాడుతడు. ఎదుటివారిని నొప్పించాలనే తత్వం కాదు అతనిది. కోల మొఖం, నలభై వయసు వుంటుంది. కొద్దిగా నెరసిన జుట్టు కొచ్చటి ముక్కు గుబురుగా పెంచిన నల్లటి మీసాలు, చిరునవ్వు చిందించే మొఖం. అతనితో ఒక్కసారి మాట్లాడితే చాలు ఎన్నో ఏండ్లుగా పరిచయమున్నట్లుగా అనుభూతి కల్గుతుంది. రాజు అంటే రాయమల్లుకు సానుభూతి, ప్రేమ. మల్లయ్య కుటుంబం ఎలా బరుబాదు అయిందీ, రాజేశంను చంపేసిన సంగతి, భూనిర్వాసితుల గోడు అంతా అతనిని కలిచివేసింది. రాజు ముసలి తాతతో కలిసి బతుకు దెరువుకోసం సాగించే పోరాటం అతన్ని బాగా కలిచివేసింది. ఒకవిధమైన సానుభూతి, జాలి. ఆయన గుండెల నిండా నిండిపోయి తీరుబడి దొరికినప్పుడల్లా

మాటలు కలిపేవాడు ఆ చిన్న పిల్లవాడి ముందు తాను చిన్నపిల్లవాడై పోయినట్టు మాటలు పొడిగించేవాడు. మల్లయ్యతో మాట్లాడేటప్పుడు అతను ఎంతో అనుభవం వున్నవాడిలా కష్టం సుఖం తెలిసి మాట్లాడేవాడు.

ఆరోజు రాయమల్లు వెంట వచ్చిన వారితో ఏదో సీరియస్‌గా మాట్లాడు తున్నాడు. "తన ఆఫీసు ముందున్న గులాబి చెట్టునుండి పువ్వు తెంపిందని కార్మికున్ని నాల్గు రోజులు సస్పెండ్ చేసిందంటే ప్రాజెక్టు మేనేజరు ఎటువంటివాడో అర్థం చేసుకోవచ్చు" అంటున్నాడు.

"వాడు పెద్ద కన్నింగ్ అన్నా, లెవన్ లో పనిచేసినప్పుడు డ్యూటీకి నెక్కరు వేసుకొని రాలేదని ఇరువై మందిని ఇంటికి పంపించిండు."

"మరి వాన్ని ఏం చేయమంటావు నయాపైస పని ఉండదు. వచ్చిన కాన్నుంచి ఎట్లా డబ్బులు సంపాదించటమా అనే ఆలోచనే నాయే. లెవెన్ లో వున్నప్పుడు గిట్లనే కాంట్రాక్టర్లతో కుమ్మక్కు అయి లక్షలు బోంచేసిండని అక్కడి నుండి ఇక్కడికి పంపిస్తే ఇక్కడ కోట్లు బోంచేస్తాండు. అయ్యగారి పని కుప్పమీద కూసుండబెట్టినట్టు అయ్యింది."

"కోట్లా? నమ్మశక్యంగా లేదే" మరొకతను అమాయకంగా అడిగిండు.

"అందులో అబద్ధం ఏం లేదు" రాయమల్లు కంఠం కంగున మోగింది. అంతలోనే రాజు చాయ్ గ్లాసులు తెచ్చిస్తే వాటిని అందుకొని చప్పరిస్తూ మళ్ళీ మాట్లాడసాగిండు. "అసలు ప్రాజెక్టు ఎన్ని కోట్లతోని నడుస్తుందనుకుంటున్నావు. దాదాపు ఐదారువందల కోట్ల పెట్టుబడి పెట్టిండ్లు. ఈ మట్టి దిబ్బలమీద ప్రతి పని యంత్రాలే చేస్తాయి. వాటిని నడిపించడానికే మనుష్యులు. ఈ యంత్రాలకు స్పేర్‌పార్టు కావాలని, అవి కావాలని ఇవి కావాలని పై అధికారులకు రిపోర్టులు పంపుతారు. లేకుంటే ప్రాజెక్టు ఆగిపోయేలా వుందనేసరికి, ఆఘమేఘాలమీద స్పేర్‌పార్టులు సప్లయి కావాల్సిందే. ఒక్కొక్క స్పేర్‌పార్టు ఖరీదు వందలు వేలు కాదు లక్షల్లో వుంటది. అటువంటి స్పేర్‌పార్టును సప్లయిచేసి మిలాఖతు అయిపోయి లక్షలు భోంచేస్తాండ్లు." 'రాయమల్లు చాయ్‌ను చప్పరించి "అదంతా పెద్ద కుంభకోణం ఇదంతా అందరికి తెల్సిన వ్యవహారమే అయినా ఎవరికి ఏం పట్టనట్టుగా ఉంటారు. ఎందుకంటే అందరు దొంగలేనాయే" చాయ్ తాగిన గ్లాసు కింద పెట్టిండు.

"మరి అటువంటప్పుడు యూనియన్ వాళ్ళు ఏం చేస్తాండ్లు. ఇటువంటి వాళ్ళ అవినీతిని నిలదీయవచ్చు కదా?"

"మా ఇంటివాడే మంచోడు అయితే మంగలివాని తోని నేనెందుకు పోతనన్నదట ఎనకటికి ఎవతో. ఇటువంటి అవినీతిపరులైన అధికారులు ఎవరితోని ఎట్లా ఉండాలో అట్లా వుంటారు. నీ వల్ల వాని అస్థిత్వానికి భంగమని భావిస్తే నయానో భయానో నిన్ను మంచి చేసుకోవాలని చూస్తారు. మన యూనియన్ నాయకులెవరికి డబ్బు అంటే చేదు? అట్లని అందరు అట్లా ఉన్నారని కాదు. కిందిస్థాయిలో కార్మికుల మంచి కోసం పని చేస్తామని జాలి కలిగినవారు ఒకరిద్దరు ఉన్నా వాళ్ళ మాటలు నెగ్గకుండా అయితాంది."

రాయమల్లు మాటల్లో పడి టీ డబ్బులు యిచ్చి ఎక్కువసేపు అక్కడ ఉండకుండా వెళ్ళిపోయిండు.

సెకండు షిఫ్టు ఆరంభం కావడంతో మల్లయ్య లేచివచ్చి పనిలో మునిగి పోయిండు తాత మనవడు ఇద్దరు ఆ రోజు తీసుకున్న పాలు అయిపోయేసరికి సాయంత్రం ఏడయింది. మసక వెలుతురు పోయి చీకట్లు కమ్ముకున్నాయి. గిన్నెలు బోళ్ళు కడుక్కొని మూట ముల్లె సర్దుకొని ఇంటిదారి పట్టేసరికి ఎనిమిది కావచ్చింది.

మారేడుపాక ఊళ్ళోకు పోయేదారి రెండు పెద్ద మట్టికుప్పల గుండా సన్నటి గతుకుల మట్టి రోడ్డు. గోనె సంచిలో కట్టిన బోళ్ళను నెత్తిమీద పెట్టుకొని మల్లయ్య ముందు నడుస్తుంటే ఆయన వెనక రాజు రెండు చేతుల్లో రెండు సంచులు పట్టుకొని వెంట నడుస్తున్నాడు. చిమ్మని చీకటి. మట్టిదిబ్బల మధ్య మరింత చీకటిగా ఉంది. అలవాటయిన దారి కావడంతో మల్లయ్య కండ్లకు సరిగా దారి కానరాకున్నా సరసర ముందు నడుస్తున్నడు. పాత చెరువు బాపతు తూము కాడ క్షణకాలము నిలబడిపోయి మనుమని కోసం నిలబడిపోయి వెనక్కి తిర్గి చూసిండు. కాస్త దూరంలో మనుమడు లీలగా కనిపించాడు. రాజు వచ్చేవరకు మల్లయ్య అక్కడే నిలబడిపోయిండు. రాజు అతన్ని సమీపించిన తరువాత మల్లయ్య ఎప్పటిలా మళ్ళీ చెప్పసాగిండు.

"గీ తూము పక్కన పెద్ద రాలచెట్టు ఉండేది. మీ నాన్న చిన్నప్పుడు ఇక్కడే ఆగుకునేవాడు. గీ చెరువులో ఈత కొట్టేవాడు" అంటూ మళ్ళీ ఎనకటి విషయాల్లోకి దిగిండు.

ఇప్పుడక్కడ చెట్టు చేమ ఏమీ లేదు. పాడుబడి ఒకవైపు మట్టి కప్పుకపోయిన తూము, మరోవైపున సగం వరకు తేలిన తూము బాపతు పెద్ద బండరాళ్ళు తప్ప మరేమీ లేదు. ఆ చీకట్లో ఏదీ సరిగా కనిపించలేదు.

"గీ తూముకు ఈవల జారుడుబండ ఉండేది. ఆ బండ ఇప్పుడు ఆ మట్టిదిబ్బ కింద కప్పుకపోయింది" అంటు ఎదురుగా ఉన్న మరో మట్టి దిబ్బను చూయించిండు. నిజానికి మల్లయ్యకు అంతా అల్లుకుపోయినట్టుగా మసక మసకగా ఎత్తైన మట్టి దిబ్బ కనిపించింది. ఆ మట్టి దిబ్బ దిక్కు దృష్టి సారించి అక్కడే నిలబడిపోయిండు.

రాజుకు అసహనంగా ఉంది. తాత చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెపుతడు. ఒకవైపు పొద్దంతా ఎండలో పనిచేసి ఆ చిన్నారి ప్రాణం అలిష్టగా వుంది. ఇంటికి పోయి ఎప్పుడు పక్కమీదికి చేరుకుందామా అన్న ధ్యాస.

"పద తాత ఆలస్యం అయితాంది ఇంటికి పోదాం" అంటూ రాజు తొందర చేసిండు.

మల్లయ్య అక్కడి నుండి కదలలేదు. నెత్తిన మూటను తూము రాయి మీద దింపి ఇంటికే కదా పోదాం ఆగు కాసేపు దమ్ము తీసుకొని పోదాం" అంటు ఆ బండరాయి మీద చతికిలపడ్డాడు.

రాజు చేసేది లేక తాత పక్కనే కూచున్నాడు.

మల్లయ్య మళ్ళీ చెప్పసాగిండు. "ఇగో ఇక్కడి నుండి తూము జాలారు బండ కాన్నుంచి పోతే నాల్గు మళ్ళు దాటితే మన పొలం వుండేది' చీకట్లో మల్లయ్య చేయెత్తి మట్టిదిబ్బ దిక్కు చూయించిండు

"గీ చెరువు నిండితే రెండు పంటలు అలుకగ వుండేది మీ నాన్నకు పొలమంటే ప్రాణం. మనకు రెండు దున్నపోతులుండేవి. వాటిని వేసుకొని తొలకరి చినుకులు పడేసరికి పొలము మీదుండేవాడు. దుక్కి దున్ని సాపుచేసి చెరువులకు బారెడు నీళ్ళు వచ్చేసరికి నారు అలికేవాడు. వాని ఆపచ్చన చూసి ఊరు ఊరంతా ఆశ్చర్య పోయేటోళ్ళు. వాడు అన్నిటికంటే ఎక్కువ ఆ మట్టిని నమ్ముకున్నాడు. గీ భూమిని నమ్ముకుంటే లాభం లేదని బాయి పనిల కుదురుకుంటున్నారు. మీ అయ్యకు బాయి పని మీద జోషే ఉండేది కాదు. మనకింత పొలం వుంది. ఆ తల్లి చల్లగా చూస్తే మన తిండికి కొదవ ఉండదు అనేవాడు. అప్పట్లో బాయి పనికి కుదురుకున్నా మనకు గీ కష్టాలుండేవి కావు. మల్లయ్య క్షణకాలము మాటపలుకు లేకుండా ఆగిపోయిండు. గతం తాలూకు స్మృతులు అతని మాట పెగలనియ్యలేదు. భారంగా నిట్టూర్చి మెల్లగా లేచి ముందుకు కదిలిండు రెండు చేతుల్లోకి సంచులు తీసుకొని రాజు తాత వెంట నడిచిండు.

మారేడుపాక గ్రామం చుట్టూ ఓపెన్ కాస్టు మట్టిదిబ్బలు కొండల్లా పేరుకు పోవడంతో బయటనుండిచూస్తే అక్కడ ఒక ఊరు ఉన్నట్టుగానే కనిపించదు. చిమ్మని చీకటిని పారదోలలేక అక్కడక్కడా గుడ్డి కిరసనాయిల్ దీపాలు ఇంకా తొలగిపోని ఆ గ్రామస్తుల ఆశల్లా మినుకు మినుకు మంటూ మిగిలిపోయాయి.

ఆ గ్రామంలో దాదాపుగా నాల్గు వందల గడపలుంటాయి. అక్కడున్న ఇండల్లలో సగానికి పూరి పాకలు. మిగిలిన కొన్ని ఇండ్లల్లో కొన్ని గూనపెంకుల ఇండ్లు. ఒకటి రెండు దాబాలున్నాయి దాదాపుగా ఆ ఇండ్లన్ని ఓపెన్‌కాస్టు బ్లాస్టింగ్‌ల వల్ల పగుల్లు బారి, నెర్రలిచ్చి ఇప్పుడో అప్పుడో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నా యింకా ఆ ఇండ్లను వదిలిపెట్టకుండా ఉన్న కుటుంబాలు, ఆ చీకట్లో మానవ అస్థిత్వాన్ని తెలియజేస్తున్నాయి. ఓపెన్‌కాస్టు బావికింద ఆ గ్రామాన్ని కంపెని ఆక్రమించక ముందు ఆ గ్రామంలో కరెంటు ఉండేది. ఎప్పుడైతే ఆ గ్రామాన్ని కంపెని ఆక్రమించటానికి సిద్ధమైందో దాని మీద చెలరేగిన వివాదం గత ఏడు ఎనిమిది సంవత్సరాలుగా పరిష్కరించకపోవడంతో గ్రామస్తులు ఆ గ్రామాన్ని ఖాళీచేయలేదు. దాంతో కంపెని ఆ గ్రామానికి పోయే కరెంటు స్తంభాలను పీకేసింది. అప్పటినుండి ఆ గ్రామం చీకటిమయం అయిపోయింది. గ్రామం చుట్టు ఎత్తైన మట్టిదిబ్బలు పేరుకు పోవడం వల్ల మొత్తం గ్రామానికి గ్రామమే ఒక బురదగుంటలా తయారు అవుతోంది ఆ గ్రామంలోని కొంత మంది కుటుంబీకులు బొగ్గు బావిలో పనిచేసే వారున్నా అటువంటి వారు కూడా ఆ గ్రామాన్ని ఖాళీ చేయలేదు. ఎందుకంటే కార్మికుల్లో తొంభైశాతం మందికి కంపెనీ ఎటువంటి గృహవసతి కల్పించలేదు. దాంతో చాలా ఏండ్లు ఆ గ్రామంలో బతుకుతుండటం వలన బాయి పని చేసే వాళ్ళు కూడా ఇండ్లను ఖాళీ చేయలేదు నష్టపరిహారం ఎటూ సెటిల్ కాకపోవడం వల్ల వారు ఆ గ్రామాన్నే అంటిపెట్టుకొని బతుకుతున్నారు.

ఆ గ్రామాన్ని తప్ప ఆ గ్రామానికి సంబంధించిన పంట పొలాలు, చెలకలను కంపెని ఆక్రమించుకున్నది. దాంతో ఉపాధి కోల్పోయిన సగంమంది బతుకుదెరువు కోసం రోడ్డుమీద పడ్డారు. చాలా కుటుంబాలు జీవనోపాధి లేక ఆగం అయిపోయాయి. అటువంటి వారిలో చాలామంది రోజు కూలీలుగా, కాంటాక్టు కార్మికులుగా రోడ్డు పనివారుగా దొరికిన కూలీనల్లా చేసుకుంటు జీవన సమరం సాగిస్తున్నారు.

పెద్ద పానాది గుండా తాత మనుమలు ఇద్దరు ముందుకు సాగి ఊరి చివరినున్న వారింటికి వచ్చిండ్లు. మల్లయ్యది రెండు గదులున్న గూన పెంకుల ఇల్లు. ఒకప్పుడు ఆ ఇంటిముందు, ఇంటి వెనకాల పశువుల కోసం రెండు పాకలుండేవి. ఇంటి చుట్టు వెదురు తడకలతో అల్లిన దడి ఉండేది. ఆ రోజుల్లో మల్లయ్య అప్పు సప్పు లేకుండా ఒకింత మంచిగానే బతికిండు. గత కొన్ని సంవత్సరాలుగా ఆ ఇంటిని సగబెట్టకపోవడం వలన ఆ ఇల్లంతా పాడుబడిన ఇల్లులా తయారైంది. దానికితోడు ఓపెన్ కాస్టు గని నిరంతర పేలుల్ల వల్ల గోడలన్ని నెర్రలు బాసిపోయి ఇప్పుడో అప్పుడో కూలిపోవటానికి సిద్ధంగా ఉంది. మల్లయ్య ఇంటికి పదిగజాల దూరంలోనే ఓపెన్‌కాస్టు మట్టిగుట్ట కొండలా పేరుకపోయింది. పొలం పనులు బందు అయిన తరువాత పశువులు పోయినవి. పాకలు పోయినవి. తడవకు రెండుసేర్లపాలిచ్చే బర్రెను కూడా అమ్ముకొని తినవలసిన దుస్థితి ఏర్పడింది. చివరికి అమ్ముకోవటానికి ఆ ఇంట్లో ఇంకేమి మిగులలేదు. బతుకుదెరువు కోసం రోడ్డుమీద పడవలసి వచ్చింది.

మల్లయ్య ఇంటికి చేరుకునేసరికి పక్కింటి జంగం పాపయ్య వచ్చిండు. మల్లయ్య "ఇయ్యాల పొద్దున్నే వచ్చిండ్లు మామ" అంటు మాట కలిపిండు. రాజు తాత దగ్గర అగ్గిపెట్టె తీసుకొనిపోయి గూట్లో దీపాన్ని వెలిగించిండు. మసక వెలుతురు ఆ ఇంటి నిండా కమ్ముకున్నది. జంగం పాపయ్య వచ్చి వాకిట్లో నిలబడ్డాడు. మల్లయ్య అక్కడున్న నులక మంచం వాల్చుకొని కూచున్నాడు.

"మళ్ళీ కలెక్టరు వస్తడట ఈ సారన్నా ఏదో ఒకటి తేలిపోతే మంచిగుండు" పాపయ్య వచ్చి మంచం చివర కూసున్నాడు.

కలెక్టర్ గ్రామానికి వస్తాడన్న విషయము తెలిసిన కాన్నుంచి పాపయ్యకు ఎటు పాలుపోవడం లేదు. ఏదో ఒకటి తేలిపోతే బాగుండునని మనిషి ఆరాట పడుతున్నాడు. అందరిలాగే పాపయ్య ఈ వివాదంతో విసిగిపోయిండు. అంతకు ముందు పాపయ్యకు మారేడుపాక చెరువు కింద ఎకరం పొలం వుండేది. మరో రెండు ఎకరాల చెలక ఉండేది. భూములు కోల్పోనంత వరకు వాటిమీద జీవనం కొంచెం ఒడుదుడుకులతో సాగిపోయేది. ఇప్పటంత కష్టంగా వుండేది కాదు. యాడాదికి ఆరేడు నెల్లు వచ్చిన పంట మీద జీవనం సాగేది. మిగతా రోజుల్లో ఏదో కూలినాలి చేసుకొని బ్రతికేవాడు. ఇప్పుడు ఆ మాత్రం వెల్లకుండా పోయింది. ఏదో విధంగా సెటిల్ అయిపోయి రావలసిన డబ్బులు చేతికి వస్తే ఏదో ఒక వ్యవహారం చేసుకొని బతుకవచ్చనే ఆలోచనతోని ఉన్నాడు.

"నిన్న పొద్దున రాజలింగం సారు పెద్ద వెంకటయ్య అందర్ని పిలిపించిండ్లు. ఈసారి ఏదో ఒకటి తేలిపోద్దని అంటాండ్లు. లాయరు రాంచంద్రం కూడా వచ్చిండు."

వాళ్ళ పేర్లు వినగానే మల్లయ్యకు పుండు మీద కారం చల్లినట్టుగా మనసు బగ్గున మండింది. "శవాల మీద పైసలు ఏరుకుంటాండ్లు" అసహనంగా గొణిగిండు.

"నల్గురితోని నారాయణ! మంచో చెడో అందరితోపాటు మనం" పాపయ్య బదులిచ్చిండు.

పాపయ్యకు పైరవికారులైన పెద్ద వెంకటి, రాజలింగం గురించి తెలియక కాదు. అంతకు మించి మరో మార్గం కనిపిస్తలేదు.

"రాజేశం చెప్పిందే నిజమైంది" పాపయ్య భారంగా మాట్లాడిండు. పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకుంటే పాతిక రూపాయలు దొరుకుతలేవు. అది కూడా కూలి దొరికిననాడు దొరుకుతుంది. లేనినాడు లేకుంట పోతాంది. రోజులు ఎట్లా వెల్లదీయాల్నో అర్థం అయితలేదు. ఏదో ఒకటి సెటిలైపోతే వచ్చిన కాడికి తీసుకొని ఆపైన ఎట్లయినా బతకవచ్చు అంటు మనసులో మాట చెప్పిండు.

పాపయ్య మరోసారి కొడుకు పేరు ఎత్తేసరికి మల్లయ్య మనసు దుఃఖసాగరం అయింది.

"ఎనిమిదేండ్ల కాన్నుంచి ఎట్లా బతుకుతాన్నమో ఆ దేవునికి ఎరుక. ఇగో అయిపోయింది, అగ్గో పైసలు వస్తాయి అంటు ఏండ్లకు ఏండ్లు గడుపుకుంటు వస్తున్నారు. లాయరు రామచంద్రంను ఎప్పుడు కలిసినా ఇంకో వారం పదిరోజుల్లో కేసు సెటిలైపోతదంటడు. ఇంకా ఎన్నాళ్ళని ఇట్లా బతికేది. మనకు ఇక్కడ గీ మట్టితోని రుణం పాసిపోయింది. ఇక మనం ఎంత నెత్తినోరు మొత్తుకున్న మన మాట ఎవరు వినేవారులేరు. మరి అటువంటప్పుడు మనం "చేయగల్గిందేముంది" పాపయ్య.

వీల్లిట్లా మాటల్లో మునిగిపోయి ఉండగానే రాజు రాత్రికని మిగిల్చుకున్న మధ్యాహ్నపు అన్నం కంచాల్లో వేసుకొని వచ్చి తాత ముందు పెట్టిండు. "లేచి అన్నం తిను తాత" అంటూ తన కోసం వేసుకున్న కంచాన్ని తెచ్చుకొని భోజనానికి కూచున్నాడు.

అన్నం తిన్నంక చాలా సేపటిదాక పాపయ్య మల్లయ్యతోని మట్లాడుతూనే వున్నాడు. అన్నం తినగానే రాజుకు నిదుర ముంచుకురావడంతో నులుక మంచంలో తాత పక్కన ఒరిగిండు. ఇలా పండుకోగానే అలా నిదుర ముంచుకొచ్చింది.

పాపయ్య వెళ్ళిపోయిన తరువాత కూడా మల్లయ్యకు నిదురరాలేదు. చుట్టు చీకటి గూట్లోని గుడ్డి దీపం అచ్చంగా మల్లయ్య మనసులాగే ఏదో ఆశ ఇంకా మినుకు మినుకు మంటుంది. ఇంకా ఎంతకాలం ఈ పడిగాపులు. పాపయ్య అన్నట్టుగా ఏదో ఒకటి సెటిలైపోతే బాగుండునన్న ఆలోచన కల్గసాగింది. మంచంలో అదమరచి నిదురపోతున్న మనుమన్ని చూసిండు. అంతా చక్కగుంటే

ప్రస్తుతానికి ఆరోపాడో చదివేవాడు కదా. మరోసారి మల్లయ్య మనసులో గతం తాలూకు ఆలోచనలు చుట్టుముట్టాయి.

ఎనిమిది సంవత్సరాల కిందట ఆ రోజు ఇంకా అతనికి బాగా గుర్తుంది. ఆ రోజు కమాన్‌పూర్ మండలాఫీసరుతోపాటు కంపెని అధికారులు, గ్రామ పంచాయితీ చావడి కాడికి వచ్చిండ్లు. ఊళ్ళోవాళ్ళనందరిని కుప్పేసిండ్లు. అప్పటికి సమయం పదకొండు కావచ్చింది. ఆ రోజు రాజేశం ఉదయాన చీకటితోనే పొలంపనులకు పోయినవాడు అధికారులు వచ్చిండ్లని తెలిసి అటునుంచి అటే గ్రామ చావడికాడికి వచ్చిండు. అధికారుల కోసం గ్రామ చావడి కాడ కుర్చీలు వేసిండ్లు. వేపచెట్టు నీడన గ్రామస్తులంతా గుమిగూడి ఉన్నారు.

ఊరి సర్పంచు పెద్ద ఎంకటి లేచి విషయం ఏమిటో చెప్పుకొచ్చిండు. "ఎన్నో ఏండ్లుగా మన తాత ముత్తాతల కాన్నుంచి మనం ఈ గ్రామంలో బతుకుతున్నాము. కాని ఈ రోజు మనం మన గ్రామాన్ని ఖాళీ చేయవలసి వస్తున్నది" అంటు మొదలు పెట్టేసరికి గ్రామస్తులందరి మనస్సులో బండరాయి పడ్డట్టుగా అయిపోయింది. ఏకకాలికమైన మనసుతో ఒక్కసారి అందరు గోలగోలగా తలో మాట మాట్లాడ సాగిండ్లు. రాజేశం అందరికంటె ముందు నిలుచొని ఉన్నాడు. అతని బిక్కమొఖం వెలవెలబోయింది.

"ఎందుకు ఖాళీ చేయాలె" ఎవరో కోపంగా అరిచిండ్లు. పెద్ద వెంకటి మాట పచ్చిన దిక్కుగా గుచ్చి చూసిండు. ఆ మాటన్నది తెలువక ఎల్లయ్య అని పోల్చుకొని అతని వంకే చూస్తూ మళ్ళీ మాట్లాడసాగిండు. నిజమే మనం నమ్ముకున్న ఈ గడ్డను వదిలిపోవాలంటే మనకెవరికి సహజంగానే ఇష్టం వుండదు. కాని తప్పదు. ఇది ప్రభుత్వ ఉత్తర్వు మీ కందరికి తెలుసు. మన గ్రామం చుట్టుపక్కల మరికొన్ని గ్రామాలు ఓపెన్‌కాస్టు 8 బావి కింద పోతున్నాయని అందుకే ప్రభుత్వం ఈ ఊళ్ళన్నీ ఖాళీ చేయించాలని నిర్ణయించింది" పెద్ద వెంకటికి ఎమ్మార్వో దిక్కు చూసిండు. ఎమ్మార్వో నిజమే అన్నట్టుగా తలాడించిండు.

"ఊరు వదిలి మరి మేము ఎట్లా బతకాలి" రాజేశం అరిచిండు. పండ్లు బిగబట్టడంతో అతని బక్క చెంపదవుడలు తేలినాయి.

"ఆ ఆ మేం ఎట్లా బతకాలి" వెనక నుంచి ఎవరో వంత పాడిండ్లు.

"మనం ఇండ్లు భూములు ఖాళీ చేసినందుకు ప్రభుత్వం నష్టపరిహారము ఇస్తుంది. అదంత మన ఎమ్మార్వోగారు వివరిస్తారు" అంటూ మాట్లాడ్డం ఆపి పోయి తన కుర్చీలో కూర్చున్నాడు పెద్ద వెంకటి.

లావుగా బొద్దుగా ఉన్న ఎమ్మార్వోగారు లేచేసరికి జనమంతా ఊపిరి బిగబట్టిండ్లు. ఎమ్మార్వో గారిది గుండ్రటి మొఖం, ఉబ్బు చెంపలు కొద్దిగా నెరిసిన తల సన్నటి పెదవులు కదలంగా మాట్లాడటం మొదలుపెట్టిండు. భూములు కోల్పోయినందుకు ఇండ్లు ఖాళీ చేసినందుకు ప్రభుత్వం మీకు మీ పొలాల విలువను బట్టి నష్టపరిహారం చెల్లిస్తుంది. నష్టపరిహారము చెల్లించే వరకు మీరు మీ పొలాలను ఊరును ఖాళీ చేయవలసిన అవసరం లేదు. మీ కందరికి తెలుసు. మన గోదావరి ఒడ్డున బొగ్గు నిల్వలు ఉన్న సంగతి, ఇదిగో మీ గ్రామాన్ని ఆనుకొని బొగ్గు

గనులు నడుస్తున్న సంగతి మన అందరికీ తెలుసు. మన చుట్టుపక్కల గ్రామాలంతట భూమి కింద బొగ్గు నిల్వలున్నాయి బొగ్గు మనదేశానికి ఎంతో అవసరము. బొగ్గు లేకపోతే కరెంటు లేదు. రైల్లు నడుపవు ఫ్యాక్టరీలు నడువవు మీకు తెలుసు. పది సంవత్సరాల కింద మీ ఊరికి కరెంటు లేదు. ఇప్పుడు కరెంటు వచ్చింది. మీ పొలాలకు నీళ్ళు కావాలంటే బావులకాడ మోటలు కొట్టేవారు. ఇప్పుడు ఇంజన్ స్టార్టు చేస్తే నీళ్ళు పైకి వస్తున్నాయి. ఇట్ల స్విచ్ వేస్తే లైట్లు వెలుగుతున్నాయి. అంటేంది. కరెంటు మన జీవితంలో భాగమైపోయింది. కరెంటు లేకుంటే మన బతుకేనడవని పరిస్థితి ఏర్పడింది. అయితే ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న కరెంటు మన దేశ అవసరాలకు చాలడంలేదు ఇప్పటికింకా ఎన్నో గ్రామాలకు కరెంటు లేదు. అన్ని గ్రామాలకు కరెంటు సప్లయి కావాలంటే అదనంగా కరెంటు ఉత్పత్తి కావాలి. కరెంటు ఉత్పత్తి కావాలంటే బొగ్గు కావాలి బొగ్గు కావాలంటే బొగ్గు ఎక్కడుంటే అక్కడ తవ్వుకోవాలి. అందుకోసం ప్రభుత్వం వేలకోట్లు పెట్టి బొగ్గు తవ్వడానికి సిద్ధపడ్డది. మనం ఈ దేశపు పౌరులుగా ప్రభుత్వానికి సహకరించాలి" అని అంటూ అతను చాలా చెప్పుకొచ్చిండు.

అటు తరువాత కంపెని అధికారి మాట్లాడిండు. కాంపెన్‌సేషన్ విషయంలో త్వరలో నిర్ణయం జరుగుతుందని చెప్పుకొచ్చిండు. అంతేకాకుండా ఉపాధి కోల్పోయిన వారికి కాంపెన్‌సేషన్‌తోపాటు కంపెనీలో భూనిర్వాసితులు కింద ఉద్యోగాలు ఇవ్వటం జరుగు తుందన్నడు.

ఊరు ఊరంతా కలకలం రేగింది.

కంపెని భూములు తీసుకుంటే మాకు వేరే చోట భూములకు బదులు భూములివ్వాలి అన్నారు కొందరు.

అది సాధ్యం కాదని తేల్చి చెప్పాడు కంపెనీ అధికారి. కాంపెన్‌సేషన్‌తోపాటు ఉపాధి కల్పించడం జరుగుతుందని మరోసారి చెప్పుకొచ్చిండు.

ఉద్యోగాలు ఇస్తామంటే ఫర్వాలేదన్నారు కొందరు. దాంతో గ్రామస్తుల మధ్య రెండు అభిప్రాయాలు చెలరేగినవి.

అది జరిగిన రోజు రాత్రి చాలా పొద్దుపోయే వరకు రాజేశంకు నిదురరాలేదు. వాకిట్లో మంచం వాల్చుకొని ఆకాశం కేసి చూస్తూ ఆలోచనల్లో పడిపోయిండు. కోడలు రాజ్యలక్ష్మి చాలాసేపు చూసి చూసి మంచంలో పండుకున్న పిల్లవాన్ని తీసికొని ఇంట్లోకి పోయింది. రాజేశంకు ఎటు పాలుపోవడం లేదు. తానేదైతే వద్దు అనుకున్నాడో అదే జరుగుతున్నది. బాయి పని అంటే అతనికి మొదటి నుండి ఇష్టంలేదు. భూములు పోతే ఎలా బతికేది. నిజానికి తను బాయి పని చేయాలంటే గతంలో ఎంతో ఈజీగా దొరికేది. కాని బాయి పనిమీద యిష్టంలేక దాని జోలికి పోలేదు ఇప్పుడు భూములు పోతే బాయిపని తప్ప మార్గం కనిపిస్తలేదు అది ఒకందుకు మంచే అనుకొని తసకు తాను సంతృప్తి పరుచుకున్నాడు

చూస్తుండగనే ఆర్నెల్లు గడిచిపోయినయి. ఇప్పుడో అప్పుడో కంపెనీ భూములు ఆక్రమిస్తుందని చాలామంది వర్షాకాలపు పంట మీద అంత శ్రద్ధ చూపలేదు. మరి

కొంతమంది భూములు పోయినప్పుడు పోతయి. అంత వరదాక దున్నుకుంటానుని వ్యవసాయపు పనులు మొదలు పెట్టిండ్లు.

మారేడుపాక వీర్లపల్లి గ్రామాల మధ్యన సెవన్ ఇంక్లయిన్ బావి ఉన్నచోట ఓపెన్ కాస్టు పనులు ఆరంభమైనవి. పెద్ద పెద్ద భారీ యంత్రాలు వచ్చినవి. క్రేనులు, బుల్‌డోజర్లు, డంపర్లు వచ్చినవి. కంపెనీ అత్యున్నత అధికారి చేత పెద్దఎత్తున దేరాలు వేసి భూమిపూజ జరిపించిండ్లు. పనులు చురుకుగా సాగుతున్నాయి.

భూములు కోల్పోయేవారి కాంపెన్‌సేషన్ ఎటు తేలక ముందు భూములు ఖాళీ చేయాలని గ్రామస్తులకు కంపెని నోటీసులు యిచ్చింది. ఆందులో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాల ఊసేలేదు.

కాలం గడుస్తోంది. కంపెనీలో మెకానైజేషను మొదలై కంపెని పాలసీ మారి పోయింది. ఉన్న కార్మికులే ఎక్కువైండ్లని, అంతవరదాకా నష్టాల్లో నడుస్తున్న అండర్ గ్రౌండులు కొన్ని మూసివేయడంతో ఆ కార్మికులే ఎక్కువైండ్లని కంపెని ప్రకటించింది. దానితోపాటు ఎక్కువైన అదనపు కార్మికులను ఎట్లా తొలగించాలనే ప్లానులను కంపెనీ సిద్ధం చేసింది. డిపెండెంటు ఉద్యోగాలు ఇక ముందు ఉండయని పుకార్లు బయలు దేరినయి. దానికితోడు డిపెండెంట్ ఉద్యోగాల్లో స్త్రీలను తీసుకునే పద్ధతిని కంపెని ఎత్తివేయడంతో అదనపు కార్మికులను తీసివేస్తారు. అనే పుకార్లకు బలం చేకూరింది. ఇదిట్లా ఉండగానే భూములు ఖాళీ చేయాలని గ్రామస్తులకు నోటీసులు అందినవి.

ఊరు ఊరంతా మరోమారు కలకలం రేగింది. ఇప్పుడు ఏమిటి చేయడం అన్న ఆలోచన అందరినీ వేధించసాగింది. కంపెని నుండి నోటీసులు అందగానే గ్రామస్తులంతా చావిడికాడికి పరుగుపెట్టిండ్లు.

అప్పటికే అక్కడ ఊరోల్లంతా జమయిండ్లు. పెద్ద వెంకటి వాళ్ళను సముదాయించలేక పోతున్నాడు. "ఇగో తొందరపడొద్దు. నేను పై అధికారులతో మాట్లాడిన. భూములను కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇచ్చే విషయంలో ఎటువంటి మార్పులేదు." అంటూ అతను సముదాయిస్తున్నాడు.

నష్టపరిహారంగా వస్తాయన్న డబ్బులు రాకపాయే. ఇస్తారన్న ఉద్యోగాలు ఇవ్వరని చెప్పుకొస్తాండ్లు. మరి ఇటువంటప్పుడు మనం భూములనెట్లా ఖాళీ చెయ్యాలి నల్ల మల్లయ్య నల్లటి మొఖం మరింత ముడుచుకుపోగా మాట్లాడిండు.

"యాడాది కాన్నుంచి ఇప్పటికే ఆగం ఆగం అయిపోయింది బతుకు. ఏదీ ఎటు తేలకుండా ప్రాణం పోయినా సరే భూములు ఖాళీ చేసేది లేదు" అంటూ రాజేశం ఆవేశంగా అన్నాడు.

"అంతే మరి" అన్నారు చాలా మంది.

అక్కడున్న ఆడ మొగ అందరు పెద్ద వెంకటి ఏం చెప్పుతాడో అని ఆత్రంగా చూసిండ్లు. ఆయన మొద్దు మొఖంలో ఏ భావం అంత స్పష్టంగా కనిపించలేదు.

ఆయన మెల్లగా నోరిప్పి "అటువంటి పరిస్థితి వస్తే అందరం ఒక్క మాట మీద నిలబడాలి. ఈ వ్యవహారమంతా మామూలు వ్యవహారం కాదు మనం కాదు,

కూడదంటే కంపెనివాడు ఊరుకోడు. వాని వెనక ప్రభుత్వం ఉంది పోలీసు లున్నారు. బలవంతం గానైనా భూళీ చేయిస్తరు. ఎన్టీపీసీ కింద అరువై ఊళ్ళు భూళీ చేయించిండ్లు. అప్పుడు గిట్లనే అయింది. అయినా ఊళ్ళు భూళీ చేయక తప్పలేదు. ఈ వ్యవహారాన్ని సున్నితంగా పరిష్కరించాలి ముల్లును ముల్లుతోనే తీయాలి. చట్టాలున్నాయి. కోర్టులున్నాయి. న్యాయం కోసం మనం కోర్టుకు పోదాం మంచో చెడో అక్కడే తేల్చుకుందాం" అంటూ చెప్పుకొచ్చిండు.

ఇదంతా కొంత సబబుగానే ఉందనిపించింది వారికి.

అయితే ఏదో ఒకటి తొందరగా తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. మరునాటి నుండి పెద్ద వెంకటి కోర్టు వ్యవహారం చూసేందుకు మరో ఇద్దరిని వెంట వేసుకుని పట్నం పోయిండు

మూడో రోజున కంపెని అధికారులు రెండు వ్యానుల నిండా పోలీసులను తీసుకొని భూములు కబ్జా చేసుకోను వచ్చిండ్లు పట్నం పోయిన పెద్ద వెంకటి అప్పటికింకా తిర్గిరాలేదు. ఏంచెయ్యాలో ఎటు సమదయితలేదు. అప్పుడు రాజేశం ముందుకొచ్చిండు.

"ఏదో ఒకటి తేలేదాకా ప్రాణం పోయినా కాని భూములు భూళీ చేసేది లేదు" అన్నాడు అధికారుల ముందుకుపోయి

ఊరోల్లంత సై అంటె సై అన్నారు. చీమలబారుల్లాగా ఆడమగ పిల్లపాప అనే భేదము లేకుండా పొలాలల్లకు చేరుకున్నారు అలా గుమిగూడిన వారిని ఉద్దేశించి రాజేశం మాట్లాడిండు. ఎన్నో ఏండ్లుగా మనం గీ భూమిని నమ్ముకొని బతికినం. మనకో దారి చూయించకుండా ఉన్న ఫలంగా ఈ భూములు భూళీ చేయమంటే మనం ఎక్కడికి పోయేది. కంపెని ముందుగా మాట యిచ్చినట్టుగా భూములు పోయినోల్లందరికి ఉద్యోగాలు ఇవ్వాలి. ఇవ్వకుంటే మనం మన పొలాలను వదిలేది లేదు. ఏ ఆధారం లేకుండా పొలాలను వదులుకుంటే మనల్ని నీళ్ళు లేనికాడ బొండిగకోసుకున్నట్టే. మన జీవన ఆధారమైన ఈ పొలాలను వదులుకొని మనం బతికేది ఎట్లా? మనకిప్పుడు ఏ ఆధారంలేదు. పొలాలను వదులుకొని ఆకలితో చావడం కంటే పొలాలను కాపాడుకోవడం కోసం కొట్లాడుతం" అతని బక్క మొఖంలో మెడ నరాలు ఉబ్బుంగ ఆవేశంగా మాట్లాడిండు

కంపెని అధికారులకు, వెంట వచ్చిన పోలీసులకు ఎటు సమజు అయితలేదు. గ్రామస్తులంతా మూకుమ్మడిగా ఎదురు దిర్గేసరికి పరిస్థితి విషమించే లాగున్నదని కంపెనీ అధికారులు భయపడసాగిండ్లు. పోలీసు సర్కిల్ ఖానుకు మాత్రం ఒళ్ళంతా పుండు మీద కారం చల్లినట్టుగా మంట మండసాగింది. అలగా జనం పోలీసులంటే లెక్కలేనట్టుగా మాట్లాడటం అతని సహనానికి పరీక్షగా నిలిచింది. అందునా వాళ్ళందరి మధ్యలో నిలబడి మాట్లాడే రాజేశం మీద దృష్టిపడింది. రాజేశం వైపు కోపంతో చురచుర చూస్తూ పది నిముషాల్లో మీరంతా ఇక్కడి నుండి భూళీ చేసి వెళ్ళాలి. లేకుంటే పరిస్థితి చెయ్యి దాటిపోతుంది. ప్రభుత్వ ఉత్తర్వును ధిక్కరించిన నేరానికి మిమ్ములన్నందరిని బొక్కలోకి తోయాల్సివస్తుంది" అంటూ హెచ్చరించాడు సర్కిల్.

అయినా ఆ మాటలేవీ గ్రామస్తులను భయపెట్టలేకపోయినవి. చల్ల కనకమ్మ ముసల్ది సరిగా కండ్లు కానరావు. నడుము వంగిపోయింది. మందిల నుండి గబగబా ముందుకొచ్చి సర్కిల్ కేసి మసక కండ్లకు చెయ్యి అడ్డం పెట్టుకొని మొఖంలోకి గుచ్చి చూస్తు "ఏంది బిడ్డా మేం ఎట్లా బతకాలి మేమేమన్న దొంగతనం చేసినమా లంగతనం చేసినమా? ఏండ్లకానుంచి గీ మట్లె బతుకుతున్నాం. గీ మట్టిని నమ్ముకున్నాం. మమ్ముల్ని ఉన్నపలంగా వెళ్ళిపొమ్మంటే ఎక్కడికి పోతం. దొరలు మీరు మాకేదన్న ఆధారం చూయించుండ్లి. మేం ఎల్లిపోతం" అంది.

గ్రామస్తులంతా ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. ముసల్దాని మాటలు అసలే కోపంతో నున్న సర్కిల్ మనసులో పుండుమీద కారం చల్లినట్టుగా అయింది. బాగా బలిసిన లావాటి చెయ్యి ముసలిదాని మీదికి ఎత్తిండు.

రాజేశం మరి కొంతమంది గబుక్కున ముసల్దాన్ని పొదవి పట్టుకున్నారు. ఆడోళ్ళు ఏడుపు లంకించుకున్నారు. మరి కొంత మంది పోలీసోల్లను శాపనార్థాలు పెట్టుకుంటు తిట్లు అందుకున్నారు.

రాజేశం కోపంతో అరిచిండు "ఏంటి దౌర్జన్యం? మమ్ముల్నందర్ని ఒక్కసారి చంపుండ్లి. అప్పుడిక మీకు ఎవరు అడ్డం రారు" అంటూ ఎదమీద అంగి చింపుకుని సర్కిల్ ముందు కురికుండు.

సర్కిల్ ఖాను భయంతో వెనక్కి జరిగి "మారో" అంటు అరిచిండు. ఒక్కసారిగా లాటీలు, తుపాకీ మడమలు గాల్లోకి లేచాయి. ఇంతవరదాక ఆ గ్రామస్తుల చమటతో తడిచిన నేల ఇప్పుడు రక్తంతో తడిసింది.

గ్రామస్తులను చెల్లాచెదురు చేసిన పోలీసులు రాజేశంతోపాటు కొంతమంది యువకులను వ్యానుల్లో వేసుకొని వెళ్ళిపోయిండ్లు.

ఆ రోజు రాత్రి గ్రామంలోని ఎవరింట్లో పొయ్యిలోని పిల్లి లేవలేదు. ఏడ్పు అరుపులతో నిండిపోయింది. గ్రామస్తుల్లో కొందరికి బలమైన దెబ్బలే తాకాయి. కొంత మంది తలలు పగిలినయి. మరి కొంతమందికి కాళ్ళు చేతులు విరిగినయి. పట్టుకపోయిన వాళ్ళ సంగతి ఎటూ తేలలేదు.

మల్లయ్య మనసు మొద్దుబారిపోయింది. కోడలు రాజ్యలక్ష్మి అదే పనిగా శోకాలు తీస్తూ ఏడ్పు లంకించుకుంది. చిన్న పిల్లవాడైన రాజు బిక్కసచ్చి పోయి తల్లిని కరుచుకొని ఏడ్వటం మొదలుపెట్టిండు. ఆ గ్రామంలో ఒకరిని ఒకరు ఓదార్చేవారే కరువైపోయిండ్లు. ఆ రాత్రి భారంగా గడిచిపోయి తెల్లారి ఈ విషయం తెల్సి పెద్ద వెంకటి ఊళ్ళోకి వచ్చిండు. వచ్చిన వాడు వచ్చినట్టుగానే గోదావరిఖనికి పోయి కాంగ్రెస్ లీడర్లను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు పోయి పట్టుకపోయిన వారిని విడిపించుక వచ్చేసరికి మరునాడు పొద్దుకూకింది.

పోలీసులు పట్టుకపోయిన వారిని బాగానే మంత్రించిండ్లు. అందరికంటే ఎక్కువ రాజేశంను చితకబాదిండ్లు. ఆ దెబ్బలకు రాజేశం వారం రోజులదాక కోలుకోలేదు.

పది పదిహేను రోజుల దాక కంపినోడు మళ్ళీ మారేడుపాకకు రాలేదు. నివురుకప్పిన నిప్పులా అంతా కుతకుతలాడిపోతోంది ఏదో శ్మశాన ప్రశాంతత ఆవిరించినట్టుగా ఊరు ఊరంతా కమ్ముకున్నది

ఆ సంఘటన జరిగిన వారం రోజుల తర్వాత ఒకనాటి అర్ధరాత్రి ఊరు ఊరంతా గాఢనిద్రలో మునిగిపోయినవేళ ఇంటిముందు పందిరికింద పడుకున్న మల్లయ్యకు చిన్నగా ఏదో అలికిడి వినిపించింది. ఆయనకు అప్పుడే కాస్త కునుకుపట్టింది. ఇంటిలోపల రాజేశం రాజేశ్వరి పడుకొని వున్నారు. అలికిడికి మల్లయ్యకు నిద్రా భంగమైంది. ఆయన అలా పడుకునే అలికిడి అయిన దిక్కుకేసి చూసాడు. ఎవరో పనుగడ తలుపు తీయడానికి ప్రయత్నిస్తున్నది లీలగా కనిపించి ఛటుక్కున లేచి కూచొని ఎవరది అంటూ గట్టిగా సరాయించిండు.

అంతలోనే పనగడ తలుపు తెరుచుకొని బిలబిలమంటు నలుగైదుగురులోనికి ఉరికి రావడం మల్లయ్య దొంగలు దొంగలు అని అరవటం క్షణంలో జరిగిపోయింది.

అలా ఉరికి వచ్చినవారు బలమైన లారీలతో ఆయన మీద విరుచకపడటం ఆ బాధతో తల్లడిల్లిపోతూ మంచంలో వెల్లకిల్లా పడిపోవడం అంతా క్షణాలమీద జరిగి పోయింది.

ఆ మసక చీకట్లో అంత బాధలో కూడా మల్లయ్య తన మొఖం మీదికంటు వంగిన అతన్ని పోల్చుకోగల్గాడు. ఆ రోజు పొలాలు భాళీ చేయించటానికి కంపెనీవాడు పోలీసు బలగాలతో వచ్చినప్పుడు సర్కిల్ పక్కన తుపాకి పట్టుకొని నిల్చున్నవాడే వీడని మల్లయ్య పోల్చుకోగల్గిండు. వచ్చింది పోలీసులే అని అర్థమయ్యే సరికి మల్లయ్యకు పై ప్రాణాలు పైనే లేచిపోయినట్టు విలవిల లాడిండు ఒక్క ఉదుటున లేచికూచుని "అయ్య బాంచెను నా కొడుకును ఏం చేస్తరు" అంటూ ఎదురుగా నిలుచున్నవాడి కాళ్ళమీద పడ్డాడు. వాడు ఒక్కసారిగా కాళ్ళు జాడించి "నీ కొడుకును పిలువురా" అంటూ హుంకరించాడు.

"నీ కాళ్ళు మొక్తా! ఎందుకు బాంచెను" మరోసారి వాని కాళ్ళకు మొక్కిండు. కాని అప్పటికే మరొకడు వెనక నుంచి వీపులో తుపాకీ మడమతో ఒక్కటిచ్చుకునే సరికి పెద్దగా అరుస్తూ బొక్కబోర్లాపడ్డాడు. సరిగ్గా అదే సమయానికి ఆ గలాటాకు మెలకువవచ్చి రాజేశం దబ్బున తలుపుతీసుకుని బయటికి వచ్చిండు. అది చూసి మల్లయ్య "అరె రాజేశం! నీ కోసం పోలీసులు వచ్చిండ్రు పారిపో" అంటూ పెద్దగా అరిచిండు.

కాని ఫలితం లేకుండా పోయింది. బయటికి వచ్చిన రాజేశంను చుట్టుముట్టిన పోలీసులు రాజేశంకు ఏం జరుగుతుందో ఏమో అర్థంకాక ముందే విరుచుకుపడ్డారు. రాజేశం అరుపులతో పెడబొబ్బలతో చుట్టుపక్కల వారంతా లేచిండ్లు. కాని ఎవరిని దగ్గరికి రానియ్యకుండా బయట నిలుచున్న పోలీసులు గెదిమేసరికి చుట్టుపక్కల వాళ్ళు ఎవరు ముందుకు రాలేకపోయిండ్లు. రాజ్యలక్ష్మి జర్గుతున్నది అర్థమైపోయి ఏడ్పు లంకించుకొని బయటికి ఉరికి వచ్చింది. ఓ సివిల్ డ్రెస్ పోలీసువాడు రెండు జబ్బలు పట్టి బలంగా గదిలోకి తోసి బయటినుండి

గడివేసిండు. లోపల రాజ్యలక్ష్మి పెట్టే బొబ్బలకు పిల్లవాడు అదిరిపడి లేచి ఏడ్పు లంకించుకున్నాడు.

అదంతా క్షణాల్లో జర్గిపోయింది. సివిల్ డ్రెస్సులో వచ్చిన పోలీసులు స్పృహ తప్పిన రాజేశంను ఎత్తుకొనిపోయిండ్లు. గుల్లయ్య లేచి కొడుకును వాటేసుకుంటే బలవంతంగా మల్లయ్య విసిరేసరికి ఆ తోపుకు మల్లయ్య విరుచుకుపడిపోయి మళ్ళీ లేవలేకపోయిండు.

మల్లయ్య ఆ లీడరును ఈ లీడరును పట్టుకొని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పోలీసు స్టేషన్లు తిర్గిండు. ఎక్కడా రాజేశం అచూకి తెలియలేదు.

రాజేశంను మాయం చేసిన తరువాత, ఊరు పరిస్థితే మారిపోయింది. ఏదో భయపూరితమైన వాతావరణం కమ్ముకున్నది. ఎవరు బయటపడి ఏమీ మాట్లాడడం లేదు. తమలో తామే గుంజాటనపడసాగిండ్లు. ఊరి సర్పంచ్ పెద్ద వెంకటిలో కూడా మునుపటి ఉత్సాహం లేకుండా పోయింది. ఆయన కూడా రాజేశం దొరకాలే అని దేవునిమీద భారంవేసి వీలయినంత తొందరగా కాంపన్‌సేషన్ రాబట్టుకోవాలని స్థానిక ఎమ్మెల్యే చుట్టూ తిరగసాగిండు.

ఈసారి భూములు ఖాళీ చేయించడానికి కంపెనివాడు పోలీసులతో వచ్చినప్పుడు పెద్ద ప్రతిఘటన లేకుండా పోయింది. "ఊరి పెద్దమనుషులే దగ్గరుండిరి ఇప్పుడిక మనం చేయగల్గింది ఏమీ లేదు" అన్నారు. ప్రభుత్వాన్ని ఎదురించి మనం నిలబడలేము. ఏదో విధంగా ఫైసలా చేసుకోవాలి. కేసులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వుండిపోయాయి.

మల్లయ్య కుటుంబ పరిస్థితి మరీ అధ్వాన్నం అయింది. పోలీసులు ఎత్తుకపోయిన కొడుకు అడ్రసు ఎటు తేలనేలేదు. గుర్తుతెలియని శవంగా మార్చి దహనం చేసిండ్లనే పుకార్లు లేచినయి. చేతికి అందివచ్చిన కొడుకు ఎటుకాకుండా అయిపోయి మల్లయ్య పరిస్థితి మరింత అధ్వాన్నం అయింది. కదిలిస్తే చాలు కన్నీళ్ళ వర్షం కురిసే రాజ్యలక్ష్మి కొద్ది రోజులకే చిక్కి శల్యమైపోయింది. ఏమీ తెలియని పసివాడు రాజును చూస్తే మల్లయ్య మనస్సు తరుక్కుపోయేది. ఏం చేయాలో ఎలా బతకాలో తెలియక పుట్టెడు దుఃఖముతో మనిషి కృంగిపోయిండు. ఇంట్లో వున్న పాడి పశువులు, విలువచేసే సామాన్లు అన్ని ఒక్కటొక్కటిగా హరించుకుపోయినయి. పూట గడవడమే గగనమై పోయే పరిస్థితి వచ్చింది. రాజేశం పోయి ఆర్నెల్లు తిరుగకముందే రాజ్యలక్ష్మి చేదబావిలో దునికి ఆత్మహత్య చేసుకుంది. పసివాన్ని బతికించుకోవడానికి మల్లయ్య గుండె దిటవు చేసుకొని మళ్ళీ బతుకు బండి లాగడం మొదలుపెట్టి టీ కొట్టు తెరిచిండు.

మారేడుపాక గ్రామంలో ఆ రోజు ఎంతో హడావిడిగా ఉంది. భూనిర్వాసితుల కేసులు పరిష్కరించేందుకు కలెక్టరుగారు వస్తున్న విషయం చాలారోజుల నుండి అనుకున్నదే. కలెక్టరుగారు వచ్చేనాటికి అణగారిపోయిన గ్రామస్తుల ఆశలు మళ్ళీ చిగురించసాగాయి.

గ్రామస్తుల అందరి మనసుల్లో ఒక్కటే ఆశ. ఈసారి అయినా కేసులు పరిష్కరించ బడుతాయా అని ఎంతో ఆందోళనగా, ఆశగా ఉన్నారు. గ్రామ

సర్పంచు పెద్ద వెంకటి ఎంతో ప్రయత్నం చేస్తేకాని కలెక్టరు గారు క్యాంపుకు రాలేకపోయిండు. చాలా ఏండ్లుగా పెండింగ్‌లో వున్న భూనిర్వాసితుల కేసులు పరిష్కరించడానికి కలెక్టరుగారే స్వయంగా రాపడానికి సిద్ధమవడంతో ఏదో విధంగా కేసులు సెటిల్ అవుతాయనే అందరు నమ్మకంతో ఉన్నారు ఎక్కడచూసినా గ్రామస్తులు గుంపులు గుంపులుగా చేరి అదే విషయాన్ని చర్చించుకుంటున్నారు

భూములు కోల్పోయిన చాలా గ్రామాల్లో ఆ గ్రామ ప్రజలు కూడా నానా అగచాట్లు పడ్డారు. ఒకప్పుడు పచ్చటి పంట పొలాలతో కళకళలాడిన గ్రామంలో నేడు చావు కళ తాండవిస్తోంది. ఏండ్ల తరబడి తరతరాలు ఆ భూమిని అంటి పెట్టుకొని బతికిండ్లు. ఆ రోజు మారేడుపాకలోని గ్రామస్తులు ఎవరు పనుల్లోకి పోలేదు. ఊరంత సందడిగా వుంది. ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే ఆశ అందరి మనసుల్లో ఉంది

సర్పంచ్ వెంకటయ్య పైరవికారు రాజలింగం పొద్దుటినుండి హడావిడి పడుతున్నారు. సాయంత్రం జరగబోయే సభ గురించి కలెక్టరుతో మాట్లాడవలసిన విషయాల గురించి చర్చించుకున్నారు

సాయంత్రము నాలుగు గంటలకు మొదలవుతుందనుకున్న మీటింగ్ కలెక్టర్‌గారికి ఏదో పనిబడి సాయంత్రం ఆరు గంటలకు గాని మొదలవలేదు. గ్రామ చావడి కాడ షామియానాలను వేసిండ్రు. చోటామోటా నాయకులు వచ్చిండ్లు. పోలీసుల బందోబస్తు ఏర్పాటయింది. చీకటి పడటంతో మీటింగ్‌కోసం ప్రత్యేకంగా కరెంటు సౌకర్యం కల్పించడంతో ఊళ్ళో మరోసారి వెలుగు విరజిమ్మింది. కలెక్టర్‌గారి కారు రావడం కోసం మట్టి రోడ్లను సాపు చేసిండ్లు ఏదో కొత్త కళ ఊరును ఆవరించింది.

అక్కడ గుమిగూడిన జనం తలోతీరుగా చర్చలో మునిగిండ్లు. జంగం పాపయ్య, కోల మల్లయ్యతోని మాటలు పొడిగించిండు. కల్లుపోషవ్వ మట్టిదిబ్బల కింద మునిగి పోయిన ఎకరం పొలమ్మీద ఎన్ని పైసలు వస్తయని ఎవరినో అడుగుతున్నది. అందరి సమస్య ఒక్కతీరుగనే ఉంది. మీటింగ్‌లు చూసి, అధికారుల రాజకీయ నాయకుల మాటలు విని విని విసిగిపోయిన మరికొందరి మనసుల్లో మాత్రం ఏదో అపనమ్మకం. మల్లయ్య ఒక మూల మనువణ్ణి ముందేసుకుని ఓ చిన్న బండరాయి మీద కూచున్నాడు.

సాయంత్రం ఆరుంబావుకు బుర్‌బుర్‌న దుమ్ములేపుకుంటు కార్లు, జీపులు వచ్చినవి. బిలబిలమంటూ పోలీసులు, అధికారులు మీటింగ్ ఆవరణను ఆక్రమించుకున్నారు.

సభ ఆరంభమైంది. సలువ చేసిన ఇస్త్రీ బట్టతీర్గ ఉన్న కలెక్టరు వేదికను అలంకరించిండు. ఆయన పక్కన కొంతమంది అధికారులు, ఊరి సర్పంచ్ వెంకటి మరి కొంతమంది పెద్దలు ఆసీనులైండ్లు.

నల్లగా కుదిమంట్రంగా కలిసిన రెవెన్యూ అధికారి లేచి మొదట మాట్లాడిండు. భూముల కేసులు పరిష్కరించడానికి కలెక్టరు తీసుకున్న చొరవ గురించి చాలా చెప్పుకొచ్చి అటువంటి వారు మనకు కలెక్టరుగా రావడం మన అదృష్టంగా

చెప్పుకొచ్చిండు. ఆయన తర్వాత సర్పంచు వెంకటయ్య మాట్లాడిండు. భూములు పోయిన కానుంచి ఊళ్ళో జనం పడ్డ బాధల గురించి సోదాహరణంగా వివరించి, చివరికి కలెక్టరుగారు గ్రామస్తులను ఆదుకోవడానికి రావడం చాలా ఆనందంగా వుందని, సమస్య ఈ విధంగానైనా పరిష్కారమైతే అందరికి సంతోషంగా వుంటుందని చెప్పుకొచ్చిండు.

మరో యిద్దరు ముగ్గురు మాట్లాడిన తరువాత చివరగా కలెక్టరు మాట్లాడటానికి లేచిండు. ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. ఎవరో వచ్చి మైకును ఆయన ముందుకు జరిపారు. ఆయన చిన్నగా సన్నటి పెదాలను కదుపుతూ మాట్లాడసాగిండు. "ప్రియమైన ప్రజలారా" అంటూ మొదలుపెట్టిండు. "చాలా ఏండ్లుగా పెండింగులో వున్న భూ నిర్వాసితుల సమస్య సత్వరమే నిర్ణయం జరగకపోవడం చాలా బాధాకరమైన విషయం. అలా ఎందుకు జరిగిందని నేను వివరాల్లోకి పోవడం లేదు. భూములు పోవడం వలన మీరు పడుతున్న బాధలు ఇప్పుడే సర్పంచ్‌గారు వివరించారు. అయితే ఒక్క విషయం మనమంతా గుర్తుంచుకోవాలి. భూములు ఎందుకు పోయినవో మీకు తెలుసు, ఈ భూముల కింద బొగ్గు ఉండడం, దేశ అవసరాల దృష్ట్యా బొగ్గు ఉత్పత్తి ఎక్కువ కావలసి రావడం అందులో భాగంగానే కొన్ని గ్రామాలను ఖాళీ చేయించక తప్పని పరిస్థితి ఏర్పడిందని మీ అందరికీ తెలుసు. భూమి కేసులు పరిష్కరించబడడంలో వివిధ డిపార్టుమెంట్ల మధ్య సమన్వయం సరిగా లేకపోవడం అత్యాశకు పోయి కొంతమంది ఈ సమస్యను కోర్టుల వరకూ తీసుకపోవడం వల్ల సమస్య జటిలమైపోయింది. దాంతో భూనిర్వాసితుల సమస్యను పరిష్కరించటములో జాప్యం ఏర్పడింది. ఇప్పటికే చాలా ఆలస్యమైందని దీనికి ఏదో పరిష్కారం ఏర్పాటు చేయాలని భావించి మీ సమస్యను పరిశీలించడం జరిగింది."

ఆయన మాటకు అడ్డుపోయి జనంలో నుండి ఎవరో అరిచిండ్లు. "భూములు పోయినోళ్ళకు ఉద్యోగాలిస్తమన్నరు ఆ సంగతేమైందో చెప్పాలి."

ఒక్కసారి అందరు అటువైపు చూసిండ్లు. కాని ఎవరు మాట్లాడింది అర్థం కాలేదు. కలెక్టరు ఒక్క క్షణం అటువైపు చూసి తన సహజ ధోరణిలో మళ్ళీ మాట్లాడసాగిండు. "భూ నిర్వాసితులకు ఉద్యోగాల విషయమై ప్రభుత్వం నుండి నిర్దిష్టమైన ఆదేశాలేమీ లేవు. అది కంపెనీకి సంబంధించిన వ్యవహారం. అందులో జోక్యం చేసుకునే అధికారం మాకు లేదు. మా చేతుల్లో ఉన్నమేరకు సమస్యను సత్వరంగా పరిష్కరించి నష్టపరిహారం చెల్లించడానికి నిర్ణయించాం."

నష్టపరిహారం విషయం వచ్చేసరికి జనమంతా చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దమైనారు.

ఎకరం పరిపొలానికి ముప్ఫయివేలు, చెలకకు ఇరవై వేలు ప్రభుత్వం నష్టపరిహారంగా చెల్లిస్తుంది.

అంతే ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఆ మాట వాళ్ళ ఆశలను నిరాశపరిచింది. దాంతో వాళ్ళ ఆవేశం కట్టలు తెంచుకుంది.

"పొలానికి ముప్ఫయి, చెలకకు ఇరవై వేలా ఎవని గు...ల పెట్టుకోవాలి?"

"కేసుల చుట్టు తిర్గేసరికే వేలకువేలు అయినవి "

"కొండ పొడుగు రాగం తీసి పిచ్చకుంట్ల పాట పాడిండంట. అరే ఏదో పైసలా అయిద్దంటే ఇదా పరిష్కారము. పనికిరాని భూములకు కమూన్‌పూర్ దొర ఎకరానికి లక్షా పాతికవేలు తీసుకున్నడు. బంగారమసుంటి భూమి నాది ముప్ఫయివేలు ఇస్తడట ముప్ఫయివేలు" ఒక రైతు ఆవేశంగా అరిచిండు

"ఉద్యోగాలివ్వాలి" మరొకడు అరిచిండ్లు

ఈ హఠాత్తు సంఘటనకు బీరపోయిన కలెక్టర్ మరోమాట మాట్లాడలేక పోయిండు. ఇది కనిపెట్టి పక్కనే ఉన్న అధికారి ఒకరు లేచి మైకు చేతబట్టుకొని "మీరట్లా ఆవేశపడొద్దు అంతా మంచికే జరుగుద్ది" రెండు చేతులు ఆడిస్తూ ఏదో చెప్పబోయిండు.

అదిగో అప్పుడు లేచిండు కుండ మల్లయ్య. అంతవరదాక ఏ మూలకు కూచున్నడో ఏమో కాని ఒక్కసారిగా వేదిక ముందుకొచ్చిండు. ఆవేశంతో కోపంతో ఊగిపోతూ ఆవేశంగా అరుస్తున్నాడు.

"మమ్ములందర్ని ఒక్కసారిగా చంపుండ్లి. ఇట్లా మనిషింతా మనిషింతా పీక్కు తినకుంటా ఒక్కసారి కాల్చేయండ్లీ. మేం ఏ పాపం చేసుకున్నామని మమ్మల్నీ ఈ తీర్గ అరిగోస పెడుతుండ్లు. నా భూమి గుంజుకున్నరు. అది పాయే అని ఊరుకున్న. ఇదేందని అడిగినందుకు నా కొడుకును సంపిండ్లు. ఆ దుఃఖాన్ని ఎలాగో దిగమింగుకొని గా పోరన్ని పట్టుకొని ఎప్పటికైనా పరిష్కారం కాకపోద్దా దేవుడు చల్లగా చూడకపోతాడా అని బతుకుతున్న. ఇగో గీ దొర వచ్చిండు ఏదో మంచి చేస్తడనుకున్న. కానీ ఈ దొర మా సమస్యను పరిష్కారం చేయటానికి రాలే. మేం ఇంకా సచ్చినమో బతికినమో చూడడానికి వచ్చిండ్లు. చంపుండ్లీ. మమ్ములన్నందర్నీ మట్టికుప్పల కిందేసి ఒక్కసారిగా బొంద పెట్టుండ్లీ. అప్పుడు మీ కళ్ళు చల్లబడుతయి. ఏండ్ల తరబడి మేం ఈ భూములను నమ్ముకొని బతికినం. కష్టమో నష్టమో ఈ భూమితోని పంచుకున్నం. మా భూముల్ల బొగ్గు పడదన్నరు మా భూముల్లో సంపద వస్తే మాకేమో వస్తదనుకున్నం. ఏమొచ్చింది మా భూములు పోయినవి. మా భూముల్లో పుట్టిన సంపద పోయింది. ఎవని కోసం చేస్తాండ్లు ఇదంతా, ఎవన్ని ఉద్దరిస్తామని. మా గోస ఊరికేపోదు" మల్లయ్య ఆవేశంగా అడుగుతున్నడు. తిడుతూ శాపనార్థాలు పెడుతున్నాడు. శాపనార్థాలు పెడుతూ విలవిల ఏడుస్తున్నాడు అంత గోలగోలగా మారింది.

ఈ హఠాత్తు సంఘటన నుండి తేరుకుని పోలీసులు లారీలు ఆడించారు. తుపాకి మడమ ఏడుస్తూ అరుస్తున్న మల్లయ్య మూతిని తాకింది. ఒక్కసారిగా కుప్పకూలి పోయిండు. బుక్కనిండా ఎర్రటి నెత్తురు నేల తల్లి ఒడిని తాకింది. పోలీసు లారీలకు తాళలేక జనం తలోదిక్కు పరుగు పెట్టిండ్లు. ఎవరో విసిరిన రాయి అక్కడంతా చీకటి కమ్ముకునేలా చేసింది. ఏం జరుగుతున్నదో ఏమో ఎవరికి తెలియడంలేదు

తాతా అంటు రాజు చీకట్లో వెతుకులాడిండు. దుఃఖంతో భయంతో బిక్కసచ్చి పోయిండు. పరుగెత్తే వాడెవడో రాజును ఫట్‌మని తాకిండు. ఈ తాకుడుకు

నేలమీద పడ్డ రాజు లేచి ఏడుస్తూనే మట్టి కుప్పలకేసి పరుగుపెట్టిండు. ఎత్తైన ఆ మట్టికుప్పను ఎక్కి అటువేపుగా దిగిండు.

ఆ మట్టికుప్పకు ఆవల ఆగి ఉన్న డంపర్ దగ్గర డంపర్ ఆపరేటర్ సాయబలీ డీజిల్ అమ్మే కొమురయ్య వారి పనిలో వారున్నారు. రాజు అక్కడికి చేరుకున్నడు. మారెడుపాకలో జరిగిన సంఘటన గురించి తెలియని సాయబ్‌అలీ కొమురయ్యలు తమ అలవాటయిన పద్ధతిలో ఆగి వున్న డంపర్ నుండి డీజిల్ దొంగతనంగా క్యాన్‌లలో నింపుతున్నరు. రాజు అక్కడికి రావడం చూసిన కొమురయ్య "అరేయ్ ఈ క్యాన్ తీసుకొనిపోయి అక్కడున్న ఎడ్లబండిలో పెట్టు" మంటు అలవాటుగా చెప్పిండు.

డీజిల్ క్యాన్ అందుకొని ముందుకు కదిలిండు రాజు.

పని అయిపోగానే కొమురయ్య దొంగతనం హడావిడిలో పడిపోయి రాజుకు ఇచ్చిన క్యాన్ సంగతి మరిచిపోయి ఎడ్లబండిని తోలుకుని పోయిండు. అంతా సవ్యంగానే జరగడంతో సాయబ్‌అలీ, రేపు రావాల్సిన డబ్బుల గురించి మనసులోనే లెక్కలు వేసుకుంటు అంతవరదాక తాగుతున్న సిగరెట్టు పీకను విసురుగా గిరాటువేసి వేడెక్కిన డంపర్ ఇంజన్ చల్లారేంతవరకు ఓ చాయ్ తాగి వస్తానని అక్కడి నుండి ముందుకు కదిలిండు.

అటు తరువాత కొంతసేపటికి ఇరవై లక్షల విలువచేసే డంపర్ తగులబడిపోవ డానికి క్యాన్ డీజిల్, విసిరేసిన సిగరెట్టు పీక కారణమవుతుందని వారు ఊహించకపోవచ్చు.

రాజు చిన్న హృదయంలో ఏదో సంతృప్తి. డంపర్ ఎగజిమ్మే మంటలు కొండల్లా పేరుకుపోయిన మట్టికుప్పల మీద నక్కి ఉన్న రాజు కళ్ళలో ప్రతిఫలిస్తున్నాయి.

● 2000 ●

# 74. గోలీమా

♦ అఫ్సర్ ♦

ఇంకో అరగంటలో మా వూళ్ళో వుండబోతున్నానంటే వొంటినిండా ఏవేవో ప్రకంపనలు! నెమ్మదిగా వెళుతున్న పాసింజరు బయటికి చూపు సారిస్తే అప్పుడప్పుడే చురుకెళ్ళుతున్న ఎండ సూటిగా పైకి చూడనివ్వడంలేదు. దూరంగా చెట్టునిండా ఎర్రెర్రని పూలతో దిరిసెనచెట్టు ఆకుపచ్చని నది మధ్యలో ఎగరేసిన ఎర్రజెండాలా వుంది. చూపులు ఇంకాస్త కిందికి వెళ్తే కంకరరాళ్ళ ఆవల పసుపుపచ్చని తంగేడుపూల గుంపులు. నేను నా కృత్రిమమైన నగర జీవనం తళుకుబెళుకులన్నీ వదిలించుకుని కాసేపు ఆ దృశ్యంలో కరిగిపోయాను.

చిన్న చిన్న ప్లాట్ ఫారాలు దాటుకుంటూ వాటికంటే వేగంగా చెట్లనీ పొలాల్నీ చెరువుల్నీ దాటేస్తూ నా చిన్నతనంలోకి నన్ను పరుగెత్తిస్తోంది. నాన్న చిటికెన వేలు పట్టుకుని ఈ ప్లాట్‌ఫారమ్మీద నడిచిన సాయంత్రాలు వొకరకంగా మధ్యతరగతి సంచార బతుకులు మావి. ఏ వూళ్ళోనూ మూడేళ్ళకు మించి గడపలేదు. కాని ఇప్పుడు ఈ వూరునైనా మా వూరు ఎందుకంటున్నానంటే ఇక్కడ మేం కాస్త ఎక్కువ కాలమే గడిపాం. ముప్పయ్యారేళ్ళ బతుకులో ఆ కొద్దికాలం బతుకు పెద్దదేమీ కాకపోవచ్చు. కాని 'కొద్ది కాలం' అంటే నాకు చాలాప్రేమ. ఇంట్లో మాత్రమే చదువుకున్న ఖాయ్‌దాతోఈ వూళ్ళోకి అడుగుపెట్టాను. ముందు నన్ను ఒకటో తరగతిలో చేరనివ్వలేదు. వీధి బడిలో వేశారు. పంతులు గారు నన్ను 'ఒరే, అలీఫ్‌బే..ఏం బే!' అన్నప్పుడల్లా నేను పరుగు పరుగున అమ్మ దగ్గిరకు వెళ్ళి ఏడ్చేవాణ్ణి. గోల చేసేవాణ్ణి. 'ఈ బే నాకు వద్దు.. అఆలు చెప్పు' అనేవాణ్ణి. నిజానికి అమ్మకు అ ఆ లు రావని నాకు తెలియదు. అప్పుడు నాన్న పలక తీసుకుని నాచేత ముందు అ ఆలు దిద్దించారు. అయిదేళ్ళవయసు వచ్చే దాకా నాది ఏభాషో నాకు తెలియదు. అందరూ ఒకటో తరగతి వాచకం చదువుతుంటే నాకు నామోషిగా ఉండేది. నాకు యాభై ఆరు అక్షరాలు సరిగ్గా రావాయె. నా దినచర్య ఫజర్ నమాజ్‌తో మొదలయ్యేది. పొద్దున్నే నిద్రలేవడం ఎవరూ చెప్పకుండానే అలవాటైంది నాకు. వజూచేసి టోపీ పెట్టుకుని అమ్మతోపాటు ఫజర్ నమాజ్‌కి తయారయ్యేవాణ్ణి చెప్పొద్దూ, నమాజ్ చదవడం అంటే నాకు చాలా ఇష్టం. ఇది దైవకార్యం అనో ఇంకొకటనో నాకు తెలియదు. అమ్మ అంటే నాకు చాలా ఇష్టం కాబట్టి అంతే! అమ్మ చేసే పనులన్నీ చాలా ఇష్టంగా చేస్తాను. అమ్మతో కలిసి కసువూడుస్తాను. అమ్మతో కలిసి వంటిల్లు

శుభ్రం చేస్తాను. అమ్మతో కలిసి బట్టలుతుకుతాను. వుతికిన బట్టల్నిసాపు చేసి చెక్క బీరువాలో పెడతాను బడికి వెళ్ళడం అనేపని అమ్మకు లేదు. కాబట్టే ఆమె పనులన్నీ నాకు మహా ఇష్టం. ఆ పనుల్లో మునిగిపోయి బడిని మరిచిపోతాను. పంతులుగారు రోజూ నాకోసం పిల్లల్ని పంపేంతవరకూ అలా మరిచిపోయినట్లు నటించేస్తాను.

'ఏకా అలీప్ బే, నువ్వేమన్నా నవాబువా?' నీకోసం రోజూ భటులు రావాలా?' అని పంతులుగారు చింత బరికెతో వొకటిచ్చుకునేవాడు.

అలా చింతబరికె నా వీపు మీద మోగుతున్న సమయాన ఓ రోజున.

'ఏమయ్యా పంతులూ చిన్నపిల్లాడని చూడకుండా ఏమిటదీ?' అన్న గొంతు వినిపించింది. ఎవరా అని చూస్తూ నిజంగా దేవతే దిగి వచ్చిందా అన్నట్టుగా ఒకావిడ. పంతులుగారి వైపు తీక్షణంగా చూస్తూ మాట్లాడుతోంది. పంతులుగారు ఏమీ తొణక్కుండా.

'వీడు చిన్నపిల్లాడా?' అని మరోసారి బెత్తం దెబ్బ ఇచ్చుకున్నాడు. అంతే, ఆమె మెరుపులా దూసుకొచ్చి పంతులుగారి చేతిలో బెత్తం లాక్కుని విరిచేసింది అలా విరిచేసరికి పంతులుగారు స్థాణువైపోయాడు. పిల్లలంతా వొక్కపెట్టున గోల చేసేశారు. కొత్త బెత్తం ఇప్పట్లో రాదు కదా మరి! పంతులుగారు భద్రంగాజ్ఞి పిలవాలి. వాడెళ్ళి చెట్టెక్కాలి. అప్పటి దాకా బెత్తం దెబ్బలు తప్పినట్టే ఈ పంతులునుంచి నాకు విముక్తి ప్రసాదించిన ఆవిడ వైపు చూసి నేను పరుగు పరుగున వెళ్ళి ఆమె తెల్లచీర మడతల్లో దాక్కుండిపోయాను.

ఆ రోజు సాయంత్రం ఆమె మా ఇంటికి వచ్చి అమ్మానాన్నల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా చెరిగి పడేసింది. 'మోతీ జైసా బచ్చా. లే జాకే వో షైతాన్‌కె పాలేమె హాత్ కైసా ఆయె' (ముత్యంలాంటి పిల్లాడు. తీసుకువెళ్ళి ఆ షైతాన్ పాలుచేయడానికి చేతులెలా వచ్చాయి.) అని ఖరాఖండిగా అడిగేసరికి 'ఇన్ చిలాచింతర్. ఇస్కు ఘర్‌మే రఖలియెతో ఘర్ గిరాకో మండ్వా దాల్తా, తుమారేకు నై మాలూమ్ గోరీమా' (వీడు పెద్ద కోతి. ఇంట్లో వుంచితే ఇల్లు పీకి పందిరేస్తాడు) అని అమ్మ నవ్వుతూ అనేసింది.

అప్పుడు తెలిసింది ఆమె పేరు గోరీమా అని!

అమ్మ అన్న మాటకు నాకు కోపం వచ్చినా గోరీమా అన్నమాటతో అది కాస్తా ఎగిరిపోయి నేను గోరీమా తెల్ల కొంగుపట్టుకుని ఆడుకుంటూ వుండిపోయాను. నన్ను కష్టాల్లోంచి కాపాడే శక్తిలాగా, నా మాటన్నా ఆటన్నా పాటన్నా కళ్ళకి అద్దుకునే గొప్ప దోస్తులాగా గోరీమా నాకు కనిపించింది. నావ్యక్తిత్వాన్ని బలంగా నిర్మించిన ఆమె చేతుల్ని ఇప్పటికీ ఎప్పటికీ నేను గుర్తుంచుకుంటాను. వెళ్తూ వెళ్తూ గోరీమా.

'అరే బచ్చే, తు రోజ్ మేరే పాస్ ఆ. . మై ఉర్దూ అరబ్బీ పడాతిం' అనేసి వెళ్ళిపోయింది.

నా దిక్కుమాలిన వీధి బడినుంచి నాకు విముక్తి ప్రసాదించి, నా ఆకాశంలోకి నన్ను ఎగరేసే స్వేచ్ఛా గీతం ఏదో ఆ పలుకుల్లో వినిపించింది నాకు.

అంతే, గోరీమా ప్రవేశంతో నా జీవితం మారిపోయింది కానీ తెల్లగా మల్లెపూవులా ఎప్పుడూ చెరగని నవ్వులా గోరీమా అనే సెలయేరు. ఎన్ని బండరాళ్ళ మీంచి ప్రవహిస్తుందో తెలియడానికి నాకింకా అప్పటికి ఊహలేదు.

ఏదో ప్లాట్‌ఫారం వచ్చినట్టుంది. అందరూ దిగుతున్నారు. నేను ఆలోచనల్లోంచి దిగలేకపోయాను. బయటికి చూస్తే. . ఇదే నేను దిగాల్సిన మా వూరు గబగబా బ్యాగ్ తీసుకొని కిందికి దిగాను.

'సార్ కాc జాతె?' దిగబోతుంటే ఎవరో ఎదురొచ్చారు. తలెత్తి చూస్తే ఓ మనిషి.. మా వూళ్ళో రిక్షాలు కూడానా?

'రిక్షా వద్దులే'

'రిక్షా కాదు, బండి ఊళ్ళోకి దూరం నడవాల' అన్నాడు.

ఏదో ఆలోచనలోకి వెళ్ళబోతున్నట్టు 'వద్దులే' అంటూ ముందుకు నడుచుకుంటూ వచ్చాను. నా పాత ఆనవాళ్ళు ఇక్కడేమైనా దొరుకుతాయా అని వెతుక్కుంటున్నాను. స్టేషన్ పెద్దగా ఏమీ మారలేదు. జనం పెద్దగా లేరు ఎంత పరీక్షగా చూసినా ఒక్క మొహమూ నాకు తెలియడం లేదు. పోనీ నా వైపు ఎవరైనా పరీక్షగా చూస్తున్నారా అంటే అదీ లేదు. ఈ వూరు నన్ను ఎప్పుడో మరచిపోయి వుంటుంది. అనుకుంటూ స్టేషన్ బయటికి వెళ్ళే దారిదాకా వచ్చాను. అక్కణ్ణించి మళ్ళీ ముందూ వెనుకా చూశాను. వెనుక నిశ్శబ్దం కనీసం రైలువెళ్ళిపోయిన సందడైనా లేదు. ముందు రెండడుగులు వేస్తే స్టేషన్ బయటికి దారి.

బయటికి అడుగుపెట్టగానే అడుక్కు తినేవాళ్ళు ఇద్దరు ముగ్గురో! పోనీ వీళ్ళెవరైనా నన్ను గుర్తుపడతారా అని పరీక్షగా చూశాను నాలుగూ నాలుగు పిచ్చిమొహాల్లా ఉన్నాయి. వొకావిడ వొంటినిండా కప్పుకుని శరీరాన్ని కుప్పలా దగ్గిరకు లాక్కుని కూర్చుని వుంది. అడుక్కు తినడానికి సిగ్గు కాబోలు... అడుక్కు తినేటప్పుడూ నా జాతికి బురఖా వుండాలి.. మిగిలిన ముగ్గురిలో ఇద్దరు కుంటివాళ్ళు. వొకడు గుడ్డివాడు ఏదో పాడుతున్నట్లుగా పాడి చివర్న 'బాబూ ధర్మం' అని వాడి సొంత బాణీ కలిపేస్తున్నాడు. చాలా యాంత్రికంగా నేనువొంటి నిండా ముసుగు కప్పుకున్న స్త్రీ ముందు ఓ రూపాయి పడేసి ముందుకు అడుగేశాను.

రెండడుగులు ముందుకు వేశానోలేదో వెనుక ఓ యుద్ధకాండ చూడాల్సి వచ్చింది. మిగిలిన ముగ్గురూ ఆ ముసిల్దాని మీద ఎగబడి కొట్టీ ఆ రూపాయి లాక్కుంటున్నారు. వంటి మీదున్న ముసుగుని ఇంకా దగ్గిరకు లాక్కుంటూ రూపాయిని కాపాడుకునే ప్రయత్నంలో ముసిలమ్మ ఓడిపోతోంది. నాకు చిరాకేసింది. వెనక్కి వెళ్ళి ఆ ముగ్గుర్నీ వాళ్ళ మొహాల మీద తలా అద్దరూపాయి వేసి ముందుకు నడిచాను.

స్టేషన్నుంచి ఊళ్ళోకి వెళ్ళాలంటే కొంత దూరం నడవాలి. ఈ దూరం నాకు చాలా ఇష్టం. చిన్నప్పుడు నాన్నతో కలిసి ఈ దూరం నడిచేవాణ్ణి. ఆయన మాటలు వింటూ ఆయనేమీ మాట్లాడకపోతే నేను ప్రశ్నలు వేసి మాట్లాడిస్తూ నడవటం ఎంత బాగుండేదో! ఆయనతో పాటు వొక్కోసారి ఉస్మాన్ వచ్చేవాడు. స్టేషన్‌కీ, మా వూరికీ

మధ్య వుండే నిశ్శబ్దాన్ని అతను భరించలేకపోయేవాడు. రోడ్డుకి ఇరుపక్కలా చెట్లు, దుమ్మూ ధూళితో వీచే గాలీ, అస్సలు జనసంచారం లేకపోవడం, ఎక్కడో కాని ఓ ఇల్లు కనిపించక పోవడం... భరించలేక పాటెత్తుకునేవాడు. ఎంత అందంగా పాడేవాడో చెప్పలేను, పాడుతున్నంతసేపూ నేను అతని గొంతువైపూ, వూగే పిల్లి గడ్డం వైపూ చూస్తూ వుండేవాణ్ణి. పాటలో భావం ఏమిటా అని ఎప్పుడూ అడిగిందీ లేదు, అతను చెప్పిందీ లేదు.

'ఎవరు నేర్పారీ పాట?' అని అడిగానో సారి.

'గోరీమా..'

అప్పటికి నాకు గోరీమాలో వున్న గాయని సంగతి తెలియదు. తర్వాత ఓసారి మొహర్రం నెలలో తెలిసింది గోరీమా చాలా బాగా పాడుతుందని! ఆమె పాట సంగతి ఊరంతా తెలుసని! మొహర్రం నెలలో ఓ రోజు సాయంత్రం అమ్మ చాలా హడావిడి చేసేస్తోంది ఇంట్లో. వంటపని వేగంగా ముగించేసింది.

'మీరూ త్వరగా భోం చేసేయండి' అని నాన్ననీ, నన్నూ తొందరపెట్టి భోజనానికి కూర్చో బెట్టింది.

'ఏమిటా తొందర?' అని నాన్న అడిగారు.

'ఇవాళ మాతంలో గోరీమా పాడుతుంది..'

త్వరగా భోజనాలు ముగించుకుని మేం మాతం దగ్గిరకు వెళ్ళాం. నాకు అప్పటిదాకా పీర్ల చావిడిలో హడావుడి వొక్కటే తెలుసు. అక్కడికి వెళ్ళాక ఆడవాళ్ళు మొహర్రం ఇంకా సందడిగా ఇంకా ఉద్వేగంగా జరుపుకుంటారని తెలిసింది. మధ్యలో నిలబడి గోరీమా వూగిపోతూ పాడుతూంటే చుట్టూ ఆడవాళ్ళు తిరుగుతూ ఎంత ఉద్వేగంగా ఆడుతున్నారో! వాళ్ళ స్వరాలు అంత పూరాగా విచ్చుకుని పాడడం అదే మొదటిసారి విన్నాను నేను. ఇంక గోరీమా పాట సంగతి చెప్పనే అక్కర్లేదు. ఈ చీకట్లో నా కుతూహలం నిండినకళ్ళని చూస్తే గోరీమా ఎంత సంబరిపడి పోయేదో! ఆమె పల్లవి ఎత్తుకుంటున్న ప్రతీసారి నేను గంతులేస్తున్నాను. నా గంతులు చూసి గోరీమా ఆడవాళ్ళ వ్యూహాన్ని చీల్చుకుని పాట పాడుతూనే బయటికి వచ్చి నన్ను తనతోపాటు తీసుకెళ్ళి పక్కన నిలబెట్టుకుంది. ఇక గోరీమా పాడటం, మిగిలిన ఆడవాళ్ళతో కలిసి నేనూ ఆడడం! ఇండ్లలో ఏనాడూ కనీసం గొంతు విప్పనివాళ్ళు, స్వేచ్ఛగా కాళ్ళు కదపని వాళ్ళు అక్కడ బాగా అలవాటైనట్టుగా గొంతువిప్పి పాడటం, కాళ్లూ చేతులూ ఎగరేస్తూ ఆడడం నాకు భలే సంబరాన్నిచ్చింది.

కానీ, ఈ సంబరం నాకు ఎంతో కాలం నిలబడలేదు.

ఆ మరుసటి ఏడాది మళ్ళీ మొహర్రం వచ్చింది. కాని ఈసారి గోరీమా పాట లేదు.

కచ్చితంగా ఇంకో రెండు మూడు రోజులకు చావడీలో పీర్లు పెడతారనంగా ఓ సాయంత్రం గోరీమా ఆవేశంగా అమ్మ దగ్గరకు వచ్చింది. అప్పటికే ఆమె జుట్టు బాగా రేగిపోయి వుంది. మల్లెపూవు లాంటి ఆమె తెల్లచీర మాసిపోయింది. ఎప్పుడూ

ప్రశాంతంగా వెలుగుతుండే ఆమె కళ్ళు ఎర్రగా చింతనిప్పులు కురుస్తున్నాయి. గోరీమా చాలా ఆవేశంగా కోపంగా మాట్లాడుతోంది ఆమె మాటల్లోంచి నేనేమీ గ్రహించ లేకపోయాను. ఆమె చాలా కష్టంలో వుందన్నదొక్కటే నాకు అర్థమైంది. చాలాసేపు గోరీమా మాట్లాడి వెళ్ళిపోయింది వెళ్ళాక అమ్మనడిగాను

"నీకు అర్థం కాదులేరా!" అని ఎంతకీ ఏమీ చెప్పలేదు అమ్మ

నాన్న భోజనానికి వచ్చినప్పుడు మాత్రం తనే చెప్పడం మొదలు పెట్టింది. కాని నాకేమీ అర్థం కాలేదు అది గోరీమా ఇంటి గొడవ అని మాత్రం తెలిసింది.

ఆ రాత్రి నాకు చాలాసేపు నిద్ర పట్టలేదు తెల్లారే లేచి గోరీమా ఇంటికి వెళ్ళాను.

అక్కడ చాలా సందడిగా వుంది చుట్టూ జనం. కేకలు, పళ్ళాలనిండా కొబ్బరి కాయలూ, పూలు పెట్టుకుని తండోపతండాలుగా వస్తున్నారు ఇంకా ఇంకా వస్తూనే వున్నారు. నేను ఆ జనాన్నంతా తోసుకుని గోరీమా ఇంట్లోకి అడుగు పెట్టాను.

గోరీమా అంటే ఎంత ఇష్టమో ఆ ఇల్లన్నా అంతే ఇష్టం నాకు. ఓపెద్ద మిద్దె. మిద్దె చివరి పెద్ద వేపచెట్టు. చెట్టుపైన ఆకుపచ్చ. ఎర్రజెండాలు. లోపలికి అడుగుపెట్టగానే పూలచెట్ల పలకరింతలూ, చుట్టుముట్టే పరిమళాలు అన్నిటికీ మించి తెల్ల లాల్చీ, పైజమాలో ఎప్పుడూ కడిగిన ముత్యంలా కనిపించే అన్వర్‌భాయి. ఎప్పుడూ నవ్వుతూ ఎదురొచ్చే అన్వర్‌భాయి ఆ రోజు కనిపించలేదు. మూడు నాలుగు గదుల ఆ ఇంట్లో చివరి గది భాయిది నేను ముందూ వెనుకా చూడకుండా లోపలికి వెళ్ళిపోయాను. గదిలో నేలమీద పడుకొని కప్పుకేసి చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు అన్వర్‌భాయి.

నేను చాలా మెల్లిగా భాయ్.. అని పిలిచాను.

'రా' అన్నట్లుగా తల వూపి మళ్ళీ ఆలోచనల్లో కూరుకుపోయాడు.

నేను దగ్గిరగా వెళ్లి కూర్చున్నాను.

'భాయి..' అని మళ్ళీ అన్నాను

ఏమి మాట్లాడాలో తెలియడం లేదు. ఆ వాతావరణం నాకు కొత్తగా వుంది. అంత నిశ్శబ్దాన్ని ఆ ఇంట్లో నేను చూడలేదు. నిజానికి ఆ సమయానికి అరబ్బీ పారం చెబుతూ వుండాలి బయట మిద్దెమీద కూర్చొని అన్వర్‌భాయి ఏదైనా చదువుకుంటూ వుండాలి లేదా పూలమొక్కలకు నీళ్ళు పోస్తూ వుండాలి. అవేమీలేని ఆ ఉదయం నాకు భయమేసింది బయటేమో ఆ సందడి.. ఇంట్లో ఇంత నిశ్శబ్దం! అన్వర్‌భాయ్ ఏమీ మాట్లాడకపోయేసరికి నేను మళ్ళీ వరండాలోకి వచ్చాను. అప్పుడే గోరీమా అక్కడికి వచ్చినట్టుంది. తన్నీ లెక్కిస్తూ కూర్చొని వుంది నేను ఎదురుంగా వెళ్ళి కూర్చునేసరికి. .

'కబ్ అయె బా?' అనింది

నేనేమీ అనకుండా 'క్యాహువా గోరీమా? అని అడిగాను. అలా అడిగేసరికి వొక్కసారిగా గోరీమా ఏడిచేసింది నన్ను వొళ్ళోకి లాక్కుంది

'మేరా ఘర్ షైతాన్‌కా పాలె హువా బా' అంటూ ఏడుస్తోంది

'బాహర్ క్యావో...' (బయటఏమిటి?) అని అడిగాను.

'షైతానా, కాఫిరా జమే... కోన్కీ అమ్మ ఆయి కతే...' అంటూ ఏడుస్తోంది. తప్ప నాకేమీ అర్థం కావడం లేదు. చెప్పినా నాకు అర్థమయ్యే పరిస్థితి కాదు అది. బయట హడావుడి కొద్ది కొద్దిగా తగ్గుతున్నట్టుగా వుంది. జనం కేకలు తగ్గిపోయాయి. కాసేపు వుండి గోరీమా మళ్ళా నమాజ్‌లోకి వెళ్ళిపోయింది. నేను బయటికి వచ్చాను.

బయట గోరీమా ఇంటి గోడకి ఆనుకుని ఓ పెద్ద బండరాయి. దానికి ఎర్రెర్రని బొట్టూ, కుంకుమలు పూశారు. పూలు తొడిగారు. తోరణాలు కట్టారు. అలాంటి దృశ్యం నేను ఓసారి చెరువుదగ్గిర చూశాను. ఇప్పుడు ఇక్కడ.. పరీక్షగా చూస్తే ఆ రాతిమీద ఓ స్త్రీ ఆకారం వుంది. అది చాలా వికృతంగా అనిపించింది నాకు. ఎక్కువసేపు చూడలేక అయిష్టాన్ని వ్యక్తం చేయడానికి ఓ చిన్నరాయి విసిరి కోపంగా వచ్చేశాను. అప్పటినుంచీ ఆ రాతి రూపం నన్ను వెంటాడుతూనే వుంది.అమ్మని అడగాలి. అమ్మకి తెలియపోతే నాన్నని అడగాలి.

అమ్మా నాన్న ముందు వరండాలో కూర్చుని వున్నారు. నాన్న పేపర్లు దిద్దుకుంటున్నారు. అమ్మ బియ్యంలో రాళ్ళు ఏరుతోంది.

'గోరీమా పరేషాన్‌లో పడిపోయింది పాపం' అంటోంది అమ్మ.

'ఏం చేస్తుంది ఆడది? మనవాళ్ళా వొకళ్ళకొకళ్ళు తోడు రారు' అంటున్నారు నాన్న.

'నిజంగా అక్కడ ఆ దేవత వెలిసిందా?'

'దేవతలు వెలవడం ఏమిటి? ఇల్లు బాగుంది కదా, ఎవడో కన్నేశాడు. ఓ రాయి విసిరి వెళ్ళిపోయాడు, అంతే, మనకు రాళ్ళంటే పిచ్చి కదా, దానికి కాస్త కుంకుమా, బొట్టూ వున్నాయంటే ఇంక పూనకాలొచ్చేస్తాయి.'

నేనువాళ్ళ మాటలు వింటూ ఓ పక్కన కూర్చోబోయాను.

'నాన్నా, 'బాబూ, ఎక్కడికి వెళ్ళావురా?' అంటూ దగ్గరకు పిలిచారు. నేను దగ్గిరకు వెళ్ళి ఆయన పక్కనే కూర్చున్నాను.

అమ్మ మళ్ళీ అడిగింది.

'ప్రెసిడెంటు మీరు చెప్పినట్టు వింటాడు కదా, ఓ మాట చెప్పొచ్చుగా'

'వాళ్ళకు కావల్సిన మాటలు వింటారు. ఈ విషయం అడిగితే ఎందుకు లేవయ్యా, ఇందులో కులం గొడవుంది. నీకు తెలుసుగా ఆ కులపోళ్ళు వూళ్ళో ఎక్కువున్నారు.. అనేశాడు'

అమ్మ ఇంకేమీ అన్లేదు.

'నిజమే.. మనోళ్ళు తక్కువ వుండడమే మనకు అన్యాయం. ఆ తక్కువలో కూడా మళ్ళీ వొకళ్ళకొకళ్ళకి తేడాలు.. మనం బాగుపడంలెండి' అంటూ చాట తీసుకుని నిలబడింది.

'నా బాధల్లా గోరీమా గురించి. దిగులుతో మంచంపట్టింది. ఆ పెద్దకొడుకు పట్నం వెళ్ళి కూర్చున్నాడు. తల్లి గురించి పట్టించుకోడు. ఇంక మగదిక్కు ఏది? బతుకంతా పెద్దకొడుకుమీద ఆశలు పెట్టుకొని ఈడ్చుకుంది. భర్తపోయాక రెండోపెళ్ళి

చేసుకోమని అందరూ అన్నారు. ఎంతసేపూ పిల్లలు పిల్లలు అంటూ దొంతరిదై పోయింది. ఆ అన్వర్‌కి ఇంకా చిన్నవయసు'

అని స్వగతంగా అనుకుంటున్నట్లుగా పంటగదిలోకి వెళ్ళిపోయింది.

నాన్న మౌనంగా పేపర్లు దిద్దుకుంటూ వుండిపోయారు నాకేమో అయోమయంగా వుంది. గోరీమాని కాపాడుకోవాలి ఎలా' ఎలా?

గోరీమాని, నేను కాపాడుకోలేకపోయాను.

కాని ఆ తర్వాత ఊరు లీరే మారిపోయింది అమ్మానాన్నా కూడా ఊరి విషయాలు పెద్దగా చర్చించుకోవడం లేదిప్పుడు నాన్న దినచర్య మామూలుగా సాగిపోతూనే వుంది అమ్మ ఎప్పుడైనా మధ్యాహ్నం గోరీమా దగ్గరకు వెళ్ళి వచ్చేది. కాని ఇంట్లో చెప్పేది కాదు నాకు ఏమీ అర్థం కావడం లేదు

గోరీమా చిక్కి శల్యమైపోవడం నాకళ్ళారా చూస్తున్నాను అన్వర్‌గడి నాలుగ్గోడల మధ్య ఖైదీలా పడివుండడమూ చూస్తున్నాను అన్నట్టు ఇప్పుడూ గోరీమా పెద్ద గదుల ఇల్లు వదిలేసి వెనక చిన్న పాకలాంటి ఇంట్లోకి మారింది ఆ మార్పు కూడా అప్పటికి నాకు తెలియదు. బయట దేవత ప్రలిష్ట రోజురోజుకీ పెరుగుతోంది. ఇదివరకు ఏ శనివారంనాడో జనాలు వచ్చేవారు. ఇప్పుడు రోజూ వస్తున్నారు అక్కడ ఎంత హింస జరుగుతుందో చెప్పలేను. మేమాడుకునే జెండాచెట్టుకింద సాయంత్ర మయ్యేసరికి కోళ్ల బొచ్చు గుట్టలుగా పడి వుంటుంది. క్రమంగా ఈ ప్రదేశమ్మీద నా ఆకర్షణ తగ్గిపోయింది గోరీమా కళ్ళల్లో ఇదివరకటి ప్రేమ బదులు ద్వేషం పుట్టుకు రావడం నా లేతకళ్ళకూ తెలుస్తోంది. కాని ఇప్పుడెవరూ ఏమీచేయలేని స్థితి... సాహెబ్ మామయ్య వస్తాడని. అంతా కుదురుకుంటుందనీ గోరీమా మొదట్లో అమ్మతో చెప్పేది కాని సాహెబ్ మామయ్యని నేను మళ్ళీ చూడలేదు. పట్నంలో తప్ప!

నాన్న రంజాన్ పండక్కి బట్టలు కొనడానికి నన్ను పట్నం తీసుకెళ్ళినప్పుడు సాహెబ్ మామయ్యని చూశాను.

నాన్న నాకు చొక్కా కొనిపెట్టాక చెప్పులు కావాలని గొడవ చేశాను.

'ఇంట్లో ఓ జత వున్నాయి కదరా..

'కాదు, ఇంకోటి కావాలి'

కాసేపు మారాం చేస్తే నాన్న చెప్పుల షాపులోకి తీసుకు వెళ్ళారు. అక్కడ ఓ వ్యక్తి నాన్నకి చిరునవ్వుతో సలాం కొట్టాడు

'క్యా, సాహెబ్, ఖైరీయత్?' అని అడిగారు నాన్న 'ఓహో సాహెబ్ మామయ్య ఇతనేనా?' అనుకుని పరీక్షగా చూశాను పొడుగ్గా అందంగా వున్నాడు సాహెబ్. గోరీమా కొడుకే ఇతను అంటే ఎవరైనా వెంటనే అవునవును కదా అనేట్టున్నాడు

'కా ఖైరీయత్ సాబ్' అంటూనే ఒక బాధతో కూడిన నవ్వుతో మాట్లాడుతున్నాడు. అతనేదో మాట్లాడుతున్నాడు. గోరీమా ప్రసక్తి వస్తుందేమోనని నేను ఆసక్తిగా వింటున్నాను. కాని అతను ఒక్క మాట కూడా పొరపాట్న గోరీమా గురించి ఎత్తలేదు. చివరికి నాన్న అడిగారు

'ఏక్‌బార్ ఆవో.. అమ్మ ఒంటరిదైపోయింది. గొడవులుగా వుంది.'

'అమ్మీ పిచ్చిది. ఇక్కడికి రమ్మంటే రాదు. వాళ్ళా, అమ్మని వెళ్ళగొట్టేంతవరకూ పూరుకోరు. ఆ కులపోళ్ళు చాలా గట్టివాళ్ళు. మొండిముండాకొడుకులు. మనం నిలబడ గలమా? అమ్మేమో ఏవో బీరాలు పలుకుతోంది. ఎట్లయినా ఇల్లు దక్కించు కోవాలంటుంది. మనకు ముందూ వెనుకా ఎవరూ లేరు. ఆ స్థలానికి కాగితాలు లేవు. మనం ఏమీ మాట్లాడలేం.'

'నువ్వు వచ్చి ఇంకోసారి కోషిష్ చెయ్యి'

'నాకు నమ్మకం లేదు సాబ్, వాళ్ళు ఎంత క్రూరులో మీకు తెలుసు. ఎలాగైనా ఆ ఇల్లు ఆక్రమించి అక్కడో పెద్దగుడి కట్టేద్దామనుకుంటున్నారు. వేరేవూళ్ళ జనాలు కూడా ఇప్పుడు తోడయ్యారు. మొన్నటికి మొన్న కూడా వచ్చి బెదిరించి వెళ్ళారు. ఇల్లు ఖాళీ చేయకపోతే వేసేస్తామని. నా పిల్లలు పెరుగుతున్నారు. నేను ప్రాణాన్ని ఫణంగా పెట్టలేను...' నిస్సహాయతని ప్రకటిస్తున్నాడు సాహెబ్.

నాన్న కూడా ఇంకేమీ అనలేకపోతున్నాడు.

'ఇస్కా సైజ్ ఏక్‌జోడా నికాలో (వీడి సైజుకి ఓచెప్పుల జత తీయండి) అన్నారు.

సాహెబ్ నా కాళ్లు దగ్గరకు తీసుకొని సైజు చూశాడు.

'యే కైసా దేతె?'

'ప్రస్తుతానికి గడుస్తుంది. పిల్లలు పెరిగితె గడవడం కష్టం' అన్నాడు.

'ఎంత పెద్ద కుటుంబం ఎలా అయిపోయింది? ఆరోజుల్లో గోరేభాయ్ అంటే ఊళ్ళో ఎంత ఇజ్జత్!'

'అదంతా ఆయనతోనే పోయింది. ఇప్పుడు కులం తప్ప మనుషులు కనిపించడం లేదు' సాహెబ్ కళ్ళలో తడి మెరిసింది.

'ఇంటికి రండి...ఈ పూట వుండి వెల్దురుకాని...' అన్నాడు ప్రేమగా సాహెబ్. అలా అన్నప్పుడు అచ్చంగా గోరీమాలానే వున్నాడు.

'ఏ బార్ జరూర్ ఆతె..'

'భాబీకు లేకే ఆవో' (వదినమ్మని తీసుకు రండి) అంటూ షాపు బయటికి దాకా వచ్చి మమ్మల్ని సాగనంపాడు సాహెబ్.

తిరుగు ప్రయాణంలో నేను నాన్నని ఎంత విసిగించానో చెప్పలేను. గోరేభాయ్ ఎవరు? సాహెబ్ మామయ్య తల్లికి దూరంగా ఎందుకున్నాడు? అంటూ.

'గోరేభాయ్ మలేరియాతో చనిపోయాడు. ఆ రోజుల్లో మలేరియా వస్తే అంతే! వూళ్ళోకుటుంబం గడవక భార్యాపిల్లలతో పట్నం వచ్చేశాడు సాహెబ్. గోరీమా సొంత వూరూ, సొంత ఇల్లూ అంటూ అన్వర్‌తో సహా అక్కడే ఉండిపోయింది' అన్నారు వొక్కమాటలో.

అయినా నేను వినలేదు.

'ఇప్పుడు గోరీమాని ఎవరు చూస్తారు?'

'అన్వర్ పెద్దయ్యేదాకా అంతే!' అని ఆయన తన ఆలోచనల్లో తను మునిగి పోయారు.

ఇది జరిగిన కొన్నాళ్ళకు మా ఇంటికి మోతీ పిన్ని వచ్చింది. మోలీ గోరీమాకు మంచి స్నేహితురాలు

'నువ్వే చెప్పు ఆపా, గోరీమా పెద్ద యుద్ధం చేస్తోంది ఈ యుద్ధంలో గెలిస్తే ఇల్లు దక్కుతుంది. ఇల్లు కంటే ముందు పరువూ ప్రతిష్ఠా నిలుస్తుంది'

'ఏం లాభం, మనిషి శవమైపోతోంది. ఆ కులపోళ్ళతో గొడవెందుకు. పోతే పోనీ పాడు ఇల్లు అనిపిస్తోంది నాకయితే' అంది అమ్మ.

'ఎలా వదిలిపెడుతుంది చెప్పు. గోరేభాయ్ గోరీమా ఎలా వుండేవాళ్ళో నీకు తెలుసుగా. ఆ రోజుల్లో వూళ్ళో అందరికీ తలలో నాలుకలాగా. ఆయన జ్ఞాపకం ఈ ఇల్లొక్కటీ తనకు వొదిలి పెట్టమంటోంది. వున్న పొలం సాహెబ్ అమ్ముకుని పట్నం వెళ్ళి కూర్చున్నాడు' అంటోంది మోతి

'నిజమే, కాని ఇల్లుతో పాటు గోరీమా కూడా మనకు దక్కేట్టు లేదు' అంది నిరాశగా అమ్మ.

'అల్లా క్యా లిఖేతో వో హోతా, ఆపా, కోన్ క్యా కర్తే (అల్లా ఏది రాసిపెట్టాడో అదే జరుగుతుంది, ఎవరేం చెయ్యగలరు?) అని వెళ్ళిపోయింది మోలీ.

ఆ తర్వాత కాలమెలా గడిచిపోయిందో గడిచిపోయింది. గోరీమా మాత్రం వూరు కోలేదు. పోరాడుతూనే వుంది. మెల్ల మెల్లగా ఆమె ఇల్లు గుడికింద మారిపోతోంది. దాన్ని ఆపే శక్తి ఎవరికీ లేకుండాపోయింది అందరి నిశ్శబ్దాన్ని ప్రశ్నిస్తూ గోరీమా తిరగ బడుతూనే వుంది అలా చెప్పీ చెప్పీ, పోట్లాడి పోట్లాడీ గోరీమా ఏమైపోతుందా అన్ని కొన్ని రోజులు దిగులు పెట్టుకున్నాను అమ్మకి చెప్పాను, నాన్నకి చెప్పాను కాని ఎవరూ గోరీమా గురించి పట్టించుకోలేదు. అన్వర్ బయటికి రావడమే మానేశాడు క్రమంగా మా మధ్య దూరం పెరిగింది.

ఈలోగా చాలా మార్పులు జరిగిపోయాయి. మా కుటుంబం టౌనుకి మారింది. వూళ్ళో వున్న కాసింత చెక్కా బాబాయ్‌కి అప్పజెప్పారు. బాబాయ్ టౌను వచ్చినప్పుడల్లా ఊరు సంగతులు చెప్పేవాడు. అలా గోరీమా గురించి బాబాయ్ చెప్పగా వినడమే.....!

ఆ జ్ఞాపకాల్లో ఊళ్ళోకి వచ్చేశాను వూళ్ళోకి ప్రవేశించగానే రోడ్డుకి కుడిపక్కన పోలీస్ స్టేషన్ ఎప్పటిలానే ఉంది. కాని అక్కడ జనం ఎక్కువగా వున్నారు. నా చిన్నప్పుడు అక్కడ ఎప్పుడూ వొకరిద్దరు తప్ప కనిపించేవాళ్ళు కాదు ఇప్పుడు జనం రద్దీ చూస్తోంటే వూళ్ళో హింస బాగానే పెరిగిందనిపిస్తుంది. కొద్దిగా డౌన్‌లోకి వస్తే ఎడం వైపున గిర్నీ వుంది అది ధనా ధనా చప్పుళ్ళు చేస్తూనే వుంది. పెద్ద మార్పేమీ లేదు. వొక్కో అడుగు అలా గతంలోకీ, వర్తమానంలోకీ వేస్తూ వూళ్ళోకి వచ్చాను. అటూ ఇటూ జనం తిరుగుతూనే వున్నారు ఎవరూ నావైపు చూసి నన్ను గుర్తుపట్టడం లేదు. చిన్నప్పుడు నేను ఈ వూళ్ళో ఎటువెళ్ళినా 'హిందీసార్ కొడుకురా' అని నాకు తెలియనివాళ్ళు కూడా గుర్తుపట్టే వాళ్ళు. లేదా వూళ్ళోకి ఓ కొత్తమనిషి వస్తే ఎగాదిగా చూసేవాళ్ళు. ఇప్పుడు అలాంటిది లేదు. ఆ వూళ్ళో నేనొక

అనామకుణ్ణి అనిపించింది. కొత్త కొత్త ముఖాల్లో పాత పోలికలేమన్నా కనిపిస్తాయా అని వెతుక్కుంటూ చావిడి దాకా వచ్చాను. చావిడికి నాలుగైదు అడుగుల దూరంలో బాబాయ్ ఇల్లు. ఎత్తయిన అరుగులు. పాతకాలపు నిర్మాణంలా వుండే చావిడీ, చావిడి తలుపులు ఎప్పుడూ తీసే వుంటాయి. వొక్క మొహర్రం నెలలో తప్ప మామూలప్పుడు దాన్ని ఎవ్వరూ పట్టించుకోరు. ఆ నెలలో ఈ చావిడీ ఎంత హడావిడిగా వుంటుందో! పెద్ద ఆలమ్ పట్టుకుని సాహెబ్ మామయ్య వూగి పోతుండడం, అలా తొక్కడం పూనకం వచ్చినట్టు ఏదేదో మాట్లాడడం... వొక భయంతో కూడిన ఆనందం నాకు! చావిడీకి ఎదురుగా పెద్ద ఖాళీ స్థలం. ఆ ఖాళీ స్థలంలో శ్రీరామనవమి. పందిరి వేసేవాళ్ళు. కోలాటాల సందడి.

'గణగణమూర్తివి గణనాధా

నువ్వు శివుడీ కుమారుడివి గణనాధా'

అలా కోలాటం ఆడుతుంటే మాకాళ్ళూ చేతులూ ఆగేవి కావు. పీరు వూగినట్టు వూగిపోయేవాళ్ళం. సాయంత్రం కాగానే ఎవరోవొకరు పెద్దపాత్రలో పులిహోర తెచ్చేవాళ్ళు. పీర్ల చావిడి అరుగు ఎక్కి అందరికీ పంచేవాళ్ళు. ఆ దృశ్యాలన్నీ నా జ్ఞాపకాల్లోంచి కళ్ళ ముందు సజీవంగా తిరుగాడుతున్నట్టే అనిపించింది.

పీర్ల చావిడిలో మాత్రం పాడుతున్నప్పుడు సాహెబ్ మామయ్యా , అన్వర్ అన్నయ్యా నిజంగా ఏడిచేవాళ్ళు. వాళ్ళతో కలిసి పాడే అందరూ పెద్దగా ఏడిచేవాళ్ళు. ఆ ఏడిచేవాళ్ళల్లో ఎవరికీ కులమతాల పట్టింపులుండేవి కావు.

'ఓ.. మేరే హుసేన్..' అనగానే ఆలమ్‌పైన కప్పిన ఎర్రగుడ్డల్ని కళ్ళకి అదుముకుని నిల్చున్నవాళ్ళు నిల్చున్నట్లే వొక్కసారిగా తట్టుకోలేక కింద పడిపోతారా అన్న ఉద్వేగంతో పాడేవాళ్ళు. ఆ సన్నివేశంలో ఎంత బండరాయికైనా భళ్ళున ఏడుపు పొంగుకొచ్చేది.

నేను జ్ఞాపకాల్లో వుండగానే

'బాబూ...' అన్న కేక వినిపించింది.

చూస్తే... ఉస్మాన్!

ఉస్మాన్‌ని చూడగానే నాకు ఏడుపొచ్చేసింది. గట్టిగా కావలించుకున్నాను. 'ఉస్మాన్ మామా' అన్న మాట నాకు తెలియకుండానే గొంతులోంచి వచ్చేసింది.

ఆయనా అంతే ప్రేమగా నన్ను కావిలించుకున్నాడు.

'ఎన్నిరోజుల్ తర్వాత వచ్చావు.. అంటూ కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు.

ఈ ఉస్మాన్‌కు ఓ ఇల్లూ వాకిలీ లేదు. ఈ చావిడీ పట్టుకుని లేదంటే ఆ ఫ్లాట్‌ఫారమ్ పట్టుకుని బతికేసేవాడు.. ' యే ఉస్మాన్ యేక్ దీవానా. నా ఘర్‌కా నా ఘాట్‌కా' గోరీమా ఎంత కోప్పడేదో! ఎప్పుడీ బీడీ తుంట వేళ్ళమధ్య సరిచేసుకుంటూ తిరిగేవాడు. 'అరే బచ్చో..' అంటూ పిల్లకాయల్ని వెంటేసుకుని... వాళ్ళని ఆడించేవాడు. నిజానికి పిల్లకాయలే వాడితో ఆడుకునేవాళ్ళు.

'బాబూ.. మేరే ఘర్ జాయెంగే'

'నీకో ఇల్లా?'

'ఏం? నాకు ఇల్లుండకూడదా'

నిజమే, నా ప్రశ్న నాకే అర్థరహితంగా ధ్వనించింది

'కాదు, ముందు బాబాయ్‌నీ, పిన్నినీ పలకరించి వస్తా'

'బడా నిక్‌లా లే... చాలాకాలం తర్వాత బేటా వస్తున్నాడు కదా స్టేషన్‌కి వెళ్దాం అన్న ధ్యాస అయినా లేదు ఆ బేవకూఫ్‌కి.

'లేదు, బాబాయ్‌కి తెలియదు నేను వస్తానని'

'సరే, ముందు ఈ గరీబ్ గుడిసె చూసి అప్పుడు వెళ్లు కాని '

అయినా నేను వొప్పుకోలేదు. ముందు బాబాయ్‌కి సలామ్ చేయాలి. పిన్నితో మాట్లాడాలి ముకరమ్ ఎలా వుందో చూడాలి దానికి ఆరోగ్యం బాగా లేదని విన్నాను. జాఫర్ ఎలా వున్నాడో! నా ఆలోచనలన్నీ చాళ్ళ చుట్టూ తిరుగుతున్నాయి

ఉస్మాన్‌కి నా పరిస్థితి అర్థమైనట్టుంది

'సరే, అసర్ తాజూవ్వ వస్తాలే. ' అన్నాడు

బాబాయ్ ఇంటిదాకా దిగబెట్టాడు 'నువ్వొళ్ళు...' అనేసి వెళ్ళిపోయాడు. ఎందువల్లనో అతను లోపలికి రాలేదు. చిన్నప్పుడైతే ఉస్మాన్ అసర్ నమాజ్ తర్వాత ఎప్పుడూ బాబాయ్ ఇంటి చూరే పట్టుకుని వుండేవాడు. ఏదో తేడాగా అనిపించింది నాకు.

నేను వెళ్ళేసరికి బాబాయ్ ఇంట్లో లేడు. బయట చిన్న వరండా దూరంగా పశువుల కొట్టం నా అలికిడి విని లోపల్నుంచి ఎవరో వచ్చారు. ముకర్‌మ్...! ముకరమ్‌ని చూడగానే నాకు కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ముకరమ్ శవంలాగా వుంది. ఎప్పుడూ నవ్వుకుంటూ తుళ్ళుకుంటూ కెరటంలా ఎగిసిపడే ఆ ఉత్సాహమూ, ఆనందమూ... అసలు అలాంటివి ఆ అమ్మాయికి జీవితంలో ఎప్పుడన్నా తెలుసా? అన్నట్టుంది.

'అమ్మీ, బాబు భాయి..' అంటూ పరుగు పరుగున లోపలికి వెళ్ళింది. లోపల్నుంచి పిన్ని వచ్చింది 'ఎన్నిరోజుల తర్వాత వచ్చావు బాబూ, ఇక్కడ వూళ్ళో మేం బతికే వున్నామా? ఎన్ని బాధలు పడుతున్నామో మీ అమ్మకీ గుర్తుండదు. మీకూ గుర్తుండదు' పిన్ని కొంచెం వెటకారంగానే అన్నట్టుంది. దగ్గిరకు వెళ్తున్నవాడ్నల్లా నేను ఆ మాటలకు ఎక్కడివాడ్ణి అక్కడే వుండిపోయాను. ఈమె ఏమీ మారలేదు అనిపించింది. ఈలోపున ముకరమ్ లోపలికి వెళ్ళి నాకు ఓ గ్లాసు మంచినీళ్ళు తెచ్చింది. తాగబోతుండగానే పిన్ని

'మా కష్టాలు మీరెప్పుడైనా తలుచుకుంటారా, బాబూ' అని మొదలెట్టింది. తాగబోతున్న గ్లాస్ పక్కన బెట్టి ముకరమ్ వేపు చూశాను. నేను, ఆమె అంతేలే.. అన్నట్టుగా నా వైపు కాస్త ప్రేమగా చూసింది ముకరమ్.

'వచ్చీ రాంగానే ఎందుకు? బాబుభాయ్ స్నానానికి నీళ్ళు పెడతాను. మంచి ఎండలో వచ్చావు అలిసిపోయుంటావు' అంది ముకరమ్. ఆ మాటలు చాలా వూరట నిచ్చాయి. ఆ తర్వాత పిన్ని ఏదో గొణుక్కుంటూను వుంది.

'జాఫర్ ఏడి?' అని ముకరమ్‌ని అడిగాను.

'కామ్ నై... ధామ్‌నై.. కా జాఁతా' అంటూ మళ్ళీ కల్పించుకుంది పిన్ని. ఆమె మాటతీరులోని తేడాని నేను అర్థం చేసుకోగలను. మా సంబంధాలు ఇదివరకటంత స్వచ్ఛంగా లేవని నాకు తెలుసు. అమ్మ ఎప్పుడూ పిన్నిని తిడ్తూనే వుంటుంది. 'షాదీ మేజ్వానే మే బీ నై సకా కరీ దుష్మన్' (పెళ్ళీ పేరంటాల్లో కూడా మమ్మల్ని రాకుండా చేసింది... శత్రువు) అనే తిట్టేది అమ్మ. పిన్ని గుర్తొస్తే అమ్మకి ఎక్కడలేని ఆవేశం, నాన్న కోప్పడ్డంతో 'ఆ... భాయికే ఊపర్ మఖ్మీ భీ నై ఫిర్నా' (తమ్ముడిమీద ఈగ కూడా వాల కూడదు) అనేసి తన పనిలో తను వెళ్ళిపోయేది. నాన్నకి మొదట్నుంచీ బాబాయ్ అనే సానుభూతి, 'వాడా చదువుకోలేదు, మనకు చిన్నదో చితకదో గవర్నమెంటుద్యోగం వుంది' అనేవారు. వూళ్ళోవున్న భూమిగురించి ఆయన ఏనాడూ పెద్దగా పట్టించుకోలేదు. బాబాయ్ ఎప్పుడైనా వచ్చేవాడు. వచ్చేటప్పుడు ఏవో గింజలూ, కూరగాయలూ తెచ్చేవాడు. ఒకటి రెండురోజులు వుండి వెళ్ళిపోయేవాడు. క్రమంగా రాకపోకలు కూడా తగ్గిపోయాయి. ఈలోగా నాన్న ఆరోగ్యం దెబ్బతింది. ఇంట్లో ఖర్చులు పెరిగిపోయాయి. ఎంత డబ్బూ ఆస్పత్రికే ధారపోయాల్సి వచ్చేది ఊరెళ్ళి ఆ భూమి వ్యవహారమన్నా తేల్చుకు రమ్మని అమ్మ పోరేది. కాని నాన్న ఎప్పుడూ పట్టించుకున్నది లేదు. అలా ఆయన అనారోగ్యంతో తీసుకుంటూ తీసుకుంటూ కన్నుమూశారు. కుటుంబం అప్పుల పాలయింది.

'పెద్ద కొడుకువి, కనీసం నువ్వయినా ఆ భూమి గురించి పట్టించుకో' అని అమ్మ ఎన్నిసార్లు తిట్టిపోసిందో తెలియదు. కాని వూరెళ్ళినా నేను బాబాయ్‌ని ఆ భూమి గురించి అడగ్గలనా? ఏమో.. నాకు నమ్మకం లేదు. ఆయన ముందు మాట్లాడే ధైర్యం లేదు. నిజానికి ఆయన కుటుంబ పరిస్థితి నాకు బాగానే తెలుసు. అయినా అమ్మ మాట తీసిపారేయలేక వచ్చాను. ఇక్కడ పిన్ని సూటిపోటు మాటలు నేనూహించినవే. కాని... ముకరమ్, జాఫర్‌కీ ననేంటే చిన్నప్పణ్ణించీ ప్రేమ. బాబాయ్‌కి నేనంటే పెద్ద ప్రేమాలేదు. అంత కోపమూ లేదు. ఆయన దృష్టిలో నేనెప్పుడూ 'బచ్చా'ని. భాయ్, పాని నికాలిం' (అన్నా, నీళ్ళు తోడాను) అన్న ముకరమ్ మాటలతో నేను ఆలోచనల్లోంచి బయటపడ్డాను. నేను స్నానం చేసి వచ్చేలోగా బాబాయ్ వచ్చాడు.

'కబ్ ఆయారే?' అని పలకరించాడు. ఆయన మొహంలో ఎలాంటి భావమూ లేకుండా ఆయన ఎప్పుడూ అంతే.

'ఇప్పుడే..'

అంతే, ఆయనతో సంభాషణ. ఆ తర్వాత నేను బట్టలు మార్చుకుని వచ్చా. ముకరమ్ అన్నం వడ్డించింది.

'ఏక్ వక్త్ కిత్తే తకలీఫా పడ్తే హై కి అల్లా జానే' (ఒక్కపూట అన్నం మెతుకులు కోసం ఎన్ని కష్టాలు పడుతున్నామో దేవుడికెరుక) అంటూ పిన్ని మళ్ళీ మొదలు పెట్టింది. అన్నం వడ్డిస్తున్న ముకరమ్ తల్లివైపు కోపంగా మిటుకూ మిటుకూ చూసింది. అదీ తల్లికి తెలియకుండా.

మంచి ఆకలి మీదున్నా నేను సరిగ్గా భోంచేయకుండానే ముగించాను మంచి ఎండలో వచ్చానేమో మంచం మీద వాలేసరికి నిద్ర కమ్ముకొచ్చింది. అప్పటికీ జాఫర్ రాలేదు

అసర్ దాకా ఓ కునుకు తీశాను. నేను మంచం మీద పడుకుని వుండగానే బయట వరండాలో పిన్ని మాటలు విన్పిస్తున్నాయి.

'బాబు వూరికే ఎందుకొస్తాడు? పొలం సంగతి కనుక్కుందామని వచ్చి వుంటాడు. నీళ్ళు నమలకుండా చెప్పండి. వాళ్ళ నాన్న వైద్యం ఖర్చుల కింద తీసుకున్న డబ్బుకీ, పొలానికీ చెల్లయిపోయిందని, అప్పుడే చెప్పాను. మీకు అన్నిటికీ కాయితాలూ పత్రాలూ వుండాలని....' అంటోంది. ఆ మాటలు నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. నాన్న డబ్బు తీసుకున్నారా? ఈ పొలం మీద డబ్బు ఆయన మాకు తెలియకుండా వాడుకున్నారా? మరి టౌన్‌లో చేసిన అప్పులు ? అదలా వుంచితే, పిన్ని ఇంత కర్కశంగా మాట్లాడటం ఏమిటి? నేను మంచంలో కాస్త ఇబ్బందిగా కదులుతున్నాను. ఈ లోగా ముకరమ్ వచ్చింది

'బాబు భాయ్, నువ్వేమీ అనుకోకు నువ్వురావడం మాకు ఎంత ఆనందం కలిగించిందో...' అంటూ కళ్ళనీళ్ళు తుడుచుకుంది అంతకంటే ఇంకేమీ అనలేక అవతలికి వెళ్ళిపోయింది. ఎందుకో నా ఆలోచనల్లోకి మళ్ళీ గోరీమా పచ్చింది.

'దేఖో, ఓ ఘర్‌కే వాస్తే గోరీమా కెత్త జంగ్ . కరీకి. ' (చూసి నేర్చుకోండి. ఆ ఇంటికోసం గోరీమా ఎంత యుద్ధం చేసిందో?) అంటుంది అమ్మ ఎప్పుడూ. కాని ఈ యుద్ధంలో గోరీమా ఏమైందో మాకు తెలీదు. ఇప్పుడైనా తెలుసుకోవాలి. కాని నా యుద్ధం మాటేమిటి? గోరీమా ఒక కులపోళ్ళతో పోరాడింది, నేను కనీసం 'ఇంట' గెలవగలనా? పోనీ, బాబాయ్‌ని నిలదీసి అడగ్గలనా? ఏమో. నమ్మకం లేదు!

కచ్చితంగా అసర్‌వేళకీ ఉస్మాన్ వచ్చాడు.

'నమాజ్‌కు ఆవో..' అంటూ బలవంతం చేశాడు. కాస్త రిలీఫ్‌గా వుంటుందని నేనూ వజూచేసి అతని వెంట వెళ్ళాను.

దారి పొడవునా నేను ఉస్మాన్‌తో వొక్క మాటకూడా మాట్లాడలేకపోయాను. లోలోపల గుడిసుళ్ళు పడుతున్నాను. ఈ వూరితో, నాకు వున్న అనుబంధం నాన్నగారి ఆ భూమి... అది కాస్తా తెగిపోతుందా? ఇంక ఇప్పుడు 'మాట్లాడకపోతే ఇంకెప్పుడూ మాట్లాడే అవకాశం రాదు, కనీసం ఈ వూరు వచ్చే వీలు కూడా వుండదేమో! పిన్ని ఎంత వీలైతే అంత అడ్డుపడుతుంది. బాబాయ్‌ని పడనివ్వదు. ముకరమ్ విషాద వదనం... తాడూ బొంగరం లేని జాఫర్! నా అసమర్థతని గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తున్న అమ్మ... నేను ఎంతో కొంత తెచ్చి ఈ అప్పుల విషయవలయం లోంచి బయటపడేస్తానని ఎదురు చూస్తున్న తమ్ముళ్ళు... జోడే కా రకమ్ కోసం ఇంక వేధిస్తున్న బావ...! యహ్, అల్లాహ్!

'పర్వర్ దిగారే ఆలమ్..' అందుకున్నాడు ఉస్మాన్. నా విషాదయోగం తెలిసిందా ఉస్మాన్‌కీ? అవన్నీ నెమరు వేసుకుంటుండగానే మస్జీద్ మెట్లు ఎక్కి లోపలికి అడుగు పెట్టాను. ఆ వాతావరణంలోకి అడుగుపెట్టగానే ఒక్కసారిగా మనసంతా ప్రశాంతంగా మారిపోయింది. హజ్రత్ సాబ్ నావైపు చూశారు నేను సలామ్ చేసి వొంగి ఆయన కడుపులో తల దాచుకున్నాను. ఆయన ప్రేమగా నన్ను దగ్గిరకు తీసుకున్నారు. ముసలికళ్ళు చిలికిస్తూ 'కోన్‌బేటా?' అని అడిగారు.

'హమారే మున్వర్ ఆపాకీ బేటా, భూల్ గయే' అన్నాడు ఉస్మాన్. ఊళ్ళో మా వాళ్లందరికీ నేను మున్వర్ ఆపాకే బేటాగానే తెలుసు. ఆయన గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నంలో పడ్డాడు. నమాజ్ అయ్యింతర్వాత నేను దువా చేసుకున్నాను. బాబాయ్ కుటుంబంతో మా సంబంధాలు గట్టిపడాలనీ, ముకరమ్ కాపురం ఓ కొలిక్కి రావాలనీ అల్లాని దువా చేశాను. కాసేపు మసీదులో మౌనంగా కూర్చున్నాను. భూమి విషయంలో బాబాయ్‌తో తగూ అనవసరం అనుకున్నాను. అమ్మ ఏమనుకున్నా సరే, ఏదో రకంగా అక్కడే అప్పోసప్పో చేసి ఇంటి ఆర్థికవ్యవహారాలు ఓ కొలిక్కి తేవాలని అనుకున్నాను. ఇప్పుడు చాలా ప్రశాంతంగా అనిపించింది.

బయటికి రాగానే ఉస్మాన్ తన ఇంటికి వెళ్దామని పట్టుబట్టాడు. సరే అని బయలు దేరాను. నడుస్తున్నాం, వున్నట్టుండి ఉస్మాన్ అడిగాడు.

'జమీన్ ఛోడో నక్కో. అబ్బాకి యాద్ఓ యేకీచ్‌నా?' (భూమిని వదులుకోవద్దు, నాన్నాగారి జ్ఞాపకం అదొక్కటేగా)

ఉస్మాన్ మాట నా లోపలి ప్రశాంత వలయాన్ని మళ్ళీ కుదిపింది. అవును, నాన్నగారి జ్ఞాపకం..?

ఉస్మాన్‌కే అంత పట్టింపుగా ఉంటే అమ్మకెలా వుండాలి? నేను మళ్ళీ తీవ్రమైన ఆలోచనల్లో పడిపోయాను. ఆ పొలంలోని పచ్చని పైరుమీద వీచే చల్లని గాలిలా నాన్న చిరునవ్వు కనిపించింది. ఎన్ని దుఃఖాల్ని కప్పేసిందో ఆ చిరునవ్వు..? నేను లోపల్లోపల గుక్కపెట్టి ఏడుస్తున్నానేమో.. బయటికి వొక్క మాట అనలేకపోతున్నాను. ఆ జమీన్ నాన్న జ్ఞాపకం.. నిజమే! దాన్ని వదులుకోకూడదు. వొళ్లంతా పిడికిలి బిగుసుకుంది.

'మీ చాచా ముఖం చూసి అంతా వదిలేద్దామనుకోకు. నన్నడిగితే వాడంత కాఫిర్.. షైతాన్ లేదు'.

'గోరీమా కనబడలేదు నాకు' అన్నాను నేను.

అప్పుడు ఉస్మాన్ చెప్పిన విషయాలు విని నేను కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యాను.

ఆలోచనల్లో మునిగిపోయాను. ఉస్మాన్ మళ్ళీ రైలు వేళకి వస్తానని వెళ్ళిపోయాడు.

ఉస్మాన్ వచ్చేసరికి నేను బ్యాగ్ సర్దుకుని రెడీగా వున్నాను. అందరికీ 'ఖుదాహఫీజ్ చెప్పి బయలుదేరాను.

ఉస్మాన్ తనే ప్రస్తావించాడు.

'జమీన్ విషయం ఏం తేల్చారు?' అని

నేనేమీ మాట్లాడలేదు.

ఇంతలోనే స్టేషన్ చేరుకున్నాం. అక్కడి దృశ్యం మామూలే. ఆ ముసలావిడ బురఖాతో మళ్ళీ ఎదురైంది కూర్చొని.

ఉస్మాన్‌ని చూడగానే ఆమె పలకరించింది.

అప్పుడే ఆమెను కాస్త పరీక్షగా చూశాను.

గోరీమా..!

ఆ మాట పైకే అనేశాను

గోరీమా నా కళ్ళల్లోకి చూసింది

'అక్బర్..'

ఆమెకు లేచి నిలబడే ఓపిక లేదు నేలమీద కూర్చునే నన్ను ఆపాదమస్తకం ప్రేమగా నిమిరింది. నాచేతులు అందించాను. ఆమె నా చేతుల్ని దగ్గిరకు తీసుకుంది.

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

'చివరకి ఇలా మిగిలిపోయాను. ఇప్పుడింక ఏమీ లేదు బాబూ... నిండా మునిగి పోయాను.'

'ఏమైంది? ఏందుకిలా?'

ఆమె ఏమీ మాట్లాడలేకపోతుంది. ఉస్మాన్ తనే కల్పించుకుని చెప్పడం మొదలెట్టాడు. అంతా విన్న తర్వాత గోరీమా నా ముందు ఆకాశమంత ఎత్తులో కనిపించింది. ఆమె పాదాలకు నమస్కరించాలనిపించింది. కళ్ళల్లో నీళ్ళు నింపుకున్నాను. ఆమె తెగింపు, సొంత నేలకోసం ఆమె పోరాటం... ఆమేముందు మరీ మరుగుజ్జులా కనిపించాను నాకు నేనే!

'గోరీమా ఈ దేశం రాయలేని చరిత్రవి నువ్వు - నువ్వొక తిరుగుబాటువి. నా తరానికి అంతుపట్టని భూ పోరాటానివి. సొంత నేలకోసం సంఘాన్నంత ఎదురొడ్డి నిలిచావు. ఓడినా సరే, నువ్వే గెలిచావు. నీ నేల మీద నువ్వున్నావు. ఈనేలకి దూరంగా.. పిరికిగా పారిపోతున్నాను... నేను'

కిటకీలోంచి బయటికి చూస్తే మబ్బుల గుంపులు పరుగు తీస్తున్నాయి గోరీమా హృదయంలో పరుగెత్తుతున్న యుద్ధాశ్వాల్లా.

● 2001 ●

# 75. కిర్రు చెప్పలు

♦ దార్ల రామచంద్ర ♦

"తాతయ్య ఇగో..... అన్నయ్య ఈరోజు బడికి పొయేటప్పుడు చెప్పులు పోగొట్టు కుండు" చెప్పింది పాప. రమణ అన్నయ్యపై చెప్పుడు మాటలు విన్న తల్లి "ఓ రాజుగా" పిలిచింది కొడుకుని గొంతెత్తి.

"వస్తున్నానమ్మా" అంటూ వచ్చాడు రాజు కడుపులో భయం భయం.

"ఏరా నీ చెప్పులేవి?" నిలదీసినట్టు అడిగింది తల్లి రాజును.

బిక్కమొఖమేసుకొని నీళ్ళు నములుతు చెల్లెలు వైపు చురచురా చూస్తూ "నా.... నా... చెప్పులు పోయినయమ్మ" అన్నాడు గుటక తిప్పుకోని.

"పోతే.. పోయినాయిలే...ఆ గొప్ప చెప్పులు! వాన్ని కొట్టబాకులే" అని సపోర్టుగా పలికిండు తాతయ్య.

కోపం ఆపుకోలేక రాజుని జుట్టుపట్టి చడామడా చెంపదెబ్బలు కొట్టిందితల్లి.

"అబ్బా సూరమ్మ వాన్ని కొట్టద్దన్నానా? ఎందుకు వాన్ని బాధపెడతావు. అవేమన్నా కిర్రు చెప్పులా?" అన్నాడు తాతయ్య.

కిర్రు చెప్పులా? అవెట్లుంటవో మన మనస్సులోనే ఆ మాట వినగానే వాటి గురించి తెలుసుకోవాలనుకుంది రమణ.

"కిర్రు చెప్పులా! వాటి గురించి చెప్పవా తాతయ్య" అంది తాతయ్యతో రమణ.

"అదేదో పెద్దకథలే వాటి గురించి చాంతాడంతా పొడుగు ఆ కథ ఇప్పుడు వద్దు వద్దు" అన్నాడు తాతయ్య.

★ ★ ★

రమణ పట్టుపట్టింది. కథచెప్పాలంటూ మారాం చేసింది.

తాత కథ చెప్పటం, రమణ 'ఊ' కొట్టడం మొదలైంది.

ఆనాటి వృత్తి తనపాత జీవితం గురించి చెప్పటం ప్రారంభించాడు.

"కరకరమని పొద్దుపొడిచి బారెడెక్కింది. ఎండచురచురమని కాస్తుంది. మా గుడిసెలు పక్కపక్కనే కలుసుకుంటాయి. మా ఇంటి పక్కనే మైసయ్య ఇల్లు ఉంది" మైసయ్య పనిపెట్టి పానరాయి మీద గూటం దెబ్బలు కొడుతూ తోలును ఊనుతు సరి చేస్తుండు. సీరియస్‌గా చెప్పులు కుట్టేపనిలో ఉన్నాడనిపిస్తుంది. ఆరె దిగకపోతే

ఎద్దుకొమ్ములో గుచ్చి తీసి చెప్పు కుదుతండు కత్తి తెగకపోతే అరెతో నూరుతు పనిని తొందరగా పూర్తిచేసి ఆతృతగా ఉన్నట్టుంది.

"మైసన్నా" అంటూ పిలిచిండు భద్రం. 'ఆ...ఎవరూ?" తలపైకెత్తి చూసిండు" భద్రం నువ్వా? ఎప్పుడచ్చినవు తమ్ముడా?"

"రాత్రి పొద్దుపోయింది వచ్చెరికి?" ఈ చెప్పులు వెరైటీగా ఉన్నాయే అన్నాడు భద్రం. "అవును తమ్ముడు కిర్రు చెప్పులా? అంటే?"

ఓ చిరునవ్వు నవ్వి, "నీకు తెలియదులే నువ్వు చదువుకుంటున్నాపుగా" అన్నాడు మైసయ్య.

"కాళ్ళకు తొడుక్కుని నడుస్తుంటే కిర్రు కిర్రు మంటు తమాషాగా శబ్దం వస్తుంది ఆ చెప్పుల్ని దొర రకం చెప్పులంటారు. గిప్పుడర్థమైందా?"

"ఔ గట్లనా" చెప్పులపై ఎర్రటి ప్లాస్టిక్‌తో చేసిన పూలలాంటి కుచ్చులు రకరకాల అలంకరణతో చేసిన ఆ చెప్పులు ప్రత్యేక తయారి తరహాను తెలియజేస్తున్నాయి. అందంగా ఆకర్షణీయంగా చూసిన వాళ్ళను ఆకట్టుకునేట్లుగా ఉన్నాయి

"ఎవరికి కుదుతున్నావ్ చెప్పులు?"

"మన ఊరి సర్పంచ్ దొరకి" సర్పంచ్ దొరకా?" కనుబొమ్మలెగరేస్తు అన్నాడు భద్రం.

"అవును సర్పంచ్‌కే చిన్నా" అన్నాడు మైసయ్య మరోసారి

"ఈ చెప్పుల్ని దొర ఎప్పుడు ఏసుకున్నట్టు చూడలేదే! అని మనస్సులోనే మదన పడ్డాడు భద్రం.

"అన్నా! నిజంగా ఈ చెప్పులు సర్పంచ్ దొరకేనా?!" మళ్ళీ రెట్టించి అడిగాడు భద్రం."

"అవును - అవును" తలాడించాడు. మైసయ్య ముసిముసి నవ్వులు నవ్వుతు. అందరు ఈ చెప్పులు తొడగరు. దొరకు, పటేల్, పట్వారి, మాలీపటేల్, పోలీస్ పటేల్‌లాంటి వాళ్ళు దొరలకు మాత్రమే ఈ చెప్పులు చేయించుకుంటారు" అన్నాడు మైసయ్య.

"ఓసారి నాకాళ్ళకి తొడుక్కుని చూస్తా ఎట్లుంటవో ...కిర్రు కిర్రు చెప్పులు ఎట్ల చప్పుడస్తదో జర చూస్తా ఇయ్యవా" అంటూ అడిగిండు భద్రం.

"గట్లనా పిల్లకాయ చేష్టలు కాదు. మాసినట్టు పాతగా అనిపిస్తే దొర కోప్పడతడు జర సమజ్ అయిందా" అన్నాడు మైసయ్య చిరుకోపం ప్రదర్శిస్తూ.

"ఎట్లుంటవో, ఎట్ల చప్పుడస్తదో తొక్కి చూస్తే తప్పా?"

"తప్పా.. తప్పున్నరా?" మైసయ్య లేచి చెంబుచేత పట్టుకొని దొడ్డికి పోయిండు. రాజుకంటే మొండివాడు బలవంతుడన్నట్టు మనస్సులోనే అనుకోని చెప్పులేసుకోని కాళ్ళకు నాలుగడుగులు అటూ ఇటూ రెండు మూడుసార్లు నడిచి చూసిండు. కిర్రు కిర్రు మనే సౌండ్ సంగీతంలా వస్తుంది.

"ఓహో!" మనస్సులోనే మైసయ్యను మెచ్చుకోన్నాడు. సింధు నాగరికత కంటే

ముందు నుంచే ఉత్పత్తిలో భాగం పంచుకొని, శ్రమతో అన్నిటిని సృష్టించింది, పుట్టించింది మనమే కదా! భద్రం మనస్సు చరిత్ర పుటల బతుకులోతుల్లోకి మళ్లింది.

మసక మసక చీకట్లో నిద్రలేచిండు మైసయ్య. చుట్ట చుట్టుకోని పొయ్యిలో నిప్పుతో చుట్ట అంటించుకొని మూలన ఎర్ర మట్టిమీద ఉన్న కొడవలిని పట్టుకొని, చిలక్కొయ్య మీద తాడు తీసుకొని అడుగులు సారించి అడవికి బయలుదేరాడు. బారెడు పొద్దెక్కాక కట్టెల మోపు ఎత్తుకొని ఇంటికి చేరిండు మైసయ్య.

భార్య కమలమ్మను పిలిచి తెచ్చిన తంగేడు కట్టెల మోపు చూపిస్తు ఆ పుల్లల్ని వదల కొట్టమన్నాడు.

"గట్లనే వదల కొడ్తాలే" అంది కమలమ్మ. చెక్క పట్టుకొని వచ్చి పుల్లల్ని తోలు వదలకొట్టి ఎండలో ఎండబోసింది ఆ పొట్టుని.

కమలమ్మని మైసయ్య పిలిచి "మొన్నటి ఎద్దుతోలు, ఉప్పు, సున్నం పట్టించి పేడతట్టలో పెట్టిన దాన్ని తీసి గాబులో పడెయ్యి. రెండు మూడుకుండల నీళ్ళు పోయ్యి" అన్నాడు.

"చేస్తలే" తలాడించింది కమలమ్మ, తోలు గల్లాలో ఏసి, ఒలిచిన తంగేడు, చెక్క పొట్టుని అందులో పోసి రెండు మూడు కుండల నీళ్ళు పోసింది. కొంచెం సున్నం, ఉప్పు అందులో ఏసింది. ఆరు ఏడు రోజులు తరువాత ఆ గల్లాలోంచి తోలును తీసి కత్తితో ఊనిండు మైసయ్య. కొద్దిగా వాసన వస్తుంది. ఆ తోలు, గల్లాలోని నీళ్ళు కంపు మురుగు వాసన కొడుతున్నాయి.

ముక్కు మూసుకొని బిగ్గరగా "అబ్బే - ఏందో ఈ వాసన మురుగువాసన" అంటూ గొనుక్కుంటు పోతుండు గూడెంలోకి "ఏం పని మీద వచ్చిండో" అంటూ మనస్సులోనే అనుకున్నడు మైసయ్య.

నీళ్ళలో జాడించి, ఎండలో ఒకరోజు ఎండిన తర్వాత మంచిగ తయారైంది. ఆ తోలుతో దొరగారి కచ్చడం బండి ఎడ్లమెడకు గజ్జేల పట్టాలు చేసిండు. దొర కచ్చడం పోతుంటే గలగలమని శబ్దం వచ్చేది. దొరగారి ఇంట్లోకి ఫ్రిజ్‌లాంటి నీళ్ళకు నీళ్ళ తిత్తి. దొరకు దొరసానికి కిర్రు చెప్పులు. దొరపాలేర్లకు ఇరవై జతల చెప్పులు, దొర ఇరవై అరకలకు భేరటాకులు, ఊరి వడ్రంగికి కొలిమితిత్తి, గౌండ్ల వాళ్ళకు తాడెక్కి ముస్తాదులు దొరగారికి చండ్ర కోల ఇలా రకరకాల తోలు వస్తువులు కుట్టిచ్చేవాడు మైసయ్య.

కూటి కొరకు కోటి విద్యలన్నట్టు మా ఊళ్ళో ఇలాంటి కుటుంబాలు చేతివృత్తిపై బతికెటోల్లకు ముప్పై నలభైదాకా ఉంటాయి. రైతు లంబాడ తండ రైతుల్ని ఊరంతా భాగాలుగా పంచుకొని పట్టడం నా వాళ్ళ కులవృత్తి.

"ఈ సంవత్సరం కాలం మంచిగైంది కట్ట మైసమ్మకు పెట్టాలే. చెరువు తూము తెరిచి వరినాట్లు మొదలు పెట్టాలే" అంటూ ఊరి మాదిగ డప్పు దండోరా వేసాడు. నాట్లు అయినాక అందరూ ఊరంతా వండుక తిన (వనభోజనం) పోయిండ్రు. ఏటల్ని, పందుల్ని, మేకల్ని, కోళ్ళల్ని ఎవరికి తోచిన ఆర్థిక స్థోమతను బట్టి వాళ్లు

కోసుకొని ఉత్సాహంగా పండుగలా ఆ రోజు గడిపేటోల్లు.

"మా మాదిగలు కొందరు ఎవరి ఆసామి రైతుల దగ్గర వాళ్ళు అన్నం కూరలు అడుక్కొచ్చు కొనేటోళ్ళు. లేదురా. పో అంటూ ఇసడించే వాళ్ళు కొందరు. కుక్కలకన్నా హీనంగా చూసేటోల్లు. చీ...చా..లేదురా .. పో గాడిది కొడకా అని తీసి పారేసేటోల్లు' ఈ పద్ధతి చూసి భద్రంకు ఈ బ్రతుకులొద్దురా అనిపించేది

మనసులోనే గత చరిత్ర జ్ఞాపకానికొచ్చింది భద్రంకు.

చావుకాడ డప్పులు కొట్టి పాడెమీద శవం కాలేదాక కాష్టం దగ్గర కుక్కలా కాపలా కాయడం చేసేవాళ్ళు.

"తాలే... లల్లాయిలే... శివతాలే.. లల్లాయిలే" అంటూ డప్పు వాయించడంలో మైసన్నది తిరిగిన చెయ్యి. చిర్రపట్టి చిటికలేసి డప్పుకొట్టడం, చిందు చేయటం మైసయ్యకు వెన్నతో పెట్టిన విద్య.

పెండ్లీలకు పీరీల సవార్లకు డప్పు కొట్టటం, చాటింపులు, దండోరా వేయడం, మాదిగల కుల వృత్తి. మాదిగ.... మాలలు లేకుండా గ్రామం తన జీవనాన్ని ముందుకు నడిపించేది కాదు. కాలుకూడా కదుపలేదు

★ ★ ★

ఈ ఏడుకాలం మంచిగైంది. వరి కోతలు కోసింద్రు, కుప్పలు ఏసింద్రు. ఈ సీజన్లో తీరిక ఉండదు. దొర కల్లం జోలి మనస్సులో పడింది కమలమ్మకు కోడి కూతతోనే భర్తను నిద్ర లేపింది.

"ఏమయ్యా! ఈ రోజు దొరగారి కల్లం చెయ్యాలే. గింత శ్రద్ధలేకుండా నిద్ర పోతున్నవు... లే... మొఖం కడుక్కో పోదాం" అంది కమలమ్మ మైసయ్యని.

"ఇద్దరు రెండు కొడవళ్ళు తీసుకోని పొరక ఒకటి కుండ పట్టుకొని బయలుదేరారు. వరి మడినంతా కొయ్యకాలు కోసింద్రిద్దరు. మట్టిగడ్డలు చితిపి నున్నగా సదును చేసింద్రు. కమలమ్మ కుండతో నీళ్ళు తెచ్చిపోస్తుంది. మైసమ్మ కల్లంలో చల్లుతుండు దొర పెద్ద జీతగాడు. గొడ్లను బంతికట్టి, కళ్ళంలో తింపుతుండు. నున్నగా చదునుగా తయారైంది. కళ్ళంను పొరకతో మంచిగ శుభ్రంగ ఊడ్చింది కమలమ్మ

రాత్రి సందకాడనే బండి కట్టుకొని, బంతికి ఎడ్లని ఇంకొన్నింటిని తోలుకోని, బండిమీద ఇతర సామానులు వేసుకొని పెద్ద జీతగాడు బయలుదేరిండు. ఇరవైమంది జీతగాళ్ళు 25 రోజులు రాత్రనక, పగలనక కుప్ప కొట్టింద్రు. వీళ్ళతోపాటు మైసయ్య కూడా కుప్ప కొట్టిండు. రెండువందల పుట్ల వరిధాన్యం వడ్లు తూర్వార పోసింద్రు. పెద్ద జీతగాడు వడ్లు కొలిసిండు. . బండ్లకు వడ్లు ఎక్కిచ్చి రెండురోజులు తోలింద్రు. వడ్లు చివరి నాలుగు కుండలు కల్లంలో ఉన్నాయి. "బాంచెన్ దొరా ఈ గింజలు ఉండనియ్యింద్రి" అంటూ దొర కాళ్ళమీద పడింది బతిమలాడింది కాళ్ళవేళ్ళామీద పడి మొక్కింది

"బాంచెన్ దొరగారు నా పోరగాళ్ళను బతకనీయండ్రి. ఈ గిన్నిగింజలు ఉండ నీయండ్రి" అంటూ మైసయ్య కమలమ్మ ప్రాధేయపడిండ్రు.

"మరో రెండు కుండలు కొలువురా అన్నాడు దొర."

కల్లం అడుగు బొడుగులు ఊడ్చి బాగు చేసుకున్నది. తాలులో కొన్ని, పొల్లులో కొన్ని తూర్పారా పోసిండ్రు. అన్నీ కలిపి ఓ నాలుగు కుండల వరకు అయినాయి. అవి తినిపారేసిన ఇస్తారాకుల్లో మెతుకుల్లా ఆ గింజలు కనిపించినాయి.

ఏడాదంతా గొడ్డుచాకిరి చేసినా! వరినాటులనుండి కుప్పకొట్టె వరకు పని చేయించుకొని, మాదిగపనితోపాటు ఈ ఎట్టి చాకిరి ఏడాది చేసినా! చివరకు యియ్యే వడ్లగింజలు గతి" మనసులో బాధపడ్డాడు మైసయ్య. భార్య కమలమ్మ కూడా ఈ బాధల కంతం లేదా? అని వాపోయింది.

"పెద్దబిడ్డా పెండ్లీడుకు వచ్చింది, పెద్దమనిషై ఆరేండ్లయింది. ఈ ఏడైనా లగ్నం చేద్దామంటే ఈ ఆదారం గిట్లుండే. లగ్గంకు పెట్టె లాంచనాలు, కులం బంతి భోజనం లగ్గంకు పై ఖర్చులు అన్ని తడిసి మోపెడంతా ఖర్చు వస్తది. మాకష్టం బండేడు, ఆదారం పిడికేడు ఎట్లా, ఈ బతుకుల్ని ఎల్లదీసేది" మనసులోనే చింతించింది కమలమ్మ.

అప్పోసప్పో చేసి బిడ్డలగ్గం చేసిండు మైసయ్య. అప్పుమీద నాగు, నాగుకు అసలు నాగు, పెరిగి పెరిగి అప్పు తీర్చటానికి ఇద్దరు కొడుకుల్ని పాలేర్లుగా పెట్టిండు మైసయ్య. ఏడేల్లు పనిచేసినా అప్పు తీరలేదు. కొన్నాళ్ళకు చిట్టచివరకు అప్పు జైలునుండి బయట పడిండు మైసయ్య.

చిన్నప్పటినుండి తన కులవృత్తి నేర్పుదామనుకుండు తన కొడుకులకు మైసయ్య పరిస్థితులు కలిసిరాక పశువులకాపర్లుగా చిన్నతనమునుంచే పనిలోకి దింపిండు. పెండ్లిడు వచ్చేదాక జీతాల పాలైరి. చలి నీళ్ళకు వేడినీళ్ళలా సంసార సాగరం ఈదిండు మైసయ్య...

"భద్రం గీషాపులో మన మాదిగ వస్తువులెందుకున్నాయి? దేశంలో మార్పుతో పాటు, సంఘం మారుతోంది. దేశంలోని పారిశ్రామికవేత్తలు పరిశ్రమలను స్థాపించిండ్రు. మాదిగలకు సంబధించిన తోళ్ల పరిశ్రమలు కార్కానాలు, తోలువస్తువుల వృత్తి మాదిగల కులవృత్తికి ప్రత్యామ్నాయంగా పరిశ్రమలు పుట్టుకొచ్చినాయి. మోటలకు బదులు ఆయిల్, కరెంట్ ఇంజన్ వచ్చింది. నాగటికి బదులు యంత్రాలు వచ్చాయి. చేతివృత్తులకు బదులుగా దేశంలో పరిశ్రమలు వస్తువులు ఉత్పత్తి చేయసాగాయి. మారుతున్న కాలంతో పాటు పల్లెల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. పరిశ్రమల్లోని వస్తువులు దేశంలో దర్శన మిచ్చాయి. నాగ్‌పూర్, కాన్‌పూర్ బాటాకంపెనీ చెప్పులు, షోలాపూర్ బ్యాగ్, ప్లాస్టిక్ చెప్పులు, లెదర్ బూట్లు, బెల్ట్‌లు రకరకాల తోలు వస్తువులు, దేశమంతటా షాపుల్లో ఎక్కడపడితే అక్కడ కోకొల్లలుగా లభిస్తున్నవి.

అందుకే కావచ్చు తమ్ముడు? "రైతులు, దొరలు, కాపులు, రెడ్లు, చెప్పులు, చేయించుకోవటం తగ్గించిండ్రు. ఈ షాపుల్లో కొనుక్కోవడం మొదలు పెట్టిండ్రు

క్రమంగా వారు ఆ చెప్పులకే అలవాటుపడ్డారు. మెల్లగా మన వృత్తి కాస్త కనుమరుగైంది, అంటూ వాపోయాడు భద్రంతో మైసయ్య చెప్పుకుంటు.

"నా యిద్దరు కొడుకులకు పెండ్లి చేసినా, కొంత అప్పయినా దాన్ని తీర్చలేక పోయినా, పట్నం పంపినా. పెద్దోడు ఉప్పరిపని చేస్తుండు. చిన్నోడు రిక్షా తొక్కుతుండు. అప్పుతీరాక వాళ్ళు మేము పట్నంలోనే ఉండిపోయాము" అన్నాడు మైసయ్య. ఇప్పుడు పట్టణంలో మిమ్మల్ని ఎలా చూస్తున్నారు మైసన్న?"

"ఒరేయి మైసయ్య రా....రా పోరా అంటూ యిక్కడ ఇసడింపులు లేవు. కులం గురించి ఎవరు పట్టించుకోవడం లేదు. ఓ రిక్షా అబ్బాయి ఇటురా! ...ఫలానా కాడికి ఎంత తీసుకుంటా వబ్బాయి ... బాబు రిక్షా ఎంతకొస్తావు...అంటూ మనిషిని గౌరవంగా మనుస్సుల్లాగానే పిలుస్తుంద్రు. చూస్తుంద్రు" అన్నాడు మైసయ్య.

వృత్తి వూడితే వూడింది. ఆత్మగౌరవం మిగిలింది. అంటరానితనం తగ్గుమొఖం పట్టింది. ఈ విధానం వల్ల పూర్తిగా మార్పుకాకపోయినా, పాక్షికంగా మార్పు జరిగినందులకు మైసయ్యకు భద్రంకు గొప్ప మానసిక సంతోషంగా ఉంది. ఆర్థిక విధానంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది.

● ప్రజాసాహితి మాసపత్రిక, దళిత జ్యోతి మాసపత్రిక సంచిక - 2001 ●

# 76. దొర మళ్లా వచ్చిండు

♦ కె.వి. నరేందర్ ♦

"దొర మళ్లా వూర్లెకచ్చిండు. పదిహేడేళ్ళ తర్వాత దొర వూర్లెకడుగు పెట్టిండు" వూరంతా ఏదో విచిత్రం జరిగినట్టూ.. అందరిలోనూ విస్మయం.

"నక్సలైట్ల భయానికి పట్నం పారిపోయిన దొర ఇన్నేళ్ళకు మళ్లా వూర్లెకచ్చిండు. ముందలించి వద్దాం."

వూరు కదిలింది.

"ఇంతకీ దొర ఎక్కడున్నాడ్రా?"

"వాళ్ల బావమరిదింటికి వచ్చిండట. గడీ ఎప్పుడో పాడువడే"

"దొర వచ్చిండని తెలిస్తే...నక్సలైట్లు వత్తరేమో?"

"ఆళ్ళొస్తే పోలీసుల్తో పీకులాట. ఊరు వల్లకాడైతది"

"దొరతోని నలుగురు పోలీసోల్లు కాపలా గచ్చిండ్రట. ఏంకాదు. పొద్దు గూకంగనే మల్లపట్నం బోతడట".

"అయినా దొరని చూసొద్దాం పద."

ఆడ మగా, పరిచితులు, అపరిచితులు అంతా పరమేశ్వర్‌రావ్ దొరని చూడటానికి బయల్దేరారు.

అందరూ హడావిడిగా వెల్తుంటే.. అరవై ఏళ్ళ మొగిలయ్య మనస్సు ఎక్కడికో పోయింది. దొరతనం గుర్తొచ్చి ముసలి శరీరం వణికిపోయింది.

పరమేశ్వర్‌రావ్ దొర...

ఒకప్పుడు ఈ పల్లె శ్రమని గొట్టంతో షర్బత్ పీల్చినంత తేలిగ్గా పీల్చినవాడు. పదహారేళ్ళనించే దొర పెత్తనం మొదలెట్టి దాదాపు పాతికేళ్ళు సాగించిన అకృత్యాలు. గడీల నించి బయటికి కొద్దిగా పొక్కినా తను, తన కొడుకు ఎన్నింటికో మూగసాక్షాలై మిగిలిపోయారు.

కొన్ని దారుణాలు చూసి తను పట్టించుకోకపోయినా పదిహేడేళ్ళ తన కొడుకు రాజేందర్ రక్తం సలసలా మరిగిపోయేది.

ఇంటికొచ్చి తల్లితో చెప్పుకొనేవాడు.

గఢీలో జరిగిన అత్యాచారాలు ..

గఢీలో జరిగిన హత్యలు..

గఢీలో జరిగిన పంచాయితీలు అన్నీ చూస్తుంటే నెత్తుటితో తడిసిన తాజ్‌మహల్‌గా కన్పిస్తుందని పద్యాలు రాసుకునేటోడు

గడీలో ఎన్నో చూసినవాడు. ఇంట్లోంచి మాయమైపోయాడు కడుపు తీపితో కన్న పేగులు చించుకొని భోరున ఏడ్చాం. ఆర్నెల్ల తర్వాత వాడు అన్నలల్ల కల్సిండని తెలిసాక భయపడ్డాం. కానీ. అనుకున్నంత జరిగింది. వాడు దళంతో గడిమీదికి దండెత్తాడు. దొరని చంపాలని కాల్పులు జరిపాడు

కాని.. పరమేశ్వర్‌రావ్ తప్పించుకొని పట్నం పారిపోయాడు

ఆర్నెల్లలో మరో రెండుసార్లు వూర్లోకి వచ్చిండని తెల్సి ముళ్ళే దాడి చేశాడు. మళ్ళీ తప్పించుకొని ఇక పట్నంలోనే వుండిపోయాడు ఊళ్లో జెండాలు పాతినప్పటికీ అక్కన్నించే భూముల్ని అమ్మకానికి పెట్టాడు

దొర పోయింతర్వాత... వూరు ప్రశాంతమైందని వూరంతా తనకొడుకుని పొగిడారు రాజేందర్ పుణ్యమాని మంచిగ బతుకుతున్నమని వీళ్ళంతా తనతో అంటూంటే గర్వంగా పొంగిపోయేవాడు ఈలోగా తన కొడుకు ఎన్‌కౌంటర్లో చచ్చిపోయాడు. నక్సలైట్లల్లో కల్సినప్పుడు ఏడ్చినంతగా కూడా ఏడ్పు రాలేదు ఎందుకంటే వాడు చావుకి సిద్ధపడే పోయాడని రోజూ అనుకునేవాళ్ళం కాబట్టి.

కాలక్రమంలో రాజేందర్ పేరుని వూరు మర్చిపోయింది. దొరని కూడా దాదాపు మర్చిపోయారు

అటువంటిది... 'దొర మల్లా వచ్చిండు' అని వూరంతా చూడ్డానికి పరిగెడుతున్నారు. మొగిలయ్య నులకమంచంలో కూచొని చుట్ట తాగుతూ వచ్చిపోయే వాళ్ళ మాటలు వింటున్నాడు.

"దొర ఎంత మంచోడు. ఎంత ప్రేమగా మాట్లాడిండు

"మునుపటి దొర కాదు. ఇంక అందర్నీ యాదికి పెట్టుకున్నడు. చచ్చిపోయినోళ్ళను కూడా యాజ్ఞేసిండు. "

"నువ్వు పోశిగాని కొడుకువ్ గదా అని నన్ను దగ్గరికి తీస్కున్నడు దొరకాళ్ళకి మొక్కాలన్పించింది."

"దొరది పెద్ద మనసు. గడీ మొత్తం బడికి రాసిచ్చిండు."

"ఎందుకో అందర్నీ చూడబుద్దయి వచ్చిన్నని జెప్పిండు వూర్ని జూసినంక దుఃఖమాగలేదట. అందరికి దూరమైతి అని బాధపడ్డడు."

మొగిలయ్యకి జనం మాటలు ఆశ్చర్యాన్ని గొలిపాయి.

"దొరది పాడుపడ్డ పశువుల దొడ్డి కూడా మంచిగ జేయిస్తనన్నడు. దాన్ని కమ్యూనిటీ హాల్‌గా వాడుకొమ్మన్నడు."

"గట్లనే. చెరువు కింది భూముల్ల చాకలోల్లను దోబీలు కట్టుకోమన్నడు."

"ఒక్కసారిగ దేవుని లెక్కచ్చి.. వరాలిచ్చి పోవట్టే. ఇంక వూర్లైనే వుంటె ఎంత మంచిగ జేసేటోడో..."

"రాజేందరనేటోడు నక్సలైట్లల్ల కల్సిమననోట్లె మన్నుగొట్టిండు. దొర ఎంత మంచోడో ఇప్పుడు దెల్వలేదా?"

మొగిలయ్య గుండె మీద గుండు సూదులు గుచ్చుతున్నయ్. మాట్లాడేవాళ్ళంతా ఈ తరం వాళ్ళు. అయినా మారిపోయిన దొరని తనకీ ఒకసారి చూడాలనిపించింది. తర్వాత మనసు వద్దంది. అయినా చూసొస్తే తప్పేంటి అని నులకమంచంలోంచి లేచి కట్టె తీసుకొని అడుగులో అడుగేసుకుంటూ పోయాడు. దొర బామ్మర్దింటి నిండా వూరి జనం. లోపలికి వెళ్ళాలన్నా సందులేదు.

"ఈడి కొడుకు చెయ్యంగనే దొర వూరిడిసిపెట్టిండు" ఎవరో అన్నారు. రోజూ చూసేవాళ్ళయినా అప్పుడు మొగిలయ్యని విచిత్రంగా చూశారు. అందరి మధ్యలోంచి మెల్లిగా సందుజేసుకొని లోపలికెళ్ళాడు మొగిలయ్య.

నిండుగా.. భారీ విగ్రహంతో.. వయసు తెచ్చిపెట్టిన పెద్దరికంతో మసక మసకగ్గా కన్పించాడు పరమేశ్వర్రావ్. మొగిలయ్యని చూడగానే గుర్తుపట్టాడు. కుర్చీలోంచి లేచొచ్చి...

"అరరే... మాదిగ మొగిలయ్య కదూ...మొగిలీ.. మంచిగున్నవా... నన్ను చిన్నప్పుడు ఎత్తుకొని తిరిగెటోనివి. యాదికుందా" అంటూ దగ్గర తీస్కున్నాడు.

మొగిలయ్య కన్నా ముందు చుట్టూ వున్న జనం ఉబ్బితబ్బిబ్బయ్యారు.

"మంచిగనే వున్ననయ్యా.. మీరు మంచిగున్నరా?" అన్నాడు మొగిలయ్య.

"చుంచిగనే వున్న మొగిలీ.. అన్నట్టు రాజేందర్‌గాన్ని పోలీసోల్లు చంపిండ్రని తెల్సింది. గీ వయసుల ఆడు నీకు లేనిపోని కష్టం బెట్టె. కండ్లు మంచిగ కనవడుతున్నయా.... ఇగో మొగిలీ.. చిన్నప్పుడు నీ చేతుల్ల పెరిగినోన్ని. నన్ను కొడుకు లెక్కనుకొని ఓసారి పట్నంరా. కండ్ల డాక్టర్‌కు జూపిత్త" ప్రేమగా చెప్పాడు పరమేశ్వర్రావ్.

"గట్లనే దొర.." మొగిలయ్యకి కూడా దొర బాగా మారిపోయాడనిపించింది.

పరమేశ్వర్రావ్ వాళ్ళ బామ్మర్దిని పిలిచి ఎల్లుండి మొగిలిని సిటీకి తీసుకురమ్మని అందరిముందూ చెప్పాడు.

"నీ కొడుకు చంపటానికి పోయినాకూడా దొర నిన్ను దగ్గర తీసిండ్రా మొగిలీ. దొర మునుపటి దొరకాదు" అన్నారు ఒకరిద్దరు.

ఇంకా ఎవరెవరో రావటంతో పరమేశ్వర్రావ్ మాటల్లో పడిపోయి.. సాయంత్రం కాగానే హడావిడిగా వెళ్ళిపోయాడు. పోతూ పోతూ అయిదువేలు కులపెద్దలకిచ్చి వెళ్ళాడు. జల్సా చేసుకొమ్మని.

వూరంతా ఆనందంతో నిండిపోయింది.

★ ★ ★

మనవడి సాయంతో పట్నం చేరిన మొగిలయ్యని పెద్ద హాస్పిటల్‌లో చేర్చారు పరమేశ్వర్‌రావ్ బామ్మర్ది జాయిన్ చేసి వెళ్ళాడు. అంత పెద్ద హాస్పిటల్ దొరదేసని తెల్సిన మొగిలయ్య ఆశ్చర్యపోయాడు దొర ఇల్లు, కార్లు, అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు అన్నీ చూశాక మొగిలయ్య తల తిరిగిపోయింది సిటీకి పోయినంక దొర కన్పించలేదు కాని డాక్టర్లు ఆపరేషన్ తర్వాత రెండో రోజున కళ్ళకు కట్టిన కట్లు విప్పారు. మొగిలయ్యకి పరమేశ్వర్‌రావ్ ఆస్తులు ఇప్పుడు మరింత స్పష్టంగా కన్పించాయి.

డిశ్చార్జి అయ్యే రోజున అకస్మాత్తుగా వచ్చాడు పరమేశ్వర్‌రావ్

మొగిలయ్య దండంపెట్టాడు

పరమేశ్వర్‌రావ్ ఆ చేతుల్ని పట్టుకొని "నీ కొడుకు నాకు గొప్ప పని చేశాడ్రా వాడే గనక మరో పదేళ్ళ ముందు నన్ను పట్నాలకు పారిపొయ్యేలా చేసుంటే ఈ సిటీనే కొనేసి వుండేవాడ్ని.

పట్నం వచ్చాక పైసల్ని పదింతలు చేయటం ఎలాగో తెల్సింది తెలివి పెరిగింది. లౌక్యం తెల్సింది. ఇక్కడ ప్లాట్ల బిజినెస్ చేశాను బాగా సంపాదించాను. నేనే కాదు. నాలాంటి దొరలంతా పల్లెలు వదిలాక పారిశ్రామికవేత్తలయ్యారు. ఎ వన్ కాంట్రాక్టర్లయ్యారు. కాలేజీలకు, హాస్పిటల్లకు ఓనర్లయ్యారు. ఆనాటి భూస్వామ్య వర్గమంతా ఈనాడు పారిశ్రామిక యాజమాన్యంగా మారిందంతే విప్లవం వర్ధిల్లాలని పట్నాల్లో దొరలు పూజలు చేసార్రా. విప్లవం అంటే మాకు ప్రేమరా అందుకే రాజేందర్‌గాడు అప్పుడప్పుడు మనసులో మెదుల్తుంటాడు అవునూ . నీకిప్పుడు కళ్ళు బాగా కన్పిస్తున్నాయా" అన్నాడు ప్రేమగా మొగిలయ్య కళ్ళ జోడుని సవరిస్తూ.

"మంచిగా కనపడుతున్నయ్ దొ.. రా" అని మొగిలయ్య మనవడి ఆసరాతో వెళ్ళిపోవడానికి సిద్ధమవుతుంటె. .

"మొగిలీ... నయాపైస కూడా ఈ దవాఖాండ్ల సువ్వు కట్టేదిలేదు. మంచిగ తిను. ఖర్చులకు ఈ అయిదువందలుంచు" అని బలవంతంగా డబ్బుని మొగిలయ్య చేతుల్లో వుంచాడు.

మొగిలయ్య మనవడు దొరవైపు ఆరాధనాపూర్వకంగా చూశాడు. వాళ్ళు వెళ్ళి పోబోతుంటే ..

"మొగిలీ. ." అన్నాడు అనునయంగా.

"నువ్వు వూర్లెకు బోయినంక ఇప్పట్నించి నా గురించి చెప్పాలె. ఊరంత ఒకటి చెయ్యాలె. ఇంక ఏడెనిమిది నెల్లల్ల ఎలక్షన్లు వస్తున్నయ్ ఈసారి ఎమ్మెల్యే టిక్కెట్ నాకే వచ్చేటట్టుంది. మనూర్లె నుంచి ఒక్క ఓటు కూడా వేరోటోనికి పోవద్దు నువ్వు కాపాడాలె...." అన్నాడు దగ్గర తీసుకుంటూ.

"మంచిది దొర" అన్నాడు పరమేశ్వర్‌రావ్ అంతరంగం అర్థమై

'ఏమోయ్.. మనూర్లె నువ్వే యువనాయకుడివి ఎలక్షన్లో బాగా తిరగాల. మీ తాతని జాగర్తగా దీస్కపో..." అన్నాడు మొగిలయ్య మనవడితో

వాడిలో కృతజ్ఞతాభావం ఎవరెస్టు శిఖరంలా ఎదిగిపోయింది.

దొర వెళ్ళిపోయాడు.

బస్టాండ్‌కి వచ్చాక మొగిలయ్యని మనవడడిగాడు.

"తాతా కళ్ళద్దాలు పెట్టుకున్నాక చూపు బాగా ఆనుతుందా?"

"ఈ వెలుతురు భరించలేకపోతున్నా బిడ్డా. నాకీ అద్దాలొద్దు. ఆ గుడ్డితనమే కావాలన్పిస్తోందిరా..." మొగిలయ్య కంఠంలో ఏదో జీర.

"దొర గంత మంచిగ ఆపరేషన్ జేయిస్తే.. గట్లనవడ్తివేందే?"

అంతలోకే బస్సొచ్చింది.

ఇద్దరూ జనాన్ని తోసుకుంటూ బస్సెక్కారు.

పావుగంట తర్వాత బస్సు కదిలింది.

మనవడు చూడకుండా.. మొగిలయ్య నెమ్మదిగా కళ్ళద్దాలు తీస బస్ కిటికీలోంచి జారవిడిచారు.

అవి బస్ ట్రైర్ల కింద పడి నలిగిపోయాయి. మొగిలయ్య కళ్ళల్లో మళ్లీ మసక చీకటి అలుముకుంది.

అయినా ఆ కళ్ళనిండా ఏదో తృప్తి!!

● 2001 ●

# 77. గొరడు

♦ గూడ అంజయ్య ♦

ఎడతెరిపి లేకుంట మూడ్రోజుల నుంచి వర్షం కురిసింది. వర్షానికి కుంటలు. చెరువులు, బావులు అన్నీ తెప్పరిల్ల నిండ నిండినయి. జనమంతా బీల బీలమని గుడిశెల నుండి బయటికొచ్చి గుంపులు... గుంపులుగా నిలుసొని "నా చిన్నతనం జేత్తనగాని అవ్వతోడు నెన్నెడు గింత వానసూడ లేదే కొండయ్య మామ" "ఏమ్‌వాన. . ఏమ్‌వాన... అనంటె అనగాదే .." గా పెద్ద పాట చెరువు జూడు... అగో నిండ నీళ్ళెరా..." గా అలుసు సప్పుడిన రాదె!.... "బొయ్యా... బొయ్యా వొత్తంది అలుగు ..' దేని ఇంట్లనన్న చెరువు కొట్టయితే తెగేది గదా?" ఆగు మౌనంగానే అడుగుతుండు ఆశాయి... నెత్తిమీదికెల్లి తువ్వాల కప్పుకొని గడ ...గడ వణుకుతుండు పోశెట్టి.. వరుదలకు పెద్ద పెద్ద చేపలు ఎదుంక్కా? వత్తానయని చేపలు పట్టుకొను ఉరుతంప ఇస్తాలి. దొడ్లల్లో పశులు, మేకలు మీట్ల మీద నుంచి ఇడువంగనె బజార్లపడి ఉరుకుతున్నయి...." చెట్లమీద కాకులు రెక్కలు టప టప గొడుతున్నయి సూరుకున్న గూట్లె నుండి తొంగి... తొంగి సూత్తంది ఊరపిచుక. . గజ్జికుక్క లొట.. లొటచెవులు కొట్టుకుంట ఉరుకుతంది. వూళ్ళోని జనమంత మూడ్రోజుల నుంచి కురిసిన వర్షం గురించె మాట్లాడుకుంటుండ్రు. . రాజమల్లుకు మాత్రం ఏమి పట్టనట్లు మందిని దాటేసుకుంట క్యాంపు దిక్కు పరుగుపరుగున ఉరుకుతుండు . మూడ్రోజుల నుంచి చెపరాసి నౌకరికి గైరాజారు అయినందుకు నౌకరి నుంచి ఏడ తీసేత్తడోనని కడుపులంత అగులు బుగులు అయితంది రాజమల్లుకు.

సూపర్‌వేజర్ సుబ్రమణ్యం సారు.. సిగరేటు తాగుతు వరండాలో పచార్లు కొడుతుండు... ఏగపోసుకుంట వచ్చిన రాజమల్లుకు పెయ్యంత సెమటలు వట్టినయి సూపర్‌వేజర్ సుబ్రమణ్యంను చూడంగానే పై ప్రాణాలు పైనే పోయినంత పనయింది మల్లుకు.

"సలాముసారు. . అంటూ సలాం చేశాడు రాజమల్లు. సుబ్రమణ్యం వినపడిన వినపడనట్టుగానే గాలిలోకి సిగరెట్టు పొగ వదులుతు ఏదో ఆలోచిస్తున్నట్టు నటిస్తున్నాడు...

అది నటనేనని రాజమల్లుకు కూడా తెలిసిపోయింది. కానీ ఏమీ అనలేదు... చిన్న జీతగాడు... సూపర్‌వేజర్‌సారుకు కోపమొస్తే నౌకరి నుంచి తీసేయగలడని

భయం. "చెట్టు ఊగకున్న... ఆఫీసర్ ఉగుతుందంటే అవుననాలి... ఇంకా బాగా ఉగుతుంది సార్ అంటే ఆపీసరు మరింత సంబరపడిపోయి శబ్బాశ్ అంటడు"...!

ఈసారి గట్టిగనే రాజమల్లు సలామ్ సారు... అంటూ చేతులు కట్టుకుని దూరాన నిలుసున్నాడు...

"సుబ్రమణ్యం ఒక్కసారి వెనక్కి తిరిగి రాజమల్లును కింది నుండి పైకి చూసిండు."

రాజమల్లుకు కడుపుల అగులు బుగులు అయింది.

"రెండు చేతులు పబ్బతివట్టె నిలుసున్నడు"

"నోట్లె తడి ఆరిపోతంది"

"సుబ్రమణ్యసారును జూసిన రాజమల్లుకు వెన్నుపూసల కెల్లి సన్నగ వణుకు పుడుతుంది"

"మాయల ఫకీరు ప్రాణాలు చిలుకలో వున్నట్టు రాజమల్లు నౌకరి సుబ్రమణ్యం సారుచేతిలో ఉంది"

"ఎనుక ఏడు తరాలు ఎవ్వరు గూడ సర్కారు నౌకరు జెయ్యలేదు రాజమల్లు ఇంట్ల"

"రాక ...రాక....లేక....లేక.. చెపరాసి నౌకరి దొరికింది రాజమల్లుకు.

ఆనాటి నుంచి రాజమల్లు ఇంట్లోపప్పుల పొనుకేసు కుంటండ్రు."

"ఐదేళ్ళు నోట్లెకు వోతున్నయి"

"ఏమోయి...?" మూడ్రోజులకు నువ్వు ఈ రోజా డ్యూటీకి రావడం" గద్దించి నట్టుగానే అడిగిండు సూపర్‌వైజర్.

"లేదుసార్... మూడ్రోజుల నుండి ఎడతెరిపి లేకుంట కురుస్తున్న వానలకు నా గుడిశంత కూలిపోయింది. అందుకనే కొలువుకు రాలేకపోయిన సారు, చేతులు నలుసుకుంటు బ్రతిమాలుతుండు రాజమల్లు..."

"నీది పర్మనెంటు నౌకరి కాదు! నిన్ను ఎప్పుడంటే అప్పుడు డిస్మిస్ చేసేస్తా జాగ్రత్త!.

"వద్దుసారు... వద్దు..." "గంతమాటనకుండ్రి. పిల్లలు గలొన్ని..." సచ్చి మీ కడుపున పుడుత.

"యీసారికి మన్నియుండి కాళ్ళావేళ్ళా బతిమాలుతుండు రాజమల్లు. " ప్రాధేయపడ్డాడు రాజమల్లు.

"సరే... పో... పోయి ఇంట్లో పనిచేసుకోపో..."

"రాజమల్లుకు సచ్చి పుట్టినంత పనయింది."

మూడొద్దుల నుంచి బట్టలన్నీ మలెవడ్డయని కచ్చెడు బోళ్ళు... మూటెడు బట్టలు ఏసింది సూర్యకాంతమ్మ.

"జల్ది బట్టలుతికి బోళ్ళు దోము"

"ఊ... కానీయ్యి... ఇంక బజారుకువొయ్యి కూరగాయలు దేవాలే ప్రరమాయిస్తుంది కాంతమ్మ."

"రాజమల్లుది ఒకనాడు పెట్టిన చెయ్యేగాని... అడిగిన చెయ్యిగాదు"

కాలం కలిసిరాక... పంటలు లేక... ఏద్దు ఏవుసంబొయ్యి... గడ్డిగాదంలేక, గొడ్డుగొదలమ్ముకొని, సర్కారు నౌకరని ఆశపడి వచ్చినందుకు ఇరువై ఏండ్ల నుంచి ఆఫీసరు ఇండ్లల్ల అంట్లుదోమి, అంటుముట్టు బట్టలుతుకుదెగాని పర్మనెంటు కొలువులేదు. పైస ఆముదానిలేదు..."

"బతుకు పాడుగాను... కుక్కబతుకయిపాయె, బతుకుమీద ఇసడింపువచ్చిన రాజమల్లు తన బతుకును తనే తిట్టుకుంటండు..."

"ఏందిర ఏందో గులుగుతున్నవు, కాంతమ్మా"

"ఏమీ లేదు దొరుసాని, లోలోపలె కుమిలిపోయిండు రాజమల్లు"

★ ★ ★

"వరండాలో కుసున్న సూపర్‌వేజర్ సుబ్రమణ్యం సుదీర్ఘంగ ఆలోచిస్తుండు. అంతలో సారు... సారు... అంటూ పరుగుపరుగున ఉరికొచ్చిండు గుమాస్తా వినాయకరావు."

"ఏందయ్య వినాయకరావు"

"ఏం లేదు సారు మూడ్రోజుల నుండి మా ఇండ్లలోకి పాకివాడు రావడంలేదు" మలమూత్రాలు ఎత్తిపోయకపోవడంతో క్యాంపు క్యాంపంత గత్తరొచ్చినట్టు ఒక్కటే కంపు వాసన భరించలేకపోతున్నాము సారు...! మీరే ఏదైన మార్గమాలోచించాలి.

"ఎగపోస్తు అడుగుతుండు వినాయకరావు."

సుబ్రమణ్యంకు ఏమి చేయాలో తోయక కాసేపు ఆలోచించుకుని ఇంట్లో అంట్లు దొముతున్న రాజమల్లును పిలిసాడు...

"రాజమల్లు వచ్చి దూరాన నిలుసున్నడు."

"సారు... పిలిసారా?"

"అవునోయ్..."

"నువ్వు వెళ్ళి మన క్యాంపులో పాకిదొడ్లు కడిగి మలమూత్రాలు ఎత్తిపోసే కిషన్‌లాల్‌ను పట్టుకరాపో."

"సరే... సారు అంటూ కిషన్‌లాల్ ఇంటి దిక్కు నడుక సారించాడు రాజమల్లు."

★ ★ ★

కిషన్‌లాల్ గుడిశెకాడున్న చింతగున్న మీద కాకులన్నీ కావు కావున మొత్తు కుంటున్నాయి.

"గుడిశెముందు మందంత గుమిగూడిన్నరు", "వాకిట్లో మంట."

"రాజమల్లుకు విషయం అర్థమైపోయింది."

"ఎప్పుడు పోయిండు"? పక్కనున్నాయన్ను అడిగిండు రాజమల్లు."

"గిప్పుడే గంటకిందనే పోయిండు పాపం."

"ఎనుకముందు ఎవ్వరులేరు" బతుకు తెరువు కోసం పొట్టచేత పట్టుకొని ఎక్కడి నుంచో వచ్చి గీడపోయిండు" తలో దిక్కు సానుభూతి పలుకుతుండ్రు" అందుకే అన్నారు నలుగురితోని మంచిగుండాలని."

"కిషన్‌లాల్‌కు నల్గురెగాదు ఊరిలో అందరి నాల్కల మీదున్నాడు" పుణ్యాత్ముడు...

"విషయం తెలుసుకున్న రాజమల్లు తిరుగుమొఖం పట్టిండు."

"సదుస్తున్న రాజమల్లుకు ఎన్నో అనుమానాలొస్తున్నాయి."

"కాలంజేసిన కిషన్‌లాల్ చేసేపని నాకు ఏడ అంటగడుతడోనని వెన్నుపూసలోంచి వణుకు పుడుతుంది రాజమల్లుకు... భయపడకుంటనే బంగళాకొచ్చిండు"

"దొర... కిషన్‌లాల్... పొద్దుగాలనే కాలం జేసిండట" మందంత జమయిండ్రు...

"సుబ్రమణ్యం ఒక్కసారి ముక్కిరిసిండు"

"పోయినోడు పోతే బోయిండు గాని ఇప్పుడు మా పరిస్థితి ఎట్లాసార్... నిప్పులో ఉప్పేసిండు వినాయకరావు"

"చూడు ... వినాయకరావు... కిషన్‌లాల్ మన ఇంటిల్లిపాది మలమూత్రాలు గత పాతికేళ్ళనుంచి ఎత్తిపోస్తునే ఉన్నడు, పాపం నేటితో కాలం తీరిపోయి కాలంజేసిండు...

"మీరు భలేవారు సారు... కిషన్‌లాల్ ఏదో పెద్ద దేశ... అయినట్టు తెగ బాధపడి పోతున్నారు."

"క్యాంపు ఆఫీసరుగా మీరేమయిన చేయండి సారు?"

"మేము మాత్రం కంపు వాసన భరించలేకపోతున్నాము."

అంతలోనే కొండల్‌రావు... వెంకట్‌రెడ్డి, చౌదరిగారు అందరు జమయి జెనంటే... జెనంటు పట్టుదలగ ఉన్నారు.

"సుబ్రమణ్యంకు ఏమిచేయాలో తోచడంలేదు."

"ఇంతకి నన్ను ఏమి చెయ్యమంటారో చెప్పండయ్య"

"ఏముంది సార్ వెరీ సింపుల్."

"ఊళ్ళో ఉన్న ఎట్టిమాదిగోన్ని పిలిపియ్యండి."

"సర్కారు నౌకరని చెప్పండి."

"వెదవది సచ్చినట్టు వాడే చేస్తాడు."

మలమూత్రాలు ఎత్తిపోయడమే కాదు...! ఏదయిన చేస్తాడు... ఉచిత సలహా అందించాడు పూజారి పంతులు.

"అవును అంటూ అందరూ వత్తాసు పలికారు."

"వినాయకరావుకు కూడా సమ్మతమే అనిపించింది."

"నెత్తిమీది బరువు దిగినంత సంబరమయింది రాజమల్లుకు."

"రాజమల్లును పిలిచాడు వినాయకరావు"

సారు అంటు రాజమల్లు చేతులు కట్టుకొని నిలుసున్నాడు.

"ఈ వూల్లో ఎట్టి మాదిగోడు ఎవ్వడున్నాడురా?"

"గౌరడు సారు" తలగోకుకుంట చెప్పిండు రాజలింగు.

నువ్వు వెళ్ళి గౌరన్ని వెంటబెట్టుక రా పో!

సరే సారు అంటూ రాజమల్లు గూడెం దిక్కు బయలుదేరిండు.

"రాజమల్లుకు గౌరని గూడెంకు పోవాలంటే కొంత నామర్దంగానే ఉన్నది. కాదంటే చెపరాసి కొలువు పోతుందేమోనని భయం.

"భుజంమీదున్న తువ్వాలతో ముక్కు మూసుకొని గౌరని గుడిశెముందు నిలుసున్నడు రాజమల్లు"

"గౌరయ్య ఓరి... గౌరయ్య..." వాకిట్లో నిలుసుండి పిలుస్తుండు రాజమల్లు.

రాజమల్లు పిలుపు ఇన్న గౌరయ్య గుడిశెలకెల్లి బయటకొచ్చిండు.

రాజమల్లును చూడంగానే "సలాం... రాజమల్లు" అంటూ సలాం చేసిండు గౌరడు. ముక్కు మూసుకొనే ప్రతి సలాం చేసిండు రాజమల్లు.

"ఏంది గిట్లత్తివి రైతా?"

"రైతా పాడా! ఎక్కడి రైతోయ్ గౌరయ్య."

"రైతుతనం ఏనాడో మంట్లె కలిసిపోయింది నీకు దెల్వదా?" దునియంత సర్కారు నౌకర్ల కెగబడ్డరు"

"అన్నట్టు నీకు సర్కారు కొలివిత్తరంట సేత్తవా?"

"గదేంది రాజమల్లన్న గట్ల ఏగుతాలి సేత్తున్నావు."

"నీ వేళకొలం గాని నాకెవ్వలిత్తరు సర్కారు నౌకరి?"

"నిజంగానే... గౌరయ్య, నీకు సర్కారు కొలువిత్తరట."

"నిన్ను సూపర్‌వైజర్ సుబ్రమణ్యంసారు జల్ది తీసుకురమ్మన్నాడు."

సర్కారు నౌకరంటే సంకలెగరేసిండు గౌరయ్య.

ఇద్దరు కలిసి బంగళదిక్కు నడుతుండ్రు.

గౌరయ్యకు లోలోపల ఎంతో సంబురమయితంది.

"సర్కారు కొలువు దొరికితే ఏములాడ రాజన్నకు ఎద్దును కట్టెత్త" నని మొక్కు కుంటుండు గౌరయ్య.

"సారు... గౌరడొచ్చిండు" రాజమల్లు.

అందరు వెనకదిక్కు మళ్ళి చూసిండ్రు.

దూరాన వేపచెట్టుకింద నిలుసున్నడు గౌరడు.

"రా..." అంటూ దగ్గరకు పిలిసిండు వినాయకరావు.

వరండమెట్ల దగ్గర చేతులు కట్టుకొని నిలుసున్నడు గౌరడు.

పెరిగిన తెల్లని గడ్డం, పిల్లి కండ్లు, నడీడు వయస్సు, నెత్తికి రుమాలు, ముఖం మీద అక్కడక్కడ ముడుతలు పడుతున్నయి. చూస్తే చార్వాకుని తీరున్నడు. "నీపేరేంటిదోయ్" అంటూ దౌడకు వక్కపోక వేసుకుని దీర్గాలు తీసుకుంట అడుగుతుండు పరందామయ్య...

"గౌరయ్య...! అందరూ గౌరడు అంటారు!"

"ఏం పని సేత్తవు?"

"కులవృత్తి" గర్వంగ చెప్పిండు గౌరయ్య.

పంతులు పరందామయ్యకు గౌరని మాటలు ఏకలవ్యుని బాణంతీరు వెన్నుల గుచ్చుకున్నవి.

"చూడు గౌరయ్య నీకు సర్కారు నౌకరిత్తము చేస్తావా?" మద్యల కలుగచేసుకుండు వినాయకరావు.

"అన్నం పెడుతమంటే ఎవరద్దంటరు సారు?"

"సర్కారు కొలువిత్తనంటే ఎందుకు జెయ్యా?"

"ఏమి జెయ్యాలో చెప్పుండ్రి."

"ఏమిలేదు గౌరయ్య నువ్వు ముందు కొన్నిరోజులు ఈ క్యాంపులోని ఇండ్లల్లో వున్న మరుగుదొడ్లు అన్నింటిని సాపుజెయ్యాలే - కొద్దిరోజులు నువ్వు చేసావంటె నీకు ముందు ముందు సర్కారు చెపరాసి కొలువొత్తది."

గంగిరెద్దు తీరు తలూపిండు గౌరయ్య...

ఇంకేముంది... చేతుల చీపురుకట్ట, భుజాన ఇనుప బకెటు తగిలించుకొని భూతలయుద్ధంలో సైనికుని తీరుగున్నడు గౌరయ్య...

"మొదట వెగుటే అనిపించిన రాను... రాను... అలవాటు పడిన వృత్తి గౌరయ్యకు ఏమంత కష్టంగలేదు. కోటి విద్యలు కూటికే అన్నదానిలో ఇది కోటొక్క విద్యవుతుంది" తాతలు, తండ్రులు చెయ్యని వృత్తి.

★ ★ ★

కాలం కదిలిపోతుంది. ఏ ఒక్క గడియ ఎవ్వరి కోసం ఆగటం లేదు. గడియలు - నిముషాలు - నిముషాలు - గంటలు, గంటలు - రోజులు, రోజులు - నెలలు, నెలలు - సంవత్సరాలు గడిసిపోతునే వున్నాయి. క్యాంపు ఎత్తివేయాలని పై అధికారుల నుండి ఉత్తర్వులు రావడంతో క్యాంపును ఎత్తివేసే కార్యక్రమాలు చురుకుగా సాగుతున్నయి. రోజుకొక్క కార్యాలయం తరలిపోతుంది.

గౌరడు రోజు తన నౌకరి కోసరం ఆఫీసరు సుబ్రమణ్యం సారు ఇంటిచుట్టూ ప్రదర్శనలు చేస్తూనే వున్నాడు. "ఇయ్యాల... రేపు" అంటూ రోజులు గడుపుతుండు వినాయకరావు.

క్యాంపు ఆఫీసరు సుబ్రమణ్యంకు ఉన్నత పదవచ్చింది.తెల్లవారితే కొత్త ఉద్యోగంలో చేరిపోవాలి. అందుకని ఆఫీసులో అందర్నీ హడావిడి చేస్తుండు.

కాంతమ్మ ... రాజమల్లు ఇంట్లోని సామాన్లన్నీ సర్దుతున్నరు.

క్యాంపులేసిపోతుందన్న సంగతి గౌరనికి తెలిసింది. ఈసారి వినాయకరావును గట్టిగానే నౌకరి గురించి అడగాలనుకున్నాడు.

తెల్లవారేసరికి బంగ్లాముందు హాజరయిండు గౌరడు.

లారీలో సామాన్లు ఎక్కిస్తున్నరు... వెనకాలనే వున్న జీపులో కూర్చొని వుండు వినాయకరావు.

"సలాం సారు...!" అంటూ సలాం చేసిండు గౌరడు.

గౌరని దిక్కు చూసీ చూడనట్టుగానే వున్నాడు వినాయకరావు.

మరొక్కమారు సలాం చేసిండు గౌరడు.

"ఆఁ! ఏందోయ్" ఏమీ కాలేదన్నట్టు అడిగిండు వినాయకరావు.

"నా నౌకరండి.. నాకిప్పిస్తనన్న నౌకరీ" గౌరడు బతిమాలుతూనే అంటున్నడు.

"ఎక్కడి నౌకరోయ్... క్యాంపే లేసిపోతోంది... ఇంకెక్కడి నౌకరీ వెళ్ళు... వెళ్ళు.." అని కసిరికొట్టినట్టు మాట్లాడుతుండు వినాయకరావు.

వినాయకరావు నోటినుండి మాటిన్న గౌరనికి 'తెగిన బొక్కెన.. నూతిలె దాక' అనిపించింది.

సామాన్లన్నీ సర్దిన రాజమల్లుకు వినాయకరావు పాత ప్యాంటూ... పాత కోటు యిచ్చింది కాంతమ్మ.

పర్మినెంటు కొలువొత్తదని వ్యవసాయం పని మానేసిన రాజమల్లు బతుకు ఎడారిలో ఎండమావే అయ్యింది.

రాజమల్లు మతి భ్రమంచిపోయి కాంతమ్మ యిచ్చిన ప్యాంటు, కోటు వేసుకుని పిచ్చోడై తిరిగి తిరిగి కాలంజేసిండు.

జీపు కదలిపోవడానికి సిద్ధంగా వుంది.

దొరా... నా నౌకరీ...అంటూ కదిలిపోతున్న జీపు వెనకాల ఉరుకుతుండు గౌరడు.

జీపు దుమ్ములేపుకుంటు వెళ్ళిపోతోంది.

ఎడమకాలుకున్న చెప్పుదీసి జీపుమీదకిసిరిండు గౌరడు...

కాక్ ... థూ... అని కాండ్రికిచ్చి ఉమ్మేసిండు.

బతుకుపోరులో ఓడిపోయిన ఆనాటి గౌరడు ఇప్పుడు ఆత్మగౌరవ పోరాటంలో ముందున్నడు.

● 2001 ●

# 78. ఆఫ్టర్ ట్వంటీ ఇయర్స్ అను మంచి మిత్రుల కథ

♦ కాసుల ప్రతాపరెడ్డి ♦

ఆలోచిస్తుంటే శేఖర్‌కు లోన ఏదో కోరిక వున్నట్లు కనిపిస్తోంది. ఆ కోరిక ఏమిటో అతను చూచాయగా తెలియపరుస్తున్నట్లు నాకేదో అనుమానం. అతని ధోరణిని మొదట్లో నేను పెద్దగా పట్టించుకోలేదు.

కానీ, రాను రాను నాకు అతని పద్ధతి విచిత్రంగానూ, అనుమానంగానూ అనిపించసాగింది. నాలో ఈ అనుమానం కలగడానికి నాలోని భయమే కారణమా అని కూడా చాలాసార్లు ఆలోచించాను. అలా భయపడడానికి తగిన కారణమేదీ నాకు కనిపించలేదు. మరి, శేఖర్ అలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడో నాకు అర్థంకావడం లేదు.

శేఖర్ మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ ప్రాంతంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్. మేమిద్దరం చిన్నప్పుడు మంచి మిత్రులం. పదో తరగతి వరకు మా స్నేహం చెక్కు చెదరకుండా కొనసాగింది. రాత్రుళ్ళు కూడా విడిపోయేవాళ్ళం కాదు. వాడు లైట్ వేసుకుని చదువుతుంటే నేను నిద్రపోయేవాణ్ణి. అయినా, ఫస్ట్ ర్యాంక్ నాకే వచ్చేది. అయినా నా మీద వాడికెప్పుడూ కోపం రాలేదు. ఇద్దరం సైన్స్ గ్రాడ్యుయేట్స్‌మే. వాడు మెడిసిన్ ఎంట్రన్స్‌కు ప్రిపేర్ అయి సాధించలేక జువాలజీలో ఎం.ఎస్.సి చేశాడు. నేను సైన్స్ నా ఒంటికి పడదని చెప్పి తెలుగు లిటరేచం చేసి ఎం.ఫిల్ చేశాను. వాడికి గవర్నమెంటు టీచర్ ఉద్యోగం వచ్చింది. ఆ ఉద్యోగం చేస్తూ జువాలజీలో రీసెర్చి కూడా చేశాడు. కానీ ఎందుకో అకస్మాత్తుగా ఆ ఉద్యోగం మానేసి సబ్ ఇన్‌స్పెక్టర్ రిక్రూట్‌మెంట్‌కు వెళ్ళాడు. వెళ్ళడమేకాదు, సెలెక్ట్ కూడా అయ్యాడు. ఇదే నాకు రుచించలేదు. నేను తెలుగు సాహిత్యంలో రీసెర్చ్‌ని సగంలో వదిలేసి జర్నలిజంలో పడిపోయాను. ఇక్కడే మా యిద్దరి దారులు వేరయ్యాయి. ఎస్.ఐ.గా పోలీసు శాఖలో అడుగుపెట్టిన శేఖర్ సి.ఐ. కూడా అయిపోయాడు. అతనలా దూరం కావడం గురించి నేను పెద్దగా ఆలోచించలేదు. పెద్దగా బాధపడిందీలేదు. అది నా ఆలోచనలో వచ్చిన మార్పు కావచ్చు. అతనెలా ఫీలవుతున్నాడో నాకిప్పటికీ తెలియదు. హైదరాబాదుకు వచ్చినప్పుడు నా మిత్రుల దగ్గరికి వచ్చిపోతుంటాడు. నన్ను మాత్రం కలిసేవాడుకాడు. నన్ను కలవడానికి అతనికున్న ఇబ్బందులేమిటో నాకు ఏరోజూ అర్థంకాలేదు. ఓరోజు అర్ధరాత్రి ఫోన్

మోగుతుంటే రిసీవర్ ఎత్తా. గాఢ నిద్రలో వున్న నాకు ఆదేళ ఫోన్ రింగవడం చిరాగ్గా వుంది. అవతలి కంఠం విని నిద్ర ఎగిరిపోయింది. 'హాలో' అన్న తర్వాత 'గుర్తు పట్టావా?' అని అడిగాడు.

గుర్తు పట్టకపోవడమేమిటి? అది శేఖర్ గొంతు. ఆ గొంతును ఎంత మందిలోనైనా నేను పోల్చుకోగలను. కాస్తా గంభీరంగా మారిందంతే. అదే మాట చెప్పాను. నవ్వాడు. 'ఎక్కడి నుంచి?' అని అడిగాను. 'సిటీ అవుట్‌స్కర్ట్స్ నుంచి' అని చెప్పాడు. 'ఇంత అర్ధరాత్రివేళ నేను గుర్తుకు రావడమేమిటి?' అని అడిగాను. 'వెళ్తూ వెళ్తూ ఇక్కడ పోలీస్ స్టేషన్‌లో కూర్చున్నా. నువ్వు గుర్తొచ్చావు' అన్నాడు. 'హైదరాబాద్ వచ్చినవాడివి ఇంటికి రావచ్చు కదా!' అన్నాను. 'మరోసారి వస్తానులే' అన్నాడు. 'లైఫ్ ఎలా వుంది?' అని అడిగా. 'బాగానే వుంది' అని చెప్పాడు. కాసేపు ఇద్దరిమధ్య నిశ్శబ్దం. హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు మా ఇద్దరి మధ్య సంభాషణకు ట్రైమ్ సరిపోయేది కాదు. ఇప్పుడేమిటి? ఇలా అయిపోయిందని అనుకున్నాను. అతను కూడా అదే ఫీలవుతున్నాడా అని క్షణం సేపు ఆలోచించాను. అప్పుడెన్ని కబుర్లుండేవి? మాట్లాడుతూ మాట్లాడుతూ నిద్రలోకి జారిపోయేవాళ్ళం. 'సరే వుంటాను' అని ఫోన్ పెట్టేశాడు.

శేఖర్ ఆలోచనలోనే నిద్రపోయాను. తెల్లారి లేచేసరికి కాస్తా లేటయింది. తలుపు తీసి ఆనాటి దినపత్రికను చేతుల్లోకి తీసుకున్నాను. పేపర్ మీద ఎర్రటి మరకలు. నెత్తురోడుతున్న శవాలు. కాసేపు భయం వేసింది. ఆ తర్వాత బాధేసింది. 'ఏమిటి, ఇలా పిట్టల్లా రాలిపోతున్నారు?' అని అనుకున్నాను. టాప్ సక్సర్స్ లీడర్స్ ముగ్గురు ఎన్‌కౌంటర్‌లో మరణించిన వార్త బ్యానర్. శరీరాల మీద బుల్లెట్ల గాయాలు. ఎందుకింత దారుణంగా చనిపోయారనిపించింది. వీరు కలలు కంటున్న రాజ్యం వస్తుందో, రాదో నాకు అనుమానమే. కానీ పర్వమానమంతా గాయాల పరదలు.

అది మొదలు శేఖర్ అర్ధరాత్రుళ్ళు ఫోన్ చేస్తే ఆందోళన పెరగడం మొదలైంది నాలో. అతను ఫోన్ చేసిన తెల్లారి ఏదో ఒక సంఘటన జరుగుతోంది. అయితే, అది కాకతాళీయమే కావచ్చు. నిజానికి, ప్రతిరోజూ ఏదో ఒక సంఘటన జరగడం అతి సాధారణమైంది తెలంగాణాలో. కానీ, శేఖర్ నాకు ఫోన్ చేయడానికి, వీటికి ఏదో లింకు వున్నట్లు ఫీలవ్వసాగాను. నాకు విద్యార్థి దశలో విప్లవ విద్యార్థి సంఘాలతో కొంతమేరకు సంబంధాలుండడం, జర్నలిజంలో వున్నప్పుడు కూడా అవి నన్ను వదలకపోవడం నా ఫీలింగ్‌కు కారణం కావచ్చు. అతను ఫోన్ చేసిన ప్రతిసారీ నామీద నిఘా వేశాడా ఏమిటి? అని అనిపించడం మొదలుపెట్టింది.

అతను ఓరోజు ఫోన్ చేసి 'ఆదివారం ఇంట్లోనే వుంటావు కదా, నేను వస్తాను' అని చెప్పాడు. నేను ఆ రోజంతా అతని కోసం వెయిట్ చేశాను. కానీ రాలేదు. మరోసారి ఇలాగే చెప్పాడు. అప్పుడు కూడా అలాగే నిరీక్షించాను. అప్పుడు కూడా రాలేదు. మా యింటికి రావడానికి అతను భయపడుతున్నాడా అని అనిపించింది. అతనికి త్రెట్ వున్న మాట నిజమే కాని, మా ఇంటికి రావడానికి అతను భయపడాల్సిన అవసర మేముంది? అని చాలాసార్లు అనుకున్నాను. ఎవరి జాగ్రత్తలు వారివి అనుకున్నానేగానీ శేఖర్ ఎందుకిలా చేస్తున్నాడనే ఆలోచన నాలోంచి తుడిచి

పెట్టలేక పోయాను. దీనికి తోడు మరో ఆలోచన కూడా నాలో మొగ్గతొడిగింది. అతనిలోని నిగూఢ కోరికేదో శేఖర్ అలా ప్రవర్తించడానికి కారణం కావచ్చుననేది ఆ ఆలోచన. ఈ ఆలోచనలో భాగంగానే నాకు పదే పదే 'ఆఫ్టర్ ట్వంటీ ఇయర్స్' అనే కథ గుర్తు రాసాగింది. ఈ కథను మేం హైస్కూల్లో చదువుకున్నాం. ఈ కథంటే శేఖర్‌కు చాలా యిష్టం. అదే సమయంలో 'మంచి మిత్రులు' అనే సినిమా కూడా గుర్తురాసాగింది. ఈ కథకు, సినిమాకు దగ్గరి పోలికలున్నాయి. ఈ సినిమాను మేమిద్దరం కలసి చూశాం. ఇందులో శోభన్‌బాబు, కృష్ణ నటించారు. 'ఆఫ్టర్ ట్వంట్వీ ఇయర్స్' కథలో ఇద్దరుమిత్రులు ఇరవై ఏళ్ళ తరువాత కలుసుకుందామని అనుకొని కలుసుకోవాల్సిన తేదీని, స్థలాన్ని నిర్ణయించుకుంటారు. అయితే, ఎంతో మంచివాడయిన ఒక వ్యక్తి దొంగగా మారిపోతాడు. అతన్ని పట్టుకోవాల్సిన బాధ్యత పోలీసు ఆఫీసర్ అయిన అతడి మిత్రుడి మీదే పడుతుంది. తాము ముందు నిర్ణయించుకున్న ప్రకారం మిత్రులిద్దరూ కలుసుకుంటారు. ఆ తర్వాత పోలీసాఫీసర్ దొంగ అయిన తన మిత్రుణ్ణి అరెస్టు చేస్తాడు. స్థూలంగా కథ యిది. మంచి మిత్రులు సినిమా కావడం ఇదే పద్ధతిలో వుంటుంది. నాకు ఇప్పటికీ 'ఇంకా తెలవారదేమీ, ఈ చీకటి విడిపోదేమీ' అని పాటకు అభినయం చేస్తూ రఫ్‌గా నడిచే కృష్ణ క్యారెక్టర్ గుర్తొస్తూ వుంటుంది. నాకు క్యారెక్టర్ మీద అభిమానం కూడా పెరిగిపోయింది. ఒక మంచి వ్యక్తి పరిస్థితి ప్రభావం వల్ల దొంగగా ఎలా మారిపోతాడో చెప్పిన క్యారెక్టర్ అది. శోభన్‌బాబు క్యారెక్టర్ ప్లేన్‌గా వుంటుంది. ఇలా ప్లేన్‌గా వుండే క్యారెక్టర్లంటే నాకు కొంత విసుగు. శేఖర్‌కు శోభన్‌బాబు వేసిన క్యారెక్టర్ ఇష్టం.

నాలో ఎలాగైతే ఈ సినిమా, ఈ కథ ప్రభావం వేశాయో శేఖర్ మీద కూడా అదే ప్రభావం వేశాయా? పైగా మా యిద్దరి జీవితాలు కూడా అలాగే వున్నాయని శేఖర్ నమ్ముతున్నాడేమోననే అనుమానం నన్ను పీడించడం మొదలుపెట్టింది. నేనేదో చట్ట ఉల్లంఘన చేస్తానని ఆ సినిమాలో లేదా కథలో మాదిరిగా నన్ను అరెస్టు చేయాలని శేఖర్ అనుకుంటున్నాడేమోనని నా అనుమానం. తన నిజాయితీని నిరూపించుకోవాలనే కోరిక అతని అంతరంతరాల్లో ఎక్కడో దాగి వుందని నాకు అనిపించడం తప్పే కావచ్చు. కానీ నేనెందుకో ఆ భావన నుంచి దూరం కాలేకపోతున్నాను. నేను స్కూల్లో మంచి అబ్బాయిని. నన్ను చూసి బుద్ధి తెచ్చుకోవాలని పెద్దవాళ్లు తమ పిల్లలకు సుద్దులు చెప్పేవాళ్ళు. శేఖర్ ఎంత చదివినా చదువులో నన్ను దాటలేకపోయాడు. మంచి పేరులోనూ దాటేయలేకపోయాడు. కానీ, ఇద్దరు పై చదువులకు వచ్చాకే దారులు మారాయి. అతను బుద్ధిగా కష్టపడి చదివితే నేను ఉద్యమాలంటూ తిరిగాను. పొట్ట పోసుకోవడానికి పనికిరాని తెలుగు సాహిత్యం చదివాను. అతను చట్టాన్ని కాపాడే పోలీసాఫీసర్ అయ్యాడు. నేను అవసరమైతే చట్టాన్ని ఉల్లంఘించడాన్ని కూడా సమర్థించే జర్నలిస్టునయ్యాను. అతను నన్ను జీవితంలో ఓడిపోయినవాడిగా భావిస్తున్నాడా లేక ఇప్పటికే నేను పైమెట్టులో ఉన్నానని అనుకుంటున్నాడా నాకు అర్థం కాలేదు. ఎందుకంటే నా తలపొగరు అతనికి తెలుసు.

నేను ఓసారి అతను పనిచేస్తున్న వూరికి డ్యూటీమీద వెళ్ళాను. నేను వెళ్ళే సరికి అర్ధరాత్రి దాటింది. ఎక్కడో రాత్రి పడుకున్నాననిపించి ఓ లీడర్‌ను ఇంటర్వ్యూ

చేస్తున్నాను. ఓ పోలీసు జీపు నాకోసం వచ్చిందని కబురొచ్చింది. నాకోసం పోలీసు జీపు రావడమేమిటి అని ఆలోచించాను. అప్పుడు గుర్తొచ్చింది. ఇక్కడ శేఖర్ పనిచేస్తున్నట్లు. నేను బయటకు వచ్చాను. కానిస్టేబుల్ దగ్గరకు వెళ్ళి 'ఏమిటి' అని అడిగాను. 'అయ్యగారు రమ్మంటున్నారు' అని చెప్పాడతను. 'అయ్యగారంటే... ?' అని అన్నాన్నేను. 'సి.ఐ. దొర' చెప్పాడు. 'ఆయన పేరేమిటి?' అని అడిగాను. చెప్పాడు. 'ఒక్క పది నిముషాలు ఆగు' అని చెప్పి మళ్ళీ లోపలికి వెళ్ళి ఇంటర్వ్యూ ముగించుకుని జీపులో కూర్చున్నాను. సరాసరి శేఖర్ వద్దకు తీసుకెళ్ళింది జీపు నన్ను.

నా కోసం బయటే వెయిట్ చేస్తున్నాడు శేఖర్. అప్పుడు కూడా నాకు ఆ కథ, ఆ సినిమా గుర్తొచ్చాయి. చాలాసేపు కూర్చున్నాం. ఏదేదో మాట్లాడుకున్నాం. మాటల సందర్భంలో 'మా వాడు ఏం చెప్పాడు?" అడిగాడు శేఖర్. 'అయ్యగారు రమ్మన్నారని చెప్పాడు' అని జవాబిచ్చా. 'అలా చెప్పొద్దని మరీ మరీ చెప్పాను. అలాగచెప్తే రాకపోవచ్చునని కూడా చెప్పా. శేఖర్ రమ్మంటున్నాడు. మీ ఫ్రెండట అని చెప్పుమని మరీ మరీ చెప్పా' అన్నాడు. చిన్నప్పటి విషయాలు, మిత్రుల విషయాలు చెప్పుకున్న తర్వాత నేను సెలవు తీసుకుని బయటకు వచ్చాను. అప్పుడు కూడా మా యింటికి వస్తానని హామీ యిచ్చాడతను. నాలుగైదు సార్లు చెప్పి కూడా రావడం లేదంటే ఆ రోజు ఆ భేటీకానీ, తర్వాత అప్పుడప్పుడు నాకు ఫోన్ చేయడం గానీ తన డ్యూటీలో భాగంగానే శేఖర్ చేశాడా అనే ప్రశ్న నన్ను ఇప్పటికీ తొలుస్తూనే వుంది.

తాను పోలీసాఫీసరైనా చాలా మందిలా అడ్డదారులు తొక్కి సంపాదించలేదు. ఆ విషయం నాకు గట్టిగానే తెలుసు. పోలీసు శాఖలో వున్నా కూడా తాను నిజాయితీగానే వున్నానని నిరూపించడానికో లేదా నువ్వు మంచివాడవు కాదు, చట్టాన్ని ఉల్లంఘించే నేరస్థుడవని నన్ను నిలబెట్టడానికో అతను తహతహలాడి పోతున్నాడని నా ఊహ. అది నిరూపించుకోవడానికి సమయం వచ్చినప్పుడు మాత్రమే అతను మా యింటికి వస్తాడేమోనని కూడా నాకు అనిపిస్తూ వుంటుంది. శేఖర్ కోరిక నెరవేరకపోవచ్చునని నాకు అప్పుడప్పుడు సంతోషం వేస్తూ వుంటుంది. ఎందుకంటే, నాకు ఉద్యమాల మీద గురి వున్న కాలంలో నేను తెగువ, ధైర్యం చూపలేకపోయాను. ఇప్పుడు నాకు వాటి మీద విశ్వాసం సడలుతూ వుంది.

● ప్రజాతంత్ర వర్తమాన సాహిత్యసంచిక - మార్చి, 2001 ●

# 79. మా వూరి ముచ్చట్లు

♦ నల్లాల లక్ష్మీరాజం ♦

నడిజాము నాత్రి దాటింది కావచ్చు. గప్పటి దాక మా అయ్య సాత్రాలు జెప్పుతుండు. మేమంత మక్కబూరు తీసి గప్పుడే పడుకున్నం. కన్నంటుకుంటుంది. ఎవరో వచ్చి దబదబ తలుపు కొడుతు "పోచన్న, పోచన్న" అని పిలిచిండ్రు. అందరం లేసి కూసున్నం. ఎండాకాలం అసలే దొంగల భయం. మా అన్న అటుకు మీదున్న దుడ్డు కర్ర తీసిండు. మా అయ్య సరాయించుకుంట తలుపుతీసి చూస్తే రాజన్న. మా ఇంటికి రెండ్లింట్ల అవతలుంటది రాజన్న ఇల్లు.

"ఏందిరా గింత రాత్రచ్చినవ్" అన్నాడు మా అయ్య ఆవులిస్తూ....

"మా అదినెను చుక్కారెడ్డి గాన్ని దొరకబట్టినామే" అన్నాడు రాజన్న అస పోసుకుంటు.

"ప" అంటూ నడిచాడు మా అయ్య. వారి వెనక మా లింగన్న కాసెగట్టిగా చెక్కి దుడ్డు కర్ర ఊపుకుంట నడిచిండు వారి వెనక. మా అవ్వపండుకున్న మాచెల్లెను భుజాన వేసుకొని "మనం కూడ పోదాం ప" అంటూ నన్ను వెంట తీసికెళ్ళింది.

మా అయ్యకు రాజన్న తమ్ముని వరసవుతాడు. బాల్ తాతకు ఇద్దరు కొడుకులు. నర్సయ్య పెద్దోడు, రాజన్నచిన్నోడు. నర్సయ్యకు లగ్గమయింది, ఒక కొడుకు రాజన్నకు ఇంకా లగ్గం కాలేదు. రాజన్న చిన్నగుండగనే తల్లి చచ్చిపోయింది. బాల్ తాతనే ఆడిపని మొగపని చేసుకుంట ఇద్దరు కొడుకులను సాదుకుంటు వచ్చిండు. నర్సయ్యకు లగ్గమయినంక బాల్ తాతకు ఆడిపని తప్పింది.

గంత రాత్రి గంత మందికి ఎట్లా తెలిసిందో ఏమో మా వాడకట్టు మందంత గుమి గూడిండ్రు. మగవాళ్ళు కోపంతో ఊగిపోతుండ్రు. ఆడవాళ్ళు గుసగుస పెట్టుకుంటు పెదవులు విరుస్తుండ్రు. మా అయ్య తలుపు తీయగానే కొందరు చుక్కారెడ్డిని, శాంతమ్మను కొట్టటానికి ఉరికిండ్రు. మా అయ్య వారిని అడ్డగించి "ఆ గుండ్రా ఉరుకు లాటెందుకు" అంటూ వారిని నూకేసిండు. చుక్కారెడ్డి మంచంమీద కూసోని బీడి తాగుతు చెమటలు తుడుసుకుంటుండు. శాంతమ్మనేమో మూలకు కూసోని నాలె ముఖమేసింది. మా అయ్య ఇద్దర్ని తేరిపార చూసి "పెద్ద కులమని నీల్లుతవ్ గదా, మరి గిదేంటిది" అంటూ థు అని ఊంచిండు చుక్కారెడ్డిని చూస్తు.

మా అయ్య వెనక నిల్చున్న బాల్‌తాత "ఈని తోటి మాటలేందిర తన్నేదానికి" అంటూ మోకాలు తోని చుక్కారెడ్డిని గుద్దిండు. బాల్‌తాతకు అరవై ఏళ్ళుంటాయి కావచ్చు కోపంతో పడుచోనిగ ఊగిపోతుండు.

మా అయ్య బాల్‌తాతను గట్టిగా దొరకబట్టి "ఆగే చిన్నయ్య ఎందుకు తొందర పడుతున్నవ్" అని శాంతమ్మ వైపు చూస్తు "నర్సయ్య ఎటు పోయిండే" అన్నాడు.

మూడోసారికి "పటేండ్లింటికి కావలిపోయిండు" అంది శాంతమ్మ నాలెగేతలుగీస్తు.

"ఆం... అన్నేమో కావలితోలి ఈనితోని కులుకుతున్నవ్. ధు నల్లి లంజె ఏదన్న నూతిల దునికి సావు పో" తిట్టుకుంటు కోడలి మీదికి ఉరికిండు బాల్‌తాత.

మా అయ్య అడ్డం నిలబడి, "ఆగే నర్సుడైతే రాని..." అని పక్కనున్న ఎల్లయ్యతోని "నువ్వు పోయి నర్సయ్యను తీస్కరా పో, ఆనికి ఏకేదం గిట్లా అని చెప్పకు. ఏదో ఓటి చెప్పి తీస్కానిరా" అని చెప్పి తోలేసి పోషమ్మను పిలిచి, "దాని దగ్గరే ఉండుండ్రి ఇజ్జత్కి ఏమన్న చేస్కోయిక్క" అన్నాడు.

కొద్దిసేపట్కి నర్సయ్యను తోలుకొని వచ్చాడు ఎల్లయ్య. నర్సయ్యకు విషయం అర్థమయింది కావచ్చు వత్తెనే నాలెకు మొఖమేసిండు.

"నువ్వెందుకురా బాధపడ్తవ్ ఆ లంజెను తల్లిగారింటికి పంపిద్దాం" అంటూ నర్సయ్యను పట్టుకొని బోరున ఏడ్చిండు బాల్‌తాత.

"ఇగో.. ఏ విషయం పొద్దుగాల మాట్లాడుకుందాం ఇప్పుడెందుకు" అన్నాడు మా అయ్య.

"పొద్దుగాల దాకెందుకే ఇపుడే చీరిపోగులు పెడదాం" అంటూ పళ్ళు కొరుక్కుంటూ లేచాడు రాజన్న.

నర్సయ్య గబాల్న రాజన్న గల్ల పట్టుకొని "ఏందిరా లావ్ ఉరుకులాడుతున్నవ్ ఓవల్ను చంపుతవ్‌రా? చంపుటానికి నువ్వోనివిరా, ఇగో.....మీ అందర్కి చెప్పుతున్న నా పెండ్లాన్ని గాని, పటేల్ను గాని ఎవలు ఏమనేది లేదు. నాపెండ్లాం నా ఇష్టం మీకెందుకు? మర్యాదగా ఎక్కడోల్లక్కడ ఎల్లిపోండ్రి" అనడంతో అక్కడున్నవాళ్ళంతా ఖంగుతిని మొఖాలు చూసుకున్నారు.

బాల్‌తాతకు కోపం పొడుచుకొచ్చింది. "ధు ఆడిగుల్లోడ నీది ఒక బత్కేనార, పార చిన్నోడ, మనం ఈ ఇంట్ల ఉండద్దు ఎక్కడన్న బతుకుదాం ప....." అని చిన్న కొడుకును తీస్కాని కదిలాడు.

"పాండ్రి ఇంకేం జూత్తుండ్రు. ఇదేమన్న బాగోతమా, ఆనికే లేనప్పుడు మనకెందుకు?" మా అయ్య అనడంతో అందరు లేచి నడిచారు.

బాల్‌తాత రాజన్నను తోలుకొని ఎనిమిది రోజులు చుట్టాలిండ్లల్ల ఉండి, తిరిగి వచ్చి నర్సయ్య ఇంటికి దూరంగా పెరట్లో గుడిసె వేసుకున్నారు. గ్రామంలో కొన్ని దినాలదాక అందరి నోట్లో ఇదే విషయం నానింది. మా కులం వాళ్ళంతా కూసుండి "నర్సయ్య ఇంటికి ఎవరు పోవద్దు. వాళ్ళతో ఎవరు మాట్లాడవద్దు. ఆ ఇంటికి అగ్గి

నీళ్ళు బందు పెడ్డాం. ఈ కట్టుబాటును ఎవరైన దాటితే జరిమాన విధించుదాం" అని తీర్మానించారు.

ఏడాది తర్వాత బాల్‌తాత కుక్కిల పడ్డాడు. బాల్‌తాత, మా అయ్యను, ఎల్లయ్యను బంగారయ్యను పిలుచుకొని "నాకు ఊరు దూరమైతుంది, కాడు దగ్గరవుతుంది. నేను చచ్చిపోకముందు నా కొడుక్కు ఏడన్న పిల్లను జూసి లగ్గం చేయుండ్రి, ఆడు జీతం పోయుచ్చి అందుకునుటానికి యాష్టకత్తండు" అని దండంబెట్టిండు.

కులపెద్దలు పిల్లకోసం ఆ వూరు తిరిగితే "తోడ బుట్టిన అన్నగాడు పిల్లనడుగ ఎందుకు రాలేదు" అని అనుమాన పడుతు ఈవూరు పిల్లనిచ్చుటానికి ఎవ్వరు ముందుకు రాలేదు.

చివరకు ఊల్లెనే పిలగాడు మంచోడని ఎల్లయ్యబిడ్డ అమ్మక్కను మాట్లాడి లగ్గం జేసిండ్రు. లగ్గమప్పుడు తోడబుట్టిన తోడుగదా నర్సయ్యను కూడ లగ్గానికి పిలుద్దామని మా అయ్య అంటే "ఆన్ని పిలిస్తే నేను నూతిల దూకి సత్తా" అని మంకు పట్టు పట్టిండు బాల్‌తాత.

పాపం నర్సయ్య దూరంనుంచే చూసుకుంట ఏడిసిండు.

చుక్కారెడ్డి నర్సయ్య ఇంటికి రావడం మానలేదు. చుక్కారెడ్డి వచ్చినప్పుడు నర్సయ్య ఇంటికాడ ఉంటే, చుక్కారెడ్డిని ఆప్యాయంగా పలకరించి కుర్చీ వేసి కూర్చుండ బెడుతున్నాడు. నర్సయ్య కొడుకు శంకరిగాడు కూడా చుక్కారెడ్డి సైకిల్ మోటార్ ఇస్తే చాలు ఎగిరి గంతేసి చెప్పిన పనల్ల చేస్తున్నాడు. పటేలా పటేలా అంటూ చుక్కారెడ్డి ముద్దెంబడె తిరుగుతున్నాడు. విచిత్రమైన వారి ప్రవర్తన అర్థంకాక మావాల్లు బుర్రలు గోక్కుంటున్నారు. సిగ్గుతో తల దించుకుంటున్నారు.

చుక్కారెడ్డిని బాల్‌తాత చూస్తే మాత్రం చించుకుంటున్నాడు. పొడకంటు మాటలంటు కుక్కమీద, నక్కమీద పెట్టి గాలికి తిట్టుకుంటున్నాడు. ఎన్ని తిట్టినా చుక్కారెడ్డి పట్టించుకుంటలేదు. పాపం బాల్‌తాత అదిరి అదిరి కొన్నాళ్ళకు సచ్చిపోయిండు.

చుక్కారెడ్డి పైసలు నింపి నర్సయ్యను దుబాయి తోలేసిండు. నింపి నర్సయ్య దుబాయినుంచి రూపాయలు పంపిచ్చినపుడు, చుక్కారెడ్డే శాంతమ్మను తోలుకొని బ్యాంకుకు పోతున్నాడు. నర్సయ్యకు ఉత్తరాలు రాయడం, వచ్చిన ఉత్తరాలను చదవడం అన్ని చుక్కారెడ్డే చూసుకుంటున్నాడు.

కులం వాళ్ళు కొంతమంది శాంతమ్మతోని చాటుమాటుకు మాట్లాడుతుండ్రని తెలిసి కులం పెద్దమనుషులు పిలిచి మందలించిండ్రు. శాంతమ్మకు తాగుడు అలవాటు చేసిండు చుక్కారెడ్డి.. శాంతమ్మ తాగినప్పుడు కులపెద్దలను, కుక్కమీద, నక్కమీదాపెట్టి పేర్నాల పెట్టుకుంట తిట్టుడు మొదలు పెట్టింది. శాంతమ్మ బండ బూతులు భరించలేక ఆమె నోటికి భయపడి ఎవరు ఎదురు చెప్పలేదు. మా అయ్య గూడ "నాకెందుకు అందరితోని కంటు" అని ఊరుకున్నాడు.

శాంతమ్మకు సోపతి మరో నలుగురు ఆడవాళ్ళు తయారయిండ్రు. సినిమాలకు పోయిన ఎటుపోయిన కలిసేపోతున్నారు. అప్పుడప్పుడు దావతులు కూడా చేసుకుంటున్నారు. ఇపుడు కులం మీదా వారిదే పెత్తనం. వారి మాటకు ఎదురు లేదు.

ఈసారి సర్పంచి పదవి మా ఎస్సీ ఆడవాళ్లకు వచ్చిందని తెలియగానే మా మాలమాదిగోల్లంత కూసుండి "ఎవరిని సర్పంచిగా పెట్టుకుందాం మన ఆడవాళ్లలో ఎవరు తెలివైనవారు?" అని ఆలోచిస్తే చుక్కారెడ్డి ఆయన బంధువులేమో మా వాళ్ళ ఆలోచనకు పూర్తి విరుద్ధంగా "ఎస్సీ ఆడవాళ్లలో ఎవరు తెలివిలేనివారు? ఎవరు మన చెప్పుచేతల్లో కాలికింద చెప్పులెక్క పడి ఉంటరు?" అని ఆలోచించి శాంతమ్మను ఎంచుకున్నారు.

మా మాలమాదిగిండ్లల్ల ఒక్క ఎల్లయ్య కోడలు లచ్చుమక్క ఒక్కతే కొద్దిగంత చదువుకుంది. మా వాళ్లంత కలసి లచ్చుమక్కను సర్పంచి పదవికి పోటీకి నిలబెడదామని అనుకున్నారు. కాని చుక్కారెడ్డి సాగనీయలేదు. "సర్పంచికి పోటీ నిలబెట్టకపోతే గ్రామ అభివృద్ధి కోసం సర్కారు పదివేల రూపాయలు ఇస్తుంది. ఊరికి ద్రోహం చేసేవాళ్ళే పోటీకి నిలబెడతారు" అని చుక్కారెడ్డి ఆయన బంధువులు ప్రచారం చేసి ఇతర కులస్తులను నమ్మించి మా వాళ్ళ మీదికి ఉసిగొల్పి శాంతమ్మకు పోటీ లేకుండా చేసిండ్రు.

సర్పంచి అయిన తర్వాత శాంతమ్మలో చాలా మార్పు వచ్చింది. కట్టుబొట్టు మార్చింది. శూన్యంగా మాట్లాడుతుంది. శాంతమ్మ పేరుకు మాత్రమే సర్పంచి అధికారమంతా చుక్కారెడ్డిది, ఆయన బంధువులదే. శాంతమ్మ పేరుకు మాత్రం పెత్తనం చెలాయించాలని చూస్తుంది. ఎవరైనా ఎగతాళిగానైనా సర్పంచమ్మా అంటే చాలు వారితో తీయగా మాట్లాడుతుంది. మెచ్చుకోనివాళ్ళను చీదరించుకుంటుంది. "పెద్ద పెద్దోల్లు అటువంటిది నాకు విలువ ఇత్తుండ్రు. మీరు ఇత్తే ఎంత ఇయ్యకపోతే ఎంత. ఎంతైనా చిల్లరోల్లు చిల్లరోల్లే. అయ్యో మా చిన్న కులంల ఓ తెలివిమంతురాలు సర్పంచి అయింది దానితోని ఎప్పుడైన పని పడుతుంది. దానితోని మంచిగా కలిసుందాం అన్న ఇంగిత జ్ఞానం లేదు. బతక నేర్పు లేదు చిల్లర కులపోల్లకు. గందుకే గీపాటి బతుకుతుండ్రు" అంటూ దెప్పుతుంది.

ఎవరైన "ఇప్పుడున్న అందరితోని మంచిగా కలిసుండు అందరితోని కొట్లాట ఎందుకు పెట్టుకుంటవు" అంటే "ఇగో మీరు ఓట్లేత్తే నేను సర్పంచిని కాలేదు. నేను మిమ్మల్ని ఓటెయ్యమని మీ కాళ్ళు మొక్కలేదు. నన్ను సర్పంచిని చేసింది పటేండ్లు. మీతో నాకేం పని?" అని ఎదురు ప్రశ్నిస్తుంది.

మా మాలమదిగ ఆడవాళ్లందరికంటే తాను తెలివిపరురాలు, మాటకారి కావటం వలనే సర్పంచిని అయినాను అనుకుంటుంది శాంతమ్మ. కాని అష్టకష్టాలు పడుతూ అజ్ఞానంతో అట్టడుగు స్థాయిలో జీవిస్తున్న మాలాంటి వారు అభివృద్ధి చెందడం కోసం అంబేద్కరయ్య ఎంతో కష్టపడి కల్పించిన రిజర్వేషన్ సౌకర్యాన్ని చుక్కారెడ్డి అక్రమ సంబంధాన్ని అడ్డం పెట్టుకుని దొడ్డిదారిన దొంగిలించాడని తాను, తన జాతివాళ్ళు తెలివికి రాకుండా, ఎదగకుండా చేస్తున్నాడని శాంతమ్మకు తెలియదు. తన కులం వాళ్ళు వెలివేసిన, ఎగతాళి చేసిన చుక్కారెడ్డి, ఆయన బంధువులు చేరదీసి సర్పంచిని చేసి విలువ, గౌరవం కల్పించినారని విశ్వాసంతో వారికి అణిగిమణిగి ఉంటూ, అయ్యా బాంచెన్ అంటూ విధేయురాలుగా మెదులుతుంది. చిన్న కులస్థులను మాత్రం చీదరించు కుంటుంది.

ఆఫీసు పని మీద చుక్కారెడ్డి, శాంతమ్మ కలిసి చిలకాగోరింకల లెక్క సైకిల్ మోటార్ మీద జగిత్యాలకు పోతుంటే గ్రామం నివ్వెరపోయింది. భగ్న ప్రేమికులని

కొందరన్నారు. ముచ్చటైన జంట అని కొందరు మెచ్చుకున్నారు. మా వాళ్లేమో మొఖాలు మాడ్చుకున్నారు.

★ ★ ★

ఏడాది తర్వాత మా అయ్య నన్ను చుక్కారెడ్డికి జీతముంచిండు. జీతము కుదిరిన మొదట్లో చుక్కారెడ్డితోని, ఆయన భార్య మంగవ్వతోని వారి పిల్లలతోని బిడియం చేత భయం భయంగా మాట్లాడితే, "ఆడపిల్లవారా లావ్ సిగ్గుపడుతున్నవ్" అని మంగవ్వ నన్ను దెప్పి పొడిచేది. మంగవ్వ మంచిదే కాని ఆరితోరి అని పిలిస్తేనే గుండెల్లో కెలికినట్లనిపించేది.

కొన్నాళ్ళకు బిడియం తేలిపోయి కొద్దికొద్దిగా మెలితమయిన. కాని నాతోటి పాలేరు బుచ్చన్నతోటే తిప్పలుంది. బుచ్చన్న మా పాలోడే. వరుసకు అన్నవుతడు. ఒట్టి కండ్లమంట మనిషి. మంగవ్వతోని కొద్దిగా మంచిగా మాట్లాడితే చాలు కడుపెర్రి చేసుకుంటాడు. ఒట్టిగానే కసురుకుంటాడు. అతనిమీద నేనేమైనా ఎక్కిరాలు చెబుతానని భయమో ఏమో? అయినా మా అయ్య జీతము కుదరంగనే చెప్పిండు ఆడు పుండకోరు మనిషి ఆనితోని జెర జాగ్రత్తగా ఉండుమని.

మిరపతోటకు పురుగుల మందు కొట్టివచ్చి మోటార్ మమ్ములింట్ల దాచి పెడదామని ధనధన పోయి గుమ్ములింట్లోని దృశ్యాన్ని చూసి భూమి గిర్రున తిరిగినట్లనిపించి కళ్ళు మూసుకున్న. నన్ను చూసి మంగవ్వ, బుచ్చన్న లేచి మూలకు ఒదిగిండ్రు. మనసు మనసులో లేదు. మౌనంగా బయటకు వచ్చిన.

మా చిల్లర కులంలోనే అనుకున్న వీళ్ళదాంట్లో కూడా... మరి శాంతమ్మ చుక్కారెడ్డి సంబంధం గురించి ఊరందరికీ తెలిసి ముచ్చట్లు పెట్టుకున్నట్లు మంగవ్వ, బుచ్చన్న సంబంధం ఎందుకు పొక్కలేదు? ఒకవేళ తెలిసినా ముచ్చట్లు పెట్టుకోవ డానికి జనం భయపడ్డారా? ఏమైన పెద్దోల్లు పెద్దోల్లే, చిన్నోల్లు చిన్నోల్లే. పెద్ద కులపోల్లు తప్పు చేసినా గాని గౌరవించబడతారు. అదే తప్పు చిన్నకులపోల్లు చేస్తేనేమో చులకనవుతారు. ఇందులోని మతలబు ఏమిటో అర్థమయి సావదు.

తెల్లవారి నేనే తప్పుచేసినవాడిలా మంగవ్వ మొఖంలోకి సూటిగా చూసే ధైర్యం లేక నాలె గీతలు గీసిన. మంగవ్వలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. బుచ్చన్నతో కూడా ఎప్పటిలాగే మాట్లాడుతుంది. "జెర బుచ్చిగా" అని ఆరితోరి పిలుపు కూడా మానలేదు.

నర్సయ్య రెండేండ్లకు దుబాయి నుండి వచ్చిండు. మనిషి ఎర్రగా బుర్రగా అందంగా తయారయిండు. చుక్కారెడ్డికి, మంగవ్వకు వారి పిల్లలకు బట్టలు, గడియారాలు, బోలెడంత సామాను పెట్టిండు.

నేను బుచ్చన్న కరెంటు మోటార్ పెట్టి పల్లి చేనుకు నీళ్ళు కడుతున్నము. కరెంటు పోయింది.

"పల్లి కాయ కాల్చుకుందాం పార మల్లిగా కరెంటు వచ్చేదాక" అన్నాడు బుచ్చన్న.

"దబ్బన పటేలత్తే తిడుతడే" అన్న భయపడుతూ.

"అత్తే భయమా ఏందిరా? ఒట్టి పెలగానివున్నవు నీవు" అంటూ పదిగల్ల పల్లి దంట్లు పీకి కట్టెలు జమ చేసి కాల్చిండు.

"మిరిగుడ్లు పెట్టుకొని ఏం జూత్తున్నవ్ వచ్చి బుక్కు" అన్నాడు పల్లికాయలు బుక్కుతూ.

ఈని కొంప కాలిపోను. ప్రతిమాటకు తిట్టుడే. వీడో పెద్ద జగమొండి. అన్ని మొండిపనులే, పిలిచి పిల్లనిత్తనంటే వయసు ముదురన్నట్లు. ప్రేమ కొద్ది పిలిచినప్పుడు ఎందుకు వద్దందమని పోయి పల్లికాయలు బుక్కుతూ బుచ్చన్న మొఖంలోకి చూస్తే ఎందుకో జాలి అనిపించింది. "బుచ్చన్న! మొన్నటిది ఏం పనే పటేల్‌కు తెలిస్తే ప్రాణం మీది కత్తది" అన్నాను నీ మంచికోసమే చెప్తున్న అన్నట్లు ఫోజు పెట్టి.

బుచ్చన్న నా మొహంలోకి చూసి నవ్వి "ఓరి పిచ్చోడా! పటేల్కు తెలవదను కుంటున్నవా? ఒకసారి నర్సయ్య..."

నర్సయ్య పేరెత్తంగనే నా గుండె ఝల్లుమంది. ఇంకేమి వినవలసి వస్తుందోనని... అంతట్లకే అనుకోకుండా చుక్కారెడ్డి పటేల్ వచ్చి "కరంటు బందుపెట్టి కడుపులు ఎల్తి ఉన్నయని పల్లికాయ కాల్చుకుని బుక్కుతున్నారా" అంటూ బూతులు తిట్టుడు మొదలుపెట్టిండు.

"ఏ నేను బుక్కతలేను పటేల. కరంటుపోవుట్ల వట్టిగానే కూసున్న. వీడే వద్దు పటేలత్తే తిడుతడని నేను చెప్పంగ కూడా కాల్చుకుని బుక్కుతుండు" అంటూ నా ముందటున్న పల్లికాయ పొట్టును చూపించిండు బుచ్చన్న. నేను నివ్వెరపోయిన. నోట మాట రాలేదు. పటేల్ తిట్టినందుకేమో కాని బుచ్చోని దగుల్బాజీతనానికి దుఃఖమచ్చింది. వీడు పల్లికాయ బుక్కుతూ పొట్టు నా ముందట వేస్తే, ఒక్క దగ్గరగా కుప్పగా ఉండాలని వేస్తుండు కావచ్చు అనుకున్నాను. కాని గింత ఉషార్‌తనం చేస్తడని అనుకోలేదు, గింత తాడు దొంగతనమా? మీది కుండ మీదుండంగా కింది కుండ తప్పదీసే రకం వీడు. ఊలపెట్టేది వీడు, నింద మోసేది నేనా? ఇట్లా ఎన్నోసార్లు జరిగింది. కాని ప్రతిసారి అట్టనే జేస్తడ అనుకుంట నమ్మి మోసపోతున్న; చుక్కారెడ్డి పటేల్ తిట్టి తిట్టి పోయినంక బుచ్చోడు నన్ను చూసుకుంటు ముసిముసి నవ్వితే నాకు కడుపంత ఎదిరింది.

"ఒరేయ్ పుండకోరోడ నా పాపం దల్గి చచ్చేటప్పుడు పురుగుల పడిసత్తవురా, పుట్టంగనే పుట్టెడు అబద్ధాలతోని పుట్టినవురా ఇషప్పుచ్చోడ" అంటూ పెద్దోడని చూడకుండా నా ఇష్టమచ్చినట్టు తిట్టిన. ఎంత తిట్టినా నవ్వుతూనే ఉన్నాడు నల్ల మొఖపోడు కుళ్ళు బుద్ధోడు.

★ ★ ★

ఈ లంగ బుచ్చోని తోటి నాకు తిప్పలే ఉంది. ప్రాణం మంచిగా లేదని పనికి తప్పించి దావఖానకు పోతున్నానని పటేల్కు చెప్పి జగిత్యాలకు పోయిండు. వాని అగలన్ని నాకు మా ఏర్పాటే, జగిత్యాల్లో కొత్త సినిమా పడ్డప్పుడల్లా అనికి ప్రాణం మంచిగుండది. ఈడ చిన్నపని, పెద్దపని అన్ని నేనే చేసి సావాలె. చుక్కారెడ్డి పటేలు ఇంటిపట్టున ఉండడాయె. ఎప్పుడూ రాజకీయాలేనాయె. అదురుకుంటు పొలంలో

నారుమడి దున్నటానికి బయలెల్లి నాగలికి ఎడ్లను కడుతున్న. మంగవ్వ పక్కింటి సత్తవ్వతోని ఏదో విషయం మాట్లాడుతూ "మాల మాదిగ జాతి చిల్లర జాతి గదా, వాళ్ళకు సిగ్గు మానం ఎక్కడ్డి" అంది. ఆ మాటతో నా గుండె చిట్టినట్లయింది. "ఏంది మాలమాదిగ జాతి చిల్లర జాతా ఎందుకు? దేనికి? పల్లికాయలు కాల్చుకున్న సంఘటన గుర్తుకువచ్చి లపంగి, తాడుదొంగ బుచ్చోడు కండ్లల్ల మెదిలిండు. ఈమె కూడా అచ్చం మా బుచ్చోని సాత్రమే. మా బుచ్చోని తియ్యరాదు, దీన్ని పెట్టరాదు. దొందుదొందే. అవకాశవాదులు. ఎంత ఆపుకుందామన్నా ఆవేశం ఆగలే, సర్రున పోయి "ఔనవ్వ, మా మాలమాదిగోళ్లం తప్ప అందరు సక్కటి పూసలే, రంకు నేర్చి, బొంక నేర్చుడు అందరికి చేతనవుద్దా? చూడు తల్లి! ఏ కులంలోనైనా మంచోల్లు ఉన్నరు. చెడ్డోల్లున్నరు. కులం పేరుపెట్టి తిట్టుడెందుకవ్వ" అన్నాను.

సత్తవ్వ కల్పించుకుని "అవును బిడ్డా నువ్వన్నట్లు ప్రతి కులంలోనూ మంచోల్లు ఉన్నరు, చెడ్డోల్లు వున్నరు. కులం పేరుపెట్టి అనుడు తప్పే" అంది. నేను అదే కోపంతో విసురుగా వచ్చి నాగలి ఎడ్ల మెడల మీద పారేసుకుని పొలానికి బయలెల్లిన. ఛీ! మాటలకు చేతలకు పొంతనుండని ఇట్లాంటి మనుషుల మధ్య ఇముడుడు కష్టం అనుకున్నాను.

నేను చుక్కారెడ్డికి జీతం బందయి మా అన్నతోని చిల్లర పనికి (క్రికిలి) పోతున్నా, నర్సయ్య రెండేండ్ల కొకసారి వచ్చుకుంట పోతుండు. నర్సయ్య కొడుకు శంకరిగాడు చదివే కాలేజీలోనే చుక్కారెడ్డి బిడ్డ రజితవ్వ చదువుకుంటుంది. ఎన్ని రోజులవుతుందో వాళ్ళు ప్రేమించుకోవట్టి. పరీక్షలు రాసినంక ఎవరికి చెప్పకుండా ఎటో లేచిపోయిండ్రు. ఈ కథ ఇలా మలుపు తిరుగుతుందని నేను ఏనాడూ అనుకోలేదు.

చుక్కారెడ్డి ఆయన బంధువులు కోపంతో ఊగిపోతు శాంతమ్మ ఇంటికి వచ్చి ఇంట్లోని సామానులన్ని ఆగమాగం చేసి "నీ కొడుకేడే?" లంజకొడుక్కు మా అమ్మాయే కావల్సివచ్చిందా? మా ఇజ్జతి తీసిన గాడిదకొడుకును బతకనియ్యం ఎక్కడున్నడో చెప్పు" అని బాధిచ్చుకుంటు శాంతమ్మను కొట్టిండ్రు.

మీకు ఎక్కడెక్కడ చుట్టాలున్నరో అక్కడక్కడ తిరిగి మా అమ్మాయిని మాకు అప్పగించకపోతే ఊల్లెకేయి ఎల్లగొడ్తం లంజె" అని బెదిరించి పోయిండ్రు.

శాంతమ్మను కొట్టంగ మా కులం వాళ్ళు ఎవరు అడ్డపోలేదు. "అడ్డంపోయే ముఖముంచిందా?" అని తిట్టుకున్నారు. కులంలేని పక్షి వనం ఇడిసిన కోతిలా అయింది శాంతమ్మ పరిస్థితి. ఇన్ని రోజులు ఆప్యాయంగా చూసుకొన్న చుక్కారెడ్డి ప్రేమ ఎట్లాంటిదో అర్థమయింది శాంతమ్మకు. నిప్పులు గక్కుతున్న చుక్కారెడ్డి నిజస్వరూపం చూసి భయపడింది. గప్పుడు శాంతమ్మ మా యింటికి వచ్చి మా అయ్యను పట్టుకొని భోరుమని ఏడ్చింది.

ఇప్పుడు మా వూల్లె ఎక్కడ జూసిన ఇదే ముచ్చట. ఇద్దరికో గుంపు, ముగ్గురికో గుంపు. 'గింత పాపమా' అని కొందరు, "చిల్లర కులపోల్లకు కాపురాలచ్చినాయి" అని కొందరు, "కలికాలం, దునియా కరాబయింది" అని మరికొందరు. ఊరంత పొగసూరినట్లు ముచ్చట్లే ముచ్చట్లు. ముచ్చట్ల పందుగోలె.

కాని ఇందులో ఇంత విద్వారమేముందో? జరగరాని ఘోరం ఏం జరిగిందో? మా శంకరిగాడు కానిపని ఏం జేసిండని ఎందుకు ఇంతగనం ఆడిపోసుకుంటు ముచ్చట్లు పెడుతుండ్రో నాకు మాత్రం ముక్క కూడా అర్థం కావటంలేదు.

ఒకవేళ వాళ్ళు లేచిపోవడం విచిత్రం అనుకుంటే, ఇరవై యేండ్ల పొద్దుసుండి, శాంతమ్మకు భర్త ఉండంగా కూడా సొంత పెండ్లంతోని కులికినట్లు కులికిండు చుక్కారెడ్డి. కులం ఐక్యమత్యాన్ని దెబ్బతీసి కులం కట్టుబాట్లను కాలరాసిండు. అప్పుడు మా కులం ఇజ్జతి పోలేదా? అప్పుడు కొన్నిరోజుల దాకా మావాళ్ళ మొఖాలమీద నెత్తురు చుక్కలేదు. అది విచిత్రం కాదా? ఆయన బంధువులకు అప్పుడు లేని కోపం ఇపుడెందుకు? ఇజ్జతి పోయిందని లబలబ మొత్తుకుంటుండ్రు. అప్పుడు ఇజ్జతు పోలేదా? కులంగాని దానితోని అక్రమ సంబంధం పెట్టుకుంటే పెద్దిర్కమనుకున్నరా! అక్రమ సంబంధాన్నేమో ఒప్పుకుంటున్నారు. అదే చట్ట ప్రకారం న్యాయమైన బంధాన్నేమో తప్పు పడుతుండ్రు. అంటే వీళ్ల దృష్టిలో శీలం కంటే కులం గొప్పదేమో! ఏమో! ఈ మనుషుల మనస్తత్వం అర్థం కాదు.

ఎనిమిది రోజులకు తెలిసింది మా శంకరి గాడు, రజితవ్వ కోర్టులో పెండ్లి చేసుకున్నారని. మళ్ళీ మా ఊరు జనం ముచ్చట్లకు మూతులు చాపిండ్రు, చెవులు కొరుక్కుంటుండ్రు నొప్పి పుట్టేలా...

● 'నేటి నిజం' దినపత్రిక - 2002 ●

● తిరుగు ప్రయాణం కథల సంపుటి - 2003 ●

# 80. బోరు పొక్కలు

♦ బోధనం నర్సిరెడ్డి ♦

"ఏందల్ల గింత పాపమై పాయె. ఊల్లె గుడ్డబట్టలోళ్ళు బతికేకాలం లేకుంట య్యింది గద.

మా భూమిల మీము బోరేసుకుంటె పొక్క బూడ్పుత మంటరు గిదెక్కడి నాయం? యాడ జెప్పు నేర్శిండో చెప్పురి జెర ఎవ్వారం?"

భార్య సోములమ్మ మందిలకొచ్చి కోపంతోటి మాట్లాడుతుంటె యాపచెట్టు మొదలు సుట్టేశిన అరుగుకు అనుకోని కూసున్న భిక్షంరెడ్డి సప్పుడు జెయ్యకుంట తలకాయ నేలకేశి పుల్లతోని గీతలు గీస్తున్నడు. సర్పంచి మొగడు వెంకటకృష్ణ, ఉపసర్పంచి పర్వతరెడ్డి, ఊరిపెద్ద మడుసులంత చెట్టునీడన కూకున్నరు అక్కడోళ్ళు అక్కడోళ్లు. పనిపాట మానుకున్న జనాలు ఇంకా శానామంది పంచాయితి ఏమైద్దోనని ఎదురు చూస్తున్నారు.

"ఏందమ్మో అట్లెందుకు మొత్తుకుంటువుగని నువ్వేచెప్పు నాయం. తెల్సినోళ్ళు ఓళ్ళు జెప్పితేంది? మీమే చెప్పాల్నని యాన్నన్న ఖరారున్నదా? ఏంలేదుగద. మీరు మీ భూమిల్నే బోరేసుకున్నరుగని సుట్టు నాలుగైదు బోర్లు నిలువున ఎండిపోయినయ్. నడూల్లె నీళ్ళటాంకి కేశిన బోర్ల సుక్క నీళ్ళు గూడస్తలేవు. ఊరందరికి మంచినీళ్ళు లేక గొతులెండి పోయే కాలమొచ్చింది. నువ్వొక్కదానివి నా భూమిల నీను బోరేసుకున్న నని ఎవసాయం జేసుకుంటె తతిమ్మోళ్ళు నీళ్లు దొర్కక ఊరిడిశిపెట్టి పోవాల్నా? చెప్పు? గందికనే మీ ఒక్కబోరు బందుబెడితె ఊరందరికి నీళ్ళు దొరుకు లేకపోతె లేదు. నువ్వే చెప్పు ఏంజేయాల్నో."

వార్డు మెంబరు చెన్నకేశవులు మాట్లాడిండు.

"నువ్వన్నదిగూడ నిజమేగని చెన్నకేశవులన్నా! మరి కడుపుల పేగుల్లేనోళ్ళం మీమెక్కడబోవాలె చెప్పు. మాకున్నదే రొండెకరాలు. వరిచేను పొట్టకొచ్చి ఈనమోపుల మీదున్నది. గిన్ని గిన్ని బోశిన చిన్నబోరు నిన్న మొన్న బొత్తిగ ఎండిపాయె మీరు సూస్తనే ఉంటిరి. ఎన్ని నీళ్ళు బడ్డా మాకు ఈ రెండెకరాలే గద! మందంద - రోతిగ పుట్లకుపుట్లు ఒడ్లు పండిచ్చుకుంటుంటిమా? ఎకర్రాలకెకరాలు తోటలు బెట్టుకుంటిమా? ఓడు దొంగంటె గుడ్డబట్టలోడే దొంగని మా మీదికే ఒచ్చినాది

తప్పు? సరె! మీరు జెప్పినట్టే బోరుపొక్క పూదేద్దురుగని మా పొలానికి నీళ్ళు బెట్టురి మరి యాన్నించి దెస్తరో తెచ్చి - ఇప్పుడు బోరుకు మోటరుకు గలిపి ఇరవై ఎయిల రూపాలైనయ్. అయిగుండ గట్టియ్యిరి ఊకుంటం."

తోచినతీరుగ మాట్లాడింది సోములమ్మ.

చెన్నకేశవులు ఏమనునోగని ఆయిన మాట్లాడకముందే సర్పంచి రాములమ్మ మొగడు వెంకటకృష్ణ అందుకున్నడు.

"ఏందమ్మో ఏమో లెస మాట్లాడుతున్నవు? మీ పొలానికి ఊరోళ్ళను నీళ్ళు బెట్ట మంటవు. బోరేసుకున్నం పైసలియ్యమంటవు! బాగుందే నీ ఎవ్వారం! యూడ దెచ్చిస్తరు మంది? పున్నేనికొస్తయా డబ్బులు? ఏదో మీము మాట్లాడ్తంగని జెరదాలు నువ్వు! ఏందే? నువు సప్పుడు జెయ్యక గూకున్నవు! ఆమేమొ మందిలకొచ్చి మాట్లాడుతుంది!"

భిక్షంరెడ్డి దిక్కు తిరిగి అడిగిండు.

"ఏందిర ఎట్నో మాట్లాడుతవ్. లెక్కెంట మాట్లాడితందుకు ఓలైతేంది? నువు మాట్లాడ్తలేవార? సర్పంచిగిరి మీ ఆమెదైతే ఆమెను మూలకు బెట్టి నువ్వే తిరుగు తుంటివి కచ్చీర్లన్ని. మీ చిన్నమ్మ మాట్లాడింది గదగదే మాట్లాడ్త నీను గూడ. చెప్పురి ఏం జెప్పుతరో మరి మీరు? బోరు బందుజేశి పొలానికి నీళ్ళు బెడ్తరో! లేకుంటె మమ్మల్ని తట్టబుట్ట సదురుకోని ఊళ్ళెనించి పొమ్మంటరో!"

భిక్షంరెడ్డికి నోరు తెరిస్తె ఆవేశమాగదు. ఊరు ఊరంత తనను ఎలేశి ఊరెల్ల గొడుతున్నట్లనిపిస్తున్నది. దుఃఖమో కోపమోగాని గొంతు ఒనికి గుడ్లల్ల నీళ్ళు గమ్ముతున్నై.

"ఏందిరా! అట్ల కాకులు మొత్తుకున్నట్టు మొత్తుకుంటరు? ఆవేశపడి అరుచుకుంటె ఆయాసం చేటేగని ఏమన్న సంపాయిస్తరా? ఊరందరి కోసమేగా అందరమాలోచించేది! మరి ఊల్లె అందరం బాగుంటెనేగా ఊరు బాగుండేది! ఊరికి నీళ్ళు దొరకవని ఆని బోరు బందుజేశినప్పుడు మరి ఆని బుతుకుగూడ యోచన జేస్తెనేగా ఊరు! లేకుంటె ఊరికి అడవికి తేడేముంటది? ఎప్పుడు ఇట్నే కాలం బోతదా? దేవుడు కన్ను దెరిశి ఒక్కేడు చెరువులు నింతె మళ్ళీ నాలుగైదేండ్ల దన్న నీళ్ళ కరువుండదు. మనకీ పంచాయితులు గూడుండవ్! కాబట్టి నాకు తోచిన మాట జెప్త. జర అందరు నిమ్మలంగినురి."

అనికాసేపు ఆగి జేబుల్నించి అగ్గిపెట్టెదీశి సిగరెట్టు ముట్టిచ్చుకున్నడు, పించిని పుచ్చుకున్న పంతులు పర్వతరెడ్డి ఆయిన రిటైరయినంక వార్డు మెంబరై ఊరికి సర్పంచయ్యిండు. కొడుకు ఏదో ఆఫీసరు నౌకరే చేస్తున్నడు. తోట, ఎవసాయం గిట్ట బానే సాగుతున్నది.

ఏం జెప్తవో చెప్పరాదు! అన్నట్లు సూశిండు సర్పంచి మొగుడు.

"ఎవ్వరేం జెప్పినాగని మాకన్నేలం జేస్తె మటుకు మీమూకోం! ముంచి మూడు ఏంచేడు దోశిళ్ళ మన్ను బోస్తం ఊరిమీద!"

రాములమ్మ మాట పూర్తిగాకుంటనే... ఏందమ్మో కాపామె ఎట్నో మాట్లాడ్తవ్? పెద్ద మడ్సి మాట్లాడ్తనే ఉండె ఊకోరాదు! ఏమో గింత ఓపికలేకుంట ఊర్ని సాపిస్తవ్! ఊకోరాదు!" అన్నరు మందిలనుంచి ఎవరో -

"అరేయ్! ఎవర్రా ఆడు మీం మాట్లాడ్తనే ఉంటిమి మీకెందుకుర మజ్జల పన్లేనోల్లంత జమయింద్రు నోరు మూసుకోని ఇనుర్రి. లేకుంటె ఇండ్లల్లబడ్డ దన్కపోరి. నుడుమ నడుమ మాట్లాడితె మటుకు మర్యాదగుండదు."

కోపం జేశిండు పర్వతరెడ్డి.

మాయదారి కాపోడు కర్రిర్గకుంట పాము జావకుంట ఏం తీర్మానం జేస్తడో చూద్దామని మంది గమ్మున ఊకుండ్రు.

"ఇగో రాములమ్మ! నోరుందని మొత్తుకోకుగని జర నిమ్మలంగిను. ఈ ఊరోళ్ళంత నీకేం పగోళ్ళు గారు. మీమేం నిన్ను ఊల్లెనుంచి ఎల్లగొట్టాలని అనుకోలె. ఈ ఎండకాలం ఊరెడుమందికి నీళ్ళు లేకపోతె ఎట్లైతది చెప్పుమరి నువ్వే! అందుకనే నేనొక్కటి చెప్తున్న సమ్మతైతదేమొ సూడు! మా రాళ్ళబాయిబోరు ఓ మోటెడు మోటెడు నీళ్ళిల్తుండె. దానికింద మొత్తం జొన్నచొప్ప జల్లినం - నడుముల్లోతు పైన్నే పెరిగింది. ఇగ దానికి నీళ్ళు గట్టినా కట్టకున్నా ఒకటే. ఒక నాలుగైదు పైపులేస్తే ఆ నీళ్లొచ్చి మీ పొలంల బడతై. పైపులు గూడ మీరేం దెచ్చుకోవద్దు. తోటలకు నీళ్ళు బట్టే పైపులు మాయే ఉన్నె. ఎట్నో ఈ యాసంగి కారొక్కటెల్తె ముందుకు జూద్దాం మీ బోర్ని మోటర్ని ఏంజేయాల్నో. గంతేగని ఇంతమందిని గాదని మా బోరు, మా భూమి, మా ఇష్టమని అంటె మటుకు బాగుండదు. అదిగాక ఈ సంవత్సరం కార్తీకం, మార్గశిరంల తుఫాన్లు గూడరాలే. అంధుచేత ఈ ఎండాకాలంల తుఫాన్లొచ్చినా ఒస్తె ఓపాలి మంచి నడెండకాలం వైశాకమాసం ఎల్లుదలల చెరువులన్ని అరుగులెల్లినై. గట్ల గిట్లయ్యినా ముందుకు అందరం బానే ఉంటం. లేకపోతే అప్పుడే సూద్దాం ఏంజెయ్యాల్నో" అని అలిపిరి దీసుకున్నట్టు ఆగిండు పర్వతరెడ్డి. సిగిరెట్టు పూర్తిగాలకుంటనే నేలకురాశి పక్కన పడేశిండు.

సర్పంచి మొగనికిగాని, ఊళ్ళెమందికిగాని పర్వతరెడ్డి జెప్పిన తీర్మానముల మతలబేందో అర్థంగాలె. జర నాలుగు పైసలున్నోడు, ఈ నడుమ ఊరికి ఉపసర్పంచై నోడు, కొత్తగా ఊళ్ళె తెలంగాణ పార్టీ బెట్టినోడు, మంచి పంతులని పేరు దెచ్చుకున్నాడు ఊరికోసం ఉదారంగ నీళ్ళు బెడుతున్నడనే అనుకున్నరు గని ఆయన మనసులున్న తెలివితేటలు ఓళ్లకు అంతుజిక్కలే.

అందరు సరేనన్నట్టు కూకున్నోళ్ళంత లేశింద్రు.

"ఏంర భిక్షం! ఇంక నువ్వేం దేవులాట బెట్టుకోకు. అంత నీను జూసుకుంటగని. మా జీతగాని పోరన్తోటి పైపులు బంపిస్త. ఇంత అన్నందిని పొయ్యి ఇద్దరు గల్సి పైపులు దగిలిచ్చుకోరి" అని భిక్షంరెడ్డితోని చెప్పిండు పర్వతరెడ్డి.

అట్ల భిక్షంరెడ్డి బోరుపొక్కను ఆయనకు గాకుంట జేశింద్రు ఊరిజనం. మోటరు దీశేశి మొత్తం పొక్కను పూడెయ్యకుంట కేస్కింగుమీద మూతబెట్టి మన్నుగప్పింద్రు.

★ ★ ★

"ఏందో భిక్షం పొలమంత తేల ఈని అర్రొంచింది గద? ఇంకో పది పదిహేను రోజులకు తడిదప్పితె బానే ఉండెట్టుంది'

ఒకనాడు భిక్షంరెడ్డి పొలం కాడికొచ్చి పల్కరిచ్చిండు పర్వతరెడ్డి.

"ఏమోనె! ఈ ఏటికైతె... ఏగెం తెల్లారితటుందిగని ముందుకేమయిద్దో తెల్వకుంటుంది" అన్నడు భిక్షంరెడ్డి.

"గదేరా గది మాట్లాడ్డామనే గీడిదాకొచ్చిన. మొన్న మీ అల్లుడొచ్చిన్నాడే ఇంటి దునుకొద్దామనుకున్నగాని మండల మాఫీసుల పనిబడి నల్లగొండకు బొయిన. మీ బుజ్జినిచ్చింది అడిశర్ల పెళ్ళే గదుర అది చిన్నడిశర్ల పెళ్ళా? పెద్దడిశర్ల పెళ్ళా?" అడిగిండు.

"పెద్దడిశర్ల పెళ్ళేగని ఆళ్ళిప్పుడు అంగడిపేట గేటుకాడ రోడ్డుమీదనే ఉంటుండ్రు. ఆడ ఓ నాలుగర్రల ఇల్లు గట్టిండ్రు. గుడిపెల్లి శివార్ల శింగరాజుపెల్లి దగ్గర పన్నెండెకరాల భూమికొన్నరు. ఆల్ల బాయి, పొలం అక్కంపెల్లి చెర్ల మునిగిపాయె గదా! దానికొచ్చిన పైశల్తోటి భూమి గొన్నరు. మా అల్లుని ఇద్దరు చెల్లెండ్ల పెళ్లిగూడ నిరుడొక్కపాలే చేశిండ్రు. ఏదో భగవంతుని అదురుష్టాన ఆళ్ళు బానే ఉన్నరుగని మాకే ఒచ్చింది టంగు."

భిక్షంరెడ్డి అడిగిన ముచ్చట అడగని ముచ్చట అంతజెప్పిండు బుక్క మలిపినట్లు.

"అదేరా అక్కడ పుట్టంగండి ఎత్తిపోతల నీళ్ళతోటి అక్కంపెల్లి చెర్వు భజానా చేశిండ్రు గద! దాంట్లెనించి కాలువదవ్వి మన పానగంటి చెర్ల గలిపిండ్రు. పానగంటి చెర్వుకట్ట గూడ ఎత్తులేపిండ్రు.

ఈ ఏడు వానలు బడక సాగర్ నిండలేదుగని మన కనగల్లు, పానగల్లు రెండు చెర్వులు నింపితె మనకు ఎంత ఎట్టొచ్చినా నీళ్ళు కరువుండదింక."

సానుభూతిగ మాట్లాడిండు పర్వతరెడ్డి. భిక్షంరెడ్డి భూమికి పుటంబెట్టాలన్న తన మనసుల మాటను ఎట్ల బైట బెట్టాల్నో ఆయనకు దబ్బున సమజైత లేదు.

"ఈడ మట్టుకు నీకోళ్ళున్నర్ర? ఉన్నది ఒక్క బిడ్డనాయె? బుజ్జి పెండ్లప్పుడు దేవరకొండ ఉత్త బెట్టె రాజ్యమని పిల్ల నియ్యాలంటె భయపడ్డంగని ఇప్పుడా అక్కంపెల్లి చెరువు సుట్టుపక్కల ఊళ్ళల్ల నీళ్ళ కరువు లేకుంటయ్యింది. కాల్వకిందిరోకు బావులు దియ్యనిస్తలేరు గని పైరోకున్నోళ్ళు కాల్వకట్టకు పది ఇరవైగజాల దూరంగ గూడ బావులు దవ్వుకుంటుండ్రు. మూడుకోలలుగూడ నిండ తెగకముందే నీళ్ళు బడుతున్నయ్ ఒక్కొక్కతాన. మొన్న పి.ఎ.పెల్లి అదే పెద్దడిశర్లపెల్లి మండలాధ్యక్షుడి బిడ్డ పెండ్లికి బొయినప్పుడు సూశిన నేను.

ఇదంత పర్వతరెడ్డి ఎందుకు చెప్పుతున్నడో అర్థంచేసుకునే తెలివితేటలు భిక్షంరెడ్డికి లేవు. అహా! అట్లనానే అనుకుంట ఊకొడుతున్నడు.

"మరేమనుకుంటున్నవ్‌ర! నువ్వేనుకుంటవోనని ఊకున్నగని మన్న పంచాయితినాడే చెప్పుదామనుకున్న నీకు. భూముల ధరలుగూడ ఇంక బాగ పెరుగలేదు అక్కడ. మనకంటె నల్లగొండ దగ్గర జేబట్టి నీళ్ళున్నా లేకపోయినా ఉత్త

పర్ర దుబ్బలకుగూడ నలభై యాభై వెయిలు పలుకుతున్నది ధర. అక్కడయితె పదిపదిహేను వెయిలగ్గూడ ఎకరం దొరుకుతున్నదంట. భూమి. మాదున్నకాడికి అమ్మి మీం గూడ అడు బోతెనే బాగుండుననిపిస్తున్నది. మావోని నౌకరు గూడ దేవరకొండకయ్యింది. పట్నం నించి రొజొచ్చి పోతున్నడు."

తను భిక్షంరెడ్డి భూమిని కొనాల్నని మనసుల ఉంచుకోని తన భూమే అమ్ముతనని మదత మాటలు చెప్పుతున్నడు పర్వతరెడ్డి.

"నిజమానె! మొన్న నీను మా అల్లున్ని అడుగనన్న అడుగనైతిని. నాకు బోరు పుల్లగ బడ్డది నీళ్ళకు ధోకలేదనుకున్నగని గిట్ల నా బోరు పొక్క నాకు అక్కరకు రాకుంట బోద్దని తెల్వదాయె. ఆడ యాన్నన్న ఒక్కతాన అయిమన్న ఖండం దొరుకుద్దేమొ ఈ రొండెకరాలు అమ్ముకోని అటుబోతెనే బాగుంటెట్టుంది."

చివరకట్ల తనచెప్పుదామనుకున్నమాటల్ని భిక్షంరెడ్డి నోట్లెనించి రప్పించ్చిండు పర్వతరెడ్డి.

"అవున్రా! నీకు నాకు మజ్జన ఆచాకలోల్ల ఇనారా చీర్కెమటుకే ఉంది. దాన్నిగూడ ఆళ్ళు పత్తుల పొత్తుల బేరం బెట్టిండ్రు. మొన్న మా పిలగాడొచ్చినప్పుడు చెప్పిన ఊల్లె పంచాయితి సంగతి కూడ. ఆ చాకలోల్ల చీరికెతోపాటు నీదిగూడ కలుపుకుంటె అంత ఓ పదెకరాలైతదీడ. ఆ ఈదెమ్మ గుంటితోట ముసల్దైపోయింది. ఇంతలోనుదీశి మల్ల ఈడిన్ని బతాయి చెట్లేస్తే బాగుండుననిపిస్తుంది. మావోడైతె ఎందుకే జంజాటమనే అంటున్నడుగని."

పర్వతరెడ్డి మెల్లగ బైటబడ్డడు.

"ఈ ఊరోళ్ళె నన్ను ఎట్టైనా నెగల్నియ్యటట్టుంది. ఆచాకలోల్ల చీరికెతోటి గల్పి నాది గూడ దీస్కో ఇగ. ఇయ్యాల్సింది మీ కోడలామె తోటి ఇశారిస్తగని, మరి ఎకురం ఎట్ల బెడుతున్నవు ధర" అడిగిండు భిక్షంరెడ్డి.

"నీను కొత్తగ బెట్టెదేందిర? ఊళ్ళె అమ్ముతలేరా? కొంటలేరా? భూములు. నల్గురు గూకోని ఏది నికురం జేస్తె గదే ధర" అన్నడు పర్వతరెడ్డి.

"అదిగాదే ఎప్పుడో పదేండ్లకింది పడావు భూమి చాకల్లదైతె సక్కదనాల బోరుపడి ఎకురం ఐదారు పుట్లబండే ఏగిలి తరినాదాయె. రొండు ఒక్కటేనంటె ఎట్ల? దేని ధర దానికి జెయ్యొద్దు మరి?"

"సరే అట్నే కానియ్యరాదుర! ఇప్పుడే తొందరపడ్తవెందుకు? ఈ యాసంగి వరికోత లైనంక మాట్లాడ్దాం. నువుగూడ అక్కడ మీ అల్లునికి జెప్పి యాన్నన్న మంచి యాకండి కిత్త దొరుకుద్దేమొ సూడమను. మల్ల పైశలాగమైపోత్తై. ఈడివిట్నే అనామతుగ దీస్కపొయ్యి అడ గడ్తె బాగుంటది."

సలహా జెప్పిండు పర్వతరెడ్డి.

బాయిసుట్టు తాటిబొత్తలే. మంచి పరుపుదాళ్ళ సీజను. గవుండ్లోళ్ళు ముస్తాదులు గట్టి పొద్దుటపూట కల్లొడుస్తున్నరు. భిక్షంరెడ్డి తాడు నొడిశిలొట్టి దీస్కోని బోరుకాడి కొచ్చిండు గవుండ్ల వెంకటేశం.

"ఏం ఎంకటేశులూ! ఇయ్యాల పొద్దుగల్లొచ్చినవ్. మరట్నే రొండు రేకలు గట్టియ్యరాదు ఇయ్యాల పెద్ద పటేలు గూడొచ్చిండు. చెర్రొండు ఊటలు ఒంచిపోదువు" అన్నడు భిక్షంరెడ్డి.

"ఒద్దులేర భిక్షం! నాకీ మజ్జన సుస్తున్నది. మొన్న డాక్టరు కాడికిబోతె కల్లు, విస్కి, సిగరెట్టు అన్నీ బందు జెయ్యమన్నడు. మందులు దింటున్న"- అన్నడు పర్వతరెడ్డి.

మరైతే ఊళ్కెకే బోతున్నవు గదు జర ఇంటిదాక పట్కపోరాదు లొట్టి నీను జెర్రంతాగి మోట్ర బందుజేశొస్త."

ఎంకటేసుల్తోటన్నడు భిక్షంరెడ్డి.

పర్వతరెడ్డి గూడ పెద్ద కష్టం లేకుంటనే తన పాచిక పారిసండుకు లోపల్లోపల సంతోష పడుకుంట అట్ల తోటకాడంగ ఎల్లొస్తనని బయల్దేరిండు.

తర్వాత పన్లన్ని సర్రసర్ర జరిగిపోయినయ్. చాకల్లొల్ల భూమికంటె ఎకురం ఐదు వెయిలు ఎక్కువ జేశింద్రు భిక్షంరెడ్డి భూమికి. అయ్యే పైసల్తోటి అక్కంపెల్లి కాలువ కట్టెమ్మటి అయిదెకరాలు కొనుక్కోని బాయిదవ్విండు అల్లుని దాపున. మూడు కోలల మీదనే నీళ్ళు మస్తు బడ్తై. దేవులాట లేకుంటయ్యిందని సంతోషం గున్నడు భిక్షంరెడ్డి.

ఇక్కడ పర్వతరెడ్డి కొడుకు జీతంతోటి, తన ఫించను పైశల్తోటి బాంకుల తెచ్చిన లోనుతోటి మొఖం జూదకుంట - చాకల్లొల్ల చీర్కె, భిక్షంరెడ్డి చీర్కె, రాళ్ళబాయి గుడ్డం మొత్తం గల్పి కొత్తగ తోట బెట్టిండు. ఇంతల ముప్పారం పైపులైన్నించి మంచినీళ్ళ కనెక్షనిచ్చిండ్రు ఊరికి. మంచినీళ్ళకు ఇబ్బంది లేకుంటయ్యింది గద! భిక్షంరెడ్డి చీర్కెల బందుజేసిచ్చిన బోరు పొక్కకు మోటరు ఫిట్టుజేపిస్తె రొండు మూడేండ్ల నించి నీళ్ళు తగ్గకుంట పోస్తున్నది బోరు. చెట్లు మంచి తేజుగ బెరిగి నాలుగేండ్లకే కాపుకొచ్చినై.

కడుపుల మాయి కలదనట్లే భూమి లోపలి మర్మం ఓనికి దెల్వదు. కాలం ఒక్కేడన్న బాగైతదేమోననుకుంటె సాపెనబెట్నట్టు ఏటేట ఎన్కకే పేకబట్టింది. ఆయిటి చినుకులు రాకుంటె రాకపాయెగాని తుఫాన్లు గూడ ఒస్తలేవు. పర్వతరెడ్డి పాత తోట ముసల్దయిందని చెట్లు కొట్టేపిచ్చిండు. మనుమడు బైటికి బోతుండని ఆ గుంటిని బేరం బెట్టిండు. దాంట్లె బోర్లు పీక్కపొయ్యి ..... ..... నీల్లుకూడ ఎల్తలెవ్వు. యాడికో కాడికి ఆ గుంటిని దీశెయ్యాలనుకుంటున్నడు. పదావు బెడ్తె ధర రాదని అల్లగూడ మల్ల సితపాల, సపోట చెట్లు బెట్టిండు. జర నీళ్ళ దెబ్బ తట్టుకుంటయని. కాని రోజు రోజుకు అంద్ల బోర్లు బొత్తిగ పీకినై. ఇగ ఇట్లయితె కాదని పుట్టినకాన్నుల్ల అప్పు దెచ్చి మూడు కిలోమీటర్ల దూరం పైపులేశిండు ఈ బోరుకాన్నించి ఆ బోరుకాడికి. కొడుకు ఒద్దన్నా ఇనలేదు. తనకేదో గాలిబూనినట్టు పెట్టుబడి పెట్టిండు. ఈలోపల మల్ల సర్పంచి ఎలక్షన్లొచ్చినై. సీటు జనరలైతె పర్వతరెడ్డిని ఏకగ్రీవంగ సర్పంచిని జేశింద్రు ఊరిజనం. అరవై అయిదేండ్లు మీదబడ్డా మనిషింక గట్టిగనే ఉన్నడు. తను అనుకున్నట్టు నడుస్తున్నందుకు సంతోషంగ గూడ ఉన్నడు పర్వతరెడ్డి.

అట్ల ఎంతమంది ఏంజెప్పినా ధైర్నంజెడని మనిషికి భిక్షంరెడ్డి బోరు ఎనకపట్టు బడతాలకు ఫికరు బట్టుకుంది. మొన్న సంకురాత్రి పండుగకు కొడుకుని, కోడల్ని, పిల్లల్ని ఇంటికి రప్పించుకుండు. ఎట్నన్న తోటల మల్లో రెండు మూడు బోరుపొక్క లెయ్యాల్నని కొడుకు తోటన్నడు.

"ఎందుకు బాపూ ఒద్దంటుంటె ఇనకుంట పెట్టుబడులన్ని బెట్టి చాతనయ్యి చాతగాక ఈ యవసాయాన్ని బట్టుకొని యాలాడ్తవు? ఉన్నకాడికి గుండు గుత్తగ ఓనికన్న బేరం బెట్టి హైద్రాబాదుకు బోదాం పా! బోర్లొద్దు గీర్లొద్దు.

కొడుకు మొదట్నించి మాట్లాడిన దానికంటె ఈసారి జర గట్టిగనే అన్నడు. పర్వతరెడ్డి పండుగపూట ఎందుకని జర బతిలాడినట్టు చెప్పిండు కొడుకుతోటి.

"ఎందుకుర నాయినా! నాకు చెప్పిన మాటే మాటిమాటికి చెప్పుతవ్! నా చేతగాని నాడు నేనే ఒస్త నేనేడికి బోతగని! ఇగనన్నించయితట్టు లేదు పెట్టుబడి. మొన్న పైపులైనుకే ఊల్లె పుట్టిన కాన్నల్ల దెచ్చిన! ఇప్పుడు మల్ల బోర్లెయ్యాల్నంటె పైసలు బుట్టనట్టుంది. కష్టమో, నిష్టూరమో ఈ ఎండకాలమెల్లదీస్తె ముందుకు కాలంగాక పోతాది? రొండు కాపులుగాస్తె మొత్తం పెట్టుబడెల్లిపోద్ది. ఎందుకు తొందరపడాలె? అమ్ముదామనుకున్నా గని నీళ్ళులేని భూమిని కరువుల ఎవడు గొంటడు చెప్పు? ఓ ఇరవై ముప్పైవేయిలు సుత్లాయించు ఎట్నన్న జేశి."

"ఏమో ఇగ నీ ఇష్టం ఇగ ఇదే ఆఖరుసారి. మల్లనైతె నేను పైస బంపేది లేదు ఎవసాయానికి" అని కరాఖండిగ జెప్పి ముప్పైవైలు బంపిచ్చిండు కొడుకు.

జియాలజిస్టులతోటి మూడు పాయింట్లు జూపిస్తె ఎవ్వరూ నీళ్ళు బడ్తయని ఖచ్చితంగ జెప్పనేలేదు. అయినా దేవునిమీద భారమేసి తనకు తోచినకాడ మూడు పొక్కలేపిచ్చిండు పర్వతరెడ్డి. రెండొందల యాభై మూడొందల ఫీట్లేశినా దుమ్మే లేశిందిగని గింత తేమగూడ దగ్గల్లేదు. ఇన్నాళ్ళు ధైర్నంగున్న పర్వతరెడ్డికి గుండె దిగజారి నట్లయింది. భూమిలోపలికి దింపిన ఒక్కొక్కరాడ్డు తనకడుపులకే దిగినట్టు గిలగిల కొట్టుకున్నడు లోపల్లోపల. రోజురోజు నీళ్ళు ఎనకపట్టు బట్టి ఊరందర్ని భయపెట్టిన భిక్షంరెడ్డి బోరుగూడ మొత్తం ఎండిపోయింది నిలువున. మొత్తం పూత, పిందె వాడిపోయి రాలిపోతున్నది. ఈ ఏటి మటుకు పూత పిందె పోతెపాయె. చెట్లనన్న బతికిచ్చుకుంటె మంచిదని యాన్నన్న నీళ్ళు దొరికితె ట్యాంకర్ల తోటన్న కానుక్కొచ్చి పోపియ్యాలనుకున్నడు పర్వతరెడ్డి. కొడుకుతోని మాట్లాడి మల్లగిన్ని పైశలు దేవాల్నని పట్నం బొయిండు.

"ఏంది బాపూ! నీకేమొపిచ్చి బట్టుకున్నట్టుంది. ఒద్దు ఒద్దంటె మల్ల తోట బెడ్తివి. ఒద్దు ఒద్దంటె బోర్లేశి నిన్న మొన్న మల్ల ముప్పయి వెయిలు మంట్లెబోస్తివి. మల్లిప్పుడేడ దెమ్మంటవ్ పైశలు. అసలు పైసలిస్తె మటుకు సుట్టుపక్కల యాడ దొరుకుతై నీళ్ళు. అసలు మన ఊరుసుట్టు నీళ్ళుంటె మన భూమిల మటుకు బడకపోయినయా బోర్లు" అడిగిండు కొడుకు.

"గాపులిమామిడి వాగెమ్మడి ఉశికె బోర్లల్ల ఇన్నన్ని నీళ్ళెల్తున్నయంట. చెయ్యి పన్నెండొందలకు ట్యాంకరు చొప్పున అమ్ముతున్నరంట. ముషంపెల్లి, ఎర్రబెల్లి సుట్టుపక్కల ఊర్లోళ్ళు ఒకళ్ళిద్దరు కొని పోస్తున్నరంట" చెప్పిండు పర్వతరెడ్డి

కొడక్కు ఇష్టంలేకపోయినా నోటికాడికొచ్చిన తోట ఎట్లన్న ఈ రొండునెల్లు చెట్లని కాపాడుకుంటె మంచిదని అనుకున్నడు. సరేనని తండ్రెంట ఊరికి బయల్దేరిండు. పులిమామిడి బొయ్యి నీళ్ళట్యాంకరును మాట్లాడుదామనుకున్నారు.

"ఏమే పర్వతయ్య పెదనాయినా! ఇయ్యాల తండ్రికొడుకులు ఇద్దరు ఒక్కపాలె కల్మింద్రు జెర మా సంగతి గూడచెప్పితె బాగుంటది గద."

అప్పుడప్పుడు చిల్లరమల్లరగ పర్వతరెడ్డికి అప్పిచ్చిన బాకీదార్లు అప్పు సంగతి మాట్లాడుదామని ఇంటికొచ్చి అడిగిండ్రు.

"ఏంటిదే ఇప్పుడు మీతోటి మాట్లాడేద్దేముంది కొత్తగ?"

పర్వతరెడ్డి కొడుకడిగిండు ఒచ్చినోళ్ళని.

"గదేర! నిరుడు మునేడు తోట బెడితప్పుడు నువ్విటు మళ్ళీసూడనే సూడనైతివి. మాదగ్గర తలాయిన్ని డబ్బులు దెచ్చిండు నాయిన. ఇగోయి కాయతాలు" అని అప్పు పత్రాలు జూపిచ్చిన్రు.

మూడు లక్షలపైనే ఉన్నై కాయితాలు. బ్యాంకు లోను కలుపుకుంటె అంత ఎనిమిది లక్షలకు పైనే ఉన్నది బాకీ. ఉక్కోలుగ నీళ్ళుంటె చెట్లల్ల ఏదన్న మెట్ట పంటేసుకుంటె కొంతలో కొంతన్న పెట్టుబడెల్తుండె. ఇప్పుడు అసలుకే మోసమొచ్చే కాలమొచ్చింది. ఏం చెయ్యాల్నో తోసుబాటు కావడం లేదు పర్వతరెడ్డి కొడుక్కి. ఈ కానిపోని కాలాన్ని నమ్ముకోని ఎవపాయం జేయొద్దంటె ఇనకపాయె ఇప్పుడింక బిందెడు బిందెడు నీళ్ళు బోసి చెట్లను బతికిస్తనని సూస్తున్నడు ముసలోడు. ఇది అయ్యేపని కాదనుకున్నడు. కట్టలు కట్టలు రూపాలు దెచ్చి ఈ ఎండిపోయే బోరు పొక్కల్ల పోస్తె ఎన్నాళ్ళున్నా ఉన్నకాడికి అమ్ముకోక తప్పదనుకున్నడు.

"ఇగో కోటన్నా! ఇయ్యాల నీనొచ్చిన పని ఒకటైతె ఇంకోటి అయితట్టుందిగని. అయితె ఆయె. నేను యాన్నించో ట్యాంకర్లమీద నీళ్ళు దెచ్చి మళ్ళో నలభైయాభై వెయిలు ఖర్చు పెట్టి ఈ రొండు నెల్లు చెట్లను బతికిచ్చినా ముందుకు బోర్లు నీళ్లు బోస్తయన్న నమ్మకం లేదు. మళ్లీ బోర్లేస్తే నీళ్లు బడ్తయన్న ఆశలేదు. అందికనే మీరే ఎట్నో గట్టి తిప్పలు బడి ఈతోటను జూసుకోని మీ అప్పుల్తోపాటు ఆ బ్యాంకు కిస్తులు గూడ గటుకోరి. ఇంకో నాలుగేండ్లుగాని, అయిదేండ్లుగాని నీనిటు దిక్కోరాను" అన్నాడు పర్వతరెడ్డి కొడుకు.

"అదేందిర అట్ల మాట్లాడుతవ్? మీకు దొరకని నీళ్ళు మాకు దొరుకుతయా? అప్పు దీర్చమంటె తోట జూసుకోమంటవ్" అన్నరు ఆళ్ళు.

"అదంతేనే! బాపు నా ఎంట ఒస్తె ఒచ్చిండు లేకుంటె లేదు. ఆయనతోనే మాట్లాడు కోరి మీరే నాకైతే తెల్వదు" అని బ్యాగు దీస్కోని నల్లగొండబాట పట్టనే పట్టిండు పట్నం బోతందుకు.

"సరె నువ్వు బోర! నీను రొండు రోజులైనంక ఒస్త" అని అన్నడు పర్వతరెడ్డి.

"ఏందిరా! ఇన్నెకురాల భూమి, బోర్లుండగ మీ అప్పులు బోతాయిర! ఏదో జేశి ముందొరకు సుత్తాయిద్దుంగని పోయిరారి" అని ఆళ్ళని పంపిచ్చిండు.

ఇంకో పదిరవైరోజులు గడిచినై. బోర్లన్ని బొత్తిగ ఎండిపొయినయ్. చెట్లు వాడుబట్టి పిందెల్తోపాటు ఆకుల్నిగూడ రాల్చుతున్నయ్. ఆటిని జూస్తుంటె పర్వతరెడ్డి కడుపుల కుమ్మరాములు గూల్తున్నయ్. కడుపున బుట్న పిల్లలకు బువ్వపెట్టలేక అభిమానం చంపుకోని అడుక్కోవడానికి వెళ్ళిన తండ్రికి బుక్కెడు బువ్వగూడ దొర్కకుంటె పిల్లలకాడికి పోవాల్నో, ఉరిబెట్టుకొని సావాల్నో తెల్వనట్టుగుంది ఆయన పరిస్థితి. గుండెను చెరువు చేస్కోని చెట్లనొదిలిపెట్టి భార్యను దీస్కోని పట్నం బయలుదేరిండు కొడుకుతానికి మల్లొస్తనో రానో అని మతిల అనకుంట పర్వతరెడ్డి.

● వార్త ఆదివారం అనుబంధం - 16 మార్చి, 2003 ●

# 81. అంతర్ముఖం

♦ జాతశ్రీ ♦

ఇంకా తెలవారలేదు.

మంచు దట్టంగా కురుస్తోంది.

ముందు వసారాలో కట్టేసి ఉన్న గేదెపాలు పితికిన భూదేవమ్మ ఇంట్లోకి వస్తూ, తాళ్ళు గీయడానికి తయారవుతున్న భర్తను చూస్తూ "కాస్తాగు టీ పెడత... తాగి పోదువు గాని" అంటూ పొయ్యిదగ్గరకు పోయింది.

అప్పటికే బిల్లగోచిపై పట్టా బిగించి, ముస్తాదు కట్టుకొన్నాడు మల్లేశం. "జర్ర కానీయ్" అంటూ చిరతబద్ద అందుకొని నులకమంచం మీద కూచొని ముంజ కొడవలిని సానబడుతూ "ఏవంటున్నడు పెద్దోడు?" అన్నాడు.

"అనేదేముంది.. అదే పదం. ఎంత జెప్పినా ఇనుకోటంలే... ఏమూట జెప్పినా తిరుగ జెపుతుండు. ఒక్కేడు ఓపిక పడితే మన కష్టాలన్నీ తీర్తయి అంటున్నడు. సెప్పీ, సెప్పీ యాష్టకొస్తాంది" అంది భూదేవమ్మ.

"పట్టు, పట్టుమని యాభయ్యేలు ఎవురిస్తరే.. నేనేడ జచ్చేది?" అన్నాడు మల్లేశం.

"ఈడి కిదేం మాయరేగవోఁ... కుయిటు, కుయిటు అని తగిలిండు. ఇదానం ఎప్పుడెక్కుతనని సూస్తాండే తప్ప, మరో దేస లేదాగికి" అంది భూదేవమ్మ.

"ఏం ఇవానవోఁ... ఏవోఁ.... నన్ను పాడెక్కించేలా ఉన్నడు" సానబట్టిన ముంజ కొడవలిని బొటనవ్రేలితో గీరుతూ, పదును జూసి, దాన్ని ప్రక్కనే ఉంచి, గీసకత్తిని అందుకొన్నాడు మల్లేశం.

"గీసకత్తిని రేత్తిరే పదునెట్టినవ్‌గాదూ?..." టీ గ్లాసుతో భర్త దగ్గరగా వస్తూ అంది భూదేవమ్మ.

"పట్టినలే తియ్" అంటూ గీసకత్తిని పదును జూసి, చిరతబద్దమీద ఓ సారాడించి పక్కనుంచుతూ టీగ్లాసు అందుకొన్నాడు మల్లేశం.

భూదేవమ్మ భర్త కాళ్ళముందు నేలమీద కూచొని, మూడు రోజుల క్రితం తాటిమట్ట గీరుకొని, పెద్ద పుండయిన చోట కుడి చూపుడు వ్రేలితో నెమ్మదిగా నిమురుతూ, "సీవింకా ఉంది, సూదేయించుకొన్నవా?" అంది.

"ఆ.... ఇరవై దొబ్బిండు గాదూ డాకటరు" అన్నాడు మల్లేశం.

"అదేంది.. పదేగాదూ!....న్ని పొద్దాల ముంజ కొమురన్నకి సూదేసి పదే తీసుకుందుగా...ఎవురికేసినా అదే సూదాయె.., మన్సికోరేటా?.." అంది భూదేవమ్మ.

"ఏవో....పోనియ్, పిల్లలున్నోళ్ళం. ఎప్పుడు కేకేసినా పరిగెత్తుకొస్తాండు.. అయితె మాన్సె.'

"పున్నేని కొస్తాండా.. బరాబర్ పైసలిస్తన్న... నేనడుగుతానుండు."

"అడక్కు...ఏ సూదిల ఏ మతలబు ఉందో, మనకేవ్ఁరక?"

"అందుకని అడిగినంతిస్తవా?"

"పోనీ అన్నాగా.. అరవబాక" అంటూ టీ గ్లాసు అందించి, మంచంలోంచి లేచి, చిలక్కొయ్యకున్న కాళ్ళ గుదిని తీసుకొని, ఓసారి లాగి చూసి, మూలనున్న కాడిబద్దనందు కొన్నాడు మల్లేశం.

"మర్సిన, రేత్రి, సందేళ... మీ తమ్ముడు కోటేశం ఇంటికొచ్చిండు" అంది భూదేవమ్మ.

"ఏందట?"

"పెద్దపిల్ల – అదే, మాలక్ష్మి సవఁర్తయిందట. ఒకెయ్యి రూపాయలు కావాలన్నడు" అంది భూదేవమ్మ.

"నువ్వేవఁవన్నవ్?"

"నిన్నడిగి సెపుతనన్న.... అప్పుడే ఇద్దావనిపించింది గాని, నీకోమాట జెపితే బాగని. ఆగిన..."

"ఇస్తే పొయ్యేవిగా... నాకు జెప్పేదేది? ఇంట్లో ఉండి గుడ్లేఁవన్న పెడతయా?... అయినోడికీ. ఆపదకీ కాక రూపాయలు మూట కడతవా... అన్నాతమ్ముడూ, మంచీ మన్ననా, లేక, డబ్బో...అంటూ ఎర్రెత్తి పోటానకీ మనవేఁవన్న ఈ కాలపోళ్ళవాఁ" అన్నాడు మల్లేశం.

"సరే.. అట్టనే. నేనే పొయ్యి ఆ పిల్దాని చేతిల రెండు కొబ్బరి కుడకలూ... ఇంత బెల్లంబెట్టి, కోటేశానికి డబ్బులిచ్చొస్త" అంది భూదేవమ్మ.

వసారాలో పందిరిగుంజకు తగిలించి ఉంచిన మోకు అందుకొని "సూత్తన్న వేంది, లొట్లు దేపో..." అన్నాడు మల్లేశం.

"నా మతిమండ... ఏందో, గీ పోరగాడు జెయ్యబట్టి మతిలమతి ఉండటంలే...." అంటూ ఇంటి వెనుక నీళ్ళగాబు దగ్గరున్న లొట్లు కడిగి, తీసుకొచ్చి అందించింది భూదేవమ్మ.

వాటినందుకొని మల్లేశం, కావిడి బద్దకు తగిలించుకొంటుంటే, భర్త వీపున చెయ్యానిస్తూ, "జాగర్త, మంచు కురుస్తాంది" అంది భూదేవమ్మ.

"నా జాగర్తకేంగాని, ఆ పెద్దోడిని కాస్త అర్సుకో" అన్నాడు మల్లేశం.

"అవ్‌గాని, రాజెన్నేవఁన్నడు?" అంది భూదేవమ్మ.

"సంక్రాంతెల్లినాక ఏ సంగతి జెపుతనన్నడు. గవొర్నమెంటు సుత దివాలెత్తిందంట. పోయినేడు బకాయిలన్నీ కట్టందే కొత్త లోన్లియ్యొద్దని సెంద్రబాబు ఆర్డరేసిండట" అన్నాడు మల్లేశం.

"ఏవాఁయె....పేదోళ్ళు బతకొద్దంటనా?... అయినా మనం ఫూరా గట్టినం గాదూ?.." అంది భూదేవమ్మ.

"మనం గడితె - సరిపోద్దా... సొసైటీ మెంబర్లంత కట్టొద్దా... అయ్యన్నీ సెకట్రీ బేంకుల జమచెయ్యొద్దా... ఆ లెక్కలన్నీ తేలాక, అప్పుడు మళ్ళీ కొత్తపులకి అర్జీ పెట్టుకోవఁని సాటింపేస్తరు. ఎరకయిందా?" అన్నాడు మల్లేశం.

"ప్చ్... ఏందో ఈ శెరలు..ఈ మాయదారి పోరగాడితో మా సిరాగ్గుంది. ముద్ద మింగుడు పడనియ్యటంలే...ఒహటే... నస... రెండెకరాలు అమ్ముదావంటడు" అంది భూదేవమ్మ.

మల్లేశం ఉలిక్కిపడ్డాడు. నోరు పడిపోయిన వానిలా ఓ క్షణం తేలగుడ్లేసి, భార్యకేసి, "ఏందీ....పొలం అమ్ముతడంటనా... అమ్మి... ఏం జేస్తడంట" అన్నాడు.

'ఏడాది తిరక్కుండానే నాలుగెకరాలు కొంటడంట."

"మా కొంటడు. వాడి ఏశాలు తెల్వదనుకుంటుండేవో.. సదుపు రానోళ్ళవఁని మా ఆడిస్తండు. అరె, ఈ పోర్గాడు జెయ్యబట్టే గద, ఆ కొత్తగూడెం టీవోడు ఇంటిమీద బడి పరువు దీస్తండు. వాయిదాల సొమ్మొద్దురాంటే ఇని సచ్చిండా... ఆడి తడీని మోసెఁడయింది. అయ్యగారికి టి.వి. లేకుంటే పొద్దబోదేవోఁ... నెలకు పడేసొండలు యాడనుంచి తెస్త" అన్నాడు మల్లేశం చిరుకోపంతో.

"అయితే మాన్నె తియ్.. ఊరంత తీసుకొంటుంటే వాడూ కాయిశు పడ్డడు. అప్పుల అప్పు.. ఇంకేంది, మూడాయిదాలు కడితే తీరిపోద్ది" సముదాయింపుగా అంది భూదేవమ్మ.

"శానజెప్పినవ్‌లే, ఇగాగు... అరె, అటు పెద్దాని పెళ్ళి బాకీ సంగతి జూడాల్నా.. అదో బిడ్డ తల్లయినా దానికిస్తనన్న ఇరవయ్యేలూ సర్దలేక చస్తుంటే..వాడికి తెల్వదా.. వాడేవఁన్న పాల్దాగుతుండా.. ఇగ్గో వాడితో జెప్పు. ఒహటేమాట.. కాలం బాగుంటే, కలిసొస్తే పత్తిడబ్బు లొచ్చినంక పొమ్మను. ఇప్పుడిప్పుడే కావాలంటే నే కాటికి పోటం తప్ప దారేది దొరకటంలే.. అరె, తోటోడు తొడగోసుకున్నడని మనం మెడగోసు కొందావఁ... సదూకున్నోడేవోఁ.. ఆమాత్రం తెల్వదా వాడికి" అన్నాడం మల్లేశం.

"నీ జెపుతలే, నువ్వు గుండె జెదరమాక" అంది భూదేవమ్మ.

మల్లేశం లోలోనే మరేదో గొణుక్కొంటూ, కావిడి బద్ద బుజానుంచుకొని, ఓ పక్క మోకు తగిలించాడు. వసారాలో ఉన్న చెప్పులేసుకొని, "పొయ్యొస్త" అంటూ ఇల్లు దాటాడు.

వీధి వాకిళ్ళలో ఊడుస్తో, కళ్ళాపి జల్లుతో, ముగ్గులేస్తో, అమ్మలక్కలు పనులు చేసుకుంటున్నారు. తాళ్ళ వనానికి బయల్దేరిన ఐదారుగురు 'గౌడ' లు పాఠశాల ముందు రోడ్డుమీద ఏవో మంతనాలు చేస్తున్నారు. వాళ్ళను చూసేసరికి మల్లేశానికి తాడిశిస్తు కట్టాల్సిన విషయం గుర్తొచ్చింది. శిస్తు డబ్బులుతీసి పక్కన బెట్టాడు గాని, నాల్రోజుల నుంచి పెద్దోడి గోలకి ఏదీ గుర్తుండటం లేదు. "రేపుకడదాంలే తియ్" అని తనకి తానే చెప్పుకొని ముందుకు సాగాడు.

కొత్త మామ్మ కాగానే శిస్తు వసూళ్ళు మొదలుపెట్టడం చాలామందికి కాస్త ఇబ్బందిగానే ఉంటూంది. అదే సమయంలో పిల్లల అవసరాలూ నెత్తిన పడతాయి. స్కూల్ డ్రస్‌లూ, బస్‌పాస్‌లూ, పుస్తకాలూ..అన్నీ ఒకేసారి సర్దాలంటే, కులవృత్తికి తోడు కాస్త వ్యవసాయం ఉన్న వాళ్ళ పరిస్థితి ఫర్వాలేదు గాని, అచ్చంగా కల్లుమీదనే ఖర్చులన్నీ తీరాలంటే కష్టంగానే ఉంటుంది. ఎంతకాదనుకున్నా మూడు నాలుగువేలు అప్పు పడటం తప్పదు. సీజను వచ్చేదాకా వడ్డీ కట్టడమూ తప్పదు.

మల్లేశం కులవృత్తి పైనే పూర్తిగా ఆధారపడిన వాడేంగాదు. పిత్రార్జితం మూడెకరాల మాగాణీ. నాలుగెకరాల నల్లరేగడి చెలకా ఉంది. కులపోళ్ళు అతన్ని ఉన్నోళ్ళ సరసనే లెక్కిస్తారు. అయితే గత ఐదారేళ్ళ నుంచీ అతనికి వ్యవసాయంలో కలిసిరావడం లేదు. ఊరి చెరువు అలుగెల్లితే రెండు పంటలకు ఢోకా ఉండదు. ఎంత లేదన్నా డెబ్భయి, ఎనభై బస్తాల వడ్లు ఇంటికి చేరతాయి. ఎరువులూ, పురుగుమందులూ, ఇతర ఖర్చులూ పోను, అటు ఏడాది తిండి ధాన్యమూ, చేతిలో ఓ పాతికవేలూ కనబడే పరిస్థితిలోంచి... క్రమంగా - కష్టపడీ, నెత్తిన చెంగేసుకుని నీరసంతో ఇంటికి చేరే దుస్థితిలోకి దిగజారాడు.

తోడుగా - ఈ మధ్య రైతుల్ని దగాచేసే దళారీలూ ఎక్కువయ్యారు. గత సంపత్సరం పదహారు క్వింటాళ్ళ పత్తి గుంటూరు మిల్లుకెత్తితే, వాడు తిరిగొచ్చిందీ లేదు. పత్తి డబ్బులిచ్చిందీ లేదు. అదేమని, నలుగురైదుగురు కలిసి అడిగేందుకుపోతే ఇచ్చిన రశీదులు దొంగవని బెదరగొట్టారు. పోలీసు కేసు పెట్టడం జరిగింది గాని, కొన్న మనిషే కనిపించడం లేదు.

రోజుల్ని చూస్తూంటే మల్లేశానికి అయోమయంగా ఉంది. ఎందుకు, ఎలా జరుగుతుందో అతనికి తెలిసి రావడం లేదుగాని, రోజు రోజుకీ ఖర్చులు బాగా పెరిగి పోతున్నాయి. అదే తిండి, అదే బట్ట, అదే పూరిల్లు, కొత్తగా వొరిగొచ్చిందేమీ లేకున్నా, సంపాదనంతా లెక్కకు దొరక్కుండానే పోతోంది. పది రూపాయలు వెనకేద్దామంటే వల్ల గావడం లేదు. ఎరువుల కొట్లో, బట్టల కొట్లో అప్పులు అలానే వున్నాయి. ప్రతి ఉగాదికీ అప్పులన్నీ తీర్చేసి, కొత్త ఖాతా రాయించుకునే మల్లేశం, రెండేళ్ళనుంచీ పాత అప్పుకే వడ్డీ కలిపి, కొత్త ఖాతా తెరవడం బాధగా ఉంది. తెలివిన బతుకుతాడని చదివించిన చదువుతో, వాడికి 'బతుకు తెలివి' తప్ప మిగతా 'అతి తెలివి' ఎక్కువైంది.

"చదివితే కులవృత్తి చేయకూడదా?... నాగలి పట్టకూడదా?... కూచొని సంపాయించే ఉద్యోగ మెవడిస్తాడు? పనిచేసుకుంటూ బతకడం నామోషీ అయితే ఎలా?... రోజులు మారినాయని చెప్తాడే తప్ప. వాటితోపాటు తనూ మారాలనీ తెలీదా?"... అనుకున్నాడు మల్లేశం.

మల్లేశానికి కొడుకు ఏ విధంగానూ కొరుకుడు పడటం లేదు. గత రెండేళ్ళు సింగరేణి కొలువంటూ కొత్తగూడెం కంపెనీ ఆఫీసుల చుట్టూ, యూనియన్ నాయకుల చుట్టూ తిరిగి ఇరవై వేల దాకా పాడు చేశాడు. ఇప్పుడా ఆశ వదులుకొని 'కువైట్' అంటూ కొత్తరాగం ఎత్తుకోవడంతో ఏం చేయడానికీ తోచడం లేదు. 'ఓ

యాభైవేలు ఇవ్వండి. ఏడాది తిరక్కుండానే లక్షలు... లక్షలు తెస్తానంటూ చిటికలేస్తున్నాడు. కాదు. కూడదంటే ఏడుపులూ, పెడబొబ్బలు, తలగడం, అరవడం... ఇంటిని రావణకాష్ఠం చేస్తున్నాడు.

వాడు తెచ్చే లక్షలేమో గాని, ముందూ అరలక్ష ఎలా సర్దాలో మల్లేశానికి దారి దొరకడం లేదు. ఇంకా ముగ్గురాడపిల్లలు. చిన్నోళ్ళేగాని రేపో, మాపో వాళ్ళూ గుండెల మీద కుంపట్లే గద! ఎంత ఓకారోడ్నిచూసినా అధమం అరలక్ష అదగక మానడనే ఆలోచనల్లో మల్లేశానికి అదో భయం కూడా గుండెల్లో గూడు చేసుకుంటూంది.

మల్లేశం వీధి మూల మలుపున తిరిగి నారం దాసు ఇంటి దాపుకొచ్చేసరికి ఎదురింటి ఈ తాకుల తులిసెమ్మ నురగతో నిండిన కల్లు బింకీ ఇంట్లోంచి తెచ్చి కల్లును కాలువలో పారబోస్తూ కనిపించింది.

ఆ దృశ్యం అతని గుండెల్లో బాణంలా గుచ్చుకుంది. "ష్‌... ఎంతలేదన్నా, చెడమ్ముకున్నా రెండొందలు... ఏం సుఖం, నేల పాలాయె! ఇంకా గవుండ్లోల్లకి బతుకెక్కడిది?..." అనుకుంటూ తులిసెమ్మ దాపుగా వచ్చి, "ఏం తులిసెక్కా.. కల్లు పులిసిందా, పారబోస్తన్నవ్?" అన్నాడు.

తలెత్తి చూసిన తులిసెమ్మ "ఎవరూ మల్లేశవా...నీకు తెలవందేవుంద్రా తమ్ముడూ, కల్లు పులిసిపోవడం తప్ప ఖర్చయ్యే రోజులు మాయమవుతున్నయిరా.. మాయదారి కోకాకోలా తెచ్చి పెట్టిండుగా కోవిడ్‌ నర్సింహ... ఇంకేది, తండల్ల దొంగ గుడంబ దొరుకుతనే ఉంది. ఇగ కల్లు ఊసెవుడికి గావాల్రా...పదితో తెల్లారిపోతుంటే పాతిక పెట్టే దేవుడ్రా?..." కల్లు బింకీలో మిగిలిన సురగంతా చేత్తో తీసి పడేస్తూ అంది తులిసెమ్మ.

మల్లేశం తలాడించాడే తప్ప నోరాడించలేదు.

అతనికి మరింత దగ్గరగా వచ్చిన తెలిసెమ్మ చిన్న స్వరంతో, "అవ్‌రా తమ్ముడా.. బండోళ్ళ ఎంకన్న పెళ్ళానికి డబ్బు లొచ్చినయటగా?" అంది అదో రహస్యంలా.

"తెల్వదక్కా."

"నీ మొహం, వచ్చి నాల్రోజుల పైన్నే అయిందట.. ఖర్చులన్నీ పోను ఎనభయ్యేలు ఇచ్చినంట."

"ఎన్నిచ్చినా ఎంకన్న బతికొస్తాడక్కా.. దాని ముగ్గురు బిడ్డల్ని సాగనంపడానికి ఆ పోర్ది ఎన్ని శెరలు పడాల్నో...."

"ఇంకేం శెరలురా...మొగుడు లేడనేగాని, దాని బతుక్కు దిగులేం ఉండదు. ఆ డబ్బుల్తోటి పిల్లల్ని సాగనంపుద్ది. వాడుండి సెయ్యలేని పెళ్ళిళ్ళు, మన్నయి జేస్తండు గాదురా.. ఇన్నాళ్ళు రాని సంబంధాలు ఇగొస్తయి చూడు.. మూతొంకర, ముక్కుపొడుగు అన్నోళ్ళే పిల్ల నచ్చిందని ఎంటపడతర్రా....మాయదారి కాలం...ఇయాల్రేపూ మనిషున్నా, లేకున్నా డబ్బు.. డబ్బుండాల్రా.." అంది తులిసెమ్మ.

"ఏదోలె బతకనియ్‌" అంటూ పొద్దుకేసి చూసి "పొయ్యొస్తక్కా.." అంటూ కాలాడించిన మల్లేశానికి మదిలో బండి వెంకన్న కదిలాడు.

వెంకన్న పూటకు పెద్ద ఉన్నోడేం కాకపోయినా మాటకు మనిషనిపించుకొన్నాడు. వయసు చిన్నదయినా వ్యవహారానికి దిట్ట. చురుకుదనం పాలు ఎక్కువ. అందుకని గీత కార్మిక సహకారసంఘం బాధ్యతలూ, అప్పు వాయిదాల వసూళ్ళూ అన్నీ అతనికే అప్పగించారు. కుల పంచాయితీల్లో న్యాయం ప్రక్కన తప్ప ఎదుటి ప్రక్కన ఎంతపోసినా నిలబడేరకం కాదు. అటువంటి వెంకన్న నాలుగునెలల క్రితం పరుపుతాళ్ళు అడుగుబట్టి, తాటి మట్టల్లోంచి గెలని బయటకు తీస్తుంటే మట్టల సందుల్లో చేరిన మంద్రగబ్బ కాటేసింది. వెంకన్న గోస పెడుతూ తాడిమీద నుంచి దొర్లిపడ్డాడు. ఇదిగో ఇదిగో అంటుంటేనే ప్రాణం పోయింది. ప్రభుత్వం నుంచి నష్టపరిహారంగా లక్షరూపాయలు వస్తే రావొచ్చుగాని, తాటి వనానికి పోయిన 'గౌడు' ఇంటికి చేరే నమ్మకం లేకుంటే ఇంకెందుకా బతుకు? నష్టపరిహారాల కోసమేనా ఈ వృత్తులు? ఈ బతుకులు.....

ఆలోచనలతో మల్లేశం మనసు చిందరవందరై పోతూంది. చిరాగ్గా ఉంది. గుండె బరువుగా ఉంది. శ్వాస - నిశ్వాసగా మారింది.

తాళ్ళవనం దాపుగా వచ్చేసరికి అప్పటికే చెట్లెక్కి ఫలసాయాన్ని చూసుకొంటూ వస్తున్న కొర్ర రాములు "మావాఁ.... కాలు జాగర్త. కాళ్ళగుది గట్టిగా జూసుకో. మంచుకి చెట్టు పూరాగా తడిసింది" అన్నాడు.

మల్లేశానికి నవ్వొచ్చినట్టనిపించింది. కాని నవ్వలేకపోయాడు. చాలా రోజులుగా బహుశా నాలుగయిదు సంవత్సరాలుగా అతనిలో నవ్వు మాయమైంది. ఎంత ప్రయత్నించినా ఎదో చిన్నపాటి చిరునవ్వే తప్ప గుండెల్లో రక్తం కదిలేలా నవ్వక చాలా కాలమైంది."తాతకు దగ్గులు నేరుపుతున్నావురా?....." అంటూ మరింత దగ్గరగా వచ్చి, "రేయ్, రామూ నీ సావాస గాడేగా... మా ఓడికి నువ్వన్నా జెప్పురాదురా... కుయిట్, కుయిట్ అని గోస పెడతుండు" అన్నాడు మల్లేశం.

"అవ్ మావాఁ.... ఎప్పుడు పొయ్యేది?"

"ఎగసికం గున్నాదిరా... కుయిట్ పోటవంటే మాట్లా.. యాభై ఏలు...ఏలు కావాల్రా... యాడ దొబ్బుకొచ్చేది?"

"డబ్బే కట్టలేదా.. మరి మీవోడు నెలాఖర్న యివాఁనం ఎక్కుతనని నిన్న సుత నాతో అన్నడు. వాడు పోవాలగాని, నీకు డబ్బులే... డబ్బులు..." అని పెదాలపై నవ్వాడించాడు రాములు.

"చాలసె... ఎదవ డబ్బు.. డబ్బులుండే బతికినావుఁర ఇంతకాలం?.. ఈ మద్దెనొచ్చిందీ డబ్బురోగం" అన్నాడు మల్లేశం.

"ఎనకటి ఊసెందుకులే మావాఁ... ఆ రోజులన్నీ ఇహ కథలే.... అప్పటి పలకరింపులూ, రుచులూ ఇప్పుడున్నయా? బుద్దులు పూరాగా మారిపోతున్నయి గద మావాఁ....." అన్నాడు రాములు.

"అవ్‌రా...పురుగు మందుల పంటలు తింటన్నం గాదూ.... మనిషికీ పురుగు బుద్ధొస్తాంది" మల్లేశం అన్నాడు.

"సత్తెం జెప్పినవ్ మావా... బయ్యారెపూ దబ్బులోన్నోడే మనిషి. లెనోడు పురుగుతో జమ."

"అవ్‌రా రాము, నాకు తెల్వటంలే... పుట్టిన గడ్డా, కనిపెంచిన తలిదండ్రీ లేకుండ యాడనో బతకడం కూడా బతుకేనారా! కలో గంజో తాగి కలిసి బతకాలని జెప్పిన్రు గాదుర పెద్దోళ్ళు. జంతువుల్లాగ ఎవుడికాడు బతకడం, మూటగట్టుకోవడం మన్సి బతుకెట్టయిద్దిరా.." తల గోక్కుంటూ అన్నాడు మల్లేశం.

"పోయినయ్ మావా.. ఆ రోజులన్నీ పోయినయ్, బయారెపూ దబ్బుదే లోకం. తల్లేగాని, చెల్లేగాని దబ్బుతో కొలుస్తున్రు. వాడదురుష్టం ఎట్టుందో, ఎట్టనన్నజేసి పంపియ్యి మావా... కాదంటే ఒరిగేదేవన్న ఉందా?" అన్నాడు రాములు.

"అంతేనంటావా?"

రాములు తలూపుతూ దాటిపోయాడు.

మల్లేశం దాటిపోతున్న రాముల్ని చూస్తూ అలాగనే నిల్చుండిపోయాడు. కొద్దిసేపటికి తెలివొచ్చినట్టుగా, తత్తరపాటుతో "ఏందీ..ఏందీ మాయ? ... ఇంతవయసొచ్చి, నా కొడుకంతోడితో జెప్పించుకొన్న, నా బుద్దేవయింది?" అనుకుంటూ తాటిచెట్టు దగ్గరగా చేరాడు.

మల్లేశం మనసు పరిపరివిధాల, వెనక్కి ముందుకీ, కుడికీ ఎడమకీ పరిగెడుతూంది. తన బతుకులోకి చూసుకొన్నాడు. అప్పులన్నీ నోటికి లెక్కేశాడు. నలభైవేలు లెక్క కొచ్చాయి. రోజులు చూస్తే ఖర్చులు తప్ప రాబటి అరుదైపోయింది. భూమి నిస్సారమై పోతూంది. గాడిద మబ్బులు తప్ప వాన మబ్బులు కరుపైపోయాయి. ఇటుజూస్తే నిఖార్సయిన కల్లుకు నూకలు దొరకడంలేదు. దూబగుంట కల్తీ కల్లూ, నల్లబెల్లం దొంగ గుడంబా కలిసి గౌండ్ల బతుకుల్ని చెక్కిరిస్తున్నాయి. ఏదో ఒక రాబడి.. రాబడి ఉండాలంటే పెట్టుబడీ ఉండాల. పెద్దోడ్ని కుయిట్ పంపిస్తేనే కుదిరేలా ఉంది. పోనీ వాడదురుష్టం ఎలా ఉందో...

అంతలోనే మరో గుబులు... తెలీని చోటికి పిల్లోడ్ని పంపితే కష్టాల పాలౌతాడేమో! అక్కడేదైనా జరిగితే కబురైనా అందదు. అయినా వాడడిగినడబ్బు యాడ తెచ్చేది? చెలకమ్ముదామన్నా కొనేవాడెవడు? ఊరిలో డబ్బెవరికుంది?... పోనీ, వడ్డీకి తెచ్చినా రేపు వాడి గీత బావుండక అప్పు మోపెడై ఏ పురుగుల మందో గతయిద్దా యేం?" అనుకొన్నాడు.

మళ్ళీ అంతలోనే... 'దెశపో... ఎట్టయినా మా బాగె.. బతికేందుకు రోజూ సచ్చేదానికన్న అదే సుకం.. కానీయ్" అనుకొని, మల్లేశం తన కొడుకును కుయిట్ పంపించాలనే నిర్ణయానికి వచ్చాడు.

డబ్బు దొరికే దారుల్లో సాగుతూ, తనకు నెలవైన వ్యాపారుల్నీ, ఉద్యోగస్తుల్నీ గుర్తు చేసుకొన్నాడు మల్లేశం. అతని ఆలోచనలకు ఒకరిద్దరు అందినా, అంత డబ్బు ఇవ్వడానికి వెనుకాడతారేమో ననిపించింది.

ఇంతకాలం అడిగి లేదనిపించుకొన్నవాడు కాదు మల్లేశం. మాట తప్పని రైతుగా మంచి పేరుందతనికి. ఇంతకాలం వ్యవసాయానికి అప్పులిచ్చిన వాళ్ళు గత

కొన్నేళ్ళుగా రైతుల్ని పక్కకు నెట్టేసి, వ్యాపారాలకి మదుపు పెడుతున్నారు. కాదంటే తలకొట్టేసి నట్టుంటుందనే ఆలోచనలు ప్రారంభమయ్యాయి. మనసు నిండా టిక్కులూ, రైట్లూ... పిచ్చిగీతలు - తలవేడెక్కుతుంటే, కులదేవుడు - 'కాటయ్య'ని తల్చుకొంటూ "సావీఁ.... ఈ గండం గట్టెక్కిస్తే పోతుపిల్లనిస్తా... దయజూడు తండ్రీ..." అంటూ రెండు చెంపలు వేసుకున్నాడు.

తాటిచెట్టు మొగదలలో నిలబడి, కావిడి బద్ద దించి, ఓ ప్రక్కగా ఉంచాడు. లొట్టిని ముస్తాదుకున్న కొక్కానికి తగిలించాడు. కత్తుల్ని చేత్తో తడిమి చూసుకొన్నాడు. పంచె కట్టులో దోపిన చిరతబద్దని తీసి క్రింద పడేసి, మోకందుకొని బుజాల క్రిందుగా, నడుం మీదుగా తాటిచెట్టు చుట్టూ తిప్పి కొక్కెం తగిలించాడు. లాగి చూశాడు. గట్టిగా పట్టుకుంది.

కాళ్ళగుది అందుకొని, కుడి పాదానికి తగిలించి చేతిపట్టుతో నాలుగైదు బారలు చెట్టెక్కి, కాళ్ళగుదిలో ఎడమ పాదాన్ని కూడా దూర్చి రెండుపాదాల్ని చెట్టుకు దొప్పలా మోపి, కాళ్ల బిగువుతో మోకును పైకి నెట్టుకుంటూ, ఉబుకుతూ ఎక్కసాగాడు.

సంగం చెట్టు ఎక్కేసరికి ఆయాసమనిపించింది. ఎప్పుడూ ఉండేదే... గొండ్ల బతుకే అంత. చెట్టు చెట్టుకీ గస పెట్టందే ఫలసాయం చేతికందదు. ప్రతిరోజూ, ప్రతిచెట్టూ- ముప్పొద్దూ - మూడుసార్లు ఎక్కిగెల గీసి లొట్టి మార్చాల్సిందే. నాగబెడితే కుదరదు. కల్లు బారదు. కల్లు బారకపోతే బతుకు గడవదు.

ఆయాసంతో పాటు మల్లేశంలో ఆలోచనలూ సాగుతున్నాయి. వాడు లక్షలు తెస్తనంటున్నాడు... ఈ దెబ్బతోనన్న పిల్లల బతుకులో దారిన పడతయి. ఫలానోడి పిల్లలు సుకంగున్నారంటే అంతేచాలు..

డబ్బెట్ట.. యాభయ్యేలు యాడ దొరుకుతయ్?.. అనుకుంటూ మరో నాలుగు బారెలు సాగేసరికి మల్లేశం మనసులో బండి వెంకన్న బుడగేశాడు. "చస్తేంది, బతికి పీక్కతినేదేవఁన్న ఉండేడిస్తేగ?... పిల్లల్నో దారి జేసిండు... ఇయ్యాల గాకుంటే రేపన్న బూడిద గాక తప్పుద్దా?...." మనసులోనే అనుకున్నాడు.

చెట్టు మొగదల దాకా చేరాడు. చెట్టు ఊగింది. రాత్రి కురిసిన మంచు, ఎండ పొడకు నీళ్ళు మారింది. చెట్టు కదిలేసరికి నీళ్లు మట్టలోంచి జారి తలపై పడ్డాయి. తల తడిసింది. చల్లదనానికి చెవులు జివ్వుమన్నాయి.

ఏందోగవుండ్లోడి బతుకు... ఎక్కీదిగటవేగాని ఎదిగొచ్చినోడెవడు లేడు. తాళ్ళ పాట పాడినోడు తప్ప తాళ్ళు గీసేవోఁడు బాగయింది లేదు. చెట్టు గీసేవోడి కంటె చెట్టుమీంచి పడినోడికే ఇలువ" అనుకుంటూ గెలకు కట్టిన లొట్టి విప్పుతుంటే తల తిరిగినట్టయింది

చెట్టు ఊగుతున్నట్టుగా ఉంది. భూమి తిరగబడుతున్నట్టుగా ఉంది. చెట్టు పడి పోతున్నట్టుగా... తను గాల్లో తేలిపోతున్నట్టుగా... మొహంనిండా చెమట... గుండె... గుండె ఏదో...ఎలానో...మంట, తాటిమట్టతో బరబరా కోస్తున్నట్టుగా గుండెలో బాధ ...!

మల్లేశం తెలివి తెచ్చుకునేందుకు ప్రయత్నించాడు. తనకేదో అవుతోందనిపించింది చెట్టును పట్టుకోవాలనుకొన్నాడు. అందుకు ప్రయత్నం చేసేంతలోనే.....అంతలోనే.. మోకు కిందికి జారింది. కాలు వణికింది. క్షణం గడవకముందే కాళ్ళగుది జారిపడింది.

అదే క్షణంలో... కాళ్ళ గుదితో పాటే "పెద్దోడా. కుయిట్. జాగర్తరో..." కేకేసి, హెచ్చరిస్తున్నట్టుగా భీకరంగా అరుస్తూ - మల్లేశం.

● ఆంధ్రజ్యోతి ఆదివారం - 23 మార్చి, 2003 ●

# 82. బొలాద్

♦ గీతాంజలి ♦

పెరింట్ల నులకమంచం మీద పండుకుంది నఫీజ్. పిల్లలిద్దర్ని లోపట నిద్రబోయి నంక అప్పుడే నులకమంచం మీద కూలవడింది. అత్త నూరున్నీసా పక్కింట్లకు బోయింది జంగమ్మతోని ముచ్చట్లు బెడ్తామని. ముచ్చట్లంటె ఇంకేముంటయ్. కోడండ్లమీద ఇచ్చకాలు చెప్పుకునుడే వాల్ల ముచ్చట్లు. ఇగ మామ రహమతుల్లా ఆకిట్ల ఏవో ముచ్చట్లు తన వయసు ముసలోల్లతోని ఆడతా కూసున్నడు. రాత్రి భోజనాలు జేసినంక వాల్లు దినాం చేసే పని ఇది. నఫీజ్ మొగడు ఆర్ఫాజ్ కోసానికై తొవ్వ జూడ వట్టింది. అర్ఫాజ్ పొద్దున్న మాంసం దుక్నం నడ్పిస్తనే పగటికెల్లి సైకిలు మీద పట్నాంబొయ్యి ఘుడీలు రిపేరు జేసే షాపుల పనిజేస్తడు. నఫీజ్, అర్ఫాజ్‌ల పెండ్లయి ఆరేండ్లయింది. వాల్లకు ఇద్దరాడ పోరీలు పుట్టిన్రు. సాజీదా, అమీలూ. ఏదో తీరు సంసారం నడుస్తున్నది. నఫీజ్ ఊరి చివరన ఉన్న నర్సరీల పన్జేస్తది. నెలకు ఒక పన్నెండు వందలు వస్తయ్. పొద్దున్న బయట వడిందంటె ఇంటి కచ్చేటాల్లకు రాత్రి ఏడవుతది. ఇగ ఇద్దరు పిల్లలను నానమ్మ నూరున్నీసానే చూస్తది.

నూరున్నీసా కొడుకుకు ఇద్దరూ ఆడ పోరగాండ్లే ఉన్నరని ఒకడన్న మగపోరడు ఒక బొలాద్ పుట్టింటె బాగుండునని ఒగటే గోస ఆమెని పరేషాన్ జేస్తున్నది. వంశం నిలవాలె. గందుకు మగపోరడు గావాలె. ఇద్దరాడ పోరీల తర్వాత 'ఇన్నేండ్లాయే నఫీజ్‌కు కడుపు రాకచ్చింది. బందుగులల్ల అందరూ ఇదె ముచ్చట సాగుతున్నది. తమకు సిగ్గవుతున్నది. వీని తోటోల్లందర్కి ఇద్దరు ముగ్గురు పోరలు పుట్టిన్రు.

"యే బొరత్ బచ్చీయోంకో బస్ కర్కే ఏక్ బొలాద్‌కే పైదా కరో" అంటా రెండేండ్ల సంది గునుస్తనే ఉన్నది.

"కాన్పు గాకుంట గోలీ ఏస్కుంటున్నదా ఏంది?బందు జెయ్యమను" అని అర్ఫాజ్‌ని హెచ్చరిస్తనే ఉంటది నడుమ నడుమ.

ఒక రోజు "అరె అర్ఫాజ్.. నఫీజ్‌కో డాక్టర్ కనే లేజాకే దిఖావ్... బచ్చే క్యోఁ నైహోరేకి క్యాకి..." అని అన్నది. నఫీజ్ గుండెలు గుబ గుబ మన్నయ్. దినాం ఒక్కసారన్నా ఈ మాట గుర్తు జేస్తనే ఉన్నది నూరున్నిసా. ఇగ ఎప్పుడో ఒగప్పుడు అసలు సంగతి తెల్వక మానదు. అసలు సంగతి తల్లికి చెప్తానన్నాడు అర్ఫాజ్.

"బోల్‌దేంగీ. కిత్నే దిన్ ఛుపాయేంగే" అన్నడు నఫీజ్‌తో. ఇగ ఎపుడు చెప్తడో ఏమోగని నఫీజ్ మాత్రం గిజగిజలాడతనే ఉన్నది. మంచంల ఎల్లెత్కల పండుకోని నల్లని ఆస్మాన్‌ని చూస్తా ఆలోశనల వడిపోయింది.

ఇంతట్ల సైకిల్ గంట గణగణ మోగింది. నఫీజ్ గుండె ఒక్కసారి ఝల్లుమన్నది.

"అమ్మీ ఎటువోయింది" అన్కుంట పెరట్లకచ్చి మంచంల పడుకున్న నఫీజ్‌ని చూస్కుంట "బచ్చే సోగయే క్యా... చలో ఖానా లగావ్... భూక్ లగ్‌రై" అని కాల్లు చేతులు కడుక్కున వోయిండు.

అన్నం తిన్కుంట ఆలోచన జేస్తున్నడు అర్ఫాజ్. ఈ లోపట పక్కింటోల్లతోని కారో బారి ఎలగబెట్టిన నూరున్నిసా రానే వచ్చింది. ఆమె ఎంబడే రహమతుల్లా సుగ లోపటి కచ్చిండు. ఇగ రేపన్న పని బందువెట్టి నఫీజ్‌ని డాక్టరు తానకు తీస్కపొమ్మన్నది.

"అమ్మీ.....నఫీజ్‌కో బచ్చే నై హోతే. తీన్‌సాల్ పైలే బచ్చే నై హోనేకా ఆప్రేషన్ కర్వాయా మైనే.." అర్ఫాజ్ కుత్కలోని వణుకుని దిగ మింగుకుంట చెప్పిండు.

"క్యా....క్యాబోలేరే అర్ఫాజ్" అని వొర్రింది నూరున్నిసా.

నఫీజ్‌కు చెమటలు ధారలు గట్టినయ్.

మూడేండ్ల కింద అమీనా పుట్టింది. కడుపు కోసి పిల్లను తీసిన్రు. సాజిదా గట్లనే పుట్టింది. అమీనా పుట్టినపుడు నఫీజ్‌కు రక్తహీనత ఉండె "పెయిల రక్తమేలేదు. ఇంకోసారి అప్రేషన్ గిట్ల చేస్తే మంచిదిగాదు. పిల్లలు గాకుంట జేపిచ్చుకోన్రి ఇద్దరున్నరు గద" అన్నది డాక్టరమ్మ. నఫీజ్‌కు గూడా రెండు సిజేరియన్‌లతోని ప్రాణం చాన సుస్తయ్యింది. రెండు సీసాల రక్తమెక్కిచ్చిన్రు. ఇగ పిల్లలు సాలు. నీ ఆరోగ్యం బాగలేదు. ఇద్దర్ని సాదుడే కష్టంగుంది అని నఫీజ్‌కు నచ్చజెప్పి ఇంట్ల ముసలోల్లిద్దర్కి తెల్వకుంట ఆమెకు ఆప్రేషన్ జేపిచ్చిండు అర్ఫాజ్. ఇప్పుడ్దాంక అమ్మీ అబ్బాలకు చెప్పలె. చెప్పే మౌకారాలె. చెప్తే ఇంట్ల ఏం జర్గబోతందో గూడ తెల్సు.

"ఎట్ల జేపిచ్చుకున్నవే హరాంజాదీ... వానికి సిగ్గు షరం లేకపోతే నీకన్న లేదానె. మేరె బేటాకో బే ఔలాద్ కరేదేగి క్యా" అన్కుంట నూరున్నిసా శివంగి తీరు కోడలు నఫీజ్ మీదకు ఉరికి ఎంటికలు బిగవట్టి ఈపుమీద గుద్దుడు షురు జేసింది. నఫీజ్ అత్త కొట్లని భరించుకుంటనే ఏడ్వబట్టింది.

"అమ్మీ... ఛోడో... ఇండ్ల ఆమె తప్పేంలేదు. సబ్‌కుచ్ మేరీ కహనేసే హువా.. ఇగ మమ్ముల సతాయించకున్రి" అన్కుంట నఫీజ్‌ని ఇడిపించుకుని లోపటికి వోయిండు.

నూరున్నిసా కింద కూలవడి "యా అల్లా మై క్యాకరూఁ" అన్కుంట గుండెలు బాదుకోబట్టింది. రహమతుల్లా గూడ నోట మాట లేక గప్ చుప్‌గ కూసుండి పోయిండు. ఆ రాతిరి ఆలు మొగలిద్దరు నిద్రవోలె.

తెల్లారింది మొదలు నఫీజ్‌కు జీనా హరాం అయ్యింది. నూరున్నిసా గునుగుడు ఎక్కువైంది. ఊకూకనే ఏడుస్తది. శాపాలిస్తది. చాయ ఇస్తె వద్దంటది. అన్నానికి

పిలిస్తె లెవ్వదు. తానం గీనం చెయ్యక ముద్దుక పంటది. అప్పుడే ఏడస్తది. అప్పుడే ఖామోష్ అయిపోతది. ఎవ్వలతోని మాటలేదు. ముచ్చటలేదు. పిసలేసినట్లే అయ్యింది. ఇది జూసి అర్ఫాజ్‌కు తాయిమాయిగున్నది. గీ తీరు ఒక వారం దినాలు నడ్సింది

★ ★ ★

గా దినం మటన్ దుక్నం బందుజేసి సీదా ఇంటికే అచ్చిండు అర్ఫాజ్. తానం గీనం జేసిండు. తెచ్చిన మాంసం నఫీజ్‌కిచ్చి కూరవండమని చెప్పిండు. పిల్లలు కిలకిల నగుకుంట ఆటలాడుకుంటున్నరు. నఫీజ్ మాత్రం అర్ఫాజ్‌ని వట్టుకోని వలవల ఏడ్వ బట్టింది. అర్ఫాజ్‌కు తెల్సు ఆమె ఎందుకేడుస్తున్నదో. "ఊకోయే.. నీకు తెల్సుగద అమ్మీ సంగతి" అన్కుంట నఫీజ్‌ని ఓదార్చబట్టిండు.

"నై ముఝే ఘర్సే చలేజావ్ బోల్రే. నీకు ఇంకొక పెండ్లి జేస్తరంట" అన్కుంట ఇంకింత జోరుగ ఏడ్వబట్టింది.

"షాదీ నై కుఛ్ నై చుప్ రహో" అన్నడు అర్ఫాజ్ కోపంగ. ఈలోపట నూరున్నిసా వచ్చింది.

"ఇగో సూడు అర్ఫాజ్. నాకొక మన్మడు గావాలె. యే సైతాన్‌కో ఘర్నే నికాల్‌దో. నీకింకో మంచి పిల్లని జూసి పెండ్లి జేపిస్త. నైతో... మై యే జహర్ పీలూంగే" అన్కుంట తన చేతిల ఉన్న సీసా చూపిచ్చి తన కళ్రములకు వోయి తలుపులు విడాయించుకున్నది.

నఫీజ్ దుఃఖం మరింత ఎక్కువయ్యింది. కండ్లపొంటి నీల్లు ఆగకుంట కారిపోతనే ఉన్నయి. అర్ఫాజ్ ఏమీ సమజుల పట్టకచ్చింది. ఆమెని ఎట్ల బుదిరికియ్యాల్నో తెల్వకచ్చింది.

పిల్లలు ఈటీవీ ఉర్దూ చానల్ సూస్తున్నరు. టీవీల 'జిందగీ తుమ్‌కో తో బస్ ఖ్వాబ్ మే దేఖా హమ్‌నే' పాట విషాదంగ ఇనవడ్తున్నది.

అర్ఫాజ్ పరేషానయ్యిండు. కోరికోరి చేస్కున్నడు నఫీజ్‌ని. అర్ఫాజ్‌కు నఫీజ్ అంటే సాన ప్రేమ. ఆమె ఆరోగ్యం కోసమే డాక్టరమ్మ చెప్పిందని నస్‌బందీ చేపిచ్చిండు. ఆప్రేషన్ చేపియ్యకపోతే కడుపు వస్తది. కడుపు వస్తే అట్ల ఆప్రరేషన్ గావాలె. చేపిస్తే ఇట్ల. ఈ ముస్లోల్లకు బుద్ధి ఎందుకుండదు. మగపోరలు లేకపోతే ఏమైతది? మగపోరడు లేకపోతె తనకుండాలె బాదగని వాల్లకెందుకు? తండ్రి మాటలు యాదికచ్చినయ్ అర్ఫాజ్‌కు. "యే ధోకా హై.. హమ్‌కో క్యోc నహీ బోలే. ఈ హరాంజ్‌దీని ఇంట్లకెల్లి ఎల్లగొట్టు" అన్నడు. ఇన్నేండ్లయినంక, తనకు ఇద్దరు పిలల్నిగన్నాంక ఎటువోతది? అసలు తను తప్పు జేసిండు. తనే నస్ బందీ చేపిచ్చుకున్నని చెప్పితె అయిపోతుండె. గప్పుడు నఫీజ్‌ని ఏమనక పోదురు. ఇన్ని కతలు గాకపోతుండె.

అటు నఫీజ్ ఎట్లయిపోయింది. బక్కపీస్గు లెక్క తయారయ్యింది. అన్నం తింటలేదు. వాల్ల తిట్లే తింటున్నది. నర్సరికీ వోతున్నది. అస్తున్నది. ముద్దుకోని పంటున్నది. అత్త తనని గొడ్రాలి లెక్కనే సూస్తున్నది. ఇద్దరు ముద్దబంతుల్లెక్క ఉన్న

పిల్లల్ని గని గొడ్రాలయింది. ఆడపిల్లలు పిల్లలు గారా ఏంది? చిడలు నానీ చానీ అన్కుంట ఉరుకుత మీదకొచ్చి పడితె మొన్నటిదాంక కుషయిపోయి ముద్దులు వెడ్తుండె.. ఇప్పుడు "ఛల్ జావ్ బేషరమ్ లడ్కియా" అన్కుంట తురుముతున్నది అది ముట్టినా గొడ్డున్తది.. ఇది ముట్టినా గొడ్తున్నది. నా మీద కుమ్ముతోని పిల్లల్ని సుగ వోరుస్తలేరు. మామ సుగ అంతే... నిపుకలు ఎగవోస్తుండు తనని బేటీ అని పిల్పేటోడు... ఇప్పుడు హరాంజాదీ అనే అంటున్నడు. ఒక్క మగపోరన్ని కననండుకు ఎంత చీదరించుకుంటున్నరు వీండ్లు. ఇంట్లకెల్లి ఎల్లిపొమ్మంటున్నరు. ఎటుబోత? ఎట్లవోత? ఈ మకాన్ నాదనుకోని అచ్చిన గద. అగ్గో గా కమ్రీ నా కష్టంతోనే గట్టింది గాదూ....! ఈ ఇంట్ల అయిదు రంజాన్లు అయిదు బక్రీద్లు జూసింది తను. అగ్గో అటక మీదగా ఉయ్యాల తొట్టెల తన ఇద్దరు బిడ్డెలను పండుకోబెట్టి జోలపాటలు పాడింది. ఇంటెన్క పెరంట్ల గులాబి చెట్లు, మల్లె చెట్లు, దడికి దొండ తీగెలు, అంకాయలు, బెండకాయలు. పుంటికూర, తోటకూర మదులు, ఒగ మూల కల్యమాకు చెట్టు ఇంటిముంగట బర్రె తన పుట్టింటోల్లు ఇచ్చిందే ఇంటికి తను కోడలే గని ఏం తక్కువ జేసింది. ఆయనతోని సమానంగ ఇంటిని సగవెట్టింది. ఇద్దరి ఆమ్దాని గలిస్తెనె ఇల్లు నడుస్తాంది ఇంత జేస్తున్నా ఒక మగపోరడు పుట్టనందుకు అన్ని ఎన్కకు పోయినయ్. మాట మాట్లాడితే చలేజావ్ అంటున్నరు. మొన్నచాయ చేస్కపోయి ఇస్తె అబ్బా చాయకోపుని గోడకు ఇసిరికొట్టి "చలే జావ్! బేషరమ్ ఔరత్" అని అర్సిండు తనమీద. అర్ఫాజ్ చూస్తనే ఉన్నడు. ఇదంత....ఏమనడు.. మూడు కాన్పుల్ల ఆడపోరీలు పుట్టినంక అత్తోరింటోల్ల సతాయింపులకు ఎట్లెట్ల ఏడ్సిందో ఆడబిడ్డె ఫాతిమా సంగతి వీల్లు అప్పుడే యాది మర్సిన్రా.... ఆగలే బార్ బచ్చా నై పైదా హువాతో తలాక్దేకే దూస్రీ షాదీ కర్దేంగే అని గామె బొల్లున ఏడిస్తే "కైసే కర్తే దూస్రీ షాదీ . మగపోరడు పుట్టుడు మన చేతుల్ల ఉన్నదా. దిమాగ్ గిట్లక రా బైందానే మీ అత్తోరోల్లకు" అని ఎగిరెగిరి పడింది అత్త. నాల్గో కాన్పుల మగపోరడు పుట్టి ఫాతిమా బత్కిపోయిందిగని ఆడిపోరయితే ఏంజేద్దురు? తన బిడ్డకు కష్టం వస్తె ఒగ తీరు.. కోడలి దగ్గరికివచ్చే వరకాల్ల ఇంకొక తీరు ఆలోశన జేస్తరు. ఇప్పుడు తనకెవలున్నరు? పెండ్లయిన యాడాదికే బీమారయి అమ్మీ అబ్బాలు ఒగరెనుక ఒగరు సచ్చిపోయిన్రు ఉన్న ఒక్క దీదీ పెనిమిటి సచ్చిపోయి బీదర్ల బత్కనీకి తన్లాడుతున్నది. ఇగెవరికి చెప్పుకోవాలె. ఆయన దప్ప ఈ దునియల ఎవలున్నరు తనకు.... నఫీజ్ ఆలోశెనలు వొడుస్తలెవ్వు తెగుతలెవ్వు.

నర్సరీల నఫీజ్ ఖాస్ దోస్త్ బాలమణికి దప్ప ఆమె కష్టం ఎవలకి దెల్వదు. "ఏం పని ఫికర్ జేత్తవే... ఏమయితె అదైతది. . ఏమన్నయితె మేం లేమానే" అని భరోసా ఇచ్చి అన్నం తినవెడ్తాంది బాలమణి

★ ★ ★

"నఫీజ్‌కి మల్లా పిల్లలు పుట్టనీకి ఆప్రేషన్ జేపిత్త ఉస్కేబాద్ బచ్చే హోతే బోల్రే డాక్టరమ్మ' అన్నడు అర్ఫాజ్ రొట్టెముక్క నోట్ల వెట్టుకోని

"ఆప్రేషన్ జేపిత్తె ఏమైతది? పైసలు ఖర్చవుడు దప్ప క్యా ఫాయిదా. పిల్లలు పుడ్తరని గ్యారంటి గిట్ల ఉన్నదారా? ముఝే సబ్ మాలూం హై. ఆప్రేషన్ కయ్యే

కర్చులతోని ఇంకో పెండ్లి జేసుకుంటె పాయే.. యే హరాంజాదీకో తలాక్ దేదే" అన్నది నూరున్నిసా కోపంతోని.

"నై అమ్మీ! కల్ హమ్ షహర్ జారే" అర్ఫాజ్ ఏం వినదల్చుకోలె. చుప్‌చాప్‌గ తల్లెల్ల రొట్టె తినేసి కమ్రలకు వోయిండు. పెనిమిటికి తన మీదున్న మొహబ్బత్‌కు నఫీజ్‌కు దుఃఖమచ్చింది. తల్లెలన్నీ ఎత్తి అంటిల్లు సర్ది అర్ఫాజ్ తానకు వోయింది.

"ఫిర్ మేరేకో బచ్చే హోంగే క్యా" ఆశతోని కండ్లపొంటి నీల్లు కారుతుంటె అడుగుతున్న నఫీజ్‌ని "క్యోఁ నహీ... జరూర్ హోంగే. ఆప్రేషన్ అయినంక జల్ది నీ ఒడిల పిలగాడుంటడు" అని గుండెల కద్దుకున్నడు అర్ఫాజ్.

★ ★ ★

"మల్ల పిల్లలు పుడ్తరని గ్యారంటీగా చెప్పలేము. ఫిఫ్టీ ఫిఫ్టీ చాన్సుంటది. అయినంక పిల్లలు గాలేదని మమ్ములనంటె కుదరదు మల్ల. మీకిష్టమైతే చెప్పుర్ని ఆపరేషన్ జేస్త" అన్నది డాక్టరమ్మ.

"కరో... అమ్మా... హుయీతో హూయీ నైతో నహీ. ఘర్ మే యే గడ్‌బడ్ యే కిర్‌కిరీ ఏక్‌దో సాల్‌తో బంద్ హోజాయేంగే" అన్నడు అర్ఫాజ్.

ఆప్రేషన్ అయింది. అయినంక ఆడి బిడ్డె ఫాతిమా సూడనీకి అచ్చింది. "క్యాకీ బాబీ . . మరద్ బచ్చా నహీ హైతో జిందగీ బర్‌బాద్ హోజాతీ... మనం పని జేసినవ్... అబ్ జల్దీసే ఏక్ మరద్ బచ్చాకో పైదాకరో" అన్కుంట నగింది.

"లడ్కీ పైదా హుయీతో" కోపంగ అడిగింది నఫీజ్. అడ్నే అత్త నూరున్నిసా కూసున్నది.

"ఏం గాదు, ఇంకోసారి కోషిష్ జేయ్యు. ఫాతిమాకు పుట్టలె నాల్గో కాన్పుల. హమారే నానీ బారా బచ్చేంకే పైదాకరీ మాలూమ్. ఔరత్‌కా కమీ హై బచ్చేంకే పైదా కర్నా" చేతులు తిప్పుకుంట అంటున్నది నూరున్నిసా.

ఇగంతె... రక్తంపోయినా కంటనే పోవాలె. పన్నెండు మందిని కంటెరక్తం యాడుంటది. బచ్చేదానీ చినిగిపోయేద్దాంక కంటనే ఉండాలి... నఫీజ్‌కు నీర్సంతోని కండ్లు తిరిగి నట్లయ్యింది.

గొన్ని దినాలు ఏమనలె నూరున్నిసా. అంతా ఖామోష్ అయిపోయిన్రు. నఫీజ్ దువాల మీద దువాలు జేస్తున్నది మగ పోరనికి కోసానికి. ఎవలేం జెప్తె అది దింటున్నది. ఔలాద్ గావాల్నని అర్ఫాజ్ మసీదుల్ల, దర్గాల కాడ, దువాలెక్కువ జేసిండు. నఫీజ్‌ని పహారీ షరీఫ్ దర్గాకి తీస్కపోయి మొక్కుకుండు.

దినాలు నెలలైనాయ్. గునుగుడు షురు అయ్యింది. నఫీజ్ పరేషాని ఇంకెక్కువయ్యింది. దువాలెక్కువ జేసింది.

నెలలు యాడాదైంది... గునుగుడు తిట్లకి మారుతాంది. నఫీజ్ గుండెల్ల దడ ఎక్కువయితాంది. ఉపాసాలు షురు జేసింది.

సంవత్సరం ఎల్లి - ఇంకో సంవత్సరం షురు అయ్యింది. అదిగూడ ఖతం అయ్యింది. నూరున్నిసా అల్టిమేటం ఇచ్చింది. నఫీజ్ గుండె ఆగినంత పనయింది.

అత్త కాల్లు మీదవడి ఏడ్సింది. ఇంకొక యాడాది జూద్దామన్నది. ఏడ్పు దుఃఖంతోని మనిషే కన్నీటి మత్తడయింది

ఈ నడిమిట్ల రంజాన్లు అచ్చినయ్ బక్రీద్‌లచ్చినయ్ ఎల్లిపోయినయ్. మొహ్రాం వచ్చె చార్మినార్ వోయి బీబీకా ఆలమ్ కిందట్టి గట్టంది ఆడిబిడ్డ ఫాతిమా. పక్కింటి ఖతీజా బేగం పక్కూర్లె నూరున్నిసా చెల్లెలి బిడ్డె సాధికాలకు జెలాద్‌లు బుట్టిన్రు. వాల్లకేగాదు దునియల మస్తు మందికి మరద్ బచ్చాలు పుట్టిన్రు. అట్ల సానమంది బత్కిపోయిన్రు. ఒక్క నఫీజ్‌కు మాత్రం ఎవలు పుట్టలె.

మరి . నూరున్నిసా ఏం జేసింది.

నూరున్నీసా కొడుక్కు రిస్తా తీస్కచ్చింది.

నూరున్నిసా ఇషం సీసా సూపిచ్చింది.

నూరున్నీసా కొడుక్కు నిఖా జేపిచ్చింది .

మరి... నఫీజ్ ఏం జేసింది?

అర్ఫాజ్ నిఖా అయి తెల్లవారె పెరంట్ల నూతిల తన ఇద్దరు బిడ్డలతోని శవమై తేలింది. జిందగీని ఖ్వాబ్‌ల గూడ చూసుడు ఇష్టంలేక.

● వార్త ఆదివారం అనుబంధం - 2 నవంబరు, 2003 ●

# 83. ఎర్రదీపం

♦ ముక్తవరం పార్థసారథి ♦

బావుంది. చల్లనివేళ బయలెళ్ళారు ఊరేగింపు.

– రోడ్డు కాలిపోతున్నది. ఎండలు మాడ్చేస్తున్నాయి –

అలా మూగుతారేం, నడవండి ఎందుకింత హడావిడి, ఎవరి కొంపలో తగలడి పోతున్నట్టు. పద పద.

ఓహో, శవం ఊరేగింపా, పెళ్ళికి, చావుకీ ఊరేగింపే. ఎంత జనం వెంట నడుస్తున్నారు. ఇలా, ఇంత బలగంతో చచ్చిపోవాలి. అవునూ, శోకాలు పెట్టే ఆడవాళ్ళు లేరేం? పద, పద కొంచెం పక్కకు తొలగవయ్యా స్వామీ.

కుండ పట్టుకుని ముందరో మనిషి వుండడూ, ఏమిటి వీళ్ళ బాజాలు వుపయోగించనట్టుందే. వ్యవహారం కూడా కొంచెం పెద్దదిగానే కనబడుతున్నది. పాడెకు బదులు జీప్‌ను ఉపయోగిస్తున్నారు. చుట్టూ అంతమంది. సరే...పద.

పద. ఏమిటీ హత్యా, ఆఁ, మతకలహాల్లో హత్యా! అందుకా రోడ్లిలా నిర్మానుష్యంగా వున్నాయి. పద. పద కర్రలు.

అమ్మయ్యో. ఈ గడ్డంతో ఎలా దాక్కోవటం? పద, ఏదీ కొంచెం చోటు, ముందరో లూటీ.

ఔనౌను. ఇంకవన్నీ మామూలే. పరిగెత్తు. జనం వచ్చేస్తున్నారు.

ఊఁ! పరుగు.

కొట్లన్నీ మూసి వున్నాయి. జనం పరిగెత్తుతున్నారు.

ఈ ఉద్రిక్తత క్షణంలో ఎలా వ్యాపించింది. వాళ్ళ కళ్ళలో ఎంత తీవ్రత.

ఇదిగో జనం వచ్చేస్తున్నారు. రాళ్ళు రువ్వుతున్నారు. లాఠీలు. లాభంలేదు.

పరుగు! వచ్చేశారు. అయ్యో!

పరుగు పరుగు పరుగు పరుగు ప....అబ్బా! బొటనవేలు పగిలింది. సరేలే. పరిగెత్తు.

పాపం, రిక్షా పచ్చడైంది. రిక్షా వాడితల చితుకుతోంది. పరుగు పరుగు. నీ తలా చితికి పచ్చడవుతుంది. పద.

బాబోయ్, ఎలా తప్పించుకోవడం. పరుగు పరుగు గన్ కారేజీ వంటి జీప్ మీద శవం.

చుట్టూ గులాబిపూలు, కుంకం, కళ్ళు ఎర్రగా.

లాల్చీలు, కుంకం కారి. . నెత్తురు. అబ్బా కాలినొప్పి.

పరుగు పరుగు, పక్క సందులోకి

గాడ్, ఇది సందుకాదు. ఇక్కడ సందులేదు. పరుగు. పాపం తోపుడు బళ్ళు - అన్ని పళ్ళు -

పోనీ, మీరైనా తినండి.. ప్లాస్టిక్ సామాన్లు పగిలి.. వాళ్లేమన్నారు అమాయకులు... అయ్యో తల పగిలింది. వాడికి నీక్కూడా పద పద.

అమ్మా, చచ్చాను దేముడోయ్, పద. పద

ఒక్కరాయే కద, ఫరవా లేదు పరిగెత్తు, ఊఁ పదా.

ఖూన్‌కా ఖూన్- నినాదాలు.

కిస్కా ఖూన్?

ఆ అరుపుల్లో ఎంత ఉద్రేకం? నిన్ను ఛాలెంజి చేస్తున్నారు వాళ్ళ కళ్ళల్లో బాధా, పగా, నిషా, భయం.

ఓపిక చచ్చినవాళ్ళ మొహాల్లో అలసట ఆకలి.

ఖూన్‌కా ఖూన్.

అమ్మా, చస్తే చస్తాను. ఇంక పరిగెత్తలేను. . గౌస్.

అయ్యో, పాపం గౌస్‌కు గాయాలు. ఇదిగో, గౌస్

మొదట అతన్ని డాక్టరు వద్దకు తీసికెళ్ళండి.

గౌస్ ఎలా తగిలాయి గాయాలు?

అబ్బా, మంట చచ్చాను.

మరేం భయంలేదు. సూపర్ ఫిషియల్ స్క్రాచెస్.

గౌస్ ఏమైంది?

ఊరేగింపు.... ఏమిటీ?

గౌస్ ఇంటికెళ్ళిపో, ఇంక పనిచెయ్యలేవు. వెళ్ళి విశ్రాంతి తీసుకో

నీ వొంట్లో బావుండలేదు. వెళ్ళిపో గౌస్.

వద్దు. ఒక్కణ్ణీ వెళ్ళలేను ఈసారి చంపేసినా దిక్కులేదు.

ఔను. ఈ రాత్రెలా వుంటుందో?

రాత్రి అటువైపు యిళ్ళు తగలెట్టారట

వాళ్ళూరుకుంటారా, ఈ రాత్రి వాళ్ళూ తగలెడతారు.

ఐనా, ఇదొక్కనాటి గొడవా, ప్రతీసారీ ఇంతే.

వాళ్ళో హత్య చేస్తారు. తెల్లారి ప్రతీకారంగా మరో హత్య.

కొన్ని యిళ్ళు కాలిపోతాయి. ఆస్తి నష్టం ఛీఛీ వెధవ గొడవ

సవాల్ చేసుకున్నవాళ్ళు పోట్లాడుకోవాలి గాని ఇలా జనాన్ని హింసిస్తే ఎలా?

గౌస్, పోనీ ఇలా పడుకో!

పరవాలేదు. కూర్చుంటాను.

ఏమైంది. చెప్పు.

చెప్పేందుకేముంది. చూడాలి.

రాత్రికెలా మరి, ఎక్కడుంటావు? మీయింట్లో...

యింటికెళ్ళను. మా వాళ్ళు లేరు. ఎక్కడో హోటల్లో వుంటాను.

హోటల్లో ఎందుకు మాయింట్లో పడుకో. తోడుగా మా బాబాయి, మరో నలుగురు స్నేహితులు కూడా వస్తున్నారు.

పద–

జరగవలసిందంతా జరిగింతర్వాత ఫైరింజన్లు వచ్చాయి. ప్రేక్షకుల మీద బాష్ప వాయువు షెల్స్ పేలాయి. ఎవరో చచ్చినట్లుగా ఇళ్లు బోసిగా వున్నాయి. మంటలారని కిరోసిన్ కొట్లు, కాలని శవాల్లా పొగపట్టిన కిరాణాకొట్లు.

అధికార్లు, అనధికార్లు రాజకీయ నాయకులువచ్చి చూసి మత సామరస్యం పెంపొందించుకుని దేశ సౌభాగ్యానికి, ఐక్యమత్యానికి తోడ్పడవలసిందని ఉద్బోధించి వెళ్ళారు. పాత్రికేయులు జనాన్ని ప్రశ్నించారు. కాని వాళ్ళ జవాబులు 'ఉద్రేకాల్ని రెచ్చగొట్టేవి' గా వుండడం వల్ల అధికార వార్తలను మాత్రమే ప్రచురింప నిశ్చయించు కున్నారు.

ఫైరింజన్లు, ఫైరింజన్లు.

పగలంతా, రాత్రంతా వాటి చప్పుళ్ళే.

ఎక్కడర్రా తగలడుతున్నాయి ఎక్కడ? ఎక్కడ? ఎవరూ ఈ పన్లు చేస్తున్నారు. చేయిస్తున్నారు.

'ఏ గడియారం అలారం మోగుతున్నది? ఎంతయింది, గంట? ఫైరింజను గంట.

ఈ రోజు నగరం పిచ్చాసుపత్రి లాగున్నది, లేవండి.

ఇక్కడొ, అక్కడొ యిళ్ళు తగలడుతున్నాయి, చూడండి.

ఆఁ.. ఏమయిందవ్వా, రాత్రి?

రాత్రి మా వాడలో యిరవై మూడిళ్ళు కాల్చేశారు బాబూ, ఇద్దరు పిల్లల్ని – చంటి పిల్లల్ని పొడిచి చంపారు.

ఒక్కణ్ణి నడిరోడ్డు మీద పొడిచారు....

గట్టు దగ్గరున్న చాకలి దాన్ని....

ఇంకా? ఇంకా?

విన్న ఘోరాలూ చాలవూ, ఇంకా ఏం కావాలి?

పరిస్థితి అదుపులో ఉంది.

– ఉదయం వార్తలు

స్వల్పంగా ఆస్తి నష్టం తప్ప చెప్పుకోదగ్గ సంఘటనలు మరేమీ లేవు.

– సాయంత్రం వార్తలు

ఐదు ప్రాణాలు పోతే, ఓ ఆడకూతుర్ని మానభంగంచేసి చిత్రవధ చేస్తే వందిళ్ళు తగలబడితే ఇంకా పరిస్థితి అదుపులో వున్నట్టా?

హరహర మహాదేవ!

అంతేనండీ, ప్రజల ఉద్రేకాలను రెచ్చగొట్టే విషయాలేవీ చెప్పరు, ముఖ్యంగా ఇలాంటి సమయాల్లో.

అలాకాదు. ఎవరు ఎంతమంది చచ్చారో, ఎవరి ఆస్తి ఎంత నష్టమయిందో నాకు స్పష్టంగా కావాలి ఆఁ అదీ నాక్కావలసింది, తెలిసిందా!

ఆ లెక్కన వాళ్ళు నిజం పలకరు వాళ్ళకు నిజం తెలియదనికాదు. తెలిసీ పలకరు. ఎందుకంటే...

వాళ్ళకధికారం కావాలి. జేబులు నిండాలి. మరో పది బంగళాలు లేవాలి. వాళ్ల విగ్రహాలు, పటాలు అన్ని ముఖ్య ప్రదేశాల్లో ఆవిష్కరింపబడాలి.

వీధులకు, సంస్థలకు వాళ్ల పేర్లుండాలి. వాళ్ళను శ్లాఘిస్తూ రాసిన కావ్యాలకు అవార్డులు రావాలి. ఇంకా..

ఊక దంపుడు ఉపన్యాసం యివ్వకు అసలు విషయం చెప్పు. అందుకోసం నీ పార్టీకి ఓటు వెయ్యమంటావా. ఆఁ?

కాదు. అసలు లోపమంతా మనలోనే ఉంది. మనలో ఐక్యమత్యం లేదు.

కారణం కులభేదాలు. అందువల్ల కులాలు నిర్మూలించండి.

మనుషులందరూ ఏకం కావాలంటే మతాలు నిర్మూలించాలి మరి.

నీకు మతమంటే గౌరవం లేదు

ష్! ఆపండి కాసేపు గొడవ.

నాకు తెలుసునురా. దేశ విభజన రోజుల్లో ఎన్ని ఘోరాలు జరిగిన యనుకున్నావు...

ఔనుగానీ, మీ వాళ్ళనెప్పుడు తీసుకొస్తున్నావు బాబాయి?

ఎలాగోయ్, ఈ పరిస్థితులు కొంచెం నిమ్మళిస్తే... ఐనా ఇది మొదటిసారి గనకా, ప్రతీ రెండు మూడేళ్లకోసారి ఇంచుమించు ఇంతే. ఎప్పుడీ విపత్తులనించి విముక్తి దొరుకుతుందో....

ఒక్కటే పరిష్కారం చెప్పనా అసలు నలభై ఏడులోనే తేలిపోవలసింది. ఇప్పటికైనా మించిపోలేదు...

ఆపు, ఇంకాపు. నువ్వేం చెప్పొద్దు ఆపు.

సారీ, గౌస్, నీ మనసు నొప్పించానా, క్షమించవూ.

ఫరవాలేదోయ్. ఇలాంటి సమయాల్లో ఉద్రేకాలు సహజం.

ప్లీజ్, టేకిట్ ఈజీ.

అదేమిటి? మళ్ళీ గోల?

అంతా వట్టి షో! సమాన హక్కులూ లేవు. స్వాతంత్ర్యమూ లేదు.

మీరే కూడబలుక్కుని అడుతున్న నాటకం ఇది.

అంతా జరగనిచ్చి, తర్వాత,

అయ్యో బలహీనుడి కన్యాయం జరిగిందే అని నాలుగుకన్నీటి చుక్కలు రాల్చిపోతావు కదూ.

నేనసహాయుణ్ణే. నాకు క్షేమం లేదు. కాని ఈ అవమానాల వల్ల నాలో ఏం రగుల్కుంటోందో తెలుసా?

నీ మీద పగ. నేను నీతో మాట్లాడను. కాని నీ పాలలో విషం కలపగలను.

భాయీ, పిల్లిని గదిలో బంధించి హింసించకు.

ఎవరో పరిగెత్తుకొస్తున్నారు. గోల.

అదిగో కేక. పన్నెండు దాటింది.

కిటికీ తియ్యకు. లైట్ తీసెయ్.

మూలుగు, దూరంగా మూలుగు.

ఎలాగ, ఈ రాత్రి గడవటం?

మూలుగు, చేరువవుతున్నది.

పరిగెత్తుకొచ్చిన ఆ దడ ఇంకా పోలేదు. వ్రేలు వాచింది. సలుపుతున్నది. బాధకు జ్వరం వస్తున్నట్టుంది. ఆ టెన్షన్ ఇంకా పోలేదు.

మిగతా రోజుల్లో ఎంత స్నేహంగా ఉంటేనేం.

ఇప్పుడు సునాయాసంగా చీలిపోగలరు.

క్షణంలో రక్తం వేడెక్కుతుంది.

రోడ్లు వాళ్లకోసమే అన్నట్టుగా ఖాళీగా వుంటాయి.

ఈ నగరంలోని ఏ ప్రాంతం ఎక్కువ క్షేమకరం?

అలా కాదు. మనమంతా సోదరులం.

అవును. ఎవరు కాదన్నారు. హం సబ్ కా ఖూన్ ఏక్ హై. ఖూన్ కా ఖూన్.

చరిత్ర ప్రసిద్ధమైన చార్మినారు కట్టడమిది....

అమ్మ బాబోయ్. అటువైపా.

నిజం, నిజం తప్ప మరేం పలుకకు. ఇది హైకోర్టు.

సరిసరి అటువైపు ఛస్తే వుండను.

ఇది మూసీ, దీనికి రెండువైపులా... మూలుగు!

ఎటు వైపు?

నేలమీద ఎవరో పొర్లాడుతున్నారు. బలహీనంగా మూలుగుతున్నారు. సత్తువ కోల్పోతున్నారు.

ఎవరు? ఎవరు?

ఔను. ఆడగొంతే.

నరాలమీద సన్నగా నొక్కులు.

అర్ధరాత్రి ఆడగొంతు, రోడ్డు పక్క సన్నగా మూలుగుతూ.

తూలుతూ వచ్చేస్తున్నది. మూలిగే సత్తువ కూడా లేనప్పుడు వెలువడే అతి సన్నని శబ్దాలు.

ఎవరో ఆమె?

పొద్దున్న జరిగిన దానికి ప్రతీకారంగానేమో.

అవును. సరే. తృప్తిగా వుందిగదూ

నో. తలుపు తియ్యొద్దు.

చూద్దాం ఏమిటో

జాగ్రత్త. ఏమైనా జరిగితే. రోజులు బాగోలేవు ఇప్పటి దాకా గోల . ఎవరో .

తలుపు సందులోంచి ఏం కనిపిస్తుంది. తీద్దాం ఇటువైపే నడుస్తున్నారు. తియ్యకండి. ష్.

నా కాళ్ళు వణుకుతున్నాయి మృత్యులయ

తూలుతున్న నడక చప్పుడుకు మూలుగు.

తియ్యకు, తియ్యకు.

అమ్మో, తలుపుమీద చప్పుడు, ష్. ఎవరో బాదేరు?

ఊపిరి కూడా బిగపట్టిన నిశ్శబ్దం - భయంకరం.

తియ్యండి, తలుపు తియ్యండి.

వద్దు కొంచెంగా.

ఎవరూ? ఏం చేశారామెకు? ఎవరీ నగ్న సుందరి?

నీలో ఏం ప్రేరేపిస్తున్నది? అరె, పెదాలు లేవేం?

ఎర్రటి గుడ్డలా? కాదు.. కాదు.. నెత్తురు ఏదో వాసన, నర వాసన

అయ్యో, ఆమె వక్షోజాలేవి?

ఎవరమ్మా, నిన్ను గాటు పెట్టారు?

నీ వునికి వాళ్లనెలా పురిగొల్పింది?

ఎక్కడ గాయం చేశారో కూడా తెలియకుండా ఒళ్లంతా నెత్తురు

ఈ కర్ఫ్యూ రాత్రి అసలు నువ్వెలా బయటికి వచ్చావు?

ఏయ్ , మనిషి లోపలకు తూలుతూంది. ఊఁ, జీపు మీద శవం, కళ్ళు ఎర్రగా, రాళ్ళు. కర్రలు.

తోసెయ్యండి. దాన్ని

అమ్మో, నేను ముట్టుకోను.

ష్ష్... ఇటు సోలిపోతున్నది తోసెయ్.

అబ్బీ, పో.

పిచ్చా ఏమిటి, తోసెయ్యమంటే.

తోసెయ్.

తోసెయ్.

పాపం.

పాపం లేదు పుణ్యంలేదు. తోసెయ్

భయంకరం. నేను ముట్టుకో..

తోసెయ్. హమ్మయ్య.

నా కేడుపొస్తున్నది. భయమేస్తున్నది. గుండెల్లో దడొస్తున్నది.

టిఁ గడియ పెట్టియ్.

ఆ స్పర్శ!

మెత్తగా...

ఎవరు హంతకులు?

ఎవరది?

పిచ్చిది.

ఎవరూ?

చేతులు కడుక్కుని వచ్చి పడుకో. రెండు దాటింది.

ఎవరో?

ఏమో, ఐనా పిచ్చివాళ్ళకేం మతం.

ఒక సంఘటన.

మురికినీళ్ళతో, మూసీనది, సోమరిగా, మగతగా, రోగిష్టిలా నెమ్మదిగా కదుల్తోంది. నడిరాత్రి దాటినా నీటిమీది గాలి ఇంకా వెచ్చగా, దుర్వాసనలతో మత్తుగా శ్వాస కోశాల్లో నిండుతోంది. ఒంటిగా నిర్మానుష్యంగా వున్న వంతెన కావలివైపు పోలీస్‌స్టేషన్ దగ్గర ఖాళీ ట్రక్కు నిల్చింది. దూరంగా కన్నిస్తున్న మంటల దగ్గరకు పోలీసులప్పుడు వెళ్ళారు.

ఎదురుగా తడికలతో కప్పబడిన పళ్ళ దుకాణం ఒకటి బిక్కుబిక్కుమంటూ కూర్చున్న అసహాయలా ఉంది. అక్కడ అనూహ్యమూ, భయానకమూ ఐన వాతావరణం ట్రైం బాంబులా వేచి వుంది.

పోలీసులు నిష్క్రమించిన పదినిమిషాల్లో నలుగురు మనుషులు ముసుగుల్లో వచ్చారు. ఒకడు గీరిన అగ్గిపుల్ల పక్కవాడి చేతిలోని దివిటీని వెలిగించింది. మరొకడు పెట్రోలు సీసా దుకాణం మీద కుమ్మరించిన క్షణాన దివిటీ దుకాణం మీద విసిరేసి పరిగెత్తారు.

మరో రెండు నిమిషాల తర్వాత ట్రక్కు కూడా మంటల్లో చిక్కుకున్న బౌద్ధ భిక్షువులా కన్పించింది.

నాలుగు ముసుగులూ వంతెన కింద గుడిశల్లో మాయమయ్యాయి.

మూసీనది కిక్కురుమనకుండా, రహస్యాలన్నిటినీ కడుపున దాచుకుని, ఒదిగి ఒదిగి ప్రవహించింది.

● 2003 ●

# 84. మట్టి మనుషులు

♦ పంజాల జగన్నాథం ♦

తంతెలు మారినా ప్యాదోళ్ళ తలరాతలు మారలేదు. దునియాలో ఎన్నో మార్పులు సుడిగాడ్పులా వచ్చినయ్. ఆ మార్పులతోటి కొందరే సుఖంగ బతుకుతున్నరు. కానీ, ఎందరో సుడిగాలిల చిక్కుకొని గిలగిలలాడుతున్నరు. ఎన్నో కుటుంబాలు ఆగమాగ మయినయి. బతికే తరీకలు మారి, బతుకు దెరువు కరువయి వాళ్ళ బతుకులు ఎటమట మయితున్నయి.

సుట్టుముట్టు గుట్టలు, ఆ గుట్టల్ల నడిమిట్ల అదో ఊరు. దగ్గరలో పెద్ద అడివి. ఆ ఊరి జనంలో అమాయకత్వం ఉంది. భారతదేశపు పల్లెలకు అదొక ఉదాహరణ. ఆ ఊళ్ళో చావకుంట, బతుకలేక ఎద్దుముడ్డి బొడుసుకుంట ఎవుసం జేసుకుంట ఎట్లనో సంసారాన్ని ఎల్లదీత్తున్న కొమురయ్య ఓ బక్కరైతు. రెండు దొయ్యల తరి, అరబిగెడు కుష్కి రెండు బక్కెడ్లు అతని ఆస్తి. ఇంత వరి, గొంతపునాస పంటలు పొట్ట మందం పండించి పెండ్లాం, పిల్లల్నీ పోషించుకుంటుండు. అతని సంసారం గొట్టె తోకలా ఎదుగూ బొదుగూ లేకుంట ఉంది. సుఖమంటే ఎట్లుంటదో అతనికి తెల్వదు. కొమురయ్యకు తెలిసిందల్లా వంగవడి పనిజేసుడే. మన్నుల బుట్టిండు. మన్నుల బొర్లుతుండు. బతుకు పోరుల తండ్లాడుతుండు. కొమురయ్య తన మనుసుల ఎనుకటి ముచ్చెట్లు యాజ్జేసుకుంటుండు.

వీరయ్యకు కొమురయ్య ఒక్కడే కొడుకు. కొమురయ్య భూమిమీద పడంగనే వీరయ్య పెండ్లాం కన్నుమూసింది. వీరయ్య కమ్మకత్తితో తుమ్మాకు, తుమ్మకాయ కోసి తినిపించి ఎంతో గావురంగ పెంచుకున్న మేక తన పిల్లమేకతో పాటు కొమురయ్యకు కూడా తల్లి అయింది. వీరయ్య తన కొడుక్కు మేకపాలు పోసి సాదిండు. సవరించిండు. వీరయ్యకు తన కొడుకూ, తన చేన్లూ, చెలకలు తప్ప వేరే లోకమే తెల్వదు. మల్ల లగ్గం గూడ జేసుకోలేదు. నియ్యతుగ బతుకుతున్నడు. ఎవుసం పనికి పోయేటప్పుడు మాత్రం వాళ్ళ అవ్వకు కొమురయ్యను అప్పజెప్పి, పాల గిన్నె ఇచ్చి ఎప్పుడెప్పుడు పాలు తాగించాల్నో, ఏమేం జాగర్తలు తీసుకోవాల్నో చెప్పి వెళ్ళేవాడు. రాత్రిళ్లు వీరయ్య కొడుకును పక్కలో బెట్టుకొని పడుకునేటోడు. ఎవరిని నమ్మేటోడు కాదు. సుట్టాలు వీరయ్యకు మారువానం తేవాలని జూసిండ్రు. అందుకు వీరయ్య ఒప్పుకోలేదు. మారువానం వచ్చింది తన కొడుకును ఎట్ల జూసుకుంటదోనన్న భయం.

కాలం గడిసిన కొద్దీ కొమురయ్య ఎదుగుతుండు. చేతికందిండు. కొమురయ్యను వీరయ్యఎవుసం పనులకు ఎంత తోలుకెల్తుండు. కొమురయ్య వయస్సోడయిండు. రెక్క ముదురుతుంది. సన్నగా మీసం మొలిచింది. ఈడు రాంగనే వీరయ్య తనకొడుక్కు తోటి రైతు బిడ్డ సుగుణతో లగ్గం జేసిండు వయస్సచ్చిన పోరగాండ్లు ఇయ్యల్ల రేపట్ల నమ్మచ్చతట్టులేదని ఎగిర్త పడి కొమురయ్యకు పెళ్ళి జేసిండు. సుగుణ పేరుకు దగ్గట్టు గుణవంతురాలు. పనిమంతురాలు. కొడుకు ఎదిగి చేతికందిండు. కోడలుకు సంసారాన్ని చక్కబెట్టుకునే ఇగురముంది. గిప్పుడు వీరయ్యకు గొంచెం ఊరట కలిగింది. నిరందిగ ఉన్నడు. నిమ్మలం అయింది. ఆరాం దొరుకుతంది. కోడలు యాల్లకింత చేసి పెడతంది. బుక్కెడంత తిని పనికి బోతండు పురుసత్ దొరికినప్పుడల్లా ఊల్లే సాపడి కాడ రాయి చెట్టుకింద తనతోటి రైతులతో మంతకాని జేసుకుంట పొద్దుబుచ్చుతుండు.

"ఈరయ్యా! నీకేందిరా మారాజువు. కొడుకు పనోడయిండు. బుద్ధిమంతుడు. రేవు కచ్చిండు. బుద్ధిమంతురాలైన కోడలు దొరికింది" అంటూ సోపతి గాళ్ళన్నప్పుడు వీరయ్య చాన సంబరపడెటోడు.

"వారీ కొమురయ్యా...! మూలసుక్క బొడిసింది బిడ్డా! మోటకు బోవాలె. తోటకు నీళ్ళు గట్టి అట్నుంచి అటే చెర్ల దొయ్యలకు గూడెయ్యాలె. లే బిడ్డా! రెక్కల కట్టం జేసుక బతికెటోళ్ళం. పంటె ఎల్లుతదా....!" గొంగలి నిండ కప్పుకుని కడుపులో కాళ్లు మలుచుకొని పడుకున్న కొడుకును వీరయ్య గావురంగ లేపిండు. అప్పటికే వీరయ్య కొట్టంల పెండ తీసి, పెంట బొందల ఏసిండు. కొట్టం సాపు జేసి, ఎడ్లకు మ్యాతేసిండు. అవి మేస్తున్నయ్. ఇంకా అట్లనే మూలుక్కుంట అటిటు మెసులుతు పడుకున్న కొడుకును జూసి, "వారి కొమురయ్య ఏంది బిడ్డా...! పొద్దు బోవట్టె లే..!" గట్టిగ గద్దిరించిండు. వీరయ్యకు తెలుసు వయసు పోరగాండ్లకు నిద్దురెక్కువని. జిరాయత్‌ల నిద్ర, ఆకలి చంపుకొని రెక్కలు ముక్కలు జేసుకుంటె బుక్కెడు బువ్వ దొరుకుతుందని వీరయ్య ఆలోచన.

వీరయ్య గద్దరింపుతో "ఈ ముసలోడికి ఏడ పనిలేదు. దయ్యమోలే నిర్దనేవోడు. నీ యవ్వ... గింత నాత్రి లేపుతుండు" గులుక్కుంటనే కొమురయ్య కండ్లు నులుముకుంట లేసిండు. జెకుముకి రాయిని చటన కొట్టి నిప్పు రాజేసి దూదిని అంటించుకొన్నడు. దాన్ని చుట్ట కొనకు పైన పెట్టుకుని ఏలుతో ఒత్తిపట్టి 'ఉప్ప,ఉప్ప' మంటూ ఊదిండు. చుట్ట అంటుకుంది. 'రప్పు రప్పు'న రెండు దమ్ములు దాగిండు. గుండెనిండా ఎచ్చదనం. కొమురయ్యకు 'హాయ్' గుంది నిద్ర మబ్బు తొలగింది. గొంగళి ముసుగేసుకుని కొమురయ్య తండ్రినుక నడుస్తుండు. ఎన్నీల పిండి ఆరబోసినట్లుంది.

వీరయ్య ఎడ్లను దోలుకుంట తోటదారి బట్టిండు. తోటకు చేరుకున్నడు. ఎడ్లను మోటకు గట్టి 'రామ సక్కనోడ ఓ రైతు బిడ్డా' అనుకుంట తీరొక్క పల్లె రాగాలు పాడుకుంట మోట గొడుతుండు. ఆ పాటలో ఏదో తెల్వని దుక్కం అండ్లనే ఏదో సంబురం అనుభవిస్తుండు. వీరయ్య ఆ పాటలోనే తన బాధ, శ్రమ, అలసట అన్నింటిని మరిచి పోతండు. అతనికి నంగి పనిజేసుకునుట్లనే ఆనందం. కొమురయ్యను

కాయగూర, మిరప చెట్లకు నీళ్ళు గదుతండు. ఓ గుంటెడు మిరుపచెట్లు, కొన్ని ముళ్ళ ఎల్లి, కోతిమీర, మెంతి వాటి చుట్టూ అక్కడక్కడా ఉల్లి వేసిండ్రు. నడమ నడమ ముద్దబంతి, పట్నం బంతిపూలు, పచ్చని గసాల పూలు, జాంబురంగు పట్నం బంతిపూలు, కుంకుమ రంగు గడ్డిపూలతో తోటంతా సింగారించుకొని కళకళ లాడుతంది. ఓ రెండు కోండ్రల మక్క అది తలసుంచు లేస్తుంది. తోట చుట్టూతా ఆయిందం చెట్లు, వాటికి చిక్కుల్లు, ఆనిగపు, బీరతీగలు పాకి ఉన్నయి. పిందెలు వేసినయి. తోటకు చుట్టూ హద్దుల్ల పసులు, గొడ్డూ, గోదా, మేకలు, గొర్లూ రాకుంట జిట్రేగి కంపతో ఎనుగు నాటిండ్రు. తోట్లకు పోయేతందుకు మోట దగ్గర తోట మొదట్ల తుమ్మ కట్టెల తోటి చేసిన పనగడి ఉంది. కాలువల్ల పారే నీళ్ళు ఎన్నీల పొడకు తల తల మెరుస్తున్నయి. బాయిల నీళ్ళు ఒడిశినయి. నీళ్లు ఊరిన కొద్దీ వీరయ్య తోట పారిత్తున్నడు. మిరుప, టమాట, వంకాయ పూత కచ్చినయి. చిక్కుడు పూత వాసన ఘుమఘుమ లాడుతంది. తెల్లారె గట్లూ తోటంతా మనసు వడి తడి తడిగా ఉంది. మోటను బందువెట్టి తండ్రీకొడుకులిద్దరు చెర్ల దొయ్యలవైపు బయలు దేరిండ్రు. ఎడ్లను పక్కన తుమ్మ చెట్టుకు కట్టేసిండ్రు. వీరయ్య, కొమురయ్య కలిసి గూడేత్తండ్రు. దొయ్యలకు నీళ్ళు పారుతున్నయ్. ఓ రెండు గంటలయినంక 'గూడ' ఆపిండ్రు. వీరయ్య దొయ్యల చుట్టూ తిరిగి పారిందీ, లేనిదీ చూసుకున్నడు. ఒడ్లల్ల ఎండ్రికాయలు చేసిన పొక్కల్ని సదిరిండు. దొంగపొక్కల్ని సదరడానికి మా తిప్పల వడ్డడు వీరయ్య. పొక్కలు సదిరేటప్పుడు దొరికిన ఎండ్రికాయల్ని పేగుల ముల్లె గట్టి కొడుక్కు ఇచ్చిండు. తెల్లారె సుక్క బొడిచింది. "వారీ కొమురయ్య ఈ ఎండ్రికాయల్ని కోడలు పిల్లకు ఇచ్చి పులుసు బెట్టమను. నేను ఎడ్లను చెరువు కట్టపొంటి కొచ్చేపు తింపుకొత్త. పసుకనాకుతయి. నువ్వు జెల్దిన ఇంటికి పో" అని కొడుకును ఇంటికి పంపిండు. తుమ్మ చెట్టుకు కట్టేసిన ఎడ్లను ఇడిసిండు.

తెల్లారుతుంది. వీరయ్య చెరువు కట్టెంబడి ఎడ్లను తోలుకుంట పోతున్నడు. చెరువుల కొద్దిపాటి నీళ్ళున్నయి. ఆ నీళ్ళ తడలకు చందమామ కదలి ఇచ్చుక పోతంది. మత్తడి వద్ద నీళ్ళు లటలట లాడుతున్నయి. అక్కడక్కడ చాప పిల్లలు ఎగురుతున్నయి. తెనుగోళ్ళు తోపెలేసి చాపల్ని పడుతున్నరు. చల్లని ఈదరగాలి. పిట్టల కిసకిసలు. ఎక్కడో చెట్టుమీద కోయిల కూస్తంది. చెరువు కట్టెంబడి సోలుపూత తాటిచెట్లు, అక్కడకడ ఈత గుంపులు, గాలికి అవ్వితి ఆకులు వూగుతున్నయి. తీతువు పిట్ట అరుచుకుంట వెళ్లుతంది. కొంగలు ఆకాశంల సోలుపూత పోతున్నయి. మబ్బులు మెల్లిగ కదులుతున్నయి. గౌండ్లోల్లకు మోకు ముత్తాదులతోటి కావడిబద్ద బుజాన ఏసుకొని తాళ్ళిక్కడానికి పోతన్నరు. తొవ్వెంబడి పోతున్న వీరయ్యను ఎక్కడికెళ్ళో ఈత గుంపుల 'బుస్సు' మంటూ పాము వచ్చి కుట్టింది. పాము చూస్తుండగనే మాయమైంది. 'అవ్వ' అంట వీరయ్య కాలు చూసుకున్నడు. రెండు కోరలు దిగి గాయమైంది. కొంచెం నెత్తురు బయటికచ్చింది. మూలుక్కుంట కొంత దూరం నడిచిండు వీరయ్య...అంతే! కూలవడ్డడు. నోట్లెనుండి నురుగులు కక్కుతున్నడు. దగ్గర్ల ఈత చెట్లల్ల ఉన్న గౌండ్ల మల్లయ్య జల్దిన ఉరుక్కుంట వచ్చి 'ఈరయ్యను పాంకుట్టింది' అంటూ మొత్తుకో వట్టిండు. చుట్టుపక్కల దరిదాపుల్ల, తాళ్ళల్ల ఉన్న గౌండ్లోల్లు అందరూ అక్కడికి చేరిండ్రు. విషమెక్కింది అమలచ్చింది. వాళ్లకు తెలిసిన నాటువైద్యం జేస్తన్నరు. కొందరు

ఒకరూ అలం తెచ్చి ముక్కుల, నోట్లో, గాయంమీద పసర్లు పిండుతన్నరు. ఫాయిదా కనబడుతలేదు. వీరయ్య భయాలు దప్పిండు. ఒకరు కొమురయ్య వద్దకు వెళ్ళి సంగతి జెప్పిండ్రు. "అయ్యో! నాయిన్నా ఎంత పనాయే..!" అంటూ లబ్బలబ్బ మొత్తుకుంట వెత్తే. నోరు కొట్టుకుంట ఉరికిండు. కొమురయ్య చేరేటప్పటికి వీరయ్య పాణం ఇడిసిండు కొమురయ్య తండ్రి కాళ్ళమీద పడి తనని గావురం గెట్ల పెంచిందీ తలుచుకుంట కంటికి కుంచెడు వడుపు తుండు. అక్కడున్న అందరికి దుక్కం వచ్చింది. కొందరు అతన్ని ఓదారుస్తున్నరు. కొమురయ్యకు లోకమంతా చీకటిగా తోచింది. తండ్రి యాది అతనికి మనసున వట్టకుంట జేస్తంది. తండ్రి చావుతో కొమురయ్య ఒంటరి చాడయ్యిండు. కొమురయ్యది పెద్దదిక్కులేని బతుకయ్యింది.

అనుభవము లేకపోవుడు, నీటి ఎద్దడి, లాగోడి లేక.. కొమురయ్య ఎవుసం కుంటువడ్డది ఒకరోజు మబ్బుల కొమురయ్య తోటకు మోటగొడుతుండు. భార్య సుగుణ మిరుప చెట్లకు నీళ్ళు గడుతంది. పక్కన దొరచేన్ల ఏదో పెద్ద చప్పుడు కొమురయ్య దంపతులకు వినబడుతంది. ఆ చప్పుడుకు చెవులు గిల్లుమంటున్నయి. కొమురయ్య గుండెల్ల బుగులుగుంది. "అదేదో బోర్ బాయిట. దొర తన చేన్ల వేసిండు. కరెంటు మోటారు పెడుతడట. ఆ మోటార్ బోర్ బాయిల సిత పాతాళం నుండి నీళ్ళను గుంజి పారబోత్తదట. బోర్‌బాయి పక్కనున్న మోటబాయిల్ల నీళ్ళ ఊట మర్రిపోతదట. పైసలు చాన్నే అయినయట. ప్యాదోళ్ళ తోటి గా బాయి దవ్వించుడు యాడయితది " కొమురయ్యకు మనుసుల ఒకటే రందిగా ఉంది. రోజులు గడుస్తున్నయి కొమురయ్య బాయిల నీళ్ళు గుంజుక పోయినయి. ఇంకొన్నాళ్ళకు పూర్తిగా అడుగంటినయి. నీళ్ళు లేక తోట ఎండి పోయింది. ఎవుసం కొరకు మిత్తికి తెచ్చిన బాకి తడిసి మోపడయింది. ఉన్న భూమి దొర దగ్గర గిరివి బెట్టిండు. చెర్ల దొయ్యల్ల వేసిన వరి పాలుపోసి ఇత్తులయ్యే టయిమ్‌కి నీళ్ళందక చేతికి రాకపాయె. కొమురయ్యకు కాలు చెయ్యి ఆడకుంటయింది. బొండిగల మంటి బురదల దిగవడ్డట్టు బాధపడుతుండు. బాకి కింద దొర కొమురయ్య తోటను కబ్జా జేసుకొని, తన చేన్ల కలిపేసుకున్నడు. చెర్ల దొయ్యలకు కూడ అదేగతి పట్టింది.

జమాన మారింది. ఎవుసం పన్లు దున్నుడు కాన్నించి తొడిమ, అలుకుడు, నాట్లు, కలుపు, కోతలు, బంతులు, తూర్పారా అరొక్క పనిమిషన్లే జేత్తునయి. దినుసును ఇండ్లల్లకు, బీట్లెకు లారీలల్ల, ట్రాక్టర్లల జారగొడుతున్నరు. ఎనుకట దినుసును ఎడ్లబండ్లు, గాడిదలు, గుర్రాల తోటి జారగొట్టెటోల్లు, మోటలు, రాట్లు, యాతాలు, గూడలు సకులం బోయినయి. కరెంటు మోటర్లచ్చినయి. అన్ని పన్లు గవే జేత్తున్నయి.

మారుతున్న జమానాలో కొమురయ్య మోంబత్తి లెక్క కరిగిపోతుండు. గీ హోలతుల అన్నీ పోయి కూలోడయిండు. కైకిలి గంబడి చేసుకుంట బతుకు తకిలీబుగ ఎల్లదీస్తుండు. కొమురయ్యకు ఇద్దరు సంతానం. ఓ కొడుకు, ఓ బిడ్డ. కొడుకు రాజయ్య, బిడ్డ వజ్రమ్మ. రాజయ్య పైసల్లేక బడికి దూరమయిండు. ఎదుగుతున్న కొడుకును కొమురయ్య తనెంట కూలి పనులకు తోలుకెళుతున్నడు. వజ్రమ్మ వాళ్లమ్మతోటి బీడీలు చుడుతుంది. అందరు గొంతగొంత సంపాదించంగ గూడ సగం పొట్టకు సుతం తింటలేరు. సంబరంగ బల్లెకు పోయి చదువుకోవలసిన వయస్సులో సంసారం ఎల్లక పిల్లల్నిసుత కొమురయ్య దంపతులు కైకిలికి తోలుకవోతున్నరు. మిషన్లచ్చినంక

కొమురయ్య కుటుంబానికి మునుపటి లెక్క కైకిలికి పని దొరుకతలేదు. ఆడగూడ పోటీ కత్తన్నరు. ఒక్క మిషిని ఇరువైమంది పని జేయవట్టె. కొమురయ్య సోంటోళ్ళు ఎంతోమంది బజారు పాలయితండ్రు. వాళ్ళకు రోజురోజుకు సంసారాన్ని ఈదడం ఓ గండంగా మారింది. కొమురయ్య పక్కనున్న కరీంనగర్‌కు కాలినడకన కూలిపన్లకు బోతండు. లేబర్ అడ్డాకాడ ఆశతో ఎదురుజూత్తున్నడు. కూలికి ఎవలయినా పిలుస్తారేమోనని. కొమురయ్య లెక్క ఆడ ఎంతోమంది ఎదురు జూత్తున్నరు. అరొక్కపని ఇంజన్లు చేస్తున్నయి. కయికిలోల్ల అవుసరం తగ్గింది. ఒగొగ రోజు కొమురయ్యకు కూలీ దొరికేటిది కాదు. ఉత్త చేతులతో ఇంటి మొకం పట్టెటోడు. అతడి పరిస్థితి భార్యా పిల్లల ముందు చాతగానోని తరీక ఉండేది. రాజయ్య తన తండ్రి పరిస్థితి చూసి బాధపడేటోడు. తండ్రికి ఆసరాగా ఉండాలనుకున్నడు. ఏదో తరీక సాయపడాలనుకున్నడు. ఎట్లనన్నజేసి రాజయ్య తన కుటుంబాన్ని గట్టెక్కించాలని నిర్ణయించుకున్నడు. ఆ ఆలోచనే అతని పుర్రెను కుమ్మరి పురుగు తీరుగ తొలచ వట్టింది. ఒక రోజు రాజయ్య తన తండ్రి కొమురయ్యకు నచ్చ జెప్పి తన పాత పెంకుటిల్లును రైను పెట్టి, బాకి తీసుకుని దుబాయి బయలెల్లిండు. అక్కడ బుగ్గ పైసలు సంపాయించి, మంచి కట్నం ఇచ్చి చెల్లెకు లగ్గం జేయాలనీ, తల్లిదండ్రుల్ని సుఖపెట్టాలని అనుకున్నడు. ఏజంటు జేసిన మోసంవల్ల దుబాయి పోలేక నడిమిట్ల బొంబాయిల్నే ఆగిపోయిండు. బొంబాయిల చిక్కుపడ్డ రాజయ్య తన ఊరికి పోవడానికి పైసల్లేక ఉప్పరిపని జేసుకుంట పొట్టబోసుకుంటున్నడు. వయసులో ఉన్న రాజయ్య కోరికలు అదుపు తప్పినయ్. ఎయిడ్స్ బీమారి అంటుకుంది. ఆర్నెల్లు తిరక్కుండానే బొంబాయిల దిక్కూమొక్కూ లేని చావు సచ్చిండు రాజయ్య కీసల ఉన్న పత్తాతోటి సోపతిగాళ్ళు సంత ఊళ్ళె ఉన్న తల్లిదండ్రులకు రాజయ్య చావుకబురు తెలిపిండ్రు

బొంబాయి పొయ్యేటందుకు కొమురయ్య చేతిల చిల్లిగవ్వ లేదు. బొంబాయిల్నే తోటి పనోల్లు రాజయ్య శవాన్ని దానం జేసిండ్రు. కన్న కొడుకును కడసారి చూడ్డానికి కూడా కొమురయ్య దంపతులు నోచుకోలేదు. ఆ దంపతులకు కడుపుకోతే మిగిలింది. గౌండ్ల మల్లయ్య, ఎదిరింటి నర్సయ్య, చుట్టుపక్క వాళ్ళు ఓదార్చి పోతుండ్రు. ధైర్యం చెబుతుండ్రు. కొమురయ్య దంపతులు గుండె రాయి జేసుకుని బిడ్డ వజ్రమ్మను జూసుకుంట బతుకుతున్నరు.

సుగుణ తనబిడ్డ వజ్రమ్మను ఎంటేసుకుని చేనుపనికి బోతంది. పెద్దోళ్ళ ఇండ్లల్ల వాకిల్లు ఊడ్చి, అలుకు చల్లుతంది. బోల్లు తోముతుంది. ఇంక బియ్యం జేసేది రాత్రిపూట దీపం ఎలుగుల బీడీలు చుట్టేది అరొక్క పనిజేసేది. సంక్రాంతి రోజుల్ల సకినాల పిండి గొట్టేది దొరలు, పటేండ్ల పిండిగిర్ని కుందెన్ల దంచిన బియ్యపు పిండితో చేసిన సకినాలు కమ్మంగా ఉంటయని దంచిపిచ్చుకునేది. గిప్పుడు గాపనులు గూడ తగ్గినయి. దొర తన పొలాల దగ్గర వడ్లగిర్ని, పిండిగిర్ని, పసుపు, మిర్చి గిర్ని బెట్టినంక సుగుణ అసోంటళ్ళకు గసోంటి పన్లు గూడ లేకుండా బోయినయి. ప్యాదోళ్ళు ఓ పూట తింటే ఓ పూట ఉపాసమున్నట్లు గడుపుతున్నరు.

ఆ ఊరికి దగ్గర్ల సోలుపూత గుట్టలున్నయి. వాటిని అందరు అనప గుట్టలంటరు ఆ గుట్టల్ల ఓడ్డోళ్ళు, తురక కాశోళ్ళు తాటాకు గుడిశల్ల నివాస ముంటండ్రు ఒడ్డోళ్ళు మొలకు పొట్టిగా పంచె కట్టుకుంటరు. పైన అంగీ ఉండేదికాదు. నెత్తికి ఓ తరీకల

రుమాలు చుట్టకుంటరు. కర్రెగ, బలంగ కండలు దేరి ఉండెటోళ్ళు. బాయిలు దవ్వి, పూడిక. పునాదులు తీసి, మోరీలు దవ్వి, మట్టిపని జేసుక బతికెటోళ్ళు. ఒడ్డె మైసయ్య 'గజం' బద్రపట్టుకొని ఊరూరా, వాడ వాడ తిరిగి పనులు గుత్తకు పట్టెటోడు. ఆడా, మగా. పిల్లా జెల్లా అందరూ కలసి ఆపనులన్నీ పూర్తి జేసెటోళ్ళు. వచ్చిన పైకాన్ని జట్టు లెక్కన పంచుకునేటోళ్ళు. ఓసారి పాత బాయిల పూడిక తీస్తున్నప్పుడే దరి కూలి మైసయ్య అక్కడికక్కడకే నెత్తి పగిలి మెదడు చిట్లి సచ్చిపోయిండు. ఒడ్డోళ్ళకు పెద్దదిక్కు బోయింది. పనులు గుత్తకు పట్టుకచ్చెటోళ్ళు కురువయింద్రు. వాళ్ళు దిక్కుతోచని హాలతుల చిక్కుకున్నరు.

ఒడ్డె మైసయ్య సచ్చిపోయినంక అతని కొడుకు బూమయ్య తండ్రి బరువు బాధ్యతలను చేపట్టిండు. పల్లె పల్లెకు తిరిగి తిప్పలు వడి పనులు గుత్తకు పట్టుకత్తండు. ఏదో తరీక ఒడ్డోళ్ళకు నిప్పుల మీద నీళ్ళు చల్లినట్లు అప్పుడప్పుడో పని దొరికి ఆకలికి గంజినీళ్ళు తాగుతండ్రు. ఊళ్ళల్ల రాక్షసుల్లా ప్రవేశించిన ప్రొక్లెయినర్లతో గుట్టల్ల ఎండకు బండలు సలసల కాగినట్లు ఒడ్డోళ్ళ బతుకులు కైకిలి దొరక్క మలమల మాడుతున్నయి. ఒడ్డె బూమయ్యకు పనులు దొరుకుతలేవు. పిచ్చోని లెక్క తిర్గుతున్నడు.

అదే అనపగుట్టల్ల తురుక కాశి గుడిశలు. అందులో కాశిందో కుటుంబం. కాశిం మంచి పనోడు. రాళ్ళు గొట్టుట్ల ఇగరు మంతుడు. కట్రాళ్ళు కనీలు, ఐదర్లు, మొగురాల కింద బెట్టే కురుస రాళ్ళు, ఇసుర్రాళ్ళు, పొత్రాలు, రోళ్ళు తయారు జేసేటోడు. కంకర, బీచ్చ గూడా తయారు జేస్తడు. తురుక కాశి కుటుంబాలు ఆ ఇస్రల్ని ఊర్లల్ల, బస్తీలల్ల అమ్ముకుని సంసారాల్ని ఎల్లదీత్తన్నరు. రాళ్ళతో పనిముట్ల ఇస్రల్ని చేయడం వాళ్ళ కషిపి. కాశిం రాళ్ళను చీల్చి బేత్రీనయిన ఇస్రల్ని జేసెటోడు. అతని జిందగీ అంతా గుట్టలల్లనే గడిచింది. చుట్టు పక్కల ఊళ్ళల్ల కాశిం పనిముట్లకు మంచి గిరాకీ ఉండేది. ఇస్రలు బాగా అమ్ముడుబోయిన రోజు కాశిం ఎంతో సంబురంగ గౌండ్ల మల్లయ్య వద్దకు తాటికల్లు తాగడానికి పోయేది.

కాశిం ఎర్రంచు దోతి కట్టుకుని పైన యాపారం తొడుక్కుంటడు. నెత్తికి ఆకుపచ్చ లేదా ఎర్రంచు చమ్లా చుడుతడు. ఎర్రని చాయ. ఒకచెవికి నులి తిరిగిన రాగిపోగు, ముంజేతికి సన్నని వెండి తీగలతో అల్లిన బెల్టు. ఆ బెల్టుల గులాలు రంగు చిన్న రాళ్ళు పొదిగి ఉండేటివి. మెడలో తాయెత్తు, ఎర్ర లేదా పచ్చ పూసల దండలు ఏసుకునే టోడు. జబ్బకు జోరపు సంచి. దింట్ల రాళ్ళను పగులగొట్టేటివి, ఇస్రలు తయారుచేసే అతారలను ఉంచుకునేటోడు. నడుంకు చిన్న తోలుసంచి దాంట్ల దూది, చెకుముకి రాయి ఉండేటివి. చెవి వెనుక సందులో చుట్ట ఉంచుకునేటోడు. కాశిం మంచి పనోడే కాకుండా మాటకారి. తన మాటలతోటి మందిని ఇట్లనే వశం జేసుకునేటోడు. గట్ల తన ఇస్రలకు మంచి గిరాకి సంపాయించేటోడు.

కాశిం దంపతులకు సంతానం ఇద్దరు. ఒక ఆడ, ఒక మగ. కొడుకు పుట్టిండని వాళ్ళెంతో సంబ్రపడ్డరు. కాశిం రాళ్ళతో పోరాడుతండు. రాళ్ళల్ల పొర్లుతండు. కాశింకు దినాం బతుకు బాటల పోట్రాళ్ళ దెబ్బలు తలుగుతనే ఉన్నయ్. కాశి కొడుకు హుస్సేన్ పెద్దోడయిండు. ఎదిగి చేతికందిండు. కాశిం తనకున్న రెండు గాడిదలమీద బోరాలు వేసి దాంట్ల ఇసురాళ్ళు, పొత్రాలు, రోళ్ళు వేసుకొని కొడుకునెంటేసుకొని ఊరూరూ తిరిగి అమ్మెటోడు. కాశిం కొడుక్కి ఎప్పటికప్పుడు వ్యాపారంలోని కిటుకులు,

మెలుకువలు తెలిపెటోడు. ఇస్రల్లి ఎట్ల తయారు చేయాల్నో, ఉలి ఎట్ల చెట్టాలె, సాస ఎట్ల బట్టాలె, సుత్తెతో ఎట్ల గొట్టాలె, ఎట్ల తొలవాలె ఇగురమంతా సకులం దగరుండి నేర్పించిండు హుస్సేన్ ఎంతో బుద్ధిగ అన్నీ నేర్చుకొని తండ్రంత బంటయిండు కాశిం ఇస్రలను అమ్ముకోంగ వచ్చిన పైకంతోటి అంగట్ల కావలసిన గాసం కొనుక్కోని కుటుంబాన్ని పోషించేటోడు.

ఒకనాడు గుట్టల్ల కాశిం పెద్ద పెద్ద బండరాళ్ళను తొలిచి దాంట్ల బత్తులు పెట్టి పలగ్గొడుతండు. ఓ పెద్ద బండకు తొలిగోట్టి దాంట్ల బత్తులు పెట్టి బయలుదేరిండో లేదో పెద్ద చప్పుడు తోటి పేలింది. బండ పటాల్ల పలిగి ఓ రాయిబిచ్చ కాశిం కాలుకు బలంగా తలిగింది. కాలిచియ్య ఊడి వేలాడుతుంది. నెత్తురు 'శిలశిల' కారుతంది. కాశింకు చిమ్మన్ చీకట్లు వచ్చినయి దగ్గర్లో ఉన్న తోటి పనోళ్ళు "అయ్యయ్యో! కాశింకు దెబ్బ తలిగిందిరా గేర్ అచ్చి పడ్డదురా" అంటూ దబ్బదబ్బ అతని వద్దకు వచ్చి కాలికి వేలాడుతున్న మాంసం ముక్కను ఒత్తిపట్టి తడి గుడ్డతోటి గట్టిగా కట్టిండ్రు. మొకం మీద నీళ్ళు చల్లిండ్రు. కాశిం కళ్ళు తెరిచిండు. కంకర గొడుతున్న కాశిం భార్య లబ్బలబ్బ మంటు మొత్తుకుంట పెనిమిటి వద్దకు ఉరికింది పట్టుకొని ఏడ్చింది. కుండలో ఉన్న మంచీల్లు సత్తుగ్లాస్‌తో తాగించింది. ఆమె కండ్లల్ల బుగులు, దుక్కం కనబడుతంది. కాశింను దావకాన్ల చూపించింది మందులు వాడుతన్నడు. ఖాజాబీ రోజూ భర్త కాలు కట్టు విప్పి గాయం తుడిచి మలాం రాసి మల్ల కట్టుకడుతుంది. రోజూ కట్టు మారుస్తంది. ఉన్నంతలో పాలు, పండ్లు తిండి సరిగా బెడుతూ భర్తను జాగర్తగా జూసుకుంటంది. అయినా పైసల్లేక ఖాజాబీ మొగనికి బస్తీల వైద్యం సరింగ చేయించలేకపోయింది. సెప్టిక్ అయ్యింది పుండు నుండి చీము బుడబుడ కారుడువెట్టింది. ఆరెంపీ డాక్టరు వైద్యం కాశింకు కుదికాలు తీసేదాకా వచ్చింది. కాశింకు కుదికాలు తీసేసిండ్రు అతనికి తన బతుకంతా చీకటిగా తోచింది అయినా అధైర్న పడలేదు. పని తనానికి మనుసుల తట్టే ఆలోచనలకు అవిటితనం ఉండదు. కాశిం నడుం బిగించిండు. మునుపటి లెక్కనే పనిముట్లు జేస్తుండు. వాటిని భార్య ఖాజాబీ, కొడుకు హుస్సేన్ ఊరూరా తిరిగి అమ్ముతండ్రు జీవితం సాగుతంది. కాశిం కొడుక హుస్సేన్‌కు లగ్గం జేసిండు. తను జేసిన పనిముట్లను భార్య, కొడుకూ కోడలు అమ్ముకత్తన్నరు. వచ్చిన పైసల్తోటి సంసారాన్ని ఎల్లదీత్తన్నరు. అప్పటికీ సగం కడుపుకే తింటన్నరు. కషిపిల రోజు రోజుకూ బట్టాపొట్టా ఎల్లడమే తక్షీబుగ ఉంది.

★ ★ ★

ఆ రోజు ఇంట్ల గాసం నిండుకుంది. కాశింకు జరమచ్చింది పెయ్యి సలసల కాలుతంది. నెత్తి మసలుతుంది. కంతలకు అమృతాంజనం రుద్దుకొని చింపుల బొంత నిండా కప్పుకొని గదంచల మలుచకపన్నడు. గదంచ నులక తెగి కిందికి ఊగు లాడుతంది. చలికి వణుకుతండు. చలి ఆగుతలేదు. ఎగిరెగిరి పడుతండు. తండ్రి అవస్థను జూస్తుంటే హుస్సేన్‌కు మనసున పడుతలేదు. పాణమంత తల్లడిల్లితంది జరం గోలీలు కొందామంటే చేతిల చిల్లిగవ్వ లేదు. ఎర్రపంచ దులిపి నెత్తికి చుట్టకొని బోరెంల కొన్ని రోళ్ళు, పొత్రాలు, ఇసుర్రాళ్ళు ఏసుకొని దాన్ని గాడిద మీద వేసి అమ్మడానికి ఊరివైపు బయలెల్లిండు ఆ పైసల్తోటి తండ్రికి జరం గోలీలు, ఇంట్లకు పప్పు, ఉప్పు,

చింతపండు, మిరపకాయలు, గొంత గాంచునూనె కొనక్కురావాలను కున్నడు. పొద్దటి ఎండ మబ్బు వీడి కొర్రాయి లెక్క ఎల్లింది. 'ఇసుర్రాళ్ళూ, పొత్రాలు, రోళ్ళు....' అంటూ కేకలేసుకుంట ఊళ్ళె వాడవాడ తిరిగిండు. నెత్తినుండి చెవుల మీంచి చెమటలు కారుతున్నయి. ఇండ్లల్ల దొర్సానులు, పటేలవ్వలను అడిగిండు. వాడల్ల ఎవ్వల్ని అడిగినా పద్దంటున్నరు. ఎవ్వలు ఇస్రల్ని అడిగిన పాపాన పోలేదు. సంగతేందో సమజ్ కాలేదు హుస్సేన్‌కు చెమటతో పెయ్యిమీది అంగి తడిసింది. ఎండ సురసుర మంటంది. వాడల్ల మంది లేరు. పనుల్లేక బస్తీలకు బతుకవోయి చానా ఇండ్లకు తాళాలు కనబడుతున్నయి. కొన్ని ఇండ్ల గోడలు కూలిపోయి ఉన్నయ్. గోడలమీద ఎండిన గడ్డిపోసలు సామాన్లు బయిరంగ మయినయి.

ఆకురాలు కాలం. తొవ్వంతా చింత, వేపచెట్లు ఆకులు రాలి ఉన్నాయి. హుస్సేన్ తోలుక పోతున్న గాడిద ఆకలికి ఆగి ఆగి ఆ ఆకుల్ని నములుతున్నది. మొస పోత్తంది. హుస్సేన్‌కు, గాడిదకు దూపయితంది. చెర్లు, కుంటలు ఎండిపోయినయి. దరిదాపుల్ల చుక్క నీరు కనవడతలేదు. హుస్సేన్ ఓ ఇంటి ముందు ఆగి ఓ అవ్వను మంచీల్లు అడుక్కుని తాగిండు. ఆ అవ్వ ఆ చెంబును అక్కడ బోర్లించమంది. హుస్సేన్ చెంబును బోర్లించి అక్కడినుండి బయలెల్లిండు. ముందేమో 'నల్లసరం' బండలతోటి గిట్లజేయాలె, గట్ల జేయాలె అని మల్లమల్ల జెప్పి ఇస్రల్లి చేయించుకునేటోళ్ళు, ఇష్టబడి కొనుక్కునే టోళ్ళు గిప్పుడేమయిందో? గవ్వీటిని ఎవ్వలు అడుగతలేరు. కాశింకు దిగులు పట్టుకుంది.

పొద్దు నడినెత్తిమీదకచ్చింది. ఎర్రటి ఎండ చిర్రుమంటుంది. హుస్సేన్ రుమాలు తోటి మొకం మీద చెమట తుడుచుకున్నడు. కడుపుల ఎలుకలు ఉరుకుతున్నయి. పేగులు పిల్లికూతలుపెడుతున్నయి. హుస్సేన్ గాడిదను దమాయించుతూ, కాళ్ళీడ్చుకుంట సదుస్తున్నడు. చెమట తోటి అంగంత తడిసి పెయ్యికి అంటుకు పోయింది. బజారంతా దుబ్బగా ఉంది. గాడిద దెక్కలు దుమ్ము రేపుతున్నయి. ఆ దుమ్ము ఎండల రగరగ మెరుస్తంది.

హుస్సేన్ కొమురయ్యను చూసి "అయ్యా! కొమురయ్య పటేలా..! గిదేందయ్యా ఎంత అన్నాలం, ఊరు గొడ్డు వోయిందా చేతులకు పొక్కులు రాంగ ఎంతో కట్టపడి ఇస్రలు జేత్తే ఒక్కటి గూడ అమ్ముడువోలె."

వారీ హుస్సేన్ వడ్లు బట్టుడు, పిండి, కారప్పొడి, పసుపు కొట్టుడు, అరొక్క దానికి గిర్నీలు వడ్డంక మీ ఇస్రల్ని ఎవలడుగుతర్రా. ఎర్రోడా...! నేను మడి చెక్కను నమ్ముకొని బతికినోణ్ణి. గప్పుడు మన్ను బిసిగి మానిక్యాలను బండించిన. గిప్పుడు లాగోడి లేక, నీళ్ళులేక ఎవుసం బందువెట్టిన. ఈ గడ్డు దినాల్ల జిరాయత్ జేసుడంటే నక్కి దువ్వాట లెక్కయ్యింది. వానల్లేవు. కల్తీ ఇత్నాలు, కల్తీ మందులు రైతుకు సకులం సమ్మెట దెబ్బలే. కైకిలి జేసుక బతుకుతున్న. కైకిలి గూడ సక్కంగ దొరుకతలేదు. పిచ్చోన్నయి తిరుగుతున్న పనికొరకు...! ఒగప్పుడు నేనూ, నా కొడుకూ గోరుకోలు గుంకి మూలసుక్క బొడిచి నప్పుడు మోటకు బోయెటోళ్ళం. నా కొడుకు ఎన్నీల పొడకు తోటకు నీళ్ళు గట్టెటోడు. నీళ్లూరిన కొద్ది మోట గొట్టేది. ఉన్నకొద్ది జాగల్నే అరొక్కటి పండిత్తిమి. గప్పుడు నీళ్ళు సొలత్ మంచిగుండె. గసోంటిదిప్పుడు ఎవుసమంటేనే

బయమేత్తంది. ఎవుసాన్ని నమ్మితే అది నన్నే అమ్మింది. మోట బొక్కెన్లు. రాటు బొక్కెన్లు. గూడలు యాత బొక్కెన్లు ఎవుసం సామాన్లన్నీ అటకెక్కినయి. అడీవి నరుకుతండ్రు. గుట్టలు పగుల గొడుతండ్రు. వాగుల్ల వుశ్క తోడుతండ్రు. ఇంగ చానలెట్ల బడ్తయి. బూమిల జల లేకుండా బోయింది. నీళ్ళు సితపాతాళానికి వోయిసయి. ఒగప్పుడు గింత జమీనున్నోడు మారాజు. గిప్పుడు నీళ్ళు లేక ఎన్నో రకాల జమీన్ పడావ్ ఉంటంది. రైతులు చినుకు కొరకు మొగులు దిక్కు ఆశగా జూత్తన్నరు. కాపుదనపోన్ని... నేను కైకిలికి ఏ పని దొరికితే గా పని జేత్తన్న. అయినా పెండ్లాం, పిల్లలకి బుక్కెడు మెతుకులు సరింగ పెట్టలేక పోతన్న' అంటు కొమురయ్య తన కడుపుల ఉన్న ఎతనంత హుస్సేన్ దగ్గర ఎల్లబోసుకున్నడు.

కొమురయ్య ఊరివైపు నడుస్తున్నడు. హుస్సేన్ గాడిదను తోలుకుంట కొమురయ్య ఎనుక ఎల్లుతండు. ఊరి నడిమిట్ల చావడి దగ్గర రాలెచెట్టు. దాని చుట్టూ గుండ్రంగ సిమెంటు గద్దె. ఆడినుండి మన్నెపు గూడేనికి పటేండ్ల వాడకు ఇతర కులాల వాడలకు నాల్గు తొవ్వలు బోతున్నయి. చావడి కాడ ఓ దిక్కు మసీదు. ఇంకో దిక్కు కోమట్ల మడిగె. మసీదుల పీరీలను నిలబెడ్తరు. మసీదు ముందు గోయి, దాన్ని గుండం అంటరు. పీరీల పండుగ రోజున పడుసుపోరగాండ్లు గుండంచుట్టూ తిరిక్కుంట "అసోయిదూల' ఆడుతుంటరు. నా కొమురయ్య, హుస్సేన్ ఇద్దరు ఆడికి చేరుకున్నారు. గద్దెమీద కూకున్నరు. కొమురయ్య జెకుముకురాయి, దూది తోటి చుట్ట అంటబెట్టుకున్నడు. గుండెల్నిండా పీల్చుకుంట రెండు బుక్కలు దాగిండు. ఆ చట్టుతోటే హుస్సేన్ తన చుట్ట కొరుకును చెవిమీంచి తీసి దులిపి అంటువెట్టుకున్నడు. 'ఉప్ప ఉప్ప' మంటూ రెండు బుక్కలు పీల్చిండు. ముసలి కొమురయ్య వయసులో ఉన్న హుస్సేన్ ఇద్దరు బతుకుపోరుల తండ్లాడు తున్నరు. మార్పుల సుడిగాల్లే ఇద్దరి బతుకులు చిల్లం కల్లం అయినయి. వాళ్ళు తమ వెతల్ని కతలు కతలుగా ఒకరికొకరు చెప్పుకున్నరు మద్దెల, రోలు ముచ్చట్లు వెట్టుకున్నట్లు.

"పటేలా! మన కషిపీలు గీ హాలత్ల ఉంటే జిందగీ ఎట్ల గుజ్రాయిస్తమే. సంసారం ఎట్ల ఎల్లుతదే. పిల్లలెట్ల బతుకుతరే....." అంటూ దిగులుగా హుస్సేన్ కొమురయ్యతోటి మ:నసుల ఉన్నదంతా ఎల్లగక్కిండు.

గంతేరా ఇగ మన బతుకులు! మిషన్లచ్చినయి. అన్ని పనులను గవ్వే జేస్తన్నయి. మన కడుపుమీద గొడుతున్నయి. గరీబుగాళ్ళం. బువ్వలేక ఆకలికి మాడి సత్తన్నం. మ్యాత లేక పసుల్ని కటికోనికి అమ్మవడితిమి" కొమురయ్య రందిగ చెబుతున్నడు. ఎన్నో ఆలోచనలు కొమురయ్య మనస్సుని చెదలు బట్టినట్లు బట్టినయి. కొమురయ్య తన తాతల, తండ్రుల తంతెల్ని చూసిండు. తన తంతెని, తన కొడుకు తంతెని చూస్తున్నడు. కొమురయ్యను దేవుడు చిన్న చూపు జూసిండు. కొమురయ్య కన్న తండ్రిని, కన్న కొడుకును పోగొట్టుకున్న దురదుట్టపోడు. కష్టాలతో కాపురం జేస్తున్న కొమురయ్యకు వయస్సుకు మించిన ముసలితనం వచ్చింది. కొమురయ్య, హుస్సేన్‌లు రాలె చెట్టు కాన్నించి బయలుదేరిండ్రు. పొద్దు వంగింది. చెలకల్ల పిల్ల తొవ్వెంబడి నడుస్తన్నరు. బతుకు పట్ల దిగులుతో బరువుగా తడబడుతు అడుగులు బడుతున్నయి. ఓ చోట తాటిచెట్టు దగ్గర గౌండ్ల మల్లయ్య కల్లొట్లను కావడి బద్దకు తగిలించుకొని దాన్ని బుజాన వేసుకొని మండువా దిక్కు బయలుదేరుతన్నడు.

"ఏం కొమురయ్య బావా, వారీ హుస్సేన్ ...! ఓ దమ్ము పడుతరా, అచ్చం కల్లు, నిజానమైంది. చెట్టుమీంది. నీళ్ళు, చాక్రీన్ కలుపలె. పెయ్యికి శానా మంచిది. టానిక్‌ల పని జేత్తది" అంటూ గౌండ్ల మల్లయ్య రెండు మోతుకాకులు ఇయ్యబోయిండు. గౌండ్ల మల్లయ్య నల్లంగ, కండలు తిరిగి దండలతోటి బలంగ ఉన్నడు. బుజాలపైన, దండల వద్ద కాయలు కాసినయి. పెయ్యి మీద అంగిలేదు. పెయ్యంతా చెమట పట్టి ఎండకు మెరుస్తున్నడు.

"ఇంట్ల గాసానికే పైసల్లేవు. ఇగకల్లేడ తాగుతం. హుస్సేన్ గాడికి వాని నాయిన్న జరం మందుకే పైసల్లేవు. వాడి సంగతి గంతే. వాని ఇస్రలు అమ్ముడువోలె" విసిగి పోయిన జీవితంతోటి బాధగ చెప్పిండు కొమురయ్య.

"కొమురయ్య బావా! సువ్వు సుత గంట్లంటె ఎట్లనే."

"మరి లేకపోతే ఏం జెయ్యమంటవ్‌రా మల్లయ్య..! బతుకులన్నీ గట్ల అద్వాన్న మాయె. కడుపుకు తిండి దొరుకుతలేదు. ఇక కల్లు దావత్ చేసుకునే టట్లుందారా....!"

"గౌండ్లోల్ల బతుకులు గూడ గట్లనే పాడయినయి కొమురయ్య బావ..! ఏం జెప్పమంటవ్. ఏదో ఫారిందట. బీర్, బ్రాందీ, విస్కీలంట..! ఆ దుకాణం రంగారావ్ దొర మన ఊళ్ళె బెట్టినంక గప్పటినుండి కల్లు గిరాకి తగ్గిపాయె. రకమే ఎల్లుతలేదు. కిస్తులు గట్టుడు ఇబ్బందయితంది. వానల్లేక చెట్లకు కల్లు సరింగ పారుతలేదు...!' అంటూ మల్లయ్య తన ఇక్కట్లు ఏకరువు బెట్టిండు.

"అది గాదురా మల్లయ్య ఎవుసమంటె జేత్తే నక్కెల్లి తుపాకాయె. పెట్టిన లాగోడి ఎల్లకపాయె. అప్పుల పాలయితిని. కైకిలి గంబడి జేసుక బతుకవడితిమి. కట్టెలు గొడితి, మట్టి మెత్తి, ఉప్పరి పనిజేత్తి...! గ్యాస్ స్టౌవ్ లచ్చినంక కట్టెల్తోటి వంట జేసుడు ఎనుకకు వట్టె, పెళ్ళిళ్ళలకు, పేరంటాలకు తప్ప కట్టెల్ని అడిగెటోళ్ళె లేకపాయిరి...!"

ఇంతల ఆడికి ఒడ్డె బూమయ్య వచ్చిండు. చిల్లులు బడ్డ దోతి కట్టిండు. చింపుల పంచెనెత్తికి చుట్టిండు. "కొమురన్నా! మాకు మొదటి సుందీ బూమి జాగ లేదాయె. ఏడ కైకిలి దొరికితే గాడనే పని జేసుకు బతికితిమి. బాయిలు దవ్వితిమి. బున్యాదులు దీత్తిమి. కాలువలు కందుకాలు తోడితిమి. రోడ్లకు మట్టి బోత్తిమి. పాతబాయిల్ల ఆమిది తీత్తిమి. పూడికలు దీత్తిమి. మోరీలు దవ్వితిమి. ఎక్కడ పని దొరికితే పెండ్లాం, పిల్లల్తోటి ముల్లె మూట ఎంట పట్టుకపోయి గక్కన్నే ఉంటిమి. ట్రాక్లెయిన్లచ్చినంక గాపన్లన్నీ గవ్వే జెయ్యవట్టె. మాకు కైకిలికి పనికరువాయె. గదేదో గవర్మెంటోళ్ళ పధకమట పని జేత్తే తిండికి గింజలిత్తరట. గది గూడ మోసమేనాయె. ప్యాదోళ్ళ పొట్ట మీద గొట్టవట్టిరి...!" బూమయ్య తన ఒడ్డెర కుటుంబాల గోడును ఎల్లబోసిండు.

కొమురయ్య, కాశిం, బూమయ్య, మల్లయ్య అసొంటోళ్లెందరో.. ఈ సుడి గాడ్పుల కొట్టుక పోతున్నరు. దునియాల ఎంటెంటనే వచ్చే మార్పుల దాటికి తట్టుకోలేక వాల్ల బతుకులు చిల్లంకల్లం అయితన్నయి.

# 85. మన్నుబువ్వ

♦ జాజుల గౌరి ♦

**బు**డ్డగున్నప్పట్నించి జూస్తున్న ఎన్నడూ జూసిన ఇంట్ల కయ్యాలే కయ్యాలు. నాకేం సమజ్ గాకుంటుండే. అవ్వ నాయినా ఎందుకు గట్ల కయ్యం జేస్కుంటారో, ఎందుకు తిట్టుకుంటరో, జెరసేపు కొట్లాడి మాట్లాడ్కుండేటోళ్ళు.

"ఇంట్లకీ ఏమన్నా సొదలున్నాయా? రాషనున్నదా? పోరగాళ్ళ కడ్పులు ఎన్నడు మాడ్పుడే నాయే. నేనింత మాడవడ్తి ఆళ్ళింత మాడవట్రి. గింత జూస్కుంట గూడ నువ్వు జేసేది నువ్వు జెయ్యి."నాకు తెల్వకడుగుతా పతాకం గిట్ల తాగి రాకుంటే నీ నోట్ల మన్నువడ్తదా, దుమ్మువడ్తదా? జేసిన కట్టమంతా సక్కంగా దీస్కొచ్చి నా సేతిలో పెట్టాలే నువ్వు గట్ల గన్నజెయ్యకుంటే ఇగనయ్యే! గీ సంసారం జేసుడు నాతరం గాదు, జూస్కో మరి, చేసిన కూలీ సేసినట్లు తీస్కోస్తనే మంచి గుంటది లేకుంటే ఇంటిల్లాదులం గిట్లనే మాడ్తుంటం సమజయ్యిందా? లేదా?' అని పొయ్యికాడ కూకుని నాయిన దిక్కు జూస్కుంటూ అవ్వంటుంటే....

"ఏందే నీయమ్మ గిట్ల లొల్లిజేస్తవ్, సేసిన కట్టమంతా నీ సేతులల్ల వొయ్యవడ్తిగా. అదే పొద్దంతా పన్జేసి పొద్దిమీంకి గొంత బొట్టుతాగితే గింతగనం లొల్లిజేస్తవ్. కట్టం జేసచ్చిండు, గింత బువ్వేసి నీళ్ళిద్దామనవ్? నా కట్టం జూడకపోతివి, నా సుఖం జూడక పోతివి, ఎప్పుడు జూసినా ఇల్లు, సంసారం పోరగాళ్ళు గిదేనాయే నీ పికరు. అయిన కాడ్కి రూపాలిస్తుంటి గింతకంటే ఎక్కువ ఏడ్కెల్కితేవాల్నే. థూ.. నీ..అవ్వ ఎంతదెచ్చినా సాలకపాయే" అని అన్కుంట నాయిన బయటికి పోయేటోడు.

పొద్దుమీకల్ల పోయినోడు అద్దుమ్మ రాత్రైనంక ఊగుకుంట, తూలుకుంట ఇంటికి వచ్చేటోడు. మస్తు నిషాలో ఉన్నంక కూడా "ఒసేయ్ లచ్చిమి ఏమి జేస్తున్నవే నీ యవ్వ బాగా ఆకలై కడుపులో కాల్తుందే బువ్వేయ్యే, బువ్వెయ్యి, సెప్తె నీ సెవికెక్కదే..."అని అమ్మ దిక్కు ఉరిమి ఉరిమి జూస్తుండే.

అవ్వేమో! "నువ్వు గిట్ల ఏ రాత్రంటే ఆ రాత్రొస్తే నీ దిక్కెని జూస్కుంట ఎవళ్ళు కూకుంటరన్కున్నవ్. జెల్ది రావాలని తెల్వదా, మస్తుగా తాగటం నేర్సినవ్, శరమ్ లేదు. తాగకమని ఎంతగనమని సెప్పాలే నీకు" అని నాయినను తిట్టుడు సురువు జేస్తుండే.

"ఏందే ఊకున్న. కొద్ది ఎక్వ మాట్లాడుతున్నావ్. నామర్జే నేనేమన్నా జేస్కుంట. నేను నా కష్టమంత కర్సువెడ్త తాగి తందానాలాడ్తా నా ఇష్టం. నీయమ్మ ఇంటికాడ్కని దెచ్చినవా నాకు ఎదురు సెప్తవా, సెప్తవా?" అని అవ్వను కొట్టకొట్టపోతుండె.

ఇద్దరు గిట్ల లొల్లిజేస్తుంటే ఆ లొల్లికి మాకందరికి మేల్కొస్తుండే కానీ మేము లేచిన మని సమజైతె నాయినా అందర్ని కలేసి తిడ్తడని గమ్మున పండుకునే ఉండేటోల్లం.

నాయిన అవ్వను తిట్లుడు వెడ్తుంటే అవ్వేమో మాటకు మాట ఎదురు సెప్తుండే గంతే ఇద్దరి సందున మస్తులొల్లయ్యి కొట్లాడుకుండెటోళ్ళు. నాయినకు తిక్కరేగి అవ్వను కొడ్తుండె. ఆ కొట్టుడుకు అవ్వ తిడ్తుండే గది జూసి మాకు మస్తు ఏడ్పు వస్తుండేది. సెల్లెదిక్కు జూస్కుంట నేను ఏడ్సుకుంట పండుకునేదాన్ని. గట్లనే అందరం ఎప్పుడు నిద్రపోయేటోళ్ళమో మాకే తెల్వకపోతుండే. ఇద్దరు కొట్లాడి కొట్లాడి సద్దుమనిగి తాలకల్ల కోడి కూసేదేమో? మాకు తెల్వక పోతుండే.

నేను జెరపెద్దగైన కాన్నించి అన్ని సుద్దులు సమజైతుండే ఇంట్లనే అందరము కూకొని తినేటోళ్ళం. గానీ నాయిన వొక్కడే పన్జేసి రూపాలు దీస్కరావాలే. ఆ ఒచ్చిన రూపాయిలు గూడా ఇన్ని తాగుడుకు కర్సు గావట్టెనని. "తాగుడుకు కర్సు పెట్టకుండా గా రూపాలన్ని దెచ్చిస్తే మంచిగుంటదిగా, గట్టియ్యనీకి నీకు పాణం దరియ్యదాయే ఎట్లయ్య నీతో ఏగేది. మన పోరగాళ్ళ దిక్కన్నాజెర సోంచాంచుమని" నాయిన తాగనప్పుడు అవ్వంటుండే అప్పుడు గమ్మునుండి పొద్దిమీకంగనే కల్లుదుకనం దిక్కువోయి గవేలెక్కలు జేస్తుండే. ఒకదినం పొద్దుగాలప్పుడు అవ్వ ఏమివొండలె.

నా కడుపుల కాలవట్టింది మెల్లగా అవ్వ కాడ్కిపోయి "అవ్వ ఆకలెత్తందే నాకేదన్నా చేసిపెట్టుమని" అడిగినా "ఉండు బిడ్డా! అన్నను దుక్నం కాడ్కి పంపించినా బియ్యంకొని దెస్తండుండు. జెరసెపైతే బువ్వండి పెడ్తా జెర ఓర్చుకోబిడ్డా" అని ఓదార్చింది. ఇయ్యాల పొద్దుగాల్నుంచి నా పాణమంతా యెట్లనో అయి గుమ్మొచ్చింది. జెరసేపాగి, చూసీ చూసీ విసుగచ్చింది. అన్న ఇంకా రాలే కడుపులో కాలుతుంది. ఇల్లా అవ్వ కాడ్కి బోయి "అవ్వ ఏమన్నా ఉంటే ఇయ్యే కొనుక్కుంటా మస్తు ఆకలైతంది" అని లొల్లిజేసి ఏడిసినా.

"అయ్యో బిడ్డా! జెరసేపు ఓర్సుకో, పొద్దుగాలుంటే మాపటకీ ఉండదాయే మాపటికి ఉంటే పొద్దుగాలకు ఉండదాయే నేనెట్లా జెయ్యాలా బిడ్డా నాకాడున్న పైసలన్ని అన్నకిచ్చినా. పొద్దుగాల నాయిన గూడా ఉపాసమే పోయిండు. ఎండలు బాగా కొడ్తున్నాయి. ఎండల ఎట్ల పన్జేస్తుండో ఏమో? గీ ఆరంనించి పని సరిగ్గా దొర్కతలేదంట గందుకే మస్తు కష్టమైతంది. నాయిన కాడున్న పైసలన్ని ఇచ్చిపోయిండు. జెర ఓర్సుకో బిడ్డా! అగో అన్నొస్తుండు. బువ్వాండి పెడ్తనని" పొయ్యి కాడ్కిపోయింది. నాకేమో మస్తు ఆకలెయ్యవట్టింది. మెల్లగా లేసి కుండకాడ్కి బోయి నీళ్ళు తాగి ఆకిట్ల కొచ్చిన. ఆకిట్ల నిలబడితే నా నెత్తిమీద ఎండ బాగ కొడ్తంది. నా నీడేమో నా కాళ్ళ కిందకొచ్చింది. నాకు ఎండలో నిలవడ్తే గుమ్మొస్తంది. అక్కడ్నించి కదిలి ఇంటి ముందలున్న సెట్టు కాడ్కిబోయి చెట్టుకింద కూకున్న.

సెట్టు కింద సల్లగుందిగానీ నా కడుపులో మంటగుంది. ఆడనే శానాసేపు మన్నుల గీతలు గీసుకుంట కూకున్న. మన్నుతో ఆడ్కున్న. కడుపుల ఆకలి తక్కకాలే. గటూ గిటూ సూసి నన్ను ఎవ్వరు జూస్తలేరనుకున్నంకా, ఆ మన్ను దీస్కోని చేతితో అటుగిటు ఊపినా, జెర్రైనంక దొడ్డు దొడ్డు రాళ్ళన్ని బోయి సన్న మన్ను చేతికొచ్చింది. దాన్ని ఆసన జూస్తే మస్తు కమ్మగుంది. గంతే లటుక్కున నోట్లో పోసుకున్న. ఆకలి సల్లారే దాక మన్ను దింటనే ఉన్నా. జెరసేపైనంక ఆకలి తక్కువయింది. నడ్సుకుంట నడ్సుకుంట ఇంట్లకి బొయినా.

నేను బోయేతాలకల్ల అవ్వ బువ్వొండి ఎసరు వంపుతోంది. అన్న, సెల్లె అవ్వ సుట్టూ కూకుని బువ్వెప్పుడైతదా అని జూస్తుండ్రు. గానీ నేను కుండ కాడ్కిబోయి సెంబు నిండా నీళ్ళు దీస్కుని గట్ట గట్ట తాగి, అవ్వ దిక్కు పోయి మీదున్న దేగీస దిక్కు జూసుకుంట కిందనే పండుకున్నా. అప్పటిదాకా బువ్వడిగి గట్ల పండుకున్న, నా దిక్కు అవ్వ, అన్నా, సెల్లి సిత్రంగా జూస్తుండ్రు. నాకు ఆ తరువాత ఏమైందో ఏమో! ఇగలేసి తింటది, అగలేసి తింటదని ఎదిరిసూత్తనే ఉంటరు గావచ్చు.

● 2003 ●

# 86. నెలపొడుపు

♦ బి.వి.ఎన్. స్వామి ♦

తప్పతాగి మోచేతులకు, మోకాళ్ళకు దెబ్బలతో రోడ్డు పక్కన పడిపోయాడు. ఎర్రటి ఎండ, వేసవి వేడి అతనిపై ఏ మాత్రం ప్రభావం చూపలేకపోతున్నవి. అతనికోసం వచ్చేవాళ్ళు ఎవరు లేనట్లున్నారు. చాలా సేపు అలా పడి ఉన్నాడు. మెదడులో చలనం వచ్చినట్లుంది. శరీరాన్ని కదపసాగాడు. కాని శరీరం కదలడం లేదు. అలాగే ఎండను భరిస్తూ, అచేతనంగా ఉండిపోయాడు. నాలుక పిడచ గట్టింది. మెల్లగాలేచి నాలుగడు గులు వేసి నీడలో బోర్లాపడిపోయాడు. నీడకు మరి కాసేపు ఉండిపోయాడు. కాస్త పొట్టిగా, చామనచాయ ఆకర్షణీయమైన అవయవ పొందిక, నిగనిగమెరుస్తున్న కళ్ళు, ఆత్మవిశ్వాసం మూర్తీభవించిన ఆడమనిషి వచ్చింది. వస్తూనే అతడి కాలర్ పట్టి లేపింది. బరబరా గుంజుక పోయింది. గూడు చేరి మీద నీళ్ళు కుమ్మరించింది. అప్పుడు పూర్తి సోయిలోకి వచ్చాడు. సోయిలోకి రాగానే బుద్ధిమంతుడిలాగా లేచి స్నానం చేసి తిండికి తయారయ్యాడు.

"అన్నం పెట్టు."

"ఇంక నేను ఎన్నేండ్లు వనవాసం చెయ్యాలె నీతోని" అన్నం పెడ్తూ అంది.

"ఊర్లెనే ఉంటివి. మందిలనే ఉంటివి. చిత్రంగ మాట్లాడుతున్నవు"

"తాగి రోడ్లమీద పడవడ్తివి. ఇజ్జత్ పోయె కాలమచ్చె."

నన్నందరు తాగుబోతు ఎదవ అని అననే బట్టిరి... ఇంక ఇజ్జత్ పోవుడేంది.

"తాగి రోడ్ల మీద పడ్డ నిన్ను లావట్టుక రావాల్నంటె నా మానం పోయినంత పని అయితంది."

"తాగిపడ్డంక, నన్ను ఇంట్ల దిగపెట్టుమని నీకు నేను చెప్పిన్నా" అంటూ తిండి ముగించి లేచాడు. తను కూడా తిండి ముగించింది. వంటపాత్రలు అన్ని సర్ది ముందు గదిలోకి వచ్చింది. వచ్చేసరికి అతను గుర్రుపెట్టి నిద్రపోసాగాడు. నిట్టూర్చింది. తను కూడా కొంగు పరుచుకుని పడుకుంది. నిద్రకోసం కళ్ళు మూసుకుంది. రోజువారీ హింస నిద్రను అడ్డుకుంది. ఎన్ని తిట్లు, ఎన్నెన్ని తన్నులో శరీరంపై దెబ్బ తాకని చోటుకోసం వెదకసాగింది. తగలనిచోటు లేదని తెలిసి, కంటినుండి వెచ్చని నీరు జారింది. పుట్టింది చిన్న కులంలో, పెరిగింది లేమిలో...చదువు, సంధ్యలేదు. కాయకష్టం తెలిసిన విషయం. ఓపికతో రోజులు దొర్లించడం నేర్చిన పారం, వయసు వచ్చినాక, ఊహ తెలిసాక, పెండ్లి –

మొగుడు - పిల్లలు అనే చట్రం ఎరుకయ్యాక తను కోరుకున్నదేమిటి? గుప్పెడు ప్రేమ, మరి తను బతుకిట్లయ్యింది ఎందుకు? దీనికి కారణం ఎవరు? ఎంతవరకు? ఒడ్డూ, పొడుగు కంటికి నదురుగా ఉన్నందున తను ఇతణ్ణి ఇష్టపడింది. సొంత ఇల్లు, పనితనం ఉన్నందున తన తల్లిదండ్రులు వీణ్ణి ఇష్టపడ్డారు. పెండ్లి అయింది. ఇద్దరు పిల్లలు, తాగడం మామూలుగా ఉండేఅలవాటే. కాని ఇంతగా తాగడానికి కారణాలు ఏమిటి? జేబుల పైసలు లేకున్నా తాగుడు మానడం లేదు. చీప్‌లిక్కర్ అందుబాటులోకి వచ్చింది. దాంతోటి ఎక్కువయింది. గొడవలు ఎక్కువయినయి. ఈ బెల్టుషాపులు పాడుగాను వీటితోటి సంసారం నాశనమైతుంది. చెబితే వినే మనిషి కాదు. ఈ సంసారం ఎట్లా నెట్టుకు రావాలో మరి.. పరి పరి విధాలుగా ఆలోచిస్తూ... నిద్రలోకి వెళ్ళింది.

సాయంత్రం కావొచ్చింది. గబగబా లేచి తయారైంది. అంగడికి బయల్దేరింది. "ఏయ్! జరాగు" కొంగు బట్టి లాగాడతను.

"మల్లేం బుట్టింది. చక్కగ పండు" అంది.

"నాకో వంద రూపాయలిచ్చిపో."

"నా దగ్గర పైసల్లేవు. అయినా నేనెందుకియ్యాలె. మీ అవ్వను అడుక్కో పో" అంతే! మెడపై బలంగా కొట్టాడు. రొండికున్న సంచిలోంచి దబ్బు గుంజుకొని బయటకు నెట్టాడు. బొక్కబోర్లాపడ్డది.

"వీని తలపండు వల్ల" అంతకు మించి మాటలు రాలేదు.

క్రమంగా మాటలు ఎక్కిళ్ళ రూపం ధరించాయి. లేచి అంగడి దిక్కు బయలు దేరింది. కళ్ళనిండా నీటివల్ల కాబోలు రోడ్డంతా మసక మసకగా కనపడ్తుంది. పెద్ద తుఫాను తోస్తె పరిగెత్తినట్లు నడుస్తుంది. నిజమే తను తుఫానులో చిక్కుకుంది. ఈ రోజు జరిగింది ఆది కాదు, అంతంకాదు. ఏండ్ల నుంచి జరుగుతుంది. ఎప్పటి కప్పుడు మరవటానికి ప్రయత్నించుడేనాయే. సమస్యకు పరిష్కారమెట్లా దొరుకుతుంది. అంగట్లో పని ముగించుకొని ఇంటికొచ్చింది.

పిల్లలిద్దరు ఆకలితో తల్లికోసం ఎదురు చూస్తున్నారు. వండిపెట్టింది. తనూ తిన్నది.

"వీడింకా రాకపోయే" ఎదురు చూసింది.

"ఎక్కడనన్నా చావని" పడకేసుకుంది.

"సారాదుకాండ్లనే ఉన్నడో! రోడ్డుమీద సచ్చిండో" మేను వాల్చింది.

"బురదల పడ్డట్టాయె. ఈగండాలు ఎప్పుడు గడుస్తయో" నిద్రకోసం కళ్ళు మూసుకుంది.

"శారదా! శారదా!!" అర్ధరాత్రి పిలుపు. లేచి తలుపు తీసింది.

"ఏందక్కా గీయాల్లకు వచ్చినవు."

"నీ మొగడు బగ్గతాగి, సోయి లేకుండ రోడ్డు మీద పడ్డడట. జీబుకొట్టి పోయిందని అంటుండ్రు"

గబగబా పక్క సందులో ఉన్న అత్తగారింటికి పోయింది. "అత్తా! మామా!" అంటూ బిగ్గరగా పిలిచింది. ఇద్దరు బయటికొచ్చి విషయం తెలుసుకున్నరు. తలుపులు మూసుకున్నరు. తను ఒంటరిదయింది. ధైర్యం తెచ్చుకుంది. యాక్సిడెంట్ జరిగిన చోటుకెళ్ళింది. యాక్సిడెంట్ జరిగిన ఆనవాళ్ళేం లేవు. అర్ధరాత్రి. అలికిడి లేదు. నడిరోడ్డుపై అచేతనంగా భర్త. "ఉన్నడో పోయిండో" తేల్చుకోడానికన్నట్లు ముక్కుముట్టి చూసింది. "ఏముంది, అంతా అయిపోయింది" తేల్చుకుంది. గాభరాపుట్టింది.

ఆందోళనా, అలజడి నిండిన మనసుతో తన ఇంటి యజమానిని లేపింది. విషయం చెప్పింది.

"చాని శపం మాత్రం నా ఇంట్ల ఎయ్యుద్దు" గట్టిగా చెప్పాడు.

అచేతనురాలయ్యింది. దిక్కుతోచడం లేదు. తన తల్లిగారు దగ్గరలేరు. కాళ్ళల్లో బలం సన్నగిల్లింది. ఒక్కసారిగా తన నిలుచున్నచోట మోరి మీద గద్దెపై కూలబడింది. అలా క్షణాలు, నిమిషాలుగా, నిమిషాల్ని గంటలుగా భయంగా కాలం గడిపింది. ఇంట్లో పిల్లలు గాఢనిద్రలో, బయట భర్త శాశ్వత నిద్రలో, తను మాత్రం నడుమ కడపపై నిరాశగా గడిపింది.

★ ★ ★

తెల్లారింది. పదిమంది మూగారు. పదిరకాలుగా మాట్లాడుతున్నారు. "చీప్‌లిక్కర్" బలి తీసుకుంది. జనం నిర్ధారించారు. "తాగిండు – సచ్చిండు" కొందరు తిట్టసాగారు. అయిన వాళ్ళందరూ దూరంగా ఉండటంతో కొందరి సమక్షంలో అతని అంత్యక్రియలు జరిగాయి. సంప్రదాయం కావచ్చు. సంప్రదాయం వెనుక దాగిన అవసరం కావచ్చు. శారద పిల్లలతో సహా తల్లిగారింటికి వెళ్ళింది. తనింటికి రావడానికి, తనకు తానుగా రావలసిన అగత్యం శారదను మరికొన్నాళ్ళు తల్లి గారింట్ల ఉండేట్లు చేసింది. తల్లి పిల్లలు వెరసి ముగ్గురు ఖాళీగా తింటూ గడపటం తల్లికి భారమైంది. సణుగుడు గుణుగుడు తల్లితోనే ప్రారంభం కావడం విశేషం.

"నీ మొగనికి ఆస్తిల భాగం రాదానే" తెలిసిన విషయాన్నే కదలించింది తల్లి.

"ఇల్లమ్మిన పైస వాని తాగుడుకే సరిపాయె" కూతురు జవాబు.

"నువ్వు, పోరగాండ్లు ఎట్ల బతుకుతరు?"

"మీరంతా లేరా, తలా ఒక చెయ్యి ఎయ్యిండ్రి."

"మీ అయ్య సచ్చినాంక, నాది కోడండ్ల మీది బతుకయ్యింది."

"నీ మీది బంగారం అమ్మి ఇయ్యి. మిత్తికి తిప్పుకుంట. కూలో, నాలో చేసుక బతుకత."

"గా బంగారం చూసే నాకింత తిండి పెట్టవట్టిరి. అది నీకిత్తె నా నోట్లె మన్ను వడదా."

"నీ కొడుకులను నువ్వు సాదలేదా. నెలకు తలా ఇన్ని పైసలియ్యమను."

"మంచిది అడుగుత, వాళ్ళిచ్చినప్పుడు ముల్లెగట్టి నీకిత్తతీ."

'అంటె, ఇప్పుడు నా ఇంటికి నన్ను పొమ్మంటవా ఏంది."

"....."

తల్లి నుండి సమాధానం రాకపోయేసరికి దుఃఖం ముంచుకొచ్చింది దిక్కుతోచని పరిస్థితి వచ్చింది. పిల్లలవైపు ఒకసారి చూసుకుంది. వాళ్ళకోసమైనా ధైర్యంగా ఉండాలనుకుంది. మొండి పట్టుదల తెచ్చుకుంది. నిండా పాతికేళ్ళు లేని తనకు ఎన్ని దెబ్బలు అయినా ఒంట్లో రక్తమాంసాల ఉధృతి, బయట బొడ్డు తెంచుకుని పుట్టిన బిడ్డల పెంపకం, కర్తవ్యాన్ని నిర్దేశించాయి. ఒక ఉదయాన పిల్లల్ని తీసుకొని అత్తగారింటికి బయల్దేరింది. నేరుగా వెళ్ళి అత్తగార్ని కలిసింది.

"ఇప్పుడే వస్తున్నావే" అప్యాయంగా పలకరించింది అత్త.

"అవును."

"గిన్ని రోజులు అటే పోయినవు" ప్రశ్నించింది అత్త.

"మీరెవ్వలన్న తోల్కపోను వత్తరనుకున్నా."

"ఎంబడి మీ అవ్వ రాలేదా?"

"ఎవ్వలు లేందాన్నయిన" నిష్కారంగా జవాబిచ్చింది.

"బతికి ఉన్నప్పుడు నీ మొగడు ఎవల్నన్నా చూసిండా"

"నా మొగుడు అంటున్నవు. నీ కొడుకు కాదా? వాడు చూడందానికి నేనేం జేయాలె."

"ఎవలు ఏం జేసేదిలేదు. ఎవల కడుపుకు వాళ్ళు బతకాలె. ఇప్పుడైతె బువ్వ తిందువురా" అని లేపింది అత్త.

తెల్లారింది. అత్త పురాణం మొదలుపెట్టింది. కొడుకు పెండ్లి మొదలు, కొడుకు చావు దనుక తవ్విపోసింది. పొమ్మనలేక పొగపెట్టినట్లు చేసింది. అత్తముచ్చట అర్థమయింది. ఏం జెయ్యాల్నో మరొక్కసారి ఆలోచించుకుంది. ఇల్లుకానిల్లు. తను ఉంటున్న కిరాయింటికి బయలుదేరింది. తాళం తీసి నడింట్లో పిల్లల్ని ముందరేసుకుని కూర్చుంది.

"ఎవలూ! శారద వచ్చిందా" తలుపు తెరచి ఉండటం చూచి ఒచ్చిండు ఓనరు.

"ఇప్పుడే వచ్చిన బాపూ."

"అంత మంచిదేనా బిడ్డా."

"ఏం మంచి మొగడొక్కడే పోయిండు అనుకున్నా. కాని అందరు పోయిండ్రని ఇప్పుడు తెలిసింది."

"గట్లంటవెందుకు బిడ్డా! 'దిక్కులేనోల్లకు దేవుడే దిక్కు' ధైర్యంగా ఉండాలె."

"బాపూ! ఇప్పుడు నువ్వే నాకు దేవునివి. ఒక రెన్నెల్లదాక కిరాయి పైసలు అడగకు" చేతులు జోడించి ప్రార్థించింది.

"నీ ఇష్టం బిడ్డ, నువ్వెప్పుడిత్తె అప్పుడు దీస్కుంట ముందుగాల నువ్వు పనిలవడు. తాగుబోతోని తోటే నీకు కష్టం ఉండె. ఇప్పుడు నీకు ఆ కష్టం లేదు. బడికిపోయే పోరగాండ్లేనయిరి. వాళ్ళు నీ పనికే అడ్డం ఉండరు. మంచిగ ఆలోచించు. ఇయ్యాల్ల మా ఇంట్లనే బువ్వతిను" అంటు వెళ్లిపోయాడు.

లేగకు ఆసరా దొరికినట్లయింది. లేచి పనిలో పడింది. ఉన్న ఒక్క గదిని శుభ్రం చేసింది చక్కగా సర్దింది. పిల్లల్ని తయారు చేసింది. తనూ తయారైంది. సగం బరువు దిగింది ఇంట్లో వాతావరణం తేలికైంది. భవిష్యత్తుకు చెందిన ఆశేదో శారదలో మొలకేసింది పిల్లలతో సహా అన్నం తినడానికి ఓనరు ఇంటికి బయలుదేరింది

★ ★ ★

ఆది జిల్లా కేంద్రం. పట్టణం నడిబొడ్డున మార్కెట్. కూరగాయల మార్కెట్. మరోవైపు చేపల బజార్. ప్రధాన కేంద్రంనుండి కొనుక్కుని వెళ్లే చిన్న వ్యాపారులతో, అక్కడికి వచ్చి చేరే చేపలతో ఎప్పుడూ సందడిగా ఉంటుంది. అదేచోట చేపలు అమ్మేవారు. కొనేవారి మధ్య బేరసారాలు ఊపులో ఉంటాయి. కొనుక్కున్నవారి చేతి నుండి దాదాపు లాక్కున్నట్టుగా కనిపించే వారు కొందరు. వారే చేపలను కడిగేవారు. అందరూ ఆడవారే రకరకాల చేపలు, చివరకు చేపలన్నీ ఆడవాళ్ల చేతుల్లోకి వస్తున్నాయి. కదుగుతున్నారు. ఒక్కో చేపను కడిగే తీరు ఒక్కోరకం. బొమ్మెలాంటి సల్ల చేపలన్నీ ఇల పీటలకేసి రాకుతుంటే ఒచ్చే కర్..కర్.. కర్...లాంటి శబ్దాలు ఒకచోట చిత్ర, రసూలాంటి తెల్లచేపలను. చేప బ్రష్‌తో గీకుతుంటే పొలుసులు ఊడుతూ వచ్చే బర్. . బర్ .. బర్ లాంటి చప్పుళ్ళు మరోచోట. కొనుక్కున్నవారి చేతిలో నుండి చేపలను తీసుకోవడానికి పోటి పడ్డ ఇద్దరు, ముగ్గురు స్త్రీల మధ్య పుట్టిన చిచ్చు తాలూకు సెగలు అంతట. వెరసి చేపల మార్కెట్. దీనికి తోడు ఒక్కొక్కరి వద్ద కుప్పలు కుప్పలుగా పోగుపడ్డ చేప తలలు, తోకలు, పుచ్చె, సెన, తిత్తి, చేదులాంటి అనవసర పదార్థాల నుండి పుట్టుటచ్చిన వాసన నీసువాసన - కవుసు వాసన ఆ ప్రదేశానికి ఒక వాతావరణాన్ని కల్పించింది. ఎంత శుభ్రం చేసికొన్నా ప్రతి ఒకరికి చేతికి అంటి వున్న బూడిద, నడుముకు చెక్కుకున్న పైసల సంచి అలసటతో కనిపించే వారి మొహాలు వారి ఉనికిని తెలిపేవిగా ఉన్నాయి. అంతటి పాకురు జల్లురులో సైతం ఎవరి స్థానాలు వారికి కేటాయించబడ్డట్టే ఉన్నాయి. ఆ స్థలాలకు, ఆ మనుషులు అలవాటయ్యారు. ఆ మనుషులకు, ఆ స్థలాలు పునాదులయ్యాయి. అలాంటి స్థలాన్ని ఒకదాన్ని స్వంతం చేసుకొని చేపలు కడుగుతూంది శారద. పనిలో శ్రద్ధ, చురుకుదనం, ఆకట్టుకొనే తీరు ఆమె సొంతం. అందుకే ఎక్కడ కొనుక్కున్నా, ఆమె దగ్గరకే వచ్చి కడిగించుకొనేవారు చాలామంది.

ఆమె పనితనం వారికి ఆమోదం. వారి ఆమోదం ఆమెకు ఆధారం.

"తల్లిగారింటి నుండి ఎప్పుడచ్చినవే శారదా."

"రెండ్రోజులయింది"

"మొగడు పోయిండనికని..నీ పీడ పోయిందె సెల్లె"

"....."

"నువ్వు రాక రెండు, మూడు నెల్లాయె బిడ్డా! ఇక్కనుంచెల్లి రోజురా."

".... ....."

"సందమామ లెక్క ఉండేది. బుడ్డ పరక లెక్క అయింది."

పక్కనున్న అమ్మలక్కలు పలకరించసాగారు. కొన్నిటికి జవాబులు, మరికొన్నిటికి మౌనం ఆమె సమాధానమైంది. ఆ విధంగా రోజులు, నెలలు గడిచిపోయాయి. పాతను మరవడమే కాదు. కొత్త జీవితానికి అలవాటు పడింది. ఏడాది దాటింది పిల్లల తరగతులు మారాయి. శారద స్థితిగతులు మారాయి. ఆమె నడక. పొదుపు ఆమెను గట్టెక్కించాయి.

ఒకరోజు పనిలో.."ఏందే! బాగ ముందటికి పోయి కూసున్నవు" తోటి మనిషి గయ్యిమంది.

"రోజటి లెక్కనే కూసున్న" శారద జవాబు.

"చాన్రోజుల నుండి సూత్తున్న నాకచ్చే గిరాకిని నువ్వు గుంజుకుంటున్నవు."

"నాతోటి కొట్తాడ బుద్ధయితున్నాదె.

"నేను అట్టిగనె కొట్లాడెదానోలె కనపడుతున్ననా నిన్న నాకచ్చే కొర్రమట్టల గిరాకిని నువ్వు మలుపుకోలేదా."

"అనవసరంగ నన్ను కంట్లె పెట్టుకుంటున్నవు. నా ఉసురు నీకు తగులుద్దే."

మాటా, మాటా పెరిగింది. గొడవ పెరిగి పెద్దదయింది. నలుగురు గుమికూడారు. తలా ఒక మాట అనసాగారు. గొడవను పెంచజూసే వారు కొందరు, తగ్గించాలను కొనేవారు కొందరు, చోద్యం చూసేవారు మరికొందరు. ఈ సమయంలోనే గుంపు లోకి ప్రవేశించాడతడు. ఎక్కడి వాళ్ళనక్కడకు పంపించాడు. ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చాడు.

గయ్యాళికి నాలుగు చీవాట్లు అంటించాడు.

"దాంతోటి ఎందుకు పెట్టుకున్నవు" శారదను ప్రశ్నించాడు

"అదే మొదలు పెట్టింది" శారద జవాబు.

"దాంది ఓర్వలేని గుణం. గంపనోరు "

"అట్లని నేను పడుకుంటపోతే అది అనుకుంట పోతది."

"నిన్ను బదనామ్ చేయడానికి లక్ష తొవ్వలున్నాయి దానికి."

"ఏం జెయ్యాలె! ఎట్లయ్యేది అట్లయితది "

"అది నిన్నేమన్నంటె నాకు చెప్పు. దాని జోలికి పోకు" చెప్పుకుంటూ వెళ్ళి పోయాడు.

అతనిది చేపల వ్యాపారం. బయటినుండి చేపలు తెప్పించడం, అమ్మడం అతని పని. ఒక్కోసారి అతనే చేపలు పట్టి తెచ్చి అమ్మేవాడు చదువు సంధ్యలు లేని అతను కులవృత్తినే నమ్ముకున్నాడు. వ్యాపారంలో కాస్త వెనకేసిండు కనుక అతనంటే అందరికి గురి. వయసుకు చిన్నవాడే అయినా చేసేది పెద్దమనిషి వ్యవహారం. అతడు వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయింది శారద

"ఏందే, వాని మొకాన్నే చూసుకుంట కూసున్నవు "

"మంచిమనిషి. మన కులపోడు "

"ముందటున్న చాపలు కడుగు. అటెన్క వాన్ని సూద్దువుగని."

"ఏమోనే. ఇవ్వాల కొట్లాటలకు సొచ్చుకచ్చిండు కనుక ఆగింది. లేకపోతే అది నన్ను కదుర్తుండె."

"నీదేం తప్పు లేదుకదనే, ఎందుకు భయపడుడు."

"బక్కోన్ని సూత్తె మొత్తబుద్ధయింతదట. దిక్కు సక్కి లేనిదాన్ని అందుకే భయం."

"అంతపైనున్నోడే సూసుకుంటడు. నారు పోసినోడు, నీరు పోయడా?"

"అదంత మనసు నిమ్మలం జేసుకొనేటాన్కే అనుకొనేది."

"ఏందో అంత. కడగటాన్కి చాపలు ఉన్నయి" అంటూ వెళ్ళింది తోటిది.

మొదటిసారి భయం అనే వేరు పురుగు శారద వెన్నెముకను ముట్టడించింది. జీవితం మామూలుగా వెళ్ళదీయటానికి కావలసిన డబ్బుంది కదా అని సంతోష పడింది పనిచేయడానికి ఒంట్లో శక్తి, మనసు వైరాగ్యం వైపు వెళ్ళనీయకుండా పిల్లలు ఉండటం వల్ల యంత్రంలా బతకసాగింది. ఏవైనా ఒడిదుడుకులు కాని అనారోగ్యం గాని వస్తే ఎట్ల? అనే ప్రశ్న, జరిగిన కొట్లాట నుండి పుట్టుకొచ్చింది. తనుచేసే పని, పరిస్థితులు, వాతావరణం, అన్నీ క్రమరాహిత్యంలో ఉన్నాయి. రక్షణ కరువై, నిస్తేజంగా బతుకు గడుస్తుంది. బతుకులో ఎక్కడో, తారసిల్లిన సుఖం, సంతోషం గుర్తుకు రాసాగాయి. వాటి అన్వేషణలో మనసు ఉరకలు వేయసాగింది. తనువులో కొత్త వాసనలు ఊరసాగాయి.

తన పరిస్థితి తనకే స్పష్టంగా అర్థమవసాగింది. పరిపరి విధాలుగా పరుగెడతున్న మనసును నియంత్రించ ప్రయత్నించింది. నిద్రకు ఉపక్రమించింది. భౌతికత, మానసిక చలనాన్ని నిర్దేశించడం వల్ల కొట్టుమిట్టాడ సాగింది. పక్కలోనున్న పిల్లల కలవరింతలు ఆమె మనసుకు బ్రేకులు వేయసాగాయి. పొద్దంతాపడ్డ శారీరక శ్రమ, కొన్ని గంటలు మానసిక ఆలోచనతో అలసి నిద్రలోకి జారుకుంది.

★ ★ ★

ఈ రోజు ఆదివారం మార్కెట్లో సందడి ఎక్కువ. చేపలు కొనుక్కునేవాళ్లు ఎక్కువ. కనుక గిరాకి ఎక్కువ. గిరాకిని దృష్టిలో ఉంచుకొని తుపాకి నుండి వెలువడ్డ తూటాలా ఇంటి పనులు చేయసాగింది. ఇంటి పనులన్ని ముగించుకొని తనతోబాటు బిడ్డను బయల్దేరదీసింది. ఇంతలో....

"శారదా! మార్కెటుకు పోతున్నవా" ఇంటి ఓనరు స్వరం.

"అవును."

"అయితే మా ఇంట్లకు కిలో చాపలు తీసుకురా."

"నేనచ్చెటాలకు అంబటాలయితది కాదె బాపు."

"అయితే మానె. మంచి చాపలు తీసుకరా."

"మంచియంటె? నీకు ఏం గావాలె" అవాంతరానికి విసుక్కుంది.

"మార్కెట్లకు ఏమేం వత్తయి."

"బొమ్మెలు, మార్పులు, పాపెర్లు, కొర్రమట్టలు, జెల్లలు, ఇంగ్లీకాలు, బొచ్చెలు, పరకలు, గురిజెలు, చందమామలు, చిత్రాలు, రహులు, గంగరొయ్యలు...ఏవి కావాలంటె అవి తెస్త" ఇంటికి తాళం వేస్తూ అంది.

"నీ ఇష్టం. మొత్తానికి నల్లచేప తీసుకురా."

"సరెకని, నా కొడుకుని మీ ఇంట్ల కూసుండవెట్టుకో. లేకపోతే ఆటకు మరుగతడు" కొడుకును అప్పగించి బయల్దేరింది.

పరుగు పరుగున మార్కెట్లో వచ్చి వాలింది. అప్పటికే జనం చిక్కబడ్డరు. ఒక్కొక్కరే తనకు తెలిసినవాళ్ళు ఒకరినిచూసి, మరొకరు ఇలా ఎడతెగకుండా పనిసాగింది. చేతినిండా పని.

"ఇట్లనె ఉంటె, చాపలన్నీ అయిపోతయి. ఓ కిలో బొమ్మెచాపలు పట్టుక రా పో" కూతురుతో అంది.

"ఎందుకే."

"మన ఇంటి తాతకు కావాలన్నడు."

"పైసలు ఇయ్యి."

"చాపలైతె తెమ్మన్నడుగని పైసలియ్యకపాయె ముసలాయన."

"నీ దగ్గర లేవా?"

"మా అమ్మ ఇయ్యమన్నదని అతని దగ్గర తీసుకురాపో" అంటూ వేలు చూపింది.

"అతనా! ఆయన పేరేంది?" అటువైపు చూస్తూ అతనెవరో పోల్చుకోలేక అంది.

"నారాయణ."

సరే అంటూ వెళ్ళి అతని వద్ద నిల్చుంది. పనిలో ఉండటం వల్ల దించిన తల ఎత్తడం లేదు. కాసేపు అలానే నిల్చుంది. ఇంకా సేపు ఆగి...

"అంకుల్" పిలిచింది.

"ఏం కావాలె"

తలెత్తి అడిగాడు.

"మా అమ్మ కిలో చేపలు ఇయ్యమంది.

మీ అమ్మ! ఎవరు వాల్లు."

"అగో... ఆమె" అంటూ వేలు చూపింది.

"ఏం పేరు" తట్టలోని చేపల్ని కదిలించసాగాడు.

"శారద."

"శారదనా" ఆశ్చర్యంగా పిల్లకేసి చూసి శారదవైపు తిరిగాడు.

శారద ఇటువైపు చూస్తుంది. ఇద్దరిచూపులు కలిశాయి. "చాపలు ఇవ్వమన్నట్లు" సైగ చేసింది.

"ఎవలకు మీకేనా' అడిగాడు.

"కాదు. మా ఇంటి తాతకు" జవాబిచ్చింది శారద కూతురు.

"ఎన్ని కావాల?"

'కిలో."

"మీకు కూడా ఇచ్చిన పో" అంటూ చేతిలో సంచిని పెట్టాడు. పని పూర్తి అయి. ఇంటికి తయారు అయేసరికి దాదాపు మధ్యాహ్నం అయింది. ఇంటికి వెళ్తూ, వెళ్తూ నారాయణ దగ్గర ఆగింది శారద.

"పైసలు రేపు రాంగ తీసుకత్త."

"అయ్యో! పైసలు ఎటు పోతయి, నన్ను రమ్మంటే నేనువచ్చి తీసుకుంట."

"అయితే సాయంత్రం ఇంటి మొకాన రా" అంది శారద.

ఆ విధంగా ఆ సాయంత్రం మొదలైన రాకపోకలు రాత్రిళ్ళ వరకు దారితీశాయి. ఆ దారి వెనుక అవసరాలు - ఆచరణలు, విరహం- వైభోగం, తెగింపు - మమేకం, కష్టాలు - సుఖాలు, భవిష్యత్ భయాలు, రక్షణ వలయాలు, ఇలా అనేకం అల్లుకు పోయి ఉన్నాయి. ఆ విధంగా ఏర్పడ్డ దారి క్రమక్రమంగా రహదారి అయింది. అతను- ఆమె ఒకరికొకరుగా, తోడూ నీడగా కలిసి ఉండసాగారు. ఎందరో ఈ వ్యవహారాన్ని గమనించారు. కొందరు చెవులు కొరుక్కున్న వారైతే, మరికొందరు ఆడిపోసుకున్నవారు. అందరిలోనూ తీక్షణంగా గమనించినవాడు, విషయాన్ని కదిలించినవాడు ఆ ఇంటి ఓనరు.

"బిడ్డా! ఎవలే వాల్లు" విషయాన్ని సూటిగా వచ్చాడు.

"మార్కెట్ల పని పనిచేస్తడు."

"ఏం కులం?"

"మా కులం."

"పెండ్లయిందా? కాలేదా?

"అయింది. ఇద్దరు పిల్లలు."

"కొసెల్ల ఉంటడా నీతోటి"

"ఏమో! ఎట్ల జెప్పాలె"

"తెల్వకపోతె, ఇదేం ఎవారం బిడ్డా?"

"ఇష్టం, అవసరం."

"అయితె, పెండ్లి జేసుకో."

'కుదరది."

"ఎందుకు"

"అయన పెండ్లాం ఊకుంటదా? దాని ఉసురు నాకు కొట్టదా?"

"భయంగల్ల కోడి బజార్ల గుడ్డు పెట్టిందట. గంత భయం ఉన్న దానివి వానికెందుకు మరిగినవు"

"మరి, అతనో...?!"

"వాడు మొగోడు..."

"....."

"ఏం మాట్లాడవేంది బిడ్డా. ఎన్కాముందు లేని దానివి. మంచి - చెడు తెలుసుకునే వయసు నీ బిడ్డకు వచ్చింది. అది ఏదోతరగతి చదువుతుంది. నీ ఎవారాలు అది అర్థం చేసుకుంటె ఎట్లుంటదో ఆలోచించినవా. నీ ఎన్కా ముందు ఎవరు ఎన్ని మాటలు అనుకుంటున్నారో తెలుసా?"

"తెలుసు. అన్నీ తెలిసే వానితోటి కూడిన."

"ఈ పద్ధతి మంచిదికాదు. నా ఇంట్ల కూడా ఎదిగిన ఆడపోరగాండ్లు ఉన్నరు. నిన్ను ఇంట్ల ఉంచుకున్నందుకు నేనూ మాటలుపడాల్సి వచ్చింది. ఇట్లనే వాడు వచ్చి పోయేటట్లు ఉంటే ఇల్లు ఖాళీచేయి" అంటూ వెళ్ళిపోయాడు

బేలగా చూసింది. కలవరపడింది. అనివార్యంగా. అయిష్టంగా ఇల్లు మారింది. ఇల్లు మారడం, కిరాయి పెరగడం ఆమెను ఆర్థికంగా దెబ్బతీసింది అక్కడ నారాయణ రాకపోకలకు వ్యతిరేకత వ్యక్తం కాలేదు. కాని శారదలో ఘర్షణ మొదలయింది. ఇల్లుకోసం వెతకడం, ఖాళీచేయడం, కొత్తింట్లో సర్దుకోవడం అనే పనుల్లోనేకాక, వీటికోసం తను పడ్డ తపనలో నారాయణ పంచుకున్న భాగమెంత? అసలు ఇల్లు మారడానికి గల మూల కారణాలను అన్వేషిస్తూ అతడు ఎన్నివిధాలుగా కారకుడయ్యాడో ఆలోచింప సాగింది. అందులో భాగంగానే తన జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలు, మలుపులన్నింటిని మననం చేసుకోసాగింది. జరిగినవన్నీ తన ప్రమేయం లేటువంటివే. తను కోరి అందుకున్నవి కావనే విషయం అర్థం కాగానే ఒళ్ళు జలదరించింది. నారాయణ సాన్నిహిత్యాన్ని పదిలపరచుకోవాలని భావించింది. కాని "ఈ సంబంధం ఎంతకాలం కొనసాగుతుంది" అనే ఇంటి తాత ప్రశ్న వేధించసాగింది. "వయసులో ఉన్నంతసేపేనా!" అతనికి మెజు తీరేవరకేనా!"

"ఎల్లకాలం సూత్రబద్ధమైనది మా మధ్యలో ఏమైనా ఉందా?" ఇలాంటి అనేక ప్రశ్నలు గుప్పెడు మనసును ఛిద్రం చేశాయి. ఆ అలజడిలో, ఆ చింతనలో పడి రాత్రి ఎప్పటికో నిద్రపోయింది.

★ ★ ★

"శారదా! శారదా"

"ఎవలు"

....

"గా బజార్ల నిలబడి ఏం ఒర్రుతున్నవు లోపలికిరా" గబగబా లోపలికి వచ్చాడు నారాయణ. నింపాదిగా ఉన్న శారదను చూశాడు. "ఇవ్వాల మార్కెట్కు రావా. ఎత్మినాన్గ కూసున్నావు."

"రోజు పనేనా. యాష్టత్తంది"

"బువ్వతినుడు యాష్ట అనిపిత్తలేదా?"

ీ పాడు జెయ్యి. ఓముద్దులేదాయె, ముచ్చటలేదాయె."

"ఇప్పుడేం జేద్దామంటవు."

"పన్నెండేండ్లకు వచ్చినయట. గా పుష్కరాలకు పోయి తానం జేసి వద్దాం పా"

"ీ తాంబోరు మొగనితోటి గిట్లెప్పుడన్న మాట్లాడినావె?"

"చా జోలెండుకు నడిమింట్ల"

'లేకపోతేండె ఇనెటోన్ని ఉన్న గనుక ఇనిపిత్తన్నవు. ఎన్కటికి, ఇప్పటికి పైస పెర్గింది భక్తి పెరిగింది. పుష్కరాలు పెరిగినయి. ఇంక గిసొంటియి చాల పెరుగుతయి సూడు."

"అన్నింటిని పైసతోటి ముడేయద్దయ్యా. మా అంటే వందో, రెండువందలో భర్చు అయితయి గంతె"

"పైస గురించి కాదే నేను మాట్లాడేది. మనం చాపలు పడుతున్నం. అమ్ముతున్నం వాటి తోటే బతుకుతున్నం. ఇవన్నీ కూడా మానేరు డ్యాంలయే. మన బతుకులు డ్యాం తోటి కలిసి పోయినయి. అసొంటి మానేరుకు వరదలచ్చినపుడు కలసి తానం జేద్దాం పుణ్యముంటది. దానికో అర్థం ఉంటది."

"సువ్వెపుడు ఎడ్డమంటె తెడ్డెమంటవు. అన్నిపెడ ముచ్చట్లు మానేరుకు ఎన్నడు వరదలు రావాలె."

"ఎంతల్నె మఘ మర్రిందంటె మానేరు గడ్డలు ఒర్రి సత్తయి."

"ఆ! అవి ఒర్రినట్లె. ఈ మొగోడు తానం జేసినట్టే".

"ఏందే! మరుగుపాపెర మందు ఏసుకున్న మొగోన్ని నేను, నిన్ను మానేర్ల ముంచి లావట్టకపోతే చూడు."

"మరి ఇప్పుడు ఎటు వోతున్నావు. "

"నేను పోవుడు కాదు. నిన్ను మార్కెటుకు తోల్కపోను వచ్చిన. ఇయ్యాల్లటి నుంచి హోటల్ గిరాకి ఒకటి మాట్లాడిన. ప్రతిరోజు కనీసం పదికిలోల చాప కడిగి వాళ్ళకు ఇచ్చి రావాలె అందుకే జల్ది బయలుదేరు. ఇద్దరం కలిసిపోదాం."

ఆ విధంగా నారాయణతో కలిసి మార్కెట్‌కు బయలుదేరింది శారద.

'అమ్మా' మేం కూడా వత్తం. మమ్మల్ని బడి కాడ దించి పోండ్రి."

"సరే, బయల్దేరుండ్రి జల్ది. నారాయణ అంగీకరించాడు. ఆ కుటుంబ భారాన్ని తల్లి, ఆ తల్లికి ఊతంగా అతను, వారి ఆప్యాయతతో పిల్లలు ఎదగసాగారు. ఒక కుటుంబం నిలదొక్కుకుంది. ఒక పొద్దు పొడిచింది.

# 87. లాకప్ డెత్

♦ కర్ర ఎల్లారెడ్డి ♦

కుటుంబాన్ని పోషించే వ్యక్తి అన్యాయంగా నిందితుల చేతుల్లో లాకప్‌లో మరణిస్తే అతని కుటుంబాన్ని పట్టించుకునే వారెవరు?

నేరాలు జరిగిన ఇప్పుడు నిందితులను అరెస్టు చేశారా లేదా అని, ఒకవేళ అరెస్టు చేస్తే 24 గంటలలోపు వారిని కోర్టులో ప్రవేశపెట్టారా లేదా అని, ఆ నిందితులపై జాప్యం లేకుండా కోర్టులో నేర విచారణ జరుగుతున్నదా లేదా అన్న విషయాల గురించి ఎక్కువగా ప్రశ్నలు వేస్తూవుంటారు. ఆ నిందితులు చేసిన నేరంవల్ల నష్టపోయిన బాధితుల గురించి తక్కువగా పట్టించుకుంటారు. కొన్ని హైకోర్టులు ఇలాంటి నేర బాధితుల గురించి ఆలోచిస్తున్నాయి.

సాయంత్రం నాలుగు గంటల సమయంలో నాగయ్య ఇంట్లో ఉండగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్ళు అతడిని అరెస్టు చేసి తీసుకెళ్ళారు నాగయ్య స్కూటర్ల దొంగతనాలు చేశాడని ఆరోపిస్తూ పట్టుకుపోయారు.

నాగయ్య భార్య, అతని తల్లిదండ్రులు మరో అరగంటలో పోలీస్ స్టేషన్‌కు వెళ్ళారు. కానీ అక్కడ ఎస్.ఐ గారు లేకపోవడంతో ఆయన వచ్చేంతవరకు చూద్దామని వారంతా అక్కడే ఉండిపోయారు. ఇందాక నాగయ్యను పట్టుకుపోయిన కానిస్టేబుల్ ఒకాయన వీరివద్దకు వచ్చి నాగయ్య తను చేసిన స్కూటర్ దొంగతనాల గురించి నిజంచెబితే కేసురాసి కోర్టులో ప్రవేశపెడతామని చెప్పాడు. నాగయ్య అలాంటి వ్యక్తికాదని వారు కానిస్టేబుల్‌ను బతిమిలాడారు. నాగయ్య పదవతరగతి వరకు చదువుకొని ఒక కాంట్రాక్టర్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, దొంగతనాలు చేయాల్సిన అవసరం అతనికి లేదని, అతడిని కొట్టకుండా వదిలివేయాలని ప్రాధేయపడ్డారు. ఇంతలో ఎస్ ఐ. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. నాగయ్యను లాకప్‌లో వేయించాడు.

మరోగంట పడిగాపులు పడ్డ తర్వాత నాగయ్య, భార్య తల్లిదండ్రులు ఎస్.ఐ.ని కలిసి మాట్లాడగలిగారు ఇంతకుముందు కానిస్టేబుల్‌కు చెప్పిన విషయాలనే ఎస్.ఐ.కి చెప్పి నాగయ్య అమాయకుడని, అతడిని ఏమీ చేయవద్దని వేడుకున్నారు.

నేరం చేసిన ప్రతివాడూ తాను అమాయకుడేనని అంటాడని, అతని బంధువులు కూడా మావాడు చాలా మంచి వాడని చెబుతారని ఎస్.ఐ. అంటూ నాగయ్యను ఈ రాత్రి ఇంటరాగేట్ చేసిన తర్వాత అన్ని విషయాలు బయటపడతాయని అన్నాడు. వారిని వెళ్ళిపోవాలని చెప్పటంతో నాగయ్య భార్య తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్ నుంచి ఇంటికి వెళ్ళిపోయారు.

రాత్రి పదిగంటలు దాటింది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ., నాగయ్యను పట్టుకొచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్ళు అతన్ని ఇంటరాగేట్ చేయటం మొదలుపెట్టారు. వారిని చూసి నాగయ్య వణికిపోయాడు. తాను ఏ నేరం చేయలేదని తనను కొట్టవద్దని వేడుకున్నాడు.

పావుగంట సేపు ఇద్దరు కానిస్టేబుళ్ళు కలిసి నాగయ్యను నగరంలో జరిగిన స్కూటర్ దొంగతనాల గురించి, దొంగల ముఠా గురించి ప్రశ్నించారు. నాగయ్యకు ఆ విషయాలేవీ తెలియనందున నిజంగా తనకేమీ తెలియదని నిజాయితీగా చెప్పాడు. దొంగతనాలు చేసి కూడా అబద్ధాలు చెబుతున్నాడని ఇక వట్టిమాటలతో కాదని కానిస్టేబుళ్ళు ఇద్దరు లాఠీలతో కొట్టడం ప్రారంభించారు. ఎంతసేపటికి నాగయ్య దొంగతనం చేసినట్లు అంగీకరించకపోడంతో ఆగ్రహంతో ఊగిపోయిన ఎస్.ఐ. కూడా విపరీతంగా కొట్టాడు. ఆ దెబ్బలకు తాళలేక, నాగయ్య నేలమీద పడిపోయాడు. అయినా విడిచిపెట్టకుండా ముగ్గురు పోలీసులు కలిసి కర్రలతో కొడుతూ కాళ్ళతో తన్నారు. దెబ్బలకు తాళలేక నాగయ్య బిగ్గరగా ఏడుస్తూ మరికొద్ది సేపటికి స్పృహతప్పి పడిపోయాడు.

కొద్దిసేపటికి అతడే లేచి కూర్చుంటాడని భావించిన పోలీసులు అక్కడి నుంచి వెళ్ళిపోయారు. మరో అరగంట తర్వాత ఒక కానిస్టేబుల్ వచ్చిచూస్తే నాగయ్య అలాగే పడిపోయి వున్నాడు. అతన్ని కదిలించినా కదలలేదు. అతని ముక్కు దగ్గర చెయ్యిపెట్టి చూస్తే శ్వాసకూడా ఆగిపోయి ఉంది. వెంటనే అతడు పరుగెత్తికెళ్ళి ఎస్.ఐ.కి ఈ విషయం చెప్పాడు. నాగయ్య చనిపోయినా వారు చలించలేదు.

ఎస్.ఐ. చెప్పిన ప్రకారం ఇద్దరు కానిస్టేబుళ్ళు కలిసి చనిపోయిన నాగయ్యను తీసుకెళ్ళి అతను చెట్టుకు ఉరి వేసుకున్నట్టుగా వేలాడదీశారు.

మర్నాటి ఉదయం నాగయ్య భార్య, తల్లిదండ్రులు నాగయ్య యజమానిని తీసుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళేసరికి అక్కడ ఎస్.ఐ.గానీ, నిన్నటి ఇద్దరు కానిస్టేబుళ్ళు గానీ లేరు. మరో కానిస్టేబుల్ వారి వద్దకు వచ్చి నిన్న రాత్రి నాగయ్య చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయినట్లు చెప్పాడు.

నాగయ్య యజమానికి అనుమానం వచ్చి ఈ విషయాన్ని పత్రికలవారికి, న్యాయ పోరాట కమిటీవారికి, మానవ హక్కుల వారికి తెలియజేశాడు. నాగయ్యను పోలీసులే కొట్టిచంపి, చెట్టుకు వేలాడదీశారని వారందరికీ చెప్పారు. వారంతా నాగయ్య భార్య, తల్లిదండ్రులతో మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకున్నారు. నాగయ్య తన యజమాని వద్ద గత మూడేళ్ళ నుంచి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, అతడు ఈ

మధ్యకాలంలో దొంగల ముఠాతో కలిసి స్కూటర్లు దొంగతనాలు చేసే అవకాశం లేదని గ్రహించారు.

నాగయ్య లాకప్‌డెత్ గురించి అన్ని పత్రికల్లో వచ్చింది. న్యాయపోరాట కమిటీ వాళ్ళు ధర్నాలు, ఆందోళన చేశారు. నాగయ్య మృతికి బాధ్యులైన పోలీసులపై హత్యకేసు నమోదు చేయాలని హక్కుల సంఘం వాళ్ళు డిమాండ్ చేశారు.

నాగయ్య మృతదేహానికి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అతని దేహంపై లాఠీ దెబ్బలను గుర్తించారు. పోలీసులు బూటు కాళ్ళతో తన్నటం వల్ల పక్కటెముకలు విరిగాయని, శరీరంలోపల రక్తస్రావం జరగటంవల్ల నాగయ్య మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు.

నాగయ్యది లాకప్‌డెత్ అని నిర్ధారణ అయింది. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా నాగయ్య మృతికి బాధ్యులైన ఇద్దరు కానిస్టేబుళ్ళు ఎస్.ఐ.పై హత్య కేసు నమోదు చేశారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్ సి.ఐ. ఈ కేసును పరిశోధించి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు అప్పగించారు.

మరో ఏడాది తర్వాత నాగయ్య హత్యకేసు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణకు వచ్చింది. నాగయ్య భార్య, నాగయ్య తల్లిదండ్రులు, అతని యజమాని కోర్టులో సాక్ష్యం చెప్పారు. మరికొందరు సాక్షులు, పోస్టుమార్టం నిర్వహించిన డాక్టర్లు కేసు పరిశోధించిన సి.ఐ. కోర్టులో సాక్ష్యం చెప్పారు.

నిందితులకు జీవిత ఖైదు విధించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించాడు, అన్ని ఆధారాలను, సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత జిల్లా సెషన్స్ జడ్జి ముగ్గురు పోలీసులు నాగయ్యను హత్య చేశారని నిర్ధారించి ముగ్గురు నిందితులకు జీవితఖైదు, తలా అయిదు వేల రూపాయలు జరిమాన విధించారు. ఒకవేళ నిందితులు మొత్తం జరిమానా చెల్లిస్తే అందులోంచి పదివేల రూపాయలను నష్టపరిహారం కింద నాగయ్య భార్య, తల్లిదండ్రులకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

హైకోర్టులో పోలీసులు దాఖలు చేసిన క్రిమినల్ అప్పీలు విచారణకు వచ్చింది. ఇద్దరు హైకోర్టు జడ్జీలతో కూడిన బెంచి ముందు పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసులు తమ పక్షాన నియమించుకున్న న్యాయవాది వాదోపవాదాలు చేశారు. కింది కోర్టు నాగయ్య బంధువులకు చాల తక్కువ నష్టపరిహారం ఇవ్వాలని తీర్పుచెప్పటం పట్ల హైకోర్టు బెంచి అసంతృప్తి వ్యక్తం చేసింది. వెంటనే నిందితుల తరపు న్యాయవాది లేచి, నష్టపరిహారాన్ని పెంచితే తన క్లయింట్లు చెల్లించటానికి సిద్ధంగా వున్నారని తెలిపాడు. నిందితులందరూ ఉద్యోగులైందున వారి శిక్షా కాలాన్ని తగ్గిస్తే కోర్టు సూచించిన నష్టపరిహారాన్ని నేర బాధితులకు చెల్లిస్తారని విన్నవించాడు. ఈ సందర్భంగా చెన్నమ్మ కేసులో మద్రాసు హైకోర్టు తీర్పును ప్రస్తావించాడు.

మరింత నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు చెప్పేముందు నేర బాధితుల మనోగతాలను తెలుసుకునేందుకు హైకోర్టు బెంచి నాగయ్య భార్య, తల్లిదండ్రులను

కోర్టు ముందుకు పిలిపించింది. వారి సమక్షంలో న్యాయమూర్తులు మాట్లాడుతూ నిందితులు చెల్లించే జరిమానాను మూడు లక్షల రూపాయలు విధిస్తామని చెప్పారు. ముందుగా నష్టపరిహారం వద్దని చెప్పినప్పటికీ హైకోర్టు ప్రోద్బలంతో వారు అంగీకరించారు. జైలు శిక్షకు బదులు భారీ జరిమానా విధించాలని హైకోర్టులు తీర్పులిచ్చాయి. చెన్నమ్మ కేసులో ఇలాగే తీర్పు చెప్పారు.

నిందితులైన పోలీసులు ఆవేశంతో విచక్షణారహితంగా కొట్టడం వల్ల నాగయ్య మరణించాడని, యావజ్జీవ జైలు శిక్షను ఆరు నెలలకు తగ్గిస్తూ జరిమానాను మూడు లక్షల రూపాయలకు పెంచుతున్నామని తీర్పు చెప్పారు. ఈ జరిమానాను నిందితులు రెండు వాయిదాల్లో తలా యాభైవేల చొప్పున చెల్లించాక ఆ మొత్తాన్ని నేర బాధితులకు అందజేయాలని తీర్పు చెప్పారు. నేర బాధితులకు చివరికి న్యాయం జరిగింది.

● అదాలత్ కథలు - 2004 ●

# 88. "ఐటి కప్ప"

♦ పులిపాటి గురుస్వామి ♦

అలవాటు ప్రకారంగా క్లినిక్ మూసేముందు డబ్బుల్ని లెక్కపెట్టుకుంటున్నాను

"సార్ లోపలికి రావచ్చా" తొంగిచూస్తూ ఓ కప్ప.

రమ్మని తల ఊపాను లెక్కపెట్టడం ఆపి.

ఏమనుకోకపోతే మీతో మాట్లాడాలని వచ్చాను. చాలా రోజుల్నుంచి అనుకుంటూ వున్నాను. కానీ తీరటంలేదు" అంది కప్ప.

ఏదో ఆరాటంతో వుంది కప్ప. టైం చూస్తే 11గం. దాటింది. కాంపౌండరును, నర్సును పంపించేసి సరే చెప్పమన్నాను.

"ఇబ్బంది పెడుతున్నందుకు క్షమించాలి" అంది ఓరకంట చూస్తూ.

పైగా ఇదొకతంతు - సరే చెప్పమన్నాను.

"మీకు మంచి పేరుండటం వల్ల, మిమ్మల్ని చాలా రోజుల్నించి గమనించి మీ దగ్గరకు వచ్చాను"

మనుషుల్లానే పొగడ్తతో మొదలెట్టింది.

"అసలు విషయం చెప్పు" అన్నను.

"దయచేసి మీరు విసుక్కోవద్దు. నా గాధ మీతో విన్నవిస్తాను. తగిన సలహా ఇవ్వండి" అంది.

ఇక నాకు తప్పేటట్టు లేదు. చాలా తీరిగ్గానే వినదల్చుకొని ప్రారంభించమన్నాను.

"అయ్యా! మీకు తెలియందేముంది - మా కప్పలకు కాలం చెల్లింది. మీరు చూస్తుండగా మీ బాల్యంలో ఏ కుంటలో చూసినా మేమే ఏ కాల్వలో చూసినా మేమే. మీరు వాగుల్లో ఈతలు కొట్టిన కాలం మా బతుకు బంగారం చేపపిల్లల్తో రొయ్యపిల్లల్తో దోస్తీ చేసుకుంట ఆనందంగా గడిపినం వాగులు, వంకలు, నదులు అన్నింటా మేం సకల భోగాలు అనుభవించాం. కాలం అట్లనే కలిసొచ్చింది.

వానలు పడ్డాయి, మా కడుపులు పండాయి.

మనుషుల దురదృష్టమో మరి మాదో - చూస్తుండగానే కాలం ఎట్ల మారిపోయె. ఏండ్లకేండ్లు వానల్లేక బావులు, కుంటలు, చెరువులు, కాల్వలు అన్నీ

ఎండిపాయె. మా కప్పల జాతి "నీళ్ళో రామచంద్రా" అనుకుంటూ ఎక్కడి కప్పలు ఆక్కడ్నే తిప్పలు పడుకుంట పురుగు బుస్సి తిని తినక ఎట్ల కాలం గడుపుతున్నమో దేవునికే ఎరుక.

ఏమీ దొరకని కప్పలు ఎండకు ఎండిపాయె. బండల కింద రాళ్ళ కింద శవాలైపాయె.

అయ్యా! 'ఉభయచరాల' మనే వరం ఒకటుంది కాబట్టి సరిపోయింది కాని, లేకపోతే మా బతుకులు ఇంకా అధ్వాన్నం కాకపోవు? ఏదో గాలి పీల్చుకుంటూ గాల్లో తిరిగే పురుగుల్ని తినుకుంటూ బతికినం.

కొంత కాలం తర్వాత బతుకుమీద ఆశ చావక మా కుటుంబం గెంతుకుంటూ గెంతుకుంటూ హైదరాబాద్‌కు వచ్చిపడ్డం. రాజధాని నగరంలో హుస్సేన్‌సాగర్ మీద కన్నుపడ్డది మాకు. నా ముగ్గురు పిల్లలు, నేను, మా ఆయన కొద్దిరోజులు హుస్సేన్ సాగర్‌లో బాగానే బతికినం నాయనా. కొత్త గదా మంచిగనే అనిపించింది. నెలకాంగనే ఆ మురికినీళ్లల్లో ఉండబుద్ధికాలేదు.

చూస్తుండగానే హుస్సేన్‌సాగర్ చుట్టూ అనేక పార్కులు వెలిశాయి. హోటళ్ళు వెలిశాయి. బోటింగు ఏర్పాటు చేశారు. పిల్లల ఆటలకోసం, పెద్దల సాయంత్రపు విహారాల కోసం అనేక ఏర్పాట్లు చేశారు. విపరీతమైన రద్దీ. అడపాదడపా వీళ్ళ మలినాలన్నీ మా హుస్సేన్ సాగర్‌లో కలుస్తూనే వున్నాయి. తట్టుకోలేకపోయాం.

ఇక పార్కుల్లోకి విహారానికి వచ్చిన మనుషుల ముచ్చట్లు విని, రకరకాల కుతంత్రాలు, యువ దంపతుల మధ్య అపనమ్మకపు యుద్ధాలు విని విని మాకు తిన్నది కూడ అరగకుంట అయ్యింది. బుద్ధున్ని చూసి చూసి మేం బుద్ధి తెచ్చుకున్నాం. ఏట్లైనాసరే ఇక్కడి నుండి పోవాలనుకున్నాం.

ఎట్లా పోవాలె, ఎక్కడికి పోవాలె. ఒక్క వానలేదు. కనీసం మబ్బులేదు. అదనంగా పక్కనున్న సెక్రటేరియట్ కంపు మొత్తం హుస్సేన్‌సాగర్‌లో చేరి రోజుకింత మాకు చావు దగ్గరౌతుంది.

'ఆగు ఆగు 'కప్పాజీ' మధ్యలో ఆపుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. 'ఆ ఆఫీసుల కంపు ఎపుడైనా వుండేదే కదా కొత్తేముంది?' అన్నాను.

లేదు సారూ! ఈ రాష్ట్రంలోని వ్యవహారాల కంపు మొత్తం ఇక్కడే కదా మాట్లాడేది. ఇంతకుముందు డ్రైనేజీల్లోంచే వచ్చేది. ఇప్పుడేమో నేరుగా ఆఫీసుల్లో నుండి చుట్టుపక్కలంతా వ్యాపించిపోతుంది గాల్లో. ఉభయచరాలం కదా! నీట్లో వున్నా అదే. ఒడ్డుకు చేరి బయట కూచున్నా అదే. ఈ మధ్యన ఇంత విపరీతంగా వ్యవహార కాలుష్యం బహిరంగంగా వ్యాపించడం చేత మేం అక్కడ ఉండలేకపోయాం.

ఇట్లా పోదామనుకునే సందిగ్ధంలోనే, కిందటి వినాయకచవితికి నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లలో ఒడ్డుమీద వదిలిన ఓ గణేశుని కింద మా ఆయన నలిగిపోయాడు. ఒడ్డు నుండి విసిరేసిన ఓ గణేశుడు తగిలి ఓ కొడుకు ప్రాణం వదిలాడు. రెండోవాడు లాబరేటరీ డిసెక్షన్ల కోసం కాంట్రాక్టర్ వేసిన వలలో చిక్కి వీర మరణం పొందాడు.

అట్లా నేను పోయినా బాగుండేది నాయినా. మిగిలిన ఆ ఒక్క కొడుకు వల్ల

నాకు అపకీర్తి వచ్చేటట్టుంది అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది. కాసేపటికి తలవిదిలించి 'బెకబెక' అంది. కన్నీళ్ళు రాలిపడ్డాయి.

"డాక్టరుగారూ కొంచెం మంచినీళ్ళు కావాలి" అంది.

ఓ మగ్గులో నీళ్ళు అందించాను. చంగున అందులో దూకింది. 'ఆహా చాలా రోజులైంది శుభ్రమైన నీళ్ళలో తడవక' అంటూ ముసిముసిగా ఆనందపడి నీళ్ళు తాగి– 'అయ్యా! మీకేం తొందరలేదుగా?' అని ప్రశ్నించింది.

నాకు ఓ పక్కన ఒళ్ళు మండుతోంది. సమాధానం చెప్పేలోపునే 'మీ ఓపిక గురించి చాలా విన్నాను. అందుకే నా బాధలు మీకు చెప్పుకోవడానికి సాహసించాను, అంటూ చెంగున నీళ్ళలో నుండి బెంచీ మీదికి ఎగిరి కూచుంది.

అర్ధరాత్రి దాటుతుందన్న చిరాకు కొంచెం వున్నా, నేను 'సరే, అసలు విషయం చెప్పు' అన్నాను ముక్తసరిగా.

'నాయందు దయుంచండి సార్! చెప్పబోతున్నాను' అంది.

అయ్యా మిగిలిన నా కొడుకుతో ఆ మురికి హుస్సేన్‌సాగర్ నుండి బయటపడే అవకాశం కోసం కరెంటు స్తంభాల మొదళ్ళలో ఎదురు చూడగా చూడగా ఓరోజు అవకాశం చిక్కింది.

ఓ దంపతులు ఖరీదైన కారులో వెళ్తూ హుస్సేన్‌సాగర్ చూసి ముగ్ధులై రోడ్డుపక్క కారాపి తమకంతో ఇద్దరూ నడుంమీద చేతులు వేసుకుని అలల మీదుగా వస్తున్న దుర్గంధం కలిసిన చల్లగాలిని సేవించే తరుణంలో కార్ డోర్ వేయడం మరిచారు. అదే అదనుగా నేనూ మా వాడూ అందులో చొరబడిపోయాం.

బంజారాహిల్స్‌లో ఓ పెద్ద భవంతి ముందు చిన్నపాటి గార్డెన్‌లో కారాగింది. కొంచెం తెలివిగా వాళ్ళు దిగేలోపే చెంగున ఎగిరి బయటపడ్డాం. బతికి పోయాం. ఇక మా నివాసం కోసం రాత్రంతా కలియదిరిగాం. ఆ తోట నచ్చింది. అనేక రకాల చెట్లు, పూల మొక్కలు నీటి వసతి కల్గి వున్న ప్రాంతం దొరికిందని సంబరపడ్డాం.

రెండురోజులకు మాకు మరో అవకాశం దొరికింది. మా యజమాని ఇంటిపక్క ఓ పెద్ద ఫైవ్‌స్టార్ హోటలుంది. దాని చెత్త చెదారం పోయే డ్రైనేజీ మా యజమాని కాంపౌండు వాల్ పక్కనుండే వెళ్తూ వుంది. అక్కడక్కడా వున్న రంధ్రాలద్వారా మేం ప్రవేశించాం. మాంచి నివాసం దొరికిందని సంబరపడ్డాం. అది కొంచెం భూమి లోపలికి వుండటం వల్ల మనుషుల కంటపడలేదు. లేకపోతే ఆ రంధ్రాన్ని మూసేవాళ్ళే. ఇక మా జీవితం కొంతసేపు డ్రైనేజీలో – కొంతసేపు తోటలో చెట్లకింద. వెన్నెట్లో పురుగులు – డ్రైనేజీలో జలకాలు – నచ్చినంతసేపు నచ్చిన దగ్గర ఇలా కొంతకాలం సాగింది సార్.

"నాకో చిన్న సందేహం కప్పాజీ! మీరు అసలు విషయం చెప్పడానికి ఇంకెంతసేపు పట్టొచ్చు?" అన్నాను కొంచెం చికాకుతో.

'క్షమించాలి డాక్టర్! విషయం కూలంకషంగా మీకు అర్థమవుతే నాకు సలహా ఇవ్వటానికి మీకేమీ యిబ్బంది వుండదని' తన చమత్కారానికి 'బెకబెక' మనుకుంది తనలో తనే.

ఇక తప్పేట్టులేదు. 'సరే చెప్పు చెప్పు అని' స్టూలు కాళ్ళకిందికి లాక్కుని కాళ్ళు చాపుకున్నాను.

చెంగున ఎగిరి కప్ప నా టేబుల్‌మీదికి వచ్చింది.

'అక్కడే వుండి చెప్పొచ్చుగా' అన్నాను కాస్త కోపంగా.

'ఇది 'రహస్య ఘట్టం' డాక్టరుగారూ! నా కప్పజాతిలో ఎవరైనా వింటే ఇక పుట్టగతులు వుండవు. కనుక ఇలా దగ్గరికి వచ్చి చెప్పాల్సి వస్తుంది.'

'సరే చెప్పండి కప్పాజీ.'

'డాక్టర్! ఈ మధ్య కొంతకాలంగా నా ఆరోగ్యం బాగుండక తోటలోనే వుండి పోతున్నాను. హోటల్ డ్రైనేజీలోకి వెళ్ళడం మానేశాను. ఆ ఆహారం నాకు పడటం లేదు. నా కొడుకు మాత్రం తోటలోకి రావటం తగ్గించి అక్కడే ఎక్కువ కాలం గడపటం ప్రారంభించాడు.

వానికి దోస్తులు ఎక్కువయ్యారు. రోజూ తోటలోకి వచ్చి పడుకునేవాడు. ఈ మధ్య సరిగా రావటంలేదు. ఎపుడో గుర్తొచ్చినప్పుడు వచ్చిపోతున్నాడు. ఒళ్ళు చేశాడు. గొంతు మారింది. అయ్యా! అన్నింటికంటే ఘోరం – మా తరతరాల కప్పల జాతిని కించపరిచే వ్యవహారం, మా పూర్వీకులను అవమానపరిచే, అబ్బురపరిచే విషయమేమిటంటే, నా కొడుకు కప్పకు ఏమయిందో ఏమో ఈ మధ్య 'బెకబెక' మనటం మాని 'ఐటి ఐటి' అంటుండు నాయినా' అని భోరుమని ఏడ్చింది.

నాకేం అర్థం కాలేదు.

'ఐటి ఐటి' ఏంటి?' అన్నాను.

'ఏమో వాయినా! అది తెలిస్తే నీ దగ్గరికెందుకొస్తాను నాయినా' అంది ఏడుస్తూనే.

నేను ఆలోచనల్లో పడ్డాను.

కాసేపు ఏడ్చి ఏడ్చి 'బెకబెక' మని కన్నీళ్ళు రాల్చుకుని – "అయ్యా! నడుస్తూ 'ఐటి ఐటి' అంటుండు, నవ్వుతూ 'ఐటి ఐటి' అంటుండు, ఆడుకుంటూ గెంతుకుంటూ 'ఐటి ఐటి' అంటుండు. 'బెకబెక' మని మరిచిపోయిండు నాయినా! చెపితే విడ్డూరం కాని వాని అపానవాయువు కూడా 'ఐటి ఐటి' అనే వస్తుంది నాయినా!" అని భోరుమంది.

నాకు ఫెళ్ళున నవ్వాగింది కాదు.

చాలాసేపు నవ్వాను. కప్ప ఏడుస్తూంది.

కొంతసేపటికి – "నా బతుకు ఇట్లా నలుగురిలో నవ్వులపాలు చేస్తుండు నాయినా నా కొడుకు. 'ఐటి ఐటి' అని అరుస్తుంటే మా కప్పల పెద్దలు వీనికేదో రోగం తగిలిందని, ఎవరికైనా మంచి డాక్టరుకు చూపమని సలహాలిస్తున్నారు. కొందరేమో వీనికేదో పిచ్చిపట్టిందని లోపల్లోపల గుణుగుతున్నారు.

కన్నతల్లి కడుపు ఊకుంటుందా నాయినా! మా వాన్ని పిలిచి బుజ్జగించి – 'నాయినా మనం కప్పలం. మన జాతి చాలా గొప్పది. మన గురించి సుమతీ

శతకంలో గొప్ప పద్యం రాశారు. మనుషులు మనల్ని చూసి చాలా నేర్చుకున్నారు. మన పూర్వీకులు చాలా గొప్పగా జీవనదుల్లో జీవించారు. మన దరిద్రం కొద్దీ మనం డ్రైనేజీల్లో బతుకున్నాం కానీ మన చరిత్ర తక్కువదేం కాదురా! నీవు మన జాతిమంత్రం "బెక బెక" వదిలి "ఐటి ఐటి" అంటావేం రా!' అని నెమ్మదిగా చెప్పినా పట్టించుకోవటం లేదు నాయినా. గెంతుకుంటూ 'ఐటి ఐటి' అని వంకరగా డ్రైనేజీలోకి పోతూనే వుంది" - అంది.

నాకు కొంత అర్థమయింది కప్పాజీ! ఈమధ్య హోటల్లో ఏమైనా మీటింగులు జరిగాయా? అని ప్రశ్నించాను.

'మీటింగులకేం నాయినా రోజు తప్పించి రోజులాగా జరుగుతూనే వున్నాయి. కొత్తగా కుర్రవాళ్లు తాగి తందనాలాడే పబ్, డిస్కో థెక్‌లు కూడా ప్రారంభించారు. కోడి కూసే రాత్రి దాకా తాగటం, తినటం, ఎగరటం. డ్రైనేజీ నిండా కొత్తకంపు రకరకాలుగా మురిగిమరిగిన మైల. వాటన్నిటిని తట్టుకోలేకనే నాయినా నేను తోటలోనే వుండిపోతున్నాను.

ఇక ఈ మధ్య విదేశాల నుండి మన దేశం నుండి కొత్త కొత్త కంప్యూటర్ చదువులు చదివిన వాళ్ళంతా ఈ హోటల్లోనే వుండటం, ఇక్కడే మీటింగులు, సెమినార్‌లు పెట్టుకుంటున్నారు. ఎప్పుడూ ఏదో పండగొచ్చినట్టు కొత్త బట్టలు, టైలు, సూటకేసులు, బ్యాగ్‌లు ఏమో నాకేం అర్థం కాలేదు సార్ ఆ మనుష్యుల వ్యవహారాలు, పగటిపూట ఇట్లా వుంటుంది - రాత్రిపూట తాగి తాగి, ఆడి, కక్కి, ఏరిగి మా నివాస ప్రాంతాలను కంపు కంపు చేశారు.

ఏవో కొత్తలోకంలోకి తీసుకుపోతున్నారట వాళ్ళంతా. హోటల్ గార్డెన్‌లో ఆ పెద్దమనుషులందరూ మాట్లాడుకుంటుంటే విని, మావాడు "కొత్తలోకం", "కొత్తలోకం" నేను కూడా పోత అంటున్నాడు నాయినా!

అయ్యా! ఇక్కడి గాలి, ఇక్కడి నీరు, ఇక్కడి బతుకులు, బంధాలు వదిలి వాడు నడిమంత్రపు మోసగాళ్ళ మాటలు, వేషాలు నమ్మి ఖరాబయ్యాడు సార్! చెవులారా విందామంటే ఒక్కసారి గూడా వాని నోటివెంట 'బెక బెక' మంటలేదు.

కప్ప ఏడుస్తూ వుంది. నాకు ఏం చేయాలో తోచలేదు. మధ్యరాత్రి దాటింది. ఆకలి, నిద్ర అన్నీ ఎగిరిపోయాయి.

కొడుకు కప్పలో మార్పు తల్లి కప్ప జీర్ణించుకోలేకపోతుంది. కొత్త జీవితం కోసం కొడుకు వెళ్ళిపోవాలనుకోవటం తల్లి కప్పకు మనసంగీకరించటంలేదు.

ఆ 'ఐటి కప్ప'ని చూడాలన్పించింది. మాట్లాడాలన్పించింది. 'కప్పాజీ! రేపోసారి నీ కొడుకును తీసుకురా. అతన్ని పరీక్షించి మాట్లాడి ఏదైనా పరిష్కారం చెప్తానన్నాను.

కప్ప ఆనందంగా ఒక గెంతు గెంతి - 'సార్! చాలా సంతోషం. రేపటిదాకా ఎందుకు బయటవుంచే వచ్చాను. మా వాడ్ని పిలుస్తానంటూ' డోర్ వైపు గెంతింది.

ఇప్పటితో ఆపుదామనుకున్న నాకు వీలుకాలేదు. అంతా ప్లాన్డ్‌గా వచ్చింది కప్ప.

కొడుకును తీసుకుని రానే వచ్చింది.

'ఐటి ఐటి' అంది కొడుకు కప్ప లోపలికి రాగానే.

'వైధవ్యశాలు ఆపు డాక్టరుగారి దగ్గర' తల్లి కప్ప కసిరింది.

'హూయ్‌య్‌య్‌య్‌...' అని విష్ చేస్తూ కొడుకు విచిత్రంగా తలూపాడు.

'హాయ్' అన్నాన్నేను.

'ఐటి ఐటి' అంటూ మరోచోటికి గెంతింది కొడుకు కప్ప.

'ఒక్కచోట ఉండలేవూ' తల్లి కప్ప కసిరింది.

'ఏంటి మాం. ఇదంతా టైం వేస్ట్. ప్రపంచమంతా కంప్యూటర్ లోకంలోకి పోతూ వుంది. ది గ్రేట్ అమెరికా, బిట్రన్, రష్యా ఇలా అనేక దేశాలు పోటీలుపడి కొత్తలోకంలోకి పరుగెడుతున్నాయి.

మన దేశంలో ఇప్పుడిప్పుడే వాళ్ళ తోకలు పట్టుకొని ప్రయాణాలు సాగిస్తూ వున్నారు. నేను కూడా కొత్తలోకంలోకి వెళ్తాను. పాత చింతకాయపచ్చడి, మురికి కుంటలు, కుళ్ళిన చెట్ల మొదళ్ళు, బండరాళ్ళు వదిలి ప్లేవర్డ్ డ్రైనేజీల్లోకి రా. ఇంకా అక్కణ్ణించి ప్రపంచపు వీధుల వెంట విహారం చేద్దాం రా! 'బెక బెక'లు ఇక చాలు పక్కకు పెట్టు. 'ఐటి ఐటి' మన నినాదంగా వూపిరిగా చేసుకోవాలి. నేను అలాగే నడుస్తాను. నీకు ఇష్టమైతే రా. లేదా ఇక్కడే చావు.

అంతేకాని – ఇలాంటి ఓల్డ్ ఐడియాస్ డాక్టర్లతో నాకు నీతి పాఠాలు బోధించడానికి తీసుకురావద్దు.

'ఒరే ఒరే 'బెక బెక' నా పరువు తీస్తున్నావు కదరా! పెద్దాయన్ను బతిమలాడి, క్లినిక్ మూసుకునే సమయంలో ఆపినందుకు కృతజ్ఞతలు చెప్పాల్సింది పోయి అవమానపరుస్తావా? బెక బెక.'

'ఐటి ఐటి' నన్ను ఎందుకు తీసుకువచ్చావో పసిగట్టలేననుకున్నావా! నన్నేదో మార్చటం కోసం కదూ! అది ఎవరివల్లా కాదు. నేను తొందర్లోనే కొత్తలోకానికి చేరుకుంటాను 'ఐటి ఐటి'.

'నిన్ను బంజారాహిల్స్‌కు తీసుకురావటం నా బుద్ధి తక్కువైందిరా. ఈ టోటల్ డ్రైనేజీ నీ జీవితాన్ని బుగ్గిపాలు చేసిందిరా! ఎవడన్నా మంత్రాలు చేసినాడురా! బెక బెక.'

'అవునే 'ఐటి ఐటి'. అమెరికా వాడూ మంత్రం వేసిండు. ఇక ఎవరూ ఏం చేయలేరు – ఈ డాక్టర్లెంత?' అని పకపక నవ్వుకుంటూ, గదిలో ఆగకుండా విచిత్రంగా గెంతడం ప్రారంభించింది.

'చూశారా డాక్టర్‌గారూ! గెంతడంలో కూడా మా జాతి లక్షణాన్ని వదిలి పాశ్చాత్య గెంతడాలు నేర్చుకుంది. ఇంతకంటే మరణం మరొకటేముంటుంది నాయినా, దుఃఖంతో బెకబెక మంది తల్లి కప్ప.

సారీ డాక్టరు గారూ! మీరు మరెవ్వరికైనా నీతి ట్రీట్‌మెంట్ ఇవ్వండి. నాలాంటి ఐటి తరానికి మాత్రం కాదు.

ఐటి తరం చాలా గొప్పది. ప్రపంచాన్నే మార్చేసే తరం మాది. త్వరలో నేను కొత్తలోకం వెళ్ళబోతున్నాను. ఆ తర్వాత తెలుస్తుంది నా తడాఖా. వస్తా. బై పూర్

అన్డ్ ఓల్డ్ మాం. 'ఐటి ఐటి ఐటి' అంటూ నడుచుకుంటూనో, గెంతుకుంటూనో వెళ్ళిపోయింది.

'కప్పాజీ! మీ వాడికి చాలా రోగం ముదిరినాక తీసుకువచ్చారు' అన్నాను. ఇక నేనేం చెప్పగలను?

'సారీ డాక్టరు గారు మళ్ళెప్పుడైనా కొత్త బాధ కల్గితే చెప్పుకోపడానికి వస్తా. దయుంచండి బెక బెక' అంటూ బయటకు గెంతింది.

ఇక క్లినిక్‌లోనే కాళ్లు జాపి కళ్లు మూసుకున్నాను.

కలలు - ఐటి ... క ... ల ... లు.

● వార్త - 5 జనవరి, 2004 ●

# 89. చర్చల కథలు

♦ సి.హెచ్. మధు ♦

'గొ'ల్లపల్లి' లో కనకయ్యకు పాలు పోవటం లేదు. రాత్రి తొమ్మిది దాటింది.
ఎ మెతుకులు నోట్లో వేసుకొని 'భోజనం' చాలని లేచాడు. ఆయనకు ఏమీ
ా కావటం లేదు. చర్చల సారాంశం తెలియటంలేదు. ఏమవుతుందో ఎటు
ు ఎటు తిరుగుతుందోనని భయంగా ఉంది.
గుడ్డి దీపం వెలుగులో భార్యను పిల్చి అన్నాడు "ఎందుకైనా మంచిది ఒక
ంలో కొన్ని అటుకులు, బట్టలు వేసి ఉంచు."
భార్యకు అర్థమయ్యింది.
చర్చలు ఫెయిలయితే వూరు విడిచి పారిపోవటానికి సన్నాహాలు.
కనకయ్య భార్యకు తెల్సు. తన భర్తకు అన్నలతో ఏ సంబంధం లేదని -
ఇసు ఇన్‌ఫార్మర్ కాదని. అయినా దెబ్బ దెబ్బే. ఎటునుండి దెబ్బతగిలినా
లొచ్చు ఆ వూరూ అలాంటిది.
గొల్లపల్లి చిన్న వూరు. వంద దాటని కడప. మూడు వందలు దాటని జనాభా.
ఎట్ తీగెలింకా రాలేదు. రోడ్డు లేదు. ఫోన్ లేదు. టి.వి. లేదు. చిన్న బడి
న్ని లేనట్టే లెక్క. ఎప్పటికీ తాళమే. ఆసుపత్రి ఛాయలు కూడా ఆ వూరులో
ా. ఆధునిక యుగంలో స్వాతంత్ర్య భారతదేశంలో ఇటువంటి వూరు వుందంటే
రూ నమ్మరు.
"ఇటువంటి వూళ్ళు ఉన్నాయి కనుకే నక్సలైట్లున్నారు. నక్సలైట్లు వున్నందునే
ంవంటి వూళ్ళు అభివృద్ధి చేయలేకపోయామని" ప్రభుత్వం అంటుంది.
టువంటి వూళ్లు ఉన్నాయి కనుకే మేమున్నాం ఆయుధాలు ధరించాం" అని
క్సలైట్లు అంటారు. ఈ చర్చ మనకెందుకూ ఈ కథలో 'చర్చ ఎందుకూ'
ంచేవారికి విడిచిపెడుదాం!
గొల్లపల్లి చుట్టూ గుట్టలు. గుట్టలే కాదు. దట్టమైన అడవి వుంది. ఆ వూరు
క్సలైట్ల ప్రాంతమని పోలీసులంటుంటారు. కానీ ఆ మాటను ప్రజలు
ంగీకరించరు. అయితే ఒకటి నిజం. అడవి దగ్గరగా వున్నందున ఆ వూరుకు
క్సలైట్లు వస్తుంటారు. నక్సలైట్లు వస్తున్నారని పోలీసులు వస్తుంటారు. ఇద్దరు
పటం ఆ వూరు ప్రజలకు ఇష్టంలేదు. పోలీసులు, నక్సలైట్ల మూలంగా ఆ పల్లె

ఘోర నరకాన్ని అనుభవించింది. గత ఆరు సంవత్సరాలుగా ఆ వూరులో ఒక్క మగ పురుగు కనిపించదు. ఎక్కడికో పారిపోయారు. ఆ వూరులో ఇంచుమించు అన్ని కుటుంబాలు అటు పోలీసుల బెదిరింపులకు, నక్సలైట్ల బెదిరింపులకు దెబ్బతిన్న కుటుంబాలే. "నక్సలైట్లు వచ్చారా" అని పోలీసులు, "పోలీసులు వచ్చి ఏం చేస్తారని" నక్సలైట్లు ఆ వూరి ప్రజలను వేధించారు, బెదిరించారు. రెండు తుపాకీల మధ్య ఆ పల్లె శ్మశానంగా తయ్యారయింది. ఈ ఆరు సంవత్సరాలుగా మగవారు గొల్లపల్లి విడిచి పారిపోయారు. అంత భయం.

ప్రభుత్వం– నక్సలైట్ల మధ్య చర్చల వాతావరణం ప్రారంభం కాగానే ఆ వూరులో కొంత మార్పు వచ్చింది. శాంతియుత వాతావరణం మొదలైంది గత నాలుగు నెలలుగా నక్సలైట్లు పోలీసులు ఎవరూ రావటం లేదు. బెదిరింపులు లేవు. తుపాకీ శబ్దాలు లేవు. గొల్లపల్లి ప్రశాంతంగా వుంది.

వాతావరణం ప్రశాంతంగా వుందని మూడు సంవత్సరాల క్రితం ఇల్లు వూరు వదలి పోయిన కనకయ్య మూడు నెలల క్రితం ఇంటికొచ్చాడు. "చర్చలు ఏమవుతాయోనని అందరిలాగా ఆయనకు భయం." చర్చలు ఫెయిలయితే మళ్ళీ గ్రామం శ్మశానంగా తయారవుతుంది. చర్చలు ఫేలైతే మళ్ళీ పారిపోవాల్సి వుంటుంది. అందుకే కనకయ్య భయం సన్నాహాలు.

నిజానికి కనకయ్యకు ఎవరితో సంబంధం లేదు. ఇల్లు, పని తప్ప వేరు తెలియదు. కమ్యూనిజం తెలియదు. రాజ్యాంగం తెలియదు. తెలియకున్నా వేధింపులు తప్పవు. రకరకాల కారణలతో ఆ వూరి ప్రజలను అటు పోలీసులు, ఇటు నక్సలైట్లు వేధిస్తుంటారు. బాధపెడుతుంటారు. 'అన్నం పెట్టమని' నక్సలైట్లు తుపాకీతో బెదిరిస్తే 'ఎందుకు పెట్టావని' పోలీసులు తుపాకీతో బెదిరిస్తారు ఇదీ వాతావరణం ఇదంతా తమకోసమేనని వాళ్ళు అనటం కనకయ్య వినటం చాలాసార్లు జరిగింది ఆ లోతుల్లోకి కనకయ్య వెళ్ళలేదు. ఈ బాధ తప్పితే చాలు తమ బతుకు తాము బతికితే చాలు.

ఎవరు తమను బతికించాల్సిన అవసరం లేదు. ఎవరు తమను రక్షించాల్సిన అవసరం లేదు. ఇది ఆయన ఆలోచన.

ఇది కనకయ్య ఒక్కడి బాధే కాదు. ఆ వూరులో అందరి బాధ. ఆ వూరు లాంటి వందల వూళ్ళ ప్రజల బాధ. అందుకే చర్చల సారాంశం కొరకు కనకయ్య నిద్ర పోకుండా చూస్తున్నాడు.

తండ్రి కనకయ్య బాధ, భయాన్ని చూసి స్కూల్ సెలవుల్లో ఇంటికొచ్చిన కొడుకు కొంచెం విసుక్కున్నాడు. 'ఇదేం భయం, ఇంత భయమెందుకూ?" అనుకున్నాడు ఐదు సంవత్సరాలుగా పట్నంలో చదువుతున్నాడు. కనుక పల్లె భయం వాడికి అర్థం కాలేదు.

పది గంటల రాత్రి అయినా నిద్ర పోకుండా బీడీ కాలుస్తున్న తండ్రిని చూచి కొడుకు అన్నాడు. "ఎందుకు భయం నాన్నా! మనకు నక్సలైట్లతో సంబంధం లేదుగా" అన్నాడు.

"లేకున్నా బెదిరిస్తారు" తాపీగా అన్నాడు.

"నాన్నా పోలీసులతో మనకు సంబంధంలేదు. పేచీ లేదు. వాళ్ళ మనుషులం కాదు. మననెందుకు బెదిరిస్తారు?"

"బెదిరిస్తారు, కొడతారు, తంతారు" విసుగ్గా అన్నాడు తండ్రి.

పదవ తరగతి చదువుతున్న కొడుకుకు ఏమీ అర్థం కాలేదు. తండ్రి భయానికి కారణం కనిపించలేదు. అరిచినట్టుగా అన్నాడు.

"మనం ఎందుకు భయపడాలి? తప్పు చేయనపుడు భయమెందుకూ? ఎదిరిద్దాం."

కొడుకు ఆవేశాన్ని చూచి తండ్రి చల్లబడలేదు. ఈ విషయంలో "ఆవేశం" ఎంత ప్రమాదమో ఆయనకు తెల్సు. అయినా కొడుకు చెంపచెళ్ళు మనిపించాడు కనకయ్య. షాక్ తిన్నాడు కొడుకు.

"అటూ ఇటూ వాళ్లిద్దరి వద్ద తుపాకులున్నాయి. మన దగ్గర ఏమీ లేవు. ఎదిరిస్తాడట. ఎదిరిస్తాడు" బీడీ కాలుస్తూ నెమ్మదిగా అన్నాడు కనకయ్య.

## భూమెందుకూ?

"ప్రభుత్వం-నక్సలైట్ల" మధ్య చర్చలు జరుగుతున్నాయిగా భూమి పంచుతారట. భూమిలేని వాళ్ళకు భూమి వస్తుంది. ఇంకేం!" అన్నాడు టీ తాగుతూ రామయ్య.

ఉదయం ఎనిమిది గంటల సమయం. ఎండ ముఖం మీద పడుతూ ఉంది. 'గురజాడ పల్లె' అనే పల్లెలో ఒక చిన్న టీ షాప్ ముందు పదిమంది కూర్చుని మాట్లాడు కొంటున్నారు.

గురజాడ పల్లె ఒక చిన్న వూరు. రెండు వందలు దాటని ఇల్లు. నాల్గు వందలు దాటని జనం. వూరుచుట్టూ పొలాలు, చెరువులు, వాగులు. ఈ మధ్య చెరువులలో, వాగులలో నీళ్ళు వుండటం లేదు. వర్షాలు లేవు. కరువు పరిస్థితులు అన్ని వూళ్ళలాగే. అక్కడ మెజారిటీ రైతులు ఒక్క పూట కూడా కడుపునిండా తినటం లేదు. రైతు చుట్టూ అప్పులు నెలక్రితం. ఒక రైతు అప్పుల బాధ పడలేక ఆత్మహత్య చేసుకొన్నాడు. వూరు చుట్టూ పొలాలన్నీ పేరేకాని సగం సాగుకు నోచుకోవటం లేదు.

గురజాడ పల్లెలో రెండు టీ కొట్టులున్నాయి. రామయ్య టీ తాగుతున్న టీ కొట్టు వూరు మధ్యలో ఉంటుంది. ఉదయం లేవగానే పదిమంది అక్కడ చేరి టీ తాగుతూ మాట్లాడుకోవడం అలవాటు. ఇంటి విషయాలు, వూరు విషయాలు, రాజకీయాలు అన్నీ వారి మాటల్లో చోటు చేసుకొంటాయి. తెల్సి కొంత, తెలియక కొంత తమకు తోచింది మాట్లాడుకొంటారు. అందులో భాగంగానే రామయ్య చర్చల గూర్చి ఆ మాట అన్నాడు.

రామయ్య ఆ మాట అనగానే అక్కడే టీ తాగుతున్న భూమయ్య అన్నాడు. ఎదురుగా వున్న నర్సింలును చూస్తూ "ఇంకేం భూమి పంచితే మన నర్సింలుకు రెండు ఎకరాలో, మూడు ఎకరాలో వస్తుంది" అన్నాడు. రామయ్యకు భూమి ఉంది. భూమయ్యకు భూమి ఉంది. నర్సింలుకు లేదు. వెంటనే నర్సింలు అన్నాడు.

"ఎందుకు భూమి నాకు? మీలాగా అప్పులపాలు కావటానికా? ఆత్మహత్య చేసుకోవటానికా?"

## హాయు పాత్రైనపుడు

ప్రభుత్వానికి, మావోయిస్టు పార్టీకి 'చర్చలు' ప్రారంభం కాగానే 'వాతావరణం ఎటో వుందని ఇదే సమయంలో అనుకూలంగా పాచిక విసరాలని ఎం.ఎల్.ఎ. రమణారెడ్డి వీరేశలింగం పేట సర్పంచు ఇంటికి ఒకరాత్రి వెళ్ళాడు. సర్పంచు పేరు దినేశ్‌రెడ్డి. చెప్పా పెట్టకుండా వచ్చిన ఎం.ఎల్.ఏ. రమణారెడ్డిని చూచి ఆశ్చర్యపోయాడు. రాత్రి పది గంటలు దాటింది. వీరేశలింగం పేట వూరు మొదట్లో ఉన్న సర్పంచు దినేశ్‌రెడ్డి ఇల్లు విద్యుత్ దీపాలతో కళకళలాడుతూ ఉంది. పెద్ద భవంతి అది. వీరేశలింగంపేట రమణారెడ్డి ఎం.ఎల్.ఏ పరిధిలోకి వస్తుంది. ఆయన పరిధిలో ఆ వూరు అతి పెద్ద గ్రామం. ఆయన ఇపుడు సర్పంచు. కానీ అంతకు ముందు ఆ వూరు దొర. తరతరాల భూస్వామ్య దొరతనం వారిది.

ఎం.ఎల్.ఏ. రమణారెడ్డి సర్పంచు దినేశ్‌రెడ్డి ఒకే పార్టీవాళ్ళు. ముఖ్యంగా అధికార పార్టీ వాళ్ళు. ఈ రెండూ కొంచెం దూరం బంధానికి సంబంధానికి గుర్తు కావచ్చు. కానీ – ఒక మాటలో వాళ్ళు ఆత్మీయులు. ప్రభుత్వ సొమ్మును పంచుకోవటంలో ప్రజల కష్టాన్ని జేబులో నింపుకోవటంలో ఎప్పుడూ పోటీ పడరు. కల్సి పంచుకొంటారు. కల్సి ఏదైనా అనుభవిస్తారు. కల్సితింటారు.

ప్రభుత్వం నక్సలైట్ల చర్చల సరళి చూచి భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని కల్సి పంచుకోవాలని, కల్సి అనుభవించాలని ఎం.ఎల్.ఏ. రమణారెడ్డి సర్పంచు దినేశ్‌రెడ్డి ఇంటికొచ్చాడు.

రాత్రి పదిగంటలు సమయాన 'టీ'లు ఏం బాగుంటాయి. రాజకీయ నాయకులకు! దినేశ్‌రెడ్డి ఫ్రీజ్‌నుండి ఫారెన్ విస్కీ బాటిల్, ఐస్ ముక్కలు మినరల్ వాటర్ బాటిల్ తీసి టేబుల్‌పైన పెట్టాడు. గదినిండా మెర్క్యూరీ బల్బుల వెలుగు. టి.వి.లో స్లోపైజన్ సంగీతం.

తాను వచ్చిన పని ప్రారంభించాడు ఎం.ఎల్.ఏ. "దినేశ్! ఈ వూరు సర్పంచువి నీవు. పెద్ద ధనవంతుడివి, నాకు తోడూ, నీడవు నీవు. ఈ వూరు చుట్టుపక్కల ఈ ప్రాంతంలో చెరుకు బాగా పండుతుంది."

విస్కీ గొంతులో పోసుకొని సిగరెట్టు అంటించి మళ్లీ ప్రారంభించాడు.

"మనం ఇద్దరమూ కల్సి ఈ ప్రాంతం రైతుల కొరకు ఈ వూరు పక్కనున్న భూములలో పెద్ద షుగర్ ఫ్యాక్టరీ నిర్మిద్దాం."

ఆశ్చర్యపోయాడు దినేశ్‌రెడ్డి. ఎం.ఎల్.ఏకు ఎదురు మాట్లాడినా, ప్రశ్నించినా కోపమే. నిశ్శబ్దంగా వూరుకున్నాడు.

"నీది సగం వాటా, నాది సగం వాటా."

కృతజ్ఞతగా ఎం.ఎల్.ఏ. వంక చూచాడు దినేశ్‌రెడ్డి.

"దినేశ్! ప్రభుత్వానికి నక్సలైట్లకి మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. చర్చల ప్రభావం ఎలా వుంటుందో ఇప్పుడే చెప్పలేం కానీ మిగులు భూమి పంపకం జరిగిపోతుంది ఇది ఖాయం."

"ప్రభుత్వం– నక్సలైట్ల మధ్య మిగులు భూమి గూర్చి ఓ ఒప్పందం కుదిరిన తర్వాత ఇది సాధ్యం కాదు. మనకు భూమి మిగలదు. మీ వూరు చుట్టుపక్కల వందల ఎకరాలు ప్రభుత్వ భూములున్నాయి. ఒకే ప్రాంతంలో రెండు వందల ఎకరాలు మనం పెట్టబోయే షుగర్ ఫ్యాక్టరీ కొరకు అతి తక్కువ మామూలు ధరకు పంచాయితీలో తీర్మానం చేయించు. ప్రభుత్వం మనదే కనుక ఆమోదముద్ర వేయిస్తాను. భూమి రెండు వందల ఎకరాలు మనదవుతుంది.

"రేపు పొద్దున్న భవిష్యత్తులో నక్సలైట్లు" సర్పంచు సందేహం వ్యక్తీకరించాడు.

"మిగులు భూములు పంచుతారు. ఒకరి పేరుతో రిజిస్ట్రేషన్ అయిన భూమి ఎలా పంచుతారు? ఆస్తి హక్కు రాజ్యాంగ బద్ధం మన దేశంలో."

# ఆయుధం

శ్రీశ్రీ పల్లెలో 'సిరిసిరిమువ్వల చిన్నలచ్మవ్వ' చిన్నబోయి కూర్చుంది. ఆమెకు భయంగా ఉంది, ఆందోళనగా ఉంది. రాత్రి పదకొండు గంటలు. నిద్ర రాక ఇంటిముందు అరుగుమీదికొచ్చి ఒక్కతే కూర్చుంది.

శ్రీశ్రీ పల్లె నిశ్శబ్దంగా ఉంది. అక్కడక్కడా కుక్కలు అరుస్తున్నాయి. వీధిలైట్లు వెలగటం లేదు. గ్రామం చీకట్లో ఉంది. అందరూ నిద్రపోయినట్లున్నారు. నిద్రపోయారని కచ్చితంగా చెప్పలేం. అరగంట క్రితం బాగా తాగిన జనం వీధుల్లో అరవటం, అల్లరి చేసుకోవటం జరిగింది. ఇది ఆ వూరుకు మామూలే!

"సిరిసిరి మువ్వల చిన్నలచ్మవ్వ' వయస్సు నలుపది దాటదు. అయితే ఆమె ఆకర్షణీయమైన అందమైన ముఖం ముప్పది దాటనట్టుగా కనిపిస్తుంది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. మగడు దుబాయ్‌లో వుంటున్నాడు. ఆమె కొంత రాజకీయ పరిజ్ఞానం గల వ్యక్తి. చాలా ధైర్యం గల వ్యక్తి. కొంతకాలం ఆమె ఆ వూరుకు సర్పంచుగా పనిచేశారు.

ప్రభుత్వం – నక్సలైట్ల మధ్య చర్చల వాతావరణం ప్రారంభమయిన తర్వాత శ్రీశ్రీ పల్లెలో వచ్చినమార్పు సిరిసిరి మువ్వల చిన్నలచ్మవ్వలో ఎంతో భయాన్ని కల్పించింది. ఎంతో ఆందోళనకు గురిచేసింది. చర్చల వాతావరణం ప్రారంభం కాగానే ఐదు సంవత్సరాల నుండి వూరిలో కనిపించనివారు, వూరునుండి పారిపోయినవారు కనిపించడం ప్రారంభించారు. జులాయిగా తిరిగే రౌడీలు, పోలీసు మనుషులుగా పడినవారు, మిలిటెంట్లగా చెప్పుకొని గ్రామ ప్రజలను వేధించినవారు, పాత నక్సలైట్లు వీధుల్లో కనిపించసాగారు. కనిపించటం కాదు విర్రవీగి తిరుగుతున్నారు. మళ్ళీ ప్రజలను బెదిరిస్తున్నారు.

ఇటువంటి వారి బాధ పడలేకే సర్పంచు పదవికి ఆనాడు రాజీనామా చేసింది. తనను పోలీసు ఇన్‌ఫార్మర్లు వేధించారు. మిలిటెంట్లు వేధించారు. అర్ధరాత్రి వచ్చి

తలుపులు కొట్టేవారు. డబ్బులిమ్మని బెదిరించేవారు. రాత్రి తలుపులు కొట్టి ఇంట్లోనే పడుకుంటామనేవారు. కొందరైతే తనతో పడుకొమ్మని లేకపోతే పోలీసులతో చెప్పి అరెస్టు చేపిస్తామని అన్నలతో చెప్పి కాళ్ళు, చేతులు విరగ్గొట్టిపిస్తామని బెదిరించేవారు.

ఐదు సంవత్సరాలుగా వాతావరణంలో మార్పు వచ్చింది. అటూ ఇటూ వచ్చిన ఒత్తిడి మూలంగా శ్రీశ్రీ పల్లెలో ఇన్‌ఫార్మర్లు, గుండాలు మిలిటెంట్లు ఎక్కడికో పారిపోయారు.

చర్చల వాతావరణం రాగానే మళ్ళీ కనిపించసాగారు.

శ్రీశ్రీ పల్లె అడవికి దగ్గరగా వున్న ఒక పల్లె. అన్నల పల్లె అని పోలీసులంటారు. అన్నల పేరుతో ప్రజలను వేధిస్తున్నారని కొందరంటుంటారు. నిజమేమిటో కానీ అటూ ఇటూ మద్దతు వున్న వారు ప్రజలను వేధించుకతిన్న మాట నిజం.

ఆ వాతావరణం మళ్లీ వచ్చిందని, పోలీసుకు సంబంధించిన వారు, లేదా మిలిటెంట్లు, మాజీ నక్సలైట్లు, రౌడీలు మళ్ళీ తనను వేధిస్తారని "సిరిసిరి మువ్వ చిన్న లచ్మవ్వ' బాధపడసాగింది. ఏమి చేయాలా అని ఆలోచించసాగింది.

ఆ రాత్రి ఆలోచించగా ఆలోచించగా గబుక్కున ఒక ఆలోచన వచ్చింది. ప్రభుత్వం ఎంత చెప్పినా నక్సలైట్లు ఆయుధాలు వదలటంలేదెందుకూ?

ఆయుధంలో అంత బలముందా? ఆయుధం చుట్టూ ఆమె ఆలోచనలు పరిభ్రమించాయి.

తనకు తుపాకీ వుంటే బాగున్ను! తుపాకీ చుట్టూ ఆమె ఆలోచనలు పరిభ్రమించాయి. తుపాకీ దొరకదు. ఎలా? ఈ మిలిటెంట్లనుండి, మాజీ నక్సలైట్లనుండి, పోలీసుల అండ ఉన్న రౌడీలనుండి బతకాలంటే ఆమె ఆ రాత్రి అరుగుమీదినుండి ఇంటిలోనికి నడిచింది. ఇంట్లో ఒక గోడమీద దాచిన 'వేట కొడవలి'ని తీసి ఆ రాత్రి బాగా నూరసాగింది.

'ఈ వేట కొడవలి చాలు ఎవరు వచ్చినా నరకటానికి' అనుకుంది.

● వార్త ఆదివారం - 5 డిసెంబర్, 2004 ●

# 90. నిత్యగాయాల నది

♦ బెజ్జారపు రవీందర్ ♦

సాయంకాలమది. చీకట్లు ముసురుకుంటున్నాయి. ఆకాశపు కాషాయ వస్త్రం మాసిపోతోంది. నింగి బ్లాటింగ్ పేపర్‌పైన జరజరా పాకుతూ వస్తున్న నల్లటి సిరాలా ఉంది చీకటి.

ఏ రిక్రియేషన్‌లేని కిక్కిరిసిన చిన్నపట్టణాల్లో రేల్వే స్టేషనే గొప్ప రిలాక్సింగ్ పాయింట్! చాలా సాయంకాలాలు చీకటిపడ్డాక మా పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఒంటరి సిమెంట్ బెంచీపై కూర్చుంటాను. అల్లసాని పెద్దన వర్ణించిన అందమైన సాయంత్రాల్ని ఆస్వాదించేది ఇక్కడే. ఏకాంతంలో గొప్ప సమూహాన్ని, జాతరలాంటి జనం మధ్య ఏకాంతాన్ని అనుభూతి చెందేది ఇక్కడే!

కాని గత కొద్ది రోజులుగా నా సమస్త ఆలోచనల్ని ఆక్రమించుకుంటోందామె. దాదాపు ప్రతిరోజు వస్తోంది. నాలాగే ఒంటరిగా, దూరంగా కూర్చుంటుంది.

ఆమెపట్ల పట్టరాని కుతూహలం, ఆకర్షణ ఏర్పడ్డాయి నాలో. రోజుకొకరకంగా కనిపిస్తుంది. ఒక్కోసారి ఆమె వేల సంవత్సరాల అనుభవంతో పండిన వృద్ధురాలిలాగా అనిపిస్తుంది. మరోసారి ముసలితనపు జాడలేని నూత్న జవ్వనిలాగా కనిపిస్తుంది. అసలు ఎవరీమె?

ఆమెలో ఎన్ని గ్వందాలున్నా, వైరుధ్యాలున్నా ఆమెలో గొప్ప ఆకర్షణ ఉంది. అదిమాత్రం నిజం. ఎన్నో ఏళ్ళ పరిచయం. ఆత్మీయత మామధ్య ఉన్నట్లు అనుభూతి చెందుతాను. ఆమెను చూసినప్పుడల్లా తొలకరి స్పర్శకు మురిసిన మట్టి తొలి పరిమళం నన్ను అలుముకుంటుంది.

ఆసక్తిని చంపుకోలేక, ఒకరోజు ఆమె కూర్చున్నచోటుకు వెళ్ళాను. నా ఉనికి గమనించి తల పైకెత్తి ఏమిటన్నట్లు చూసింది.

"మీరెవరో తెలుసుకోవచ్చా?" అంటూ వినయంగా అడిగాను.

"నేనా...?" అంటూ నవ్వింది. అంతలోనే ఆమె ముఖం గంభీరంగా మారిపోయింది.

"నువ్వు నన్ను పోల్చుకోలేవు. నేను నిత్యం కుబుసం విడిచే మహాసర్పాన్ని. నేను అంటార్కిటికా ఖండాన్ని కాదు. ఆర్రుతువుల అందమైన భూమిని. నడినెత్తిన సూరీడున్న నిత్య మధ్యాహ్నాన్ని!" అంటూ దాదాపు అరుస్తున్నట్లు చెప్పింది.

ఆమె కంఠంలోని తీవ్రతకు వణికిపోయాను. తిరిగి తన వాక్ప్రవాహాన్ని ఇలా కొనసాగించింది.

"....పదితలల మనిషిన్నేను. రావణున్ని కాదు. రావణుడు నా ముఖాల్లో ఒక ముఖం మాత్రమే. అడవులకు నెత్తురు పులిమిన సమ్మక్క సారమ్మలను. చారెడు భూమికోసం పోరు సలిపి గెలిచిన చాకలి అయిలమ్మను. సాంస్కృతిక శిలాజాల్లోంచి దేవుళ్ళను వడగట్టిన కోశాంబిని. అలాగనీ ఎధీస్ట్‌ను కాను. వేదాల్ని ఆరాధించే దాశరథి రంగాచార్యను. జోడేఘాట్‌లో నిద్రిస్తున్న కొమురం భీమును. తెగిన అవయవాల్ని తిరిగి అతికించుకున్న శంబూకుడ్ని. పెదబొంకూరులో బయటపడిన కుండ పెంకుని. మరీ నన్ను రాతియుగం మనిషిననుకునేవు. నేను..చిప్స్ స్పందనల కంప్యూటర్‌ని... అయితే మిత్రమా, నా ఆధార ముఖం మాత్రం నాకే తెలియదు. అది వట్టి బ్లాంక్ ముఖం. అలాగనీ ప్రతిదృశ్యాన్నీ ప్రతిబింబించే ప్లెయిన్ అద్దం కాదు. అది వట్టి బ్లాంక్.. అంతే!" ఆయాసపడుతూ ఆగిందామె.

ఆమె మెటఫర్‌లకు కొట్టుకుపోతూ అస్తిత్వాన్ని మరిచిపోయి వింటున్న నాకు తెరిపి దొరికినట్లయింది.

ఆమెవైపు పరీక్షగా చూశాను. పదితలలు లేవు! చిన్న కళ్ళు, నల్లటి ముఖం... జిమ్‌లలో కాకుండా కాయకష్టంతో గట్టిపడ్డ పొందికైన శరీరం.. అంతకుమించి చెప్పుకోదగిన విశేషమేమి లేదు. కాని ఆ చిన్నకళ్ళలో మహాస్వప్నాలున్నట్లనిపించాయి.

"అది సరేగానీ, నీ సంగతేంటి?" తిరిగి ప్రశ్నించిందామె.

నవ్వొచ్చింది.

"నాలో అంతమంది లేరు. నా పేరు రవి. నాలో నేను మాత్రమే ఉన్నాను" అంటూ నవ్వాను.

నా నవ్వును చూసి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిందామె.

"ఛీ... ఒక్క నువ్వేనా? ఏకవచనం గాళ్ళంటే నాకు అసహ్యం" అందామె ఛీత్కారంగా.

నవ్వు నా ముఖం నుండి ఆవిరైపోయింది. ఆమె దురుసు మాటలకు నొచ్చుకున్నాను. కాని ఆమె మాటల్లో ఏదో అవ్యక్త ఆకర్షణ ఉంది. డెప్త్ ఉంది. ఇంత మాటపడి కూడా ఆమె వివరాలు తెలుసుకోలేకపోయాను.

★ ★ ★

ఆమె కనిపించిన ప్రతిసారి ఆమెనే పరిశీలిస్తూ ఉండడం అలవాటయ్యింది. ఆమె రాని రోజు వెలితిగా అనిపించేది.

చాలాసార్లు ఏదో ఒక పుస్తకం చదువుతూ కూర్చునేది. లేదా ఎవరో ఆప్తుల కోసం ఎదురు చూస్తున్నట్లు ప్లాట్‌ఫాంపై ఆత్రుతగా అటూ ఇటూ తిరిగేది. కాని ఆమె ఎన్నడూ ఎవరితో మాట్లాడగా చూడలేదు.

అసలు రైల్వే స్టేషన్‌లోని జనం ఆమె ముందునుండి వెళుతూ కూడా ఆమెను గమనించకుండానే వెళ్ళిపోయేవారు. ఒక్కోసారి అనుమానం వేసేది. బహుశా ఆమె నా ఒక్కడికే కనిపిస్తుందేమో అని!

★ ★ ★

ఒకరోజు ఓ వింత దృశ్యం నన్నాకర్షించింది. ఒక్కో చేత్తో ఒక్కో పుస్తకం పట్టుకుని ఏక కాలంలో రెండింటిని చదువుతూ ఆమె కనిపించింది. తెగ ఆశ్చర్యపోయాను. ధైర్యం చేసి మెల్లగా ఆమెను సమీపించాను.

"రెండు పుస్తకాల్ని ఒకేసారి చదువుతున్నట్లున్నారే?" అంటూ జోక్ చేశాను.

కాని ఆమె నవ్వలేదు. నావైపు సీరియస్‌గా చూసింది.

"అవును. నాకు బైనరీ విజన్ ఉంది. రెండు పుస్తకాల్ని ఏకకాలంలో చదవగలను.. ఒక్కో కంటితో ఒక్కో పుస్తకం!" అంది.

తమాషాకు అలా అంటుందేమో అనుకున్నాను. కాని ఎప్పటిలాగే ఆమె ముఖంలో నిజాయితీతో కూడిన గాంభీర్యం కనిపించింది. అనాదికాలం నాటి దండకారణ్యంలోని ఋషులు, రాక్షసుల ఆత్మలు నా చుట్టూ నృత్యం చేస్తున్నట్లనిపించింది. ఆ వాతావరణం భయం వేసింది. ఎందుకో చెప్పలేనుగానీ, అకస్మాత్తుగా ఆమె పోతపోసిన మా ఊరిలా అనిపించింది. ఈ భావన రాగానే ఆమె పట్ల అవ్యాజ్యమైన ప్రేమ కలిగింది.

ఎవరీమె? నాకన్నా చిన్నదా, పెద్దదా...నా స్నేహితురాలా, బంధువా? ప్రేయసా, తల్లా?..ఇవేవి కాదు అనుకున్నాను. బహుశా అన్నీ కలిపితే ఈమేనేమో!

"ఏమిటా పుస్తకాలు?" అంటూ అడిగాను. రగు చేపములు గుండిక్కాయల దిగేసినట్లు ఏదో మాట అంటుందని...వినడానికి మానసికంగా సిద్ధమయ్యాను.

కాని నా ప్రశ్న ఆమెకు చిరాకును కలిగించలేదు. పైగా నచ్చినట్లుంది. ప్రశాంతమైన స్వరంతో జవాబిచ్చింది.

"ఈ పుస్తకాలా?.. ఒకటి దాస్ కాపిటల్.. రెండోది పోతన భాగవతం!" అందామె.

వాటి పేర్లు చెపుతున్నపుడు ఆమె గొంతులోని తన్మయత్వాన్ని గమనించాను.

నా ఆశ్చర్యానికి అంతేలేదు. ఆమెకు బైనరీ విజన్ ఉంటే ఉండొచ్చుగాక. ఏకకాలంలో రెండు పుస్తకాల్ని చదివే సామర్థ్యం ఉందనీ.. కాని పొంతనలేని మార్క్స్‌ను, పోతనను ఎలా చదువగలుగుతోంది?

నా ఆశ్చర్యాన్ని, సందిగ్ధాల్ని పట్టించుకోకుండా..

"ఇవి కావాలా నీకు..? చదువుతావా?..." అంటూ అడిగింది.

నేను సమాధానం ఇవ్వకముందే నా చేతుల్లో దాస్ కాపిటల్ పడేసి చక్కా వెళ్ళిపోయింది.

నేనూ దాస్ కాపిటల్ మాత్రమే మిగిలామక్కడ.

★ ★ ★

దాస్ కాపిటల్‌ను చదవడం ప్రారంభించాను. అందులోని పదాలు, వాక్యాలు, అర్థమవుతున్న కొద్దీ, అక్షరాలు నేలజారడం ప్రారంభమయ్యాయి. కొద్ది సేపటి తరువాత అవి మనుషులుగా మొలకెత్తడం గమనించాను. క్రమంగా ఎదిగి...ఎదిగిన

మనుషులు సమూహాలు, సమూహాలుగా గది తలుపులు తెరుచుకుని జనంలో కలపడం మొదలుపెట్టారు. భయం వేసి పుస్తకాన్ని చదవడం ఆపాను.

కాని ఆమెలో ఉన్నటువంటి ఆకర్షణే ఆ పుస్తకంలోనూ ఉంది. ఆమెలోని మార్మికతే పుస్తకంలోనూ ఉంది.

పుస్తకాన్ని వాపసు చేద్దామని ఆమెకోసం వెతికాను. కనిపించలేదు. ఆమె కనిపించ కుండా ఉన్న కొద్దీ నాలో ఆరాటం ఎక్కువయింది. పుస్తకాన్ని చేతిలో పట్టుకుని తిరిగే ప్రతిసారి, ఒక గొప్ప జనసమూహాన్ని వెంటేసుకుని తిరుగుతున్నట్లుగా ఊపిరాడేది కాదు.

ఎట్టకేలకు ఒకరోజు కనిపించింది. పరిగెత్తుతూ ఆమె వద్దకు వెళ్ళాను. పుస్తకాన్ని ఆమె చేతిలో పెట్టాను. ఒకసారి ఆప్యాయంగా దాన్ని నిమిరి తెరిచి చూసింది. పట్టరాని సంతోషం ఆమె కళ్ళలో కనిపించింది.

"అదీ!... నువ్విప్పుడు నాకు నచ్చావు. అక్షరాల్ని మనుష్యులుగా మార్చే ఇంద్రజాలికులంటే నాకిష్టం" అంది బిగ్గరగా నవ్వుతూ.

ఆమె నవ్వు విరగబూసిన మోదుగులా ఉంది. స్త్రీ రూపం దాల్చిన సిద్ధార్థుడి నవ్వులా సమ్మోహనంగా ఉంది.

ఆమె పుస్తకాన్ని తెరిచి, పేజీలు తిరగేసి చూపిస్తూ.

"చూడు చూడు ఖాళీ పేజీలు.. మానవ సమూహాలుగా మారిన పేజీలు.. ఇప్పుడు వాళ్ళెక్కడెక్కడో తిరుగుతుంటారు. కన్నీళ్ళు కారుస్తారు. కలియబడతారు. అంతమవుతారు. ఎవడో ఒక కవి పుస్తకంలో అక్షరాలుగా సుషుప్తావస్థ పొందుతారు. మళ్ళీ నీలాంటివారు ఎవడన్నా తట్టి లేపేదాకా..." అంటూ పుస్తకాన్ని పైకెగరేసింది.

ఆకాశానికి నిచ్చెన వేయడం కోసం అర్జునుడు ప్రయోగించిన మొదటి బాణంలా పుస్తకంపైకి దూసుకెళ్ళింది. అలా పైకే చూస్తుండిపోయాను. ఎంతకూ కిందకు పడక పోయేసరికి మెడలు నొచ్చి ముందుకు చూస్తే.. ఆమె లేదు!

ఆమె నన్ను ఇంద్రజాలికుడు అంది. కాని వాస్తవమేమిటంటే ఆమె నిజమైన ఇంద్రజాలికురాలు. ఆ... తెలిసింది. ఆమె మెజీషియన్ అనుకున్నాను. కాని అలా అనుకోవడం సంతృప్తి కలిగించలేదు.

వాస్తవం ఏదైతేనేం, మనకు నచ్చినట్లు వ్యాఖ్యానించుకోవడమే కదా జీవితం! ఆమె మెజీషియన్‌కాదు. ఎందుకు కాదంటే అలా అనుకోవడం నాకిష్టంలేదు. మరి ఎవరామె? తెలుసుకోవలసిన విషయమే అది.

★ ★ ★

ఇన్ని రోజుల పరిచయం తరువాత కూడా ఆమె ఎవరో.. ఆమె పేరేమిటో.. ఏదీ తెలుసుకోలేకపోయాను. కాని ఆమె నాకు అత్యంత పరిచయమున్న సన్నిహితమైన ఆప్తురాలు అనిపిస్తోంది. కాని ఎవరామె? ఆమెను గుర్తించలేనంతగా మతిమరుపు నన్ను కమ్ముకొందా? ఆమెను పోల్చుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాను.

సాయంత్రం ఏడున్నర అయింది. భాగ్యనగర్ పాసింజర్ వచ్చింది. కొంతసేపటి దాకా ప్రయాణికుల ప్రవాహం. తరువాత నిశ్శబ్దం. ఏకాంతం. ప్లాట్‌ఫాంపైన నేనొక్కడినే మిగిలాను. ఒక వ్యక్తి సుమారు అరవై ఐదు, డెబ్భై ఏళ్ళు ఉంటాయనుకుంటా, అక్కడే తచ్చాడుతున్నాడు. నా దగ్గరికి వచ్చాడు. ధోతి, ఖద్దరు బనియన్, చేతిలో కర్ర.. ఏలె లక్ష్మణ్ గీసిన పల్లెటూరి మనిషిలాంటి నిరాడంబరమైన ముఖం.

'చూడు బాపూ... ఇక్కడో తల్లి ఉండాలే..." అంటూ గొణిగాడు.

అది ప్రశ్న కాకపోవడంతో నేనేమీ మాట్లాడలేదు.

"ఇయ్యాలగానీ నీకు కనిపించిందా?" అంటూ ప్రశ్నించాడు.

"మీరెవరి గురించి అడుగుతున్నారు?" అంటూ తిరిగి ప్రశ్నించాను.

"నీకు తెలిసినామె గురించే అడుగుతున్నా. తంగెడుపూల చెట్టులెక్క నిండుగ ఉంటది. తాటిచెట్టు తీరుగ నిటారుగ ఉంటది. గునకపూల లెక్క నవ్వుతది...అదో..గా తల్లి ఇయ్యాల కనపడ్డదా?"

అతను ఎవరి గురించి ప్రశ్నిస్తున్నాడో అర్థమయింది. పక్కన కూర్చోమన్నట్లుగా జరిగాను. కూర్చున్నాడు.

"ఆమె కనపడక చాలా రోజులవుతోంది. ఇంతకీ ఆమె నీకు ఏమవుతుంది?" అంటూ అడిగాను. ఎట్టకేలకు ఆమె రహస్యం ఏదో తెలుస్తుందని ఆశపడ్డాను.

"మట్టికి, మనిషికి ఉండాల్సిన సంబంధమే ఆమెకు, మనకు నడిమిట్ల ఉన్నది" అన్నాడతను.

అంతా కలిసి నన్ను గొప్ప సందిగ్ధంలోకి నెట్టేస్తున్నారు అనుకుంటూ విసుక్కున్నాను.

"మీరెక్కడి నుండి వచ్చారు?" అనడిగాను.

"బోనగిరి" అంటూ సమాధానమిచ్చాడు.

"ఆమెకు ఏదన్నా చెప్పే ముచ్చట నాకు ఉంటే చెప్పండి. ఆమె కనిపించినంక నేను చెప్తా" అన్నాను.

అతడు గొంతు సవరించుకుని తన సంగతి చెప్పడం ప్రారంభించాడు.

"ఇప్పటికి అరవై ఏండ్ల సంది గూసులాడుతనే వున్నా. రజాకార్ల తోటి కొట్లాడిన, దొరల్ని గుజ్జుమనేటట్లు చేసిన. నిజాంతోటి నిల్చుండి కొట్లాడిన. ఇండియన్ మిలిట్రీ కండ్లల్ల కారం గొట్టిన. గిప్పుడు కూడ కొందరు నా పిలగాండ్లు కొట్లాడుతున్నరు".

"కాని, బాపూ, గప్పుడు నా అసోంటి బక్కోళ్ళకోసం బందూకు పట్టక తప్పింది కాదు. మమ్మల్ని పీక్కుతినే బలిసిన దొరలమీదికి బందూకు ఎక్కుపెట్టిన. ఒక్కడ్ని.. ఒక్కడ్ని...కూడ ఊర్లల్ల ఉంచకుండా ఎల్లగొట్టినం. గోసీలు సదురుకుంట గడీగోడలు దుంకి పారిపోయిన్రు. దోచుకునేటోళ్ళను ఎల్లగొట్టుడే సిద్ధాంతం. అంతకుమించి తెల్వదు నాకు.

"కాని గిప్పుడుగూడ దోపిడీ జరుగుతాంది. అయితే దోపిడీ చేసేటోడెవ్వడో కనిపిస్తలేదు. లక్ష్మణులు, ఇంద్రజిత్తు యుద్ధంల ఇంద్రజిత్తు జేసిన మాయల మంత్రాల యుద్ధం లెక్క ఉన్నది. దోపిడి ఉంది. అది చేసేటోడెవ్వడో కంటికి కనిపించదు.

"ఊరోళ్ళందరి ఉమ్మడి శత్రువు దొర ఉండె. ఆళ్ళను ఎల్లగొడితె దీపావళి జరుపుకున్నరు జనం. ఇప్పుడు కూడా శత్రుస్పర్శ తెలుస్తూనే ఉన్నది. కాని ఎటువైపు కత్తి విసరాల్నో తెలస్తలేదు. పోలీసోళ్ళ మీదికి బందూకెత్తుతున్నాం. కాని జనం పండుగలు జేసుకుంటలేరు. ఎందుకంటే దొరల జాగాల పోలీసోళ్ళు పనికిరారు.

"అందుకే ఆ తల్లిని అడుగుదామని వచ్చిన, కంటికి కనిపించిన దుష్మన్‌తోని ఎట్లా కొట్లాడేది? అది సమర్థితలేదు నాకు..." అన్నాడా వృద్ధుడు ఆవేదనతో.

★ ★ ★

అతనూ, అతని సమస్య అర్థమైంది నాకు. మా ఊరి దొర ప్రకాశరావు గురించి మా తాత చెప్పిన విషయాలు యాదికొచ్చినయ్. ఊరి పంటభూముల్లో బారానా మందం దొరవే! ఊరి జనంలో చాలామంది కూలీలుగానో, వెట్టిచాకిరీ చేసే కట్టుబానిసలుగానో బతకాల్సి ఉండేది.

ప్రకాశరావు దొర పరమ కర్కోటకుడిగా పేరు పడ్డాడు. కొపమొస్తే, చిన్నప్పుడు తల్లి దగ్గర తాగిన పాలనుకూడా కక్కేటట్లు కొట్టిస్తాడని ప్రతీతి. స్త్రీల విషయంలో కీచకుడు కూడా ప్రకాశరావు ముందు చిన్నబోతాడు.

అట్లాంటి ప్రకాశరావు దొర ప్రజల చైతన్యం చూసి, జరుగుతున్న సంఘటనలు గమనించి భయంతో ఊరు వదిలి పారిపోయాడు. ఆ వార్త తెలిసిన మరుక్షణం ఊరోళ్ళ హృదయాల్లో విరిసిన సంతోషం, ఊరిలో జరిగిన సంబరం గురించి మా తాత మెరిసే కళ్ళతో చెప్పేవాడు.

పారిపోయిన దొర కొన్నేళ్ళకు ఎమ్మేల్యే అయ్యాడు. అతని కొడుకు పెద్ద ఇండస్ట్రియలిస్ట్. మనుమడు గ్రూప్ వన్ అధికారి.

దొర భూముల్లో ఎర్రజెండాలు పాతారు. వాటిని పంచాలనుకున్నా పంచడం జరగలేదు. ప్రకాశరావు ఎస్.సి. కార్పోరేషన్‌కు భూముల్ని అమ్మాడు. కొన్ని లక్షల రూపాయలు వచ్చాయి. ఎస్.సి. కార్పోరేషన్ ఆధ్వర్యంలో పేదలకు భూములు పంచారు. కాని వాటిలోనూ రాజకీయాలు, కమీషన్లు, లంచాలు.

ప్రకాశరావు దొరకు వచ్చిన నష్టమేమి లేదు. భూములు పోయాయి. నగదుగా మారాయి. రాజకీయ పునాదులుగా మారాయి. పరిశ్రమల యంత్రాలుగా మారాయి. బ్యూరోక్రసీ తెల్ల అంగీల గళ్ళలుగా మారాయి. సంపద రూపం మారిందంతే.

ప్రస్తుతం ప్రజల ముందు ప్రకాశరావులాంటి ప్రత్యక్ష దోపిడీదారుడు లేడు. తక్షణ శత్రువు లేడు. ఇప్పుడు మనమీద శిలువలు మోపుతున్న, మన కష్టాలకు కారణమైన వ్యవస్థ ప్రకాశరావు కాలంలోలాగా నా ఊరిలోనే, నాకళ్ళెదురుగానే ఉండడంలేదు. దాని ఉనికి, రాష్ట్రాలు, దేశాల సరిహద్దులు దాటి ఖండాంతరాలుగా వ్యాప్తి చెంది ఉంది.

అందుకే విప్లవకారుడు ప్రకాశరావు దొరను ఎదుర్కొన్న తీరులోనే ప్రస్తుత దోపిడీ వ్యవస్థను ఎదుర్కోలేడు. అసాధ్యం. దోపిడీ తీరు మారినప్పుడు పోరాట పంథా కూడా మారాలి. లేకపోతే నా ముందున్న ఈ వృద్ధుడిలాగా సందిగ్ధంలోకి జారిపోవాల్సి ఉంటుంది.

ఆ ముసలాయన్ని చూస్తే జాలేసింది. నిరంతర అజ్ఞాతవాసం ఎంత భయం కరమైనది! ఒక లక్ష్యం కోసం, సిద్ధాంతం కోసం శ్రమించడంలో ఆనందం ఉంటుంది. కాని తానంతవరకు రక్తం ధారపోసిన సిద్ధాంతంలో బలహీనత లుండడాన్ని గమనించడం... మన నమూనాకు సిద్ధాంతం ఆశిస్తున్న నమూనాకు మధ్య వ్యత్యాసం ఏర్పడినప్పుడు కలిగే బాధ నరకప్రాయం.

"ఎందుకయ్యా, చిన్నతనం నుంచే బందూకు పట్టినవ్?" అని ప్రశ్నించాడు.

కొద్దిసేపటిదాకా మాట్లాడలేదతను. కళ్ళు మూసుకున్నాడు. అతని మనోఫలకం మీద ఏయే దృశ్యాలు కుండపోత వర్షంలాగా, వడగళ్ళవానలాగా జారుతున్నాయో!

"శివారెడ్డి కవిత్వం చదివినవా? కరుణ గలవాడే కృపాణం ధరించగలడు అంటాడాయన!" అన్నాడు కళ్ళు తెరవకుండానే.

★ ★ ★

ఒకవైపు పోలీస్ ఇన్‌ఫార్మర్ల హత్యలు.. మరోవైపు ఎన్‌కౌంటర్లు.... ఇంకోవైపు మత కలహాలు...మనం ఎవరికి టార్గెటో తెలియని విచిత్ర యుద్ధభూమిలో ఉన్నాం. వీటన్నింటితోపాటు మనమీద మెల్లగా పరుచుకుంటున్న ప్రపంచీకరణ అక్టోపస్ నీడ.. పాము పడగ ఎంత నీడనివ్వగలదో, ఎంత భద్రమైనదో అంత సురక్షితం మన జీవితాలు అనుకుంటూ రైల్వేస్టేషన్‌లోకి వెళ్ళానో లేదో అకస్మాత్తుగా ఆమె ప్రత్యక్షమైంది. ఆమె పరిస్థితి చూసి పరేషానయ్యాను. రేణుకా ఎల్లమ్మ తల్లిలాగా నిండుగా, గంభీరంగా ఉండే ఆమె, బదాబదలైన దేహంతో రక్తసిక్తమై జాలి గొలిపేటట్లు కనిపించింది!

ఒళ్ళంతా దెబ్బలు... ఆగకుండా స్రవిస్తున్న రక్తం. ఆమెను చూడగానే హృదయం ద్రవించిపోయింది.

ఉరుకుతూ ఆమె వద్దకు వెళ్ళాను. జేబులోంచి దస్తీ తీసి రక్తస్రావాన్ని ఆపబోయాను. ఆమె వారించింది.

"వద్దు...వద్దు... నేనో రక్తనదిని. ఈ ప్రవాహం ఆగదు" అంది నిర్వేదంగా.

"ఎలా అయ్యాయి ఈ గాయాలన్నీ?" అంటూ ప్రశ్నించాను. నా గొంతులోని దుఃఖం ఆమెను కదిలించినట్లయింది. నావైపు ఆపేక్షగా చూసింది.

"ఇవ్వాళ ఓ ఇద్దరు హైస్కూలు పిల్లలు కనిపిస్తే వాళ్ళని అడిగిన – నా బిడ్డ కొమురం భీము నీకు తెలుసా అని? కాని వాళ్ళు తెలియదన్నరు..." అంటూ ఆమె వివరించబోతుంటే మధ్యలో ఆపాను.

"నువ్వు కొమురం భీము తల్లివా?" అంటూ ప్రశ్నించాను. నా ప్రశ్నకు ఆమె విసుక్కుంది.

"మధ్యలో అడ్డంరాకు బిడ్డా.. సరే ఆ పిలగాండ్లకు తెలువదేమో అనుకున్నా. అనుమానం వచ్చి అక్కడికి దగ్గర్లోని హైస్కూలుకు వెళ్ళిన. పదో తరగతి రూములకు పోయి అడిగిన – మీకు నా బిడ్డ కొమురం భీము తెలుసా? అని. ఎందుకో ఈ రోజు వాడి గురించి పదిమంది నోటి తోటి వింటే మంచిగుండు అనుకున్న. కాని

ఆక్లాసు పిలగాండ్లకు ఎవరికి భీము గురించి తెలువదట. ఏడుపొచ్చింది నాకు. చదువుకునే పోరగాండ్లే నాబిడ్డ కొమురం భీము గురించి నా చెవిల నాలుగు మంచి మాటలు వెయ్యకపోతే ఇంకెవరు చెప్తరు? అయినా ఆశ చావక జంగల్ల ఉంటూ సర్కారును' బందూకుల్తోటి, బాణాలతోటి ఆడవిల బిడ్డ సాయంతోటి ఎదిరించినోళ్ళ పేర్లు చెప్పుమన్నా. అప్పుడు చెప్పిన్రు వాళ్ళు అల్లూరి సీతారామరాజు పేరు!

"నువ్వే చెప్పరా తండ్రీ!...అల్లూరి సీతారామరాజు గొప్పవాడే... కాని నా బిడ్డ కొమురం భీముడు ఏం తక్కువ? సీతారామరాజు పేరు తెలిసిన పిల్లగాండ్లకు కొమురం భీము గురించి తెలువకుండా జేసిన వాళ్ళెవరు? మన్నెం వీరుడితో నా జోడేఘాట్ పోరదు సాటిరాడా?

"కొమురం భీము గురించే తెలువనోళ్ళకు నా మిగతా పిల్లలు దొడ్డి కొమురయ్య రావి నారాయణరెడ్డి...ఎవ్వరి పేర్లైనా ఎట్ల తెలుస్తయ్? అవున్లే బాపూ, నా టాంక్‌బండ్ గుండెలపైనే నా పోరగాండ్ల ఆనవాలు కానరానప్పుడు మీ తరానికి వాళ్ళ గురించి ఏం తెలుస్తుందిలే!

"మనల్ని తన ఇనుప పాదాల కింద నలిపేసిందెవరో తెలుసా? మనం ఎవరి నుండి విముక్తి పొందామో తెలుసా అని ఆ పదో తరగతి పిలగాండ్లను అడిగిన. బ్రిటీషోళ్ళు అని చెప్పిన్రు. దొరలు తెలుసా... దేశ్‌ముఖ్‌లు తెలుసా... రజాకార్లు తెలుసా... నిజాం సర్కారు తెలుసా... అని అడిగిన. ఏదో పరాయిదేశపు పేర్లు వింటున్నట్లు నోరు తెరిచి చూస్తున్నరు గానీ, ఒక్కని కండ్లల్ల వాళ్ల వివరం తెలిసిన జాడల్లేవు.

"ఈ చదువులు గిట్లెందుకు తగలబడ్డయి బిడ్డా? వాని మట్టి గురించి వానికి తెలియకపోతే ఎట్లా?

"ఈ లొల్లి అంతా వింటున్న పోలీసొకడు వచ్చి కొమురం భీము గురించి చెప్తున్నవేందే.. నక్సలైట్లతోటి మిలాఖతైనవా అంటూ ఎటుపడితే అటు గుద్దిండు. గవ్వే గీ దెబ్బలు."

"అల్లూరి సీతారామరాజు గురించి మాట్లాడితే దేశభక్తి. కొమురం భీము గురించి నోరిప్పితే తీవ్రవాదం! తమ తల్లి గురించి తామే మాట్లాడుకోవడం నిషిద్ధమైన కాలంలో ఇక అన్నదమ్ముల గురించి మాట్లాడుతారులే..." అంటూ చెప్పుకు పోతోందామె.

ఆమె మాటల్లో ఆవేశం ఉంది. ఆవేదన ఉంది.

అర్థమవుతోంది తల్లీ.. నాకర్థమవుతోంది! నువ్వెవరో, నీ ఆవేదన దేనికోసమో.. నీ ఆగ్రహమెందుకో! వణుకుతున్న శరీరంతో, చెమర్చిన కళ్ళతో ఆమెవైపు చూశాను.

"ఇంకా ఏం పోల్చుకోవాలని చూస్తావు... నేనురా.. తీగెలు తెగిన నీ కోటిరతనాల వీణను.. కరువులో వచ్చిన బతుకమ్మ పండుగను... ప్రసవంలోనే బిడ్డల్ని పోగొట్టుకున్న పచ్చిబాలింత రొమ్మును" అంది.

● 2004 ●

# కథకుల జీవన రేఖలు

1. **మాడపాటి హనుమంతరావు (1885-1970):** తెలంగాణ నుంచి మొట్టమొదటి కథకుడు. హృదయ శల్యం కథను 1912లో ఆంధ్రభారతిలో ప్రచురించారు. తెలంగాణ వైతాళిక రచయిత. 1915లోనే మల్లికా గుచ్ఛం పేరుతో వీరి కథల సంపుటి వెలువడింది. మాడపాటి రాసిన కథలు 12 అన్నీ ఆణిముత్యాలనదగ్గ కథలే.

2. **సురవరం ప్రతాపరెడ్డి (1896-1953):** మహబూబ్ నగర్ జిల్లాలో జననం. తెలుగు సంస్కృతాలలో మంచి పండితుడు. గోలకొండ పత్రిక సంపాదకులు. పత్రికా రచయితగా, పరిశోధకుడిగా, చరిత్రకారుడిగా, సాంఘిక సంస్కర్తగా ప్రసిద్ధులు. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హిందువుల పండుగలు, రామాయణ విశేషాలు వంటి గ్రంథాలేకాకుండా అనేక కథలు, నాటికలు రాశారు. వీరికి కేంద్ర సాహిత్య అకాడమీ లభించింది. జోగిపేటలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభకు అధ్యక్షులు. గ్రంథాలయాలు స్థాపించి దళితుల అభివృద్ధికి కృషిచేశారు. తెలంగాణా వైతాళికుల్లో ముఖ్యులు.

3. **నందగిరి వెంకట్రావు :** ఈతని జననం 1909 హైదరాబాద్ సమీపంలోనున్న మేడ్చల్‌కు దగ్గరున్న పూటూరి గ్రామంలో. తెలంగాణా విమోచనోద్యమంలో పాల్గొని జైలు కెళ్ళాడు. తర్వాత లా చదివి జిల్లా సెషన్స్ జడ్జీగా పనిచేశాడు. రిటైరు అయ్యాక బీహారు ధన్‌బాదులో లేబర్ కోర్టులో ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా 9 సంవత్సరాలు పనిచేశాడు. తెలుగు, ఉర్దూ భాషలపై అభిమానం. గిరి కలం పేరుతో కథలు రాసినా ఆయన కథలు పుస్తక రూపంలో రాలేదు. 1985లో చనిపోయారు.

4. **అజ్ఞాతవాసి భాగ్యరెడ్డివర్మ:** 1888 సం॥ హైదరాబాద్‌లో జన్మించారు. వీరి అసలు పేరు మ్యాదరి బాగయ్య. 1931లో భాగ్యనగర్ పత్రికను స్థాపించారు. వీరు కథలు, బుర్రకథలు, నాటకాల ద్వారా దళితుల్ని చైతన్యవంతుల్ని చేశారు. 1937లో హైదరాబాద్‌లో మరణించారు. భారతదేశం పర్యటించి నిమ్న జాతుల ఉద్ధరణకు తీవ్రంగా కృషి చేశారు. నిజాం రాజ్యంలో హరిజనులను ఉద్ధరించే పలు కార్యక్రమాలను చేపట్టారు. అజ్ఞాతవాసి అన్న కలంపేరుతో ఎన్నో కథలు రాశారు.

5. **నందగిరి ఇందిరాదేవి:** ఈమె జననం 1919 సెప్టెంబర్ హనుమకొండలో తెలంగాణాలో స్త్రీ విద్య కోసం కృషిచేసిన సంఘ సేవకుడు చర్లకొండ నరసింహారావు ఆమె తండ్రి. నందగిరి వెంకటరావు సహధర్మచారిణి. ఆంధ్రయువతీ మండలి స్థాపకుల్లో ఒకరైన ఈమె బి.ఏ. వరకు చదువుకుంది. సంసార సంబంధమైన ఇతివృత్తాలను తీసుకొని కథలు రాసింది. తెలంగాణా కథా రచయిత్రుల్లో మొదటి రచయిత్రి. ఇప్పుడామె అమెరికాలోని టెక్సాస్ స్టేట్‌లో డల్లస్ నగరంలో ఉంటోంది.

6. **పెండ్యాల శేషగిరి రావు:** వరంగల్ జిల్లా చిన పెండ్యాలలో 1925లో జన్మించారు. 1943లోనే ఐదు కథలతో దాంపత్యం కథల సంపుటి ప్రచురితం. శ్రావణి పేరిట మరో పుస్తకం వచ్చినట్టు విజ్ఞాన గ్రంథమాల వారు పేర్కొన్నారు. దాంపత్యం సంపుటిలో దాంపత్యం కథతోపాటు నా స్నేహం, ఒడిదొడుకుల జీవితం, సంచారి, ముహూర్త బలం అనే కథలున్నాయి.

7. **కాళోజీ నారాయణరావు (1914-2001):** నా గొడవ కాళోజీగా ప్రసిద్ధుడైన కాళోజీ నారాయణరావు గొప్ప కవిమాత్రమేకాదు - కథకుడు కూడా. ప్రజల గొడవనంతా తన గొడవగా భావించి కవిత్వం పండించిన కాళోజీ కథల్లోనూ ప్రజల గొడవే. ఈతడు 1914లో వరంగల్లులో పుట్టాడు. తెలంగాణా విమోచనోద్యమంలో పాల్గొన్నాడు. వ్యావహారిక భాషలో తెలంగాణ పదాలూ, నుడికారాలతో కాళోజీ భాష సజీవంగా ఉంటుంది. వీరి కథలు కాళోజీ కథలు పేరుతో సంపుటిగా వచ్చాయి.

8. **కవిరాజమూర్తి:** కవి రాజమూర్తిగా ప్రసిద్ధులైన ఈయన అసలు పేరు సర్వదేవ భట్ల నరసింహమూర్తి. మొదటిరాత్రి, జారుదుబండ అనే నవలలు, మానవ సంగీతం అనే కావ్యం, మార్పు నాటకం రాశాడు. ఖమ్మం జిల్లాకు చెందినవాడు. 1926లో అక్టోబరులో జననం ఈతన్ని చిలీ కవుల్లో నెరూడాతో పోల్చారు. ఈయన చాలా కథలు రాసినా చాలావరకు అలభ్యాలు.

9. **అద్దూరి అయోధ్య రామ కవి:** 1922లో వరంగల్ జిల్లా తాటికొండలో జననం. 1948లో కథా సంపుటాన్ని ప్రచురించారు. 1949-50 లలో భాగ్య నగర్ పత్రికను నడిపించాడు. హన్మకొండలో విజ్ఞాన గ్రంథమాలను ఏర్పాటు చేసి కథావాటిక సంకలనాన్ని ప్రచురించారు. దాదాపు పది పుస్తకాలు ప్రచురించారు. నైజాం ప్రజా ఉద్యమం (బుర్రకథ) ఆంధ్రకేసరి, ఘంటారావం (1944 వరంగల్), దీపావళి (ఖండిక), రుద్రమదేవి (నాటిక), తాటికొండ గేయమాలిక, స్వాతంత్ర్య గీతాలు, అన్నపూర్ణేశ్వర శతకం, సీతారామ శతకం ప్రచురించారు.

10. **కాంచనపల్లి చిన వెంకట రామారావు (1921 -1992):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న వీరు నల్గొండ జిల్లాలో జన్మించారు. వీరు ప్రసిద్ధ గ్రంథ సమీక్షకులు. సాహిత్య వ్యాసాలెన్నో రచించారు. న్యాయవాద వృత్తితోపాటు కమ్యూనిస్టుపార్టీ శాసనసభ్యుడిగాకూడా ఉన్నారు. అరుణరేఖలు

కవితా సంపుటి. మన వూళ్ళో కూడానా కథల సంపుటి వీరి ప్రముఖ రచనలు.

11. **జి. రాములు:** ఈయన కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో 1921లో పుట్టాడు. కరీంనగర్ జిల్లా నుండి ఆధునిక కథలు రాసిన వారిలో మొదటివాడు. సినారె, జి.రాంరెడ్డి, జస్టిస్ జీవనరెడ్డికి విద్యా గురువు. 1948లో పెరటి చెట్టు పెద్ద కథను, 1956లో పిచ్చి శాయన్న నవలను రాశాడు. సంస్కరణ భావాలతో, నిజాం వ్యతిరేక స్ఫూర్తితో రజాకార్ల దుండగాలు జరుగుతున్న కాలంలోనే కథలు రాసిన మొదటి తరం రచయిత.

12. **ఆవుల పిచ్చయ్య:** 1919లో నల్గొండ జిల్లా సూర్యాపేటలో జన్మించాడు. కమ్యూనిస్టు పార్టీ తరపున తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో పాల్గొని 23.5.47నుంచి 30.6.49 వరకు హైదరాబాద్, నల్గొండ, బీడ్ (మహారాష్ట్ర) జైళ్ళలో శిక్షననుభవించాడు.

13. **నెల్లూరి కేశవస్వామి (1920-1984):** హైదరాబాద్ నగరంలో జన్మించారు. నీటిపారుదల శాఖలో ఇంజనీరుగా ఉద్యోగించారు. "పసిడిబొమ్మ" అనే పేరుతో వీరికథల సంపుటి వెలువడింది. ఐతే చార్మినార్ వీరి ప్రసిద్ధ కథల సంపుటి. ఈ సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. వెలుతురులో చీకటి అనే వీరి నవల కూడా ప్రసిద్ధమైనదే.

14. **పి.వి. నరసింహారావు (1921-2004):** భారతదేశ మాజీప్రధాని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లాంటి అనేక ఉన్నతోన్నత పదవుల నలంకరించిన పాములపర్తి వెంకట నరసింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడే కాకుండా గొప్ప రచయిత కూడా. ఈతని జన్మస్థలం కరీంనగర్ జిల్లాలోని వంగర గ్రామం. 1921లో జన్మించిన ఈయన వరంగల్, నాగపూర్‌ల్లో విద్యాభ్యాసం చేశాడు. వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నాడు. అష్టభాషా ప్రవీణుడైన ఈ పండిత రాజనీతిజ్ఞుడు గొల్ల రామవ్వ, మంగయ్యగారి అదృష్టం లాంటి కథలు, ఇన్‌సైడర్ ఆత్మకథ, వేయిపడగల అనువాదం లాంటి అనేక సాహిత్య వ్యాసంగాల్లో మునిగి తేలాడు. పి.వి. కీర్తిని సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలబెట్టే కథ గొల్ల రామవ్వ.

15. **ఎం. హీరాలాల్ రాయ్:** 1927లో ఖమ్మం జిల్లాలో జన్మించాడు. మాతృభాష తెలుగుకాకున్నా తెలుగు రచనలు చేశారు. తెలుగు - హిందీ - ఉర్దూ భాషల్లో 300 కథలు రాశారు. తెలంగాణ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని 14 సంవత్సరాలు జైల్లో గడిపాడు. బ్రతుకు బాధలు కథల సంపుటి 1958లో వచ్చింది. కథ మానవ జీవితానికి, ప్రపంచానికి సంబంధించిన సంఘటనలు ప్రతిబింబించే దర్పణం అనే దృక్పథంతో రాశాడు.

16. **కందుకూరి లింగరాజు:** హైదరాబాద్ ప్రాంతపు జీవితాన్ని కథల్లో చిత్రించిన కె. లింగరాజు ఖమ్మం జిల్లా వాడు. చాలా కథలు రాశాడు. సంపుటిగా రాలేదు. ఈతని కథల్లో తెలంగాణ పదాలు దొర్లాయి. భాష సరళం.

17. **వట్టికోట ఆళ్వారుస్వామి (1915-1961):** తెలంగాణా తొలితరం కథకుల్లో ప్రముఖులు. కథకుడుగా, నవలారచయితగా ప్రచురణకర్తగా ప్రసిద్ధులు. ప్రజల మనిషి, గంగు వీరి ప్రసిద్ధ నవలలు. దేశోద్ధారక గ్రంధమాల స్థాపించి ఎన్నో గ్రంథాలను ప్రచురించి తెలంగాణ సాహిత్యాభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. జైలులోపల అన్న పేరుతో వీరి కథలు సంపుటిగా ప్రచురిత మయ్యాయి. తెలంగాణ వైతాళిక సాహితీకారుల్లో ప్రముఖులు.

18. **పొట్లపల్లి రామారావు:** 1922లో వరంగల్ జిల్లాలో జన్మించాడు. ఈతని కథలు 'జైలు' పేరుతో 1945లో సంపుటిగా వచ్చాయి. చుక్కలు అనే కవితా సంపుటి ప్రచురించారు. జొన్నగింజ, సమాధి స్థలము లాంటి అనేక కథలు రాశాడు. పొట్లపల్లి కథలు సరళమైన శైలిలో ఉండే మంచి శిల్పంతో కూడుకున్నవి.

19. **జి. సురమౌళి (1935-1995):** తెలంగాణ జీవితాన్ని అతి దగ్గరగా పరిశీలించి తన గొంతులో పలికించడమే గాకుండా కలకాలం నిలిచి పోయే కథలెన్నో రాశారు. తెలంగాణ జీవద్భాషలో కథమొత్తం నడిపించిన బహుకొద్ది మంది రచయితల్లో తొలితరానికి చెందిన రచయిత. ఆకాశవాణినుండి తనదైన ప్రత్యేకశైలిలో వార్తలు వినిపించి శ్రోతలను ముగ్ధులను చేసిన కంచుకంఠం వీరిది. అనువాదకులుగా అసెంబ్లీలో కొంతకాలం పనిచేశారు.

20. **గూడూరి సీతారాం :** తెలంగాణా మొదటి తరం కథకుల్లో ఒకరైన ఈ రచయిత జన్మస్థలం కరీంనగర్ జిల్లాలోని హనుమాన్‌పేట. తెలంగాణ రచయితల సంఘం కరీంనగర్ జిల్లా శాఖకు కార్యదర్శిగా పనిచేశారు. 80 వరకు కథలు రాసినా చాలావరకు లభ్యం కావడం లేదు. లభ్యమైన 13 కథలతో 2005లో గూడూరి సీతారాం కథల సంపుటి తీసుకొచ్చారు. మొదటి తరంలోనే కథను పూర్తి మాండలికంలో నడిపించిన కథకులు. జీవితంలోని ఎత్తుపల్లాలను వాస్తవికంగా చిత్రించే రచనలు చేసిన ఈ రచయిత 1936లో జన్మించారు.

21. **చక్రవర్తి రంగస్వామి:** 1917లో గుంటూరు జిల్లా దరిశి అగ్రహారంలో పుట్టారు. నల్గొండలో స్థిరపడ్డారు. 1956లోనే దాశరథి తొలినుడితో నిజమైన మనుషులు కథల సంపుటి వెలువడింది. 1949లో జయభారత్ అనే పిల్లల పత్రికను నడిపించారు. హేమలత, తొలిచూపు అనే సాంఘిక కథలు 1951కి ముందే రాశారు. 1999లో హైదరాబాద్‌లో చనిపోయారు.

22. **జనపరెడ్డి సత్యనారాయణ (సత్యశ్రీ):** 28.4.1934న ఖమ్మం జిల్లాలో జన్మించారు. కొత్తగూడెం రామచంద్రా ఉన్నత పాఠశాలలో సీనియర్ తెలుగు పండితునిగా పనిచేశారు. తెలుగు స్వతంత్ర, భారతి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ లలో వీరిరచనలు ప్రచురించారు. రేడియోకోసం సంగీత రూపకాలు రాశారు. 7.1.2003లో మరణించారు. ఇటీవల వీరి రచనల సంకలనం ఒకటి వెలువడింది.

23. **డి. రామలింగం (1925-2000):** 1925లో జన్మించిన ఈ రచయిత ఖమ్మం జిల్లాకు చెందినవాడు ఈతరం తెలుగు కథ (సాహిత్య అకాడమి)కి సంపాదకత్వం వహించాడు. 1947లో సారధిలో పనిచేశాడు. గ్రంథ సమీక్షకుడు గానూ, కథా రచయితగానూ ప్రసిద్ధులు. వీరి కథలు 1964లో దేశి కవితా మండలి విజయవాడ వారిచే కాగితపు పడవలు పేరుతో సంపుటిగా వచ్చాయి. కొన్ని కథలు ప్రామాణిక భాషలో, సంభాషణలు మాండలికంలో ఉన్నాయి.

24. **కవుటూరు వెంకట నారాయణరావు:** ఖమ్మం జిల్లా నివాసి. కథలూ కవితలూ రాసేవారు. సుమారు డెబ్భై సంవత్సరాల వయస్సు. (వివరాలు తెలియవు)

25. **ఈటుకూరు రంగారావు:** 1929లో జననం. ఈ రచయిత హీరాలాల్ రాయ్ సమకాలికుడు. అయితే చిన్నతనంలోనే మరణించాడు. ఖమ్మంజిల్లా వాడు. జర్నలిస్టు. తెలంగాణా విమోచనోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళాడు. హీరాలాల్ కథక మిత్రుల్లో రంగారావు ఒకరు.

26. **ఇటికాల నీలకంఠం:** ఖమ్మం జిల్లాలో 1917లో జన్మించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఖమ్మం మెట్టు శాఖను నిర్వహించాడు. సాహిత్యాభిమాని. అనేక కథలు రాసి పత్రికల్లో ప్రచురించినా పుస్తకంగా రాలేదు. ఈతని కథలు ప్రామాణిక భాషలో ఉన్నా, సరళమైన భాషతో తెలంగాణా పదాలతో నిండి ఉంటాయి.

27. **భాస్కరభట్ల కృష్ణారావు:** హైదరాబాద్ సమీపంలో ఉన్న వేమాజ్ పేట్‌లో 1918లో జన్మించాడు 1939-57 మధ్యకాలంలో 40 వరకు కథలు, నాలుగు నవలలు రాశాడు గోల్కొండ పత్రిక సంపాదకవర్గంలోనూ, ఆలిండియా ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గానూ పని చేశాడు. ఆయన కథలు 1955లో కృష్ణారావు కథలుగా, 1962లో వెన్నెల రాత్రి సంపుటాలుగా వెలువడ్డాయి. సరళమైన వ్యావహారిక భాషలో రాయబడిన ఈయన కథల్లో తెలంగాణ రైతుజీవితం, గ్రామీణ వాతావరణం కనబడతాయి. 1966లో మరణించారు.

28. **ఇల్లిందల సరస్వతీదేవి (1918-1988):** హైదరాబాద్‌లో స్థిరపడిన వీరు 1958-66లో శాసనమండలి సభ్యురాలిగా ఉన్నారు. స్వర్ణకమలాలు, తులసీ దళాలు వీరు ప్రచురించిన కథా సంపుటాలు. కేంద్ర సాహిత్య అకాడమి బహుమతి గ్రహీతలు.

29. **కొండపల్లి వెంకట శేషగిరిరావు:** నల్గొండ జిల్లా అనంతగిరిలో 28.10.1930న జన్మించారు. ఖండకావ్యాలు, కథలు రాశారు. చీకటి వెలుగులు అన్న నవల 1959లో ప్రచురించారు. అనేక అనువాద రచనలు చేశారు.

30. **పబ్బరాజు గోపాలరావు:** 1928లో ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెంలో జన్మించారు. కథలు, గేయాలు, కవితలు చాలా పత్రికల్లో ప్రచురితమయ్యాయి.

లచ్చినవ్వింది అన్న వీరి రచనల సంపుటం 1959లో ఖమ్మంలోని మిత్రమండలివారు ప్రచురించారు.

31. **పి. యశోదారెడ్డి:** 1929లో మహబూబ్‌నగర్ జిల్లా జీజినేపల్లిలో జన్మించిన ఈ రచయిత్రి మొదట్నించి తెలంగాణ నుడికారంలో కథలు రాస్తున్నారు. 1950కి ముందే కథలు రాసిన ఈ విదుషీమణి సుప్రసిద్ధ చిత్రకారుడు పి.టి.రెడ్డిగారి సతీమణి. మా ఊరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు వీరి ప్రసిద్ధ గ్రంథాలు. ఉస్మానియా యూనివర్శిటీ తెలుగు ప్రొఫెసర్‌గా, అధికార భాషా సంఘం అధ్యక్షురాలిగా పనిచేసిన ఈ విద్వాంసురాలు తన ప్రాంత మాండలికాన్ని మాత్రం విడిచిపెట్టలేదు. మాట, రచనలోనూ తెలంగాణా జీవద్భాష తొణికిసలాడు తుంటుంది.

32. **దాశరథి రంగాచార్య:** 1928లో జననం ఖమ్మం జిల్లా గార్లలో. స్థిరపడింది హైదరాబాద్‌లో. చిల్లర దేవుళ్ళు నవలా రచయితగా తెలంగాణా జనావేదన సంఘర్షణ చిత్రకారుడిగా ప్రారంభించి, మోదుగుపూలు రచయితగా ఎదిగి, జీవనయానంతో దిగంతాలకు వ్యాపించి నాలుగు వేదాలను తెనిగించిన అపర వాచస్పతి ఈ రచయిత. నవలాకారుడిగా ప్రసిద్ధుడై వేలాది పేజీల వచనం రాసి కొన్ని కథలు కూడా రాసిన మొదటితరం రచయిత.

33. **తాడిగిరి పోతురాజు:** కోస్తాలో పుట్టి కరీంనగర్‌లో స్థిరపడి జైలు కథల రచయితగా ప్రసిద్ధి పొందిన ప్రసిద్ధ రచయిత. వీరికి మట్టిమనుషులు నవల ఎంతో పేరు తెచ్చి పెట్టింది. రాశిలో తక్కువ కథలే రాసినా వాసిలో ఎన్నదగిన కథలు రాశారు.

చిరునామా: కోతుల నడుమ, (వయా) హుజూరాబాద్ కరీంనగర్ (జిల్లా)

34. **నిఖిలేశ్వర్ :** పుట్టింది హైదరాబాద్ జిల్లాలో. దిగంబర కవులుగా ప్రసిద్ధులు. అనేక సామాజిక వ్యాసాలతోపాటు, కథలూ రాశారు. నిఖిలేశ్వర్ కథల పేరుతో వీరికథా సంకలనం ఇటీవలే వెలువడింది. అయిదు సంవత్సరాల కింద అధ్యాపక వృత్తిలో విరమణ చేశారు.

చిరునామా: విద్యానగర్ - హైదరాబాద్.

35. **చెరబండరాజు:** పుట్టింది రంగారెడ్డి జిల్లాలో. నన్నెక్క నివ్వండి బోను అనే కవిత ద్వారా సామాజిక రుగ్మతలను, దేశ స్వరూపాన్ని నగ్నంగా నిలబెట్టిన విప్లవ కవి చెరబండరాజు. మాపల్లె నవల, చెరబండరాజు కథలు కూడా రాశారు. దిగంబర కవుల్లో ప్రసిద్ధులైన వీరు అనేక పాటలు, కవితలు రాయడమే కాకుండా వచనం కూడా రాశారు. ఈతని కథల్లో తెలంగాణా జనజీవన సంఘర్షణ వాస్తవిక రూపంలో కనబడుతుంది.

36. **మాదిరెడ్డి సులోచన:** ఈమె 1936లో భాగ్యనగరం దగ్గరున్న శంషాబాద్‌లో జన్మించారు. ఉపాధ్యాయ వృత్తిలో వుండి చాలా నవలలూ, కథలూ రాశారు. ఈమె ఇథియోపియా, జాంబియా దేశాలలో వున్నారు. గ్యాస్ సిలిండర్ పేలుడు ప్రమాదంలో 1983లో మరణించారు.

37. **చావా శివకోటి:** డెబ్భైఏళ్ళ క్రితం ఖమ్మం జిల్లాలో కన్ను తెరిచిన ఈ రచయిత అనేక కథలు రాశారు. ఈతని కథల్లో తెలంగాణ జనం బాధలు, దొరల దౌర్జన్యాలు, పీడితుల తిరుగుబాట్లు దర్శనమిస్తాయి. ఉద్యమాలకు ముందు తెలంగాణా గ్రామాల స్వరూప స్వభావాలే కథల్లో కనబడతాయి. ఇటీవలే 'కథలోయ్ కథలు' పేరుతో ఓ కథల సంపుటిని వెలువరించారు.

38. **దేవరాజు మహారాజు:** 1952లో నల్గొండ జిల్లా భువనగిరిలో జన్మించిన ఈ రచయిత మొదట్లోనే తెలంగాణా మాండలికంలో అనేక రచనలు చేశారు. కవిగానూ, కథకుడుగానూ, విమర్శకుడుగానూ అనువాదకుడుగానూ ప్రసిద్ధులు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జూవాలజీ ఉపన్యాసకులుగా పనిచేస్తున్నారు.

39. **చంద్ర:** 1946లో వరంగల్ జిల్లాలో జన్మించిన ఈ రచయిత గొప్ప చిత్రకారులు. ఈతని చిత్రం ప్రచురించని పత్రికలేదు. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ఉద్యోగించి ఈ మధ్యనే పదవీ విరమణ పొందారు. జగమెరిగిన చిత్రకారుడే కాకుండా గొప్ప కథకుడు. 60, 70 వరకు కథలు రాసినా ఒక్క సంపుటి కూడా ప్రకటితం కాలేదు.

చిరునామా: HIG-12, బాగ్‌లింగంపల్లి, నియర్ వాటర్ ట్యాంక్, హైదరాబాద్.

40. **పడాల రాములు:** మెదక్ జిల్లా నివాసి.చాలాకథలు రాశారు. సుమారు 52 సం॥రాల వయస్సున్న వీరు ఉపాధ్యాయ వృత్తిలో వున్నారు.

41. **అల్లం రాజయ్య:** తెలుగు కథల్లో విప్లవ కథలు విరివిగారాసిన ఈ రచయిత 5-6-1952న కరీంనగర్ జిల్లాలోని మంథని దగ్గరున్న గాజులపల్లిలో జన్మించాడు. అతడు, మనిషిలోపలి విధ్వంసం, మధ్యవర్తులు లాంటి అద్భుత కథలు రాశాడు. కొలిమంటుకుంది, అగ్నికణం ... నవలలు రాశాడు. ఈతని కథల్లో తెలంగాణా మాండలిక భాషా సొగసులు దర్శనమిస్తాయి. 100 వరకు కథలు రాసిన ఈ రచయిత భూమి, సృష్టికర్తలు సంపుటాలు ప్రచురించాడు.

చిరునామా: ACC సిమెంటు ఫ్యాక్టరీ కాలనీ, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా.

42. **నందిని సిద్ధారెడ్డి:** మెదక్ జిల్లా సిద్ధిపేటలో 1950లో జన్మించిన ఈ రచయిత తెలుగు ఉపన్యాసకులుగా పనిచేస్తున్నారు. ప్రధానంగా కవి అయిన ఈ రచయిత అనేక కథలు రాశారు. పౌరరచయియతల సంఘం, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులుగా విరివిగా సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. భూమి స్వప్నం వీరి ప్రసిద్ధ కవితా సంపుటి.

చిరునామా: తూంబాయి పేట, సిద్ధిపేట.

43. **రామాచంద్రమౌళి:** సుమారు 57 సంవత్సరాల చంద్రమౌళిగారు వరంగల్ జిల్లావారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ శాఖాధిపతిగా అక్కడే వుంటూ కథలూ - కవిత్వం రాస్తూంటారు. చాలాకాలం తర్వాత ఇటీవల "ఎటు" కవితా సంకలనం ఒకటి ప్రచురితమైంది. వీరి ఎన్నో కథలు బహుమతులను గెల్చుకున్నాయి. ఇంజనీరింగ్ విషయంలోను పలుగ్రంథాలు రాశారు.

44. **పులుగు శ్రీనివాస్:** సంకరవిత్తులు, చుడీదార్ పిల్ల, రోసయ్య రాకపాయె లాంటి ప్రసిద్ధ కథలు, తెలంగాణా వివక్షపై కథలు రాసిన ఈ రచయిత 3-5-1960న వరంగల్ జిల్లా ధర్మసాగరం మండలం వేలేరు గ్రామంలో జన్మించారు. బోనస్, అడవిలాంటి సంపుటాలను వెలువరించాడు. కార్మికులపై అనేక కథలు రాశాడు.
చిరునామా: 5-111/1, చింతల్, హెచ్.యం.టి. రోడ్, హైదరాబాద్-54.

45. **నందిగం కృష్ణారావు:** గత ముప్పయి సంవత్సరాలకు పైగా హైదరాబాదులో స్థిరపడిన ఈ రచయిత 1952లో జన్మించారు. తెలంగాణ నుంచి కోర్టుకథలు లేని లోటును తీర్చుతున్నారు. నాలుగుకాళ్ళ న్యాయం కథలు, రెప్ప వేయని కన్ను కథలు సంపుటాలుగా వచ్చాయి. ప్లీడర్ చెప్పిన పోలీస్ కథలు, గాడిదకథలు ప్రాచుర్యం పొందిన కథలు. హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న ఈ రచయిత కలం పదునైంది.
చిరునామా : బ్లాక్-7, ఫ్లాట్‌నుం. 10, HIG -II, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.

46. **వుప్పల నరసింహం:** 1955లో సికింద్రాబాద్ సమీపానగల దేవరయాంజాల గ్రామంలో జన్మించారు. తిరుగబడ్డ భూమి, టార్చిలైట్ వీరి కథాసంపుటాలు. వివిధ పత్రికలలో వీరి సాహితీ వ్యాసాలు విరివిగా ప్రచురితమయ్యాయి. జర్నలిస్టుగానూ ప్రసిద్ధులు.

47. **కె. రాంమోహన్ రాజు:** 1950లో వరంగల్ జిల్లాలో జన్మించారు. సృజన సంపాదకవర్గంలో ఉండేవారు. 'అనామకుడి డైరీ' అనే కథల సంపుటి వచ్చింది. సారా కథలూ రాశారు. రెండు మూడేళ్ళ క్రితం అకాల మరణం చెందారు.

48. **పొల్కంపల్లి శాంతాదేవి:** మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తిలో 1942లో జన్మించారు. అక్కడే స్థిరపడ్డారు. 150 కిపైగా కథలూ, 60 నవలలూ రాశారు. అనేక పురస్కారాలందుకున్నారు.

49. **సదానంద్ శారద:** 1952లో వరంగల్‌లో జన్మించారు. తెలుగు సాహితీ కారుల్లో తొలిసారిగా తన శ్రీమతి పేరు శారదను తన పేరుకు చేర్చుకుని సాహితీ వ్యాసాలు, కథలు, నవలలెన్నో రాశారు. జాడి వీరి ప్రముఖ కథ. జాడి, గొలుసు వీరి కథా సంపుటాలు. మంచినీళ్ళబావి నవలకు ఆంధ్రప్రభ వారపత్రిక బహుమతి అందుకున్నారు. విశాలాంధ్ర తెలుగుకథ సంకలనానికి సంపాదకత్వం వహించారు. 150 పైగా కథలు రాశారు. కామర్స్‌లో రీడరైన వీరు హైదరాబాద్‌లో కళాశాల ప్రిన్సిపాల్.

చిరునామా: 12-10-590/87 వారాసిగూడ, సికిందరాబాద్ - 500 061.

50 **నవీన్:** అంపశయ్య నవీన్‌గా ప్రసిద్ధులైన వీరు 1941లో వరంగల్ జిల్లాలో జన్మించారు. వీరి ప్రముఖ నవల అంపశయ్య. 25 నవలలు, అరవై కథలూ, 50 పైగా సాహిత్యవ్యాసాలు రాశారు. లైఫ్ ఇన్ ఎ కాలేజ్, ఎనిమిదో అడుగు వీరి కథా సంపుటాలు. వీరి కాలరేఖలు నవలకు ఇటీవల కేంద్ర సాహిత్య

అకాడమీ అవార్డ్ లభించింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్‌తో పాటు అనేక పురస్కారాలు అందుకున్నారు.

చిరునామా: 84, ఎక్సైజ్ కాలనీ, సుబేదారి, హనుమకొండ.

51. పాపు: 1955లో కరీంనగర్ జిల్లాలో శనిగరం గ్రామంలో జన్మించారు. గంపు బంధుగా ప్రసిద్ధి. ఆదిలాబాద్ జిల్లా గిరిజనులతో కలిసి జీవించి వారి జీవితాలమీద చక్కని కథలు రాశారు. అల్లం రాజయ్యతో కలిపి "కొమరం భీం" నవల రాశారు. 1993లో అకాల మరణం పొందారు.

52. బోయ జంగయ్య: . 1942 సం॥ నల్గొండ జిల్లా లింగారెడ్డిగూడెంలో జన్మించిన ఈ రచయిత తెలంగాణానుంచి ప్రసిద్ధిగా వెలిగిన రెండవ తరం రచయిత. వందలాది కథలు జాతర, జగదం లాంటి నవలలు రాసిన ఈయన రచనల్లో దళిత జీవన ప్రతిస్పందనలు, వేదన తొంగి చూస్తాయి. దున్న, బో.జ. కథలు ఎచ్చరిక, జాతర, జగదంలాంటి అనేక పుస్తకాలను వెలువరించారు. తెలుగు విశ్వ విద్యాలయ పురస్కారాలతోపాటు అనేక అవార్డులందుకున్నారు.

చిరునామా: 5-9-200/1 మాన్యం చెలక, నల్లగొండ, 508101.

53. పసుపులేటి మల్లికార్జునరావు: ఖమ్మం జిల్లాలో 1944 మే 5న జన్మించారు. వీరి మొదటి కథ "నా స్మృతి పథంలో". సుమారు 80 కథలు రాశారు. నాటికలూ రాశారు. సమాంతర రేఖలు, ఉక్కు పిడికిలి, ఉదయం, పక్షులు, భూమికి నిచ్చెనలు నవలలు. పక్షులు, భూమికి నిచ్చెనలు నవలలకు ఆంధ్రజ్యోతి పత్రికలో బహుమతులు లభించాయి.

54. తుమ్మేటి రఘోత్తమరెడ్డి: పుట్టింది 1.12.1959న. చిట్యాల మండలం వరంగల్ జిల్లా. గోదావరిఖని, సింగరేణి గనుల్లో ఉద్యోగం. 1987లో మొదటికథ ధిక్కారం. పాతిక వరకు కథలు, నల్లవజ్రం నవల, బండికింది బతుకులు, శర్మిణ రచనలు చేశారు. చావు విందు, పనిపిల్లలాంటి ప్రసిద్ధ కథలు రాశారు. పనిపిల్లపై విశేష చర్చ జరిగింది.

చిరునామా: పవర్‌హౌస్, గోదావరి ఖని - 505 009.

55. గోపి భాగ్యలక్ష్మి: గిరిజన ప్రాంతంలో పుట్టి, వాళ్ళతో మమేకమై, వాళ్ళతో జీవిస్తూ ఆదిలాబాద్ గిరిజన బతుకుల గూర్చి అత్యంత వాస్తవిక దృక్పథంతో కథలు రాస్తున్న రచయిత్రి.
చిరునామా: ఆదిలాబాద్.

56. దిలావర్: ఖమ్మం జిల్లా వాస్తవ్యుడు. పాల్వంచలో అధ్యాపక వృత్తిలో ఉంటూ అనేక కవితలూ, కథలూ రాశారు. దాశరథి రచనలపై పరిశోధన వ్యాసం రాశారు. సుమారు 60 సంవత్సరాల వయస్సున వీరు కవితా సంకలనాలు ప్రచురించారు.

57. **ఆదెపు లక్ష్మీపతి:** రాయగుంపు ఎరువుల కర్మాగారంలో ఫోర్‌మెన్‌గా [illegible] చేసి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన వీరు 1956 లో కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో జన్మించారు. ఇప్పటి వరకు మూడువందల కథలు రాసిన వీరు 'నాలుగుద్వారాలు' కథల సంపుటిని ప్రచురించారు. దీన్నుండియే కథకు విపుల కథల పోటీలో ప్రథమ బహుమతి లభించింది.

58. **జ్వాలాముఖి:** 67 సంగల కింద పుట్టింది హైదరాబాద్‌లో. చెరబండరాజు, నిఖిలేశ్వర్‌లతో కలిసి దిగంబర సాహిత్యోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన ఈ రచయిత - కవిగా, సామాజిక కార్యకర్తగా ప్రసిద్ధుడైనా హైదరాబాదులు పేరుతో హైదరాబాద్ జనజీవన సంఘర్షణను గూర్చి చక్కని కథలు రాశారు.

చిరునామా: అంబర్ పేట్, హైదరాబాద్.

59. **జూకంటి జగన్నాథం:** కరీంనగర్ జిల్లా తంగళ్ళపల్లిలో యాదైపెన్న [illegible] జన్మించిన ఈ రచయిత CESS Ltd. సిరిసిల్లలో ఉద్యోగిస్తున్నారు. ప్రధానంగా వలసలు, వైపణి లాంటి మంచికథలు రాశాడు. వైపణి కథల సంపుటి ఇటీవలే వెలువడింది. తెలంగాణా జనజీవన సంఘర్షణ ఈతని కథల నిండా దర్శనమిస్తుంది.

చిరునామా: 6-5-101, విద్యానగర్, సిరిసిల్ల.

60. **జింబో:** న్యాయమూర్తిగా హైదరాబాద్‌లో ఉంటున్న ఈ రచయిత పుట్టింది 1955లో. పెరిగింది కరీంనగర్ జిల్లా సిరిసిల్ల దగ్గరున్న తంగళ్ళపల్లిలో. కవి, కథా రచయిత, విమర్శకుడు. కవిగా హుజర్ హై, రెండక్షరాలు, లోపలి వర్షమై కురిసి, కథకుడిగా రూల్ ఆఫ్‌లా, జింబో కథలు సంపుటిద్వారా నిరంతర సాహితీ వ్యవసాయం చేస్తున్న సృజనకారుడు జింబో. న్యాయ వ్యవస్థలో బండారాన్ని బయటపెట్టే కథలెన్నో రాశాడు.

చిరునామా: 305, సౌందర్య రెసిడెన్సీ, వీధి నం.8. హిమాయత్‌నగర్, హైదరాబాద్.

61. **భూపాల్:** 50 సంవత్సరాలున్న వీరు హైదరాబాద్‌లో జన్మించిన ప్రముఖ తెలంగాణ కథకులే గాక నటులు కూడా. అంబల్ల బంద వీరి కథా సంపుటి. కథలతోపాటు వ్యాసాలు, పాటలద్వారా కూడా వీరు సుపరిచితులు.

చిరునామా: 2-2-985, అంబర్‌పేట్, హైదరాబాద్ - 13.

62. **కాలువ మల్లయ్య:** 1953లో కరీంనగర్‌జిల్లా తెలుకుంట గ్రామంలో జననం. ఈ రచయిత పాతికేళ్ళ క్రితం కలంపట్టి 600 పైగా కథలు, 12 నవలలు, 250 వ్యాసాలు, నువ్వద్ది, సహితం, ధిల్లగి ముచ్చట్లు శీర్షికా రచనలు, తెలుగులో ప్రగతిశీల కథాసాహిత్యాల పరిశోధనా గ్రంథం రాశారు. తెలుగులో అత్యధికంగా కథలు రాసిన రచయిత. బతుకు పుస్తకం, కాలువ మల్లయ్య నవలలు, కాలువ మల్లయ్య కథలు, మా కథలు, అవ్వతోడు గిది తెలంగాణ సంపుటాలుగా వచ్చాయి. కేంద్ర సాహిత్య అకాడమీ సీనియర్

ఫెలోషిప్ అవార్డ్‌తో తొమ్మిది పదుల తెలంగాణా కథపై 500 పేజీల పుస్తకం రాశారు. ఆటా, రా.వి.శాస్త్రి, తెలుగు విశ్వవిద్యాలయ అవార్డ్స్‌తోపాటు 50 అవార్డులు పొందారు. ఈతని సాహిత్యంపై 6 గురు పిహెచ్.డి., యమ్.ఫిల్ చేశారు. 10 మంది వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేస్తున్నారు. తెలంగాణా భాషను హృదయానికి హత్తుకుని తెలంగాణ జన జీవితాన్ని నిరంతరం రాస్తున్న రచయిత.

చిరునామా: 7-4-163, కరీంనగర్ - 505 002.

63. **దొడ్డి రామ్మూర్తి** : నల్లగొండ జిల్లాకు చెందిన ఈ రచయిత ఈ నడుమ తెలంగాణ జీవితాలను నిబద్ధతతో చిత్రిస్తూ చక్కని కథలు రాస్తున్నారు.

64. **అంబల్ల జనార్దన్:** నిజామాబాద్ జిల్లాలో పుట్టి, స్వయంకృషితో అనేక కష్టనష్టాల కోర్చి బ్యాంక్ మేనేజర్ స్థితి కెదిగిన ఈ రచయిత (ప్రస్తుత నివాసం ముంబయి) 9-11-1950లో జననం. ప్రవాసాంధ్రుల గూర్చి, వలస బతుకులు గూర్చి వైవిధ్యపూరితమైన కథలు రాస్తూ అంబల్ల జనార్దన్ కథలు అనే సంపుటిని ప్రచురించాడు.

చిరునామా: బి. 204, దైరాజ్‌కిరణ్ అపార్ట్‌మెంట్స్, చించోలి బందర్‌రెడ్, మలాట్‌వెస్ట్, ముంబయి - 400064.

65. **ఎన్.కె. రామారావు:** నల్గొండ జిల్లానుండి సీనియర్ రచయితల్లో ఒకరైన ఈయని కథల్లో ఆదర్శాలు, విలువలు, మానవ సంబంధాలు, దర్శనమిస్తాయి. జననం 1947 నల్గొండలో.

66. **బి.ఎస్. రాములు:** 1949లో కరీంనగర్ జిల్లా జగిత్యాలలో జన్మించిన వీరు నవతరం తెలంగాణా కథకుల్లో ప్రసిద్ధులు. కథా రచయితగానేకాక సాహితీ విమర్శకుడిగా, వ్యాసరచయితగా ప్రముఖులు. వీరి బతుకుపోరు నవల మంచిపేరు తెచ్చింది. పాలు, స్మృతి, మమతలు మానవ సంబంధాలు, వేపచెట్టు, తేనెటీగలు వీరి కథా సంపుటాలు. కథల బడి, బహుజన తత్వం, సమగ్ర సామాజిక కథ వీరి వ్యాస సంపుటాలు. వందకుపైగా కథలు రాశారు. అడవిలో వెన్నెల కథకు కొ.కు. అవార్డ్, కథల సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించాయి.

చిరునామా: 6-2-157, మిషన్ ఆసుపత్రిదగ్గర, జగిత్యాల - 505 327.

67. **షాజహానా:** స్పష్టమైన నిబద్ధతతో ముస్లిం జీవితాలకు భాష్యాలనదగిన అద్భుత మైన కథలు రాస్తున్న ఈ రచయిత్రి మైనారిటీకథోద్యమ నాయకురాలు.

68. **పెద్దింటి అశోక్‌కుమార్:** 19.4.1969లో జన్మించాడు. ఉపాధ్యాయులు. 1999లో తొలికథ ఆశ - నిరాశ - ఆశ అచ్చైంది, ఊటబాయి కథా సంపుటి ప్రచురించారు. గంభీరావుపేట మల్లారెడ్డిపేట కరీంనగరులో ఉంటారు.

69. **గౌస్ మొహియుద్దీన్:** వీరు నల్గొండ జిల్లా వాసి. కాకతీయ, ఉస్మానియా యూనివర్శిటీల నుంచి ఎం.ఎ, బి.యిడీ చేశారు. కాలేజీ అధ్యాపకుడిగా

ప్రస్తుతం నల్గొండలో పనిచేస్తున్నారు. వీరికి ప్రస్తుతం 32 సంవత్సరాలు

చిరునామా: ఇ.నెం. 5-11-222, హైదర్‌ఖాన్ గూడెం,
నల్గొండ - 508 001

**70. ఐతా చంద్రయ్య:** మెదక్ జిల్లా సిద్ధిపేట మండలం చింతబర్ల గ్రామంలో 3-1-1946న జన్మించిన ఈ రచయిత సిద్ధిపేటలో స్థిరపడ్డారు. 300లకు పైగా కథలు రాసిన ఈ రచయిత స్వేచ్ఛా జీవులు, నిశ్చితార్థం లాంటిపలు సంపుటాలను ప్రచురించారు నిత్యం కథలు, నవలలు రాస్తూ ఉండే ఈ రచయిత కలంలో వాడి, వేడి ఉంటుంది

చిరునామా: 4-4-11, షేక్‌పురా, సిద్ధిపేట -502 103.

**71. పరవస్తు లోకేశ్వర స్వామి:** హైద్రాబాద్ పాతనగరంలో 10 6.1951న జన్మించారు. ఎం.ఎ. చదివిన వీరు డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా బోధన్‌లో పనిజేస్తున్నారు. ముసాఫర్, జీవితం అతని కొక తమాషా, వేయిన్నొక శేషప్రశ్నలు అన్న గ్రంధాలొచ్చాయి.

**72. ముదిగంటి సుజాతారెడ్డి:** 25.5.1942 రోజున నల్గొండ జిల్లా నక్రేకల్ మండలం ఆకారం గ్రామంలో పుట్టిన ఈ రచయిత్రి కథలు, నవలలు, విమర్శనా వ్యాసాలు అనేకం రాశారు. విసుర్రాయి, మింగుతున్న పట్నం, రథచక్రాలు లాంటి పుస్తకాలు ప్రచురించారు. తొలితరం తెలంగాణా కథకులపై విశేష పరిశోధన చేసి మరుగునపడ్డ అనేక కథలను బయటకు తీశారు. ఈ రచయిత్రి సంపాదకత్వంలో వెలువడిన తొలితరం తెలంగాణా కథలు రెండు సంకలనాలూ తెలంగాణా కథలకు కొత్త వెలుగులను ప్రసాదించింది.

చిరునామా: 2-2-1105/21, రోహణమ్, తిలక్ నగర్,
హైదరాబాద్- 500 044.

**73. పి. చంద్:** 1954లో వరంగల్‌లో జన్మించిన వీరి అసలు పేరు పి యాదగిరి. భూ నిర్వాసితులు వీరి కథల సంపుటి. 'శేషగిరి' సింగరేణి గని కార్మిక జీవితాలపై సజీవ చిత్రణ. యాభై పైచిలుకు కథలు రాసిన వీరు గని కార్మికుల స్థితిగతులను చేరువగా పరిశీలించి ప్రతిస్పందించిన రచయిత వీరు సింగరేణి కాలరీస్ కంపెనీలో ఉద్యోగస్థులు.

చిరునామా: 2T No.SC-2-173, 8-ఇండేన్ కాలనీ,
గోదావరిఖని - 505 211

**74. అఫ్సర్:** 22.2.1946న ఖమ్మం జిల్లాలో జన్మించారు. మొదటికథ "అడవి" 1963లో అచ్చయింది. ప్రస్తుతం అమెరికాలోని విస్కాన్‌సిన్‌లో పన్జేస్తున్నారు. కవిత్వం, రక్తస్పర్శ, ఇవాళ కవితా సంకలనాలు వచ్చాయి జర్నలిస్టుగా పన్జేస్తున్నారు.

75. **దార్ల రామచంద్ర:** ఖమ్మం జిల్లా డోర్నకల్ గొల్లచర్ల గ్రామంలో జననం. పుట్టుకతో కట్టుబానిసగా ఉన్నా కష్టపడి కార్మిక కుటుంబంనుంచి ఎం.ఎ. బి.యిడి. వరకు విద్యావంతుడై తన జీవితానుభవాల నేపథ్యంలోంచి సామాజిక నేపథ్యంలోకి ఎదిగి రచనలు చేస్తున్న రచయిత. కథలు, కవితలు రాశాడు. జాతీయస్థాయిలో అంబేద్కర్ అవార్డ్. రాష్ట్రస్థాయి అవార్డులు పొందాడు. తెలుగు ఉపన్యాసకుడుగా హుస్నాబాద్‌లో పనిచేస్తున్నారు.

చిరునామా: ప్రభుత్వ జూనియర్ కళాశాల, హుస్నాబాద్, కరీంనగర్.

76. **కె.వి. నరేందర్ :** 7-6-1967 రోజున కరీంనగర్ జిల్లా గొల్లపల్లి మండలం చిల్లాకోడూర్‌లో పుట్టిన కందుకూరి వెంకట నరేందర్ చిరుప్రాయంలోనే కలంపట్టి, అనేక కథలు రాశారు. మనోగీతం, అమ్మ, యుద్ధం, బురదలో జాబిల్లి, కాలుతున్న పూలతోట, నాన్న, నాతిచెరామి లాంటి కథా సంపుటాలు వెలువరించారు. వీరి కథలు పలు భాషల్లోకి అనువదించబడ్డాయి.

చిరునామా: కెనాల్ పక్కన, జెంబిగద్దె రోడ్, జగిత్యాల,
కరీంనగర్ - 505 327.

77. **గూడ అంజయ్య:** 1952లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో జన్మించిన ఈ రచయిత దళిత మూలాలెరిగిన వాడు. ప్రధానంగా కవి. ఊరు మనదిరో పాటతో తెలుగు సాహితీలోకంలో సంచలనం సృష్టించాడు. ఐదారు కథలు కూడా రాశాడు. పాట రాసినా, కథ రాసినా ప్రజల పక్షాన నిలబడి రాస్తున్న రచయిత.

చిరునామా: ఉట్నూరు - ఆదిలాబాద్ జిల్లా.

78. **కాసుల ప్రతాపరెడ్డి:** 10-7-1962 రోజు నల్లగొండ జిల్లా, రాజీపేట మండలం, బొందుగుల గ్రామంలో పుట్టిన ఈ రచయిత ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో స్థిరపడ్డారు. సుప్రభాతంలాంటి పత్రికలకు సంపాదకుడిగా పనిచేసి ప్రస్తుతం దట్స్ తెలుగు డాట్‌కామ్‌కు సంపాదకత్వం వహిస్తున్నారు. తెలంగాణా తోవలు, త్రిలింగం కథ, దేవులాట పుస్తకాలకు సంపాదకత్వం వహించడమే కాకుండా తెలుగు నవల వ్యాపారధోరణి, విలువకు తొడిగిన మొగ్గ (కథలు) భౌగోళిక సందర్భం (వ్యాసాలు) వెలువరించారు. ఈతని కథల్లో పట్టణ జీవన సంఘర్షణ కనబడుతుంది.

చిరునామా: 303, నార్త్ బ్లాక్, శాలివాహన టవర్స్, శాలివాహన నగర్,
మూసారం బాగ్ - హైదరాబాద్ - 36.

79. **నల్లాల లక్ష్మీరాజం:** 5-10-1970లో జననం. తక్కిల్లపల్లి గ్రామం కరీంనగర్ జిల్లాలో దళితుడుగాపుట్టి అనేక వేదనలను భరించి పోలీసుశాఖలో ఉద్యోగిస్తున్న ఈ రచయిత 'తిరుగు ప్రయాణం' అనే కథల సంపుటి వెలువరించాడు. దళిత జీవన సంవేదనను, తెలంగాణా గ్రామాల్లో దళితుల బతుకులను వాస్తవికంగా చిత్రిస్తూ కథా రచయితగా ఎదుగుతున్న వర్ధమాన కథకుడు.

చిరునామా: 1-3-195, కృష్ణానగర్, జగిత్యాల, కరీంనగర్- 505 327.

80. **బోధనం నర్సిరెడ్డి:** పుట్టింది1956లో. తెలంగాణా రైతు గురించినవులను కలుపు పరిస్థితులను నీటి కరువును వాస్తవికంగా చిత్రిస్తూ రైతు కథలు రాస్తున్న రైతు కుటుంబంలోంచి వచ్చిన రచయిత. నల్లగొండలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేస్తున్న వీరు పల్లె మూలాలెరిగిన రచయిత.

81. **జాతశ్రీ:** ఖమ్మం జిల్లా కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ఈ రచయిత అరవై ఏళ్ళకు పైబడినవాడు. విశాలాంధ్ర నవలల పోటీలో వీరి కథలకు ప్రథమ బహుమతి వచ్చింది. ఇటీవలే పట్టికోట అచ్చారుస్వామి కథా పురస్కారం పొందారు. 60, 70 కథలు రాసిన ఈ రచయిత కథల్లో తెలంగాణా జీవన పరిమళముంటుంది.

82. **గీతాంజలి:** ఇటీవలి కాలంలో ముస్లిం జీవితాల గూర్చి అద్భుతంగా కథలు రాస్తున్న రచయిత్రి. వాళ్ళ జీవితాలతో మమేకమై. భాషతో తాదాత్మ్యం చెంది సమర్థవంతుడైన ముస్లిం రచయితయినా రాయలేనంత వాస్తవికంగా ఆ జీవితాలను కథీకరిస్తున్న రచయిత్రి. ఈమె ప్రసిద్ధ నవల 'ఆమె అదమని జయించింది' ఆంధ్రప్రభ నవలల పోటీలో బహుమతి పొందింది.

చిరునామా: దిల్‌షుక్‌నగర్, హైదరాబాద్.

83. **ముక్తవరం పార్థసారథి:** 1944లో జన్మించారు. వీరితొలి కథ 1959లో గోలకొండ పత్రికలో అచ్చయింది. 1969లో రంగులవల నవలకు ఆంధ్ర వారపత్రిక ఉగాది పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది. వీరు అనేక నవలలు, కథలు పెక్కు అనువాదాలు చేశారు. వీరి ఎర్రదీపం కథ 1969 ఫిబ్రవరిలో ఆంధ్రవారపత్రికలో అచ్చయింది. ప్రస్తుతం వీరు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

84. **పంజాల జగన్నాథం:** యాస్పాడ గ్రామంలో 5-8-1952లో పుట్టిన ఈ రచయిత ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివి కరీంనగర్ జిల్లా గంగాధరలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. 30 వరకు కథలు, 30 కవితలు, కొన్ని వ్యాసాలు వివిధ పత్రికల్లో వచ్చాయి. 2004లో మట్టి వాసనలు కథా సంకలనం తీసుకొచ్చారు.

చిరునామా: 7-2-74/ఏ, మంకమ్మతోట, కరీంనగర్.

85. **జాజుల గౌరి:** 2.3.1963 రోజున సికిందరాబాద్‌లో లోతుకుంటలో దళిత కుటుంబంలో జన్మించిన ఈ రచయిత్రి మన్నులోంచి బువ్వను తీస్తున్న రచనలు చేస్తున్నది. 'మన్నులో పుట్టి, మన్నులో పెరిగి, మన్ననే తిని, మన్ను రాతలు రాసిన మట్టి మనిషిని నేను ఒట్టిమనిషిని నేను' అని కథలు రాస్తున్న ఈ రచయిత్రి ఇటీవలి కాలంలో వెలువరించిన మన్నుబువ్వ కథల సంపుటి ఆమె మొదటి పుస్తకం.

చిరునామా: 8-4-373/15/ఏ, శాస్త్రి నగర్, ఎర్రగడ్డ,
హైదరాబాద్ - 500 018.

86. **బి.వి.ఎన్. స్వామి:** కరీంనగర్ జిల్లా కోహెడ మండలం వరికోలు గ్రామంలో 16-12-1964న జననం. ప్రస్తుం కరీంనగర్ పట్టణంలో స్థిర నివాసం. రెండొందల కథా సంకలనం వచ్చింది. అనేక వ్యాసాలు, సమీక్షలు వివిధ పత్రికల్లో వచ్చాయి. ఉత్తర తెలంగాణా సాహిత్యం 1970-2000 పై తెలుగు విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టాకోసం పరిశోధన చేస్తున్న స్వామి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు.

చిరునామా: బి.వి.ఎన్.స్వామి, రాంనగర్, కరీంనగర్.

87. **కర్ర ఎల్లారెడ్డి:** వరంగల్ జిల్లా వీర భైరాగ్‌పల్లిలో 1963 లో జన్మించిన కర్ర ఎల్లారెడ్డి వ్యవసాయ కుటుంబంలోంచి వచ్చారు. వరంగల్, హైదరాబాద్ కోర్టుల్లో న్యాయవాదిగా పనిచేస్తూ 2005 నాటికి ఎనిమిది పుస్తకాలు ప్రచురించారు. ప్రతి ఏటా తెలంగాణా కథా వార్షికను, ప్రతినెల సోపతి పత్రికను వెలువరిస్తున్నారు. అదాలత్ కథల పుస్తకం న్యాయవ్యవస్థకు దర్పణం పట్టింది.

చిరునామా: 2-5-449 అదాలత్ వెనుక, హనుమకొండ

88. **పులిపాటి గురుస్వామి:** జననం 19.4.1970 నల్లగొండ జిల్లా గడ్డంవారి యెడకల్లి. ఇటీవలి కాలంలో సామాజికపరమైన అంశాలపై ప్రపంచీకరణ దుర్మార్గంపై చక్కటి కథలు రాస్తున్న వర్ధమాన రచయిత.

చిరునామా: 3-6-259, ఎల్.బి.నగర్, హైదరాబాద్ - 500 074.

89. **సి.హెచ్. మధు:** నిజామాబాద్ ప్రాంతానికి చెందిన ఈ రచయిత తెలంగాణలో జరుగుతున్న భూపోరాట ఉద్యమాలకు సంబంధించి అనేక కథలు రాశారు. స్పష్టమైన దృక్పథంతో, నిబద్ధతతో తనకలాన్ని ప్రజాపక్షం ఎక్కుపెడుతున్న ఈ రచయిత రాజ్యహింసను వ్యతిరేకిస్తూ కథలు రాశాడు.

90. **బెజ్జారపు రవీందర్:** కరీంసగర్ జిల్లా పెద్దపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈ రచయిత తెలంగాణ ప్రాంతంపై జరుగుతున్న వివక్షపై నిత్యగాయాలనది, పోరుతల్లి లాంటి కథలు రాశాడు. తెలంగాణపై జరుగుతున్న వివక్షలోని సమస్త పార్శ్వాలను స్పృశించాడు. నిత్యగాయాలనది కథకు వట్టికోట ఆళ్వారుస్వామి కథా పురస్కారం లభించింది.

(సవరణలను, సూచనలను తెలియజేస్తే స్వాగతిస్తాం.)

## తెలుగువారి ప్రతి ఇంటా ఉండాల్సిన

# శరత్ సాహిత్యం పది సంపుటాలు

## నేడే తగ్గింపు వెలతో రిజర్వు చేసుకోండి!

## శరత్ గ్రంథాలు ప్రతి ఇంటికీ సుగంధాలు !!

**10 సంపుటాల సెట్** (3,750 పేజీలు) **వెల : రూ. 1,300/-**

31.8.2005లోగా పైకం చెల్లించి రిజర్వు చేసుకున్నవారికి **రూ.1,000/-** మాత్రమే

మీరు రూ.1,000/-లను డి.డి లేదా నగదు రూపంలో ఈ దిగువ అడ్రసుకు పంపి మీ శరత్ సాహిత్యం సెట్‌ను నేడే రిజర్వ్ చేసుకోండి ! పుస్తక విక్రేతలు, గ్రంథాలయాలు, విద్యాలయాలు కూడా రిజర్వ్ చేసుకోవచ్చు !!

శరత్ సాహిత్యం పూర్తి వివరాల ఫోల్డర్ కోసం ఈ దిగువ అడ్రసుకు రాయండి

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

అబిడ్స్, హైదరాబాద్ - 1. ఫోన్ : 24744580/98480 23461

**విశాలాంధ్ర బుక్ హౌస్** - అబిడ్స్ / సుల్తాన్ బజార్, హైదరాబాదు, విజయవాడ, గుంటూరు, హన్మకొండ, అనంతపురం, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ.

# తెరుచుకోని కథలు